## చతుర్వేదాంతర్గత

I

# ఉపనిషత్ ఉద్యానవనము

మంగళ శ్లోక - తాత్పర్య - వివరణ సమేతంగా

(మొదటి సంపుటి - ఋగ్వేదాంతర్గత - శుక్లయజుర్వేదాంతర్గత)



తాత్పర్య - వ్యాఖ్యానములు : యేలేశ్వరపు హనుమ రామకృష్ణ

# చతుర్వేదాంతర్గత

# ఉపనిషత్ ఉద్యానవనము

## (మంగళ శ్లోక - తాత్పర్య - అధ్యయన సమేతంగా)

## సంపుటి - 1 ఋగ్వేదాంతర్గత - శుక్ల యజుర్వేదాంతర్గత

⌘


అధ్యయన విద్యార్థి

**యేలేశ్వరపు హనుమ రామకృష్ణ** B.Com., C.A.I.I.B.,

(Retd, Chief Manager - Andhra Bank)

D.No. 2/8, Siva Temple Street,

Kuchipudi - 521 136 Krishna Dist. A.P. India

cell : 9247105392 land : 08671 - 251164

Website : www. yhramakrishna.com

e.mail : yhrk2525@gmail.com


⌘


ప్రకాశకులు

**శ్రీమతి యేలేశ్వరపు కనకదుర్గ**

D.No. 2/8, Siva Temple Street,

Kuchipudi - 521 136 Krishna Dist. A.P. India

cell : 92479 25278 land : 08671 - 251164

చతుర్వేదాంతర్గత

# ఉపనిషత్ ఉద్యానవనము

**(మంగళ శ్లోక - తాత్పర్య - అధ్యయన సమేతంగా)**

**సంపుటి - 1 ఋగ్వేదాంతర్గత - శుక్ల యజుర్వేదాంతర్గత**


అధ్యయన విద్యార్థి

**- యేలేశ్వరపు హనుమ రామకృష్ణ**



ప్రథమ ముద్రణ : **అగష్టు 2014**

ప్రతులు : 1000

వెల : 500/-

పబ్లిషర్ మరియు ప్రతులకు

**శ్రీమతి యేలేశ్వరపు కనకదుర్గ**

D.No. 2/8, Siva Temple Street,
Kuchipudi - 521 136 Krishna Dist. A.P. India
cell : 92479 25278 land : 08671 - 251164

Cover Page Designedy By

**Aravinda Graphics,** Eluru
Cell : 98486 44882

***DTP & Printed By*** (For Copies)

**B. SAI KUMAR**
Hasitha Graphics & Printers
Rose Gardens, Eluru - 534 001 W.G. Dist
Cell : 97042 75472



**వై.హెచ్. రామకృష్ణ**
సెల్ : 92471 05392
ల్యాండ్ : 08671-251164

# ఉపనిషత్ ఉద్యానవనము

# స్వపరిచయం

*పాఠక-ఆత్మానంద స్వరూపులకు నమస్కరిస్తూ...*

*ఓం సర్వే అత్ర సుఖినస్సంతు సర్వేసంతు నిరామయాః*
*సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖభాగ్ భవేత్*

| | | |
|---|---|---|
| మాతృ-పితృ దేవతలు | : | యేలేశ్వరపు ఆదిలక్ష్మి కామేశ్వరమ్మగారు, లక్ష్మీ నారాయణ గారు |
| జన్మస్థానం | : | భావదేవరపల్లి (వయా నాగాయలంక), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ |
| పుట్టిన తేదీ | : | 20-7-1951 |
| స్వగ్రామం | : | కూచిపూడి, కృష్ణా జిల్లా |
| చిరునామా | : | డోర్ నెం. 2/8, శ్రీరామలింగేశ్వరస్వామి గుడి వీధి<br>కూచిపూడి - 521136, మొవ్వ మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ |
| లోక విద్య | : | బి.కామ్. (హిందూ కాలేజి, మచిలీపట్నం 1968-71), సి.ఎ.ఐ.ఐ.బి. |
| ఇష్టదైవం | : | శివయ్య |
| వృత్తి | : | రిటైర్డ్ చీఫ్ మేనేజర్, ఆంధ్రాబ్యాంక్ (After Serving 38 1/2 years) |
| ప్రవృత్తి | : | తాత్త్విక చింతన, సద్గోష్టులు, ధార్మికోపన్యాసాలు వినటం, శివార్చన, సాహిత్యాభిమానం |
| ఆశయం | : | సర్వమతములు మానవుని జీవితమును సుసంపన్నం చేయటానికి, ప్రశాంతత - ఆనందములతో నింపటానికే ఉన్నాయి. సర్వ మార్గముల అంతర్లీనమే మానవతా వాదము. అట్టి మానవతపు విలువలు పరిరక్షింపబడటానికి నేను సైతం నావంతు కృషి నిర్వర్తించి, తద్వారా 'మానవుడనై ఉండుట' అను మహోత్కృష్టమైన అవకాశమును సద్వినియోగ పరచుకోవటం. |
| సద్గురువు | : | శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారు, శ్రీకాళహస్తి. శ్రీ యేలేశ్వరపు రామకృష్ణయ్య గారు, కూచిపూడి |
| ఇతర రచనలు | : | ⌘ శ్రీ వసిష్ఠరామ సంవాదము (యోగవాసిష్ఠము) వచన కావ్యము (32000 శ్లోకముల వచన పూర్వక అధ్యయనము) (4 Volumes - Sri Rama Krishna Math, Hyderabad)<br>⌘ భగవద్గీత - వచనము - అధ్యయన పుష్పము<br>⌘ కఠ-ఈశావాస్యోపనిషత్ అధ్యయన పుష్పములు (మరియు) శ్రీ నారద ప్రణీత భక్తి సూత్రములు-తాత్పర్యము<br>⌘ గొల్ల కలాపము - అధ్యయన పుష్పము<br>⌘ శ్రీకృష్ణ - ఉద్ధవ సంవాదము (ఉద్ధవ గీత) - అధ్యయన పుష్పము<br>⌘ (వర్తమానంలో) 108 ఉపనిషత్తుల ఉద్యానవనము |

*ఓం శ్రీగురుభ్యోన్నమః*
*ఓం సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరబ్రహ్మణే నమః*
*ఓం సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి శివానంద పరబ్రహ్మణే నమః*
*ఓం సద్గురు శ్రీశ్రీశ్రీ శ్రీకృష్ణ పరమాత్మనే నమః*

# ముందు మాట

**ఉపనిషత్ = ఉప + నిషత్**

ఉప అనగా **సమీపము**, నిషత్ అనగా **ఆసనం** లేదా **స్థానం. ఆత్మ సమీపమునందు స్థానము యేర్పఱచునది ఉపనిషత్**. ఉపనిషత్‌లు జ్ఞాన **నికేతనములు**. మోక్షమును ప్రసాదించు కేవల జ్ఞాన భాండాగారములు. వీటినే **శ్రుతులనియూ, వేదాంతములనియూ** పేర్కొందురు. ఇవి వేదములందు అంతర్భాగములు. వేదమనగా **తెలివి** లేదా **జ్ఞానము. విత్** అను ధాతువు నుండి వేద పదము ఆవిర్భవించినది. వేదములు అపౌరుషేయములు. అనగా ఏ పురుషుని చేతనూ వ్రాయబడలేదు. అనగా స్వతస్సిద్ధముగా ఏ మానవుడూ వ్రాసినవి కావు. చిదాకాశమే అశరీరవాణిగా కొన్ని సంజ్ఞల రూపంలో జ్ఞాన సంకేతములు పంపగా, (టెలిగ్రాఫ్ కోడ్ మాదిరిగా), వాటిని 'విని' మహర్షులు సంస్కృత భాష రూపంలో అన్వయించి వ్రాయుటచే (డీకోడ్ చేయగా) ఉపనిషత్తులను '**శ్రుతు**' లందురు. ఇవి వేదములందలి ప్రతి శాఖకు **అంత్యములో చెప్పబడుటచే 'వేదాంతము'** లందురు.

**శ్లో॥ ద్వామివా పథ పంథానో యత్రవేదా ప్రతిష్ఠితః ।**
**ప్రవృత్తి లక్షణో ధర్మో నివృత్తిశ్చ విభాషితః ॥** **(శ్రుతి వాక్యం)**

వేదములలో ప్రవృత్తి, నివృత్తి అని చెప్పబడు రెండు మార్గములు కలవు. ప్రవృత్తి అనగా జనన మరణ రూప సంసార చక్రము (వృత్తము). ఇది కర్మ మార్గము. యజ్ఞ యాగాదులతో కూడిన యీ కర్మ మార్గము ఆచరించినచో మానవుడు సంసారమునందు సుఖ భోగములు, స్వర్గ ప్రాప్తి, కర్మ ఫల సమాప్తి అనంతరము మరల జన్మ పరంపరకు దారితీయును. వేదములలో రెండవది **జ్ఞానమార్గం**. సంసారము నుండి ఉపశమింపజేయు **మోక్షమార్గం**. ఉపనిషత్తులన్నియూ **నివృత్తి మార్గమునే తెలియజేయును.**

ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదములను యీ నాలుగింటికీ 1180 శాఖలు గలవు. ప్రతి శాఖయందు **ప్రథమంలో ప్రవృత్తి రూప** కర్మ **మార్గమునూ**, అంత్యములో **నివృత్తిరూప జ్ఞాన మార్గమునూ** నిక్షిప్తములైయున్నవి. అందుచే 1180 శాఖలకు 1180 ఉపనిషత్తులు ఏర్పడినవి. అయితే ముఖ్యంగా 108 ఉపనిషత్తులే ప్రస్తుతం అందుబాటులో యున్నవి. ఈ 108లో మొదటిదగు **ఈశావాస్యోపనిషత్** నుండి ఆఖరిదగు **ముక్తికోపనిషత్** వరకు వివరంగా **ముక్తికోపనిషత్** లోనే విశదపఱచబడినది. దీనియందే శ్రీరామచంద్రమూర్తి ఆంజనేయ స్వామి వారితో

**శ్లో॥ మాండూక్యమ్ ఏకమేవ అలం, ముముక్షూణాం విముక్తయే।**
**తథాऽపి అసిద్ధంచేత్, జ్ఞానం దశఉనిషదం పఠ ॥** (ముక్తికోపనిషత్ ప్రథమాధ్యయము, 6శ్లో॥)

మోక్షం కొఱకు '**మాండూక్యోపనిషత్**' ఒక్కటియే చాలునని, ఇంకనూ జ్ఞానం కలుగనిచో దశోపనిషత్తులను చదువుమని శెలవిచ్చి యున్నారు.

ఈశ, కేన, కఠ, ప్రశ్న, మాండూక్య, ముండక, తైత్తరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకోపనిషత్‌లు (దశోపనిషత్తులు) - మోక్షము గోరువానికి '**ఓంకారము**' లేదా '**ప్రణవ రూప యోగసాధన**' యే ముఖ్యమైన ఉపాయము అగుటచే అట్టి యోగసాధన 12 మంత్రములతో **మాండూక్యోపనిషత్**లో చెప్పబడుటచే ఆ ఉపనిషత్ ఒక్కటే చాలునని శ్రీ రామచంద్రమూర్తి శలవిచ్చియున్నారు.

అందుచే జగద్గురు ఆది శంకరాచార్యులవారి పరమ గురువుగారూ, మరియు శ్రీశుకబ్రహ్మ యొక్క శిష్యులునూ అగు శ్రీగౌడపాదాచార్యులవారు యీ ఉపనిషత్‌పై 220 'కారికలు' వ్రాసియున్నారు. 'వేదశిరస్సు' గా చెప్పబడు '**ముండకోపనిషత్**' లో కూడా ప్రణవరూప యోగసాధనయే చెప్పబడినది.

శ్లో॥ **ప్రణవో ధనుః శరోహి ఆత్మా బ్రహ్మ తత్ లక్ష్యమ్ ఉచ్యతే।**
**అప్రమత్తేన వేత్తవ్యం శరవత్ తత్‌మయో భవేత్॥** (ముండకోపనిషత్-ద్వితీయ ముండకము, 4అ, 6శ్లో॥)

శ్లో॥ **యోగాత్ సంజాయతే జ్ఞానం జ్ఞానాత్ యోగః ప్రవర్తతే**
**యోగ జ్ఞాన పరోనిత్యం సయోగీ న ప్రణశ్యతి॥** **(త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్ - 16)**

యోగం వలన జ్ఞానం కలుగుచున్నది. ఆత్మ విషయజ్ఞానం వలన యోగం వృద్ధి యగుచున్నది. యోగ జ్ఞానములతో కూడిన యోగి యెన్నటికినీ నశించడు - అని చెప్పుటచే, **ఉపనిషత్‌లన్నియూ యోగ-జ్ఞానములనే వివరించుచున్నవి.**

సర్వోపనిషత్‌ల సారమగు శ్రీమద్భగవద్గీత కూడా యీ యోగ-జ్ఞానములనే బోధించుచున్నది. శ్రీమద్భగవద్గీత, ఉపనిషత్‌లు, బ్రహ్మ సూత్రములు యీ మూడింటిని **ప్రస్థానత్రయ** గ్రంథములందురు. ఇవియే ప్రామాణిక గ్రంథములు. మరియూ, శ్రీమద్భగవద్గీత, బ్రహ్మసూత్రములకు కూడా ఉపనిషత్‌లే మూలాధార ప్రామాణికములైయున్నవి.

శ్లో॥ **సర్వోపనిషదోగావో। దోగ్ధా గోపాల నందన।**
**పార్థోవత్సః సుధీః భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥** **(గీతామహత్యం)**

సర్వోపనిషత్తులను గోమాతగానూ, పాలను పితుకువారు శ్రీ గోపాల నందనునిగానూ, మహత్తరమైన గీతామృతమను పాలను త్రాగు దూడను పార్థునిగానూ సరిపోల్చుటలో ఒక రహస్యం దాగి యున్నది. ఆవు పాలనిచ్చుటకు ముందు దూడ తల్లి పొదుగును తనమూతితో గుద్దినగాని పాలను చేపుట జరగదు. తల్లిపాలను దూడ త్రాగుటతో సరిపోవును కాదా ! మరి పాలను పితుకువారెందులకు ? అనగా తల్లిపాలు దూడకే కాకుండా లోకమునకు కూడా అవసరమగుటచే పాలు పితుకువారు అవసరమొచ్చినది. అటులనే అర్జునుడు సమయోచిత ప్రశ్నలు వేయుటచేతనే, అతనిని నిమిత్తంగా చేసుకొని, శ్రీకృష్ణ పరమాత్మ లోకకళ్యాణార్థమై సర్వోపనిషత్తుల సారమగు యోగ జ్ఞానామృతమును పిండి, లోకమునకు పంచిపెట్టిరి.

వేదమనగా తెలివియే కాకుండా స్వరమని కూడా అర్థం కలదు.

శ్లో॥ **యో వేదా ద్వౌ స్వరః ప్రోక్తో వేదాంతే చ ప్రతిష్ఠితః।**
**తస్య ప్రకృతి లీనస్య యః పరః స మహేశ్వరః** ॥

వేదములందు ఉదాత్తు, అనుదాత్తులను రెండు స్వరములు కలవు. ఉదాత్తు అనగా పైకి చరింపజేయు స్వరం. అనుదాత్తు అనగా క్రిందకు చరింపజేయు స్వరం. ఈ రెండు స్వరములను వేదపఠనమందు తప్పనిసరిగా వినిపించవలెను. అయితే ఇవి నోటితో బైటకు ఉచ్ఛరించునవి కావు. ప్రాణాయామం చేయువారికి మాత్రమే యీ ఉదాత్తు, అనుదాత్తు స్వరములు సహజంగా ఉద్భవించుచుండును.

శ్లో॥ **కుండలిన్యాం సముద్భూతా గాయత్రీ ప్రాణధారిణీ।**
**ప్రాణవిద్యా మహావిద్యా। యస్తం వేద స వేదవిత్ ॥** **(యోగచూడామణ్యుపనిషత్ 7 శ్లో॥)**

ప్రాణమే గాయత్రి. ఇదియే కుండలినీ శక్తి. ప్రాణాయామము చేయుచుండగా ఉద్భవించు ధ్వనియే 'ప్రణవము' లేదా 'ఓం'కారము. దీనినెఱుగువారే వేదములనెఱుగగలరు.

**శ్లో॥ యత్ అక్షరం వేద విదో వదన్తి, విశంతి యత్ యతయో వీతరాగాః ,**

**యత్ ఇచ్ఛంతో బ్రహ్మచర్యం చరన్తి తత్ తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే। బ్రవీమి ఇతి -ఏతత్ (భ.గీ.8-11, కఠోపనిషత్)**

దేనిని అక్షరమని వేదవిదులందురో, దేనిని కోరి బ్రహ్మచర్యమాచరింతురో, సంగ్రహముగా చెప్పుచున్నాను వినుము. అదియే 'ఓం' అను పదం. కావున సకల వేదసారం ఓంకారమే.

**శ్లో॥ సకృత్ ఉచ్చరిత మాత్ర స ఏష ఊర్ధ్వమ్ ఉత్ - నామయతి, ఇతి 'ఓం' కారః॥ (అధర్వ శిఖోపనిషత్ - 11)**

ఒక్కసారి చరింపజేసినచో దానంతట అదియే పైకిపోవునదేదో దానినే ఓంకారమందురు.

**శ్లో॥ దంతోష్ఠ తాలు జిహ్వా నామాస్పదం యత్ర దృశ్యతే ।**

**అక్షరత్వం కుతస్తేషాం క్షరత్వం వర్తతే సదా ॥ (ఉత్తరగీత)**

దంతములు, పెదవులు, అంగళి, నాలుక యీ నాలుగు భాగములు ఉపయోగించకుండా అంతర్లీనంగా సహజంగా ప్రాణామామంలో ప్రణవ ధ్వని ఉద్భవించుచుండును. దీనినే అక్షరమందురు. బయటకు ఉచ్ఛరించుచూ యీ నాలిగింటినీ ఉపయోగించి చదువు వేద పఠనములన్నియూ క్షరములే కదా !

వేదముల సారము ఉపనిషత్తులు. ఉపనిషత్తుల సారము ఓంకారమే. కావున ప్రణవాన్ని జపించుచూ, ప్రాణాయామం చేయు యోగియే సర్వ వేదసారమును ఎఱుగగలడు.

**శ్లో॥ బహూనాం జన్మనామ్ అంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।**

**వాసుదేవః సర్వమ్ ఇతి। స మహాత్మా సుదుర్లభః ॥ (భ.గీ. 7-19)**

కేవల శాస్త్ర జ్ఞానంతో తృప్తి చెందు జ్ఞాని, అనేక జన్మలనెత్తగా సర్వమూ వాసుదేవమయమను అనుభవ జ్ఞానం పొంది, నన్ను చేరుచున్నారు. దీనికి వివరణము **యోగశిఖోపనిషత్**లో మాత్రమే యున్నది.

**శ్లో॥ జన్మాంతరైశ్చ బహుభిః యోగో జ్ఞానేన లభ్యతే ।**

**జ్ఞానంతు జన్మని ఏకేన యోగాత్ ఏవ ప్రజాయతే ॥ (యోగశిఖోపనిషత్ 9 శ్లో॥)**

శాస్త్ర జ్ఞానికి అనేక జన్మల పిమ్మట యోగం లభించుచున్నది. ఆ యోగంతో ఒకే జన్మలో సర్వమూ వాసుదేవ మయమనే అనుభవ జ్ఞానమును పొందుచున్నాడు.

**శ్లో॥ సన్న్యాసః కర్మయోగశ్చ నిః శ్రేయస కరా వుభౌ।**

**తయోస్తు కర్మ సన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే ॥ (భ.గీ. 5-2)**

కర్మ సన్యాసము, కర్మ యోగములు యీ రెండూ శ్రేయస్కరములైనప్పటికీ, యీ రెంటిలో కర్మయోగము విశిష్టమైనదని చెప్పుటచే వేదములలో చెప్పిన యజ్ఞ యాగాదులే కర్మ యోగమని చాలామంది భావించుచున్నారు. కాని దీనికి వివరణం **త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్**లో

**శ్లో॥ బంధనం మనసో నిత్యం కర్మయోగః స ఉచ్యతే**

**యస్య చిత్తస్య సతతమ్ అర్థే శ్రేయసి బంధనం**

**జ్ఞానయోగః స విజ్ఞేయో సర్వ సిద్ధికరశ్శివః॥ (త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్ 18-19)**

కదులుచున్న మనసును (ప్రాణవాయు చలనము వలన) కదలకుండా నిత్యం బంధించుట, అనగా స్థిరముగా నుంచుటయే కర్మయోగమందురు. అట్టి స్థిరమైన మనసును ఆత్మయందు లయము చేయుటయే జ్ఞానయోగమందురు. కావున అంతర్ముఖ ప్రాణాయామ కర్మయే కర్మయోగము గాని, బాహ్య కర్మలు కావు. **"యుక్త ఇత్యుచ్యతే యోగి" (భ.గీ. 6-8).** దీనికి వివరణం **అన్నపూర్ణోపనిషత్**లో

**శ్లో॥ ప్రాణాది అనిల సంశాంతౌ యుక్త్యా యే పదమాగతాః,**
**అనామయమ్ అనాద్యంతం తే స్మృతా యోగ యోగినః ॥ (అన్నపూర్ణోపనిషత్ - 5వ అ. 6 శ్లో॥)**

ప్రాణాపాన వ్యానోదాన సమాన వాయువులనబడు పంచప్రాణములను యే యుక్తితో శాంతింపజేయుచున్నారో అట్టివారు యోగులకు యోగియగుచున్నారు. కావున **'యుక్త'** అను పదమునకు యోగము అని అర్థం.

**శ్లో॥ 'ఓం' ఇతి ఏక-అక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామ్ అనుస్మరన్,**
**యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాం గతిమ్ ॥ (భ.గీ. 8-13)**

బ్రహ్మవాచకమగు ఓంకారమును దీర్ఘంగా ఉచ్ఛరించుచూ, నన్ను స్మరించువారు దేహత్రయంయొక్క భంగం పొంది పరమగతిని పొందుదురని చెప్పుటచే 'ఓం' 'ఓం' అంటూ బాహ్యంగానే ఉచ్ఛరించుచున్నారు. దీనికి వివరణం **శ్వేతాశ్వతరోపనిషత్**లో

**శ్లో॥ స్వదేహమ్ అరణిం కృత్వా 'ప్రణవం' చ ఉత్తరారణిం**
**ధ్యాన నిర్మథనాభ్యాసాత్ ఏవం పశ్యేత్ నిగూఢవత్**

తన శరీరమును ఒక అరణిగాను (యజ్ఞంలో అగ్ని మథనం కోసం ఉపయోగించు కట్టె), ప్రణవమును పై అరణిగాను చేసి, ప్రాణాయామ మథన క్రియ చేసి, ధ్యానము చేసినచో నిగూఢముగానున్న పరంజ్యోతి బహిర్గతమగుచున్నది. **"జ్యోతిర్దర్శనాత్" (బ్రహ్మసూత్రం).** దీనికి వివరణం **బ్రహ్మవిద్యోపనిషత్**లో ...,

**"జ్యోతిర్లింగం భ్రువోర్మధ్యే నిత్యం ధ్యాయేత్ సదా యతిః"**

యతులు నిత్యమూ యోగసాధన చేయుచూ, భ్రూమధ్య స్థానములో ఆత్మజ్యోతిని దర్శించుకుంటూ ధ్యానించుచున్నారు.

ఈ విధంగా ఇటు భగవద్గీతకు, అటు బ్రహ్మసూత్రములకు వివరణ కేవలం ఉపనిషత్తులందే లభించుటచే ఇవి అత్యంత ప్రమాణికములైనవి. అందుచే శ్రీ ఆది శంకరులచే **"దుష్తర్కస్తు విరమ్యతాం, శ్రుతి మతః తర్కోఽనుసంధీయతాం"** శ్రుతి ప్రమాణము ననుసరించి చేయు తర్కమే అభినందనీయం. తదితరము లన్నియూ దుష్తర్కములే యగుననియూ చెప్పబడింది. **"శ్రుత్యా, యుక్త్యా, స్వానుభూత్యా"** - ఏ ఋషి చెప్పిననూ ఉపనిషత్ ప్రమాణ పరంగానూ, సోదాహరణలతో గూడుకొని తన అనుభవము కూడా అందులకు జోడించి చెప్పుచున్నారు. తదనుగుణంగానూ ఉన్నచో దానిని స్వీకరింపవలెనని ఉద్ఘాటించిరి.

ఈ కోవకు చెందినవారే మద్గురువరేణ్యులగు **బ్రహ్మర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ స్వామి రామానంద పరమహంసలవారు** మరియు మా పరమ గురుదేవులగు **బ్రహ్మర్షి సద్గురు శ్రీశ్రీశ్రీ శివానంద పరమహంసలవారు.**

⌘

పాశ్చాత్య నాగరికతకు ఆకర్షితులై మానవ మనుగడకు కేవలం భౌతికాభివృద్ధియే ప్రధానమని యెంచుచున్న నేటి సమాజము, మన ప్రాచీన భారతీయ సంస్కృతికి రానురాను దూరమగుచున్న యీ తరుణంలో దేవనాగరి భాషయగు సంస్కృతంలో వ్రాయబడ్డ యీ

ఉపనిషత్‌లను సులభశైలిలో అచ్చతెనుగు భాషలో అందించి సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉంచవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. మొత్తం 108 ఉపనిషత్తులనన్నింటినీ తాత్పర్య సహితముతో వ్యాఖ్యానించడమనునది అత్యంత సాహసోపేతమైన చర్య. ఇట్టి బృహత్తర కార్యమునకు పూనుకొనిన **శ్రీ యేలేశ్వరపు హనుమ రామకృష్ణ గారు అత్యంత అభినందనీయులు.** శ్రీ రామకృష్ణ గారు **శ్రీ'యోగవాశిష్ఠ'**మను శ్రీ వసిష్ఠ రామ సంవాద గ్రంథమును అత్యంత సులభశైలిలో సామాన్య జనులకు అర్థమగు రీతిలో ఇదివరకే వ్రాసియున్నారు. కొద్దిపాటి చదువుకున్నవారు కూడా వీరి గ్రంథములను చదివి, గ్రంథసారములను అతి త్వరగా అవగాహన చేసుకోగలరు. అందఱికీ అందుబాటులో ఉంటూ సంస్కృత భాషా పరిచయము లేకపోయిననూ, మహద్గ్రంథముల సారమును కొంచమైననూ శ్రమ లేకుండా పఠించుచుండుటకై అందింపజేయుట యనునదియే శ్రీ రామకృష్ణ గారి ధ్యేయము. శ్రీరామకృష్ణ గారు ఒక బ్యాంకు ఆఫీసర్ అయి ఉండి కూడా యింతటి దీర్ఘ ప్రయత్నము చేయుచున్నారంటే అది వారి గురుదేవులగు **శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల వారు** (శ్రీ శుకబ్రహ్మాశ్రమం - శ్రీ కాళహస్తి) ఎంత గొప్ప మనీషియో అర్థం కాగలదు.

***గురు ఆజ్ఞతో, గురు ప్రేరణతో చేయు ప్రయత్నములన్నియూ అత్యంత ఫలప్రదమగుననియూ విశ్వసిస్తూ,***

*శ్రీ గురుదేవుల అనుగ్రహమునకు పాత్రులగుదురని భావిస్తూ,*

*వారిని ప్రార్థిస్తూ, శ్రీ రామకృష్ణ గారిని అభినందించుచున్నాను.*

ఇట్లు


**డాక్టర్ వండాన వేంకటేశ్వరరావు**

పీఠాధిపతి

శ్రీ స్వామి రామానంద యోగజ్ఞానాశ్రమం

కామన్నవలస, విజయనగరం జిల్లా.

సెల్ : 09849446237


తేది : 04-06-2014

బుధవారము

*సదాశివ సమారంభామ్, శంకరాచార్య మధ్యమామ్, అస్మదాచార్య పర్యంతామ్*
*శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి ఆచార్య (శ్రీకాళహస్తి) పర్యంతామ్ - శ్రీ యేలేశ్వరపు రామకృష్ణయ్య ఆచార్య (కూచిపూడి) పర్యంతామ్*
*వందే గురు పరం పరామ్॥*

# చతుర్వేదాంతర్గత

# ఉపనిషత్ ఉద్యానవనము

## (మంగళ శ్లోక - తాత్పర్య - అధ్యయన సమేతంగా)

## సంపుటి - 1 ఋగ్వేదాంతర్గత - శుక్ల యజుర్వేదాంతర్గత

**మనలో ప్రతి ఒక్కరికీ సంబంధించినట్టి రెండు విశేషములు :**

**1. ఇహరూపము :** ఈ ఎదురుగా కనిపిస్తున్న దృశ్యజగత్తుకు అంతర్గతమైనట్టిది. మధ్యలో వచ్చి-మధ్యలోనే పోయే మృత (మార్పు) స్వభావము కలిగి యున్నట్టిది. పాంచభౌతిక-దృశ్య సంబంధిత మానసిక రూపములతో కూడినట్టిది. ఇక్కడి సంగతి-సందర్భము-సంబంధములకు చెందియున్నట్లు కనిపిస్తున్నట్టిది. జగన్నాటకంలోని నాటక పాత్ర సదృశము.

**2. పరరూపము :** ఈ దృశ్య జగత్తుకు ఆవలగా (పరముగా) ఉండి, సాక్షిగా *సందర్శిస్తున్నట్టిది.* ఈ దృశ్యజగత్ వ్యవహారమంతా తనయొక్క భావనారూపముగా కలిగియున్నట్టిది. భౌతిక దేహమునకు, ఆలోచనలకు ఆధార - ప్రేరణ - ధారణ రూపమైనట్టిది. మార్పు - చేర్పులకు అతీతము కాబట్టి అమృతరూపము. 1. కల 2. కలలోనివాడు 3. కల తనదైనవాడు వలె 1. జగత్తు 2. జీవాత్మ 3. ఈశ్వరుల అఖండసారము.

మనలోని ప్రతి ఒక్కరికి సంబంధించిన సందర్భరూపమగు **"ఇహాత్మ"**-మరియు సహజము, నిత్యము అగు **"పరాత్మ"**లను విధి-విధానపూర్వకంగా విశ్లేషించి ప్రబోధించు 4 వేదములలోని ఆత్మ తత్త్వశాస్త్ర (లేక) వేదాంత శాస్త్ర మధురఫలములు-**"ఉపనిషత్తులు"**.

| | | |
|---|---|---|
| **ఉప** | = | (పరబ్రహ్మమునకు) అత్యంత - అత్యంత సమీపముగా |
| **నిషత్** | = | ఆశీనులై ఉండటము. |

→ తమయొక్క భక్తి - తపో - ధ్యాన - యోగ మార్గములలో - ఈ జీవునియొక్క వాస్తవ తత్త్వమేమిటో ఎరిగినవారై, అల్లంత దూరంగా ఉన్న మనలను సంబోధించి ప్రవచిస్తున్న తత్త్వజ్ఞుల - బ్రహ్మజ్ఞుల **జ్ఞాన - విజ్ఞాన విద్యాంశములు.**

→ ఆత్మతత్త్వ జ్ఞాన మార్గాన్వేషకులమైనపుడు మనకు ఆత్మతత్త్వజ్ఞులు ఎలుగెత్తి **"శృణ్వంతి విశ్వే అమృతస్య పుత్రః..."** అని చెప్పు మన **అమృత స్వరూప - నిరూపణ వాక్యములు.** **"తత్ త్వమ్** .... అదియే నీవు" అని గుర్తు చేయునవి.

→ ఈ 'ఇహ' స్వరూపమునకు ఆధారమై, **ఇహ స్వరూపమును** తన అంశగా కలిగియున్నట్టి మన **'పరస్వరూపము'** గురించి బోధించు **ఆప్తవాక్యములు.**

**వ్యాసాయ విష్ణురూపాయ। వ్యాసరూపాయ విష్ణవే।** శ్రీ కృష్ణ ద్వైపాయన-వ్యాస మహర్షి సర్వజగత్ జీవులపై గల అవ్యాజమైన ప్రేమతో ప్రపంచంలోని వేదవేత్తల, తత్త్వవేత్తల ఉచ్ఛ్వాసస్వరములగు, యజ్ఞ-యాగ-ఆత్మోపాసనలను తెచ్చి, క్రోడీకరించి, సంస్కరించి **(1) సంహిత (2) బ్రాహ్మణములు** (యాగ విధులు, మనో-ఉపాసనలు)గా విభజించి, 3వ విభాగముగా **బ్రహ్మతత్త్వ** ప్రవచనమగు **ఉపనిషత్తులను** అలంకరించారు. 4 వేదములలోనూ.... 1180 శాఖలలోను సంహిత-బ్రాహ్మణ-ఉపనిషత్తులు (ఆరణ్యకములు) విభజకపూర్వకంగా మనకు ప్రసాదించారు. వేదశాఖలలో చిట్ట - చివరి విభాగంగా '108' ఉపనిషత్తులు మాత్రమే మనకు ప్రస్తుతం ద్యోతకమగుచున్నాయి.

| | | |
|---|---|---|
| ఋగ్వేదము | 10 | ఉపనిషత్తులు |
| శుక్ల యజుర్వేదము | 19 | ఉపనిషత్తులు |
| కృష్ణ యజుర్వేదము | 32 | ఉపనిషత్తులు |
| సామవేదము | 16 | ఉపనిషత్తులు |
| అథర్వణవేదము | 31 | ఉపనిషత్తులు |
| | 108 | ఉపనిషత్తులు |

*ఉపనిషత్తులు → వేదాంతములు అని కూడా ప్రసిద్ధి. వేదాంతములు అనగా?*

→ వేద వాఙ్మయంలో-యజ్ఞ యాగముల మంత్రములతో కూడిన దేవతాహ్వానములు, అగ్ని కార్యములు, యాగవిధి-విధానముల తరువాత... చివర 'సత్సంగము' రూపంగా ఉపనిషత్తులు అలంకరించబడి ఉండటముచేత అవి **'వేదాంతములు'** గా చెప్పబడుచున్నాయి.

→ **వేదమ్** = తెలియబడునది, **అంతమ్** = ఆవల. ఈ ఇంద్రియములకు విషయమగుచూ ఇక్కడ తెలియబడుచున్న దాని కంతటికీ, (అంతే కాక) మనో – బుద్ధి – చిత్త – అహంకారములకు కూడా ఆవల **"తెలుసుకొనుచున్నవాడు"**గా ప్రకాశమానమగుచున్న **'స్వస్వరూపము'** గురించి ప్రస్తావిస్తూ, నిర్వచిస్తూ, అభివర్ణిస్తూ చెప్పుచుండటంచేత, తదనుభవమునకు మార్గము చూపుచూ ఉండటంచేత కూడా – **'వేదాంతములు'** అని పిలువబడుచున్నాయి.

**ఉపనిషత్తులకు రచయితలు ఎవ్వరు? శ్రోత ఎంతటి మహత్తరుడో చెప్పేవి ఉపనిషత్తులు. రచయిత ఎంతటివాడో చెప్పే ఉద్దేశ్యము కలిగి లేవు.**

ఈ జీవుని వాస్తవ – సహజ – నిత్య స్వరూపము గురించి తపో – ధ్యానములచే తెలుసుకొన్న మహనీయులే రచయితలు! అట్టి బ్రహ్మతత్త్వజ్ఞుల ఆత్మను గురించిన స్వానుభవ విశదీకరణములే **ఉపనిషత్తులు**. వారి పరిభాషణములను వినుచూ, వివేకవంతులగు శిష్యులు (లేక) శ్రోతలు **భాషారూపంగా** తీర్చిదిద్దుటచే వేద-ఉపనిషత్తులను **'శృతులు'** ..... అనికూడా అంటారు.

ఉపనిషత్తులకు 'రచయితగా' ఎవ్వరూ ఎక్కడా చెప్పబడలేదు. ***'అనుభవము' నుండియే వేదాంత శాస్త్రములగు ఉపనిషత్తులు బయల్వెడలుచున్నాయి*** – అని మాత్రం నిర్ణయించబడుతోంది. అవి అనేకమంది తపోధనుల, మహర్షుల అనుభవైకవేద్యములు. స్వానుభవముగా (As an Essence of Human Experience) రూపుదిద్దుకున్నట్టివి. స్వస్వరూప – పరాకాష్ఠ గురించిన సత్యాన్వేషకుల **"అంతిమ – అవగాహన'** (The Final Understanding). కాబట్టి ఉపనిషత్తులు అపౌరుషేయములు.

స్మృతులు = శ్రుతులలోని వాక్యములను నిరూపించు చారిత్రాత్మక దృష్టాంతములు. సోదాహరణములు. (Some Historic Practical Examples).

**ఎప్పుడు రచించబడ్డాయి?**

ఈ ఉపనిషత్తులను **'ఇది ఈ కాలమున రచించబడినది'** – అని కాల నిర్ణయం చేయడం కూడా జరుగుటలేదు. వందల – వేల సంవత్సరాలుగా ఈ భూమిపై అనేకచోట్ల వెలసిన మహనీయుల ఆశ్రమముల నుండి **గురు – శిష్య సంవాద రూపములుగా –** జలము నుండి తరంగముల వలె ..... **స్వభావసిద్ధంగా** ఉపనిషత్తులు **బయల్వెడలాయి**.

**త్రిమతాచార్యుల భాష్యములు**

శ్రీ శంకరాచార్యుల వారు, శ్రీ రామానుజుల వారు, శ్రీ మధ్వాచార్యుల వారు ప్రస్థానత్రయంలో ఒక భాగంగా '10' ఉపనిషత్తులకు భాష్యములను మానవాళికి ప్రసాదించారు. అట్లాగే ఎందరో మహానుభావులు భాష్యము, వివరణలను ఆయా కొన్ని కొన్ని ఉపనిషత్తులకు విశ్లేషణములుగా ప్రవచించారు. వాటిలో కొన్ని పఠించి ఉత్తేజితుడనై 108 ఉపనిషత్తులకు 'అధ్యయనము'ను వ్రాయాలనేది నా ఉత్సాహము! నాది 'భాష్యము' అనే ధైర్యం నాకు లేదు. అందుకే ఇందలి విశ్లేషణలకు **"అధ్యయన పుష్పములు"** గల **"ఉద్యానవనము"** అని పేరుపెట్టబడింది. అస్మత్ గురువుల – త్రిమతాచార్యుల – మహర్షుల – మత ప్రవక్తల కరుణ నాకు చేదోడు వాదోడై వెంటనంటి ఉండటము చేతనే ఇది సాధ్యమగుచున్నదని నాకు అనిపిస్తుంది. నా గురు – ప్రార్థనా ఫలములే ఈ 'అధ్యయన పుష్పముల ఉద్యాన వనము'. **"వర్తమానతరంలోని – రాబోయే తరంలోని ముముక్షువులకు ఇది ఒక పఠణ – పరిశీలనా – మోక్షసమాచార గ్రంథమగును గాక!"** – అని నా ఆత్మనివేదన!

శ్లో॥ 'ఓం' కార పంజర శుకీం, ఉపనిషత్ ఉద్యాన కలకంఠీమ్,
ఆగమ విపినమయూరీం, ఆర్యాం అతర్విభావయేత్ గౌరీమ్॥

**ఉపనిషత్తులు పఠించుటకు ఎవ్వరు అర్హులు?:** ఆత్మతత్త్వముపట్ల జిజ్ఞాస, స్వయమాత్మానుభూతి పట్ల **'మహదాశయము'** కలవారంతా **ఉపనిషత్ పఠణ – అధ్యయనములకు** అర్హులే! ఉపనిషత్తులన్నీ ప్రతి ఒక్క జీవుని స్వస్వరూపమునకు సంబంధించిన నిర్వచన – విశ్లేషణ – నిర్ధారణలతోను, అందుకు ఆశ్రయించవలసిన ప్రాణాయామ – షట్చక్రోపాసన – బ్రహ్మరంధ్ర స్పర్శ – సహస్రార యోగ మార్గబోధ – ఇత్యాది ఉపాయములతోను నిండి ఉన్నాయి. అవి ఆత్మతత్త్వ నిరూపణములు. వైద్య శాస్త్రము, సాంఘిక శాస్త్రము, భౌతిక శాస్త్రము మొ॥వి లాగానే ఈ ఉపనిషత్తులు **ఆత్మ శాస్త్రము. సోఽహమ్ శాస్త్రము! జిజ్ఞాస కలవారంతా అర్హులే!**

ఇవి "మీ మతము – మా మతము" అను ఇటువంటి పరిధులకు సంబంధించినవి కావు– అని నా భావన. అనేకమంది అభిప్రాయం కూడా! '**VEDANTHA SASTRA**' is a school of thought. Hence, it cannot be limited to a particular Religious Square. The Upanishaths emanate from Long Time Studies and Human Experiences. They are explanations to substantiate universal Truth Pertaining to Al-Present and Al-pervading ONE'S OWN SELF of everybody of us. **సర్వమత ప్రవక్తల అవ్యాజ ప్రేమ వాక్య– సారములు కూడా ఇటువంటివే అని నేను పరిశీలిస్తున్నప్పుడు నాకు అనిపిస్తుంది.**

**'నేను' ఎవరు? కోఽహమ్? తత్ త్వమ్! సోఽహమ్! త్వమేవాఽహమ్! :**

*అదియే నీవు నేను అది నీవుగా ఉన్నది నేనే!*

మనందరికి ఈ జాగ్రత్ – స్వప్న – సుషుప్తులలో కూడా అనునిత్యానుభవమై ప్రదర్శనమగుచున్న 'నేను' అనునది ఎట్టిది? ఎంతటిది? అది జాగ్రత్ పరిమితమా? దేహ పరిమితమా? దేహ–దేహాంతరములకు కూడా ఆవల గల 'కేవలసాక్షి'యా? అద్దాని ఔన్నత్యము స్వానుభవంగా అవటానికి మార్గములు ఏమేమి? ఈఈ మొదలైన వాటన్నిటికీ సమాధానములే **'ఉపనిషత్తులు'. 'స్వకీయ కల్పన – కల్పించువాడు'** ల నిర్వచనములను నిర్ద్వంద్వముగా ఉపనిషత్తులు ప్రకటిస్తున్నాయి. **దృశ్యము–దేహము–దేహి–దేహిత్వము – నాలోని నేనైన – నీవైన నేను** .... మొదలైనవన్నిటినీ కూడా **ఉపనిషత్తులు నిర్వచన – వివరణాంశములుగా కలిగియున్నాయి. "ఓ అమృతానంద స్వరూపులగు సర్వ జనులారా! ఊర్ధ్వబాహుః విరౌమ్యేష॥** చేతులెత్తి బిగ్గరగా – మీ కేవల – వాస్తవ – సహజ – నిత్య – సత్యమగు 'తత్' యొక్క విన్యాసము ఎట్టిదో మేము ఎరుగుచున్నాము! **వేదాహమేతమ్ పురుషమ్ మహాన్తమ్॥** వినండి, చెప్పుచున్నాము..... అని ఋషులు ప్రేమాస్పదులై చెప్పుచున్న ఆప్త వాక్యములతో ఉపనిషత్తులు నిండినవై ఉన్నాయి. **"నీవు నిత్యమగు ఆత్మవు. కనుక బంధమే లేదు"** – అని నిరూపించి చెప్పుచున్నాయి.

అట్టి 108 ఉపనిషత్తులను (1) మంగళ – శ్లోక (2) తాత్పర్య (3) వ్యాఖ్యానములు ఈ గ్రంథములో పొందుపరచబడుచున్నాయి. శ్లోకములను సంధులు విడదీసి వ్రాయటం, తాత్పర్య – వ్యాఖ్యానముల కొరకై సులభమగు వాడుక భాషను ఉపయోగించడం – నా యీ ప్రయత్నము. ఇది నాకు తపస్సు! ఈ జగత్తు నా ఉపాస్య వస్తువు! స్వయమాత్మ స్వరూపులగు పాఠకులు నాకు ఉపాసనా దైవస్వరూపులు! ప్రతి ఒక్కరినీ సహజ–వాస్తవ–అనునిత్య స్వస్వరూపముగా సందర్శించటమే – నాకు ఈ ఉపాసనా **ఆశయసిద్ధి.**

అట్టి 108 ఉపనిషత్తులకు **1. మంగళ శ్లోకములు 2. తాత్పర్యములు 3. అధ్యయన వివరణములు** .... 4 సంపుటములుగా మమ ఉపాసనా దైవస్వరూపులగు పాఠకుల ముందు ఉంచే సాహసము చేస్తున్నాను. మీరంతా ఉపనిషత్ ఉద్యాన కల కంఠులు. నేను ఉపనిషత్ ఉద్యానవన దేవతను అగుచున్నాము. బ్రహ్మశ్రీ గట్టి సత్యనారాయణ గుప్త గారు, ప్రార్థనా ప్రచారసంఘం, సత్యనారాయణపురం, విజయవాడ వారు మూడు భాగములుగా వ్రాసిన 108 ఉపనిషత్తులు ఈ కార్యక్రమమునకు ఎంతో సహకరించినాయి. **వారి పాద పద్మములకు నమః సుమాంజలులు.**

**మాతృ-పితృ దేవతలగు శ్రీమతి ఆదిలక్ష్మి కామేశ్వరమ్మ - శ్రీ లక్ష్మీనారాయణ గార్ల పాదపద్మములకు సాష్టాంగ దండ ప్రణామములు. చి॥సౌ॥ కనకదుర్గను జీవిత భాగస్వామిగా ప్రసాదించిన జగదీశ్వరికి భక్తిపూర్వక నమస్కారములు.**

డి.టి.పి. మరియు ముద్రణ దిగ్విజయంగా పూర్తి చేసిన చి॥ బి. సాయికుమార్, హసితా గ్రాఫిక్స్ అండ్ ప్రింటర్స్, ఏలూరు, సెల్ : 9704275472 మరియు కవర్ పేజి డిజైన్ చేసిన చి॥ పి. సుబ్రహ్మణ్యం, అరవింద గ్రాఫిక్స్, ఏలూరు-వీరికి నా హృదయ పూర్వక ఆశీస్సులు. వారికి ఎల్లప్పుడు శుభములు కలుగును గాక! వారి గృహంలో చిన్ని కృష్ణయ్య వెన్నదొంగై సదా-సర్వదా అడుగులిడును గాక!

మొదటి పాఠకులగుచూ, అక్షర దోషనివారణకై సహకరించుచున్న **బ్ర॥శ్రీ బి. రామబ్రహ్మం** (రిటైర్డ్ జనరల్ మేనేజర్, ఆంధ్రాబ్యాంకు) 0866-2552871 గార్కి కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

1 వ సంపుటము - ఋగ్వేద-శుక్ల యజుర్వేదములలోని 28 ఉపనిషత్తులు.

2 వ సంపుటము - కృష్ణయజుర్వేదములోని 32 ఉపనిషత్తులు

3 వ సంపుటము - సామవేదములో 15 + అథర్వణవేదములోని 20 ఉపనిషత్తులు

4 వ సంపుటము - అధర్వణవేదము 11 ఉపనిషత్తులు+శుక్లయజుర్వేదములోని బృహదారణ్యకోపనిషత్+సామవేదములోని ఛాందోగ్యోపనిషత్

సర్వాంతర్యామి, సర్వస్వరూపుడు అగు పరమాత్మకు ఇదంతా నా హృదయపూర్వక పూజా పుష్పములు. ఈ జగత్తే జనని. అట్టి జగజ్జనని - జగదీశ్వరులగు పార్వతీ పరమేశ్వరులకు పాదపద్మములను అస్మత్ సర్వస్వము పూజాపుష్పమై చేరియుండును గాక!

- ప్రపంచమంతా శాంతి వెల్లివిరియును గాక! అందుకొరకై కర్మయోగ - వైరాగ్య - క్రియా యోగ - భక్తియోగ - జ్ఞాన యోగములు సర్వే సర్వత్రా ప్రవృద్ధమానమగుచుండును గాక!
- సర్వేజనాః సుఖినో భవంతు!
- పరస్పర అవగాహన - ఐక్యమత్యములు వెల్లి విరియును గాక!
- శంనో అస్తు ద్విపదే। శం చతుష్పదే।

ఓం శాంతిః శాంతిః శాంతిః।


⌘

**యేలేశ్వరపు హనుమ రామకృష్ణ** B.Com., C.A.I.I.B.,
(Retd, Chief Manager - Andhra Bank)
D.No. 2/8, Siva Temple Street, Kuchipudi - 521 136 Krishna Dist. A.P. India
cell : 9247105392 land : 08671 - 251164

ఓం నమో బ్రహ్మాదిభ్యో, బ్రహ్మవిద్యా సంప్రదాయ కర్తృభ్యో
వంశ ఋషిభ్యో, మహద్భ్యో గురుభ్యోం నమః ।
కాలే వర్షతు పర్జన్యే। పృథివీ సస్యశాలినీ। దేశోయమ్ క్షోభ రహితో। బ్రాహ్మణాః సంతు నిర్భయాః॥

# PRAYER

**(VISWAKAVI RAVINDRA NATH TAGORE - GITANJALI)**



***Where the mind is without fear***
***and the head is held high,***
***Where the knowledge is free,***
***Where the world has not been***
***broken up into tiny fragments***
***by narrow domestic walls,***
***Where words come out from the depth of Truth,***
***Where tireless striving stretches***
***its arms towards perfection,***
***Where the clear stream of Reason***
***has not lost its way***
***into the dreary desert sand of dead habit,***
***Where the mind is led forward by THEE***
***into ever-widening Thought and Action,***
***Into that Heaven of freedom, My FATHER!***
***Let my Country Awake!***

ఓం స్వస్తి ప్రజాభ్యః, పరిపాలయంతామ్ న్యాయేన మార్గేణ మహిమ్ మహీశామ్
గో బ్రాహ్మణ్యేభ్యః సుఖినో భవంతు। లోకాం సమస్తాం శుభమస్తు నిత్యమ్।

# విషయ సూచిక

ఋగ్వేదాంతర్గత


| | | | |
|---|---|---|---|
| 1. | అక్షమాలికోపనిషత్ | ..... | 1-15 |
| 2. | ఆత్మబోధోపనిషత్ | ..... | 16-31 |
| 3. | ఐతరేయోపనిషత్ | ..... | 32-50 |
| 4. | కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్ | ..... | 51-110 |
| 5. | త్రిపురోపనిషత్ | ..... | 1-15 |
| 6. | నాదబిందూపనిషత్ | ..... | 1-15 |
| 7. | నిర్వాణోపనిషత్ | ..... | 1-15 |
| 8. | బహ్వృచోపనిషత్ | ..... | 1-15 |
| 9. | ముద్గలోపనిషత్ | ..... | 1-15 |
| 10. | సౌభాగ్య లక్ష్మ్యుపనిషత్ | ..... | 1-15 |


శుక్లయజుర్వేదాంతర్గత


| | | | |
|---|---|---|---|
| 1. | అద్వయతారకోపనిషత్ | ..... | 1-15 |
| 2. | అధ్యాత్మోపనిషత్ | ..... | 1-15 |
| 3. | ఈశావాస్యోపనిషత్ | ..... | 1-15 |
| 4. | జాబాలోపనిషత్ | ..... | 1-15 |
| 5. | తారసారోపనిషత్ | ..... | 1-15 |
| 6. | తురీయాతీతోపనిషత్ | ..... | 1-15 |
| 7. | త్రిశిఖిబ్రాహ్మణోపనిషత్ | ..... | 1-15 |
| 8. | నిరాలంబోపనిషత్ | ..... | 1-15 |
| 9. | పరమహంసోపనిషత్ | ..... | 1-15 |
| 10. | పైంగలోపనిషత్ | ..... | 1-15 |
| 11. | భిక్షుకోపనిషత్ | ..... | 1-15 |
| 12. | మండలబ్రాహ్మణోపనిషత్ | ..... | 1-15 |
| 13. | మంత్రికోపనిషత్ | ..... | 1-15 |
| 14. | ముక్తికోపనిషత్ | ..... | 1-15 |
| 15. | సుబాలోపనిషత్ | ..... | 1-15 |
| 16. | యాజ్ఞవల్క్యోపనిషత్ | ..... | 1-15 |
| 17. | శాట్యాయన్యుపనిషత్ | ..... | 1-15 |
| 18. | హంసోపనిషత్ | ..... | 1-15 |


ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 1 అక్షమాలికోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## మంగళశ్లోక - తాత్పర్య పుష్పము



**ఓం**

ఓం కార రూప పరబ్రహ్మమునకు నమస్కరిస్తూ!

**అథ ప్రజాపతిః గుహమ్ పప్రచ్ఛ,**

ఒకానొక సందర్భములో ప్రజాపతి భగవంతుడగు కుమారస్వామితో సత్సంగ పూర్వకంగా సంభాషిస్తూ ఇట్లు పరిప్రశ్నించసాగారు.

**"భో బ్రహ్మన్ । అక్షమాలాభేద విధిమ్ బ్రూహి" । - ఇతి**

భో బ్రహ్మన్! భగవన్! కుమారస్వామీ! ఇప్పుడు అక్షమాల యొక్క భేదవిధి - అంతరార్ధ వివరణ ఏమిటో వివరించి చెప్పమని అర్థిస్తున్నాను.

**"సా కిం లక్షణా? కతి భేదా?**

అక్షమాల యొక్క లక్షణములు ఏమి? అవన్నీ ఎన్ని విధములైనవి?

**అస్యాః కాని సూ(మా)త్రాణి?**

ఎన్ని సూత్రములు (దారములు)తో ఏఏ ఆకారములుగా నిర్మించబడాలి?

**కథం ఘటనా ప్రకారః?**

గ్రుచ్చి ఉంచటం ఎట్లా? ఏమేమి రంగులు ఉంటాయి?

**కే వర్ణాః? కా ప్రతిష్ఠా?**

అర్ధాని అధి దేవతలు ఎవరు?

**క ఏష అధి దేవతా? కిం ఫలం చ? ఇతి ।"**

అర్ధాని ఉపాసనా విధి - ప్రయోజనములు, ఫలితములు ఎట్టివి?

**తం గుహః ప్రత్యువాచ:**

**అప్పుడు బ్రహ్మవిద్యా విశారదుడు, శివపుత్రుడు అగు కుమారస్వామి ప్రజాపతికి ఇట్లు వివరించారు.**

**ప్రవాళ మౌక్తిక స్ఫటిక శంఖ రజత అష్టాపద చందన పుత్రజీవిక అబ్జ రుద్రాక్షా ఇతి।**

అక్షమాల ముఖ్యముగా 10 విధములైనవిగా లోక ప్రసిద్ధము.

1. పగడములు 2. ముత్యములు 3. స్ఫటికములు 4. శంఖములు 5. వెండి 6. బంగారము 7. మంచి గంధము 8. పుత్రజీవిక 9. తామరగింజలు 10. రుద్రాక్షలు.

వీటిలో ఏ ఒక్కటిచే నిర్మితమైనప్పటికీ ఆ మాల శ్రేష్ఠమే!

**ఆది-క్షాంత మూర్తిః।**

అక్ష - "అ నుండి క్ష" వరకు సంజ్ఞగా కలిగి ఉండటంచేత అక్షమాలను **ఆదిక్షాంతమూర్తి - మూర్తీభవించిన అకారాది క్షకారాంత సర్వతత్త్వ స్వరూపిణి** .... అని అభివర్ణిస్తున్నారు.

**సావధాన భావా,**

**సౌవర్ణం రాజతం తామ్రం చేతి సూత్రత్రయమ్।**

తద్వివరే సౌవర్ణమ్।
తత్ అక్షపార్శ్వే – రాజతమ్ ।
తత్ వామే తామ్రం।
తత్ ముఖే ముఖమ్ ।
తత్ పుచ్ఛే పుచ్ఛమ్ ।
తదంతర – ఆవర్తన క్రమేణ యోజయేత్ ।

అక్ష = అకార 'ఆది' - 'క్ష'కార 'అంత' సర్వస్వరూపిణి!
అక్షలు + మాల = అక్షమాల. మాల = 3 సూత్రములు
బంగారము - వెండి - రాగి సూత్రములు 3.
అక్షమాల యొక్క పూసలు గుచ్చే మాలా-సూత్రపు దారములలో.....
- అక్ష రుద్రముల రంధ్రముల నుండి బంగారు దారము,
- కుడివైపుగా వెండి దారము,
- ఎడమవైపుగా రాగిదారములతో గ్రుచ్చుతున్నారు. అక్ష యొక్క పైభాగము పైకి, క్రింద భాగము క్రిందకి వెనుక భాగము వెనుకకు ఉండునట్లుగా అక్షమాలను తయారు చేసుకుంటున్నారు.

---

2. యత్ అస్య అంతరం సూత్రం తత్ 'బ్రహ్మ' ।
యత్ అక్ష పార్శ్వే తత్ 'శైవమ్' ।
యత్ వామే తత్ 'వైష్ణవమ్' ।
యత్ ముఖమ్, సా 'సరస్వతీ' ।
యత్ పుచ్ఛమ్, సా 'గాయత్రీ' ।
యత్ సుషిరమ్ సా 'విద్యా' ।
యా గ్రంథిః సా 'ప్రకృతిః' ।
యే స్వరాః తే ధవళాః
యే స్పర్శాః తే పీతాః ।
యే పరాః తే రక్తాః ।
అథ తాం పంచభిః గంధైః అమృతైః,
పంచభిగవ్యైః తనుభిః
శోధయిత్వా, పంచభిః గవ్యైః
గంధోదకేన సంస్నాప్య,

లోపల ఉన్న సూత్రము - **బ్రహ్మ సూత్రము** గాను
కుడివైపు సూత్రపు దారము **శివతత్త్వము - శైవము** గాను,
ఎడమవైపు సూత్రపు దారమును **విష్ణుతత్త్వము - వైష్ణవము**గాను,
అక్షమాల యొక్క ముఖ భాగమును **బ్రహ్మవిద్యా ప్రసాదిని అగు సరస్వతీ దేవి**గాను,
అక్షమాల యొక్క అక్షల వెనుక (పుచ్ఛ) భాగమును **గాయత్రీ దేవి**గాను,
అక్షమాల - రంధ్ర స్థానము (సుషిరము) **విద్యా రూపము** గాను,
గ్రంధిని (ముడులను) **ప్రకృతి** రూపముగాను,
తెల్లని అక్షలను **స్వరములు**గాను, (అ-అఃవరకు గల అచ్చులు గాను)
పసుపు పచ్చనిరంగు అక్షలను **స్పర్శములు** (క నుండి మ వరకు **కకారాది-మకారాంత-హల్లులు**) గాను,
ఎర్రని రంగు అక్షలను తక్కిన **యకారాది - క్షకారాంత హల్లులు**గాను,
**భావన చేసి అక్షలు అమర్చుకోవాలి.**

అటు తరువాత ఆ అక్షమాలను పంచగంధములతోను, పంచామృతములతోను, పంచగవ్యములతోను, పంచ తనువులతోను శోధించాలి. రుద్దాలి. శుభ్రం చేయాలి. (పంచ గవ్యములు = గోమూత్రము, గోపేడ, గోవుపాలు, గోపెరుగు, గోనెయ్యి)
(పంచామృతములు - ఉదకము, పాలు, పెరుగు, నేయి, తేనె)
- పంచ గవ్యములతోను, పంచ గంధములతోను తడిపి సంస్నాప్యము చేయాలి.

తస్మాత్ స 'ఓం' కారేణ
పత్ర కూర్చేన స్నపయిత్వా,
అష్టభిః గంధైః ఆలిప్య
సుమనః స్థలే నివేశ్య,

- ఓంకారోచ్చారణచేస్తూ ఆకుల-కుంచె (కూర్చ)తో తుడవాలి. స్నపనం చేయాలి.
- అష్ట గంధములతో (కర్పూరము, కస్తూరి, పునుగు, జవ్వాజి, అగరు, పన్నీరు, అత్తరు, శ్రీగంధము)తో పూత పూయాలి. మనస్సుకు ఆనందం కలిగించే తీరుగా - అమర్చుచూ, పుష్పములపై ఉంచాలి.

---

అక్షత పుష్పైః ఆరాధ్య,
ప్రత్యక్షమ్ ఆది–క్షాంతైః వర్ణైః భావయేత్।

అక్షమాలకు పుష్పాలంకరణ చేసి అక్షతలతోను, పుష్పములతోను పూజించాలి.
అట్లా పూజిస్తూ, "ఈ అక్షమాల యొక్క అక్షలు- 'అ'కారమునుండి 'క్ష' కారము వరకు గల వర్ణములు-ఆధ్యాత్మిక ప్రత్యక్ష రూపములు" - అని భావన చేయాలి. పరమాత్మ స్వరూపంగా సంభావించాలి! ఒక్కొక్క అక్షతను శబ్ద-అర్థభావ పూర్వకంగా ఈవిధంగా గంధ పుష్పాలతో పూజించాలి.

**ఓం "అం" కార మృత్యుంజయ సర్వవ్యాపక**
**ప్రథమే అక్షే ప్రతితిష్ఠ ! (1)**
**(ప్రతితిష్ఠ = శాశ్వతముగా నిలుపబడునది)**

**ఓం "ఆం" కార ఆకర్షణాత్మక సర్వగత**
**ద్వితీయే అక్షే ప్రతితిష్ఠ ! (2)**

**ఓం "ఇం" కార పుష్టిద-అక్షోభకర**
**తృతీయే అక్షే ప్రతితిష్ఠ ! (3)**

**ఓం "ఈం" కార వాక్ ప్రసాదకర నిర్మల**
**చతుర్థే అక్షే ప్రతితిష్ఠ ! (4)**

**ఓం "ఉం" కార సర్వబలప్రద సారతర**
**పంచమే అక్షే ప్రతితిష్ఠ ! (5)**

**ఓం "ఊం" కార ఉచ్చాటనకర దుస్సహ**
**షష్ఠే అక్షే ప్రతితిష్ఠ ! (6)**

**ఓం "ఋం" కార సంక్షోభకర చంచల**
**సప్తమే అక్షే ప్రతితిష్ఠ ! (7)**

**ఓం "ౠం" కార సంమోహనకర – ఉజ్వల**
**అష్టమే అక్షే ప్రతితిష్ఠ ! (8)**

**ఓం "ఌం" కార – విద్వేషణకర మోహక**
**నవమే అక్షే ప్రతితిష్ఠ! (9)**

**ఓం "ౡం" కార మోహకర**
**దశమే అక్షే ప్రతితిష్ఠ ! (10)**

**ఓం "ఏం" కార సర్వవశ్యకర శుద్ధసత్వ**
**ఏకాదశే అక్షే ప్రతితిష్ఠ ! (11)**

**ఓం "ఐం" కార శుద్ధసాత్త్విక పురుష వశ్యకర**
**ద్వాదశే అక్షే ప్రతితిష్ఠ ! (12)**

**ఓం "ఓం" కార అఖిల వాఙ్మయ నిత్యశుద్ధ**
**త్రయోదశే అక్షే ప్రతితిష్ఠ! (13)**

**ఓం "ఔం" కార సర్వ వాఙ్మయ వశ్యకర**
**చతుర్దశే అక్షే ప్రతితిష్ఠ ! (14)**

## అక్షపూజ

ఓం-అమ్.. కారా! ఓ మృత్యుంజయా! సర్వ వ్యాపకా! ప్రథమ అక్షా! మిమ్ములను స్థాపిస్తూ పూజిస్తున్నాను. ప్రతితిష్ఠ! వేంచేసి సుఖాశీనులవండి!

ఓం-ఆమ్.. కారా! ఓ సర్వాకర్షణాత్మకా! సర్వగతా! ద్వితీయాక్షాయ నమః ప్రతితిష్ఠ!

ఓం-ఇమ్.. కారా! పుష్టిప్రదాతా! సర్వ క్షోభములు తొలగించే తృతీయ అక్షాయ నమః । ప్రతితిష్ఠ!

ఓం-ఈమ్.. కారా! సర్వబల ప్రదాతా! సారతర స్వరూపా! చతుర్థాక్షాయ నమః । ప్రతితిష్ఠ !

ఓం-ఉమ్.. కారా! నిర్మలమైన వాక్కు, మనస్సు ప్రసాదించే చతుర్థాక్షాయ నమః । ప్రతితిష్ఠ

ఓం-ఊమ్.. కారా! ఉచ్చాటనశక్తి ప్రదాతా! సర్వమునూ ప్రకటించు స్వామీ! శత్రువులకు సహించరాని శబ్దశక్తి ప్రదాతా! ఆరవ అక్షా! నమో నమః ! వేంచేసి సుఖాసీనులయ్యెదరు గాక! ప్రతితిష్ఠ !

ఓం-ఋమ్.. కారా! యుద్ధములో వేగవంతమైన చంచలము, సంక్షోభకరము అగు శక్తితో విజయము ప్రసాదించు సప్తమాక్షా! నమోనమః! ప్రతిష్ఠితులయ్యెదరు గాక!

ఓం-ౠమ్.. కారా! యుద్ధభూమిలో శత్రువులకు సంమోహనమును కలగజేయగల, ఉజ్వలత్వము ప్రసాదించు అష్టమాక్షా! ప్రతిష్ఠితులవ్వండి!

ఓం-ఌమ్.. కారా! యుద్ధోత్సాహము, విద్వేషకర- మోహము కలుగ (తొలుగ) జేయునది అగు నవమ అక్షే నమః ! ప్రతితిష్ఠ!

ఓం-ౡమ్.. కార! సర్వమును మోహింపజేయ స్వామీ! పదవ అక్షా! ప్రతిష్ఠితులయ్యెదరు గాక!

ఓం-ఏమ్.. కార! శుద్ధ సాత్విక స్వరూపులు, సర్వవశ్యకరులు అగు 11వ అక్షే! పతితిష్ఠ! నమో నమః !

ఓం-ఐమ్.. కార! శుద్ధ సాత్విక పురుష స్వరూపులు, సర్వవశంకరులు అగు 12వ అక్షే! త్వమ్ ప్రతితిష్ఠ! నమోనమః !

ఓం-ఓమ్.. కార! అఖిల వాఙ్మయ స్వరూపులు, నిత్య శుద్ధ స్వరూపులు అగు 13వ అక్షే! ప్రతితిష్ఠులవండి!

ఓం-ఔమ్.. కార! సర్వ వాఙ్మయమును వశ్యకరం చేయు, పాండిత్యము ప్రసాదించు 14వ అక్షే! ప్రతితిష్ఠ !

ఓం "అం" కార గజాది వశ్యకర మోహన
పంచదశే అక్షే ప్రతితిష్ఠ ! (15)

ఓం-అం.. కార! ఏనుగు మొదలైనవి వశముచేయు (ఏనుగువంటి వారిని వశము చేయు) - మోహనకరము అగు 15వ అక్షే! ప్రతితిష్ఠ !

ఓం "అః" కార మృత్యునాశకర రౌద్ర
షోడశే అక్షే ప్రతితిష్ఠ ! (16)

ఓం-అః.. కార! రౌద్ర రూపియై, మృత్యుముఖమునుండి కూడా రక్షించునది అగు 16వ అక్షమాతా! ప్రతితిష్ఠ !

ఓం "కం" కార సర్వవిషహర కల్యాణద
సప్తదశే అక్షే ప్రతితిష్ఠ ! (17)

ఓం-కమ్.. కార! సర్వవిషమ స్థితులనుండి, గతుల నుండి వాటిని తొలగించి కాపాడు కళ్యాణప్రదమగు 17వ అక్ష! ప్రతితిష్ఠ!

ఓం "ఖం" కార సర్వక్షోభకర వ్యాపక
అష్టాదశే అక్షే ప్రతితిష్ఠ ! (18)

ఓం-ఖమ్.. కార! సర్వమును క్షోభింపజేయగల, వ్యాపకత్వ ప్రసాదకరము అగు 18వ అక్షను ప్రతితిష్ఠిస్తున్నాము.

ఓం "గం" కార సర్వవిఘ్నశమన మహత్తర
ఏకోనవింశే అక్షే ప్రతితిష్ఠ ! (19)

ఓం-గమ్.. కార! సర్వ విఘ్నములను శమింపజేయు, మహత్తరత్వము ప్రసాదించునదిగా 19వ అక్షను ప్రతితిష్ఠిస్తున్నాము.

ఓం "ఘం" కార సౌభాగ్యద స్తంభనకర
వింశే అక్షే ప్రతితిష్ఠ ! (20)

ఓం-ఘమ్.. కార! సౌభాగ్యప్రదము, వ్యతిరేక శక్తులను స్తంభింపజేయునదిగా 20వ అక్షను పూజిస్తున్నాము.

ఓం "ఙం" కార సర్వ విషనాశకర ఉగ్ర
ఏకవింశే అక్షే ప్రతితిష్ఠ ! (21)

ఓం-ఙమ్.. కార! సర్వ విషములను నశింపజేయునది, ఉగ్రమైనదిగా, ఉత్సాహముగా చేయునదిగా 21వ అక్షను ఆస్వాదించుచూ, ఉపాసిస్తున్నాము.

ఓం "చం" కార అభిచారఘ్న క్రూర
ద్వావింశే అక్షే ప్రతితిష్ఠ! (22)

ఓం-చమ్.. కార! అభిచారములను (హానిచేయు హోమము ఇత్యాదుల) దోషములను) నిరోధించునదిగాను 22వ అక్షను ప్రార్థిస్తూ స్థాపిస్తున్నాను.

ఓం "ఛం" కార భూతనాశకర భీషణ
త్రయోవింశే అక్షే ప్రతితిష్ఠ ! (23)

ఓం-ఛమ్.. కార! భూత తత్త్వములను అధిగమింపజేయునది, భీషణము అగు 23వ అక్షను ప్రతితిష్ఠిస్తున్నాము.

ఓం "జం" కార కృత్యాదినాశకర దుర్ధర్ష
చతుర్వింశే అక్షే ప్రతితిష్ఠ ! (24)

ఓం-జమ్.. కార! కృత (కర్మ), అకృత (కర్మల) దోషములను నశింపజేయు (అతీతుని చేయు), ఇతరుల కర్మలకు అలభ్యము- దర్శము అగు 24వ అక్షను ప్రతితిష్ఠిస్తున్నాము.

ఓం "ఝం" కార భూత నాశకర
పంచవింశే అక్షే ప్రతితిష్ఠ ! (25)

ఓం-ఝమ్.. కార! భౌతిక పరిమిత భావ శృంఖలములను (బేడీలను) త్రెంచివేయు భూత నాశకరమగు 25వ అక్షను ప్రతితిష్ఠించి ఆరాధిస్తున్నాము.

ఓం "ఞం" కార మృత్యు ప్రమథన
షడ్వింశే అక్షే ప్రతితిష్ఠ ! (26)

ఓం-ఞమ్.. కార! మృత్యువుయొక్క విచారణచే మృత్యువును అధిగమించి అమృతత్వము చేర్చునదిగా 26వ అక్ష ప్రతితిష్ఠితమగు గాక!

ఓం "టం" కార సర్వ వ్యాధిహర సుభగ
సప్తవింశే అక్షే ప్రతితిష్ఠ ! (27)

ఓం-టమ్.. కార! సర్వవ్యాధులను హరించు, భాగ్యవంతముగా తీర్చిదిద్దు 27వ అక్ష ప్రతితిష్ఠమగు గాక!

ఓం "ఠం" కార చంద్రరూప
అష్టావింశే అక్షే ప్రతితిష్ఠ ! (28)

ఓం-ఠమ్.. కార! ఓషధ-అమృతరస ప్రసాదియగు చంద్ర రసరూపముగా 28వ అక్ష ప్రతిష్ఠితమగు గాక!

ఓం "డం" కార గరుడాత్మక విషఘ్న శోభన
ఏకోనత్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (29)

ఓం-డమ్.. కార! గరుడాత్మకమై విషత్వము తొలగించు 29వ అక్షను ప్రతితిష్ఠించు చున్నాము.

ఓం "ఢం" కార సర్వ సంపత్ప్రద సుభగ
త్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (30)

ఓం-ఢమ్.. కార! సర్వసంపదలను ప్రసాదించు, భాగ్యవంతవము అయినదిగా 30వ అక్ష ప్రతితిష్ఠిస్తున్నాము.

| | |
|---|---|
| ఓం "ణం" కార సర్వసిద్ధిప్రద మోహకర<br>ఏకత్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (31) | ఓం-ణమ్.. కార! సర్వ ఆశయములను సిద్ధింపజేయునది, మోహనకరము అగు 31వ అక్షను ప్రతితిష్ఠిస్తున్నాము. |
| ఓం "తం" కార ధనధాన్యాది సంపత్‌ప్రద ప్రసన్న<br>ద్వాత్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (32) | ఓం-తమ్.. కార! ధన-ధాన్య-సంపదలను ప్రసాదించునది, ప్రసన్న స్వరూపిణిగా, 32వ అక్షను ప్రతితిష్ఠించి పూజిస్తున్నాము. |
| ఓం "థం" కార ధర్మప్రాప్తికర నిర్మల<br>త్రయస్త్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (33) | ఓం-థమ్.. కార! ధర్మముపట్ల శ్రద్ధను ప్రాప్తింపజేయునదిగా, బుద్ధిని నిర్మలము చేయునదిగా 33వ అక్షను ప్రతితిష్ఠించి పూజిస్తున్నాము. |
| ఓం "దం" కార పుష్టివృద్ధికర ప్రియదర్శన<br>చతుస్త్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (34) | ఓం-దమ్.. కార! పుష్టిను వృద్ధిఇచ్చు, ప్రియదర్శనమును ప్రసాదించు 34వ అక్ష ఆరాధిస్తున్నాము. |
| ఓం "ధం" కార విషజ్వరఘ్న విపుల<br>పంచత్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (35) | ఓం-ధమ్.. కార! విషజ్వరమును తొలగించు, బుద్ధిని విస్తారము చేయు 35వ అక్షను ప్రతితిష్ఠించి సేవిస్తున్నాము. |
| ఓం "నం" కార భుక్తి-ముక్తి ప్రద శాంత<br>షట్త్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (36) | ఓం-నమ్.. కార! భుక్తి-ముక్తి ప్రదము, పరమశాంత రూపము అగు 36వ అక్ష ప్రతితిష్ఠితమగు గాక! |
| ఓం "పం" కార విషవిఘ్ననాశన, భవ్య<br>సప్తత్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (37) | ఓం-పమ్.. కార! విషముతో సమానమైన విఘ్నములను తొలగించుచూ సంరక్షించు 37వ అక్షను పూజిస్తున్నాము. |
| ఓం "ఫం" కార అణిమాది సిద్ధిప్రద జ్యోతీరూప<br>అష్టత్రింశే అక్షే ప్రతితిష్ఠ ! (38) | ఓం-ఫమ్.. కార! అణిమాది అష్ట (8) సిద్ధులను ప్రసాదించునదిగా, జ్యోతి స్వరూపముగా 38వ అక్షను ప్రతితిష్ఠించి నమస్కరిస్తున్నాము. |
| ఓం "బం" కార సర్వదోషహర శోభన<br>ఏకోనచత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (39) | ఓం-బమ్.. కార! సర్వదోషములను హరించునదిగా, శోభను ప్రసాదించునదిగా 39వ అక్షను ప్రతితిష్ఠితం ! |
| ఓం "భం" కార భూతశాంతికర భయానక<br>చత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (40) | ఓం-భమ్.. కార! భూత శాంతికరముగాను, దుష్టబుద్ధులకు భయానకముగాను 40వ అక్ష ప్రతితిష్ఠితము అగుగాక! |
| ఓం "మం" కార విద్వేషి మోహనకర<br>ఏక చత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (41) | ఓం-మమ్.. కార! విద్వేషి-మోహనకరముగాను, 41వ అక్షను ప్రతితిష్ఠిస్తున్నాము. |
| ఓం "యం" కార సర్వవ్యాపక పావన<br>ద్విచత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (42) | ఓం-యమ్.. కార! సర్వ వ్యాపకము, సర్వమును పావనము-పవిత్రము చేయునది అగు 42వ అక్షము ప్రతితిష్ఠిస్తున్నాము. |
| ఓం "రం" కార దాహకర వికృత<br>త్రిచత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (43) | ఓం-రమ్.. కార! దాహకరము, ప్రకృతికి వేరై, నామరూపాత్మకము-వికృతము అగు 43వ అక్షను ప్రతితిష్ఠిస్తున్నాము. |
| ఓం "లం" కార విశ్వంభర భాసుర<br>చతుశ్చత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (44) | ఓం-లమ్.. కార! విశ్వమును భరించునదిగాను, సర్వమును ప్రకాశింపజేయునదిగాను 44వ అక్షను ప్రతితిష్ఠిస్తున్నాము. |
| ఓం "వం" కార సర్వాప్యాయనకర నిర్మల<br>పంచచత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (45) | ఓం-వమ్.. కార! సర్వమును ఆప్యాయకరముగా చేయునదిగాను, హృదయము నిర్మలము చేయునదిగా 45వ అక్షను నిలుపుచున్నాము. |
| ఓం "శం" కార సర్వఫలప్రద పవిత్ర<br>షట్చత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (46) | ఓం-శమ్.. కార! సర్వఫలప్రదముగాను, పవిత్రముగాను 46వ అక్షను భావ నిశ్చలము చేస్తున్నాము. |
| ఓం "షం" కార ధర్మార్థకామద ధవళ<br>సప్తచత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (47) | ఓం-షమ్.. కార! ధర్మ-అర్థ-కామ ప్రదముగాను, ధగధగాయ మానము అగు, 47వ అక్షను సుస్థిరీకజేస్తున్నాము. |

| | |
|---|---|
| **ఓం "సం" కార సర్వకారణ సార్వవర్ణికా<br>అష్టచత్వారింశే అక్షే ప్రతితిష్ఠ ! (48)** | ఓం-సమ్.. కార! సర్వకారణ కారణముగాను, సర్వ వర్ణములతో ప్రకాశించునదిగాను, 48వ అక్షను స్థాపన చేస్తున్నాము. |
| **ఓం "హం" కార సర్వవాఙ్మయ నిర్మల<br>ఏకోఽన పంచాశత్ అక్షే ప్రతితిష్ఠ ! (49)** | ఓం-హమ్.. కార! సర్వ వాఙ్మయ స్వరూపముగాను 49వ అక్షను ప్రతిక్షేపిస్తున్నాము. |
| **ఓం "ళం" కార సర్వశక్తిప్రద ప్రధాన<br>పంచాశత్ అక్షే ప్రతితిష్ఠ ! (50)** | ఓం-ళమ్.. కార! సర్వశక్తిప్రదము, ప్రధానముగాను 50వ అక్ష స్థాపించుచున్నాము. |
| **ఓం "క్షం" కార పరాపరత్వ జ్ఞాపక<br>పరజ్యోతి రూప శిఖామణౌ ప్రతితిష్ఠ ! (51)** | ఓం-క్షమ్.. కార! పరమునకు ఆవలగల పరాపరత్వమును జ్ఞాపకము చేయునది గాను, పరంజ్యోతి స్వరూపముగాను భావనా ప్రతిష్ఠితము చేస్తున్నాము. |

**అథ ఉవాచ :**

**యే దేవాః పృథివి ఈషదః, తేభ్యో ....**
**నమో భగవంతో అనుమదంతు ।**
**శోభాయై పితరో అనుమదంతు ।**
**శోభాయై జ్ఞానమయీమ్**
**అక్షమాలికామ్ ।**

జగద్గురవగు, కుమారస్వామి మరల ఇట్లా చెప్పసాగారు! ఈవిధముగా అక్షమాలను అక్షములతో ప్రతితిష్ఠము చేసిన తరువాత, ఇట్లా ప్రార్థించాలి **“ఏఏ దేవతలు ఈ భూమినంతా వేంచేసి ఉన్నారో భగవంత స్వరూపులగు వారందరికీ నమస్కారము! మా ఈ ఉపాసన - ఆరాధనలను అనుమతించెదరు గాక! శోభను, సౌందర్యమును మా యీ కార్యక్రమమునకు ఇచ్చెదరు గాక! భూమిపై వేంచేసియున్న పితృదేవతలు అనుమదిస్తూ, ప్రసాదించుదురు గాక! ఈ అక్షమాలిక శోభతో జ్ఞానమయమై ప్రకాశించును గాక!”**

**అథ ఉవాచ :**

**యే దేవా అంతరిక్షసత్ తేభ్య**
**ఓం నమో భగవంతో అనుమదంతు ।**
**శోభాయై పితరో అనుమదంతు ।**
**శోభాయై జ్ఞానమయీమ్**
**అక్షమాలికామ్ ।**

ఏఏ దేవతలు **అంతరిక్షమునందు** వేంచేసియున్నారో, వారందరికి నమస్కరిస్తున్నాము. ఈ అక్షమాలికోపాసనకు అనుమతి ప్రసాదించ వేడుకొనుచున్నాము.

అంతరిక్షములోని **పితృదేవతలు** శోభకై ఈ అక్షములను అంగీకరించెదరు గాక! శోభతో జ్ఞానమయమై ఈ అక్షమాల మాపట్ల ప్రకాశించును గాక!

**అథ ఉవాచ**

**యే దేవా దివిషదః**
**తేభ్యో నమో భగవంతో అనుమదంతు ।**
**శోభాయై పితరో అనుమదంతు ।**
**శోభాయై జ్ఞానమయీమ్**
**అక్షమాలికామ్ ।**

ఏఏ దేవతలు **స్వర్గ (దివ్య)** లోకములో అవస్థితులై ఉన్నారో... వారందరికీ నమస్కరిస్తున్నాము. వారు ఈ అక్షమాలను అనుమదించెదరు గాక! అంగీకరించెదరు గాక! దివ్యలోకాలలోని పితరులు అనుమోదించి శోభాయమానముగా ఈ అక్షమాలను శోభింపజేసెదరు గాక!

ఈ అక్షమాల శోభాయమానమై, జ్ఞానమయమై మా పట్ల వెలుగొందును గాక!

**అథ ఉవాచ**

**యే మంత్రా యా విద్యాః**
**తేభ్యో నమఃతాభ్యశ్చ**
**ఓం నమస్తః శక్తిః**
**అస్యాః ప్రతిష్ఠాపయతి ।**

ఈ భూమిపై ప్రకాశించుచున్న సర్వ మంత్ర దేవతలకు, సర్వ విద్యా దేవతలకు నమస్కరిస్తున్నాము. ఓ మంత్ర దేవతలారా! విద్యా దేవతలారా! మీమీ శక్తులను ఈ అక్షమాలయందు ప్రతిష్ఠింపజేయ వలసినదిగా ప్రార్థిస్తున్నాము. అర్థిస్తున్నాము.

**అథ ఉవాచ**

**యే బ్రహ్మ-విష్ణు-రుద్రాః**
**తేభ్యః సగుణేభ్య**
**ఓం నమః**
**తత్ వీర్యమ్**
**అస్యాః ప్రతిష్ఠాపయతి ।**

సగుణతత్త్వ స్వరూపులగు త్రిమూర్తులారా! బ్రహ్మ విష్ణు మహేశ్వరులారా! మీకు నమస్కరిస్తున్నాము. మీ వీర్య ఉత్సాహములను ఈ "అక్షమాల" యందు ప్రతిష్ఠాపన చేయవలసినదిగా మిమ్ము వేడుకుంటున్నాము! (ఆ మీ వీర్యశక్తి మాయందలి బద్ధకము, అశ్రద్ధ, దురభ్యాసములు, మెతకతనములను తొలగించుచు మమ్ములను ఉత్సాహవంతులను, వీర్యవంతులను చేయును గాక!)

| | |
|---|---|
| <u>అథ ఉవాచ</u><br>**యే సాంఖ్యాది తత్త్వభేదాః**<br>**తేభ్యో నమో**<br>**<u>వర్తధ్వం, విరోధే అనువర్తధ్వమ్!</u>** | ఏఏ సాంఖ్య-భక్తి-జ్ఞాన-కర్మ యోగాది భేదములు (వేరువేరుగా) చెప్పబడుచున్నాయో,.... అట్టి యోగ భేద దేవతలందరికీ నమస్కరిస్తున్నాము. ఇక్కడ ఉండండి! విరోధము (Differences) లను అనుసరిస్తూనే,.... ఇక్కడికి రండి! (ఏకము అగు మార్గము చూపండి) |
| <u>అథ ఉవాచ</u><br>**యే శైవా-వైష్ణవా-శాక్తాః శత సహస్రశః**<br>**తేభ్యో నమో నమో భగవంతో అనుమదంతు!**<br>**అనుగృహ్ణంతు ।** | శైవ-వైష్ణవ-శాక్త .... ఇట్లు వందల - వేల వివిధ మార్గాణ్వేషకులు ఎవరెవరు ఉన్నారో..., వారందరికీ నమోనమః !<br>ఓ భగవంతులారా! ఈ అక్షమాలను అనుమతించండి! ఇది మా పట్ల దివ్యోపకరణమగుగాక - అని దీవించండి! |
| <u>అథ ఉవాచ</u><br>**యాశ్చ మృత్యోః <u>ప్రాణవత్యస్తః</u>**<br>**తేభ్యో నమో నమః।**<br>**తేన యేతాం మృడయత! మృడయత!** | ఏ మృత్యు దేవతలు, ప్రాణ దేవతలు ఉన్నారో,... వారందరికి నమస్కారము! నమస్కారము! మీరు ఇదంతా సుఖముగా ఉండునట్లు చేయండి! మాకు సుఖము ప్రసాదించెదరు గాక! |
| **పునః ఏతస్యాం సర్వాత్మకత్వమ్ భావయిత్వా, భావేన**<br>**పూర్వమాలికామ్ ఉత్పాద్య,**<br>**ఆరభ్య, తన్మయీం**<br>**మహోపహారైః ఉపహృత్య**<br>**ఆది-క్షాంతైః అక్షైః అక్షమాలామ్**<br>**అష్టోత్తరశతమ్ స్పృశేత్ ।**<br>**అథః పునః ఉత్థాప్య, ప్రదక్షిణీ కృత్య...,**<br>**ఓం నమస్తే భగవతి। మంత్రమాతృకే ।**<br>**అక్షమాలే । సర్వవశంకర్యోః ।**<br>**నమస్తే భగవతి మంత్రమాతృకే ।**<br>**అక్షమాలికే । శేష స్తంభిన్యోః ।**<br>**నమస్తే భగవతి।**<br>**మంత్రమాతృకే అక్షమాలికే ఉచ్చాటన్యోః**<br>**నమస్తే ।** | దీనియందు పునఃపునః సర్వాత్మకత్వము భావన చేయుచున్నాము. అట్టి భావనతో పూర్వమాలికను దారములతో నిర్మించుకొని, ధ్యానము ఆరంభించి, ఆ ధ్యాన ఫలమును పరమాత్మకు మహత్తరమైన కానుకగా సమర్పించెదము గాక! "అ" మొదలు " క్ష " అంతము వరకు అక్షములతో (పూసలతో) - అష్టోత్తరశతమును (108) సర్వాత్మక భావనతో స్పృశించుచున్నాము!<br>అటు తరువాత ఒక ప్రదేశమున సుఖాశీనముగా ఉంచి అక్షమాలకు ప్రదక్షిణ నమస్కారములు చేయుచున్నాము.<br>ఓ భగవతీ! మంత్రమాతృకే! అక్షమాలికే! సర్వదృశ్యమును స్థంభింపజేయ గలవు! వశము చేయగలవు! ఆదిశేషత్వమును ప్రసాదించెదవు గాక!<br>భగవతీ! నమస్తే!<br>హే మంత్రమాతృకే! అక్షమాలికే! సర్వోచ్చారిణివైయున్న (One whose expression is all this)<br>నీకు - నమస్తే! |
| **మంత్ర మాతృకే, అక్షమాలికే, విశ్వా!** | హే మంత్రమాతృకే! |
| **మృత్యో, మృత్యుంజయ స్వరూపిణి!** | విశ్వ స్వరూపిణీ! |
| **సకలలోక ఉద్దీపిని!** | మృత్యు-మృత్యుంజయ స్వరూపిణీ! |
| **సకల లోక రక్షాధికే!** | సకల లోకములను ప్రకాశింపజేయు మాతృమూర్తీ! |
| **సకలలోక ఉజ్జీవికే!** | లోక రక్షకే! |
| **సకల - ఉత్పాదికే!** | సకల లోకములను ఉజ్జీవింపజేయు మాతే! |
| **దివా ప్రవర్తికే, రాత్రి ప్రవర్తికే!** | సకల లోకముల ఉత్పత్తి నిర్వర్తిస్తున్న ఉత్పాదక స్థానమగు మాతృదేవీ! |
| **నద్యంతరమ్ యాసి!** | పగలు - రాత్రులను ప్రవర్తింపజేయుచున్న జననీ! |

| | |
|---|---|
| **దేశాంతరమ్ యాసి!** | నదులలో అంతర్లీనముగా గల జగదంబికే! |
| **ద్వీపాంతరమ్ యాసి!** | దేశ దేశాంతరములుగా వ్యాపించి ఉన్న మూర్తీ! |
| **లోకాంతరమ్ యాసి!** | ద్వీప-ద్వీపాంతరములు, లోక-లోకాంతరములుగా మూర్తీభవించియున్న తల్లీ! |
| **సర్వదా స్ఫురసి!** | సర్వదా సర్వముగా స్ఫురిస్తున్న సర్వతత్త్వ స్వరూపిణీ! |
| **సర్వహృది వాసయసి ॥** | ఓ సర్వ హృదయ నివాసినీ! |
| **నమస్తే పరా రూపే ।** | ఓ పరాత్పరీ! పరారూపే! నమస్తే! |
| **నమస్తే పశ్యంతీ రూపే ।** | ఓ సర్వముగా కనబడుచున్న పస్యంతీ రూపిణీ! నమస్తే! |
| **నమస్తే మధ్యమా రూపే ।** | మధ్యమా (శబ్దముల) రూపిణీ! నమస్తే! |
| **నమస్తే వైఖరీ రూపే ।** | వైఖరీ (వాక్య రూపమైన వాక్కు) రూపిణీ నమస్తే! నమస్తే! |
| **సర్వ తత్త్వాత్మికే ।** | సర్వతత్త్వములయొక్క ఆత్మ స్వరూపిణీ! |
| **సర్వ విద్యాత్మికే ।** | హే సర్వ విద్యా స్వరూపిణీ! |
| **సర్వ శక్త్యాత్మికే ।** | సర్వశక్తి స్వరూపిణీ! |
| **సర్వ దేవాత్మికే ।** | సర్వ దేవతా స్వరూపిణీ! |
| **వసిష్ఠేన మునినా ఆరాధితే ।** | వసిష్ఠ మహర్షిచే తత్త్వ స్వరూపిణిగా ఆరాధించబడే తల్లీ! |
| **విశ్వామిత్రేణ మునినా ఉపసేవ్యమానే ।** | విశ్వామిత్ర మహర్షి చే (గాయత్రీ దేవిగా) సేవించబడు జననీ! |
| **నమస్తే । నమస్తే ॥** | నమస్తే! నమస్తే! |

## ఫలశ్రుతి

| | |
|---|---|
| **ప్రాతః అధీయానో రాత్రింకృతం**<br>**పాపమ్ నాశయతి ।** | ఈవిధముగా అక్షమాలను, స్తోత్రము చేయువాడు ఉత్తమ ప్రయోజనం పొందుచున్నాడు. |
| **సాయమ్ అధీయానో దివసకృతం**<br>**పాపం నాశయతి ।** | ఉదయం పఠించువాడు (ఉపాసించువాడు) క్రితం రాత్రి పాపదోషములను తొలగించుకోగలడు! |
| **తత్ సాయం ప్రాతః**<br>**ప్రయుంజానః పాపో అపాపో భవతి।** | సాయంకాలము అక్షమాలోపాసనచే రోజంతా చేసి పాపకర్మలనుండి విముక్తి పొందుచున్నాడు. |
| | ఉదయం-సాయంకాలం కూడా పఠించువాడు పాపి కూడా అపాపి అగుచున్నాడు. |
| **ఏవమ్ అక్షమాలిక యా జప్తో**<br>**మంత్రః సద్యః సిద్ధికరో భవతి।** | ఈ రీతిగా ఉపాశించిన అక్షమాలిక (పూసల దండ) జపం చేయు చుండగా, అట్టివాని మంత్రము అతి త్వరగా సిద్ధించగలదు. |
| **ఇతి ఆహ భగవాన్ గుహః ప్రజాపతిమ్ ।** | **ఈవిధంగా భగవానుడగు కుమారస్వామి ప్రజాపతికి సవివరించటం జరిగింది.** |
| **ఇత్యుపనిషత్**<br>**అక్షమాలికోపనిషత్ సమాప్తా ।** | **ఇతి అక్షమాలికోపనిషత్** |
| **ఓం శాంతిః శాంతిః శాంతిః** | **ఓం శాంతిః శాంతిః శాంతిః** |

ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 1 అక్షమాలికోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము

"ఓం" కార సంజ్ఞార్థ స్వరూపుడు, సర్వాంతర్యామి, స్వయం పరిపూర్ణుడు అగు పరమాత్మకు నమోవాక్కములు!

✷

ఒకానొక సందర్భములో ప్రజాపతి–సృష్టికర్త అగు బ్రహ్మదేవుడు కైలాసమును సందర్శించారు. తన బిడ్డలగు జీవుల సంసార దుఃఖ ప్రశమనము, జీవుల మోక్షానందము, లోకకళ్యాణము ఉద్దేశ్యించారు. అట్టి సమయములో భగవంతుడగు కుమారస్వామితో సందర్భమైనట్టి ఒక సమాగమమును లోక కళ్యాణపూర్వకంగా శుభప్రదము చేయాలని సంకల్పించి, ఇట్లు సంభాషించ సాగారు.

**ప్రజాపతి :** భో బ్రహ్మన్! భగవన్! శివ ప్రియకుమారా! శ్రీ కుమారస్వామీ! సాధకులు ఇష్ట దైవ ప్రీతి కొరకై రుద్రాక్ష (లేక) స్ఫటిక (లేక) తులసి మొదలైన వాటితో కూడిన మాల (దండ) ను సహాయకారిగా తీసుకొని మంత్రోపాసన, నామ జపం చేస్తూ వుంటారు. అట్లాగే ఏకాగ్రత–తదేక భావన–ధ్యాసలకొరకై అట్టి అక్షమాలికను ధరిస్తూ కూడా ఉండటం ఉపాసకులు అభ్యాసము కదా!

అట్టి అక్షమాలాదేవి యొక్క – **సా కిం లక్షణా?** – ఏఏ లక్షణములు కలిగి ఉంటున్నాయి? కతి భేదా? ఎన్నివిధములుగా ఉంటున్నాయి?

**అస్యాః కాని సూ (మా)త్రాణి?** ఎన్ని సూత్రపు దారములు కలిగి వుంటున్నాయి?

**కథం ఘటనా ప్రకారః?** ఆ పూసలను గ్రుచ్చి ఉంచటం ఏఏ తీరులుగా?

**కా వర్ణాః?** ఏమేమి రంగులు కలిగినవై ఉంటున్నాయి? అక్షమాలికలోని అక్షరముల ఉపాసనావిధి ఏమిటి?

- **కా ప్రతిష్ఠా?** ఆయా పూసలు ఏఏ అర్థ–పరమార్థములతో ప్రతిస్థాపితం చేసుకోవాలి?
- **క ఏష అధి దేవతాః?** అట్టి ధ్యాననిమిత్తమై ఉపయోగించబడుచున్న అక్షమాలికలకు (పూసల దండలకు) అధిదేవతలు ఎవ్వరెవ్వరు?
- **కిం ఫలం?** అక్షమాలా దేవి సహాముతో చేయు ధ్యానోపాసనల ఫలములు ఎటువంటివి?

హే కుమారస్వామీ! శివప్రియ పుత్రా! మీరు శివతత్త్వజ్ఞాన సంపన్నులు. దైవీతత్త్వ సంరక్షక–సంప్రదాయకులు. భక్తులపట్ల అవ్యాజమైన ప్రేమ కలవారు. సాధకుల మనోగతమైన ఉపాసనా శ్రద్ధలను ఉద్దేశ్యించి, **అక్షమాలా దేవ్యుపాసన** విశేషాలు చెప్పండి!

### గుహమ్ (కుమార స్వామి) ఉవాచ

ఓ ప్రజాపతీ! సర్వజనుల సంసార బాధా నివృత్తిని ఉద్దేశ్యించి మీరు అక్షమాలా దేవ్యుపాసనా విశేషాలు అడుగుచుండటం నాకు చాలా సంతోషమును కలుగజేస్తోంది. అక్షమాలా విశేషాలు చెప్పుచున్నాను. వినండి.

✷

ముముక్షువులైన ఉపాసకజనులు, మునులు, ఋషులు, దేవతలు మొదలైనవారు ధారణ చేస్తున్న అక్షమాలలు అసంఖ్యాక తీరులుగా ఉంటాయి. అందులో "10" రకములు అతి ముఖ్యమైనవిగా చెప్పబడుచున్నాయి.

| | | | | |
|---|---|---|---|---|
| 1. పగడములు | 2. ముత్యములు | 3. స్ఫటికములు | 4. శంఖములు | 5. వెండి |
| 6. బంగారము | 7. మంచిగంధము | 8. పుత్ర జీవిక | 9. తామర గింజలు | 10. రుద్రాక్షతలు |

ఆదిక్షాంత మూర్తిః = " అ" కారంతో ప్రారంభమై " క్ష" కారంతో అంతమయ్యే మూర్తీభవించిన దేవతగా దర్శిస్తున్నారు.

అక్షమాల = " అ" కారంతో ప్రారంభమై " క్ష " కారంతో అంతమై యుండటంచేత సర్వతత్త్వ – మూల ప్రకృతి స్వరూపిణిగా అక్ష అనే పేరు వచ్చింది. మాల = సూత్రము, దారము.

సావధానభావా = అక్ష = "సావధానభావ ప్రసాదిని" అని అభివర్ణిస్తున్నారు. జీవునికి అధ్యాత్మ భావనపట్ల, విద్యపట్ల సావధానము (Full Attention) ప్రసాదించునది.

**మాల (దారము, సూత్రము) :** 3 సూత్రములు (దారములు) కలిగి ఉంటోంది. 1. సౌవర్ణము (బంగారము) 2. రజతము (వెండి) 3. తామ్రము (రాగి) ... (సృష్టి కల్పనయొక్క సత్వ–రజో–తమో గుణముల సంజ్ఞ)

తద్వివరే సౌవర్ణమ్ → తొల (రంధ్రము)లో బంగారపు దారము

తత్ అక్ష పార్శ్వే రజతమ్ → కుడివైపు వెండి సూత్రము

తత్వామే తామ్రమ్ → ఎడమవైపు రాగి సూత్రము

పూసయొక్క పై భాగము (అగ్రము) – పై వైపుగాను, క్రింద పృష్ఠ భాగమును క్రిందికిగాను, మధ్యలో ప్రదక్షిణ క్రమముగాను పూసలను దారములకు గ్రుచ్చి దండను నిర్మించుకొనుచున్నారు. (అక్షముయొక్క పైభాగము పైకి – మధ్య భాగము మధ్యగా, క్రింద భాగము క్రిందకు ఉండుతీరుగ గ్రుచ్చుచున్నారు).

అంతరః (లోపలి) సూత్రమును → బ్రహ్మము (యొక్క స్వరూపం) గాను (తత్ బ్రహ్మ),

దక్షపార్శ్వే కుడివైపున ఉన్నదానిని → శివోపాసనారూపమగు శైవముగాను (తత్ శైవమ్),

వామే తత్ వైష్ణవమ్ → ఎడమవైపు భాగము → విష్ణోపాసనారూపమగు వైష్ణవముగాను,

యత్ ముఖమ్ సా సరస్వతీ → ముఖమును → సర్వశబ్ద స్వరూపిణియగు సరస్వతీదేవిగాను,

యత్ పుచ్ఛం సా గాయత్రీ → వెనుకభాగము → గాయత్రీ–సావిత్రీ–సరస్వతీ తత్త్వమగు గాయత్రీదేవిగాను,

యత్ సుషిరమ్ సా విద్యా → రంధ్ర విభాగము → విద్య గాను, బుద్ధిస్వరూపిణి గాను,

యా గ్రంథిః సా ప్రకృతిః → ముడి ప్రదేశమును → ప్రకృతీస్వరూపిణిగాను,

యే స్వరా తే ధవళాః → తెల్లని విభాగములు → స్వరములు (అచ్చులు) గాను, ('అ' నుండి 'అః' వరకు)

యే స్పర్శాః తే పీతాః → పసుపుపచ్చనివి → స్పర్శములు ('క' నుండి 'మ' వరకు గల హల్లులు) గాను

యే పరాః తే రక్తాః → ఎర్రనివి → పరములు (య కారాది క్షకారాంతము వరకు గల హల్లులు గాను)

భావన చేసి, ఒకానొక క్రమమైనవిధంగా అక్షమాలా నిర్మాణమును నిర్వర్తించి, మునిజనము ఉపాసిస్తున్నారు.

అటు తరువాత ఆ అక్షమాలను

→ పంచ గంధ (పంచ చందన)ములతో (సుగంధ ద్రవ్యములతో),

→ పంచామృతములతో (ఉదకము, పాలు, పెరుగు, నేయి, తేనెలతో)

→ పంచగవ్యములతో (గోమూత్రము, గోపేడ, గోవుపాలు, గోపెరుగు, గోనెయ్యిలతో),

→ పంచతనువులతో (పంచభూతత్వములతో)

శోధించి శుభ్రము చేస్తున్నారు. ప్రకాశమానంగా తీర్చిదిద్దుచున్నారు. ఆ తరువాత కూడా పంచగవ్యములతో, మంచి గంధ జలంతో తడపుచున్నారు.

**ఓం** కారము - ఆకారముతో చేసిన దర్భకూర్చ యొక్క బ్రహ్మముడితో మార్జనము చేస్తున్నారు. అష్ట గంధములతో (కర్పూరము, కస్తూరి, పునుగు, జవ్వాజి, అగరు, పన్నీరు, అత్తరు, శ్రీగంధములతో) పూతపూస్తున్నారు.

చక్కటి మనో ఆహ్లాదపూరితమగు స్థలములో ఉంచి అక్షతలతో, పూలతో ఆరాధనపూర్వకంగా పూజిస్తున్నారు.

ఒక్కొక్క పూసను పూలతో, అక్షతలతో పూజిస్తూ 'అ' కారంతో ప్రారంభమై 'క్ష' కారముతో అంతమయ్యే ఒక్కొక్క అక్షర-వర్ణ తత్త్వములను భావన చేస్తూ నమస్కరిస్తున్నారు. అక్షర తత్త్వమును ఒక్కొక్క పూసలో ప్రతిష్ఠేపిస్తున్నారు. (ప్రతితిష్ఠ - ఆహ్వానించి శాశ్వతంగా నిలిపి ఉంచుట) - అక్షరము యొక్క విశేషతత్త్వ వర్ణనలు:

| | | |
|---|---|---|
| ఓం అంకార ప్రథమాక్షే | మృత్యుంజయ! సర్వ వ్యాపక! | (1) |
| ఓం ఆంకార ద్వితీయాక్షే | ఆకర్షణాత్మక! సర్వగత! | |
| ఓం ఇంకార తృతీయాక్షే | పుష్టిత! అక్షోభకర! | |
| ఓం ఈంకార చతుర్థాక్షే | వాక్ ప్రసాదకర! నిర్మల! | |
| ఓం ఉంకార పంచమాక్షే | సర్వబలప్రద! సార తర! | |
| ఓం ఊంకార షష్ఠే అక్షే | ఉచ్చాటన (Exhibiting) కర దుస్సహ! | |
| ఓం ఋంకార సప్తమే అక్షే | సంక్షోభకర! చంచల! | |
| ఓం ౠంకార అష్టమే అక్షే | సంమోహనకర! ఉజ్వల। | |
| ఓం ఌంకార నవమే అక్షే | విద్వేషణకర మోహన । | |
| ఓం ౡంకార దశమే అక్షే | మోహనకర । | (10) |
| ఓం ఏంకార ఏకాదశే అక్షే | సర్వవస్యకర। శుద్ధసత్వ । | |
| ఓం ఐంకార ద్వాదశే అక్షే | శుద్ధసాత్వికః పురుష వశ్యకర । | |
| ఓం ఓంకార త్రయోదశే అక్షే | అఖిలవాఙ్మయ । నిత్యశుద్ధ । | |
| ఓం ఔంకార చతుర్దశే అక్షే | సర్వ వాఙ్మయ వశ్యకర । | |
| ఓం అంకార పంచదశే అక్షే | గజాది వశ్యకర మోహన । | |
| ఓం అఃకార షోడశే అక్షే | మృత్యునాశకర రౌద్ర । | |
| ఓం కంకార సప్తదశే అక్షే | సర్వవిషహరణ । కళ్యాణ ద । | |
| ఓం ఖంకార అష్టాదశే అక్షే | సర్వ క్షోభకర వ్యాపక । | |
| ఓం గంకార ఏకోనవింశతే అక్షే | సర్వవిఘ్న శమన మహత్తర । | |
| ఓం ఘంకార వింశతే అక్షే | సౌభాగ్యద । స్తంభనకర । | (20) |
| ఓం ఙంకార ఏకవింశే అక్షే | సర్వవిషనాశకర । ఉగ్ర । | |

| | |
|---|---|
| ఓం చంకార ద్వావింశౌ అక్షే | అభిచారఘ్ను-క్రూర (దుష్ట ప్రయోగ నివారణ) |
| ఓం ఛంకార త్రయోవిశే అక్షే | భూతనాశకర । భీషణ । |
| ఓం జంకార చతుర్వింశే అక్షే | కృత్యాది నాశకర (బాధింపజాలని) । దుర్ధర్ష । |
| ఓం ఝంకార పంచవింశే అక్షే | భూత నాశకర । |
| ఓం ఞంకార షడ్వింశే అక్షే | మృత్యు ప్రమథన । |
| ఓం టంకార సప్తవింశే అక్షే | సర్వవ్యాధిహర । సుభగ । |
| ఓం ఠంకార అష్టావింశే అక్షే | చంద్రరూప । |
| ఓం డంకార ఏకోనత్రింశే అక్షే | గరుడాత్మక । విషఘ్ను (విషమును విరచివేయు) |
| ఓం ఢంకార త్రింశే అక్షే | సర్వ సంపత్ ప్రద ! సుభాగ ! |
| ఓం ణంకార ఏకత్రింశే అక్షే | సర్వసిద్ధిప్రద ! మోహకర ! |
| ఓం తంకార ద్వాత్రింశే అక్షే | ధనధాన్యాది సంపత్‌ప్రద! ప్రసన్న! |
| ఓం థంకార త్రయస్త్రింశే అక్షే | ధర్మప్రాప్తికర ! నిర్మల ! |
| ఓం దంకార చతుస్త్రింశే అక్షే | పుష్టివృద్ధికర ! ప్రియదర్శన ! |
| ఓం ధంకార పంచత్రింశే అక్షే | విషజ్వరఘ్ను (విషజ్వరమును తొలగించునది) ! విపుల (సర్వము విశదీకరించునది) |
| ఓం నంకార షట్రింశే అక్షే | భుక్తి-ముక్తి ప్రద । శాంత। |
| ఓం పంకార సప్తత్రిశే అక్షే | విష విఘ్న నాశన । భవ్య (విషమువంటి విఘ్నములను తొలగించునది! తేజోప్రదము) |
| ఓం ఫంకార అష్టత్రింశే అక్షే | అణిమాది సిద్ధిప్రద । జ్యోతిరూప । |
| ఓం బంకార ఏకోన చత్వారింశే అక్షే | సర్వదోష హర । శోభన । (దోషములను తొలగించి శోభను కలిగించేది) |
| ఓం భంకార చత్వారింశే అక్షే | భూతశాంతి కర । భయానక |
| ఓం మంకార ఏక చత్వారింశే అక్షే | విద్వేషి మోహనకర । |
| ఓం యంకార ద్విచత్వారింశే అక్షే | సర్వ వ్యాపక! పావన । |
| ఓం రంకార త్రిచత్వారింశే అక్షే | దాహకర వికృత । (ప్రకృతి ప్రతిబింబిత)। |
| ఓం లంకార చతుశ్చత్వారింశే అక్షే | విశ్వంభర! భాసుర । |
| ఓం వంకార పంచ చత్వారింశే అక్షే | సర్వాప్యాయనకర నిర్మల । |
| ఓం శంకార షట్ చత్వారింశే అక్షే | సర్వఫలప్రద । పవిత్ర । |
| ఓం షంకార సప్తచత్వారింశే అక్షే | ధర్మార్థకామద! ధవళ । |
| ఓం సంకార అష్ట చత్వారింశే అక్షే | సర్వకారణ సార్వవర్ణికా । |
| ఓం హంకార ఏకోన పంచాశత్ అక్షే | సర్వవాఙ్మయ నిర్మల । |
| ఓం ళంకార పంచాశత్ అక్షే | సర్వశక్తిప్రద ప్రధాన । |
| ఓం క్షంకార షష్టాశత్ అక్షే | పర-అపర జ్ఞాపక పరంజ్యోతీ రూప శిఖామణే । |

**ప్రతితిష్ఠ**

భగవానుడగు కుమారస్వామి అక్షమాలికా విశేషములగురించి సృష్టికర్తయగు ప్రజాపతికి ఇంకా ఇట్లా చెప్పసాగారు.

✹

ఈవిధంగా విజ్ఞులు అక్షమాలను అ-కారాది-క్షకారాంత' అక్షలను అక్షరసాగుణ్యంగా ప్రతితిష్ఠింపజేస్తున్నారు. అటు తరువాత అక్షమాలోపాసన ఈవిధంగా కొనసాగిస్తూ ప్రార్థనాగీతాలు సమర్పించబడుచున్నాయి.

✹

ఏఏ దేవతలు కరుణాంతంగులై ప్రేమాస్పదంగా ఈ పృధివిపై వేంచేసి ఇదంతా పుణ్యక్షేత్రములుగా చేయుచున్నారో,.... అట్టి దివ్య – భగవత్ ప్రజ్ఞా స్వరూపులారా! మా ఈ నమస్కారములు స్వీకరించండి. ఈ అక్షమాలతో మేము చేయబోవు ధ్యాన – మనన – ఉపాసనలకు అనుమతిని ప్రసాదించమని వేడుకొనుచున్నాము.

ఓ పృథివిపై వేంచేసియున్న పితృదేవతలారా! మా కార్యక్రమములకు శోభ-సౌందర్యములను  అనుగ్రహిస్తూ అనుమతించెదరు గాక!

ఈ అక్షమాల జ్ఞానప్రసాదిని అయి శోభించునుగాక!

ఏఏ కరుణామూర్తులగు దేవతలు అంతరిక్షములో పరివేష్ఠితులై ఉన్నారో,.... వారికి – **ఓం నమో భగవంతో**-భగవత్ స్వరూపులైన ఆ దేవతలందరికి **వచసా – మనసా** నమస్కరిస్తున్నాము. వారు ఈ అక్షమాలా ధ్యానసూత్రమును అనుమతించెదరు గాక! అట్లాగే సృష్టి నిర్మాతలు అగు అంతరిక్షములోని పితృ దేవతలు కూడా ఈ మా అక్షమాలా వ్రతవిధికి అంగీకారము ప్రసాదించెదరుగాక! ఈ అక్షమాలిక వారందరి అనుజ్ఞ-కరుణలచే శోభాయమానము, జ్ఞానమయము, జ్ఞానప్రాసాదితము అగుచుండును గాక!

ఏఏ దివ్యస్వరూపులగు దేవతలు దివ్య (స్వర్గ) లోకము మొదలైన ఊర్ధ్వ లోకములలో వేంచేసి అవస్థితులై ఉన్నారో,.... భగవత్ రూపులగు వారంతా కూడా ఈ అక్షమాలికను ఆరాధనకై అనుమతిని, అనుజ్ఞను అందజేయుచుండెదరు గాక! స్వర్గలోక నివాసులగు దేవతలు – పితృదేవతలు కరుణించి మా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమములకు అంగీకారము, సహకారము దయచేసెదరు గాక! వారందరి కరుణచే ఈ అక్షమాల మా పట్ల శోభాయమానము జ్ఞానమయము అయి శోభిల్లునుగాక!

ఈ విశ్వ-విశ్వాంతరాళాలలో  ఏఏ మంత్రదేవతలు, విద్యాప్రసాద దేవతలు వేంచేసి,లోక కళ్యాణమూర్తులై సంచరించుచున్నారో.... వారందరికీ నమస్కరిస్తున్నాము. వారు వారివారి సాత్విక-దివ్య-విద్యా శక్తులను ఈ అక్షమాలయందు ప్రతితిష్ఠాపన చేయవలసినదిగా వేడుకొనుచున్నాము.

సృష్టి – స్థితి – లయకారకులు, సగుణతత్త్వ స్వరూపులు అగు ఓ బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులారా! త్రిమూర్తులారా! మీకు మా హృదయపూర్వక నమస్కారములు, సాష్టాంగ దండ ప్రణామములు సమర్పించుకుంటున్నాము. మీయొక్క వీర్యశక్తిని ఈ అక్షమాలయందు ప్రవేశింపజేసి, మా ధ్యాన-ఉపాసన-సాధనా కార్యక్రమములను దిగ్విజయము చేయవలసినదిగా విన్నపములు సమర్పించుకుంటున్నాము. మాలో బద్ధకము, అశ్రద్ధ, దోషదృష్టులను తొలగించి అధ్యాత్మవాఙ్మయమువైపుగా ప్రోత్సాహించండి!

ఏఏ సాంఖ్య-భక్తి-జ్ఞాన-కర్మ-క్రియా యోగాది మహానుభావులు నిష్ణాతులై ఈ భూమిపై చిద్విలాసముగా సంచరిస్తున్నారో, వారందరికి నమోవాక్కులు సమర్పించుకుంటున్నాము. ఓ మహామహనీయులారా! మీమీ పరస్పర విరోధ (వేరువేరైన) ఆధ్యాత్మికవాదోపవాదములతో, తత్ సమాచార – వ్యాఖ్య విశేషాలతో ఇక్కడికి వేంచేయమని వేడుకుంటున్నాము. ఈ అక్షమాలతో ఏ పరమసత్య స్థానము పొందగలమో, అందుకు మీరందరూ మార్గదర్శకులయ్యెదరు గాక!

ఓ శైవ – వైష్ణవ – శాక్త్యాది వందల – వేల మార్గములలో పరమాత్మను ఉపాసిస్తున్న వివిధ పాండితీ ప్రావీణ్యులారా! మీకందరికీ నమస్కరిస్తున్నాము. మీరంతా వేంచేయండి! భగవత్ స్వరూపులగు మీరంతా ఈ అక్షమాలోపాసనను అంగీకరించండి! ఆశీర్వదిస్తూ అనుగ్రహించండి. మా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమములకు తోడ్పై ఉండండి!

ఓ మృత్యుదేవతా ప్రాణదేవతలారా! జీవన-మరణ దేవతలారా! మీ అందరికీ నమో నమః ! మీరు మమ్ములను సుఖవంతులుగా చేయండి! సుఖ – శాంతులను మాపై ప్రసరింపచేయండి! ఈ మా ఆరాధనా-ఆధ్యాత్మిక కార్యక్రమములకు దిగ్విజయత్వము ప్రసాదించండి!

కుమారస్వామి ఇంకా ఇట్లా ప్రజాపతితో చెప్పసాగారు.

ఈవిధంగా దేవతా ప్రజ్ఞలను, భూ ప్రపంచంలోని దైవీతత్త్వాలను అర్ధిస్తూ ఇక ఆపై అక్షమాలయందు **సర్వాత్మకత్వము** భావనాపూర్వకంగా ప్రతితిష్ఠేపించబడును గాక!

అట్టి సర్వాత్మ భావనతో మాలికను దారములతో గ్రుచ్చి నిర్మించుకోవాలి. ఇక ఆపై ఆ పరమ పవిత్రమగు అక్షమాలతో భగవత్ సమర్పణ పూర్వకంగా జప-ధ్యానములను ఆరంభించాలి. ఆ ధ్యాన ఫలమును సర్వాత్మకుడగు పరమాత్మకు సమర్పణ చేయాలి.

ఆదిక్షాంత ("అ" కారముతో ప్రారంభమై - "క్ష" కారముతో చివరికి వచ్చే) అక్షమాలతో అష్టోత్తర శత (108) సార్లు మునివ్రేళ్ళతో స్పృశిస్తూ జప-ధ్యానములను నిర్వర్తించాలి.

అటు తరువాత ఆ అక్షమాలను ఒక పవిత్రమైన ప్రదేశములో ఉంచి ఆ అక్షమాలకు ప్రదక్షిణ నమస్కారములు సమర్పించాలి. ఈవిధంగా ఆ అక్షమాలా దేవిని స్తుతిచేయుదురు గాక!

ఓం నమస్తే భగవతి! మంత్రమాతృకే! అక్షమాలే సర్వవశంకర్యోః!
నమస్తే భగవతి ! మంత్రమాతృకే ! అక్షమాలే ! శేషస్తంభిన్యో !
నమస్తే భగవతి ! మంత్ర మాతృకే ! అక్షమాలికే ! నమస్తే !
మంత్రమాతృకే ! అక్షమాలికే! విశ్వా! మృత్యో ! మృత్యుంజయ స్వరూపిణీ!
సకలలోక ఉద్దీపినీ ! సకల లోక రక్షాధికే ! సకల లోక ఉజ్జీవికే !
సకల ఉత్పాదికే ! దివా ప్రవర్తికే ! రాత్రి ప్రవర్తికే!
నద్యంతరమ్ యాసి ! దేశాంతరమ్ యాసి ! ద్వీపాంతరమ్ యాసి! లోకాంతరమ్ యాసి!
సర్వదా స్ఫురసి ! సర్వహృదయవాసయసి !
నమస్తే **పరా**రూపే ! నమస్తే **పశ్యంతీ**రూపే !
నమస్తే **మధ్యమా** రూపే! నమస్తే **వైఖరీ** రూపే!
సర్వతత్త్వాత్మికే ! సర్వ విద్యాత్మికే ! సర్వశక్త్యాత్మికే ! సర్వదేవాత్మికే !
వసిష్ఠేన మునినా ఆరాధితే !
విశ్వామిత్రేణ మునినా ఉపసేవ్యమానే !

*నమస్తే ! నమస్తే ! నమస్తే ! నమోనమః !*

అమ్మా! అక్షమాలా దేవీ! ఓంకార స్వరూపిణీ! భగవతీ! నమస్తే! నమో నమః!

హే భగవతీ! మంత్రమాతృకే! సర్వవశంకరీ ! సర్వము లయించగా, అప్పటికీ శేషించియుండే ఆత్మానంద స్వరూపిణీ! చంచలమైన ఈ జగత్తుకు ఆధారమైయున్నట్టి నిశ్చలమైన, స్థంభీ భూతమైన పరమాత్మ స్వరూపిణీ! నీకు నమస్కారములు. సర్వమును వెలిగిస్తూ, తేజోమయం చేస్తున్న ఓ భగవతీ! నీకు నమస్కరిస్తున్నాము. ఈ 14 జగత్తులు ఎవ్వరి ప్రదర్శనమో, ఎవ్వరి ఉచ్చాటన యో, అట్టి నీకు నమస్కారమమ్మా!

నీవు సర్వ మంత్రములకు మాతృకవు! సర్వమంత్ర-మంత్ర దేవతలకు ఉత్పత్తి స్థానమువు! తల్లివి! హే అక్షమాలికే! విశ్వేశ్వరీ! విశ్వ స్వరూపిణిదేవీ! విశ్వాధారీ! విశ్వే! ఓ మాతా! మార్పు చెందుచున్నది, మార్పు చెందనిదీ కూడా నీవే! అందుచేత మృత్యు-మృత్యుంజయ స్వరూపిణివి కూడా!

సకలలోకములను ఉద్దీపింపజేయునది (లేక) ప్రకాశింపజేయునది నీవేనమ్మా! ఈ లోకములన్నిటికీ అధికారిణివి! రక్షకురాలవు! అసలు ఈ లోకాలన్నీ నీ ఇచ్ఛ చేతనే ఉత్పత్తి చేయబడుచున్నాయి! నీవు లోక జననివి! ఇదంతా సంకల్పించి లీలగా ఉజ్జీవింప జేస్తున్నావు! మాకు ఉత్పత్తి - జీవితము నీ నుండే లభిస్తున్నాయి. నీవు మాకు, ఈ సర్వమునకు ఉత్పాదక - ఉజ్జీవన చైతన్య శక్తివైయున్నావు కదా! మేమంతా మీ ఇచ్ఛాశక్తి ప్రదర్శనములము అయి ఉన్నామమ్మా!

సూర్యభగవానుని రూపము ధరించినదానవై, సర్వాధారివి అయి ఉండి లోకములకు పగలు-రాత్రులను ప్రవర్తింపజేయుచున్నది నీవే! జ్ఞాన-అజ్ఞానములను, విద్యా-అవిద్యలను కల్పించుచున్నది కూడా నీవే! సర్వ నదులలో అంతర్లీనంగా ఉండే నదీమతల్లివి! దేశ దేశాంతరములుగా వ్యాపించి ఉన్న దానవు! ద్వీప-ద్వీపాంతరములుగా, లోక లోకాంతరములుగా విస్తరించి ఉన్నది నీవే!

సర్వత్రా సర్వదా సర్వముగా స్ఫురిస్తున్నదంతా నీరూపమేనమ్మా! నీవు ఎక్కడున్నావని వెతకాలి! మా హృదయాలలోనే సర్వదా వేంచేసియే ఉన్నావు! సర్వహృదయ నివాసినివి! ఈ కనబడేదంతా నీవే! కానీ ఇదేమీ కాకుండా వేరైకూడా ఉన్నావు! హే పరాస్వరూపిణీ! నమస్తే!

| | | |
|---|---|---|
| పర | – శబ్దము | – ఆవల ఉన్న పరతత్త్వము. |
| పశ్యంతి | – మాటల కూర్పు – అర్థము | – ఎదురుగా కనబడుచూ ఉన్న దృశ్యజగత్తు. |
| మధ్యమ | – స్వరము | – ఈ జగత్తును స్వానుభవముగా పొందుచున్న ద్రష్ట (జీవాత్మ) |
| వైఖరీ | – వాక్యరూపమైన వాక్కులతో కూడిన | – ఈ దృశ్యము వివిధ ద్రష్టలచే వివిధరీతులుగా దర్శించబడుచుండటము. |
| పర-పశ్యంతి | – మధ్యమ – వైఖరీ శబ్ద జాలమంతా నీవే! | – వేద-వేదాంత శబ్దజాలము. |

అంతా నీవే! శబ్దములన్నీ నీవే! అందుచేత నీవు మధ్యమా స్వరూపిణివి! అంతేకాదు, ఆ శబ్దములతో ఏర్పడే వాక్యముల రూపమగు వైఖరీస్వరూపిణివి కూడా! వాక్యార్థములు కూడా నీ రూపమే! ఆ అర్థముల పరమార్థము కూడా సర్వదా నీవే! పరము, ఇహము, ద్రష్ట, దర్శనము, దృశ్యము నీవే!

ఓ జగన్మాతా! మాకు ఈ జగత్తులో "నీవు" గా కనిపించేదంతా, నీవేనమ్మా! అందుచేత తత్-త్వమ్! తత్త్వస్వరూపిణివి! సర్వతత్త్వస్వరూపిణివి! సర్వ జీవులలోని 'అహమ్' స్వరూపిణివి!

ఓ సర్వ విద్యాత్మకే! ఈ తెలియబడేదంతా కూడా, ఇందలి సర్వ విషయ-విశేషాలతో సహా నీవే అయి ఉన్నావమ్మా! అందుచేత నీవు సర్వ విద్యాత్మికవు! వేద స్వరూపిణివి! తెలుసుకొంటున్నదీ నీవే! అందుచేత వేదాంత స్వరూపిణివి! వేద వేద్యవు! తెలుసుకొనుచున్న వానిని తెలుసుకొనుచున్నది కూడా నీవే! సర్వము ఆత్మగా తెలియజేయు ఆత్మవిద్యవు!

మా దేహాలన్నీ కూడా ఏ శక్తిచే నిలిచి ఉంటున్నాయో, ఆ శక్తి నీదే! నీవే! నీవు సర్వశక్తి స్వరూపిణివి! ఏఏ దేవతలు అరూపులై ఈ జగత్తులోని విత్తు-వృక్షము-ఆకులు-దేహములు-ఆహారములు .... ఇవన్నీ నిర్మించి జీవుల దేహములను పరిపోషిస్తున్నారో .... ఆ దేవతలందరి రూపముగా వేంచేసి ఉన్నది నీవే! సర్వదేవతా స్వరూపిణివి!

శ్రీ వసిష్ఠమహర్షి ఏ తత్త్వమును ఆరాధిస్తూ, శ్రీరామ చంద్రమూర్తికి (యోగవాసిష్ఠ మహాగ్రంథములో) ప్రవచించారో, అట్టి ఆయనయొక్క పరతత్త్వ ఉపాసనా వస్తువు నీవేనమ్మా! విశ్వామిత్ర మహర్షిచే అహమ్ ఏకతరంగమస్మి తత్-రామచంద్ర ఆనందసాగరః అని గాయత్రీ రూపంగా గానం చేశారో ..... అది నీవే! ఆయనచే ఉపసేవ్యమానమైనది నీవే! మహర్షులంతా సర్వదా సేవిస్తున్నది నిన్నే! నేనైన నీకు, నీవైన నాకు నమస్కారము.

*అమ్మా! నమస్తే! నమస్తే! నమస్తే!*

## ఫలశృతి

ఈ అక్షమాలికా స్తోత్రము (ఉపనిషత్‌ను) పగలు పఠిస్తే రాత్రి కృతమైన పాపములన్నీ నశిస్తున్నాయి. సాయంకాలము పఠిస్తూ పారాయణం చేసినవారియొక్క పగలు నిర్వర్తించిన కర్మదోషములు నశించగలవు.

ఉదయము-సాయంత్రము పఠించుచున్నప్పుడు పాపికూడా అపాపి, పుణ్యశీలి అగుచున్నాడు.

ఈ రీతిగా అక్షమాల (పూసల దండ)ను ముందుగా పూజించి, ఆ తరువాత జపము చేయువానికి అతి త్వరగా మంత్రసిద్ధి లభించగలదు.

***ఈవిధంగా భగవానుడగు శ్రీ కుమారస్వామి సృష్టికర్తయగు ప్రజాపతికి అక్షమాలా విశేషములను లోక కళ్యాణార్థమై సవివరించారు.***

***ఇతి అక్షమాలికోపనిషత్***
***లోక కళ్యాణమస్తు***
***ఓం తత్ సత్।।***


**ఋగ్వేదాంతర్గత**

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 2 ఆత్మబోధోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ శ్రీమన్నారాయణాకారమ్ అష్టాక్షరమహాశయమ్**
**స్వమాత్రానుభవాత్ సిద్ధమ్ ఆత్మబోధం హరిం భజే॥**

- శ్రీమత్ నారాయణాకారుడు
- అష్టాక్షర మహాశయుడు,
- ప్రతి ఒక్కరి స్వాత్మ స్వరూపుడే అయి ఉండి, స్వానుభవమే అయి ఉన్నవాడు.....,
- ఆత్మబోధ స్వరూపుడు అగు శ్రీహరిని అర్చించుచున్నాను.

**1. ఓం ప్రత్యక్-ఆనందం।**
**బ్రహ్మ పురుషమ్। ప్రణవ స్వరూపమ్।**
**'అ' కార 'ఉ' కార 'మ' కార ఇతి త్ర్యక్షరమ్ ప్రణవమ్।**
**తత్ ఏతత్ 'ఓం' ఇతి**
**యమ్ ఉక్త్వా, ముచ్యతే యోగీ జన్మసంసార బంధనాత్**
**ఓం నమో నారాయణాయ**
**శంఖ చక్ర గదాధరాయ।**
**తస్మాత్ ఓం నమో నారాయణాయ**
**ఇతి మంత్ర ఉపాసకో**
**వైకుంఠ భువనమ్ గమిష్యతి।**

పరబ్రహ్మము (లేక) పరమపురుషుడు అనగా ఎవరు? ప్రత్యక్ - అకారణ - కేవల ఆనంద స్వరూపుడు! ప్రణవ స్వరూపుడు ఆయన!

ప్రణవము - "అ" కార, "ఉ"కార, "మ" కార .... త్రి-అక్షరములు!

అటువంటి ఆ '3' అక్షరముల ఏకస్వరూపమే 'ఓం'!

అట్టి ప్రణవమగు "ఓం" కారమును ఉచ్ఛరిస్తున్న యోగి జన్మ-సంసార బంధములనుండి విముక్తుడగుచున్నాడు.

**ఓం నమో నారాయణాయ।**
శంఖ చక్ర గదాధరాయ। - అట్టి నారాయణుడు ప్రణవ స్వరూపుడు.

"**ఓం నమో నారాయణాయ**" మంత్రమును ఉపాసించే ఉపాసకుడు వైకుంఠ పదమును చేరుచున్నాడు. మరల ఉపాధి గమ్యుడు కాడు!

---

**2. యత్ ఇదమ్ బ్రహ్మపురమ్ పుండరీకమ్**
**తస్మాత్ తటిదాభ మాత్రమ్ దీపవత్ ప్రకాశమ్।**
**బ్రహ్మణ్యో దేవకీపుత్రో।**
**బ్రహ్మణ్యో మధుసూదనః।**

బ్రహ్మపురము (లేక) బ్రహ్మీభావ స్థానము వికశించిన పద్మమువంటిది.

కేవల ప్రకాశమాత్రము. దీపమువలె స్వయంజ్యోతి స్వరూపము. దీపమును చూపటానికి మరొక దీపం కావాలా? అట్లాగే బ్రహ్మము సర్వమును వెలిగించుచున్నట్టిది. అద్దానిని వెలిగించు మరొకటేదీ లేదు. అవసరం లేదు కూడా!

దేవకీపుత్రుడగు శ్రీకృష్ణుడే ఆ పరబ్రహ్మమూర్తి!

బ్రహ్మణ్యః పుండరీకాక్షో।
బ్రహ్మణ్యో విష్ణుః, అచ్యుతః।
సర్వభూతస్థమ్ ఏకమ్ నారాయణమ్।
కారణ పురుషమ్।
అకారణమ్। పరం బ్రహ్మ ఓం।

ఆ పరబ్రహ్మమే పుండరీకాక్షుడు (పద్మనయనుడు), సర్వత్రా ఉనికిచే విష్ణువు. 'చ్యుతి' లేనివాడు కాబట్టి అచ్యుతుడు. సర్వజీవులలో ఏకస్వరూపుడై, సర్వదా వేంచేసి ఉన్నవారు కాబట్టి-సర్వతరంగములలోని ఏకస్వరూపమగు జలమువలె ఏకోనారాయణుడు!

ఆయన సర్వమునకు కారణుడు. కారణపురుషుడు. ఈ జగత్తంతా ఆయనయొక్క పురుషకారమే! కానీ, ఆయన మాత్రం అకారణుడు! ఆ నారాయణుడే పరబ్రహ్మము! ఆయనయే ఓం యొక్క అర్థము! పరమార్థము! ఆయనే మనమంతా కూడా!

---

**3.** శోక-మోహ వినిర్ముక్తో
విష్ణుమ్ ధ్యాయన్ న సీదతి।
ద్వైత - అద్వైతమభయం భవతి।
మృత్యోః సః మృత్యుమ్ ఆప్నోతి
య ఇహ నానేవ పశ్యతి।
హృత్పద్మమధ్యే సర్వం తత్ ప్రజ్ఞా నేత్రమ్।
ప్రజ్ఞానేత్రే ప్రతిష్ఠితమ్। ప్రజ్ఞానేత్రో లోకః
ప్రజ్ఞా ప్రతిష్ఠా।
ప్రజ్ఞానమ్ బ్రహ్మ।
ఏతేన ప్రజ్ఞేన ఆత్మనా అస్మాత్ లోకాత్
ఉత్క్రమ్య ఆముష్మిమ్ తు స్వర్గే లోకే
సర్వాన్ కామాన్ ఆప్త్వా,
అమృతః సమభవత్। సమభవత్।

శోక-మోహములచే స్పృశించబడనివాడు నారాయణుడు. సర్వసర్వత్రా వేంచేసి ఉన్నవాడు. కనుక విష్ణువు!

అట్టి సర్వాత్మకుడగు విష్ణుభగవానుని ఎవరు ధ్యానిస్తే వారు ద్వైత-అద్వైత భేదభావనలనుండి (ఆ చిక్కుముడుల నుండి), సర్వ భయములనుండి విముక్తుడగుచున్నారు. అభయుడగుచున్నారు.

ఎవ్వరైతే ఇక్కడ జీవాత్మ వేరు-పరమాత్మ వేరు-ఇత్యాదిగా నానాత్వమునే దర్శిస్తూ (చూస్తూ) ఉంటారో వారు ఒక చావునుండి వేరొక చావుకు పోతూనే ఉంటారు.

ఓ సర్వజనులారా! మీ హృదయ పద్మము యొక్క మధ్యభాగములో **"సర్వము తత్ పరమాత్మయే! పర బ్రహ్మమే"** - అను ప్రజ్ఞానేత్రము ఉండనే ఉన్నది. అది తెరువండి. మీలో ప్రజ్ఞానేత్రుడే ఆ నారాయణుడు. ఆయన రూపమే ఈ లోకములన్నీ కూడా! అనగా మీకు కనబడే ఈ లోకాలన్నీ మీ ప్రజ్ఞయందే ప్రతిష్ఠితమై ఉన్నాయి. మీరు లోకాలలో ఉండటము కాదు. మీ యందే లోకాలు!

అందుచేత "**ప్రజ్ఞానం బ్రహ్మ**" అను మహావాక్యము చెప్పబడుతోంది. తెలుసుకొంటున్న ఆయన - తెలియబడునది ఈ రెండూ ప్రజ్ఞాస్వరూపమే! ఏక-అఖండ ప్రజ్ఞయే!

తెలుసుకొను-తెలియబడు-ఉభయము రూపముగాగల ప్రజ్ఞయే ఆత్మ అని ఎరుగుచున్నవాడు-ఇక్కడి లోక విషయములన్నీ అధిగమించి ఆముష్మికమగు స్వర్గ-ఇత్యాది ఉత్తమ లోకాలు చేరుచున్నాడు. సర్వకోరికలు సిద్ధింపజేసుకున్న వాడగుచున్నాడు. క్రమంగా, లోక-లోకాంతరాలు దాటివేసినవాడై **అమృతస్వరూపుడగుచున్నాడు. సర్వసమత్వము-సమభావన** సముపార్జించుకొనుచున్నాడు.

---

**4.** యత్ర జ్యోతిః అజస్రం,
యస్మిన్ లోకే అభ్యర్హితమ్, తస్మిన్ మాం దేహి ప్లవమానా
అమృతే లోకే అక్షితే। అమృతత్త్వం చ గచ్ఛతి
ఓం నమః॥

ఓ శ్రీమన్నారాయణ స్వామీ! ఆత్మజ్యోతి స్వరూపా! ఎక్కడ ఎల్లప్పుడు ఆత్మజ్యోతి యొక్క జ్ఞానము వెలుగొందుచున్నదో, ఏ లోకములో ఆత్మజ్యోతి యొక్క ఉపాసన నిత్యము జరుగుచున్నదో, ఆ లోకమునకు నన్ను జేర్చండి! అమృతమయ లోకమును జేరి నేను మృతమునుండి (మార్పు నుండి) అమృతత్వమును పొంది "ఓం" తత్త్వ స్వరూపుడనగుదును గాక! **(మృత్యోఽర్మా అమృతంగమయ)!**

---

**5.** ప్రగళిత నిజమాయోఽహమ్।
నిస్తుల దృశిరూప వస్తుమాత్రోఽహమ్।
అస్తమిత - అహంతోఽహమ్।
ప్రగళిత జగత్-ఈశ-జీవ భేదోఽహమ్
ప్రత్యగభిన్న పరోఽహమ్
విధ్వస్త అశేష విధి-నిషేధోఽహమ్
సముదస్త ఆశ్రమకోఽహమ్

స్వయం కల్పితమగు నాయొక్క మాయ వీగిపోగా, నేను కేవల దృక్ (దృశి) రూపుడునగుచున్నాను. కేవల ఆత్మవస్తు మాత్రుడను! "బ్రహ్మమేఽవాహమ్" కారము ఉదయించుచుండగా అంధకారరూపమగు జీవాహంకారము తొలగిపోవుచున్నది.

నాయొక్క జగత్-ఈశ్వర-జీవ.... భేదములన్నీ వీగిపోవుచున్నాయి. అశేషమగు కర్మ-విధి-నిషేధ భేదములన్నీ ఎటో వెళ్ళిపోవుచున్నాయి. మటుమాయమగుచున్నాయి! ఆ ప్రత్యక్ వస్తువగు ఆత్మతో మమ-ఏకత్వము సంతరించుకొనుచున్నాను!

అనేక నియమములతో కూర్చి చెప్పబడు బ్రహ్మచారి-గృహస్త-వానప్రస్త-సన్యాస ఆశ్రమ ధర్మముల సంబంధమైన విధి - నిషేధములను అధిగమించుచున్నవాడనగుచున్నాను.

ప్రవితత సుఖపూర్ణ సంవిదేవ అహమ్।
(సత్ + విత్ ఏవ అహమ్)

ఆత్మ స్వరూపుడుగా - అవన్నీ నాపట్ల **లేనివే** అగుచున్నాయి.
సర్వత్రా వ్యాపించి, పరమసుఖ స్వరూపమగు సత్+విత్=సంవిత్ స్వరూపడను నేను!

---

**6.** సాక్ష్యహమ్। అనపేక్షో౽హమ్।
నిజమహిమని సంస్థితో౽హమ్।
అచలో౽హమ్। అజరో౽హమ్। అవ్యయో౽హమ్।
పక్ష-విపక్షాది భేదవిదూరో౽హమ్। అవబోధైక రసో౽హమ్।
మోక్షానందైక సింధురేవా౽హమ్।
సూక్ష్మో౽హమ్ । అక్షరో౽హమ్।
విగళిత గుణజాల కేవలాత్మా౽హమ్।
నిస్త్రైగుణ్య పదో౽హమ్। కుక్షి స్థ అనేక లోక కలనో౽హమ్।
కూటస్థ చేతనో౽హమ్। నిష్క్రియ ధామా౽హమ్
అప్రతర్క్యో౽హమ్।

ఈ సర్వమునకు కేవల సాక్షిని. దేనిపట్లా అపేక్ష లేనివాడను. నిజమహిమచే సర్వత్రా సంస్థితుడనై ఉన్నవాడను. దేహములు రావచ్చు, పోవచ్చుగాక! నేను యథాస్థానంలో ఆత్మగా అచలుడను! జరామరణములు నాకు లేవు! మార్పు-చేర్పులు లేనివాడను! అవ్యయుడను! నాకు నావారు లేరు! కాని వారూ లేరు. పక్ష-విపక్షములు లేనివాడను!

ఆత్మబోధైక రసస్వరూపుడను! మోక్షానందైక సముద్రడను! స్థూలమును ఉపయోగించునట్టి సూక్ష్మాతిసూక్ష్మ (Very Subtle) స్వరూపుడను! క్షరము లేనివాడను! అక్షరుడను! గుణములకు ఆవల గల నిర్గుణ కేవలాత్ముడను! త్రిగుణరహితమగు సంస్థానమే నా సహజ స్వరూపము! ఈ సకల లోకములు నా కుక్షియందే ఉంటున్నాయి! మూల ప్రకృతి స్వరూపుడను! కూటస్థ (Root form) చైతన్య స్వరూపుడను! నిష్క్రియ స్థానములో వెలయుచున్నవాడను! చర్చించి, విశ్లేషించి, ఊహించి చెప్పటానికి అలవికానట్టి వాడను!

---

**7.** ఏకో౽హమ్। అవికలో౽హమ్।
నిర్మల నిర్వాణమూర్తిరేవా౽హమ్।
నిరవయోవో౽హమ్। అజో౽హమ్।
కేవల సన్మాత్ర సారభూతో౽హమ్।
నిరవధి నిజబోధో౽హమ్।
శుభతర భావో౽హమ్।
అప్రభేద్యో౽హమ్।
విభురహమ్। అనవద్యో౽హమ్।
నిరవధి నిస్సీమ సత్వమాత్రో౽హమ్।

సర్వదా ఏకస్వరూపుడను! అనేకముగా అవటమే లేదు! నాకు ఎట్టి వికలములు మొదలే లేవు! సర్వదా సర్వత్రా మూర్తీభవించిన నిర్మల-నిర్వాణ స్వరూపుడను! నేను అవయవముల స్వరూపము కాదు! నిరవయవుడను!

ఈ దేహమునకు జన్మ ఉండవచ్చుగాక! దేహి స్వరూపుడనగు నేను జన్మరహితుడను! అజో౽హమ్! కేవల సత్ (ఉనికి-నేను ఉన్నాను అను రూపము) యొక్క సారభూతుడను! నాకు అధికమైనది మరొకటేదీ లేనివాడను. నిరవధిక-నిజబోధ స్వరూపుడను! శుభంకరుడను! శుభములన్నిటికీ ఆవల గల కేవలభావనా స్వరూపుడను! అఖండుడను! అప్రభేద్యుడను (I am unpartitionable)! మనోబుద్ధి చిత్త అహంకారములను నియమించువాడును! విభుడను! వేరువేరు భాగములుగా విభజించబడని వాడను! అనవద్యుడను! అవధులుననవే లేనట్టి సత్వమాత్ర స్వరూపుడను!

---

**8.** వేద్యో౽హమ్ ఆగమాంతైః
ఆరాధ్యః సకల భువన హృద్యో౽హమ్।
పరమానంద ఘనో౽హమ్।
పరమానందైక భూమ రూపో౽హమ్।
శుద్ధో౽హమ్। అద్వయో౽హమ్।
సంతత భావో౽హమ్। ఆది శూన్యో౽హమ్।

తెలియబడేది - తెలుసుకొనేది - అంతానేనే! వేద్యుడను.

తెలియబడేదానికంతటికీ ఆవల తెలుసుకొనుచున్నట్టి వాడను. వేదములకు చివరగా గల వేద-వేదాంత స్వరూపుడను! ఉపనిషత్తులన్నీ గానం చేస్తున్నది నాగురించే! సకల భువనములకు (14 లోకములకు) హృదయేశ్వరుడను! ఘనీభూతమైన పరమానంద స్వరూపుడను! పరమానంద భూమ (Highest Zone of Happyness) ఘనీభూత రూపుడను! నిత్యశుద్ధుడను! నాకు వేరైనదంటూ ఎక్కడా లేనివాడను! అద్వయో౽హమ్! మొదలు అనునదే లేనివాడను! సంతత భావ స్వరూపుడను! ఆది శూన్యుడను!

---

**9.** శమిత-అంత త్రితయో౽హమ్।
బుద్ధో ముక్తో౽హమ్। అద్భుతాత్మా౽హమ్।
శుద్ధో౽హమ్। అంతరో౽హమ్।
శాశ్వత విజ్ఞాన సమరసాత్మా౽హమ్।
శోధిత పరతత్త్వో౽హమ్।
బోధానందైక మూర్తిరేవా౽హమ్।

జాగ్రత్-స్వప్న-సుషుప్తులనే త్రితయములు శమించియున్నవాడను! బుద్ధిచే సర్వదా ముక్తుడను! అద్భుతమగు ఆత్మస్వరూపుడను!

ఎట్టి జన్మ-కర్మాది దోషములు అంటనట్టి పరమశుద్ధస్వరూపుడను! సర్వజీవుల అంతరమున ఉన్నవాడను! అంతరాంతరస్వరూపుడను! అందరిలో "తెలుసుకొను చుండటము" అను రూపమైన **శాశ్వత విజ్ఞాన సమరస స్వరూపుడను!** ఎవరికి వారే తమయందు వెతుగుచుండగా లభించగల పరతత్త్వ స్వరూపుడను! మూర్తీభవించిన బోధానంద స్వరూపుడను!

**10. వివేకయుక్తి బుద్ధ్యాఽహమ్।**
**జానామి ఆత్మానమ్ అద్వయమ్।**
**తథాపి బంధమోక్షాది వ్యవహారః ప్రతీయతే।**
**నివృత్తోఽపి ప్రపంచో మే**
**సత్యవత్ భాతి సర్వదా।**
**సర్ప ఆదౌ రజ్జుసత్తేవ, బ్రహ్మసత్తేవ కేవలమ్।**

వివేకము-యుక్తి (ఉపాయము)చే అంతరంగముననే ఉన్నట్లు తెలియబడు ఆత్మను! ద్వితీయమనునదే లేనట్టి ఆత్మస్వరూపముగా తెలియబడుచున్నట్టి వాడను! అట్లా అయి ఉండి కూడా, బంధ-మోక్షముల విశేషములు గలవానివలె తెలియబడుచున్నది కూడా నేనే!

ప్రపంచము నివృత్తి కాగా, శేషించుచున్న నివృత్తి ప్రపంచ స్వరూపుడను! అయినప్పటికీ కూడా, కల్పనామాత్రమై, సత్యమువలె భాసిస్తున్న ఈ ప్రపంచమంతా నారూపమే!

త్రాడు పామువలె అనుభూతమయ్యేవిధంగా...., వాస్తవానికి త్రాడుత్రాడుగానే ఉన్నతీరుగా, పాము కల్పితమైన ఆపాదనగా..., ఇదంతా కేవల బ్రహ్మసత్తయే! పాము అనునదే లేనివిధంగా, ప్రపంచమనునదే లేదు.

---

**11. ప్రపంచాధార రూపేణ వర్తతే, అతో జగత్ నహి।**
**యథా ఇక్షురస సంవ్యాప్తా శర్కరా వర్తతే,**
**తథా, 'అద్వయ బ్రహ్మ' రూపేణ**
**వ్యాప్తోఽహమ్ వై జగత్రయమ్।**
**బ్రహ్మాది - కీట పర్యంతాః ప్రాణినో మయి కల్పితాః।**

చెఱకు రసమంతా పంచదార (మాధుర్యము) వ్యాపించి ఉన్న తీరుగా, ఈ జగత్తంతా నేనే వ్యాపించి ఉన్నాను. అయితే వాస్తవానికి జగత్తు అనబడేదేదీ మమాత్మకు వేరుగా (త్రాడులో పామే లేని తీరుగా) లేనే లేదు!

చెఱకురస మాధుర్యమువలె నేను త్రిజగత్తులన్నీ ఆత్మస్వరూపముచే వ్యాపించి ఉన్నాను. బ్రహ్మదేవుని నుండి కీటకము వరకు గల సర్వప్రాణులు నాయొక్క కల్పనయందు గల అంతర్విశేషములే!

---

**12. బుద్బుదాది వికారాంతాః**
**తరంగాః సాగరే యథా,**
**తరంగస్థం ద్రవం సింధుః**
**న వాంఛతి యథా తథా,**
**విషయానంద వాంఛా మే**
**మా భూత్ ఆనంద రూపతః।**
**దారిద్ర్య-ఆశా యథా నాస్తి సంపన్నస్య, తథా మమ॥**

బుడగలు, తరంగములు... ఇవన్నీ కూడా సముద్రజల స్వరూపములే! అయితే సముద్రము తనయందలి తరంగములలోని ద్రవత్వము "నాకు కావాలి" ... అని కోరుకుంటుందా? తరంగ జలముయొక్క ద్రవత్వస్వభావము సముద్రములోని చమత్కారమే కదా!

అట్లాగే ఆనందస్వరూపుడనేనగు నేను "దారిద్ర్యము పోవాలి - సంపదలు రావాలి! వచ్చి ఆనందమును కలుగజేయాలి" అని కోరుకోను. ఆనందమే స్వరూపముగా గల నాకు ధనాశ తీరటం వలన క్రొత్తగా వచ్చే ఆనందము ఏముున్నది? ఒక ధనికుడు పేదతనమును కోరుకోని తీరుగా, నేను జగత్ విషయమేదీ కోరుకొనటము లేదు.

---

**13. బ్రహ్మానందే నిమగ్నస్య విషయాశా న తత్ భవేత్।**
**విషం దృష్ట్వా, అమృతం దృష్ట్వా**
**విషం త్యజేతి బుద్ధిమాన్, ఆత్మానమ్ అపి దృష్ట్వా**
**అహమ్, అనాత్మానమ్ త్యజామి అహమ్।**

బ్రహ్మానందమునందు నిమగ్నుడనై ఉన్న నాకు విషయానందములతో పని ఏమున్నది?

ఏ బుద్ధిమంతుడైనా ... విషము - అమృతము - ఈ రెండూ తారసపడినప్పుడు అమృతమును స్వీకరిస్తాడేగాని, విషమును కానే కాదు కదా! విషయములే విషము. ఆత్మను ఎరుగుచూ - దర్శించిన తరువాత ఇక నేను స్వభావసిద్ధంగానే అనాత్మనంతా త్యజించి వేయుచున్నాను!

---

**14. ఘటా అవభాసకో భానుః,**
**ఘటనాశే న నశ్యతి।**
**దేహావభాసకః సాక్షీ, దేహ నాశే న నశ్యతి।**
**న మే బంధో। న మే ముక్తిః।**
**న మే శాస్త్రమ్। న మే గురుః।**

కుండలో గల నీటిలో సూర్యుడు ప్రతిబింబిస్తున్నాడనుకోండి. ఆ కుండ పగిలితే ఆకాశంలోని సూర్యుడు నశిస్తాడా? లేనే లేదు! అట్లాగే సర్వమునకు **కేవలసాక్షిని, ఆత్మ స్వరూపుడను** అగు నేను ఈ దేహనాశనముచే ఏమాత్రము నశించువాడను కాదు!

**ఆత్మ**నగు నాకు **బంధము** లేదు. **ముక్తి** లేదు. జీవాత్మగా ఏదైనా బంధముంటే దానికి నేను పరిమితుడను కాదు! పరమాత్మగా నాకు బంధమే లేదు! ఆత్మానందము రుచి చూస్తూ ఉండగా ఇక నాకు శాస్త్రము లేదు! గురువు లేడు! ఆత్మయేవ హి గురుః।

---

**15. మాయా మాత్ర వికాసత్వాత్**
**మాయాతీతోఽహమ్, అద్వయః।**
**ప్రాణాః చలంతు తత్ ధర్మైః**
**కామైర్వా హన్యతాం మనః।**
**స్వభావ-ఆనంద పూర్ణస్య**
**మమ దుఃఖమ్ కథమ్ భవేత్?**

ఈ కనబడేదంతా కేవలము మాయా విలాసమే! భావావేశముచే ఉన్నట్లుగా కనిపించేదంతా వాస్తవానికి లేనేలేదు. ఇక నేనో? అద్వయుడను! నాకు వేరైనదంటూ ఏదీ లేనివాడను! **మాయాతీతుడను! మాయకు సాక్షిని!**

- ప్రాణములు వాటి ధర్మమును అనుసరించి చలించుచున్నాయి.
- మనస్సో? అద్దాని స్వభావంచేత ఏదేదో కోరుకుంటూ ఉంటోంది! బాధలు పొందవచ్చు గాక! ఇవన్నీ ఆతీరుగా అవవచ్చుగాక! నేను స్వభావము చేతనే ఆనంద-పూర్ణస్వరూపుడను! అట్టి నాకు ప్రాణమువలనగాని, మనస్సువలన గాని దుఃఖము ఎట్లా కలుగుతుంది? కలుగదు! సముద్రంలో తరంగాలవలె నాలో ప్రాణ-మనస్సులు తరంగాలు!

**16.** ఆత్మానమ్ అంజసా వేద్మి।
క్వాపి అజ్ఞానం పలాయితమ్। కర్తృత్వమపి మే నష్టమ్।
కర్తవ్యమ్ వా అపి న క్వచిత్।
బ్రాహ్మణ్యం కుల-గోత్రేచ
నామ సౌందర్య జాతయః స్థూలదేహగతా।
ఏతే స్థూలాత్ భిన్నస్య, మే నహి।

అవును! పెద్దలు చూపు మార్గంగా నేను ఆత్మ గురించి తెలుసుకుంటున్నాను. ఇక అజ్ఞానం ఎటువెళ్ళుతోందో ఏమి చెప్పాలి? దీపము వెలిగించితే చీకటి ఎటుపోతోంది?

నాకు ఇప్పుడు కర్తృత్వము లేదు! కర్తవ్యము లేదు. చేయువాడనుగాను! చేయవలసినదీ లేదు! బ్రాహ్మణ్యము, కులము, గోత్రము, పేరు, అందంగా ఉండటము... ఇవన్నీ కూడా ఈ స్థూల దేహానికి మాత్రమే చెందినవి! ఇక నేనో? ఈ స్థూల దేహమునకు భిన్నమైయున్న ఆత్మను కదా! అందుచేత అవి నాకు చెందినవి కావు.

---

**17.** క్షుత్ పిపాస అంధ్య బధిరస్య
కామక్రోధాదయో అఖిలాః లింగదేహ గతా।
ఏతే హి అలింగస్య న సంతిహి।
జడత్వ ప్రియమోదత్వ ధర్మాః కారణ దేహగాః
న సంతి మమ నిత్యస్య నిర్వికార స్వరూపిణః॥

ఆకలి, దప్పిక, గ్రుడ్డితనము (చూపు లేకపోవడం) చెవులు పని చేయకపోవడం (వినలేకపోవటం), కామము, క్రోధము.... ఇటువంటివన్నీ కూడా లింగ దేహము (సూక్ష్మ దేహము) యొక్క లక్షణాలు. నేనో? లింగదేహరహితుడను! అందుచేత అవన్నీ నాకు ఎప్పుడూ లేవు! జడత్వము, ప్రియత్వము, మోదకత్వము.... ఇవన్నీ కూడా కారణ దేహము యొక్క లక్షణములు. నిత్యుడను, నిర్వికార స్వరూపుడను అయి ఉన్న నాకు అవన్నీ స్వతఃగానే లేనేలేవు!

---

**18.** ఉలూకస్య యథా భానుః అంధకారః ప్రతీయతే,
స్వప్రకాశే పరానందే తమో మూఢస్య జాయతే।

గుడ్లగూబ వెలుతురు చూడలేదు కనుక సూర్యకాంతి చీకటివలె, అద్దానికి తోచుచూ ఉంటుందే!

అట్లాగే పరానంద స్వయం ప్రకాశమగు-ఆత్మ మూఢ దృష్టికి "తమస్సు(Darkness)" వలె తోచుచున్నది. మూర్ఖత్వము తొలుగగా, విజ్ఞాన దృష్టికి అంతా ఆత్మయే!

---

**19.** చక్షుర్దృష్టినిరోధే అభ్రైః 'సూర్యోనాస్తి' -
ఇతి మన్యతే ....,
తథా అజ్ఞాన-ఆవృతో దేహీ
'బ్రహ్మ నాస్తి' - ఇతి మన్యతే।
యథా అమృతమ్-విషాత్ భిన్నమ్,
విషదోషైః న లిప్యతే, న స్పృశామి జడాత్ భిన్నో
జడదోషాత్ న ప్రకాశతః॥

ఆకాశమంతా మేఘములు క్రమ్ముకొని ఉన్నప్పుడు సూర్యుడు లేనట్లుగా ఉంటుంది! **"కళ్ళకు కన్పించటము లేదు కాబట్టి సూర్యుడు లేడు"** - అని ఒకడు అనవచ్చు. అట్లాగే, ఈ దేహి అజ్ఞానముచే ఆవరించబడి ఉన్నప్పుడు "బ్రహ్మమే లేదు!" అని అనవచ్చుగాక! **బ్రహ్మము లేనిది ఎప్పుడు? బ్రహ్మము కానిది ఏది?**

అమృతము - విషము భిన్న భిన్నమైనవి కదా! విషము ప్రక్కనే మరొక పాత్రలో ఉన్నంత మాత్రం చేత అమృతము - అమృతము కాకుండా పోతుందా? జడమునకు వేరైనట్టి చైతన్య స్వరూపుడనగు నేను జడ సంబంధమైన దోషములచే స్పృశించబడు వాడను గాను! నాకు జడత్వము అంటదు! నన్ను ముట్టదు.

---

**20.** స్వల్పాఽపి దీపకణికా బహులం నాశయేత్ తమః,
స్వల్పోఽపి బోధోపి
అజ్ఞానం బహులం నాశయేత్ తమః।
కాలత్రయే యథా, సర్పో రజ్జౌ నాస్తి, తథామయి।

దీపము వ్రేలెడంతే అయినప్పటికీ గదిలో అంతా విస్తరించియున్న చీకటినంతటినీ తొలగించివేస్తుంది కదా! అట్లాగే స్వల్ప ఆత్మజ్ఞానముచేత జన్మ జన్మలుగా విస్తరించియున్న బాహుళ్యమైనట్టి అజ్ఞానము తొలగగలదు! త్రికాలములందు (పాము ఉన్నదనుకొనకముందు, పామును చూచినామని అనుకున్నప్పుడు, అది పామేకాదని తెలిసినప్పుడు కూడా)... అక్కడ త్రాడుయే ఉన్నది. పాము ఎప్పుడూ లేదు కదా! త్రికాలములలోనూ ఆత్మయే సత్యము!

---

**21.** అహంకారాది దేహాంతం జగత్ నాస్తి। అహమ్ అద్వయః।
చిద్రూపత్వాత్ న మే జాడ్యమ్।
సత్యత్వాత్ న అనృతమ్ మమ।
ఆనందత్వాత్ న మే దుఃఖమ్,
అజ్ఞానాత్ భాతి సత్యవత్।
ఇతి ఆత్మప్రబోధోపనిషదమ్
ముహూర్తమ్ ఉపాసిత్వా,
న చ పునరావర్తతే। న చ పునరావర్తతే॥
ఇత్యుపనిషత్
ఆత్మబోధోపనిషత్ సమాప్తః।
ఓం శాంతిః శాంతిః శాంతిః

అద్వయ స్వరూపుడను, ఆత్మరూపుడను అగు నాయందు అహంకారము మొదలుకొని ఈ దేహము, జగత్తు మొదలైనవాటి వరకూ ఎప్పుడూ ఇవన్నీ లేనేలేవు! స్వప్నంలో వాస్తవానికి ఇళ్ళు-నగరములు-మనుష్యులు ఉన్నారా? లేరుకదా!

నేను సర్వదా చిదానంద రూపుడను! అట్టి నాకు దేహ-దృశ్య జాడ్యములు మొదలే లేవు! సర్వదా సత్యస్వరూపుడనగు నాయందు మాయ, అనృతము (మాయా- యామా) ఇత్యాదులు లేనేలేవు! కేవలానంద స్వరూపుడనగు నాయందు దుఃఖాదులు లేవు! అజ్ఞానముచే లేనివి ఉన్నట్లుగా, సత్యము వలె భాసిస్తున్నాయి. వాస్తవానికి నేనే సర్వదా సత్యమును! నిత్యమును!

**నేనే సర్వదా సత్ రూప సత్యమును!**

ఆత్మబోధాత్మకమగు ఈ ఉపనిషత్‌ను ముహూర్త కాలము **(64 ని॥ కాలము)** ఉపాసించినా కూడా... అట్టివాడు పునః జన్మించడు! అతనికి ఈ జన్మా లేదు! పునర్జన్మా లేదు! లేనిదే అగుచున్నది. **జన్మలే లేనివాడికి ఈ జన్మమాత్రం ఎక్కడున్నది?**

**ఇతి ఆత్మబోధోపనిషత్ సమాప్తః**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 2 ఆత్మబోధోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



**'ఓం నమో నారాయణాయ'** అను అష్టాక్షర స్వరూపుడు – మనందరి ఆత్మస్వరూపుడై ఆ నారాయణుడు సర్వదా స్వానుభవమే అయి ఉన్నారు. అట్టి వారిని ఆత్మబోధోపనిషత్‌తో అర్చించుచున్నాము.

⌘

'ఓం' కేవల విషయరహితానంద స్వరూపుడగు నారాయణ స్వరూపము. నారాయణుడు ప్రణవ స్వరూపుడు.

ప్రణవము 'ఓం' = – 'అ'కారము + 'ఉ'కారము + 'మ' కారము
– సత్ + చిత్ + ఆనందము
– త్ర్యక్షరమ్ ! ప్రణవమ్ ! కేవలము ! నిర్గుణము! **నారాయణాయ సగుణము**.

'ఓం' కార ఉచ్చారణచే, జపించటం చేత, అట్టివాడు బ్రహ్మజ్ఞాని అగుచున్నాడు. బ్రహ్మము గురించి తెలుసుకుంటున్నాడు. ఫలితంగా జన్మ మృత్యు సంసారము నుండి విముక్తుడగుచున్నాడు.

**ఓం నమో నారాయణాయ - శంఖ చక్ర గదాధరాయ!**

అను మంత్రమును జపించటం చేత ఆ ఉపాసకుడు జన్మ – మృత్యువుల పరిధిని దాటినవాడై, **వైకుంఠ ధామమును** సముపార్జించు కొంటున్నాడు. **'బ్రహ్మపురము'** చేరుచున్నాడు. తనయొక్క సగుణ – నిర్గుణ స్వరూపతత్త్వములను ఎరుగుచున్నాడు.

అట్టి బ్రాహ్మీస్థానము వికశించిన పద్మమువలె **ఆత్మజ్ఞానోదయం! బ్రహ్మమును ఎరిగిన వాడు బ్రహ్మమే అగుచున్నాడు**. బ్రహ్మము **కేవల ప్రకాశమాత్రము.** దీపకాంతివలె **స్వయంజ్యోతి స్వరూపము**. దీపమును చూడటానికి మరొక దీపంతో ఏమి అవసరం ? బ్రహ్మము **ఆ రీతిగా స్వయం ప్రకాశం. స్వయం ప్రదర్శకం!**

దేవకీ పుత్రుడగు శ్రీకృష్ణమూర్తి, మదుసూధనుడు, విష్ణువు, అచ్యుతుడు అగు శ్రీమన్నారాయణమూర్తి స్వయముగా పరబ్రహ్మమే! కృష్ణస్తు భగవన్ స్వయమ్ ! *(నారాయణమ్ మహోజ్ఞేయమ్। అంతర్బహిశ్చ తత్ సర్వమ్ వ్యాప్య నారాయణ స్థితః)!*

పరబ్రహ్మ స్వరూపుడగు నారాయణుడే సర్వ భూతజాలమునందు సర్వదా సమముగా వేంచేసియున్నారు!

సర్వ భూతములు (జీవులు) నారాయణుడే ! నారాయణుడే – ఆ పరబ్రహ్మము ! కనుక సర్వజీవులు పరబ్రహ్మమే !

అట్టి ఏకము – సర్వభూతస్థము అగు నారాయణుడే సర్వమునకు కారణకారణుడు. సర్వమునకు నారాయణ పరబ్రహ్మమే కారణమయి ఉండి కూడా... ఆ నారాయణుడు స్వయముగా అకారణుడు! ఆయనకు మరొక్కటేదీ కారణము కాదు.

**ఓమ్ నారాయణాయ** – 'ఓం' కార, సత్ – చిత్ – ఆనంద కారణ పురుష, అకారణ సర్వభూతస్థ – సర్వముతానైన **పరబ్రహ్మమునకు** నమస్కరిస్తున్నాను.

నమో – న = సర్వాత్మకుడు

మ = జీవాత్మ

నమో = జీవాత్మగా కనిపిస్తూ పరమాత్మగా అయి ఉన్నవారు

విష్ణు – సర్వము తానై, సర్వముగా విస్తరించి ఉన్న పరబ్రహ్మము.

సర్వరూపములు తానై–సర్వమునకు సాక్షి అయి, సర్వ బ్రహ్మాండములకు తానె సూత్రధారి అయి, సర్వముగా కనిపిస్తూ–ఏకమే అయి ఉన్న ఆ విష్ణు భగవానుని **'ఓం నమోనారాయణాయ'**

- అష్టాక్షరీమంత్ర సహాయముతో ధ్యానించువాడు, ధ్యాసను సులభముగా ఆ పరబ్రహ్మముపై నిలుపుచున్నాడు.
- **శోకమోహ వినిర్ముక్తమ్ విష్ణుమ్ ధ్యాయన్నసీదతః :** శోకమోహముల నుండి (From all worries and from all illusions) విముక్తుడగుచున్నాడు.
- **ద్వైత – అద్వైతమభయం భవతిః :** ద్వైత – అద్వైత బేదభావాలన్నీ మొదలంట్లా తొలగిపోతున్నాయి.

తానే అభయస్వరూపుడగుచున్నాడు. స్వయం నారాయణ పరబ్రహ్మమై ప్రకాశించుచున్నాడు.

ఇదంతా ఏకమగు నారాయణ పరబ్రహ్మమే! ఇక్కడ అనేకమనునదే లేదు. ఇదంతా ఎవ్వరైతే **ఏకో నారాయణ స్వరూపముగా** కాకుండా, అనేకముగా వేరు వేరై ఉన్నట్లుగా చూస్తూ ఉన్నారో .....

**మృత్యోః స మృత్యుమ్ అప్నోతి య ఇహ నానేవ పశ్యతి**

అట్టి భేద దృష్టి కొనసాగిస్తున్నవారు ఒక మృత్యువు నుండి – మరొక మృత్యువును పొందుచూ పోవుచున్నారు.

ఒక జన్మనుండి → మరొక జన్మను

ఒక చావు నుండి → మరొక చావును... పొందుచూనే ఉంటారు. ఏకమగు నారాయణుని (లేక) సర్వముగా ఉన్న విష్ణుతత్త్వమును దర్శించినప్పుడు మాత్రమే అమృత స్వరూపులై, జన్మ జరా మరణ – పునర్జన్మల చక్రము నుండి విడివడి **అమృత స్వరూపమగు నారాయణ పరబ్రహ్మతత్వము** తామే అయి ప్రకాశించగలరు. అట్టి సర్వత్రా విస్తరించి ఉండుటచే **విష్ణువు!** ఓంకార పరబ్రహ్మగుటచే నారాయణుడు! సర్వముతానే అయి ఉండుటచే శ్రీకృష్ణ చైతన్యమూర్తి! ... ఆయన ఉన్నదెక్కడ! ఎక్కడికి వెళ్ళి ఆయనను దర్శించాలి !

ఆయన సర్వుల అంతర్ – హృదయేశ్వరుడు! హృత్ పద్మమునకు మధ్యగా వేంచేసి ఉండి, సర్వము తానే అయి కూడా సర్వమును వేరుగా స్వమాయచే దర్శించు జ్ఞాన–విజ్ఞాన నేత్రుడు!

**ఎరుక** (లేక) **'ప్రజ్ఞ'** అనే ప్రజ్ఞానేత్రమునందే కంటిలో చూపుగా, హృదయములో జగద్దర్శిగా, బాహ్యమున జగత్ దృశ్యముగా ఉన్నవారు. ప్రదర్శనమగుచున్నదంతా ఆ నారాయణుడే! ఈ సర్వము ఆయన యొక్క ప్రజ్ఞానేత్ర సందర్శనం!

ద్రష్టగా ప్రతిష్ఠుతుడై ఉన్నది ఆ ప్రజ్ఞానేత్రమే! ఆ ప్రజ్ఞా నేత్రమే దృశ్యరూపంగా – లోకములుగా ప్రతిష్ఠితమై ఉన్నది.

ఇదంతా నారాయణుని స్వరూప – ప్రజ్ఞావిశేషమ్ ! ప్రజ్ఞయే నారాయణుడు !

**ప్రజ్ఞానం బ్రహ్మ !** ప్రజ్ఞానమే బ్రహ్మము ! తెలియబడుచున్నదంతా నేనైన నేనే బ్రహ్మమును!

తెలుసుకొనుచున్నది – తెలివి – తెలియబడుచున్నది... ఈ త్రిపుటి ఏకమగు ప్రజ్ఞానారాయణ స్వరూపమే!

**'ప్రజ్ఞానమ్ బ్రహ్మ'** అను ఈ వేద మహావాక్యము యొక్క అర్థము తెలిసి, "నేను – నాచే గాంచబడేది... ఇదంతా కేవల ప్రజ్ఞారూపమగు – చిదానంద రూప పరబ్రహ్మమే! నారాయణుడే" – అని తెలుసుకొన్నవాడు–ఈ "లోకములలో రాకపోకలు" అనే జన్మ–మృత్యు పరిధిని దాటి ఆముష్మిక స్థానమును చేరుచున్నాడు. అట్టివాడు అమృతస్వరూపుడై **"కావాలనుకుంటే జన్మ! జన్మించి కూడా జన్మరాహిత్యము"** అను స్వాతంత్ర్యము పొందగలడు ! సర్వకోరికలు సిద్ధించినవాడై సమము – శాంతము అగు అమృతస్వరూపుడై విరాజిల్లుచున్నాడు. "ఓం నమః" అను **ఇతి మోక్ష స్థానం** చేరుచున్నాడు.

ఓం! ఓ సర్వాంతర్యామీ ! సర్వతత్త్వ స్వరూపా ! శ్రీహరీ ! శ్రీమన్నారాయణా ! విష్ణు దేవా ! శ్రీకృష్ణ పరబ్రహ్మమా !

మమ్ములను అసత్తు (కల్పన) నుండి – సత్తు (సత్యము) లోనికి, తమస్సు (చీకటి, అజ్ఞానము) నుండి – జ్యోతి లోనికి, (వెలుతురుకు), మృత్యువు నుండి – అమృతత్వము తీసుకొని పోవుటకై మీకు **'ఓం నమో నారాయణాయ'** అని అష్టాక్షరీ స్తోత్రము చేయుచున్నాము.

- ఏ చోట ఆత్మత్వము పొగలేని అగ్నివలె జ్యోతిస్వరూపమై వెలుగొందుచున్నదో – **యత్ర జ్యోతిః అజస్రం,**
- ఎక్కడ ఆత్మజ్యోతి నిత్యము ఉపాసించబడుచున్నదో – **యస్మిన్ లోకే అభ్యర్హితమ్,**

అట్టి అమృతప్రదమగు విష్ణులోకము మాకు ప్రసాదించండి ! అమృతమయ లోకమునుజేరి ఈ మృతత్వమును అధిగమించెదముగాక! ఓంకార స్థానము పొంది ఆత్మతత్త్వ జ్ఞానులమై, బ్రహ్మమై ఆత్మస్వరూపులమై అమృత దృష్టిని అస్వాదించెదము గాక !

**అమృతే లోకే అక్షితే, అమృతత్వం చ గచ్ఛతి ఓం నమయితి !** అమృతమగు – సర్వము ఆత్మగా దర్శించే – దృష్టిచే మేము ఓంకార స్వరూపానందమగు అమృతత్త్వమును సంతరించుకొనెదము గాక !

⌘

- అమృత స్వరూపుడగు శ్రీమన్నారాయణోపాసనము సహాయంగా తీసుకొనుచున్నాను!
- నా యొక్క కల్పనచే నా చుట్టూ నాకు నేనే కల్పించుకొన్న మాయావరణము వీగి పోగా, ఇక నేను కేవల 'దృక్' స్వరూపుడనగుచున్నాను.

నా యందు **బ్రహ్మమేవాఽహమ్ – అహమ్ బ్రహ్మోఽస్మి** అను సూర్యోదయముచే భ్రమాత్మకమగు జీవాహంకారము – వెలుగు వచ్చినప్పటి చీకటివలె–తొలగిపోవుచున్నది. నా పట్ల జగత్తు–జీవుడు–ఈశ్వరుడు ఇత్యాది భేదాలన్నీ స్వయంగా అంతర్హితమగుచున్నాయి. వాటికి అవే అవన్నీ నాకు అభిన్నమై, నా యొక్క ప్రత్యక్‌పర స్వరూప ప్రదర్శనా విన్యాసమాత్రమై ఉంటున్నాయి. స్వప్నమంతా నాదే ! స్వప్నములోని నేను – నీవు కూడా నేనే ! స్వప్నమునకు వేరై ఉన్నవాడిని నేనే ! అట్టి ప్రత్యేక ఆత్మస్వరూపుడనై ప్రకాశించుచుండగా... ఇక అంతకుముందున్నట్టి అంతులేని కర్మ పరంపరలు నాపట్ల స్వతఃగానే 'లేనివి' అగుచున్నాయి. ఇక నేను–బ్రహ్మచారి–గృహస్థ–వానప్రస్త–సన్యాసాశ్రమ సంబంధములైన విధి–నిషేధములను (Dos & Don'ts) అధిగమించినవాడనగుచున్నాను.

సర్వమునకు వేరై వెలుగొందుచున్న **బ్రహ్మమే** నేనగుచున్నాను.

⌘

**నేనెవ్వరు ? కోఽహమ్? అహమ్ బ్రహ్మోఽస్మి । 'బ్రహ్మము' అనబడునది నేనే!** పరమ పవిత్రము, సర్వత్రా వ్యాపించి ఉన్నట్టిది, పరమ సుఖస్వరూపము అగు కేవల సంవిత్ (సత్–ఉనికి; విత్–ఎరుక) స్వరూపుడను నేను !

**సాక్ష్యహమ్ :** దేహ – మనో – బుద్ధి – చిత్త – అహంకారములకు – వాటియొక్క సర్వ అవలోకనములతో సహా ఈ సర్వమునకు సాక్షీమాత్రుడను! సర్వమునకు **కేవలసాక్షిని!**

**అనపేక్షోహమ్ :** దేనిపట్లా ఆపేక్ష (Attachment) లేనివాడను. **అపేక్షా బంధరహితుడను.** ఇదంతా 'నేనే' అయి ఉండగా, ఇందులో ఏదో కోరుకోవలసినది ఏముంటుంది? స్వప్నమంతా నాదైన నాకు స్వప్నములో ఒక ప్రదేశముపట్ల అపేక్ష దేనికి?

**నిజమహిమ సంస్థితోఽహమ్ :** సర్వమునకు వేరై, అప్రమేయుడనైనట్టివాడను ! ఈ లోకాలు, దేహాలు, సంబంధ – అనుబంధ – బాంధవ్యాదులు నన్ను ఆశ్రయించి ఉన్నాయి. వాటిలో నేను లేను. అవినాలోనూ లేవు. నా యొక్క మహిమయందే నేను సంస్థితుడనై ఉన్నట్టివాడను! మహామహిమాన్వితుడను! **ఈ 14 లోకాలు నా మహిమ యొక్క కాంతి పుంజములు!**

**అచలోఽహమ్ :** ఆత్మ స్వరూపడనై ఆత్మయందే వేంచేసి ఉంటాను. ఒకచోట నుండి మరొకచోటికి పోవువాడను కాను. స్వప్నమంతా తనదైనవాడు స్వప్నంలో ఈ ఊరి నుండి ఆ ఊరికి పోవుచున్నాడా? లేదు కదా? **నేను అచలుడను.**

**అజరోహమ్ :** నేను ధరించిన ఒక వస్త్రము యొక్క రంగు – రూపు నేనౌతానా? లేదు. నేను ధరించిన ఈ దేహము యొక్క బాల్య – యౌవన – వార్ధక్య – మరణములతో నాకు సంబంధము లేదు. నేను జరామరణములు లేనట్టివాడను. దేహమునకు కేవల సాక్షిని.

**అవ్యయోహమ్ :** నేను 'జీవాత్మ'ను కల్పించుకొనుచూ, జన్మ-కర్మలు నిర్వర్తించవచ్చును గాక ! నా ఆత్మస్వరూపమునకు 'వ్యయము' అనునదేమీ లేదు. అవ్యయుడను. **(పూర్ణాత్ పూర్ణమాదాయ పూర్ణమేవ అవశిష్యతే).**

**పక్ష-విపక్షాది భేదదూరోఽహమ్ :** నాకు ఎక్కడా అయినవాళ్ళు లేరు. కానివాళ్ళు లేరు. స్వపక్షము లేదు. విపక్షము లేదు. ఒకాయన ఒక నవల రాస్తే ... అందులో కొన్ని పాత్రలు ఆయనకు తన పక్షము, మరికొన్ని పాత్రలు ఆయనకు పరపక్షము ఉంటాయా ? కలలో కనిపించేదంతా కలకనేవాని భావనయే అయి వుండగా, ఆ కలకనేవానికి "కొందరు నావారు-మరికొందరు కాదు"... అనునదేముంటుంది! అంతా నావాళ్లే ! నేను సర్వదా ప్రత్యక్ ఆత్మ స్వరూపుడను కాబట్టి ఎవ్వరూ నావారు కాదు ! నాటకంలో ఒక పాత్ర వహిస్తున్నప్పుడు...

- అందరము కలసి నాటకం వేస్తున్నాము కనుక అందరు నావారే !
- నేను సర్వదా పాత్రకు వేరైన వ్యక్తిత్వము కలవాడను కనుక, అంతా నాటకమే కనుక ఎవ్వరూ నావారు కాదు.

  ఈవిధంగా నాకు "నా పక్షము వారు (My Related) – కాని వారు (The other side people) అనునదేమీ లేదు ! అంతా నా ఆత్మ చైతన్య విశేషమే !

**అవబోధైక రసోఽహమ్ :** 'ఎరుగుట' తరువాత కదా, ఎరుగబడేది... అనునది ! ఆ **'ఎరుగుట'**ను **'చిత్, బోధ'** శబ్దములతో కూడా చెప్పుకుంటున్నాం. అట్టి కేవల – అవబోధరూపుడను! బోధైక రూపుడను! అట్టి 'బోధ'చే చెవులతో వినటం, కళ్ళతో చూడటం, మనస్సుతో ఆలోచనలు చేయటం... మొ॥న ఇవన్నీ నాచే నిర్వర్తించబడుచున్నాయి.

**మోక్షానందైక సింధురేవాఽహమ్ :** నేను దేహములకు – భావనలకు ఆవల ఉన్నవాడను. ఈ దేహాదులు నాకు అలంకారములేగాని బంధము కాదు. బంధరహితమగు ఆత్మానంద స్వరూపుడను! అఖండమోక్షానంద సముద్రుడను! ఈ జన్మలు, మనోబుద్ధి చిత్తాహంకారాలన్నీ నా యొక్క మోక్షానంద సముద్రములోని తరంగాల వంటివి!

**సూక్ష్మోఽహమ్ :** ఈ స్థూలదేహము నేను కాదు. ఇది నాచే కదల్చబడే జడమగు వస్తువు వంటిది. నేను సూక్ష్మ చైతన్య స్వరూపుడను! దేహాలకు – భావాలకు ఆవల వుండి వాటిని చైతన్యపరచువాడను! సర్వ స్థూలములకు ఆధారమై ఉంటున్న సూక్ష్మాతి సూక్ష్మ స్వరూపుడను.

**అక్షరోఽహమ్ :** ఈ ప్రపంచంలో కనిపించేదంతా క్షయించటమే ధర్మముగా కలిగి ఉన్నది. ఇక నారాయణస్వరూపుడనగు నేనో? క్షరమునకు ఆవల అక్షరుడను! ఈ దేహము – జన్మ – శిశు – బాల్య – కౌమార – యౌవన – వార్ధక్యములు పొందుచుండగా... ఇద్దానికి వేరై, సాక్షినై అక్షరుడనైనట్టి **ఆత్మస్వరూపుడను!**

**విగళిత గుణజాల కేవలాత్మాఽహమ్ :** త్రిగుణ సంబంధమైన సర్వ గుణములకు ముందే ఉన్న నమో నారాయణుడను! ఆత్మస్వరూపుడను! నేను ఉన్నాను కాబట్టి గుణములు. అంతేగాని, గుణములచేత 'నేను' కాదు! గుణములు నాకు సంబంధించిన **సందర్భసత్యము** మాత్రమే! నేనో, **కేవల నిత్య సత్యమును!** గుణములు లేనప్పుడు కూడా నేనున్నాను! కనుక గుణరహితుడను! గుణాతీతుడను ! కేవలాత్మ స్వరూపుడను!

**నిస్త్రైగుణ్య పదోఽహమ్ :** సర్వదా త్రిగుణరహిత – త్రిగుణాతీత పదమును – స్థానమును అలంకరించి ఉన్నవాడను.

**కుక్షిస్థానేక లోక కలశోఽహమ్ :** ఈ లోకములు, లోకవిశేషములు, లోకాధిపతులు... ఈ వ్యవహారమంతా నా కుక్షియందే కలిగి ఉన్నట్టి ఆత్మస్వరూపుడును. జగత్తులు కలిగియున్నట్టి కలశమును (పూజా కలశమువంటి వాడను).

**కూటస్థ చేతనోఽహమ్ :** తాను కదలక, సర్వమును కదలించు కూటస్థ చైతన్యమే నేను ! మూల ప్రకృతి స్వరూపుడను ! నా యందే సర్వము వెలయుచున్నది. నా వలననే సర్వము కదలుచున్నది. నిశ్చలుడనగు నా యొక్క చేతనా విశేషమే ఈ చంచల జగత్తులు.

**నిష్క్రియధామాఽహమ్ :** క్రియలన్నింటికీ ఆవల అకర్తనై ఉన్నవాడను. అందుచేత నేనున్న చోటు నిష్క్రియ రూపము. మనోబుద్ధి చిత్త అహంకారముల యొక్క ఈ జగన్నాటక రచన – నాటక దీపమువంటి నా (చిత్) వెలుగులో కొనసాగుతోంది.

**అప్రతర్క్యోహమ్ :** బుద్ధిచే ఎవరికి వారే గమనించి ఆస్వాదించగల ఆత్మ స్వరూపుడను. అంతేగాని ఇద్దరు – ముగ్గురు కలసి తర్క – వితర్కములు చేస్తే లభించువాడను కాదు. అవన్నీ ఆత్మావగాహనా బుద్ధికి సహకారి కారణములు మాత్రమే.

**ఏకోऽహమ్ :** (ఒంటివాడ! చుట్టమొకడూ లేదు. పోతన భాగవతం-వామన చరిత్ర). నేను సర్వదా ఏక స్వరూపుడనే! అనేకముగా కనిపిస్తూ ఏకస్వరూపుడునై ఉన్నవాడను. నటుడు అనేక నాటకములలో అనేక వేషములు వేసినప్పటికీ.. అతడు సర్వదా ఒక్కడే కదా! నాటకంలో అనేక పాత్రలు కల్పిస్తూ ఉన్నప్పటికీ నాటక రచయిత సర్వదా ఒక్కడే! స్వప్నంలో అనేక మంది కనిపిస్తున్నప్పటికీ స్వప్నము తనదైనవాడు ఒక్కడే! నేను సర్వదా ఏక స్వరూపుడను! అనేకముగా అగుటలేదు. **అనేకముగా (అజ్ఞానదృష్టికి) కనిపిస్తూ కూడా, సర్వదా ఏకముగా (జ్ఞానముచే) అనిపించువాడను.**

**అవికలోऽహమ్ :** నాకు ఎట్టి వికారములు, వికలములు లేవు. నటుడు నవరసాలు నాటకంలో (నటించుచున్నప్పుడు) ప్రదర్శించు చున్నప్పటికీ... అతనికి ఏ రసము లేదు కదా! జన్మ-కర్మ వికల్పములేవీ నాకు లేవు ! వాటన్నిటికీ ఆవల ఉన్నవాడను.

**నిర్మల నిర్వాణ మూర్తిరేవాऽహమ్ :** నిర్మలమగు నిర్వాణ స్వరూపుడను. జగత్తులుగా మూర్తీభవించినట్టి నిర్మల స్వరూపుడను. మూర్తీభవించిన నిరాకారుడను? అమూర్తి మూర్తుడను!

**నిరవయవోऽహమ్:** నా యొక్క ఇంద్రియశక్తుల ప్రదర్శనము కొరకై ఇంద్రియములకల్పన జరుగుతోంది. ఇంద్రిములకు వేరై, పరమై ఉన్న నేను ఇంద్రియాతీతుడను! ఇంద్రియరహితుడను. ఇంద్రియములు-ఇంద్రియ విషయములు నా సంకల్ప చమత్కారములు మాత్రమే!

**అజోऽహమ్ :** ఈ దేహము జనిస్తోంది. క్షయిస్తోంది. నేనో ? 'దేహి' ని కదా ! కాలఃకాలస్వరూపమగు నా దేహిత్వమునకు జననమే లేదు. అందుచేత అజుడను.

**కేవల సన్మాత్ర సారభూతోऽహమ్ : 'నేను'** అనే భావనకు ముందే **'నేను ఉన్నాను'** అనునదే నా యొక్క సత్ స్వరూపము. **'ఉనికి'** ఉన్నచోటే **'ఎరుక'** ఉంటుంది కదా ! ఎరుకకు మునుముందే ఉన్నట్టి **కేవల సత్ సార స్వరూపుడను.**

**నిరవధి నిజబోధోऽహమ్ :** నవల రచించువాని రచనాకళ ఒక నవలతో అంతము పొందదు కదా ! ఎరుగుట అను చిత్ శక్తి ఒక దేహము యొక్క శబ్ద - స్పర్శ - రూప - రస గంధముల ఎరుకచే ఖర్చు అయ్యేది కాదు. నా యొక్క బోధ (ఎరుక) తత్త్వము అవధులు లేనిది! నిరవధి ! అట్టి నిరవధి నిజ బోధ స్వరూపుడను. అవధులు లేని సత్ - చిత్ - ఆనంద - ఉనికి - ఎరుక - నిజకల్పనానంద స్వరూపడను. ఇదంతా నా వినోదము! అవధులు లేనివాడను.

**శుభతర భావోऽహమ్ :** సర్వ శుభప్రదమగు భావనాస్వరూపుడను! సర్వ శుభ భావములకు ఆవల ఉన్నట్టి వాడను. సర్వ శుభంకరుడను! మహత్తరమైనట్టి శుభప్రదములన్నీ నాయందు కలిగి ఉన్నవాడను!

**అప్రభేద్యోऽహమ్ :** సర్వము ఆత్మయే! నేను ఆత్మ స్వరూపుడను! ఆత్మ సర్వాత్మకమగు ఆత్మయే అయి ఉండటం చేత, నాకు భేదమైనది, వేరైనది ఏదీ లేదు. దేనికీ భేదమైనవాడిని కాను. అప్రభేదుడు! దేనితోనైనా నాకు ఏకత్వమే ఉన్నది! నేను దేనికీ భేదమైన వాడిని కాను.

**విభురహమ్ :** మనో బుద్ధి చిత్త అహంకారములు నాచే నియమించబడినట్టివి. వాటిచే దృశ్యము ఆస్వాదించబడుచున్నది. సర్వమునకు నియామకుడను! విభువును! సర్వము కల్పించునది, కల్పించి ప్రవేశించునది, ప్రవేశించి నన్ను నేనే ఏమరుచుచున్నదీ కూడా నేనే!

**అనవద్యోహమ్ :** నా స్వప్నములో నాకు కనిపించే "నేను - తదితరులు'గా నేను అగుచున్నానా ? లేదు. స్వప్నంలో కనిపించేదేదీ నన్ను జయించలేదు, నన్ను దాటిపోనూ లేదుకదా! ఈ జాగృత్ - సుషుప్తి విశేషములు కూడా అంతమాత్రమే! సర్వదా ఏకమై అవిభాగస్వరూపుడనై ఉన్నాను.

జాగ్రత్ (విశ్వుడు) స్వప్నము (తేజసుడు), గాఢనిద్ర (ప్రాజ్ఞుడు).. నాచే నియమించబడుచూ, ఆస్వాదించబడవచ్చుగాక ! నేనే జాగ్రత్ - స్వప్న - సుషుప్తుల అంతర్గతుడను. వేరు వేరుగా అవకుండానే అంతా ఆపాదించుకొని ఆస్వాదిస్తున్నాను. విభాగముగా అవటం లేదు కాబట్టి నేను సర్వదా అనవద్యుడను. అఖండుడను !

**'నిరవధి నిస్సీమ సత్వమాత్రోऽహమ్ :** దేహానికి పొడవు - వెడల్పులు ఉండవచ్చు గాక! నేను దేహి చైతన్యమును. అవధులు లేనివాడను. ఏ ప్రదేశమునకు పరిమితుడను కాను. నిస్సీమ మహిమా స్వరూపుడను ! కేవల సత్ స్వరూపుడను. పంచభూతాలకు - దేహాలకు - లోకాలకు ఆవల సత్ స్వరూపుడనై ప్రకాశించువాడను. ప్రదేశముచే పరిమితుడను కాను. నన్ను దాటి మరింకేదో లేదు.

**ఆగమాంతైః వేద్యోऽహమ్ :** వేదముల చివరగల ఉపనిషత్ వాణి **'బ్రహ్మము' 'అధ్యాత్మము' 'పరమాత్మ'** మొ॥ శబ్దములతో

చెప్పుచున్న **పరాకాష్ఠతత్త్వము** నేనే! సర్వము ఎరుగుచున్న **వేదాంత పురుషుడను!** ఈ తెలియబడే అంతటినీ తెలుసుకుంటున్న **వేదస్వరూపుడను! వేదాంత స్వరూపుడను!** తెలియబడే జీవుడిని-జగత్తును తద్రూపంగా **తెలుసుకొనుచున్నవాడిని!**

**ఆరాధ్యఃసకల భువన హృద్యోఽహమ్ :** సకల భువనములలోని, 14 లోకములలోని సర్వజనుల హృదయ స్వరూపుడను! ఎవ్వరెవ్వరు ఎక్కడెక్కడ ఎవ్వరెవ్వరని ఆరాధిస్తూ ఉన్నప్పటికీ, అది ఆత్మవస్తువునే! అట్టి ఆత్మస్వరూపుడనే నేను! **అందుచేత సర్వుల ఆరాధ్య వస్తువును.**

**పరమానంద ఘనోఽహమ్ :** ఆత్మస్వరూపంగా నేను ఎల్లప్పుడు ఘనీభూతమైన పరమానంద స్వరూపుడను! నా యొక్క ఆనందవిలాస చమత్కారమే ఈ జన్మ - ఇంద్రియ ... విషయ విశేషాలన్నీ కూడా! **ఇదంతా నాకు నేనే వినోదముగా కలిగి ఉన్నట్టివాడను?**

**పరమానందైక భూమరూపోఽహమ్ :** పరమానంద భూమ (Zone of Natural and Highest happyness) రూపుడను. ఇహానందములకు సంబంధించని **భౌమానంద స్వరూపుడను**. ఆనంద క్రియా విశేషంగా, **సర్వము కల్పించుకొనువాడను.**

**శుద్ధోఽహమ్ :** దేహ - మనో - బుద్ధి - చిత్త - అహంకారములచే ఏ మాత్రము ఆత్మ స్పృశించబడదు. నేను స్వతఃగా ఆత్మానంద స్వరూపుడును! కనుక సర్వదా శుద్ధుడను! నిత్య నిర్మలుడను!

**అద్వయోఽహమ్ :** అస్మత్ ఆత్మస్వరూపమునకు వేరైనది ఎక్కడా ఏదీ లేదు. అందుచేత నేను అద్వయ స్వరూపుడను! ద్వితీయమైనదేదీ లేనివాడను! ఇదంతా నేనే అయి ఉన్నాను! **త్వమేవాఽహమ్। అహమ్ సర్వమిదగ్‍ం సర్వమ్।** 'నీవు'గా ఉన్నది నేనే అయి ఉన్నవాడను.

**సంతత భావోఽహమ్ :** ఎల్లప్పుడు భావనతో కూడి ఉండువాడను. (భావన = ప్రకృతి. అమ్మవారు) భావనా స్వరూపుడను! జాగ్రత్ -స్వప్న-సుషుప్తులు, దేహ-దేహాంతరములు ఇవన్నీ భావనా చమత్కారములే! ఆత్మ - భావన కలసియే ఉంటాయి. (భవుడు + భావన) నేను సర్వదా భావనా సమన్వితుడనై ఉండువాడను.

**ఆదిశూన్యోఽహమ్ :** ఆత్మకు ఆది - అంతములు లేవు. నేను ఆత్మస్వరూపుడనే కాబట్టి నాకు మొదలు అనునదే లేదు. స్వప్నద్రష్ట స్వప్నంతో ప్రారంభమౌతాడా? అంతమౌతాడా? నేను జన్మలతో ప్రారంభంగాను. అంతకు ముందే ఉన్నవాడను. ఎప్పటికీ ఉండువాడను ! 'ఇది మొదలు' అనునదేమీ నాకు లేదు.

**శమిత - అంతస్త్రిత్రయోఽహమ్ :** జాగ్రత్-స్వప్న-సుషుప్తులు తురీయుడనగు నా నుండే బయల్వెడలి, తిరిగి నాయందే శమిస్తున్నాయి.

త్రిగుణములు కూడా నానుండే బయల్వెడలి నా యందే తిరిగి సశాంతిస్తున్నాయి. అట్లాగే మనో-బుద్ధి-చిత్తములు కూడా!

ద్రష్ట - దర్శనము - దృశ్యము - ఈ మూడూ ఆత్మారాముడనగు నాయందు బయల్వెడలి చివరికి నా యందే శమమును పొంది శాంతిస్తున్నాయి. సర్వము ఎందులోంచి బయల్వెడలుచున్నదో, ఎందులో శమిస్తున్నదో... అట్టి **అధ్యాత్మరూపుడను!**

**బుద్ధో ముక్తోఽహమ్ :** నిర్మలమైన బుద్ధిచే నేను సర్వదా ముక్తుడనే! నాటకంలో నటించువాడు నాటకరచనకు బద్ధుడైనట్లుగా కనిపిస్తాడు! అట్లాగే జీవాత్మగా జగత్ నాటకంలో బద్ధునివలె కనిపిస్తానేమో! కానీ **నాకు బంధమే ఉండజాలదు! బుద్ధిచే నిత్య ముక్తుడను.**

- **జీవాత్మగా** - జగన్నాటకానుసారం ఉంటుంది. అది నా ప్రతిబింబమాత్రమే కాబట్టి - ముక్తి అనే ప్రసక్తే లేదు.
- **పరమాత్మగా**-నాకు బంధమే లేదు. పరమాత్మత్వము **నా సహజరూపము**. జీవాత్మత్వమో, ఆరోపితము మాత్రమే ! జగత్ కల్పనాంతర్భాగము మాత్రమే! అందుచేత నేను పరాత్మగా నిత్య ముక్తుడను! జీవాత్మకు గల బంధమునకు సంబంధించిన వాడనే కాను.

ఎందుకంటే సర్వదా **అద్భుతమగు ఆత్మస్వరూపుడను కాబట్టి !**

**శుద్ధోఽహమ్ ! అంతరోఽహమ్ :** నిత్యశుద్ధుడను! సర్వమునకు అంతర్యామిని! సర్వదా అంతరాంతర స్వరూపుడను. కదిలే దేహమునకు అంతరమున ఉండి కదల్చుచుండువాడను ! భావనలకు ఆవల ఉండి, భావనలను కదిలించు చైతన్య స్వరూపుడను!

ఆలోచనలకు అంతరముగా - **'ఆలోచనలకు ఉత్పత్తి సాన్థము'** అయి ఉన్నాను. జన్మ - కర్మలకు ఆధారుడను.

**శాశ్వత విజ్ఞాన సమరసాత్మాఽహమ్ :** ఎల్లప్పటికీ ఉండువాడను. సదాశివోఽహమ్ ! తెలియబడేదంతా కల్పించుకొని తెలుసుకొంటున్నట్టి శాశ్వత విజ్ఞాన స్వరూపుడను. తెలుసుకొనేవాడు తెలియబడే దానిచే ప్రారంభముకాదు, ముగియడు. అందుచేత

శాశ్వత విజ్ఞాన స్వరూపుడను. తెలుసుకొనుచున్నప్పుడు, తెలుసుకొననప్పుడు కూడా నా యొక్క విజ్ఞాన స్వరూపము యథాతథము. సర్వదా సమరసమగు ఆత్మస్వరూపుడను!

**శోధిత పరతత్త్వోఽహమ్ :** ఈ దృశ్యములో దేహబద్ధుడుగా, జీవుడుగా కనిపించవచ్చును గాక ! నా స్వరూపము యొక్క వాస్తవతత్త్వము శోధించినప్పుడు – ఇహ స్వరూపమునకు, స్వభావమునకు ఆవల గల పరతత్త్వ స్వరూపుడుగా తెలియవచ్చుచున్నాను. అందుచేత **పరిశీలించనప్పుడు జీవుడుగాను, శోధించబడినప్పుడు పరతత్త్వము గాను తెలియబడువాడను.** నటుడు వేరు – పాత్ర వేరు అయిన తీరుగా.... నేను వేరుగా, 'ఇహము'లో కనిపించే నా కల్పనయగు 'జీవాత్మ'కు అతీతుడనై ఉన్నాను.

**బోధానందైకమూర్తిరేవాఽహమ్ :** మూర్తీభవించిన బోధానందరూపుడను. ఈ జగత్ దర్శనములు, ఈ జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు.. ఇవన్నీ కూడా చమత్కారమగు నా ఆనందరూపములు ! 'బోధ' (Knowing) అను అస్మత్ కళాత్మక మూల పదార్థ విశేషముచే నిర్మితమైనట్టివి. ఏకమే అయి అనేకము కల్పించుకొనువాడను. **కేవల బోధ – ఆనంద – ఏకైక రూపుడను.**

**వివేకయుక్తి బుద్ధ్యాఽహమ్ :** వివేకముచే, బుద్ధి యొక్క సునిశిత్వము చేత... ఆత్మగా ఎరుగబడువాడను. దేహమునకు – త్రిగుణములకు ఆధారమైయున్న అస్మత్ ఆత్మ స్వరూపము – వివేకయుక్తమైన ఉత్తమ బుద్ధికి మాత్రమే తెలియబడుచున్నది.

**జానామి ఆత్మానమ్ అద్వయమ్ :** వివేక దృష్టిగలిగియున్నట్టి మహర్షులు, సద్గురువులు, **"నేను అద్వయమగు ఆత్మస్వరూపుడను"** అని తెలిసికొనినవారై **"శృణ్వంతి విశ్వే అమృతస్య పుత్రః"** అని గానం చేస్తున్నారు. **(తత్త్వమ్; సోఽహమ్ ; జీవోబ్రహ్మైతినాపరః ; అయమాత్మా బ్రహ్మ.... ఇత్యాది)** వేదవాక్యములచే నా యొక్క అద్వయమగు ఆత్మస్వరూపము తెలియపరచబడుచూనే ఉన్నది. సిద్ధాంతీకరించబడుచునే ఉన్నది. అట్టి పార్శ్యాంశములను అనుసరించి నన్ను నేను సర్వమునకు అద్వితీయముగా ఎరుగుచూ ఉన్నాను.

**తథాపి బంధమోక్షాది వ్యవహారః ప్రతీయతే :** నిత్యమోక్ష స్వరూపుడనే అయి ఉండి కూడా "బంధము – మోక్షము" అను విశేషాలన్నీ నా పట్ల ప్రతీతమై, ప్రసిద్ధమై ఉంటున్నాయి. ఆత్మగా నిత్య ముక్తుడనూ నేనే ! జీవుడుగా నిత్య బద్ధుడను నేనే!

**ఆత్మను ఏమరచుటచే బద్ధుడను! ఆత్మజ్ఞానముచే ముక్తుడను!**

అను ఆపాదనలు స్వీకరిస్తూ ఉన్నాను. వాస్తవానికి నేను సర్వదా ఆత్మస్వరూపుడనే ! అది లీలగా ఏమరచి ఎప్పటి నుండో వస్త్రమువలె ధరించు ఈ భౌతిక దేహమునకు సంబంధించిన ఇంద్రియ విశేషములకు అభ్యాసవశం చేత బద్ధుడనై, క్రమంగా అనేక దేహముల రాక – పోకలు అనుభవిస్తూ పోతున్నాను. ఎప్పుడో "ఈ జన్మ – కర్మలచే బద్ధుడను ..." అని గమనించి "ఎట్లాగురా మోక్షము?".... అని తత్ప్రయత్నములు ప్రారంభిస్తున్నాను. ఈ విధంగా బంధ మోక్షములు నా పట్ల **ప్రతీతి** పొందుచున్నాయి.

**నివృత్తోఽపి ప్రపంచో మే సత్యవత్ భాతి సర్వదా :** వాస్తవానికి స్వతఃగానే ఆత్మస్వరూపుడనగు నేను వృత్తిరహితుడను. (I am beyond all avocations). వృత్తులు నా నుండి బయల్వెడులుచున్నాయి. వృత్తుల కంటే మునుముందే వృత్తిరహితుడనైయున్నాను. ఈ ప్రపంచము నా యొక్క వృత్తుల స్వరూపము. (This world is the form of my flock of avocations).

- నేను నిత్యుడను. సత్యమును.
- నా వృత్తులే ఈ జగత్ రూపము.
- సత్యస్వరూపుడనగు నాయొక్క సామీప్యముచే జగత్తు కూడా సర్వదా సత్యము వలె గోచరిస్తూ ఉంటోంది.

**సర్పాదౌ రజ్జు సత్తేవ! బ్రహ్మసత్తైవ కేవలమ్! :** కొందరు బాటసారులు ఏదో దూరప్రదేశం నుండి నడచివస్తున్నారు. క్రమంగా సాయం సమయమయింది. చీకటిపడింది. వారంతా ఒక గ్రామం సమీపిస్తూ ఉండగా వారికి బాట ప్రక్కన ఒక మంచినీటి బావి కనిపించంది. మంచినీళ్ళు త్రాగుదామనుకొని ఆ బాటసారులు బావి (Well) ని సమీపించారు. వారిలో ఒకరు నీరు తోడే ప్రయత్నంలో ఉండగా ఆ బాటసారులలో మరొకడు యథాలాపంగా వెనుకకు చూచాడు. "బాబోయ్" అని పెద్దగా అరుస్తూ గజగజ వణకటం ప్రారంభించాడు. "ఏమిటిరా?" అని అంటూ ఇతర బాటసారులు కూడా వెనుకకు చూచారు ! అక్కడ పొడవుగా ఉన్న భయానకమైన ఆకారం !

"పాము! పాము! ఎంత పెద్ద పామో! అయ్యో! ఎవరైనా వచ్చి కాపాడండి! రక్షించండి! ఓ గ్రామ జనులారా! కర్రలు పట్టుకురండి! ఓ దూరంగా వుండే రైతులారా! బాబూ! కర్రలు తీసుకురండి! ఈ పాము ఒక్కసారి లేచి మమ్ములను కాటేస్తుందేమో! బాబూ రండి! బాబూ! రండి! చస్తామేమో!

అల్లంత దూరంలోగల 'గుడిశ'లో ఒక వృద్ధురాలు ఆ కేకలు విన్నది! "అయ్యో! పాపం! ఈ బాటసారులు భయపడుచున్నారు!" అని అనుకొన్నది. అప్పుడే వెలిగించిన దీపము (Lantern) పట్టుకొని ఒక దుడ్డుకర్రతో ఆ నూతివైపుగా వచ్చింది.

"ఏమిటర్రా గొడవా ? పెద్ద పామా ! ఇక్కడ పాములేమీ ఉండవే ! అయినారండి ! చూద్దాం !"

అని లాంతరు (దీపపు) వెలుగును అక్కడ సమీపంగా ప్రసరింపజేసింది !

**"ఓహో! ఇదా! చాంత్రాడు - పొద్దైపోతే ఎవ్వరో ఇక్కడ నూతి ప్రక్కన పడవేశారు! ఇది పాము కాదు! కొండ శిలువ కాదు !"** అని అందరినీ పిలిచి చూపించింది. **"అమ్మయ్య ! బ్రతికాముురా బాబూ!"** అని అనుకుంటూ ఆ బాటసారులు, ఆ పాముగా కనిపించిన త్రాడు గురించి చెప్పుకుంటూ, కడుపునిండా బావినీళ్ళు త్రాగి, ఇక అక్కడ నుండి హాయిగా బయలు దేరారు! దీనిని **"సర్పరజ్జు భ్రాంతి" అంటారు.**

1) అక్కడ మొట్టమొదటగా ఉన్నదేది ? చాంత్రాడు!

2) ఆ బాటసారులకు ఏదిగా కనిపించింది ? పెద్ద సర్పముగా!

3) ఆ సర్పము ఎక్కడినుండి వచ్చింది ? రాలేదు! అస్సలు పాము అక్కడ లేదు !

4) మరి సర్పముగా ఎందుకు కనిపించింది? త్రాడును చూచి బాటసారి పాత జ్ఞాపకాలు, సంస్కారాలు కారణంగా "పామేమో?" అని అనుకున్నాడు. పాము దృష్టితో త్రాడును చూచి ***"భయంకరమైన పెద్ద పాము"*** అని ఆపాదించాడు. తన ఆపాదన భయం చేత నిజమేననుకున్నాడు. 'పాము' అని అరిచాడు.

5) మరి తదితర బాటసారుల సంగతేమిటి? వారు "అది ఏమిటి?" అని పరిశీలించలేదు. "చీకటి కదా! పామే అయి ఉంటుంది"... అని అనుకొని అరవటం ప్రారంభించారు. "మన వాడు చెప్పాడు కదా ! పామే !" ... అని నమ్మనారంభించారు. పాము కాటేస్తే ఏమౌతుందో - ఊహించుకోసాగారు.

6) త్రాడు పాముగా కనిపించటానికి ఇంకేదైనా కారణమున్నదా ? అవును! మసక చీకటి.

7) ఆ మసక చీకటి ఏమైనది? ఏమీ కాలేదు. లాంతరు వెలుగుచే అంతా స్పష్టంగా కనిపించింది. అంతకుముందో, చీకటిలో త్రాడుగా కనిపించలేదు. అంతే !

8) ఇంతకీ పాము ఏమయినట్లు? ఏమీ కాలేదు. అస్సలు పామే లేదు. ఇంక ఏమైనదనే ప్రశ్న ఎక్కడిది? దానికి సమాధానము ఏమున్నది?

9) ఎప్పటి నుండి పాము త్రాడుగా అయ్యింది ?

ఎ) మొట్టమొదట అది త్రాడే!

బి) మధ్యలోనూ అది త్రాడే!

సి) చివరకీ త్రాడుగానే తెలియవచ్చింది! అంతే!

ఈ దృష్టాంతాన్ని ఎదురుగా ఘనీభూతమై అనేక దుఃఖములకు (దుఃఖాలయమ్ - అశాశ్వతమ్) ఆలవాలమై యున్న ఈ దృశ్య జగదనుభవమనకు...తత్పరంగా చూద్దాము.

1) ఇక్కడ మొట్టమొదటగా ఉన్నదేది ? స్వస్వరూపమగు పరబ్రహ్మమే !

2) బాటసారులవంటి మనకు 'జీవుడు-దేహము'గా ఇప్పుడు కనిపిస్తున్నదేది ? భరించలేనంతగా అనేక సంబంధ - అనుబంధ - బాంధవ్య - సంపద - ఆపద - మార్పు - చేర్పులతో కూడిన దృశ్యజగత్తు !

3) ఇంతటి అనేక బాధ - దుఃఖములతో కూడిన ఈ జగత్ దృశ్యము ఎక్కడి నుండి వచ్చింది ?

దృశ్యము లేదు! జగత్తు లేదు! లేనే లేనిది "ఎక్కడి నుండి వచ్చింది?" అనే ప్రశ్నేమున్నది ?

4) సరే! మరి ఇది జగత్ దృశ్యముగా ఎందుకు అనుభూతమౌతోంది? మనయొక్క పూర్వ - తత్ పూర్వ సంస్కారములు కారణంగా "ఇదంతా నిజమే! ఉన్నది! భవము!" అని అనిపిస్తోంది. ఫలితంగా భవబంధముగా ప్రాప్తిస్తోంది! దృష్టి చేతనే సృష్టి సంసార, భావముగా పొందబడుచున్నది.

5) మరి అనేకమందికి కూడా ఈ జగత్‌దృశ్యము సత్తువలె, భవము వలె, నిజంగానే ఉన్నదానివలె, స్వస్వరూపపరబ్రహ్మమునకు వేరైనదాని వలె అగుపిస్తోందే? అనిపిస్తోందే? తదితరులలో అనేక మంది "ఈ జగత్తు - బంధాలు ఉన్నాయని అనేకమంది అంటున్నారుగా! ఉండియే ఉంటుంది!" - అని నమ్ముచూ తమ యొక్క పరబ్రహ్మత్వము (పరము - ఆత్మత్వము)ను ఏమరచి **"మాకు కూడా బంధమున్నది!"**

అని ప్రకటించనారంభిస్తున్నారు. పదిమంది అంటున్నారు కాబట్టి, ఆత్మలేనిదానివలె, ఇంద్రియ జగత్తు సత్యమై ఉన్నదానివలె అనిపిస్తోంది! అంతమాత్రం చేత సత్యము అసత్యమవదు! ఆత్మయే 'జగత్తు' రూపంగా భ్రమచే అనిపిస్తోంది.

6. జగత్తు ఆత్మ యొక్క భావనా చమత్కారమే అయి ఉండగా, ఈ జగత్తు తన స్వరూపమునకు వేరై ఉన్నట్లు అనిపించటానికి ఇంకేదైనా కారణమున్నదా? అవును ఉన్నది. అజ్ఞానము చేతనే ! **ఆత్మయొక్క మహిమ ఎట్టిదో... సరిగ్గా పరిశీలించకపోవటమే అజ్ఞానము.**

7. ఆత్మజ్ఞానము వికశించుచుండగా అజ్ఞానము ఏమౌతోంది? **సమాధానం :** దీపం వెలిగించగానే చీకటి ఏమౌతోంది ? ఏమీ చెప్పలేం ! ఆత్మ జ్ఞానముచే అజ్ఞానము యొక్క ఊసు ఉండదు. ఆత్మజ్ఞానరాహిత్యమే అజ్ఞానము యొక్క రూపము!

8. జ్ఞానముచే సర్వము ఆత్మ తేజోరూపమగుచుండగా **"అంతకుముందటి జగత్తు"** ఏమైనట్లు ? ఏమీ కాలేదు. అస్సలు జగత్తు అనునదే స్వతఃగా లేదు. మొదలే లేనిది పోయిందనాలా ? విషయం తెలిసిందనాలా?

9. ఇదంతా ఎప్పటినుండి బ్రహ్మము అవగలుగుతోంది ?
–మొట్టమొదట ఇదంతా పరబ్రహ్మమే !
–జగత్తుగా ఆపాదించబడి భ్రమచే పొందబడుచున్నది. అప్పుడు కూడా పరబ్రహ్మస్వరూపమే !
–భ్రమ తొలగితే అంతా స్వస్వరూప పరబ్రహ్మమే ! బ్రహ్మమే అయి, బ్రహ్మముగానే ఉండి,.... ఈ జగత్తు బ్రహ్మముగానే శేషించుచున్నది – అగుచున్నది.

**ప్రపంచాధార రూపేణ వర్తతే! అతో జగత్ నహి :** బంగారము ఆధారము. ఆభరణము అధేయము. బంగారపు ఆభరణములో అంతా బంగారమే! 'ఆభరణము' అనునది ఆకారమాత్రమే! బంగారము కానిదేదీ లేదు. ఆకారమో .... కల్పితము!

పరబ్రహ్మము పై 'జగత్తు' అనబడునది ఆధారపడినదై ఉన్నది. జగత్తుగా కనిపించేదంతా పరబ్రహ్మ తేజో విలాసమే ! ('ఆభరణము' అనునది బంగారమునకు ఆకారమాత్ర భ్రమయే అయినట్లు) ... పరబ్రహ్మమే సర్వదా ఉన్నది. **నేను అట్టి పరబ్రహ్మస్వరూపుడను**. ఇక ఈ జగత్తో – వాస్తవానికి లేనే లేదు. నన్ను ఆధారము చేసుకొని మాత్రమే ఉన్నది.

**యథా ఇక్షురస సంవ్యాప్తా శర్కరా వర్తతే... తథా ... అద్వయ బ్రహ్మరూపేణ వ్యాప్తోఽహమ్ వై జగత్రయమ్:** చెఱకురసమంతటా తీపి (పంచదార) విస్తరించి ఉన్నది కదా ! అదే రీతిగా అద్వయ బ్రహ్మము రూపంగా ఈ త్రిజగత్తులు నేనే వ్యాపించినవాడనై ఉన్నాను.

**బ్రహ్మాది కీటపర్యంతాః ప్రాణినో మయి కల్పితాః :** సృష్టికర్తయగు బ్రహ్మము మొదలుకొని – ఒక కీటక ప్రాణి వరకు అనేక లోకములు, అనేక జీవరాసులుగా కనిపించేదంతా కూడా – పరబ్రహ్మ స్వరూపుడిగా ... నా కల్పన మాత్రమే ! నా సంకల్పము యొక్క భౌతికరూపమే ఇదంతా! ప్రాణశక్తి సర్వదా ఏకమే అయి ఉండి, అనేక – అసంఖ్యాక ప్రాణులుగా ప్రదర్శనమగుచున్నది. నేను ఆత్మను! కనుక సప్రాణ స్వరూపుడను!

**బుద్బుదాది వికారాంతాః తరంగాః సాగరేయథా :** సముద్ర జలంలో తరంగాలు, బుడగలు ఉండవచ్చు గాక! వాటన్నిటికీ ఆధారం? సముద్ర జలమే కదా ! ఈ జన్మలు, ఆలోచనలు, భావాలు వీటన్నిటికీ ఆధారము ఆత్మయే ! నేను ఆత్మ స్వరూపుడను ! ఆత్మసాగరుడను. తదితరమైనదంతా ఆ సాగరములోని తరంగములు – బుడగలు వంటివి!

**తరంగ స్థల ద్రవం సింధుః న వాంఛతి యథా, తథా విషయానందవాంఛా మే మా భూత్, ఆనంద రూపతః:** సముద్రజలం "నాకు కొన్ని తరంగాలు కావాలి ! మరికొన్ని వద్దు ! ... అని ఏమైనా కోరుకుంటుందా ? "నాకు ద్రవత్వం వస్తే బాగుండు !" ... అని అనుకుంటుందా ? లేదు కదా! అట్లాగే...,

ఆత్మానందరూపుడనైయున్న నాకు విషయానందములు కావాలని కోరుకోను.

**దారిద్ర్య ఆశా యథా నాస్తి సంపన్నస్య – తథామమ :** ఒక ఆగర్భ శ్రీమంతుని ఏకైక కుమారుడు అనేక గొప్ప సంపదలు గల సొంత తోట నుండి, తమ భవనమువైపుగా సేవకులతో వెళ్ళుచూ,... ఒక పూరి గుడిశను చూచాడు. ఆ గుడిశ వద్ద రెండు సత్తు కంచాలు బోర్లించబడి కనిపించాయి. "నాకు ఆ రెండూ కావాలిసిందే!" అని సేవకులను పురమాయించాడు. కానీ గుడిశ యజమాని – "నేను ఇవ్వను! మా ఇద్దరు పిల్లలు ఊరుకోరు" అని చెప్పి ఇవ్వ నిరాకరించాడు. ఆ శ్రీమంతుని కుమారుడు ఇంటికి వెళ్ళిన తరువాత కూడా ఏడుపు వదలేదు. ఈ జీవుని ఆశ–నిరాశల దుఃఖము ఇట్టిదే! ఒక ధనికుడు "నాకు దారిద్ర్యము వస్తే బాగుండు!" అని కోరుకుంటాడా! సహజానంద రూపుడనగు నేను ఇంద్రియ విషయానందములను కోరుకోను. బ్రహ్మానందమునందు నిమగ్నమై యున్న నేను విషయానందములు లభించాలనుకోవలసిన పనేమున్నది ?

**విషం దృష్ట్వా-అమృతం దృష్ట్వా ... విషం త్యజేతి బుద్ధిమాన్ ! ఆత్మానమపి దృష్ట్వా - అహమ్ అనాత్మానమ్ త్యజామి :** ఎదురుగా విషము, అమృతము ఉన్నాయనుకో ! బుద్ధిమంతుడుడైనవాడు అమృతమును కోరుకుంటాడు గాని, విషమును కోరుకోడు గదా ! ఆత్మానందము ఎట్టిదో గమనించిన తరువాత అనాత్మమగు లౌకిక పేరు – ప్రతిష్ఠలు, భౌతిక సుఖములు... ఇవన్నీ నేను త్యజించి వేసినవాడనై ఉంటున్నాను. **ఘటావభాసకో భానుః ఇతి।**

| | | |
|---|---|---|
| ఆకాశంలో సూర్యుడు | పరంజ్యోతి స్వరూపుడునగు నేను ఆత్మాకాశ | సూర్యుడిని! సర్వసాక్షిని! |
| నేలపై కుండలోని ప్రతిబింబ సూర్యుడు | దేహంలో సాక్షిగా భాసించే జీవాత్మను | |
| **ఘటా అవభాసకో భానుః ఘటనాశే న నశ్యతి!** | **దేహావ భాసకో సాక్షీ దేహనాశే న నశ్యతి ।** | |

ఆకాశంలో సూర్యుడు ప్రకాశిస్తూ ఉన్నారు.

నేలపై ఒకచోట ఒక మట్టి కుండ ఉన్నది. అందులో జలము. ఆ జలములో సూర్యబింబము ప్రతిబింబిస్తోంది. అవభాసిస్తోంది.

ఏదో కారణం చేత ఆ మట్టి కుండ–ఎవరిదో కాలు తగిలి, (లేక) ఏ కర్రయో తగిలి–పగిలిపోయింది. కుండలోని నీరు కాస్తా నేలపాలైనది. ఇప్పుడు ఆకాశంలోని సూర్యుడికి ఏమైనా అవుతుందా ? ఏమీ కాదు కదా !

అట్లాగే స్వయంజ్యోతి స్వరూపుడను, సర్వమునకు కూడా (జగత్ – దేహ – మనో – బుద్ధి – అహంకారాలకు కూడా) 'కేవల సాక్షి'ని అగు నేను – ఈ దేహము నశించినప్పుడు కూడా నశించువాడను కాను. దేహముల పతనముచే ఏదీ పొందను. మరేదీ కోల్పోను.

**నమే బంధో ! నమే ముక్తిః । నమే శాస్త్రమ్ । నమే గురుః । :** సర్వదా సర్వత్రా పరమాత్మతేజో రూపుడనై విరాజిల్లుచున్నట్టి కేవలాత్మానంద రూపుడునగు నాకు వేరైనదేదీ ఎక్కడా లేదు. నాకు మరొకరుగా బంధువు లేదు! నేను దేనికో బద్ధుడనే కాదు! జీవాత్మగా దేహ ఘటము (కుండ)లో ప్రతిబింబిస్తున్నప్పటికీ వాస్తవము – అనునిత్యము అగు పరస్వరూప సూర్యునిగా నాకు బంధమే లేదు. **బంధమే లేని వానికి 'ముక్తి' అనే ప్రసక్తి ఎక్కడిది ?** కనుక నాకు ముక్తి అనునదే లేదు ! శాస్త్రము (మోక్ష శాస్త్రము) నా గురించి అభివర్ణిస్తోంది. అంతేగాని నన్ను శాస్త్రము కల్పించుట లేదు. అనుభవము నుండి శాస్త్రము వస్తోంది. మరి నాకు శాస్త్రమేమున్నది? శాస్త్రముకంటే ముందే అనుభవి స్వరూపుడనై ఉన్నాను ! కనుక నాకు శాస్త్రము లేదు ! నేను ఏమరిచిన ఆత్మ గురించి గురువు గుర్తు చేస్తున్నారు! ఆత్మస్వరూపముగా నాకు గురువు అనునదీ లేదు! గురు–శిష్యులమగు మేము ఇరువురము **ఏకాత్మ స్వరూపులము!**

**మాయా మాత్ర వికాసత్వాత్, మాయా - అతీతోఽహమ్ అద్వయః :** ఇంద్రియ విషయరూపాలుగా కనిపిస్తున్న దృశ్య జగత్తంతా కూడా నా యొక్క మాయామాత్ర వికాసభావ కల్పనా చమత్కారం! ఇక నేనో ? స్వప్నముగా కనిపించేదంతా స్వప్నము తనదైన స్వప్నద్రష్టకు – అభిన్నము. కానీ స్వప్న ద్రష్ట సర్వదా వేరే కదా! అట్లాగే నేను నాకు ద్వితీయమనునదే లేనట్టి అద్వితీయుడను! అద్వయుడను! మాయకు అతీతుడను ! మాయకు సాక్షిని! మాయ నాదైనట్టివాడను ! మాయను కల్పించుకొని వినోదించువాడను. మాయా రూపంగా కనిపిస్తున్నది నేనే!

**ప్రాణాఃచలంతు తత్ ధర్మైః కామైర్వా హన్యతామ్ మనః । స్వభావ ఆనంద పూర్ణస్య ! మమ దుఃఖమ్ కథమ్ భవేత్ ? :** ప్రాణశక్తి – దేహమంతా చలించటము, ఇంద్రియాలను వెలిగించటము, ఒక దేహము వదలి మరొక దేహమును ఆశ్రయించటము – ఇటువంటి ధర్మములు (Characteristic features) కలిగి ఉండి, తన వర్తనములు తాను కలిగి వుండి ఉంటోంది.

**ఇక మనస్సో?** ఏవేవో క్రొత్త క్రొత్త అన్యమైనవాటిని కోరుకుంటూ, ఈ దృశ్య జగత్తులో సంచరిస్తూ తన పని తాను చేసుకుంటూ పోతోంది.

**మరి నేనెవరు?** స్వభావంగానే పూర్ణానంద స్వరూపుడను. అటువంటి నాకు ప్రాణచలన ధర్మములవలన గాని, మనో చలన ధర్మముల వలనగాని దుఃఖం (Worry) ఎట్లా – ఏర్పడుతుంది? ఏర్పడదు! వాయుతరంగముల – మేఘముల చలనము చేత ఆకాశమునకు వచ్చే లోటేమిటి? మేలేమిటి? కీడు ఏమిటి?

**ఆత్మానమ్ అంజసావేద్మి! క్వాపి అజ్ఞానపలాయనమ్!:** ఆత్మ యొక్క వాస్తవ స్వరూపమేమిటో కనులు తెరచి తెలుసుకొన్న తరువాత అజ్ఞానము ఎటో పలాయనము చిత్తగిస్తోంది, దీపం వెలుగగానే చీకటి ఎటో పలాయనమగుతీరుగా !

**కర్తృత్వమపి మే నష్టమ్ ! కర్తవ్యమేవాపి న క్వచిత్ :** "నేను సత్–చిత్–ఆనందరూపమగు ఆత్మను"... అని తెలుసుకొన్న తరువాత, ఇక "వీటికి నేను కర్తను ! అవన్నీ నేను నిర్వర్తించవలసియున్న కర్తవ్యములు"... ఇటువంటి మనోధర్మాలు నా పట్ల 'లేనివే'.... అగుచున్నాయి. మనస్సు నాకు ఒక శిరోభూషణము. అంతవరకే! అట్టి మనోధర్మాలు నేను కాదు! నాటకములోని సంఘటనలకు

పాత్రధారుడు కారణమా? కాదుకదా!

**క్షుత్, పిపాసా, అంధ, బధిరస్య, కామ క్రోధాదయో అఖిలాః-లింగ దేహగతాత్! ఏతే అలింగస్య న విద్యతే!:** ఆకలి, దప్పిక, కళ్లు కనబడటం, కనబడకపోవటం వినటం–వినలేకపోవటం, కామము, క్రోధము.. ఇవన్నీ లింగదేహము (సూక్ష్మ దేహము) యొక్క ధర్మాలు. ఇక నేనో? అలింగ స్వరూపుడను! ఆత్మజ్ఞానముచే ఆత్మగా ఎరుగబడుచున్నట్టి వాడను! అందుచేత ఆయా ధర్మాలన్నీ నాకు లేవు!

**జడత్వ - ప్రియ - మోదత్వ ధర్మాః కారణదేహగాః న సంతి మమ ! నిర్వికార స్వరూపిణః :** జడత్వము – చేతనత్వము – ప్రియము – అప్రియము ఇవన్నీ కారణదేహము (సంస్కార దేహము) యొక్క ధర్మాలు అయి ఉన్నాయి. నేను నిత్య – నిర్వికార స్వరూపుడను. కారణదేహమో, సవికారము. అందుచేత ఆయా కారణ దేహ ధర్మాలేవీ నాకు లేనే లేవు. **వాటికి ఆవల నిత్యోదిత స్వరూపుడనై సర్వదా వెలుగొందువాడను.**

**ఉలూకస్య యథా భానుః అంధకారః ప్రతీయతౌ, స్వప్రకాశే పరానందే తమో మూఢస్య జాయతే :** గుడ్లగూబ వెలుతురు చూడలేదు కాబట్టి "సూర్యుడే లేదు" అని అనుకొనే తీరుగా–తమస్సు చేత, మూఢత్వము చేత బుద్ధి ఆవరించబడియున్నప్పుడు "ఆత్మయే లేదేమో !"… అని అనిపించియుండవచ్చు గాక ! వాస్తవానికి **ఆత్మజ్యోతి సర్వదా వెలుగుచూనే** వున్నది !

**చక్షు దృష్టి నిరోధే అభ్రైః 'సూర్యోనాస్తి"-ఇతి మన్యతే.. తథా అజ్ఞానావృతో దేహీ "బ్రహ్మనాస్తి".. ఇతి మన్యతే:** ఆకాశంలో మేఘాలు క్రమ్ముకొని ఉండటం చేత ఒక పసిబాలుడు "ఆకాశంలో సూర్యుడే లేడు".. అని అమాయకంగా అనుకుంటాడు చూచారా! ఆ విధంగా 'అజ్ఞానము' అను మేఘముచే బుద్ధి ఆవరించబడినప్పుడు.. ఈ దేహి "బ్రహ్మమే లేదు" అని అనుకుంటూ ఉండవచ్చు గాక! వాస్తవానికి బ్రహ్మమే ఉన్నది. (బ్రహ్మ సత్యమ్–జగత్ మిథ్యా). జగత్తు స్వకీయ కల్పనా చమత్కారము, ఊహా వైభవము మాత్రమే.

**యథా అమృతమ్ - విషాత్ భిన్నమ్ విషదోషైః న విప్యతే… న స్పృశామి జడాత్ భిన్నో, జడదోషాత్ ప్రకాశతే:** అమృతము – విషము సర్వదా వేరు వేరే ! అమృతము విషదోషములను పొందదు. అట్లాగే జడమగు దృశ్యము – చైతన్యాత్మ స్వరూపుడనగు నేను ఎప్పుడూ వేరు వేరే ! నిత్య ప్రకాశ స్వరూపుడనగు నన్ను జడము యొక్క దోషము అంటజాలదు.

**స్వల్పాఽపి దీపకణికా బహుళం నాశయేత్ తమః, స్వల్పోఽపి బోధోఽపి - అజ్ఞానమ్ బహుళం నాశయేత్ తథా :** వ్రేలెడంత చిన్న దీపపు వెలుగుచే గదిలో దట్టంగా విస్తరించియున్న చీకటంతా తొలగించబడుతోంది కదా ! అదే రీతిగా కించిత్ బోధ (ఆత్మ జ్ఞానము) చే బహుళంగా విస్తరించియున్న అజ్ఞాన తమస్సు తప్పక తొలగిపోగలదు.

**కాలత్రయే యథా సర్పో రజ్జౌ నాస్తి, తథామయి :** సర్ప రజ్జు భ్రాంతిలో అక్కడ సర్పము ఉన్నదా ? లేదు. త్రాడు మాత్రమే ఉన్నది. అట్లాగే కాలఃకాల స్వరూపమగు మమాత్మ స్వరూపము యొక్క సమక్షంలో…

జరిగిపోయిన కాలము (Past) లేదు ! జరుగుచున్న కాలము (Present) లేదు !

జరుగబోవు కాలము (Future) లేదు! త్రికాలములూ లేవు. మమాత్మ స్వరూపమే సర్వత్రా సర్వదా యథాతథముగా వేంచేసినదై ఉన్నది!

**అహంకారాది దేహాంతం జగత్ నాస్తి అహమ్ అద్వయః :** అద్వయుడనగు పరతత్త్వ స్వరూపుడనై నేనే ఉన్నాను. ఇక అహంకారము మొదలుకొని చిత్త–బుద్ధి–మనో విషయములతో సహా ఈ పాంచ భౌతిక దేహము వరకూ గల జగత్తు అనబడునదేదీ మొదలే లేవు. ***ఆత్మ స్వరూపుడను, అద్వితీయుడను అగు నాకు వేరుగా ఎక్కడా ఏదీ లేనే లేదు.*** (స్వప్నంలో వస్తుజాల మెక్కడిది?)

**చిద్రూపత్వాత్ న మే జాడ్యమ్:** సర్వదా కేవల చిత్ చైతన్య స్వరూపుడనై ఉన్నాను! అట్టి నాకు జడత్వమనునది ఎప్పుడూ లేదు. ఉండదు.

**సత్యత్వాత్ న అనృతమ్ మమ :** సత్య స్వరూపుడనగు నాకు చెంది అసత్యమనునది ఏదీ లేదు. సత్యస్వరూపుడనగు నేనే ఈ మనో–బుద్ధి–చిత్త–అహంకార–దేహ–జగత్ దృశ్యములుగా వెలుగొందుచున్నాను! సర్వము నేనే! అందుచేత ఏదీ అనృతము కాదు!

**ఆనందత్వాత్ న మే దుఃఖమ్ :** స్వతఃగా ఆత్మానంద స్వరూపుడనగు నాకు దుఃఖము ఉండటానికి వీలే లేదు! అవకాశమే లేదు! అజ్ఞానాత్ భాతి సత్యవత్! ఒకవేళ దుఃఖము ఉంటే అది అజ్ఞానము కారణంగా మనస్సుకు మాత్రమే ఉనికి కలిగి ఉన్నది.

సర్వదా సర్వత్రా ఆత్మగా నేనే సత్యము! నిత్యము! సకలము! మనస్సు ఎట్లా ఉన్నాకూడా, అది ఆత్మధర్మము రాదు! ఆత్మయొక్క ఒక చమత్కారము మాత్రమే!

ఆత్మ స్వరూపబోధాత్మకమైనటువంటి ఈ **ఆత్మాబోధోపనిషత్** ముహూర్తకాలము (64 ని॥ కాలము) ఉపాసించినా కూడా

– మరల **జీవుడుగా అవటము** అనే పునరావృత్తి దోషమే ఉండజాలదు.

**ఆత్మానంద స్వరూపుడై ఆ అధ్యయనుడు వెలుగొందుచున్నాడు.**

***ఇతి ఆత్మబోధోపనిషత్ సమాప్తః***

***ఓం శాంతిః శాంతిః శాంతిః***


ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 3 ఐతరేయోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



| ప్రథమాధ్యాయము – 1వ ఖండము | 1వ అధ్యాయము – 1వ ఖండము |
|---|---|
| **1.1** ఓం<br>ఆత్మావా ఇదమ్ ఏక ఏవ<br>అగ్ర ఆసీత్।<br>న అన్యత్ కించనమ్ ఇషత్ ।<br>స ఈక్షత లోకాన్ను సృజా – ఇతి॥ | ఈ అద్భుతమైన అనంత సృష్టికి మునుముందే ఉన్నట్టిదేది? ఆత్మయే! అట్టి ఆత్మ ఏక స్వరూపమై (అఖండమై-అద్వితీయమై) ఉండి ఉన్నది! ఏకము అఖండము అగు అట్టి ఆత్మకు "అన్యము" అనునది ఏదీ లేకుండెను. అనన్యమై ఉన్నది. ఈ పరిణామ జగత్తు (మొట్టమొదట) లేదు! అట్టి ఆత్మ **"నేను ఏకమై, నాకు అన్యమైనదే లేనప్పుడు ఏమీ వినోదము, ఉబుసుపోక లేవు! అందుచేత లీలగా, (తమాషాగా, సరదాగా) లోకములను కల్పనగా సృష్టించుకొని క్రీడించెదను గాక! వినోదించెదను గాక!"** - అని తలచింది. |
| **1.2** స ఇమామ్ లోకాన్ అసృజత।<br>అంభో, మరీచిః, మరమ్।<br>ఆపో అంభః ।<br>పరేణ దివం ద్యౌః ప్రతిష్ఠా।<br>అన్తరిక్షం – మరీచయః। పృథివీ మరో।<br>యా అధస్తాత్ తా ఆపః॥ | అట్లు "సృష్టించుకొనెదనుగాక!" అని ఆలోచించి, క్రమంగా....,<br>1. అంభో (పైనగల-స్వర్గ) లోకము (ద్యులోకము-స్వర్గలోకమునకు పైనగా ఉన్న లోకము)<br>2. మరీచి లోకము (ఆకాశ)<br>3. మరలోకము / భూలోకము (మరణమే స్వభావముగాగల భూలోకము)<br>4. ఆపోలోకము - భూలోకము కంటే క్రింద ఉన్నట్టి జలలోకము. పాతాళము మొ॥వి.<br>(ద్యులోకము అంభో లోకమునకు ఆధారము.) |
| **1.3** స ఈక్షత<br>ఇమేను లోకా లోకపాలాన్ను సృజా–ఇతి।<br>సో అద్భ్య ఏవ పురుషమ్,<br>– సముద్ధృత్యా<br>– అమూర్ఛయత్। | **"సరే! లోకాలైతే సృజించాను. ఇప్పుడు వీటిని పరిపాలించటానికి లోకపాలకుడు కావాలి కదా!"** అని (ఆత్మ భగవానుడు) అనుకున్నారు.<br>ఈవిధంగా ఆలోచించి జలము మధ్యనుండి సమర్థత-ఉత్సాహము గల సాహసవంతుడైన ఒక పురుషతత్త్వమును (పురుషాకారము కలవానిని) సృజియించారు! మంచి రూపము సామర్థ్యము-సాహసము-ఉత్సాహము కలవాడుగా చేశారు. (సృష్టికి కర్త - బ్రహ్మదేవుడు - ప్రజాపతి). |
| **1.4** తమ్ అభ్యతపత్।<br>తస్య అభితప్తస్య ముఖం నిరభిద్యత।<br>యథా అణ్డమ్। ముఖాత్ వాక్। | ఆ పురుషాకారుని గురించి మరికొంతగా యోచనచేశారు. ఆ ఆత్మదేవుని సంకల్పానుసారం నోరు-ఒక గ్రుడ్డు బయల్పెడలు రీతిగా - వికాసమానమైనది.<br>- నోరు నుండి - వాక్కు. |

**వాచో అగ్నిః,**
**నాసికే నిరభిద్య ఏతామ్,**
**నాసికాభ్యాం ప్రాణః॥**
**ప్రాణాత్ - వాయుః ।**
**అక్షిణీ నిరభిద్యేతామ్ ।**
**అక్షిభ్యాం చక్షుః॥ చక్షుష ఆదిత్యః॥**
**కర్ణౌ నిరభిద్యేతామ్॥ కర్ణాభ్యాం**
**శ్రోతం॥ శ్రోత్రాత్ దిశః॥**
**(అభిద్యా = పరధన - విషయే ఇచ్ఛా)**

- వాక్కు నుండి - అగ్ని పుట్టాయి.

తరువాత ఆత్మకు అనన్యమైన ఆ **పురుషకారమునకు నాశికా (ముక్కు) రంధ్రములు** ఏర్పడినాయి. వాటి నుండి **ప్రాణము** ఉదయించింది. ఆ ప్రాణ శక్తినుండి **వాయువు** (చలనశక్తి) జనించింది.

ఆపై పరమాత్మ నుండి రెండు నేత్రములు వికశించాయి. ఆ నేత్రముల నుండి **చక్షురింద్రియశక్తి** (చూపు), ఆ చూపునుండి **ఆదిత్యుడు** (సూర్యుడు) జనించారు.

- ఇంకా ఆపై ఆ పరమాత్మ నుండి **చెవులు** వికశించాయి. ఆ చెవులనుండి **వినికిడి శక్తి** బయల్వెడలింది. ఆ వినికిడి నుండి **దిక్కులు** బయల్వెడలాయి.

---

**త్వక్ నిరభిద్యత । త్వచో లోమాని ।**
**లోమభ్య ఓషధి - వనస్పతయః॥**

ఆయనపట్ల **చర్మము** వికసితమయింది. ఆ చర్మము నుండి **స్పర్శశక్తి**, అట్టి **స్పర్శ శక్తి** నుండి **ఓషధులు (వరి, గోధుమ మొ॥వి), వనస్పతులు (వృక్షజాతులు)** జనించాయి.

---

**హృదయం నిరభిద్యత॥ హృదయాత్ మనః॥**
**మనసః చంద్రమాః॥ నాభిః నిరభిద్యత ।**
**నాభ్యా -- అపానః॥**
**అపానాత్ -- మృత్యుః॥**
**శిశ్నమ్ నిరభిద్యత॥**
**శిశ్నాత్ -- రేతః॥**
**రేతస -- ఆపః ।**

***ప్రథమాధ్యాయః***
***ప్రథమ ఖండః సమాప్తమ్***

ఆయన నుండి **హృదయము** ప్రదర్శితమయింది. ఆ హృదయము నుండి **మనస్సు** బయల్వెడలింది. మనస్సు నుండి **చంద్రుడు** ఉదయించారు.

ఆయన నుండి **నాభి (బొడ్డు స్థానము)** ఏర్పడినదైనది. ఆ బొడ్డు నుండి **అపానవాయువు** బయల్వెడలింది. అద్దానినుండి **మృత్యు దేవత** (మార్పు-చేర్పు) జనించింది.

ఆయన నుండి **శిశ్నము (శృంగారాంగము)** ఏర్పడినదైనది. అద్దాని నుండి **రేతస్సు** జనించింది. అద్దాని నుండి "**జలము**" బయల్వెడలింది.

| పరమాత్మ నుండి సంకల్పంగా | ఇంద్రియ శక్తి | సృష్టి శక్తి |
|---|---|---|
| నోరు | వాక్కు | అగ్ని |
| నాశిక | ప్రాణము | వాయువు |
| నేత్రములు | దర్శనము | ఆదిత్యుడు |
| చెవులు | వినికిడి | దిక్కులు |
| చర్మము | స్పర్శ | ఓషధులు (ఆహారధాన్యములు) |
| | | వనస్పతి (వృక్షములు) |
| హృదయము | మనస్సు | చంద్రుడు |
| నాభి | అపానవాయువు | మృత్యుదేవత |
| శిశ్నము | రేతస్సు | ఆపః (జలము) |

**1.2.5.** **తా ఏతా దేవతాః సృష్టా**
**అస్మిన్ మహత్య అర్ణవే**
**ప్రాపతం తమ్**
**అశనాయా - పిపాసాభ్యామ్**
**అన్వవార్జత్ ।**
**తా ఏనమ్ అబ్రువతః**
**"ఆయతనం నః ప్రజానీహి**
**యస్మిన్ ప్రతిష్ఠితా "అన్నమదామా" ఇతి॥**

ఈవిధంగా ఆత్మ భగవానునిచే వాక్కు, అగ్ని, ప్రాణము, వాయువు, దృష్టి, ఆదిత్యుడు, వినికిడి, దిక్కులు, స్పర్శ, ఓషధులు, వనస్పతులు, హృదయము, చంద్రుడు, నాభి, అపానము, మృత్యువు, శిశ్న-రేతస్సు, మొదలుగా గల దేవతలంతా సృష్టించబడ్డారు. వారంతా (ఆత్మ) సముద్ర (దివ్య) జలతరంగాల వలె సృష్టిలో ప్రవేశించారు. ఆ కారణపురుషునికి (ఆత్మ లీలగా కల్పించిన జీవ పురుషునికి) ఆకలి-దప్పికలు కలిగేటట్లు చేశారు. అట్లా సృష్టించబడిన దేవతాశక్తులన్నీ ఆత్మభగవానుని సమీపించి... అయ్యా! మమ్ములను సృష్టించినారు సరే! ఇప్పుడు మేము అన్నము (Utillity / Activity/Executions) ఎక్కడ పొందగలమో అట్టి స్థానములను ప్రసాదించండి (Please show us the placement for our further functioning as per your pleasure) - అని కోరారు.

**1.2.6.** **తాభ్యో గామాన యత్తా అబ్రువన్।**
**"<u>స వై నో అయమ్ అలమ్।</u>" ఇతి ॥**
**తాభ్యో అశ్వమ్ ఆనయత్తా।**
**అబ్రువన్ ।**
**"<u>స వై నో అయమ్ అలమ్</u>" ఇతి ॥**

ఆ దేవతా శక్తుల క్రియా విశేషముల నిమిత్తమై ఆత్మభగవానుడు ఒక ఆవును సృష్టించి అందించారు. అప్పుడా సృష్ట్యంతర్గత దేవతలు "ఓ ఆత్మదేవా! **ఇంత మాత్రమే మా ఉనికికి, క్రియా విశేషాలకు ఏమాత్రము చాలదు కదా!**".... అని పలికారు.
అప్పుడు ఆత్మదేవుడు ఒక అశ్వము (గుర్రమును) సృష్టించి అందజేశారు. అప్పుడా దేవతలు - **సవై నో అలమ్ ఇతి** - "ఈ మాత్రం కూడా మాకు మామా ప్రదర్శనలకు సరిపోదే!" అని పలికారు. ఆవిధంగా అనేక జీవజాలము సంకల్పించబడింది. దేవతలు ఇంకనూ తృప్తిపడలేదు.

**1.2.7.** **తాభ్యః పురుషమానయత్ ।**
**తా అబ్రువన్**
**సుకృతం బత । ఇతి।**
**పురుషోవా వ, సుకృతం తా అబ్రవీత్**
**యథా ఆయతనమ్ ప్రవిశత - ఇతి॥**

అప్పుడు ఆ పరమాత్మ పూర్ణ లక్షణ సంపన్నుడగు ఒక పురుషుని (మానవుని) ఆకారము సృష్టించి ఆ దేవతలకు (దివ్య శక్తులకు) ఎదురుగా నిలిపారు. అప్పుడా దేవతలు ఆ పురుషుని చూచి **"ఆశ్చర్యం! ఈ పురుష (మానవ) రూపము బహు చక్కగా సృష్టించినారే!"** అని సంతోషము ప్రకటించారు. అప్పుడు ఆత్మ దేవుడు - **"ఓ సృష్టి దేవతలారా! ఇక మీరంతా ఈ పురుష రూపములోని మీమీ స్థానములు మరింత నిండుగా చేరండి! మీమీ కార్యక్రమములను నిర్వర్తించండి"**... అని చెప్పారు.

**1.2.8.** **అగ్నిః వాక్ భూత్వా ముఖం ప్రావిశత్।**
**వాయుః ప్రాణో భూత్వా నాశికే ప్రావిశత్।**
**ఆదిత్యః చక్షుః భూత్వా అక్షిణీ ప్రావిశత్।**
**దిశః శ్రోత్రం భూత్వా కర్ణౌ ప్రావిశత్।**
**ఓషధీః - వనస్పతయో**
**లోమాని భూత్వా, త్వక్ చం ప్రావిశత్।**
**చంద్రమా మనో భూత్వా హృదయం ప్రావిశన్।**
**మృత్యుః అపానో భూత్వా**
**నాభిం ప్రావిశత్ ।**
**ఆపో రేతో భూత్వా శిశ్నం ప్రావిశన్ ।**

అప్పుడు పరమాత్మయొక్క ఆజ్ఞను ఆ దేవతలు శిరసావహించసాగారు. అగ్ని దేవుడు వాక్ స్వరూపులై ఆ పురుషుని ముఖములో ప్రవేశించారు. వాయు దేవుడు ప్రాణస్వరూపులై నాశిక (ముక్కు) యందు ప్రవేశించారు. ఆదిత్యుడు (సూర్యుడు) చూచువాడు అయి, చక్షువులు (చూపు) రూపము ధరించి కళ్ళు(Eyes) తో ప్రవేశించారు. దిక్ దేవతలు వినటము అయి, వినికిడి రూపము దాల్చి చెవులలో ప్రవేశించారు.
ఓషధ-వనస్పత దేవతలు స్పర్శ రూప ధారణతో చర్మమునందు ప్రవేశించారు.
చంద్రుడు ఆలోచనా స్వరూపుడై, మనోరూపము ధరించి హృదయంలో ప్రవేశించారు.
మృత్యుదేవత మార్పు-చేర్పు శక్తి అయి, అపానవాయువు రూపము ధరించి నాభి (బొడ్డు)లో ప్రవేశించారు. ఆపః (జలము) దేవత రేతస్సు రూపము ధరించి శిశ్నము (పునరుత్పత్తి అంగము) నందు స్థానము స్వీకరించారు.

**1.2.9.** **తమ్ అశనాయా-పిపాసే**
**అబ్రూతామ్ ఆవాభ్యామ్**
**"అభిప్రజానీహి", ఇతి।**

అప్పుడు ఇక **ఆకలి - దప్పికలు** పరమాత్మను సమీపించాయి. **"హే ఆత్మభగవాన్! మరి మా ఇద్దరికీ కూడా ఎక్కడ ఉండాలో, స్థానమును నిర్దేశించి, మమ్ములను కూడా ఆజ్ఞాపించండి!"** అని అభ్యర్థించాయి.

| | |
|---|---|
| **తే అబ్రవీత్..., ఏతా స్వేవ వాం**<br>**దేవతా స్వా భజామి ఏతాసు భాగిన్యో కరోమి ఇతి॥**<br>**తస్మాత్ యస్య ఏకస్య చ దేవతాయైః**<br>**హవిః గృహ్యతే, భాగిన్యాః ఏవ,**<br>**అస్యామ్ అశనాయా**<br>**పిపాసే భవతః॥** | అప్పుడు ఆత్మభగవానుడు **"మిమ్ములను ఈ ఈ దేవతలతోపాటే అనుభాగినులుగా (లేక) సహభాగినులుగా ... (భాగస్వాములుగా) నిర్ణయించుచున్నాను. అంతేగాని, ఈ పురుష దేహములో మీకు వేరే ప్రత్యేక స్థానము ఉండదు.**<br>**"అందుచేత ఏ దేవతను ఉద్దేశ్యించి హవిస్సు ఇవ్వబడుచున్నదో,... మీరు ఆ దేవతతోపాటే ఆ హవిస్సు స్వీకరించుచూ ఉండెదరు గాక!"** - అని నిర్ణయించారు. అందుచేత ఆకలి-దప్పికలు ఇంద్రియ దేవతలతోబాటే ఆయా స్థానములలో భాగస్వాములు కాసాగారు. ఇంద్రియములు పొందుచున్నవి తాము కూడా స్వీకరిస్తూ ఉండసాగారు. |
| <u>**ప్రథమాధ్యాయః - తృతీయ ఖండః**</u><br>**1.3.10.** స ఈక్షత<br>**"ఇమే ను లోకాశ్చ, లోకపాలాశ్చ**<br>**అన్నం ఏభ్యః సృజా"–ఇతి॥** | <u>**ప్రథమాధ్యాయము - తృతీయ ఖండము**</u><br>అప్పుడు ఆ పరమాత్మ<br>-- ఇదిగో ఇవి నేను సృష్టించిన భౌతిక లోకాలు,<br>-- వీరంతా నా కల్పనలోని లోకపాలకులు, వీరికి ఇక అన్నము (ఆహారము Food Stuff / Consumption Material-Matters to Experience ) కల్పించాలి కదా! అని యోచన చేశారు. |
| **1.3.11. సో ఆపో (ద్రవము) అభ్యపత్।**<br>**తాభ్యో అభి–తప్తాభ్యో 'మూర్తిః' అజాయత।**<br>**యా వై సా మూర్తిః అజాయత, అన్నం వై తత్।** | ముందుగా "జలము" గురించి యోచన-భావన చేశారు.<br>ఆ జలము నుండి ఒక మూర్తి ప్రభవించింది. మూర్తీభవించిన శబ్ద-స్పర్శ-రూప-రస-గంధముల అనుభవజాలమే 'ఆ మూర్తి'.<br>అట్టి జలము నుండి ఏది మూర్తీభవించినదో...., అదియే అన్నముగా ఉండ సాగింది! (అదియే మూర్తీభవించిన స్థూల - సూక్ష్మ జాగ్రత్ రూపం) |
| **1.3.12. తత్ ఏనత్ సృష్టమ్**<br>**పరాజ్‌త్యజిఘాంసః**<br>**తత్ వాచా అజిఘృక్షత్।**<br>**తత్ న శక్నోత్ వాచా గ్రహీతుమ్।**<br>**స యత్ ఏనత్ వాచా అగ్రహైష్యత్**<br>**అభి–వ్యాహృత్య హైవ**<br>**అన్నమ్ <u>అత్రప్స్యత్</u> ।** | ఆవిధంగా పుట్టిన అన్నము వెనుకకు పరుగుతీయసాగింది.<br>అప్పుడు ఆ అన్నదేవతను **వాక్ శక్తి (వాక్ ఇంద్రియ దేవత)** తన వాక్ బలముతో పట్టుకో యత్నించింది.<br>వాక్‌శక్తి అన్నమును (అనుభూతిని) పట్టుకోలేకపోయింది.<br>ఒకవేళ వాక్కు అన్నమును పట్టుకోగలిగి ఉంటే అప్పుడు "మాట" చేతనే పురుషుడు అన్నము (ఆహారము) స్వీకరించి తృప్తిపొందగలిగేవాడు. అనగా "అన్నమ్" అని అనగానే మాట మాత్రంగానే ఆహారము దేహమునకు లభించేది. కాని, అది అట్లా జరుగలేదుమరి! |
| **1.3.13. తత్ ప్రాణేన అజిఘృక్షత్।**<br>**తత్ న శక్నోత్ ప్రాణేన గ్రహీతుమ్।**<br>**స యత్ అద్ధైనత్ ప్రాణేన అగ్రహైష్యత్,**<br>**అభిప్రాణ్య హి ఏవ అన్నమ్ <u>అత్రప్స్యత్</u>।** | అప్పుడు **ప్రాణశక్తి (ప్రాణవిధి)** ఆ అన్నమును ప్రాణశక్తి సమీపించి పట్టుకోవటానికి ప్రయత్నించింది. కానీ అన్నమును ప్రాణశక్తికి కూడా పట్టుకోవటం కుదరలేదు.<br>ఒకవేళ ప్రాణశక్తి ఆ అన్నమును పట్టుకొనగలిగి ఉంటే, అప్పుడు గాలి పీల్చినంత మాత్రముచేతనే దేహమునకు అన్నము లభించి దేహము తృప్తి పొందేదే! మరి అట్లాగా జరుగలేదు. |
| **1.3.14. తత్ చక్షుషా అజిఘృక్షత్।**<br>**తత్ న శక్నోః చక్షుషా గ్రహీతుమ్।**<br>**స యత్ అద్ధైనత్ చక్షుషా గ్రహ**<br>**ఈష్యత్ దృష్ట్వా హి ఏవా అన్నమ్ అత్రప్స్యత్।** | అప్పుడు **చక్షువులు** చూపుతో ఆ అన్నమును (దృశ్యానుభవమును) పట్టుకోవటానికి ప్రయత్నించాయి. కానీ ఆ అన్నమును పట్టుకోలేకపోయాయి.<br>ఒకవేళ చూపులు అన్నమును పట్టుకోగలిగి ఉంటే, అప్పుడు చూపుతోనే ఈ దేహి ఆహారము స్వీకరించి తృప్తి పొందగలిగేవాడే! కానీ అది ఆ తీరుగానూ సాధ్యపడలేదు! |

| | |
|---|---|
| **1.3.15. తత్ శ్రోత్రేణా అజిఘృక్షత్।**<br>**తత్ న శక్నోః శ్రోత్రేణ గ్రహీతుమ్।**<br>**సయత్ అద్థైనత్ శ్రోత్రేణా అగ్రహి ఏష్యత్,**<br>**శ్రుత్వా హి ఏవ అన్నమ్ అత్రప్స్యత్।** | అప్పుడు **శ్రోత్రశక్తి (వినికిడి శక్తి)** ఆ అన్నమును పట్టుకోవటానికై ప్రయత్నించింది. అది కూడా అన్నమును పట్టుకోలేక పోయింది.<br>శ్రోత్రము (వినికిడి శక్తి) అన్నమును పట్టుకోగలిగి ఉంటే ఆహార పదార్థముల గురించి విన్నంత మాత్రము చేతనే ఆకలి తృప్తి పొందేది. కానీ అట్లా కూడా జరుగలేదు. |
| **1.3.16. తత్ వచా అజిఘృక్షత్।**<br>**తత్ న శక్నోతు వచా గ్రహీతుమ్।**<br>**సయత్ అధ్యైనత్ వచా అగ్రహ ఏష్యత్**<br>**స్పృష్ట్వా హి ఏవ అన్నం అత్రప్స్యత్॥** | అప్పుడు చర్మము యొక్క **స్పర్శశక్తి** అన్నమును అందుకోబోయినప్పటికీ అది స్పర్శకు సాధ్యం కాలేదు.<br>ఒకవేళ స్పర్శశక్తి అన్నమును పట్టుకొన గలిగి ఉండి ఉంటే, అన్నమును స్పృశించినంత మాత్రముచేతనే దేహము అన్నమును పొందగలగటం జరిగేదే! కానీ అది అట్లాగూ అవలేదు! |
| **1.3.17. తత్ మనసా అజిఘృక్షత్।**<br>**తత్ న శక్నోత్ మనసా గ్రహీతుమ్।**<br>**స యత్ అద్థైనత్ మనసా, గ్రహ్యైషత్,**<br>**ధ్యాత్వా హి ఏవ అన్నమ్ అత్రప్స్యత్॥** | ఇక **మనస్సు** అన్నమును పట్టుకోవటానికి ప్రయత్నించింది. కాని మనస్సు శక్యము కూడా కాలేదు. అన్నమును స్వీకరించలేకపోయింది. మనస్సు కనుక అన్నమును స్పృశించగలిగి ఉండి ఉంటే, అప్పుడు ఈ పురుషుడు (జీవుడు) అన్నము గురించి ఆలోచన చేసినంత మాత్రం చేతనే ఆకలి తీరేది. అన్నపుష్టి లభించేదే! కానీ అట్లానైనా జరుగలేదు. |
| **1.3.18. తత్ శిశ్నేనా అజిఘృక్షత్।**<br>**తత్ న శక్నోః శిశ్నేన గ్రహీతుమ్।**<br>**స యత్ యద్థైనత్ శిశ్నే న అగ్రహైష్యత్**<br>**విసృజ్య హి ఏవా**<br>**అన్నమ్ అత్రప్స్యత్॥** | అప్పుడు శిశ్నము స్థానంలో **రేతస్సుగా వేంచేసియున్న దేవత** అన్నమును పట్టుకోవడానికి ప్రయత్నించి, పట్టుకోలేకపోయింది.<br>ఒకవేళ్ళ విసర్జనావయవము గు శిశ్నము తనయొక్క రేతస్సు శక్తిచే అన్నమును పట్టుకొనగలిగి ఉండి ఉంటే, అప్పుడు అన్నమును విసర్జించుటచే కడుపు నిండేది. అన్నము స్వీకరించిన ఫలము/ప్రయోజనము లభించేది. కానీ అది అట్లా అయి ఉండలేదు. |
| **1.3.19. తత్ అపానేన అజిఘృక్షత్, తదా అవయత్।**<br>**స ఏషోః అన్నస్య ।**<br>**గ్రహో యత్ వాయుః అన్నమ్ ఆయుర్వా ఏష**<br>**యత్ వాయుః॥** | అప్పుడు **అపానము** అన్నమును పట్టుకొనే ప్రయత్నం చేసింది.<br>**అపానవాయువు అన్నమును గ్రహించగలిగింది.**<br>అట్టి అన్నమును పట్టుకోగలిగినట్టిదే **వాయువు!** ఈవిధంగా **వాయువే** అన్నము స్వీకరిస్తూ " అన్నము" ద్వారా దేహములో ప్రాణధారణ చేయగలుగుచున్నది. |
| **1.3.20.** స ఈక్షత,<br>**"కథం ను ఇదమ్ అదృతేస్యాత్?" ఇతి॥**<br>**స ఈక్షత ,**<br>**"కతరేణ ప్రపద్యా?" ఇతి॥**<br>**స ఈక్షత**<br>**యది వాచా అభివ్యాహృతం,**<br>**యది ప్రాణేన అభిప్రాణితమ్,**<br>**యది చక్షుషా దృష్టమ్,**<br>**యది శ్రోత్రేణ శ్రుతమ్,**<br>**యతి త్వక్చ స్పృష్టమ్,**<br>**యది మనసా ధ్యాతమ్,** | అప్పుడు ఆత్మభగవానుడు ఈ పిండశరీరము నన్ను వదలి జీవించగలదా! లేదు కదా! మరి ఈ ఇంద్రియములు-ఇంద్రియ ప్రదర్శనములతో కూడిన దేహము (పురుషుడు, జీవుడు) తనకు తానుగా చైతన్యము (స్వకీయ ప్రవర్తనము) కాదు. ఒక కీలుబొమ్మలాటిది మాత్రమే! ఇక్కడ రెండు ప్రశ్నలు.<br>1. ఈ తోలు బొమ్మ స్వీయ ప్రజ్ఞతో చైతన్యవంతము కావాలంటే ఇందులో నేను చైతన్య స్వరూపుడనై ప్రవేశించినవాడనై వుండాలి.<br>2. నాయొక్క చైతన్యముచేత ఈ పురుషుని చైతన్యముతో నింపివేస్తేనో? ఇప్పుడీ దేహములోని చైతన్యము నన్నువదలి, నాయొక్క ఇష్టాయిష్టాలు ప్రమేయం లేకుండా తనకు తానే ఇచ్ఛలో కూడినదై....<br>- వాక్కుతో తన ఇష్టానుసారం మాట్లాడటం ... (అభివ్యాహృతము),<br>- నాచే పొందిన ప్రాణశక్తితో ప్రవర్తించటము (అభిప్రాణితము)<br>- కళ్ళతో తనకు ఇష్టమైనది చూడటం (దృష్టమ్)<br>- చెవులతో తన ఇచ్ఛానుసారంగా ఇష్టమైనది వినటం (శ్రుతమ్) |

యది అపానేన అభ్యపానితం,
యది శిశ్నేన విసృష్టమ్,
అథ, కోఽహమ్? ఇతి॥

- చర్మముతో స్పర్శానుభవము పొందటం (స్పృష్టము)
- మనస్సుతో తనకు తోచినది ఆలోచించటము, (ఆలోచితం)
- అపానము మార్గంగా వాయువును బహిర్గతం చేయడం (అపానం)
- శిశ్నముతో **విసర్జించటము**

ఇవన్నీ అస్మత్ చైతన్య స్వరూపుడగు జీవుడు తనకుతానే నిర్వర్తించేడట్లుచేసెదనుగాక! అయితే, అప్పుడు **పరమాత్మనగు నా పాత్ర ఏమిటి?** అని యోచించారు.

---

**21.** స ఏతమ్ ఏవ సీమానం
విదార్యైతయా ద్వారా ప్రాపద్యత।
స ఏషా విదృతిః నామ ద్వాః।
తత్ ఏతత్ అన్నాదనం।
తస్య త్రయ ఆవసథాత్
త్రయః స్వప్నాః।
ఆయమా వసథో,
ఆయమా అవసథో,
ఆయమా అవసథ ఇతి॥

"అందుచేత నేను యథాతథముగా ఉండియే చైతన్యస్వరూపుడనై ఈ దేహములలో ప్రవేశించి ఉండెదనుగాక!" అని అనుకున్నారు. దేహములోని చైతన్యము పరమాత్మకు వేరు (ద్వితీయము) కాదు!"-అను రీతిగా జీవాత్మ సిద్ధించింది.
ఆ పరమాత్మ సీమానము (శిరస్సు యొక్క చిట్టచివరి ప్రదేశము)ను ఛేదించి, ఆ ద్వారము నుండి తాను కల్పించిన పురుషకార దేహములోనికి చైతన్యము రూపంగా ప్రవేశించారు. అట్టి పరమాత్మ యొక్క పురుషదేహ ప్రవేశమార్గమును "**విదృతి**" అని అంటారు. అట్టి విదృత - ఆత్మభగవానునికి **ఆనందస్థానము (సహస్రార స్థానము)** అయింది.
అట్టి ఆత్మకు నివాస స్థానములు, సంచారస్థానములు, విశ్రాంతి స్థానములు - మూడు. 1. జాగ్రత్ 2. స్వప్న 3. సుషుప్తులు
నేత్రములు, కంఠము, హృదయము-దేహములో ఆత్మకు ముఖ్య నివాస స్థానములు అయ్యాయి.

---

**22.** స జాతో భూతాని అభివ్యైఖ్యత్,
"కిం ఇహ అన్యంవా అవదిషత్?" ఇతి।
స ఏతమ్ ఏవ పురుషం బ్రహ్మ।
తతమ్ అమపశ్యత్ "ఇదమ్ అదర్శం" ఇతి॥

ఈవిధంగా పరమాత్మ "పురుష దేహము" లో సత్-చిత్ చైతన్యముగా ప్రవేశించటం జరిగింది. జీవాత్మగా పంచభూత నిర్మిత దేహముతో, తాదాత్మ్యము పొందటం జరిగింది. మరొకప్పుడు **"ఇక్కడ నాకు అన్యమైనదేదీ లేదు కదా! నేను మాత్రమే ఉన్నాను"** - అని గమనించారు. అప్పుడు ఆ దేహములోని పురుషుని దర్శించి, "ఈ పురుషుడే పరబ్రహ్మ పురుషుడు, ఈతడే సర్వత్రా వ్యాపించి ఉన్నవాడు. సర్వోత్కృష్టుడు కదా?" అని **"అదర్శుడు"** అని దర్శించాడు.

---

**23.** తస్మాత్ ఇదం ఇంద్రో నామ
ఏతమ్ ఇంద్రో హ వై నామ।
తమ్ ఇదమ్ ఇంద్రమ్ సంతమ్, ఇంద్ర ఇతి ఆచక్షతే
పరోక్షేణ। పరోక్ష ప్రియా ఇవ హి దేవాః
పరోక్షప్రియా ఇవ హి దేవాః॥
ఇతి ప్రథమాధ్యాయః

ఆత్మ దేవుడే ఇంద్రియ తత్త్వమును అవధరించి ఇంద్రియములను పర్యవేక్షించువాడు, అధినాయకుడు అయ్యారు. అందుచేత "**ఇంద్రుడు**" అను నామధేయుడగుచున్నారు. దేవతలకు నాయకుడు కాబట్టి **దేవేంద్రుడు. దేవతలు పరోక్ష ప్రియులు.** (మానవునికి ఇంద్రియ-ప్రత్యక్షము ప్రియంగా ఉంటుంది). మనస్సులో నిర్వర్తించేది పరోక్షము. పరోక్షమును, పరోక్షోపాసనను, పరోక్షానుభవములను దేవతలుకు ప్రియమై ఉంటుంది.
**ఇతి ప్రథమాధ్యాయః**

---

<u>ద్వితీయాధ్యాయః-ప్రథమఖండః</u>

**ద్వితీయోధ్యాయః - ప్రథమ ఖండః**

**24.** ఓం పురుషే హ వా అయమ్
ఆదితో గర్భో భవతి।
యత్ ఏతత్ "రేతః" – తత్ ఏతత్
సర్వేభ్యో అంగేభ్యః తేజః।
సంభూతమ్ ఆత్మన్యేవ
ఆత్మానం బిభర్తి।

పురుష స్త్రీ సమాగమముచే ఇంద్రియ దేవతల గృహమువంటి ఈ జీవుల దేహపరంపరలు ఏర్పడుచున్నాయి.
మొట్టమొదటగా పురుషునియందే గర్భమునకు సంబంధించిన బీజము ఏర్పడినదగుచున్నది. దేహములోని సర్వ అంగముల (ఇంద్రియ దేవతల) తేజస్సులు ఒకచోటికి చేరినవై రేతస్సు రూపము దాల్చుచున్నవి. ఆ రేతస్సే సార రూపము! పురుషుడు తనయందే శుక్రరూపమగు ఆత్మను భరించినవాడుగా, ధరించినవాడుగా ఉంటున్నాడు. అట్టి పురుషుని వీర్యము ఎప్పుడైతే స్త్రీయందు నిషేకము అగుచున్నదో

తత్ యదా స్త్రీయాంసిం చ
అథైనః జనయతి।
తత్ అస్య ప్రథమం జన్మ॥

అప్పుడు వీర్యరూపములో ఉన్న ఆత్మ స్త్రీ గర్భమునందు జనించి ప్రవృద్ధి పొందుచున్నది.

**పురుషునితో వీర్యరూపముగా ఉన్న ఆత్మ ఆ పురుషుని నుండి వెలువడి స్త్రీ గర్భములో ప్రవేశించి సంతాన పురుషాకారము పొందటము** .... అనునది ఆత్మ భగవానుని సంకల్పమగుచున్నది.

---

ద్వితీయాధ్యాయః - ద్వితీయఖండః

(అపక్రామంతు గర్భిణ్యః)

25. తత్ స్త్రియా ఆత్మభూయమ్ గచ్ఛతి
యథా స్వమ్ అంగం, తథా
తస్మాత్ ఏనాం న హినస్తి।
సా అస్యైనమ్ ఆత్మానమ్
అత్ర-గతం భావయతి॥

ద్వితీయాధ్యాయ ద్వితీయఖండః

గర్భిణీ స్త్రీలు - కొద్దిసేపు వినకుండా - బయటకు)

గర్భములోనికి పురుషవీర్యము స్వీకరించిన స్త్రీకి ఆ వీర్యము ఆ స్త్రీలో, స్వదేహ-అంగమువలె (శరీరములోని చేతులు, కాళ్ళు, పొట్టవలె) అంతర్విభాగముగా అగుచున్నది. అందుచేత **గర్భస్థ శిశువు** స్త్రీ గర్భములో ఎదుగుచున్నప్పటికీ, అది ఆ స్త్రీని బాధించదు. ఆ స్త్రీ "ఆత్మయే (ఆత్మభగవానుడే) నా గర్భమున ప్రవేశించి గర్భస్థ శిశువుగా ఎదుగుచున్నది"... అను భావన పొందుతోంది. అందుచేత గర్భము స్త్రీకి సుఖప్రదము, ఆనందప్రదమే అగుచున్నది.

---

26. సా భావయిత్రీ।
భావయితవ్యా భవతి।
తం స్త్రీ గర్భం బిభర్తి।
సో అగ్రఏవ కుమారం జన్మనో
అగ్రే అధి భావయతి।
స యత్ కుమారం జన్మనో
అగ్రే అధిభావయతి।
ఆత్మానమేవ తత్ భావయతి
ఏషాం లోకానాం సంతత్యా।
ఏవం సంతతా హి ఇమే లోకాః
తత్ అస్య ద్వితీయం జన్మ।

"నా ఈ గర్భమునందు పరమాత్మయొక్క స్వరూపమే గర్భస్థశిశువు" అని ఆ మాతృమూర్తి భావనను కలిగి ఉండి గర్భమును భరించుచున్నది. పురుషుడు కూడా గర్భములో ఉన్న ఆ స్త్రీని సందర్శించినప్పుడు "ఈ నా జీవిత భాగస్వామి గర్భములో ఎదుగుచున్నది ఆత్మయే (నా ఆత్మయే)" అని భావించుచున్నాడు. అట్టి ఆత్మ లక్షణమైనట్టి **ప్రియము** అను భావన ఆ శిశువు జనించిన తరువాత, ఎదుగుతూ ఉన్నప్పుడు కూడా కొనసాగుచున్నది.

ఇదియే తల్లితండ్రులకు తమ సంతానముపట్ల ఏర్పడు **ఆత్మసంబంధ వాత్సల్యం!** ఆత్మభావన పుత్రునిపట్ల ఏర్పడి ఉండటంచేతనే పుత్రుడు ప్రియముగా అగుపిస్తున్నాడు. (ఆత్మావై పుత్ర నామాసి)! ఆ ప్రియాత్మ భావనయే తనపట్ల తాను కలిగి ఉన్నాడు. జగత్తు (లోకము) ఆత్మ స్వరూపమే కనుక ఇందలి జీవనమును ప్రియముగా పరిపోషించుకొనుచున్నాడు. ఈవిధంగా ప్రజా సంతతియొక్క వృద్ధి ప్రియ స్వరూపంగా పరమాత్మచే కల్పితమగుచున్నది. అదే ఆత్మయొక్క **ద్వితీయ జన్మ**... ఈ జీవితము, ఈ లోకములు అగుచున్నాయి.

1. తాను ఆత్మయే 2. ఈ సర్వము ఆత్మయే! 3. ఆత్మను ఎరిగినప్పుడు సర్వము ప్రియమే!

---

ద్వితీయాధ్యాయః-తృతీయ ఖండః

27. సో అస్య అయమాత్మా
పుణ్యేభ్యః కర్మభ్యః ప్రతిధీయతే।
అథా అస్యా అయమ్
ఇతర ఆత్మా కృతకృత్యో వయోగతః ప్రైతి।
స ఇతః ప్రయన్నేవ పునః జాయతే।
తత్ అస్య తృతీయం జన్మ
తత్ ఉక్తమ్ ఋషిణా।

ద్వితీయాధ్యాయః - తృతీయఖండః

ఈ జీవాత్మ పుత్ర రూపముగా కనిపిస్తున్నది పరమాత్మయే! స్వీయ పుణ్య కార్యక్రమములచేత పితృదేవులు (తండ్రి) సత్కర్మానుష్ఠానము చేత ఆ బిడ్డ పవిత్రుడగు చున్నాడు. పితృదేవతలు ఆ పుత్రుని కృతకృత్యుని చేస్తున్నారు.

ఆ సత్కర్మానుష్ఠానములను తండ్రి నుండి పుత్రుడు స్వీకరించి కొనసాగిస్తున్నాడు. తండ్రిని తన సత్కర్మలచే ఆ పుత్రుడు కృతకృత్యునిగా చేస్తున్నారు. ఆ తరువాత ఆ తండ్రి ముదుసలి అయి, ఈ లోకమును వీడి, వెనువెంటనే మరొక జన్మ పొందుచున్నాడు.

ఇదియే **మూడవ జన్మ** అగుచున్నది. అనగా ....,

1. తానే **మొదటి ఆత్మ**

2. పుత్రవాత్సల్యముయొక్క దర్శనముచే పొందబడు-ఆస్వాదించబడునది, పుత్ర రూపంగాను-జగత్తు రూపంగాను దర్శించునది **ద్వితీయాత్మ.**

3. వర్తమాన దేహానంతరము మరల పొందబడునది **తృతీయాత్మ.**

అంతా ఆత్మ స్వరూపమే! ఈవిధంగా, మహనీయులగు-సత్యదర్శులగు ఋషులు పరమాత్మయొక్క త్రి-స్వరూప చమత్కారములను అభివర్ణించి చెప్పుచున్నారు.

ద్వితీయాధ్యాయః–చతుర్ధ ఖండః

**2వ అధ్యాయము – 4వ ఖండము**

**వామదేవౌ వాచ:**

**28.** "గర్భే అనుసన్ అన్వేషామ,
వేదమ్–అహమ్ దేవానామ్,
జనిమాని విశ్వా।
శతమ్ మాపుర ఆయసీరరక్షన్
అథః శ్యేనో జవసా
నిరదీయమ్ ఇతి,
గర్భ ఏవై తచ్ఛయానో
వామదేవ ఏవమ్ ఉవాచ।

"మాతృగర్భములో ఉన్నప్పుడు ఈ జీవాత్మ - తాను శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ రూపధారులగు సర్వ దేవతల జన్మ వృత్తాంతములను నేను తెలుసుకొనియే ఉంటున్నాను. ఆ దేవతలందరు ఆత్మ నుండియే, ఆత్మ సంకల్ప రూపలై ప్రకటితులగుచున్నారనే విషయం గమనిస్తున్నాను. ఎందుకంటే జన్మించటానికి ముందు మాతృ గర్భములో ఉండగా మాతృదేహములో స్థానము కలిగియున్న ఆదేవతలంతా రక్షిస్తూ, నాకు వారి శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ అంశలను ప్రసాదిస్తూ వస్తున్నారు. నేను గర్భము నుండి వారు ప్రసాదించిన శబ్ద-స్పర్శాదిగా గల జీవశక్తులతో బయటకు వచ్చిన తరువాత కూడా వారంతా ఆమాతృ గర్భములో నివాసితులై ఉన్నారు".

**ఈవిధంగా గర్భరహస్యమును ఎరిగియున్న వామదేవ మహర్షుల వారు విశదీకరించు చున్నారు.**

**29.** స ఏవమ్ విద్వాన్ అస్మాత్ శరీర భేదాత్
ఊర్ధ్వ ఉత్క్రమ్యా,
ఆముష్మిన్ స్వర్గే లోకే సర్వాన్ కామాన్
ఆప్త్వా అమృతః సమభవత్। సమభవత్।

ఇతి ద్వితీయోధ్యాయః సమాప్తః

అట్టి గర్భవాసతత్త్వమును, గర్భమునుండి బయల్వెడలుటను ఎరిగి, విశదీకరిస్తున్న మహనీయుడు వామదేవ మహర్షియొక్క గర్భవాస శాస్త్ర వాక్యములు - విని ఆకలింపు చేసుకొనువారు ఇహమందు శుభములను పొంది, ఆ తరువాత ఆముష్మిమున ఊర్ధ్వలోకములైనటువంటి స్వర్గము మొదలైన ఉత్తమలోకములు పొందగలరు.

మృతత్వ పరిధులను దాటివేసి అమృతులగుచున్నారు.

- దేహము రాకముందు-వచ్చిన తరువాత-ఇది మృతించిన తరువాత స్థితులలోని సమరసతత్త్వమును ఎరిగినవారై ఆత్మస్వరూపత-సమరసభావ సమన్వితులగుచున్నారు.

**ఇతి ద్వితీయో అధ్యాయమ్ సమాప్తము**

తృతీయాధ్యాయః

యథాస్థానంతు గర్భిణ్యాః

**30.** కో అయమ్ ఆత్మేతి
వయమ్ ఉపాస్మ హే,
"కతరః స ఆత్మా?"
యేన వా రూపం పశ్యతి,
యేన వా శబ్దం శృణోతి,
యేన వా గంధానా జిఘ్రతి,
యేన వా వాచం వ్యాకరోతి,
యేన వా స్వాదు చ, అస్వాదు చ విజానాతి॥

**తృతీయ అధ్యాయము**

(గర్భిణీ స్త్రీలు ఇక మరల వినవచ్చును)

ఏ ఆత్మయొక్క అభిలాషచే నాటకీయంగా ఈ జీవాత్మ-దృశ్యము-పుత్రుడు పునర్జన్మలన్నీ క్రీడా విశేషాలుగా జరిగిపోవుచున్నాయో.... అట్టి ఆత్మగురించి ఇక మనము చెప్పుకుందాము. మనము ఆత్మ-పరమాత్మ అని చెప్పుకుంటున్నది ఎద్దాని గురించి? అట్టి ఆత్మ ఎట్టివాడు? ఎవరు? ఈ జీవుడుగా మనమంతా.....

- దేనివలన రూపము చూచుచున్నామో....,
- దేనివలన శబ్దములను వినుచున్నామో...,
- దేనిచేత వాసన ఆస్వాదిస్తున్నామో....,
- దేనివలన మన ఈనోరు మాట్లాడుచున్నదో.....,
- దేనివలన - ఇది రుచి - అని రుచి అనుభవము పొందుచున్నదో....,

దేనిచేత ఇదంతా తెలియవచ్చుచున్నదో?..... అట్టి జీవాత్మలన్నిటికీ ఆత్మగా కలిగి ఉన్నట్టిదే "మహదాత్మ"! అదియే నీవు. అదియే నేను.

**31. యత్ ఏతత్ హృదయమ్ మనశ్చ,**
**ఏతత్ సంజ్ఞానమ్, అజ్ఞానమ్,**
**విజ్ఞానమ్, ప్రజ్ఞానమ్,**
**మేధా, దృష్టిః, ధృతిః, మతిః, మనీషా**
**జూతిః, స్మృతిః, సంకల్పః, క్రతురసుః, కామోవశ**
**ఇతి। సర్వాణి ఏవ ఏతాని ప్రజ్ఞానస్య**
**నామధేయాని భవంతి।**

ఏదైతే....
హృదయము, మనస్సుల సంజ్ఞారూపమై, అజ్ఞానము-విజ్ఞానము- మేధ-దృష్టి-ధృతి-మతి-బుద్ధిమంతత్వము-జ్ఞాపకము-సంకల్పము -- **ఇవన్నీ తానే అయి,** తన వికల్పములుగా వాటన్నిటినీ **గాంచుచున్నదో....,**
ఏదైతే అవన్నీ తెలుసుకొనుచున్నదో,... అవన్నీ తానేగా కూడా గమనించుచున్నదో...,
అదియే "**ప్రజ్ఞానము**" అనే పేరుతో చెప్పబడుచున్నది. సర్వము ప్రజ్ఞాన స్వరూపమే అయి ఉన్నది. తెలుసుకొనువాడు - తెలియబడునది- తెలుసుకోవటము - అంతా సర్వదా కేవల ప్రజ్ఞాతత్త్వమే!

---

**32. ఏష బ్రహ్మా। ఏష ఇంద్రః।**
**ఏష ప్రజాపతిః। ఏతే సర్వే దేవా,**
**ఇమాని చ పంచ మహాభూతాని,**
**పృథివీ వాయుః ఆకాశః ఆపో జ్యోతీంషి ఇతి।**
**ఏతాని ఇమాని చక్షుద్ర మిశ్రాణీవ,**
**బీజాని ఇతరాణి చ, ఇతరాణి చ**
**అండజాని చ, జరాయుజాని చ,**
**స్వేదజాని చ, ఉద్భిజాని చ,**
**అశ్వా, గావః, పురుషా, హస్తినో,**
**యత్ కిం చ ఇదం ప్రాణి జంగమం చ।**
**పతత్రి చ యచ్చ స్థావరం, సర్వం,**
**తత్ ప్రజ్ఞానేత్రం**
**ప్రజ్ఞానే ప్రతిష్ఠితమ్।**
**ప్రజ్ఞానేత్రో లోకః ప్రజ్ఞా ప్రతిష్ఠా।**
**ప్రజ్ఞానం బ్రహ్మ।**

అట్టి ఏది **ప్రజ్ఞానము** అని పిలువబడుచున్నదో - **ప్రజ్ఞానమ్ బ్రహ్మ!**
- అదియే బ్రహ్మ!
- అదియే ఇంద్రుడు!
- అదియే ప్రజాపతి!

అదియే చూపు-వినికిడి-స్పర్శ-రుచి-గంధముల చమత్కారమంతా ప్రదర్శన చేయునట్టి ఈ దేహములోని దేవతా తత్త్వాలు కూడా!
ఆ ప్రజ్ఞాన స్వరూపమే ఇక్కడి పంచభూతములయినటువంటి పృథ్వి (స్థూలము), వాయువు (చలనము), ఆకారము (స్థానము), ఆపః (ద్రవము) జ్యోతీంషి (అగ్ని) కూడా! అల్ప జీవులగు కీటకములు, బీజ-అంకురములు, ఇతర చేతనములు, అండజములు (పక్షులు మొ॥వి), జరాయుజములు (గర్భము నుండి జనించే జంతువులు), స్వేదము (చెమట) నుండి పుట్టుచున్న జీవులు, ఉద్భిజములు (గాలిలో పుట్టేవి), గుర్రములు, ఆవులు, మానవులు, ఏనుగులు, తదితర సర్వజంగమ ప్రాణులు, పక్షులు, స్థావరములు ... అన్నీ కూడా ప్రజ్ఞా నేత్రములే! ప్రజ్ఞాన దృష్టి రూపములే! అవన్నీ ఉన్నది 'ప్రజ్ఞానము' నందే!
లోకమంతా **ప్రజ్ఞాన నేత్రమే!**
సర్వము ప్రజ్ఞానమునందే ప్రతిష్ఠితమై యున్నది!
**ప్రజ్ఞానమే బ్రహ్మము!**

---

**33.** స ఏతేన ప్రజ్ఞాన-ఆత్మనా
**అస్మాత్ లోకాన్ ఉత్క్రమ్య**
**ఆముష్మిన్ స్వర్గేలోకే। సర్వాన్ కామాన్ ఆప్త్వా,**
**అమృతః**
**సమభవత్। సమభవత్।**
**ఇతి ఓం।**
**ఇతి తృతీయోధ్యాయః సమాప్తః**
**ఐతరేయోపనిషత్ సమాప్తా**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

అట్టి కేవల ప్రజ్ఞాన స్వరూపుడగు పరమాత్మను ఎరిగినవాడు ఈ లోక వ్యవహార జన్మ-కర్మ చక్రము నుండి బయల్వెడలినవాడై, ఆముష్మికమగు స్వర్గాదిలోకాలు చేరుచున్నాడు, సర్వకామములు సిద్ధించుకొన్నవాడై అమృత స్వరూపుడు అగుచున్నాడు. సర్వస్వరూపుడై, సర్వసముడై, ఓంకార సంజ్ఞార్థ స్వరూపుడై ప్రకాశించుచున్నాడు. బ్రహ్మమే తానై విరాజిల్లుచున్నాడు.

**ఇతి తృతీయోధ్యాయము సమాప్తము!**

**ఇతి ఐతరేయోపనిషత్ సమాప్తము!**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 3 ఐతరేయోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



**ఐతరేయమ్** = దీనికంతటికీ వేఱై, ఇదంతా తానే అయి ఉన్నవాడు!

**ఈ** అత్యద్భుతము, బహు చమత్కారము, నిరంతర-పరిణామయుతము, "ద్రష్ట - దర్శన - దృశ్యము - దేహము - జననము - మరణము" మొదలైన అనేక విశేషములతో కూడుకున్నట్టిది అగు సృష్టి అందరికీ అనుభవమగుచున్నది కదా!

అట్టి ఆశ్చర్యకరమైన సృష్టికి మునుముందే, దీనికంతటికీ ఆధారమై ఇద్దానికి సకారణమై ఏదైనా ఉన్నదా? ఉన్నది!

మొట్టమొదట **ఏకస్వరూపమై అఖండమై ఆత్మయే ఉండి ఉన్నది.** అట్టి ఆత్మకు వేరైనదంటూ (మొదట) ఏదీ ఉండి ఉండనే లేదు. ఆత్మ సర్వే సర్వత్రా సహజంగానే సర్వదా అనన్యము. అద్వితీయము. నిత్యము.

అన్యమే లేనట్టి అనన్యస్వరూపమగు ఆత్మ చైతన్యము-**"ఏక స్వరూపుడనగు నేను ఒంటరివాడనై ఉండటము ఏమి మోదము? అందుచేత - క్రీడా వినోదంగా, లీలగా - తెలుసుకోవటం-తెలుసుకొనుచున్నట్టివాడు-తెలియబడునది**-(perceiver - perception - object ; knower - knowing - that being known) మొ॥వి .... **కల్పించుకొని ఆహ్లాదము పొందెదను గాక"..** అని భావించింది. **"సంకల్పశక్తిని ప్రేరేపించుకొని లోకములను సృష్టించుకొనెదను గాక !"**... అని తలచింది. భావనలకు - సంకల్పములకు మునుముందే ఉన్నట్టి ఆ ఆత్మ భగవానుని సంకల్పశక్తి ప్రదర్శన రూపంగా, భావనా రూపంగా లోకములు కల్పించబడటం ఆరంభమయింది.

(అందుచేతనే ఆ కల్పనకు శివార్ధభాగము భావన - ఊహ - సంకల్ప - స్వభావ - ప్రకృతి - ఇత్యాది పేర్లు!)

1) ఊర్ధ్వమున - ఆంభో (స్వర్గము మొ॥న) లోకములు.
2) ఆకాశంలో - మరీచి - సంకల్ప సిద్ధ లోకములు.
3) భౌతికంగా - మర (భూ) లోకము
4) జలమున - అధో లోకములు (పాతాళము, జంతు ప్రవృత్తులు),

- చిన్న పిల్లవాని స్వకీయ ఊహా క్రీడలవలె, బాలా లీలా వినోదంలాగే... అవన్నీ కల్పించబడసాగాయి.
- పాంచభౌతిక సృష్టికి ఆవల - ద్యోః (స్వర్గ) లోకము,
- అంతరిక్షంలో (Space) మరీచి లోకము,
- భూమి (Solid) పై మరులోకము,
- జలము (liquid) లో క్రింది లోకములు కల్పించబడ్డాయి.

"సరే ! లోకాలైతే సృష్టించాను. మరి లోకాలను సృష్టించిన తరువాత, వాటికి పరిపాలించటానికి, పర్యవేక్షించటానికి, కథ నడపటానికి లోకపాలకుడు (One who manages) కావాలి కదా" - అని ఆత్మ భగవానుడు అనుకున్నారు. ఇట్లా ఆలోచించి ఒక పురుషుని

ఆకారము సృజియించారు? (ఆయనే సృష్టికర్తయగు బ్రహ్మదేవుడు. ప్రథమ పురుషుడు). అట్లా కల్పించబడిన పురుషాకారమును గురించి ఆత్మభగవానుడు మరల యోచన చేయసాగారు ! ఆ పురుషాకారుడగు సృష్టికర్తను సృష్టి తపన రూపమగు తపస్సునందు నియమించారు. 'తపన'యే తపస్సు. ఆ తపన నుండియే ఈ సర్వము బయల్వెడలుతోంది.

**పరమాత్మ నుండి సంకల్ప రూపమగు సృష్టిలోనికి - సమిష్టి సంకల్పుడగు సృష్టి పురుషునికి**

| | | |
|---|---|---|
| నోరు - వికాసమానం అయింది | నోరు నుండి - వాక్కు | వాక్కు నుండి 'అగ్ని' పుట్టింది. |
| నాశికారంధ్రములు వికసించాయి | ప్రాణము | ప్రాణశక్తి నుండి 'వాయువు' జనించింది. |
| నేత్రములు వికసించాయి | చూపు | చూపు నుండి ఆదిత్యుడు ప్రకటితమైనారు. |
| రెండు చెవులు వికసించాయి | వినికిడి శక్తి | వినికిడి శక్తి నుండి దిక్కులు బయల్వెడలాయి |
| చర్మము వికసితమయింది | చర్మము నుండి స్పర్శశక్తి | స్పర్శ నుండి ఓషధులు (ఆహార ధాన్యములు, పశు ధాన్యములు మొ॥వి), వనస్పతులు (పసుపు, తదితర వృక్షములు మొ॥నవి) జనించినాయి. |
| హృదయము ప్రదర్శితమైనది | హృదయమ నుండి మనస్సు | మనస్సు నుండి చంద్రుడు ఉదయించారు |
| నాభిస్థానము ఏర్పడింది | నాభి నుండి (బొడ్డు నుండి) అపాన వాయువు | ఆపాన వాయువు నుండి మృత్యువు (మార్పు-చేర్పులు) ప్రదర్శనమైనాయి. |
| శిశ్నము (విసర్జకావయవము) | శిశ్నము నుండి రేతస్సు | రేతస్సు నుండి 'జలము' జనించింది |

ఈ విధంగా ఆత్మ భగవానుని నుండి, ఆత్మ భగవానుని చేతనే... సృజించబడిన "సృష్టికర్త" నుండి **వాక్కు దేవత, అగ్ని దేవత, ప్రాణ దేవత, వాయు దేవత బయల్వెడలారు. దృష్టి, (ఆదిత్యుడు), వినికిడి, దిక్కులు, స్పర్శ, దేహ పరిపోషితములగు ఔషధులు, వనస్పతులు (వృక్షములు)....** వీటన్నిటికీ సంబంధించిన శక్తి సమన్విత **దేవతా ప్రజ్ఞలుగా** ఉదయించాయి. ఆ దేవతలంతా కూడా సముద్రజల తరంగాల వలె పరమాత్మ నుండి బయల్వెడలి, పరమాత్మ కల్పనా సృష్టియందు ప్రకటించబడి, సంసిద్ధులైనారు. వారందరి ప్రవేశముతో బాటు ఆకలి దప్పికలు కూడా వెంటనంటి వచ్చాయి.

(నోరు - నాశిక - చర్మ - హృదయ - నాభి - శిశ్న - అధిష్ఠాతలగు అగ్ని , వాయు, ఆదిత్య, దిక్, ఓషధ, వనస్పత, చంద్ర, జల దేవతా శక్తి ప్రజ్ఞలగు దేవతలు).

ఆ దేవతలు ఆత్మ భగవానుని సమీపించి, **"ఓ ఆత్మ భగవాన్ ! మేము మీ సంకల్పము నుండి సృష్టించబడి మీ ఎదురుగా నిలచి ఉన్నాము!** మీచే జనించిన మేము ఎక్కడ అన్నము (ఆహారము - అర్థములు, కార్యక్రమములు Activitiy, Execution) .... ) పొందగలమో, అట్టి మేము ఉండవలసిన స్థానమును మీరు నిర్ణయించి మాకు చెప్పండి ! మమ్ములను ఆజ్ఞాపించండి ! మేము మామా ధర్మములను నిర్వర్తించవలసిన విధులను నిర్దేశించండి !" అని అభ్యర్థించారు.

'ఓ ! అట్లాగే' ... అని ఆత్మదేవుడగు పరమాత్మ అంగీకరించారు. ఆ దేవతా తత్త్వాలు తమ తమ స్థానములలో ఆత్మ సంకల్పితము - నిర్దేశితము అయిన తమ తమ ధర్మాలు (Function) నిర్వర్తిస్తూ ఉండటానికిగాను మొట్టమొదటగా.. **ఒక ఆవు (కామధేనువు)**ను సృష్టించి ఎదురుగా నిలిపారు. అప్పుడు ఇంద్రియ - పంచభూత - ఔషధ - చంద్ర ఆకలి దప్పికా దేవతలు ఆ ఆవును ప్రవేశించటానికి సంసిద్ధులౌతూనే ... ఆత్మ భగవానునితో... **"స్వామీ! మా ఉనికి - ఆహారము కొరకు ఈ ఒక్క ఆవు కల్పన మాత్రమే చాలదు కదా !"** అని మరల విన్నవించుకున్నారు.

అప్పుడు ఆత్మ భగవానుడు వారి స్థాన నిర్దేశము కొరకై ఒక గుర్రము (శ్వేతాశ్వము) ను కూడా సృష్టించి (కల్పించి) దేవతాతత్త్వాలకు (దేవతలకు) ఎదురుగా నిలిపారు. అప్పుడా దేవతలు **"ఓ ఆత్మ దేవా ! ఈ మాత్రము కూడా మా మా విధి నిర్వహణలకు చాలదేమో కదా !"** అని అభ్యర్థించారు. అప్పుడు అసంఖ్యాక జీవజాలము కల్పించబడింది.

అప్పటికీ దేవతలు పూర్తిగా సంతోషించనే లేదు. అప్పుడు పరమాత్మ తన యొక్క సంకల్పానుసారంగా **పూర్ణ లక్షణ సంపన్నుడైనటువంటి పురుషుని(మానవుని)** సంకల్పించారు. ఆ దేవతలకు (దివ్య శక్తులకు) ఎదురుగా నిలిపారు. అప్పుడు ఆ దేవతలు పురుషాకారమును చూచి **"ఆహాఁ! చాలా సంతోషము ! ఈ పురుష, (మానవ) రూపము బహు లక్షణ సమన్వితమై సృష్టించబడినది"..** అని తమ ఆనందమును ప్రకటించారు.

అప్పుడు ఆత్మ భాగవానుడు

**ఓ ఇంద్రియ - పంచభూత - ఇత్యాది సంబంధితులగు దేవతలారా ! ఇక మీరు సృష్టి పురుషునిలో ప్రవేశించి మీమీ స్థానములు అలంకరించండి. మీ మీ ధర్మములు - కార్యక్రమములు** (Functions and Activities) నిర్వర్తిస్తూ ఈ నా కల్పనా సృష్టిని అనుభవ ప్రదము **చేయండి !** అని ఆజ్ఞాపించారు.

అప్పుడా దేవతలు పరమ పరుషుని యొక్క ఆజ్ఞను శిరసావహించసాగారు.

| | | |
|---|---|---|
| **అగ్ని దేవుడు** | వాక్ స్వరూపులై | *నోటియందు,* |
| **వాయుదేవుడు** | ప్రాణ స్వరూపులై | *నాశిక యందు,* |
| **ఆదిత్యుడు (సూర్యుడు)** | దర్శన (చూపు) స్వరూపులై | *చక్షువుల (కళ్ళ)యందు,* |
| **దిక్ దేవతలు** | శ్రోత్ర (వినికిడి) స్వరూపులై | *కర్ణముల (చెవుల) యందు,* |
| **ఓషధ - వనస్పత దేవతలు** | స్పర్శ స్వరూపులై | *చర్మమునందు,* |
| **చంద్రుడు** | మనస్సురూపముదాల్చి | *హృదయమునందు,* |
| **(యమ) మృత్యు (మార్పు) దేవత** | అపానరూపము దాల్చి | *నాభిప్రదేశమునందును,* |
| **జల దేవత (వరుణుడు)** | రేతస్సు రూపము దల్చి | *శిశ్నము (పునరుత్పత్తి అవయవము) నందు* |

**ప్రవేశమును పొందారు.** ఆయా స్థానములను ఆక్రమించి ఇక తమ తమ విధులను నిర్వర్తించటానికి ప్రయత్నశీలురు కాసాగారు.

ఇది ఇట్లా ఉండగా, ఇంతలో **ఆకలి-దప్పిక శక్తులు** పరమాత్మను సమీపించాయి.

**"హే ఆత్మభగవాన్ ! తదితర దేవతలకు సృష్టిలో వారి వారి స్థానములను నిర్దేశించారు. పురుషుని దేహములో వారి వారి ధర్మములను** (functions) **నిర్వచించారు. ఇక ఇప్పుడు మా స్థానములను కూడా సృష్టియందు నిర్ణయించి ఆజ్ఞాపించ ప్రార్థిస్తున్నాము."** అని విన్నవించుకొన్నారు. అప్పుడు పరమాత్మ స్వరూపుడగు **సృష్టికర్తపురుష ఆకారుడు** కొంచము యోచన చేసి,

**ఓ అశన - పిపాసలారా ! (ఆకలి దప్పికలారా !) మీకు పురుష దేహములో ఒక స్థానమంటూ ఏదీ నిర్దేశించటము లేదు. అందుచేత మీరిరువురు కూడా ఇప్పుడు పురుష సృష్టి దేహమునందు అనువర్తిస్తున్నటువంటి తదితర దేవతలను అనుసరిస్తున్న వారై ఉండండి. వారితోనే అనుభాగినులై (భాగస్వామ్యులై) ఉండవలసినదిగా నిర్ణయిస్తున్నాను. అంతేగాని, మీకు వేరుగా ప్రత్యేకమైన స్థానమనునదేదీ ఉండదు !**

**అందుచేత ఏ దేవతను ఉద్దేశ్యించి హవిస్సు (అన్నము - ఆహారము) ఇవ్వబడుచున్నదో, మీరు ఆ హవిస్సులోని భాగమును ఆ దేవతతో భాగస్వామ్యులై స్వీకరించుచుండెదరు గాక !** అని నిర్ణయించారు.

అప్పుడు ఆ అశన-పిపాసా దేవతలు (ఆకలి-దప్పికలు) ఆ ఆజ్ఞాపించిన తీరుగానే ఆయా ఇంద్రియ దేవతలతోబాటే పురుష దేహమునందు ప్రవేశించారు. ఆయా స్థానములను అలంకరించినవారై, ఆయా దేవతలతో బాటే హవిస్సులకు భాగస్వామ్యులు కాసాగారు.

⌘

## ప్రథమాధ్యాయము - తృతీయ ఖండము

అప్పుడు ఆ సృష్టికర్త **"ఇదిగో ! ఇవన్నీ నేను సృష్టించిన లోకాలు, ఈ లోకాలు నడపటానికి లోకపాలకుడిని (సృష్టికర్తయగు ప్రజాపతిని), దేవతాతత్త్వాలను (ప్రజ్ఞలను) కూడా కల్పించాను. బాగానే ఉన్నది!**

ఇప్పుడు...,

వీరందరి సృష్టి కథా సంవిధానము కొరకై

అన్నమ్ (Material as fuel, (లేక) ఆహారము Food stuff, consumption material, fuel for energy) కల్పించుచున్నాను..." అని యోచన (భావన) చేశారు. **(అన్నము = That Being Experienced, సర్వ ఇంద్రియనానుభవ వస్తువులు – విషయములు, అనుభవము, అనుభూతి)**

అప్పుడు జలము నుండి ఒకానొక మూర్తీ విభవము ప్రభవించింది. ఆ విధంగా పరమాత్మ సంకల్పానుసారము ఏది జలము నుండి మూర్తీభవించినదో అదియే అన్నమ్! (అదియే జాగ్రత్ – స్వప్న సంబంధమైన స్థూల–సూక్ష్మ రూపం కూడా!)

*(ఆ అన్నము గురించి – 'అన్నమ్ బ్రహ్మ', 'అహమ్ బ్రహ్మ – భోక్తా చ బ్రహ్మ', అన్నమయమ్ మనః' అన్నమ్ బ్రహ్మేతి య ఏవం వేద".... ఇత్యాది స్తోత్రములు, అన్నసూక్తము వేదములలో వేరు వేరు చోట్లగా అభివర్ణించబడింది).*

ఆ విధంగా పరమాత్మ సంకల్పానుసారము సృష్టి పురుషుని దేహమునకు ఎదురుగా 'అన్నము (Subject for Experiencing)' సృష్టించబడింది. దేహమునందు స్థానమును పొందుచున్న (పైన చెప్పబడిన) నోరు – కళ్ళు – చెవులు – చర్మము – శిశ్నము మొదలైన స్థాన దేవతా ప్రజ్ఞలు ఆ పరమాత్మ కల్పితమైన అన్నదేవతను చూచారు.

మొట్టమొదట వాక్ దేవత (వాక్ ఇంద్రియ ప్రజ్ఞాదేవత) – **"ఈ మూర్తీభవించిన అన్న దేవతను నేను పట్టుకొని సొంతము చేసుకొనెదను గాక !"** అని తలచి తన యొక్క వాక్ శక్తితో ఆ అన్న బ్రహ్మమును పట్టుకోవటానికి బయల్వెడలింది. కానీ, వెనుకకు పరుగులు తీస్తున్న ఆ అన్నతత్త్వమును వాక్‌శక్తి తన హస్తములతో పట్టుకోలేకపోయింది. (తత్ న శక్నోత్ వాచా గ్రహీతుమ్) !

**సయత్ అధేత్ వాచా అగ్రహి ఏష్యత్ అభివ్యాహృత్య హి, ఏవ అన్నమ్ అత్రప్స్యత్ !** ఒకవేళ ఆ సందర్భములో వాక్ దేవత కనుక తన వాక్ శక్తితో అన్నబ్రహ్మమును పట్టుకొనగలిగి ఉండి ఉంటే,... అప్పుడు ఈ జీవుడు "అన్నమ్" .... అని వాక్కుతో అనగానే దేహమునకు ఆహారము లభించినది అయ్యేదే! తృప్తి పొందేదే! కాని అది అట్లా జరగలేదు!

⌘

అప్పుడు **ప్రాణదేవత** కూడా తన ప్రాణశక్తి హస్తములను చాచి ఆ అన్న దేవతను ప్రాణ హస్తములతో పట్టుకోవటానికికై ప్రయత్నము చేసింది. కానీ అదీ కుదరలేదు. అనగా ప్రాణశక్తి అన్నమును పట్టుకోలేకపోయింది. అట్లా పట్టుకొనగలిగి ఉంటే, అప్పుడు ఈ దేహి గాలిపీల్చినంత మాత్రంచేతనే దేహము ఆహారము – ఆహార రసము స్వీకరించి తృప్తి చెందగలిగేదే ! అట్లాగూ జరగలేదు.

⌘

తరువాత **చక్షు దేవత** అన్నమును పట్టుకోవటానికి ప్రయత్నించి, తాను కూడా విఫలమయింది. చక్షువులుగాని అన్నమును పట్టుకోగలిగితే, అప్పుడు ఈ భౌతిక శరీరధారి తన కంటి చూపుతో చూచినంత మాత్రము చేతనే – దేహము అన్నము (ఆహారము) పొంది తృప్తి పొందగలిగేది. కానీ అది అట్లా కూడా జరుగలేదు.

⌘

ఆ తరువాత, **శ్రోత్ర (వినికిడి) శక్తి దేవత (శ్రవణేంద్రియము)** ఆ వెనుకకు మరలుచున్న అన్నమును తన చేతులతో పట్టుకోవటానికి ప్రయత్నించింది. కానీ సాధ్యపడలేదు. ఒకవేళ శ్రోతశక్తి అన్నమును తన హస్తములతో పట్టుకొనగలిగి ఉంటే ఇక ఈ దేహి (పురుషుడు) ఆహారమును గురించి వర్ణన విన్నంత మాత్రము చేతనే శరీరమునకు ఆహారము లభించినదై దేహము తృప్తి పొందగలిగేదే ! మరి ఆ విధంగానూ జరుగలేదు.

⌘

ఇకప్పుడు **త్వక్ ఇంద్రియ దేవత** వెనుకకు జరుగుచూ పోతున్నట్టి అన్నదేవతను పట్టుకొనటానికి ప్రయత్నించింది. ఏమాత్రం సాధ్యం కాలేక విఫలమయ్యింది. అట్లా పట్టుకొనగలిగి ఉంటే, అప్పుడు పురుషుడు అన్నమును చేతితో స్పృశించినంత మాత్రము చేతనే ఆకలి – దప్పికలు తొలగి, దేహము అన్నము స్వీకరించినదై తృప్తిని పొందేదే ! అ తీరుగా కూడా జరుగలేదు.

⌘

అటు తరువాత **మనస్సు** ఆ అన్నరసతత్త్వ దేవతను అందుకోవటానికి సంసిద్ధమై, తన ప్రయత్నమంతా నిర్వర్తించింది. కానీ ఏమి లాభం? మనస్సు ఆ ప్రయత్నములో ఏమాత్రము సఫలం పొందలేదు. ఒకవేళ మనస్సు ఆ అన్నరస స్వీకారమునందు విజయము

పొంది ఉంటే, .... అప్పుడు పురుషుడు (దేహి) అన్నము గురించి – **సయత్ అధైనన్ మనసా గ్రహ్యైషత్ ధ్యాత్వా హి, ఏవ అన్నమ్ అత్రప్స్యత్–** *ఆలోచనా–భావన చేసినంత మాత్రము చేతనే ఆహార రూపమగు అన్నము ఈ దేహము పొందినదై తృప్తిగా ఉండేదే ?* ఆ విధంగానూ జరుగలేదు మరి !

⌘

ఆపై **శిశ్నము** నందు స్థానము పొందియున్న రేతస్సు **"సరేం ! నేనన్నా ఈ అన్నరస దేవతను చేతులతో పట్టుకొనెదను గాక !"** ... అని తలచి ప్రయత్నించింది. అదీ సాధ్యం కాలేదు. ఒకవేళ విసర్జ కావయమగు శిశ్నములో గల రేతస్సు ఆ ప్రయత్నమునందు విజయము పొంది ఉండి ఉంటే, అప్పుడు 'అన్నము' ను చూచి "నేను ఈ అన్నరసమును వదలుచున్నాను"... అని తలచగానే దేహము అన్నమును పొంది తృప్తి పడేదే ! అట్లా అవనేలేదు.

⌘

ఇకప్పుడు – **తత్ అపానేన అజిఘృక్షత్** – అపాన వాయువు అన్నమును పట్టుకొనే ప్రయత్నము చేసింది.

**స యేషో అన్నస్య గ్రహో!**

అపానము (వాయువు) అన్నమును పట్టుకొనగలిగింది !

**యత్ వాయుః అన్నమ్ ఆయుర్వా ఏష యద్వాయుః !**

అట్టి అన్నమును పట్టుకొనగలిగినదే ప్రాణాపాన వాయువు ! ఈ విధంగా ప్రాణాపాన వాయువే అన్నమును స్వీకరిస్తూ అట్టి అన్నము యొక్క రసతత్వముచే దేహమునందు ప్రాణశక్తిని నిలుపుచున్నదగుచున్నది.

⌘

ఆ తరువాత, అట్లు ప్రాణశక్తి సమన్వితముగా నిలచియున్న భౌతిదేహమును పరమాత్మ చూచినవారై

**"ఈ పిండ శరీరమును నేను ప్రవేశించకపోతే ఇది నిలవగలుగుతుందా ? లేదు కదా ! నా చైతన్యత్వము చేతనే ఇది స్వయంసత్త పొందగలదు. లేదా ఇంద్రియములకు, ఇంద్రియ శక్తులు వేరువేరుగా సంప్రదర్శనమగుచున్న ఈ దేహము ఒక జడమగు తోలు బొమ్మ వంటిదే! ఇందులో ఇచ్ఛ–జ్ఞాన–క్రియా శక్తుల సమిష్ఠి ప్రదర్శకుడనగు నా చైతన్యముయొక్క సంప్రవేశము అవసరం !**

ఇక్కడ రెండు విషయములు

1) తోలు బొమ్మ (జీవ దేహము / పురుషుడు / జీవుడు) స్వకీయముగా ఇచ్ఛ – జ్ఞాన–క్రియా శక్తిమంతుడై చైతన్యవంతుడై ఉండాలి. అందుకు నేను ఇందులో అస్మత్ చైతన్య విశేషముతో ప్రవేశించాలి కదా ! లేకుంటే ఇది చైతన్యవంతము కాదు.
2) నేను చైతన్య స్వరూపముగా ఇందులే ప్రవేశించి, ఇద్దానికి నా చైతన్యవంతము ప్రసాదిస్తే ? అప్పుడు ఈ జీవుడు నా ప్రమేయం లేకుండానే తన ఇచ్ఛను అనుసరించి..., యది (if) (ఒకవేళ)

| | | | |
|---|---|---|---|
| – | వాచా అభివ్యాకృతమ్ | – | వాక్కుతో తన ఇష్టానుసారంగా మాట్లాడటం..., |
| – | చక్షుషా దృష్టమ్ | – | కళ్ళతో తన ఇచ్ఛానుసారము చూడటం..., |
| – | శ్రోత్రేణ శ్రుతమ్ | – | చెవులతో తనకు ఇష్టమైనది వినటం..., |
| – | త్వక్‌చ స్పృష్టమ్ | – | చర్మముతో స్పర్శానుభవం తను అనుకున్న రీతిగా పొందటం..., |
| – | యది మనసా ధ్యాతమ్ | – | మనస్సుతో తనకు తోచిన రీతిగా ఆలోచనలు చేయటం..., |
| – | అపానేన అభ్యపానితమ్ | – | అపానముతో తన ఇష్టమైనది తినటం, త్రాగటం, విసర్జించటం..., |
| – | శిశ్నేన విస్పృష్టకమ్ | – | శిశ్నముతో విసర్జించటము..., |

ఇవన్నీ ఈ పురుషుడు (తనకు తానే, నా ప్రమేయము లేకుండా) నిర్వర్తిస్తూ ఉంటే... అప్పుడు

**కథం ను ఇదం అదృతే స్యాత్ ? కతరేణ ప్రపద్యా ?**

'అప్పుడు నేనెవరును ? నా వలన ప్రయోజనము ఏమిటి మరి ?" అని (ఆత్మ భగవానుడు) యోచించారు ?

అప్పుడు ***"అనంత – సహస్ర చైతన్య కిరణ స్వరూపుడనగు నేను ఒకానొక చేతన కిరణముచే ఈ దేహములలో ప్రవేశించి ఉండటం చేత నాకేమి లోటు?"*** అని భావించారు.

ఆ పరమ పురుషుడు తాను లీలగా కల్పించిన పురుష దేహము యొక్క ఊర్ధ్వశిరో (సహస్రార) భాగము ద్వారా శిరస్సును ఛేదించి, ఆ ద్వారముగుండా దేహములోనికి (పురుషుని లోనికి) తనయొక్క అంశను (జీవ చైతన్యాంశను) ప్రవేశింపజేసారు.

**అట్టి మార్గమును 'విదృతి' అని పిలుస్తున్నారు. (అదియే యోగవిద్యలో బ్రహ్మరంధ్ర ప్రాణప్రవేశ గమనిక - యోగము).**

అది ఆనంద స్థానము. ఎందుకంటే కల్పనఅంతా ఆత్మభగవానుడు తన వినోదముకొరకే కల్పించారు కాబట్టి !

**అట్టి ఆత్మ యొక్క త్రయోనివాస స్థానములు :**

1) జాగ్రత్ - స్వప్న - సుషుప్తులు - (మనస్సునందు)

2) నేత్రము - కంఠము - హృదయము - (దేహములో)

**అయమ్ ఆవసథో! అయమ్ ఆవసథో! అయమ్ ఆవసథో! ఇందులో నేను ఉన్నవాడను అగుచున్నాను అని భావించారు. అని సంకల్పించారు.**

⌘

ఈ విధంగా పరమాత్మ చైతన్యానంద స్వరూపుడై పురుష (జీవుని) దేహములోనికి (స్వయం పురుషాకార - స్వీయాంశలోనికి) - తన స్థానమునందు తాను యథాతథుడై ఉంటూనే - **ప్రవేశించారు.** జీవరూపుడు (Experience, perceiver) గా అయినారు.

తన కల్పనా చమత్కృతినే తాను **'భూతభావన'** తో తదాత్మ్యము పొందుతూ దృశ్యమును గ్రహించసాగారు. ఆ తరువాత,

**కిమ్ ఇహ అన్యంవా అవదిషత్?**

**"ఇక్కడ నేను కానిది ఏది? వాస్తవానికి ఇక్కడ ఉన్నదంతా నేనే! నాకు వేరైనది ఏదీ ఎక్కడా లేదు కదా!"** - అని గమనించి, ఎలుగెత్తి ఉచ్చరించారు. "ఇదంతా ఏమిటో తెలుసుకున్నాను కదా!" అని తృప్తిని పొందారు, కనుక, పరబ్రహ్మము...,

- **సర్వోత్కృష్టము !**
- **సర్వవ్యాపకము !**
- **సర్వ స్వరూపము !**
- **సర్వము అయి ఉన్నది.**

**"ఈ ఇంద్రియములన్నిటికీ అధిపతిని, (ఉపయోగించువాడను), యజమానిని** (User and Owner) **నేనే కదా !"**... అని గ్రహించుటచే ఆయన **"ఇంద్రుడు"** - అని ప్రసిద్ధికెక్కారు. దేహములోని శబ్ద - స్పర్శ మొదలైన సర్వ అధిష్ఠాన దేవతలను పరిపాలించువాడు కాబట్టి **"దేవేంద్రుడు"** - అయ్యారు ! ఈ మానవుడు ఇంద్రియ విషయములకు ప్రత్యక్ష ప్రియులు కదా ! అయితే దేవతలు

- పరోక్ష ప్రియులు
- పరోక్షముగా ప్రియత్వము కలవారు ! భావమాత్ర సంతుష్టులుగా ఉండసాగారు !

అందుకని "ఓ ఇంద్రియముల యజమానీ! ఓ వర్షమునకు అధికారీ! ఓ నిప్పును శరీరముగా కలవాడా!" ... అని అనము. ఓ **ఇంద్రదేవా! వరుణదేవా! అగ్ని భగవన్! జాతవేదా!** - అని అంటాము.

# ద్వితీయోధ్యాయః - ప్రథమ ఖండః

**అపక్రామంతు గర్భిణ్యంః**-విషయము గర్భిణీస్త్రీలు వినవద్దని ఉద్దేశించబడింది. (శ్రోతలలో గల గర్భిణీ స్త్రీలను బయటకు వెళ్ళమని చెప్పుతారు).

**ఓం పురుషే హ వా అయమ్ ఆదితో గర్భోభవతి !** మొట్టమొదటగా గర్భము (శిశువు యొక్క మొట్టమొదటి ప్రారంభము) పురుషునియందే సంభవించుచున్నదగుచున్నది.

పురుషునిలోగల - శబ్దము (వినికిడి) - దర్శన (చూపు) - స్పర్శ (తాకుటకు సంబంధమైన చర్మ ధర్మము) నాలుకలోని రసదేవత, ముక్కులోని గంధ దేవత - ఈ ఈ దేవతలంతా సమర్పించిన తమ తమ తేజస్సులచే పురుషుని యందు **'రేతస్సు'** రూపు దిద్దుకుంటోంది.

అనగా పురుషునిలో సర్వాంగములలోని శక్తితత్వములు ఏకరూపముగా దాల్చి ఒక చోటికి వచ్చి ఆ పురుషునిలో **వీర్య రూపమగు రేతస్సుగా** ఏర్పడుచున్నాయి. దేవతా శక్తులన్నీ ఆత్మ పరికల్పితములే కాబట్టి **ఆత్మరూపములే!**

**సంభూతమ్ ఆత్మన్యేవ ఆత్మానం బిభర్తి !**

స్వతఃగా ఆత్మస్వరూపుడే అయి ఉన్న పురుషుడు తన అంతరములో ఆత్మనే **'శుక్రము'** రూపముగా భరించుచున్నాడు. ఎప్పుడైతే ఆ పురుషుడు ఆ శుక్రమును స్త్రీ యోనియందు (లేక గర్భమునందు) **నిషేకము** చేయటం జరుగుతుందో, అప్పుడు **వీర్యము (రేతస్సు) రూపములో ఉన్న ఆత్మ** – పురుష శరీరము నుండి బయల్వెడలి – **స్త్రీ గర్భమున ప్రవేశించినదగుచున్నది.**

ఇదియే పురుషుని (జీవుని) – దేహముతో కూడి ఉన్నట్టి – **ప్రథమ జన్మ**

⌘

# ద్వితీయోధ్యాయః - ద్వితీయ ఖండః

**తత్ స్త్రియా ఆత్మభూయం గచ్ఛతి ।**
**యథా స్వమంగం, తథా తస్మాత్ ఏనాం న హినస్తి॥ ॥**

స్త్రీ దేహమునందు ప్రవేశించిన వీర్యము బిడ్డగా రూపుదిద్దుకొనునప్పుడు స్త్రీకి ఆత్మభాగివలె అగుచున్నది. స్వదేహములోని ఒక అంగ విభాగమువలె అయి ఉండటంచేత, ఆ వీర్యముగాని, తదనంతర శిశువుగాని ఆ తల్లిని బాధించుట లేదు. స్వీయ – అవయవము వలె ఆనందమే కలుగజేయుచున్నది. వీర్యము ఏ విధంగా శరీరములోని భాగమే అయి పురుషుని బాధించదో, ఆవిధంగానే, స్త్రీ విషయంలో కూడా గర్భము దాల్చటం దేహాంతర్విభాగమై, ఆ తల్లికి సంతోషమే అగుచున్నది. **"నా ప్రియమైన భర్త ఆత్మరూపుడై నా యొక్క గర్భమునందు ఉన్నారు"** ... అను భావనతో ప్రేమగా గర్భమును ఆ మాతృమూర్తి గ్రహించుచున్నది.

గర్భముతో ఉన్న స్త్రీ ఆత్మస్వరూపుడగు శిశువును ధరించి ఉండటంచేతనే, ఆ భర్త తన అర్ధాంగి అగు ఆమెకు ప్రియమైన ఆరోగ్యప్రదమైన తినుబండారములు అందించడము ఆచారమగుచున్నది. ఎందుకంటే – తం స్త్రీ గర్భం బిభర్తి – ఆ స్త్రీ గర్భస్థ శిశువును భరించుచున్నది కదా ! **సా భావయిత్రీ భావయితవ్యా భవతి !** ఆమె భావసుమన్వితురాలై, గర్భస్థ శిశువును భావసంపూర్ణునిగా చేయుచున్నది. అందుచేత గర్భస్త స్త్రీ పవిత్రమైన దైవీ సంబంధ భావనలు కలిగి ఉండటం చేత శిశువు అదే రీతిగా దైవీ గుణ సంపత్తి, భావాలు కలిగినవాడుగా అగుచున్నాడు.

శిశువు జన్మించిన తరువాత తండ్రి అనేక సంస్కారములు నిర్వర్తించవలసిన బాధ్యతను పొందుచున్నాడు. ఎందుకు ? పుత్రుడు ఆత్మ నుండి ఉదయించిన కారణంచేత, ఆ సంస్కారములు తన కొరకై తానే నిర్వర్తించుచూ, పరిపోషించుకొనుచున్నట్లే అగుచున్నది !

ఆ విధంగా ప్రజాసంతతి వృద్ధి కొరకై ఆ తండ్రి శిశువుకు సంస్కారములు నిర్వర్తించి ప్రజా సంతతి యజ్ఞము నిర్వర్తించుచున్న వాడగుచున్నాడు. ఇట్లు సంతతి వృద్ధి చెందునుగాక !

**ఇది ఆత్మ యొక్క ద్వితీయ జన్మ ! (ఆత్మా వై పుత్రః)।**

# ద్వితీయోఽధ్యాయః - తృతీయ ఖండః

ఈ విధంగా సంతానము నిమిత్తమై పుణ్యకర్మలు నిర్వర్తిస్తూ తండ్రి ఆ మార్గములో 'ఆత్మోపాసకుడు' అనియే చెప్పబడుచున్నాడు.

ఆ తరువాత ఆత్మస్వరూపుడే అయి ఉన్న తండ్రి తన యొక్క జగదంతర్గతమైన ఆత్మ (జీవాత్మ)ను ఉత్తమ కర్మలతో కృతకృత్యుడుగా చేయుచున్నాడు. ఆయుర్దాయము ముగిసిన తరువాత అతడు (తండ్రి) తన భౌతిక శరీరమునువీడి వెళ్ళుచున్నాడు. అతడు ఈ లోకము నుండి బయల్వెడలుచూనే, తిరిగి మరొక శరీరమును ఆశ్రయించి వెంటనే పునర్జన్మను పొందుచున్నాడు.

**తదస్య తృతీయ జన్మ తత్ ఉక్తమ్ ఋషీణాం !**

ఒక శరీరము వదలి మరొక శరీరమును స్వీకరించటము (పునర్జన్మ పొందటము) ఆత్మకు **'తృతీయ జన్మ'** అగుచున్నది. ఇది ఈ విధంగా మహర్షి ప్రోక్తము. అట్టి పునర్జన్మ – పాత వస్త్రము వీడి, కొత్త వస్త్రము ధరించటము వంటిదే కాబట్టి, ... దేహముల రాక–పోకలచే ఆత్మయొక్క యథాతథత్వము చెక్కుచెదురునది కాదు.

# ద్వితీయాధ్యాయః చతుర్ధ ఖండః

మహర్షియగు వామదేవులవారు (వాసుదేవ మహర్షి) తల్లి గర్భమున ఉన్నప్పుడు – స్వీయానుభవంగా మనం చెప్పుకున్న త్రిజన్మల గురించి, పురుష – స్త్రీ దేహములోని ఆత్మభగవానుని క్రీడా వినోదంగా దేహ పట్టణములో ప్రవేశించు దేవతా ప్రజ్ఞల చమత్కారము గురించి – స్వయంగా గమనించి శిష్యులకు వివరించి చెప్పుచున్నారు.

### శ్రీ వామదేవొ వాచ :

*ఓ స్వయమాత్మానంద స్వరూపులారా వినండి !*

మాతృగర్భములో నివసించుచూ ఉండగా, సకల దేవతల జన్మవృత్తాంతములను ఇప్పటి వరకూ చెప్పుకొనియున్న రీతిగా తెలుసుకొన్నాను.

- ఆయా దేవతలు – నేను జీవాత్మరూపుడనై అజ్ఞానిగా ఉన్నప్పుడు కూడా, గర్భమునందు ఏమీ తెలియక అనేక బంధనముల మధ్య నిస్సహాయంగా ఉన్న నాకు తమతమ ప్రజ్ఞలతో శబ్ద–స్పర్శ–రూప–రస–గంధ శక్తులను ప్రసాదిస్తూ ఈ అద్భుతమైన దేహమును నిర్మించి ప్రసాదించుచున్నారు. ఇదియే ప్రతి జీవుని విషయము కూడా!
- ఈ విధంగా గర్భములో ఉన్న నన్ను కరుణాసముద్రుడగు ఆత్మ భగవానుడు సంరక్షించుచున్నారు. ఆయన కరుణచేత, ఆయన సంకల్పానుసారం, ఆయనకు అభిన్నులగు దేవతల రక్షణ చేతనే ఈ భౌతిక దేహములు నిర్మితమవటం, పరిరక్షించబడటం... ఇదంతా జరుగుతోంది.

| | | |
|---|---|---|
| అగ్నిదేవుడు | వాక్ స్వరూపంగా | నోటియందు, |
| వాయుదేవుడు | ప్రాణ స్వరూపులై | నాశిక (ముక్కు) యందు, |
| సూర్య తేజస్సు | దర్శన శక్తియై | కనులయందు, |
| అశ్వనీ దేవతలు(ఓషధ–వనస్పతి దేవతలు) | స్పర్శ శక్తితో | చర్మమునందు, |
| దిక్ దేవతలు | శ్రోత్ర శక్తితో | చెవులయందు, |
| చంద్రుడు | మనోరూపుడై | హృదయములోను, |
| యమదేవత(మృత్యుదేవత) | అపానరూపులై | నాభి ప్రదేశమునందు, |
| వరుణ (జల) దేవులు | రేతస్సు రూపులై | శిశ్నమునందు, |

ప్రవేశించి తమ తమ అంశల–శక్తులతో నివసిస్తూ, ఈ దేహ నిర్మాణాన్ని నిర్వర్తిస్తూ రక్షిస్తూ పర్యవేక్షకులై ఉండటం చేతనే నా దేహము నిర్మితమై, క్రియా సామర్థ్యము పొందుచున్నట్లు నేను గమనించుచున్నాను. (ఇదియే సర్వ దేహముల విషయం కూడా!)

- ఆ దేవతలు పరమాత్మ సంకల్ప చమత్కారములే కనుక పరమాత్మకు అభిన్నులు.
- ఆ దేహములోని సర్వవిశేషాలు ఆ దేవతా ప్రజ్ఞల క్రియా విశేషాలు, ఆ దేవతల ప్రసాదితాలు. కనుక ఈ దేహము ఆ దేవతలకు అభిన్నము. పరమాత్మకు అభిన్నము. ఈ దేహము దేవతలకు చెందినది, దేవతలు పరమాత్మకు చెందినవారు అగుచున్నారు.
- తత్త్వజ్ఞానము కలుగనంతవరకు ఈ జీవుడు దేహ – దేహాం తరములు ప్రయాణిస్తూ అనేక అసంఖ్యాక జీవజాతుల గర్భములలో ప్రవేశ – నిష్క్రమణములు చేస్తున్నాడు. దేహముల రాకపోకలు పొందుచూనే ఉంటున్నాడు.
- 'తత్త్వజ్ఞానప్రాప్తి' రూపమగు "కారణ కారణ స్వరూపుడు–స్వస్వరూపుడు"... అయినట్టి పరమాత్మను ఎరిగినప్పుడు ఇక ఆపై గరుడ పక్షివలె గర్భముల పరంపరా వ్యసనమును ఛేదించుకొని, **జన్మరాహిత్యము** పొందుచూ **ఆత్మతో మమేకమై** ప్రకాశించుచున్నాడు.

ఎవ్వరైతే ఈ విధమైన దేహ నిర్మాణ విశేషాలతో కూడిన జన్మ–కర్మల రహస్యము, దైవీతత్త్వాలు, పరమాత్మ విన్యాసము ఎరుగుతారో

**స ఏవమ్ విద్వాన్ అస్మాత్ శరీర భేదాత్ ఊర్ధ్వమ్ ఉత్క్రమ్యా...**
**ఆముష్మిన్ స్వర్గలోకే సర్వాన్ కామాన్ అప్త్వా... అమృతః సమభవత్ ! సమభవత్ ! ఇతి 'ఓం'।**

అట్టివాడు ఈ జనన – మరణ (దేహ – దేహాంతర) మహాచక్రము నుండి విడివడినవాడై, బయల్పడి ఆముష్మిక లోకములు ప్రవేశిస్తాడు. సర్వకామములు సిద్ధింపజేసుకొన్నవాడై "ఏదో కావాలి" అను కామరూప పరిధులను దాటివేయుచున్నాడు.

దేహ నిర్మాణ – దేవతాశక్తి ప్రాప్తముల చమత్కృనిని ఎరిగిన యోగి ఆపై ఇక సర్వసమభావుడై, అమృతానంద స్వరూపుడై, స్వయమాత్మానంద విభవుడై ఓంకార స్వరూపుడై ప్రకాశించుచున్నాడు. **ఇది వామదేవ మహర్షి ప్రవచనమ్ ! ఓం నమో వామ దేవాయ।**

⌘

# తృతీయోధ్యాయః

**(యధాస్థానం గర్భిణ్యః – ఇప్పుడిక్కడనుండి గర్భిణి స్త్రీలు కూడా వచ్చి కూర్చుని వినవచ్చు)**

ఈ విధంగా – ఆ ఆత్మ భగవానుని సంకల్పము నుండి లీలా – క్రీడా – ఆనందరూప కల్పనగా బయల్వెడలిన దేవతలు, దేహములలో ప్రవేశించి, తమ ప్రజ్ఞలచే – దేహములోని చూపు – వినికిడి – స్పర్శ మొదలైన తత్త్వాంశలను పర్యవేక్షిస్తూ, సర్వమూ ఆత్మ భగవానునికి సమర్పణగా కార్యక్రమములన్నీ నిర్వర్తించటం....,

ఆత్మ భగవానునికి అభిన్నుడగు ఈ జీవుడు దేహ ప్రవేశ – నిష్క్రమణములు నిర్వర్తించటము..., **ఇదంతా జరుగుచున్నది.**

అట్టి ఆత్మను ఎరుగనంతవరకు జీవుడుగాను, ఆత్మను ఎరుగుటచే **స్వయమాత్మ స్వరూపుడుగా** ఉత్క్రమణ పొందటం. ... జరుగుచున్నది. ఇక ఇప్పుడు,

**కో అయమ్ ఆత్మేతి వయమ్ ఉపాస్మహే - కతరః ఆత్మా?**

మనము ఉపాసించుచున్న ఆ ఆత్మ భగవానుడు ఎట్టివాడు ? ఆత్మ అనగా ఏమి? ఎట్టిది? ఎక్కడిది? మనమంతా **దేనివలన – దేనిచేత...** దేహ–మనో–బుద్ధి–చిత్త–అహంకారాలతో ఏదైనా **చేయుచూ ఉన్నామో....** అదియే మనము ఉపాసించు "ఆత్మ"!

ఈ జీవుడు

- **యేన వా రూపం పశ్యతి –** దేనివలన కనులతో దృశ్యమును చూచుచున్నాడో...,
- **యేన వా శబ్దం శృణోతి –** దేనివలన చెవులతో శబ్దమును వినుచున్నాడో....,
- **యేన వా గంధానా జిఘ్రతి –** దేనివలన ముక్కుతో వాసనలను ఆఘ్రాణిస్తున్నాడో ....,
- **యేన వా వాచం వ్యాకరోతి –** దేనివలన నోటితో మాటలు మాట్లాడుచున్నాడో ....,
- **యేన వా స్వాదు చ అస్వాదు చ విజానాతి –** దేనివలన నాలుకతో రుచి ఆస్వాదిస్తున్నాడో ...., దేని వలన 'ఇది రుచిగా లేదు' అని ఎరుగుచున్నాడో,
- దేనివలన "ఇది ఇట్లు కదా !" అని బుద్ధితో తెలుసుకుంటున్నాడో, మనస్సుతో నవరసముల భావనలు చేస్తున్నాడో, **ఏది హృదయము, మనస్సు కూడా అయి ఉన్నదో అదియే ఆత్మ !** ఆత్మదేవుడు ప్రజ్ఞా స్వరూపుడై ఈ సర్వము నిర్వర్తిస్తున్నారు. కనుక **ప్రజ్ఞానం బ్రహ్మ !** ప్రజ్ఞానమే బ్రహ్మ ! ఈ సర్వము ప్రజ్ఞానస్వరూపమ్ ! పరబ్రహ్మమ్ !
- లోక లోకాంతరములు తనయందు కలిగి ఉన్న ఈ **హృదయము**.
- అనేక విషయములను ఒకటి తరువాత మరొకటిగా ఆలోచిస్తూ ఉన్న ఈ **మనస్సు.**
- తాను కదలక ప్రాణ – మనో – బుద్ధి ఇత్యాదులన్నీ కదల్చు **చైతన్యము,**
- అనేక జ్ఞాన విశేషములతో కూడిన సంజ్ఞారూప ***జగత్తు, అజ్ఞానము,***
- ఇవన్నీ సమన్వయించు ***విజ్ఞానము,*** కేవల రూపమగు ***ప్రజ్ఞానము,***
- తెలివితేటల రూపమగు **మేధస్సు,**
- ధ్యాసరూపమగు **దృష్టి,**

- అనేక అనుభవపరంపరలతో కూడిన **మతి,** మనోధైర్యరూపమైన **ధృతి, మనోదార్ఢ్యము,**
- **విచక్షణాజ్ఞానము,** నిర్ణయములను నిర్ణయించు **మనీషము (బుద్ధి),** **మనోవేదనా జ్ఞానము,**
- అసంఖ్యాక జ్ఞాపకములతో కూడిన **జ్ఞప్తి, స్మృతి, స్మృతులు, స్మరణము, శాస్త్ర జ్ఞానము,**
- భావనా పరంపరల రూపమైనట్టి **సంకల్పము, కల్పనను జోడించి చూచు వికల్పము,**
- కార్యక్రమముల ధ్యాసరూపమైన **క్రతువు,**
- స్వాధీన రూపమైన **అసుః, ఆశ్రయము,**
- 'ఏదో కావాలి' అనే రూపమైన **కామము,**
- కొన్ని నామ–రూప–ధ్యాసలకు, వశమైయుండు **'అవశము',**

**"ఇతి సర్వాణి ఏతాని ప్రజ్ఞానస్య నామధేయాని భవంతి ।"**

ఆయా మొదలైన ఇవన్నీ కూడా ప్రజ్ఞారూపములే ! (లేక) **ప్రజ్ఞాన బ్రహ్మమే – ఈ ఈ వివిధ నామధేయములతో చెప్పొందుచున్నది.**

అట్టి ప్రజ్ఞయే సృష్టికర్తయగు బ్రహ్మ దేవుడు ! ఆ ఆత్మ భగవానుడే ఇంద్రుడు. ఆయనయే ప్రజాపతి ! సర్వదేవతలు ఆ పరబ్రహ్మ మూర్తియే ! అతడే భూమి – జలము – అగ్ని – వాయువు – ఆకాశము కూడా ! పంచ భూతములు ఆ పరమాత్మ స్వరూపమే ! అల్పములగు జంతువులు, సర్వ వస్తు మిశ్రమములు, విత్తనములు, వృక్షములు, మిగతా సర్వస్థావర – జంగమములు, అండజములు, బీజజములు, జరాయుజములు (గర్భ, జనితములు), స్వేదజములు, ఉద్భుజములు ఆ పరమాత్మ స్వరూప విన్యాసములే !కథా రచయితయొక్క కథా కల్పనా చైతన్యమే కథలోని సర్వ విశేషములు కదా!

ఇక్కడి గుర్రము, ఆవు, మానవుడు, ఏనుగు మొదలైన జంగమములు, స్థావరములు, ప్రాణములున్నవి, ప్రాణములు లేనివి... ఇవన్నీ ఆ ప్రజ్ఞాన భగవానుని వివిధ నేత్రములే! నేను–నీవు–ఆతడు–ఈతడు–అది–ఇది ఆత్మయే అయి ఉన్న ప్రజ్ఞాన స్వరూపులమే! **ప్రజ్ఞానం బ్రహ్మ!**

**ప్రజ్ఞా నేత్రో లోకః** ఈ లోకములన్నీ ఆ ప్రజ్ఞాన భగవానుని నేత్రమే !

**ప్రజ్ఞా ప్రతిష్ఠ :** ఇవన్నీ ప్రజ్ఞ యందే ప్రతిష్ఠితమై ఉన్నాయి. ప్రజ్ఞాన బ్రహ్మమునందే అంతర్గతము!

**ప్రజ్ఞానం బ్రహ్మ :** ప్రజ్ఞానమే బ్రహ్మము !

స్వప్నంలో కనిపించే ఇల్లు – రాయి – మట్టి – గోడ – జంతువులు – పక్షులు – మానవులు – దేవతలు – అన్నీ స్వప్న ద్రష్టయొక్క స్వప్న చైతన్య రూపమే అగుటయే ఇందుకు దృష్టాంతము.

**ఈ కనబడేదంతా బ్రహ్మమునందే ప్రతిష్టితమైయున్నది – ఐతరేయమ్! దీనికంతటికీ వేరై, ఇదంతా అయి ఉన్నవాడు.**

- ప్రజ్ఞారూపుడైన పరమాత్మ ....,
- ప్రజ్ఞా విశేషమగు ఈ దృశ్య జగత్ కల్పన చేసుకొని....,
- ప్రజ్ఞా రూపుడై జీవుడుగా సంచారాలు చేస్తూ....,
- ఎప్పుడో ఈ జగత్తుల నుండి బయల్వెడలి....,
- స్వర్గము మొ॥న ఊర్ధ్వ లోకాలలో ఆయా మనోవాంఛలను అనుభవిస్తూ...,
- ఒకానొకప్పుడు బాహ్య ప్రజ్ఞ – అంతర్ ప్రజ్ఞ యందు లయమయి పోగా....,
- **కేవల ప్రజ్ఞా అమృతానంద** స్వరూపుడై విలసిల్లుచున్నాడు!

**ఆత్మ** నుండియే **ఆత్మ** బయల్వెడలి **ఆత్మ**యందు సంచరించి **ఆత్మ**యందే లయించుచున్నది

**ఇతి ఐతరేయో పనిషత్ సమాప్తః**

**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 4 కౌషీతకీబ్రాహ్మణోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ శ్రీమత్ కౌషీతకీ విద్యా వేద్య, "ప్రజ్ఞామాత్ర పరాక్షరమ్"।**
**ప్రతియోగి వినిర్ముక్త "బ్రహ్మమాత్రం" విచిన్తయే॥**

*కేవల ప్రజ్ఞాతత్త్వ స్వరూపము - పరము - అక్షరము - వాదోపవాదములకు ఆస్కారము లేని విధంగా సుస్పష్టము అగు ఏ బ్రహ్మము యొక్క మహదత్వము ఈ కౌషీతకీ విద్యచే తెలియవచ్చుచున్నదో, ఇద్దానిచే బోధింపబడుచున్నదో **అది జీవునకు బంధవిముక్తము ప్రసాదించుటకై విచిన్తన చేయబడునుగాక!***

### ప్రథమో అధ్యాయః

**1. ఓం**
**చిత్రో హ వై గార్గ్యాయణిః**
**యక్ష్యమాణ - ఆరుణిం వవ్రే,**
**సహపుత్రం శ్వేతకేతుం ప్రజిఘాయ।**
**'యాజయేతితం'**
**హసీనం పప్రచ్ఛ;**
**"గౌతమస్య పుత్రా। తే సంవృతం**
**లోకే యస్మిన్ ఆధ అస్య అస్యన్**
**మహోబుద్ధో ఊర్ధ్వలోకే**
**దాస్యసి?" ఇతి।**

<u>సహోవాచ:</u>

**'న అహమ్ ఏతత్ వేద,**
**హంత! ఆచార్యం ప్రచ్ఛాని।' - ఇతి।**
**సహ పితరమ్ ఆసాద్య**
**పప్రచ్ఛేత్ ఇతి**
**మాప్రాక్షీత్ కథం**
**బ్రూవాణి - ఇతి।**

### 1వ అధ్యాయము

పూర్వం 'చిత్ర' అనే పేరుగల గార్గ్యాయనీ (గోత్రజుడు) ఉండేవారు. ఆయన ఒక యజ్ఞము చేయసంకల్పించారు. అప్పుడు ఆయన 'అరుణి' అనే మహర్షిని సమీపించి తాను తలపెట్టిన యజ్ఞమును విధివిధానాలతో సహా నిర్వర్తింపజేయవలసినదిగా, ఋత్విక్‌గా (ఉండవలసినదిగా) అభ్యర్ధించారు. అప్పుడు ఆ అరుణి మహర్షి తన కుమారుడైనట్టి శ్వేతకౌతువును పిలచి,

"శ్రీ గార్గ్యాయణి కోరిన విధంగా ఈయనచే యజ్ఞమును దగ్గిర ఉండి ఋత్విక్‌వై చేయించు నాయనా!"...అని ఆజ్ఞాపించారు. అందుకు శ్వేతకౌతువు అంగీకరిస్తూ "పితృదేవా! తమ ఆజ్ఞ" - అని సంసిద్ధతను సూచించారు. అప్పుడు చిత్ర నామధేయుడగు గార్గ్యాయణి ముని ఒకచోట శ్వేత కౌతువును కలిసికొని ఓ శ్వేతకేతూ! నాచే యజ్ఞము చేయించటానికి మీరు అంగీకరించారు. చాలా సంతోషం! నాదొక చిన్న విన్నపము. వీరు యజ్ఞవిధి - యజ్ఞఫలంగా నన్ను ఊర్ధ్వ లోకములను చేర్చగలరా? లేదూ, అందుకు ఉత్తమమైన ఉపాయం చెప్పి త్రోవచూపించగలరా?' అని అభ్యర్ధించారు.

**శ్వేతకేతు :** అయ్యా! **"యజ్ఞకర్తను ఊర్ధ్వ లోకాలుజేర్చటం"** అనే ప్రక్రియ సంబంధమైన విషయం **నాకు తెలియదు!** నేను మీచే యజ్ఞము చేయించగలను! అంతవరకే! మీరు అడిగనది - మా నాన్నగారు ఆరుణి మహర్షిని అడిగి తెలుసుకుంటాను అన్నారు. అప్పుడు శ్వేతకేతు తండ్రి అరుణి మహర్షి వద్దకు వెళ్ళారు. 'ఊర్ధ్వలోకాలు యజ్ఞఫలంగా పొందేది ఎట్లా?' అని అడిగారు.

సహెూ వాచ

'అహమ్ అపి ఏతత్ న వేద।
సదస్యేవ వయం స్వాధ్యాయమ్
అధీత్య హరామహే యన్నః
పరే దదత్య ఏహి ఉభౌ గమయిష్యావ'! ఇతి।'
సహ సమిత్పాణిః చిత్రం గార్గ్యాయణిం
ప్రతిచక్రామోపాయని ఇతి।

తం హెూ వాచ

'బ్రహ్మోర్హో (బ్రహ్మజ్ఞో) అసి । గౌతమ!
యో మామ్ ఉపాగా దేహి,
త్వా జ్ఞపయిష్యామి!' ఇతి॥

అప్పుడు ఆ ఆరుణి మహర్షి 'నాయనా! ఆ విషయం నాకు కూడా తెలియదు. అయితే మరి, తెలుసుకుందాములే! ఈ చిత్ర - గార్గ్యాయణి యజ్ఞం చేసేచోట అక్కడి సదస్సులో వేదాధ్యయనం చేసి, స్వాధ్యాయనం చేసి, అప్పుడు అక్కడ వీరిదగ్గరే తెలుసుకుందాము'' అని పలికారు.

ఒకరోజు, ఆరుణరుషి, ఆయన కుమారుడు శ్వేతకౌతువుతో కూడా, సమిత్పాణులై (శిష్య భావంతో దర్భలు చేబూని) చిత్ర గార్గ్యాయనిని సమీపించారు. **"హే మహాత్మా! చిత్రగార్గ్యాయనీ! మునీంద్రా! మా ఇద్దరినీ మీరు** (బ్రహ్మతత్త్వ బోధకై) శిష్యులుగా అంగీకరించండి. మేము మీ ఆశ్రమంలో వేద-వేదాంత అధ్యయనం చేస్తూనే, మీ యజ్ఞమును జరిపిస్తూ ఉంటాము''...అని పలికారు. అప్పుడు చిత్ర గార్గ్యాయని గౌతమనామధేయుడగు అరుణితో.....,

**"ఓ గౌతమా! మీరు బ్రహ్మజ్ఞానియే!**

ఎందుకంటే తెలియనిది తెలియనట్లు ఒప్పుకున్నారు కదా! సరే! నాతో రండి. మీకు తెలియునట్లు నాకు తెలిసింది. తెలియజేస్తాను'' - అని పలికారు

---

**2.** సహెూ వాచ

యేవా ఏకేచ అస్మాన్ లోకాత్
ప్రయంతి చంద్రమసమ్ ఏవ తే సర్వే గచ్ఛంతి।
తేషాం ప్రాణైః 'పూర్వపక్ష' ఆప్యాయతే,
అథా 'పరపక్షే' న ప్రజనయతి,
ఏతత్ వై స్వర్గస్య లోకస్య ద్వారమ్।
యత్ చంద్రమాస్తం యత్ ప్రత్యాహ,
తమ్ అతిసృజతే
య ఏనం ప్రత్యాహ, తమ్
ఇహ వృష్టిర్భూత్వా వర్షతి।
త ఇహ కీటో వా, పతంగో వా
శకునిర్వా, శార్దూలో వా, సింహెూ వా,
మత్స్యో వా, పరశ్వా వా, పురుషో వా
అన్యోవై తేషు స్థానేషు ప్రత్యా జాయతే,
యథా కర్మ యథా విద్యం! తమ్ ఆగతం పృచ్ఛతి,
'కో అసీ'? ఇతి, తం ప్రతిబ్రూయాత్।
విచక్షణా దృతవో రేతః
ఆభృతం పంచదశాత్ ప్రసూతాత్
పిత్రాపతత్ స్తనమా పుంసి।
కర్తర్యేర యధ్వం పుంసా కర్త్రా మాతరి మాసి
షిక్తః సజాయమాన - ఉపజాయామానో,
ద్వాదశ - త్రయోదశ ఉపమాసో
ద్వాదశ - త్రయోదశేన పిత్రా సంత ద్విదేఽహమ్।
తవ ఋతవో! మర్త్యవ ఆరభధ్వం తేన సత్యేన
తపసర్తు రస్మార్తవో అస్మి ఏకోఽసి,
త్వమ్ అసీతి, తమ్ అతిసృజతే॥

చిత్రగార్గ్యాయని

అయ్యా! గౌతమ గోత్రోద్భవులగు ఆరుణి శ్వేతకేతులారా! వినండి.

ఎవ్వరైతే ఈ దేహమును త్యజిస్తారో, అట్టివారు (మరణించినవారు) చంద్రలోకమునకు వెళ్ళుచున్నారు. ఇక అక్కడినుండి మరల బయల్వెడలుచున్నారు. ఆ చంద్రలోకము స్వర్గలోకమునకు ద్వారమైయున్నది.

పూర్వపక్షము (శుక్లపక్షము)న చంద్రలోకమును చేరి, స్వర్గలోకమును చేరినవారు స్వర్గలోక ద్వారములతో ప్రయాణించి స్వర్గలోకమే చేరుచున్నారు.

ఎవ్వరైతే పరపక్షము (కృష్ణపక్షము)లో చంద్రలోకము చేరుకొంటున్నారో...వారు తిరిగి భూలోకమునకు తిరిగిరావలసి వస్తోంది. మరల భూతసృష్టిలో ప్రవేశించుచున్నారు. అట్టి వారు వర్షము ద్వారా భూలోకమునకు వస్తున్నారు. వారువారు నిర్వర్తించిన కర్మల -తెలియవచ్చిన జ్ఞానము యొక్క ప్రభావమును అనుసరించి భూమిపై కీటకముగానో, దోమగానో, తుమ్మెదగానో, పక్షిగానో, పులిగానో, సింహముగానో, జలములో చేపగానో, క్రూరమృగముగానో ఆయా గర్భస్థానములలో ప్రవేశించుచున్నారు.

వారు భూలోకమునకు వచ్చినప్పుడు **'మేమెక్కడ ఉండాలి?'** అని అడుగుతుండగా, అప్పుడు కర్మదేవతలు ఆ జీవుని 'మీరెవరు?' అని ప్రశ్నిస్తున్నారు. దానికి ఆ జీవుడి సమాధానం వినండి.

ఓ కర్మదేవతలారా! నేను చంద్రలోకం నుండి తిరిగి వస్తున్నాను. కృష్ణపక్షములో చంద్రలోకమును ప్రవేశించిన కారణంగా తిరిగి భూలోకము చేరుచున్నాము. ఇక్కడ ఉత్తమమైన పురుషరేతస్సులో ప్రవేశించాలనునది నా కోరిక. 15 నెలల కాలం ఉత్తమ జన్మ రేతస్సులో ఉంచిన తరువాత, నన్ను మానవ పితృగర్భరేతస్సులోను, (మానవ) మాతృగర్భములోను 12-13 నెలలు ఉంచి మరల మాకు మానవజన్మను ప్రసాదించవేడుకుంటున్నాను. ఓ ఋతుదేవతలారా! సత్య - తపస్సుల ప్రభావం చేత నేను మీ స్వరూపమే (ఋతుదేవతగానే) అగుచున్నాను. నేను ఎవరు? మీరెవ్వరు? మీరు - నేను ఒక్కటే! మనము ఇక కలిసియే ముందుకు సాగుదాము గాక! సృష్టిలో మరల ప్రవేశించెదము గాక!....

ఈ విధంగా భూమిపైకి వచ్చిన ఆ జీవుడు కర్మ - ప్రజ్ఞానుసారము ఋతు దేవతల సహకారముతో కర్మఫలములను అనుసరించి తిరిగి భూమిపై దేహధారిగా అగుచున్నాడు.

3. తమ్ ఏతం దేవయానమ్ పంథానమ్
అసాద్య, 'అగ్నిలోకమ్' – ఆగచ్ఛతి।
స వాయు లోకమ్। స వరుణ లోకమ్।
స ఆదిత్య లోకమ్। స ఇంద్ర లోకమ్।
స ప్రజాపతి లోకమ్। స బ్రహ్మలోకమ్।
తస్య హ వా ఏతస్య బ్రహ్మలోకస్య
'ఆరో' హ్రదో ముహుర్తాయేష్టి హా।
విరజానదీ..., ఈల్యో వృక్షః,
సాయుజ్యమ్ సంస్థానమ్
అపరాజితమ్ ఆయతనమ్।
ఇంద్ర–ప్రజాపతీ ద్వార గోపౌ
'విభుం' ప్రమితం 'విచక్షణా' సంధ్య
అమితౌ జాః పర్యంకః ప్రియాచ।
మానసీ ప్రతిరూపాచ్చ చాక్షుషీ పుష్పాణి ఆదాయా
వయతౌ వైచ జగత్యంబాశ్చ ।
అంబా అవయవాశ్చ, అప్సరసో అంబయా,
నద్యస్తమ్ ఇత్థం విదా గచ్ఛంతి।
తం బ్రహ్మోహాభి ధావత మమ యశసా విరజాం
వాయం పాలయన్ నదీ ప్రాపంన వా అయం
జిగీష్యతి। ।ఇతి।

***ఇక చంద్రలోకమునుండి ఊర్ధ్వలోకములగు స్వర్గ బ్రహ్మ లోకములవైపుగా శుక్లపక్ష మార్గములో ప్రయాణించు జీవుని గురించి (ఆత్మజ్ఞానము ఎరిగిన జీవుల ముందు ప్రయాణం):***

ఆతడు ముందుగా అగ్నిలోకము చేరుచున్నాడు. ఆ తరువాత వాయులోకము, వరుణలోకము, ఆదిత్య లోకము, ఇంద్రలోకము, ప్రజాపతిలోకము, బ్రహ్మలోకము క్రమంగా జేరుచున్నాడు.

అక్కడ బ్రహ్మలోకములో **'ఆరము'** అనే సరస్సు ఉన్నది. అక్కడ యేష్టివా (కొన్ని బ్రహ్మముహూర్తములు) గడుపుచున్నాడు. ఇంకా అక్కడ విరజానది (విః + అజా -- జన్మరాహిత్యమును, శుభ్రము - సుసంగతము చేయునది) ఉన్నది. 'ఈల్య' అనే కల్పవృక్షమున్నది. తరువాత సాయుజ్యము (Salvation) అనే పట్టణము ఉన్నది. **అపరాజితము (అజేయము)** అనే ప్రాకార సమన్వితమైన భవనమున్నది. ఆ భవనములో ద్వారపాలకులుగా, ఇంద్రుడు, ప్రజాపతి మొ॥ లోకపాలకులు ఉంటారు. ఆ భవనంలో ఇంకా **విభు (సర్వమునకు అధికారి)** అనే ప్రమితము (సభామంపడము) ఉన్నది. ఆ సభా ప్రాంగణంలో విచక్షణ (common sense) అనే మహాతేజోవంతమైన సింహాసనము, **'అమితతేజము'** అనే ప్రియభూమినీ పర్యంకము కలిగి ఉండటము జరుగుచున్నది. అక్కడ **'మనసీ' 'చాక్షుషీ'** అనే ఇద్దరు దేవకాంతలు చేతిలో పుష్పములు ధరించి అక్కడ నుండి దారి చూపుచూ ఉంటారు. జగదంబ - (ప్రకృతి రూప) అంబ సౌష్ఠవము, సౌందర్యము వర్ణిస్తూ ఉంటారు. అప్సరసలు, మాతృదేవతలు, నదీమతలుల్లు తత్త్వగానము చేస్తూ ఉంటారు...వారు ఆతనితో "బ్రహ్మదేవుడి దర్శనం మీకు అవుతుంది. ఈలోగా **"బ్రహ్మలోక యశస్సు ఆస్వాదించండి. మానసికంగా మరల విరజానదీ స్నానము చేయండి. మీకు శోకము - వార్ధక్యము ఉండకుండుగాక!"** అని ఆశీర్వదిస్తారు.

4. తం పంచశతాని అప్సరసాం
ప్రతి ధావంతి।
శతం మాలా హస్తాః
శతమాంజన హస్తాః
శతమ్ చూర్ణ హస్తాః
శతమ్ వాసో హస్తాః,
శతమ్ ఫణా హస్తా స్తం,
బ్రహ్మాలంకారేణ అలంకుర్వన్తి।
స బ్రహ్మాలంకారేణ
అలంకృతో బ్రహ్మవిద్వాన్
బ్రహ్మైవ అభిప్రైతి!
స ఆగచ్ఛతి, 'ఆరం' హ్రదం తన్
మనసా ఆత్యేతి।
అమృత్వా సంప్రతి విదో మజ్జంతి।
ఆగచ్ఛతి ముహూర్త
అన్యేష్టి హాః తస్మాత్, అపద్రవంతి।
స ఆగచ్ఛతి విరజాం నదీం

**బ్రహ్మతత్త్వజ్ఞుల బ్రహ్మలోకానుభవములు**

అక్కడ (బ్రహ్మలోకంలో) '500' మంది అప్సరసలు ఆయనను (బ్రహ్మతత్త్వ జ్ఞానిని) సేవించటానికి సంసిద్ధులై ఉంటారు. ఆ **బ్రహ్మజ్ఞాన సమన్వితుని** సన్మానిస్తూ ఉంటారు. అందులో మొదటి 100 మంది పుష్పమాలాహస్తులై ఉంటారు. మరొక 100 మంది సుగంధ ద్రవ్యములను చేతులతో ధరించి ఉంటారు. ఇంకొక 100 మంది ఆయా సుందర ద్రవ్యములు చేతిలో ధరించి ఉంటారు.

అనేక పుష్పమాలికలతో వారంతా ఆ జీవుని బ్రహ్మదేవునితోపాటే అనేక అలంకారాలు అలంకరింప జేస్తారు. అందముగా తయారుజేస్తారు. పూర్వ - అపరిశుభ్రతలు తొలగిస్తారు.

ఆ విధంగా బ్రహ్మవలె పంచశత అప్సరసలు అలంకరించుచున్నారు. ఆ బ్రహ్మ విద్వాంసునికి బ్రహ్మదేవుని సన్నిధానమునకు దారిచూపుచున్నారు. ఆతడు మార్గములో మనస్సుతో 'ఆరం' అనే సరస్సులో మానసిక స్నానం చేస్తున్నాడు. ఆ సుందర సరస్సులో స్నానం చేసి ఆనందము, ఆహ్లాదము పొందుచున్నాడు. 'ఋతమ్' అను ఋక్కులసారమగు పరమసత్య వస్తు భావము పొందుచున్నాడు. అక్కడ 'యేష్టిహా' అని పిలవబడు కొన్ని బ్రహ్మముహూర్తములు గడుపుచున్నాడు. ఉత్సాహము పొందుచున్నాడు. అక్కడి నుండి విరజానది జేరి అక్కడ మనోస్నానం చేసి సుకృత-దుష్కృతములు తాను భౌతిక దేహముతో నివశించి వచ్చిన లోకములకు సమర్పిస్తూ, త్యజిస్తున్నాడు. సుకృత ఫలములను తనకు ప్రియులైన

**తాం మనసైవ ఆత్యేతి తత్ సుకృత – దుష్కృతే**
**ధూనుతే। తస్య ప్రియా జ్ఞాతయః సుకృతం**
**ఉపయంత్య ప్రియా, దుష్కృతం తత్ యథా రథేన।**
**ధావయన్ రథచక్రే పర్యవేక్షత**
**ఏవమ్ అహో–రాత్రే పర్యవేక్షత।**
**ఏవం సుకృత – దుష్కృతే సర్వాణి చ ద్వంద్వాని।**
**స ఏష విసుకృతో – విదుష్కృతో**
**బ్రహ్మవిద్వాన్ బ్రహ్మైవ అభిప్రైతి॥**

జ్ఞాతులకు (పుత్రుడు మొదలైన వారికి), శిష్యులకు ఇచ్చి వేస్తున్నాడు. దుష్కృత-ఫలములను లోక కంటకులగు అప్రియులకు అందజేస్తూ వదలి వేస్తున్నాడు.

ఈ విధంగా నడుస్తూ నడుస్తూ ఉన్న ఒక రథము యొక్క రెండు చక్రములు ఊడి పోయి, ఆ రథము నిస్తేజమై నేలపై కూలిపోవు విధముగా - పుణ్యాపాపములు, సుఖదుఃఖములు, స్వర్గ-నరకములు, చీకటి వెలుగులు - మొదలైన ఆయా ద్వంద్వములన్నీ అతని పట్ల వీగిపోతున్నాయి. ఆతనిని విడిచి వెళ్ళిపోతున్నాయి. సర్వ ద్వంద్వములను విడచివేసినవాడై, ఆ బ్రహ్మ విద్వాంసుడు 'బ్రహ్మము'ను చేరుచున్నాడు. బ్రహ్మమే అయి ప్రకాశించుచున్నాడు. (బ్రహ్మ లోకం చేరుచున్నాడు).

---

**5. స ఆగచ్ఛత 'ఈల్యం' వృక్షం,**
**తం బ్రహ్మగంధః ప్రవిశతి।**
**స ఆగచ్ఛతి సాయుజ్యం।**
**సంస్థానం తం బ్రహ్మ స ప్రవిశతి।**
**స ఆగచ్ఛతి అపరాజితమ్ ఆయతనమ్**
**తమ్ బ్రహ్మతేజః ప్రవిశతి।**
**స ఆగచ్ఛతి ఇంద్ర, ప్రజాపతి**
**ద్వారగోపౌ తావస్మాత్ అప ద్రవతః।**
**స ఆగచ్ఛతి విభు ప్రమితం।**
**తం బ్రహ్మయశః ప్రవిశతి।**
**స ఆగచ్ఛతి విచక్షణామ్**
**ఆసందీం సా ప్రజ్ఞా ప్రజ్ఞయా**
**హి విపశ్యతి।**
**స ఆగచ్ఛతి అమితౌజసం పర్యంకం।**
**తం స ప్రాణః।**
**తస్య భూతంచ – భవిష్యచ్చ పూర్వౌ పాదౌ శ్రీశ్చ**
**ఏరాచ అపరౌ, బృహద్రథ అంతరే।**
**అనూచ్యే భద్ర యజ్ఞా**
**యజ్ఞీ యే శీర్షణ్యమ్**
**ఋచశ్చ, సామానిచ**
**ప్రాచీనా గానం యజూంషి।**
**తిరశ్చీనాని సోమాంశవ**
**ఉపస్తరణమ్ ఉద్గీథ**
**ఉపశ్రీ శ్రీః ఉప బర్హణం।**
**తస్మిన్ బ్రహ్మాః । తే ఇతమిత్థం**
**విత్సాదేన ఏవ అగ్ర ఆరోహతి**
**తం బ్రహ్మ ఆహ,**
**"కోஉసీతి?" తం ప్రతి బ్రూయాత్।**

బ్రహ్మ సింహాసనము సమీపించే ముందు ఆతడు **'ఈల్య'** అనే (బ్రహ్మలోకములోని) జ్ఞాన-వృక్షము క్రిందికి చేరుచున్నాడు. అప్పుడు ఆ ఈల్యవృక్షము నుండి 'బ్రహ్మము' అనే సుగంధము ఆతనిలో ప్రవేశించుచున్నది.

తరువాత ఆతడు **'సాయుజ్యము'** అనే పట్టణము చేరుచున్నాడు. అక్కడ కూడా బ్రహ్మానంద ఉత్సాహము (ఆ పట్టణము నుండి) ఆతనియందు చేరుచున్నది.

అక్కడి నుండి 'అపరాజి' అనే భవనమును చేరుచున్నాడు. ఆ అపరాజి భవనము నుండి బ్రహ్మతేజస్సు ఆతనియందు ప్రవేశము పొందుచున్నది.

అప్పుడు ఆతడు ఇంద్రుడు, ప్రజాపతి అనువారు ఇరువురు ద్వారపాలకులుగా ఉంటున్నట్టి బ్రహ్మసౌధమును చేరుచున్నారు. వారు బ్రహ్మదేవుని సమీపించ మార్గమును బ్రహ్మక్రాంతి ద్వారా చూపుచున్నారు. అప్పుడు ఆతడు 'విభుః' అనే రాజ్యసభావేదిక జేరుచున్నాడు. ఆతనిలో మరికొంత బ్రహ్మతేజస్సు (యశస్సు) ఆతనిని అనుగమించుచూ ఆతనిలో ప్రకాశిస్తోంది.

ఆ తరువాత ఆతడు 'విచక్షణ' అనే బ్రహ్మసింహాసనమును సమీపించుచున్నాడు. ఆతడప్పుడు ప్రజ్ఞచే సృష్టికర్త - ప్రజాస్వరూపుడు అగు పరబ్రహ్మమూర్తిని దర్శించుచున్నాడు. ఆ బ్రహ్మభగవానుని సింహాసనముయొక్క పర్యంకమును సమీపించుచున్నాడు.

అక్కడ **'అమితౌజసము'** అనే వాహనము కనిపించగలదు. ఆ అమితౌజసమే ప్రాణవాయువు! ప్రాణశక్తి! భూత-భవిష్యత్ కాలములు ఆ అమితౌజసముయొక్క రెండు ముందు కాళ్ళు! సంపద - ప్రతిష్ఠ అద్దానికి వెనుకకాళ్ళు. భద్రయజ్ఞము - యాజ్ఞీయము అద్దాని రెండు శిరస్సులు. (యజ్ఞవిధులు - యజ్ఞభావన...ఆ శిరస్సులు). **బృహత్-రథంతర సామగానములు (బాహ్యజగత్‌గానము - అంతరంగ జగత్‌గానము)** అద్దాని సామవేదగానములు. అవి ఆ పర్యంకము యొక్క రెండు యజ్ఞోవేదయజుస్సులు. అనగా, ఆ బ్రహ్మపర్యంకము యొక్క అడ్డముగా ఉండు చెక్కలు. సోమలతలు దానిపై తివాసీ. 'ఓంకార' నాదస్వరూప ఉద్గీథము దానిపై ఉపశయనము (దిండు)

ఆ పర్యంకముపై ఇతమిద్ధము (ఈ జగత్తు యొక్క వాస్తవ - సహజ రూపము నిర్వచించు బ్రహ్మవాఙ్మయము) ప్రకాశమానమగుచుండగా, **ఎత్తైన ఆసనంపై శ్రీ బ్రహ్మదేవుడు ఆసీనులై ఉంటారు.**

బ్రహ్మమే తానై సర్వము ఆస్వాదించే పరమానంద పరబ్రహ్మస్వరూపులను ఆ బ్రహ్మదేవ భగవానుడు ఇట్లా ప్రశ్నిస్తున్నారు. **'ఏవరు నాయనా నీవు?'** ఈ ప్రశ్నకు ఆ జీవుడు తన వాస్తవ స్వరూపమేమిటో, ఏమని తలచుచున్నాడో అట్టి బ్రహ్మమునకు సంబంధించిన సమాధానం ఇట్లా సోదాహరణం!

**6. ఋతుః అస్మ్యార్తవో।**
**అస్య ఆకాశాత్ యోనేః**
**సంభూతో హవై।**
**తత్ సంవత్సరస్య తేజోభూతస్య।**
**భూతస్య ఆత్మ భూతస్య,**
**త్వమ్ ఆత్మ – అసి।**
**"యః త్వమ్ అసి – సో అహమస్మి" ఇతి॥**
**తమ్ ఆహః కోఽ హమస్మి? ఇతి॥**
**సత్యమితి బ్రూయాత్।**
**కింతత్ సత్యమ్? ఇతి॥**
**యత్ అన్యత్ దేవేభ్యశ్చ, ప్రాణేభ్యశ్చ**
**తత్ పదథ, యత్**
**దేవాశ్చ, ప్రాణాశ్చ!**
**తత్ యమ్ తదేతయా**
**వాచాభి వ్యాహ్రియతే**
**'సత్యమితి' ఏతావత్ ఇదం।**
**సర్వమిదమ్॥**
**సర్వమ్ అసీతి ఏవైనం**
**తత్ ఆహ, తమ్ ఆహ।**
**కేన పౌంస్నాని నామాని ఆప్నోతి? ఇతి॥**
**ప్రాణేన ఏతి బ్రూయాత్!**
**కేన స్త్రీ నామాని ఇతి? వాచ–ఇతి।**
**కేన నపుంసక నామాని? ఇతి।**
**మనసా ఇతి॥ కేన గంధాని ఇతి?**
**ఘ్రాణేన – ఇతి।**
**బ్రూయాత్ కేన**
**రూపాణి? ఇతి। చక్షుషా – ఇతి।**
**కేన శబ్దాని–ఇతి? శ్రోత్రేణ–ఇతి।**
**కేన అన్న రసానీతి? జిహ్వయా–ఇతి।**
**కేన కర్మాణీతి? హస్తాభ్యామ్ – ఇతి।**
**కేస సుఖ–దుఃఖే – ఇతి? శరీరేణ – ఇతి।**
**కేన ఆనందం రతిం,**
**ప్రజాతిమ్? ఇతి।**

**బ్రహ్మ భగవానుడు :** బిడ్డా! ఇక్కడ బ్రహ్మలోకములో ప్రవేశించావు. నా దర్శనానికి వచ్చావు. అట్టి నీవు ఎవరు? చెప్పు చూద్దాం!

**బ్రహ్మజ్ఞానియగు బ్రహ్మలోక ప్రవేసి:** స్వామీ! కాలమునకు ముందే ఉండి ఉండి, లీలావినోదినై కాలమునందు ప్రవేశించినట్టివాడను. నేను కల్పించుకొన్న సంబంధముచే కాలస్వరూపుడను అయ్యాను. ఋతు స్వరూపుడనై ఋతు ధర్మములు ఆశ్రయించాను. ఆకాశమునుండి యోని (స్త్రీగర్భము)నందు సంభూతుడనై, దేహినగు నేను దేహధారిని అయ్యాను. అనేక లోకములలో సంచరించి, బ్రహ్మతత్త్వానుభవ సిద్ధి కొరకై ఇప్పుడు మీ దర్శనమునకు వచ్చాను.

అనంతకోటి జీవాత్మలలో నేనూ ఒకడిని. అయితే జీవాత్మలగు మేమంతా అఖండాత్మ స్వరూపులమే కదా! కనుక నేను అఖండ - అప్రమేయ ఆత్మస్వరూపుడను.

హే బ్రహ్మ భగవాన్! మీరూ ఆత్మస్వరూపులే! **ఆత్మసాగర స్వరూపులగు మీయందు నేను ఒక తరంగమును.**

అందుచేత ఏది మీరై ఉన్నారో ...అదియే నేనై ఉన్నాను 'స్వామీ!'

**బ్రహ్మదేవుడు :** ఓహో నేనే నీవా? నేను ఏది అయి ఉన్నానో, అదియే నీవై ఉన్నావా? సంతోషము. **మరి నేనెవరు?**

**బ్రహ్మలోకప్రవేశి :** మహాత్మా! మీరు సత్యలోక పాలకులు కదా! అందుచేత, **నిత్య సత్యస్వరూపులై** ఉన్నారు. సత్ - సత్య స్వరూపులు!

**బ్రహ్మభగవానుడు :** అట్లాగా? ఏమిటా సత్యము?

**బ్రహ్మలోకప్రవేశి :** ఇంద్రియ దేవతలకు, ప్రాణశక్తికి కూడా ఆవల, చైతన్య స్వరూపులు తేజోనివాసులై ప్రకాశిస్తూ ఉన్నారు. ఏ చైతన్యము - **దేవతలు, ప్రాణశక్తి** కూడా అయి ఉన్నదో, అట్టి చిత్ - **ఆత్మానంద స్వరూపులు** మీరు! ఏది సత్ + యమ్...**సత్యమో** అదియే మీరు. **సత్ స్వరూపులు.** సత్యలోక యజమాని! ఈ సమస్త జగత్తు మీ రూపము - మీరే అయి ఉన్నారు. ఇదంతా మీ సత్యస్వరూపమే! ఇదంతా మీరే! దీనంతటికీ వేరై ఉన్నదీ మీరే!

బ్రహ్మ భగవానుడు : సర్వమునకు ఆవలగా ఉండి, ఇదంతా నా పురుషకార (something framed by my workmanship)గా నన్ను పురుషకారస్వరూపునిగా ఎట్లా తెలుసుకోగలిగావు? ఎట్లా పరబ్రహ్మస్వరూపుడగునన్ను చేరావు?

**బ్రహ్మలోకప్రవేశి :** ప్రాణోపాసనచే ప్రాణవాయుతత్త్వము ద్వారా ప్రాణి స్వరూపిడుగా ఉపాసించి, మిమ్ము చివరికి పరమ - **పురుష రూపునిగా** తెలుసుకున్నాను.

**బ్రహ్మభగవానుడు :** మరి స్త్రీ రూపమును ఎట్లా తెలుసుకొన్నావు?

**బ్రహ్మలోక ప్రవేసి :** వేదోపనిషత్ వాక్యార్థముల ద్వారా **"స్త్రీ - ప్రవృత్తిరూపము. ప్రకృతి స్వరూపము. పురుషుడు - పరబ్రహ్మస్వరూపులగు మీరే!" అని గురువాక్య మహిమచే** తెలుసుకున్నాను.

**శ్రీ బ్రహ్మ భగవానుడు :** మరి నపుంసకరూపములు ఏమని తెలుసుకొంటున్నావు?

**బ్రహ్మలోక ప్రవేశి :** మనస్సు (ఆలోచన Common sense) - ద్వారా నపుసంక రూపములు కూడా మీరేనని గ్రహిస్తున్నాను.

| బ్రహ్మ భగవానుని ప్రశ్న | **బ్రహ్మలోకప్రవేశియొక్క సమాధానం** |
|---|---|
| గంధము ఎట్లా ఎరుగుచున్నావు? | ఘ్రాణము (ముక్కు) తో! |
| రూపములో? | కళ్ళతో! |
| శబ్దములో? | చెవులతో! |
| అన్నరసమును? | జిహ్వ (నాలుక)తో |
| కర్మలు ఎట్లా నిర్వర్తించావు? | చేతులతో! |

**ఉపస్థేన – ఇతి।**
**కేన ఏత్యా ఇతి? పాదాభ్యామ్ – ఇతి।**
**కేన ధియో విజ్ఞాతవ్యం? కామాన్ – ఇతి?**
**ప్రజ్ఞ – యేతి!**
**ప్రబ్రూయాత్ తమ్ ఆపో**
**హైవ ఖలు మే హి**
**అసావయంతే**
**లోక ఇతి। సాయా**
**బ్రహ్మణి**
**చితిర్యా వ్యష్టిస్తాం।**
**చితిం జయతి తాం,**
**వ్యష్టిం వ్యశ్నుతే**
**య ఏవం వేద! య ఏవం వేద!**

**సుఖదుఃఖాలు ఎవరికి చెందినవి? దేనిచే ఏర్పడు చున్నాయి?**
*అవన్నీ శరీర సంబంధమైనవి. శరీర తాదాత్మ్యము వలన కలుగుచూ వస్తున్నాయి.*
**ఆనందరతి ఎవరికి సంబంధించినది? ఏ విధంగా తెలుసుకుంటున్నావు?**
*అది ప్రజాపతి చేత ఉపస్థేంద్రియ సంబంధమై కలుగుచున్నాయి.*
**నడవటం ఎట్లా దేనిచేత తెలుసుకుంటున్నావు?**
*పాదములలో గల బ్రహ్మశక్తిచే పాదములు శక్తిపొంది కదలుచూ ఉన్నాయి.*
**కామములు, సంకల్పములు, భావములు దేనిచేత తెలుసుకొన్నావు?**
*బుద్ధి ప్రజ్ఞచేత! ప్రజ్ఞచేతనే అన్నీ తెలియబడుచున్నాయి.*
**ఈ కనబడే ఈ దృశ్య జగత్తంతా ఏమి అయి ఉన్నదని తెలుసుకొంటున్నావు?**
*ఇదంతా కూడా నాయొక్క రసమయ విన్యాసమే! (ఆపో) రసస్వరూపము! ఇదంతా నాదే. ఇది మీది కూడా! ఈ లోకాలన్నీ మీ నా స్వస్వరూపమగు బ్రహ్మమే! నేనుగా ఉన్నది మీరే కాబట్టి మీది-నాది, మీరు-నేను ఏకమే! అఖండమే!*
***ఇదంతా ఎవ్వరైతే చిదానంద రూపంగా, కేవలచిత్ రసాత్మకంగా బ్రహ్మమే అని తెలుసుకొనుచున్నారో వారు అఖండమగు బ్రహ్మమే అగుచున్నారు కదా!***
ఇదంతా బ్రహ్మమే అని నేను ఆర్యవాక్యానుసారంగా ఎరుగుచున్నాను. ఫలితంగా బ్రహ్మమే నేను!

## ద్వితీయోధ్యాయః

1 **"ప్రాణో బ్రహ్మ" ఇతి హస్మాహ కౌషీతకీః।**
**తస్య హవా ఏతస్య ప్రాణస్య బ్రహ్మణో**
**మనోభూత్వా వాక్ పరివేష్టు**
**చక్షుః శ్రోతం సంశ్రావయిత్ర**
**తస్మై వా ఏతస్మై**
**'ప్రాణాయ బ్రహ్మణ'।**
**ఏతాః సర్వా దేవతా**
**అయాచమానాయ।**
**బలిం హరంతి, తథో ఏవ అస్మై**
**సర్వాణి భూతాని యయా ఆచమానాయైవ**
**బలిం హరంతి య యేవం వేద!**
**తస్య ఉపనిషత్ నయా చేత్ ఇతి**
**తత్ యథా గ్రామం భిక్షిత్వా!**
**లబ్ధ్వా ఉపవిశేత్ న హమతో**
**దత్తమ్ అశ్నీయామ్ – ఇతి**
**య ఏవ ఏనం పురస్తాత్**
**ప్రత్యాచక్షీరం స్త ఏవైనమ్**
**ఉపమంత్ర యంతే।**
**దదామత ఇత్యేష ధర్మో యాచితో భవతి**
**అనంతరస్తు తేవ ఏనమ్**
**ఉపమంత్రయంతే దదామత ఇతి॥**

## 2వ అధ్యాయము

**చిత్రగార్గ్యాయణి:** ప్రాణమే (ప్రాణశక్తియే) బ్రహ్మము అని ఈ మన కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్ ఎలుగెత్తి పలుకుచున్నది! అట్టి ప్రాణ (శక్తి) రూపబ్రహ్మమే సంకల్పములను ఆశ్రయించినప్పుడు **మనోరూపమును** దాల్చుచున్నది. ఆ మనస్సు **పలుకులు** పలుకుచున్నప్పుడు **వాక్ ఇంద్రియముగాను**, చూచుచున్నప్పుడు **చక్షుః ఇంద్రియముగాను**, వినుచున్నప్పుడు **శ్రవణేంద్రియముగాను** అగుచున్నది. ఈ విధంగా **'సర్వేంద్రియ ప్రదర్శనా సంపద స్వరూపియగు ప్రాణమే బ్రహ్మము'** అని ప్రాణతత్త్వమును బ్రహ్మముగా - గమనించుచున్నవారికి ఆయా దేవతలు కూడా వారి వారి సంపదలు అయాచితంగానే ఆతనికి ప్రసాదిస్తూ ఉంటారు. అట్లాగే ప్రాణోపాసనా రహస్యము తెలిసి, ప్రాణోపాసన నిర్వర్తించు యోగులు ప్రాణతత్త్వము ఎరిగిన వారై వారియొక్క తమ ఇంద్రియ సంపదలను ప్రాణదేవుని ఇహరూపంగా గమనించి, ఇంద్రియ విషయములన్నీ ప్రాణదేవతా భావనతో ప్రాణోదేవికి సమర్పించాలి.

అందుచేత 'నాయనలారా! **"ఇంద్రియ విషయములను అభిలషించటము గ్రామములో భిక్షాటనము చేయుటవంటిది"గా భావించి, యాచన చేయకండి'** అని ఈ ఉపనిషత్ బోధ!

ఇది గ్రహించి 'లభించిన దానితో సరిపెట్టుకొని ఉండాలి. ఇతరులను (ఇంద్రియ విషయ పరంపరలను) యాచించి - దత్తామ్ (ఇవ్వబడినది - దానం చేయబడినది)... సిరిసంపదలవంటివి స్వీకరించ ఇచ్ఛగించాడు-యాచకుడే!

(ఇద్రియ విషయములను) యాచన చేయని స్వభావము కలవారు ఎప్పుడూ భాగ్యవంతులే (కౌపీనవంతః ఖలు భాగ్యవంతః)! 'ఇంకా కూడా, "నాకు ఏదో లభించాలి! ఇవ్వబడునుగాక!" అను భావన కొనసాగించువారు యాచకులు అగుచున్నారు. 'యాచన' (Desiring) త్యజించువారు గౌరవించబడి, దేవతలచే వారివారికి అవసరమైనవన్నీ ఇవ్వబడుచున్నాయి.

**2. "ప్రాణో(బ్రహ్మ" - ఇతి హస్మాహ పైంగ్యః।**
**తస్య హవా ఏతస్య ప్రాణస్య।**
**బ్రహ్మణో వాక్ పరస్తాత్ చక్షుః**
**ఆరుంధే చక్షుః పరస్తాత్।**
**శ్రోతమ్ ఆరుంధే శ్రోత్రం పరస్తాత్।**
**మన ఆరుంధే మనః పరస్తాత్।**
**ప్రాణ ఆరుంధే తస్మైవా ఏతస్మై**
**త్రాణాయ బ్రహ్మణ ఏతాః।**
**సర్వాదేవతా అయాచమానాయ।**
**బలిం హరంతి। తథో ఏవా**
**అస్మై సర్వాణి భూతాని**
**అయాచమానాయ బలిం హరంతి।**
**య ఏవం వేద తస్య ఉపనిషత్**
**న యాచేత ఇతి తత్ యథా గ్రామం భిక్షిత్వా।**
**లబ్ధ్వా ఉపవిశేత్ న అహమ్ అతో దత్తమ్ అశ్నీయామి**
**ఇతి య ఏవ ఏనం పరస్తాత్।**
**ప్రత్యాచక్షీరం స్త ఏ వైనమ్**
**ఉపమంత్ర యంతే దదామత।**
**ఇతి ఏష ధర్మో యాచితో భవతి అన్యతరస్తు**
**ఏవైనమ్ ఉపమంత్రయంతే దదామత। ఇతి॥**

ప్రాణమే బ్రహ్మము. అట్టి ప్రాణశక్తి 'పైంగ్యము' (ప-మట్టి బొమ్మలో మట్టివలె, ఈంగ్యము - నిండి ఉన్నది) అని పిలువబడుచూ ఉన్నది. సర్వదేహములకు 'అంతర్యామి'గా ఉన్నది. అట్టి ప్రాణరూపబ్రహ్మమే. ...

- వాక్కును పలికించుచున్నది.
- కళ్లను చూచుశక్తితో నింపి ఉంచుచున్నది.
- చెవులను వినికిడి శక్తితో స్పందింపజేయుచున్నది.
- మనస్సును భావనా చైతన్యముతో ఆలోచన చేయునట్లుగా సిద్ధింపజేయుచున్నది.

సర్వ దేవతలు తమ తమ దివ్య శక్తులను తిరిగి ప్రాణమునకే సమర్పించుచున్నారు. ఈ విధంగా ప్రాణమే బ్రహ్మము!

అట్లాగే జీవులంతా కూడా ఆయాచితంగా తమ ఇంద్రియానుభవాలన్నీ ప్రాణేశ్వర భగవానునికి సమర్పిస్తూ.... ప్రాణపరమాత్మకే సర్వదా బలిహరణము (సమర్పణము) చేయుచుండటం జరుగుతోంది.

ఇట్టి '**ప్రాణాత్మకు బలిహరణము**' అను ఈ ఉపనిషత్ ప్రతిపాదితమైన సత్యమును గ్రహించువారు ఇంద్రియ విషయ యాచనను అనుసరించరు.

అట్టి అర్థమును గ్రహించినవాడు ఇంద్రియ విషయములను అభిలషించనివాడై, ఇంద్రియ గ్రామమునందు నిత్యముక్తుడుగా సగౌరవించబడుచున్నాడు.

దేహములోని ఇంద్రియ దేవతలు, ఏ బాహ్య విషయములను అభిలషించక, సర్వము ప్రాణదేవునికి సమర్పించువానికి తమతమ మహిమలను ప్రసాదించి గౌరవించుచున్నారు...'అయాచిత ధర్మము' అను వ్రతము నిర్వర్తించువారు సర్వము పొంది **మహత్ భాగ్యులు** అగుచున్నారు. ప్రాణశక్తికి ఇంద్రియ విషయ సమర్పణ (బలి) తత్త్వము ఎరిగి, సర్వము పొందుచున్నారు.

---

**3. అథాత ఏక ధనావరోధనం**
**యత్ ఏకధనమ్ అభిధ్యాయాత్।**
**పౌర్ణమాస్యాం వా అమావాస్యాం వా**
**శుద్ధపక్షే వా పుణ్యే నక్షత్రే**
**అగ్నిమ్ ఉపసమాధాయ, పరిసమూహ్య।**
**పరిస్తీర్య పర్యుక్ష్య పూర్వ దక్షిణం,**
**జాన్వా వాచ్య।**
**స్రువేణ వా, చమసేన వా, కంసేనవా,**
**ఏతా ఆజ్యా ఆహుతిః జుహోతి,**
**వాక్-నామ దేవతా అవరోధినీ**
**సామే అముష్మాత్ ఇదమ్ అవరుంధా!**
**తస్మై స్వాహా ప్రాణోనామ దేవతా అవరోధినీ**
**సామే అముస్మాత్ ఇదమ్ అవరుంధా।**
**తస్మై స్వాహా "చక్షుః" నామ దేవతా అవరోధినీ**
**సామే - అముష్మాత్ ఇదమ్ అవరుంధా।**
**తస్మై స్వాహా "శ్రోతం" నామ దేవతా అవరోధినీ**

చంద్రలోకమునుండి ఊర్ధ్వమగు 'స్వర్ణ' ఇత్యాది ఆనందలోకములు చేరు ఆశయముగలవారు **ఏ విధంగా అగ్నికార్యోపాసనలు నిర్వర్తిస్తున్నారో...చెప్పుచున్నాను.**

నిండు పౌర్ణమి తిథి రోజునగాని, అమావాస్య రోజునగాని, శుక్లపక్షములో పుణ్య నక్షత్రము రోజునగాని...ఏదో ఒక శుభదినమున (మంచి రోజున) అగ్నికార్యము (యజ్ఞము) ప్రారంభించుచున్నారు. పవిత్రమైన ప్రదేశమును ఎంచుకొనుచున్నారు. ఆ ప్రదేశమును పరిశుభ్రముగా చేయుచున్నారు.

పవిత్రముగా చేయబడిన వాతావరణమును తయారు చేసుకొని అగ్నిని వ్రేల్చుచున్నారు. స్రువము (చెంచా, గరిట), చమసము (కొయ్యపాత్ర), కంచు పాత్రలను ఉపయోగించి, అగ్నిలో ఆజ్యము (నేయి) సమర్పిస్తూ యజ్ఞశాస్త్రమంత్రములు నిర్ణయించే దేవతా సంబంధమైన 'మంత్రము' గానం చేస్తూ ఉన్నారు. ఆ దేవతను ఉద్దేశ్యించి ఆజ్యము సమర్పించుచున్నారు. ఆ ప్రాణ నామ దేవతను ధ్యానిస్తూ ...., 'స్వాహా' అని పలుకుచూ సమర్పించుచున్నాను.

'వాక్' ఇంద్రియ ప్రాణ దేవతకు వాక్కులన్నీ బలిహరణముగా సమర్పించుచున్నాను. స్వాహాః! (ఇదం న మమ!)

- 'చక్షురింద్రియ ప్రాణదేవతకు నేను దృశ్యదర్శనములన్నీ సమర్పిస్తున్నాను - స్వాహా' అని సమర్పిస్తున్నాను! నాకు చక్షుదేవత ఆముష్మిక సుఖము ప్రసాదించునుగాక!
- శ్రోత దేవతకు సర్వశ్రోత (వినికిడి) ఫలములన్నీ 'స్వాహా' అని సమర్పించుచున్నాను. ఆ చక్షుదేవత నాకు ఆముష్మిక సుఖము ప్రసాదించునుగాక!
- మనస్సుతో చేస్తున్న ఆలోచనలన్నీ..., ఈ ఇహకార్యక్రమములన్నీ మనో నామ

సామే - అముష్మాత్ ఇదమ్ అవరుంధా।
తస్మై స్వాహా "మనో" నామ దేవతా అవరోధినీ
సామే - అముష్మాత్ ఇదమ్ అవరుంధా।
తస్మై స్వాహా "ప్రజ్ఞా" నామ దేవతా అవరోధినీ
సామే అముష్మాత్ ఇదమ్ అవరుంధా।
తస్మై స్వాహేతి।
అథ ధూమ గంధమ్ ప్రజిఘ్రాయ,
ఆజ్య లేపేన అంగాని అను- విమృజ్య వాచం।
యమోభి ప్రవ్రజ్యార్థం బ్రవీతి
దూతం వా ప్రహిణుయాత్ లభతే హైవ।

ప్రాణదేవతకు 'స్వాహా' అని సమర్పిస్తున్నాను. నా ఇహ (ఐహిక) మనో కార్యక్రమ ఫలములను స్వీకరించి నాకు ఆముష్మిక సుఖములను ప్రసాదించునుగాక।

ప్రజ్ఞానామ దేవతకు నా బుద్ధి ఇహంలో చేస్తున్న క్రియా విశేషాలన్నీ 'స్వాహా' అని ఈ ఆజ్యము రూపంగా అగ్ని ద్వారా సమర్పిస్తున్నాను. ఆ ప్రజ్ఞా ప్రాణదేవత ఆముష్మిక సుఖము ప్రసాదించునుగాక!

ఈ విధంగా అగ్నికి ఆజ్యమును **'స్వాహాయేతి'** అని సమర్పిస్తూ ఆ ధూమగంధము (మసి)ని అంగములకు పాముకొంటూ, భావనాపూర్వకంగా **సర్వ ఇంద్రియ వ్యాపారములను ఆయా అధి దేవతలకు సమర్పించి వేయాలి. సర్వేంద్రియ దేవతలను ప్రాణతత్త్వ ప్రదర్శనములుగా సమర్పించాలి.**

అట్టి యజ్ఞకర్త ఏది (ఆముష్మికము లేక ఐహికము) కోరుకొని 'స్వాహా' అని పలుకుచూ అగ్నియందు ఆజ్యము సమర్పిస్తూ, **ఇంద్రియాధిదేవతలకు ఇహ ఇంద్రియ కర్మలన్నీ సమర్పిస్తున్న భావన చేస్తూ ఉంటాడో,** ఆతడు ఆ కావాలనుకొనేవన్నీ పొందగలడు.

4. అథాతో దైవస్మరో యస్య ప్రియో
బుభూషే యస్యైవా ఏషాం వై తేషామ్ ఏవై తస్మిన్
పర్వణి అగ్నిమ్ ఉపసమాధాయ
ఏతయైవ ఆవృత ఏతా ఆజ్య హుతీః జుహోతి
వాచం తే మయి జుహోమి అసౌ స్వాహా।
ప్రాణం తే మయి జుహోమి అసౌ స్వాహా।
చక్షుః తే మయి జుహోమి అసౌ స్వాహా।
శ్రోత్రం తే మయి జుహోమి అసౌ స్వాహా।
మనః తే మయి జుహోమి అసౌ స్వాహా।
జుహో తే మయి జుహోమి అసౌ స్వాహా ఏతి।
అథ దూమగంథం, ప్రజిఘ్రాయ ఆజ్య లేపేన అంగాని
అనువిమృజ్య వాచం యమోభి ప్రవ్రజ్య సంస్పర్శం
జిగమిషేత్ అపి వాతాద్వా।
సంభాషమాణః తిష్ఠేత్ ప్రియోహైవ
భవతి స్మరంతి। హైవ భవతి, స్మరంతి హైవ స్యాత్।।

అప్పుడు ఆ అగ్నికి 'స్వాహా' శబ్దముతో ఆహుతులను, దేహేంద్రియములలోను, జగత్తులోనుగల ఇంద్రియ దేవతలకు సమర్పిస్తూ ఉండగా దైవస్మరణకు ఫలప్రసాదముగా దివ్యమహిమలను ఆ దేవతలు ప్రసాదించుచున్నారు. ఆజ్యమును (నేయి) ఆహుతిగా అగ్నికి సమర్పిస్తున్నప్పుడు 'జుహోమి' - అని యాజ్ఞికుడు యజ్ఞకర్తచే వాక్యములు పలికిస్తున్నారు.

ఓ వాక్ దేవతా! ఓ ప్రాణదేవతా! ఓ చక్షు దేవతా! ఓ శ్రోత దేవతా!

ఓ మనో దేవతా! ఓ ప్రజ్ఞా దేవతా! ఓ దేవదేవా!

**"'తేమయి జుహోమి అసౌ స్వాహా! (స్వాహా ఏతి)!"**

అని పలుకుచూ, ఆ యజ్ఞకర్త ధూమగంధమును (భస్మ గంధనము) లేపనముగా అంగాంగములకు లేపనము చేయుచున్నారు. ఆ తరువాత మౌనముగా అగ్నిగుండమును సమీపించి, ఆ అగ్నిగుండ నలుచదరములను రెండు అరచేతులతో స్పృశించి రెండు కనులు మూసుకొని ఆయా **ఆహ్వానిత దేవతల మహిమను ఒక్కొక్కటిగా మనస్సుతో తలచుకుంటూ కృతజ్ఞతలు చెప్పుచున్నారు.** ప్రియమైన స్తోత్ర సంభాషణతో ఆయా ఆవాహిత దేవతలను కర్మణా, మనసా, వాచా స్మరిస్తూ తమ విన్నపమును మనస్సుతో వాక్కుతో విన్నవించుకుంటున్నారు.

5. అథా అతః సాయమ్ అన్నం
ప్రాతర్ధనమ్ అంతరమ్
'అగ్నిహోత్రమ్' ఇతి చ ఆచక్షతే।
యావత్ వై పురుషో భాసతే, న తావత్ ప్రాణితుం
శక్నోతి। ప్రాణం తదా వాచి
జుహోతి। యావత్ వై పురుషః
ప్రాణితి, న తావత్ భాషితుం శక్నోతి వాచం,
తదా ప్రాణే జుహోతి।
ఏతే అనంతే మృతాహుతీః జాగ్రచ్చ
స్వరూపం చ సంతతమ్
అవ్యవచ్ఛిన్నం జుహోతి

**ఇప్పుడిక ఈ 'దేహము' అనే యజ్ఞశాలలో అంతరముగా నిర్వర్తించుయజ్ఞము అగ్నిహోత్ర కార్యక్రమము గురించి చెప్పుకుంటున్నాము.**

ఏ సమయములో ఈ జీవుడు మాట్లాడుచూ ఉన్నాడో ఆ సమయములో ఆతడు, ఊపిరిపీల్చుటలేదు. అప్పుడు ఆతడు **శ్వాసను వాక్కులో ఆహుతి** చేయుచున్నాడు. ఆ వ్యక్తి శ్వాస పీల్చుచున్నప్పుడు వాక్కులు (శబ్దాలు) పలకలేడు. అనగా, అప్పుడు **వాక్కును శ్వాస (లేక) ప్రాణాగ్నిలో** ఆహుతి చేస్తూ ఉన్నాడు.

ఈ విధంగా వాక్ - ప్రాణశక్తులను ఒక దానియందు మరొకటి అవిచ్ఛిన్నంగా, ఎల్లప్పుడూ (మెళకువ - నిద్రాసమయాలలో) ఆహుతిగా జీవించియున్నంత కాలం చేస్తూనే ఉన్నాడు.

అట్టి బహిరంగంగా ఈ జీవుడు నిర్వర్తిస్తున్న బహిరంగ ఆహుతులన్నీ అంతరంగ కర్మలు!

ఇది గమనించిన పూర్వీకులకు విద్వాంసులు 'అగ్నిహోత్రమునకు నేయిని

**అథ యా అన్యా ఆహుతయో**
**అంతవత్ యస్తాః కర్మమయి,**
**యో భవంతి ఏతత్ ఉవై పూర్వే విద్వాంసో**
**అగ్నిహోత్రం జుహ్వాం చక్రుః**

"ఆహూతులుగా ఇస్తూ ప్రాణ దేవతను, ప్రాణస్వరూపములే అయి ఉన్న చక్షువులు మొదలైన దేవతలను ఉపాసించి, అనుకొన్న స్థితిగతులు పొందటం" అనే యజ్ఞవిధిని మానవాళికి ప్రసాదించారు.

దేహంలోను బాహ్యంలోను జరుగుచున్నదంతా బ్రహ్మమే। సర్వము బ్రహ్మమే! అట్టి బ్రహ్మోపాసనయే ఈ బాహ్య - అంతర యజ్ఞ కార్యక్రమ విశేషాలన్నీ కూడా! అందుకే ఇదంతా 'శుష్క అంగారమ్రుక్' అను పేరుతో ఉపాసిస్తున్నారు.

---

**6. అథ కథం బ్రహ్మేఽ తి హస్మా హ**
**"శుష్క అంగారమృక్" ఇతి ఉపాసీత।**
**సర్వాణి హస్మై భూతాని శ్రేష్ఠ్యాయ**
**అభ్యర్చ్యంతే తత్ యజుః ఇత్యుపాసీత।**
**సర్వాణి హో అస్మై భూతాని శ్రైష్ఠ్యాయ (ఇతి) యజ్యంతే।**
**తత్ సామే ఇతి ఉపాసీత సర్వాణి హో**
**అస్మై భూతాని శ్రైష్ఠ్యాయ సన్ నమంతే।**
**తత్ 'శ్రీ' ఇతి ఉపాసీత।**
**తత్ 'యశ' ఇతి ఉపాసీత।**
**తత్ 'తేజ' ఇతి ఉపాసీత।**
**తత్ యథై తత్ శాస్త్రాణాం**
**శ్రీమత్ తమమ్, యశశ్వితమమ్,**
**తేజశ్వి తమమ్ భవతి।**
**తథ ఏవైవం విద్వాన్ సర్వేషాం**
**భూతానాం శ్రీమత్తమో,**
**యశస్వితమః, తేజస్వితమో భవతి।**
**తమ్ ఏతమ్ ఐష్టికం**
**కర్మమయమ్ ఆత్మానమ్**
**అధ్వర్యుః సంస్కరోతి।**
**తస్మిన్ యత్ ధర్మమయం ప్రభవతి।**
**తత్ ధర్మమయం ఋక్మయం।**
**హోతా ఋక్మయమ్।**
**సామమయమ్ ఉద్గాతా। స ఏష సర్వస్యై**
**'త్రయీవిద్యా'యా ఆత్మైష ఉప**
**ఏవా-అస్య ఆత్మైతత్ ఆత్మా భవతి,**
**య ఏవం వేద।**

'సర్వజీవులు యజుర్వేద ఋక్కులతో తమ ఇంద్రియ కర్మలచే బ్రహ్మమునే అర్చించుచున్నారు' అని భావించి, యజ్ఞకర్త యజుస్సులతో యజ్ఞవిధిగా బ్రహ్మోపాసన చేయుచున్నాడు. సర్వజీవులు బ్రహ్మముయొక్క మహాత్మ్యము చేతనే ఇంద్రియ కర్మలచే **ప్రాణ - ఇంద్రియ ధర్మముల సామగానము** చేస్తున్నారు అని అవగాహన సమన్వయము చేసుకొనబడుగాక? ఈ సృష్టి ఇందలి జీవుల సర్వ స్వభావాలు, అనుభవాలు - ఇవన్నీ ఆత్మభగవానునికి సమర్పిస్తున్న సామగానస్తోత్రాలే!

**"ఆ బ్రహ్మముయొక్క శ్రేష్ఠత్వము, మహదత్వము సర్వదా కీర్తించబడుచూ, ఉపాసించబడుగాక! ఆత్మయొక్క తేజో విభవములో ఆరాధించబడుగాక!"** అని ఉద్దేశ్యించి యజ్ఞ (అగ్ని) కార్యము నిర్వర్తించాలి. అట్లు యజ్ఞ కార్యము బ్రహ్మోపాసనగా నిర్వర్తించువారు యశోసంపన్నులు, తేజోసంపన్నులు అగుచున్నారు.

**'ఈ సర్వ జీవులు ఆ పరబ్రహ్మము యొక్క సౌందర్య - ఐశ్వర్య తేజో విభవమే'** అని యోగి ఆత్మకు నమస్కరించుచున్నాడు. అట్టి ఉపాసనచే తాను యశస్వి, తేజోమయుడు అగుచున్నాడు.

ఆత్మ భగవానుని ఉపాసించే ముఖ్య భావనలతో ఐష్టికములను (శాస్త్రములచే సూచించబడు యజ్ఞ-యాగములను) నిర్వర్తించువారు. (యజ్ఞకర్త - ఆధ్వర్యుడు) స్వభావసిద్ధముగా సంసారభావన - దృష్టుల నుండి సంస్కరించబడుచున్నారు. ఆత్మ ధర్మములను పుణికిపుచ్చుకొని, బ్రహ్మమే తామై ప్రకాశించుచున్నారు!

ఆతడు సర్వమును...,

- ధర్మమయముగాను,
- ఋగ్వేద-ఋక్ స్తోత్రమయము గాను,
- ఋక్మహిమా సమన్వితము గాను,
- సామమయముగాను, నాదానందమగు ఉద్గాత గాను,
- త్రయీ విద్యా - ఆత్మతత్త్వ స్వరూపము గాను

**యజ్ఞవిధులను ఉపాసిస్తున్నాడు.** సర్వము ఆత్మమయముగాను దర్శించుచున్నాడు. వేదములలో చెప్పిన అగ్నికార్యముల ఆత్మోపాసనా రహస్యమును ఎరిగి, ఇంద్రియ విషయములచే అంతర్యజ్ఞమును, ఆహుతి - అగ్నిలతో కూడిన బహిర్యజ్ఞము...నిర్వర్తించువాడు ఆత్మయే (బ్రహ్మమే) తానై ప్రకాశించుచున్నాడు!

---

**7. అథా అతః సర్వ జితః కౌషీతకేః**
**త్రీణి ఉపాసనాని భవంతి। యజ్ఞోపవీతం కృత్వాప**
**ఆచమ్య, త్రిః ఉదపాత్రం ప్రసిచ్య,**
**'ఉద్యంతమ్ ఆదిత్యమ్'**
**ఉపతిష్ఠేత్ యత్ వర్గోఽ సి**

బుద్ధి యొక్క పరిశుద్ధత - నిశ్చలతల కొరకై '3' విధములైనటువంటి కౌషీతకీ సూర్య - త్రిసంధ్యోపాసనలు ఈ విధంగా యజ్ఞోపవీత పూర్వకంగా నిర్వర్తించబడుగాక!

యజ్ఞోపవీతమును ఉపవీతముగా ధరించి '3' సార్లు ఉదక పాత్రతో ఆచమనం చేసి, ఉదకపాత్రపై ఉదక ప్రోక్ష్యం చేయాలి.

పాప్మానమే ఉద్వృన్ "ధీ" – ఇతి ఏతయైవ ఆవృతా
మధ్యే సంతమ్ ఉద్వర్గో౽సి పాప్మానమ్
అంతర్ద్వ్యపావాత్య ఏతైవ ఆవృతాః 'స్తయంతమ్'
యత్ వర్ణోసి పాప్మానం మే సర్వం వాత్యేతి
యత్ అహో-రాత్రా భ్యాం
పాపం కరోతి సంతత్ వృంక్తే॥

ఓ ఉదయిస్తున్న ఆదిత్య భగవాన్!
**"ఉద్యంతమ-ఆదిత్యా! సూర్యదేవా! నాకు దగ్గరై ఉపతిష్ఠులవండి. నన్ను సర్వపాపవర్గముల నుండి ప్రక్షాళనము చేయండి!"** అని ఉపాసించాలి. అట్లాగే మధ్యాహ్నము (12 గంటల వేళ) కూడా, **"స్వామీ! ఆదిత్యా! స్తయంతమాదిత్యా! నీవు సర్వపాపములను ప్రక్షాళన చేయు మహాత్ముడవు! నా యొక్క సర్వపాప (అనాత్మ) భావములనుండి నన్ను సముద్ధరించండి!".**

అదే విధంగా సాయం సంధ్యాసమయంలో కూడా ఆదిత్యో పాసన చేయుటచే సర్వపాప సంస్కారాల నుండి విముక్తులు అగుచున్నారు. లయానంతరము శేషించే స్వస్వరూపము అనుభవమగుచున్నది.

---

**8.** అథ మాసిమా అస్య అమావాస్యాయాం
పశ్చాత్ చంద్రమసం దృశ్యమానమ్
ఉపతిష్ఠేత ఏతయైవ ఆవృతా హరిత తృణాభ్యాం వా
వృత్తస్యాత్ యత్ తే స్వసీమే
హృదయమ్ అధి, చంద్రమసి
శ్రితం। తేన అమృతత్వమ్
అస్య ఈశానం మాహం పౌత్ర మఘం రుదమితి।
స హ అస్మాత్ పూర్వాః ప్రజాః ప్రయంతీతి
న జాత పుత్రస్య అథా
జాత పుత్రస్య ఆహ (అ)యం సమేతాతు
ఆప్యాయస్వ సమేతు తే, సంతే
పయాంసి సముయంతువా।
రాజా యమ్ ఆదిత్యామ్ ఆత్వా
అంశుమ్ ఆప్యాయయంతితే, తాః తిస్ర ఋచో
జపిత్వా న అస్మాకం ప్రాణేన
ప్రజయా, పశుభిః ఆప్యాయయస్వ యో అస్మాన్
ద్వేష్టి యంచ వయం ద్విష్మః
తస్య ప్రాణేన ప్రజయా పశుభిః
ఆప్యాయస్వేతి। దైవీమ్ ఆవృతమ్। ఆవర్త ఆదిత్యస్య।
ఆవృతమ్ అన్వావర్తయతి। దక్షిణం బాహుం అన్వా వర్తతే।

ప్రతి నెల శుద్ధ పాడ్యమి నుండి పౌర్ణమీ తిథి వరకు 'చంద్రమసము' నందు దృశ్యమానమగు చంద్రోపాసన చేయబడుగాక! పచ్చటి గడ్డి పరకలకు (హరిత తృణములను) చంద్రభగవానునికి సమర్పిస్తూ, **"ఓ చంద్రదేవా! నా హృదయసీమలో మీరు మనోరూపంగా సదా వేంచేసియే ఉన్నారు. సర్వదా అమృత కిరణములను ప్రసరిస్తూ ఉండండి! నన్ను 'పౌత్ర మఘము' (నా సంతానము, బంధువులు మొ॥వారి వలన నాకు దుఃఖములు) కలుగకుండునట్లు అగ్రహించండి!"** - అను భావనతో ఉపాసించాలి.

ఈ మంత్రమును ఉపాశించువారి సంతతి కూడా చంద్ర భగవానుని చల్లటి కిరణములచే రక్షింపబడుచుండెదరు. పుత్రులు లేని వారు (నజాత పుత్రులు), పుత్రులు కలవారు (జాతపుత్రులు) చంద్రభగవానునికి ప్రార్థనలు సమర్పించెదరుగాక!

**ఓ చంద్రభగవాన్! నన్ను మీదరి చేర్చుకొనెదరుగాక! మీరు రస స్వరూపులు! మీయందు సర్వ రసములు ఉండి ఉన్నాయి. మీరు సర్వశక్తి సమన్వితులు. మా జీవితములు ఆప్యాయము (మధురము) అగునట్లు చేసెదరుగాక! అట్లే ఆదిత్యుడు (సూర్యభగవానుడు)కూడా మా జీవితములను ఆప్యాయ మాధుర్యములతో నింపెదరుగాక!**

ఈ తిస్ర-ఛందోరూపమైన ఋక్కులతో సూర్య -చంద్రులను స్తోత్రములు సమర్పించాలి.

'ఓ సూర్య-చంద్రులారా! ప్రాణశక్తివలనగాని, దుష్ట-అల్ప స్వభావులగు జనులవలన గాని, పశువులవలనగాని మాకు కష్టములు రాకుండా కాపాడండి!

ప్రాణశక్తి, ప్రజలు, పశువులు మాయొక్క సాధనలందు సానుకూల్యురై ఉండెదరుగాక! దేహములోని దేవతలు, ఆదిత్యుడు మా చుట్టూ ఉండి రక్షించుచుండెదరుగాక! అనువర్తులు, సానుకూల్యురు అయ్యెదరుగాక! మా కుడిచేయి ఉత్తమ కర్మలయందు అనువర్తనమై, సానుకూల్యముగా ఉండును గాక!

---

**9.** అథ పౌర్ణమాస్యాం పురస్తాః
చంద్రమసం దృశ్యమానమ్
ఉపతిష్ఠ ఏతయైవ ఆవృతా
సోమో రాజాసి విచక్షణః
పంచముఖో౽సి, ప్రజాపతిః
బ్రాహ్మణ స్త।
ఏకం ముఖం। తేన ముఖేన రాజ్ఞోఉత్సి।
తేన ముఖేన మాం అన్నాదం కురు।

పౌర్ణమి తరువాత - కృష్ణపక్ష చంద్రుడు తూర్పు దిక్కుగా కనబడుచున్నంతకాలము ఆ చంద్ర భగవానుని ఈ తీరుగా ప్రార్థన చేయాలి.

ఓ చంద్రదేవా! మీరు మీ కిరణములతో ఆకాశంలో రారాజువై ప్రకాశిస్తున్నారు! జ్ఞానానంద స్వరూపులు! గగన వీధులలో పంచముఖప్రజ్ఞాపతి బ్రహ్మమై విలసిల్లుచున్నారు.

మొదటి ముఖముతో ఆకాశరాణివై (రాజ్ఞి) జీవులందరికీ ఔషధ రూపముగా ఆహారము (అన్నము) ప్రసాదిస్తున్నారు. అట్టి మొదటి ముఖములో మాయందు అన్నమును భుజించువానిగా (ఆహార స్వీకరించువానిగా. ధాన్యమును రక్షించు వానిగా) ఉండండి! మీ వాత్సల్యం మాపట్ల కొనసాగించండి. 'అన్నాదుడు' అయి ఉండండి! ఆహార స్వీకారానుభవములన్నీ మీకు సమర్పించుచున్నాము.

రాజా త ఏకం ముఖం। తేన ముఖేన
విశోత్సిత, ఏనైవ ముఖేన మామ్ అన్నాదం కురు।
శ్యేనస్త ఏకం ముఖం। తేన ముఖేన పక్షిణో ఉత్సి,
తేన ముఖేన మాం అన్నాదంకురు।
అగ్నిస్త ఏకం ముఖం। తేన ముఖేన ఇమం లోకమత్సి।
తేన ముఖేన మామ్ అన్నాదం కురు।
సర్వాణి భూతాని ముఖం। తేన
ముఖేన సర్వాని భూతాని అత్సి।
తేన ముఖేన మామ్ అన్నాదం।
ఇత్యేవ పంచమం కురుమ్।
అస్మాకం ప్రాణేన ప్రజయా పశుభిః
అవక్షేపా యో। అస్మాన్ ద్వేష్టియంచ । వయం ద్విష్మః
తస్య ప్రాణేన ప్రజయా పశుభిః
అవక్షీయన్వేతి స్థితిః దైవీమ్ ఆవృతమ్ ఆవర్త।
ఆదిత్యస్య ఆవృతమ్ అన్వావర్తం త ఇతి
దక్షిణం బాహుమ్ అన్వావర్తతే॥

మరొక ముఖముతో **'రాజాధిరాజు'** అయిప్రకాశించుచున్నారు. ఈ ముఖముతో కూడా మాకు అన్నము ప్రసాదించండి. ఇంకొక ముఖముతో **పక్షిజాతినంతటినీ** ఉత్తేజితం చేస్తున్నారు. ఆ ముఖముతో కూడా మాకు అన్నము దయచేయండి. మరొక ముఖముతో **అగ్నితేజోవిలాసులై** ఈ లోకమును ప్రకాశింపజేస్తున్నారు. ఉజ్జీవింపజేస్తున్నారు. ఆ ముఖము కూడా అన్నాదమ్ (అన్నము - బ్రహ్మము) దమ్- ఇచ్చునది)గా చేయండి!

సర్వజీవులు మీయొక్క **వేరొకముఖము**. సర్వభూతస్వరూపముఖముతో కూడా మాకు అన్నప్రసాదితులు అవండి!

ఈ విధంగా పంచముఖములతో మాయొక్క ఆస్వాదనమును (అన్నాదమును) పరిపుష్ఠము చేయండి. మాయొక్క ప్రాణశక్తి, జనసంపద, పశుసంపద 'లోటు' పొందకుండును గాక! మా స్థితి-గతులకు తోడు అవండి!

మమ్ము ద్వేషించువారి, మేము ద్వేషించువారి ప్రాణ ప్రజ పశుసంపదలను, స్థితులను, గతులను కూడా దేవతలు రక్షించెదరుగాక! దేవతలు ఆవృత్తులై తమ ఆవర్తనములతో అందరినీ రక్షించెదరుగాక! ఓ ఆదిత్యదేవా! సూర్యభగవాన్? ఆహూతులై మా దైవీ కార్యక్రమములను అన్వావర్తము (activate) చేయండి. మేము ఈ కుడిబాహువులతో పుణ్యకార్యములు ఎల్లప్పుడు చేయుచుండేట్లుగా అనుగ్రహించండి!

**10.** అథ సంవేశ్యన్ జాయాయై హృదయమ్ అభిమృశేత్
యత్ తే సుసీమే హృదయో
హితమంతః। ప్రజాపతౌ మన్యే
ఇహ మాం తత్ విద్వాంసం మాహం
పౌత్రమఘం రుదమ్ – ఇతి
న హాస్మాత్ పూర్వాః ప్రజాః ప్రైతి।

**హృదయమే శరీర ఉపాసన** : జీవిత భాగస్వామిగా పరమాత్మచే ప్రసాదించిన భార్య (ప్రకృతి) యొక్క హృదయస్థానమును స్పృశిస్తూ **"ఓ హృదయేశ్వరీ! నా హృదయముచే హృదయపూర్వకంగా ఆరాధిస్తూ 'హితము' కలుగజేయుమని" వేడుకొనుచున్నాను. ప్రజాపతి స్వరూపులుగా మిమ్ములను ఉపాసిస్తున్నాను. నాకు మీరు విద్వాంస-స్వరూపులు! నన్ను విద్వాంసులుగా చేయండి. మన సంతతికి వ్యాధులు రాకుండా రక్షించండి'.......... అని ప్రార్థన!**

అట్లు ఇంటి ఇల్లాలిని ఉపాసించువారి సంతానమునకు కష్టములు ఉండవు.

**11.** అథ ప్రోష్యాయన్ పుత్రస్య మూర్ధానమ్ అభిమృశతి।
అంగాత్ అంగాత్ సంభవసి।
'హృదయాత్ అధిజాయసే। ఆత్మావై పుత్ర నామ్నా।
స జీవ శరదశ్శతమ్। అసావితి నామాస్య
(అశ్మాభవ। పరశుర్భవ। హిరణ్యమస్తృతం భవ।
తేజోవై పుత్ర నామాసి, సజీవ శరదశ్శతం।
ఆసావితి నామాస్య గృహ్ణాతి।
యేన ప్రజాపతిః ప్రజాః
పర్యక్ గృహ్ణీత అరిష్ట్యై తేన త్వా పరిగృష్ణామి
అసావితి యథాస్య దక్షిణే కర్ణే జపతి।
అస్మే ప్రయన్ధి మఘువన్
ఋజీషిత్ ఇతి ఇంద్ర శేష్ఠాని
ద్రవిణాని ధేహీతి।)
గృహ్నాతి మా చ్ఛేత్తా, మా వ్యథిష్ఠాః,
శతం శరద ఆయుషో జీవపుత్ర, తే నామ్నా

**ఆత్మావైపుత్రః** : కుమారుని మూర్ధమును (foreface) చేతులతో స్పృశించి ముద్దుపెట్టుకొని, **"నా అవయములలోని దేవతల ప్రసాదముగా ఉన్నావు. నా హృదయమునుండి నీవు బయల్వెడలావు. నాయనా! నేనే నీవుగా ఉన్నాను! బిడ్డా!** నిండు నూరేండ్లు జీవించెదవుగాక"! అని సంతానము పేరు చెప్పి పలకాలి.

"బిడ్డా! సుఖమును పొందుము! పదునైన బుద్ధికలవాడువుకమ్ము! బంగారు రంగుతో ప్రకాశించుము! నూరేళ్ళు జీవించుము'' - అని సంతానము పేరు చెప్పి ఆశీర్వదించునుగాక! **" దేనిచేత ప్రజాపతి తన బిడ్డలగు సర్వజీవుల అరిష్టములను (కష్టములను) తొలగించుచున్నారో, అద్దాని చేతనే బిడ్డల కష్టములను నేను తొలగించుచున్నాను"** - అని భావిస్తూ, కుమారుని కుడి చెవియందు మంత్రము చెప్పునుగాక!

"ఓ శ్రేష్ఠుడవగు ఇంద్ర భగవాన్! మా సంతానమును అల్ప పాపబుద్ధుల నుండి కాపాడుచు సంపదలు ప్రసాదించండి"!

ఓ సంతానమా! బాధలు వ్యధలు లేకుండా మా సంతతి (పుత్రులు పౌత్రులు) అగు మీరు ఉత్తమ మార్గాన్వేషులై, ధ్యానము, యజ్ఞము మొదలైన దైవీ

**మూర్ధానమ్ అభిజిఘ్రామ్య అసావితి।**
**త్రిభిః మూర్ధానమ్ అభిజిఘ్రేత్**
**గవా త్వా హింకారేణ అభి హింకరోమి!**
**ఇతి త్రిరస్య మూర్ధానమ్ అభిహిం కుర్యాత్।**

కార్యక్రమములు నిర్వర్తిస్తూ నూరేళ్ళు యశస్సుతో వర్థిల్లెదరుగాక!'- అని గోవు హీంకరిస్తున్న రీతిగా హీంకరించుచున్నాను.

ఇట్లు పలుకుచు, సంతానమును బ్రహ్మముగా భావన చేస్తూ '3' సార్లు మూర్థమును (foreface) స్పృశించాలి!

---

**12.** **అథా అతో దైవః పరిమర ఏతత్వై**
**బ్రహ్మ దీప్యతే। యత్ అగ్నిః,**
**జ్వలత్య అథైతత్ మ్రియతే।**
**యత్ న జ్వలతి, తస్య "ఆదిత్య మేవ",**
**తేజో గచ్ఛతి వాయుం,**
**ప్రాణ ఏతత్వై బ్రహ్మ దీప్యతే**
**యథా మర్త్యో దృశ్యతే అథ ఏ తత్ మ్రియతే।**
**యత్ న దృశ్యతే తత్ "చంద్రమసమేవ"।**
**తేజో గచ్ఛతి వాయుం**
**ప్రాణ ఏతద్వై బ్రహ్మ దీప్యతే।**
**యత్ చంద్రమా దృశ్యతే**
**యత్ విద్యుః విద్యోతతే**
**అథ ఏతత్ మ్రియతే।**
**యత్ న విద్యోతతే, తస్య విద్యుతమేవ।**
**వాయుమేవ, తేజోగచ్ఛతి।**
**వాయుం ప్రాణః తావా।**
**ఏతాః సర్వా దేవతా వాయుమేవ।**
**ప్రవిశ్య వాయౌ తృప్తాన మూర్ఛంతే,**
**తస్మాత్ ఏవ పునః ఉదీరత**
**ఇత్యధిదైవతమ్ అథ "ఆధ్యాత్మమ్"**

ఇప్పుడు సర్వదేవతలుగా ఏ బ్రహ్మము దీపించున్నదో...అద్దానిని ఆరాధిస్తున్నాము. - ఏదైతే అగ్నిగా జ్వలించుచున్నదో, అదియే సూర్యుడు.

ఏదేది జ్వలించుచున్నదో (అగ్నిగా వెలుగుచున్నదో)...అందంతా ఆదిత్యుడే! అగ్నియే ఆదిత్యుడు! ఆదిత్యుడే అగ్ని!

అగ్నిలోగల (బ్రాహ్మీ శక్తి రూపమగు) ప్రాణశక్తియే వాయువు రూపముగా ప్రదర్శనమగుచున్నది. బ్రహ్మమే ప్రాణశక్తి! ఏదైతే కదలుచూ **నామరూపాత్మకంగా కనిపిస్తోందో** (మర్త్యో దృశ్యత్) అది నాశనము మార్పు చేర్పు కలిగినదై ఉంటోంది. (యత్ దృశ్యమ్ తత్ నశ్యమ్) **ఏది కదిలించునదై, దృశ్యముగా కనిపించటములేదో, అది చంద్రమసము (చంద్రశక్తి) అని గ్రహించబడుగాక!**

తేజస్సు వాయువునందు ప్రవేశించుచున్నది. వాయువే ప్రాణశక్తి. **ఆ ప్రాణశక్తిగా బ్రహ్మమే దీపించుచున్నది.**

ఏది చంద్రమసముగా (చంద్రునిగా) కనిపించుచున్నదో, ఏది విద్యుత్ ప్రకాశరూపముగా సృష్టిలో కనిపించుచున్నదో...**అదంతా సూర్యతేజో రూపమే! అగ్నిరూపమే!** ఏది ప్రకాశమానమై కనిపించుటలేదో, అది కూడా విద్యుత్ (తేజో)రూపాంశమే! **చీకటి కూడా తేజస్సుయొక్క మరొక అంశయే.** ఆ తేజస్సు వాయువునందు ప్రవేశించుచున్నది. వాయువు ప్రాణశక్తి రూపము. ప్రాణశక్తియే ఇదంతా! కనుక సృష్టిదేవతలంతా ప్రాణశక్తి తత్త్వమగు వాయురూపులే! **దేవతలంతా వాయువునందు ప్రవేశించి, వాయు స్వరూపులై శాంతిస్తున్నారు.** వాయు రూపమునందు ఉండుటచే దేవతలు అమరులు. దేవతలు వాయురూపులై, వాయువు ప్రాణరూపమై, ప్రాణము బ్రహ్మరూపమై చెన్నొందుచుండటమే - 'అధి దైవతము, అధ్యాత్మము'...... అని పిలువబడుచున్నది.

---

**13.** **ఏతత్వై బ్రహ్మ దీప్యతే**
**యత్ వచా వదతి,**
**అథ ఏతత్ మ్రియతే।**
**యత్ న వదితి,**
**తస్య చక్షురేవ।**
**తేజో గచ్ఛతి**
**ప్రాణం ఏతద్వై బ్రహ్మ దీప్యతే।**
**యత్ చక్షుషా పశ్యతి,**
**అథైతత్ మ్రియతే।**
**యత్ న పస్యతి,**
**తస్య శ్రోత్రమ్ ఏవ**
**తేజోగచ్ఛతి ప్రాణం।**
**ప్రాణ ఏతద్వై బ్రహ్మ దీప్యతే!**

ఏదైతే వాక్కుగా ప్రకాశించుచున్నదో, అది బ్రహ్మముయొక్క దీప్తియే! కాంతియే! తేజస్సే! ఏదైతే మాట్లాడబడుచున్నదో, అది ముగించబడి నశించవచ్చుగాక! వాక్కుగా ప్రకాశించే బ్రహ్మము అగ్ని రూప, ప్రకాశరూప, **వాక్ తేజస్సుగా నశించదు.**

ఏదైతే చూచుశక్తిగా కనబడుచున్నదో, అట్టి దృక్శక్తిగా ప్రాణతేజస్సే ప్రదర్శితమగుచున్నది. చూడబడునది మారుచున్నప్పటికీ **దృక్శక్తి మారదు.**

బ్రహ్మమే ప్రాణశక్తిగా, చూపుశక్తిగా దీపించుచున్నది. చూపు శక్తికి నాశనము లేదు.

ఏది కళ్ళకు కనిపిస్తుందో, అది నశించబోతోంది. యత్ దృశ్యమ్ - తత్ నశ్యమ్! ఏది కళ్ళకు కనబడకుండా ఉన్నదో, అట్టి బ్రహ్మమే దృశ్యమువలె కళ్లకు కనిపిస్తోంది. కనుక కనిపించేదంతా కూడా మార్పుచేర్పులకు అతీతమగు బ్రహ్మమే!

ఏ తేజస్సు ప్రాణశక్తిగా అగుచున్నదో, ఆ ప్రాణతేజస్సే దేహములో 'వినికిడి శక్తి' అయి ఉన్నది. బ్రహ్మమును వినికిడి శక్తియే ప్రాణము. వినబడని ప్రాణశక్తియే వినబడే శ్రుతశక్తిగా అగుచున్నది. ఏది ప్రాణశక్తిగా ప్రకాశిస్తోందో, అదియే మనోశక్తి రూపమును దాల్చుచున్నది. మనస్సు అనగా - ఆలోచన. ఏది ఆలోచించబడుతోందో

యత్ శ్రోత్రేణ శృణోతి అథ ఏతత్ మ్రియతే।
యత్ న శృణోతి తస్య మన ఏవ తేజో గచ్ఛతి ప్రాణం।
ప్రాణ ఏతత్వై బ్రహ్మ దీప్యతే।
యత్ మనసా ధ్యాయతి, అథ ఏతత్ మ్రియతే!
యత్ న ధ్యాయతి తస్య ప్రాణమేవ
తేజో గచ్ఛతి। ప్రాణం,
ప్రాణః తావా ఏతా సర్వా దేవతాః।
ప్రాణమేవ ప్రవిశ్య, ప్రాణే నృప్త్వాన
మూర్ఛంతే। తస్మాత్ తదైవ పునః ఉదీరతే।
తత్ యది హ వా
ఏవం విద్వాంస ఉభౌ పర్వతాః
అభిప్రవర్తయాతాం
తత్ వర్షమాణో దక్షిణశ్చ – ఉత్తరశ్చ
న హై వైనంస్తు తృణ్వీయాతామ్
అథ య ఏనం ద్విషంతి
యాంశ్చ స్వయం ద్వేష్టి।
త ఏవం సర్వే పరితో మ్రియంతే।

అది నశిస్తోంది (మార్పు చెందబోతున్నది). కానీ **ఆలోచనాశక్తి నశించుటలేదు.** ఏది ఆలోచనకు విషయముకాదో, ఆలోచించబడటము లేదో...అదీ ప్రాణశక్తియే! ఆలోచించునది- ప్రాణశక్తి! **ప్రాణశక్తియే బ్రహ్మము.**

ప్రాణము తేజస్సునందు ప్రవేశించుచున్నది. దేహములోని సర్వ ఇంద్రియ దేవతలుగా ప్రాణశక్తియే రూపుదాల్చుచున్నది. ప్రాణశక్తి స్వరూపులై ప్రాణమునందే దేవతలు నివశిస్తున్నారు. ఆ ప్రాణము అనంతమగు ఆత్మ శక్తియందు లయించుచూ, తిరిగి ఆత్మయందే, దేవతలతోసహా బయల్వెడలుచున్నది.

**ఇంద్రియ దేవతలు, ఇంద్రియ విషయములు, ప్రాణశక్తి...ఇవన్నీ ఆత్మయందే ఆత్మగానే ఏర్పడినవై ఆత్మరూపముగానే ఏర్పడి - లయించి తిరిగి ఆత్మరూపముననే ఏర్పడుచున్నవగుచున్నాయి.**

ఇట్టి బ్రహ్మతత్త్వమును ఎరిగినట్టి, అర్థము చేసుకున్నట్టి విద్వాంసుడు - ఇంద్రియ దృశ్యములను, విషయములను **ఇంద్రియ శక్తి రూపంగాను,** ఇంద్రియశక్తి దేవతలను **ప్రాణశక్తిరూపంగాను,** ప్రాణశక్తిని **బ్రహ్మముగాను** గ్రహించుచున్నాడు. అట్టి యోగాభ్యాసి అవలీలగా (వింధ్య హిమాచల) ఉభయ పర్వతముల మధ్యగా ఉన్నదంతా ఉత్తర - దక్షిణ సర్వ దిక్కులలో ఉన్నదంతా తృణమును చుట్టినట్టు చుట్టగలడు. ఎవరు ఈ జగత్తు యొక్క వాస్తవరూపమగు బ్రహ్మమును ద్వేషిస్తారో...వారు తమను తామే ద్వేషించుకొంటున్నట్లు. ఎందుకనగా, తాము బ్రహ్మమే అయి, ఇదంతా బ్రహ్మమే అయి ఉన్నది కాబట్టి. బ్రహ్మము యొక్క సర్వవ్యాపకత్వ పాత్యాంశమును ద్వేషించువాడు ఆత్మ ద్వేషియే!

---

**14.** అథా అతో నిః శ్రేయస ఆదానం
సర్వాహ వై దేవతా అహం శ్రేయసే
వివదమానా, అస్మాత్ శరీరాత్
ఉచ్చక్రుముః తత్ దారు భూతం శిష్య।
అథ హైనం 'వాక్' ప్రవివేశ,
తత్ వాచా అవదః శిష్య ఏవ,
అథ హి ఏనం చక్షుః ప్రవివేశ
తత్ వాచా వద చక్షుషా పశ్యః
శిష్య ఏవ।
అథహి ఏనం శ్రోత్రం ప్రవివేశ।
తత్ వాచా వద, చక్షుషా పశ్యః
శ్రోత్రేణ శృణ్వన్ శిష్య ఏవ।।
అథ హి ఏనం మనః ప్రవివేశ।
తత్ వాచా వద, చక్షుషా
పశ్యతి, శ్రోత్రేణ శృణ్వన్
మనసా ధ్యాయః శిష్య ఏవ।
అథ హైనత్ ప్రాణః ప్రవివేశ।
తత్ తత్ ఏవ సముత్తస్థౌ తత్ దేవాః
ప్రాణే నిఃశ్రేయసం విచింత్య, ప్రాణమేవ

**ఇప్పుడు మనము 'నిః శ్రేయసా ఆదానము గురించి చెప్పుకుందాము.**

ఒకానొక సందర్భములో దేహములోని వేరు వేరు శబ్ద - స్పర్శ - రూప - రస - గంధ ఆదిగా గల దేవతలంతా ఎవరికి వారే - "మేమే గొప్ప" అని వాదోపవాదములు చేస్తూ...దేహమునుండి బయల్వెడల సాగారు. అప్పుడు దేహములో శ్వాస నిలిచి పోయింది. ఇంద్రియములన్నీ నిస్తేజమై, ఎటూ పోలేక స్థంభించిపోయినాయి.

అప్పుడు ఏం జరిగింది? మొట్టమొదటగా వాక్కు దేవత దేహములో ప్రకాశించారు. వెంటనే 'వాక్' ఇంద్రియము పనిచేస్తూ, మాటలు చెప్పటం ప్రారంభించింది. కానీ తదితర ఇంద్రియములతో సమన్వయము కుదరలేదు.

తరువాత చక్షుదేవత కూడా దేహములో ప్రవేశించారు. మరుక్షణం చంక్షురింద్రియం (కళ్ళు) చూడగలగటం ప్రారంభించాయి. అప్పుడు ఆ జీవుడు మాట్లాడటము, చూడటము ప్రారంభించాడు.

అప్పుడు శ్రోత్ర (వినికిడి) ఇంద్రియ దేవత ఆ భౌతికదేహంతో ప్రకాశించారు. అప్పుడా జీవుడు వాక్కుతో మాట్లాడుచూ, కళ్లతో చూస్తూ, చెవులతో వినటం చేయసాగాడు.

అప్పుడు **మనో దేవత** ఆ దేహంలో ప్రవేశించారు. అప్పుడా జీవుడు వాక్కుతో మాట్లాడుచూ, కళ్ళతో చూస్తూ, చెవులతో వింటూ, మనస్సుతో ధ్యానము (ఆలోచనలు) చేయసాగాడు. కానీ, ఆ శరీరములో జీవశక్తి లేకపోవటంచేత 'నిస్తేజత్వము' తొలగలేదు. ఇంద్రియదేవతల సమన్వయత్వము లేకపోయింది.

అప్పుడు ప్రాణశక్తి కూడా ఆ దేహములో ప్రవేశించసాగింది. వెంటనే ఆ దేహము జీవశక్తి పొందినదై సర్వేంద్రియములను **సమన్వయపూర్వకంగా** ఉపయోగించుకో

ప్రజ్ఞాత్మానం అభిసంస్థాయ।
సహ ఏతైః సర్వైః అస్మాత్ లోకాత్ ఉచ్చక్రముః॥
తే వాయుః ప్రతిష్ఠా,
అకాశాత్మానః స్వర్యయుః తథో ఏ వైవం
విద్వాన్ సర్వేషాం భూతానాం ప్రాణమేవ, ప్రజ్ఞాత్మానమ్
అభి సంస్థాయ। స హైః తైః సర్వైః అస్మాత్ శరీరాత్
ఉత్క్రామతి। స వాయు ప్రతిష్ఠా, ఆకాశాత్మనః
స్వరేతి, తత్ భవతి॥ యత్ర ఏతత్ దేవాః.
తత్ ప్రాప్య, తత్ అమృతో భవతి,
యత్ అమృతా దేవాః॥

సాగింది. ఇంద్రియ దేవతలందరూ ఒకరితో మరొకరు సంబంధీకులై, ఇక ఆపై ఆ జీవుడు ప్రవర్తించగలిగాడు. ఇంద్రియాలన్నిటికీ శ్రేయస్సు కలిగింది! అప్పుడు ఇంద్రియ దేవతలంతా **'మనకు త్రాణ ప్రాణశక్తియే! కనుక ప్రాణశక్తియే శ్రేష్ఠమైనది'** అని సిద్ధాంతీకరించుకున్నారు. ప్రాణదేవతకు తమను తాము సమర్పించుకున్నారు. ప్రాణదేవతతో మమేకమై ప్రాణరూపమగు వాయువునందు ప్రతిష్ఠితులై భౌతికదేహ పరిమిత శృంఖలములను విడచి, ఆకాశాత్మయందు ప్రవేశించి ప్రాణముతో సహా ఆత్మాకాశ స్వరూపులైనారు.

ఎవ్వరైతే ప్రాణాత్మయే సర్వోత్కృష్టమైనదని, ఆత్మయే ప్రాణములుగా, తదితర సర్వదేవతలుగా ప్రకాశించుచున్నదని గ్రహిస్తారో...వారు **ఆత్మత్వము ప్రాప్తించుకొను చున్నారు.** దేవతలు ఏ అమృతత్వమును పొందినారో, అట్టి అమృతత్వమును ఆ ప్రజ్ఞావంతులు పొందగలరు. పొంది అమరులై దివ్య లోకములు చేరి ఆనందించగలరు!

15. అథాతః పితా పుత్రీయం
సంప్రదానమ్ ఇతి చ ఆచక్షతే।
పితా పుత్రం ప్రేష్య–ఆహ్వయతి
న వైః తృణైః ఆగారం సంస్తీర్య అగ్నిమ్ ఉపసమాధా
యోదకుంభం స పాత్రం
ఉపనిధాయా హతేన
వాససా సంప్రచ్ఛన్నః శ్యేత
ఏత్య పుత్ర ఉపరిష్టాత్ అభినిపద్యత,
ఇంద్రియై రస్యేంద్రియాణి
సంస్పృశ్య, అపివా అస్య
అభిముఖత ఏవ ఆసీత్,
అథ అస్మై సంప్రయచ్ఛతి।
వాచం మే త్వయి దధానీతి।
పితా! వాచం తే 'మయి దధ' ఇతి।
ప్రాణంమే త్వయి దధానీతి।
పితా! ప్రాణం తే మయి
దదా ఇతి పుత్ర।
పుత్రః! చక్షుః మే త్వయి దధాని ఇతి।
పితా! చక్షుః తే మయి దధ। ఇతి
పుత్రః! శ్రోత్రం మే త్వయి మయి దధాని ఇతి।
పితా! "శోత్రం తే మయి దధ" – ఇతి।
పుత్రో! "మనో మే త్వయి దధాని" ఇతి।
పితా! "మనః తే మయి దధ" ఇతి।
పుత్ర! అన్న రసాత్ మే త్వయి దధాని – ఇతి।
పితా! "అన్న రసాం తే మయి దధ" ఇతి।

## ప్రదాన యజ్ఞము

ఇప్పుడు తండ్రి (పరమాత్మ) పుత్రుని (జీవాత్మ సంజ్ఞను) పిలిచి, అతనితో యజ్ఞమునకు సంసిద్ధుడగుచున్నాడు. ముందుగా, గడ్డి మొదలైన పదార్థములను యజ్ఞవేదికా స్థానము నుండి తొలగించి ఆ పరిసరములును పరిశుభ్రపరచుచున్నారు.

జలకుంభమును (నీటికుండను), తదితర పాత్రలతో సహా తెప్పించి పరిశుభ్రము చేయబడిన యజ్ఞవేదికపై ఉంచుచున్నారు. సుఖాశీనులగుచున్నారు. అగ్నిని ప్రజ్వలించుచున్నారు. పరిశుభ్ర వస్త్రములు ధరించి తండ్రి - కొడుకులు (పరమాత్మ-జీవాత్మ సంజ్ఞలు) ఎదురుబొదురుగా ఆసీనులగుచున్నారు.

తండ్రి కుమారుని రసేంద్రియము (నాలుక)తో సహా సర్వేంద్రియములను స్పృశిస్తున్నారు. ఒకరికొకరు అభిముఖులై (ఒకరికి ఎదురుగా రెండవవారు) ఆసీనులై ఇక (giving) **"ప్రదానము"** ఆరంభిస్తున్నారు.

**తండ్రి** : బిడ్డా! కుమారా! నీలో నాయొక్క వాక్కును ప్రవేశింపజేస్తున్నాను.

**కుమారుడు** : పిత్రుదేవా! మీరు నాయందు ప్రవేశింపజేస్తున్న 'వాక్కు'ను నేను స్వీకరిస్తున్నాను.

**తండ్రి** : నా ప్రాణశక్తిని నీలోనికి ప్రవేశింపజేస్తున్నాను.

**కుమారుడు** : మీరు నాకు ప్రసాదిస్తున్న ప్రాణశక్తిని నేను భక్తితో స్వీకరిస్తున్నాను.

**తండ్రి** : కుమారా! నాలోని చూపుశక్తిని నీయందు సవిస్తరింపజేస్తున్నానయ్యా!

**కుమారుడు** : పితృదేవా! మీరిస్తున్న చక్షు శక్తిని నేను, ఇదిగో, స్వీకరిస్తున్నాను.

**తండ్రి** : ఓ వినయుడా! నాయొక్క శ్రోత్ర (వినికిడి) శక్తిని నీయందు ప్రతిక్షేపిస్తున్నాను.

**కుమారుడు** : పిత్రుదేవా! మీరు విస్తరింపజేస్తున్న శ్రవణ - శ్రోత్ర శక్తిని నేను పొందుచున్నాను.

**తండ్రి** : బిడ్డా! నా మనోశక్తిని నీయందు ప్రకాశింపజేస్తున్నాను.

**పుత్రుడు** : ఓ పిత్రుదేవా! మీరు నాయందు విస్తరింపజేస్తున్న మనస్సు (ఆలోచనాశక్తి)ని నేను స్వీకరిస్తున్నాను.

**తండ్రి** : నాయనా! నాలోని అన్న రస దేవతారూపమగు జిహ్వేంద్రియ తత్త్వమును నీకు అందిస్తున్నాను.

**పుత్రః! "కర్మాణి మే త్వయి దధాని" – ఇతి**
**పితా! "కర్మాణి తే మయి దధ" – ఇతి।**
**పుత్రః! సుఖ – దుఃఖే మే త్వయి దధాని – ఇతి।**
**పితా! సుఖ – దుఃఖే తే మయి దధ – ఇతి।**
**పుత్ర! "ఆనందం రతిం ప్రజాతిం**
**మే త్వయి దధాని" – ఇతి।**
**పితా! "ఆనందం రతిం ప్రజాతిం**
**తే మయి దధ" – ఇతి।**
**పుత్ర! "ఇత్యాం మే త్వయి దధాని" – ఇతి।**
**పితా! "ఇతి యాన్తే మయి దధ" –ఇతి।**
**పుత్రో! "ధియో విజ్ఞాతవ్యం**
**కామాన్ మే త్వయి దధాని" – ఇతి।**
**పితా! ధియో విజ్ఞాతవ్యం**
**కామాం తే మయి దధ – ఇతి।**
**పుత్రో! అథ దక్షిణా ప్రాక్ ప్రాణ్ పరిక్రామతి।**
**తం పితా సమంత్రయతి।**
**యశో బ్రహ్మవర్చసమ్ అన్నాద్యం**
**కీర్తిస్త్వా జుషతామి। ఇతి।**
**అథ ఇతరః సవ్యమం సమన్వ వేక్షతే**
**పాణినాం అంతర్ధాయి**
**వసనం తనువా (వసనాం తేనవా) ప్రచ్ఛాద్య**
**స్వర్గాన్ లోకాన్ కామాన్**
**అవాప్ను హి। ఇతి।**
**స యహి ఏకతస్స్యాత్ పుత్రస్య**
**ఐశ్వర్యే పితా వసేత పరివా వృజే యః**
**యద్ధ్యవై ప్రయుజ్యాత్ ఏ వైసం**
**సమాపయతి। తథా,**
**సమాపయతవ్యో భవతి॥**

**పుత్రుడు** : నాన్నగారూ! మీరు అందిస్తున్న అన్నరసదైవీశక్తిని నేను పొందుచున్నవాడనగుచున్నాను.

**తండ్రి** : బాలకా! నాయొక్క కర్మఫలములను నీయందు స్థాపించుచున్నాను.

**పుత్రుడు** : మీరు అందజేస్తున్న కర్మ - కర్మఫలములను నేను అందుకుంటున్నాను.

**తండ్రి** : ముద్దుల కుమారా! నాయొక్క సుఖ-దుఃఖములు నీకు అందజేస్తున్నాను.

**పుత్రుడు** : తండ్రీ! మీరు అందించే సుఖదుఃఖములను నేను అందుకుంటున్నాను.

**తండ్రి** : కొడుకా! నాయొక్క పునరుత్పత్తి - ప్రయోజనకరమగు ఆనందరతి శక్తిని నీకు జేర్చుచున్నాను.

**పుత్రుడు** : మీరు నాకు జేర్చుచున్న ప్రజాజనక ఆనందరతి శక్తిని నేను నాయందు జేర్చుకొనుచున్నాను. ఆనందము, రతి, సంతతిని స్వీకరిస్తున్నాను.

**తండ్రి** : కుమారా! అంతరంగ చతుష్టయములలో మొదటిదగు **మనోవిభాగము**ను నీదరి జేరుస్తున్నాను.

**పుత్రుడు** : మీరు జేర్చే మనోశక్తి విభాగమును నేను అందుకుంటున్నాను. మీ మనస్సు నాయందుండునుగాక!

**తండ్రి** : నాయందలి ధీ శక్తిని (తెలుసుకొనే విజ్ఞాతవ్యశక్తిని), 'కావాలి-చేయాలి' అనే కామశక్తిని నీలో ప్రకాశింపజేస్తున్నాను.

**పుత్రుడు** : మీరు నాకు అందజేయుచున్న ధీ - విజ్ఞాతవ్య - కామశక్తులను నేను స్వీకరించుచున్నవాడనగుచున్నాను. ధీశక్తి, విజ్ఞానము, కామము, మీ నుండి నాలో ప్రవేశించి ప్రకాశించునుగాక!

**తండ్రి** : "పుత్రా! కుడివైపు తిరుగు!"... అని చెప్పి, కుమారుని మంత్రముగ్ధునిగా ఆజ్ఞాపించుచున్నారు. అప్పుడు పుత్రుడు సమంత్రయుతుడు అగుచున్నారు.

అప్పుడు తండ్రి పుత్రునితో 'బ్రహ్మవర్చస్సును పొందుము. అన్నము (ప్రకృతి)ను పొందినవాడవగుము. కీర్తిమంతుడవగుము - అని దీవిస్తున్నారు. దీవిస్తూ పుత్రుని ఎడమభుజముపై తన కుడిచేయి ఉంచు చున్నారు.

వస్త్రముతో పుత్రుని ముఖము కప్పి 'ఓ మమాత్మస్వరూపుడువగు ప్రియపుత్రకా! స్వర్గాదిసౌఖ్యము నీకు లభించునుగాక!

కుమారా! నా సర్వస్వము నీకు సమర్పించుచున్నావయ్యా! నేను జీవించి ఉన్నప్పుడు అటు తరువాత కూడా నాయొక్క తేజస్సు చే దివ్య తేజోసంపన్నుడవై 'జీవితము' అనే ఈ అవకాశమును పుష్టి చేసుకొనుము. సద్వినియోగము చేసుకొనుము - అని దీవించవలెను.

---

<u>**తృతీయోఽ ధ్యాయః**</u>

**1. ప్రతర్దనో హ వై దైవో దాసిః**
**ఇంద్రస్య ప్రియం ధామా ఉపజగామ।**
**యుద్ధేన పౌరుషేణ చ।**
**తం హి ఇంద్ర ఉవాచ:**
**ప్రతర్దన! వరం తే దదానీతి।**

## 3వ అధ్యాయము

ఒకానొకప్పుడు గొప్ప దేవ దానవ యుద్ధము జరిగింది. ఆ యుద్ధంలో ప్రతర్దనుడు దైవోదాసి (దివోదాసుని కుమారుడు) దేవతల కోరికపై ఆ యుద్ధములో పాల్గొని అనేకమంది రాక్షసులను సంహరించి, త్రిలోకాధిపతి అగు ఇంద్రునికి ప్రియం చేకూర్చారు. ఆతని సౌర్య-వీర్య-పరాక్రమాలకు, ఇంద్రుడు సంతోషించారు. దివోదాసీ పుత్రుడగు ప్రతర్దునుని తన అంతఃపురమునకు రప్పించి తన సంతోషమును తెలియజేస్తూ సన్మానించటానికై ఉపక్రమించారు.

సహోవాచ : (ప్రతర్దానోవాచ):

'త్వమేవ వృణీష్వ

యమ్ త్వమ్ మనుష్యాయ

హితతమం మన్యస' ఇతి।

<u>తం మహేంద్రౌ ఉవాచ:</u>

న వై వరం పరస్మై వృణీతే

త్వమేవ వృణీష్వ।

ఏతత్ద్ధి వరో వైతర్హి కిల మ ఇతి।

సహోవాచ – ప్రతర్దనోవాచ:

అథో ఖలు ఇంద్రః సత్యాదేవ నేయాయః

సత్యం మహీంద్రః।

సహో వాచ (మహేంద్రౌవాచ):

మామ్ ఏవ విజానీహి ఏతదేవ,

అహం మనుష్యాయ హిత తమం

మన్యే యత్ మాం విజానీయాం

త్రిశీర్షాణం త్వాష్ట్రమ్ అహనమ్

అవాక్ – ముఖాని యతీంతు

సాలావృకేభ్యః ప్రాయచ్ఛం

బహ్వీః సంధా అతిక్రమ్య దివి।

ప్రహ్లాదీన తృణమ్ అహమ్। అంతరిక్షే

పౌలోమాన్ పృథివ్యాం కాలకాశ్యాం

తస్య మే తత్ర న లోమచనామ్ ఈయతే।

స యో మాం విజానీయాత్

న అస్య కేనచ కర్మణా లోకో

మీయతే, న మాతృవధే,

న పితృ వధేన, న స్తేయేన, న భ్రూణహత్యయా

న అన్య పాపంచ, న చ చక్షుషో,

కృష్ణోముఖాత్ నీలం వేత్తీతి।

**దేవేంద్రుడు** : ఓ ప్రతర్దనా! నీవు దేవతలకు అందించిన సేవలకు మేమెంతో సంతోషించామయ్యా! నీకు ప్రియమైన ఏదైనా వరము ప్రసాదించదలచాము. కనుక ఏదైనా వరము కోరుకో! సంతోషంగా ఇస్తాను.

**ప్రతర్దనుడు** : ఓ మహేంద్ర భగవాన్! నేను మీ సేవగా యుద్ధములో పాల్గొన్నానే తప్పితే, ఏదీ కోరికాదు. అయినా కూడా మహనీయులగు మీ ఆజ్ఞను శిరసావహించకుండా ఉండలేను. అందుచేత మానవులకు ఏదైతే మహత్తరమైన హితము (హితతమము) అయి ఉన్నదో అది మీరే నిర్ణయించి ప్రసాదించండి!

**మహేంద్రుడు** : మానవులకు ఉత్తమ వరము - అని అడుగుచున్నావు కదా! నీకు ఏది ఉత్తమోత్తమమో అది నేను - నిర్ణయించి నీకు ఇచ్చుట మర్యాద కాదయ్యా! నీవే నీకు కావలసినదేదైనా వరము కోరుకో!

**ప్రతర్దనుడు** : స్వామీ! మీరు త్రిలోకాధినేతలు. సత్యస్వరూపులు. ఇంద్రియములకు అధినేత. 'ఇంద్రుడు అనగా సత్యము' అని లోకప్రసిద్ధి. అందుచేత నా కొరకు మీ **సత్య స్వరూపమును** విశదీకరించమని అర్థిస్తున్నాను.

**మహేంద్రుడు** : నాయనా! నీవు తెలివిగా పరమ సత్యమగు బ్రహ్మమును గురించే అడుగుచున్నావు. **"నేను సత్యస్వరూపమగు పరబ్రహ్మము నేనయ్యా! 'సర్వేంద్రియానంద స్వరూపుడునగు నేను మహత్తరుడను! సర్వజన ప్రియుడను"** - అని నన్ను తెలుసుకో! మూడు ముఖములుగల త్వష్టుని (వృత్రాసురుని) సంహరించిన వాడను. అనగా-జాగ్రత్ స్వప్న-సుషుప్తి త్రివృత్తులను జయించి, ఆ మూడింటికి ఆవలగల తురీయుడనుగ అవాక్ ముఖుడను. ఇంద్రియములకు ఆవల ప్రకాశించు వాడను. సాలావృతములను (అడవి కుక్కలను- 4 వేదములను) అతిక్రమించి ఉన్నవాడను. నిత్యాత్మ ప్రకాశకుడను. ఆత్మస్వరూపుడనగు నన్ను ఆశ్రయించుటచే జీవులకు ఉత్తమ లోకములగు దివిలోకము మొదలగునవి ప్రసాదించువాడను.

త్రిలోకాధిపతి ధర్మము నిర్వర్తిస్తూనే **ప్రతి ఒక్కరి ఆత్మస్వరూపుడను**. భక్తి జన పరాధీనుడను. అందు చేతనే మహాభక్తుడగు ప్రహ్లాదుని కోరికను బద్ధుడనై ఆయన పాలనలోని ప్రజలకు దివ్యలోకములను అనుగ్రహించాను. అంతరిక్షంలోని పౌలోమజనులకు, భూమిపై కాలకేశ్యులకు దేవతాలోక ప్రాప్తిని కలుగజేశాను.

జీవుల స్వస్వరూపమే అయి ఉన్న నా మహేశ్వర రూపము తెలుసుకున్న వారు ఇక ఏ కర్మలకు బద్ధులు కారు. జీవులు వారి వారి లోకములతో పాపములు చేసి ఉన్నప్పటికీ, మాతృవధ - పితృవధ - దొంగతనము - భ్రూణహత్య మొదలైన మహాపాపములు చేసియున్నవారు కూడా, వారి ఆత్మ స్వరూపుడనైయున్న నన్ను తెలుసుకొంటే, - ఇక వారు పాప పర్యవసానముల గురించి భయపడనక్కరలేదు! పవిత్రమగు ఆత్మ జ్ఞానముచే వారు నా వలన ఉత్తమలోకములు పొందగలరు.

---

**2.** <u>సహోవాచ। (మహేంద్రౌవాచ)</u>

ప్రాణోఽస్మిన్ ప్రజ్ఞాత్మా। తం మామ్

ఆయుః। అమృతమ్ ఇతి।

ఉపాస్స్వాయుః (ఉపాత్ ప్రాయుః)।

ప్రాణః ప్రాణో వా ఆయుః ప్రాణ ఉ వా

అమృతం యావత్

అస్మిం శరీరే ప్రాణో వసతి,

తావత్ ఆయుః ప్రాణేన హి ఏవ

నేను సర్వ జీవులలోని ప్రాణస్వరూపుడను! సర్వులలోని కేవల ప్రజ్ఞాస్వరూపునిగా నన్ను ఉపాశించు. ఆయువు (ప్రాణస్వరూపం)గా అమృతస్వరూపంగా నన్ను దర్శించు.

ప్రాణమునకే ప్రాణమగు ఆత్మరూపుడను! ప్రాణమే జీవజగత్తు, జీవుడు కూడా! అట్టి ప్రాణమునకు ప్రాణమగు ఆత్మ - అమృతము. మృతము లేనట్టిది. జీవాత్మ సర్వదా అమృతస్వరూపుడే. అట్టి జీవాత్మ ఈ భౌతిక దేహములో శ్వాస ఉన్నంతవరకే వర్తమాన దేహంతో నివసిస్తున్నాడు.

**శ్వాస యొక్క ఉపాసనచే ఈ జీవుడు ఇక్కడే అమృతత్వము పొందగలడు.**

**ఆముష్మిన్ లోకే అమృతత్వమ్ ఆప్నోతి। ప్రజ్ఞ యా**
**సత్య సంకతల్పః స యో మ ఆయుః అమృతమ్ ఇతి,**
**ఉపాస్తే సర్వమ్ ఆయుః। అస్మిన్**
**లోకే ఆప్నోతి అమృతత్వం అక్షితం, స్వర్గే లోకే।**
**తద్ధైక అహుః ఏక భూయం వై**
**ప్రాణా గచ్ఛంతి ఇతి । నహి**
**కశ్చన శక్నుమ్ యాత్ సకృత్**
**వాచా నామ ప్రజ్ఞాపయితుం**
**చక్షుషా రూపం, శ్రోత్రేణ శబ్దం, మనసా ధ్యాతమ్,**
**ఇతి। ఏక భూయం (భూత్వా) వై**
**ప్రాణాభూత్వా ఏకైకం**
**సర్వాణిఏవ ఏ తాని ప్రజ్ఞాపయంతి।**
**వాచం వదతీం**
**సర్వే ప్రాణా అను వదంతి, చక్షుః పశ్యతి,**
**సర్వే ప్రాణా అనుపశ్యంతి,**
**శ్రోతం శృణ్వతి....**
**సర్వే ప్రాణా అనుశృణ్వంతి।**
**మనో ధ్యాయతి....సర్వే,**
**ప్రాణా అనుధ్యాయంతి।**
**ప్రాణః ప్రాణం తం సర్వే ప్రాణా అనుప్రాణంతి।**
**ఇతి ఏవమ్ హ ఏవై తదితి హి।**
**<u>మహేంద్ర ఉవాచ:</u>**
**అస్తి ఇత్యేవ ప్రాణానాత్ నిశ్రేయ సాదానమితి।**

ప్రజ్ఞ-సత్య సంకల్పములచే జీవుడు అమరత్వము పొందగలడు. ఎవ్వరైతే నన్ను - జీవాత్మగా, పరమాత్మగా కూడా ఉన్నట్టివానిగా ఉపాసిస్తారో, వారు నానుండి ఈ స్వర్గలోకమునందు నివాసము పొందుచున్నారు. అమృత స్వరూపులై అమరులై అక్షితి పొందగలరు. స్వర్గలోకవాసులై ఆనందించగలరు.

ఇంకా దేహములోని - విశ్వములోని ప్రాణతత్త్వము గురించి ఈ విధంగా ప్రాణ - ఆత్మ యోజ్ఞగలచే చెప్పబడుతోంది. ప్రవచనములుగా బోధించబడుతోంది. ఈ దేహములోని ప్రాణశక్తి అనంత ప్రాణశక్తిలోని అద్వితీయ విభాగమే అయి ఉన్నది. అనంత ప్రాణశక్తి నుండియే వ్యష్టి ప్రాణశక్తిగా బయల్వెడలి, దేహమునగల ప్రాణశక్తిగా కూడా ఉన్నది. అనంత ప్రాణశక్తియొక్క సంబంధము లేకపోయినట్లైతే వాగింద్రియం పలుకులు పలకలేదు. కళ్ళు రూపములు చూడలేవు. చెవులు శబ్దములు వినలేవు. మనస్సు ధ్యానము (ఆలోచనము) చేయలేదు. అనంత - అఖండ ప్రాణశక్తియే ప్రజ్ఞారూపంగా దేహములలో పంచప్రాణములుగా ఏకరూపము అయి - ప్రజ్ఞాపన (తెలివి) రూపములగు సర్వ శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ ఇంద్రియ కార్యములు నెరవేరుస్తోంది. విశ్వప్రాణశక్తి - దేహములోని పంచ ప్రాణ రూపములు ఏకరూపము దాల్చియే - ఈ విశ్వములోను, దేహములోను ఆయా సర్వ కార్యక్రమములు నిర్వర్తిస్తోంది. ఈ నోరు మాటలు మాట్లాడటానికి గాని, ఈ కళ్ళు చూడగలగటానికిగాని, ఈ చెవులు వినగలగటానికిగాని, ఈ మనస్సు ఆలోచించటానికిగాని సర్వ ప్రాణము (విశ్వప్రాణము + దేహములోని పంచప్రాణాలు) దేహమునందు ప్రాణశక్తిని ప్రదర్శించుటచేతనే జరుగుతోంది.

ప్రాణశక్తి ప్రాణ-అపాన- వ్యాన - ఉదాన - సమాన (పంచ) ప్రాణములు క్రియలు నిర్వర్తించుట చేతనే ఉచ్ఛ్వాస నిశ్వాసలతో దేహము నిలుస్తోంది. ప్రాణమును ఉజ్జీవింపజేయుటచే ప్రాణచర్యా మహిమచేత ప్రాణశక్తి సర్వ కార్యములు నిర్వర్తిస్తోంది. అందుచేత **ఈ ఇంద్రియములు ఈ జగత్ దృశ్యము - ఇదంతా ప్రాణశక్తి ప్రదర్శనమే!**

ఓ ప్రతర్దనా! ఇదంతా కూడా నిశ్రేయమగు ముఖ్య ప్రాణము (సప్రాణము) యొక్క మధురమైన సంప్రదర్శనమే! సాదానమే! **ప్రాణశక్తి సంప్రదర్శనమునకు వేరుగా ఎక్కడా ఏదీ లేదు.**

---

**3. జీవతి వాగపేతో, మూకాని**
**విపశ్యామో, జీవతి। చక్షుః అపేతో,**
**అంధాని విపశ్యామో జీవతి।**
**శ్రోత్రాఽపి ఏతో బధిరాని విపశ్యామో, జీవతి।**
**బాహుచ్ఛిన్నో జీవతి, ఊరుచ్ఛిన్న।**
**ఇత్యేవం హి పశ్యామ।**
**ఇతి ప్రాణ ఏవ ప్రజ్ఞా ఆత్మే ఇదం**
**శరీరమ్ పరిగృహ్యో ఉత్థాపయతి।**
**అథ ఖలు తస్మాత్ ఏతమ్ ఏవ**
**ఉక్థమ్ ఉపాసీత యో వై ప్రాణః సా ప్రజ్ఞా।**
**యా వా ప్రజ్ఞా, స ప్రాణః।।**
**సహహి ఏతావత్ అస్మిన్**
**శరీరే వసతః, సహ ఉత్క్రామతః తస్యైషైవ దృష్టిః।**
**ఏతత్ విజ్ఞానం యత్ర ఏతత్**
**పురుషః సుప్తః స్వప్నన్ న కంచన పశ్యతి।**

ప్రాణశక్తి చేతనే ఇంద్రియ శక్తులు జీవిస్తున్నాయి. అంతేగాని ఇంద్రియ శక్తులచే ప్రాణము జీవించటం లేదు సుమా!...ఎందుకంటావా? ఒకని నోరు మాట్లాడలేకపోయిందనుకో! అయినా కూడా ఆతడు మూగవాడుగా జీవిస్తున్నాడు కదా! కళ్ళతో చూడలేనివాడు గ్రుడ్డివాడుగా జీవిస్తూనే ఉన్నాడు. చెవులతో వినలేనివాడు కూడా చెవిటివాడుగా జీవిస్తూనే ఉన్నాడు.

బహుచ్ఛిన్నుడు (మనస్సు ఒకచోట నిలువలేనివాడు) కూడా ఊరుచ్ఛిన్నుడై (పిచ్చివానిగా) జీవిస్తూనే కనిపిస్తున్నాడు కదా! కాళ్ళు చేతులు లేనివాడు కూడా జీవిస్తూనే ఉన్నాడు.

ప్రాణశక్తి చేతనే ప్రజ్ఞాత్మ (బుద్ధి) కూడా ఈ శరీరమును స్వీకరించుచూ, పనిచేయించగలుగుతోంది.

అందుచేత **'ప్రాణశక్తిచే అన్నీ పొందవచ్చు'** అని నిరూపించబడుతోంది. అందుచేత ప్రాణతత్త్వమే ముఖ్యముగా ఉపాశించబడవలసినది.

ప్రాణమే (ప్రాణశక్తియే) ప్రజ్ఞాత్మ। ప్రజ్ఞాత్మయే ప్రాణము కూడా!

ఈ శరీరములో ప్రజ్ఞాత్మ - ప్రాణము ఏకరూపములే అయి వర్తిస్తున్నాయి.

**యథా అస్మిన్ ప్రాణ ఏవైకధా భవతి తథైనం**
**వాక్ సర్వైః నామఅభిః సహ ఆప్యేతి చ**
**మనః సర్వైః రూపైః సహా ఆప్యేఉతి।**
**శోత్రం సర్వైః శబ్దైః సహా ఆప్యేఉతి।**
**మనః సర్వైః ధ్యాతైః సహా ఆప్యేఉతి।**
**స యదా ప్రతిబుద్ధ్యతే।**
**యథాగ్నేః జ్వలతో విస్ఫులింగా**
**విప్రతిష్ఠేరన్ న ఏవమ్ ఏవై।**
**తస్మాత్ ఆత్మనః ప్రాణా**
**యథా ఆయతనం విప్రతిష్ఠింతే**
**ప్రాణేభ్యో దేవా। దేవేభ్యో లోకాః।**
**తస్యైష ఏవ సిద్ధిః, ఏతత్ విజ్ఞానం**
**యత్ర ఏతత్ పురుష ఆర్తో మరిష్యన్**
**న బల్యం న్యేత్య మోహం నేతి తదాహుః**
**ఉదక్రమీః చిత్తం న శృణోతి। న పశ్యతి।**
**న వాచా వదతి। యథా, అస్మిన్ ప్రాణ ఏవై కథా భవతి, తథైనం**
**తథై 'వాక్' సర్వైః నామభిః సహ ఆప్యేతి।**
**చక్షుః సర్వై రూపైః సహా ఆప్యేతి।**

ప్రజ్ఞాత్మయే 'దృష్టి' (perception) రూపముగా ఉంటున్నది. దృష్టియే జగత్తు! ఈవిధంగా, ఈ సర్వము ప్రజ్ఞాత్మరూపమే! ప్రాణశక్తి రూపమే!

ప్రజ్ఞాత్మ అనగా? జాగ్రత్‌లోని దృష్టికి విజ్ఞానము (ఎరుక, తెలివి) పరిమితము కాదు. (ఇక్కడి జాగ్రత్‌లోఈ జీవుని తెలివితేటలు రూపపరిమితంకాదు). ఈ జీవుడు నిద్రించి కలకంటున్నప్పుడు  ఇంద్రియములను ఉపయోగించటం లేదు. గాఢనిద్రలో ఉన్నప్పుడో! జాగ్రత్ - స్వప్న విషయములే ఉండుట లేదు. సుషుప్తిలో వాక్కు, కళ్ళు, చెవులు, మనస్సు మొదలైన ఇంద్రియాలన్నీ ప్రాణమునందు లీనమై ఉంటున్నాయి. నిద్రలేవగానే? దీపం వెలుగగానే కాంతి కిరణములవలె ప్రజ్ఞాత్మ (ప్రాణశక్తి) సర్వేంద్రియములలో వ్యాపింపజేసి, విషయములను సిద్ధింపజేయుచున్నది. అనగా తిరిగి ఇంద్రియ శక్తులను ప్రాణశక్తి తమతమ స్థానములలో నిలుపుచున్నది.

ప్రాణశక్తి నుండి నిద్రాణమైన ఇంద్రియశక్తులు, మనస్సు, ధ్యాస బయల్వెడలు చున్నాయి. జాగ్రత్‌లో - విస్ఫులింగమువలె ప్రకటితమగుచున్నాయి. ఇంద్రియ విషయములుగా ఇంద్రియ జగత్తుగా ప్రదర్శితమగుచూ ప్రకాశమానమగుచున్నది ప్రాణశక్తియే! ఆత్మయే ప్రాణశక్తిగా ప్రదర్శితమగుచున్నది

ప్రాణశక్తియే ఇంద్రియ దేవతల రూపముగాను (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాది దివ్యశక్తుల రూపమున) దైవీతత్వములగాను, లోకముల రూపముగాను **విద్యమాన మగుచున్నాయి**. అందుచేత సర్వమునకు ఆధారము, ఆధేయముగా ఉన్నది ఆత్మయే! ఆత్మయే ఇదంతా!

---

**4. స యదా అస్మాత్ శరీరాత్**
**ఉత్క్రామతి 'వాక్' అస్మాత్ సర్వాణి**
**నామాని అభివిసృజతే,**
**వాచా సర్వాణి నామాని ఆప్నోతి।**
**ప్రాణోఅస్మాత్ సర్వాన్ గంధాన్ అభిసృజతే।**
**ప్రాణేన సర్వాన్ గంధాన్ ఆప్నోతి।**
**చక్షుః అస్మాత్ సర్వాణి రూపాణి**
**అభివిసృజతే, చక్షుషా**
**సర్వాణి రూపాణి ఆప్నోతి।**
**శ్రోత్రమ్ అస్మాత్ సర్వాం శబ్దాని**
**అభివిసృజతే, శ్రోత్రేణ**
**సర్వాం శబ్దాన్ న ఆప్నోతి।**
**మనో అస్మాత్ సర్వాణి ధ్యాతాని**
**అభివిసృజతే, మనసా సర్వాణి ధ్యాతాని న ఆప్నోతి।**
**స ఏషా ప్రాణే సర్వాప్తిః యోవై ప్రాణః, సా ప్రజ్ఞా।**
**యావా ప్రజ్ఞా, స ప్రాణః ।**
**సహ హి ఏతావత్ అస్మిం శరీరే**
**వసతః సహా ఉత్క్రామతో అథో ఖలు**
**యథా ప్రజ్ఞాయాం**
**సర్వాణి భూతాని ఏకీ భవంతి।**
**తత్ వ్యాఖ్యాస్యామః ॥**

ఈ శరీరములోని ఇంద్రియ దివ్యశక్తులు, మనస్సు పనిచేస్తూ ఉన్నాయి కదా! ఇప్పుడు ఈ జీవుడు దేహమును విడచినప్పుడు ఏమేమి తనవెంట తీసుకొనిపోవుచున్నాడు? విను. వాక్ ఇంద్రియము తన జ్ఞప్తులను, సంస్కారములను ప్రాణదేవతకు అందిస్తోంది.

ప్రాణశక్తితోబాటే సమస్త వాసనలను (All Jenencies) ఆత్మ స్వరూపుడగు జీవుడు తనవెంట కొని పోవుచున్నాడు. ప్రాణము సర్వ గంధములను (సంస్కారములను) ఇంద్రియములనుండి సమీకరించుకొంటోంది.

నేత్రములు తాము జీవితమంతా చూస్తూ ఉన్న అనేక అభిరుచుల యొక్క సానుకూల - వ్యతిరిక్త జ్ఞాపకములన్నీ (సంస్కారరూపంగా) ప్రాణమునకు సమర్పించుచున్నది. అట్లా సమర్పించినవానిని ప్రాణము స్వీకరించినదగుచున్నది.

అట్లాగే శ్రోత్రము (చెవులు) తాము జీవితమంతా వినియున్న అభినివేశముతో కూడిన విషయములను ప్రాణశక్తికి సమర్పించి మూగబోవుచున్నది. ప్రాణశక్తి సర్వశబ్ద సంస్కారములను, జ్ఞాపకములను (సూక్ష్మరూపంగా) స్వీకరించి తనయందు దాచుచున్నది.

మనస్సు తన ఆవేశముతో కూడిన ధ్యాసలన్నీ ప్రాణదేవతకు సమర్పించుకుంటూ దేహమును విడుస్తోంది. ప్రాణశక్తి ఆ ధ్యాసలను మనస్సునుండి స్వీకరించి తనయందు సూక్ష్మరూపంగా నిక్షిప్తం చేసుకుంటోంది.

ఏదైతే సర్వ ఇంద్రియముల నుండి జ్ఞాపక - సంస్కారముల రూపంగా పొందుతొందో, అట్టి **ప్రాణశక్తి స్వయముగా ప్రజ్ఞరూపమే అయియున్నది.**

**ఏది ప్రజ్ఞయో, అదియే ప్రాణము కూడా!** ఈ రెండూ ఏకరూపమే అయి, శరీరములో ఉండి, ఒకానొకప్పుడు ఈ శరీరము నుండి నిష్క్రమించుచున్నది. ఏ ప్రజ్ఞ సర్వదేహములలో ఏకస్వరూపమై యున్నదో, అట్టి ప్రజ్ఞానాత్మ (ప్రజ్ఞానం బ్రహ్మ) గురించి మనము ఇప్పుడు వ్యాఖ్యానించుకొనెదము గాక ఓ ప్రతర్దనా! వినండి!

5. వాగేవ అస్యా ఏకమ్ అంగమ్ ఉదూఢం।
తస్యై నామపరస్తాత్ ప్రతివిహితా భూతమాత్రా॥
ఘ్రాణమేవ అస్యా ఏకమ్ అంగమ్ ఉదూఢం।
తస్య గంధః, పరస్తాత్ ప్రతివిహితా, భూతమాత్రా॥
చక్షురేవ అస్యా ఏకమ్ అంగమ్ ఉదూఢం,
తస్య రూపం పరస్తాత్ ప్రతివిహితా భూతమాత్రా। శ్రోత్రమేవ
అస్యా ఏకమ్ అంగమ్ ఉదూఢం।
తస్య శబ్దః పరస్తాత్ ప్రతివిహితా భూతమాత్రా॥
జిహ్వైవ అస్యా ఏకమ్ అంగమ్ ఉదూఢం,
తస్యాన్ నరసః పరస్తాత్ ప్రతివిహితా భూతమాత్రా।
హస్తావేవ అస్య ఏకమ్ అంగమ్ ఉదూఢం। తయోః కర్మపరస్తాత్
ప్రతివిహితా భూతమాత్రా। శరీరమేవ।
అస్య ఏకం అంగమ్ ఉదూఢం। తస్య
సుఖ-దుఃఖే పరస్తాత్ ప్రతివిహితా భూతమాత్రా। 'ఉపస్థ' ఏవ
అస్యా ఏకమ్ అంగమ్ ఉదూఢం, తస్యా ఆనందో రతిః ప్రజాతిః
పరస్తాత్ ప్రతివిహితా భూతమాత్రా॥
పాదావేవ అస్యా ఏకం అంగం ఉదూఢం।
తయోః ఇత్యా పరస్తాత్ ప్రతివిహితా
భూతమత్రా। ప్రజ్ఞైవ అస్యా ఏకమ్ అంగమ్ ఉదూఢం
తస్యైధియో విజ్ఞాతవ్యం
కామాః పరస్తాత్ ప్రతి విహితా భూతమాత్రా॥

**సర్వ దేహములలోని ఏకస్వరూపమగు ప్రజ్ఞ।**

ఈ జీవునిలో వాక్కు-శక్తి ఒక అంగముగా రూపము పొందుచున్నది. అది ఒక విభాగముగా ఉంటోంది. దానియొక్క బాహ్య రూపము 'నామ-రూపాత్మకము' అను భూతమాత్రరూపము! అది భౌతిక రూపము.

'ఘ్రాణశక్తి' మరొక విభాగపు అంగము. గంధము-అద్దాని బాహ్యరూపము. భౌతిక రూపము.

'చక్షు (దర్శన)' శక్తి ఇంకొక అంగరూపము. దర్శనము (కనబడునదంతా)- అద్దాని బాహ్యరూపము. అదియే భూతరూపము. (లేక) భౌతికరూపము.

వేరొక అంగము శబ్ద శక్తి. అద్దాని బాహ్యరూపము చెవులకు వినబడు సర్వశబ్దాలు! చెవులు, శబ్దము - భూతమాత్ర స్వరూపము (లేక) బాహ్యరూపము (లేక) భౌతికరూపము. జిహ్వ ఇంకొకటైన అంగము. అద్దాని బాహ్యరూపము రుచి. అది భూతమాత్ర స్వరూపము (లేక) భౌతికరూపము.

జీవునియందు రెండు చేతులు ఇంకొక విభాగము. ఆ చేతులయొక్క బాహ్యరూపము చేతలు (లేక) కర్మలు. అవి భౌతికరూపములు.

ఈ శరీర భావనాశక్తి ఇంకా ఒక విభాగము. అద్దాని బాహ్య భౌతిక రూపములు సుఖ-దుఃఖములు. ఉపస్థ మరొక శక్తి తత్వము. అద్దాని బాహ్యరూపము ఆనందము. దృశ్యజగద్రూపము ప్రజాపతి.

రెండు పాదములు మరొక విభాగము. అద్దాని భౌతిక (బాహ్య) రూపము 'నడక'.

అంతఃకరణము వేరొక విభాగము. కోరికలు, సంకల్పములు...ఇవన్నీ ఆ అంతఃకరణము యొక్క బాహ్యరూపములు. ప్రజ్ఞ ఇంకొక విభాగము. తదితరమైనదంతా తెలుసుకోవటము తెలియబడు విషయాలు. అద్దాని బాహ్యరూపము (లేక) బాహ్యధర్మము (లేక) భౌతికరూపము.

6. ప్రజ్ఞయా వాచం। సమారుహ్య వాచా సర్వాణి।
నామాని ఆప్నోతి ప్రజ్ఞయా ప్రాణం
సమరూహ్య, ప్రాణేన సర్వాన్ గంధాన్ ఆప్నోతి।
ప్రజ్ఞయా చక్షుః సమారుహ్య
చక్షుషా సర్వాణి రూపాణి ఆప్నోతి।
ప్రజ్ఞయా శ్రోత్రం సమారుహ్య
శ్రోత్రేణ సర్వాన్ శబ్దాన్ ఆప్నోతి।
ప్రజ్ఞయా జిహ్వాం సమరూహ్య,
జిహ్వయా హి సర్వాన్ అన్నరసాని ఆప్నోతి।
ప్రజ్ఞాయా హస్తౌ సమారుహ్య హస్తాభ్యాం
సర్వాణి కర్మాణి ఆప్నోతి।
ప్రజ్ఞయా శరీరం సమారుహ్య శరీరేణ సుఖ-దుఃఖే ఆప్నోతి।
ప్రజ్ఞాయా ఉపస్థం సమారుహ్య
ఉపస్థేన ఆనందం రతిం ప్రజాతిమ్ ఆప్నోతి।
ప్రజ్ఞయా పాదౌ సమారుహ్య
పాదాభ్యాం సర్వా ఇత్యా ఆప్నోతి।
ప్రజ్ఞయైవ ధియం సమారుహ్య
ప్రజ్ఞయైవ ధియో విజ్ఞాతవ్యం కామాన్ ఆప్నోతి।

అయితే, సర్వము గ్రహించుచున్నది (లేక) గుర్తించుచున్నది. (లేక) గమనించు చున్నది ప్రజ్ఞయే! సర్వము వాక్ - అర్థరూపంగా గమనిస్తున్నది, స్వీకరిస్తున్నది ప్రజ్ఞయే! ప్రజ్ఞయే 'ప్రాణము' అనే నామమాత్రరూపము పొంది, ఆ ప్రాణశక్తితో 'ఇది గంధము' అని గ్రహిస్తోంది. ప్రజ్ఞయే చక్షువులను ఉపయోగించి, ప్రజ్ఞారూపము అయినట్టి సర్వరూపములు పొందుతోంది.

ప్రజ్ఞయే శ్రోత్రము (వినికిడి శక్తి) రూపము ఆశ్రయించినదై సర్వశబ్దరూపమును పొందుచున్నది.

ప్రజ్ఞయే జిహ్వరూపము దాల్చినదై బాహ్యమున రుచిగా, పదార్థములలోని అన్న రస స్వరూపమై ఉంటున్నది.

ప్రజ్ఞయే 'చేతులు' రూపముగా అయి, బాహ్యమున సర్వకర్మల రూపమున చెన్నొందుచున్నది. (దేహికి దేహము ఐహిక మోహము)

ప్రజ్ఞయే 'శరీరము' రూపముగా అగుచూ సుఖదుఃఖ కల్పనల రూపముగా కూడా ప్రకాశమానమగుచున్నది.

ప్రజ్ఞయే 'ఉపస్థ' రూపము దాల్చినదై, ఆనందరతిరూపముగా బాహ్యమున ప్రదర్శితమగుచున్నది.

ప్రజ్ఞయే పాదశక్తి రూపము దాల్చినదై, బాహ్యమున చలన శక్తిగా ప్రవర్తితమగుచున్నది. ప్రజ్ఞయే ధీశక్తి (బుద్ధి) రూపము దాల్చినదై, బుద్ధితో బాహ్యమున తెలియబడు సర్వకామముల స్వరూపము ధారణచేయుచున్నదగుచున్నది.

7. నహి ప్రజ్ఞాపేతా 'వాక్' నామ కించన (ప్రజ్ఞపయే)
ప్రజ్ఞాపయేత్, అన్యత్ర మే మనో ఆభూత్।
ఇత్యాహ నాఽహమ్ ఏతం శబ్దం, నామ
ప్రాజ్ఞాసిషమితి।
నహి ప్రజ్ఞాపేతః ప్రాణో గంధం
కంచన ప్రజ్ఞాపయేత్, అన్యత్ర మే
మనో ఆభూత్ ఇతి ఆహ నామ ఏతమ్
'గంధం ప్రజ్ఞాసిషమ్' ఇతి।
నహి ప్రజ్ఞాపేతం
చక్షూ రూపం కించన ప్రజ్ఞాపయేత్,
"అన్యత్ర మే మనో ఆభూత్।
ఇత్యాహ। నాఽహమ్ ఏతత్ రూపం
ప్రజ్ఞాసిషమ్" – ఇతి।
"నహి ప్రజ్ఞాపేతం శ్రోత్రం శబ్దం కంచన ప్రజ్ఞాపయేత,
అన్యత్ర మే మనో ఆభూత్" – ఇతి
ఆహ। నాఽహమ్ ఏతమ్ శబ్దం ప్రజ్ఞాసిషమ్ ఇతి।
"నహి ప్రజ్ఞాపేతా జిహ్వా-అన్నరసం
కంచన ప్రజ్ఞాపయేత్, అన్యత్ర
మే మనో ఆభూత్" – ఇత్యాహ
నాఽహమ్ ఏతమ్ అన్నరసం ప్రజ్ఞాసిషమ్ – ఇతి।
"నహి ప్రజ్ఞాపేతౌ హస్తౌ కర్మ కించన
ప్రజ్ఞాపయేతామ్, అన్యత్ర
మే మనో ఆభూత్" – ఇత్యాహ।
నాహమ్ ఏతత్ కర్మ ప్రజ్ఞాసిషమ్ ఇతి।
నహి ప్రజ్ఞాపేతం, శరీరం సుఖదుఃఖే కించన
"ప్రజ్ఞాపయేత్ అన్యత్ర మే మనో ఆభూత్!" ఇత్యాహ।
"న అహమ్ ఏతత్ సుఖ-దుఃఖే ప్రజ్ఞాసిషమ్" ఇతి।
"నహి ప్రజ్ఞాపేత ఉపస్థ ఆనందం రతిం ప్రజాతిం
కంచన ప్రజ్ఞాపయేత్, అన్యత్ర
మే మనో ఆభూత్" – ఇత్యాహ।
"న అహమ్ ఏతమ్ ఆనందం రతిం ప్రజ్ఞాతిం
ప్రజ్ఞాసిషమ్" – ఇతి।
నహి ప్రజ్ఞాపేతౌ పాదావిత్యాం కంచన ప్రజ్ఞాపయే
తామ్, అన్యత్ర మే మనో ఆభూత్ – ఇతి ఆహ।
నాఽహమ్ ఏతమ్ ఇత్యాం ప్రజ్ఞాసిషమ్ ఇతి।
నహి ప్రజ్ఞాపేతా ధీః కంచన సిద్ధ్యేత్।
న ప్రజ్ఞా తవ్యం ప్రజ్ఞాయేత।।

**'ఎరుక' లేక 'ప్రజ్ఞ' పాల్గొననప్పుడు ఏదీ అనుభూతము కాదు.** ఉనికి పొందదు. ప్రజ్ఞత్వంతో కూడిన 'వాక్కు'తో మాత్రమే ఏదైనా విశదీకరించగలము. ఉట్టి మాటలతో, (ప్రజ్ఞ/తెలివి) తోడు లేకుండా ఉంటే, మాటలతో ఏది తెలియజేయ బడగలదు? ఒకడు పరధ్యానంగా ఉండగా ఎదుటివాడు మాటలు వినికూడా, వినకుండా ఆ తరువాత, **'అయ్యా! మీ మాటలు విన్నాను. కానీ, నా ధ్యాస ఎక్కడో ఉండటం చేత గమనించలేదండీ! మళ్లీ చెప్పండి'** అని అంటాడు కదా!

బుద్ధి తోడు కాకుండా కేవలము ప్రాణశక్తితో వాసనను 'ఇది సువాసన' అని గ్రహించగలమా? లేదు. వాసన వచ్చికూడా కూడా, **'అయ్యా! నా మనస్సు ఎక్కడో ఉన్నదండీ! అందుచేత ఆ వాసనను నేను గమనించనే లేదండీ!'...** అని అంటాము కదా!

కనుక బుద్ధి (మనస్సు) చేరినప్పుడు మాత్రమే వాసన ఇట్టిదని గమనించగలం!

'ప్రజ్ఞ' తోడై ఉండకపోతే కళ్ళు చూస్తూ ఉన్నా అది ఆ జీవునికి అనుభవమవదు. **'నా దృష్టి (మనస్సు) వేరే విషయంపై ఉన్నదండీ! అందుకని వాస్తవానికి చూడనే లేదు'** అంటాడు.

ఆ రూపమును చూస్తూ చూడనివాడై 'చూడలేదు' అనునదే సిద్ధిస్తుంది.

ఒకడు చెవులతో వింటూ కూడా ఆ శబ్దముపై మనస్సు (ప్రజ్ఞ) కేంద్రీకృతం చేయకపోతే ఆ శబ్దము - అర్థము గ్రహించలేడు. **'మీరు మాట్లాడుచున్నది నా చెవులకు చేరింది. కానీ నా ధ్యాస ఎక్కడో ఉండటం చేత నేను వినలేదు మళ్ళీ చెప్పండి!'** ... అంటాడు.

తింటున్నప్పుడు ధ్యాస రుచి మీద లేకపోతే, రుచిని గుర్తించలేము. **'నా జిహ్వతింటూ ఉండగా నా ధ్యాస మరెక్కడో ఉన్నది. అందుచేత తింటున్న దాని రుచి నేను గమనించనే లేదు'**...అని అంటాము.

ప్రజ్ఞ ఏకాగ్రం కాకపోతే రెండు చేతులతో పనిచేస్తూ ఏమి చేస్తూ ఉన్నామో గమనించనివారమే అగుచున్నాము. 'ఆ పని చేస్తున్నప్పుడు నా ధ్యాస మరెక్కడో ఉన్నది. అందుచేత అది నా చేతులతో చేస్తున్నది నేను ఏమాత్రము గుర్తించనూ లేదు. గుర్తే లేదు' అని అంటాము.

ప్రజ్ఞ (తెలివి, ధ్యాస) శరీరముపై కాకుండా మరెక్కడో బలముగా కేంద్రీకృతమైయున్నప్పుడు 'అయ్యా! నా ధ్యాస మరెక్కడో ఉండటము చేత నాకు శారీరక సంబంధమైన సుఖ-దుఃఖాలు, బాధ మొ॥నవి తెలియనే లేదు...అంటాము.

'కనుక ప్రజ్ఞ (లేక) బుద్ధి తోడవకపోతే ఇంద్రియముల విషయానుభవములు మన పట్ల అనుభవరూపములై ప్రాప్తించవు. అవి స్వతఃగా లేనివిగానే అగుచున్నాయి.

'ప్రజ్ఞ' పాల్గొనకపోతే ఉపస్థ ఆనందరతిని పొందజాలదు. "ధ్యాస ఎక్కడో ఉన్నది. నేను ఆనందము పొందటం జరుగలేదు కదా?".....అని మాత్రమే అనిపించగలదు. ఎప్పటికీ అది అనుభవరూపమును దాల్చనిదే అగుచున్నది.

'ప్రజ్ఞ'తో నిర్వర్తించబడనప్పుడు కాళ్ళు నడుస్తున్నప్పటికీ అది తెలియబడదు. 'బాబూ! నాకాళ్లు నడుస్తూ ఉన్నప్పటికీ, ఆ విధంగానడుస్తున్నప్పుడు నా ప్రజ్ఞ మరేదో మరొక విషయము గురించి ఆలోచన చేస్తూ ఉన్నది. అందుచేత కాళ్ళ నడక - (దేనిని తాకుచున్నదీ మొ॥వి) నాకు అనుభవములో లేవు'...అని అంటాము.

కేవలము తెలివితో మాత్రమే బుద్ధి పనిచేయజాలదు. విషయములు తెలియజాలవు. మనస్సు (ధ్యాస) తోడైతేనే బుద్ధి తెలుసుకోవలసినది తెలుసుకుంటోంది.

| | |
|---|---|
| **8.** న వాచం విజిజ్ఞాసీత,<br>**వక్తారం విద్యాత్।**<br>న గంధం విజిజ్ఞాసీత,<br>**ఘ్రాతారం విద్యాత్।**<br>న రూపం విజిజ్ఞాసీత,<br>**రూపవిదం విద్యాత్।**<br>న శబ్దం విజిజ్ఞాసీత,<br>**శ్రోతారమ్ విద్యాత్।**<br>న అన్నరసం విజిజ్ఞాసీత,<br>**అన్న రస విజ్ఞాతారం విద్యాత్।**<br>న కర్మ విజిజ్ఞాసీత,<br>**కర్తారం విద్యాత।**<br>న సుఖ–దుఃఖే విజిజ్ఞాసీత,<br>**సుఖ–దుఃఖయోః విజ్ఞాతారం విద్యాత్।**<br>న ఆనందం రతిం ప్రజాతిం<br>విజిజ్ఞాసీత,<br>**ఆనందస్య రతేః ప్రజాతేః**<br>**ప్రవిజ్ఞాతారం విద్యాత్।**<br>న ఈత్యాం విజిజ్ఞాసీత,<br>**ఈతారం విద్యాత్।** న మనో విజిజ్ఞాసీతమ్,<br>**మన్తారం విద్యాత్।**<br>తావా ఏతా దశైవ భూతమాత్రా<br>అధిప్రజ్ఞం దశప్రజ్ఞా మాత్రా – అధిభూతం<br>యద్ధి భూతమాత్రానస్యుః।<br>న ప్రజ్ఞా మాత్రానస్యుః<br>యద్వా ప్రజ్ఞా మాత్రానస్సుః<br>(యత్ హి ప్రజ్ఞో మాత్రాన స్యుః)<br>న భూత మాత్రాస్స్యుః॥ | **ఇంకా మహేంద్ర భగవానుడు చెప్పటం కొనసాగిస్తున్నారు.**<br>ఓ ప్రియప్రతర్దనా! ఆత్మగురించి ఎరుగుట అనగా ఏమి? విను!<br>వాక్కు, మాటలు, వాక్ ఇంద్రియము-ఇవి మాత్రమే తెలుసుకుంటే సరిపోదయ్యా! ఆ **మాట్లాడేవాడు ఎట్టివాడో**...తెలుసుకోవాలి.<br>గంధము (వాసన) గురించిన వివరాలు తెలుసుకుంటే సరిపోదు. ఆ గంధమును **ఆస్వాదించేవాడు ఎవ్వడో** తెలుసుకోవాలి.<br>ఒకానొకని రూపము తెలుసుకున్నంత మాత్రంచేత తెలుసుకోవలసి తెలుసుకున్నట్లు కాదు. రూపవిదుణ్ణి **(రూపము తెలుసుకొనుచున్న వాడిని)** తెలుసుకోవాలయ్యా! శబ్దమును తెలుసుకుంటే సరిపోదు, **వినేవాడి వాస్తవ** రూపము ఏమిటో...అదయ్యా ముఖ్యంగా తెలుసుకోవలసినది! రసము (రుచి) గురించి ఎంతగా తెలుసుకున్నా సరిపోదు నాయనా! **ఆ రసమును (రుచిని) తెలుసుకొనుచున్న రసవేత్త ఎవ్వరు - ఏమిటి** అనేది తెలుసుకోవాలి సుమా!<br>ఒకని కర్మల గురించి ఎంతగా ఏమని తెలుసుకున్నప్పటికీ సరిపోదు, ఆ **'కర్త' యొక్క సహజ రూపము** ఏదియో, ఏమియో, ఎట్టిదో తెలుసుకోవాలి.<br>ఒకానొకని యొక్క సుఖ-దుఃఖముల గురించి ఎంతగా తెలుసుకొన్నప్పటికీ, అసలైన విషయము తెలిసినట్లు కాదు।<br>ఆ సుఖ-దుఃఖములు **తెలుసుకొనుచున్న** వాని గురించి తెలుసుకోవాలి.<br>ఆనందరతి - పునరుత్పత్తిల గురించి ఎన్ని వివరాలు తెలుసుకున్నప్పటికి ఏమి ప్రయోజనం? ఆ ఆనందరతిని, **ఎవ్వరు తెలుసుకుంటున్నారో**...ఆయన గురించి - ప్రజ్ఞాతి సవిజ్ఞాతుమ్, విద్యాత్ - తెలుసుకోవాలి!<br>ఒక నడచుచున్న వాని నడతలు (About behaviour of a person) గురించి తెలుసుకుంటే చాలదు. నడతలు తనవై, **నడచుచున్నవాడు ఎట్టివాడో**...అది పరిశీలించి తెలుసుకోవాలి.<br>ఆలోచనా రూపమైన మనస్సు, అద్దాని తత్త్వము ఏమిటో వివరణలన్నీ తెలుసుకున్నా కూడా సరిపోదు. ఆ **ఆలోచనలు చేస్తున్నట్టి ఆలోచించు వాని గురించి** తెలుసుకోవాలి.<br>ఈ విధంగా వాచం, గంధము, రూపము, శబ్దము, అన్నరసము, కర్మ, సుఖ- దుఃఖాలు, ఆనందరతి ప్రజాతి, ఈత్వము (నడుతలు) మనస్సు, ఇవన్నీ కూడా **తెలియబడేవి.** అది ప్రజ్ఞ యొక్క భౌతిక రూపములు. **'భూతమాత్రములు'** అని అంటారు. ఇవన్నీ ప్రజ్ఞారూపములేగాని కేవల ప్రజ్ఞ కాదు. కేవల ప్రజ్ఞామాత్రము భౌతిక రూపములుగా అగుటలేదు. భౌతిక ప్రజ్ఞారూపములు కేవల నిర్మల ప్రజ్ఞారూపం కాజాలవు. **ఈ విభేదమేమిటో గ్రహిస్తేనే స్వస్వరూప ఆత్మతత్త్వము విశదము కాగలదు.** |
| **9.** నహి అన్య తరతో రూపం కించన సిద్ధ్యేన్నో<br>ఏతన్ న నా తత్ యథా<br>రథస్య–అరేషు నేమిః అర్పితా, నాభా వరా అర్పితా<br>ఏవమ్ ఏవైతా భూతమాత్రాః<br>ప్రజ్ఞామాత్రా స్వర్పితాః।<br>ప్రజ్ఞామాత్రాః ప్రాణే అర్పితాః<br>సవా ఏష ప్రాణ ఏవ ప్రజ్ఞా<br>ఆత్మానందో, అజరో, అమృతో। | ఓ ప్రతర్దనా!<br>ఇక్కడ ఒక ముఖ్యమైన విశేషము మనము గమనించెదముగాక! ఏది ఎందులోంచి సిద్ధించినదిగా అగుచున్నదో, అది ఆ మొదటి ఆధార వస్తువుకు వేరైనది కానేకాదు. సర్వము అంతర్యామియగు ఆత్మకు అభిన్నమై, వేరు కానిదే అయి ఉన్నది.<br>ఒక రథచక్రము యొక్క నాభి యొక్క కదలిక చేతనే సర్వము కదులుతోంది కదా! **ఆత్మయొక్క కల్పనా చైతన్యమే సర్వదృశ్యమానవిశేషాలన్నీ కూడా!** భూతమాత్రమంతా (భౌతికంగా కనిపించేదంతా కూడా) ఆత్మప్రజ్ఞారూపమే! ప్రజ్ఞయందే ప్రాణశక్తి అమరిక కలిగినదై ఉన్నది. ఆ ప్రాణ శక్తి ఆత్మానందరూపమే! అజరము, అమృత స్వరూపము అగు ఆత్మయే! ఒకడు సాధువర్తనుడు అయితే |

న సాధునా కర్మణాభూయాత్
నో ఏవా సాధునా కర్మణా।
కనీయా ఏష హి ఏవ ఏనం
సాధు కర్మ కారయతి। య మన్వానున్ ఏష త్యేష
ఏవైనమ్ అసాధుకర్మ కారయతి,
తం యమేభ్యో లోకేభ్యో
నునుత్సత ఏష లోకపాలః।
ఏష లోకాధిపతిః।
ఏష లోకేశ్వరః।
సమ ఆత్మేతి విద్యాత్।
సమ ఆత్మేతి విద్యాత్।
ఇతి తృతీయోధ్యాయః

(మంచి పనులు చేసినంతమాత్రంచేత) **ఆత్మ సాధువర్తనము కాదు.** పాపకర్మలచే **ఆత్మ పాపవర్తనమూ** కాదు.

సాధు-అసాధు (మంచి-చెడు) ద్వంద్వములు జడమగు దృశ్యమునకు (లేక) ప్రకృతికి సంబంధించినవి మాత్రమే! ఆత్మయో, పురుషుడు! సర్వపురుషకారములకు కారణకారణుడు! కానీ, కర్మబద్ధుడు కాదు.

అట్టి జ్ఞానముచే ఆత్మను ఎరిగినవాడు లోకములను దాటి వేస్తున్నాడు. లోకములకు వేరై, లోకములను చూచువాడు, కల్పించుకొనువాడు, పరిపాలించువాడు, లోకములకు అధిపతి అగుచున్నాడు. ఆత్మను ఎరిగి, ఆట్టి స్వస్వరూపముతో మమేకమగువాడు లోకములకు ఈశ్వరుడై, నియామకుడై వెలుగొందుచున్నాడు. కనుక ఈ దృశ్యజగత్తులలోని కార్యాకార్యములను అధిగమించి ఆత్మను **ఎరిగినవాడు ఆత్మస్వరూపుడై,** సాక్షియై, దృశ్య- అప్రవేశకుడై ప్రకాశించుచున్నాడు.

**ఇతి తృతీయోఽధ్యాయము**

<u>చతుర్థోఽధ్యాయః</u>

**4వ అధ్యాయము**

1. గార్గ్యో హ వై బాలాకిః
అనూచానః సంస్పష్ట ఆస। సోఽయమ్
ఉశీనరేషు, సత్సు మత్స్యేషు,
కురు, పాంచాలేషు, కాశీ, విదేహి ఈష్వితి।
సద హో అజాతశత్రుం కాశ్యమ। ఏత్యో వాచ
'బ్రహ్మ తే బ్రవాణి' - ఇతి
తం హోవాచ అజాతశత్రుః సహస్రం దద్మస్త
ఏతస్యాం వాచి, జనకో, జనక ఇతి, వా ఉ జనా
ధావంతి - ఇతి।

పూర్వకాలము గార్గ్య బాలాకిర్య అనే పేరుగల ఋషీశ్వరుడు ఉండేవారు. ఆయన ఉశీనరదేశవాసి. ఒకసారి ఆయన మత్స్య-కురు-పాంచాల దేశాలలో పర్యటిస్తూ కాశీనగరం వచ్చారు. ఆ సమయంలో కాశీరాజ్యాన్ని అజాతశత్రువు అనే రాజు పాలిస్తూ ఉండేవారు. ఆయన 'విదేహాముక్తుడు' అని లోకప్రసిద్ధి. ఆ బాలాకిర్య ఋషిని సగౌరవంగా తన మందిరమునకు ఆహ్వానించి సపర్యలు - సమర్పించారు.

**బాలాకిర్య ఋషి :** ఓ అజాత శత్రు మహారాజా! మీరు విదేహరాజు జనకునితో సమానులు. మన ఈ సమాగమము సందర్భముగా మనము బ్రహ్మతత్త్వము గురించి వివరించుకొనెదము గాక!

**అది విని మహారాజు వేయి గోవులను ప్రపత్తితో అతిథి పూజా పూర్వకంగా సమర్పించారు.**

<u>2.</u> సహోవాచ బాలాకిర్య
ఏవ ఏష ఆదిత్యే పురుషః
"తమేవ అహం" ఉపాస - ఇతి?
<u>తం హోవా వాచ అజాతశ్శత్రుః</u>
మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠా।
బృహన్, పాండరవ, అసాధిష్ఠా
సర్వేషాం భూతానాం మూర్ధేతి వా
అహమ్ ఏతమ్ ఉపాస ఇతి।
సయో హి ఏతమేవమ్ ఉపాస్తే
అధిష్ఠాః సర్వేషాం భూతానాం మూర్ధా భవతి॥

**అజాతశత్రురాజు :** ఓ ఋషీశ్వరా! అవస్యము అట్లే!

**బాలాకిర్య ఋషి :** మనము కొన్ని ప్రశ్నలతో బ్రహ్మము గురించి చెప్పుకుందాము. నేను తపస్సుచే ఆదిత్యునియందు, చంద్రునియందు, తేజస్సునందు, (విద్యుత్తునందు), పంచభూతములయందు, సర్వ లోకములందు ప్రవేశించి ఉపాసిస్తూ ఉంటున్నాను.

మహారాజా! **ఆదిత్య పురుషుడగు సూర్యునిలో** నేను బుద్ధితో ధ్యానముచే ప్రవేశించినప్పుడు, సూర్యునిలో ఉండి, నేను ఆరాధించవలసిన పరమ పురుషుడెవ్వరు? అభివర్ణించవలసినది (లేక) ఆరాధించవలసినది **సూర్యునియే** (లేక) **ఆదిత్య పురుషునే** కదా? ఏమని వర్ణించాలి?

**అజాతశత్రువు :** ఆ ఆదిత్య పురుషుని నేను అభివర్ణించలేను. అయితే ఆ సూర్యతత్త్వమును 'బృహత్తరము! మహత్తరమైనవాడు! సర్వము నందు అధిష్ఠానముగా ఉన్నవాడు, ఆధారమైనవాడు, సర్వజీవులకు శిరస్సు వంటివాడు, ఈ సృష్టికే శిరస్సు' అగు ఆత్మపురుషుడే-అని ఉపాశిస్తు ఉన్నాను. ఈవిధంగా "ఆత్మ ప్రదర్శనముగా" సూర్యభగవానుని ఆరాధించువారు సర్వజీవులలో శ్రేష్ఠులు, శిరస్సు వంటి వారు సూర్యతేజస్సుచే ప్రకాశవంతులు అగుచున్నారు.

<u>3.</u> <u>స ఏవ ఏష బాలాకిర్య :</u>
'ఏవైష చంద్రమసి పురుష ఏతమేవ అహమ్
బ్రహ్మోపాస ఇతి?
<u>తం హోవాచ అజాతశత్రుః</u>

**బాలాకిర్య ఋషి :** చంద్రునిలో ప్రవేశించినప్పుడు, చంద్రునిలో ఉన్న నేను బ్రహ్మమును ఏ రీతిగా, ఏ పరమపురుషునిగా చంద్రుని ఉపాశించాలి?

**అజాతశత్రు మహారాజు :** ఆ పరమపురుషుని నేను అభివర్ణించలేను. అయితే

మా మ వై ఏతస్మిన్ సమవాదయిష్ఠాః
సోమో రాజన్ న అన్నస్య ఆత్మేతి వా,
అహమ్ ఏతమ్ ఉపాస। ఇతి। సయోహి ఏతమేవ
ఉపాస్తే అన్నస్య ఆత్మా భవతి॥

'చంద్రునిలో, తత్త్వము సోముడు! సృష్టికి రారాజు! అన్నము! బ్రహ్మమునకు అన్నము అగు చంద్రుని ఆత్మ బ్రహ్మమే అని భక్తితో ఉపాసిస్తున్నాను. ఈ విధంగా చంద్రుని ఉపాశించువాడు అన్నమునకు (సృష్టి ప్రదర్శనకు) ఆత్మగా అగుచున్నాడు.

**4.** <u>సహోవాచ బాలాకిర్య :</u>
ఏవ ఏష విద్యుతి పురుష
ఏతమేవ అహమ్ 'బ్రహ్మోపాస' ఇతి?
<u>తం హోవాచ అజాతశత్రుః :</u>
మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠాః తేజస్య ఆత్మేతివా,
అహమ్ ఏతత్ ఉపాస – ఇతి।
స యో హై ఏతమేవమ్ ఉపాస్తే తేజస్య ఆత్మాభవతి।

**బాలాకిర్య ఋషి :** విద్యుత్తులో తేజో పురుష రూపుడనై ఉన్నప్పుడు నేను ఏ పురుషుని బ్రహ్మముగా ఉపాసించాలి?

**అజాతశత్రు మహారాజు :** ఏ పురుషుడు బ్రహ్మముగా ఉపాసించాలో నాకు తెలియదు. అయితే **'ఆ పరమ పురుషుడగు బ్రహ్మమే విద్యుత్ - తేజస్సుకు ఆత్మ'**...అని మాత్రం ఉపాసిస్తున్నాను. ఈ విధంగా 'తేజస్య ఆత్మేతివా!' - అను రూపంగా ఆత్మను-భక్తితో ఉపాసించువాడు తేజస్సుకే ఆత్మ అయి విరాజిల్లగలడు. తానే అంతా తేజోరూపుడై ప్రకాశించగలడు.

**5.** సహోవాచ బాలకిర్య
ఏవ ఏషః తనయిత్నౌ పురుష
ఏతమేవ అహం బ్రహ్మోపాస ఇతి?
<u>తం హో వాచ అజాత శత్రుః</u>
మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠాః।
శబ్దస్య ఆత్మేతి వా అహమ్ ఏతమ్ ఉపాస – ఇతి।
సయోహి ఏతమేవమ్ ఉపాస్తే శబ్దస్య ఆత్మా భవతి।

**బాలాకిర్య ఋషి :** ఆకాశమునందు శబ్ద - ఉరుము రూపముగా ఉన్నట్టి నేను ఏ పరమ పురుషుడగా బ్రహ్మోపాసన చేయాలి?

**అజాతశత్రు మహారాజు :** ఏ పరమపురుషుడగు బ్రహ్మముగా మీరు ఉపాసించాలో నేను చెప్పజాలను. అయితే 'శబ్దమునకు ఆత్మగా ఉన్నది బ్రహ్మమే' అను భావనతో నేను భక్తితో శబ్దమును ఉపాసిస్తున్నాను. ఆ పరమపురుషుడగు బ్రహ్మమును శబ్దమునకు ఆత్మగా ఉపాసించుటచే-అట్టివాడు శబ్దమునకు ఆత్మగా అగుచున్నాడు.

**6.** సహోవాచ బాలకిర్య
ఏవ ఏష ఆకాశే పురుషః
తమేవ అహమ్ ఉపాస ఇతి?
<u>తం హో వాచ అజాత శత్రుః</u>
మా మ ఏతస్మిన్ సంవదిష్ఠాః।
పూర్ణమ్, అప్రవర్తి, 'బ్రహ్మ' ఇతివా
అహమ్ ఏతమ్ ఉపాస । ఇతి।
స యో హి ఏతమేవ ఉపాస్తే పూర్యతే
ప్రజయే పశుభిః నో ఏవ
స్వయం నాస్య ప్రజా పురాకాలాత్ ప్రవర్తతే।

**బాలాకిర్య ఋషి :** ఆకాశమంతా పురుషడనై ఆక్రమించుకొని ఉన్న నేను బ్రహ్మమును (పరమపురుషుని) ఏ రీతిగా ఉపాసించాలి?

**అజాతశత్రు మహారాజు :** మీరు బ్రహ్మమును ఎట్లా ఉపాసించాలో, ఏమని ఉపాసించాలో నేను చెప్పలేను. అయితే, **'పరబ్రహ్మము పూర్ణపురుషుడు! నిష్క్రియుడు-అంతటా నిండి ఉన్నవాడు! అప్రవర్తి! స్వయం బ్రహ్మము!...' ఆయనయే ఆకాశపురుషుడుగా ఉన్నారు** - అని ఆయనను నేను ఉపాసన చేస్తున్నాను. ఆకాశమును బ్రహ్మము రూపముగా ధ్యానిస్తున్నాను. ఈ విధంగా **'ఆకాశముగా ఉన్నది బ్రహ్మమే'** అని ధ్యానించువాడు గొప్ప సంతానముతో (ప్రజయా), పశుసంపదతో వర్ధిల్లగలడు. స్వయము సృష్టికి పూర్వమే ఉన్న, కాలమునకు ముందే గల కాలః కాల స్వరూపము (పురాకాల స్వరూపము) పొంది బ్రహ్మానందించగలడు.

**7** <u>సహోవాచ బాలకిర్యః</u>
ఏవ ఏష వాయౌ పురుషః తమేవ అహమ్ ఉపాస, ఇతి॥
<u>తం హో వాచ అజాతశత్రుః</u>
మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠా। ఇంద్రో వైకుంఠో అపరాజితాన్
సేనేతి వా అహమ్ ఏతత్ ఉపాస ఇతి।
స యో హి ఏతమేవమ్ ఉపాస్తే జిష్ణుః హ వై పరాజిష్ణుః
అన్యతః తత్ జ్యాయాత్ భవతి।

**బాలకిర్య ఋషి :** వాయువులో ప్రవేశించి ఉన్నప్పుడు నేను ఆత్మ - పరమ పురుషుని ఉపాసించేది ఏరీతిగా?

**అజాతశత్రుమహారాజు :** ఆ పరమపురుషుని ఏమని ఉపాసించాలో తెలిసినవాడను, చెప్పగలిగినవాడను కాను. అయితే వాయువు యొక్క ఆత్మయే ఇంద్రుడు! వైకుంఠుడగు విష్ణువు! అపరాజితుడు!' అని వాయువును భక్తితో ఆరాధిస్తున్నాను. ఈ విధముగా వాయువును బ్రహ్మముగా, పరమపురుషునిగా (నమస్తే వాయో! త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాఽసి) అని ఉపాసించువారు పరాజయము లేనివారై, జిష్ణువై (విష్ణువై) ప్రకాశించగలరు. (వాయువు - ప్రాణతత్త్వ ప్రత్యక్ష రూపము).

**8.** <u>సహోవాచ బాలకిర్య :</u>
ఏవ ఏష అగ్నౌ పురుషః తమేవ అహమ్ ఉపాస ఇతి?
తం హో వాచ అజాతశత్రుః మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠా।

**బాలకిర్య ఋషి :** అగ్నితత్త్వములో ప్రవేశించినప్పుడు నేను ఉపాసించవలసిన పరమపురుషుడు ఎవ్వరు? ఎట్టివారు?

**అజాతశత్రు మహారాజు :** ఓ ఋషీశ్వరా! అది నేను చెప్పజాలను! అయితే,

**విషా సహిః ఇతి వా అహమ్ ఏతమ్ ఉపాస। ఇతి।**
**సయో హి ఏతమేవాఽహమ్**
**ఉపాస్తే విషా సహి ర్వా ఏష భవతి!**

**'సర్వమును భస్మము చేయు అగ్నియొక్క రూపముగా ఉన్నది ఆ పరబ్రహ్మమే!'**...అని మాత్రం భక్తితో గానం చేస్తున్నాను! అగ్నియొక్క ఆత్మను బ్రహ్మముగా (పరమపురుషునిగా) ఉపాసించువాడు అగ్నివలె స్వయంప్రకాశవంతుడగుచున్నాడు!

---

**9.** <u>సహెూ వాచ బాలకిర్య</u>
**ఏవ ఏషో అప్సు పురుషః తమేవ అహమ్ ఉపాస ఇతి?**
**<u>తం హెూ వాచ అజాతశత్రుః</u>**
**మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠాః। నామ్న్యస్య ఆత్మేతివా**
**అహమ్ ఏతమ్ ఉపాస ఇతి। స యో హి ఏతమేవమ్ ఉపాస్తే**
**నామ్నో అస్య ఆత్మా భవతి,**
**ఇతి అధి దైవతమ్, అథా అధ్యాత్మమ్।**

**బాలకిర్య ఋషి :** జలములో (వరుణ) పురుషుడుగా నేను అవతరించి ఉన్నప్పుడు నేను పరమపురుషుడగు బ్రహ్మమును ఎట్లా ఉపాసించాలి?

**అజాతశత్రు మహారాజు :** అట్టి జలరూప పరమపురుషుడగు బ్రహ్మము ఎవ్వరో నాకు తెలియదు. 'ఈ వరుణ దేవుడే జలరూపుడే కాకుండా, సర్వనామ-రూపములకు ఆత్మ స్వరూపుడుగా అయి ఉన్నాడు'...అని మాత్రం నేను భక్తిగా ఉపాసిస్తున్నాను. సర్వనామములు ఆత్మభగవానునిగా ఉపాసించువారు సమస్త నామములకు తానే ఆత్మగా అగుచున్నాడు. ఆత్మయే అధిదైవతముగా, ఆధ్యాత్మముగా ఉన్నది కదా!

---

**10.** <u>సహెూ వాచ బాలకిర్య</u>
**ఏవ ఏష ఆదర్శే పురుషః తమేవ అహమ్ ఉపాస ఇతి?**
**<u>తం హెూ వాచ అజాతశత్రుః</u>**
**మా మ ఏవ ఏతస్మిన్ సమవాదయిష్ఠాః।**
**'ప్రతిరూప' ఇతివా, అహమ్**
**ఏతమ్ ఉపాస ఇతి। సయో హి**
**ఏతమేవమ్ ఉపాస్తే ప్రతిరూపో హైవా అస్య**
**ప్రజాయామ్ అజాయతే నా ప్రతిరూపః॥**

**బాలకిర్య ఋషి :** "అద్దములోనా ప్రతిబింబము 'నేనే' అయినట్లుగా జీవాత్మగా ఉన్నవాడనైన నేనే" - అని అనుకుంటూ ఉన్నప్పుడు - బ్రహ్మమును ఎట్లా ఉపాసిస్తూ, అర్థం చేసుకుంటూ ఉండాలి?

**అజాతశత్రు మహారాజు :** జీవాత్మనై పరమాత్మ (బ్రహ్మము)ను ఏ రీతిగా తెలుసుకొని ఉండాలో నాకు తెలియదు. జీవాత్మ పురుషుని పరమాత్మ పురుషుని ప్రతిరూపంగానే భక్తితో భావన చేస్తూ ఉన్నాను. పరమాత్మయే ఇహాత్మగా (జీవాత్మగా) చూచువారు సర్వుల ఆత్మరూపమే అగుచున్నారు. ప్రతిరూపిగా (జీవాత్మగా) అవరు! సర్వాత్మకుడౌతాడు. జీవాత్మయందు జీవాత్మగా కనిపిస్తున్న పరమాత్మను ధ్యానిస్తున్నాను.

---

**<u>11.</u>** <u>సహోవాచ బాలకిర్య :</u>
**ఏవ ఏష ప్రాతి శ్రుత్కాయాం**
**పురుషః తమేవా అహమ్ ఉపాస ఇతి?**
**<u>తం హోవాచ అజాతశత్రుః</u>**
**మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠా।**
**ద్వితీయో అనపగ ఇతి వా,**
**ఆహమ్, ఏతమ్ ఉపాస ఇతి। సయో హై తమ్ ఏవమ్**
**ఉపాస్తే, విందతే ద్వితీయం। ద్వితీయవాన్ భవతి॥**

**బాలకిర్య ఋషి :** నాయొక్క నీడ అయినటువంటి ఛాయ పురుషునిగా అయినప్పుడు నేను **ఆత్మోపాసను** ఎట్లా చేయాలి?

**అజాతశత్రువు :** ఆ మీయొక్క ఛాయా పురుషుని ఆత్మోపాసన గురించి, అక్కడి ఆత్మావగాహన గురించి నేను తెలిసియున్నవాడిని కాను. అభివర్ణించలేను. అయితే, "నాయొక్క ఛాయా పురుషుడు (ఉదా : నీళ్ళలోని నా ప్రతిబింబము) వెలుతురులో నానీడ (ఛాయ) నాకన్నా వేరు కాదు కదా..." అని తలచే, ఛాయాపురుషుని ఆత్మను బ్రహ్మముగా ఉపాసిస్తున్నాను. బ్రహ్మమును ఏకాత్మ స్వరూపంగా ఆరాధించువాడు ఛాయా పురుష సమేతంగా - **ఏకాత్మ స్వరూపుడై అద్వితీయత్వమును ఆస్వాదించుచున్నాడు!**

---

**<u>12.</u>** <u>సహోవాచ బాలాకిర్య :</u>
**ఏవైష శబ్దః పురుషమ్ అన్వేతి తమేవ అహమ్ ఉపాస ఇతి?**
**<u>తం హోవాచ అజాతశత్రుః</u>**
**మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠా।**
**ఆయురితీవా అహమ్ ఏతమ్ ఉపాస ఇతి।**
**సయో హై తమేవమ్ ఉపాస్తే నో ఏవ స్వయం నాస్య**
**ప్రజా పురా కాలాః 'సంమోహమ్' ఏతి॥**

**బాలాకిర్య ఋషి :** నన్ను నేను 'అహమ్' పురుషుడుగా దర్శించు సందర్భములో నేను ఆత్మను ఉపాసించు తీరు ఏమిటి?

**అజాత శత్రు మహరాజు :** నేను 'అహమ్' ప్రత్యయభావనగా ఉన్నప్పుడు 'ఆత్మ ఇట్టిది' అని నేను తెలుసుకొనియుండలేదు. వర్ణించి 'ఇది' అని చెప్పలేను. అయితే ఆ 'అహమ్' ప్రత్యయమును ఆది అంతములతో కూడిన కల్పితమగు జీవభావనగాను, బ్రహ్మమునకు అది వాస్తవానికి అభిన్నమైనదిగాను ఉపాసిస్తున్నాను. అహమ్ పురుషుని బ్రహ్మము యొక్క స్వీయ కళా విశేషముగా ఉపాసించువారు ఈ జగత్తులో దేనికీ 'సంమోహితులు' కారు!

---

**<u>13.</u>** <u>సహోవాచ బాలాకిర్య :</u>
**ఏవ ఏష చ్ఛాయాయాం**
**పురుషః తమేవ అహమ్ ఉపాస ఇతి?**

**బాలాకిర్య ఋషి :** నాయనా! నాయొక్క ఛాయపురుషకారమును (గుణములు - దేహములు - సంబంధములు - అనుబంధములు - బాంధవ్యములు ఇత్యాదులతో కూడిన వ్యష్టిత్వము) నేనేనని అనుకున్నప్పుడు...ఏవిధంగా నిత్య వస్తువును ఉపాసించాలి?

సహోవాచ అజాతశత్రుః :
మా మ ఏ తస్మిన్ సమవాదయిష్ఠా।
మృత్యురితి వా అహమ్ ఏతమ్ ఉపాస ఇతి।
సయో హి ఏతమ్ ఏవమ్ ఉపాస్తే నో ఏవ
స్వయం న అస్య ప్రజా పురా కాలాత్ ప్రమీయతే।

**అజాత శత్రు మహరాజు** : ఛాయా పురుషుడు ఎట్టివాడో నేను అభివర్ణించలేను. అయితే అద్దానిని మార్పు చెందు క్షరస్వరూపమగు మృత్యుదేవతా రూపముగా భక్తితో ఉపాసిస్తున్నాను. 'మృత్యువు ఆత్మచమత్కారమే' అను కల్పనా విభాగ విశేషంగా ఆత్మను దర్శించుచున్నాను. అట్టి ఆత్మోపాసకుడు అకాల మృత్యువు పొందడు. ఆతని సంతానమునకు అకాల మృత్యువు ఉండదు.

**14.** సహోవాచ బాలాకిర్య :
ఏవైష శారీరః పురుషః తమేవా అహమ్ ఉపాస ఇతి?
తం హో వాచ అజాత శత్రుః :
మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠాః।
ప్రజాపతిః ఇతివా అహమ్
ఏతమ్ ఉపాస ఇతి। స యో హై ఏతమ్ ఏవమ్
ఉపాస్తే ప్రజాయతే ప్రజయా పశుభిః

**బాలాకిర్య ఋషి** : దేహిగా జాగ్రత్‌లో (విశ్వుడుగా) దేహముతో ఉన్నప్పటి నేను ఉపాసించవలసిన **పరమ పురుషుడు** ఎవ్వరు? ఏది?

**అజాతశత్రు మహరాజు** : ఆ ఉపాశించవలసి పరమపురుషుని నేను వర్ణించి చెప్పలేను. అయితే ఈ దేహములో చరించుచున్న దేహిని (లేక) పురుషుని నేను 'సృష్టికర్తయగు ప్రజాపతి'గా భక్తితో కూడి ఉపాసిస్తున్నాను. ఈ విధంగా 'దేహములో ఉన్న నేను' ను ప్రజాపతికి, ప్రజాపతి బ్రహ్మమునకు చెందినదిగా ఉపాసించువారికి సంతానము, పశుసంపద సంవృద్ధి కాగలదు.

**15.** సహోవాచ బాలాకిర్య :
ఏవైష ప్రాజ్ఞ ఆత్మా యేనైతత్ సుప్తః – స్వప్నమ్ ఆచరతి
తమేవ అహమ్ ఉపాస ఇతి?
తం హోవాచ అజాతశత్రు :
మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠా।
యమో రాజేతి వా అహమ్ ఏతమ్ ఉపాస ఇతి।
సయో హ ఏ తమేవమ్ ఉపాస్తే సర్వం హాస్మా ఇదం
శ్రేష్ఠ్యాయ గమ్యత్ (యమ్యతే)।

**బాలాకిర్య ఋషి** : సుషుప్తిలో సంచారము కలిగియున్న నాయొక్క **ప్రాజ్ఞ పురుషుని**, స్వప్నములో సంచరిస్తున్న నాయొక్క **తేజస పురుషుణ్ణి** నేను ఏ రూపంగా బ్రహ్మోపాసన చేయాలి?

**అజాతశత్రువు** : ఆ ప్రాజ్ఞ (సుషుప్త పురుష) తేజస (స్వప్నపురుష) గుర్తింపు - ఉపాసనల గురించి నేను విశ్లేషించి చెప్పజాలను. అయితే అవి రెండు స్థితి - గతి -మార్పు-చేర్పులను అద్దానికి అధిపతియగు ఆత్మ స్వరూప - యమ భగవానుని ఉపాసించు చున్నాను. ఈ జాగృత్ విశ్వ - సుషుప్త ప్రాజ్ఞ - స్వప్న తేజస పురుషులను యమదేవుని (యమధర్మరాజు యొక్క) కళా విశేషాలుగా ఉపాసించువారు శ్రేష్ఠత్వము పొందుచున్నారు. బ్రహ్మముగా సంభావించుచున్నాను.

**16.** సహోవాచ బాలాకిర్య :
ఏవైష దక్షిణే అక్షన్ పురుషః తమేవ అహమ్ ఉపాస ఇతి?
తం హో వాచ అజాతశత్రు:
మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠా, నామ్న ఆత్మా అగ్నేః,
ఆత్మా జ్యోతిష, ఆత్మేతి వా
అహమ్ ఏతమ్ ఉపాస ఇతి।
సయోహై తమేవమ్ ఉపాస్త ఏ తేషాం
సర్వేషామ్ ఆత్మా భవతి॥

**బాలాకిర్య ఋషి** : నా కుడి కంటిలో నివసిస్తున్న పురుషుడెవ్వరు? ఆతనిని నేను ఎట్లా ఉపాసించాలి?

**అజాతశత్రు మహారాజు** : కుడికంటిలో నివసిస్తున్న ఆత్మపురుషుని నేను అభివర్ణించి చెప్పలేను. అయితే కుడికంటిలోని దృష్టి తత్త్వమును నేను అగ్ని-జ్యోతి స్వరూపుడగు **ఆత్మయొక్క తేజోరూపముగా** భక్తితో ఉపాసిస్తున్నాను. ఎవరు కుడికంటిలోని చూపుశక్తిని ఆత్మయొక్క జ్యోతిరూపముగా ఆరాధిస్తారో అట్టి వారు సర్వము ఆత్మ స్వరూపముగా దర్శించగలరు.

**17.** సహోవాచ బాలాకిర్య :
ఏవైష సవ్యే అక్షణ్ పురుషః
తమేవ అహమ్ ఉపాస ఇతి?
తం సహోవాచ అజాతశత్రుః
మా మ ఏతస్మిన్ సమవాదయిష్ఠాః సత్యస్య ఆత్మా విద్యుత,
ఆత్మా తేజస, ఆత్మేతివా అహమ్–ఏతమ్ ఉపాస ఇతి।
సయో హై ఏతమేవమ్ ఉపాస్త ఏతేషాం
సర్వేషామ్ ఆత్మా భవతి। ఇతి॥

**బాలాకిర్య ఋషి** : నా ఎడమకంటిలో నివసిస్తున్న నేనైన పరపురుషుని నేను ఏ విధంగా ఉపాసించాలి?

**అజాతశత్రు మహారాజు** : ఎడమ కంటిలోని నేనైన పరమపురుషుని ఏ విధంగా అభివర్ణించాలో తెలియదు. అయితే - నేను ఆ ఎడమకంటి అంతర్గత పురుషుని సత్యాత్మ-సర్వాత్మ స్వరూపునిగాను, ఆత్మాతేజో-విద్యుత్‌విలాసముగాను, స్వయమాత్మగాను భావించి ప్రేమగా ఉపాసిస్తున్నాను. ఎడమకంటి దృష్టిపురుషుని ఆత్మభావనగా ఉపాసించువారు సత్యమునకు, విద్యుత్తుకు, తేజస్సుకు ఆత్మయే తాముగా - అయిఉంటున్నారు.

**18.** తత ఉ హ బాలాకి తూష్ణీమ్ ఆస।
తం హో వాచ అజాతశత్రుః
ఏతావన్నూ బాలకా (బాలకీ) ఇతి। ఏతావత్ ఇతి-హోవాచ।
తం హో వాచ అజాశశత్రుః
మృషావై కిల మా సంవదిష్ఠా బ్రహ్మ తే బ్రవాణీతి।
ఏతేషాం పురుషాణాం కర్తా
యస్యవై తత్ కర్మ సంఘైః వేదితవ్య – ఇతి।
తత ఉ హ బాలాకిః సమిత్పాణిః
ప్రతిచక్రామ ఉపాయాని ఇతి।
తం హో వాచ అజాతశత్రుః
ప్రతిలోమ రూపమేవస్య
యద్యాత్ క్షత్రియో బ్రాహ్మణ,
ఉపనయేత్ ఏహి వ్యేవత్వా
జ్ఞపయిష్యామి। ఇతి।
తం హ ప్రాణాః అభిమథ్య
ప్రవవ్రాజ, తౌ హ సుప్తం పురుషం ఈయతుః।
తం హో అజాతశత్రుః
ఆమంత్రయాం చక్రే బృహన్
'పాండరవాసా। సోమరాజన్।' ఇతి।
స తూష్ణీమ్, ఏవ శిశ్యేత।
త ఉ హై నం యష్ట్యా విచిక్షేప।
తత ఉ ఏవ సముత్తస్థౌ।
తం హోవాచ అజాతశత్రుః
క్వైష ఏతత్, బాలాకే పురుషో
శయిష్ట? యత్ర ఏ తత్ అభూత్? యత ఏతత్
అగాత్? – ఇతి తదుహ బాలాకిః "న విజజ్ఞౌ"!

అప్పుడు బాలాకి ఋషి కొంతసేపు ఏమీ మాట్లాడనివారై మౌనము వహించారు.

**అజాతశత్రు మహారాజు** : ఓ బాలాకిర్య ఋషీశ్వరా! మీ ప్రశ్నలు ఇంతవరకేనా?

**బాలాకిర్య ఋషి** : హే మహాత్మా! అవును! నా ప్రశ్నలు ఇంతవరకే!

**అజాతశత్రువు : ఓ బాలకిర్యా! ఇప్పటివరకు మనము చెప్పుకున్న విశేషాలన్నీ మృతమ్-మృషమ్-భ్రాంతి మాత్ర విశేషాలు మాత్రమే.** ఇప్పుడు ఇక బ్రహ్మము గురించి చెప్పుకుందామా? ఎందుకంటే బ్రహ్మముయొక్క భ్రాంతి రూపములగు కర్తృత్వము కర్మ సంఘముల గురించే ఎంత వరకు చెప్పుకొని ఏమి లాభం? వీటన్నిటికీ ఆధారమైయున్న బ్రహ్మము గురించి కదా, మనం అసలు తెలుసుకోవలసింది!

(అప్పుడు బాలాకి ఋషి తనలో "**ఈ అజాత శత్రుమహారాజు నాకన్నా కూడా ఆత్మతత్త్వము ఎరిగినట్టివాడు**"...అని భావించారు).

**బాలాకిర్య ఋషి** : అయ్యా! సమిత్పాణినై (చేతిలో యజ్ఞసమిధలు ధరించి) మీకు శిష్యుడనగుచున్నాను. మీరు **ఆత్మతత్త్వమును ఎరిగే ఉపాయాలతో నాకు బోధించండి.**

**అజాతశత్రు మహారాజు** : అయ్యా! క్షత్రియుడనగు నేను తపో - అధ్యయన సంపన్న బ్రాహ్మణులగు మిమ్ములను శిష్యులుగా స్వీకరించజాలనుకదా! అయితే ఆత్మ గురించి తెలియజెప్పుకుందాము. రండి!

అప్పుడు అజాత శత్రు మహారాజు బాలాకి ఋషి చేతిని అందుకొన్నారు. వారిద్దరూ అక్కడినుండి బయలుదేరారు. వారిరువురు ప్రాణాలు అలసిపోయి, గాఢనిద్రా పరవసుడైయున్న ఒకానొక మానవుడిని (ఆత్మ విద్యను నిరూపించుకొనే నిమిత్తము) సమీపించారు!

అప్పుడు ఆ గాఢనిద్రలో ఉన్న 'జీవుని', "**ఓ తెల్లటి దుప్పటి - వస్త్రములు ధరించిన ఓ సోమరాజా!**" అని అజాత శత్రువు పిలిచారు. ఆ గాఢనిద్రపోతున్న జీవుడు నిద్రలేవలేదు. కొంత బిగ్గరగా పిలిచారు. అయినా లేవలేదు.

అప్పుడు ఒక చిన్న కర్రతో ఆ మహారాజు ఆ గాఢనిద్రలో ఉన్న వానిని గట్టిగా తట్టారు. వెంటనే ఆ గాఢ నిద్రపోవుచున్న జీవునికి మెళుకువ వచ్చి లేచి కూర్చున్నారు.

అప్పుడు అజాతశత్రు మహారాజు బాలాకిర్య ఋషితో ఇట్లా అనసాగారు.

**అజాతశత్రుమహారాజు:** హే బాలాకీ! ఈ పురుషుడు గాఢ నిద్రపోతూ ఎక్కడికి వెళ్ళి ఉన్నాడు? నిద్రలో ఎక్కడ ఉండి ఏమి చేస్తూ ఉన్నాడు? గాఢ నిద్రలోంచి నిదురలేచి ఎక్కడికి వచ్చాడు?

**బాలాకిర్య ఋషి :** గురువర్యా! మీ ప్రశ్నయే అర్థము కాలేదు. నాకిక సమాధానమూ తెలియదు - అని వేరే చెప్పేదేమున్నది?

**19.** తం హో వాచ అజాతశత్రుః
యమేవైష ఏతత్, బాలాకే!
పురుషో శయిష్ట యత్ర ఏతత్
అభూద్యత? ఏతత్ ఆగాత్?
'హితా' నామ హృదయస్య
నాడ్యో హృదయాత్
'పురీతతమ్' అభిప్రతన్వంతి
యథా సహస్రధా కేశో
విపతితః, తావత్ 'అణ్వ్యః'
పింగళ స్యాణమ్నా తిష్ఠంతే
శుక్లస్య, కృష్ణస్య, పీతస్య,

**అజాత శత్రు మహారాజు** : ఓ బాలాకీ ఋషీశ్వరా! ఈతడు గాఢనిద్రలోకి వెళ్ళినప్పుడు ఎక్కడికి వెళ్లాడు? ఎక్కడ ఉండి ఉన్నాడు? ఎక్కడి నుండి తిరిగివచ్చాడు? - అనునది యోగశాస్త్రముచే ఇట్లా వివరించబడుతోంది.

హృదయతలములో 'హిత' అనే నాడి ద్వారా ప్రయాణించి హృదయములోని 'పురీతతతము' అనే స్థానమున ఈ జీవుడు చేరాడు. ఆ 'హిత'నాడి - ఒక వెంట్రుకకు వేయవవంతు (1/1000) పరిమాణములో ఉండే సన్నటి శక్తినాడి. ఆ నాడీ మార్గము పింగళ (తెలుపు) - ఎరుపు - నలుపు - పసుపు - నీలము రంగుల విభాగములు కలిగి ఉన్నది.

అట్టి హితనాడిలో తెల్లటి భాగమును చూస్తున్నప్పుడు ఈ జీవునకు స్వప్నము ఉండదు. గాఢ నిద్రలో ఉంటాడు.

ఈ జీవుడు ప్రాణశక్తితో మమేకమై, కేవల ప్రాణశక్తి స్వరూపుడై ఉంటాడు.

అప్పుడు అతని జాగ్రత్ - స్వప్నములలోని అనుభవరూపములగు సర్వవాక్కులు - నామములు అన్నీ కూడా ఏకత్వము పొందుచున్నాయి.

**లోహితస్య – ఇతి తాసు తదా భవతి।**
**యదా సుప్తః స్వప్నం న కంచన పశ్యతి,**
**యథా అస్మిన్ ప్రాణ ఏవై కధా భవతి,**
**తథై నం వాక్ సర్వైః నామభిః సహ ఆప్యేతి।**
**చక్షుః సర్వైః రూపైః సహ ఆప్యేతి।**
**శ్రోత్రం సర్వైః శబ్దైః సహ ఆప్యేతి।**
**మనః సర్వైః ధ్యాతైః సహ ఆప్యేతి।**
**స యదా ప్రతిబుధ్యతే యథా అగ్నేః విస్ఫులింగా**
**విప్రతిష్ఠేః అన్యేవమ్ ఏవై।**
**తస్మాత్ ఆత్మనః ప్రాణా**
**యాథా ఆయతనం విప్రతిష్ఠంతే।**
**ప్రాణేభ్యో దేవా। దేహేభ్యో లోకాః।**
**తత్ యథా క్షురః క్షురధావే హి**
**ఏతస్య అస్య విశ్వంభరో వా విశ్వంభరః**
**కులాయ ఏవమేవ ఏష**
**ప్రాజ్ఞ 'ఆత్మ' ఇదం శరీరమ్ అనుప్రవిష్ట**
**ఆలోమభ్య । ఆనభేభ్యః।**

దృష్టులు సర్వరూపములతో మమేకత్వము పొందుచున్నాయి.
వినికిడి సర్వశబ్దములతో ఏకత్వము పొందుతోంది.
మనస్సు సర్వధ్యాసలతో ఏకరూపమగుచున్నది.
ఎప్పుడైతే ఈతడు నిదురలేచాడో...అగ్ని ప్రజ్వలించే తీరుగా, మొట్టమొదట ఈతని ప్రాణచైతన్యము అగ్నియొక్క విస్ఫులింగమువలె ప్రకాశమానమగుచున్నది. ఆ వెనువెంటనే ఇంద్రియ దేవతలు మేల్కొని వ్యవహార - వ్యక్తీకరణ ఉత్సాహం పొందుచున్నారు. వెనువెంటనే ఇంద్రియ విషయాలన్నీ యథారీతిగా ప్రవర్తమానమగుచున్నాయి. ఆత్మయందు మౌనరూపంగా ఉన్న ప్రాణశక్తి ఆత్మ సంకల్పముచే బయల్వెడలి, దేహమును నఖశిఖ పర్యంతరము ఉత్తేజింపజేస్తోంది.
ఆత్మనుండియే ప్రాణశక్తి (ప్రాణతత్త్వము) బయల్వెడలినదగుచున్నది.
ప్రాణశక్తి నుండి శబ్ద స్పర్శ రూప రస - ఇత్యాది దేహాంతర్గత - విశ్వాంతర్గత దేవతలు (దివ్యతత్త్వములు) బయల్వెడలుచున్నారు. ఆ దేవతల నుండి 14 లోకాలు ప్రదర్శితమగుచున్నాయి.
ఈ విశ్వమంతా భరిస్తూ విశ్వమునకు నాభివలె ప్రజ్ఞానాత్మయే ఈ జాగ్రత్‌గా దృశ్య కల్పనయందు అంతటా (ఇంద్రియానుభవ బాహ్య ప్రపంచమంతా) ప్రవర్తించుచున్నది. ఆత్మయే ప్రాణ రూపముగా దేహమునందు ప్రకాశించి, భౌతిక - అభౌతిక తత్త్వములన్నిటినీ ప్రదర్శించుచున్నదై ఉంటోంది. అందుచేత అంతా ఆత్మప్రదర్శనమే! ఆత్మకు ఇదంతా అభిన్నమే! ఎందుకంటే ఆత్మ అలోమము! అద్వితీయము! అనభేద్యము! అఖండము!

---

**20** **తమ్ ఏతమ్ 'ఆత్మానమ్'**
**ఏతమ్ ఆత్మానో అన్వ పశ్యంతి।**
**యథా శ్రేష్ఠినం స్వాస్తత్,**
**యథా శ్రేష్ఠైః తైః భుంక్తే,**
**యథావా శ్రేష్ఠినం స్వా భుంజంత**
**ఏవం శ్రేష్ఠినం స్వాస్త ఏవా అనర్థయాః ఇంద్ర**
**ఏతమ్ ఆత్మానం న విజిజ్ఞౌ**
**తావత్...ఏనమ్ అసురా అభిబభూవుః**
**స యదా విజిజ్ఞావ అథ**
**హత్వా సురాన్ విజిత్య,**
**సర్వేషాం భూతానాం శ్రైష్ఠ్యం,**
**స్వారాజ్యం ఆధిపత్యం, పర్యేతి।**
**తథో ఏవఏవం విద్వాన్**
**సర్వేషాం భూతానామ్**
**శ్రైష్ఠ్యం స్వారాజ్యం**
**ఆధిపత్యం పర్యేతి।**
**య ఏవం వేద।।**
**య ఏవం వేద।।**
**ఇతి కౌషీతకే బ్రాహ్మణోపనిషత్ సమాప్తః**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ప్రాణ - ఇంద్రియ - ఇంద్రియ దేవతల - ఇంద్రదేవ - జగద్దృశ్య - జీవ-దేహ-జాగ్రత్ - స్వప్న - సుషుప్తులతో సహా, ఈ దేహ - దేహాంతర దైవీతత్త్వ ప్రదర్శనలతో కలుపుకుని **సర్వము ఆత్మానంద స్వరూపమే!**
**ఆత్మయే అయిఉన్న సర్వ విశేష సముదాయాలను తన నుండి ఆత్మయే బయల్వెడలదీసి, ఆత్మయే ద్రష్ట అయి, ఆత్మరూపమును దృశ్యముగా సందర్శము చేస్తూ ఉన్నది.** ఏవిధంగా అయితే శ్రేష్ఠుడైనవాడు అనేక శ్రేష్ఠమైన విశేషాలు కల్పన చేసుకొని, తాను కల్పించుకొనుచున్న ఆ శ్రేష్ఠ విశేషాలన్నీ తానే ఆస్వాదిస్తూ ఉంటాడో, కొంతమంది శ్రేష్ఠులను నియమించుకొని గొప్ప కార్యక్రమము నిర్వర్తిస్తూ ఉంటాడో వారంతా ఆయా కార్యక్రమాలు నిర్వర్తిస్తూ ఉండగా, సాక్షి అయి పర్యవేక్షిస్తూ ఉంటాడో, ...ఆత్మ కూడా ఈ సర్వ ఇంద్రియ, దేవతలను, దేహములను, దిక్పాలకులను కల్పించుకొని ఇదంతా ఆస్వాదిస్తూ ఉన్నది. ఇదంతా ఆత్మకు సర్వదా అభిన్నము! ఆత్మ అద్వితీయము!
ఆత్మను ఏమరిచినప్పుడే సుఖ-దుఃఖ, బంధమోక్షాది భావాలన్నీ జీవునిచుట్టూ క్రమ్ముకుంటున్నాయి. ఆత్మజ్ఞానముచే, మొదలంట్లా పటాపంచలగుచున్నాయి. త్రిలోకాధిపతిఅగు ఇంద్రుడు ఆత్మను ఎరిగినప్పుడు ఆనందంగా లోకములన్నీ పాలిస్తున్నారు. ఆత్మను ఏమరచినప్పుడు అసురులు దండయాత్ర చేసి అమరావతిని ఆక్రమిస్తున్నారు. **ఆ ఇంద్రుడు తిరిగి ఆత్మజ్ఞాని అయి అసురులను జయించి స్వారాజ్యసిద్ధి పొందుచున్నాడు.**
అదేవిధంగా ఆత్మజ్ఞానము ఎరిగినప్పుడు ఆ విద్వాంసుడు సర్వభూతజాలమును ఆత్మ స్వరూపముగా ఎరిగినవాడై శ్రేష్ఠమగు ఆత్మస్థానమును చేరి **'స్వారాజ్యాభిషిక్తుడు'** అగుచున్నాడు. ఆత్మయొక్క శ్రేష్ఠత్వము ఎరిగి ఆత్మాభిషిక్తుడై ఈ జీవుడు పరమానందమును పొందగలడు.
***ఇతి కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్***
***ఓం శాంతిః శాంతిః శాంతిః***

ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 4 కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము

ఓం

- కేవల ప్రజ్ఞాస్వరూపము
- తత్త్వజ్ఞానముచే ఆనందరూపమై లభించునది,
- సర్వమునకు, పరము (ఆవల) అయినట్టిది,
- వాద ఉపవాదముల మాత్రంచేత లభించనిది..., బుద్ధితో ఎవరికి వారే అర్థము చేసికొని ఆస్వాదించవలసినట్టిది,
- అత్యంత సుస్పష్టమైనట్టి స్వానుభవము–అగు ఏ **స్వస్వరూపబ్రహ్మము** గురించి తత్త్వజ్ఞులచే ఎలుగెత్తి గానము చేయబడుచున్నదో..,

అయ్యది ఈ కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్ అధ్యయనముచే కరతలామలకమగును గాక! సుస్పష్టమగుచుండును గాక!

✡

పూర్వము చిత్రుడు అను గార్గ్యాయణ్ణీ గోత్రుడు ఉండేవారు. శాస్త్రముల పరమార్థము, ఉద్దేశ్యములు ఎరిగిన మహాజ్ఞాని. ఆ చిత్ర గార్గ్యాయణి ఒక సందర్భములో లోక కళ్యానార్ధం ఒక గొప్ప 'యజ్ఞము' చేయ సంకల్పించారు. అందుకొరకై గౌతమ గోత్రజ్ఞుడగు ఆరుణి మునీంద్రులవారిని దర్శించి, **"అయ్యా ! నాచేత యజ్ఞము నిర్వర్తింపజేయటానికై ఋత్విక్కులై మీరు వేంచేయండి"** అని అభ్యర్థించారు. అప్పుడు అరుణి గౌతమ మునీంద్రుడు తన కుమారుడైన శ్వేతకేతువును పిలిచి, **"బిడ్డా ! తత్త్వజ్ఞులలో శ్రేష్ఠుడుగా పేరొందిన ఈ చిత్రగార్గ్యాయని కోరిన విధంగా నీవు యజ్ఞము చేయించు. ఋత్విక్కుగా ఆ కార్యక్రమము శ్రద్ధగా దిగ్విజయము చేయి" అని ఆజ్ఞాపించారు. శ్వేతకేతువు "పితృదేవా! తమ ఆజ్ఞను శిరసావహించుచున్నాను"..** అని అంగీకారము తెలియజేశారు.

అప్పుడు శ్వేతకేతువును సమీపించి చిత్రగార్గాయణి, "ఓ గురుపుత్రా ! నేను నిర్వర్తించు యజ్ఞమునకు ఋత్వికులుగా మీకు సుస్వాగతము! నాదొక చిన్న విన్నపము. నేను ఈ లోకబుద్ధిని దాటివేసి అన్యమైనట్టి ఊర్ధ్వలోకాలకెల్లా పరాకాష్ఠ అయిన లోకము చేరవలెననే ఆశయము కలవాడను. ఋత్విక్కులగు మీరు అట్టి ఉన్నతోన్నత స్థానమును మీ యజ్ఞనిర్వహణా సామర్థ్యముచే చేకూర్చండి. పరమోత్కృష్ఠ స్థానమునకు త్రోవచూపండి !"... అని అడిగారు.

అప్పుడు శ్వేతకేతు, "మహాత్మా ! అట్టి పరమోత్కృష్టమైన స్థానము ఎట్టిదో, ఈ యజ్ఞనిర్వహణ మార్గంగా యజ్ఞకర్తను ఎట్లా జేర్చగలమో నాకు ఋత్విక్కుగా తెలియదు. సరేఁ ! ఉండండి మా పిత్రుదేవులగు ఆరుణి గౌతమ మునీంద్రుల వారితో తగు విధంగా ఈ విషయమై సంభాషించి మీ వద్దకు వస్తాను !" ... అని పలికి తన పిత్రుదేవుని సమీపించారు.

**శ్వేతకేతు :** తండ్రీ ! గౌతమారుణి మునీంద్రా ! మన చిత్రగార్గ్యాయణ్యులు – "మానవులు యజ్ఞమార్గంగా భౌతిక లోకములన్నీ దాటివేసి, సర్వమునకు వేరైనట్టి పరమోత్కృష్టము – మేధస్సుకు పరాకాష్ఠ అయినట్టి ఉత్తమోత్తమ స్థానము – అయిన పరలోకమును

చేర్చటం గురించి నన్ను అడుగుచున్నారు. అట్టి మహత్తర లోక యజ్ఞ మార్గ దర్శక గతి గురించి మీరే నాకు వివరించాలి.

**అరుణిగౌతమ: *బిడ్డా! అహమపి ఏతత్ న వేద!*** అట్టి పరమోత్కృష్ట స్థానము చేరు యజ్ఞవిధి గురించి నాకు కూడా తెలియదయ్యా ! సరే! మనము ఆ యజ్ఞము జరిగేచోటే వేదాధ్యయనము, స్వాధ్యాయనము చేస్తూ విచారణ చేద్దాము. ఆ యాగకర్తయగు చిత్రగార్గ్యాయణి తెలుసుకోవలసినది తెలుసుకున్నట్టి **విదితవేద్యుడు**. ఆయనయే మనకు – **మానవ జన్మాశయమగు ఆ పరమపదము గురించి – వ్యాఖ్యానించి చెప్పగలరని** నేను అనుకుంటున్నాను. ఒకవైపు వారి యజ్ఞము జరిపింపజేస్తూనే – మరొకవైపు వారికే శిష్యరికము చేస్తూ వారి దగ్గరే ఆ విశేషాలు విందాము.

✡

ఇట్లా అన్న తరువాత ఆ తండ్రీ కొడుకులిద్దరూ చేత యజ్ఞ సమిధలను ధరించినవారై (శిష్యభావముతో గురువుకు యజ్ఞముకొరకై కావలసిన యజ్ఞ పరికరములు చేబూనినవారై, సమిత్పాణులై) చిత్రగార్గ్యాయణి యజ్ఞము నిర్వర్తిస్తున్న ప్రదేశమును చేరుటకు సంసిద్ధులైనారు.

**అరుణిగౌతమ :** హే మహనీయా ! చిత్రగార్గ్యాయణ్యా ! మీరు మా పుత్రుడు శ్వేతకేతువును అడిగినట్టిది జన్మకర్మల చక్రమును దాటివేసి – పునర్జన్మ రహితమగు ఆత్మజ్ఞాన జనితమైన ఆత్మసాక్షాత్కారమే అయి ఉన్నది. అట్టి ఆత్మానుభూతికి యజ్ఞ మార్గమును మేము ఎరిగిన వారము కాము. అట్టి ఊర్ధ్వమార్గమును గురువులనుండి ఎరిగినట్టి ఆత్మజ్ఞులు మీరే – అని లోక ప్రసిద్ధము. అందుచేత మీ యజ్ఞమును మీచే నిర్వర్తింపజేస్తూనే, మీకు శిష్యులమై విచారణచే ఆత్మతత్త్వమును, ఆత్మ సందర్శన మార్గమును ఎరిగెదము గాక ! మాకు శిష్యత్వము అనుగ్రహించండి.

**చిత్రగార్గ్యాయణి :** హే బ్రహ్మన్ ! గౌతమ బిరుదాంకితులగు అరుణీ ! **త్వం బ్రహ్మతత్త్వజ్ఞోఽసి।** మీరు బ్రహ్మమును ఎరిగియే ఉన్నారు. కాబట్టే **"బ్రహ్మమును ఎరిగినవాడిని కాను"** అని అనగలుగుచున్నారు. నిరభి మానముగా 'తెలియదు' – అని యదార్థముగా అను వానికి తెలిసియేఉన్నది – అని కదా, ఉపనిషత్ శాస్త్రవాక్యము ! సరేఁ ! మీరు యజ్ఞస్థలమునకు నావెంట వేంచేయండి. మనము అర్థము చేసుకొను విధానంగా ప్రవచించుకొనెదముగాక !

✡

**యజ్ఞము ప్రారంభమై నిరాంటకముగా కొనసాగుచుండగా,.... ఒకానొకరోజు :**

**చిత్రగార్గ్యాయణి :** అయ్యలారా ! ఓ గౌతమారుణీ – శ్వేతకేతులారా ! వివిధ గురువులచే వివరించబడినంత వరకూ, నాకు తెలిసినంత వరకు చెప్పుకొందాము. మనము ముందుగా శాస్త్ర ప్రసిద్ధములైనటువంటి జీవులయొక్క **శుక్లగతి – కృష్ణగతి** (లేక) **పూర్వపక్ష పరపక్ష** మార్గములగురించి (గతుల లేక – మార్గముల గురించి) కొన్ని విశేషాలు వివరించుకుంటున్నాము వినండి.

జీవులంతా దేహము త్యజించిన తరువాత సూక్ష్మ (మనో) దేహముతో చంద్రమసమును (చంద్రలోకమును) చేరుచున్నారు. ఇక అక్కడినుండి రెండు మార్గములలోను ప్రయాణము కొనసాగిస్తున్నారు. 1. ఆపై ముందు ముందుకు 2. తిరిగి వెనుకటి భౌతిక లోకములకు.

**1.పూర్వ (శుక్ల) పక్ష ఆప్యాయత జీవులు : (దేవయానం):** శుక్ల (పూర్వ) పక్షములో బాహ్యమును (అన్యమును) నిరసించినట్టి అంతరంగ స్వరూపమగు ఆత్మ–తత్త్వమునందు (అనన్యమునందు) ప్రీతి కలిగి చంద్రలోకము చేరువారికి ఆ చంద్రస్థానము – ఊర్ధ్వమునగల స్వర్గలోకమున చేరటానికి – ముఖ్యద్వారముగా అగుచున్నది. వారు ఆ ముఖద్వారముగుండా ప్రయాణించి దేవతల స్థానములగు స్వర్గము మొదలైన ఊర్ధ్వలోకములను చేరుటకు ఉద్యుక్తులగుచున్నారు.

**2.అపర (కృష్ణ) పక్ష ఆప్యాయత జీవులు: (భూత–భౌతిక యానం):** వీరు బాహ్య–దృశ్యమునందు అభిరుచి పెంపొందించుకొని ఉన్నట్టివారు. కృష్ణ పక్షములో చంద్రలోకము చేరుకొనుచున్న ఈ జీవులు భూతసృష్టియందు గల ప్రీతిచేత, ధ్యాసచేత భౌతిక రూపములు పొందుచూ తిరిగి పునరావృత్తి దోషముచే భూలోకములో ప్రవేశించవలసివస్తోంది. అట్లు భూతసృష్టికి (పాంచభౌతిక దేహరూపధారణల కొరకై) తిరిగి వచ్చుచున్నవారు **వృష్టిరూపము దాల్చి వర్షించుట** – ద్వారా భూ (భౌతిక) లోకమునకు వస్తున్నారు. అట్టివారు తమ ఇతః పూర్వపు భౌతిక (పంచభూతనిర్మిత) దేహములతో నిర్వర్తించిన కర్మల ప్రభావముచే, నిర్మితమైన సంస్కారములను అనుసరించి భూమిపై కీటకము గానో, దోమగానో, తుమ్మెదగానో, పక్షిగానో, పులి–సింహము–నక్క మొ॥న జంతు రూపములుగానో, జలములో చేప

ఇత్యాది సముద్రజంతువుగానో – ఆయా గర్భములతో ప్రవేశించుటకు సంసిద్ధులగుచున్నారు. అట్టి జీవులు భూలోకమునకు వచ్చినప్పుడు ఈ భూలోకములో **"నేను ఎక్కడ ఉండాలి ? నా స్థానము ఏది ?"**... అని పలుకుచుండగా, ... వారికి కర్మదేవతల దర్శనమగుచున్నది. ఆ కర్మదేవతలు, **"మీరు ఎవ్వరు ?"** అని ఆ జీవులను ప్రశ్నిస్తున్నారు. అప్పుడు వారు, **"ఓ కర్మ దేవతలారా ! మేము చంద్రలోకమునుండి తిరిగి భౌతిక రూపములకు పునరాగమనం చేస్తున్నవారము"** అని విన్నవించుకుంటున్నారు.

అప్పుడు ఆ కర్మదేవతలు ఆయా జీవులకర్మానుసారముగా నిర్మితమైన బుద్ధిని అనుసరించి (బుద్ధిః కర్మాణుసారిని) ఆయా ప్రవృత్తి ధర్మానుసారంగా – జంతుజాతులందు గర్భప్రవేశములకై దారిచూపుచున్నారు.

భక్తి జ్ఞాన వైరాగ్య సంబంధమైన ఉత్తమ కర్మలు నిర్వర్తించిన మరికొందరు **సాత్విక** గుణాధిక్యత, **సత్వరజో**గుణ సంపన్నులైన జీవులు తమతమ ఉత్తమ కర్మలను, తాము ప్రదర్శించిన సాత్విక గుణములను కర్మదేవతలకు విన్నవించుకొనుచున్నారు.

*"ఓ కర్మ దేవతలారా! మేము నిర్వర్తించిన పుణ్యకార్యములను, ఉపాసన ఇత్యాది భగవత్ సంబంధమైన – మాచే నిర్వర్తించబడిన క్రియా విశేషాలను – మీకు వివరించుకుంటున్నాము. వినండి. ఆ తరువాత, ఇక్కడ భూలోకములో ఉత్తమమైన పురుష రేతస్సులో ప్రవేశింపజేయుటకై అభ్యర్థిస్తున్నాము.*

*మమ్ములను 15 నెలల కాలము ఉత్తమ జన్మకు సంబంధించిన రేతస్సులో నివాసము కల్పించండి.*

*అటు తరువాత మానవుల సంబంధమైన పురుషరేతస్సులోను, మాతృగర్భములోను 12 – 13 నెలలు ఉంచి తిరిగి మాకు సులక్షణ సంపన్నమైన మానవజన్మ ప్రసాదించండి !*

*ఓ ఋతు దేవతలారా ! మేము సత్యము – తపస్సులను ఆశ్రయించి ఉండుటచేత మీరూపమే (ఋతు దేవతారూపమే) అగుచున్నాము. నేనెవ్వరు ? మీరు ఎవ్వరు ? మీరు – నేను ఒక్కటే ! మనము ఇక కలిసియే జీవనము కొనసాగించెదముగాక ! సృష్టిలో మరల ప్రవేశించెదము గాక ! ... అని తమ దృశ్యతాదాత్మ్యమును వివరించుకుంటున్నారు.*

ఈ విధంగా అభ్యర్థనలు సమర్పిస్తూ భూమిపైకి వచ్చి, స్వకీయమగు కర్మ – ప్రజ్ఞలను అనుసరించి ఋతుదేవతల సహకారముతో తిరిగి అర్హమగు మానవ దేహమును ధరించటము జరుగుతోంది.

✡

## పూర్వపక్ష – శుక్లపక్ష దేవయానము

భౌతిక విశేషాల పట్ల ఉత్తమ వైరాగ్య సంపన్నులై, కర్మ – జ్ఞాన – భక్తి – యోగ సాధనలచే ఉత్తమమగు అర్హత సముపార్జించుకున్న జీవులు చంద్రలోకమునుండి 'పునరావృత్తి' పొందనివారై, చంద్రలోక ద్వారమునుండి స్వర్గ – ప్రజాపతి – బ్రహ్మలోకములవైపుగా ప్రయాణించుచున్నారు. ఓ ఆరుణిగౌతమ – శ్వేతకేతు స్నేహితులారా ! మనము ఇప్పుడు అటువంటి 'దేవయానము'ను ఆశ్రయించు ప్రజ్ఞాజీవుల గురించి చెప్పుకుంటున్నాము. వినండి !

అటువంటి **ఆత్మతత్త్వజ్ఞాని, ఉత్తమ దైవీగుణ శీలుడు** అగు జీవుడు భౌతిక స్థితి–గతులచే ఆకర్షించబడనివాడై, ఊర్ధ్వలోక ద్వారములలో ప్రవేశించుచున్నాడు.

ఆతడు మునుముందుగా అగ్ని లోకము చేరుచున్నాడు. క్రమంగా...,

వాయులోకము; వరుణలోకము; ఆదిత్యలోకము; ఇంద్రలోకము; ప్రజాపతిలోకము; బ్రహ్మలోకము చేరుచున్నాడు.

## బ్రహ్మలోకయానము

బ్రహ్మలోకము ప్రవేశించుచూ, మొదటగా 'అరము' అనే పేరుగల సరస్సుకు ఈవలి వద్ద చేరుచున్నాడు. అక్కడ కొన్ని ముహూర్తములు (యేష్టికాలము) గడుపుచున్నాడు. ఆ అరో సరస్సు దాటి, ఆవలి వద్ద చేరి... అక్కడినుండి

**విరజానది** (విః+అజ – జన్మరహితమైన ఉత్తమస్థానం, జన్మరాహిత్యము గురించి బోధపొందు స్థానము, విః+రజ = దోషరహితము) చేరుచున్నాడు. ఆ తరువాత **'ఈల్య'** అనే కల్ప వృక్షమును చేరుచున్నాడు. ఆపై 'సాయుజ్యము' అనే పట్టణము చేరుకుంటున్నాడు. ఆ పట్టణంలో 'అపరాజిత' అనే సౌధము చేరుచున్నాడు. ఆ సౌధమునకు ఇంద్రుడు–ప్రజాపతి (సృష్టిపాలకులు) ద్వారపాలకులై కనిపిస్తారు.

ఆ సౌధములో **విభు** (సర్వమునకు పాలకుడు నియామకుడు) అనే సభామండపము (ప్రమితము) ఉన్నది. ఆ **సభామండపములో** **'విచక్షణ'** ... అని పిలువబడే - గొప్ప తేజస్సుతో ప్రకాశిస్తున్న - సింహాసనము గల గొప్ప ప్రదేశము ఉన్నది. అక్కడకు దగ్గిరే **'అమితౌజము'** అనే లోక పావనియగు ఒక **ప్రియభామినీ - మాతృ పర్యంకము** కలదు.

అక్కడే **'మానసీ', చాక్షుసీ** (Thought, Perception) అనే పేర్లుగల ఇద్దరు దేవకాంతలు ఉంటారు. వారిద్దరూ చేతులలో చంద్రకాంత పుష్పములు ధరించి, అక్కడకు వచ్చియున్న జీవులకు జగత్ స్వరూప - స్వభావ - తత్త్వములను బోధిస్తూ, అభివర్ణిస్తూ, గానం చేస్తూ ఉంటారు. వారిద్దరూ జగదంబ (ప్రకృతి, జగత్తు రూపమున ఉన్న అంబ, అమ్మవారు) యొక్క మహిమ, సౌష్ఠవము, సౌందర్యము అభివర్ణిస్తూ ఉంటారు. అక్కడ ఎందరో అప్సరసలు, మాతృదేవతలు (అష్టమాతృకలు), నదీదేవతలు...' వీరంతా బ్రహ్మతత్త్వమునుగానం చేస్తూనే, **"బిడ్డలారా ! రండి ! ఈ బ్రహ్మలోక తేజో విలాసమును ఆస్వాదించండి. మీకు పరతత్త్వస్వరూపుడగు బ్రహ్మదేవుని దర్శన భాగ్యము లభించుగాక ! అందుకుగాను ముందుగా మరొకసారి విరజానదీ స్నానము చేసి పరిశుభ్రత పొందండి. అప్పుడిక మీకు శోకము - దుఃఖము - వార్ధక్యము మొదలైన సర్వదోషములు తొలగగలవు"** ... అని మార్గదర్శకులగుచున్నారు. మాతృవాత్సల్యంతో బ్రహ్మలోకమును ప్రవేశించినవారికి బ్రహ్మభగవానుని సందర్శనమునకు త్రోవచూపుచున్నారు.

## బ్రహ్మదేవుని మందిరము

**కేవలానందస్వరూపులు, ఆత్మతత్త్వ ప్రజ్ఞాదురంధరులు, పరమవాత్సల్య స్వరూపులు, సృష్టికి ఆది అయినవారు, సృష్టి సంకల్పులు, సర్వజన పితామహులు, జగన్మాతయగు సరస్వతీసమేతులు, వేదములచే స్తుతింపబడువారు, సర్వజ్ఞానసహితులు, ఆర్తత్రాణ పరాయణులు అగు బ్రహ్మభగవానుడు** బ్రహ్మాసనాశీనులై కోటి సూర్య మండలముల ప్రభాభాసుడై, తనను దర్శించువారికి బ్రహ్మానందమును-దర్శన మాత్రముచేతనే-కలుగుజేస్తూ ఉంటారు.

ఆ బ్రహ్మ భగవానుడు పంచశత (500)మంది అప్సరసలచే సేవించబడుతూ కనిపిస్తారు. వారంతా బ్రహ్మజ్ఞాన సమన్వితులైన జీవులను అత్యంత వాత్సల్యంతో **"బిడ్డలారా ! రండి ! రండి ! లోక కళ్యాణమూర్తియగు బ్రహ్మదేవులవారి దర్శనముచే పునీతులయ్యెదరు గాక !"** అని సన్మాన, ఆశీర్వాద పూర్వకంగా ఆహ్వానిస్తూ ఉంటారు. ఆ అప్సరసలతో మొదటి వందమంది సువాసనాభరితమైన నందనవన పుష్ప మాలికలను చేబూని, బ్రహ్మతత్త్వజ్ఞులగు జీవ బాటసారులకు సమర్పిస్తూ ఉంటారు. రెండవ వందమంది సుగంధ పరిమళ ద్రవ్యములను చేబూని, బ్రహ్మదేవుని దర్శించటానికి వచ్చేవారలను అలంకరింపజేస్తే ఉంటారు. అనేక పుష్పమాలికలతో, సుగంధములతో ఆ బ్రహ్మదేవుని దర్శించవచ్చిన జీవుని తల్లి తన బిడ్డలను అలంకరించునట్లుగా అలంకరిస్తూ ఉంటారు. ప్రయాణ బడిలిక తొలగేటట్లుగాను, సర్వ అపరిశుభ్రతలు పోవునట్లుగాను ఆ జీవుని తీర్చిదిద్దుతారు. వారు బ్రహ్మదేవుడు సుఖాసీనులై యున్న **బ్రహ్మ సింహాసనము**నకు దారిచూపుతారు.

ఆ దారిలో వచ్చు జీవులు అక్కడి అప్సరసల సూచనల ప్రకారము మరల 'అర'సరస్సులో, విరజానదిలో మానసిక స్నానం నిర్వర్తిస్తూ ఉంటారు. అప్పటిదాకా తమను వెంటనంటి వస్తున్న సుకృత - దుష్కృతములను తాము భౌతిక దేహముతో నివసించి వచ్చిన లోకమునకు సమర్పించివేస్తారు. సుకృతఫలములను తనకు ప్రియమైనట్టి, తనను సేవించినట్టి జ్ఞాతులకు, శిష్యకోటికి ఇచ్చివేస్తున్నారు. దుష్కృత ఫలములను - సాత్వికులను, భక్తజనులను బాధించుచు, పూజ్యులకు అప్రియము కలుగజేస్తూ, తోటిజీవులను వేధించు స్వభావము కలవారికి, వారు నడచు మార్గములయందు వదిలివేస్తున్నారు."

ఈ విధంగా, ఒకడు ప్రయాణించుచున్న రథము యొక్క రెండువైపులా రథచక్రములు ఊడిపోవు విధంగా, ఆ బ్రహ్మమందిర ప్రవేశ జీవునికి సంబంధించిన సుకృత - దుష్కృత కర్మలు ఆతనిని విడచినవగుచున్నాయి. అట్లాగే పుణ్య-పాపములు, సుఖ-దుఃఖములు, స్వర్గ నరకములు, చీకటి - వెలుగులు.. మొదలైన ద్వంద్వములన్నీ ఆతడు విడచివేసినవాడగుచున్నాడు.

బ్రహ్మ సింహాసనమును సమీపించేముందు ఆతడు మనస్సుతో బ్రహ్మలోకములోని **'ఈల్య'** వృక్షము క్రిందకు చేరుచున్నాడు. **"బ్రహ్మమునకు సంబంధించిన అభివర్ణనము"**... అనే సుగంధము ఆయనయందు ప్రవేశిస్తోంది. తరువాత ఆతడు **'సాయజ్య'** పట్టణము చేరుచుండగా ఆతనియందు అనిర్వచనీయమగు **'బ్రహ్మానందవీచికలు'** ప్రవేశము పొందుచున్నాయి. **'అపరాజి'** భవనము చేరుచుండగా బ్రహ్మతేజస్సు ఆతనియందు ధగధగ ప్రకాశమానమగుచున్నది. బ్రహ్మసౌధము చేరుచుండగా ఆ సౌధమునకు ద్వారపాలకులగు ఇంద్రుడు, ప్రజాపతి ఆతనికి బ్రహ్మదేవుని పర్యంకమువైపుగా దారిచూపుచున్నారు. **'విభు'** అను దివ్యసభామంటపమును

మనస్సుతో సమీపిస్తూ ఉండగా ఆతనిలో **'బ్రహ్మయశస్సు'** ప్రవృద్ధి పొందుచున్నదగుచున్నది. ఆ తరువాత **'విచక్షణ'** అనే బ్రహ్మ సింహాసనము సమీపిస్తూ ఉండగా ఆతనిలో వైరూప, వైరాజ, శార్వద, రైవత, అని చెప్పబడే ప్రజ్ఞలు ప్రవేశిస్తున్నాయి. అట్టి ప్రజ్ఞచే ఆత్మప్రజ్ఞాస్వరూపుడై విరాజిల్లుచున్నాడు. ఇకప్పుడు బ్రహ్మ భగవానుని పర్యంకమును సమీపిస్తున్నారు. "అమితౌజసము" అనే వాహనము (నెమలి)ను దర్శించుచున్నాడు.

ఆ అమితౌజసము సృష్టిలోని ప్రాణశక్తి ! **భూత – భవిష్యత్ కాలములు** అద్దాని ముందుకాళ్ళు. సంపద – ప్రతిష్ఠ వెనుకకాళ్ళు. భద్రయజ్ఞము – యజ్ఞాయనము (యజ్ఞవిధులు – యజ్ఞభావన) అద్దాని శిరోభాగములు. బృహత్‌గానము – రథంతరగానము... అనే సామగానములు యజస్సులు. సోమలతలు ఆ పర్యంకముపై పరచిన తివాసీలు. 'ఓం'కారనాదము యొక్క ఉద్గీథము ఆ పర్యంకముపై అలంకరించబడిన ఉపశయనములు (దిండ్లు). ఆపర్యంకముపై 'ఇతమిత్థము' (ఈ జగత్తుయొక్క వాస్తవ స్వరూపమును నిర్వచించునట్టి బ్రహ్మతత్త్వ – ఉపనిషత్ వాఙ్మయము) ప్రకాశమానమగుచుండగా ...,

**ఎత్తైన పద్మాసనముపై సుఖాసీనులై, బ్రహ్మభగవానుడు దర్శనమిచ్చుచున్నారు.**

బ్రహ్మమే తానై సర్వమును ఆస్వాదించు పరమానంద పరబ్రహ్మస్వరూపులగు బ్రహ్మ భగవానుడు ఆ బ్రహ్మలోకము జేరిన జీవునితో సంభాషించప్రారంభిస్తారు.

**బ్రహ్మభగవానుడు :** వత్సా ! ఎవరు నాయనా నీవు ? నీ వాస్తవ స్వరూపమేమిటి ? నీ గురించి నీవు ఏమని తలచుచున్నావు ? విశదీకరించు.

**బ్రహ్మజ్ఞానియగు బ్రహ్మలోకప్రవేశి :** నేనా స్వామీ? 'కాలము' అను కల్పనకు మునుముందే ఉన్నట్టివాడను. ఆత్మాకాశమే నా స్వరూపము–జన్మస్థానము. లీలావినోదినై కాలమునందు ప్రవేశించునట్టివాడను. కాలము నాకు నేనుగా కల్పించుకొనుసంబంధమే కాబట్టి కాలస్వరూపుడను కూడా! ఋతు స్వరూపుడనై అనేకసార్లు ఋతుధర్మమును ఆశ్రయించటం జరిగింది. సంవత్సర (కాల) స్వరూపుడనైనట్టి నేను ఆత్మాకాశమునుండి యోని (స్త్రీగర్భము) యందు సంభూతుడనైనాను. అస్మదాత్మ స్వరూపము సర్వదా యధాతథమై ఉండికూడా, మరొకవైపు దేహమును ఆశ్రయించి, దేహధారిని, దేహిని అవుతూవస్తున్నాను. దృశ్యములను ఆస్వాదిస్తూ ద్రష్టను అగుచూ వచ్చాను.

స్వామీ ! భగవాన్ ! ఇంత వరకూ చెప్పినది – నాయొక్క దృశ్య సంబంధమైన విభాగం గురించి. ఇక, నా గురించి చెప్పుకుంటున్నాను. దయతో వినండి !

అనంతకోటి జీవాత్మలలో నేనూ ఒకడిని. అయితే అట్టి అనంతకోటి జీవాత్మలంతా అఖండాత్మస్వరూపమే కదా ! అందుచేత నేను **అఖండము – సర్వమునకు ప్రమేయములేనట్టిది (అప్రమేయము) అగు ఆత్మస్వరూపుడను !**

ఇక్కడి భూతజాలమంతా మీ యొక్క సృష్టియే కదా ! అందుచేత – భూతస్య త్వమ్ ఆత్మాఽసి ! – సర్వజీవులకు ఆత్మ స్వరూపుడు మీరే! మీ సృష్టిలో నేను కూడా ఒక దేహిని. జీవుడిని. కనుక నా ఆత్మస్వరూపులు మీరు. ఆత్మ సర్వదా ఏకమే గాని అనేకము కాదు కదా! కనుక ..., **యత్ త్వమ్ అసి, సోఽహమస్మి! ఏది మీరు అయి ఉన్నారో, అదియేనేను!** ఈ విధంగా...,

**"నీవు ఎవ్వరు?"** అను ప్రశ్నకు సమాధానముగా **"త్వమేవాఽహమ్। మీరు ఏదియో, అదియే నేను"** అని మీకు విన్నవించుకొనుచున్నాను.

**బ్రహ్మభగవానుడు :** ఓ హోఁ! ఏదినేనై ఉన్నానో, అదియే నీవై ఉన్నావా ? బాగున్నది. **అయితే నేను ఏద్దై ఉన్నాను ?**

**బ్రహ్మలోకప్రవేశి :** హే భగవాన్ ! మీరు సత్యలోకాధిపతులు కదా! ప్రతి జీవుని నిత్య సత్య స్వరూపమే మీరై ఉన్నారు! సత్యమితిబ్రూయాత్। సత్యస్వరూపులు మీరని చెప్పబడుచున్నారు.

**బ్రహ్మభగవానుడు :** కిమ్ తత్ సత్యమ్–ఇతి? ఏమిటి ఆ సత్యము ?

**బ్రహ్మలోకప్రవేశి :** – ఏ మహాతేజోవిలాస చైతన్యమైతే – సర్వేంద్రియదేవతలకు, ప్రాణశక్తికి కూడా ఆవల సర్వదా ప్రకాశమానమగుచున్నదో...,

– ఏ కేవల చైతన్యమైతే దేవతలు, ప్రాణశక్తి కూడా తానే అయి, తన యొక్క వివిధ రూపములుగా కలిగియున్నదగుచున్నదో.... అట్టి **నిత్యాత్మానంద స్వరూపులు** మీరు ! యమ్ (త్) + సత్ = సత్యము ఏదైతే సర్వదా, సర్వకాల సర్వావస్థలయందును" ఉనికి (నేను ఉన్నాను కదా)"... అను రూపముగా (సత్ అయి) సర్వభూతముల యందు సర్వత్రా వేంచేసియే ఉన్నదో, దేనికి 'లేక పోవటము'

అనునదే లేదో... అదియే మీ పట్ల మనము చెప్పుకొనుసత్యము.

**మేమంతా మీరూపమే ! కాబట్టి మేమూ అఖండ సత్యమే ! మీ యొక్క సత్యస్వరూపతేజస్సే భావనాత్మమైన ఈ త్రిజగత్తులు. కనుక ఇది (మీ స్వరూపమే కాబట్టి) ఈ జగత్తు కూడా సత్యమే !**

ఇదంతా మీ సత్యస్వరూపమే ! ఇదంతా మీరే ! మీ తేజో కిరణ విశేషమే నేను!

ఇదంతా మీరే అయి ఈ కనబడే అంతటికీ వేరై ఉన్నదీ మీరే ! అందుకే మీరు **సత్యము, నిత్యము, కేవల సాక్షి, సర్వము** కూడా !

**బ్రహ్మభగవానుడు :** అదేమిటయ్యా ! నాచే సృష్టించబడిన జగత్తులు సత్యమేనా? మిథ్యకాదా ?

**బ్రహ్మలోకప్రవేశి :** ఈ జగత్కల్పనకు ఆవల పురుషుడవు, పూర్ణుడవు కదాస్వామి ! ఇక ఈ జగద్దృశ్యములంటారా ? ఇవన్నీ మీయొక్క పురుషకారమే ! **పురుషునికంటే పురుషకారము ఎప్పుడూ వేరు కాదు కదా !** పురుషుడు సత్యమే, పురుషకారమూ సత్యమే కదా!

**బ్రహ్మభగవానుడు :** బాగున్నదయ్యా! సరేం! మరి, ఈ సర్వమునకు ఆవల గల పరమపురుషుడనని, జలము యొక్క తరంగములవలె ఈ కనబడే విశ్వమంతా నాయొక్క తేజోరూప పురుషకార విలాసమేనని ఎట్లా తెలుసుకోగలిగావు? పరబ్రహ్మస్వరూపుడునగు నన్ను ఎట్లా సమీపించగలిగావు ?

**బ్రహ్మలోకప్రవేశి :** అదా స్వామీ ! ప్రాణేనేతి బ్రూయాత్ ! పెద్దలు – శాస్త్రములు మార్గము చూపుచుండగా ప్రాణోపాసనకు ఉపక్రమించాను. ప్రాణవాయు తత్త్వోపాసనచే మిమ్ములను సర్వగత ప్రాణస్వరూపునిగా ఉపాశించాను. ప్రాణ–దేవతగా ఆరాధించాను. సర్వమునకు **పురుషునిగాను, పరమ పురుషునిగాను** కర్మ–భక్తి–జ్ఞాన–యోగములతో ఉపాసించుటచేత మీయొక్క అపారకరుణ వీక్షణ నాపై ప్రసరించింది. అందుచేత మిమ్ములను దర్శించగలుగుచున్నాను.

**బ్రహ్మభగవానుడు :** ఓహో ! సర్వమునకు పురుషుడను నేనేనా ? మరి 'స్త్రీ' అనబడునది ఏది ? కేన స్త్రీ నామాని ఇతి ? స్త్రీలింగమును ఏదిగా ఎట్లా తెలుసుకుంటున్నావు ?

**బ్రహ్మలోకప్రవేశి :** (ఏకోసత్ విప్రా బహుధా వదంతి ! ఏకమే వాఽద్వితీయమ్ బ్రహ్మ మొదలైన) వేద ప్రతిపాదిత మహావాక్యములద్వారా **(వాచేఽతి)** – "స్త్రీ–పురుషుడు, ప్రకృతి–పురుషుడు... ఈ ఉభయము పరబ్రహ్మమగుమీ లీలా విశేషములే !" అని గ్రహించుచున్నాను. ఆత్మజ్ఞులగు గురువుల వాక్యములు సృష్టికి – సృష్టికర్తకు గల అభేదమును మాకు విశదీకరిస్తూ వస్తున్నాయికదా స్వామీ ! ***(విశ్వమ్ విష్ణుః – ఈ విశ్వమే విష్ణువు).*** ఈ సృష్టి అంతా మీ కథా (నవలా) రచన! నవలలోని విశేషాలన్నీ ఆ రచయితకు వేరు కాదు కదా! సృష్టికర్తయగు మీకు ఈ సృష్టి వేరు కాదు.

**బ్రహ్మ భగవానుడు :** అట్లాగా ? మరి నపుంసకనామ – రూపములను ఏవిధంగా, ఏమని నీవు తెలుసుకొనుచున్నావు? **కేన నపుంసక నామానీఽతి** ?

**బ్రహ్మలోకప్రవేశి :** హే జగద్గురూ ! దృశ్యములో నపుంసకమైనదంతా – మనస్సే అట్లా మననము చేస్తోంది – మనసేఽతి – అని గమనించుచున్నాను. మనస్సు మీ విన్యాసమే కదా! అందుచేత మనస్సు (Commonsense) చే – నపుంసకరూపములు మీరేనని విజ్ఞుడనై ఎరుగుచున్నాను.

| **బ్రహ్మ భగవానుడు** | **బ్రహ్మలోక ప్రవేశి** |
|---|---|
| – కేన గంధానీఽతి ? గంధమును ఎట్లా తెలుసుకుంటున్నావు | ఘ్రాణేతి (ముక్కుతో) ! |
| – కేన రూపానీఽతి? రూపములు? | చక్షువులతో (కళ్ళతో) ! |
| – కేన శబ్దానీఽతి? శబ్దములను ? | శ్రోత్రేణేఽతి ! చెవులతో ! |
| – కేన అన్నరసానీఽతి ? అన్నరసము (రుచి)ని ఎట్లా ఎరుగుచున్నావు ? | జిహ్వా (నాలుక) తో ! |
| – కేన కర్మానీఽతి ? కర్మలను ఎట్లా నిర్వర్తించావు ? | ఈ హస్తములతో ! హస్తాభ్యామితి ! |

**బ్రహ్మ భగవానుడు : కేన సుఖ – దుఃఖేఽతి** ? సుఖ–దుఃఖములు దేనిచే నీకు ఏర్పడుచున్నాయి? ఏ రూపములుగా ఎరుగుచున్నావు?

**బ్రహ్మలోకప్రవేశి : శరీరేణేఽతి !** దేహముతో తాదాత్మ్యము చెందిన సందర్భములలో మనస్సుకు సుఖ–దుఃఖములు అనుభవముగుచూ వచ్చాయి. తాదాత్మ్యము తొలగినప్పుడు సుఖము లేదు, దుఃఖము లేదు.

**బ్రహ్మ భగవానుడు :** దేనిచేత ఆనందరతి అనుభవమవటం జరుగుతోంది ?

**బ్రహ్మలోకప్రవేశి :** అది ప్రజాపతి యొక్క జీవజాతి నిర్మాణ వేడుకచేత, ఉపస్థ – ఇంద్రియ సంబంధమై కలుగుతోంది.

**బ్రహ్మ భగవానుడు** : కేన ఏత్యా ఇతి ? నడకలు – నడతలు దేనిచేత నిర్వర్తించబడుచున్నాయి ?

**బ్రహ్మలోకప్రవేశి :** పాదములలో నిక్షిప్తమైన మీ యొక్క బ్రాహ్మీశక్తిచే పాదములు కదులుచూ నడక జరుగుతూ వస్తోంది.

**బ్రహ్మ భగవానుడు :** కామ సంకల్పములు, భావనలు దేనిచేత తెలుసుకుంటూ వస్తున్నావు? **కేన ధియో విజ్ఞాతవ్యం కామానీఽతి?**

**బ్రహ్మలోకప్రవేశి :** బుద్ధిచే కామము – సంకల్పములు తెలియబడుతూ, నిర్వర్తించబడుచూ వస్తున్నాయి.

**బ్రహ్మ భగవానుడు :** మరల మరొక్కసారి చెప్పు. ఈ కనబడే ఇంద్రియ విషయరూప దృశ్య జగత్తంతా – ఏ అర్థముతో పరమార్థముతో – ఏమిటి? – అని తెలుసుకుంటున్నావు ?

**బ్రహ్మలోకప్రవేశి :** పితామహాః! లోకగురూ! పరబ్రహ్మమూర్తీ ! ఈ జగద్దృశ్య వ్యవహారమంతా కూడా నాయొక్క ఆపో (రసమయ) విన్యాసచమత్కారమే ! ఇదంతా నాదే ! నేనే!

ఇదంతా మీదే కూడా ! ఈ లోకాలు, లోకపాలకులు, లోకాంతర సర్వ విశేషాలు... ఇవన్నీకూడా

**మీయొక్క – నాయొక్క స్వస్వరూపమగు పరమానంద పరబ్రహ్మమే !**

**ఎవ్వడైతే ఇదంతా కూడా..., చిదానంద రూపముగాను, కేవల చిత్ రసాత్మకముగాను తెలుసుకొనుచున్నాడో... ఆతడు స్వయముగా సత్–చిత్–ఆనంద రూపమగు బ్రహ్మమే అగుచున్నాడు.**

**"ఇదంతా బ్రహ్మమే"** అని ఆత్మజ్ఞుల – తత్త్వజ్ఞుల ఆప్త వాక్యానుసారముగా ఎరుగుచున్నాను.

కాబట్టి నేను బ్రహ్మమే ! మీరు బ్రహ్మమే ! నేనే ఇదంతా ! జీవాత్మగా – (నవలా రచయిత – నవలలోని పాత్రల వలె) నేను మీ యొక్క భావనా కల్పనను! కేవలాత్మగా – నేనే మీరు! నేను మీరే! నేను మీకు చెందినవాడనే! మీరే నా స్వస్వరూపులు! అహమ్ త్వమేవ। తత్ త్వమ్। సోఽహమ్! త్వమేవాఽహమ్!

## ద్వితీయ అధ్యాయము

ఏ ప్రాణతత్త్వము సర్వదేహములలోను బాహ్య – అభ్యంతరములలో వేంచేసి, సర్వమును శక్తియుతము, స్పందన యుతము చేయుచున్నదో, ... అట్టి ప్రాణశక్తియే బ్రహ్మము – **ప్రాణోబ్రహ్మేఽతి** .. అని మన ఈ **కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్** చేతులెత్తి ప్రకటించుచున్నది.

అట్టి ప్రాణ రూపబ్రహ్మము (శక్తి) **సంకల్పములను నిర్వర్తించు** సందర్భములో **మనో రూపమును** దాల్చుచున్నది. ఆ ప్రాణశక్తియే...,

| | |
|---|---|
| – మాటలు మాట్లాడుచున్నప్పుడు | వాక్ ఇంద్రియముగాను, |
| – చూచుచున్నప్పుడు | చక్షురింద్రియముగాను, |
| – వినుచున్నప్పుడు | శ్రవణేంద్రియముగాను, |

మొదలైనవిగా ప్రదర్శితము అగుచున్నది. ఈ విధంగా సర్వేంద్రియములు – ఇంద్రియ విషయములుకూడా తన స్వరూపమే అయివున్నట్టి ప్రాణమే బ్రహ్మము. ఎవ్వరైతే ప్రాణోపాసకులై ప్రాణతత్త్వమే దేహములోను – దేహ బాహ్యముగాను దర్శిస్తూ,... ఇంద్రియ దేవతలను తదితర **సర్వజీవులను ప్రాణస్వరూపముగా భావిస్తూ, ఆస్వాదిస్తూ, ఆరాధిస్తూ ఉంటారో...** ఆ సర్వదేవతలు తమతమ సంపదలను ఆయాచితంగా ఆ ప్రాణోపాసనా బ్రహ్మతత్త్వదర్శికి ప్రసాదిస్తూ ఉంటారు.

అట్టి ప్రాణతత్త్వమును ఎరిగిన ప్రాణోపాసనా రహస్య వేదులు

- ప్రాణశక్తిని బ్రహ్మముగా ఆరాధించువారై,
- తమ ఇంద్రియ సంపదలను, విషయ జగత్ దర్శనములను ప్రాణదేవుని ప్రదర్శనా రూపముగా గమనిస్తూ....,
- తమ ఇంద్రియ విషయానుభవములన్నీ ప్రాణోపాసనగా ప్రాణభగవానునికి బలిగా సమర్పించుచున్నవారై ఉంటున్నారు.

అందుచేత...,

"బిడ్డలారా ! శ్రోతలారా ! **న యాచేత ఇతితత్ యథా గ్రామం భిక్షిత్వా !** సహజ ప్రాణాత్మ స్వరూపులగు మీరు ఇంద్రియ గ్రామములో ప్రకాశితులై, ఉండవచ్చు గాక! కానీ, ఇంద్రియ విషయములే పరమార్థమైనట్లుగా జీవితమంతా అభిలషించుచూ రోజులు గడపటమనేది...,

ఒకడు సర్వసంపదలు కలిగియున్నవాడై ఉండి కూడా, తనదైన గ్రామములో తానే ప్రవేశించి భిక్షాటణమునకు ఉపక్రమించటము వంటిది (Begging at one's own Doors). – అని కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్ గుర్తుచేయుచున్నది. ఇది గ్రహించి, **"లభించిన వాటితో తృప్తిచెంది ఉంటాను. ఇంద్రియ విషయ పరంపరలను ఆశించి ఆశించి యాచించి – దత్తమ్ – ఇతరులచే ఇవ్వబడు ఆయా సంపదల కొరకై ఇచ్ఛ కలిగి ఉండను"**... అని గుర్తు కలిగినవారై జీవించండి. ఇంద్రియ విషయములను ఎవ్వరైతే యాచించుచూ ఉందరో, వారు భాగ్యవంతులే ! (కౌపీనవంతమ్ ఖలు భాగ్యవంతః). **"ఇంకా ఎంతగానో నేను ఏవేవో దృశ్యజగత్తులలో పొందవలసినవి అనేకం ఉన్నాయి. అవన్నీ లభించుగాక! ఎట్లా లభిస్తాయోమరి?"**... అని తలచువారు ఎల్లప్పటికీ యాచకులు గానే మిగిలిపోతున్నారు. ఎవ్వరైతే 'యాచన' అనే స్వభావమును త్యజించినవారై ఉంటారో, ... అట్టివారు దేవతలచే గౌరవించబడి, వారికి అవసరమైనవన్నీ ఆయా దేవతలచేత అయాచితంగానే ప్రసాదించబడుచున్నారు.

**ప్రాణోహి బ్రహ్మ !** ప్రాణమే బ్రహ్మము ! అట్టి ప్రాణశక్తి సర్వదేహములలో **అంతర్యామిగా ఉన్నప్పుడు** (సర్వదేహములో అంతర్యామిగా ఉన్న ప్రాణశక్తిని దర్శించుచున్నప్పుడు)... **'పైగ్యము'** అను పేరుతో పిలువబడుచున్నది. **(పైగ్యయోగము).**
అట్టి ప్రాణశక్తిరూప పరబ్రహ్మమే...

- నోటిలో ప్రవేశించినదై **'వాక్కు'**ను పలికించుచున్నది. **పలుకబడుచున్న పలుకులుగా** కూడా (విషయములుగా కూడా) అగుచున్నది.
- కళ్ళలో ప్రవేశించి చూపు శక్తిగా ప్రదర్శితమై, **చూడబడుచున్నదంతా కూడా** స్వీయ ప్రదర్శనముగా కలిగి ఉంటోంది.
- చెవులలో వినికిడి శక్తిగా ప్రవేశించినదై, వినుటను స్పందింపజేస్తోంది. వినబడుచున్న **సర్వశబ్ద స్వరూపమై కూడా** ప్రకాశిస్తోంది.
- భావించు ప్రక్రియా శక్తిగా ఆలోచనల రూపమైనట్టి మనస్సును – **ఆ ఆలోచనలకు విషయమైన మనో విషయముల (ఆలోచించబడుచున్న సర్వ ఆలోచనా విషయముల) రూపమును కూడా** ధరించుచున్నది.

ప్రాణ దేవత వివిధ శక్తులతో దేహములో వినికిడి చూపు – స్పర్శ – ఆఘ్రాణము – రుచి మొదలైన ఆయా అధిదేవతా రూపములను దాల్చుచున్నది. ఆయా సర్వదేవతలు తమ దివ్యశక్తుల అనుభవములన్నీ తిరిగి ప్రాణశక్తికే సమర్పణము (బలి) చేయుచున్నారు.

ఈ విధంగా **ప్రాణమే బ్రహ్మము !** జీవులంతా ప్రాణశక్తి స్వరూపులే ! జీవులంతా కూడా తమతమ జీవితాంతర్గతమైన ఇంద్రియానుభవాలన్నీ ప్రాణపరమాత్మకే సర్వదా **బలిహరణము (సమర్పణము)** చేయుచున్నారు.

ఈ రీతి అయినట్టి **"జీవాత్మల ఇంద్రియ దేవతల సర్వానుభవములనూ కూడా – ప్రాణిశక్తికి బలిహరణము"** అనే **ప్రాణబ్రహ్మతత్త్వము గమనించినవారు** ఈ ఉపనిషత్ చెప్పు బ్రహ్మతత్త్వము గ్రహించు వారై, ఇక ఇంద్రియవిషయ యాచనను కలిగి ఉండరు. ఇంద్రియ విషయములను, ఇంద్రియార్థములను తాను స్వీకరించక, **పరమాత్మ (ప్రాణాత్మ)కు సమర్పించువాడు–ఇంద్రియాగ్రామమునందు సగౌరవించబడు** వాడగుచున్నాడు.

ఆయాచిత ధర్మము (దృశ్యములో ఏదీ ఆశించకుండానే – బుద్ధియొక్క నిర్మలతను సంపాదించుకొనే నిమిత్తము మాత్రమే నిర్వర్తించబడు స్వధర్మము) నిర్వర్తించటము **ఆత్మోపాసనయే** అగుచున్నది.

**ప్రాణతత్త్వమును తెలిసినవారు ప్రాణశక్తి భగవానునికి ఇంద్రియ విషయముల బలిగా సమర్పించినవారై మహత్ భాగ్యము పొందుచున్నారు. సర్వము పొందినవారై ఆనందయుతులగుచున్నారు.**

## ఊర్ధ్వలోకయానమునకై అగ్నోపాసనా విధి

**చిత్రగార్గ్యాయణి :** చంద్రలోకము నుండి తిరిగి భౌతిక లోకములకు రాకుండా ఊర్ధ్వగతిని, అభౌతికమగు ఆనందలోకములకు యానము ఉద్దేశ్యముగా కలవారు ఏ రీతిగా ఆగ్నోపాసనలకు ఉపక్రమించుటకై శాస్త్రములు సూచిస్తున్నాయో.... కొన్ని విషయాలు ఇక్కడ చెప్పుకుంటున్నాము. ఓ ఆరుణి గౌతమ – శ్వేతకేతు మిత్రులారా ! వినండి.

అగ్ని కార్యనిష్ఠ స్వీకరించువాడు నిండు పౌర్ణమి తిథి రోజున గాని, అమావాస్యనాడు గాని, శుక్లపక్షములో ఒకానొక పుణ్యనక్షత్రము రోజున గాని, ఏదైనా (విజయదశమి మొదలైన) ఒకానొక శుభదినమునగాని **అగ్నికార్యవిధి (యజ్ఞకార్య విధి)**ని నిష్ఠా భక్తులతో ప్రారంభము చేయుచున్నాడు.

ఒక పవిత్రమైన పరిసరములు గల యజ్ఞవేదికా స్థలమును ఎంచుకొనుచున్నాడు. ఆ పరిసర ప్రదేశములను పరిశుభ్రముగా, పవిత్రముగా తీర్చిదిద్దుకొనుచున్నాడు. సాలంకృతంగా చేయబడిన ఆ స్థలములో అగ్నిగుండమును నిర్మించుకొనుచున్నాడు. యజ్ఞ – అగ్నికార్యమునకు

కావలసిన చక్కటి ఆకారము గల సమిధలను సిద్ధము చేసుకొనుచున్నాడు. ఒక శుభ తరుణములో మంత్రయుక్తముగా అగ్నిని ఆహ్వానించి, ఆ అగ్నిలో వేల్చుచున్నాడు. స్రువము (చెంచాగరిట) తోను, **చమసము** (కొయ్యగరిట)తోను, (లేక) కంచుగరిట / పాత్రలో ఆజ్యము (నేయి)ని అగ్నిలో సమర్పిస్తూ యజ్ఞ శాస్త్రమంత్రములు నిర్ణయించి చెప్పు మంత్రోచ్చారణతో విధి – విధానములలో ఉపాసించాలి. యజ్ఞభావితులగు ఆయా దేవతా సంబంధమైన ఆహ్వాన – సమర్పణ మంత్రములు గానం చేస్తూ నేయిని సమర్పించాలి. ఆ దేవతలను సాంగోపాంగముగా భావనచేస్తూ నేయిని అగ్నిలో వేయాలి. ఆయా దేవతలకు 'స్వాహా' అను శబ్దముతో ప్రాణాలు యొక్క అనురూపదేవతాభావనను ఆశ్రయిస్తూ సమర్పించాలి.

- ఓ ప్రాణస్వరూపమగు చక్షురింద్రియదేవతా ! చూపుకు అధిదేవతయగు ప్రాణస్వరూప సూర్యభగవాన్ ! స్వాహా ! ఇదిగో ! ఈ అగ్నిద్వారా ఆజ్యము స్వీకరించండి. మా చక్షుక్రియలన్నిటినీ, ఇదిగో... మీకు సమర్పిస్తున్నాము. మాకు ఐహిక సుఖములను, ఆముష్మిక సుఖములను ప్రసాదించండి.
- ప్రాణస్వరూపమగు శ్రోత్రేంద్రియ దేవతా ! స్వాహా ! అగ్ని ద్వారా ఆజ్యము స్వీకరించండి. మా వినుచున్న సర్వవిశేషాలు మీకు సమర్పిస్తున్నాము. మాకు ఇహ–పరసుఖములు దయచేయండి !
- ఓ ప్రాణస్వరూపమగు మనోదేవతా ! స్వాహాః ! అగ్నిద్వారా ఆజ్యమును స్వీకరించండి ! దీనితోపాటే మా సర్వ ఆలోచనలను మీకు సమర్పిస్తున్నాము. మాకు ఇహ–పర బంధములను, జ్ఞాన ప్రతిబంధకములను తొలగించండి !

ఈ విధంగా **"ఇంద్రియములు – ఇంద్రియదేవతలు – ఇంద్రియ కార్యక్రమములు ప్రాణదేవతా రూపుడగు ఇష్టదైవమునకు చెందినవే"..** అను అంతర్భావన – అవగాహనలతో 'స్వాహాః' శబ్దమును ఉపయోగిస్తూ అట్టి 'సమర్పణ'కు సంజ్ఞగా ఆజ్యమును అగ్నికి స్రువము – చమసములతో సమర్పించే విధినిని, వేదమంత్రములను వేదములు మానవాళికి ప్రసాదిస్తున్నాము.

యజ్ఞకర్త ఈ విధమైన బాహ్య – అంతర ప్రక్రియతో **'స్వాహాయేతి'** అని పలుకుచూ, అగ్నికి ఆజ్యము సమర్పించాలి. ఆ తరువాత, యజ్ఞవాటికలో శేషించే ధూమగంధమును (మసిని) ఒక్కొక్క అంగముపై పూసుకొంటూ **"ఈ అంగముల వ్యాపారములన్నీ ఆయా అధిదేవతలకు, అధిదేవతల ద్వారా ఆయా వ్యాపారములు** (Functions) **ప్రాణశక్తికి సమర్పితమై, చివరికి ప్రాణాత్మను చేరినవగుగాక ! నేను ఆత్మసామీప్యతపొంది, దర్శించి ఆత్మచే ఆత్మస్వరూపుడనై ఆత్మయందు సుఖశాంతులు పొందుదునుగాక !"** ... అని యజ్ఞవిధులను ముగిస్తున్నాడు.

అట్టి యజ్ఞమును – ఏఏ ఐహిక (outward) – ఆముష్మిక (Inward) ప్రయోజనములను అభిలషించి, (లేక ఉద్దేశ్యించి) ఆ యజ్ఞ కార్యము శాస్త్రవిధి అనుసారము అగ్ని–మంత్ర–దాన–ధర్మముగ్ధంగా నిర్వర్తిస్తూ ఉన్నారో.. అట్టివారు – ఆయా ప్రయోజనములను తప్పక పొందుచున్నారు. (అనగా)..., అగ్నికి ఆహూతులను 'స్వాహా' శబ్దోచ్చారణతో సమర్పిస్తూ, దేహములోను – విశ్వములోను గల ఇంద్రియ – ప్రకృతి దేవతలకు సమర్పిస్తూ ఉండగా, వారంతా 'జుహోతి' శబ్దములను ఆజ్యముతో బాటుగా స్వీకరిస్తూ, ఆయా కోరుకొన్న ఫలములను యజ్ఞబద్ధులై ప్రసాదిస్తున్నారు.

ఓ వాక్ దేవాతా ! వాచం ! **తే మయి జుహోమి అసౌ స్వాహాః! ప్రాణం తే మయి జుహోమి అసౌ స్వాహా।**

ఓ ప్రాణదేవతా! చక్షుదేవతా! శ్రోత్రం దేవతా! మనోదేవతా! **జుహో తే మయి జుహోమి అసౌ స్వాహాయేఽతి !** – అని అంటూ దేవతల మహిమను, వారు ప్రసాదించిన శబ్ద – స్పర్శాదిగాగల ప్రాణశక్తులను తలచుకుంటూ కృతజ్ఞతలు చెప్పుకొంటున్నారు. ప్రియమైన స్తోత్ర సంభాషణలతో వారు ఇతః పూర్వముగా ప్రసాదించిన విశేషములను మనసా–వాచా–కర్మణా స్మరిస్తూ, తమతమ కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నారు. విన్నపములను మనస్సుతోను, వాక్కుతోను విన్నవించుకుంటున్నారు. ఇట్టి యజ్ఞవిధిచే కోరినవి లభించగలవు.

## దేహయజ్ఞశాల – అంతర ఆత్మయజ్ఞము

ఇప్పుడిక ఈ 'దేహము' అనే యజ్ఞశాలలో అంతరముగా నిర్వర్తించి అగ్నిహోత్రకార్యరూపమైన అంతర్యజ్ఞవిశేషాలు చెప్పుకొందాము.

| | |
|---|---|
| ఏ సమయంలో ఈ జీవుడు మాట్లాడుచూ ఉన్నాడో, ... | ఆ సమయములో – ఆతడు 'శ్వాస'ను – వాక్కులో |
| ఆ సమయంలో ఈతడు ఊపిరిపీల్చుటములేదు | ఆహుతి చేయుచున్నాడు. |
| ఆతడు శ్వాసపీలుస్తూ ఉన్నప్పుడు వాక్కును పలుకుటలేదు. | అప్పుడు వాక్కును – శ్వాసరూపమగు ప్రాణశక్తిలో |
| | ఆహూతిగా సమర్పిస్తూ – యజ్ఞము నిర్వర్తిస్తున్నవాడగుచున్నాడు. |

ఈ విధంగా, .... ఈ జీవుడు జీవించి ఉన్నంతకాలము కూడా, అవిచ్ఛిన్నంగా (Woithout a break) ఎల్ల వేళలా (మెళుకువ-నిద్రా సమయాలలోకూడా) ఒకదానియందు మరొకటి ఆహుతి చేస్తున్నంతకాలము ఈ జీవుడు సదేహి అయి జీవిస్తున్నాడు. అంతరంగమున ఈ జీవుడు నిర్వర్తిస్తున్న ఆహుతి కర్మలన్నీ విశ్వరచనా - యజ్ఞవిధిని అనుసరించియే ఉన్నాయి. పూర్వీకులగు విద్వాంసులు ఇది గమనించి, దృష్టియందు కలిగియున్నవారై...,

***"అగ్నికి ఆజ్యము సమర్పిస్తూ ప్రాణ - ఇంద్రియ దేవతలను ఉపాసించి, తాము కోరుకొన్న ప్రకృతి సంపదలను, స్థితిగతులను సముపార్జించుకోవటము. ప్రకృతిని తమకు సానుకూల్యముగా సిద్ధించుకొనటము!"***

..... అనే యజ్ఞ విధిని సాధన ద్రవ్యముగా రచించి మానవాళికి - ఉత్తమ గతుల మార్గముగా - ప్రసాదించారు. దేహములోపల ఇంద్రియ నిగ్రహరూపంగా జరుపు యజ్ఞమునకు **'ప్రాతర్థనము'** అని పేరు.

ఈ దేహము యొక్క బాహ్య - అభ్యంతరములలో జరుగుచున్న - దేహి - దేహ - ఇంద్రియ దేవతా - జగత్‌దృశ్య - ఇటువంటి సర్వ వ్యవహారములు, యజ్ఞ విధివిధానములు, ఊర్ధ్వలోకగతులు (Paths to Higher Plain) **ఇవన్నీ కూడా బ్రహ్మమే ! సర్వము బ్రహ్మమే !** అట్టి బ్రహ్మమును ఈ దేహధారియగు జీవుడు ఉపాసించు విధి - విశేషమే ఈ బాహ్య - అభ్యంతర యజ్ఞ విధివిధానములు. అందుచేత ఈ ప్రక్రియా రూపమును **"శుష్క అంగారమృక్"** అను పేరుతో ఉపాసిస్తూ ఉంటారు. అనగా, నిత్యము సిద్ధించియే ఉన్న ఆత్మస్వరూపము సిద్ధించుటకై చేసే కర్మలు.

- సర్వజీవులు తమ ఇంద్రియ కర్మలచే బ్రహ్మమునే ఆరాధిస్తున్నారు.
- ఆ ఆరాధన - ఉపాసన - సమర్పణయే యజుర్వేద యజస్సులు అయ్యాయి.
- ఈ విధంగా యజ్ఞకర్త చేత యజుర్వేద యజస్సులతో యజ్ఞవిధిద్వారా ఉపాసించబడుచున్నది బ్రహ్మమే!
- సర్వజీవులు తమ తమ ప్రాణ - ఇంద్రియ - మనో కర్మలచే జనించినవి సామగానముల రూపంగా తీర్చిదిద్దబడుచున్నాయి. అదీ ఆత్మోపాసనయే! ... అట్టి సత్యము ఎల్లప్పుడూ సమన్వయించుకొనబడుగాక !

ఈ సృష్టి, ఇందలి సర్వజీవుల సర్వ అనుభవాలు.. ఇవన్నీ సర్వతత్త్వ ప్రదర్శనశీలుడగు ఆత్మభగవానునికి ఆత్మనివేదనలే ! బ్రహ్మము యొక్క శ్రేష్ఠత్వము, మహదత్వము కీర్తించటానికి, ఆత్మయొక్క తేజోవిభవములు ఆరాధించటానికే ఋగ్వేదములోని ఋక్కులు, (మంత్రములు), యజుర్వేదములోని యజస్సులు (దేవతావర్ణనములు), సామవేదములోని సామగానములు (ఛందోబద్ధ స్వరములు), అధర్వణ వేదములోని ప్రకృతి శోభావర్ణనములు ఉద్దేశ్యిస్తున్నాయి.

ఇది గ్రహించి యజ్ఞవిధులు వేదములచే సశాస్త్రీయంగా రచించబడి - సూచించబడుచున్నాయి. యజ్ఞకర్త యజ్ఞము నిర్వర్తిస్తున్నారు. యజ్ఞకర్త - ఋత్విక్కులు, తదితర శ్రామికులు పాల్గొనువారు... వారంతా యశస్సు తేజస్సు పొందగలరు. వారంతా ఆత్మభావనచే, భౌతిక దృష్టులను త్యాగభావముతో దర్శించుచున్నప్పుడు, ఇక ఊర్ధ్వలోకములు చేరగలరు. స్వభావసిద్ధంగానే ఊర్ధ్వలోక అధి - ప్రత్యధి దేవతలు నిష్కామయజ్ఞకర్తలకు సుస్వాగతాలు పలికి, యజ్ఞకర్తకు ఊర్ధ్వ లోకములను సమర్పిస్తున్నారు.

✡

**"సర్వజీవులు పరబ్రహ్మము యొక్క సౌందర్య - ఐశ్వర్య - తేజో విభవములే"...** అని గమనించి, యోగులు, ఇంద్రియ విషయ జగత్ దృశ్యమును దర్శిస్తూ నమస్కరించుచున్నారు. విద్వాంసుడగు అట్టి ఉపాసకుడు యశస్వి, తేజోమయుడు అగుచున్నాడు.

సర్వాత్మకుడగు ఆత్మభగవానుని ఉపాసించే ముఖ్యోద్దేశ్యము హృదయ పవిత్రతయే! ఉత్తమ భావన (Main Idea)లతో ఐష్టికములను (శాస్త్రములచే నిర్మితమగుచు, సూచించబడుచున్న యజ్ఞమంత్ర-విధి-విధానములను) నిర్వర్తించు యజ్ఞకర్త, ఆధ్వర్యుడు,తదితర యజ్ఞకార్యక్రమనిష్ఠులు... యజ్ఞోపాసనా భావములచే పవిత్రులగుచున్నారు. వీరంతా కూడా స్వభావసిద్ధముగా సంసార భావములను అధిగమిస్తూ, వాటి నుండి సంస్కరించబడుచున్నారు. వేదములోని ఉపనిషత్ వాణిచే అట్టి సంస్కారము 'పరము'వైపుగా ఉద్గీథమగుచున్నాయి. వారు ఆత్మధర్మమును పుణికి పుచ్చుకొన్నవారై బ్రహ్మమే తామై ప్రకాశించుచున్నారు. దృష్టియొక్క పరమ పవిత్రతచే

- సర్వము సృష్టికర్తయొక్క లీలా వినోదమగు సృష్టి ధర్మమయముగాను,
- ఋగ్వేదాంతర్గతమైనటువంటి ఋక్కులు శుద్ధసౌరభమయముగాను, ఋక్ (సత్య) మహిమ సమన్వితముగాను,
- యజుర్వేదాంతర్గతమగు యజస్సు (మంత్ర) తత్త్వమయముగాను,

- సామవేదాంతర్గతమై సామగానానంద ప్రదర్శనముగాను,
- త్రయీ విద్యాసమన్వితమగు ఆత్మతత్త్వ స్వరూప సౌందర్యముగాను, దర్శించుచున్నారు.

**సర్వము ఆత్మమయముగాను, ఆత్మకు అభిన్నముగాను చూస్తూ సందర్శనానందము పొందుచున్నారు.**

1. వేదములచే అందింపడుచున్న అగ్నికార్యములయందు అంతర్గతమై రహస్యముగా దాగియున్న ఆత్మజ్ఞాన–ఆత్మస్తోత్ర– ఆత్మోపాసనా రసతత్త్వమును ఎరిగి నిర్వర్తించువాడు,
2. దేహములో వేంచేసియున్న ప్రాణాత్మ భగవానుని తేజో విశేషములే ఇంద్రియ దేవతలని ఎరిగి, ఇంద్రియానుభవములన్నీ ఆత్మ – భగవానునికి పుష్పమాలగా సమర్పించు విధానమును ఎరిగి నిర్వర్తించువాడు

ఈ ఇరువురు కూడా ఆత్మ గురించి ఎరుగుచున్న మార్గములో ఉన్నవారే! క్రమంగా, ఆత్మయే (బ్రహ్మమే) తామై స్వయమఖండ – ఆత్మతేజో రూపులై ప్రకాశించగలరు!

## కౌషీతకీ బ్రాహ్మణ – త్రీణి ఉపాసనాని

బుద్ధి యొక్క నిశ్చలత – పరిశుద్ధతల కొరకై '3' విధములైనటువంటి **"కౌసీతకీ సూర్య త్రిసంధ్యోపాసన"** అనబడు **త్రిసూత్ర–యజ్ఞోపవీత** సంబంధిత విశేషములను ఇప్పుడు మనము చెప్పుకుంటున్నాము. ఓ ఆరుణీ గౌతమ – శ్వేతకేతులారా! దయచేసి శ్రద్ధగా వినండి.

త్రిసూత్రములతో కూడిన యజ్ఞోపవీతమును చేతితో కలిగియుండి '3'సార్లు ఉదకపాత్రలోని ఉదకముతో ఆచమనం చేసి ఉదకమును సంప్రోక్ష్యం చేయాలి. (ఉదయం 6 గం॥ సమయమున) ఉదయించుచున్న సూర్యుణ్ణి ఉద్దేశ్యిస్తూ...

ఉదయం : **ఉద్యంతమ ఆదిత్యమ్। ఉపతిష్ఠేత్। యత్ వర్గోఽసి పాప్మానం మే ఉత్ – వృజ్ ఇతి, ఏతయైవ ఆవృతా మధ్యే సంతమ్ ఉత్–వర్గోఽసి॥ ఉద్యంతమ ఆదిత్యమ్! ఉదయించు ఆదిత్య భగవాన్! సూర్యదేవా! నా హృదయమునకు సమీపముగా ఉపవిష్టులయ్యెదరు గాక! నన్ను నాయొక్క సర్వ పాప – దోష దృష్టులనుండి ప్రక్షాళణము చేసెదరుగాక ! కాపాడెదరు గాక !** అని ఆరాధించాలి.

మధ్యాహ్నం : అట్లాగే మధ్యాహ్న సమయంలో (మద్యాహ్నం 12 గంటలకు) మధ్యాహ్న సూర్యుని ఉపాసిస్తూ, **పాప్మానం అతద్వ్యపావాత్య ఏతైవా ఆవృతా స్తంయంతం యత్ వర్ణోఽసి పాప్మానం మే సర్వం వాత్యేతి। "ఓ స్తయంతమాదిత్యా ! నీవు మా యొక్క సర్వమనోఽ బుద్ధి దోషములను తొలగించ సమర్థుడవు ! మహాత్ముడవు ! అనాత్మ – పాప భావములనుండి మీరు నన్ను పరిశుద్ధము చేసి సంరంక్షించండి ! –** అని **ఉపాసించుచుండెదము గాక !**

సాయంత్రం : అదే విధంగా సాయంసంధ్య (సాయంత్రం 6 గంటల) సమయములో కూడా, **యత్ అహో–రాత్రాభ్యాం పాపం కరోతి సంతత్ వృంక్తే।**

**"సాయంసూర్యభగవాన్। మేము మీ చైతన్య స్వరూపమును జ్ఞప్తి కలిగియుండి జ్ఞానులముగా అగుదుముగాక ! జడత్వము త్యజించెదము గాక !** – అని సాయం సంధ్యోపాసనను నిర్వర్తించెదముగాక!

***ప్రతి నెల శుద్ధపాడ్యమి నుండి – పౌర్ణమి తిథి వరకు "చంద్రమసము"***

చంద్రమసము నందు దృశ్యమానమగు ఆకాశంలో సందృశ్యమానమగుచున్న **'చంద్రోపాసన'** నిర్వర్తించబడుగాక !

పచ్చటి గడ్డిపరకలను (హరిత తృణములను) చంద్ర భగవానునికి నివేదనగా సమర్పిస్తూ...,

*''ఓ చంద్రభగవాన్ ! ఔషధ – వనస్పత ప్రదాతా! మీరు నా హృదయములో 'మనస్సు' రూపంగా సర్వదా వేంచేసి యున్నారు. ఎల్లప్పుడూ నా హృదయమునందు చల్లటి అమృత కిరణములతో ప్రకాశిస్తూ నా దృష్టిలోను, వాక్కులోను, భావములలోను మీ అమృత కిరణములను ప్రకాశింపచేయండి. నేను చేయు పౌత్రమఘము (నావారు – నా సంతానము – నా వంశము – నాకు సంబంధించినవారు) అనే భ్రమలనుండి, వాటి వలన కలుగుచున్న సంకుచిత భావములనుండి, దుఃఖములనుండి కాపాడండి. గురువై ఆత్మభావనను అనుగ్రహించండి !"*

> **"యత్ యత్తే స్వసీమే హృదయమ్ అధి । చంద్రమసి శ్రితం ।**
> **తేన అమృతత్వమ్ అస్యేశానం । మాఽహమ్ పౌత్రమఘం రుదమితి।"**

పై మంత్రమును ఉపాశించువారు వారి సంతతికూడా ఆచంద్ర భగవానుని చల్లటి కిరణములచే రక్షింపబడుచున్నారు. జాతపుత్రులు (పుత్రులు కలవారు), నజాత పుత్రులు (పుత్రులు లేనివారు) కూడా చంద్రభగవానుని ఆత్మప్రజ్ఞాతత్త్వమును పై మంత్రముచే ఉపాసిస్తూ సర్వశుభములు పొందగలరు.

**ఆపాయస్వ సమేతు తే। సంతే పయాంసి సముయుంతు వా।**
**రాజా యమ్ ఆదిత్యామ్ ఆత్వా అంశుమ్ ఆప్యాయయంతే।**

ఓ చంద్రభగవాన్ ! మీరే మాకు ఆధారము! నన్ను మీ దరి చేర్చుకోండి। మీరు రస–ఆనంద స్వరూపులు. మీయందు సర్వ రసములు ప్రకాశించుచున్నాయి. సర్వశక్తి సమన్వితులు ! మీ రసములు మా యందు ప్రసరింపజేసి మా జీవితములను మధురముగాను, ఆప్యాయముగాను దయతో తీర్చిదిద్దండి ! మిమ్ములను ఉపాసిస్తూ ఉన్నాము.

అట్లే **ఆదిత్యుడు (సూర్యుడు) మా మనస్సులను ఆప్యాయముగాను, జీవితమును పవిత్రముగాను తీర్చిదిద్దెదరుగాక !**

ఈ విధంగా త్రిఛందోరూపమైన ఋక్కులతో ప్రత్యక్ష దేవతారూపులగు సూర్యచంద్రులకు స్తోత్రములు సమర్పించబడుగాక !

**"ఓ సూర్య చంద్రులారా ! అనారోగ్యముల వలన గాని (ప్రాణ అసానుకూల్యతచేతగాని), మాపై ఇతరులు కలిగి ఉండే అల్పమైన అభిప్రాయములువలనగాని, పశువులు ఇత్యాది జంతువుల వలనగాని మాకు కష్టములు రాకుండా కాపాడండి. ప్రాణశక్తి, సహ జనులు, బంధువులు, పశువులు మొదలైనవన్నీ మాకు అవిరోధమై, మా సాధనసంపత్తికి సానుకూల్యమగుదురు గాక ! మా దేహములోని దివ్యశక్తితత్త్వములు (దేవతలు), ఆదిత్యుడు కూడా మా చుట్టూ ఉండి రక్షించుచుండెదరు గాక ! అనువర్తులు, సానుకూల్యురు అగుదురుగాక ! మా కుడి చేయి ఉత్తమ కర్మలందు అనువర్తమై యుండుగాక !"** అని సూర్య–చంద్రోపాసన నిర్వర్తించబడుచుండవలెను.

## పౌర్ణమితరువాత – కృష్ణపక్ష చంద్రోపాసన

పౌర్ణమి అయిన తరువాత, కృష్ణపక్ష చంద్రుడు తూర్పు దిక్కుగా కనబడుచున్నంత కాలము – చంద్రుడు ఈ రీతిగా ఉపాసించబడును గాక!

**ఓ చంద్రదేవా! మీరు అమృత కిరణములతో ఆకాశములో 'సోముడు' – అను పేరుతో రారాజై ప్రకాశిస్తునారు. జ్ఞానానంద స్వరూపులు ! గగన వీధులతో పంచముఖ ప్రజాపతియై విరాజిల్లుచున్నారు. చంద్రమసం దృశ్యమానమ్ ఉపతిష్ఠేత్, ఏత ఏవ ఆవృతి సోమో రాజాఽసి। విచక్షణః పంచముఖోఽసి।**

**మొదటి ముఖముతో** – ఆకాశరాజువై జీవులందరికీ అత్యంత వాత్సల్యంతో ఔషధరూపంగా అన్నము (ఆహారము) ఇస్తున్నారు. **తేన ముఖేన మాం అన్నాదం కురు !** మాకు ఆ ముఖముతో భౌతిక – ఆహారము, బ్రహ్మజ్ఞాన ఆహారము కూడా దయచేయండి !

**రెండవ ముఖముతో** – పక్షి సంతతిని సంరక్షిస్తూ ఉత్తేజ పరచుచున్నారు. ఆ ముఖము మాకు పక్షిగణము ద్వారా అన్నప్రదాత అయి సర్వదా రక్షించెదరు గాక !

**మూడవ ముఖముతో** – అగ్ని (Heat) మీ మూడవముఖము. అగ్ని రూపులై ఈ జగత్తంతానిండి ఉన్నారు. ఆ ముఖముతో కూడా మాకు అన్నమును–అరుగుదలను వర్చస్సును ప్రసాదించండి.

**నాలుగవ ముఖముతో** – ఈ సర్వజీవుల భౌతిక రూపాలన్నీ మీ నాలుగవముఖము. ఆ ముఖముతో కూడా అన్నప్రదాత అయి వాత్సల్యము చూపెదరుగాక ! దృశ్యసౌందర్య రచనచే మా మనస్సును ఆహ్లాదపరచండి!

**ఐదవముఖము** – ప్రజాపతి – ఆత్మస్వరూపులై సర్వజీవుల హృదయాలలో సర్వదా ప్రకాశమానులగుచున్నారు. సర్వత్రా సర్వము అయినట్టి మీరు మాకు అన్న ప్రదాతలై కరుణించండి. ఈ సృష్టినంతా వరముగా ప్రసాదించుచున్నారు. మీ సృష్టి మాకు సానుకూల్యమగుచూ,... మమ్ములను రక్షించుచుండును గాక!

[అన్నము = ప్రకృతి / సర్వ ఇంద్రియ విషయ ప్రదర్శనలు / సృష్టి / భావన / అనుభూతులు]

ఈ విధంగా మీ పంచముఖములతో మా యొక్క అన్నమును (జగత్ దర్శనాకళను) ఆత్మామృతంతో పరమపవిత్రము చేయండి !

ఓ చంద్రభగవాన్ !

- మా యొక్క ప్రాణ – ప్రజ – పశు సంపదలను రక్షించండి !
- **మమ్ము ద్వేషించువారి – మేము ద్వేషించువారి ప్రాణ – ప్రజ – పశుసంపదలనుకూడా రక్షించమని వేడుకొనుచున్నాము.**

దేవతలు (ఇంద్రుడు – ఇంద్రియ దేవతలు) తమ తమ ఆవర్తములతో మమ్ములను రక్షించి శుభ – శాంతి – ఐశ్వర్యములు ప్రసాదించెదరు గాక ! బ్రహ్మవిద్యకు సంసిద్ధులముగా తీర్చిదిద్దెదరు గాక!

**ఓ ఆదిత్యదేవా ! సూర్యభగవాన్ !**

మా చుట్టూ ఆవృతులై (While rounding up around us) మా యొక్క దైవీకార్యక్రమములను (Our Devine Schedules) అన్వావర్తము (activate) చేస్తూ ఉండండి ! ఈ దేహము మీది ! ఈ కుడి బాహువులు మీవి ! అందుచేత ఈ మీ కుడి బాహువులచే ఎల్లప్పుడూ మాచే పుణ్యకార్యములు చేయిస్తూ అనుగ్రహించండి ! ఈ చేతులు మీవే ! చేతలూ మీవే ! అందుచేత మేము సదా మిమ్ములను సంతోష పరచే కార్యక్రమములందే నియమించండి ! అల్ప-దుష్ట-ద్రోహ చింతనలు మా దరి చేరకుండా మీ తేజో కిరణములతో మమ్ము సదా సంరక్షించండి!

## జీవిత భాగస్వామి (Life Partner) ఉపాసనా యజ్ఞము

**అథ సంవేశ్యన్ జాయాయై హృదయమ్ అభిమృశేత్ ! యత్ తే సుసీ మే హృదయో హితమంతః ।**

ఓ శ్రోతలారా ! మీరు మీ జీవిత భాగస్వామిని (భార్యను / భర్తను) పరమాత్మ ప్రసాదితంగాను, పరమాత్వ స్వరూపముగాను భావించి ఉపాసించండి. మీ జీవిత భాగస్వామి హృదయముపై (రోజుకొక్కసారి) అరచేతితో తాకుచూ...,

*"ఓ జీవిత భాగస్వామీ ! నా హృదయముచే మిమ్ములను హృదయేశ్వరి (మరియు ) ప్రాణేశ్వరిగా భావిస్తూ ఆరాధిస్తున్నాను. ప్రజాపతి (సృష్టికర్తకు) చెందిన వారు కాబట్టి ప్రజాపతి స్వరూపులుగా భావిస్తున్నాను. హితము కలుగజేయ వేడుకొనుచున్నాను. మీరు విద్యచే స్వతఃగా ఆత్మ స్వరూపులే ! విద్వాంసులే ! ఆత్మయొక్క అంశయే ! నన్ను విద్వాంసునిగా (ఆత్మ విద్యను ఎరిగినవాడుగా) చేయండి ! మన సంతతికి ఎట్టి వ్యాధులు సోకకుండా రక్షించెదరు గాక !"* అని ప్రార్థన చేయాలి.

ఈ విధంగా ఇల్లాలిని ఉపాసించువారికి, వారి సంతానమునకు కష్టములు ఉండవు ! (భార్యను దూషించువారి - భర్తను దూషించువారి సంతానము కష్టములు పొందగలరు - అని తలచబడునుగాక !)

## ఆత్మావైపుత్రః - పుత్రోపాసనా యజ్ఞము :

కుమారుని పరమాత్మ రూపముగా భావించటంచేత ప్రకృతి జనితమైన పుత్రవాత్సల్యమును ఆత్మోపాసనగా తీర్చిదిద్దుకోబడుగాక!

**సాధన :** కుమారుని 'మూర్ధము' (Fore face) ను కుడిచేతి వ్రేళ్ళన్నీటితో స్పృశించి, ముద్దుపెట్టుకొని, **"పరమాత్మకు అభిన్నులై, పరమాత్మచే నియామకులైనట్టి నా దేహములోని దివ్యశక్తుల రూపులగు దేవతా ప్రసాదముగా నీవు నాకు పుత్రుడవయ్యావు! నాయనా ! నీవు నా హృదయమునుండి వికశించిన ఆత్మదేవుని స్వరూపమువు. మన ఇరువురము అఖండమగు ఆత్మయే సహజ స్వరూపముగా కలిగి ఉన్నాము. అందుచేత,**

***నేనే నీవు, నీవే నేను! ఆత్మావై పుత్రః ।***

**నీవు నిండు ఆయురారోగ్య ఐశ్వర్యములతో జీవితమును గడుపుచుండెదవుగాక !** - అని పలుకుచూ పుత్రుని (సంతానమును) దీవించునుగాక !

బిడ్డా ! పుత్రా ! సుఖమును పొందుము. పదునైన బుద్ధి (Sharp Brain) కలవాడవు కమ్ము ! బంగారు రంగుతో ఉత్తమ మనో బుద్ధులతో నిండు నూరేళ్ళు జీవించుము..... అని పుత్రుని పేరు చెప్పి, ఆతనిని వాత్సల్యముతో ఆత్మోపాసనాపూర్వకంగా స్పృశించాలి. ఆశీర్వదించాలి!

**"ఏ మహిమచేత సృష్టికర్తయగు ప్రజాపతి సర్వజీవుల యొక్క అరిష్టములను, కష్టములను, బాధలను తొలగించుచున్నారో, ... అదే విధంగా, ఆ మహిమచేతనే ఆత్మస్వరూపుడనగు నేను ఆత్మస్వరూపులగు నా బిడ్డల అరిష్టములను, కష్టములను, బాధలను తొలగించుచున్నాను."** అని చెప్పుచూ ఉచ్చరిస్తూ, భావిస్తూ ఈ క్రింది మంత్రము బిడ్డల చెవులలో పలుకునుగాక !

**"ఆత్మావై పుత్ర నామ్నా । స జీవ శరదశ్శతమ్ । ఆసావితి నామాస్య । అశ్మాభవ । పరశుర్భవ । హిరణ్యం అస్తృతం భవ। తేజోవై పుత్రనామాఽసి । స జీవ శరదశ్శతం । ఆసావితి నామాస్య గృహ్ణతి। యేన ప్రజాపతిః ప్రజాఃపర్యక్ గృహ్ణీత అరిష్ట్యై, ... తేన త్వా పరిగృహ్ణామి ।"**

## తన సంతానమును ఉద్దేశ్యించి

"ఓ సర్వశ్రేష్ఠుడవగు ఇంద్రభగవాన్ ! నన్ను మా సంతానమును అల్ప - పాప దృష్టులనుండి, ధ్యాసలనుండి, భావములనుండి కాపాడండి ! మా పుత్ర - పౌత్ర - ప్రపౌత్రులకు, వారి వారి సంతానమునకు రక్షకుడవండి ! శ్రేయోదాయకమగు సంపదలు ప్రసాదించండి ! వారికి బాధలు, వ్యధలు తొలగించండి ! ఓ సంతానమా ! మీరంతా కూడా ఉత్తమ మార్గాన్వేషులై, దానము -

ధ్యానము – యజ్ఞము మొదలైనటువంటి దేవతలను సంతోషింపచేయు దైవీ కార్యక్రమములను ఏమరచకుండెదరు గాక ! అవి చక్కగా నిర్వర్తిస్తూ నిండు నూరేళ్ళూ వర్ధిల్లండి !" .... అని గోవు ఘీంకరించు రీతిగా పలుకుచుండెదరు గాక ! ఈ విధముగా అంటూ "ఓ సంతానమా ! ఆసావితి! ఆసావితి! ఆసావితి! మీరు సదా బ్రహ్మమే అయి ఉన్నారు సుమా !" ... అని '3'సార్లు వారందరి మూర్ధమును స్పృశిస్తూ ముద్దుపెట్టుకొనెదరుగాక !

## దివ్యతేజో ఆరాధన

ఇప్పుడిక ఈ దేహములో బ్రహ్మమే సహజ స్వరూపముగా గల ఏఏ దేవతలు వేంచేసి దీపిస్తూ, ప్రకాశించుచూ ఉన్నారో,... వారిని ఆరాధించుచుండెదముగాక !

- **యత్ జ్వలతి, తస్య ఆదిత్య మేవ ।** ఏది అగ్ని రూపముగా అంతటా వెలుగొందుచున్నదై ఉన్నదో, ... అదంతా **ఆదిత్య భగవానుని తేజస్సే ! ఆదిత్యుడే !** మన ఈ దేహములోని అగ్ని ఆదిత్య తేజస్సే !
- అగ్నిలోగల ప్రాణశక్తియే వాయువు రూపముగా కూడా ప్రదర్శనమగుచున్నది.
- బ్రహ్మమే ప్రాణశక్తి రూపముగా కూడా ఉన్నది. ప్రాణశక్తియే వాయురూపముగా ఉన్నది. కనుక వాయువు బ్రహ్మమే ! అట్టి వాయువుకు నమస్కారములు సమర్పించుకుంటున్నాము. (నమస్తే వాయుః। త్వమేవ ప్రత్యక్షమ్ బ్రహ్మాఽసి)

## సర్వమ్ చంద్రమసి

నామ – రూపాత్మకమై – కదలుచుండు స్వభావముకలిగినదై – ఏదైతే మార్పు – నాశనము స్వభావముగా కలిగి ఉండి 'మర్త్యో' దృశ్యతే (మృత ధర్మసహితే, **దివ్యతేజో ఆరాధన ఇతి** మర్త్యా) ... ప్రస్తుత వర్తమాత్రమానికి మాత్రము కనిపిస్తోందో, ... అది చంద్రమస రూపశక్తియే ! (ఉదా : కదిలే దేహము)

ఏది సర్వము కదిలించుచుచు, తాను నామ రూపరహితమై యున్నదో **అది కూడా చంద్రమసరూప శక్తియే !**

కదిలేది – కదిలించేది – మార్పు చెందేది – మార్పు చెందనిదీ ... రెండూ ఏకైక ప్రాణశక్తి యొక్క రూపములే ! బ్రహ్మమే !

- తేజస్సే వాయువుగా ప్రదర్శితమగుచున్నది.
- వాయువు ప్రాణశక్తి రూపము!
- బ్రహ్మమే ప్రాణశక్తి రూపముగా ప్రదర్శితమౌతోంది !
- తేజస్సు బ్రహ్మమునకు చెందినదే !
- ఏది చంద్రమసము (చంద్రబింబము) యొక్క తేజస్సుగాను, విద్యుత్ రూప ప్రకాశముగాను కనిపిస్తోందో, ... అదంతా సూర్యతోజో రూపమే !
- సూర్య తేజస్సు అగ్ని యొక్క రూపము !
- అగ్ని ప్రాణశక్తి ప్రదర్శనము. ప్రాణశక్తి బ్రహ్మము యొక్క సంప్రదర్శనము.
- యత్ చంద్రమా దృశ్యతే ...... చంద్రునిగా కనిపిస్తోందో
- యత్ విద్యుః విద్యోతతే ...... ఏది విద్యుత్‌గా తేజో రూపమై అనుభవమౌతోందో,
- అథ ఏతత్ మ్రియతే ....... ఏది జనన – మరణ స్వభావము కలిగి ఉన్నదో...,

అంతా ఆ బ్రహ్మ తేజస్సే ! బ్రహ్మమే ! ఏది ప్రకాశమానమై కనిపించుటలేదో, (చీకటిగా ఉన్నదో) ... అది కూడా విద్యుత్ (ప్రకాశము) యొక్క మరొక రూపమే ! అంశయే ! బ్రహ్మమే !

**వాయుమేవ తేజో గచ్ఛతి** – వాయువే తేజస్సుగా అగుచున్నది

**వాయుం ప్రాణా తావా** – వాయువు ప్రాణశక్తి యొక్క రూపము !

**ఏతాః సర్వదేవతాః వాయుమేవ ।** – దేహాంతర్గత – దేహబాహ్య దేవతలంతా ప్రాణశక్తితత్త్వమగు వాయురూపులే !

దివ్యశక్తులన్నీ (దేవతలంతా) ప్రాణవాయువు నుండి బయల్వెడలి, తిరిగి ప్రాణవాయు స్వరూపులై సశాంతిస్తున్నాయి.

వాయురూపులై ఉండటం చేత దేవతలు అమరులు, మరణము లేనివారు (ఈ జీవుల పట్ల దేహములుగా కనిపిస్తున్నవో?... ఇవి మరణధర్మము కలిగియున్నట్టివి)

## అధిదైవత - ఆధ్యాత్మ ఉపాసన

దేవతలు సహజంగా వాయురూపులై ఉండటము,
వాయువు - ప్రాణతత్త్వమై ఉండటము,
ప్రాణశక్తి - బ్రహ్మమే అయిఉండటము
... ఈ విశేషమును "అధిదైవతము ; ఆధ్యాత్మము" అని కూడా చెప్పబడుచున్నది.

✡

ఏదైతే "వాక్కు ప్రదర్శన శక్తి"గా ప్రకాశించుచున్నదో, ... అది బ్రహ్మము యొక్క తేజస్సు. ఏదైతే మాట్లాడబడుచున్నదో (సంగతులు, కబుర్లు, కథానికలు మొ॥వి) అది నశించవచ్చుగాక ! గతించవచ్చు గాక ! మార్పు-చేర్పులు చెందవచ్చు గాక! **బ్రహ్మ తేజోరూపమైన 'వాక్‌శక్తి'కి నశించటము, గతించటము అనునదే లేదు.** అయితే వాక్‌గా అనుభవమయ్యేదికూడా బ్రహ్మమే ! మరి, బ్రహ్మము సదా అద్వితీయము కదా!

ఏదైతే **దృక్‌శక్తి (చూచుశక్తి)**గా ప్రదర్శితమగుచున్నదో, ... అది బ్రహ్మము యొక్క తేజోరూపము (లేక) ప్రాణశక్తిరూపము. ఏది కళ్ళకు కనిపిస్తూ ఉన్నదో, అది నశించబోతోంది (యత్ దృశ్యమ్ - తత్ నశ్యమ్). ఏది కళ్ళకు కనబడకుండా, కళ్ళతో చూపుశక్తి అయి ఉన్నదో అది ప్రాణశక్తి రూపము (లేక) బ్రహ్మతేజో రూపము కాబట్టి, ... నశించుటయే లేదు. అయితే దృశ్యముగా కనిపించు వాస్తవ రూపము కూడా ప్రాణశక్తియే ! **ప్రాణ బ్రహ్మమే మార్పు చెందు దృశ్యరూపముగా కూడా కనిపిస్తోంది.**

ఏ బ్రహ్మము యొక్క తేజస్సు **ప్రాణశక్తిగా ప్రదర్శిత** మగుచున్నదో, ... అయ్యదియే దేహములో **వినికిడిశక్తి**గా ప్రకాశమానమగుచున్నది. అనగా శ్రుత (వినికిడి) శక్తియే ప్రాణశక్తి రూపముగా గమనించబడుగాక ! అదియే మార్పు చెందు **"వినబడువిషయములు"**గా కూడా అగుచున్నది. ఈ విధంగా వినబడేదంతా పరబ్రహ్మతేజస్సే ! మార్పుచెందని వినికిడి శక్తి - మార్పుచెందే **'వింటున్న మాటలు'** ఉభయము బ్రహ్మమే!

ఏది ప్రాణశక్తిగా ప్రకాశిస్తోందో, ... అదియే **మనోశక్తి (ఆలోచనాశక్తి)**గా ప్రభావమగుచున్నది. "ఏది ఆలోచించబడుచున్నదో, అది మనోరూపమునకు (మనోశక్తి)కి వేరైనదికాదు. నిర్విరామంగా ఆలోచించబడుచున్న "ఆలోచనావిషయములు" కూడా ... మనోరూపమే, కాబట్టి **ప్రాణరూప పరబ్రహ్మమే ! ఆలోచనలు మార్పు చెందుతాయి, నశిస్తాయేమోగాని**, ఆలోచనాశక్తికి నాశనము లేదు (అయినాకూడా ఉభయము బ్రహ్మమే ।) !

ఆలోచనలు .. ప్రవర్తించినవై కొంతసేపటికి **ఆలోచనాశక్తిలో ప్రవేశిస్తున్నాయి**. ఆలోచనాశక్తి ప్రాణశక్తియందు, ప్రాణశక్తి ఆత్మయందు ప్రవేశించి సంశాంతిస్తూ ఉన్నాయి. మరల మరెప్పుడో బయల్వెడలుచున్నాయి.

## ఆత్మతత్త్వము

ఆత్మనుండి - ప్రాణశక్తిని సర్వేంద్రియ దేవతలు - దేహము - విషయానుభవములు రూపుదాల్చుచు, మరల మరెప్పుడో వెనుకకు మరలి ఆత్మయందే ప్రవేశిస్తున్నాయి. ఆత్మ నుండి బయల్వెడలేదంతా ఆత్మకు భిన్నము కాదు. *ప్రాణము తన జనన స్థానమైనట్టి అనంతమగు ఆత్మతత్త్వమునందు తన ఇంద్రియ దైవీశక్తుల రూపంగా ప్రదర్శనమవటము - ఆ దైవీశక్తులు తిరిగి ప్రాణమునందు ఉపసంహారణమవటము. తిరిగి మరొకప్పుడు బయల్వెడలటం* ... ఇవియే సృష్టి - స్థితి - లయ - పునరారంభ చమత్కారములు.

అయితే ప్రాణశక్తి ఇంద్రియ దేవతలు, జీవుడు (Experiences), దృశ్యము ... **ఇవన్నీకూడా ఆత్మ స్వరూపము కాని సందర్భమేలేదు.** ఆ సర్వము సర్వదా సర్వత్రా ఆత్మయే ! కనుక ఆత్మనుండి ఏదీ బయల్వెడలటమూలేదు. వేరుగా ప్రకాశించటమనునదీ లేదు ! ఉపశమించటమూ లేదు. ఆత్మ సర్వదా యథాతథము.

బ్రహ్మతత్త్వమును ఈ రీతిగా తెలుసుకొనుచు, ఆస్వాదిస్తూ మమేకమగుచున్నట్టి బ్రహ్మతత్త్వజ్ఞాని (లేక) విద్వాంసుడు ఈ జగత్ దృశ్యము గురించి - **బ్రాహ్మీదృష్టితత్పరుడై ఉంటున్నాడు. "ఈ ఇంద్రియ విషయపరంపరల రూపమగు దృశ్యము, ఇంద్రియ దివ్యశక్తి స్వరూపులగు దేవతలు, ప్రాణశక్తి ... సర్వము స్వస్వరూప బ్రహ్మమే!"** ... అని అనుభూతపరుచుకుంటూ, చిరునవ్వు చెదరక చూస్తున్నాడు. అట్టివాడు - వింధ్య హిమాలయ పర్వతముల మధ్యగానూ, ఆవల - ఈవలగాను ఉన్నదంతా తన యొక్క ఆత్మవైభవముతో - గాలి తృణమును (గడ్డిపరకను) చుట్టి ఉన్నట్లుగా చుట్టి వేయగలడు. **"నా ఆత్మశోభయే వింధ్య - హిమాచల పర్యంతము. ఇంకా ఆవల - ఈవల చుట్టుకొని ఉన్నది"** ... అను మననమును స్వభావ సిద్ధపరచుకొన్నవాడై ఉంటున్నాను.

ఎవ్వరు మనము వర్ణించుకొంటున్న సర్వతత్త్వ స్వరూప పరబ్రహ్మమును **ద్వేషిస్తారో, ... వారు తమను తామే ద్వేషించుకొన్నట్లు** సుమా ! ఎందుకంటే, తాము బ్రహ్మమే అయి ఉన్నారు కాబట్టి.

## నిఃశ్రేయసా – ఆదానము – ప్రాణేశ్వరత్వము

**చిత్రగార్ప్యాయణి :** ఓ ఆరుణిగౌతమ – శ్వేతకేతు ఆత్మానంద స్వరూపులారా ! నిః **"శ్రేయ–ఆదానము"** అని చెప్పబడు ఆత్మతత్త్వ వివరణ రూపమగు ఒక ప్రాచీనమైనట్టి చమత్కార విశేషమును చెప్పుకుంటున్నాము. వినండి!

ఒకానొక సందర్భములో **చెవులు – కళ్ళు – ముక్కు – చర్మము – నోరు** (శబ్ద స్పర్శ రూప రస గంధ అధిష్ఠాన దైవశక్తులు, ఆరవదగు మనస్సు)–ఇవన్నీ ఒక చోట సమావేశమైనారు. ఎవరికి వారే – **"ఈ దేహము నా వలననే శ్రేయస్సు పొంది జీవించగలుగుతోంది. నేనే లేకుంటేనా, ... ఈ దేహము ఎట్లా నిలుస్తుంది ? నిలువదు"** ... అని తమతమ ప్రత్యేకతలను, అగత్య – అనివార్యత్వముల గురించి ఎలుగెత్తి చెప్పుకొననారంభిస్తున్నాయి. వాదించుకోసాగాయి. 'మేమే గొప్ప' అంటూ క్రమంగా పోట్లాడుకోసాగాయి. **"మేముంటేనే జీవుడు"** – అని అనసాగాయి.

అప్పుడు అవన్నీ తమ గొప్పతనము తెలియజేయటానికై అప్పటికప్పుడే భౌతిక దేహమునుండి ఒక్కొక్కటిగా బయల్వెడలసాగారు. అప్పుడు దేహములో శ్వాసనిలిచిపోయింది.

మొట్టమొదట – **ఏనం వాక్ ప్రవివేశ** – నోటిలో వాక్కు ప్రవేశించింది. నోరు శబ్దములు చేయసాగింది. అవి శబ్దములేగాని అర్థ సహితమగు మాటలు కావు. భావన తోడుగా లేదు. 'బే–తే–కే–మ్–దే–గే'... అంటూ నోరు శబ్దములు మాత్రం చేయసాగింది.

ఆ తరువాత **'చూపు'** కళ్లలో ప్రవేశించింది. కళ్ళు చూడగలుగుచున్నాయి. దేహములో వాక్కు – చూపు పనిచేయసాగాయి. అయితే ఆ రెండింటికి ఎటువంటి సమన్వయము లేదు. ఎదురుగా ఉన్నది చూడగలుగుచున్నాయి గాని "ఎందుకు – ఏమిటి – ఎట్టిది – బాగు – ఓగు" ... ఇవ్వేమీ అనుభవంగా లేకపోయినాయి.

అప్పుడు **శ్రోత్రము (వినికిడి శక్తి)** చెవులలో ప్రవేశించింది. దేహము మాట్లాడగలుగుతోంది, చూడగలుగుతోంది, వినగలుగుతోంది, ఆలోచనలు చేయగలుగుతోంది. అవి సమన్వయమై కలిసి పనిచేయడం లేదు. శబ్దము – చూపు – వినికిడి – ఆలోచన.... ఇవన్నీ వేటి పనిలో అవి ఉన్నాయి. **ఒకదానితో మరొకటి సంబంధము లేకపోయింది.**

అట్టి పరిస్థితిలో ప్రాణశక్తి దేహములో ప్రవేశించింది. వెంటనే ఆ దేహము ఇంద్రియములు మనస్సు జీవశక్తి పొందినదైనది. ఆ జీవుడు సర్వేంద్రియములను సమన్వయించుకొని దేహమును ఉపయోగించుకోగలిగాడు. ప్రాణశక్తితో ఇంద్రియ శక్తులు శ్రేయస్సు పొందసాగాయి.

అప్పుడు ఇంద్రియ దేవతలంతా మనస్సుతో సహా, **"అవును, మనకు త్రాణ ప్రాణశక్తియే ! ప్రాణశక్తి ఈ దేహములో ప్రవేశించకపోతే మనకు క్రియాశక్తి, ప్రయోజనశీలత్వము లభించవు. కనుక దేహములో ప్రాణ దేవతయే (ప్రాణశక్తియే) అన్నిటికంటే శ్రేష్ఠము. ఉన్నతము"** ... అని అంగీకరించారు. అంతేకాదు **"మనకు ఆధారము – ఆధేయము కూడా ప్రాణేశ్వరుడే!"** అని తలచి, ప్రాణదేవతకు తమను తాము సంపూర్ణముగా సమర్పించుకోసాగారు. "మేము ప్రాణదేవతయొక్క ప్రేరణ స్వరూపులము. ప్రాణదేవత యొక్క కళలము (We are the artistic exhibition of PRANA ENERGY) " – అను భావమును పొందసాగాయి. ప్రాణేశ్వరునితో మమేకమై, ప్రాణరూపమగు వాయువునందు ప్రతిష్ఠితులైనారు. భౌతిక దేహ బాహ్య విషయ – భావనా సంబంధమైన బంధనములను త్రెంచుకొని ఆత్మాకాశము నందు (ఆత్మభావనయందు) ప్రవేశించారు. ప్రాణశక్తితో సహా ఆత్మాకాశమునందు ఏక–అఖండరూపులైనారు. విషయములను ఆత్మస్వరూపముగా దర్శిస్తూ పూర్ణత్వమును పునికి పుచ్చుకోసాగారు.

ఓ మిత్రులారా ! ఎవ్వరైతే – **"ప్రాణాత్మయే సర్వోత్కృష్టమైనది. ఏకము – అఖండము అగు ఆత్మయే పంచప్రాణములుగా, సర్వేంద్రియములుగా, విషయములుగా ఆయాధర్మములను దృష్టిలోపెట్టుకొని పిలువబడుచున్నది"** ... అని గ్రహిస్తారో, దర్శిస్తారో, (ఆత్మతో) మమేకమౌతారో, ... వారు స్వయముగా ఆత్మత్వమును ప్రాప్తించుకొనుచున్నారు. **(బ్రహ్మైవ – న బ్రహ్మవిత్).** అట్టి మార్గములో ఆ ఇంద్రుడు మొదలైన దేవతలు, మనస్సు ఏ అమృతత్వమును పొందినారో, అట్టి అమృతానందమును ప్రజ్ఞావంతులమై మనము కూడా పొందగలము. పొంది అమరులమై (మృత్యు పరిధులను దాటివేసిన వారమై) దివ్య లోకములు చేరి ఆనందించగలము.

## పిత్రు - పుత్ర యజ్ఞము (భారసాలోపాసన)

**ఇప్పుడు** .., తండ్రి (పరమాత్మ సంజ్ఞ) పుత్రుని (జీవాత్మసంజ్ఞను) పిలచి ఆతనితో కూడి యజ్ఞమును నిర్వర్తించు తత్త్వజ్ఞాన వాఙ్మయములోని ఒకానొకవిధి గురించి మనం చెప్పుకుంటున్నాము. (పరమాత్మ తండ్రిని, జీవాత్మ పుత్రుడని, ఆత్మ ఉభయత్రా ఏకము అని - విశేష వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించి చెప్పటం జరుగుతోంది).

ముందుగా తండ్రి 'పుత్రయజ్ఞము' నిర్వర్తించటానికై సంసిద్ధుడగుచున్నారు. యజ్ఞ ప్రదేశమును ఎన్నుకొని అక్కడ గడ్డి మొ॥వి తొలగించి, యజ్ఞశాలను - యజ్ఞవేదికను తయారు చేసుకొనుచున్నారు. యజ్ఞస్థలమునకు బయటకూడా పరిశుభ్రముగా చదునుగా చుట్టూగల వాతావరణము యజ్ఞ సానుకూల్యముగా చేసుకొనుచున్నారు.

జలకుంభములను (పవిత్రనదీజలముతో కూడిన నీటికుండ)ను వేదికై (అభిషేకాదులకొరకై) తగిన స్థానముతో అమర్చుకొనుచున్నారు.

ఇక తండ్రి కుమారులు (విశేషార్థంగా పరమాత్మ-జీవాత్మ The Abosolute 'self and the self in the incident) ఎదురు - బొదురుగా ఆశీనులగుచున్నారు. అగ్నిగుండములో అగ్నిని మంత్రముగ్ధముగా ఆహ్వానించి యజ్ఞకార్యము (అగ్నికార్యము) నిర్వర్తిస్తున్నారు. అట్టి యజ్ఞకార్యము-ఆహుతులు-ఇవన్నీ ముగిసిన తరువాత.... ఒకరికొకరు అభిముఖముగా ఆశీనులగుచున్నారు. తండ్రి - కుమారుని రసేంద్రియము (నాలుక) మొదలుకొని కళ్ళు, చెవులు, పెదిమలు మొదలైన సర్వజ్ఞానేంద్రియములు బ్రహ్మభావనతో స్పృశిస్తున్నారు.

## పిత్రు దేవునిచే ప్రదానము - పుత్రునిచే స్వీకారము

**పిత :** బిడ్డా ! నా దేహములోని దేవతలచే ప్రాసాదితుడవగు మమజీవాత్మ స్వరూపా! నా ఆత్మ ప్రతిబింబమా ! నీలో నా వాక్ దేవతయొక్క అనుజ్ఞతో నాయొక్క వాక్కును నీయందు ప్రవేశింపజేస్తున్నానయ్యా !

**పుత్రుడు :** పితృదేవా ! మీచే ఇవ్వబడు వాక్ శక్తిని నేను పుచ్చుకొనుచున్నాను.

| పితౌవాచ। | పుత్రౌవాచ। |
|---|---|
| పుత్రా ! నా లోని ప్రాణశక్తిని నీయందు ప్రవేశింపచేస్తున్నాను. | పితృదేవా ! మీరు అనువర్తింపచేస్తున్న ప్రాణశక్తిని నేను స్వీకరించుచున్నాను. |
| పుత్రా ! నాలోని చక్షు (చూపు) శక్తిని నీయందు ఉంచుతూ, నీకు అందిస్తున్నాను. | నాన్నగారూ ! మీరు ప్రసాదిస్తున్న చక్షు శక్తిని నేను స్వీకరించుచున్నాను. సవిస్తరింపజేసుకొనుచున్నాను. |
| పుత్రా ! నాలోని శ్రోత్ర (వినికిడి) శక్తిని నీకు అందిస్తున్నాను | పితృదేవా ! మీరు అందించే శ్రోత్ర శక్తిని నేను స్వీకరించుచున్నాను. |
| బిడ్డా ! నా మనోశక్తిని నీయందు ప్రవేశింపజేస్తున్నాను | తండ్రీ! మీరు ప్రవేశింపజేస్తున్న మనోశక్తిని నేను పొందుచున్నాను. |
| నాలోని అన్నరసదేవతా రూపమగు జిహ్వేంద్రియతత్త్వమును నీకు అందిస్తున్నాను. | జిహ్వేంద్రియ శక్తిని నేను పుచ్చుకొనుచున్నాను. |
| నాయొక్క కర్మఫలములను నీకందిస్తున్నాను. | నేను పుచ్చుకొనుచున్నాను. |
| నా సుఖ-దుఃఖములను నీకు ఇస్తున్నానయ్యా ! | నేను పుచ్చుకొనుచున్నాను. |
| నాయొక్క పునః ప్రజా జనకము (Reproductive) అగు ఆనందరతిని నీకు జేర్చుచున్నాను. | మీ నుండి ఆనంద రతి - సంతతివిధిని నేను స్వీకరించుచున్నాను. |
| నా మనస్సును నీకు అందిస్తున్నాను. | మీ మనస్సును నేను పొందుచున్నాను. |
| ధీ (బుద్ధి) శక్తిని, తెలుసు కొనువ్యవస్థను, ఏదో ఒకటి కావాలి - చేయాలి నే కామశక్తిని నీకు ఇచ్చుచున్నాను. | మీరు ఇస్తున్నట్టి - విజ్ఞాతవ్య - కామ శక్తులను నేను పుచ్చుకునుచున్నాను. |
| కుడివైపు తిరుగు ! నిన్ను మంత్ర మనన ధ్యాస కలవానిగా శక్తిని యిచ్చుచున్నాను. | కుడివైపు తిరిగి మీ ప్రసాదముచే సమంత్రితయుతుడను అగుచున్నాను. |

ఈవిధంగా తండ్రి బిడ్డకు తనయందలి దైవీతత్త్వముల, విభవములను పుత్రునికి ప్రసాదించుచున్నారు. అప్పుడు తండ్రి పుత్రుని ఈ రీతిగా దీవిస్తున్నారు.

ప్రియపుత్రా ! బిడ్డా ! మమాత్మానంద స్వరూపా !

- బ్రహ్మవర్చస్సును పొందుము.
- అన్నము (ప్రకృతి- బ్రహ్మము)ను పొందినవాడవగుము.
- కీర్తిమంతుడవయ్యెదవు గాక !

ఇంకాకూడా, పుత్రుని ముఖముపై, తన ముఖముపై వస్త్రమును కప్పి ...,

"ఓ మమాత్మా-అభిన్న స్వరూపా ! స్వర్గము మొదలైన ఉత్తమ ఊర్ధ్వలోక మార్గములు నీకు లభించునుగాక ! నా సర్వస్వము నీకు సమర్పిస్తున్నానయ్యా !

- నేను జీవించి ఉన్నప్పుడు, నా ఈ భౌతిక దేహ పతనానంతరము కూడా నా యందలి తేజస్సు నీయందు ప్రవేశించి, నిన్ను పవిత్రుని చేయుచుండునుగాక ! దివ్య తేజో సంపన్నుడవై లోక శ్రేయస్సును దృష్టిలో కలిగి జీవించెదవు గాక !

'జీవితము' అనే బ్రహ్మదేవప్రసాదితమైన మహత్తర అవకాశమును పరిపుష్టి చేసుకొనెదవుగాక ! సద్వినియోగపరుచుకొనెదవు గాక"

అని తండ్రి పుత్రుని దీవించుచున్నాడు. **ఇతి పిత్రు - పుత్ర యజ్ఞః ॥**

## తృతీయ ఆధ్యాయము - ప్రతర్దన మహేంద్ర సంవాదము

**చిత్రగార్గ్యాయణి :** ఓ ప్రియ ఆరుణిగౌతమ - శ్వేతకేతు ప్రియ మమాత్మానంద స్వరూపులారా ! ఇప్పుడు ఆత్మోపాసనను విశదీకరించే "ప్రతర్దన - మహేంద్ర సంవాదము" ... ను సందర్భోచితం కాబట్టి చెప్పుకొనెదము గాక !

ఒకప్పుడు దేవ - దానవుల మధ్య గొప్ప యుద్ధము జరిగింది. ఆ యుద్ధములో దేవతల ఆహ్వానముపై ప్రతర్దనుడు అను దివోదాసీ పుత్రుడు దైవోదాసుడు దానవులతో యుద్ధం చేసి దేవతల విజయానికి సహకరించారు. ఆతడు తన సేనలతో దేవతలకు విజయము చేకూర్చినందుకు అందరూ ఎంతగానో మెచ్చుకున్నారు. దేవతలకు అధిపతియగు మహేంద్రుడు ప్రతర్దనుని సన్మానించదలచి తన అంతఃపురానికి ఆహ్వానించాడు.

**మహేంద్ర భగవానుడు : ప్రతర్దన ! తే వరం దదానీ౨తి !** ఓ ప్రతర్దనా ! నీవు దేవతా విజయమునకు అందించిన సేవలకు మేమంతా సంతోషించుచున్నాము. నీకు ప్రియమైన వరము ఏదైనా ఇచ్చి, నిన్ను సంతోషింపచేసి తిరిగి భూలోకమునకు పంపదలచుచున్నాము. కోరుకో !

**ప్రతర్దనుడు :** హే మహేంద్రభగవాన్। నేను దేవతలకు సేవాతత్పరుడనై భక్తితో యుద్ధములో పాల్గొన్నాను. ఏదీ కోరికాదు. అయినాకూడా, మహనీయుల ఆజ్ఞను తిరస్కరించలేము కదా ! అందుచేత, "మానవులమగు మాకు ఏదైతే మహత్తరమైన హితము కలుగజేయగలదని అనుకుంటారో, **యమ్ త్వమ్ మనుష్యాయ హితతమమ్ మన్యసీ౨తి** - అది మీరే యోచించి, నాకు శుభము కొరకై ప్రసాదించండి.

**మహేంద్రుడు :** అత్యంత హితమైనది అని నేనే నిర్ణయించి వరప్రదానము చేయాలని ... అడుగుచున్నావుకదా ! ఏది ఉత్తమోత్తమమో అది నాకు నేనుగా నిర్ణయించటము మర్యాద కాదయ్యా ! నీకుగా నీవు నీకు కావలసిన ఏదైనా వరము కోరుకో ! నేనే నీకొరకై నిర్ణయించి నీకివ్వటమనేది అతిథి మర్యాద అవుతుందేమో గాని, వరప్రదాన విధానము కాదు.

**ప్రతర్దనుడు :** స్వామీ ! మీరు మహత్ ప్రజ్ఞా స్వరూపులు. త్రిలోకములకు అధినేతలు. సత్‌చిత్ ఆనంద స్వరూపులు. "ఖలు ఇంద్రః సత్యాదేవాయ। సత్యమేవ మహేంద్రః ! మహేంద్రుడు! సత్యము ఎరిగినవారు. సత్యస్వరూపులు" ... అని ఉపాసకజనులు మిమ్ములను వేద సూక్తులతో యజ్ఞ యాగములతో స్తోత్రము చేస్తూ ఉంటారు కదా ! మరి **సత్యము ఏదై ఉన్నదో, అద్దానిని నాకు బోధించమని** వేడుకుంటున్నాను. మీయొక్క సత్యస్వరూపమేమిటో, ఎట్టిదో వివరించమని నా అభ్యర్థన !

**మహేంద్ర భగవానుడు** : నాయనా ! నీవు తెలివిగా **పరమసత్యమగు పరబ్రహ్మము** గురించియే తెలుసుకోవాలనుకుంటున్నావు. నాకు సంతోషము కలుగజేస్తోంది.

నేను **నిత్యము, సత్యము అగు పరబ్రహ్మ స్వరూపుడను**. సర్వేంద్రియుడనగు నేను పరబ్రహ్మమే సహజ స్వరూపముగా కలిగి ఉన్నాను. సర్వదేహములలో వేంచేసియుండుట చేత **సర్వజన ప్రియుడను !** నన్ను **నీ ఆత్మ స్వరూపముగా** ఎరుగుము. అంతేగాని బాహ్యమగు

ఒక వ్యక్తిగా కాదు. ఎందుకంటే, నీవు అదియే ! తత్త్వమసి ! మూడు ముఖములుగల త్వాష్టుని (వృత్రాసురుని) సంహరించినవాడను. అనగా జాగ్రత్ – స్వప్న – సుషుప్తును అధిగమించి, ఆవలగల తురీయ స్వరూపుడను ! త్రివృత్తులను జయించిన వాడను! అవాఙ్ముఖుడను. వాక్కుకు ఆవల గల సర్వదేవతా స్వరూపుడను. ఇంద్రియములకు ఈవల – ఆవల కూడా ప్రకాశమానుడగుచున్నవాడను. సాలావృతములను (అడవికుక్కలను – వేదములను) అతిక్రమించినవాడను । త్రిలోకాధిపత్య ధర్మము నిర్వర్తిస్తూనే, ప్రతిఒక్క జీవుని ఆత్మస్వరూపముగా వెలుగొందుచున్నవాడను. భక్తజనులకు అధీనుడనై, వారిని సేవిస్తూ శుభములు కలుగజేయువాడను. **భక్తులకు కావలసినది ఇవ్వటము నా స్వభావము**. అందుచేతనే మహాభక్తుడగు ప్రహ్లాదుని ఇష్టమేమిటో గ్రహించి ఆయన పాలనలోని ప్రజలందరికీ ఆయన అడుగకుండానే దివ్యలోకములను అనుగ్రహించాను. అంతరిక్షములోని పౌలోమజనులకు, భూమిపై కాలకాశ్యులు మొ॥వారికి **భక్తజన పరాధీనుడవై దివ్యలోకములను ప్రాప్తింపజేశాను**. ఈ విధంగా భక్తులకు దాసానుదాసుడను. అనురక్తుడను. నన్ను ప్రేమించు వారికి 'ప్రేమ'ను అందించువాడను!

నీవు నా సత్య స్వరూపము గురించి అడిగావుకదా ! విను.

నేను సర్వజీవుల **సహజ స్వస్వరూపమే** అయిఉన్నాను. అందుచేతనే 'మహేంద్ర' (ఇంద్రియముల మహత్ స్వరూపము) అని పిలువబడుచున్నాను. లీలగా ఈ దేవ – దానవ యుద్ధమువంటి ఆయా గెలుపు–ఓటముల కల్పనలచే వినోదించువాడను. ఎవ్వరైతే **నా యొక్క తమయందలి మహేశ్వరతత్త్వమును** తెలుసుకుంటారో, అట్టివారు ఇక ఇంద్రియ వ్యవహారములచే **బద్ధులు – నిబద్ధులు కారు.** ఈ జీవులలో కొందరు మాతృవధ, పితృవధ, దొంగతనము, భ్రూణహత్య మొదలైన మహాపాతకములు చేసి ఉన్నప్పుడు కూడా వారు గనుక తమయందే వేంచేసి యున్న **మహేంద్రాత్మతత్త్వమును** శాస్త్రసాధనల సహాయంతోను, గురుముఖతఃగాను, స్వకీయవిచారణతోను తెలుసుకుంటారో, ఉపాసిస్తారో, దర్శిస్తారో, వారందరిని నేను కాపాడు వ్రతము కలవాడను. అందుచేత వారిక దుష్ట–పర్యవసానముల గురించి భయపడవలసిన అవసరము లేదు. ఆత్మజ్ఞానముచే వారు నావలన ఉత్తమలోకములు పొందగలరు.

ఓ ప్రతర్దనా! సర్వజీవులతో ప్రాణ స్వరూపుడనై వెలుగొందుచున్నాను. త్వమేవాఽహమ్! నీవుగా ఉన్నది నేనే! కనుక **"నాకు కనబడే ఈ సర్వజీవులలోని కేవల ప్రజ్ఞా రూపుడను నేనే" –** అని నిన్ను నీవు గ్రహించు. జీవుల **ఆయువు రూపముగా**, వాయువు (ప్రాణము) రూపముగా, **అమృత** స్వరూపముగా నన్ను దర్శించు.

ప్రాణమునకు కూడా ప్రాణమైయున్న వాడను. ప్రాణఃప్రాణోవా ! ప్రాణేశ్వరుడగు నేను ఈ జీవజగత్తు – జీవుడు కూడా ! అట్టి ప్రాణప్రాణము అమృత స్వరూపము. మార్పు (మృతము) లేనిది.

ప్రియప్రతర్దనా ! ఎవ్వరు నీకు జీవాత్మగా – గుణసహితులై కనిపిస్తున్నారో ... వారంతా స్వతఃగా అమృతస్వరూపులేనయ్యా !

అట్టి జీవాత్మ ఈ దేహములలో ప్రవేశించి ఒక్కొక్క భౌతికదేహములో ఉండి, ఆ దేహములో శ్వాస ఉన్నతంవరకు జీవిస్తున్నాడు. మరల మరొక దేహములో నూతన వస్త్ర ధారణవలె ప్రవేశించి నానుండి శ్వాస (ప్రాణచలనము) పొందుచున్నాడు.

అట్టి శ్వాసపై ధ్యాసచే, శ్వాసను ఉపాశించి ఈ జీవుడు అమృతత్వము పొందగలడు.

ఎవ్వరైతే నన్ను 'జీవాత్మగాను – పరమాత్మగాను' కూడా ఉన్నవాడుగా సర్వసందర్భ – స్థితి – గతులలోను ఉపాసిస్తారో, వారు స్వభావసిద్ధముగా ఊర్ధ్వలోకములు పొంది ఆనందిస్తున్నారు. అమృతరూపులగుచున్నారు. జన్మ – మృత్యువుల పరిధిని దాటివేస్తున్నారు. కనుక నీయందు వేంచేసియున్న ప్రాణతత్త్వమును 'గమనించుట' అను ఉపాసన ద్వారా జన్మ–మృత్యు చక్రమునుండి విడివడి అమృతలోకములు ప్రవేశించెదవు గాక !

జన్మ–మృత్యువులు "మమాత్మ" యందలి స్వయం కల్పిత ఊహా విశేషములు. అంతేగాని, నేను వాటిచే బద్ధుడను కాదు – అని గ్రహించి ఉండు.

**ప్రతర్దనుడు :** మహాత్మా ! మహేంద్రా ! ఈ జీవుని భౌతిక దేహములోను – విశ్వములలోను గల ప్రాణతత్త్వముల సంబంధము ఏతీరైనదో వివరించండి !

**మహేంద్రుడు :** ఈ జీవుని భౌతిక దేహములో ప్రదర్శితమగుచున్న ప్రాణశక్తి – సముద్ర జలంలోని ఒక తరంగ జలము వలె – అనంతరూపమగు విశ్వప్రాణశక్తిలో అంతర్విభాగమే ! అనగా విశ్వప్రాణమే (సప్రాణమే) వ్యష్టి ప్రాణశక్తి రూపముగా కూడా అగుచున్నది.

(అంతటా ఉన్న అగ్ని ఒక దీపమును కూడా వెలిగించుతీరుగా). అట్టి అనంత ప్రాణశక్తి యొక్క సంబంధము లేక పోయి ఉంటే...,

- వాక్ ఇంద్రియము పలుకులు పలకలేదు. ఎవ్వరూ పలుకగలిగేవారూ కాదు. పలుకగలిగే మాటలు ఉండజాలవు.
- కళ్ళు రూపములు చూడలేవు ! ఎవ్వరూ కనబడేవారు కాదు. ఏదీ కనబడేది కాదు.
- చెవులు శబ్దములను వినలేవు. ఎవ్వరూ వినిపించనూలేరు. ఏదీ వినబడేది కాదు.
- మనస్సు దృశ్య సంబంధితముగా యోచనలు చేయలేదు. ఏ ఆలోచనా రాగలిగేది కాదు.

ఆ **అనంత ప్రాణశక్తి** యొక్క **ప్రజ్ఞారూపమే** దేహములోని **పంచప్రాణములు**. ఆ అనంతవిశ్వశక్తియే **ప్రజ్ఞాపన** (తెలియబడునది, అనుభవమగుచున్నది)గా కూడా అగుచున్నది.

విశ్వప్రాణము + దేహములోని పంచవిధులు నిర్వర్తించు పంచప్రాణములు – సర్వప్రాణము (లేక సప్రాణము) ఈ మూడు ఏక – అఖండ ప్రాణతత్త్వ స్వరూపమే! శక్తియే ప్రాణముయొక్క సంప్రదర్శనము.

ప్రాణశక్తి దేహములో ప్రాణ – అపాన – వ్యాన – ఉదాన – సమాన క్రియలు నిర్వర్తించటము చేతనే దేహములో ఉచ్ఛ్వాస – నిశ్వాసలు జరుగుచున్నాయి. పంచ ప్రాణశక్తిచేతనే ఇంద్రియములు శక్తిని పొంది (1) ఇంద్రియ విషయములను (2) విషయరూపములే అయినట్టి జగత్ వ్యవహారమును – సిద్ధింపజేయటం జరుగుతోంది. కాబట్టి **ఈ లోకములు, జీవులు, దృశ్యములు, లోకపాలకులు ... ఇదంతా కూడా ప్రాణశక్తి ప్రదర్శనమే!** ముఖ్య ప్రాణము యొక్క ప్రియసందర్శనమే !

- ప్రాణశక్తి చేతనే ఇంద్రియ శక్తులు జీవిస్తున్నాయి.
- అంతేగాని ఇంద్రియములచే ప్రాణశక్తి జీవింపజేయబడటము లేదు.

**ప్రవర్దనుడు :** అది ఎట్లా స్వామీ ! ఇంద్రియాలు పనిచేయకుంటే ప్రాణము నిలువవు కదా !

**మహేంద్రుడు :** ఊహూ ! కాదు!

- ఒకని నోరు మాట్లాడక పోయినప్పటికీ ఆతడు **మూగవానిగా** జీవిస్తున్నాడు కదా!
- మరొకనికి కళ్ళు కనిపించటము లేదనుకో. అయినా కూడా **గ్రుడ్డివాడుగా** జీవిస్తూనే ఉన్నాడు కదా !
- ఇంకొకడు చెవులతో ఏమీ వినలేని స్థితిలోకూడా, **చెవిటివానిగా** జీవిస్తున్నాడు. కదా !
- వేరొకని మనస్సు బహుచ్ఛిన్నముచేత – ఎదురుగా ఉన్నవాటిని గమనించలేని స్థితిలో కూడా ఉండినా **ఊరుచ్ఛిన్నుడుగా** (పిచ్చివాడుగా), ఆతడు జీవిస్తూనే ఉన్నాడు కదా !

ప్రాణశక్తి చేతనే ప్రజ్ఞాత్మ (బుద్ధి) కూడా ఈ శరీరమును స్వీకరించటము, విసర్జించటము నిర్వర్తిస్తోంది.

కనుక **"ప్రాణశక్తిచే అన్నీ పొందవచ్చు. ప్రాణశక్తి లేకుంటే ఏ ఇంద్రియము ఉనికిని కలిగి ఉండదు"** – అని నిరూపించబడుతోంది.

అందుచేత ప్రాణశక్తియే అన్నిటికన్నా ముఖ్యముగా ఉపాసించవలసినదై ఉన్నది.

ఇంకా విను.

- ప్రాణతత్త్వమే – ప్రజ్ఞాత్మ ।
- ప్రజ్ఞాత్మయే – ప్రాణశక్తి అయి ఉన్నది. ప్రాణశక్తి – ఆత్మ ఒకదానితో మరొకటి అభిన్నము.

ఈ భౌతిక దేశములో **ప్రాణశక్తి ప్రజ్ఞాత్మ** – ఉభయము ఏకరూపమే అయి ఉండి కూడా – రెండు ధర్మములు నిర్వర్తించటం జరుగుతోంది. (ఇది – ఒకే వ్యక్తి గృహధర్మములు – ఉద్యోగధర్మములు నిర్వర్తించేతీరుగా ) ప్రజ్ఞాత్మయే ద్రష్ట – దృష్టి – దృశ్యములరూపముగా కూడా త్రిధర్మములను నిర్వర్తించుచున్నదగుచున్నది. ఈవిధంగా ప్రజ్ఞాత్మ సహస్ర రూపములుగా ఆయా ధర్మములు ప్రదర్శించుచున్నది. ఈ జగత్తు ఆత్మ స్వరూపమే!

- దృష్టియే జగత్తు. దృష్టియే సృష్టి. దృష్టి లేకపోతే సృష్టియే లేదు.
- దృష్టి లేనప్పుడు 'జగత్తు' అనునదానికి ఉనికియే ఉండదు. **స్వప్న ద్రష్ట స్వప్న దర్శనమే చేయునప్పుడు, స్వప్నదృష్టియే కలిగి ఉండనప్పుడు స్వప్నమనునది ఎక్కడుంటుంది** ? ఇదీ అంతే !

ప్రజ్ఞాత్మ జాగ్రత్‌కు మాత్రమే పరిమితమై ఉండటములేదు. ప్రజ్ఞాత్మయొక్క ప్రజ్ఞత్వమే జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు. అనగా, ప్రజ్ఞాత్మ జాగ్రత్‌లో కనబడే తెలివితేటలకు పరిమితము కాదు. జాగ్రత్ – స్వప్న – సుషుప్తులలోని అనుభవగు విషయమంతటికీ కూడా ఒకే తెలివితేటలు అనువర్తిస్తున్నాయి. కనుక ప్రజ్ఞాత్మను "జాగ్రత్‌లోని తెలివితేటలు" ... అను దానికి పరిమితమని అనవీలులేదు.

స్వప్న సమయంలో తెలివి (స్వప్న ప్రజ్ఞ) పని చూస్తూఉండగా, జాగ్రత్ సంబంధిత తెలివి (జాగ్రత్ ప్రజ్ఞ) వాటి వాటి – సమాచారములు అప్రదర్శితంగా ఉండవచ్చుగాక ! లేకుండా పోవుటలేదు. సుషుప్తిలో జాగ్రత్ – స్వప్న తెలివి – సమాచారము మౌనత్వము పొంది ఉంటున్నాయి. నిద్రలేవగానే ? జాగ్రత్ తెలివి – సమాచారములు తిరిగి ప్రవర్తన శీలమగుచున్నాయి.

ఒకడు నిదుర లేచినప్పుడు తత్‌క్షణమే జరుగుచున్నదేమిటి ? దీపము వెలుగగానే కాంతి నలువైపులా ప్రసరిస్తూ, ఆక్షణమే గదిలోని వస్తువులన్నీ కనిపిస్తూ ఉంటాయికదా ! అదే విధంగా, ప్రజ్ఞాత్మ ప్రాణశక్తి ద్వారా ప్రాణశక్తిరూపంగా ఇంద్రియములను ప్రవర్తింపజేయుచున్నది. ఇంద్రియములు ఇంద్రియ విషయరూపములుగా ప్రదర్శితమగుచున్నాయి. ప్రాణశక్తి సర్వేంద్రియములలో వ్యాపించి ఇంద్రియ విషయానుభవములను సిద్ధింపజేయుచున్నది. ప్రాణశక్తియే ఇంద్రియ విషయరూపములుగా కూడా సంప్రదర్శనమగుచున్నది.

అనగా, నిదుర లేచుచూనే ప్రజ్ఞాత్మ స్వరూపమైన ప్రాణశక్తి ఇంద్రియ శక్తుల రూపమును దాల్చి ఆయాస్థానములలో ప్రకాశించి (చూపు–వినికిడి మొదలైన) ఇంద్రియ శక్తులను ఆయా స్థానములలో ఉంచి, వివిధ వ్యవహారానుభవములను స్వీయకల్పనగా పొందుచున్నది.

సుషుప్తిలో నిద్రాణమైయున్న ఇంద్రియ శక్తులు, (మనస్సు, దృశ్యధ్యాస, దృశ్యసంబంధమైన జ్ఞాపకములు – సంస్కారములు, అభినివేశములు ... ఇవన్నీకూడా) జాగ్రత్ ఆరంభక్షణంలో (మెళుకువవచ్చుక్షణంలో) విస్ఫులింగములవలె వికశితమగుచున్నాయి. ఇకప్పుడు ఇంద్రియ జగత్తు ప్రదర్శితమగుచూ ప్రకాశమానమగుచున్నది. ప్రియ ఆత్మానంద ప్రాణేశ్వర స్వరూప ప్రతర్దనా ! మనం చెప్పుకున్న విశేషాలను అనుసరించి కొన్ని ముఖ్యమైన సారవిశేషాలు వాక్యరూపాలుగా చెప్పుచున్నాను విను.

- **ఆత్మనః ప్రాణా :** సర్వదా యథాతథమై, ప్రతిష్ఠితమైయున్న ఆత్మయే – ప్రాణశక్తిగా ప్రదర్శితమగుచున్నది.
- **ప్రాణేభ్యో దేవా** – ప్రాణశక్తియే ఇంద్రియ దేవతల రూపము (ఇంద్రియ దివ్యశక్తులుగా) దాల్చుచున్నది. సర్వమునకు ఆధారము – ఆధేయము (That which is Dependent as well as that upon which depending) ఆత్మయే ! ఇంద్రియ దేవతలు – శరీరములోని శబ్ద–స్పర్శ–రూప–రస–గంధములు చోదనము చేయు విశ్వ ప్రజ్ఞలు, తదనుభూతములు అంతా ఆత్మయే!

**కపర్దనుడు :** స్వామీ ! జగద్గురూ ! మహేంద్రా ! ఈ దేహములో ఇంద్రియ శక్తులు ప్రవర్తించుచున్నాయి. అట్లాగే మనస్సు సంచరిస్తోంది. ఇప్పుడు ఈ దేహమును విడచి వెళ్ళుచున్న జీవుడు తనవెంట ఏమేమి తీసుకొని పోవుచున్నాడు ?

**మహేంద్రుడు :** ఆత్మస్వరూపుడగు ఈ జీవుడు దేహమునుండి **'ప్రాణశక్తిని'** విరమింపజేసి, ఆ ప్రాణశక్తిని తన వెంట తీసుకొని పోవుచున్నాడు.

- వాక్ ఇంద్రియదేవత ... తనయందలి జ్ఞప్తులను, సంస్కారములను ప్రాణదేవతకు సమర్పించుచూ, తాను ప్రాణశక్తియందు ప్రవేశము పొందుతోంది. జీవుడు ప్రాణశక్తితో బాటే సర్వగంధములను (వాక్ సంస్కారములను – వాసనలను) తనవెంట తీసుకొని పోవుచున్నాడు.
- అట్లాగే నేత్రములు (కళ్ళు) తాము జీవితమంతా చూస్తూ వస్తున్న నామ రూప సంబంధమైన అభిరుచుల యొక్క సానుకూల – వ్యతిరిక్త జ్ఞాపకములను ప్రాణదేవతకు సమర్పించుకుంటున్నాయి.
- చెవులు (శ్రోత్రము) కూడా జీవితకాలంలో వింటూ, అభినివేశము (Emotional Involvement or Entanglement) ) కలిగియున్న శబ్ద విశేషాలను ప్రాణశక్తికి సమర్పించుకొనుచున్నది.

ప్రాణశక్తి వాటినన్నిటినీ సూక్ష్మ సంస్కారముల రూపంగా స్వీకరించి, చిత్తవిభాగమునందు పదిలపరచుచూ, ఆత్మయందు ప్రవేశము పొందుచున్నది.

మనస్సు – దేహము యొక్క జీవితకాలములోని **"ఆవేశముతోను, అభిరుచితోను కూడిన ఆలోచన"**లను, ధ్యాసలను ప్రాణశక్తికి సమర్పించుకొనుచు, భౌతిక దేహమును త్యజిస్తోంది. ఆ ధ్యాసలను ప్రాణశక్తి మనో సూక్ష్మ రూపమున (ఆలోచనల సూక్ష్మరూపంగా) స్వీకరించి తనయందు నిక్షిప్తము చేసుకుంటూ ఆత్మను అనుసరించుచున్నది.

ఏ ప్రాణశక్తి అయితే సర్వ ఇంద్రియములనుండి జ్ఞాపకములను, అభ్యాస సంస్కారములను (దేహము విడచునప్పుడు) స్వీకరించుచున్నదో, అయ్యది **ప్రజ్ఞారూపమే** అయి ఉన్నది. **ప్రజ్ఞానము బ్రహ్మమే అయి ఉన్నది.** (ప్రజ్ఞానమ్ బ్రహ్మ)

ఏది **'ప్రజ్ఞ'** అని పిలువబడుచున్నదో, అదియే **ప్రాణశక్తి**కూడా !

ప్రజ్ఞ – ప్రాణము ... ఈరెండూ ఏకరూపమేగాని, వేరువేరు రూపములు కాదు. ఈ రెండూ ఏకరూపమై దేహములలో ప్రవేశ – నిష్క్రమణములు నిర్వర్తిస్తున్నాయి. అటువంటి సహజ ప్రజ్ఞా స్వరూపులమగు మనము మరి కొన్ని విశేషాలు చెప్పుకొనెదము గాక !

## సర్వదేహములలో ఏకరూపమగు "అఖండ ప్రజ్ఞ"

**మహేంద్రుడు :**

**వాక్‌శక్తి :** ఈ దేహ నిర్మాణములో వాక్‌శక్తి ఒక అంగరూపమును దాల్చుచున్నది. అది ఈ దేహములో ఒక విభాగమగుచున్నది. అద్దాని బాహ్యరూపము – భౌతిక రూపము శబ్దము. గొంతు – నోరు అద్దాని దేహములోని స్థానము. బాహ్యమగు నామరూపాత్మకమంతా అద్దాని బాహ్యరూపము అగు భూతరూపము.

**ఘ్రాణశక్తి :** ఇది దేహములో మరొక అంగము. గంధము దానియొక్క బాహ్యరూపము. ముక్కు అద్దాని స్థానము. బయట గల వాసనలు దాని బాహ్యరూపము. భూత (భౌతిక) రూపము.

**శబ్దశక్తి :** ఇది వేరొక అంగము. చెవులు దేహములోని రూపము. వినబడు సర్వశబ్దములూ బాహ్యాభౌతిక (భూత) రూపము.

**రుచిశక్తి :** ఇది మరొక అంగము. జిహ్వ (నాలుక) దీని శరీరములోని స్థానము. తినబడు పదార్థములలో రుచియే ఈ రుచిశక్తి యొక్క బాహ్యభూత (భౌతిక) రూపము.

**క్రియాశక్తి:** రెండు చేతులలో వేంచేసి ఉండు శక్తి ఇది. సర్వచేతనములు (లేక) క్రియలు (కదలికలు) ఇద్దాని భూత (భౌతిక) రూపము.

**శరీర భావనాశక్తి :** ఇది ఇంకొక శరీర విభాగము. సుఖదుఃఖములు ఈ శరీరములో అంతర్గతము. ఇద్దాని బాహ్య రూపములే – సుఖమని అనిపించేవి, దుఃఖమని అనిపించేవి, వస్తు – విషయ – సందర్భాదులు కూడా! అవి బాహ్య (భౌతిక) రూపములు.

**నడక శక్తి :** ఇది రెండు పాదములు స్థానముగా కలిగి ఉన్న శక్తి. అద్దాని భౌతిక (భూత) రూపము నడక. బాహ్యరూపము (భౌతికరూపము) నడచుప్రదేశములు.

**అంతఃకరణ విభాగము :** మరొక విభాగము. అట్టి ఈ అంతఃకరణములో "సంకల్పములు, కోరికలు, ఆశలు, ఆశయములు"... ఇవన్నీ అంతఃకరణములో అంతర్విభాగములు. బాహ్య విషయములు, రూపములు, సందర్భములు, ... ఇవన్నీ (ఈజగత్తంతా) అంతః కరణము యొక్క బాహ్య భౌతిక (భూత) రూపము

**ప్రజ్ఞ – బుద్ధి విభాగము :** ప్రజ్ఞ ఇంకొక విభాగము. తెలుసుకోవటము అద్దాని దేహములోని రూపము. ఇక తెలియబడుచున్నదంతా బుద్ధియొక్క బాహ్య భూత (భౌతిక) రూపము.

అయితే...,

సర్వము గమనిస్తూ గుర్తిస్తూ ఉన్నది ప్రజ్ఞయే కదా ! (Intelectual in everybody is operating for recognising whatever being seen, heard, tasted, touched, smelt etc.,). అనగా ...,

సర్వమునకు అర్థరూపముగా, అనుభూతిగా నిర్వచిస్తూ స్వీకరిస్తున్నది ప్రజ్ఞయే !

ప్రజ్ఞయే 'ప్రాణము' అను నామమాత్ర రూపము పొందినదై, ఆ తనయొక్క ప్రాణ శక్తితో కూడి, "ఇది గంధము, ఇది దృశ్యము; ఇది శ్రుతము; ఇది రుచి; ఇది ఆలోచన; ఇవి చేతులు; ఇవి కాళ్ళు; ఇది శరీరము; ఇది సుఖదుఃఖములు; ఇది ఉపస్థ; ఇది వినబడునది; ఇది చూడబడునది; ఇది ఆఘ్రాణించబడునది; ఇది స్పర్శించబడునది; ఇది ఇష్టము, ఇది అయిష్టము; ఇది భావన; ఇది అర్థము కాబడునది; ఇది విసర్జనము..., గా అగుచున్నది.

**ఈ విధంగా బాహ్య – అభ్యంతర రూపములుగా ప్రజ్ఞయే రూపము దాల్చుచున్నది.**

‘ప్రజ్ఞ’ (లేక) ‘ఎరుక’ పాల్గొనకపోతే, ఏదీకూడా అనుభవరూపము పొందజాలదు. ఒకడు ప్రజ్ఞతో కూడి వింటున్నప్పుడు మాత్రమే, ఆతనికి ఏదైనా విషయము విశదీకరించగలము. ఉట్టి మాటలు మాట్లాడినంతమాత్రంచేత, చెప్పునది తెలియబడదు.

ఒకడు మాటలు వింటూ వింటూ ఉండగా, ధ్యాస మరెక్కడో ఉన్నప్పుడు, “ఏమిటీ ! మరల చెప్పండి ! మీరు మాట్లాడుతున్నప్పుడు చెవులు విన్నాయి గాని, నేను వినలేదు. నా ధ్యాస మరెక్కడో ఉందిలెండి ! అందుచేత వింటూ కూడా నాకేమీ తెలియలేదు” – …, అని అంటూ ఉంటాడుకదా !

ముక్కు వాసన పొందుచున్నప్పటికీ ప్రాణశక్తి వాసనను పొందినప్పటికీ, బుద్ధి – ధ్యాస మరెక్కడోఉంటే? ఆ వాసన అనుభూతముగా మారదు. “వాసన ఎట్లాఉన్నది?” అని ఆతనిని అడిగితే, “ఏమిటో ! నా ధ్యాస మరెక్కడో ఉన్నదండీ ! అందుచేత ఆ వాసన ఎట్లా ఉన్నదో నేను గుర్తించలేదు. కాబట్టి చెప్పలేను”… అని ఒకడు అంటూ ఉంటాడుకదా ! కనుక, బుద్ధి (ప్రజ్ఞ) తోడైనప్పుడు మాత్రమే, “ఇది సువాసన. ఇది దుర్వాసన” … అని గమనించబడగలదు !

అదే విధంగా చూపు విషయం కూడా ! ఒకడు కళ్ళతో అల్లంత దూరంలో బాటలో … ఎవరో వెళ్ళుచూ ఉన్నట్లు చూస్తూ ఉండవచ్చుగాక. కానీ ఆతని ప్రజ్ఞ (బుద్ధి, ధ్యాస) మరేదో అతి ముఖ్యమనుకొన్న విషయము గురించి ఆలోచన చేస్తున్న దనుకో. అప్పుడు ? **“అటు వెళ్ళుచున్నట్లు నా కళ్ళు చూచాయండీ ! అయితే ఎవ్వరు అటు వెళ్ళారో మాత్రం నేను గమనించలేదు. గుర్తించలేదు. ఎందుకంటే, అప్పుడు నా మనస్సు ఎక్కడో మా పిల్లల గురించి ఆలోచిస్తోంది”…** అని అనటం లోక ప్రతీతియేకదా ! అనగా మనస్సు అక్కడ ఉండకపోవటం చేత చూచికూడా చూడనివాడుగా అగుచున్నాడు.

ఒకడు మనస్సు (ప్రజ్ఞ)ను కూడా కేంద్రీకృతము చేయకపోతే శబ్దము వినీ గ్రహించలేడు. అర్థమును స్వీకరించలేడు. **“ఆయన ఏం మాట్లాడారో మరి ! నాకు అర్థము అవలేదు”** అంటాడు. అట్లాగే, సుఖ-దుఃఖాలు మొదలైనవి కూడా కదా !

ఈ విధంగా ప్రజ్ఞ (లేక), బుద్ధి – మనస్సుతో కూడి పాలు పంచుకోకపోతే ఇంద్రియములకు తారసబడే దృశ్యజగత్ విషయములు అనుభవ రూపములుగా సంతరించుకోవు. అప్పుడు అవన్నీ స్వతఃగా లేనివే అగుచున్నాయి.

ఇంకాకూడా చెప్పుకోవాలంటే…

ప్రజ్ఞ పాల్గొననప్పుడు ఉపస్థ ఆనందరతిని పొందజాలదు. ప్రజ్ఞతోడు కానప్పుడు, ఈ కాళ్ళ నడుస్తున్నప్పటికీ కూడా ఏఏ నేలను కాళ్ళ స్పృశిస్తున్నాయో, అది అనుభవమవదు. ఒక్క తెలివి ఉన్నంతమాత్రంచేత ఒకడు విషయాలు తెలుసుకోలేడు. అందుకు ధ్యాస (మనస్సు)తోడైతేనే తెలుసుకోగలడు.

కాబట్టి ఓ ప్రతర్దనా ! మనస్సుతో కూడిన ఇంద్రియముల అనుభవములు – మనస్సు తోడుగా లేనప్పటి ఇంద్రియ – మనో అనుభవములు గురించి సమీక్షిస్తూ…., ఇప్పుడు ప్రజ్ఞాత్మతత్త్వమును గురించి విశ్లేషించుకుందాము.

**న వాచం విజ్ఞాసీత ! వక్తారమ్ విద్యాత్ । మాటల గురించి కాదు! మాట్లాడేవాని గురించి తెలుసుకోవాలి!**

ఒకడు నోటితో మాట్లాడే మాటలు తెలుసుకున్నంత మాత్రము చేత ఆతని గురించి మనము తెలుసుకున్నట్లు కాదయ్యా ! ఆ మాట్లాడు వాడు ఎట్టి ప్రజ్ఞాస్వరూపుడో, అట్టి స్వతః ప్రజ్ఞాత్మను తెలుసుకున్నప్పుడే ఆతడు మనకు తెలియబడగలడు.

**న గంధం విజిజ్ఞాసీతా ! ఘ్రాతారం విద్యాత్ ! వాసనల గురించి కాదు! ఆ వాసనలను ఆస్వాదించు వానిని తెలుసుకోవాలి!**

గంధము గురించి తెలుసుకుంటే సరిపోదు. ఆ గంధము **తెలుసుకునే వాని గురించి** (One who is knowing) తెలుసుకొన్నప్పుడే ఆతని గురించి సమగ్రంగా తెలుసుకొన్నట్లు !

**న రూపమ్ విజిజ్ఞా సీతా ! రూపవిదమ్ విద్యాత్ ! ఒకడు తెలుసుకొను రూపముల గురించి కాదు! ఆ రూపములు తెలుసుకొనుచున్న వాని గురించి తెలుసుకోవాలి!**

ఒకని రూప జ్ఞానము గురించి తెలుసుకుంటే చాలదు. లేక, “ఈ ప్రపంచములో ఏ రూపము ఏనామము కలిగి ఉన్నది !” మొదలైనవి తెలుసుకున్నంత మాత్రము చేత ఏ మాత్రము సరిపోదు. **“రూపములు తెలుసుకుంటూ ఉన్నవాడు ఎవరై ఉన్నారు? ఎట్టివాడు”…** అనునది తెలుసుకోవాలి.

**న శబ్దం విజిజ్ఞాసీత ! శ్రోతారమ్ విద్యాత్ !**

శబ్దముల గురించి ఎంతగా తెలుసుకున్నా సరిపోదు. "ఆ శబ్దములు వింటున్నవాడు ఎట్టివాడు ? ఎమైఉన్నాడు ?" ... అనునది తెలుసుకోవాలి.

**న అన్నరసం విజిజ్ఞాసీత్! అన్నరసవిజ్ఞాతారం విద్యాత్** : పదార్థముల రుచిని గురించి ఎంతగా పరిశోధించి వాటి వాటి తత్వములను, స్వభావములను తెలుసుకున్నా అసలు విషయము తెలియదు. తెలుసుకోవలసినది తెలుసుకున్నట్లుకాదు. (అది విదితవేద్యముకాదు) ఆ పదార్థముల రుచిని ఎవరు తెలుసుకుంటున్నారో, **ఆతనిని తెలుసుకోవాలి.**

**న కర్మ విజిజ్ఞాసీత । కర్తారం విద్యాత్ ।**

కర్మ విశేషాలు ఎంతెంతగా తెలుసుకున్నప్పటికీ అది సరిపోదు. ఆ కర్మలు ఎవ్వరు నిర్వర్తిస్తున్నారో.... అట్టి కర్తయొక్క కర్తృత్వ-భోక్తృత్వములకు మునుముందే ఉన్న **కేవల స్వరూపము** గురించి తెలుసుకోవాలి.

అనగా

- అయ్యా ! ఈతడు ఇట్టి పనులు చేస్తున్నాడు. కనుక మంచివాడు. (లేక) గొప్పవాడు.
- ఆతడో ? అటువంటి పనులు చేస్తున్నాడు. కనుక గొప్పవాడు కాదు. లేదా, మంచివాడు కాదు.

ఇట్లా కర్మల గురించి విచారణ సమగ్రము కాదు. మరి ? "కర్మలు నిర్వర్తిస్తూ ఉన్న ఆతని - కర్మలకు మునుముందే ఉన్న - **సహజ స్వరూప స్వభావాలు** ఎట్టివి ?" ... అనునది తెలుసుకోవాలి !

**న సుఖ దుఃఖే విజిజ్ఞాసీత ! అన్యత్ - సుఖ-దుఃఖయో విజ్ఞాతరం విద్యాత్ !**

"అతని యొక్క (లేక) నాయొక్క సుఖ-దుఃఖాలు ఇటువంటివండీ !" ... అని తెలుసుకున్నంత మాత్రం చేత ఒకని గురించి మనకు పూర్తిగా తెలిసినట్లు కానేకాదు. ఆ సుఖ-దుఃఖాలు ఎవరివో, ఆతని గురించి తెలుసుకోవాలి. (సుఖ-దుఃఖములకు వేరైన నీ-నా స్వస్వరూపము గురించి తెలుసుకుంటేనే సత్యమును ఎరుగుచున్నట్లు!

**న ఆనందరతిం ప్రజాతిం విజిజ్ఞాసీత ! ఆనందస్య రతేః ప్రజాతేః ప్రవిజ్ఞాతారం విద్యాత్ :**

శృంగారానంద రతి గురించి తెలుసుకొంటే ఏ మాత్రము సరిపోదు. ఆ శృంగార రతి ఆనందము పొందుచున్న - ఆనందము తనదైయున్న - ఆనందించువాని యొక్క ఆవల గల **వాస్తవ రూపమేమిటో** తెలుసుకుంటేనే, అసలైన స్వరూపము తెలుసుకున్నట్లు ।

**న ఈత్యాం విజిజ్ఞాసీత ! ఈతారం విద్యాత్ !** ఈ జీవుని నడక, నడత గురించి తెలుసుకుంటే సరిపోదు. ఆ నడతలన్నీ - నడకలన్నీ ఎవరివై ఉన్నాయో ... ఆతడు వాస్తవానికి ఏ స్వరూపం? ఎట్టివాడు? - ఇది తెలుసుకోవలసిన అసలైన **నిత్యసత్యము !**

**న మనో విజిజ్ఞాసీత ! అన్యో తమ్ మన్తారమ్ విద్యాత్ ।**

మనస్సు అనగా ఏమి ? ఆలోచనకదా ! అట్టి మనస్సు (లేక) ఆలోచన ఎట్టిదో, ఏమేమి ఈ మనస్సు ఆశ్రయిస్తోందో, మనస్సు ఎట్లా జనిస్తోందో... ఇవి ఎంతగా తెలుసుకున్నా ఏమిలాభం? ఆ మనస్సు ఎవ్వరిదో ... ఆతని గురించి మనము తెలుసుకోవలసినది ! **ఆలోచనలకు ఆవల గల ఆలోచించువాని యొక్క - ఆలోచనలకు మునుముందే ఉన్న ఆతని రూపమేమిటి?** - ఇదీ తెలుసుకోవలసినది!

ఓ ప్రతర్దనా ! వింటున్నావు కదా ! మనం ఇప్పటి దాకా చెప్పుకొన్న దశవిషయములు 'అధిభూతములు' అని అంటారు.

(1) వాక్కు, (2) గంధము, (3) రూపము, (4) శబ్దము, (5) రసము, (6) కర్మ, (7) సుఖదుఃఖాలు, (8) ఆనందరతి, (9) ఈత్వము (నడత), (10) మనస్సు (ఆలోచనలు) ఇవన్నీ అధి భౌతికానుభవాలు మాత్రమే!

ఈ దశ భూత విషయములా మూడు లక్షణాలు కలిగిఉన్నాయి.

(1) ఇవన్నీ తెలియబడేవి. బుద్ధి ప్రజ్ఞకు / బుద్ధి స్థితి - గతులకు / బుద్ధి నిర్ణయమునకు సంబంధించినవి.

(2) ఇవి కాలబద్ధము. అనగా మార్పు - చేర్పులు చెందేవి. ఒకప్పుడు ఒకతీరుగా, మరొకప్పుడు మరొకతీరుగా అనుభూతమయ్యేవి.

(3) ద్వంద్వరూపములు. అనగా ఒకప్పుడు ఈ జీవునికి సంతోషమును కలుగజేసేవి, మరొకప్పుడు సంతోషమును పాడుచేసేవి

అయి ఉంటున్నాయి. ఇవి తెలియబడేవి కాబట్టి **"ప్రజ్ఞ యొక్క భూతరూపములు (లేక) భౌతిక రూపములు"**.... అని కూడా చెప్పబడుచున్నాయి.

అంతేకాదు. ఇవన్నీ ప్రజ్ఞయొక్క వివిధ రూపములేగాని, ప్రజ్ఞ యొక్క వాస్తవ తత్త్వము కాదు. ఉదాహరణకు **'దేహము'** అనేది **'దేహి'** యొక్క రూపము. అంతేగాని దేహము – దేహి కాదు కదా ! **దేహము కదల్చబడే జడవస్తువు. దేహియో, దేహమును కదిలించుచున్న చైతన్య రూపము**. అట్లాగే, దశవిధ ప్రజ్ఞాభూతములు, ప్రజ్ఞయొక్క అనుభూతములేగాని, ప్రజ్ఞయొక్క వాస్తవతత్వము అయిఉండలేదు. ఒక పటిగబెల్లపు (ఖండసారి) ముక్క యొక్క ఆకారము పటిగబెల్లపురుచిని నిర్వచించదు కదా ! ప్రజ్ఞయొక్క భూతరూపముల గురించి మనము వివరించుకొన్నంతమాత్రము చేత ప్రజ్ఞయొక్క తత్త్వము తెలియబడదు.

ప్రజ్ఞ–ప్రజ్ఞ యొక్క భౌతిక (భూత) రూపములు ఈ రెండింటి **బేధమేమిటో, సమన్వయమేమిటో** మనము తెలుసుకుంటేనే,... ఈ జీవుని సహజ–నిత్య స్వస్వరూపముగు **'ప్రజ్ఞాత్మ'** గురించి తెలుసుకోగలము. **మనము తెలుసుకోవలసినది ప్రజ్ఞాత్మ గురించి సుమా!**

## ఏది ఎందులోంచి వస్తోందో.... అట్టి ఇది అదియే !

ఓ ప్రతర్దనా ! ఇక్కడ మరొక్క ముఖ్యమైన విషయం మనము గమనించాలయ్యా ! **ఏది ఎందులోనించైతే సిద్ధించినదిగా అగుచున్నదో, ... ఆ సిద్ధించుచున్నట్టిది మొట్టమొదటి దానికి వేరు కాదు ! కానేకాదు ! జలంలోంచి తరంగం బయల్వెడలితే,.... తరంగము జలమునకు వేరు కాదు కదా! మట్టి బొమ్మ మట్టికి వేరు కాదు కదా!**

**ఇది సిద్ధాంతము.** ఈ సిద్ధాంతమును అనుసరించి మనము వివరించుకొన్న దశవిధ భూత ప్రజ్ఞా విశేషాలు (భౌతిక ప్రజ్ఞలు) కేవల రూపమగు ప్రజ్ఞాత్మకు వేరైనవి కావు. **ఆధారమునకు (దేనిపై ఆధారపడి ఉన్నదో అద్దానికి)... అధేయము (ఆధారపడి ఉన్నట్టిది) వేరు కాదు!**

కనుక జగత్తుగాని, జగత్తుగా కనిపించుచున్న ఈ సర్వము గానీ ... ఈ సర్వమునకు అంతర్యామి అయి ప్రకాశించుచున్న **'ఆత్మప్రజ్ఞ'**కు వేరైనదికాదు ! జగత్తు ఆ ప్రజ్ఞాత్మయే ! దశవిధ భౌతిక ప్రజ్ఞలు 'కేవల ప్రజ్ఞ' యొక్క రూపములే ! అనన్యములే!

ఒక రథచక్రము యొక్క నాభి కదలికయే రథచక్రము యొక్క కదలికకదా ! చక్రము కదలు చున్నట్లు భౌతికంగా కనిపిస్తున్నప్పటికీ, ... "చక్రనాభి (మధ్యస్థానము) కదలికయే ఇది" ... అని ప్రజ్ఞచే గమనిస్తున్నాము !

ఓ ప్రతర్దనా !

**ఆత్మయొక్క స్వకీయ ప్రజ్ఞాకల్పనా విశేషమే దృశ్యమానమగుచున్న ఈ సర్వజగత్ రూపము కూడా !**

- ప్రజ్ఞయందే ప్రాణశక్తి అమరిక కలిగినదై ఉన్నది (రథచక్రములో ఇరుసువలె)!
- అట్టి ప్రాణశక్తి రూపమే ఇంద్రియ దేవతలు!

అట్టి ప్రాణశక్తి – ఆనందము, అజరము, అమృత స్వరూపము అగు ఆత్మయే !

కర్మలన్నీ ఆత్మయొక్క ప్రజ్ఞా చమత్కారమే! అయితే కర్మలకు – ఆత్మకు సంబంధమే లేదయ్యా !

ఒకడు సాధువర్తనుడు కాబట్టి "ఆత్మ సాధవర్తనమైనదని" ... అనవీలు లేదు. అట్లాగే, మరొకడు అసాధువర్తనుడు కనుక "ఆత్మ అసాధువర్తనమైనది" ... అనటానికి కూడా కుదరదు. సాధు – అసాధు, మంచి – చెడు, పుణ్య – పాపము ... ఈ విశేషాలన్నీ 'ప్రకృతి'కి సంబంధించినవి. ఇక ఈ జీవుడో? 'పురుషుడు' అయి ఉన్నాడు. ప్రకృతి – పురుషుడు అనునవి 1) కథలలోని పాత్రలకు, విశేషాలకు 2) కథా రచయితకు గల సంబంధము వంటివి. ఈ పురుషుని స్వరూపము ఆత్మయే ! ఆత్మయే ఈ పురుషుడు ! అట్టి ఆత్మ సర్వదా సర్వమునకు కారణకారణము. అంతేగాని ఆత్మకు కర్మ బంధములేదు. దశవిధ ప్రజ్ఞాభూత విశేషముల చేతనూ బద్ధముకాదు.

**ఇదియే ఆత్మజ్ఞానము.** ఈ జీవుడు ఇది తెలుసుకొని, హృదయస్తం చేసుకుంటే ఆత్మచే బలవంతుడై సర్వలోకముల పరిధులను దాటి వేయగలడు. **ఏషలోక పాలః ! ఏషలోకాధిపతిః ! ఏష లోకేశ్వరః! స మ ఆత్మేఽతి విద్యాత్ । స మ ఆత్మేఽతి విద్యాత్ ।**

- ఆత్మ అనగా ఇది !
- నేను సహజంగానే ఆత్మ స్వరూపుడను ! ఆత్మయే నా స్వరూపము, స్వభావము కూడా!

అని తెలుసుకున్నవాడు లోకములను **స్వీయకల్పనగా, తన స్వకీయ భౌతిక రూపంగా** చూస్తూ ... లోకపాలితుడుగా, లోక పాలకుడుగా, లోకాధిపతిగా, లోకేశ్వరుడుగా ఒక్కసారే అగుచున్నాడు. మహేంద్రుడనగు నేను, తదితర లోక పాలకులు కూడా – అట్టి వానికి నివేదనలు సమర్పిస్తున్నాము. సేవకులమై ఉంటున్నాము.

ఓ కపర్దనా ! వింటున్నావు కదా ! కనుక...,

- ఈ ఇంద్రియములకు ఎదురుగా కనిపిస్తున్న దశవిధ ప్రజ్ఞాభౌతిక రూపములను అధిగమించివేయి !
- "ఆత్మైవాఽహమ్।" ఆత్మ స్వరూపమును సంతరించుకో !
- సర్వాత్మ స్వరూపుడవై స్వయం భూతానంద – ఘన స్వరూపుడవై వెలుగొందు !
- ఈ 14 లోకములు, లోక సంబంధములు, లోక స్థితిగతులు – ఇవన్నీ బాలానందము వలె నీయొక్క ప్రజ్ఞా సంబంధిత లీలా – క్రీడా వినోదముగా సందర్శించు !
- అప్రమేయుడవై, కేవలసాక్షివై, కేవల ప్రజ్ఞానందుడవై, ఆత్మాకాశ స్వరూపుడవై,
- నిర్గుణడవై, గుణములన్నీ నీవైన వాడవై,
- నిరాకారుడవై, జగదాకారుడవై, స్వయమ్ సర్వాకారుడవై,
- సర్వగుణాలంకృతుడవై, గుణరహితుడవై, సర్వ గుణ ప్రదర్శకుడవై,
- సర్వలోకములను ఆభరణముగా ధరించినవాడవై, అలోకుడవై, లోక స్వరూపుడవై...,

***సర్వాత్మవై, ఆత్మగాసాక్షివై, బ్రహ్మమువై ... ప్రకాశించుము!***

॥ ఇతి తృతీయో ఆధ్యాయః ॥

✡

## చతుర్ధ అధ్యాయము
## గార్గ్యబాలాకి – అజాత శత్రు సంవాదము
## ఇదంతా ఆత్మగా దర్శించటమే ఆత్మజ్ఞానము

**చిత్ర గార్గ్యాయణి :** ఓ ఆరుణిగౌతమ – శ్వేతకేతు మమాత్మ స్వరూపులారా ! ఈ జగత్తంతా **"స్వస్వరూపాత్మ యొక్క చిత్కళావిశేషము"**గా దర్శించటమే **ఆత్మసాక్షాత్కారము, ఆత్మజ్ఞానము, ఆత్మానంద ఆస్వాదనము** కూడా ! ఈ విషయమును నిరూపిస్తూ, ఒకానొక సందర్భములో మా పూర్వీకుడగు గార్గ్యబాలాకి ఋషి – అజాతశత్రు మహారాజుల మధ్య ఒకానొక విజ్ఞానపూర్వకమైన **'సంవాదము'** జరిగింది. స్వస్వరూపాత్మ ప్రసాదితమగు ఆ విశేషాలు మనము ఇప్పుడు చెప్పుకుందాము. వినండి!

✡

మహనీయులగు మా పూర్వీకుడు గార్గ్యబాలాకి ఋషి ఒకానొక సందర్భములో తన నివాసస్థానమైన ఉశీనర దేశము నుండి తీర్ధయాత్రలకు బయల్వెడలారు. మత్స–కురు–పాంచాల దేశాలు పర్యటిస్తూ కాశీ నగరము వచ్చారు. అప్పటి కాశీదేశపు మహరాజు అజాతశత్రు బాలాకి ఋషి యొక్క రాక గురించి తెలుసుకొన్నారు. వారిని తన అంతఃపురానికి ఆహ్వానించారు. సపర్యలతో సంతోషింపజేశారు. **"స్వామీ ! మీ రాకతో మా అంతఃపురము, మా కాశీ రాజ్యము పావనమైనది !"** ... అని స్తోత్రాలు సమర్పించారు. అప్పుడు బాలాకి ఋషీంద్రులు అజాతశత్రురాజు సమర్పించిన పాదపూజకు, అతిథి సత్కారములకు ఎంతో సంతోషించి **"ఓ అజాతశత్రు మహారాజా! నీ సపర్యలకు, సత్కారాలకు సంతోషించానయ్యా । బదులుగా ఏమి ఇవ్వగలను? నీతో "బ్రహ్మము–బ్రహ్మతత్త్వము" గురించి సంభాషిస్తానయ్యా !"** అని పలికారు.

అజాత శత్రు మహారాజు అది విని మహదానందము పొందారు. **"మహాత్మా ! మేము ధన్యులము. మీరు మాపై బ్రహ్మజ్ఞాన వర్షము కురిపించప్రార్ధన. గురు దక్షిణగా, ఇదిగో "వేయి గోవులు" మీ ఆశ్రమమునకు సమర్పిస్తున్నాను."** ... అని ఆ బాలాకితో పలికారు. అప్పటికప్పుడు రాజాజ్ఞానుసారం గొప్ప సత్సంగ సభ సిద్ధము చేయబడింది... ఋషీశ్వర – మహారాజ సంవాదము వినటానికై

ఆత్మతత్త్వ జ్ఞానాభిలాషులైనటువంటి కాశీపట్టణ ప్రజలలో అనేకులు ఆ సభకు శ్రోతలై వచ్చారు. వారంతా" **ఆహాఁ ! మన అజాతశత్రు మహారాజు జనకమహారాజుతో పోల్చతగినవారుకదా ! మనందరినీ ఆత్మజ్ఞాన విశేషాలతో పవిత్రులవటానికి సర్వదా ఉద్దేశ్యిస్తూ ఉంటారు. ఆయనయే స్వయముగా ఆత్మతత్త్వజ్ఞుడు. ఆయన పాలనలో మనము పునీతులము !**" ... అని సంభాషించుకోసాగారు సత్సంగ సభ వేదవచనాలతో, భగవత్ స్తోత్రాలతో ప్రారంభమైనది.

## బ్రహ్మము గురించి నిర్వచనము

**బాలాకి ఋషీశ్వరుడు:** ఓం తత్ సత్! సర్వము తానైన పరమాత్మకు నమస్కరిస్తూ మనము ఈ సత్సంగ సమావేశమును ప్రారంభించెదముగాక! ఓ అజాత శత్రు మహారాజా! ముందుగా నాదొక ప్రశ్న. ఆత్మస్వరూపుడుగా నేను అంతటా, అన్నిటా సిద్ధించియే ఉన్నాను కదా ! **ఏవైష ఆదిత్యే పురుషః 'తమేవ అహమ్' ఉపాస ఇతి** ? ఆదిత్య పురుషునిలో ప్రవేశించి నేను ఏ పరమపురుషుని ఉపాసించవలసియున్నదో చెప్పండి?

**అజాతశత్రు మహారాజు: మామ్ మ ఏతస్మిన్ సమవాతయిష్ఠ!** ఆదిత్యుడగు సూర్య భగవానునిలోగల మీరు ఏ స్వరూపమును పరమపురుషుడుగా, పురుషోత్తముడుగా ఉపాసించాలో నాకు తెలియదు. స్వామీ! అయితే "**ఈ ఆదిత్యుని సూర్యతత్త్వమును బృహన్-బృహత్తరము! పాండరవా-మహత్తరమైనది. ఈయన సర్వమునకు ఆధారము! సా ఆసాధిష్ఠా!** ఈ కనబడే సర్వజీవులకు, సర్వజగత్తుకు ఆదిత్యుడే మొట్టమొదటిగా ఉండి (ఆది ఇతియః)-ఈ సర్వము ఆధారము. సర్వమునకు అధిష్ఠానము కూడా! **సర్వేషాం భూతానాం మూర్థేతివా!** సర్వజీవులకు శిరస్సు వంటివాడు. ఈ సృష్టికి శిరస్సు ఆది స్వరూపుడగు ఆదిత్యుడే!" ... అని **ఆదిత్యుని ఆత్మ దేవునిగా** నేను ఉపాసిస్తున్నాను. **"ఆత్మయే ఆదిత్య పురుషునిగా ప్రదర్శనమగుచున్నది"** - అను సందర్శనము కలిగి ఉంటున్నాను.

ఆదిత్యుడగు సూర్యభగవానుని ఈ రీతిగా ఆరాధించుచున్న వాడు - సర్వేషాం భూతానాం మూర్ధా భవతి। - సర్వ జీవులకు మూర్ధుడు) (ముఖ్యుడు), శిరస్సువంటివాడు!" - అగుచున్నాడు.

**బాలాకి ఋషీశ్వరుడు** : సరేఁ ! చంద్రునిలో బ్రహ్మముగా పురుషునిగా ఉన్న నేను ఎవ్వరిని, ఏ పురుషుని ఆరాధించాలి?

**అజాతశత్రు** : హే మహనీయా ! చంద్రుని యందు ప్రవేశించిన మీరు ఏ పురుషుని బ్రహ్మముగా ఉపాసించాలో చెప్పలేను. తెలియదు. కానీ "చంద్రునిలో సోమతత్త్వముగా ప్రకాశించుచున్నది. అన్న ప్రదాత కాబట్టి, ఆయన సృష్టికి రారాజు. జీవులందరికీ మనోఆత్మ భగవానుడు । **బ్రహ్మమే చంద్రతత్త్వముగా ప్రదర్శనమగుచున్నది.**" ... అను భావనలతో ఎల్లప్పుడూ చంద్రభగవానుని ఉపాసిస్తూ ఉన్నాము.

ఈ విధంగా చంద్రుని ఉపాశించువాడు సమస్త ఆహారములకు ఆత్మ స్వరూపుడై వెలుగొందుతాడని చెప్పబడుచున్నది కదా, మహనీయా!

**బాలాకి ఋషీశ్వరుడు** : నిజమే ! మరి, విద్యుత్తులో తేజో ప్రకాశ పురుషడనై ఉన్న నేను ఏ పురుషుని, ఏ ఆత్మతత్త్వముగా ఉపాసించాలి? తేజో రూపుడై నేను, **ఏతమేవ అహమ్ బ్రహ్మోఽపాస ఇతి** - ఎవరిని బ్రహ్మముగా ఉపాసించాలి?

**అజాతశత్రు** : అదికూడా నేను వర్ణించి సమాధానము చెప్పజాలను. అయితే **"పరమ పురుషుడగు బ్రహ్మమే విద్యుత్ - తేజస్సుకు ఆత్మ అయి ఉన్నారు"** ... అని విద్యుత్తును మేము ఉపాసిస్తున్నాము.

ఈ విధంగా **"బ్రహ్మము తేజస్సుకే ఆత్మ అయి ఉన్నది"**... అని ఉపాశించుటచే, తేజస్సుకే ఆత్మ స్వరూపుడై (ఆత్మఅయి) విరాజిల్లగలడు కదా!

**బాలాకి ఋషీశ్వరుడు** : బాగున్నది. ఇక, ఆకాశమున ఉరుము - మెరుపులలో ప్రవేశించినప్పుడు నేను బ్రహ్మమును ఏ పరమపురుషుడుగా ఉరుము మెరుపులతో కూడి ఉపాసించాలి ?

**అజాతశత్రు** : గురువర్యా ! ఆకాశము, ఉరుము - మెరుపులలో ఉన్నప్పుడు ఏ పరమపురుషుని ఉపాసించాలో నాకు తెలియదు. **"శబ్దమునకు కాంతికి కూడా ఆత్మయే ఆ పరమపురుషుడు!"** అని ధ్యానోపాసన చేస్తున్నాను. అట్టివాడు సర్వశబ్దములకు ఆత్మ స్వరూపుడు అగుచున్నాడు.

**బాలాకి ఋషీశ్వరుడు** : అవునౌను ! ఆత్మ స్వరూపముచే ఆకాశమంతా నిండిఉన్నట్టి నేను ఏ పురుషుని, తెలుసుకొని ఆత్మోపాసన కొరకై సంసిద్ధుడనై ఆరాధించాలి?

**అజాతశత్రు** : ఆకాశమంతా నిండి ఉన్న మీరు ఏ పురుషుని ఉపాసించాలో నేను అభివర్ణించలేను. అయితే **పరబ్రహ్మమే ఆకాశ రూపమున ఉన్నదని భావించి ఉపాసిస్తున్నాను.**

ఆత్మాకాశమే భూతాకాశముగా ప్రదర్శనమగుచున్నదని భావనచేస్తున్నాను. అప్పుడీ ఆకాశమును...,

- పూర్ణము (It is complete by it self) గాను,
- అప్రవర్తి, (అకర్త, అభోక్త, విషయ రహితము) గాను,
- (సర్వము తనకు తానే సృష్టించుకొని, అందులో ప్రవేశించి ఆస్వాదిస్తూ, సర్వము మరొకప్పుడు లయింపజేసుకొను బ్రహ్మమునకు అభిన్నముగాను...,

భావించి భక్తితో ఆకాశమునకు ప్రణామములు సమర్పిస్తూ ఉంటున్నాను! **ఆకాశమును బ్రహ్మము రూపముగానే దర్శిస్తున్నాను. ఆకాశముగా ఉన్నది బ్రహ్మమే !**

ఇట్టి ధ్యానము చేయువారికి సత్సంతానము, పశుసంపద, ... మొదలైనవి లభిస్తాయి ! ఆకాశ బ్రహ్మోపాసనచే అట్టివాడు కాలపరిధులను దాటిపోయి, కాల నియామక – కాలః కాల స్వరూపము సంతరించుకోగలడు కదా !

**బాలాకి ఋషీశ్వరుడు :** వాయురూపుడనై వాయువు నందు ప్రవేశించినప్పుడు.... నేను బ్రహ్మముగా ఉపాసించవలసిన పురుషుడెవ్వరు?

**అజాత శత్రు :** వాయ్వాత్మ స్వరూపులై వాయువునందు ఏ పురుషుని ఉపాసించాలో నాకు తెలియదు. కానీ

**"వాయువు యొక్క కదలిక (స్పందన)కు ఆధారము ఆత్మయొక్క చైతన్యశక్తియే ! వాయు కదలిక చేతనే ఇంద్రియములు క్రియాశీలకమవగలుగు చున్నాయి. కళ్ళు చూడటానికి, చర్మము స్పర్శశక్తి ప్రదర్శించటానికి, చెవులు వినగలగటానికి ... వీటన్నిటికీ కారణము వాయు స్పందన. ఆ స్పందమునకు ఆధారము ప్రాణశక్తి. కనుక ఈ వాయుశక్తియే ఇంద్రుడు ! అన్నిటినీ జనింపచేసి, తానే జనించుచు, ఈ సర్వముగా ఉన్న 'జిష్ణువు' ఇహంగా కనిపించేదాని కంతటికీ పరమై ఆవలయున్న పరాజిష్ణువు కూడా !" వాయువు విష్ణువు. వాయు తరంగములు జిష్ణుడు" –**

... అని వాయువును ఆరాధిస్తూ ఉన్నాము. ఈ వాయువే తదితర సర్వమునకు కారణమగు ఆత్మ **అన్యతః తత్ జాయా భవతి ।** (నమస్తే వాయుః! త్వమేవ ప్రత్యక్షమ్ బ్రహ్మాఽసి) ... అని భక్తితో దర్శిస్తున్నాము. ఈ రీతిగా వాయువును బ్రహ్మముగా ఉపాశించు వారు పరాజయము లేనివారై, **అంతటా వేంచేసియున్న జిష్ణుస్వరూపులై విరాజిల్లగలరు కదా !**

**బాలాకి ఋషీశ్వరుడు :** బాగుబాగు, ఇక, అగ్నితత్త్వములో ఉన్న నేను ఏ పురుషుని ఉపాశించాలి ? **ఏష ఏవ అగ్నౌ పురుషః తమేవ అహమ్ ఉపాస ఇతి?**

**అజాతశత్రు :** ఓ ఋషి పుంగవా! అగ్ని పురుషునిలో మమేకత్వోపాసనచే ఏ పురుషుని ఉపాసించాలో చెప్పలేను. అయితే **"ఓ ఆత్మభగవాన్! ఆత్మ అయి ఉన్న మీరు అగ్ని రూపమును దాల్చి సర్వమును ఉష్ణస్పర్శచే ఉజ్జీవింపజేస్తూ, సర్వమును భస్మము చేయగలిగినవారై ఉన్నారు. కనుక అగ్నిగా కనిపిస్తున్నది ఆత్మదేవుని దివ్య తేజో విభవమే!"** ... అని అగ్నిదేవునికి ప్రార్థనలు చేస్తూ ఉన్నాము.

ఈ విధముగా అగ్నిని పరబ్రహ్మ తేజో విభవముగా ఉపాసించువాడు అగ్నివలె స్వయం ప్రకాశమానుడు అగుచున్నాడు కదా!

**బాలాకి ఋషీశ్వరుడు :** నాయనా ! అజాతశత్రూ ! ఈ జగత్ దృశ్యములో కనిపిస్తున్న ఆయా వాటివాటినన్నిటినీ ఆత్మయొక్క విలాస చమత్కారముగా ఉపాసించుచుండటమును నీ నుండి వింటున్నాను. ఇంకా అడుగుచున్నాను. జలమునందు గల రసస్వరూపుడగు జల (వరుణ) పురుషునిగా ఉండి నేను ఏ పురుషుని బ్రహ్మముగా ఉపాసించాలి?

**అజాతశత్రు :** జలములో ప్రవేశించినప్పుడు 'కిం పురుషోపాసన?' నాకు తెలియదు. "ఆత్మదేవా ! **మీరే జలమునందు రస (వరుణ) రూపులై సర్వమునకు నామారూపాత్మకంగా చేసి ఉంచుచున్నారు.** కనుక జలరూపముగా త్రాణ అయి, సర్వజీవుల దేహములను పరిరక్షిస్తూ, నామరూపములుగా – **నామ అస్య ఆత్మీఽతిహ** – అట్టి ఆత్మ భగవాన్‌గా నిన్ను స్తుతిస్తున్నానయ్యా !" ... అను ఉపాసన కలిగి ఉంటున్నాము. ఇట్లు జలమును సర్వ నామ – రూపప్రసాదినిగా ఆరాధించువారు, సర్వ నామములకు తానే ఆత్మస్వరూపుడై

- అధి దైవతముగా....,
- అధ్యాత్మముగా ....

ప్రకాశించగలడు కదా!

**బాలాకి ఋషీశ్వరుడు :** వాస్తవమేనయ్యా ! అయితే, **ఏవ ఏష ఆదర్శే పురుషః తమేవ అహమ్ ఉపాస ఇతి?** దర్పణములోని ప్రతిబింబమువలె దర్పణ పురుషుడుగా ఉన్నదెవ్వరు? అద్దానిని ఉపాసించటమెట్లా? ('మనస్సు' అనే) దర్పణముగా ఉన్నట్టి ఆత్మ పురుషుని దర్శించటము ఎట్లా ?

**అజాతశత్రు :** అదాస్వామీ? (మనో) దర్పణ (ప్రతిబింబ) పురుషుని ఆత్మగా ఎట్లా ధ్యానించాలో నేను వివరించలేను. అయితే మనో దర్పణమునందు ఏది జీవాత్మ రూపముగా తెలియవచ్చుచున్నదో, ఆ జీవాత్మ పరమాత్మయొక్క ప్రతిబింబమే ! (జీవో బ్రహ్మేఽతి నాపరః మొదలైన) ఇట్టి మహావాక్యము సహాయంతో జీవాత్మ ప్రతిబింబమును పరమాత్మ యొక్క లీలా మానుష చైతన్యము – అని భావనచేస్తూ ఉపాసిస్తున్నాను. పరమాత్మయే ఇహాత్మ అనబడు ప్రతిబింబముగా (జీవుడుగా) దర్శించుచున్నవారు సర్వజీవులకు తామే ఆత్మ స్వరూపులు అగుచున్నారు. ఇక ప్రతిబింబమాత్రుడుగా ఉండడు కదా మహనీయా! అనేక దర్పణములలో ప్రతిబింబించే ఏకైక వస్తువువలె ఆత్మయగు తానే అనేక జీవదర్పణములో ప్రతిబింబించువాడగుచున్నాడు.

**బాలాకి ఋషీశ్వరుడు :** బాగున్నదయ్యా ! సరేc ! నా యొక్క నీడ అయినటువంటి త్రిగుణ స్వరూపి అగు – గుణరూపముగా ఉన్న ఛాయా పురుషుని మమాత్మ స్వరూపముగా దర్శించటమెట్లా ? **ఏవ ఏష ప్రాతిశ్రుత్కాయాం పురుషః 'తమేవాఽహమ్' ఉపాస? ఇతి.**

**అజాతశత్రు :** త్రిగుణ సమన్వితమైయున్న ప్రతి – దేహరూపము (ప్రతిశ్రుత్కాయాం)ను ఆత్మ పురుషుడునగా ఎట్లా దర్శించాలో చెప్పలేను. అయితే, **"నీళ్ళలో ప్రతిబింబము బింబము కంటే వేరు కానట్లు దేహముతో కనిపించే త్రిగుణాత్ముడగు దేహి (లేక) జీవుడు ఆత్మయొక్క ప్రతిబింబమే ! కాబట్టి ఆత్మ స్వరూపమే..."** అని భావిస్తూ ఉపాసిస్తున్నాను. (సందర్భంగా జీవుడు సహజంగా పరమాత్మ) ఛాయా – ప్రతి బింబరూపమగు గుణ సహిత దేహమును ఆత్మ ప్రదర్శనముగా ఉపాసించటంచేత, అప్పుడిక ఏకాత్మ స్వరూప ఆరాధన చేస్తున్నట్లే కదా ! ఏకాత్మగా ఆరాధించువాడు ఏకాత్మస్వరూపుడై అద్వితీయత్వమును ఆస్వాదిస్తూ, ఆనందించుచూ, ద్వితీయమును స్వకీయ మాయా విశేషంగా, అహమ్ ఆత్మగా భావిస్తూ ఉపాసిస్తున్నాను.

**బాలాకి ఋషీశ్వరుడు :** మరి, **ఏవ ఏష శబ్దః పురుషమ్ అన్వేతి తమ్ ఏవ అహమ్ ఉపాస?** అహమ్ శబ్ద పురుషరూపుడనగుచున్నప్పుడు బ్రహ్మమును, పరమపురుషుని ఎట్లా దర్శించాలి?

**అజాతశత్రు :** అహమ్ ప్రత్యయముగా ఉండి ఆత్మను ఎట్లా దర్శించాలో చెప్పలేను. అయితే, **ఆయు రితివా అహమ్ ఏతమ్ ఉపాసతే। అ–హమ్** అక్షర ప్రత్యయము ఆది – అంతముగల ఆయువు రూపముగా ఉన్నదికదా ! మార్పు చెందేదంతా మృత్యురూపము ! మార్పుచెందేది (మృత్యువు) అమృత స్వరూపమునందలి చమత్కారమే! కనుక **అహమ్ జాగ్రత్‌లోనిదిగాను, కల్పిత భావనగాను, 'అహమ్' యొక్క వాస్తవ రూపము ఆత్మగాను, అహమ్‌ను ఆత్మకు అభిన్నమైనదిగాను** భావించి ధ్యానిస్తూ ఉన్నాను. 'అహమ్' ప్రత్యయమును బ్రహ్మము యొక్క ఒకానొక స్వకీయ కళావిశేషముగా భావిస్తూ ధ్యానము చేస్తున్నవారు – ఈ జగత్తులో ఏది చూచినా సంమోహితులు కారు. వారు మోహమును జయించగలరు. **న అస్య ప్రజా పురా కాలా సంమోహయతి!** దేహమును విడచునప్పుడు కూడా మోహము దరిజేరదు.

**బాలాకి ఋషీశ్వరుడు :** ఈ జాగ్రత్ శరీర పురుషుడగు 'విశ్వుడు' అని పిలవబడువానిగా, ఆత్మ స్వరూపము దర్శించటము ఎట్లా? ఏ పురుషుని ఉపాసించాలి?

**అజాతశత్రు :** అది ఎట్లాగో చెప్పటం నా చేత కాదు. అయితే **"ఆత్మయే సృష్టికర్త అగు ప్రజాపతి పురుషుడు కదా !"** ... అనే భావనతో ఉపాసిస్తున్నాను. నా ఈ దేహములో ఉండి జాగ్రత్ అనుభవ పొందుచున్న ఆత్మయొక్క – వైభవ చమత్కారముగా జగత్ దృశ్యమును ఉపాసిస్తూ ఉన్నాను. దేహములో ఉన్న జాగ్రత్–విశ్వుని 'నేను'ను ప్రజాపతికి చెందినదిగా భావనచేస్తూ ఉన్నాను. అట్టివారికి సంతానము, పశుసంపద ప్రవృద్ధమౌతూ ఉంటుంది కదా !

**బాలాకి ఋషీశ్వరుడు :** గాఢనిద్రలో సంచారము చేస్తున్నట్టి ప్రాజ్ఞ పురుషుడుగా ఉన్నప్పుడు – స్వప్నములో సంచారములు చేస్తూ ఉన్న స్వప్న (తేజో) పురుషుని, సుషుప్త పురుషుని ఆత్మగా ఉపాసించటమెట్లా?

**అజాతశత్రు :** సుషుప్త – స్వప్న సంచార పురుషులగు **ప్రాజ్ఞ – తేజస పురుషులను** ఆత్మ స్వరూపులు ఎట్లా దర్శించాలో నాకు తెలియదు. అయితే, ... ఆ రెండింటి యొక్క నిర్మాణము, స్థితి, గతి అంతర్గత విశేషాలు ... ఇవన్నీకూడా 'మార్పు'కు అధినేత అయినట్టి యమ భగవానునివిగా అర్థము చేసుకుంటూ ఉన్నాను. మూల కారణ పురుషుడగు–**యమో రాజే, తేవా అహమ్** రూపములుగా

ఉన్నారను భావనచే భక్తితో ప్రణమిల్లుచున్నాను. ఎవరు ప్రాజ్ఞ-తేజసు పురుషులను మార్పు యొక్క అధినేతయగు యమ భగవానునికి చెందినవిగా దర్శిస్తూ, ఆత్మకు అభిన్నముగా ఆరాధన చేస్తూ ఉంటారో, వారు శ్రేష్ఠత్వము పుణికి పుచ్చుకోగలరు కదా! **ఆత్మయేవ యమ పురుషః।**

**బాలాకి ఋషీశ్వరుడు :** నా దక్షిణ (కుడి) కంటిలో గల 'చూపు' అనుశక్తి రూపములోగల పురుషుడెవ్వడు ? ఆతనిని నేను పరమ పురుషునిగా ఎట్లా దర్శించాలి ?

**అజాతశత్రు :** అది నేను మాటలకు పరిమితము చేసి వర్ణించి చెప్పలేను. నాకు తెలియదు. అయితే ఈ కుడికంటిలోని దృష్టిశక్తిని **"అగ్ని-జ్యోతి స్వరూపుడగు ఆత్మయొక్క తేజో రూపము"** అని భక్తితో నమస్కారములు సమర్పిస్తున్నాను. ఎవ్వడైతే కుడికంటిలోని చూపుశక్తిని ఆత్మయొక్క తేజోరూపముగా భావిస్తూ ఉపాసిస్తాడో, ఆతడు అతి సులభముగా సర్వమును ఆత్మస్వరూపముగా దర్శించగలడుకదా! **తేషాం సర్వేషామ్ ఆత్మా భవతి। అట్టివాడు అతి త్వరగా ఈ సర్వమునకు ఆత్మగా తానే అగుచున్నాడు.**

**బాలాకి ఋషీశ్వరుడు :** అవును ! తప్పక దర్శించగలడు. **ఏవ ఏష సవ్యే అక్షన్ పురుషః తామ్ ఏవ అహమ్ ఉపాస?** మరి ఈ ఎడమ కంటిలోని దృశ్య శక్తిని పరమపురుషునిగా ఉపాసించటమెట్లా?

**అజాతశత్రువు :** ఈ ఎడమ కంటిలో వేంచేసి ప్రకాశిస్తూ ఉన్న దృక్‌శక్తితో ఎట్లా ఉపాసించాలో తెలియదు. అయితే ఈ ఎడమకంటిలోని అంతర్గత దృష్టిపురుషుణ్ణి ఆత్మతేజో విద్యుత్ విలాసముగా, సత్యాత్మ స్వరూపునిగా, స్వయమాత్మగా భావిస్తూ ప్రేమగా స్తోత్రములు సమర్పిస్తున్నాము. ఎడమ కంటిలోని దృష్టిశక్తిని ఆత్మగా భావించి ఉపాసించువాడు సత్యమునకు, విద్యుత్‌కు, తేజస్సుకు కూడా ఆత్మరూపుడై వెలుగొందగలడు కదా, భగవాన్ !

✡

అప్పుడు బాలాకిఋషి అజాతశత్రు మహరాజు యొక్క ఉపాసనా వర్ణనలను వింటూ వింటూ ఇక ఏమీ మాట్లాడలేనివాడై, **"ఆత్మగా ఉపాసించటము"**... అను స్వర్వాతీతదృష్టి గురించి మననము చేస్తూ మౌనంగా ఉండిపోయాడు. తూష్ణీభావుడైనాడు.

**అజాతశత్రు :** ఓ బాలాకిఋషి పుంగవా? మీ ప్రశ్నలు ఇంతవరకేనా? **లేక ఇంకేమైనా ప్రశ్నలు మిగిలి ఉన్నాయా** ? ఏతావన్ను ?

**బాలాకి ఋషీశ్వరుడు :** నా ప్రశ్నలు ఇంతవరకేనయ్యా ! ఇంకేమీ మిగిలియుండలేదు. ఏతావత్‌ధీఇతి !

**అజాతశత్రు :** ఓ ఋషీశ్వరా ! నా వాస్తవమైన అభిప్రాయము నిర్మోహమోటముగా చెప్పుచున్నాను. వినండి. ఇప్పటివరకూ మీరు అడిగిన ప్రశ్నలు, నేను చెప్పిన సమాధానాలు ... ఇవన్నీ కూడా వేదాంత శాస్త్రములో 'మృషమ్' అని అంటారు. అనగా ఇవన్నీ భ్రాంతి మాత్ర విశేషాలే ! **'మనస్సు' అనే కల్పిత వస్తువును (లేక) స్వప్నములో కనిపించే భ్రమాత్మకమైనటువంటి స్వాప్నిక విశేషాలను అర్థప్రతిపాదనతో నిర్ణయించటము వంటిదే !**

ఎందుచేతనంటారా ?

మనము ఇప్పటివరకు బ్రహ్మము యొక్క స్వీయకల్పనా రూపములైనట్టి **కర్తృత్వసంఘము** గురించి మాత్రమే చెప్పుకున్నట్లు అవుతుంది. వీటన్నిటికీ ఆధారమైయున్న బ్రహ్మము గురించి చెప్పుకోవాలికదా ! అసలు మనము తెలుసుకోవలసినది బ్రహ్మము గురించికదా !

ఆ మాటలు మౌనముగా ఉండి వింటున్న బాలాకిఋషి **"ఓహోc! ఈతడు నిజంగా బ్రహ్మజ్ఞానియే ! ఆత్మతత్త్వము ఎరిగినవాడు. అందుచేత ఈతనిని గురుభావనతో దర్శిస్తూ, శిష్యత్వమును అవధరిస్తాను"**.... అని తలచాడు. సమిత్పాణియై, (చేతిలో యజ్ఞ సమిధ (కట్టె)లను ధరించి) లేచి, అజాతశత్రు మహారాజు ఆసీనులైయున్న ఆసనమును సమీపించారు.

**బాలాకి ఋషీశ్వరుడు :** మహారాజా ! మీరు బ్రహ్మజ్ఞులు. గురుతుల్యులు. **"ఆత్మయే నేనై - నేనే ఈ సర్వమై"**.... ప్రకాశించగల **ఆత్మతత్త్వజ్ఞానమును** సూటిగా నాకు బోధించమని మిమ్ములను అభ్యర్థిస్తున్నాను.

**అజాతశత్రు మహారాజు :** (లేచి నిలబడి) ఓ ఋషీశ్వరా ! మీరు వేద-వేదాంగలు పారంగతులు. తపోసంపన్నులు. అధ్యయన కోవిదులు. నేనో, ... మీవంటి పెద్దలకు శుశ్రూషచేస్తూ, తాత్త్విక విషయాలు విని నేర్చుకొనుచున్న ఒక సామాన్యరాజును. మహనీయులగు మిమ్ములను శిష్యులుగా స్వీకరించలేను. అయితే మనము **'ఆత్మ' యొక్క మహిమ ఎట్టిదో, స్వరూప - స్వభావములు ఏమేమిటో, ఎటువంటివో, ఔన్నత్యము ఎంతటిదో** మనము మనన పూర్వకంగా తప్పక వివరించుకుందాము. రండి ! మనము అట్లా ఆరుబయటకు వెళ్ళెదము గాక !

అప్పుడు ఆ ఇరువురు అక్కడి సభను ముగించుకొని, ఆ సత్సంగ సభాస్థలము నుండి బయల్వెడలారు. అజాతశత్రు మహారాజు తనకుడి హస్తముతో ఆ ఋషిపుంగవుని ఎడమ చేతిని ఆప్యాయంగాను, స్నేహపూర్వకంగాను పట్టుకొని... కాశీ పట్టణము పొలిమేరలకు నడుచుకుంటూ వెళ్ళారు. ఒకచోట గల ఒక ఇంటిలో ప్రవేశించారు. ఆ ఇంటి యజమాని ఒక మంచముపై విశ్రాంతి తీసుకుంటూ గాఢనిద్రా పరవశుడై ఉన్నాడు. ఆ ఇద్దరు, ఆతడు నిదురించి యున్న మంచమును సమీపించారు.

అప్పుడు అజాతశత్రు మహారాజు – "తెల్లటి వస్త్రము ధరించి, తెల్లటి దుప్పటి కప్పుకొనియున్న మిత్రమా ! సోమరాజా ! నీ చిన్ననాటి స్నేహితుడను, అజాతశత్రు మహారాజును. నేను నీతో కాసేపు చిన్ననాటి బాల్య విశేషాలు ముచ్చటించాలని వచ్చానయ్యా ! నిదురలేఁ !" ... అని మృదువుగా పలికారు.

కానీ గాఢ నిద్రలో ఉన్న ఆ సోమరాజు నిద్రలేవనే లేదు.

బాలాకి ఋషి ఇదంతా గమనిస్తున్నారు. **"ఈయన తాత్త్విక విశేషములు, ఆత్మతత్త్వము చెప్పమంటే... ఇదేమిటి ? ఇక్కడికి నన్ను తీసుకువచ్చారు? ఇందులో ఏదో విశేషము ఉండి ఉంటుందిలే !"** ... అని మనస్సులో అనుకుంటూ ఉన్నారు.

అప్పుడు అజాత శత్రు మహారాజు గాఢనిద్రలో ఉన్న తన బాల్యమిత్రుడు సోమరాజును ఆ ప్రక్కనే ఉన్న ఒక చిన్న కర్రతో – కొంచము గట్టిగా తట్టారు. నిద్రపోతూ ఉన్న సోమరాజుకు మెళుకువ వచ్చింది.... నెమ్మదిగా కళ్ళు తెరచి అటువైపు ఇటువైపు చూచారు. మహారాజు కనిపించాడు. ఉలిక్కిపడ్డాడు. వెంటనే గబుక్కున లేచి, "మహారాజా ! ఏమి ఆశ్చర్యం ! మీరు మా ఇంటికి రావడమేమిటి? ... ఆజ్ఞ ఇస్తే నేనే వచ్చేవాడిని కదా !" అని చేతులు కట్టుకొని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు.

అప్పుడు అజాతశత్రు రాజు బాలాకిర్యఋషితో ఇట్లా సంభాషించసాగాడు.

**అజాతశత్రురాజు :** ఓ ఋషి పుంగవా ! ఇప్పుడు మిమ్ములను కొన్ని ప్రశ్నలు అడుగుచున్నాను.

- నా బాల్యమిత్రుడు ఈ సోమరాజు రాత్రి నిద్రపోతూ ఎక్కడినుండి ఎక్కడికి వెళ్ళాడు ?
- గాఢ నిద్రలో ఉండగా, ఎక్కడ ఉండి ఉండటం జరిగింది ? ఆతడు అప్పుడు ఉన్నదెక్కడ?
- నేను నిద్ర లేపినప్పుడు ఎక్కడినుండి ఎక్కడికి వచ్చి ఉన్నాడు ? ఏచోటు నుండి ఈ 'జాగృత్'కు వచ్చాడు?

**బాలాకి ఋషి :** గురువర్యా ! అజాతశత్రు మహారాజా ! మీరు అడిగిన ప్రశ్నయే నాకు అర్థము కాలేదు. ఇక సమాధానము ఏమి చెప్పగలను ? **'తెలియదు!'** – అని మాత్రం అనగలను.

**అజాతశత్రు మహారాజు :** ఇప్పుడు 'యోగపరిభాష'లో కొన్ని విశేషాలు చెప్పుకుందాము. ఈతడు ఇంద్రియానుభవములయినట్టి జగద్విశేషాలనుండి బుద్ధితో వెనుకకు మరలాడు. ఇంద్రియములను కూడా వదిలి 'హిత' అనే పేరుతో చెప్పబడే నాడిలో ప్రయాణిస్తూ ఆలోచన-భావనలకు జనన ప్రదేశమగు హృదయ స్థానమును చేరాడు. అట్టి హృదయ స్థానమును, **పురీతతము** అని పిలుస్తున్నారు. ఈతడు ప్రయాణించిన హితనాడి **భావచైతన్య శక్తిరూపము**. ఒక వెంట్రుకలో వేయివవంతు (1/1000) పరిమాణము గల సన్నటి సూక్ష్మనాడి. అట్టి హితనాడి మార్గములో – ఆకుపచ్చ – తెలుపు – ఎరుపు – నలుపు – పసుపు – నీలిరంగు విభాగములున్నాయి. ఆ హితనాడిలో తెల్లటి విభాగమును మనస్సుతో దర్శిస్తూ ఉన్నప్పుడు, ఇక ఆతనిపట్ల జాగ్రత్-స్వప్నములు "స్ఫురణలో లేనివి"గా అగుచున్నాయి. అనగా, **జాగ్రత్‌లోని 'నేను', స్వప్నములోని 'నేను' అప్రదర్శితమై ఉంటున్నాయి.** విషయములను దాటివేసిన హృదయవిభాగము చేరిన జీవుడు ప్రాణశక్తితో ఏకత్వమును పొందినవాడై ఉంటాడు. అనగా, ఏ ఆలోచనలు చేయని వాడై, కేవల ప్రాణ స్వరూపుడగుచున్నాడు. ఈతడు అనుభవములను దాటివేసిన స్థానమును అప్పుడు చేరుచున్నాడు. అయితే, అట్టి గాఢనిద్రా సందర్భములో తనను తాను విడచి ఉంటున్నాడా? లేదు.

ఈతని జాగ్రత్-స్వప్నములలోని సర్వవాక్కులు, నామ-రూపములు, అనుభవ ప్రజ్ఞ... ఇవన్నీ సుషుప్తిలో ఏకరూపము పొందుచున్నాయి. దృశ్యము దృష్టితోను, శబ్దము శ్రవణశక్తితోను, స్పర్శానుభవములన్నీ స్పర్శశక్తితోను, ... ఏకత్వము పొందుచున్నాయి.

- మనసః సర్వైః ఆప్యేఽతి। మనస్సులోని సర్వ ధ్యాసలు ఏకరూపము పొందుచున్నాయి.
- మనస్సు ప్రాణశక్తిలో ప్రాణతరంగ రూపముదాల్చి అప్రకటితరూపము సంతరించుకొంటోంది.
- ఈ జీవుడు కేవల ప్రాణస్వరూపుడై విషయ రాహిత్యమును ఆస్వాదిస్తున్నాడు.

**గాఢనిద్రనుండి నిదురలేవగానే .... ?**

అగ్ని ప్రజ్వలనమవగానే కాంతి బహిప్రదర్శనమౌతుంది చూచారా ? ఆ విధంగా, ... ఎప్పుడైతే ఈ నా మిత్రుడు నిదురలేచాడో, ...

- మొట్టమొదటి ప్రాణశక్తి అగ్ని విస్ఫులింగమువలె ఈతని స్వకీయ చైతన్య స్ఫూర్తిచే ప్రజ్వలితమైనది.
- ఆ వెనువెంటనే ఇంద్రియములలోనికి ప్రాణశక్తినుండి ఇంద్రియ దివ్యశక్తులు తిరిగి చేరుచున్నాయి.
- ఆ ఇంద్రియ శక్తులతోబాటే – అనుభూతులు, అనుభవములు, అభిప్రాయములు, ఆవేశ–కావేశములు, తదితర చారిత్రకమైన సమాచారములు కూడా చేరుచున్నాయి. అవన్నీ ప్రాణశక్తియొక్క సూక్ష్మ రూపములే !
- "ప్రాణశక్తి + మనస్సు + జ్ఞప్తులు" వీటన్నిటినీ తన బుద్ధితో ఉపయోగిస్తూ ఆత్మస్వరూపుడగు ఈ జీవుడు కనులు తెరుస్తున్నాడు. **సంస్కారములను, మనస్సును** ఉపయోగించి ఇతఃపూర్వపు ఇంద్రియ దృశ్యమును తిరిగి అనుభవములోనికి తెచ్చుకొనుచున్నాడు.
- ఇక కనులు తెరచి ఎదురుగా ఉన్న సమయ – సందర్భములను అనుసరించి ఇతఃపూర్వమువలె ప్రవర్తమానుడగుచున్నాడు.

ఇక్కడ నా ఈ మిత్రుడగు సోమరాజు కనులు తెరచిన తరువాత నన్ను చూచి "మహారాజా !" అని మిగిలిన సర్వ అంగములతో రాజదర్శన వ్యవహారములోనికి ఉద్దేశ్యము – ఆవేశములతో ప్రవేశించటము మనము చూచాము కదా !

గాఢనిద్రలో ఆత్మయందు మౌనరూపంగాను, నిర్విషయ ప్రదర్శనరూపంగాను ఉన్నట్టి ప్రాణశక్తి ఆత్మయొక్క స్వసంకల్పముచే బయల్వెడలి దేహము యొక్క నఖ–శిఖ పర్యంతము తనను తాను నింపివేసినదగుచున్నది.

కాబట్టి ప్రాణశక్తికి ప్రధమోత్పత్తి స్థానము ఏది ? ఆత్మయే !

ప్రాణశక్తినుండి శబ్ద – స్పర్శ – రూప – రస – గంధ – మనో – దివ్య తత్త్వములు – దీపముయొక్క వేరువేరు కిరణములవలె, సప్తరంగుల సూర్యకాంతివలె (సప్తాశ్వరధమారూఢము) వలె – ప్రదర్శమానమగుచున్నాయి. ఆ 'దేవతలు' అనబడు (శబ్దము, మనస్సు మొ॥వాటి నుండి) ఈ 14 లోకములు ఒకే జలములోని వివిధ తరంగములవలె దర్శనమగుచున్నాయి.

- ప్రజ్ఞాత్మయే మార్పు – చేర్పులతో కూడిన ఈ విశ్వమంతటికీ గరిమనాభి. ఉత్పత్తి స్థానము.
- ప్రజ్ఞాత్మయే జాగ్రత్‌రూపమున, జాగ్రత్‌కు అంతర్గతమైన అసంఖ్యాక విశేషముల రూపమున కూడా ప్రకాశమానమగుచున్నది. వెలుగులో అనేక వస్తు సముదాయములు కనబడుచున్న తీరుగా, ప్రజ్ఞాత్మయొక్క జాగ్రత్ వెలుగులో లోక సముదాయాలన్నీ అగుపిస్తున్నాయి। నేను–నీవు–సంగతి–సందర్శనము–సంబంధము–అనుబంధము మొ॥వన్నీ కల్పితమై చెన్నొందుచున్నాయి. ప్రజ్ఞాత్మయొక్క స్వప్న వెలుగులో స్వప్న విశేషాలు ప్రతిబింబితమగుచున్నాయి. జన్మ–జన్మాంతరముల కార్యక్రమ విశేషములు కూడా ఇటువంటివే!

ఆత్మయే ....,

- ప్రాణరూపము దాల్చి,
- భౌతిక – అభౌతిక తత్త్వములన్నీ ప్రదర్శించుచున్నదై,
- మరొకప్పుడు సర్వమును తనయందు లీనము చేసుకొనుచున్నదై, మౌనము వహించినదై,
- వాస్తవానికి జగత్తులు ప్రదర్శించుచున్నప్పుడు, ఉపశమింప జేస్తున్నప్పుడు కూడా ముందు – వెనుక కూడా పరమశాంతమై, మహామౌనస్వరూపమై, కేవల – నిర్విషయమై ఉంటోంది.

అందుచేత ఓ బాలాకి ఋషీశ్వరా !

ఎల్లప్పుడూ ఆత్మ యధాతథము ! మీరు–నేను–మనము విడచి వచ్చిన సభలోని జనులు – **మనమంతా ఏకైకరూపమగు ఆత్మయే !** అఖండాత్మ స్వరూపులమే! ఈ సర్వము ఆత్మకు అభిన్నము ! **అట్టి సహజ రూపభావన గుర్తుకురావటానికే ఉపాసన !**

**చిత్రగార్గ్యాయణి** : ఓ ఆరుణిగౌతమ – శ్వేతకేతు మమాత్మ స్వరూపులరా ! మనము ఈ "కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్"ను సత్సంగ పూర్వకంగా ముగించుకుంటూ ఒక్కసారి కొన్ని విషయాలు సమీక్షించుకుందాము.

ప్రాణము-ఇంద్రియములు-మనస్సు- జగత్ దృశ్యము - ప్రాణులు - అధిష్ఠాన ఇంద్రియ దేవతలు - అంతరంగ చతుష్టయము - 14 లోకాల సర్వ అంతర్గత విశేషాలు, జాగ్రత్-స్వప్న-సుషుప్తులు... ఇవన్నీ కూడా ఆత్మ అనే జ్యోతి యొక్క తేజో విలాసములే ! ఆత్మ సూర్యుని కిరణజాలములే !

ఆత్మ తనకు అభిన్నమైన దృశ్యభావనను ఒకప్పుడు తననుండి ప్రదర్శితము చేస్తూ, మరొకప్పుడు తన యందే ఏకస్వరూపముగా, ఆత్మస్వరూపముగా లయింపజేసుకొనుచున్నది. ఇదంతా ఈ జీవునియొక్క దైనందికమైన స్వప్నానుభవము, స్వప్న-ఉపశమనము వంటిదే!

- ఏ విధంగా ....
- ఒక శ్రేష్ఠుడైనవాడు ...,
- అనేక శ్రేష్ఠమైన విశేషాలను కల్పించుకొని..., తాను కల్పన చేసుకొన్న ఆ శ్రేష్ఠమైన విశేషాలన్నీ కూడా తానే ఆస్వాదిస్తూ ఉంటాడో,
- తన శ్రేష్ఠమైన కార్యక్రమములో కొంతమంది శ్రేష్ఠులైన వాళ్ళను కల్పించుకొని ఏదో గొప్ప కార్యము నిర్వర్తిస్తూ ఉంటాడో..., (ఉదా : స్వప్నాంతర్గత ద్రష్ట, స్వప్నాంతర్గత విశేషాలు)...,

ఏవిధంగా ఒక కథా రచయిత అనేక పాత్రలు - స్వభావములను ప్రారంభించి, కొనసాగించి, ముగించి.... కథను తనయందు మౌనరూపంగా లయము చేసుకుంటున్నాడో...,

***ఆత్మకూడా ...,***

సర్వ ఇంద్రియ దేవతలను కల్పించుకొని ఈ దృశ్య వ్యవహారమంతా ఆస్వాదిస్తోంది !

అట్టి ఆత్మను ఏమరచినప్పుడు జీవునికి సుఖ-దుఃఖ, బంధ-మోక్ష మొ॥న భావాలు చుట్టు ముట్టి ఉంటున్నాయి. క్రమ్ముకుంటున్నాయి.

ఆత్మజ్ఞానముచే సర్వము స్వస్వరూపాత్మగా అనుభూతమై, 'తదితరము' అయినదంతా ఆత్మయందు ఏకత్వము-అను రూపముగా లయమగుచున్నది. ఏకమగుచున్నది! అనగా సర్వము ఆత్మకు అనన్యమగుచున్నది.

సోదాహరణముగా చెప్పాలంటే..., త్రిలోకాధిపతి ఇంద్రుడు కూడా ఆత్మజ్ఞానమును ఏమరచినప్పుడు అసురులు దండయాత్ర చేస్తున్నారు. తిరిగి ఇంద్రుడు ఆత్మజ్ఞాని అయినప్పుడు అసురులను జయించి స్వారాజ్య సిద్ధి పొందుచున్నారు.

ఆత్మజ్ఞానము ఎరిగినప్పుడు ఈ జీవుడు ఆత్మగానే సర్వము ఆస్వాదిస్తున్నాడు. స్వారాజ్యభిషిక్తుడగుచున్నాడు. ఏమరచినప్పుడో, పరిమితత్త్వమును భావనచేసి 'జీవుడు' అని పిలువబడుచున్నాడు.

**వాస్తవానికి ఈ జీవుడు సర్వదా ఆత్మయే ! ఆత్మయే జీవుడుగా కనిపిస్తోంది.**

ఆత్మదృష్టిచే ఆత్మగా అనిపించగలదు !

**కనుక జగత్ దృష్టికి కనిపించే జగత్తును ఆత్మ దృష్టితో దర్శించటమే యోగము - జ్ఞానము కూడా!**

**కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్**

**సమాప్తః**

***ఓం శాంతిః శాంతిః శాంతిః***


ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 5 త్రిపురోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ త్రిపురోపనిషత్ వేద్య అపారమ్ ఐశ్వర్య వైభవమ్**
**అఖండానంద సామ్రాజ్యమ్ రామచంద్రపదం భజే ॥**

*(త్రిపురోపనిషత్ తెలియజేయుచున్న సంసారమునకు ఆవలగల అపారమగు ఆత్మైశ్వర్య వైభవము, అఖండ-ఆనంద సామ్రాజ్యము అయినట్టి రామచంద్ర తత్త్వమును భజించుచున్నాము.)*

ఓం

**1. త్రిసః పురః।**
**త్రి పథా।**
**విశ్వచర్షణా।**
**అత్రా కథా అక్షరాః సన్నివిష్టాః ।**
**అధిష్ఠాయా ఏనా అజరా పురాణీ ।**
**మహత్తరా మహిమా దేవతానామ్ ।**
**నవ యోనిః। నవ చక్రాణి దీధిరే।**
**నవైవ యోగా। నవ యోగిన్యశ్చ।**
**నవానాన్ చక్రా। అధినాథాస్యోనా।**
**నవ భద్రా। నవ ముద్రా। మహీనామ్।**
**ఏకా స ఆసీత్ ।**
**ప్రథమ ఆసా నవా ఆసీత్ ।**
**ఆసా ఏకోన వింశత్ (19)-ఆసో ఏకోన త్రింశాత్ (29)॥**

**ప్రణవ స్వరూప ఆత్మ భగవానునికి నమోవాక్కములు.**

మూడు పురములు ఉన్నాయి. (జాగ్రత్-స్వప్న-సుషుప్తులు)

ఆ మూడు పురములకు మూడు మార్గాలు ఉన్నాయి.

అవి విశ్వమంతా వ్యాపించినవై ఉన్నాయి.

వాటి వ్యవహారమంతా అక్షరమగు పరబ్రహ్మమునందు స్థానము కలిగి ఉన్నాయి.

దానిని అధిష్ఠించి-అజరమై (అవినాశనమై), పురాతనమై, మహత్తరమై, **దేవతలయొక్క మహిమగా** బ్రాహ్మీతత్త్వము (లేక) పరబ్రహ్మ తత్త్వము నిత్యప్రదర్శితమై ఉన్నది. దేవతలందరికి మూలతత్త్వమై దేవతలు ఉన్నట్టి స్థానము అయి ఉన్నది. సర్వమునకు ఆత్మదేవియే అధిష్ఠానము!

నిర్గుణ పరబ్రహ్మము లీలా వినోదముగా నిర్వర్తించు కేవలీతత్త్వమ్ సగుణంగా తొమ్మిది (9) యోని స్థానములు కలిగియున్నది. పరబ్రహ్మము ప్రకృతి స్వరూపుణీ జగన్మాత అయి 9 చక్రములు (నవ శ్రీ చక్రాంతర్గత చక్రములు)తో ప్రకాశమానమగుచున్నది.

సగుణ తత్త్వమగు ఆ త్రిపురేశ్వరియే నవ (9) యోగములు. నవ (9) యోగినులతో సృష్టి స్వరూపిణిగా ప్రదర్శితమగుచున్నది. నవ చక్రములకు నవ (9) అధినాథులను నియమించుచూ, నడిపించుచున్నది.

నవ (9) భద్రములు, నవ (9) ముద్రలు, నవ (9) మహిమలు కలిగి ఆ త్రిపుర సుందరీ బ్రాహ్మీతత్త్వము తదితర తత్త్వములన్నీగా ప్రదర్శితమగుచున్నప్పటికీ సర్వదా ఏకమే గాని అనేకము కాదు! నిర్గుణమునకు భిన్నము కాదు!

సర్వమునకు ప్రథమముగా, మునుముందుగా ఉన్నట్టి **అఖండరూపమే త్రిపురేశ్వరీ దేవి!** ఆ ఏకము అఖండము అగు ఆత్మతత్త్వ స్వరూపిణియే

- ఏకోనవింశత్ (19) తత్త్వములుగా, ఏకోనత్రింశత్ (29) తత్త్వములుగా కూడా అగుచు -సృష్టి - స్థితి - లయ విన్యాసమంతా క్రీడార్థము నిర్వర్తించుచున్నది.

2. **చత్వారింశత్ (40) అథ తిస్రః సమిధా**
**ఉశతీః ఇవ మాతరో మా విశంతు ।**
**ఊర్ధ్వజ్వల జ్వలనం జ్యోతిః అగ్రే**
**తమోవై తిరశ్చీనమ్ అజరమ్**
**తత్ రజో అభూత్ ।**
**ఆనందమ్ మోదనమ్ జ్యోతిః**
**ఇందో రేతా ఉ వై**
**మండలా మండయంతి।**
**యాః తిస్రో రేఖాః సదనాని భూః త్రీః,**
**త్రివిష్టపాః**
**త్రి గుణాః,**
**త్రి ప్రకారాః।**
**ఏతత్ త్రయమ్ పూరకమ్ పూరకాణాం**
**మన్త్రీ ప్రథతే మదనో మదన్యా,**
**మదంతికా, మానినీ, మంగళా చ సుభగా చ**
**సా సుందరీ, సిద్ధిమత్తా,**
**లజ్జా మతిః తుష్టిః, ఇష్టా చ, పుష్టా,**
**లక్ష్మీః, ఉమా, లలితా, లాలవంతీ ।**
**ఇమామ్ విజ్ఞాయ సుధియా**
**మదంతీ పరిస్స్రుతా తర్పయంతః స్వ పీఠమ్ ।**
**నాకస్య పృష్ఠే మహతో వసంతి।**
**పరంధామ త్రైపురంచా విశంతి ।**
**కామో యోనిః। కామకలా।**
**వజ్రపాణిః గుహో హసా,**
**మాతరిశ్వ అభ్రమ్ ఇంద్రః,**
**పునః గుహో సకలా మాయయాచ,**
**పురూచ్య ఏషా, విశ్వమాతా, ఆదివిద్యా ॥**

చతుర్వింశతి (40) సమిధలు ధరించినదై ఆ చైతన్య స్ఫూర్తి స్వరూపిణియగు త్రిపురేశ్వరీ మాతృదేవి నాయందు దేహమంతా వాయువుగా ప్రవేశించినదై ఉన్నది. సమిధలు (కట్టెలు) అగ్నిచే జ్వలించుచుండగా, (ఊర్ధ్వముగా అగ్ని జ్వలిస్తూ జ్యోతి స్వరూపమై అంధకారము తొలగించు రీతిగా) చతుర్వింశతి (40) సమిధా ధారిణియగు **ఆ పరబ్రహ్మ మూర్తి స్వరూప త్రిపురేశ్వరీ చైతన్య స్వరూపిణి** అంతరమున వ్యాపించి ఉన్నది. ఊర్ధ్వమున జ్యోతి స్వరూపిణియై ప్రకాశించు చున్నది.

చంద్రతత్త్వ త్రిపురేశ్వరియే..., చంద్రకాంతి స్వరూపిణియై చంద్రజ్యోతితో (తేజస్సుతో) ప్రకాశించుచు, దుఃఖము-మనో జాడ్యములను తొలగించుచు, ఆనందానుభూతిని కలిగించుచున్నది. మండలములను (హృదయములను) అలంకారమయము చేయుచున్నది.

ఆ త్రిపురేశ్వరీ చైతన్యము త్రిరేఖలచే అలంకరించబడినదై ఉన్నది.

ఆ త్రిరేఖసంజ్ఞలు

**త్రిఃభుః** → భూ-భువర్-సువర్ :: భౌతిక - మానసిక-బుద్ధిక

**త్రివిష్టపా** → జీవుడు-ఈశ్వరుడు-పరమాత్మ!

**త్రిగుణాః** → సత్వ-రజో-తమో గుణ

**త్రిపురాకారములు** → స్థూల-సూక్ష్మ-కారణములు.

ఈ త్రిపురతత్త్వములు పూరకమునకు పూరకము.

అట్టి త్రిపురతత్త్వమును మంత్రపూర్వకముగా ఉపాసించువాడు మదనుడై మదనియై ప్రకాశించుచున్నాడు. మదన్య (నాకు వేరైనదంతా నేనే)గా సారూప్యుడగుచున్నాడు. మదంతికా, మానినీ, మంగళా, సుభగా, సుందరి, సిద్ధి మత్త, లజ్జ, మతి, తుష్టి, ఇష్ట, పుష్ట, లక్ష్మి, ఉమ, లలిత, లాలవంతీ

..... ఇవన్నీ **త్రిపురేశ్వరీ అవతార సారూప్య** తత్త్వ చమత్కారములు.

ఏ బుద్ధిమంతుడైతే (సుధియ) ఇవన్నీ అఖండ పరతత్త్వ స్వరూపుణి యొక్క వివిధ ప్రదర్శనా దైవీతత్త్వములుగా తెలుసుకుంటాడో, అట్టివాడు **'మదంతీ'** అనే స్వస్వరూప పీఠమును అధిరోహించి ఆనందించుచున్నాడు.

మహదత్వముతో కూడిన నాకము (నడుము) యొక్క పృష్ఠభాగమున (మూలాధారమై) ఉండి **పరంధామము** అనే త్రైపురస్థానమును (సర్వము పరతత్త్వ స్వరూపంగా అనుకొనుచూ, భావించి, సేవించువాడుగా) ప్రకాశించుచున్నాడు.

కాముడు, యోని, కామకల, వజ్రపాణి, గుహుడు. వాయువు, మేఘము, ఇంద్రుడు, పునః (తిరిగి) గుహ ... ఇవన్నీ పరతత్త్వ స్వరూపిణియొక్క మాయా స్వరూపములు. విశ్వాంతర్భాగములు. ఆ త్రిపురేశ్వరీ చైతన్యమే..., ఆది విద్యా స్వరూపుణియై, సర్వమునకు మునుముందే ఉన్నట్టి **విశ్వమాత!**

3. **షష్ఠమ్-సప్తమమ్ అథ వహ్నిః సారథిమ్**
**అస్యామూల త్రికమ్**
**ఆదేశయంతః,**
**కథ్యమ్ కవిమ్ కల్పకమ్।**
**కామమీశమ్ తుష్టవాంసో అమృతత్వం భజంతే ।**
**పురం "హం" త్రిముఖమ్ విశ్వమాతుః**

త్రిపురయోగమును ఉపాశించు సాధకుడు షష్ఠము (6వది - ఆజ్ఞా చక్రము)నుండి సప్తమము (7వది సహస్రారము) ..... వరకు వహ్ని సారధి (నడిపించు అగ్ని-జ్యోతితత్త్వము) అయి ఉంటున్నాడు. త్రిక (ఓం హ్రీం శ్రీం) మూల మంత్రమును జపిస్తూ - సహస్రారమును దాటుచున్నాడు. జగత్ కథా ధారుడు, కవి, సర్వము కల్పించువాడు, కామేశ్వరుడు అగు పరమాత్మను దర్శించి స్తుతిస్తూ అమృతత్వమును పొందుచున్నాడు.

**హం** అనునది విశ్వమాత యొక్క త్రిముఖములతో కూడిన పురము. ఆ చైతన్య స్వరూపిణి స్వరమధ్యమునందు (త్రిశుద్ధ చక్రము)తో సూర్యతేజో రూపమై

రవేః ఏకా స్వరమధ్యమ్ తత్ ఏషా ।
బృహత్‌తిథిః, దశ, పంచ చ నిత్యా,
స షోడశికం పురమధ్యం బిభర్తి ।
యద్వా మండల ఆద్యాః తస బింబమ్ ఏకమ్।
ముఖం చ అథ త్రీణి గుహాసదనాని ।
కామీకలా కామరూపామ్
చికిత్వా నరో జాయతే కామరూపశ్చ కామః
పరిసృతం ఝషం, అజం పలఙ్బ భుక్తాని
యోనిః సుపరిష్కృతాశ్చ
నివేదయన్ దేవతాయై, మహత్యైః
స్వాత్మీకృతే సుకృతీ సిద్ధిమ్ ఏతి ॥

విరాజిల్లుచున్నది.
**అహం** చే హంపూర్ణమగుచున్నది. ఆ త్రిపురేశ్వరీ ఆత్మ ప్రజ్ఞయే బృహత్‌తిథి, దశ, పంచ, నిత్య, షోడశికారూపిణియై పురము (దేహము) మధ్యలో షోడశ (16) కళలతో ప్రవర్తించుచు, సర్వమును రక్షించుచున్నది. భరించుచున్నది.
అంతేకాకుండా, మండలము (శ్రీచక్రము)నకు ఆదిస్థానముగా ఏకస్వరూపమై ఈ విశ్వమంతా వెలుగొందుచున్నది. ఈవిధముగా విశ్వ మండలమునకు ఆదిబింబ స్వరూపిణియై ఒక్క ముఖము - మూడు గుహ సదనములను, కామకలా రూపమైన **ఆది తత్త్వమును** తెలుసుకొని ఉపాసించువాడు కామరూపుడు (ప్రకృతి రూపము) - కాముడు (పురుషరూపము) తానే అయి పరబ్రహ్మముగా దీపించుచున్నాడు.
ఆతడు...,
-- చేప మేక అన్నములను (మనస్సు-బుద్ధి-అహంకారములను) సుపరిష్కృతమైన యోనులను (జన్మలను) దేవతలకు సమర్పించుచు, నివేదించుచు (సర్వ జన్మ కర్మలను బ్రహ్మార్పణము చేయుచు) సర్వమును "స్వాత్మరూపము" (Form of own Self) గా చేసినవాడై సుకృతుడు (ఉపాసకుడు) అయి, ఆత్మత్వమును సిద్ధించుకొనుచున్నాడు.

---

4. సృణ్యేవ సితయా విశ్వచర్షణిః।
పాశేనైవ ప్రతిభద్నాతి అనీకాన్।
ఇషుభిః పఞ్చభిః ధనుషా చ విధ్యతి
ఆదిశక్తిః అ(ఉ)రుణా విశ్వజన్యా।
భగః శ్శక్తిః భగవాన్
కామ ఈశ ఉభదాతారా, విహ సౌభగానామ్ ।
సమప్రధానౌ సమసత్త్వౌ
సమోజౌ తయోశక్తిః, అజరా।
విశ్వయోనిః। పరిస్సృతా హవిషా భావితేన
ప్రసంకోచే గళితే, వై మనస్కః ।
శర్వః సర్వస్య జగతో విధాతా ధర్తా హర్తా
విశ్వరూపత్వమేతి ।
ఇయమ్ మహోపనిషత్,
త్రైపుర్యాయమ్ అక్షయం
పరమోగీర్భిరీట్టే,
ఏషణ్ ఋజుః యజుః పరమేతచ్చ
సామాయమ్ అథర్వేయమ్
అన్యాచ విద్యా ।
ఓం హ్రీం। ఓం హ్రీం।
ఇత్యుపనిషత్
ఇతి త్రిపురోపనిషత్
ఓం శాంతిః శాంతిః శాంతిః

అట్టి యోగి సాత్వికతతో కూడిన తెల్లటి ఇంద్రియములను ప్రతిబంధిస్తున్నాడు. త్రిపురేశ్వరి, విశ్వజననియగు ఆదిశక్తి ఐదు బాణములతోను, ధనస్సుతోను సర్వ ప్రతిబంధకములను కొట్టుచు పారద్రోలుచున్నది.
ఆదిశక్తి, విశ్వజనని మనలను రక్షించుచు విశ్వతత్త్వమగు పరబ్రహ్మమువైపుగా నడపుచున్నది.
సర్వము వెలుగించు భగశ్శక్తి-భగవంతుడు (పార్వతీ పరమేశ్వరులు) కామ - ఈశ... ఈ ఇద్దరు మన సర్వ సౌభాగ్యములకు సర్వదా తోడై మనకు అవసరమైనదంతా ప్రసాదిస్తూ ఉంటారు.
ప్రకృతి-పురుషులు (శక్తి-శివులు) సమప్రధానాలు! సమసత్త్వులు. విశ్వము-విశ్వేశ్వరుడు... ఇద్దరూ ఒక్కటే! సమ ఓజో ప్రకాశమానులు!
పురుష - ప్రకృతుల శక్తి నాశనము లేనిది (Energy is constant)!
విశ్వమునకు ఆ శివ-శక్తులే యోని (జనించి స్థానము) అయి ఉన్నారు.
హవిస్సులచే (సమర్పించబడు విధులచే) ఈ విశ్వమంతా నిండి ఉన్నవారు కూడా వారే!
విశ్వముయొక్క సంకోచ - వ్యాకోచములు విశ్వ-విశ్వేశ్వరులగు పరబ్రహ్మమే! మనస్సుచే ఇదంతా జనించి, మనస్సుతోనే లయించుచున్నది.
శర్వుడే ఈ సర్వజగత్ స్వరూపము. ఆతడే విధాత! సృష్టికర్త! ధరించునది ఆ ఆత్మ భగవానుడే! జీవుడూ ఆయనే! ఇదంతా హరించునది ఆయనే! ఈ విశ్వమంతా ఆయనయే! ఆయన యందే! ఆయనచేతనే! విశ్వేశ్వరుడే విశ్వరూపుడై ఉన్నారు.
విశ్వేశ్వరి ఆయనయే! విశ్వము ఆయనయే!
ఇతి మహోపనిషత్ సారము! త్రైపుర్యా మహోపనిషత్!
అట్టి పరమాత్మ జగత్ విభవమును ఎవ్వరైతే అక్షయరూపముగా ఆరాధిస్తారో వారు శివరూపులగుచున్నారు! శివానందము పొందుచున్నారు.
ఋక్ - సామ - యజో అథర్వణ వేదవిద్య అన్య విద్య సారమంతా ఇదే!
ఓం హ్రీం శివ - శక్త్యాయ నమో నమః! ఓం హ్రీం! ఓం హ్రీం!
**ఇతి త్రిపురోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 5 త్రిపురోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



ఒకానొక చోట మూడు పురములు : త్రిపురా - త్రిపురములు!

→ (స్థూల-సూక్ష్మ-కారణ **దేహ** పురములు!

→ జాగ్రత్-స్వప్న-సుషుప్తి **అవస్థా** పురములు!

→ ద్రష్ట-దర్శన-దృశ్య **త్రిపుటీ** పురములు!

→ అనుభవి-అనుభవ-అనుభవించబడు **అనుభూతి** పురములు!

→ కార్య - కారణ - కర్తృత్వ **భావ** పురములు!

→ భావించువాడు - భావించుట - భావించబడునది అగు **అనుభవ** పురములు!

→ ఇంద్రియములు ఉపయోగించుచున్నవాడు-ఇంద్రియములు-ఇంద్రియ విషయములు అను **జగత్ రూప** పురములు)

ఆ మూడు పురములకు మూడు పథములు (లేక) మార్గములు. (సాంఖ్య - భక్తి - యోగ - మార్గములు).

... అవి ఈ విశ్వమంతా వ్యాపించి విశ్వరూపముగా సంప్రదర్శితమగుచున్నాయి.

అయితే....,

ఈ త్రిపురములలోని అంతర్గత విశేషాలన్నీ కాలగతిచే మార్పు చేర్పులు చెందుతూ ఉన్నాయి. మార్పు-చేర్పులు చెందుచున్నవన్నీ కూడా నిత్య నూతనము-సర్వదా యథాతథము అగు అక్షరమునందు స్థానము (Placement) కలిగి ఉన్నాయి. అద్దానిని "అక్షర పరబ్రహ్మము" అని, "త్రిపురేశ్వరీతత్త్వము" అని "పరబ్రహ్మము" అని నిత్య సత్యము అని వర్ణించబడుతోంది. సదాశివము, అజరము (అజరము), పురాతనము, మహత్తర మహిమాసనిత్వము అగు పరబ్రహ్మము సర్వ దేవతా రూపములను అధిష్ఠించినదై ఉన్నది. దేవతలందరికి మూలతత్త్వము. వారు ఏర్పడి ఉన్న స్థానము కూడా అదియే! దేవతలు ఆ ఆత్మతత్త్వము యొక్క సంప్రదర్శనా రూపములు. **అధిష్ఠాయా ఏనా అజరా, పురాణీ, మహత్తరా మహిమా దేవతానాం!**

నిర్గుణ పరబ్రహ్మ స్వరూపిణియగు త్రిపురేశ్వరీమాత (ఆత్మ) - కల్పనతో కూడిన ఈ "సృష్టి"ని - లీలా వినోదముగా కల్పించుకొనుచున్నది. ఇదంతా **బాల త్రిపుర సుందరి యొక్క బాలా లీలా వినోదము.**

అట్టి ఈ సృష్టి :

**నవవిధ (9) యోని స్థానములు :** (జ్ఞాన, సుఖ, దుఃఖ, ఇచ్ఛ, ద్వేష, ప్రయత్న, ధర్మ, అధర్మ, సంస్కారములు) కలిగి ఉన్నది.

**నవవిధ (9) చక్రములు :** (త్రైలోక్య మోహనము, సర్వాశాపరిపూరకము, సర్వసంక్షోభణము, సర్వసౌభాగ్యదాయకము, సర్వార్థసాధకము,

సర్వరక్షాకరము, సర్వరోగహరము, సర్వసిద్ధ ప్రదాయకము, సర్వానందదాయకములు. (ఈ తొమ్మిది శ్రీ చక్రములోని వివిధ చక్రములు). – (9) గా ప్రవర్తమానమగుచున్నాయి.

**నవాన్ చక్రా అధినా దాస్యోనా :** నవచక్రములకు నవ అధినాధులను, నవగ్రహములను నియమించుచున్నది ఆ త్రిపురేశ్వరియే!

**నవ భద్రాన్ :** (9) భద్రములు (రక్షకతత్త్వములు) ఇందు (విశ్వజ్యోతినందు) ప్రతిక్షేపితమై ఉన్నాయి.

**నవ ముద్రాన్ :** (చిన్ముద్ర మొదలైన) నవవిధ మహిమాన్విత ముద్రలు కలిగినదై ఈ విశ్వకథను నడిపించుచున్నది.

ఇవన్నీ ఏకబ్రాహ్మీ – ఆత్మ చైతన్య స్వరూపుణియగు త్రిపురాదేవి యొక్క మహిమలుగా ప్రదర్శితమౌతున్నాయి. అయితే త్రిపురాదేవి ఏకస్వరూపిణియే గాని అనేకముగా అగుట లేదు. ఆత్మ స్వరూపిణియగు త్రిపురేశ్వరీ దేవి....,

-- ఏకోనవింశతి (19) తత్త్వములుగా (పంచకర్మేంద్రియములు, పంచజ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారముగా)....,

-- ఏకోనత్రిశత్ (29) తత్త్వములుగా (పైవే కాకుండా పంచప్రాణమలు, పంచ ఉపప్రాణములు)గా కూడా అగుచు....

ఇవన్నిటితో సృష్టి స్థితి లయ క్రీడా వినోద విన్యాసమును నిర్వర్తించుచున్నది. కథా రచయిత కథకు వేరై కథలోని సంఘటణలను పాత్రలను కల్పించుచున్న తీరుగా,.... కేవలాత్మ రూపిణియొక్క కేళీ విలాసమే ఈ జగత్తంతా కూడా!

## చతుర్వింశతి సమిధలు (40)

**పంచ భూతములు :** పృథివి ఆపః తేజో వాయు ఆకాశః (Solid Liquid Fire Vapour Space)

**పంచ కర్మేంద్రియములు :** చేతులు, కాళ్ళు, చర్మము, గుదము, శిశ్నము

**పంచ జ్ఞానేంద్రియములు :** త్వక్కు (చర్మము) చక్షువులు (కళ్ళు) రసము (నోరు) శోత్రము (చెవులు) ఘ్రూణము (ముక్కు)

**పంచ ఇంద్రియ విషయములు (పంచతన్మాత్రయి) :** శబ్ద – స్పర్శ – రూప – రస గంధములు

**పంచకోశములు :** అన్నమయ–ప్రాణమయ–మనోమయ–విజ్ఞానమయ–ఆనందమయ.

**పంచప్రాణములు :** ప్రాణ–అపాన–వ్యాన–ఉదాన–సమాన

| | | | |
|---|---|---|---|
| **దశవిధనాడులు :** | ఇడానాడి | – | ముక్కుకు ఎడమభాగముగా |
| | పింగళనాడి | – | ముక్కుకు కుడి భాగముగా |
| | సుషమ్నానాడి | – | ముక్కుకు మధ్య భాగముగా |
| | గాంధారి నాడి | – | కుడి కంటిలో |
| | అస్తిని నాడి | – | ఎడమకంటిలో, నాలుకలో |
| | పుసానాడి | – | కుడి చెవిలో |
| | పయస్వనినాడి | – | ఎడమ చెవిలో |
| | ఆలంబన నాడి | – | గుద స్థానమున |
| | లకుహనాడి | – | గుద స్థానమున |
| | శంఖినీ నాడి | – | నాభి స్థానమున |

(ఈ ఉపనిషత్తులో పై 40 విభాగించి వివరణగా చెప్పబడలేదు. యోగవిద్య యందు ప్రసిద్ధములు.)

చైతన్య స్ఫూర్తి రూపిణియగు త్రిపురేశ్వరి (పైన వివిధ ఇతర శాస్త్రములచే చెప్పబడిన) 40 సమిధల–తేజోరూపము ధరించినదై– వాయువు దేహములో ప్రవేశించి అంతటా విస్తరించిన తీరుగా – ఈనా దేహములో ప్రవేశించినదై ఉన్నది. అట్లే అన్ని దేహములలోనూ కూడా! కట్టెలు అగ్నిచే వెలుగుచున్నప్పుడు చీకటి పటాపంచలౌతుంది కదా! ఆవిధంగా అగ్ని ఊర్ధ్వముగా వెలుగునట్లు,

-- నా అంతరమున 40 సమిధలను ధరించి ప్రవేశించినదై, జ్యోతి స్వరూపిణియై, ప్రకాశించుచుండగా నా అజ్ఞానాంధకారము తొలగిపోవును గాక!

ఆ ఆత్మజ్యోతి స్వరూపిణియగు త్రిపుర సుందరియే ...,

చంద్ర స్వరూపిణి అయి, చల్లటి చంద్ర కిరణముల తేజస్సుతో ప్రకాశిస్తోంది!

నాలోని దుఃఖ భావములను, మనోజాడ్యమును తొలగించుచూ, ఆనందానుభూతిని కలిగించుచుండును గాక! హృదయ మండలమును అలంకరించి శోభ ప్రదము చేయును గాక!

ఆ త్రిపురేశ్వరీ ఆత్మచైతన్య విశ్వేశ్వరి ... ఈ లోకములన్నిటినీ నిండియున్నదై, త్రిరేఖలు ధరించి ప్రకాశించుచున్నది. ఆ త్రిపురేశ్వరియే...,

త్రిభూః – స్వర్గ – మర్త్య – పాతాళలోకములుగా, భౌతిక – మానసిక – బుద్ధి తత్త్వ రేఖలుగా,

త్రివిష్టపా – జీవుడు, ఈశ్వరుడు, పరమాత్మగా,

త్రిగుణాః – సత్త్వ – రజో – తమో గుణములుగా,

త్రిప్రకారములు – స్థూల – సూక్ష్మ – కారణ రూపములుగా,

**త్రిరేఖాలంకృతయై**, సర్వే–సర్వత్రా సర్వముగా ప్రకాశమానమగుచున్నది.

ఆ త్రిపురేశ్వరీ మహా చైతన్య స్ఫూర్తి దేవి.....

- పూరకమునకే (పూరక ప్రాణాయామమునకే) **పూరకము!**
- కుంభకమునకే **కుంభకము!**
- రేచకమునకే **రేచకము!**

**ఓం ఐం హ్రీం క్లీం శ్రీం**
**ఓం క్లీం క్లోం**

త్రిపురతత్త్వమును మంత్ర పూర్వకముగా ఉపాసించువాడు

మదనుడు (కోరుకొనువాడు) – మదని (కోరుకొనబడునది)
చూచువాడు – చూడబడునది
భోగించువాడు – భోగించబడునది

ఈ మూడు తన స్వరూపమే అయి ప్రకాశించుచున్నాడు.

⌘ ⌘ ⌘

ఆ త్రిపుర సుందరీ చైతన్యము అనేక స్ఫూర్తి రూపములను ధరించి ఈ లోకములన్నీ పాలించుచున్నది.

మదంతికా; మాననీ; మంగళా; సుభగా; సుందరీ;
సిద్ధిమత; లజ్జ; మతి; తుష్టి; ఇష్ట;
పుష్టి; లక్ష్మి; ఉమ; లలిత; లాలపంతి.

మొదలైనవన్నీ త్రిపురేశ్వరీ అవతార (సారూప్య) చిత్ చమత్కారములే!

ఏ బుద్ధిమంతుడైతే "**సర్వము త్రిపురమహేశ్వరీ ఆనందతత్త్వమే**".... అని గమనిస్తూ, దివ్యతత్త్వములతో, ప్రదర్శనా చమత్కారములతో కూడిన ఈ సర్వలోకములు త్రిపురేశ్వరీ స్వరూపముగా తెలుసుకుంటాడో... అట్టివాడు "మదంతీ" (ఆత్యంతికమగు మత్ స్వరూపము) అనబడు స్వస్వరూప పీఠమును అధిరోహించి ఆనందించుచున్నాడు. (మత్ + అంతీ – 'నేను'కు ఆవల గల 'నేనైన నేను')

యోగ సాధకుడు "మూలాధార చక్రము" అని పిలువబడు మహామహదత్త్వముతో కూడిన నాకము (నడుము) యొక్క పృష్ఠభాగములో ప్రవేశించి, ఇక అక్కడినుండి 'త్రైపు' అనే సహస్రార ఊర్ధ్వ భాగమును చేరి, సర్వ ఇంద్రియ విషయములను అధిగమించినవాడై, సర్వే–సర్వత్రా **త్రిపురేశ్వరీ కేవల చైతన్య దర్శనము** చేసుకొనుచున్నాడు. సర్వము త్రిపురేశ్వరీ తత్త్వముగా దర్శించుచున్నాడు. అదియే బిందువు. (సర్వము త్రిపురేశ్వరీ రూపం సందర్శించు సహస్రాకాతీత బిందు స్థానము)!

### పరంధామము; దివ్య స్థానము; త్రైపురీయోగము; ఆత్మసాక్షాత్కారము

మొదలైన పేర్లతో ఆ త్రిపురేశ్వరీ వైభవము చెప్పబడుతోంది. సాలోక్య – సారూప్య – సామీప్య – సాయుజ్య వైభవముగా వర్ణించబడుచూ చెప్పబడుతోంది.

# త్రిపురేశరీమాయ

**"కామోః యోనిః కామకలా"** – ఈ లోకముల కల్పన అంతా కూడా త్రిపురేశరీ (ఆత్మదేవీ) కామ (ఇష్ట) జనితము ఆ దేవియొక్క ఇష్ట కళా విశేషమైనట్టి మాయా కల్పనయే!

**కామో (ఇచ్ఛ)** .......... నిర్విషయము – అప్రమేయము అగు ఆత్మ "నాకు ద్వితీయమైనది కల్పించుకొనెదను గాక!" అని అనుకొనుచున్నది. దృష్టాంతానికి, ఊరికినే కూర్చున్నవాడు ఊరికే ఉండబుద్ధి గాక ఏదో "ఊహ" లోకి వెళ్ళాలని అనుకోవటమే ... కామము.

**యోనిః (కల్పనా జగత్)** .......... ఈ లోకాలన్నీ త్రిపురేశ్వరీ దేవి యొక్క స్వకీయ ఇచ్ఛా శక్తి నిర్మితమైన ఊహా చమత్కారమే! ఈ దృశ్య జగత్‌కల్పన ఎక్కడి నుండి వచ్చింది? త్రిపురేశ్వరి (లేక) ఆత్మదేవి యొక్క కల్పన నుండే! కనుక ఇదంతా ఆత్మయొక్క కల్పనచే కల్పించబడి ఇచ్ఛనుండి ఏర్పడిన ఊహాదృశ్యమే! – ఈ లోకాలు.... అంతా ఊహాదృశ్యమే!

**కామకలా** .......... కల తనదైనవాడు కల కల్పించుకొని, కల తనదేననే విషయం ఏమరచి, కలలోని వానివలె కలను చూస్తూ అనుభవిస్తూ ఉంటాడు కదా! అట్లాగే ఆ త్రిపురేశ్వరి అగు ఆత్మ "జగత్ కల్పన" అనే కలవంటి కల్పనలో ప్రవేశించి "నేను జీవుడను" .... అని భావిస్తూ ... ఆస్వాదించుచున్నది. జగత్ కల్పన – ఆత్మదేవీ ఇష్ట – కామకళా కల్పనా విశేషం.

ఇంకా ఆ త్రిపురాకల్పినియగు ఆత్మ

**మాతరిస్వ** .... వాయువువలె జగత్తు – దేహములలో అంతటా సంచారము కలిగి ఉన్నది.

**అభ్రమివ**.... మేఘము సూర్యుని కప్పి ఉంచు తీరుగా, తన చైతన్య తత్త్వమును ఏమరచి విషయములచే కప్పి ఉంచుకొని ఉంటోంది.

**ఇంద్రః** .... ఇంద్రస్వరూపిణి అయి యింద్రియ విషయములను ఆస్వాదించుచున్నది.

**పునఃగుహాయా** .... చిన్న పిల్లవాడు (ఇసుకతో పిచ్చుకగూడు మొదలైన) ఆటలు ఆడుకుంటూ వాటిలో లీనమై, మరల ఎప్పుడో ఇల్లు గుర్తుకు వచ్చి, ఆటలు ఆపేసి ఇల్లు చేరుతాడు కదా! అట్లాగే, ఆ త్రిపురేశ్వరీ ఆత్మదేవి లోకకల్పనలు – లోకాంతర జీవ రూప సంచారములు .... వదలి తిరిగి స్వస్వరూపమున ప్రవేశము పొంది,.... అంతా తానే అయి ఆనందించుచున్నది. తన హృదయ గుహయందు కల్పించుకొనటము, త్యజించటము నిర్వర్తిస్తోంది.

**సకలా మాయయాచ** .... ఇదంతా స్వకీయ మాయా కల్పనా బాలా లీలా వినోదమే! విశ్వ కల్పనా అంతర్భాగ విశేషాలు మాత్రమే!

ఇక ఆత్మ స్వరూపిణియగు త్రిపురేశ్వరియో?

- మాయాకల్పనకు మునుముందే ఉన్నట్టి **కేవల నిత్యానంద ఆత్మ స్వరూపిణి.**
- అట్టి ఆత్మయొక్క కల్పనకదా, ఇదంతా! అట్టి ఆత్మ సర్వదా కల్పన (కామో, యోనిః కామకలా మాయా తతంగమంతా) లేనప్పుడు, ప్రారంభమైన తరువాత, తిరిగి మాయను ఉపశమింపజేసినప్పుడు కూడా (లేక) సర్వము స్వస్వరూపంగా దర్శించునప్పుడు కూడా **వేరుగానే ఉన్నది. అప్రమేయమై ఉన్నది. సర్వము తానే! శర్వము (వేరైనదీ) తానే!**

ఆ ఆత్మస్వరూపుణియే "**విశ్వమాతా**" స్వరూపిణిగాను, "**ఆదివిద్యా**" స్వరూపిణిగాను కూడా ఉన్నది.

⌘

ఈవిధంగా త్రిపురేశ్వరీ యోగమును అభ్యసించు, ఉపాసించు, సాధనచేయు యోగి.... క్రమముగా షష్ఠమము (6వది – ఆజ్ఞాచక్రము) నుండి సప్తమము (7వది – బ్రహ్మ రంధ్రము) వరకు అగ్నిజ్యోతి (జ్ఞానము)ను నడిపించుచు "వహ్నిసారధి" అయి ఉంటున్నాడు.

త్రిక (ఓం హ్రీం శ్రీం) అను (శ్రీచక్ర) మూల మంత్రమును జపిస్తూ... ప్రజ్ఞను సహస్రారము దాటిస్తున్నాడు. ఆత్మత్వమును అవధరిస్తూ... ఇక ఈ కల్పనా లోకములతో కూడిన జగత్తు విషయమై

- ఈ జగత్తును ఒక కథవలె (ఒక కథను చదువుచున్న తీరుగా) దర్శించువాడు అగుచున్నాడు (కథ్యమ్).
- స్వీయ రచనా చమత్కారంగా చూస్తూ ఉన్నట్టి 'కవి' అగుచున్నాడు. శ్రేష్ఠుడై, వేరై బాహ్యవస్తువు వలె ఈ దేహములను, లోకములను **స్వీయ కల్పనా విశేష మాత్రంగా** చూస్తున్నాడు.
- కేవలము కల్పనగా గమనిస్తున్నాడు (కల్పకమ్).

అనగా....,

- అప్రమేయ త్రిపురేశ్వరీ పరస్వరూపము,
- మాయా కల్పన,

- మాయను విరమింపజేయటము,
- సర్వదా కేవలసాక్షీ – అప్రమేయ నిత్యత్వము....

ఎరిగినవాడు అగుచున్నాడు. **కథ్యమ్ కలిమ్ కల్పకమ్** – ఈ జగదర్శనమంతా తాను కవియై కల్పించుకొన్న కథలాగా దర్శిస్తూ, త్రిపురేశ్వరీ స్వస్వరూపమును ఆస్వాదిస్తూ ఉంటున్నాడు. కామములను అధిగమించి, కామేశ్వరుడై పరమాత్మను దర్శించుచూ, స్తుతిస్తున్నాడు. అమృతత్వమ్ భజంతే! అమృతత్వమును ఆరాధిస్తూ అమృత స్వరూపుడు అగుచున్నాడు.

⌘

ఈవిధంగా ఈ విశ్వమంతా విశ్వమాతయొక్క త్రిముఖముల పురము.

**హం** – విశ్వమాత యొక్క 3 ముఖముల (జ్ఞాత–జ్ఞానము–జ్ఞేయము, తెలుసుకొనువాడు – తెలుసుకోవటం–తెలియబడునది మొదలుగా గల) పురము.

**అహం** – అ + హమ్ ‘అ’ కారము = పురుషుడు, “హమ్” కారము = ప్రకృతి
త్రిపురేశ్వరుడు + త్రిపురేశ్వరి
ఆత్మ + కల్పన

అట్టి ఈ విశ్వమాతా విన్యాసమంతా కూడా చైతన్య స్వరూపుణియగు త్రిపురేశ్వరి యొక్క స్వరము (విశుద్ధ చక్రము)లో సూర్య తేజో రూపమై విరాజిల్లుచున్నది. కనుకనే ***అహమ్ ఏవ బ్రహ్మమ్ – అహమ్ బ్రహ్మాస్మి*** .... అగుచున్నది.

ఆ త్రైలోక్యమాత (త్రిపురధారిణి)

- బృహత్ తిథి (కాల) స్వరూపిణియై
- దశ (పంచప్రాణ – పంచ ఉపప్రాణ స్వరూపిణి) అయి,
- పంచ (పంచ కర్మేంద్రియ పంచ జ్ఞానేంద్రియములై)
- నిత్య (ఎల్లప్పుడు యథాతథ స్వరూపిణి) అయి,

**సషోడశికమ్ :** షోడశ కళలతో (పంచ కర్మేంద్రియములు + పంచ జ్ఞానేంద్రియములు + అంతరంగ చతుష్టయము + జీవాత్మ + ఈశ్వర కళాత్మికంగా)

ఈ త్రిపురముల పురమధ్యలో స్థానము కలిగియుండి సర్వమును ప్రదర్శించుచు, **భిభర్తి** – భరించుచున్నది.

అంతే కాకుండా....,

మండలమునకు (విశ్వమునకు–విశ్వభావములకు–శ్రీచక్రమునకు) నాభి–మధ్య స్థానములో ఉండి సర్వదా సర్వము తానే అయి, ఏక స్వరూపిణి అయి వెలుగొందుచున్నది.

ఈవిధముగా త్రిగృహముల యజమాని – గృహిణియగు త్రిపుర సుందరీ ఆత్మ చైతన్యము ఆదిబింబ స్వరూపిణి అయి ప్రతిబింబమాత్ర జగత్ దృశ్యమును ప్రతిబింబింపజేస్తూ

ఏకముఖము – ఏకద్రష్ట
మూడు గుహసదనములు – జాగ్రత్–స్వప్న–సుషుప్త, జీవ–ఈశ్వ–పరమాత్మ దర్శనములు ప్రదర్శిస్తూ,

ఇదంతా తనయొక్క కామకళగా ప్రదర్శించు కామేశ్వరీ – కామకళా రూపిణియగు త్రిపురతత్త్వమును తెలుసుకొని ఉపాశించువాడు...,

కాముడు – కామకలా రూపము
పురుషుడు – ప్రకృతి

తానే అయి పరబ్రహ్మముగా దీపించగలడు.

అట్టివాడు....,

**పరిసృతం ఝషమ్ – అజం పలఇౠ భుక్తాని** – చేప – మేక మాంసము–అన్నము (జీవుడు – ఈశ్వరుడు – బ్రహ్మము, మనస్సు – బుద్ధి – అహంకారము)లను, సుపరిష్కృతమైన యోనులను దేవతలకు లోక కళ్యాణార్ధము సమర్పిస్తున్నవాడై...., నివేదన చేస్తూ....,

మహత్త్వైః .... ఈ సర్వము త్రిపురేశ్వరీ ఆత్మస్వరూపుణియొక్క మహత్తుగా దర్శిస్తూ....,

**స్వాత్మీకృతే సుకృతీ సిద్ధిమ్ ఏతి!**

- సర్వమును బ్రహ్మార్పణముగా చేయుచు...,
- ఈ కనబడేదంతా స్వాత్మారూపముగా ఆస్వాదిస్తూ (Enjoying as form of own self) ఉన్నాడు.

(అట్టి సుకృతుడు) ఆత్మత్వమును సిద్ధించుకొని త్రిపురీదేవీ తత్త్వమై ప్రభవిస్తున్నాడు. ప్రకాశిస్తున్నాడు. విశ్వదేవీ భావనా - సాత్త్విక దృష్టులతో సర్వము అమృతప్రాయము చేయుచున్నాడు.

త్రిపురేశ్వరీ ఆత్మ చైతన్యముగా ఈ విశ్వమును ఉపాసించువాని యొక్క ప్రతిబంధకములన్నీ విశ్వజననియగు ఆదిశక్తి పంచబాణముల ప్రయోగముచే (కర్మ-భక్తి-జ్ఞాన-యోగ-సమాధి విధానములచే) పారద్రోలుచున్నది. ఆదిశక్తి, విశ్వజనని.... సాధకులము, ఉపసాకులము అగు మనలను రక్షించుచు, విశ్వతత్త్వమగు పరబ్రహ్మమువైపుగా నడపుచుండును గాక!

⌘

ఇక్కడ ద్విత్వము లేదు. ఏకతత్త్వమే అంతటా తాండవించుచున్నది. సర్వమును వెలిగించు భగః శక్తి-భగవంతుడు - కామీ (ప్రకృతి)-ఈశ ఇరువురును ఏక స్వరూపులు.

పురుషుడు - ప్రకృతి
అనుభవించువాడు - అనుభవించబడునది (Experiencer - Experiencing)

ఏకమే! ఉభయతత్త్వములు మనకు తోడై సర్వము ప్రసాదిస్తూ ఉన్నాయి.

ప్రకృతి - పురుషులు ....
ఇరువురు సమప్రధానులే! (Equally Important)
సమసత్త్వులే! (Equally Energitic)

**పురుషుడు - ప్రకృతి, శివ-శక్తుల ఐక్యత్వము**, సమాన ప్రధానత్వము, సమం-సత్వము, సమ ఓజోశక్తిత్వములను ఎరుగుటచే త్రిపురతత్త్వము అనుభూతమవగలదు.

- పురుషుడు - ప్రకృతి .... ఉభయము అవినాశనమైనవి
- ఈ విశ్వమునకు యోనిస్థానము (జనించు స్థానము) శివ-శక్తుల (Experiencer-Experiencing) యొక్క ఏకస్థానమే! ఆ ఇరువురు ఏకమగు ఆ ఉభయతత్త్వములు హవిస్సులచే (By respective contributions) ఈ విశ్వమంతా నిండి-నింపి ఉంచుచున్నారు.
- ఈ విశ్వముయొక్క సంకోచ-వ్యాకోచములు ఉభయములు పరబ్రహ్మము యొక్క విశేష వైశిష్ట్యము!
- ఈ విశ్వము విశ్వేశ్వరుని మనస్సుచే జనిస్తోంది. మనస్సు చేతనే లయిస్తోంది. మనస్సే దేవీ స్వరూపము!
- ఈ విశ్వముయొక్క రూపము విశ్వేశ్వరుడే! విశ్వేశ్వరుడే విశ్వరూపముగా ఉన్నాడు.
- స్వస్వరూపమగు శర్వుడే ఈ సర్వ జగత్ స్వరూపము. ఆతడే సృష్టికర్త! విధాత! సంరక్షకుడు! పరిపోషకుడు! హర్త!
- ఇదంతా ధరించుచున్నది, తన అనుభవరూపముగా నిర్వచించుకొనుచున్నది విశ్వేశ్వరుడే!
- ఆతడే ఆత్మ! ఆతడే ఈ జీవుడు! అతడే ప్రకృతి! అతడే సృష్టి - స్థితి - లయము! ఆతడే త్రిపురసుందరీ స్వరూపము!
- విశ్వమంతా విశ్వాత్మమయము. విశ్వాత్మయే జీవాత్మ కూడా!

ఇతి త్రిపురోపనిషత్ సారము! మహోపనిషత్ వాక్యము! **అట్టి త్రిపురేశ్వరుడగు పరమాత్మయొక్క విభవముగా ఈ జగత్తును, ఎవ్వరైతే ఆరాధిస్తూ ఉంటారో వారు స్వయం పరబ్రహ్మ స్వరూపులుగా నిర్వచనానందము పునికి పుచ్చుకొనుచున్నారు.** ఋక్-యజుర్-సామ-అధర్వణ వేదముల, వేదాంతవిద్యయొక్క, అన్యవిద్యలయొక్క సారము - **భిన్నముగా కనిపించేదాని ఏకత్వమే అయి ఉన్నది. ఓం హ్రీం! ఓం హ్రీం! ఓం హ్రీం! శ్రీమాత్రే నమః!**

***ఇతి త్రిపురోపనిషత్ సమాప్తః***

*ఓం శాంతిః! శాంతిః! శాంతిః!*


ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 6 నాదబిందూపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ వైరాజ - ఆత్మోపాసనయా సంజాత జ్ఞాన వహ్నినా**
**దగ్ధ్వా కర్మత్రయమ్ యాతి యత్ పదం యాతి తత్ భజే।**

*సర్వత్రా విరాజమానమైయున్న ఏ ఆత్మతత్త్వముయొక్క ఉపాసన వలన జనించే జ్ఞానాగ్నిచే* ***కర్మత్రయము*** *(అగామి, సంచితము, పారబ్ధము) దగ్ధము అగుచూ, యోగులు ఆత్మస్థానమును చేరుచున్నారో..., అట్టి సర్వాత్మకమగు ఆత్మపదమును భజించుచున్నాము!*



| | |
|---|---|
| **1. ఓం**<br>**"అ" కారో దక్షిణః పక్ష**<br>**"ఉ" కారస్తు ఉత్తర స్మృతః।**<br>**"మ" కారః పుచ్ఛమ్ ఇతి ఆహుః**<br>**అర్ధమాత్రా తు మస్తకమ్॥** | ఓం అను బ్రహ్మ సంజ్ఞాక్షర **హంసకు**<br>"అ" కారము కుడి రెక్క అని,<br>"ఉ"కారము ఎడమ రెక్క అని,<br>"మ"కారము ... తోక అని,<br>అర్ధమాత్ర ... మస్తకము (Face) అని **సంజ్ఞాపూర్వకముగా చెప్పబడుచున్నది.** |
| **2. పాదాదికం గుణాత్ తస్య**<br>**శరీరమ్ - తత్త్వమ్ ఉచ్యతే।**<br>**ధర్మో అస్య దక్షిణం చక్షుః।**<br>**అధర్మో అధో అపరః స్మృతమ్।** | ఆ హంసకు త్రిగుణములు (సత్వ-రజో-తమో గుణములు) --- **పాదములు.**<br>తత్త్వమ్ (త్వమ్ తత్ అసి) --- **శరీరము**<br>→ కుడి కన్నేమో --- **ధర్మము!**<br>→ ఎడమ కన్నేమో --- **అధర్మము!** |
| **3. భూః లోకః పాదయోః తస్య,**<br>**భువః లోకః అస్తు జానునీ।**<br>**సువర్లోకః కటీ దేశే,**<br>**నాభి దేశే మహత్-జగత్॥**<br>**(మహర్జగత్ః = మహర్లోకము)** | ఇంకా ఆ హంసకు<br>→ పాదములు --- **భూలోకములు.**<br>→ జానువులు (భుజములు) --- **భువర్లోకము.**<br>→ కటి (చుట్టూ) ప్రదేశమేమో --- **సువర్లోకము.**<br>→ బొడ్డు ప్రదేశము --- **మహర్లోకము.** |
| **4. జనోలోకస్తు హృదయే**<br>**కంఠే లోకః తపః తతః।**<br>**భ్రువోః లలాట మధ్యేతు**<br>**సత్యలోకో వ్యవస్థితః॥** | → హృదయము --- **జనోలోకము.**<br>→ కంఠప్రదేశము --- **తపోలోకము.**<br>→ నుదురు-లలాట మధ్య ప్రదేశము (భ్రూమధ్య ప్రదేశము) --- **సత్యలోకము.** |

| | |
|---|---|
| **5.** సహస్రారమ్ ఇతీవ అత్ర<br>మంత్ర ఏష ప్రదర్శితః<br>ఏవమ్ ఏతామ్ సమారూఢో<br>హంసయోగ విచక్షణః॥ | → ఆ హంస యొక్క సహస్రారస్థానములో --- **ఓం-ప్రణవ మంత్రము సంప్రదర్శితమౌతోంది.**<br>**హంసయోగము**ను విచారణ చేయువాడు అట్టి హంసయోగమగు "**సోఽహమ్**" ను అధిష్ఠించినవాడు అగుచున్నాడు. |
| **6.** న భిద్యతే కర్మచారైః,<br>పాపకోటి శతైః అపి,<br>ఆగ్నేయీ ప్రథమా మాత్రా<br>వాయవ్య ఏషా తథా పరా॥ | ఆత్మకు (బ్రహ్మమునకు) సంజ్ఞ అయినటువంటి **"సర్వము ఆత్మయే"** అను అర్థమును చెప్పు - "ప్రణవము" ఉపాసించువానిని శతకోటి పాప కర్మలు కూడా ఇక బాధించలేవు.<br>ప్రణవము = జాగ్రత్ - స్వప్న - సుషుప్తులు - తనవే అయినట్టి **స్వస్వరూపము.**<br>ద్రష్ట = దృశ్యముల **ఐక్యరూపము.**<br>అట్టి ప్రణవముయొక్క ఉపాసనకై ...,<br>ప్రథమమాత్ర "అ"-అగ్ని దేవతా స్వరూపము ద్వితీయ మాత్ర "ఉ"-వాయు స్వరూపము |
| **7.** భానుమండల సంకాశా<br>భవేత్ మాత్రా తథా ఉత్తరా<br>పరమా చ అర్ధమాత్రాయా<br>వారుణీం తాం విదుః బుధాః॥ | **'ఓం'**కారముయొక్క ఉత్తర మాత్ర - "మ" కారము - సూర్య మండలమువలె మహా తేజో విరాజమానము.<br>ఈ సర్వమునకు ఆవలిగట్టు అయినటువంటి అర్ధమాత్ర - వరుణదేవతా రూపము. ప్రణవోపాసనను బోధించు బుద్ధిమంతులగు **ప్రణవతత్త్వవిదులు** ఈవిధంగా 'హంస' ను వర్ణనగా పలుకుచున్నారు. |
| **8.** కాలత్రయే అపి యస్య ఇమా<br>మాత్రా నూనం ప్రతిష్ఠితాః<br>ఏష "ఓం" కార ఆఖ్యాతో<br>ధారణాభిః నిబోధత॥ | ఓంకార ప్రణవము సర్వ కాలములందు (భూత-వర్తమాన-భవిష్యత్తులందు) మాత్రలతో (Formation of Different Bits) సహా ప్రతిష్ఠితమై ఉన్నది.<br>అట్టి ఓంకార తత్త్వము - నిబోధము - విశదము అవాలంటే, అద్దాని మాత్రలతో సహా నిరంతరము ధ్యానించుచూ ఉండటము చేతనే సాధ్యము. అందుచేత ముందుగా **'ధారణ'** గురించి చెప్పుకుంటున్నాం. (ధారణ = Constantly holding ) |
| **9.** ఘోషిణీ ప్రథమా మాత్రా<br>విద్యుత్ మాత్రా తథా పరా<br>పతంగినీ తృతీయ అస్యాః<br>చతుర్థీ వాయువేగినీ ॥<br>**10.** పంచమీ నామధేయాతు<br>షష్ఠీ చ 'ఇంద్రి' అభిదీయతే।<br>సప్తమీ వైష్ణవీ నామ<br>అష్టమీ శాంకరీతి చ॥<br>**11.** నవమీ మహతీ నామ<br>ధృతిస్తు దశమీ మతా<br>ఏకాదశీ భవేత్ నారీ<br>బ్రాహ్మీతు ద్వాదశీ పరా॥ | ఓంకారములోని మాత్రలు (విభాగములు)<br>ప్రథమమాత్ర (1) --- **ఘోషిణీ మాత్ర! (శబ్దము)**<br>ద్వితీయమాత్ర (2) --- **విద్యుత్తు మాత్ర! (తేజస్సు)**<br>తృతీయమాత్ర (3) --- **పతంగిని మాత్ర! (నిశ్చల వాయువు)**<br>చతుర్ధమాత్ర (4) --- **వాయువేగిని మాత్ర! (వాయు కదలికలు)**<br>పంచమమాత్ర (5) --- **నామధేయ మాత్ర! (నామ-రూపాత్మకము)**<br>షష్ఠమాత్ర (6) --- **ఇంద్రిణీ మాత్ర! (ఇంద్రియ తత్త్వము)**<br>సప్తమమాత్ర (7) --- **వైష్ణవి మాత్ర! (సర్వత్రా ఉనికి)**<br>అష్టమమాత్ర (8) --- **శాంకరీ మాత్ర! (శుభత్వము)**<br>నవమీమాత్ర (9) --- **మహతీ మాత్ర! (సర్వ దేహములలోని నేనైన నేను)**<br>దశమీమాత్ర (10) --- **ధృతి మాత్ర! (కేవల బుద్ధి)**<br>ఏకాదశీమాత్ర (11) --- **నారీ మాత్ర! (ప్రకృతి)**<br>ద్వాదశీమాత్ర (12) --- **బ్రహ్మీ మాత్ర! (పురుషుడు-బ్రహ్మము-కేవలము)** |

| | |
|---|---|
| **12. ప్రథమాయాంతు మాత్రాయాం<br>యది ప్రాణైః వియుజ్యతే<br>భరతే వర్షరాజా సౌ<br>సార్వభౌమః ప్రజాయతే॥** | ప్రణవోపాసన చేస్తూ ఉండగా ప్రథమ మాత్ర (ఘోషిణి శబ్దతత్త్వము) ఉపాసిస్తూ ప్రాణములు వదలినవాడు - (ప్రాణయోగాభ్యాస సిద్ధిచే) తిరిగి **భరతవర్షములో సార్వభౌముడై** పుట్టుచున్నాడు. |
| **13. ద్వితీయాయాం సముత్ కాంతో<br>భవేత్ యక్షో మహాత్మవాన్।<br>విద్యాధరః తృతీయాయామ్<br>గాంధర్వస్తు చతుర్థికా** | ద్వితీయమాత్ర (విద్యుత్ ప్రకాశము)ను ఉపాసిస్తూ దేహము విడచినవాడు తేజో ప్రకాశమానుడై, యక్షులలో మహాత్ముడై పుట్టుచున్నాడు.<br>తృతీయమాత్ర (పతంగి కదల్చబడుచున్నది)ని ఉపాసిస్తూ దేహము విడిచినవాడు విద్యాధరుడు అయి జన్మిస్తున్నాడు.<br>నాలుగవ మాత్ర (వాయు వేగిని కదల్చుచున్నది)ని ఉపాసిస్తూ ప్రాణము విడచినవాడు గంధర్వుడుగా జన్మిస్తున్నాడు. |
| **14. పంచమ్యామ్ అథ మాత్రాయాం<br>యది ప్రాణైః వియుజ్యతే<br>ఉషితః సహ దేవత్వం<br>సోమలోకే మహీయతే॥** | ఐదవ మాత్ర (నామధేయ నామరూపాత్మకమైనది)ను ఉపాసిస్తూ ప్రాణములు విడచినవాడు దేవత్వమును పొందినవాడై చంద్రలోకములో నివాసము పొందుచూ ప్రకాశమానుడగుచున్నాడు. |
| **15. షష్ఠ్యామ్ ఇంద్రస్య సాయుజ్యమ్<br>సప్తమ్యామ్ వైష్ణవమ్ పదమ్<br>అష్టమ్యాం వ్రజతే రుద్రం<br>పశూనాం చ పతిం తథా॥** | ఆరవ మాత్ర (ఇంద్రియాధినేతోపాసన)తో ప్రాణులు విడచినవాడు ఇంద్ర సాయుజ్యము పొందుచున్నాడు.<br>ఏడవమాత్ర (వైష్ణవి)ను ఉపాసిస్తూ ప్రాణములు విడచినప్పుడు వైష్ణవ పదము (విష్ణుసాయుజ్యము) పొందుచున్నాడు.<br>ఎనిమిదవ మాత్ర (శాంకరి) ని ఉపాసిస్తూ ప్రాణములు విడచినప్పుడు రుద్రలోకము చేరి పశుపతిని పొందుచున్నాడు. |
| **16. నవమ్యాం తు మహర్లోకం<br>దశమ్యాంతు జనం వ్రజేత్<br>ఏకాదశ్యాం తపో లోకమ్<br>ద్వాదశ్యాం బ్రహ్మ శాశ్వతమ్॥** | తొమ్మిదవమాత్ర (మహతి) ఉపాసనలో మరణము పొందినవాడు మహర్లోకము పొందుచున్నాడు.<br>పదవమాత్ర (ధృతి) ఉపాసనలో ప్రాణములు విడుచువాడు జనోలోకము చేరుచున్నాడు.<br>పదకొండవ మాత్ర (నారి) ఉపాసనలో ప్రాణములు విడచువాడు తపోలోకము పొందుచున్నాడు.<br>పంద్రెండవ మాత్ర (బ్రాహ్మి) ఉపాసనలో ఉండగా ప్రాణములు వదులువాడు శాశ్వతమగు బ్రహ్మలోకమును పొందుచున్నాడు. |
| **17. తతః పరతరం శుద్ధమ్<br>వ్యాపకమ్ నిర్మలమ్ శివమ్<br>సతా–ఉదితం పరం బ్రహ్మ<br>జ్యోతిషామ్ ఉదయో యతః॥** | ఇక ఆపై ఆ ఓంకారోపాసకుడు (పూర్ణమును ఉపాసించువాడు) - వ్యాపకము, నిర్మలము, శివము, శాంతము అగు స్థానము పొందుచున్నాడు. ఏదైతే సత్‌కు - జ్యోతిస్వరూపమునకు కూడా ఉదయించు స్థానమైయున్నదో అట్టి **పరబ్రహ్మస్థానము**ను పొందుచున్నాడు. (ప్రణవనాద స్వరూపుడై ప్రకాశించు చున్నాడు). 'ఆత్మను ఎరుగుట'ను దాటి 'ఆత్మయే తాను' అగుచున్నాడు. |
| **18. అతీంద్రియం గుణాతీతమ్<br>మనోలీనం యదా భవేత్<br>అనూపమమ్ శివమ్ శాంతమ్<br>యోగయుక్తః సదా విశేత్॥** | ఓంకార యోగసాధనచే ఈ జీవుడు యోగయుక్తడు అయి - మనస్సును లయింపజేస్తూ, ఇంద్రియములను జయించి, గుణములను దాటివేసినవాడై, ఇకప్పుడు అనూపము (చెదరనిది) శివము, శాంతము అగు **"సదాశివ బ్రహ్మము"**నందు ప్రవేశము పొందుచున్నాడు. |

| | |
|---|---|
| **19. తత్ యుక్తః తన్మయో జంతుః<br>శనైః ముచ్యేత్ కులే జనమ్<br>సంస్థితో యోగధర్మేణ<br>సర్వ సంగ వివర్జితః॥** | అట్టి **యోగయుక్తుడు, ఓంకారార్థ తన్మయుడు** అగు జీవుడు తాను క్రమంగా ముక్తుడగుచున్నాడు. యోగ ధర్మముచే సర్వ సంగములను దాటిపోతాడు. వివర్జితుడౌతాడు. అనగా సర్వమునకు ఈవల తానై, ఆవలి తనను తాను సాక్షిగా చూస్తూ ఆస్వాదిస్తున్నాడు.<br>తాను ముక్తుడవటమే కాకుండా, తన కులములోని జనులకు ముక్తిని ప్రసాదించువాడు కాగలడు. (సతరతి। సతరతి। సలోకామ్ తారయతి). |
| **20. తతో విలీన పాశో అసౌ విమలః కమలా ప్రభుః।<br>తేనైవ బ్రహ్మభావేన 'పరమానందమ్' అశ్నుతే॥** | ఆతడు ఇక సర్వ సంసార పాశములను త్రెంచి వేసుకున్నవాడై నిర్మలుడు, సూర్య ప్రకాశమానుడు అగుచున్నాడు. **బ్రహ్మభావము** చే **పరమానందము**ను పొందినవాడగు చున్నాడు. ఆత్మ భావముచే బ్రహ్మానంద భరితుడై ఉంటున్నాడు. |
| **21. ఆత్మానమ్ సతతమ్ జ్ఞాత్వా<br>కాలం నయ మహామతే।<br>ప్రారబ్ధమ్ అఖిలమ్ భుంజత్<br>న ఉద్వేగమ్ కర్తుమ్ అర్హసి।** | కాబట్టి ఓ సర్వ ప్రియ జీవులారా! బుద్ధిమంతులారా! మహామతులారా! ఆత్మను ఎరుగుటకు ఈ జీవితము ఒక అవకాశము. జీవిత కాలమంతా ఆత్మను తెలుసుకొనే మార్గములోనే మీరు గడపండి. విషయములలో కాదు. ఇక ప్రారబ్ధకర్మల విషయానికి వస్తే,... వాటినన్నిటినీ ఉద్వేగ రహితముగా, జ్ఞానముతో అనుభవిస్తూ ప్రారబ్ధకర్మలు నిర్వర్తించండి! వాటికి ఉద్వేగపడవలసిన అవసరమే లేదు! మహదాశయులు అవండి! |
| **22. ఉత్పన్నే చ ఆత్మవిజ్ఞానే ప్రారబ్ధమ్ నైవ ముంచతి<br>తత్త్వజ్ఞాన-ఉదయాత్ ఊర్ధ్వం పారబ్ధమ్ నైవ విద్యతే।** | ఒకనిలో ఓంకార తత్త్వోపాసనచే ఆత్మ జ్ఞానము జనించుటచే ఇక ఆతడు ముక్తుడే! అయితే, ఆత్మ జ్ఞానము పొందినా కూడా ప్రారబ్దకర్మ వదలదు. కానీ..., |
| **23. దేహాదీనామ్ అసత్వాత్తు<br>యథా స్వప్నే విబోధతః<br>కర్మ జన్మాంతరీయం యత్<br>ప్రారబ్ధమ్ ఇతి కీర్తితమ్॥** | తత్త్వజ్ఞానము (త్వమ్-తత్ అసి-నీవుగా కనిపించునది తత్ పరబ్రహ్మమే (లేక) నేనే... అను) జ్ఞానోదయముచే ఇక "**పారబ్ధకర్మ అనేది మొదలే లేదు**"... అని సుస్పష్టము కాగలదు.<br>ఒకడు నిద్రపోయి కలకంటూ ఉండగా ఆతని దృష్టికి భౌతిక దేహము, భౌతిక దృశ్యము అసత్తు - లేనిదిగా అయిపోతుంది కదా! అట్లాగే, ఆత్మతత్త్వ జ్ఞానికి జన్మజన్మాంతర సంబంధమైనటువంటి సంచిత-ప్రారబ్ద-ఆగామి కర్మ వ్యవహారములు స్వతఃగా లేనేలేవు - అను దృష్టి కలుగుచున్నది. |
| **24. తత్ తు జన్మాంతరా భావాత్<br>పుంసో నైవ అస్తి కర్హిచిత్<br>స్వప్నదేహో యథా అధ్యస్తః<br>తథైవా అయం హి దేహకః॥** | అట్టి ఆత్మ తత్త్వము ఎరిగిన బ్రహ్మజ్ఞాని దృష్టిలో (ఆత్మ దృష్ట్యా) వర్తమాన జన్మయే లేదు, రాబోయే జన్మలు అసలే లేవు. ఆతడు జన్మలకు వేరైన స్వస్వరూపాత్మను ఆస్వాదిస్తూ ఉంటాడు. "జ్మలకు మునుముందే ఉన్నట్టివాడను నేను" - అను సమన్వము కలిగి ఉంటాడు.<br>ఒకడు నిదురలేచిన తరువాత - "రాత్రి నాకు కలలో కనిపించినవన్నీ వాస్తవానికి ఏమాత్రమూ లేనివే!" ... అని ఎరిగి, వర్తమాన జాగ్రత్‌లో మామూలుగా వ్యవహరిస్తున్నాడు. అంతేగాని, "రాత్రి కలలోని నా దేహము మరణించింది. జాగ్రత్‌లో పుట్టాను" అంటున్నాడా? అట్లాగే, ఆత్మ జ్ఞాని "జాగ్రత్‌లో కనిపించేదంతా స్వప్నము వంటిదేకదా!" ... అని గ్రహించి ఆత్మనే అంతటా దర్శిస్తూ ఆత్మయందే రమిస్తున్నాడు. |
| **25. అధ్యస్తస్య కుతో జన్మ?<br>జన్మ అభావే కుతః స్థితిః?<br>ఉపాదానం ప్రపంచస్య<br>మృత్-భాండస్యా ఇవ పశ్యతి॥** | **"జన్మలకంటే ముందే జన్మించువాడినైన నేను ఉన్నాను. నేను ఉన్నాను కాబట్టే జన్మలు. జన్మలు నాయందు ఉండవచ్చు గాక! నేను జన్మలలో ఉండటమేమిటి?"** ... అని గ్రహించి, గమనించువాని దృష్టిలో ఇక జన్మలెక్కడుంటాయి? జన్మలే లేనివానికి లోకములలోగాని, జాగ్రత్-స్వప్న-సుషుప్తులలో గాని 'స్థితి' (Placement) అనునదే ముంటుంది? మట్టికుండలో... మట్టి వేరుగా, కుండ వేరుగా రెండు విషయాలున్నాయా? లేవు. మట్టియే ఆకారము దృష్ట్యా "కుండ" అంటున్నాము. అట్లాగే **"పరబ్రహ్మమగు నేనే జగత్తుగా కనిపిస్తున్నాను. జగత్తు బ్రహ్మమునకు వేరు కాదు"** - అని ఆత్మజ్ఞాని చూస్తున్నాడు. నిశ్చలుడై గమనిస్తున్నాడు. |

| | |
|---|---|
| **26.** **అజ్ఞానం చ ఇతి వేదాంతైః**<br>**తస్మిన్ నష్టే క్వ విశ్వతా?**<br>**యథా రజ్జుం పరిత్యజ్య**<br>**సర్పం గృహ్ణాతి వై భ్రమాత్॥** | **వేదాంత జ్ఞానము**చే అజ్ఞానము తొలగిన తరువాత, ఇక ఆత్మకు వేరుగా విశ్వము (దృశ్యము) ఎక్కడ ఉన్నది? త్రాడును త్రాడుగా మరచి పాముగా భ్రమిస్తే అప్పుడు అక్కడ పాము "ఉన్నదిగా" అగుచున్నదా? లేదే! అట్లాగే సర్వదా ఆత్మయే అయి ఉండగా ఇక విశ్వము అనునది ఎప్పుడున్నది? ఎప్పుడూ లేదు. ఎక్కడా లేదు! (స్వప్నంలో కనిపించిన దృశ్యము ఎక్కడైనా ఉన్నదా?) |
| **27.** **తద్వత్ సత్యమ్ అవిజ్ఞాయ**<br>**జగత్ పశ్యతి మూఢధీః**<br>**రజ్జుఖండే పరిజ్ఞాతే**<br>**సర్పరూపం న తిష్ఠతి॥** | ఒకడు మూఢ బుద్ధి కలిగి ఉన్నవాడై ఎంతవరకైతే, "సత్యము ఏమిటి?" ... అని పరిశీలించి తెలుసుకోడో, అర్థము చేసుకోడో... అంతవరకు "జగత్" అనబడునది ఎదురుగా ఉన్నట్లు అగుపడుచూ ఉంటుంది. ఒకడు సర్ప రజ్జు భ్రాంతిచే త్రాడును చూచి "అరెరె! ఇక్కడ త్రాచు పాము ఉన్నదే!" - అని ఎంతవరకు భయపడుతూ ఉంటాడు? పరిశీలించనంతవరకు. పరిశీలించి, "**ఇక్కడ ఉన్నది త్రాడు మాత్రమే! పాము అనునది నా భ్రమ. పాము మొదట్లోనూ లేదు, మధ్యలోనూ లేదు. ఇప్పుడూ లేదు!**" ... అని గమనించి శాంతము పొందుతాడు కదా! |
| **28.** **అధిష్ఠానే తథా జ్ఞాతే**<br>**ప్రపంచే శూన్యతాం గతే**<br>**దేహస్య అపి ప్రపంచత్వాత్**<br>**పారబ్ధ అవస్థితిః కుతః?** | ఈ విశ్వము (లేక) జగత్ విషయము కూడా అంతే!<br>ఈ కనబడే విశ్వము ఎందులో ఉన్నది? ఆత్మ నందు. మట్టిలో కుండ ఉన్నట్లు ఈ జగత్తు ఏ ఆత్మలో ఉన్నదో, అట్టి అధిష్ఠానమగు ఆత్మ గురించి తెలుసుకున్న తరువాత (మట్టిని తెలుసుకున్న తరువాత మట్టికుండలోని మట్టికి వేరైన కుండవలె) ఈ ప్రపంచము లేదు .... అని తెలియవచ్చి, ఇది "**శూన్యమే**" అగుచున్నది. మరి ఈ భౌతిక దేహము సంగతేమిటి? ఇది కూడా ప్రపంచములోని ఒక భౌతిక వస్తువే కాబట్టి ఇది **"లేనిదే (శూన్యమే)"** అగుచున్నది. దేహమే లేనప్పుడు ఇక ప్రారబ్ధ కర్మలు అనబడునవి ఎక్కడుంటాయి? |
| **29.** **అజ్ఞాన జన బోదార్థమ్**<br>**'<u>పారబ్ధమ్</u>' ఇతి చ ఉచ్యతే।**<br>**తతః కాలవశాత్ ఏవ**<br>**ప్రారబ్ధే చ క్షయం గతే॥** | మరి ప్రారబ్ధము అనుభవించక తప్పదని ఇందాక ఒకసారి అనుకున్నాం కదా! దాని మాట ఏమిటి? అదా? శాస్త్రములు అజ్ఞానికి బోధించటానికి, "నీవు కర్మలకు బద్ధుడవు కావయ్యా!" ... అని చెప్పటానికి మునుముందుగా, "నీ దుఃఖములకు కారణము ప్రారబ్ధము" ... అని కల్పించి చెప్పుచున్నాయి. "కాలవశంగా ప్రారబ్ధము తొలగుతుంది. అనుభవిస్తే అదేపోతుంది" .... అని బోధిస్తున్నాయి. ఆతడు విజ్ఞాని అగుచుండగా - ఆత్మగురించి ఎరుగుచుండగా, **"కర్మలే లేవు. ఇక ప్రారబ్ధమెక్కడిది?"** - అని బోధించబడుతోంది. |
| **30.** **బ్రహ్మ ప్రణవ సంధాన**<br>**నాదో, జ్యోతిర్మయ శివః**<br>**స్వయమ్ ఆవిర్భవేత్ ఆత్మా**<br>**మేఘాపాయే అంశుమాన్ ఇవ॥** | ఆకాశంలో దట్టంగా మబ్బులు క్రమ్ముకున్నాయి. సూర్యుడు కనిపించటం లేదు.అనగా, మబ్బులు సూర్యుడిని మ్రింగివేశాయని, ఆకాశంలో సూర్యుడు లేకుండా పోయారని ఎవ్వరైనా అంటారా? లేదు. ఎందుచేత? గాలి వీచికలచే మబ్బులు తొలగగానే మరల సూర్యుడు కనిపిస్తున్నాడు కదా!<br>అట్లాగే...,<br>"ఓం" అను ప్రణవము యొక్క అనుసంధానముచే - "జగత్తు ఉన్నది. ఆత్మజ్యోతి స్వరూపుడనగు నా శివస్వరూపమును జగత్ భావాలు మ్రింగాయి ......" అనే భ్రమ కూడా తొలగుతుంది. "**ప్రపంచ భావములు**" అనే మేఘములు - ఓంకారనాద వీచికలచే తొలగిపోవుచుండగా ఆత్మజ్యోతి స్వరూపుడగు శివుడు సహజముగా, స్వయముగా అనుభవము కాగలడు. అనగా తానే శివ స్వరూపుడై ప్రకాశిస్తున్నాడు. ఈ జీవుడే 'సదాశివుడు' అగుచున్నాడు. |

**31.** **సిద్ధాసన స్థితో యోగీ**
**ముద్రాం సంధాయ వైష్ణవీమ్।**
**శృణుయాత్ దక్షిణే కర్ణే**
**"నాదమ్ అంతర్గతం" సదా॥**

కాబట్టి ఇప్పుడు తొలగలవసినది ఏమిటి? జగత్ భ్రమ. అది తొలగితే ఆత్మ శివభగవానుడు స్వయముగా ప్రకాశించుచున్నారు. అందుకు మార్గము? యోగోపాసన. కనుక యోగి

- సిద్ధాసనమును స్వీకరించుచూ,
- వైష్ణవీ ముద్రను అణుసంధానము చేస్తూ,
- బాహ్య విషయాలు బాహ్యముననే వదలివేస్తూ...,
- **అంతర్గతమగు ఓంకార బిందునాదమును** కుడి చెవితో ఎల్లప్పుడూ వినుచుండుటను **అభ్యసించాలి.**

---

**32.** **అభ్యస్యమానో నాదో అయమ్**
**బాహ్యమ్ ఆవృణుతే ధ్వనిమ్।**
**పక్షాత్ విపక్షమ్ అఖిలమ్**
**జిత్వా 'తుర్యపదమ్' వ్రజేత్।**

ఈవిధంగా అంతర్గతంగా కుడి చెవికి అంతరంగమునుండి వినబడుచున్న **"ఓం"** ... నాదమును వినుచుండగా,... ఇక బాహ్య వస్తు-విషయ-నామ-రూప ధ్వనులు, ధ్యాసలు వాటికవే ఉపశమిస్తూ వస్తాయి. అట్టివాడు ఏకపక్షము (Inner side) నుండి ద్విపక్షము (Outer-world) ను జయించి, **తురీయపదమును** (జాగ్రత్ - స్వప్న-సుషుప్తులు తనవి. తాను వాటిలో పరిమితుడు కాడు... అను స్థానమును).... చేరుచున్నాడు.

---

**33.** **శ్రూయతే ప్రథమ అభ్యాసే**
**నాదో, నానావిధో మహాన్**
**వర్ధమానః తథా అభ్యాసే**
**శ్రూయతే సూక్ష్మ-సూక్ష్మతః॥**

అటువంటి **ఓంకార అతరంగనాదము కుడిచెవితో వినటము** ... అనే యోగ సాధనలో, మొట్టమొదటగా అనేక విధములైన మహత్ నాదములు అంతర్గతముగా వినబడుతూ ఉంటాయి. క్రమంగా అభ్యాసము చేస్తూ ఉండగా, ఆ అనేక నాదములన్నీ ప్రక్కకు తొలగి, ఇక ఆ యోగికి సూక్ష్మాతి సూక్ష్మమైనట్టి (బుద్ధితో మాత్రమే గ్రహించగలుగు) "సూక్ష్మనాదము" విబడుతుంది. నిర్విషయాత్మ బుద్ధికి సూక్ష్మమగు స్వస్వరూపమును తెలియవస్తుంది.

---

**34.** **ఆదౌ జలధి జీమూత**
**భేరీ నిర్ఝర సంభవః**
**మధ్యే మర్దళ శబ్దాభో**
**ఘంటా కాహళజః తథా॥**

ప్రణవనాదోపాసనలో మొట్టమొదట - ప్రారంభంలో **సముద్ర తరంగముల ఘోష, మబ్బుల మోత, భేరీ నినాదము వంటివి....** (లో నుండి) వినబడుతాయి. **"నాదము వినుట"** అను సాధనలోని మధ్య దశలో

- మద్దెల శబ్దము
- గుడిగంట నాదము
- కాహళ (కామ్-కామ్) శబ్దములు

.... కొంత నెమ్మదిగా ఆ యోగికి వినబడుతూ ఉంటాయి.

---

**35.** **అంతేతు కింకిణీవంశ**
**వీణా భ్రమర నిస్వనః**
**ఇతి నానావిధా నాదాః**
**శ్రూయంతే సూక్ష్మ-సూక్ష్మతః॥**

అంతర్గత ప్రణవనాదోపాసన యొక్క చివరి చివరి దశలలో

- చిరుమువ్వల కింకిణీ శబ్దము,
- వేణుగానము,
- భ్రమరము (తుమ్మెద) ఝుంకార శబ్దము

ఈవిధంగా ఆయా నానావిధములైన శబ్దములు సూక్ష్మ-సూక్ష్మంగా వినిపిస్తూ వస్తాయి.

---

**36.** **మహతి శ్రూయమాణేతు**
**మహాభేర్యాధిక ధ్వనౌ।**
**తత్ర సూక్ష్మం సూక్ష్మతరం**
**నాదమేవ పరామృశేత్॥**

"అంతర్గత ప్రణవ నాదోపాసన" అను యోగాభ్యాసికి ఎక్కువగా శ్రవణం చేస్తూ ఉన్న సందర్భాలలో 'మహాభేరీ నాదము' వినబడుతూ ఉంటుంది. అటువంటప్పుడు ఆ యోగసాధకుడు పెద్ద శబ్దమును ప్రక్కకుపెట్టి సూక్ష్మమైన నాదములపై బుద్ధిని ఏకాగ్రత చేస్తూ, వింటూ ఉండాలి. "మ్"... అను సౌమ్యనాదమును గమనిస్తూ ఉండటానికి అధికాధికముగా బుద్ధిని సూక్ష్మతరం చేస్తూ ఉండాలి.

**37. ఘనమ్ ఉత్సృజ్య వా సూక్ష్మే**
**సూక్ష్మమ్ ఉత్సృజ్యవా ఘనే**
**రమమాణమ్ అపి క్షిప్రమ్**
**మనో న అన్యత్ర చాలయేత్॥**

ఇంకొక ఉపాయము.

బుద్ధియొక్క మధురమైన ఏకాగ్రత చేత...,

- సూక్ష్మనాదమును వినుచున్నప్పుడు ఘననాదమును విడచిపెట్టుచూ ఉండాలి.
- ఘననాదమును వినుచున్నప్పుడేమో సూక్ష్మనాదమును విడచి (వినక) ఉండాలి.

ఈవిధముగా త్యాగ-ఆశ్రయ పూర్వకంగా వినుచూ ఉన్నప్పుడు **మనస్సు** తదితరమైన విషయములవైపుగా వెళ్ళకుండా.... అది అంతర్ - శబ్దమునే వింటూ ఆనందించునట్లుగా నియమితమౌతూ వస్తుంది.

---

**38. యత్ర కుత్రాపి వా నాదే లగతి ప్రథమం మనః,**
**తత్ర తత్ర స్థిరీభూత్వా తేన సార్ధం విలీయతే॥**

ఈ మనస్సుకు ఒక ముఖ్య 'ధర్మము' ఉన్నది. ఇది మొట్టమొదటగా - ఏకాగ్రంగా ఏనాదము (లేక శబ్దము) వింటే, అది పోయి అక్కడే ఏర్పాటును పొంది, ఆ అర్థములోనే విలీనమైపోతూ ఉంటుంది. అది మనస్సు యొక్క స్వభావము మరి!

---

**39. విస్మృత్య సకలమ్ బాహ్యమ్**
**నాదే దుగ్ధ-అంబువత్ మనః**
**ఏకీభూయ అథ సహసా**
**చిదాకాశే విలీయతే॥**

అందుచేత (బాలుని లాలించినట్లుగా) మనస్సును లాలిస్తూ, సకల బాహ్య విషయములను, వృత్తులను విస్మరించే రీతిగా నయాన నియమించాలి. అంతరంగము నుండి వినబడు ప్రణవనాదముపైనే మనస్సుకు ఇష్టమగునట్లుగా లాలిస్తూ తీర్చి దిద్దాలి. అప్పుడు మనస్సు క్రమంగా అంతరంగ ప్రణవనాదముతో విలీనమై, పాలు-నీరు వలె (దుగ్ధ-అంబువత్) ప్రణవముతో కలిసిపోయి, ఏకీభూతమగుచున్నది. చివరికి మనస్సు "చిదాకాశము"లో విలీనము కాగలదు.

---

**40. ఉదాసీనః స్థితో భూత్వా**
**సదాభ్యాసేన సంయమీ**
**ఉన్మనీకారకం సద్యో**
**నాదమేవ అవధారయేత్॥**

ఈ మనస్సు - దృశ్య సంబంధమైన సంఘటనలు, సంబంధములు, బాంధవ్యములు, అవసరమేలేని వ్యవహారములు, పరుల తప్పులు, దూషణ - ఇటువంటి అనేక విషయాలపై వ్రాలి వాటితో మమేకమౌతోంది. అందుకని

- సంయమి అగు యోగి మనస్సుకు సదాభ్యాసముల సహాయంతో దృశ్య విషయాలపై ఉదాసీనంగా ఉండటం.
- అటువంటి మనస్సును ఉన్మనీకారకమైన (యోగ భావ పూర్వకమైన) "అంతరంగము నుండి నాదము వినుట" ...

అనే అభ్యాసములను అవధారణ చేయించాలి. (మనస్సును సాక్షిగా దర్శించు మనో విభాగము **'ఉన్మని'**)

---

**41. సర్వచింతాం సముత్సృజ్య**
**సర్వచేష్టా వివర్జితః**
**నాదమేవ అనుసంధధ్యాత్**
**నాదే చిత్తం విలీయతే॥**

ఎప్పుడైతే ఈ చిత్తము

- సర్వ ప్రాపంచక చింతనలను వదలిపెట్టుచూ...,
- సర్వ దృశ్య - లోక సంబంధమైన చేష్టలను విడనాడుచూ...,

అంతరంగము నుండి వినబడు ప్రణవనాదముపై అనుసంధానము అగుచున్నదో, అప్పుడు ఆ నాదమునందే ఆచిత్తము విలీనమగుచూ, క్రమంగా లయము పొందు చున్నది. ఇక దృశ్య జగత్తును ప్రణవనాద స్వరూపంగా సందర్శించటం ప్రారంభిస్తుంది.

---

**42. మకరందం పిబన్ భృంగో**
**గంధాన్ న అపేక్షతే యథా,**
**నాదాసక్తం సదా చిత్తం**
**విషయం నహి కాంక్షతే॥**

అత్యంత మధుర రసముతో కూడిన పూలపై వ్రాలుచున్న తుమ్మెద, ఆ పుష్పములలోని మకరందమును గ్రోలుటయందే నిమగ్నమౌతుంది. ఇక ఇతర దుష్ట వాసనలు గల పూల గురించి, ఆలోచిస్తుందా? వాటిని పట్టించుకుంటుందా? లేదు.

అట్లాగే...

అంతరంగ ప్రణవనాదమునందు ఆసక్తితో లగ్నమైయున్న చిత్తము బాహ్య లౌకిక-ఇంద్రియ విషయములను కాక్షించనే కాంక్షించదు. వాటన్నిటికీ ఏమాత్రము ప్రాముఖ్యత ఇవ్వదు.

| | |
|---|---|
| **43. బద్ధః సునాద గంధేన<br>సద్యః సంత్యక్త చాపలః<br>నాదగ్రహణ తత్ చిత్తమ్<br>అంతరంగం భుజంగమమ్॥** | పాము నాగస్వరము వింటూ ఆ శబ్దానందముతో తన్మయమై ఇతర శబ్దములేవీ వినదు. "ఎవరిని కుట్టాలి?" ... అని ఆలోచించదు కదా! అట్లాగే,... అంతరంగము నుండి వినబడు ప్రణవ సునాదమును వినుచున్న చిత్తము, ఆ నాదమునకు బద్ధమై, తన యొక్క ఇతఃపూర్వపు చపలత్వము, చంచలత్వము విడచి పెట్టుచున్నది. ప్రణవనాదమునే ఆస్వాదిస్తూ ఉంటోంది. (అంతర్ హృదయమునుండి వినబడు ఘన-సూక్ష్మ శబ్దములపైనే చిత్తము వ్రాలుతూ ఉంటుంది). |
| **44. విస్మృత్య విశ్వమ్ ఏకాగ్రమ్<br>కుత్ర చిత్ నహి ధావతి<br>మనో-ఉన్మత్త గజేంద్రస్య<br>విషయ-ఉద్యానచారిణః॥** | పిచ్చి పట్టిన ఏనుగు అందమైన ఉద్యానవనంలో చపలంగా, పిచ్చిగా అటూ ఇటూ తిరుగుతూ ఉంటే ఎట్లా ఉంటుంది? అట్లాగే ఈ మనస్సు అనే పిచ్చిపట్టిన ఏనుగు విషయములపై, విషయ సుఖములపై వ్రాలటం అలవాటు చేసుకొని, ధ్యానములో విశ్వమును ఏమరచి కూడా,... ఇంతలోనే ఎక్కడెక్కడో సంచారాలు చేస్తోంది. విషయముల ఉద్యానవనంలో సంచరిస్తోంది. ఆ ధ్యానికి పట్టు దొరకడం లేదు. |
| **45. నియామన సమర్థోఽయమ్<br>నినాదో నిశిత అంకుశః<br>నాదో అంతరంగ సారంగ<br>బంధనే వాగురాయతే॥** | ఏనుగును అంకుశముతో ఎట్లా నియమించాలో తెలిసిన మావటివానిచేతిలోని అంకుశము వంటిది - యోగికి **ప్రణవనాదము**. జగదరణ్యంలో జన్మ-కర్మలు అనే ప్రదేశములో సంచరించే మనస్సు అనే సారంగము (లేడి)ని పట్టుకొనే గొప్పవల వంటిది.... అంతరాంతర 'ఓం' కారనాదోపాసన! |
| **46. అంతరంగ సముద్రస్య<br>రోధే వేలాయతేఽపి చ<br>బ్రహ్మ ప్రణవ సంలగ్న<br>నాదో జ్యోతిర్మయాత్మకః॥** | అంతరంగము అనే సముద్రమునకు - అదుపుచేసే చెలియ కట్ట వంటిది - ప్రణవనాదము.<br>బ్రహ్మ ప్రణవము - జ్యోతిర్మయము అగు ప్రణవనాదము గురించి "వినుట" అను అభ్యాసము సహాయముతో చిత్తమును దృశ్యము నుండి విరామముపొంది, ఆత్మయందు సంలగ్నము కాగలదు. |
| **47. మనః తత్ర లయం యాతి<br>తత్ విష్ణోః పరమం పదమ్<br>తావత్ ఆకాశ సంకల్పో<br>యావత్ శబ్దః ప్రవర్తతే॥** | ఎంత వరకు శబ్దము ప్రవర్తిస్తూ ఉంటుందో..., అంతవరకు సంకల్పాకాశము (Thought Zone) పని చేస్తూనే ఉంటుంది. ఎప్పుడైతే మనస్సు (జలంలో ప్రవేశించిన ఉప్పు బొమ్మ - ఆకారమువలె) లయిస్తుందో,... ఆ లయించు స్థానమే పరమపదమగు విష్ణు స్థానము. సర్వోత్కృష్ట స్థానము. |
| **48. నిశ్శబ్దం తత్పరం బ్రహ్మ<br>పరమాత్మా సమీయతే<br>నాదో యావత్ మనః తావత్<br>నాదాంతే తు మనో-ఉన్మనీ॥** | మనస్సు నిశ్శబ్దత సంతరించుకుంటుంది.<br>నిర్విషయ రూపము, నిశ్శబ్ద తత్పరము అగు పరబ్రహ్మమే-జీవునికి ఉనికి స్థానము-మనస్సు-ఆ మనస్సుకు ఉత్పత్తి స్థానము అగు పరమాత్మ ఏకత్వము పొందుచున్నాయి.<br>నాదము ఉన్నంత వరకు మనస్సు ఉనికి కలిగి ఉంటుంది.<br>నాదము యొక్క సశాంతించు స్థానములో మనస్సు లయించు "మనో-ఉన్మనీ" అను మనోరహిత స్వానుభవము (ఆత్మానుభవము) శేషిస్తుంది. అప్పుడు జీవుడు **'పరబ్రహ్మము తానే'**గా ఎరుగుచున్నాడు. |
| **49. స శబ్దశ్చ అక్షరే లీనో<br>నిశ్శబ్దం పరమమ్ పదమ్<br>సదా నాద - అనుసంధానాత్<br>సంక్షీణా వాసనాతు యా॥** | 'ఓం' శబ్దము అక్షరమునందు లీనమగుచున్నది. నిశ్శబ్దము శేషిస్తోంది.<br>వాస్తవానికి శబ్దము లయము కాగా, శమించగా శేషించే నిశ్శబ్దమే పరమపదము.<br>మరి, అట్టి నిశ్శబ్ద రూప పరమపదమును పొందే విధమేది? ఎల్లప్పుడు నాదము (ఓంకారము)ను వింటూ అనుసంధానము చేస్తూ ఉండగా, వాసనలు సంక్షయించి, **నిశ్శబ్ద పరమపద సుఖము** - స్వభావసిద్ధంగా అనుభవమవుతోంది. |
| **50. నిరంజనే విలీయేతే<br>మనో వాయూ న సంశయః<br>నాదకోటి సహస్రాణి<br>బిందుకోటి శతాని చ॥** | ఎప్పుడు మనస్సు అనే వాయువు నిర్మలము - నిరంజనము అగు బ్రహ్మములో లీనమౌతుందో,... అప్పుడు ఇక వేల కోట్ల నాదములు, వందల కోట్ల బిందువులు కూడా ఆ మనస్సుతో బాటే, ఆ బ్రహ్మము (లేక) పరమపదమునందు లీనమగుచున్నాయి. ఇక ఈ జగత్తులో వినబడే శబ్దముల గురించి చెప్పేదేమున్నది? |

| | |
|---|---|
| **51.** **సర్వే తత్ర లయం యాంతి**<br>**బ్రహ్మ ప్రణవనాదకే**<br>**సర్వావస్థా వినిర్ముక్త,**<br>**సర్వచింతా వివర్జితః॥** | "అనేకముగా కనిపిస్తూ కూడా వాస్తవానికి ఒక్కటే" ... అని అనిపించుట ద్వారా సర్వ బేధములు బ్రహ్మ ప్రణవనాదము నందు - ప్రణవనాదోపాసకుని దృష్టిలో-లయమును పొందుచున్నాయి. ఇక ఆయోగి సర్వ అవస్థల నుండి విముక్తుడగుచున్నాడు. సర్వ చింతలను వదలి వేయుచున్నవాడగుచున్నాడు. |
| **52.** **మృతవత్ తిష్ఠతే యోగీ**<br>**స ముక్తో న అత్ర సంశయః**<br>**శంఖదుందుభి నాదం చ**<br>**న శృణోతి కదాచన॥** | అంతరంగ హృదయము నుండి వినబడు ప్రణవనాదమును అభ్యాసము చేయు యోగి ... క్రమంగా సర్వ లోక సంబంధములైన విషయాలను - **ఇవి నాకు చెందినవి కావు. నేను వీటికి చెందియుండ లేదు ... నేను ఆత్మ స్వరూపుడను కదా! ఇదంతా ఆత్మయొక్క వినోద కల్పన ....** అను దృష్టితో చూస్తాడు. ఏవిధంగా ఒక మరణించిన వాడు ఏలోక బంధములూ లేనివాడగుచున్నాడో,... ఆవిధంగా యోగి (మరణించిన వానివలె) **దేనికీ సంబంధము లేకయే ఉంటాడు. అన్నీ నిర్వర్తిస్తూ ఏమీ చేయనివాడై ఉంటున్నాడు.** ఎప్పుడు అట్టి దృష్టిని దృశ్యము పట్ల ఒకానొకడు సంపాదించుకుంటున్నాడో, ఆతడు అప్పుడు ముక్తుడే! ఇక ఆతని అంతర్హృదయ నాదోపాసనలో ప్రారంభంలో వినబడిన శంఖ-దుందుభి నాదాలు కూడా వినబడవు. **కేవల-ఆత్మానందుడై ఉంటాడు.** |
| **53.** **కాష్టవత్ జ్ఞాయతే దేహమ్**<br>**ఉన్మని-అవస్థయా ధ్రువమ్**<br>**స జానాతి న శీతోష్ణం**<br>**న దుఃఖం న సుఖం తథా॥** | అట్టి యోగి-ఈ దేహము ఒక కట్టెవలె, బాహ్య జడవస్తువు వలె-అగుపించు యోగ స్థితిని-పొందుతున్నాడు. సీత-ఉష్ణములను, సుఖ-దుఃఖములను సమదృష్టితో చూడగలుగు అట్టి యోగి ధృవము అగు **"ఉన్మనీఅవస్థ"** అను యోగ, పరాకాష్ఠ పొందిన వాడగుచున్నాడు. (ఉన్మనీ = మనస్సును దాటివేసిన స్థితి, స్థానము) |
| **54.** **న మానం న అవమానంచ**<br>**సంత్యక్త్వా అథ సమాధినా**<br>**అవస్థాత్రయమ్ అన్వేతి**<br>**స చిత్తం యోగినః సదా!** | ఆ మనస్సును ఆత్మయందు (లేక) ఆత్మ భావనయందు (లేక) "సర్వము నా ఆత్మయొక్క వినోద ప్రదర్శనమే" .... అను బుద్ధి స్థితియందు లయము చేసిన యోగికి (మనస్సును దాటి వేసిన యోగికి) ....,<br>- ఇక మానము ఉండదు. - అవమానము ఉండదు.<br>సమాధి స్థితిని పొందిన ఆతడు చిత్తమును చిత్‌నందు లయింపజేస్తూ జాగ్రత్ - స్వప్న సుషుప్తులకు కేవల-సాక్షిత్వముచే అధిగమించి సమాధి రూపమగు "**తురీయావస్థ**" అనబడు "**అహమ్‌బ్రహ్మ**" స్థానము పొందుచున్నాడు. తానే ఈ సర్వమై ఆస్వాదిస్తున్నాడు. |
| **55.** **జాగ్రత్ నిద్రా వినిర్ముక్తః**<br>**స్వరూపావస్థతామి యాత్॥** | ఆతడు జాగ్రత్ - స్వప్న - సుషుప్తుల నుండి విడివడినవాడై - "**ఈ మూడు అవస్థలకు వేరైనట్టి కేవలాత్మ స్వరూపుడిని కదా!**" - అను స్వస్వరూపావస్థ (తురీయావస్థ - బ్రాహ్మీ స్థితి) యందు ప్రవేశించుచున్నాడు. సర్వము తానై, సర్వులు తన ఆత్మ స్వరూపులే అయి ఆస్వాదిస్తున్నాడు. స్వస్వరూపావస్థ పొందినవాడగుచున్నాడు. |
| **56.** **దృష్టిః స్థిరా యస్య**<br>**వినా స దృశ్యమ్।**<br>**వాయుః స్థిరో యస్య**<br>**వినా ప్రయత్నమ్,**<br>**చిత్తం స్థిరం యస్య**<br>**వినా అవలంబమ్**<br>**స బ్రహ్మతారాం (పాం) తర**<br>**నాదరూపమ్।**<br>**ఇత్యుపనిషత్**<br>**నాదబిందూపనిషత్**<br>**ఓం తత్ సత్** | అట్టి కేవల స్వస్వరూపావస్థ ... స్థితిలో - "**బ్రహ్మ తారాంతరనాద**" రూపుడగుచున్నాడు. **ఓం** కారస్వరూపుడగుచున్నాడు.<br>ఎప్పుడైతే ...,<br>- ఎదురుగా ఈ దృశ్యము కనిపిస్తున్నప్పటికీ ఇదంతా ఆత్మస్వరూపమై దృశ్యమనునదే ఆతనిపట్ల వేరుగా లేనిదై ఉంటుందో,<br>- ఏ ప్రయత్నము లేకుండానే అతనియందు ప్రాణతత్త్వము స్థిరత్వమును (స్వభావసిద్ధంగానే) సంతరించుకుంటుందో...,<br>- ఏ సాధన వస్తువు - అంతర హృదయ ప్రణవనాదశృతము మొదలైనవేవీ లేకుండా కూడా ఆతని చిత్తము ఆత్మభావనయందు సుస్థిరము-నిశ్చలము స్వభావ సిద్ధముగా అగుచున్నదో...<br>అట్టి బ్రహ్మ తారాంతర స్థితికి (లేక) బ్రహ్మ పారాంతర స్థానమునకు ఆ యోగి చేరుచున్నాడు. ఓంకార ప్రణవనాదము వినటమును దాటి, ప్రణవనాదమే తానై ప్రకాశించుచున్నాడు.<br>***ఇతి నాదబిందూపనిషత్***<br>***ఓం శాంతిః శాంతిః శాంతిః*** |

ఋగ్వేదాంతర్గత

# 6 నాదబిందూపనిషత్

## అధ్యయన పుష్పము



హంస హంసోఽహమ్ సోఽహమ్ సోఽహమ్‌ల ప్రతీక 

**ఓం**

సర్వే సర్వత్రా - అంతటా విరాజమానమైయున్న ఏ పరమాత్మయొక్క ఉపాసన వలన జనించే జ్ఞానాగ్నిచే సంచిత - ఆగామి - ప్రారబ్ధ కర్మత్రయము మొదలంట్లా నశించినదై... ఆత్మపదము స్వానుభవమగుచున్నదో.....

అట్టి **పరమాత్మ పరంధామ తత్త్వమును** భజించుచున్నాము.

హృదయము యొక్క అంతరాంతరము నుండి "ఉమ్-మమ్- (ఉమ్-ఉమ)" అని వినబడు నాదము - **ప్రణవనాదము.**

'ఓం'... ప్రణవాక్షరము యొక్క **సంజ్ఞ.**

'హంస'... ప్రణవనాదమునకు సూచన రూపము. 'సోఽహమ్' అర్థ ప్రతిపాదితము.

అక్షర పరబ్రహ్మమునకు సంజ్ఞయగు ప్రణవాక్షర 'ఓం' కార - 'హంస' .....ను అభివర్ణించుకొనుచున్నాము.

అట్టి హంసకు

| | | |
|---|---|---|
| 'అ' కారము | ... | కుడి రెక్క |
| 'ఉ' కారము | ... | ఎడమ రెక్క |
| 'మ' కారము | ... | తోక |
| 'అర్ధమాత్ర' | ... | ముఖము / మస్తకము |
| త్రిగుణములు | ... | (ఆ హంస యొక్క) పాదములు |
| "తత్త్వమ్, తత్ త్వమ్ అసి" అను యజుర్వేద మహా వాక్యము-అనగా 'నీవు'గా కనిపించుచున్నది పరబ్రహ్మమే ! .... అను సందర్శనము. | ... | ఆ హంసయొక్క శరీరము |
| కుడికన్ను | ... | ధర్మము |
| ఎడమ కన్ను | ... | అధర్మము |
| పాదములు | ... | భూ లోకము (Zone of Matter) |
| జానవులు (భుజములు) | ... | భువర్లోకము (Zone of Thought) |

| | | | |
|---|---|---|---|
| కటి (నడుము) చుట్టూ ప్రదేశము | ... | సువర్లోకము | (Zone of Divinity) |
| బొడ్డు ప్రదేశము | ... | మహర్లోకము | (Zone as Al-pervading) |
| హృదయము | ... | జనోలోకము | (Zone as Al-extended) |
| కంఠ ప్రదేశము | ... | తపో లోకము | (Zone of cogitation) |
| నుదురు-లలాట మధ్యప్రదేశము, భ్రూమధ్యము | ... | సత్యలోకము | (Zone of Al-presence) |
| సహస్రార - శిరో ఊర్ధ్వ ప్రదేశము | ... | 'ఓం' ప్రణవ మంత్రము | (All put together) |

ఈ విధముగా 'హంస' యోగమును ఎరిగి ఉపాసించు హంసయోగి 'సోఽ హమ్' స్థానమును అధిష్ఠించుచున్నాడు.

అట్టి "పరమహంస" ను ధ్యాన వస్తువుగా, నాద బిందువుగా స్వీకరించి, ప్రణవనాదమును ఉపాసించువానిని ఇక ఇతఃపూర్వపు శతకోటి పాపఫలములు కూడా సమీపించవు. బాధించవు.

**'ఓం' ప్రణవము (అ + ఉ + మ + అర్ధమాత్ర** Mere Sound**)** (చూపుడు వేళ్ళతో చెవులు మూసినప్పుడు లోనుండి వినబడు నాదము)

| | | | |
|---|---|---|---|
| ప్రథమ మాత్ర | 'అ' | → | **అ**గ్ని స్వరూపముగా |
| ద్వితీయ మాత్ర | 'ఉ' | → | వా**యు** స్వరూపముగా |
| ఉత్తర - తృతీయమాత్ర | 'మ' | → | సూర్య **మ**ండల సంకాశమగు భానుమండల తేజస్సుగా |
| సర్వమునకు ఆవలి గట్టు అయినటువంటి (మ్‌మ్ .... శబ్దము) | అర్ధమాత్ర | → | వరుణ భగవానుడుగా |

అని ప్రణవతత్త్వ విదులు ప్రణవోపాసనను అధిష్ఠాన దేవతలతో ఏకము చేసి 'ఓం' ఉపాసించుటను సూచిస్తున్నారు.

అట్టి 'ఓం' సంజ్ఞార్ధరూప 'ప్రణవము' అగు పరబ్రహ్మమే సర్వకాలములందును (ఇతః పూర్వకము, ఇప్పుడు, ఇకముందు కూడా) అంతటా అన్నిటా, అంతయూ అయి, 'మాత్రలు' గా ప్రతిష్ఠితమైయున్నది. అట్టి ప్రణవమగు ఓంకారము యొక్క జగత్ రూపధారణ ఎట్టిదో మనము వివరించుకొనెదము గాక! ప్రణవము యొక్క మాత్రల గురించి (About Verieties of Bit appearences) చెప్పుకుందాము.

**ప్రణవము యొక్క జగత్ రూప మాత్రలు (Bit-wise manifestations)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) | ప్రథమ మాత్ర | .... | ఘోషిణి | .... | స్థూల రూపము |
| 2) | ద్వితీయ మాత్ర | .... | విద్యుత్ | .... | తేజో రూపము |
| 3) | తృతీయ మాత్ర | .... | పతంగిని | .... | (నిశ్చల) వాయు రూపము |
| 4) | చతుర్ధ మాత్ర | .... | వాయు స్పందన | .... | వాయు కదలికలరూపము |
| 5) | పంచమీ మాత్ర | .... | నామదేయా | .... | నామ రూపములు (Name and Forms) |
| 6) | షష్ఠీ మాత్ర | .... | ఇంద్ర్య | .... | ఇంద్రియ అధినాయకుడగు ఇంద్రుని పరిపాలనములు అగు ఇంద్రియముల రూపము |
| 7) | సప్తమ మాత్ర | .... | వైష్ణవీ | .... | సర్వమునందు ఏకరూపమై విస్తరించియున్న విష్ణుతత్త్వ రూపము (Al-Present and Al-Pervading Absolute self) |
| 8) | అష్టమ మాత్ర | .... | శాంకరీ | .... | సర్వమునందుగల సుఖ-శాంతి-ఆనంద రూపము (Pleasantness) |
| 9) | నవమీ మాత్ర | .... | మహతి | .... | ఈ దృశ్య జగత్తంతా తన మహిమగా గల రూపము (One's own focus) |
| 10) | దశమీ మాత్ర | .... | ధృతి | .... | పట్టుదల రూపము. దేహ - మనో బుద్ధి మొ॥ వాటిని ధరించు ధైర్య - ధారణ రూపము (Meditational upholding) |
| 11) | ఏకాదశీ మాత్ర | .... | నారీ | .... | సర్వజీవులలో ఉండే ఆశయ - ఆవేశ రూపము (Instinct and Inspration in all). |
| 12) | ద్వాదశీ మాత్ర | .... | బ్రాహ్మీ | .... | సర్వరూపములు తానై, సర్వమునకు వేరే కూడా అయి ఉన్నట్టి **బ్రహ్మతత్వజ్ఞాన ఆనంద రూపము.** |

ఈ విధముగా యోగి ప్రణవోపాసనను వివిధ మాత్రల ఉపాసనగా నిర్వర్తించి, క్రమంగా బ్రాహ్మీతత్త్వమును చేరుచున్నాడు. ఒక్కొక్క మాత్రారూపమును ఆశ్రయించి (భావన చేస్తూ)... ఓంకారోపాసన నిర్వర్తించుచూ ఉండగా దేహానంతరము ఒక్కొక్క ప్రయోజనము పొందుచూ... చివరికి ఓంకార పరాకాష్ఠ స్థానము చేరి, **ఓంకారార్థమగు పరమాత్మయే తానై, బ్రహ్మమే తానై, సర్వము తానై, సర్వమునకు వేరై... అనిర్వచనీయ ఆత్మత్వమును పుణికి పుచ్చుకొనుచున్నాడు. ఖండత్వమును దాటి వేసి, అఖండ - కాలఃకాల కేవలీ పరతత్త్వమై, నిర్గుణబ్రహ్మమై,... - సర్వమునకు ఆధారమగు పరబ్రహ్మమై** వెలుగొందుచున్నాడు.

## మాత్రోపాసన - లోక ప్రయోజనములు / ఫలశ్రుతులు

ప్రణవమును ఒక్కొక్క మాత్రరూపంగా (As Different Bit - concentrations) యోగాభ్యాసము చేస్తూ ఉండగా ఒక్కొక్క ఫలము (ప్రయోజనము) సిద్ధిస్తూ ఉంటోంది. ఆ యోగి ఆయా ఉత్తమ స్థానములను చేరుచూ... ఉపాసన యొక్క పరాకాష్ఠచే చివరికి ప్రణవ స్వరూపుడై విరాజిల్లుచున్నాడు. ఇప్పుడు మనము ఒక్కొక్క మాత్రను ఆలంబముగా చేసుకొని ప్రణవోపాసన చేస్తూ పొందు చతుర్ధశ భువన సంబంధమైన ప్రయోజనములు వర్ణించుకుంటున్నాము.

| **వ.నెం.** | **మాత్రోపాసన చేస్తూ భౌతికత్వము (దేహము) విడుచువాడు (ప్రాణ-ఉపసంహరణ చేయువాడు)** | **పొందుచున్న తదనంతర జన్మ స్థానము** |
|---|---|---|
| 1వమాత్ర | **ప్రథమాయంతు మాత్రాయాం యది ప్రాణైః వియుజ్యతే!** మొట్టమొదటి మాత్ర యగు 'ఘోషిని' - (ఘన - స్థూల రూపమున)ు ఆలంబనముగా తీసుకొని ప్రణవోపాసన చేస్తూ ఉండగా దేహమును - విడవటం జరిగితే ... | భరతవర్షములో సార్వభౌముడుగా పుట్టుచున్నాడు |
| 2 ద్వితీయ మాత్ర | విద్యుత్ - (తేజో రూపమును) సముత్ కాంతిని ఆలంబనముగా తీసుకొని బ్రహ్మమును ప్రణవోపాసన చేయుచూ ప్రాణములు విడవటం జరిగితే ... | యక్షులలో శ్రేష్ఠుడై, మహనీయుడు - మాననీయుడుగా పుట్టడం జరుగగలదు. |
| 3.తృతీయ మాత్ర | **పతంగిని** ప్రాణవాయు రూపముగా (ప్రాణోపాసన) ఆలంబనం చేసుకొని ప్రణవోపాసన చేయుచుండగా | విద్యాధరుడుగా జన్మిస్తున్నాడు. |
| 4.చతుర్ధ మాత్ర | వాయుస్పందన ఆలంబనముగా ప్రణవోపాసన చేయుచూ ప్రాణములు ఉపసంహరించటం జరిగితే... | గంధర్వుడుగా అగుచున్నాడు. |
| 5. పంచమ మాత్ర | 'నామధేయ'... నామరూపాత్మకమైనదంతా ప్రణవ స్వరూపముగా ఉపాసిస్తూ ఉండగా ప్రాణములు (దేహము) విడవటం జరిగినప్పుడు | దివ్యరూపముతో చంద్ర లోకము ప్రవేశించి దేవతలతో సమానముగా పూజింపబడుచూ ఉంటున్నాడు. |
| 6. షష్ఠీమాత్ర | **ఇంద్రి** (ఇంద్రియ నియామకుడు - సొంతదారుడు అగు ఇంద్ర రూపంగా ఉపాసిస్తున్నప్పుడు) | సర్వ బంధములను అధిగమించి సాయుజ్యము పొందుచున్నాడు. |
| 7. సప్తమమాత్ర | **వైష్ణవి** (అంతటా విస్తరించి (సత్‌రూపమై) ఉన్నతత్త్వము)ను భావన చేస్తూ ఉపాసించువాడు | **"అంతటా విస్తరించియున్నది నేనే కదా ।"** అన్న వైష్ణవ పదమును, విష్ణు సాయుజ్యము పొందుచున్నాడు. |
| 8. అష్టమ మాత్ర | **"శాంకరి"** అను మాత్రగా ఉపాసిస్తూ ఉన్నప్పుడు | రుద్రలోకం చేరి పశుపతితో మమేకము పొందుచున్నాడు. సర్వులకు శుభములు చేకూర్చు వాడగుచున్నాడు. |
| 9వ మాత్ర | **'మహతి'** (మహత్-ఇతి) అను మాత్రను ఆలంబనముగా చేసుకున్నవాడు | 'ఈ దృశ్యమంతా నా యొక్క మహిమయే కదా" అను భావన అనుభవమగు మహర్లోకము చేరుచున్నాడు. |

| | | |
|---|---|---|
| 10వ మాత్ర | **ధృతి**... ధారణ... అను మాత్రను అవలంబించి ఓంకారోపాసన చేస్తున్నవాడు | జనో లోకము **(జీవులంతా తన రూపము - అను భావన కలుగు స్థితి)** చేరుచున్నాడు. |
| 11వ మాత్ర | **'నారీ'**.... అను మాత్రను ఆవలంబనముగా చేసుకొనుచున్న ప్రణవోపాసకుడు | "సర్వస్వభావములు నేనే" అనే భావనతో తపోలోకము చేరుచున్నాడు. |
| 12వ మాత్ర | **బ్రహ్మీ**... సర్వము బ్రహ్మమే। నేను-నీవు... ఇదంతా కూడా ... అను మాత్రను ఆవలంబనముగా కలిగి ఉన్నవాడు | శాశ్వతమగు బ్రహ్మలోకము పొంది "ఇదంతా నా సృష్టియే! నా దృష్టియే ఈ సృష్టి! నేనే!" అను రూపము గల బ్రహ్మానందమును పొందుచున్నవాడగుచున్నాడు |

**ఈ విధంగా నాదబిందు యోగోపాసకుడు బ్రాహ్మీతత్త్వము యొక్క '12' మాత్రల ఉపాసనాక్రమముచే పరబ్రహ్మస్థానము చేరుచున్నాడు. ఏ స్థానమైతే**

❈ సర్వ వ్యాపక ❈ పరమ నిర్మలము ❈ సర్వ శుభప్రదము, శివము
❈ కేవల జ్యోతి స్వరూపము ❈ జ్యోతి (Devine light) ఉదయించుచున్న జ్యోతిర్జ్యోతి

అయి ప్రకాశించుచున్నదో, అట్టి బ్రహ్మీ స్థితి చేరి, ప్రణవ స్వరూపుడై ప్రకాశించుచున్నాడు.

హృదయము నుండి వినబడు 'ఉమ్‌....' నాదయోగమును అనుష్ఠించుచున్న యోగి

- ఇంద్రియములను - ఇంద్రియ విషయములను దాటివేసినవాడై ...,
- త్రిగుణములకు అతీతుడై ...,

"యోగయుక్తుడు"... అగుచున్నాడు. చెదరనట్టి, చ్యుతిలేనట్టి "శివము - శాంతము" అగు సదాశివ బ్రహ్మమునందు ప్రవేశము పొందుచున్నాడు. ఓంకారార్ధతన్మయుడు (తానే ఓంకారార్ధముగా) అగుచున్నాడు. యోగధర్మముచే సర్వ దృశ్య - దేహ - మనో - బుద్ధి - చిత్త ధర్మములను దాటిపోయి, ఆత్మ ధర్మమునందు ప్రవేశించి, 'ముక్తుడు' అగుచున్నాడు. సర్వ సంగమముల (All Attachments) బంధములను త్రెంచి వేసినవాడై, సర్వమును తనయందే దర్శించుచున్నాడు. తాను సంగ వివర్జితుడు - ముక్తుడు అవటమే కాకుండా.. తనను ఆశ్రయించిన వారిని, కులము లోనివారిని, పరిసరములలోని వారిని క్రమముగా, ముక్తులుగా తీర్చిదిద్దుచున్నాడు.

**శనైః ముచ్యేత్ కులేజనమ్ । సంస్థితో యోగ ధర్మేణ సర్వసంగ వివర్జితః !**

సర్వ సంసార పాశములను సాలెపురుగువలె తన ఆత్మవికాసముచే దిగమ్రింగి వేసినవాడై, నిర్మలుడు, సూర్యప్రభాప్రకాశమానుడు అగుచున్నాడు. **తేనైవ బ్రహ్మభావేన పరమానందమ్ అశ్నుతే !** బ్రహ్మ భావముచే పరమానందము పొందుచున్నాడు. బ్రహ్మమే తానైన స్థితిని పొందుచున్నాడు. కాబట్టి ఓ సర్వ ప్రియ జీవులారా! స్వయమాత్మానంద స్వరూపులారా! సహజ ఓంకారాత్ములారా! బుద్ధిమంతులారా! మహాశయులారా! శ్రేయోదాయకమగు మా ఈ మాటలు వినండి. మీరంతా కూడా జీవితకాలమంతా "ఆత్మ"ను గురించి తెలుసుకునే ప్రయత్నములోనే ఉండండి. అంతేగాని, ఇంద్రియ విషయ పరిమితులై 'జీవితము' అనే మహత్తర అవకాశమును వృధా చేసుకోకండి.

**ఆత్మానమ్ సతతమ్ జ్ఞాత్వా కాలం నయ, మహామతే!**

ఇక జీవితంలోని కష్ట-సుఖముల, సుఖ-దుఃఖముల, అనుకూల-ప్రతికూల సందర్భముల మాటేమిటంటారా? **ప్రాబ్ధమ్ అఖిలమ్ భుంజన్, న ఉద్వేగమ్ కర్తుమ్ అర్హసి ।** మీరంతా మహామతులు అవండి! గొప్ప తెలివిగలవారై ప్రారబ్దములను (ఈ దేహముతో అనివార్యముగా అనుభవించవలసి వస్తున్న సుఖ-దుఃఖ మొ॥న విషయములను), ఆత్మ భావనతో సమగ్రమైనటువంటి అవగాహనముతో, ఉత్తమమైన ఆశయసిద్ధికొరకై ఉద్వేగరహితులై స్వీకరించండి. పరమానందమగు ఆత్మయే స్వరూపముగా కలిగి ఉన్నట్టి మీరు, ప్రారబ్దముల గురించి ఉద్వేగము పొందవలసిన అవసరమేమున్నది? కించిత్ కూడా లేదు. **"నా ఆత్మ ఇట్టిది కదా! బంధరహితము! సర్వాతీతము! సర్వసాక్షి! కేవలానంద స్వరూపము! అప్రమేయము।"** - అను రీతిగా ఆత్మ గురించిన ఆత్మ జ్ఞానము మీలో ఉదయించిందా.. ఇక ప్రారబ్దము మిమ్ములను ఏమి చేయగలదు ? **"ఉత్పన్నేచ ఆత్మ విజ్ఞానే, ప్రారబ్ధము నైవ ముంచతి ।"**

– "ఇది నా ప్రారబ్దమురా, నాయనా !"... అని ఆతడు ప్రారబ్ధములో మునగడు.

– ప్రారబ్ధము అతనిని ముంచనూ లేదు. ఇముడ్చుకొననూ లేదు. మబ్బులు ఆకాశమును మింగ్రగలవా? లేదు కదా? ఇదీ అంతే! అంతే కాదు.

**తత్త్వజ్ఞానోదయాత్ ఊర్ధ్వమ్ ప్రారబ్ధమ్ నైవ విద్యతే ।**

తత్త్వజ్ఞానము ఉదయించినదా... ఇక ఆపై **'ప్రారబ్ధము'** అనబడేదీ **'లేనిదే'** అగుచున్నది. ఒక దృష్టాంతము. ఒకాయన నిదురిస్తూ కలకంటున్నప్పుడు అట్లా కలకంటూ ఉండగా, అతని దృష్టిలో పాంచభౌతిక దేహము ఉంటుందా ? ఏమాత్రమూ (దృష్టి – అనుభవములకు) ఉండదు కదా! **దేహాదీనామ్ అసత్వాత్తు యథా స్వప్నే నిబోధతః, కర్మ జన్మాంతరీయంతు ప్రారబ్ధ ఇతి కీర్తితమ్ ।** ఈ దేహము– ఇతఃపూర్వపు దేహము – రాబోయే దేహములకు సంబంధించిన సంచిత – ప్రారబ్ధ – ఆగామి కర్మలు కూడా, **"స్వప్నదర్శి యొక్క భౌతికదేహావగాహన"** వలె **"మొదలే లేనివి"** అగుచున్నాయి. ఆత్మ జ్ఞానికి ఈ జన్మయే లేదు. ఇక క్రితం జన్మలు – రాబోయే జన్మలు, అందుకు సంబంధించిన కర్మలు ఇంకెక్కడివి? ఆత్మజ్ఞాని సర్వదా జన్మ – కర్మలకు సంబంధమే లేనట్టి స్వస్వరూపాత్మను, సత్–చిత్–ఆనందతత్త్వమును ఆస్వాదిస్తూ ఉంటాడు. **స్వప్న దేహో యథా అధ్యస్తః తదైవ అయం హి దేహకః ।** ఒకడు నిదుర లేచిన తరువాత, **"రాత్రి కలలో నాకు కనిపించిన, నాకు చెందిన ఆ భవనము ఏమైనట్లు? స్వప్నంలోని నా దేహము ఏమైనట్లు? ఏ ప్రదేశములో ఉన్నట్లు?"** అని వెతుకుచున్నాడా? లేదే ! **"ఆఁ! అదంతా నా ఊహలో నేను కల్పించుకొని, ఊహతో సహా అంతా నాలోనే లయం చేసుకున్నాను. అంతకుమించి కలలోని దేహము లేదు! భావన లేదు! స్వప్నంలోని గృహాలు లేవు" ...** అని క్షణంలో వదలివేసి జాగ్రత్ కార్యక్రమాలు స్వీకరిస్తున్నాడు కదా! అట్లాగే...

**జాగ్రత్‌లో నాకు ఇప్పుడు కనిపిస్తున్నదంతా స్వప్నములో నాకు కనిపించిన విశేషాలు వంటివే కదా! అంతా నాలోంచి బయలు దేరే ఊహతో నిర్మితమై, ఉహచే అనుభవించబడి, ఊహతోబాటే నాలో లయ అగుచున్నాయి. దేహము స్వభావంగా నశిస్తూ ఉండగా, దేహభావాలు - నాలో లయిస్తున్నాయి.**

–అని వర్తమానములోనే, (ఈ జాగ్రత్‌ను దర్శిస్తూ ఉండగానే,..) అవగాహన కలిగి ఉంటున్నాడు. 'ఈ జన్మ, రాబోయే జన్మ కలవంటిదే! కలలో వచ్చేదేమున్నది? పోయే దేమున్నది" అను అర్థముతో కూడిన బుద్ధితో కలిగి ఉండియే, ... ఇదంతా చూస్తున్నాడు!

**అధ్యస్తస్యకుతో జన్మ? జన్మ-అభావే కుత స్థితిః?** నేను ఉంటే జన్మలు. జన్మలుంటే కర్మలు. అంతేగాని, జన్మలలో నుండి, కర్మలలో నుండి నేను జనించువాడను కాను. జన్మల కంటే మునుముందే నేనున్నాను. ముందే ఉన్న నాకు జన్మలెక్కడివి? జన్మచే జనించువాడను కానట్టి ఆదిస్వరూపమగు ఆత్మకు జన్మలు లేవు. జన్మలే లేనిదానికి 'జన్మలలో స్థితి' అన్నదెక్కడున్నది? కనుక నేను జన్మలకు – కర్మలకు సంబంధించని అప్రమేయుడను. జన్మలే లేనట్టి నాకు లోకములు ఎక్కడున్నాయి ? ఆ లోకములలో స్థితి ఎక్కడున్నది? జాగ్రత్ – స్వప్న సుషుప్తులలో స్థితి (placement) అనునదేమున్నది? ఇక ఈ పాంచభౌతికమైనట్టి ప్రపంచము గురించి ఏమిటంటారా? దేహము ఏమిటి? **ఉపాదానం ప్రపంచస్య, మృత్ భాండస్యేవ పస్యతి!**




"మట్టికుండ" అనునది 'మట్టి+కుండ' అనబడు ద్వంద్వ సమాసమా ? కాదు. మట్టియే ఒకానొక ఆకారముచేత 'కుండ' అని చెప్పబడుతోంది. అంతేగాని 'మట్టికి వేరైన – కుండ" అని ఏదైనా ఉన్నాదా ? లేదు. మట్టియే ఆకారము దృష్ట్యా 'కుండ' అని పిలువబడుతుంది. కుండగా కనిపించేది మట్టియే అయినప్పటికీ,... "మట్టి కాస్తా 'కుండ' అనే దశగా మారినది" ..... అనునది యుక్తి యుక్తం కాదు కదా!

అట్లాగే

పరబ్రహ్మస్వరూపుడనగు నేను జీవుడు, జగత్తు, భౌతిక దేహములుగా కనిపిస్తూ ఉండవచ్చును గాక!

పరబ్రహ్మమే స్వరూపముగా కలిగియున్న నాకు (మట్టికుండలో 'కుండ' విభాగమువలె).. భౌతిక దేహము లేదు. ఈ పాంచభౌతిక ప్రపంచమూ లేదు. ఒక వేళ ఉన్నాయనుకుంటే అస్మత్ జ్ఞానానంద ఆత్మయే దేహముగా, జగత్తుగా (నేను అజ్ఞాన దృష్టిని స్వీకరించినప్పుడు) అగుపిస్తోంది.

కుండ పగిలినా మట్టికి ఏమీ కాదు. ఈ "జాగ్రత్-స్వప్న" దేహ జగత్తులకు ఏమి అయినా, పరబ్రహ్మస్వరూపుడనగు నాకు ఏదీ అవదు.

**తద్వత్ సత్యమ్ అవిజ్ఞాయ జగత్ పశ్యతి మూఢధీః ।** ఎంతెంత వరకు ఒకడు మూఢ బుద్ధి కలిగి ఉంటాడో,... అంతవరకు 'జగత్తు' అనబడునది చూస్తూ ఉంటాడు. ఎప్పుడైతే నిర్మల - సునిశిత బుద్ధి వికసిస్తుందో అప్పుడు **"ఆహాఁ । నా ఆత్మయే నాకు జగత్తు రూపముగా నా బుద్ధికి** కనిపిస్తూ వస్తోంది ! ఆత్మ గురించి తెలుసుకున్నాను కాబట్టి ఇప్పుడు జగత్తుగా కనిపిస్తున్నదంతా - ఆత్మ జ్ఞానముచే ఆత్మగా అనిపిస్తోంది..." అని జగత్తును ఆస్వాదిస్తున్నాడు. ఆత్మను ఎరిగిన తరువాత జగత్తు ఏమౌతోంది? ఎటు వెళ్తోంది ? వెలుతురు వచ్చిన తరువాత చీకటి ఎటు వెళ్తోంది! ఇదీ అంతే!

## సర్ప రజ్జు -- భ్రాంతి

ఒకడు బాటలో వెళ్లుచూ, రహదారికి ప్రక్కగా గల బావిని చూచి "ఇక్కడ నీళ్ళు త్రాగుదాము"... అని అడుగులు నూతివైపు వేయసాగాడు. అది మసక చీకటిగా ఉన్న సమయము. అక్కడ బావి ప్రక్కగా కనబడిన ఏదో ఆకారము చూచి **" అయ్య‌ బాబోయ్ ! పాము !"**... అని ఎగిరి గంతులేశాడు. అయినా నిలబడి "పామేనా ! చూద్దాము !".... అని (శాస్త్ర - గురు పాఠములు అనే) కాంతి ఉపకరణముతో (Battery Llight) కొంచెము నిదానముగా పరిశీలించి చూచాడు. **"అబ్బే ! ఇది పాము కాదు. త్రాడు మాత్రమే।"**... అని గమనించాడు. ఇక భయమేమున్నది ? చేతితో ఆ త్రాడును ప్రక్కకు పడవేసి నూతిని సమీపించసాగాడు. **ఆ త్రాడునే బొక్కెనకు కట్టి నీరు తోడుకోసాగాడు.**

- ఆ బాటసారి అటు చూడకముందు అక్కడ ఏమున్నది? ***త్రాడు ఉన్నది.***
- బాటసారి "పామేమో?"... అని అనుకున్నప్పుడు పాము వచ్చిందా? లేదు. **అక్కడ పాము లేదు. త్రాడే ఉన్నది.**
- మరి బాటసారికి **'పాము'** అని ఎందుకు అనిపించింది? తన అనుభూతి జ్ఞాపకములలో ఉన్న పామును గుర్తు చేసుకొని అక్కడ ఆపాదించాడు కాబట్టి (He emotionally attributed his past Experiences regarding a snake and its bite to the present context).
- అతడు అప్పుడు ఏమి చేశాడు? వివేకముతో **"అసలు అది ఏమిటి రా?"** ... అని పరిశీలించాడు. (శాస్త్ర వాక్య విచారణ - గురువాక్యములు అనే వెలుగులో) తేరపార చూచాడు.
- అప్పుడేమైనది ? **"ఇది త్రాడు మాత్రమే! పాము అక్కడ లేనే లేదు"...** అని అర్థం చేసుకున్నాడు.

అంతకు ముందేమో - **యథా రజ్జుం పరిత్యజ్య సర్పం గృహ్ణాతి వై భ్రమాత్ !** త్రాడుకు సంబంధించిన అనుభవము వదలి, 'పాము' కు సంబంధించిన జ్ఞాపకాలన్నీ తెచ్చిపెట్టుకొని, పాముకు సంబంధించి దృష్టిలో భ్రమచేత దర్శించాడు.

మరి ఇప్పుడు? 'త్రాడు' అని తెలిసిన తరువాతో? **రజ్జు ఖండే పరిజ్ఞాతే సర్ప రూపం న తిష్ఠతి!** అది త్రాడు ముక్కగా తెలుసుకోగానే, ఇక ఆ సందర్భములోని సర్పముపు అనుభవం యొక్క ఉనికియే లేకుండా పోయింది.

**అట్లాగే ...**

**అజ్ఞానంచ, ఇతి వేదాంతైః తస్మిన్ నష్టే క్వ విశ్వతా?** తెలియబడుచున్న దానిలో ఈ విశ్వమంతా కనిపిస్తోంది. "తెలియబడునది తెలుసుకుంటున్నవాడు (ఆత్మ) ఎట్టివాడు?" అనే విషయము గురించి చెప్పుచున్న ఉపనిషత్ వాణిని విని, గ్రహించిన తరువాత (త్రాడు పట్ల పామువలె) ఈ విశ్వము లేనిదే అగుచున్నది. విశ్వము ఆత్మ స్వరూపముగా దర్శించబడి, ఆస్వాదించబడుతోంది. ఒకవేళ విశ్వమనదేది కాసేపు ఉన్నదని అనుకున్నా, అదంతా ఆత్మకు 'ఆత్మగా' ఆస్వాదించటానికి సాధన (లేదా) క్రీడా వస్తువు మాత్రమే అగుచున్నది.

- **వేదాంత శాస్త్రముచే బోధింపబడుచున్న సత్యము పరిశీలించనంత వరకే ఇది భిన్నమగు విశ్వము.**
- **సత్యము పరిశీలించిన వివేక దృష్టికి ఇదంతా అభిన్నమగు ఆత్మ స్వరూపమే ! ఆత్మానందమే !**

  ఇదియే వేదాంత సారము! తత్త్వసారము!

విశ్వముగా కనిపించేదంతా ఉన్నది ఆత్మలోనే! ఆత్మయే! ఈ విశ్వమునకు అధిష్ఠానమగు 'ఆత్మ' గురించి తెలుకున్న తరువాత ఇక విశ్వము గురించి, 14 లోకాల గురించి క్రొత్తగా తెలుసుకోవలసినది ఏముంటుంది? మట్టి గురించి తెలుసుకుంటే, ఇక ఆయా మట్టి బొమ్మల తల-చేతుల గురించి క్రొత్త విశేషమేమున్నది? ఆత్మ జ్ఞానము చేత **"విశ్వము ఆత్మకు వేరుగా లేదు"...** అని తెలియవస్తోంది. అప్పుడు విశ్వమును విశ్వముగా చూస్తే, ఇది **శూన్యమే!** (మట్టికి వేరుగా కుండను చూడదలచినవారికి... కుండ వేరుగా లేదు.. అని తెలియవచ్చు విధంగా).

ఇక ఈ భౌతిక దేహము గురించియా? ఈ దేహము కూడా విశ్వములోని ఒక వస్తువే కదా ? కనుక విశ్వము 'లేనిదే – శూన్యమే' అయినట్లు దేహము కూడా 'లేనిదే – శూన్యమే' అగుచున్నది. దేహము – **దేహికి ఐహిక మోహము** మాత్రమే (Existence of physical body is one of the many illusionary thoughts). "దేహమే లేనిది"... అని అనుకున్నప్పుడు ఇక "ప్రారబ్ధము" అనబడునది ఎక్కడున్నది? **"కలలో ఒక ఇల్లు ఎందుకు కనిపించింది?"**... అని విచారిస్తే అది ప్రారబ్ధమా? ఆగామియా? సంచితమా? భ్రమలో ఏదో ఒకటి కనిపించాలి కాబట్టి అది కనిపించింది. అట్లాగే 'ప్రారబ్ధము అనబడునదేదీ లేనేలేదు'.. అని ఆత్మజ్ఞానముచే సుస్పష్టమగుచున్నది.

మరి ప్రారబ్ధము అనుభవించక తప్పదని, అనుభవము చేతనే అది తొలుగుతుందని ఇందాక ఒకసారి అనుకున్నాము కదా ? ఓహో. అదా?

**అజ్ఞానజనబోధార్థమ్ "పారబ్ధమ్ ఇతి చ" ఉచ్యతే !**

ఆత్మజ్ఞానము సంపాదించటానికి ఇంకా సంసిద్ధుడు కాని అజ్ఞానిని ఆత్మజ్ఞానానికి సిద్ధం చేయు ఉద్దేశ్యముతో – "కష్టములు ఆత్మజ్ఞాన దృష్టిచే లేనివే"... అను సమాధానము (దృశ్యముపై నమ్మకము ఉన్నంతవరకు) అర్థమవదు కనుక!

**"ప్రారబ్ధము"** అనునది విజ్ఞులచే (అజ్ఞులను సంస్కరించటానికై) కల్పించ చెప్పబడుచున్నది.

"కాలవశం చేత ప్రారబ్ధము తనకు తానే 'నాస్తి' రూపము ధరించి తొలగుతుంది. అనుభవముచే అదే పోతుంది"... అని చెప్పుచూ, ఆత్మజ్ఞులచే ఇకప్పుడు స్వస్వరూపమగు 'ఆత్మ' గురించి బోధించటం ప్రారంభమగుచున్నది. ఆత్మ గురించి తెలుసుకుంటూ ఉండగా, **"మట్టికుండలోని మట్టికి వేరైన కుండ విభాగము"** వలె, **"త్రాడులో చూచిన పాము"** వలె.. ఇక కర్మలే **'లేనివి'** అగుచున్నాము. జన్మ-కర్మలే లేనప్పుడు **'ప్రారబ్ధము'** అనునది మాత్రం ఎక్కడున్నది ?

⌘

## బ్రహ్మము - ప్రణవము- అనుసంధానము

'ఓం' అనబడు ప్రణవనాదముతో 'బ్రహ్మము' ను అనుసంధానముచేస్తూ ఉండగా 'జగత్తు బ్రహ్మమే' అను అనుభవము (ఆత్మానుభవము) స్వయముగా ఆవిర్భవించగలదు. మేఘాలు తొలగగానే స్వయముగా సూర్య ప్రకాశము ద్యోతకమౌతోంది. ఇక సూర్య ప్రకాశము కొరకై మేఘములు తొలగించిన తరువాత ఏప్రయత్నమూ అవసరము లేదు కదా! జగత్తు సంబంధమైన అజ్ఞానము తొలగితే స్వభావంగానే **ఆత్మతత్త్వ జ్ఞానము** ప్రకాశించగలదు. కాబట్టి... ఇప్పుడు తొలగవలసినది ఏమిటి? దృశ్య జగత్తు పట్ల దట్టముగా బుద్ధిలోను, మనస్సులోను ఏర్పరచుకొనియున్న భ్రమ మాత్రమే! అట్టి జగత్ భ్రమ అనేక జన్మల దురభ్యాసముల రూపము కదా! అందుచేత తనకు తానుగా తొలగదు. మరి అందుకు మార్గము?

## యోగోపాసనయే!

యోగ సాధన (అభ్యాసము) కొరకై

- సిద్ధాసనము (దేహముకు స్థిరమైన, ఏకాగ్రతకు అనుకూలమైన ఆసనము) స్వీకరించబడుగాక!
- వైష్ణవీ ముద్ర (అంతటా నేనైయున్న నాలోని (నేనైన) నేను) అనుసంధానము చేయబడును గాక!
- బాహ్య విషయములు బాహ్యముననే వదలబడును గాక!

**... శృణుయాత్ దక్షిణేకర్ణే 'నాదమ్' అంతర్గతం సదా!** 'కుడి చెవు'తో హృదయాంతర్గతము (From the Recess of Heart) నుండి ఎల్లప్పుడూ వినబడు **ఓంకార నాదము**ను ఏకాగ్రతతో వింటూ ఉండటము-అభ్యసించబడు గాక!

అటువంటి **"అంతర్గతమగు ప్రణవనాదమును ఎల్లప్పుడు వినుచుండటము"**... అనే యోగాభ్యాసము ప్రారంభించినప్పుడు ఆ యోగి యొక్క అనుభవాలు కొన్ని వివరించుకుంటున్నాము.

కళ్ళు మూసుకొని 'వినికిడిని' దేహమునకు 'అంతరము'గా (కుడిచెవిని చూపుడు వ్రేలుతో మూసి ఉంచి, అంతర్-నాదమును వినుట-మొదలైన విధాలుగా) నియమించుచున్నప్పుడు,

**మొట్టమొదట : శ్రూయతే ప్రథమాభ్యాసే 'నాదో - నానావిధాన్ మహాన్' ...** అనేక విధములైన పెద్ద - పెద్ద నాదములు వినబడుచూ ఉంటాయి.

"అట్టి అంతరనాదమును వినటము" - అను **అభ్యాసము కొంత కొనసాగుచుండగా...** క్రమక్రమంగా **వర్ధమానః తథా అభ్యాసే శ్రూయతే సూక్ష్మ - సూక్ష్మతః....** అనేక పెద్ద పెద్ద నాదములన్నీ అభ్యాస బలముచే వాటికవే తొలగుతూ వస్తాయి. ఇక ఆ యోగాభ్యాసికి బుద్ధితో మాత్రమే గమనించబడునట్టి సూక్ష్మ - సూక్ష్మాతి నాదములు వినబడసాగుతాయి.

వరుసక్రమము = 1. ఘననాదము 2. మంద్రనాదము 3. బుద్ధికి మాత్రమే తెలియవచ్చే నిశ్శబ్ద నాదము.

⌘

**'ప్రణవనాద శ్రవణ - ఉపాసన'లో** దేహముయొక్క అంతరము నుండి వినబడు శబ్దముపై బుద్ధిని ఏకాగ్రపరచుచున్నప్పుడు

**మొట్టమొదటగా** సముద్ర తరంగములవంటి ఘోష, మబ్బులతో జనించే పిడుగు - మెఱుపుల మోత, భేరీ నినాదము వంటివి వినబడుచూ ఉంటాయి. (ఘన నాదము)

**మధ్య దశలో (నాద శృతోపాసన కొనసాగుచుండగా) ...** మద్దెల శబ్దములు, గంటల నాదములు, కాహళ శబ్దములు వంటివి వినబడసాగుతాయి. (మంద్ర నాదము)

**చివరి - చివరి (పరిపక్వ) దశలో:** వేణుగాన నాదము, చిరుమువ్వల కింకిణీ నాదము, తుమ్మెదల ఝుంకారము వంటి సున్నిత - సుతిమెత్తని శబ్దములు వినబడసాగుతాయి. ఆ తరువాత బుద్ధికి మాత్రమే తెలియవచ్చే **ఆత్మనాదము** సిద్ధించగలదు.

**యత్ర కుత్రాపి వా నాదే లగతి ప్రథమం మనః, తత్ర తత్ర స్థిరీభూత్వా, తేన సార్థం విలీయతే !**

అంతర హృదయ స్థానము నుండి నాదములు వినుచున్నప్పుడు మొట్టమొదటి దశలో ఘనమైన భేరీ నాదములు, అటు తరువాత మంద్రనాదములు కూడా వినబడుతూ ఉంటాయి కదా ! అయితే, యోగి తన ధ్యాన స్థితిలో మహాభేరీ నాదములను వినిపించుకోకుండా క్రమంగా మంద్ర నాదములను మాత్రమే ఏకాగ్ర బుద్ధిలో వినిపించుకుంటూ రావాలి. అటువంటి దశలో...

- మంద్ర - సూక్ష్మ నాదములు వింటూ ఉన్నప్పుడు ఘనమైన నాదములను విడచిపెట్టుచూ ఉండుగాక !
- ఘనమైన నాదములను వినుచున్నప్పుడేమో మంద్రము-సూక్ష్మము అగు నాదములను విడిచిపెట్టుచుండును గాక ! (అంతే గాని రెండూ ఒక్కసారే కాదు).

⌘

ఈ విధంగా అంతర్గత నాదములను వినటము అనే "యోగము" అభ్యసిస్తూ ఉండగా, మనస్సు తదితరములైన బాహ్య విషయముల వైపు వెళ్ళకుండా - సర్వ అవస్థలలోనూ కూడా - **అంతరంగ శబ్దములనే** వినుచూ వినోదించటము, ఆనందించటము ప్రారంభించగలదు.

ఈ మనస్సు కోతి వంటిది కదా? యోగి మొట్టమొదట ఏ నాదమును ఏకాగ్రత - అభిరుచిలతో వింటాడో.. మనస్సు ఆ శబ్దములోనే ప్రవేశించి, అక్కడే స్థిరమౌతూ ఉంటుంది. మనస్సు దేనిపై అభినివేశముతో వ్రాలితే, అద్దాని గురించే మరల మరల మననము చేస్తూ ఉండటమనేది అద్దాని యొక్క స్వభావము.

అందుచేత, **విస్మృత్య సకలమ్ బాహ్యామ్, నాదే దుగ్ధ - అంబువత్, మనః ఏకీ భూయ అథ సహసా చిదాకాశే విలీయతే ।** ఈ చిత్తము-అను బాలుని లాలిస్తున్నట్లుగా లాలిస్తూనే సకల ప్రాపంచక బాహ్య వృత్తులను విస్మరించే మార్గములో నియమిస్తూ ఉండాలి. నయాన మనస్సును లాలించాలి. బయటకు సంబంధించిన సంభాషణ శబ్దములపట్ల అభినివేశమును తగ్గించుకుంటూ ఉండాలి. అంతరగము నుండి వినబడే నాదమే ప్రీతి అగు విధంగా అద్దానిని తీర్చిదిద్దాలి.

క్రమంగా అంతర్ **హృదయ ప్రణవనాదముతో** ఆ మనస్సు – 'పాలు-నీరు' వలె – ఏకీభూతమగుచున్నది. అటు తరువాత ఆ ఏకరూపము సంతరించుకున్న నాద – మనస్సులు 'చిదాకాశము'లో విలీనము అగుచున్నాయి.

ఈ మనస్సు (లేక) చిత్తము అనేక దృశ్య సంబంధములైన సందర్భములు, సంఘటనలు, సంబంధములు, బాంధవ్యములు, అనుబంధములు, ఆశ-నిరాశ-దురాశ-పేరాశలు, సంబంధమే లేని అనేక బాహ్య వ్యవహారములతో తలదూర్చటం, పరుష శబ్దములతో కూడిన పరదూషణ, ఏదో ఇంకా పొందాలనే తపనలు, సంపదల గురించి పరులతో పోల్చుకుంటూ పెంపొందించుకొనే ఆవేశ – కావేశాలు ... ఇటువంటి అంతేలేని అసంఖ్యాక విషయపరంపలపై వ్రాలుచూ, వాటితో మమేకమగుచున్నది. నిమగ్నమగుచున్నది. "సంయమి" అగు యోగి మనస్సుయొక్క చేష్టలను గుర్తిస్తున్నాడు. అందుచేత మనస్సును సదాభ్యాసముల సహాయముతో దృశ్య ***విషయముల పట్ల... ఉదాసీనత, వ్యధారాహిత్యమును*** నేర్పుచూ రావాలి. అంతర హృదయ నాదమును ఇష్టముతో శ్రవణము చేస్తూ (వినుచూ) ఉండగా ఇది సుసాధ్యం అవుతుంది. ఎప్పుడైతే ఈ చిత్తము...

- ప్రాపంచక చింతనలన్నీ హృదయములోకి రాకుండా ప్రక్కకు పెట్టుచూ...,
- దృశ్య సంబంధమైన భావావేశములను విడనాడుచూ...,
- స్వధర్మమునకు ప్రతికూలమైన సర్వ సంగతములకు, మనో ఆవేశ-కావేశములకు, సర్వ చేష్టలకు విముఖత్వము కలిగి ఉంటూ...

**.....హృదయము నుండి చెవులకు చేరు ప్రణవనాదమును వినుటయందు అభ్యాసశీలమౌతుందో..**

అప్పుడిక, అట్టి అనుసంధానము యొక్క ప్రభావము చేత చిత్తము ఆ నాదమునందే విలీనమగుచున్నది.

**శ్లో॥ మకరందం పిబత్ భృంగో గంధాన్ న అపేక్షతే యథా,**
**నాదాసక్తం సదా చిత్తం విషయం నహి కాంక్షతే ॥**

పుష్పములపై వ్రాలుతూ మధురమైన తేనెను గ్రోలుచున్న తుమ్మెద ముళ్ళచెట్లపై గల దుర్వాసనతోడిన కుళ్ళుపై వ్రాలి, ఆ వాసనలను పొందాలని కోరుకుంటుందా? లేదు కదా! అట్లాగే, ప్రణవ నాదమును వినుటయందు సంలగ్నమగుచున్న చిత్తము బాహ్యమైన ఇంద్రియ విషయములకు, తత్‌సంబంధమైన లౌకిక విశేషములకు ఏ మాత్రమూ కూడా ప్రాముఖ్యతను ఇవ్వనే ఇవ్వదు. కోరుకోనే కోరుకోదు.

త్రాచుపాము పాములవాని యొక్క "నాగస్వరము' వింటూ, అట్టి నాగస్వర సంగీతములో తన్మయమై పడగ విప్పి ఆడుచూ... ఇక తన కోపముతో కూడిన బుసను, (ఎవరిపై కాటు వేయాలా అనే....) తన చపలమును (నాగ స్వర తన్మయము కారణంగా) వదిలి ఉంటుంది కదా!

అదే విధంగా ...,

ఈ చిత్తము కూడా అంతర హృదయమునుండి వినబడు ప్రణవనాదమును, అద్దాని **"ఘన – మంద్ర – సూక్ష్మ"** నాదములను వినుచూ, అద్దానియందు తన్మయ మగుచూ, ఇక సహజ లక్షణమైనట్టి చపలత్వమును త్యజించినదై... నాదానందమును ఆస్వాదిస్తూ ఉంటుంది.

ఓ ప్రియ సహజాత్మానంద స్వరూపులగు శ్రోతలారా ! ఇంకా వినండి. పిచ్చి పట్టిన ఏనుగు ఉద్యానవనంలో భీకరంగా ఘీంకరిస్తూ సంచారాలు చేస్తూ ఉంటుంది చూచారా ? అట్లాగే ఈ మనస్సు (ఆలోచన) – చిత్తము (ఇష్టము)... అట్టి పిచ్చిపట్టిన ఏనుగు లాగా ఇంద్రియ – విషయ జగత్ సంబంధమైన అనేక సంగతి – సందర్భ – అభిరుచి – ఆవేశ – సాపేక్షిక (Comparativity) విషయాలపై వ్రాలి, వాటితో తన్మయమై ఉండటం అలవాటు చేసుకున్నది. ఇప్పుడు "ఈ విశ్వమును మరచి ఉండాలి".. అని ఒక్కొక్కప్పుడు తలచి కూడా... ఒక క్షణంలో చ్యుతి (Distraction) పొందుచున్నది. ఆత్మధ్యానమే కుదరటము లేదు. ఏనుగును ఎట్లా అంకుశముతో పొడిచి తన వశంలో ఉంచుకోవాలో తెలిసిన మావటీవాని వలె, ఇప్పుడు ఈ చిత్తమును వశం చేసుకోవాలి. అందుకు అంతరంగ నాదోపాసన గొప్ప అంకుశము. ఈ మనస్సు అనే సారంగము (లేడి) ని పట్టుకొనే గొప్ప వల వంటిది. బుద్ధి అంతరంగనాద శ్రవణముపై ఏకాగ్రవం అవటం – అనునది గొప్ప ఉపాయం.

ప్రాపంచకమైన 'ఆలోచనలు' అనే అసంఖ్యాక ఉత్తుంగ తరంగములు గల సముద్రజలమునకు 'చెలియలికట్టు' వంటిది... ఈ ప్రణవనాదోపాసన. "బ్రహ్మప్రణవరూపము – జ్యోతిర్మయము" అగు ప్రణవనాదోపాసన – అను శ్రవణ అభ్యాసము తప్పకుండా **చిత్త గజమును (లేక) చిత్తము** – అను లేడిని తనయొక్క అపరిశుభ్ర విషయ సంచారములనుండి నిరోధించగలదు.

## శబ్దమును దాటి ఆత్మతో తన్మయమవటం

మనము ఇప్పటి వరకూ **"అంతర హృదయమునుండి వినబడుచున్న ప్రణవనాదముపై బుద్ధిని, చిత్తమును ఏకాగ్రము చేయటము"..** అనే సాధన గురించి చెప్పుకుంటూ వస్తున్నాము కదా ! అయితే.., **తావత్ ఆకాశ సంకల్పో యావత్ శబ్దః ప్రవర్తతే ।** ఎంతెంత వరకు 'శబ్దము' ప్రవర్తిస్తూ ఉంటుందో.. అంతంత వరకు సంకల్పాకాశము ప్రవర్తమానమౌతూనే ఉంటుంది. ఎప్పుడైతే ఈ చిత్తము (లేక మనస్సు) – (జలములో ప్రవేశించిన ఉప్పు బొమ్మవలె) లయము పొందుచున్నదో... ఆ లయ స్థానమే **"విష్ణు పదము" లేక "పరమ పదము".** అనగా, సరి అయిన సమయములో (At appropriate time) **"అంతర నాద శ్రవణోపాసన"** ను అధిగమించిన ఆత్మ స్థానమును ఆశ్రయించాలి.

మనస్సు లయించగానే ఆత్మపదము బుద్ధికి అనుభవము కాగలదు. ఆత్మను భావన చేస్తూ ఉండగా, సందర్శిస్తూ ఉండగా, మనస్సు స్వయముగా "నిశ్శబ్దము – తత్ పరం బ్రహ్మ – పరమాత్మ" యందు లయించుచున్నది.

నాదము ఉన్నంతవరకు మనస్సు ఉంటుంది. **నాదము శాంతించు స్థానములో మనస్సు కూడా లయిస్తుంది.** భావనారూపమగు మనస్సు మౌనం వహించగా, అప్పుడు "మనోన్మనీ' (మనో – ఉన్మనీ) అని పిలువబడు "మనోరహిత – ఆత్మానుభవ బుద్ధి స్థితి' (లేక) 'ఆత్మాఽహమ్ ఆనంద స్థితి" స్వయముగా శేషించి ఉన్నదగుచున్నది.

**సశబ్దశ్చ అక్షరే లీనో, నిశ్శబ్దం పరమం పదమ్ ।**

శబ్దతత్త్వమంతా అక్షరము (మార్పు చేర్పులు లేనట్టి స్వస్వరూప తత్త్వము) నందు లీనమగుచున్నది. అప్పుడిక 'నిశ్శబ్దము' అను అలౌకిక ఆత్మానుబవ స్థితి మాత్రమే శేషించుచున్నది. అయితే అది ఎట్లా లభించగలదని అడిగితే ..,

**"సదా నాద అనుసంధానాత్ సంక్షీణే వాసనాతు యా"**

సదా ప్రణవనాదములో ఈ మనస్సు అనుసంధానమగుచూ ఉండగా, క్రమంగా వాసనలు (Tendencies regarding outside world scenary) స్వయముగా క్షీణిస్తున్నాయి. అప్పుడు ఆత్మయే సహజమైన స్వాభావసిద్ధమైన అనుభవము అగుచున్నది.

ఎప్పుడైతే 'మనస్సు' అనే వాయువు సర్వ సంశయములు త్యజించి నిరంజనము, నిర్మలము అగు 'బ్రహ్మము'నందు విలీనము అవటం జరుగుతుందో..,

**శ్లో॥ నిరంజనే విలీయేతే మనోవాయూ, న సంశయః,**
**నాదకోటి సహస్రాణి - బిందుకోటి శతానిచ**
**సర్వే తత్ర లయం యాంతి ।**

అప్పుడిక కోటి సహస్రనాదములు, బిందుకోటి సహస్రములు... ఇవన్నీ కూడా మనస్సుతోబాటే ఆ బ్రహ్మమునందు విలీనమగుచున్నాయి.

ఈ అనేకముగా కనిపిస్తూ ఉన్నదంతా వాస్తవానికి **"ఏకము-అఖండము అగు బ్రహ్మమే"... అని అనుకోవటం ప్రవృద్ధమౌతుంది.** అనుకుంటూ ఉండగా **'అనిపించటము'** ప్రారంభమౌతుంది. సర్వ భేదములు బ్రహ్మము రూపము చెంది భేదత్వమంతా కోల్పోవుచున్నాయి. ఆ ప్రణవ నాదోపాసకుని దృష్టిలో 'తాను–తదితరము' అంతా కూడా ఏకరూప బ్రహ్మమవటము బుద్ధికి సుస్పష్టము, నిర్దుష్టము అగుచున్నది. అట్టివాడు

... సర్వ అవస్థల నుండి 'విముక్తుడు' అగుచున్నాడు.

... సర్వ చింతనలను మొదలంటా వదలి వేయుచున్నాడు.

... గాంభీర్యముగా బ్రహ్మత్వము స్వయముగా పుణికిపుచ్చుకొనుచున్నాడు. సర్వము తానై స్వప్రకాశమానుడగుచున్నాడు.

అంతరహృదయమునుండి మంద్రముగా వినబడు ఓంకార నాదమును విను అభ్యాసము చేయు నాదయోగి, మొట్టమొదట ఇంద్రియ బాహ్య (unrelated, unnecessary) అసంగతములను, ఆ తరువాత సంగత (related, unnecessary) విషయములను, అటుపై క్రమంగా ఇంద్రియములకు అంతర్గ చతుష్టయమైనట్టి మనో – బుద్ధి – చిత్త – అహంకారముల సంబంధమైన ప్రాపంచక విషయములను... సాక్షిత్వముచే దాటి వేస్తున్నాడు. కేవల సాక్షిత్వమును పుణికి పుచ్చుకొనుచున్నాడు.

- ఇవి నాకు చెందినవిగావు....,
- వీటికి నేను చెందినవాడిని గాను...

అను అతీత – అప్రమేయ – మౌన – దృష్టితో దృశ్య–దేహ–ఇంద్రియ–మనో–బుద్ధి–చిత్త–అహంకారములను చూస్తూ ఉంటాడు.

ఇవన్నీ ....... ఎక్కడో! .... **కల్పనయందు!**

నేనో ........... మరెక్కడో! **కేవలీ స్వరూపమునందు** – అను అవగాహన – బుద్ధి వీడకుండా చూస్తూ ఉంటాడు.

**మృతవత్ తిష్ఠతే యోగీ, స ముక్తో! న అత్ర సంశయః॥**

**"ఎప్పుడో, ఎప్పుడని తెలియని క్షణంలో ఈ భౌతిక దేహపతనము ఈ జీవునిపట్ల అనివార్యము కదా! ఆ మరుక్షణం? ఈ దేహానికి సంబంధించిన సంపదలు, సంబంధాలు, అనుబంధాలు, బాంధవ్యాలు సుఖాలు, దుఃఖాలు మొదలైన అనేక ప్రపంచ సంబంధమైన విషయాలు ఆ మృతుని వెంట వెళ్లుచున్నాయా? లేదే? అందుచేత నేను వాటినన్నిటినీ ఒక మృతునివలె ఇప్పుడే వదలి, సంబంధమే లేనివానివలె ఎందుకుండకూడదు? అవన్నీ నాకు సంబంధించనివిగాను, నేను వాటికి సంబంధించనివానినిగాను దర్శిస్తూ ఉంటాను"**....... అను భావన, కలిగి హృదయ ప్రణవనాదోపాసనపై బుద్ధిని నిలుపుకొని సాధనకు ఉపక్రమిస్తూ, నిర్వర్తిస్తూ ఉన్న యోగి **ఇక ముక్తుడే** ! ఇందులో సందేహమే లేదు.

ఈ విధంగా 'మృతవత్'.. భావనతో (ఈ భౌతికదేహమును – మరణించిన వస్తువు – అను భావనతో) ప్రణవనాదోపాసనను నిర్వర్తించు యోగి క్రమంగా 'మనస్సు' యొక్క స్థితిని దాటవేసి, మనస్సును కూడా తదితర బాహ్య వస్తువులవలె చూడగలడు. అట్టి మనో అతీత స్థితిని 'ఉన్మనీఅవస్థ'... అని యోగ శాస్త్రజ్ఞులు పిలుస్తున్నారు. అది మనస్సు ఆత్మయందు ఆత్మభావనయందు లయమైన స్థితి. అట్టి ఉన్మనీ అవస్థలో అంతర హృదయ ప్రణవనాదోపసనచే ప్రవేశించిన యోగి.....

- **కాష్ఠవత్ జ్ఞాయతే దేహమ్.....** ఈ దేహమును ఒక జడమైన 'కట్టె'ను చూస్తున్న రీతిగా చూస్తూ ఉండగలడు.
- **న జానాతి శీతోష్ణమ్..** అతడు శీత ఉష్ణ దేహతాపములను కూడా సాక్షివలె, "తనకు సంబంధించని–కాష్ఠదేహ సంబంధించిన" విషయములవలె దర్శిస్తూ ఉంటాడు. దేహబాధలకు కూడా సాక్షిగా అయి, వాటికి అల్లంత దూరమైన విషయాలుగా చూస్తూ ఉంటాడు.
- **న దుఃఖం-న సుఖం ...** "నాకు సుఖము లేదు. దుఃఖము లేదు. నేను ఆ రెండింటికీ సంబంధించనివాడని"... అను ఉత్తమ బుద్ధిని కలిగి ఉంటాడు. అతని దృష్టిలో అవన్నీ పెద్దగా పట్టించుకోవాలసినవే కావు. 'అందరికీ ఉండేవే! పైగా అవి దేహ సంబంధమైనవి. మరి నేనో! ఆత్మ స్వరూపుడను కదా! నాకేమి సంబంధము?' – అను అవగాహనతో పరాక్రమ సమన్వితుడై ఉంటాడు.
- **న మానమ్, న అవమానమ్...** జగత్తులో అతడు మానవమానములకు పట్టుబడక, వాటిచే స్పృశించబడక ఉంటాడు.

అతడి దృష్టిలో జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు కూడా "లేనివే" అగుచున్నాయి. అవస్థాత్రయమను చిత్త సంబంధమైనవిగా మాత్రమే చూస్తూ, తాను ఆ చిత్తమును 'చిత్' స్వరూపమగు ఆత్మయందు లయింపజేసివేస్తాడు. **"మనో – చిత్తములకు కనిపించేదంతా ఆత్మస్వరూపమే"** అను అవగాహనను **"చిత్తలయస్థితి"** అని అంటారు. అట్టి స్థితి 'సమాధి' అని కూడా పిలువబడుచున్నది. **"జగత్తుగా కనిపించేదంతా ఆత్మానంద స్వరూపమే ! బ్రహ్మమే"..** అను భావన – అవగాహనలచే ఆ యోగి "సమాధి నిష్ఠుడు" అగుచున్నాడు. అతని చిత్తము సర్వదా (అన్ని స్థితులలోను)... దేహము వస్తున్నప్పుడు ఉంటున్నప్పుడు – పోతున్నప్పుడు కూడా ... త్రి అవస్థలందు **ఆత్మ భావన** వీడనివాడై ఉంటున్నాడు. అందుచేత

**"న చిత్తం యోగినః సదా"..**

అతడు చిత్తరహితుడుగా సమాధి స్థితుడుగా చెప్పబడుచున్నాడు. "చిత్తమే ఆతని పట్ల లేదు" అని అనబడుతోంది.

ఇక ఈ విధంగా ఆతడు జాగ్రత్ – స్వప్న అవస్థల నుండి విడివడినవాడై, వాటిచే తాను మార్పు – చేర్పులు పొందనట్టి అవగాహనతో, ఆత్మ నిష్ఠను వదలక ఉంటున్నాడు. అట్టివాడు **"స్వరూపావస్థ స్థితుడు"...** అని చెప్పబడుచున్నాడు. **స్వరూపావస్థ తామియాత్ !** స్వ స్వరూపము – సహజము అగు **"పరబ్రహ్మరూపావస్థ"** యందు సంస్థితుడగుచున్నాడు.

ఇక ఆతడు **"బ్రహ్మతారాంతరాంతరుడు"** (స్వస్వరూప అంతరాంతర స్వరూపుడు...,) అయి ఉంటున్నాడు.

ఎప్పుడైతే...

- ఈ దృశ్యము ఎదురుగా ఉన్నప్పటికీ స్థిరమైన దృష్టిచే దృశ్యమంతా ఆత్మగానే దర్శిస్తూ.. స్వాత్మకు వేరైన దృశ్యమనునది లేనివాడై ఉంటాడో...
- ప్రాణచలనము కూడా ఆత్మయందు, ఆత్మగా సంస్థితమై, అప్రయత్నముగానే ఆత్మగా అనుభూతమౌతుందో.. (స్థిరప్రాణమే చంచలముగా కూడా... అని తెలియవస్తుందో...),
- చిత్తము ఏ అవలంబనము (ప్రాణోపాసన – ఓంకార నాదోపాసన మొదలైన సాధనల ఆయా – ప్రయత్నములు లేకుండానే) – స్థిరత్వము సంతరించుకుంటుందో

**అతడే బ్రహ్మతారాంతరాంతరుడు.**

సహజమగు ఆత్మయే స్వరూపముగా గల ఓ ప్రియ జనులారా ! మనమంతా కూడా అంతరంగ ప్రణవ ఓంకార శబ్దోపాసనము ఆశ్రయించి

దృశ్యమును నాదమునందు
నాదమును ప్రాణమునందు
ప్రాణమును ఆత్మయందు
లయం చేస్తూ...

దృశ్యమును మృతవత్ – గతించి పోయిన దానివలె దర్శిస్తూ ఉండెదము గాక! శబ్దమును మనస్సునూ దాటి, **మనోన్మనీ స్థానము** చేరి సమాధినిష్ఠులమై దేహమును ఒక జడకట్టుకొయ్యవలె దర్శిస్తూ ..., సర్వ ద్వంద్వములకు, త్రి – అవస్థలకు సాక్షిస్వరూపులమై, జగత్ దృశ్యము ఉండి కూడా – లేనివారలమై ఉండెదము గాక! చిత్తమును – ప్రాణమును స్థిరపరచి సమాధి సంస్థితులై **"బ్రహ్మమే నేను"** **"సర్వము నేనే"** అను స్థానమును ఆస్వాదించెదముగాక!

**ఇతి**


**నాద బిందూపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఋగ్వేదాంతర్గత

# 7 నిర్వాణోపనిషత్

## శ్లోక తాత్పర్య పుష్పమ్



శ్లో॥ నిర్వాణ ఉనిషత్ వేద్యం నిర్వాణానంద తుందిలమ్
త్రైపదానంద సామ్రాజ్యమ్ స్వమాత్రమితి చింతయేత్ ॥

*ఈ నిర్వాణోపనిషత్ పలుకుచున్న నిర్వాణానంద సామ్రాజ్యమును "**త్రైపదానంద సామ్రాజ్యము**"గాను, "**స్వస్వరూప మహిమ**"గాను తెలుసుకొనబడును గాక! అట్టి ఆస్వాదనకై **చింతన** చేయబడును గాక!*

1. **ఓం అథ నిర్వాణోపనిషదమ్ వ్యాఖ్యాస్యామః।**
**పరమహంసః సోఽహమ్।**
**పరివ్రాజకాః పశ్చిమలింగాః।**
**మన్మథః క్షేత్రపాలాః।**
**గగన సిద్ధాంతః।**
**అమృత కల్లోల నదీ।**
**అక్షయమ్ నిరంజనమ్।**
**నిస్సంశయ ఋషిః।**
**నిర్వాణో దేవతా।**
**నిష్కుల ప్రవృత్తిః।**
**నిష్కేవల జ్ఞానమ్।**
**ఊర్ధ్వామ్ ఆమ్నాయః।**
**నిరాలంబ పీఠః।**
**సంయోగ దీక్షా।**
**వియోగో ఉపదేశః।**
**దీక్షా సంతోషపానం చ।**
**ద్వాదశాదిత్య అవలోకనమ్।**

ఇప్పుడు ఇక మనము **'నిర్వాణము'** అను ఉపనిషదమును (పుణ్యక్షేత్రమును) గురించిన (సారూప్యత - సామీప్యత) విషయమై వ్యాఖ్యానించుకొనుచున్నాము.
నేను ఆ పరమహంసయే సహజ స్వరూపముగా కలిగి యున్నాను. పరమహంసయే అయి ఉన్నాను. పరివ్రాజకత్వము నాయొక్క ఆ తత్ చిహ్నము. నిర్వాణ స్థానము యొక్క ఒక గుర్తు మూలవిరాట్టు.
మన్మథుడు క్షేత్రపాలకుడు. (నా ఇచ్ఛా స్వరూపమే ఈ జగత్తు).
"నేను చిదాకాశమును" - అనునది సిద్ధాంతము.
అమృత స్వరూప జలము-జన్మలు అను తరంగముల కల్లోలముతో కూడిన నది.
క్షయమనునదే లేనట్టి నిరంజన (నిర్దోష) ఆత్మ స్వరూపము. (జీవాత్మ).
సర్వ సందేహములు తొలగడమే ఋషి!
నిర్వాణమే (లేక) మోక్షమే దేవత!
కుల-జాతి భేదరహిత - నిర్మలబుద్ధియే ప్రవృత్తి.
సాపేక్ష రూపమగు నిష్కేవలమే జ్ఞానము.
వేదముల ప్రతి పాదితమగు ఏకతత్త్వమే ఊర్ధ్వము.
నిర్విషయమగు నిరాలంబమే పీఠము!
ఆత్మతో సంయోగము - దీక్ష!
జగత్ విషయములతో వియోగమే - ఉపదేశము.
సంతోషముగా ఉండటం, తృప్తి - అనునది దీక్ష.
ద్వాదశ ఆదిత్యత్వమే అవలోకనము.

2. వివేక రక్షా।

వివేకము --- నిర్వాణయోగికి రక్ష!

కరుణైవ ఆనందమాలా।

కరుణయే --- ఆనందమాల!

ఏకాసన గుహాయామ్।

ఏకాసనమే --- ఏకాంతగుహ!

ముక్తాసన సుఖగోష్ఠీ।

ముక్తాసనమే --- సుఖగోష్ఠి!

అకల్పిత భిక్షాశీ।

కల్పనరహితమైన ఆత్మత్వమే కోరుకొను బిక్ష.

హంస ఆచారః।

హంసోఽహమ్ - సోఽహమ్ - త్వమేవాఽహమ్ .... మహా వాక్యాలు - ఆచారము.

సర్వభూతాంతర్వర్తీ హంస ఇతి ప్రతిపాదనమ్।

సర్వజీవుల అంతరహృదయవర్తి "హంస",.... హంసయోగ ముఖ్యార్థముగా ప్రతిపాదనము. నేను సర్వ హృదయములలో అంతర్యామిని అనునదే హంస యోగము.

ధైర్యమ్ కంథా।

"ధైర్యము"అను **బొంత** ధరించి ఉండటము.

ఉదాసీన కౌపీనమ్।

సర్వ వ్యధలను జయించి, సర్వ ప్రాపంచక విషయములపట్ల ఉదాసీనంగా ఉండటం (Un affected and silently wel-balanced) అనునదే **కౌపీనము**! విచారణయే - **యోగదండకము**.

విచార దండః।

బ్రహ్మావలోకో యోగపట్టః।

"జగత్తు బ్రహ్మమే" అను నిశ్చలబుద్ధితో బ్రహ్మావలోకనము యోగపట్టు.

శ్రియాం పాదుకా పర ఇచ్ఛ - ఆచరణమ్।

శ్రీపాదుకాపరమైన ఇచ్ఛయే (శ్రీవారి పాదుకలు హృదయములోను-శిరస్సుపై ధారణ చేయుట) ... ఆచరణ.

కుండలినీ బంధః।

కుండలీ శక్తిని ఉపాసించటము - యోగ బంధము.

పరాపవాదముక్తో జీవన్ముక్తః।

పరాపవాదము నుండి (పరతత్త్వ జ్ఞాన అంశములను తిరస్కరించు సంభాషణములకు దూరంగా) ముక్తుడై ఉండటము ... జీవన్ముక్తి.

శివయోగనిద్రా ఖేచరీ ముద్రా చ।

త్వమ్ శివేతి - శివతత్త్వ జ్ఞానములో విశ్రాంతియే ఖేచరీ ముద్ర.

పరమానందీ। నిర్గత గుణత్రయమ్।

పరతత్త్వమును జ్ఞప్తిలో ఉంచుకొనినవాడు - పరమానందీ! త్రిగుణములను వదలి దాటి దర్శించువాడు నిర్గతగుణుడు! వివేకముచేతనే లభించునది ఆత్మానుభవము.

వివేక లభ్యమ్।

మనో-వాక్ అగోచరమ్।

అట్టి ఆత్మానుభవము (లేక) శివయోగ స్థానము (యోగనిద్ర) మనస్సుకు - వాక్కుకు అగోచరము. మనస్సునకు విషయము కాదు. ఏది జనిస్తోందో ... అట్టి జగత్తు నిత్యమైనది కాదని గమనించి ఉండాలి. జగత్తు జనించనే లేదు.

అనిత్యమ్ జగత్ యత్ చ అజ్జనితమ్।

స్వప్న జగత్ అభ్ర-గజాది తుల్యమ్।

ఈ జగత్తు కలలో విశేషాలవంటిదే! మేఘములందు మేఘాకారంగా కనిపించే ఏనుగు వంటిది. వాస్తవానికి మేఘములలో ఏనుగు ఉండదు కదా!

తథా దేహాది సంఘాతమ్,

ఈ దేహములతో సంఘాతము కూడా అటువంటిదే!

మోహగుణజాల కలితమ్।

మోహము (illusion) త్రిగుణములు అనే జాలము (వల)చే నిండి ఉన్నట్టిది.

తత్ రజ్జు-సర్పవత్ కల్పితమ్।

త్రాడుపై ఆపాదించబడిన పామువలె ఈ జగత్-దృశ్యమంతా కల్పితము.

విష్ణు విద్యా-ఆది శతాభిధాన లక్ష్యమ్।

విష్ణుమాయ - (యోగమాయ) మొదలైన అనేక (శాస్త్రములుచెప్పే) పేర్లకు విషయము ఈ మోహము.

అంకుశో మార్గః।

ఏనుగుకు అంకుశమువలె ఈ మాయామయ, జగత్తును జగత్తుగా చూడక, ఆత్మగా చూచే మార్గము ఆశ్రయించాలి.

శూన్యం న సంకేతః।

ఈ జగత్తు వాస్తవానికి శూన్యమే అనునది సంకేతము కాదు. ఇది ఆత్మయే! పూర్ణమిదమ్!

పరేశ్వర సత్తా।

ఇహమంతా కూడా పరమగు ఈశ్వరసత్తాయే!

సత్య సిద్ధయోగో మఠః।

దృశ్యమానమగు జగత్తును సత్యమగు పరేశ్వర స్వరూపముగా దర్శించు యోగాభ్యాసమే మఠము.

అమరపదమ్ న తత్ స్వరూపమ్।

అమరపదము (స్వర్గలోకము) ఆ తత్ స్వరూపము కాదు!

3. ఆది బ్రహ్మ స్వ సంవిత్।
అజపా గాయత్రీ।
వికార దండో ధార్యః।
మనో నిరోధినీ కంథా।
యోగేన సదానంద స్వరూప దర్శనమ్।
ఆనంద భిక్షాశీ।
మహాశ్మశానేఽపి ఆనందవనే వాసః।
ఏకాంతస్థానమ్ ఆనంద మఠమ్।
ఉన్మని - అవస్థా।
శారదా చేష్టా।
ఉన్మనీ గతిః।
నిర్మల గాత్రమ్।
నిరాలంబ పీఠమ్।
అమృతకల్లోల ఆనంద క్రియా।
పాండరగగన మహాసిద్ధాంతః।
శమ-దమాది దివ్యశక్త్య ఆచరణే
క్షేత్ర పాత్ర పటుతా। పరాపర సంయోగః
తారక-ఉపదేశః।

ఆది స్వరూప-స్వస్వరూపమగు సంవిత్‌యే (సత్-ఉనికి, విత్ -ఎరుక) అజపా గాయత్రి! అదియే స్వయం భావనోపాసన! అర్థముయొక్క భావనయే అజపా గాయత్రి!

జగత్ వికారములు పూలదండవలె ధరించాలి.

మనస్సును నిరోధించటమే కండువా! బొంత!

యోగబలముతో సదానందరూపముగా ఈ సర్వమును దర్శించాలి!

"ఆనందము" నే బిక్షగా స్వీకరించి ఉండాలి.

విషయములన్నీ లయించినట్టి మహాశ్మశానమే ఆనందవన స్థానము.

ఏకాంత స్థానమే ఆ ఆనంద మఠము.

మనస్సును సాక్షిగా దర్శించు ఉన్మనీయే ఆ స్థితి, అవస్థ. చేష్ఠ ఆత్మవిద్యా (శారదావిద్యా) రూపముగా ఉండుగాక! గతి కూడా మనస్సును దాటినట్టి ఉన్మనియే! (భౌతిక-మానసిక-బుద్ధిరూప) దేహములను - నిర్మలము చేసుకోవాలి.

ఆలంబనములన్నీ లయించినట్టి నిరాలంబమే (ఏదీ ఆధారముగా కలిగి ఉండక అన్నిటికి తానే ఆధారమైనదే) - పీఠము.

క్రియలన్నీ అమృతసాగర ఆనంద క్రియలే!

పాండవాకాశమే (బ్రహ్మకాశమే).... మహా సిద్ధాంతము.

మనో-ఇంద్రియ నిగ్రహమే ఆచరణగా ఉండవలసినది! అదియే క్షేత్రము - పాత్రల పటుత్వము.

పరము-అపరముల ఏకత్వమే (సంయోగమే) తారకమంత్రము. తారకోపదేశము.

---

4. అద్వైత సదానందో దేవతా।
నియమస్య అంతరింద్రియనిగ్రహః।
భయ-మోహ-శోక-క్రోధ త్యాగః సత్యాగః।
పరావరైక్య రసాస్వాదనమ్।
అనియామకత్వ నిర్మలశక్తిః।
స్వప్రకాశ బ్రహ్మతత్త్వే
శివ-శక్తి సంపుటిత ప్రపంచ ఛేదనమ్।
తథా పత్రాక్ష అక్షి కమండలు భావాభావ దహనమ్।
బిభ్రతి ఆకాశ ఆధారమ్।
శివం తురీయం యజ్ఞోపవీతమ్।
తన్మయా శిఖా।

సదా అద్వైతానందమే దేవత!

శాస్త్రములు - గురువులు నియమించి చెప్పే నియమములు... అంతరింద్రియ నిగ్రహరూపము.

భయము-మోహము-శోకము-క్రోధములను త్యజించటమే నిజమైన త్యాగము.

పరతత్త్వమును ఆస్వాదిస్తూ ఇహస్వరూపమును అధిగమించి-ఉండటము ... రసాస్వాదనము. ఏకము-అక్షరము అగు తత్త్వమే రసాస్వాదనము.

మనో-బుద్ధి - చిత్తములను నియమించి, వాటికి ఆవలసాక్షియై ఉండటమే నిర్మలశక్తి! ఆత్మ నిర్మలశక్తి స్వరూపము. బ్రహ్మతత్త్వము స్వయం ప్రకాశకమైనది.

శివ-శక్తి తత్త్వములకు సంపుటీకరముచే ప్రపంచము ఛేదించబడగలదు.

అదేవిధంగా పత్రాక్షము (Perception of Divisibility), అక్షికమండలు (నిశ్చలంగా నిలబడే దృష్టితో)లచే భావ- అభావములను దహింపజేయబడగలవు. కళ్లే పులి చర్మము, దృష్టియే కమండలము.

ఆత్మాకాశమే సర్వమునకు ఆధారము. శివము, తురీయము అనునవే .... యజ్ఞోపవీతము.

ఆత్మతో తన్మయత్వము - శిఖ!

5. చిన్మయంచ ఉత్-సృష్టి దండమ్।
సంతత అక్షి-కమండలుమ్।
కర్మనిర్మూలన కథా।
మాయా మమత అహంకార దహనమ్।
శ్మశానే అనాహతాంగీ।
నిస్త్రైగుణ్య స్వరూపానుసంధానమ్, సమయమ్।
భ్రాంతి హరణమ్।
కామాది వృత్తి దహనమ్।
కాఠిన్య దృఢకౌపీనమ్।
చీరాజిన వాసః।
అనాహత మంత్రః।
అక్రియైవ జుష్టమ్।
స్వేచ్ఛాచారో స్వస్వభావో మోక్షః।
పరబ్రహ్మ ప్లవత్ ఆచరణమ్।
బ్రహ్మచర్యః శాంతి సంగ్రహణమ్।
బ్రహ్మచర్యాశ్రమే అధీత్య,
వానప్రస్థాశ్రమే అధీత్య,
స సర్వ విన్యాసమ్ 'సన్యాసమ్'।
అంతే బ్రహ్మ-అఖండాకారమ్।
నిత్యం సర్వసందేహ నాశనమ్।
ఏతత్ నిర్వాణ దర్శనమ్।
పుత్రం వినా శిష్యం వినా
నదేయమ్।
ఇత్యుపనిషత్
నిర్వాణోపనిషత్ సమాప్తః
ఓం శాంతిః శాంతిః శాంతిః

చిన్మయానందమే సృష్టి! ఇదంతా ఎత్తబడిన చిన్మయానంద దండమే!
చిన్మయానందరూపమగు దృష్టియే ఎల్లప్పుడు చేతితో ధరించవలసిన కమండలము.
కర్మరాహిత్యము - కర్మల నిర్మూలనము గురించే ఎప్పుడు కథగా చెప్పుకోవాలి.
మాయా రూపములయినట్టి మమత-అహంకారములను యోగాగ్నితో దహిస్తూ ఉండాలి.
ఈ భౌతిక దేహమును శ్మశానము చేరబోవు వస్తువుగా చూస్తూ, (తనకు తానుగా) బాధింపజాలని వస్తువుగా దర్శించాలి. హృదయమే (అనాహతమే) విషయ రహిత శ్మశానము.
సమయమంతా త్రిగుణములకు ఆవలగల నిర్గుణ నిర్మల స్వరూపమును అనుసంధానం చేస్తూ గడపాలి.
సర్వభ్రాంతులను జ్ఞాననేత్రముతో మ్రింగివేయాలి.
"ఏదో ఇంకా కావాలి" అనేదే కామము. సర్వకామ వృత్తులను దహించివేయాలి.
ఈ దృశ్య విషయాలచే స్పర్శ పొందని కఠినమైన బుద్ధిని కౌపీనముగా ధరించాలి.
యోగ నార బట్టలను ధరించి ఉండాలి.
అనాహతమే (వాయుస్తంభనయే) మంత్రముగా (మననముగా) స్వీకరించాలి.
"నాహమ్ఽ కర్తా" అను అక్రియత్వము (నిష్క్రియత్వము) స్వీకరించబడినదై ఉండుగాక!
స్వస్వభావము-స్వస్వరూపము అగు ఆత్మ నిత్యస్వేచ్ఛా స్వరూపమైనదిగా దర్శించటమే మోక్షము. నాటక పాత్రవంటి జీవాత్మకు ముక్తి లేదు. అవసరమూ లేదు. సహజమగు ఆత్మకు బంధమే లేదు. ఆత్మకు ముక్తితో పని ఏమి? ఆత్మ నిత్య ముక్తము కదా?
పరబ్రహ్మత్వమును ఆరాధిస్తూ తత్ ధారణ కలిగి ఉండటమే ఆచరణము.
బ్రహ్మమే ఇదంతా-అను మనోబుద్ధులతో చరించు బ్రహ్మచర్యమే శాంతిని స్వీకరించటం.
బ్రహ్మచర్యము అనే మార్గముగా ఆత్మగురించి అధ్యయనము చేయాలి.
వనములో మనస్సు (Hands may be in the world. But Head should be in the forest)
**ఆత్మయొక్క విన్యాసమే ఇదంతా** గీ అను నిశ్చల అవగాహనయే సన్యాసము.
చివరికి అఖండబ్రహ్మాకారమే నేనగుట!
ఇక జ్ఞానమెందుకు! ఎల్లప్పుడు నేను బ్రహ్మమే అను విషయములో సర్వ సందేహాలు తొలగటానికై! స్వస్వరూపము గురించిన సందేహాలు నశింపజేసుకోవాలి.
అఖండమగు బ్రహ్మమే నేను... అనునదే నిర్వాణ సందర్శనము.
ఈ నిర్వాణోపనిషత్ పితృభక్తి గల పుత్రునికి, గురుభక్తి గల శిష్యునికి బోధించిన ఉత్తమ ప్రయోజనము సిద్ధించగలదు. అట్టి భక్తి లేనప్పుడు వారు ఇందలి జ్ఞానము విశదీకరించటానికి అనర్హులు.
**ఇతి నిర్వాణోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**




ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 7 నిర్వాణోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



ఇప్పుడిక మనము "నిర్వాణోపనిషదము"ను వ్యాఖ్యానించుకొనుచున్నాము. నిర్వాణయోగ సిద్ధి యొక్క సామీప్యానుభవం గురించి చెప్పుకుంటున్నాము.

పరమహంసోఽహమ్। సోఽహమ్। హంసోఽహమ్। నాయొక్క ఇహ (ఇక్కడి) స్వరూపము ఒక కలవంటిది. పరస్వరూపమే నేను! అది నా సహజ స్వరూపము!

### "నిర్వాణయోగియొక్క తత్త్వ దర్శనము"

"నేను".... పరమహంస స్వరూపుడను! పరమహంసత్వమే నా వాస్తవ సహజ స్వరూప స్వభావములు.

నేను సంచారము చేయు దృశ్యజగత్తు నా యొక్క పరమహంస – పరివ్రాజకత్వము యొక్క ఒకానొక చిహ్నరూపము.

ఈ ఇంద్రియజగత్తుకు మనోరూపుడగు **మన్మథుడు** నాయొక్క నిర్వాణ సామ్రాజ్యమునకు **క్షేత్రపాలకుడు.**

ఈ అకాశమంతా నా సిద్ధస్వరూపముతో నిండినదై ఉన్నది! భూతాకాశము, చిత్తాకాశము కూడా నా చిదాకాశ స్వరూపమునకు అభిన్నము.

- అనేక దృశ్య వ్యవహార పరంపరా తరంగములతో కూడిన ఈ **విశ్వము** అనే నది నా **అమృత స్వరూపజలముచే** నిండి వున్నది.
- అట్టి నా **వేద వాఙ్మయ ప్రవచితం అయిన అమృతాత్మ స్వరూపము-అక్షయమైనది.** జగత్ దోషములతో స్పృశించబడక, నిరంజనమై యున్నది.
- ఋషివాక్యములచే ఋత్ – సత్యము బోధపడి, సర్వ సంశయములు మొదలంట్లా తొలగిపోవటము సహజముగా జరిగిపోతోంది.
- నిర్వాణమును సుస్పష్టముగా ఆస్వాదించు ఇక్కడి మహనీయులే నాకు నిర్వాణ **స్థాన దేవతామూర్తులు!**
- ఆత్మయొక్క నిర్విషయ – నిష్కళంక – నిర్దోష – నిర్మల – సహజమగు తత్త్వానుభవము – నాకు ప్రవృత్తి.
- నిర్విషయ కేవలీత్వము → **జ్ఞానము.**
- వేద – ఉపనిషత్ ప్రతిపాదించు ఆత్మతత్త్వము → **ఊర్ధ్వగమనము.**
- ఆధారరహితమగు (అన్నిటికీ ఆధారమై) నిరాలంబస్థానము → **నిర్వాణపీఠము.**
- అట్టి నిష్కళంక – నిరాలంబమగు ఆత్మతో సంయోగము → **దీక్ష.**
- 'ఒకటి – రెండుగా ప్రకాశించుట – ఆత్మ – జగత్ రూపముగా ప్రదర్శించుట – లీలగా జరుగుతోంది. ఇది నిర్వాణయోగి యొక్క ద్వాదశాదిత్య.... **అవలోకనము!**

**వివేక రక్షా :** వివేకముతో కూడిన దృష్టి → **రక్షా బంధనము!**

**కరుణైవ ఆనందమాలా :** కరుణ వాత్సల్యము – నా నిర్వాణ స్థానమును అలంకరించి ఉన్న → **ఆనందమాల!**

**ఏకాసన గుహాయాం :** బాహ్యమున అనేకముగా కనిపిస్తూ కూడా, అంతరమున (అంతర్ దృష్టిచే) ఏకముగా కనిపించు స్థానమే ఆ నిర్వాణము దాగి ఉన్న గుహ. త్రిగుణముల జనిత స్థానమే నా అంతరంగ స్వరూపము.

**ముక్తాసన సుఖ గోష్ఠీ :** "బంధమనునది స్వతఃగా లేదు" … అనురూపమైన వాఙ్మయము → **నాకు సత్సంగరూప సుఖ గోష్ఠి.**

**అకల్పిత భిక్షాశీ :** కల్పనలన్నీ లయించినట్టి అకల్పితాత్మ తత్త్వము నా యొక్క ఆ **నిర్వాణస్వరూప శివరూపత్వపు→ఆది భిక్షుత్వము.**

**హంస – ఆచారః :** హంసః – సోఽహమ్ – 'నేను' గా అనుభవమగుచున్నదంతా బ్రహ్మమే… అనునది **ఆచారము.**

**సర్వభూతాంతవర్తీ 'హంసా' :** సర్వజీవుల (భూతముల) అంతర్వర్తిగాను, అంతర్యామిగానూ తనను తాను గమనించటమే **'హంస' రూపము.**

**'ఇతి' ప్రతిపాదనమ్ :** నిర్వాణము – "ఆత్మయే – స్వస్వరూపముగా, సర్వస్వరూపంగా దర్శించటము"… అనునది ఆధ్యాత్మ శాస్త్ర **ప్రతిపాదనము, శృతి ప్రతిపాదితము** కూడా! ఆత్మయే జగత్ దృశ్యరూపముగా ఏక–అఖండమై యున్నది – అనునది అనుక్షణిక బుద్ధి ప్రతిపాదనము.

**ధైర్యమ్ కంథా :** సర్వ పిరికితనములను, దృశ్యసంబంధమైన సర్వసుఖ–దుఃఖ ద్వంద్వములను, జీవాత్మ – పరమాత్మ భేద భావములను అధిగమించుచున్నాను. బుద్ధితో **"గొప్ప ధైర్యము"** అనే గొంగళిని ధరించుచున్నాను. (నా ఽయమాత్మా బలహీన లభ్యః)! సర్వ బేలతనములను వదలివేస్తున్నాను. నేను సర్వాత్మకుడనై ఉండగా భయమెందుకు?–అనునదే మోక్షార్థి అగు యోగి ధరించు గొంగళి (దుప్పటి).

**ఉదాసీన కౌపీనమ్ :** దృశ్యములో 'ఏమి పొందాము ? ఏమి పొందలేదు' … ఇట్టి విషయములను తీసి దూరంగా ఉంచుచూ, "సర్వ సందర్భముల పట్ల, సర్వ ఇంద్రియ విషయముల పట్ల ఈ దేహము యొక్క రాక పోకల పట్ల" కూడా **ఉదాసీనము** వహించటమే నిర్వాణయోగోపాసన! జగత్ సన్యాసిగా ధరించే **కౌపీనము (గోచి). (ఉదాసీనమ్ గత వ్యథా).**

**విచార దండః :** ఆత్మ – అనాత్మ విచారణ, ఏది నిత్యము, సత్యము – ఏది అనిత్యము, అసత్యము (కల్పనా మాత్రము) …. అను విచారణయే నిర్వాణయోగినగు నా చేతిలోని **దండము.**

**బ్రహ్మావలోకో యోగపట్టః :** కనబడే లోకములన్నీ ఈ సర్వజీవులను కూడా బ్రహ్మముగా అవగాహనతో సందర్శించటము నా నిర్వాణయోగము యొక్క యోగ పట్టు (లేక) యోగ సాధన.

**శ్రియాం పాదుకా పర ఇచ్ఛా ఆచరణం :** శ్రీపాదుకాపరమైన 'ఇచ్ఛ'యే → ఆచరణము. 'అపరము' అగు ఈ దృశ్యమునందు నేను సంచరిస్తున్నప్పుడు శ్రియమగు ఆత్మభావనయే నేను ధరించు పాదుకలు (చెప్పులు). సర్వాంతర్యామియగు పరమాత్మయొక్క పాదపద్మములను శరణు వేడుతూ పరాప్రేమతో ఆశ్రయించి ఉండటమే – ఆచరణము.

**కుండలినీ బంధః :** కుండలినీ యోగాభ్యాసమే చంచల ప్రాణములకు ఆధారమగు నిశ్చల ప్రాణశక్తిని ఆశ్రయించు **ప్రాణబంధము.**

**పరవాదముక్తో జీవన్ముక్తః :** 'పరబ్రహ్మమునకు జగత్తు జీవుడు వేరు"… అను సర్వ అపవాదముల నుండి (పరాపవాదముల నుండి) ఎవరు ముక్తుడౌతాడో, అట్టి నిర్వాణ యోగి **జీవన్ముక్తుడు. నేను సర్వ అపవాదములనుండి విముక్తుడను – అగుచుండెదను గాక – అనునదే ముక్తికి మార్గము.**

**శివయోగనిద్రా ఖేచరీముద్రౌచ :** సర్వము శివమయముగా (శివాత్ పరతరమ్ నాస్తి), దర్శించుటయే శివతత్త్వ జ్ఞానము. అట్టి యోగ నిద్రా మౌనమును ఆశ్రయించటమే నిర్వాణ యోగికి **ఖేచరీ ముద్ర !** నిర్వాణయోగినై **'సర్వము శివమయమే'** అనే ఖేచరీ ముద్రను ధరించినవాడనై ఉండెదను గాక – అనునదే ఆత్మయోగి యొక్క ఖేచరీ ముద్ర.

**పరమ – ఆనందీ :** నిర్వాణ యోగి ఈ దృశ్య జగత్తులో క్రొత్తగా ఏదో చూచి ఆనందము పొందువాడు కాదు. అతని ఆనందమునకు ప్రసాదించునది – విఘాతము కలిగించునది అగు విషయమేదీ ఈ విశ్వములో ఉండదు. ఉండజాలదు. పరమగు ఆత్మ స్వరూపమును బుద్ధితో గ్రహించి, అదియే తనకు ఆనందమగు విషయముగా కలిగినవాడై ఉంటాడు. అతడు నాకు **మార్గదర్శి.** ఇహమును అధిగమించిన దృష్టియే పరమానందము.

**నిర్గత గుణత్రయమ్ :** సత్త్వ-రజో-తమో త్రిగుణములు కూడా అతని పట్ల **గతించిపోయిన విషయాలై** ఉంటాయి. ఇక ఆత్మజ్ఞుడు గుణములకు కేవలము సాక్షి అయి, త్రిగుణములకు అతీతుడై సర్వులయందు గల "**గుణములకు సంబంధించని ఆత్మ**" యందు దర్శనము కలిగి ఉంటాడు. అందరినీ ఆత్మ స్వరూపంగా చూస్తూ, ఆత్మయందు మాత్రమే రమిస్తూ ఆత్మారాముడై ఉంటాడు. గుణములకు అతీత దృష్టితో సహజీవులను గాంచటమే - నిర్గత గుణత్రయము.

**వివేక లభ్యమ్ :** వివేకియై సర్వదా సర్వత్రా ఆత్మ దృష్టి లభించినవాడై ఆ నిర్వాణయోగి ఆనందిస్తూ ఉంటున్నాడు. వివేకము - వివేక దృష్టియే ఈ జగత్తు నుండి పొందవలసిన లాభము.

**మనో-వాక్ అగోచరమ్ :** మనస్సుకు - వాక్కుకు కూడా అగోచరమై, బుద్ధిచే మాత్రమే (With mere common-sense) నిర్వాణస్థానమును దర్శిస్తూ, ఆస్వాదిస్తూ ఉంటున్నాను. కేవలము నిర్మల - సునిశిత బుద్ధికి మాత్రమే తెలియవచ్చునదే 'ఆత్మ'!

**అనిత్యమ్ జగత్ యత్ చ అజ్జనితమ్ :** ఈ ఎదురుగా కనిపిస్తున్న దృశ్య జగత్తుకు గల ముఖ్య లక్షణాలు .....

- ఇదంతా ఆత్మ యొక్క చిత్కళా విశేషములైనట్టి ఇంద్రియములకు విషయముల రూపము.
- ఈ 'జగత్తు' అనబడేది భౌతికంగానూ, భావాత్మకంగానూ కూడా "(జ) జనిస్తూ ఉంటుంది ; (గ) గతిస్తూ ఉంటుంది"!! కనుక జగత్ దృశ్యములో ... (అనగా) ఈ 14 లోకాలలో కూడా ఎవరెవరికి ఏదేది "నాకు చెందినది కదా" అని అనిపిస్తుందో (మరియు) ఏదేది ఇంద్రియములకు అనుభూతమగుచూ వర్తమానంలో ఉన్నట్లున్నదో అట్టిదంతా కూడా **అనిత్యము, కల్పితము, స్వప్నసదృశము. నిత్యమైనదే సత్యము!**.... అందుచేత ఇంద్రియ విషయ జగత్ స్వతఃగా సత్యమైనది కూడా కాదు. మరి? ఇది పరమాత్మ తన వినోదము కొరకై కల్పించుకున్నది. (స్వప్నములోని పురుషుడువంటి) జీవాత్మకు అనుభవములై ఉన్నట్టిది.
- 'జగత్తు' అని పిలువబడునది...... భావనతో జనించి, భావనతో లయిస్తోంది. భావనే లేనప్పుడు **'జగత్తు' అనునదే లేదు**. కనుక ఈ జగత్ దృశ్యము ఆత్మకు వేరుగా గాని, అన్యముగా గాని స్వతఃగాగాని చూస్తే అజ్జనితము. **జనించనే లేదు**. బ్రహ్మ సత్యమ్ - జగత్ మిథ్యా - అను ఎరుకయే వివేకము.

**స్వప్న జగత్ - అభ్రగజాదితుల్యమ్ :**

ఒక పిల్లవాడు ఆకాశంలో మేఘముల ఒక చివర చూచి, "అదిగో ! అక్కడ ఏనుగు కదులుతూ ముందుకు జరుగుతోంది" అని తలచినట్లుగా..., ఈ జగత్తు స్వప్న తుల్యము. ఇదంతా **జాగ్రత్ స్వప్నము**. స్వప్నములో కనిపించేదేమో... **స్వప్న జాగ్రత్.** ఉభయము ఊహచే కల్పించుకొని పొందబడుచున్నవే గాని, సహజ సత్యములు కావు.

**తథా దేహాది సంఘాతమ్ :** స్వప్నములో కనిపించే ఒక ఇల్లు, కొండ ఎటువంటివో, ఈ భౌతక దేహము కూడా అటువంటిదే ! ఇది కూడా అజ్ఞానికి స్వకీయమోహము వలననే సర్వదా ఉండే వస్తువువలె అనిపిస్తూ ఉండవచ్చుగాక ! ఇది స్వప్న వస్తువుతో సమానమైనదే. దేహికి దేహము ఐహిక మోహము-ఇదంతా కూడా స్వప్నంలో ధరించిన ఆభరణము వంటిది.

ఈ విధంగా భౌతిక దేహము, జీవుల సంబంధములు, దృశ్య వస్తు సంబంధములు, జన్మ-మృత్యువులు, మనోబుద్ధి చిత్త అహంకారాలు, బంధ - మోక్షములు... ఇవన్నీ కూడా స్వప్నములో కనిపించే వస్తు సముదాయమువంటివి మాత్రమే!

**మోహగుణజాల కలితమ్ :** మరి జాగ్రత్‌లోని వస్తువులన్నీ కలలోని వస్తువులవలె అనిత్యము అని, వస్తుతః అసత్యము అని అనిపిస్తున్నాయా? లేదుకదా? ఇవన్నీ ఘనీభూతమై ఉన్నట్లు, జీవునికి అనేక బంధములు కలిగిస్తున్నట్లు ఏర్పడినవై అనుభూతమగుచున్నాయి. ఎందుచేత? మోహము చేతనే! స్వబుద్ధి నిర్మించుకొన్న భ్రమ పరంపరలచేతనే! కలలో కనిపించేవి అవాస్తమే అయినప్పటికీ కలలో ఉన్నంతసేపు అవన్నీ ఏకారణం చేత 'వాస్తవమ్' అని అనిపిస్తూ ఉండటం జరుగుతోందో..., అదియే మోహము. ఈ జాగ్రత్ జగత్ కూడా వాస్తవానికి స్వప్నము వంటిదే అయి వుండి, నిర్వాణ రూప జ్ఞానము కలుగనంత వరకు ఇందులోని విశేషాలన్నీ 'సత్యమే' అని ఏకారణంగా అనిపిస్తోందో ... అద్దానిని కూడా 'మోహము' అని చెప్పుచున్నారు. ఈ విధంగా జాగత్ దృశ్యభావావేశము, దేహముల రాకపోకలు... ఇవన్నీ 'మోహగుణములు' అనే జాలము (వల) నుండి పుట్టుకొస్తున్నాయి. మోహము (Illusion) నిర్వాణజ్ఞానముచే తొలగినప్పుడు బంధము లేదు. మోక్షము లేదు. జన్మ లేదు. మృత్యువులేదు. దేహము లేదు. ఇంద్రియ దృశ్యము లేదు.

**తత్ సర్పరజ్జువత్ కల్పితం :** శబ్ద – స్పర్శ – రూప – రస – గంధములు అనే '5' శక్తులు గల ఈ దేహములో పొందబడుచున్న దృశ్యానుభవ పరంపరల వలన కలుగుచున్న సుఖ–దుఃఖములు, బంధ – మోక్ష భావములు, కష్ట–సుఖములు, సంబంధ–బాంధవ్యములు... ఇవన్నీ కూడా త్రాడును చూచి "పాముర బాబూ" అని అనుకొని సర్ప వికారాలు పొందటము... వంటిది. 'పాము' అనుకోవటం తరువాత బంధము వచ్చి, త్రాడు అని తెలిసిన తరువాత మోక్షము వచ్చిందా? లేదు కదా ! 'భ్రమ తొలగింది' అని మాత్రమే మనము ఇక్కడ చెప్పుకోవాలి. అట్లాగే **'నిర్వాణ స్వరూపుడే'** అయి ఉన్న ఈ జీవుడు దృశ్య వ్యవహారములను 'సర్పరజ్జుదృష్టి' అనే భ్రమ, భ్రాంతిచే పొందుచున్నాము. 'నిర్వాణ జ్ఞానము' చే 'దేహ – ఇంద్రియ – దృశ్య విషయములు సర్పభ్రాంతి వంటిది మాత్రమే" అని గుర్తించి.. తొలగించుకొనుచున్నాను. భ్రమను మొదలంట్లా త్యజించివేసినవాడై బుద్ధితో మాత్రం చిరునవ్వుతో చూస్తున్నాడు.

**విష్ణు విద్యాది శతాభిధాన లక్ష్యమ్ :** సత్య ద్రష్టలగు మహనీయులు 'విష్ణుమాయ' అనబడే **"జగత్ రూపరహస్యము"**ను విశదపరచుచూ 'విష్ణు విద్య', 'ఆత్మ విద్య', 'భక్తి–జ్ఞాన–క్రియా యోగ మార్గములు' మొదలైన ఆయా వివరణలు, ఉపాయములు ఈ జీవులకు అందిస్తున్నారు. వాటన్నిటి యొక్క ఆశయము, **"ఇవన్నీ నీకు బంధము కాదు. ఎందుకంటే నీవు నిర్వాణ స్వరూపుడవు. సర్వ విషయములకు ఆవల గల ఆత్మస్వరూపుడవు"**... అని పరతత్త్వ జ్ఞానము ప్రతిపాదించి, బోధించటము కొరకే – అయి ఉన్నది. జీవునకు అతని నిర్వాణ స్వరూపము గుర్తు చేసి 'నీవు బంధరహితుడవు. బంధము నీ కల్పన".... అను బోధచే సత్యమును ఎరుగపరచటము కొరకు శాస్త్రములు ఉద్దేశ్యిస్తున్నాయి. "విష్ణు విద్య, ఆత్మవిద్య, భౌమావిద్య, శివతత్త్వ విద్య, మోక్ష విద్య, ఇటువంటి వందల పేర్ల లక్ష్యమంతా ఒక్కటే! తనను తాను ఎరుగుటయే!

**అంకుశో మార్గః :** ఒక పిచ్చిపట్టిన ఏనుగు వనములో ఇచ్చవచ్చినట్లుగా సంచారములు చేస్తున్న తీరుగా, ఈ చిత్తము : జన్మ–కర్మలు, ఇంద్రియ దృశ్యపరంపరలు అనబడే – **సంసారారణ్యము**లో సంచారములు చేస్తూ బహు దుఃఖములు తెచ్చిపెట్టుకొని అనుభవిస్తోంది. అందుకు ఉపాయములే "తపస్సు – ధ్యానము – భక్తి – వైరాగ్యము – కర్మ సమర్పణ" మొదలైన సాధనలతో కూడిన యోగములు. **చిత్త ఏనుగును వశం చేసుకొనే అంకుశము – అట్టి యోగోపాయములే!**

శాస్త్రములు చెప్పు యోగశాస్త్రము, భక్తి గుణములు, జ్ఞాన సంపత్తి, సాధన చతుష్టయము, ఇవన్నీ కూడా చిత్తము అనే ఏనుగుకు 'సంసార సంచారము' అనే పిచ్చిని తొలగించి మనకు నిర్వాణ రూపమగు **'ఆత్మాఽ హమ్'** భావనకు త్రోవ తీసే **అంకుశములు.**

**శూన్యం సంకేతః :** అటువంటి నిర్వాణస్థానమును పునికిపుచ్చుకోవటానికి, **"ఈ జగత్ బంధము మోహముచే మనోకల్పితము. వాస్తవానికి అంతటా ఆత్మయే ! స్వప్నంలో కనిపించేదంతా వాస్తవానికి అవిషయము, శూన్యము కదా ! అట్లాగే జాగ్రత్ కూడా ! ఆత్మ యొక్క ఊహా విలాసమే ! వస్తుతః శూన్యమే !"** ... అను సమాచారము.

- ఎందుకు ఆత్మ మాత్రమే సత్తుయో,
- ఎందువలన జగత్తుగా కనిపించేదంతా ఆత్మకు వేరుగా చూస్తే శూన్యమో ...అదియే **నిర్వాణస్థానము చేరుటకు సంకేతము.**

**పరేశ్వర సత్తా :** స్వస్వరూప సత్తాయే పరేశ్వరుడు. అట్టి పరేశ్వర సాకారోపాసన, నిరాకార ధ్యానము, సర్వము తానైన సోఽహమ్ – అభ్యాసము ఇవన్నీ ఈశ్వర ధ్యాన రూపమగు మంత్రమననములు.

**సత్య సిద్ధయోగో మఠః :** సత్యమును సిద్ధింపజేయు సాధనలు (భక్తి–జ్ఞాన–విజ్ఞాన–ఆత్మ సంయమ యోగములు) ఉపాసించుచున్న... ప్రదేశమే ఆశ్రమము. అదియే 'మఠము' కూడా!

**అమర పదమ్ న తత్ స్వరూపమ్ :** దేనికైతే మార్పు – చేర్పులు లేవో, అమృత–అమరపదమై యున్నదో, కేవల తత్ ఆత్మస్వరూపమైయున్నదో.... అట్టి కేవలీ ఆత్మాకాశము అనంతమైయుండగా, ఈ జగత్ భావాలు అనే మేఘము అద్దానిని కప్పి ఉంచుటము – అనే మాటయే అర్థరహితము. అట్టి మన నిర్వాణ స్వరూపము తత్ స్వరూపమై, శాస్త్రసాధనలచే గుర్తు చేయు అనుక్షణిక విశేషమై ఉన్నాయి. 'ఆత్మాఽ హమ్' అను బుద్ధియొక్క స్థితియే మహాశయము. తదితర 'సర్గ' మొదలైనవి (దృశ్య సంబంధమైన ఆశయములు) అల్పాశయములు.

**ఆది బ్రహ్మ సంవిత్ :** ఈ జగత్ దృశ్యము ఇంద్రియములకు విషయరూపము. ఇంద్రియములు దేహము యొక్క అంతర్భాగము. ఈ దేహమో – అనేక **జనించి గతించుచున్న అసంఖ్యాక దేహములలో ఒకానొకటి.** అట్టి దేహముల ప్రహసనమునకు ముందు – మధ్య

– ఇకముందు దేహి ఉన్నాడు. అట్టి దేహి యొక్క దేహములకు వేరైన స్వస్వరూపమే **"ఆది బ్రహ్మము".** అట్టి బ్రహ్మము... ఎటువంటి లక్షణములు కలిగి ఉన్నది ?...

సత్ – ఉనికి (నేను ఉన్నాను కదా !.. అను) రూపము.

చిత్ – ఎరుక (తెలుసుకొనువాడనై ఉన్నాను కదా !... అను) రూపము.

అట్టి **ఆదిబ్రహ్మ – సంవిత్‌యే** నిర్వాణ రూపము.

**అజపా గాయత్రి :** "ఓం తత్ సవితుః వరేణ్యమ్ భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్"... అను శబ్దోపాసన... **"సాక్షాత్ ఉనికి రూపమున ఉంటూ, ఎరుక రూపమున – బుద్ధి రూపమున వెలిగించు వరేణ్యుడగు** సవిత్రుదేవత (సత్ + చిత్ + బుత్) నా బుద్ధిని ప్రేరేపించును గాక"... అను అర్ధమును ప్రతిబింబిస్తున్న ఉపాసనా మంత్రము – జపాగాయత్రి. అట్టి జపాగాయత్రి యొక్క గానోపాసనచే ఈ సర్వముగా ఉండి, ఈ సర్వముగా తెలియబడుచున్న సంవిత్ స్వరూపము స్వానుభవముగా అగుచూ వస్తున్నది. జపాగాయత్రి... స్వానుభవమగు 'అజపాగాయత్రి'గా సంతరించుకొనుచున్నప్పుడు.. ఇక ఈ జగత్తు స్వాభావికంగానే ఆత్మరూపముగా అనుభవమగుచున్నది. అదియే నిర్వాణము. బుద్ధితో గాయత్రీ మంత్రార్ధమును భావన చేయటము ***'అజపా గాయత్రి'.*** తద్వారా నిర్వాణ భావన స్వయముగా సిద్ధిస్తున్న దగుచున్నది. శబ్ద వ్యవహారమంతా శాంతించగా సిద్ధించు ఆత్మభావనయే **'అజపాగాయత్రి'.**

**వికార దండో ధార్యః** అట్టి నిర్వాణమును సమీపిస్తున్న యోగికి ప్రాపంచక విషయాలన్నీ "సన్యాసి చేతిలో ధరించే దండము" వంటివి అగుచున్నాయి. బాహ్య విషయములు బాహ్యముననే లయిస్తూ, అంతరంగమున ప్రవేశించకుండా దండించబడుచు, శాసించబడుచున్నాయి. జగత్ వికారములన్నీ దండమువలె బాహ్యమున మాత్రమే ధరించి, అంతరమున ఆత్మ భావన మాత్రమే శేషించటము – ధారణ.

**మనో నిరోధినీ కంథా :** మనస్సు విషయముల నుండి నిరోధించి, ఉపశమింపజేసి (Withdrawl) నిర్వాణ రూపమగు బ్రహ్మము వైపు ప్రయాణింపజేయు విద్యుక్త విధానమే ఆ **నిర్వాణ యోగసన్యాసి ధరించు బొంత / కందువా!**

**యోగేన సదానందరూప దర్శనమ్ :** యోగాభ్యాసముతో నిర్వాణయోగి ఈ దృశ్యమునంతా ఆనంద రూపమగు పరబ్రహ్మ రూపంగా (లేక) ఆనందాత్మ రూపముగా దర్శించుచున్నాడు. స్వస్వరూపము యొక్క స్వకీయ ప్రదర్శనముగా దర్శిస్తున్నాడు.

**ఆనంద భిక్షాశీ:** "అంతా ఆత్మానందమే కదా!–అను **బుద్ధి రూప భిక్ష"**ను ఈ సన్యాసి ఈ **మనో జగత్ గృహస్థుని** నుండి పొందుచున్నాడు.

**మహాశ్మశానేఽపి ఆనందవనే వాసః :** ఈ జగత్ దృశ్యమును మొదలే లేనట్టి, ఎప్పుడో గతించిపోయిన ఒకానొక దృశ్యమువలె చూస్తూ, ఆనందాస్వాదన చేయుచున్నాడు. జగత్ దృశ్యమును శ్మశానము వలె త్యజించి 'ఆత్మానందము' అనే వనములో ఆనందముగా సంచరించుచున్నాడు. **"ఇదంతా – మహాశ్మశానమే అయి కూడా, నాకు ఆనందంగా విహరించు వనము వంటిదే"....** అను అనుభవము సిద్ధించుకొనుచున్నాడు.

**ఏకాంతస్థానే ఆనందమఠమ్ :** అనేకముగా కనిపిస్తున్న జగత్తును ఏకమునందు లయం చేసి, అప్పుడు శేషించు విషయానందాతీతమైన ఆత్మానందమును ***నివాస మఠముగా*** కలిగి ఉంటున్నాడు.

**ఉన్మనీ అవస్థా : మనస్సుకు సాక్షి, మనస్సు నియమించు స్థానము** అయినట్టి **"ఉన్మనీ అవస్థ"**ను ఆశ్రయించి ఉంటున్నాడు. అట్టి నిర్వాణమును ఆశ్రయించి సర్వ ***ఆలోచనలను, వాటి వాటి సంచారాలను*** చిరునవ్వుతో గమనిస్తూ ఉన్నాడు. స్వయమ్ తత్ స్వరూపముగా అయి ఉంటున్నాడు. మనస్సును, అద్దాని విషయ చింతనలను ఆత్మతో 'ఏకము' చేసి, ఏకాత్ముడై సర్వాతీత స్థానమునుండి ఈ మనోకల్పిత జగత్ దృశ్యమును మౌనంగా చూస్తున్నాడు.

**శారదా చేష్టా :** చేష్టలన్నీ ఆత్మ విద్యా సమన్వితమై, శారదా చేష్టలగుచున్నాయి. శబ్ద బ్రహ్మమును ఆశ్రయిస్తూ ఉంటాడు. అనేకంగా కనిపించేదంతా ఏకాత్మ భావనతో దర్శిస్తున్నాడు.

**ఉన్మనీగతిః :** శబ్ద బ్రహ్మమును మనస్సుకు ఆవల సాక్షిగా ఉండునది 'ఉన్మనీగతి'. మనస్సుకు కనిపించేదంతా ఆత్మయందు క్షణక్షణము గతింపజేస్తున్నాడు.

**నిర్మల గాత్రమ్ :** శబ్దోపాసనతో దృశ్య – దేహ – మనో – బుద్ధి – చిత్త – అహంకారాలు నిర్మలమగుచున్నాయి.

**నిరాలంబమ్ పీఠమ్ :** నిరాధారమగు నిర్వాణ స్థానమే ఆ యోగికి ఆసీన ప్రదేశమగు పీఠము.

**అమృతకల్లోల ఆనంద క్రియా :** "అహమ్ ఏక తరంగమస్మి నిర్వాణానంద సాగరమ్"..... అను భావనతో తాను అమృత సాగరంలో ఆనంద తరంగమువలె సంచారములు సలుపుచూ ఉండటము – అతడు నిర్వర్తించు యోగభ్యాస రూపమగు 'క్రియ' అగుచున్నది.

**పాండర గగన మహా సిద్ధాంతః :** బ్రహ్మాకాశమే జగత్ రూప విశేషముగా దర్శించటము, సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ – జీవో బ్రహ్మైఽ తి నా పరః – అయమాత్మా బ్రహ్మ – అహమ్ బ్రహ్మాఽస్మి".. ఇత్యాది మహా వాక్యానుభవ విస్తారమే ఆ నిర్వాణ యోగి యొక్క మహత్తరమగు అంతిమ మహాసిద్ధాంతము అగుచున్నది.

**శమ-దమాది దివ్యశక్త్య ఆచరణి :** బాహ్య-అంతర ఇంద్రియముల నిగ్రహము, నియామకము.. ఇవియే అతని ఆచరణము. ఆచారము.

**క్షేత్ర – పాత్రపటుతాః :** దేహక్షేత్రము – ప్రకృతి ప్రసాదించే పాత్ర (Role) ఈ రెండిటినీ సమన్వయించుకొని ధర్మ నిర్వహణా భావముతో నిర్వర్తించవలసినది నిర్వర్తిస్తూ, అది నిర్వాణోపాసనగా భావిస్తూ ఉంటాడు. ఈ దేహమును పట్టుదలతో యోగమునందు నియమించుచూ ఉంటున్నాడు.

**పర – అపరసంయోగః తారకోపదేశః :** పర (జగత్ దృశ్యమునకు ఆవల గల సర్వాధారమగు సాక్షీరూపము – పరమాత్మ).. – ఇహ (జగత్ దృశ్యము) ... అను రెండిటి యొక్క సంయోగము (నటుడే పాత్రగా, పాత్రధారుడే నటుడుగా కనిపిస్తున్న రీతిగా అనిపించటమే) తారకోపదేశము. అదియే ***నిర్వాణయోగి*** ఆశ్రయించు ***తారకమంత్రము***. తరింపజేయు మననము.

**అద్వైత సదానందా దేవతా :** ద్వితీయమైనది – (వేరైనది లేనట్టి) అద్వితీయ – సదానందమే అతని ఇష్ట దేవత ! ఆత్మయే జగత్‌గా కూడా భాసిస్తూ ఉన్నది. "జగత్ – అహమ్ – త్వమ్" ప్రత్యయములు అద్దానికి వేరు కాదు. కాబట్టి అద్వైతమగు ఆత్మానంద స్వరూపమే జగత్ అహమ్ త్వమ్ రూపము. **"జీవాత్మగా ఉన్నది పరమాత్మయే"** .... అను అద్వైత దేవదేవిని ఉపాసించుచున్నాడు.

**నియమస్య అంతరింద్రియ నిగ్రహః :** అంతరింద్రియమములైనట్టి మనో-బుద్ధి – చిత్త – అహంకారములను సాధననియమములతో నిగ్రహిస్తూ నిర్వాణమువైపుగా నడుపబడుగాక! ఆ అంతరింద్రియములను ఆత్మభావనతో సందర్శించటమే (లేక) భావించటమే నియమము, నిగ్రహము కూడా !

**భయ – మోహ – శోక – క్రోధ త్యాగః సత్యగః :** సన్యాసి మరి త్యజించవలసినవి ఏమేమి ?

భయము, మోహము, శోకము, క్రోధము. వాటిని వదిలి ఉండటమే నిజమైన త్యాగము. అంతేగాని భౌతిక వస్తువులు త్యజించిన మాత్రంచేత అది నిజమైన త్యాగము కాదు.

**పరావరైక్య రసాస్వాదనమ్ :** ఇహంగా **'ఈ కనబడే జీవులంతా పరస్వరూపమగు బ్రహ్మమే'** ..... అను మధురమైన దృష్టితో నిర్వాణ యోగ పుంగవులు రసాస్వాదులై ఉంటున్నారు.

**అనియామకత్వః నిర్మల శక్తిః :** తానే ఇంద్రియ నియామకుడై ఉంటాడు. అంతేగాని.... తాను ఇంద్రియములచే నియమించబడు వాడు కాడు. నిర్మల శక్తి సంపన్నుడై, శబ్ద – స్పర్శ – రూప – రస – గంధముల సూక్ష్మ స్వరూప శక్తి సమన్వితుడై ఉంటాడు. ఇంద్రియములను మాయయందు దర్శించుచూ అనియామకత్వము వహిస్తూ కూడా ఉంటాడు.

**స్వప్రకాశ బ్రహ్మతత్త్వే :** నిర్వాణ రూపము (సర్వము కదలుస్తూ, తాను కదలక ఉన్నట్టి కేవలీ చిత్ తత్త్వము)... అగు బ్రహ్మతత్త్వమును అనుభవైకవేద్యముగా కలిగి ఉంటాడు. స్వస్వరూప పరబ్రహ్మమే సర్వమును వెలిగిస్తూ తాను స్వప్రకాశమానమై ఉన్నది. అద్దానిని వెలిగించునది మరొకటేమీ లేదు.

బ్రహ్మము యొక్క స్వయం ప్రకాశ రూపమే... ఈ తదితరమైనదంతా కూడా ! – అను ధారణ కలిగి ఉంటాడు.

**శివ-శక్తి సంపుటి ప్రపంచ ఛేదనమ్ :** శివుడు + శక్తి ఐక్యతత్త్వముచే ప్రపంచము ఆతనికి భాసిస్తోంది. శివశక్తి స్వరూపముగా అనుభవమగుచున్నది. అప్పుడిక భూతపంచక మాత్రంగా కనిపించదు. ప్ర+పంచము = శివశక్త్యైక్య రూపమునకు అభిన్నమైనది.

| శివ | శక్తి | ఏకము-ఐక్యత్వము |
|---|---|---|
| భావించువాడు | భావించబడునది | ***భావనలు భావించువాని రూపమే!*** |
| చూచువాడు | చూడబడునది | ***చూడబడుచున్నదంతా చూచువాని రూపమే!*** |
| వినువాడు | వినబడునది | ***వినువాడి చైతన్యరూపమే వినబడునదంతా!*** |
| ఆలోచించువాడు | ఆలోచనలు | ***ఆలోచనల రూపము ఆలోచించువాడే!*** |
| తెలివితనదైనవాడు | తెలియబడునది | ***తెలుసుకొనుచున్నవాడే తెలియబడు రూపి!*** |
| ఇష్టపడువాడు | ఇష్టమగుచున్నది | ***ఇష్టమంతా ఇష్టము తనదైనవాని రూపమే!*** |
| అహంకారము తనదైనవాడు | అహంకారము | ***అహంకారము తనదైన వాడే అహంకార! రూపముగా ఉన్నాడు!*** |

ఉభయము ఏకముకాగా ఇక, వీటికి వేరైన పాంచభౌతిక ప్రపంచము లేనిదే అగుచున్నది. ద్వంద్వములుగా కనిపించేది ఏకము యొక్క చమత్కారమే !

**తథా పత్రాక్ష - అక్షి కమండలు బావాభావ దహనం :** అట్టి ఏకత్వమునందు సాధన వస్తువులగు అక్షి - కమండలు, ఉ పకరణములు దహించవేయబడుచున్నాయి.

| | | |
|---|---|---|
| పత్రాక్షము | - | Perception of Divisibility |
| అక్షి కమండలు | - | Pure perception |
| ద్రష్ట | - | దృశ్యము |

ఇవన్నీ ఏకస్వరూపమై, భావ-అభావ వ్యవహారమంతా దహించి వేయబడినదగుచున్నది.

**బిభ్రతి ఆకాశ ఆధారమ్ :** సర్వమునకు ఆధారము ఆత్మాకాశమే ! ఆత్మాకాశమో... నిరాధారము.

⌘

ఆత్మాకాశమే స్వరూపాధారముగా కలిగియున్న ఆ నిర్వాణ యోగి పుంగవుని స్వరూప - స్వభావములు, ఇంకా కూడా, ఎట్టివో ... చెప్పుకుంటున్నాము.

ఆ నిర్వాణ యోగికి

| | |
|---|---|
| - శివానంద స్వరూపగము శివోహమ్ తురీయము | - యజ్ఞోపవీతము. |
| - ఆత్మతో తన్మయమగు చిత్తము | - శిఖ (పిలక). |
| - చిత్-మయమగు దర్శనము | - యోగదండము. |
| - ఎల్లప్పుడు ఆత్మ దృష్టియే | - కమండలువు. |
| - అకర్మయందు కర్మ దర్శనము, కర్మయందు అకర్మ దర్శనము | - ... ఇదియే జీవిత కథాగమనము. |
| - మాయ-మమతలు | - దహనమునకు ఉపయోగించు కట్టెలు. అగ్నికి ఆహుతులు. |
| - వాయువు కదలికల నిశ్చలత్వ ప్రాణాయామమే | - శ్మశానము, విషయ-రహితమగు హృదయాంతర్గత ప్రదేశము |
| - త్రిగుణములకు ఆవల త్రిగుణాతీతమగు నిస్త్రైగుణ్య-ఆత్మభావనయే | - స్వస్వరూపానుసంధాన సమయము. |
| - భ్రాంతియే | - హరించివేయు హారతి కర్పూరము. |

| | |
|---|---|
| – కామ – క్రోధ – లోభ – మద–మాత్సర్యములే | – దహించవలసిన వస్తు సముదాయము . అగ్నిలో వేయు వస్తువులు. |
| – బ్రహ్మ భావము పట్ల పట్టుదల, కఠినత్వము, మొండితనము | – దృఢముగా ధరించే కౌపీనము (పంచకట్టు). |
| – యోగసాధనలు | – నార వస్త్రములు . |
| – అనాహతమ్ | – (ప్రాణనిరోధము) మంత్రము. |
| – సర్వకర్మల విషయములో/అకర్తృత్వమ్ | – స్వీకరించబడు పానీయము. |
| – స్వస్వరూపమగు ఆత్మ యొక్క నిత్య స్వాభావిక స్వాతంత్ర్యత్వమును సర్వదా దర్శించటమే... | – మోక్షము. "ఆత్మకు ఏక్షణమందూ కూడా దేనిచేతనూ బంధము పొందుట లేదు"... అను అవగాహనయే మోక్షము. "నేను సర్వదా ఆత్మ స్వరూపుడను" అను భావనాభ్యాసముచే మోక్షము నిశ్చలమగుచున్నది. |
| – 'పరబ్రహ్మము' అను 'నావ' (Boat) ఎక్కి ఉండటమే | – ఆచరణము. నావ నీళ్ళలో ఉంటుంది. కానీ నావలో నీళ్ళు వుండవు కదా. ఆ యోగి జగత్తులో ఉన్నప్పుడు కూడా తనలో జగత్తు ఉండనివ్వడు. "పరబ్రహ్మమే స్వరూపముగా గల నేను – జీవుడు జగత్తులందు కూడా ఉండవచ్చును గాక! కానీ నాయందు జీవుడు లేదు. జగత్తు లేదు"... అనునదే నిర్వాణయోగి యొక్క ఆచారము. |
| – బ్రహ్మచర్యమ్ (అనునిత్యము బ్రహ్మమునందే చరించటమే) | – బ్రహ్మముగా దర్శిస్తూ జగత్‌రహితుడై ఉండటము... ఆతని శాంతి పాఠము. |
| – బ్రహ్మచర్యాశ్రమే అధీత్య, వాన ప్రస్థాశ్రమే అధిత్య | – బ్రహ్మచర్యాశ్రమము – వానప్రస్థాశ్రమము ఆతని పాఠశాలలు. అధ్యయన స్థానములు. చేతులు దృశ్యములో ఉంచి కూడా తాను బ్రహ్మచర్య – వాన ప్రస్థాశ్రమ వాసిగానే ఉంటాడు. క్రమంగా ఉత్తరోత్తర పరాస్థానము చేరుచున్నాడు. (Hands in the world. But Head in the Forest). |
| – 'ఇదంతా ఆత్మ యొక్క విన్యాసము' అను భావనయే | – ఆతని సన్యాసము సత్ + న్యాసము సత్‌ను ఉపాసించటము |
| – అఖండమగు బ్రహ్మమే తానగుట | – ఇదియే ఆ నిర్వాణయోగి యొక్క పరాకాష్ఠ అనుభవము, స్థానము కూడా. |
| – బ్రహ్మమునకు వేరుగా ద్వితీయమైనదేదీ లేదు.... అను నిస్సందేహత్వమే | – అతని సర్వసందేహ నివృత్తి స్థానము |

**ఇది నిర్వాణ దర్శనము**

**ఇట్టి నిర్వాణయోగము యోగ్యతగలవారికే బోధించబడుగాక!**

**ఆయోగ్యుడగు పుత్రునికిగాని, శిష్యునికిగాని బోధించబడకుండును గాక!**


**ఇతి నిర్వాణోపనిషత్**

***ఓం శాంతిః శాంతిః శాంతిః***

ఋగ్వేదాంతర్గత

# 8 బహ్వృచోపనిషత్

## శ్లోక తాత్పర్య పుష్పమ్



శ్లో॥ బహ్వృచాఖ్య బ్రహ్మవిద్యా మహాఽఖండార్థ వైభవమ్
అఖండానంద సామ్రాజ్యం రామచంద్రపదమ్ భజే ॥

*"ఈ బహ్వృచోపనిషత్ ఆఖ్యాయికము, బ్రహ్మవిద్యా విశేషము, జీవునియొక్క మహత్-అఖండార్థ వైభవము, అఖండానంద సామ్రాజ్యము"* అయినట్టి *"శ్రీరామచంద్ర పదము"*ను ధ్యానిస్తున్నాము.

**బహ్వృచో = అఖండము-ఏకము అగు పరతత్త్వస్వరూపిణి యొక్క అనేకవిధములైన అభిరుచులు. బహు ఋచమ్ = సత్యము యొక్క బహుళత్వము, ఋక్కులు**

**1. 'ఓం' దేవీ హి ఏకా అగ్ర ఆసీత్ ।**
**స ఏవ జగత్-అండమ్ అసృజత ।**
**కామకళేతి విజ్ఞాయతే ।**
**శృంగార కళేతి విజ్ఞాయతే ।**
**తస్యా ఏవ బ్రహ్మా అజీజనత్ ।**
**విష్ణుః అజీజనత్ ।**
**రుద్రో అజీజనత్ ।**
**సర్వే మరుత్ గణా అజీజనత్ ।**
**గంధర్వ - అప్సరస - కిన్నరావ - ఆది త్రవాదినః**
**సమంతాత్ అజీజనత్ ।**
**భోగ్యమ్ అజీజనత్ ।**
**సర్వమ్ అజీజనత్ ।**
**సర్వమ్ శాక్తమ్ అజీజనత్ ।**
**అండజమ్, స్వేదజమ్, ఉద్భిజమ్, జరాయుజమ్**

ఓంకార సంజ్ఞార్ధ స్వరూపమైనట్టి (కేవల-అంఖడాత్మరూపిణియగు) దేవి యే సర్వమునకు మొట్టమొదట ఉన్నది. ఆ దేవియే జగత్ అనే అండమును (లేక) బ్రహ్మాండమును సృజించినది.

ఎందుకు సృష్టించింది? తనయొక్క ఇష్టము చేత! ఇచ్ఛ! బహురుచి! అభిరుచి! అందుచే ఇది ఆ దేవి యొక్క **క్రీడా వినోదము, కామకేళీ విలాసము** అని, **శృంగారకళా వినోదము** అని తెలియవచ్చు చున్నది. **బాలా లీలా వినోదము**... అని అనవలసివచ్చుచున్నది.

ఆ దేవియొక్క కామకేళీ-శృంగార విలాసములో ప్రప్రథమంగా సృష్టికర్తృత్వ రూపుడగు బ్రహ్మదేవుడు జనించారు! (సృష్ట్యభిమాని)

ఆ దేవి యొక్క ఇచ్ఛనుండియే సృష్టి రక్షకుడు విష్ణువు (స్థితి అభిమాని), లయకారకుడగు రుద్రుడు కూడా జనించారు (లయాభిమాని).

ఆ దేవియొక్క ఇచ్ఛారూప సంకల్పశక్తి నుండియే
- మరుత్ గణములు (భౌతిక దేహ నిర్మాణశీలురు),
- గంధర్వులు, అప్సరసలు, కిన్నరులు,
- సర్వవాద్యములు, స్వరములు, శబ్దజాలము,
- సర్వభోగ్యవస్తువులు జనించుట జరిగింది. ఆ దేవి శృంగారరస రూపాలే అవన్నీ.

'ఓం' (అ + ఉ + మ) అను ఒక్కమాటతో (భావనచే) సర్వవస్తుజాలము జనించినది. అంతేకాదు సర్వశక్తి తత్త్వమంతా కూడా జనించింది. ఆ దేవి నుండియే అంజములు (పక్షులు), స్వేదజములు (కీటకములు), ఉద్భిజములు (బీజమునుండి పుట్టిన

**యత్కించిత్ ఏతత్ ప్రాణి స్థావర జంగమమ్**

**మనుష్యమ్ అజీజనత్ ।**

**స ఏషా పరాశక్తిః ।**

**స ఏషా శాంభవీ విద్యా ।**

**కాది విద్యేతి వా । హాది విద్యేతి వా ।**

**సాది విద్యేతి వా । రహస్యమ్ ఓం।**

**ఓం వాచి ప్రతిష్ఠా ।**

**స ఏవ పురత్రయమ్, శరీరత్రయమ్**

**వ్యాప్య, బహిః అంతరః అవభాసయంతీ,**

**దేశ–కాల–వస్తుః అంతరా సంగాత్**

**మహాత్రిపురసుందరీ వై ప్రత్యక్ – చితిః ।**

వనస్పతులు), జరాయుజములు (గర్భమునుండి జనించేవి), స్థావరములు (కదలని రాళ్ళు కొండలు మొ॥వి), కదిలే జంగములు, మనుష్యులు .... వీటన్నిటితో కూడిన ఈ సర్వసృష్టి జనించింది.

ఆ దేవియే సర్వమునకు ఆధారమై సర్వమునకు పరమై (వేరై) యున్న పరాశక్తి.

అట్టి పరాశక్తిని విశదపరచు **శాంభవీ విద్య** కూడా ఆ దేవియే!

ఆ దేవియే **దేవీతత్త్వమును** తెలియజేయునట్టి, ఆ దేవి ఎవ్వరో **విశదపరచునట్టి 'కా విద్య'**!

ఈ సృష్టి లయించినప్పుడు శేషించు **"హాది విద్య"** కూడా! ఈ సృష్టియొక్క పరమ రహస్యము కూడా ఆ దేవియే! 'సత్' ఇత్యాది రూపములన్నీ ఆ దేవియే!

అట్టి ఓంకార స్వరూపిణి, 'ఓం' శబ్ద స్వరూపిణి కూడా! శబ్దము - అర్థము... రెండూ ఆ దేవియే!

ఆ దేవియే జాగ్రత్-స్వప్న-సుషుప్తులనబడే త్రిపురములయందు, మనో-బుద్ధి-చిత్త త్రిశరీరములందు, స్థూల-సూక్ష్మ-కారణ శరీరములందు, దేహి-దేహ దృశ్య త్రిదేహములయందు బయట-లోపల కూడా వ్యాపించి, నీళ్ళలో ప్రతిబింబమువలె వాటియందు తానే ప్రతిబింబించుచున్నది.

ఆ దేవియే దేశము (Place Factor), కాలము(Time Factor), వస్తువు(Factor of Matter), (మరియు) వాటి కలయికలచే ఏర్పడే దృశ్యమంతా కూడా!

**మహా త్రిపురసుందరియే**

మహా - తురీయము - త్రిపుర - (జాగ్రత్ స్వప్న సుషుప్తులు) కూడా!

ఆ మహా త్రిపుర సుందరియే ....,

- ఎరుగబడుదానికి ఆవలగల

**ప్రత్యక్ చిత్! తెలివియొక్క కేవలీ రూపము.**

(ఎరుకయొక్క కేవల రూపము, విషయములను ఎరుగుటకు మునుముందే గల ఎరుక రూపము) - చిదానందరూపము.

---

2. **స ఏవ ఆత్మా ।**

**తతో అన్యత్ అసత్యమ్, అనాత్మా ।**

**అత ఏషా బ్రహ్మ సంవిత్తిః ।**

**భావ భావ కళా వినిర్ముక్తా ।**

**చిద్విద్యా । అద్వితీయ । బ్రహ్మసంవిత్తిః।**

**సత్–చిత్–ఆనంద లహరీ ।**

**మహా త్రిపురసుందరీ బహిరంతరమ్ అనుప్రవిశ్య**

**స్వయమ్ ఏకఏవ విభాతి ।**

**యత్ అస్తి → సన్మాత్రమ్!**

**యత్ విభాతి → చిన్మాత్రమ్!**

ఏ దేవి నుండి త్రిమూర్తులు, త్రిశక్తులతో సహా ఈ సర్వము బయల్వెడలుచున్నదో అట్టి **దేవ దేవియే** సత్య-నిత్య స్వరూపిణియగు **ఆత్మ!**

ఇక ఏదైతే అసత్యము-అనిత్యము-ఊహా సదృశము-భావనా మాత్రముగా-స్వతఃగా లేనిదియే అయి ఉన్నదో, అదీ ఆ దేవియే! - అసత్యము (న-సత్-యమ్), అనాత్మ (న ఆత్మ)గా కనిపించేదంతా కూడా ఆ దేవియే! మాయ-మాయి... రెండూ ఆ అమ్మయే.

ఏది వేదాంత వాఙ్మయముచే బ్రహ్మము; సత్ + విత్ = సంవిత్ (ఉనికి+ ఎరుకరూపమగు) = సంవిత్తు శబ్దములచే ఉద్దేశ్యించబడుతోందో, అదీ ఆ దేవియే!

ఆ దేవి నుంచి భావములు, ఆ భావముల 64 కళలు బయల్వెడలుచున్నాయి. అనగా వాటికి ఆవల ఆ మాత చైతన్య స్వరూపిణి అయి - వేంచేసి ఉన్నది. వాటికి ముందే ఉన్న **ఆది స్వరూపిణి** కాబట్టి భావాభావములచే, కళావిశేషములచే పట్టుపడదు.

ఆ దేవియే తెలుసుకొనేది - తెలియబడేదీ అయి ఉండటముచే,... చిద్విద్యా (చిత్ స్వరూపిణి అయి చిత్‌ను ఎరుగునది) - అయి ఉన్నది. ఎరుక - ఎరుగబడునది - ఎరుగువాడు ఆ దేవీ స్వరూపమే!

మనందరము ఆ అమ్మకు వేరుగా లేము. అందుచేత మనము ఆ దేవికి, ఆ దేవికి మనము వేరైనవారము గాము. **అద్వితీయ సంవిత్ బ్రహ్మము!** ఆ దేవి సత్ (ఉనికి)

**యత్ ప్రియమ్ ఆనందమ్ తత్।**

**ఏతత్ సర్వాకారా మహాత్రిపుర సుందరీ ।**

**త్వమ్ చ – అహమ్ చ – సర్వమ్ విశ్వమ్ –**

**సర్వదేవతా – ఇతరత్ సర్వమ్ మహాత్రిపురసుందరీ ।**

**సత్యమ్ – ఏకమ్**

**లలితా ఆఖ్యమ్ వస్తుః,**

**తత్ అద్వితీయమ్ ॥**

**అఖండార్థమ్। పరబ్రహ్మ**

**పంచరూప పరిత్యాగాత్ అస్వరూప ప్రహాణతః।**

**అధిష్ఠానమ్ పరమ్ తత్త్వమ్ – ఏకమ్**

**సత్ శిష్యతే మహత్ ఇతి ।**

**"ప్రజ్ఞానమ్ బ్రహ్మ" ఇతి వా**

**"అహమ్ బ్రహ్మాఽస్మి" ఇతి వా భాష్యతే ।**

**"తత్ త్వమ్ అసి" ఇతి ఏవ సంభాష్యతే ।**

**"అయమాత్మా బ్రహ్మ" ఇతి వా,**

**"బ్రహ్మైవాహమస్మి" ఇతి వా,**

**"యో అహమస్మి" ఇతి వా,**

**"సోఽహమస్మి" ఇతి వా,**

**"యోఽసౌ సోఽహమస్మి" ఇతి వా,**

**యా భాష్యతే, స ఏషా**

**షోడశీ శ్రీవిద్యా పంచదశాక్షరీ**

**శ్రీ మహాత్రిపుర సుందరీ**

**బాలంబికా ఇతి,**

**బగళా ఇతి,**

**మాతంగీ ఇతి,**

**స్వయమ్ వరకళ్యాణీ ఇతి, భువనేశ్వరీ ఇతి,**

**చాముండి ఇతి,**

**చండి ఇతి,**

- చిత్ (ఎరుక) - ఆనంద (అనుభవి) ... ప్రదర్శన స్వరూపిణి.

ఆ దేవీమాత త్రిపురములందు జాగ్రత్-స్వప్న-సుషుప్తులుగా విరాజిల్లుచూ, వాటియందు ప్రకాశమాన రూపమై, బాహ్య-అభ్యంతరములలో ప్రవేశించి-సర్వదా **'ఏక రూపమే'** అయి ఉన్నది. ఏకరూపిణియై త్రిపురములలో సర్వ విశేషములుగా ప్రదర్శితమగు మహాత్రిపుర సుందరి!

ఏదైతే "ఉన్నాను" అను భావరూపిణియై ఉనికి రూపమున (అస్తి) ఉన్నదో ...., అది **సన్మాత్రము.**

ఏది తెలుసుకొనువాడు - తెలియబడునది రూపమున ప్రకాశమానమగుచున్నదో (Being Enlightened) ..., అది **చిన్మాత్రము.**

ఏది **ప్రియము** (అనుభూతి) రూపముగా ఉన్నదో...., అదియే **ఆనందము.**

ఈవిధంగా సన్మాత్ర - చిన్మాత్ర - ఆనందములుగా ప్రదర్శనము అగుచున్నదగుటచేత మహాత్రిపురసుందరి!

**"ఆ త్రిపురసుందరీ దేవి ఉన్న స్థానమేది?"** అని ఆ అమ్మను పట్టుకోవడానికి బయల్వెడలితే....

- "నీవు" గా ఉన్నది. ఆ దేవియే. (త్వమ్ తత్; తత్త్వమ్)

- "నేను" గా ఉన్నదీ ఆ దేవియే. (సోఽహమ్)

- ఈ విశ్వము రూపముగా కనిపిస్తున్నదీ ఆ దేవియే! (విశ్వేదేవీ)

- దేవతల రూపము - దేవతలు కాని రాక్షసుల, తదితరుల రూపముగా ఉన్నదీ కూడా ఆ దేవియే! ఓ మహా త్రిపురసుందరీ! అంతా నీవేగదమ్మా!

- సర్వదా సత్యమై, అనేకముగా కనిపిస్తూ ఏకమే అయి, "లలితాదేవి" అనుపేరుచే మాచే పిలువబడుచూ, మాకు ఏమాత్రమూ వేరుగా లేక, మాకు **అద్వితీయమై** ఉన్నావు. నీకు అద్వితీయమై మేము ఉన్నాము. (అహమ్ ఇత్యేవ విభావయేత్ భవానీ)

నీవు రెండుగా అవనట్టి అఖండార్థమువు! పరబ్రహ్మమువు! నేను నీకంటే వేరై ఎట్లా ఉండగలను? లేను.

నీ నుండి దృశ్య-మనో-బుద్ధి-చిత్త-అహంకారాలు, పంచభూతములు బయ దేరుచున్నప్పటికీ నీ అఖండత్వమునకు వచ్చే హాని ఏదీ లేదు. ఈ పంచవస్తు ప్రపంచమునకు అధిష్ఠానమై ఉన్నావు. పరమై ప్రకాశించు తల్లివి. ఈ (పంచభూత) పాంచభౌతికమును దాటి చూస్తే సర్వ జీవుల ఆత్మగా, మహత్ స్వరూపిణివై శేషిస్తున్న దేవీ స్వరూపిణివి నీవు!

అందుకే నీగురించి తెలిసిన యోగజ్ఞాన వరేణ్యులు-**'ప్రజ్ఞానమే బ్రహ్మము'** అని అంటున్నారు.

**- తెలియబడేదంతా (ప్రజ్ఞానము) బ్రహ్మమే!**

**- తెలుసుకొనుచున్న నేను బ్రహ్మమే!** ఆది శక్తియగు దేవియే బ్రహ్మము అని నీ గురించి భాష్యము చెప్పుచున్నారు.

**నీవుగా కనిపించేదంతా ఆ దేవీ తత్‌స్వరూపమే** - అని భక్తులు సంభాషించు కుంటున్నారు.

**"ఈ జీవాత్మ బ్రహ్మమే (అయమాత్మా బ్రహ్మ)"** అని, **"నేను బ్రహ్మమే అయి ఉన్నాను (సోఽహమ్)"** అని కూడా అభివర్ణిస్తున్నారు.

**వారాహీ ఇతి,**

**తిరస్కరిణీ ఇతి,**

**రాజమాతంగీతి వా**

**శుకశ్యామళేతి వా**

**లఘు శ్యామళేతి వా**

**అశ్వారూఢేతి వా**

**ప్రత్యంగిరా**

**ధూమావతీ**

**సావిత్రీ**

**గాయత్రీ**

**సరస్వతీ**

**బ్రహ్మానంద కళేతి ।**

**ఋచో అక్షరే**

**పరమే వ్యోమన్**

**యస్మిన్ దేవా అధివిశ్వే నిషేదుః**

**యః తత్ న వేద, కిమ్ ఋచా కరిష్యతి?**

**యః ఇతి తత్ విదుః స ఇమే**

**సమాసత ॥**

**ఇత్యుపనిషత్ ।**

**బహ్వృచోపనిషత్ సమాప్తః**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**తెలియబడేదంతా బ్రహ్మమే! తెలుసుకొనుచున్నది బ్రహ్మమే! నేను బ్రహ్మమును అయి ఉన్నాను. నీవు బ్రహ్మమే! జీవాత్మ బ్రహ్మమే! బ్రహ్మమే 'నేను'గా ఉన్నది. ఇంకేదీ కానేలేదు. కాబోము కూడా!**

అంతేకాదు. ఏదైతే "**నేనై ఉన్నాను**" గా ఉన్నదో, ఆ "**పరమైనదే నేను**" గా ఉన్నదో, "**ఆపరతత్త్వమే నేను**" గా ఉన్నదని భాష్యము చెప్పబడుచూ, సంభాషించబడుచూ ఉన్నదో....

అదియే....,

షోడశీ అక్షరమంత్రము, శ్రీవిద్య, పంచదశాక్షరీ, అర్ధస్వరూపమగు శ్రీ మహాత్రిపుర సుందరి అని,... యోగులు గమనిస్తున్నారు. ఇంకా కూడా,

బాలాంబిక; బగళ; మాతంగీ; స్వయం వరకళ్యాణి; భువనేశ్వరి; చాముండీ; చండే; వారాహి; తిరస్కరిణి; రాజమాతంగి; శుకశ్యామల; లఘుశ్యామల; అశ్వారూఢ; ప్రత్యంగిరా; ధూమావతి; సావిత్రి; గాయత్రి; సరస్వతి - అనే పేర్లతో ఒకే బ్రహ్మము ఉపాసించబడుతోంది. ఇవన్నీ బ్రహ్మానందము యొక్క వివిధ కళావిశేషాలే! అనేక పేర్లతో పిలువబడు ఏక - అఖండ దేవియే!

ఆ దేవియే ఋగ్వేదములోని ఋక్కులచే గానము చేయబడుచున్నది.

"ఋత్-చ" ... అను వర్ణనచే **పరమసత్యము.** అక్షరే... అను వర్ణనచే మార్పుచెందు వాటన్నిటికీ ఆధారమగు **మార్పుచెందని తత్త్వము.** ఆ దేవీ తత్త్వమునందే సర్వ దేవతలు **స్థితి** కలిగి, ప్రకాశమానులగుచున్నారు. ఈ విశ్వమంతా ఏ 'దేవీ తత్త్వము' నందు సర్వదా (కల్పనచే) స్థితి పొందియున్నదో అది ఎరుగక, ఈ విశ్వమును, అన్య విశ్వదేవతల తత్త్వమును దర్శించునంతవరకు ఋక్కులు గానం చేయటం తెలిస్తే మాత్రము ఏమి ప్రయోజనము?

ఎవ్వరైతే నేను-నీవు (అహమ్-త్వమ్) ప్రత్యయములతో సహా ఈ విశ్వము - విశ్వరచనా అంతర్గతులగు దివ్యశక్తి స్వరూప దేవతలు.... ఇవన్నీ ఆ దేవీ తత్త్వమునకు అంతర్గతముగాను, అభిన్నముగాను దర్శిస్తున్నారో, వారు దేవీస్వరూపులే! దేవీ ఆత్మానంద స్వరూపులై, సర్వము తామై ప్రకాశించుచున్నారు.

**ఇతి బహ్వృచోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః శాంతిః**




ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 8 బహ్వృచోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



ఈ ఎదురుగా ఉన్న సృష్టికి మునుముందుగా, మొట్టమొదటిగా "ఓం" కార స్వరూపిణి, ఆదితత్త్వము అయినట్టి "దేవి" మాత్రమే ఉన్నది. దేవతలకే "ఆది" అగు ఆ దేవాది దేవి సంకల్పమాత్రముగా ఈ "జగత్తు" అనే అండమును (బ్రహ్మాండమును) సృజించింది. ఎందుకొరకు? స్వకీయ వినోదము, లీల, ఆనందము కొరకై! అందుచేతనే ఆదేవి బాలా లీలా వినోదిని!

- ఆ దేవి యొక్క ఇచ్ఛా రూపమే బ్రహ్మాండములకు ఉత్పత్తిస్థానము (It is a past time Entertainment). అందుచేత..., ఇదంతా
- ఆ దేవి యొక్క కామకేళీ, విలాసవమే!
- శృంగార కళా ప్రదర్శనమే!

తెలియజేయు – తెలుసుకొను 'విజ్ఞాయతే' ఆ దేవి! తెలియబడుచున్నదంతా ఎక్కడి నుండి జనిస్తోంది? తెలియబడేదంతా ఆ దేవి – తన కేళీ వినోదము కొరకై – తనయొక్క 'ఎరుక' నుండి సంప్రదర్శిత పరచుచున్నది. "**నేను ఆడుకోవాలి. ఆనందించాలి**"... అను–ఆ దేవి యొక్క బాలా లీలా వినోదినీ విజ్ఞాన తత్త్వము నుండియే "**నాకు వేరైనది**" అనే "**కల్పన ఊహ, భావన**" .... బయల్వెడలుతోంది. అట్టి దేవీ ఇచ్ఛా శక్తియే...,

"బ్రహ్మదేవుడు" రూపమైన సృష్టిని **సృష్టించటము**, "**విష్ణు దేవుడు**" రూపమై... అట్టి **సృష్టిని స్థితింపజేయటము, పరిపోషించటము,** "**రుద్రదేవుడు**" రూపమై **లయ విన్యాసము** చేయటం, "**మరుత్‌గణము**" రూపముగా **నామరూపాత్మక మాయను** ప్రదర్శించటము చేయుచున్నది.

(సృష్టికర్త్రీ బ్రహ్మరూపీ, గోప్త్రీ గోవిందరూపిణీ, సంహారిణీ విశ్వరూపా ....! లలితా సహస్రము).

ఆ దేవియొక్క ఇచ్ఛయే (కామకేళీ–శృంగారీ) గంధర్వులు, అప్సరసలు, కిన్నెరులుగా... ఇత్యాది గాన–నృత్య–సౌందర్య రూపములుగా ప్రదర్శనమగుచున్నది. "ఆ" వాది (శబ్ద) రూపములుగా, వాద్య–స్వర–శబ్ద–నాద జాల రూపములుగా... సంప్రదర్శితమగుచున్నది. భోగ్య వస్తువులన్నీ ఆ దేవియొక్క శృంగార రసరూపములుగా అగుచున్నాయి. పండు – కాయ – కొండ జీవుల దేహములు ... వీటన్నిటిలో కనిపించేదంతా ఆ దేవియొక్క ఇచ్ఛారూప సౌందర్యమే!

సర్వము ఆ దేవియే! **ఆస్వాదించువాడు – ఆస్వాదించబడునది – ఆస్వాదన** .... ఇవన్నీ ఆ దేవియొక్క శృంగార–నామ రూపాత్మక కేళీ విలాసములే!

ఆ దేవి నుండే విలాసరూపంగా శక్తితత్త్వము – శక్తి ప్రదర్శనములు కూడా జనించుచున్నాయి. ఆ శక్తులు అనేక రూపములుగా

✠ అండజములు (గ్రుడ్డు నుండి జనించు పక్షులు),
✠ స్వేదజములు (చెమటనుండి, వాసన నుండి జనించు కీటకములు),
✠ ఉద్భిజములు (బీజము నుండి జనించు వృక్షములు, వనస్పతులు – కాయగూరలు, ధాన్యములు మొ॥వి),
✠ జరాయుజములు (గర్భము నుండి జనించే జంతువులు, మానవులు మొ॥వి),

ప్రదర్శనమగుచున్నాయి. ఈ సృష్టిలో కనిపించే సర్వప్రాణులు, స్థావర జంగమములు..., ఈ మనుష్య రూపములతో సహా ... ఇవన్నీ ఆ దేవియొక్క తేజో విలాసమే! ఇచ్ఛారూపమగు కామకేళీ విలాస-శక్తి జనితమే! ఆ దేవీ ఇచ్ఛా తత్త్వమే ఈ సర్వమునకు ఆధారమై, సర్వరూపమై, సర్వమునకు శక్తియై, సర్వ బాహ్యా-అభ్యంతరరూపమై, సర్వమై పరాశక్తి గా వెలయుచున్నది. అట్టి "పరాశక్తితత్త్వము" ను విశదీకరించుచున్న "ఆత్మవిద్య" (లేక) "శాంభవీ విద్య" యొక్క రూపము కూడా ఆ పరాశక్తియే!

**"కా" ది విద్యేతివా** – ఈ దృశ్యమంతా ఎవ్వరివలన? ఎవ్వరిచేత? ఎవ్వరి కొరకు? ఎందుకొరకు? ఏ రీతిగా? ఏది సహజము? ఏది కల్పితము? ... ఇట్టి "కింతత్" రూపమగు వాఙ్మయ విద్య ఆ దేవీ రూపమే! "కా"రణ పంచకమగు కాల- స్వభావ- పురుష-కర్మ-నియతులు... ఆ దేవీ కళా విశేషాలే!

**"హా" ది విద్యేతివా**–ఆ దేవియే **'ఆహా'**... రూపమైయున్నది. తెలుసుకొను రూపమై, తెలియబడు సత్యమై కూడా యున్నది. యోగ సాధన రూపములగు (ప్రాణాయామ-కుండలినీ-ఇత్యాది)... మార్గములు కూడా సర్వ విద్యాస్వరూపిణియగు ఆ ఆదిశక్తీ దేవియే! అహమ్-నాఽహమ్-సోఽహమ్-చిదానందరూపోఽహమ్-సర్వస్యప్రభవోఽహమ్-జీవశివైక్యోఽహమ్-విద్యలు ఆ **దేవీ విద్యా విశేషాలే!**

"సా" **ది విద్యేతివా** – సత్ రూపిణియై, స్వస్వరూప ఆత్మ నిరూపణ విద్యయై, వేదోపనిషత్ వేదాంతరూపిణిగా ఉన్నది... **ఆ దేవియే!**

**సాధకుల పంచావస్థలు :** శ్రవణ – వివరణ – స్మరణ – ఆపన – ప్రాపన దశలన్నీ కూడా – అవస్థ రహితయగు ఆ **దేవీ తత్త్వ ప్రకాశ లీలా వినోదావస్థలు!**

**సాత్త్విక భావములు :** స్తంభము, ప్రళయము, రోమాంచము, స్వేదము, వైవర్ణ్యము, వేపథు, అశ్రువు, వైస్వర్యము – ఈఈ ఉపాసనా స్థితులన్నీ ఆ దేవీ తత్త్వోపాసనా జనిత భావములే! కనుక దేవీ **చిన్మయ చమత్కారమే!**

మానసికమైనదంతా ఆ **దేవీ – చిన్మయము.** భౌతికమైనదంతా ఆ **దేవీ – మృణ్మయము.**

ప్రతి జీవుని అప్రదర్శిత – అంతర్ – హృదయ రహస్య స్వరూపము ఆ దేవీ మహత్త్వమే! అట్లాగే ప్రదర్శితమగుచున్నట్టిదంతా కూడా... ఆ మాహత్త్యమే!

**ఓం ఓం వాచి ప్రతిష్ఠా!** ఓం ఓం అను వాక్కునందు ప్రతిష్ఠితమైయున్న **సర్వమాయ – సర్వాకార – సర్వాధార – నిరాధార** తత్త్వము సర్వదా ఆ దేవియే. (ఈ నాలుగు ఆ దేవి శయనించే నాలుగు కోళ్ళు గల మంచము)

**స ఏవ పురత్రయమ్ – శరీరత్రయమ్ వ్యాప్య బహిః – అంతరః :** ఆ దేవీ దివ్య చైతన్యమే జాగ్రత్ – స్వప్న – సుషుప్త పురములయందు, మనో-బుద్ధి-చిత్త అంతరంగ త్రయమునందు, దేహి – దేహ – దృశ్య స్థానములందును, స్థూల – సూక్ష్మ – కారణ శరీరములందును, లోపల – బయట – ఆరుబయట యందును, స్థూలాకాశ – చిత్తాకాశ – చిదాకాశములయందును వ్యాపించి ఉన్నదై, బాహ్య, **అభ్యంతర రూపిణి** అయి ఉన్నది. **బంగారపు ఉంగరము**... లోన-బయట కూడా **బంగారమే** అయి ఉన్నట్లుగా, **అంతః బహిశ్చ తత్ సర్వమ్ వ్యాప్య నారాయణీ స్వరూపిణే!**

ఆ దేవాది దేవియే దేశ (Place Factor) కాల (Time factor) వస్తు (Zone of Matter) త్రితత్త్వముల అంతర్వేణి! అంతర్యాణి! వాటి కలయికలచే ఏర్పడే దృశ్యమంతా ఆ దేవియే! అందుచేత ఆ దేవి మహా త్రిపుర సుందరిగా స్తోత్రము చేయబడుచున్నది.

**మహా .......** తురీయ ....,
**త్రిపుర .......** జాగ్రత్-స్వప్న-సుషుప్తి ప్రదర్శిత, సంచారీ...,
**సుందరి .......** ఆనంద స్వరూపిణీ !

**ప్రత్యక్ చిత్ :** "**ఎరుగుచుండుట**" అను "సందర్భ వ్యవహారము" నుండి **ఎరుగుబడుచున్నది** అనుదానిని ప్రక్కగా పెట్టినప్పుడు అప్పటికే శేషించు "కేవల ఎరుక స్వరూపిణి"! ప్రత్యక్ చిత్ స్వరూపిణి! "ఎరుక" కు ముందే గల కేవల చిత్ తత్త్వి! కేవల తెలివి స్వరూపము!

⌘

ఆ త్రిపుర సుందరీ స్వరూపిణియగు దేవీ రూపమునే **'ఆత్మ'** అనే శబ్దముతో ఉపనిషత్-వేదాంత వాఙ్మయము పిలచుచున్నది. ఆ "దేవి" కి వేరుగా ఏది ఉన్నట్లుగా అనిపిస్తుందో,... అదంతా "కథ-నాటకము-స్వప్నము" లోని దృశ్యసంఘటనా సందర్భములవలె "అసత్యము", "అనాత్మ" కూడా! వాస్తవానికి వచ్చినప్పుడు ఆత్మ స్వరూపిణి అయి ఉన్న దేవి మాత్రమే సత్యమై నిత్యమై గ్రహించబడుచున్నది.

**బ్రహ్మ సంవిత్:** ఆ దేవియే అద్వితీయము, బ్రహ్మసంవిత్ అయి ఉంటోంది. ***సర్వమునందు, సర్వముగా, సర్వము*** అయి ప్రకాశించుచున్నది.

**బ్రహ్మము → సత్ + విత్ = సంవిత్ = బ్రహ్మసంవిత్తు** అని కూడా వేదాంత శాస్త్రముచే బోధగా చెప్పబడుచున్నది.

**భావాభావ కళా వినిర్ముక్తా:** జలములో తరంగములు బయల్వెడలి, తిరిగి జలమునందే లయమగుచున్నాయి కదా! అట్లాగే పరతత్త్వ స్వరూపిణి యగు ఆ దేవి నుండి భావ-అభావ తరంగములు బయల్వెడలి తిరిగి అ దేవియందే లయిస్తూ ఉన్నాయి. ఆ భావ-అభావములకు మునుముందే ఉండి, భావములకు సాక్షి-ఉత్పత్తి స్థానము అయి, భావనారాయణీ స్వరూపిణిగా ఉన్నది. భావ-అభావములచే పట్టుపడని దగుటచేత **భావాభావవినిర్ముక్త! అట్టి భావ - అభావ తరంగములే సృష్టి - స్థితి - లయములు.**

**చిత్‌విద్యా:** "చిత్" చేతనే – చిత్‌గా తెలియచేయబడు "చిత్" విద్యా స్వరూపిణి! ఎరుగుచున్న తత్త్వము గురించిన "ఎరుక"చే ఎరుగబడుచున్న విద్యా స్వరూపిణి!

**అద్వితీయ:** ఆ దేవికి వేరుగా త్వమ్ లేదు. అహమ్ లేదు. జగత్తు లేదు. దృశ్య-దర్శన-ద్రష్ట-దృక్ తత్త్వాదులు లేవు. ఆ దేవీ తత్త్వానికి వేరైనదనునదే ఉండి ఉండజాలదు. బంగారు అరవంకెలోని పుష్ప-దేవతా మొ॥న ఆకారాలన్నీ బంగారమునకు వేరు కాదు కదా!

**సత్‌చిత్ ఆనంద లహరీ:** ఉనికి (Existance-Presence), చిత్ (Knowing - Knowledge) ఆనంద (Enjoying) ప్రవాహమై సర్వే-సర్వత్రా, అంతటా విస్తరించి, సంచారము కలిగినదై ఉన్నది.

సత్ ఆనంద – చిదానంద జలములో సచ్చిదానంద తరంగములుగా విహరించు సర్వతత్త్వ స్వరూపిణి ఆ దేవి! ఆ మహాత్రిపుర సుందరి జాగ్రత్-స్వప్న-సుషుప్తి త్రిపురములందు ప్రకాశించుచు, వాటి అంతర-బాహ్యములుగా ప్రభవించుచూ.... త్రిరూపధారణిగా విభాతి .... భాసించుచున్నది.

- ఏది **ఆ దేవియొక్క** అస్తి (ఉనికి)యో .... అదియే **సన్మాత్రము.**
- ఏది దేవి యొక్క 'ఎరుక'గా ప్రకాశించుచున్నదో ... అదియే **చిన్మాత్రము.**
- ఏది దేవి ప్రియ స్వరూపిణి అయి వినోదించుచున్నదో .... అది **ఆనందము.**

ఆ మహాత్రిపుర సుందరి సర్వ ఆకారములు తానే అయి, తనవే అయి, సత్‌చిత్ ఆనంద రూపముగా... విశ్వరూప ప్రదర్శనమును ప్రకటన మానము చేయుచున్నది.

ఈ విధంగా

**నీవుగా** (త్వమ్) ఈ విశ్వమునందు కనిపిస్తున్నదీ-ఆ దేవియే! **(తత్‌త్వమ్)**
**నేను** (అహమ్) రూపంగా విశ్వాంతర్గతంగా కనిపిస్తున్నదీ-ఆ దేవియే **(సోఽహమ్) (స్వాత్మైవ దేవతా ప్రోక్తా లలితా దివ్య విగ్రహా)**
సర్వదేవతలూ కూడా ... ఆ దేవియే! **(దేవ దేవి)**
ఈ విశ్వమంతా ఆ దేవియే! **(విశ్వరూపీ, విశ్వేశ్వరీ)**
సర్వము ఆ దేవాది దేవియే! **(సర్వేశ్వరీ, సర్వతత్త్వ స్వరూపిణీ!)**

ఈ దృశ్యరూప విశ్వమునకు వేరై ఏదైనా, ఎక్కడైనా ఉంటే,.... అదీ ఆ దేవీ స్వరూపమే! అట్టి మహా త్రిపురసుందరి,

– సత్యమై (యమ్ సత్-ఉనికి స్వరూపిణియై),

– ఏకమై, అనేకంగా **కనిపిస్తూ,** [(దేవీ సర్వాంతర్యామీ - సర్వ తత్త్వ స్వరూపీ జ్ఞానముచే) ఏకముగా **అనిపించుచున్నదై**]

లలితానామధేయియై శ్రీలలిత సహస్రనామావళీ-పరమార్థ ప్రకాశమానమగుచున్నది. అఖండార్థము-పరబ్రహ్మము... అయినట్టిది ఆ దేవి వైభవము. హే దేవీ! జగజ్జననీ! నీవు అద్వితీయురాలివి కదా! ద్వితీయమ్ లేదు కాబట్టి-నీవు మాకు ఏ మాత్రము వేరైన దానివి కావు. అద్వితీయ తత్త్వమువు! రెండుగా నీవు అగుచుండుట లేదు. అందుచేత **అఖండార్థమువు**. సర్వమునకు ఆవలిగట్టువై ఉండుటచే **పరబ్రహ్మమువు!**

నీ నుండి పంచరూప-అరూప తత్త్వములైనట్టి దృశ్య-మనో-బుద్ధి-చిత్త-అహంకారాలు, పంచభూతములు... ఇవన్నీ బయలుదేరుతూ ఉండవచ్చు గాక! కానీ నీవు అఖండమే అయి ఉన్నావు. అన్ని సర్వరూపములు నీవే – అయి ఉండుటచే రూపరహితవు కూడా! బంగారము ఎన్ని ఆభరణరూపములుగా అయినప్పటికీ, బంగారమునకు ఆకారమనునదేదీ లేదు కదా! ఇంతలోనే, బంగారు ఆభరణముల ఆకారాలన్నీ బంగారమువే కదా! త్రిపురసుందరీ దేవియే సర్వ ఆకారములు అయినప్పటికీ,... ఆ దివ్యశక్తికి "ఇది" అను ఆకారమేదీ లేదు. సర్వత్రా అనురాగివైన నీవు విరాగివి కూడా! మనస్సుయొక్క రాగ విశేషముచేత ఒకడు 'స్వప్నం'లో అనేక వస్తువులను చూస్తూ కూడా, అవన్నీ క్షణంలో వదలి 'జాగ్రత్'కి వచ్చి, స్వప్నంలోని వస్తువులతో విరాగమే కలిగి ఉంటున్నాడు కదా! ఈ సర్వము పట్ల నీవు కూడా అంతే!

అన్ని ఆభరణములకు బంగారమే అధిష్ఠానమైన తీరుగా,… సర్వజీవుల అధిష్ఠానము దేవీతత్త్వమే! సర్వభావాలకు, దేహాలకు, జగత్తులకు ఆవల-మునుముందే-అప్రమేయమై ఉండటముచేత ఆ దేవి **"పరదేవత, పరమ్, పరస్వరూపిణి"** అని,…. **వ్యక్తావ్యక్త స్వరూపిణి** అని కూడా చెప్పబడుతోంది.

"త్వమ్-నీవు" అను రూపముగా ఉన్నది ఆ దేవియే కాబట్టి **"తత్త్వ (తత్-త్వమ్) స్వరూపిణీ దేవీ!"** … అని అభివర్ణించబడుతోంది. అనేకముగా కనిపిస్తున్న ఈ విశ్వమంతా దేవియొక్క ఏక స్వరూపము కనుక, "**ఏకమ్ దేవీ**" … అని ఎలుగెత్తి పిలువబడుచున్నది.

ఈ జీవుల స్వతః సిద్ధమగు సత్యరూపము ఏమిటి అని పరిశీలిస్తే, **జగత్‌రూపజననియగు దేవీ మహత్య్మ విశేషమే!** ఆ దేవియొక్క సత్‌స్వరూప విశేషమే ఈ జగత్తు … అని తెలియవచ్చుచున్నది. అందుచేత "**మహత్ తత్ శిష్యతే**" అనబడుచున్నది.

తెలియబడుచున్న ప్రజ్ఞానము బ్రహ్మము! తెలుసుకొనుచున్న 'నేను' **ప్రజ్ఞానరూప బ్రహ్మమునే! ప్రజ్ఞానమ్ దేవీ స్వరూపమ్।** - అని విజ్ఞులు దేవీ పరబ్రహ్మ స్వరూపము గురించి వ్యాఖ్యానిస్తున్నారు. "**తెలియబడే జగత్తు దేవియే! తెలుసుకొనుచున్న ద్రష్టయూ దేవియే**" …. అని భాష్యము చెప్పుచున్నారు. ఆ దేవీ తత్త్వసారము తెలిసియున్నవారు "**తత్ త్వమ్ అసి! నా ఎదురుగా "నీవు" అను రూపముగా కనిపించేదంతా ఆ దేవియొక్క దివ్యానంద పరబ్రహ్మస్వరూపమే!**"… అని సంభాషించుచున్నారు. అదియే తత్త్వశాస్త్రమై విరాజిల్లుచున్నది. ఈ జగత్తు బంధము కాదు. ***"ఆత్మేశ్వరి" అగు జగన్మాతా స్వరూపము! జగదీశ్వరీ క్రీడా - లీలా - ఆనంద స్వరూపము!***

ఈ జీవాత్మగా కనిపించేది దేవీ చైతన్యమే అని గ్రహించిన మహనీయులు **అయమాత్మా బ్రహ్మ** అను పరార్థ సమన్వయమును ఆశ్రయించినవారై ఉంటున్నారు.

అట్లాగే …., **"దేవికి నేను వేరు"** అను అహంకారమును త్యజించుచున్నారు. **దేవి సర్వదా అనన్యము కదా!**

నేను దేహ-మనో-బుద్ధి-చిత్త-అహంకారములను కాను. అవన్నీ ఆపాదితములు. సందర్భములో కనిపించే ఇవన్నీ సందర్భముతోనే తొలగుచున్నాయి. మరి నేను ఎవరు? **జగన్మాతాభావనా కిరణ స్వరూపుడను! బ్రహ్మైవాఽహమస్మి!** నేను బ్రహ్మమే అయి ఉన్నాను. అంతేగాని ఒక జీవజాతిని కాను. (లేక) ఒక లోకవాసిని కాను! రూప-మాన-గుణములు కాను! దేవీ మహత్మ స్వరూప విశేషమునే!

దేవీతత్త్వముతో తదాత్మ్యము-మమేకము అగు విజ్ఞులు దేవీ స్వరూప-తదాత్మ్య భావావిష్కరణను అనుక్షణము కలిగినవారై ఉంటున్నారు.

**యో-అహమస్మి:** ఆ దేవికంటే నేను వేరుకాదు. అందుచేత నేను ఏదై ఉన్నానో,…. అది దేవియే! దేవి ఏదై ఉన్నదో అదియే నేను. నాకు - దేవికి ఉన్న సంబంధము…. "బంగారు ఆభరణమునకు - బంగారమునకు ఉన్న సంబంధము. ఆభరణములు అనేకం! బంగారము ఒక్కటే! ఇహజీవాత్మలు అనేకం! పర దేవీశ్వరీ దేవీ ఒక్కటే!

**సోఽహమస్మి:** నేను ఆ దేవీ స్వరూపమే! మరింకేమీ కాదు. దేహము-జాతి-జన్మ-కర్మ-స్థానము-పదవి-గుణము-పాండిత్యము… మొదలైనవేవీ కూడా నేనై ఉండలేదు. అవి నావి కావు. జగన్నాటక సంబంధమైనవి మాత్రమే! అఖండాత్మ దేవికి సంబంధించినవి. ఇక నేనో? కేవలము ఆ దేవీ స్వరూపుడనే అయి ఉన్నాను. తదితరమైనదంతా ఆదేవికి ఆభరణములు!

**యో అసౌ, సోఽహమస్మి:** ఆ దేవి ఏమిటో నేనూ అదియే! ఆ దేవికి వేరై ఉన్నాను - అనటానికి నేను అహంకారము కలిగి ఉండాలి. కాని "అహంకారము" కూడా (సోఽహమస్మి-సయేవ అహమ్ అస్మి) ఆ దేవీ స్వరూపమే అయి ఉన్నది. ఎందుకంటే, ఆ దేవి అనన్యము - అద్వితీయము కదా! కనుక **అహమ్-నేను** గా ఉన్నది ఆ దేవియే! **'నిర్గుణి' యగు దేవియందు 'సగుణి' అగు నేను 'దేవి'కి అభిన్నమై ఉన్నాను.** నేను సగుణినై ఉంటే, అదంతా నిర్గుణియగు దేవియొక్క సగుణ చమత్కారమే!

**యా భాష్యతే స ఏషా :** ఏది ఆ దేవి గురించి (లలితా సహస్రము - త్రిపురా రహస్యము - ఇత్యాది స్తోత్ర పఠణ-పరిశీలనా సాహిత్యము దృష్ట్యా) …. వ్యాఖ్యానించి, వివరించి…. భాష్యము చెప్పబడుచున్నదో,….. అది **మమాత్మ స్వరూపము గురించే!** మమాత్మ దేవీ స్వరూపమే అయి ఉన్నది కదా! ఎందుకంటే, **దేవియే మమాత్మ స్వరూపిణి** కాబట్టి!

**షోడశీ శ్రీవిద్యా : (ఓం ఐ హ్రీం క్లీం శ్రీం శ్రీ బాల త్రిపురసుందరీ నమః** … అని) మంత్ర-తంత్ర ముగ్ధముగా చెప్పబడు ఆ దేవి యొక్క ఉపాసనచే - భక్తునకు (మంత్రోపాసనకు) దేవీత్వమే ప్రాప్తిస్తోంది.

**పంచదశాక్షరీ :** (15) బీజాక్షర స్వరూపిణి! (క ఏ ఈ ల హ్రీం - హ సకహల హ్రీం - సకల హ్రీం)

**మహాత్రితపుర సుందరీ :** జాగ్రత్ స్వప్న సుషుప్తులను, భూత-వర్తమాన-భవిష్యత్తులను, జీవ-ఈశ్వర-పరబ్రహ్మములను తన సుందర రూపముగా కలిగి ఉన్నట్టి దేవి! కాబట్టి **మహాత్రిపుర సుందరి!**

**బాలాంబికే :** ఈ విశ్వము, ఈ జగత్ సృష్టి - స్థితి - లయములు **ఆ దేవియొక్క బాలాలీలా వినోదము.** అంతే కాకుండా,.... సర్వజీవులు తానై, సర్వజీవులకు సర్వము ప్రసాదిస్తూ ఉండటముచే ఆ దేవి "అంబ"!

**బగళేతి :** సర్వశబ్దాక్షర స్వరూపిణి!

**మాతంగేతి:** సర్వ దేహములలోని 'మ' కార (జీవాహంకార) స్వరూపిణి! "నేను" అను భావనకు మునుముందే గల 'మహానేను' స్వరూపిణి!

**స్వయం వరకళ్యాణి :** స్వయముగా వరప్రసాదిని, లోక కళ్యాణ ఆనంద స్వరూపిణి. ప్రేమగా, లాలనగా అర్థిస్తే ఏదైనా ఇచ్చుటకు సంసిద్ధమైయున్న మాతృవాత్సల్య స్వరూపిణి!

**భువనేశ్వరీ :** చతుర్దశ భువనములుగా తానే విస్తరించినదై ఉన్నది. 'స్వప్నద్రష్ట' చైతన్యమే స్వప్నమంతా నిండి ఉండి, సర్వము అగుచున్న రీతిగా.... ఇదంతా దేవీ ఆనంద స్వరూప విస్తారమే!

**చాముండేశ్వరి :** దోషములను హరించు దేవి. మనో-బుద్ధులలోని అసంఖ్యాక దోషములు తొలగడానికి-ఆ దేవిని ఆశ్రయించి, దేవీతత్త్వమును భావించుటయే ఉపాయము.

**చండ :** సర్వము శాసించునది.

**వారాహీ :** సర్వమును సర్వజీవులకు అందించుచున్నట్టిది. మాతృక!

**తిరస్కరిణి :** సర్వము తిరస్కరించగా శేషించు దేవి.

**రాజమాతంగి :** సర్వజీవులకు మాత. సర్వులయొక్క ఆత్యంతిక స్వస్వరూపము! మహాహంకార స్వరూపిణి! (అన్ని అహంకారములు తనవే అయినట్టి దేవి!)

**శుక శ్యామల :** 'వేదాంత శాస్త్రము' అనే చిలక పలుకుల అంతర్భాగము.

**లఘు శ్యామల:** వేదాంతశాస్త్ర తర్కరూప బాహ్యార్థములు.

**అశ్వారూఢ :** మనస్సును అధిరోహించిఉన్న దేవి.

**ప్రత్యంగిరా :** జీవులందరి వాస్తవ అచంచల స్వస్వరూపము.

**సావిత్రీ :** సత్-విత్-ఋత్ :: ఉనికి - ఎరుక - సహజసత్యము.

**గాయత్రీ :** గాతయత్ త్రాయతే! గానము చేసినవారిని రక్షించునది.

**సరస్వతీ :** సత్ రస స్వరూపిణి! ప్రతి జీవునిలో సత్ చిత్ ఆనందరసముగా ప్రత్యక్షమై ఉన్నట్టిది.

**బ్రహ్మానంద కళ :** సర్వము బ్రహ్మముగా దర్శించునప్పటి ఆనంద కళ!

**ఋచో అక్షకేరే :** ఋత్-పరమసత్య స్వరూపిణి. మార్పులు-చేర్పులు లేనందున అక్షరము. ఋగ్వేదములోని ఋక్కులచే స్తోత్రము చేయబడునది.

**పరమే వ్యోమ్నే :** పరమాకాశ స్వరూపిణి, పరమానంద రూపిణి, మార్పుచెందు సర్వ వస్తువులకు మూలాధారము.

ఎందులోఅయితే ఈ విశ్వము, విశ్వ దేవతలు అలంకారప్రాయులై స్థితి కలిగి ఉన్నారో, అదియే ఆ దేవీ స్వరూపము. అట్టి సర్వాత్మస్వరూపము, సర్వదేవతల-సర్వ మానవుల-సర్వ జీవుల-సమస్త విశ్వముల యొక్క వాస్తవరూపమగు దేవీ పరమాత్మచైతన్య తత్త్వము గురించి తెలుసుకోకుండా-యః తత్ న వేద, కం ఋచా కరిష్యతి?..., కేవలము ఋగ్వేద ఋక్కులు చదవటం, ఎలుగెత్తి స్వర విన్యాసంగా పలకటం మాత్రము చేత లాభమేమున్నది? అవన్నీ చిలుకలు నేర్చుకొని పలికే 'బబ-మమ-తత పలుకులవంటివే!

ఎవ్వరైతే సకల, **"దేవతలతో కూడియున్న ఈ విశ్వమంతాకూడా, అహమ్-త్వమ్- సః ప్రత్యయార్థములతో సహా ఆ దేవీ తత్త్వమగు అఖండాత్మ స్వరూపమే"** ... అని గ్రహిస్తారో,

వారు స్వయముగా **దేవీ ఆనందరూపులై,**

పరమానందమగు **పరమాత్మస్వరూపులై,**

సర్వమును **తమయందే సందర్శిస్తూ సర్వతత్త్వ స్వరూపముగా,**

అంతటా సమముగా వేంచేసిన **సమాసతరూపముతో,**

**బ్రహ్మానందాస్వాదనమును అనునిత్యపరచుకోగలరు!**

*ఇతి బహ్వృచోపనిషత్*

*ఓం శాంతిః శాంతిః శాంతిః*


ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 9 ముద్గలోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## మంగళ - శ్లోక --- తాత్పర్యపుష్పము



**శ్లో॥ శ్రీమత్ పురుష సూక్తార్థం, పూర్ణానంద కళేబరమ్।**
**పురుషోత్తమ విఖ్యాతం, పూర్ణం బ్రహ్మ భవామి అహమ్॥**

పూర్ణానందముగా తీర్చిదిద్దగల "పురుషోత్తమము" అని ప్రసిద్ధమై యున్న - శ్రీమత్ నారాయణ ప్రవచితమగు పురుషసూక్తార్థమును సేవించి పూర్ణబ్రహ్మముగా అగుదుము గాక!

| | |
|---|---|
| **1. ఓం**<br>**(అథ) పురుషసూక్తార్థ నిర్ణయమ్,**<br>**వ్యాఖ్యాస్యామః ।**<br>**పురుష సంహితాయామ్**<br>**పురుష సూక్తార్థః సంగ్రహేణ ప్రోచ్యతే ।** | సర్వస్వరూపుడు - స్వస్వరూపుడు ఓంకార సంజ్ఞార్థుడు అగు పరమపురుషుని గురించి పురుష సూక్తముచే గానము చేయబడుచున్నది! అట్టి 'పురుషసూక్తము' ఏ అర్థమును అందిస్తోందో. ఈ జీవుని వాస్తవ - సహజ స్వరూపమగు పరమపురుష తత్త్వము గురించి ఏమని నిర్ణయిస్తోందో, వ్యాఖ్యానిస్తోందో, ... ఆ విషయాలు ఇప్పుడు మనము చెప్పుకుంటున్నాము. పురుష సంహిత లో వర్ణించి చెప్పబడిన పురుషసూక్తము యొక్క అర్థ విశేషాలను సంగ్రహముగా వివరించుకొనెదము గాక! |
| **'సహస్ర శీర్షా' ఇతి అత్ర స శబ్దో అనంత వాచకః।**<br>**అనంత యోజనం ప్రాహ 'దశాంగుల' వచః తథా।**<br>**ప్రథమ మంత్రం:**<br>**తస్య ప్రథమయా విష్ణోః**<br>**(సహస్రాక్షః సహస్ర పాద్**<br>**సభూమిం విశ్వతో వృత్వా**<br>**అత్యతిష్ఠత్ దశాంగుళమ్)**<br>**ద్వితీయ మంత్రం -**<br>**(పురుష ఏవ ఇదగ్ం సర్వం**<br>**యత్ భూతం, యచ్చ భవ్యమ్॥)**<br>**ద్వితీయా చ అస్య విష్ణోః 'కాలతో వ్యాప్తిః' - ఉచ్యతే ।** | **సహస్ర శీర్షా పురుషః । సహస్రాక్షః । సహస్రపాత్!**<br>పురుషుడు = The worker of the Universe, వేయితలలు = సహస్రశీర్షా పురుషః అనునది - ఒక కథలోని అనేక పాత్రల ఆలోచనా విధానాలన్నీ ఆ కథా రచయిత యొక్క సంకల్పనా చమత్కారములైన తీరుగా - పురుషుడు (పరమాత్మ) అనంత రూపుడు - అనంతగుణుడు - అనంత నామాత్మకుడు... మొదలైన విధంగా - ఆయన **అనంతతత్త్వము** సూచించబడుచున్నది.<br>**భూమిం - విశ్వతో వృత్వా స దశాంగుళమ్ అత్యతిష్ఠతి** : అని అన్నప్పుడు - "ఈ భూమి - విశ్వము (దృశ్యము) పరిమితము కాదు - అపరిమితము. అనంతవిస్తీర్ణము - అని అభివర్ణించబడుచున్నారు. దేశతో వ్యాప్తిః శబ్దో దశాంగుల వచః తథా।<br>*(కథా రచయిత యొక్క రచనాకళావిశేషమే కథంతా నిండి, తాను కథకు వేరుగా ఉన్నట్లు, స్వప్నము తనదైనవాడు-స్వప్నమంతా నిండి ఉండి-వేరుగా కూడా ఉన్న విధంగా)*<br>..."ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నవాడు.... అను అర్థమును సూచించేదే 'విష్ణు శబ్దము'.<br>**దశాంగుళమ్** అన్నప్పుడు దేశముగా (Byvirtue of Place and Matter) - విష్ణువు అనంతుడై విస్తరించి ఉన్నారు - అని విష్ణు ప్రథమ వర్ణన.<br>**'యత్ భూతమ్ - యశ్చభవ్యమ్'** అనునప్పుడు కాలముచే ఆయన అనంత కాలస్వరూపుడై విస్తరించి ఉన్నట్లు దేశతః - కాలతః అనంతుడు అగు విష్ణువే **తత్పురుషుడు** - అని సిద్ధాంతీకరించబడుతోంది - (విష్ణు ద్వితీయ వర్ణన) |

2. విష్ణోః మోక్ష ప్రదత్వంచ కథితంతు తృతీయయా ।
'ఏతావాన్' ఇతి మంత్రేణ వైభవమ్ కథితమ్ హరేః ।
'ఏతేనైవ చ' మంత్రేణ చతుర్వ్యూహో విభాషితః ।
'త్రిపాద్' ఇతి అనయా ప్రోక్తమ్ అనిరుద్ధస్య వైభవమ్ ।
'తస్మాత్ విరాడ్' ఇతి అనయా పాదనారాయణాత్ ధరేః ।
'ప్రకృతేః పురుషస్య' అపి సముత్పత్తిః ప్రదర్శితా ।

**ఉత అమృతస్య ఈశానః యత్ అన్నేన అతిరోహతి** - అను '3'వ మంత్రము విష్ణువు **అజ్ఞాన జీవులకు మోక్షమును ప్రసాదించుట కొరకై అన్నము** (That being Experienced) రూపముగా వేంచేస్తున్నారు... అని వ్యాఖ్యానించబడుచున్నది.

**ఏతావాన్ అస్య మహిమా అతోజ్యాయా గ్ంశ్చ పురుషః** - ఆ పురుషుని మహిమా విశేషమే ఈ దృశ్య జగత్తు - ఈ జీవులు కూడా ! ఆయన - మన కంటికి కనిపించే శక్తి కన్నా కూడా ఇంకా ఇంకా అనంత శక్తి - ప్రభావ - వైభవములు కలిగియున్నారు.

ఈ విశ్వము - ఇందులోని జీవరాసులు... (భౌతిక ప్రపంచమంతా - మార్పు - చేర్పులు పొందుతూ) ఆ పురుషునిలో 4వ వంతు మాత్రమే. ఈ భౌతిక ప్రపంచానికి ఆవల అమృతము - దివ్యము అగు మరిమూడు విభాగములు నిత్యమై ప్రకాశిస్తున్నాయి.

(1) **విరాట్ పురుషుడు** - భౌతిక కల్పనా కళాపురుషుడు భౌతిక - తత్త్వము - శరీర పురుషుడు (ప్రకృతి)
(2) **ఛందః పురుషుడు** - మనో పురుషుడు (కేవల మనస్సు)
(3) **వేద పురుషుడు** - బుద్ధి పురుషుడు (కేవల బుద్ధి)
(4) **మహా పురుషుడు** - ఆత్మ పురుషుడు

త్రిపాదూర్ధ్వ ఉదైఃపురుషః - అన్నప్పుడు మార్పులేని - నిరుద్ధముకానట్టి - **అనిరుద్ధ పురుష** వైభవము చెప్పబడుతోంది !

**తస్మాత్ విరాట్ - జాయత** : దేహమునకు వేరైన - గుణ దోషములచే స్పృశించని ఆవల '3' భాగముల నుండి చేతన - అచేతన రూపములుగా విరాట్ రూపుడై, భూవిభాగుడై "పాదనారాయణుడు"..గా ప్రదర్శనమగుచున్నారు.

**తస్మాత్ విరాడజాయతా** - అనుమంత్రముచే ఆ నారాయణుని నుండి ప్రకృతి-జీవుడు ఈ రెండు సముత్పన్నమై ప్రదర్శితమగుచున్నాయి - అని తెలియజేయ బడుచున్నది.

'యత్ పురుషేణ' ఇతి అనయా సృష్టి యజ్ఞః సమీరితః ।
'సప్త ఆస్యాసన్ పరిధయః' సమిధశ్చ సమీరితాః।

**యత్ పురుషేణ హవిషా దేవాయజ్ఞమ్ అతన్వత** - దేవతలు - శరీర రచనా ప్రజ్ఞలు సృష్టించబడి, ఆ తరువాత సృష్టికొరకై ఆ దేవతలు "సృష్టియజ్ఞము" ను నిర్వర్తించటము గురించి చెప్పబడుతోంది.

**సప్తాస్యాసన్ పరిధయః త్రిసప్తసమిధః కృతాః** దేవతలు పురుష స్వరూపమనే 'హవిస్సు'గాను, శరదృతువును ఆజ్యముగాను, ఏడు స్వరములు ఛందస్సులు గాను, 7 × 3 ఉదాత్త - అనుదాత్త మొ॥వి సమిధలుగాను **విరాట్ పురుషుని** యజ్ఞపశువుగాను **మానసిక యజ్ఞము** సృష్టికొరకై నిర్వర్తించారు.

**దేవతలు** : సృష్టికర్త బ్రహ్మ యొక్క ప్రాణ - ఇంద్రియ స్వరూపులు. సృష్టియొక్క మూల స్వరూపములైనట్టి కేవల శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ ప్రదాతలగు దివ్య ప్రజ్ఞలు.

'తం యజ్ఞమ్' ఇతి మంత్రేణ సృష్టియజ్ఞః సమీరితః ।
'అనేనచ ఏవ' మంత్రేణ మోక్షశ్చ సముదీరితః ।

తం యజ్ఞమ్ బర్హిషి ప్రోక్షన్ పురుషం జాతమగ్రతః - ఆ సృష్టియజ్ఞము సిద్ధించటానికి సృష్టికి పూర్వమే జనించిన విరాట్ పురుషుడు యజ్ఞపశువుగా వికసించారు.

ఆ సృష్టియజ్ఞములో అనేక సృష్టికి ఉపకరణములగు నామరూపాత్మకమైన వస్తు తత్త్వములు, జంతుతత్త్వములు, శక్తితత్వములు ఆ యజ్ఞపశువు నుండి ... జనించాయి. జీవుడు, బంధము, మోక్షము... వరకు సృష్టి సరంజామా అంతా ఉత్పన్నమైనది.

'తస్మాత్' ఇతి చ మంత్రేణ జగత్ సృష్టిః సమీరితా।
'వేదాహమ్' ఇతి మంత్రాభ్యామ్ వైభవమ్ కథితం హరేః।
'యజ్ఞేన' ఇతి ఉపసంహారః సృష్టేః మోక్షస్యచ ఈరితః
'య ఏవమ్' ఏతత్ జానాతి స హి ముక్తో భవేత్ । ఇతి।।

**తస్మాత్ యజ్ఞాః సర్వహుతః సంభృతమ్ పృషత్ ఆజ్యమ్** - అనుమంత్రము చే ఈ దృశ్యజగత్ సృష్టియొక్క కల్పనా విధానమంతా చెప్పబడినది.

(1) **వేదాऽహమ్ ఏతమ్ పురుషం మహాంతమ్, ఆదిత్యవర్ణమ్, తమసస్తుపారే...**

(2) **ధాతా పురస్తాత్ ఆద్యం ఉదజహార, శక్రః ప్రవిద్వాన్ ప్రదిశః చతస్రః** - అను రెండు మంత్రములచే సర్వమును తానైన **'హరి'** యొక్క వైభవము వర్ణించి చెప్పబడింది.

**యజ్ఞేన యజ్ఞమ్ అజయన్త దేవాః తాని ధర్మాని ప్రథమాని ఆసన్** అను మంత్రము ద్వారా, **"ఈ సృష్టికి మోక్షమే ఉపసంహారము"** ... అను విషయము విశదీకరించబడింది.

ఎవ్వడైతే మూలపురుషుడు తత్త్వ ప్రజ్ఞలగు ఇంద్రియదేవతలు - దేవతల యజ్ఞము - సృష్టిప్రదర్శనము - ఉపసంహార రూపమగు మోక్షము... మొదలైనవి గానము చేయబడిన పురుషసూక్తార్థమును తెలుసుకుంటాడో, ఆతడు తాను ముక్తుడౌతాడు. లోక సహజనులకు కూడా ముక్తిని కలిగించగలడు.

---

**3.** అథ తదా "ముద్గలోపనిషత్"
ఇతి పురుషసూక్తస్య వైభవమ్
విస్తరేణ ప్రతిపాదితమ్ ।
వాసుదేవ ఇంద్రాయ భగవత్ జ్ఞానమ్ ఉపదిశ్య
పునరపి సూక్ష్మశ్రవణాయ
ప్రణతాయ ఇంద్రాయ।
పరమ-రహస్య భూతమ్,
పురుషసూక్తాభ్యామ్
ఖండద్వయాభ్యామ్
ఉపాదిశత్।
ద్వౌ ఖండే ఉచ్యేతే
యో అయమ్ ఉక్తః సః 'పురుషో
నామ - రూప - జ్ఞాన అగోచరమ్ ।
సంసారిణామ్ అతి దుర్జ్ఞేయమ్ ।
విషయం విహాయ
క్లేశాదిభిః సంక్లిష్ట దేవాది జిహీర్షయా
సహస్ర కలావయవ కల్యాణమ్ దృష్టమాత్రేణ
మోక్షదమ్ వేషమ్ ఆదదే।।

ఈ విధంగా "ముద్గలోపనిషత్" ప్రతిపాదించబడిన పురుషసూక్త వైభవమును భగవంతుడగు వాసుదేవుడు ఇంద్రునకు జ్ఞానోపదేశము కొరకై సవిస్తరముగా బోధించారు.

అప్పుడు ఇంద్రుడు పురుషసూక్తవైభవమును విన్న తరువాత మరింత సూక్ష్మగ్రహణమునకై, అందులోని పరమ రహస్యమగు మరికొంత అంతరార్థము తెలుసుకోవాలనుకొని, తిరిగి జగద్గురువగు వాసుదేవునికి నమస్కరించారు.

అప్పుడు వాసుదేవ భగవానుడు పురుషసూక్తమంత్రముల యొక్క పరమరహస్యమగు సూత్రార్థమును రెండు ఖండములుగా (విభాగాలుగా విభాగించి) ఉపదేశించసాగారు.

తదాదిగా, రెండు (ఖండములుగా) విభాగములుగా చేసి పురుషసూక్తార్థమును చెప్పుచున్నారు.

**పురుషసూక్తములో చెప్పిన పురుషుడు అనగా ఎవ్వరు?** ఆయన నామ - రూపములకు సంబంధించినవాడు కాదు. ఇంద్రియ జ్ఞానమునకు అగోచరుడు.

దృశ్యముపట్ల సత్యదృష్టి కలిగినవారై, ఇంద్రియ విషయములే ఆశయములుగా గల సంసార జీవులకు అందని వాడు దుర్జ్ఞేయుడు.

ఆయన నిర్విషయుడు. ఇంద్రియ విషయములకు వేటికీ సంబంధించనివాడు. ఇంద్రియ ధ్యాసలకు అందనివాడు. కానీ దేవతలయొక్క మరియు (కర్మ - భక్తి - జ్ఞాన - యోగమార్గములను అనుసరించు) సర్వ జీవులయొక్కయు - సంక్లిష్టములను, ఆపదలను తొలగించుటలో సముత్సాహము కలిగియున్నవారు. వేలాది కళారూపములు, - కళావయములు తనయందు కలిగి ఉన్నవాడై - **కళ్యాణ ప్రదుడై దర్శన మాత్రముచే మోక్షప్రదుడు.** సర్వ సులక్షణములుగల వేషమును స్వీకరించువారు. (నామ రూప రహితుడై ఉండి కూడా,... దేవతల కొరకు, భక్తుల కొరకు మంగళప్రద రూపులై కనిపించువారు. అవతారములు ధరించువారు).

4. తేన వేషేణ భూమ్యాది లోకమ్ వ్యాప్య
అనంత యోజనమ్ అత్యతిష్ఠత్ ।
పురుషో నారాయణో భూతమ్ భవ్యమ్ భవిష్యత్ చ ఆసీత్।
స ఏష సర్వేషామ్ మోక్షదశ్చ ఆసీత్।
స చ సర్వస్మాన్ మహిమ్నోః జ్యాయాన్ ।
తస్మాత్ న కోఽపి జ్యాయాన్।
మహాపురుష ఆత్మానమ్ చతుర్ధా కృత్వా,
త్రిపాదేన పరమే వ్యోమ్ని చ ఆసీత్ ।
ఇతరేణ చతుర్థేన అనిరుద్ధనారాయణేన
విశ్వా న్యాసన్! సచ పాదనారాయణో
జగత్ స్రష్టుమ్ ప్రకృతిమ్ అజనయత్ ।
స సమృద్ధ కామఃసన్, సృష్టికర్మ న జజ్ఞివాన్,
సో అనిరుద్ధనారాయణః తస్మై సృష్టిమ్ ఉపాదిశత్ ॥

ఆ రూపమే "**పురుష నారాయణ**" రూపము. ఆ రూపముతో ఆయన భూ - స్వర్గ - పాతాళ త్రిలోకములన్నీ వ్యాపించి అనంత యోజన విస్తీర్ణములను, అనేక బ్రహ్మాండములను ఆక్రమించుకొని ఉన్నారు. ఈ సర్వము తానై ఉన్నారు!

ఆ పురుష నారాయణుడే భూత-వర్తమాన - భవిష్యత్ **ఏకస్వరూపుడు** !

ఆయన సర్వులకు 'మోక్షప్రదుడు' అయి ఉన్నారు.

ఆయన తదితర సర్వవస్తువుల కంటే - **మహామహిమాన్వితుడు.** సర్వ విషయములకు ఉత్పత్తిస్థానమైకూడా **నిర్విషయుడు. సర్వము తన మహిమగా కలవాడు.**

ఆ పురుష నారాయణుని మించినది మరెవ్వరూ లేరు. ఏదీ లేదు.

ఆ మహాపురుషుడు తనను తాను 4 విభాగములుగా రచించుకొనుచున్నారు.

తన యొక్క మూడు పాదములచే (విభాగములచే) ఆకాశమంతా నింపివేస్తున్నారు. పరమాకాశ రూపంగా సంప్రదర్శితులు.

ఇక నాలుగవ పాదము (విభాగము) అగు 'అనిరుద్ధనారాయణుడు'- సర్వభౌతిక ప్రపంచ రూపుడగుచున్నాడు. అట్టి విశ్వరూపుడగు పాదనారాయణుడు జగత్ సృష్టి నిర్వర్తించటానికై 'ప్రకృతి'ని జనింప చేయుచున్నారు.

ఆ పాదనారాయణుడు పూర్ణకాముడు. కొత్తగా 'ఇది పొందాలి' అనునదేదీలేదు. అందుచేత సృష్టికి సంబంధించిన జిజ్ఞాస ఏమీ ఉండదు. త్రిపాదూర్ధ్వ పురుషుడగు అనిరుద్ధ నారాయణుని ఉపదేశము చేతనే 'సృష్టి' అను ప్రకృతి పాదనారాయణునిచే సంకల్పితమగుచున్నది. ఈ సృష్టి నారాయణ వినోద సంకల్ప రూపము!

---

5. బ్రహ్మన్! తవ ఇంద్రియాణి యాజకాని ధ్యాత్వా,
కోశభూతమ్ దృఢ గ్రంథిం, కళేబరం హవిః ధ్యాత్వా,
మాం హవిర్భుజమ్ ధ్యాత్వా,
వసంతకాలం ఆజ్యం ధ్యాత్వా, గ్రీష్మమ్ ఇధ్మం ధ్యాత్వా,
శరదృతుమ్ రసమ్ ధ్యాత్వా, ఏవమ్ అగ్నౌ హుత్వా,
అంగస్పర్శాత్ కళేబరం
వజ్రం హీష్యతే।
తతః స్వకార్యాన్,
సర్వప్రాణి-జీవాన్ సృష్ట్వా
పశ్చాత్ ద్యాః ప్రాదుర్భవిష్యంతి।
తతః స్థావర - జంగమాత్మకం
జగత్ భవిష్యతి ।
ఏతేన జీవాత్మనోః యోగేన
మోక్షప్రకారశ్చ
కథిత, ఇతి అనుసంధేయమ్ ।

నా అంశరూపుడవగు ఓ బ్రహ్మదేవా ! సృష్టియజ్ఞము కొరకై ధ్యానము చేయుచుందురు గాక! మీరు ఇంద్రియములనే సృష్టియజ్ఞము నిర్వర్తించు యాజకులు అగుదురుగాక!

- దృఢ గ్రంధులు కలిగి, కోశములతో కూడిఉన్న కళేబరము (ఈ భౌతిక దేహము) హవిస్సుగా అగుగాక! హవిస్సుగా (ధ్యానము చేయుదురు గాక!)
- (అనిరుద్ధ నారాయణుడగు) నేను హవిర్భోక్తనుగా భావించబడుగాక ! ముందుగా కాలమును కల్పించండి ! కాలస్వరూపుడనై నేనే ఉంటాను! అనగా కాలమును నాయందు కల్పించెదరు గాక!
- వసంతకాలము - ఆజ్యము
- గ్రీష్మఋతువు - ఇంధనము
- శరదృతువు - హవిస్సు

సృష్టియజ్ఞమును ఈవిధంగా ఆరంభించి,... అప్పుడు అగ్నియందు హోమము చేసెదరుగాక !

ఆ తరువాత అంగస్పర్శచే మీ సూక్ష్మ రూపములగు అంగములు వజ్రమువలె స్థూలత్వము సంతరించుకొనును గాక !

మీరప్పుడు 'స్వకార్యము'గా స్వీకరించి, సర్వప్రాణులను సృష్టించెదరుగాక ! అటు తరువాత, మీరు కూడా నామరూపాత్మకులై ఆవిర్భవించండి!

అట్టి మీ ఆవిర్భావమునుండి స్థావర - జంగమాత్మకమగు జగత్తు ఏర్పడును గాక! సృష్టిలో మీ కల్పనను ఆస్వాదించు నా అంశ అగు జీవాత్మ - దృశ్యమును పొందుచూ ఉంటాడు. "నేను దేహముచే బద్ధుడను" ... అనునది కలిగి ఉంటున్నాడు.

అట్టి జీవాత్మ ... జగన్నాటకముల యొక్క విధివిధానంగా జీవాత్మ - పరమాత్మల

య ఇమం సృష్టియజ్ఞమ్
జానాతి మోక్షప్రకారం చ,
సర్వమ్ ఆయుః ఏతి ।

సంయోగరూపమగు 'మోక్షము' కూడా సృష్టియందు పొందుపరచబడును గాక! ఈ విధంగా సృష్టి - స్థితి - మోక్షము ప్రకారము తెలుసుకొనువాని ఆయుష్షు పవిత్రమగుచున్నది. **నిర్విషయ నిరాకారము - సవిషయ సాకారము - జీవాత్మ - బంధము - జగత్ లీల - పరమాత్మత్వము - మోక్షము.... ఇదంతా నారాయణలీల!**

---

**6.** ఏకో దేవో బహుధా నివిష్టః
అజాయమానో, బహుధా విజాయతే ।
"తమ్ ఏతమ్ అగ్నిః" ఇతి అధ్వర్యవ ఉపాసతే।
'యజుః' ఇతి ఏష హి
ఇదమ్ సర్వమ్ యునక్తి! "సామేతి" ఛందోగాః।
ఏ తస్మిన్ హి ఇదమ్ సర్వమ్ ప్రతిష్ఠితమ్ ।
'విషమ్' ఇతి సర్పాః।
'సర్ప' ఇతి సర్పవిదః।
'ఊర్గ్' – ఇతి దేవాః ।
'రయిః' ఇతి మనుష్యాః ।
'మాయా' ఇతి అసురాః।
'స్వధా' ఇతి పితరః ।
'దేవజన' ఇతి దేవజన విదః ।
'రూపమ్' ఇతి గంధర్వాః।
'గంధ' ఇతి అప్సరసః ।
తం యథా యథా – ఉపాసతే
తథైవ భవతి ।
తస్మాత్ బ్రాహ్మణః పురుషరూపం
"పరం బ్రహ్మైవాఽహమ్' ఇతి
భావయేత్ తద్రూపో భవతి, య ఏవం వేద ।

పరమాత్మయగు శ్రీమన్నారాయణుడు సర్వదా 'ఏకమే' అయి ఉండి కూడా బహు విధములుగా కనబడుచున్నారు. తెలియబడరు. కానీ, తెలియబడేదంతా ఆయనయే! ఆయన జన్మ రహితుడై ఉండి కూడా అనేక నామ - రూపములలో జన్మించుచున్నారు. అనేక రూపములతో అనేక రీతులుగా తనను తానే ఉపాసించుకొనుచున్నారు. అట్టి ఏకస్వరూపుడగు ఏకో నారాయణుని యజుర్వేద పారాయణులగు ఆధ్వర్యులు **"అగ్ని స్వరూపుడు"** అని ఎరిగి, యజ్ఞములతో ఉపాసించుచున్నారు. యజస్సులు సర్వము ఏకముగా కలుపుచున్నది"... అని వారు భావిస్తున్నారు.

ఇక ఛందోగులు **"గానమే బ్రహ్మము ! ఆ పరమాత్మయొక్క సామగానమే ఇదంతా"** (All this is a song sung by God) అను మార్గముగా ఉపాసిస్తున్నారు. ఆ పరమాత్మయందే మంత్రములు - గానములు మొదలైనవన్నీ కూడా ప్రతిష్ఠితమై ఉన్నాయి. పరమాత్మయొక్క చిద్విలాస లీలయే ఈ ఏక - అనేక-రూప చమత్కారమంతా ! అదంతా సృష్టిని సుందరవనముగా తీర్చిదిద్దుచున్నది.

సర్పములు (ఆ ఆదినారయణ పరమాత్మను) 'విషము'గా ఆరాధిస్తున్నారు. సర్పవిదులు ఆ భగవానుని ... (నాగరాజు, ఆదిశేషుడు ఇత్యాతి) **సర్పరూపములు**గాను..., దేవతలు **'ఊర్గ్'** అను పేరుతోను, మానవులు **'తేజస్సు (కాంతి)'** రూపముగాను, **జ్యోతి** స్వరూపముగాను, అసురులు **'మాయా'** రూపమని, పితరులు **'స్వధా'**... రూపమని, దేవజనులు **'దేవజన'** రూపుడని (దేవజనులుగా ఉన్నట్టివాడని), ఉపాసిస్తున్నారు.

గంధర్వులు - "పరమాత్మ సర్వ రూపములు తానైనవాడు" అని ఆరాధిస్తున్నారు.

- అప్సరసలు 'గంధ' రూపుడని అంటున్నారు. ఈ విధముగా వేరువేరు జీవులు ఆ పరమాత్మను అనేక రూప - తత్త్వ రీతులుగా ఉపాసిస్తూ ఉన్నారు. ఒక చమత్కారము! ఎవరు ఏ రీతిగా - ఏ రూపముగా ఉపాసిస్తూ ఉంటే వారికి ఆ రీతిగానే పరమాత్మ పరాకాష్ఠ వస్తువుగా అనుభవమగుచున్నారు. **య దేవ ఉపాసయేత్, త దేవ భవత్యితి!**

అందుచేత, 'బ్రహ్మము' గురించి సమాచారము తెలిసిన వారు,... ఇదమ్ జగత్ బ్రహ్మమ్-ఈ జగత్తు బ్రహ్మమే! "త్వమ్ బ్రహ్మమ్-నీవు బ్రహ్మమే"! "అహమ్ బ్రహ్మోఽస్మి"

"నేను బ్రహ్మమును - బ్రహ్మమునే" అని అనుకుంటూ ఉండగా, తాము 'బ్రహ్మమే' అగుచున్నారు. (యత్ భావమ్ - తత్‌భవతి). "బ్రహ్మమునే నేను", నీవుగా కనిపిస్తున్నదంతా బ్రహ్మమే", "నేనే ఈ సర్వరూప పరబ్రహ్మమును" అని తలచువాడు, ఆవిధంగా అనుకుంటూ-అనుకుంటూ ఉండగా, స్వభావ సిద్ధముగా, ఆతనికి పరాకాష్ఠయందు సర్వము బ్రహ్మమే అగుచున్నది! అటుపై తానే 'బ్రహ్మము' అగుచున్నాడు.

---

**7.** తత్‌బ్రహ్మ – తాపత్రయాతీతమ్ ।
షట్ – కోశ వినిర్ముక్తమ్ ।
షట్ – ఊర్మివర్జితమ్ ।
పంచకోశాతీతమ్। షట్–భావ వికారశూన్యమ్ ।

బ్రహ్మమును ఆశ్రయించి, బ్రహ్మమే అయినప్పుడు - ఈ జీవుడు త్రితాపములకు అతీతుడు అగుచున్నాడు. ఆరు కోశముల నుండి వినిర్ముక్తుడు, - ఆరు ఊర్ములను దాటి వేసినవాడు, పంచకోశములకు ఆవలవాడు. ఆరు భావవికారములు లేనివాడు,

సర్వ లక్షణ విలక్షణుడు- గా ప్రకాశించుచున్నాడు.

**కనుక బ్రహ్మమును సర్వలక్షణ విలక్షణంగా ఉపాసించెదరు గాక!**

ఏవమ్ ఆది సర్వ విలక్షణమ్ భవతి ।
తాపత్రయం తు ఆధ్యాత్మిక ఆధి భౌతిక ఆధి దైవికమ్ ।
కర్తృ – కర్మ – కార్య.
జ్ఞాతృ – జ్ఞాన – జ్ఞేయ.
భోక్తృ – భోగ – భోగ్యమ్।
– ఇతి త్రివిధమ్ ।

**తాపత్రయములు** : (Tri - Worries)
ఆధ్యాత్మి - ఆధిభౌతిక - ఆధి దైవికములు
**త్రైమాయాత్రివిధములు**
- కర్తృ - కర్మ - కార్యములు
- జ్ఞాతృ-జ్ఞాన - జ్ఞేయములు
- భోక్తృ - భోగ - భోగ్యములు
ఇవి త్రైవిధ త్రిమాయలు

---

8. త్వక్ – మాంస – శోణిత –
అస్థి – స్నాయు – మజ్జా షట్కోశాః।
కామ–క్రోధ – లోభ – మోహ – మద – మాత్సర్యమ్....
ఇతి అరిషట్ వర్గః ।
అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ
ఆనందమయా ఇతి పంచకోశాః
ప్రియత్వ – జనన – వర్ధన
పరిణామ – క్షయ – నాశాః
షట్ (6) భావాః।
అశనాయా పిపాసా శోక
మోహ జరా మరణాని
షట్ (6) ఊర్మయః । కుల గోత్ర
జాతి వర్ణ ఆశ్రమ రూపాణి ఇతి
షట్ (6) – భ్రమాః।
ఏతత్ యోగేన పరమపురుషో జీవో
భవతి । న అన్యః ।

**షట్కోశములు** : త్వక్కు (చర్మము); మాంసము, శోణితము; అస్థి (బొమికలు), స్నాయువు (సన్నటి నరములు), మజ్జ (ఎముకలలోని గుజ్జు).

**అరిషట్ వర్గములు : కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు.** ఇవి అరి షట్ -'6' గురు శత్రు వర్గములు.

**పంచకోశములు (5) : అన్నమయ - ప్రాణమయ - మనోమయ - విజ్ఞానమయ - ఆనందమయ** కోశములు.

**షట్ భావములు (6) : ప్రియత్వము - పుట్టుక - వర్ధనము - పరిణామము - క్షయము - నాశనము** - అను భావములు.

**షట్ ఊర్ములు : ఆకలి** (Hunger) - **దాహము** (Thirst) - **శోకము** (Worry) - **మోహము** (Illusion) - **జరా** (Feeling of Old Age) - **మరణానీ** (Death)

**షట్ (6) భ్రమలు : కుల - గోత్ర - జాతి - వర్ణ - ఆశ్రమ** - రూపములు.

పరమ పురుషుడు - తాపత్రయములతోను (3); త్రివిధ త్రైమాయ (3×3) తోను, షట్ (6) కోశములతోను; అరిషట్ (6 శత్రు) వర్గములతోను; పంచ (5) కోశములతోను ; షట్ (6) భావములతోను, షట్ (6) ఊర్ములతోను సంబంధము కల్పించుకొని పరిమితత్వమును ఆశ్రయించు సందర్భమునందు **జీవుడుగా** చెప్పబడుచున్నాడు. న-అన్యః! పరమాత్మకు వేరుగా మరెవరో వచ్చి జీవాత్మగా కావటం లేదు. పరమాత్మయొక్క ఆట-ఆట విడుపులే ఇదంతా! **జీవాత్మ పరమాత్మయే!**

---

9. య ఏతత్ ఉపనిషదం నిత్యమ్ అధీతే,
సో – అగ్నిపూతో భవతి ।
స వాయుపూతో భవతి ।
స ఆదిత్యపూతో భవతి ।
అరోగో భవతి ।
మహాపాతకాత్ పూతో భవతి ।
సురా పానాత్ పూతో భవతి ।
అగమ్య ఆగమనాత్ పూతో భవతి ।
మాతృగమనాత్ పూతో భవతి ।
దుహితృ స్నుష అభిగమనాత్ పూతో భవతి ।
స్వర్ణస్తేయాత్ పూతో భవతి ।
వేదో జన్మహానాత్ పూతో భవతి ।
గురోః అశుశ్రూషణాత్ పూతో భవతి ।

**ఉపనిషత్ ఫలశ్రుతి**

ఎవ్వరైతే ఈ ఉపనిషత్‌ను ఉత్తమ - సునిశిత - సూక్ష్మ బుద్ధితో రోజూ అధ్యయనము చేస్తూ ఉంటారో... అట్టివారు అగ్నివలె, వాయువువలె, ఆదిత్యునివలె పరమ పవిత్రులౌతారు. అగ్ని-తాను కాల్చువస్తువు దుర్వాసనను, తాను పొందుతుందా? వాయువు సువాసన జగత్తులోనే వదలుచున్నది గాని, తాను పొందదు కదా! సూర్య కిరణము తాను ప్రసరించువస్తువు యొక్క దోషము ఆ కిరణములను స్పృశిస్తుందా? లేదు కదా! అట్లాగే....,

ఈ ఉపనిషత్ ఉపాసకుడు తన శరీర - మనో బుద్ధి దోషములను తొలగించుకొని ఆరోగ్యవంతుడగుచున్నాడు. మహాపాతక దోషములను, సురాపాన దోషములను కడిగికొని పవిత్రుడగుచున్నాడు.

అగమ్య - ఆగమనము (తెలియకయే వచ్చినప్పటికీ), తెలుసుకోవలసినది తెలుసుకొని సవిజ్ఞేయుడు కాగలడు.

తల్లిగర్భములో ప్రవేశ - నిష్క్రమణముల (జన్మ-జన్మల) దోషముల నుండి విముక్తడగుచున్నాడు.

మహాపాతకములైనటువంటి 'దుహితృ - స్నుష అభిగమనము'(కూతురు-కోడలు వంటివారి పట్ల వక్ర దృష్టి) నుండి, 'బంగారము దొంగిలించియున్న దోషము' నుండి,

**అయాజ్య యాజనాత్ పూతో భవతి ।**

**అభక్ష్య భక్ష్యణాత్ పూతో భవతి ।**

**ఉగ్ర ప్రతిగ్రహాత్ పూతో భవతి ।**

**పరదార గమనాత్ పూతో భవతి ।**

**కామ - క్రోధ - లోభ - మోహ - ఈర్ష్యాదిభిః**

**అబాధితో భవతి ।**

**సర్వేభ్యః పాపేభ్యో ముక్తో భవతి ।**

**ఇహజన్మని 'పురుషో' భవతి ।**

**తస్మాత్ ఏతత్ పురుషసూక్తార్థమ్**

**అతి రహస్యమ్ । రాజ గుహ్యమ్ ।**

**దేవ గుహ్యమ్ । గుహ్యాత్ అపి గుహ్యతరమ్ ।**

**న అదీక్షితాయ ఉపదిశేత్ ।**

**న అనూచానాయ, న అయజ్ఞ శీలాయ,**

**న అవైష్ణవాయ, న అయోగినే**

**న బహుభాషిణే, న అప్రియవాదినే**

**న అసంవత్సర వేదినే, న అతుష్టాయ**

**న అనధీత వేదాయా ఉపదిశేత్ ॥**

జన్మతః బ్రాహ్మణుడైకూడా వేదాధ్యయనము విడచియున్న దోషమునుండి, 'గురు శుశ్రూష' చేయని దోషము నుండి, దానము తీసుకోకూడనివి దానముగా పొందిన దోషమునుండి, పరాయి స్త్రీతో సంగమ దోషము నుండి ... ఆయా దోషములు తొలగి పవిత్రుడు కాగలడు.

ఈ ఉపనిషత్ విద్య అధ్యయన పారాయణము చేయువాడు కామ-క్రోధ-లోభ-మోహ - ఈర్ష్య మొదలైన వాటిచే బాధింపబడడు. సర్వ పాపములనుండి విముక్తుడు కాగలడు. వర్తమాన జన్మలోనే "పురుషుడు పరమపురుషుడు - ఆత్మానందుడుగా "సర్వమునకు" కారణుడుగా - స్వతఃగానే సర్వకార్యకారణ స్వరూపుడుగా అగుచున్నాడు.

ఇది అతిరహస్యమైనది, రహస్యములలో కెల్లా రహస్యమగు రాజగుహ్యము! దేవతలకు కూడా పరమరహస్యము!

**ప్రపంచములోని రహస్యములన్నింటికన్నా రహస్యమైనది.**

... అట్టి ఈ పురుషసూక్తార్థ రహస్యమును దీక్ష లేనివానికి బోధించరాదు.

ఉత్తమ సంప్రదాయముల పట్ల గౌరవము లేనివారికి, యజ్ఞభావముతో జీవితమును - స్వధర్మములను దర్శించనివానికి, (యజ్ఞశీలుడు, కానివానికి), విష్ణుభక్తి లేనివానికి, యోగాభ్యాసము లేనివానికి,

అనేక లౌకిక విషయాలు సంభాషించటంలో తలమునకలైన వానికి, ఇతరులకు బాధ కలిగేటట్లు మాట్లాడువానికి,

"ఎండాకాలము - వానాకాలము - చలికాలములవలె కష్ట - సుఖాలు, సుఖ-దుఃఖాలు వస్తూపోతూ ఉంటాయి"... అను సంవత్సర జ్ఞానము లేని వానికి, వాటిచే చంచల బుద్ధి పొందువానికి,

ఎప్పుడూ అసంతృప్తి ప్రదర్శించువానికి, వేదములను నమ్మని వానికి - ఈ ఉపనిషదర్థము ఉపదేశించరాదు.

---

10 **గురురపి ఏవమ్ విత్**

**శుచౌదేశే, పుణ్యనక్షత్రే**

**ప్రాణాన్ ఆయమ్య, పురుషమ్ ధ్యాయన్,**

**ఉపసన్నాయ శిష్యాయ, దక్షిణే కర్ణే**

**'పురుష సూక్తార్థమ్' ఉపదిశేత్ ।**

**విద్వాన్ న బహుశో వదేత్ ।**

**(కింతు) యాతయామో భవతి ।**

**అసకృత్కర్ణమ్ ఉపదిశేత్ ।**

**ఏతత్ కుర్వాణో అధ్యేతా - అధ్యాపకశ్చ**

**ఇహ జన్మని పురుషో భవతి ।**

**ఇతి ముద్గలోపనిషత్**

**ఓం శాంతిః శాంతి ః శాంతిః**

గురువు - శిష్యునికి బోధించునప్పుడు కూడా శాస్త్ర నియమము గౌరవించాలి. పాటించాలి.

- శుచి అయిన ప్రదేశములో,
- పుణ్య ప్రదమైన నక్షత్రములో,
- ప్రాణోపాసన చే బుద్ధిని నిర్మలము, సునిశితము చేసుకొని,
- పరమపురుషుని (ఆది నారాయణుని, సృష్టికి ఆవల ఉన్నవానిని) చక్కగా ధ్యానించి,
- ఉత్తమగుణములు - అర్ధంచేసుకోగల తెలివి... మొదలైన ఆయా అర్హతలు గల శిష్యుని కుడిచెవిలో "పురుష సూక్తార్థము"ను బోధించాలి.

విద్వాంసునకు, ఇద్దానిని అనేకసార్లు చెప్పరాదు. ఎందుకంటే చెప్పిందే అనేక సార్లు చెప్పితే సారవిషయము తెలియదు. ఇది వల్లెవేయడం వంటిది కాదు. గురువు చెప్పినది శిష్యుడు ఆలోచిస్తూ వినాలి. "ఆలోచించి గ్రహిస్తున్నాడా? లేదా ?" అని గురువు గమనించాలి. వివేచన - విజ్ఞాన దృష్టి - ఉత్తమ ఆశయము లేనివాడు, అర్థము చేసుకోలేడు. విషయము అతనికి 'అసకృత్' అవగలదు.

ఈ విధంగా జాగరూకతతో పురుష సూక్తార్థమును బోధించు గురువు - వినుచున్నట్టి శిష్యుడు కూడా.... పురుష సూక్తము నిర్వచిస్తున్న ఆ 'పురుషుడు'... తామే అగుచున్నారు. (బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి !)

**ఇతి ముద్గలోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 9 ముద్గలోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



"ఓం" సర్వ స్వరూపుడు – స్వస్వరూపుడు – ఆశ్రితవత్సలుడు – సర్వసాక్షి అగు శ్రీమన్నారాయణ పరంధామునకు ఓంకార స్వర – అర్థ – భావముల సమేతముగా **సాష్టాంగదండ ప్రణామములు!** 'పురుషోత్తమము' అని చెప్పబడు – శ్రీమత్ నారాయణ ప్రవచిత పురుషసూక్తార్థమును సేవించి పూర్ణబ్రహ్మస్థానము సిద్ధింపచేసుకొనెదము గాక!

✡

ఒకానొక సందర్భములో త్రిలోకాధిపతియగు ఇంద్రదేవుడు పురుషసూక్త తత్త్వార్థి, జ్ఞానార్థి అయి, పరమ పురుషుడు, ఉత్తమ పురుషుడు (The Abslute Self beyond all), ఉత్తమ పురుష – First Person in every body), భగవంతుడు (The Enlightnar of all) అగు శ్రీవాసుదేవనారాయణ స్వామిని దర్శించారు. **"స్వామీ ! నాపై దయతో నాకిప్పుడు పురుషసూక్త రహస్యార్థమును బోధించవలసినదిగా వేడుకొనుచున్నాను"** – అని ప్రార్థించారు.

శ్రీ వాసుదేవస్వామి పురుషసూక్త వైభవమును ప్రవచించసాగారు. అదియే ముద్గల మహర్షిచే ప్రవచితమైనట్టి ముద్గలోపనిషత్!

✡

**వాసుదేవ నారాయణుడు : ఓం పురుషసూక్తార్థ నిర్ణయమ్ వ్యాఖ్యాస్యామః !** ఇప్పుడు మనము 'పురుషసూక్తోపాసన'గా పురుష సూక్త శ్లోకములు అర్థనిర్ణయమును దృష్టిలో ఉంచుకొని వ్యాఖ్యానించుకొనెదము గాక! ఋగ్వేదములోని 'పురుష సంహిత'లో విస్తారంగా వర్ణించబడిన పురుషసూక్తార్థ హృదయమును సంగ్రహముగా (In a Nutshell) ముందుగా చెప్పుకుంటున్నాము.

హరిః ఓం....,

**సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాద్ – అనంత వాచకః**

సహస్ర ⟶ అనంతవాచకమ్

ఒకాయన చాలా కథలు వ్రాశారు. ఆ కథలలోని అనేక–అసంఖ్యాక పాత్రలు, వారి–వారి స్వభావములు... అన్నీ కూడా, ఆ కథా రచయిత యొక్క ఊహాకల్పనలే కదా! "కథలోని కొన్ని పాత్రల స్వభావములు ఆయన స్వభావములే" అని కూడా అనలేము. అయన నుండే పాత్రల స్వభావములు కానీ, ఆయా స్వభావములు మాత్రం ఆయన కాదు. వాటన్నిటికీ ఆ రచయితయే ఆది స్వరూపుడు. అవన్నీ ఆయన కల్పనలే కాబట్టి, ఆ రచయితయే పురుషుడు. ఆది పురుషుడు. పరమపురుషుడు.

పురుష సూక్తములోని **'పురుషుడు'** సర్వ బ్రహ్మాండములకు, అందులో ఉండే లోకములకు, ఆ లోకములలోని జీవులకు – లోకపాలకులకు కూడా ఊహగా సంప్రదర్శించు రచయిత. ఆయన భావనా చమత్కృతియే ఇదంతా ! ఆయన భావన ఆయన రూపమే కాబట్టి, ఆయనకు ఏదీ వేరు కాదు. ఈ అనంత శిరస్సులు (యోచనలు – భావాలు – సిద్ధాంతాలు); అనంత అక్షిలు (కళ్ళు) ... (దృష్టులు అభిప్రాయాలు), అనంత పాదములు (నడకలు – నడతలు) ! ... ఆయనవే ! ఆయనయే! ఆయన యొక్క పురుషకారాలే ! ... ఈ మంత్రము ఆయనయొక్క **'అనంతత్వము'** సూచిస్తోంది. అయితే, వీటన్నిటికీ ఆయన వేరే ! రచనలన్నిటికీ రచయిత సర్వదా వేరే కదా! నీవు – నేను... ఆ పురుషుని పురుషకార చమత్కారములమే! ఆ పరమపురుషునకు అభిన్నములు.

**భూమిం – విశ్వతో స వృత్వా, దశాంగుళమ్ అత్యతిష్ఠతి !**

ఆ పురుషుడు ఈ భూమి (The physical Forms) – ఈ సర్వభౌతిక రూపములు – ఈ విశ్వము (All subtle forms) అయి, అంతటితో ఆగక, ఇంకా అనంతముగా విస్తరించి ఉన్నారు. **అనంత యోజనం ప్రాహ – దశాంగుల వచాః తథా !** 'అనంత యోజనములు విస్తరించి ఉన్నారు' అనటానికై "దశాంగులము" – అని ప్రయోగము ఉద్దేశ్యించబడింది.

**ఇదగ్ం – యశ్చ భూతమ్ – యశ్చ భవ్యమ్ – సర్వమ్ "పురుష" ఏవ** *:* ఇత పూర్వము ఉన్నది, ఇప్పుడున్నది, ఇకముందు ఉండబోవునది సర్వము ఆ పరమపురుషుడే! స్వాత్మపురుషుడే!

**వ్యాపకుడు – విష్ణువు** *:* స్వస్వరూపాత్మ విన్యాసుడే...

***1. విష్ణోఃదేశతో వ్యాప్తః :*** దేశము (Place) స్వరూపుడై అనంతముగా వ్యాపించి ఉన్నారు.... (Extended infinitely as place factor)

***2. విష్ణోః కాలతో వ్యాప్తః :*** కాల (Time) స్వరూపముగా కూడా అనంతముగా వ్యాపించి ఉన్నారు. .... (Extended infinitely as Time factor as well)

**ప్రథమయా విష్ణోః దేశతో వ్యాప్తిరీరితా! ద్వితీయాయ చ అస్య విష్ణోః కాలతో వ్యాప్తిః – ఉచ్యతే !**

**దృష్టాంతంగా !** (1) కథా రచయిత యొక్క రచనకళా విశేషమే – కథలోని దేశ – కాలమాన రూపములుగా పాఠకునకు అనుభూతమగు తీరుగా; స్వప్నము తనదైనవాడే – స్వప్నాంతర్గత ద్రష్టగా, స్వప్నములోని దేశ – కాలములుగా ..., తన ఊహను తానే ఆస్వాదించుచున్న రీతిగా **విష్ణువే విశ్వము**. కానీ స్వప్నము తనదైనవాడు–స్వప్నమునకు వేరుగా – సాక్షిగా సర్వదా ఉండి ఉంటున్న విధముగా, ఈ విశ్వమునకు విష్ణువు వేరుకూడా ! దేశ కాలములుగా అనంతుడై ఉన్నవాడే విష్ణువు. ఆయనయే "పురుషసూక్త పురుషుడు"గా ఈ మంత్రములతో అభివర్ణించబడుచున్నారు. (One who is Al-present and Al-pervading)

**ఉత – అమృతత్వస్య 'ఈశానః' యత్ అన్నేన అతిరోహతి**

అట్టి విష్ణువుయొక్క అంతటా ఆవరించిన ఈశానత్వమును ఎరిగినప్పుడు, ఇక సంసార భ్రమలు మరల జనించవు. ఈ మూడవ మంత్రము పరమపురుషుడు తన యొక్క మార్పు – చేర్పులు లేనట్టి అమృతస్థానము నుండి అజ్ఞాన జీవులకు మోక్ష ప్రధానము చేయుటకై 'అన్నమ్' (అనుభవించబడునది – భౌతికమైనది – – తెలియబడునది) రూపము ధరించుట వర్ణించబడుతోంది. ఆయన భౌతికంగా కనిపించేదంతా అతిక్రమించి, ... ఆవల **మార్పు చేర్పులు లేని అమృతరూపుడు కూడా!**

**ఏతావాన్ అస్య మహిమా, అతో జ్యాయగ్ంశ్చ పురుషః ।**

ఆ పురుషుని మహిమా విశేషములే ఇక్కడ కనిపిస్తున్న దృశ్య జగత్తులు, జీవుల చిత్ర–విచిత్ర జీవిత విశేషములు, లోకములు, లోకపాలకులు, జన్మ – జీవన్ – మరణములు మొదలైనవన్నీ కూడా ! **వైభవమ్ కథితో హరేః ।**

ఆ పరమాత్మ స్వయం ప్రకాశ – అమృతత్వమును దాటి ఈవలకు వచ్చి, తనకు అభిన్నమగు ఈ జీవులపై అవ్యాజమగు మమకారముచే లీలా మానుష వేషంగా జగదవస్థను స్వీకరించుచున్నారు. అవస్థాసహితుడు, కర్మఫల భోక్త కూడా అయి ఉంటున్నారు. పరిపూర్ణుడగు ఆ పరమాత్మ మన కంటికి భౌతికంగా కనిపించే శక్తికంటే ఇంకనూ అనంతశక్తి సమన్వితుడు.

**పాదో అస్య విశ్వా భూతాని – త్రిపాద అస్య అమృతం దివి** : ఆ పురుషుని పూర్ణ స్వరూపములో 4వ వంతు విభాగములో మాత్రమే

ఈ విశ్వజీవులంతా స్థానము కలిగి ఉన్నారు.

**పురుషుని నాలుగవ వంతు** → మార్పు చేర్పులు పొందుచున్న భౌతిక ప్రపంచము. 'ప్రకృతి' శబ్దార్థము.

**పురుషుని మిగిలిన మూడు వంతులు** → దివ్యమై, అమృతమై ప్రకాశించుచున్నట్టిది. మార్పు చేర్పులచే స్పృశించబడనిది.

ఈ మంత్రముచే చతుర్వ్యూహములు పురుషతత్త్వముగా చెప్పబడుచున్నాయి. – **చతుర్వ్యూహో విభాషితః ।**

| | | | |
|---|---|---|---|
| 1. | **పంచభూత – ప్రపంచ పురుషుడు – విరాట్ పురుషుడు** | | దేహాలు – జన్మలు – కర్మలు – దేహనాశనములు మొ॥నవి. మార్పు – చేర్పులు గల విభాగము. భౌతిక రూప పురుషుడు. (Zone of changing factors) |
| 2. | **ఛందః పురుషుడు** | – | **శుద్ధ మనోపురుషుడు** (విషయములను తనయందు కలిగియున్నట్టి, విషయములకు వేరైనట్టి **కేవల మనో రూపుడు.** మనస్సులో విషయాలు మారవచ్చుగాక ! మనస్సు మారునది కాదు). ఆలోచనలకు మునుముందే ఉన్న కేవల మనోతత్త్వ పురుషకారము. |
| 3. | **వేద పురుషుడు** | – | శుద్ధబుద్ధి స్వరూపుడు. **'తెలియబడేవన్నీ తెలుసుకుంటూ ఉన్న'** – కేవల బుద్ధిరూపుడు. తెలుసుకొనుచున్నది తానే! తెలియబడేది తానే! తెలియబడేదాని కంటే మునుముందే ఉన్న కేవల బుద్ధితత్త్వ పురుషకారము. ప్రతిబింబముల కారణముగా దర్పణము మారదు కదా! |
| 4. | **మహా పురుషుడు** | – | **ఆత్మ పురుషుడు.** ఈతడే పురుష సూక్తములోని పురుష శబ్దార్థుడు. మనో బుద్ధులకు జననస్థానమైన సహజాత్మతత్త్వము. |

**"త్రిపాదూర్ధ్వ ఉదైః పురుషః"** అన్నప్పుడు, **పాదో అస్య ఇహ భవాత్ పునః,** "కేవలమనో – కేవల బుద్ధి – కేవలాత్మ స్వరూపుడు అని అన్నప్పుడు, చైతన్య త్రివిభాగ (3/4 th - Upper) పురుషుడు మార్పు చేర్పులు లేని వాడు! త్రిగుణ దోషములు అంటనివాడు! "అమృత పురుషుడు" ! – అని చెప్పబడుతోంది.

**త్రిపాద్ ఇది అనయా ప్రోక్తమ్ అనిరుద్ధస్య వైభవమ్!** ఊర్ధ్వమున అమృత స్వరూపమై 3వంతులై, 4వ వంతు విభాగంగా ఈ విశ్వము రూపమును, జీవులు రూపమును దాల్చుచూ, **ఇదంతా తన వైభవముగా** కలిగి ఉన్నారు. అందుచేత ఇదంతా **అనిరుద్ధ పురుష వైభవము. "నిరుద్ధము లేనట్టి ఆత్మయొక్క వైభవమే ఈ జగత్ దృశ్యము"**... అని **పురుషతత్త్వము** గురించి సూచన చేయబడుతోంది.

**తస్మాత్ "విరాడ" జాయత, విరాజో "అధి పూరుషః"। పశ్చాత్ భూమిమ్ అథోపురః :** సర్వవ్యాపకుడగు ఆ ఆత్మ పురుషుడు (లేక) నారాయణ పురుషుని నుండే విరాట్ పురుషుడు (ఈ బ్రహ్మాండములతత్త్వము) జనిస్తున్నది. ఆ విరాట్ పురుషుని నుండి జీవాత్మపురుషుడు బయల్వెడలుచున్నారు । పరిపూర్ణుడగు పరమాత్మయే సృష్టి క్రీడానందము కొరకై విరాట్ పురుషుడు – జీవాత్మ పురుషుడుగా అగుచున్నారు (కథా సృష్టి రచయిత యొక్క కల్పనయే, కథా క్రమమును, అందులోని పాత్రల స్వభావములుగా ప్రదర్శితమగుచున్నట్లుగా!)

| | | |
|---|---|---|
| విరాట్ పురుషుడు | → | కథా రచయిత |
| విరాట్ రూపము | → | కథా విధానము (సంఘటణలతో కూడిన భౌతిక ప్రపంచము) |
| జీవ పురుషుడు | → | కథలోని పాత్ర (జీవులు) |

ఆ విధంగా జీవ పురుషుడుగా అయిన విరాట్టు పురుషుడు విరాట్ విశ్వములో దేవ – మనుష్య – జంతు – స్థావర – జంగము – వివిధ రూపములన్నీ భావన చేసి, స్వయముగా ప్రదర్శితమగుచున్నారు. దేవతల దివ్య రూపములను పొంది, అటు తరువాత భూమండలమును, ఆపై **సప్త ధాతువులతో కూడిన భౌతిక దేహములను** సృష్టించుచున్నారు.

**తస్మాత్ విరాట్ ఇతి అనయో పాదనారాయణాత్ ధరేః ।** ఆ హరినుండియే ప్రకృతి – పురుష రూపములు బయలు వెడలి, ఆయనచేతనే ధరించబడుచున్నాయి. అట్టి ధరించు నారాయణ అంశను **'పాదనారాయణ ధారణ'** అని గానం చేయబడుతోంది.

అనగా... **ప్రకృతేః పురుషస్య అపి సముత్పత్తిః ప్రదర్శితః!** ప్రకృతి – పురుషులను (The Experiences and the Experiencer, perceptions and perceiver; The Body and user of the Body) ... అనబడు ఉభయమూ ప్రదర్శించు పురుషవైభవమే **'పాదనారాయణ పురుష' వైభవం! 'ప్రకృతి పురుష' ప్రదర్శన వైభవము.**

## సృష్టియజ్ఞము

**యత్పురుషేణ హవిషా, దేవా యజ్ఞమ్ అతన్వత । 'వసంతో' అస్య ఆసీత్ ఆజ్యమ్, గ్రీష్మ ఇధ్మ, శరత్ ధవిః** : దివ్యశక్తి స్వరూపులగు దేవతలు 'సృష్టి' అను కార్యము సిద్ధించటానికై నిర్వర్తించిన మానసిక యాగము (యజ్ఞము) గురించి చెప్పబడుచున్నది. ఆదినారాయణపురుషుని నుంచి (కేవలాత్మ నుండి) భావనా మాత్రంగాను – సంకల్ప మాత్రంగాను జనించిన (సృష్టించబడిన) దివ్యశక్తి స్వరూపులు (శబ్దతత్త్వ దేవతలు, దర్శన శక్తిదేవతలు, రూపశక్తి దేవతలు, రసశక్తి దేవతలు, గంధశక్తి దేవతలు మొదలైన అభౌతిక దేవతలు).. ఉత్తర (ఆ తరువాతి) సృష్టి (భౌతిక బ్రహ్మాండము) సిద్ధించటానికై ఒక మానసికమైన యాగము ప్రారంభించారు. అప్పుడు బాహ్య వస్తువులు లేవు కాబట్టి, పురుష రూపమనే మనస్సుగా, **"యజ్ఞ హవిస్సు"** గా తలచారు. మానసిక యాగము ప్రారంభించారు. వసంత గ్రీష్మ – శరత్ రుతువులు ఆ యాగమునకు ఆజ్యము (నేయి); సమిధలు; అగ్ని రూపములుగా అయినాయి. అనగా మనస్సుచే (ఆ దివ్యశక్తి స్వరూప దేవతలు సంకల్పముచే) ఋతుధర్మాలు సృష్టి యజ్ఞము కొరకై భావన చేయబడ్డాయి.

**యత్ పురుషేణ ... ఇతి అనయా సృష్టి యజ్ఞేన సమీరితః** – ఈ విధంగా పురుషుని సంకల్ప రూపులగు దేవతలు సృష్టిని సిద్ధింప జేయు యజ్ఞమును పరమ పురుషుని ఉద్దేశ్యమును సిద్ధింప జేయటానికై మనోకల్పిత మంత్ర – తంత్ర యుక్తంగా ఆరంభించారు.

**సప్త – అస్య ఆసన్ పరిధయః, త్రిసప్త 'సమిధః'కృతాః । దేవా యత్ యజ్ఞం తన్వానాః, అబధ్నన్ పురుషమ్ – పశుమ్ । తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్ పురుషమ్ జాతమ్ అగ్రతః ॥**

సప్త (7) వ్యాహృతులు (అగ్ని యొక్క సప్త జిహ్వలు, **పంచ భూత మనో – అహంకారములు** పరిధులు (యల్లలు) గాను, వాటిని జాగ్రత్ – స్వప్న – సుషుప్తి భావనచే 7×3 = '21' ... తత్త్వాలు సమిధలు (Fire Wood Pieces) గాను, విరాట్ పురుషుని 'యజ్ఞ పశువు' గాను భావన చేశారు. ఆ యజ్ఞము (సృష్టియోగము) సిద్ధించటానికై సృష్టికి పూర్వమే స్వయం కల్పితమై ఉన్నట్టి విరాట్ పురుషుడు – యజ్ఞ పశువుగా స్వీయ సమర్పణ చేశారు. ఈ విధముగా **"ఆత్మనారాయణ పురుషుని సంకల్ప స్వరూపుడు"** అయినట్టి సృష్టికర్త బ్రహ్మనారాయణుని (బ్రహ్మదేవుని) యొక్క ప్రాణ – ఇంద్రియ స్వరూపాలే – దేవతలుగా అయి మానసిక యజ్ఞము చేయువారైనారు. ఆ సృష్టి యజ్ఞమునందు.... ఇంద్రియశక్తిరూప దివ్య దేవతలు యజ్ఞకర్తలుగా పాల్గొనసాగారు.

సృష్టికి పూర్వమే ఉన్న విరాట్ పురుషుడు (బ్రహ్మ), సృష్టి ప్రారంభలో ఉన్న ఇంద్రియ స్వరూపులగు దేవతలు (విరాట్ పురుషునినుండి సృష్టికొరకై బయల్వెడలిన ఇంద్రియ తత్వరూపులు)... సృష్టిని మనోరచనగా సంకల్పించసాగారు.

- విరాట్ పురుషుని ఉఛ్వాస – నిచ్వాసల నుండి జనించిన ప్రాణశక్తి, ఆహుతి రూపులైనటువంటి **"సాధ్యులు",**
- వారికి అనుకూలురై ప్రాణ – ఆహుతులను ఎరిగిన మంత్ర ద్రష్టలు కల్పించబడ్డారు. వారే – మంత్రోచ్చారణలతో పరమ పురుషుని ఉపాసించి సిద్ధాంతీకరించునట్టి ఋత్ (సత్య) వ్రతులగు **ఋషులు**.

వీరందరూ కలిసి సృష్టిని సిద్ధింపచేయటానికై ఆ మానసిక యాగములో తమతమ పాత్రలు నిర్వర్తించసాగారు. **తం యజ్ఞం బర్హిసి ప్రౌక్షమ్...** విరాట్టే హోమముగా ఉన్నట్టి ఆ వృషత్ – ఆజ్యము (గోవు నెయ్యి) తదితర భోగ్య వస్తువులు (All Matter for the materialization of the activity of creation) ఆ యజ్ఞగుండము నుండి జనించసాగాయి. ప్రాణవాయు ప్రదర్శన రూపములైనటువంటి జీవులు, పశువులు, ... ఇవన్నీ ఏర్పడసాగాయి. అంతేగాకుండా, గ్రామ్యములు గ్రామ జంతువులైన మేకలు మొ॥వి ఋక్ – యజుర్ – సామ – అథర్వణ వేదములు, అనేక సృష్టి ఉపకరణములు, తపో – ధ్యాన – యోగ – భక్తి తత్వాలు, అవతారమూర్తులు, ఇతిహాసాలు ... ఇవన్నీ బయల్వెడలాయి. **అనేనచ ఏవ మంత్రేణ – మోక్షశ్చ సముదీరితః ।** ... అట్లాగే ఈ జీవుడు – అనుభవము – ఆకర్షణ బంధము – సాధనలు – మోక్షము.... ఇవన్నీ కూడా రూపు దిద్దుకున్నాయి.

**తస్మాత్ అశ్వా అజాయన్త ఏకఏచ – ఉభయాదతః । గావోహ జజ్ఞిరే తస్మాత్, తస్మాత్ జాతా అజా – అవయః । యత్పురుషం వ్యదధు : కతిధా వ్యకల్పయన్ ।**

ఆ యజ్ఞమునుండి గుర్రములు, గాడిదలు, గోవులు, మేకలు, గొర్రెలు... ఇవన్నీ కలిగాయి.

అప్పుడు బ్రహ్మజ్ఞానము తెలిసినట్టి మహనీయులు పుట్టారు. వారు బ్రహ్మమును – సృష్టిని ప్రశంసిస్తూ **'బ్రాహ్మణములు'** పలికారు. ఆ సంకల్ప యజ్ఞమునుండి ఈ దృశ్యములో కనిపించే సర్వ వస్తుజాలము, జీవజాలము, బంధము, భక్తి – జ్ఞాన – యోగ సమన్వితమైన మోక్షమార్గములు కూడా జనించాయి.

ఆవిధంగా, **ఆ విరాట్‌రూప యజ్ఞపురుషుని** నుండి సృష్టియొక్క కార్యక్రమములు కొనసాగటానికై అనేక దివ్యసాధనా పరికరాలు, తత్త్వాలు బయల్వెడలసాగాయి.

**సృష్టి యజ్ఞ పురుషుని ముఖమునుండి...**

**బ్రాహ్మణో అస్యముఖమ్ ఆసీత్ :** బ్రాహ్మణముల రూపములో స్తోత్రములు, మంత్రములు, ఉపాసనలు సేవించు ప్రజ్ఞలు. అనగా, సర్వాత్మకుడగు పరమాత్మయొక్క తత్త్వమును సందర్శిస్తూ గానము చేయు ప్రజ్ఞలు,

**బాహువులనుండి (బాహు 'రాజన్యః' కృతః)** ... బలపరాక్రమములు, సామర్థ్యము ... సంబంధితమైన ప్రజ్ఞలు,

**తొడలనుండి (ఊరూ తత్ అస్య యత్ 'వైశ్యః')** .... కృషి – రక్షణ నిర్వర్తించు తత్సంబంధ ప్రజ్ఞలు,

**పాదముల నుండి (పద్భ్యాగ్ం శూద్రో అజాయత।)** .... సేవించు స్వభావులగు ప్రజ్ఞలు,

ఆయా స్వభావ ప్రజ్ఞలే చతుర్విధ స్వభావులగు జీవులుగా సృష్టియందు, వారివారి సృష్టి ప్రదర్శనా సంబంధములైన స్వధర్మములందు నిరతులగుచూ, ఈ సృష్టి పరిపోషణ యందు పాల్గొనసాగారు.

ఇంకా కూడా..., **ఆ యజ్ఞ పురుషుని యొక్క...**

→ **మనస్సు ఆలోచనల విభాగము నుండి** → ఓషధ – వనస్పత ప్రదాత యగు చంద్రుడు

(చంద్రమా మనసో జాతః)

→ **దృశ్య – దర్శన – శక్తి విభాగమునుండి (చక్షోః సూర్యో అజాయత)** → తేజోరూపుడగు (ప్రజ్ఞారూపమగు) సూర్యుడు

**ముఖము నుండి (ముఖాత్ ఇంద్రశ్చ, అగ్నిశ్చ)** → సర్వేంద్రియ ఉపకరణ – ప్రజ్ఞాస్వరూపుడగు **ఇంద్రుడు**, భౌతిక దేహ పరిరక్షకుడు, తేజోమూర్తి అగు **అగ్ని** జనించారు.

→ **ఆ యజ్ఞ పురుషుని ప్రాణముల నుండి – ప్రాణాత్ వాయుః అజాయత** → యజ్ఞ పురుషుని ప్రాణశక్తినుండి భౌతిక దేహములకు అణువణువు ప్రాణశక్తిని అందజేయు **వాయుదేవుడు** బయల్వెడలారు.

**ఆ యజ్ఞ – వేదనారాయణ పురుషుని నాభినుండి** (నాభ్యా ఆసీత్ అంతరిక్షమ్) → బొడ్డు నుండి **'అంతరిక్షము'** పుట్టింది.

**శిరస్సు నుండి శీర్ష్ణోద్యౌః సమవర్తతా** → శిరస్సు నుండి సమవర్తమగు **ఆకాశము** ఆవిర్భవించింది.

**పాదములనుండి పద్భ్యాం భూమిః** → పాదములనుండి **భూమి** జనించింది.

**చెవులనుండి దిశః శ్రోత్రాత్** → చెవులనుండి **దిక్కులు, శబ్దతత్త్వము** ప్రకటనమయ్యాయి.

ఈ విధంగా – **తదా లోకాగ్ం అకల్పయన్...! లోకాలన్నీకూడా** ప్రాదుర్భవించాయి. కల్పన చేయబడ్డాయి.

**'తస్మాత్' ఇతి మంత్రేణ జగత్ సృష్టిః సమీరితా** .... ఈ పురుషసూక్తములోని తస్మాత్ రూపమంత్రముతో సర్వ సృష్టి సిద్ధించిన విధము గానము చేయబడుతోంది.

✡

ఇక **(1) వేద అహమ్ ఏతమ్ పురుషం మహాన్తమ్, ఆదిత్య వర్ణం తమసస్తు పారే, సర్వాణి రూపాణి విచిత్య ధీరః నామాని కృత్వా అభివదన్ యదాస్తే। (2) ధాతా పురస్తాత్ ఆద్య ఉదాజహార, శక్రః ప్రవిద్వాన్ ప్రదిశశ్చ తస్రః ।**

ఈ రెండు మంత్రములచే ఆత్మ పురుషుని యొక్క మహిమ, వైభవము వర్ణించబడుతోంది.

**'వేదాహమ్' ఇతి మంత్రాభ్యామ్, వైభవమ్** – ఏ విరాట్ స్వరూప ఆదిపురుషుడైతే మహాన్త స్వరూపుడై, **ఆది** అయి ఆదిత్యుడుగా ప్రకాశించుచున్నారో; అజ్ఞానాంధ కారమునకు ఆవల తేజోమూర్తియై వెలుగొందుచున్నారో; సర్వ నామ–రూపములు తనవే అవటం చేత విశ్వరూపుడు–రూప రహితుడు కూడానో; సర్వజీవ బుద్ధులలో విచిత్ర రీతులుగా సంకల్ప – వికల్పములను నిర్వర్తించుచున్నారో, మహా బుద్ధి స్వరూపుడో, సర్వదిక్కులందు ప్రసరించి దిక్కులన్నీ తన స్వరూపముగా దీప్తుడగుచున్నాడో, అట్టి మహత్తర పురుషుని గురించి **ఏతమ్ పురుషమ్ వేద అహమ్।** – మేము తెలుసుకొన్నాము – అని సూక్తద్రష్ట గానం చేస్తున్నారు. మనము తెలుసుకోవలసిన, దర్శించవలసిన, మమేకమవ వలసినతత్త్వము, పరమ పురుషుడు! ఉత్తమ పురుషుడు! శ్రీమన్నారాయణుడు !

ఏ విరాట్టు సమస్త జీవుల సృష్టికి కారణమో, ఆ పరమాత్మయే

- ఇది మానవుడు
- ఇది పశువు
- ఇది దేవత
- ఇది కీటకము

మొదలైన సర్వ రూపములను శబ్దములను కల్పించి, ఆ నామ – రూపములతో కనబడే సర్వమునందు తానే చైతన్య స్వరూపుడై ప్రవేశించుచున్నారు. సర్వత్రా సర్వ రూపాలుగా వ్యాపించిఉన్నారు.

అట్టి సూర్యునివలె స్వయం ప్రకాశకుడు, సర్వమునకు ఆది – అయినట్టి పరమ పురుషుని అనుక్షణమూ ధ్యానించాలి. ఉపాసకుల ధ్యానము – ఏకాగ్రతల ఆవస్యకతను – వసతిని దృష్టిలో ఉంచుకొని ఋషులు – విరాట్ పురుషుని నామ–రూపాత్మకంగా లోకములకు ప్రసాదించుచున్నారు. సకల దిక్కులలో ఉండి, సర్వ ప్రాణులను ఎరుగుచున్న ఇంద్రుడు ఆ పరమపురుషుని ఎరిగినవాడై, జనులకు ఉపాసనామార్గము చూపుచున్నారు.

**తమేవమ్ విద్వాన్ అమృత ఇహ భవతి ! న అన్యః పంథా అయనాయ విద్యతే !**

అట్టి విరాట్ పురుషుని ఇక్కడే, ఇప్పుడే ఎరిగినప్పుడు ఈ జీవుడు జనన మరణ చక్రమును అధిగమించి అమృతత్వము పొందుచున్నాడు. పరతత్త్వము ఎరిగి పరమాత్మ అయి వెలుగొందుచున్నాడు. సర్వ సాక్షియై సర్వమును స్వస్వరూపముగా సదా సందర్శించుచున్నాడు. అట్టి పరమ – విరాట్ పురుషుని ఇక్కడే, ఇప్పుడే ఎరుగుటయే అమృతత్వమునకు త్రోవ. ఇక వేరైన త్రోవయే లేదు.

**శ్లో॥ యజ్ఞేన యజ్ఞమయజన్త దేవా, తాని ధర్మాని ప్రథమాన్యాసన్ ।**

**తేహ నాకం మహిమానః సచన్తే, యత్ర పూర్వే సాధ్యాః, సన్తిదేవా ॥**

ఈ సృష్టికి మోక్షమే ఉపసంహారము – **యజ్ఞేనేత్ ఉపసంహారః సృష్టేః మోక్ష ఈరితః..** అనే అర్థము ఈ మంత్రము గానము చేస్తూ **'పురుషసూక్తము'ను అధ్యయనము చేయు వారికి దారి చూపుచున్నది.**

- ప్రజాపతి రూపులైన దేవతలు – **మానసయజ్ఞమును** నిర్వర్తించి – ఏ పరమ పురుషుని ధ్యానించటము వలన వారివారి వికార రూపములగు సర్వ భౌతిక – రుగ్మతలు తొలగుచూ, వారంతా సంసిద్ధి పొందిన వారగుచున్నారో....,
- దేవలోకములోని పురాతన సాధ్యపురుషులు ఏ విరాట్ పురుషుని ధ్యానిస్తూ, ఉపాసిస్తూ, ఆరాధిస్తూ ఊర్ధ్వ లోకములలో ఉంటున్నారో...,

అట్టి కేవల సాక్షి – సత్ స్వరూప – సర్వ స్వరూప పురుషుని – ఈ **'పురుషసూక్త గానము'** – ఉపాసించుటచే, ఉపాసకులు తప్పక పరమ పురుషత్వమును పొందుచున్నారు.

***అద్భ్య సంభూతః*** – ఆ నారాయణుడు జలముతో రసస్వరూపంగా ఉద్భవించుచున్నారు.

***పృధివ్యై రసాశ్చ*** – ఈ భూమి కూడా భూవలయము అగు జలమునుండే ఉద్భవించినది.

***విశ్వకర్మణః సమవర్తతాది*** – పరమాత్మయగు విశ్వకర్మయే ఈ బ్రహ్మాండము – విరాట్‌నకు సంకల్పకర్త! ఆయనయే సమవర్తి!

***తస్యత్వష్టా విదధత్ రూపమేతి*** – ఇదంతా ఆ విరాట్ పురుషుని ఇచ్ఛా విభవ – వినోదమగు వివిధ (అనేకములగు) రూపలీలా, క్రీడా చమత్కారమే !

***తత్ పురుషస్య విశ్వమ్ ఆజానమ్ అగ్రే*** – దీనికంతటికీ ఆవల ఆధారముగా ఉన్నట్టి **తత్‌పరాత్మ పురుషుని** హేలయే, లీలయే, ఈ జగత్తు. సృష్టి ప్రారంభమునుండియే ఇదంతా అనేకత్వమంతా కలిగినదై ఉన్నది. ఆవల ఏకరూపుడు! ఈవల అనేకముతో కూడిన జగత్తు (లేక) విశ్వరూపుడుగా కూడా అయి ఉంటున్నారు.

**ప్రతి జీవుడు కేవలాత్మ స్వరూపుడే కాబట్టి,.... ఆవల ఏకము, ఈవల 'అనేకము' కలిగినవాడై ఉంటున్నాడు.**

అట్టి ఆదిత్య (One who is prior to and at the begining of the Total creation) పురుషుని తెలుసుకొన్నవాడు ఇక్కడే అమృతుడగుచున్నాడు. తత్‌పురుషుడుగా తానే అగుచున్నాడు.

ఈ విధంగా ఆ పరమపురుషుడే – సృష్టికర్త అయి, దివ్యమగు శబ్ద స్పర్శ రూప రస గంధతత్త్వులగు దేవతల రూపుడై,

ఆ దేవతల సృష్టి యజ్ఞమునుండి జీవుడు – జగత్తుగా కూడా అయి,

ఆ జగత్తునందు జీవుడుగా బద్ధుడై, క్రీడా వినోదమును కొనసాగిస్తూ....,

తిరిగి అంతా తనయందు ఎప్పుడో లయింపజేసుకొని **పరమ పురుషుడు** అగుచున్నాడు.

✡

## శ్రీ వాసుదేవ ప్రోక్త సూక్ష్మార్థః

**పురుషసూక్త ఫలశ్రుతి: య ఏవమ్ ఏతత్ జానాతి, సముక్తో భవతి ఇతి!** ఎవ్వరైతే ఇక్కడి సృష్టి స్థితిలయ కారకుడగు పురుషుని ఈ **"పురుష సూక్తము"**తో మహర్షులు దర్శించి వివరించిన తీరును అధ్యయనము చేసి, అంతరార్థమును గ్రహిస్తారో, ఇందులో చెప్పబడిన పురుష సంకల్పిత ఇంద్రియ దేవతల యజ్ఞ సృష్టి – ఉపసంహారముల గురించి, 'మోక్షము' గురించి తెలుసుకుంటారో... వారు నిస్సందేహముగా 'ముక్తులు' అగుచున్నారు. **తత్ పురుష యేవ స్వయం భవతి!** ఆ పురుషుడే స్వస్వరూపముగా దర్శించే దర్పణమే **"పురుష సూక్తము"**.

శ్రీ వాసుదేవుడు పురుషసూక్త ప్రవచితమైన సృష్టి – ఉపసంహార – మోక్ష స్థితి – గతి – స్థానముల గురించి త్రిలోకాధిపతియగు ఇంద్రునికి ఇంకనూ ఆయా విశేషములను వివరించి చెప్పారు. జ్ఞానోపదేశమును బోధించారు.

సర్వేంద్రియ అధినేత అగు ఇంద్రుడు శ్రీ వాసుదేవుడు సవిస్తరంగా చెప్పియున్నట్టు పురుష సూక్త వైభవము గురించి శ్రద్ధగా విన్నారు. వినిన తరువాత ఇంద్రదేవుడు కొంతసేపు మౌనము వహించి, తనలో **"నా స్వామి వివరించిన పురుష సూక్తార్థము మహత్తరము, మోక్షదాయకముకూడా ! అయితే సూక్ష్మ గ్రహణము కొరకై, మరి కొంతగా అంతరార్థమును వినాలని ఇంకా కోరికగా ఉన్నది"**... అని భావించారు. లేచి, జగద్గురువగు శ్రీవాసుదేవునికి హృదయపూర్వకముగా ప్రణామములు సమర్పించి, అభ్యర్ధన పూర్వకంగా నిలబడ్డారు.

అప్పుడు సర్వాంతర్యామి యగు వాసుదేవ భగవానుడు చిరునవ్వుతో, ఇంద్రుని హృదయేచ్ఛను గ్రహించి, ప్రేమగా కూర్చోమని ఆదేశించి పురుషసూక్త మంత్రముల పరమ రహస్యమగు సూత్రార్థములను రెండు ఖండములుగా విభజించి ఉపదేశించసాగారు.

## శ్రీ వాసుదేవుడు:

ఓ ఇంద్రదేవా ! పురుషసూక్త రహస్యార్ధము ముఖ్య ఉద్దేశ్యము రెండు ఖండములుగా సూక్త ద్రష్టలచే చెప్పబడుచున్నది.

### ప్రధమఖండము – అవిజ్ఞేయత్వము – స్వకల్పిత మాయా బంధనము

**అజ్ఞానదృష్టి :** ఆ పరమ పురుషుడు అవిజ్ఞేయులకు 'మాయను' కల్పించి భ్రమింపజేస్తున్నారు. అజ్ఞానదృష్టిని ఆశ్రయించి, **"ఇంద్రియ జగత్తు సర్వస్వమైయున్నది. దేహముతో పొందేదే నేను పొందినట్లు ! దేహమునకు నేను చెందినవాడను ! దేహ పరిమితుడు ! ఈ దేహము లేకుంటే నేను లేను. దేహమునకు సంబంధించిన జాతి – బంధుత్వము ఇత్యాదులు మాత్రమే నాకు సంబంధించినవి"**.. ఈ విధంగా పరిమిత – సంకుచిత దృష్టి పెత్తనము చేయుచున్నంతవరకు ఈ జీవునకు 'పురుషసూక్తము' వర్ణించే పురుష తత్త్వము అనుభవమునకు రాదు.

ఇక్కడ ఇంద్రియములకు ఘనీభూతమై కనిపిస్తున్న దృశ్యముపట్ల 'ఇది సత్యమే' అనే దృష్టి కలిగినవారై, ఇంద్రియ విషయములే ఫలాశయములుగా గల సంసారజీవునికి నామ – రూప – జ్ఞానములు దృష్ట్యా పురుషసూక్త పురుషుడు దుర్జ్ఞేయుడు! తెలియ బడజాలడు!

"ఈ దృశ్యము సత్యమే" అను మూర్ఖ భావనయే 'భవరోగము'. (భవము = ఉన్నది; నిజమే). తన వాస్తవ స్వరూపము గురించి, తనకు దృశ్యముతో గల – (నాటకము పాత్రవంటి) కల్పనా సంబంధము గురించి, తనకు తదితర జీవులతోను, ఈ భౌతిక దేహముతోను గల (స్వప్నసదృశ్యమై) నాటకీయత గురించి సరియైన సమాచారము సముపార్జించనంత వరకు కూడా..., ఈ జీవుని పట్ల దుఃఖము, శోకము, భయము, ఆదుర్దా... ఇత్యాదులు కొనసాగుచూనే ఉంటున్నాయి. **అందుచేతనే జ్ఞానావస్యకత!** అయితే, ఈ **"అవిజ్ఞ రూపమున ఉన్నది, అవిజ్ఞులు"** కూడా ఆ **అద్వితీయుడగు పురుషునకు** వేరైన వారు కాదు. కాబట్టి 'మాయ' **పరమపురుషునియొక్క (లేక) పురుషోత్తముని యొక్క ప్రధమ ఖండవిభాగమే అగుచున్నది.**

### ద్వితీయ ఖండము - విజ్ఞేయత్వముచే మోక్షప్రదానత్వము

ఎవ్వరైతే దృశ్య విషయములను అధిగమించి, దైవీ గుణములను పెంపొందించుకొనుచూ, ఆ పరమ పురుషుని చేరుటకు భక్తి – జ్ఞాన – యోగ – వైరాగ్య మార్గములలో ఉద్యుక్తులై ఉంటారో, పరమపురుషుడు వారి సర్వ అడ్డంకులను, క్లేశములను, కష్టములను తొలగించు స్వభావము కలిగి యుంటున్నారు. ఆయన అనంతరూపుడై (సహస్రరూపుడై) అనంత కళాప్రదర్శకుడై, కళ్యాణరూపుడై, ఆర్తత్రాణ పరాయణుడై వెలుగొందుచున్నారు. అట్టి బృహత్ – విశ్వరూపము, విరాట్ రూపము తెలుసుకొనిన వారికి – ఆ రూపము దర్శించనంత మాత్రము చేత..., మోక్షప్రదాత అగుచున్నారు.

అరూపుడగు ఆ పరమాత్మ – సర్వ రూపములు, సర్వగుణములు, సర్వతత్త్వములు తనవే అయినట్టి విశ్వరూపమును ప్రదర్శించుచున్నారు. అట్టి పురుష నారాయణుని మహిమయే ఈ విశ్వము. పురుష సూక్తమంత్రములు అట్టి సర్వాంతర్యామి – సర్వతత్త్వ స్వరూపుడు, అగు పురుషనారాయణుని మోక్షార్థులగు జీవుల దృష్టికి తెచ్చి **"విశ్వరూపము విశ్వేశ్వర రూపమే"**... అనే మోక్షమార్గమునకు సంబంధించిన అవగాహనను బోధిస్తున్నాయయ్యా ! ఈ జీవుడు పురుషసూక్తార్థమును ఎరిగినప్పుడు **"ఈ జగత్ దృశ్యమంతా, ఇందలి జాగ్రత్–స్వప్న–సుషుప్తి విశేషములతో సహా – ఆత్మగా నా మహిమయే"** అని గ్రహిస్తున్నాడు.

**తేన వేషేణ భూమ్యాదిలోకమ్ వ్యాప్య, అనంత యోజనమ్ అత్యతిష్ఠత్।**

ఓ ఇంద్రదేవా ! ఆ పురుషనారాయణుని వేష రూపమే ఈ భూ – భువర్ – సువర్ మొదలైన లోకములలో – అంతర్ దృశ్యములుగా వ్యాపించి ఉన్నది. అనంత యోజన విస్తీర్ణమైనదంతా ఏకో–నారాయణరూపమే !

**అంతేకాదు.**

**తత్ పురుషోనారాయణో భూతమ్ భవ్యమ్ భవిష్యత్‌చ ఆసీత్ ।** త్రికాలములలోను సత్ స్వరూపుడు ఆయనయే ! స్వప్నము తనదైన వాడే, ... స్వప్నమునకు మునుముందుగాను, స్వప్న సమయంలోను, స్వప్నము ముగిసిపోయిన తరువాత స్వప్నమంతా కూడా ఉండి ఉన్నట్టివారు కదా ! ఇక స్వప్నంలోని విషయాలో ? స్వప్నంతోనే ముగుస్తున్నాయి. స్వప్న ద్రష్ట చైతన్యుడికి వేరైనదంతా అసత్తు– ఆ స్వప్న ద్రష్ట మాత్రమే సత్తుకదా ! (దానికి ఆధారమగు పురుషుడే సత్యము).

అట్లాగే

- జరిగిపోయిన కాలమునందు, వర్తమానమునందు రాబోవు కాలమునందు కూడా...,
- ఈ జగత్ సృష్టులకు ముందు – జగత్ సృష్టి అనుభవ కాలమందు – ఈ జగదనుభవము లయించి పోయినతరువాత కూడా...,
- ప్రతిదేహి పట్ల ఈ దేహము రాకముందు, ఇంద్రియ – విషయములతో కూడిన దేహ సందర్భములలోను, ఈ దేహము లయించిన తరువాత కూడా...,

సర్వకాల – సర్వావస్థలయందు, **సర్వత్రా సర్వదా సర్వముగా ఉన్నది ఆ వ్యాప్యనారాయణుడే!** ఆ నారాయణ పురుషుడే....

- ఆదినారాయణుడై,
- భూతనారాయణుడై,
- విశ్వవిభూతి నారాయణుడై,
- సర్వ వ్యాప్తనారాయణుడై,
- విరాట్ నారాయణుడై,
- జీవ – ఈశ్వర నారాయణుడై,
- అఖండ నారాయణుడై,
- జ్ఞాన – జ్ఞేయ నారాయణుడై,
- ద్రష్ట – దర్శన – దృశ్య త్రిమూర్తి నారాయణుడై సర్వమై వెలుగొందుచున్నారు.

**స ఏష సర్వేషామ్ మోక్షదశ్చ ఆసీత్!** ఆ సర్వతత్త్వ స్వరూప నారాయణుడే సర్వ జీవులకు దృశ్యబంధములను, పరిమితులను తొలగించగలుగు 'మోక్ష ప్రదాత' అయి ఉన్నారు. అంతటా ఉండి, పిలువగానే పలికి, ఈ జీవునకు సర్వబంధములు – అడ్డంకులు తొలగించి, సహజ స్వరూప ప్రదాత అయి, సర్వత్రా వెలయుచున్నారు.

**సయేవ చ సర్వ అస్మాన్ మహిమ్నో జాయన్!** ఈ దృశ్య జగత్తులో మహిమగల అనేక వస్తుజాలములు ఉండవచ్చుగాక ! అవన్నీ ఆ ఆదినారాయణుని మహిమ – రూపాలే ! ఆయన కానిది, ఆయనకు వేరైనది లేక పోవుటచే, .. ఆ నారాయణ పురుషుడు మహిమాన్వితుడు ! సర్వులు ఆయన రూపములే కనుక, **మహామహితాత్ముడు** కూడా ! **తస్మాత్ న కోఽపి జాయన్ ।** ఆయన అందరినీ ఎరిగియున్నారు. ఆయనను ఎవ్వరు ఎరుగరు. తెలుసుకొంటున్నదే ఆయన!

ఆయనకు మించినట్టిది మరొకటేదీ ఉండదు ! లేదు ! ఆయనయందే ఈ బ్రహ్మాండములన్నీ ఆయన భావకల్పనా చమత్కారముచే ప్రదర్శిత మగుచున్నాయి. ఆయనయే నేను ! ఆయనయే నీవు ! నీవు – నేను లోని ఏక – అఖండ సత్ తేజోవిలాసుడు ! ఆయనను ఆయనయే ఎగురుచున్నారు! మరెవ్వరూ ఆయనను ఎరుగలేరు! ఈవల నుండి ఆయనను తెలుసుకోలేము. ఆయనగా ఉండి మాత్రమే ఆయనను తెలుసుకోగలం.

అట్టి కేవల ఆనంద – ఆత్మానారాయణ మహాపురుషుడు తన యొక్క 'సృష్టి' అనే క్రీడా వినోదమును సిద్ధింప జేసుకొనుటకై తనను తాను నాలుగు విభాగములుగా విభజించుకొనుచున్నారు.

1. **మహిమ పురుషుడు**. ఈతడే సర్వాత్మకుడగు పురుషుడు. 'పురుషసూక్తము'లో వర్ణించిన జగద్రూప మహిమాన్వితుడు, జగత్ కల్పనా సృష్టికర్త కూడా ఈయనయే ! ఈ జగత్తంతా కూడా ఈయన మహిమయే! (ఏతావాన్ అస్య మహిమా). 'ఇదంతా నా మహిమ' అను పురుషకారుడు.

2. **వేదపురుషుడు**: సర్వమును ఎరుగుచు – వెలుగొందు 'చిత్ తత్త్వము'. ఎరుగుట (Knowing) అను తత్త్వమును ప్రదర్శించువారు. తెలియబడేదంతా తన తెలివిరూపంగా చూచుచున్న ఎరుకరూప పురుషకారుడు.

3. **ఛందః పురుషుడు :** శుద్ధ మానసుడై 'ఇష్టము' అను ఆనంద స్వరూపమును ప్రదర్శించు పురుషుడు. ఆలోచనలకంటే మునుముందే ఉన్నట్టి ఆలోచనా పురుషకార సమన్వితుడు. "దేనిగురించి యోచిస్తున్నాము?" – అనునది ప్రక్కగా పెట్టి చూస్తే, "ఆలోచన రూపమగు కేవల పురుషకారము" .. గా ఉన్నవాడు. ఇష్టము–యోచన–తనవిగా కలిగియున్నట్టి పురుషకారుడు. ఆలోచనచే ప్రదర్శనమయ్యేదంతా ఆయనకు అనన్యము.

4. **భౌతిక రూప పురుషుడు:** నామ – రూపాత్మకమై – మార్పు చేర్పులలో కనిపించు జగత్ పురుషుడు. భౌతిక బ్రహ్మాండ పురుషుడు. లోకాల సృష్టి – దేహాలు – జన్మలు – కర్మలు – బంధాలు, మోక్షాలు మొదలైన ఈ సకల విశేష సముదాయములతో కూడిన విరాట్ పురుషుడు. పాదనారాయణుడు! సృష్టికర్త! సృష్టిని కల్పించుకొని, ప్రవేశించి ఆస్వాదించుకొనుచున్న పురుషకారుడు.

ఓ త్రిలోకాధిపతీ ! ఇంద్రదేవా ! ఈ విధంగా మహా పురుషుని స్వకీయ కల్పిత విభజనా చమత్కారములలో మొదటి మూడు దివ్య – అమృత (మార్పు పొందని) అనిరుద్ధ నారాయణ విభాగములో ప్రదర్శితమగుచున్నాయి. నాలుగవది ఈ భౌతిక రూపముగా కనిపిస్తోంది. మార్పు – చేర్పులచే స్పృశించబడని అనిరుద్ధ (నిరుద్ధరహిత) నారాయణుడే పాదనారాయణుడై జగత్తును, ప్రకృతిని, జీవుని (The scene, Scene context and one who experiences the scene) కల్పించుచున్నారని గమనించు. పాదనారాయణుడే బ్రహ్మదేవుడై సృష్టిని సృష్టిస్తున్నారు. దృష్టియే సృష్టి! ఆత్మానారాయణుని స్వకీయ చమత్కారమే దృష్టి–ద్రష్ట–బ్రహ్మ కూడా!

**ఇంద్రదేవుడు :** హే మహాత్మా ! మోక్షప్రదాతా ! జగద్గురూ ! సర్వజీవుల అంతర్యామీ ! వాసుదేవా ! ఈ సృష్టిని పాదనారాయణస్వరూపుడగు బ్రహ్మదేవుడు సృష్టిస్తున్నారు కదా ? ఆయనకు జీవునివలెనే ఏదైనా కోరి ఈ సృష్టిని సృష్టిస్తున్నారా ? అయితే ఏది కోరి ఏ ఆశయ సిద్ధికొరకై నిర్వర్తిస్తున్నారు. ఈ 14 లోకాలను, నాతో సహా ఈ లోకాధిపతులను, పంచతన్మాత్రలను, జీవులను – బంధమోక్షములను – ఇవన్నీ ఆయనచే సృష్టి కార్యముగా ఎందుకొరకై నిర్వర్తించబడుతోంది ? దీనంతటివలన సృష్టికర్త పొందులాభమేమిటి ?

**శ్రీవాసుదేవుడు :** ఓ త్రిలోకాధిపతీ ! ఇంద్రదేవా ! పాదనారాయణ స్వరూపుడగు సృష్టికర్త బ్రహ్మదేవుడు సర్వకోరికలు తీరి ఉన్నవాడు.

**స సమృద్ధ కామః సన్, సృష్టికర్మ న జజ్ఞివాన్ ।** సృష్టికర్త వాస్తవానికి ఆప్తకాముడు. "నేను సృష్టికార్యము నిర్వర్తించి, తద్వారా ఇది పొందాలి" అనునదేదీ ఆయనకు లేనే లేదు ! మరి ఎందుకు సృష్టిస్తున్నాడంటావా ? సర్వులకు అంతర్యామి అయి సర్వమునకు పరమై, కేవల నిర్విషయ పరమానంద స్వరూపుడై, ఆదినారాయణుడై యున్నట్టి దివ్య స్వభావుడగు **అనిరుద్ధ నారాయణుని చిద్విలాస విభాగమే (లేక) క్రీడావినోద సంకల్ప విభాగమే సృష్టికర్మను నెరవేర్చుచున్నది. స అనిరుద్ధ నారాయణః తస్మై సృష్టిమ్ ఉపాదిసత్।**

ప్రతి ఒక్క జీవుని కేవలీ స్వరూపుడు (Absolute Self) అగు అనిరుద్ధ నారాయణుని లీలా వినోద భావనయే – సృష్టికర్త–సృష్టి–ప్రకృతి... ఇవన్నీ ఏర్పడుటకు మూలకారణం. **ఆత్మా–నారాయణుడే లీలా వినోదముగా–సృష్టి నారాయణుడై** ఈ జగత్ కల్పనను నిర్వర్తించుచున్నారు. అంతే!

**అనిరుద్ధ నారాయణుడు** తన నుండి సృష్టికర్తయగు బ్రహ్మదేవ ప్రజ్ఞను బయల్వెడల పరచి, ఇక ఆపై ఇట్లా ఆజ్ఞాపిస్తున్నారు.

## సృష్టిక్రీడా కల్పన – మానసిక సృష్టియజ్ఞము

**అనిరుద్ధ నారాయణుడు : మమాత్మానందము నుండి జనించినట్టి (ఆత్మావై పుత్రః) ప్రియ మమ కుమారా ! బ్రహ్మదేవా !**

నీవు నా సృష్టిక్రీడా వినోదరూపుడవై, మమాత్మకల్పనగా ఉదయించావు. ఇప్పుడు నా స్వీయాంశవైనట్టి నీవు నా సంకల్పమును నెరవేర్చెదవుగాక. అందుకుగాను, ఇప్పుడు కొన్ని సూచనలు ఇస్తున్నాను.

**తవ ఇంద్రియాణి యోజకాని ధ్యాత్వా,** – ఓ నా సృష్టి అభిమాన స్వరూపా! ఇప్పుడు "నేను నా ఇంద్రియ తత్త్వములకు నియమించు యాజకుడిని (ఇంద్రియ పరికరములచే యజ్ఞము నిర్వర్తింపచేయువాడను)" ... అని ధ్యానించుచున్నవాడవగుము.

**ధ్యాత్వా కోశభూతమ్,** ... పంచ కోశములైనట్టి అన్నమయ – ప్రాణమయ – మనోమయ – విజ్ఞానమయ – ఆనందమయ కోశముల ధ్యాసతో ధ్యానించినవాడవై (ధ్యాసయే ధ్యానము), షట్ కోశములైనట్టి చర్మము – మాంసము – శోణితము – అస్థి – స్నాయు – మజ్జలను సృష్టించుచుండెళివు గాక!

**ధ్యాత్వా ధృఢగ్రంథిమ్,...** "నేను సృష్టి (బ్రహ్మ) – స్థితి (విష్ణు) – లయ (రుద్ర) – గ్రంథుడను. దృశ్యములోని దేహ పదార్థమును. నేను దేహమును. నేను మనో ధర్ముడను. బుద్ధి ధర్ముడను. జన్మలు ధర్మముగా కలవాడను" ... ఇటువంటి ధృఢమైన గ్రంథుల ధ్యాసతో ధ్యానించెదవు గాక!

**కళేబరం హవిః ధ్యాత్వా....** "చతుర్ముఖ భౌతిక దేహ రూపమే నేను సృష్టి యజ్ఞమునకు సమర్పిస్తున్న హవిస్సు"... అను ధ్యాసతో కూడి, భావన చేయి.

**మాం హరిర్భుజ్యమ్ ధ్యాత్వా....** ఆత్మ రూపుడను, అనంతరూపుడను అగు నన్ను (నారాయణుని) హవిస్సుల **భోక్తగా** సంకల్పించుము.

**వసంతకాలమ్ ఆద్యం ధ్యాత్వా....** కాలము యొక్క ప్రథమ ఋతువగు **వసంత కాలమును** అగ్నిలో వేయు నేయి (ఆజ్యము)గా భావించుము.

**'గ్రీష్మ'–ఇధ్మమ్ ధ్యాత్వా...** కాలముయొక్క ద్వితీయ ఋతువగు **గ్రీష్మ ఋతువును ఇంధనముగా** (యజ్ఞసమిధ)గా అనుకొనుచున్నవాడవై,

**శరత్ ఋతురసం ధ్యాత్వా ...,** కాలము యొక్క మూడవ కల్పిత ఋతువు అయినట్టి **శరదృతువును రసరూపముగా** భావన చేసి, అద్దానిని **జీవ రసతత్త్వముగా** సంకల్పన చేయుము.

**ఏవమ్ అగ్నౌ హుత్వా....,** ఇవన్నీ కూడా 'సృష్టి యజ్ఞాగ్ని' యందు సమర్పణ చేయుచూ....,

నీచే సంకల్పించబడిన భౌతిక దేహ నిర్మాణమును – **అంగస్పర్శాత్ కళేబరం వజ్రం ఈష్యతే** – మనోబుద్ధి చిత్త అహంకార శక్తులచే అంగాంగములను స్పృశిస్తూ ఘనరూపముగా తీర్చిదిద్దుము!

**తతః స్వకార్యాన్ భావయిత్వా** ఇది నాకు **'స్వకార్యము – స్వధర్మము'** అని భావన చూస్తూ...,

**సర్వ ప్రాణి జీవాన్ సృష్ట్వా...** సర్వ జీవ ప్రాణులను సృష్టించుచూ...,

**పశ్చా ధ్యాః పాదుర్భవిష్యంతి....** అటు తరువాత "ఇవన్నీ కూడా నా దేహములే"... అనే అనుభూతితో విశ్వస్వరూపుడవై, హిరణ్య గర్భుడవై, విరాట్ రూపుడవై ప్రాదుర్భవించుము. సృష్టియందు **అనంత భౌతిక దేహసమన్వితుడవగుము.**

ఇక అప్పటినుండి స్థావర – జంగమాత్మకమైన సృష్టి ఏర్పడిన దగుచుండును గాక !

అంతేకాకుండా సృష్టితోబాటే (1) జీవుడు అజ్ఞాని అయి దృశ్యమునందు తన్మయుడగు విధము, (2) మరల ఆ బంధము తొలగించ 'మోక్ష మార్గము' అయినట్టి వైరాగ్య –క్రియా యోగ – భక్తి – జ్ఞాన – సమర్పణ యోగానుసంధానములను లీలా–క్రీడా వినోద భావికుడవై కల్పించెదరు గాక !

అనగా, మోక్ష మార్గ విధి–విధానమును కూడా సృష్టిలో భాగముగా అనుసంధానము చేసెదరు గాక! అంతర్ – భాగముగా అనుసంధానము చేసెదరు గాక ! సృష్టియొక్క తత్త్వమును సత్య దృష్టితో నిరూపించు ఋషి వాక్యములను–ఋషి ప్రజ్ఞలను కూడా కల్పించెదవు గాక!

✡

**ఈవిధంగా పరమపురుషుని గురించి సత్యద్రష్టలగు ఋషులు పురుషసూక్తమును గానము చేయుచున్నారు.**

**శ్రీ ఇంద్రదేవుడు :** ఆదినారాయణ-ఇచ్ఛా - రూపము అయినటువంటి ఇట్టి సృష్టి విధానమును స్తోత్రం చేయు **పురుష సూక్తమంత్ర ఋషులు** ఏ ప్రయోజనమును ఆకాంక్షిస్తున్నారు ?

**శ్రీ వాసుదేవుడు :** ఇప్పుడు మనము పురుషసూక్త విశేషార్ధము - రహస్యార్ధముగా చెప్పుకొన్న "సృష్టి యజ్ఞము" గురించి తెలుసుకొనిన ఉపాసకుడు **మోక్షమార్గమును ఎరుగుచున్నాడు.** ఈ భౌతిక దేహము సహాయముతో పొందిన అతని ఆయుష్షు (జీవితము) పవిత్రము, సత్ప్రయోజనకరము అవగలదు. ఇదియే బ్రహ్మ దేవునిచే మనో సంకల్పితులు (మానసపుత్రులు) అగు ఋషుల ఆశయం !

ఓ ఇంద్రదేవా! పరమాత్మ సర్వదా ఏకమే అయి ఉంది, బహువిధములుగా (అజ్ఞాన దృష్టికి) అగుపిస్తున్నారు. అనిపిస్తున్నారు. **ఆత్మ దృష్టి** గలవారికి **అనేకముగా కనిపించేదంతా కూడా ఏకమగు స్వస్వరూపాత్మ విభవమే - అని** తప్పక అనిపించగలదు. ఇదియే పురుషసూక్త **ముఖ్యార్ధము, వాచ్యార్ధము, వివేచనార్ధము** కూడా !

ఆ పరమాత్మ 'దేహ - ఇంద్రియ - మనస్సులకు తెలియబడేవాడు కాదు. అయినాకూడా - **అజాయమానో, బహుధా విజాయితే - ఈ అనేకముగా తెలియబడేదంతా కూడా తానే అయి ఉన్నారు**. ఏకమే.... అనేక రూపములై, తనను తాను అనేక రీతులుగా, అనేక విధములుగా ఆస్వాదించుచున్నది. **ఏకో నారాయణుడే బహుప్రజ్ఞా నారాయణుడై** ఈ సృష్టి అంతా తానే అయి, వివిధ జీవప్రజ్ఞలతో వివిధ రూపాలుగా భావనచేసి అనువర్తించుచున్నారు.

## వివిధ ఉపాసనా విధులు

**'తమ్ ఏతమ్ అగ్నిః' ఇతి అధ్వర్యవ ఉపాసతే -** ఋగ్వేద సంబంధమైన యజ్ఞతత్త్వదర్శులు **అగ్నిః త్వమేవ! త్వం అగ్ని తేజోరూపాయ!...** అని పరమాత్మను అగ్ని స్వరూపునిగా తేజో విభవముగా, జ్యోతి స్వరూపునిగా భావనచేస్తూ ఉపాసిస్తున్నారు.

**యజుః ఇతి ఏష హి, ఇదం సర్వమ్ యునక్తి -** "యజుర్వేదములో అభివర్ణించిన యజ్ఞపురుషుడే ఇక్కడ అందరమూ ఉపాసించవలసిన దైవము".. అని యజుర్వేద వక్తలు పరమాత్మను నిర్వచిస్తూ ఉపాసిస్తున్నారు.

**సామ ఇతి - ఛందోగా ః -** పరమాత్మను ఉపాసించాలంటే సామగానమే మార్గము. లేకపోతే మనస్సు పరమాత్మతో లగ్నంకాదు. అని ఛందోగులు అభిప్రాయపడుచున్నారు. 'గానముచేతనే ఆయన సులభసాధ్యుడు' .... అని గాన లహరి వినిపించుచున్నారు.

ఆ పరమాత్మయందే **ఋక్కులు, యజుర్వేద యజ్ఞములు, సామవేద గానములు** ప్రతిష్ఠితమై ఉన్నాయి. ఆ అఖండ - ఏక పరమాత్మయొక్క లీలా వినోద సృష్టి - అనే ఆటలోని అంతర్భాగములే ఈ ఏకానేక ఉపాసనా విశేషాలు కూడా ! ఆ వివిధ రీతులైన ఉపాసనలు మోక్షమార్గమును అనేక మధుర పుష్పసౌరభములతో తీర్చిదిద్దుతున్నాయి. అట్టి ఉపాసనా విధులు అసంఖ్యాకములు.

ఇంకాకూడా..., ఆయా వేరైన పరమాత్మను గురించిన మరికొన్ని ఉపాసనల గురించి ఇక్కడ ఉదహరించుకుంటున్నాము.

**సర్పులు** (ఒక కొండజాతివారు మొ॥వారు) విషనాగుల కంఠములో నుండి స్రవించు 'విషము'నే పరమాత్మోపాసనా మార్గముగా భావించి, కొలచుచున్నారు.

**సర్పవిదులు** (మరొక కొండజాతి వారు మొ॥వారు) పరమాత్మను **(నాగరాజు - ఆదిశేషుడు** ... ఇటువంటి) సర్పరూపములను, సర్పశిల్పములను ఆ పరమాత్మగా భావించి పూజిస్తున్నారు.

దేవతా జాతులవారు - **'ఊర్గ' అనే విశ్వ శక్తితత్త్వ జగదీశ్వరీ (ఉమాదేవీ) దేవతయే పరమపురుష తత్త్వము** - అని మనోవాక్కులతో సేవిస్తున్నారు.

మానవులలో కొందరు అంతరహృదయ యోగాభ్యాసులు యోగాభ్యాసములో కనిపించే **జ్యోతి-తేజస్సులనే** పరమపురుష భావనతో ఆరాధిస్తున్నారు. రయి **ఇతి మనుష్యాః**

అసుర జాతులతో మరికొందరు "**పరమాత్మ మాయా**రూపుడు అని, మాయా దేవ్యోపాసనచే, పరమాత్మను మంత్రముగ్ధంగా -

మంత్రశక్తుల ప్రసాదితునిగా సేవిస్తున్నారు. నివేదనలు సమర్పిస్తున్నారు.

పితృ లోకంలోని పితరులు ఆ పురుషుని "**స్వధా**" దేవతగా భావించి ప్రణతులర్పిస్తున్నారు. (స్వధామః మంత్రమును జపిస్తున్నారు).

దేవలోకములోని వారు **(దేవజనవిధులు), "దేవజనస్వరూపుడే ఆ పరమాత్మ"**... అని భక్తోపాసనలు సమర్పిస్తున్నారు.

అప్సరస జాతివారు – **'*గంధ*'** రూపమే ఆ పరమాత్మ అని భావించి ***సుగంధోపాసన*** నిర్వర్తిస్తున్నారు.

ఈ విధంగా ఆ పరమాత్మను అసంఖ్యాకమైన రూప – తత్త్వ స్వభావాలుగా భావనచేసి వేరువేరు జనులు వేరువేరుగా ఉపాసన – ఆరాధన కొనసాగిస్తున్నారు. ఇక అశ్వత్థ నారాయణుడు ఎవరు ఏ రీతిగా ఉపాసిస్తూ ఉంటే వారివారికి ఆ రూపముగానే ప్రసన్నులై, కోరిన దృశ్యసంబంధమైన – అదృశ్య సంబంధమైన ఫలములను ప్రసాదిస్తున్నారు. ఆ ఆరాధకుడు ఆ తత్త్వమునే స్వయముగా సిద్ధింపజేసుకొనుచున్నాడు. తన్మయుడగుచున్నాడు.

(యేఽపి అన్యదేవతా భక్తా యజంతే శ్రద్ధయా ఽన్వితాః తేఽపి మామేవ, కౌంతేయ! యజన్తి అవిధిపూర్వకమ్ – భగవద్గీత – రాజవిద్యా రాజగుహ్య యోగము)

అందుచేత... బ్రహ్మము గురించి, పురుషసూక్తములోని పురుషుని గ్రహించి తెలుసుకొన్న తరువాత...,

"పరంబ్రహ్మైవాఽహమ్ । నేను పరబ్రహ్మమునే – అను ఉపాసన"

ఇట్టి భావనను ఆశ్రయించాలి. పురుషసూక్త మంగళశ్లోకములను, అర్థయుక్తముగా గానము చేస్తూ, "సోఽహమ్-తత్త్వమ్" – అను పరమార్థమును మననము చేయువాడు 'పురుష' తత్త్వమును ఎరుగుచున్నాడు. ఎరిగి ఆ పురుషుడుగా తానే సంతరించుకొనుచున్నాడు. పరమపురుష – స్వరూపుడగుచున్నాడు. బ్రహ్మమును ఉపాసించువాడు...., సర్వమును దాటి వేయుచూ బ్రహ్మమే తానగుచున్నాడు. **(బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి) !**

- **ఆధ్యాత్మిక తాపములు** – తనయొక్క స్వరూప-స్వభావముల గురించి అసంపూర్ణ జ్ఞానముచే వచ్చిందే మనోవేదనలు.
- **ఆధి భౌతిక తాపములు** : తేలు – పామువంటి విషజంతువుల వలన వచ్చే శారీరక బాధలు. దేహము – ఇంద్రియములు మొదలైన వాటికి కలుగు ఆధి – వ్యాధులు.
- **ఆధిదైవిక తాపములు :** ప్రకృతి సంఘటనలైనటువంటి అతివృష్టి, అనావృష్టి, తీవ్రమగు యండలు, అతివాయువులు, గాలివీచక పోవటం. ఇవి కాక, సంబంధ-బాంధవ్యములకు సంబంధించిన అనుకోని సంఘటణల గురించిన దిగుళ్ళు.

  పురుషసూక్తోపాసకుడు ఇటువంటి బాధలు ఈ మూడు తాపములను స్వభావసిద్ధంగా అధిగమించివేసి ఉండగలడు.

***త్రివిధ – త్రితాపములచే స్పృశించబడనివాడై, కేవల పరమపురుష సాక్షిత్వము సంతరించుకొనుచున్నాడు.***

- **కర్త – కర్మ – కార్యములను :** "నేను కర్తను. కర్మలచే బద్ధుడను. ఇక్కడి కార్యములు సుఖదుఃఖభరితంగా అనివార్యము..."
- **జ్ఞాతృ-జ్ఞాన-జ్ఞేయములను...** "తెలుసుకోవలసినవి, తెలిసినవి... ఇవన్నీ నాకు బంధములు, తెలియబడుచున్నవాటిచే నేను పరిమితుడను....,"
- **భోక్తృ – భోగ – భోగ్యములను** ... నేను భోక్తను అనుభవించువాటికి నేను నిబద్ధుడను...

***ఈ త్రిభావనలను కూడా దాటివేసి ఉంటాడు. అతీతుడై మౌనముగా "అప్రమేయ-ఆత్మాఽహమ్ భావన"తో చూస్తూ ఉన్నవాడవగలడు.***

**షట్ ఊర్ములు – వర్జితమ్ (6) :** భౌతిక సంబంధమైన ఆకలి – దప్పిక – శోకము – మోహము, జర – మరణములు పరిధులను దాటి, వాటిని అత్యంత దైనందికమైన స్వల్పవిశేషాలుగా దర్శించగలుగుచున్నాడు.

**పంచకోశాతీతమ్ :** అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ – కోశములను దాటివేసి, వాటిని తనయందు దర్శిస్తూ, వాటిని స్వభావంగా అధిగమించినవాడై ఉండగలడు. (వాటియందు తనను కాదు, తనయందు వాటిని గమనించగలరు.

**అన్నమయ** – ఈ భౌతిక దేహముకంటే ముందే ఉన్నవాడను. ఇది నాకు ఒక ఉపకరణము మాత్రమే !

**ప్రాణమయ** – నా ప్రాణశక్తి (లేక) శక్తి అనునది నన్ను అనుసరించియే ఉంటుందేగాని, ఈ దేహముతో వచ్చి – పోయేదికాదు. నేను సర్వదా శక్తిమంతుడను.

**మనోమయ** – ఆలోచనలకంటే మునుముందు ఉన్న "ఆలోచించు" పురుషకారమును.

**విజ్ఞానమయ** – తెలుసుకోవటానికి మునుముందే ఉన్నట్టి "తెలుసుకొనుచున్నవాడను" నేను ! తెలుసుకొననప్పుడు కూడా నేనున్నాను. **యథా గాఢనిద్రా సమయే !**

**ఆనందమయ** – ఆనందము – దుఃఖము నావి కావచ్చు గాక! కానీ, అవి లేనప్పుడూ ఉంటాను.

ఈ విధంగా పంచకోశములు **"నేనుంటేనే అవి ఆభరణములు వలె నన్ను ఆశ్రయించి ఉంటాయికదా !"**... అని గ్రహించి ఉండగలడు.

**షట్ కోశ (6) అతీతమ్ :** ఈ శరీరములో చర్మము-మాంసము-శోణితము-అస్థి (బొమికలు) స్నాయు (సన్నటి నరములు) – మజ్జ (బొమికలలో గుజ్జు) అనునవి '6' కోశములు. ఈ శరీరమునకే కేవల సాక్షిని అయి ఉండటం చేత, నేను ఆ ఆరిటికి చెందిన వాడిని కాను. అవి నాకు చెందినవీకావు.

**షట్ (6) భావ వికార శూన్యమ్ :** షట్ భావములు అయినటువంటి ప్రియత్వ – జనన – వర్ధన – పరిణామ – క్షయ – నాశనములు భౌతిక దేహమునకు సంబంధించినవి. నేనో ? దేహిని. ఈ భౌతిక దేహమును ఒక వస్తువువలె ఉపయోగించువాడను. నిత్యోదిత పురుషరూపుడను. అందుచేత ఆరు వికార భావములచే బద్ధుడను కాను. పరిమితుడనుకాను.

**ఏవమ్ ఆదిః** జన్మలు – కర్మలు కంటే ముందే ఉన్నట్టి ఆది స్వరూపుడను. ఆద్యంతరహితుడను!

**సర్వవిలక్షణమ్ భవతి :** నాకు చెందినవిగా చూడబడుచున్న లక్షణములన్నీ ఈ జగన్నాటకములో నాకు ఇవ్వబడి నేనునటించుచున్న పాత్రకు చెందినవి. నేను జగత్ ఆగమన – నిష్క్రమణములకు (రాక-పోకలకు) కూడా సాక్షిని. పాత్రలయొక్క లక్షణాలు నటుడి వ్యక్తిగతమైనవిగా అవవుకదా! నాకు జన్మ-కర్మల పాత్రత్వము లేదు. **సర్వలక్షణములకు విలక్షణమైన ఆత్మను!**

**అరిషట్ వర్గ దిగ్విజయో** : ఆరుగురు శత్రువులపై యుద్ధము ప్రకటించి, **పురుషసూక్త పురుషతత్వ నిర్వచనముల సహాయముతో జయించి వేయగలడు. వాటి వివరణలు**

**1. కామవర్గము:** ఇప్పటికి లేనివేవో ఇంకా లభిస్తే గాని, ఏదో చెప్పరాని లోటు తొలగదు. ఇంకా ఇంకా ఏవేవో కావాలి ! పొందాలి! అంతదాకా లోటే!

**2. క్రోధవర్గము:** ఆవేశముతో కూడిన – మనోబుద్ధులను తీవ్రముగా ఆక్రమించి యున్న 'కోపము', కోప భావాలు, అభిప్రాయాలు వదలలేకపోవటం. (ఒకే సందర్భము గురించి 3 సార్లు కోపమువస్తే అది క్రోధ లక్షణము).

**3. లోభవర్గము :** "కలిగి ఉన్నవేవో పోగొట్టు కోవలసివస్తుందేమో? తొలగుతాయేమో?" అనే ఆవేదన. పంచుకోవలసినవి కూడా దాచుకోవాలనే తాపము.

**4. మోహవర్గము :** తప్పుడు – లోపములతో కూడిన అవగాహనలు. కామ-క్రోధములు, ఇత్యాది భావ ఆవేశములతోను, సత్య – సంకుచిత దృష్టుల కారణంగాను ఏర్పడు అసత్య దృష్టి. అసమగ్రమైన – సంకుచితమైన దృష్టి, భావనలు, అభిప్రాయాలు. సత్యమును సమగ్రంగా పరిశీలించక, జ్ఞానమును సంపాదించకుండానే... కొన్ని కొన్ని నమ్మికలకు, మమకారములకు, అహంకారములకు లోను అయి పెంపొందించుకొనటము. సంకుచితత్వముతో కూడిన అవగాహన.

**5. మదము :** సంపదలనో, పదవులనో, స్థితి–గతులనో, భౌతిక బలమునో, జనబలమునో చూచుకొని గర్వించుచుండటము. ఇతరులను తక్కువ వారిగా చూడటము. తక్కువ చేసి మాట్లాడటము. గర్వము.

**6. మాత్సర్యము :** ఇతరులపై క్రోధముతో దర్పములు ప్రదర్శిస్తూ బాధించు ప్రవృత్తి. తనవలన తనకు గాని, ఇతరులకు గాని కలుగుబాధను గమనించకపోవటము. సర్వదా పరదూషణకు సంసిద్ధుడై, అందుకు త్రోవలు వెతకటము.

బ్రహ్మమును, పరమపురుషుని ఎరిగినవాడు స్వభావ సిద్ధంగానే, అంతదూరంగా ఉన్నప్పుడే పై అరిషట్‌వర్గమును గమనించి, గుర్తించి వాటి నుండి తన **హావ – భావ జ్ఞాన – విజ్ఞానములను** పరిరక్షించుకొనుచూ ఉంటాడు.

**షట్‌భ్రమో పరిత్యజ్య :** పురుషసూక్తములో వర్ణించబడిన 'పురుషుడు' యొక్క శబ్దార్థమును, తాత్పర్యమును, ఎరుగుచూ, పురుషసూక్తమును గానము చేస్తూ ఉపాసించువాడు షట్ (6) భ్రమలకు లోనుకాడు. భ్రమ మాత్రంగా దర్శించగలుగుతాడు.

**షట్ భ్రమలు ('6' Illusionary Conceptions):**

(1) కులము (2) గోత్రము (3) జాతి (4) వర్ణము (5) ఆశ్రమము (6) రూపము

ఇవన్నీ సందర్భ మాత్ర విషయములుగాను, వస్తుతః భ్రమమాత్రముగాను చూస్తూ, సమున్నతమైన, భేధరహితమైన సమగ్రమైన **'పరాదృష్టి'**ని పెంపొందించుకొని ఉంటున్నాడు.

**జీవో :** ఎప్పుడు పరమపురుషుడు తన అఖండ అప్రమేయ – నిత్య – సర్వాతీత స్వరూపమును ఏమరచి – త్రి (3) తాపత్రయములతోను, త్రిగుణ రూపమగు త్రివిధ త్రయీమాయతోను, షట్ (6) కోశములతోను; అరిషట్ (6) వర్గములతోను; షట్ (6) ఊర్ములతోను; అంతరంగ (5) పంచ కోశములతోను, షట్ (6) (శరీరములోని) కోశ విశేషములతోను, షట్ (6) భావవికారములతోను (7) జన్మ – కర్మల తాదాప్యముతోను..., తన్మయుడై ఉంటాడో, ... అప్పుడు (ఆ పరమపురుషుడు).. జీవుడుగా చెప్పబడుచున్నాడు.

ఎప్పుడు జీవుడు (పురుషసూక్త–అర్థోపాసనచే) వాటిని దాటుచున్నాడో, అప్పుడాతడు ***పరమపురుషుడుగా*** శేషించుచున్నాడు.

ఇతి ముద్గలోపనిషత్

## ఫలశ్రుతి

- ఎవ్వరైతే ఈ ఉపనిషత్ రహస్యార్థమును నిత్యము ఉపాసిస్తాడో...,
- ఆతడు అగ్నివలె, వాయువువలె, ఆదిత్యునివలె (సూర్యునివలె) నిత్యనిర్మలుడగుచున్నాడు.
- సర్వ భౌతిక – మానసిక తాపములనుండ విడివడగలడు.
- మహాపాతక దోషములనుండి విముక్తుడు, నిర్మలుడు కాగలుడు. మత్తు పానీయములు గ్రహించిన దోషము, ఉత్తమమైన ఆశయములు లేకుండటము, తల్లిని బాధించిన దోషము, పరస్త్రీ వ్యామోహము, దొంగతన దోషము, వేదములు చెప్పినవి తెలిసి కూడా ఆచరించకపోవటము, గురువును సేవించకపోవటము, చేయకూడని యాగములు చేయుటము, తినకూడనివి తినటము, తీసుకో కూడని దానము స్వీకరించడము, ఇతరుల భార్యలపై దుర్భావన, ... ఇటువంటి దోషములనుండి పురుషసూక్త అంతర్లీనార్థమును గ్రహిస్తూ ఉండగా... విముఖుడు, విముక్తుడు అగుచున్నాడు.

కామ క్రోధ – లోభ – మద – మాత్సర్య – ఈర్ష్య – అసూయ దురభిమానముల వంటివి అతనిని కించిత్ కూడా సమీపించజాలవు. మనో – బుద్ధులను తాకనైనాలేవు.

సర్వపాపములనుండి విముక్తుడై, ఆ పురుష సూక్తార్థోపాసకుడు ఇక్కడే పురుషసూక్త పతిప్రాదితమగు **పురుషుడు** కాగలడు.

అందుచేత ఓ ఇంద్రదేవా ! నీ పాలనలోని ముల్లోక జనులు కూడా....

అతి రహస్యము, రాజ గుహ్యాము, దేవ గుహ్యాము, అయినటువంటి

**పురుష సూక్త మంగళ శ్లోకముల అర్ధ – అంతరార్ధము లను సేవించెదరు గాక !**

✡

దీక్ష – పట్టుదల – శ్రద్ధ – ఉత్తమ ఆశయము లేనివానికి ఈ ముద్గలోపనిషత్ తాత్పర్యమును బోధించవలదు. అట్లాగే, పూజ్యులపట్ల– – శాస్త్రములు చెప్పు విది విధానములపట్ల గౌరవములేనివారు, ద్రవ్యయజ్ఞ – తపోయజ్ఞ–ప్రాణాయామయజ్ఞ–దైవయజ్ఞ–ఇటువంటి కొన్ని యజ్ఞములను శ్రద్ధ–విజ్ఞతలతో నిర్వర్తించు ఆశయము లేనివారు, విష్ణు ద్వేషులు, ఏకాగ్రత –వివేచనాదృష్టి లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడువారు, 'వారు అప్రియులు' ఇటువంటి బలమైన దురభిప్రాయములు పెంపొందించుకొని ఉండువారు, దేశ – కాల నియమములపట్ల గౌరవము లేనివారు, అసంతృప్తితో చరించువారు....,

ఇటు వంటివారు వేద – వాక్యసారమగు **ముద్గలోపనిషత్ బోధకు అర్హులు కాజాలరు.**

గురువు శిష్యునకు బోధించే సందర్భములలో

- శుచి అయిన ప్రదేశము,
- పుణ్య నక్షత్రము,
- ప్రాణాయామ – అభ్యాసము, పరమపురుష స్తోత్రముతో నాంది పలకటము...., ఇటువంటివి పాటించబడుగాక !

ఈ ఉపనిషత్ వ్యాఖ్యానమును గురువు రహస్యముగా శిష్యుని ఎదురుగా కూర్చోబెట్టుకుని కుడిచెవిలో బోధించునుగాక !

విద్వాంసునికైతే ఎక్కువసార్లు చెప్పవలసిన పని ఉండదు. అతి త్వరగా గ్రహించి "పురుషసూక్త ప్రవచిత పరమ–పురుషత్వము" పొందుచూ, అనునిత్యాస్వాది కాగలడు.

ఈ విధముగా పురుషసూక్తమును వ్యాఖ్యానించు ఈ ముద్గలోపనిషత్తు – గురువు శిష్యునికి బోధించుచుండగా గురు – శిష్యులిరువురు ఇప్పుడే, ఇక్కడే ఈ జన్మయందే – పరమ పురుషత్వమును పుణికి పుచ్చుకొనగలరు.

***ఇతి ముద్గలోపనిషత్***

***శ్రీమన్నారాయణాభ్యోం నమః। పితామహ బ్రహ్మదేవాభ్యోం నమః।***

***ముద్గలమహర్షి భ్యోం నమో నమో నమో నమః***

***ఓం శాంతిః శాంతిః శాంతిః***

## ముద్గలోపనిషత్ - నాంది (అనుబంధము)

# పురుష సూక్తము

| | |
|---|---|
| హరిః ఓం।<br>సహస్ర శీర్షా పురుషః।<br>సహస్రాక్షః। సహస్ర పాత్।<br>స భూమిం విశ్వతో వృత్వా<br>అత్యతిష్ఠత్ దశాంగులమ్।<br>పురుష ఏవ ఇదగ్ం సర్వమ్<br>యత్ భూతమ్। యత్ చ భవ్యమ్।<br>(పురుషయేవేదగ్ం సర్వం) | 'ఓం' కార స్వరూపుడై సర్వము తానే అయి ఉన్న హరిని స్మరిస్తున్నాము. నమస్కరిస్తున్నాము.<br>ఏ (పరమ) పురుషుడైతే...,<br>- వేలాది శిరస్సులలో (అసంఖ్యాక భావనలతో, యోచనలతో).....,<br>- వేలాది కనులతో (చూపులతో దృష్టులతో, ధ్యాసలతో)....,<br>- వేలాది పాదములతో, (నడకలతో, నడతలతో)....<br>ఈ భూమితో సహా విశ్వమంతా నిండి ఉండి, ఇంకనూ '10 అంగుళములు విస్తరించి దాటి ఉన్నారో...,<br>అట్టి (మహా) పురుషుని ప్రత్యక్ష రూపమే - ఇప్పటి, ఇతఃపూర్వపు, ఇక ముందటి ఉనికి కలిగియున్నదంతా కూడా. త్రికాలములలో తెలుసుకొనవలసినది ఆయననే! |
| ఉత అమృతత్వస్య ఈశానః<br>యత్ అన్నేన అతిరోహతి। | అట్టి ప్రభువగు ఈశానుడు ఊర్ధ్వమున అమృతస్వరూపుడుగాను, క్రిందుగా అన్నము (సర్వ అనుభవములతో కూడిన భౌతిక జగత్తుగాను) అతిశయించి ఉన్నారు. |
| ఏతావాన్ అస్య మహిమా<br>అతో జ్యాయాగ్ంశ్చ పూరుషః। | ఈ కనబడేదంతా కూడా ఆ పురుష - ఈశ్వరుని మహిమయే! ఈ కనబడే విశ్వశక్తులన్నిటికంటే ఆయన అత్యధికుడు! మహనీయుడు! మహాతిశయుడు! |
| పాదో అస్య విశ్వా భూతాని,<br>త్రిపాదస్య అమృతం దివి। | ఈ సమస్త భూతజాలము ఆ పురుషోత్తముని - 4వ వంతు విభాగము మాత్రమే! ఇది మార్పు-చేర్పుల విభాగము. ఈ భూ - విశ్వములను అతిక్రమించి, ఆయనయొక్క అమృత విభాగము - ముప్పావువంతుగా ప్రకాశమానమైయున్నది. |
| త్రిపాద్ ఊర్ధ్వ ఉదైత్ పురుషః<br>పాదో అస్య ఇహ భావాత్ పునః॥ | ఊర్ధ్వంగా 3/4వ భాగము (అవినాశనమై మార్పు-చేర్పులు లేనిదై) నిత్యోదితమై, ఉత్కర్షణముగా ప్రకాశమానమై ఉన్నది. ఆయన 4వ భాగము విశ్వముగా విస్తరించి ఉన్నది. |
| తతో విష్వఙ్ వ్యక్రామత్<br>సా ఆశన, అనశనే అభి। | ఆ పురుషుని 4వ విభాగము సృష్టి - సంహారములతో కూడి మాయా విభాగమై ప్రదర్శనమగుచున్నది. చేతన - అచేతనములుగా విస్తరించి ఉంటోంది. |
| తస్మాత్ విరాడ జాయత।<br>విరాజో అధి పూరుషః।<br>స జాతో అత్యరిచ్యత।<br>పశ్చాత్ భూమిః, అథో పురః। | ఆ పరమాత్మ నుండి మొట్టమొదటగా "విరాట్ పురుషుడు" బయల్వెడలారు. ఆ విరాట్ పురుషుని ఆధారంగా చేసుకొని ఆ పరమపురుషుడు అధిపురుషరూపము దాల్చారు. పరిపూర్ణుడగు ఆ అధిపురుషుడు ఉత్కృష్టరూపుడుగా ప్రకాశించసాగారు. తరువాత ఆ మహాపురుషుడు భూమిని సృష్టించారు. అటు తరువాత జీవులను, వారివారి దేహములను సృజించారు. పరిపోషకులగు దివ్యస్వరూపులగు దేవతలను కూడా సృష్టించారు. దేవము = అశరీరులై సృష్టిలో వ్యక్తీకరణమగు దివ్యప్రజ్ఞలు) |
| యత్ పురుషేణ హవిషా<br>దేవా యజ్ఞమ్ అతన్వత। | ఆ (పరమ) పురుషుని కల్పన నుండి బయలుదేరిన ఆ దేవతలు సృష్టికొరకై మనస్సులే హవిస్సుగా సృష్టి యజ్ఞమునకు ఉపక్రమించారు. |
| వసంతో అస్య ఆసీత్ ఆజ్యమ్।<br>గ్రీష్మ ఇధ్మః। శరత్ హవిః। | ఆ సృష్టి యాగమునకు కాలరూపమగు వసంత ఋతువు ఆజ్యము (నెయ్యి) అయింది. గీష్మ ఋతువు సమిధలు. శరత్ ఋతువు హవిస్సు (యజ్ఞమునకు సమర్పించు వస్తు రూపము) అయినాయి. |

| | |
|---|---|
| **సప్త అస్యాసన్ పరిధయః।**<br>**త్రిసప్త సమిధః కృతాః।** | (గాయత్రీ చంధస్సు మొదలైన) సప్త (7) ఛందస్సులు ఆ యజ్ఞవాటికకు '7' ఎల్లలు (పరిధులు) అయ్యాయి. (జాగ్రత్-స్వప్న-సుషుప్తులనే) 3 x 7 = 21 ఎల్లలుగా సమిధల (కట్టెల) రూపముగా అయ్యాయి. |
| **దేవా యత్ యజ్ఞం తన్వానాః।**<br>**అబధ్నన్ పురుషం పశుమ్।** | దేవతలు ఈవిధంగా సృష్టి కల్పనా యజ్ఞమును ప్రారంభిస్తూ.... విరాట్ పురుషుని యజ్ఞ పశువుగా రూపుచేశారు. |
| **తం యజ్ఞం బర్హిషి ప్రోక్షమ్।**<br>**పురుషం జాతమ్ అగ్రతః।**<br>**తేన దేవా అయజన్త,**<br>**సాధ్యా ఋషయశ్చ యే।**<br>**తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః,**<br>**సంభృతం పృషత్–ఆజ్యమ్।** | సృష్టికి మునుముందే జనించియున్న ఆ విరాట్ పురుషుని యాగపశువుగా (అశ్వమేధయాగంలో గుఱ్ఱమువలె) చేసి మానసిక యజ్ఞము ప్రారంభిస్తూ, ఆ దేవతలు సంప్రోక్షము (జలమును చల్లటము) నిర్వర్తించారు.<br>ఆ విరాట్ పురుషుని నుండి జనించిన దేవతలు, సాధ్యులు, ఋషులు మానసిక యజ్ఞములో పాల్గొన సాగారు.<br>మానసిక - సర్వహుత యజ్ఞము జరుగుచుండగా యజ్ఞవాటిక నుండి (సర్వహుతము అనే ఆ యజ్ఞములోని అగ్నిగుండము నుండి) పృషత్ - ఆజ్యము (ఆవునెయ్యి) జనించింది. |
| **పశూగ్ః తాగ్ః చక్రే వాయవ్యాన్,**<br>**ఆరణ్యాన్ గ్రామ్యాశ్చ యే।** | అక్కడి యజ్ఞవాటిక నుండి వాయు దేవతా తేజస్సులతో కూడిన గోవులు, అరణ్య జంతువులు, గ్రామ్య జంతువులు (పులులు, సింహాలు, మేకలు, కుక్కలు మొ॥వి) పుట్టాయి. |
| **తస్మాత్ యజ్ఞాత్ 'సర్వహుతః',**<br>**ఋచః సామాని జజ్ఞిరే।**<br>**ఛన్దాగ్ంసి జజ్ఞిరే తస్మాత్।**<br>**యజుః తస్మాత్ అజాయత॥**<br>**తస్మాత్ అశ్వా అజాయన్త,**<br>**యేకేచ, ఉభయా 'దతః'।**<br>**గావో హ జజ్ఞిరే తస్మాత్।**<br>**తస్మాత్ జాతా అజావయః॥** | ఆ సర్వహుత యజ్ఞవాటిక నుండి ఇంకా ఋగ్వేదము, సామవేదము, (గాయత్రి మొదలైన) ఛందస్సులు, యజుర్వేదము బయల్వెడలాయి.<br>ఆ యాగ గుండము నుండి ఇంకా, గుఱ్ఱములు, క్రింద పలువరసలు కలవి, (ఖడ్గమృగములు మొ॥వి), ఉభయ దంతములు గలవి, గోవులు అజావయములు (మేకలు, గొర్రెలు) మొదలైన జంతు జాలమంతా పుట్టింది. |
| **యత్ పురుషం వ్యదధుః,**<br>**కతిథా వ్యకల్పయన్।**<br>**ముఖం కిమ్ అస్య? కౌ బాహూ?**<br>**కా ఊరు, పాదా ఉచ్యతే।**<br>**బ్రాహ్మణో అస్య ముఖమ్ ఆసీత్।**<br>**బాహూ రాజన్యః కృతః।**<br>**ఊరూ తత్ అస్య యత్ వైశ్యః**<br>**పద్భ్యాగ్ం శూద్రో అజాయత।** | ఆ విరాట్ పురుషునకు ముఖము, బాహువులు, తొడలు, పాదములు మొదలైనవి కల్పించబడ్డాయి.<br>ఆ విరాట్ పురుషునికి ఏది ముఖము? బాహువులు ఏవి? తొడలు ఏవి? పాదములు ఏమని కల్పించబడ్డాయి?<br>- పరబ్రహ్మతత్త్వమును ప్రవచించు బ్రాహ్మణములు (స్తోత్రములు), స్తుతించు ప్రజ్ఞలు. ఆ విరాట్ పురుషుని ముఖము.<br>- క్రియా సామర్థ్యములగు రాజన్యము బాహువులుగా భావించబడినాయి.<br>- (కృషి-వాణిజ్య సూచికమగు) వైశ్యులు ఆయనకు తొడలు.<br>- పాదములు సేవా స్వభావులగు శూద్రులు. వీరంతా ఆయననుండే బయల్వెడలారు. |
| **చన్ద్రమా మనసో జాతః।**<br>**చక్షోః సూర్యో అజాయత।** | ఆయన మనస్సు నుండి చంద్రుడు, చక్షువుల నుండి సూర్యుడు (తేజస్సు) జనించారు. |

| | |
|---|---|
| **ముఖాత్ ఇన్ద్రశ్చ అగ్నిశ్చ।**<br>**ప్రాణాత్ వాయుః అజాయత॥**<br>**నాభ్యా ఆసీత్ అన్తరిక్షమ్।**<br>**శీర్ష్ణః ద్యౌః సమవర్తత॥** | ఆ విరాట్ పురుషుని ముఖము నుండి ఇంద్రుడు, అగ్ని, ప్రాణము నుండి వాయువులు జనించాయి.<br>నాభి నుండి - అంతరిక్షము,<br>శిరస్సు నుండి - ద్యులోకము (ఊర్ధ్వదేవతాలోకము), ఉద్భవమయ్యాయి. |
| **పద్భ్యాగ్ం భూమిః, దిశః శ్రోత్రాత్।**<br>**తథా లోకాగ్ం అకల్పయన్॥**<br>**వేద అహమ్, 'ఏతం పురుషం మహాన్తమ్'**<br>**ఆదిత్య వర్ణమ్, తమసస్తు పారే,**<br>**సర్వాణి రూపాణి విచిత్య ధీరః**<br>**నామాని కృత్వా, అభివదన్ యదాస్తే।** | పాదముల నుండి - భూమి,<br>చెవుల నుండి - దిక్కులు,<br>ఈవిధంగా లోకాలన్నీ సంకల్పించబడి సృష్టించబడ్డాయి.<br>ఈ సమస్త రూపములను స్వీయ బుద్ధితో చిత్ర విచిత్రములుగాను, అనేక నామరూపములుగాను భావనా కల్పన చేయుచున్న, వ్యాపింపజేయుచున్నట్టి ఆయనను దర్శిస్తూ ఉపాసిస్తున్నాము. అంధకారమునకు ఆవల ఆదిత్యవర్ణుడై వెలుగుచున్న ఆ విరాట్ పురుషుని మేము తెలుసుకొనుచున్నాము. ఆయన ఆజ్ఞానమునకు ఆవల సూర్య తేజోవిలాసుడై వెలుగొందుచున్నారు. |
| **ధాతా పురస్త ఆద్యమ్ ఉదాజహార,**<br>**శక్రః ప్రవిద్వాన్ ప్ర-దిశశ్చ తస్రః।**<br>**తమ్ ఏవం విద్వాన్**<br>**అమృత ఇహ భవతి।**<br>**న అన్యః పంథా**<br>**అయనాయ విద్యతే।** | ఏ విరాట్ పురుషుని-ధాత (ప్రజాపతి, బ్రహ్మ) ధారణ చేయుచున్నారో, అట్టి చమత్కృతిని మొట్టమొదటగా (విశాలమైన చెవులు గల) ఇంద్ర దేవుడు (ఇంద్రియముల అధిపతి) గ్రహించినవారై, నలుదిక్కులా వినిపిస్తూ వ్యాపింపజేయ సాగారు.<br>అట్టి విరాట్ స్వరూపమును తెలుసుకొని ఈ జీవుడు ఇక్కడే అమృతత్వమును సిద్ధించుకోవాలి. అట్టి పరమపురుషుని (స్వస్వరూపముగా) ఎరుగుటతప్పితే మోక్షమునకు, వేరు త్రోవ (దారి) లేదు. (లేక) **దృశ్య దాస్యరూపమగు సంసార బంధ విముక్తికి** వేరు త్రోవ (దారి) లేదు. |
| **యజ్ఞేన యజ్ఞమ్**<br>**అయజన్త దేవాః।**<br>**తానిధర్మాణి ప్రథమా న్యాసన్॥**<br>**తేహ నాకం మహిమానః సచన్తే,**<br>**యత్ర పూర్వే సాధ్యాః సన్తి దేవాః॥** | యజ్ఞకర్తలగు దేవతలు - మానసిక యజ్ఞముచే యజ్ఞ స్వరూపుడగు ఆ (స్వస్వరూప) పురుషుని సంకల్పంగా జగద్రూప ధర్మములను నిర్వర్తించసాగారు.<br>అట్టి మానసిక జగత్ సృష్టి యజ్ఞము నిర్వర్తించిన దేవతలు, సాధ్యులు దివ్యమగు మహిమలను పొందినవారై సృష్టిని నడిపించసాగారు. అట్టి మహిమను పురుషసూక్తార్థ గ్రహణముచే జీవుడు ఇక్కడే సృష్టి యజ్ఞపురుషోపాసనచే సిద్ధించుకొనగలడు. |
| **అద్భ్యః సంభూతః।**<br>**పృథివ్యై రసాచ్చ।**<br>**విశ్వకర్మణః సమవర్తత అధి।**<br>**తస్య త్వష్టా విదధత్ రూపమేతి,**<br>**తత్ పురుషస్య విశ్వమ్ ఆజానమ్ అగ్రే** | అట్టి పరమపురుషుడు (శ్రీమత్ నారాయణుడు) జలమునుండి రసస్వరూపులై సృష్టియందు సంభవించారు. పృథివియందు రసస్వరూపులై ప్రకాశించసాగారు.<br>విశ్వకర్మ చేత ఆధిక్యత పొందినవారయ్యారు. నారాయణాంశ అగు విరాట్ పురుషుడుగా జగదీశ్వరుడగు ఆయనయే అవధరించుచున్నారు.<br>ఆ పురుషుడే విశ్వ స్వరూపుడై మొట్టమొదట జనించారు. ఈ విశ్వము విశ్వేశ్వర రూపమే! విశ్వేశ్వరుని నుండియే ఆయనకు అభిన్నమైనట్టి విశ్వము జనిస్తోంది. |
| **వేద అహమ్ ఏతమ్ పురుషం మహాన్తమ్**<br>**ఆదిత్య వర్ణమ్, తమసః పరస్తాత్।**<br>**తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి।**<br>**న అన్యః పంథా విద్యతే అయనాయ।** | అట్టి పరమ పురుషుని మహత్ శక్తి సంపన్నునిగాను, సూర్య తేజో విలాసునిగాను, అజ్ఞానమునకు ఆవల ప్రత్యక్షమై ఉన్నవానిగాను నేను తెలుసుకొనుచున్నాను. అట్టి పురుషుని (The wroker of the universe appearing here as work of the universe) ఈ జీవుడు తన సంసార బంధవిముక్తికై తెలుసుకోవాలి. తత్ ఫలితంగా ఇక్కడే ఈ జీవుడు తనయొక్క ('త్రిపాదస్య అమృతం దివి' అనబడు) అమృతత్వమును అనుభూతపరచుకోవాలి. అంతకుమించి వేరే త్రోవలేదు. |

| | |
|---|---|
| ప్రజాపతిః చరతి గర్భే అంతః।<br>అజాయమానో, బహుధా విజాయతే।<br>తస్య ధీరాః పరిజానన్తి యోనిమ్।<br>మరీచీనాం పదమ్ ఇచ్ఛన్తి వేధసః।<br>యో దేవేభ్య ఆతపతి,<br>యో దేవానాం పురోహితః,<br>పూర్వోయో దేవోభ్యో జాతః।<br>నమో రుచాయ బ్రాహ్మయే।<br>రుచం బ్రాహ్మణ జనయన్తః।<br>దేవా అగ్రే తత్ అబ్రువన్। | ఈ జగత్తుయొక్క గర్భమున ప్రజాపతి (సృష్టికర్త) గా అయి ఆ చైతన్యమూర్తి ప్రకాశించుచున్నారు. ఆయన జన్మరహితుడు. కానీ ఈ దృశ్యములో కనిపించే పుట్టుకలన్నీ ఆయనవే! అనేక రీతులైన జన్మలు కలిగి ఉంటున్నారు. అదంతా కూడా ఒకని కలలో అనేకులు ప్రవర్తమానులగు విధంగా జరుగుతోంది.<br>అట్టి 'యోనిని ధీరులగు బుద్ధిశాలురు (జ్ఞానులు) స్పష్టముగా సందర్శించుచున్నారు. మరీచి మొదలైన ఉత్తమ పురుష సందర్శకుల స్థానము కోరుకొనుచున్నారు.<br>అట్టి ప్రజాపతి రూపుడగు పరమపురుషుడు<br>- **సృష్టిలోని అశరీర దివ్య అజ్ఞారూపులగు** దేవతలను ప్రకాశింపజేయుచు, సంప్రదర్శించుచున్నారు.<br>- ఆ పురుషుడు దేవతలకంటే మునుముందే ఉండి ఉన్నారు. దేవతలకు పురోహితులై (శ్రేయస్సు కలుగజేయువారై) ఉన్నారు.<br>**ఋగ్వేద బ్రాహ్మణములచే స్తుతించబడుచున్న అట్టి పరమపురుషునికి నమస్కారము.** దేవతలచే మొట్టమొదట 'సర్వహుత' యజ్ఞము ద్వారా ఉపాసించబడు యజ్ఞపురుషునికి ప్రణమిల్లుచున్నాము. |
| యస్తు ఏవం బ్రాహ్మణో విద్యాత్,<br>తస్య దేవా అసన్ (ఆసన్) వశే।<br>హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్నౌ।<br>అహో రాత్రే పార్శ్వే।<br>నక్షత్రాణి రూపమ్।<br>అశ్వినౌ వ్యాత్తమ్।<br>ఇష్టం మనిషాణ।<br>అముం మనిషాణ।<br>సర్వం మనిషాణ। | ఏ బ్రహ్మజ్ఞానిఅయితే బ్రాహ్మణమును (మానసిక యాగమును) తెలుసుకొని ఉంటారో అట్టి వానికి దేవతలు కూడా వశులై ఉంటున్నారు.<br>హ్రీం శక్తి, లక్ష్మి (ఐశ్వర్యము)లను పత్నులుగా కలిగి ప్రదర్శించుచున్న పురుష తత్త్వమా!<br>రాత్రింబవళ్ళు మీకు పార్శ్వములుగా ఉన్నాయి. నక్షత్రములు మీ రూపము. అశ్వినీ దేవతలు మీకు ముఖాలంకారము!<br>ఓ పరాత్పరుడగు పరమ పురుషా!<br>మేము కోరుకొనుచున్న పురుషసూక్త జ్ఞానమును మాకు ప్రసాదించండి. సంపదలు ప్రసాదించండి!<br>ఇహ-పర సౌఖ్యములు ప్రసాదించండి! పరమపురుషత్వము మాకు సిద్ధించుటకై వెంటనంటి ఉండండి. |
| ఓం తత్ శం యో ఆవృణీ మహే।<br>(తచ్ఛంయోరావృణీమహే)<br>గాతుం యజ్ఞాయ।<br>గాతుం యజ్ఞపతయే।<br>దైవీ స్వస్తిః అస్తు నః।<br>స్వస్తిః మానుషేభ్యః।<br>ఊర్ధ్వమ్ జిగాతు భేషజమ్।<br>శంనో అస్తు ద్విపదే।<br>శం చతుష్పదే।<br>ఓం శాంతిః। శాంతిః। శాంతిః।<br>ఇతి పురుష సూక్తమ్।। | ఏతత్ స్వరూప పరమాత్మయొక్క స్వకీయ మహిమయే ఈ విశ్వమంతా అయి ఉన్నదో, అట్టి ఈ సృష్టి యజ్ఞమును, సృష్టియజ్ఞపతిని స్తుతించుచున్నాము.<br>(We pray the work appearing as this universe and the worker of the universe)<br>దివ్య తేజో సంపన్నులు, జగత్ రచనా ప్రజ్ఞారూపులు అగు దేవతలు మాకు శుభము-శాంతి-ఐశ్వర్య-ఆనందముల రూపమగు 'స్వస్తి'ని ప్రసాదించెదరు గాక!<br>**స్వస్తి** = స్వస్వరూపమునందు స్థితి<br>ఆ పరమ పురుషుని అమృత రూపమే ఊర్ధ్వమున ప్రదర్శించబడుచూ ఈ విశ్వమునకు ఆధారమైయున్నది.<br>ద్విపాదులగు సర్వ మానవులకు, చతుష్పాదులగు సర్వ జంతువులకు మీరు సుఖ ప్రదాతలయ్యెదరు గాక!<br>మా ఆధి భౌతిక - ఆధి దైవిక - ఆధ్యాత్మిక తాపములు (స్వస్వరూపమగు ఆత్మతత్త్వ జ్ఞానమునందు) శమించును గాక!<br>**ఓం శాంతిః। శాంతిః। శాంతిః।।**<br>**ఇతి పురుషసూక్తమ్** |


ఋగ్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 10 సౌభాగ్య లక్ష్మ్యుపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక - తాత్పర్య పుష్పము



### స్తోత్రమ్

శ్లో॥ సౌభాగ్య కైవల్య లక్ష్మీ విద్యా వేద్య సుఖాకృతీ ।
త్రిపాద్ నారాయణానంద రామచంద్రపదం భజే ॥

*"శ్రీ సౌభాగ్య కైవల్యలక్ష్మీ విద్య"చే తెలియబడుచున్న పరమ సుఖాకృతి అయినట్టి **త్రిపాద - నారాయణానంద రామచంద్రపదము**ను భజించుచున్నాము. ఓం శ్రీ ఆనంద - కర్దమ - చిక్లీత ఇందిరాసుత త్రైయార్షేయ నమః! ఓం శ్రీ మాతా మహాలక్ష్మీభ్యాం నమః*

| | | |
|---|---|---|
| । | ఓం | **ఓంకార స్వరూపుడగు పరమాత్మకు నమస్కరిస్తూ :** |
| 1. | అథ భగవంతమ్ దేవా ఊచుః<br>హే భగవన్ । స కథయ,<br>"సౌభాగ్యలక్ష్మీ విద్యామ్" తథే అవోచత్ । | ఒకానొక సందర్భములో దేవతలు భగవంతుడగు శ్రీమన్నారాయణుని దర్శించి, స్తుతించారు.<br>**దేవతలు :** హే భగవాన్ ! శ్రీమన్నారాయణా! లక్ష్మీనారాయణా! ఆదినారాయణా ! మాపై కరుణను వర్షించు మహానుభావా ! జగత్ అంతర్యామీ! మీకు ఒక విన్నపము చేసుకుంటున్నామయ్యా! మాపై దయతో **"శ్రీ సౌభాగ్యలక్ష్మీ విద్య"**ను మాకు దయయుంచి బోధించ ప్రార్థన. |
| 2. | భగవాన్ ఆదినారాయణః (ఊచుః)<br>సర్వే దేవా! యూయం<br>సావధాన మనసో భుత్వా శృణుత !<br>తురీయ రూపామ్!<br>తురీయాతీతామ్!<br>సర్వ-ఉత్కటామ్!<br>సర్వమంత్రాసన గతామ్।<br>పీఠ - ఉపపీఠ దేవతా పరివృతామ్।<br>చతుర్భుజామ్! శ్రియమ్।<br>"హిరణ్య వర్ణామ్".... | **శ్రీమన్ ఆదినారాయణుడు :**<br>ఓ సర్వ దేవతలారా ! **"సౌభాగ్య లక్ష్మీ విద్య"** చెప్పటానికి సంతోషముగా సిద్ధ పడుచున్నాను. మీరంతా కూడా సావధాన చిత్తులై వినండి.<br>- జాగ్రత్ - స్వప్న - సుషుప్తులకు అతీత - సాక్షి యగు తురీయ రూపిణి.<br>- తురీయమునకు కూడా కేవల 'సాక్షి' యగు తురీయాతీత. సృష్టినంతా చిత్ చైతన్యముచే అణువణువు ఉత్తేజ పరచు 'సర్వోత్కట' (లేక) సర్వశ్రేష్ఠ! సర్వమంత్రములు తనయొక్క ఆసనముగా కలిగి ఆసీనురాలై ఉన్నట్టి భగవతియే ఆలక్ష్మి.<br>- పీఠ-ఉపపీఠ దేవతాస్త్రీలచే పరివృతమైన దేవి!<br>- నాలుగు భుజములు కలిగి, సర్వ జీవులకు ఆహారము - పానీయము. రక్షణ - ప్రసాదించు అపార కరుణామూర్తి! శ్రియమ్ దేవి! శ్రీదేవి!<br>అట్టి **జగజ్జనని, జగత్ పరిపోషిణి** యగు సౌభాగ్యలక్ష్మీదేవిని |

**ఇతి పంచదశ (15) ఋక్భిః ధ్యాయథ ।**

**అథ పంచదశ 'ఋక్' ఆత్మకస్య శ్రీ సూక్తస్య**

**"ఆనంద", "కర్దమ", "చిక్లీత" -**

**ఇందిరా సుతా ఋషయః ।**

**శ్రీః ఇతి ఆద్యా ఋచః।**

**చతుర్దశానామ్ ఋచామ్ ఆనందాది ఋషయః।**

**'హిరణ్యవర్ణామ్' ఇత్యాది**

**ఋక్ త్రయస్య అనుష్టుప్ ఛందః।**

**'కాంసోస్మి' ఇతి అస్య బృహతీ ఛందః।**

**తదన్యయో ఊర్ధ్వయోః త్రిష్టుప్ఛందః।**

**అనుష్టుప్ పునః అష్టకస్య।**

**శేషస్య ప్రస్తార పఙ్క్తిః।**

**'శ్రీ' అగ్నిః దేవతా ।**

**'హిరణ్యవర్ణామ్' ఇతి బీజమ్ ।**

**'కాంసోస్మి' ఇతి శక్తిః ।**

**హిరణ్మయా చంద్రా రజతస్రజా,**

**హిరణ్య స్రజా**

**హిరణ్యా హిరణ్య వర్ణేతి**

**'ప్రణవ' ఆది - 'నమో' అంతైః**

**చతుర్థ్యంతైః అంగన్యాసః ।**

**అథ వక్త్రత్రయైః అంగన్యాసః।**

**మస్త - లోచన - శ్రుతి - ఘ్రాణ -**

**వదన - కంఠ - బాహుద్వయ -**

**హృదయ - నాభి - గుహ్య -**

**పాయు - ఊరు - జాను -**

**జంఘేషు**

**శ్రీ సూక్తైః ఏవ క్రమశో న్యసేత్ ॥**

"హిరణ్యవర్ణా..." మొదలుగా గల 15 ఋక్కులతో ముందుగా మీరంతా ధ్యానము చేసెదరుగాక ! (అనుబంధంగా మొదట ఇవ్వబడినది)

అట్టి "పంచదశ (15)" ఋక్ - ఆత్మకమగు 'శ్రీసూక్తము'నకు...

ఋషులు : 1. ఆనంద 2. కర్దమ, 3. చిక్లీత - త్రి ఋషులు-వీరు ఇందిరాసుతులు.

శ్రీ యం - శ్రీర్మాదేవి మొదలైనవన్నీ ఋక్కులు పదునాలుగు ఋక్కులకు ఆనందుడు మొ॥ వారు ఋషులు!

**<u>అనుష్టుప్ ఛందస్సు - హిరణ్యవర్ణాం - ఇతి - ఋతి త్రయస్య (3)</u>**

శ్లో॥ **హిరణ్యవర్ణాం హరిణీం! సువర్ణ రజత స్రజాం ।**
**చన్ద్రాం మహిరణ్మయీం లక్ష్మీమ్, జాదవేదో ! మమ ఆవహ।**

శ్లో॥ **తాం మ ఆవహ జాతవేదో ! లక్ష్మీమ్ అనపగామినీమ్!**
**యస్యాం హిరణ్యం విన్దేయం గామ్, అశ్వమ్ పురుషాన్ అహమ్ !**

శ్లో॥ **అశ్వ - పూర్వాం, రథమద్యామ్, హస్తినాద ప్రబోధినీమ్,**
**శ్రియందేవీమ్ ఉపహ్వయే శ్రీర్మాదేవీ జుషతామ్ ॥**

**బృహతీ ఛందస్సుః - కాసోఽస్మితాన్ ఇతి (4)**

శ్లో॥ **కాసోఽస్మితాం హిరణ్యం ప్రాకారమ్, ఆర్ద్రాం**
**జ్వలన్తీం తృప్తాం తర్పయంతీమ్।**
**పద్మే స్థితాం పద్మ వర్ణాం తామ్ ఇహ ఉపహ్వయే శ్రియమ్ ॥**

ఆ తరువాత రెండు స్తోత్ర శ్లోకాలు - త్రిష్టుప్ ఛందస్సు (5 నుండి 6)

ఆ తరువాత '8' శ్లోకాలు మరల అనుష్టుప్ ఛందస్సు (7 నుండి 14)

మిగిలిన శ్లోకము ప్రస్తారపంక్తి ఛందస్సు (15)

**సంకల్పము :**

శ్రీ అగ్నిం ... దేవతా! (తేజోరూపి)

**హిరణ్యవర్ణామ్ - ఇతి బీజమ్!** (బంగారుఛాయ)

**కాం సోస్మితామ్** ... ఇతి శక్తిః (బ్రహ్మమే స్వరూపముగా కలిగి, సర్వదా చిరునవ్వుతో ఉండునది)

అథ 'ప్రణవ' ఆది-'నమో' అంత ('ఓం'తో ప్రారంభమై 'నమః'తో అంతమగు చతుర్థ్యాంతములతో కూడిన అంగన్యాసము 1. ఓం 2. నామము 3. నమః 4. ఓం

ఓం ( హ్రీం శ్రీం క్లీం) హిరణ్మయాయ అంగుష్ఠాభ్యాం నమః ఓం।
ఓం (హ్రీం శ్రీం క్లీం) చంద్రాయ తర్జనీభ్యాం నమః ఓం।
ఓం (హ్రీం శ్రీం క్లీం) రజతస్రజాయ మధ్యమాభ్యాం నమః ఓం।
ఓం (హ్రీం శ్రీం క్లీం) హిరణ్యస్రజాయ ఆనామికాభ్యాం నమః ఓం।
ఓం (హ్రీం శ్రీం క్లీం) హిరణ్యాయ కనిష్ఠికాభ్యాం నమః ఓం।
ఓం (హ్రీం శ్రీం క్లీం) హిరణ్యవర్ణాయ కరతల కరపృష్ఠాభ్యాం నమః ఓం।
అటు తరువాత....., చతుర్థంత్యములుచే (హిరణ్మయాచంద్ర రజతస్రజా హిరణ్యస్రజా హిరణ్యా హిరణ్యాం వర్ణాయ - మస్తకాభ్యాం నమః)
మూడు ముఖములతో అంగన్యాసము! (ఆదిశక్తి - పరాశక్తి - అంతశ్శక్తి ఓం)

ఆ తరువాత...., శ్రీసూక్త మంత్రములతో క్రమంగా అమ్మవారి సర్వాంగన్యాసము... మస్తకము (నుదురు), లోచనం (కళ్ళు), శ్రుతి (చెవులు), ఘ్రాణ (ముక్కు), వదన (ముఖము), కంఠ (కంఠము) బాహుద్వయము (రెండుచేతులు), హృదయము నాభి (బొడ్డు), గుహ్య (గుహము, శిశ్నము), పాయువు (విసర్జక రంధ్రము), ఊరు (తొడలు), జాను (మోకాళ్ళు), జంఘ (కాలిపిక్క) ములను న్యాసము (భావనాస్పర్శతో భక్తి సమర్పణ) చేయవలెను.

3. అరుణ, కమల సంస్థా,
తత్ రజః పుంజవర్ణా,
కరకమల ధృతేష్టా,
అభీతి యుగ్మాంబుజాచ
మణిమకుట విచిత్రాలంకృత ఆకల్పజాలైః
సకల భువనమాతా
సంతతం శ్రీ శ్రియై నః ॥
తత్ పీఠకర్ణికాయాం
స సాధ్యం 'శ్రీ' బీజమ్
వసుః ఆదిత్య కలా పద్మేషు
శ్రీసూక్తగత అర్ధార్ధ అర్చా,
తత్ బహిర్యః
'యశ్శుచిః' ఇతి మాతృకయా చ శ్రియమ్,
యంత్రాంగ దశకం చ విలిఖ్య
'శ్రియమ్' అవాహయేత్ ।
అంగైః ప్రథమా ప్రతిః ।
పద్మాదిభిః ద్వితీయా ।
లోకేశైః తృతీయా ।
తత్ ఆయుధైః తురీయా (చతురీయా) ప్రతిః భవతి ॥
శ్రీ సూక్తైః ఆవాహనాది షోడశ సహస్ర జపః ।
సౌభాగ్య రమా-ఏకాక్షర్యా (ఏకః + అక్షరః)
భృగుః నృచత్ గాయత్రీ ।
శ్రియో ఋష్యాదయః ।
'శం' ఇతి బీజశక్తిః ।
'శ్రాం' ఇత్యాది (శ్రాం - శ్రీం
- శ్రూం - శ్రైం - శ్రౌం - శ్రః)
షడంగమ్ ।

స్వచ్ఛమగు తేజస్సుతో విరాజిల్లు ఎర్రటి కమలమున సంస్థితమైనట్టిది, తెల్లటి వెండి వర్ణమున ప్రకాశించి తెల్ల కలువలను చేత ధరించినట్టిది,

ఇష్టము - అభయము అను యుగ్మపద్మములను ధరించినట్టిది...,

- విచిత్రమైన మణులతో ప్రకాశించు కిరీటము ధరించినట్టిది...,

- ఆకల్ప జాలములచే - (అనేక పుష్పములచే) అలంకృత అయినట్టిది...,

సకల భువనములకు అమ్మ అగు సర్వ జగన్మాత శ్రీ లక్ష్మీదేవి మాపట్ల సదా సంపత్ ప్రదాత్రి అయి ఉండునుగాక !

అమ్మవారి ప్రతిమను పీఠముపై పూజించుటకై ప్రతిష్ఠాపించాలి!

తత్ (ఆ) పీఠముయొక్క కర్ణికలంద (నాలుగు మూలలా) సత్ - సాధ్య స్వరూపగు 'శ్రీ' అను బీజమును సంకల్పించాలి (రచించాలి). శ్రీచక్రమును ప్రతిక్షేపించాలి. అట్టి శ్రీ చక్రమునకు రెండు కలాపద్మములు వసువు-ఆదిత్య దేవతలను ఆహ్వానించి సాంగ-సపరివారంగా ఉపవిష్ఠులను చేయాలి.

వాటికి వెలుపల శ్రీసూక్తమంత్రగతములైనట్లు అర్ధార్ధ అర్చలు అలంకరించాలి. 'యాశ్శుచిః' అను మాతృకతో 'శ్రీ' అక్షరముతోను, యంత్రాంగదశకము (10 విభాగములతో కూడిన శ్రీచక్రమును) రచించి 'శ్రియమ్' రూపిఅగు ఆ జగన్మాతను ఆ దశక యంత్రములోనికి 'శ్రీ' అని పలుకుచూ ఆహ్వానించాలి. ఆ దేవీప్రతిమను పూజించాలి. మొట్టమొదటి ప్రతి (Corner)-లక్ష్మీదేవి యొక్క అంగ-ఉపాంగములు.

రెండవప్రతి (Corner) పద్మము - మొ॥ లైనవి.

మూడవ ప్రతి (Corner) - త్రిమూర్తులు, లోకపాలకులు!

నాలుగవ ప్రతి (Corner) - లక్ష్మీదేవి వైభవము, దిక్పాలకులు.

శ్రీ సూక్త జపశ్లోకములతో ఆధ్యాయామి-ఆవాహయామి-నవరత్న ఖచిత సింహాసనం సమర్పయామి .... ఇత్యాది షోడశోపచరాములుతో పూజించి జపమునకు ఉపక్రమించాలి - సహస్ర జపము చేయాలి.

ఓం "సౌభాగ్యరమా" ఏకాక్షరము (ఏకము - అక్షరము అగు స్వరూపము)ను ఉపాసించుచున్నాము.

భృగువు - ఋషి !

నృచత్ గాయత్రి - చంధస్సు।

'శ్రీ' యో ఋషి సమూహము!

శం - బీజశక్తి

శ్రాం - శ్రీం - శ్రూం - శ్రైం -
శ్రౌం - శ్రః - ఇతి షడంగన్యాసము. (అంగుష్ఠాభ్యాం - తర్జనీభ్యాం - మధ్యమాభ్యాం- అనామికాభ్యాం - కనిష్ఠకాభ్యాం - కరతలకర పృష్ఠాభ్యాం!)

---

4. భూయాత్ భూయో ద్విపద్మా
అభయ వరదకరా
తప్త కార్త స్వరాభా,
శుభ్రాభ్రాభేభ యుగ్మ ద్వయ కరధృత
కుంభాత్భి రాసిచ్య మానా, రత్నౌఘా బద్ధమౌళిః
విమలతర దుకూలార్తవా లేపనాఢ్యా
పద్మాక్షీ, పద్మనాభో ఉరసి కృత వసతిః

**స్తుతి :**

- (వసువు - ఆదిత్యుడు అను) ద్వి (2) పద్మములు ధరించినట్టిది,
- వాత్సల్యముతో, భక్తులపై చిరు నవ్వు కురిపించునది, వరములు ఇచ్చుచూ,అభయము ప్రసాదించు - వరదాభయ చేతులు చూపునది,
- మేలిమి ప్రకాశమానమగు బంగారు ఛాయతో వెలుగుచున్నట్టిది,
- రెండు తెల్ల ఏనుగులు తొండముతో స్వర్ణ కుంభము ధరించి సమర్పించుచున్న అభిషేకము స్వీకరించు దేవి..., రత్నములచే పొదగబడిన కిరీట - వస్త్రములు ధరించి ఉన్నట్టిది,

ఋతు-అనుకూలమగు సుగంధ లేపనములచే అలంకరించబడినది, పద్మము వంటి కనులు గలది, పద్మనాభుని (విష్ణువు) హృదయ కమలములో నివాసము

పద్మగా శ్రీ శ్రియై నః ॥
తత్పీఠమ్, అష్టపత్రమ్, వృత్తత్రయమ్,
ద్వాదశ రాశిఖండమ్, చతురశ్రం, రమాపీఠమ్ భవతి।
కర్ణికాయాం ససాధ్యం శ్రీ బీజమ్।
విభూతిః ఉన్నతిః కాంతిః
సృష్టిః కీర్తిః స్థితిః నతిః పుష్టిః
ఉత్కృష్టిః 'బుద్ధిః' ఇతి ప్రణవాది నమోంతైః
చతుర్థ్యంతైః నవశక్తిమ్ యజేత్ ।

కలిగి ఉన్నట్టిది **అగు శ్రీలక్ష్మీదేవి మాకు సంపద ప్రసాది అగును గాక ! - అని మరల మరల భావిస్తూ... ప్రతిమపై బుద్ధిని నిలపాలి.**

ఆ లోక కళ్యాణి, జగన్మాతృమూర్తి యగు శ్రీ సౌభాగ్యలక్ష్మి యొక్క పీఠము 'అష్టదళము' (8) దళములచే నిర్మితమైనది. నాలుగు (4) వృత్తములతో, ద్వాదశ (12) రాశిఖండములలోను, చతురస్రము" అయిఉన్నది.

శ్రీ బీజ శ్రీపీఠ కర్ణికలు - విభూతి, ఉన్నతి, కాంతి, సృష్టి, పుష్టి, కీర్తి, స్థితి, నతి, ఉత్కృష్టి, స్వరూపములు. ('ఓం'తో మొదలు-నమో! నమః చివరగా)

బుద్ధిని దేవిగాను, ఓంకార సంజ్ఞార్థములోని '4' అంశలగు 'అ'కార 'ఉ'కార, 'మ'కార అర్థమాత్ర రూపిణిగాను, నవశక్తి స్వరూపిణిగాను యజించాలి.

---

4. అంగైః ప్రథమావృతిః। వాసుదేవాది ద్వితీయా।
బాలక్యాది తృతీయా। ఇంద్రాదిభిః చతుర్థీ భవతి॥
ద్వాదశ లక్ష జపః।
శ్రీర్లక్ష్మీః। వరదా। విష్ణుపత్నీ।
వసుప్రదా। హిరణ్యరూపా। స్వర్ణమాలినీ।
రజతస్రజా। స్వర్ణ ప్రభా। స్వర్ణప్రాకార పద్మవాసినీ।
పద్మహస్తా। పద్మప్రియా।
ముక్తాలంకారా। చంద్రా। సూర్యా।
బిల్వప్రియా। ఈశ్వరీ। భుక్తిః ముక్తిః విభూతిః।
వృద్ధిః।సమృద్ధిః। కృష్టిః। పుష్టిః। ధనదా। ధనేశ్వరీ।
శ్రద్ధా। భోగినీ। భోగదా। సావిత్రీ। ధాత్రీ। విధాత్రీ।
ఇత్యాది 'ప్రణవ' ఆది, 'నమో'-అంతాః
చతుర్థ్యంతా మంత్రాః ఏకాక్షరపదంగ ఆదిపీఠమ్,
లక్ష జపః దశాంశమ్ తర్పణమ్ ।
శతాంశమ్ హవనమ్ । సహస్రాంశం ద్విజతృప్తి ః ।
నిష్కామానామేవ శ్రీ విద్యాసిద్ధిః ।
న కదాపి సకామానామ్ । ఇతి ॥

ప్రథమ ప్రతి ... అంగములు (I Angle)

ద్వితీయ ప్రతి... వాసుదేవుడు మొ॥ వారు (II Angle)

తృతీయ ప్రతి... బాలికమహర్షి మొ॥ వారు (III Angle)

నాలుగవ ప్రతి... ఇంద్రుడు మొ॥ వారు అయి ఉంటున్నారు. (IV Angle)

- ద్వాదశ (12) లక్షల జపము । శ్రీ లక్ష్మీ! వరదా! విష్ణుపత్నీ! వసు (భూ) ప్రదా! హిరణ్య (బంగారు) రూపా! స్వర్ణమాలినీ! రజిత (వెండి) స్రజ! స్వర్ణ ప్రభ! స్వర్ణ ప్రాకార పద్మవాసిని! పద్మహస్తా! పద్మ ప్రియ! ముక్తాలంకారా! చంద్ర! సూర్యా! బిల్వ (దళ) ప్రియ! ఈశ్వరీ భుక్తి! ముక్తి! విభూతి! వృద్ధి! సమృద్ధి ! కృష్టి - పుష్టి - ధన దా! ధనేశ్వరీ! శ్రద్ధా! భోగినీ ! భోగదా ! సావిత్రీ! ధాత్రీ ! విధాత్రీ !

అని 'ఓం' ప్రణవముతో మొదలై, "నమః ఓం" తో అంతమగుచు చతుర్థ్యతీ మంత్రమును గానం చేయాలి!

ఆ లక్ష్మీదేవి ఆదిపీఠము = ఏకము - అక్షరము అగుపదము.

**లక్ష** - జపము ; **దశాంశము** తర్పణము!

**శతాంశము**... హోమము!

**సహస్రాంశము**... ద్విజులకు భోజనసేవ! ఇట్టి వ్రతము ఎవ్వరైతే నిష్కాములై సేవిస్తారో, వారికి 'శ్రీవిద్య' సర్వప్రదయై సిద్ధించగలదు. ఎందుకంటే ఆ శ్రీవిద్య జాగ్రత్ - స్వప్న - సుషుప్త - తురీయములను దాటివేసినట్టి **తురీయతీత స్వరూపిణి** కదా!

---

5. <u>అథ హి ఏనం దేవా ఊచుః</u>
తురీయయా మాయయా
నిర్దిష్టం తత్ త్వం బ్రూహి । ఇతి ॥
<u>తథ ఇతి సహోవాచ, :</u>
- యోగేన యోగో జ్ఞాతవ్యో।
- యోగో యోగాత్ ప్రవర్థతే ।
యో అప్రమత్తస్తు యోగేన స యోగీ రమతే చిరమ్ ।
సమాపయ్య నిద్రాం, సుజీర్ణే అల్పభోజీ

**దేవతలు** : హే భగవాన్ ! జగత్‌గురూ ! శ్రీమన్నారాయణ స్వామీ ! **జాగ్రత్ - స్వప్న సుషుప్తములకు ఆవలగా చెప్పబడు తురీయరూపము యొక్క నిర్దుష్టమైన రూపము ఏదై ఉన్నదో, అద్దాని గురించి మాకు బోధించ వేడుకొనుచున్నాము.**

**శ్రీమన్ ఆదినారాయణ స్వామి** : ఓ దేవతలారా ! యోగము చేతనే యోగము ఏమిటో తెలియవస్తుంది. యోగము చేతనే యోగము ప్రవృద్ధమగుచున్నది. ఏ యోగి అయితే 'యోగము' నందు సదా అప్రమత్తుడై ఉంటాడో, ఆ యోగి చిరకాలము యోగధారణచే <u>కైవల్య</u> **లక్ష్మీ స్వరూపిణీ** తురీయ పదమును పొందగలడు.

ముందుగా... యోగమును ఆశ్రయించు యోగి యోగాభ్యాసము చేయునప్పుడు కావల్సిన జాగ్రత్త గురించి వినండి.

శ్రమత్యాజ్య బాధే వివిక్తే ప్రదేశే,
సదా ఆసీత నిస్తృష్ణ ।
ఏష ప్రయత్నో అథవా,
ప్రాణ రోధో నిజాభ్యాస మార్గాత్,
వక్త్రేణ ఆపూర్య వాయుం,
హుతవహ అనిల యే
'అపానమ్' ఆకృష్య ధృత్వా
స్వ-అంగుష్ఠాది అంగులీభిర్వః
వర కరతలయోః షట్ (6) భిః ఏవం నిరుధ్య,
శ్రోత్రే నేత్రేచ నాసాపుట యుగళమ్ అథో
అనేన మార్గేణ సమ్యక్ పశ్యంతి ప్రత్యయాంసమ్
ప్రణవ బహువిధ ధ్యాన సంలీన చిత్తాః ॥
శ్రవణ ముఖ నయన నాసా
నిరోధనేన ఏవ కర్తవ్యమ్ ।
శుద్ధ సుషుమ్నా సరణౌ స్ఫుటమ్
అమలమ్ శ్రూయతే నాదః ।
<u>విచిత్రఘోష సంయుక్తా</u>
అనాహతే శ్రూయతే ధ్వనిః ।
దివ్యదేహశ్చ తేజస్వీ దివ్యగంధోఽపి, అరోగవాన్।
సంపూర్ణ హృదయః-శూన్యే తు
ఆరంభే యోగవాన్ భవేత్ ।
ద్వితీయామ్ విఘటీ కృత్య
వాయుః భవతి మధ్యగః।
ధృఢాసనో భవేత్ యోగీ
పద్మాది ఆసనసంస్థితః।
'విష్ణుగ్రంథేః' తతో భేదాత్
పరమానంద సంభవః।
అతిశూన్యో విమర్దశ్చ
'భేరిశబ్దః' తతో భవేత్ ।
తృతీయామ్ యత్నతో భిత్వా
నినాదో మర్దళధ్వనిః
'మహాశూన్యమ్' తతోయాతి
సర్వసిద్ధి సమాశ్రయమ్ ॥

**యోగాభ్యాస విధులు**

- నిద్రను, జడత్వమును జయించాలి!
- జాగ్రత్‌లో బద్ధకము, అశ్రద్ధలను దరిచేరనీయరాదు.
- అల్పమైన (మితమైన) ఆహారముతో చక్కగా జీర్ణము కలిగి ఉండాలి.
- "నేను శ్రమ పడుచున్నాను. బాధపడి యోగాభ్యాసము చేస్తున్నాను" - అనునది వదిలి యోగము ఆనందపూర్వకంగా నిర్వర్తించాలి.
- తృష్ణలన్నీ రహితం చేసుకొని **ఏకాంత ప్రదేశములో ఆశీనుడై యోగమును అభ్యసించాలి.**
- నోటితో (ముక్కుతో) వాయువును పూరించి, అగ్ని నిలయ స్థానమగు జఠరాగ్ని జనిత ప్రదేశము (పొట్ట) లోనికి ఆపానమును ఆకర్షించి, ధరించాలి.
- బొటనవేలు - ఉంగరపు వేలు కలుపుచూ అరచేతి భాగమును నిరోధించి, మిగిలిన '6' వేళ్ళను నిట్టనిలువుగా కదలకుండా ఉంచాలి.

చెవులను, కళ్ళను, ముక్కుపుటములను, మనస్సుతో వాయుబంధన మార్గముగా బిగదీసి, ప్రాణశక్తితో నింపియుంచి, ప్రణవ నాదమును భావించి, ఆ భావనతో బహువిధములైన ధ్యాసలు గల చిత్తమును లయంచేసి కదలికలు లేనిదిగా చేయాలి. ప్రత్యగాత్మ దర్శనము కొరకై చెవులు - ముఖము - కళ్ళు - ముక్కు నందు **ప్రాణ ప్రసరణ నిరోధముచే చిత్తమును నిశ్చలము చేయుటము** ఇక్కడ ముఖ్యకర్తవ్యము. అట్టి ప్రాణ వాయు నిరోధనాభ్యాసముచే సుషుమ్నా నాడి మార్గము ప్రస్ఫుటమగుచున్నది. నిరోధములు తొలగి - దోషరహిత మగుచున్నది. అట్టి శుద్ధ సుషుమ్నా నాడినుండి స్ఫుటము - అమలము అగు అంతర - నాదము, వినపడగలదు.

దేహములో షట్ చక్రములలో వెన్నెముకయందుండు, **అనాహతము** నుండి ధ్వని వినబడగలదు. అట్టి అనాహతధ్వనిని వినుచున్న అభ్యాసముగలవాడు **దివ్య దేహి, మహా తేజోవంతుడు, దివ్య గంధము గలవాడు, రోగములేని** వాడు అగుచున్నాడు.

అట్టివాడు శూన్యమునందు కూడా సంపూర్ణ హృదయుడు, జగత్-ఆరంభమునుండియే యోగవంతుడు కాగలడు.

రెండవ విఘటికి వాయువు మధ్యమము అగుచున్నది.

పద్మాసనమును స్వీకరించినప్పుడు సంస్థితుడైనప్పుడు ఆయోగి ధృఢమైన ఆసనుడు అగుచున్నాడు. అట్టి స్థిరాసన ధారణ - ప్రాణధారణలచే విష్ణుగ్రంధి భేదము జరిగి పరమానందము జనించుచున్నది.

యోగసాధన యొక్క క్రమ - ఉత్కృష్ట ద్వితీయ స్థితియందు అతి శూన్యము నుండి గొప్ప మర్దనానుభవం (As if Pressed) గల భేరీ శబ్దము, వినబడుచున్నది. ఇక తృతీయ స్థితిలో మద్దెలనినాదము వినబడగలదు.

ఆ తరువాత ఆతడు ఆ శబ్దములన్నీ త్యజించి సర్వసిద్ధిప్రదమైనటువంటి **మహాశూన్య స్థానమును** పొందుచున్నాడు. నిర్విషయ పరాకాష్ఠ తత్త్వమును సమాశ్రయించి... అట్టి మహాశూన్యము సిద్ధించుకొనుచున్నాడు. అట్టి శూన్యమునుండి జగత్తుల ఆగమన-నిష్క్రమణములను సాక్షి అయి దర్శిస్తున్నాడు.

6. చిత్తానందం తతో భిత్వా సర్వపీఠగత – అనిలః
నిష్పత్తౌ 'వైష్ణవః' శబ్దః క్వణతీతి క్వణోభవేత్ ।
ఏకీభూతం తదా చిత్తం
సనకాదిముని ఈడితమ్ ॥
అంతే 'అనన్తమ్' సమారోప్య
ఖండే ఖండం సమర్పయన్।
భూమానం ప్రకృతిం ధ్యాత్వా కృతకృత్యో అమృతోభవేత్ ।
యోగేన 'యోగం' – సంరోధ్య
భావం భావేన చ అంజసా,
నిర్వికల్పం పరం తత్వం
సదా భూత్వా పరం భవేత్।
'అహంభావం' – పరిత్యజ్య
జగద్భావమ్ అనీదృశమ్,
నిర్వికల్పస్థితో విద్వాన్
భూయో న అపి అనుశోచతి।
సలిలే సైంధవం యద్వత్ సామ్యం భవతి యోగతః,
తథా "ఆత్మ మనసోః ఐక్యమ్"
సమాధిః – అభిధీయతే ॥
యదా సంక్షీయతే ప్రాణో
మానసం చ ప్రలీయతే,
తదా సమరసత్వం యత్ –
సమాధిః – అభిధీయతే ।
యత్ సమత్వం త్రయోః అత్ర
జీవాత్మ పరమాత్మనోః
సమస్త నష్ట సంకల్పః –
సమాధిః అభిధీయతే ।
ప్రభాశూన్యం మనశ్శూన్యం
బుద్ధిశూన్యం నిరామయమ్,
సర్వశూన్యం నిరాభాసం
సమాధిః అభిధీయతే ॥
స్వయమ్ ఉత్ –చలతే దేహే
దేహీ–నిత్యమ్ సమాధినా,
నిశ్చలం తం విజానీయాత్

ఇక ఆ యోగి సర్వపీఠముల వాయువులను ఉపాసించు క్రమంగా దాటి వేసినవాడై, "చిత్తానందము"ను దాటివేయుచూ **"చిదానందము"** నందు ప్రకాశించుచున్నాడు. అంతటా ఉనికి రూపము, ఏకోభూతము, సనక - సనందనాదులచే సర్వదా ఉపాసించబడుచున్నది అగు చిత్‌చిత్త స్వరూపుడు అగుచున్నాడు.

చివరికి "అనంతమగు ఆత్మలక్ష్మీ వైభవము"ను సంకల్పించుచూ, తదితరమైనదంతా ఖండ - ఖండములుగా చేసి ఆత్మ భావనయందు సమర్పించి వేయుచున్నాడు. ప్రకృతిని భూమానందస్వరూపమగు స్వస్వరూప పరతత్త్వముగా ధ్యానిస్తూ కృతకృత్యుడై స్వయముగా అమృతానంద స్వరూపుడగుచున్నాడు.

యోగముచే సంయోగ రూపమగు యోగమును నిరోధిస్తూ, భావముచే భావములను మ్రింగివేయుచూ **నిర్వికల్పమగు పరతత్వము**ను ఆశ్రయించి, తత్ అనంత సర్వ - నిర్గుణ, పరరూపము తానే అగుచున్నాడు.

**"నేను ఈ దేహమును, ఒక జీవుడను"**... అను రూపమగు భావనలను మొదలంట్లా త్యజిస్తూ, వాటిని స్వల్ప విషయములుగా గమనిస్తూ..., ఈ జగత్తు అస్మత్ ఆత్మ స్వరూపమే!" ... అనే జగత్ ఆనంద స్వరూప - ధారణను ఆశ్రయిస్తున్నాడు.

నిర్వికల్పస్థితిని ఎరిగి, అద్దానితో మమేకమై, ఇక ఆ విద్వాంసుడు దేహ - దృశ్య - జగత్ విషయములను చూచి ఏ మాత్రము శోచత్వము (దుఃఖము) పొందడు.

నీటిలో ఉప్పుగడ్డ పడవేసి నప్పుడు అద్దానినామ - రూపములు ఏమౌతున్నాయి? కరిగి రహితమైపోతున్నాయి. వాటి జాడకూడా తెలియకుండా పోతున్నాయి కదా !

అదేవిధంగా ఎప్పుడైతే ఈ మనస్సు అనే ఉప్పుబొమ్మ తన హావ - భావ - బుద్ధి - ప్రియ - అప్రియ - ఆశయ - ఆకాంక్ష - ఆవేదన - చిత్తానందములతో సహా 'ఆత్మ దేవి' యందు ప్రవేశము పొంది సర్వము ఆత్మమయంగా చేసివేస్తుందో... అదియే "సమాధిస్థితి"

ఎప్పుడైతే, 1) 'ఇష్టము' ను తన అంతరస్వరూపముగా కలిగియున్న ప్రాణము, 2) హావ-భావముల రూపమగు మనస్సు ఈ రెండూ ఆత్మతో ఏకమై - అభిన్నమగు చున్నాయో, అప్పుడు ఏర్పడు **సమరసభావనా స్థితియే 'సమాధి'**... అని పిలువబడుతోంది.

ఎప్పుడైతే జీవాత్మకు జనిస్తున్న సర్వ సంకల్ప - వికల్పములు వినష్టమై, నిశ్శబ్దము వహించినవై **జీవాత్మ - పరమాత్మల ఏకత్వము సహజ భావనగా సిద్ధిస్తుందో,** అదియే **'సమాధి'** అని ప్రవచించబడుతుంది.

ప్రభాశూన్యము; మనశ్శూన్యము; నిర్విషయ నిరామయము (వేరొకటి లేకయే పోవటము). సర్వ శూన్యము, ఆభాసము (ప్రతిబింబత్వము) అనునది మొదలే రహితమై పోవడం... అట్టి స్థితియే సమాధి.

ఈ దేహి 'విషయ శూన్యత' అను మానసిక అభ్యాసముచే, 'దేహములోని నేను' అను సంకుచిత-పరిమిత బంధ భావము నుండి బయల్వెడలి, మాంసమయ దేహము నుండి ఉత్-చలితుడై (బయటకు వచ్చినవాడై), చంచలమునకు ఆవల గల **నిశ్చలత్వము ఎరుగుచుండుటయే సమాధి అభ్యాసము.** (తరంగాలకు జలము ఆధారమైనట్లు) నిశ్చలుడై చంచల మనోభావములను సాక్షి అయి, తన అంతర్ విశేషములుగా నిత్యము చూస్తూ ఉండగలగటమే సమాధి! ఈ 1. కనబడేదంతా (దృశ్యము)ను, 2. చూస్తూ

| | |
|---|---|
| సమాధిః అభిధీయతే॥<br>యత్ర యత్ర మనోయాతి<br>తత్ర తత్ర పరం పదమ్,<br>తత్ర తత్ర పరంబ్రహ్మ<br>సర్వత్ర సమవత్ స్థితమ్ ॥ఇతి॥ | ఉన్నవాడిని (ద్రష్టను) - రెండిటినీ మౌనంగా నిత్యము చూస్తూ ఉండటము) అనబడు (కేవల దృక్ స్థితి) - ఇది సమాధి!<br>ఈ ఆలోచనల రూపమైన మనస్సు ఎక్కడెక్కడకు వెళ్ళి వాలుచున్నదో అదంతా ఆ మనస్సు స్వభావంగానే **పరంబ్రహ్మముగా** దర్శించు అభ్యాసముయొక్క ఫలమే సమాధి. పరమపదము. ఆత్మపదమును అధిరోహించి సర్వత్రా సమమగు **పరమాత్మను** దర్శించు- మమేకమగు అట్టి స్థితియే.... యోగి సాధించుకొనవలసిన సంస్థితి! సర్వత్ర సమవత్ స్థితమ్! |

---

| | | |
|---|---|---|
| 7. | <u>అథ హి ఏనం దేవా ఊచుః</u><br>నవచక్ర వివేకమ్ అనుబ్రూహీతి।<br>తథేతి సహోవాచ : | **దేవతలు :** హే శ్రీమన్నారాయణ భగవాన్! మాకు "నవచక్ర" ధ్యాన - వివేకమును ప్రసాదించ ప్రార్థన!<br>**శ్రీమన్నారాయణుడు :** నవ చక్ర ధ్యానము గురించిన కొన్ని విశేషములు వినండి! |
| | <u>(1) ఆధారే బ్రహ్మచక్రం।</u> త్రిరావృత్తి భంగిమండలాకారమ్।<br>తత్ర మూలకన్దే శక్తిః। పావక ఆకారమ్<br>ధ్యాయేత్, తత్రైవ కామరూపపీఠమ్<br>సర్వకామ ఫలప్రదమ్ భవతి ।<br>ఇతి ఆధార చక్రమ్ । | **1. మూలాధార :** ఇది బ్రహ్మచక్రము. త్రిరావృత్తి (ధ్యాని - ధ్యానము - ధ్యేయము) రూపమగు) మండలాకారము. ఈ మూలాధారమునందు "శక్తి పావకారము (అగ్ని ప్రకాశములను) ధ్యానించాలి.<br>ఈ ఆధార స్థానము **కామరూప పీఠము.** ఈ పీఠము **సర్వఫల ప్రదము.** ఇక్కడ శక్తి - అగ్ని తేజస్సులను ఆరాధించు వారి సర్వ కోరికలు సిద్ధించగలవు. |
| | <u>(2) ద్వితీయం స్వాధిష్ఠాన చక్రమ్ ।</u> షట్ (6) దళమ్ ।<br>తన్మధ్యే పశ్చిమాభిముఖం, లింగం ప్రవాళాంకుర<br>సదృశం ధ్యాయేత్, తత్రైవ ఉడ్యాణపీఠం<br>జగదాకర్షణ సిద్ధిదం భవతి । | **2. స్వాధిష్ఠాన చక్రము :** '6' దళములు కలది. అద్దాని మధ్యగా (1) పశ్చిమాభిముఖముగా (Facing towards west) లింగమును, ప్రవాళ అంకుర (రత్నముయొక్క కోణచివవంటిది) సదృశమును ధ్యానించాలి. అక్కడ స్వాధిష్ఠాన చక్రములో గల ఉడ్యాణపీఠము ఆ యోగికి జగదాకర్ష సిద్ధిని ప్రసాదిస్తోంది. |
| | <u>(3) తృతీయ నాభిచక్రం :</u> పంచావర్తం। సర్వ కుటిలాకారం।<br>తన్మధ్యే కుండలినీం, బాలార్క కోటి ప్రభామ్ ।<br>తనుమధ్యాం ధ్యాయేత్,<br>సామర్థ్య శక్తిః సర్వసిద్ధిప్రదా భవతి-మణిపూరకచక్రం। | **3. నాభిస్థానము - మణిపూరకచక్రము :** పంచ (5) ఆవర్తములు (ప్రవాహములు గలిగి ఉన్నది; సర్వకుటిలాకారము (వంకర టింకరగా); ఈ మణిపూరక చక్రమధ్యగా కోటి సూర్యులు ఉదయిస్తున్న కాంతి పుంజములు వెదజల్లు కుండలినీని శక్తి ప్రసరిస్తోంది. అట్టి కుండలినీ శక్తి శరీర మధ్యగా ఉన్నతీరును భావిస్తూ ధ్యానించాలి. అప్పుడు ఆ యోగికి సర్వ సామర్థ్యములు లభిస్తున్నాయి. |
| | <u>(4) హృదయచక్రం :</u> అష్టదళమ్ । అధోముఖమ్ ।<br>తన్మధ్యే జ్యోతిర్మయ లింగాకారమ్ ధ్యాయేత్ ।<br>స ఏవ హంసకళా, సర్వప్రియా<br>సర్వలోక వశ్యకరీ భవతి । - (అనాహత చక్రం) | **4. హృదయ స్థానము - అనాహత చక్రము :** '8' దళములు గలది. అధో (క్రిందివైపుగా) ముఖము గలది; అద్దాని మధ్యగా జ్యోతిర్మయ లింగాకారమును ధ్యానించాలి! ఈ చక్రము హంసప్రియ (సోఽహమ్ ప్రియత్వము) రూపమై, సర్వులకు ప్రియమై, సర్వలోకములు ఆ అనాహత చక్రోపాసకునకు వశ్యము అవగలవు. |
| | <u>(5) కంఠచక్రం :</u> చతురంగులమ్।<br>తత్ర వామే - ఇడా - చంద్రనాడీ,<br>దక్షిణే - పింగళా - సూర్యనాడీ<br>తన్మధ్యే సుషుమ్నాం, శ్వేతవర్ణామ్ ధ్యాయేత్ ।<br>య ఏవం వేదా 'అనాహత సిద్ధిదా' భవతి । | **5. కంఠ స్థానము - విశుద్ధ చక్రము 4** అంగుళముల స్థానము. ఇక్కడ ఎడమవైపు 'ఇడ' నాడి (చంద్రనాడి), కుడివైపు 'పింగళ' నాడి (సూర్యనాడి) ఉన్నాయి. అట్టి కంఠచక్రము (విశుద్ధ చక్రము) మధ్యగా తెల్లటి వర్ణము గల "సుషుమ్న"ను యోగి - ధ్యానించును గాక!<br>ఇది తెలుసుకొని యోగధ్యానము చేయువాడు అనాత స్థితి (మనో వాయునిశ్చల స్థితి) సముపార్జించుకొనుచున్నాడు. అనగా మనోచంచలమునకు సాక్షిత్వము సముపార్జించు కొనుచున్నాడు. |

**(6) తాలుచక్రమ్ తత్ర అమృతధారా ప్రవాహః।**
**ఘంటికా లింగం। మూలచక్ర రంధ్రే రాజదంతావలంబినీ**
**వివరమ్। దశమ ద్వారమ్ – తత్ర శూన్యమ్ ధ్యాయేత్,**
**చిత్తలయమ్ భవతి ।**

**(7) సప్తమం – భ్రూ చక్రమ్ :**
**అంగుష్ఠమాత్రమ్ ! తత్ర జ్ఞాననేత్రమ్ !**
**దీపశిఖాకారమ్ ధ్యాయేత్ !**
**తదేవ కపాల కన్దమ్ ! వాక్ సిద్ధిదం భవతి ।**
**ఆజ్ఞాచక్రమ్॥**

**(8) అష్టమమ్। బ్రహ్మరంధ్రం। నిర్వాణ చక్రమ్ ।**
**తత్ర సూచికా గృహేతరమ్।**
**ధూమ్ర శిఖాకారమ్ ధ్యాయేత్ । తత్ర జాలంధరపీఠమ్।**
**మోక్షప్రదమ్ భవతి ।**
**ఇతి పరబ్రహ్మ చక్రమ్॥**

**(9) నవమమ్ – ఆకాశ చక్రమ్ :**
**తత్ర షోడశదళ పద్మమ్ । ఊర్ధ్వముఖమ్ ।**
**తన్మధ్య కర్ణికా త్రికూటాకారమ్ ।**
**తన్మధ్యే ఊర్ధ్వశక్తికాం పశ్యన్ ।**
**ధ్యాయేత్ తత్రైవ పూర్ణగిరి పీఠమ్।**
**సర్వేచ్ఛా సిద్ధి సాధనమ్ భవతి ॥**
**సౌభాగ్యలక్ష్మ్యుపనిదమ్ నిత్యమ్ అధీతే,**
**సో అగ్నిపూతో భవతి । స వాయుపూతో భవతి ॥**
**స సకల ధన ధాన్య సత్పుత్ర కళత్ర హయ**
**భూ గజ పశు మహిషీ దాసీ దాస యోగ–జ్ఞానవాన్ భవతి।**
**న స పునరావర్తతే ।**
**న స పునరావర్తత ।**
**ఇత్యుపనిషత్**
**ఇతి సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్**
**ఓం శాంతి : శాంతి : శాంతి :**

**6. తాలుచక్రమ్ :** గడ్డము - నోరు - కొండనాలుక స్థానము. ఈ చక్రములో అమృతధారా ప్రవాహము

ఘంటికా లింగము (కొండనాలుక) ; మూలచక్ర రంధ్రము; రాజ-దంతావలంబనీ వివరము ; (కేవలీభావనా సిద్ధి). దశమ (10వ) ద్వారము. ఇక్కడ "నిర్విషయము - (భావ-భావముల మధ్య ప్రదేశము) అగు "శూన్యము"ను ధ్యానించెదరుగాక! అప్పుడు "చిత్త లయము" సులభముగా సిద్ధించగలదు.

**7. భ్రూచక్రము : భ్రూమధ్య స్థానము :** సప్తమము - అంగుష్ఠమాత్ర పురుష స్థానము; జ్ఞాననేత్రస్థానము. 'దీపశిఖ' ఆకారము కలిగి ఉన్నట్టిది. దీనిని కపాల - కన్దము అని కూడా అంటారు. ఇక్కడ చిత్తమును నిలుపుయోగికి **'వాక్శుద్ధి'** లభించగలదు.

**8. అష్టమము - ఆజ్ఞాచక్రమం :** ఇది బ్రహ్మరంధ్రనిర్వాణ చక్రము, ఇక్కడి సూచిక గృహేతరము-ధూమ్ర శిఖాకారమును ఇక్కడ ధ్యానించాలి. ఇక్కడ ధూమ్ర జాలంధరపీఠము... మోక్షప్రదము. ఇది 'పరబ్రహ్మచక్రము' అయి ఉన్నది.

**9. నవమము - ఆకాశచక్రము :** "16" దళములతో కూడిన పద్మము, ఊర్ధ్వముఖముగా బాహ్యమునకు విస్తరించి ఉన్నది. ఇద్దానిని ఊర్ధ్వముగా ధ్యానించాలి. ఇద్దాని మధ్యలో త్రికూట ఆకారము. అద్దాని మధ్యలో "ఊర్ధ్వ శక్తి" (Upward Energy Beyond Skill) ని దర్శించుచు ధ్యానము చేయాలి.

అద్దానియందు 'పూర్ణగిరి పీఠము'ను భావన చేయాలి. ఇది సర్వ ఇచ్ఛలు సిద్ధింపజేయునది అగుచున్నది. విశ్వ విశ్వాంతరములు తనయందు ఇముడ్చుకొనుచున్న స్వస్థానము.

ఎవ్వరైతే ఈ "సౌభాగ్యలక్ష్మ్యుపత్ నిషత్" ను నిత్యము పారాయణము చేస్తూ అర్థాన్ని సేవిస్తారో... వారు అగ్ని పవిత్రులు, వాయుపవిత్రులు అగుచున్నారు.

సకల ధన, ధాన్య, సుపుత్ర - సుకళత్రవంతులు అగుచున్నారు. గుర్రములు - భూమి - ఏనుగులు - పశు సంపదలు మొదలైనవన్నీ కోరుకున్న విధంగా కలుగుచున్నాయి. మహిషీ (పట్టపుదేవి), దాస - దాసీ జనుల సేవలు పొందుచున్నారు. యోగజ్ఞాని అగుచున్నారు. మరల పునరావృత్తి ఉండనట్టి మోక్ష స్థానము చేరుచున్నారు.

***ఇతి సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్***

***ఓం శాంతిః శాంతిః శాంతిః***

❑ ❑ ❑

ఋగ్వేదాంతర్గత

# 10 సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్

## అధ్యయన పుష్పము



"ఓం" కార సంజ్ఞచే సులక్ష్యమగుచున్న పరమాత్మతత్త్వమునకు నమస్కారము! "శ్రీ సౌభాగ్యలక్ష్మీ మహావిద్య"చే తెలియబడుచున్న పరమసుఖ స్వరూపము త్రిపాద (భూ-భువర్-సువర్ స్వరూప, జాగ్రత్-స్వప్న-సుషుప్తి స్వరూప, జీవ-ఈశ్వర-పరమేశ్వర స్వరూప), ... **శ్రీమన్నారాయణానంద-శ్రీరామచంద్ర బ్రహ్మ - సచ్చిదానంద** పదమునకు నమస్కరిస్తున్నాము.

✡

ఒక సందర్భములో దేవతలు మహానంద ప్రదము - లోక కళ్యాణకారకము అగు వైకుంఠమునకు వెళ్ళి శ్రీమన్నారాయణుని దర్శనం చేసుకొన్నారు. భక్తి ప్రపత్తులతో స్వామికి ప్రణామములు సమర్పించారు. దేవతలంతా సుఖాశీనులైన తరువాత సత్సంగపూర్వకమైన సంవాదము ప్రారంభించబడినది.

✡

**దేవతలు :** ఓ సౌభాగ్యలక్ష్మీ హృదయేశ్వరా! జగజ్జనని, జగత్ అంతర్గత మహాకుండలినీ స్వరూపిణియగు మహాలక్ష్మిని నిజ హృదయమున కలిగియున్న శ్రీమన్నారాయణ భగవాన్! అపార కరుణామూర్తీ! పావనముల కన్నా పరమపావనమగు **ఆత్మవిద్యా సాధన** విషయమై మాకు ఉత్తమ **"మార్గము - వ్రతము - ఉపాసన"** పూర్వకమైన త్రోవను ప్రసాదించండి, బోధించండి!

**శ్రీ ఆదినారాయణస్వామి :** ఓ ప్రియదేవతలారా! మీ కోరికను అనుసరించి తప్పక చెబుతాను. **యూయంసావధాన మనసో భూత్వా, శ్రుణుత!** మీరంతా సావధాన మనస్కులై వినెదరుగాక ! నేను నా హృదయమున సర్వదా ఉపాసించు సౌభాగ్యలక్ష్మీ దేవీతత్త్వమహిమ వినండి !

దేవదేవియగు 'సౌభాగ్యలక్ష్మీ దేవి' యొక్క వాస్తవ తత్త్వమేమిటి? ఇది ముందుగా మనము చెప్పుకొనెదము

**తురీయ రూపామ్**

→ జాగ్రత్ - స్వప్న - సుషుప్తులు, ఎవరియొక్క స్వకీయకల్పనా చమత్కారములో,

→ ఎవ్వరికి జాగ్రత్ - స్వప్న - సుషుప్తులు మూడూ కూడా వేరువేరైన ప్రదేశములలోని స్వీయకల్పిత క్రీడామైదానములో...,

→ ఎద్దానినుండి 'జాగ్రత్ - స్వప్న - సుషుప్తి' అనుభవములు, భావములు బయల్వెడలినవై, ప్రదర్శితమై, తిరిగి వెనుకకు మరలి అవ్యక్తస్థితిలో సుశాంతించినవి అగుచూ ఉంటున్నాయో.... అదియే తురీయము.

అట్టి తురీయ రూపమే' శ్రీలక్ష్మీ దేవీదివ్య రూపము. [(తురీయము = 4వ రూపము (చతురీయము)]. శ్రీ సౌభాగ్యలక్ష్మీ ధామము!

**తురీయాతీతము– తురీయమునకు సాక్షి అగు స్వస్వరూపము:**

- ఏ శుద్ధము-బుద్ధము-నిర్మలము-అప్రమేయము అగు కేవలీ తత్త్వమునందు జాగ్రత్-స్వప్న-సుషుప్త-తురీయములు లీలా వినోదముగా స్వ-ఇచ్ఛచే ప్రదర్శితమగుచున్నాయో..,
- ఏది కేవలసాక్షియై, ఎద్దానికీ కూడా ప్రమేయమేలేకుండా కేవల చైతన్య స్ఫూర్తి స్వరూపమై, పరమ శాంతమై యున్నదో....

మనము చెప్పుకుంటున్న శ్రీ సౌభాగ్యలక్ష్మీ విభూతి అట్టి **తురీయాతీతము** కూడా! జాగ్రత్-స్వప్న-సుషుప్తులకే కాకుండా, తత్ సంచాలకుడగు తురీయమునకు కూడా 'సాక్షి' అయి ఉన్నట్టిది – కాబట్టి తురీయాతీతము.

**సర్వోత్కటామ్:** ఈ పాంచభౌతిక జగత్‌దృశ్యమునకు, పాంచ భౌతిక దేహమునకు, ఇంద్రియములకు, అంతరంగ చతుష్టయమగు మనో-బుద్ధి-చిత్త-అహంకారములకు, జన్మ-మృత్యు-పునర్జన్మ వ్యవహారములకు కూడా వేరై, వాటికి ఆవల ఉన్నదై, కేవల చైతన్యమై వాటన్నిటికంటే ఉత్కటమై (శ్రేష్ఠమై) యున్నట్టిదియే లక్ష్మీదేవి తత్త్వమని గమనించండి! ఉపాసించండి!

**సర్వమంత్రాసనగతామ్:** శ్రీ మహాలక్ష్మీదేవి సర్వమంత్రాశ్రయ – ధేనువు! సర్వమంత్రములను, తన పీఠముగా కలిగిఉండి, సర్వమంత్రార్థములలోను సారభూతమై వేంచేసియున్నది. సర్వమంత్ర-మంత్రార్థస్వరూపిణియై విరాజిల్లుచున్నది. హృదయదేవియై విరాజిల్లుచున్నది. కథలోని పాత్రలయొక్క ఆలోచనలన్నీ రచయితవే అయి ఉన్న తీరుగా, **సర్వబీజాక్షరములు, వాటితత్త్వార్థములు ఉపాసనావిధులు... ఇవన్నీకూడా తురీయాతీత, జగద్రచయిత అయినట్టి శ్రీదేవియొక్క కళావైభవమే! ఆ దేవీ మహిమను, దేవీ వైభవమును హృదయమందు నిలుపుకొని నేను కూడా ఈ విశ్వమును పాలిస్తున్నాను.**

**పీఠ-ఉపపీఠ దేవతా పరివృతామ్ :** ఓ దేవతలారా! సర్వతత్త్వ స్వరూపిణి – సర్వజ్ఞానమయి అగు శ్రీ ఆది లక్ష్మీదేవిని ఆశ్రయించిన వారై ఉండండి. సర్వ పీఠ – ఉపపీఠ దేవతామూర్తులంతా పరివృతులై, ఆ జగజ్జనని ఆశీనురాలై ఉన్న పీఠమునకు నలువైపులా స్థానము కలిగి ఉన్నారు. ఆ సౌభాగ్యలక్ష్మీయొక్క పాదపీఠమే దేవలోకములకు ఉనికి స్థానమై ఉన్నది.

**చతుర్భుజామ్ – మనో-బుద్ధి-చిత్త అహంకారములు** అనే (మరియు) **జాగ్రత్-స్వప్న-సుషుప్తి- తురీయములు** – అనే సామర్థ్యములచే సృష్టిని నింపిఉంచున్నట్టిదేవి! సృష్టిని తన చైతన్య శక్తితో చేతనము చేయుచున్న లక్ష్మీదేవి!

**శ్రియమ్ :** సర్వ జీవులందరికీ సంపదలు, సకల శ్రేయస్సులు కలుగజేయునది.

ఈ విధంగా "హిరణ్య వర్ణాం..."తో ప్రారంభమగుచున్న పంచదశ శ్రీసూక్తాత్మకమైన ఋక్కులతో ముందుగా ఆ జ్ఞానాదంద స్వరూపిణియగు శ్రీ సౌభాగ్యప్రద లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకోవాలి.

అట్టి [(ఈ అధ్యయన పుష్పమునకు అనుబంధముగా ఇవ్వబడిన పంచదశ (15)] ఋక్‌ఆత్మకమగు శ్రీ సూక్త స్తోత్రములకు ఋషులు → ఇందిరా సుతులగు ఆనంద, కర్దమ, చిక్లీత ఋషులు.

**శ్రీః ఇతి ఆధ్యాఋచః :** అట్టి లక్ష్మీదేవి ప్రసన్నముకొరకై.. "శ్రీః" ఇది మొట్టమొదటి ఋచము (మంత్రము) అగుచున్నది.

**చతుర్థశానామ్ ఋచామ్**... 14 లోకములు ఆదేవి గానములు

**ఆనందాత్... ఋషయః** – ఆనందుడు మొ॥నవారు ఋషులు. 15 ఋక్కులు కూడా ముగ్గురు ఋషుల దేవీ వర్ణనములు.

(1) హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ రజత స్రజామ్, చన్ద్రామ్ హిరణ్మయీాం లక్ష్మీమ్ జాతవేదో మమావహ॥

(2) తామ్ మ ఆవహ జాతవేదో। లక్ష్మీమ్ అనపగామినీమ్, యస్యాం హిరణ్యం విన్దేయం గామ్ అశ్వం పురుషాన్ అహమ్॥

(3) అశ్వ పూర్వాం రథ మధ్యాం హస్తినాద ప్రబోధినీం, శ్రియం దేవీమ్ ఉపహ్వయే శ్రీః మా దేవీ జుషతామ్॥
**ఈ మూడు ఋక్కులు – అనుష్టుప్ ఛందోబద్ధము**

(4) కాంసోస్మితాం హిరణ్యప్రాకారామ్ ఆర్ద్రామ్ జ్వలన్తీమ్ తృప్తాం, తర్పయంతీమ్! పద్మే స్థితామ్, పద్మవర్ణామ్ తామ్ ఇహ ఉపహ్వయే శ్రియమ్॥.... ఈ నాలుగవది ***బృహతీ ఛందోబద్ధము.***

(5) చంద్రాం ప్రభాసాం యశసా జ్వలన్తీం శ్రియం లోకే దేవ జుష్టామ్ ఉదారామ్। తామ్ పద్మినీ మీం శరణమ్ అహమ్ ప్రపద్యే అలక్ష్మీః మే నశ్యతామ్ త్వామ్ వృణే॥...., ఇది ***త్రిష్టుప్ ఛందో బద్ధము***

- ఆ తరువాతి '8' ఋక్కులు (6 నుండి 13) **అనుష్టుమ్ ఛందోబద్ధము.**
- అటుతరువాత (14, 15) **ఋక్కు - ప్రస్తారపంక్తీ ఛందోరూపము.**

## శ్రీ సూక్తరూప సౌభాగ్యలక్ష్మీ ఉపాసనావిధి

"శ్రీం" అగ్నిః దేవతా! (తేజోరూపిణి)

"హిరణ్యవర్ణామ్" ఇతి బీజమ్ । (బంగారుఛాయ)

"కాంసోస్మితామ్" ఇతి శక్తిః । (చిరునవ్వుముఖము)

హిరణ్మయా! చంద్రా! రజతస్రజా। హిరణ్య స్రజా। హిరణ్యా। హిరణ్యవర్ణేఽతి - ఈ నామములకు 'ఓం' ఆది-'నమః' అంతము గాను

ఓం హిరణ్యమయా అంగుష్ఠాభ్యాం నమః।

ఓం చంద్రామ్ తర్జనీభ్యాం నమః।

ఓం రజతస్రజామ్ మధ్యమాభ్యాం నమః।

ఓం హిరణ్యస్రజామ్ అనామికాభ్యాం నమః।

ఓం హిరణ్యామ్ కనిష్ఠికాభ్యాం నమః।

ఓం హిరణ్యవర్ణేఽతి కరతలకరపృష్ఠాభ్యాం నమః।

ఈ విధంగా - **ప్రణవ ఆది** - నామ - **నమో అంతైః,** చతుర్థి (4వది) అంతైః - అనగా, అర్థమాత్ర అంతముగా - అంగన్యాసః - నాలుగుసార్లు అంగన్యాసము చేయాలి.

ఆ తరువాత పురాణద్రష్టలచే ప్రసాదించబడిన శ్రీలక్ష్మీ ముఖమును భావన చేస్తూ అంగన్యాసము చేయాలి.

ఇక అటుపై అమ్మవారి మస్తకము (నుదురు); కళ్ళు, చెవులు, హృదయము, నాభి, జానువు (మోకాళ్ళు) జంఘము(కాలిపిక్క) భావనచేస్తూ ఈ క్రమంగా అమ్మవారి ఒక్కొక్క అంగమును మనోఫలకముపై నిలుపుకొంటూ పై సంకల్పమును గానం చేయాలి. పురాణద్రష్టల ప్రవర్ణనమగు శ్రీ సౌభాగ్యలక్ష్మీ మంగళరూపమును ధ్యానించాలి. స్వశరీరంలోనే ఆయా భాగములలో ప్రసన్నలక్ష్మీయొక్క ఉనికిని భావిస్తూ శబ్ద పూర్వకంగా ధ్యానం చేయాలి.

**స్తోత్రము**

శ్లో॥ **అరుణ కమల, సంస్థా, తద్రజః పుంజవర్ణా**
**కరకమల ధృత 'ఇష్ట - అభీతి' యుగ్మాంబుజాతా,**
**మణిమకుట విచిత్రాలంకృత అకల్పజాలైః**
**సకల భువన మాతా సంతతం శ్రీ శ్రియై నః ॥**

తా॥ స్వచ్ఛమై ఎఱ్ఱటి కమలములందు నివాసము కలగియున్నట్టిది,

- కమల పరాగ కిరణముల వంటి ఎఱ్ఱటి వర్ణము గల "ఇష్ట - అభయము" అనే రెండు పద్మములను రెండు చేతులతో (ధృత) ధరించినట్టిది....,
- పద్మరాగమణులతో అలంకరించబడిన విచిత్ర కిరీటము ధరించినట్టిది...,
- ఆకల్ప జాలములతో (కాలస్వరూపిణియై), అనేక కోటి బ్రహ్మాండ జనని అయి, దివ్య విగ్రహంగా అలంకృతమైనట్టిది...,

అగు సకల భువనమాత శ్రీ సౌభాగ్యలక్ష్మీదేవి మనకు ఎల్లప్పుడూ సర్వసంపదలు ప్రసాదించుచుండునుగాక!

✡

## పూజావిధి

శ్రీలక్ష్మీ అమ్మవారిని ప్రతిక్షేపించినట్టి ఆ పీఠము యొక్క నాలుగు మూలలా – **"స సాధ్యమ్ 'శ్రీ' బీజమ్"** – సత్ సాధ్యస్వరూపమగు 'శ్రీ' బీజమును ఆహ్వాన పూర్వకముగా సంకల్పిస్తూ చిత్రించాలి. పీఠముపై వసు – ఆదిత్య కళాపద్మములందు శ్రీసూక్తగతమైన అర్ధర్చలు (పూదండలు) బహిర్ అంగరూపంగా సమర్పించాలి.

సత్ = కేవలాత్మ, సాధ్యము = ప్రకృతి ప్రదర్శనా చమత్కారము,

శ్రీ = సర్వశుభ ప్రదాయి, వసు = వెలుగు, ఆదిత్య=వెలిగించటం. సర్వమునకు మొట్టమొదటే ఉన్న తేజోరూపిణి.

ఆ పీఠముయొక్క వెలుపల "యః శుచిః ప్రయతో భూత్వా జుహుయాత్ ఆజ్యమ్ అన్వహమ్"... అను మాతృకతో 'శ్రీ' ని, 'యంత్రాంగదశము'ను వ్రాయాలి !

అప్పుడు 'శ్రీయమ్' దేవిని ఆవాహనం చేయాలి.

### శ్రీదేవీ ప్రతిరూప విభాగాలు

– **అంగములచే** మొదటిప్రతి; (కోణము)

– **పద్మము** మొదలైన అలంకారములతో రెండవ ప్రతి; (పుష్పములచే)

– **లోకేశులచే** మూడవప్రతి;

– **దిక్పాల – సాంగ, స–ఆయుధములచే** నాలుగవప్రతి అగుచున్నది.

అప్పుడు శ్రీ సూక్తమంత్రములచే.... ధ్యానముచేస్తూ ఆవాహనముచేసి, ఇక ఆ తరువాత **హస్తయో, అర్ఘ్యము, పాదయో పాద్యము; ఉపచారికస్నానము; శుద్ధోదక స్నానము, వస్త్రయుగ్మము, ఉపవీతము; ఆభరణము, గంధము, అక్షతలు ధూపము, దీపము, నైవేద్యము, తాంబూలము, నీరాజనము, మంత్రపుష్పము, సాష్టాంగనమస్కారము**... గాగల షోడశ **(16) ఉపచారములు** సమర్పించాలి.

శక్తి–వసతి అనుసరించి అష్టోత్తర శతనామార్చన, సహస్ర నామార్చన చేయాలి !

### జపవిధి

| | | |
|---|---|---|
| సౌభాగ్యరమా | ... | ఏకాక్షర్యా |
| భృగు | .... | ఋషిః |
| నృచగాయత్రీ | ... | ఛందస్సు |
| 'శ్రి'యో | ... | ఋషి నమోవాక్కములు |
| శ్రీ | ... | దేవతా |
| శం | .... | ఇతి బీజశక్తిః |

ఇతి శ్రాం–శ్రీం–శ్రూ–శ్రైం–శ్రౌం–శ్రః...లతో **షడంగ న్యాసము** నిర్వర్తించాలి.

### స్తోత్రము

శ్లో॥ **భూయాత్ భూయో ద్విపద్మా అభయ వరదకరా, తప్తకార్త స్వరాభా,**
**శుభ్రాభ్రాభేభ యుగ్మద్వయ కరధృత కుంభాత్ భి రాసిచ్యమానా,**
**రత్నౌఘా బద్ధమౌళిః విమలతల దుకూలార్తవా లేపనాఢ్యా**
**పద్మాక్షీ పద్మనాభ ఉరసి కృతవసతిః పద్మగాః శ్రీ శ్రియై నః ॥**

అన్ని సమయములందూ **అభయవరదములు, ఆశ్రిత జన రక్షకములు** – అగు రెండు చేతులతో, రెండు **"అభయ–వరప్రసాద" పద్మములు** ధరించి ఉన్నట్టిది, ధగధగాయమానంగా మెరయు మేలిమి బంగారు ఆభరణములు ధరించినట్టిది, తెల్లటి రెండు ఏనుగులు

తమ తొండములచే ధరించబడిన కనక కుంభములచే అభిషేకములు చేయబడుచున్నట్టిది; నవరత్నములు పొదగబడిన మహాప్రకాశమానమగు కిరీటము ధరించినట్టిది; నిర్మల ప్రకాశముతో కూడిన పట్టు వస్త్రములు ధరించినట్టిది; సుగంధ లేపనము గలది; పద్మదళముల వలె ప్రకాశమానమగు బ్రహ్మజ్ఞాన నేత్రములు కలది; విష్ణు భగవానుని వక్షస్థలము తన నిత్య నివాస స్థానముగా కలిగి ఉన్నట్టిది - అగు ఆ **శ్రీదేవి** మాకు జ్ఞాన-సిరి-సంపదలు, శ్రేయస్సులు మరల మరల ప్రసాదించునుగాక! **"అమ్మా! శ్రీ సౌభాగ్యలక్ష్మీ! మీ కొరకై మేము సిద్ధము చేసిన ఈ శ్రీపీఠముపై పద్మకళలతో ఆశీనులు అవండి!"**

అని... జగదంబ యగు సౌభాగ్యలక్ష్మీదేవియొక్క ప్రసన్నము కొరకై స్తోత్రములు సమర్పించెదరు గాక ! ఆ దేవిని ఆహ్వానించిన పీఠమునకు భక్తి - ప్రణతులు సమర్పించెదరు గాక!

✡

శ్రీలక్ష్మీదేవి అధిష్ఠించియుండు పీఠము (శ్రీచక్ర సూత్రానుసారంగా శ్రీ చక్రయంత్రానుసారంగా)

- అష్టపత్రమ్ - '8' పత్రములతో
- వృత్త త్రయమ్ - '3' వృత్తములతో
- ద్వాదశ రాశి ఖండమ్ - '12' రాశి-ఖండములతో
- చతురస్రమ్ - రమా పీఠమ్ భవతి
- మొత్తము చతురస్రముగా **'రమాపీఠము'** నిర్మితమగుగాక ! - అనునది ఋషిదర్శన-

ప్రకటనమగు **శ్రీసూక్తవిధి.**

చెవుల స్థానమునందు ససాధ్య (సత్ సిద్ధిస్వరూప) శ్రీ బీజము అలంకరించి (చెవి ప్రోగులుగా) అమర్చబడుచున్నాయి.

ఆ దేవేశి యొక్క విభూతులు...., అష్టదళములు - నవశక్తి తత్త్వములు!

1. ఉన్నతి (Progress) 2. కాంతి (Enlightenment) 3. సృష్టి (Creative ability)
4. కీర్తి (సర్వే సర్వత్రా కీర్తించబడునది) 5. బుద్ధి (Wisdom. Discrimination) 6. స్థితి (Placement)
7. నతి (నమస్కరించబడునది) 8. పుష్టి (Strength) 9. ఉత్కృష్టి (Placed on the Highest)

ఈ (9) బుద్ధి తత్త్వములు నవ విధకళలుగా 'ఓం'తో ప్రారంభము, 'నమః' అంతము (ఉదా: ఓం శ్రీ విభూతిదేవ్యై నమః) గా ('ప్రణవ'-ఆది-'నమః' అంతముగా) చతుర్ధంతముగా (అర్ధమాత్ర శబ్దముతో) ఉచ్చరిస్తూ బుద్ధిరూప నవశక్తి తత్త్వదేవిని ఉపాసించెదరుగాక!

అంగములు... ప్రధమ ప్రతి;

'వాసుదేవా' ఇత్యాది... ద్వితీయ ప్రతి;

'బాలక్యా' ఇత్యాది... తృతీయ ప్రతి;

'ఇంద్ర' ఇత్యాది... చతుర్థీ ప్రతి;

ఓం శ్రీ; శ్రీర్లక్ష్మీః; వరదా; విష్ణుపత్నీ నమః ఓం॥

ఓం వసుప్రదా; హిరణ్యరూపా; స్వర్ణమాలినీ నమః ఓం॥

ఓం రజతస్రజా, స్వర్ణప్రభా నమః ఓం॥

ఓం స్వర్ణప్రాకార పద్మవాసినీ నమః ఓం॥

ఓం పద్మహస్తా; పద్మప్రియాయై నమః ఓం॥

ఓం ముక్తాలంకారా; చంద్ర - సూర్యాయై నమః ఓం॥

ఓం బిల్వప్రియా; ఈశ్వరీయై నమః ఓం॥

ఓం భుక్తిః, ముక్తిః; విభూత్యై నమః ఓం॥

ఓం వృద్ధిః; సమృద్ధియై నమః ఓం॥

ఓం కృష్టిః; పుష్టిః ధనద ధనేశ్వరీయై నమః ఓం॥

ఓం శ్రద్ధా; భోగిన్నీ; భోగదాయై నమః ఓం॥

ఓం సావిత్రీ; ధాత్రీ; విధాత్రీయై నమః ఓం॥

ఇటువంటి ప్రణవము – 'ఓం' – తో మొదలై, 'నమః'తో ముగుయుచు చతుర్థ్యంతా (అర్థమాత్రా) మంత్రయుక్త నామావళితో పూజించాలి ! ధ్యానించాలి ! జపించాలి !

4సార్లు పై విధిని పలుకుచూ, చతుర్ధంతముగా శ్రీసౌభాగ్యలక్ష్మిని **1. నామరూప 2. ఇహ 3. ఈశ్వర 4. పరతత్త్వము"**గా భావన చేస్తూ పూజించాలి!

***ఏకాక్షరపదంగ–ఆదిపీఠమ్... (ఏక–అక్షర – పదంగ)***

1. అనేకముగా కనిపిస్తూ 'ఏకమే' అయి ఉన్నదిగాను..., ఈ అనేకముగా కనిపించేదంతా ఏకస్వరూపిణియగు ఆ శ్రీదేవియేగాను...,
2. అక్షర–మార్పు–చేర్పులు లేనట్టిది గాను...,
3. పదంగము – 'అ' కారముతో ప్రారంభమై 'క్ష' కారమువరకు గల అక్షరములతో నిర్మితమైన పదములన్నీ తన అంగములుగా కలిగినట్టిది గాను,

– సర్వశబ్ద స్వరూపిణిగాను, ఈ నామ రూపాత్మకమైనదంతా తన ఒక అంగముగా కలిగి ఉన్నటిదిగాను ఉపాసించండి.

– సర్వ ఇహములకు పరము (ఆవల)గా ఉన్నట్టి, సర్వ ఇహములను చేతనము చేయు చైతన్యస్వరూపంగా ఆరాధించండి.

## ఆది పీఠమ్

అంతేకాదు, "ఆదేవియే ఈ జగత్తుకు **ఆదిపీఠము.** మూలాధారము. మనమంతా ఆ ఆదిపీఠమునకు అంతర్గతులము" – అని భావన చేస్తూ స్థుతించండి.

**లక్ష జపమ్**... నూరువేల జపము. గుతి–ఆశయ–పరాకాష్ఠ స్వరూపముగా భావన–చేయండి! లక్షణయుక్తంగా ఉపాసించెదరు గాక!

**దశాంశము**... ఆదేవి 10 అంశలు కలిగినదిగా (కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ స్వరూపిణి గా) ఆరాధించండి!

**శతాశమ్హనమ్**.... '100' అంశలు సమర్పితము, సహస్రాంశద్విజతృప్తి... వేయి అంశలతో సహస్రనామావళీ శబ్దములచే సంతోషించునది–అని దర్శిస్తూ, స్థుతించండి!

... ఈ తెలియబడేదాదని కంతటికీ ఆధారమై ఉన్నట్టిదిగా ఆ దేవిని భావన చేస్తూ నిష్కాములై, **దృశ్యజగత్ ఆధారభావనగా** ఉపాసించండి. దృశ్యముతో 'ఏదోకావాలి' అను భావనచే ఉపాసిస్తే ఆ దేవి పట్టుబడదు. **"ఆ జగన్మాత యొక్క తత్త్వానందమే మా ఆశయము"**... అను మహాశయులకు ఆ దేవి సులభ సాధ్యము. ఆ దేవియే **తురీయ రూపిణి! మాయా రూపిణి! తురీయమునకు మాయకు సాక్షి కూడా!**

**దేవతలు :** శ్రీమన్నారాయణా! ఆర్తత్రాణపరాయణా! అటు తురీయతత్త్వము – ఇటు మాయా స్వరూపము కూడా అయినటువంటి ఆ దేవి యొక్క నిర్దుష్టరూపమును నిర్వచించి మాకు బోధించండి – అని మీకు మా విన్నపము. ఆ సౌభాగ్యలక్ష్మీయోగవైభవములో మేము ప్రవేశించేది ఎట్లా? దయతో శెలవియ్యండి!

**శ్రీమన్నారాయణుడు:** ఓ దేవతలారా ! **యోగేన యోగోజ్ఞాతవ్యో ! యోగేన యోగాత్ ప్రవర్ధతే !**

– యోగము చేతనే యోగము తెలియబడుచున్నది.

– యోగము చేతనే యోగము ప్రవృద్ధమవగలదు.

అందుచేత యోగమును ఆశ్రయించి, నదీజల సముద్ర ప్రవేశమువలె – ఆ సౌభాగ్యలక్ష్మీ యోగ వైభవము నందు ప్రవేశితులు అవండి.

ఈ విధంగా, సర్వమునకు ఆధారము – సర్వమునకు పరము – సర్వము అయి ఉన్న ఆ సౌభాగ్యలక్ష్మీదేవీ తత్త్వమును తెలుసుకొని, దర్శించి, ప్రవేశించు ప్రయత్నమే 'యోగమార్గము'. **యో అప్రమత్తస్తు యోగేన, సయోగీ రమతే చిరమ్ !** ఎవ్వరైతే యోగాభ్యాసమునందు అప్రమత్తులై ఉంటారో, వారే ఆ దేవీయోగమునందు ఎల్లప్పుడు రమించగలుగుచున్నారు. నిత్యము యోగమునందు క్రీడించగలరు. **వ్యష్టిత్వమును – సమష్ఠత్వమునందు, సమష్ఠత్వమును – సాక్షిత్వమునందు, సాక్షిత్వమును – 'సర్వము' అయి ఉన్న సౌభాగ్యలక్ష్మి అఖండాత్మత్వమునందు బుద్ధిని ఏకముచేయటమే యోగమార్గము.**

**దేవతలు :** స్వామీ ! అట్టి యోగాభ్యాసము గురించి మరికొంత వివరించండి.

**శ్రీ మన్నారాయణుడు**

ఏ యోగులైతే......

- **సమాపయ్యనిద్రా** ... దృశ్యతాదాప్య రూపమగు నిద్రనుండి సమాప్తి పలికినవారై (విరమించువారై), అనిమేషులై, ఏమరపును జయించినవారై,
- **సుజీర్ణో** వేదమహావాక్యములను, విని వాటి పరమార్ధమును జీర్ణము చేసుకొన్నవారై...,
- **అల్పభోజీ**... దృశ్యానుభవములను, ఇంద్రియాహారములను నియమము పరిమితము చేసుకుంటూ ఉన్నవారై...,
- **శ్రమత్యాజ్యబాధే**... శ్రమ–బాధ సంబంధమైన భావములను వదలచూ, ("నాకు ఎన్ని కష్టాలో! చెప్పలేను! మరి నాకు ఎక్కడ కుదురుతుంది"? – ఇటువంటి బలహీనమైన భావనలను త్యజించి...,)
- **వివిక్త ప్రదేశే** ... దృశ్య సంబంధమైన అభిప్రాయ–భావ–అనుభవావేశములు దగ్గరకు రానీయనట్టి ఏకాంత ప్రదేశముతో...,
- **నిస్తృష్ణ**... "ఏదో దృశ్యమునుండి పొందాలి"... అనే రూపముగల సర్వతృష్ణలు త్యజించినవారై...,

సదా ఆసీనులైఉండి యోగాభ్యాసము చేస్తారో వారు **శ్రీసౌభాగ్యలక్ష్మీ దేవీ సిద్ధిని** తప్పక పొందుచున్నారు.

## యోగాసనము

- **సదా ఆపీత** ... సుఖమైన ఆసనమును ధరిస్తూ,
- **వక్త్రేణ ఆపూర్త వాయుమ్**... ముఖమంతా వాయువుతో నింపివేసి,
- **హుతవహ నిలయే యో ఆపానమ్ అకృష్య ధృత్వా** అపాన ప్రక్రియతో జఠరాగ్ని జనించునట్టి (పొట్ట) ప్రదేశమునందు అపానవాయువును ఆకర్షించి, ధరించి,
- **స్వాంగుష్ఠాది – అంగులీభిః వర కరతలయో షడ్భిరేవం నిరుధ్య**–బొటనవ్రేలు–ఉంగరపువేలు కలుపుచూ, అరచేతి భాగమును బిగియబట్టి మిగిలిన (3+3) ఆరువ్రేళ్ళను నిలువుగానిలిపి, రెండుచేతులా 3+3 వ్రేళ్ళన తాకించి నిరోధపూర్వకంగా ధారణచేసి,
- **శ్రోత్రే నేత్రేచ నాసాపుటయుగళమ్ అథో అనేనమార్గేణ సమ్యక్** – చెవులలోను, కళ్ళలోను, ముక్కు పుటములందుగల వాయువును ప్రాణశక్తితో ప్రాణకదలికలను నిశ్చలముచేసి ఉంచి....,
- **ప్రణవ బహువిధ ధ్యానసంలీన చిత్తాః॥**... ప్రణవ నాదమును వినుచూ, ఆ నాదమునందు ఈ బహువిధములైన ధ్యాసలతోకూడిన చిత్తమును – **సంలీనము** చేసి, (ఏకాగ్రపరచి)..., అప్పుడిక, **పశ్యంతి ప్రత్యయాంసం** –ప్రత్యగాత్మ స్వరూపిణి – సర్వతత్త్వ స్వరూపిణియగు శ్రీ సౌభాగ్యలక్ష్మీతత్త్వ దర్శనమును చేయాలి. తరువాత కొనసాగించాలి. తరువాత అనునిత్య దర్శనాభ్యాసమును ఆశ్రయిస్తూ ఉండాలి.

  **"మమాత్మస్వరూపిణి – సర్వాత్మ స్వరూపిణి – జగత్ స్వరూపిణి యగుదేవీ ! నమో నమః !"** – అని ఎలుగెత్తి మనోబుద్ధిలతో గానం చేయాలి !

  **శ్రవణ–ముఖ నయన–నాసా నిరోధనేననైవ కర్తవ్యమ్।** – ఓ దేవతలారా ! చెవుల–ముఖ–కళ్ళ–నాసాపుటముల ఆయా స్థానములందు ప్రాణచలనమును నిరోధించి, తద్వారా విషయ ధ్యాసలనుండి వెనుకకు మరలటము యోగాభ్యాసములో ముఖ్యముగా నిర్వర్తించవలసినదిగా... యోగాభ్యాసులు గమనించెదరుగాక !

✡

అట్టి ప్రాణవాయునిరోధన అనే - శుద్ధ సుషుమ్నా - అభ్యాసముచే సుషుమ్నానాడి - అనుభవమునకు వచ్చుచూ, ప్రకాశమానమగుచున్నది. ఆ సుషుమ్న నాడి పరిశుభ్రము దోషరహితము అగుచున్నది. అట్టి శుద్ధ సుషుమ్నానాడి నుండి సుస్ఫుటము-ప్రస్ఫుటము-నిర్మలము అగు నాదము (ఓం ... లోని అర్ధమాత్రా రూప విభాగ నాదముతో సహా) వినబడుగలదు. దేహములో షట్ చక్రములు స్థాపితమై యున్నట్టి 'అనాహతము' నుండి ఆ ధ్వని వినబడగలదు. అట్టి - **"అనాహత ధ్వనిని బుద్ధి యొక్క ఏకాగ్రతచే వినటము"** అను అభ్యాసముచే యోగి యొక్క దేహము పవిత్రమై, ఇక ఆతడు దివ్యదేహి (దేహము దివ్యత్వానుభూతి ప్రసాదించునదిగా) అగుచున్నాడు. ఆతడు క్రమంగా మహాతేజోవంతుడు, దివ్య గంధములు ప్రభవించువాడు, ఆరోగి అగుచున్నాడు. శారీరక-మానసిక రుగ్మతలు తమకు తామే తొలగుచున్నాయి. విషయములన్నీ అవిషయములగుచున్నాయి.

✡

మొట్టమొదట హృదయమును-జగన్మాతా రూపభావనా అభ్యాసముచే.... క్రమక్రమంగా విషయశూన్యముగాను, సంపూర్ణ విషయరహిత స్వరూపముగాను తీర్చిదిద్దుకోవాలి. **సంపూర్ణ హృదయశూన్యేతు ఆరంభే యోగవాన్ భవేత్ !** ఈ విధంగా యోగ సంసిద్ధతకు ఉపక్రమించాలి.

ఇక ఆపై రెండవస్థితిలో (At 2nd stage / phase) వాయునిరోధమునకు (పైన చెప్పినవిధంగా) ఉపక్రమించాలి. 'విఘటీ' స్థితిని (నిశ్చలతను) అభ్యాసము చేయాలి. క్రమంగా మూలాధారములో నిదురించు కుండలినీశక్తి సుషుమ్నలో ప్రవేశించి బ్రహ్మగ్రంధిని ఛేదించగలదు.

ఆయోగాభ్యాసి పద్మాసనమునుగాని, శరీరమునకు అనుకూలమైన మరేదైనా స్థిరాసనమునుగాని అవధరించును గాక !

అట్టి స్థిరాసనము - ధారణ - ప్రాణచలన నిరోధనములచే **విష్ణుగ్రంధిబేధము** జరిగి జగత్తుకు ఆవల స్థానమగు పరమానంద భావన జనించగలదు. జగత్తును నామ-రూపాత్మకంగాకాకుండా, విష్ణుస్వరూపంగా సందర్శనము ఆరంభము కాగలదు. యోగసాధన యొక్క తర్వాతి-తర్వాతి స్థితులలో అతిశూన్యస్థానమునుండి గొప్ప మర్ధనానుభవముతో కూడిన భేరీశబ్దములు వినబడసాగుతాయి.

తృతీయ (3వ) యత్నస్థితిలో (Third stage / phase) నినాదముతో కూడిన మర్ధళ నినాదధ్వనులు వినబడసాగుతాయి. ఆ తరువాత (At 4th stage) యోగి ఆ శబ్దములన్నీ త్యజిస్తూ, సర్వసిద్ధిప్రదమైనటువంటి **'మహాశూన్యస్థానము'**ను పొందుచున్నాడు. 'నిర్విషయ పరాకాష్ఠ'ను ఆశ్రయించుచున్న ఆ యోగి ఒకానొక మహాశూన్య స్థానమును సిద్ధింపచేసుకొనుచున్నాడు. అటు తరువాత (5th stage) మౌనరూపమగు 'సర్వత్రా ఏకత్వము' సిద్ధిస్తోంది.

క్రమంగా చిత్తానందసంబంధమైన సర్వదర్శనములను త్యజించి, దాటివేయుచున్నాడు. షట్‌చక్ర-వాయుస్థానములను అధిగమించి ***ఏకీభూతము* = *సనక - సనందనాదుల వంటి బ్రహ్మమానసపుత్రులకు అనునిత్యానుభవము*** అగు **"చిత్‌చిత్త స్వరూపుడు"** అగుచున్నాడు.

అనగా, సర్వపీఠములలోని వైశ్వానరాగ్నిని ఉపాసిస్తూ, చిత్తానందమును దాటివేసి **'వైష్ణవము'** అను శబ్దముచే చెప్పబడుచున్న - **సర్వత్రా సర్వమై వేంచేసి యున్నట్టిది, ఏకీభూతము, అణువణువు వ్యాపించి ఉన్నట్టిది, సనకుడు మొ॥వారిచే ఉపాసించబడునది"** అగు దేవీతత్త్వోపాసనా చిత్ - సముపార్జించుకొనుచున్నాడు. అంతిమమున **అనంతమగు ఆత్మసౌభాగ్యలక్ష్మీవైభవమును సమీపించుచూ, తదితరమైనదంతా ఖండ-ఖండపూర్వకముగా అఖండవైభవమునందు అంతర్గతము చేసివేయుచున్నాడు.** ఇక ప్రకృతిని ఆమూలాగ్రము భూమానంద స్వస్వరూపతత్త్వముగా ధ్యానిస్తూ, కృతకృత్యుడగుచున్నాడు. (తత్ స్వయమ్) స్వయముగా అమృతానందమయమగు సౌభాగ్యలక్ష్మీవైభవోపేతుడగుచున్నాడు.

**"యోగేన యోగం సంరోధ్య,... భావం భావేన చ అంజసా...,"**

- **'యోగము'** సహాయంతో జగత్ విషయసంయోగ రూపమగు యోగమును నిరోధిస్తూ...,
- **'భావన'** సహాయంతో నామరూపాత్మకమైన సంసార భావనలను ఉపసంహరింపచేస్తూ...,

**"నిర్వికల్పం పరం తత్త్వం సదాభూత్వా పరంభవేత్"**

నిర్వికల్ప-(ఆలోచనా జనన స్థాన) **సమగ్ర సహజభావ స్వరూపాన్ని** స్వీకరించి, సర్వమునకు ఆవలగల **పరస్వరూపమును** ఆశ్రయించిఉండునుగాక! అట్టి నిర్వికల్ప (Thoughtless - Thinker conscious) స్థితిని తెలుసుకొని ఆస్వాదించు వాడు, ఆపై ఇక భావముల రాకపోకలను గమనిస్తూ, భావములకు బద్ధుడు కానివాడై, భావములకు ఆది-అతీతస్థానమునుండి భావములను

గమనించుచున్నవాడై ఉంటున్నాడు. ఇక ఆతడు భావపరిధులలో బంధితుడు-సంబంధితుడు కానివాడై, .... కేవలసాక్షిగా ఉన్నవాడగుచున్నాడు.

## సమాధి-నిర్వచనములు

### మనోలయం

**శ్లో॥ సలిలే సైంధవం యద్వత్ సామ్యం భవతి యోగతః, తథా ఆత్మ మనసోః ఐక్యమ్ "సమాధిః" అభిధీయతే॥**

నీటిలో ఉప్పుగడ్డను వేసినప్పుడు అది తన నామ-రూపములు త్యజించి నీటిలో కరిగినదై ఇక కనిపించకుండా పోతుందికదా !

అదేవిధంగా ఈ 'మనస్సు' అనబడే భావాభావ, ప్రియాప్రియ ఆశ, నిరాశ, ఆకాంక్ష-ఆవేదనాదులతో కూడిన **ఉప్పుబొమ్మ** 'ఆత్మ' అనే జలముతో ఐక్యమయినప్పుడు మనస్సు ఆత్మత్వము సంతరించుకొనుచున్నది. (**"మనోవై ఇదగ్ం సర్వమ్॥ ఆత్మావై మనః॥ అతో ఆత్మావై ఇదగ్ం సర్వమ్"** - అనుస్థితి-స్వానుభవము అనునిత్యమవటమే **"సమాధి"** - అని చెప్పబడుచున్నది. (ఈ దృశ్యముగా పొందబడేదంతా స్వీయమనోరూపమే! మనస్సు ఆత్మరూపమే! కనుక ఇదంతా ఆత్మరూపమే!)

**ప్రాణసమరసత్వమ్: యదా సంక్షీయతే ప్రాణో మానసంచ ప్రలీయతే, తదా సమరసత్వం యత్ సమాధిః అభిధీయతే॥** ఎప్పుడైతే ఈ ప్రాణశక్తి మనస్సుతోసహా క్షీణించినదై 'ఆత్మ' యందు లీనమగుచూ **'సమరసత్వము'** పొందుచున్నదో అప్పటి ఆ సామరస్య - సమరస స్థితియే **సమాధి !** మనస్సు, ప్రాణము ఆత్మకు అనన్యంగా దర్శించబడినప్పుడు, అట్టి స్థితియే సమాధి.

**జీవాత్మలయమ్: యత్ సమత్వం తయోః అత్ర జీవాత్మ పరమాత్మనో సమస్తనష్ట సంకల్పః సమాధిః అభిదీయతే॥** ఎప్పుడైతే తాను ఆశ్రయిస్తున్న సంకల్పములను త్యజించి **'సదా సర్వ - సమత్వము'** అనే లక్షణమును ఆశ్రయించి ఈ జీవుడు ఆత్మత్వము పుణికి పుచ్చుకుంటాడో, ... అదియే **'సమాధి'** అను పేరుతో ఉద్దేశ్యించబడుచున్నది.

**సర్వశూన్యం, ప్రభా శూన్యం, మనః శూన్యం. బుద్ధి శూన్యం, నిరామయమ్, సర్వం శూన్యం నిరాభాసం సమాధిః అభిధీయతే॥**

**ప్రభాశూన్యం** - తెలియబడునది-తెలుసుకొనువాడు - ఇరువురి భేదము రహితమయినప్పుడు, (ఏకత్వము పొందినప్పుడు),
**మనోశూన్యం** - ఆలోచించబడునది-ఆలోచించువాడు.. ఈ రెండు ఏకత్వ స్థితికి చేరినప్పుడు,
**బుద్ధిశూన్యం** - తెలియబడునది-తెలివికలవాడు... ఈ రెండూ అభేదము పొందినప్పుడు,
**నిరాభాసం** - అభాస-ప్రతిబింబించు స్వభావము రహితమై, సర్వము స్వయంప్రకాశ రూపమే అగుచున్నప్పుడు...,
**నిరామయం** - వస్తువు - వస్తుభావకుడు, అనుభవము-అనుభవి... ఇవికూడా నిర్విషత్వమగుచుండగా, **అప్పటికీ శేషించియే ఉండు కేవలీస్వస్వరూపాస్వాదనయే** 'సమాధి' అని అనబడుచున్నది. అదియే **శ్రీదేవీ తత్త్వము!**

**శ్లో॥ స్వయం ఉత్-చలితే దేహే, దేహీ నిత్యం సమాధినా।**
**నిశ్చలం తమ్ విజానీయాత్ 'సమాధిః' అభిధీయతే॥**

**దేహీ అనునిత్య 'ఉత్' భావన :**

ఈ దేహము లోని దేహిత్వము యొక్క అనుక్షణికమైన నిత్యోదితత్వము, నిశ్చలస్వస్వరూపాను సంధానము, ఆత్మత్వమును ఎరిగి ఆస్వాదించుచుండటమే 'సమాధి' అని చెప్పబడుచున్నది. దేహభావమును వదిలి 'దేహి' భావము ఆశ్రయించటమే సమాధి !


**మనస్సు - పరబ్రహ్మ భావన :**

**యత్ర యత్ర మనో యాతి, తత్ర తత్ర పరంపదమ్, తత్ర తత్ర పరంబ్రహ్మ సర్వదా సమవస్థితమితి॥** మనస్సు ఎక్కడెక్కడ వ్రాలితే, ఈ మనస్సు అక్కడక్కడ పరమపదమగు పరబ్రహ్మమునే ఆస్వాదిస్తూ, సర్వత్రా సమస్థితి కలిగి ఉండటము ఇదియే సమాధిస్థితి యొక్క సహజ స్వభావము.

## నవ చక్రస్థానములు - తత్ స్థాన-ధ్యాన ఫలములు


**దేవతలు :** హే నారాయణ భగవాన్ ! సౌభాగ్యలక్ష్మీతత్త్వ మహిమగురించి మహత్తరమగు విశేషాలు చెప్పుచున్నారు ! స్వామీ ! ఇప్పుడు లక్ష్మీదేవి నవకళావిశేషంగా చెప్పబడుచున్న దేవీ నవచక్రముల గురించి వివరించ ప్రార్థన.

**శ్రీమన్నారాయణుడు:** కొన్ని విశేషాలు చెప్పుకుంటున్నాము. వినండి!




1 **ప్రధమం - ఆధారము : మూలాధారచక్రం :** ఇది బ్రహ్మచక్రము

- త్రి ఆవృత్తి భంగి మండలాకారము.
- జాగ్రత్-స్వప్న-సుషుప్తి (త్రి) మండలముల ఆకారము.
- స్థూల - సూక్ష్మ-కారణమండలములు, దృశ్య దర్శన - ద్రష్టల ప్రారంభం!



- త్రికాల మండలములతో కూడుకొని ఉన్నట్టిది.

అట్టి మూలాధారములో ప్రకృతి-పురుష సమన్వితమగు కేవలశక్తి స్వరూపమును **మూలకందనము**నందు పావకాకారముగా (అగ్ని రూపముగా) ధ్యానించాలి. తేజోరూపము భావించి, ధ్యాస నిలపాలి!


- ఈ మూలాధార మూలకంద ప్రదేశమే 'కామరూపపీఠము' !
- ఇక్కడ మూలాధార కందనమునందు తేజోరూపమును ధ్యానించు యోగికి కోరుకున్నవి ఫలప్రదమవగలవు.

**2. ద్వితీయం - స్వాధిష్ఠాన చక్రము (ఉత్-యానము-**Leading to upward)

- ఈ స్వాధిష్ఠాన చక్రము మూలాధారమునకు ఊర్ధ్వంగా నాలుగువేళ్ళంతదూరముగా స్థానము కలిగి ఉన్నది.
- '6' దళములు గల ప్రదేశము. ఆ దళముల మధ్య పశ్చిమాభిముఖముగా (క్రిందివైపుగా) అభిముఖమైన లింగమును, ప్రవాళాంకుర **(మణికొన)** సదృశముగా ధ్యానించాలి !
- అక్కడ గల సాధన స్థానమును (స్వాధిష్ఠాన మధ్య ప్రదేశమును) **'ఉఢ్యానపీఠము'** అని పిలుచుచున్నారు.


ఇక్కడ బుద్ధి-ఇచ్ఛలను నిలిపి ధ్యానించినప్పుడు ఆయోగి **జనాకర్షణసిద్ధిని** పొందుచున్నాడు.

**3. తృతీయ - నాభిచక్రం - మణిపూరకం**



- పంచ (5) ఆవర్తములు కలిగినట్టిది
- బొడ్డు స్థానమున ఉన్నట్టిది
- అనేక వంకర-టింకర ఆకారములు కలిగి నట్టిది.
- ఆ మధ్యలో కుండలినీ శక్తి అప్పుడే ఉదయిస్తున్న కోటి సూర్య ప్రభవములతో, కాంతి పుంజముల తేజస్సుగా యోగులకు అనుభూతమగునట్టిది.
- శరీర నాభి ప్రదేశముతో (తనుమధ్యామ్) ధ్యాయేత్... ధ్యానము చేయవలసినది.
- అట్టి మణిపూరకచక్రమధ్య స్థానమును ధ్యానించుటచే సర్వసామర్థ్యశక్తులు పెంపొందుతాయి. ఈ స్థానము సర్వసిద్ధులు ప్రసాదించునది. సిద్ధింపజేయునది.

**4. చతుర్థ - హృదయచక్రము: అనాహతచక్రము**



- '8' దళములుకలిగి ఉన్నట్టిది
- అధోముఖమ్। క్రిందివైపుగా ముఖము కలిగి ఉన్నట్టిది.
- ఈ హృదయమధ్యలో స్థితిగల ఈ హృదయచక్రమధ్యగా **"జ్యోతిర్మయమైన లింగాకారము"**ను ధ్యానించాలి.
- ఇది హంసకళ. సర్వప్రియ అయినట్టిది. అందుచేత **సర్వలోక వశకరము** అయిఉన్నది.

**5. పంచమ - కంఠచక్రము : విశుద్ధ చక్రము :**

- చతురాంగుళము .... ఆకారము.
- కంఠమధ్యలో స్థానము.
- ఎడమవైపునుంచి 'ఇడ'నాడి (చంద్రనాడి), కుడివైపునుండి వైపునుండి 'పింగళ' నాడి (సూర్యనాడి); మధ్యగా సుషుమ్నానాడి ఈ కంఠస్థానములోని మధ్యప్రదేశము వరకు విస్తరించినవై ఉంటున్నాయి.
- అట్టి **తెల్లటి ప్రకాశముగల స్వచ్ఛమగుసుషుమ్న నాడిని** ధ్యానము చేయాలి.
- అట్టి 'సుషుమ్నానాడి'ని తెలుసుకోవటముచేత 'అనాహతసిద్ధి' (వాయునిశ్చలస్థితి, ప్రాణనిరోధస్థితి)... సిద్ధిస్తోంది.

**6. షష్ఠ-తాలుచక్రమ్ :** - దవడ లోపలిభాగము స్థానము కలిగినట్టిది.

- అమృతధారాప్రవాహరూపము.
- ఘంటికా (కొండనాలుక) స్థాన లింగము.
- మూలచక్రరంధ్రము.
- రాజదంతావలంబినీ వివరము.
- ఈ భౌతిక దేహములో గల నవద్వారములకు వేరుగా దశమ (10వ) శక్తిద్వారము
- అట్టి తాలు చక్రస్థానములో (దవడ-నోరు-నాలుక-కొండనాలుక స్థానములో) **శూన్యము (నిర్విషయత్వము)** ను ధ్యానించాలి.
- అట్టి ధ్యానముచేత **'చిత్తలయము'** సిద్ధించుచున్నది.

**7 సప్తమమ్ – భ్రూ చక్రము– ఆజ్ఞా చక్రము – రెండు కనుబొమ్మల మధ్యగా, ముక్కుకు ఊర్ధ్వంగా గల బిందు స్థానము.**

- అంగుష్ఠ (బొటనవేలు) మాత్ర తేజో ప్రకాశము. ఇంద్రియములను దాటిన స్థానము. ఇంద్రియములను ప్రకాశముతో నింపు స్థానము.
- అక్కడ మూడవనేత్రము – జ్ఞాననేత్రము. (Common sense - Logic)
- దీపశిఖవంటి ఆకారము.
- ఇది కపాల కన్దస్థానము (కేంద్రీకృత ప్రదేశము)
- అట్టి భ్రూ చక్రములో దీపశిఖవంటి ప్రజ్ఞాతత్త్వకాంతిని ఉపాసించుటచే ఈ చక్రస్థానము **వాక్‌సిద్ధి ప్రదాత** అగుచున్నది.

**8 అష్టమమ్ – బ్రహ్మరంధ్రమ్ – నిర్వాణచక్రము**

- శిరస్సులోని బ్రహ్మరంధ్రస్థానము
- ఇది 'నిర్వాణచక్రము'
- ఇక్కడి సూచిక దేహమునకు బాహ్యమైనట్టిది. సూచికా గృహేతరము.
- ఇక్కడ ధూమ్రము (పొగ, ఎక్కువ నలుపు –తక్కువ ఎరుపు కలసిన రంగు)... యొక్క శిఖాగ్రము (పొగ చివ్వరి అగ్రభాగము) యొక్క ఆకారమును ధ్యానించాలి.
- అక్కడ జాలంధర పీఠము (జాలంధరాసనము). మోక్షపీఠము. (One who seats himself there, where one experiences All-Beyond)
- ఇక్కడ – బ్రహ్మరంధ్రమునందు ధ్యాస – ధ్యానము మోక్ష ప్రదము. అందుచేత **"పరబ్రహ్మచక్రము"** అని కూడా అంటున్నారు.

**9 నవమమ్ – ఆకాశచక్రమ్**

- **శిరోఊర్ధ్వ భాగమున** ఉన్నట్టిది.
- ఇక్కడ '16' దళములుగల పద్మము – ఊర్ధ్వముఖంగా,
- ఆ షోడశ దళ మధ్యగా త్రికూటాకారము (Triangled Frame).
- ఆ త్రికూటాకారమునందు గల ఊర్ధ్వశక్తి స్వరూపమును దర్శించాలి
- ఆ ఊర్ధ్వశక్తి రూపమునందు "పూర్ణగిరిపీఠము"... అను ఆసనాసీనుడై ధ్యానము చేయాలి.
- **సర్వేచ్ఛా సిద్ధి సాధనం భవతి।** ఇది సర్వ ఇచ్ఛలను సిద్ధింపజేయునది.

## ఫలశ్రుతి

***సౌభాగ్యలక్ష్మ్యుపనిషదమ్ నిత్యమ్ అధీతే, స వాయుపూతో భవతి – ఈ ఉపనిషత్ నిత్యము ఉపాశించు యోగి,***

- **సో అగ్నిపూతో భవతి** – అగ్నివలె సర్వ సంసార బంధములను భస్మము చేసి వేసి **పవిత్రులై ఉండగలడు.**
- వాయువలె పుష్ప సువాసనలను స్వీకరిస్తూ, మరుక్షణం త్యజిస్తూ **నిర్మలులై ఉండగలడు.**
- సకల ధన–ధాన్య–సత్పుత్ర – సకళత్ర – హయ (గుర్రాలు) – భూ–గజ– (ఏనుగు–పశు–మహిషీ–దాసీ దాస **సంపద పొందగలరు.**
- యోగ జ్ఞాన సంపదా, **జ్ఞాన సంపదా సమన్వితులై ఉంటారు.**

**అట్టి వారు పునరావృత్తి లేనటువంటి మోక్షస్థానము చేరినవారై ఉంటున్నారు.**

***ఇతి సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్***

***ఓం శాంతిః శాంతిః శాంతిః***

# సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్ - అనుబంధము
## శ్రీ సూక్తమ్ - (మంగళశ్లోక తాత్పర్యములతో)
### (పంచదశ శ్లోకీ)

హరిః ఓం ।

1 హిరణ్యవర్ణాం హరిణీం,
సువర్ణ రజత స్రజాం।
చంద్రామ్ హిరణ్మయీం లక్ష్మీం
జాతవేదో! మమ ఆవహ ।

ఓ జాతవేదా ! అగ్నిదేవా ! బంగారు ఛాయగలిగినట్టిది, పచ్చనికాంతి వెదజల్లునది, వెండివలె తెల్లని వర్ణములు గల పుష్పమాలికలను ధరించినట్టిది, పూర్ణ చంద్రునివలె ప్రశాంతకాంతులతో ప్రకాశించునట్టిది, ... బంగారు కిరణములతో వెలుగొందుచున్నట్టిది అగు - శ్రీలక్ష్మీదేవిని మాకొరకై మా వద్దకు ఆహ్వానించండి!

---

2 తామ్ మ ఆవహ, జాతవేదో!
లక్ష్మీమ్, అనపగామినీమ్,
యస్యాం హిరణ్యం విన్దేయం
గామ్ అశ్వం పురుషాన్ అహమ్ ॥

ఓ సద్గురు వరేణ్యా! జాతవేదా ! అనపగామిని (గమన-ఆగమనములు లేనట్టిది) అగు శ్రీ లక్ష్మీదేవిని మా కొరకై పిలుచుకురండి. ఏ తల్లి దయచే మేము గో - అశ్వ - ప్రాణశక్తి - వ్యవహార సామర్థ్య సంపదలను పొందుచున్నామో... ఆ మాతృవాత్సల్యనీ సామీప్యమును మేము మీ సహాయముచే పొందెదముగాక !

---

3 అశ్వపూర్వాం రథ మధ్యాం
హస్తినాద ప్రబోధినీం,
శ్రియం దేవీమ్ ఉపహ్వయే
శ్రీః మా దేవీః జుషతామ్ ॥

తెల్లటి గుర్రములచే పూర్చబడిన రధము మధ్యగా ఆనందముగా, చిరునవ్వు చిందిస్తూ ఆశీనురాలై ఉండగా, తెల్లటి ఏనుగులనాదములను వింటూ అలవోక చిరునవ్వుతో విచ్చుకుంటున్న కనులుగల ఈ దేవి యొక్క అనుగ్రహవీక్షణలు మేము పొందెదముగాక ! మా వద్ద ఆ జనని నెలకొని ఉండును గాక!

---

4 కాంసోఽస్మితాం, హిరణ్య ప్రాకారామ్,
ఆర్ద్రాం జ్వలంతీం, తృప్తాం తర్పయన్తీమ్।
పద్మేస్థితాం, పద్మవర్ణాం
తామ్ ఇహ ఉపహ్వయే శ్రియమ్ ॥

పరబ్రహ్మస్వరూపిణి, మందస్మిత వదనారవింద చిరునగవులు చిందించువెూము గలది, బంగారు ఛాయలతో ప్రకాశించునది, క్షీరసముద్రములో జనించుటచే ఎల్లప్పుడూ పాలతో తడిసి యున్నట్టిది, భక్తుల అభీష్టములను ప్రసాదిస్తూ 'తృప్తి' యందు తడిపి వేయునది, నమస్కరించి నంతమాత్రము చేత సిరి - సంపదలతో నింపి వేయునది, పద్మము నందు నివాసము (స్థితి) కలిగియున్నట్టిది, పద్మదళముల కాంతి పుంజ వర్ణములతో విరాజిల్లునది అగు శ్రీలక్ష్మీదేవిని, శ్రియందేవిని మేమున్న లోకమునకు, స్థానమునకు ఆహ్వానించుచున్నాము. ఆ జగన్మాత మమ్ములను సమీపించి ఉండును గాక!

---

5 చన్ద్రాం ప్రభాసాం యశసా జ్వలన్తీం
శ్రియం లోకే దేవ జుష్టామ్
ఉదారామ్।
తాం పద్మినీగ్ం ఈం శరణమ్
అహమ్ ప్రపద్యే।
అలక్ష్మీః మే నశ్యతాం
త్వాం వృణే ॥

చల్లని అమృత కిరణములతో కూడిన పూర్ణచంద్రునివంటి రూపము కలిగినట్టిది, మిక్కిలి తేజస్సుతో ప్రకాశించునది, తనయొక్క యశస్సుచే లోకములన్నీ నింపినదై ఉండునది, సర్వజీవులకు శ్రేయస్సు కలుగజేయునది, స్వర్గలోక వాసులగు దేవతలచే కూడా **దేవదేవిగా** స్తోత్రములు చేయబడుచున్నది, జీవులకు సర్వము ప్రసాదించే ఉదార స్వభావి అయినట్టిది - అగు ఆ శ్రీదేవిని మేము శరణము వేడుకొనుచున్నాము. ఓ సౌభాగ్యలక్ష్మీదేవి! మా యొక్క అలక్ష్మిని (దారిద్ర్యమును) తొలగించు నిన్ను రక్షకురాలిగా భావన చేస్తున్నామమ్మా ! సంపద - సద్భావన మొదలైనవి కొరతవడిన దారిద్ర్యము మాకు కలుగకుండును గాక!

---

6 ఆదిత్యవర్ణే తపసో అధిజాతో
వనస్పతిః తవ వృక్షో అథ బిల్వః।
తస్య ఫలాని తపసానుదన్తు
మాయ అన్తరాయాశ్చ, బాహ్యా అలక్ష్మీః ।

సూర్యుని వంటి తేజస్సు కలిగి ఉన్నట్టి ఓ లక్ష్మీదేవీ! నీ సంకల్పము చేతనే పువ్వులు లేకయే ఫలములు ఇచ్చు బిల్వవృక్షము జనించింది. అట్టి బిల్వవృక్షములు నీదయచేతనే బాహ్య అభ్యంతర ఇంద్రియసంబంధమైన అలక్ష్మిని(దరిద్ర్యములను)-తొలగించివేయునవిగా ఈ లోకములో ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 7 | ఉపైతు మాం దేవసఖః<br>కీర్తిశ్చ మణినా సహ।<br>ప్రాదుః భూతోఽస్మి రాష్ట్రేఽస్మిన్<br>కీర్తిమ్ వృద్ధిమ్ దదాతు మే ॥ | దేవతా సఖుడగు కుబేరుడు, దక్షకన్యయగు కీర్తి మాకు దేవీ అనుజ్ఞానుసారం సంపద-కీర్తి ప్రసాదించెదరు గాక! ఈ ప్రదేశములో పుట్టిఉన్నట్టి మాకు మా పరిసరములలో కీర్తి, వృద్ధి కలుగ జేయుదురు గాక! |
| 8 | క్షుత్ పిపాసామ్ అమలాం జ్యేష్టామ్<br>అలక్ష్మీం నాశయామి అహమ్।<br>అభూతిమ్ అసమృద్ధిం చ<br>సర్వాం నిర్ణుద మే గృహాత్ । | జ్యేష్ఠాదేవి కృతములగు ఆకలి - దప్పికలతో మలిన మైన దేహముతో కూడిన అలక్ష్మీ విశేషాలు మాపట్ల తొలగినవై ఉండునుగాక ! అభూతి (లేమి, దరిద్ర్యము) అసమృద్ధి మొదలైనవన్నీ మా గృహమునుండి తొలగును గాక ! |
| 9 | గంధద్వారాం దురాధర్షాం<br>నిత్యపుష్టాం కరీషిణీమ్।<br>ఈశ్వరీగ్ం, సర్వభూతానామ్<br>తామ్ ఇహ ఉపహ్వయే శ్రియమ్। | మంచి సుగంధద్రవ్యములు ధరించినట్టిది, దుర్గ్రాహ్యమైనట్టిది, నిత్యమూ సర్వ సస్యసంపదను పుష్టిని ప్రసాదించునది, సర్వజీవుల నియామకురాలు అగు ఓ సౌభాగ్యలక్ష్మీదేవీ! మాతా! ఇప్పుడు మాకు శ్రేయస్సును, సంపదలను ప్రసాదించుటకై-ఇక్కడికి నిన్ను ఆహ్వానిస్తూ, ఇక్కడే ఉపాసించుచున్నామమ్మా! దయతో వేంచేయి. |
| 10 | మనసః కామమ్ ఆకూతిం<br>వాచః సత్యమ్ అశీమహి;<br>పశూనాగ్ం రూపం అన్నస్య<br>మయి శ్రీః శ్రయతాం యశః ॥ | ఓ దేవదేవీ! జగజ్జననీ! శ్రీదేవీ! మా మనస్సులలోని కోరికలను సిద్ధింప జేయవమ్మా! మా ఆలోచనలు (ఆకూతిం), వాక్కు మహిమానిత్వమై **సత్యత్వము** పొందునుగాక ! పశుసంపదను, రూప సంపదను, అన్నమును, శ్రేయస్సును, యశస్సును నీ యొక్క కరుణా వాత్సల్యములచే మేము పొందెదముగాక ! |
| 11 | కర్దమేన ప్రజాభూతా<br>మయి సంభవ, కర్దమ।<br>శ్రియం వాసయ మే కులే,<br>మాతరం, పద్మమాలినీమ్! | కర్దమమునికి కూతురువై జన్మించిన ఓ కర్దమాదేవీ ! మా గృహమునందు ఎల్లప్పుడూ ప్రేమాస్పదవై వేంచేసి ఉండెదవు గాక ! పద్మమాలను ధరించిన మాతా ! మాకు మా ఇళ్ళలో శ్రేయో-శిరి సంపదలు ప్రసాదించవమ్మా! మా వంశములో శ్రియముగా పద్మమాలినివై వేంచేసి ఉండవమ్మా! |
| 12 | ఆపః సృజన్తు స్నిగ్ధాని<br>చిక్లీత! వస మే గృహే।<br>నిచ దేవీం మాతరగ్ం<br>శ్రియం వాసయ మే కులే । | జలముతో స్నిగ్ధమగు (స్నేహపూర్వకమగు), సృజన్తమగు (సృజనాత్మకమగు) పుణ్యకార్యములు చేసే సద్బుద్ధిని మాకు చిక్లీతుడు గలుగజేయుదురు గాక! లక్ష్మీపుత్రుడగు చిక్లీతుడు మా గృహములో ఉండుటకు, మేము దేవియొక్క మాతృ వాత్సల్యము పొందుటకు యోగ్యులము అయ్యెదముగాక! ఓ శ్రీదేవీ! మాతా! మా వంశమునందు నివసిస్తూ మాకు జ్ఞానధనమును ప్రసాదించవమ్మా! |
| 13 | ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం<br>పింగళాం పద్మమాలినీమ్ ।<br>చన్ద్రాం హిరణ్మయీం లక్ష్మీం,<br>జాతవేదో ! మమ ఆవహ । | హే అగ్ని భగవాన్ ! జాతవేదా ! ఎల్లప్పుడూ పాల సముద్ర జలముచే తడిసిన శరీరముకలది, నిత్యాభిషేకములు సమర్పించ బడునది, పద్మమాలికను ధరించినట్టిది, పింగళ (పసుపుపచ్చని) ఛాయ కలిగినట్టిది, చంద్రభాస సమానమైనది అగు జగదంబిక శ్రీలక్ష్మీదేవికి నిత్యప్రార్థనలు సమర్పించు కొనుటకై మేము సంసిద్ధులగుచున్నాము. మా కొరకై ఆ దేవికి మా సుస్వాగతమును తెలియజేయండి! |
| 14 | ఆర్ద్రాం యః కరిణీం యష్టీం (పుష్టిం)<br>సువర్ణాం హేమమాలినీమ్।<br>సూర్యాం హిరణ్మయీం లక్ష్మీం<br>జాతవేదో ! మమ ఆవహ । | ఓ అగ్నిదేవా ! జాతవేదా! గురుదేవా!<br>ఆర్ద్ర (తడిసిన దేహము) గలది, ఈ సర్వజగత్ నిర్మాత, (తెల్లటి) పూలదండలు ధరించినట్టిది, బంగారు ఛాయగలది, జడలో బంగారు రంగు పుష్పధారిణి, సూర్యకాంతి తేజో పుంజములు వెదజల్లునది అగు శ్రీ లక్ష్మీమాతకు మేము భక్తి ప్రపత్తులు సమర్పిస్తున్నాం. (మీరు మా నమస్కృతులను ఆ మా మాతృదేవికి అందించండి). మా కొరకై ఆ దేవికి మా నిత్యాహ్వానము అందజేయండి! |

| | | |
|---|---|---|
| 15 | **తాం మ ఆవహ జాతవేదో !<br>లక్ష్మీమ్ అనపగామినీమ్,<br>యస్యాం హిరణ్యం ప్రభూతం<br>గావో దాస్యో అశ్వాన్<br>విన్దేయం పురుషాన్ అహమ్ ।** | ఓ అగ్నిదేవా ! ఏ అనపగామిని (నిర్మల, నిర్దోషి), బంగారపు ఛాయలతో ప్రకాశించునది, అగమా-**ఆత్మ సౌభాగ్యదేవి, మా శ్రీసౌభాగ్యలక్ష్మీ అగు మాత**నుండి మేము గోసంపదను, దాసజనమును, అశ్వసంపదను, పురుషకారమును పొందుచున్నామో...... అట్టి ఆ దేవతకు ఇవే మా ప్రణతులు. ఆ తల్లి మమ్ములను వీడక మా దగ్గరనే ఉండునట్లు కృప చూపండి ! ఆ శ్రీమాతకు మా ఆహ్వానమును దయచేసి తెలుపండి. |

## ఫలశ్రుతి

| | | |
|---|---|---|
| శ్లో | **యః శుచిః ప్రయతో భుత్వా<br>జుహుయాత్ ఆజ్యమ్ అన్వహమ్<br>శ్రియః పంచదశ అర్చం చ శ్రీకామః సతతం జపేత్।<br>ఆనందః కర్ధమశ్చైవ చిక్లీత ఇతి<br>విశ్రుతాః। ఋషయన్తే త్రయః పుత్రాః।<br>స్వయం శ్రీదేవి దేవతా !** | ఎవ్వరైతే ఆజ్యమును (నేయిని) అగ్నికి సమర్పిస్తూ, అగ్న్యోపాసన యుక్తంగా ఆనంద-కర్దమ-చిక్లీత లక్ష్మీపుత్రులగు త్రైయార్షేయులు (ముగ్గురు ఋషులు) గానం చేసిన 15 శ్లోకములను శుచి - శ్రద్ధలతో గానము చేస్తారో వారు శ్రీలక్ష్మీదేవతా అనుగ్రహ సిద్ధి పొందగలరు. |
| | **పద్మాసనే । పద్మ ఊరూ ।<br>పద్మాక్షీ । పద్మ సంభవే ।<br>త్వం మాం భజస్వ పద్మాక్షి,<br>యేన సౌఖ్యం లభామి అహమ్ ॥** | ఓ పద్మము ఆసనముగా గలదానా! పద్మము వంటి ఊరువులు (తొడలు) గల తల్లీ! పద్మమువంటి కనులు గలదానా! పద్మము నందు సంభవించిన (జనించిన) మాతా! చల్లటి తల్లివగు నిన్ను భజించి నీ పద్మమువంటి దృక్కులు ప్రసరించుటచే మేము సర్వసౌఖ్యములు పొందుచున్నాము. మేము ఇప్పటికే పొందుచున్న వాటన్నిటికీ నీకు సర్వదా కృతజ్ఞులము! |
| | **అశ్వదాయీ చ, గోదాయి, ధనదాయి<br>మహాధనే । ధనం మే జుషతాం దేవీ,<br>సర్వకామార్థ సిద్ధయే ।** | ఓ అశ్వ-గో-ధన-మహా(జ్ఞాన) ధన సంపత్ ప్రదాయీ ! సర్వ కోరికలు సిద్ధించుటకై 'సర్వ జగత్' అనే ధన స్వరూపిణివగు నిన్ను అర్చించుచున్నాము. |
| | **పుత్ర పౌత్ర ధనం ధాన్యం హస్తి అశ్వ, అజావిగో, రథమ్<br>ప్రజానాం భవసి మాతా ఆయుష్మన్తం కరోతు మామ్ !** | పుత్ర-పౌత్ర-ధన-ధాన్య-గజ సంపదను, ఇచ్చి కోరిన కోర్కెలను తీర్చి, ప్రజలను (స్నేహితులను) ఇచ్చి మమ్ములను ఆయుష్మంతులుగా చేయుము. |

| | |
|---|---|
| **చంద్రాభామ్ । లక్ష్మీమ్ । ఈశానామ్ ।**<br>**సూర్యాభామ్ । శ్రియమ్ । ఈశ్వరీమ్ ।**<br>**చంద్రసూర్యాగ్ని వర్ణాభామ్।**<br>**శ్రీ మహాలక్ష్మీమ్ ఉపాస్మహే ।** | **చంద్రకళలు ప్రదర్శించునది**; (సర్వ సంపదలు ప్రసాదిస్తోంది కాబట్టి) – **లక్ష్మీనామధేయి**; (సర్వత్రా విస్తరించినదై ఉండటంచేత) **ఈశ్వరీ స్వరూపిణీ**; (జ్ఞాన) సూర్యకాంతులతో **శోభాయమానమైనది**; చంద్ర–సూర్య–అగ్ని సర్వశోభలతో **వెలగొందునది** అగు **శ్రీ సౌభాగ్యమహాలక్ష్మి**ని మనసా వాచా కర్మణా సర్వదా ఉపాసించుచున్నాము. |
| **ధనం అగ్నిః । ధనం వాయుః ।**<br>**ధనం సూర్యో ! ధనం వసుః ।**<br>**ధనం ఇంద్రో। బృహస్పతిః వరుణం(ణో) ధనమశ్నుతే ।** | ఆ లక్ష్మీ అమ్మవారి విభవములే అగ్ని, వాయువు, సూర్యుడు త్రిలోకపాలకుడగు ఇంద్రుడు, బృహస్పతి, వరుణ (వర్ష) దేవుడు కూడా ! ఆ అమ్మ అనుగ్రహించుట చేతనే వారంతా ధనమును, వైభవమును పొందినవారై, స్నేహభావనతో అవన్నీ మాకు ప్రసాదించు చున్నారు. |
| **వైనతేయ! సోమం పిబ।**<br>**సోమం పిబతు వృత్రహా ।**<br>**సోమం ధనస్య, సోమినో**<br>**మహ్యం దదాతు సోమినః ।** | వినతా సుతుడవగు ఓ వైనతేయా! గరుత్మంతా! మేము సమర్పించు సోమ రసము త్రాగండి! వృత్రాసురిని సంహరించిన ఇంద్ర దేవా! ఈ సోమ రసమును స్వీకరించండి! ఓ దేవతలారా! మేము సోమ యాగమును నిర్వర్తించుటకై పుష్కలంగా సంపదను ప్రసాదించండి! శ్రీలక్ష్మీ ఉపాసనయే మా సోమయాగము! |
| **న క్రోధో, న చ మాత్సర్యం,**<br>**న లోభో, న అశుభామతి :**<br>**భవంతి కృత పుణ్యానాం**<br>**భక్తానాం శ్రీసూక్తం జపేత్ సదా !** | ఈ శ్రీ సూక్తమును జపించువాడు కృతకృత్యుడు, కృతపుణ్యుడు అగుచున్నాడు. ఆతనిలో ఇక క్రోధ మాత్సర్య లోభ అశుభ వాసనలు, దుర్బుద్ధులు నిలవనే నిలవవు. పటాపంచలై తొలగి పోగలవు. అట్టివాడు భక్తి సంపదను పొందుచున్నాడు. |
| **వర్షన్తు యే విభావరి**<br>**దివో అభ్రస్య విద్యుతః**<br>**రోహన్తు సర్వబీజాని**<br>**అప (అవ) బ్రహ్మద్విషో జహి ।** | శ్రీసూక్త పారాణము చేయుటచే, ఆకాశములోని మేఘ – విద్యుత్తులనుండి వర్షించు జలమువలె, **సర్వభాగ్యములు వర్షించగలవు**. ఆ జలముచే **జ్ఞానబీజములు మొలకెత్తగలవు. బ్రహ్మమును తిరస్కరించు స్వభావములు కడిగి వేయబడగలవు.** |
| **పద్మప్రియే । పద్మిని । పద్మహస్తే ।**<br>**పద్మాలయే । పద్మదళాయతాక్షి ।**<br>**విశ్వప్రియే । విష్ణుమనోనుకూలే ।**<br>**త్వత్ పాదపద్మం మయిసన్నిధత్స్వ ।** | ఓ పద్మప్రియా ! పద్మినీ ! పద్మహస్తా ! పద్మాలయా ! పద్మదళాయతాక్షీ! విశ్వేశ్వరుడగు శ్రీ విష్ణుమూర్తి మనస్సును రంజింపచేయు తల్లీ ! నీ పాదపద్మ సామీప్యతను, సందర్శనమును మాకు ప్రసాదించవమ్మా! |

శ్లో యా సా పద్మాసనస్థా విపులకటితటీ, పద్మపత్రాయతాక్షీ,
గంభీరావర్త నాభిః, స్తనభరనమితా శుభ్రవస్త్రోత్తరీయా,
లక్ష్మీః దివ్యైః గజేంద్రైః మణిగణఖచితైః స్నాపితా
హేమకుంభైః, నిత్యం సా పద్మహస్తా
మమ వసతు గృహే సర్వ మాఙ్గళ్యయుక్తా ॥

పద్మముపై ఆసీనురాలైనట్టిది; విపులమైన కటి (నడుము చుట్టు) కలిగియున్నట్టిది; తామర రేకులవంటి కన్నులు కలిగినట్టిది; లోతైన గంభీరమైన నాభి కలిగియున్నట్టిది; పాలిండ్ల భారముతో వంగి ఉన్నట్టిది; స్వచ్ఛమైన వస్త్ర-ఉత్తరీయములు ధరించినట్టిది; దివ్య (దేవ) లోకములోని గజేంద్రునిచే మణులు-రత్నములతో పొదగబడిన బంగారు కలశములతో నిత్యమూ అభిషేకించ బడునట్టిది, చేత పద్మము ధరించినట్టిది; సర్వమంగళ స్వరూపిణియు అగు **శ్రీమత్-మహాలక్ష్మీ దేవి మా గృహములో సర్వదా నివశించును గాక!**

---

శ్లో ॥ లక్ష్మీం క్షీరసముద్రరాజ తనయాం
శ్రీరంగధామేశ్వరీం।
దాసీభూత సమస్తదేవ వనితాం
లోకైక దీపాంకురాం।
శ్రీమత్ మందకటాక్ష లబ్ధ విభవత్
బ్రహ్మ-ఇంద్ర-గంగాధరాం,
త్వాం, త్రైలోక్యకుటుంబినీం
సరసిజాం। వందే, ముకుంద ప్రియాం ।

సర్వ సంపదలకు ఆలవాలమైనట్టిది (లక్ష్మీమ్); క్షీర సముద్రరాజ కుమార్తె; శ్రీరంగధామములో ఈశ్వరి అయి వెలసినది; దేవలోక స్త్రీలందరు తన దాసీజనముగా కలిగి ఉన్నట్టిది; లోకమంతా ఏకైక దీపమై (అఖండ జ్యోతి అయి) వెలుగొందుచున్నట్టిది; తనయొక్క శ్రీ-శుభకరమగు కించిత్ కటాక్షముచే బ్రహ్మ-ఇంద్ర-గంగాధరులకు (శివునికి) వారివారి విభవములను ప్రసాదించునది, ముల్లోకములు తన కుటుంబముగా పాలించుచున్నట్టిది, తామర కొలనులో ఉద్భవించినది, ముకుందునకు ప్రియాతి ప్రియమైనది అగు సౌభాగ్య మహాలక్ష్మీ దేవికి మేము నమస్కరించుచున్నాము.

---

శ్లో॥ శు(సి)ద్ధలక్ష్మీ। మోక్షలక్ష్మీ। విజయలక్ష్మీ। సరస్వతీ।
శ్రీఃలక్ష్మీ। వరలక్ష్మీశ్చ
ప్రసన్నా మమసర్వదా ।
వర-అంకుశౌ-పాశమ్-అభీతిముద్రాం
కరైః వహన్తీం, కమలాసనస్థాం,
బాలార్కకోటి ప్రతిభాం, త్రినేత్రాం,
భజే అహమ్ అంబాం, జగదీశ్వరీం తామ్ ।

శుద్ధ లక్ష్మీ! పరమ నిర్మల స్వరూపిణీ! సిద్ధ లక్ష్మీ! మాకు సర్వము సిద్ధింపజేయు దేవీ! ముక్తిని ప్రసాదించు మోక్ష లక్ష్మీ! సర్వ విజయములను కలుగజేయు విజయలక్ష్మీ! సారస్వతమును - ఉత్తమ స్వరమును ప్రసాదించు సరస్వతీ! పద్మమున జనించి, సర్వ శిరులు - సంపదలు అనుగ్రహించు శ్రీలక్ష్మీ! మాకు వరములు కటాక్షించు వరలక్ష్మీ! నీవు మా పట్ల సర్వదా ప్రసన్నురాలవై ఉండవమ్మా!

ఉభయ హస్తములలో...,

1. వరప్రసాదమగు క్రిందవైపుగా వ్రేలాడు అరచేయి మునివ్రేళ్ళు,
2. దుష్ట గుణములను తొలగించు అంకుశము,
3. సర్వజీవులపట్ల అంతులేని అవ్యాజమైన ఆప్యాయతను కురిపించు ప్రేమాస్పద ప్రసరణములు,
4. **"నేను ఉన్నాను. వెంట ఉండి, బిడ్డలైన మిమ్ము కాపాడుకుంటాను కదా!"** (సవ్యాపసవ్య మార్గస్థా! సర్వ ఆపద్ వినివారిణీ) - అను అభయహస్తము.

ఇవన్నీ ముద్రలుగా గల వహస్తి! పద్మమును ఆసనముగా కలిగి ఉన్నట్టిది! ఉదయించుచున్న కోటి సూర్యుల ప్రభవములు వెదజల్లుచున్నట్టిది! త్రికాలములను, త్రిమూర్తులను, త్రివేదములను, త్రిలోకములను, త్రి–స్థూల సూక్ష్మ కారణ దేహములను– మొదలైనవన్నీ తన త్రినేత్రములుగా కలిగియున్న దేవి! అట్టి అంబ, జగదీశ్వరిని అర్చించుచున్నాము. భజించుచున్నాము.

---

**శ్లో॥ సర్వమఙ్గళ మాంగళ్యే! శివే! సర్వార్థ సాధికే!**
**శరణ్యే! త్ర్యంబకే! దేవీ!**
**నారాయణి! నమోస్తుతే!**

సర్వ మంగళముల కంటే అత్యంత మంగళ ప్రదమైనది, సర్వ శుభ– సుఖ ప్రదాత, సర్వ సంపద ప్రదాత, శరణు వేడుటకు అత్యంత అర్హమైనది, త్రిమూర్తి – త్రిమాతా – త్రి ఆకాశ స్వరూపిణివగు ఓ లక్ష్మీ దేవీ! నీకు నమస్కారములు!

---

**శ్లో॥ సరసిజ నిలయే (నయనౌ) సరోజహస్తే!**
**ధవళతరాంశుక గంధమాల్యశోభే!**
**భగవతి హరి వల్లభే! మనోజ్ఞే!**
**త్రిభువన భూతికరి, ప్రసీద మహ్యమ్!**

పద్మములవంటి కనులు కలిగినది, పద్మము చేతియందు ధరించినది, అత్యంత తెల్లని, ప్రశాంత–పవిత్రములైన వస్త్రములు– గంధ మాలలచే శోభించుచున్నది, సర్వ జీవులలోను సర్వ విషయములను వెలిగించు చైతన్య స్ఫూర్తి స్వరూపిణి అగుటచే భగవతి, శ్రీహరి పత్ని, మనస్సును దృశ్యవస్తువు వంటిదిగా దర్శించు (ఎరుగు) ఆత్మ స్వరూపిణి, త్రిలోకములలోని సర్వజీవ పరిపోషకురాలు అగు లక్ష్మీదేవి మమ్ములను అనుగ్రహించును గాక!

---

**శ్లో॥ విష్ణుంపత్నీం క్షమాం దేవీం**
**మాధవీం మాధవప్రియామ్!**
**విష్ణోః ప్రియసఖీం దేవీం**
**నమామి, అచ్యుత వల్లభామ్!**

విష్ణు భగవానుని అర్ధాంగి, తల్లి అయి బిడ్డలందరి తప్పులను క్షమించు దేవి, తులసీ దేవిగా పవిత్రత ప్రసాదించు మాధవి, మాధవునికి అతి ప్రియమైనది, విష్ణువుయొక్క ప్రియ సఖి, అచ్యుతునకు ప్రియ వల్లభి – ప్రీతి పాత్రమైనది … అగు **శ్రీ దేవికి ప్రణమిల్లుచున్నాము!**

---

**శ్లో॥ శ్రీవర్చస్యమ్ ఆయుష్యమ్ ఆరోగ్యమ్**
**మామ్ విధాత్ పవమానం మహీయతే!**
**ధనం ధాన్య పశుం బహుపుత్రలాభం,**
**శత సంవత్సరం దీర్ఘమాయుః॥**

**ఓ సౌభాగ్య మహాలక్ష్మీ దేవీ!** మాకు శుభకరమగు శ్రీ వర్చస్సు, పూర్ణాయుష్షు, మంచి ఆరోగ్యము, సంపదలు ప్రసాదించవమ్మా! అట్లాగే ధనము, ధాన్యము, పశు సంపద, కీర్తి, బహుపుత్ర లాభము శత సంవత్సరముల దీర్ఘాయుర్దాయము అనుగ్రహించెదవు గాక! మేము నీ బిడ్డలము కదా!

---

**ఓం మహాదేవ్యైచ విద్మహే!**
**విష్ణుపత్నైచ ధీమహి!**
**తన్నో లక్ష్మీః ప్రచోదయాత్ ॥**
**హరిః ఓం!**

**– ఇతి శ్రీసూక్తమ్ –**

**ఓం శాంతిః శాంతి : శాంతిః**

మహాదేవీ తత్త్వమును ఎరుగుటకై విష్ణుపత్నిని స్తుతించుచున్నాము. ఆ సౌభాగ్యలక్ష్మీ దేవి మన బుద్ధులను ప్రేరేపిస్తూ వికసింప జేయును గాక!

**ఓం శాంతిః శాంతి : శాంతిః**

## హారతి మీరేల ఇవ్వరే

హారతి మీరేల ఇవ్వరే అంబకు మంగళ హారతి మీరేల ఇవ్వరే హారతి మీరేల
ఇవ్వరే జ్ఞాన విద్యల్ల కెల్ల ప్రబలడి లీలతో పదిమారు వన్నెల మేలిమి బంగారు తల్లికి ॥హా॥

1. ఇంతపరాకేల ననరే రుద్రుని దేవికి చెంత నుండి పూజ సేయూరే చెంతనుండీ పూజ
సేయరే శంఖరీ ఓం కారి, పూరికి కుంకుమా ద్యాయ లంకిణికి పొంతయైన వరాల తల్లికి ॥హా॥

2. పాదములకు పూజ చేయరే మాతల్లి కిపుడు – పారిజాతపు హారతి ఇవ్వరే పారిజాతపు
హారతి యివ్వరే మొల నూలు గజ్జెల జోడు – వన్నెల రవ్వల పాపిట బొట్టును
గెల సమయమున ధరియించు తల్లికి ॥హా॥

3. లక్ష వత్తుల జ్యోతి కూర్చరే చెలులార – మీరు రక్షింతంబుగాను పాడరే రక్షితం
బుగ వేదాక్షరముల తోను గూడిన రాక్షసా – సంహారి కిపుడు ముచ్చటలరా పాడుకొనుచూ ॥హా॥

## శ్రీలక్ష్మీదేవి హారతి

శ్రీ మాతా (శ్రీ లలితా) శ్రీలక్ష్మి నీకు హారతి – జయ జగదీశ్వరీ నీకు మనసు హారతీ॥

1. పంచ భూతములను గీదు ప్రమిదగాను చేసినాను – మించిపోయే గుణముసన్నీ వంచి వత్తి చేసినాను
కామక్రోధములను తీసి కైవత్తిగ వెలిగించి – దూషణమను గుణము తీసి ధూపముగా వేసినాను ॥శ్రీ॥
2. తామసమను గుణముతీసి తరచి చమురు పోసినాను – అహంకారగుణముతీసి అక్షింతలు చేసినాను
మాయ అనే గుణముతీసి మల్లెపూల పూజచేసి – మంచిగాను మనసు విప్పి మంత్రపుష్పముంచినాను ॥శ్రీ॥
3. చెడు గుణంబులన్నితీసి ప్రదక్షిణములు చేసినాను – ఇచ్ఛ అనే గుణము తీసి దక్షిణగా వుంచినాను
మా... మనసునే నీకు అర్పణ చేసినాము ॥శ్రీ॥

## వరలక్ష్మి పాట

ఎట్లా నిన్నెత్తు కొందునమ్మ వరలక్ష్మి తల్లి – ఎట్లా నెన్నెత్తు కొందు నమ్మా

1. ఎట్లా నిన్నెత్తు కొందు ఆట్లాడే బాలవు – నీవు ఇట్లా రమ్మనచు పిలచి కోట్లా ధన మిచ్చెదవమ్మా ॥ఎ॥

2. పసిబాలవైతె ఎత్తు కొందు వరలక్ష్మి – తల్లి పసిడి బుగ్గల పాలవెల్లి పూవులు
పండ్లు, తోరణములతో పాల వెల్లి కట్టిన వేదిక పైన కాలి యందియలు
ఘల్లున మ్రోగగ కలహంస నడకలతో రావమ్మా ॥ఎ॥

## సుందరవదనే

సుందరవదనే సుగుణ మనోహరి మందహాస ముఖ శశివదనే – చందన కుంకుమ అలంకృత వదనే
దుర్గ మహేశ్వరి రాజ రాజేశ్వరి – జగదంబ మహేశ్వరి రాజ రాజేశ్వరి ॥సుం॥
ఓంశక్తి, ఓంశక్తి, ఓంశక్తి, ఓంశక్తి, ఓంశక్తి,

## లలితా దేవి పాట

శివ వామభాగే శ్రీ లలితే సదాసుఖ దాయిని హైమవతే ॥శి॥

1. ఇందు శయన హరి అభయ ప్రదాయిని – పరమపావనీ పరాత్పరీ ఇ అంబ ॥శి॥

2. లలితా సన్నిధిలో మనసే నిండెనుగా – నిన్నే కొలిచెదము అంబ పరాత్పరి ॥శి॥

# కోరెద కోరెద కోలక కోరెద

కోరెద కోరెద కోరిక కోరెద – కోరెద తల్లీ నిన్నొక కోరిక ॥కో॥

1. అనుచితమైన కోరిక కాదు – అర్థతలేని కోరిక కాదు
మణిమాన్యమ్ముల కోరిక కాదు – పదవుల కొరకై కోరిక కాదు ॥కో॥

2. నీపదములకడ వెలిగే జ్యోతినై – నిరతము నిన్నే చూచెడి కోరిక
నిరతము నీరూపు నాలోన నిలిపి – నిరతము నిన్నే చూచెడి కోరిక ॥కో॥

3. నీ పాదయుగళా సరోజ రజమునై – జీవిత శేషము గడిపే కోరిక
నిరతము నీ రూపు నాలో నిలిపి – నీలో నేను లీనము కాగల ॥కో॥
కోరితి కోరిక కోరిక కోరితి – కోరితి తల్లీ ఈ చిన్న కోరిక ॥కో॥

# లక్ష్మీదేవి పాట

వచ్చిందమ్మా శ్రావణ లక్ష్మి వరముల నొసపగే – శ్రీ వరలక్ష్మి ఆహ్వానించి ఆసనమిచ్చి – నోముల వ్రతములు చేయండమ్మా ॥వచ్చిం॥

ముంగిట ముగ్గులు పెట్టండమ్మా – పేరంటానికి పిలవండమ్మా ॥వచ్చిం॥

పసుపు కుంకుమ గంధాక్షింతలు – దేవికి పూజలు చేయండమ్మా ॥వచ్చిం॥

ధూప దీప నైవేద్యములొసగి – మంగళ హారతి పాడండమ్మా ॥వచ్చిం॥

వచ్చిందమ్మా శ్రీ వరలక్ష్మి – వరముల నొసగే శ్రావణ లక్ష్మి ॥వచ్చిం॥

# శుక్రవారం పాట

ప॥ వారంలో శుభవారం శుక్రవారం శుభకరకమైనది శుక్రవారం
శ్రీహరి హృదయేశ్వరి నితలచే వారం – శ్రీ మహాలక్ష్మిని కొలచే శుభవారం వా॥

1. తొలి సంధ్యారుణ కిరణం నిలచేటి వేళా – మంగళకరనాదమే పలికేటి వేళా
మనసులలో భక్తి భావం విరిసేటి వేళా – మహాలక్ష్మీ మా పూజలు అందుకునే వారం వా॥

2. కలువబాల నిద్దురలో మునిగేటి వేళా – వెలుగురేఖ చీకటులను తరిమేటి వేళా
కలకంఠము గళమెత్తి పలికేటి వేళా – మహాలక్ష్మీ మా పూజలు అందుకునే వారం వా॥

3. కర్మసాక్షి కలల మరిచి లేచేటి వేళా – సుప్రభాత సుమ సేఖలు కురిసేటి వేళా
కర్పూరపు హారతి వెలిగేటి వేళా – లోజనని పాదములే కొలిచే శుభవారం

# లలితా దేవి పాట

ప॥ శ్రీ లలిత పరమేశ్వరి, జగదీశ్వరి మహేశ్వరి
శ్రీ చక్రపురవాసిని చింతామణి గృహేశి


1. భద్రప్రియ భద్రమూర్తి – భవపాపవినాశినీ
క్షుద్రశక్తి నిర్మూలిని – శుభమంగళకారిణి
సకలాగమసన్నుత – సర్వాధికారిణి ॥శ్రీ॥

2. హిమశైల విహారిణి శృంగా గ్రమధ్యవాసిని
కామజనక సోదరి కామేశ్వరి వాత్యాయిని
అమలకమలోచినీ అఖిలార్థదాయినీ ॥శ్రీ॥

శుక్ల యజుర్వేదాంతర్గత

# 1 అధ్యాత్మోపనిషత్

## శ్లోక తాత్పర్య పుష్పమ్



*(ఓం పరమశివాయ, అపాంతరతమమునివర్యాయ, బ్రహ్మదేవాయ, ఘోరాంగిరసాయ, రైక్వాయ, శ్రీరామాయ .... మహత్ సత్ గురుపరంపరాయ నమో నమో నమో నమో నమః!*

**శ్లో॥ యత్ర అంతర్యామి – ఆది (ఇత్యాది) భేదః**
**తత్త్వతో న హి యుజ్యతే,**
**నిర్భేదం పరమాఽద్వైతం**
**స్వమాత్రమ్ .... అవిశిష్యతే॥**

*ఎచ్చటైతే అంతర్యామి బహిర్యామి-ఇత్యాది భేదములేవీ 'మొదలే లేనివి' అగుచున్నాయో, ఆ స్థానమే* ***భేదరహితము - పరమాద్వైతము అగు స్వస్వరూపమాత్రముగా*** *సర్వత్రా ఏర్పడినదై యున్నది! శేషించియున్నదగుచున్నది.*

**1. అంతః శరీరే నిహితో గుహాయామ్।**
**అజ – ఏకో నిత్యమ్। అస్య పృథివీ శరీరం,**
**యః పృథివీమ్ అన్తరే సన్చరస్య**
**యం పృథివీ న వేద।**
**యస్య ఆపః శరీరం,**
**య ఆపో అన్తరే సంచరస్యమ్,**
**(యం) ఆపో న విదుః।**
**యస్య తేజః శరీరమ్**
**యః తేజో అన్తరే సంచరస్యమ్,**
**(యం) తేజో న వేద।**
**యస్య వాయుః శరీరం,**
**యో వాయుమ్ అన్తరే సంచరస్యమ్,**
**(యం) వాయుః న వేద।**
**యస్య ఆకాశః శరీరమ్,**
**య ఆకాశం అన్తరే సంచరస్యమ్।**

**సర్వ దేహములలోని బుద్ధి గుహయందు ఆత్మ భగవానుడు వేంచేసి ఉన్నారు.** ఆయన జన్మరహితుడు. అనేకముగా కానట్టివారు, ఏకరూపులు, నిత్యులు.

ఈ భూమి అంతా ఆయన శరీరమే! ఈ భూమియొక్క అంతరమున సంచరించు చున్నట్టి వారు. కానీ, **ఆయన గురించి ఈ భూమికి తెలియవచ్చుట లేదు.**

(పృథివియందు తెలుసుకొనువాడుగా వేంచేసి యుండి, పృథివికి తెలియబడటం లేదు)

- ఆ పరమాత్మ జలమును తన శరీరముగా కలిగి ఉన్నారు.
- ఈ జలములో అంతరంగా సంచరిస్తున్నారు. **అయితే జలము ఆ విషయం గమనించటంలేదు.**
- తేజస్సు పరమాత్మ శరీరమే!
- ఆయన తేజస్సులో అంతః సంచారి!
- **కానీ ఈ తేజస్సు ఆయనను గుర్తు పట్టటం లేదు.**

పరమాత్మ వాయు శరీరుడు కూడా!

వాయువుకు అంతరముగా వాయుదేవుడై సంచరిస్తున్నారు. **ఆ విషయం వాయువుకు అనుభవమవటం లేదు.**

**(యమ్) ఆకాశో.... న వేద।**
**యస్య మనః శరీరమ్,**
**యో మనో అన్తరే సంచరస్యమ్,**
**(యం) మనో న వేద।**
**యస్య బుద్ధిః శరీరమ్,**
**యో బుద్ధిమ్ అన్తరే సంచరస్యమ్**
**(యం) బుద్ధిం న వేద।**
**యస్య చిత్తం శరీరమ్,**
**యః చిత్తం అన్తరే సంచరస్యమ్,**
**(యం) చిత్తం న వేద।**
**యస్య అహంకారః శరీరమ్,**
**యో అహంకారమ్ అన్తరే సంచరస్యమ్,**
**(యం) అహంకారో న వేద।**
**యస్య అవ్యక్తమ్ శరీరమ్,**
**యో అవ్యక్తమ్ అన్తరే సంచరస్యమ్,**
**(యం) అవ్యక్తమ్ న వేద।**
**యస్య అక్షరమ్ శరీరమ్,**
**యో అక్షరమ్ అన్తరే సంచరస్యమ్,**
**(యం) అక్షరమ్ న వేద।**
**యస్య మృత్యుః శరీరమ్,**
**యో మృత్యుమ్ అన్తరే సంచరస్యమ్,**
**(యం) మృత్యుః న వేద।**
**స ఏష సర్వభూతాంతరాత్మా,**
**అపహత పాప్మా, దివ్యో దేవ ఏకో నారాయణః॥**

- ఈ ఆకాశము ఆ పరమాత్మ యొక్క శరీరమే!
- ఆకాశమునందు అంతరహృదయుడు ఆయనయే! ఆకాశ-అంతర సంచారుడు!

కానీ విచిత్రం! **ఆకాశమునకు అది ఎరుక అవటం లేదు.**

- ఆ పరమాత్మ మనః శరీరుడు.
- మనస్సంతా అంతరమున నిండి ఉన్నది ఆయనే!

కానీ **మనస్సుకు ఆయన గురించి ఏమీ తెలియరావటం లేదు.**

ఈ బుద్ధి ఆయనయొక్క శరీరమే! బుద్ధికి అంతరముగా ప్రకాశించుచున్నది ఆయనే!

ఆశ్చర్యం! **ఈ బుద్ధి అది గమనించటం లేదు మరి!**

ఆయన చిత్తమును తన శరీరముగా కలిగి ఉన్నవారు. చిత్తము యొక్క అంతరములో సంచారకుడు కూడా! **ఆయన ఎవరో ఈ చిత్తము ఏమాత్రమూ గ్రహించటము లేదు.**

ఆ ఆత్మ భగవానుడు అహంకారశరీరుడు కూడా!

అహంకారము యొక్క అంతరములో అంతర్యామి! అయితే అహంకారమునకు **ఆయన గురించి ఎరుక లేదు.**

ఆయన అవ్యక్త శరీరుడు. అవ్యక్తముయొక్క అంతరముగా సాక్షి అయి నిండి ఉన్నదీ ఆయనే! ఏమి చిత్రం! **ఆయనను అట్టి ఈ అవ్యక్తము తెలుసుకోవటమే లేదు.**

ఆయన 'అక్షరమును' శరీరముగా కలిగి ఉన్నవారు. అక్షరము యొక్క అంతరమున ఆయన సంచరిస్తూ ఉన్నప్పటికీ, **అక్షరమునకు ఆయన గురించి తెలిసిరావటమే లేదు.**

మృత్యువు ఎవ్వరియొక్క శరీరమైయున్నదో, ఎవ్వరైతే మృత్యువు యొక్క అంతర్యామి కూడానో అట్టి **మృత్యువునకు ఆయన తెలియబడకయే ఉన్నారు.**

**అట్టి పరమాత్మ సర్వ జీవులయొక్క అంతరాత్మ! ఆయన నిత్య నిర్మలుడు! పాప దోషములచే స్పృశించబడనట్టివాడు!**

దివ్య స్వరూపుడు ....! దేవాది దేవుడు! ఏకము అఖండము అగు **శ్రీమన్నారాయణుడు!**

---

**2. 'అహమ్-మమ' - ఇతి యో భావో**
**దేహ-అక్షదాః అనాత్మని,**
**"అధ్యాసో" అయం నిరస్తవ్యో**
**విదుషా బ్రహ్మనిష్ఠయా।**
**జ్ఞాత్వా స్వం ప్రత్యగాత్మానం**
**బుద్ధిః తత్ వృత్తి సాక్షిణమ్।**
**సోఽహమ్ ఇత్యేవ తత్ వృత్త్యా**
**స్వా - అన్యత్రా ఆత్మమతిం త్యజేత్।**
**లోకా అనువర్తనం త్యక్త్వా,**
**త్యక్త్వా దేహా-అనువర్తనమ్**

ఒక్కొక్క దేహములో ఒక్కొక్క తీరుగా కనిపించే "నేను-నాది" మొదలైనవన్నీ-దేహాత్మ భావన వలన కలుగుతోంది. అది దేహ దృష్టికి పరిమితమైనది. అది ఆత్మ దృష్టి కాదు. కాబట్టి "అనాత్మము".

'నేను ఈ దేహముచే పరిమితుడను' అను దేహ ధ్యాస (లేక) దేహపరిమిత దృష్టియే **"అధ్యాస"** అని పిలవబడుతోంది. అది మిధ్యాదృష్టి. అట్టి మిధ్యా అధ్యాసను **"బ్రహ్మనిష్ఠ"** అనే ఉపకరణముతో విజ్ఞులు నిరస్తవ్యులై (లేనిది లేనట్లు దర్శించువారై) జయిస్తున్నారు.

ఈ నా దేహమునకు - సర్వదేహములకు వేరుగా ఉన్న "ప్రత్యగాత్మ" **"బుద్ధికి - ఆ బుద్ధి యొక్క వృత్తులకు కేవలసాక్షి"** గా, స్వం-అఖండమైన **"నేను"** గా వెలుగొందు చున్నట్లు గ్రహించాలి. **"సోఽహమ్ - సర్వ దేహములలోని సర్వ బుద్ధి వృత్తులకు కేవలసాక్షిగా ఉన్న ఆ ప్రత్యగాత్మయే నేను"** - అను **'తత్ వృత్తిని'** ఆశ్రయించాలి. ఇక **"దేహాత్మను. దేహమే నేను. జీవాత్మత్వము పొందాను. ఈ జాతి నాది"....** మొదలుగా గల .... **అన్యమగు దేహాత్మబుద్ధిని జయించాలి.**

**శాస్త్రా-అనువర్తనమ్ త్యక్త్వా**
**స్వాధ్యాసా అపనయం కురు॥**

బిడ్డలారా! "ఆత్మ మరెక్కడో ఉన్నది. ఇంకెప్పటికో లభిస్తుంది"- అను రూపము గల అన్యత్రా ఆత్మబుద్ధి (ఆత్మ వేరు-నేను వేరు అను బుద్ధి)ని త్యజించాలయ్యా! ఎట్లా? మూడు అనువర్తనములు వదలుము. నాలుగవ అనువర్తనమును ఆశ్రయించండి.

1. లోక విషయాలు - లోకంలో కనిపించే (లేక) లోకాలలో కనిపించే భిన్నత్వము - **లోకానువర్తనము**. ఇది వదలి ఉండండి.
2. ఈ దేహమే నేను .... అనునది **దేహానువర్తనము**. దీన్ని కూడా వదలివేయండి.
3. శాస్త్రాలు నాకు తెలుసు. అతనికి తెలియదు-అను **శాస్త్రానువర్తనము**. ఇదీ వదలాలి!
4. ఈ మూడు అనువర్తములు వదలి, స్వీయాత్మ సంబంధమైన **"నేను ఆత్మస్వరూపుడను కదా..."** అనే **ఆత్మానువర్తన భావన** తో తదితర పరిమిత స్వా ధ్యాసలు వదలి ఉండండి.

---

**3. స్వాత్మన్యేవ సదా స్థిత్వా**
**మనో నశ్యతి యోగినః।**
**యుక్త్యా శ్రుత్యా స్వానుభూత్యా**
**జ్ఞాత్వా సర్వాత్మ్యమ్ ఆత్మనా**
**నిద్రాయా లోకవార్తాయాః**
**శబ్దాదేః ఆత్మవిస్మృతేః,**
**క్వచిత్ న అవసరం దత్వా**
**చిన్తయా ఆత్మానమ్ ఆత్మని।**
**మాతా పిత్రోః మల-ఉద్భూతం**
**మల-మాంస మయం వపుః,**
**త్యక్త్వా చణ్డాలవత్ దూరం**
**బ్రహ్మీభూయ కృతీ భవ।**
**ఘటాऽకాశ మహాऽకాశ ఇవ**
**ఆత్మానం పరాత్మని**
**విలాప్యాऽఖండ భావేన**
**తూష్ణీం భవ సదా మునే।**
**స్వప్రకాశం అధిష్ఠానం**
**స్వయంభూయ సదాऽత్మనా**
**బ్రహ్మాణ్డమపి పిణ్డాऽణ్డమ్**
**త్యజ్యతాం మలభాండవత్।**
**చిదాత్మని సదాऽనన్దే దేహారూఢామ్**
**అహం ధియమ్.**
**నివేశ్య లింగమ్ ఉత్సృజ్య**
**'కేవలో' భవ సర్వదా॥**

"స్వ ఆత్మ"యందే ఎల్లప్పుడు స్థితిని సంపాదించుకొనుచున్న యోగి యొక్క - అనాత్మమైన - ప్రతిబింబిత విషయముల మనన రూపమగు - మనస్సు... స్వయముగా వినాశనమగు చున్నది. (స్వాత్మకు అభిన్నరూపంగా లయం పొందుచున్నది)

యుక్తి (ఉపాయము) - శ్రుతి (శాస్త్ర-గురు వాక్యముల - పాఠముల తాత్పర్యము)- స్వానుభవము... (స్వకీయ ప్రాణాయామ - భక్తి ఇత్యాది ప్రయత్నములచే రూపు దిద్దుకొనే అనుభవము-స్వ విచక్షణ) ...... ఈ మూడిటి సహాయంతో **సర్వాత్మకమైన స్వీయాత్మను** తెలుసుకొని, ... లోకములో జీవుల పరస్పర సంబంధముల రూపముగా కనిపిస్తున్న లోకవార్తా విషయ రూపములగు శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాదులపట్ల నిద్రామౌనము వహించు. దేహాత్మ భావనలను విస్మరించినవాడవై, "వీటన్నిటితో నాకేమి అవసరం?" ... అని భావిస్తూ, **ఆత్మతో సర్వాత్మభావనను** చింతన చేయాలి.

ఈ భౌతిక దేహము ఎటువంటిది? తల్లి-తండ్రుల మలము నుండి ఉద్భవించినట్టిది. అట్టి ఈ దేహము మల-మూత్ర-మాంసమయమే గాని ఇందులో సారమైన వస్తువు ఏదీ లేదు. మురికి-మలము-మూత్రము వంటి చండాలమగు వస్తువులను వదలి దూరంగా ఉంటాము కదా! ఆవిధంగా దేహాత్మభావనను **"సర్వదేహ సాక్షియగు పరమాత్మయే నేను"** ... అను భావన సహాయంతో త్యజించి **బ్రాహ్మీభూయ ఆకృతుడవు - బ్రహ్మభావనా కృతకృత్యుడవు** అగుము.

ఒకచోట అనేక కుండలు ఉంటే ఆ కుండలన్నిటిలో ఉండే ఆకాశము - అంతటా ఉన్న ఆకాశములో అఖండమగు అంతర్విభాగమేగా! అట్లాగే ఘటాకాశము, మహాకాశమువలె సర్వ దేహాలలోని జీవాత్మ - పరాత్మయొక్క ప్రదర్శనమే! ఈవిధంగా సర్వ దేహాలలోని ఆత్మను **"పరాత్మ"**గా గానం చేస్తూ, అఖండ భావనను ఆశ్రయించినవాడవై **"నేను వేరు - నీవు వేరు"** అను దృశ్య-రూప ఖండ భావనలపట్ల **తూష్ణీకరించి ఉండుము.**

స్వయం ప్రకాశము, సర్వదేహములకు అధిష్ఠానము (సర్వ జీవులు ఎందులో ఉండి ఉన్నారో, అట్టి పరాత్మ)ను నేనే! తన చేత తానే ఉనికి గల స్వయం భూయమగు సదాత్మనే నేను! .... అను **భావనతో స్వాత్మను ఆశ్రయించుము.** ఇక ఆపై మలముతో నిండిన కుండలను దూరంగా ఉంచివేయు రీతిగా పిండాండమును (భౌతికమగు ఈ దేహమును), బ్రహ్మాండ రూపముగా కనిపించే దానిని (బాహ్య భౌతిక సువిశాల జగత్తును) కూడా త్యజించి వేయుము.

ఈ భౌతిక దేహ ఘటములో కనిపిస్తూ ఉంటున్న అహమ్ (నేను)-ధియమ్‌ను (బుద్ధులను) **సదానంద స్వరూపుడు-సర్వ దేహములలో వెలుగొందు చిదాత్ముడు అగు పరమాత్మత్వ**యందు నిలిపి,... ఆపై ఇక నామరూపాత్మకంగా (సందార్భను చితంగా మాత్రమే) కనిపించేదంతా వదలి.... సర్వదా **కేవల స్వరూపుడవై** ఉండుము.

4. యత్ర ఏష జగత్ – ఆభాసో
'దర్పణాన్తః పురమ్' యథా,
'తత్ బ్రహ్మాఽహమ్' ఇతి జ్ఞాత్వా
కృతకృత్యో భవ, అనఘ!
'అహంకార' గ్రహాన్ ముక్తః
స్వరూపమ్ ఉపసద్యతే
చంద్రవత్ విమలః పూర్ణః
సదా ఆనందః స్వయం ప్రభః।
క్రియా నాశాన్ భవేత్, చిన్తా నాశో।
అస్మాత్ వాసనాక్షయః।
వాసనా ప్రక్షయో మోక్షః
సా "జీవన్ముక్తిః" ఇష్యతే ।
సర్వత్ర సర్వతః సర్వః
బ్రహ్మమాత్రా–అవలోకనమ్
సత్ భావ భావనా దార్ఢ్యాత్
'వాసనాలయమ్' అశ్నుతే॥
ప్రమాదో బ్రహ్మనిష్ఠాయామ్
న కర్తవ్యః కదాచన।
"ప్రమాదో మృత్యుః" ఇతి ఆహుః,
విద్యాయాం బ్రహ్మవాదినః॥

బిడ్డా! పాపరహితుడా! (శ్రోత (శిష్య) దేవా! పుణ్య పాపములచేత స్పృశించబడజాలని ఆత్మస్వరూపా! నిర్మలానంద రూపా!

ఒక దర్పణంలో ఎదురుగా ఉన్న నగరము (పురము) దృశ్యము (ప్రతిబింబితమై) కనబడువచ్చు గాక! అంత మాత్రముచేత, దర్పణము (అద్దములో) పురము (నగరము) ఉన్నదని అనము కదా! అట్లాగే **"ఏ 'ఆత్మ' అనే అద్దములో జగత్తు అనబడునది ఆభాసిస్తోందో, అట్టి దర్పణరూప బ్రహ్మమే నేను"** అని తెలుసుకొని కృతకృత్యుడవు అవవయ్యా!

చంద్రగ్రహణమప్పుడు చంద్రబింబమును ఆవరించిన (కేతు)గ్రహము వదలగానే పూర్ణ చంద్రుడు ప్రకాశమానమౌతాడు కదా! అదేవిధంగా అహంకారము అనే గ్రహమును వదలించుకొని, విముక్తుడవై - పూర్ణచంద్రునివలె **స్వయమాత్మానంద ప్రభతో శోభించవయ్యా!**

రజోగుణ-సంసర్గముచే ఏర్పడుచున్న (లేక), ఏర్పడే **ఏదో చేయాలి, చేయాలి... అనే క్రియ-ఆశల** వలన రూపుదిద్దుకొనే చింతలను వదలివేస్తూ ఉండగా, క్రమంగా వాటికి సంబంధించిన వాసనలు కూడా తొలగుతాయి. ఆవిధంగా వాసనలు ప్రక్షాళణం కావటమే మోక్షము. ఆతడే **'జీవన్ముక్తుడు'** అని పిలువబడుచున్నాడు.

**"ఓ పరమాత్మా! ఈ కనబడేదంతా నీ దర్శనా విశేషమే! కనుక ఇదంతా 'నేను'తో సహా, నీవేనయ్యా!"** .... అను ఉత్తమ బుద్ధితో, అంతటా, ఎల్లప్పుడు సర్వమూ 'బ్రహ్మము'గా అవలోకనము చేయటము చేత ఏర్పడుచున్న సద్భావనా దార్ఢ్యమే (అంతా సత్ చిత్ ఆత్మ స్వరూపమే - అనే భావనా బలిమియే) "వాసనాలయము" అయి ఉన్నది. అటువంటి బ్రహ్మనిష్ఠ కలిగి యుండటములో ఏమాత్రమూ ఏమరపు-అశ్రద్ధ, బద్ధకము, మత్తు పనికిరాదు. **"ఏమరుపు - అశ్రద్ధ - బద్ధకము రూపమగు ప్రమాదమే మృత్యువు సుమా!"** అనునదే బ్రహ్మవేదులు గుర్తు చేసే **బ్రహ్మవిద్యా మార్గము!**

---

5. యథా అపకృష్టం శైవాలం క్షణమాత్రం న తిష్ఠతి,
ఆవృణోతి తథా మాయా
ప్రాజ్ఞంవాఽపి పరాఙ్ముఖమ్।
జీవతో యస్య కైవల్యం
విదేహోఽపి స కేవలః,
సమాధి నిష్ఠతామ్ ఏత్య
నిర్వికల్పో భవ, అనఘ।
అజ్ఞాన హృదయగ్రంథేః
నిశ్శేష విలయః తథా,
సమాధినా వికల్పేన యదా అద్వైతాత్మ దర్శనమ్।
అత్ర ఆత్మత్వం దృఢీ కుర్వన్ 'అహమ్' ఆదిషు సన్త్యజన్,
ఉదాసీనతయా తేషు తిష్ఠేత్ ఘట – పటాదివత్॥
బ్రహ్మాది – స్తమ్భపర్యంతం

నీటిలోని నాచును ప్రవాహ వేగం ప్రక్కకు నెట్టినా కూడా, తిరిగి యథారీతిగా తల ఎత్తుకొని నిలబడువిధంగా, ఒకడు ఆత్మ సమాచారము దృష్ట్యా మహా ప్రాజ్ఞవంతుడయినప్పటికీ కించిత్ పరాఙ్ముఖము (ఏమరపు)చే మాయ ఆక్రమించుకొనగలదు. కనుకనే **నిత్య జాగరూకత అత్యవసరము.**

జీవించి ఉన్నంత కాలము (దేహము ఉన్నప్పటికీ) కేవలమగు విదేహ ముక్తిని సిద్ధించుకోవాలి. అట్లా సముపార్జించుకొన్నవాని సమాధినిష్ఠ దేహము తొలగినా కూడా కొనసాగగలదు. అట్టి నిర్వికల్పుడవగుము. కేవల స్వరూపుడవై శేషించుము.

సమాధిచే ఎప్పుడైతే నిర్వికల్పుడవు (కల్పనా రహితుడవు) అవుతావో, ఇకప్పుడు హృదయములోని అజ్ఞాన గ్రంధులు నిశ్శేషంగా విలయించిపోగలవు. అద్వైతాత్మ దర్శనము పొందగలవు. (పరాత్మ-జీవాత్మ-జగత్ దృశ్యముల అభేదత్వమే అద్వైతము).

అట్టి సమాధి నిష్ఠుడు "నేను ఆత్మస్వరూపుడను"-అను ఆత్మతత్త్వమును దృఢీకరించుకుంటున్నవాడై, అహమ్-త్వమ్ (నేను-నీవు) మొదలైన వాటిని మొదలంట్లా త్యజించి వేసి, (లేక) స్వస్వరూపమునందు లయింపజేసి ఉదాసీనుడై ఉంటాడు. కుండ-వస్త్రము వలె దృశ్యానుభవ పరిమితిని దాటి, మౌనము వహించి ఉంటాడు.

మృషామాత్రా ఉపాధయః।
తతః పూర్ణం స్వమాత్మానం
పశ్యేత్ ఏకాత్మనా స్థితమ్।
స్వయం బ్రహ్మా। స్వయం విష్ణుః।
స్వయం ఇంద్రః। స్వయం శివః।
స్వయం విశ్వం ఇదం సర్వం।
స్వస్మాత్ అన్యత్ న కించన।।

సృష్టికర్తయగు బ్రహ్మ దేవుని నుండి - ఒక స్థంభము వరకు కనబడుచున్న ఉపాధులన్నీ మిధ్య (Illusion) మాత్రమే! ... అను అవగాహన కలిగి, యోగి - "ఇదంతా నా యొక్క పూర్ణానందాత్మ స్వరూపమై ఏకాత్మయందు స్థానము కలిగి ఉన్నది" ... అను దృష్టి - అవగాహనలతో దర్శిస్తున్నాడు.

**నా ఆత్మయే** స్వయముగా సృష్టికర్తయగు **బ్రహ్మ!** స్థితి స్వరూపుడగు **విష్ణువు!** లయకారుడగు **శివుడు!** ఇంద్రియముల అధిపతియగు **ఇంద్రుడు.** ఈ విశ్వమంతా కూడా **స్వయమాత్మ స్వరూపమే!** మమాత్మకు వేరై ఎక్కడా ఏదీలేదు! కనుక **అంతా నేనే!**

---

**6.** స్వాత్మని ఆరోపితా అశేషా
భాస వస్తు నిరాసతః
"స్వయమేవ పరంబ్రహ్మ,
పూర్ణమ్। అద్వయం। అక్రియమ్।।"
అసత్‌కల్పో వికల్పోఽయం, విశ్వమ్
ఇతి ఏకవస్తుని,
నిర్వికారే నిరాకారే నిర్విశేషే అభిధా కుతః?
ద్రష్టృ-దర్శన-దృశ్య-ఆది భావశూన్యే నిరామయే
కల్పాఽర్ణవ ఇవ అత్యన్తః పరిపూర్ణే చిదాత్మని,
తేజసీవ తమో యత్ర
విలీనం భ్రాంతి కారణమ్?
అద్వితీయే పరే తత్త్వే
నిర్విశేషే భిధా కుతః?
ఏకాత్మకే పరే తత్త్వే
భేదకర్తా కథం వసేత్?
సుషుప్తౌ సుఖమాత్రాయాం
భేదః కేన అవలోకితః?
చిత్తమూలో వికల్పో అయం
చిత్త అభావేన కశ్చన?
అతః చిత్తం సమాధేహి
ప్రత్యక్ రూపే పరాఽఽత్మని!

నిరాకారమగు బంగారమునందు సాకార పరిభాష అగు ఉంగరము-గాజు మొదలైనవి ఆపాదించబడుచున్న విధంగా, అసత్య వస్తురూపమగు ఈ ప్రపంచమంతా కూడా సత్యమగు ఆత్మయందే ఆరోపితమై ప్రతి-భాసిస్తోంది!

అట్టి పరమాత్మ స్వయముగా పరబ్రహ్మమై, పూర్ణమై, సర్వమై, సర్వాంతర్యామి అయి, తనకు ద్వితీయమైనదంటూ ఎక్కడా ఏదీ లేనిదై విరాజిల్లుచున్నారు.

సంకల్పముచే అనేకముగా కనిపిస్తున్న ఈ విశ్వమంతాకూడా అసత్‌కల్పనయే! **అసంకల్పత్వము, అవికల్పము లచే** లేనిదై, ఏకవస్తు స్వరూపమగుచున్నది. నిర్వికారము, నిరాకారము, నిర్విశేషము అగు ఆత్మయే మనకుఉండగా, ఇందులో నీ-నా ఆత్మ ఎక్కడున్నది? చూచువాడు-చూపు-చూడబడునది.... (ద్రష్ట దర్శన దృశ్య) ఆదిగా గల త్రిపుటిలు-భావనాశూన్యము, నిరామయము అగు ఆత్మయందు-ఎక్కడున్నాయి? లేవు!

కల్పార్ణవము వలె (సముద్రమువలె) చిదాత్మ అత్యంత పరిపూర్ణమైనది.

తేజో రూపమగు ఆత్మ భ్రాంతి అనే తమస్సులో విలీనమవటమెక్కడిది? కుదరదు!

కథా రచయిత కథలో మునిగిపోవటమెక్కడిది? అద్వితీయమగు పరమతత్త్వము నిర్విశేషమైయుండగా, ఇక అద్దానిలో త్రిపుటీకల్పన, నేను-నీవుల ఉనికి ఎట్లా ఉంటాయి? స్వప్నంలో, అనుభవమయ్యే 'నేను-నీవు'లు ఉన్నాయా? ఉంటే తెల్లవారే సరికి ఏమౌతున్నాయి? వాస్తవానికి లేవు!

సర్వదా ఏకాత్మకమైయున్న పరమ తత్త్వమునందు భేదము కల్పించు బాహ్యవిషయుడగు కర్త ఎట్లా ఉంటాడు? **భేదము చేయు మరొకడుంటే ఆత్మ ఏకము, అద్వితీయము ఎట్లా అవుతుంది?**

సుషుప్తిలో ఉన్న వానికి ఏక సుఖమేగాని భేదావలోకమే ఉండదు కదా!

జగత్తు అనబడునది చిత్తము యొక్క వికల్పన మాత్రమే అయి ఉండగా... చిత్తము అభావముచే తనకుతానుగా లేనప్పుడు, ఇక జగత్తు ఎక్కడిది?

చిత్తము భేదములను త్యజించి సమాధాన స్థితి పొందినప్పుడు ప్రత్యక్ రూప పరమాత్మయందు ఐక్యమగుచున్నది.

---

**7.** అఖండానందమ్-ఆత్మానం
విజ్ఞాయ స్వస్వరూపతః
బహిః అంతః సదానంద
రసాఽఽస్వాదనమ్ ఆత్మని।
వైరాగ్యస్య ఫలం బోధో
బోధస్య ఉపరతిః ఫలమ్।
స్వ-ఆనందానుభవాత్ శాన్తిః

**అఖండాత్మానంద పరమాత్మ** నాకు వేరైనది కాదు. అద్దాని కంటే నేనూ వేరు కాదు. మరెవ్వరూ వేరుకాదు! అని **స్వస్వరూప జ్ఞాన పూర్వకంగా** తెలుసుకొన్నవాడు ఇక ఆపై లోపల-బయట ఉన్నదంతా తనయందే, తానుగానే రసాస్వాదనము చేయుచున్నాడు. తానే ఉభయుడై తనయందు భేదము లేనివాడగుచున్నాడు.

వైరాగ్యమునకు ఫలము ఆత్మబోధ (జ్ఞానము) అగుచున్నది. ఆత్మ జ్ఞానమునకు ప్రయోజనంగా ఇంద్రియ విషయములలో రతించటం, రమించడం సన్నగిల్లి, **ఆత్మయందు రమించటం (ఉపరతి)** స్వయంగా రూపు దిద్దుకుంటోంది.

**ఏషైవ ఉపరతేః ఫలమ్॥**
**యత్ ఉత్తరోత్తరా భావే**
**పూర్వ రూపంతు నిష్ఫలమ్,**
**నివృత్తిః పరమాతృప్తిః**
**ఆనందో అనుపమః స్మృతః॥**
**మాయో౽పాధిః జగద్యోనిః**
**సర్వజ్ఞత్వాది లక్షణః**
**పారోక్ష్య శబళః సత్యాత్**
**ఆత్మకః తత్ పదాభిధః॥**
**ఆలంబనతయా భాతియో 'అస్మత్'**
**'ప్రత్యయ' శబ్దయోః**
**అన్తఃకరణ సంభిన్న బోధసత్వా అపరాభిదః॥**
**మాయా అవిద్యే విహాయైవ**
**ఉపాధి పర జీవయోః**
**'అఖండం సచ్చిదానందం పరబ్రహ్మ' విలక్ష్యతే॥**

ఉపరతిచే ఈ జీవుడు ఆత్మరసానందభరితుడగుచున్నాడు. అదియే పరమోత్తమ ఫలము.

దృశ్యముతో తదాత్మ్యము అను స్థితి నుండి-వైరాగ్యము-ఆత్మజ్ఞానము-ఉపరతి-స్వాత్మానందము - ఇవన్నీ ఒకటి పొందితే, అప్పుడు వెనుకటిది నిష్ఫల రూపము పొందుచూ ఉన్నవి. అనగా, ఇవన్నీ కూడా, తరువాతది పొందనప్పుడు అంతకు ముందటిది నిష్ఫలమే! చివరికి వృత్తి రహిత స్థితి (నివృత్తి). అది పరమతృప్తిని, పరమానందమును స్వభావంగా ప్రసాదిస్తున్నది.

**మాయను ఉపాధిగా** కలిగి ఉండటము, ఈ **జగత్తుకు కారణము** తానే అయి ఉండి ఉండటము, ఉపాధికి ముందు - ఇప్పుడు - ఉపాధి నశించిన తరువాత కూడా ఎల్లప్పటి **స్థితి - స్థానము ఎరిగి ఉండటము, కేవల సాక్షి ధర్మ** విశిష్టత్వము మొదలైనవన్నీ కూడా-**ఈశ్వరుని** గుణ సంపదా విశేషములు అగుచున్నాయి.

ఇక జీవుడో! అంతఃకరణ సహితుడై, దృశ్యమును ఆలంబనముగా కలిగి ఉండి, ఆత్మకు ఉపకరణ వస్తువు వంటివాడై ఉన్నాడు. జీవాత్మగా పిలువబడుచూ కూడా, ఆత్మకు అభిన్నుడే అయి ఉన్నాడు. దేహమును ఉపాధిగా కలిగి ఉన్నాడు.

ఎప్పుడైతే ఈ జీవుడు స్థూల-ఉపాధి భావన-అను మాయ, అవిద్యలను విడిచి పెట్టినవాడగుచున్నాడో, అప్పుడు **విలక్షణ అఖండ సచ్చిదానందము** అగు **పరబ్రహ్మత్వము**ను ఆస్వాదిస్తున్నాడు.

---

**8. ఇత్థం వాక్యైః తత్ అర్థ -**
**అనుసంధానం 'శ్రవణం' భవేత్॥**
**యుక్త్యా సంభావితత్వ**
**అనుసంధానం 'మననం' తు తత్॥**
**తాభ్యాం నిర్విచికిత్సే అర్థే**
**చేతసః స్థాపితస్య తత్**
**ఏకతానత్త్వమ్ ఏతద్ధి**
**'నిది ధ్యాసనమ్' ఉచ్యతే ।**
**ధ్యాతృ - ధ్యానే పరిత్యజ్య**
**క్రమాత్ ధ్యేయ - ఏక గోచరమ్,**
**నివాత దీపవత్ చిత్తం**
**"సమాధిః" అభిధీయతే ॥**
**వృత్తయస్తు తదానీం అపి**
**అజ్ఞాతా ఆత్మగోచరాః**
**స్మరణాత్ అనుమీయన్తే**
**వృత్థితస్య సముత్థితాః॥**
**అనాదిత్ అవిహ సంసారే,**

ఈ ఉపాధి-ఉపాధిని ఉపయోగిస్తున్న దేహి... ఈ రెండిటికి సంబంధించిన వేదాంతాధ్యయనముచే, [(1) మాయ-అవిద్య (2) అఖండ సచ్చిదానందత్వము.... మొదలైన] మహావాక్యాలు, వాటి అర్థము వినటము, అనుసంధానమును - చేయటమే **శ్రవణము** అంటారు.

విన్న వాక్యముల అర్థమును సమన్వయించుకోవటమును **'మననము'** అంటున్నారు.

ఆవిధంగా వేదమహావాక్యాల శబ్ద-అర్థముల శ్రవణ-మననములచే తెలియవచ్చు స్వస్వరూపాత్మ స్వభావమును తెలుసుకోవాలి. ఆత్మ గురించిన సంశయాలను తొలగించుకోవాలి. **అఖండ-సచ్చిదానంద ఆత్మ స్వతత్వమునందు** బుద్ధిని నిలపాలి. దృష్టి-ధ్యాస-ఏక భావనలను బుద్ధియొక్క అనన్యానుభవముగా చేసే ప్రయత్నము **నిదిధ్యాస** (ఏకాకార వృత్తి)-అంటారు.

ఆత్మ దృష్ట్యా సర్వదా ఏకమే అయి ఉండి కూడా,... ధ్యాస (Avocation) కారణంగా ఇక్కడంతా అనేకత్వముగా స్థూల దృష్టికి అనుభవమౌతోంది. శ్రవణ-మనన-నిది ధ్యాసల సహాయంతో మనలోని ధ్యానము చేయువాడు (Perciver) - ధ్యానము (Perception) లను పరిత్యజించి క్రమంగా ఏకము-అఖండము అగు ఆత్మవస్తువుయందు - గాలి కదలికలు లేనిచోట దీపము నిశ్చలమయి ఉన్నట్లు- **చిత్తమును నిశ్చలము చేయుటయే సమాధి.**

చిత్తమును వృత్తి రహితం చేసి నివాత స్థితిలో దీపము (గాలి వీచనిచోట దీపము) వలె వృత్తి రహితం చేస్తే లభించే 'వృత్తి రహిత చిత్త స్థితి' అనబడే సమాధి స్థితిలో కూడా వృత్తి ఉంటుంది. **'ఆత్మయే దర్శించటము'** అనే ఒక వృత్తి ఇంకా శేషించియే ఉంటుంది. అయితే అట్టి స్మరణరూప వృత్తి 'అంతా మమాత్మయే' ... అనే వృత్తిరూపము కలిగి ఉంటుంది. కనుక నివృత్తి రూపమే!

చిత్తమును నిర్మలముగా ఉంచటం అనే సాధనావృత్తి నుండి కొంచెము ఈవలకు రాగానే, మరల ప్రాపంచక వృత్తులు బయల్వెడలతాయి-అనునదియే సంచిత

సంచితాః కర్మకోటయః
అనేన విలయం యాంతి
శుద్ధ ధర్మో వివర్ధతే॥

కర్మల రూపమగు  సంసారము. అట్టి ఇతఃపూర్వపు దృశ్యతాదాత్మ్య పూర్వక సంసారము సమాధి సాధనచే తొలగి, **అఖండత్వము-అప్రమేయత్వము- నిత్యత్వము** ... మొదలైన ఆత్మధర్మము రూపుదిద్దుకోవాలి. అట్టి ఆత్మధర్మము పెంపొంది, **"ఇదంతా మమాత్మస్వరూపమే"**.... అనే శుద్ధ ధర్మమునకు దారి చూపగలదు.

---

**9. ధర్మమేఘమ్ ఇమం ప్రాహుః**
**సమాధిం యోగవిత్తమాః।**
**వర్షతి ఏష యథా ధర్మాః**
**అమృతధారాః సహస్రశః॥**

మండుటెండలచే, తీవ్రమైన వడగాలులచే వేడెక్కియున్న ఒక ప్రదేశము - మేఘములు వచ్చి వర్షించినప్పుడు - మొత్తమంతా చల్లబడుతుంది కదా! అట్లాగే సమాధి (చిత్తమును నిర్విషయము చేసి ధారణచేయు సాధన)చే **"ఆత్మ ధర్మము"** అనే అమృతధార వర్షించి ఈ కనబడు దానినంతా ఆత్మ భావామృతమయంగా చేస్తోంది. అందుకే యోగ వేత్తలు **"సమాధి ఆత్మధర్మ వర్షమునకు మేఘము వంటిది"** అని అభివర్ణిస్తున్నారు.

**అమునా వాసనాజాలే**
**నిశ్శేషం ప్రవిలాపితే,**
**సమూలా ఉన్మీలితే**
**పుణ్య-పాపాఖ్యే కర్మ సంచయే।**

హృదయములో దట్టంగా పేరుకొనియున్న వాసనాజాలమే ఈ జీవుని పుణ్య-పాప కర్మ పరంపరల అంగీకారానుభవ కారణమగుచున్నాయి. నిర్వికల్ప సమాధి యొక్క అభ్యాసముచే పుణ్య-పాప కర్మ సంచయమంతా సమూలంగా తొలగిపోగలదు. నేను ఇంకా ఏదో చేస్తే గాని సుఖము లేదు. (లేదా) ఆత్మ లభించదు - అనునది సమాధియొక్క అభ్యాసముచే సన్నగిల్లుతోంది. **ఆత్మయొక్క 'అహమేవ' భావన స్వతః సిద్ధము, స్వయం సిద్ధము** అగుచున్నది.

**వాక్యమ్ అప్రతిబద్ధం సత్ –**
**ప్రాక్ – పరోక్షో న భాసతే।**
**కర ఆమలకవత్ బోధమ్**
**'అపరోక్షం' ప్రసూయతే।**

"తత్ త్వము - సోఽహమ్" ... మొదలైన వాక్యముల అర్థమేమిటి? ఎందుకలా అంటున్నారు? ... అనే అర్థ - మనన-విచారణలచే ప్రత్యక్ష - పరోక్ష జగత్‌రూప భాసనమంతా తొలగి..., "అరచేతిలో ఉసిరికాయ" వలె అఖండాత్మానుభవము అత్యంత సుస్పష్టము కాగలదు. అపరోక్షఆత్మ సాక్షాత్కారము ప్రాప్తించగలదు.

**వాసనా అనుదయో భోగ్యే**
**వైరాగ్యస్య తదా అవధిః,**

"ఏదో పొందాలి - చేయాలి - ఇంకా మారాలి" ...  ఇటువంటి భోగ వాసనలు ఉదయించక పోవటమే... వైరాగ్యము యొక్క **పరమావధి.**

**అహం భావ-ఉదయా అభావో**
**బోధస్య పరమాఽవధిః।**

పరిమితము - సంకుచితము అగు "నేను - నాది" ... అనునవి ఉదయించక, **అభావ రూపము** పొందటమే **బోధ (లేక) సమాధి యొక్క పరమావధి.**

**లీనవృత్తేః అనుత్పత్తిః**
**మర్యాదా ఉపరతి అస్తుసా,**

చిత్తము విషయములందు ప్రవేశించనట్టి వృత్తియొక్క అభ్యాసరత స్థితియే **ఉపరతి** యొక్క పరాకాష్ఠ స్థితి! అంతేగాని, **పాండిత్యముచే ఉపరతి లభించదు.**

**స్థితప్రజ్ఞో యతిః అయం**
**యః సదా ఆనందమ్ అశ్నుతే।**
**బ్రహ్మణ్యేవ విలీనాఽత్మా**
**నిర్వికారో వినిష్క్రియః॥**

ఎప్పుడైతే చిత్తము విషయముల మననము త్యజిస్తుందో అప్పుడు ఆ యతి **స్థిత ప్రజ్ఞుడు** అగుచున్నాడు. అట్టి స్థితప్రజ్ఞుడు సర్వదా ఆనందము పొందుచూ స్వభావంగా సదానంద స్వరూపుడగుచున్నాడు. ఎవ్వడైతే తన జీవాత్మత్వమును నిర్వికారము- నిష్క్రియము అగు బ్రహ్మమునందు విలీనము చేసి తాను బ్రహ్మమే అగుచున్నాడో, ఆతడే **స్థితప్రజ్ఞుడు.** ఆతని ఆత్మానందమునకు ఈ దేహ - మనో-దృశ్యాదులు గాని, లోకలోకాంతరములు గాని అవధులను కల్పించ జాలవు.

---

**10. బ్రహ్మాఽత్మనోః శోధితయోః**
**ఏకభావా అవగాహినీ,**

'ఈశ్వరుడు' అనబడు 'తత్'ను జీవుడు అనబడు 'త్వమ్'ను, ఈ రెండిటియొక్క ఏకత్వముగా నిర్వచించునదే 'బ్రహ్మము' యొక్క శబ్దార్థము. ఈ శబ్దార్థ మహిమలను శోధించి పరిశీలించినప్పుడు - జీవ - జగత్ - ఆత్మల ఏకత్వముయొక్క **అవగాహన- అనుభూతి-అనుభవము** రూపుదిద్దుకుంటున్నాయి.

**నిర్వికల్పాచ చిన్మాత్రా వృత్తిః**
**'ప్రజ్ఞ' – ఇతి కథ్యతే।**
**సా సర్వదా భవేత్ అస్య**

అట్టి ఏకత్వానుభవ స్థితియే నిర్వికల్ప స్థానము. చిత్తమును వృత్తిరహితం చేసి, స్థితింపజేస్తూ ఉండటము ... అనే చిన్మాత్ర - వృత్తినే శాస్త్రములు **'ప్రజ్ఞ'** అని పిలుస్తున్నాయి.

స 'జీవన్ముక్త' ఇష్యతే ।
దేహ–ఇంద్రియేషు 'అహం'భావ,
'ఇదం' భావః తదన్యకే,
యస్య నో భవతః క్వాఽపి
స 'జీవన్ముక్త' ఇష్యతే।
న ప్రత్యక్ బ్రహ్మణోః భేదం
కదాఽపి బ్రహ్మ సర్గయోః
ప్రజ్ఞయా యో విజానాతి
స 'జీవన్ముక్త' ఇష్యతే।
సాధుభిః పూజ్యమానే అస్మిన్,
పీడ్యమానేఽపి దుర్జనైః,
సమభావో భవేత్ యస్య
స 'జీవన్ముక్త' ఇష్యతే।
విజ్ఞాత బ్రహ్మతత్త్వస్య
యథాపూర్వం న సంసృతిః
అస్తిచేత్ న సవిజ్ఞాతా
బ్రహ్మభావో బహిర్ముఖః।
సుఖాది అనుభవో యావత్
తావత్ ప్రారబ్ధమ్ ఇష్యతే।
ఫలోదయః క్రియాపూర్వో
'నిష్క్రియో', నహి కుత్ర చిత్॥

ఎవ్వనికైతే - **"జీవుడు - జగత్తు - ఈశ్వరుడు సర్వదా ఏక స్వరూపమే! బ్రహ్మమే!"** అను అనుభవము అనునిత్యమౌతుందో, ఆతడే **జీవన్ముక్తుడు.**

ఎవ్వరికైతే - ఈ దేహము - ఇంద్రియములు - ఇంద్రియ విషయములు - అహంభావము - తదితర భావములు-ఇవన్నీ ఆత్మయొక్క చమత్కార విశేషములై, "ఆత్మకు ఏమాత్రము భిన్నము కాకయే ఉన్నాయి" ..... అని అకృతిమంగా - స్వభావ సిద్ధంగా అనిపిస్తుందో,.... అతడే **జీవన్మక్తుడు.**

బ్రహ్మమునందు-"ఇది బ్రహ్మము-ఇది సర్గము (దృశ్యము)" ... అను భేదమే లేదు. "నాకంటే వేరుగా బ్రహ్మము లేదు, దృశ్యములేదు" ... అని ప్రజ్ఞచే సుస్పష్టముగా నిర్దుష్టముగా, స్వభావికంగా తెలుసుకొని ఎవడు ఉంటాడో, ఆతడే **జీవన్మక్తుడు.**

కొందరు సాధుభావముతో తనను పూజిస్తున్నప్పుడు, మరి కొందరు దుర్జనులై తనను భాధిస్తున్నప్పుడు కూడా, **"పరమాత్మయే ఇదంతా అహమేవ ఇదం సర్వమ్!"** అను ఎరుకతో సర్వదా సమరస భావనయే కలిగి ఉంటాడో..., అతడే **జీవన్మక్తుడు.**

బ్రహ్మతత్త్వము ఏమిటో, ఎట్టిదో, ఏమియో ఎరిగిన తరువాత, ఇక పూర్వమువలె ఆతడు దృశ్యపరంపరా రూపమగు **సంసృతి** పొందడు. సమాధి నుండి బయల్వెడలి దృశ్యమును పొందుచున్నప్పుడు కూడా, బహిర్ముఖుడగుచూ కూడా బ్రహ్మమునే దర్శిస్తూ ఉంటే ఆతడు **విజ్ఞుడు-(తెలుసుకోవలసినది తెలుసుకున్నవాడు) అగుచున్నాడు. తెలుసుకొనువాడు-తెలియబడునది బ్రహ్మమే అయినప్పుడు ఇంక ఎక్కడ మాత్రం ఏమున్నది? బ్రహ్మమునకు వేరే ఏదీ లేదు! తానే సర్వమై బ్రహ్మమై వెలుగొందుతాడు!**

ఇతః పూర్వపు (ఇదివరకటి) కర్మలే సుఖ-దుఃఖాలుగా పరిణమిస్తూ ఉంటాయి - అనునదే ప్రారబ్ధము యొక్క నిర్వచనం! కర్మలకు మునుముందే ఉన్న నిష్క్రియమగు ఆత్మ స్వరూపమే సిద్ధించిన తరువాత, ఇక కర్మలు ఎక్కడ? కర్మలే లేవు. కర్మలే లేనప్పుడు ప్రారబ్ధము యొక్క ప్రసక్తి ఎక్కడిది?

---

11. 'అహంబ్రహ్మ' ఇతి విజ్ఞానాత్
కల్పకోటి శత ఆర్జితమ్
సంచితం విలయం యాతి,
ప్రబోధాత్ స్వప్న కర్మవత్।
స్వం అసంగమ్ ఉదాసీనమ్
పరిజ్ఞాయ నభో యథా,
న క్లిశ్యతే యతిః కించిత్
కదాచిత్ భావి కర్మభిః॥
న నభో ఘటయోగేన
సురాగంధేన లిప్యతే,
తథా ఆత్మోఽపాధి యోగేన
తత్ ధర్మో నైవ లిప్యతే।
జ్ఞానోదయాత్ పురా ఆరబ్ధమ్ కర్మ
జ్ఞానాత్ న నశ్యతి।

ఒకడు నిదుర లేవగానే నిద్రపోతున్నప్పటి ఆతని సుదీర్ఘమైన స్వప్నము (కల)లోని విషయాలు స్వప్న దృశ్యముతో సహా మటుమాయమౌతున్నాయి కదా! అదే రీతిగా, కోటి కల్పములలో సముపార్జించుకొనియున్న సంచిత వ్యవహార పరంపరలన్నీ కూడా **"నేనే బ్రహ్మమును. నేను బ్రహ్మమునే"** అని ఎరిగిన మరుక్షణం - మొదలంట్లా మటుమాయమగుచున్నాయి.

ఏవిధంగా అయితే ఆకాశము దేని చేతనూ స్పృశించబడనిదై, సంబంధించనిదై ఉంటోందో.... "నేను అసంగుడను" అని ఎరిగిన ఆత్మజ్ఞాని కూడా అట్లా సర్వమునకు అసంగుడై, ఉదాశీనుడై ఉంటున్నాడు.

ఇక ఆ యతి సంచిత కర్మలచేత గాని, భవిష్యత్ కర్మలచేత గాని సంబంధితుడు, బంధితుడు కాడు.

కుండలోని ఆకాశము (Space) కుండలో గల సుర (సారా, మత్తు పానీయము) యొక్క వాసన (Smell) చే దోషము పొందుతుందా? పొందదు కదా! దేహ- **ఉపాధిత్వమును** దాటి **ఆత్మ-ఉపాధిత్వమును** ఆశ్రయించు యోగి జీవుడు- జగత్తు-ఇంద్రియముల ధర్మములు మొదలైన వాటిచే స్పృశించబడడు. దోషము పొందడు. అజ్ఞాని మాత్రమే దేహ-మనో-ధర్మములను తనపై ఆపాదించుకుంటున్నాడు.

అదత్వా స్వఫలం లక్ష్యమ్
ఉద్దిశ్యః ఉత్సృష్ట బాణవత్।
వ్యాఘ్ర బుద్ధ్యా వినిర్ముక్తో
భాణః పశ్చాత్ తు గోమతౌ,
న తిష్ఠతి భినత్త్యేవ,
లక్ష్యం వేగేన నిర్భరమ్।
అజరోఽస్మి, అమరోఽస్మి-ఇతి
య ఆత్మానం ప్రపద్యతే,
తదా ఆత్మనా తిష్ఠతో యస్య,
కుతః పారబ్ధ కల్పనా?

**ఒక చిన్న విషయం!** ఆత్మ జ్ఞానము ఉదయించినంత మాత్రముచేత, అట్టి జ్ఞానముచేత ప్రారబ్ధకర్మ యొక్క సందర్భములు తొలుగుతాయా? తొలగవు. సంధించి వదలిన బాణము, ఇక ఆగమన్నా ఆగక, లక్ష్యము వైపుకే వెళ్ళ తీరుగా.... ప్రారబ్ధము ఆత్మజ్ఞాని పట్ల కూడా కొనసాగుతూనే పోతుంది.

ఒకడు, 'అది పులి' అని అనుకొని బాణమును విడచిన తరువాత, "అరెరే! అది పులికాదే! ఆవు కదా! ఓ బాణమా! ఆగాగు...." అని అన్నా కూడా, సంధించి విడచిన బాణము వెనుకకు మరలదు. అది వేగముగా పోయి లక్ష్యమును తాకక మానదు కదా!

**అయితే, ఇంకొక విషయం కూడా! "జరామరణములకు, కర్మ-కర్మ ఫలములకు కించిత్ కూడా సంబంధించనట్టి ఆత్మను 'నేను"....** అని తెలుసుకొని, ఆత్మనే ఉపాసిస్తూ, ఆత్మయందే తిష్టత్వము (Placement) కలిగి ఉన్న వానిపట్ల పారబ్ధము ... అనుదాని కల్పనకు చోటు ఎక్కడిది? కలలోని గృహాలు నిజంగా ఉన్నాయా?

---

12. ప్రారబ్ధం సిధ్యతి తదా,
యదా దేహాఽత్మనా స్థితిః।
దేహాఽత్మభావో నైవేష్టః
ప్రారబ్ధం త్యజ్యతామ్ అతః।
ప్రారబ్ధ కల్పనాఽపి అస్య
దేహస్య భ్రాంతిరేవ హి।
అధ్యస్తస్య కుతః సత్వమ్?
అసత్తి అస్య కుతో జనిః?
అజాతస్య కుతో నాశః?
ప్రారబ్ధమ్ అసతః కుతః?
జ్ఞానేన అజ్ఞానకార్యస్య
సమూలస్య లయో యది,
తిష్ఠతి అయం కథం దేహ
ఇతి శంకావతో జడాన్?
సమాధాతుం బాహ్య దృష్ట్యా
'పారబ్ధం' వదతి శ్రుతిః
"నతు దేహాఽది సత్యత్వ"
బోధనాయ విపశ్చితామ్।
పరిపూర్ణమ్। అనాద్యతం ।
అప్రమేయమ్। అవిక్రియమ్।
సద్ఘనమ్! చిద్ఘనం! నిత్యం!
ఆనన్దఘనమ్! అవ్యయమ్!
ప్రత్యక్! ఏకరసం! పూర్ణమ్!
అనన్తమ్! సర్వతోముఖమ్!
అహేయమ్! అనుపాదేయమ్!
అనాదేయమ్! అనాశ్రయమ్॥

అందుచేత, దేహాత్మ భావ స్థితి కొనసాగుచున్నంత వరకు, జీవునికి **"ప్రారబ్ధము ఉన్నదయ్యా"** ... అని బోధించబడుతోంది.

దేహాత్మభావనను అధిగమిస్తున్న యోగి విషయంలో క్రమంగా ప్రారబ్ధకర్మల పట్ల, దృశ్యసంబంధమైన కోరికలపట్ల **"అవి ఎక్కడున్నాయిలే!"** ... అను రూపము గల త్యాజ్యబుద్ధి ప్రవృద్ధమగుచున్నది. మరికొంత విచారణ చేస్తూ ఉండగా..., **"మాయలోని ఒక వస్తువు మాత్రమే అయి ఉన్న ఈ దేహము-దీనికి సంబంధించిన ప్రారబ్ధకర్మలు .... భ్రాంతి (illusion) మాత్రమే"** ... అని తెలియవస్తోంది. అనగా, భ్రమ ఉన్నంత వరకే ప్రారబ్ధము. సత్యదృష్టిచే అది లేదు.

కల్పనా చమత్కారంగా కనిపించే దానికి సత్త (ఉనికి) ఎక్కడిది? ఉనికియే లేనిదానికి జననమెక్కడిది? జననము (ఉత్పత్తియే) లేని దానికి నాశనము ఎక్కడిది?.... ఈ రీతిగా 'ప్రారబ్ధము' అనబడునది మొదలే లేనిదైయుండగా... అది జనించటమేమిటి? మరెప్పుడో అది తొలగటమెక్కడిది? అటువంటిదేమీ లేదు.

ఆత్మతత్త్వ జ్ఞానముచే అజ్ఞాన కార్య వ్యవహారము సమూలముగా శమించు చుండగా... ఇక 'జడమే' అయినటువంటి ఈ దేహమునకు స్వకీయమైన ఉనికి ఎక్కడిది? లేనిదే అగుచున్నది. దేహము-దృశ్యము కూడా ఐహిక మోహములోని స్వప్న చమత్కారము లౌతాయి. స్వప్నంలో దేహమే లేకుండా అనుభవాలు ఉంటున్నాయి కదా!

"నాకు ఈ బాహ్యమైన బాధలన్నీ ఎందుకొస్తున్నారా బాబూ" అని ఆవేశముగా జడమగు దేహమును దృశ్యమును నమ్మి శంక కలిగి ఉన్నవానిని కొద్దిసేపు సమాధాన పరచటానికి మాత్రమే శ్రుతులు ప్రారబ్ధము గురించి చెప్పుకొస్తున్నాయి.

"దేహాదులు మొదలే సత్యము కాదు" అనే బోధ దర్శనమునకు, ఆత్మ సాక్షాత్కారమునకు అర్హుడగు విద్యార్థికి ప్రారబ్ధము లేదనియే చెప్పబడుతోంది!

స్వస్వరూపము, సహజ స్వరూపము అగు ఆత్మ

- ❖ పరిపూర్ణము
- ❖ అనాద్యంతము, అప్రమేయము,
- ❖ నిష్క్రియము, సద్ఘనము,
- ❖ నిత్యము, ఆనంద ఘనము,
- ❖ అవ్యయము, ప్రత్యక్ రూపము
- ❖ ఏకరసము, పూర్ణము,
- ❖ అనన్తము, అన్నివైపులా ముఖద్వారములు కలిగినట్టిది.

ఆత్మకు - వదల వలసినదిగాని, స్వీకరించవలసినదిగాని ఇక్కడ ఏదీ లేదు-ఆత్మ ఒక చోటనుండి వచ్చునది కాదు. మరొకచోటికి వెళ్ళునది కాదు. దేనినీ ఆశ్రయించి ఉండునది కాదు.

13. నిర్గుణమ్। నిష్క్రియమ్। సూక్ష్మమ్। నిర్వికల్పమ్। నిరంజనమ్।
అనిరూప్య స్వరూపం యత్, మనోవాచామ్ అగోచరమ్।
సత్-సమృద్ధం। స్వతస్సిద్ధం। శుద్ధం। బుద్ధం। అనీదృశమ్।
ఏకమేవాఽద్వయం బ్రహ్మ।
నేఽహ నానాఽస్తి కించన।।
స్వానుభూత్యా స్వయం జ్ఞాత్వా
స్వమాత్మానమ్ అఖండితమ్,
స సిద్ధః సుముఖం తిష్ఠత్
నిర్వికల్పాఽత్మనాఽత్మని।
క్వ గతం? కేనవా నీతం? కుత్ర లీనం ఇదమ్ జగత్?
అధునైవ మయా దృష్టం నాస్తి
కిం మహత్ అద్భుతం?
కిం హేయం? కిం ఉపాదేయం?
కిం అన్యత్? కిం విలక్షణమ్?
అఖండానంద పీయూష పూర్ణ బ్రహ్మమహార్ణవే,
న కించిత్ అత్ర పస్యామి, న శృణోమి న వేద్మి అహమ్।
స్వాత్మనైవ సదానందరూపేణాఽస్మి స్వలక్షణః।
అసంగోఽహమ్! అనంగోఽహమ్!
అలింగోఽహమ్! అహమ్ హరిః।
ప్రశాంతోఽహమ్। అనంతోఽహమ్।
పరిపూర్ణః చిరంతనః।
అకర్తాఽహమ్। అభోక్తాఽహమ్।
అవికారోఽహమ్। అవ్యయః।
శుద్ధబోధస్వరూపోఽహమ్। కేవలోఽహం సదాశివః।

ఇంకా కూడా,.... ఆత్మ....
నిర్గుణము! నిష్క్రియము! నిర్వికల్పము! దోషములచే స్పృశించబడదు! నిరంజనము! రూపరహితమయినది! మనస్సు - వాక్కులకు అగోచరమైనది!
సత్‌స్వరూపముగా సమృద్ధమైనది! స్వతః సిద్ధము!
శుద్ధము! పరమ మౌనస్వరూపము!
బుద్ధము! కళ్ళకు కనబడనిది!
బ్రహ్మము సర్వదా ఏకము. అద్వితీయము. "ఇక్కడ ఏకమేగాని, కించిత్ కూడా అనేకము లేదు. ఆత్మ స్వానుభవమేగాని, మరొకరిచే తెలియబడేది కాదు".... అని మహావాక్యములు చెప్పుచున్నాయి.
అట్టి స్వస్వరూపాత్మను 'అఖండము' అని స్వానుభవముచే ఎరిగినప్పుడు, అట్టి ఆత్మయోగి నిర్వికల్పాత్మను తనయందే సిద్ధింపజేసుకొనుచున్నాడు. ఆత్మయందే స్థానము కలిగియున్నవాని దృష్టిచే..., "ఈ జగత్తు ఎక్కడ ఉన్నది? ఎక్కడినుండి తేబడింది? ఎందులో లీనమౌతుంది?" .... అను ప్రశ్న మొదలంట్లా తొలగిపోతోంది.
**"మహత్తరము, అద్భుతము అని చెప్పబడు జగత్తు"** అనబడునది నా దృష్టికి **కనబడటమే లేదయ్యా! స్వప్నంలోని వస్తువులకు ఉనికి ఎక్కడిది?**
"లేని జగత్తులో వదలవలసినదేది? పట్టుకోవలసినదేముంటుంది? ఈ రెండూ కానిదేది? ఈ దృశ్యములో విలక్షణమనతగినదంటూ ఏమున్నది?"
అఖండానంద స్వరూపమగు పూర్ణబ్రహ్మ మహాసముద్రములో సాకార-గుణ-సామ్యరూపమైనదేదీ నాకు **కనబడటం లేదు. వినబడటం లేదు. ఆత్మకు వేరుగా ఏదీ తెలియబడటమూ లేదు.**
స్వకీయ లక్షణము చేతనే సదానంద రూపమగు స్వాత్మ జగత్ దృశ్యమువలె విరాజిల్లుచున్నది. నేను-నీవు ఆత్మస్వరూపులమే!
నేను దేనితోనూ సంగములేనివాడను! అంగ (అవయవ) రహితుడను! నామ రూప రహితుడను. కదిలే దేహమును కదిలిస్తున్న చైతన్య స్వరూపుడనగు నాకు స్త్రీ - పురుష లింగభేదమేమున్నది! 'హరి' అని ఏ తత్త్వమును పౌరాణికులు పిలుస్తున్నారో అది నేనే! నన్నే! సర్వమై ఉన్నవాడను.
నేను సర్వదా పరమ ప్రశాంతమగు ఆత్మ స్వరూపుడను. ఆది-అంతము లేనివాడను! పరిపూర్ణుడను! చిట్ట చివరికి శేషించు చిరంతనుడను! జన్మ-దేహ-జగత్ వికారములు లేనివాడను! అవ్యయుడను!
శుద్ధబోధ స్వరూపుడను! కేవలుడను! ఎల్లప్పుడూ శివ స్వరూపుడను! సదాశివుడను!

---

14. ఏతాం విద్యాం అపాంతరతమాయ దదౌ।
అపాంతరతమో బ్రహ్మణే దదౌ।
బ్రహ్మ ఘోరాంగిరసే దదౌ।
ఘోరాంగిరా రైక్వాయ దదౌ।
రైక్వో రామాయ దదౌ।
రామః సర్వేభ్యో భూతేభ్యో దదౌ।
ఇతి ఏతత్ నిర్వాణాఽనుశాసనం।
వేదాఽనుశాసనం।
వేదాఽనుశాసనం।
ఇతి అధ్యాత్మోపనిషత్
ఓం శాంతిః శాంతిః శాంతిః

ఈ అధ్యాత్మోపనిషత్ వర్ణితమైనట్టి ఆత్మవిద్య అపాంతరతమునికి (నారాయణుడు అనే మహనీయునికి) సదాశివునిచే ఇవ్వబడింది. ఆ నారాయణుడు బ్రహ్మదేవునికి ప్రసాదించటం జరిగింది. ఆయన ఘోరాంగిరసునికి అందించారు. ఘోరాంగిరస మహర్షి రైక్వాయన మునీంద్రులకు అందించారు. ఆ రైక్వుడు శ్రీరామునికి అందించారు.
ఆ శ్రీరాముని ద్వారా సర్వజీవులకు ప్రసాదించబడుచున్నది.
**ఇది ఉపనిషత్ నిర్వాణానుశాసనము.**
**వేద ప్రవచన శాసనము!**
**వేదాను శాసనం!**
**ఇతి అధ్యాత్మోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 1 అధ్యాత్మోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



ఈ ఎదురుగా కళ్ళకు కనిపిస్తున్న సర్వభౌతిక దేహములలోని బుద్ధిగుహలలో అంతర్యామియై **"అఖండమగు ఆత్మభగవానుడు"** సర్వదా వేంచేసియున్నారు. ఆయన ఏకరూపుడై, అఖండుడై, నిత్యుడై ఈ అసంఖ్యాక శరీరములలో ఎల్లప్పుడు ప్రకాశించుచున్నారు. మహామహితాత్ముడై వెలుగొందుచున్నారు.

**ఆయనది ఏ శరీరము? ఎక్కడ సంచరిస్తున్నారు? ఎవరికి ఆయన గురించి తెలుసు?**

- ఈ పృథివి (భూమి) అంతా ఎవ్వరికి శరీరమై ఉన్నదో..., ఏది ఈ పృథివి యొక్క అంతరమున సంచారము కలిగియున్నదో..., అట్టి **కేవలాత్మ పురుషుని** గురించి **పృథివికి తెలియకయే** ఉన్నది !
- జలము – జలతత్త్వము ఎవ్వరికి శరీరమో, ఎవ్వరు జలమునందు అంతర్యామియై వెలుగొందుచూ సంచరించుచున్నారో..., అట్టి **నిత్యాత్మ పురుషుని** గురించైతే **జలమునకు ఎరుక లేకయే** అగుచున్నది !
- ఎవ్వరికి తేజస్సు (అగ్ని) శరీరమే అయి ఉన్నదో., ఎవ్వరు తేజస్సునందు అంతర్యామియై ప్రకాశించుచున్నారో..., అట్టి తేజో–ఆత్మభగవానుని గురించైతే **తేజస్సుకు తెలియవచ్చుట లేదు !**
- ఏ తత్త్వమైతే వాయువును తన శరీరముగా కలిగిఉన్నదో... వాయువునకు అంతః సంచారి అయి చైతన్యవంతము చేయుచున్నదో... కదలికలకు దివ్యశక్తిత్వము ప్రసాదిస్తోందో.., అట్టి చైతన్యాత్మ గురించి వాయువుకు తెలియుట లేదు. దేనికి ఆకాశము శరీరమై ఉన్నదో అట్టి చైతన్యాత్మ గురించైతే **ఆకాశము ఎరిగి ఉండుట లేదు !**
- **ఏది** మనస్సును తన యొక్క శరీరముగా కలిగియున్నదో..., అట్టి మనస్సుకు ఏది అంతర్యామియై, అంతర – ఆధారమైయున్నదో.., అట్టి **మనోజనన స్థానమగు** ఆత్మ గురించైతే **మనస్సుచేత "ఇది ఇట్టిది" అని యోచించబడటము లేదే !**
- ఏ **మహత్ తత్త్వమైతే** బుద్ధిని తన శరీరముగా కలిగి ఉండి వ్యవహరిస్తోందో.., ఏదైతే బుద్ధియందు అంతరముగా వేంచేసి సంచారము కలిగియున్నదో.., చిదాత్మగురించైతే **బుద్ధి అవగాహనము కలిగి ఉండటమే లేదుమరి !**
- ఏ **కేవలీ తత్త్వమైతే** చిత్తమును తన శరీరముగా కలిగి ఉండి వ్యవహరిస్తోందో.., చిత్తము యొక్క అంతరమున వ్యవహారశీలి అయి సంచారములు నిర్వర్తిస్తోందో..., ఆ చిత్–తత్త్వము గురించి **చిత్తమునకు ఎరుక కలగటము లేదే !**
- ఏ పర–ఆత్మ తత్త్వమైతే (సర్వ దేహములలోని) అహంకారములను తన శరీరముగా కలిగియున్నదో.., ఏదైతే అహంకారమునకు అహంకారమై అంతర్యామి అయి సంచరిస్తోందో., అట్టి ఆ అహమ్ తత్త్వము గురించి **అహంకారమునకు 'ఇది ఇట్టిది'... అను అవగాహన కలుగుటలేదు!**
- 'అవ్యక్తము'ను తన శరీరముగా కలిగి ఉండి, ఆ అవ్యక్తమునకు అంతర్యామిఅయి సంచరిస్తూ ఉన్నా కూడా, ఆ **అవ్యక్తమునకు అద్దానిని గురించి (ఆత్మగురించి) తెలియవచ్చుటయే లేదు !**

- 'అక్షరము'ను తన శరీరముగా కలిగి ఉండి, అద్దానికి అంతర్యామిఅయి సంచారములు నిర్వర్తిస్తూ ఉన్నప్పటికీ, ఆ **అక్షరముచే అట్టి కేవలాత్మ గురించి ఎరుగబడటము లేదు !**
- ఆత్మ మృత్యువు తన శరీరముగా కలిగి ఉండి, మృత్యువుకు అంతర్యామిగా సంచరిస్తున్నప్పటికీ, **ఆ మృత్యువునకు అట్టి అమృతాత్మ తెలియబడటము లేదు !**

  అట్టి.... ఆత్మభగవానుడే **సర్వజీవుల అంతరాత్మ ! సర్వాంతర్యామి! అంతర హృదయ విహారి !** ఆయనయే దోషరహితమైన యోగులకు అనుభవమగుచున్న **ఏకో నారాయణః ॥**

స్వప్నంలో ఉండి, స్వప్న దృశ్యమును 'అనన్యము'గా అనుభవిస్తున్న నేను,.... **"స్వప్నమంతా నాదైన నేను"** ...ను గమనించకపోవటం వంటిదే అదంతా!

**బిడ్డలారా! శ్రోతలారా!**

మన యొక్క స్వస్వరూపాత్మ ఎంతటి మహత్తరమైనదో పై వాక్యములను అనుసరించి గమనిస్తున్నారు కదా ! మరి "అది ఎందుకు అనుభవమునకు లభించటం లేదు?"... 1. ఆత్మను గురించిన ఏమరుపు. 2. దృశ్యసంబంధమైన అభ్యాస – వ్యసనము.

ఆత్మ **అఖండము** కాబట్టి....,

ప్రతి జీవుని యొక్క ఆత్మ మనము చెప్పుకొన్న రీతిగా **మహత్తరము, అఖండము కూడా!** అయితే సహజ రూపమగు ఆత్మను ఏమరచుటచేతనే, ఈ జీవుడు 'నేను – నేను' అను **భావనా** సంకల్పమునకు **మునుముందే** ఉన్న **స్వస్వరూపమునకు సంబంధించిన** సమాచారమును పరిశీలించటం లేదు. సందర్భ స్వరూపమునకు మాత్రమే పరిమితమై, **"నేను బద్ధుడను...."** అను అభినివేశమునకు చోటు ఇస్తున్నాడు. సందర్భ సంబంధమైన (That which is incidentally related) **అహమ్ – మమ (నేను – నాది)** లను మాత్రమే తనకు సంబంధించిన పూర్తి సమాచారమని భావించి ఈ జీవుడు దుఃఖితుడు అగుచున్నాడు. ఆత్మతత్త్వమును ఎరిగిన మహనీయులు ఈ జీవునికి ఆతని సహజమగు ఆత్మ గురించి ఎలుగెత్తి గుర్తు చేస్తున్నారు.

**అహమ్ - మమ ఇతియో భావో, దేహాక్షాదాః అనాత్మని !**

అందుచేతనే, ఈ దృశ్యాంతర్గతంగా స్వీయకల్పితమైనట్టి, 'నేను – నాది' అను ఏ పరిమిత – సంకుచిత భావములు అనుభూతమగుచున్నాయో .... వాటిని ఉపనిషత్ వాణి విశ్లేషించి పరమ సత్యమును ప్రబోధిస్తోంది !

1) "ఈ దేహమే నేను" అను దృష్టియే దేహాత్మ భావము. మనము **దేహి** (one who is operating the body) అయి ఉన్నాము. అంతేగాని 'దేహము'– కాదు. దేహము మనకు **ఉపకరణము** (Instrument being used) మాత్రమే !
2) ఈ 'అహమ్ – మమ' అను లోకసంబంధమైన, లోకాంతర్గతమైన భావనలు సహజమగు స్వీయాత్మ యొక్క ఔన్నత్యమును అనుభవమునకు రాకుండా కప్పి ఉంచుచున్నాయి. కాబట్టి **'అనాత్మ'** అని చెప్పబడుచున్నాయి.

**"నేను ఈ భౌతిక దేహపరిమితుడను"** – అను పరిమిత (సంకుచిత, అపరిశీలనాత్మకమైన) భావన – అపరిశీలన కారణంగా ఏర్పడుతోంది కాబట్టి **"అధ్యాస" (Peception or avocation that took form due to non - examining of the Finest and first fact of One's Own self)**... అని పిలువబడుతోంది.

**అయం అధ్యాసో నిరస్తవ్యో - విదుషా బ్రహ్మనిష్ఠయా ।**

జగత్ స్వప్నాంతర్గతమైన "అహమ్ – మమ" అనునవి స్వతఃగా ఉన్నవి కావు. నాటకంలో పాత్ర సంబంధమైన భావావేశముల వంటివే! **'దేహమే నేను'** అను రూపమైనట్టి **దేహాత్మ భావనచే** అవి రూపు దిద్దుకుంటున్నాయి..." అని విదుషులు (వివేక పాండిత్య సంపన్నులు) అగు బ్రహ్మనిష్ఠులచే ప్రవచించబడుతోంది.

## వృత్తిసాక్షిః సోఽహమ్

ప్రియసహోదరా !

బుద్ధికి ఈవల ఈ ఇంద్రియ దృశ్య జగత్తంతా అనుభూతమై కనిపిస్తోంది కదా ! బుద్ధి యొక్క వృత్తుల రూపమే ఈ దృశ్య జగదనుభవ మంతా! అట్టి బుద్ధికి, బుద్ధి వృత్తులకు 'సాక్షి' అయినట్టి స్వస్వరూపమే **'ప్రత్యగాత్మ'**గా పిలువబడుతోంది.

**"అట్టి బుద్ధికి సాక్షి అయి, బుద్ధికి బుద్ధి వృత్తులకు ఉత్పత్తి స్థానమై, వృత్తి రహితమైనట్టి ప్రత్యగాత్మయే నేను"** అను "సోఽహమ్"

వృత్తిని ఆశ్రయించాలి. అట్టి **సాక్షివృత్తి** సహాయంతో తదితరమైన (అన్యత్రా) బుద్ధి విభాగమును (లేక) జగత్ వృత్తి సహిత బుద్ధి విభాగమును త్యజించి **"వృత్తిరహిత బుద్ధి సాక్షిత్వము"** ను ఆశ్రయించాలి.

**శ్లో॥ లోకానువర్తనం త్యక్త్వా, త్యక్త్వా దేహాను వర్తనమ్,**
**శాస్త్రానువర్తనం త్యక్త్వా, స్వాధ్యాసా అపనయం కురు ।**

- లోకంలోని సంబంధ – అనుబంధ – ప్రియ – అప్రియ – సుఖ – దుఃఖ సమాచారాలు మొ॥వి లోకానికే, లోకంలోనే వదలినవాడవై ఉండు!
- ఈ దేహము యొక్క జన్మ – బాల్య – కౌమర – యౌవన – వార్ధక్య – మృత్యువు అనువర్తనమును, "ఇవి నాకు సంబంధించినవే"… అను అభిప్రాయ దృఢావేశములను మొదలంట్లా వదలి వుండు. వీటిని భౌతిక – జడ దేహమునకు సంబంధించినవిగా గమనించు.
- శాస్త్రపాండిత్య జ్ఞానముయొక్క అనువర్తనమును ఉపయోగించుకొన్న తరువాత వాటిని కూడా దాటివేయి. వదలివేయుము.
- స్వస్వరూపమగు **"బుద్ధి వృత్తి సాక్షిత్వము"**ను స్వీకరించు. స్వీయాత్మ సంబంధమైన "నేను స్వతఃగా ప్రత్యగాత్ముడను" … అను ధ్యానమును, భావనను ప్రవృద్ధపరచుకో. అదియే సహజ స్వస్వరూపానుభవము!

ఆ విధంగా "స్వా–ఆత్మ" యందే ఎల్లప్పుడూ స్థితిని సుస్థిర పరచుకుంటున్న యోగి పట్ల మనస్సు తనకు తానే నశించుచున్నది. క్రమంగా దృశ్య విషయముల పట్ల మననము సన్నగిలినదై, అట్టి లోక – దేహ – శాస్త్ర విషయ మననము యొక్క స్థానములో ప్రత్యగాత్మ భావన రూపుదిద్దుకుంటూ వస్తోంది. అది సుస్థిరీకరించుకొనుచూ ఉండగా **"కేవల – మౌనరూప సాక్షిత్వము"** అనే ఏకైక వృత్తిచే ఆత్మానుభావనము సదృఢపడగలదు. ఇక ఆపై,

**"నా ఆత్మయే సర్వజీవుల ఆత్మ కూడా అయి ఉన్నది ! మమాత్మా సర్వభూతాత్మా ।"** అను సర్వాత్మత్వము సిద్ధిస్తోంది. వ్యష్టి సంబంధమైనట్లుగా కనిపించే ప్రత్యగాత్మత్వము సర్వాత్వముగా రూపు దిద్దుకొనును గాక ! అందుకు '3' ఉపాయాలు చెప్పబడుచున్నాయి.

**యుక్త్యా - శ్రుత్యా - స్వానుభూత్యా జ్ఞాత్వా సర్వాత్మకమ్ - ఆత్మని**

1) **యుక్తి :** మహనీయులగు ఆత్మజ్ఞులు, గురువులు ఆత్మస్వరూపము గురించి పలుకు ఆప్త వాక్యములు, వారు సూచిస్తున్న సాధన – అవగాహన సంబంధమైన ఉపాయములు, దృష్టాంత వాక్యములు, వివరణలు, విశ్లేషణములు మొదలైనవి.

2) **శ్రుతి :** వేదమహావాక్యములైనటువంటి **తత్ త్వమ్** – (నీవు అదియే అయి ఉన్నావు). **సోఽహమ్** – (నేను అదియే) **జీవో బ్రహ్మైఽతి నా పరః** – (జీవుడుగా కనిపించుచున్నది బ్రహ్మమే. మరొకటేదీ కాదు)…,

**అహమ్ బ్రహ్మాఽస్మి** – (నేను బ్రహ్మమే అయి ఉన్నాను), **అద్వితీయమ్ పరమ్ బ్రహ్మ** – (బ్రహ్మమునకు వేరుగా జగత్తు లేదు. నీవు నేను మొ॥వి లేవు. సర్వమునకు పరమై, సర్వము దేనిలో ఉన్నదో అదియే బ్రహ్మము. నేను బ్రహ్మమును)…. మొదలైన ప్రవచనముల శ్రవణము.

3) **స్వానుభవము:** యుక్తి – శ్రుతుల సహాయంతో తనకు తానే తన బుద్ధి యొక్క **యోచనచే** ఏర్పడే **అనుభవము.**

ఈ మూడు ఉపాయాలతో **స్వాత్మ యొక్క సర్వాత్మత్వము** ను – జ్ఞాత్వా – తెలుసుకొంటూ ఆస్వాదించాలి. "స్వీయాత్మ" అనే ఉపకరణముతో "సర్వాత్మత్వము" అనే సమున్నతమైన ఫలము – ప్రయోజనములను పొందాలి.

అందుకు అభ్యాసమేమిటి ?

**నిద్రాయా లోక వార్తాయాః శబ్దాదేః ఆత్మ విస్మృతేః, క్వచిత్ న అవసరం దత్వా...,**

- లోక వ్యవహారముల పట్ల, లోక సమాచార – సంబంధ – అనుబంధ – సంపద – ఆపద సందర్భముల పట్ల **మౌనముద్రారూపమైన నిద్ర** వహిస్తూ..,
- ఆత్మ పట్ల ఏమరపు (ఆత్మ విస్మృతి)కి కారణమగుచున్న శబ్ద – స్పర్శ – రూప – రస – గంధాదులను విస్మరించి (స్మరించక), వాటిపై ఆధారము కలిగి ఉండక.
- **చిన్మయా ఆత్మానమ్ ఆత్మని...!** అంతరములో 'ఆత్మచింతన'ను ఎప్పుడూ ఆశ్రయించాలి. "ఆత్మయే ఇదంతా"… అని అనుకుంటూ అనుకుంటూ ఉండాలి. **అనిపించేంత వరకు అనుకుంటూ ఉండాలి. ఆత్మతో ఆత్మచింతన చేయాలి!**

**మాంసమయదేహము** : ఈ భౌతిక దేహము ఎటువంటిది ?

- **మాతా పిత్రోః మల ఉద్భూతమ్ ।** తల్లిదండ్రుల మలము నుండి జనించనట్టిది.
- **మల మాంస మయమ్ వపుః ।** ఇది మలమాంసములతో నిండి ఉన్నటిది.

అటువంటి ఈ భౌతకి దేహమునకు సంబంధించిన భావ - ఉద్వేగ - మమకారములను ఒక మల పదార్థమువలె, మురికి వస్తువువలె త్యజించి ఉండాలి. **త్యక్త్వా చండాలవత్ దూరమ్** - దేహాత్మ భావనను మురికిగుంట వలె త్యజించి, పరబ్రహ్మతత్త్వమును ఆశ్రయించాలి. - **బ్రహ్మీభూయ కృతీభవ ।** బ్రహ్మీభూయ కృతకృత్యుడవు అగుము. బ్రహ్మీ భావనను ఆశ్రయించుము.

**ప్రత్యగాత్మ - పరమాత్మ** : ఓ మునీ !




ఒక కుండలో ఆకాశము (Space)-ఆ కుండ బయట గల ఆకాశము ఒక్కటే కదా! కుండలోని గాలి-బయటగల గాలి ఒక్కటే కదా ! అట్లాగే...,

**ఘటాకాశ - మహాకాశ ఇవ ఆత్మానం - పరమాత్మని ।**

నా-నీ దేహములోని ఆత్మయే సర్వ దేహములలోని ఆత్మగా, సర్వ జీవాత్మల రూపమగు పరమాత్మగా విరాజమానమై ఉన్నది.

**"అందరూ నాలో - అందరిలోనూ నేను"** అను అఖణ్డ భావమును ఆశ్రయిస్తూ, గానంచేస్తూ, ఇక ఆపై,

**విలాప్యాఽఖణ్డభావేన, తూష్ణీంభవ సదా మునే।** ఓ మునీ! ఏ ఏ భేద భావములు కనిపిస్తూ ఉన్నాయో, వాటన్నిటిపట్ల మౌనము వహించి, తూష్ణీభావము కలిగి ఉండు. "అబ్బే! వాస్తవానికి భేదములేవీ లేవు! అభేదమే!" - అని అనుకుంటూ ఉండు.

"పరమాత్మకు నేనుగాని, మీరుగాని, మరొకరెవరైనా గాని భిన్నులము కాము. అట్టి **స్వప్రకాశము**, సర్వమునకు **అధిష్ఠానము** (సర్వమునకు ఆధారమై, వాస్తవతత్త్వమై ఉన్నట్టిది), **స్వయంభువు** (తన ఉనికికి తానే కారణమైనట్టిది) అగు **సదాత్మస్వరూపమే నేను!** అదియే ఇదంతా" - అను అఖండాత్మభావనను ఆశ్రయించు. అట్టి **నిత్యోదిత చైతన్యాత్మ భావనను అఖండాత్మానుభూతిని** గట్టిగా అవధరించు. **"స్వయం ప్రకాశమగు ఆత్మ స్వరూపుడను నేను"** అనునది మాత్రమే ఆశ్రయించి ఉండు. ప్రయత్నపూర్వకంగా ధారణ చేయి.

**శ్రోత** : ఇక్కడి అణ్డాండ - పిణ్డాండముల మాట ఏమిటి ?

**గురువు** : అవా ? **బ్రహ్మాండమపి పిణ్డాండమ్ త్యజ్యతాం మలభాండవత్ !** ఈ అణ్డాండ (Universal) - పిణ్డాండ (Individual) భౌతిక - వ్యవహారమంతాకూడా - మల పదార్థములతో నిండి ఉన్న కుండను వదలినట్లు దూరముగా త్యజించి ఉండు.

**మహత్ధియమ్** : ఉత్తమమైన ధీశక్తి (బుద్ధిశక్తి) కలవాడవై, నామరూపాత్మకమై కనిపిస్తున్నదంతా (లింగము) వదలివేసి, సర్వదేహములలో సర్వదా ప్రకాశమానమై వెలుగొందుచున్న సదానంద స్వరూపమగు **'చిదాత్మ'**పై బుద్ధిని నియమించు. **కేవలీభవ సర్వదా!** అట్టి ఉత్తమ బుద్ధికి సిద్ధించుచున్న **కేవలీ స్వరూపుడవు** (Absolute form of self) గా సర్వదా అయిఉండుము.

**శ్రోత** : స్వామీ ! ఈ ఎదురుగా కంటికి కనిపిస్తున్న దృశ్య జగత్తును ఏ విధంగా సమన్వయించుకుంటూ దర్శించాలి ?

**గురువు** : ఓ అనఘా ! ఇక్కడ ఏ దృశ్య జగత్తు ఇంద్రియ విషయరూపమై అగుపిస్తోందో..... ఇదంతా -**దర్పణాంతః పురమ్** -దర్పణము (అద్దము) లో కనిపించే నగర దృశ్యముగా సందర్శించు. అద్దంలో దృశ్యము కనిపిస్తూ ఉన్నప్పటికీ,.... అద్దములో దృశ్యము ఉన్నదా? ఉండదు కదా!

**"ఇదంతా ఏ పరబ్రహ్మమునందు అద్దములోని దృశ్యమువలె అగుపిస్తోందో... అట్టి తత్ బ్రహ్మానంద స్వరూపదను నేను"** అను భావనను ఆశ్రయించి కృతకృత్యుడవగుము.

చంద్రగహణము సమయములో అన్ని వైపులా చీకట్లు క్రమ్ముకొని ఉంటున్న తీరుగా, అఖండమగు స్వస్వరూపమును "అహం-మమ" కారములు ఆవరించనవై ఉంటున్నాయి. గ్రహణం తొలగగానే పూర్ణ చంద్రుడు శోభాయమానంగా ఆకాశంలో వెలుగొందుచూ అమృత కిరణాలు లోకాలకు ప్రసాదిస్తారు కదా ! పరిమితమగు దేహ - అహంకారము అధిగమించబడగానే ఈ జీవాత్మయొక్క పరమాత్మత్వము పూర్ణానంద - సదానందములతో కూడి, **స్వయం ప్రభలను వెదజెల్లగలదు.**

**శ్రోత :** గురుదేవా ! 'మోక్షము' అనుదాని రూపమేమిటి ?

**గురువు :** ఈ జీవుని హృదయంలో క్రియలకు సంబంధించిన, ఆశలకు సంబంధించిన, చిన్తలకు సంబంధించిన అనేక అభినివేశములు (Emotional Attachments) జన్మ - జన్మలుగా పేరుకొని ఉంటున్నాయి. వాటికి సంబంధించిన వాసనలు తొలగించుకొన్నాడా... అదియే 'మోక్షము' అయి ఉన్నది. అద్దానినే 'జీవన్ముక్తి' అని కూడా వ్యవహరిస్తున్నారు.

**శ్రోత :** మరి వాసనా విలయము ఎట్లా సాధ్యం ? మార్గం ఏమిటి ?

**గురువు :** బ్రహ్మనిష్ఠయే అందుకు మార్గము.

1) **"సర్వత్రా, సర్వతః సర్వః (అంతటా, ఎల్లప్పుడు సర్వము)... బ్రహ్మమే"** - అను బ్రహ్మావలోకనము చేయటం. (ఈ కనబడే సర్వజీవులు ఆ అఖండ పరమాత్మయొక్క ప్రత్యక్ష రూపాలే - అని అనుకుంటూ, అనిపించేవరకు తత్‌భావనను కొనసాగించటం).

2) సత్ భావనను దృఢపరచుకోవటం. అసత్ భావనలయినట్టి అరిషట్ వర్గములను తగ్గిస్తూ, జయిస్తూ క్రమంగా హృదయములో 'రహితము' చేసుకోవటము.

నాయనా ! బ్రహ్మనిష్ఠకు అతి ముఖ్యము - ప్రమాదకరము అగు ఒక గొప్ప అవరోధము గురించి గుర్తు చేస్తున్నాను.

**శ్లో ॥ ప్రమాదో బ్రహ్మనిష్ఠాయామ్ న కర్తవ్యః కదాచన,**
**'ప్రమాదో మృత్యుః' ఇతి ఆహుః, విద్యాయాం బ్రహ్మవాదినః ॥** (ప్రమాదము = బద్ధకము, అశ్రద్ధ, జాడ్యము)

బద్ధకము, అశ్రద్ధ... ప్రమాదమైన విషయాలు, **"అట్టి జాడ్యము మృత్యువుతో సమానము"** అని బ్రహ్మజ్ఞులు ఎలుగెత్తి గుర్తు చేస్తున్నారు. బద్ధకము-అశ్రద్ధలకు ఏ మాత్రము చోటు ఇవ్వరాదు. 'మాయ' చాలా బలవత్తరమైనది. అది అనేక విషయములు తెలిసి - బోధించగలిగినట్టి జ్ఞానిని కూడా క్షణంలో భ్రమింపజేయగలదు. నీటి ప్రవాహమునకు నాచు ప్రక్కకు తొలగుచూ, ప్రవాహవేగము సన్నగిలగానే మరల తల ఎత్తుచున్న రీతిగా... అభ్యాసము (Practice) కొరవడితే, మరల మాయ వచ్చిచేరగలదు. **ప్రాజ్ఞమ్‌వాపి పరాఙ్ముఖమ్ ।** ఎంతో పాజ్ఞుని కూడా పరాఙ్ముఖునిగా చేసివేయగలదు.

ఓ అనఘా ! ప్రియ చైతన్యస్వరూపా !

ఈ దేహము ఉన్నప్పుడే సమాధినిష్ఠుడవై **"జగత్తు - దేహము నా కల్పన ! ఇక నేనో వీటికి సంబంధించని కేవల స్వరూపదను"**... అను **కేవలీ రూప విదేహముక్తిని** (లేక) **కైవల్యమును** సముపార్జించుకొని **నిర్వికల్ప స్వరూపుడవయ్యెదవు** గాక ! **"ఈ జగత్ దృశ్యము నా పట్ల ఏర్పడినది - ఉన్నది - తొలగాలి"**... ఇత్యాది రూపమైనట్టి హృదయములోని గ్రంథులు (చిక్కుముడులు) - సమాధి యొక్క అభ్యాసముచే ఎప్పుడు నిశ్శేషంగా విడివడి విలయమౌతాయో, వికల్పమౌతాయో, అప్పుడు అద్వితీయము - అఖండము అగు **ఆత్మ దర్శనము** (ఆత్మానుభవము) సిద్ధించుచున్నది. అటువంటి అఖండాత్మత్వము సిద్ధించుకొన్నవాడు ఇక ఆపై "నేను - నీవు - జగత్తు" మొదలైనవాటి పట్ల ఒక కుండ - వస్త్రమువలె (ఘట-పటాదివత్) - అత్యంత **"ఉదాసీనుడు"**, **"వ్యథరహితుడు"**... అగుచున్నాడు. అవన్నీ విషయములే కానట్లుగా దర్శిస్తూ **'ఉదాసీనము'** నందు మౌనముగా సంస్థితుడు అగుచున్నాడు.

ఓ ప్రియ శ్రోతా! బిడ్డా!

సృష్టికర్తయగు బ్రహ్మదేవుడు మొదలుకొని - ఒక స్థంభము వరకు ఏఏ అసంఖ్యాక ఉపాధి పరంపరలు కనిపిస్తున్నాయో అవన్నీ కూడా మిధ్య (illusion) మాత్రమే! పూర్ణ స్వరూపమగు మమాత్మ (స్వీయాత్మ) సర్వదా ఏకమే! అనేకము కాదు. అట్లు అయిఉండి, అజ్ఞాన దృష్టి చమత్కారముచే అనేకముగా కనిపిస్తోంది. జ్ఞాన దృష్టికో..., (అనేకముగా కనిపించేదంతా) **ఏకమేనని** అనిపించగలదు.

ఈ సర్వము అఖండాత్మ ప్రదర్శనమే? నేను, నీవు ... ఇదంతా ఏకాత్మయే? కాబట్టి...

అఖండాత్మ స్వరూపుడనగు నేనే ఇదంతా!

**మం॥ శ్లో॥ స్వయం బ్రహ్మా । స్వయం విష్ణుః ।**
**స్వయం ఇంద్రః । స్వయం శివః ।**
**స్వయం విశ్వం ఇదం సర్వమ్**
**స్వస్మాత్ అన్యత్ నకించన ।**

నేనే స్వయముగా సృష్టికర్తయగు బ్రహ్మను ! స్థితికారకుడగు విష్ణువును ! లయకారకుడగు శివుడను ! ఈ విశ్వమంతా నేనే ! నాకు వేరైనది ఎక్కడా ఏదీ కించిత్ కూడా లేదు! 'ఇది ఆకారము' అనునది ఏదీ లేనట్టి బంగారము నందు, 'ఉంగరము-గాజు-గొలుసు'... మొదలైన నామ - రూపములు ఆపాదించబడి, వ్యవహారశీలము అగుచున్నాయి కదా ! అదే విధంగా స్వయముగా **పూర్ణము - అద్వయము - అక్రియము"...** అగు నా పరబ్రహ్మ స్వరూపముపై అశేష వస్తుజాలములతో కూడిన ఈ జగత్తంతా ఆపాదించబడుతోంది.

సంకల్పముచే - అనేక - విభిన్న విశేషములతో కూడిన ఈ విశ్వమంతా కూడా ... వాస్తవానికి అసంకల్పనచే **"ఏకవస్తు స్వరూపము (అఖండాత్మ స్వరూపమునకు అభిన్నము, స్వతఃగా చూస్తే లేనిది)"** అగుచున్నది. ఈ ఎదురుగా కనబడే ఇంద్రియానుభవ దృశ్యమంతా కూడా సర్వదా **నిర్వికారము, నిరాకారము, నిర్విశేషము అగు ఆత్మయే!** అట్టి అఖండాత్మయందు ఈ దృశ్యవ్యవహారము ఆపాదించబడుచుండగా ఆత్మ సర్వదా నిర్వికారము, నిరాకారము, నిర్విశేషము అయి యథాతథంగా కొనసాగుచూనే ఉన్నది. అట్టి నిరామయమగు ఆత్మయందు ద్రష్ట - దర్శనము - దృశ్యమునకు సంబంధించిన వస్తుసమూహములు లేవు. ఎందుకంటే ఆత్మ స్వతఃగా భావనలకు మునుముందునుంచే ఉన్నది. మొట్టమొదట - మధ్య - చివర కూడా భావాతీతమై, త్రిగుణరహితమై ఉన్నది.

అసంఖ్యాకతరంగాలతో సముద్రము పరిపూర్ణమైనట్లుగానే (కల్పార్ణవము వలె) చిదాత్మ అత్యంత పరిపూర్ణ-తేజోరూపము. అట్టి తేజోరూపమగు చిదాత్మ అజ్ఞాన తమస్సునందు మునుగుతుందా ? ఎట్లా మునుగుతుంది ? ఏకాత్మమగు పరతత్త్వము అనేక బేధములు అవటానికి కారణమేదీ లేదు. కారణమే లేనప్పుడు కార్యరూపమగు ఖండత్వము ఎక్కడ ఉంటుంది, సర్వము అఖండాత్మ అయి ఉండగా?... **"దీపము వెలుగుచూనే ఉన్నది. కానీ అది చీకటిచే కప్పబడినది"** - అనునది అసంబద్ధము కదా!

సర్వదా ఏకాత్మమైయున్న పరమతత్త్వమునందు ఖండత్వము భేదము కల్పించగల 'కర్త' ఎక్కడ, ఎట్లా ఉండగలడు ? ఆత్మకు వేరుగా ఆత్మకు ఖండత్వము - భేదము కల్పించువాడు మరొకడుంటే "ఆత్మ అఖండము (unpartitionalble) - అద్వితీయము (అద్దానికి ద్వితీయమైనది లేనట్టిది".. మొదలుగా గల ఆత్మ ధర్మాన్ని నిర్వచించే మహతత్త్వ వర్ణనలు నిష్ఫలమౌతాయి కదా !

దృష్టాంతానికి...,

సుషిప్తి దశలో సర్వజీవుల యొక్క సుషుప్తి అనుభవము ఒకే తీరైనది అగుచుండటమే **"ఇక్కడ అనేకత్వము లేదు"** అనుదానికి ఒక దృష్టాంతము. సుషుప్తి స్థితిలో-**సుషుప్తౌ సుఖమాత్రాయాం భేదః కేన అవలోకితః?** సుషుప్తి సుఖములో భేదము చూచే ద్రష్ట ఎక్కడున్నాడు? అట్లాగే అఖండమగు ఆత్మ (లేక) బ్రహ్మమునందు భేదమును దర్శించు ద్రష్ట (బ్రహ్మమునకు వేరుగా) ఎక్కడుంటాడు? ఉండడు!

ఇక "జాగ్రత్-స్వప్నములలో వేరు వేరు ద్రష్టలుగా అయి ఆత్మ కనిపిస్తున్నది కదా"... అంటావా? **చిత్తేన వికల్పోఽయం చిత్త అభావేన కళ్పన?** జాగ్రత్ - స్వప్నములలో కనిపించే భేదమంతటికి చిత్తమే మూలము. చిత్తము సుషుప్తిలో అభావించబడుతోంది. చిత్తము అభావించినప్పుడు సర్వభేదములు లేనివే అయి ఏకత్వము సిద్ధించుచున్నది. అనగా, **చిత్తము ఉంటే భేదము కనిపిస్తోంది. చిత్తము లేనప్పుడో,... భేదమే లేదు!**

**అతః చిత్తమ్ సమాధేహి ప్రత్యక్ రూపే పరాత్మని,** చిత్తము ఎప్పుడైతే సమాధి స్థితిని పొంది సమాధాన స్థితి పొందుచున్నదో అప్పుడు ప్రత్యక్ రూప (జీవాత్మ రూప) మంతా పరాత్మ స్వరూపమే అగుచున్నది. **చిత్తము సుషుప్త మౌనము వహించి ఉండియే,... దృశ్యమును దర్శిస్తూ ఉండటము - సమాధి.**

**" అఖండానంద ఆత్మయే నా యొక్క స్వస్వరూపము ! - అది నాకు వేరు కాదు ! నేను అద్దానికి వేరు కాను !"** అను స్వస్వరూపాత్మకు సంబంధించిన సత్యమును తెలుసుకొని, అట్టి దర్శనమును ఆశ్రయించి, అద్దానిని స్వభావము చేసుకొన్నవాడు..., ఈ బాహ్యమున కనిపించేదంతా కూడా.... **1. తన యందే ఉన్నట్లుగాను, 2. 'తానే' గానూ, 3. తన రసాస్వాదనా చమత్కారంగానూ** చూస్తూ, ఇదంతా తన ఆత్మగా ఆస్వాదిస్తున్నాడు. (త్రిపుర తాత్త్వికార్థం)

**వైరాగ్యస్య ఫలం బోధో :** ఇంద్రియ విషయములన్నిటిపట్ల రాగము తొలగించుకొన్నప్పుడు, ఇక ఆత్మకు సంబంధించిన బోధ జ్ఞానము (శాస్త్రములచే, ఆత్మజ్ఞులచే బోధింపబడు బోధస్వరూప **ఆత్మజ్ఞానము**) లభిస్తోంది. బోధ జ్ఞానముచే చిత్తము ఇంద్రియ విషయములలో రతించటం సన్నగిల్లుతోంది. అనగా, చిత్తమునకు చిత్త విషయములన్నీ కూడా 'చిత్' స్వరూపమై సిద్ధించుచున్నాయి.

**బోధస్యోఽపరతిః ఫలమ్ :** బోధ (ఆత్మ) జ్ఞాన సమాచారము యొక్క సముపార్జన - పరిశీలనలచే (లేక - ఆత్మజ్ఞానముచే) దృశ్య విషయముల నుండి చిత్తము శమిస్తూ, వెనుకకు మరలుచూ, "ఉపరతి (withdrawl)" అనే ఫలము సిద్ధిస్తోంది. దృశ్యము అతనిపట్ల శాంతిస్తోంది. ఆత్మయందు నియమితమౌతోంది. దృశ్యము ఆత్మగా శమించినదగుచున్నది.

**స్వానందానుభవాత్ శాన్తిః** : దృశ్యము శమించి శాంతించుచుండగా, స్వాత్మానందానుభము (ఈ సర్వము నేనైన నేను యొక్క అనుభవము) దృఢత్వమును సంతరించుకుంటోంది. ఇదియే 'ఉపరతి' యొక్క ఫలము. **ఏష ఏవ ఉపరతేః ఫలమ్ !**

ఈ విధంగా 'ఇంద్రియ విషయ తదాత్మ్యము' అను "పరిమిత జీవాఽహమ్" (లేక) 'సంకుచిత భావన' నుండి....... **1) వైరాగ్యము 2) ఆత్మ జ్ఞాన సమాచారము 3) ఉపరతి 4) జగత్ దృశ్య ఉపశాంతి**... అనునవి ఒకటి తరువాత మరొకటి ప్రయత్నశీలునికి లభిస్తూ వస్తున్నాయి. వాటికి ఫలముగా **"నివృత్తి-పరమానంద తృప్తి"** రూపమగు ఆత్మానందము పొందబడుచున్నదని ఆత్మను ఎరిగిన మార్గదర్శకులు మార్గమును చూపుచున్నారు. అయితే పైన చెప్పిన నాలుగిటిలో ఒకటి తరువాత ఆపై మరొకటి పొందనప్పుడు ఒక్కొక్కటి యొక్క వెనుకటి స్థితులు నిష్ఫలమే అవగలదు సుమా ! వైరాగ్య - బోధ - ఉపరతులు సంపాదించుకొని, మరి శాంతిని పొందక పోతే, ... ఆ మూడు సంపాదించుకొని ప్రయోజనం ఏమున్నది? అందుచేత పూర్ణ నివృత్తితో కూడుకొన్న మౌనరూప ప్రవృత్తి... సంపూర్ణ సత్ఫలముగా అగుచున్నది. (లేక) ఒకటి పొందగానే వెనుకటిదానితో పని లేకుండా పోతోంది)

## తత్ - త్వమ్

**'తత్' (పరమాత్మ)** - స్వతఃగా విలక్షణుడు, నిర్గుణుడు, ఉపాధిరహితుడు. అట్టి పరమాత్మ యొక్క తటస్థ లక్షణములు :

1) **మాయోఽపాధిః :** మాయను తన ఉపాధిగా కలిగి ఉండటము.
2) **జగద్యోనిః :** ఈ జగత్ జనించు యోని స్థానముగా అవటము.
3) **సర్వజ్ఞము :** ఈ దేహమునకు ఈవల - ఆవల గల తత్త్వమును ఎరిగినట్టి **'సర్వజ్ఞత్వము'**
4) **సాక్షిత్వము :** దేహపరంపరలకు కేవల **సాక్షిత్వము**. దేహాతీత్వమునకు కూడా సాక్షి !

మొదలైనవన్నీ కూడా **'తత్' శబ్దార్థమగు ఈశ్వరుని లక్షణములు**. (నాటక దీపమువలె దృశ్య-దేహ-మనో-బుద్ధి-చిత్త-అహంకారములకు కూడా కేవల సాక్షి).

**త్వమ్ (జీవాత్మ) :** 1) భౌతిక ఉపాధిని ఆలంబనముగా కలిగి ఉండటము 2) జగత్తులో జనించినవాడివలె ఉండటము 3) నేను ఈ భౌతికదేహముచే పరిమితుడను-అను భావనను పరిపోషించుకొని ఉండటము 4) ఈ ఒక్క దేహమునకు సాక్షి మాత్రమే - అయి, పరిమిత స్వాభావుడై ఉండటము... ఇవి **జీవాత్మ లక్షణములు**.

అట్టి జీవాత్మ పరమాత్మకు ఉపకరణమువంటివాడు. జీవాత్మ పరమాత్మ యొక్క ఒకానొక కళా విశేషము. జీవాత్మగా పిలువబడుచూ కూడా పరమాత్మకు అభిన్నుడే అయి ఉన్నవాడు. ఎందుకంటే...,

**మం॥శ్లో॥ మాయా అవిద్యే విహాయైవ, ఉపాధి పర-జీవయోః**
**అఖండ సచ్చిదానందం, పరంబ్రహ్మ విలక్ష్యతే !**

ఈ 'త్వమ్' స్వరూప జీవాత్మ ఉపాధిపరిమితిని అధిగమించి, మాయారూపమగు అవిద్యను సాక్షిత్వముతో విడచిన మరుక్షణం, విలక్షణమగు **'అఖండ - సత్‌చిత్ ఆనంద - పరబ్రహ్మత్వము'** ను స్వభావసిద్ధంగా పుణికి పుచ్చుకొనుచున్నాడు.

**1. శ్రవణము : ఇత్థం వాక్యైః 'తత్' అర్థమ్ అనుసంధానం 'శ్రవణమ్' భవేత్ ! 1. తత్ త్వమ్ పరమాత్మ 2. ఇదంత్వమ్ జీవాత్మ'** ఈ రెండింటిని సంబంధించిన శబ్దార్థములను, మాయోపాధి – దేహోపాధిల (తత్–త్వమ్‌ల) తాత్పర్యమును వినటమును **'శ్రవణము'** అని పిలుస్తున్నారు.

**2. మననము :** ఈ విధంగా శాస్త్రవర్ణనములను ఆత్మజ్ఞుల ప్రవచనములను విని, అర్థము చేసుకొంటూ, **- యుక్త్యా సంభావితత్వా, అనుసంధానం - 'మననం' తు తత్ -** యుక్తితో (యోగము – భక్తి – జీవసమాధి – అభావ సమాధి ... ఇటువంటి మార్గములలో) ఆ పరమార్థమును బుద్ధికి సిద్ధింపజేసుకుంటూ, ఆ బుద్ధితో ఆ అర్థమును అనుసంధానము చేయుటము (Applying practically while even being with worldly scene) ను **"మననము"** గా చెప్పబడుతోంది.

**3. నిదిధ్యాసనమ్ : తాభ్యాం నిర్విచికిత్సే అర్థే చేతసః స్థాపితస్య తత్ 'ఏకతానత్వమ్', ఏ తత్ధి 'నిదిధ్యాసనమ్' ఉచ్యతే ।** ఈ విధంగా వేదమహా వాక్యముల శ్రవణం (వినటం) – మననములచే తెలియవచ్చుచున్న స్వస్వరూపాత్మ పట్ల నిలకడ బుద్ధిని పెంపొందించుకుంటూ, అఖండ – సచ్చిదాత్మయందు ధ్యాస–భావనలను నిలుపుచూ, దృష్టి – ధ్యాసలను ఆత్మవైపుగా నడుపుచున్నప్పుడు తొలగు **'అనేకత్వము'**ను, రూపుదిద్దుకొని **'ఏకత్వము'** ను **'నిదిధ్యాస'...** అని ఉద్దేశ్యిస్తున్నారు.

**4. సమాధి :** **ధ్యాతృ - ధ్యానే పరిత్యజ్య, క్రమాత్, ధ్యేయ ఏక గోచరమ్**
**నివాత దీపవత్ చిత్తం, 'సమాధిః' అభిధీయతే ।**

ఆత్మ దృష్ట్యా ఇదంతా కూడా సర్వదా ఏకమే గాని, అనేకము కాదు. 'ధ్యాస (Avocation)' కారణంగా ఇక్కడున్నదంతా స్థూలదృష్టికి 'అనేకము'గా అనుభూతమగుచున్నది. శ్రవణ – మనన – నిదిధ్యాసల సహాయముతో అట్టి ద్విత్వము – అనేకత్వములను పరిత్యజించి, క్రమంగా... **"ఏకము - అఖండము అగు ఆత్మ వస్తువు"** నందు ఈ చిత్తమును **– గాలికదలికలు లేని చోట గల దీపమువలె –** నిశ్చలత్వము సంతరించుకోవటము **"సమాధి"**.

అనగా..,

1) ధ్యాతృ (ధ్యానము చేయువాడు) 2) ధ్యానము ... ఈ రెండింటిని అధిగమించి, ధ్యేయమగు ఏకాత్మను మాత్రమే ఈ చిత్తము సందర్శిస్తూ, గాలివీచని చోట దీపమువలె నిశ్చలత్వమును సంతరించుకోవటమును **"సమాధి"** శబ్దార్థముగా అభివర్ణిస్తున్నారు.

ఈ విధంగా చిత్తమునుండి జగత్ సంబంధమైన వృత్తులను వెనుకకు మరల్చి, **నివృత్తి** చేయటం సమాధి సాధన. అట్టి చిత్త వృత్తిరహిత స్థితియగు సమాధి యందు **"ఆత్మను దర్శించటము"** అను ఏకైక వృత్తి మాత్రమే శేషిస్తుంది. అనగా, అట్టి సమాధి వృత్తి **"ఇదంతా మమాత్మయే"** అనే స్మరణమును మాత్రం కలిగి ఉంటుంది.

అయితే...,

"వృత్తులను శాసించి, వెనుకకు మరల్చి, ఆత్మయందు నియమించటము"... అనే సమాధి కొనసాగునంతవరకు దృశ్యవృత్తులు శమిస్తాయి కానీ, సమాధి అభ్యాసమును కొంచము విరమించగానే, మరల ఇంద్రియ విషయవృత్తులు తిరిగి వచ్చి పడతాయి. అనగా 'సమాధి అభ్యాసము' సమయంలో కూడా చిత్తవృత్తులు రహితం అగుచున్నాయా? లేదు. కించిత్ రహస్యంగాను, మౌనంగాను దాగియేఉండి, ఆ అభ్యాసమునుండి విరామము పొందగానే మరల తిరిగి వస్తున్నాయన్నమాట!

**శ్రోత :** గురువర్యా ! సమాధి నుండి కొంచము విరామమును ఆశ్రయించగానే ప్రాపంచక చిత్త వృత్తులు వచ్చి పడుచున్నాయా ? ఎందుచేత ?

**గురువు :** ఎందుచేతనా? విను

**శ్లో॥ అనాది-అవిహ సంసారే సంచితాః కర్మకోటయః**
**అనేన విలయం యాంతి, శుద్ధధర్మో వివర్ధతే ।**

ఈ జీవుడు అనాదిగా అనేక ఉపాధులతో కూడి ప్రోగుచేసుకొన్న కోటాను కోట్ల సంచిత కర్మల ధ్యాసలు, అభ్యాసములు చిత్తములో ప్రోగు అయి ఉన్నాయి.

**శ్రోత :** ఎంత పెద్ద ప్రమాదం ?

**గురువు :** బిడ్డా ! నిరుత్సాహపడనవసరము లేదయ్యా ! మరల మరల సమాధిని అభ్యసిస్తూ ఉండగా, ఆ అసంఖ్యాక కర్మ సంస్కారాల వ్యవహారమంతా విలయమై **"సోఽహమ్! త్వమేవాఽహమ్! అహమ్ ఆది-మధ్య - అంతశ్చ! అహమేవమ్ ఇదగ్ం సర్వమ్"...** మొదలైన మహా - వాక్య ప్రవచనార్థమగు ఆత్మ ధర్మము తప్పక ప్రకాశించగలదు. శుద్ధ ధర్మము ప్రవృద్ధము కాగలదు.

మేఘములు వర్షించి, నేలను తడిపి, సమృద్ధిగా ధాన్య సంపదను మానవాళికి ప్రసాదిస్తాయి చూచావా?

ఆ విధంగా...,

**శ్లో॥ "ధర్మ మేఘమ్ ఇమం ప్రాహుః సమాధిః", యోగ విత్తమాః**
**వర్షత్య ఏష యథా ధర్మ - అమృతధారా సహస్రశః ॥**

సమాధి అభ్యాసము ఆత్మధర్మ–అమృత ధారలను సహస్రములుగా (వేలాది అమృతధారలుగా) వర్షింపజేయగలదు. అందుచేత సమాధిని **"ఆత్మతత్త్వానుభవ ధర్మ మేఘము"** అని యోగవేత్తలు పిలుస్తూ ఉంటారు. జగత్ దృశ్యమంతా స్వభావసిద్ధంగా (As a natural course) 'స్వస్వరూపం'గా అనుభూతమవటమే ఆత్మ ధర్మ–అభ్యాస అమృత ధార!

**శ్రోత :** ఈ జీవుడు అసంఖ్యాకములగు పుణ్య – పాప కర్మల మధ్య చిక్కుకొని ఉంటున్నాడు కదా ! ఎందుచేత ?

**గురువు :** అనేక జన్మలుగా, అనాదిగా ఆశ్రయిస్తూ వస్తున్న ఉపాధి పరంపరల కారణంగా ఈ జీవుని హృదయములో వాసనాజాలములు అభిప్రాయములు – ఆవేశములు సంస్కార రూపంగా దట్టముగా పేరుకొని ఉండటం జరుగుచున్నమాట నిజమే. అట్టి వాసనాజాలములే ఈ జీవునిపట్ల **పుణ్య – పాప కర్మల ఉద్వేగములకు** కారణం అగుచున్నాయి. అయితే నిర్వికల్ప సమాధి యొక్క అభ్యాసము... (Repeatedly practising the thoughtless - Thought towards state of self) చేత – మనము ఉదహరించుకొన్న – పుణ్య పాపకర్మల వాసనాజాలమంతా సమూలముగా నశించగలదు. **"నేను ఇంకా ఏదో నిర్వర్తిస్తే గాని ఆత్మ యొక్క సాన్నిధ్యము లభించదు. ఇంకా ఏదో చేయాలి ! ఎక్కడికో వెళ్ళాలి"...** ఇటువంటి కర్మపరంపరావేశములన్నీ సమాధి యొక్క అభ్యాసముచే సన్నగిలుతూ ఉపశమించగలవు! స్వతఃగా సర్వదా స్వస్వరూపమునకు అభిన్నమై సిద్ధించియున్న 'స్వాత్మ' కొరకై క్రొత్తగా ఇప్పుడు సంకల్పించవలసినదేమున్నది? నిర్వర్తించవలసినదేమున్నది?

**శ్రోత :** మహనీయా ! సద్గురూ! వేదమహావాక్యములను ఎట్లా ఆశ్రయించాలి ? ప్రయోజనము ఎట్టిది?

**గురువు : "తత్ త్వమ్; సోఽహమ్; జీవోబ్రహ్మేఽతి నాఽపరః; అయమాత్మ బ్రహ్మ"...** మొదలైన మహత్తరమైన అర్థమును ప్రసాదించు మహావాక్యములు వేద – ఉపనిషత్తులచే, వేద–వేదాంత స్వరములచే సర్వ జనులకు, సాధకులకు ప్రసాదించబడుచున్నాయి. 1) ఎందుకొరకు? 2) వాటి ఉద్దేశ్యార్థమేమిటి? ... ఈ రెండు విషయాలు గ్రహించి, **విచారణ** చేస్తూ ఉండాలి. **మననము** చేస్తూ ఉండాలి. విచారణను దృష్టి యందు పదిలము – **నిర్దుష్టము** చేస్తూ ఉండగా, ఇక క్రమంగా.., **ప్రత్యక్ష – పరోక్ష** సంబంధమైన అజ్ఞానమంతా తొలగి **అపరోక్ష జ్ఞానము** ఉదయిస్తుంది. కరతలామలకము (చేతిలోని ఉసిరిపండువలె) కాగలదు.

**వైరాగ్యము : వాసనా అనుదయో భోగ్యే, 'వైరాగ్యస్య' తదా అవధిః ।** – "ఏదో ఇంకా పొందాలి. చేయాలి. ఎక్కడికో వెళ్ళాలి" ... ఇటువంటి లోక సంబంధమైన వాసనా ఆవేశము ఉదయించకపోవటమే **వైరాగ్యము యొక్క అవధి, సిద్ధి!**

'అహంభావము' నుండి ఉదయించు భావనలను అభావించుటయే **'బోధ'** లేక **'జ్ఞానము'** (లేక) **సమాధి యొక్క పరమావధి!**

## ఉపరతి

"చిత్తము విషయములందు ప్రవేశించి తన్మయము కాకపోవటము, కేవలత్వము సంతరించుకోవటము **ఉపరతి**. వృత్తులు జనించకయే చిత్తము సందర్భములందు పాల్గొనటము ఉపరతి. ఉపరతి – చిత్త వృత్తిరాహిత్యమునకు సంబంధించినదే గాని శాస్త్ర – శబ్ద పాండిత్యమునకు సంబంధించినది కాదు. (యోగః చిత్త వృత్తి నిరోధకః – పతంజలి)

## స్థితప్రజ్ఞుడు

**శ్రోత :** హే భగవాన్ ! సద్గురూ ! 'స్థితప్రజ్ఞుడు' అనగా ఎవ్వరు ?

**గురువు :** ఎప్పుడైతే చిత్తము విషయముల మననమున పూర్తిగా త్యజించినదై, సర్వే – సర్వత్రా చిదానందతత్త్వ దర్శనముచే – విషయముల పట్ల మౌనము, తూష్ణీభావము, – ఆత్మ పట్ల అనుక్షణిక – అకారణానందము ధరించినదై ఉంటుందో... అప్పుడు

అతడు **'స్థితప్రజ్ఞుడు'** అని చెప్పబడుచున్నాడు. అతడు స్వభావముచే ఆత్మానందభరితుడై, సర్వమును స్వస్వరూపాత్మ భావనచే దర్శిస్తున్నాడు. తన యొక్క **జీవత్వమును నిర్విశేష బ్రహ్మము యొక్క చిత్కళా కిరణముగా** దర్శించుచున్నాడు. జీవత్వమును బ్రహ్మత్వము నందు విలీనము చేసి, తానే సర్వ రూప సాక్షాత్కార బ్రహ్మముగా, అకారణానందరూపముగా నిర్వచించుకొని ఉంటున్నాడు. **"నా ఆత్మానందమునకు ఈ దేహము యొక్క రాక – పోకలు గాని, జగత్ దృశ్య విశేషాలు గాని, మనోబుద్ధి చిత్త అహంకారముల స్థితి – గతులు గాని అవధులు కల్పించలేవు"...** అను దృష్టిని ప్రవృద్ధపరచుకొని, సుస్థిరీకరించుకొన్న వాడగుచున్నాడు. ఆత్మను బ్రహ్మమునందు విలీనము చేసినవాడై, హృదయమునందు **నిర్వికారుడు – నిష్క్రియుడు – కేవల సాక్షి – సర్వమును లీలావినోదముగాను, ఇంద్రజాలము గాను దర్శించువాడు** ... అయి ఉంటున్నాడు.

## నిర్వికల్పుడు – ప్రజ్ఞానం బ్రహ్మ

**ప్రజ్ఞ = బ్రహ్మాత్మనోః శోదితయోః ఏక భావ అవగాహినీ, నిర్వికల్ప చ :**

ఈ జీవుని ఏ తెలివి (మరియు) విద్వత్తులచే ...,

- ఒక దేహమునకు అంతర్గతుడగు 'జీవుడు'
- దేహ – దేహాంతర ప్రహసనములకు, సాక్షియగు 'ఈశ్వరుడు'!
- దేహముల ఉనికి లేములకు సంబంధించనట్టి "పరబ్రహ్మము'!

ఈ మూడు శోధించబడి, ఈతడు ఏకీభావ (అంతా ఒక్కటే అను అనుభవ) సమేతుడై ఎప్పుడుఉంటాడో, సర్వదా నిర్వికల్ప – కేవల చిన్మాత్ర ప్రవృత్తుడై ఉంటాడో... అట్టి తెలివియే **'ప్రజ్ఞ'!** సర్వము స్వకీయ–కేవల ప్రజ్ఞారూపముగా ఆస్వాదించుటయే "నిర్వికల్ప స్థితి"!

'నేను జీవుడను' అనుభావనను – **'నేను సర్వస్వరూపమగు బ్రహ్మమునే', "అఖండ బ్రహ్మమే నేను–నీవు–జగత్తుగా అనిపిస్తూ ఉన్నది"...** అను **ఆధ్యాత్మ భావన**యందు లయము – ఏకము చేయుటకు ఉపకరించు **"అవగాహన"**యే ప్రజ్ఞ.

చిన్మాత్ర వృత్తి రూపమగు (Absolute wisdom) కల్పనా రహిత – నిర్వికల్ప (A state of self sans sense of relativity) స్థితి 'ప్రజ్ఞానము' అని పిలువబడుచున్నది. **"ప్రజ్ఞానమ్ బ్రహ్మ"** లోని ప్రజ్ఞ అనగా కూడా అదియే !

## జీవన్ముక్తుడు

– ఈ ఎదురుగాగల 'అనేకత్వము'ను అధిగమించి, 1) ఏక భావ సంబంధమైన అవగాహన, 2) కేవల చిత్‌భావనా రూపమైన **చిత్‌మాత్రవృత్తి** – ఈ రెండూ ఎల్లప్పుడు కలిగి ఉండటమే **"జీవన్ముక్తి".**

> **దేహ - ఇంద్రియేషు అహమ్ భావ ఇదం భావ తదన్యకే, యస్య నో**
> **భవతః క్వాఽపి, స 'జీవన్ముక్త' ఇష్యతే ।**

ఎవ్వరికైతే **"ఈ దేహ ఇంద్రియములు నాకు సంబంధించినవి. నేను ఈ దేహ ఇంద్రియములకు సంబంధించినవాడను"...** అను ఇహ – అహమ్ భావము ఉండదో..., వారికి అన్యమగు ఆత్మసాక్షీ భావన (పరాహంభావన) రూపు దిద్దుకొని స్థిరపడుతుంది. ఎవ్వరు దేహ – ఇంద్రియ – అహంకార – జగత్తులకు వేరై, వాటికి సంబంధించిన భావములకు తాను బద్ధుడుకాకయే ఉంటాడో... అతడే జీవన్ముక్తుడు. "ఇహాఽహమ్ భావన కూడా నా యొక్క పరాస్వరూపము యొక్క అంశ" అని ఎరిగి ఉండటమే జీవన్ముక్తి.

> **న ప్రత్యక్ - బ్రహ్మణోర్భేదమ్ కదాఽపి బ్రహ్మ - సర్గయోః, ప్రజ్ఞయా విజానాతి, - స జీవన్ముక్తః॥**

**"బ్రహ్మమునందు – ఇది ద్రష్ట – ఇది దృశ్యము – ఇది జీవాత్మ – ఇది సర్గము – ఇది పరమాత్మ అను భేదము ఎప్పుడూ ఈషణ్మాత్రంగా కూడా లేదు"...** అని ప్రజ్ఞచే స్పష్టముగా ఎరిగి జీవిస్తూ ఉన్నవాడు **జీవన్ముక్తుడు.**

అట్టి దృష్టిని సుదృఢీకరించు ప్రజ్ఞను పెంపొందించుకొన్నవాడు జీవన్ముక్తుడు.

> **సాధుభిః పూజ్యమానే అస్మిన్, పీడ్యమానేఽపి దుర్జనైః 'సమభావో' భవేత్ యస్య స జీవన్ముక్తః॥**

సాధుజనులచే పూజింపబడుచున్నప్పుడు, దుర్జనులచే బాధించబడుచున్నప్పుడు కూడా "ఈ ఇరువురు కూడా బ్రహ్మమే ! మమాత్మ స్వరూపులే ! నేను – ఒక సజ్జనుడు – దుర్జనుడు– ఒక విజ్ఞుడు – ఒక అజ్ఞుడు – అందరము కూడా సర్వదా ఏకమాత్రమగు అఖండాత్మ స్వరూపులమే" – అను సమరస భావనను ఏమాత్రమూ వదలకయే ఉంటాడో... అతడే **జీవన్ముక్తుడు.**

ఓ ప్రియ మమాత్మ స్వరూపా ! బిడ్డా ! వత్సా !

బ్రహ్మతత్త్వము ఏమిటో ఎట్టిదో ఎరిగిన తరువాత, ఇక ఆ విజ్ఞుడు ఇతఃపూర్వమువలె 'దృశ్యము సత్యమే' అను సంసారరూప సంసృతిలో మునుగడు. సంసారములో ఉండటం జరిగినా కూడా, బ్రహ్మ భావముతోకూడి, దీనికంతటికీ ఆవల బహిర్ముఖుడై సర్వాతీతుడై ఉంటాడు. (Hands in the world. But Head in the forest). బయట-లోపల బ్రహ్మమునే దర్శించుచూ, తెలుసుకొనవలసినది తెలుసుకొనినవాడై ప్రశాంతంగా, పూర్వాపరాలు ఎరిగి ఉంటున్నాడు. **తెలియబడేదీ - తెలుసుకొనుచున్నవాడు** ... రెండు బ్రహ్మమే అయి ఉండగా, ఇక అతని దృష్టిలో 'సంసృతి' అనునది ఎక్కడ మిగిలి ఉంటుంది? ఉండదు.

**శ్రోత :** మహాత్మా ! అనేక జన్మలుగా సముపార్జించుకొన్న సుకృత - దుష్కృత కర్మ ఫలాలను **'సంచితము'** అని, వర్తమాన జన్మలో ఫలరూపములగుచున్న కర్మఫలములను **'ప్రారబ్ధము'** అని, ఈ దేహానంతరము వెంటనంటి తదనంతర దేహ సందర్భమునకై వేచి ఉండే కర్మ ఫలాలలను **'ఆగామి'** అని అంటారు కదా ! మరి జీవన్ముక్తుని పట్ల సంచిత - పారబ్ధ - ఆగామి కర్మలు కొనసాగుతాయా? తొలగిపోతాయా ?

**గురువు :** ఏ సుఖ - దుఃఖ ఇత్యాది అనుభవములుగా (లేక) అవగాహనలుగా తారసబడుచున్నాయో, వాటినే 'కర్మ ఫలములు' అని పిలుస్తున్నారు. అవియే ప్రారబ్ధ కర్మలుగా వర్తమానములో ఫలీకరించుచున్నాయని శాస్త్రములు చెప్పుకొస్తున్నాయి. అయితే, **ఫలోదయః క్రియా పూర్వో నిష్క్రియో నహి కుత్రచిత్ !** కర్మలవలన కదా, కర్మ ఫలాలు ! కర్మలకన్నా ముందే ఆత్మ ఉన్నది కదా ! అట్టి నిష్క్రియమగు ఆత్మ యొక్క అర్థ-పరమార్థములను సిద్ధించుకొన్న తరువాత, ఇక కర్మ ఫలాలు ఏమి చేస్తాయి? అవి ఉండవచ్చు, లేదా, లేకపోవచ్చు. కానీ జీవన్ముక్తుని దృష్టిలో **"కర్మలు - కర్మఫలాలు కల్పనలోనివి ! స్వతఃగా లేవు"**... అను అవగాహన సుస్థిరమై ఉంటోంది. కలలోని సందర్భాలను 'కర్మఫలాలు' అని అంటామా? అనము కదా! "అహమ్ బ్రహ్మ! - నేను బ్రహ్మమును"... అని సుస్పష్టపరచుకొన్న తరువాత ఇక కర్మలకు మునుముందే ఉన్న తత్ స్వరూపుని పట్ల కోటికల్పములలో సంపాదించుకొన్న సంచితము కూడా విలయమైపోగలవు. స్వప్నతుల్యం కాగలదు.

**శ్లో॥ 'అహం బ్రహ్మ' ఇతి విజ్ఞానాత్ కల్పకోటి శతార్జితమ్**
**సంచితం విలయం యాతి, ప్రబోధాత్ స్వప్న కర్మవత్ ।**

**దృష్టాంతానికి..,**

ఒకడు కలలో అనేక ప్రదేశాలు తిరుగుచూ, అనేక క్రియలు నిర్వర్తిస్తూ, అనేక వ్యవహారాలలో మునిగి ఉన్నాడు. గొప్ప గొప్ప గృహాలు మొదలైనవి నిర్మించుకొని, అనేక మందితో రకరకములైన సంబంధ - అనుబంధ - బాంధవ్యములలో మునిగి - తేలుచున్నాడు. కొన్ని కొన్ని విషాద - సంతోష సంఘటనలు కూడా అతనిని ముంచెత్తి ఉన్నాయి. అనేకమందిని కలసి, అనేక విషయాలు చర్చించటానికి ఇంటినుండి బయలుదేరుచున్నాడు.

**ఇంతలో, మెళుకువ వచ్చింది.**

అప్పుడేమౌతుంది ? స్వప్నదృశ్యమంతా క్షణంలో మటుమాయమౌతుంది కదా !

అట్లాగే 'ఇదమ్ అహమ్ - తత్ బ్రహ్మమేవ" అని **'సర్వకాలములలోని నేనైన నేను'** గురించి తెలుసుకొని, ఏకత్వము పొందిన తరువాత ఇక ఆపై ప్రాపరబ్ధము ఇత్యాది కర్మల గురించిన ఊసుయే ఉండదు.

ఇక, భావి (ముందుముందు) కర్మల విషయమో ? ఏ విధంగా అయితే ఆకాశము అంతా తన యందే కలిగి ఉండి దేని చేతనూ స్పృశించబడటము లేదో, **స్వం అసంగం ఉదాసీనం పరిజ్ఞాయం నభో యథా, న క్లిశ్యతే యతిః కించిత్ కదాచిత్ భావికర్మభిః ।...** అదే రీతిగా "ఆత్మగా నేను దేనికీ సంగము లేనివాడను. ఉదాశీనుడను" అని తెలుసుకున్న జీవన్ముక్తుడు **"భావి (Future) కర్మలచేత కర్మఫలములచేత కూడా బద్ధుడను కాను !"..** అని గ్రహించినవాడై ఉంటున్నాడు. **"సర్వదా పరమైయున్న నా సమక్షంలో స్వీయ కల్పనయే ఈ జన్మ-కర్మలు"** - అను ఎరుకయే జీవన్ముక్తుని స్వభావం!

ఒకచోట ఒక కుండ ఉన్నది. దానియందు సురాపానము (కల్లు) ఉన్నది. ఆ కల్లు వాసన అక్కడి స్థలమును (ఆకాశమును) అంటుతుందా ? అంటదు. "నేను ఆత్మను. ఈ దేహము నాకు ఉపకరణము. ఉపాధి అనబడు **"ఆత్మోపాధి యోగమును"** ఆశ్రయించిన జీవన్ముక్తుని "జీవుడు-జగత్తు-ఇంద్రియములు-విషయములు-సుఖ-దుఃఖములు-కర్మ అకర్మలు".. మొ॥ వన్నీ స్పృశించజాలవు.

**శ్రోత :** ఆత్మ జ్ఞానము సముపార్జించుకున్న తరువాత, ఇక ఆపై ప్రారబ్ధకర్మ నశిస్తుందని మీ అభిప్రాయమా, స్వామీ !

**గురువు :** లేదు నాయనా! సంచిత-ప్రారబ్ధ-ఆగామి కర్మ ఫలానుభావముల గురించి వివరించు విజ్ఞులు, **"ప్రారబ్ధము అనుభవముచేత మాత్రమే తొలగుతుంది. ఆత్మజ్ఞానికి కూడా అనివార్యమే"...** అని చెప్పుతూ వస్తున్నారయ్యా! సంధించి విడచిన బాణము, ఆపై ఆగమన్నా ఆగకుండా లక్ష్యమువైపునకే కదలివెళ్ళు తీరుగా, ప్రారబ్ధము ఆత్మజ్ఞాని పట్ల కుడా ప్రవర్తితము అగుచున్నది. ఒకడు "పులేమో" అని అనుకొని విల్లు చేబూని బాణమును సంధించి విడచిన తరువాత, అప్పుడు "అది పులికాదు. ఆవు!" ... అని తెలిసికొన్న మాత్రం చేత ఏమి ప్రయోజనం? ఆ విడచిన బాణము ఆగుతుందా? ఆగదుగదా! ప్రారబ్ధకర్మలు అట్టివేనని చెప్పబడుచున్నాయి.

అయితే... జీవన్ముక్తుని విషయమై ప్రారబ్ధకర్మలు ఉండి కూడా లేనివైపోతున్నాయి. ఎట్లా అంటావా? విను!

**"నేను జన్మ - జరా - మరణములకు కించిత్ కూడా సంబంధము లేనట్టి చైతన్యాత్మను కదా!"...** అని తెలుసుకొన్నవానికి బాహ్యంగా లోక సంబంధంగా కనిపించే కర్మ - కర్మ ఫలముల వలన క్రొత్తగా వచ్చేదేమున్నది? పోయేదేమున్నది? అట్టి వానికి ప్రారబ్ధ కర్మ ఫలములు తాను చదువుచున్న కథలోని సంఘటనల వలె కల్పన - భావన - ఊహ మాత్రమే అయి ఉంటున్నాయి.

అందుచేత...,

**ఎంతవరకైతే దేహాత్మ బుద్ధి కొనసాగుతుందో, అంతవరకు 'ప్రారబ్ధ కర్మ' ఉన్నట్లే** అగుచున్నది. ఏది ఏమైతేనేం ! ఈ భౌతిక దేహము ఏ విధంగా కల్పనలోని విభాగమో, అదే విధంగా, ప్రారబ్ధకర్మ ఫలాల అనుభవము కూడా కల్పనలోని విభాగమే ।

- కల్పనా విభాగములే అయి ఉన్నప్పుడు కర్మ - కర్మ ఫలాలు సత్యము (ఉన్నవి) ఎట్లా అవుతాయి ? నేను నా ఊహలో అడవిలో చిక్కుకున్నట్లుగా భావిస్తూ ఉన్నంత మాత్రంచేత, అడవిలో చిక్కుకొన్నవాడిని అవుతానా? లేదు కదా ! కలలో కొండ ఎక్కితే కొండ ఎక్కినవాడిని అవుతానా ? అవను కదా ! - అసత్తు (వాస్తవానికి లేనిది - భావనచే మాత్రమే ఉన్నది) అయినట్టి కర్మఫలాలకు సంబంధించిన సంచిత - ప్రారబ్ధ - ఆగామికర్మ - కర్మ ఫలాలకు (అట్లాగే, ఈ దేహము మొదలైనవాటికి) జననమెక్కడిది ? పుట్టుక అనునదేమున్నది ? - జననమే లేనివాటికి నాశనమెక్కడిది ?

ఇప్పుడు - చెప్పు ! ప్రారబ్ధ - కర్మ ఫలాలు - అనునవి ఎక్కడున్నాయి ? అసత్తుకు ఉనికి ఏమున్నది ? ఆత్మతత్త్వ జ్ఞానముచే అజ్ఞాన కార్యవ్యవహారమంతా సమూలముగా లయము పొందుచుండగా ఇక **"జడదేహత్వము - దేహము ఉన్నాయి. ఈ దేహత్వము నాకు పోయేది ఎట్లా ?"** ... అను శంక ఎందుకు ? ప్రసక్తి ఎక్కడిది ?

**శ్రోత :** మీరు చెప్పేదానిని బట్టి "ప్రారబ్ధకర్మములు మొదలేలేవు" అనే అర్థము నాకు స్ఫురిస్తోంది. మరి శాస్త్రములు ఎందుకు సంచిత - పారబ్ధ - ఆగామి కర్మల గురించి విస్తారంగా అభివర్ణిస్తున్నాయి ?

**గురువు :** అదా ? **సమాధాతుం బాహ్య దృష్ట్యా 'ప్రారబ్ధం' వదతి శృతిః ।** 'నాకు ఈ బాధలు ఎందుకొస్తున్నాయి ?'... అనే ప్రశ్నతో గురువును సమీపించినప్పుడు, వెంటనే, ఆత్మ దృష్టిని చెప్పి **"కర్మ ఫలములు మనోకల్పనయే"** అని సూచించటం కుదరదు. అందుకు శిష్యుడు ఇంకా సిద్ధపడి ఉండడు. అందుచేత ముందుగా **"దుష్టకర్మల వలన దుఃఖము, ఉత్తమ కర్మల వలన సుఖము లభిస్తున్నాయి"** అను బోధచే ఆ మముక్షువును అతని సుఖ దుఃఖముల విషయమై సమాధానము పొందింపజేయుచున్నారు. ఉత్తరోత్తరా ఉత్తమ కర్మల యందు ప్రోత్సాహపరస్తున్నారు. ఉత్తమ కర్మలచే అమానిత్వ - అదంభిత్వాది భక్తి గుణములు రూపుదిద్దుకుని హృదయమున ప్రవృద్ధమగుచున్నాయి. భక్తి గుణములు బుద్ధిని నిర్మలము, సునిశితము, విస్తారము, అర్ద్రము చేస్తున్నాయి. అట్టి నిర్మలమగు బుద్ధి ప్రత్యగాత్మ - సర్వాంతర్యామిత్వము యొక్క అనుభవమునకు ఆ ముముక్షువును సంసిద్ధం చేస్తున్నాయి.

ఓ ప్రియ బిడ్డా ! వత్సా ! ఆత్మబంధూ ! అట్టి బుద్ధికి ఆవల నిత్యోదితమై, సర్వకారణ కారణమైయున్న ఈ జీవుని స్వస్వరూప – సర్వ స్వరూప – సర్వాంతర్గత పరమాత్మ తత్త్వము ఎట్టిదని తెలియవచ్చుచున్నదో,..... విను.

**ప్రతి ఒక్కరి ఇహ స్వరూపమును ఆధారముగా కలిగి ఉన్న పరస్వరూపము ఎట్టిది ? ఆత్మగా ఈ జీవుడు ఎట్టివాడు?**

**పరిపూర్ణమ్** : “తనకు తానే ‘పూర్ణము’ అయి, ఉన్నదంతా తానే అయి, తన పూర్ణత్వమునకు మరొకటేదీ అవసరమే లేనట్టిది.

**అనాద్యంతమ్** : ఆది అంతములు లేనిది.

**అప్రమేయమ్** : గదిలోని దీపపు కాంతివలె దేనికీ సంబంధించనిది ! గదిలో వెలిగే దీపముయొక్క కాంతికి ఆ గదిలో వెలుగునందు కనిపించే వస్తు జలమునకు బంధమేమి? సంబంధమేమి?

**అవిక్రియమ్** : సర్వకర్మలకు సాక్షి. కనుక ఏవైనా క్రియ – కార్యక్రమములచే లభించేది కాదు ! అవగాహనచే లభించేది. ఆత్మకు ఆయా క్రియల కర్తృత్వము ఆపాదించ వీలు కాదు.

**సద్ఘనమ్** : సత్ (ఉనికి) – అనే తేజముచే ఘనీభూతమైనది !

**నిత్యమ్** : త్రికాలములలోను యథాతథము ! నిత్యమైనది, ఎల్లప్పటికీ ఉండునది.

**ఆనన్దఘనమ్** : ఘనీభూతమైన ఆనందస్వరూపము. అనుభూతులన్నిటికీ ఆవల ఆధారమై వెలుగుచున్న కేవలీ స్వరూపము.

**అవ్యయమ్** : మార్పు – చేర్పులు లేనిది ।

**ప్రత్యక్** : ప్రతి దేహములోను బుద్ధికి కూడా సాక్షి అగు ప్రత్యక్ ఆత్మ స్వరూపము ! సర్వసాక్షీ రూపమగు ఆత్మచైతన్యము.

**ఏకరసమ్** : అనేకముగా కనిపిస్తూ సర్వదా ఏకరస స్వరూపము !

**పూర్ణమ్** : జీవ – ఈశ్వర – పర స్వరూపియై సర్వదా పూర్ణమైయున్నది ! శూన్యము కానిది ! ఈ సర్వమును పూరించి, పూర్ణము చేయునది.

**అనన్తమ్** : అంతమంటూ లేనిది ! (Infinite).

**సర్వతోముఖమ్** : స్వప్నద్రష్ట స్వప్నమంతా అన్ని వైపులా నిండి ఉంటున్న తీరుగా, విశ్వమంతా అన్నివైపులా ఏర్పడి ఉన్నట్టిది. ఈ దృశ్యమంతా కూడా తన ముఖముగా కలిగి ఉన్నట్టిది.

**అహేయమ్** : ‘నాఽ ఇతి’ అని త్యజించగా చివరికి ఏమాత్రమూ వదలలేనట్టిది. “సహజ స్వస్వరూపమే” అయినట్టి దానిని వదలటమెట్లా! బంగారు ఆభరణము యొక్క ఆభరణాకారము మారవచ్చుగాక! మరొక ఆభరణంగా మలచినప్పుడు కూడా ఆవస్తువు బంగారత్వము కోల్పోదుకదా! ఆత్మత్వము అట్టిదే!

**అనుపాదేయమ్** : ఆత్మ స్వీకరించబడగలిగిన ఏదో వస్తువుకాదు, పొందగలిగేదీ కాదు. ఏదైనా పొందాలంటే ఆ పొందే వానికి పొందబోయేది వేరుగా ఉండాలిగా! కానీ ఆత్మయో? స్వస్వరూపమే అయి ఉన్నది. తానే అయి ఉన్నట్టి దానిని తాను మరింకెప్పుడో క్రొత్తగా పొందటమనే ప్రసక్తి ఎక్కడిది?

**అనాదేయమ్** : అది ఒకరు మరొకరికి ఇచ్చేది కాదు. ఏది తానే అయి ఉన్నదో, అద్దానిని మరొకరు వచ్చి ఇవ్వటమేమిటి ? ఇస్తేగాని పొందలేమనే ప్రసక్తి ఎక్కడిది ? గురువులు, శాస్త్రములు అద్దానిని గుర్తు చేస్తున్నాయి! అంత వరకే!

| | | |
|---|---|---|
| **అనాశ్రయమ్** | : | వెలుతురులో వస్తువులు, మనుష్యులు కనిపిస్తున్నారనుకో. వెలుతురు ఆ ఆకారాలను ఆశ్రయించినట్లా? లేక, ఆ వస్తువుల ఆకారాలు వెలుతురును ఆశ్రయించినట్లా? రెండు లేదు కదా! **ఆత్మ దేనినీ ఆశ్రయించటమూ లేదు. ఏదీ అద్దానిని ఆశ్రయించి ఉండటమూ లేదు.** |
| **నిర్గుణమ్** | : | ఆధ్యాత్మతత్త్వమగు ఆత్మ త్రి-గుణములకన్నా ముందే ఉన్నది. త్రిగుణములు అద్దాని స్వీయమహిమ. అంతేగాని అది త్రిగుణములచే బంధించబడేది కాదు. కల తనదౌతుందేమో గాని, కలలో తాను చిక్కుకోదు కదా ! కనుక ఆత్మ గుణములకు ఆధారమై, నిర్గుణమైయున్నది. |
| **నిష్క్రియమ్** | : | కర్మలకు ముందే ఆత్మ ఉన్నది. ఆత్మ ఉన్నది కాబట్టి కర్మలు, జన్మలు ఉన్నాయి. కర్మలకు మునుముందే ఉండటంచేత సనాతనము! నిష్క్రియము! |
| **సూక్ష్మమ్** | : | ఆత్మ ఒక స్థూల వస్తువు కాదు. కళ్ళకు కనబడేది కాదు. బుద్ధికి ఆవల ఉండి, బుద్ధికి అనుభవరూపమై ఉండేది కనుక సూక్ష్మము. |
| **నిర్వికల్పమ్** | : | 'కల్పనలో (in the one's own creation)' ఈ దేహము - జగత్తు ఉన్నాయి. కల్పనకు ముందే 'కల్పించువాడు' ఉన్నాడు. ముందే ఉన్నాడు కాబట్టి ఆయన (ఆత్మదేవుడు) కల్పన కాదు. వికల్పన కాదు. అన్నిటినీ కల్పించుకొని, ఆక్రమించుకొని యున్న **అధ్యాత్మ-నిర్వికల్పము!** |
| **నిరంజనమ్** | : | మనస్సు - బుద్ధి - చిత్తము - అహంకారము - అవ్యక్తము - మాయ... వీటికి దోషములు ఉంటే ఉంటాయేమో ! వీటన్నిటికీ ఆవల గల ఆత్మ వాటిచే స్పృశించబడదు. నిత్యనిర్మలము. నిరంజనము. ఆకాశములాగానే ఆత్మను ఏదీ అంటదు. |
| **అనిరూప్యస్వరూపమ్ యత్** | : | ప్రపంచములో రూపముగల దాని గురించి "దీని రూపము ఇది. ఇటువంటిది" అని నిరూపించి చెప్పగలం. ఆత్మ ప్రపంచములోనిది కాదు. అందుచేత, 'ఆత్మ రూపము ఇట్టిది' అని ఎట్లా చెప్పటం ? అందుచేత, ఎద్దాని స్వరూపము మనము మరొకరికి నిర్వచించి చెప్పలేమో అది అనిరూప్యము (You cann't prove and explain its form), అనుభవైకవేద్యము మాత్రమే! |
| **మనోవాచామగోచరమ్** | : | మనస్సుచేత, వాక్కుచేత 'ఆత్మ ఇట్టిది' అని ఎట్లా చెప్పటం ? ఆ రెండింటికి ఆధారమైయున్నట్టిది కదా ! మట్టి బొమ్మ తన ఆకారమును నిరూపణగా తీసుకొని మట్టి గురించి చెప్పగలదా? కలలోని వాడు "కల అనగా ఏమి?"... అనునది విశ్లేషించి చెప్పగలడా ? ఆత్మ మనస్సుకు వాక్కుకు విషయమే కాదు. ఆ రెండింటికి అగోచరము. |
| **సత్ సమృద్ధమ్** | : | తాను సత్ వస్తువుతో (ఉనికితో) సమృద్ధమై, దృశ్యమునంతటినీ అట్టి సత్ (Presence) చే సమృద్ధము చేయుచున్నది. స్వప్న ద్రష్ట స్వప్నమంతా తన ఉనికితో నింపుచున్నాడు కదా! నవలా రచయిత నవలను అంతటినీ తన రచనా చైతన్యముతో నింపుచున్నాడు కదా ! ఆత్మ దృశ్య జగత్తునంతటినీ తన ఉనికితో నింపుచున్నది. ఆత్మయొక్క 'ఉనికి'ని ఆధారంగా చేసుకొనియే దృశ్యము ఉన్నదగుచున్నది! |
| **స్వతఃసిద్ధమ్** | : | అధ్యాత్మమగు ఆత్మను మరొకరెవరూ సిద్ధింపజేయటము లేదు. తనకుతానే సిద్ధించియున్నట్టిది. 'నేను' అనునది మరొకరు సిద్ధింపజేయవలసిన పనేమి? |
| **శుద్ధమ్** | : | నిత్య నిర్మలమైనది. నిర్దోషము, కేవలము అగుటచేత 'శుద్ధము' అని అనబడుతోంది. |
| **బుద్ధమ్** | : | కేవల బుద్ధి స్వరూపము. మౌనస్వరూపము. సర్వము తన బుద్ధిచే ఎరుగుచున్నట్టిది. |
| **అనీదృశమ్** | : | ఇంద్రియములకు కనిపించేది కాదు. దృశ్యవస్తువు కాదు. అందుచేత అనీదృశము. |

**ఏకమేవాఽద్వితీయమ్ బ్రహ్మ** : విశ్వజగత్తులోను, ఈ దేహములోను మహత్తరమైయుండటం చేత 'బ్రహ్మము' ! జీవులు – జగత్తులు – బ్రహ్మాండముల రూపముగా, **అనేకముగా** కనిపిస్తూ కూడా సర్వదా **ఏకమే** అయి ఉన్నట్టిది. అద్దానికి ద్వితీయమైనదంటూ ఎక్కడా ఏదీ లేదు. అందుచేత ఏకము. అద్వితీయము. బ్రహ్మము **'అనుభూతమగుచున్నట్టిది'**గా అయి, అనుభూతికి **ఆధారమై అనుభూతిని ఆస్వాదించునదై** ఆవల ఉన్నది.

**నేఽహనానాఽస్తి కించన** : ఇక్కడ అనేకము, నానాత్వము అనునది ఆత్మ దృష్ట్యా కించిత్ కూడా లేదయ్యా ! బ్రహ్మమే ఇదంతా ! బ్రహ్మమే అజ్ఞాన దృష్టిచే నానావిధములుగా **అగుపిస్తూ** ఆత్మ జ్ఞానదృష్టిచే **"నానాత్వము కొంచము కూడా లేదు"** అను సత్యము **అనిపిస్తూ** సుస్పష్టమగుచున్నది.

⌘

**శ్రోత :** అటువంటి ఆధ్యాత్మతత్త్వమును చేరటము ఎట్లా ? మార్గాన్వేషకుడనగు నాకు మార్గదర్శకులై మార్గము చూపండి. ఈ జగత్తు అప్పుడేమగుచున్నదో కూడా వివరించండి !

**గురువు :** బిడ్డా ! మమాత్మానందస్వరూపా ! అట్టి ఆధ్యాత్మమును అఖండతము (unpartitionable) అప్రమేయము, నిత్యసత్యము... అని స్వానుభావముచే స్వయముగా తెలుసుకోవటమే మార్గము.

- ❑ జ్ఞాత్వా... తెలుసుకొని
- ❑ సిద్ధిమ్... సిద్ధింపజేసుకొని,
- ❑ ద్రష్టుమ్ .. దర్శించుచూ...,
- ❑ ప్రవేశమ్ ... ప్రవేశించటము.... అనునవి ఉపాయములు.

'అదియే నేను' అని నీకు నీవే గుర్తించి గమనించి, ఉండెదవుగాక !

నిర్వికల్పమగు ఆత్మయందు ఆత్మజ్ఞాన సంపన్నుడై, సుముఖుడై, సంసిద్ధుడై, తిష్ఠపొందిన తరువాత... ఇక

- ◆ ఈ జగత్తు ఎక్కడ ఉన్నట్లు ?
- ◆ ఎక్కడి నుండి వచ్చుచున్నట్లు ?
- ◆ ఎటు పోతున్నట్లు ?
- ◆ ఎందులో ఉన్నట్లు ? ఎందులో విలీనమగుచున్నట్లు ?

కల్పనలో (లేక) కలలో భవనమువలె మొదలే లేనిది ఎటునుంచి వచ్చినట్లు? ఎటు పోతున్నట్లు? లేనిది సర్వదా లేనిదే!

**శ్రోత :** మహత్తరము–అద్భుతముగా ఈ ఎదురుగా కనిపించే జగత్తు ఎట్లా ఎవరి సంకల్పం చేత, ఎందుకు రూపుదిద్దుకుంటున్నట్లు ?

**గురువు : అథునైవ మయా దృష్టం నాస్తి కిం మహత్ అద్భుతమ్ !** అత్యద్భుతము – మహత్తరము అని ఏ దృశ్య జగత్ గురించి విశేషణములు చెప్పుచున్నావో... అది నాకు ఆత్మకు వేరుగా అగుపించటమే లేదయ్యా ! మహా సముద్రము–సముద్రజలమును చూస్తూ "ఈ తరంగాలు స్వీకరిస్తాను ! ఆ తరంగాలు వదలుతాను" అని నిర్ణయాలు చేసుకుంటుందా? చేసుకోదు. ఎందుచేత? అంతా సముద్రజలమే కదా ! అట్లాగే నా యొక్క ద్రష్టత్వముతో సహా ఈ సర్వమూ కూడా – **అధ్యాత్మమహాసముద్రములో ఆత్మతరంగములే** అయి ఉండగా, ఇక్కడ స్వీకరించవలసినదేమున్నది ? త్యజించవలసినదేమిటి ? సముద్ర తరంగాలు సముద్ర జలమును బంధిస్తాయా? లేదు కదా! ఈ దృశ్య విశేషాలు ఆత్మను బంధించజాలవు!

ఇదంతా అఖండ ఆనంద పీయూష పూర్ణ బ్రహ్మముతో రూపితమైన అస్మత్ ఆత్మ మహాసముద్రమే! నేను ఆత్మ మహాసముద్రుడను! ఆహమ్ ఆత్మ–ఆనంద సాగరమస్మి। ఈ దృశ్యమంతా నాకు అన్యముగా గాని, విలక్షణమైనదిగాగాని కొంచము కూడా కనిపించటం

లేదు. వినిపించటం లేదు. తెలియవచ్చుట లేదు. అట్లాగే నీవు కూడా అఖండానంద మహాసముద్రుడవై, అంతరంగ తరంగములవలె ఈ దృశ్య వ్యవహారములన్నిటినీ వీక్షించుము.

**స్వాత్మనైవ సదానందరూపేణాఽస్మి స్వలక్షణః** (స్వాత్మ యొక్క స్వలక్షణముల చేత)

| | |
|---|---|
| **సదానందరూపేణాఽస్మి స్వలక్షణః** | : నేను ఎల్లప్పుడూ, ఎప్పుడూ ఆనందరూపుడనే ! జన్మ – జ్ఞానము – అజ్ఞానము – దుఃఖము – బంధము–పునర్జన్మ... ఇవన్నీ నా వినోదరూపాలు. జ్ఞానము ఉన్నప్పుడు–లేనప్పుడు, జన్మలు ఉన్నప్పుడు–లేనప్పుడు, సమాధిలో ఉన్నప్పుడు–సంసారిగా ఉన్నప్పుడు ... అన్ని సందర్భాల లోను సర్వదా **ఆత్మానందస్వరూపుడనే! అస్మత్ ఆత్మ సదా సిద్ధించియే ఉన్నది కదా!** |
| **అసంగోఽహమ్** | : దేనికీ సంబంధించినవాడను కాను ! నాటక కళాకారుడు నాటకములోని పాత్ర యొక్క గుణములకుగాని, వస్త్రధారణకుగాని, సంబంధ – బాంధవ్యములకుగాని సంబంధించినవాడు కాదు ; వాటితో అతనికి సంబంధమే లేదు కదా ! అట్లాగే నేను జీవాత్మత్వముతో, దృశ్యముతో, సందర్భములతో **సంగము లేనివాడను.** |
| **అనంగోఽహమ్** | : ఈ దేహము యొక్క అంగములు, వాటికి సంబంధించిన శబ్ద – స్పర్శ – రూప–రస – గంధములు నాకు చెందినవి కావు – నేను వాటికి చెందినవాడను గాను. అవన్నీ జగత్ నాటక పాత్రకు సంబంధించినవి మాత్రమే! **నేను అంగరహితుడను.** |
| **అలింగోఽహమ్** | : నామ రూప రహితుడను. ఆకారరహితుడను. స్త్రీ – పురుష – నపుంసకలింగ భేదములు లేనట్టి ఆత్మ స్వరూపుడను. స్వప్నములో రూపరహితుడనై దృశ్యరూపమును పొందుచున్న రీతిగా... జాగ్రత్‌లో కూడా అరూపుడనై ఇదంతా పొందుచూ ఆస్వాదిస్తున్నాను. |
| **అహమ్ హరిః** | : ఈ నామ రూపాత్మకమై కనిపించేదంతటికీ ఆధారమై, సర్వాత్మకమైనటువంటి హరినే **నేను!** నేనే హరిని ! విహరించువాడను, హరించువాడను కూడా! ఇదంతా నేనే అయి ఉన్న వాడను! |
| **ప్రశాంతోఽహమ్** | : పరమ ప్రశాంతమగు ఆత్మ స్వరూపుడను. ఇక తదితరమైన జన్మ – కర్మలు, జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు, బ్రహ్మాండ పంపరలు... ఇవన్నీ నా యొక్క ప్రశాంతరూపమే! వినోదములే! విభవములే! మహిమలే! పరమప్రశాంతుడనై ఉండియే ఇవన్నీ అగుచున్నాను. |
| **అనంతోఽహమ్** | : నామ – రూపరహితుడను కాబట్టి ఆద్యంతరహితుడను. జగత్తులచేత గాని, జన్మల చేతగాని, కర్మలచేతగాని, గుణముల చేతగాని **పరిమితుడను కాను. అపరిమితుడను!** ఆనంతుడను. |
| **పరిపూర్ణ** | : నాకు నేనేస్వయముగా పరిపూర్ణుడను. క్రొత్తగా రావలిసినదేదీ లేదు. ఉన్నదేదో పోవలసినదీలేదు. |
| **చిరంతనః** | : ఎల్లప్పుడూ ఉండువాడను. నిత్య సత్యస్వరూపుడను. కేవలుడును. అన్తమునకు ఆవల చిరస్వరూపుడను! |
| **అకర్తాఽహమ్** | : నాకు చేయవలసినవీ లేవు. చేయబడుచున్నవీ ఏవీ లేవు. చేయకూడనివీ లేవు. ఆత్మగా కర్మలకు సంబంధించినవాడనే కాను. కనుక కర్తృత్వరహితుడను. అకర్తను. నాటకములోని ఒక పాత్రకు సంబంధించిన మంచి, చెడులకు రచయిత కర్త–అనము కదా! పాత్రధారుడూ కర్త కాదు కదా! |
| **అభోక్తాఽహమ్** | : అంతా మనస్సే అనుభవిస్తోంది. నేనో,... మనస్సుకు ఆవల, మనస్సుకు కేవల సాక్షినై అసంకల్పితుడనై ఉన్నాను. అందుచేత దేనికీ భోక్తను కాను. అభోక్తను. ఇక సుఖ – దుఖములంటారా ? వాటికి నేను సాక్షిని ! అవన్నీ మనో లీలా వినోదాలు మాత్రమే ! నేను మనోరహితమగు కేవల చైతన్య స్ఫూర్తిని ! |

**అవికారోఽహమ్** : ఎట్టి గుణ - రూప - నామ - దేహ - దుర్స్వభావ - సుస్వభావ వికారములూ లేనివాడను. దీపపు వెలుగులో నాటకం జరుగుతూ ఉంటే,... ఆ నాటకములోని సందర్భాలకు, పాత్రల గుణములకు, వికారములకు దీపకాంతికి ఏమి సంబంధం ! ఆత్మ యొక్క దివ్యతేజస్సులో ఈ బ్రహ్మాండాలు, త్రిమూర్తులు, సృష్టి స్థితి లయాలు - ఇవన్నీ ప్రదర్శితమగుచున్నాయి. జరుగుచున్నాయి. వాటికి సంబంధించిన వికారాలేవీ ఆత్మతేజో రూపుడనగు నాకు సంబంధించినవే కావు. నేను సర్వదా ఆత్మ స్వరూపుడను ! కాబట్టి **సర్వదా, సదా అవికారుడను.**

**అవ్యయః** : దేని చేతనూ మార్పు - చేర్పులు పొందనివాడను. వ్యయము (Spending) కానివాడను. అవ్యయుడను. అక్షరములతో ఒకడు ఒక వాక్యమును వ్రాస్తే, అక్షరములు తరుగుతాయా? పెరుగుతాయా? లేదు కదా!

**శుద్ధబోధ స్వరూపోఽహమ్** : తెలుసుకోవటానికి తెలివి కావాలి కదా ! తెలియబడే అంతటికీ ఏ తెలుసుకొనే తెలివి ఉన్నదో... అది తెలియబడేదానికి మునుముందే ఉన్నది. ఆ మునుముందే ఉన్న తెలివి రూపుడను. శుద్ధభోధ స్వరూపుడను. తెలియబడే దానిచేత తెలివి మార్పు - చేర్పులు చెందుచున్నదా ? లేదు. అందుచేత నా శుద్ధ బోధ స్వరూపత్వము సర్వదా యథాతథము. తెలివి-తెలియబడుదాని స్వభావ-స్వరూపములతో ప్రమేయము పొందదు కదా!

**కేవలోఽహమ్** : సర్వమునకు కేవలస్వరూపుడను! The original form of all is what I am ? ఆభరణమునకు బంగారము కేవలమైనట్లు, పంచభూతాలకు ఆదిశక్తి మూలమైనట్లు, ఈ బాహ్య - అంతర వ్యవహారమంతటకీ మూలస్వరూపుడనై, కేవలుడనై ఉన్నాను. అన్నీ నా చేతనే, నేనే ఆధారమై చేయబడుచున్నాయి. ఆభరణాకారము బంగారు లోహము యొక్క ఉనికిపై ఆధారపడి ఉన్నట్లుగా... ఈ సృష్టి - స్థితి - లయములన్నీ కేవల స్వరూపుడనగు నాపై ఆధారపడి ఉన్నాయి.

**సదాశివః** : సదాశివుడను! ఎల్లప్పుడు శివస్వరూపుడను. జన్మలను పొందనప్పుడు శివస్వరూపుడనే ! స్వస్వరూపము ఏమరిచి దృశ్య తదాత్మ్యము పొందుచున్నప్పుడూ శివ స్వరూపుడనే ! సంసారమంతా ఉన్నప్పుడూ తొలగినప్పుడూ కూడా శివ స్వరూపుడునే ! కాలమునకు ఆవల కేవల శివ స్వరూపుడనై సర్వదా వెలుగొందుచున్నవాడను. భూత-వర్తమాన-భవిష్యత్తులచే మార్పు-చేర్పులు పొందను!

❖

ఈ ఆధ్యాత్మోపనిషత్ పరమవిద్యను ఒకప్పుడు సదాశివుడు **అపాంతరతమునకు** (శ్రీమన్నారాయణునకు) బోధించారు. ఓం నమః శివాయ ! ఓం నమో నారాయణాయ ! అపాంతరతముడు సృష్టికర్తయగు బ్రహ్మ దేవునకు ఈ విద్యను బోధించారు.

ఓం నమో నారాయణాయ ! ఓం పితామహాయ బ్రహ్మ భగవాన్ నమః!

బ్రహ్మ దేవులవారు ఈ విద్యను ఘోరాంగిరసుడు అను తన మానస పుత్రునికి బోధించారు. ఆ ఘోరంగిరసుడు రైక్వునకు బోధించారు. రైక్వుడు శ్రీరామచంద్రునికి బోధించాడు. శ్రీరాముడు ఈ విద్యను తనను 'రామా' అని ప్రేమగా పిలచినంత మాత్రము చేతనే అట్టి సర్వజీవులకు ప్రసాదించుచున్నారు.

ఇది వేదప్రమాణము ! వేదానుశాసనము.

ఇది అధ్యాత్మోపనిషత్

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

----


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 2 అద్వయతారకోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



శ్లో॥ **ద్వైత-అసంభవ విజ్ఞాన సంసిద్ధ "అద్వయ తారకమ్"**
**తారక బ్రహ్మేఽతి యత్ గీతం వన్దే శ్రీరామ వైభవం॥**

*ఈ అద్వయతారకోపనిషత్ "ద్వైతము అసంభవము" అను స్థానమునకు సంసిద్ధము చేయునదై, **"తారక బ్రహ్మేఽతి"** అనే గీతమై, **ఆత్మారామ వైభవమును** ప్రకటించుచున్నది. అట్టి శ్రీరామ వైభవమునకు నమస్సుమాంజలులు.*

1. ఓం
**అథాఽతో అద్వయ తారకోపనిషదమ్।**
**వాఖ్యాస్యామో।**
**యతయే జితేంద్రియాయ,**
**శమ-దమాది షడ్గుణ పూర్ణాయ;**
**"చిత్ స్వరూపోఽహమ్"**
**ఇతి సదా భావయన్,**
**సమ్యక్ నిమీలితాక్షః**
**కించిత్ ఉన్మీలితాక్షో వా**
**అంతర్-దృష్ట్యా**
**భ్రూ-దహరాత్-ఉపరి**
**సత్-చిత్-ఆనంద తేజః,**
**కూటరూపం,**
**పరబ్రహ్మ - 'అవలోకయన్',**
**తద్రూపో భవతి।**

**'ఓం'** అక్షరము, **పరమార్థము** అయినట్టి **'అద్వయ పరమాత్మ'**కు **అద్వయ తారక సిద్ధికై** ప్రణమిల్లుచున్నాము.

**తారకమ్** - తరింపజేయునది.

**అద్వయతారకమ్** - దేనికైతే 'ద్వితీయము' అనునదే (జీవాత్మ-జగత్తు అనబడే వేరైనదంతా) స్వతఃగా లేదో,... అద్దానిని సిద్ధింపజేసి తరింపజేయునది.

**అద్వయ తారకోపనిషత్ :** అట్టి అద్వయమును సిద్ధింపజేసి తరింపజేయు తత్త్వము యొక్క సామీప్యత! అట్టి **'అద్వయ తారకోపనిషత్'**ను ఇప్పుడు మనము వ్యాఖ్యానించుకొనుచున్నాము.

మొట్టమొదట శాస్త్రములు సూచించే భక్తి-యోగ-సాధనలు నిర్వర్తించి, తద్వారా ఈ ఇంద్రియములను - ఇంద్రియ విషయములను జయించి, **"ఇవి నా కల్పనపై ఆధారపడి ఉన్నాయిగాని, నేను వీటిపై ఆధారపడి లేను"**.... అను స్థితి సంపాదించాలి. **శమము-దమము-ఉపరతి-తితిక్ష-శ్రద్ధ-సమాధానము** ... అను షట్‌గుణ పూర్ణుడై ఉండి **"నేను చిత్ స్వరూపుడను"**... అని ఎల్లప్పుడు భావన చేస్తూ ఉండాలి.

కనులు మూసుకొనియో, లేక కనులు సగము తెరచి (అర్థనిమీలిత నేత్రుడు అయి)యో,.... **సర్వ జీవులలో సర్వదా సమముగా వేంచేసి ఉన్న పరమేశ్వర స్వరూప ధ్యాని అయినట్టి యోగి అంతర్-దృష్టిని ఆశ్రయించువాడగుచున్నాడు.** ద్రష్ట-దర్శన-దృశ్యములు ఏక రూపము పొందు త్రిపుటీ స్థానమగు భ్రూమధ్యముగా గల దహరాకాశమునకు ఆవల-అంతరాంతమున సర్వదా వేంచేసి ఉన్నట్టి సత్-చిత్-ఆనంద రూపము, తేజో రూపము, కూటస్థము (సర్వమునకు కేంద్రము,

| | |
|---|---|
| గర్భ జన్మ జరా మరణ సంసార<br>మహత్ భయాత్ సన్తారయతి।<br>తస్మాత్ 'తారకమ్' ఇతి। | గరిమ-నాభి)-అగు పరబ్రహ్మమును అవలోకిస్తూ, ఆ పరబ్రహ్మమే తానగుచున్నాడు.<br>అట్టి అంతర్-దృష్టితో భ్రూమధ్యమున గల దహరాకాశమునకు ఆవలగల పరమాత్మ సందర్శనముచే, ఈ జీవుడు తరించగలడు. "తల్లి గర్భములో నివాసము-జన్మ-వార్ధక్యము- మరణము" మొదలుగా గల అనేక జన్మ-కర్మ-కర్మఫలముల భయాలతో నిండి ఉన్న సంసారమునుండి **బంధవిముక్తుడు** అగుచున్నాడు. అందుచేత అది **'తారకవిద్య'** అని చెప్పబడు చున్నది. |
| 2. "జీవ-ఈశ్వరౌ మాయికా।"<br>ఇతి విజ్ఞాయ, సర్వవిశేషం<br>నేఽ తి నేఽ తి - ఇతి విహాయ,<br>యత్ అవశిష్యతే,<br>తత్ "అద్వయం బ్రహ్మ"।<br>తత్ సిద్ధ్యై లక్ష్యత్రయా<br>అనుసంధానం కర్తవ్యమ్॥ | **జీవుడు** - ఒక దేహములో ప్రదర్శనమగు ప్రజ్ఞా తేజస్సు. (దృష్టాంతము : ఒక నాటకంలోని పాత్ర)<br>**ఈశ్వరుడు** - (1). అనేక దేహములలో సంచారములు చేయు ప్రజ్ఞా తేజస్సు (దృష్టాంతము : అనేక నాటకములలో నటించే నాటక కళాకారుడు). (2). ఈవలగా ఉండి, కలలో అనేక నామరూపములు ధరిస్తున్న చైతన్యము.<br>ఈ రెండూ మాయా కల్పనా - అంతర్విభాగములే ... అని తెలుసుకొని ఉండాలి!<br>- ఇది నేను కాదు - ఇది నేను కాదు అని విచారణచే దృశ్య-దేహ-మనో-బుద్ధి-చిత్త-అహంకారాలను, జీవ-ఈశ్వర స్వరూపములను వాటి - వాటి విషయాలను దాటివేసి, **ఆవల స్థానమును ఆశ్రయించి ఉండాలి.**<br>- ఆపై శేషించునదే 'తత్త్వమ్-తత్ అహమ్' స్వరూపమగు అద్వయ బ్రహ్మము... అని నిర్ణయించుకొని అద్దానిని **1. అంతర్లక్ష్యము 2. బహిః లక్ష్యము 3. మధ్య లక్ష్యము** అను లక్ష్య త్రయము (Three Dimensional - Three Phased Objective) తో ఆ అద్వయ బ్రహ్మమును అనుసంధానము చేయటమే (మానవ జన్మ వచ్చినందుకు) ఉపాయమై, కర్తవ్యమై యున్నది. అదియే **తారకయోగము.** |
| 3. దేహమధ్యే బ్రహ్మనాడీ<br>'సుషుమ్నా' - సూర్యరూపిణీ<br>పూర్ణ చన్ద్రాభా వర్తతే।<br>సాతు మూలాధారాత్ ఆరభ్య<br>బ్రహ్మరంధ్రగామినీ భవతి।<br>తన్మధ్యే తటిత్‌కోటి సమాన కాన్త్యా<br>మృణాళ సూత్రవత్<br>సూక్ష్మాఙ్గీ కుణ్డలినీ ప్రసిద్ధా అస్తి।<br>తాం దృష్ట్వా మనసైవ నరః<br>సర్వ పాపవినాశ ద్వారా ముక్తో భవతి।<br>ఫాల - ఊర్ధ్వగ లలాట విశేషమండలే<br>నిరన్తరం తేజః తారక యోగ<br>విస్ఫురణేన పశ్యతి చేత్. సిద్ధో భవతి।<br>తర్జనీ అగ్రా ఉన్మీలిత కర్ణరంధ్ర ద్వయే,<br>తత్ర ఫూత్ కార శబ్దో జాయతే।<br>తత్ర స్థితే మనసి, చక్షుః<br>మధ్యగత నీలజ్యోతిః స్థలం | **అంతర్‌లక్ష్య లక్షణము** - ఈ దేహము మధ్యగా బ్రహ్మనాడి ఉన్నది. ఆ సుషుమ్న **సూర్య తేజస్సుతోను, పూర్ణచంద్రుని ప్రకాశముతోను** వర్తిస్తోంది.<br>ఆ సుషుమ్న నాడి **'మూలాధారము (గుదస్థానము)'** నుండి ఆరంభమై, **బ్రహ్మ రంధ్రము** (కపాల చిట్ట చివరి స్థానము) వరకు విస్తరించినదై ఉంటోంది.<br>ఆ సుషుమ్న నాడి మధ్యలో కోటి మెరుపు కాంతులతో తామరతూడులోని సన్నటి దారము వలె అత్యంత సూక్ష్మ శక్తితత్త్వ రూపముగా **కుండలినీ శక్తి** ప్రసిద్ధమై వెలుగొందుచూ ఉన్నది.<br>కోటానుకోట్ల విద్యుత్కాంతి పుంజములతో సమానమైన ప్రకాశమానమగు 'కుండలినీ మహాశక్తి" ని మనస్సుతో దర్శిస్తూ ఉండాలి. అట్లు కుండలినీ శక్తిని దర్శిస్తున్న జీవుడు **సర్వ సంసార దోషముల నుండి విముక్తుడు కాగలడు.** మోక్షము పొందుతున్నాడు.<br>ఫాల "(Fore Face) భాగమునకు ఊర్ధ్వముగా "(Upward) లలాట ప్రదేశములో-విశేషమగు (చంద్ర) మండలము నందు నిరన్తరము ప్రకాశించే కుండలినీ మహాతేజస్సును మనస్సు-ధ్యాసలతోను, స్ఫురణయొక్క శక్తితోనూ దర్శిస్తూ ఉంటే కూడా అట్టి తారకయోగ విస్ఫురణచే ఈ జీవుడు సిద్ధించవలసినది సిద్ధించుకొని సిద్ధి పొందగలడు.<br>చూపుడు వ్రేలు (తర్జనీ అగ్రము)తో రెండు చెవులను (కర్ణ రంధ్రములను) మూసి ఉంచినప్పుడు 'ఫూ' శబ్దమును (లోనుండి) వినబడుతూ వుంటుంది.<br>మనస్సు ఆ 'ఫూ' శబ్దమును వినుచూ ఉన్నప్పుడు ఏర్పడే ఏకాగ్రతచే కనుల మధ్య ప్రదేశమున గల 'నీలజ్యోతి' యొక్క సందర్శనము మనస్సుకు అనుభూతమౌతుంది. |

విలోక్యా, అంతర్దృష్ట్యా
నిరతిశయ సుఖం ప్రాప్నోతి।
ఏవమ్ హృదయే పశ్యతి।
ఏవమ్ అంతర్లక్ష్య లక్షణం
ముముక్షుభిః ఉపాస్యమ్।

అట్టి అంతర్దృష్టిచే సిద్ధించు **'నీలజ్యోతి మనో దర్శనము'** ... అనే సందర్శనముచే నిరతిశయమైన సుఖము ప్రాప్తించగలదు.

ఈవిధముగా యోగి తన హృదయమునందే ఆ అద్వయ పరమాత్మను 'మనస్సు' అనే ఉపకరణముతో చక్షువుల మధ్య-ఆకాశంలో సందర్శిస్తున్నాడు. **అటువంటి ఉపాసనను "అతర్లక్ష్య లక్షణము".... అంటారు.** ముముక్షువు అట్టి అంతర్లక్ష్య లక్షణోపాసకుడై అఖండాత్మతో మమేకము కాగలడు.

---

4. అథ బహిర్లక్ష్య లక్షణమ్।
నాసికాऽగ్రే చతుర్భిః (4"), షట్భిః (6"),
అష్టభిః (8"), దశభిః (10"), ద్వాదశభిః (12")
క్రమాత్ అంగుళాన్తే నీలద్యుతిః,
శ్యామత్వ, సదృక్ రక్త భంగీ స్ఫురత్,
పీతవర్ణ ద్వయోపేతం
వ్యోమ యది పశ్యతి, స తు యోగీ భవతి।
చలత్ దృష్ట్యా వ్యోమభాగం వీక్షితుః పురుషస్య
దృష్ట్యగ్రే జ్యోతిర్మయూఖా వర్తంతే,
తత్ దర్శనేన "యోగీ" భవతి।
తప్తకాఞ్చన సంకాశా జ్యోతిర్మయూఖా
అపాంగాన్తే భూమౌవా పశ్యతి।
తత్ దృష్టిః స్థిరా భవతి॥
శీర్ష-ఉపరి ద్వాదశాంగుళ (12")
సమమ్ ఈక్షితుః అమృతత్వం భవతి।
యత్ర కుత్ర స్థితస్య శిరసి వ్యోమ జ్యోతిః
దృష్టంచేత్, సతు 'యోగీ' భవతి।

ఇప్పుడిక **బహిర్లక్ష్య లక్షణము** గురించి చెప్పుకుంటున్నాము! నాసిక (ముక్కు) అగ్రభాగమునకు పైనగా (నాసికాగ్రమునుండి) - వరుసగా 4 అంగుళాలు, 6 అంగుళాలు, 8 అంగుళాలు, 10 అంగుళాలు, 12 అంగుళములు చిట్ట చివరిగా గల స్థానములలో నీలకాంతి, శ్యామ (నలుపు) వర్ణము, ఎరుపు వర్ణము, పసుపు రంగు, తెలుపు రంగులతో కూడియున్న గగనతలములను (Space) మనస్సుతో దర్శించు అభ్యాసము. అట్టి 'యోగి' - యోగారూఢుడు అగుచున్నాడు. అనగా, అట్టివాడు సంయోగ - వియోగాతీతమగు యోగ స్థానమును అలంకరించుచున్నాడు. అప్పుడు క్రమంగా దేహ-ఇంద్రియాదుల రాక - పోకలకు కూడా 'సాక్షి' అగుచున్నాడు.

సంచలనము - సపరిశీలనము గల దృష్టితో ఆకాశ భాగమును వీక్షిస్తూ వస్తున్న పురుషుని దృష్టికి ఆవలగల **జ్యోతిర్మయ స్వరూపుడగు ఆ ద్రష్టయొక్క సహజ స్వరూప సందర్శనము** సిద్ధించగలడు. అట్టి జ్యోతిర్మయ తత్త్వమును దర్శిస్తూ, ఉపాసించటం చేత, ఆ ఆరాధకుడు, త్వరత్వరగా యోగి అగుచున్నాడు.

యోగి-బంగారు ఛాయలతో వెలుగొందు **జ్యోతిర్మయ కిరణములను అంగాంగములందు గాని, భూమినంతటాగాని దర్శిస్తూ ఉండగా** - ఆ దర్శనము **మనస్సునందు** రూపము పొందుచున్నది.

అట్టి బంగారు ఛాయగల జ్యోతి కిరణములను శిరస్సుకు 12 అంగుళముల విస్తీర్ణము వరకు ఊర్ధ్వముగా దర్శించుచూ ఉపాసించువాడు 'మృత్యువు'ను అధిగమించి 'అమృత తుల్యుడు' (అమృతానంద స్వరూపుడు) అగుచున్నాడు. అనగా, దేహముల రాక పోకలకు కూడా సాక్షిగా ప్రకాశిస్తున్నాడు. దేహముల రాక-పోకల సంబంధమైన జనన-మనన భ్రమ తొలగుతోంది. సాధకునకు ఎప్పుడు శిరస్సునందు ఆకాశజ్యోతి సంస్థితమై, దర్శనమౌతుందో,... అప్పుడు ఆతడు **యోగి** అవుచున్నాడు. **శిరస్సుకు ఊర్ధ్వంగా ఆత్మ జ్యోతి ధారణ** ఆ యోగికి అనునిత్యమగుచున్నది.

---

5. అథ మధ్య లక్ష్య లక్షణమ్।
ప్రాతశ్చిత్రాది వర్ణ అఖణ్డ
సూర్యచక్రవత్, వహ్నిజాలావలీవత్
తద్విహీనా అన్తరిక్షవత్ పశ్యతి।
తత్ ఆకారా ఆకారితయా అవతిష్ఠతి
తత్ భూయో దర్శనేన
గుణ రహితా - ఆకాశం భవతి।
విస్ఫురత్ తారకా ఆకార సందీప్యమానా
గాఢ తమోపమం పరమాకాశం భవతి।
కాల - అనల సమద్యోతమానం
'మహాకాశం' భవతి।
సర్వోత్కృష్ట పరమద్యుతి

ఇప్పుడు **"మధ్య లక్ష్య లక్షణము"** గురించి మనము చెప్పుకుంటున్నాము.

అనేక రంగులతో కూడినదై, అఖండ సూర్య మండలమువలె, అగ్నిజ్వాలాపుంజముల వలెను, (అంతే కాకుండా) కొన్నిసార్లు అవి కూడా ఏమియులేనట్టి నిర్మలాకాశము వలెను మధ్య లక్షణ లక్ష్యము గల యోగి - తన అభ్యాసమునందు దర్శన స్వరూపంగా దర్శించుచూ, అద్దానిని ఉపాసిస్తున్నాడు.

అట్టి అభ్యాసముచే - తాను చూస్తున్న సూర్య మండలము, అగ్ని జ్వాలా పుంజములు, నిర్మలాకాశము - తానే అవన్నీ అయి ప్రకాశించుచున్నాడు.

అట్టి **అహమేవ తత్ సూర్యమండల - అగ్నిజ్యోతిః, నిర్మలాకాశ స్వరూప మస్మి** ... అను దర్శనము మరల మరల దర్శించటం చేత త్రిగుణాతీతుడై, గుణములకు సాక్షి అయి ప్రకాశించుచున్నాడు. **నిర్గుణాకాశ స్వరూపుడగుచున్నాడు.**

దూరంగా కనిపిస్తూ అసంఖ్యాక నక్షత్రమండలములతో నిండిన గాఢాంధకారము (జగత్ రాహిత్యము)తో కూడా నిండియున్న పరమాకాశమే తానగుచున్నాడు.

కాలాగ్ని తేజోమండలమునకు సమానమైన **తేజోరూపమగు మహాకాశమై** వెలుగొందు చున్నాడు.

ప్రద్యోతమానం తత్త్వాకాశం భవతి।
కోటి సూర్య ప్రకాశ వైభవ
సంకాశం, సూర్యాఽకాశం భవతి।
ఏవం బాహ్యే – అభ్యన్తరస్థ
వ్యోమ పంచకం తారకలక్ష్యమ్।
తత్ దర్శీ విముక్త ఫలస్తాత్
(సా) దృక్ – వ్యోమ సమానో భవతి।
తస్మాత్ తారకఏవ లక్ష్యమ్।
అమనస్క ఫలప్రదం భవతి॥

అట్టి భావనయొక్క అభ్యాసముచే సర్వోత్కృష్టమై, అన్నిటికంటే అత్యుత్తమమై పరమజ్యోతి స్వరూపమై ప్రద్యోతమానమగు (ప్రకాశించు) **తత్త్వాకాశ స్వరూపుడు** అగుచున్నాడు.

కోటి సూర్య మండలముల కాంతితో శోభితమగు సూర్యాకాశ ప్రకాశమానుడగుచున్నాడు. సర్వత్రా వెలుగొందు అఖండ - కేవలాత్మ అయి అంతటా ప్రదర్శనశీలుడగుచున్నాడు.

ఈవిధంగా బాహ్యమునందు, అంతరమునందు ఏర్పడినదైయున్న వ్యోమ పంచకము తానై ప్రకాశించటము, తన యొక్క విశ్వ-విశ్వాంతరాళ విశ్వంతర్గత - విశ్వ బాహ్య ఆకాశత్వము యొక్క అవధారణయే **తారకయోగము యొక్క లక్ష్యము.**

అట్టి **"తారక లక్ష్యము"**ను దర్శించుచున్నట్టి యోగి **దృక్ ఆకాశ స్వరూపుడు** (Absolute Perceiver prior to Perceptions) గా అగుచున్నాడు. అందుచేత "తారకయోగము".... అనునది "అమనస్కయోగము" అనే ఉత్తమ ఫలమును ప్రసాదించుచున్నది. ఆలోచన జనించు స్థానమును ధారణ చేయుటమే **'అమనస్కము'.**

---

**6.** **తత్ 'తారకం' ద్వివిధమ్।
పూర్వార్థం తారకమ్,
ఉత్తరార్ధం అమనస్కం చ ఇతి।
తత్ ఏష శ్లోకో భవతి।
తత్ యోగం చ ద్విధా విద్ధి –
పూర్వ – ఉత్తర విధానతః।
పూర్వంతు 'తారకం' విద్యాత్।
'అమనస్కం' తత్ ఉత్తరమ్ ఇతి।
అక్ష్యన్తః తారయోః
'చంద్ర–సూర్య' ప్రతిఫలనం భవతి।
తారకాభ్యామ్ సూర్య–చంద్ర మండల దర్శనమ్।
బ్రాహ్మాఽణ్డమివ పిణ్డాఽణ్డ శిరో మధ్యస్థ ఆకాశే
రవి–ఇన్దు మండలమ్ ద్వితయమస్తి
ఇతి నిశ్చిత్య, తారకాభ్యాం
దర్శన మాత్రాఽపి ఉభయ
ఐక్య దృష్ట్యా మనోయుక్తం ధ్యాయేత్।
తత్ యోగ–అభావే, ఇంద్రియ ప్రవృత్తేః
అనవకాశాత్।
తస్మాత్ అంతర్–దృష్ట్యా
'తారక' ఏవా అనుసన్ధేయః॥**

అట్టి తారకము, రెండు రీతులైనవి.

1. పూర్వార్థము ⟶ **"తారకము"**
2. ఉత్తరార్థము ⟶ **"అమనస్కము"**.

ఇది వివరిస్తూ ప్రాచీన శ్లోకములచే ఈవిధంగా గానం చేయబడుతోంది.

ఆ యోగము కూడా రెండుత తీరులు. 'తారకవిద్య' కు మొదటి (పూర్వ) విభాగము 'తారకము', ఉత్తర విభాగము 'అమనస్కము' అని సిద్ధాంతము.

కనులకు సంబంధించిన తారక విద్యచే కనులలో సూర్య-చంద్రులు ప్రతిఫలించుచున్నారు.

అట్టి తారకముచే సూర్యమండల - చంద్రమండల దర్శనము కలుగుతోంది.

బ్రహ్మాండములో సూర్య-చంద్రులు తేజో-ఓషధ ప్రదాతలై ప్రకాశించుచున్నారు కదా! అదేవిధంగా **పిండాండములో కూడా** (ఈ భౌతిక వ్యష్ఠి దేహములో కూడా) **శిరోమధ్య భాగములో సూర్య-చంద్ర మండలాలు ఉన్నాయి.**

ఇది నిశ్చయించుకొని తారకాభ్యాసము ద్వారా "ఆకాశములోని సూర్య చంద్రుల చైతన్యమే దేహములోనూ ఉన్నదని గమనించి, వాటి ఐక్యత్వమును దర్శిస్తూ మనో పూర్వకంగా ధ్యానించాలి! ఉపాసించాలి! ఒకే చైతన్యము సూర్య-చంద్రులలోను, రెండు కనులలోను, ప్రకాశమానమగుచున్నట్లు ఉపాశించాలి.

ఆవిధంగా సూర్య-చంద్ర తత్త్వములను శిరోభాగాకాశములో గమనించి ధ్యానించకపోతేనో? లేక తదితర విధములుగా యోగం అభ్యసించకపోతేనో ఇంద్రియ ప్రవృత్తులే పెత్తనం చెలాయిస్తాయే గాని, అంతర్-ప్రవృత్తికి (అంతరంగ యోగమునకు) మార్గము సుగమం కాదు.

అందుచేత అంతర్ దృష్టితో దేహములో తారక విద్యను, ఉపసానను అనుసంధానం చేయాలి!

---

**7.** **తత్ తారకమ్ ద్వివిధమ్।
"మూర్తి తారకమ్, అమూర్తితారకమ్" చ ఇతి।
యత్ ఇంద్రియాన్తమ్ తత్ మూర్తిమత్।
యత్ భ్రూ యుగాతీతం, తత్ 'అమూర్తిమత్'।**

అట్టి తారక విద్య రెండు తీరులైనది.

**1. మూర్తి తారకము 2. అమూర్తి తారకము.**

ఏ తారకవిద్య ఇంద్రియములకు ఉపయోగిస్తూ దృశ్యమును దాటివేయునదై ఉన్నదో.... అది **మూర్తి తారకము**. ఇంద్రియాంతర్గతమైన **ఇంద్రియాతీత తారకము.**

సర్వత్రా అన్తః పదార్థ వివేచనే,
'మనో యుక్తా అభ్యాస' ఇష్యతే।
తారకాభ్యాం తత్ ఊర్ధ్వస్థ సత్త్వ దర్శనాత్
మనోయుక్తేనా అన్తరీక్షణేన
సత్-చిత్-ఆనంద స్వరూపం బ్రహ్మైవ।
తస్మాత్ శుక్ల తేజోమయం 'బ్రహ్మేఽతి' సిద్ధమ్।
తత్ బ్రహ్మ మనః సహకారి చక్షుషా
అంతర్దృష్ట్యా వేద్యం భవతి।
ఏవమ్ 'అమూర్తితారకమ్' అపి
మనోయుక్తేన చక్షుషైవ దహరాదికం వేద్యం భవతి।
రూపగ్రహణ ప్రయోజనస్య మనశ్చక్షుః
అధీనత్వాత్।
బాహ్యవత్ అన్తరేఽపి ఆత్మ-మనః-చక్షుః
సంయోగేనైవ
రూప గ్రహణ కార్యోదయాత్।
తస్మాత్ మనోయుక్తా - అంతర్దృష్టిః
తారక ప్రకాశాయ భవతి।
భ్రూయుగ మధ్యబిలే దృష్టిమ్
తత్ ద్వార ఊర్ధ్వస్థిత తేజ
ఆవిర్భూతం "తారక యోగో" భవతి।
తేన సహ మనోయుక్తం
తారకం సుసంయోజ్యం
ప్రయత్నేన భ్రూయుగ్మమ్
సావధానతయా కించిత్
ఊర్ధ్వమ్ ఉత్-క్షేపయేత్
ఇతి పూర్వ భాగీ తారకయోగః

ఏది భ్రూమధ్య .... ఆకాశయుగ అవధారణచే ఆకాశాతీతమో అది అమూర్తి తారకము. భ్రూమధ్య ప్రదేశమునందు **భ్రూమధ్యాతీతతారకము.**

ఎక్కడైనప్పటికీ - అన్తః పదార్థ వివేచన-మనస్సుతో కూడిన అభ్యాసము ముఖ్యము! బుద్ధితో వివేచన చేస్తూ, **మనస్సుతో ఆత్మతత్త్వమును** మననము చేయాలి.

తారకముచే అద్దాని (అ)పై గల సత్త్వము (The absolute presence) యొక్క దర్శనము లభిస్తోంది. మనస్సుతో కూడిన అంతర్ముఖ దృష్టి చేత సత్-చిత్-ఆనంద రూపమగు 'పరబ్రహ్మము' తెలియబడుచున్నది. అనుభవమగుచున్నది.

శుక్ల (తెల్లటి) తేజోమయ రూపమగు బ్రహ్మమే, సర్వే సర్వత్రా (బయట-లోపల కూడా) అన్ని రూపములుగా వెల్లి విరిసి, సిద్ధించినదై యున్నది.

**"బ్రహ్మమే ఇదంతా (సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ)"** అను పరమ సత్యము మనో రూపమైన అంతర్-నేత్రములకు (జ్ఞాన నేత్రములకు) అంతర్-దృష్టిచే తెలియబడున దగుచున్నది. అనుభూతికే విషయమగుచూ, చెప్పవీలు కానిదగుచున్నది.

అట్లాగే 'అమూర్తి తారకము' కూడా మనోయుక్తమైన చక్షువులకు (దృష్టికి) దహరాకాశ దర్శనముచే బ్రహ్మము తెలియబడగలదు. (దహరాకాశము = భావన, ఆలోచన కూడా జనించే చోటు).

బాహ్యమున **మనస్సు-చక్షువుల సంయోగము** జరిగినప్పుడు మాత్రమే కళ్ళకు ఎదురుగా గల దృశ్యము అనుభవమౌతుంది కదా! అట్లాగే అంతరము కూడా మనస్సు - చక్షువులు ఒక చోటికి వస్తేనే మహత్తర తత్త్వము అనుభవమునకు వస్తుంది. కనుక ఇచ్ఛ - ఆలోచన ఏకమవ్వాలి!

ఈవిధంగా మనస్సులో కూడిన అంతర్దృష్టిచేత మాత్రమే (మనస్సు-దృష్టి సంయోగము పొందినప్పుడే) "తారక తత్త్వము'' ప్రకాశమానము అవగలదు. (లేక) అనుభవముగా సిద్ధించగలదు. లేక స్వతః సిద్ధమవగలదు.

భ్రూమధ్య ప్రదేశమునందు గల బిలము (ద్వారము) నందు దృష్టిని నిలపాలి. ఆ ద్వారము ద్వారా ఊర్ధ్వమున గల తేజస్సు నిత్యానుభవముగా ఆవిర్భూతము అగుచూ ఉండగా ఆ యోగసాధకుడు **'తారక యోగి'** అగుచున్నాడు.

ఆ ప్రకాశమునందు మనస్సుతో కూడిన తారకము (దృష్టి)ని సుసంయోజ్యము చేసి (చక్కగా, నిశ్చలముగా, సుస్థిరముగా నిలిపి) సావధాన పూర్వకమైన ప్రయత్నముతో రెండు భ్రుకుటులను (కంటిపై గల నొసవులు) కొంచము పైకి ఎత్తి నిలపాలి. ఇది **"పూర్వభాగీ తారకయోగము"....** అని పిలుస్తారు. దీని వలన ఆ యోగి మనస్సును దాటి వేసినవాడగుచున్నాడు. **'ఉన్మనీ' స్థితిని** పొందుచున్నాడు. **మనస్సు లయించినప్పుడు కూడా శేషించి ఉండే స్వస్థితి ఉన్మనీ స్థితి!**

8. ఉత్తరం తు అమూర్తిమత్ 'అమనస్కమ్' ఇతి ఉచ్యతే।
తాలు మూల ఊర్ధ్వభాగే మహాన్ జ్యోతిః మయూఖో వర్తతే।
తత్ యోగిభిః ధ్యేయం। తస్మాత్ అణిమాది సిద్ధిః భవతి।
అంతర్-బాహ్య లక్ష్యే దృష్టౌ
నిమేష - ఉన్మేష వర్జితాయాం
సత్యాం "శాంభవీ ముద్రా" భవతి।
తన్ముద్రా "ఆరూఢజ్ఞాని"
నివాసాత్ భూమిః పవిత్రా భవతి।

ఉత్తరభాగ తారకమును **"అమూర్తిమంతమగు అమనస్కయోగము"....** అని పిలుస్తూ ఉంటారు.

తాలు (కొండ నాలుక) యొక్క ఊర్ధ్వ (పై) భాగమునందు తేజో ఆకాశమున్నది. ఆ **"మహా జ్యోతి కిరణము"** (తాలుపై భాగమునందు)పై ధ్యాసను నిలిపి, ధ్యానము చేయు యోగులకు అణిమ-గరిమ-మహిమ మొదలైన సిద్ధులు లభిస్తున్నాయి.

యోగి లోపలి - బయట ఉండే (అంతర్-బాహ్య) సర్వ దృష్టులను వెనుకకు మరల్చి కళ్ళు తెరవటం-మూయుటమును కూడా నిలిపి ఉంచు అభావనా స్థితిని అభ్యసించటమును **శాంభవీ ముద్ర** అంటారు.

అట్టి శాంభవీ ముద్రను అభ్యసించి, సాధనచే సిద్ధింపజేసుకొను యోగి నివశించు

తత్ దృష్ట్వా సర్వే లోకాః పవిత్రా భవన్తి।
తాదృశ పరమయోగి పూజా
యస్య లభ్యతే, సోఽపి 'ముక్తో' భవతి॥

ప్రదేశము (స్థలము) ఆతని శాంభవీముద్ర ప్రభావంచేత పవిత్రమౌతోంది!

అట్టి శాంభవీముద్రను సిద్ధించుకొన్న యోగి చూపుతోనే లోకములను పవిత్రము చేయుచున్నారు.

అట్టి పరమ యోగిని ఎవ్వరు పూజిస్తారో, వారు కూడా ముక్తులు అగుచున్నారు.

---

9. అన్తర్లక్ష్య 'జలజ్యోతి స్వరూపం' భవతి।
పరమ గురూపదేశేన సహస్రారే
జలజ్యోతిర్వా బుద్ధిగుహా నిహిత
చిత్ జ్యోతిర్వా, షోడశ అన్తస్థ
తురీయ చైతన్యంవా అన్తర్లక్ష్యం భవతి।
తత్ దర్శనం సదాచార్య మూలమ్।
ఆచార్యో వేద సమ్పన్నో,
విష్ణుభక్తో, విమత్సరః,
యోగజ్ఞో యోగనిష్ఠశ్చ
సదా యోగాఽత్మకః శుచిః
గురుభక్తి సమాయుక్తః, పురుషజ్ఞో విశేషతః,
ఏవం లక్షణ సమ్పన్నో
'గురుః' ఇతి అభిధీయతే।
'గు' శబ్దస్తు అంధకారస్స్యాత్
'రు' శబ్దః తత్ నిరోధకః।
అంధకార నిరోధత్వాత్
'గురుః' ఇతి అభిధీయతే।
గురురేవ పరంబ్రహ్మ।
గురుః ఏవ పరాగతిః।
గురుః ఏవ పరావిద్యా।
గురుః ఏవ పరాయణమ్॥
గురుః ఏవ పరాకాష్ఠా।
గురుః ఏవ పరం ధనం॥
యస్మాత్ తత్ ఉపదేష్టాఽసౌ
తస్మాత్ గురుతరో, 'గురుః' ఇతి॥
యః సకృత్ ఉచ్చారయతి
తస్య సంసార మోచనం భవతి।
సర్వజన్మకృతం పాపం తత్క్షణాత్ ఏవ నశ్యతి।
సర్వాన్ కామాన్ అవాప్నోతి।
సర్వ పురుషార్థ సిద్ధిః భవతి,
య ఏవం వేద।
ఇతి అద్వయతారకోపనిషత్
ఓం శాంతిః శాంతిః శాంతిః

అమనస్క రూపమగు అంతర్లక్ష్య ఉపాసకుడగు యోగి జలజ్యోతి స్వరూపుడు అగుచున్నాడు. పరమగురువుల ఉపదేశముచేత సహస్రారమునందు గల **'జలజ్యోతి'** దర్శన-ధ్యానములచేతగాని, బుద్ధి గుహయందు నిహితమై (స్థానము కలిగి) యున్న **'చిత్‌జ్యోతి'** చేత గాని, షోడశాంతమున గల (శిరస్సుకు ఊర్ధ్వముగా గల) తురీయ చైతన్యమును గాని ఆరాధించటము **"అంతర్లక్ష్యము"** అగుచున్నది.

సద్గురువుయొక్క అనుగ్రహము చేత అంతర్లక్ష్య సిద్ధి కలుగుచున్నది. గురువు-స్వప్రయత్నము ఏకమవ్వాలి!

ఆచార్యుడు వేద విద్యా సంపన్నుడు, విష్ణుభక్తి కలిగియున్నవాడు, మత్సరము (గర్వము) లేనివాడు, యోగ శాస్త్రము తెలిసియున్న ప్రావీణ్యుడు, యోగ నిష్ఠా సాధన సంపద గలవాడు, ఎల్లప్పుడు యోగాత్మకుడు, గురుభక్తితో కూడినవాడు, పరమపురుషుని విశేషముగా ఎరిగినవాడు.... ఇట్టి లక్షణములు కలవాడు. అట్టివాడు 'గురువు' లేక 'ఆచార్యులు' అవటానికి అర్హుడు అగుచున్నాడు.

'గు' అను శబ్దార్థము - **'అంధకారము'!**

'రు' అను శబ్దార్థము - **నిరోధించువాడు!**

అజ్ఞానాంధకారము నిరోధించి, స్వస్వరూపాత్మ జ్ఞాన వెలుగును ప్రసాదిస్తారు కనుక 'గురువు' అని పిలువబడుచున్నారు.

ఆత్మతత్త్వమును గుర్తు చేయు
గురువే ..... పరబ్రహ్మము!
గురువే ..... పరమగతి!
గురువే ..... పరావిద్య!
గురువే ..... పరమాశ్రయము!
గురువే ..... అత్యుత్తమమగు లాభము అయినట్టి "ఆత్మతత్త్వ జ్ఞానము"ను విశదీకరించు పరాకాష్ఠ! "తత్ ఆత్మ త్వమేవ" - అని నిరూపించి చూపు మహాప్రావీణ్యతగల ఆధేయము!
గురువే ..... పరమునకు ధనము. గురువు ఆ తత్ వస్తువగు స్వస్వరూపము గురించి ఉపదేశిస్తారు. మిక్కిలి ఉన్నతుడు. కాబట్టి, 'గురు' అని శబ్దముతో పిలుస్తున్నాము. "ఇక్కడ తారసపడుచున్నదంతా - సందర్భ సత్యము మాత్రమే! ఇదిగో, ఇదీ నీయొక్క సహజసత్యము" అని చూపువారు గురువు. గురువును మించినది గురువే! మరొక్కరు కాదు!

ఎవ్వరైతే ఈ గురు స్తోత్రమును, గురు - ఉపాసనను, గురు ఔన్నత్యమును ఉచ్చరిస్తారో, వారు 'సంసారము' నుండి విముక్తులు అగుచున్నారు. గురువును ఆరాధించి, సేవించువారి సర్వ జన్మలకృతమైన పాపము-**గురువును ఉపాసించుటచే, సేవించుటచే - తొలగి పోగలదు.** అట్టి గురుస్తుతిని అభ్యసించు వారి సర్వ కోరికలు నెరవేరగలవు. ఆతడు సర్వ పురుషార్థ సిద్ధి పొందుచున్నాడు. ఎవ్వరైతే ఈ ఉపనిషత్ పరామార్థమును ఉచ్చరిస్తూ ఉపాసిస్తారో, అట్టివారు పైన చెప్పిన ప్రయోజనములు పొందుచున్నారు. ఇది వేదవాక్కు.

**ఇతి అద్వయతారకోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 2 అద్వయతారకోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము

'ఓం' కార అక్షర పరమార్థమయినట్టి అద్వయ – సద్గురు – తారక పరమాత్మకు – అద్వయతారకసిద్ధికై ప్రణమిల్లుతూ...

ఇప్పుడిక "అద్వయతారక" ఉపనిషదులమై, సామీప్యము పొందుటకై, సముపాశ్రయించుటకై ఆరాధన పూర్వకముగా తారకము గురించి వివరించుకొనుచున్నాము. వ్యాఖ్యానించుకొనుచున్నాము. 'ద్వైతము అసంభవము' అను విజ్ఞాన సంసిద్ధిని అద్వయతారకము ప్రసాదించుచున్నది. అట్టి తారక బ్రహ్మముగా కీర్తించబడుచున్న శ్రీ ఆత్మారామ వైభవమును స్తుతించుచున్నాము.

❖

**భవము :** "ఈ దృశ్యము, ఇద్దానిలో అనేక వేరువేరైన జీవులు, సంబంధాలు, అనుబంధాలు, బాంధవ్యాలు, జీవ – ఈశ్వర భేదాలు, ఈశ్వర – పరమాత్మ భేదాలు.. ఇవన్నీ ఉన్నాయి కదా ... !" అనే నమ్మకముతో కూడిన ఆవేశము. అల్పావగాహన. దురవగాహన–'భవము', 'భవబంధము' – అని పిలువబడుతోంది.

**భవసాగరము:** అట్టి నమ్మికతోకూడిన అసంఖ్యాక భావావేశతరంగ పరంపరలతో కూడిన భవ (ఇదంతా నిజముగా ఉన్నది అనే) భావతరంగాల మహాసముద్రము. అట్టి భవభావతరంగాల నుండి జనించే భయ–ఆవేశ–సుఖ–దుఃఖ–ఆశ–నిరాశ–ఉద్వేగ–అనిశ్చిత–ఏది ఏమిటో, ఎటో తెలియని అజ్ఞానము–ఇవన్నీ జల్–జల్ ఘోష శబ్దాలు. అజ్ఞానావేశ దృష్టులు. దృష్టుల నుండి తెచ్చిపెట్టుకున్న బంధనములు.

**తారకము : "ఈ దృశ్యము అనే పంజరములో ప్రవేశించి నేను చిక్కుకున్నాను. అనేక బంధములు నన్ను కట్టిపడేస్తున్నాయి. ఆశ – నిరాశల మధ్య, సుఖ – దుఃఖాల మధ్య, జీవన్ – మరణముల మధ్య ఇరుక్కొని పోయి ఉన్నానే ! నాగతి ఏమిటిరా బాబూ ?"**... అను రూపముగల సంసార భావోద్వేగముల నుండి – ఈ జీవుని **తరింపజేయునది** (that which relieves) కాబట్టి **"తారకము"**! కామ – క్రోధ – లోభ – మోహ – మద – మత్సర్య రూపములగు తరంగములు గల సాగరంలో చిక్కుకున్న మనలను ఆవలి (పరమువైపు) జేర్చునది కాబట్టి తారకము! **యత్ తారయతి, తత్ తారకమ్ !**

**అద్వయతారకము :** ఇహ స్వరూప పరిమితత్వము నుండి తరింపజేసి ఆవలివడ్డు అగు **"అద్వయ పరబ్రహ్మము"** అను స్థానమునకు జేర్చునది. **"అహమేవ ఇదగ్ం సర్వమ్"** అని పట్టి చూపించునది. అట్టి అద్వయతారకోపనిషత్‌ను ఇప్పుడు మనము విశదీకరించుకుంటున్నాము.

**యతయే జితేంద్రియాయ...** మొట్టమొదటగా ఆత్మబంధువులగు గురువులు, శాస్త్రములు మనలోని విజ్ఞతను, నిద్రలేపు ప్రయత్నముగా సూచించుచున్న సత్కర్మ – యోగ – భక్తి – ప్రవత్తులను మొ॥వి అత్యంత శ్రద్ధగా, మెళుకువతో ఆచరించాలి. అట్టి సాధన సహాయముతో **"ఈ ఇంద్రియములు – ఇంద్రియ విషయములకు ఆధారము నేను. ఈ దేహము – ఇంద్రియములు, ఈ జగత్తు నా స్వకీయ కల్పనా విశేషములే! అంతేగాని, వీటిపై నేను ఆధారపడి ఉన్నవాడను కాను"** అను అవగాహనతో ముముక్షువు జితేంద్రియుడు (ఇంద్రియములను జయించినవాడు) కావాలి. అందుకు గాను – **శమదమాది షట్–గుణ పూర్ణాయ...**,

1) **శమము :** అంతరింద్రియ నిగ్రహము. మనో-బుద్ధి-చిత్త-అహంకారములను విషయములనుండి మరల్చి, దైవీ విధులందు నియమించటము. (Internal Control)

2) **దమము :** బాహ్య - ఇంద్రియ నిగ్రహము. కళ్ళు - కాళ్ళు - చెవులు మొ॥వి శాస్త్ర సమ్మతములైన కార్యక్రమములందు క్రియాశీలము చేయటము. విషయముల నుండి మరల్చటము. (External Control)

3) **ఉపరతి :** ప్రేయో మార్గము నుండి విరమిస్తూ, శ్రేయో మార్గానుసరణము. అవిహిత కర్మలను జ్ఞానపూర్వకంగా క్రమంగా విడిచి పెట్టటము. దృశ్య బంధములను ఆత్మీదృష్టితో దాటివేస్తూ ఉండటము. (Withdrawl)

4) **తితీక్ష :** శీత-ఉష్ణ, సుఖ-దుఃఖ, శత్రు-మిత్ర, సంపద - ఆపదల సందర్భములలో **ఓర్పు**ను విడువక, అటువంటి ద్వంద్వముల పట్ల **సమబుద్ధిని** కలిగి ఉండటము. (Forbearence)

5) **శ్రద్ధ :** సాధనములపట్ల, గురుబోధ-వేదాంత శాస్త్రము ప్రతిపాదించే మహావాక్యార్ధముల పట్ల అను నిత్య విచారణ విశ్వాసము కలిగి ఉండటము. అశ్రద్ధను దరికి రానీయకపోవటము. వినినది మననము చేయటము. (Attentively charting)

6) **సమాధానము :** సద్గురూపదేశములను, మహావాక్యార్ధములను వినుచు సంతృప్తి పొంది ఉండటము. "దృశ్య-దేహములు ఇటువంటివి కదా! ఆత్మ ఇట్టిది కదా!"... అను నిశ్చయములను సుదృఢం చేసుకోవటము. నిత్యానుభవముగా తీర్చి దిద్దుకోవటము. (Wet answered interpretatively)

ఈ విధంగా షట్ (6) గుణ పూర్ణులమై ఉండాలి. **"చిత్ స్వరూపోఽహమ్ - నేను కేవలమగు చిత్ - ఆనంద (ఎరుగుట - అనే ఆనంద గుణముతో కూడిన) స్వరూపము కలవాడిని కదా !"...** అని, **ఇతి సదా భావయేత్...** ఎల్లప్పుడు భావన చేస్తూ ఉండాలి. కనులు మూసుకొనియో (లేక) సగము కళ్ళు తెరచియో - **సమ్యక్ నిమీలిత అక్షః, కించిత్ ఉన్మీలత అక్షోవా** - అంతర దృష్టిని ఆశ్రయించాలి. అట్టి అంతర్దృష్టి సహాయంతో భ్రూమధ్యము (రెండు కనుబొమ్మల మధ్య గల ప్రదేశము) నుండి పైపైకి (అంతరాంతరముగా) దృష్టిని సారించాలి. ఆ విధముగా దృష్టిని సారించి, సత్ - చిత్ - ఆనంద లక్షణములతో ప్రకాశమానమగుచున్న **కూటస్థ రూపమగు పరబ్రహ్మము'** ను అవలోకనం చేయాలి ! *(కూటస్థము = బంగారు ఆభరణమునకు బంగారమువలె, తరంగమునకు జలమువలె సర్వ భావనలకు, దేహ-దృశ్యాదులకు జననస్థాన సహజరూపము).*

**పరబ్రహ్మ అవలోకయన్,... తద్రూపో భవతి !** ఆ విధముగా తేజోమయమగు కూటస్థ పరబ్రహ్మము (The Absolute Self at the root of all else in which all else is placed and which is englightening all else) ను అవలోకించి **"అదియే నేనై ఉన్నాను"** అను **సంస్థితి - అనుభవమును సంపాదించుకొని, అనునిత్యము చేసుకోవాలి.** "ఈ సర్వము పరబ్రహ్మ రూపమే! నేను బ్రహ్మమునే! కనుక, ఈ కనబడే విశ్వమంతా నా యొక్క పరబ్రహ్మత్వపు తేజోకాంతి విశేషమే !" ... అను స్వాభావికానుభావమును సముపార్జించుకోవటమే **'తారక యోగము'**

అటువంటి **"సర్వదా తత్ పరబ్రహ్మమేవాఽహమస్మి... ఆ పరబ్రహ్మమే నేనై, ఈ దృశ్యమును నా విభూతిగా కలిగియున్నాను కదా !"** ... అనే సత్ యోగోపాసనచే, ఆ యోగి - గర్భవాస - జనన - మరణ సంసార మహత్ భయములను దాటిపోవుచున్నాడు, తరిస్తున్నాడు. అట్టి - ఆత్మోపమ్యేవ సర్వత్ర - రూపమగు యోగమార్గము ఈ జీవుని సర్వ అనర్ధములనుండి, మానసిక వేదనల నుండి తరింపజేయగలదు. కాబట్టి **తస్మాత్ 'తారకమ్' ఇతి** - 'తారకము' అని పిలువబడుతోంది.

అనేక నాటకములలో నటించేవాడు ఒకసారి ఒక నాటకంలో నటిస్తూ ఉండగా, అతని నాటకములోని 'ఉనికి'ని **పాత్ర** (Role) అంటాము. అనేక నాటకములలోన నటించే అతనిని **'నటుడు'** (Action) లేక **'నాటక కళాకారుడు'** (Artist) అంటాము కదా! అట్లాగే జీవ-ఈశ్వరులు కూడా! ఆ నటుని యొక్క **'సహజ రూపము'** నటనాకౌశలమునకు కూడా వేరై, సాక్షియై ఉన్నది కదా! అది **జీవ-ఈశ్వర సాక్షియగు పరాత్మ!**

ఈ దృష్టాంతమును దృష్టిలో పెట్టుకుంటే...,

**జీవుడు...** వర్తమాన దేహములో దేహమును వర్తింపజేయువాడు.

**ఈశ్వరుడు** ... అనేక దేహములకు సంబంధించినవాడు, దేహ-దేహాంతరములకు ఈవల-ఆవల-మధ్యగా కూడా ఆక్రమించుకొని ఉన్నవాడు.

జీవుడు - ఈశ్వరుడు ... **ఈ ఇరువురూ** కూడా దేహములకు సంబంధించినవారే కాబట్టి **మాయలోనివారే !**

ఈ విధంగా జీవ - ఈశ్వర న్యాయమును (తత్వతః) విచారణ చేసి, ఎరిగి ఆ రెండింటి సంబంధించిన సర్వ విశేషముల విషయమై **'నేఽతి-నేఽతి!** ఇది కాదు ఇది కాదు'... అని విచారణచే గమనించిన తరువాత, అప్పటికీ ఏదైతే శేషిస్తుందో అదియే **అద్వయ బ్రహ్మము.**

- జగన్నాటకంలోని **'నేను'** – జీవుడు.
- అనేక జగత్తులలో ఉపాధులను స్వీకరిస్తూ, త్యజిస్తూ ఉండు **నేను** – ఈశ్వరుడు.
- దేహత్వము – జగదత్వమునకు కూడా మునుముందే ఉన్నట్టి నేనైన నేను – పరబ్రహ్మము. (లేక) అద్వయబ్రహ్మము.

**నాలోని నేనైన నేనే ఇదంతా!**

**జీవ - ఈశ్వరౌ మాయకాః -** జీవుడు – ఈశ్వరుడు ... ఈ రెండూ కూడా 'కల్పన' లేక 'మాయ' లోనివే! **ఇతి విజ్ఞాయా** ఇవి సుస్పష్టముగా, అనుభవపూర్వకంగా తెలుసుకొని,... **సర్వ విశేషం నేఽ ఇతి ఇతి విహాయ -** సర్వ విశేషయములు **"ఇది నా కల్పనలోని విభాగమేగాని నేను ఎట్లా అవుతాను ? కాను !"...** అని ప్రక్కకు పెట్టివేస్తూ ఉండగా....,

**యత్ అవశిష్యతే..** ఏది చివరికి అవశేషించినదై, త్యజించటానికి వీలే కాదో.... అదియే **"అద్వయ పరబ్రహ్మము" !**


**ఈ జీవుడు సిద్ధించుకోవలసినది అట్టి స్వస్వరూప అద్వయ బ్రహ్మమే సుమా!** మరి అది ముముక్షువుకు సిద్ధించేది ఎట్లా ? అందుకు లక్ష్యత్రయమును ('3' లక్ష్య రూపములను) అనుసంధానము చేయును గాక !

**1) అంతర్లక్ష్య లక్షణము 2) బహిర్లక్ష్య లక్షణము 3) మధ్య లక్ష్య లక్షణము**

## 1. అంతర్లక్ష్య లక్షణము

### హృదయాంతర్గతోపాసన

**1. కుండలినీ మహాశక్త్యుపాసన**




ఈ దేహమునకు మధ్యగా బ్రహ్మనాడి ఉన్నది. దానినే 'సుషుమ్న' అని కూడా అంటారు. అది సూర్య తేజస్సుతో వెలుగొందుచూ, పూర్ణచంద్రుని వలె అమృత కిరణ సమన్వితమై వర్తిస్తోంది. **సాతు మూలాధారాత్ ఆరభ్య.. బ్రహ్మరంధ్రగామినీ భవతి !** అట్టి సూర్యప్రభలతో వెలుగొందుచున్న బ్రహ్మనాడి మూలాధారమునందు ఆరంభమై, శిరస్సు యొక్క ఉపరి భాగమున స్థానము కలిగినట్టి బ్రహ్మరంధ్రము వరకు విస్తరించినదై ఉన్నది. **తన్ మధ్యే తటిత్‌కోటి సమాన కాన్త్యా, మృణాళసూత్రవత్ సూక్ష్మాఙ్గీ "కుణ్డలినీ" ప్రసిద్ధా అస్తి!...** ఆ బ్రహ్మనాడికి మధ్యగా కోటి మెరుపుల కాంతులతో, తామరతూడులోని కళ్ళకు కనిపించనంత సన్నని దారమువలె సూక్ష్మాతి సూక్ష్మమైన మూలశక్తిగా వెలుగొందుచూ ఉన్నది. అది **'కుండలినీ'** అను పేరుతో యోగశాస్త్రజ్ఞులచే పిలువబడుతోంది.

**మనస్సుతో ఆ 'కుణ్డలినీ మహాశక్తి'ని దర్శించటము, ఉపాసించటము, తత్ తేజోరూపమవటము** అనే కుణ్డలినీ ఉపాసనను ఎరిగి, యోగవేత్తలు నిర్వర్తిస్తున్నారు. ఎవ్వరు కుణ్డలినీ ఉపాసనను నిర్వర్తిస్తూ ఉన్నారో. అట్టివారు సర్వసంసార బంధములను దాటివేసినవారై 'ముక్తులు' అగుచున్నారు. వారికి ఈ దృశ్యమంతా **క్రీడా–లీలా ఇంద్రదజాల** వినోదము అగుచున్నది.

**2) లలాట ఆకాశయోగోపాసన :** ఫాల భాగమునకు (Foreface) కు ఊర్ధ్వముగా లాలాటమునకు అంతర్గతమై, మహత్తరమగు తేజోమండలము నిరంతరము జ్వాజ్వల్య ప్రకాశమానమైయున్నది. ఆ లలాట తేజో ఆకాశము ముఖమంతా, (మరియు) బాహ్యమున విశ్వమంతటనూ విస్తరించి ఏర్పడినదై నిండియున్నది. 'తారక యోగము' చే యోగులు బుద్ధితో గమనిస్తున్నారు. విస్ఫురణ శక్తితో, ఆత్మ జ్ఞాన శక్తితో, దర్శించుటను అభ్యసించుచున్నారు. సిద్ధించుకోవలసినది సిద్ధించుకొని 'సిద్ధులు' అగుచున్నారు.

**3) దేహ అంతర్గత జనిత (ఫూ...) నాద శ్రుతోపాసన :**

అ) తర్జనీ (చూపుడు వ్రేలు Index finger) యొక్క పై భాగముతో చెవు మూసుకున్నప్పుడు **తర్జని అగ్ర ఉన్మీలిత కర్ణ రంధ్రద్వయే, తత్ర 'ఫూ' త్కారశబ్దోజాయతే -** లోపలి నుండి 'ఫూ' త్కారముతో కూడిన ఒకానొక శబ్దము వినబడుచూ ఉంటుంది. మనస్సును ఆ శబ్దముపై ఏకాగ్రం చేసి వింటూ ఉండటము– **'అంతరంగ నాదోపాసనా యోగము'** అయి ఉన్నది.

ఆ) చక్షువుల మధ్యలో స్థితి కలిగియున్న నీల జ్యోతి స్థలమును (ఆకాశమును) వీక్షించుచూ ఉండటము.

ఈ విధమైన ఉభయముల సాధనచే, యోగి అంతర్దృష్టివంతుడై, **నిరతిశయమగు సుఖమును** పొందుచున్నాడు.

పై మూడు కూడా హృదయమునందు దర్శిస్తూ ఉండే యోగసాధనా విధానములు. ముముక్షువులు ఇట్టి **అంతర్లక్ష్య లక్షణ యోగ మార్గములను** అనువర్తులై, ఉపాసించినవారై ఉత్తమ ప్రయోజనము పొందగలరు.

## 2. బహిర్లక్ష్య లక్షణము

1) నాసి కాఊగ్రే... ముక్కు యొక్క అగ్రభాగమునుండి క్రమంగా

అ) '4' అంగుళముల పైస్థానము ; ఆ) '6' అంగుళముల పైస్థానము

ఇ) '8' అంగుళముల పైస్థానము ; ఈ) 10' అంగుళముల పైస్థానము

ఉ) 12 అంగుళముల పైన ఉన్న స్థానము.

ఈ విధముగా బుద్ధిని ఐదు స్థానములలో నిలుపుచూ మనస్సుతో కొంత-కొంతసేపు ఉపాసిస్తూ క్రమంగా 12 అంగుళముల స్థానములలో గల నీలకాంతి, శ్యామ (నలుపు), ఎరుపు, పసుపురంగు, తెలుపురంగులతో కూడిన ఆకాశమును-

గగనతలములను దర్శించుచూ యోగాభ్యాసము చేయుటముచే అతి త్వరగా అతడు **"పూర్ణయోగిత్వము"** పొందుచున్నాడు. **సతు యోగీ భవతి ।**

2) చలనము కలిగిన దృష్టులతో (కళ్లు ఇటు - అటు కదల్చుచు)... ఆకాశ భాగమున చూస్తూ ఉండువాడు అట్టి దర్శనాభ్యాసముచే కూడా 'యోగి' అగుచున్నాడు.

3) జ్యోతిర్మండలములో బంగారు కాంతులు వెదజల్లు జ్యోతిర్మయ కిరణములను భావన చేస్తూ ఆ కిరణములయందు మనో దృష్టిని నిలుపుటచే కూడా అతని దృష్టి స్థిరత్వము పొందుతోంది.

4) అంగాంగములందు గాని (తన దేహమునంతటాగాని, ఇష్ట దైవము యొక్క రూపమునందుగాని, పఠమునందు గాని, విగ్రహమునందు గాని, గురు రూపమునందు గాని) ఈ పృథ్విని (భూమి) అంతాటగాని మనో-దృష్టులను నిలుపుతూ వస్తే... అట్టివాని **మనోధ్యాస, దృష్టి స్థిరత్వము పొందగలవు.**

5) **శీర్షా-ఉపరి ద్వాదశాంగుళ సమమ్ ఈక్షితుః అమృతత్వం భవతిః ।** శిరస్సు యొక్క ఊర్ధ్వ భాగమునుండి 12 అంగుళముల విస్తీర్ణము వరకు (మనో) దృష్టిని నిలిపి సమముగా సందర్శించు అభ్యాసము నిర్వర్తించవాడు అమృతత్వమును పుణికి పుచ్చుకొనుచున్నాడు. దృష్టి యొక్క సర్వసమత్వము (Feature of Equality perceiving) సిద్ధించుకోగలడు.

ఈవిధంగా పైన చెప్పుకొన్న యోగాభ్యాసములచే... ఆ యోగసాధకునికి శిరస్సుపై "ఆకాశజ్యోతి' (కాంతి పుంజములతో కూడిన తేజస్సు) యొక్క దర్శనము పొందుచున్నాడు. అతడు యోగ సిద్ధిని పొంది, **'యోగసిద్ధుడు'** అగుచున్నాడు.

## 3. మధ్యలక్ష్య లక్షణము

మధ్య లక్షణ తారక యోగాభ్యాసులు అగు యోగ సాధకులు - ఉదయించుచున్న సూర్య ప్రభలను, సూర్యగోళమును, అగ్నిజ్వాలలను, నిర్విషయమగు శూన్యాకాశమును, వస్తు శూన్యమగు అంతరిక్షమును, ఆకాశము - భూమిల మధ్య భాగమును మనో నేత్రముతో (వాటిలో ఒకటిగాని, కొన్నిగాని, అన్నీ గాని) దర్శించుచూ బుద్ధిని ఏకాగ్రపరచుచూ **యోగ ప్రక్రియ**ను నిర్వర్తించుచున్నారు. మనో - బుద్ధులను ఏకం చేసి ఆయా స్థితి - దర్శనములందు సుస్థిరీకరించి, (నిలిపి) యోగాభ్యాసము చేస్తూ ఉంటున్నారు. అట్టి ఉదయించు సూర్యుని - సూర్య గోళమును - అగ్ని యొక్క తేజో ప్రభలను, శూన్యాకాశమును, అంతరిక్షమును (The vacant space in between any two objects) వాటిలో ఏ ఒక్కటైనా (లేక) కొన్ని, (లేక) అన్నీ ధ్యానము చేస్తూ చేస్తూ ఉండగా... ఆ యోగి **తత్ ఆకారా ఆకారితయో అవతిష్ఠతి।** ఆ ఆకారమే తానై ప్రకాశించుచున్నాడు. అట్టి తత్ ఆకార ఆకారత్వము చేత ఆ యోగి **గుణరహిత ఆకాశ స్వరూపుడు** అగుచున్నాడు. **తత్ భూయో దర్శనేన 'గుణ రహిత ఆకాశమ్' భవతి !** అంతేకాదు. **విస్ఫురత్ తారకాకార సందీప్యమానా గాఢ తమోపమమ్ పరమాకాశమ్ భవతి !** 1. ఆకాశములోని నక్షత్ర ప్రకాశమును, 2. నక్షత్రముల మధ్య గల **అంధకారము**, 3. కళ్ళు మూసుకొన్న ప్పటి **అంధకారమును**, ఈ '3' కూడా..., పరమాకాశరూప విభాగములై యోగసాధనయందు

యోగులచే ఉపాసించబడుచూ, ఆరాధించబడుచున్నాయి. **సర్వోత్కృష్ట పరమద్యుతి ప్రద్యోతమానం తత్త్వాకాశమ్ భవతి ॥** ఈ భౌతికాకాశము కంటే కోటానుకోట్ల రెట్లు సూక్ష్మమైనట్టి ఆ పరమాకాశము సర్వోత్కృష్టమై పరమ తేజోమయమై, **జ్యోతిర్జ్యోతి స్వరూపమై యోగసాధకునకు అనునిత్య-ఆత్మానుభూతిని ప్రసాదించుచున్నది ! కోటి సూర్య ప్రకాశ వైభవ సంకాశం సూర్యాకాశం భవతి !** అట్టి యోగసాధకుడు కోటి సూర్యుల ప్రకాశమానుడై వెలుగొందుచున్నాడు. ఆ ప్రకాశమే తానై తారక తత్త్వాస్వాదన చేస్తున్నాడు.

ఈ విధంగా బయట - అంతరమున వెలుగొందుచున్న

1) **నిర్మలాకాశము** : "నేను నిత్యనిర్మల **నిర్విషయ స్వరూపుడను!**"
2) **నిర్గుణాకాశము** : "త్రి-గుణములను లీలా-క్రీడా విశేషములు గాను, ఆభరణములుగాను కలిగి వున్న-**నిర్గుణ స్వరూపుడను !**"
3) **పరమాకాశము** : "సర్వమునకు పరమై, ఇహమంతా కూడా నా యొక్క కళా విశేషమైనట్టి **పరమాకాశ స్వరూపుడను !**"
4) **మహాకాశము** : "చీకటి - వెలుగులకు కూడా సాక్షిని అయి, భావ - అభావములకు స్థానమైయున్న మహదాకాశతత్త్వమగు **మహాకాశమును!**"
5) **తత్త్వాకాశము** : "నేను - నీవు మొదలైనవన్నీ ఎద్దాని యొక్క తేజో విభవ విలాసమో ... అట్టి **తత్త్వాకాశ స్వరూపుడను !**"

అను **వ్యోమపంచకము** - వాటిపట్ల మనస్సును నిలిపి, యోగాభ్యాసముచే స్వానుభవముగా ... స్వస్వరూపము యొక్క పరమార్థ-అనుభవముగా సిద్ధించుటయే **తారకయోగ లక్ష్యము.. తత్ దర్శీ విముక్త ఫలస్తాత్ (సా) 'దృక్' వ్యోమసమానో భవతి!** అట్టి వ్యోమపంచక సందర్శకుడు సర్వ దృశ్యాంతర్గతమైన ప్రయోజనములను అధిగమించి **దృక్ ఆకాశ** - (The absolute perceiver that is always present even prior to, as during the, and even after the ACTIVITY of PERCEPTIONS) **స్వరూపమాత్రుడు అగుచున్నాడు !**

ఈ విధమైనటువంటి తారకయోగోపాసన యొక్క అత్యుత్తమ ఫలము (లేక) ప్రయోజనమే **"అమనస్కము"**

***(అమనస్కము = ఆలోచనలకు సాక్షిత్వము అభ్యసిస్తూ సిద్ధించుకోవటము. ఆలోచనలు వచ్చి పోతూ ఉండగా, అట్టి ఆలోచనలకు జనన స్థానము, ఆలోచనలకు ముందేగల చైతన్య స్థానమును బుద్ధితో గమనిస్తూ మమేకమవటము.***

సాధన - సాధ్యము (ప్రయత్నము - ప్రయోజనము) ల ఏకత్వ సంస్థితియే **'తారకము'** అను శబ్దము యొక్క పరమార్థ సారము. అందుచేత అట్టి తారకమే 'జీవితము' అనే అవకాశముచే సిద్ధించుకోవలసిన **ఉత్తమోత్తమ - పరమ** ప్రయోజనము.

అట్టి తారక యోగము (పరాకాష్ఠ కొరకై) రెండు విభాగములు (Two phases) గా చెప్పబడుతోంది.

**ప్రథమార్థము :** మనము ఇంతవరకు చెప్పుకుంటూ వస్తున్న తారక యోగసాధ్యములు (అంతర్లక్ష్య తారకము, బహిర్లక్ష్యతారకము, మధ్య లక్ష్య తారకము)

**ద్వితీయ విభాగము (ఉత్తరార్ధము) :** అమనస్కము. మనస్సుకు ఆవల (ఈ యోగి) సంస్థితుడై, **మనస్సును తన నుండి జనించు 'కళ-అంశ'గా సందర్శిస్తూ ఉండటము. మనస్సుకు విషయములగుచున్నవన్నీ ఆత్మకు అభిన్నంగా గమనించటము. మనస్సు అఖండాత్మ రూపమును స్వయముగా సంతరించుకోవటము.**

## అక్ష - తారక విద్య

కనుల యందు ఆకాశమును మనస్సుతో గమనిస్తూ ఆరాధించు విధిని **'అక్ష-తారకవిద్య'** అని పిలుస్తున్నారు. అట్టి తారక విద్యచే కనులలో గల చీకటి - తేజస్సులు ప్రవర్తిస్తూ కనిపించు స్ఫురణవ్యోమ్ని (ఆకాశము) ను ఉపాసించు యోగులకు సూర్యచంద్రుల ఉనికి కనులలో అనుభూతమౌతుంది. అనగా కనుల స్థానములో సూర్య - చంద్రమండలముల దర్శనము కాగలదు.

- బ్రహ్మాండములో సూర్య - చంద్ర-జ్యోతి అనబడు '3' కూడా ప్రకాశమానులై విరాజిలుచున్నట్లే ...
- శిరస్సునకు మధ్యగా గల ఆకాశములో **రెండవ సూర్య చంద్ర అగ్ని స్వరూపములతో కూడిన మండలము** ప్రకాశిస్తూ ఉన్నది. (సూర్య చంద్రాగ్ని నేత్రాయ!)

**బ్రహ్మాండమివ... పిణ్డాణ్డ ... శిరో మధ్యస్థ ఆకాశే, 'రవి ఇన్దుమండలమ్ - ద్వితీయమ్ అస్తి, ఇతి నిశ్చిత్య తారకాభ్యాం, దర్శనమాత్రాపి ఉభయ ఐక్య దృష్ట్వా మనోయుక్తం ధ్యాయేత్ !**

బ్రహ్మాండమువలె పిండాండము (భౌతిక వ్యష్టి – దేహము) లోగల ద్వితీయ సూర్య – చంద్ర మండలముల ఉనికిని యోగాభ్యాసముచే–మనస్సుతో గమనిస్తున్నారు. (తత్ – ఆకాశాంతర్గముగా), "ఆకాశములోని సూర్య చంద్రమండల ద్వితీయ రూపమే నా శిరో ఆకాశములో వేంచేసి ఉన్నది"..... అని గమనించి ఉపాసిస్తున్నారు. అట్టి బుద్ధి నిశ్చయముతో శిరస్సులోను (లేక) రెండు కనులలోను గల దహరాకాశములో సూర్యచంద్రమండలముల స్థానమును **మనోనిశ్చయము – మననము** ద్వారా ధ్యానించాలి. మూడవది జ్ఞానాగ్ని.

ఈ విధంగా 1. ఆకాశములోని సూర్య – చంద్రమండలములను, 2. స్వీయ శిరో ఆకాశములోని కనులలో గల సూర్యచంద్ర మండలములను ఈ రెండిటినీ మనస్సుతో ఏకంచేసి ధ్యానిస్తే, అట్టి యోగాభ్యాసి ఇంద్రియములను (శబ్ద – స్పర్శ – రూప – రస – గంధముల అభి నివేశమును, ఆకర్షణనను, వాటితో ఏర్పడుచున్న అనుబంధములను, అభ్యాస – ఆవేశములను) జయించి వేయగలడు. జ్ఞానాగ్నిచే దృశ్యవిషయములు దగ్ధమై ఆత్మత్వమును సంతరించుకుంటాయి.

మరొక ముఖ్య విషయం! 'సంసారము'ను తత్త్వదృష్టితో జయించకపోతేనో,... యోగ సాధనకు ఇంద్రియ విషయములు – 'ఏమార్చే అడ్డంకులు'గా ప్రవర్తిస్తూ ఉంటాయి. ఇంద్రియములను స్వాధీనం చేసుకోకపోతే–ఆ యోగ సాధకుడు అంతర్లక్ష్య–బహిర్లక్ష్య–మధ్య లక్ష్య ***తారక యోగములో*** ప్రవేశించలేడు. ఇక్కడి విషయములను, సంబంధములను, సంఘటనలను, సందర్భములను మొదలైన వాటిని లోక సంబంధమైన(లౌకిక) దృష్టితో కాకుండా, బ్రాహ్మీదృష్టితో చూడటమే సంసార జయము. తత్త్వ దృష్టియే సంసార రోగమునకు ఓషధం.

❖

ఈ విధంగా అంతర్ – దృష్టి రూపమగు 'తారకము' యొక్క అనుసంధానము **సంసార బద్ధునికి** (దృశ్యముచే నేను బద్ధుడను కదా!... అని భావించువానికి) **అత్యంత ఆవస్యకమైనదని** ఈ అద్వయ తారకోపనిషత్ ఎలుగెత్తి గానము చేయుచున్నది.

## మూర్తి - అమూర్తి విభాగ తారక - యోగము

ఇప్పుడు మనము 'తారక యోగము' నకు సంబంధించిన మరొక విభాగ యోగవిధి గురించి చెప్పుకుంటున్నాము. అట్టి ఈ మరొక విధమైన విభజన (Divisional Analysis) – రెండు రీతులుగా విభజించి చెప్పబడుతోంది. **1) మూర్తి తారకము 2) అమూర్తి తారకము.**

### మూర్తి తారకము-ఇన్ద్రియాన్తమ్ :

**యత్ ఇన్ద్రియాన్తమ్, తత్ మూర్తిమత్ ।** ఏ తారక యోగ విధానములో "ఇంద్రియములను దాటి, ఇంద్రియములకు ఆధారమై... కదలుచున్న వాటినన్నిటినీ కదిలించుచున్నదై..." ఇంద్రియములను (కన్ను–చూపు, చెవి – వినికిడి, చర్మము – స్పర్శ, నాలుక – రుచి, ముక్కు – వాసనలను) చైతన్యవంతముగా చేయుచున్నదో అద్దానిని "మూర్తితారకము" అని అంటారు. అది **భ్రూమధ్య గల ఆకాశములో సమావేశమగుచున్న ఇంద్రియ తత్త్వములను గమనిస్తూ, వాటికి మూలమగు చైతన్యాకాశములో మనస్సును ప్రకాశింపజేసి ఉపాసించటము అయివున్నది.**

### అమూర్తి తారకము-భ్రూయుగాతీతమ్ - భ్రూమధ్యాతీతమ్

**యత్ భ్రూయుగాతీతమ్, తత్ అమూర్తివత్ ।** ఏదైతే భ్రూఆకాశమును దాటివేసిన, సహస్రారము వరకు, ఆపై 12 అంగుళముల వరకు, ఇంకా ఆపై బ్రహ్మాండమంతా వ్యాపించినదై ఉన్నదో, అట్టి **దహరాకాశమును** బుద్ధితో గమనించి, మనస్సుతో ఉపాసించు యోగసాధన **'అమూర్తి తారక యోగ సాధన'** అని పిలువబడుచున్నది.

అయితే...

మూర్తి – అమూర్తి ఉభయతారక యోగములలో కూడా–**బాహ్యమును బాహ్యమునసే వదలి, "అంతః పదార్థ వివేచన"** కొరకై బుద్ధిని ఉపయోగిస్తూ ఆ తారక యోగాభ్యాస మనోయుక్తమైన సాధనకు ఉపక్రమించవలసిందే!

తారకాభ్యాసముచేత బుద్ధిని నియోగించి, ఈ ముముక్షువు అంతరిక్షమునందు (లేక) నిర్విషము శూన్య స్థానమునందు మనస్సును జేర్చి యోగాభ్యాసము కొనసాగించుగాక ! అట్టి తారక యోగభ్యాసము యొక్క ఔనత్యముచే చివరికి అనుభూతమయ్యేది ఏది ?

### సత్ చిత్ ఆనంద స్వరూపమగు పరబ్రహ్మమే

తెల్లటి జ్యోతికాంతితో, శుక్ల తేజోమయమై బ్రహ్మమే సర్వే సర్వత్రా వెల్లివిరిసి యున్నది. **తస్మాత్ శుక్ల తేజోమయమ్ బ్రహ్మేఽతి సిద్ధమ్** అనునది స్వభావ సిద్ధమై అనుభవమునకు వచ్చుచున్నది.

**తత్ బ్రహ్మ మనః సహకారి చక్షుషా అంతర్దృష్ట్యా వేద్యం భవతి !** అట్టి బ్రహ్మము మనో దృష్టికి అంతర్దృష్టిచే మాత్రమే అనుభవమవగలదు. అది **మూర్తి తారక లక్షణ లక్ష్యముచే** సాధ్యం ! అదే విధంగా మనోయుక్తమైన కనులకు (దివ్య చక్షువులను – perception with common sense) మాత్రమే అమూర్తి తారకము కూడా **దహరాకాశ దర్శనమును** అందించగలదు. అట్టి **దహరాకాశ మనో దర్శన అభ్యాస – యోగోపాసనచే** అఖండాత్మ అనుభూతము కాగలదు.

❖

మనస్సుచేత ఆత్మ ఎరుగబడుచున్నది. అంతేగాని, భౌతికమైన చక్షువులకు కానే కాదు. ఆ మాటకువస్తే ..., బాహ్యమున కూడా ఈ భౌతికమైన కళ్ళు ఒక రూపమును చూడాలంటే కూడా ఆ **అనుభవము మనో చక్షువుల ఆధీనములోనే ఉన్నది.** బాహ్యమున ఒక వస్తువును చూడటానికి గాని, అంతరమున తారక యోగా భ్యాసముచే దహరాకాశదర్శనముగాని, ఆ తరువాత ద్రష్ట – దృశ్యముల 'కేవల స్వస్వరూప' దృక్ దర్శనానుభవానికి గాని... **మనస్సే మార్గము. మనస్సే బంధము. మనస్సే ఆత్మానుభవమునకు ఉపకరణము.**

### *మరల చెప్పుకుంటున్నాం !*

బాహ్యమునగాని, అంతరమునగాని **ఆత్మ + మనస్సు + చక్షువులు** ఈ మూడింటి సంయోగము అయినప్పుడు మాత్రమే ఒక రూపము యొక్క గ్రహణము (Experiencing of any form or object) సాధ్యం.

అందుచేత...

**తస్మాత్ మనోయుక్తా అంతర్దృష్టిః తారక ప్రకాశాయ భవతి ।** మనస్సుతో కూడిన అంతర్దృష్టి చేతనే (మనస్సు – అంతర్దృష్టి సంయోగము పొందినప్పుడు మాత్రమే)... తారకతత్త్వము కూడా ప్రకాశమానమై అనుభవముగా సిద్ధించగలదు.

## తారక యోగము - భ్రూమధ్య బిల్వద్వార ఊర్ధ్వతేజో ఉపాసన

తారకయోగ విధి – తత్త్వముల గురించి మరికొన్ని విశేషాలు దృష్టిలో పెట్టుకొని వివరించుకొనెదము గాక !

**భ్రూయుగ మధ్య బిలే దృష్టిమ్, తత్ ద్వారా – ఊర్ధ్వస్థిత తేజ ఆవిర్భూతమ్... "తారకయోగో" భవతి !**

- భ్రూమధ్య ప్రదేశమునందు గల బిల్వద్వారమునందు దృష్టిని నిలిపి...,
- అట్టి మనో అనుభవమగు బిల ద్వారమునకు ఊర్ధ్వము (upward) వైపుగా ధ్యాసను (మనస్సును) ప్రయాణింపజేసి, ఊర్ధ్వమున ప్రకాశమానమైయున్న **మహత్‌తేజో ప్రకాశమును** భావనచేస్తూ దర్శించటము. ఆ ప్రకాశమును మనోయుక్తంగా ఉపాసించటము. ఆ ప్రకాశమును మనోయుక్తంగా దర్శిస్తూ ఉండటము – అనే **తన్మయా రూపమగు అభ్యాసము** (ఆది, నేనే... అను మనస్సుతో భావోపాసన) కూడా 'తారకయోగము' అని చెప్పబడుతోంది.

## పూర్వ భాగీతారకము - సహమనోయుక్త తారకము

**తేన సహ మనోయుక్తం తారకమ్ సుసంయోజ్యం ।**
**ప్రయత్నేన 'భ్రుయుగ్మమ్' సావధానతయా కించిత్**
**ఊర్ధ్వమ్, ఉత్-క్షేపయేత్ - ఇతి పూర్వభాగీ తారక యోగః ॥**

పైన చెప్పిన తారకములందు మనస్సును నియమించి, మనో దృష్టిని నిలిపి, నిశ్చలము చేసి, సుస్థిరముగా చేయు సావధాన పూర్వకమైన ప్రయత్నమే మనస్క – **తారక యోగాభ్యాసము**. అంతర్గతముగా **మనస్సుతో కూడిన దృష్టిని నిలుపుట** అందుకు విధానము. దృష్టిని భ్రూమధ్య స్థానము నందు నిలిపి, అద్దానియందలి ఆకాశ తేజో దర్శనము చేయుటము. అట్టి యోగసాధన చేయుచున్నప్పుడు కనుబొమ్మలను కొంచము ఊర్ధ్వము (upward) గా ఎత్తి ఉంచాలి. అట్లాగే దృష్టిని కూడా! అట్లా ఎత్తి ఉంచటము వలన సావధానము (Attentivity) వృద్ధి చెందగలదు. ఈవిధంగా మనస్సును అంతర్గతి – ఊర్ధ్వగతియందు నియమించుచూ, తారకోపాసన నిర్వర్తించు విధిని **'పూర్వభాగీ తారకము'** అని అంటారు.

## ఉత్తర భాగీ తారకము - అమనస్కము

**ఉత్తరంతు అమూర్తిమత్ అమనస్కమ్ ఇతి - ఉచ్యతే ।**

– అమూర్తివంతము (Formless)

– అమనస్కము. మనస్సు పాల్గొననట్టి కేవలీ–బుద్ధికి స్వభావంగా నిత్యానుభవమై సిద్ధించే – అభావస్థితి.

ఇది పూర్వభాగీతారకము యొక్క శ్రద్ధతో కూడిన అభ్యాసముచే లభించు ఉత్తరోత్తర స్థితి విభాగము.

మనస్కమ్ – మనస్సుతో వేరుగా చూడటము

అమనస్కమ్ – ఆ అనుభూతము – అనుభవము తానే అయి (తత్ రూపమై) ప్రకాశించటము. **మనస్సు కూడా సాక్షిత్వము. మౌన స్వకీయము. దృశ్యమును తనయందు లయింపజేసుకొను స్థితి** – తరంగము జలమునందు లయమగు తీరుగా!

## తాలు మూలో ఊర్ధ్వ - మహత్ జ్యోతిర్మయూ - ఉపాసన

ఇక్కడ మరొక ఉపాసనకొరకై తారకలక్ష్యమును చెప్పుకుంటున్నాము.

**తాలుమూల ఊర్ధ్వభాగే ... మహాన్ జ్యోతిర్మయూఖ్యో వర్తతే !** తాలువు (దవడ) యొక్క ఊర్ధ్వ భాగముగా మహత్తరమైనటువంటి జ్యోతి (వెలుగు, కాంతి) విరాజమానమైయున్నది. **తత్ యోగిభిః ధ్యేయమ్।** తారకయోగ అభ్యాసులచే అట్టి మహత్తరమగు జ్యోతి కాంతి పుంజములు బుద్ధితో గమనించబడుచూ, మనోబుద్ధులచే ధ్యానింపబడుచున్నాయి. అట్టి తాలు – ఊర్ధ్వభాగ–మహత్ జ్యోతి తేజస్సును ఉపాసించుచున్నట్టి యోగులు "అణిమ – మహిమ – గరిమ – లఘిమ – ప్రాప్తి – ప్రాకామ్య – ఈశత్వ – వశిత్వములనబడే అష్టసిద్ధులు సిద్ధింప చేసుకోగలరు కూడా!

## శాంభవీముద్ర

ఇప్పటి వరకు మనము చెప్పుకున్న అంతర – బాహ్య లక్ష్య లక్షణోపాసన రూపమగు తారకోపాసన సహాయంతో

**నిమేష - ఉన్మేష వర్జితాయాం!** కనులు తెరిచినప్పుడు – కనులు మూసుకున్నప్పుడు కూడా ఆ మూయటానికి తెరవటానికి సంబంధము లేకుండా... **సమరసత్వమగు పరబ్రహ్మమునే ధ్యానిస్తూ భావిస్తూ ఏ యోగి దర్శిస్తూ ఉంటాడో...** అట్టివారు **'శాంభవీముద్ర'** ధరించినవాడుగా చెప్పబడుచున్నాడు.

**తన్ముద్రా "ఆరూఢజ్ఞాని" నివాసాత్ భూమిః పవిత్రా భవతి ।**

అట్టి శాంభవీ ముద్ర **(సర్వము పరమాత్మ యొక్క (లేక) పరబ్రహ్మము యొక్క ప్రత్యక్ష–పరోక్ష రూపమే! పరమాత్మయే సర్వములో–సర్వముగా ఈ సర్వమై కనిపిస్తూ ఉన్నారు – అను బుద్ధినిశ్చలత)** ను అభ్యసించి, సాధన చేస్తూ (అనుకుంటూ – అనుకుంటూ ఉంటూ) ఉన్నవాడు, ఒకానొకప్పుడు – **అప్రయత్నంగానే అనిపించే స్థితికి** చేరుచున్నాడు. ఆ మహామహితాత్ముడగు మహనీయుడు ఏ భూప్రదేశములో ఉంటే ఆ ప్రదేశమంతా పరమపవిత్రము అగుచున్నది. (తీర్థం కరోతి తీర్థాని). ఆయనను దర్శించినంత మాత్రము చేతనే లోక జీవులు కూడా పవిత్రులు కాగలరు. **అట్టి శాంభవీముద్రా దిగ్విజయ పరమయోగిని ఎవరు పూజిస్తారో... వారు కూడా ముక్తులు కాగలరు.**

## జలజ్యోతి (తరంగ అతీత దృష్టి)

అమనస్క రూపమగు తారక యోగము యొక్క అంతర్లక్ష్య లక్షణోపాసకుడు అపః జ్యోతి (జల జ్యోతి–జగత్‌జ్యోతి) స్వరూపుడగుచున్నాడు.

ఆ విధంగా అంతర్లక్షణ లక్షణులైన తారకసిద్ధ యోగీశ్వరులు ఉన్నారు. వారు ఈ భూమిపై సంచరిస్తూ తాము ఉన్న పరిసరములలో అద్వయ తారకకిరణములను వెదజల్లుచూ, ఆశ్రయించిన జీవుల అజ్ఞానాంధకారమును పటాపంచలు చేయుచున్నారు. ఓ ప్రియజనులారా! అట్టి పరమ గురువుల సూచనలను, మార్గదర్శనములను, బోధలను వినండి.

**పరమగురూపదేశేన సహస్రారే జలజ్యోతిర్వా, బుద్ధి గుహా నిహిత చిత్ జ్యోతిర్వా, షోడశ అన్తస్థ తురీయ చైతన్యం వా అన్తర్లక్ష్యమ్ భవతి।** వారి ఉపదేశానుసారము.

- సహస్రారస్థానమునందు జలజ్యోతి దర్శనము – తదుపాసనలు చేతను, తన్మయమగుట చేతనూ.. (లేక)
- బుద్ధి గుహయందు నిహితమై, సంస్థితమై, అజ్ఞానపొరల క్రింద దాగియున్న చిత్ జ్యోతిని దర్శిస్తూ, ఉపాసిస్తూ తత్‌స్వరూపమగుట చేతనూ.. (లేదా)
- షోడశ దళములకు (పంచ కర్మేంద్రియ – పంచజ్ఞానేంద్రియ – మనోబుద్ధి చిత్త అహంకార – జీవ – ఈశ్వరులకు) అంతస్థము అయి, మూల స్వరూపమైనటువంటి (By which all these are made up of) తురీయము యొక్క ధ్యానము చేతనూ తారకము సిద్ధించుచున్నది ! ఈ మూడు కూడా **తారక అంతర్లక్ష్య లక్షణములు.**

అయితే అట్టి తురీయ చైతన్య సందర్శనమునకు ముఖ్య సహకారికారణము – **గురుబోధ, గురు అనుగ్రహము** అయి ఉన్నది. **గురియే గురువు.** తురీయ చైతన్య సిద్ధి పొందిన మహనీయుడు గురువై తనను ఆశ్రయించిన శిష్యులకు మార్గము చూపుచున్నారు. **తత్ దర్శనమ్ సదాచార్యమూలమ్!** సదాచార్యుల కృపచే తారక యోగము సులభమగుచున్నది. అది సిద్ధించునొన్నవారు 'ఆచార్యులు' అని చెప్పబడుచున్నారు. తారకయోగ సిద్ధికై మహనీయులగు అట్టి ఆచార్యులను శరణువేడెదరు గాక!

### ఆచార్య లక్షణములు

మహనీయులగు ఆచార్యుల సహజ లక్షణములు కొన్ని ఇప్పుడు మనము చెప్పుకుంటున్నాము.

**ఆచార్యో వేద సంపన్నో : తెలుసుకొనవలసినది తెలుసకొన్నవారు.** తెలియబడుచున్నదంతా తత్త్వతః బ్రహ్మముగా తెలిసియున్నవారై, **వేద సంపన్నులు** అయి ఉంటున్నవారు. వేదములు బోధించు సారవిషయము ఏమిటో ఎరిగి ఉన్నవారు. **"తత్ త్వమ్ అసి** – నీవు అదియే" అని శిష్యుని గురించి ఎరిగియే ఉన్నవారు.

**విష్ణు భక్తో :** సర్వే సర్వత్రా సమముగా వేంచేసియున్న **విష్ణుతత్త్వ సందర్శకులు, సత్‌ఉపాసకులు.** స్వయం విష్ణు తత్త్వ ప్రదర్శనాశీలురు అయి ఉంటున్నారు. భక్తిః జ్ఞానమ్ ప్రజాయతే! పూర్ణ జ్ఞానులై ఉండి కూడా, పరా ప్రేమ రూపమగు భక్తిని వదలని వారు. భక్తి–జ్ఞానములలో ఒకటి తాను వదలితే, రెండవది తనను వదలి దూరమవగలదని ఎరిగినవారు.

**విమత్సరః** : **గర్వము–మదము–మత్సర్యము ఏ మాత్రము లేని వారు.** "నేను గొప్ప ! వారు కాదు"... అను స్ఫురణయే లేని వారు. **'సర్వము బ్రహ్మమే' అను నిత్యధారణ కలవారు.**

**యోగజ్ఞో: యోగతత్త్వము** తెలిసియున్నవారు. శిష్యుని స్థితి తెలిసి, అతనికి సానుకూలమగు ఉద్వేగరహితమైన యోగమార్గము చూపగలిగినవారు. **శిష్యుని తత్ స్వరూపునిగా భావించువారు.** భవరోగమును ఎరిగి, సరియగు ఔషధమును సూచించగల భిషజులు (వైద్యులు).

**యోగ నిష్ఠశ్చ** : యోగ నిష్ఠాపరులై ఉంటారు. **"జీవబ్రహ్మైక్యమితి యోగమ్! – మత్తః పరతరమ్ న అన్యత్ కించిత్ అస్తి – ఇతి యోగమ్"** ఇత్యాది నిర్వచనములు ఎరిగి ఉన్నవారు.

**సదా యోగాత్మకః :** సర్వదా తురీయాతీత స్వరూపులై జగత్తులను స్వస్వరూపముగా ధారణ చేస్తూ **శ్రోత యొక్క ఆత్మను స్వస్వరూప భావనతో నిత్యానుసంధానము చేస్తూ సదానందులై ఉందువారు.**

**శుచిః :** వారి వాక్కు – మనో – బుద్ధి – చిత్తములు శుచి అయినట్టి **ఆత్మౌపమ్యేవ సర్వత్రా తత్ సందర్శనభావ అభిరుచులతో** నిండి ఉంటాయి.

**గురుభక్తి సమాయుక్తః :** గురుభక్తి సమాయుక్తులై ఉంటారు. అనుభవజ్ఞులు – దార్శనికుల – మహనీయుల ప్రవచనములను, వేదవాక్యములను ప్రమాణములుగా దృష్టాంతములుగా వచించటం చేయువారు!

**పురుషజ్ఞో విశేషతః : విశేషమగు పరమ పురుషుని ఎరిగి ఉంటారు**. జీవాత్మకు ఆవల, జీవాత్మకు **సాక్షి ప్రేరకుడు అగు చైతన్య పరమ పురుషుని** ఎరిగినవారై ఉంటారు. **చైతన్యానంద స్వరూపులై ప్రకాశించువారు.**

ఇటువంటి విశేషగుణ సంపన్నులను గురుతుల్యులుగా భావించబడునుగాక ! పై లక్షణములు కలవారు గురుస్వరూపులే ! **ఆరాధ్య దైవ సమానులే !** ఎందుచేతనంటారా? వినండి!

**'గు'** – కార అంధకారస్యాత్,

**'రు'** – కార తన్నిరోధకః ॥

మనలో ఆత్మ జ్ఞానజ్యోతిని వెలిగించి, అజ్ఞానాంధకారమును మొదలంట్లా తొలగిస్తారు కదా! కాబట్టి 'గురు' అను శబ్దముచే చెప్పబడుచున్నారు.

**గురురేవ ... పరబ్రహ్మ !** జీవాత్మకు ఆవల గల ఆత్మసాక్షి స్వరూపము !

**గురురేవ ... పరాగతిః !** పరమునకు మార్గము చూపువారు. ఇహత్వపరిమిత జన్మ-తదనంతర జన్మ – జన్మాంతరముల జాడ్యము తొలగించుకోవటానికి 'గతి' (మార్గము) అయి ఉన్నవారు. **మార్గాన్వేషకులకు మార్గదర్శకులు.**

**గురురేవ... పరావిద్యా !** వారే పరా విద్యా స్వరూపులు! **ఆత్మ విద్యా బోధకులు!** స్వయమాత్మానంద స్వరూపులు!

**గురురేవ ... పరాయణమ్ !** పరమాశ్రయులు – వెతికి వెతికి చేరవలసినది ఆ సద్గురువు **పాదాలనే.**

**గురురేవ .... పరంధనః** పరమునకు ధనమువంటి వారు. యోగ-ధ్యాన సంపదను ప్రసాదించువారు.

**యస్మాత్ తత్ ఉపదేష్టాఽసౌ, తస్మాత్ గురుతరో గురు ఇతి ।**

మహత్తరము, మనలో ప్రతి ఒక్కరి యొక్క సహజ స్వరూపముఅగు తత్ పరమాత్మత్వమును విశదీకరించి, ఉపదేశిస్తూ, మనకు సుస్పష్టపరుస్తారు కదా ! అందుచేత వారిని **'గురు'**... అని ఎలుగెత్తి పిలుస్తున్నాము ! శరణువేడుచున్నాము.

ఎవ్వరైతే గురుస్తోత్రముతో కూడి తారక యోగమును వివరిస్తున్న ఈ **'అద్వయతారకోపనిషత్'** ను పరమార్ధతః పఠిస్తారో, ఉపాసిస్తారో, ఉపదేశిస్తారో, **వారు సంసార సాగరము నుండి విముక్తులు కాగలరు.**

గురోపాసన – తారకయోగాభ్యాసములను ప్రారంభించిన వెను వెంటనే, ఆ మరుక్షణమే, **అనేక జన్మకృతములగు పాపములు అగ్నిలో వేసిన కట్టెలవలె భస్మము కాగలవు**. వారు కోరుకొన్నది. సిద్ధించగలదు.

**సర్వపురుషార్ధ సిద్ధిఃభవత, య ఏవం వేద ।**

ఈ ఉపనిషత్ చూపు 'పరబ్రహ్మము' అనబడు స్వస్వరూప పరమ సత్యమును ఎరుగుచుండగా చతుర్విధ పురుషార్థములు తమకుతామే సిద్ధించుచున్నాయి.

***ఇతి అద్వయ తారకోపనిషత్***

***ఓం శాంతిః శాంతిః శాంతిః***


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 3 ఈశావాస్యోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## మంగళ - శ్లోక -- తాత్పర్యపుష్పము



**ఓం పూర్ణమదః పూర్ణమిదం, పూర్ణాత్ పూర్ణమ్ ఉదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమ్ ఆదాయ, పూర్ణమేవ అవశిష్యతే ॥ ఓం శాన్తిః। శాన్తిః। శాన్తిః।**

*స్వయం ప్రకాశకుడు, స్వస్వరూపుడు అగు – పరమాత్మ సర్వదా పూర్ణుడు! ప్రకాశితమగుచున్న ఈ దృశ్య జగత్తు కూడా సర్వదా పూర్ణమే! పూర్ణమగు పరమాత్మ నుండే ఈ పూర్ణమగు దృశ్య జగత్తు (కాంతి నుండి కాంతి పుంజమువలె) బయల్వెడలుతోంది. పూర్ణమగు పరమాత్మ నుండి ఈ పూర్ణమగు దృశ్యము బయల్వెడలుచున్నప్పటికీ పరమాత్మ సర్వదా పూర్ణముగానే ఉండియున్నారు. ప్రకాశించువారై–ప్రకాశిచబడుచున్నదై కూడా ఉన్నారు.* ***ఈ జగత్తు పూర్ణమగు పరమాత్మ యందు పూర్ణ–ఆనంద స్వరూపమైయున్నది.***

*పూర్ణమగు పరమాత్మ నుండి పూర్ణమగు ఈ జీవుడు ప్రదర్శితమగుచున్నాడు. అయినప్పటికీ పరమాత్మ సర్వదా పూర్ణుడై ప్రకాశిస్తున్నారు. వాస్తవానికి ఈ జీవుడు, (సహజంగా చూస్తే),* ***పూర్ణ పరమశాంత స్వరూపుడై సర్వదా పరమాత్మగా*** *వెలుగొందుచున్నాడు!*

----

**1.** **ఓం ఈశావాస్యమ్ ఇదగ్ం సర్వం**
**యత్ కించ జగత్యాం జగత్।**
**తేన త్యక్తేన భుంజీథా।**
**మా గృథః కస్యస్విద్ ధనమ్ ॥**

స్వప్నములో కనిపించేదంతా, స్వప్న ద్రష్టయొక్క స్వప్న చైతన్య రూపమే కదా! అట్లాగే, ఈ కనబడే అనునిత్య పరిణామ రూపమగు జగత్ (జ = జనించేది, గత్ = గతించేది) అనబడే దృశ్యమంతా కూడా **అణువణువూ ఈశ్వరునిచే ఆక్రమించ బడినదై యున్నది. ఇదంతా ఈశ్వర భావనా సంప్రదర్శనమే.** అట్టి ఈ జగత్తును పొందుచున్న మనం ఇద్దానిని **"ఇది నాది కాదు"** అని భావించి (త్యజించి), **ఎటిగియేయుండి మాత్రమే ఆస్వాదించాలి.** పరమాత్మకు చెందిన ఇద్దానిని, పరమాత్మకు చెందిన మనం "ఇది నాది" అని, "అది కావాలి" అని కోరుకోకూడదు! త్యాగివై జీవించాలి. ఇతరుల ధనముపై అపేక్ష కూడదు. (ఇది ఏదీ నాది కాదు-అని గ్రహించి ఉండాలి).

---

**2.** **కుర్వన్ ఏవ ఇహ కర్మాణి**
**జిజీవిషేత్ శతగ్ం సమాః।**
**ఏవం త్వయి న అన్యథేతో అస్తి**
**న కర్మ లిప్యతే నరే!**

నిర్వర్తించవలసిన ఆయా విద్యుక్త - శాస్త్రవిహిత కర్మలు నిర్వర్తిస్తూ నిండు నూరేళ్ళు జీవించాలనే ఉద్దేశ్యం కొనసాగించాలి. భగవదర్పితంగా ఆ కర్మలు నిర్వర్తిస్తే, అప్పుడు కర్మల దోషమే జీవుణ్ణి అంటదు. కర్మలు నిర్వర్తించటం అనివార్యం. భగవదర్పితంగా కర్మలు నిర్వర్తించటం తప్పితే ఇక్కడ వేరే త్రోవయే లేదు. " నా కొరకే నా కర్మలు" అనుకున్నామా, .... కర్మలు బంధము - దోషము తెచ్చిపెడతాయి.

**3.** అసుర్యా నామ తే లోకా
అంధేన తమస ఆవృతాః
తాగ్ంస్తే ప్రేత్య అభిగచ్ఛన్తి
యే కే చ ఆత్మ హనో జనాః ॥

“భగవదర్పితంగా కర్మలు నిర్వర్తించటం” అనే జ్ఞాన బుద్ధి లేకపోతే, అప్పుడీ క్రియా వ్యవహారమంతా బంధమే అవుతోంది. ఈ కనబడే జగద్దృశ్యమంతా అజ్ఞానాంధకారమే అయిఉంటోంది. “భగవదర్పిత బుద్ధి” అనే త్యాగ భావనతో కూడిన బుద్ధిని సంపాదించనట్టి జీవులు - ముందుముందు అజ్ఞానాంధకారమగు స్థితి-గతులను జన్మ-కర్మలను పొందుచూ తమకు తామే ద్రోహం చేసుకొనుచున్న వారగుచున్నారు.

---

**4.** అనేజత్ ఏకం, మనసో జవీయో,
నైనద్దేవా (న ఏతత్ దేవా) ఆప్నువన్ పూర్వమ్ అర్షత్
తత్ ధావతో అన్యానత్యేతి తిష్ఠత్
తస్మిన్ అపో మాతరిశ్వా దధాతి ॥

ఈ జగత్తంతా ఏ ఆత్మయొక్క ఈశ్వర తత్త్వముచే ఆక్రమించబడినదై ఉన్నదో, .... అట్టి పరబ్రహ్మము - తాను సర్వదా మార్పు-చేర్పులు లేనిదై చలనరహితమై యున్నది. అయితే ఏం? మనస్సుకంటే కూడా అత్యంత వేగయుక్తమైయున్నది. ఏ ఇంద్రియములకు ఈ దృశ్యజగత్తు అనుభవమౌతోందో అట్టి ఈ ఇంద్రియములు, ఇంద్రియ దేవతలు అద్దానిని గమనించలేవు. దర్శించలేవు. ఎందుకంటే ఈశ్వర స్వరూపం ఈ ఇంద్రియ మనస్సుల కంటే ముందే ఉండి ఉన్నది. ఈశ్వరుని వాయుతత్త్వము చేతనే ప్రాణ-మనో-ఇంద్రియములు ఏర్పడినవై ఉన్నాయి. ఇక్కడి వ్యాపారములకు ఈశ్వర తత్త్వమే ఆధారమై ఉన్నది. వాటి కార్యకలాపములు ధరించుచున్నది, నియమించునది ఈశ్వర తత్త్వమే!

---

**5.** తత్ ఏజతి। తత్ న ఏజతి!
తత్ దూరే! తత్ ఉ అన్తికే।
తత్ అంతరస్య సర్వస్య
తదు సర్వస్య అస్య బాహ్యతః ॥

అట్టి ఆత్మ అంతటా - అన్నిటా చలించుచున్నది. కానీ అది సర్వదా చలనరహితం. సర్వ పరిణామములకు ఆధారం. కానీ, పరిణామ రహితం. అది దృశ్య - దేహ - మనో - బుద్ధి - చిత్త - అహంకారాలకు ఆవల ఉన్నది. అందుచేత దృశ్యము దృష్టా **అత్యంత సుదూరంగా** ఉన్నది. అయితే దృశ్య - ద్రష్ట రూపము తానే అయివుండటం చేత ప్రతి జీవునికి సర్వదా అతిసమీపంలో ఉన్నది. ఆ ఆత్మ సర్వజీవుల అంతరంగ స్వరూపంగాను, సర్వజీవుల బాహ్య జగత్ స్వరూపంగాను ప్రదర్శితమగుచూ అంతా తానే అయివున్నది. **సర్వ వ్యాపకము, సర్వజీవుల బాహ్య-అంతర స్వరూపము ఆత్మయే!**

---

**6.** యస్తు (యః తు) సర్వాణి భూతాని
ఆత్మనీ ఏవ అను-పస్యతి,
సర్వ భూతేషు చ ఆత్మానం,
తతో న విజుగుప్సతే ॥

ఏ ద్రష్ట (లేక) జీవుడైతే **“సర్వము నా ఆత్మ స్వరూపమే”** అని, **“సర్వము నా ఆత్మ యందే ఉన్నది”**... అని దర్శిస్తూ ఉంటాడో,.... అట్టివానికి ఇక ద్వేషించటానికి గాని, విబేధించటానికిగాని, తిరస్కరించటానికి గాని ఎవ్వరు ఎక్కడ ఏరూపంగా మిగిలి ఉంటారు? అట్టి ఆత్మ సాక్షాత్కారం పొందినవానికి ద్వేషానికి స్థానమే లేదు. దేనిని చూచి అసహ్యించుకోడు. (ఒకడు తన చేతి వ్రేళ్ళను చూసి తానే ద్వేషించడు కదా!)

---

**7.** యస్మిన్ సర్వాణి భూతాని
ఆత్మైవ అభూత్ విజానతః
తత్ర కో మోహః? కః శోకః?
ఏకత్వమ్ అను-పస్యతః ॥

ఎవ్వడైతే **“సర్వ తదితర జీవులు-దేహాలు-చరాచర జగత్తు అభూతమగు నా ఆత్మ స్వరూపమే అయిఉన్నది కదా!”**... అని గ్రహిస్తున్నాడో అతనికి మోహమెక్కడిది? దుఃఖమెక్కడిది? ద్వేషమెక్కడిది? తనతో సహా అంతటా ఏకత్వమే తాండవించటం గమనించి ఆనందిస్తున్నాడు! **ఈ జగత్తంతా అతనికి తన అఖండ స్వరూపమై విరాజిల్లుచున్నాడు.**

---

**8.** స పర్యగాః, శుక్రమ్, అకాయమ్, అవ్రణమ్,
అస్నావిరగ్ం, శుద్ధమ్, అపాప విద్ధమ్।
కవిః మనీషీ పరిభూః స్వయంభూః యథా
తథ్యతో అర్థాన్ వ్యదధాత్ శాశ్వతీభ్యః సమాభ్యః ॥

అట్టి తనుకు తానే ఉదయించినట్టి ఆత్మ సర్వవ్యాపము ఉజ్వలము-నిర్మలము అయినది. దేహాదులచే పరిమితమైనది కాదు! బాధారహితమైనది. దృశ్యాదుల ఆకారం లేనిది! సర్వదా పరమ శుద్ధము! పాపసంస్కార రహితము! జగత్ ప్రదర్శనమునకు తానే రచయిత. అంతా ఎఱిగియున్నది! అన్నిటినీ తనయందు సర్వదా కలిపివేసుకొనియే ఉన్నది. సర్వదా యథాతథమై (As it is) ఏర్పడియున్నది. సర్వ అర్థ పరమార్థములకు తానే నిర్మాత. సర్వమును తానే పంచి యిచ్చుచున్నట్టిది! ఎల్లప్పుడూ, ఎల్లప్పటికీ సమస్వరూపమై విరాజిల్లుచున్నది! శాశ్వతమైనది!

| | |
|---|---|
| **9.** అంధం తమః ప్రవిశన్తి<br>యే అవిద్యామ్ ఉపాసతే।<br>తతో భూయ ఇవ తే తమో<br>య ఉ విద్యాయాగ్ం రతాః ॥ | "నేను వేరు - ఈ సహజీవులు వేరు - దైవము వేరు" ... అని తలచుచూ, కామ్యకర్మల రూపమగు అవిద్యను ఎవ్వరు ఉపాసిస్తూ ఉంటారో, .... అట్టివారు అజ్ఞానాంధకారములో ప్రవేశించి సంచరిస్తున్నవారగుచున్నారు. "శాస్త్ర పాటవం" అనే విద్యను పరిమితులైతే కూడా (నేర్చుకున్నది దృష్టిలో ప్రవేశించకుంటే) అది "అంధకారము" యొక్క కొనసాగింపే అవుతుంది. ఎవ్వరైతే క్రమంగా తమ అజ్ఞానాంధకారం తొలగించుకుంటూ వస్తారో, "అంతా ఆత్మయందు. ఆత్మయే అన్నిటా" తత్ ఆత్మయేవాஉహమ్ అను - అనుభూతి పెంపొందించుకొంటూ వస్తారో, .... వారు మాత్రమే శాస్త్ర పాఠ్యాంశాన్ని అనుభవ రూపంగా మరల్చుకొంచున్నారు. .... అవిద్య నుండి ఆత్మవిద్య వైపు ప్రయాణిస్తున్నారు. |
| **10.** అన్యత్ ఏవ ఆహుః "విద్యయా",<br>అన్యత్ అహుః "అవిద్యయా"।<br>ఇతి శుశ్రుమ ధీరాణాం<br>యే నః 'తత్' విచచక్షిరే ॥ | → అంతా నా ఆత్మ స్వరూపమే ఆత్మయందే అంతా ఉన్నది →**'విద్య'**<br>→ ఇదంతా వేఱు వేఱు →**'అవిద్య'**<br>'విద్య' అనే మార్గం 'అవిద్య' అనే మార్గం, వాటి వాటి ప్రయోజనములు వేఱువేఱై ఉంటున్నాయి. దేనిచేత తత్పదము పొందటానికి మనం అర్హులం అవుతామో, అట్టి పథమును విజ్ఞులు - దార్శనికులు అగు మహనీయులు, ఆత్మజ్ఞులగు ధీరులు ప్రవచిస్తూ ఉండగా, వారి వ్యాఖ్యానములు వింటున్నాము. సత్యసుబోధితులమగుచున్నాము. |
| **11.** విద్యాం చ అవిద్యాం చ<br>యః తత్ వేదో ఉభయగ్ం సహ,<br>అవిద్యయా మృత్యుం తీర్త్వా,<br>విద్యయా అమృతమ్ అశ్నుతే ॥ | శాస్త్ర సాధనా క్రమములు అవిద్యా నిర్మితాలే! శాస్త్ర సంవిధానములోని విద్య-అవిద్యా విభాగములు ఎవ్వరైతే చక్కగా బుద్ధితో విచక్షించి గ్రహిస్తారో, ..... అట్టివారు అవిద్యా రూపసాధనలను ఉపయోగించి మృత్యువు నుండి విడివడినవారై, విద్యను ఉపాసించి అమృత స్వరూపులగుచున్నారు. **'విద్య' కొరకై అవిద్య - 'ఉద్ధరిణ' వలె, 'పంచపాత్ర' వలె ఉపకరణము అగుచున్నాయి.** |
| **12.** అంధం తమః ప్రవిశన్తి<br>యే అసంభూతిమ్ ఉపాసతే।<br>తతో భూయ ఇవ తే తమో<br>య ఉ సంభూత్యాగ్ం రతాః ॥ | దృశ్య జగత్తు - తదితర జీవులు ఆత్మకు వేఱుగాలేరు. ఏది ఆత్మకు వేఱుగా మొదలే లేదో, .... అట్టి 'అసంభూతి'ని ఉపాశించేవాడు (సృష్టిని ఉపాసించువాడు) అజ్ఞానాంధకారంలో ప్రవేశించువాడగుచున్నాడు. "అట్లాగే పరమాత్మ దీనికి వేఱుగా ఎక్కడో ఉన్నారు" అనే సంభూతిని (సృష్టికర్తయగు హిరణ్యగర్భుని) అన్యముగా ఉపాసించువాడు కూడా అజ్ఞానం కొనసాగిస్తున్నవాడే అగుచున్నాడు. |
| **13.** అన్యత్ ఏవ ఆహుః 'సంభవాత్'।<br>అన్యత్ అహు 'అసంభవాత్'।<br>ఇతి శుశ్రుమ ధీరాణాం<br>యేనః తత్ విచచక్షిరే ॥ | జ్ఞాన చక్షువులు గల మహనీయులు ధీచక్షువులతో దర్శించి **"జగత్తు ఏర్పడి ఉన్నట్లు కనబడుతోంది. నిత్య సంభవమగు ఆత్మయే ఈ జగద్రూపం. కానీ ఆత్మయందు జగత్తు లేదు (అసంభవము)"** .... అని సంభవ - అసంభవములను విశదీకరించగా మనం వింటున్నాము. గ్రహిస్తున్నాము. |
| **14.** సంభూతిం చ వినాశం చ<br>యః తత్ వేద ఉభయగ్ం సహ...,<br>వినాశేన మృత్యుం తీర్త్వా<br>సంభూత్యా అమృతమ్ అశ్నుతే ॥ | సర్వదా యథాతథమై సర్వత్రా ఏర్పడియున్నది = "సంభూతి"<br>అనుక్షణం మార్పుచెందుతూ ఉండేది = "అసంభూతి"<br>(జలానికి గల తరంగాకారం సర్వదా మార్పు పొందుతూ ఉంటుంది (వినాశభూతము). కానీ అన్ని తరంగాలలోని జలము సర్వదా అయథాతథము) (అవినాశము).<br>"మార్పు చెందనిది - మార్పు చెందేది" అనే రెండిటి సంయోగమే ఈ జీవుడు-జగత్తు కూడా! **విజ్ఞుడైనవాడు** ఈ సంభూతి (యథా తథము)-వినాశన శీలము (మార్పు చెందేది) అను రెండిటినీ చక్కగా గ్రహించినవాడై, సంభూతి-అసంభూతిల వివేచను వివేకములచే ఆశ్రయించి, మృత్యువును అధిగమించినవాడగుచున్నాడు. 'సంభూతము' అను ధర్మమునకు కూడా అతీతములగు ఆత్మను సేవించి **అమృతత్వమును సంతరించు కొనినవాడు అగుచున్నాడు.** అనగా మార్పు చెందని దానిని గమనించి, ఉపాశించి మార్పు - చేర్పుల పరిధిని అధిగమించి తన స్వస్వరూపమును ఆస్వాదించుచున్న వాడగుచున్నాడు. |

**15. హిరణ్మయేన పాత్రేణ**
**సత్యస్య అపిహితం ముఖమ్ ।**
**తత్ త్వం, పూషన్! అపావృణు,**
**సత్య ధర్మాయ దృష్టయే ॥**

ప్రతి జీవునియందు 'ఆత్మజ్ఞానము' అనే విశేషముతో కూడిన ఆత్మజ్యోతి జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తోంది. అయితే ఆ ఆత్మజ్ఞానము అనే 'సత్యము' **హిరణ్యగర్భుని కల్పనయగు 'జగత్ అనుభవం' అనే బంగారు పాత్రలో 'మోహము'** అనే మూసచే కప్పబడినదైయుండి, అనేక మంది జీవులకు అనుభూతం కావటం లేదే! ఏమి ఆశ్చర్యం!

ఓ పరమాత్మా! **'మోహము'** అనే పదార్థముతో తయారుకాబడి 'జగదనుభవం' అనే బంగారు పాత్రలో సత్యమగు మా **స్వస్వరూపము** కప్పబడియున్నది కదా! ఫలితం? మేము అనేక వేదన-రోదనలకు గురి అగుచున్నామే! కాబట్టి సర్వాత్మకుడ వగు ఓ పరంధామా! మాయొక్క సత్య-ధర్మములు సాక్షాత్కారము కొరకై **'లోకాపేక్ష'** అనే మూసను తొలగించమని మిమ్ము వేడుకుంటున్నాం. "అపేక్ష" రహితమైనట్టి నిర్మల సత్య-ధర్మ దృష్టిని ప్రసాదించండి!

---

**16. పూషన్! ఏకర్షే! యమ! సూర్య! ప్రాజాపత్య!**
**వ్యూహ రశ్మీన్ సమూహ ।**
**తేజో యత్ తే రూపం కల్యాణ తమం (అస్తి),**
**తత్ తే పశ్యామి యో అసావసౌ పురుషః "సోఽహమస్మి" ॥**

ఓ ఆత్మదేవా! సర్వ పరిపోషకుడా! ఒంటరి బాటసారీ! యముడు - సూర్యుడు - ప్రజాపతులతో సహా సర్వ నియామకుడా! సర్వస్వరూపుడా! అనంతకోటి సూర్యప్రభావా! సర్వజీవుల ఉత్పత్తి స్థానమా! నీ'మాయ' అనే తేజోకిరణములను కొంచెం ఉపసంహరించవయ్యా! లేకుంటే నిన్ను దర్శించలేకపోతున్నామే! కళ్యాణ స్వరూపము - అత్యంత వైభవోపేతము - మంగళకరము అగు ఆత్మ స్వరూపమును నీ అనుగ్రహం చేత మాత్రమే సందర్శించగలుగుతాముకదా! తద్వారా "సర్వ నియామకుడగు పరమాత్మయే నేను" .... అను సోఽహమ్‌నకు చేరెదము గాక!

---

**17. వాయుః అనిలమ్ అమృతమ్ మథౌదం**
**భస్మాంతగ్గ్ శరీరమ్ ।**
**ఓం క్రతో స్మర! కృతగ్గ్ స్మర!**
**ఓం క్రతో స్మర! కృతగ్గ్ స్మర ॥**

ఓ ప్రాణవాయువులారా! మీరు సర్వప్రాణస్వరూపమగు సప్రాణ స్వరూపులై నాకనుభవమయ్యెదరుగాక! ఓ అగ్నిదేవా! మీ కరుణచే ఈ దేహము దేహాతీతానుభవమునకై నాకు సహకరించునుగాక! వాయు - అనిలముల ఉపాసనచే మా భౌతికభ్రమ భస్మమగును గాక!

ఈ జీవాత్మను సర్వాత్మకమగు పరమాత్మయందు లయించే కార్యక్రమము మాచే సర్వదా స్మరించబడుగాక! మాయొక్క సర్వ కార్యక్రమములు అట్టి మార్గములో, అట్టి ఉద్దేశ్యము పొందినవై ఉండుగాక! ఓ క్రతో! స్మరించుము! ఆత్మను స్మరించుము!

---

**18. అగ్నే! నయ సుపథా రాయే! అస్మాన్**
**విశ్వాని దేవ! వయునాని విద్వాన్।**
**యుయోధి అస్మత్ జుహురాణమ్ ఏనో**
**భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ ॥**

**ఇతి ఈసావాస్యోపనిషత్**

**ఓం శాంతిః శాంతి ః శాంతిః**

ఓ అగ్నిదేవా! కరుణతో నన్ను అసత్‌మార్గము నుండి విరమింపజేసి సన్మార్గములో ప్రయాణించునట్లు మార్గదర్శకులగుదురు గాక - అని అర్థిస్తున్నాను. స్వామీ! మీరు మాయొక్క సమస్త కర్మ-జ్ఞానములు ఎఱిగియే ఉన్నారు కదా! మాలోని అల్ప-పాప-దోష భూయిష్టమగు దృష్టులను ప్రేమతో స్పృశించి నశింప జేయండి! దయాసాగరులగు మీ కటాక్ష వీక్షణచే మేము పునీతులం కాగలం. మా స్తోత్ర వాక్యములతో మిమ్ములను భక్తితో స్తుతిస్తూ ఉపాసిస్తున్నాం.

***ఇతి ఈశావాస్యోపనిషత్***

***ఓం శాంతిః శాంతి ః శాంతిః***


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 3 ఈశావాస్యోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



**ఓం పూర్ణమదః పూర్ణమిదమ్, పూర్ణాత్ పూర్ణమ్ ఉదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమ్ ఆదాయ, పూర్ణమేవ అవశిష్యతే॥**

**అదః = సహజము - స్వస్వరూపము అగు పరమాత్మత్వము,**
**ఇదమ్ = సందర్భమాత్రము. జగత్ ద్రష్టత్వము - జగత్తులు. జీవాత్మత్వము.**

ఓ సర్వాత్మ స్వరూపా! మీయొక్క **పరతత్త్వ స్వరూపము** సర్వదా పూర్ణమే !

మీయొక్క "జగత్తు - జీవుడు" రూపమగు ఈ ఇహతత్త్వ స్వరూపము కూడా సర్వదా సర్వత్రా పూర్ణమే ।

ఈ జీవుడు - దృశ్య జగత్తులు మీచే జనించి, మీయందే ఉన్నవై, మీచేతనే ప్రకాశింపజేయబడుచున్నాయి. పూర్ణ స్వరూపులగు మీనుండే పూర్ణ స్వరూపమగు దృశ్యజగత్-జగత్ ద్రష్టలు ఆవిర్భవిస్తున్నాయి.

పూర్ణ స్వరూపులగు మీనుండి పూర్ణ స్వరూపమగు జగత్తు ప్రదర్శించబడుచున్నప్పటికీ మీరు సర్వదా యథాతథ పూర్ణస్వరూపులై సర్వే-సర్వత్రా ప్రకాశిస్తున్నారు. సర్వత్రా శాంతైశ్వర్యముతో నింపి వేస్తున్నారు!

✡

**ఈశ = పరమాత్మ. సమస్త జీవులకు ఆత్మ. ఈష్టే ఇతి ఈట్. సర్వస్వతంత్రుడగు కేవలాత్మ!**

ఈ కనబడే దృశ్యము నామరూపాత్మకమై - అనుక్షణికంగా అంతటా మార్పుచేర్పులు పొందుతూ అగుపిస్తోంది కదా! '**జ**నించటము-**గ**తించటము' అనే ధర్మములను ప్రదర్శిస్తూ 'జగత్' అని చెప్పబడుతోంది. అయితే, అనుక్షణిక పరిణామములతో కూడిన ఈ దృశ్యజగత్తుకు సర్వాత్మకుడగు ఈశ్వరుడే ఆధారము. మార్పులచే చేర్పులచే స్పృశించబడని ఈశ్వరుడు ఈ దృశ్యజగత్తు యొక్క అణువణువునా వ్యాపించినవారై ఉన్నారు. కలలో కనిపించేదంతా కూడా ఆ కల తనదైనవాని స్వప్నచైతన్య రూపమే కదా! కలలో కనిపించే మార్పు-చేర్పులకు కల తనదైనవాడు లోను అవుతాడా? లేదు కదా!

ఓ సహజీవుడా! మిత్రమా! అట్టి **ఈ జగత్తు నాదీ కాదు - నీదీ కాదు!** "ఇది నాది కాదు" అని మునుముందుగా గ్రహించి అటుపై అనుభవమునకు స్వీకరించు. **"ఇదంతా ఈశ్వరునిచే ప్రసరించబడియున్నదై, ఈశ్వరునికి చెందినదై యున్నది"** .... అని

గమనించి ఉండు. "హే పరమాత్మా! ఈశ్వరా నాది నాది అని నేను అనుకున్నదంతా నాది కాదయ్యా! నీది" అని గ్రహించి ఉండాలి. అంతేగాని "ఇది నాది - నాకు చెందినది" అని దేనినీ కోరుకోకు. నామ-రూప-క్రియలను త్యాగబుద్ధితో దర్శించు. దేనినీ సొంతమని అనుకోకు. **అహమిత్యేవ బంధాయ। నాహమ్ ఇత్యేవ మోక్షయే।**

ఇక కర్మలంటావా! నిర్వర్తించవలసిన కర్మలు ఇక్కడ శాస్త్రానుకూలంగా, లోకానుకూలంగా నిర్వర్తిస్తూనే నిండు నూతేళ్ళ జీవితం కలిగి ఉండాలని ఉద్దేశ్యించు. దేహం వచ్చిందంటే కర్మలు నిర్వర్తించటం అనివార్యం. అయితే కర్మఫలాలు - తదనంతర కర్మలు .... ఇవన్నీ గొలుసు యొక్క రింగులవలె జీవుణ్ణి దృశ్యజగత్తుకు బంధించి అట్టేబెట్టుచున్నాయి. తనకు నియమితమైన కర్మలను ఎవ్వడు భగవదర్పిత బుద్ధితో మాత్రమే, సర్వాంతర్యామి - సర్వస్వరూపుడు అగు భగవానునికి సేవాపరంగాను, సదుద్దేశ్య సమన్వితంగాను నిర్వర్తిస్తాడో, .... అప్పుడా శుభాశుభ కర్మల దోషం ఆతనికి అంటదు. **దేహాభిమాని - కర్మల అభిమాని అగు జీవునికి - కర్మలు నిర్వర్తించే విషయంలో ఇంతకుమించి త్రోవయే లేదు**. ఎందుకంటే, మరింకేవిధంగానైనా సరే, ఏ కర్మ అయినాకూడా అతనిపట్ల బంధమే కాగలదు. అందుచేత యోగ-యజ్ఞ - యాగ - జ్ఞాన - స్తోత్ర సంబంధమైనట్టివితోసహా సర్వకర్మలు జగదీశ్వరునికి సమర్పించి ఉండాలి.

ఆత్మజ్ఞానం సముపార్జించుకోవటం జీవునికి అత్యంతావశ్యకం. **అత్యవసరం**. అది అన్ని మనోవేదనలకు సరిఅయిన ఔషధం. ఏ జనుడైతే దేహం సానుకూల్యంగా ఉండగానే ఆత్మజ్ఞాన జ్యోతిని ఉద్దీపింపజేసుకోడో, ఎవ్వడైతే ఈ దృశ్యవస్తు - విషయ - సంబంధ - బాంధవ్య - లోకప్రతిష్ఠాది విశేషములే జీవిత పరమావధి అని తలచి జీవితం గడిపివేస్తూ ఉంటాడో, .... అట్టివాడు అజ్ఞానాంధకారముచే నిబిడీకృతమైన అసుర లోకాలలో కర్మఫల సంబంధమైన ఉపాధి సహస్రాలు పొందటం కొనసాగించవలసి వస్తుంది. ఎవ్వడు ఈ 'మానవజన్మ' అనే అవకాశమును **"ఉత్తమమైన ఆత్మావగాహన - ఆత్మజ్ఞాన అభ్యాసములు పెంపొందించుకోవటం"** అనే ప్రయోజనము కొరకై సద్వినియోగపరచుకోడో, .... అట్టివాడు తనకు తానే ద్రోహం చేసుకొన్నవాడు అగుచున్నాడు. ఉత్తరోత్తర తనకు ప్రాప్తించగల అధమ స్థితిగతులకు ఔషధం సేవించనివాడు అగుచున్నాడు. **అసుర్యా = పరమాత్మ భావమ్ అద్వయమ్ అపేక్ష్యా, దేవాదయోనిపి అసురాః !** పరమాత్మ భావన - అద్వయము! కర్మఫలముల దృష్ట్యా పుణ్య ఫలములగు దేవలోకము కూడా, అపేక్షకారణంగా అసురమే!

సర్వజీవుల వాస్తవ స్వరూపమగు ఆత్మ తాను యథాతథ స్థానంలో కదలికలు లేక, మార్పుచేర్పులు లేకయే ఉంటోంది. అయితే ఏం? మనస్సుకే ఆధారమై, మనస్సుకంటే కూడా జవీయః - మిక్కిలి వేగయుక్తమై యున్నది. కనుక అది కదలదు - కదులుతుంది కూడా! అట్టి ఆత్మ ఇంద్రియములకు విషయమా? కాదు. **న-అప్నువన్।** ఇంద్రియములు పొందజాలవు. అనగా కంటికి కనబడేది, చెవులుకు వినబడేది కాదు. వాటన్నిటికంటే ముందు అది ఏర్పడినదైయున్నది. అయితే, ఆత్మయొక్క చైతన్యము చేతనే జడమగు ఇంద్రియములు - మనస్సు క్రియా సహితమై ప్రవర్తించగలుగుచున్నాయి. కళ్ళకు కనబడకపోయినప్పటికీ అంతటా గాలి ఉండియే ఉన్నట్లు, ఇంద్రియముల బాహ్య-అభ్యంతరములలో ఆత్మ అనునిత్యముగా వెలుగొందుచున్నదై యున్నది.

ఆత్మ అంతటా ప్రసరించుచున్నదై, అన్నిటా చలించుచున్నట్టిది. **తత్ ఏజతి**. కదలికలన్నీ అద్దానివే! కానీ అది చలనరహితం. పరిణామ రహితం. ఇంద్రియములను ఉపయోగించి వెతకటం ప్రారంభిస్తే, అది అత్యంత సుదూరం. కాని **ఆ ఇంద్రియములకే ఆధారమై అది అత్యంత సామీప్యం కూడా! తత్ ఉ అంతః, అస్యసర్వస్య, తత్ ఉ సర్వస్య అస్య బాహ్యతః।** సర్వ జీవులలోని అంతరాంతరములు వ్యాపించియున్నదై ప్రకాశిస్తోంది. ప్రతి జీవుని అంతరము - బాహ్యము కూడా ఆత్మ స్వరూపమే అయివున్నది. దృశ్యము - ద్రష్ట కూడా ఆత్మ స్వరూపమే! అంతా అంతటా అన్నిటా అన్నీగా ఏర్పడిఉన్నది ఆత్మయే! జలము తనయందు తరంగములను ధరించినట్లుగా, ఆత్మయే ఈ జగత్‌దృశ్య - తదంతర వ్యవహారాదులను, జన్మ-కర్మ-అనుభూతి-అనుభవ పరంపరలను లీలగా ధరిస్తోంది. తన సన్నిధాన మాత్రంచేత ఈ సర్వదేహుల దేహ-మనో-బుద్ధి-చిత్త అహంకారాదులను 'ప్రవర్తన' కలిగి ఉండేటట్లు చేస్తోంది. తాను మాత్రం చలనరహితమై, అంతటా ప్రసరించి యున్నదై, అంతా తానే అయి సత్-చిత్-ఆనంద స్వరూపమై యథాతథంగా ఏర్పడియున్నది.

ఆహాఁ! ఆత్మ చలన రహితం. కానీ అన్నిటినీ తానే తన ఉనికి మాత్రంచేత కదలిస్తోంది! ప్రాణశక్తిని ప్రదర్శింపజేస్తూ, తద్వారా తదితరములన్నిటినీ చలింపచేస్తోంది. తాను పరిణామరహితం. కానీ కనబడే పరిణామాలన్నీ అద్దానివే! అద్దాని యందే! బాహ్య-అభ్యంతరములలో వ్యాపించి, సర్వవ్యాపారములకు తానే కారణం! మనో-బుద్ధి-చిత్త-అహంకారాలు తమకుతామే ప్రవర్తిస్తున్నాయని అజ్ఞానముచే అనిపిస్తోంది. కానీ, వాటిని నియోగించి ప్రవర్తింపజేసేది ఆత్మయే! జడ జగత్తును చేతనపరచుచున్నట్టిది - ఆత్మయే!

ఈ 'జగత్తు' అనబడేది పదార్థమాత్రమా? బంధపరంపరా సమన్వితమా? ఇష్ట-అయిష్ట సంయోగమా? భావనామాత్రమా? ద్రష్ట స్వరూపమేనా? .... ఈ ప్రశ్నలకు సమాధానం, **"ద్రష్ట దేనిపట్ల ఎట్లు ఎట్టి భావనను ఆశ్రయిస్తాడో, ..... అట్లే అనుభవమౌతుంది"** అని అనవలసి వస్తోంది. భావనయే జగత్‌రూపం. భావన ద్రష్టయొక్క రూపమే! ద్రష్ట ఆత్మరూపుడే! కనుక **"నేను - నాకు కనబడే ఈ సర్వ తదితర జీవులు నా ఆత్మ యొక్క స్వరూపమే!" ...** అని ఎవ్వరు గ్రహించి, హృదయస్థం చేసుకొంటారో, వారి దృష్టి **సమున్నతం**. వారికి **"అంతా ఆత్మయే"** .... అనువిధంగా కనబడుతోంది.

**"- నేను ఆత్మస్వరూపుడను!**

**- సర్వ తదితర జీవులు ఆత్మ స్వరూపులే!**

**- సర్వతదితర జీవులు - నేను కూడా ఆత్మయందే ప్రదర్శితులమగుచూ, ఆత్మకు అభిన్నమై ఉన్నాము!"**

అని దర్శించే వారికి, .... ఇక జుగుప్స (అసహ్యం), కోపము, తాపము, పగ, దురభిమానము మొదలైనవి ఎక్కడుంటాయి? అట్టి ఆత్మ సాక్షాత్కారం పొందినవానికి ద్వేషానికి స్థానమే లేదు? ఇంకెక్కడి మోహం? ఇంకెక్కడి దుఃఖం? **తత్ర కోమోహః? కోశోకః?** అంతా అన్నిటా అప్పుడు-ఇప్పుడు-ఎప్పుడు ఆత్మయే తాండవిస్తోంది. **ఏకత్వం అనుపశ్యతి।** ఆతడు ఏకత్వమే అన్నిటా సందర్శిస్తున్నాడు. ఆ ఆత్మద్రష్ట తన స్వరూపమునే అన్నిటా దర్శిస్తూ తనను తాను సర్వవ్యాపిగా గమనిస్తున్నాడు. ఆస్వాదిస్తున్నాడు.

దేహరహితం. దేహానికి బాల్య-యౌవన-వార్ధక్యాలు ఉండవచ్చుగాక! వీటిని కదల్చే మన ఆత్మ ఆకారరహితం-అపరిమితం. కాబట్టి దేహము యొక్క దోషాలు (భౌతికమైనవేవీ) అద్దానికి అంటవు. దేహానికి ఆకలి-దప్పులు ఉండవచ్చుగాక! ఆత్మకు అవన్నీ లేవు. సదా శుద్ధము. ఈ పాప-పుణ్యాలతో ఆత్మస్వరూపానికి సంబంధం లేదు.

**స పర్యగాః।** సర్వవ్యాపకము. తాను నిష్క్రియమై ఉండి కూడా..... అన్నిటినీ చూచేది, వాటికి అర్థము సంకల్పించేది అదే! అత్యంత సమున్నతము - ఉజ్వలము అయినది. పరిపూర్ణము. స్వయంభువు. (It is created by itself. It has no creator).! అట్టి ఆత్మ ఏ దృష్టితో చూస్తే అట్లాగే గోచరిస్తుంది. (యథా తథ్యతో అర్థాత్, యత్ భావమ్ - తత్ భవతి). సర్వదా యథాతథము. కాలమునకే సాక్షి. కనుక శాశ్వతము. అంతటా సమ స్వరూపమై వెలుగొందుచున్నట్టిది.

ఆత్మయే సత్యము. తదితరమంతా ఆపాదితము. నవరస నాటకములోని సంఘటనలు సంబంధములవలె తదితరమైనదంతా కల్పితము. ఆత్మ **విద్యాస్వరూపము**. ఆత్మకు అన్యంగా అనిపించేదంతా అవిద్యయే!

ఏ ఆత్మను ఏమరచి ఉండటం చేత జగత్ దర్శనమంతా అనేకత్వ సమన్వితమై కనిపిస్తూ - అనిపిస్తూ ఉన్నదో అదియే **అవిద్య**.

ఎవరైతే ఆత్మను ఏమరచి **"ఈ దృశ్యమే సత్యము. ఈ దేహమే సత్యము. మనో - బుద్ధి - అహంకారములు వాటివాటి విషయములు సత్యమే"** .... అని ఉపాసిస్తారో .... అట్టివారు క్రమంగా అజ్ఞానాంధకారంలో ప్రవేశించుచున్నవారగుచున్నారు. అట్లాగే "ఆత్మ వేఱు. దృశ్యము వేఱు. ఆత్మదర్శనము ఎప్పుడో-ఎన్నడో-ఎట్లాగో" - అనే ఆశయంతో ఎక్కడెక్కడో వెతుకుతారో, వారుకూడా చీకటిలో వెలుతురు కొరకై వెతుకుచున్నవారే అగుచున్నారు.

స్వస్వరూపమగు ఆత్మ తత్త్వాన్ని ఎఱిగిన ఆత్మజ్ఞులు ఉన్నారు. అట్టి ఆత్మజ్ఞుల అనుభూతి-అవగాహనల ప్రవచనములే ఇక్కడ మనకుఆత్మజ్ఞాన (వేదాంత) శాస్త్రాదుల రూపంగా అందించబడుచున్నాయి. ఆత్మజ్ఞానోపాసకులకు అట్టి విజ్ఞుల వాక్యార్థముల సారము గ్రహించటమే మార్గము.

**విద్య-అవిద్య** ఇవి రెండు వేరువేరు రీతులుగా, వేరువేరు మార్గాలకు దారితీస్తూ ఈ దృశ్య ప్రపంచంలో లభిస్తున్నాయి. ఆత్మదర్శులు-ధీరులు అగు మహనీయులు చెప్పిన ప్రవచనములను విని, వ్యాఖ్యానములను **'ఆత్మ తత్త్వము'** గురించి గానం చేస్తున్నాం. మేము ఉపాసించే **"విద్య"**ను ప్రకటిస్తున్నాం.

ఓ దేహపుర సుదీర్ఘ బాటసారులారా! **విద్యాంచ-అవిద్యాంచ యఃతత్ వేద ఉభయం సహ,** విద్య-అవిద్యల విచక్షణను గ్రహిస్తూ మార్గం సారించుకోవాలి సుమా! **అవిద్యయా మృత్యుం తీర్త్వా...**, అవిద్య → "మార్పు-చేర్పులు" అనే **"లోకబంధనములు"** అనే వైపుగా జీవులను చేర్చుచున్నది. అదియే మృతస్థానం. **విద్యయా అమృతమ్ అశ్నుతే।** విద్యయో, మనలను అమృత స్వరూపులుగా తీర్చిదిద్ది పునీతం చేస్తోంది. కాబట్టి మనం జీవితనావను ఉపయోగించి చేరవలసిన స్థానం మన **"నిత్య-నిర్మల-అప్రమేయ-అమృత" స్వరూపమగు ఆత్మవైపుకు** – అని గమనించెదరు గాక! సర్వజీవులు తానై, సర్వమునకు సాక్షిగా వేరైనట్టి ఆత్మత్వమే విద్యామార్గము.

**అన్యత్ ఏవ ఆహుః సంభవాత్। అన్యత్ ఆహుః అసంభవాత్ ॥** ఆత్మ సర్వదా 'సత్-సంభూతము' అయివున్నది. సర్వదా, సర్వే-సర్వత్రా ఏర్పడియున్నదై ప్రకాశిస్తోంది. అది అనన్యము. అనగా, ఆత్మకు తదితరమైనది మొదలే లేదు. కాని అద్దాని అన్య భావనచే మాత్రమే 'అన్యము' అనునది అనుభూతమౌతోంది. ఏదైతే "భావించబడుటచే మాత్రమే ఉన్నట్లుగా అనిపిస్తోందో, .... వేఱువేఱు భావనలచే వేఱువేఱుగా అనిపిస్తూ ఉంటుందో, స్వతఃగా సత్యము అయిఉండలేదో" ..... **అట్టి భౌతిక జగత్తు సత్యము కాదు.**

**అసంభూతి :** వస్తుతః లేనట్టిది. కొన్ని కల్పనలచే భావనలచే కల్పించబడి అనుభవమునకు వస్తున్నది. (Actually not existent. But is being experienced by the Exercise of Relatedness or RELATIVITY)

ఉదా :

తూర్పు-పడమర మొదలైన దిక్కులు ప్రపంచంలో ఉన్నాయి. సూర్యుడు – భూగోళము ప్రక్కకు పెడితే దిక్కులు ఉన్నాయా? దూరంగా కొండ నునుపుగా కనిపిస్తోంది → కొండ నునుపుగా ఉన్నదా?

సంబంధ బాంధవ్యాలు సత్యమేనని అందరికీ అనిపిస్తున్నాయి. అయితే క్రమక్రమంగా పాత అనుబంధ – సంబంధ – బాంధవ్య భావాలు తొలగి క్రొత్తవి ఏర్పడుచూ పోతున్నాయి కదా!

ఏదైతే స్వతఃగా లేక, కేవలం ద్రష్ట యొక్క భావన-స్థితి-గతిని అనుసరించి సత్యమేనని అనిపిస్తూ, కాల-స్థితి-గతుల మార్పుచే అవి కూడా మార్పు-చెందుచున్నాయో .... అట్టిదంతా 'అసంభూతి'.

**'అసంభూతి' అగుదానిని ఎవ్వరు ఉపాసిస్తూ 'సంభూతి' అగు ఆత్మయొక్క తత్త్వాన్ని గమనించరో, .... అట్టివారు అజ్ఞానాంధకారములో ప్రవేశించినవారగుచున్నారు.**

✡ ✡ ✡

**సంభూతి:** ఈ దృశ్యమునకు వేరుగా పరమాత్మ మరెక్కడో – అనునది కూడా **అవిద్యయే!**

అట్లాగే,

**"ఈ దృశ్యము వేరు – సంభూతి** (Actually always present) **అగు పరమాత్మ వేరు. ఆయన ఇంకెక్కడో ఎన్నటికో ప్రాప్తించగలరు" .... అని తలచేవారు అజ్ఞానమును కొనసాగించుచున్నవారే అగుచున్నారు.**

- సంభవమగు ఆత్మవేరు. ఈ జగత్తు వేరు.
- అసంభవమగు ఈ జగత్తు సత్యమే!
- ఈ రెండూ కూడా అజ్ఞానమునకు దారితీయు మార్గములే! పరమాత్మ ఎక్కడో ఉన్నారని, జగత్తు ఇక్కడ ఉండి బంధము కలిగిస్తోందని... తలచి పరోక్ష దైవోపాసనకు పరిమితులగు వారు కూడా చీకటి మార్గమును ఆశ్రయిస్తున్నవారే!

జగత్తుకు కారణం ఆత్మ కాదు. ఆత్మ సర్వదా నిర్మలం, అప్రమేయము కదా! జగత్తుగా అనుభవమయి, 'సంసారము' అని

నిర్వచించబడే దృశ్యమునకు కారణం జడమగు ఈ దేహమూ కాదు. **ఆత్మయే ఆత్మకు అజ్ఞాన దృష్టికి జగత్తుగా కనిపిస్తోంది.** జ్ఞానదృష్టిచే జగత్తు ఆత్మయే! ఆత్మ – జగత్తు ఏకరూపమే! ఈ రీతిగా **"సంభవ-అసంభవ న్యాయము"** ను గ్రహించిన జ్ఞాన చక్షు సమన్వితులగు మహనీయుల ప్రవచనములు మనం వింటున్నాం.

✡

ఓ ప్రియ సహజీవుడా! ప్రతి జీవుడూ కూడా **"మార్పు చెందని + అనుక్షణికంగా మార్పుచెందునది"** అను రెండింటి చమత్కారమును తనయందు సమావేశముగా పొందియున్నవాడై ఉన్నాడు. ఈ రెండింటిని విచక్షించి గమనించాలి. **వినాశేన మృత్యుం తీర్త్వా, సంభూత్యా అమృతమశ్నుతే।** "వినాశనము" (మార్పు చెందేది)" ... అనుదానికి అతీతత్వం సంపాదించుకొని సర్వదా యథాతథమైయున్న ఆత్మను ఉపాశించి తద్వారా విజ్ఞుడు **మృత్యుత్వమును అధిగమించి అమృతత్వమును సంతరించుకుంటున్నాడు.** "మృత్యువు తరువాత కూడా నేను సత్యము-నిత్యము – అగు ఆత్మగా యథాతథమై ఉంటాను అనునదే **"అమృతత్వము"**.

నశించే దానిని ఉపకరణంగా చేసుకొని నశించని ఆత్మను చేరాలి. ప్రతి జీవుని యొక్క 'అంతరంగము' అనే బంగారు పాత్రలో సత్యమగు జ్ఞానము జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తూనే ఉన్నది. అనగా "ఇది వినాశన భూతము – ఇది నాయొక్క అవినాశిత్వము" .... అని ప్రతి జీవుడు జ్ఞానము కలిగియే ఉన్నాడు. అయితే ఆ పాత్ర అజ్ఞాన దృష్టులచే నిర్మితమైన మూసచే కప్పబడిఉన్నది.

హే పరమాత్మా! మాకు **'సత్య-ధర్మములు'** అనే సముత్సాహం ప్రసాదించండి. మాయందలి **అజ్ఞానపు మూతను** తొలగించుకొనే శక్తి-యుక్తులను ప్రసాదించండి! మాలోని ఆత్మజ్ఞాన ప్రకాశము ప్రజ్వలింపజేయండి. మా దృష్టులన్నిటిని ఆత్మ దర్శనాభ్యాసము వైపుగా నడిపిస్తూ ఉండండి! ఆత్మత్వము సంతరించుకొనేటట్లుగా అనుగ్రహించండి. సర్వమునకు నియామకుడగు పరమాత్మ యొక్క భక్తిచేతనే ఆత్మయొక్క ఔన్నత్యం, ఆత్మయొక్క యమ-సూర్యాది సర్వ నియామకత్వం, ఆత్మయొక్క సర్వాంతర్యామిత్వం – ఇదంతా **ఆత్మ స్వరూపులమగు మాకు అవగతం కాగలదు.**

హే పూషన్! జగత్తును పరిపోషిస్తున్న పూషణుడవగు భగవన్! ఋత్-సత్యదేవా! **ఏకఋషి-ఇతి గచ్ఛతీతి ఏకర్షీ!** ఒంటరి బాటసారీ! సర్వనియామకుడవగు యమా! హే సూర్యభగవన్! ప్రజాపతి నియామకుడవు, స్వరూపుడవు అగు ఓ ప్రాజాపతీ! పరిపరివిధముల చరించు మా బుద్ధిని ఏకాగ్రం చేయండి! కళ్యాణప్రదమగు స్వస్వరూపాత్మ దర్శనమును ప్రసాదించండి!

ఓ ప్రాణమా! నీవు సర్వుల **సప్రాణ** స్వరూపమై మాకు అనుభవమయ్యెదవుగాక! శరీరాదులకు అతీతమైయున్న మా ఆత్మయొక్క అఖండ – అప్రమేయ – నిర్విశేషత్వములు మాకు అనుభూతమగుగాక! మా జన్మ-జన్మల సంస్కారదేహము ఉపాసనలచే సంస్కరించబడి, తపో అగ్నిచే భస్మమగుగాక! మేము క్రతువు-కృతముల సహాయంతో ఆత్మను స్మరించెదము గాక!

ఓ అగ్నిదేవా! మా మార్గం సుమార్గం చేయండి. సమస్త కర్మ-జ్ఞానములు సర్వాత్మకమగు ఆత్మజ్ఞానైక రసమునందు పరితప్తమై యుండునుగాక! మా హృదయ-ఔన్నత్యము మేము ఆస్వాదించెదముగాక!

ఓ అగ్ని దేవా! **సుపథా నయ!** మంచి మార్గమును మాకు చూపండి! హేదేవా! **అస్మాన్ రాయే సుపథాన్ నయ!** సోఽహమ్ పరమమ్-ఆత్మానుభవమునకై సరియైన త్రోవలో మమ్ములను నడిపించండి! హే అగ్ని భగవన్! **విశ్వాని – వయునాని విద్వాన్!** మీరు ఈ విశ్వతత్త్వము ఎరిగినవారు. మాకు మీరు ఉపాస్యులు, మా అంతరంగ స్వరూప – స్వభావములు మీకు తెలుసు. **జుహురాణం ఏన అస్మాత్ యుయోధి!** మాలోని మోసము – పాపము – అల్పము అగు దృష్టులను మానుండి తొలగించండి! **తే భూయిష్ఠాం నమఉక్తిం విధేమ!** హే దేవాదిదేవా! స్వామీ! ప్రాణస్వరూపా! పరిపోషకా! మీకు అధికాధికంగా నమోవాక్కములు సమర్పించుకటనుచున్నామయ్యా! విధేయులమై ఆశ్రయిస్తున్నాము! మా గురించి మేము ఎరుగు మార్గములో నడిపించండి!

**ఇతి – వాజసనేయ సంహితాంతర్గత**

**ఈశావాశ్యోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘


4

# జాబాలోపనిషత్

(బృహస్పతి-యాజ్ఞవల్క్య-అత్రిమహర్షి-జనక చక్రవర్తుల సంవాదములు)

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



### శాంతి పాఠమ్

**ఓం**
**పూర్ణమదః।**
**పూర్ణమిదమ్।**
**పూర్ణాత్ పూర్ణమ్ ఉదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమ్ ఆదాయ**
**పూర్ణమేవ అవశిష్యతే।।**
**ఓం శాంతిః శాంతిః శాంతిః।।**

ఓంకార సంజ్ఞా స్వరూపుడగు ఆ పరబ్రహ్మము పూర్ణము.
(అధిష్ఠాన దృష్టిచే, పరమాత్మయే జగత్ రూపుడు కాబట్టి) ఈ జగత్తు కూడా పూర్ణమే!
ఈ జీవాత్మ-జగత్తులు కూడా పరమాత్మత్వముచే పరిపూర్ణము.
పరబ్రహ్మము నుండే జీవాత్మ-జగత్తులు (జలంలో తరంగాలువలె) బయల్వెడలుచున్నాయి.
పూర్ణ వస్తువునుండి పూర్ణమగు ఈ దృశ్యము బయల్వెడలుచూ కూడా, పూర్ణ పరమాత్మ పూర్ణమే అయి ఉన్నారు. తరంగములు ప్రదర్శనమగుచున్నప్పటికీ జలము జలముగానే ఉన్నది కదా! (జీవాత్మగా కనబడినంత మాత్రంచేత మనలోని ప్రతి ఒక్కరి పరమాత్మత్వమునకు వచ్చు లోటు ఏమీ లేదు).
ఓం శాంతిః శాంతిః శాంతిః

---

**శ్లో।। జాబాలోపనిషత్ ఖ్యాతమ్ సన్న్యాస జ్ఞాన గోచరమ్**
**వస్తుతః త్రైపదమ్ బ్రహ్మ స్వమాత్రమ్ అవశిష్యతే ।।**

*జగత్తును సన్న్యసించి ఆత్మ వస్తువును ఆశ్రయించే జ్ఞాన విషయమును ఈ జాబోలోపనిషత్ వ్యాఖ్యానిస్తున్నది.* ***"బ్రహ్మము స్వస్వరూపమాత్రమే"*** *అను రూపముగల త్రైపదమును చూపి బ్రహ్మముగా సశేషింపజేయుచున్నది.*

1. **<u>బృహస్పతిః ఉవాచః</u>**
**యాజ్ఞవల్క్యమ్!**
**యత్ అను కురుక్షేత్రం**
**దేవానామ్ దేవయజనమ్।**
**సర్వేషామ్ భూతానాం బ్రహ్మసదనమ్,**
**'అవిముక్తమ్' వై కురుక్షేత్రమ్।**
**తస్మాత్ యత్ర క్వచ న గచ్ఛతి**

మహత్తరము-ఉత్తమము-మహోన్నతము అగు బుద్ధి సంపన్నులగు శ్రీ బృహస్పతుల వారు ఒకానొక సందర్భములో శిష్యుడగు యాజ్ఞవల్క్యునకు ఇట్లా బోధించసాగారు.
**ప్రియ శిష్యా! యాజ్ఞవల్క్యా!** నీకిప్పుడు 'కురుక్షేత్రము' అను వేదాంత శబ్దము యొక్క అర్థమును, తత్సంబంధిత విశేషములను చెప్పుచున్నాను. విను! ఈ దేహమే కురుక్షేత్రము. "కురుక్షేత్రము" అనునది దేవతలకు, భక్తులగు దైవోపాసకులకు, సర్వభూతజాలమునకు **బ్రహ్మపద స్థానము**. అది 'అవిముక్తము' అని కూడా అంటారు. ఎందుకంటే అది భౌతిక దేహమునందలి అభౌతికమగు పరాకాశ స్థానము! (అవిముక్తము = ఆత్మ నుండి విముక్తము, విభక్తము కానట్టిది)

| | |
|---|---|
| **తదేవ మన్యతే..., (మన్యేత) తదముక్తమేవ<br>"ఇదమ్ వై కురుక్షేత్రమ్<br>దేవానామ్ దేవయజనమ్,<br>సర్వేషాం భూతానామ్ బ్రహ్మసదనమ్"।<br>అత్ర హి జంతోః ప్రాణేషు ఉత్క్రమమాణేషు<br>రుద్రః - తారకమ్<br>బ్రహ్మ వ్యాచష్టే యేనా ఆసావత్<br>మృతీ భూత్వా 'మోక్షీ' భవతి।<br>తస్మాత్ అవిముక్తమేవ నిషేవేత<br>అవిముక్తమ్ న విమున్చేత్<br>ఏవమేవైతత్ యజ్ఞవల్క్యః॥** | అద్వితీయమగు ఆత్మ-అన్వేషకులకు ద్వితీయమగు ఉపాసనా స్థానము కురుక్షేత్రము! అందుచేత ఎవ్వడు ఎక్కడ ఉన్నా, ఎక్కడికి వెళ్ళినా కూడా, "ఇది కూడా మోక్షస్థానమగు కురుక్షేత్రమే! దేవతలు-దేవగణము-సర్వభూత జాలమునకు చెందిన **బ్రహ్మసదనము!** పరబ్రహ్మ స్థానము"! అని భావించాలి!<br>అట్టి బ్రహ్మస్థానమగు కురుక్షేత్రమునందు (తత్ భావనయందు) ప్రాణము దేహమునుండి ఉత్క్రమణము పొందుచుండగా (ఇంద్రియ జగత్ విషయముల నుండి ప్రాణశక్తి సమేతుడై ఈ జీవుడు బహిర్గతమగుచుండగా) లయకారుడగు రుద్ర భగవానుడు ఆ జీవులను తరింపజేయగల తారకమంత్రము ఉపదేశిస్తూ ఉన్నారు! **పరబ్రహ్మ వాక్కులు ఘంటాపథముగా వినబడుచుండగా ఆ మృతుడు మోక్ష స్వరూపుడగుచున్నాడు. (సాంబ ఏకః సహాయః)**<br>అందుచేత ఎవ్వరు ఎక్కడుంటే అక్కడ - అవిముక్తము - విముక్తి ప్రసాదము అగు 'కురుక్షేత్రము'ను మనో-బుద్ధి-చిత్తములతో ఉపాసించెదరు గాక! జగత్ - భేద విషయములను కాదు! |
| **2. <u>అథ హి ఏనమ్ అత్రిః</u><br><u>పప్రచ్ఛ యాజ్ఞవల్క్యమ్:</u><br>"య ఏషో అనన్తో అవ్యక్త ఆత్మా<br>తం కథమ్ అహం<br>విజానీయామ్?" ఇతి॥<br><u>సహోవాచ యజ్ఞవల్క్యః :</u><br>సో అవిముక్త ఉపస్యో య ఏషో<br>అనన్తో - అవ్యక్త ఆత్మా<br>సో అవిముక్తే ప్రతిష్ఠిత ॥ఇతి॥<br><u>అత్రిమహర్షి :</u><br>సో అవిముక్తః కస్మిన్ ప్రతిష్ఠిత? ఇతి॥<br><u>యాజ్ఞవల్క్యుడు :</u><br>వరణాయాం - నాశ్యాంచ మధ్యే<br>ప్రతిష్ఠిత । ॥ఇతి॥<br><u>అత్రిమహర్షి :</u><br>కావై వరణా? కా చ నాశి? ॥ఇతి॥<br><u>యాజ్ఞవల్క్యుడు :</u><br>సర్వాని ఇంద్రియకృతాన్<br>దోషాన్ వారయతి - ఇతి<br>తేన వరణా భవతి ।<br>సర్వాని ఇంద్రియకృతాన్ పాపాన్<br>నాశయతి-ఇతి తేన 'నాశీ' భవతి।** | ఆ తరువాత మరొక సందర్భములో అత్రిమహర్షి యజ్ఞవల్క్య మహర్షిని సమీపించి ఇట్లా ప్రశ్నించారు.<br>**మహాత్మా! యాజ్ఞవల్క్యా!**<br>ఆత్మ అనంతము - అవ్యక్తము కదా! మేము వ్యక్తమగుచున్నదానినైతే గుర్తిస్తున్నాం. తెలుసుకోగలం. మరి అవ్యక్తము అని చెప్పబడుచున్న బ్రహ్మమును మేము తెలుసుకోవటం ఎట్లా? **ఆత్మజ్ఞానులము అవటం ఎట్లా?**<br>**యాజ్ఞవల్క్యుడు**<br>మీరు అడుగుచున్న ఆత్మ **'అవిముక్తము'** నందు ప్రతిష్ఠితమైయున్నది. కనుక, అనన్తము - అవ్యక్తము అగు ఆత్మకొరకై అవిముక్తమును సందర్శించి ఉపాసించి తద్వారా ఆత్మ దర్శనం చేయాలి!<br>**అత్రిమహర్షి**<br>ఆ అవిముక్తము ఎక్కడ ప్రతిష్ఠితమై ఉన్నది?<br>**యాజ్ఞవల్క్య మహర్షి**<br>ఆ అవిముక్తము వరణమునకు-నాశికు మధ్యగా ప్రతిష్ఠితము. (ఇతి వారనాశి).<br>**అత్రిమహర్షి**<br>వరణము అనగా ఏమి? నాశిక అనగా ఏమి?<br>**యజ్ఞవల్క్యుడు : వరణము + నాశి = వారణాసి**<br>వరణము - ఆవరణము (Space). ఇంద్రియకృతమైన సర్వ దోషములను ఏ స్థానము వారిస్తుందో, ఇంద్రియ విషయ దోషములకు చోటు ఉండదో.... అది వరణము (లేక) వారణము.<br>సర్వ ఇంద్రియకృత పాపములను నశింపజేస్తుండటంచేత 'నాశి' కూడా! ఈవిధంగా 'వారనాశి'ని గుర్తెరుగాలి. సాంసారిక భ్రమలనువారింపజేసేది, నశింపజేసేది - వారణాసి. |

| | |
|---|---|
| **అత్రిమహర్షి :**<br>కతమచ్చా అస్య స్థానమ్ భవతి? ॥ఇతి॥ | **అత్రిమహాముని**<br>వారణము - నాశిల స్థానము ఏది? (దేహములో) 'వారనాశి' స్థానము ..... అనగా ఏది? |
| **యాజ్ఞవల్క్యుడు :**<br>భృవోః-ఘ్రాణస్యచ యః సన్ధిః<br>స ఏష ద్యౌర్లోకస్య<br>పరస్య చ సంధిః భవతి । ॥ఇతి॥<br>ఏతత్ వై సంధిం 'సంధ్యామ్'<br>బ్రహ్మవిద ఉపాసత ॥ఇతి॥<br>సో అవిముక్త<br>ఉపాస్య ॥ఇతి॥<br>సో అవిముక్తమ్ జ్ఞానమ్ ఆచష్టే<br>యో వై తత్ ఏతత్ ఏవం<br>వేద ॥ఇతి॥ | **యాజ్ఞవల్క్యుడు**<br>భ్రూమధ్య-ఘ్రూణము (ముక్కు)లకు ఆ రెండిటియొక్క మధ్యలో అభౌతికశక్తి రూపమగు) స్థానమున్నది. అది ద్యౌర్లోకమునకు (భౌతిక ఆకాశమునకు పరమై) ఉన్నది. దీనిని యోగవేత్తలు (ఆత్మకు-లోకములకు) "సంధి" అని కూడా అంటున్నారు. అట్టి సంధి స్థానమై, ద్యౌర్లోకము (ఆకాశమునకు స్వర్గలోకమునకు) ఆవల ఉన్నట్టి సంధ్యాతత్త్వమును బ్రహ్మము గురించి ఎరిగిన బ్రహ్మవిదులు ధ్యానిస్తున్నారు. అదియే **'సంధ్యావందనము'** అదియే యుక్తము. అది భౌతికమునకు ఆవల! బ్రహ్మమునకు ఈవల! అదియే ఉపాస్యము.<br>- ఆ అవిముక్త స్థానమును సంధ్యోపాసనగా వేదజ్ఞులు సర్వదా మననముగా ఉపాసిస్తున్నారు.<br>- అది ఆత్మ జ్ఞానము ప్రసాదించు స్థానము.<br>- అది ఆత్మకు సామీప్య స్థానము. ఈ జీవుడు తత్ బ్రహ్మమును తెలుసుకొని మోక్షము పొందుటకు బుద్ధిని ఏకాగ్రము చేయును గాక! |
| **3.** <u>అథ హి ఏనం</u><br><u>బ్రహ్మచారిణః ఊచుః :</u><br>కిం జపేన అమృతత్వం?<br>బ్రూహి ॥ఇతి॥<br><u>సహోవాచ యజ్ఞవల్క్యః :</u><br>శతరుద్రీయేణా ఇత్యేతాని<br>హ వా అమృతస్య<br>నామధేయాని భవన్తి ॥<br>ఏతైః హ వా అమృతో భవతి ॥ఇతి॥<br>ఏవమేవై తత్ యాజ్ఞవల్క్యః ॥ | **అది వింటూ, అక్కడ ఉన్న కొందరు బ్రహ్మచారులు (శిష్యజనులు) ఇట్లా అడిగారు.**<br>"భృకుటి - నాశికల మధ్య గల సంధి స్థానమున గల పరాకాశ తత్త్వమును సంధ్యావందన క్రియతో బ్రహ్మవేత్తలు ఏమంత్రముతో జపిస్తున్నారు? దేనిని జపిస్తూ మేము **అమృతత్వమును** సముపార్జించుకోగలం?<br>**యాజ్ఞవల్క్యుడు**<br>అక్కడ **శతరుద్రీయము** యొక్క పఠనము సహాయముతో అమృతమగు ఆత్మతత్త్వమును మననం చేయుచున్నారు.<br>("ఓం నమఃశివాయ", (లేక) రుద్రము, నమకము, చమకము (లేక) ఇష్ట దైవ నామస్మరణ ఇత్యాదులతో) - అమృతాత్మను మననము చేయువాడు మృత్యువు - మార్పుకు అతీతుడై అమృత స్వరూపుడగుచున్నాడు. (ఇదం సర్వం శతధా రుద్రీయ మేవ-ఇతి శతరుద్రీయం. అంతా ఈశ్వర ప్రదర్శనమే-అను బుద్ధి స్థితి) |
| **4.** సన్న్యాసమ్<br>అథ జనకో హ వైదేహో<br>యాజ్ఞవల్క్యమ్ ఉపసమే<br>ఇతి ఉవాచ।<br>భగవన్! "సన్న్యాసమ్" అనుబ్రూహి ॥ఇతి॥<br><u>సహో వాచ యాజ్ఞవల్క్యః:</u><br>బ్రహ్మచర్యం సమాప్య గృహీ భవేత్ । (గృహస్థు)<br>గృహీభూత్వా వనీ భవేత్ । (వానప్రస్థము) | మరొక సందర్భములో విదేహ చక్రవర్తియగు జనక మహారాజు తత్త్వజ్ఞానాభిలాషి-తత్త్వ విద్యార్థి అయి, యాజ్ఞవల్క్య మహర్షులవారి ఆశ్రమమునకు వచ్చారు. మహర్షిని ఇట్లా పరిప్రశ్నించారు.<br>సద్గురూ! భగవన్! యాజ్ఞవల్క్యమహర్షీ! "సన్న్యాసము" అనగా ఏమై ఉన్నది? వివరించమని అర్థిస్తున్నాను.<br>**యాజ్ఞవల్క్యుడు**<br>చతుర్(4) ఆశ్రమముల గురించి ముందుగా వినండి. మొట్టమొదటగా, ఆచార్యులవారిని ఆశ్రయించి, శిష్యుడై విద్యను అభ్యసించాలి. ఈతనిని |

**వనీభూత్వా ప్రవ్రజేత్।**
**యదివా - ఇతరథా - బ్రహ్మచర్యాత్ ఏవ ప్రవ్రజేత్।**
**గృహాద్వా, వనాద్వా, అథ పునః**
**- అవ్రతీవా, వ్రతీవా**
**- స్నాతకోవా, అస్నాతకోవా**
**- ఉత్సన్నాగ్నిః, అనగ్నికోవా**
**యత్ అహరేవ విరజేత్**
**తత్ అహరేవ ప్రవ్రజేత్।**
**తద్ధైకే ప్రజాపత్యా మే**
**వేష్టిమ్ కుర్వన్తి।**
**తదు తథా న కుర్యాత్**
**ఆగ్నేః యామేవ**
**కుర్యాత్! అగ్నిర్హి వై**
**ప్రాణః! ప్రాణమే వై తథా**
**తయా కరోతి।**
**పశ్చాత్ త్రైధా**
**తన్మయ్యామ్ ఏవ కుర్యాత్**
**ఏతయైవ త్రయో**
**ధాతవో యమతీ**
**'సత్త్వమ్ - రజః - తమ' ఇతి।**
**అయమ్ తే యోనిః ఋత్విజో**
**యతో జాతో ప్రాణాత్ అరోచథాః,**
**తమ్ ప్రాణాత్ జానన్ అగ్న ఆరో హాథానో**
**వర్ధయా 'రయిమ్'  ॥ఇతి॥**

"**బ్రహ్మచారి**" అంటాము. ఇది **బ్రహ్మచర్యాశ్రమము.** చక్కగా పారలౌకిక విద్య-లౌకికవిద్యలను ఎరిగిన తరువాత గుర్వాజ్ఞతో **గార్హస్థ్యాశ్రమము** స్వీకరించి, ధర్మపరుడుగా సంఘంలో సహజనులతో సేవాభావంగా జీవించాలి. ఆ తదుపరి సంఘ జీవనము విడచి ఉండు **వానప్రస్థాశ్రమము.** వానప్రస్థాశ్రమానంతరము **సన్న్యాసాశ్రమము** స్వీకరించాలి. లేదా బ్రహ్మ చర్యాశ్రమము తరువాత సన్న్యాసాశ్రమము స్వీకరించవచ్చు.

***ఇక్కడ ఒక ముఖ్య విషయము:***

- ఆచార నియమములు నిర్వర్తిస్తున్నా, లేకున్నా...,
- గృహములో ఉన్నా, వనంలో ఉన్నా, (అరణ్యంలో ఏకాంతంగా ఉన్నా),
- వ్రతములు నిర్వర్తించువాడు అయినా, అవ్రతడు అయినా...,
- స్నాతకుడు (పరివ్రాజకుడు) అయినా, అస్నాతకుడై ఉన్నా

ఏ రోజు సర్వ దృశ్య విషయములపై విరక్తి పుడుతుందో, ఆ రోజే సన్న్యసించాలి. బలీయమైన వైరాగ్యమే సన్న్యాసాశ్రమమునకు తగిన సమయం!

**(సత్-న్యాసమ్ ఇతి సన్న్యాసమ్)**

బ్రహ్మచారి-గృహస్థ-వానప్రస్థ ఆశ్రమముల నుండి సన్న్యసించటానికై శాస్త్ర విహితము అయినట్టి ప్రజాపతియాగము నిర్వర్తించి, సర్వ లౌకిక విషయములను ప్రజాపత్యాగ్నిలో వ్రేల్చి, అటుపై సన్న్యసిస్తున్నారు.

ఆవిధంగా అగ్ని సంబంధమైన ఆగ్నేయాష్టి - సన్న్యాసాశ్రమజీవితానికి నాందిగా అగుచున్నది. అగ్నిసాక్షిగా సన్న్యసించినట్లు అవుతుంది. అగ్నియే ప్రాణ స్వరూపము. వ్యష్టి ప్రాణాగ్నిని విశ్వప్రాణాగ్నిలో యజ్ఞపూర్వకంగా వ్రేల్చి సన్న్యసించాలి.

అటు తరువాత సత్వ-రజో-తమో త్రిగుణాత్మకమైన సర్వ విషయ-విశేషములను ఆ తత్పురుషుడగు పరమాత్మ యొక్క ఆనంద-వినోద రూప భావన చేస్తూ **'పరమాత్మ'** అను అగ్నియందు **సమర్పణ** చేయాలి. త్రిగుణములకు ఆవలగల **త్రిగుణాతీత చైతన్యధారణను** ఆశ్రయించాలి.

సన్న్యాసాశ్రమము కొరకై పరతత్వ యజ్ఞము నిర్వర్తించాలి. సర్వలోక సంబంధమైన వ్యవహారముల పట్ల అరుచియే ఋత్విజునిగా భావన చేయాలి.

జ్ఞానాగ్నిని ప్రజ్వలించి, అద్దానిని తేజో ప్రవృద్ధమునందు సర్వస్వము ఆహుతి చేయాలి.

---

**5.** **అనేన మన్త్రేణ అగ్నిమ్ ఆజిఘ్రేత్**
ఏష వా అగ్నేః యోని ర్యః
"ప్రాణః ప్రాణమ్ గచ్ఛస్వాహా"
ఇత్యేవమేవ ఏతత్ ఆ హ,
గ్రామాత్ అగ్నిమ్ ఆహృత్య
పూర్వవత్ అగ్నిమ్ అఘ్రాపయేత్।
యత్ అగ్నిమ్ న విన్దేత్, అప్సు జుహుయాత్।
"ఆపోవై సర్వా దేవతాః।
సర్వాభ్యో దేవతాభ్యో జుహోమి స్వాహా" ఇతి।

మొట్టమొదట గ్రామాగ్ని. **"ప్రాణః ప్రాణమ్ గచ్ఛ స్వాహా"** అని ఉచ్ఛరిస్తూ మంత్ర పూర్వకముగా అగ్నిని ప్రజల్వింపజేసి, **"ఈ ప్రజ్వలించు అగ్ని ఆత్మరూపమే"** అనే భావనతో గ్రామాగ్నిని (ఉదా: కర్పూరాగ్నిని) అగ్నిగుండమునందు సమర్పించాలి. నేయి ఇత్యాది ఆహూతులన్నీ సమర్పించి యజ్ఞము పరిసమాప్తము చేసి ఆత్మ **యజ్ఞమునందు ప్రవేశించాలి.**

ఒకవేళ యజ్ఞ విధానపూర్వకమైన ఆహూతులు లభించకపోతే గ్రామ జలమును విశ్వజలమునకు సమర్పించి యజ్ఞవిధి నిర్వర్తించ వచ్చు.

**"ఆపోవై సర్వా దేవతాః సర్వాభ్యో దేవతాభ్యో జుహోమి స్వాహా"**

"జలము సర్వదేవతా స్వరూపము. జలముతో సకల దేవతలకు హోమము చేస్తున్నాను". అని ఉచ్ఛరిస్తూ...,

హుత్వా ఉద్ధృత్య ప్రాశ్నీయాత్ ఆజ్యం
హవిః అనామయం
మోక్ష మంత్రః త్రైయ్యేవమ్ విందేత్ ।
తత్ బ్రహ్మ! తత్ ఉపాసితవ్యమ్
'ఏవమేవ ఏతత్' భగవన్, ఇతి వై యాజ్ఞవల్క్యః।
అథ హి ఏనమ్ అత్రిః పప్రచ్ఛః
యాజ్ఞవల్క్యం పృచ్ఛామి త్వా
యాజ్ఞవల్క్యః!
అయజ్ఞోపవీతీ కథం బ్రాహ్మణ? ॥ఇతి॥
సహోవాచ యాజ్ఞవల్క్యః
ఇదమేవా అస్య తత్ యజ్ఞోపవీతమ్
య ఆత్మా ఆపః ప్రాశ్యా,
ఆచమ్యా, అయం విధిః
పరివ్రాజికానామ్ విరాధ్వానేవా
ఆనాశకేవా, అపాం ప్రవేశేవా,
అగ్నిః ప్రవేశేవా, మహాప్రస్థానేవా ।
అథ పరివ్రాట్ వివర్ణవాసామ్,
ముండో, అపరిగ్రహః శుచిః
అద్రోహీ భైక్షమాణో
బ్రహ్మభూయాయ భవతి ॥ఇతి॥
యది ఆతురస్యాత్ మనసా వాచావా సన్న్యసేత్
ఏష పన్థా బ్రహ్మణా హా అనువిత్తస్థః ।
ఏనైతి సన్న్యాసీ బ్రహ్మవిత్ ఏవమ్ ఏష,
భగవన్ ఇతి వై యాజ్ఞవల్క్యః ।

గ్రామ జలమును **ఆహుతులు**గాను, విశ్వజలమును **యజ్ఞాగ్ని**గాను భావనచేస్తూ విశ్వశ్రేయో భావాలతో జలయజ్ఞవిధిని సన్న్యాసయోగ యజ్ఞముగా నిర్వర్తించాలి. హవిస్సును నేతితో (బ్రహ్మముతో) కలిపి స్వీకరించి యజ్ఞము ముగించి, ఇక అటు నుండి,

"ఈ సర్వము తత్ బ్రహ్మమే,.... నేను బ్రహ్మమునే....,"

**"తత్ బ్రహ్మ! తత్ ఉపాసితవ్యమ్! ఏవమేవ ఏతత్ భగవన్!"** అను భావనను యజ్ఞఫలంగా స్వీకరించాలి.... అని యాజ్ఞవల్క్యుడు తెలియజేశారు.

***ఆ తరువాత అత్రిమహాముని ఈ రీతిగా ప్రశ్నించారు.***

మహాత్మా! యాజ్ఞవల్క్యా! నా సందేహము విన్నవించుకుంటున్నాను.

యజ్ఞోపవీతము త్యజించినవాడు బ్రాహ్మణుడు ఎట్లా అవుతాడు? అవడేమో కదా?

**యాజ్ఞవల్క్య మహాముని :**

మనము ఇంతకు ముందు చెప్పుకొన్నవిధంగా ఎవడు ఆత్మయజ్ఞము చేస్తూ **'ఆత్మభావన'** అనే పవిత్రమైన ఆచమనము చేసి పవిత్రుడగుచున్నాడో ఆ **పవిత్రతయే** ఆతని **యజ్ఞోపవీతము**. అదియే **పరివ్రాజకత్వవిధి**. సర్వ ప్రాపంచక విషయములపట్ల, అరుచి, ఆశలేనివాడై ఉండటము, అగ్ని-జలములందు దేహ సమర్పణము.... ఇవి **మహాప్రస్థాన** విధి విధానములు.

పరివ్రాజకుడై, వర్ణాశ్రమ ధర్మములకు అతీతుడై, కేశములు త్యజించి, అపరిగ్రహుడు-శుచి-అద్రోహి-భైక్ష వృత్తి వీటివీటిచే సన్న్యాసి అయి, బ్రహ్మమే అయి పవిత్రుడగుచున్నాడు. (బ్రహ్మ భావనయే ఆతని యజ్ఞోపవీతము). ఈతడే **పరివ్రాట్.**

మనసా-వాచా-కర్మనా సర్వ జగత్ సంబంధములైన **"ఆతురత"**లను మానసికంగా సన్న్యసిస్తూ ఉంటే, ఆ అనువిత్తస్థుడు అయినట్టి సన్న్యాసి, బ్రహ్మవేత్తయే! సర్వము వెలిగించువాడు కాబట్టి భగవంతుడే!

6. తత్ర పరమహంసా నామ
సంవర్తక, అరుణి శ్వేతకేతు
దుర్వాస ఋభు నిదాఘ
జడభరత దత్తాత్రేయ
రైవతక ....
ప్రభృతయో,.....
అవ్యక్తలింగా, అవ్యక్తాచారా,
అనున్మత్తా ఉన్మత్తవత్ ఆచరన్తః।
త్రిదణ్డం, కమణ్డలుం, శిక్యం,
పాత్రం, జలపవిత్రం, శిఖాం,
యజ్ఞోపవీతం
చేత్యేత్ తత్సర్వం 'భూస్స్వాహ' ఇతి

## పరమహంసలు

***ఓ అత్రిమహామునీ! తదితర ప్రియ మునీశ్వరులారా! శ్రోతలారా!***

ఇప్పుడు **మహామహనీయులు, ఆత్మతత్త్వానంద ఆస్వాదకులు** అగు పరమహంసల గురించి మనము స్మరించుకుంటున్నాము. నమస్కరించుకుంటున్నాము.

**(పరమహంస=సోహమ్ పరమమ్ = ఆవల ప్రకాశించు నిత్య-సత్యాత్మయే నేను)**

**సంవర్తకుడు, ఆరుణి, శ్వేతకేతువు, దుర్వాసుడు, ఋభు, నిదాఘ, జడభరతుడు, దత్తాత్రేయుడు, రైవతుడు**... మొదలైనవారంతా పరమ హంసల కోవకు చెందినవారు. ప్రాతఃస్మరణీయులు. వారికి హృదయపూర్వక నమస్కారములు సమర్పిస్తున్నాము. వీరంతా స్వస్వరూపము ఆస్వాదిస్తూ, "మేము సాకారమంతా వ్యక్తీకరించు అవ్యక్తలింగ స్వరూపులము" అనే మహత్ భావనిష్ఠులు అగుచున్నారు. అవ్యక్తమైన ఆచారములు, బ్రహ్మతత్త్వ ప్రజ్ఞావంతులై ఉండి కూడా, పిచ్చివారివలె పైకి కనిపిస్తూ, అంతరంగమున **ఆత్మ దృష్టిని** మాత్రమే రహస్యంగా అభ్యసించు వారు. **కేవలానంద ఆత్మాఽహమ్ భావనను అనునిత్యంగా ధరించువారు.**

**అప్సు పరిత్యజ్య –**

**ఆత్మానమ్ అన్విచ్ఛేత్।**

**యథా జాత రూపధరో, నిర్ద్వంద్వో**

**నిష్పరిగ్రహః తత్త్వ బ్రహ్మమార్గే**

**సమ్యక్ సంపన్న శుద్ధ మానసః,**

**ప్రాణ సంధారణార్థమ్ యథోక్త కాలే**

**విముక్తో భైక్షమ్**

**ఆచరన్, ఉదరపాత్రేణ**

**లాభాఽలాభౌ సమౌ భూత్వా**

**శూన్యాగార – దేవగృహ**

**తృణకూట, వల్మీక, వృక్షమూల**

**కులాలశాలా,**

**అగ్నిహోత్రశాలా**

**నదీ పులిన – గిరి – కుహర – కన్దర**

**కోటర నిర్ఝరః తండిలేషు**

**తేషు అనికేతవాస్య,**

**అస్య ప్రయత్నో**

**నిర్మమ – శుక్ల ధ్యాన పరాయణో**

**అధ్యాత్మ నిష్ఠో**

**అశుభ కర్మ నిర్మూలనపరః**

**సన్న్యాసేన దేహత్యాగం కరోతి,**

**స పరమహంసో నామ॥**

**ఇత్యుపనిషత్**

**ఇతి జాబాలోపనిషత్**

విజ్ఞులగు ఆ మహనీయులు సన్న్యాసాచారములగు త్రిదణ్డము, కమండలువు, శిక్యము (ఉట్టి, జోలె), పాత్రను, స్నానాది పవిత్ర బాహ్య వేషములను, శిఖను, యజ్ఞోపవీతమును- ఇవన్నీ కూడా మంత్రపూర్వకంగా జలములో పరిత్యజించి వేస్తున్నారు. **ఆత్మ జ్ఞానమునందు మాత్రమే అనురక్తులై, ఆత్మ స్వరూపమాత్రులై వెలుగొందుచున్నారు.** (సన్న్యాసాశ్రమమును ఆశ్రయించువారికి కూడా ఇదియే మార్గము).

"బంధము తొలగాలి" అను సర్వ ఆశ్రమ ముముక్షువులకు త్రోవ- సాధనము- ఆశయము- లక్ష్యసాధనకు ఒక్కటే! అది ఈ క్రింద చెప్పబడుచున్నదే!

**యథా జాత రూపధరో** : అప్పుడే పుట్టిన బిడ్డవలె వ్యవహార సంబంధములు హృద.లో లేనివారు.

**నిర్ద్వంద్వో : "పరమాత్మకు - పరమాత్మస్వరూపుడగు నాకు వేరైనది ఎక్కడా ఏదీ ఉండజాలదు కదా!"** అనే **నిర్ద్వంద్వత్వము** వహించి ఉండాలి.

**నిష్పరిగ్రహః** : దేనినీ స్వీకరించనివారై ఉండాలి.

**తత్త్వబ్రహ్మమార్గే** : తత్త్వ జ్ఞాన సంపన్నులవటమే ఆశయముగా (Basic objective) కలిగి ఉండాలి.

సర్వత్రా సమస్వరూపమైన సమ్యక్ బుద్ధిని ప్రవృద్ధం చేసుకుంటూ ఉండాలి.

నిర్మల మనస్కులగుచూ ఉంటారు!

'పొట్ట' అనే పాత్రలో ఎప్పుడు ఎంత వరకు ఏ ఆహారము లభిస్తే అది మాత్రమే. సందర్భానుచితంగా - ప్రాణమును ధరించటమే ఆశయంగా - స్వీకరించాలి. బ్రతకటం కోసం మాత్రమే తినాలి. తినటం కోసం బ్రతకకూడదు. సంసార బంధ విముక్తిని సిద్ధించుకొనుట కొరకే బ్రతకటం.

లాభాలాభములను ఒకే తీరుగా స్వీకరిస్తూ ఉండాలి.

శిధిల గృహము - దేవాలయము, గడ్డి ప్రదేశము - పుట్ట ప్రక్కన, చెట్టు మొదలు, కుమ్మరివాని గృహము, యజ్ఞము జరుగుచున్న అగ్నిహోత్రశాల, నది ఒడ్డు, ఇసుక దిబ్బ, కొండ, కొండగుహ, చెట్టు తొఱ్ఱ, సెలయేరు, యదారి ప్రదేశము... అన్నీకూడా ఒకే తీరైన స్థానములుగా, ప్రదేశములుగా అనిపించాలి! **"అన్నీ నాకు వసతి గల గృహములే"**.... అని భావించబడుగాక!

అటువంటి ప్రయత్నశీలుడై ఉంటూ, మమకార రహితుడై, నిర్మల స్వరూపుడగు పరమాత్మ ధ్యాన పరాయణుడై పరమహంసత్వము అభ్యసించాలి! అధ్యాత్మనిష్ఠుడుగాను, ఆత్మ విద్యయే మహదాశయముగాను, ప్రప్రథమ మనో లక్ష్యముగా కలవాడై ఉండాలి.

ఈవిధంగా శుభాశుభ కర్మల-కర్మఫలాలపట్ల **సన్న్యాస మనస్కుడై**, దేహాతీత భావనతో దేహమును త్యజించినవాడై (అతీతుడై) ఉండుగాక!

అట్టివాడు ఏ ఆశ్రమంలో ఉన్నా కూడా..., **"పరమ హంస"** అయి ప్రకాశిస్తున్నాడు.

**ఇతి జాబాలోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

4

# జాబాలోపనిషత్

(బృహస్పతి-యాజ్ఞవల్క్య-అత్రిమహర్షి-జనక చక్రవర్తుల సంవాదములు)

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము

**పూర్ణమదః పూర్ణమిదమ్ పూర్ణాత్ పూర్ణమ్ ఉదచ్యతే!**
**పూర్ణస్య పూర్ణమ్ ఆదాయ పూర్ణమేవ అవశిష్యతే ॥**

పరమాత్మ సర్వదా **పూర్ణస్వరూపుడు! సంపూర్ణుడు!** ఈ జీవాత్మ కూడా (పరమాత్మ మహాసముద్ర జలముయొక్క తరంగ స్వరూపుడే కాబట్టి) **పూర్ణస్వరూపుడే! సంపూర్ణుడే!** ఈ జగత్తు పరమాత్మరూపమే కాబట్టి, ఇదియు పూర్ణమే!

అనగా, అద్వితీయుడగు పరమాత్మ ఏవిధంగా పరిపూర్ణుడో, అదేవిధంగా పరమాత్మకు అద్వితీయమైన ఈ జగత్తు పూర్ణమే!

జగదనుభవి అగు ఈ జీవుడూ పూర్ణుడే! పూర్ణస్వరూపుడగు పరమాత్మనుండే పూర్ణ స్వరూపుడగు జీవాత్మ – జగత్తులు ఉదయించుచున్నాయి.

పూర్ణుడగు పరమాత్మ నుండి పూర్ణమగు జీవాత్మ ప్రదర్శితుడగుచూ ఉండగా కూడా, **పరమాత్మ ఎల్లప్పుడూ పూర్ణుడుగానే ఉన్నారు.**

**ఓ జీవాత్మా! నీ యొక్క పరమాత్మత్వమునకు జీవాత్మత్వము కారణంగాగాని, జగత్తు కారణంగాగాని వచ్చే అపూర్ణత్వము ఏమీ లేదు.**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

----

యాజ్ఞవల్క్య మహర్షి, ఒకానొక సందర్భంలో – తన సద్గురువు, దేవతల గురువు, మహాబుద్ధి సంపన్నుడు, లోకకళ్యాణ మూర్తి, ఆశ్రితవత్సలుడు అగు బృహస్పతులవారిని సమీపించి, వేదాంత శాస్త్ర విజ్ఞానాభిలాషియై ఇట్లా ప్రశ్నించారు.

❖

### యాజ్ఞవల్క్య మహర్షి

మహాత్మా! లోక గురూ! అధ్యాత్మ శాస్త్ర పారంగతా! స్వామీ! హే బృహస్పతీ! వేదాంత శాస్త్రములో, "**దేహమే దేవాలయము. ఈ దేహములో 'కురుక్షేత్రము' అనే ముఖ్య ప్రదేశము, ప్రవేశ ద్వారము ఉన్నది**".... అని చెప్పుచూ ఉంటారు.

అట్టి **'కురుక్షేత్రము'** అగు యోగ స్థానము గురించి వివరించమని నా విన్నపము.

### శ్రీ బృహస్పతి

ప్రియ శిష్యా! యజ్ఞవల్క్యా! వినండి.

ఏదైతే దేవతలకు, దేవతలను ఉపాసించే దేవయజనులకు (ద్వైతోపాసకులకు) పరమాత్మ సందర్శన స్థానమో, సర్వ భూతజాలమునకు

పర(బహ్మముయొక్క సాక్షాత్కారమునకు పవిత్ర-దివ్యక్షేత్రమై యున్నదో, ... 'అవిముక్తము' (బద్ధులగు జీవులు విముక్తికై ఆశ్రయించే ఉత్తమ ప్రదేశము, అవిముక్త గృహము) అని చెప్పబడుచున్నదో, **అదియే కురుక్షేత్రము! అద్వితీయాత్మ యొక్క స్వగత-ద్వితీయ కల్పనా స్థానమే కురుక్షేత్రము.** (The Zone of Functional Athma).

ఏ స్థానము చేరిన తరువాత ఈ జీవుడు సకల దేవతల సందర్శనము, బ్రహ్మ సదనము పొంది, ఇక మరొక స్థానమునకు వెళ్ళవలసిన అగత్యమే ఏమాత్రం కలిగి ఉండదో,.... అదియే **కురుక్షేత్రము**. అది దృశ్యములోనిదిగాని, దృశ్యములో ఒక ప్రదేశ పరిమితమైనది గాని కాదు. అభౌతికమైనది.

ఈ జీవుడు తనయందే గల ఈ కురుక్షేత్రమును గమనించును గాక! ఈతడు ఎక్కడకు వెళ్ళినా, ఏ ఆశ్రమంలో ఉన్నా కూడా..., **తనయందలి** కురుక్షేత్ర స్థానమును గుర్తించాలి! ఏ స్థానమైతే **"ఇదమ్ కురుక్షేత్రమ్ - దేవానామ్ దేవయజనమ్, సర్వేషామ్ భూతానామ్ బ్రహ్మ సదనమ్** - నాయందలి ఇదియే ఆలోచనలకు జననస్థానమగు కురుక్షేత్రము. దేవతలు వేంచేసి యుండే స్థానము. సర్వ దేహులకు బ్రహ్మస్థానము. మోక్ష స్థానము. ఇక మరొకచోటికి బంధ విముక్తి, మోక్షము కొరకు వెతకవలసిన అగత్యం లేదు" - అని తెలియవచ్చుచున్నదో, అదియే **'కురుక్షేత్రము'** అని ఆత్మజ్ఞులచే ప్రవచించబడుతోంది. అదియే సర్వజీవులకు పుట్టిన ఇల్లు.

అట్టి కురుక్షేత్ర స్థానము పరమ పవిత్రము. జీవులందరికి సంసారము నుండి విముక్తి ప్రసాదించగల శ్రేయో స్థానము. పుట్టినింటికి వెళ్ళడం వంటిది. అట్టి కురుక్షేత్ర స్థానమును చేరువానికి ప్రాణ-ఉత్క్రమణ సమయంలో రుద్ర భగవానుడు ప్రత్యక్షమై, సంసారము నుండి తరింపజేయు **'తారకము'**ను ఉపదేశించుచున్నారు. **(సర్వం వ్యర్థం మరణ సమయే సాంబ ఏకః సహాయః)** కనుక ఈ కురుక్షేత్ర స్థానముగా జీవుడు ఏమరువక సర్వదా, తానెక్కడుంటే అక్కడే,... సర్వకాల-సర్వావస్థలయందు మోక్షాశయమును ఆశ్రయించినవాడై ఉండాలి! కురుక్షేత్రమును ఉపాసనాస్థానముగా కలిగి ఉండటము శుభప్రదము.

### అవిముక్త స్థానము

***"అట్టి కురుక్షేత్ర స్థానము నన్ను విడచుటలేదు! నేను అద్దానిని విడిచి ఉండుచున్నవాడను కాను!"*** అను అర్థముచే, అద్దానిని 'అవిముక్త స్థానము' అను పేరుతో చెప్పుచున్నారు.

ఏది 'బ్రహ్మము' అను శబ్దముతో ఉద్దేశ్యించబడుతోందో..., దేనియొక్క ప్రకాశము - స్థానసముపార్జన చేత ఈ జీవుడు **"నేను జన్మ-మృత్యువులకు సంబంధించినవాడను కాను. వాటిచే పరిమితుడను కాను!"**... అను **అమృతత్వము** అనుభూతమౌతోందో, సర్వమునకు ఆవల అమృత స్వరూప కేవల సాక్షిగా ప్రస్థానప్రాప్తి జరుగగలదో..., ఏ స్థానము ధ్యానించుటచే ఆ ధ్యాని **"నాకు ఈ జన్మ-కర్మలన్నీ వినోదమేగాని, విషాదమూ కాదు. బంధమూ కాదు. వీటికి వేరైనా వేదాంత - కార్యకారణాతీత స్వరూపుడను"**... అను రూపముగల మోక్షి అగుచున్నాడో...,

***అది అవిముక్త స్వరూపము, అవిముక్త స్థానముగా అభివర్ణించబడుతోంది!***

- **నిషేత్ ఏవ విముక్తమ్।**
- **అవిచ్ఛేత్ ఏవమ్ ఏతత్॥**

"బంధము ఉన్నట్లు భావించునప్పుడు, బంధము లేనట్లు తెలియవచ్చుచున్నప్పుడు కూడా, ఆ కురుక్షేత్ర స్థానము సర్వదా యథాతథము" కనుక అది అవిముక్త స్థానము! ముఖములోని అట్టి స్థానమును బ్రహ్మోపాసనకు 'వసతి స్థానము' అని గమనించబడు గాక!

***ఇతి బృహస్పతి ప్రబోధమ్॥***

⌘

అటు తరువాత, మరొక సందర్భములో ఉత్తమ జ్ఞాననిష్ఠుడగు అత్రి మహర్షి యాజ్ఞవల్క్యుని దర్శనం చేసుకొని, బ్రహ్మతత్త్వ విషయమై సంభాషించటం ప్రారంభించారు.

**అత్రిమహర్షి :** హే గురువర్యా! యాజ్ఞవల్క్యా! ***య ఏషో-అనన్తో అవ్యక్తాత్మా-తమ్ కథమ్ అహమ్ విజానీయామ్?*** మా ఈ ఇంద్రియములకు వ్యక్తీకరణములైన విషయాలు, పరిమిత వస్తువులు మాత్రమే తెలియ వస్తున్నాయి కదా! మరి 'అనంతము - అవ్యక్తము' అగు ఆత్మను మేము ఎట్లా తెలుసుకోగలము? ఎట్లా సందర్శించగలము? దానికి ఇంద్రియబద్ధులమగు మాకు త్రోవ చూపించ ప్రార్థన.

**యాజ్ఞవల్క్యుడు : సో అవిముక్త ఉపస్యో య ఏథో అనన్తో - అవ్యక్త ఆత్మా అవిముక్తే ప్రతిష్ఠిత।** మీరు చెప్పుచున్న ఆ అనంత - అవ్యక్తాత్మ మనందరిలోని 'అవిముక్తము' అను స్థానములో ఉపస్థితమై, ప్రతిష్ఠితమై యున్నదయ్యా! అందుచేత అవిముక్త సమేతముగా ఆత్మవస్తువును ప్రతిష్ఠించి ఉపాసించాలి!

**అత్రిమహర్షి :** స్వామీ! ఆత్మ ప్రతిష్ఠితమగు ఆ అవిముక్తము ఎక్కడ ప్రతిష్ఠితమై యున్నది? **సోఽ విముక్తః కస్మిన్ ప్రతిష్ఠిత?**

**యాజ్ఞవల్క్య మహాముని : వరణాయాం - నాశ్యాంచ మధ్యే ప్రతిష్ఠితః।** వరణము నాశిక మధ్య స్థానములో ఆ ఆత్మ స్థానమగు అవిముక్తము ప్రతిష్ఠితమై యున్నది. (ఆజ్ఞా చక్రాకారము, ఇంద్రియములను దాటిని స్థానము)

**అత్రిమహర్షి : కా చ వరణా? కా చ నాశి?** 'వారణము' అనగా ఏమి? నాశిస్థానము అనగా? ఆ మధ్యగా ఏది స్థానము? అందుగల విశేషమేమిటి?

**యాజ్ఞవల్క్య మహాముని :**


**వరణా = సర్వాన్ ఇన్ద్రియకృతాన్ దోషాన్ వారయతి ఇతి వరణా!** దేహ - ఇంద్రియముల వలన కలుగుచున్న భ్రమాత్మకమైన సంసారమును, దోష-అల్ప దృష్టులను నివారణము చేయుచున్నదో.... అదియే 'వారణము' (వరణము).

చూపు - వినికిడి - స్పర్శ - రసము - గంధము ఇట్టి ఇంద్రియముల అనుభవమునకు ఆవల గల 'ఆవరణము'.

**నాశి = సర్వాన్ ఇన్ద్రియకృతాన్ పాపాన్ నాశయతి తేన 'నాశీ'** ఇంద్రియకృతములైన సర్వ పరిపంధ్య (శత్రు) - పాప క్రియలను నశింపజేస్తుంది కాబట్టి 'నాశి'. పాప కర్మలనుండి విరమింపజేస్తుంది. ప్రతిబంధకదోష - కర్మల నుండి విరమింపజేస్తోంది. కనుక ఆస్థానము 'నాశి' శబ్దముచే చెప్పబడుతోంది.

**అత్రిమహర్షి : కతమ్ చ అస్య స్థానమ్ భవతి?** వారణాసి... వారణము-నాశి ... ఈ రెండు ఎక్కడ ఉంటాయి? అవి ఉన్న స్థానము ఏది?

**యాజ్ఞవల్క్యుడు :**




**భ్రువో - ఘ్రాణస్య చ యః "సంధి", స ఏష ద్యార్లోకస్య పరస్య చ సంధి భవతి॥**

భ్రూ (కనుబొమ్మల) - ముక్కు మధ్య సంధి స్థానము ఉన్నది. ఈ సంధి స్థానము అంతరము-ఆవల అయి, స్వర్గలోకమునకు (ద్యోలోకమునకు) పరమై (ఆవల) **ఆత్మాకాశము** (భౌమాకాశము) సర్వదా వేంచేసి యున్నది.

ఇంద్రియములకు ఆవల ఆవరణము! ఆవరణమునకు ఆవల ఆత్మ! అది వాత (వాయు) ఆవరణము!

వారణము - ఆత్మల సంధిస్థానమే 'సంధ్యామ్' (సంధ్యా స్థానమ్) అని అంటారు. బ్రహ్మవేత్తలు బ్రహ్మమును ఈ సంధ్యాస్థానమునందు ఆత్మోపాసనకు అతి సులభము - మధురము అగు స్థానముగా గమనించి **బ్రహ్మమును** ఉపాశిస్తున్నారు. బోధిస్తున్నారు.

అదియే అవిముక్తము. అట్టి అవిముక్తమును మహదాశయులగు ముముక్షువులు ఉపాశించెదరు గాక! తదేవ అవిముక్తోపాసనము!

అది ఆత్మజ్ఞానమును ప్రసాదించే సర్వేంద్రియాతీత స్థానము. అందుచేత అవిముక్తమును తెలుసుకోవటమే ఆత్మజ్ఞానము. మోక్ష స్థానమును ప్రసాదించునది.

ఈవిధంగా అవిముక్తము గురించి ఆయా విశేషాలు బోధించారు.

⌘

కొందరు బ్రహ్మచారులు తత్త్వాన్వేషులై యాజ్ఞవల్క్య మహాముని ఆశ్రమం వచ్చారు. స్వామికి నమోవాక్యములు సమర్పించుకొన్నారు.

**బ్రహ్మచారులు :** హే యాజ్ఞవల్క్య మహామునీ! మాకు మా సాధన గురువులు మంత్రోపదేశం చేయగా మేము (శివపంచాక్షరి, షోడషాక్షరి, గౌరీ పంచాక్షరి, గాయత్రి ఇత్యాది) మంత్రోపాసనలను శ్రద్ధగా నిర్వర్తిస్తున్నాము.

ఇప్పుడు మా సందేహము : మంత్రము వలన మోక్షము లభిస్తుందా? మోక్ష ప్రదాతయగు ఉత్తమార్ధ ప్రతిపాదిత మంత్రము ఏది? అట్టి మంత్రమును - తత్త్వమును ఉదహరిస్తూ మాకు ఉపదేశించ వేడుకొనుచున్నాము.

**యాజ్ఞవల్క్య మహాముని :** మననముచే తరింపచేయునది కాబట్టే 'మంత్రము' అంటున్నారు. (మననాత్ త్రాయతే ఇతి మంత్రః). శాశ్వత ప్రయోజనకారకము, ఉత్తమము అగు **"ఆత్మజ్ఞానము - శాశ్వత బంధ విముక్తి"** అను మహదాశయముతో గురువులు - శాస్త్రములచే సూచించబడే మంత్రములను ఉపదేశిస్తున్నారు. గురువుల - శాస్త్రముల ఉద్దేశ్యము ఏమిటి?

→ ఇంద్రియార్థముల అల్పార్థముల నుండి, **"కాల-సందర్భ బద్ధము"** అగు విషయముల నుండి - వెనుకకు మరలటానికి,

→ మనస్సు తన చాంచల్యమును త్యజిస్తూ ఏకాగ్రమౌతూ రావటానికి,

→ బుద్ధి నిర్మలము - సునిశితము - విస్తారము అయి, అమృత స్థానమును దర్శించటానికి,

→ ఈ జీవుడు అమృత స్వరూపమగు ఆత్మగా ప్రకాశించటానికి,

అటువంటి మహామంత్రములలో శతరుద్రీయ మహా మంత్రము బ్రహ్మతత్త్వజ్ఞాన శబ్దోచ్ఛారణా ఉపాసన మంత్రముగా చెప్పబడుతోంది.

**శతరుద్రీయేణా ఏత్యేతత్ తాని హ వా**

→ **అమృతస్య నామధేయాని భవన్తి।**

→ **ఏతైః హ వా అమృతో భవతీతి ।** అది అమృతత్వమును ప్రసాదించగలిగిన మంత్రము.

గురువుపై విశ్వాసముతో, మంత్ర దేవతపై భక్తి-ప్రపత్తులతో అమృత స్థానమగు 'సోఽహమ్' కొరకై మీరు ఇష్టమంత్రమును అభ్యసించండి! శ్రద్ధయే మంత్రసిద్ధికి కారణము.

⌘

విదేహ రాజ్యాధిపతి జనకమహారాజు ఉత్తమ కర్మయోగి! విజ్ఞాన సమన్వితుడు. మహాపురుషుల సంశ్రయమును సర్వదా ఆశ్రయించే ఉత్తమ సత్సంగాభిలాషి. కర్మలను బంధముగా కాకుండా, భగవదోపాసనగా మరల్చుకొను ఉపాయము తెలిసిన కర్మ-జ్ఞానయోగ సంపన్నుడు. రాజయోగి! బ్రహ్మజ్ఞుడు! పురుణాములచే ఉత్తమ దృష్టాంతముగా చెప్పబడు పురాణ పురుషుడు!

ఆయన ఒకసారి యాజ్ఞవల్క్య మహామునీశ్వరుల దర్శనార్థమై ఆశ్రమానికి విచ్చేశారు. గురు నమస్కారములు, సపర్యలు సమర్పించారు. సత్సంగాభిలాషతో ఈ రీతిగా పరిప్రశ్నించారు.

**జనకమహారాజు :** భగవన్! **'సన్న్యాసమ్' అనుబ్రూహి!** సన్న్యాసము గురించి వాఖ్యానపూర్వక వివరణ ప్రసాదించమని అభ్యర్థన.

**యాజ్ఞవల్క్య మహామునీశ్వరులు :** సరే! మీరు కోరినట్లే కొన్ని విషయాలు ఇప్పుడు వివరించుకుందాం.

ఒకడు బ్రహ్మచర్యాశ్రమం ప్రారంభిస్తూ బ్రహ్మచారి అయి, ఆచార్యులవారిని ఆశ్రయిస్తున్నాడు. 1. లౌకిక విద్య (లోకంలో ఎలా జీవించాలి?) 2. పార లౌకికమగు **బ్రహ్మ విద్య** అభ్యసిస్తున్నాడు. అటు తరువాత గురు అనుజ్ఞతో బ్రహ్మచర్యాశ్రమం ముగించుకొని, బయల్వెడలి గృహస్థాశ్రమము స్వీకరిస్తున్నాడు.

గృహస్థాశ్రమములో కర్మల ద్వారా పరమాత్మను ఉపాసిస్తూ కర్మయోగి అయి - కొంత కాలమైన తరువాత, అనుకూలమగు సమయములో - ఏకాంత వాసము కొరకై **వనములో** (అరణ్యముగాని, ఆశ్రమముగాని) ప్రవేశిస్తూ **'వాన ప్రస్థాశ్రమము'**లో ప్రవేశిస్తున్నాడు.

ఈ మూడు ఆశ్రమములు ఉత్తమ ఆశయముతో భవ్యముగా, విజయవంతముగా గడపిన తరువాత **'సన్న్యాసాశ్రమము'** స్వీకరించి **పరివ్రాజకుడు** అగుచున్నాడు.

ఒకవేళ సందర్భములు సానుకూల్యముగా ఉంటే...,

**యది వేతరథా బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్।**

బ్రహ్మచర్యాశ్రమము తరువాత సూటిగా (గృహస్థ–వానప్రస్థంగా కాకుండా) సన్న్యాసము స్వీకరించవచ్చు. పరివ్రాజకుడు కావచ్చును. ఇక్కడ ఒక ముఖ్యమైన విశేషము మనము చెప్పుకోవాలి.

ఒకడు ....,

**గృహద్వా – వనాద్వా** ..... గృహస్థుడు కావచ్చు, వన నివాసి కావచ్చు గాక!

**అవ్రతీవా – వ్రతీవా** ..... ఆచారాదులకు సంబంధించి సువ్రతుడు కావచ్చు. లేదా, అవ్రతుడు (వ్రత నియమములు పాటించనివాడు) కావచ్చు గాక!

**స్నాతకోవా – అస్నాతకోవా** ..... తీర్థయాత్రా నిష్ఠతో స్నాతకుడు కావచ్చు. ఒకచోటనే ఉండు **అస్నాతకుడు** కావచ్చుగాక!

**ఉత్పన్నాగ్నికోవా – అనగ్నికోవా** ..... దైనందికంగా అగ్నికార్యము నిర్వర్తించువాడు కావచ్చు – నిర్వర్తించనివాడు కావచ్చు గాక!

..... ఎవ్వడు ఎట్టివాడై ఏ స్థితి–గతులలో ఉన్నప్పటికీ కూడా,... ఏ రోజు ఈ జగత్ దృశ్య–జగత్ జీవిత–తత్సంబంధిత విషయ–విశేషాల పట్ల అనురక్తి తొలగిపోయి **విరక్తి, విరజత్వము** మనస్సులో ఉదయిస్తుందో, ఆ రోజే **సన్న్యాసము** (పరివ్రాజక జీవితమును) స్వీకరించటము సముచితము. (సత్–న్యాసము – 'సత్'ను ఆశ్రయిస్తూ, తదితరమైనది రాగరహితంగా (విరాగిగా) .... గమనించటము) వైరాగ్యమే తగిన సమయము. వేరే వేరే కాల నియమములు లేవు. మరొక్క ముఖ్య విశేషం కూడా!

***చతుర్విధ పంథా :***

- బ్రహ్మమును అధ్యయనము చేయటము (బ్రహ్మచారిత్వము),
- జగత్తును ఆత్మగా ఎరిగి జగత్ గృహములో ప్రవర్తించటము (గృహస్థత్వము),
- జగదతీతత్వము (వాన ప్రస్థము),
- సత్ వస్తువును ఆశ్రయించటము (సత్ న్యాసము)

**.... ఒక్కసారే ఆశ్రయించాలి**. అవి వేరు వేరు రీతులు కాదు. వేరు వేరు దశలు కావు!

***సన్న్యాస స్వీకారము :***

సన్న్యాసాశ్రమ (పరివ్రాజక) స్వీకార సందర్భములో కొందరు–**శాస్త్ర సూచనానుసారంగా** ప్రాజాపత్యము నిర్వర్తిస్తున్నారు. మరికొందరు సన్న్యసిస్తూ అవన్నీ చేయకపోవచ్చును. అట్టివారు అగ్నిరూపమైన **ప్రాణమును విశ్వప్రాణము** అనే **విశ్వాగ్నియందు** (వ్రేల్చుచూ) సమర్పిస్తూ **'అగ్నివేష్ఠి'**ని నిర్వర్తించుచూ, **మనస్సుతోనే ప్రాజాపత్యము** నిర్వర్తిస్తున్నారు.

**పశ్చాత్ త్రైధా తన్మయ్యామేవ కుర్యాత్।**
**ఏతయైవ త్రైయో ధాతవో యమతీ "సత్వం రజః తమ" ఇతి ॥**

ఆ తరువాత త్రిగుణములను (సత్వ–రజో–తమో గుణములను) వాటివాటి అధిష్ఠానములందు ఆరోపిస్తూ సర్వకారణుడగు పరమాత్మకు చెందినవిగా భావించి సమర్పించివేయాలి. గుణములను–నిర్గుణస్వరూపుడగు 'గుణి' (లేక) నిర్గుణమగు ఆత్మ స్వరూపముయొక్క–లీలా వినోదముగా భావించటమే సమర్పించటం అగుచున్నది. విశ్వాగ్నిని విశ్వేశ్వరుని యందు వ్రేల్చుతూ త్యజించి, **గుణాతీతత్వమును** ఆశ్రయించటము.

**సర్వ జగత్ విషయములపట్ల అరుచియే ఋత్విజుడు.**

అందుకు ప్రతీకగా గ్రామాగ్నిని విశ్వాగ్నియందు హవిస్సు రూపంగా – సమర్పించబడుగాక!

ఒక వేళ (పరివ్రాజకత్వము స్వీకరిస్తున్న) ఆ తరుణంలో అగ్ని కూడా లభించని సందర్భములో...,

**యత్ అగ్నిమ్ న విందేత్, అప్సు జుహుయాత్,**
**"అపోవై సర్వదేవతా! సర్వాభ్యో దేవతాభ్యో జుహోమి స్వాహా!" .... ఇతి॥**

ఇకప్పుడు **"ఈ జలమును సర్వదేవతా స్వరూపముగా భావన చేస్తున్నాను. జలమును హవిస్సుగా సంకల్పిస్తూ సర్వస్వరూపమగు విశ్వ జలమునందు సమర్పిస్తున్నాను వ్యష్టిత్వమును సమిష్టిత్వమునందు హోమం చేస్తున్నాను"** .... అని భావిస్తూ జలముతో **ప్రాజాపత్యయాగము** నిర్వర్తించవచ్చును.

**హృత్వా ఉద్ధృత్య ప్రాశ్నీయాత్, స ఆజ్యం హవిః అనామయమ్।**

హృదయమునందు హృదయముతో ఆత్మత్వమును సర్వాత్మత్వమునందు–నేయిని అగ్నియందు సమర్పించువిధంగా – సమర్పించివేయాలి!

**మోక్ష మంత్రః త్రైయ్యేవమ్ విందేత్**

మోక్ష మంత్రములగు వేదమహావాక్యములను మూడిటిని ఆనందభరితంగా ఉచ్చరించును గాక! బుద్ధితో ఎలుగెత్తి గానము చేయుచుండును గాక!

| | | | |
|---|---|---|---|
| → | **తత్ త్వమ్** | – | **నీవు పరమాత్మవే! బ్రహ్మమే! 'నీవు'గా కనిపిస్తున్నదంతా పరమాత్మ ప్రదర్శనా విన్యాసమే!** |
| → | **సోऽహమ్** | – | **నేను పరమాత్మను (బ్రహ్మమే) అయి ఉన్నాను!** |
| → | **త్వమ్ ఏవ హమ్** | – | **నీవే నేను. అహమేవ త్వమ్ – నేనుగా ఉన్నది నీవే.** |

అను **మోక్షత్రయీ వేద మహావాక్యార్థములను** మనో–బుద్ధులతో మరల మరల స్మరించి – భావించ – దర్శించనారభించాలి!

ఆ పరబ్రహ్మమునే ఉపాసించాలి. తత్ ప్రయోజనంగా ఆ **పరివ్రాజకుడు** → **పరబ్రహ్మమే** అగుచున్నాడు!

❖

***అప్పుడు అత్రిమహాముని ఇట్లు అడుగుచున్నారు.***

**అత్రిమహర్షి :** స్వామీ! ఒకడు బ్రహ్మచర్యాశ్రమము స్వీకరిస్తూ యజ్ఞోపవీతము ధరించటమనేది శాస్త్ర విధి కదా!

**అయజ్ఞోపవీతీ కథమ్ బ్రాహ్మణ ఇతి?** యజ్ఞోపవీతి (ధరించినవాడు) యజ్ఞోపవీతమును త్యజిస్తే బ్రాహ్మణుడుగా ఎట్లా అవుతాడు?

**యాజ్ఞవల్క్యుడు :** ఓ అత్రి మహర్షీ! యజ్ఞ పురుషుడు సర్వాంతర్యామి, సర్వతత్త్వ స్వరూపుడు అగు పరమాత్మయే! ఆయనయే మీలోను, నాలోను, సర్వ జీవులలోను ఆత్మ స్వరూపుడై విరాజిల్లుచున్నారు కదా!

**ఇదమేవా అస్య తత్ యజ్ఞోపవీతమ్, ఇతి → యత్ జ్ఞః ఉపవీతేతి – ఈ తెలియబడేదంతా నాయొక్క 'ధారణయందు – తెలుసుకొనుచూ ఉన్న నేను నిర్వర్తించు సంచారమే! ... అను భావనయొక్క సుస్థిరతచే పరివ్రాజకుడు అగుచున్నాడు.**

**య ఆత్మా ఆపః ప్రాశ్యా, ఆచమ్యా, అయం విధిః పరివ్రాజినామ్..., ఆత్మయందు దృశ్యమును ఏకము చేయు ఆచమనమే పరివ్రాజవిధి, జాగ్రత్ స్వప్న సుషుప్తి వ్యవహారమంతా ఆత్మకు అభిన్న భావనయే త్రిరాచమ్యము.**

**'ఆత్మభావన'** = సర్వ తరంగాలలోను జలమే సత్యమైనట్లు సర్వ జీవులు **పరమాత్మ అను మహా సముద్రములో తరంగాలే** – అనే భావనతో ఆచమనము చేయుచుండటయే **ధారణ**. అట్టి ధారణయే వాస్తవమగు **యజ్ఞోపవీతము**.

ఇదియే సన్న్యాసవిధి! సన్న్యాసియొక్క యజ్ఞోపవీతము. **ఇదియే సమస్త వ్రతములలోని ముఖ్య నియమము**. అనగా సర్వ వ్రతములలోను ఆత్మభావనయే ప్రథమంగా నిర్వర్తించవలసిన యజ్ఞోపవీత ధారణ! **'సర్వాంతర్యామిత్వము'** అనబడే యజ్ఞ పురుషత్వము! పవిత్రతయే యజ్ఞోపవీతము! ఇది బ్రహ్మచర్య – గృహస్థ – వానప్రస్థ – సన్న్యాసాది సర్వ ఆశ్రమవాసులకు ఆచరణీయ నియమమే!

ఒకడు....,

| | | |
|---|---|---|
| విరోధ్వా | – | నిర్విషయుడవవచ్చు గాక! |
| అనేవా అనాశకేవా | – | అనేక విషయములలో ఉండవచ్చు గాక! ఆహారి కావచ్చు. నిరాహారి కావచ్చు! |
| అపాం ప్రవేశేవా | – | జలములో ప్రవేశించి జల దిగ్బంధన విద్యా సమన్వితుడు కావచ్చు గాక! |
| అగ్నిప్రవేశేవా | – | అగ్నిలో ప్రవేశించవచ్చు గాక! అగ్ని దిగ్బంధన విద్యావేత్త కావచ్చు. |
| మహా ప్రస్థానేవా | – | మహాప్రస్థానమును ఆశ్రయించ వచ్చు గాక! |

***ఆత్మ అను జలమును స్వీకరించి ఆచమించువాడే, సర్వము ఆత్మ భావనయందు ఏకముచేయువాడే, శాస్త్రములు చెప్పుచున్న పరివ్రాజకత్వము ఆశ్రయించినవాడు అగుచున్నాడు.***

***యజ్ఞోపవీత ధారి → పరి[వ్రాట్ [బ్రాహ్మణుడు → పరమహంస అనునవి..., ఇదమ్ సర్వమ్ మమ ఆత్మయేవ అను అభ్యాసము యొక్క ఉత్తరోత్తర స్థితులు.***

***పరి[వ్రాట్ యొక్క బాహ్య విశేషాలు***

| | | |
|---|---|---|
| **వివర్ణవాసా** | – | వర్ణరహితమైన వస్త్రధారణతో, |
| **ముణ్డో** | – | కేశములు పరిత్యజించి, |
| **అపరి[గ్రహః** | – | దేనినీ స్వీకరించక, |
| **శుచిః** | – | శుచి అయిన భావాలు, పవిత్రమైన మనస్సు – బుద్ధి కలిగియుండి..., |
| **అద్రోహీ** | – | ఎవ్వరిపట్లా కూడా ద్వేష – ద్రోహ భావాలు లేనివారై |
| **భైక్షమానో** | – | భిక్షాటకుడై (భి = అంధకారమును, క్ష = క్షయింపజేసుకొను వృత్తిని స్వీకరించువాడు) |

**బ్రహ్మభావమును మాత్రమే ఆశ్రయించి, బ్రహ్మమే తానై, సర్వమును తన 'ధారణ'గా కలిగి ఉంటున్నవానిని 'పరి[వ్రాట్' అని అంటున్నారు.**

**సన్న్యాసి :** దేనిని సన్న్యసిస్తే సన్న్యాసి?

**యది ఆతురస్యాత్ మనసా – వాచా వా సన్న్యసేత్ ।**

"ఆత్మయందే నిష్ఠ" అను అనుష్ఠానముచే మనో – వాక్కుల సంబంధితమైన సర్వ ఆతురతలను త్యజించినవాడే సన్న్యాసి!

**ఏష పన్థా బ్రహ్మణా హ అనువిత్తః**

**తేన ఏతి సన్న్యాసీ బ్రహ్మవిత్ ।**

సర్వ ప్రాపంచిక – భౌతిక సంపదలను, సిద్ధులను, మమకారములను సన్న్యసించి **'బ్రహ్మమే ఇదంతా! ప్రాణులంతా పరమాత్మ స్వరూపమే!'** – అను బుద్ధితో దృశ్యమును దర్శించు మార్గములో నడచుచున్నవాడే బ్రహ్మవేత్త అగు ***బ్రాహ్మణుడు.***

**ఏవమ్ ఏవై తత్ భగవన్ ఇతిః**

**బ్రహ్మమును ఎరిగినవాడు బ్రహ్మమే అగుచున్నాడు.** బ్రహ్మమును ఎరిగినవాడే బ్రాహ్మణుడు. బ్రహ్మమును స్వస్వరూపముగా ఎరిగి, గానము చేస్తున్నట్టి **పరమహంసలు** మనకు ప్రాతఃస్మరణీయులు. మార్గదర్శకులు. జగత్తులను, దృశ్యములను స్వస్వరూప పరబ్రహ్మముగా ఆస్వాదించు బ్రహ్మజ్ఞానానంద – ఆస్వాదులు.

ఉదాహరణకు : మహనీయులగు **సంవర్తకుడు, ఆరుణి, శ్వేతకేతు, దుర్వాసుడు, ఋభు, నిదాఘ, జడభరతుడు, దత్తాత్రేయులు, రైవతుడు** మొదలైన వారంతా మనకు ఆత్మ సందర్శన మార్గమును చూపుతూ ఆత్మ క్షీర సముద్రములో విహరించు రాజహంసలై విరాజిల్లుచున్నారు!

వీరంతా కూడా...,

**అవ్యక్త లింగా** ...., నామ-రూప ప్రతిష్ఠ – ప్రచారాదులకు అతీతులై...,

**అనున్మత్తా ఉన్మత్త ఇవ** .... వారు పరబ్రహ్మ జ్ఞానులు. సంసారము వారిని స్పృశించజాలదు. వాస్తవానికి ఇంద్రియ విషయములపై బుద్ధిని నిలుపువారే ఉన్మత్తులు కదా! ఆ పరమహంసలు ఉన్మత్తులు (పిచ్చివారు) కాకపోయి కూడా, సంసార దృష్టితో చూచేవారికి ఉన్మత్తులవలె అగుపిస్తున్నారు.

⌘

సన్న్యాసి త్రిదండము, కమండులువు, శిక్యము (కావడి, ఉట్టి, జోలె), పాత్ర, జల పవిత్రత (స్నానాది నియమాలు), శిఖ, యజ్ఞోపవీతము ఇవన్నీ కూడా జలతర్పణ విధానంగాను, మంత్ర ముగ్ధముగాను త్యజించి...,

## **ఆత్మానమ్ అన్విచ్ఛేత్!**

ఆత్మత్వమునే ఉపాసించాలి! ఆ(శయించాలి. సాధ్య వస్తువును సమీపిస్తూ ఉండగా,... సాధన వస్తువులను యథాస్థానములో పరిత్యజించటంలోకరీతియే కదా!

**యథా జాతరూప ధరో** → ఏవిధంగా అయితే అప్పుడే పుట్టిన పిల్లవానికి ప్రాపంచక సంబంధాలు, సంపదలు, మానావమానాలు, కష్ట-సుఖ, ఇష్ట-అయిష్ట భావాలు విషయమే కానట్లుగా ఉంటాయో, **ఆవిధంగా పరమహంసలు ఉంటున్నారు.**

**నిర్ద్వంద్వో** → ద్వంద్వరహితులై ఉంటున్నారు. **"పర(బహ్మమునకు (పరమాత్మకు) వేరుగా ద్వితీయమైనది ఎక్కడా ఉండదు! ఉండజాలదు!"** ... అను అవగాహనకు ఆ(శయించినవారగుచున్నారు.

**నిష్పరి(గహః** → దేనినీ స్వీకరించనివారై, అంతరంగమును విషయ రహితంగా పరిశు(భపరచువారై (ప్రవర్తిల్లుచున్నారు. స్వప్నములో సత్యమైనది-నిత్యమైనది ఏది ఉంటుంది? అట్లాగే జా(గత్ కూడా - అని వారు గమనిస్తున్నారు!

**సత్వః (బహ్మమార్గే** → (బహ్మ మార్గమునందు బుద్ధిని నిలుపుచున్నారు!

**సమ్యక్ సంపన్న శుద్ధ మానసః** → (సర్వేషు భూతేషు తిష్ఠన్తమ్ పరమేశ్వరమ్ ... అను రూపమైన సర్వే సర్వ(తా సమముగా ఉన్న పరమాత్మను దర్శించే మనోహర రూపమైనట్టి) - సమ్యక్, సుసంపన్న శుద్ధ మానసులై చరిస్తున్నారు.

**(ప్రాణ సంధారణార్థమ్ యథోక్తకాలే విముక్తో భైక్షమ్ ఆచరన్ ఉదర పా(తేణ** → కేవలము (ప్రాణధారణ నిమిత్తమై మా(తమే ఆకలి వేసినప్పుడు (యథోక్తకాలంగా), 'పొట్ట' అనే భిక్షక పా(త్రతో భిక్షమువలె ఆహారము వేయాలి. అంతేగాని ఆహారము కొరకు జీవించకూడదు. (ప్రాణధారణ ఎందుకు? సంసారబంధ విముక్తి కొరకై! ఆత్మ జ్ఞానము సంపాదించుకోవటానికై! ఆత్మజ్ఞానము సర్వ దుఃఖములు రహితమవటానికి! ఇది ఎరిగిన సన్న్యాసి పరి(వ్రాజకుడై, పరమ హంస అయి విరాజిల్లుచున్నాడు.

**లబాలాభౌ సమౌ భూత్వా** → లభించటము - లభించకపోవటము ఒకే తీరుగా దర్శిస్తూ, భిక్ష ఇచ్చేవారిని - ఇవ్వనివారిని పర(బహ్మ స్వరూపులుగానే భావిస్తూ..., శిధిలగృహము, దేవతల సంపదలు గల (ప్రదేశము, దేవాలయము, గడ్డి దుబ్బు (ప్రదేశము, పుట్ట, వృక్షమూలము, కుమ్మరి గృహము, యజ్ఞ యాగములు జరుగుచున్న అగ్నిహో(త్రశాల, నదిలోని ఇసుక దిబ్బ, కొండ, కొండగుహ, కొండ(కింద (గామము, చెట్టు తొఱ్ఱ, సెలయేరు, ఎడారి... ఈ ఈ (ప్రదేశములలో ఒకే తీరైన **ఆత్మోపమ్యేవ సర్వ(తా** - భావనతో సంచరిస్తూ ఉంటున్నారు.

**అనికేతవా** → 'ఇది నా ఇల్లు కదా' అనే భావనయే దరిజేరనీయరు. సాధనశీలురై, (ప్రయత్నపూర్వకంగా **"నాది-నాకు సంబంధించినది - దీనికి నేను సంబంధించినవాడను"** .... అను మమకారము లేనివారై, జగత్ కల్పనా రచనలో తమకు ఉచితమగు ఆ(శమములందు (ప్రవర్తిల్లుచున్నారు.

- నిర్మలమగు పరమాత్మ ధ్యాన పరాయణులై...,
- అనుక్షణము అధ్యాత్మ నిష్ఠతో...,
- అశుభ - శుభ కర్మలను (కర్మ ద్వంద్వములను, ద్వంద్వ భావములను) నిర్మూలించుకొన్నవారై (వీరు మంచి వారు - వారు కాదు. వీరి కర్మలు గొప్పవి. వారివి కాదు మొ॥న ద్వంద్వ భావములను తొలగించుకొంటున్నవారై) .... నిర్మలులగుచున్నారు.

సన్న్యాసియై (సత్-న్యాసి అయి) దేహ భావమును త్యజించి ఉంటున్నారు.

ఈ రీతిగా ఉన్నవారు **పరమహంస** అని చెప్పబడుచున్నారు. సోహమ్ పరమమ్ - ఇతి పరమహంసా! "సర్వమునకు పరమైయున్న ఆత్మసాగర తరంగస్వరూపుడను నేను" అను నిశ్చితాభి(ప్రాయము కలిగియున్న వాడు **"పరమహంస".**

ఇట్టి మార్గములో ఈ జీవుడుపరమహంస కాగలడు.

ఈ జీవుడు ఏ ఆ(శమంనుంచైనా సరే, బుద్ధిచే సన్న్యాసి అయి, పరి(వ్రాజకుడై, దేహ సందర్భమును సద్వినియోగపరచుకొనును గాక!

***ఇతి పరమహంసో నామే జాబోలోపనిషత్, ఇత్యుపనిషత్॥***

***ఓం శాంతిః శాంతిః శ్శాంతిః॥***


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 5 తారసారోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ యత్ నారాయణ తారార్థ సత్యజ్ఞాన సుఖాకృతి**
**త్రిపాద్ నారాయణాకారం తత్ బ్రహ్మైవాఽస్మి కేవలమ్ ॥**

*ఏదైతే 'నారాయణ' అను శబ్దము యొక్క తారార్థమై, అంతరార్థమై, సత్య జ్ఞాన స్వరూపమై, సుఖానంద ప్రదమై, (ఋగ్వేద, యజుర్వేద, సామవేద) త్రిపాద సమన్వితమగు నారాయణాకారమై ఉన్నదో,... **ఆ కేవలమగు బ్రహ్మమే నేను! నారాయణ పరబ్రహ్మ** స్వరూప సోఽహమ్! నారాయణమ్ మహాజ్ఞేయమ్ అహమేవ!*

**ఓం నమో నారాయణాయ। ఓం బృహస్పతయే నమః । ఓం యాజ్ఞవల్క్యాయ నమః । ఓం భారద్వాజాయ నమః।**

**1. హరిః ఓం।**
**ఓం! బృహస్పతి ఉవాచ, –**
**యజ్ఞవల్క్యమ్: యదను కురుక్షేత్రం,**
**దేవానాం దేవయజనగ్ం,**
**సర్వేషాం భూతానాం బ్రహ్మ సదనమ్।**
**తస్మాత్ యత్ర క్వచ న గచ్ఛేత్।**
**తదేవ మన్యేత ఇతి–ఇదమ్ వై కురుక్షేత్రం।**
**దేవానాం దేవయజనమ్।**
**సర్వేషాం భూతానాం బ్రహ్మసదనమ్।**
**అవిముక్తం వై కురుక్షేత్రం, దేవానాం దేవయజనం,**
**సర్వేషాం భూతానాం బ్రహ్మసదనమ్।**
**అత్ర హి జంతోః ప్రాణేషు ఉత్క్రమమాణేషు రుద్రః**
**'తారకం బ్రహ్మ' వ్యాచష్టే।**
**తేన అసావత్ అమృతీభూత్వా**
**'మోక్షీ' భవతి। తస్మాత్ అవిముక్తమేవ నిషేవ**

ఓంకార - సర్వతత్త్వ స్వరూప - సర్వాంతర్యామియగు శ్రీరామచంద్ర బ్రహ్మమునకు నమస్కరిస్తూ...., **బృహస్పతి యాజ్ఞవల్క్యునితో ఇట్లు పలుకుచున్నారు.**

ఓ యాజ్ఞవల్క్యా! భౌతికంగా కనిపిస్తూ ఉన్నట్టి ఈ శరీరమే (లేక) ఈ **దేహమే** కురుక్షేత్రము! దేవతలకు దేవాలయ స్థానము. వారు సృష్టి సంబంధమైన యజ్ఞము నిర్వర్తించు యజ్ఞశాల!

సర్వ జీవుల బ్రహ్మీ స్థానము (బ్రహ్మము అనుభవమగు స్థానము). ఈ దేహములో సర్వ దేవతలు నివసిస్తూ ఉండటము, ఆ దేవతలు యజ్ఞ కార్యక్రమములు నిర్వర్తించటమూ అనుక్షణం జరుగుచున్నాయి. జీవుల బ్రాహ్మీతత్త్వము కూడా ఈ దేహములోనే వేంచేసి ఉండగా దీనిని వదలి ఏదో పొందటానికై ముముక్షువు ఎక్కడికో వెళ్ళి, దేనికోసమో వెదుకవలసిన పనేమున్నదయ్యా? **ఈ దేహమునందే తత్త్వసారమంతా ఉన్నది.**

అందుచే ఈ శరీరము **'కురుక్షేత్రము'**గా భావించబడుచున్నది. ఎందుకంటే **దేవతలకు దేవ యజనము, జీవులకు బ్రహ్మసదనము** కదా ఈ శరీరమే! ఇందలి చైతన్యాకాశమే ఈ విశ్వసంప్రదర్శనము కూడా!

అవిముక్తులకు ఇదే కురుక్షేత్రమై, దేవతలకు కార్యక్రమశాల అయి జీవులకు బ్రహ్మస్థానము అగుచున్నది. **యాజ్ఞికులకు యాగశాల** కూడా!

అట్టి ఈ కురుక్షేత్రమునందు ఈ జీవుడు ప్రాణములను విడచుచున్నప్పుడు రుద్రభగవానుడు ఈ జీవులకు **"తారక బ్రహ్మము"** ను ఉపదేశించుచున్నారు.

**అట్టి తారకబ్రహ్మమును పొందిన జీవుడు మృత్యువును అధిగమించి, అమృత స్వరూపుడగుచున్నాడు.**

**ఏతా అవిముక్తం న విముంచేత్।**
**ఏవమ్, ఏష ఏవైష భగవన్।**
**ఇతి యాజ్ఞవల్క్యః।**

అందుచేత 'అవిముక్తము' అయినట్టి (బంధము కలిగించగల) కురుక్షేత్రమునే (ఈ దేహమునే) బ్రహ్మీస్థితిని ప్రసాదించునదిగా భావించాలి. దీనిని అల్పవస్తువు అనుకోరాదు - అని భగవానుడగు బృహస్పతి యాజ్ఞవల్క్యునకు బోధించటము జరిగినది.

---

**2. అథ హి ఏనం భారద్వాజః పప్రచ్ఛ యాజ్ఞవల్క్యం।**
**కిం తారకం? కిం తారయతి? ఇతి।**
**సహోవాచ యజ్ఞవల్క్యః :**
**"ఓం నమో నారాయణాయ"**
**ఇతి తారకం।**
**'చిదాత్మకమ్' - ఇతి ఉపాసితవ్యమ్।**
**'ఓం' ఇతి (ఏకమ్-అక్షరమ్) ఏకాక్షరమ్।**
**ఆత్మస్వరూపమ్**
**"నమ" ఇతి ద్వ్యక్షరమ్ - <u>ప్రకృతి స్వరూపమ్।</u>**
**"నారాయణాయ" ఇతి పంచాక్షరమ్,**
**<u>పరంబ్రహ్మ స్వరూపమ్।</u>**
**ఇతి య ఏవం వేద,**
**సో <u>అమృతో</u> భవతి ।**
**'ఓం' ఇతి <u>బ్రహ్మా</u> భవతి।**
**'న' కారో <u>విష్ణుః</u> భవతి।**
**'మ' కారో <u>రుద్రో</u> భవతి।**
**'న' కారో <u>ఈశ్వరో</u> భవతి।**
**'ర' కారో <u>అణ్డం విరాట్</u> భవతి।**
**'య' కారః <u>పురోషో</u> భవతి।**
**'ణ' కారో <u>భగవాన్</u> భవతి।**
**'య' కారః <u>పరమాత్మా</u> భవతి।**
**ఏ తత్ <u>వై</u> నారాయణస్య**
**అష్టాక్షరమ్ వేద....,**
**పరమపురుషో భవతి**
**<u>అయం ఋగ్వేదః ప్రథమ పాదః।</u>**
**'ఓం' ఇతి ఏతత్ అక్షరం పరంబ్రహ్మ।**
**తదేవ ఉపాసితవ్యమ్।**
**ఏతత్ ఏవ సూక్ష్మ - అష్టాక్షరమ్ భవతి।**
**తత్ ఏతత్ అష్టాత్మకో అష్టధా భవతి।**
**'అ' కారః ప్రథమాక్షరో భవతి।**

మరొక సందర్భములో **భారద్వాజుడు** గురుమహారాజగు **యాజ్ఞవల్క్యులవారిని** ఇట్లా ప్రశ్నించారు.

**తరింపచేయునది తారకము** - అని అంటారు కదా! తారకము ఏదై ఉన్నది? దేనిని అది తరింపజేస్తుంది?

**యాజ్ఞవల్క్యులవారు**

'ఓం నమోనారాయణాయ' అను అష్టాక్షరీ మంత్రము 'తారకము' అను పిలువబడుతోంది. ఈ మంత్రము యొక్క తాత్పర్యము సర్వాంతర్యామి - సర్వతత్త్వ స్వరూపము అగు **"చిదాత్మయే"** అను అన్వయము - అవగాహనలతో ఉపాసించెదరు గాక! ఇది జీవుని తరింపజేయగలదు.

"ఓం" : ఏకాక్షరము = **ఏకము** = Unity in the Diversity

**అక్షరము** : క్షరము కానిది. (That which is absolutely changeless)

ఓం అనగా ఆత్మ స్వరూపమే!

**నమ** = ప్రకృతి స్వరూపము! ద్వ్యక్షరము-ద్రష్ట+దృశ్యము, ఆలోచించువాడు - ఆలోచన చేయబడునది.

**నారాయణాయ** = ఇది పంచాక్షరి. పరబ్రహ్మ స్వరూపము. (ద్రష్ట-దృశ్యములకు ఆవల గల పరబ్రహ్మము. 'దృక్' స్వరూపము.)

ఇది తెలుసుకొనియుండి ఈ అష్టాక్షరీ మంత్రమును ఎవ్వరు సముపాసిస్తారో, వారు అమృత స్వరూపులగుచున్నారు.

**మరికొన్ని సంజ్ఞార్థములు**

**ఓం** ఇతి : సృష్టికర్తయగు **బ్రహ్మ!**
**న** కారో : స్థితికర్తయగు **విష్ణువు!**
**మ** కారో : లయకారుడగు **రుద్రుడు.**
**న (నా)** కార : అంతటా తానే విస్తరించియున్న **ఈశ్వరుడు!**
**ర (రా)** కారో : విరాట్ పురుషుడు. **బ్రహ్మాండము! భౌతికంగా కనిపించేదంతా!**
**య** కారః : వ్యష్టి పురుషుడు. **జీవుడు.**
**ణ (ణా)** కారో : సర్వమును వెలిగించు, ప్రకాశింపజేయువాడు. **భగవంతుడు.**
**య** కారః : సర్వమునకు పరమై, ఆవల ఉన్నదై, సర్వమునకు ఆధారమైయున్న **పరమాత్మ! పై తదితరములన్నీ తనయొక్క కళలుగా ప్రదర్శించుచున్నట్టి 'ఆత్మ'!**

అట్టి **"ఓం నమో నారాయణాయ"** మంత్రమునకు **పరమపురుషుడు** - సర్వమునకు పరము అయినట్టి **శ్రీమన్నారాయణుడే!** అష్టాక్షరీ మననముచే జీవుడు పరమపురుషు అగుచున్నాడు.

**ఈ అష్టాక్షరమంత్రార్థమునకు పై వర్ణన ఋగ్వేదము "ప్రథమ పాదము" అయి ఉన్నది.**

ఓం - తత్ స్వరూపమగు అక్షరపరబ్రహ్మము.

'ఓం' అని ఉచ్చరిస్తున్నప్పుడు అక్షర పరబ్రహ్మమునే ఉద్దేశ్యించుచూ ఉపాసించాలి.

'ఓం' అనునది సూక్ష్మ - అష్టాక్షర తత్త్వముగా అగుచున్నది. సూక్ష్మాక్షరము - క్షరమును కల్పించుకొంటూ, త్యజించుచున్నట్టిది. తాను మాత్రము క్షరము కానట్టిది. అఖండము-ఏకము అగు 'ఓం' - అష్టాత్మలు (8 విభాగములు)గా ప్రదర్శిత మగుచున్నది.

'ఉ' కారో ద్వితీయాక్షరో భవతి।

'మ' కారః తృతీయాక్షరో భవతి।

'బిందుః' (చ)తురీయాక్షరో భవతి।

'నాదః' పంచమాక్షరో భవతి।

'కలా' షష్ఠాక్షరో భవతి।

'కలాతీతా' సప్తమాక్షరో భవతి।

'తత్పరశ్చ' అష్టమాక్షరో భవతి।

తారకత్వాత్ తారకో భవతి।

తత్ ఏవ తారకం బ్రహ్మ, త్వం విద్ధి।

తదేవ ఉపాసితవ్యం।

అత్ర ఏతే శ్లోకా భవంతి।

'అ' కారత్ అభవత్ బ్రహ్మా

'జాంబవాన్' ఇతి సంజ్ఞకః।

'ఉ' కార అక్షర సంభూత

'ఉపేంద్రో' హరినాయకః।

'మ' కార అక్షర సమ్భూతః

'శివస్తు హనుమాన్' స్మృతః

'బిందుః' ఈశ్వర సంజ్ఞస్తు

శత్రుఘ్నః చక్రరాట్ స్వయం।

'నాదో' మహాప్రభుః జ్ఞేయో

భరతః 'శంఖ' నామకః।

కలాయాః పురుషః సాక్షాత్

లక్ష్మణో ధరణీ ధరః।

కలాతీతా భగవతీ,

స్వయం సీతేతి సంజ్ఞితా।

తత్పరః పరమాత్మా చ।

శ్రీరామః పురుషోత్తమః।

'అ'కారము → మొదటి అక్షరము
'ఉ'కారము → ద్వితీయ అక్షరము
'మ'కారము → తృతీయాక్షరము
బిందుః → తురీయాక్షరము
నాదము → పంచమ
కలా → 6వ అక్షరము
కలాతీతము → 7వ అక్షరము
తత్పరుడు → 8వ అక్షరము.

**ఓం నమోనారాయణాయ** అను ఈ అష్టాక్షరి **దృశ్యపరిమితత్వము నుండి తరింపజేయును కాబట్టి తారకము.**

**ఈ అష్టాక్షరియే తారక బ్రహ్మము! పరబ్రహ్మార్థము!** అష్టాక్షరిచే ఉపాసించ బడుచున్నది బ్రహ్మమే. ఎందుకు ఉపాసించాలి? **"ఆ తారక బ్రహ్మమే నేను-నీవు కూడా!"** అనే బుద్ధి సునిశ్చిత కొరకు (సోఽహమ్! తత్ త్వమ్!)

..... ఈవిధంగా (ఋుక్-యజుర్వేదాదులచే) గానము చేయబడుచున్నది.

**వివిధ సంజ్ఞలు**

**'అ'కారము నుండి అక్షర సంభూతుడు:** అభవుడు (జన్మరహితుడు) అగు సృష్టికర్త బ్రహ్మదేవుని స్థానము క్రియారూపమగు సృష్టి రూపుడుగా దిద్దుకున్నవాడై "జాంబవాన్ - జ + అంబవాన్ ... జన్మ -అనుభవ కర్తగా" ప్రసిద్ధి పొందుచున్నారు. జాంబవంతుడు అందుకు సంజ్ఞ!

'ఉ' కారాక్షరమునుండి హరి జగత్తుకు నాయకుడు-పరిపోషకుడు అయి.....'ఉపేంద్రుడు' గా ప్రసిద్ధి పొందుచున్నారు. ఉప = సామీప్యుడు, పరిపోషకుడు, ఆధారుడు. హరి (కోతుల) నాయకుడు - సుగ్రీవుడు - సంజ్ఞ!

'మ'కార అక్షరము నుండి "శివుడు - హనుమంతుడు" శివాంశ అయిన హనుమ - 'మ'కారమునకు సంజ్ఞ!

బిందు → ఈశ్వరునికి సంజ్ఞ. అంతటా అన్నీగా విస్తరించియున్నట్టి తత్త్వము- సర్వ జీవులలోని 'అహమ్' స్వరూపుడు-శివుడే హనుమంతుడై 'అహమ్' స్వరూపముగా అన్ని దేహములలో వెలుగొందుచున్నది.

శత్రుఘ్నుడు స్వయముగా శ్రీచక్ర స్వరూపము - బిందువుకు సంజ్ఞ!

(జడ-చేతనములను ఒకచోటికి జేర్చు చైతన్యము)

నాదము స్వయముగా మహా ప్రభువు అని గ్రహించబడుగాక! నాదము, పిలుపు శ్రీరామచంద్రుడే 'నాద' స్వరూపుడై భరతుడుగా నమస్కరించబడుచున్నారు.

కలా (కాలబద్ధమైనది) (దృశ్యతత్త్వము). సాక్షాత్తు పురుషుడే! (Experiencing) (కల్పనా పురుషుడు). అనుభవములన్నీ తనవైన జీవుడు.

ఈ భూమిని ధారణ చేయువాడు ధరణీధరుడు → లక్ష్మణుడు. (లక్ష్యధారణా రూప-ఇతి లక్ష్మణః (ఆదిశేషుడుగా భూమిని నిలబెట్టు చైతన్యము) అని రామచైతన్యమే - సంజ్ఞ!

దృశ్య తత్త్వమునకు ఆవల కలాతీతమైనది స్వయముగా సీతాదేవియే ... సంజ్ఞిత అయి ఉన్నది. (ప్రకృతికి-మాయకు అధినేత తత్త్వము. మూల ప్రకృతి రూపము).

ద్రష్ట - దర్శనము - దృశ్యములకు ఆవల (పరమ్),... తత్పరమై, కేవలసాక్షి అయినట్టి దానికి, పురుషోత్తమునకు సంజ్ఞ. సాక్షాత్ శ్రీరామచంద్రుడు. (సర్వము తనయందు కలిగియుండి, సంపూర్ణుడై యున్నవాడు). ('నేను'కు ఆవల గల నిర్విషయము, సర్వము అయిన నేను)!

3. 'ఓం' ఇతి ఏతత్ అక్షరమ్ ఇదమ్ సర్వమ్।
తస్య ఉపాఖ్యానమ్।
భూతం భవ్యం భవిష్యం, యత్ చ
అన్యత్
తత్త్వ మంత్ర వర్ణ దేవతాః, ఛందః
ఋుక్ కలా శక్తి
సృష్ట్యాత్మకమ్ ఇతి।
య ఏవం వేద।
యజుర్వేదో ద్వితీయ పాదః।
అథ హి ఏనం భారద్వాజో యాజ్ఞవల్క్యమ్ ఉవాచ :
అథ కైః మన్త్రైః పరమాత్మా ప్రీతో భవతి?
స్వాత్మానం దర్శయతి?
తాన్నో బ్రూహి భగవన్। ఇతి।
సహోవాచ యాజ్ఞవల్క్యః
(అష్టవిధ మంత్రము)
ఓం యో హ వై శ్రీ పరమాత్మా
నారాయణః, స భగవాన్
'అ' కారో వాచ్యో జాంబవాన్।
భూర్భువస్సుః తస్మై వై నమో నమః॥ (1)
ఓం యో హ వై శ్రీ పరమాత్మా నారాయణః స భగవాన్
'ఉ'కార వాచ్య ఉపేంద్ర స్వరూపో, హరి నాయకో
'భూర్భువస్సుః' తస్మై వై నమో నమః॥ (2)
ఓం యో హ వై శ్రీ పరమాత్మా నారాయణః స భగవాన్
'మ'కార వాచ్య శివ స్వరూపో హనుమాన్
'భూర్భువస్సుః' తస్మై వై నమో నమః॥ (3)
ఓం యో హ వై శ్రీ పరమాత్మా నారాయణః స భగవాన్
బిందుస్వరూప శత్రుఘ్నో,
'భూర్భువస్సుః' తస్మై వై నమో నమః॥ (4)
ఓం యో హ వై శ్రీ పరమాత్మా నారాయణః స భగవాన్
నాదస్వరూపో భరతో,
'భూర్భువస్సుః' తస్మై వై నమో నమః॥ (5)

ఈ ఎదురుగా కనిపిస్తున్న విశ్వము, దీనికి ఆవల - ఈవల ద్రష్ట-దర్శన-దృశ్యములతో సహా ఇదంతా కూడా ఓంకార స్వరూపమే! అందుకు ఉపాఖ్యానంగా ఇప్పుడు కొన్ని విశేషాలు చెప్పుకొనుచున్నాము.

ఏదైతే ఇతఃపూర్వము ఉన్నదో, ఇప్పుడున్నదో, ఇకముందు ఉండబోవుచున్నదో - (అనగా) భూత వర్తమాన - భవిష్యతులలో ఉన్నదంతా **అఖండము - ఏకము అగు ఓంకారమే.** త్రికాలములకు సంబంధించనిదేదైనా అన్యంగా ఉంటే, అదీ ఓంకార స్వరూపమే! అట్లాగే మంత్రములచే వర్ణింపబడు వివిధ దేవతా తత్త్వాలు, ఛందస్సు, ఋుక్కులు, కలా (కల్పనా) శక్తి తత్త్వము, ... ఈ తెలియబడేది అంతా కూడా ఓంకార స్వరూపమే! అంతా కూడా ఓంకారమునకు ఉపాఖ్యానమే!

ఈవిధంగా చేయబడుచున్న యజుర్వేదగానము **తారక ద్వితీయ పాదము.**

**అప్పుడు భారద్వాజుడు యాజ్ఞవల్క్య మహర్షిని ఇట్లు ప్రశ్నించారు.**

ఏ మంత్రముచే పరమాత్మ ప్రీతి పొందగలరు? ప్రీతి పొంది స్వాత్మస్వరూప దర్శనమును ప్రసాదించగలరు? హే భగవన్! యాజ్ఞవల్క్య మహనీయా! ఈ విషయం దయచేసి వివరించండి.

**శ్రీ యాజ్ఞవల్క్య మహర్షి**
**అష్టవిధ మంత్రము**

1. ఓంకార స్వరూపుడగు నారాయణుడే శ్రీకరుడు - శుభకరుడు అగు పరమాత్మ! సర్వమును ప్రకాశమానము చేయుటచే భగవంతుడు. 'అ'కారముచే చెప్పబడుచున్నవాడు. జన్మల కంటే మునుముందే ఉండి (జన్మలు అనే కర్తృత్వమును మహిమగా కలిగి ఉండి), జన్మలు తనవిగా కలవాడై ఉన్నారు. ఒక కార్యక్రమము నిర్వర్తించువాడు ఆ నిర్వహణకు మునుముందే ఉండి ఉండాలి కదా! ఆ మునుముందుగా ఉన్నవాడు నారాయణుడు. ఆయన వాస్తవానికి నిష్క్రియుడు. అయితే యిదంతా నవలా రచనలాగే, ఆయన కల్పనా విశేషమే! భూ-భువర్-సువర్లోక స్వరూపుడగు నారాయణునికి నమస్కరిస్తున్నాను. ఆ 'అ'కారవాచ్య జాంబవంతునికి **నమస్కరిస్తూ ఉపాసిస్తున్నాను.**

2. ఓంకార స్వరూపుడగు ఆ నారాయణ భగవానుడే శ్రీకరుడై **'ఉ'**కారముచే చెప్పబడుచున్నాడు. ఉపేంద్ర స్వరూపుడై, ఈ భూ-భువర్-సువర్ లోకములుగా, లోకపాలకులుగా, సర్వ జీవులుగా విస్తరించి, అధీశ్వరుడై, నాయకుడై ఉన్న ఆ **పరమాత్మకు నమస్కరించుచున్నాము. 'ఉ'కార వాచ్య సుగ్రీవునికి నమస్కారము.**

3. ఓంకార స్వరూపుడగు పరమాత్మ శ్రీ-శుభకరుడై **'మ'**కారముచే పిలువబడు చున్నారు. సర్వశుభములు ఆయన నుండే వెలువడుచున్నాయి. శివ తత్త్వ స్వరూప హనుమాన్‌గా భూ-భువర్-సువర్ లోక స్వరూపుడై వెలుగొందుచున్నారు. అట్టి **శ్రీమన్- సర్వ శుభంకర నారాయణునికి నమస్కరించుచున్నాము. 'మ'కార వాచ్య హనుమాన్‌కు నమస్కరిస్తున్నాను.**

4. ఏ పరమాత్మ శ్రీకరుడు ఓంకారస్వరూపుడో, శ్రీమన్నారాయణుడో, బిందు స్వరూప శత్రుఘ్నుడో, భూ-భువర్-సువర్ త్రిలోక స్వరూపముగా ప్రదర్శిత మగుచున్నారో, అట్టి సర్వము ప్రకాశింపజేయు భగవానునికి నమస్కరించుచున్నాము. ఈ లోకములన్నీ తన గర్భమున ధరించు బిందుస్వరూపులు! **'బిందు'** వాచ్య **శత్రుఘ్నులవారికి నమస్కారము.**

5. ఆ శ్రీమన్నారాయణుడే ఓంకార ప్రణవ స్వరూపుడు, శ్రీకరుడు - శుభకరుడు అయి వెలుగొందుచున్నారు. భగవానుడగు ఆ శ్రీమన్నారాయణుడే నాదస్వరూపుడై భరతుడుగా స్తుతించబడుచూ, భూ-భువర్-సువర్ త్రైలోక్య వ్యాపకులై ఉన్నారు. అట్టి శ్రీమన్నారాయణునికి నమస్కరించుచున్నాము. **'నాద' వాచ్య భరతుల వారికి నమస్కారము.**

ఓం యో హవై శ్రీ పరమాత్మా నారాయణః స భగవాన్
కలా స్వరూపో లక్ష్మణో
'భూర్భువస్సువః' తస్మై వై నమో నమః।

6. ఆ ప్రణవ 'ఓం' కార స్వరూపమే శ్రీకరుడగు పరమాత్మ శ్రీమన్నారాయణుడు. **ఆ భగవానుని కలా స్వరూపమే లక్ష్మణ స్వామి!** జగత్ కల్పన అంతా కర్తృత్వ - భోక్తృత్వాలతో సహా - ఆయనయే!

ఏ ఓంకార పరమాత్మయగు శ్రీమన్నారయణుడు తన కలా స్వరూపముచే లక్ష్మణ స్వామియై, భూ-భువర్-సువర్ లోక స్వరూపముగా ప్రకాశమానుడగుచున్నారో అట్టి శ్రీమన్నారాయణునికి నమస్కరించుచున్నాము.

4. ఓం యో హ వై శ్రీ పరమాత్మా నారాయణః స భగవాన్
కలాతీతా భగవతీ సీతా చిత్ స్వరూపా
'భూర్భువస్సువః' తస్మై వై నమో నమః।
ఓం యో హ వై శ్రీ పరమాత్మా నారాయణః స భగవాన్
తత్ పరః। పరమ పురుషః। పురాణ పురుషోత్తమో।
నిత్య శుద్ధ బుద్ధ ముక్త సత్యపరమానంద అనంత అద్వయ
పరిపూర్ణః బ్రహ్మైవాఽహమ్ రామోఽస్మి।
'భూర్భువస్సువః' తస్మై వై నమో నమః।
ఏతత్ అష్టవిధ మంత్రమ్ యో అధీతే...,
సో అగ్ని పూతో భవతి।
స వాయు పూతో భవతి।
స ఆదిత్య పూతో భవతి।
స స్థాణు పూతో భవతి ।
స సర్వైః దేవైః జ్ఞాతో భవతి।
తేన ఇతిహాస పురాణానాం
రుద్రాణాం శతసహస్రాణి
జప్తాని ఫలాని భవంతి।
శ్రీమన్నారాయణ అష్టాక్షర
అనుస్మరణేన గాయత్ర్యా
శతసహస్రం జప్తం భవతి।
ప్రణవా నామయుతం జప్తం భవతి।
దశపూర్వాన్ దశోత్తరాన్ పునాతి।
'నారాయణపదమ్' అవాప్నోతి।
య ఏవం వేద, తత్ విష్ణోః పరమం పదగ్ం
సదా పశ్యంతి సూరయః।
దివీవ చక్షుః ఆతతమ్।
తత్ విప్రా సో విపన్యవో
జాగ్రవాగ్ం సః సమింధతే।
విష్ణోః యత్ పరమం పదమ్।
సామవేద తృతీయ పాదః॥
ఇతి తారసారోపనిషత్
ఓం శాంతిః శాంతిః శాంతిః

**7. ఓం-ప్రణవ స్వరూప పరమాత్మయే శ్రీమన్నారాయణుడు. ఆ భగవానుని కలాతీత - భగవతి (కల్పనకు ఆవల సర్వమును వెలిగించుచున్నదై) చిత్‌శక్తి స్వరూపమే సీతాదేవి.** ఆ దేవి చిత్ స్వరూపిణి అయి భూ-భువర్-సువర్ లోకములుగా ద్యోతక మగుచున్నది. అట్టి ప్రమేయ శ్రీమన్నారాయణ స్వరూప **మూల ప్రకృతి స్వరూపిణీ మాతయగు** సీతా దేవికి నమస్కరించుచున్నాము. కలాతీతా వాచ్య 'సీతామాత'కు నమస్కారము.

ఓంకార స్వరూపుడు, శ్రీకరుడు అగు పరమాత్మయే శ్రీమన్నారాయణుడు. అట్టి నారాయణస్వామి సర్వమునకు ఆవల ఉన్నట్టి **తత్పరుడు!** సర్వ జీవుల స్వరూపుడై వెలుగొందు **పరమ పురుషుడు!** త్రికాలములకంటే మునుముందే ఉండి, సర్వ జీవులలో 'ఉత్తమ పురుషగా' వెలుగొందు **పురాణపురుషోత్తముడు.** నిత్యుడు. శుద్ధుడు- నిర్మలుడు! కేవల బుద్ధ స్వరూపుడు. నిత్యముక్తుడు సత్యము! పరమానందుడు! తనకు వేఱైనదేదీ లేనివాడు! **స్వతఃగానే పరిపూర్ణుడు.** అట్టి పరాత్‌పరుడగు శ్రీ రామచంద్రమూర్తికి నమస్కరిస్తున్నాను.

అట్టి శ్రీరామచంద్ర పరబ్రహ్మమే ఈ సర్వము! ఆ పరబ్రహ్మమే నేను! భూ-భువర్-సువర్ లోకములుగా ప్రకాశించు అద్వయ శ్రీరామ తత్త్వమే నేను! నేనే ఇదంతా! (ఈ సర్వముగా మూర్తీభవించినవారు, జగత్తుగా రమించువారు అగు శ్రీరామచంద్రునికి నేను వేరు కాదు. వేరు - అనే అహంకారం త్యజిస్తున్నాను).

ఈ తత్ బ్రహ్మతత్త్వ వర్ణితమగు "అష్టవిధ మంత్రము"ను ఎవ్వరు ఉపాసిస్తారో, సేవిస్తారో, నిర్వర్తిస్తారో... వారు అగ్ని-వాయు-ఆదిత్య పవిత్ర స్వరూపులుగా అగుచున్నారు. స్థాణువు (నిశ్చలులు) అయి సర్వ చాంచల్యములను జయించివేస్తున్నారు. సర్వ దేవతల తత్త్వ స్వరూపమేమిటో ఎరుగుచున్న వారగుచున్నారు.

ఈ అష్టవిధ మంత్ర జపముచే జీవుడు ఇతి హాస - పురాణములు పఠించిన ఫలమును, రుద్రమును లక్షసార్లు పారాయణము చేసిన ఉత్తమోత్తమ ఫలమును పొందుచున్నాడు.

**"ఓం నమో నారాయణాయ"** అను శ్రీమన్నారాయణ అష్టాక్షరీ మంత్రమును నిత్యము జపిస్తూ - స్మరించువాడు లక్ష గాయత్రీ జప ఫలమును పొందగలడు.

ప్రణవమును అనుక్షణము ఉచ్చరించిన జప ప్రయోజనము పొందగలడు. ఆతనికి వెనుక పదితరములవారు, ముందు పది తరముల వారు పవిత్రత సంతరించు కొనుచున్నారు.

విద్వాంసుడగు సూరుడు - సర్వే సర్వత్రా సర్వదా ఆ విష్ణు పరమ పదమునే, విష్ణు తత్త్వమునే చూస్తూ ఆస్వాదిస్తూ ఆనందిస్తున్నారు. "విశ్వమంతా విష్ణువే" అను ప్రశాంతత సంతరించుకుంటున్నాడు.

ఆ శ్రీమన్నారాయణ తత్త్వమే (శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న - హనుమత్ సమేత శ్రీరామచంద్ర పరబ్రహ్మ తత్త్వమే) ఆకాశమంతటా విస్తరించినదై ఉన్నది.

జాగరూకులగు వేదవిదులైన విప్రులు **ఆత్మానారాయణ - శ్రీరామచంద్ర పరబ్రహ్మమునే** సర్వదా పొంది, బ్రహ్మానంద సంతుష్టులగుచున్నారు. అదియే **విష్ణు పరమపదము! విష్ణు సాయుజ్యము.**

ఇది సామవేద గాన రూపమగు శ్రీమన్నారాయణ తృతీయ పాదము.

**ఇతి తారసారోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 5 తారసారోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



ఓంకార స్వరూపుడు, ప్రణవ స్వరూపుడు, సర్వతత్త్వ స్వరూపుడు, సోఽహమ్ స్వరూపుడు అగు శ్రీరామచంద్ర పరబ్రహ్మమునకు నమస్కరిస్తూ....

❖

ఒకానొకప్పుడు వేద-వేదాంగ-పురాణ-ఇతిహాసకోవిదుడు, మహాతపశ్శాలి - అగు యాజ్ఞవల్క్యుడు **దేవతల గురువు, తత్త్వార్థకోవిదుడు, సర్వజన శ్రేయోభిలాషి, మహాప్రాజ్ఞుడు, పరమోదార స్వభావుడు,...** "గురువరేణ్యులు" అగు శ్రీ బృహస్పతిని సమీపించారు. ప్రదక్షిణ పూర్వక సాష్టాంగదండ ప్రణామములు సమర్పించిన తరువాత యాజ్ఞవల్క్య మహర్షి, సద్గురువగు బృహస్పతితో ఆధ్యాత్మక విషయాలు సంభాషించసాగారు. "**కురుక్షేత్రము**" సంబంధించి సత్సంగ - ఆత్మజ్ఞానాభిలాష పూర్వక విశేషాలు చెప్పుకోసాగారు.

❖

**యాజ్ఞవల్క్యుడు :** గురుదేవా! లోకకళ్యాణమూర్తీ! బృహత్ మేధావీ! దేవగురూ! బృహస్పతి భగవన్! "**కురుక్షేత్రము**" అను యోగ-తత్త్వ విద్యా ప్రతిపాదితమగు పవిత్రస్థానము ఉన్నదెక్కడ? అద్దానిని ఏ సాధనచే చేరగలము? ఆశయములేమిటి? మార్గమేమిటి? ప్రయోజనమేమిటి? ఈఈ సంబంధించిన విశేషాలు నాకు బోధించవలసినదిగా మిమ్ములను అభ్యర్థిస్తున్నాను.

**జగద్గురువు బృహస్పతి :** ఓ యాజ్ఞవల్క్యా! ఈ దేహమే కురుక్షేత్రమయ్యా! ***(దేహమ్ దేవాలయమ్ ప్రోక్తః)*** పంచమహాభూతాని, అహంకారో, బుద్ధిః, అవ్యక్తమ్, పంచ జ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, ఇంద్రియములకు గోచరించే సమాచార విశేషాలు, ఇచ్ఛ, ద్వేషము, సుఖ-దుఃఖ భావాలు, విషయములతో ఏర్పడే వివిధ రీతులైన సంఘాతములు(Associated Experiences), కదలించే తత్త్వము, కదలునవి, ధృతి-ఉత్సాహాలు, ఊహ-అపోహలు - ఇవన్నీ **క్షేత్రములోని విశేషాలు.** అట్టి క్షేత్రము అనబడే ఈ దేహము **దేవతల దేవయజ్ఞములకు యజ్ఞశాల.** దేవతలు వారి విద్యుక్త ధర్మముయొక్క ప్రదర్శనమునకు వేంచేసియున్న గృహము. అంతేకాదు 'బ్రహ్మీతత్త్వము' కూడా ఇక్కడి "క్షేత్రము"లో సర్వదా వేంచేసి, దిక్కులన్నీ ప్రకాశింపజేయునదై ఉన్నది.

ఈవిధంగా,..... **యదను "కురుక్షేత్రం",... దేవానాం దేవయజనగ్ం, సర్వేషాం భూతానాం బ్రహ్మ సదనమ్। తస్మాత్ యత్ర క్వచ న గచ్ఛేత్!...** ఈ శరీరమే దివ్యశక్తి సమన్వితులగు దేవతల కార్యక్రమ - ప్రదర్శనములు, సర్వ స్వరూపమగు **బ్రహ్మతత్త్వమునకు బ్రహ్మసదనము** అయి ఉన్నది. ఇక దీనిని వదలి మరింకెక్కడికో, దేనికోసమో, మోక్షము కొరకై వెళ్ళి వెతకవలసినది ఏమున్నదయ్యా? దేహములో సర్వ తత్త్వములు వేంచేసి, జ్ఞానికి ఆత్మతత్త్వదర్శనమునకు ఉపయుక్తమై, సంసారబంధ విముక్తిని ప్రసాదించగల పవిత్ర తీర్థస్థానము కూడా! అందుచే, "ఇది అవిముక్త క్షేత్రము. బద్ధుడగు జీవుడు తన బంధ విముక్తి కొరకై ఆశ్రయించుచున్న పవిత్ర

ప్రదేశము. జన్మయొక్క ఉద్దేశ్యము బంధవిముక్తియే" – అని గమనించాలి.

ఇక్కడ మరొక ముఖ్య విషయం కూడా! **అత్ర హి జంతోః ప్రాణేషు ఉత్క్రమమాణేషు రుద్రః తారకమ్ బ్రహ్మ వాచష్టే!** ఈ జీవుడు దేహములో ప్రాణములు విడుచుచున్నప్పుడు రుద్రభగవానుడు తారకబ్రహ్మతత్త్వమును ఉపదేశించుచున్నారు. (**సర్వమ్ వ్యర్థమ్ మరణ సమయే సాంబయేవః సహాయః** – అని అందుకే అంటారు). తద్వారా ఈ జీవుడు తారకబ్రహ్మమును ఎరుగగలడు సుమా! అట్టి సమయములో ఈ జీవుడు దృశ్య ధ్యాసలను జయించినవాడై ఉంటే, రుద్రతారకమును తప్పక పొందగలడు.

అందుచేత విజ్ఞులగు యోగులు, వేదవిహితులు, తత్త్వజ్ఞులు ("దేహమ్ దేవాలయమ్ ప్రోక్తమ్" ... అనువాక్యముల ద్వారా) ఈ దేహము మహదత్త్వముతో కూడిన "కురుక్షేత్ర పుణ్యస్థలము, తరింపజేయు పరమార్థమును సిద్ధింపజేయగల ఆశ్రమము, తీర్థస్థలము పుణ్యక్షేత్రము కూడా – అని ఎలుగెత్తి గుర్తు చేస్తున్నారయ్యా!

**తేన అసావత్ అమృతీభూత్వా 'మోక్షీ' భవతి॥** ఆవిధంగా రుద్రదేవునిచే (ఇష్టదైవము నుండి) అమృతరూపమగు 'తారకము'ను పొందిన ఈ జీవుడు మోక్షము పొందగలడు. అందుచేత అవిముక్తము (బంధముతో కూడిన / కలిగించగల) కురుక్షేత్రమనబడు ఈ దేహమును, **"ఓ దేహమా! నీవు నాకు బ్రాహ్మీస్థితిని కలిగించగలవు కదా!"** అని భావించాలి. ఇద్దానిని అల్పవస్తువుగా చూస్తూ, ఇంద్రియ విషయములకు మాత్రమే సమర్పించి ఉండరాదు. ఇది జీవులచే సర్వదా గమనించబడు గాక!

ఈవిధముగా భగవానుడగు బృహస్పతి తనకు శిష్యుడై ఆశ్రయించిన యాజ్ఞవల్క్యునికి తారకమంత్రము – **తారక బ్రహ్మముల** గురించి, **కురుక్షేత్రమగు** ఈ దేహముయొక్క **ఉపకరణత్వము** గురించి అనేక విషయాలు **బోధించారు**.

⌘

ఆతీరుగా బృహస్పతి – యాజ్ఞవల్క్య గురు – శిష్య సమాగమము తరువాత చాలా రోజులు గడిచాయి. మరొక ఒకానొక సందర్భములో గురువగు **యాజ్ఞవల్క్య మహాశయుని** సందర్శనార్థమై **భారద్వాజ మునీశ్వరుడు** యాజ్ఞవల్క్యాశ్రమమును సందర్శించారు. నమస్కరించి, ఈవిధంగా పరిప్రశ్నించారు.

**భారద్వాజ మునీంద్రుడు :** హే మహాత్మా! యాజ్ఞవల్క్యా! 'తారకము' గురించి వివరించ ప్రార్థన! తారయతి–ఇతి తారకమ్ అంటారు కదా! **తరింపజేయునదేది? తరింపజేయబడునది ఏది? తారకమును ఏ ఉపాసనచే మేము ఆశ్రయించాలి?**... ఈ ఈ విషయాలు వివరించ వేడుచున్నాను.

**యాజ్ఞవల్క్యుడు : "ఓం నమో నారాయణాయ"** ఈ అష్టాక్షరీ మంత్రము జీవుని సంసారమునుండి తరింపజేస్తుంది. కాబట్టి 'తారకము' అని స్తోత్రము చేయబడుచున్నది. ఈ మంత్రముచే ఉపాసించబడునది 'చిదాత్మతత్త్వమే'! ఈ అష్టాక్షరీ మంత్ర తాత్పర్యము కేవలమగు స్వస్వరూపమే!... అను అవగాహనతో అనుసంధానము చేయు వాడు సంసార బంధము నుండి సముద్ధరించబడగలడు. అష్టాక్షరీ యొక్క అంతరార్థమును భావించి, మంత్రమును ఉపాసించాలి. అది వివరించుకుందాము!

⌘

## "ఓం"

"ఓం" సత్ (ఉనికి) –చిత్ (ఎరుక) –ఆనంద (అనుభూతి) స్వరూపము. ఏకము – అక్షరము అగు పరమాత్మ. ఈ ద్రష్ట– దర్శనము– దృశ్యము–బ్రహ్మాండము ఎద్దానిలో కల్పనచే స్థానము కలిగియున్నాయో... అయ్యదియే ఆత్మకు సంజ్ఞయగు 'ఓం'! (దృష్టాంతంగా – ఒకడు కల కంటూ ఉన్న సందర్భములో, **కల తనదైనవాడు కథకు కథారచయిత** వంటివాడు.

**ఏకమ్** .... 'అనేకము'గా (అనేక జీవులు – ద్రష్టలు మొదలైనవిగా) కనిపిస్తూ, ఇదంతా కూడా సర్వదా ఏకమే అయి ఉన్నది! అట్టి అఖండాత్మను ఉద్దేశ్యించునదే ఓం!

**అక్షరమ్** .... జన్మలచే కర్మలచే – ఉపాధులచే – దృశ్యపరంపరలచే – ఎదగటముగాని తరగటము గాని లేనట్టిది. మార్పు చెందనిది. దృష్టాంతానికి, అనేక ఆభరణములుగా అగుచూ కూడా బంగారము మార్పు చెందదుకదా! స్వప్నములోని వివిధ స్వప్న దృశ్య సందర్భ సంఘటనలచే స్వప్నము తనదైనట్టివాడు మరొకటేదోగా మారడుకదా! బాల్యం నుండి – ఇప్పటి వరకు ఏ ఒక్క జీవుని 'నేను' కూడా పెరగదు, తరగదు కదా! ఆత్మ సర్వదా అక్షరము! జాగ్రత్ – స్వప్న – సుషుప్తులు తనవై, వాటి అంతర్గత విషయములచే తాను మార్పు చేర్పులు పొందనట్టి తత్త్వము.

**సమగ్రము – సర్వము అగు ఆత్మయే 'ఓం'** అను అక్షరముచే ఉద్దేశ్యించబడుచున్నది.

### "నమో"

**'నమః'** (ద్వి–అక్షరీ!) : ప్రకృతి స్వరూపము. ద్రష్ట – దృశ్యముల సంబంధ రూపము. పరమాత్మ – జీవాత్మల ఏకత్వము, అభిన్నత్వము సూచిస్తోంది. (న = అందరిలోని 'నేను'. మ = వ్యష్ఠిగతంగా కనిపించే 'నేను'. ఓం = ఏకమే అయిన ఉన్నట్టి 'నేను')

### "నారాయణాయ"

**'నారాయణాయ'** (పంచాక్షరీ!) : జీవాత్మకు సాక్షియై, జీవాత్మను ఉపకరణముగా కలిగి ఉన్నట్టిది. పరమ్ – ఆవల గల ఆత్మ స్వరూపము. కాబట్టి 'పరమాత్మ'! అసంఖ్యాక తరంగములన్నీ సముద్ర జలస్వరూపమే అయినట్లు,.... ఈ జీవులందరూ 'నారాయణాయ' అను బ్రహ్మానందసాగర తరంగాలే! (నార = జలము; నారాయణమ్ = అనేకతరంగములలోని ఏక స్వరూప జలము, జీవులు అనేకంగా ఉన్నా కూడా,.... ఏకమే అయి ఉన్న 'ఆత్మ')

ఈవిధముగా ఏకాక్షరార్థము – ద్వి అక్షరార్థము – పంచాక్షరార్థము ... తెలుసుకొని, ఉద్దేశ్యించి, పూర్ణ భావనతో ... అష్టాక్షరీమంత్రమును జపించువాడు 'మార్పు' యొక్క పరిధిని దాటినవాడై, అమృత స్వరూపుడగుచున్నాడు. అనగా, సందర్భములకు, జాగ్రత్ – స్వప్న – సుషుప్తులకు, దేహ–దేహాంతరములకు 'సాక్షి' అయి ఉన్న **"కేవలీరూపము"** ను గమనిస్తున్నాడు. మనో–బుద్ధి–చిత్త–అహంకారములకు, దేహ–దేహాంతరములకు ఆవల గల **'నేనైన నేను'**ను ఆస్వాదిస్తున్నాడు.

### "త్రిపాద నారాయణము"

**'ఓం నమో నారాయణాయ'** అను తారకమంత్రము గురించి ఋగ్వేద–యజుర్వేద–సామవేదములు గానం చేయు 'త్రి' వివరణలు త్రిపాదములుగా చెప్పబడుచున్నాయి.

#### తారకముయొక్క మొదటి పాదము (ఋగ్వేదాంతర్గతము) (Elplanation - 1)

| | |
|---|---|
| **'ఓం' కారో** | సృష్టికర్తయగు సంజ్ఞార్థము బ్రహ్మదేవుడు! సృష్టి ముందే గల సృష్టి సంకల్పుడు. (ఊహా జననము) |
| **'న' కారో** | స్థితి – రక్షకుడు అగు విష్ణుదేవుడు! (ఊహా మననము) |
| **'మః' కారో** | లయకారుడగు రుద్ర దేవుడు! (ఊహా లయము) |
| **'నా' (న) కారో** | అంతటా ... **అన్నీగా విస్తరించినదైయున్న 'ఈశ్వరత్వము'**నకు సంజ్ఞ! (ఊహలో అనేక రూపములుగా కనిపించు దృశ్యకల్పన) |
| **'రా' కారో** | **బ్రహ్మాండము** (లేక) **విరాట్‌పురుషుడు!** (విశ్వాభిమాని) |
| **'యః' కారో** | (వ్యష్ఠి) పురుషుడు (లేక) జీవుడు. (The one who is immersed and involved in experiencing) (వ్యష్ఠి అభిమాని) |
| **'ణా' (ణ) కారో** | సర్వమును 'ఎరుక' అను చైతన్య ప్రజ్ఞచే ఉద్దీపింపజేయు, వెలిగించు భగవాన్! (ఎరుక) |
| **'య' కారో** | 'జీవాత్మ'ను ఉపకరణముగా కలిగియున్న తత్త్వమగు పరమాత్మ. (ఉదాహరణకు నాటకంలోని పాత్ర 'జీవాత్మ' అయితే, ఆ నటుని సహజ వ్యక్తిత్వస్వరూపము పరమాత్మ. జీవాత్మ జగన్నాటకములో పాత్రధారి అయితే, పరమాత్మ ఆ పాత్రకు వేరైన లక్షణుడగు పర(నాటకమునకు ఆవల) స్వరూపుడు. |

స్వప్నమును దృష్టాంతంగా ఇక్కడ తీసుకుంటే (Vision of Dream - Visualising maintaining and withdrawing)

| | |
|---|---|
| **'ఓం' → బ్రహ్మ** | మనలోని స్వప్న సంకల్పమును సృష్టించి, స్వప్న దృశ్యమునకు రూపునిచ్చు **స్వప్న ప్రారంభ స్వకీయతత్త్వము.** |
| **'న' → విష్ణుః** | స్వప్న స్థితిని – గతిని నడపుచూ ఉన్న **స్వకీయ తత్త్వము!** |
| **'మః' → రుద్ర** | ఆ స్వప్నమును తనలో ఉపశమింపజేయు **స్వకీయ లయతత్వము!** |
| **'నా' → ఈశ్వరో** | స్వప్నమంతా నిండి ఉన్నట్టి స్వకీయ స్వప్న చైతన్య తత్వము. **స్వప్న ప్రజ్ఞ.** |
| **'రా' → విరాట్** | అనేక స్వప్న పరంపరలన్నీ తనవైన, స్వప్నదృశ్య బ్రహ్మాండ పరంపరలు. |

**'యః'→ వ్యష్ఠి పురుషః** స్వప్నములోని – స్వప్నాంతర్గత ద్రష్ట. స్వప్నములో భాగమై స్వప్నములోని దృశ్యాలన్నీ జగత్ దృశ్యమువలె తనకు వేరైనట్లు చూచువాడు. (స్వప్న పరిమిత వ్యష్ఠి అభిమాని)

**'ణా' → భగవాన్** స్వప్నములో అన్నీ ప్రకాశింపజేయు భగవంతుని స్వప్న చైతన్యము. ఏ ఏరుకచే సర్వము ఎరుగబడుచున్నదో.... అట్టి **"ఎరుక రూపుడు".**

**'య' → పరమాత్మ** స్వప్నమంతటికీ పరమై (వేరే అయి) స్వప్నము నాదైన 'నేను' → చైతన్యము.

**"ఓం నమో నారాయణాయ"** .... అను అష్టాక్షరి ఈవిధంగా 'పరము' అయినట్టి సర్వతత్త్వ సమన్వితుడగు **పరమ పురుషునికి** సంబంధించిన ఉపాసనయే! **అయం ఋగ్వేదః ప్రథమ పాదః।** ఈ విధంగా తారకము యొక్క మూడు పాదములలో ఋగ్వేదముచే గానము చేయబడుచున్న మొదటి పాదము. సర్వములోని ఏకస్వరూపుడు – సర్వమునకు వేరైనవాడు అగు నారాయణ ధ్యాత–ధ్యాన స్వరూపుని ఋగ్వేదములోని ఋక్కులు స్తుతించుచున్నాయి.

## తారకము యొక్క రెండవ పాదము *(యజుర్వేదాంతర్గతము)* (Explanation - 2)

ఇక అష్టాక్షరి గురించి ***యజుర్వేదములోని*** వర్ణన దృష్ట్యా చెప్పుకుంటున్నాము.

**ఓం** ="తత్" అను శబ్దమునకు అర్థము అయినటువంటి (1) అక్షరము (2) ఏకము అగు పరబ్రహ్మము!

అట్టి సూక్ష్మమగు "తత్ అక్షరపరబ్రహ్మము" – తనకు ద్వితీయము కానట్టి **'క్షరము'**ను కల్పించుకొనుచూ, మరొకప్పుడు ఆ కల్పనను తన యందే లయింపజేసుకొనుచున్నది. పరమాత్మ తత్త్వమగు ఓంకారము అక్షయము – అఖండము అయి, అష్టవిధములుగా కూడా అక్షరమై సంప్రదర్శితమగుచూ కనిపిస్తోంది.

1. అ కార ప్రథమాక్షరము ..... జాగ్రత్ కల్పన! జాగ్రత్ పురుషకారము!
2. ఉ కార ద్వితీయాక్షరము .... స్వప్న కల్పన! స్వప్న పురుషకారము!
3. మ కార తృతీయాక్షరము .... సుషుప్తి కల్పన! సుషుప్తి పురుషకారము!
4. 'బిందు' (చ)తురీయాక్షరము .... తురీయము. (జాగ్రత్–స్వప్న–సుషుప్తి సంచార స్వరూపుడగు నాలుగవవాడు).
5. 'నాద' పంచమాక్షరము .... నాదము. చెవులు మూసుకొనినప్పుడు అంతరమున వినబడు నాద సంజ్ఞా స్వరూపుడు.
6. కలా .... షష్టాక్షరము .... (కల్పన)
7. కలాతీతా (కల్పన తనదైనవాడు) .... సప్తమాక్షరము ... (జీవుడు)
8. తత్–పరుడు. (అఖండముగా – సమముగా తిష్ఠితమైయున్న తత్) .... అష్టమాక్షరము (జీవునికి సాక్షి)

ఈ ఎనిమిది ఎద్దాని ప్రదర్శనములో అది **ఏకాక్షర తారకము!**

**"ఈ '8' అక్షరములు స్వస్వరూప–ఏకాక్షరముయొక్క లీలా వినోద కల్పనలే!"** అని ఎరిగి ఉండటమును, మౌనముగా – అతీతముగా – సాక్షిగా దర్శించు అభ్యాసమును **"తారకత్వము"** అనబడు తారకయోగము యొక్క తత్త్వార్థము **తారకత్వాత్ తారకో భవతి।** తారకత్వమే తరింపజేయు తారకం! **తదేవతారకం బ్రహ్మ త్వమ్ విద్ధి।** నీవే ఆ తారక బ్రహ్మమువు – అని ఎరుగుము.

తారకత్వమును అభ్యసించి ఈ జీవుడు తారకుడు (తరతిశోకమ్–తారయతి–తరించువాడు) అగుచున్నాడు. **"పరమాత్మ స్వరూపుడనగు నేను ఈ '8' అక్షరరూపములను (జాగ్రత్–స్వప్న–సుషుప్తి–తురీయ–నాద–కలా–కలాతీత–తత్పరము)** నా యొక్క '8' విశేషములుగాను, **నేను వాటికి వేరై – శ్రేష్ఠమైనవాడుగాను ఉన్నాను** – అని గమనించి దర్శించుచున్నాడు. తారకత్వమును ఆశ్రయించి, తరించువాడను నేనే! **"కేవల పరమాత్మస్వరూపుడనే సర్వదా అయి ఉన్నాను" .... అను స్వయం పర–పరమాత్మ స్వరూపుడవై ఉండటమే తారకము.**

అట్టి తారక యోగతత్త్వమే ఇక్కడ ఆరామ–విరామములతో కూడి ఉంటోంది. "రామ బ్రహ్మతత్త్వము"గా చెప్పబడుచూ, ఈవిధముగా గానము చేయబడుచున్నది.

| | | |
|---|---|---|
| **'అ'కారాత్**<br>బ్రహ్మా-జాంబవాన్-ఇతి | జన్మరహితమగు బ్రహ్మము సృష్టికి ఉపక్రమించటము | సృష్టి-సృష్టించువాడు. జాంబవాన్ సంజ్ఞ. |
| **'ఉ'కారాత్**<br>ఉపేంద్రో హరి నాయకః | అక్షర సంభూతుడు. క్షరమునకు ఆధారమైన అక్షరముగా అవతరించువాడు. | స్థితి కల్పన. అందుకు సంజ్ఞ ఉపేంద్రుడు.<br>ఆయనే హరి. ఆయనే సర్వమునకు నాయకత్వం వహిస్తున్నటివారు. హరి (కోతుల) నాయకుడగు సుగ్రీవుడుగా - సంజ్ఞ! |
| **'మ'కారాత్**<br>శివస్తు - హనుమాన్! | అక్షర సంభూతము. అక్షరమై దేహములో సాక్షిగా ఉన్నట్టిది. బుద్ధి సాక్షి, | బ్రహ్మాండమునందు శివుడు-హనుమంతుడుగా ప్రసిద్ధి పొందుచున్నట్టిది. హనుమంతుడుగా- బుద్ధి రూపముగా, గురువుగా ప్రదర్శనమగుచున్న అక్షరము |
| **'బిందు'**<br>**ఈశ్వర సంజ్ఞస్తు**<br>**శత్రుఘ్నః**<br>**చక్రరాట్ స్వయమ్** | ఈశ్వర, సంజ్ఞస్తు అంతటా సాకారమై విస్తరించి ఉన్నట్టిది. ఈశ్వరత్వము.<br>స్వయముగా చక్రరాట్ తెలుసుకొనుచున్న జ్ఞేయతత్త్వము - మహాప్రభుః జ్ఞేయో | ఈశ్వర నామ రూపంలో విస్తరించి అంతర్లీనుడై ఉన్నవాడు.<br>ఎరుగుచున్నట్టిదే ఎరుగబడు దాని రూపమగు జ్ఞేయము. ఎరుగుచున్నవాడు ఎరుగబడుదాని నియామకుడు కాబట్టి మహాప్రభువు. |
| **నాదో భరతః**<br>**శంఖనామకః** | శంఖ నామకః - శంఖ నినాదము | నినాద సంజ్ఞ।<br>సర్వశబ్ద స్వరూపుడు |
| **కలాయాః**<br>**పురుషఃసాక్షాత్**<br>**లక్ష్మణో**<br>**ధరణీధరః** | కల్పించుకొని అనుభవించు పురుషుడు! జీవుడు<br><br>ధరణీధరః | దేహములో ఉండి అన్నీ ఆస్వాదించువాడు!<br>పురుషుడు! జీవుడు!<br>ఈ భూమిని ధారణ చేయువాడు.<br>భరించువాడు. భర్త. |
| **కలాతీతా**<br>**భగవతీ స్వయం**<br>**సతేఽ తి సంజ్ఞికా** | మూల ప్రకృతి స్వరూపము. | ప్రకృతి. సర్వమును వెలగించు మూలతత్త్వము.<br>భగవతి।<br>ప్రప్రథమమగు ఊహ, భావన, సంకల్పము, స్వభావము! |

**తత్పరః పరమాత్మా చ! సర్వము తానే అయి, సర్వమునకు వేరైన తత్త్వము పరమాత్మ!** ఆ పరమాత్మయే పురుషోత్తముడగు శ్రీరామ చంద్రుడు ....!

పురుషోత్తముడు = ఉత్తమ పురుషుడు! 'నేను'ను భావనచేస్తూ, అట్టి భావనకు ముందే ఉన్న ఉత్తమపురుష (First Person)

ఓ భారద్వాజా! పైన చెప్పుకొన్న తీరుగా ఈ కనబడేదంతా కూడా ఆ అక్షరమగు 'ఓం' కార స్వరూపమేనయ్యా! **ఓం ఇతి ఏతత్ అక్షరమ్ ఇదమ్ సర్వమ్।** పరమ సత్యమును సందర్శించు అభ్యాసమే 'ఓంకారోపాసన'! ఈ అనేకమునకు ఆధారమగు ఏకత్వ దృష్టియే ఓంకార సిద్ధి! **అదియే తారసారము.**

***'సర్వము' అయిన 'ఓంకారము' గురించి మరి కొంతగా ఉపాఖ్యానించుకుందాము.***

**భూతం భవ్యం భవిష్యం యచ్చ ।** ఇతః పూర్వము ఏదైతే ఉన్నదో, ఇప్పుడేమేమి ఉన్నదో, ఇకముందు ఏవేమి ఉండినట్లుగా అనుభవము కానున్నదో ... అదంతా కూడా సర్వదా ఓంకారమే! పరబ్రహ్మమే! ఈ జీవుని కేవల స్వస్వరూపమే! దేహముల రాక - పోకలకు కూడా సాక్షి - ఆధారము అయి ఉన్నట్టిదే 'ఓం' శబ్దార్థ 'ఆత్మ'!

- త్రిలాకలములకు (కాలమునకు అతీతమై) ఏదైనా ఉంటే,... అదీ ఓంకార స్వరూపమే!

- సర్వమంత్రములు, సర్వదేవతా వర్ణనలు, ఛందస్సు, ఋగ్వేదములోని ఋక్కులు, కలాశక్తి (ప్రకృతి శక్తులు), సృష్ట్యాత్మకమైనది (సృష్టించబడుచున్నదిగా కనిపించేది), సృష్టించువాడు.... ఇదంతా పరమాత్మ యొక్క లీలా విలాసమే! ఓంకార రూపమే! ఆ పురమ పురుషునికి వేరైనట్టిదేదీ లేదు. జీవులుగా, అనుభవములుగా, మనోబుద్ధి చిత్త అహంకారములుగా, వాటి ఆకార సాకార-

వికార-నిరాకారములుగా, సృష్టి స్థితిలయములుగా... ఈవిధంగా కనిపించేది, అనుభవమయ్యేది, అనుభవముకానిది.... అంతా కూడా **ఓంకార స్వరూపమే!** ఇదియే **'ఓం నమో నారాయణాయ'!**..... అను మంత్రముయొక్క మంత్రార్థము! తత్త్వార్థము!

***ఇతి తారకము యొక్క యజుర్వేద సారమగు రెండవపాదము.***

## తారకము యొక్క మూడవ పాదము (Explanation - 3)
### *(సామవేదాంతర్గతము)*

అప్పుడు భారద్వాజ మునీంద్రులవారు సద్గురువగు శ్రీ యాజ్ఞవల్క్య మహర్షిని ఇట్లా అడుగసాగారు.

**భారధ్వాజ మునీంద్రుడు :** మహాత్మా! యాజ్ఞవల్క్యా! సర్వమూ తానై, సర్వమునకు వేరైనట్టి పరబ్రహ్మమును ఉపాసించటమెట్లా? **అథ కైః మంత్రైః పరమాత్మా ప్రీతో భవతి?** మననాత్ త్రాయతే ... అను ప్రసిద్ధిగల ఏ మననముచే ఆ పరమాత్మ సంతోషిస్తారు? స్వాత్మానంద స్వరూపులై ప్రసన్నము అయి, సంప్రదర్శనములవుతారు? హే భగవాన్! ఈ విషయమై నాకు చెప్పి, త్రోవ చూపండి!

**యాజ్ఞవల్క్యుడు :** ఓ భారద్వాజా! సర్వభూతములు - దృశ్యజాలములు తానే అయి, సర్వసాక్షిగా వేరే అయినట్టి పమాత్మయగు శ్రీమన్నారాయణుడు **'ఓం నమోనారాయణాయ'** అను అష్టాక్షరీ మంత్రార్థ భావనచే తప్పక ప్రసన్నులై, స్వానుభవ రూపముగా ప్రదర్శితులు కాగలరని మరొక్కసారి గుర్తు చేస్తున్నానయ్యా! మంత్ర మననముచే అజ్ఞాన దృష్టులు పవిత్రత సంతరించుకొనుచుండగా, నారాయణత్వము స్వభావమై సిద్ధిస్తోంది. తరంగము జలమే కదా! **జీవులందరూ ఏకోనారాయణ స్వరూపులే!**

నీవు అడుగుచున్న విషయమై, శ్రీమన్నారాయణ పరబ్రహ్మతత్త్వమును అతి త్వరగా ప్రసాదించగల మహర్షి ప్రవచితమైన "అష్టశ్లోకీ అష్టాక్షరి" ... ని ఉదహరిస్తూ, అభివర్ణిస్తున్నాను. ముముక్షువులకు-సాధకులకు సులభ ప్రసన్నము అయి ఉన్నది కనుక ..., వినండి.

1. <u>**ఓం యో హ వై శ్రీ పరమాత్మా! నారాయణః స భగవాన్। "అ" కార వాచ్యో జాంబవాన్ భూర్భువస్సువః తస్మైవై నమో నమః**</u> ఓం-ప్రణవ స్వరూప పరమాత్మా! భగవాన్ నారాయణా! 'అ'కారవాచ్యుడవై జాంబవాన్‌గా (జనింపజేయువాడవుగా) భూ భువర సువర్ త్రిలోక ప్రసిద్ధుడవైనట్టి నీకు నమో వాక్కములయ్యా! జాంబవాన్ నారాయణునికి నమోవాక్కములు. (బ్రహ్మయొక్క అంశ)

2. <u>**ఓం యో హ వై శ్రీ పరమాత్మా! నారాయణః। స భగవాన్। "ఉ" కార వాచ్యో "ఉపేంద్ర" స్వరూపో, 'హరి' నాయకో భూర్భువస్సువః తస్మైవై నమో నమః**</u> ఆ నారాయణుడే ఓంకార స్వరూపుడగు పరమాత్మ! ఆ భగవానుడు,

   - 'ఉ' కారముచే ఉద్దేశ్యించబడువాడు ఇంద్రియలోక స్వరూపుడు.

   - 'సుగ్రీవుడు (హరి-కోతుల (ఇంద్రియములు) నాయకుడు)గా ఉన్నట్టి వారు! సృష్టి స్వరూపుడు! నియామకులు! సర్వము తానైన హరి భూ భువర్ సుర్ లోకములుగా ప్రకాశించుచున్నారు. అట్టి ఉకారవాచ్య-ఉపేంద్రనారాయణునికి, ***హరి (సుగ్రీవ) నారాయణునికి నమో నమో నమో నమః! (ఇంద్రుని అంశ)***

3. <u>**ఓం యో హ వై శ్రీ పరమాత్మా! నారాయణః। స భగవాన్। "మ" కార వాచ్యం, శివ స్వరూపో హనుమాన్ భూర్భువస్సువః తస్మైవై నమో నమః**</u> పరమాత్మ అగు ఆ శ్రీమన్నారాయణ భగవానుడు 'మ' శబ్దముచే చెప్పబడుచున్నారు. శివభగవానుడు అగు ఆయన సర్వశుభ ప్రదాత! ఆయనయే 'హనుమాన్' స్వరూపుడై పరతత్త్వమునకు జేర్చు సద్గురువు. భూ భువర్ సువర్ లోకముల రూపముగా ప్రకాశమానుడగుచున్న అట్టి పరమాత్మకు నమస్కార సహస్రములు! శివ-హనుమాన్ స్వరూప నారాయణునికి నమస్కృతులు! (శివాంశ)

4. <u>**ఓం యో హ వై శ్రీ పరమాత్మా! నారాయణః। స భగవాన్। బిందు స్వరూప శత్రుఘ్నో భూర్భువస్సువః తస్మైవై నమో నమః**</u> ఆ పరమాత్మయే శ్రీమన్నారాయణుడు. ఆయన బిందు స్వరూపుడై శత్రుఘ్ను రూపములో భూ భువర్ సువర్ లోకములన్నీ ప్రకాశింపజేయుచున్నారు. అట్టి శత్రుఘ్న వాచ్య బిందుస్వరూప పరమాత్మకు మరల మరల నమస్కరించుచున్నాము. ఏ బిందువు నుండి లోకాలన్నీ జనిస్తూ, బిందువునందే అంతర్గతమైయున్నాయో.... అట్టి బిందు-శత్రుఘ్న నారాయణుని స్మరిస్తున్నాము.(చక్రాంశ)

5. <u>**ఓం యో హ వై శ్రీ పరమాత్మా! నారాయణః। స భగవాన్। నాదస్వరూపో భరతో భూర్భువస్సువః తస్మైవై నమో నమః**</u> శ్రీ పరమాత్మ శ్రీమన్నారాయణుడే ప్రణవ స్వరూపుడు. నాద స్వరూపుడై, భరత స్వరూపుడై, సూక్ష్మముగా భూర్భువస్సువర్

త్రిలోకములో నిండియున్నారు. అట్టి పరమాత్మకు బహు ప్రణామములు. ఓంకారనాద తత్త్వ భరత నారాయణునికి నమస్కారములు.(శంఖాంశ)

6. **<u>ఓం యో హ వై శ్రీ పరమాత్మా! నారాయణః। స భగవాన్। కలాస్వరూపో, లక్ష్మణో భూర్భువస్సువః తస్మైవై నమో నమః</u>** ఓంకార స్వరూప పరమాత్మయే శ్రీమన్నారాయణుడు, కలా (కల్పనా-ప్రకృతి) స్వరూపులై విరాజిల్లుచున్న వారు. ఆరాధకులకు లక్ష్మణస్వరూపులై ప్రసాదితులు అగుచున్నారు. భూర్భువస్సువ దృశ్య తత్త్వములుగా ప్రదర్శితులగుచున్నారు. అట్టి పరమాత్మ - పరంధామునికి వేనవేల దండాలు. కల్పన నుండి విముక్తి కలిగించు కలాస్వరూప లక్ష్మణ-నారాయణునికి నమో నమః (ఆది శేషాంశ)

7. **<u>ఓం యో హ వై శ్రీ పరమాత్మా! నారాయణః। స భగవాన్। కలాతీతా భగవతీ సీతా చిత్ స్వరూపా భూర్భువస్సువః తస్మైవై నమో నమః</u>** ఓంకార స్వరూప శ్రీ పరమాత్మా! శ్రీమన్నారాయణా! మీరు కలాతీతా (ప్రకృతిని దాటిన రూపుడవై) భగవతియగు **సీతాదేవిగా** ఉపాసనార్ధమై ప్రాప్తించుచున్నారు. చిత్ స్వరూపమై భూర్భువస్సువర్లోకములను వెలిగించుచున్నారు!

   అట్టి పరమాత్మకు పునః పునః సాష్టాంగ దండ ప్రణామములు. అవాక్ మానసగోచర-నారాయణుని సీతా స్వరూప చిత్ (ఎరుక)-మూల ప్రకృతి ప్రదర్శన-నారాయణునికి ప్రణామములు. (మూల ప్రకృతి - అంశ).

8. **<u>ఓం యో హ వై శ్రీ పరమాత్మా! నారాయణః।</u>** ప్రణవ స్వరూప శ్రీ పరమాత్మయే నారాయణుడు! భగవానుడుగా ఆ నారాయణతత్త్వము గురించి చెప్పుకుంటున్నాము. విను!

**తత్ పరః :** ప్రకృతి - పురుషులకు ఆవల తత్ స్వరూపుడై సర్వదా ప్రకాశమానుడై ఉన్నారు. అందుచేత ఆయన తత్-పరుడు. నాటకంలో నటించువాని వ్యక్తిగత రూపము నాటకమునకు పరమైయున్న రీతిగా - సర్వమునకు వేరై ఉన్నారు. ఈ జీవుని సహజ స్వరూపమై ఉన్నట్టి వారు!

**పరమ పురుషః :** జీవుడు - జగత్తు కూడా ఆయనయొక్క భావనారాయణత్వమే! ఇహము - పరమునకు ఆవల వేంచేసి, సర్వకారణుడై ఉండటం చేత **పరమపురుషుడు**. రచయిత యొక్క నాటక రచన నుండి పాత్రలన్నీ వస్తున్నట్లు, రచయిత నాటకములోని సర్వపాత్రలకు, కథాగమానికి, పాత్రల స్వభావాలకు సర్వదా వేరైనట్లు, **ఆ పరమపురుషుడే సర్వము అయి, సర్వమునకు వేరై ఉన్నారు.**

**పురాణ పురుషః :** జన్మలకు కర్మలకు ముందే ఉన్నది-ఆ ఓంకార పరమాత్మ భగవానుడగు శ్రీ సత్యనారాయణుడే! సర్వమునకు ముందే ఉన్నవాడు... 'పురా' - ముందుగానే ఉండి, న వేతి... ఇప్పటికీ, ఎప్పటికీ నూతనంగా యథాతథము.

**పురాణ పురుషోత్తమో :** సర్వులలోని - సర్వములోని ఉత్తమ పురుష (The First Person - Absolute Presence of I) ఆయనే ! ఆయన ఆది స్వరూపుడు! ఆయనయే మన నిత్య - సత్య సహజ స్వరూపము! కాబట్టి, 'పురాణపురుషోత్తముడు' అని కూడా వర్ణించబడుచున్నారు. జాగ్రత్-స్వప్న-సుషుప్తులలో **నేను-నేను-నేను** కంటే మునుముందే ఉన్న **నేను** కనుక పురుషోత్తముడు!

**నిత్య-శుద్ధ-బుద్ధ-ముక్త :** ఆ అష్టాక్షరీ తత్త్వ సర్వనారాయణుడు కాలమునకు అతీతుడు. త్రికాలములలోను ఏక స్వరూపుడు. కాబట్టి 'నిత్యుడు'! ఈ దేహ, జగదంతర్గత భేద, మనో, బుద్ధి, చిత్త, అహంకారాల దోషాలు అంతర్గత - బహిర్గత పరాత్పరుడగు ఆ నారాయణ భగవానుని ఏ మాత్రము స్పృశించవు. ఆయన నిత్యుడు, నిత్యశుద్ధుడు కూడా!

ఆయన కేవల మౌనస్వరూపుడై, కేవల బుద్ధితత్త్వముగా 14 లోకాలలోని సర్వ జీవాత్మలయందు, చర-అచరములయందు వెలయుచున్నారు. నిత్య-శుద్ధ-బుద్ధ స్వరూపుడై సర్వమునకు వేరుగా ఉండి, సర్వము తానే అయి ఆనందించుచున్నారు. ఈ జీవాత్మ, ఈ నీవు-నేను-ఈ సర్వలోకాలు, బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులు, పిపీలికాది బ్రహ్మ పర్యంతము ఆయన లీలా-క్రీడా-వినోద-ఆనంద సంకల్ప స్ఫురణలే! విస్ఫులింగములే! **కనుక ఆయన నిత్య శుద్ధ - బుద్ధ స్వరూపుడు!**

ఆయన దేనికీ సంబంధితుడు కాదు. మనో బుద్ధి చిత్త అహంకారములచే పరిమితుడు కాదు. ఆయన శాసనమే ఈ సర్వము. ఆయనను శాసించునదేదీ లేదు. దేనిచేతనూ నియమితుడు, నిబద్ధుడు కాదు. కాబట్టి ఆ శ్రీమన్నారాయణుడు **<u>నిత్యముక్త స్వరూపుడు!</u>**

**సత్య :** శ్రీమత్-నారాయణ పరబ్రహ్మమే సత్యము. మిగిలినదంతా కల్పన. అందుచేత అష్టాక్షరిచే సత్యమైనది ఉపాసించబడుచూ, "అసతోమా సద్గమయ"... అను వేద వాక్యార్ధమును సిద్ధింపజేయుచున్నది. **"కేవలో తత్ నారాయణోఽహమస్మి"** స్థానమును జేర్చుచున్నది.

**పరమానంద : అష్టాక్షరీ - అఖండాక్షరీ ఉపాసన, తత్ అర్థమననము** నిర్వర్తించు యోగి... పరిమితము, దుఃఖ సమ్మిళితము, అసత్ మార్గ ప్రయోజనము గల ఇహ - ఇంద్రియ సుఖములను అధిగమించుచున్నాడు. 'పరమ్-ఆవల' గల ఆత్మ సంస్పర్శానందము, సర్వాత్మత్వ సుఖమును సముపార్జించుకుంటున్నాడు.

**అనన్తమ్ :** ఆద్యంతరహితమగు **'సోఽహమ్ నారాయణాయమస్మి'**ని అనుభవముగా సిద్ధింపజేసుకుంటున్నాడు.

**అద్వయమ్ :** అష్టాక్షరీ పరమాత్మోపాసనచే ఎద్దానికైతే ద్వితీయము - (స్వప్నములో స్వప్న ద్రష్టయొక్క స్వప్న చైతన్య ప్రదర్శనమునకు వేరైనదేదీ లేని తీరుగా), కాదో - అట్టి **అద్వయ పరబ్రహ్మమే** ఆశయమై యున్నది. నా స్వప్నములో నాకు వేరుగా ఏదీ లేని తీరుగానే, **"జాగ్రత్‌లో గాని, మరింకెక్కడా గానీ మమాత్మ స్వరూపమునకు వేరైనదంటూ కించిత్ కూడా ఏదీ లేదు?"**.... అనునదే అష్టాక్షరీ ఆశ్రయము యొక్క అంతిమము - అతి ముఖ్యము అగు **ప్రయోజనము!**

**పరిపూర్ణః** 1. జగత్ 2. జీవ (జగత్‌ద్రష్ట) 3. ఈశ్వర (అనేక ఉపాధులుగా ప్రదర్శనమగు చైతన్య) 4. కేవల సాక్షియగు పరతత్త్వములన్నీ తనయందు కలుపుకొని, **పరిపూర్ణ నారాయణత్వమునకు** గొనిపోవు స్థానమైయున్నది. ఇదియే అష్టాక్షరీ ప్రయోజనము!

**భు-భువర్-సువర్లోకముల ఉత్తేజితరూపుడు, తత్పరుడు, పరమపురుషుడు, పురాణ పురుషోత్తముడు, నిత్య శుద్ధ బుద్ధ ముక్తుడు, సత్య - పరమానంద - అనంత - అద్వయ స్వరూపములచే పరిపూర్ణుడు, బ్రహ్మము అయినట్టి రామ బ్రహ్మమును నేనే అయి ఉన్నాను. నేను అభిన్నుడను! తదితర జీవులు - జగత్తు కూడా అభిన్నమే!**

అట్టి ఆత్మారామానంద - ఆత్మ స్వరూపమునకు నేను నమస్కరించుచున్నాను. జీవాత్మగా పరమాత్మను (లేక) నా శ్రీరామచంద్ర పరబ్రహ్మ స్వరూపమును ఉపాసిస్తున్నాను. **పరబ్రహ్మముగా జీవాత్మను** - ఒక శిల్పి తాను చెక్కిన **శిల్పము** చూచువిధముగా-**వీక్షిస్తున్నాను.**

❖

## ఫలశ్రుతి

ఇట్టి అష్ట విధ - అష్ట తత్త్వార్థ - అష్టాక్షరీ మంత్రమును ఎవ్వరు శ్రద్ధతో జపిస్తారో, పరమార్థపూర్వకంగా ధ్యానిస్తారో, అట్టి వారు అగ్నిచే బంగారము, వాయువుచే మేఘావృత ఆకాశము, ఆదిత్యునిచే చీకటి ప్రదేశము - పవిత్రమగు విధంగా.... **పరమపునీతులగుచున్నారు**.

వారు పిల్లగాలులు ఏమాత్రము కదల్చలేని గండ శిలవలె సంసార తరంగములచే కదలించబడనివారగుచున్నారు. సర్వ దేవతల మహత్-తత్త్వమేమిటో ఎరిగినవారగుచున్నారు. ఇతిహాస - పురాణముల అంతరార్థము ఎరిగిన ప్రయోజనము పొందుచున్నారు. రుద్రము లక్షసార్లు జపించినంతటి ఉత్తమ ఫలము సముపార్జించుటకున్నవారగుచున్నారు.

శ్రీమన్నారాయణ అష్టాక్షరీ మహామంత్రమును మనో-బుద్ధి సమన్వితంగా జపించినవారు (అనుస్మరించినవారు) .... శతసహస్ర (లక్ష) గాయత్రీ జపఫలము పొందగలరు. వారు ప్రణవమును అనేకసార్లు జపించిన వారగుచున్నారు.

వారి వంశములో ఇతఃపూర్వపు పదితరములవారు, ఇక ముందటి పది తరములవారు కూడా పవిత్రత సంతరించుకొనగలరు.

**అష్టవిధ మంత్రపూర్వక అష్టాక్షరీ జపము (ఓం నమో నారాయణాయ)** చేయువారు స్వయముగా నారాయణ పదమును - అలంకరించి ఆనందించుచున్నారు.

ఓ భారద్వాజా! ఆత్మజ్ఞాన విద్వాంసులగు సూరులు సర్వత్రా సర్వదా తత్ విష్ణుపదమునే దర్శించుచూ, విష్ణుస్వరూపులగుచున్నారయ్యా! ఈ త్రిలోక విశ్వము తమ స్వరూపమై, ఈ సర్వమునకు వేరుగా కూడా అయి **విష్ణుత్వమును** సదా ఆస్వాదించగలరు.

అట్టి సీతాలక్ష్మణ భరత శతృఘ్న హనుమత్ జాంబవంతాది పరివార సమేత శుద్ధ తత్త్వమగు శ్రీరామచంద్ర పరబ్రహ్మమే ఆకాశము -భూమి-పాతాళములలో వెల్లివిరిసియున్నదయ్యా! అట్టి ఆత్మారామ-**విష్ణుత్వమే** జీవుని **మహదాశయమగు పరమపదము సుమా!**

*ఇతి తారసారోపనిషత్*

*ఓం శాంతిః! శాంతిః! శాంతిః!*


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 6 తురీయాతీతోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ ఓం తురీయాతీతోపనిషత్ వేద్యం యత్ పరమాక్షరమ్**
**తత్ తుర్యాతీత చిన్మాత్రం స్వమాత్రం చింతయేత్ అహమ్ ॥**

**తురీయాతీత సన్న్యాస పరివ్రాజ అక్షమాలికా**
**అవ్యక్త ఏకాక్షరం పూర్ణ సూర్యాక్ష్య అధ్యాత్మ కుండికా ॥**

*ఈ తురీయోపనిషత్‌చే ప్రతిపాదించబడుచున్నది, పరమాక్షరమైనది, చిత్ స్వరూపము, కేవల స్వస్వరూపము అగు **"తుర్యాతీత చిన్మాత్రము"**ను చింతన చేయుచున్నాము. తురీయాతీత అద్వైత స్వరూపులగుచున్నాము. తురీయాతీతులగు సన్న్యాస పరివ్రాజకులకు తులసీమాలవంటిదగు అవ్యక్త - ఏక - అక్షర - పూర్ణ - జ్ఞాన సూర్య తేజో విభవమును ఉపాసిస్తున్నాము. **"తత్ చిత్ కేవలీ స్వరూపము"**నకు నమస్కరిస్తూ ఉన్నాము.*

**1. అథ తురీయాతీతా అవధూతానాం**
**కోఽయం మార్గః? తేషాం కా స్థితిః?**
**ఇతి పితామహో భగవన్తం**
**పితరమ్ ఆదినారాయణమ్ పరిసమేత్య, ఉవాచ।**

**పితామహుడగు బ్రహ్మదేవుడు శ్రీమన్నారాయణునితో :**

తండ్రీ! శ్రీమన్నారాయణా! ఇప్పుడు దయతో తురీయాతీతులగు అవధూతల గురించి విశదీకరించ ప్రార్థన.

- అవధూతగా అగుటకు మార్గమేమిటి?
- వారి స్థితి ఎటువంటిది? వారు ఏ తీరైనవారు? ఎట్లు ఎక్కడ ఎట్లా ఉంటారు?

**అని పితామహుడు, భగవంతుడు అగు బ్రహ్మదేవుడు వారి పితృదేవులు అగు ఆదినారాయణ స్వామిని సమీపించి అడిగారు.**

---

**2. <u>తమ్ ఆహ భగవాన్ నారాయణోః</u>**
**యో అయమ్ అవధూతమార్గస్థో**
**లోకే దుర్లభతరో।**
**న తు బాహుళ్యో। యత్ ఏకో భవతి,**
**స ఏవ నిత్య పూతః।**
**స ఏవ వైరాగ్య మూర్తిః**
**స ఏవ జ్ఞానాకారః।**

**బ్రహ్మదేవునితో భగవంతుడగు ఆదినారాయణుడు:**

ఓహో! అవధూతలగురించి చెప్పమంటున్నారా! మంచిది. అయితే అట్టి ఆ అవధూత మార్గములో ఉన్నవారు 14 లోకాలలో చాలా దుర్లభము, అరుదు. ఇతరులకు తెలియగల బాహ్య లక్షణాలు (సన్న్యాసికో, వానప్రస్తుకో ఉన్నట్లు) ఉండవు. ఎక్కడో ఏకాకి అయి తనకు తానై ఉంటారు.

ఆతడు ఎల్లప్పుడు విషయములన్నీ దాటివేసి, దానిచేతనూ స్పృశించబడక, పరమపవిత్రుడై ఉంటారు.

స ఏవ వేద పురుషః
ఇతి జ్ఞానినో మన్యన్తే।
మహాపురుషో యః తత్
చిత్తం మయ్యేవ అవతిష్ఠతే।
అహమ్ చ తస్మిన్ ఏవ అవస్థితః ।
సోఽ యమ్ ఆదౌ తావత్క్రమేణ
కుటీచకో, బహూదకత్వం
ప్రాప్య, బహూదకోహఽ మ్
సత్తమ్ అవలంబ్య,
హంసః పరమహంసోభూత్వా,
స్వరూపానుసంధానేన
సర్వ ప్రపంచం విదిత్వా,
దండ కమండలు కటిసూత్ర
కౌపీనా ఆచ్ఛాదనస్య
విధ్యుక్త క్రియాదికం
సర్వమ్ అప్సు సన్న్యస్య,
దిగమ్బరో భూత్వా,
వివర్ణ జీర్ణ వల్కలాఽ జిన
పరిగ్రహమపి సన్త్యజ్య,
తత్ ఊర్ధ్వమ్ అమన్త్రవత్ ఆచరన్,
క్షౌర, అభ్యంగస్నానో
ఊర్ధ్వపుణ్డ్రా ఆదికం విహాయ,
లౌకిక వైదికమపి ఉపసంహృత్య,
సర్వత్ర పుణ్య అపుణ్య వర్జితో,
జ్ఞాన-అజ్ఞానమపి విహాయ,
శీతోష్ణ సుఖదుఃఖ మాన-
అవమానం నిర్జిత్య,
వాసనాత్రయపూర్వకం నిన్ద-అనిన్ద-
గర్వ మత్సర దంభ దర్ప

మూర్తీభవించిన వైరాగ్యముతో కూడినవాడై ఉంటాడు. స్వభావ సిద్ధముగానే దేనిపట్లా రాగము ఉండదు. అందరిలో వేంచేసియున్న **ఆత్మ వస్తువు** ఒక్కటే ఆతనికి **ప్రేమవస్తువై** ఉంటుంది.

ఆతనికి ఈ భౌతిక దేహము దేహమే కాదు. ఆత్మ జ్ఞానాకారుడై, ఆత్మ సందర్శన-ఆత్మతదాత్మ్యమే ఆతని దేహము. **జ్ఞానమే ఆతని ఆకారము.**

తెలుసుకొనవలసినది తెలుసుకొని, అట్టి అఖండాత్మయై వెలుగొందుచున్నారు. తెలియబడేదంతా ఈతని దేహమే! అందుచేత "వేదపురుషుడు" అని జ్ఞానులు ఆతని గురించి చెప్పుకుంటూ ఉంటారు. మహత్తును ఆశ్రయించిన మహా పురుషుడు.

అట్టి మహాపురుషుని యొక్క చిత్తము సర్వాంతర్యామిని, సర్వతత్త్వ స్వరూపమును, సర్వమును, సర్వసాక్షిని అగు నాయందే ఎల్లప్పుడు అవతిష్ఠమై ఉంటుందయ్యా!

ఇక నేనో! ఆ మహనీయునియందే అవతిష్ఠుడనై ఉంటాను. అందుచేత **నాకు-అవధూతకు భేదమే ఉండదు.**

అట్టి పరమహంస తత్త్వమగు అవధూత మార్గమును అనుసరించు యోగి - మొట్టమొదట **'కుటీచకుడు'** అయి, ఆపై "**బహూదకత్వమును**" ప్రాప్తించు కొంటున్నారు. "అంతటా ఉండి ఉన్న బహూదకుడను నేను",..... అను భావనను సమీపించి, "అహమ్‌సత్యమ్"ను ఆశ్రయిస్తున్నాడు. "సోఽహమ్" అను హంస మంత్రము యొక్క ప్రత్యక్ష మననధారణలచే, "పరమహంస" అగుచున్నాడు. పరమహంస రూప - అనుసంధానముచే "**ఈ విశ్వమంతా నా దేహమే**" అనే స్వరూపత్వమును స్వీకరించు చున్నాడు. ఈ ప్రపంచమంతా నిండిన తన రూపమును ఎరిగినవాడై ఉంటున్నాడు. ఇక కనిపించేదంతా తానై ఉండగా కళ్ళు మూతలతో పనేమున్నది? సన్న్యాసాశ్రమసంబంధమైన దండము-కమండలము-యజ్ఞసూత్రము-కాషాయ వస్త్రములు- వీటన్నిటితో ఆతనికి సంబంధము ఉండదు. ఆశ్రమ సంబంధము-విద్యుక్త ధర్మములు, దండ-కమండల-కటి (మొల) సూత్రములు, ఆశ్రమ నియమ సంబంధమైన ఆయా ధర్మములు జలముతో సమంత్రంగా త్యజించివేయుచున్నారు.

దిగంబరుడు (పరిమిత వస్త్రములను త్యజించి, సర్వదిక్కులు తన వస్త్రముగా ధారణ కలవాడై) ఉంటున్నారు. ఇతఃపూర్వపు వివర్ణములగు వల్కాజినములను (నార వస్త్రములను) పరిగ్రహణము కూడా సంత్యజిస్తున్నాడు. కృష్ణాజినము (చర్మవస్త్రము) కూడా వదలి వేస్తున్నారు. నిత్యక్రియలను బాహ్యమంత్రోచ్ఛారణతో నిర్వర్తించడం కూడా త్యజిస్తున్నారు. క్షౌరము(Hair Cutting), అభ్యంగన స్నానము (నదీ-తటాక స్నాన నియమములను), ఊర్ధ్వ పుండ్రములను (విభూతి రేఖలు), బొట్టు ఇటువంటివి కూడా త్యజిస్తున్నారు. లోక సంభంధమైన వైదిక సంబంధమైన కర్మలను ఉపసంహరిస్తున్నారు.

సర్వత్ర పుణ్య-అపుణ్య క్రియా సంబంధమైన భావ-ఉద్రేక-విశేషాలు వర్జిస్తున్నారు.

జ్ఞాన-అజ్ఞానముల నిర్వచనములను కూడా వదలుచున్నారు.

శీత-ఉష్ణ, సుఖ-దుఃఖ, మాన-అవమానములు మొదలైన ద్వంద్వములను జయించివేసి ఉంటున్నారు.

లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన... అనబడు త్రివిధ వాసనాపూర్వకమైన నిన్ద-అనిన్దలను, గర్వ - మత్సర (Nature of Hearting others), దంభ (లేనిది

ఇచ్ఛా ద్వేష, కామ-క్రోధ-లోభ-మోహ
హర్షా అమర్షా అసూయా
ఆత్మ సంరక్షణాదికం దగ్ధ్వా
స్వవపుః కుణపా ఆకారమివ పశ్యత్,
అప్రయత్నేన అనియమేన
లాభా అలాభౌ సమౌకృత్వా...

ఉన్నట్లు చూపు), దర్ప (ఉన్నది గొప్పగా చూపు), ఇచ్ఛ-ద్వేష, కామ, క్రోధ,లోభ, మోహ, హర్ష-అమర్ష, అసూయ, తన క్షేమమే తనకు ఆశయమని అనుకోవటం... ఇవన్నీ ఆతడు దగ్ధము చేసివేసుకొని ఉంటారు.

తన ఈ భౌతిక శరీరమును కూడా ఆతడు ఒక మరణించినవాని దేహమును ఆతని బంధువులు చూచు రీతిగా తానే ఇప్పటికిప్పుడే చూస్తున్నారు.

కర్మలకు ఆవల అప్రయత్నశీలులై, ఏ నియమములు నియమించుకొనని వారై, లాభ-అలాభములను ఒకే తీరుగా దర్శించుచూ **అతీతుడై** ఉంటున్నారు.

---

**3.** గోవృత్యా ప్రాణసన్ధారణం కుర్వన్,
యత్ ప్రాప్తం, తేనైవ నిర్లోలుపః
సర్వ విద్యా పాణ్డిత్య ప్రపంచం భస్మీకృత్య,
స్వరూపం గోపయిత్వా,
జ్యేష్ఠ అజ్యేష్ఠత్వ అపలాపకః, (మాట్లాడక)
సర్వోత్కృష్టత్వ సర్వాత్మకత్వా
అద్వైతం కల్పయిత్వా,
అమత్తో, అవ్యతిరిక్తః
'కశ్చిత్ న అన్యో అస్తి' ఇతి
దేవ గుహ్యాది ఇన్ధనమ్
ఆత్మని ఉపసంహృత్య,
దుఃఖేన నో ఉద్విగ్నః,
సుఖేన న అనుమోదకో, రాగే నిస్పృహః,
సర్వత్ర శుభ-అశుభయో అనభిస్నేహః
సర్వేంద్రియో పరమశ్చ
పూర్వ ఆపన్న ఆశ్రమ ఆచార
విద్యాధర్మ ప్రభావమ్ అనుస్మరన్,
త్యక్త వర్ణాశ్రమ-ఆచారః,
సర్వదా దివా నక్తం సమత్వమేవ
అస్వప్నః సర్వదా సంచారశీలో,
దేహమాత్రా అవశిష్టో,
జల స్థల కమండలుః

ఒక గోవువలె ఏది ప్రాప్తిస్తే అది ప్రాణములను నిలుపుకోవటము మాత్రమే ఉద్దేశ్యించి తృప్తి కలిగి ఉంటున్నారు.

వేద-ఉపనిషత్ ప్రతిపాదితమగు సర్వవిద్యా (మహాన్ ఆత్మ విద్యా) పాండిత్యము కలిగి ఉన్నవాడై ఈ దృశ్యమును తనయందు భస్మముగా చేసి, ఇద్దాని, స్వభావ-స్వరూపములను తనయందు దాచుకొన్నవానివలె ఉంటున్నారు.

పెద్దవారు-చిన్నవారు, జ్ఞానులు-అజ్ఞానులు, గొప్పవారు-కానివారు... ఇటువంటి భావాలు, మాటలు లేనివారై, సర్వోత్కృష్టము, సర్వాత్మకము అగు అద్వైతము మాత్రమే కల్పించుకొంటూ.... సర్వ ప్రాపంచక లోక - లోకాంతరములైన సర్వ కల్పనలను కల్పన చేయనివాడై ఉంటారు.

**తనకు అన్యమైనది, వ్యతిరిక్తమైనది ఎక్కడా ఏమీ లేదు ఎవ్వరూ తనకు వేరు కాదు** - అను భావనయందు అమత్తుడై (మత్తతతోనిదురించనివారై) ఉంటున్నారు.

నాకు వేరైన దేవతలు - నాకు చెంది రహస్యము ... ఇటువంటి దేవ-గుహ్య మొదలైన ఇంధనములను (కట్టెలను) ఆత్మయందు ఉపసంహరింపజేసుకొని ఉంటారు.

దుఃఖ సంఘటనలకు ఉద్విగ్నుడు అవక, సుఖ సంఘటనలకు అనుమోదము (మోద ఉద్వేగము-సంతోషావేశము) పొందక, రాగముచే నిస్పృహుడు కానివాడై ఉంటారు.

సర్వత్రా సంభవించు శుభ - అశుభ సంఘటన - సందర్భములతో అభిస్నేహితుడు కారు.

సర్వ ఇంద్రియ-ఇంద్రియ విషయములకు వేరై ఉంటారు.

పూర్వము తాను ఆశ్రమ ఆచారములను, నేర్చుకొన్న విద్య-నిర్వర్తించిన ధర్మముల సత్ప్రయోజనములను గుర్తుపెట్టుకున్నవాడై, అనుస్మరించువాడై ఇప్పుడు మాత్రము-వర్ణాశ్రమ-ఆచారములను త్యజించివేసినవాడై ఉంటారు.

రాత్రింబవళ్ళు ఎల్లప్పుడూ "సమత్వ దర్శనము" నందు మెళుకువ కలవాడై, ఏమరచనివాడై, అస్వప్నశీలుడై, అట్టి సమత్వ దర్శన సమనిత్యంగానే సంచారశీలుడై ఉంటారు.

మనో-బుద్ధి-చిత్త-అహంకారములన్నీ ఆత్మయందు లయింపజేసి, అన్ని దేహములు తనవైపోగా..., **ఏకమాత్ర దేహుడై శేషిస్తున్నాడు**. జల-స్థల ప్రదేశములన్నీ తన కమండలువు (సన్యాసులు జలము ఉంచుకొనుపాత్ర)గా కలిగి యున్నవారై, "**దృశ్యము సత్యమే! బంధము! అడ్డు! నేను జన్మించాను! బద్ధుడను**" ... ఇటువంటి పిచ్చి లేనివాడై, అనున్మత్తుడై ... ఉంటున్నారు.

ఒక బాలునివలె, ఇదంతా క్రీడా వినోదంగా చూస్తూ ఒక ఉన్మత్తునివలె ఇదంతా తనయందే దర్శిస్తూ... సంచరించువాడై ఉంటారు. లోక సంబంధమైన విషయాలేవీ సంభాషించనివాడై ఉంటారు.

**సర్వదా అనున్మత్తో,**

**బాల-ఉన్మత్త-పిశాచవత్ ఏకాకీ,**

**సంచరన్, అసంభాషణ పరః**

**స్వరూప ధ్యానేన నిరాలంబమ్ అవలంబ్య**

**స్వాౖ త్మనిష్ఠా అనుకూలేన సర్వం విస్మృత్య**

**తురీయాతీతా-అవధూత వేషేణ**

**అద్వైత నిష్ఠాపరః ప్రణవాత్మకత్వేన**

**దేహత్యాగం కరోతి యః, సో అవధూతః!**

**స కృతకృత్యో భవతి!**

**ఇతి తురీయాతీతోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

సర్వాత్మకము - సర్వము - పరము అగు స్వస్వరూపమును ధ్యానించుచూ ఆలంబమే లేని నిరాలంబనమును అవలంబించినవాడై ఉంటారు.

"స్వాౖ త్మనిష్ఠ" అను మహత్తరమైన సానుకూల్యతను సంపాదించుకొని, ఇక తదితరమైనదంతా విస్మరించివేసినవాడై, లెక్కలోకి తీసుకొననివాడై ఉంటారు.

జాగ్రత్-స్వప్న-సుషుప్తుల కల్పనను ఆశ్రయించి, వాటియందు సంచరించుచు, వాటిచే పరిమితము కానిది తురీయము, ఇక మన అవధూతయో? ఆ తురీయమునకు కూడా ఆవలివాడై, తురీయాతీతుడై, తురీయ-సాక్షి అయి, తురీయ నియామకుడై ఉంటాడు. అవధూత వేషధారుడై స్వయం తురీయాతీతధారుడై ఉంటారు.

అద్వైతమే- - (జీవాత్మను పరమాత్మగాను, పరమాత్మయే తానుగాను) సర్వదా, సర్వత్రా దర్శించు నిష్ఠను ఆశ్రయించినవాడై ఉంటారు.

ఈవిధంగా ప్రణవాత్మ స్వరూపుడై దేహత్వమును మొదలంట్లా ఎవ్వడైతే త్యాగము చేసినవాడై ఉంటాడో... ఆతడయ్యా, అవధూత! ఆతడి గురించి ఏం చెప్పాలి? ఆతడు ఇక కృతత్యుడే! పొందవలసినది పొందినవాడే!

**ఇతి తురీయాతీతోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**




శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 6 తురీయాతీతోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



ఒకానొకప్పుడు,... జగత్ సృష్టికర్త, పద్మగర్భుడు, సర్వజీవులకు పితామహుడు,... లోక కళ్యాణమూర్తి, సర్వజీవుల జీవనప్రదాత, ధాత అగు బ్రహ్మదేవుడు,... తన పిత్రుదేవులగు శ్రీమన్నారాయణ భగవానుని సందర్శనార్థమై విష్ణులోకమునకు వేంచేశారు. లక్ష్మీ నారాయణులకు స్తోత్ర-ఋుక్ గానములను సమర్పించారు. లక్ష్మీ-నారాయణ సూక్తములతో ఆ ఆదిదంపతుల తాత్త్వికార్థమును ప్రదీపిస్తూ గానం చేశారు.

సర్వాంతర్యామి, సర్వతత్త్వ స్వరూపుడు, కేవలసాక్షి, సర్వాత్మకుడు, సర్వ రక్షకుడు, భక్తుల పాలిటి కల్పవృక్షము అగు శ్రీమన్నారాయణునితో ఆత్మతత్త్వము గురించిన అనేక విషయాలు ప్రశ్న - సమాధానాల పూర్వకంగా సంభాషించసాగారు.

**పితామహుడగు బ్రహ్మదేవుడు**

ఆదినారాయణా! తండ్రీ! సర్వలోక రక్షకా! సర్వకారణా! అకారణా! మీరు నాకు ఇప్పటి వరకూ అనేక **అఖండాత్మతత్త్వ విశేషాలు** బోధిస్తూ ఉన్నారు కదా! అందుకుగాను ఆత్మార్పణపూర్వకంగా మీ పాదములు స్పృశిస్తున్నాను.

**శ్రీమన్నారాయణుడు :** బిడ్డా! బ్రహ్మదేవా! ఇంకా ఏమైనా అడగాలని అనుకుంటున్నావా? అడుగు!

**బ్రహ్మదేవుడు :** అవును పిత్రుదేవా! ఇక ఇప్పుడు ఈ విషయముకూడా నాపై దయతో వివరించమని నా విన్నపము.

- తురీయాతీతులగు అవధూతలు ఏ మార్గమును అనుసరించి, అట్టివారుగా అగుచున్నారు? **కో౾యంమార్గః?**
- వారి స్థితి ఎట్టిది? **తేషాం కా స్థితిః?**
- ఎటువంటి లక్షణములను పునికి పుచ్చుకున్నవారై ఉంటారు?
- జీవులకు అట్టి మార్గము అనుసరించుటకై గుర్తు చేయటమెట్లా?
- ఏ స్వరూప స్వభావాలు వారు కలిగి ఉంటున్నారు?

ఈ ఈ విషయాలు చెప్పమని అర్థిస్తున్నాను.

**శ్రీమాన్ ఆదినారాయణుడు : యో అయమ్ అవధూత మార్గస్థో లోకే దుర్లభతరో!** హే బ్రహ్మదేవా! మీరు అడుగుచున్న అవధూత మార్గమును ఆశ్రయించువారు లోకములో చాలా దుర్లభముగా ఉంటారు. వారిని గుర్తించటము కూడా సులభము కాదయ్యా! ఎందుకంటే, **నతు బాహుళ్యా!** తదితర బ్రహ్మచర్య-గృహస్థ-సన్యాస-వాన ప్రస్థాశ్రమవాసులవలె బాహ్యమునకు సంబంధించిన లక్షణములు ఏవీ వారిపట్ల కనిపించవు. కాబట్టి! యత్ యత్ ఏకో భవతి। 14 లోకములలో ఎక్కడో కొద్దిచోట్ల మాత్రమే తురీయాతీత - అవధూతలు తారసపడుతూ ఉంటారు. వారు అవాక్ మానస స్వరూపులు. అయినాకూడా, వారి గురించి కొన్ని విశేషాలు ఇప్పుడు మనము చెప్పుకుందాము.

ఇది **జీవులకు లక్ష్యశుద్ధిని కలుగజేసి జీవితమును సద్వినియోగపరచుకొని పరాకాష్ఠ** చేరుటకు అవసరమైయున్న **సమాచారము!**

**స ఏవ నిత్యపూతః। వైరాగ్యమూర్తిః। జ్ఞానాకారః। వేదపురుషః – ఇతి జ్ఞానినో మన్యంతే!** ఆత్మ తత్త్వమును శాస్త్రీకరించు విజ్ఞులు ..., **అవధూత**ల గురించి ఈవిధంగా వ్యాఖ్యానించి చెప్పుచున్నారు.

- వారు నిత్యనిర్మల స్వరూపులు. జన్మ–కర్మల వ్యవహారిక దోషములచే, సంసార సంబంధములచే, రాగ–ద్వేష–మద–మాత్సర్యాదులచే స్పృశింపబడక **సర్వదా నిర్మలహృదయ విరాజిత వేషులై ఉంటారు.**
- ఈ నామరూపాత్మక – కామరూపాత్మకమై భేద దృష్టికి కనిపించేదంతా రాగరహితంగా (without adding 'I' and 'My') విరాగులై సంసార దృష్టులన్నీ దాటివేసిన దృష్టితో, **బాహ్మీదృష్టితో** చూస్తూ ఉంటారు. మూర్తీభవించిన ఆత్మచైతన్యముగా క్రీడావినోదులై ఇదంతా దర్శిస్తూ ఉంటారు. **వైరాగ్యమూర్తు**లై ఉంటారు.

దృశ్య–దేహ–మనో–బుద్ధి–చిత్త అహంకార పరిధులన్నీ దాటివేసి కేవల ఆత్మతత్త్వ జ్ఞానాకారమే తమ ఆకారముగా కలిగి, **జ్ఞానాకారులై** ప్రకాశిస్తూ ఉంటారు.

వేదములు అభివర్ణించే వేదపురుషుడు అయి ఉంటారు. అనగా, తెలియబడే అంతటికీ కారణులై, ఆధారులై, తెలియబడే అంతటికి ఆవల చైతన్యమూర్తులుగా ప్రకాశించు పరమ పురుషుడు తామే అయి, స్వానుభవులై, స్వయంప్రకాశులై సాక్షీభూతులగుచున్నారు. అందుచేత ఆ అవధూతయే వేదపురుషుడు. **మహాపురుషోయః, తత్ చిత్తం మయ్యేవ అవతిష్ఠతే।** అట్టి తురీయాతీత అవధూత మహాపురుషుని చిత్తము ఎల్లప్పుడు సర్వాంతర్యామి–సర్వతత్త్వ స్వరూపుడునైన నాయందే సర్వదా నియమితమై ఉంటోంది. ఇక నేనో? **అహంచ తస్మిన్ ఏవ అవతిష్ఠతః।** నేను వారియందు స్వయముగా అవతిష్ఠితుడనై ఉంటున్నాను.

**పితామహ బ్రహ్మదేవుడు :** స్వామీ! ఒక యోగసాధకుడు అవధూతగా అవగలడా? ఏతీరుగా?

**ఆదినారాయణుడు :** ఓ! అవును. అవగలడు! ఆ క్రమమేమిటో చెప్పుచున్నాను. వినండి! మొట్టమొదట యోగాభ్యాసమును ఆశ్రయించి, ఒక ఏకాంత స్థానములో (లేక) గుడిశలో (లేక) కుటీర ప్రదేశములో (లేక) ఏదో ప్రదేశములో ధ్యానయోగమును కొనసాగిస్తూ, అట్టి యోగాభ్యాస బలిమిచేత, బాహ్యదృష్టులన్నీ బాహ్యమునందే త్యజించినవాడై అంతరంగ గృహస్థుడై **కుటీచకుడు** అగుచున్నాడు.

ఇక కుటీచకుడు మరికొంత ఉపాసనచే బహూదకత్వుడు అగుచున్నాడు. బాహ్య–అంతరముల ఏకస్వరూపమును, తత్ సంబంధమైన జ్ఞాన–విజ్ఞానములను, క్రమక్రమంగా ధ్యానోపాసనచే పెంపొందించుకొనుచున్నారు. సత్యము (సత్ యమ్) భావనచే "**బహూదకోఽహమ్ – సంసిద్ధుడు**" గా రూపుదిద్దుకొనుచున్నాడు.

అట్టి బహూదకత్వముయొక్క అవలంబనచేత "హంస"... స్థితికి చేరుచున్నాడు. నేనే ఆ బ్రహ్మమును, ఆ బ్రహ్మము 'నేను'గా ఉన్నది అను **సోఽహంస భావన**ను సుదృఢీకరించుకొనుచున్నాడు.

అట్టి హంసోపాసన కొనసాగుచుండగా "**నేను–నీవు–అది–ఇది మొదలైనవాటితో కూడిన ఈ సర్వము సర్వదా నేనే**" అను పరమహంసత్వము (That Absolute Self which is beyond all this, while making appearance as all this including individualistic '**I**')ను పుణికిపుచ్చుకొనుచూ, **పరమహంస** అగుచున్నాడు. ఈ దృశ్య జగత్తంతా తన స్వరూపముగా అనుసంధానం చేస్తూ, ఈ కనబడే – వినబడే సర్వమును ఆత్మస్వరూపంగా ఆస్వాదిస్తున్నాడు.

"పరమహంస" గా అయినట్టి ఆయన ఇక ఆపై దండ–కమండలు–కటిసూత్ర (మొలత్రాడు), కౌపీన (గోచి–వస్త్రము) ఆచ్ఛానములను, "ఇది నేను చేయాలి! అది చేయకూడదు!" ... ఇత్యాది (బ్రహ్మచారి – గృహస్థ – సన్యాస – వానప్రస్థ) ఆశ్రమ సంబంధమైన క్రియా వ్యవహారాలన్నీ కూడా జలముతో తర్పణముగా వదలివేస్తున్నారు. సన్న్యసించివేస్తున్నారు. దిక్కులన్నీ తన వస్త్రముగా భావించుచూ వస్త్రహీనుడు (దిగంబరుడు)గా అయి ఉంటున్నారు. వివర్ణమైనవి, జీర్ణమైనవి అగు వల్కలాజినములు (నారవస్త్రములు కూడా) మనస్సుచే వదలి ఉంటున్నారు. **ఊర్ధ్వమ్ అమన్త్రవత్ ఆచరన్, లౌకిక – వైదికమపి ఉపసంహృత్య।** బయటకు మంత్ర నియమనిష్ఠలను అనుసరించనివాడై, అమన్త్రవంతుడై ఉంటారు. లౌకిక–వైదిక ధర్మములకు నియమితులు, పరిమితులు కానివారై ఉంటున్నారు. సర్వత్ర కూడా "**వీరు పుణ్యవంతులు – వారు అపుణ్యవంతులు**" ... ఇటువంటి నిర్ణయాత్మక భావ పరిమితులన్నీ, పారిభాషికములన్నీ **– సర్వము ఆత్మ స్వరూపమే అయిఉండగా ... వీరు పాపులు–వారు పుణ్యులు అనే** విభేదమెక్కడిది? ... అను ప్రశ్నయొక్క

సమాధానమునందు లయము చేసినవారై ఉంటున్నారు. **"ఇతడు జ్ఞాని - అతడు అజ్ఞాని, ఇది జ్ఞాన విధానములు - అవి అజ్ఞాన విధివిధానములు"** .... అనే భేదమును కూడా ఆతని సర్వాత్మత్వపు సందర్శనము సమక్షములో నిలువవు. శీత - ఉష్ణములను సుఖ-దుఃఖములను, మాన - అవమానములను ఆయన సర్వదా జయించివేసినవారై ఉంటున్నారు. అవన్నీ స్వప్నములోని విషయాలవలె కల్పనామాత్రములై **"సత్యదృష్టిచే మొదలే లేనివి"** అగుచున్నాయి.

- **వాసనలు** = లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన అనబడే త్రివాసనాపూర్వకమైన (తనచే ఇతరులవైపుగాని, ఇతరులచే తనవైపుగాని).... నిందా-స్తుతులను,
- **గర్వము** = తనకు గల దానిని, బలమును, అధికారము మొదలైనవాటిని చూచుకొని, "నా అంతటివాడు ఎవ్వడున్నాడు?" - అనే రూపమైన ఆలోచనలు కలిగి ఉండటమును,
- **మత్సరము** = గర్వముతో ఇతరులకు కష్టము, బాధ కలిగించే పనులను చేయుటకు సంసిద్ధుడవటమును,
- **దంభము** = లేని గొప్పలు చెప్పుకొని ఆత్మస్తుతికి ఉపక్రమించటమును,
- **దర్పము** = ఉన్నది గొప్ప గొప్పగా చూపుకుంటూ ఇతరులను చులకన చేయటమును,
- **రాగద్వేషములు** = ఇష్ట - అయిష్టములు, ఇచ్ఛా-ద్వేషములు, తన-తదితర భేదభావాలను,
- అరిషట్ వర్గము....,
    1. **కామము :** ఇంకా ఏదో పొందాలి! కావాలి! సంపాదించుకోవాలి! లేనివి ఏవో సిద్ధించాలి! అనే కోరిక.
    2. **క్రోధము :** ఇతరులపై తీవ్రమైన, సుదీర్ఘమైన - ధర్మమును అనుకూలము కానట్టి, (ధర్మమునకు వ్యతిరిక్తమైనట్టి) కోపము, పగ, ద్వేషము, ఆక్రోశము మొదలైన లక్షణాలు.
    3. **లోభము :** దోచుకొని, దాచుకొని, ఇతరులతో పంచుకొనవలసినవి పంచుకోక, తాను పొందవలసినవి పొందుచూ ఇవ్వలసినవి ఇవ్వకపోవటం - (దేవ-ఋషి-పితృ-మానవ ఋణములపట్ల తిరస్కారము)
    4. **మోహము :** Illusion. సత్యమును ఏమరచిన ఊహ-అపోహలను నమ్మి ఆవేశపూరితుడవటము.
    5. **మదము :** గర్వముతో తదితరులను బాధించటము.
    6. **మాత్సర్యము :** తీవ్రమైన, క్రూరమైన పనులకు సంసిద్ధుడవటము.
- హర్ష (సంతోషము), ఆమర్ష (నిరుత్సాహము), అసూయలు,
- **తన రక్షణతాను చూచుకొని, తన హాయి కోసం ధర్మమును విడచి ఆత్మ రక్షణయే జీవితాశయంగా కలిగి ఉండటము, ఇవన్నీ ఆత్మ జ్ఞానాగ్నియందు భస్మముచేసుకొని ఉంటున్నాడు. దగ్ధం చేసివేసి చరిస్తున్నాడు.**

ఓ బ్రహ్మదేవా! ఇంకా కూడా అవధూత మార్గము ఎట్టిదో, మరికొన్ని విశేషాలు వినండి.

**స్వవపుః కుణపా ఆకారమివ పశ్యన్** ... తన భౌతిక దేహమును - ఒక జడమైన వస్తువుగాను, [బంధువులు మరణించిన వాని దేహము (శవము)ను చూచువిధంగా] శవాకారముగానూ చూస్తూ, చిరునవ్వు నవ్వుకుంటూ ఉంటాడు. ఒకరు చెప్పారనో, ఒక నియమము పెట్టుకోవటము వంటిదో కాకుండా, సహజముగాను, అప్రయత్నపూర్వకముగాను లాభ - అలాభ సందర్భ - సంఘటనలప్పుడు సమత్వము ఏమాత్రము వీడనివాడై ఉంటాడు. తనకు సుఖము కలిగించేవారిపట్ల, కష్టము కలిగించేవారిపట్ల కూడా, **"వారంతా, నాతోసహా సర్వదా అఖండాత్మ స్వరూపమేకదా!"** ... అను ఆత్మదృష్టిని, అతీతదృష్టిని వీడనివాడై ఉంటాడు.

**గోవృత్యా ప్రాణసన్ధారనార్థమ్ కుర్వన్ యత్ ప్రాప్తం, తేనైవ నిర్లోలుపః॥** ఆవు ఏది దొరికితే అదే తిని (తుచ్ఛమైన గడ్డి తిని) మానవులకు పవిత్రమైన ఆవు పాలు యిస్తోంది కదా! ఈ అవధూత కూడా తన ప్రాణములు నిలుపుకోవటానికి ఏది ఆహారముగా లభిస్తే అది తిని జీవిస్తూ లోక క్షేమము-శ్రేయస్సులను ఉద్దేశ్యించి ఉంటాడు. "నాకు తినటానికి అదే కావాలి, ఇది ఎందుకు తినాలి?" అనే అసంతృప్తికి చోటివ్వడు. "వాళ్ళకి ఉన్నదికదా! నాకు పెట్టరేమి?" అనే మీమాంసయే ఆతనికి ఉండదు.

"అయ్యా! నన్ను చూడండి! నేను ఎంతటి పండితుడినో" ... అని చెప్పుకోపూనడు. ప్రాపంచకమైన సర్వవిద్యా - పాండిత్యములను

**(సర్వవిద్యా పాణ్డిత్య ప్రపంచమ్ భస్మీకృత్య)** – భస్మీభూతము చేసుకొని ఉంటాడు. **"నాకు అది తెలుసు. ఇది తెలుసు. ఇది ఇతరులకు తెలియటము ఎట్లారా బాబూ!"** ... అనే భావన-ఆవేశము ఆతనికి ఉండదు. తన స్వరూపము ఎట్టిదో ఎరిగి కేవలాత్మ స్వరూపుడై ఆస్వాదిస్తూ ఉంటాడు. **"నేను ఆత్మజ్ఞానిని కావాలి. అది ముఖ్యము. అంతేగాని, నన్ను ఇతరులు "జ్ఞాని" – అని అనుకోవటము నాకేమి అవసరము?** .... దానివలన ఒరిగేదేమున్నది? ఆత్మ స్వరూపుడనై ఇదంతా మమాత్మానంద స్వరూపముగా ఆస్వాదించటమేనా అభ్యాసము, ఆశయము కూడా! అంతేగాని, **నేను ఆత్మానంద తురీయాతీతుడను, అనేకులు పొందనిది నేను పొందాను అని లోకులు అనుకోవాలి ... అనునది కించిత్తుకూడా ఆశయము కాదు"** ... అను అవగాహనతో ఉంటాడు. ఆతడు ఇతరుల గుర్తింపు కోరడు కాబట్టి, – **స్వరూపం గోపయిత్వా** – తన ఆత్మావగాహన తనయందే రహస్యముగా భద్రపరచుకుంటూ ఉంటాడు. "నేను ఇంతటివాడిని. ఆత్మానుభవుడను" ... అని పదిమందిని పిలచి చెప్పడు. అసలు తెలియనివ్వడు! కానీ "నీవు ఆత్మవేనయ్యా!" అని ఎలుగెత్తి ఇతరులకు గుర్తుచేయు ఉత్సాహము కలిగియే ఉంటాడు.

**జ్యేష్ఠ – అజ్యేష్ఠ అపలాపకః** అతని దృష్టిలో జ్యేష్ఠులు – అజ్యేష్ఠులు (గొప్పవారు – కానివారు) ... అనునది ఉండదు. ఒకవేళ నోరు విప్పితే, **"ఓ శ్రోతా! నీవు ఆత్మస్వరూపుడవేనయ్యా! అఖండాత్మయే నీ స్వభావము"** .... అని గుర్తు చేస్తాడేగాని, "వారు గొప్పవారు. వీరు కాదు" .... ఈ రీతిగా సంభాషించరు. సర్వదా, సర్వోత్కృష్టమగు సర్వాత్మకమైన అద్వైత స్థితినే పలుకుతారు – **సర్వోత్కృష్టత్వ సర్వాత్మకత్వా అద్వైతం కల్పయిత్వా!** ఆయన అద్వైతమగు **"సమం సర్వేషు భూతేషు తిష్ఠంతమ్ పరమేశ్వరమ్"** ... నే దర్శిస్తూ ఉంటారు. **"నేను వీరందరి ఆత్మస్వరూపుడను! అందుచేత అందరికీ చెందినవాడనే! వీరంతా నా ఆత్మస్వరూపులే! కాబట్టి అందరూ నాకు చెందినవారే"**... అనే అద్వైత కల్పనను వదలి కొద్ది క్షణాలు కూడా ఏమర్చి ఉండదు. ద్వైతము అనే మత్తు పానీయమును దరిజేరనీయడు. ఏమాత్రము మత్తుడై ఉండడు. **అమత్తో, వ్యతిరిక్తః కశ్చిత న అన్యో అస్తీతి।** అంతా అఖండాత్మయే అయి ఉండగా, అద్దానికి వేరుగా జీవుడనై నేనెక్కడ ఉంటాను? ఉండను! అఖండాత్మయే నేనై ఉన్నాను! సర్వాత్మకుడనగు నాకు వేరుగా, వ్యతిరేకులై ఎవ్వరు ఉంటారు! ఉండరు! లేరు! అంతా నేనే అయి ఉండగా, నాకు ఒకరు వ్యతిరేకులవడమేమిటి? ... అను స్థితి – అనుభూతులను సుస్థిరీకరించుకున్నవాడై ఉంటారు. ఒక బంగారు ఆభరణములోని బంగారము, మరొక బంగారు ఆభరణములోని బంగారమును చూచి నీవు **"పేదవాడికి చెందినదానివి. నేను ధనికునికి చెందినవాడను"** – అని సభేదము చేస్తుందా? చేయదు. ఈ జీవుని రెండు విషయాలు భ్రమింపజేస్తూ ఉన్నాయి.

1. నేను వేరు. దైవము వేరు. తదితర జీవులు వేరు.
2. నేను ఇతరులకు వేరైన వాడను. నాకు సంబంధించినది ఏదైతే ఉన్నదో, అది కొంత ఇతరులకు తెలియరాని రహస్యము.

ఇటువంటి అన్య దేవ-మమ గుహ్య – మొదలైనవి అజ్ఞానమునకు, అనాత్మబద్ధానుభవమునకు ఇంధనముగా అయి, మాయను హృదయములో కొనసాగునట్లుగా చేస్తున్నాయి. తురీయాతీతుడగు అవధూత "అన్యదేవత-మమగుహ్యము" మొదలైన పేర్లుగల ఇంధనమును తొలగించుకొంటున్నాడు. ఉపసంహరించుకొని ఉంటున్నాడు. "ఆ పరమాత్మ (లేక, దేవత) నా ఆత్మ స్వరూపమే" ... అనే ఆత్మజ్ఞాన జ్యోతిని హృదయమందిరములో అఖండ జ్యోతిగా వెలిగింపజేసుకొని ఉంటున్నాడు. ఇంద్రియానుభవములన్నీ ఆత్మజ్యోతియందు పడవేసి **భస్మభూషితాంగుడు** అగుచున్నాడు. "నేను ఎవ్వరికీ వేరైన వాడను కాను. ఎవ్వరూ నాకు వేరైనవారు కారు" – అను అఖండాత్మత్వముచే నిత్యాభిషిక్తులై ఉంటున్నారు.

⌘ ⌘ ⌘

ఓ సృష్టికర్తా! చతుర్ముఖా! ఇంకాకూడా అవధూతల మార్గము గురించి వినండి.

**దుఃఖేన నో ఉద్విగ్నః। సుఖేన న అనుమోదకో । రాగే నిస్పృహః।** దుఃఖ సంబంధమైన సంగతి – సంఘటన – సందర్భములందు ఉద్వేగము పొందడు. ఉద్విగ్నుడు అవడు. సుఖ సందర్భములకు "ఆహాఁ! మంచిది! ఇట్లాగే ఉండాలి!" ... ఇటు అనుమోదము (Acceptance, saying O.K.) కలిగి ఉండడు. రాగము లేనివాడై సర్వప్రాపంచక విషయములపట్ల నిస్పృహుడై (As ignoring) ఉంటాడు. ఇక ఇంద్రియములు – ఇంద్రియ విషయములగు శబ్ద స్పర్శ రూప రస గంధములకు వస్తే... **సర్వేంద్రియో పరమశ్చ।** అవధూత వాటన్నిటికీ సర్వదా పరమై, వేరై ఉంటాడు. **"ఈ దేహములు, ఈ లోకములు నాకు స్వయం కల్పిత ఉపకరణ లీలా విశేషములు"** అను భావనను పుణికి పుచ్చుకొని ఉంటారు.

**బ్రహ్మదేవుడు :** పితృదేవా! ఆదినారాయణా! మీరు చెప్పుతూ వస్తున్న మార్గములో అడుగులు వేయు జీవుడు తప్పక పరమహంస-అవధూత కాగలడు - అని సుస్పష్టమగుచున్నది. అయితే ఈ సాధకుడు పూర్వాశ్రమములలో సాధన నిర్వర్తించియుండి క్రమంగా అవధూతత్వమును సంతరించుకొనగలడు కదా! అట్టి సందర్భములో ఆతని పూర్వ-తత్పూర్వ ఆశ్రమ ధర్మనిరతి, తత్ సంబంధమైన నియమ-నిష్ఠలతోకూడిన సాధనలు (అవధూతత్త్వమును సమీపిస్తున్నప్పుడు కూడా)... కొనసాగుతాయా? విరమించబడతాయా?

**శ్రీమన్ ఆదినారాయణుడు :** బిడ్డా! "నేను ఈ ఈ ఆశ్రమ ధర్మాలు నిర్వర్తించి, అందుకు ప్రయోజనముగా అవధూతత్వము సంతరించుకొనుచున్నాను కదా!" ... అని అతడు **గమనికలో కలిగియే ఉంటాడు**. మేడపైకి వెళ్ళినవాడు "నేను మెట్లుపై నడచి మెట్టుల సహాయంతో మేడ ఎక్కగలిగాను కదా!" ... అనునది ఏమరుస్తాడా? లేదు. పూర్వ బ్రహ్మచారి గృహస్థ-సన్యాస-వానప్రస్త ఆశ్రమములలోని ఆశ్రమ ఆచారములను, విద్యా-ధర్మ ప్రభావములను అనుస్మరిస్తూ జ్ఞప్తిలో చెరిపివేసుకోడు. **పూర్వ ఆపన్నా ఆశ్రమ ఆచార విద్యా ధర్మ ప్రభావమ్ అనుస్మరన్**,.... వాటిని అనుస్మరిస్తూనే (జ్ఞాపకములో కలిగి ఉంటూనే), ఆ యొక్క వర్ణాశ్రమ ఆచారములన్నీ వదలివేస్తాడు. **త్యక్త్వా వర్ణాశ్రమ ఆచారః।** వాటినన్నిటి త్యజించి వేస్తాడు. మెట్ల వలన మేడపైకి వచ్చాను కదా ... అని ఒకడు మేడపైకి సాగకుండా మెట్లపై చతికిలపడి కూర్చుని ఉండిపోడు కదా! ఆతీరుగా పూర్వ వర్ణాశ్రమ ధర్మాలు బుద్ధితో వదలియే ఉంటాడు.

**సర్వదా దివా-నక్తమ్ సమత్వమేవ అస్వప్నః సదా సంచారశీలో।** పూర్వాశ్రమ ధర్మాలు ఇప్పుడిక అనివార్యమనే స్థితిని దాటుతాడు. రాత్రింబవళ్ళు సర్వదా సమత్వమునందు అనుక్షణికుడై ఉంటాడు. జాగ్రత్ - స్వప్న కల్పనలను అధిగమించివేసినవాడై అస్వప్నశీలుడై, ఒకచోట ప్రదేశమునకు బద్ధుడు - పరిమితుడు కాక, సదా జగత్ సంచారశీలుడై, జగత్ అతీతుడై ఉంటాడు.

దేహము ఈ **భౌతికమాత్ర** జగత్తులో కలిగి ఉండియే, - తాను జగత్తుకు ఆవల **ఏకాత్ముడై** ప్రకాశిస్తూ ఉంటాడు. జల-స్థలములను చేతిలో కమండలువు వలె (సన్యాసి చేతిలో ధరించే జలపాత్రవలె) ఒక చేతితో పట్టుకొని, తానుమాత్రము జన్మ-కర్మల కంటే ముందే ఉన్న ఆత్మస్వరూపుడై, పురాణపురుషుడై, "దృశ్యము" అనే పిచ్చి (ఉన్మత్తత) లేనివాడై సంచరిస్తూ ఉంటాడు. సాంసారిక ఆశయములు, దృష్టులు గల జీవులకు మాత్రము అతడు ఒక చిన్న పిల్లవాడువలె, పిచ్చివాడువలె ఉంటాడు. పిచ్చివానివలె ఏకాకి (Alone) గా సంచరిస్తూ, ఎవ్వరితోనూ ప్రాపంచక విషయాలు సంభాషించటానికి ఏమాత్రము సిద్ధపడక ఉంటాడు. **బాల ఉన్మత్త పిశాచవత్ ఏకాకీ సంచరన్, న సంభాషణపరః।** లౌకిక విషయాలైన సిరి-సంపద-ఆపద-బాంధవ్యాలు ఊసులు చెప్పుకొనేచోట ఆతడు నిలువనైనా నిలువడు.

ఎల్లప్పుడు ప్రతి జీవుని నిత్య-సత్య-సహజ స్వరూపమగు పర-ఆత్మ స్వస్వరూపమునందే మననము - ధ్యాస - సందర్శనము కలిగి ఉంటాడు. **స్వరూపధ్యానేన నిరాలంబమ్ అవలంబ్య** - అట్టి స్వస్వరూపము యొక్క అనునిత్య ధ్యానము (Intensive and Uninterrupted Sence) చే నిరాలంబము (Non-dependence and Non-Attachedness to any thing) ను అవలంబించినవాడై ఉంటాడు. **స్వాత్మానిష్ఠా అనుకూలేన సర్వం విస్మృత్య** - అన్ని దృశ్య సంబంధమైన, ఇంద్రియ సంబంధమైన నిష్ఠలను మొదలంట్లా త్యజించినవాడై కేవలము **స్వాత్మానిష్ఠ** యందు మాత్రమే నిశ్చలుడై, సుస్థిరుడై, ప్రతిష్ఠాపితుడై ఉంటున్నాడు.

ఈవిధంగా తురీయాతీతుడైన అవధూత దేహపరిధులను దాటివేసి, అవధూతశరీరమాత్రుడై, అవధూతత్వమును వస్త్రముగా కలిగియున్న వేషుడై, **అద్వైత నిష్ఠాపరుడు** అయి ఉంటున్నాడు. **ఓం! ప్రణవాత్మకుడు!** స్వయముగా ఆత్మస్వరూపుడై పొగలేని అగ్ని తేజస్సువలె సర్వత్రా వెలుగొందుచున్నాడు.

ఎవ్వరైతే ఈవిధంగా **దేహత్వము, లోకత్వము, భావత్వము**.... ఇవన్నీ దాటిపోయి ఉంటారో అట్టివాడే **అవధూత! తురీయాతీతుడు!**

ప్రతి జీవునికి తురీయాతీతత్వమును ప్రయత్నించి పొందే జన్మహక్కు, అవకాశము ఉన్నాయయ్యా!

అవధూతత్వము పుణికి పుచ్చుకొన్నవాడు **కృతకృత్యుడు** - జన్మించినందుకు పొందవలసినది పొందినవాడు - అగుచున్నాడు. అట్టి పూర్ణానంద కేవలాత్మ స్వరూపుడు తారసపడినప్పుడు నేను నమస్కరిస్తూ ఉంటాను!


**ఇతి తురీయాతీతోపనిషత్**

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

శుక్ల యజుర్వేదాంతర్గత

# 7 త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ యోగజ్ఞానైక సంసిద్ధ శివతత్త్వ తయోజ్వలమ్।**
**ప్రతియోగి వినిర్ముక్తం పరబ్రహ్మ భవామ్యహమ్॥**

**ఓం**

ఓంకార ఏకాక్షర స్వరూప పరబ్రహ్మమునకు అధ్యాత్మపూర్వక నమస్కారము!

**1. త్రిశిఖీ బ్రాహ్మణ ఆదిత్యలోకం**
**జగామ। తం గత్వా, ఉవాచ**
**"భగవన్! కిం దేహః? కిం ప్రాణః?**
**కిం కారణమ్? కిమ్ ఆత్మా?"**
**సహోవాచ :**
**'సర్వమ్ ఇదం శివ ఏవ' విజానీహి।**
**కింతు నిత్యశుద్ధో, నిరంజనో,**
**విభుః, అద్వయః, శివ ఏకః॥**
**స్వేనభాసా, ఇదం సర్వం**
**దృష్ట్వా, తప్తాయః**
**పిణ్ణవత్ ఏకం - భిన్నవత్ అభాసతే।**

ఒక సందర్భములో వేద-వేదాంగ పారంగతుడగు 'త్రిశిఖి' అను పేరుగల బ్రహ్మ తత్త్వజిజ్ఞాసువు సూర్యలోకం వెళ్ళారు. జగత్ త్రాణ రూపుడు - జగత్ రక్షకుడు అగు శ్రీమన్ సూర్యనారాయణుని సందర్శించి ఇట్లా ప్రశ్నించారు.

హే భగవన్! సూర్యమండలాధీశా! ఆదిత్యదేవా! జగద్గురూ! నాయీ ప్రశ్నలకు వివరణ ప్రసాదించ ప్రార్థన! దేహము అనగా ఏమి? ప్రాణము అనగా? వాటికి కారకుడు - కారణము ఏమిటి? ఆత్మ అనగా ఏమి?

**ఆదిత్య భగవానుడు** : నీవు అడుగుచున్న దేహము ప్రాణములు మరియు ఆత్మ గురించి సూటిగా సమాధానం చెప్పాలంటే ఆ మూడూ కూడా (అద్వయము - చిదానందము - ఏకము అగు) శివస్వరూపమే!

ఎందుచేతనంటావా? **నిత్యశుద్ధుడు,** దోషములచే అంటబడడు-కాబట్టి నిరంజనుడు, సర్వనియామకుడు - కాబట్టి **విభువు,** అద్వయుడు అగు **శివుడు** ఒక్కడే ఉన్నారు. (శివాత్ పరతరం నాస్తి). శివానందమునకు వేరై ఎక్కడా ఏదీ లేదు.

అట్టి శివతత్త్వము యొక్క వెలుగులో, తేజస్సులో నీవు అడుగుచున్న **దేహ - ప్రాణ - జీవాత్మలు** ప్రకాశమానమగుచున్నాయి. ఒకే ఒక్క ముద్దవలె ఐక్యముగా ఉండి కూడా వేరువేరుగా ఉన్నట్లుగా అవన్నీ భాసిస్తున్నాయి. (అగ్ని ఒక్కటే అయి కూడా అగ్ని శిఖలో ఉష్ణము, వెలుగు వేరువేరు లక్షణములుగా కనిపిస్తున్నట్లుగా)!

---

**2 <u>త్రిశిఖీ ఉవాచ :</u>**
**తత్ భాసకం కిం?**
**<u>ఆదిత్యుడు:</u>**
**ఇతి చేత్ ఉచ్యతే 'సత్' శబ్దవాచ్యమ్।**
**అవిద్యాశబళం బ్రహ్మ।**
**బ్రహ్మణో → అవ్యక్తమ్।**
**అవ్యక్తాత్ → మహత్।**
**మహతో → అహంకారః।**
**అహంకారాత్ → పంచతన్మాత్రాణి।**

ఆవిధంగా '3' గా భాసించుచున్నదేది? ఏకమగు బ్రహ్మమే 'అవిద్య' అనే స్వీయ శబలము (చిత్‌వర్ణము)చే ఈ అనేకరూపములుగా సర్వము భాసింపజేయబడుచున్నది.
- **బ్రహ్మము** నుండి → అవ్యక్తము (వ్యక్తీకరణమునకు వేరై, సర్వము వ్యక్తీకరించునదై నట్టిది) బయల్వెడలుతోంది.
- **అవ్యక్తము** నుండి → మహత్ తత్త్వము జనించినదగుచున్నది.
- **మహత్** నుండి → అహంకారము ప్రదర్శితమౌతోంది.
- **అహంకారము** నుండి → పంచ తన్మాత్రలు [The five senses of sound; Touch; Form; Taste and Smell] ప్రకటనమగుచున్నాయి.
- **పంచతన్మాత్రల** నుండి → పంచమహాభూతములు [Solidity; Liquidity; Heat; Vapour and Space]

పంచతన్మాత్రేభ్యః → పంచమహాభూతాని।
పంచ మహాభూతేభ్యో → అఖిలం జగత్।

- అటు తరువాత పంచ మహాభూతముల నుండి - ఈ దృశ్యమానమగుచున్న జగత్తంతా **విద్యమానము** అగుచున్నది.

---

**3. తదఖిలం కిమ్? ఇతి।**
**భూతవికార విభాగాదిః ఇతి॥**
**ఏకస్మిన్ పిండే కథం**
**భూత వికార విభాగ ఇతి?**
**తత్ తత్, కార్య - కారణ భేద**
**రూపేణ అంశతత్త్వ**
**వాచక - వాచ్య, స్థాన భేద విషయ**
**దేవతాకోశ భేదవిభాగా భవన్తి।**

**త్రిశిఖి :** ఈ అనేకముగా కనిపించే జగత్తుగా ఎట్లా అవుతోంది? ఏది ఇదంతాగా అగుచున్నది?

**ఆదిత్యుడు :** ఇదంతా పంచమహాభూతముల సవికార విభాగమే! అంతకుమించి మరేమీ ఏదీ కాదు.

**త్రిశిఖి :** పిండము మొదట్లో 'ఏకము' అయి ఉండగా, ఎట్లా భూతవికార విభాగములుగా అవటం జరుగుతోంది?

**ఆదిత్యుడు :** వేరు వేరు ధర్మములు కలిగి ఉన్నట్టి పంచమహాభూతముల యొక్క కార్య - కారణ రూప భేదముచేత, వాటివాటి అంశతత్త్వములచే - (ఆకాశము- శబ్దాంశ దేవత, వాయువు - స్పర్శాంశదేవత, అగ్ని - రూపదేవతాంశ, జలము - రసదేవతాంశ, భూమి - గంధదేవతాంశ) ... ఒకే అనుభవమునకు వేరువేరైన అనుభూతులతో కూడిన **అనుభవ విభాగములు** ఏర్పడుచున్నాయి. వాటివాటి వాచక (చెప్పువాడు Experiencer-), వాచ్య (చెప్పబడునది - Experienced ) రూపముగా దేవతాంశల నుండి భేద విభాగమంతా ఏర్పడుచున్నది-అనుభవము ఒక్కటే అయినప్పటికీ శబ్ద-స్పర్శ-రూపాది అనుభవములు వేరువేరైనట్లుగా!

నిర్విషయ - నిరాకార బ్రహ్మమునుండి క్రీడగా, లీలగా బయల్వెడలిన అవిద్యా పిండము నుండి ఈఈ భేద విభాగాలు సంప్రదర్శనమగుచున్నాయి.

---

**4. అథా ఆకాశో**
**అంతఃకరణ మనో బుద్ధి చిత్త అహంకారాః।**
**వాయుః → సమాన ఉదాన వ్యాన అపాన ప్రాణాః।**
**వహ్నిః → శ్రోత్ర త్వక్ చక్షుః జిహ్వా అఘ్రాణాని**
**ఆపః → శబ్ద స్పర్శ రూప రస గంధాః**
**పృథివీ → వాక్ పాణి పాద పాయు ఉపస్థాః**

**ఆత్మనుండి ఆకాశ - వాయు - వహ్ని - జల - పృథివిలు బయల్వెడలుచున్నాయి. బ్రహ్మమునుండి మాయాకల్పనచే బయల్వెడలిన 'ఏకపిండము' (ఆత్మాకాశము) - అంతఃకరణముగా బయల్వెడలుతోంది.**
**అంతఃకరణము**-మనో బుద్ధి చిత్త అహంకార రూపములుగా ప్రదర్శితమౌతోంది.
**వాయువుయొక్క అంశలు** : సమాన - ఉదాన - వ్యాన - అపాన - ప్రాణములు
**అగ్నియొక్క అంశలు** : శ్రోత్రము (చెవులు), త్వక్ (చర్మము), చక్షుః (కనులు), జిహ్వ (రసము), అఘ్రాణాని (వాసనలు).
**ఆపః (జలము) యొక్క అంశలు** : శబ్ద - స్పర్శ - రూప - రస - గంధములు.
**పృథివీ అంశలు** : వాక్కు, పాణి (చేతులు), పాదములు, పాయు (మల విసర్జనాంగము), ఉపస్థ (మూత్ర విసర్జనాంగము).

---

**5. జ్ఞాన-సంకల్ప-నిశ్చయా**
**అనుసంధానా - అభిమానా → ఆకాశకార్యాః,**
**అంతఃకరణ విషయాః॥**
**సమీకరణ, ఉన్నయన, గ్రహణ, శ్రవణ,**
**ఉచ్ఛ్వాసా → వాయు కార్య, ప్రాణాది విషయాః॥**

**ఆకాశము యొక్క కార్యములు**
1. జ్ఞానము (Knowing)
2. సంకల్పము (The Thought Process)
3. అనుసంధానము (Getting connected to a context or an object)
4. అభిమానం (Sense of 'I' and 'my')

**అంతఃకరణ విషయాలు -**
- సమీకరణము (Collecting details).
- ఉన్నయన (Attaching meaning / perceiving).
- గ్రహణము (Interpreting).
- శ్రవణము (Hearing and Relating).

**వాయువుయొక్క కార్యము - అద్దాని అంతఃకరణ విషయాలు :** ఉచ్ఛ్వాస, ప్రాణ- అపాన-వ్యాన-ఉదాన-సమానములు.

---

**6. శబ్ద స్పర్శ రూప రస గంధా - అగ్ని కార్యాః॥**
**జ్ఞానేంద్రియ విషయా అబాశ్రితాః॥**
**వచనా ఆదాన గమన విసర్గ ఆనన్దాః-పృథివీకార్యాః॥**

**అగ్నియొక్క కార్యములు -** శబ్ద - స్పర్శ - రూప - రస - గంధములు.
**దేహములో ఆశ్రయించి ఉన్నవాటి స్థానములు** : చెవులు, చర్మము, కనులు, నాలుక, ముక్కు అనబడు జ్ఞానేంద్రియములు.

| | |
|---|---|
| కర్మేంద్రియ విషయాః।<br>కర్మ జ్ఞానేంద్రియ విషయాః,<br>ప్రాణ తన్మాత్ర విషయా, అంతర్భూతాః।<br>మనో బుద్ధ్యోః చిత్త అహంకారౌ చ అంతర్భూతౌ। | **పృథివియొక్క కార్యములు :** వచనము, ఆదానము, గమనము, విసర్గ, ఆనందము.<br>**వాటియొక్క స్థానములు :** నోరు, చేతులు, కాళ్ళు, పాయువు, ఉపస్థ అనబడు కర్మేంద్రియములు.<br>ఈవిధంగా (5) కర్మేంద్రియములు, (5) జ్ఞానేంద్రియములు, వాటి వాటి విషయములు (5 + 5), పంచప్రాణములు (5), పంచ తన్మాత్రలు (5) ... ఇవన్నీ పాంచభౌతిక దేహములో అంతర్భూతమై ఉన్నట్టివి.<br>మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము - ఇవి దేహములో అంతర్భూతమైయున్న అంతరంగ సూక్ష్మాంశలు. |
| **7.** అవకాశ విధూత దర్శన<br>పిణ్డీకరణ ధారణాః<br>సూక్ష్మతమా ఏవ<br>తన్మాత్ర విషయాః। | **సూక్ష్మతమ తన్మాత్ర విషయాలు :**<br>1. అవకాశ 2. విధూత 3. దర్శన 4. పిణ్డీకరణ 5. ధారణ<br>వీటి విషయాలే శబ్ద స్పర్శ రూప రస గంధ పంచతన్మాత్రలు. ఇవి సూక్ష్మతమ భూత మాత్రలు. (Superlatively Subtle Materialistics) |
| **8.** ఏవం ద్వాదశాంగాని<br>ఆధ్యాత్మికాని, ఆధిభౌతికాని,<br>ఆధి దైవికాని।<br>అత్ర నిశాకర, చతుర్ముఖ,<br>దిక్, వాతా, అర్క, వరుణా<br>అశ్వినీ, అగ్ని, ఇంద్ర<br>ఉపేంద్ర, ప్రజాపతి, యమా<br>ఇతి అక్ష అధిదేవతా రూపైః।<br>ద్వాదశ నాడ్యన్తః ప్రవృత్తాః<br>ప్రాణాయేవ అంగాని।<br>అంగ జ్ఞానం తదేవ జ్ఞాతేతి।। | ఈవిధంగా 1. ఆధ్యాత్మికములు 2. ఆధి భౌతికములు 3. ఆధి దైవికములు,... వాటివాటి 1. అంశలు 2. కార్యములు 3. ఇంద్రియ స్థానములు 4. విషయములు 3x4 = 12 - ఇవన్నీ ద్వాదశ (12) అంగములుగా వివరించబడుచున్నాయి.<br>12 అంగములు విశ్వరచనలో అంతర్భాగములై, సమిష్ఠిని సమీకరిస్తూ నడుపు 12 దివ్యాంశలు గల ఇంద్రియాధి దేవతలుగా 1. నిశాకరుడు (చంద్రుడు) 2. చతుర్ముఖబ్రహ్మ 3. దిక్ దేవత 4. వాయువు 5. అర్కుడు (సూర్యుడు) 6. వరుణుడు 7. అశ్వనీ దేవతలు 8. అగ్ని 9. ఇంద్రుడు 10. ఉపేంద్రుడు 11 ప్రజాపతి 12. యముడు ప్రవర్తిల్లుచున్నారు.<br>ఈ 12 అధి దేవతా భౌతిక రూపాలే సుషుమ్న మొదలుగా గల ద్వాదశ (12) నాడులు. వాటిలో గల అఖండమగు ప్రాణశక్తియే (ఏకమే అయి ఉండి) 12 నాడీ - నాడీ దేవతా రూపములుగా వెలయుచున్నది. అంతా కూడా ప్రాణతత్త్వమేనని తెలుసుకొనువాడే జ్ఞాన జ్ఞాత। అంగతత్త్వ జ్ఞాత। (తెలుసుకొనువాడు). |
| **9.** అథ వ్యోమ – అనిల – అనల<br>జల – అన్నానాం పంచీకరణం<br>ఇతి జ్ఞాతృత్వం<br>సమాన యోగేన<br>శ్రోత్ర ద్వారా<br>శబ్దగుణో 'వాక్' అధిష్ఠితే,<br>ఆకాశే తిష్ఠతి।<br>ఆకాశః తిష్ఠతి। | ఇక్కడ కనబడేదంతా కూడా ఆకాశ - వాయు - అగ్ని - జల - అన్నము (భౌతికానుభవము - భూమి - Solid) ల సమ్మేళనమే! ఇదంతా "భూత పంచీకరణము" - అని చెప్పబడుతోంది.<br>**తెలియబడుచున్నది :** భూత పంచీకరణము.<br>**తెలుసుకొనుచున్నవాడు :** ఈయన వేరుగా కేవల-చిదాకాశ రూపుడై ఉండి, సమానవాయు యోగ బంధముచే శ్రోత్రములచే (చెవుల ద్వారా) శబ్ద గుణ ప్రదర్శము చేయుచున్నాడు. 'వాక్కు' నందు అధిష్ఠితుడై, అన్నీ నిర్వర్తిస్తూ ఉన్నాడు. మరొకవైపు ఆకాశస్వరూపుడై ఆకాశమంతా నిండి ఉండి జ్ఞాతృ (తెలియబడు - తెలుసుకొను) ఉభయరూపుడై తిష్ఠించి ఉన్నాడు. వర్తిస్తున్నాడు. |
| **10.** మనో వ్యానయోగేన 'త్వక్' ద్వారా స్పర్శగుణః,<br>పాణి అధిష్ఠితో వాయౌతిష్ఠతి,<br>వాయుః తిష్ఠతి।<br>బుద్ధిః ఉదాన యోగేన<br>చక్షుః ద్వారా రూపగుణః | ఆతని మనస్సు వాయు (వ్యాన) యోగముతో చర్మము ద్వారా స్పర్శ గుణము ప్రదర్శించుచున్నది.<br>చిత్ స్వరూపుడగు ఆత్మ - **"తెలుసుకొనుచున్నవాడు"** రూపుడై, తన చేతులలో ప్రాణశక్తిరూపుడుగా ప్రవేశించి, చేతులను కదల్చుచు క్రియలు నిర్వర్తిస్తున్నాడు.<br>ఆతడు తన యొక్క బుద్ధి రూప ఉదాన ప్రాణయోగముచే చక్షువుల ద్వారా రూపగుణ యుక్తుడై, కళ్ళు దర్శించేవి కూడా తానే అయి కనబడునదంతా |

| | |
|---|---|
| పాదా అధిష్ఠితో అగ్నౌ తిష్ఠతి,<br>అగ్నిః తిష్ఠతి॥<br>చిత్తమ్ అపానయోగేన జిహ్వా ద్వారా రసగుణ<br>ఉపస్థా అధిష్ఠితో అప్సు తిష్ఠతి,<br>ఆపః తిష్ఠతి॥<br>అహంకారః ప్రాణయోగేన ఘ్రుణద్వారా<br>గన్ధ గుణో గుద అధిష్ఠితః,<br>పృథివ్యాం తిష్ఠతి, పృథివీ తిష్ఠతి॥<br>ఇతి ఏవం వేద।<br>అత్ర ఏతే శ్లోకా భవంతి। | ఆస్వాదిస్తున్నాడు. అగ్ని స్వరూపుడై పాదములయందు ప్రవేశించి తిష్ఠించుకొని నడకలు ఆస్వాదిస్తున్నారు.<br>ఆ చిత్ స్వరూపుడు చిత్తము అయి, అపానయోగముచే జిహ్వ (నాలుక) ద్వారా రసగుణమును కల్పించుకొని, రసాస్వాదనను స్వకీయ తత్త్వముగా ఆస్వాదించు చున్నాడు. రూచి చూచువాడు - పదార్థములో రుచి స్వరూపము కూడా తానే అయి ఉంటున్నాడు. అ చిత్ ఆనందస్వరూపుడు ఉపస్థయందు అధిష్ఠితుడై ఉంటున్నాడు. జలమునందు ప్రవేశించి జలస్వరూపుడై ఉంటున్నారు.<br>అహంకారము ప్రాణ యోగము యొక్క సంబంధంచేత గంధ గుణము ధరించి పృథివియందు తిష్ఠించి ఉంటోంది. ఈవిధంగా నిర్విషయ బ్రహ్మము నుండి బయల్వెడలిన అహమ్-తత్త్వమే సూక్ష్మ తన్మాత్రలు అయి, ఇటు దేహములలో ఇంద్రియములుగాను, అటు, దివ్యసూక్ష్మదేవతా శక్తి రూపాలుగాను, ఇంకా కూడా బాహ్యమున బ్రహ్మాండములోని పంచభూత(సూక్ష్మతమ) తత్త్వములు, ధర్మములుగాను అగుచూ ఉన్నది-అని (వేదవాఙ్మయముచే) గానము చేయబడుచున్నది. |
| **11.** పృథక్ భూతే షోడశ కలాః<br>స్వార్ధ భాగాన్ పరాన్ క్రమాత్,<br>అన్తఃకరణ వ్యాన అక్షి రస పాయు నభః క్రమాత్,<br>ముఖ్యాత్ పూర్వ - ఉత్తరైః భాగైః<br>భూతే - భూతే చతుః చతుః,<br>పూర్వమ్ ఆకాశమ్ ఆశ్రిత్య<br>పృథివి ఆదిషు సంస్థితాః,<br>ముఖ్యాత్ ఊర్ధ్వే పరా జ్ఞేయాన్<br>అపరాన్ ఉత్తరాన్ విదుః<br>ఏవమ్ అంశో హి అభూత్, తస్మాత్<br>తేభ్యశ్చ అంశో అభూతః, తథా తస్మాత్ అన్యోన్యమ్<br>ఆశ్రిత్య హి ఓతం - ప్రోతమ్ అనుక్రమాత్॥ | పంచప్రాణములు - పంచకర్మ - పంచజ్ఞానేంద్రియములు ఎరుగుచున్నవాడు-షోడశ (16) కళలకు వేరై, విలక్షణమై ఉన్నాడు. 'బ్రహ్మము' సర్వప్రకాశకమై ఉన్నది. అట్టి బ్రహ్మమునందు ఆ 16 కళలు - ఒక అర్థ విభాగమునందు ఆరోపితమైయున్న వగుచున్నవి. అంతఃకరణము, ప్రాణము, అక్షి (ద్రష్టత్వము), రస (ఆస్వాదన), పాయు (విసర్జన) ఆకాశ క్రమముగా కనబడుచున్నవాటికి, వేరుగా అని ఉత్తరభాగము (2nd Half). గా ఉన్న అది నాలుగు భాగాలుగా అయి, ఒక్కొక్క భాగమును భూత చతుష్టయంతో చేర్చగా 4x4 చేరి, పంచీకరణము అగుచున్నది.<br>1) పూర్వ విభాగంలో 'పృథివి' మొదలైన బాహ్యమంతా ఉన్నది.<br>2) ఉత్తరభాగములో సూక్ష్మమగు మనోబుద్ధి చిత్త అహంకార అంతరంగ విభాగము. దానికి ఆవల కేవల పురుషుడు. అంతరంగ చతుష్టయము అభూతములు (లేక) అభౌతికములు. వాటి అంశలే ఈ జగత్తులో స్థూలముగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఇక్కడ స్థూలముగా కనిపించేది కూడా సూక్ష్మతత్త్వపు ప్రదర్శనమే. స్థూల - స్థూలములు (పాంచభౌతిక దేహ ఇంద్రియతత్త్వాలు - మనోబుద్ధి చిత్త అహంకారాలు) ఇవన్నీ అన్యోన్యము ఆశ్రయించి ఓత - ప్రోతమై ఉంటున్నాయి. |
| **12.** పంచభూతమయా భూమిః<br>సా చేతన సమన్వితా।<br>తత ఓషధయో అన్నం చ।<br>తతః పిణ్డాః చతుర్విధాః॥<br>రసా - సృక్ - మాంస<br>మేదో - అస్థి - మజ్జా - శుక్లాని ధాతవః॥<br>కేచిత్ తత్ యోగతః<br>పిణ్డా భూతేభ్యః<br>సంభవాః క్వచిత్॥ | ఈ స్థూలంగా కనిపిస్తున్న భూమి - తదితర భౌతికాంశములు (అనగా) "ఆకాశ - వాయు - అగ్ని - జలముల ఘనీభూత (స్థూలముల) సంపుటీకరణయే! పాంచభౌతికమయమగు ఈ భూమి అచేతనం కాదు. చేతనముతో కూడుకొని సచేతనమే అయి ఉన్నది.<br>అట్టి భూమినుండి చైతన్యవంతమగు ఓషధులు పుట్టుచున్నాయి. సచేతనమగు ఓషధుల నుండి 'అన్నము' ఉద్భవిస్తోంది. అట్టి అన్నము నుండి సచేతనములగు అండజ, జరాయుజ (గర్భము నుండి), స్వేదజ (చమట - జలము నుండి), ఉద్భిజ (విత్తులనుండి) చతుర్విధ ప్రాణులు పుట్టుచున్నారు.<br>"అన్న చైతన్యము" నుండియే రసము, రక్తము, మాంసము, మేదస్సు అస్థి (బొమికలు), మజ్జ, శుక్లము... అనే చైతన్యముతోకూడిన ధాతువులు జనిస్తున్నాయి.<br>కొందరు "అదేమీ లేదు - శుక్ల - శోణితములు సంయోగము చేతనే ప్రాణులు పుట్టుచున్నారు కదా!" .... అని అభిప్రాయపడుచున్నారు. (అది సరికాదు).<br>ఈ ప్రాణులకు సంబంధించిన 'అన్నమయ పిండము'.... దేహములకు నాభి మండల - మధ్యస్థమై సంస్థితము అగుచున్నది. |

13. తస్మిన్ ను అన్నమయః పిణ్డో
నాభిమండల సంస్థితః।
అస్య మధ్యే అస్తి హృదయం।
స నాళం పద్మకోశవత్।
సత్త్వా అన్తర్వర్తినో దేవాః
కర్తృ – అహంకార చేతనాః।
అస్య బీజం తమః పిణ్డం
మోహరూపం జడం ఘనమ్,
వర్తతే కంఠమ్ ఆశ్రిత్య
మిశ్రీభూతమ్ ఇదమ్ జగత్।
ప్రత్యక్ – ఆనన్ద రూపాఽఽత్మా
మూర్ధ్ని స్థానే పరం పదే
అనన్త శక్తి సంయుక్తో
'జగత్' రూపేణ భాసతే॥

ఈ ప్రాణులయందు 'అన్నమయ పిండము' దేహముయొక్క నాభిప్రదేశ ఆకాశంలో మధ్యగా (నాభిమండలమునందు) సంస్థితమైయున్నది. అట్టి నాభి ప్రదేశ దేహాకాశంలో పద్మకోశము వలె - 'హృదయము' నాళములతో కూడి ఉన్నది.

అట్టి హృదయకోశమును ఆశ్రయించి ఇంద్రియాధిష్ఠాన దేవతలు, కర్తృత్వభావనలు, అహంకార భావనలు -మొదలైన భావనా ప్రదర్శన పరంపరలు సచేతనములై పరిఢవిల్లు చున్నాయి. దేవతలు అంతర్వర్తులై వెలయుచున్నారు.

అట్టి హృదయ కోశము-మనస్సుకు బీజ (జనన) స్థానము. మూలకారణము. మనస్సు మోహ రూపము. జడము. అజ్ఞానముతో కూడుకొనిన "తమో పిండ (జీవాత్మ), తమోచైతన్య రూపము. ఇదంతా మనస్సే. అట్టి మనస్సు కంఠప్రదేశమును ఆశ్రయించి ఉంటోంది. కేవల మనో చైత్యము-అజ్ఞానముతో కూడిన మననముతో మిశ్రమమై **ఈ జగత్ రూపానుభవముగా** అగుచున్నది. మనోమయ పురుషుడే (రూపుడే) ఈ జీవుడు.

మూర్ధ్ని స్థానములో ప్రత్యక్ - ఆనందరూపుడగు జీవాత్మ చైతన్య రూప ప్రదర్శితుడై ఉన్నాడు. ఆ జీవాత్మ చైతన్యము ను తనయొక్క స్వప్రదర్శనముగా కలిగియున్న పరమాత్మ పరమపదమగు మూర్ధ్ని (శీర్ష) స్థానమునందు ప్రకాశమానులై ఉన్నారు. ఆ పరమపదస్థాన పరమ చైతన్య స్వరూపుడు అనంత శక్తి సంయుతుడై జీవ - హృదయ-ఇంద్రియ-దృశ్య-చైతన్య స్వరూపుడై జగత్ రూపముగా కూడా భాసిస్తున్నారు.

---

14. సర్వత్ర వర్తతే జాగ్రత్।
స్వప్నం జాగ్రతి వర్తతే।
సుషుప్తం చ తురీయం చ
న అన్య అవస్థాసు కుత్రచిత్।
సర్వ దేశేషు అనుస్యూతః
చతూరూపః శివాత్మకః।
యథా మహాఫలే సర్వే
రసాః సర్వ ప్రవర్తకాః
తథైవా అన్నమయే కోశే
కోశాః తిష్ఠన్తి చ అన్తరే।
యథా కోశః తథా జీవో,
యథా జీవః తథా శివః।
సవికారః తథా జీవో,
నిర్వికారః తథా శివః।
కోశాః తస్య వికారాః
తే హి అవస్థాసు ప్రవర్తకాః।
యథా రసాశయే ఫేనం
మథనాత్ ఏవ జాయతే
మనో నిర్మథనాత్ ఏవ
వికల్పా బహవః తథా।

పరమాత్మ చైతన్యము నుండియే 'ద్రష్ట (లేక) జీవుడు' అని చెప్పబడు జీవాత్మ చైతన్యము బయల్వెడలుతోంది. ఆ పర చైతన్యమే జాగ్రత్ చైతన్యముగా అగుచున్నది. జాగ్రత్ అంతటా నిండి ఉండి, జీవ చైతన్య రూపముగా స్వకీయ జాగ్రత్ చైతన్యమును ఆస్వాదిస్తోంది.

జాగ్రత్‌కు ఆవల **"స్వప్న చైతన్యము స్వప్న ద్రష్ట, స్వప్న దృశ్యము"**ల రూపముగా కూడా ఆ కూటస్థ చైతన్యమే ప్రకాశమానమగుచున్నది. దానికి ఆవల సుషుప్తి. ఆపై తురీయము. జాగ్రత్-స్వప్న - సుషుప్తి - తురీయములగు చతురవస్థలకు వేరుగా మరే అవస్థా లేదు. ఆత్మ ఆ చతురవస్థలను తనకు తానే వినోదంగా కల్పించుకొనుచున్నది. విరమించుకొనుచున్నది కూడా!

ప్రత్యగాత్మయే జాగ్రత్ - స్వప్న - సుషుప్తులలో అంతటా సంచారములు చేస్తూ తురీయమై, ఆ తురీయత్వమునకు సాక్షిగా కూడా వెలయుచున్నారు.

ఏవిధంగా అయితే ఒక ఫలమునందు (In a Fruit) రసము అంతటా వ్యాపించి, నిండినదై ఉన్నదో, ఆ రీతిగా **అన్నమయ కోశమునందు ప్రాణమయకోశము** అంతరముగా విస్తరించి స్థితించియున్నది. అట్లాగే ప్రాణమయ కోశమునందు మనోమయకోశము, మనోమయకోశమునందు విజ్ఞానమయకోశము, విజ్ఞానమయకోశమునందు ఆనందమయ కోశముల విషయం కూడా!

ఫలములో అంతటా రసము ఉండి రసమయమై ఉన్నట్లే .... పంచకోశములలో జీవుడు, జీవునిలో సర్వాత్మకుడగు శివుడు రసపూరితం చేస్తూ వేంచేసియున్నారు. నిండి ఉన్నారు.

వాస్తవానికి జీవుడు - శివుడు ఏక చైతన్య స్వరూపులే. వేరు వేరు కాదు. సవికారమగు చైతన్యమును **జీవుడు** అని, నిర్వికార చైతన్యమును **శివుడు** అని.... చెప్పుకుంటున్నాము.

పంచకోశములు, వాటి యొక్క వికారములు... ఇవియే జాగ్రత్ - స్వప్న సుషుప్తి - తురీయావస్థలుగా ప్రవర్తమానమగుచున్నాయి.

కుంకుడుకాయ రసమునకు వాటికి జలముచేర్చి, రెండు చేతులుతో నలుపుచున్నప్పుడు నురుగు బయల్వెడలుచున్నది చూచావా! అదే రీతిగా, మనస్సును నలుపుటచే

సంకల్పములు బయల్వెడలుచున్నాయి. ఆ సంకల్పములనుండి అనేక వికల్పములు (విశేషణ - కల్పన పరంపరానామ్) ప్రదర్శనమగుచున్నాయి. సంకల్పములకు ఆవల శివుడు - సంకల్పములకు ఈవల జీవుడు ఈ రెండు **అఖండ - ఏక చైతన్య స్వరూపములే! పరస్పరము అద్వితీయులే!**

---

**15. కర్మణా వర్తతే కర్మీ,**
**తత్ త్యాగాత్ శాంతిమ్ ఆప్నుయాత్।**
**అయనే దక్షిణే ప్రాప్తే**
**ప్రపంచ అభిముఖం గతః।**
**అహంకార - అభిమానేన జీవస్య**
**అధ్ధి సదాశివః।**
**స చ అవివేక ప్రకృతిః**
**సంగత్యా తత్ర ముహ్యతే।**
**నానా యోని శతం గత్వా**
**శతేఽసౌ వాసనా వశాత్।**
**విమోక్షాత్ సన్చరతి ఏవ**
**మత్స్యః కూల ద్వయం యథా।**
**తతః కాలవశాత్ ఏవ హి**
**ఆత్మజ్ఞాన వివేకతః**
**ఉత్తర - అభిముఖో భూత్వా**
**స్థానాత్ స్థానాన్తరం క్రమాత్,**
**మూర్ధ్న్య ఆధాయ ఆత్మనః ప్రాణాన్**
**యోగాభ్యాసస్థితః చరన్।**

మనస్సు నుండి జనించుచున్న మనన - సంకల్పములచే కర్మల స్వభావము బయల్వెడులుతోంది. అనగా **"అది - ఇది నిర్వర్తించాలి"** అనే రూపంగా బయల్వెడలుచున్నది. కర్మలు మరి కొన్ని కర్మపరంపలకు దారి తీస్తున్నాయి. మనన రూపమగు మనస్సు శమిస్తే సంకల్పము శమిస్తుంది. వాటితోబాటు కర్మలు శమించి, ఈ జీవుడు శాంతిని పొందుచున్నాడు. శివ స్వరూపుడై శేషించుచున్నాడు.

మనస్సు సంకల్పముల పరంపరలచేత దక్షిణంగా ప్రపంచాభిముఖముగా అయినప్పుడు, శివుడే జీవుడుగా బద్ధుడై దుఃఖభాగి అగుచున్నాడు. అనగా, 'జీవుడు' అయి కన్పట్టుచున్నాడు.

స్వతఃగా సదాశివ స్వరూపుడే అయి ఉండి కూడా, అహంకారము - దృశ్యమును అభిమానించటముచే 'జీవుడు'గా అగుచున్నాడు.

అవివేకమును స్వీకరించి స్వకీయమగు ప్రకృతియందు ప్రవేశించి, సంగము పొంది మోహమును పొందుచున్నాడు.

మోహముచే అనేక యోనులలో ప్రవేశ-నిష్క్రమణములు చేస్తూ, వందలాది -వేలాది వాసనలను పెంపొందించుకుంటూ, వాటికి వశుడై **'నేను జీవుడను, జీవబద్ధుడను'...** అను భావనకు, **దర్శనముకు** బద్ధుడై, **పరిమితత్వమును** ఆపాదించుకొని **దుఃఖితుడు, నిబద్ధుడు** అగుచున్నాడు.

పెద్ద సొరచేప నదీజలంలో ఈ వడ్డు నుండి ఆ వడ్డుకు, అటునుంచి ఇటు తిరుగాడువిధంగా దృశ్యపరంపరలలో తిరుగాడుచున్నాడు. ఒకానొకప్పుడు కాలవశంగా ఆత్మజ్ఞాన వివేకము సంపాదించుటకున్నప్పుడు కర్మ బంధములను త్రెంచుకొని మోక్షాత్ముడగుచున్నాడు.

ఉత్తరాభిముఖుడై, యోగశాస్త్రములో సూచించురీతిగా **మూలాధారము నుండి సహస్రారము వరకు ఉత్తరోత్తర స్థానములను సముపార్జించుకుంటూ యోగాభ్యాసి అయి, ప్రాణములను సుషుమ్నామార్గంగా 'సహస్రారమునకు చేర్చుచున్నాడు.** జీవాత్మను సహస్రార సంస్థితమైన పరమాత్మయందు ఏకముచేసి **"పరబ్రహ్మాత్మస్వరూపుడు"** అగుచున్నాడు.

---

**16. యోగాత్ సంజాయతే జ్ఞానం।**
**జ్ఞానాత్ యోగః ప్రవర్తతే।**
**యోగజ్ఞాన పరో నిత్యం**
**సయోగీ న ప్రణశ్యతి।**
**వికారాస్తం శివం పశ్యేత్,**
**వికారశ్చ శివే న తు।**
**యోగ ప్రకాశకం యోగైః**
**ధ్యాయేత్ చ అనన్య భావనః।**

యోగ మార్గం గొప్పదా? జ్ఞానమార్గము గొప్పదా?-అని ప్రశ్నిస్తే..., యోగాభ్యాసముచే జ్ఞానము ప్రవృద్ధమౌతోంది. జ్ఞానముచే యోగము ప్రవర్తమానమగుచున్నది. కనుక ఎవ్వడైతే యోగ-జ్ఞానపరుడై ఉంటాడో, అట్టి యోగి ఇక దక్షిణాభిముఖుడవడు. ఇంద్రియవిషయములలో పడడు. ఆతనికి దృశ్యములో ప్రణశ్యత్వము ఉండదు. **యోగ-జ్ఞానముల అభేదదర్శనమే సత్యదర్శనము.**

ఓ త్రిశిఖా!

**"దృశ్య వికారములకు ఆవల సర్వాత్మకుడై పరమ శివుడు (శివము) స్వస్వరూపుడై వేంచేసి ఉన్నారు"** అను దృష్టిని యోగి సముపార్జించుకోవాలి. వికారముల దృష్టి (ఇవి సత్యమే అనే భావన) కొనసాగునంతవరకు శివము అనుభవమునకు రాదు. (దేహాకార-శవ-భౌతిక భావాలే కొనసాగుతాయి).

యోగాభ్యాసముచే యోగస్థితి (సంయోగ - వియోగాతీత స్థానము) ప్రకాశమానమౌతుంది. అట్టి యోగాభ్యాసముచే ఒనగూడిన యోగరూప భావనచే అనన్యభావము (శివునకు వేరై ఏదీ లేదు. నీకు-నాకు శివుడు అన్యుడు కాదు అను అవగాహన) పెంపొందుచున్నది.

| | |
|---|---|
| **17.** **యోగ జ్ఞానే న విద్యేతే,**<br>**తస్య భావో న సిధ్యతి।**<br>**తస్మాత్ అభ్యాస యోగేన**<br>**మనః ప్రాణాః నిరోధయేత్॥**<br>**యోగీ నిశితధారేణ**<br>**క్షురేణేవ నికృన్తయేత్,**<br>**శిఖా ప్రాణమయీ వృత్తిః**<br>**'యమ' ఆది అష్టాంగ సాధనైః॥** | యోగ జ్ఞానములను ఆశ్రయించకపోతే 'నేను జీవ బద్ధుడను' అను జాడ్య భావము తొలగదు. శివ భావన అంకురించదు. రూపు దిద్దుకోదు.<br><br>అందుచేత ఓ త్రిశిఖా! ఈ జీవుడు అభ్యాసయోగమును ఆశ్రయించాలి. మనో - ప్రాణములను నిరోధించి, స్వ-వశము చేసుకోవాలి.<br><br>ఒక పదునైన కత్తితో పిచ్చి ముళ్ళ చెట్లను - ఖండించి - పీకి వేయు విధంగా యోగి 'తీవ్రమైన యోగాభ్యాసము' అనే పదునైన కత్తితో **దృశ్య-బంధ సంబంధితమైన సంకల్పములను సమూలంగా నశింపజేయాలి.**<br><br>యమము-నియమము-ఆసనము-ప్రాణాయామము-ప్రత్యాహారము-ధ్యానము - ధారణ - సమాధి.... అని చెప్పబడు అష్టాంగ యోగ సాధనలచే ప్రాణశక్తి సహాయంతో వృత్తిని ఆత్మదర్శనమందు నియమించటమే .... 'శిఖ' లేక 'యోగశిఖ' |
| **18.** **'జ్ఞానయోగః - కర్మయోగః'**<br>**ఇతి యోగో ద్విధామతః।**<br>**క్రియా యోగమ్ అథ ఇదానీం**<br>**శృణు, బ్రాహ్మణ సత్తమ!**<br>**అవ్యాకులస్య చిత్తస్య**<br>**బన్ధనమ్ విషయే క్వచిత్,**<br>**యత్ సంయోగో, ద్విజశ్రేష్ఠ।**<br>**స చ ద్వైవిధ్యమ్ అశ్నుతే।**<br>**కర్మ కర్తవ్యమ్ - ఇత్యేవ విహితేష్వేవ కర్మసు,**<br>**బన్ధనం మనసో నిత్యం**<br>**కర్మయోగః స ఉచ్యతే।** | 'యోగము' - అనునది 1. జ్ఞానయోగము 2. కర్మయోగము ... అని రెండు విధములుగా విభజించి సూచించబడుచున్నది.<br><br>ఓ బ్రాహ్మణ సత్తమా! త్రిశిఖీ! ముందుగా 'క్రియాయోగము' గురించి మనము చెప్పుకుంటున్నాము. వినండి!<br><br>ఈ చిత్తము అనేక విషయములలో ప్రవేశించుచూ వ్యాకులత (worry ) పొందినదై ఉంటోంది. అట్టి చిత్తమును వ్యాకులతలనుండి ఈవలకి తెచ్చి, ఏదో ఒకే ఒక్క విషయమునకు మాత్రమే ముడిపెట్టి - సంబంధమును కలిగించి ఉంచటము- "యోగము" నకు సంబంధించిన అభ్యాసము.<br><br>ఓ ద్విజశ్రేష్ఠా! ఆవిధంగా చిత్తమును అనేకముల నుండి ఉపసంహరిస్తూ, ఏకాగ్రము చేయనంతవరకు 'ద్వైవిధ్యము' ... అని అంటారు. అది లేకపోవటమే యోగము.<br><br>ఈ జీవుడు "ఇది నాకు నియమించబడిన కర్తవ్యము" అను అవగాహనతో విహిత-విద్యుక్త ధర్మములను (కర్మలకు) నిర్వర్తించును గాక! మనస్సును విద్యుక్త - విహిత ధర్మములకు మాత్రమే కట్టి ఉంచి, ఉపాసనా పూర్వకంగా నిర్వర్తించటము..., **'కర్మయోగము'** అని పిలువబడుతోంది. (అవిహితము - ఇంద్రియ ప్రియము అగు కర్మలను తగ్గించటము కూడా కర్మయోగ విభాగమే!) |
| **19.** **యత్తు చిత్తస్య సతతం**<br>**అర్థే శ్రేయసి బన్ధనమ్,**<br>**జ్ఞానయోగః స విజ్ఞేయః**<br>**సర్వ సిద్ధికరః శివః।**<br>**యస్య ఉక్తలక్షణే యోగే**<br>**ద్వివిధేఽపి అవ్యయం మనః,**<br>**సయాతి పరమం శ్రేయో**<br>**మోక్ష లక్షణమఞ్జసా।** | ఈ చిత్తమును ఎల్లవేళలా శ్రేయోమార్గములగు పురుషార్థములకు బంధించి (మరొకవైపు పోకుండా) ఉంచటమును 'జ్ఞానయోగము' అంటారు. **ధర్మార్థ కామ మోక్షముల** పవిత్ర ఆశయములచే జ్ఞానయోగము సిద్ధిస్తోంది.<br><br>అట్టి జ్ఞానయోగము - తెలుసుకోవలసినది తెలియబడుచూ **సర్వసిద్ధికరము,** ఈ జీవునిపట్ల **మంగళప్రదము** అగుచున్నది.<br><br>**"కర్మయోగము - జ్ఞానయోగము"**.... ఈ రెండూ పరస్పరము ఉక్త లక్షణములు కలిగి యున్నాయి. ఒకదానిచే రెండవది స్వభావంగా వృద్ధిపొందుతోంది. (లేక) ఒకదానిపట్ల అశ్రద్ధచే రెండవది బలహీనము అగుచున్నది. అవి రెండు విధములుగా కనబడుచున్నప్పటికీ ఒకే **మనో సంలగ్నత** కలిగియున్నవి. **ఎవ్వని మనస్సు ఆ రెండిటియందు ఒకేసారి ఒకే తీరుగా సంలగ్నమై ఉంటుందో, ఆతడు మోక్ష లక్షణ సంపదను త్వరత్వరగా పొందగలడు.** |
| **20.** **దేహ-ఇంద్రియేషు వైరాగ్యం**<br>**'యమ' ఇతి ఉచ్యతే బుధైః।**<br>**అనురక్తిపరే తత్త్వే సతతం**<br>**'నియమ' స్మృతః।** | **అష్టాంగయోగాలు**<br><br>**యమము :** దేహ - ఇంద్రియ - ఇంద్రియ విషయములపట్ల రాగరహితంగా విరాగియై ఉండటము - **యమము.**<br><br>**నియమము :** పరతత్త్వమునందు అనురక్తి కలిగి ఉండటము - **నియమము.** |

**సర్వవస్తుని ఉదాసీన భావమ్**
**'ఆనసమ్' ఉత్తమమ్'।**
**జగత్ సర్వం ఇదమ్ మిథ్యా**
**ప్రతీతిః 'ప్రాణ సంయమః'।**
**చిత్తస్య అంతర్ముఖీ భావః**
**ప్రత్యాహారస్తు, సత్తమ!**
**చిత్తస్య నిశ్చలీ భావో**
**ధారణా - ఆధారణం విదుః॥**
**'సోఽహం చిన్మాత్ర మేవ' ఇతి**
**చిన్తనమ్ 'ధ్యానమ్' ఉచ్యతే।**
**ధ్యానస్య విస్మృతిః సమ్యక్**
**'సమాధిః' అభిధీయతే॥**

**ఆసనమ్ :** సర్వ దృశ్య సంబంధమైన లౌకిక విషయాలపట్ల కూడా **'ఉదాసీనత్వము'** వహించి ఉండటమే ఆసనము! ఉత్తమాసనము యొక్క పరాకాష్ఠ.

**ప్రాణసంయమము :** "ఈ కనబడే జగత్తంతా కూడా మనము చదువుచున్న కథలోని విశేషములవంటివి మాత్రమే! కనుక వస్తుదృష్టిగా చూస్తే మిథ్యయే! సహజరూపముగా బ్రహ్మమే..." అను ఉపాసనయే **'ప్రాణ సంయమము'**.

**ప్రత్యాహారము :** చిత్తము బాహ్యా విషయములను బాహ్యాముననే త్యజించి, తనయందు - అంతర్ముఖ దృష్టిని పెంపొందించుకొనుచూ, తదితరులనందరినీ తనయందే తన స్వరూపంగా చూస్తూ, "అంతర్ముఖి" అయి ఉండటమును **"ప్రత్యాహారము"** అని అంటారు.

**ధారణ :** చంచలమై ఉంటున్న ఈ చిత్తమును నిశ్చలము చేయు ప్రయత్నమే **ధారణాధారణ** (ధారణ యొక్క ఆధారణ).

**ధ్యానము :** "సర్వత్రా వెలుగొందుచున్న సత్ - చిన్మాత్రమే నేను! కేవల ఎరుకతో కూడిన తేజో రూపమే నేను! అట్టి నేను దృశ్య - దేహ - మనో - బుద్ధి - చిత్త - అహంకారాదులకు, సంబంధితుడను కాను. బద్ధుడను కాను!" అను రూపము గల చిన్తన **ధ్యానము.**

**సమాధి :** ఇక ఆపై **"నేను ధ్యానము - ఇది ధ్యానించబడునది"**... అనే ద్వైత్వమును దాటివేసి, ఆ రెండిటిని విస్మరించివేసిన "సమ్యక్ - సమాధాన స్థితి" **'సమాధి'**

---

**21.** అహింసా సత్యమ్ అస్తేయమ్
బ్రహ్మచర్యం దయా ఆర్జవమ్
క్షమా ధృతిః మితాహారః
శౌచం చ ఇతి
'యమా' దశ॥
తపః సన్తుష్టిః ఆస్తిక్యమ్
దానం ఆరాధనం హరేః।
వేదాన్త శ్రవణం హ్రీః చ
'జప' ఇత్యాది లక్షణమ్॥

**యమముయొక్క అంగములు :**

1. అహింస (తదితరులకు బాధకలిగించక, సంతోషము కలుగజేయటము) 2. సత్యము 3. అస్తేయమ్ - ఇతరుల సొమ్ము ఆశించకపోవటం 4. బ్రహ్మచర్యము (బ్రహ్మమునందే చరించుచున్న అవగాహన - అంతేగాని, ఇంద్రియ ప్రపంచమున కాదు) 5. దయ 6. ఆర్జవమ్ (ఆశయము - చెప్పునది-చేయునది... ఏకరూపమై ఉండటము) 7. క్షమ (ఇతరుల తప్పులు సహించటం) 8. ధృతి (ఉత్తమ ఆశయముతో కూడిన పట్టుదల) 9. మితాహారము 10. శుచి అయిన భావాలు, ప్రవర్తనలు.

**నియమముయొక్క అంగములు :**

1. తపస్సు (తపనయే తపస్సు) 2. సన్తుష్టి (లభించినదానితో తృప్తి) 3. ఆస్తిక్యము (ఈ దేహము, గొంతు ఇవన్నీ ఇచ్చిన పరమాత్మను గుర్తెరగటం). 4. దానము 5. భగవత్ - ఆరాధనము 6. వేదాంత శ్రవణము 7. మహనీయుల మహనీయత్వము గుర్తు చేసుకొంటూ తన తప్పులు గుర్తించటము (8) హ్రీ - సిగ్గు (9) జపము మొదలైనవి - నియమము యొక్క అంగములు.

---

**22.** ఆసనాని తత్ అంగాని
'స్వస్తికా' ఆదీని వై, ద్విజ! వర్ణ్యంతే,
స్వస్తికం - పాదతలయోః ఉభయోరపి,
పూర్వ-ఉత్తరే జానునీ ద్వే కృత్వా ఆసనమ్ ఉదీరితమ్।
సవ్యే దక్షిణ గుల్ఫం తు పృష్ఠ పార్శ్వే నియోజయేత్,
దక్షిణేఽపి తథా సవ్యం 'గోముఖమ్' గోముఖమ్ యదా।
ఏకం చరణమ్, అన్యస్మిన్ ఊరావ ఆరోప్య నిశ్చలః
ఆస్తే యది దమేన ఓష్మం
'వీరాసనమ్' ఉదీరితమ్॥

**ద్విజోత్తమా! స్వస్తికము మొదలైన అంగనియమ రూపక ఆసనముల గురించి వినండి!**

**స్వస్తికాసనము :** కుడిపాదము - ఎడమకాలి పిక్క - తొడల మధ్యగాను, ఎడమపాదమును - కుడికాలి పిక్కతొడల - మధ్యగాను ఉంచి (బాసిపీట వేసుకొని) కూర్చుని ఉండటము.

**గోముఖాసనము :** గోవు కూర్చుని ఉండు తీరుగా, నడుము క్రిందగల కటి (మొల) ప్రదేశమునకు క్రిందుగా ఎడమకాలి మడమను కుడిప్రక్కగాను, కుడికాలి మడమను ఎడమ ప్రక్కగాను ఉంచి, మోకాలి మీద మోకాలిని తాకి - నొక్కి ఉంచి, ధ్యాసను భ్రూమధ్యముగా నిలిపి ఉంచటము.

**వీరాసనము :** కుడి తొడ క్రింద ఎడమ పాదమును, ఎడమ తొడక్రింద కుడి పాదమును ఆనించి దేహమును శిరస్సును సమముగా, నిటారుగా నిలిపి ఉంచటము.

23. గుదం నియమ్య గుల్ఫాభ్యాం
వ్యుత్క్రమేణ సమాహితః
**యోగాసనం భవేత్ ఏతత్**
ఇతి యోగవిదో విదుః।
ఊర్వోః ఉపరివై ధత్తే
యదా పాదతలే ఉభే,
**పద్మాసనం భవేత్ ఏతత్**
సర్వ వ్యాధి విషాపహమ్।
పద్మాసనం తు సంస్థాప్య
తత్ అంగుష్ఠ ద్వయం పునః।
వ్యుత్క్రమేణైవ హస్తాభ్యాం
**బద్ధ పద్మాసనం భవేత్॥**
పద్మాసనం సుసంస్థాప్య
జానూః ఊర్వోః అన్తరే కరౌ,
నివేశ్య భూమా వాతిష్ఠేత్
వ్యోమస్థః '**కుక్కుటాసనః**'।
కుక్కుటాసన బన్ధస్థో
దోర్భ్యాం సంబధ్య కన్ధరమ్, శేతే కూర్మవత్ ఉత్తాన
ఏతత్ '**ఉత్తాన కూర్మకమ్**'।
పాదా అఙ్గుష్ఠౌతు పాణిభ్యాం గృహీత్వా శ్రవణావధి
ధనురాకర్షకా కృష్టమ్ '**ధనురాసనమ్**' ఈరితమ్।
సీవనీం గుల్ఫ దేశాభ్యాం నిపీడ్య వ్యుత్క్రమేణతు
ప్రసార్య జానునో హస్తాః ఆసనం '**సింహరూపకమ్**'।

**యోగాసనము** : గుదము (మూలాధారము)నకు రెండు వైపులా రెండుకాళ్ళ మడమలను వ్యుత్క్రమముగా ( ఎదురుగా - కుడికాలి మడమను ఎడమవైపు, ఎడమకాలి మడమను కుడివైపు) అమర్చి ముక్కు - ముఖము - మెడ నిఠారుగా నిలిపి సావధానముగా కూర్చుని ఉండటమును యోగవిదులు **యోగాసనము** అని పిలుస్తున్నారు.

**పద్మాసనము** : కుడి పాదమును ఎడమ తొడమీదను, ఎడమ పాదమును కుడి తొడమీదను ఉంచి...., చేతులను వీపుకు పైభాగమునుండి త్రిప్పి, కుడిచేతి బొటన వ్రేలు - చూపుడు వ్రేలులతో కుడికాలి బొటనవేలు, ఎడమచేతి బొటను వ్రేలు - చూపుడు వ్రేలుతో ఎడమకాలి బొటన వ్రేలును పట్టుకొని ఉండటము **పద్మాసనము.** ఇది సర్వవ్యాధులను, విష పదార్థములను నిరోధించగల ఆసనము.

**బద్ధపద్మాసనము** : పైన చెప్పినట్లుగా పద్మాసనమును ఆశ్రయించి, (అవలంబించి) ఆపై గడ్డమును రొమ్ముపై తాకించుచు, భ్రూమధ్యమునందు దృష్టిని నిలిపి శరీరమును నిఠారుగా గాని, కొంచెము ప్రక్కకు వంచిగాని **సమఃగ్రీవ శిరకాయుడై** ఉండటము.

**కుక్కుటాసనము** : మొట్టమొదట పద్మాసనమును సుసంస్థాప్యము (కదలికలు లేని తీరుగా) అవలంబించి, పిక్కలకు - తొడలకు మధ్యగా చేతులను దూర్చి, భూమిపై మోపి, ఆ చేతుల అదిమితో పైకి ఎగసిన తీరుగా ఉండటము.

**ఉత్తానకూర్మాసనము** : కుక్కుటాసనము వేసిన తరువాత, రెండు చేతులతో కంఠమును పట్టుకొని, భుజములను రెండువైపులా దగ్గిరగా జేర్చి తాబేలువలె వెలికిలబడి ఉండటము.

**ధనురాసనము** : రెండు పాదముల బొటనవ్రేళ్ళను రెండుచేతులతో 'ధనస్సు' ఆకృతిగా వీపు వెనుక - చెవుల వరకు సరిగ్గా లాగి పట్టుకొని ఉంచటము.

**సింహరూపకాసనము** : అండకోశమునకు క్రింది భాగములో గల 'సీవనీనాడి'కి రెండు ప్రక్కలా-రెండు మడమలను-(కుడివైపు ఎడమమడమ-ఎడమవైపు కుడి మడమ) చేర్చి ఉంచి, కుడి-ఎడమల చేతి వ్రేళ్ళను కుడి-ఎడమల మోకాళ్ళపై ఉంచి

- శరీర పై భాగమును నిలువుగా సూటిగా నిలిపి....,
- నోరు తెరచి, నాలుకను బయటకు చాచి ....,
- నాసికకు అగ్ర (బృకుటి క్రింది) స్థానముపై దృష్టిని నిలిపి చూస్తూ ఉండటము.

---

24. గుల్ఫౌ చ వృషణస్య అథ సీవిని ఉభయ పార్శ్వయోః
నివేశ్య పాదౌ హస్తాభ్యాం బద్ధ్వా '**భద్రాసనం**' భవేత్।
సీవనీ పార్శ్వ హృదయం గుల్ఫాభ్యాం వ్యుత్క్రమేణతు
నిపీడ్యా ఆసనమ్, ఏతత్ చ '**ముక్తాసనమ్**' ఉదీరితమ్।
అవష్టభ్య ధరామ్ సమ్యక్
తలాభ్యాం హస్తయోః ద్వయోః
కూర్పరౌ నాభి పార్శ్వేతు స్థాపయిత్వా మయూరవత్
సమున్నత శిరః పాదమ్ '**మయూరాసనమ్**' ఇష్యత్॥

**భద్రాసనము** : సీవనీ నాడికి రెండు ప్రక్కల - కుడికాలును ఎడమవైపు, ఎడమకాలిని కుడివైపు తాకి ఉంచి..., రెండు పాదములను చేతులతో కదలకుండా పట్టుకొని, శిరస్సును నిట్టనిలువుగా నిలిపి ఉంచటము.

**ముక్తాసనము** : సీవనీ నాడియొక్క రెండు చివరలను మడమలచే తాకి, రెండువైపులను ఊర్ధ్వముగా పట్టి, మెడ - ముఖము - శిరస్సును పైకి నిఠారుగా ధారణచేసి భుజములను కించిత్ పైకి ఎత్తి ఉంచటము.

**మయూరాసనము** : రెండు అరచేతులను చాచి, భూమిపై పూర్తిగా ఆనించి, రెండు మోచేతులను నాభి (బొడ్డు)కి రెండువైపులా ఆనించి, చేతులపై దేహమును పైకి ఎత్తి, ముఖమును ఊర్ధ్వముగా (పైకి నిట్టనిలువుగా) నిలిపి, రెండు కాళ్ళను దండమువలె మీదికి చాచి ఉంచటము.

---

25. వామ - ఊరుమూలే దక్షాంఘ్రిమ్
జానో ఉర్వేష్టిత పాణినా
వామేన వామాఙ్గుష్ఠంతు
గృహీతం '**మత్స్యపీఠకమ్**'।

**మత్స్యపీఠకాసనము** :

- కుడి పాదమును ఎడమ తొడపై ఉంచి,
- ఎడమ చేతిని వీపువైపు నుండి త్రిప్పి తీసుకొని వచ్చి ఎడమకాలి మడమను కుడి కాలికి తగులునట్లుగా ఉంచి,
- కుడిచేతిని ఎడమ మోకాలి వెలుపలి నుండి త్రిప్పి తీసుకొనివచ్చి, ఎడమకాలి

యోనిం వామేన సంపీడ్య
మేఢ్రాత్ ఉపరి దక్షిణమ్,
ఋజుకాయః సమాసీనః
'సిద్ధాసనమ్' ఉదీరితమ్॥
ప్రసార్య భువి పాదౌతు
దోర్భ్యామ్ అంగుష్ఠమ్ ఆదరాత్
జానూ ఉపరి లలాటం తు
'పశ్చిమం తాణమ్' ఉచ్యతే॥
యేన కేన ప్రకారేణ
సుఖం ధార్యంచ జాయతే,
తత్ 'సుఖాసనమ్' ఇత్యుక్తః
అశక్తః, తత్ సమాచరేత్॥
ఆసనం విజితం యేన
జితం తేన జగత్రయమ్॥

బొటనవ్రేలును పట్టుకొని ఉంచి,

- కంఠము, భుజములు, శిరస్సు ఊర్ధ్వముగా ధారణచేసి ఉండటము.

**సిద్ధాసనము** : ఎడమకాలి మడమను లింగము యొక్క పైకి చేర్చి, నొక్కి పెట్టి ఉంచి,

- ఎడమకాలి పాదముమీదకు కుడికాలి మడమను చేర్చి, నొక్కి పెట్టి ఉంచి,
- భుజముల నుండి పై భాగమంతా పైకి ధారణ చేసి ఉంచటము.

**పశ్చిమం తాణ ఆసనము** : భూమిపై కూర్చుని, భూమిపై రెండు కాళ్ళను నిలువుగా చాచి ఉంచి, కుడి చేతితో కుడి కాలి బొటన వ్రేలును, ఎడమ చేతితో ఎడమకాలి బొటన వ్రేలును పట్టుకొని ఉండి,

- లలాటమును మోకాలికి ఆనునట్లుగా ఉంచి...,
- మోకాళ్ళను భూమి ప్రదేశమునుండి పైకి ఎత్తకుండా, భూమినే తాకి ఉంచి
- భ్రూమధ్య స్థానమును చూస్తూ ఉండటము.

ఈవిధంగా ఆసనములలో ఏదో ఒక్కటి, శరీరమునకు అనుకూలమైనది **ఆసనపండితుల సంప్రతింపులతో నేర్చుకొని అవధరించాలి.** లేదా, శరీరమునకు ఏది సుఖాసనమైతే దానిని పైన చెప్పుకొన్నవాటిలో కొన్ని చిన్న మార్పులతో, ఏకాగ్రతకు సానుకూల్యమైన ఆసనమును అవధరించవచ్చును. **సమాసన-విద్వాంసుల పాఠ్యాంశములు సర్వదా సముచితము.**

శరీరమునకు సానుకూలమైన, శరీరదారుఢ్యమునకు - వయస్సు దృష్ట్యా అనుకూలమైన ఆసనము అభ్యసించి క్రమంగా అతి తేలికగా, స్వభావంగా, ఎంతసేపైనా కూర్చోకలిగేటట్లుగా ఆసనమును అవధరించటమును **"ఆసనజయము"** - అని అంటారు.

ఎవ్వడు ఆసన జయమును సంపాదిస్తాడో ఆతడు ఆ ఆసనముతో త్రిలోకము జయించగలడయ్యా!

---

**26** యమైశ్చ నియమైశ్చైవ
ఆసనైశ్చ సుసంయుతః
నాడీ శుద్ధించ కృత్వా,
ఆదౌ ప్రాణాయామం సమాచరేత్॥
దేహమానం స్వాంగుళిభిః
షణ్ణవత్ (96) అంగులాయతమ్
ప్రాణః - శరీరాత్ అధికో
ద్వాదశాంగుళమానతః॥ దేహస్థమ్ అనిలం
దేహ సముద్భూతేన వహ్నినా,
న్యూనం సమం వా యోగేన
కుర్వన్ బ్రహ్మ విదిష్యతే॥

**ప్రాణాయామము** : ఈవిధంగా యమము - నియమములతో కూడినవాడై, సుఖాసనమును అభ్యాసపూర్వకంగా స్వీకరించినవాడై, మొట్టమొదట ధ్యాసను నాడీ ప్రదేశములలో ప్రవేశింపజేసి, నాడీ శుద్ధిని చేసుకుని, ఇక ఆపై చక్కగా ప్రాణాయామమును ఆచరించును గాక! (నాడీ భావనా కుంభకము)

ఈ దేహము వారివారి అంగుళీకము (ఉంగరపు వ్రేలు చివరి భాగము)తో కొలిస్తే ఈ భౌతిక దేహము '96' అంగుళీకముల పొడవు వుంటూ ఉంటుంది. ఇక ప్రాణశక్తి యొక్క ఉనికి దేహము కంటే కూడా 12 **అంగుళముల** వరకు అధిక పరిమాణము కలిగి ఉంటుంది.

ఏ యోగికైతే తన యొక్క యోగాభ్యాసముచేత తన దేహములో జనించుచున్న 'అగ్ని' సహాయముతో ప్రాణవాయువును తక్కువగా కాని, ఎక్కువగా గాని, దేహమంతా సరిసమానముగాగానీ, చేయటము తెలిసియున్నదో - అట్టి యోగి, తత్ సాధనచే బుద్ధి సునిశితము అగుచున్నది. సులభముగా **'బ్రహ్మజ్ఞాని'** అగుచున్నాడు.

---

**27.** దేహమధ్యే శిఖిస్థానం
తప్త జాంబూనద ప్రభమ్।
త్రికోణం ద్విపదాం అన్యత్।
చతురశ్రం చతుష్పదాం।
వృత్తమ్ విహంగమానాంతు।
షడశ్రం సర్పజన్మనామ్।

సర్వ దేహములలో దేహమధ్యగా శిఖి స్థానం (మూలాగ్ని మండలము) ఉష్ణముతో వెలుగొందుచూ ఉంటుంది. ఆ మూలాగ్ని మండలము

- మానవ దేహము యొక్క మధ్య (గరిమనాభి) భాగములో △ త్రికోణాకారమై ఉంటుంది.
- నాలుగు కాళ్ళు కలిగిన జంతువులలో □ చతురస్రాకారములో ఉంటోంది.
- పక్షులలో ○ వృత్తాకారముగా ఉంటుంది.
- సర్పములలో ⬡ షట్కోణ ఆకారముగా ఉంటుంది.

అష్టాశ్రం స్వేదజానాం తు।
తస్మిన్ దీపవత్ ఉజ్వలమ్॥
కన్దస్థానం మనుష్యాణాం
దేహమధ్యం నవాంఙ్గుళమ్,
చతురఙ్గుళమ్ ఉత్సేధం
చతురంగుళమ్ ఆయతమ్।
అణ్డాకృతి తిరశ్చాం చ
ద్విజానాం చ చతుష్పదాం।
తున్దమధ్యం తదిష్టం వై
తన్మధ్యం నాభిః ఇష్యతే॥

స్వేదజములలో (చెమట నుండి) జనించు కీటము మొదలుగాగల శరీరములలో - 8 కోణములతో కూడిన ఆకారముగా ఉంటుంది. దీపమువలె ఉజ్వలంగా ప్రకాశిస్తూ ఉంటుంది.

మనుష్యులకు శరీర మధ్య భాగము - '9' అంగుళముల పరిమాణము గల కందస్థానము ఉన్నది. 4 అంగుళముల ఎత్తు, 4 అంగుళముల వెడల్పు కలిగి ఉంటుంది. ఇదియే శరీర మధ్య భాగము.

4 కాళ్ళు గల తిర్యక్ (జంతు) యోనిలలోను, పక్షుల యొక్క శరీరములలోను మధ్య భాగము అండాకృతి (పక్షిగుడ్డు ఆకారములో) కందస్థానము (శరీరమధ్య భాగము) ఏర్పడినదై ఉంటుంది.

తున్దము (పొట్ట, ఉదరము) మధ్యలో కందస్థానము ఉంటోంది. ఇదియే దేహమునకు గరిమ నాభి స్థానము (Control place) కూడా!

28 తత్ర చక్రం ద్వాదశారం
తేషు విష్ణ్వాది మూర్తయః,
అహం తత్ర స్థితః చక్రం
భ్రామయామి స్వమాయయా।
అరేషు భ్రమతే జీవః
క్రమేణ, ద్విజసత్తమ!
తన్తు పంజరమధ్యస్థా
యథా భ్రమతి లూతికా।
ప్రాణా-అధిరూఢః చరతి
జీవః తేన వినా నహి।

అట్టి కంద స్థానము యొక్క మధ్య భాగమునందు '12' దళములు గల నాభిచక్రము ఉన్నది. ఆ చక్రమునందు విష్ణువు మొదలైన సకల దేవతలు మూర్తీభవించినవారై ఉన్నారు.

ఆదినారాయణ మూర్తిని (సర్వాంతర్యామిని) అగు నేను ఆ నాభి చక్రములో స్థితించి (నివశిస్తూ) ఉంటున్నాను. నాయొక్క స్వకీయ మాయచే శరీరతత్త్వమునంతటినీ నడిపిస్తూ ఉంటున్నాను.

ఓ ద్విజసత్తమా! ఒక సాలెపురుగు తాను సాలెగూడులోనే చిక్కుకొని తిరుగుతూ ఉంటుంది చూచావా? అట్లాగే 12 దళముల నాభిలో ఒక దళములో మాత్రమే పరిమితుడగుచూ జీవుడు 12 దళములు గల నాభిలో వివిధ రీతులుగా ప్రాణమును అధిష్ఠించినవాడై సంచారములు చేయుచున్నాడు. **"ప్రాణములు ఉన్నప్పుడే నేనుండగలను. ప్రాణములు లేకుంటే నేనే లేను"** - అను భావనకు బద్ధుడై ఉంటున్నాడు.

29 తస్య ఊర్ధ్వే కుండలీస్థానం
నాభేః తిర్యక్ అధ ఊర్ధ్వతః।
అష్ట ప్రకృతిరూపా సా చ
అష్టధా కుణ్డలీకృతా।
యథావత్ వాయుసారం చ
జ్వలనాది చ నిత్యశః।
పరితః కన్దపార్శ్వే తు
నిరుధ్యైవ సదా స్థితా।
ముఖేనైవ సమావేష్ట్య
బ్రహ్మరంధ్ర ముఖం తథా।
యోగకాలేన మరుతా
సా అగ్నినా బోధితా సతీ।
స్ఫురితా హృదయాకాశే
నాగరూపా మహోజ్వలా॥

ఆ నాభి చక్రము యొక్క పైన - క్రింద నలువైపులా ప్రదేశంలో 'కుండలీ స్థానము' ఉన్నది. ఆకుండలినీ శక్తి అష్టవిధ ప్రకృతి కలిగియున్నదై, '8' విధములుగా చుట్టుకొనియున్నది. (కుండలిని = ఇచ్ఛాశక్తి; చిత్తతత్త్వము; WILL)

అట్టి కుండలినీశక్తి వాయు తరంగములను సంచాలనము చేస్తూ, ప్రాణ-అపానములను వెదురు కర్రలవలె ఉపయోగించి, అగ్నిని పుట్టించుచూ జ్వలముచే - తదితర పదార్థములను పచనము చేస్తున్నది. తాను కన్దమునకు (పొట్టకు) ప్రక్కవైపుగా కదలక - మెదలక సదా సంస్థితమై ఉన్నది.

ముఖమునందు కూడా ఆ కుండలినీ శక్తి ఆక్రమించుకొని, బ్రహ్మరంధ్రము వరకు విస్తరించి, ఆ బ్రహ్మ రంధ్రమును కప్పి ఉంచుతోంది.

**చుట్టచుట్టుకొని నిద్రాముద్ర వహించియున్న కుండలిని మేలుకొలపటం :**

(1) ప్రాణాయామము (2) చక్రములలో ఏకాగ్రత (3) ప్రాణకదలికలకు సాక్షిగా దర్శనములతో కూడిన యోగమును అభ్యసించుచుండగా, అట్టి యోగాభ్యాసకాలంలో దేహములో సంచలనములు చేస్తున్న వాయువుచే శరీరములోని యోగాగ్ని - కొలిమిలోని అగ్నిని విసరుచున్నప్పుడువలె - ప్రజ్వలితమవగలదు. అప్పుడు - చుట్టలుచుట్టి పడుకున్నపాము వేడి తగలగానే బుస్సున లేచినట్లుగా - కుండలినీ శక్తి మహోగ్రరూపి అయి హృదయాకాశములో స్ఫురణ రూపంగా ప్రకాశించుచున్నది.

30 అపానాత్ ద్వ-అంగుళాత్ ఊర్ధ్వమ్
అథో మేఢ్రస్య తావతా,
దేహమధ్యం మనుష్యాణాం,

**దేహమధ్య స్థానములు:**

మనుష్యులకు - దేహమధ్య స్థానము = అపానము (గుదము)నకు 2 అంగుళములుపైన, లింగమునకు కొంచెము క్రిందగాను...,

హృత్ మధ్యం తు చతుష్పదామ్।
ఇతరేషాం తున్దమధ్యే
ప్రాణ–అపాన సమాయుతాః॥
చతుష్ప్రకార ద్వ్యయుతే
దేహమధ్యే సుషుమ్నయా।
కన్దమధ్యే స్థితా నాడీ
సుషుమ్నా సుప్రతిష్ఠితా।
పద్మసూత్ర ప్రతీకాశా
ఋజుః ఊర్ధ్వ ప్రవర్తినీ।

చతుష్పాదులగు జంతువులకు తదితరులకు - దేహమధ్య స్థానము = హృదయ మధ్యమున పొట్ట మధ్యభాగముననను,

నాగులు మొదలగువాటికి తున్దము (పొట్ట) మధ్య స్థానమునందు సమీకృతమైయున్నది.

అట్టి దేహమధ్య స్థానమునందు ప్రాణ - అపానములు సమావేశమౌతూ ఉంటాయి. (The Inward Going Air flow and outward going Air flow - meet each other and push each other in the central zone of the physic). అక్కడ గల చతురస్ర మధ్యయందు ఇడ - పింగళనాడుల మధ్యగా, (కన్ద మధ్యగా) 'సుషుమ్ననాడి' సుప్రతిష్ఠితమైయున్నది.

అట్టి సుషుమ్న తామర తూడులోని సన్నని తంతువు వలె సన్నగా నిడుపుగా ఉండి - ఊర్ధ్వముగా సహస్రారము వరకు విస్తరించినదై, వ్యాపించినదై ప్రవర్తించుచున్నది.

---

31 బ్రహ్మణో వివరం యావత్ విద్యుత్ – ఆభాస నాళకమ్,
వైష్ణవీ 'బ్రహ్మనాడీ' చ నిర్వాణప్రాప్తి పద్ధతిః॥
ఇడాచ – పింగళా చ ఏవ
తస్యాత్ సవ్యే – ఇతరే స్థితే।
ఇడా సముత్థితా కన్దా
ద్వామ నాసాపుటా అవధిః।
పింగళా చ ఉత్థితా తస్మాత్
దక్షనాసాపుటా అవధిః॥

'సుషుమ్న' నాడి (విద్యుత్‌వలె సురసుర ప్రకాశించు నాళము) బ్రహ్మ స్థానము వరకు వ్యాపించి ఉన్నది. అందుచేత సుషుమ్నను "వైష్ణవి" అని "బ్రహ్మనాడి" అని కూడా అంటారు. అట్టి సుషుమ్నలో **"బుద్ధి-భావన, మనో నియమము"**లతో ప్రవేశించి సహస్రారము చేరటము నిర్వాణ ప్రాప్తికి విధానము.

ఇడ - పింగళ అను వేరైన రెండు నాడులు సుషుమ్నకు ఎడమ కుడిగా ఏర్పడినవై ఉన్నాయి.

సుషుమ్ననాడి ప్రకాశించుచున్న నాడీకందము (దేహ మధ్యస్థానము) నుండి పుట్టిన **'పింగళానాడి'** కుడి ముక్కు రంధ్రము వరకు వ్యాపించి ఉన్నది. అదే నాడీకందము నుండి పుట్టిన **'ఇడనాడి'** ఎడమ ముక్కు రంధ్రము వరకు వ్యాపించినదై ఉన్నది.

---

32 'గాన్ధారి', 'హస్తి జిహ్వా' చ ద్వేచ అన్యే నాడికే స్థితే,
పురతః, పృష్ఠతః తస్య వామే ఇతర దృశౌ ప్రతి।
పూషా యశస్వినీ నాడ్యౌ
తస్మాత్ ఏవ సముత్థితే।
సవ్యే–ఇతర శ్రుత్యవధి
పాయు మూలా అలంబుసా।
అధో గతా శుభా నాడీ
మేఢ్రాన్తా అవధిరాయతా।
పాద – అంగుష్ఠావధిః కన్దాత్
అధో యాతా చ, కౌశికీ।

1. గాంధారి 2. హస్తి జిహ్వా అను పేర్లతో పిలువబడుచున్న వేరైన మరి రెండు నాడులు సుషుమ్నకు ముందు వైపు - వెనుకవైపుగా బయల్వెడలి ఉన్నవై, కుడి ఎడమ కన్నులలోని కంటిపాప మధ్య స్థానముల వరకు వ్యాపించి ఉంటున్నాయి.

'పూష, యశస్విని' అను మరి రెండు నాడులు 'నాడీ కందము' నుండి బయల్వెడలి, కుడి - ఎడమ చెవుల వరకు వ్యాపించినవై ఉన్నాయి. శృతి (వినికిడి) - అంత్య స్థానము వరకు విస్తరించి ఉన్నాయి.

అలంబసా నాడి పాయువు (మల విసర్జన స్థానము) వరకు వ్యాపించి ఉన్నది.

'శుభానాడి' నాడీ కందము (దేహమధ్యభాగము) నుండి లింగాంగము చివర వరకు వ్యాపించినదై ఉన్నది.

'కౌశికీనాడి' - కందస్థానము నుండి పాదముల వ్రేళ్ళ చిట్టచివరి వరకు వ్యాపించి ఉన్నది.

---

33 దశ ప్రకార భూతా స్తాః
కథితాః కన్దసమ్భవాః।
తన్మూలా బహవో నాడ్యః
స్థూల – సూక్ష్మాశ్చ నాడికాః।
ద్వా సప్తతి సహస్రాణి (72,000)
స్థూలాః – సూక్ష్మాశ్చ నాడయః।
సంఖ్యాతుం నైవ శక్యంతే
స్థూలమూలాః పృథక్ విధాః।

ఈవిధంగా నాడీ కందము నుండి దేహములోని ఆయా స్థానముల వరకు విస్తరించియున్న **దశ విధ నాడుల** గురించి యోగ శాస్త్రముచే అభివర్ణించబడుతోంది.

అదేవిధంగా నాడీ కందము నుండి ఆ స్థానమును ఆధారముగా చేసుకొని '72000' (డెబ్బది రెండువేల) స్థూల (మరియు) సూక్ష్మ నాడులు దేహమునంతా విస్తరించినవై ఉన్నాయి.

అట్టి స్థూల - సూక్ష్మ నాడుల ఉపనాడుల సంఖ్య వాటి విధి - విధానాలు వాటికి పేర్లు పెట్టి చెప్పటం అలవికాని పని.

రావి ఆకులో ఎట్లా పెద్ద పెద్ద ఈనెలు, వాటినుండి చిన్న ఈనెలు, వాటి నుండి ఉప ఈనెలు ఏర్పడినవై ఉంటున్నాయో, దేహములో కూడా నాడీ కందమునుండి బయల్వెడలు నాడులన్నీ విస్తరించాయా అనేక దేహ ధర్మములకు కారణమగు

**యథా అశ్వత్థదళే సూక్ష్మాః**
**స్థూలాశ్చ వితతాః తథా॥**

చున్నాయి. ఈవిధంగా దేహ మధ్య స్థానమున గల నాడీ కందము నాడీ సూక్ష్మ - స్థూల నాడీ శక్తి కేంద్రమై యున్నది.

---

**34 ప్రాణ - అపాన - సమానాశ్చ - ఉదానో**
**వ్యాన ఏవ చ,**
**నాగః కూర్మశ్చ కృకరో దేవదత్తో ధనంజయః,**
**చరంతి దశనాడీషు**
**దశప్రాణాది వాయవః।**
**ప్రాణాది పంచకం తేషు।**
**ప్రధానం తత్ర చ ద్వయమ్।**
**ప్రాణ ఏవా అథవా శ్రేష్ఠో,**
**జీవాఽఽత్మానం బిభర్తి యః॥**
**ఆస్య-నాసికయోః మధ్యం**
**హృదయం నాభి మండలమ్।**
**పాద అంగుష్ఠమ్ ఇతి,**
**ప్రాణస్థానాని, ద్విజసత్తమ।**
**అపానః చరతి, బ్రహ్మన్!**
**గుద-మేఢ్రో-ఊరు-జానుషు।**
**సమానః సర్వగాత్రేషు**
**సర్వవ్యాపీ వ్యవస్థితః। ఉదానః సర్వ సన్ధిస్థః**
**పాదయోః హస్తయోః అపి।**
**వ్యానః శ్రోత్రో ఊరు కట్యాం చ**
**గుల్ఫ స్కంధ గళేషు చ ॥**

ఆ నాడులలో...,

- ప్రాణ - అపాన - సమాన - ఉదాన - వ్యానములుగా పిలువబడు ఐదు ప్రధాన వాయువులు **(పంచ ప్రాణములు)**.

- నాగ - కూర్మ - కృకర - దేవదత్త - ధనంజయములనబడే ఉపవాయువులు (పంచ ఉప ప్రాణములు).

ఈ పది ప్రాణములు నాడులందు సంచరిస్తున్నాయి.

కొందరు యోగులు - దశ ప్రాణములలో **పంచ ప్రాణములు ముఖ్యమైనవి** అని అంటారు. మరికొందరు యోగులు దశ ప్రాణములలో **ప్రాణ - అపానములే అతి ముఖ్యమై** సర్వము నడపుచున్నాయి అని అంటారు.

ఇంకొందరు యోగులు **"జీవాత్మను ధరించుచున్న ముఖ్య ప్రాణమే - అన్నిటికన్నా ప్రధానము"** - అని అంటున్నారు.

ఓ ద్విజసత్తమా! ఆస్య (ప్రాణప్రథమ స్థానమగు నాడీ కందము) - నాశికల మధ్య స్థానము, హృదయము, నాభి (బొడ్డు) మండలము, పాదము యొక్క బొటనవేలు .... ఇవి **ప్రాణము యొక్క ముఖ్య స్థానములుగా** పేర్కొనబడుచున్నది.

బ్రహ్మన్! త్రిశిఖి మహాశయా! **అపానవాయువేమో** గుదము (మలవిసర్జన స్థానము), మేఢ్రము (లింగము), జానువు (భుజములు)లలో స్థానము పొంది సంచరించుచున్నదయ్యా!

ఇక, **సమానవాయువు** దేహమునందు సర్వత్రా వ్యవస్థితమై సర్వవ్యాపి అయి ఉన్నది.

**ఉదానవాయువు** - దేహము యొక్క సర్వ సంధులలో స్థానము కలిగి ఉండి పాదములలోను, మడమలలోను కూడా ఉన్నదై సంచారములు చేస్తోంది.

**వ్యానవాయువు** - చెవులలోను, ఊరువుల (తొడల)లోను, కటి (మొల) స్థానమునందు, గుల్ఫము (చీలమండలము) నందు, స్కంధము (భుజములయందు) గళము (కంఠము) నందు స్థానము కలిగి సంచరించుచున్నది.

---

**35 నాగాది వాయవః పంచ**
**త్వక్ - అస్థి ఆదిషు సంస్థితాః।**
**తున్దస్థం జలం అన్నం చ**
**రసాదీని సమీకృతమ్।**
**తున్దమధ్యగతః ప్రాణః**
**తాని కుర్యాత్ పృథక్ పృథక్।**
**ఇత్యాది చేష్టనం ప్రాణః**
**కరోతి చ పృథక్ స్థితమ్।**
**అపానవాయుః మూత్రాదేః కరోతి చ విసర్జనమ్,**
**ప్రాణ - అపానాది చేష్టాది**
**క్రియతే వ్యాన వాయునా॥**

ఇక 1. నాగము 2. కూర్మము 3. కృకరము 4. దేవదత్తము 5. ధనంజయము అను - పంచ ఉపప్రాణములు చర్మము, బొమికలు ఇత్యాది స్థానములలో స్థితి కలిగి ప్రవర్తిస్తున్నాయి.

ప్రాణవాయువు తున్దమున (శరీరము యొక్క మధ్య భాగమున) స్థితి - చలనము కలిగియున్నదై, ఈ జీవుడు త్రాగు జలమును, తినుచున్న (భక్ష్య - బోజ్య - లేహ్య - చోహ్య) చతుర్విధ అన్నమును, రసాదులను సమీకరణము చేసి, వేరువేరు విభాగములుగా చేయుచు, **శరీరపు మారుమూలల వరకు రసశక్తిని అందించుచున్నది.**

ఈవిధంగా వ్యానవాయువు ప్రాణ-అపాన ధర్మములతో సహా అనేక చేష్టలను నిర్వర్తిస్తూ దేహకందమున ఉండి ఉంటోంది.

అపాన వాయువు శరీరమునకు మల - మూత్రముల విసర్జన శక్తిని ప్రసాదించుచున్నది.

వ్యాన వాయువే ప్రాణ వాయు ధర్మములను, అపానవాయు ధర్మములను ప్రాణ - అపాన వాయు రూపములుగా అయి, నిర్వర్తిస్తోంది.

---

**36 ఉజ్జీర్యతే శరీరస్థమ్**
**ఉదానేన నభస్వతా।**
**పోషణాది శరీరస్య**

ఉదాన వాయువు దేహములో ప్రవేశించిన ఆహార పదార్థములను జీర్ణము చేయుచున్నది.

సమాన వాయువు ఈ శరీరమునందు అంతటా నిండి ఉన్నదై, అణువణువున ఉత్తేజతపరచుచూ, రక్షించుచున్నది.

| | |
|---|---|
| సమానః కురుతే సదా।<br>ఉద్గారాది క్రియో నాగః।<br>కూర్మో అక్ష్యాది నిమీలనః।<br>కృకరః క్షపయోః కర్తా।<br>దత్తో నిద్రాది కర్మకృత్।<br>మృతగాత్రస్య శోభాది<br>'ధనంజయ' ఉదాహృతః। | **నాగ ఉపానవాయువు** - దేహములో అనవసరమైన వాయువును పర్యవేక్షిస్తూ .... త్రేపులు మొదలైన రూపముగా ఉద్గతము చేయుచున్నది (బయటకు త్రోలుచున్నది).<br>**కూర్మఉపవాయువు** - కళ్ళుమూయటం, తెరవటం మొదలైన అనేక శరీరములోని శారీరావస్యకములగు కదలికలను పర్యవేక్షిస్తోంది.<br>**కృకర ఉపవాయువు** - రోగ క్రిములను నశింపజేసి దేహమును రక్షిస్తోంది.<br>**దేవదత్త ఉపప్రాణము** - జీవునికి నిద్ర మొదలైనవి కలుగజేస్తోంది.<br>**ధనంజయము** - శవము వంటి ఈ భౌతికదేహమునకు శోభ, తేజస్సు మొదలైనవి ప్రసాదిస్తోంది. |
| **37** నాడీ భేదం, మరుత్ భేదం<br>మరుతాం స్థానమేవ చ<br>చేష్టాశ్చ వివిధాః తేషాం<br>జ్ఞాత్వైవం, ద్విజసత్తమ!<br>శుద్ధౌ యతేత నాడీనాం<br>పూర్వోక్త జ్ఞాన సంయుతః। | ఓ ద్విజసత్తమా! ఈవిధంగా<br>- నాడీస్థాన భేదములను,<br>- వాయువులు ఉండే స్థాన భేదములను,<br>- వాటి వాటి వివిధ కార్యక్రమములను,<br>- చేష్టలను .... ఇవన్నీ సంగ్రహముగా చెప్పుకున్నాము కదా!<br>ఇక ఇప్పుడు 'నాడీశుద్ధి' కొరకై (మరియు) ఇంతకుముందు మనం చెప్పుకున్న సర్వమునకు సాక్షి - ప్రేరకుడు అగు పరమాత్మ తత్త్వమును తెలుసుకోవటానికి.... విధివిధానముల గురించి ప్రస్తావిస్తున్నాను. వినవయ్యా! |
| **38** వివిక్త దేశమ్ ఆసాద్య<br>సర్వ సంబంధ వర్జితః,<br>యోగాంగ ద్రవ్య సంపూర్ణం<br>తత్ర దారుమయే శుభే।<br>ఆసనే కల్పితే దర్భ – కుశ కృష్ణాఽజినాదిభిః,<br>తావత్ ఆసనమ్ ఉత్సేధే<br>తావత్ ద్వయ సమాయతే।<br>ఉపవిశ్యా ఆసనం సమ్యక్<br>స్వస్తికాది యథా రుచి, | - ఏకాంతమైన, ప్రశాంతమైన పరిసరములుగల ప్రదేశమును ఎన్నుకొని....,<br>- సర్వబాహ్య సంబంధములన్నీ బాహ్యముననే వదలివేసి...,<br>- ధ్యానప్రదేశమును యోగాంగ ద్రవ్యములతోను, చిత్రపఠములు మొదలైన వాటితో నింపి, అలంకరించి ఉంచి....,<br>అక్కడ దారువులతో (కొయ్యలతో, వాసపు బద్దీలతో) నిర్మితమైన ఆసనమును (పీటను) తయారుగా చేసుకోవాలి.<br>దారువుపై దర్భలు, కుశలు, కృష్ణాజినము (పులి/జింక చర్మము) పరచి అమర్చుకోవాలి.<br>ఆ ఆసీనముపై స్వస్తికము మొదలైన ఏదో ఒక సుఖాసనమును, (అభిరుచికి తగిన ఆసనమును) స్వీకరించాలి. |
| **39** బధ్వా ప్రాగాసనం, విప్ర! ఋజు కాయః సమాహితః,<br>నాసాఽగ్ర న్యస్త నయనో<br>దంతైః దంతా న సంస్పృశన్,<br>రసనాం తాలునిన్ అస్య స్వస్థచిత్తో నిరామయః<br>ఆకున్చిత శిరః కించిత్ నిబధ్నన్ యోగముద్రయా,<br>హస్తౌ యథోక్త విధినా ప్రాణాయామం సమాచరేత్॥ | ఓ విప్రుడా! ఈవిధంగా ప్రాగాసనమును స్వీకరిస్తూ దేహమును (మెడ-భుజ-శిరస్సులను) నిఠారుగా నిలిపి ఉంచాలి. సమాహిత (యోగ) చిత్తముతో యోగసాధనకు సిద్ధం కావాలి.<br>ముక్కుకు అగ్రప్రదేశము (Upward Space of Nose) నందు దృష్టిని నియమించి, పై దంతములు - క్రింద దంతములు కలవకుండా, నాలుకను తాలువుతో (దవడతో) తాకింపజేస్తూ, నిర్విషయ - నిరామయమగు స్వస్థ చిత్తము కలవాడై, యోగముద్రతో కించిత్ వంచిన శిరస్సు కలవాడై, చేతులను - తగిన రీతిగా **దేహాసనమును** అనుసరించి ఉంచి, "ప్రాణాయామము" నిర్వర్తించాలి. |
| **40** రేచనం పూరణం వాయోః<br>శోధనం రేచనం తథా,<br>చతుర్భిః క్లేశనం వాయోః ప్రాణాయామ ఉదీర్యతే। | 1. రేచనము (ఖాళీచేయటం) 2. పూరణము (నింపటము) 3. శోధనము (కుంభకము - నింపి ఉంచటము) 4. పునః రేచకము (వదలటము). ఈ నాలుగు (వాయువుయొక్క) వాయు సంచలన క్లేశనములను "ప్రాణాయామము" అని చెప్పబడుచున్నది. |
| **41** హస్తేన దక్షిణేనైవ పీడయేత్ నాసికాపుటమ్<br>శనైః శనైః రథ బహిః ప్రక్షిపేత్ పింగళా అనిలమ్। | కుడిచేతి బొటన వ్రేలుతో నాసికాపుటము (ముక్కుపుటమును) పీడించి (నొక్కిపట్టి), అప్పుడు పింగళానాడిలో ఉన్నవాయువును నెమ్మది నెమ్మదిగా బయటకు వదలటము - <u>రేచకము</u>. |

ఇడయా వాయుమ్ ఆపూర్య,
బ్రహ్మన్! షోడశ (16) మాత్రయా
పూరితమ్, కుంభయేత్ పశ్చాత్
చతుష్షష్ట్యాతు (64) మాత్రయా,
ద్వాంత్రింశత్ (32) మాత్రయా సమ్యక్
రేచయేత్ పింగళా అనిలమ్।
ఏవం పునః పునః కార్యం వ్యుత్క్రామ అనుక్రమేణతు।

తరువాత ఇడా నాడిని వాయువుతో (పీల్చటము ద్వారా) పూరించాలి. అట్లా 16 మాత్రల (చిటికల) కాలము పూరిస్తూ ఉండటము.

ఆ పూరించిన వాయువును 64 మాత్రమల కాలము (64 చిటికెల కాలము) కుంభించి ఉండటము.

ఆవిధంగా కుంభించి 64 మాత్రల కాలము తరువాత, పింగళనాడి మార్గముగా 32 మాత్రల కాలము రేచించటము, వదలటము. (పునః రేచకము).

ఈవిధంగా మరల మరల ఉత్క్రామక్రమంగాను (Taking Inward) అనుక్రమణ క్రమంగా (Leaving outward ) .... ప్రాణాయామము చేయాలి.

---

42 సంపూర్ణ కుంభవత్ దేహమ్
కుంభయేత్ మాతరిశ్వనా,
పూరణాత్ నాడయః సర్వాః
పూర్యంతే మాతరిశ్వనా, ఏవం కృతేసతి, బ్రహ్మన్!
చరన్తి దశ వాయవః
హృదయా అంభోరుహంచ అపి
వ్యాకోచం భవతి స్ఫుటమ్।

ఒక కుండలో నిండుగా నీరును పోస్తారు చూచావా! ఆవిధంగా (కుంభక సమయంలో) శరీరమంతా వాయువు యొక్క ఉనికి - నిశ్చలతలతో నింపి వేయాలి. దేహమంతా వాయువుతో పూరించటము వలన నాడులన్నీ కూడా వాయువుతో సంపూరితము అగుచున్నాయి.

హే బ్రహ్మన్! ఈవిధంగా ప్రాణాయామ పూర్వక - కుంభకములచే హృదయ పద్మముయొక్క దశదళములు వికశితోత్సాహము పొందుచున్నాయి.

అప్పుడు క్రమంగా హృదయ కమలమంతా కూడా స్ఫుటము - నిర్మలము అగుచు వ్యాకోచము పొందగలదు. (The space in the Heart blossoms).

---

43 తత్ర పశ్యేత్ పరాత్మానం
వాసుదేవమ్ అకల్మషమ్।
ప్రాతః మాధ్యన్దినే సాయమ్
అర్ధరాత్రే చ కుంభకాన్,
శనైః అశీతి పర్యన్తం
చతుర్వారం సమభ్యసేత్,
ఏకాహ మాత్రం కుర్వాణః సర్వపాపైః ప్రముచ్యతే॥
సంవత్సర త్రయాత్ ఊర్ధ్వం ప్రాణాయామ పరోనరః,
యోగసిద్ధో భవేత్ యోగీ వాయుజిః విజితేంద్రియః॥
అల్పాశీ, స్వల్పనిద్రశ్చ తేజస్వీ బలవాన్ భవేత్।
అపమృత్యుమ్ అపక్రమ్య
దీర్ఘమ్ ఆయుః అవాప్నుయాత్॥

ఆవిధంగా రేచక - పూరక - కుంభక ప్రాణాయామము అనేకసార్లు నిర్వర్తిస్తూ నిర్వర్తిస్తూ ఉండగా హృదయము నిర్మలమై, సర్వులలోను, సర్వమునందు సమముగా సర్వదా వేంచేసియున్న అకల్మషుడగు **వాసుదేవ-పరమాత్మ యొక్క సందర్శనము చేయుటకు బుద్ధి నిర్మలము - ఉత్తేజితము అవుతుంది.**

కుంభక ప్రాణాయామమును ప్రాతః కాలము, మధ్యాహ్నము, సాయంకాలము, రాత్రియందు రోజుకు 4 సార్లు ( 4 x 20) 80 ప్రాణాయామములను అభ్యసించాలి. **నెమ్మదిగా, గంభీరంగా, ఆదుర్దా లేకుండా, ప్రశాంతంగా అభ్యసించాలి!**

ఈవిధంగా ఒక పగలుమాత్రంగా (ఏకాహంగా) నిర్వర్తిస్తే కూడా, ఆ యోగి సర్వ పాపములనుండి విముక్తుడగుచున్నాడు.

సంవత్సర త్రయము (3 సం॥లు) అభ్యసించిన యోగికి, ఆ ఊర్ధ్వ ప్రాణాయామ పారాయణము వలన తప్పకుండా యోగసిద్ధి కలుగగలదు. అట్టి యోగి **వాయు జయుడు** అగుచున్నాడు. ఇంద్రియములను పూర్తిగా జయించి **విజితేంద్రియుడు** అగుచున్నాడు.

అల్పాహారత్వము, స్వల్ప నిద్రత్వముతో అతడు **తేజోవంతుడు, పుష్టిమంతుడు** అగుచున్నాడు. అపమృత్యువు తొలగినదై, **దీర్ఘాయుష్మంతుడు** అగుచున్నాడు.

---

44 ప్రస్వేద జననం యస్య
ప్రాణాయామస్తు సో 'అధమః'।
కమ్పనం వపుషో యస్య
ప్రాణాయామేషు 'మధ్యమః'।
ఉత్థానం వపుషో యస్య
స 'ఉత్తమ' ఉదాహృతః।
అధమే వ్యాధి పాపానాం
నాశస్మాత్! మధ్యమే పునః
పాపరోగ మహా వ్యాధినాశస్యాత్॥

**అధమ ప్రాణాయామ సాధ్య స్థితి** : ప్రాణాయామము చేస్తూ ఉండగా శరీరమంతా చెమటపోస్తూ ఉంటే ... అది అధమ ప్రాణాయామ స్థితి! (ప్రారంభ స్థితి)

**ప్రాణాయామ మధ్యమ సిద్ధి స్థితి** : శరీరము చలనము - వణుకు కలుగుతూ ఉంటే అది మధ్య సిద్ధి ప్రాణాయామ స్థితి. (రెండవ స్థితి)

**ఉత్తమ ప్రాణాయామ సాధ్య స్థితి** : దేహము ఉత్థాన (పైకి లేచు) స్థితి కలుగుతూ ఉంటే అది ఉత్తమ ప్రాణాయామ సిద్ధిస్థితి.

అధమ ప్రాణాయామ సంసిద్ధి చేత వ్యాధులు, పాప దృష్టులు నశించి హృదయము నిర్మలము అగుచున్నది. మధ్యమ ప్రాణాయామ సిద్ధిచే పాపకర్మల సంస్కారము జయించబడుచున్నది. మూల వ్యాధులు తొలగుతాయి.

**ఉత్తమ ప్రాణాయామ సిద్ధ స్థితి** వలన పాప-రోగ-మహా వ్యాధులు మొదలంట్లా తొలగ

ఉత్తమే పునః అల్పమూత్రో, అల్ప విష్ఠశ్చ, లఘు దేహో మితాశనః,
పట్విం(ద్రియః, పటుమతిః కాల(త్రయవిత్ ఆత్మవాన్।

గలవు. అంతే కాకుండా ....., అల్పమూ(త్రము, అల్ప మలము, తేలిక దేహము, తక్కువ ఆకలి, పటువైన ఇం(ద్రియములు, సునిశితము - సూక్ష్మము అగు బుద్ధి, (త్రికాల జ్ఞానము - ఇవన్నీ లభించగలవు.

---

45 రేచకం పూరకం ముక్త్వా కుంభీకరణమేవ యః
కరోతి (త్రిషు కాలేషు,
నైవ తస్యాఽ_స్తి దుర్లభమ్।
నాభికన్దే చ, నాసా(గే పాదాంగుష్ఠే చ
యత్నవాన్,
ధారయేత్ మనసా (ప్రాణాన్ సన్ధ్యాకాలేషు వా సదా,
సర్వరోగైః వినిర్ముక్తో,
జీవేత్ యోగీ గతక్లమః।
కుక్షిరోగ వినాశ స్స్యాత్
నాభి కన్దేషు ధారణాత్,
నాసా(గే ధారణాత్ దీర్ఘమ్-ఆయుష్యం, దేహలాఘవమ్।

(ప్రాణాయామ యోగము యొక్క అభ్యాసముచేత, ఒకానొక సుస్థితిలో రేచకము - పూరకము లేకుండానే ఆ యోగి కుంభకము అవధరించగల స్థితి లభించగలదు. అట్టి **స్వభావ కుంభకము**ను ఎవ్వరు నిర్వర్తిస్తూ ఉంటారో, వారికి ఈ ముల్లోకములలో దుర్లభమనునదేదీ ఉండదు.

ఎవ్వరైతే సంధ్యా సమయమందుగాని, ఎల్లప్పుడూ గాని (ప్రయత్నపూర్వకంగా నాభికందము (శరీరమధ్య నాభీ కేం(ద్రము) నందుగాని, ముక్కు యొక్క పై చివరగాని, కాలి బొటన(వేలినందుగాని, మార్చి మార్చి గాని, మనఃపూర్వకంగా (ప్రాణశక్తిని ధారణ చేయుచున్నాడో, ఆతడు సర్వరోగముల నుండి విముక్తుడై ఆనందముగా జీవించుచున్నాడు. అందరికీ ఆ ఆనందమును పంచిపెట్ట గలడు.

నాభికన్దము (బొడ్డుచుట్టూ) కుంభక (ప్రాణయోగ ధారణ చేయువాడు పొట్టలోని రోగములన్నిటి నుండి విముక్తుడు కాగలడు.

ముక్కుకు ఊర్ధ్వ స్థానమునందు (ప్రాణయామ పూర్వక కుంభక ధారణ చేయువాడు దీర్ఘాయుష్షు కలిగినవాడగుచున్నాడు. దేహము తేలికగా, (క్రియాశక్తి శీలముగా అయి ఆయుర్వృద్ధి పొందుచున్నాడు.

---

46 (బ్రాహ్మే ముహూర్తే సం(ప్రాప్తే
వాయుమ్ ఆకృష్య జిహ్వయా
పిబతః (త్రిషుమాసేషు 'వాక్సిద్ధిః మహతీ' భవేత్।
అభ్యాసతశ్చ షన్మాసాత్ మహారోగ వినాశనమ్।
య(త్ర య(త్ర ధృతో వాయుః
అంగే రోగాది దూషితే,
ధారణాదేవ మరుతః తత్ తత్ ఆరోగ్యమ్ అశ్నుతే।

(బ్రాహ్మీముహూర్తమునందు (తెల్లవారు ఝామున 4 గంటల నుండి 6 గంటల) సమయంలో - ఏ యోగసాధకుడైతే - నాలుకలో గాలిని ఆకర్షించి పిబతము (గుక్కవేయటము) 3 నెలల కాలము అభ్యసిస్తాడో, ఆతనికి 'వాక్శుద్ధి' కలుగుచున్నది.

6 నెలలు కుంభక (ప్రాణాయామముచే మహా రోగములు తొలగుచున్నాయి. ఎక్కడెక్కడ దేహము యొక్క ఏఏ భాగము రోగా(క్రాంతమై ఉంటుందో, ఆయా శరీర భాగమునందు పూరక, రేచక పూర్వకమైన కుంభకముగాని, అవి రెండూ లేకుండానే కుంభకము గాని నిర్వర్తిస్తూ..... వాయువును కుంభిస్తూ ధరిస్తూ ఉండగా...., ఆచోట ఆ దోషము తొలగి స్వస్థత ఏర్పడ గలదు. అట్లాగే సహజీవుల అస్వస్థ బాధలను అట్టి యోగాభ్యాసి తొలగించగలడు.

---

47 మనసో ధారణాత్ ఏవ పవనో ధారితో భవేత్।
మనసః స్థాపనే హేతుః ఉచ్యతే, ద్విజపుంగవ!
కరణాని సమాహృత్య విషయేభ్యః సమాహితః।
అపానమ్ ఊర్ధ్వమ్ ఆకృష్యేత్ ఉదరో పరిధారయేత్।
బధ్నన్ కరాభ్యాం (శో(త్రాది
కరణాని యథాతథమ్
యుంజానస్య యధా-ఉక్తేన
వర్త్మనా స్వవశం మనః।
మనః కృష్ణశ్చ వై వాయుః, స్వవశే స్థాప్యతే సదా
నాసికాపుటయోః (ప్రాణః
పర్యాయేణ (ప్రవర్తతే।
తి(స్రశ్చ నాడికాః తాసు
సయావన్తం చరత్యయమ్

ఓ ద్విజ పుంగవా! ఒక ముఖ్య విషయం. మనస్సు ధరించబడిందా, వెనువెంటనే (ప్రాణశక్తి (పవనశక్తి) కూడా ధరించబడుతుందయ్యా! అందుకే, **"మనస్సు ఒకచోట స్థాపించాలంటే అందుకు ధాతువు (ప్రాణశక్తియే. అందుచేత (ప్రాణశక్తియే మనస్సును నియమించటానికి ఉపాయము"** - అని చెప్పబడుతోంది. మనస్సును ఎక్కడ నియమిస్తే, అది ఆ చోట (ప్రాణాయామముతో సమానమే!

విషయములందు (ప్రవేశించినవైయున్న ఇం(ద్రియములను (అనగా మనస్సును) - ఆ విషయములనుండి వెనుకకు మరల్చి అప్పుడిక అపానవాయువును ఊర్ధ్వమునకు లాగి, ఉదరము (పొట్టకు)పై భాగమున చక్కగా ధారణ చేయాలి.

చేతులతో చెవులు మొదలైన ఇం(ద్రియములను మూసి ఉంచి, (ప్రాణాయామ కుంభకమును సశాస్త్రీయంగా, పైన మనము చెప్పుకున్నవిధంగా సలుపుచున్నవాని మనస్సు తప్పక అధీనంలోకి వస్తుంది.

మనస్సు వశమైయుందా - (ప్రాణవాయువుకూడా స్వవశము అగుచున్నది. (ప్రాణము వశమైతే మనస్సు వశమౌతుంది.

నాసికా పుటలనుండి (ప్రాణవాయువు మరల మరల స్వీయ (ప్రవర్తనము కలిగినదై ఉంటోంది. ఇడ - పింగళా - సుషుమ్న - (త్రినాడులు దేహమునందు చలనమును తమకు తామే (అసంకల్పితంగా) (ప్రదర్శించుచూ ఉన్నాయి.

శఙ్ఖినీ వివరే యామ్యే
ప్రాణః ప్రాణభృతాం సతామ్,
తావన్తం చ పునః కాలం, సౌమ్యే! చరతి సన్తతమ్।

ప్రాణాయామ సాధనను సిద్ధించుకొన్న యోగుల ప్రాణశక్తి శంఖిణీ - వివర్తమగు సుషుమ్నయందు మాత్రమే అత్యధికంగా సంచారము కలిగి ఉంటోంది.

ఇక, యోగాభ్యాసులు కానట్టి తదితరుల విషయానికి వస్తే వారిపట్ల ఇడ - పింగళ నాడులందు తదితరనాడులందు ఎక్కువగా వాయువు సంచరిస్తూ ఉంటుంది. ఈవిధంగా దేహము సజీవంగా ఉన్నంత వరకు ప్రాణవాయువు చరిస్తూనే ఉంటోంది.

48 ఇత్థం క్రమేణ చరతా
వాయునా వాయుజిత్ నరః,
అహశ్చ, రాత్రిం, పక్షంచ
మాసం మత్వా ఆయనాదికమ్,
అంతర్ముఖో విజానీయాత్
కాలభేదం సమాహితః,
అంగుష్ఠాది స్వావయవ
స్ఫురణాదశనేరపి,
అరిష్టైః జీవితస్య అపి
జానీయాత్ క్షయమ్, ఆత్మనః,
జ్ఞాత్వా, యతేత కైవల్య ప్రాప్తయే యోగవిత్తమః।

మనం చెప్పుకొన్న పూరక - రేచక - కుంభక - పునః రేచక క్రమంలో ప్రాణాయామమును అభ్యాసంగా నిర్వర్తించు సాధక జనులు (ప్రాణాయామ యోగులు) క్రమంగా వాయువును జయించుచున్నారు. స్వాధీనం చేసుకొని సశాస్త్రీయంగా నియమిస్తున్నాడు.

రాత్రి - పగలు - పక్షము - మాసములుగా ప్రాణోపాసన చేయుచు క్రమంగా అంతర్ముఖులై కాలబేధములను దాటివేయుచు కాలః కాలమగు ఆత్మను దర్శించుచున్నారు.

ఈ జీవుడు - మనో - ప్రాణ శక్తులను ఏకం చేసి ఈ దేహమును ఒక ఉపకరణముగా భావించి, కుంభక ప్రాణాయామము మరల మరల ఆశ్రయిస్తూ - తద్వారా ఆత్మను తెలుసుకొని, ఆత్మనే దర్శిస్తూ ఆత్మయందే ప్రవేశించాలి. ఇప్పటికిప్పుడే ప్రాణాయామాది సాధనకు ఉపక్రమించాలి. తాత్సారం చేయరాదు. ఈ దేహము శాశ్వతము కాదని గుర్తుంచుకోవాలి. "బొటన వేలు - తదితర అవయవములు స్పర్శ కోల్పోవటము" ... అనే మృత్యు సూచనలు, దేహక్షయముయొక్క అనివార్యత గుర్తెరిగి, ప్రాణాయామాభ్యాసముచే ఆత్మను ఎరగాలి. యోగవిత్తముడై కైవల్యమును సంపాదించుకోవాలి.

49 పాదాంగుష్ఠే, కరాంగుష్ఠే
స్ఫురణం యస్య నశ్యతి,
తస్య సంవత్సరాత్ ఊర్ధ్వమ్
జీవితస్య క్షయో భవేత్।
మణిబన్ధే తథా గుల్ఫే
స్ఫురణం యస్య నశ్యతి,
షణ్మాసా (6 నెలలు) అవధిరేతస్య
జీవితస్య స్థితిః భవేత్।
కూర్పరే స్ఫురణం యస్య
తస్య త్రైమాసికీ స్థితిః।
కుక్షి మేహన పార్శ్వేచ
స్ఫురణాత్ ఉపలమ్భనే।
మాసా-అవధిః జీవితం స్యాత్।

ఈ దేహమేదో 'శాశ్వతము' అనుకొని, దీనిని స్వయం సంకల్ప రేచక - పూరక - కుంభక (లేక) స్వయం సంకల్పక కుంభక ప్రాణాయామాభ్యాసమునకు ఉపయోగించుకో వలసినదిపోయి, ఇంద్రియ విషయములలో తాదాప్యము చెంది ఆయుష్షు వృధా చేసుకోవటమా? ఎంతటి దౌర్భాగ్యం? అందుకే మృత్యువు గురించి గుర్తుపెట్టుకోవాలి. అందుచేత మృత్యు సూచనలను గురించి కొన్ని విషయాలు చెప్పుచున్నాను.

ఎవరికైతే కాలి బొటనవ్రేలు, చేతి బొటనవ్రేలు 'స్ఫురణ' నశిస్తుందో వారు సంవత్సర కాలం లోపల భౌతిక దేహము క్షయించు సూచన!

చేతి మణికట్టుయందు, గుల్ఫము (కాలి చీలమండలమునందు) స్ఫురణ ఎవరి దేహమునందు నశిస్తుందో వారి జీవిత స్థితి 6 మాసములు మాత్రమే శేషించుచున్నట్లు సూచన!

కూర్పరము (మోచేయి - మోకాలు మండల ప్రదేశము)నందు స్ఫురణ నశిస్తే వారి దేహము 3 మాసములు మాత్రమే జీవించగలదని సూచనగా భావించాలి.

కుక్షి, మేహన పార్శ్వములలో (పొట్టకు, మూత్రవిసర్జనావయ ప్రక్కలుగా) స్ఫురణ లభించటం ఆగుతుంటే ఆతని జీవితకాలము '1' నెల కాలము మాత్రమే శేషించుచున్నట్లు!

50 తదర్ధంస్యతు దర్శనే,
ఆశ్రితే జఠరే ద్వారే
దినాని దశ జీవితమ్।
జ్యోతిః ఖద్యోతవత్ యస్య, తదర్ధం తస్య జీవితమ్।
జిహ్వాగ్రా దర్శనే త్రీణి దినాని స్థితిరాత్మనః।
జ్వాలాయా దర్శనే మృత్యుః ద్విదినే భవతి ధ్రువమ్।
ఏవమ్ ఆదీని అరిష్టాని

పొట్టయందు జఠరాగ్ని జనించు స్థానముతో స్ఫురణ కోల్పోతే, ఇక ఆ దేహము యొక్క ఆయుష్షు 10 దినములు మాత్రమే అగుచున్నది.

ఎప్పుడైతే 'జ్యోతి' మిణుగురు పురుగువలె కనబడనారంభిస్తుందో (గదిలో దీపము మిణుగురు పురుగులాగా ఆరుతూ, వెలుగుతూ చిన్నగా కనిపించుచున్నదో)...., ఆతని ఆయుష్షు కూడా 10 రోజులలోపే.

నాలుకయొక్క కొన స్ఫురించటం ఆగిపోతే, '3' దినములు మాత్రమే బ్రతకపోవుచున్నట్లు!

అగ్ని జ్వాల కనిపించటం మానివేస్తే ఆతని శేషించిన కాలము '2' రోజులు మాత్రమే!

ఇటువంటివన్నీ అరిష్ట సూచకములు. ఇవి కనబడుతూ ఉంటే, ఇక జీవిత కాలము

దృష్ట్వాయుః క్షయకారణమ్।
నిశ్శ్రేయసాయ యుంజీత
జప ధ్యాన పరాయణః। మనసా పరమాత్మానం
ధ్యాత్వా తద్రూపతామియాత్।
యత్ అష్టాదశ భేదేషు
మర్మస్థానేషు ధారణమ్
స్థానాత్ స్థానమ్ సమాకృష్య
"ప్రత్యాహారః" స ఉచ్యతే॥
పాదాంగుష్ఠం తథా గుల్ఫం జంఘా మధ్యం తథైవచ,
మధ్యమ్ ఊర్వోశ్చ మూలం చ పాయుః హృదయమేవ చ॥

ముగియబోతోందని గమనించాలి.

జీవుడు ఎల్లప్పుడూ జప - ధ్యాన పరాయణుడై "నిశ్శ్రేయమగు మోక్షము" కొరకై సర్వ అవకాశములను ఆశ్రయించాలి. అంతే కాదు. దీపమున్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలి కదా! దేహము బాగున్నప్పుడే జప-ధ్యానములు ఆశ్రయించాలి!

ఎట్లా జపధ్యానములు నిర్వర్తించాలంటావా? విను.

మనస్సుతో పరమాత్మను ధ్యానిస్తూ ఉండగా, ఇక ఆతడు **క్రమంగా తానే సర్వాంతర్యామి, - సర్వతత్త్వ స్వరూపుడు, కేవలసాక్షి** యగు "తత్" రూపుడు అగుచున్నాడు.

యోగ ప్రత్యాహారము - దేహములో అష్టాదశ (18) వేరు వేరు భేదములతో కూడిన "మర్మస్థానములు" గుర్తించబడ్డాయి. ఆ మర్మస్థానములలో ఒకదానిలోని 'ధారణ'ను మరొక స్థానమునకు చేర్చుతూ .... ఆ ధారణను కొనసాగించటమును 'యోగప్రత్యాహారము"... అని అంటారు.

51 మేహనం దేహమధ్యం చ, నాభిం చ గళ కూర్పరమ్,
తాలుమూలంచ మూలంచ,
ఘ్రాణస్య అక్ష్ణోశ్చ మండలమ్,
భ్రువోర్మధ్యం లలాటంచ
మూలం ఊర్ధ్వం చ జానునీ।
మూలం చ కర్ణయోః మూలం మహాని ఏతాని వై, ద్విజ!
పంచభూతమయే దేహే
భూతేషు ఏతేషు పంచసు,
మానసో ధారణం యత్ తత్
యుక్తస్య చ యమాదిభిః
"ధారణా" సా చ సంసార సాగర-ఉత్తర కారణమ్॥

అష్టాదశ మర్మస్థానములు : 1. పాదముల బొటనవ్రేలు (అంగుష్ఠము) 2. గుల్ఫము (చీలమండలము) 3. జంఘము (కాలిపిక్క) 4. ఊరూమధ్యము (తొడలమధ్య భాగము) 5. ఊరూమూలము (తొడలపై భాగము) 6. పాయువు (మల విసర్జనావయవము) 7. హృదయ స్థానము 8. మేహనస్థానము (మూత్ర విసర్జన స్థానము, లింగము) 9. దేహముయొక్క మధ్య స్థానములో గల నాభి (బొడ్డు) 10. గళకూర్పరము (కంఠ మండల - నిలువు భాగము) 11. తాలు (దవడ) మూలము 12. ఘ్రాణ (ముక్కు పైభాగపు) మూలము 13. అక్షో (కనుగ్రుడ్డు) మండలము 14. భ్రూమధ్య భాగము 15. లలాటము (భ్రుకుటి పైభాగము) 16. జానువుల (మోకాళ్ళు) యొక్క మూల ప్రదేశము 17. చెవుల లోపల మూలభాగము 18. చేతుల చివరి ప్రదేశము. ఓ ద్విజుడా! ఇవి అష్టాదశ స్థానములయ్యా!

**ధారణ :** లోపల ఈ పంచభూతమయ దేహమునందును, బయటగల ఈ పంచభూత ప్రపంచమునందును యమము - నియమములతో కూడిన మనో నియామకమును 'ధారణ' అని పిలుస్తున్నారు.

అట్టి ధారణ ఈ జీవుని సంసార సాగరమునుండి తరించటానికి ఉత్తమమగు కారణము కాగలదు.

52 ఆజాను పాద పర్యతం 'పృథివీ స్థానమ్' ఇష్యతే।
పిత్తళా చతురస్రా చ వసుధా వజ్రలాంఛితా,
స్మర్తవ్యా పంచఘటికా తత్ర ఆరోప్య ప్రభంజనమ్।
ఆజాను కటి పర్యంతమ్
"అపాం స్థానం" ప్రకీర్తితమ్।
అర్ధచంద్ర సమాకారం శ్వేతమ్
అర్జున లాంఛితం,
స్మర్తవ్యమ్ అమ్భశ్శ్వసనమ్
ఆరోప్య దశ నాడికాః।
ఆదేహ మధ్య కట్యంతమ్
"అగ్నిస్థానమ్" ఉదాహృతమ్।
తత్ర సిందూర వర్ణోగ్నిః జ్వలనం దశ పంచచ
స్మర్తవ్యా ఘటికా ప్రాణం కృత్వా కుంభే తథేరితమ్।

అరి కాలునుండి మోకాళ్ళ ప్రదేశము వరకు - పృథివీ స్థానము.

పసుపు (పీత) వర్ణముతో చతురస్రముగా వజ్రలాంచితమైన ముఖము, వసుధ (భూమి) చిహ్నములు, (వజ్రలాంఛితమై) ఉంటుంది. భూతత్త్వమును హృదయములో ఆరోపించి ఈ జానునీ - పాదపర్యంతము వరకు కుంభక ప్రాణాయామమును '5' ఘటికలు (24 ని x 5 కాలము)చేయాలి.

**అపాంస్థానము** : మోకాళ్ళ స్థానము నుండి కటి (మొల) వరకు జలస్థానము. అర్ధ చంద్రాకారము, తెలుపు వర్ణము. అర్జునలాంఛితము. జలతత్త్వమును హృదయమునందు ఆరోపించుకొని (తానే తత్త్వమైయున్నవానిగా భావించి) 10 ఘటికల కాలము (10 x 24 mts) కుంభక ప్రాణాయామము నిర్వర్తించాలి.

కటి (మొల) ప్రదేశము నుండి దేహమధ్య నాభిస్థానము వరకు - అగ్ని స్థానము అని చెప్పబడుతోంది.

ఈ ప్రదేశములో సింధూర వర్ణము (ఎఱ్ఱగా) ప్రకాశించుచున్నది. అట్టి ఎఱ్ఱటి (సింధూర) వర్ణ అగ్నిని హృదయమునందు ఆరోపించి 15 ఘటికలపాటు కుంభక ప్రాణాయామము చేయాలి.

**53 నాభేః ఉపరి నాసాంతం**
**“వాయుస్థానం” తు తత్రవై,**
**వేదికా ఆకారవత్ ధూమ్రో**
**బలవాన్ భూత మారుతః।**
**స్మర్తవ్యః కుమ్భకేనైవ**
**ప్రాణమ్ ఆరోప్య మారుతమ్,**
**ఘటికా వింశతిః తస్మాత్**
**ఘ్రూణాత్ – బ్రహ్మ బిలావధి।**
**వ్యోమస్థానం నభః తత్ర**
**భిన్నాంజన సమప్రభమ్**
**ధ్యేయం మారుతమ్ ఆరోప్య**
**కుమ్భకేనైవ యత్నవాన్।**
**పృథివ్యం శే తు దేహస్య**
**చతుర్బాహుం కిరీటినమ్।**
**అనిరుద్ధం హరిం యోగీ**
**యతేత భవముక్తయే।**
**అబంశే పూరయేత్ యోగీ**
**నారాయణమ్ ఉదగ్రధీః**
**ప్రద్యుమ్నమ్ అగ్నౌ వాయ్వంశే ‘సంకర్షణమ్’ అతఃపరమ్।**
**వ్యోమాంశే పరమాత్మానం, వాసుదేవం సదా స్మరేత్।**
**అచిరాత్ ఏవ తత్ప్రాప్తిః, యుంజానస్య। న సంశయః।**

నాభి నుండి ఉపరినాసాంతము (ముక్కుయొక్క పై కొన చివరివరకు) - ఇది వాయు స్థానము. ‘వేదిక’ (Stage / Plotform) ఆకారము. ధూమ్రమ (పొగ - లేతనలుపు) రంగు. ఇది దేహములోని బలమునకు స్థానము. ఈ వాయుతత్త్వమును హృదయమునందు ఆరోపించి ‘20’ ఘటికల సమయము కుంభక ప్రాణాయామము చేయాలి.

నాసిక (ముక్కు) యొక్క ఊర్ధ్వ స్థానము నుండి బ్రహ్మరంధ్రము వరకు - ఇది ఆకాశస్థానము. నిరాకారము. రంగు కాటుక నలుపు. అట్టి ఆకాశతత్త్వమును హృదయమునందు ఆరోపించుచూ కుంభక ప్రాణాయామమును నిర్వర్తించాలి.

దేహము యొక్క పృథివీ (Solid) అంశమునందు యోగి - నాలుగు బాహువులుగల ‘అనిరుద్ధహరి’ ని ధ్యానించుదురు గాక! “దృశ్యములోని పృథివీ తత్త్వమంతా చతుర్బాహు - కిరీటధారియగు అనిరుద్ధహరీ తత్త్వమే’’ ... అని భావించుచూ కుంభక ప్రాణాయామమును నిర్వర్తించువాడు భవబంధముల నుండి విముక్తి పొందగలడు.

దేహమునందు - విశ్వమునందు కనిపిస్తున్న జలాంశ (Liquid)ను నారాయణ తత్త్వముగాను, అగ్ని అంశను ‘ప్రద్యుముడు’గాను, వాయు - అంశను సంకర్షణుడు గాను, వ్యోమాంశను (ఆకాశాంశను) పరబ్రహ్మస్వరూపుడగు “వాసుదేవుడు’’గాను స్మరించాలి. ఈవిధంగా దేహములోని - విశ్వములోని

| | | |
|---|---|---|
| పృథివీ అంశను | → | అనిరుద్ధుడు గాను |
| జల అంశను | → | నారాయణుడుగాను |
| అగ్ని అంశను | → | ప్రద్యుమ్నుడుగాను |
| వాయు అంశను | → | సంకర్షణుడుగాను |
| ఆకాశ అంశను | → | వాసుదేవుడుగాను |

కుంభక ప్రాణాయామముతో స్మరించువాడు అతి శీఘ్రముగా అనిరుద్ధ-నారాయణ-సంకర్షణ - వాసుదేవ సోఽహమ్ స్వరూపములను సంతరించుకొనగలడు. ఇందులో సందేహమే లేదు.

---

**54 బధ్వా యోగాసనం పూర్ణం**
**హృత్‌దేశే హృదయాంజలిః,**
**నాసాగ్ర న్యస్త నయనో**
**జిహ్వాం కృత్వా చ తాలుని,**
**దన్తైః దన్తాః న సంస్పృశ్య**
**ఊర్ధ్వకాయః సమాహితః,**
**సంయమేత్ చ ఇంద్రియ గ్రామమ్**
**ఆత్మబుద్ధ్యా విశుద్ధయా,**
**చింతనం వాసుదేవస్య**
**పరస్య పరమాత్మనః,**
**స్వరూప వ్యాప్తరూపస్య**
**ధ్యానం కైవల్య సిద్ధిదమ్।**
**యామమాత్రం వాసుదేవం**

యోగాభ్యాసి అయినవాడు...,

- యోగాసనమునందు దేహమును నియమించి,

- హృత్ ఆకాశములో (హృదయములో) హృదయాంజలిని (నమస్కారమును) ఘటించినవాడై,

- నాసాగ్రము (ముక్కుకు పైభాగ ఆకాశమునందు) దృష్టిని నిలిపి,

- నాలుకను తాలు ప్రదేశము (దవడకు) సున్నితముగా తాకి ఉంచి,

పై - క్రింది దంతములు ఒకటితో మరొకటి తాకనీయకుండా...,

- పృష్ఠము నుండి పై దేహమంతా నిలువుగా నిశ్చలంగా ధారణ చేస్తూ, సమాహితచిత్తుడై, నిర్మలబుద్ధితో,

ఇంద్రియములన్నిటినీ జయించి (తిరస్కరించివేసి, ఆలోచనచేయక), సమదర్శన స్థితికి తెచ్చి ఉంచి,

నిర్మలమగు ఆత్మ బుద్ధితో, “ఈ సర్వము నేనై ఉన్న నేను” .... ను భావన చేస్తూ అంతయూ తానై, అంతటికీ సాక్షి అయి ఉన్న సర్వమునకు ఆవలగల వాసుదేవ పరమాత్మను ధ్యానిస్తూ (కుంభక ప్రాణాయామముచే) సర్వము తానైన వ్యాప్తరూపము ధ్యానించటము - **కైవల్యసిద్ధి ప్రదము.**

ఈవిధంగా యోగాభ్యాసి కుంభక ప్రాణాయామమును నిర్వర్తిస్తూ...,

చిన్తయేత్ కుమ్భకేన యః,
సప్తజన్మార్జితం పాపం
తస్య నశ్యతి యోగినః॥

- సర్వజీవులలోను-సర్వజీవులుగాను - జగత్తులలోను- జగత్తులు గాను - సర్వమునకు సాక్షిగాను..., తత్త్వస్వరూపుడైయున్న వాసుదేవుని కొన్ని క్షణములు (యామమాత్రం) భావోపాసన చేసినంతమాత్రం చేత, ఆ యోగి యొక్క ఏడు జన్మలలో ఆర్జించిన పాపమంతా నశించ గలదు. (యామము = 1 రోజు / 8 = 3 గంటలు)

---

55 నాభికన్దాత్ సమారభ్య
యావత్ హృదయగోచరమ్
జాగ్రత్ వృత్తిం విజానీయాత్।
కంఠస్థం స్వప్నవర్తనమ్।
సుషుప్తం తాలు మధ్యస్థం।
తుర్యం భ్రూమధ్య సంస్థితం।
తుర్యాతీతం పరంబ్రహ్మ బ్రహ్మరంధ్రేతు లక్షయేత్।
జాగ్రత్ వృత్తిం సమారభ్య యావత్ బ్రహ్మ బిలాంతరమ్,
తత్ర ఆత్మా యం, తురీయస్య।
**తుర్యాంతే 'విష్ణుః' ఉచ్యతే॥**

**జాగ్రత్‌వృత్తుడు** : నాభిస్థానము నుండి హృదయ స్థానమువరకు స్వస్వరూపాత్మను జాగ్రత్ వృత్తివర్తనుడుగా గ్రహించి కుంభకము నిర్వర్తించబడుగాక! (అది జాగ్రత్ స్వరూపం),

కంఠమునందు (కంఠప్రదేశ ఆకాశము) స్వప్నవర్తన స్వరూపము,

తాలు (దవడ) మధ్యలో ఉన్న ఆకాశము సుషుప్తి వర్తన స్వరూపము,

భ్రూమధ్యములో (రెండు భ్రుకుటుల మధ్యగా గల ఆకాశము) తురీయవర్తనము సంస్థితమై ఉన్నది - అని భావిస్తూ కుంభకము నిర్వర్తించెదరు గాక!

ఇక బ్రహ్మరంధ్రమునకుపైన (Centrally present Top-point in the upper head space) నందు తుర్యాతీతమును భావనచేసి కుంభము నిర్వర్తించబడును గాక!

జాగ్రత్ వృత్తినుండి -- బ్రహ్మరంధ్రము వరకు గల ఆకాశమంతా తురీయమే అని అనుభవజ్ఞులచే సిద్ధాంతీకరించబడుతోంది. తురీయాతీతమో -బ్రహ్మరంధ్రమునకుపైన 'విష్ణువు' అను శబ్దార్థముగా చెప్పబడుచున్నది.

---

56 ధ్యానేనైవ సమాయుక్తో
వ్యోమ్ని చ అత్యంత నిర్మలే,
సూర్యకోటిద్యుతి రథం
విద్యోదితమ్ అధోక్షజమ్।
హృదయ అమ్బురుహ ఆసీనం
ధ్యాయే ద్వా విశ్వరూపిణమ్।
అనేక ఆకార ఖచితమ్,
అనేక వదనాన్వితమ్,
అనేక భుజ సంయుక్తమ్,
అనేక ఆయుధ మణ్డితమ్,
నానావర్ణ ధరం దేవం,
శాంతమ్ ఉగ్రమ్, ఉత్ ఆయుధం,
అనేక నయన ఆకీర్ణం సూర్యకోటి సమప్రభమ్।
ధ్యాయతో యోగినః సర్వం
మనోవృత్తిః వినశ్యతి।

స్వతఃగా ఆత్మస్వరూపుడే అయి ఉండి కూడా ఈ జీవునికి బంధము దేనివలన కలుగుతోంది? మనో వృత్తులవలన. మరి వాటిని జయించటం ఎట్లా? అందుకు కుంభక ప్రాణాయమముతో కూడిన ధ్యాన నిష్ఠకై ధ్యేయమును వివరిస్తున్నాను. 'ధ్యానము'చే సమాయుక్తుడై యోగాభ్యాసి...,

"- నిర్మల హృదయాకాశమునందు,
- కోటి సూర్యుల ప్రభావము కలవాడు, మహా ప్రకాశవంతుడు,
- విద్యుత్‌కాంతి స్వరూపుడు, విశ్వమంతా తన స్వరూపముగా కలవాడు,
అగు అధోక్షజ శ్రీమన్నారాయణుడు నా హృదయ కమలమునందు ఆశీనుడై ఉన్నారు" - అని ధ్యానించాలయ్యా!

ఆ విష్ణు భగవానుని
- ఈ కనబడే సర్వ ఆకారములు తనవే అయి ఉన్నవాని గాను,
- అనేక వదనములు - భుజములు ధరించువానిగాను,
- అనేక ఆయుధములు ధరించిన నానావర్ణాత్మకుని గాను,
- పరమశాంత స్వరూపుడు - ఉగ్రస్వరూపుడు కూడా అయి ఉన్నవాని గాను,
- ఎత్తబడిన ఆయుధములు ధరించినవానిగాను,
- అనేక నేత్రములు కలవానిగాను
- కోటి సూర్య ప్రభాభాసునిగాను...,

**యోగ కుంభక ప్రాణాయామ నిష్ఠతో ధ్యానం చేస్తూ ఉంటే, మనోవృత్తులు నశిస్తాయి.**

---

57 హృత్ పుండరీక మధ్యస్థం
చైతన్యం జ్యోతిః అవ్యయమ్,
కదమ్బగోళక ఆకారం
తుర్యాతీతం పరాత్పరమ్,
అనంతమ్, ఆనన్దమయం
చిన్మయం భాస్కరం విభుమ్।

- హృదయ కమలమునందు సదా వేంచేసి ఉన్నవారు,
- చైతన్య జ్యోతి స్వరూపుడు,
- అవ్యయుడు,
- సర్వతత్త్వములు తనయందు కలిగి ఉన్నట్టి కదంబగోళక (అరటిపువ్వు) ఆకారుడు,
- తుర్యమునకు, ఆవల గల తుర్యాతీతుడు,
- దరాత్ పరుడు, (దహరాకాశమును అధిగమించి ఉన్నవాడు),
- అనంతుడు, ఆనన్దమయుడు,
- కేవల చిత్‌మయ స్వరూపుడు,

**నివాత దీప సదృశమ్,**
**అకృత్రిమ మణి ప్రభమ్,**
**ధ్యాయతో యోగినః తస్య,**
**ముక్తిః కరతలే స్థితా।**

- సర్వమును ప్రకాశింపజేస్తున్నట్టి భాస్కరుడు,
- సర్వనియామకుడైనట్టి విభుడు,
- వాయువుల కదలికలు లేని చోట నిశ్చల దీపమువలె స్వయంప్రకాశ కాంతి స్వరూపుడు,
- అకృత్రిమమైన మణి ప్రభావములుతో దివ్యకాంతులు వెదదజల్లువాడు,

**అగు పరమాత్మను (కుంభక ప్రాణధారణతో) ధ్యానించు యోగికి ముక్తి కరతలామలకమై తీరుతుంది.**

---

**58 విశ్వరూపస్య దేవస్య రూపం యత్కించిత్ ఏవహి**
**స్థవీయః సూక్ష్మమన్యద్వా పశ్యన్ హృదయ పఙ్కజే।**
**ధ్యాయతో యోగినో యస్తు, సాక్షాత్ ఏవ ప్రకాశతే**
**అణిమాది ఫలం చ ఏవ సుఖేనైవ ఉపజాయతే।**
**జీవాత్మనః పరస్యాపి యత్ ఏవమ్ ఉభయోరపి**
**“అహమేవ పరంబ్రహ్మ। బ్రహ్మాఽహమ్”। ఇతి సంస్థితిః।**

ఈ విశ్వమంతా తన రూపమై విరాజిల్లుచున్న దేవదేవుని, సర్వాత్మకుని-స్థూలరూపంగానో, సూక్ష్మరూపంగానో (ఏది అభిరుచి అయితే అదే) - తన హృదయపద్మమునందు ధ్యానిస్తూ ఉంటాడో, ఆతనికి అట్టి పరాత్పరుడు సులభముగా స్వస్వరూపమై సాక్షాత్కరిస్తున్నారు. అట్టి వానిని అణిమ-గరిమ ఇత్యాది సిద్ధులు తమకు తామే వచ్చి ఆశ్రయించగలవు.

- ఈ **జీవాత్మ**గా ఉన్నది నేనే!
- దీనికి పరమై, ఆధారమై, సాక్షియై ఆవల ఉన్న **పరమాత్మను** నేనే.
- నేనే ఆ పరబ్రహ్మమును! పరబ్రహ్మము అని చెప్పబడుచున్నది నాగురించే!

**అన్న స్థితిని ఆ ధ్యానయోగి సిద్ధించుకోగలడు.**

---

**59 సమాధిః సతు విజ్ఞేయః**
**“సర్వవృత్తి వివర్జితః”,**
**బ్రహ్మసంపద్యతే యోగీ,**
**న భూయః సంసృతిం వ్రజేత్।**
**ఏవం విశోధ్య తత్త్వాని**
**యోగీ నిఃస్పృహ చేతసా,**
**యథా నిరిన్ధనో వహ్నిః**
**స్వయమేవ ప్రశామ్యతి,**
**గ్రాహ్య అభావే మనః ప్రాణో**
**నిశ్చయజ్ఞాన సంయుతః,**
**శుద్ధసత్త్వే పరేలీనో**
**జీవః సైన్ధవ పిణ్డవత్।**
**మోహజాలక సంఘాతో**
**విశ్వం పశ్యతి స్వప్నవత్।**
**సుషుప్తివత్ యః చరతి**
**స్వభావ పరినిశ్చలః,**
**నిర్వాణ పదమ్ ఆశ్రిత్య**
**యోగీ కైవల్యమ్ అశ్నుతే॥**

**ఇతి త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఇక ‘సమాధి’ అనునది అణిమ - గరిమ ఇత్యాది సర్వ సిద్ధులకు అతీతమైనది **వాటికి సంబంధించినదే కాదు.**

యోగి సర్వతత్త్వ స్వరూపమగు బ్రహ్మమును ఉపాసించి తాను సర్వతత్త్వ స్వరూపుడై, సర్వాతీతుడై వెలుగొందుచు, ఇక మరల సంసృతియందు ప్రవేశించటం లేదు. (దృశ్యముచే పరిమితత్వము పొందడు).

ఈ రీతిగా తత్త్వమ్ (“త్వమ్ తత్ - అసి” అను పరమార్థమును) శోధించి, ఇక తదితర సందర్భ సత్యములగు సర్వ బాహ్య విషయములపట్ల నిస్పృహుడై ఉంటున్నాడు. బ్రహ్మమే తానై ప్రకాశించుచున్నాడు.

కట్టెలు లేని అగ్ని తనకుతానే స్వయముగా సశాంతిస్తుంది కదా!

ఆ రీతిగా బ్రహ్మము గురించి స్వస్వరూపత్వము - సర్వ స్వరూపత్వము ఎరిగి భావాతీతుడై ఆయోగి నిశ్చయజ్ఞాన - విజ్ఞాన సమన్వితుడగుచున్నాడు.

ఉప్పుగడ్డ జలములో ప్రవేశించినప్పుడు తన నామ - రూపములను కోల్పోవు రీతిగా **“నేను జీవుడను, దేహముచే పరిమితుడను”** ... అనునదంతా శుద్ధసత్త్వమునందు (The Absolute Sense of Presence Unbound by Time and matter) విలీనమై రూపురేఖలు కోల్పోతోంది.

అట్టి యోగి ఇక ఈ పాంచభౌతిక జాగ్రత్ అంతా కూడా (విశ్వమంతా) స్వప్న దృశ్యమువలె ఊహా నిర్మిత కల్పనవలె అవగతమగుచున్నది. ఇదంతా మోహజాల సంఘాతము (Something that appears by virtue of association of Groups of Illusions) అని సుస్పష్టమై తెలియవచ్చుచున్నది.

సుషుప్తిలో ఉన్నవాడు జగత్తులో భౌతిక దేహము కలిగి ఉండి కూడా జగత్ దృశ్య రహితుడు, భౌతిక దేహ రహితుడు అయి ఉంటాడు కదా! ఆ తీరుగా యోగి జాగ్రత్తులో కూడా భౌతిక దేహరహితుడు అయి ఉంటున్నాడు. సర్వమునకు వేరై సాక్షిగా, ప్రశాంతముగా... కేవల స్వరూపుడై విరాజిల్లుచున్నాడు.

ఆతడే ఆత్మసంయమ యోగి. అన్ని విషయాలలో ఉండి కూడా, సర్వదా ఆత్మాఽహమ్ స్వరూపుడై ఈ సర్వమును స్వస్వరూపముగా ఆస్వాదించుచున్నాడు. నిర్వాణపదమును ఆశ్రయించి, కైవల్యమును ఆస్వాదిస్తూ ప్రకాశించుచున్నాడు.

**ఇతి త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 7 త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



1 రోజు = 8 జాములు / యామములు, 1 యామము = $7\,^{1}/_{2}$ ఘడియలు / ఘటికలు, 1 ఘడియ = 60 విఘడియలు 1 మాత్ర = హల్లు పలుకు సమయము (ఉదా: 'క' అనుటకు పట్టు కాలము)

**ఓం శ్రీ ఆదిత్య భగవన్ జగద్గురవే నమో నమో నమో నమః।**

**భాస్కరాయ విద్మహే। మహత్ ద్యుతికరాయ ధీమహి। తన్నో ఆదిత్య ప్రచోదయాత్।।**

పూర్వకాలంలో వేద – వేదాంగ పండితుడు, యోగతత్త్వాభిలాషి, ఆదిత్యనారాయణోపాసకుడు అగు 'త్రిశిఖి' అనే లోక ప్రసిద్ధుడైన బ్రాహ్మణోత్తముడు ఉండేవారు. ఆయన ఒకానొకరోజు ఆదిత్యోపాసనను కొనసాగిస్తూ, **'ఆహాఁ! జగద్గురువు అగు ఈ సూర్యభగవానుని సందర్శించి దేహము – ప్రాణము – యోగము – ఆత్మతత్త్వముల** గురించి స్వామి చెప్పు ప్రవచనములను వింటే బాగుంటుంది కదా"... అని తలచారు. ఆయన తలంపు **సందర్శనోత్సాహరూపము** దాల్చింది. ఇక ఏ మాత్రము తాత్సారము చేయలేదు. యోగ శక్తితో సూక్ష్మదేహి అయి, సూర్య మండలము ప్రవేశించారు. లోక కళ్యాణమూర్తి, సర్వజీవుల త్రాణయగు సూర్యభగవానుని సమీపించారు. భక్తతత్పరుడగు త్రిశిఖి బ్రాహ్మణుని సాదరంగా సూర్యభగవానుడు ఆహ్వానించారు. అప్పుడు త్రిశిఖి బ్రాహ్మణుడు సూర్యనారాయణ భగవానునికి పాదపద్మములకు త్రిప్రదక్షిణ పూర్వకంగా సాష్టాంగ దండ ప్రణామములు ఆచరించారు. శ్రీ ఛాయా పద్మినీ ఉషాసమేతుడైన ఆదిత్యభగవానుడు అత్యంత వాత్సల్యంతో త్రిశిఖి బ్రాహ్మణోత్తముడిని ఉచితాసనముపై ఆశీనులుగా చేశారు.

**ఆదిత్య భగవానుడు :** ప్రియ బ్రాహ్మణ సత్తమా ! త్రిశిఖీ ! మీ రాక యొక్క ఉద్దేశ్యమును తెలియజేయండి.

**త్రిశిఖి :** హే భగవాన్ ! ఆదిత్యదేవా ! బృహత్ తేజోమయా ! భక్తుల పట్ల కరుణార్ద్ర హృదయలగు మీకు మరల మరల నమస్కరిస్తున్నానయ్యా! స్వామీ ! సద్గురూ ! కొన్ని తాత్త్విక విషయాలు మీ ముఖతః వినగోరుకొంటున్నాను. మహాత్మా !

**కిం దేహః ?** ఈ దేహము ఎటువంటిది ?
**కిం ప్రాణః ?** ప్రాణముల యొక్క తత్త్వమేమిటి ?
**కిం కారణమ్ ?** దేహ – ప్రాణముల ఉనికికి, కొనసాగుతూ ఉండటానికి ఆధారమగుచున్న మూలకారణము ఏది ?

**తెలుసుకోవలసిన పరమార్థము, పరాకాష్ఠ ఏమై ఉన్నది?** ఇవన్నీ సవివరంగా తెలుసుకోవాలనుకుంటున్నాను. నాపై దయతో వాటివాటి స్వభావ విశేషాలు సవివరించండి.

**ఆదిత్య భగవానుడు :** ఓ బ్రాహ్మణ సత్తమా ! స్వస్వరూపముతో సహా ఈ ఎదురుగా అనుభవమగుచూ కనిపిస్తున్నదంతా **అఖండమగు శివతత్త్వమే** నయ్యా ! ఇదియే ఎరుగబడవలసిన పరమ సత్యము. అట్టి శివతత్త్వము నిత్యశుద్ధము. దోషములు గాని, బంధముగాని అద్దానికి లేవు. నిరంజనము. సర్వమునకు యజమాని. ఈ సర్వమును నియమించునట్టిది. విభువు. అద్దానికి వేరైనది ఎక్కడా లేదు. కనుక ఆద్యము! సర్వశుభ – ఆనందప్రదము. కనుక శివము. అనేకంగా అజ్ఞానదృష్టికి కనిపిస్తున్నప్పటికీ సర్వదా ఏకము. చీకట్లో కనిపించని వస్తువుల ఆకారములు, వాటివాటి అమరికలు సూర్యుడు ఉదయించినప్పుడు సుస్పష్టముగా కనిపిస్తాయి

కదా ! ఆ తీరుగా ఆత్మ భాసిస్తోంది కాబట్టే, అద్దాని వెలుగులో జగత్ విషయాలన్నీ కనబడుచున్నాయి, ప్రకాశిస్తున్నాయి. అయితే ఈ కనబడేదంతా సర్వదా ఆత్మకు అభిన్నమే అయి ఉన్నది. ఒకే పిండము (ముద్ద) అనేక మట్టి ముద్దల వలె సర్వదా ఏకమే అయినప్పటికీ... భిన్నవత్ (భిన్న భిన్నములైనట్లుగా) అజ్ఞాన దృష్టికి కనిపిస్తోంది. అద్దము ఏకమే అయినప్పటికీ, అద్దములో వేరువేరు వస్తుజాలము ప్రతిబింబిస్తున్న తీరుగా ఆభాసించుచున్నది. అగ్ని ఒక్కటే అయి ఉండి కూడా అగ్నిశిఖలు – వెలుగు – ఉష్ణము వేరువేరుగా కనిపిస్తున్నట్లు ద్రష్ట – దర్శనము – దృశ్యము ఆత్మకువేరుగా అగుపిస్తున్నాయి?

**త్రిశిఖి బ్రాహ్మణుడు :** స్వామీ ! అట్లా భాసింపజేయునది ఎట్టిది ? భాసించుచున్నట్టిది ఎట్టిది ?

**ఆదిత్య భగవానుడు :** ఏది సర్వమును భాసింపజేయుచున్నదో, ఏది భాసించుచున్నదో, ఎద్దానికి అది అనుభవమగుచున్నదో... ఈ మూడు కూడా 'సత్' శబ్దముచే వాచ్యము అగు (పిలువబడుచున్న) **బ్రహ్మము యొక్క అవిద్యాచమత్కారము** మాత్రమే !

బ్రహ్మము నుండి – అనిర్వచనీయంగా – **అవ్యక్తము** బయల్వెడులుతోంది.

అవ్యక్తము నుండి – వ్యక్తీకరణ రూపమగు **'మహత్'** సంప్రదర్శితమౌతోంది.

మహత్ నుండి – **అహంకారము,**

అహంకారము నుండి – **పంచతన్మాత్రలు,**

పంచతన్మాత్రాణి – **పంచ మహాభూతములు,**

పంచమహాభూతముల నుండి – **ఈ దృశ్యజగత్తు.** ఇవన్నీ కూడా ... బయల్వెడలుచున్నాయి. విద్యమానమగుచున్నాయి.

**త్రిశిఖి :** 'ఏకము' అగుదాని నుండి ఈ అనేకమైనదంతా ఎట్లా బయల్వెడలి విద్యమానమౌతోంది ? **తదఖిలం కిమ్ ఇతి ?**

**ఆదిత్య భగవానుడు:** ఈ సవికారమై కనిపించేదంతా కూడా-**భూత వికార విభాగాత్ ఇతి-** కేవలాత్మయొక్క పంచభూత వికార విభాగచమత్కార మాత్రమే !

**త్రిశిఖి : ఏకస్మిన్ పిండే కథం భూతవికార విభాగ ఇతి ?** సద్గురూ ! ఏకమగు పిండ తత్త్వము నుండి అనేక విభాగములుగా కనిపిస్తున్న భూతవిభాగమంతా ఎట్లా ఏర్పడటం జరుగుతోంది ?

**ఆదిత్య భగవానుడు :** సర్వాత్మకుడగు పరమాత్మ యొక్క కల్పనా చాతుర్యమే ఈ ద్రష్ట – దర్శన – దృశ్య జగత్ చమత్కారమంతా కూడా ! కల్పనకు కార్య – కారణ – కర్తృత్వాలు కూడా కల్పనాత్మకమై ఉండాలి కదా ! తత్ పరమాత్మ యొక్క పంచమహా భూత (ఇంద్రియ) తత్త్వములగు శబ్ద – స్పర్శ – రూప – రస – గంధాల 'అంశ' చమత్కారములో కార్య – కారణ, వాచ్య – వాచక – స్థానభేదాలన్నీ అంతర్గతమై ఉంటున్నాయి. త్రిమూర్తుల నుండి – పిపీలికము వరకు భేదవ్యవహారమంతా కల్పించబడి చెన్నొందుచున్నది.

**నిర్విషయ నిరాకార బ్రహ్మము నుండి మాయాకల్పిత లీలా వినోదమే - అనతగిన అవిద్యాపిండము - స్వభావమై, సవిషయమై, సాకారమై సంప్రదర్శితమగుచున్నది. పృథివి మొ॥న పంచీకృత మహావిభాగములుగా ప్రారంభమై, మరల అవిభాగత్వము పొందుతూ,.... ఈ కనబడేదంతా ఒకప్పుడు బయల్వెడలటం, మరొకప్పుడు ఆత్మయందే లయించటం జరుగుతోంది.**

***ఏకమగు ఆత్మ నుండి ఆకాశము, ఆకాశము నుండి ఆకాశాంశలుగా :*** అంతఃకరణ చతుష్టయమగు మనో – బుద్ధి – చిత్త – అహంకారములు, (మరియు) **వాయువు.**

***వాయువు నుండి వాయు అంశలుగా :*** సమాన – ఉదాన – వ్యాన – అపాన – ప్రాణములు (మరియు) **అగ్ని (వహ్ని)**

***వహ్ని (అగ్ని) నుండి అగ్ని యొక్క అంశలుగా :*** ఇంద్రియ ద్వారములగు శ్రోత్ర – త్వక్ – చక్షు – జిహ్వా – ఆఘ్రాణములు (చెవులు – చర్మము – కళ్ళు – నాలుక – ముక్కు) (మరియు) **ఆపః (జలము)**

***ఆపః (జలము) నుండి జల అంశలుగా :*** శబ్ద – స్పర్శ – రూప – రస – గంధములు (మరియు) **పృథివి**

***పృథివి నుండి పృథివీ అంశలు:*** వాక్కు, చేతులు, పాదములు, వాయువు (మలవిసర్జనా వయువము), ఉపస్థ (మూత్ర విసర్జనా వయము)... ఇవన్నీ స్వప్నసదృశంగా, లీలా వినోదముగా, ఆత్మకు అభిన్నంగా సంప్రదర్శితం అగుచున్నాయి.

# కార్యములు

**ఆకాశ కార్యములు : అవిద్యా పిండమునందు భూత - భౌతిక విభాగంలో - ఉపపన్నమయేదే ఆకాశము (Appearence).**

**ఆకాశాంశ యొక్క కార్యములు : జ్ఞానము (Knowing), నిశ్చయము (Decision taking), అనుసంధానము (Tendency of geting associated), అభిమానము (Sense of relatedness and belongingness).**

**వాయు అంశ యొక్క కార్యములు :** అంతఃకరణ విషయ సమీకరణము (Mixing different permutation and combinations).

ఉన్నయనము (ఉత్ + నయనము... Perceiving)
గ్రహణము (Taking inward),
ఉచ్ఛ్వాసనములు (Perspiration)

**వాయు విషయములు :** ప్రాణ - అపన - వ్యాన - ఉదాన - సమాన - సప్రాణములు.

**అగ్ని యొక్క కార్యములు :** శబ్ద - స్పర్శ - రూప - రస - గంధములు.

**అబాశ్రితములు (అనగా) జలము యొక్క కార్యములు :** జ్ఞానేంద్రియములు (కళ్ళు, చెవులు, నోరు, ముక్కు, చర్మము).

**పృధివి యొక్క కార్యములు :** వచన (Speaking), ఆదాన (Taking), గమన (Walking) విసర్గ (Leaving)

**పృధివీ విషయములు** - కర్మేంద్రియములు (కాళ్ళు, చేతులు, గుదము, రహస్యావయము, నోరు).

**"కర్మ - జ్ఞానేంద్రియ" విషయములలో** - ప్రాణ, తన్మాత్రలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు) అంతర్భూతమై ఉన్నాయి.

**"మనస్సు - బుద్ధి"** ల యందు, చిత్త - అహంకారములు అంతర్భూతములు

| **సూక్ష్మతన్మాత్రలు :** | | |
|---|---|---|
| | అవకాశము | (స్వీకరణ) |
| | విధూతము | (వదలటం) |
| | దర్శనము | (Perception) |
| | పిణ్డీకరణము | (వివిధ మిశ్రమములు సమ్మేళనములు) |
| | ధారణ | (ఆకర్షణ) |

### ఏవం ద్వాదశాంగాని - ఆధ్యాత్మికా, ఆధిభౌతికా, అధిదైవికాని

ఇవన్నీ కలిపి 1) ఆధ్యాత్మికములు 2) అధిభౌతికములు 3) అధి దైవికములు

వాటివాటి 1) అంశములు 2) కార్యములు 3) ఇంద్రియ స్థానములు 4) విషయములు

3×4 = ద్వాదశ (12) అంశములుగా శాస్త్రములు విభజించి వర్ణిస్తున్నాయి. ఇవన్నీ విశ్వరచనలో అందర్భూతములై, వివిధ ప్రజ్ఞలచే ప్రదర్శించబడుచున్నాయి. అవి **'దివ్యప్రజ్ఞలు'** అని, **'ప్రజ్ఞాధిష్ఠాన దేవతలు'** అని చెప్పబడుచూ వస్తున్నాయి. ఇవన్నీ ఈ దేహములో నిర్వర్తించబడు కార్యక్రమసమూహములుగా, ఇంద్రియ చైతన్యరూప దివ్యాంశలుగా ప్రత్యక్షమై ఉంటున్నాయి.

### దివ్యాంశలగు ఇంద్రియ అధిదేవతలు :

1) నిశాకర (చంద్రుడు) 2) చతుర్ముఖ (బ్రహ్మదేవుడు), 3) దిక్ (దిక్ దేవతలు), 4) వాయు-చలనాభిమాని 5) అర్క (సూర్యుడు), 6) వరుణ (జలదేవత), 7) అశ్వినీ (ఓషధ దేవతలు), 8) అగ్ని (తేజో -ఉష్ణ దేవత), 9) ఇంద్ర (ఇంద్రియముల అభిమాని), 10) ఉపేంద్ర (సూక్ష్మతత్త్వముల అభిమాని) 11) ప్రజాపతి (దేహముల అభిమాని) 12) యమా (మార్పు చేర్పుల అభిమాని). వీరంతా అక్ష-అధి దేవతారూపులైనట్టి (సృష్టిలో సంఘటితమౌతున్నట్టి) ద్వాదశ (12) ఇంద్రియాధిదేవతలు. వీరి భౌతిక దేహాంతంగా నిర్వర్తించే క్రియా విశేషాలే సుషుమ్న మొదలగుగా గల ద్వాదశ ముఖ్యనాడులు.

అయితే సర్వము ప్రాణశక్తి ప్రదర్శనమే! ప్రాణశక్తి వాస్తవానికి ఏకమేగాని అనేకము కాదు. అట్లా అయి ఉండి కూడా,... (ఇడ, పింగళ, సుషుమ్న, గాంధారి, పూషా, యశస్విని, అలంబుస, కుహు, శంఖిని - మొదలైన) - 12 నాడులలో 12 రూపములుగా వెలయుచు వివిధ ధర్మములను నెరవేర్చుచున్నది.

ఈ అనేకములుగా కనిపించేదంతా **ఏకరూపమగు ప్రాణతత్త్వమే –** అని తెలుసుకోవాలి.

**వ్యోమ అనిల అనల జల అన్నానాం పంచీకరణం ఇతి జ్ఞాతృత్వం సమానయోగేన శ్రోత్ర ద్వారా శబ్దగుణో అధిష్ఠితే ఆకాశేతిష్ఠతి। ఆకాశః తిష్ఠతి.**

ఇక్కడ కనబడేదంతా కూడా ఆకాశ – వాయు – అగ్ని – జల – అన్న (భూ) తత్త్వముల వివిధ సమ్మేళనములే ! ఇదంతా కూడా **"భూత పంచీకరణ"...** చమత్కారము ! ఈ ద్వాదశాంగముల గురించి చక్కగా తెలుసుకొన్నవాడే జ్ఞాత!

**తెలియబడుచున్నదంతా** (వేదమ్) – పంచభూత సమీకరణమే!

**తెలుసుకొనువాడు** (వేదాంతుడు) – ఈయన తెలియబడుచున్న దానికంతటికీ వేరై ఉన్నవాడై , యోగధారణచే, సమానవాయుసంబంధముచే

- శ్రోత్ర మార్గముగా శబ్దగుణము కలవాడై,
- వక్త మార్గముగా వాక్కును అధిష్ఠించినవాడై
- అంతర మార్గముగా ఆకాశ స్వరూపుడై

... ఆకాశమును తన ఆకాశ స్వరూపముతో నింపి ఉంచి, జ్ఞాతృత్వము (తెలుసుకొనటము) నిర్వర్తించున్నాడు. ఆత్మ స్వరూపుడగు జ్ఞాత తనకు తానే **'తెలియబడునది'** అను దానిని కల్పించుకొని, ప్రవేశించి-సర్వము తానే అయి ఉండి కూడా – (అద్వితీయుడై కూడా), సర్వము తనకు వేరైనట్లుగా భావనచేసి భావబద్ధుడు అగుచున్నాడు (యథా స్వప్నమ్).

గుణరహితుడగు పరమాత్మ లీలా – క్రీడా వినోదంగా గుణములను కల్పించుకొని, ఆ గుణములలో ప్రవేశించి గుణములచే బద్ధుడై **'గుణి', 'జీవుడు'** అని పిలువబడుచున్నాడు. సమాన ప్రాణయోగముతో చెవుల ద్వారా శబ్ద గుణ సమన్వితుడై వాక్కునందు వాక్కుగాను ఆకాశమే అగుచు ఉంటోంది.

**మనో వ్యానయోగేన 'త్వక్' ద్వారా స్పర్శగుణః పాణ్యధిష్ఠితే వాయౌ తిష్ఠతి ! వాయుః తిష్ఠతి !**

పరమాత్మ సర్వదా యథాతథుడై ఉండి కూడా, మనస్సు యొక **'వ్యాన యోగము'**-అనే విస్తరించు ధర్మము చేత చర్మము (త్వక్) ద్వారా స్పర్శగుణము కలవాడగుచున్నాడు. అరచేతిని(ప్రాణిని) అధిష్టించి (ఆశ్రయించి), వాయు స్వరూపుడై వాయువునందు కూడా ఉంటున్నాడు.

**బుద్ధి** ఉదాన (అంతటా ఏర్పడి ఉండు) వాయు సంబంధముచేత చక్షువుల ద్వారా 'రూప గుణము'ను ప్రదర్శించుచున్నది. బుద్ధియే-పాదములను అధిష్ఠించి, ఆశ్రయించి ఉన్నది. అగ్నియందు అగ్ని తత్త్వముగా అయి అధిష్ఠిత్వమును ప్రదర్శించుచున్నది.

**చిత్తము** అపానవాయు సంబంధము చేత జిహ్వ (నాలుక) ద్వారము గుండా రసగుణము కలిగియున్నదై ఉంటోంది. ఉపస్థ (శృంగారాంగము)ను ఆశ్రయించినదై, (అధిష్ఠించినదై) ఉంటోంది. జలమునందు జలస్వరూపమై ప్రవర్తించుచున్నది.

**అహంకారః ప్రాణ యోగేన ఘ్రాణ ద్వారా, గన్ధ గుణో గుణాధిష్ఠితాః పృథివ్యాం తిష్ఠతి । పృథివీ తిష్ఠతి - ఇత్యేవం వేద ।**

అహంకారము-ప్రాణ వాయు సంబంధము చేత ముక్కు ద్వారా గంధగుణము కలిగియున్నదై, 'గుదము (మలవిసర్జకాయవము)'...ను కూడా ఆశ్రయించి – అధిష్ఠించినదై ఉన్నది. భూస్వరూపమును పొంది భూమియందు కూడా వేంచేసి ఉన్నదగుచున్నది.

ఎవ్వడైతే

1) ఈ పంచీకరణమును,
2) పంచభూతముల యొక్క కార్యములను,
3) వాటి సంఘతములకు కారణమగుచున్న సంఘాత – అంతర్యామియగు పరమాత్మయొక్క (i) కర్తృత్వ, (ii) అకర్తృత్వ- (iii) సాక్షిత్వములను...,

తెలుసుకుంటాడో,... ఆతడు స్వయముగా తానే **'అంతర్యామి స్వరూపుడు'** గా అయి సర్వత్రా ఆత్మానంద స్వరూపుడుగా ప్రకాశమానుడగుచున్నవాడగుచున్నాడు. **అత్ర ఏతా శ్లోకా భవన్తి ।** ఈ విషయమే విశదీకరించబడుచు తత్త్వదర్శులు శ్లోకములను గానము చేస్తున్నారు.

ఓ త్రిశిఖీ !

పరబ్రహ్మము సర్వదా సర్వమునకు విలక్షణమై, అప్రమేయమై, యథాతథమైయున్నదయ్యా! ఇక మిగతా వ్యవహారమంటావా? అంతఃకరణము, (మనో – బుద్ధి – చిత్త – అహంకారాలతో కూడిన అంతరంగము) ; పంచప్రాణములు – పంచజ్ఞానేంద్రియములు; పంచకర్మేంద్రియములు; ... ఈ షోడశ (16) కళలు, వాటివాటి క్రియలు, వాటి విషయాలు. ఈఈ వ్యవహారాలతో సహా పరబ్రహ్మముపై ఆరోపించబడుచున్నది. (దృష్టాంతానికి, బంగారము బిళ్లయే ఆభరణముగా కమ్మరి మార్చారు – అని మాటగా అంటాము. బంగారము బంగారముగానే ఉన్నదే గానీ, 'ఆభరణము' అనబడు మరొకటిగా అవటమే లేదు కదా !)

ఈ విధంగా "ఆకాశము – వాయువు – అగ్ని – జలము – భూతత్త్వములు – అంతఃకరణము – వ్యానప్రాణము – కళ్ళు – రసము – పాయువు" మొదలైన శబ్దములన్నీ పరిగ్రహించబడుచున్నాయి. అట్లా పరిగ్రహించబడినవే విషయములుగా పొందబడుచున్నాయి.

**యోగ పంచీకరణము :** ఆకాశ–వాయు–అగ్ని–జల–భూ ... క్రమములగు పంచభూతముల యందు (ఆకాశాత్‌వాయుః;వాయురగ్నిః; అగ్నిరాపః; ఆపఃపృథివీ – క్రమమునందు)

- పంచభూతములలో ఒక్కొక్క దానిని రెండు – రెండు అర్ధ భాగములుగా విభజించి,
- ఒక్కొక్క భూతము యొక్క రెండవ (1/2) అర్ధ భాగమును '4' భాగములుగా విభజించి...
- ద్వితీయార్థములోని ఆ ఒక్కొక్క నాలుగవ భాగమును తదితర నాలుగు భూతముల మొదటి అర్ధ భాగముతో చేర్చబడుచున్నాయి.
- (1/2 x 3/4) భాగములను మరికొన్ని మిశ్రమములచేయటము జరుగుతోంది.

  ఇట్టి విభాగయోగమే **'మహాభూత పంచీకరణము'**. అట్లు విభాగించి – మిశ్రమముగా చేసిన పంచమహాభూత చతష్టయంలో
- ఒక అర్ధ భాగము – ముఖ్యము, సూక్ష్మము.
- రెండవ అర్ధ భాగము – స్థూలము, గుణము.

సూక్ష్మభాగములతో గుణాంశాలు (స్థూలములు) అనుక్రమంగా, ఓతప్రోతములుగా ఆశ్రయించినవై ఉంటున్నాయి. అవన్నీ అన్యోన్యములై శబ్ద – స్పర్శ – రూప – రస శక్తులు, విషయములు... అగుచున్నాయి. ఇదియే ఈ కనబడే సృష్టి వైవిధ్యమంతా కూడా!

## పై పంచమహాభూత సంపుటీకరణముల గురించి మరికొంత వివరంగా మనము చెప్పుకుందాము.

**భూమి :** కళ్ళకు అచేతనమువలె కనిపించు ఈ భూమి అంతర్గముగా పరిశీలిస్తూ వస్తే, భూమిలో – ఆకాశ – వాయు – జల – అగ్నులు మిశ్రమము అయి ఉన్నాయి. **పంచభూతమయీ భూమిః, సా చేతన సమన్వితాః ।** ఈ భూమి పంచభూతాత్మకమై, సచేతనమైయుండటం చేతనే భూమి నుండి ఓషధులు బహిర్గతమై, జీవులకు ఆహారరూపముగా ప్రాప్తమౌతున్నాయి.

సచేతనమగు భూమి నుండి... సచేతనమగు ఓషధులు! సచేతనమగు ఓషధుల నుండి – సచేతనమగు 'అన్నము'! సచేతనమగు అన్నమునుండి – చతుర్విధ సచేతనరూపమగు – పిండములు (జీవులు) బయల్వెడలుచున్నాయి.

1) **అండజములు** – from Egg... పక్షులు మొ॥వి,
2) **జరాయుజ** – గర్భధారణ చేత మానవులు, పశువులు మొ॥వి,
3) **ఉద్భీజములు** – బీజము (విత్తనముల నుండి జనించేవి. చెట్లు మొ॥నవి),
4) **స్వేదజములు** – చమట – మురికి నుండి జనించే పురుగులు మొ॥వి,

"అన్నచైతన్యము" నుండియే రసము, రక్తము, మేదస్సు, బొమికలు, మజ్జ, శుక్లము ... మొదలైనవి చైతన్యముతో కూడిన ధాతువులు దేహములో జనిస్తున్నాయి. స్వయం ప్రవర్తమానమగుచున్నాయి.

### ఓ త్రిశిఖి బ్రాహ్మణా :

కొందరు అనుకుంటున్నారు కదా ... "ఆఁ! ఏమీ కాదు ! శుక్ల –శోణిత పరస్పర కలయిక చేతనే ప్రాణులు పుట్టుచున్నాయి !" – అని. అది పరిమిత, సంకుచితమైన అయినట్టి అపరిశీలనాత్మక దృష్టి మాత్రమే. జీవుల దేహములన్నీ ఆహారము నుండే జనించి, ఆహారము (అన్నము) చేతనే జీవిస్తూ,.... అన్నమునందే తిరిగి లయిస్తున్నాయి.

**ఇదంతా ఇలా ఉండగా...,**

ఈ భౌతిక దేహములో 'నాభి' (బొడ్డు) వద్ద అన్నమయ పిండ చైతన్యము సంస్థితమై, దేహము యొక్క పరిపోషణ, పరిరక్షణ నిర్వర్తించుచున్నది.

### అస్య మధ్యే అస్తి హృదయం సనాళం పద్మకోశవత్ ! - హృదయకోశము (హృదయ చైతన్యము)

అట్టి అన్నమయ పిండ చైతన్యమునకు వేరుగా (గృహములో, ఒక గదిలో వేరుగా మరొక గది ఉన్నతీరుగా) హృదయస్థానములో **"హృదయ చైతన్యము"** స్ఫూర్తి రూపమై వెలుగొందుచున్నది. 'పద్మ కోశము' వలె సన్నటి దారము మాల వంటి అనేక నాళములతో కూడి ఈ హృదయము అనుక్షణం దీపకాంతివలె చైతన్యవంతమై వెలుగొందుచున్నది. అట్టి హృదయ కోశమును ఆశ్రయించి **(తస్యాంతే హృదయగం సూక్ష్మం, తస్మిన్ సర్వమ్ ప్రతిష్ఠితమ్)...,**

- ఇంద్రియ అధిష్ఠాన దేవతలు...,
- కర్తృత్వ - భోక్తృత్వ భావనలు...,
- అహంకార - మమకార - ఇత్యాది స్వభావాలు...,
- కర్తృత్వ భోక్తృత్వ, అహంకార మమకార సంబంధితమైన అనుభూతులు, అనుబంధాలు, సంబంధాలు, బాంధవ్యాలు, వేదనలు - అదుర్దాలు - గర్వాలు - గర్వభంగాలు ఉంటున్నాయి.

**ఇవన్నీ జీవుని పట్ల సచేతనములై వెలయుచున్నాయి.**

### హృదయకోశ బీజము - జీవాత్మయే

"అట్టి హృదయ కోశమునకు బీజమేమిటి ?" అని ప్రశ్నిస్తే, - మోహరూపము, అజ్ఞానముతో కూడుకొనినది, జడత్వము ఆపాదించుకొనుచున్నది - అగు 'తమోపిండము' (లేక) జీవాత్మయే!

**అస్యబీజం తమః పిణ్డం -మోహరూపం తమం ఘనమ్, వర్తతే కంఠమ్ ఆశ్రిత్య... మిశ్రీభూతమ్ ఇదమ్ జగత్ !** అట్టి తమో రూప చైతన్యము యొక్క ఒక అంతర్విభాగము 'మనస్సు' గా రూపుదిద్దుకొని, దేహము యొక్క కంఠ ప్రదేశమును ఆశ్రయించుకొనినదై ఉంటోంది. మనస్సు స్వతఃగా జడమా ? కాదు ! అదీ చైతన్యరూపమే ! మరి ? అట్టి **చైతన్య రూపమనస్సు** (అంతరంగము) (లేక) **కేవల మనో చైతన్యము** - దేహము లోని కంఠ ప్రదేశమును స్థానముగా కలిగి ఉంటూనే, తన యొక్క ఒక విభాగము ద్వారా అనేక జడ విషయముల గురించి, జడ వస్తువుల గురించి సంబంధము పెంపొందించుకుంటోంది. తన సచేతనత్వమును ఏమరచి తాను జడమైనట్లు జడ విభాగము ద్వారా భావించి, ఆ భావనలతో తనను తానే కట్టి వేసుకొని ఉంటోంది. ఈ విధంగా **అజ్ఞానముతో కూడిన మనస్సుతో, జడ విషయముల గురించి సంబంధము పెంపొందించుకొని "జగత్ రూపానుభవి' అగుచున్నది.** మరి కొంత సేపు తరువాత **"నేను ఈ జగత్తులో బద్ధుడనై ఉన్నానే ! ఏం చేయాలి ?"** అని వాపోతూ ఉన్నది. జడమిశ్రమ చేతన మనస్సుకు దిక్కు తోచటమే లేదయ్యా !

జీవాత్మ మనస్సుతో తనయందు జగత్తును కల్పించుకొని, ఆ జగత్తులో ప్రవేశించి, వినోదిస్తూ..., ఇంతలో తన కల్పనా జగత్-పంజరములో తానే చిక్కుకొన్నట్లుగా మనస్సుతో బంధము పొందుచున్నది. **"ఇదంతా నా కల్పనయే!"**... అనునది ఏమరచుచున్నది.

### జీవాత్మ చైతన్యము :

ఇప్పటి వరకు నాభిస్థానము (లేక) అన్నమయ విశేషము (పొట్ట - నాభి అన్న స్థానము), హృదయ (అంతరంగ) స్థానము, మనోమయ స్థానము వరకు చెప్పుకున్నాము.

ఇప్పుడు ఇక **మూర్థ్నిస్థానము.** మూర్థ్ని స్థానములో (At the space of the forespace) ప్రత్యక్ ఆనంద స్వరూపుడగు జీవాత్మ చైతన్యము వేంచేసినదై ఉన్నది. నాటకంలోని నటుని పాత్రధారణలాగా సంగతి - సందర్భములలో చిక్కుకున్న చైతన్యమును 'జీవాత్మ చైతన్యము' అంటారు. పాత్రకు ఆవల గల నటుని వ్యక్తిత్వము (సహజరూపము) - పరమాత్మ చైతన్యము. జీవాత్మ పరమాత్మ యొక్క అంశయే! ఆ రెండూ ఏకమేగాని, ద్వైతము కాదు! **(జీవోశివః । శివో జీవః)**

## పరమాత్మ చైతన్యము :

జీవాత్మ చైతన్యమును తనయొక్క ఒకానొక ప్రదర్శనముగాను, ఉపకరణముగాను కలిగి ఉన్నట్టి పరమాత్మ – యోగ శాస్త్రములో **'పరమపదము'** – అని వర్ణించబడుచున్న 'శీర్ష' (మూర్ధ్ని స్థానము నుండి తల ఉపరిస్థానము వరకు) నందు విషయాతీత – ప్రశాంతరూపులై వేంచేసి ఉన్నారు. శిరస్సు పరమాత్మ చైతన్య స్థానముగా అభివర్ణించబడుతోంది. అట్టి **పరమపద స్థానము** నందు గల **చైతన్య స్వరూపుడు** అనంత శక్తియుతుడై, తన యొక్క చిత్కళా విన్యాసముగా జీవ – హృదయ – ఇంద్రియ – దృశ్యాంతర్గత – దృశ్యబాహ్య ... సర్వస్వరూపుడై కూడా వెలుగొందుచున్నారు. ***అనన్యుడగు ఆ పరమాత్మయొక్క స్వరూపమే ఈ అన్యమైనదంతా!***

అట్టి **పరమాత్మ చైతన్యము** నుండియే ద్రష్ట (జీవుడు) – దర్శనము – దృశ్యములు బయల్వెడలి, తత్ చైతన్యమునందే విన్యాసము నిర్వర్తిస్తున్నాయి. ఆ పరమాత్మ చైతన్యమే జాగ్రత్ చైతన్య రూపమును ధరించి జాగ్రత్ కళగా జాగ్రత్ అంతటా నిండియున్నది. ఆ పరమాత్మ యొక్క స్వప్న చిత్ కళయే స్వప్న దృశ్యముగా ఆవిర్భవించి, ఆయనచేతనే **"స్వప్నాంతర్గత ద్రష్ట – స్వప్న దృశ్యము"**లతో సహా సర్వము ఆస్వాదించబడుతోంది. ఆయనయే సుషుప్తి రూపుడై జాగ్రత్ అనుభవములను స్వప్నానుభవములను తనయందు నిశ్శబ్దముగా–అప్రదర్శితముగా దాచివేసుకొని, నిర్విషయత్వము యొక్క "ఆస్వాదన ద్రష్ట" యై చెన్నొందుచున్నారు. జాగ్రత్ స్వప్న సుషుప్తుల స్వీయకల్పనా రచనలో సంచారములు చేయు 'తురీయము' (4వది–చతురీయము) కూడా ఆ పరమాత్మ చైతన్య విభవమే! ఈ జాగ్రత్–స్వప్న–సుషుప్తి తురీయములకు వేరై మరింకే అవస్థా లేనే లేదు. **సర్వే దేశేషు అనుస్యూతః చతురీ రూపః శివాత్మకః।** అప్రత్యగాత్మయే '4' అవస్థలయందు ధారముచే నిర్మించబడిన వస్త్రములో దారమువలె అనుస్యూతుడై, అనువర్తుడై ఉన్నారు.

> **యథా మహా ఫలే సర్వే రసాః సర్వ ప్రవర్తకాః,**
> **తథైవ అన్నమయే కోశే కోశాః తిష్ఠన్తి చ అంతరే ।**

ఏవిధంగా అయితే ఒక పెద్ద ఫలముయొక్క అంతరమంతా రసమయమై ఉంటోందో (Say a mango fruit is filled in by fruit juice), అదేవిధంగానే ... **అన్నమయ కోశమంతటా ప్రాణమయ కోశముచే నిండినదై ఉన్నది.**

అట్లాగే మనోమయ కోశముచే ప్రాణమయ కోశము, విజ్ఞానమయ కోశముచే మనోమయ కోశము, ఆనందమయ కోశముచే విజ్ఞానమయ కోశము పూరితములై ఉన్నాయి. ఆ ఆనందమయ కోశమును జీవుడు రసస్వరూపుడై పూరితము చేయుచూ ఉన్నాడు. **ఈ జీవుడే శివుడు.** శివతత్త్వమే జీవుడుగాను, పంచకోశములుగాను వెలయుచున్నది. ఏది జీవుడో అదే శివుడు. ఏది శివుడో ... అదే జీవుడు కూడా ! అయితే...

**సవికారః తథా జీవో** – సవికారత్వముచేత 'జీవుడు' అని, **నిర్వికారః తథా శివః** – నిర్వికారత్వము చేత 'శివుడు' అని పిలువబడుచున్నాడు. **కోశాః తస్యవికారాః తే హి అవస్థాసు ప్రవర్తకాః ।** పంచకోశములు, వాటివాటి వికారములే జాగ్రత్ – స్వప్న – సుషుప్తి – తురీయావస్థలై వెలయుచున్నాయి. ఏ విధంగా అయితే తరంగముల పరస్పర తాకిడిచే ఫేనము (నురుగు) తెల్లగా ప్రకటనమగుచున్నదో..., అదేవిధంగా మనస్సులో భావనల – ఆలోచనల ఒరిపిడి చేత మనస్సు నుండి సంకల్ప – వికల్పతరంగాలు బయల్వెడలి, అవియే జాగ్రత్ – స్వప్న – సుషుప్తుల రూపములుగాను, వాటివాటి సర్వ అంతర్గత విశేషములుగాను సంతరించుకుంటున్నాయి. అవస్థలుగా ప్రవర్తకములగుచున్నాయి.

| | | |
|---|---|---|
| అవస్థలకు ఆవల | → | శివుడు (సహజము) |
| అవస్థలకు ఈవల | → | జీవుడు (సందర్భమునకు అంతర్గతము) |
| ఈ రెండూ ఏక | → | అఖండ చైతన్యస్వరూపమే! (నాటకంలో పాత్రగా కనిపించేవాడు–పాత్రధారుడు వలె!) |

మనస్సు నుండి సంఘర్షణరూపముగా బయల్వెడలు సంకల్పముల వల్లనే – కర్మలతో సంబంధము ఏర్పడుతోంది. "ఆ కర్మలు నిర్వర్తించాను. ఇంకా ఇవి నిర్వర్తించాలి"... మొదలైన కర్మ వ్యవహారళ సరళి – అభ్యాసవశంగా సంస్కారాలు ఏర్పడినవై, స్పందన పూర్వకంగా ప్రవర్తిస్తున్నాయి.

**కర్మణా వర్తతే కర్మః । తత్ త్యాగాత్ శాన్తిమ్ ఆప్నుయాత్।** కర్మలవలన కర్మలు ప్రవర్తిస్తూనే పోతాయి గాని కర్మలవలన కర్మలు నశించవు. శాంతించవు. కర్మలు శమిస్తే మనస్సు శమిస్తుంది. మనస్సు శమిస్తే ఈ జీవునికి తన అప్రమేయమగు పరాత్మ అనుభవమునకు వచ్చినదై, శాంతి లభిస్తోంది.

– మనస్సు దక్షిణాభిముఖముగా (అనగా, కర్మలవైపుగా) సంకల్ప – వికల్పముల పరంపరలతో కూడుకొని వ్యావహారికమునందు కదలటం జరుగుచున్నప్పుడు, అది దృశ్యాభిముఖమై (లేక) ప్రపంచాభిముఖమై ఉంటోంది. అప్పుడు 'జీవుడు' అని పిలువబడుచూ బద్ధుడు, దుఃఖభాగితుడు అగుచున్నాడు. స్వతఃగా సదాశివుడే అయి ఉండికూడా, "అహంకారము + దృశ్యాభిమానము"ల – ఓత ప్రోతములచే జీవుడుగా అగుచున్నాడు. స్వకీయమే అగు అవివేకమునకు తలఒగ్గి, తన ప్రకృతితో 'సంగము' చేత మోహమునకు లోను అగుచున్నాడు. **నానా యోని శతం గత్వా శతేఽసౌ వాసనావశాత్,** ఇక ఆపై ఒక దేహమును వదలుచూ, మరియొక యోనిని ఆశ్రయిస్తూ నానా విధ వందలాది యోనులలో వాసనావశుడై ఉంటున్నాడు. **"నేను బద్ధుడను. అల్పుడను. నన్ను రక్షించేదెవ్వరు?"** ... అని తనకు తానే తనపై దృశ్య బంధత్వమును ఆపాదించుకొనుచున్నాడు.

## జ్ఞాన మార్గము - సద్యోముక్తి

ఓ త్రిశిఖీ ! ఆ జీవుడు ఎప్పుడైతే వివేకి అయి ఆత్మ జ్ఞానమును సంపాదించుకుంటూ ఉంటాడో.. అట్టివాడు క్రమంగా విజ్ఞాని అగుచున్నాడు. పెద్ద సొరచేపవలె సంసార నదీ జలంలో ఈవడ్డునుండి ఆవడ్డుకు తిరుగాడుచున్నాడు. ఆత్మను ఎరిగినవాడు కర్మ బంధములన్నీ త్రెంచివేసుకొని 'మోక్షము' అనే ఆవలి ఒడ్డుకు చేరుచున్నాడు. అట్టి 'మోక్షము' జ్ఞాన శాస్త్ర రూపంగా వివరించబడి చెప్పబడుతోంది. అయితే ఈ జీవునికి అట్టి ముక్తి – కాలవశంగా సుదీర్ఘమైన జ్ఞానార్జచే గానీ సిద్ధించటం లేదు. బుద్ధియొక్క నిర్మలము – సునిశితములచేతనే, అట్టి శ్రవణ రూపంగా సద్యోముక్తి లభ్యమౌతోంది.

## యోగమార్గము : క్రమముక్తి

అట్టి మోక్షము సముపార్జించటానికై ముముక్షువగు యోగసాధకుడు యోగ శాస్త్రములో సూచించిన మార్గములలో ఉత్తరాభిముఖుడై, మూలాధార స్థానమునందు యోగ సాధనను ప్రారంభించుచూ, క్రమక్రమంగా పైపై చక్రస్థానములను ఉపాసనాక్రమమును అనుసరించి అధిగమిస్తూ వస్తున్నాడు. **స్థానాత్ స్థానాన్తర క్రమాత్‌గా** యోగ సాధన చేస్తూ **మూలాధార** చక్రము–**స్వాధిష్ఠాన** చక్రము–**మణిపూరక** చక్రము–**అనాహత** చక్రము –**విశుద్ధ** చక్రము–**ఆజ్ఞా**చక్రముల స్థానములందు చిత్తమును నిలుపుతూ వస్తున్నాడు. అనగా గుదస్థానము (seating spot) ప్లీహస్థానము– నాభికేంద్రము (బొడ్డు)–హృదయ కేంద్రము–కంఠస్థానము–భ్రూమధ్య కేంద్రము (లేక) స్థానములందు చిత్తము (ఇష్టము)ను, బుద్ధిని ఏకాగ్రపరచి నిలుపుచున్నాడు. ఆ తరువాత మూర్ధ్న స్థానము నుండి బ్రహ్మరంధ్రముచేరి తనయొక్క **జీవాత్మత్వమును** అక్కడ సహస్రారమునందు సంస్థితమైయున్న తనయొక్క **పరమాత్మత్వము**నందు ఏకం చేస్తున్నాడు. ఇది **క్రమముక్తి మార్గము**గా చెప్పబడుచున్నది. లేక **'యోగ మార్గ మోక్ష సాధన'** అయి ఉన్నది.

**త్రిశిఖి :** హే ఆదిత్య భగవాన్ ! ఇప్పుడు మీరు **1) జ్ఞాన మార్గము 2) యోగ మార్గము** అను రెండు మోక్ష మార్గములు సూచిస్తూ వస్తున్నారు కదా ! ఈ రెండిటిలో ఏది గొప్పది ?

**ఆదిత్య భగవానుడు :** అవి రెండూ సాధనమార్గములే ! ఆ రెండింటినీ వేరు వేరు చేసి చూడకూడదు. "జ్ఞానమార్గతత్పరులు వేరు, యోగమార్గ తత్పరులు వేరు"... అనునవి చిన్న పిల్లలు పలికే మాటలు. ఎందుకంటే ...,

**యోగాత్ సంజాయతే జ్ఞానమ్ । జ్ఞానాత్ యోగః ప్రవర్తతే ।**

తెలుసుకోవటం జ్ఞానం. తెలుసుకొన్నది జ్ఞప్తి, అనుభూతులుగా రూపుదిద్దుకోవటం – యోగం!

యోగము చేత జ్ఞానము స్వయముగా ప్రవృద్ధమగుచూ రూపు దిద్దుకొనుచు... అనుభవముగా సిద్ధించుచున్నది. అట్లాగే జ్ఞానము చేతనే బుద్ధి ఏకాగ్రమగుచూ వస్తోంది. జ్ఞానాశయము – ఎరుకలతో యోగమార్గము విధి పూర్వకంగా నిర్ణయించి సూచించబడతోంది. ఒకడు "నేను యోగ మార్గమే అనుసరిస్తాను, జ్ఞాన విషయాలు చెప్పకండి"... అని అనకూడదు. అట్లాగే "నేను జ్ఞానమార్గంలో ఉన్నాను. యోగముతో పనిలేదు"... అని కూడా అనరాదు. యోగ – జ్ఞానములు రెండూ రెండు చక్రములు గల వాహనముగా భావించి మోక్ష మార్గములో ప్రయాణించాలి. యోగ – జ్ఞానములలో ఒక్కటి నీవు వదలితే, రెండవది నిన్ను వదలగల అవకాశము ఉన్నది. అందుచేత **యోగ - జ్ఞాన పరోనిత్యం సయోగీ న ప్రణశ్యతి ।** ఎవ్వడైతే యోగ – జ్ఞానపరుడై ఉంటాడో, ఆ రెండింటినీ వదలకయే ఉంటాడో, .... అట్టి యోగికి అపజయము – చ్యుతి – పడిపోవటం (ప్రణశ్యతము) ఉండవు.

ఓ త్రిశిఖి బ్రాహ్మణా ! ఈ దృశ్య వ్యవహారమంతా మనోవికారములకు ఈవల, సంసార రూపమై – ప్రవర్తనము కలిగి వున్నది. అట్టి సంసార వికారరూపమగు మనస్సుకు ఆవల శివము (పరమ శివుడు)ను శుద్ధ మనస్సుతో చేరాలి. ఆపై దేనిని వికారాత్మ జగత్తుగా, (దృశ్యముగా) చెప్పుకొన్నామో, అదంతా **శివస్వరూపముగా** దర్శించాలి. **ఇదీ యోగ - జ్ఞానముల యొక్క మహదాశయము!**

**అంతిమాశయము. "ఇదంతా శివ తత్త్వమే"**... అని, స్వకీయ స్వరూపముతో సహా, అంతరంగ చతుష్టయము – వాటి వాటి విషయములతో సహా – (శివముగా) దర్శించాలి. యోగముతో యోగత్వము ప్రకాశింపజేయుచు అనన్య భావనను సిద్ధింపజేసుకోవాలి. **"ఆత్మనగు నాకు ఇదంతా అన్యము కాదు!"** .... అను స్థితియే యోగము. అదియే జ్ఞానము కూడా! ఆ రెండిటికి ఇక బేధమెక్కడిది?

"ఇదంతా శివతత్త్వమునకు అభిన్నము" అని ఘంటా పథముగా మీమాంసా పూర్వకంగా నిరూపించనూవచ్చు. అయితే అట్లు తెలుసుకొన్నది ఆ తీరుగా అనిపించాలి కదా? కేవలము తెలుసుకొన్నంత మాత్రం చేత అనిపించటము సిద్ధించజాలదు. **యోగ - జ్ఞానే న విద్యేతే, తస్య భావో న సిద్ధ్యతే ।** ఒక్క యోగ మార్గము చేతగాని, ఒక్క జ్ఞానమార్గము చేతగాని మోక్ష భావన (లేక) మోక్ష స్థానము సిద్ధించదు – అని గమనించి ఉండాలి సుమా ! **అభ్యాసములేనిదే జ్ఞానము అనుభవమునకు రాదు. జ్ఞానము అభ్యాస యోగము యొక్క ఆశయము.** శాస్త్ర విచారణ – విశ్లేషణల మాత్రం చేత భావన సిద్ధించదయ్యా ! అది **అనుష్ఠానంగా** మరల్చుకొంటేనే సిద్ధిస్తుంది. మనస్సు నిరోధించబడాలంటే, **అనుష్ఠాన రూపమగు అభ్యాసయోగము**ను ఎప్పటికప్పుడు ఆశ్రయించవలసినదే ! అభ్యాసముచేత మాత్రమే మనస్సును నిలువరించగలము. నియమించగలము. **తస్మాత్ అభ్యాస యోగేన మనః ప్రాణాః నిరోధయేత్ ।** యోగముచే మనస్సును, ప్రాణచలనములను నిరోధించు అభ్యాసము ఆవస్యకము. అట్టి అభ్యాసము ఆత్మ జ్ఞాన సముపార్జనయే ఆశయముగా కలిగి ఉండవలసిందే!

ఒకడు తోటలో "ఇవి మంచి పూలు – ఫలములు ఇచ్చు మొక్కలు. ఇవి పిచ్చి మొక్కలు" ... అని తెలుసుకుంటే సరిపోతుందా ? లేదు మంచి మొక్కలను పరిపోషించుకోవాలి. పిచ్చి మొక్కలను పదునైన కత్తిని ఉపయోగించి తొలగించివేయాలి. కత్తిరించాలి. పీకివేయాలి కూడా ! అట్లాగే యోగి కూడా తీవ్రమైన "యోగాభ్యాసము"... అనే పదునైన కత్తితో అనుక్షణము హృదయములో జనిస్తున్న "దృశ్య సంబంధమైనట్టి అనేక అభ్యాసముల – ఆశయముల రూపములుగా ఏర్పడుచున్న సంకల్పములు"... అనే పిచ్చి మొక్కలను కత్తిరించి, మొదలంట్లా పీకి ఆవల పారవేయాలి.

**యోగో ద్వివిధః :** ఓ బ్రాహ్మణోత్తమా ! 'యోగము' అనునది రెండు విధములుగా విభజించ చెప్పబడుచున్నది. **జ్ఞాన యోగః, కర్మ యోగః - ఇతి యోగోద్విధామతః ।** 1) జ్ఞాన యోగము 2) కర్మ యోగము లేక క్రియా యోగము.

*ముందుగా క్రియాయోగము గురించి మనము చెప్పుకుందాము. విను.*

ఈ చిత్తము సుదీర్ఘకాలంగా దృశ్య రూప ఇంద్రియ విషయములలో నియమించబడుతూ వస్తున్నది. అట్టి అనేక విషయములలో ప్రవేశించటము చేత శ్రాంతి – శ్రమ – వ్యాకులత పొందుతోంది. ఆ విధంగా వ్యాకులమైన చిత్తము బంధము పొందినదగుచున్నది. ఈ చిత్తము ఒక్క క్షణం కూడా ఒక్క విషయము మీద నిలవక పోవటం చేత వ్యాకులత్వము క్షణక్షణం కొనసాగిస్తోంది. ఈ విధంగా అనేక జన్మలలో అనేక ఉపాధులతో విషయములవెంట సంచరించటంచేత, ఈ చిత్తము శాంతిని కోల్పోతోంది. అదియే ఈ జీవుని సర్వబంధమునకు దుఃఖములకు కారణం. అదియే సంసృతి అని, సంసారము అని చెప్పబడుతోంది. 'సంసారము' అను దృశ్యరూప బంధమునకు కారణం మనో బుద్ధుల ఇతఃపూర్వపు అభ్యాసములు మాత్రమే! అంతేగాని, కళ్ళకు ఎదురుగా కనిపిస్తున్న ఈ దృశ్యము తనకుతానై బంధము కాదు. బంధము దృశ్య జగత్తులో లేదు. స్వకీయమగు బుద్ధిలోనే ఉండి ఉన్నది.

అయితే ఈ జీవుడు "నా చిత్తము ఈ సందర్భముల వలన, సంబంధముల వలన, సంపద – ఆపద ఇత్యాది సంఘటనల వలన వ్యాకులత చెందుతోంది"... అని అజ్ఞానముచేతనే అనుకుంటున్నాడు. అది వాస్తవం కానే కాదు. **విషయములతో ఏర్పడే అనుక్షణికమైన చిత్త చాంచల్యమే బంధమునకు, దుఃఖమునకు కారణం ।** మరి ఇప్పుడు జీవుడు ఏం చేయాలీ ? **అవ్యాకులస్య చిత్తస్య బన్ధనమ్ విషయే క్వచిత్, యత్ సంయోగో, స చ 'ద్వైవిధ్యమ్' అశ్నుతే ।** ఈ చిత్తము ఆత్మతో సంయోగము పొందిందా, ఇక ఇద్దాని వ్యాకులత అంతా తనకుతానే తొలగుతోంది. ఇక అపై ద్వైవిధ్యము (రెండవ విషయముతో బేధము) అనునదే ఉండదు.

**త్రిశిఖి :** మాకు శాస్త్రముల చేతను, సంఘ నియమముల చేను ఆయా కర్మలు విధించబడుచున్నాయి కదా ! అదీకాక, కర్మలు నిర్వర్తించనిదే ఎవ్వరికీ ఈ శరీరమే నిలవదు కూడా! చిత్తమును నియోగించకుండా కర్మలు చేయగలమా? లేదు. కర్మలను మానలేము. చిత్తమును నియమించనూ లేము. ఇప్పుడు మా గతి ఏమిటి స్వామీ? చిత్తమును లేకుండా చేయాలా? ఎట్లా?

**ఆదిత్య భగవానుడు :** అవును. ఆ విధంగా చూచినప్పుడు కర్తవ్యములు – కర్మలు ప్రకృతి నియమానుసారము అనివార్యము, ఆవస్యకము కూడా ! చిత్తము కర్మల నిర్వహణయందు నియమించబడక తప్పదు. నియమించినప్పుడు ఆ చిత్తమునకు చాంచల్యము తప్పదు. చిత్త చాంచల్యమున్న చోట శాంతి ఉండని మాటకూడా నిజమే!

**అయితే, దీనికొక సులభమైన ఉపాయము ఉన్నది.**

**నాకు నియమితమగు కర్మలు నా కర్తవ్యములు. అట్టి స్వధర్మము నాకు కర్మ యోగము. కర్మలచే నిర్వర్తించు ఉపాసనయే। క్రియా యోగములోని అంతర్భాగమే ! వాస్తవానికి సర్వ కర్మలు యోగ మార్గములో భగవత్ ప్రసాదితమైన ఉపాయ రూపమైన ఉపకరణములు" ...** అని భావించి కర్మలు చేయువాని విషయంలో చిత్తము **విషయములలో ఉంటూ, విషయరహితమై ఉండగలదు.**

మనస్సును (1) విహితకర్మలు–పుణ్య–ఉపాసనా కర్మములకు, స్వధర్మమునకు మాత్రమే పరిమితముచేస్తూ, (2) ఉపాసనా పూర్వకముగా నిర్వర్తించటమును **'కర్మయోగము'** అని అంటారు. అందుచేత నీవు కర్మయోగివై కర్మలు చేయి. అప్పుడిక కర్మ బంధము నీకు ఎక్కడ ఉంటుంది? మమకార–అహంకార దోషములను బుద్ధి నుండి తొలగించబడగా, అప్పుడు చేయు కర్మలు మోక్ష మార్గములే! విహితకర్మలే 'మోక్షమార్గము' అగుచుండగా, ఇక ఈ జీవునికి దిగులెందుకయ్యా?

ఈ చిత్తము చతుర్విధ పురుషార్థములైనటువంటి ధర్మ – అర్థ – కామ – మోక్షములను ఒకేసారి దృష్టియందు కలిగియుండి ఎప్పుడైతే కర్మలయందు నియమించబడినదై ఉంటుందో.. అది **"జ్ఞాన యోగము"** అనియే గమించబడు గాక ! అవి 'కర్మలు' అని అనిపించుకోవు. లక్ష్యము ఆశయము–ఉపాసన ... ఇవన్నీ సరి అయిన రీతిలో తెలుసుకొని ఉత్తమ ఆశయములతో కర్మను నిర్వర్తించువాడు సర్వమును సిద్ధింపజేయు శివత్వమును సముపార్జించుకొనుచున్నాడు. విహితకర్మలను ఎరిగి, కామ–క్రోధ–లోభ–మోహ–మద–మత్సర్యములకు లోనుకాకుండా ఉపాసనాభావముతో ఎవ్వరు కర్మలు నిర్వర్తిస్తారో, వారి కర్మలు **సర్వసిద్ధికరములు, మంగళప్రదములు** అగుచున్నాయి.

ఓ ద్విజోత్తమా ! మరల చెప్పుచున్నాను. విను. "కర్మ యోగము – జ్ఞాన యోగము" ఈ రెండూ కూడా అవినాభావములగు "ఉక్త లక్షణములు" అని అంటూ ఉంటారు. ఎందుకంటే

- ఒకదానిచే రెండవది స్వభావముగా వృద్ధి చెందుచున్నది.
- ఒకదానిని ఏమరిస్తే రెండవది బలహీనమగుచూ వస్తున్నది.
- అవి రెండుగా కనిపిస్తూ ఉన్నప్పటికీ 'మనస్సు యొక్క లగ్నము' దృష్ట్యా చూస్తే మాత్రం **"ఆ రెండూ ఒక్క తీరైనవే"** అని తెలియవచ్చుచున్నది.
- కర్మ జ్ఞానములను రెండింటినీ అవగాహన చేసుకొని సమన్వయముతో నిర్వర్తించువాడు అతి త్వరగా మోక్ష లక్షణములను పునికి పుచ్చుకొనగలడు.

కర్మయోగము రెండు విధములుగా నిర్వర్తించబడుగాక !

1) విహిత ధర్మములను, కర్మలను ఉపాసనా పూర్వకంగా నిర్వర్తిస్తూ చిత్తమును దైవీ సంపదా లక్షణములతో అలంకరించుకొని ఉండటము.

2) ఏకాగ్రత కొరకై అష్టాంగ యోగములను చిత్తముతో ఆశ్రయించి ఉండటము.

**త్రిశిఖ బ్రాహ్మణుడు:** మహాత్మా! అష్టాంగ యోగములను మా యీ చిత్తము ఆశ్రయించు తీరు గురించి, వాటి పరమార్థ నిర్వచనముల గురించి దయచేసి వివరించ ప్రార్థన. వాటిని పరాకాష్ఠ విశేషపరంగాను, వాటి యోగార్థముల గురించి చెప్పండి.

## అష్టాంగ యోగములు - పరమార్థములు

**ఆదిత్యభగవానుడు :** సరేఁ ! అష్టాంగయోగముల ఉత్కృష్టార్థ నిర్వచనము విషయమై ఇక్కడ కొన్ని విషయాలు సంక్షిప్తంగా చెప్పుకుందాము.

**యమము(విరక్తి) : ఆత్మస్వరూపుడు – స్వతఃగా పరతత్త్వ స్వరూపుడు** అయి ఉండి కూడా..., ఈ దేహి (లేక జీవుడు) – ఈ దేహము పట్ల, ఇంద్రియముల పట్ల, ఇంద్రియ విషయముల పట్ల..., స్వస్వరూపము యొక్క **ఏమరపుతో కూడిన రాగమును** పెంపొందించుకొనుచున్నాడు. అందుచేతనే **"నేను బద్ధుడను. పరిమితుడను. కర్మలయందు జన్మలయందు చిక్కుకున్నవాడను! ఎవ్వరురా, నన్ను ఇప్పుడు రక్షించేది?"...** అని వాపోవుచున్నాడు. మరికొన్ని సందర్భములలో రాగద్వేషములకు లోనై అల్ప – అజ్ఞాన పరంపరలను తెచ్చిపెట్టుకుంటున్నాడు. అందుకు అష్టాంగయోగములలో మొట్టమొదటి తరుణోపాయముగా **'యమము'** అనునది చెప్పబడుచున్నది.

**దేహ - ఇంద్రియేషు వైరాగ్యమ్ 'యమ' ఇతి ఉచ్యతే బుధైః ।** – ఇంద్రియముల పట్ల రాగమును తొలగించుకొను ప్రయత్నములే – "యమము" అని చెప్పబడుతోంది. "ఇవన్నీ నాకు చెందినవి కావు. నేను వీటికి చెందినవాడిని కాదు. ఈ దేహ–ఇంద్రియ–విషయాలు సందర్భానుచితంగా వస్తూ వున్నాయి. సందర్భానుచితంగా పోతూ ఉన్నాయి. కనుక సందర్భములకు సంబంధించినవన్నీ

జగత్తుకు సంబంధించినవి. జగత్తు కల్పనచే ఏర్పడి, కల్పనచే తొలగబోవుచున్నట్టిది."... అను అవగాహన పెంపొందించుయత్నములే **యమము**. విరాగి అయి (without attachment and belongingness)... ఉండటమే **యమము**-అని బుధుల అభిప్రాయము. నటుడు పాత్రకు సంబంధించిన ఆయా ప్రవర్తనలు ప్రదర్శిస్తూ... అవన్నీ చేయనివాడై ఉంటాడు కదా! అట్లా జగన్నాటకంలో పాత్రధారణా భావము కలిగి ఉండటమే (లేక) తనయొక్క జీవాత్మత్వమును సమన్వయించుకొని ఉండటమే **యమము.**

**నియమము (అనురక్తి) : అనురక్తపరే తత్త్వే సతతం 'నియమ' స్మృతః ।** ఈ ఇంద్రియ ప్రంచమునకు, అంతరంగ చతుష్టయమునకు కూడా ఆధారమై, (నాటకములో నటించు పాత్రకు వేరైన పాత్రధారుని సహజ రూపము వలె) పరస్వరూపమై వెలుగొందుచున్న 'పరతత్త్వము' పట్ల **అనురక్తి**ని **'నియమము'** అంటారు. అది అష్టాంగ యోగములలో రెండవది. "నేను నటిస్తూన్నానే తప్పించి, నాటకము నిజం కాదు. పాత్ర నిజం కాదు"... అను ఎరుకను జగత్తుపట్ల తన జీవాత్మత్వము పట్ల కలిగి ఉండే ప్రయత్నము నియమము. తన యొక్క సర్వ సహదేహులయొక్క, ఈ జగత్తుయొక్క **అఖండ స్వరూపమగు ఆత్మపట్ల అనురక్తియే నియమము.**

**ఆసనము (ఉదాసీనత్వము): సర్వవస్తుని ఉదాసీనభావనమ్-'ఆసనమ్' ఉచ్యతే ।** ఈ దేహము యొక్క రాక – పోకలతో సహా ఇక్కడి దృశ్యములోని సంగతులు, వ్యవహారములు, సుఖ-దుఃఖ సంఘటనలు, అనుబంధ-సంబంధ-బాంధవ్యములు, శత్రు – మిత్ర, మాన-అవమాన విశేషాలన్నిటిపట్లా **"ఉదాసీనత"** కలిగి ఉండటమే 'ఆసనము' యొక్క ముఖ్యమైన ఉద్దేశ్యము, పరమార్ధము కూడా! "పరస్వరూపుడను-అప్రమేయుడను-ప్రత్యక్ స్వరూపుడను అగు నాకు అవి సంబంధించిలేవు. నేను వాటికి సంబంధించి లేను. కనుక, ఎట్లా ఉన్నా నాకు వచ్చేదీ లేదు. పోయేదీ లేదు. యోగము ఇత్యాది సాధనములు, కర్మ ఫలములు అన్నీ ప్రపంచమునకే చెందినవై, నాకు సంబంధించనివై ఉండుగాక! నేను అప్రమేయుడను"... అను స్థానమును మెట్లు మెట్లుగా అధిరోహించి ఉండటమే **"ఆసనము".**

**ప్రాణసంయమము (మిధ్యత్వమును గుర్తించుట) : జగత్ సర్వం ఇదం మిధ్యా ప్రతీతిః ప్రాణసంయమః ।** ఈ జగత్తు స్వప్నములోని అంతర్గత విషయాలవలె, ఒక నాటకములోని రకరకాల సంబంధములవలె, ఒక కథలోని సంఘటణా క్రమములవలె కల్పితము మాత్రమే ! (అందుకే సంకల్పము చెప్పేడప్పుడు – శ్వేతవరాహకల్పే... అని అంటాము కదా!). "వాస్తవానికి ఇంద్రియాలకు విషయాలుగా తారసపడేదంతా మిధ్యయే" అనే పరాకాష్ఠ అవగాహనను అనునిత్యము చేసుకోవటమునే "ప్రాణసంయమము" యొక్క అంతిమార్థము, ఆశయము. (నతు సత్యమిహ అణ్వపి)

**ప్రత్యాహారము (తనను - తదితరులను ఆత్మీయమగు ఆత్మ దృష్టితో చూచు అభ్యాసము) : చిత్తస్య - అంతర్ముఖీ భావః ప్రత్యాహారస్తు।** ఓ యోగిసత్తమా! ఈ చిత్తము బాహ్యమునే చూస్తూ, తదితరుల బాహ్యత్వమునకు మాత్రమే పరిమితమై తనయొక్క, సహజీవులయొక్క, దృశ్య జగత్తుయొక్క జననస్థానమగు ఆత్మను సందర్శించలేక ఆప – సోపాలు పడుతోంది. ఇప్పుడు ఈ చిత్తము బాహ్యమును దాటి అంతర్ముఖమై, తన యాజమాని యగు పరమాత్మను (చిత్ స్వరూపమును) – తనయందు సర్వజీవులయందు సందర్శించటమే ప్రత్యాహారము యొక్క ఉద్దేశ్యము, లక్ష్యము కూడా. దృశ్యమును భేద దృష్టితో కాకుండా ఆత్మ దృష్టితో చూడగలుగుటకు చేయు యత్నము – 'ప్రత్యాహారము' అగుచున్నది. సర్వ సహజీవులపట్ల బాహ్యానామ రూపగుణాత్మక దృష్టిని అధిగమించి బ్రహ్మీ దృష్టితో చూడటమే **'ప్రత్యాహారము'.**

**ధారణ : చిత్తస్య నిశ్చలీభావో ధారణా - ఆధారణం విదుః ।** చంచలమగు ఈ చిత్తము ఒక ఆధారము సహాయంతో [ప్రాణ నిష్ఠాగ్రత (ప్రాణోపాసన), ఇష్ట దైవరూపభావన, గురువుపై గల ఉత్తమగురి... మొదలైన వాటి సహాయంతో] నిశ్చలమై ఉండటము కొరకు చేయు సాధనయే **'ధారణ'** । "గురి లేక, గురుతు ఎరుగలేక, పరమార్ధమును పొందలేక, పరితప్త హృదయాల శరణాగతాలు – నీ చరణాలు" ... అను ఇష్ట దైవ – ఆశ్రయమే **"ధారణ".**

**ధ్యానమ్ : "సోఽహమ్ చిన్మాత్రమేవ" ఇతి చిన్తనమ్ ధ్యానమ్ ఉచ్యతే...** "నేను పరతత్త్వమగు కేవల చిన్మాత్ర స్వరూపుడను। అదియే పరమ సత్యము. మిగిలినదంతా కేవలం సందర్భ కల్పిత సత్యాలు మాత్రమే" .... అను విజ్ఞతతో పరమసత్యము యొక్క చిన్తనమే – ధ్యానము అగుచున్నది.

**సమాధి (ధ్యాని-ధ్యాస-ధ్యాస్యముల భేద విస్మరణ) : ధ్యానస్య విస్మృతిః సమ్యక్ 'సమాధిః' అభిధీయతే ।** ధ్యానములో ధ్యానించువాడు – ధ్యానించబడు చిత్ చైతన్య పరమాత్మ – ధ్యానించు విధానము... అనబడే త్రిపుటి కొనసాగుచూ ఉంటుంది.

**"నేను స్వతఃగానే సత్ చిత్ ఆనందమగు ఆత్మానంద స్వరూపుడనై, ఈ సర్వము నాకు అభిన్నముగా (స్వప్నమువలె) కల్పించుకొని లీలావినోదంగా ఆస్వాదించుచున్నాను. యథాతథంగా ఉండియే నా యందు ద్రష్ట - దర్శన - దృశ్యములను, జాగ్రత్ - స్వప్న - సుషుప్తి తురీయములను, ఊహ - అపోహలను భావన చేస్తూ, సంకల్పిస్తూ మరల**

**నాయందే అవన్నీ చిరునవ్వుతో లయం చేసుకొంటున్నారు. సర్వ స్వరూపుడనై, సర్వాతీతుడనై సర్వసాక్షినై, సర్వే సర్వత్రా వేంచేసియున్నవాడనై, యథా స్థానమునందు రాకపోకలు లేకయే ఉన్నవాడినై ఉన్నాను".**

... అనునది, ఎప్పుడు **అకృత్రిమమైన స్వభావసిద్ధానుభవము** అవుతుందో... అదియే 'సమాధి' అని పిలువబడుచున్నది.

ఓ ప్రియ త్రిశిఖీ బ్రాహ్మణోత్తమా!

ఈ విధంగా యమ-నియమ-ఆసన-ప్రాణసంయమ-ప్రత్యాహార-ధారణ-ధ్యాన-సమాధుల గురించిన పరాకాష్టార్థము (తాత్పర్యార్థము) ఏమిటో విన్నావు కదా! ఇప్పుడిక సాధనకు సంబంధించినంతవరకు ఇహార్థపూర్వకంగా వాటిని వివరిస్తున్నానయ్యా! విను.

## యమము - దశాంగములు

**1) అహింస :** తదితరులను శారీరకంగాని, మాసికంగాని బాధించకపోవటం. "నా మనోవాక్కులచే, కాయక క్రియలచే, కర్మలచే ఇతరులకు సుఖ, శాంతి, ఆనందములు కలుగునుగాక ! నాకు కళ్ళకు కనిపిస్తున్న ఈ సహజీవులంతా నా ఇష్ట దైవము యొక్క సాక్షాత్ ప్రత్యక్ష రూపాలే! కనుక, సేవక భావము అంతరంగమున ప్రతిష్ఠించుకొనెదను గాక !" ... అను రూపముగా గల స్వకీయ ఉపాసన భావన - అభ్యాసములే **'అహింస'** గా చెప్పబడుచున్నాయి.

**2) సత్యము:** నిత్యమైనది మాత్రమే సత్యము. యత్ సత్ (సత్ యత్) ఇతి సత్యమ్! "ఇంద్రియ కలన'లను (Illusions) దాటివేసి, వాటికి ఆధారమైయున్న **"సర్వతత్త్వస్వరూపము"**ను సమాశ్రయించి ఉండటమును 'సత్యమ్' అను శబ్దమునకు అంతరార్థముగా చెప్పబడుచున్నది.

**3) అస్తేయమ్ :** ఇతరుల సొమ్ము ఆశించటము, ఇతరుల సంపదలను చూచి అసూయపడటము, ఇతరులను నమ్మించియో, మోసము చేసియో వారి సొమ్ము అపహరించటము, ఇతరులకు తెలియకుండా వారి సొమ్ము హరించటము ... ఇవన్నీ "స్తేయము"... యొక్క లక్షణములు. ఇవి శమమును హరిస్తాయి. శాంతిని పొగొట్టేవిగా పరిణమిస్తాయి. అశాంతికి పరోక్షంగా కారణమౌతాయి. యథావిధంగా ధర్మవిధిగా ప్రాప్తించిన పదివేలనుకొని తృప్తిపడువాడు అస్తేయుడు. అస్తేయము శమము యొక్క ఒక అంగము. శమము వలన శాంతి లభిస్తుంది.

**4) బ్రహ్మ చర్యము :** అఖండ - అద్వితీయ బ్రహ్మమునందు స్వకీయ కల్పన చేత ఇదంతా అనేక బేధములతో కూడిన జగత్తుగా అనిపిస్తోంది. అజ్ఞాన దృష్టికి కనిపిస్తోంది. దివ్యదృష్టిచే (లేక) ఆత్మీదృష్టిచే సర్వము పరబ్రహ్మమే ! ఇట్టి దృష్టిని ప్రవృద్ధి చేసుకొని ఆశ్రయించి ఉండటమును 'బ్రహ్మ చర్యము' అని అంటున్నారు. **సద్గురవగు ఆచార్యులవారి వద్ద బ్రహ్మమును అభ్యసించటమే బ్రహ్మచర్యము. బ్రహ్మమును అధ్యయనము చేయువాడు 'బ్రహ్మచారి'.**

**5) దయ :** ఏ దయ (Kindness) ఒక భక్తుడు తన ఇష్టదైవము నుండి అర్థిస్తూ ఉంటాడో, అది సహజీవుల పట్ల ఆప్యాయత రూపముగా కలిగి ఉండటము. దయగలవానిపై దేవతలు దయను ఆయాచితంగా కూడా కురిపిస్తూ ఉంటారు.

**6) ఆర్జవమ్ :** మాటయందుగాని, మనస్సునందుగాని, బుద్ధియందు గాని, కుటిలత్వము లేకపోవటము. త్రికరణ శుద్ధి (మనసా వాచా కర్మణా సూటిగాను, సత్య దృష్టిని) కలిగి ఉండటము. ఆర్జవమ్ = అకుటిలత్వము / నిష్కాపట్యము.

**7) క్షమా :** ఓర్పు - సహనము - ఇష్ట, అయిష్టముల సందర్భములలో సమత్వము. ఇతరుల తప్పులకు మున్ముందే తన తప్పులు గుర్తు చేసుకోగలగటము. సహించగల శక్తి. కష్ట - సుఖములను భగవత్ ప్రసాదితములుగా భావన చేయు అభ్యాసము.

**8) ధృతి :** "స్వభావతః ఆత్మ స్వరూపమే నేను ? సిద్ధించియే ఉన్న ఆత్మతత్త్వము నాకు స్వానుభవముగా లభించక ఏం చేస్తుంది ?"... అనే ధైర్యము. ఉత్సాహము. **తనపై, శాస్త్రములపై, గురువాక్యములపై గల విశ్వాసము నుండి స్వీకరించబడిన ఉత్సాహముతో కూడిన ధైర్యము.** పట్టుదలతో కూడిన ప్రయత్నశీలత్వము. ధైర్యము - ధారణ కలిగి ఉండటము.

**9) మితాహారము :** ఇంద్రియములకు తారసబడుచున్న విషయములను ఎంత వరకు అత్యవసరమో అంతవరకే పట్టించుకోవటము. స్వీకరించటము. (అత్ర ఆహారార్థం కర్మ కుర్యాత్ అనింద్యమ్। కుర్యాత్ ఆహారమ్ దేహ సంరక్షణార్థమ్। దేహమ్ సంరక్షణాత్ తత్త్వజిజ్ఞాసనార్థమ్! - అను రీతిగా) ఆహారము పట్ల, శబ్ద - స్పర్శ - రూప - రసగంధములపట్ల సంనియమితుడై ఉండుటము.

**10) శుచి :** శుచి అయిన, సాత్వికమైన, తత్త్వ దర్శనముతో కూడిన భావాలు, అభిప్రాయాలు కలిగి ఉండటము.

**ఇవి యమము యొక్క 'దశాంగములు'**

# నియమ - లక్షణములు (అంగములు)

**1) తపస్సు :** సత్యవస్తువుగురించిన తపనయే తపస్సు.

**2) సన్తుష్టి :** తృప్తి, సంతోషము, పొందినవాటిపట్ల కృతజ్ఞత, ఉత్సాహములను అలవాటుగా చేసుకొని ఉండటము. లభించిన దానితో సంతోషిస్తూ, లభించని దాని గురించి అర్రులు చాచకపోవటము. అసంతృప్తికి చోటు ఇవ్వకపోవటము. సంపదల విషయంలో "నాకన్నా కూడా లేనివారు ఎంతమంది లేరు!" ... అనే గమనిక.

**3) అస్తిక్యము :** ఈ దేహమును నిర్మించిన ప్రకృతి, దివ్యమగు దైవీశక్తులు (దేవతలు), సర్వమునకు ఆధారమైన పరమాత్మ ... ల ఉనికిపై గౌరవపూర్వకమైన నమ్మకము (faith). సంగతి – సంఘటన – సందర్భములలో జగత్ రచయిత యొక్క ఉనికి – ఉద్దేశ్యములను గమనించటము. ఈ జగత్తును పాఠ్యాంశములుగా, జగదాధారుడగు పరమాత్మను సద్గురువుగా భావించటము.

**4) దానము : "భగవత్స్వరూపులగు తదితరుల గురించి నేను ఏది చేయగలను ! సమర్పించగలను!"** ... ఇటువంటి యోచనలు, "ఆనందము పొందుటలో లేదు. ఇచ్చుటలోనే దాగి వున్నది" ... అను అవగాహన.

**5) ఆరాధనమ్:** భగవత్ భక్తి. ఉపాసనాభావాలు. పరమాత్మపట్ల కృతజ్ఞత. తల్లి–తండ్రులపట్ల,పెద్దలపట్ల, మహనీయులపట్ల విధేయత.

**6) వేదాన్త శ్రవణము : వేదము** (తెలియబడునదంతా) యొక్క **అంతము** (ఆవల) గల **"తెలుసుకొనుచున్నవాడు** (The Knower)"... అను తత్త్వము యొక్క జ్ఞాన విషయముల శ్రవణ – మనన – నిదిధ్యాసలు.

**7) హ్రీ :** తనలోని అసత్ అవగాహనాలను, అల్పభావములను, అజ్ఞాన దృష్టులను గమనించి దృష్టిలో పెట్టుకోవటము. తదితర జీవులలోని ఉత్తమ జ్ఞానాభ్యాస విశేషములను దర్శిస్తూ ఉండటము. తన తప్పులను తాను గుర్తెరుగుచూ సిగ్గుపడుచూ ఉండటము.

**ఇవన్నీ "నియమము" యొక్క అంగములు. లక్షణములు.**

# వివిధ ఆసనములు

మహనీయులగు యోగిపుంగవులు, ద్విజులు బోధిస్తున్న (జప ధ్యానముల కొరకై ఆశ్రయించే) వివిధ (17) ఆసనముల గురించి ఇప్పుడు చెప్పుకుందాము.

1. స్వస్తికాసనము 2. గోముఖాసనము 3. వీరాసనము 4. యోగాసనము 5. పద్మాసనము 6. బద్ధపద్మాసనము 7. కుక్కుటాసనము 8. ఉత్తాన కూర్మాసనము 9. ధనురాసనము 10. సింహాసనము 11. భద్రాసనము 12. ముక్తాసనము 13. మయూరాసనము 14. మత్స్యాసనము 15. సిద్ధాసనము 16. పశ్చిమతాణాసనము 17. సుఖాసనము.

(మంగళ శ్లోక – తాత్పర్య విభాగంలో 22వ మంగళ శ్లోకము నుండి 25వ శ్లోకము వరకు సవివరంగా చెప్పిన) వివిధ ఆసనములలో ఒకటి గాని, మరింకే సుఖ – ఆసనముగాని అవధరించి జపము – తపము ఆచరించబడుగాక ! దేహమునకు ఏది సులభముగాను, సుదీర్ఘముగాను, నిశ్చలముగాను, అబాధాకరముగాను ఉంటుందో... అది 'సుఖాసనము' అనబడుచున్నది. పైన వర్ణించి చెప్పబడిన ఆసనము లేవీ ధరించలేకపోతే ఏ విధంగా వసతియో, అట్లాగే ఆశీనుడవవచ్చు.

- శరీరమునకు అనుకూల్యమైనది,
- శరీరధారుధ్యమునకు, వయస్సుకు తగి ఉన్నట్టిది,
- సుదీర్ఘకాలము శ్రమ లేకుండా, నొప్పులు లేకుండా కూర్చోగలిగినది,
- అతిస్వల్ప కాలములో దేహ – మనోనిశ్చలతలు సంతరింపజేయగలిగినది.

... అయినట్టి ఆసనమును అభ్యసించాలి. పై విధంగా ఆసనమును స్వభావసానుకూల్య ప్రజ్ఞాసమన్వితంగా ధరించగలగటమే 'ఆసనజయము'. **ఆసనం విజితం యేన జితం తేన జగత్రయమ్ ।** ఎవ్వరిచేత ఆసనజయము సముపార్జించుకోబడుచున్నదో, ఆతని చేత త్రిలోకములు జయించడుచున్నాయి.

ఈ విధంగా యమము (ఇంద్రియములను విషయముల నుండి నిరోధించటము), నియమము (ఇంద్రియములను ఉత్సాహపూర్వకంగాను, ప్రత్యాహార పూర్వకంగాను పరమాత్మోపాసనయందు నియమించటము)–ఆసనములను స్వీకరిస్తూ, నిర్వర్తిస్తూ ఇక క్రమంగా ధ్యాస (దృష్టి + బుద్ధి) ని నాడీ ప్రదేశములలో ప్రవేశింపజేయాలి. నాడీ ప్రదేశములను అట్టి ధ్యాసచే శుద్ధ పరచుకోవాలి. ఆపై యోగాభ్యాసి ప్రాణాయామమునకు (లేక) ప్రాణోపాసనకు ఉపక్రమించును గాక !

ఈ దేహము వాస్తవానికి ఒక ఉపకరణమువంటిది. ఇది అంగులీకముతో (ఉంగరపు వేలు యొక్క గీతల చివరి భాగముతో) కొలిస్తే '96' అంగుళాయతనములు పొడవు కలిగి ఉంటోంది. ఇక ప్రాణశక్తి ఈ దేహము నందు అంతటా నిండి ఉన్నదై ... ఇంకను 12 అంగుళములకు (శిరో ఊర్ధ్వ భాగము పైకి) విస్తరించినదై ఉన్నది.

**దేహస్థమ్ అనిలం దేహసముద్భూతేన వహ్నినా, న్యూనం సమంవా యోగేన కుర్వన్ బ్రహ్మ విదిష్యతే ।**

ఏ యోగికైతే తన యొక్క యోగాభ్యాసముచే జనించిన 'యోగాగ్ని' సహాయముతో వాయువును (ప్రాణశక్తిని) దేహమంతా సమముగా చేసి ఉంచటము తెలిపియున్నదో – అతడు అతిత్వరగానూ, సులభముగానూ బ్రహ్మమును ఎరుగగలడు. సర్వ దేహములలో మధ్యగా **"మూలాగ్ని మండలము"** అను శిఖి స్థానము అగ్ని ప్రకాశిత ప్రదేశము.... కాల్చబడిన బంగారకాంతులు వెదజల్లుతూ ఉన్నది. ఇద్దాని తేజో–ఉష్ణకిరణములు శరీరము యొక్క మారుమూలల వరకు విస్తరించి దేహము శిధిలము కాకుండా, ఉత్తేజితము చేస్తూ పరిరక్షించుచున్నది.

**త్రికోణమ్ ద్విపదామ్ :**

ద్విపదులగు మానవులలో ఈ మూలాగ్ని మండలము △ త్రికోణాకారమై వెలుగొందుచున్నది.

**అన్యత్ చతరశ్రం చతుష్పదామ్ :** నాలుగు పాదములు గల జంతువులలో అట్టి □ చతురస్రాకారమై ఉంటోంది.

**వృత్తం విహంగమానాంతు :** పక్షులలో అది ◯ వృత్తాకారముగా ఉంటున్నది.

**షట్ అశ్రం సర్పజన్మనామ్ :** సర్పములలో ఆ మూలాగ్ని మండలము '6' కోణములు కలిగి, అరుణోదయములు గల ఆకారముగా ప్రకాశించుచున్నది ⬡

**అష్టాశ్రం స్వేదజానాంతు :** చెమట నుండి పుట్టు పురుగులు మొదలైన శ్వేదజములలో అది '8– కోణములు⯃.

**శరీరములో కేంద్రీకృత స్థానమగు కందరస్థానము :** నాడీ కేంద్రరూపంగా శరీర కేంద్రములో కందస్థానము–గరిమనాభి స్థానముగా (శక్తి పాత స్థానముగా) ఉన్నది. మనుష్యులలో 9 అంగుళముల పరిమాణముగల(మందము) కందస్థానము.

– 4 అంగుళముల పొడవు. నాలుగు అంగుళముల వెడల్పు – **మనుష్యాణాం దేహ మధ్య, నవాంగుళమ్, చతురంగుళవ్ ఉత్సేధం, చతురంగుళమ్ ఆయనమ్।**

చతుష్పాదులైనట్టి తిర్యక్ జంతువులలోను, పక్షులలోను కందరస్థానము (ముఖ్య కేంద్ర స్థానము) **శరీర మధ్య భాగములో** ⬭ **అండావృత్తిగా** (కోడి గ్రుడ్డు ఆకారంగా) ఉంటోంది.

ఇది తుందము, (పొట్ట మధ్య స్థానము). నాభిస్థానమును కలుపుకొని ఉంటోంది.

## నాభి చక్రము

అట్టి దేహము యొక్క కేంద్రస్థానము (Central Zone) నకు మధ్యగా **'12' దళముల నాభి చక్రము** ఉన్నది. అట్టి కందములో ప్రకాశించుచున్న చక్రము నందు విష్ణు భగవానుడు మొదలైన దేవతలంతా సర్వదా వారివారి అంశలతో మూర్తీ భవించినవారై ఉన్నారు. సూర్యనారాయణమూర్తినగు నేను కూడా అట్టి నాభి చక్రదళమునందు అంశాత్మకుడనై స్థితి కలిగి ఉన్నాను. ఆ రీతిగా ఉండి శరీర తత్త్వమునంతటినీ స్వమాయచే పర్యవేక్షిస్తూ సంచారము కలిగి ఉంటున్నాను.

ఓ ద్విజసత్తమా! త్రిశిఖిమహాశయా!

ఇక ఈ "జీవుడు" విషయానికి వస్తే ...,

ఒక సాలెపురుగు తాను నిర్మించుకొనిన సాలెగూడులో చిక్కుకొని, ఆ గూడులోని దారములలో సంచారాలు చేస్తూ, బయటకు రాలేకపోతోంది చూచావా! అట్లాగే పరమాత్మ కూడా తాను క్రీడగా, లీలగా, వినోదంగా కల్పించుకొనిన జీవాత్మత్వమును ఆశ్రయించి, అద్దాని యందు ప్రవేశించి, తన నుండి బయల్వెడలిన జగత్ భావ పరంపరలయందు చిక్కుకొని 14 లోకములలో సంచారములు చేస్తున్నారు. **ప్రాణ – అధిరూఢః చరతి జీవః, తేన వినా నహి !** తన యొక్క ప్రాణశక్తిని అధిరోహించి ఉపాధి పరంపరలలో ప్రవేశ – నిష్క్రమణములను నిర్వర్తిస్తూ, **"ఈ దేహము చేతనే నేను ఉనికిని పొందుచున్నాను. ఇది లేకుంటే నేను లేను.**

**దీనికి ఆపద వచ్చిందా, నా పని ఖాళీ"...** అను రూపముతో కూడిన దేహ తదాత్మ్యము, దేహాభిమానము, దేహముతో అవినాభావ సంబంధము,... ఇవన్నీ కలిగి ఉంటున్నాడు.

కనుక

- ఆత్మ యొక్క స్వకీయ భావనారూప కల్పనయే జీవుడు. అట్టి 'జీవుడు' అనునది ఆయా ఒక సందర్భంలో తాను వహించు 'పాత్ర' వంటిది.
- జీవుని మోహకల్పనారూపమే ఈ దేహము.

ఈ జీవుడు కందాంతర్గత నాభి చక్రము యొక్క 12 దళములలో ఏదో ఒక దళముపై ప్రాణశక్తితో కూడి సంచారములు చేయుచున్నాడు. దృశ్య భావాలు ఆశ్రయించుటచే ఆ ద్వాదశ దళ మధ్య స్థానమగు తన ఆత్మను దర్శించటము లేదు. ఇదియే మాయాబద్ధుడగు సంసార జీవుని స్థితి. ఆతని ఉపాధి "అజ్ఞానము".

# కుండలినీ శక్తి స్థానము

## తస్య ఊర్ధ్వే కుండలీస్థానం నాభే తిర్యక్ అథ ఊర్ధ్వతః ।

ఓ ప్రియ త్రిశిఖా ! మనము చెప్పుకుంటూ వస్తున్న దేహ కేంద్రస్థానమునకు, అద్దానియందు ఉనికి కలిగి 12 దళములతో ఒప్పారుచున్న 'ద్వాదశదళ' (హృదయ) చక్రము'నకు, ఈవల - ఆవల, పైన - క్రింద కూడా ఒకానొక ఈ మహత్తరమగు శక్తి వ్యాపించినదై ఉన్నది. అదియే కుండలినీ శక్తి అని పిలువబడుచున్నది.

ఆ కుండలిని నాభికి అన్ని వేపులా విస్తరించి ఉండి, అష్ట ప్రకృతి (పంచభూత శక్తులు, మనో, బుద్ధి చిత్తముల) రూపముతో '8' విధములుగా చుట్టలు చుట్టుకొని ఉంటోంది.

ప్రకృతికి చెందిన కుండలినీ శక్తియే ప్రాణశక్తి కూడా। అది దేహములో వాయువు యొక్క కదిలకలను స్వశక్తిచే నిర్వర్తిస్తూ పర్యవేక్షిస్తున్నది. ప్రాణ-అపానములు" అనే వాయువు తరంగముల **లోపలికి బయటకు వచ్చి-తరలి వెళ్ళు కదలికలను**-రెండు వెదురు కర్రల వలె చేతబూని-**దేహములో జఠరాగ్నిని జనింపజేయుచున్నది.** జఠరాగ్ని ఆ విధంగా జనించి తన యొక్క జ్వలనశక్తిచే పొట్టలో ప్రవేశించుచున్న ఆహార పదార్థములను పచనము చేయుచున్నది. తాను మాత్రము పొట్ట (కందరము) లోపల ఆక్రమించుకొని కదలక-మెదలక, వాయు తరంగములను (ప్రాణ వాయు సంచలనములను) విధిపూర్వకంగా కదల్చుచు, దేహతత్త్వమంతా సంరక్షణ పూర్వకంగా పర్యవేక్షిస్తోంది.

ఆ కుండలినీ శక్తి **ముఖేనైవ సమావేష్ట్య బ్రహ్మరంధ్ర ముఖం తథా** బ్రహ్మ రంధ్రము యొక్క ముఖద్వారమును కప్పి ఉంచుతోంది.

**చుట్టలు చుట్టుకొని నిద్రాముద్ర వహించి బ్రహ్మరంధ్రమును కప్పి ఉన్న 'కుండలిని' ని మేలుకొలపటం ।**

ఒకడు కలకంటూ **'కలలోని నేను'** తో తదాత్మ్యముచెంది, సుఖ - దుఃఖ సంఘటనలను అనుభవిస్తూ **"ఇక్కడ కనిపిస్తున్న సంఘటనలచే నేను పరిమితుడను"** అనుకుంటూ ఉంటున్నాడు. అనేక పరిమితత్త్వములకు, స్వప్న సదృశ-దృశ్యములకు బద్ధుడై ఉంటున్నాడు. "ఈ స్వప్నము, స్వప్నములోని ద్రష్ట - దృశ్యములు నా కల్పనయే, ఈ స్వప్నము నేను జాగ్రత్‌నుండియే కల్పించుకోవటం ప్రారంభించాను"... అనేది పూర్తిగా ఏమరచి స్వప్నాంతర్గత పరిమితత్వమంతా తెచ్చిపెట్టుకొని అనుభవిస్తున్నాడు కదా!

అదే తీరుగా -

జాగ్రత్‌లో ఉండి, **"నేను ఆత్మ స్వరూపుడను. ఈ జాగ్రత్ అంతా నా ఉహా కల్పనయే! దీనికంతటికి నేను సహజంగానే వేరై ఉన్నాను!"** - అనునది కూడా ఏమరుస్తున్నాడు. **"ఈ జాగ్రత్‌లోని విషయాలు, జాగ్రత్‌లోని ఈ దేహము నాకు సంబంధించినవి. నేను వీటికి కట్టుబడినవాడను"** అని తలచుచున్నాడు. ఈ వ్యవహారమంతా ఆత్మస్వరూపుడే అయిఉన్న ఈ జీవునకు అనేక చిత్త భ్రమలకు, బంధములకు, దుఃఖములకు కారణమగుచున్నది. అందుచేత వేదాంత శాస్త్రము (లేక) అధ్యాత్మ శాస్త్రముచే సూచించబడుచున్న యోగాభ్యాస - జ్ఞాన సమాచారముల యొక్క అనునిత్యాభ్యాసముల ఆవశ్యకత ఏర్పడుచున్నదగుచున్నది.

1) ప్రాణాయామము.
2) ధ్యానము : మూలాధారము మొదలుకొని సహస్రారము వరకు గల శక్తిస్థానరూపములగు చక్రములలో బుద్ధితో ప్రవేశించటము. ధ్యాసను నిలపటము.
3) సాక్షీభూతత్వము : ప్రాణముల కదలికలను కేవలసాక్షియై దర్శించటము.

ఆయా అంగములతో కూడిన యోగాభ్యాసముల గురించి అధ్యాత్మశాస్త్ర - శాస్త్ర విభాగమగు **యోగశాస్త్రము**చే చెప్పబడుతోంది. అనుభవజ్ఞులగు యోగపుంగవుల స్వీయానుభవము - సవివరణగా సూచించబడుతోంది. ఆ విధంగా ముముక్షువు యోగాభ్యాసి అయి ప్రాణాయామాదులు నిర్వర్తిస్తూ ఉండగా.... అట్టి యోగాభ్యాసము యొక్క పరిపక్వ దశలో ప్రాణ - అపానముల అభ్యాస పూర్వక కదలికలచే **'యోగాగ్ని'** జనిస్తోంది. అట్టి యోగాగ్ని ప్రజ్వలితమై, నిద్రాణమైన 'కుండలిని'ని సమీపించుచుండగా, నిదురిస్తున్న త్రాచు పాము అగ్ని యొక్క వేడి తగులుటచే బుస్సున లేచు విధంగా, ఆ కుండలిని నిద్రాముద్రను వదలుచున్నది. క్రమంగా చైతన్యవంతమై, మహోగ్రరూపి అగుచున్నది. భద్రకాళివలె ప్రళయ నృత్యము చేయుచూ, అన్యత్వమంతా తనయందు మ్రింగివేసి, 'అనన్యత్వము'ను సంతరించుకొనుచున్నది. ఇదియే బ్రహ్మజ్ఞాన వికాసము కూడా!

అనగా,

ప్రాణయోగముచే ప్రాణ - అపానముల నిరోధము జరుగుతుండగా, శరీరములోని యోగాగ్ని ప్రజ్వలితమై నిద్రాణమై యున్న కుండలినీ శక్తిని నిదురలేపి చైతన్యపరచుచున్నది. అప్పుడు కుండలినీ శక్తి ప్రత్యుత్యాహము పొందినదై, హృదయాకాశములో 'ఆత్మస్ఫురణ' రూపములో క్రియా శీలకమగుచున్నది.

## సుషుమ్ననాడి

**త్రిశిఖి బ్రాహ్మణుడు :** హే సద్గురూ ! జగద్గురూ ! 'యోగ కేంద్రీకృత స్థానము' అని చెప్పబడు 'దేహ మధ్యస్థానము' సరిగ్గా ఈ దేహములో ఎక్కడున్నదో ఇప్పుడు కొంచము మరొక్కసారి వివరించ ప్రార్థన. దేహ మధ్య ప్రదేశము యొక్క ప్రాముఖ్యత ఏమిటో ... అది కూడా వివరించండి.

**ఆదిత్య భగవానుడు :**

**మనుష్యులకు - దేహమధ్య స్థానము (గరిమనాభి స్థానము)**

**అపానాత్ ద్వ అంగుళాత్ ఊర్ధ్వమ్, అధోమేఢ్రస్య తావతా దేహమధ్యం - మనుష్యాణాం -** గుదమునకు 'రెండు' అంగుళములు పైగా, లింగమునకు క్రిందుగా దేహమధ్యలో కేంద్రీకృతమై గరిమనాభి ప్రదేశము ఏర్పడినదై ఉన్నది.

**చతుష్పాద (నాలుగు పాదములుగల జంతువులకు) - దేహమధ్య స్థానము : హృత్ మధ్యం** హృదయము దేహ మధ్య స్థానముగా చెప్పబడుచున్నది.

**తదితర దేహాలకు-దేహమధ్య స్థానము-ఇతరేషామ్ తున్డ మధ్యే**-పొట్టమధ్యగా దేహ మధ్య స్థానము కేంద్రీకృతమై ఉంటోంది.

అట్టి దేహమధ్య స్థానములో ప్రాణ - అపానములు ఒకదానితో మరొకటి ఎదురుపడినవగుచున్నాయి. ఒక దానితో మరొకటి సమాయతనము అగుచున్నాయి. అట్టి దేహమధ్య కందము యొక్క స్థానములో ☐ చతురస్రముగా నానావిధ నాడీ సమేతమై ఉంటోంది. ఆ నాడీ కంద (Centrally) మధ్యభాగమునందు 'సుషుమ్ననాడి' సుప్రతిష్ఠితమైయున్నది. అట్టి సుషుమ్నానాడి - తామర తూడులోని సన్నటి తంతువు వలె సన్నగా, నిలువుగా ఉండి ఊర్ధ్వముగా (పై వైపుగా) బ్రహ్మరంధ్రము, నిర్వాణ స్థానము (సహస్రారము) వరకు విస్తరించి వ్యాపించినదై ప్రవర్తించుచున్నది. (వైదాంత పరిభాషదృష్ట్యా) విద్యుత్‌వలె 'సురసుర' ప్రకాశించుచూ బ్రాహ్మీస్థానము వరకు వ్యాపించుచున్నది. సహస్రారము దేహములోని విష్ణు స్థానము. సుషుమ్నను 'బ్రహ్మనాడి' అని, 'వైష్ణవీ' అని కూడా పిలుస్తారు.

"అట్టి సుషుమ్నానాడి మనో-చిత్తములచే ప్రేరేపించబడి, బుద్ధితో శిరస్సు ఉపరిస్థలమున గల బ్రహ్మనాడిని దాటి సహస్రార-ఉన్నత స్థానము చేరి ఉండటము"... అనునది **'నిర్వాణప్రాప్తి'**గా చెప్పబడుచున్నది

## పింగళ - ఇడ నాడులు

సుషుమ్నానాడి ప్రకాశించుచున్న 'నాడి కందము' (దేహమధ్య స్థాన - కేంద్రీకృత నాడీ మండలము) నుండియే 'పింగళనాడి' బయల్వెడలినదై **కుడి ముక్కు రంధ్రము** వరకు వ్యాపించి ఉన్నది.

అదే "నాడీ మండలము' నుండి బయల్వెడలే **'ఇడ'** నాడి **ఎడమ ముక్కు రంధ్రము** వరకు వ్యాపించినదై ఉన్నది.

ఈ విధంగా ఇడ - పింగళ అను రెండు ముఖ్య నాడులు సుషుమ్నకు ఎడమ - కుడి ప్రదేశముల వెంటగా ఏర్పడినవై ఉన్నాయి.

**'గాంధారి' 'హస్తిజిహ్వ'** అను పేర్లతో పిలువబడుచున్న వేరైన రెండు నాడులు కూడా సుషుమ్నకు ముందువైపుగాను, వెనుక వైపుగాను వెంటనంటినవై, 'కుడి-ఎడమ' కన్నులలోని **'కంటిపాప మధ్యస్థానము'** వరకు వ్యాపించి ఉంటున్నాయి.

**పూషనాడి - యశశ్వని** అను పేర్లు గల మరి రెండు నాడులు 'నాడీ కందము' నుండి బయలుదేరి కుడి – ఎడమ చెవుల వినికిడి పొరల స్థానము వరకు వ్యాపించినవై ఉంటున్నాయి. **సవ్య** నాడి చెవులకు పై స్థానముల వరకు విస్తరించి ఉన్నది.

**అలంబసానాడి:** పాయువు (మల విసర్జన స్థానము) వరకు (దేహ మధ్య నాడీ కంద స్థానము నుండి బయల్వెడలి) వ్యాపించి ఉన్నది.

**శుభానాడి:** నాడీ కందము నుండి (దేహ కేంద్రనాభీ ప్రదేశము నుండి)–లింగాంగము చిట్టచివరి కొస వరకు వ్యాపించినదై ఉన్నది.

**కౌశికీనాడి :** కందస్థానము నుండి – పాదముల వ్రేళ్ళ చిట్టచివరి కొసవరకు వ్యాపితమై ఉన్నది.

ఈ విధంగా నాడీ కందము నుండి – ఇడ – పింగళ–గాంధారి – హస్తి జిహ్వ–పూష – యశస్విని–సవ్య–అలంసబా–శుభా–కౌశికీ నాడులు దేహములోని ముఖ్యేంద్రియముల వరకు విస్తరించి ఉన్న "దశవిధముఖ్యేంద్రియనాడులు" అని (యోగశాస్త్రముచే) అభివర్ణించబడుచున్నాయి.

అదే విధంగా నాడీ కందము నుండి బయల్వెడలుచూ '72000' స్థూల – సూక్ష్మ నాడులు దేహమందు మూల మూలలకు విస్తరించి వ్యాపించినవై ఉంటున్నాయి.

అట్టి సూక్ష్మ నాడులు వాటి వాటి ఉపనాడులు... వాటిన్నిటికీ పేర్లు పెట్టి చెప్పటము తేలికైన విషయం కాదు, అద్దాని అగత్యమూ లేదు.

రావి ఆకులో ఎట్లాగైతే పెద్ద – చిన్న నాడి – ఉపనాడి ఈనెలు ఆ రావి ఆకు నిండా విస్తరించినవై ఉంటున్నాయో, దేహములో కూడా పైన మనము చెప్పుకొన్న 72000 సంఖ్య గల నాడులు దేహములోని నాభి స్థానములోని నాడీ కందమ నుండి బయల్వెడలి దేహములో అనేక క్రియాత్మకమగు ధర్మములు (Functions) జరగటానికి కారణభూతమగుచున్నాయి.

ఈ విధంగా దేహకందస్థానము (పొట్ట – దేహకేంద్రస్థానము) సూక్ష్మ – స్థూల నాడీ – ఉపనాడులకు పుట్టుక స్థానమై చెన్నొందుతోంది.

ఈ నాడులలో 1) ప్రాణము 2) అపానము 3) సమానము 4) ఉదానము 5) వ్యానము అనే వివిధ చలనములకు సంబంధించిన పంచప్రాణ వాయువులు అన్ని నాడులలోను సంచారములు చేస్తున్నాయి. ప్రాణశక్తి సర్వదా ఒక్కటే అయినప్పటికీ, సంచలనమును అనుసరించి వివిధ పేర్లు పెట్టబడ్డాయి.

అంతేకాకుండా 1) నాగ 2) కూర్మ 3) కృకర 4) దేవదత్త 5) ధనంజయ అనే పేర్లతో ఉపప్రాణములు కూడా ఆయా ధర్మములను నిర్వహించుచూ నాడులందు సంచలనములు కలిగి ఉంటున్నాయి.

కొందరు ప్రాణతత్త్వవేత్తలు పైన చెప్పిన దశ ప్రాణములలో **"పంచప్రాణములైనట్టి ప్రాణ – అపాన – సమాన –ఉదన – వ్యానములే ముఖ్యంగా దేహమును నడిపించేవి. మిగతావన్నీ ఆ పంచ ప్రాణములచేతనే నియమించబడుచున్నాయి"...** అని చెప్పుచున్నారు.

మరికొందరు యోగశాస్త్ర పండితులు **"ప్రాణ – అపానములే ముఖ్యమైనవి. మిగతాదంతా ఆ రెండింటి కార్యక్రమములలోని అంతర్వి భాగములే"** – అని కూడా చెప్తూ ఉంటారు.

ఇంకొందరు యోగ శాస్త్రవేత్తలు – **జీవాత్మ ధారణ చేస్తున్నది ముఖ్యప్రాణమే. అదియే ప్రప్రథమము. అద్దాని కార్యక్రమములే మిగతావన్నీ...** అని సిద్ధాంతీకరిస్తున్నారు.

ఓ ద్విజసత్తమా ! త్రిశిఖి మహాశయా ! ప్రాణముఖ్య కేంద్ర స్థానలముల గురించి విను.

**ఆస్య నాశికయోః మధ్యం - హృదయం నాభిమండలమ్, ప్రాణ అంగుష్టమ్ ఇతి ప్రాణస్థానాని ।**

**1) ప్రాణమునకు స్థానములు :** (1) ప్రాణప్రథమస్థానమగు నాడీకందము 2) నాభి మండలము (బొడ్డు) 3) ఆస్య – నాసికల మధ్య ప్రదేశము (బాహ్య స్థిర ప్రాణ బిందువు నుండి–నాశికయొక్క ఊర్ధ్వ భాగము వరకు) 4) పాదముల యొక్క బొటన వ్రేలు ... ఈ ఈ స్థానములు "ప్రాణకేంద్రీకృత స్థానములు" అని పేర్కొనబడుచున్నాయి.

**ప్రాణవాయువు శరీర మధ్య భాగము (తుందులము - పొట్ట) యందు స్థితి కలిగి, ఈ జీవుడు స్వీకరించు అహారములను, పానీయములను అహార రసముగా సమీకృతము చేయుచున్నది.**

**2) అపానవాయువుకు స్థానములు :** 1) గుదము (మలవిసర్జన ద్వార స్థానము) 2) మేఢ్రము (లింగము), 3) జానువులు (మోకాళ్ళు) ... ఈ మూడు చోట్ల ముఖ్యంగా అపానవాయువు స్థానము పొందినదై సంచరించుచున్నది. **ఇది దేహము నుండి మల - మూత్రాది విసర్జనములకు సహకరించుచున్నది.**

**3) సమాన వాయువునకు స్థానములు : సర్వగాత్రేషు సర్వవ్యాపీ వ్యవస్థితః** దేహమునందు అంతటా సమాన వాయువు వ్యవస్థితమై స్థానములు కలిగి ఉన్నది. ఇది దేహమునందు సర్వవ్యాపి. శరీర పరిపోషణములను నిర్వర్తించుచున్నది.

**4) ఉదాన వాయువునకు స్థానములు :** దేహము యొక్క సర్వ సంధులలోను (In the joints, joint corners ) స్థానము కలిగి ఉండి, పాదములలోను – మడమల లోను కూడా ఉన్నదై సంచారములు చేయుచున్నది.

**ఇది దేహములో ప్రవేశించిన ఆహార పదార్థములను జీర్ణము అగు ప్రక్రియలన్నిటినీ నడుపుచూ, నిర్వర్తించుచున్నది.**

**5) వ్యానవాయువునకు స్థానములు : శ్రోత్రో - ఊరు కట్యాంచ గుల్ఫ స్కంధ గళేషుచ :** చెవులులోను, తొడలలోను (ఊరువులలోను), కటి (మొల) ప్రదేశమునందు, గుల్ఫము (చీలమండలము) నందు స్కంధములయందు (భుజములయందు), గళము (కంఠము) నందు... తన సంచారము కొరకై స్థానములుగా కలిగి ఉన్నది. **ఈ వ్యానవాయువు ప్రాణవాయు చేష్టలను పర్యవేక్షించుచున్నది. (ప్రాణ - అపానాది చేష్టాది క్రియతే వ్యానవాయునా).**

## పంచ ఉపప్రాణములు

నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయములని పిలువబడేవి **పంచ ఉపప్రాణములు**. ఇవన్నీకూడా, చర్మము – బొమికలు మొదలైన వాటిని అంతరము – బాహ్యమున ఆశ్రయించి ఉంటున్నాయి.

**(1) నాగ ఉప ప్రాణ వాయువు : ఉద్గారాది క్రియో నాగః** దేహములోని అనవసరమైన వాయువులను దేహము నుండి బయటకు పంపుతూ ఉంటుంది. త్రేపులు మొదలైన ప్రక్రియ మార్గములను పర్యవేక్షిస్తూ, ఉద్గరము (బయటకు నెట్టుట) మొదలైన క్రియలు నిర్వర్తిస్తున్నది.

**(2) కూర్మ ఉప ప్రాణ వాయువు : కూర్మా అక్షాది నిమీలినః:** కూర్మ ఉపానవాయువు కళ్ళు మూయుట – తెరచుట, గుండె స్పందము మొదలైన శరీరములోని అనేక శారీరక వ్యవస్థా సంబంధమైన కదలికలను నిర్వర్తింపజేయుచూ ఉంటుంది.

**(3) "కృకరః" క్షపయోః కర్త :** కృకరప్రాణవాయువు దేహమునకు, హాని చేయగల రోగ క్రిముల ప్రవేశమును నిరోధించటం, దేహములోని రోగ జీవాణువులను నశింపజేసి దేహమును పరిరక్షించుట నిర్వర్తిస్తూ ఉంటుంది.

**(4) "దత్తో" నిద్రాది కర్మకృత్ :** దత్త ఉపాన వాయువు ఈ జీవుడు నిద్రపోవటం మొదలైన కార్యక్రమములకు సహకారము అందజేస్తూ ఉంటోంది.

**(5) మృతగాత్రం చ శోభాది "ధనంజయః" :** ధనంజయ ఉపానవాయువు శవముతో సమానమైన ఈ భౌతిక దేహమును కాంతియుతము, తేజోమయము చేయుచున్నది. జీవ తేజస్సును దేహము కలిగి ఉండునట్లుగా పరిరక్షించుచున్నది. శరీరము శిథిలము కాకుండా కాపాడుచున్నది.

ఓ ద్విజసత్తమా ! మనం ఇప్పటి వరకూ **పింగళ సుషుమ్న ఇత్యాది నాడీ భేదముల గురించి, ప్రాణ – అపాన – వ్యాన – ఉదాన – సమాన ఇత్యాది వాయు ధర్మముల భేదము గురించి, ప్రాణ – ఉపప్రాణములు దేహములో కలిగియుండే స్థానముల గురించి, పంచప్రాణ – పంచ ఉపప్రాణములు నిర్వర్తించు ఆయా ధర్మముల గురించిన** కొన్ని విషయాలు చెప్పుకున్నాం కదా !

ఇప్పుడు, సందర్భోచితం కాబట్టి, రెండు ముఖ్యమైన విషయాలు సంభాషించుకుందాము

1) నాడీ శుద్ధి గురించి.

2) సర్వమునకు సాక్షి, ప్రేరకుడు, సర్వస్వరూపుడు, స్వస్వరూపుడు ... అగు పరమాత్మతత్త్వము గురించిన ధ్యానము.

ధ్యానముచే నాడీ శుద్ధి కాగలదు. నాడీ శుద్ధిచే జన్మ – కర్మలకు ఆవల గల ఆత్మ స్వరూపము సుస్పష్టమవగలదు.

**ధ్యానము :**

- ధ్యానమునకై ఏకాంతమైనట్టి ప్రశాంత – ప్రదేశమును ఎన్నుకోవాలి.
- పరిసరములను ఏకాగ్రతకు సానుకూల్యముగా తీర్చి దిద్దుకోవాలి. గురు – ఇష్టదైవ పఠములు మనస్సును ఆకర్షించు రీతిగా అమర్చుకోవాలి. మనస్సును ఉత్సాహపరచేటట్లు, ఆకర్షించునట్లు ఉండాలి.
- సర్వ బాహ్య సంబంధములన్నీ బాహ్యముననే సుదూరముగా ఉంచుతూ ఉండాలి. అంతరంగమున ఓర్పు–నేర్పులతో అవతారమూర్తుల సంబంధమైన, బ్రహ్మజ్ఞాన సంబంధమైన సమాచారముతో నింపుకోవాలి.

- దారువులో (కొయ్య వాసపు బద్దలతో) నిర్మితమైన ఆసనమును (పీటన) తయారు చేసుకోవాలి.
- ఆ దారువుపై దర్భలు, కుశలు, కృష్ణాజినము (జింక చర్మము) పరచుకోవాలి.
- ఆ కృష్ణాజిన – ఆసనముపై స్వస్తికము మొదలైన యోగ శాస్త్రము సూచించే ఏదో ఒక ఆసనము గాని (లేక) మరేదైనా సుఖాసనమును గాని–అభిరుచి అయినది దేహముతో స్వీకరించాలి.

ఓ విప్రమిత్రుడా! యోగాసనమును స్వీకరించుచూ (ధారణచేస్తూ) ఆసీనుడైనప్పుడు మెడ – భుజము – శిరస్సులను నిఠారుగా నిలిపి ఉంచాలి. సమాహితము (wel - conditioned and wel - placed) చిత్తముతో యోగసాధనకు 'సంసిద్ధము' కావాలి.

**భద్వా ప్రాగాసనం, ఋజుకాయ సమాహితః, నాసాఽగ్ర న్యస్తనయనో, దన్తైః దన్తాః న సంస్పృశన్, రసనాం తాలునిన్ అస్య స్వస్థచిత్తో నిరామయః, ఆకున్చిత శిరః కించిత్ నిబధ్నన్ యోగముద్రయా, హస్తౌ యథోక్త విధినా ప్రాణాయామమ్ సమాచరేత్।**

- సుఖాసనమును స్వీకరించి,..... మెడ–శిరస్సును నిఠారుగా ధారణచేసి,
- దృష్టిని – నాసికము (ముక్కు) కు అగ్రభాగమున (upward point of the nose just underneath the eye - brow line) నిలిపి...,
- పై దంతములు – క్రింది దంతములు కలువకుండా ధారణ చేస్తూ...,
- నాలుకను తాలువుతో, (పై దవడకు) తాకి ఉంచుతూ...,
- చిత్తమును విషయములన్నీ త్యజింపజేస్తూ, నిర్విషయముగాను, నిరామయముగాను తీర్చిదిద్దుచూ...,
- శిరస్సు కించిత్ వంచి ఉంచి, యోగ ముద్రను ధరించుచూ...,
- చేతులను యథోక్త విధంగా (ఆసనములలో చెప్పిన తీరుగా) (లేక) చిన్ముద్ర విధిని అనుసరించి ఉంచుచూ..,

ప్రాణాయామము నిర్వర్తించుచూ ఉండాలి!

## ప్రాణాయామము - (Conscious modulation of Prana Energy through disciplining of Air-Moves)

1) **రేచకము :** గుండె నుండి ముక్కు రంధ్రముల ద్వారా వాయువును (గాలిని) బయటకు వదలటము (Push out)
2) **పూరణం :** బయట ($12^{11}$ దూరం నుండి) నుండి ముక్కు రంధ్రముల ద్వారా లోనికి స్వీకరించటము (Pull-in)
3) **శోధనము (కుంభకము) :** లోపలకు వచ్చిన గాలిని దేహమునందు నిలిపి శోధింపజేయటం. (To activite the inside of the body by holding the air knowingly and actively.
4) **పునః రేచకము :** దేహములో నిలిపి ఉంచి వాయువును దేహములో ఖాళీ చేస్తూ ముక్కు పుటములతో బయటకు వదలటము. వాయువు యొక్క ఈ '4' క్లేశనములు (ప్రక్రియలు) కలిపి 'ప్రాణాయమము' అని యోగులచే ప్రవచించబడినదై యోగ వాఙ్మయములో వివరించబడుతోంది. వాయుజయము సిద్ధించుకొన్న యోగవిత్తములచే యోగసాధకులకు సూచించబడుతోంది.

**1) రేచకము : హస్తేన దక్షిణేనైవ పీడయేత్ నాసికాపుటమ్! శనైః శనైః రథబహిః ప్రక్షిపేత్ పింగళా అనిలమ్।** కుడిచేతి బొటనవ్రేలుతో కుడివైపు నాసికాపుటము (ముక్కు పుటమును) మూసివుంచి, నెమ్మది నెమ్మదిగా శరీరమునందలి పింగళనాడిచేత గాలిని బయటకు వదలటము 'రేచకము' (బయటకు వదలటము)

**2) పూరకమ్ : ఇడయా వాయుమ్ ఆపూర్య షోడశ మాత్రయా।** తరువాత బయట నుండి ఇడనాడి లోనికి (ఎడమ ముక్కు రంధ్రము గుండా) నిండుగా గాలిని 16 మాత్రలకాలము (16 చిటికెల కాలము) పీలవటము (లోనికి పీలవటము). (మాత్ర = ఒక హల్లు ఉచ్ఛరించు సమయము)

**3) కుంభకము : పశ్చాత్ పూరితం కుమ్భయే చతుష్షష్ట్యాతు మాత్రయా।** పూరించిన వాయువును ఇడా నాడిలో 64 మాత్రల కాలము (64 చిటికెల కాలము) కుంభించి ఉంచటము.

**4) పునఃరేచకము : ద్వాంత్రింశత్ మాత్రయా సమ్యక్ రేచయేత్ పింగళా అనిలమ్।** ఆ విధంగా కుంభించిన వాయువును నెమ్మదిగా పింగళనాడి ద్వారా (ముక్కు యొక్క కుడి రంధ్రము ద్వారా) 32 మాత్రల కాలము బయటకు వదలటము.

**ఏవం పునః పునః కార్యం 'వ్యుత్క్రామ - అనుత్ర్కమేణతు'।** ఈ విధంగా ఉత్క్రామం (Inward pulling) - అనుక్రమేణ (outward pushing) మరల మరల నిర్వర్తించబడుచూ ఉండాలి.

**సంపూర్ణ దేహ కుంభకము : సంపూర్ణ కుంభవత్ దేహము కుంభయేత్ మాతరిశ్వనా।** నిండుకుండలో నీరు అంతటా ఆక్రమించి ఉంటున్న తీరుగా పూరకము - కుంభకముల సందర్భములలో వాయువును ఆ ప్రాణా యోగాభ్యాసి దేహమంతటా సుసాధ్యమైనంతవరకు - నిండుగా నింపి ఉంచాలి.

**పూరణాత్ నాడయః సర్వాః పూర్యంతే మాతరిశ్వనా ।** దేహములోని నాడులన్నీ కూడా పూర్ణముగా వాయుతో నింపి ఉంచాలి. ఈ విధంగా నాడులన్నిటిలోను వాయువును కుంభకయామ పూర్వకంగా కొన్ని మాత్రల కాలము (చిటికల కాలము) నిలిపి ఉంచు ప్రక్రియ ప్రాణాయమము. ప్రాణాయామ సాధనము చేత....

- దేహములోని దశదిశల గల వాయువులు సమము - ఉత్సాహపూరితము - నిర్దుష్టము అగు చలనము కలిగినవై ఈ దేహమును అత్యంత ఉపయోగయుక్తమైన ఉపకరణముగా ఉంచగలవు. దేహమును దారుఢ్యము - ఉత్సాహము - ధైర్యము - ఆరోగ్యముగా పెంపొందించ గలవు.
- ప్రాణాయామాభ్యాసముచే అజ్ఞాన దృష్టులు, దురభ్యాసములు, దుర్భావములు- క్రమక్రమంగా సన్నగిల్లుతాయి. దృశ్యావేశ పూర్వక స్పందనలచే ముడుచుకు పోయి ఉన్న హృదయకమలము ... ఆనంద సంపత్తితో కూడుకొని వికసించగలదు. స్ఫుటతరం అవగలదు. ఎప్పుడైతే హృదయకమలము వికసించుకుంటుందో... **తత్ర పశ్యేత్ పరాత్మానమ్ వాసుదేవమ్ అకల్మషమ్.** వికశించిన హృదయ కమలము హృదయమునంతా జ్ఞాన-భక్తి-వైరాగ్య-యోగ భావ సంపదా పుంజములతో నిర్మలము చేయుచున్నది. అప్పుడు "సకల చరాచర వ్యాపకచరణుడు" అగు వాసుదేవుడు ఆ నిర్మల హృదయములో విరాజమానుడై మనో-బుద్ధులకు సుస్పష్టముగా దర్శనము ప్రసాదించగలరు. ఈ దృశ్య జగత్ రూపము ఆ పరాత్పర స్వరూపమై అనుభవము కాగలదు. క్రమంగా వాసుదేవతత్త్వముతో మమైక్యమగు బుద్ధి-సముద్ర జలంలో ఉప్పు బొమ్మవలె-ఆత్మతో ఏకత్వం పొందగలదు.

అందుచేత ఓ త్రిశిఖి బ్రాహ్మణోత్తమా ! మముక్షువైనవాడు ప్రాణాయామ సాధనను ప్రతి రోజు నిర్వర్తిస్తూ ఉండటం శుభదాయకము.

| | | |
|---|---|---|
| 1) | ప్రాతఃకాలము | 4 AM to 6 AM |
| 2) | మధ్యాహ్నకాలము | 12 noon to 2 pm |
| 3) | సాయంకాలము | 4 PM to 6 PM |
| 4) | రాత్రి | 8 PM to 10 PM |
| 5) | అర్థ రాత్రి | 12 Night to 2 AM |

ఈ విధంగా, **ప్రాతః మధ్యన్దినే - సాయమ్ - అర్థ రాత్రేచ కుమ్భకాన్** - రోజులో నాలుగు సార్లు లేదా ఐదుసార్లు కుంభన ప్రాణాయామమును అభ్యసించాలయ్యా ! నెమ్మది - నెమ్మదిగా ప్రాణాయామముల సంఖ్యను పెంచుకుంటూ, రోజుకు '80' సార్లు అభ్యాసము చేయాలి.

ఈ విధంగా ఒక్క రోజు చేసినా కూడా అనేక బుద్ధి దోషములు, పాప దృష్టులు సన్నగిలుతాయి. ఏ యోగి అయితే ప్రాణాయోగపరుడై '3' సంవత్సరముల కాలము నిర్వస్తాడో... **సంవత్సరత్రయాత్ ఊర్ధ్వం ప్రాణాయామ పరోనరః, యోగసిద్ధో భవేత్ ।** - ఆతడు యోగ సిద్ధుడు (యోగమును, యోగ స్థానమును సిద్ధించుకొన్నవాడు) అగుచున్నాడు. అతడు 'వాయుజి' అయి, ఇంద్రియములను జయించి వేయగలడు. ఇంద్రియములు ఆతనికి వశమై ఉంటాయి. ఆతడిక ఇంద్రియములకు, ఇంద్రియ సందర్భములకు వశుడు కాడు. అవశః సః!

తన దేహములోను, తదితర దేహములోను విశ్వములోను వాయు చలనమును నిర్దేశించగలుగుతాడు కూడా !

***ఇక ప్రాణాయామాభ్యాసి యొక్క బాహ్యాలక్షణాల గురించి చెప్పవలసివస్తే ...***

- ఆతనికి ఇంద్రియ వ్యాపారములపట్ల ఇతః పూర్వము కొనసాగుచున్న ఆకలి రూపమైన ఆవేశము సన్నగిలగలదు. అతడు **అల్పాసి** (ఆకలి స్వల్పముగా మాత్రమే కలవాడు) కాగలడు. అతడు ఆకలిని జయించుటచే **"అల్పస్వీకారీ"** - స్వల్పముగా తినినా కూడా శరీరమునకు కావలసిన శక్తిని సముపార్జించుకోగలడు. అతని దేహము కించిత్ సమయము నిద్రించినా కూడా ఆతడు దేహమునకు అవసరమైనంత విశ్రాంతిని పొందగలడు. నిద్రను జయించగలడు. నిద్ర ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తుంది, వద్దంటే మానుతుంది.
- ఇంతే కాకుండా అతడు తేజస్వి, బలవంతుడు అగుచున్నాడు.

- అతడు అపమృత్యువు (The incident like sudden death sudden sickness etc.,) అను దోషమును తొలగించుకొని, దీర్ఘాయుష్మంతుడు అగుచున్నాడు. ఈ దేహసంబంధితమైన, అంతిమ క్షణము వరకు సదుపయోగమగు ఉత్సాహపూరితము అయిన రీతిగా అతని దేహము రూపుదిద్దుకుంటోంది. ఉత్తమ ప్రయోజనముతో కూడిన ఉపకరణము అవుతుంది.

ఇప్పుడు ప్రాణాయామము నిర్వర్తించు యోగి యొక్క నాలుగు స్థితుల గురించి చెప్పుచున్నాను.

**1) ప్రస్వేద జననం (అధమ) :** ప్రాణాయామము నిర్వర్తిస్తూ ఉండగా మొట్ట మొదటి దశలో (State of Begining) దేహమంతా చెమట (Sweathing) ప్రదర్శితమౌతుంది. ఇది మొదటి దశ. మొట్టమొదటిది కాబట్టి యోగభాషలో "ప్రాణాయామ అధమ ప్రస్ఫుటము"..... అని అంటూ ఉంటారు. **ప్రస్వేద జననం యస్య ప్రాణాయామస్తు సో అధమః॥**

**2) కమ్పనము (మధ్యమ) :** ఇక రెండవ దశలో (Middles State) దేహములో కొన్ని కదలికలు, కమ్పనములు కనబడుతూ వస్తాయి. ముఖ్యముగా భుజముపైన, ముఖము ప్రదేశములోను, నడుముకు క్రింద ప్రదేశాలలోను ఈ కమ్పనములు అధికంగా అనుభూతమౌతూ ఉంటాయి. దీనిని "ప్రాణాయామ ద్వితీయ సాధన దశ" (లేక) 'మధ్యమ దశ' అంటారు **(కమ్పనం వపుషో యస్య ప్రాణాయామేషు మధ్యమః)**

**3) ఉత్థానము (ఉత్తమ)** (Higher State): ప్రాణాయమాభ్యాసముచే 1) శరీరము తేలికగా అనుభవమవటము 2) శిరస్సు యొక్క ఉపరితల ఆకాశము ఉత్తేజమవటము జరుగుతుంది. క్రమంగా ఆ యోగ సాధకుని శరీరము దూదిపింజమువలె అతి తేలిక అగుచున్నది. ఏ విధంగా భూమ్యాకర్షణ గాలితో నిండిన బూరను తన ఆకర్షణ శక్తితో ఒకచోట భూమిపై నిలపలేదో, అట్లాగే ఈ దేహము భూమ్యాకర్షణమును జయిస్తోంది. ప్రాణవాయు అభ్యాసముచే నియమితమగుచుండగా, దేహములోని అణువణువు గాలి రేణువులకంటే తేలిక అగుచున్నది. ఇక ప్రాణాయామాభ్యాసము కొనసాగుచుండగా, ఆ యోగి యొక్క దేహము దూదిపింజమువలె అయి ఆతని ఇచ్ఛానుసారం పైకి లేవటం ప్రారంభించి, కొన్ని అడుగులుపైకి (గాలికలో) నిలువగలదు. అతడు క్రమంగా ప్రాణాయామ కుంభకము నెమ్మది నెమ్మదిగా రేచకం చేస్తూ ఉండగా... ఆ గాలిలో పైకి లేచిన శరీరము కొంచము కొంచము బరువును పొందుచు, తిరిగి ఇతఃపూర్వము ఆసనముపై ప్రతిష్ఠితము అగుచున్నది. **ఉత్థానం వపుషో యస్య స 'ఉత్తమ' ఉదాహృతః ।** ఈ విధముగా ప్రాణాయామయోగ – కుంభక విధానము అభ్యసించు యోగి యొక్క భౌతిక దేహము కుంభకము సమయంలో పైకి దూది పింజమువలె లేచు యోగస్థితిని పొందినవానిని **'ఉత్తమ' ప్రాణయోగ సాధన సిద్ధుడుగా** – చెప్పబడుచున్నాడు.

**అధమ** (Stage 1) **ప్రాణయామ సిద్ధి** (దేహమునకు చెమటపట్టు) వరకు వచ్చినట్టి యోగి, **"పూర్వజన్మకృతం పాపమ్ వ్యాధిగ్రస్తేన పీడితః ।"** అను సూత్రము ననుసరించి ఏ పాప అనుభవములు వ్యాధి రూపమై బాధించటానికి సంసిద్ధమగుచున్నాయో, **ఆవ్యాధులు వాటి బాధలు తొలగుతూ వస్తాయి. మధ్యమ ప్రాణాయామ సిద్ధి** పొందుచున్న యోగి పట్ల, ఆయా జన్మజన్మల శారీరక – మానసిక బుద్ధి దోష వ్యాధులు మొదలంట్లా తొలగగలవు. ఇక ఉత్తమ ప్రాణాయామ యోగ సంసిద్ధుల విషయానికి వస్తే, వారి పట్ల జన్మ – జన్మార్జితమైన కుసంస్కారములు కూడా – మరల మొలకెత్తలేనంతగా – మొదలంట్లా తొలగుచున్నాయి. క్రమంగా ఆతడు **యోగీశ్వరుడై, ఈ విశ్వమంతా తన రూపముగా సందర్శించుచూ, అవిఘ్నమగు బ్రహ్మానందమును అనునిత్యం ఆస్వాదించుచున్నాడు.**

⌘

ప్రాణాయామ పరాయణులకు సంబంధించి తదితర విషయములు – పరివర్తనముల గురించి చెప్పుకోవాలంటే ...,

- **అల్ప మలమూత్రములు** (మల –మూత్రముల విసర్జన యొక్క 'అనేకసార్లు' అనే భౌతిక దోషము తొలగుచూ వస్తుంది కాబట్టి)... అనే ఆరోగ్య ప్రదమగు ఒక లక్షణము శరీరంలో పెంపొందుతుంది.
- **లఘుదేహో**... శరీరము బరువుగా ఉండటం తొలగుచూ, తేలికగా అనిపించనారంభిస్తుంది. ఆతడు **చురుకుగాను, తేజో మనస్కుడుగాను, సునిశితమగు బుద్ధి కలవాడుగాను** అగుచూ ఉంటాడు.
- **మితాశనః** – అధికమైన ఆహారము యొక్క ఆవస్యకత తగ్గుతూ వస్తుంది.
- **పట్వింద్రియః** ఇంద్రియములు పటుత్వము సంతరించుకోగలవు.
- **పటుమతిః :** బుద్ధి పటుత్వము పొందినదై – **సూక్ష్మము, సునిశితము, విస్తారము, నిర్మలము అవుతూ వస్తుంది. ఓర్పు వృద్ధి చెందుతుంది. హృదయం పరాప్రేమమయం** అవగలదు. వినుచున్న వాటి పట్ల **ఓరిమి, శ్రద్ధ** ప్రవృద్ధి చెందుతూ ఉంటాయి. ప్రాణయోగ సాధన సంపత్తి చేత ఆ యోగి త్రికాలజ్ఞుడు అగుచున్నాడు.

దేహమునకు మునుముందటి **'అవ్యక్తరూపము', 'దేహవ్యక్తతత్వము', 'దేహానంతర అవ్యక్త చమత్కారము'**... ఈ మూడు బుద్ధికి అర్థము కాగలవు. దృష్టికి కరతలామలకము అగుచున్నది. అతడు భూత – వర్తమాన – భవిష్యత్తులను ఎరుగుచున్నవాడగుచున్నాడు. **చెదరని చిరునవ్వుతో కాలః క్రీడకు సాక్షీభూతుడగుచున్నాడు.**

## కేవల కుంభక ప్రాణాయామసిద్ధి

యోగాభ్యాసము యొక్క ఒకానొక ఉత్తమ దశలో ఆ యోగి **"వాయుబాహ్యానిష్క్రమణ పూర్వక రేచకము, వాయు అంతర్ప్రవేశ పూర్వక పూరకముల** మునుముందట ప్రక్రియలు"... మొదలైన ఇవన్నీ లేకుండానే, సూటిగా....

## "కుంభక ప్రాణాయామము" యొక్క ధారణను....

నిర్వర్తించుచున్నారు. అనగా, మనస్సును, బుద్ధిని, చిత్తమును ఒక అనుకున్నచోట అనుకున్నంతసేపు కేంద్రీకృతం చేసి ఉంచగలుగుచున్నాడు. అట్టి **'సహజ కుంభకము'**ను అవధరించువానికి ఈ త్రిలోకములలో అసాధ్యం అంటూ ఏదీ ఉండదు.

ఏ యోగి అయితే ...,

- త్రిసంధ్యా సమయములందు (లేక)
- అవసరమయిన సమయములందు
- నాభియందు, పొట్టయందును
- ముక్కు ఊర్ధ్వ (అగ్ర) భాగమునందును
- పాదముల అంగుష్ఠముయందును
- బాధ – రోగ స్థానములందును

యత్న పూర్వకంగా మనో – ప్రాణములను నిలిపి ధారణ నిర్వర్తించుచున్నాడో, అట్టివాడు సర్వరోగముల నుండి విముక్తుడగుచున్నాడు. సర్వశారీరక – మానసిక రుగ్మతల నుండి విముక్తుడై ఆనందముగా జీవించగలడు. నాభి – పొట్ట ప్రదేశములో (నాభికంద ప్రదేశములో) రేచక – పూరక ఆవస్యకత లేని **"కుంభక ప్రాణాయాజనము"** చేయువాని పొట్టలోని రోగములు వాటికవే తొలగగలవు. **నాసాగ్రము** (ముక్కు యొక్క ఊర్ధ్వయంగా – కనుబొమ్మలకు క్రిందుగా) ధారణ చేయువాడు దీర్ఘాయుష్మంతుడు అగుచున్నాడు. ఆతని దేహము అతి లాఘవంగాను, క్రియా సామర్ధ్యవంతముగాను కాగలదు.

ఏ యోగి అయితే – తెల్లవారుఝామున, సాయంకాలము – 4 గంటల నుండి 6 (లేక) 7 గంటల సమయము వరకు గల బ్రాహ్మీ ముహూర్తమునందు - **బ్రహ్మే ముహూర్తే సంప్రాప్తే వాయుమ్ అకృష్య జిహ్వాయా** - నాలుకతో గాలిని ఆకర్షించి **-పిబతః త్రిషు మాసేషు వాక్‌సిద్ధిః మహతా - భవేత్‌।** – నోటితో పిల్చు యోగసాధనను 3 నెలలు అభ్యసిస్తారో, ఆతనికి **'వాక్ సిద్ధి'** కలుగుచున్నది. 6 నెలలు అభ్యాసము చేస్తే **మహారోగ వినాశనములు** కలుగుచున్నది.

**యత్రయత్ర ధృతో వాయుః అంగే రోగాది దూషితే, ధారణాత్ ఏవ మరుతః తత్ తత్ ఆరోగ్యమశ్నుతే,** దేహములో ఏ అంగమునందు రోగదోషము కలుగుటం జరుగుతుందో, ఆచోట 'పూరక – రేచక సహిత' (లేక) 'పూరక – రేచక రహిత' (సూటిగా మనస్సుతోనే, బుద్ధితోనే) ... కుంభక ప్రాణాయమము ధారణ చేయుట చేత, ఆరోగ్యము పొందగలదు. ఆ దేహ ప్రదేశమునందు గల రోగము, బాధ తొలగగలవు.

ఓ ద్విజపుంగవా ! ఇక్కడ ఒక ముఖ్య విషయం !

**మనసో ధారణాత్ ఏవ, పవనో ధారితో భవేత్, 'మనసః స్థాపనే హేతుః' ఉచ్యతే।**

1. మనస్సు ఎక్కడ ధారణ చేస్తే (నిలిపితే) అక్కడ ప్రాణవాయువు (ప్రాణశక్తి) కూడా ధారణ చేయబడినది (లేక) నియమించినది. అగుచున్నది. 2. మనస్సును అనుకున్న చోట నియమించటానికై – అందుకుగాను ప్రాణోపాసన (ప్రాణాయామాములే) ఉపాయము" **అని యోగ పుంగవులచే విశదపరచబడుచున్నది.**

బుద్ధితో ప్రాణాయామ విధానంగా ఏకాగ్రం ఎక్కడచేస్తే, అక్కడ మనస్సు నిలుస్తుంది. మనస్సు ఎక్కడ ఏకాగ్రమైతే అక్కడ ప్రాణాయామం అప్రయత్నంగా జరుగుచున్నదే అగుచున్నది. ఈవిధంగా చిత్తము (ఇష్టము), బుద్ధి (తెలివి), మనస్సు (ఆలోచన)లను ఏక ప్రదేశంలో నియమించగలగటమే **ప్రాణాయామ యోగసిద్ధి.**

## ఇంద్రియ విషయ ఉపశమన ప్రక్రియ

ఈ జీవుని మనస్సు (లేక) ఆలోచనాపరంపరలు ప్రాణ యోగ సాధనకు ఉపక్రమించక ముందు, ఇంద్రియముల వెంట వెళ్ళి ఇంద్రియ విషయముల పరంపరలలో ప్రవేశితమై ఉంటోంది. ప్రాణముయొక్క తాత్విక రూపము ఇష్టమే కాబట్టి మనస్సు వెంట వెళుతోంది. అందుచేత యోగాభ్యాసి ఇంద్రియములను వాటివాటి విషయముల నుండి వెనుకకు మరల్చాలి. విషయముల పై పడుచున్న ధ్యాసలను వెనుకకు మరల్చు ప్రాణాయామ సాధనోపాయమును ఆశ్రయించాలి. అప్పుడు **ఈ ప్రాణములతోబాటు మనస్సు కూడా వశమౌతుంది.**

**"ఆపానమ్ ఊర్ధ్వమ్ అకృష్యేత్ ఉదరో పరిధారయేత్ ॥"**

క్రిందకు వేగముగా వెళ్ళుచుండు అపానవాయువును మనస్సుతో (లేక చిత్తముతో) పట్టుకొని నెమ్మదిగా, ఉదరము (పొట్ట) యొక్క పై భాగమునకు చేర్చి ధారణ చేయుటచే దోషపదార్థాలు నిర్వీర్యమౌతాయి. అపానవాయువును చిత్తముతో పొట్టలో బాహ్యరేచక-తదనంతర కుంభక పూర్వకంగా ధరించటంచేత పొట్టలోని దోషాలు పోతాయి. అట్టి సమయంలో పొట్ట లోపలికి కుంచించుకొనినదై ఉంచాలి.

## మనస్సును ప్రాణోపాసనచే వశం చేసుకోవడం.

**బధ్నన్ కరాభ్యాం శ్రోత్రాది కరణాని యథాతథమ్,**
**యుంజానస్య యథా ఉక్తేన వర్త్మనా స్వవశం మనః॥**

చేతులతో (లేక చూపుడు వ్రేళ్ళతో) లోపలిగా నొక్కి యథాతథముగా మూసి ఉంచి రేచక - పూరక శాస్త్ర విధిగా గాని, (లేక) సూటిగా మనో-బుద్ధులతోగాని గాని **కుంభక ప్రాణాయామమును** అభ్యసించువానికి అతిత్వరగా మనస్సు స్వాధీనము అగుచున్నది. విషయములనుండి మనస్సు కొంచము కొంచెము వశమగుచుండగా... ఇక మరికొంతగా ప్రాణశక్తి కూడా వశమగుచూ వస్తోంది. మనో-ప్రాణములు పరస్పర సాహకారికములు సుమా!

సర్వదేహుల విషయంలోనూ, ఎట్టిస్వకీయ ప్రయత్నము లేకుండానే (అసంకల్పితంగా) నాసికా పుటముల నుండి గుండెలోనికి, గుండె నుండి ఇడ - పింగళనాడుల ద్వారా లోనికి - బాహ్యానికి వాయుసంచలనము జరుగుచూ, ఈ దేహమంతా ప్రాణ సమన్వితమై ఉండటానికి కారణమగుచున్నది. **ఉద్దేశ్యపూర్వకంగా మనో-బుద్ధులకు సాధనోపకరణముగా తీర్చిదిద్దుకోవటమే ప్రాణాయామము.**

**ఓ సౌమ్యా!** ప్రాణాయామము ద్వారా 'ప్రాణ నిరోధము' అను సిద్ధిని సిద్ధించుకొన్న యోగుల విషయంలో వాయువు 'శంఖిణీ వివరము' అని పిలువబడుచున్న సుషుమ్నయందు ఉత్సాహపూరితమై సంచారము కలిగియున్నదగుచున్నది. తదితరుల విషయంలో ఇడ - పింగళల యందే అత్యధికంగాను వాయుసంచలనము జరుగుచుండటం జరుగుతోంది. ఈ విధంగా దేహము జీవించి ఉన్నంతవరకు ప్రాణవాయువు నాడులన్నిటిలో సంచలము కొనసాగుతూనే ఉంటుంది.

అయితే, సాధారణ సమయంలో సుషుమ్ననాడి మందత్వము వహించి ఉంటోంది. చురుకుతనము ఉండదు. **ప్రాణాయామముచే సుషుమ్ననాడి చురుకుగా అయి ఆ యోగికి ఉత్సాహం, ఆనందం ప్రసాదిస్తోంది.**

మనం చెప్పుకొన్న రేచక - పూరక - కుంభక పునఃరేచక విధి విధానంగా ప్రాణాయామాభ్యాసమును ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రము, రాత్రి కూడా నిర్వర్తిస్తూ కొన్ని నెలలు నిర్వర్తించువాడు క్రమంగా అంతర్ముఖుడు అగుచున్నాడు. అట్టివాడు కాలపరిధులను కూడా దాటివేయుచున్నాడు. కాలమునకు నియామకుడగు ఆత్మ భగవానుని సమక్షమును చేరి ఆత్మతో అద్వితీయత్వము సముపార్జించుకొనుచున్నాడు. త్రికాలజ్ఞాని అగుచున్నాడు. తదితర సర్వజీవులలో స్వస్వరూపమగు అంతరాత్మను సందర్శించుచూ పరమానంద సంభరితుడు అగుచున్నాడు.

ఓ త్రిశిఖి బ్రాహ్మణోత్తమా ! అంతేకాదయ్యా! ఆ యోగి అవసాన కాలము గురించిన జ్ఞానము కూడా కలవాడై జీవితావకాశమును ఎల్లప్పుడు సద్వినియోగము చేసుకొనుచున్నాడు. **దేహముల రాక - పోకలను ప్రాణాయామాభ్యాసముచే జనించిన యోగశక్తిచే సాక్షీభూతుడై లీలా-క్రీడా వినోదిగా సదర్శించుచున్నాడు.** యోగము అభ్యసించు యోగికి దేహముల రాకపోకలు వినోదభరితంగా అనుభూతమగుచున్నాయి. దేహముల రాకపోకలు, తదనంతర దేహనిర్ణయములు అతని బుద్ధికి వశమై ఉండగలవు కూడా!

# అవసాన కాలము - గుర్తెరుగుట

**త్రిశిఖి బ్రాహ్మణుడు :** యోగులు అవసాన కాలము గురించి గుర్తెరుగుచున్నారని, తదనంతర 14 లోకముల సంచారముల గురించి ఎరిగి ఉంటారని దేహ-దేహాంతరములను తమ ఆధీనంలో కలిగి ఉంటారని తమరు అంటున్నారు కదా! దేహ - యోగ శాస్త్రములను అనుసరించి **'అవసానదశ'** ను గుర్తెరగటం అవసానకాలం గురించి ఆయా సూచనల విషయమై వివరించ ప్రార్థన.

**ఆదిత్య భగవానుడు :** ఓ త్రిశిఖా ! వినండి. **అంగుష్ఠాది స్వ-అవయవ స్ఫురణాదశనేరపి, అరిష్టైః జీవితస్యాఽపి జానీయాత్ క్షయమ్ ఆత్మనః జ్ఞాత్వా, యతేత కైవల్య ప్రాప్తయే యోగ విత్తమః ।** "కాలి - చేతుల బొటన వ్రేళ్ళు' మొదలైన ఆయా శరీరములోని ప్రదేశములలో "ఇది నా అవయవము కదా"... అనే స్వ **అవయవస్ఫురణ** తగ్గి పోవుచున్నప్పుడు, " ఆహాఁ! **ఇక దేహము అవసానదశను సమీపిస్తున్నది కదా!"** అని యోగ విత్తములు గుర్తించుచున్నారు. అప్పుడిక కైవల్యప్రాప్తి కొరకై ప్రయత్నములను ఇనుమడింపజేసుకొని, మోక్షమును సిద్ధింపజేసుకుంటున్నారు. జీవులు అట్టి మార్గమును గుర్తెరిగి అనుసరించాలి.

**పాదముల - చేతుల బొటన వ్రేళ్ళు - అవి ఉన్నట్లేఉండని రీతిగా స్ఫురణ - నశించటం జరుగుతూ ఉంటే...?** -ఇక అతని వర్తమాన దేహము యొక్క మునుముందు ఆయుష్షు ఒక్క సంవత్సర కాలములోపే... అని గుర్తించబడుచున్నది.

**చేతుల, మణిబంధము (లేక) మణికట్టు యందు, గుల్ఫములయందు (కీళ్ళచీలమండలములందు) ఆ భాగములు ఉండినట్లే అనిపించక, స్ఫురణ నశించుచున్నప్పుడు -** అతనికి ఆదేహముతో శేషించిన కాలము '6' నెలల మించి కాదని గమనించబడుచున్నది.

**కర్పర (మోచేయి - మోకాలు) మండలములందు, స్ఫురణ నశించి, అవి తన దేహానుభవమునకు లభించనివగుచున్నప్పుడు** అతడు ఆ దేహమును కలిగియుండబోవుకాలము '3' నెలలు మించదని యోగి తెలుసుకొని ఉంటున్నాడు.

**కుక్షి (పొట్ట) - పార్శ్వ భాగములు, మేహన (మూత్ర విసర్జకాయవము, మొగగులు) యందు, పార్శ్వములయందు (చంకలయందు) స్పర్శ నశిస్తే (లేక) స్ఫురణ కోల్పోతూ ఉంటే,** అతనిక ఆ దేహముతో శేషించియున్న ఆయుర్దాయము ఒక నెల రోజులు మాత్రమే అని చెప్పబడుచున్నది.

***ఇవన్నీ ఎందుకు చెప్పుకుంటున్నాము?*** శేషించిన ఆయుష్షునైనా తత్త్వ దర్శనార్థము సద్వినియోగపరచుకోవాలని - ఈ జీవుడు తీవ్రముగా అనుకొని, చివ్వరి అవకాశమునన్నా సద్వినియోగమగునట్లు చేసుకోవటానికి.

**ఓ త్రిశిఖా ! ఇంకా కూడా వినండి.**

జఠరము (కడుపు)నందు స్ఫురణ కోల్పోతే, అనగా, పొట్టభాగము ఉన్నట్లే అనిపించటం మానివేసి **"నా పొట్ట భాగముఏమైందిరా?"**... అని అనిపించటం ప్రారంభమైతే... అతనికి ఆ దేహముతో సంబంధము 10 రోజులు మాత్రమేనని అనుకోవాలి.

**ఎవనికి కనులు తెరిచి చూస్తున్నప్పుడు మిణుగురు పురుగు కాంతివలె కాంతి వెలగటం - ఆరటంలాగా చుక్కలు చుక్కలుగా కనిపించటం ప్రారంభమౌతాయో...** అట్టి వాని ఆయుర్దాయము '5' రోజుల మాత్రమే మిగిలి ఉన్నట్లు.

**జిహ్వాగ్ర అదర్శనే త్రిణి దినాని స్థితి రాత్మనః ।** నాలుక చివర అనుభవానికి లభించకపోతూ ఉంటే, ఇక ఆ దేహము '3' దినములు మాత్రమే జీవించబోవుచున్నదని అర్థము అగుచున్నది.

**కంటికి ఆరని అగ్ని జ్వాలలు కనిపిస్తూ ఉంటే,** అతని దేహము పట్ల శేషించిన కాలవ్యవధి 'రెండు' రోజులు మాత్రమే.

ఇటువంటి ఆయా అనుభవములు, స్పర్శకోల్పోవుచున్న సూచనలు అనుభవమగుచూ ఉంటే, ఇంక ఆ దేహము క్షయించనున్నదని గుర్తెరగాలి.

ఓ త్రిశిఖా ! ఈ మృత్యు (దేహనాశన సంబంధిత) సూచనలు ఎందుకు చెప్పుకుంటున్నాము ? గతించిన దాని గురించి వ్యథలు త్యజించి, మిగిలిన సమయమును సద్వినియోగపరచుకోవటానికి. ఈ జీవుడు జపము, తపస్సు, కుంభకాది ప్రాణాయామములు, ఆధ్యాత్మ శాస్త్ర శ్రవణము, తత్త్వమ్, సోఽహమ్ ఇత్యాది మహా వాక్యార్థాల వివరణలను ఆత్మజ్ఞుల ముఖతః వినటము, మహనీయులను దర్శించటము, వారిని ఆహ్వానించి వారి ఆత్మ సంబంధమగు అప్త వాక్యములను పదిలపరచుకోవటం! లౌకిక విషయములన్నీ త్యజించి వేయటము... ఇత్యాది ప్రయత్నములను సిద్ధింపజేసుకోవటానికి. నిశ్రేయమగు మోక్షము కొరకై సర్వవిధముల మనో - బుద్ధులను అత్యంత ఉత్సాహ - ఏకాగ్రతలతో నియమించటానికి. మనస్సుతో పరమాత్మనే ధ్యానించాలి. సర్వాంతర్యామినే సర్వత్రా

సర్వ– స్వరూపుడుగా దర్శించాలి. స్వస్వరూపుడుగా ఆస్వాదించాలి. **మనసా పరమాత్మానం ధ్యాత్వా 'తత్' రూపమ్ ఆప్నుయాత్** । మనస్సుతో తత్ రూపమే ధ్యానిస్తూ ఉంటే, తత్ రూపుడు కాగలడు. **'యోగ ప్రత్యాహారము'** ను అతి శ్రద్ధగా, తీవ్రంగా ఆరంభించాలి.

**అంతేగాని, భయపడుచూ క్షణక్షణం గడపటం బుద్ధిజీవుడగు మానవునికి ఉచితం కాదు.**

**యోగ ప్రత్యాహారము : యత్ అష్టాదశ భేదేషు మర్మ స్థానేషు ధారణమ్ స్థానాత్ స్థానమ్ సమాకృష్య "ప్రత్యాహారః" ... స ఉచ్యతే ।** దేహములోని '18' బేధములతో కూడిన మర్మ స్థానములందు ఏ ప్రాణశక్తి ధారణ చేయబడుచున్నదో... అట్టి ధారణను బుద్ధితో ధరించి ప్రాణ వాయువును ఒక చోట నుండి మరొకచోటికి చేర్చుటను (స్వకీయ ఇచ్ఛచే కొంతకొంతసేపు చేర్చి ఉంచు యోగసాధనను) **"ప్రత్యాహారము"** అంటున్నారు.

**ప్రత్యాహార విశేష నిర్వచనము**

చూచువాడు – చూడబడునది – చూడటము.
వినువాడు – వినబడునది – వినటము.
చెప్పువాడు – చెప్పబడునది – చెప్పటము.
స్పర్శించువాడు – స్పర్శించబడునది – స్పర్శ.
రుచిచూచువాడు – రుచి చూడబడునది – రుచి.
ఆలోచించువాడు – ఆలోచించబడునది – ఆలోచన.

ఇవన్నీ ఏ ప్రాణశక్తితో ధారణ చేయబడుచున్నదో అదే ధారణచే వాటికి ఆధారమై, వాటికి వేరై, వాటి రూపములను ప్రదర్శించు ఆత్మయందు ధ్యాస కలిగి ఉండటమే **ప్రత్యాహారము**.

**18 మర్మ స్థానములలో ప్రత్యాహారము:**

చిత్తమును (లేక) ధ్యాసను (లేక) మనస్సును ఆరోహన (క్రిందనుంచి పైకి), అవరోహణ (పై నుండి క్రిందికి) క్రమముగా మార్చి మార్చి 18 మర్మ స్థానములలో నిలపటమును **'ప్రత్యాహారము'**. వాటిని వివరిస్తున్నాను, విను.

## 18 మర్మ స్థానములు

| | | | |
|---|---|---|---|
| 1) | పాదాంగుష్ఠమ్ | – | కాళ్ళ బొటన వేళ్ళు |
| 2) | గుల్ఫము | – | కాలి చీలమండలము |
| 3) | జంఘా మధ్యము | – | కాలి పిక్క భాగము |
| 4) | ఊరు మధ్యము | – | కాళ్ళ మోచిప్పలు – తొడల మధ్య భాగము. |
| 5) | ఊరు మూలము | – | తొడల మూల భాగము |
| 6) | పాయువు | – | గుదము – మల విసర్జనా అంగము |
| 7) | హృదయము | – | గుండె ప్రదేశము |
| 8) | లింగము | – | ఉపస్థ, పునరుత్పత్తి అవయవ ప్రదేశము |
| 9) | నాభి | – | దేహ మధ్య నాభి, దేహకేంద్ర ప్రదేశము |
| 10) | కంఠ కూర్పరము | – | కంఠ కేంద్రస్థానము |
| 11) | తాలు మూలము | – | దవడ మూల స్థానము |
| 12) | ఘ్రాణ మూలము | – | ముక్కుకు ఉపరితల, లోతు ప్రదేశము |
| 13) | నేత్ర గోలములు | – | కనుగ్రుడ్లు స్థానము |
| 14) | భ్రూమధ్యము | – | రెండు కనుబొమ్మల మధ్య ప్రదేశము |
| 15) | లలాటము | – | నుదురు ప్రదేశము |
| 16) | జానువులు | – | మోకాళ్లు |
| 17) | మూర్ధము | – | ముఖ ఊర్ధ్వ భాగము (Upper Fore face) |
| 18) | కర్ణమూలములు | – | చెవుల మూల ప్రదేశము |

ఈ 18 స్థానములయందు మార్చి మార్చి కుంభక ధారణ చేయాలి.

ఈ పాంచభౌతిక దేహమునందుగల పంచభూతముల యందు ధారణను గురించి కూడా విను. యమ – నియమముమలతో సంస్కరింపబడిన (యుక్తమైన – నియమితమైన) మనస్సును దేహములోని పంచభూతములపై నియమించటము **దేహాంతర్గత పాంచభౌతికధారణ** అని అంటారు

## పంచభౌతిక ధారణ యోగ విశేషములు

### (దేహాంతర్గతంగా)

ఈ దేహములోని వేరువేరు విభాగములలో ఒక్కొక్క పాంచభౌతిక తత్త్వము విశేష ధర్మము కలిగియున్నట్లుగా యోగ శాస్త్రముచే విశదీకరించబడుచున్నది. అట్టి విశేషాలు ఇక్కడ ఉదహరించుకొనెదము గాక.

**పృథివీ స్థాన ధారణ :** (భూమి)

**ఆజానుపాద పర్యంతం పృథివీస్థానం ఇష్యతే ।** → *ఆజాను పాద పర్యంతము - భూ ఉపాసన*

పాదములు మొదలుకొని మోకాలు వరకు ... పృథివీస్థానము. ఈ పృథివీ స్థానము పీత (పసుపు) వర్ణము ... చతురస్రాకారము కలది. వజ్ర లాంఛితమై యున్నట్టిది. ఈ స్థానములో 'భూతత్త్వము'ను ఉపాసించాలి. (పాదములనుండి మోకాళ్ళ వరకు)

***ఈ భూతత్త్వమును హృదయమునందు ఆరోపించి '5' ఘటికల (24ని॥ x 5 = 2 గం॥) కాలము కుంభక ప్రాణాయామము చేయబడును గాక!***

**అంభసి స్థాన ధారణ : (జలము)**

**ఆజాను-కటిపర్యంతం 'అపాంస్థానం' ప్రకీర్తితము ।** → *ఆజాను - కటి పర్యంతం - జలోపాసన!*

మోకాలి నుండి కటి (నడుము) ప్రదేశము వరకు జలతత్త్వము ఆవరించి ఉన్నది.

– అర్ధచంద్ర సమాకారము

– శ్వేత (తెలుపు) వర్ణలాంఛితము

***ఈ జలతత్త్వమును హృదయమునందు ఆరోపించి – '10' ఘటికల (24ని॥ x 10 = 240ని) కాలము కుంభక ప్రాణాయామము నిర్వర్తించబడుగాక.***

**అగ్నిస్థాన ధారణ :**

**ఆ దేహమధ్య కట్యంతం 'అగ్నిస్థానం' ఉదాహృతమ్ ।** → *కటి ప్రదేశం నుండి బొడ్డు వరకు - అగ్ని ఉపాసన*

కటి (మొల) ప్రదేశమునుండి దేహము యొక్క మధ్యగాగల 'నాభి' (బొడ్డు) వరకు అగ్ని స్థానము. వర్ణము – సింధూరము (ఎరుపు) అగ్ని జ్వలించుచూ ఉండు ప్రదేశము.

**ఈ అగ్ని తత్త్వమును హృదయమునందు ఆరోపిస్తూ '15' ఘటికల *(24ని॥ x 15 = 360 ని)* కాలము కుంభక ప్రాణాయామము చేయాలి.**

**వాయుస్థాన ధారణ :**

**నాభేః ఉపరి నాసాంతం 'వాయుస్థానం తు' తత్రవై** → *నాభి నుండి ముక్కు రంధ్రము వరకు వాయు ఉపాసన*

– నాభిప్రదేశము నుండి ముక్కు యొక్క ఉపరిస్థానము వరకు.. **వాయు స్థానము.** వేదిక (Drama Stage) వంటి ఆకారము. వర్ణము – పొగ (ధూమ్ర) వర్ణము. ఈ వాయు తత్త్వమును హృదయమునందు ఆరోపించి '20' ఘటికల సమయము కుంభక ప్రాణాయామము చేయుదురు గాక.

**ఆకాశ స్థాన ధారణ :**

**వ్యోమస్థానం నభస్తత్ర భిన్నాంజన సమప్రభమ్। ధ్యేయం మారుతం ఆరోప్య కుమ్భకేనైవ యత్నవాన్ ॥** → *ముక్కు ఉపరిభాగము నుండి బ్రహ్మ రంధ్రము వరకు ఆకాశ - ఉపాసన.*

నాసా ఉపరిరంధ్రము నుండి బ్రహ్మ రంధ్రము వరుకు – **ఆకాశ స్థానము.**

– ఇది నిరాకారము.

– రంగు – కాటుక వర్ణము (భిన్నాంజన సమప్రభమ్)

ఇట్టి ఆకాశతత్త్వమును హృదయమునందు ఆరోపించాలి. ముక్కు పై రంధ్రము నుండి బ్రహ్మ రంధ్రము వరకు గల ఆకాశతత్త్వమును హృదయమునందు ఆరోపించి '20' ఘటికల కాలము 'కుంభక ప్రాణాయమము' నిర్వర్తించుదురుగాక.

**పంచభూత స్థాన ధారణ - సాకార రూప భావన :**

**పృథివ్యం శేతు దేహస్య చతుర్బాహుమ్, కిరీటినమ్, అనిరుద్ధం హరిం యోగీ యతేత భవముక్తయే।**

దేహము యొక్క **పృథివీ అంశమును** ధ్యానించుచున్నప్పుడు - చతుర్బాహుడు కిరీటధారి అగు **హరి యొక్క అనిరుద్ధ అంశను** ధ్యానించుచూ యోగధ్యానము చేయాలి. అట్టి యోగి సర్వ సంసార బంధముల నుండి విముక్తుడగుచున్నాడు.

దేహములోని **'జలాంశ'** యందు **నారాయణ భగవానుని, అగ్ని అంశ** యందు **ప్రద్యుమ్నుని,** వాయు - అంశయందు **సంకర్షణుని, ఆకాశము** నందు పరమాత్మయగు **వాసుదేవుని** ఎల్లప్పుడు స్మరించాలి.

ఎవ్వరైతే దేహములోని పృథివీ - జల - అగ్ని - వాయు ఆకాశ తత్త్వములను చతుర్బాహు - కిరీటధారియగు **అనిరుద్ధ - నారాయణ - ప్రద్యుమ్న - సంకర్షణ వాసుదేవ** స్వరూపులుగా సదా స్మరిస్తూ ఉంటారో, అట్టి యోగి ఆయా దేవతా స్వరూపములను తప్పక సిద్ధించుకొనగలడు. ఇందులో సందేహమేలేదు.

యోగసాధకుడైనవాడు....,

ఈ భౌతిక దేహమును స్వస్తిక **- గోముఖ - వీర - యోగ -** పద్మ **- బద్ధ పద్మ - కుక్కుట - ఉత్థాన కూర్మ - ధను - సింహ - భద్ర - ముక్త - మయూర - మత్స్య పీఠక - సిద్ధ - పశ్చిమాంతాణ - సుఖాసనములలో** ఏదో ఒకటి - శరీరమునకు అనుకూలమైనది ధరించవచ్చు. ఆతనికి ఆ ఆసనము **క్షణముల కాలంలో (అతిత్వరగా) స్వీకరిస్తూ దీర్ఘ కాలము ధరించగలిగనది అయి ఉండాలి.** అట్టి సానుకూల్య ఆసనమును ఎన్నుకొని **- బద్ధ్వా యోగాసనం పూర్ణం** - యోగాసనముచే భౌతిక దేహమును నియమించి...,

**హృత్‌దేశే హృదయాంజలిః :** హృదయాకాశములో హృదయాంజలి సమర్పిస్తూ...,

**నాసాగ్రన్యస్త నయనో :** ముక్కుకు అగ్రభాగమునందు దృష్టిని నిలిపి...,

**జిహ్వాం కృత్వాచ తాలుని :** నాలుకను తాలు ద్రేశమునకు (దవడకు) సున్నితముగా తాకి ఉంచి ...,

**దంతైః దంతైః న సంస్పృశ్య :** క్రింది - పైన దంతములు తాకకుండా ఉంచుతూ...

**ఊర్ధ్వ కాయః సమాహితః :** నడుమును, ముఖమును నిలువుగా ఉంచి, సమాహితమైన - నిర్మలమైన బుద్ధితో...,

**సంయమేత్‌చ ఇంద్రియ గ్రామం :** "ఇంద్రియములను బాహ్య విషయాలపై వ్రాలకుండా (శబ్ద స్పర్శ రూప రస గంధములచే ఆకర్షించబడకుండా) నిలిపి ఉంచి...,

**ఆత్మ బుద్ధ్యా విశుద్ధయా :** బుద్ధిని నిర్మలముగా రూపొందిస్తూ, ఆత్మను సర్వత్రా దర్శించు స్వభావమును అభ్యసింపజేస్తూ...,

**చింతనమ్ వాసుదేవస్య పరస్య పరమాత్మనః, స్వరూప వ్యాప్త రూపస్య ధ్యానం కైవల్య సిద్ధిదమ్ ।**

సర్వమునకు 'పరము' అయినవాడు (ఆవల ఉన్నవాడు), సర్వస్వరూపుడై వ్యాప్తి పొంది విస్తరించి ఉన్నవాడు -అగు వాసుదేవుని **సర్వ జీవులలో, సర్వ జీవులుగా** కూడా సర్వదా వేంచేసి ఉన్నవానిని ధ్యానచింతన చేయాలి ! అట్టి ధ్యానము కైవల్యమును సిద్ధింపజేయగలదు.

ఈ విధంగా ఒక యామము (ఒకపూట కొద్ది క్షణములు) సమయము కుంభక ప్రాణాయామ విధానములో **సర్వాంతర్యామి - సర్వతత్త్వ స్వరూపుడు** అగు వాసుదేవుని భావోపాసన చేసినంత మాత్రం చేత '7' జన్మలుగా వచ్చిపడియున్న పాపదృష్టులు, పాపకర్మల దోషాలు తొలగిపోగలవు.

## జీవుని యొక్క జాగ్రత్ - స్వప్న - సుషుప్తి - తురీయ - దేహాంతర్గత - వర్తన ప్రదేశములు:

**త్రిశిఖి బ్రాహ్మణుడు :** స్వామీ! పరమాత్మా! త్రిలోకవర్తీ! లోక ప్రకాశకా! ఆదిత్య భగవాన్! ఇక ఇప్పుడు యోగ శాస్త్రప్రవచనా నుసారంగా భౌతిక దేహములో జాగ్రత్-స్వప్న-సుషుప్త తురీయముల కేంద్రీకృత - సంచారస్థానముల గురించి వివరించ ప్రార్థన.

**ఆదిత్య భగవానుడు :** కొన్ని విశేషాలు వివరిస్తున్నాను. వినండి .

జాగ్రత్ వృత్తి :

**శ్లో ॥ నాభికందాత్ సమారభ్య యావత్ హృదయ గోచరమ్ జాగ్రత్ వృత్తిం విజానీయాత్ ।** → హృదయ ప్రదేశం→జాగ్రత్ వృత్తి స్థానం:

**నాభి (బొడ్డు) కందము నుండి – హృదయ ప్రదేశము వరకు అంతటా గోచరము అగుచున్నది జాగ్రత్ వృత్తి ।**

**స్వప్న వృత్తి : కంఠస్థం స్వప్న వర్తనమ్ ।** → *(కంఠ హృదయ ప్రదేశం స్వప్న వృత్తి స్థానం):*

హృదయప్రదేశము నుండి కంఠము వరకు గల ప్రదేశము "స్వప్న వర్తన ప్రదేశము"... అని గమనించబడునుగాక !

**సుషుప్త వృత్తి : సుషుప్తం తాలు మధ్యస్తం ।** → సుషుప్తి స్థానం

తాలు (దవడ) మధ్య ప్రదేశము సుషుప్త సంచార స్థానమని గుర్తెరుగబడుగాక !

**తుర్యగ వృత్తి స్థానము : తుర్యం భ్రూమధ్య సంస్థితః ।** → భృకుటి తురీయ స్థానం

రెండు భ్రుకుటుల మధ్యగా పై ప్రదేశములో గల ఆకాశములో – **తుర్యగుని సంచార స్థానము.**

**తుర్యాతీత స్థానము : తుర్యాతీతం పరబ్రహ్మ బ్రహ్మరంధ్రేతు లక్షయేత్ ।** → *బ్రహ్మరంధ్రం తురీయాతీత స్థానం*

తుర్యాతీతమైన స్థానము కొరకై **'బ్రహ్మరంధ్రము'**ను లక్ష్యముగా చేసుకొని ఉండాలి.

**విష్ణుతత్త్వము - విష్ణుపదము : జాగ్రత్ వృత్తిం సమారభ్య యావత్ బ్రహ్మ బిలాంతరమ్ తత్ర ఆత్మానం తురీయస్య తుర్యాంతే 'విష్ణు' ఉచ్యతే ।**

జాగ్రత్ వృత్తిగల నాభి మొదలుకొని–బ్రహ్మరంధము వరకు గల ఆత్మ యొక్క ఉనికిని 4 ప్రదర్శనములుగల 'తురీయము'–అని అంటారు. తురీయము యొక్క ఆవల తురీయాతీత ఆత్మ స్వరూపమును **"విష్ణు భగవానుని స్వరూపము, సంస్థానము"** కూడా! అదియే విష్ణు పదము. బ్రహ్మరంధ్రమునకు ఆవల తురీయాతీత స్థానంలో **"ఇదమేవ తత్ విష్ణుః"**... అనునది సులభంగా అనుభూతం కాగలదు.

ఈ జీవుడు స్వతఃగా ఆత్మానందస్వరూపుడే అయి ఉండి కూడా..., స్వప్న సంఘటనాచమత్కారము వలె, తనకు తానే కల్పించుకొనుచున్నట్టి స్వకీయసంకల్పనా పరంపరలలో చిక్కుకొని, దేహ – దేహాంతరములకు ఒక కాందిశీకునివలె ప్రయాణములు చేయుచు, **"నేను బద్ధుడను ! దేహపరిమితుడను! దుఃఖితుడను! ఇంతే! ఈ బంధము తొలిగేది ఎట్లారా బాబూ?"** అని నిర్వీర్యుడగుచున్నాడు.

మరి అందుకు తరుణోపాయం ? చెప్పుచున్నాను, విను !

ఈ జీవుడు ధ్యానమునకు ఉపక్రమించాలయ్యా ! జగత్ విషయ ధ్యానమును నెమ్మది నెమ్మదిగా సన్నగిల చేసుకొనుచూ, తురీయాతీత తత్త్వమును ఆశ్రయించాలి. అనగా, **సర్వజీవుల సహజానంద స్వరూపుడు, ధ్యాని యొక్క స్వస్వరూపుడే** అగు విష్ణు భగవానుని ధ్యానించాలి. కుంభక ప్రాణ యోగాభ్యాసముచే ఆ విష్ణు భగవానుని తత్త్వము పట్ల మనో ప్రాణములను ఏకాగ్రం చేసి నిలుపుచూ తన్మయుడు, తత్ – స్వరూపుడు కావాలి.

- నిర్మల హృదయాకాశమునందు (రాగ – ద్వేష – దృశ్య సంభావన అనే మేఘములు తొలగించబడిన హృదయాకాశంలో),
- **కోటి సూర్యకాంతుల ప్రభాభాసమానుడు,**
- **విద్యుత్ కాంతివలె మహాతేజోవిలాస స్వరూపుడు,**
- **హృదయపుష్పముయొక్క అంతరమున చిరునవ్వులు చిందిస్తూ ఆసీనుడై ఉన్నవాడు,**
- **ఈ విశ్వమంతా తన స్వరూపముగా కలిగి ఉన్నవాడు.**

**అగు ఆ అధోక్షజ శ్రీమన్నారాయణుని కుంభక ప్రాణాయమ యుక్తుడై ఉపాసించాలి!**

ఇంకా కూడా ...,

- ఈ దృశ్య జగత్తులో కనిపించే జీవాకారములన్నీ తనవే అయి ఉన్నవారు, దృశ్యకల్పనా కళాకారుడు,
- ఈ అనేక ముఖములతో ప్రదర్శమగుచున్నవారు (సహస్ర శీర్షా పురుషః,
- అనేక భుజములను కలిగియున్నవారు..., అనేక సృష్టికల్పనా సామర్థ్య సమన్వితుడు...,
- సర్వత్రా – సర్వహృదయస్థుడై ప్రకాశమానమగుచు, ఎత్తబడిన అనేక ఆయుధములు ధరించియున్నవారు...,
- అనేక వర్ణములతో ప్రకాశించువారు...,
- పరమోగ్ర స్వరూపుడుగా కనిపిస్తూ పరమశాంత స్వరూపుడై యున్నవారు,
- అనేక కళ్ళు – దర్శనములు – దృష్టులు కలవారు...,
- కోటి సూర్య సమప్రభాభాసులు....,

**అగు ఆ ఆత్మ భగవానుని ఏ యోగి ధ్యానము చేస్తూ ఉంటాడో...** అట్టివానియొక్క సర్వ దృశ్య – మనోవృత్తులన్నీ తమకు తామే వినాశనము కాగలవు. అనగా, దృశ్యమంతా – మనస్సుతో సహా ఆత్మకు అభిన్నమై అనుభవమవగలదు.

**హృత్ పుండరీక మధ్యస్థం** – హృదయ కమలమునందు సదా వేంచేసి ఉన్నవారు!

**చైతన్యం, జ్యోతిం** – చైతన్య జ్యోతిస్వరూపులు!

**కదమ్బగోళాకారం** – సర్వతత్త్వములు తన కుక్షియందు కలిగియున్నట్టి కదంబ గోళాకారుడు!

**తుర్యాతీతమ్** – జాగ్రత్ స్వప్న సుషుప్తులలో సంచరించు తురీయమునకు కూడా ఆవలవాడు, తురీయ – నియమామకుడు!

**పరాత్ పరము** – జీవునికి చెందిన ఇహమునకు ఆవల గల 'పరము'నకు కూడా (సర్వ దృశ్య జగత్తు తనయందు కలిగియున్నట్టి)... పరాత్పరుడు.!

**అనంతమ్** – అంతము అనునది లేనివాడు. అనంతుడు. దృశ్య–దేహ–మనో–బుద్ధి–చిత్త–అహంకారాలు, లోకములు, లోకపాలకులు... మొదలైనవన్నీ ఆయన రచనలేగాని, వాటిచే ఆయన పరిమితుడు కాదు. అపరిమితుడు. నవలలోని పాత్రలకు, పాత్రల స్వభావములకు, సంఘటనలకు, సంబంధములకు, సందర్భములకు – రచయిత పరిమితుడు అవుతాడా?

**ఆనందమయమ్** – కేవలానంద స్వరూపుడు!

**చిన్మయమ్** – సర్వము 'ఎరుక' చే వెలిగించు చిన్మయ స్వరూపుడు!

**భాస్కరమ్** – సర్వ ప్రకాశకుడు! ఆయనయొక్క ప్రకాశమే ఈ జగత్ చమత్కారములు!

**విభుమ్** – సర్వనియామకుడు!

**నివాత దీప సదృశమ్** – గాలివీచికలు లేని చోట కదలిక లేకుండా వెలుగొందు దీప శిఖవంటివాడు!

**అకృత్రిమ మణిప్రభమ్** – స్వభావంగానే అనేక మణికాంతులతో వెలుగొందువాడు!

అగు ఆ హరిని ధ్యానము చేయుచున్న యోగులకు 'ముక్తి' అనునది (అరచేతిలోని ఉసరికాయవలె) కరతలామలకమగుచున్నది.

ఈ విశ్వమంతా తన రూపమై విరాజిల్లుచున్న ఆ దేవదేవుని, ఎవ్వడైతే, తన అభిరుచిని అనుసరించి, **సాకారంగానో, నిరాకారంగానో, స్థూలరూపంగానో, సూక్ష్మ రూపంగానో** హృదయ పద్మములో **ధ్యానిస్తాడో**, అట్టి యోగికి ఆ పరమాత్మ **సులభముగా స్వస్వరూపుడై సాక్షాత్కరించుచున్నారు**. అట్టి వానిని స్వయముగా అణిమ, గరిమ మొదలైన అష్టసిద్ధులు తమకు తామే ఆశ్రయించుచున్నవగుచున్నాయి.

– ఈ జీవాత్మగాను, దీనికి ఆవల పరమాత్మగాను ఉన్నది నేనే ! అభయ స్వరూపుడగు ఆ భగవానుడను నేనే !

– 'పరబ్రహ్మము' అని శాస్త్రములు ఎలుగెత్తి గానం చేస్తున్నది నా యొక్క సహజము – నిత్యము – పరము – అప్రమేయము అగు స్వరూపము గురించి మాత్రమే ! అంతేగాని పరబ్రహ్మమనగా ఎక్కడో ఉన్నది కాదు. మరెన్నిటికో ఏదే ప్రయత్నముల అనంతరము ఏచోటనో ఎప్పటికో లభించవలసినది ఏ మాత్రం అయి ఉండలేదు! ఈ సర్వజీవుల స్వరూపుడనై ఉన్నాను!

అహమ్ బ్రహ్మమేవ । అహమ్ బ్రహ్మోఽస్మి । సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ । జీవో బ్రహ్మేఽతి నాపరః ।

ఇట్టి ప్రయోజనము తురీయాతీత స్వరూపమగు నారాయణ (లేక) హరి ఉపాసన **"కుంభక ప్రాణాయామోపాసనా క్రమము"**చే తప్పక సిద్ధించగలదయ్యా । లక్ష్యముగా అట్టి శివోఽహమ్ అయిఉండును గాక! (Let it be the main objective).

## సమాధి

తురీయ – తురీయాతీత స్వరూపము, సర్వాత్మకము అగు శ్రీహరి – ఉపాసనను కుంభక ప్రాణాయామ మార్గములో ఉపాసించువారికి అణిమ – గరిమ మొదలైన అష్టసిద్ధులు స్వయముగా ఆశ్రయిస్తూ ఉంటాయని అనుకున్నాము కదా !

అయితే, అట్టి కుంభక ప్రాణ పూర్వక పరమాత్మోపాసన యొక్క అంతిమ లక్ష్యము 'సమాధి' యోగమే గాని, సిద్ధులు సంపాదించటము కానేకాదు. ఎందుకంటే, అట్టి సిద్ధులు ధనము ఇత్యాది సంపదలవలె మాయలోనివి మాత్రమే. అవన్నీ 'సమాధి'కి సంబంధించినవి కానేకావు. సమాధికి అవి అగత్యము కాదు. మెట్టువంటివి కూడా కానే కావు. వాస్తవానికి అవి సంసృతి (సంసార) సంబంధమైనవే!

అల్పజ్ఞానికి అవి ఆత్మసాక్షాత్కారమునకు అడ్డులు కాగలవు కూడా ! సమాధి స్థితి సర్వసిద్ధులకు సంబంధించినదే కాదని గ్రహించబడుగాక! ఆ స్థితి వాస్తవానికి సర్వసిద్ధుల వివర్జితమైనది. బ్రహ్మమును సిద్ధింపజేసుకొన్న యోగి తిరిగి సంసృతి (సంసారము) నందు దిగజారటము లేదు. అతడు 'తత్త్వమ్ (తత్ – త్వమ్... త్వమ్‌గా కనిపించేది తత్స్వరూపమగు పరబ్రహ్మమే)"ను శోధించి, ఇక ప్రాపంచక సంగతి – సందర్భము – సంబంధముల వ్యవహారముల పట్ల కథా శ్రవణమువలె సస్పృహ–నిస్పృహుడై ఉంటున్నాడు. నాటకమును చూస్తూ ఉన్నవాని వలె జగత్ దృశ్యమునకు అతీతమైన బుద్ధిని కలిగినవాడై ప్రకాశిస్తున్నాడు.

ఏ విధంగా ఇంధనము లేనప్పుడు అగ్ని మొదలంట్లా శమిస్తుందో (Subsides), ఆ రీతిగా ఆత్మతత్త్వమును తన అప్రమేయ స్వస్వరూపమును ఎరిగినవాని సర్వ ఆదుర్దాలు తొలగుతాయి. ఆతడు నిశ్చయ సిద్ధుడు – తత్త్వజ్ఞాని అగుచున్నాడు. అతని పట్ల మనస్సు, ప్రాణము కూడా స్వయముగా శాంతిస్తున్నాయి. శమిస్తున్నాయి. ఆత్మతత్త్వమును సంతరించుకొనుచున్నాయి.

ఓ త్రిశిఖి బ్రాహ్మణోత్తమా ! ఒక ఉప్పు బొమ్మ జలములో ప్రవేశించినప్పుడు ఆ బొమ్మ యొక్క రూపు – రేఖలు, దానియందలి సైంధవ లవణరేణువులు ఏమగుచున్నాయి? తమ నామ – రూప – వస్తుతత్త్వము కోల్పోయి జలముతో ఏకమై జలమునకు వేరుగా కనబడనివి అగుచున్నాయి కదా !

అట్లాగే...,

బ్రాహ్మీస్థితి సంపాదించుకొన్నవానికి ఈ ఎదురుగా కనిపిస్తున్న జగత్తంతా కూడా పైకి అనేక మోహజాలములలో (Nets of Illusion) కూడినదిగా, అయితే వాస్తవానికి **బ్రహ్మముగా** – సుస్పష్టముగా తెలిసిపోతోంది. స్వకీయ భ్రమ – అనే లీలా విశేషంగా – తెలియవచ్చుచున్నది.

### మోహ జాలక సంఘాతో విశ్వం పశ్యతి స్వప్నవత్ :

ఒకడు రాత్రి భోజనానంతరము ప్రశాంతంగా నిదురించి కల గనటం ప్రారంభిస్తున్నాడు. ఆ కలలో అనేక సందర్భములు, సంఘటనలు, దృశ్యాలు ! కొన్ని భయం కలిగించేవి ! మరికొన్ని ఆవేదన, రోషము కలిగించేవి ! ఇంకొన్ని సంతోషము కలిగించేవి, గర్వము జనింపజేసేవి ! ఇంకాకొన్ని అర్థరహితంగాను, ఆయుక్తంగాను, అసందర్భముగాను ఉంటాయి! తెల్లవారింది అతడు నిదురలేచాడు. తెల్లవారిన తరువాత ?

ఆ స్వప్నము తనదైన జీవుడు తెల్లవారిలేచి **"ఆc! ఏముందిలే ! కించిత్ కూడా సత్యమే లేనప్పుడు, ఇక కలలో జరిగిన దాని గురించి చర్చించేదేమున్నది ? ఆలోచించవలసినది ఏముంటుంది ?"**... అని అనుకుని మరుక్షణం స్వప్న దృశ్యాంతర్గత విషయాలన్నీ మొదలంట్లా త్యజించి ఉంటాడు. అంతేగాని **"నా కలలో కనిపించి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటాను"** – అని జాగ్రత్‌లో బయల్వెడలుతాడా? లేదే ! కలలో పొందిన కష్టములను గుర్తు చేసుకుంటూ రోజులతరబడి దుఃఖిస్తూ కూర్చుంటాడా? లేదు కదా!

అట్లాగే ...

బ్రహ్మ తత్త్వ జ్ఞానైశ్వర్యము సంపాదించుకొన్నవారు వర్తమాన జాగ్రత్ వ్యవహారమునంతటినీ కరగిపోతూ ఉన్న స్వప్నమువలె చూస్తున్నారు. మౌనంగా, అతీతంగా, ప్రశాంతంగా, లీలా వినోదంగా సర్వాతీతమగు అవగాహనను కలిగి ఉంటూనే, **యథాతథంగా లోకధర్మములను శాస్త్రధర్మములను లోకరీతి కొరకై నిర్వర్తిస్తున్నారు.**

గాఢనిద్రా పరవశుడైనవాడు నిద్రకొనసాగిస్తూనే అడుగులు వేస్తూ నడుచు రీతిగా ఈ లోకములో చరిస్తున్నారయ్యా!

**నిర్వాణపదమ్ ఆశ్రిత్య యోగీ కైవల్యమ్ అశ్నుతే ।**

అట్టి ఆత్మ సంయమయోగులు..., నిర్వాణపదమును ఆశ్రయించినవారై కైవల్యపదమును సముపార్జించి, బ్రహ్మానందమును అనుక్షణికంగా ఆస్వాదిస్తూనే, ఈ కల్పనా జగత్తులో లీలగా, క్రీడగా సంచరిస్తున్నారయా!

**ఇతి**

***త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్***

***ఓం శాంతిః శాంతిః శాంతిః***

శుక్ల యజుర్వేదాంతర్గత


⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 8 నిరాలంబోపనిషత్

(అశఙ్క్య మునీశ్వర ప్రవచనములు)

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ యత్ర ఆలంబ ఆలంబి భావో విద్యతే న కదాచన**
**జ్ఞ విజ్ఞః సమ్యక్ జ్ఞాలంబం నిరాలంబం హరిం భజే॥**

***ఏ స్థానమందైతే*** *ఆలంబన (ఆధారపడి ఉండి పోవటం) అను భావాలయొక్క ఆలంబనయే ఉండదో, (నేను మరొక వస్తువుపై ఆధారపడి ఉన్నాను - అను ఆలంబనా భావము రహితమౌతుందో),* ***జ్ఞాన విజ్ఞాన పూర్వకమగు సమ్యక్ జ్ఞానము*** *మాత్రమే ఆలంబనమై శేషిస్తుందో...* ***అట్టి నిరాలంబమగు*** *తత్త్వమును వివరించుకుంటున్నాము.* ***సర్వమునకు ఆశ్రయమగుచూనే,*** *తాను మాత్రం దేనిచేతా* ***ఆశ్రయము-ఆలంబనము కలుగు అవసరమే ఉండనట్టివాడు,*** *సర్వమునకు అప్రయమేయుడు,* ***నిత్యోదిత జ్యోతి స్వరూపుడు అగు శ్రీహరికి*** *నమస్కరిస్తున్నాము. ఆయనయే ప్రత్యక్ష జగత్ జ్యోతి స్వరూపుడు. సర్వ చీకట్లు తొలగించు దీపమును చూడటానికి మరొక దీపపు వెలుగుతో ఏమి పని? అటువంటి స్వయం జ్యోతి - ఆత్మ స్వరూపుడగు శ్రీహరిని శరణు వేడుచున్నాము.* ***మనమంతా అట్టి ఆత్మజ్యోతి స్వరూపులం!***

**1. హరిః ఓం**
**ఓం నమః శివాయ**
**గురవే సచ్చిదానంద మూర్తయే।**
**నిష్ప్రపంచాయ శాన్తాయ**
**నిరాలంబాయ తేజసే।**
**నిరాలంబం సమాశ్రిత్య**
**సాలంబం విజహాతి యః,**
**స సన్న్యాసీ చ, యోగీ చ**
**"కైవల్యం పదమ్" అశ్నుతే।**
**ఏషామ్ అజ్ఞాన జన్తూనాం**
**సమస్త అరిష్ట శాంతయే,**
**యత్ యత్ బోధవ్యం అఖిలమ్**
**తత్ ఆశంక్య బ్రవీమి అహమ్।**

ఓంకార స్వరూపుడగు శ్రీహరికి నమస్కరిస్తూ....!

"ఓం" అను అక్షరమునకు అర్థము అయి ఉన్నవారు, లోక గురువు, సాక్షాత్ సత్-చిత్-ఆనందములుగా మూర్తీభవించుచున్నవారు, ఈ పాంచభౌతిక ప్రపంచమునకు, సర్వసంఘటనలకు ఆవల ఉన్నవారు, కేవలసాక్షి, పరమశాంత స్వరూపులు, తేజో రూపులు, పంచభూతముల - అంతరంగ చతుష్టయముల వంటి ఏ ఆలంబముతో అగత్యము - (అవసరము) లేనివారు అగు **శివ భగవానునికి నమస్కరిస్తున్నాము.**

ఈ జీవుడు దేహ-మనో-బుద్ధి-చిత్తములకు బద్ధుడై ఉపాధి పరంపరలు పొందడం జరుగుతోంది. ఇదియే **సంసారము, సంసృతి** కూడా! ఇదంతా కల్పన!

ఎవ్వరైతే అన్ని ఆలంబనములను (All Dependence) అధిగమించి, నిరాలంబమగు పరమ శివ తత్త్వమును ఆశ్రయిస్తారో, వారే యోగి, సన్న్యాసి కూడా! వారు కైవల్యపదము (లేక) కేవలీ స్థానమును సముపార్జించుకుంటున్నారు.

ఏది తెలుసుకొనుటచే జీవులపట్ల అజ్ఞానము తొలగినదై, వారికి సమస్త అరిష్టముల నుండి ముక్తి లభించగలదో..., సర్వ సందేహములు తొలగగలవో-అట్టి **ఋషి వాక్యముల బోధసారము** చెప్పుకుంటున్నాము. ఆశంక్యమునియొక్క మహత్ వాక్యములను శ్రవణం చేస్తున్నాము. వారి ప్రవచనములను విశదీకరించు కుంటున్నాము.

**శిష్య ప్రశ్నలు**

2. కిమ్ బ్రహ్మ?
క ఈశ్వరః?
కో జీవః?
కా ప్రకృతిః?
కః పరమాత్మా?
కో బ్రహ్మో?
కో విష్ణుః?
కో రుద్రః?
క ఇన్ద్రః?
కః శమనః?
కః సూర్యః?
కః చంద్రః?
కే సురాః?
కే అసురాః?
కే పిశాచాః?
కే మనుష్యాః?
కా స్త్రియః?
కే పశ్వ ఆదయః?
కిం స్థావరం?
కే బ్రాహ్మణాదయః?
కా జాతిః?
కిం కర్మ?
కిం అకర్మ?
కిమ్ జ్ఞానం?
కిమ్ అజ్ఞానం?
కిమ్ సుఖమ్?
కిమ్ దుఃఖమ్?
కః స్వర్గః?
కో నరకః?
కో బన్ధః?
కో మోక్షః?
క ఉపాస్యః?
కః శిష్యః?
కో విద్వాన్?
కో మూఢః?
కిమ్ ఆసురం?
కిం తపః?
కిం పరమంపదమ్?
కిం గ్రాహ్యం?
కిం అగ్రాహ్యం?
కః సన్న్యాసీ? ఇతి ఆశంక్యా ఆహ॥
(కిం బ్రహ్మేఽ తి)

ఈ జీవుడు సంసారమునుండి విముక్తికై ఏ **ప్రశ్నలు** కలిగి ఉండి (అప్పుడిక **సమాధానము** పొందాలో) అవి ముందుగా ఆశంక్యముని అడుగుచున్నారు. (ప్రశ్న లేని బ్రతుకు ప్రశార్థకంబురా!)

"**బ్రహ్మము**" అనగా ఏమి? "**ఈశ్వరుడు**" అనగా ఎవరు? ఈ **జీవుడు** ఎవరు? **ప్రకృతి** అనగా ఏదై ఉన్నది? **పరమాత్మ** అనగా ఎవ్వరు?

**బ్రహ్మ-విష్ణు-రుద్రులు** ఎవ్వరై ఉన్నారు? **ఇంద్రుడు** ఎవ్వరు?

**యముడు - సూర్యుడు - చంద్రుడు** ఎవ్వరు?

**సురులు** అనగా ఎవ్వరు? **అసురులు** ఎవ్వరు?

**పిశాచులు** ఎవ్వరు? **మనుష్యులు** ఎవ్వరు?

**స్త్రీలు** ఎవ్వరు?

**పశువులు** మొదలైనవి ఎవరు?

**స్థావరము** ఏది?

**బ్రాహ్మణులు** అనగా ఎవ్వరు?

**జాతి** అనగా ఏది, ఎక్కడిది? ఎట్లా ఏర్పడినదగుచున్నది?

**కర్మ** అనగా ఏమి? **అకర్మ** అనగా ఏమి?

**జ్ఞానము** అనగా ఏమి? **అజ్ఞానము** అనగా?

ఏది **సుఖము?** ఏది **దుఃఖము?**

ఏది **స్వర్గము?** ఏది **నరకము?**

**బంధము** ఏది? **మోక్షము** అనగా?

ఉపాసించవలసినది **ఎవరిని?** (ఉపాస్య గురువెవ్వరు?)

ఎవరు **శిష్యుడు?**

**'విద్వాంసుడు'** అని ఎవ్వరిని అంటాము?

**'మూఢుడు'** అని ఎవరిని అంటాము?

**'అసురత్వము'** అనగా ఏమి?

**తపస్సు** అనగా ఏమిటి?

**పరమ పదము** అని దేనిని అంటాము? ఎట్టి పదము?

**గ్రహించవలసినది** ఏది? (What is to be taken?)

**గ్రహించ కూడనిది** ఏది? (What is to be left off?)

**'సన్న్యాసి'** అనగా శబ్దార్థము ఏమై ఉన్నది?

ఓ ఆశంక్య భగవన్! మహానుభావా! ఇవన్నీ బ్రహ్మము గురించిన విజ్ఞానము దృష్ట్యా చెప్పండి!

***- ఈ ప్రశ్నలకు గురువు వద్ద సమాధానము పొందటమే అధ్యాత్మ శాస్త్ర పఠణము. ఆశంక్యముని చెప్పుచున్నారు.***

| | |
|---|---|
| **3. <u>సహో వాచ? (గురు సమాధానం।)</u>**<br>**బ్రహ్మమ్ ఇతి చ।**<br>**మహత్-అహంకార-పృథివీ-**<br>**అపః - తేజో - వాయుః - ఆకాశాత్**<br>**ఆత్మకత్వేన బృహత్ రూపేణ**<br>**అణ్డకోశేన, కర్మ జ్ఞానార్థ**<br>**రూపతయా భాసమానమ్।**<br>**- అద్వితీయమ్।**<br>**- అఖిల ఉపాధి వినిర్ముక్తమ్,**<br>**- తత్ సకల శక్తి - ఉపబృంహితం**<br>**- అనాద్యంతమ్।**<br>**- శుద్ధం, శివం, శాంతం, నిర్గుణం।**<br>**ఇత్యాది వాచ్యం!**<br>**అనిర్వాచ్యం!**<br>**<u>చైతన్యం బ్రహ్మ</u>॥** | **బ్రహ్మము అనగా ....,**<br>దృష్టులు (1) లౌకిక దృష్టి (2) జ్ఞాన దృష్టి అను రెండు విధములు.<br>వెలుగు వేరు - వెలుగులో కనబడునవి వేరు కదా!<br>ఆత్మ అనే వెలుగులో కనిపిస్తున్నవియే మహత్-అహంకార జీవాత్మాదులు.<br>**మహత్తు** = (సమష్టి అహంకారములు తనవైనట్టిది). **అహంకారము**='నేను నాది' రూపమైనది. **జీవాత్మ** = వ్యష్టిగతమగు 'నేను'.<br>**పంచమహా భూతములు** : పృథివి, ద్రవము, తేజస్సు (అగ్ని), వాయువు, ఆకాశము. ఇవన్నీ ఒకచోటికి వచ్చి ఈ బృహత్ బ్రహ్మాండ రూపముగా కనిపిస్తున్నాయి. కర్మ-జ్ఞానముల అర్థ రూపంగా ఇవన్నీ ప్రదర్శనమగుచూ ఉన్నాయి. అయితే, ఆత్మయొక్క తేజస్సుచే అవన్నీ సాకారమై కనిపిస్తున్నాయి. ఘనీభూతానుభవంగా ప్రాప్తిస్తున్నాయి.<br>**ఇక బ్రహ్మము గురించి**<br>**అద్వితీయం** : దేనికి వేరుగా మరొకటి ఏదీ లేదో, అదియే **బ్రహ్మము.**<br>ఏది ఉపాధులకు ఏమాత్రము బద్ధము కాదో, సర్వ ఉపాధులకు సంబంధించక **<u>వినిర్ముక్తమై</u>** ఉన్నదో,<br>- శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ-జీవాత్మ-ఈశ్వరాత్మలు మొ॥న సర్వశక్తి ప్రదర్శనలు తనవే అయి ఉండుటచే **సర్వశక్తివంతమో...,**<br>- 'ఇది మొదలు - ఇది చివర' - అనునది ఎద్దానికి లేదో, **ఆద్యంతరహితమో..,**<br>- ఎద్దానిని జీవాత్మ - ప్రకృతి - అహంకారములు మొదలైనవి ఏమాత్రము స్పృశించవో, **పరమ శుద్ధమో,**<br>- సర్వుల ఆత్మయే అయిఉండి, సర్వదా శుభప్రదమై యున్నదో, **శివమో,**<br>- పరమ శాంత **స్వరూపమో....,**<br>**అదియే బ్రహ్మముగా చెప్పబడుతోంది.** ఇవన్నీ చెప్పుచూనే, శాస్త్రములు, **"అది చెప్పనలవి కాదు. అనిర్వచనీయము"** అని కూడా చెప్పి ఊరుకుంటున్నాయి. సర్వమును చేతన పరచుటచేత చైతన్యము అని, ప్రతి దేహమునందు సర్వోత్కృష్టమై వెలుగొందు చున్నది కాబట్టి బ్రహ్మము అని,"చైతన్య బ్రహ్మము" - అని అనబడుతోంది. |
| **4. <u>ఈశ్వర ఇతి చ</u>**<br>**బ్రహ్మైవ స్వశక్తిః ప్రకృత్యా**<br>**అభిధేయమ్ ఆశ్రిత్య...,**<br>**లోకాన్ సృష్ట్వా,**<br>**ప్రవిశ్యా, అంతర్యామిత్వేన**<br>**బ్రహ్మాదీనాం బుద్ధీంద్రియ నియంతృత్వాత్ ఈశ్వరః॥**<br>**<u>జీవ ఇతి చ।</u>**<br>**బ్రహ్మ - విష్ణు - ఈశాన - ఇంద్రాదీనాం**<br>**నామరూప ద్వారా**<br>**"స్థూలోఽహమ్"**<br>**ఇతి అధ్యాసవశాత్ జీవః॥** | **ఈశ్వరుడు** : బ్రహ్మము స్వశక్తియుతమగు స్వభావముచే వృత్తిని ఆశ్రయించుచున్నది. స్వకీయ శక్తి రూపమగు **ప్రకృతిని** కల్పించుకొనుచున్నది. ఆ ప్రకృతి కల్పనలోంచి **లోకాలను** సృష్టించుకొనుచున్నది. తాను సృష్టించుకొన్న లోకాలలో ప్రవేశించుచూ, ఆ లోకములకు తానే **అంతర్యామి** కూడా అయి ఉంటోంది. **బుద్ధి-ఇంద్రియములను** నియమించుకొనుచున్నది. అట్టి అంతర్యామిత్వము, బహిర్యామిత్వము బుద్ధి-తత్త్వమును కలిపి **'ఈశ్వరుడు'** అని అంటారు. సర్వ నియామకుడు ఈశ్వరుడు.<br>**జీవుడు** : **"స్థూల దేహమే నేను"** - అను స్థూలదేహాభిమాని. అట్టి స్థూల దేహాభిమానం చేత సృష్టి - స్థితి - లయ - ఇంద్రియ తత్త్వాలను, తనకు వేరైన బ్రహ్మ - విష్ణు - ఈశ్వర - ఇంద్ర మొదలైన నామ రూపాత్మక దేవతలుగా భావిస్తూ, అధ్యాస-పరిమిత దృష్టికి వశమై ఉన్నట్టి వాడు.<br>**నేను సాకారుడను. నామ-రూపములకు చెందినవాడను. ఇవి నాకు చెందినవి. ఇవన్నీ నాకు వేరై ఉన్నవి"** - అను అధ్యాసకు, ఆయా భౌతిక దృష్టులకు బద్ధుడు, పరిమితుడు అయి ఉంటున్నవాడు.<br>**బహుజీవః** : అనేక జీవజాతులలో జన్మించుచూ, ఎప్పటికప్పుడు తాను ఆ జాతివాడని అనుకోవటం.<br>వాస్తవానికి జీవుడు - పరమాత్మ కూడా ఏకము - అఖండమే అయినప్పటికీ, దేహముతో |

బహుజీవః।
సో౽హమ్ ఏకో౽పి
దేహారంభక భేదవశాత్
బహుజీవః।

కల్పించు కొనుచున్న అనేకత్వరూపమైన సంబంధముచేత స్వీయకలన యగు బహు జీవుల సంబంధ కల్పనావ్యవహారమంతా అనుభవిస్తూ, సమిష్ఠి జీవ స్వరూపుడు (లేక) సమిష్ఠి జీవాభిమాని (బహుజీవః) అగుచున్నాడు. (మా జాతి, మా ప్రదేశము మొ॥నవి ఇటువంటివి)

---

**5.** ప్రకృతిః ఇతి చ।
బ్రహ్మణః సకాశాత్
నానా విచిత్ర జగత్-నిర్మాణ
సామర్థ్యక బుద్ధిరూప
బ్రహ్మ శక్తిరేవ ప్రకృతిః॥
పరమాత్మా - ఇతి చ
దేహాదేః పరతత్వాత్
బ్రహ్మైవ పరమా౽త్మా।
స బ్రహ్మా। స విష్ణుః। స రుద్రః।
స ఇంద్రః। స శమనః। స సూర్యః।
స చంద్రః। తే సురాః। తే అసురాః।
తే పిశాచాః। తే మనుష్యాః।
సా స్త్రియః। తే పశ్వః ఆదయః।
తత్ స్థావరం।
తే బ్రాహ్మణాదయః।
సర్వం ఖలు ఇదం బ్రహ్మ।
న ఇహ నానాస్తి కించన।
(నే౽హ నానాస్తి కించన)

**ప్రకృతి :** బ్రహ్మము (లేక పరతత్త్వ స్వరూపము)నకు బుద్ధి (Intelectual) రూపమగు మహత్తర శక్తి ఉన్నది. అట్టి బుద్ధి రూప బ్రహ్మశక్తి - ఊహ - కల్పనలచే, తన భావనా చైతన్యముచే (విషయ రూపములే అయి ఉన్న) జగత్తుల నిర్మాణ సామర్థ్యము కలిగియున్నది. అట్టి బ్రహ్మము యొక్క బుద్ధి సంబంధమైన స్వకీయ **"జగత్ కల్పనా సామర్థ్యము"**ను **ప్రకృతి** అని పిలుస్తున్నారు.

**పరమాత్మ అనగా?**

ఈ దేహ - దేహాంతరముల ప్రారంభమునకు మునుముందే, వాటన్నిటికీ ఉత్పత్తి స్థానముగా ఏర్పడినదై ఉన్నదేది? ఏది ఈ దేహాదులకు ఆవల వాటికి పరమై, వాటికి సంబంధించనిదై ఉన్నది? - ఏది బ్రహ్మము అని ప్రతి జీవునిలోని పరాకాష్ఠ - ఆత్యంతికమైనదిగా వేదార్థములచే అభివర్ణించబడుతోంది? **అదియే పరమాత్మ!** అట్టి వాస్తవము - సహజము - మార్పు చేర్పులకు అందనిది అగు పరమాత్మయే....
- సృష్టికర్తయగు బ్రహ్మదేవుడుగా, (Creating visualisation)
- స్థితి కారకుడగు విష్ణువుగా, (Maintaining Visualisation)
- ఈ సృష్టికి లయకారుడగు రుద్రుడుగా, (Withdrawing Visualisation)
- ఇంద్రియాధిపతియగు ఇంద్రుడుగా, (Organising the seeing, hearing etc.,)
- మృత్యు (మార్పు) దేవతాధినేతయగు యముడుగా, (Change Factor)
- మనో స్వరూపుడు - ఓషధ ప్రదాత అగు చంద్రునిగా...,(Thought Factor)
- దేహములతో సహా ప్రకృతిలోని సర్వ తత్త్వములను తమ దివ్య ప్రజ్ఞలతో నడిపించే దేవతలు (లేక) సురులుగా..., సాత్వికులుగా..., (Devine Intelectuals)
- సృష్టికి, జీవులకు బాధలు కలిగించే అసురులుగా..., (Bothering Factors)
- భౌతిక దేహం లేకుండా పోయినా కూడా, కేవలం మనో దేహము - కారణ దేహములతో దృశ్యమువెంటనంటి ఉండు స్వభావము గల పిశాచములుగా, (Teasing Factors)
- దేహబద్ధులవలె కనిపించే మనుష్యులుగా, అనేక దేహసమూహములుగా,
- జీవుల దేహములను తమ గర్భమున ధరించి వారికి దేహ నిర్మాణ వ్యవహారములో సహకరించు స్త్రీలుగా, దేహ నిర్మాణ ప్రజ్ఞలగు ప్రకృతి శక్తులుగా....,
- పశువులు, స్థావరములు, బ్రహ్మ జ్ఞానులగు బ్రాహ్మణులుగా బ్రహ్మమే అగుచున్నది.

అంతా, ఇదంతా బ్రహ్మమే! ఏకమగు బ్రహ్మమే అయి ఉన్నది! ఇక్కడ అనేకము అనునది మొదలే లేదు. ఎప్పుడూ లేదు. బ్రహ్మము సర్వదా యథాతథము.

---

**6.** జాతిః ఇతిచ
న చర్మణో, న రక్తస్య,
న మాంసస్య, న చ అస్థినః
న జాతిః ఆత్మనో।
జాతిః వ్యవహార ప్రకల్పితా।

**జాతి**

చర్మమునకు "జాతి" అనునదియే లేదు. మరి రక్త - మాంసములకు? లేనే లేదు. బొమికలకు జాతి భేదమున్నదా? ఊహూ! లేదు. "ఆత్మ" అఖండము. అద్దానికి జాతి భేదమనునదే లేదు.

మరి? "జాతి" అనునది ఎక్కడ నుండి వచ్చింది? స్వతఃగా లేదు కానీ, లోక వ్యవహారము కొరకై కల్పించబడినది మాత్రమే! వాస్తవానికి అట్టి భేదమే వస్తుతః లేదు. (10 మంది ఒకేచోట గాఢనిద్ర పోతూ ఉంటే వారికి భేదానుభవమేమున్నది?)

**'కర్మ' – ఇతి చ**
**క్రియమాణ ఇంద్రియైః కర్మాణి**
**"అహమ్ కరోమి" – ఇతి అధ్యాత్మనిష్ఠతయా**
**కృతం కర్మైవ కర్మ।।**
**'అకర్మ' – ఇతి చ**
**కర్తృత్వ–భోక్తృత్వా ఆది అహంకారతయా**
**బంధరూపం, జన్మాది కారణం..., (ఇతి భావయిత్వా)**
**నిత్య నైమిత్తిక యాగ వ్రత**
**తపో–దానాదిషు**
**అఫలాభిసన్ధానం –**
**యత్, తత్ అకర్మ।**

**కర్మ**: సృష్టిశక్తిచే, క్రియాసమన్వితమై నిర్మించబడిన ఇంద్రియములు నిర్వర్తించు → చూడటము - వినడము- ఆఘ్రాణించటము - స్పర్శించటము - రుచి చూడటం... ఇవన్నీ "నేనే చేస్తున్నాను"... అనే జీవునియొక్క ఆధ్యాత్మ నిష్ఠచే నిర్వర్తించబడుచూ ఉన్నది. నేను 'కర్తను' అనుకుని చేయునది - **కర్మ.**

**అకర్మ: నేనే చేస్తున్నాను-నేనే అనుభవించుచున్నాను...** అను కర్తృత్వ- భోక్తృత్వాహంకారములు హృదయములో ఉన్నంత వరకు అది జన్మ-తదితర కర్మ పరంపరలకు మూల కారణముగా అగుచున్నది. నిత్య-నైమిత్తిక కర్మలు యాగ-వ్రత-తపో-దానములు మొదలైన కర్మలను "**అకర్తయగు పరమాత్మయొక్క తత్త్వానుభవము - పరమాత్మ తత్త్వము**" కొరకై నిర్వర్తించుచున్నప్పుడు దృశ్యములో ఏదో పొందాలనే ఫలాభిలాష లేకపోతే- **అకర్మయే** అగుచున్నది. పరమాత్మ కొరకై నిర్వర్తించేదంతా అకర్మయే! **'కర్మలన్నీ పరమాత్మచేత - పరమాత్మ కొరకై జరుగుచున్నది'** ... అను భావనయే **అకర్మ!**

---

**7. జ్ఞానమ్ ఇతి చ**
**దేహ–ఇంద్రియ–నిగ్రహ**
**సద్గురూపాసన –**
**శ్రవణ మనన నిదిధ్యాసనైః**
**యద్యత్ దృక్ – దృశ్య స్వరూపం,**
**సర్వాంతరస్థం, సర్వ సమం,**
**ఘట పటాది పదార్థమివా అవికారం,**
**వికారేషు "చైతన్యం వినా**
**కించిత్ నాస్తి" ఇతి**
**సాక్షాత్కారా – అనుభవ జ్ఞానం।**

**జ్ఞానము**

సామాన్యముగా ఈ జీవుడు తన తెలివిచే దేహ-ఇంద్రియములకు, నామ-రూపములకు పరిమితుడై, సంకుచితుడై దేహముతో చరిస్తున్నాడు. ఒకానొకప్పుడు ఇక్కడ నాకు సంబంధించిన సత్యము-నిత్యము ఏమిటి? ... అను ప్రశ్నకు వచ్చి **'ముముక్షువు'** అగుచున్నాడు. తెలివితో, **"వీటికి ఆవల నాకు సంబంధించి ఏమిటి?"** అనే ప్రశ్నలతో సద్గురువును ఆశ్రయించుచున్నాడు. శ్రవణ-మనన-నిదిధ్యాసలకు ఉపక్రమిస్తున్నాడు. ఈ కనబడే సర్వమునకు ఆవల పరమైయున్నదాని వైపు దృష్టిని సారిస్తున్నాడు.

వివేచనచే, సద్గురూపాసనచే, శాస్త్ర విచారణచే - "**దృక్-ద్రష్ట-దర్శన-దృశ్యరూపమై యున్నట్టిది, సర్వమునకు అంతస్థమై-అంతర్యామిగా ఉన్నట్టిది, సర్వులలోను సమస్వరూపమై ఉన్నట్టిది, (మట్టికి కుండ ఆకారము లేనట్లు, వస్త్రానికి చొక్కా ఆకారము లేనట్లు) అవికారమైనదే ఆత్మ!" - అని తెలియబడగలదు. వికారరూపంగా కనిపించేదంతా అవికారమగు ఆత్మ చైతన్యమే!** మరింకేమీకాదు - అని తెలియవచ్చుచున్నది , అట్లు సాక్షాత్కరింపజేసేది **జ్ఞానము**".

**అజ్ఞానమ్ ఇతి చ**
**రజ్జౌ సర్పభ్రాంతిః ఇవ – అద్వితీయే,**
**సర్వ–అనుస్యూతే, సర్వమయే బ్రహ్మణి**
**దేవ తిర్యక్ నర స్థావర**
**స్త్రీ పురుష వర్ణాశ్రమ**
**బన్ధ మోక్ష ఉపాధి**
**నానాత్మ భేద కల్పితం**
**జ్ఞానమ్ --- "అజ్ఞానమ్"।**

**అజ్ఞానము**

ఒకడు మసక చీకటిలో త్రాడును చూచి, "ఇది త్రాచుపామే! కాటేసిందంటే చచ్చానే! ఎట్లాగురా బాబూ?" ... అని వికారములను, భయభ్రాంతులను పొందు తీరుగా,... **అద్వితీయము-సర్వమునందు పూదండలో దారమువలె అనుస్యూతము-సర్వము తనయందు కలిగి, సర్వమయము** అయిఉన్నది-అగు బ్రహ్మము పట్ల..., "వీరు దేవతలు-అవి జంతువులు-వీరు నరులు-ఇవి స్థావరములు - వీళ్ళు స్త్రీలు - వారు పురుషులు-ఇవి వర్ణాశ్రమ వ్యవహారాలు-ఇది బంధము-అది మోక్షము-ఇది ఉపాధి - అది దృశ్యము"... ఈ-ఈ విధాలుగా నానాత్మకమైన భేదములను కల్పిస్తూ, వాటికి అర్థ-పరమార్థములు కల్పించే సమాచారములు, అభిప్రాయాలు ... ఇది **అజ్ఞానము.**

---

**8. సుఖమ్ ఇతి చ**
**సత్–చిత్– ఆనంద స్వరూపమ్ జ్ఞాత్వా,**
**" ఆనంద రూపస్థితిః"**
**ఏవ – " సుఖమ్"।**

**సుఖము** : స్వస్వరూపముయొక్క, సర్వుల సహజ స్వరూపముయొక్క - ఈ దృశ్య జగత్తు యొక్క ... సత్-చిత్-ఆనంద ... **రూప స్థితిని తెలుసుకోవటం,** తెలుసుకొన్న ఆత్మగా **ఈ సృష్టిని దర్శించటము, తానే జగదానంద స్వరూపుడై ఆనందించటము... ఇది సుఖము.**

**దుఃఖమ్ ఇతి చ ।**

**అతః సంసార విషయ**

**సంఙ్కల్ప ఏవ "దుఃఖమ్" ।**

**స్వర్గ ఇతి చ ।**

**సత్ సంసర్గః స్వర్గః।**

**నరక ఇతి చ ।**

**అసత్ సంసార విషయ జనన**

**సంసర్గ ఏవ "నరకః"।**

**బంధ ఇతి చ**

**→ అనాది అవిద్యా వాసనయా,**

**'జాతోఽహమ్' ఇత్యాది సంకల్పో "బంధః"।**

**→ పితృ మాతృ సహోదర దారా**

**అపత్య గృహ ఆరామ క్షేత్రాది**

**→ మమతా సంసారావరణ సంకల్పో "బంధః"।**

**కర్తృత్వాది అహంకార సంకల్పో "బంధః"।**

**→ అణిమ-ఆది అష్టైశ్వర్య**

**ఆశా సిద్ధ సంకల్పో "బంధః"**

**→ దేవ మనుష్యాది ఉపాసనా**

**కామ సంకల్పో "బంధః"**

**→ యమ-ఆది అష్టాంగయోగ**

**అభ్యాసాది సంకల్పో "బంధః"।**

**→ వర్ణాశ్రమ ధర్మ కర్మ సంకల్పో బంధః।**

**అజ్ఞా (ఆజ్ఞా) భయ సంశయాఽత్మ**

**గుణ సంకల్పో "బంధః"।**

**→ యజ్ఞ వ్రత తపో దాన**

**విధి విధాన జ్ఞాన**

**సంకల్పో "బంధః"।**

**→ కేవల మోక్షాఽపేక్షా**

**సంకల్పో "బంధః"।**

**⌘ సంకల్ప మాత్ర సంభవో "బంధః"।**

**దుఃఖము** : హృదయములో (అంతరంగంగా) దృశ్యపరిమితమైన సంసార విషయ పరంపరలను సంకల్పించుకొని, అందుకు ఫలితముగా "**ఈ దృశ్యమంతా ఎవ్వరో కల్పించి నన్ను నిబద్ధుని చేయుచున్నారే!" ... అను స్వకీయ కల్పనలే... దుఃఖము యొక్క రూపము.**

**స్వర్గము** : జాగ్రత్-స్వప్న సుషుప్తులయందు, జన్మ-జన్మానంతరములయందు ఏ ఉనికి (నేను ఉన్నాను) ... అనునది కలదో అట్టి సత్ వస్తువుతో సంసర్గము పొందుటము - **స్వర్గము (సువర్గము). సత్సంగము స్వర్గతుల్యము!**

**నరకము** : వస్తుతః లేకపోయినప్పటికీ, ఉన్నట్లే అగుపించే సంసార విషయములతో జనిస్తున్న సంబంధము (లేక) సంసర్గము (ఏర్పడుచున్న బంధమే) **నరకము.**

**బంధము** : అనాది అయినటువంటి అవిద్యా వాసనల చేత (Because of Tendencies that stem up out of Ignorence - Ignoring Fundamental Truths), "**అయ్యో నేను అప్పుడు జన్మించాను. నాకు జనన-మరణాలు ఉన్నాయి**"... మొదలైన సంకల్పములు ఆశ్రయించటము, కొనసాగించటము.

-ఇంకా... తండ్రి-తల్లి-సహోదరులు-భార్య-ఉద్యానవనములు-గృహములు-ఆరామము-పొలములు... మొదలైనవాటిపట్ల - **"ఇవి నాకు చెందినవి, నేను వీటికి చెందినవాడను"** - అనే మమతలు, సంసారావరణసంకల్పములు కలిగి ఉండటము, ఆవేశపూరితంగా భావించటము - ఇది **బంధము.**

-"**నేను దీనికి కర్తను. దానికి భోక్తను. ఇది నాది. అది నాకు చెందినది**"... ఇటువంటి అహంకారముతో కూడిన సంకల్పములే బంధపు త్రాళ్ళు.

-**అణిమ** - (అణురూపుడై ఉండుట), **మహిమ** (విరాట్ రూపుడవటం), **గరిమ** (భూమికంటే కూడా బరువు కాగలగటం), **లఘిమ** (దూదికంటే కూడా, తేలికవడం), **ప్రాప్తి** (అనుకున్న వస్తువులు లభింపజేసుకోగలగడం), **వశిత్వ** (వశంచేసుకోవడం) **ప్రాకామ్య** (ఎక్కడైనా ప్రత్యక్షం కాగలగడం), **ఈశిత్వ** (సమస్తమునకు అధికారి) అష్ట సిద్ధులు ఆశించటం, ఆశించినది సిద్ధింపజేసుకునే సామర్థ్యము... ఇవన్నీ బంధమే!

ఒక దేవతనో, ఒక మానవునో మాత్రమే ఉపాసనచేసి ఏదో పొందాలనుకునేదంతా కూడా బంధమే!

-"యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి... ఇవన్నీ అభ్యసించిన తరువాతగాని ఏదో (ఆత్మ) సిద్ధించదు కదా!"... అనునదీ బంధమే. (ఎల్లప్పుడు సిద్ధించియే ఉన్నది ఎప్పుడో సిద్ధించటమేమిటి?).

-వర్ణాశ్రమ ధర్మములు, కుల ధర్మములు, "ఇవియే ముఖ్యము"... అను సంకల్పములు కూడా బంధమే! (అవన్నీ సందర్భములకు చెందిన సత్యములు మాత్రమే కదా!)

- సత్యమును పరిశీలించకపోవుటచే ఏర్పడు అజ్ఞానము, భయము, స్వస్వరూపమును గురించిన సంశయములు, త్రిగుణ సంకల్పములు..... బంధమే అగుచున్నాయి.

- యజ్ఞ నిష్ఠలు, వ్రత విధానాలు, తపో నియమాలు, దానము, కర్తృత్వ-భోక్తృత్వ విధులు, జ్ఞాన సంబంధమైన శబ్దముల రకరకములైన విశ్లేషణా సమాచార సంకల్పాలు-ఇవన్నీ బంధమే!

" అన్నీ వదలాలి! మోక్షము ఒక్కటే ఎట్లాగో సంపాదించాలి" ... అను రూపము గల సంకల్పములు కూడా బంధమే!

ఒక్క మాటగా చెప్పుకోవాలంటే, సంకల్పము, సంకల్పము వలన జనించేది... అంతా బంధమే!
- సంకల్పము కలిగి ఉండటము ....,
- సంకల్పము తనదై ఉండగా తనను తాను ఏమరవటము ....,
- ఏదో విషయాలపై సంకల్పములను దేహ-దేహాంతరములుగా కొనసాగిస్తూ పోవటము .... ఇదంతాకూడా 'బంధము' - అనబడు దాని ముఖ్య నిర్వచనము! ముఖ్య రూపము!

**9. మోక్ష ఇతి ।**
నిత్య-అనిత్య వస్తు విచారాత్
అనిత్య సంసార సుఖ-దుఃఖ
విషయ, సమస్త క్షేత్ర మమతాఽఽది
సమస్త బంధ సంకల్ప క్షయో "మోక్షః"।
ఉపాస్య ఇతి చ।
సర్వ శరీరస్థ చైతన్య-బ్రహ్మప్రాపకో
గురుః ఉపాస్యః ॥
శిష్య ఇతి చ।
విద్యాత్ అధ్వస్త ప్రపంచా అవగాహిత
జ్ఞానా అవశిష్టం బ్రహ్మైవ "శిష్యః"।

**మోక్షము:** "ఇది నిత్యము-ఇది అనిత్యము" ... అని ఈ జీవుడు తన **అనుభూతి - అనుభవము- సంగతి - సందర్భములను** పరిశీలనతో విభాగించాలి. అనిత్యములగు - సంసార రూప సుఖ దుఃఖ విషయములపట్ల, సమస్త క్షేత్ర - గృహ - ఆరామ - స్థలముల పట్ల "ఇవి నావి - నేను వీటికి చెంది యున్నాను" అను సమస్త సంబంధ - అనుబంధ - బాంధవ్య సంకల్పములను క్షయింప చేసుకోవటమే మోక్షము.

**ఉపాసించతగినవాడు :** సర్వ దేహములలో సర్వదా వేంచేసియున్న చైతన్య బ్రహ్మమే ఉపాస్యము. అద్దాని గురించి విశదపరచుచూ, తత్-త్వమ్ భావనను నిదురలేపు వారు సద్గురువు. ఆత్మయే గురువు! గురువు ఆత్మ స్వరూపుడే!

**శిష్యుడు :** గురువు బోధించు "తత్త్వమ్" ... ఆప్త జ్ఞానమహా వాక్యార్థమును ఆకళింపు చేసుకొంటూ, ఆత్మ విద్యా సమాచారమును హృదయస్థం చేసుకొనుచూ, "ఈ ప్రపంచము అస్మత్ స్వస్వరూప పరబ్రహ్మమునకు వేరుకాదు,... ఆభరణమంతా బంగారమే అనువిధంగా" ... అని బ్రహ్మమే తానై శేషించుచున్నవాడే శిష్యుడు (అవశిష్యుడు). "సోఽహమ్" నందు నిదురలేచు ఆశయము అంగీకరించి ఉండువాడు శిష్యుడు.

---

**10. విద్వాన్ ఇతి చ।**
సర్వాన్తరస్థ, స్వసంవిత్ రూపవిత్ విద్వాన్।
మూఢ ఇతి చ
కర్తృత్వాది అహంకార
భావనా ఆరూఢో "మూఢః"।
అసురమ్ ఇతి చ
బ్రహ్మ విష్ణు ఈశాన ఇంద్రాదీనామ్
ఐశ్వర్య కామనయా,
నిరశన జప-అగ్నిహోత్రాదిషు
అంతరాత్మానం సంతాపయతి చ,
అతి ఉగ్ర రాగ ద్వేష హింసా దంభా ఆది
అపేక్షితం "తప ఆసురమ్"॥

**విద్వాన్ :** స్వసంవిత్ (స్వస్వరూప సత్ + విత్ యే) - సర్వము యొక్క అంతస్థముగా సుస్పష్టము చేయునది. నేను సర్వుల - సర్వముయొక్క అంతరమున ఉన్న వాడను - అని ఎరుగువాడే విద్వాంసుడు.

**మూఢుడు :** "**నేనే కర్తను! నేను చేయుచున్నవన్నీ నావలననే అగుచున్నాయి! నేనే భోక్తను!**" ... ఇటువంటి కర్తృత్వాహంకార భావనలలో ఆరూఢుడై జీవించువాడు. నాటకంలో తన పాత్రకు తానెట్లా 'కర్త' అవుతాడు? నాటకమే అవుతుంది కదా! జీవుని కర్తృత్వము అట్టిదే!

**అసురుడు :** సంపద-ఐశ్వర్యములపై, అధికారములకొరకై కోరికలతో చతుర్ముఖ బ్రహ్మ - విష్ణువు - ఈశ్వరుడు - ఇంద్రుడు మొదలైనవారిని ఉద్దేశ్యించి ఉపవాస - జప - అగ్నిహోత్ర సంబంధమైన అనేక పరిశ్రమలతో కూడిన కార్యక్రమములకు సంసిద్ధుడగుచూ,...... అంతరాత్మకు సంతాపము కలుగ జేయువాడు. తీవ్రస్థాయిలో "**నావారు - నా జాతి - నామతము**" ... అను రాగమును ఆశ్రయిస్తూ, తదితరులను ద్వేషించుచూ, "**హింస-దంభము**"... ఇత్యాదులను ఆశ్రయించువాడు. అనేక కోరికలతో, అపేక్షలతో ఏవేవో దృశ్య విషయాలు సిద్ధింపజేసుకోవటానికై తపములు ఆచరించువాడు. తన తపనలతో అంతరాత్మకు సంతాపములు కలిగించువాడు.

---

**11. తప ఇతి చ।**
"బ్రహ్మ సత్యం జగన్మిథ్యా"-ఇతి
అపరోక్ష జ్ఞానాగ్నినా - బ్రహ్మాది
ఐశ్వర్యా ఆశా సిద్ధసంకల్ప
బీజ సంతాప రూపం "తపః"
పరమపదమ్ ఇతి చ।
ప్రాణ ఇంద్రియాది అంతఃకరణ గుణాదేః పరతరమ్
సత్-చిత్-ఆనందమయమ్, సర్వసాక్షికమ్,
నిత్యముక్త బ్రహ్మస్థానమ్ "పరమమ్ పదమ్"॥

**తపస్సు :** "బ్రహ్మము సత్యము - జగత్తు మిధ్య - అను రూపముగల (ప్రత్యక్షము - పరోక్షముకానట్టి)- **అపరోక్ష (ఆత్మ) జ్ఞానాగ్ని** వెలిగించటము, వెలుగులో "**బ్రహ్మమే సత్యము-ఈ జగత్తు మనో కల్పనా విలాసమే! కథ-నాటకము-మాంత్రికుని కల్పనలోని సందర్భ-సంఘటనలవలె-మిథ్యయే**"... అని గమనిస్తూ..., బ్రహ్మదేవుని వరకు గల ఐశ్వర్యములను "ఆశించటము" - అనే బీజములను జ్ఞానాగ్నిలో **ఉడికించివేయటము.** సర్వ సంకల్ప బీజ సంతాప రూపములను తపింపజేసి మసి చేయటము. "**ఆశించటము**" అనే బీజమును అపరోక్ష జ్ఞానాగ్నిలో దగ్ధము చేయటము -తపస్సు.

**పరమపదము :** ప్రాణ-ఇంద్రియ-ఇంద్రియ విషయ - అంతఃకరణ - త్రిగుణములకు **పరతరము** (Most Beyond) అయి, ఆవలగా సర్వదా ప్రకాశమై ఉంటున్న **పదము.** అది **సత్-చిత్-ఆనందమయము.** నాటకదీపము వలె సర్వమునకు **కేవలసాక్షీమాత్రము.** సర్వదా **నిత్యముక్తము. పరబ్రహ్మతత్త్వము అయినట్టి పరమ స్థానము. స్వస్వరూపానంద పరమపదము.**

**గ్రాహ్యమ్ ఇతి చ।**
**దేశ-కాల-వస్తు పరిచ్ఛేదరాహిత్య**
**చిన్మాత్ర స్వరూపమ్ "గ్రాహ్యమ్"॥**
**అగ్రాహ్యమ్ ఇతి చ।**
**స్వస్వరూప వ్యతిరిక్త మాయామయ**
**బుద్ధి-ఇంద్రియ గోచర జగత్**
**సత్యత్వ చిన్తనమ్ "అగ్రాహ్యమ్"।**
**సన్న్యాసీ ఇతి చ।**
**సర్వధర్మాన్ పరిత్యజ్య**
**నిర్మమో నిరహంకారో భూత్వా,**
**బ్రహ్మ - ఇష్టం శరణం ఉపగమ్య,**
**"తత్ త్వమ్ అసి"**
**"సర్వమ్ ఖలు ఇదమ్ బ్రహ్మ"**
**న ఇహ నానాస్తి కించన (నేహ నానాఽస్తి కించన)**
**- ఇత్యాది మహావాక్యార్థ అనుభవజ్ఞానాత్**
**"బ్రహ్మైవాఽహమ్ అస్మి"**
**ఇతి నిశ్చిత్య, నిర్వికల్ప సమాధినా**
**స్వతంత్రో యతిః చరతి...,**
**→ స సన్న్యాసీ।**
**→ స ముక్తః।**
**→ స పూజ్యః।**
**→ స యోగీ।**
**→ స పరమహంసః।**
**→ సో అవధూతః।**
**→ స బ్రాహ్మణః॥ ఇతి।**

గ్రాహ్యము **(గ్రహించవలసినది)** : దేనిని స్వీకరించాలి? గ్రహించాలి? ఏదైతే దేశ (Place) - కాల (Time) - వస్తువు(Matter) లచే పరిచ్ఛేదము పొందటమే లేదో..., సర్వదా కేవల చిత్ మాత్రమై, తదితరములగు మార్పు చెందువాటినన్నిటినీ వెలిగించుచున్నదో,... అదే గ్రాహ్యము. **(ఆత్మగా గ్రహించటం - గ్రాహ్యము)**

**అగ్రాహ్యము : గ్రహించకూడనిది. వదలివేసి ఉండవలసినది:** ఏదేదైతే బుద్ధి-ఇంద్రియములకు ఎదురుగా గోచరమగుచు, స్వతఃగా లేక ( (యా మా) మాయామయమై, కల్పితమై, విషయముల రూపముగా అనుభవమగుచున్నదో..., అట్టి ఈ జగత్తుపట్ల - "**ఇది సత్యము-నిత్యము**" ... అను గ్రహణమును **త్యజించాలి.** జగత్తును జగత్తుగా గ్రహించటము - **గ్రహించకూడనిది.**

**సన్న్యాసి (సత్ + న్యాసి)** : బ్రహ్మచారి - గృహస్థ - వానప్రస్థ - సన్న్యాస సర్వ ఆశ్రమ ధర్మములను, నియమ-నిష్ఠలను దాటివేసిన వాడై, వాటినన్నిటినీ పరిత్యజించివేసినవాడై..., మమకారము-అహంకారములను వదలివేసినవాడై, బ్రహ్మమునందే ఇష్టము కలవాడు. అత్యంత ఇష్టముతో బ్రహ్మమునే భావన-ఆరాధన-అభిలషణ పూర్వకంగా శరణు వేడినవాడై..., ఆశ్రయించు మార్గమును అనుసరిస్తూ ఉన్నవాడు. సత్‌ను - న్యసించినవాడు (స్వీకరించినవాడు).

- త్వమ్‌గా కనిపించేదంతా తత్ బ్రహ్మ స్వరూపమే! తత్ త్వమ్!
- ఇదంతా ఈ సర్వము సర్వదా పరబ్రహ్మమే!

  మొదలైన మహావాక్యముల పరమార్థమును అనుభవ జ్ఞానముగా మలచు కొనుచున్నవాడు.
- క్రమంగా ... **"నేను బ్రహ్మమునే! బ్రహ్మమే నేనుగా ఉన్నది"** ... అను నిశ్చయమును హృదయమునందు సుసంపన్నము చేసుకొనుచున్నవాడు.
- ఎవ్వరు యతియై, ఈ దృశ్య జగత్తులో క్రీడా - లీలా వినోదిగా చరిస్తూ ఉంటాడో..., ఆతడే సన్న్యాసి! ముక్తుడు! పరమపూజ్యుడు! యోగి! పరమహంస! అవధూత! బ్రాహ్మణుడు!

---

ఫలశ్రుతి

**శ్లో॥ ఇమాం నిరాలంబోపనిషదమ్**
**యో అధీతే గురు-అనుగ్రహతః,**
- **సో అగ్నిపూతో భవతి।**
- **స వాయుపూతో భవతి।**
- **న స పునరావర్తతే।**
- **న స పునరావర్తతే ।**
- **పునః న అభిజాయతే।**
- **పునః న అభిజాయత।**

**ఇతి నిరాలంబోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## ఫలశ్రుతి

ఎవ్వరైతే గురు అనుగ్రహపాత్రులై, గురుముఖతః ఈ నిరాలంబోపనిషత్ అభివర్ణిస్తున్న శబ్దార్థతత్త్వములను ఆశ్రయిస్తారో, ఉపాసిస్తారో...,

వారు అగ్నిచే ఖనిజము శుభ్రమగురీతిగా **పవిత్రులు కాగలరు.**

వారికిక **పునరావర్త దోషము** తాకదు. తిరిగి జన్మకర్మల స్రవంతిలో పడరు.

(అనగా) "నేను పుట్టువాడను-చచ్చువాడను" - అను జనన-మరణ చక్రములో పడరు. పడరు. (దేహధారణ వ్యవహారమంతా అట్టివారి దృష్టిలో వస్త్రధారణ వంటిది మాత్రమే!)

**ఇతి నిరాలంబోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

శుక్ల యజుర్వేదాంతర్గత

# 8 నిరాలంబోపనిషత్

## అధ్యయన పుష్పము

**ఓంకార స్వరూపుడు, సర్వాంతర్యామి, జగత్‌గురువు అగు శ్రీమన్నారాయణ స్వామికి నమస్కరిస్తూ .....**

**ఓం నమఃశివాయ ! హే పరమ శివా !**

- మీరు 'ఓం'కార అక్షర - **సర్వాత్మానంద స్వరూపులు !**
- **లోకగురువు! సద్గురువు!** నమస్కరించినంత మాత్రముచేతనే మమ్ములను సముద్ధరించుటకై సంసిద్ధపడు **ఆత్మగురువు! మమాత్మస్వరూపులు !**
- సాక్షాత్ సత్-చిత్-ఆనంద స్వరూపులు!
- సచ్చిదానందతత్త్వమే అయినట్టి జగత్ దృశ్యముగా మూర్తీభవించి కనబడుచున్న పరమానంద **చిద్ఘన స్వరూపులు! శివానందమూర్తులు!**
- ఈ చర్మచక్షువులకు కనిపిస్తున్న "పాంచభౌతిక జగత్తు"కు ఆధారమగుచూ, అప్రమేయులై **"కేవలసాక్షి"** అయి ఉన్న చైతన్య **స్ఫూర్తి స్వరూపులు!**
- నిష్ప్రపంచ **తత్త్వానందులు!**
- జగత్ **తేజోసంపన్నులు!**
- నిరాలంబ **ఆత్మచైతన్య దీప్తులు!** అట్టి మీకు నమస్కరిస్తున్నాము!

❖

ఒకానొక సందర్భములో - తపోధ్యాన నిష్ఠులగు కొందరు శిష్యులు తమ ఆధ్యాత్మ-గురువగు అశంక్యమునీంద్రులవారిని దర్శించుకొన్నారు. భక్తితో నమస్కరించారు.

**శిష్యులు :** ఓ గురుదేవా ! సత్‌చిత్ ఆనంద స్వరూపజ్ఞా ! మూర్తీభవించిన వేదాంత తత్త్వవిదా ! నిష్ప్రపంచ శాంతైశ్వర్య స్వరూపా! నిరాలంబ విదితవేత్తా ! తేజో స్వరూపా ! ఆశఙ్క్య మునీంద్రా ! మేము అనేక దృశ్య విషయములకు నిబద్ధులమైయుండటం చేత కైవల్యసిద్ధికై మార్గాణ్వేషులమై, మార్గ దర్శకులగు మిమ్ములను శరణువేడుచున్నాము. అజ్ఞాన శాంతికై మీ బోధచే మమ్ములను పునీతులుగా పవిత్రులుగా తీర్చిదిద్దమని అర్థిస్తున్నాము. మేము సన్న్యాసము ఆశ్రయించటము ఉచితమో, యోగులమై కర్మ విధులను ఆశ్రయించటమో- ఏది తగిన ఉపాయమో చెప్పండి ! మోక్ష స్థానము చేరు మార్గము శలవియ్యండి!

**ఆశఙ్క్య మునీంద్రులు :** బిడ్డలారా ! మీకు శుభమగుగాక ! ఈ ప్రపంచములో ఆయా సందర్భములు సంఘటనలు మొదలైనవి ఈ జీవుని ఆకర్షించి, జ్ఞానమార్గమునకు అవరోధములు అగుచుండటానికై యత్నించవచ్చుగాక ! అయితే, **"ఇవి మాకు సంబంధించినవి, మేము వీటికి సంబంధించినవారము"**... అను అవలంబనమును ఆశ్రయించవలసిన పనేమున్నది ? బాహ్య విషయములు బాహ్యముననే

ఉంచి, హృదయములోకి ప్రవేశించనీయక **"నిరాలంబత్వము"**ను ఆశ్రయించాలి సుమా ! సహజముగానే మనమంతా ఆత్మస్వరూపులమని పూజ్యులగు బ్రహ్మతత్త్వవేత్తలచే సిద్ధాంతీకరించబడుచుండగా... ఇక దిగులెందుకు ?

**నిరాలంబమ్ సమాశ్రిత్య సాలంబం విజహాతి యః**
**స సన్న్యాసీచ, యోగీచ । కైవల్యపదమ్ అశ్నుతే ।**

నాటకంలో పాత్రధారుడు నాటకములోని తాను నటిస్తున్న సంగతి - సందర్భ - సంబంధ - సంఘటనలకు "నేను బద్ధుడనుకదా" అని తలచడు కదా! ఎందుచేత? **నాటకములోని సంఘటనలచే తన బాహ్యమగు నిజ - సహజస్వరూపమునకు (పరస్వరూపమునకు) వచ్చేదీ గాని, పోయేదీగాని ఏమీ ఉండదని ఎరిగి ఉండటము చేత!** నాటకములోని పాత్ర దృష్ట్యా, ఆ పాత్ర నాటకమును అనుసరించి సావలంవనము (Dependent on Drama Sequences) కావచ్చుగాక ! తాను నిరావలంబనము (Not dependent on events in the drama) గానే ఉంటాడుకదా ! మీరు కూడా జగద్విషయములకు సావలంబనము (Discharging respective Functions the way the world expects (or) seeks) కలిగి ఉండి కూడా, **నిరాలంబము** ఆశ్రయించియే ఉండండి. నిరాలంబముచే సాలంబమను అంతరంగమున జయించినవారై ఉండండి. ఎవ్వరైతే 'నిరాలంబన' చే సాలంబమును మొదలంట్లా జయించివేసి ఉంటారో... వారే సన్న్యాసులు. (సత్-న్యాసులు). వారే యోగులు.

**శిష్యులు :** అందుకు మార్గము ?

**ఆశజ్ఞ్యమహాముని :** అందుకు అధ్యాత్మశాస్త్ర బోధయే మార్గము, సర్వశంకలు ఆత్మశాస్త్ర పరిశీలనచే జయించాలి. అజ్ఞత్వమును త్యజించాలి. విజ్ఞులు కావాలి. శాస్త్రములు చెప్పు శబ్దార్థ నిర్వచనములయొక్క సరిఅయిన తత్త్వార్థమును ఎరిగి, హృదయస్థము చేసుకొనుచుండగా, నిరాలంబము అగు (Non dependence on worldly events Keeping up the sense of beyondness by associating with absolute self) ఆత్మాఽహమ్ అభ్యాసము తప్పక సుసాధ్యమే !

**శిష్యులు :** స్వామీ ! అయితే ఆయా ఆధ్యాత్మ శాస్త్ర శబ్దముల (Jargons) తత్త్వార్థమును విశదీకరించ ప్రార్థన. జీవుడు ఏ ఏ ప్రశ్నలకు సమాధానము ఎరుగుటచే తత్త్వశాస్త్ర హృదయము సుస్పష్టముకాగలదో, అవి చెప్పండి.

**ఆశజ్ఞ్యమహాముని :** ముందుగా కొన్ని ప్రశ్నలు గమనించండి!

బ్రహ్మము అనగా ఏమి ? ఈశ్వరుడు అనగా ఎవరు ?
ఈ జీవుడు వాస్తవానికి ఎవరు ? ప్రకృతి అనగా ?
'పరమాత్మ' అని దేనిని అంటున్నాం ?
బ్రహ్మ - విష్ణు - రుద్ర - ఇంద్రుడు అను వారు ఎవ్వరు ?
యముడు - సూర్యుడు - చంద్రుడు ఎవ్వరు ?
సురులు - అసురులు అనగా ఎవరు ?
పిశాచులెవరు ? మనుష్యులెవరు ? స్త్రీలెవ్వరు ?
పశువులు ఏమై ఉన్నాయి ? 'స్థావరము' అనగా ఏమి ?
బ్రాహ్మణులు అనగా ? 'జాతి' అనునది దేనికి సంబంధించినది ?
కర్మ - అకర్మలు అని వేటిని అంటారు ?
ఏది జ్ఞానము ? ఏది అజ్ఞానము ?
ఏది సుఖము ? ఏది దుఃఖము ?
స్వర్గమేది ? నరకమేది ?
గురువుగా సమీపించి ఉపాసించవలసినది ఎవరిని ? ఎప్పుడు 'శిష్యుడు' అని అనిపించుకోగలము ?
విద్వాంసుడెవ్వడు ? మూఢుడెవ్వడు ?
అసురుడెవ్వడు ? సురుడు ఎవ్వడు ?
తపస్సు అనగా ? ఏది పరమపదము ?
గ్రాహ్యము (గ్రహించతగినది) ఏది ? అగ్రాహ్యము (గ్రహించకూడనిది) ఏది ?
ఒకడు 'సన్న్యాసి' (సత్-న్యాసి = సత్ వస్తువును ఆశ్రయించువాడు) అని ఎప్పుడు చెప్పబడగలడు ?

**శిష్యులు :** ఓ ఆశజ్యమునీంద్రా ! స్వామీ ! "బ్రహ్మ విద్య' ను ఆశయముగా కలవారు పై శబ్దముల అర్థములను ఏ విధంగా సమన్వయించుకోవాలో, తెలుసుకొని ఉండాలో మీరే దయచేసి వివరించ ప్రార్థన. ఈ శబ్దముల అర్థమును గురుముఖతః వినటముచేత బ్రహ్మ విద్యను నేర్చుకున్నవారమవుతామని బ్రహ్మజ్ఞుల అభిప్రాయము కదా !

**ఆశజ్యమునీశ్వరుడు :** నాయనలారా ! మనము ఉదహరించుకొన్న 'ఆధ్యాత్మ విద్య – శబ్దార్థములు' అన్నీ కూడా...

- గురుముఖతః వినటము,
- శాస్త్రములు పఠిస్తూ గ్రహించటము,
- స్వకీయబుద్ధిబలముచే సుస్పష్టము, నిర్దుష్టము చేసుకోవటము,
- శబ్దార్థము సహాయముతో **బ్రాహ్మీభావనకు** ఉపక్రమించి, **బ్రాహ్మీభావమననము**లో ప్రవేశించి–వెళ్ళవలసిన చోటికి ఉపయోగపడే వాహనమువలె – ఆ శబ్దార్థములను దాటివేసిన స్థితిని ఆస్వాదించటము, ఇది ... మముక్షువు యొక్క ప్రయాణ సమీకరణము.

అనుభవము అనేది **మహత్తరము**, పరమ **లక్ష్యము** కూడా ! అనుభవము నుండి శబ్దములు ఉపయోగించబడి, బోధకొరకై ఉపకరణములుగా అగుచున్నాయి. అన్నిటికన్నా ముఖ్యము అనుభవము (Experience). అందుచేత, వేరు వేరు గురువులు కించిత్ భేదముతో శబ్దములను ఉపయోగించి ఉండవచ్చు గాక ! మీరు... తస్మాత్ సారమ్ విజానీయత్.. ముఖ్యోద్దేశ్య సారమేమిటో గ్రహించే ఉత్తమ బుద్ధిని కలిగి ఉండండి. అంతేగాని, కించిత్ అర్థభేదమును పెద్దవిగా చేసుకొని వాదోపవాదములను ఆశ్రయించవద్దు.

మనము ఇప్పుడు చెప్పుకున్న శబ్దముల ఉద్దేశ్యమేమిటో, వివిధ సిద్ధాంతములతో కూడిన "బ్రహ్మ విద్య"ను దృష్టిలో పెట్టుకొని చెప్పుకుందాము. ఒకానొక ఉపకరణ రూపమగు సామాన్యార్థాన్ని సూత్రప్రాయంగానూ (In brief, in nut-shall), సంభాషించుకుందాము. తత్వార్థపూర్వకంగానూ, ముఖ్యోద్దేశ్యము యొక్క పరిశీలనచేస్తూ ఇక్కడ **సూచనప్రాయంగా** వివరించుకుందాము. వినండి !

## ఏది 'బ్రహ్మము' అని చెప్పబడుచున్నది'

**మహత్ అహంకార పృధివీ అపః తేజో వాయు ఆకాశా-ఆత్మకత్వేన, బృహత్ రూపేణ, అణ్డకోశేన కర్మ జ్ఞానార్థరూపతయా భాసమానమ్ । అద్వితీయమ్ । అఖిల ఉపాధి వినిర్ముక్తమ్ । తత్ సకల శక్తి ఉపబృంహితమ్ । అనాద్యంతమ్। శుద్ధం, శివం, శాంతమ్, నిర్గుణమ్... ఇత్యాది వాచ్యం । అనిర్వాచ్యమ్ । చైతన్యం బ్రహ్మ।**

ఇంద్రియ సంబంధమైన లోక (దృశ్య) కల్పనను దృష్టిలో ఉంచుకొని ఈ క్రింది రీతిగా ఆధ్యాత్మ శాస్త్రము విభజించి చెప్పుచున్నది.

1) మహత్తు = చిత్ కళా వైభవము. 'ఎరుక' యొక్క విన్యాసము. 'అనుభవము' అనే వికాసము (Sense of Experiencing). ***(ఒకని నటనా చాతుర్యము వంటిది).***

2) అహంకారము = ఆ 'చిత్' అనే అనుభవ విన్యాసము నుండి బయల్వెడలిన 'నేను' అను రూపము గల వ్యష్టి అనుభవి (Experiencer) – సందర్భము పరిమితము. **దేహము నేనైన నేను.** ***(ఒకానొక నాటకములోని ఆతని ఒక పాత్ర వంటిది)***

3) పంచ మహాభూతములు – 1) ఆకాశము (Spacing) 2) చలనము–వాయువు (Movement) 3) తేజస్సు–ఉష్ణము–అగ్ని (Light, Heat) 4) ద్రవ్యము అపః – జలము (Liquid) 5) స్థూలము – భూమి (Solid). ***(నాటక స్థల అంతర్గత విశేషాలు)***

ఇవన్నీ బృహత్ రూపము వహించి అనేక పాళ్ళలో అనేక పదార్థ వైచిత్ర్యములు (Different forms by virtue of different permutations and combinations) గా ఈ ఎదురుకుండా కనిపించే **బ్రహ్మాండ ఆకారముగా** రూపు దిద్దుకుంటోంది. ఇదంతా కర్మ – జ్ఞానము (Function and knowing) అను రెండు రెక్కలచే (విన్యాసములచే) అనుభవము (Experience) గా సిద్ధించుచున్నది. బృహత్ బ్రహ్మాండము గా ***అనుభవికి*** అనుభవమౌతోంది కదా ! అయితే....

వెలుగులో ... వస్తువులు, వాటి వాటి ఆకారములు కనిపిస్తాయి. వెలుగు లేకపోతేనో అవి కనిపించవు. కానీ వస్తువులు వేరు – వెలుగు వేరు. అట్లాగే 'ఆత్మ' అనే మహత్తరమగు తేజస్సులో 'కర్మ' (ఆత్మ దేవుని క్రియాశక్తి) "జ్ఞానము" (ఆత్మ దేవుని ఎరుక)...లచే మనం చెప్పుకొన్న మహత్ అహంకార – పృధివీ – అపః – తేజో – వాయు – ఆకాశ – బృహత్ బ్రహ్మాండ"... విశేషాలన్నీ కూడా అర్థవంతముగాను, అనుభవశీలముగానూ సిద్ధించుచున్నవగుచున్నాయి. అయితే...,

ఎద్దాని తేజస్సులో పైన చెప్పుకొన్న మహత్తు, అహంకారము, పాంచభౌతిక దేహములు, పాంచ భౌతిక బ్రహ్మాండము – ఇవన్నీ అనుభశీలమగుచున్నాయో... అదియే 'బ్రహ్మము'. **అట్టి బ్రహ్మము గురించిన మరికొన్ని విశేషాలు వినండి.**

**అద్వితీయమ్ :** అద్దానికి వేరుగా మరొకటనునది ఏదీ లేదు. అగ్నియే – అనేక దీపములలో – వెలుగులు అయి ఉంటున్నట్లు ; మట్టియే అనేక మట్టి బొమ్మల – కుండల ఆకారములుగా అగుపిస్తున్నట్లు ; బంగారమే అనేక ఆభరణములుగా ఆకారములతో – పేర్లతో ప్రచారమగుచున్నట్లు,– **బ్రహ్మమే** మహత్ – అహంకార – పంచభూత – బ్రహ్మాండరూపములుగా లౌకిక దృష్టికి కనిపిస్తోంది కనుక బ్రహ్మము '.అద్వితీయము"... అని చెప్పబడుతోంది. బ్రహ్మమునకు ద్వితీయమైనది లేదు!

**అఖిల ఉపాధి వినిర్ముక్తమ్ :** ఈ కనబడే వేరు వేరు ఉపాధులన్నీ (All physical forms) బ్రహ్మమునకు చెందినవే అయినప్పటికీ కూడా, వీటిని బ్రహ్మమునకు ఆపాదించి చెప్పలేము. బంగారు – ఆభరణముగా ఉన్నది బంగారమే అయినప్పటికీ, "బంగారము ఆభరణముగా మారినది" అని (బంగారము దృష్ట్యా) అనము. కథలోని పాత్రలన్నీ రచయిత యొక్క రచనా విన్యాసమే అయినప్పటికీ రచయిత పాత్రగా అవడు కదా! రచయితకు వేరుగా పాత్రలు లేవు కదా!

మరొక దృష్టాంతము. దేహి యొక్క ఉనికిచే దేహము కదులుతోంది. కానీ "దేహి దేహముగా అగుచున్నాడు" అని అనము కదా! అందుచేత **"బ్రహ్మము – సర్వ ఉపాధులచే పరిమితము కాదు. ఉపాధులు అయ్యేది కాదు. సర్వ ఉపాధి వినిర్ముక్తము"** అని చెప్పబడుతోంది.

**సకల శక్తి - ఉపబ్రుంహితమ్ :** ఈ బ్రహ్మాండములో అగుపిస్తున్న ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియా శక్తి మొదలైనవన్నీ ఆ బ్రహ్మము నుండే బయలుదేరుచున్నాయి. బ్రహ్మమే ఆయా సర్వ శక్తుల రూపముగా ప్రదర్శితమగుచున్నది. అందుచేత – బ్రహ్మము సకల శక్తి సమన్వితము, (సకల శక్తి ఉపబృంహితము) అయిఉన్నది.

**అనాద్యన్తమ్:** ఈ దృశ్య బ్రహ్మాండములో ఇంద్రియ విషయములన్నిటికీ ఆది–అంతము (The Begining and The End) ఉంటోంది. ఇవన్నీ ఎందులో బయల్వెడలి, ఉనికి కలిగి, లయమగుచున్నాయో... అట్టి బ్రహ్మమునకు **ఆది – అంతము** లేవు. కాలబద్ధముకాదు. కాల – హేతువులు అద్దాని యందు ఆద్దాని స్వకీయ భావ కల్పితములు. కనుక బ్రహ్మము ఆద్యంతరహితము.

**శుద్ధమ్ :** ఆకాశాన్ని వాయు – అగ్ని – జల – పృధివిలు స్పృశిస్తాయా ? వాటి వాటి క్రియా విశేషములచే ఆకాశము దోషము పొందదు కదా! అట్లాగే సహజము–స్వస్వరూపము అగు బ్రహ్మము–దేశకాల–వస్తు దోషములచే స్పృశించబడక, సర్వదా సదా శివస్వరూపమై, పరమ శుద్ధమై ఉన్నది. (దృష్టాంతనికి) కళ్ళతో ఒక వస్తువును చూచినంత మాత్రము చేత 'చూపు' అను శక్తికి వస్తువు ఆకారము అంటుతుందా? లేదు. సూర్య కిరణము మురికి వస్తువుపై పడినంత మాత్రం చేత ఆ మురికి కిరణమునకు అంటుతుందా? లేదు కదా ! అట్లాగే బ్రహ్మము నిత్య శుద్ధము. నాటక దీపమువలె ప్రాపంచక సంగతి – సంఘటనలకు సంబంధించనిది. వాటన్నిటిచే బ్రహ్మము స్పృశించబడదు. మార్పు–చేర్పులు పొందదు.

**శివము :** సర్వ జీవులకు దేహ – మనో – బుద్ధి – చిత్త – అహంకార ప్రదాత అయి, ఆహారము .. మొదలైనవన్నీ తన దివ్యశక్తిచే ప్రసాదించుచున్నట్టిది. కనుక సర్వ సుఖప్రదాత ! శివము ! శుభ – ఆనంద రూపము!

**శాంతము** : సర్వమునకు **కారణ–కారణమగుచూ** కూడా తాను పరమ శాంత స్వరూపమైయున్నది. ఈ జగత్ దృశ్యములన్నీ బ్రహ్మమునందే ప్రకాశించి, బ్రహ్మమునందే సశాంతిస్తున్నాయి. సర్వము యొక్క సశాంతి రూపమే బ్రహ్మము.

**నిర్గుణము :** ప్రకృతి నిర్మితమగు సత్వ – రజో – తమో త్రిగుణములకు బ్రహ్మమే ఆధారము. అనగా, త్రిగుణములకు మునుముందుగాను, త్రిగుణ వ్యక్తీకరణము సందర్భములోను, తదనంతరము కూడా ఉన్నట్టిది. కనుక బ్రహ్మము – **నిర్గుణము, గుణరహితము.** ... ఈ విధముగా బ్రహ్మమును ఎరిగిన బ్రహ్మజ్ఞులు బ్రహ్మము గురించి సూచనలుగా చెప్పుచూనే, మరొక్క ముఖ్య విషయం కూడా ఎలుగెత్తి గానం చేస్తున్నారు. అది ఏమిటంటే.....

**బ్రహ్మము అనిర్వాచ్యం :** బ్రహ్మము గురించి మనస్సు – వాక్కు, కాయములను ఉపయోగించి **"ఇట్టిది"** – అని సమగ్రంగా చెప్పజాలనిది. కనుకనే – అనిర్వాచ్యము. అవాక్ – మానస గోచరము. బుద్ధికి ఈవల బ్రహ్మాండము వేంచేసి ఉండగా... బుద్ధికి ఆవల బ్రహ్మము సంప్రదర్శితమైయున్నది. అద్దానిని బుద్ధితో దర్శించటానికే ఇక మిగతా ప్రయత్నములు, సంభాషణము, శాస్త్రములు మొదలైనవన్నీ కూడా.

**బ్రహ్మ-చైతన్యము :** బ్రహ్మమే మనో – వాక్ – దేహ – బుద్ధి – చిత్తములను కదలునట్లుగా చైతన్యవంతము చేస్తోంది. కాబట్టియే – అవన్నీ ప్రవర్తిస్తున్నాయి. అందుచేత 'చైతన్యము' అను పేరుతో ఉద్దేశ్యించబడుతోంది. అట్టి చైతన్య బ్రహ్మమే "నేను" యొక్క "నీవు" యొక్క ఈ దృశ్య జగత్తు యొక్క **నిత్య – సత్య సహజ స్వరూపము.**

## ఈశ్వర ఇతిచ - ఈశ్వరుడు అనగా...

**బ్రహ్మైవ స్వశక్తిః ప్రకృత్యా అభిధేయమ్ ఆశ్రిత్య, లోకాన్ సృష్ట్వా, ప్రవిశ్యా, అంతర్యామిత్వేన బ్రహ్మాదీనాం బుద్ధీంద్రియ నియంతృత్వాత్ 'ఈశ్వరః'** ॥

బ్రహ్మము అనంత శక్తియుతము. అద్దాని 'స్వశక్తి' యొక్క విన్యాసప్రదర్శనమే **'ప్రకృతి'**. అట్టి ప్రకృతిని కల్పించుకొని, ఆశ్రయించి అద్దానియందు బ్రహ్మముయొక్క ఒకానొక చిత్కళావిశేషమును ప్రవేశింపజేయుచున్నది. అట్టి చిత్కళ యొక్క సృజనాత్మకశక్తి...

- లోకాలను సృష్టించుచున్నదై,
- ఆ లోకాలలో ప్రవేశించి,
- తాను సృష్టించిన సృష్టినంతటికీ (స్వప్న ద్రష్ట యొక్క స్వప్న. చిత్ కళ - స్వప్న దృశ్యమంతటికీ అంతర్యామి అయి ఉండు తీరుగా) ... అంతర్యామి (Internal Format) అయి.,
- సృష్టి కళాత్మకుడగు బ్రహ్మ దేవుని, ఇంద్రియములను, ఇంద్రియ వ్యవహార కల్పనలను కొనసాగించుచున్నది. అట్టి సృష్టిపరంపరల సృజనాత్మక చిత్కళా స్వరూపుడే **'ఈశ్వరుడు'**.

– జీవుడు ఒక్క దేహమునకు యజమాని అయి వ్యవహరిస్తున్న తీరుగా..., ఈశ్వరుడు అనేక లోకములను అనేక దేహములతో పర్యవేక్షణ చేయు తత్త్వస్వరూపుడు. సృష్టిని-సృష్టికర్తయగు బ్రహ్మ-లోకపాలకులు మొదలైనవారిని నియత్రించు వాడు. లోకముల అంతర్యామి. బుద్ధి-ఇంద్రియములను నియమించువాడు. కళాస్వరూపుడై, ఒక చిత్రకారునివలె ఈ సర్వమును కల్పించుకొని ఆనందించువారు.

ప్రతి దేహి కూడా స్వతఃగా ఆత్మస్వరూపుడు, ఇంద్రియ ప్రపంచ - దేహదేహాంతర నియామకుడై ఈశ్వరత్వమును తనయందు ప్రక్షిప్తమైయున్నవాడే! ఈ జీవుని అనేక దేహముల జీవనతత్త్వము (అనేక నాటకములలో నటించే నటుని నటనాచాతుర్యము వలె) .... 'ఈశ్వరత్వము' అనబడుచున్నది. అది వ్యష్టి - సమష్టిలయందు పూర్ణమైయున్నది.

## జీవుడు - జీవము

నామ - రూపములను అభిమానించువాడు జీవుడు. సృష్టియొక్క దివ్యప్రజ్ఞారూపులగు బ్రహ్మ, విష్ణువు, ఈశానుడు, ఇంద్రుడు, యముడు, వాయు దేవుడు, వరుణుడు ఇత్యాది అష్టదిక్పాలకులు - మొదలైన దేవతల సంకల్పశక్తిచే కల్పించబడిన ఈ **నామ రూపాత్మక పాంచభౌతిక జగత్తుయొక్క అభిమాని**. నామ రూపాత్మక జగత్తు యొక్క సందర్శనాభ్యాసముచే బద్ధుడు.

- "నేను నామ - రూపములకు చెందినవాడను.
- వీటితో నాకు అవినాభావ సంబంధము.
- నాకు దృశ్యము (ఇంద్రియ జగత్తు) అత్యవసరము.
- నా కష్టసుఖాలన్నీ దృశ్యముచే లిఖించబడుచున్నాయి.

... అను భావ-ఆవేశములు కలిగి ఉన్నవాడు జీవుడు. తాను పరమాత్మయే అయి ఉండి కూడా, తనయొక్క జీవాత్మత్వము తన కల్పనా విభాగమే అయి ఉండినప్పటికీ, భౌతిక-సాకార దృష్టులకు బద్ధుడై పరిమితుడై ఉంటున్నాడు. "ఎందుకో మరి, నేను బద్ధుడను. మోక్షము లభించేది ఎట్లా?" ... అని దృశ్యములో బంధముక్తి ఉపాయములకై దేవులాడుచూ, తన యొక్క ఈశ్వరత్వము - సర్వాత్మకమగు పరమాత్మత్వము గమనించటం లేదు. **జీవమునకు జీవుడు అధ్యాసవశంగా బద్ధుడై ఉంటున్నాడు. 'స్థూలోఽ హమ్' ఇతి అధ్యాసవశాః**

**జీవము : 'నేను స్థూలరూపపరిమితుడు' అను అధ్యాసము** (Avocation) **వశమైనవాడే జీవుడు! జీవుని ఆశ్రయ స్థానము-జీవము!**

**బహుజీవః :** ఈ జీవుడు బాహ్యమున వేరు వేరు జీవులతో స్నేహము-ద్వేషము-శత్రువు-మిత్రుడు-అయినవాళ్ళు-కాని వాళ్ళు-జాతి-దేశము ఇటువంటి సమష్టిత్వమునకు సంబంధితుడు అగుచున్నాడు. **సోహఽ మ్ ఏకోఽ పి, దేహారంభక భేదవశాత్ "బహుజీవః"**। ఈ జీవుడు సర్వదా సర్వత్రా ఏకము-అఖండము అగు ఆత్మయే స్వరూపముగా కలిగి ఉండి కూడా, బుద్ధియొక్క భేదవశముచేత **"బహు జీవుడు-సమష్టి జీవుడు"** అగుచూ, స్వయంరచిత-కల్పనకు బద్ధుడుగా ఉంటున్నాడు. **"బంధువులు-మిత్రులు మొదలైన కొంతమంది ఇతరులతో కలుపుకొని నాకు ఉన్నప్పుడే నేను సారవంతుడను"**.... అను సమిష్టి కల్పనపై మనస్సుచే ఆధారపడి ఉన్నవాడు.

## ప్రకృతి

**బ్రహ్మణః సకాశాత్ నానా విచిత్ర జగత్ నిర్మాణ సామర్ధ్యక బుద్ధిరూప బ్రహ్మ శక్తి రేవ ప్రకృతిః ।**

బ్రహ్మము-తన యొక్క బుద్ధి రూపశక్తిచే-అనేక చిత్ర-విచిత్ర కల్పనల-సంకల్పముల-జగత్తుల నిర్మాణ సామర్థ్యము కలిగి ఉన్నది. అట్టి బ్రహ్మము యొక్క సాకారరూపమగు నానా విచిత్ర జగత్ నిర్మాణ సామర్థ్యముగల బుద్ధి ప్రకాశక రూప బ్రాహ్మీ శక్తియే ప్రకృతి.

బ్రహ్మము = శివుడు, ఆత్మ, శక్తిమంతుడు.

ప్రకృతి = బ్రహ్మము (ఆత్మ) యొక్క బుద్ధి భావనాశక్తి ; - సంకల్ప శక్తి (భవాని, ఊహ, స్వభావి, సంకల్పి, సృష్టి, చంచల ... ఇవన్నీ ప్రకృతియొక్క వ్యవహార నామములు)!

## పరమాత్మ

**దేహాదేః పరతత్వాత్ బ్రహ్మైవ పరమాత్మ । (పరమ్ + ఆత్మ = పరమాత్మ)**

పరమ్ ... ఆవల ! దేనికి ఆవల ? ఈ ఉపాధుల ప్రారంభమునకు, సర్వభావములకు మునుముందే ఉన్న స్వస్వరూపమే పరమాత్మ! (జన్మ - కర్మలకు ఆవల సర్వదా కారణ-కారణంగా ప్రకాశమైయున్నదియే - అట్టి బ్రహ్మము ! అదియే పరతత్త్వము!

ఆ పరమాత్మయే..., (లేక) పరబ్రహ్మమే ... (లేక) ప్రతి జీవుని కేవల స్వస్వరూపము. అట్టి పరమాత్మ - బ్రహ్మ, విష్ణు, రుద్రుడు - ఇంద్రుడు - శమనుడు (యముడు) - సూర్యుడు - చంద్రుడు - సురులు - అసురులు - మనుష్యులు - పిశాచములు - అయి వేరు వేరు ప్రదర్శన రూపములుగా ప్రకటనమగుచున్నారు.

పిశాచము = భౌతికదేహ రహితమగు మనో ప్రజ్ఞారూపి!

ఇన్ని రూపములు తనవే అయినట్టి తత్త్వమే 'పరమాత్మ' ! అదియే పురుషులు, స్త్రీలు, స్థావరము, పశువులు, బ్రహ్మమును ఎరిగి ఉపాసిస్తున్న బ్రాహ్మణులు ... ఇవన్నీ కూడా! ఒక్క మాటలో చెప్పాలంటే!

**"సర్వం ఖలు ఇదం బ్రహ్మ । న ఇహ నానాऽస్తి కించన।" (నేహ నానాऽస్తి కించన)!**

ఇదంతా ద్రష్ట - దర్శన - దృశ్యములతో సహా అంతా బ్రహ్మమే! ఇదంతా స్వప్నస్వరూపమగు పరమాత్మ ప్రదర్శనమే!

ఇక్కడ నానాత్త్వము కనిపించవచ్చు గాక ! ఇదంతా ఈ విధంగా **కల్పనా దృష్టి - భావనా దృష్టి** చే మాత్రమే అనుభవమగుచున్నది.

**వాస్తవానికి ఇక్కడ నానాత్వమనునదే లేదు. సంకల్పముచే నానాత్వము ఉన్నది! స్వస్వభావతః లేనే లేదు! నేను-నీవు-లోకులు-లోకపాలకులు-లోకములు-ఇవన్నీ బ్రహ్మమునకు అభిన్నమగు కల్పనలు.**

## జాతి

**న చర్మనో, న రక్తస్య, నామాంసస్య, న చ అస్థినః, న ఆత్మనో జాతిః ।** ఈ లోకములో ప్రసిద్ధమై కనిపించే "ఈ జాతి - ఆ జాతి"... మొదలైనదంతా కూడా స్వతఃగా ఉన్నవి కావు. ఈ దేహములోని రక్తమునకు జాతిభేదము ఉన్నదా ? మాంసమునకు, బొమికలకు ఈ జాతి - ఆ జాతి అనునదంతా ఉన్నదా? లేదు కదా! ఇక ఆత్మకో? 'జాతి' అనునది సంబంధించియే లేదు. మరి జనులలో ప్రసిద్ధమైయన్న 'జాతి' భేధమనుదంతా ఏమిటి? - **వ్యవహార ప్రకల్పితః ।** మానవులచే పరస్పర - వ్యవహారికంగా, కించిత్ సౌకర్యము కొరకై కల్పించుకొన్నది. అఖండము - అప్రమేయము అగు ఆత్మయందు జాతి బేధము ఎక్కడినుండి వస్తుంది ? అందుచేత వ్యావహారిక కల్పితమైన దానిని వ్యావహారిక పరిమితముగా మాత్రమే చూడాలి. వ్యావహారిక సౌలభ్యమును మాత్రమే దృష్టిలో కలిగి ఉండాలి. బంగారపు గాజులు, ఉంగరము, గొలుసులు, అరవంకె... మొదలైనవన్నీ ఆకార - ఉపయుక్తముల దృష్ట్యా వేరే! కానీ, బంగారము దృష్ట్యానో? ఒక్కటే!

- ఈ పేరుగల వీధి పేరు - ఆ పేరు గల వీధి పేరు
- ఈ ఊరు - ఆ ఊరు
- ఈ ప్రాంతము - ఆ ప్రాంతము
- ఈ రాష్ట్రము - ఆ రాష్ట్రము
- ఈ దేశము - ఆ దేశము
- ఈ భాషవారు - ఆ భాషవారు

- ఈ ఆచారము వారు - ఆ ఆచారము వారు
- ఈ చదువు చదువు వారు - ఆ చదువు చదువు వారు
- ఈ పాఠశాల విద్యార్థులు - ఆ పాఠశాల విద్యార్థులు
- ఈ పేరువాడు - ఆ పేరువాడు, నీవు - నేను - ఆతడు - ఆమె - ఈమె!

మొదలైన ఇవన్నీ ఏవిధంగా వ్యావహారికము మాత్రమే! (పరస్పరము వ్యవహరించుకొనుటకొరకై ఒకానొక వీలైన విధానము మాత్రమే!...) ఆ రీతిగానే 'జాతి' అనునది చూడాలి గాని వస్తుతః భేద దృష్టితో కాదు ! "జాతిః వ్యవహార ప్రకల్పితా" అనునది ఏమరువకూడదు. ఆత్మ దృష్ట్యా, ఆధ్యాత్మ అధ్యయనము దృష్ట్యా, వేదాంత శాస్త్ర గ్రహణము దృష్ట్యా - **"ఆయా భేదములన్నీ మొదలే లేవు. అవి ఏ సందర్భము కొరకై పరికల్పన చేయబడ్డాయో... అంత వరకే ఆ సందర్భము కొరకు మాత్రమే పరిగణము చేయబడును గాక"**.... అను అవగాహనయే అఖండ బ్రహ్మజ్ఞానము. (ఉదా : ఒక తరగతి గదిలో "బాగా మార్కులు వచ్చినవారు - మధ్యరకంగా మార్కులు వచ్చినవారు - తక్కువ మార్కులు వచ్చినవారు".... అను విభాగము సందర్భానుకూలము కావచ్చు గాక ! అంతేగాని, "వీరు ఆ కులము - వారు ఈ కులము" ... అనునది విద్యార్జన దృష్ట్యా అసందర్భము కదా !)

## కర్మ - ఇతిచ

**క్రియమాణ ఇంద్రియైః కర్మాణి "అహమ్ కరోమి" ఇతి ఆధ్యాఽత్మ నిష్ఠతయా, కృతం కర్మైవ 'కర్మ'।**

ప్రకృతి చేతను (పంచభూతముల చేతను - అశరీరములగు సృష్టి ప్రజ్ఞలు {లేక దివ్య ప్రజ్ఞలు, దేవతలు} చేతను) నిర్మించబడుచూ, క్రియామానమగుచున్న ఈ ఇంద్రియములు నిర్వర్తించు కర్మలను ఈ దేహధారి "ఇవన్నీ నేనే చేయగలుగుచున్నాను. ఇంతటి వాడిని కాబట్టి చేస్తున్నాను"... అని అనుకుంటూ ఉండటమూ,

"అహం కరోమితి - నేను దీనికి కర్తను"... అని తలచటము,

అట్టి ఆధ్యాత్మ (వ్యష్టి) నిష్ఠతతోను, కర్మల పట్ల అభిమానముతోను కర్మలను నిర్వర్తించటమునే 'కర్మ' - అంటున్నారు!

**"నేనే" కర్తను ! నేనే భోక్తను । నేనే ఈ ఇంద్రియములకు యజమానిని । ఈ ఇంద్రియములు నావే। మరొకరి పాత్ర వీటిలో లేదు । మరే దైవీశక్తీ లేదు । ఈ కాళ్ళు - చేతులు నా తెలివితేటల చేతనే ప్రవర్తిస్తున్నాయి. కనుక నేనే వీటి క్రియా విశేషాలకు యజమానిని - కర్తను కూడా॥"** ... అని తలచు వానిని "ఈతడు కర్మిష్టుడు"... అని చెప్పబడుచున్నది. ఎవ్వడైతే "ఈ ఇంద్రియముల నిర్మాత జీవుడుగా నేను కాదు. కనుక వీటిచే నిర్వర్తిస్తున్నవి కేవలము నా వ్యష్టి సంబంధమైన తెలివికాదు"... అని ఎరిగి ఉంటాడో, అతడు 'కర్మిష్టుడు' అని పిలవబడడు. కర్తృత్వము ఉంటే కర్మిష్ఠుడు. లేదా .... అకర్మిష్టుడు.

## అకర్మ - ఇతి చ

**కర్తృత్వ - భోక్తృత్వాది అహంకార తయా బంధ రూపమ్ । జన్మాది కారణం। నిత్య నైమిత్తిక యాగవ్రత తపోదానాదిషు అఫలాభిసన్ధానం - యత్, తత్ "అకర్మ" ।**

కర్తృత్వ-భోక్తృత్వములను అహంకారముతో నిర్వర్తించటమే బంధరూపము. అదియే జన్మ పరంపరలకు కారణం ! ఎవ్వరైతే నిత్యము చేస్తున్న లౌకిక కర్మలనుగాని, ఉపాసన కర్మలను గాని, నైమిత్తక కర్మలను గాని (occasionally) (ఉదా : కార్తీక మాసవ్రతాలు, అప్పుడప్పుడు నిర్వర్తించే నోములు, ఏవైనా.. దేవుడు పెళ్ళి... ఇటువంటి సందర్భములలో నిర్వర్తించే కార్యక్రమాలు... ఇవన్నీ నిమిత్తాన్ని అనుసరించి చేసేవి కాబట్టి నైమిత్తిక కర్మలు) '**అకర్తాఽహమ్**' (నాఽహమ్‌కర్తా) భావనతో చూస్తారో... వారు కర్మచేయనివారే !

- ఇవన్నీ కర్తృత్వ - భోక్తృత్వ అభిమానములతో చేస్తూ ఉంటే బంధము అవగలవు.
- "ఆత్మజ్ఞాన సమన్వితుడనై, సమర్పణ - ఉపాసనాభావంతో సర్వాత్మకుని ఆనందిపజేయటానికి ఉద్దేశ్యించెదనుగాక ।"... అను అవగాహనతో నిత్య-నైమిత్తిక కర్మలు గాని, యాగ-వ్రత-తపో-దానములు మొదలైనవిగాని చేయువారు అకర్మిష్ఠులే!

"నాకు ఏమి లభించింది ?" అనే ఫలాభిసంధానమును వదలివేసి, విజ్ఞులు "దేహము ప్రసాదించిన పరమాత్మ ఉద్దేశ్యమును నెరవేరుస్తున్నాను. ఆ సర్వాత్మకుడగు, సర్వతత్త్వ స్వరూపునికి సమర్పిస్తున్నాను".. అను అకృత్రిమ - స్వభావ సిద్ధమైన భావనతో కర్మలు నిర్వర్తించుచున్నారు. వారు కర్మలు చేయనివారే అగుచున్నారు. కాబట్టి వారికి కర్మ బంధము ఉండదు.

## జ్ఞానము - ఇతి చ

**దేహ ఇంద్రియ నిగ్రహ, సద్గురూపాసన, శ్రవణ మనన నిదిధ్యాసనైః ; యద్యత్ దృక్ - దృశ్యస్వరూపం ; సర్వాంతరస్థం ; సర్వసమం ; ఘటపటాది పదార్థమివ అవికారం. "వికారేషు (చ) చైతన్యం వినా కించిత్ నాస్తి-ఇతి సాక్షాత్కారనుభవమ్ జ్ఞానమ్॥**

- **దేహ ఇంద్రియ నిగ్రహమ్:** దేహ – ఇంద్రియములను – ఆయా విషయములకు, సందర్భములకు, సంబంధములకు, సంఘటనలకు ముడిపెట్టి సమర్పించివేయకుండా... **నిగ్రహము** (Forbearence and control) కలిగి ఉండటము.

- **సద్గురూపాసనమ్:** సాంసారికమైన తన యొక్క – తదితర సాంసారిక దృష్టిగల జీవుల యొక్క అభిప్రాయములను, ఆశయములను ప్రక్కనపెట్టి, **ఆత్మ తత్త్వజ్ఞులు-తత్త్వమ్ అని ఎరగియున్నట్టివారు** అగు, **మహదాశయులగు** సద్గురువులను సమీపించి, వారు ఏ జ్ఞాన దృష్టితో ఈ జగత్తు–దేహ–అంతరంగ స్థితి – గతులను దర్శించుచున్నారో... అట్టి **సత్య దృష్టి, బ్రాహ్మీదృష్టి, తాత్త్విక దృష్టి** ... సంబంధమైన సమాచారమును వారి వద్ద సముపార్జించుకోవాలి. ఇదియే జ్ఞానమార్గము.

  'సత్'ను గురువుగా (పరాకాష్ఠగా) అభ్యసించి – దర్శించటము సద్గురూపాసనము. సత్యద్రష్టలగు మహనీయులను శరణువేడి శ్రవణం చేయడం – సద్గురూపాసనము.

**శ్రవణ - మనన - నిదిధ్యాసనైః :** గురువుల 'తత్త్వమ్' అని నిరూపించు ఆప్త వ్యాక్యాలను ముందుగా **శ్రవణం** చేయాలి. **"వారు ఇట్లా కర్మ – జ్ఞాన – భక్తి – యోగ సాధనల గురించి, ఆత్మతత్త్వ స్వరూపము గురించి ఎందుకు పలుకుచున్నారు ? ఆత్మయొక్క బాహ్యర్థము – గూడార్థము ఏమిటి ? సద్గురువుల అసలు ఉద్దేశ్యము ఏమిటి? "**.... అను విశేషాలను **మననము** చేయాలి. అనుమానాలు వస్తే, తిరిగి ఆత్మజ్ఞుల వద్ద అనునయముగా ప్రశ్నించి, వారి ఉద్దేశ్యములను – అనుభవములను – అవగాహనలను ... వాటి వాటి ప్రశ్న – సమాధానములను సమకూర్చుకోవాలి. వేదోపనిషత్ మహావ్యాకార్థ నిరూపణా సమాచారమును మననము చేసుకొంటూ విశ్లేషించుకోవాలి. విశదీకరణము చేసుకోవాలి. ఈవిధంగా సద్గురువులు ప్రకటిస్తున్న ఆత్మసాక్షాత్కారము (లేక) బాహ్మీ దృష్టిని స్వీకరించి, మనో–బుద్ధులచే – అభ్యాసవశంగా దైనందికము, అనుక్షణికము చేసుకోవాలి. ఇది **మననము.**

గురువాక్యార్థాన్ని బుద్ధితో హృదయమునందు నిలిపి, హృదయాకాశంలో స్వస్వరూప పరబ్రహ్మమే అయిఉన్న సర్వలోకములను 'ఆత్మాంతర్గతమ్' అయినట్లు దర్శించుచుండటమే **'నిదిధ్యాస'.**

తెలుసుకొనుచున్న దానిని, అభ్యాసం చేస్తున్నద్దానిని నిత్యానుభూతిగా సిద్ధింపజేసుకోవటమే 'నిదిధ్యాస'. (To transform all that being known and all that being practised - into Every minute. Experience is 'Nidi-Dhyasa')

**అదృక్ - దృశ్య రూపము :** ఏ పరబ్రహ్మమైతే దృక్ – దర్శన – దృశ్యరూపములకు 'నాటక దీపము' వలె సాక్షియై ఆవల ఉండి, కేవలము ఆధారమై, తానుమాత్రం నిరాలంబమై, నిరాధారమై ఉన్నదో... అట్టి బ్రహ్మము గురించిన సమాచారమే జ్ఞానము. అట్టి సర్వాధారమగు ఆత్మ వస్తువును ద్రష్ట – దర్శన – దృశ్య రూపమగు ఇంద్రియ జగత్తులో వెతికి లాభమేమున్నది ? "చూపు"కు, చూచువానికి 'సాక్షి' రూపమై ఉన్నది. దృక్–దృశ్యమంతా ఆత్మకు అభిన్నంగా తోచు విజ్ఞానమే **జ్ఞానము.**

**సర్వాంతస్థమ్ :** "అట్టి పరబ్రహ్మము మరెక్కడో దూరంగా ఉండి, ఎన్నటినో లభించేది కాదు. అది సర్వుల యందు, ఈ సర్వమునందు (ఆభరణములో బంగారమువలె, వస్త్రములో దారమువలె) **అంతస్థమే** (Internally and inwardly ever - present) అయి ఉన్నది" ... అని చర్చ – దృష్టాంతపూర్వకంగా నిర్ద్వంద్వముగా నిరూపించునదే **జ్ఞానము.**

**సర్వసమమ్ :** "అనేక కుండలలో ఒకేమట్టి (మృత్తికేవ సత్యమ్) ... అను రీతిగా, అది సర్వదేహములో సర్వత్రా కూడా సమస్వరూపమై ఉన్నది. నాటకములోని పాత్రల స్వభావములన్నీ నాటక రచయిత యొక్క ఒకే భావనా – ఊహా చైతన్యమే – అయిఉన్న తీరుగా, ఆ పరబ్రహ్మము విజ్ఞులలోను–అజ్ఞులలోను, ఒక పురుగులోను–సృష్టికర్తయగు బ్రహ్మదేవుని యందు సమముగా ఉన్నది (సమమ్ సర్వేషు భూతేషు తిష్ఠన్తమ్ పరమేశ్వరమ్) – **ఏ సమాచారము, విశ్లేషణ.. మొ॥వి అట్టి అవగాహనను కలిగిస్తూ ఉన్నాయో... అదియే జ్ఞానము.**

**ఘట - పటాది పదార్థమివ అవికారమ్ :**

- కుండకు ఆకారమున్నది. మరి ఆ కుండ ఏమట్టితో నిర్మితమైనదో... అట్టి మట్టికి ఆకారమున్నదా ? మట్టి కుండను చూచి, "మట్టి కుండవలె గుండ్రముగా ఉండును'... అని ఎవ్వరైనా అనగలరా ? అట్లా అనము కదా!
- వస్త్రమునకు, ఆ వస్త్రముతో తయారైన చొక్కా (Shirt) కు ఆకారము ఉండవచ్చు గాక। వస్త్రము యొక్క (లేక) చొక్కా యొక్క ఆకారమును "దారము యొక్క ఆకార ధర్మము"... అని అనగలమా? లేదు కదా ! **అట్లాగే పరబ్రహ్మము (మట్టి - దారమువలె ఘట - పటాదివ) నిరాకారము... అని విశదీకరించునది జ్ఞానము. "దేహము సాకారము కావచ్చు గాక ! ఆ దేహమును కదల్చుచున్న దేహి గాని, సర్వ దేహములలో దేహిగా సంప్రదర్శనమగుచున్న 'పరమాత్మ' గాని నిరాకారులేకాని, సాకారము కాదు...** అని సుస్పష్ట పరచు విశదీకరణమే జ్ఞానము. పరమాత్మ సర్వదా అవికారుడు, నిర్వికారుడు ! ఈ జగత్తు... సవికారము. అస్థిరము. చంచలము కూడా.

**"చైతన్యం వినా కించిత్ నాస్తి" - ఇతి సాక్షాత్కారనుభవమ్ జ్ఞానమ్ :** "పరబ్రహ్మ చైతన్యమే ఈ విధంగా బ్రహ్మాండ దృశ్యముగా అజ్ఞాన దృష్టికి అగుపిస్తోంది. జ్ఞాన దృష్టిచే ఇదంతా ఆత్మ చైతన్యమే ! ఆత్మ చైతన్యమే నీవు! - సాక్షాత్ తత్ త్వమ్ అసి... అని ఏ సంభాషణ ప్రతిపాదించి నిరూపిస్తోందో.. అదియే **జ్ఞానము.**

## అజ్ఞానమ్

**"రజ్జౌ సర్పభ్రాంతిః"ఇవా, అద్వితీయే, సర్వానుస్యూతే, సర్వమయే బ్రహ్మణి...,**
**దేవ తిర్యక్ నర స్థావర స్త్రీ పురుష వర్ణాశ్రమ బంధ మోక్ష ఉపాధి**
**(ఇత్యాది) నానాత్మ భేద కల్పితం జ్ఞానం - (ఇతి) ... "అజ్ఞానమ్"।**

ఏ పరబ్రహ్మమైతే సర్వదా ద్రష్టకు (శ్రోతకు - నాకు - నీకు - మనందరిలో ప్రతి ఒక్కరికీ) అద్వితీయమై, సర్వస్వరూపమై, పూదండలో దారమువలె సర్వమునకు అనుస్యూతమై, సర్వమయమై సర్వదా సర్వత్రా ఘనీభూతంగా వేంచేసియున్నదో... అట్టి పరబ్రహ్మతత్త్వమునకు భేదకల్పనయే అజ్ఞానము!... దేవతలు వేరు. తిర్యక్ జంతువులు వేరు. స్థావరములు ఇంకా వేరైనవి. స్త్రీలు వేరు. పురుషులు వేరు. అందరూ కూడా వర్ణాశ్రమ ధర్మాల చేత వేరు వేరు. బ్రహ్మచర్యాశ్రమము వారు - గృహస్థులు - వానప్రస్థులు - సన్యాసులు, వీరంతా వేరు వేరు తెగలకు చెందినవారు। ఇక్కడ బంధము ఉన్నది ! మోక్షమున్నది ! మోక్షము పొందినవారు వేరుగా ఉన్నారు. బద్ధులేమో ఇక్కడ ఉన్నారు. యోగాభ్యాసులు వేరు. భక్తులు వేరు. జ్ఞానులు వేరు. కర్మ యోగలు మరొక రీతివారు.

... ఈ విధంగా **భేద కల్పన** చేసి చూడటమే **'భ్రాంతి'** అని **'అజ్ఞానము'** అని చెప్పబడుచున్నది. ఇట్టి భేద దర్శనమంతా ఎట్టిదో, ఇక్కడ ఒక దృష్టాంతము చెప్పుకుందాము.

**రజ్జౌ సర్ప భ్రాంతిః :**

ఒక బాటసారి ఒకదారిలో వెళ్ళుచూ ఉండగా కటిక చీకటిలో కాలికి మెత్తగా ఏదో తగిలింది... **"అమ్మ బాబోయ్! చాలా పెద్ద పాములాగుందే! చుట్టలు చుట్టుకొని ఉన్నట్లు కనిపిస్తోంది. ఇది బుస్సున లేచి కాటేస్తుందా ఏమి? పోనీ వెనుకకు అడుగులు వేద్దామా... నా అడుగుల శబ్దమునకు ఈ త్రాచుపాము కాటేస్తే? చచ్చానే! ఇక్కడ దగ్గరలో ఎవ్వరూ లేరు కూడా! నన్ను ఎవ్వరు రక్షించేది?"...** అని భయకంపితుడై వణకుచున్నాడు. పాము కాటుకు నేల మీద పడి విషము దేహములో ప్రవేశించటం చేత కొట్టుకు-కొట్టుకు చావటమునకు సంబంధించిన-ఎప్పటివో కొన్ని తాను చూచినవి, వార్తలుగాను, సమాచారములుగాను విన్నవన్నీ అతనికి గుర్తుకు రాసాగాయి.

ఇంతలో...

ఆ బాటలో ఎవరో ఒక పెద్ద మనిషి అటుగా వెళ్ళుచూ, **"ఏమిటయ్యా బాబూ, నీ గోల?"**... అని పలకరించాడు. అప్పుడా బాటసారి "అయ్యా! నా కాలికి ప్రక్కగా పాము ఉన్నది! త్రాచుపాము ! చచ్చినట్లే ! నన్ను కాపాడండి !"... అని అరవనారంభించాడు.

అప్పుడు రెండవ పెద్ద మనిషి, "ఏమిటి? పామా ? ఏదీ ? చూద్దాం !"... అని విజ్ఞత-అనుభవములతో చూచాడు. **అక్కడ ఉన్నది ఒక చాంతాడు!**

అప్పుడా రెండవ ఆయన, "భలేవారండీ ! చూడండి ! ఇది త్రాడు !" అనగానే మొదటి బాటసారికి భ్రమలు, భయాలు, వణుకులు క్షణంలో మటుమాయమయినాయి.

"అయ్యా ! రక్షించారు ! మెత్తగా కాలికి తగులుచున్నట్లుగా ఉంటే, ఇది పామేమోనని భయపడి చచ్చాననంటే నమ్మండి" అని అనుకుంటూ చిరునవ్వు తెచ్చుకుని, అక్కడి నుండి సాగిపోయాడు. త్రాడుయందు పామును అకస్మాత్తుగా అవిచారణగా చూడటము వంటిదే - ఆత్మయందు 'జగత్తు'ను ఆత్మకు భిన్నముగా దర్శించటము!

ఇక్కడ అఖండమగు **స్వస్వరూప - సర్వస్వరూప - అప్రమేయ బ్రహ్మమే** సర్వదా సర్వత్రా వేంచేసి ఉండగా–అనేకత్వమును దర్శించటము, అనేక భేదములను ఆపాదించటము - ఇవన్నీ **మనస్సుతో కల్పించుకొని అనుభవములుగా పొందటము** జరుగుతోంది! ఇదియే **అజ్ఞానము!**

## సుఖమ్

### సత్ - చిత్ - ఆనంద స్వరూపం జ్ఞాత్వా, 'ఆనందరూపస్థితి' ఏవ 'సుఖమ్' !

ఆత్మ యొక్క సత్ (ఉనికి) – చిత్ (ఎరుక, వెలిగించునది) – ఆనంద (అంతా అద్దాని అనుభూతియే వినోదమే) ... అను తత్త్వమును తెలుసుకొని, సర్వము సచ్చిదానంద స్వరూపముగా దర్శించుచుండగా ఏర్పడు ఆనంద రూప స్థితియే "సుఖమ్".

## దుఃఖమ్

### అంతః సంసార విషయ సంకల్ప ఏవ - దుఃఖమ్ ।

**అంతరంగములో (హృదయములో) కల్పన!**

- కథ చదువుచూ ఉన్నప్పటి కథలోని విషయాలకు, కల చూస్తూ కలలోని విషయాలకు ఆవేశపడు తీరుగా,
- నాటకం చూస్తూ, నాటకములోని సందర్భములకు మనస్సు స్పందించు తీరుగా,

దృశ్య–ఇంద్రియ సంబంధమై సంగతులు, సంఘటనలు, వ్యవహార సంబంధములు–ఇవన్నీ సంకల్పించుకొని – మనస్సు భావావేశము పొందుతూ ఉండటమే దఃఖములన్నిటికీ మూలము. దృశ్య విషయములు ఆశించటము,... అల్పాశయములు–ఇవన్నీ దుఃఖములకు బీజము.

## స్వర్గమ్

### సత్ సంసర్గః స్వర్గః

- ఏది కల్పన (లేక అసత్తు) ? ఏది సత్తు (సహజ సత్యము) ? ... ఈ రెండింటినీ బుద్ధితో విడదీసి, విభాగించి

సత్ (సర్వదా ఉండి ఉన్న) వస్తువుతో సర్వదా సంసర్గము (Relatedness) కలిగి ఉండటము...

అసత్ వస్తువుతో (సర్వభేదకల్పనలతో) అసంసర్గము కలిగి ఉండటము... ఇదియే 'స్వర్గము' (సు–వర్గేఽ తి స్వర్గమ్)

సత్తు గురించి సంభాషించుకొనుచూ, పరస్పరము సంతోషము పొందుచుండటమే 'స్వర్గము'.

## నరకమ్

### అసత్ సంసార విషయ జనన సంసర్గ ఏవ 'నరకః' ।

అసత్ = స్వతఃగా లేనిది. సంసారము = లేని దానితో – కల్పనచే ఘనీతమైపోయిన సంబంధానుభవం.

కేవలము ఊహాజనితము, స్వకీయ కల్పనా నిర్మితము, తనకు తానుగా ఆశ్రయించిన భ్రమచే నిర్మిమై అనుభవమగుచున్నట్టిది ఈ దృశ్యము. అట్టి దృశ్యరూప సంబంధ–అనుబంధ మనోవికారములచే జనించు స్థితితో కలిగియున్న బంధమే–సంబంధమే (Relatedness) అసత్ సంసారము. అద్దాని సంసర్గముతో ఏర్పడు స్థితిని 'నరకము' అని పిలుస్తున్నారు.

## బంధము

### అనాది అవిద్యావాసనయా 'జాతోఽహమ్'... ఇత్యాది సంకల్పో 'బంధః' ।

- నేను దేహముతో జనిస్తున్నాను. ఈ దేహముతో బాల్య – యౌవన – వార్ధక్యములు అనుభవిస్తున్నాను. ఎప్పుడో ఏదో కారణం చేత ఈ దేహముతోబాటే మరణిస్తున్నాను ! ఇదీ నా స్థితి, గతి, పరిస్థితి. దేహ పరిమితుడను!

- ఈ దేహము తరువాత ఇంకొక దేహం! ఒక జైలు నుండి మరొక జైలుకు!
- జన్మ - కర్మ - మరణములచే బద్ధుడను. ఏం చేయను ? పూర్వ కర్మ - వాసనలే నన్ను ఇట్లా నడిపిస్తున్నాయి.

ఈ విధమైన సంకల్పము కలిగి ఉండటమే "బంధము"।

**మమతా సంసారావరణ సంకల్పోబంధః। "ఈ తండ్రి, ఈ తల్లి ఈ సహోదర - సహోదరిలు, భార్యా - పుత్రులు, నేను పుట్టిన ప్రదేశము, ఈ ఇల్లు - వాకిలి, ఈ ఆరామ క్షేత్రము (గుడి) ... మొదలైనవన్నీ నాకు చెందినవి. నేను వీటిని బంధించినవాడిని. ఇది ఇంతే !"**.... అనే 'మమత'తో ఆవరించబడటమూ, సంకల్ప-వికల్ప పరంపరల మధ్య ఊయలు ఊగుచుండటమే **బంధము!**

**కర్తృత్వాది అహంకార సంకల్పో బంధః**

- నేను కొన్నిటికి కర్తను. మరికొన్నిటికి భోక్తను. ఈ రెండిటికి బందీని.
- ఇది చేశాను. అది చేయలేకపోయాను ఇంకా ఇవి, ఇవన్నీ చేయవలసి ఉన్న పనులు.
- ఇవన్నీ సంపాందించాను. నావే ! ఇంకా, ఇదిగో, ఇవి పొందాలి ! చూద్దాం, ఏమౌతుందో, మరి ?
- అప్పుడు అది చేశాను. అట్లా అయ్యింది ! వారు అట్లా చేయలేదు. అందుకని ఇట్లా అయ్యింది !

... ఇవన్నీ కర్తృత్వ - భోక్తృత్యాది రూపమగు అహంకార - మమకారములతో కూడిన సంకల్పములు. ఈ సంకల్పములన్నీ జీవునికి అప్పటికప్పుడుగాని (లేక) కాలక్రమేణ కానీ (By Eventuality) బంధమే - అగుచున్నాయి.

**అణిమాది అష్టైశ్వర్య ఆశాసిద్ధ సంకల్పో బంధః - అణిమాది అష్ట సిద్ధులు బంధమే.**

| | | |
|---|---|---|
| అణిమ | - | అణురూపుడై, ఎదుటివారి చూపుకి మాయమైనట్లుగా అగుపించగలగటము. |
| మహిమ | - | విరాట్ రూపుడై, ఆకాశము - భూమి అంతటా నిండి ఉండటము. |
| గరిమ | - | కొండంత బరువుగా అవటము. |
| లఘిమ | - | దూదికంటే కూడా తేలికగా అయి అకాశంలో ఎగురగలగటము. |
| ప్రాప్తి | - | సంకల్పించిన వస్తువులను సృష్టించగలగటము. |
| ప్రాకామ్య | - | క్షణంలో అనుకున్న చోట ప్రత్యక్షము కాగలగటము. |
| ఈశిత్వ | - | దృశ్యమును - ప్రదేశమును ఆక్రమించి, అద్దానికి అధికారి కాగలగటము |
| వశిత్వ | - | ఎదుటివారిని ఆకర్షించి, క్షణంలో వశము చేసుకోగలగటము. |

... ఈ ఈ అష్టసిద్ధులు జీవునకు ఏకాగ్రతతో కూడిన యోగభ్యాసముచే సిద్ధించలవు. అయితే, వీటికి సంబంధించిన దృశ్య ప్రయోజనములు జీవునికి ఆత్మజ్ఞానమార్గములో ప్రతిబంధములే అగుచున్నాయి. తనను తాను ఎరుగక, వాటిచే అస్వతంత్రుడుగానే మిగులుచున్నాడు. జ్ఞానమార్గంగా చూస్తే అవన్నీ (అష్టసిద్ధులు కూడా) ధన సంపద, జన సంపదవలె స్వల్ప విశేషాలు మాత్రమే! అవి బంధమే!

**అష్టైశ్వర్యములతో సంబంధము బంధమే!** : దాసీ జనము - భృత్యులు - భార్యా భర్తల పరస్పరత్వము - పుత్రులు - మిత్రులు - వాహనములు - ధనము - ధాన్యము ... మొదలైనవాటికొరకై జీవుడు ఎన్నో మార్గములలోతాపత్రయపడుతూ ఉంటాడు. లేని వాడు, **"అవన్నీ పొందితే బాగు కదా !"** అని తలచుచూ, **"ఎట్లాగురా, పొందేది ?"**... అని యోచనలు చేస్తూ ఉంటాడు. అవన్నీ ఉన్నవాడో? "ఇప్పుడు నేను పొందవలసినదంతా పొందాను. ఇక పొందవలసినదంటూ ఏమీ లేదు"... అనే **స్వాంతన స్థితి పొందడు.** వాస్తవానికి వాటికి సంబంధించిన - "ఉన్నవి, లేవు" మొ॥న సంకల్పమున్నీ 'బంధము' కలిగించునవే అగుచున్నాయి.

**దేవ మనుష్యాది ఉపాసనా కామ సంకల్పో బంధః** : ఏవైనా లోక సంబంధమైన కోరికలతో, "అది పొందాలి ! ఇది కావాలి"... ఇటువంటి కామ సంకల్పముతో దేవతలను, మనుష్యులను ఉపాసించటము-ఈ జీవునికి "ఆత్మతత్త్వ సముపార్జన"... మార్గములో **ప్రతిబంధకములే** అయి ఉంటున్నాయి.

**యమాది అష్టాంగయోగ అభ్యాసాஉది సంకల్పో బంధః** : సర్వదా సిద్ధించియే ఉన్న ఆత్మను గుర్తెరుగుటచే ఆత్మ స్వరూపసిద్ధి లభించగలదు. అన్య భావనలను జయించి "ఆత్మతో-అనన్యానుభవము"ను ఈ జీవుడు సంపాదించుకోవాలి. అది ఏమరచి అష్టాంగ యోగ సంకల్పములను ఆశ్రయిస్తూ "ఈ యోగసాధనయేనా కార్యక్రమము"... అని సంకల్పించువానికి... అది అతని పట్ల బంధము రూపమే అగుచున్నది. యోగము ఆత్మానుభవము కొరకు కాకుండా, యోగినని అనిపించుకోవటానికైతే, అది బంధమే!

**"యమము (ఇంద్రియ నిరోధము), నియమము (ఇంద్రియ నియామకము) ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి అను అష్టాంగ యోగములు ఎంతో కాలం అభ్యసించాలి. అప్పుడు కానీ, ఆత్మ సాక్షాత్కారము సిద్ధించదు"...** అని అనుకోవటము, ఆ రీతిగా **సంకల్పములు కలిగి ఉండటము కూడా బంధమే ।**

ఎందుకంటే...

***ఎల్లప్పుడూ సిద్ధించియే ఉన్న పరమానందమగు పరబ్రహ్మతత్త్వము సిద్ధించటానికి ఎప్పుడో, ఏదో అష్టాంగ యోగములు నిర్వర్తించవలసిన పనేమున్నది ? 'కనిపించేదంతా అదే' అయి ఉండగా, కన్నుమూతలు దేనికి ? ఒకడు ఒక నాటకములో నటిస్తూ, "ఇది నేను నటించు పాత్ర! నా సహజ రూపము ఈ (జగత్) నాటకమునకు సర్వదా వేరు" – అని తెలుసుకొని ఉండటానికి ఎంతసేపు పడుతుంది?***

**వర్ణాశ్రమ ధర్మ కర్మ సంకల్పో బంధః :** "అబ్బో ! మన వర్ణ ధర్మములు చాలా గొప్పవి ! తదితర వర్ణముల వారికి ఇంత గొప్ప వర్ణ ధర్మములు కావు. మనము ఇంకా ఇంకా ఈ నియమాలు పాటించాలి. నిష్టలు అనుసరించాలి!–ఇటువంటి సంకల్పము కూడా బంధమే!

అంతే కాదు..,

"ఇవి బ్రహ్మచారి – గృహస్థ – వానప్రస్థ – సన్న్యాస ఆశ్రమ ధర్మాలు. ఇవన్నీ – ఇట్లాగూ, అట్లాగూ పాటించాలి. లేదా, నకరం ! ప్రమాదం ! తప్పు !"... ఇటువంటి సంకల్పాలు కూడా ఈ జీవునికి బంధమే కలుగజేస్తున్నాయి.

### అజ్ఞా (ఆజ్ఞా)-భయ సంశయాఽఽత్మ గుణ సంకల్పో బంధః।

- అజ్ఞానము – ఆశలు... బంధమే!
- వీరిని నేను ఆజ్ఞాపించాలి. వారి ఆజ్ఞలు నేను పాటించి తీరవలసినదే ! తప్పదు! ఏం చేస్తాం! కర్మ!
- ఏది ఎప్పుడు ఎట్లా ఎందుకు ఏదిగా పరిణమిస్తుందో తెలియనప్పుడు అంతా భయము కాక, మరింకేమిటి ?
- మాకు అనేక సంశయాలు ఉన్నాయి. అవన్నీ తొలిగితే కదా, మోక్షము ! మరి ఈ మా సంశయాలు ఎప్పటికి, ఎట్లా తొలగుతాయి ? చాలా కష్టం !
- మనమంతా త్రిగుణములలో చిక్కి ఉన్నాము. పరమాత్మ త్రిగుణాతీతుడు. ఈ గుణములు శమింపజేసుకొని పరమాత్మను జేరటం తేలికైనపనా ? కాదు ! అందుకు మనము ఇంకా ఇంకా చాలా చాలా ప్రయత్నాలు చేయాలి లెండి !"

... ఇటువంటి సంకల్పములన్నీ జీవునికి బంధమే అగుచున్నాయి. ఎందుకంటే అనునిత్యమగు సత్యమును స్ఫురింపజేటానికి మోక్షము కొరకై శాస్త్రములు సాధనరూపంగా కల్పించినదంతా **అజ్ఞాన దృష్టిచేత** బంధముగానే పరిణమిస్తున్నాయి. **విజ్ఞాన దృష్టిచే** మాత్రమే మోక్షప్రదాతలు అగుచున్నాయి.

### యజ్ఞ - వ్రత - తపో - దాన - విధి - విధాన జ్ఞాన సంకల్పో బంధః

- యజ్ఞములలో ఎన్నో విధి విధానములు ఉంటాయి. అవన్నీ కూడా ఇంకా ఎన్నో చేయాలి ! సోమయాజిని కావాలి.
- వ్రతములు – తపస్సులు – దానములు ఇంకా ఎంతగానో విధి విధానంగా నిర్వర్తించాలి. ఇవన్నీ నాలాగే కొందరే చేయగలరు.
- యజ్ఞ–యాగ–తపస్సులకు సంబంధించి అనేక పద్ధతులు ఉంటాయి. అవన్నీ పాటించాలి మరి! చాలా మందికి చాలా విషయాలు తెలియటము లేదు. చెప్పితే కూడా విధి విధానాలు ఆచరించటం లేదు. అవియే ముఖ్యము! నాకే అవన్నీ ఎరుక!"

... ఈ విధంగా యజ్ఞ – తపో – దాన – విధి విధానముల గురించిన సమాచారములు, సంకల్పములు కూడా బంధమే అగుచున్నాయి.

### కేవల మోక్షాఽపేక్ష సంకల్పో బంధః

"మోక్షమొక్కటే ముఖ్యం ! అందుకే ప్రయత్నించాలి. మిగతా విషయాలు పట్టించుకోకూడదు. మానివేయాలి" అనురూపముగల సంకల్పములూ బంధమే అగుచున్నాయి. "బంధము మొదలే లేదు" అనునదే అత్యుత్తమ పాఠ్యాంశము.

- జీవాత్మ జగదంతర్గత వస్తువు. కల్పన చేయబడినట్టిది. నాటకంలోని పాత్రవలె అద్దానికి బంధము–అనునది లేదు. మోక్షము లేదు.
- **పరమాత్మత్వము నిత్యముక్తము.** కనుక బంధమే లేదు. బంధమే లేని దానికి మోక్షమను మాట ఏముంటుంది ?

ఈ విధంగా "నాకు ఎట్లాగైనా మోక్షము లభించాలి ! ఎట్లాగురా బాబూ ?"... అను సంకల్పము కూడా బాధయే ! చివరికి మోక్షము కావాలి అనునది కూడా సన్న్యసిస్తే గాని మోక్షస్థితి సిద్ధించదు. (ఇతి మోక్ష సన్న్యాస యోగః)

ఓ బిడ్డలారా ! ఒక్క మాటగా చెప్పాలంటే,.... **అసలు 'సంకల్పము' అనునదే బంధము.**

- సంకల్పములు తనవి అయి ఉండగా, ఈ జీవుడు **తనను తానే** (ఆత్మను) – సంకల్పముల పరంపర కారణముగా ఏమరచుచున్నాడు.
- సంకల్పములు ఉన్నంతవరకు దేహ – దేహాంతరములు కొనసాగుచూనే పోతున్నాయి.

అందుచేత **"సంకల్పమే బంధము – నిస్సంకల్పమే మోక్షము"**... అని చెప్పబడుతోంది.

## మోక్షము

**నిత్య-అనిత్య వస్తు విచారత్, అనిత్య సంసార సుఖ-దుఃఖ విషయ... సమస్త క్షేత్ర మమతాది సమస్త బంధ సంకల్పక్షయో మోక్షః ।**

- ఏది నిత్యమో – ఏది అనిత్యమో విభజించి, విభాగము చేస్తూ విచారణ చేయాలి.
- ఇక ఆపై అనిత్యము, అసత్యము సంసార దుఃఖ రూపములు – అగు సమస్త జీవాత్మ సంబంధమైన అహంకార-మమకార సంబంధ కల్పనలను క్షయింపజేసుకొని ఉండటమే "మోక్షము"

ఎవ్వరి దృష్టిలో-**ఈ ప్రపంచంలోని ఈ దేహము-తదితరములైన సంబంధ అనుబంధ బాంధవ్యములతో సహా సహా**-ఏవీ కూడా తనకు బంధము కాదో, తాను వాటి సంబంధించడో అవి తనకు సంబంధించి ఉండలేదో... అట్టి అప్రమేయ-ఆత్మజ్ఞాన దృష్టియే "మోక్షము"!

## ఉపాస్యుడు (ఉపాసించ తగినవాడు)

**ఏ సద్గురువైతే మన యొక్క - సర్వత్రా సర్వదా సిద్ధించియున్న - చైతన్య బ్రహ్మ స్వరూపమును మనకు తమ ఆప్త వాక్యముల ద్వారా గుర్తు చేస్తూ ఉంటారో** (సాక్షాత్ 'తత్త్వమ్ అసి' ఇతి వేదవచసా యో బోధయత్ ఆశ్రితాన్)... ఆ మహానుభావుడగు, ఆ సద్గురువే **మనము సదా ఉపాసించవలసినవాడు.**

**సర్వ శరీరస్థ చైతన్య బ్రహ్మ ప్రాపకో గురురూపస్యః**

**"సర్వ దేహములలో వేంచేసియున్న చైతన్య బ్రహ్మ స్వస్వరూపమే గురురూపము"** అని కూడా మీరు గ్రహించి ఉండండి ! స్వస్వరూపమగు ఆత్మయే గురువు!

## శిష్యుడు

**విద్యాధ్వస్త ప్రపంచాఽవగాహిత జ్ఞానాఽవశిష్టం బ్రహ్మైవ శిష్యః ।** ఎవ్వడైతే గురువాక్యములు మననము చేస్తూ, గురుతత్త్వమేమిటో సందర్శించుచు...,

- **ఈ దృశ్య ప్రపంచమంతా – ద్రష్ట – దర్శన – దృశ్యములతో సహా... వాస్తవానికి అఖండ పరబ్రహ్మ తత్త్వమే** అను జ్ఞానముచే అవశిష్టుడై... **'బ్రహ్మమే తాను'** అని గ్రహిస్తూ ఉంటాడో అతడే శిష్యుడు. **జ్ఞానావశిష్యేతి శిష్యః ।**
- విద్యచే తనకు వేరుగా కనిపిస్తున్న దృశ్యమంతా అదృశ్యమైపోగా-అప్పటికీ శేషించియున్న స్వస్వరూపక అధ్యాయియే శిష్యుడు. **అవశిష్యేతి శిష్యః** 'శిష్యుడు బ్రహ్మమే!' ... అని ఎరిగి ఉన్నవాడే సద్గురువు.

## విద్వాన్ ఇతి చ

**సర్వాన్తరస్థ స్వసంవిత్ విద్వాన్ । స్వ స్వరూప సత్ - విత్ యే** (సంవిత్తు) **సర్వస్వరూపమై** ప్రకాశించుచున్నది. అదియే తెలుసుకొనవలసినది. అది తెలుసుకొన్నవాడే **విద్వాంసుడు.** 'నేనే ఇదంతా' – అను ఎరుకయే విద్య!

## మూఢ ఇతి చ

**కర్తృత్వాది అహంకార భావనారూఢో మూఢః** "నేనే కర్తను-భోక్తను"... మొదలుగా గల భావనలయందు ఆరూఢుడైనవాడే మూఢుడు. ఈ శరీరము-దీని నిర్మాతలగు అధిదేవతలు-జీవుడు-సంఘటన, సందర్భములు-ఈశ్వరుడు (జగత్ రచనావిధి)... ఇవన్నీ ప్రతి కర్మకు కారణమగుచుండగా, "ఇదంతా నేనే చేస్తున్నాను! నా వలననే!" అని అనువాడు అసమగ్రమగు అవగాహనదృష్ట్యా మూఢుడే అగుచున్నాడు. కర్తృత్వము-అహంకారము-మమకారము-నావి-నావాళ్ళు-నా జాతి.... మొదలైనవన్నీ మూఢత్వముచే ఏర్పడున్నాయి.

## అసుర-ఇతి చ

**బ్రహ్మ విష్ణు ఈశానా ఇంద్రాదీనామ్ ఐశ్వర్య కామనయా నిరశన జప - అగ్నిహోత్రాది ఈష్వ :** ఎవ్వడైతే భౌతికమైన ఐశ్వర్య కాముకుడై బ్రహ్మ – విష్ణు – శివ – ఇంద్రుల సంపదలను కోరుకుంటూ, తదితరులను ద్వేషిస్తూ... ద్వేష భావాలతో సహ జీవులను బాధించే ఉద్దేశ్యముతో జప – తప – అగ్నిహోత్ర ... ఇత్యాదులు నిర్వర్తిస్తాడో,..... ఆతడే అసురుడు!

**అంతరాత్మానం సంతాపయతి చ, ఉగ్ర రాగ - ద్వేష - హింసా - డంబాది అపేక్షితం తప అసురమ్ ।** తీవ్రమైన రాగము (Attachemt - Eg. జాత్యహంకారము), ద్వేషము (Hatred – మరొకరికో, మరొకజాతికో హాని కలుగజేయాలనే తీవ్రమైన ఉద్వేగము), హింసా (ఇతరులను బాధించాలనే ఉద్దేశ్యము) – డంబము ("నేనెంత గొప్పవాడినో! అందరూ నన్ను చూచి భయపడాలి"... ఇటువంటి దర్పటాటోప భావములతో) జప – తప హోమములు నిర్వర్తిస్తూ తనయందు, తదితరులయందు సమముగా వేంచేసియున్న **'సమమ్ సర్వేషు భూతేషు'** అగు అంతరాత్మను క్షోభింపజేస్తూ చేయు తపస్సు **ఆసురతపస్సు!** అతడు ఆత్మజ్ఞానమునకు సుదూరుడై అనేక అజ్ఞాన ఉపాధులలో ప్రవేశించి అనేక దుఃఖ-బంధ పరంపరలను కోరితెచ్చిపెట్టుకున్నవాడగుచున్నాడు.

## తప - ఇతి చ

**"బ్రహ్మ సత్యమ్-జగత్ మిథ్య"... ఇతి అపరోక్ష జ్ఞానాగ్నినా, బ్రహ్మాది ఐశ్వర్య, ఆశా సిద్ధ సంకల్ప బీజ సంతాప రూపం తపః।**

గడ్డిపరక నుండి – బ్రహ్మ దేవుని వరకు సర్వ ఐశ్వర్యముల పట్ల ఆశ, అవి సిద్ధించాలనే సంకల్ప 'బీజము' (The root desire of possess) బంధమగుచున్నది. ***బ్రహ్మసత్యము – ఈ జగత్తు స్వప్నమువలె మిథ్య. ఇందులో ఏదైనా పొందాలని ఆవేశపడటము, పొందటానికై ఏవేవో యత్నాలు చేయటము, పొంది గొప్ప అనిపించుకోవాలనుకోవటము... ఇదంతా కలలో చూచిన దేహములను, వస్తువులను కోరుకొని, వాటికై జాగ్రత్‌తో వెతకటము వంటిది*** – అనే జ్ఞానాగ్నితో భ్రమ-అజ్ఞానములను దగ్ధము చేయటమే **తపస్సు**. **తపనయే తపస్సు**. అజ్ఞాన దృష్టులను, ఆశలను, ఆశయములను, ఆవేశములను... వాటి వాటి బీజములతో సహా **'జ్ఞానాగ్ని'**తో దహించివేసే ప్రయత్నమును **'తపస్సు'** అని పిలుస్తున్నారు.

## పరమ పదమ్ ఇతి చ

- **ప్రాణ ఇంద్రియాది అంతఃకరణ గుణాదేః పరతరమ్,**
- **సత్ - చిత్ - ఆనందమయమ్,**
- **సర్వ సాక్షికమ్,**
- **నిత్యముక్త బ్రహ్మ స్థానమ్... "పరమమ్ పదమ్" ।**

ప్రాణముకు, ఇంద్రియములకు, (మనోబుద్ధి చిత్త అహంకారములనబడే) అంతఃకరణ చతుష్టయమునకు, సత్వ రజో తమోగుణములకు ఆవల నిత్యోదికమై వెలుగొందుచున్నట్టిది-**'పరమ పదము'**. అట్టి పరమాత్మ (ప్రతి జీవుని యొక్క పర-ఆవల గల స్వస్వరూపము)...,

**సత్** – ఉనికి
**చిత్** – ఎరుక
**ఆనంద** – **అనుభూతి** స్వరూపము అయి ఉన్నది.

- అంతరంగ – బహిరంగ జగత్తులకు **కేవల సాక్షిగా** ఉన్నది.

  అయ్యది 'నిత్యముక్తము'. ఈ దేహ – దృశ్య – సంబంధ – లౌకిక సంఘటన – ఈ దేహము తరువాత వచ్చే స్థితిగతులు ... ఇవన్నీ ఆత్మ సమక్షంలో ఆత్మ చైతన్యము నుండి స్ఫూర్తిని పొందటం చేత ప్రవర్తమానమగుచున్నాయి. ఆత్మకు దేనితోనూ బంధము లేదు. (జీవాత్మ జగత్ కల్పిత విశేషము కాబట్టి జగత్తుచే నిత్య బద్ధము).

- సూర్య కిరణాలు తటాక జలముపై పడి, అక్కడి తరంగములు మెరుపులను ప్రదర్శించవచ్చుగాక! తటాక జలము సూర్య కిరణములను బంధించగలదా ? లేదు కదా !

ఆత్మ జ్యోతి యొక్క కిరణ పుంజములగు ఈ దృశ్య – దేహ – మనో – చిత్త అహంకారాలు ఆత్మను ఎట్లా బంధిస్తాయి ? బంధించలేవు. సర్వమునకు 'పరము' (ఆవల) అయిన ఆత్మ పదము నిత్యముక్తమేగాని, అద్దానికి **'బంధము' అనునదే ఎప్పుడూ లేదు.** ఉండజాలదు. ఆత్మ స్వరూపమును బంధించగలిగేది ఎక్కడా ఏ మాత్రము లేదు.

**బ్రహ్మస్థానమ్ :** ఆ పరమ పదము సర్వ లోక స్థానములకు ఆవల **'బ్రాహ్మీ స్థితి, బ్రాహ్మీస్థానము'** అయి ఉన్నది. ఈ సకలము తానై, సర్వమునకు వేరై, కేవలీ స్వరూపమైనట్టిది 'బ్రాహ్మీస్థితి'! వేదములచే వేదాంగములచే దారి చూపించబడుచున్నది. పరాకాష్ఠ స్థానముగా, ఈ జీవుడు శాంతి – ఆనందముల కొరకై తిరిగి చేరవలసిన స్థితిగా మహర్షులచే, ఆత్మజ్ఞులచే ఎలిగెత్తి గానము చేయబడుచున్నది. ఈ జీవుడు పొందవలసిన పరాకాష్ఠయే **'పరమ పదము'** అని సూచించబడుతోంది. అదియే 'పుట్టినిల్లు'. దారి తప్పిన రాజకుమార బాలుడు తిరిగి యువరాజ సింహాసనము చేరి ఆసీనుడవటము వంటిది.

## గ్రాహ్యమ్ ఇతి చ - గ్రహించలసినది - పట్టుకొని ఉండవలసినది

**దేశ కాలవస్తు పరిచ్ఛేదరాహిత్య చిన్మాత్ర స్వరూపమ్ గ్రాహ్యమ్।** ఒకడు అనేక రకములైన విషయాలు తెలుసుకొంటూ ఉండవచ్చు.

- తెలియబడే విషయాలు వేరు వేరైన విధములై ఉండవచ్చుగాక !
- తెలుసుకుంటూ ఉన్న **'తెలివి'** మాత్రము సర్వదా ఒక్కటే అయి ఉన్నది కదా ।

అట్లాగే... తేజోమయము – ఎరుకస్వరూపము అయి, ... దేశము (Place Factor) చే గాని, కాలము (Time factor - past, present and future) చే గాని, వస్తువు (Matter) చే గాని పరిచ్ఛేదము (Divisibility. Becoming different from what it is now and here) కించిత్ కూడా ఏ మాత్రమూ పొందటమే లేదో అట్టి 'చిన్మాత్రము'నే ఈ జీవుడు ఆశ్రయించాలి.

ప్రతి జీవునిలోను 2 విశేషాలు: 1) మార్పు చెందేవి + 2) మార్పు చెందనిది (గతాసమ్, అగతాసమ్). మార్పు చెందు సర్వమును దాటి, 'మార్పు చెందనిది' ని దర్శించాలి, ఆశ్రయించాలి. అదియే స్వీకరించ తగినది. గ్రాహ్యమ్. అది **'కేవల స్వస్వరూపమే'** అని, (అట్లాగే) **'నీవు – జగత్తు'ల వాస్తవ రూపమే** అనునదే – గ్రహించవలసిన గ్రాహ్యము.

## అగ్రాహ్యమ్ ఇతి చ॥ - స్వీకరించకూడనిది - వదలి ఉండవలసినది

**స్వస్వరూప వ్యతిరిక్త, మాయామయ, బుద్ధి - ఇంద్రియ గోచర జగత్ - సత్యత్వ చింతనమ్ - ఇతి అగ్రాహ్యమ్ !**

సహజము – నిత్య నిర్మలము – అనునిత్యము – అఖండము అగు స్వస్వరూపమునకు వేరుగా (మాయచే) అనిపిస్తూ...

- కేవల "స్వీయమనో కల్పన"చే అనుభవమగుచుండుటచే మాయామయమై,
- బుద్ధి – ఇంద్రియములకు ఎదురుగా... తనకు వేరైనట్లుగా ; (ఉదా : స్వప్నము, స్వప్న ద్రష్ట యొక్క స్వప్న కళా చైతన్యమునకు వేరుకానప్పటికీ, వేరైనట్లు అగుపిస్తున్న రీతిగా)... కనిపిస్తున్న దృశ్య జగత్తును చూస్తూ...,

  ఇది సత్యమే! ఇక్కడ సుఖ – దుఃఖములకు నేను బద్ధుడను,

  ఇక్కడి స్థితిగతులు నన్ను ఇటు – అటు దొర్లించుచున్నాయి".

అను **'దృశ్య సత్యత్వచింతన'** ను విడవాలి. **అది వదలవలసిన వస్తువు. (అగ్రాహ్యమ్).** మార్పు చెందని ఆత్మను గ్రహించాలి. మార్పు చెందేది, ఆత్మకు వేరుగా మాయచే అనిపించేది అగు **'జగత్ దృశ్యము'** ను బుద్ధితో వదలి ఉండాలి !

## సన్న్యాస ఇతి చ

**సర్వధర్మాన్ పరిత్యజ్య, నిర్మమో - నిరహంకారో భూత్వా, బ్రహ్మేష్టం శరణం ఉపగమ్య, 'తత్త్వమసి', 'సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ', 'నేఽహనాస్తి కించన' ఇత్యాది మహావాక్య అనుభవజ్ఞానాత్, 'బ్రహ్మైఽవాహమస్మి'! ఇతి నిశ్చిత్య, నిర్వికల్ప సమాధినా స్వతంత్రోయతి చరతి, స సన్న్యాసీ ।**

**సన్న్యాసి...** (సత్ న్యాసి) అనగా ఎట్టివాడై ఉన్నాడో.. శ్రద్ధగా వినండి !

1) **సర్వధర్మాన్ పరిత్యజ్య :** బ్రహ్మచారి – గృహస్థ – వానప్రస్థ ఇత్యాది సర్వ ఆశ్రమ ధర్మములను అధిగమించివేసనవారై, దాటివేసి, పరిత్యజించివేసినవాడై ఉండువాడు సన్న్యాసి. దేహ–మనో–బుద్ధి–చిత్త–అహంకార ధర్మములచే పట్టుబడనివాడుగా ప్రకాశమానుడై ఉంటాడు.

2) **నిర్మమో...** "ఈ జగత్తులోకి నేను ఏదీ తేలేదు. తీసుకొని పోయేది లేదు. ఈ దేహము కూడా జీవుడుగా – నా ప్రజ్ఞచే నిర్మితమైనది కాదు. ఒక రోజు ఇక్కడ వదలి వెళ్ళవలసిన వస్తువు. ఈ దేహము – ఈ దృశ్యము నేను వచ్చి – వెళ్ళబోవు ఒకానొక ప్రదేశము వంటిది మాత్రమే ! కనుక ఇక్కడేదీ నాది కాదు. నేను అనుకున్న రీతిగా ఇది ఉండాలని కూడా నియమించుకోను"... అని మమకారరహితుడై ఉంటున్నవాడు సన్న్యాసి!

3) **నిరహంకారో భూత్వా...** "ఈ దేహము – ఇద్దానిలో కనిపించే చూపు – వినికిడి – ఆఘ్రాణము – స్పర్శ – రుచి... ఇవన్నీ ప్రకృతి ప్రసాదించిన శక్తులు. అట్టి ప్రకృతి ప్రసాదిత శక్తులతో నిర్వర్తించేది ప్రకృతి రూపిణికే చెందుతాయి. అంతే కాని, నావి ఎట్లా అవుతాయి ? అందరము అఖండ పరమాత్మ యొక్క సంప్రదర్శనమే! ఇట్లయి ఉండగా, నేను మరొకరికంటే గొప్పవాడిని ఎట్లా అవుతాను ? సర్వకిరణములు ఒకే సూర్య భగవానుని నుండి బయల్వెడలు చుండగా "ఇక్కడి ఈ కిరణము కంటే అక్కడి ఆ కిరణము గొప్పది" అనునది ఏమున్నది ?... ఈ రీతిగా నిరహంకారము అభ్యసించువాడు సన్న్యాసి.

4) **బ్రహ్మేఽష్టమ్ శరణం ఉపగమ్య :** సర్వస్వరూపము – సర్వాంతర్యామియగు బ్రహ్మమునే అత్యంత ఇష్టముగా శరణువేడుతూ ఉంటాడు. బ్రహ్మమునందే అశ్రితుడై, ప్రవేశమానుడై ఉంటాడు.

**మహావాక్య అనుభవజ్ఞానాత్ :** వేద – వేదాంత శాస్త్రము ప్రదిపాదిస్తున్న మహావాక్య జ్ఞానమును మననము చేస్తూ, తదర్థాన్ని హృదయమునందు నిలపి, దృష్టిని పరమ పవిత్రము చేసుకొనువాడు సన్న్యాసి!

| | | |
|---|---|---|
| "తత్ త్వమ్ అసి" | – | **"తత్ (పరమాత్మ) స్వరూపము నీవు అయియే ఉన్నావు" –** అను అభ్యాసము నిర్వర్తిస్తూ, |
| "సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ" | – | **ఈ కనబడుచున్నదంతా, ఈ సర్వము – బ్రహ్మమే అయి ఉన్నది** – అను పవిత్రదృష్టిచే, |
| నేఽహనానాస్తి కించన | – | **ఇక్కడ అనేకముగా కనిపించేదందా సర్వదా 'ఏకము' అగు బ్రహ్మమే ! వాస్తవానికి ఇక్కడ నానాత్వములేనే లేదు.** ... మొదలైన వాక్యముల అనుభవజ్ఞానము. (The knowledge that transpires into experience) ... అను నిస్సంశయ జ్ఞానం సహాయముతో |

### బ్రహ్మైవాఽహమస్మి - నేను బ్రహ్మమునే అయి ఉన్నాను.

... అని నిశ్చయమునకు వచ్చినవాడై ఉంటాడు. సర్వ సంకల్ప – వికల్పముల పరిధులను దాటి వేసినవాడై, ... ఆత్మకు భిన్నమైన సర్వ వికల్పనల రహితము అయినట్టి **నిర్వికల్పసమాధి** యందు ప్రవేశించినవాడై ఉంటాడు.

అట్టి యతియే... సన్న్యాసి(సత్–న్యాసి = సత్ వస్తువును ఉపాసిస్తూ పరిగ్రహించినట్టివాడు) ! ఆయన నిత్యముక్తుడు ! అందరికీ పరమ పూజ్యుడు ! యోగి ! పరమహంస ! అవధూత ! బ్రాహ్మణుడు కూడా ! అట్టి సాధనా మార్గమును స్వీకరించుటచే ఈ జీవుడు **నిరాలంబాత్మస్వరూపుడు** అగుచున్నాడు.

⌘

ఎవ్వరైతే ఈ '.నిరాలంబోషనిషత్"... ప్రతిపాదించుచున్న పరమ సత్య వస్తు నిర్వచనములను గురు అనుగ్రహం చేత గురు ముఖతః వికల్పనా రహితుడై, వినుచూ హృదయస్థము చేసుకుంటారో.

.... వారు అగ్నివలె పరమ పవిత్రులగుచున్నారు! వాయువువలె నిర్మల హృదయులగుచున్నారు.

.... అట్టివారు పునః ఈ సంసారమున పడరు. పునరావృత్తి దోషము స్పృశించజాలని **నిరాలంబ స్థానమును** పుణికి పుచ్చుకొనుచున్నారు. జన్మరహితులై, తిరిగి ఈ జనన – మరణ చక్రములో ప్రవేశించరు.

**ఇతి నిరాలంబోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 9 పరమహంసోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ పరమహంసోపనిషత్ వేద్య అపార సుఖాకృతీ।**
**త్రైపాద శ్రీరామతత్త్వమ్ "స్వ-మాత్రమ్" ఇతి చిన్తయే ॥**

*పరమహంసోపనిషత్ విషయమును తెలుసుకొన్నవాడు అపారమైన ఆత్మ సుఖమును అంది పుచ్చుకొనుచున్నాడు. జాగ్రత్-స్వప్న-సుషుప్తి-త్రిపాద సాక్షియగు రామతత్త్వము-స్వమాత్రమ్ ఇతి। "శ్రీరామ తత్త్వము, శ్రీరామబ్రహ్మము నేనే అయి ఉన్నాను" అని చింతన చేస్తూ, అట్టి* ***అనునిత్యానుభూతిని*** *సిద్ధింపజేసుకుంటున్నాడు.* ***ఆత్మారామో అహ మేవ - నమో నమః॥***

| | |
|---|---|
| **1. ఓం** | "**ఓం**" కార తత్త్వ భగవానునికి నమస్కరిస్తూ ...... |
| **అథ, "యోగినామ్ పరమహంసానామ్ కో మార్గః? తేషామ్ కా స్థితిః?" ఇతి నారదో భగవంతమ్ ఉపసమా ఇతి ఉవాచ।** | బ్రహ్మమానస పుత్రులు, దేవర్షి, లోక కళ్యాణమూర్తి అగు నారదులు శ్రీమాన్ భగవంతుడు, పితామహుడు, సృష్టికర్త, అశ్రితవత్సలుడు అగు బ్రహ్మదేవుల వారిని సమీపించి ఇట్లా అడిగారు. తండ్రీ! లోక పూజ్యా! జగద్గురూ! యోగులయొక్క పరమహంసా మార్గము, విధానము ఏతీరుగా ఉంటాయి? వారి స్థితి - సంప్రదాయములు ఎట్టివి? |
| **2. <u>తమ్ భగవాన్ ఆహ:</u>** | **భగవంతుడగు బ్రహ్మ దేవులవారు** చెప్పనారంభించారు. |
| **యో అయమ్ పరమహగ్ంస మార్గో లోకే దుర్లభతరో। న తు బాహుళ్యో! యత్ యత్ ఏకో భవతి।** | నాయనా! నీవు అడుగుచున్న **పరమ హంసల** మార్గము లోకములో దుర్లభతరమైనదయ్యా! బాహుల్యము కాదు. పరమహంసా స్థానములో ఉండి ఉంటున్నవారు అతి కొద్దిమంది! ఎక్కడో ఒక్కొక్కరు. తదితర ఆశ్రమములవలె అధికంగా ఉండరు. |
| **స ఏవ నిత్య కూటస్థః। స ఏవ వేద పురుషః** | పరమహంస- నిత్యకూటస్థుడై (మూల రూపుడై), నిత్యపవిత్రుడై, నిర్మలాత్మ స్వరూపుడై-సర్వము స్వస్వరూపంగా దర్శిస్తూ ఉంటారు. |
| **ఇతి విదుషో మన్యంతే॥** | వేదములు ఆతనిని **"వేదపురుషుడు"** అని అభివర్ణిస్తున్నాయి. **విదితవేద్యుడు** (తెలుసుకోవలసినది తెలుసుకొన్నవాడు) - అని విదుషులు (పండితులు) అతని గురించి చెప్పుకొస్తున్నారు. ఉద్దేశ్యిస్తున్నారు. |
| **మహాపురుషో యత్ చిత్తమ్ తత్ సదా మయ్యేవ తిష్ఠతే।** | ఆతని చిత్తము సర్వదా-సర్వత్రా పరమపుషుడను, మహాపురుషడను, సర్వాంతర్యామిని |

**తస్మాత్ అహం చ తస్మిన్ ఏవ**
**అవస్థీయతే॥**
**అసౌ స్వపుత్ర-మిత్ర-కళత్ర**
**బంధ్వాదీన్,**
**శిఖామ్, యజ్ఞోపవీతగ్ం**
**స్వాధ్యాయం చ,**
**సర్వ కర్మాణి సన్న్యస్య,**
**అయమ్ బ్రహ్మాండం చ హిత్వా,**
**కౌపీనమ్, దండమ్, ఆచ్ఛాదనం చ**
**స్వశరీర ఉపభోగార్థాయ**
**లోకస్యైవ ఉపకారార్థాయ చ**
**పరిగ్రహేత్।**
**తత్ చ న ముఖ్యోఽ స్తి ।**
**కోఽ యమ్ ముఖ్య?**
**ఇతి చ యత్**
**అయమ్ ముఖ్యః॥**

అగు నాయందే సంలగ్నమై, ప్రతిష్ఠితమై ఉంటున్నది. ఆయన అంతా, అంతటా సర్వమునూ పరబ్రహ్మముగానే దర్శిస్తూ ఉంటారు.

అందుచే సృష్టికర్తనగు నేను ఆతనియందు **పరిపూర్ణానుభవమూర్తిగా** అవస్థితుడనై ఉంటాను. పరమహంస అగు **అతనికి** - పరబ్రహ్మ స్వరూపుడనగు **నాకు** భేదమే ఉండదు.

ఆతడు తనయొక్క లోక సంబంధమైన పుత్రులను, మిత్రులను, బంధువులను సత్-న్యాసముచే పరబ్రహ్మ రూపముగా స్వీకరిస్తూ, బాహ్య విశేషాలను సన్న్యసించి ఉంటాడు. అంతేకాదు, శిఖ (పిలక), యజ్ఞోపవీతము, స్వాధ్యాయము, తదితర సర్వకర్మలను-సత్ వస్తువగు బ్రహ్మమునకు అభిన్న దృష్టితో-బ్రహ్మ భావముతో దర్శిస్తూ ఉంటారు. బ్రహ్మాండమును సన్న్యసించినవాడై ఉంటారు. ఇంతెందుకు? **"ఈ బ్రహ్మాండము నందు నాది అయినది లేదు. నాది కానిది లేదు"** ... అని సత్-న్యాసి అయి ఉంటారు. ఈ శరీర ధారణ - రక్షణ కొరకు మాత్రమే కౌపీనము (వస్త్రము), దండము ధరించి, దేహము మొదలైన ఇక్కడ సర్వమును ఉపకరణ భావంతో చూస్తూ ఉంటారు.

పుత్ర-మిత్ర-కళత్రములనుగాని, శిఖ-యజ్ఞోపవీత - స్వాధ్యాయనములు గాని, దేహ ఆచ్ఛాదనములు-పరికరములు గాని... ఇవన్నీ కూడా ఏది పరిగ్రహించినా **"ఇది లోక శుభము - సహజీవులకు సౌకర్యము - ఆనందము కలుగజేయును గాక!"** ... అని మాత్రమే ఉద్దేశ్యముగా కలిగి ఉంటారు. తనకొరకై ఏదీ స్వీకరించరు. కలిగి ఉండరు. త్యజించరు.

ఓ నారదా! బాహ్యమగు సంబంధములు - వస్త్రధారణలు మొ॥వి ప్రాముఖ్యమైన విశేషాలు కావయ్యా! ఆ పరమహంస విషయమై మనం చెప్పుకోబోవుచున్న ఆత్మజ్ఞానానంద విశేషాలే ముఖ్యమైనవిగా దృష్టిలో పెట్టుకొనెదవు గాక! **ఒకడు బుద్ధిచే పరమహంస అవుతాడుగాని.... దేహముచే కాదు! దేహాది ఆయా అహంకారములచే కాదు! ఆశ్రమమును బట్టి కాదు!**

---

**3. న దండమ్, న కమండలుమ్,**
**న శిఖా, న యజ్ఞోపవీతమ్,**
**న చ ఆచ్ఛాదనమ్ చరతి పరమహగ్ంసో।**
**న శీతమ్, న చ ఉష్ణమ్, న సుఖమ్**
**న దుఃఖమ్, న మాన-అవమానే**
**ఇతి షడూర్మి వర్జితో।**
**న శబ్దమ్, న స్పర్శమ్, న రూపమ్,**
**న రసమ్, న గంధమ్, న చ మనోఽ పి।**
**ఏవం నిందా గర్వ మత్సర దంభ దర్ప**
**ఇచ్ఛా ద్వేష సుఖ దుఃఖ**
**కామ క్రోధ లోభ మోహ హర్ష**
**అసూయ అహంకార - ఆదీంశ్చ హిత్వా...,**
**స్వవపుః కుణపమివ దృశ్యతే**
**యతః తద్వపుః అపధ్వస్తం। ।**

ఏదేది దేహము కొరకు, లోకము కొరకు ధారణ చేస్తూ ఉంటాడో, అవన్నీ మనస్సుతో త్యజించి, అతీతుడై ఉంటాడు. దండముగాని, కమండలముగాని, శిఖగాని, యజ్ఞోపవీతముగాని, వస్త్ర అచ్ఛేదనముగాని పరమహంసకు ముఖ్యం కాదు. ఒకవేళ ధరిస్తే అది లోక మర్యాద కొరకు మాత్రమే!

శీతలము - ఉష్ణము, సుఖము-దుఃఖము, మానము - అవమానము... ఈ షడూర్మిలు ["6" ఊర్మిలు (తరంగములు)] ఆ పరమహంస దృష్టిలో ఉండవు. సర్వము హంస (ఆత్మ)కు అభిన్నమై, తదితరమైనదంతా లీలా వినోదంగా అగుపిస్తాయి.

**"శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాలు దేహసంబంధమైనవి. మనస్సు జగన్నాటకమునకు అంతర్గతమైనది. అవి నాకు సంబంధించినవి కావు"**... అని దర్శిస్తూ ఉంటారు.

నింద-స్తుతి, మత్సరము, దంభము, దర్పము, ఇచ్ఛా-ద్వేషములు, సుఖ-దుఃఖములు, కామ-క్రోధ-మద-మాత్సర్యములు, హర్ష-శోకములు, అసూయాద్వేషములు అహంకారములు-ఇవన్నీ-ప్రక్కకు నెట్టి, వాటన్నిటికీ ఆవల జ్వాజ్జ్వల్యమానంగా వెలుగుచున్న ఆత్మనే సర్వదా - సదా - సర్వత్రా దర్శిస్తూ ఉంటారు. **"ఇవన్నీ పైపై మెరుగులు. అసలు వస్తువు ఆత్మవస్తువే"** ... అని ఆత్మకు అన్యమైనవన్నీ గమనిస్తూ ఉంటారు. "**ఈ నాదిగా అనిపించే శరీరము వాస్తవానికి శవము వంటిదే! ఎందుకంటే**

సగ్ంశయ మిథ్యా జ్ఞానానామ్ యో హేతుః,
తేన నిత్య నివృత్తః తత్ నిత్యబోధః,
తత్ స్వయమేవ అవస్థితిః।
తగ్ం శాంతమ్ అచలమ్ అద్వయానంద
చిద్ఘన ఏవ, అస్మిన్
తదేవ మమ పరమంధామ।
※ తదేవ శిఖా।
※ తదేవ ఉపవీతమ్ చ।।
※ పరమాత్మా–ఆత్మనోః ఏకత్వ జ్ఞానేన
తయోః భేద ఏవ విభగ్నః
సా 'సంధ్యా'।।

**ఇది నశించు వస్తువులలో ఒకానొకటి మాత్రమే! గాలి తాకిడికి నశించే ఈగ-దోమ దేహాల వంటిదే!" - అని దర్శిస్తూ ఉంటున్నారయ్యా!**

**"మిథ్యా జ్ఞానము కారణంగానే నిందాస్తుతి, నేను - నీవు, అహంకారాలు మొ॥వి నిజంగానే ఉన్నవైనట్లు కనబడతాయి. కానీ లేవు"** - అను అవగాహనతో ఉంటారు. మిథ్యా జ్ఞానము నుండి నిత్య నివృత్తుడై, నిత్య హంస బోధస్వరూపుడై, **నేనే ఇవన్నీ గదా!** - అని అస్వాదిస్తున్నారు.

పరమ శాంత స్వరూపులై, ఆత్మ భావననుండి అచలులై, ద్వితీయమనునది ఏకించిత్ లేనివారై, ఆనంద చిద్ఘనులై "నేను పరంధాముడను (I am that - placed in the Finest Zone of All Pervading SELF) " అని గ్రహించి ఉంటారు. తత్త్వమ్ - సోఽహమ్ భావుడై చరిస్తూ ఉంటారు. అదియే నాకు కూడా 'పరమధామము' అయి ఉన్నది.

**ఆత్మయే నేను-నీవు-ఇదంతా కూడా** ... అను భావనయే ఆతనికి **శిఖ, ఉపవీతము. జీవాత్మ-పరమాత్మల భేదమును నశింపజేసి** దర్శించటమే ఆతని **సంధ్యోపాసన!**

---

**4.** సర్వాన్ కామాన్ పరిత్యజ్య
అద్వైతే పరమే స్థితిః,
జ్ఞానదండో ధృతో యేన "ఏకదండీ" స ఉచ్యతే।
కాష్ఠదండో ధృతో యేన
సర్వాశీ జ్ఞాన వర్జితః,
తితిక్షా జ్ఞాన వైరాగ్య శమాది
గుణవర్జితః....,
భిక్షామాత్రేణ యో జీవేత్, –
స పాపీ యతి వృత్తి హా।।
స యాతి నరకాత్ ఘోరాన్
మహారౌరవ సంజ్ఞికాన్।
ఇదమ్ అంతరమ్ జ్ఞాత్వా
స పరమహగ్ంసః।।

ఏ మహాశయుడైతే...,

- దృశ్య సంబంధమైన సర్వ కామములను పరిత్యజించినవాడై,

- పరతత్త్వమగు పరమేశ్వరుడే ఈ సకల రూపధారి వలె-జగత్ దృష్టికి-కనిపిస్తున్నారని, ఈ అనేకంగా కనిపించేదంతా 'ఏకమ్' అయి ఉన్నదని, **పరమమగు అద్వైతస్థితిని** ఆశ్రయించి ఉంటాడో...,

- దృఢముగా బుద్ధితో అట్టి **"జ్ఞాన దండము"**ను చేత ధరించి ఉంటాడో... ఆతనిని **ఏకదండో** (ఏకదండుడు) అని అంటాము.

- ఎవ్వడైతే, కేవలము కొయ్యదండమును చేతిలో ధరించి, ఆత్మజ్ఞానవర్జితుడై, **"సర్వము ఆత్మయొక్క సంప్రదర్శమే"** అనే ఆత్మ దృష్టిని చేబూనకుండా, సర్వ ప్రాపంచికమైన ఏవో విషయాలను **పొందాలి** అనే ఆశలను కొనసాగిస్తూ ఉంటాడో...,

- తితిక్ష-జ్ఞాన-వైరాగ్య-శమ-దమ ఇత్యాది దైవీ-మహనీయ గుణ సంపత్తిని ఆశ్రయించక, కేవలము లోక సంబంధమైన సన్న్యాసాశ్రమ సంబంధమైన వస్త్ర ఇత్యాది ధారణను, వస్తు సంపద కొరకై భిక్షకత్వములతోను జీవిస్తూ ఉంటాడో ఆతడు **ఆత్మద్రోహి!** ఆతడు పాపవృత్తుడు అగుచున్నాడు! నరక ద్వారములను తనకు తానే తెరచి పెట్టుకుంటున్నాడు! అట్టివాడు చివరికి 'మహారౌరవము' - ఇత్యాది సంజ్ఞలచే చెప్పబడు నరకములను చేరుచున్నాడు. ఈ విషయము, సుస్పష్టముగా తెలిసియుండి, ఇకప్పుడు యోగి (ముముక్షువు) - **పరమహంస మార్గమునే** ఆశ్రయించును గాక! పరాత్పరత్వము నుండి చ్యుతి పొందకుండును గాక! అట్టి అంతరము తెలిసినవాడే పరమహంస!

---

**5.** ఆకాశాంబరో, న నమస్కారో
న స్వాహాకారో, న స్వధాకారో,
న నిందా స్తుతిః, యదృచ్ఛికో భవేత్ స భిక్షుః।।
న ఆవాహనమ్। న విసర్జనమ్।
న మంత్రమ్। న ధ్యానమ్। న ఉపాసనం చ।

**భిక్షకుడు -**

దిగంబరుడు. దేహాదుల వస్త్రధారణను అధిగమించి తన యందు, సర్వులయందు ఆత్మనే దర్శించువాడు. నమస్కారము గాని, దేవతా సంబంధమైన స్వాహా కారము గాని, పితృదేవతా సంబంధమైన స్వధా కారముగాని, నిందా-స్తుతులు గాని లేనివాడై, ఏది ఎంతవరకు, ఎట్లా లభిస్తే అంతవరకు లీలా-క్రీడా-కల్పనా మాత్రమేనని

న లక్ష్యమ్, న అలక్ష్యమ్।
న పృథక్, న అపృథక్ అహమ్।
న సత్వమ్, న సర్వమ్ చ
అనికేతః స్థిరమతిః ఏవమ్।
స భిక్షుః॥
సౌవర్ణాదీనామ్ నైవ పరిగ్రహేత్,
న లోకనమ్ న అవలోకనం చ।
న బాధకో, న చ అబాధకః। క ఇతి చేత్ బాధకో ఆస్త్యేవ,
యస్మాత్ భిక్షుః హిరణ్యగ్ం రసేన దృష్టమ్‌చేత్,
స బ్రహ్మహా భవేత్। యస్మాత్ భిక్షుః హిరణ్యమ్
రసేన స్పృష్టమ్‌చేత్ స పౌల్కసో భవేత్॥

స్వీకరించువాడు. ఆతడు దేనినీ ఆహ్వానించడు, విసర్జించడు. మంత్రము-ధ్యానము, ఉపాసనము, లక్ష్యము, అలక్ష్యము, భేదము, అభేదము, నేను-నీవు-అతడు, ఇక్కడి సమస్తము, ఇల్లు, వాకిలి... ఇవన్నీ ఉండీ.... వాస్తవానికి ఏవీ లేనివాడై ఉంటాడు. స్థిరచిత్తుడై సర్వత్రా ఆత్మయొక్క అనన్య దర్శనంతో ఆనందంగా ఉంటారు.

అతడే **బిక్షువు**. (బిక్షువు = చీకటిని క్షయింపజేసుకొన్నవాడు).

ఆతడు - బంగారము, గృహాలు మొదలైన సంపద సంబంధమైన విషయములను పరిగ్రహించడు. ఆతనికి లోకములు లేవు, అవలోకనము లేదు. సర్వదా కేవల దృక్ అయి చెన్నొందుతాడు. 'అవలోకనము'ను దాటివేసి ఉన్నవానికి లోకాలేమి ఉంటాయి?

ఆతనికి బాధకులు ఉండరు. అబాధకులు ఉండరు. బాధించువాడుగాను ఉండడు. బాధింపబడనివాడు అయి ఉండడు. బాధ ఉండదు. ఏ భిక్షకుడైతే ఇతరులను బాధిస్తాడో, బంగారమును, సంపదలను "ఇష్ట" దృష్టితో చూస్తాడో,... అతడు బ్రహ్మతత్త్వ మార్గమునుండి చ్యుతుడౌతాడు. ఇష్టంగా స్పృశిస్తే, ఆ భిక్షువు "పౌల్కసుడు" గా అయి, నూతిలో పడిన రాయివలె అల్ప జన్మలకు త్రోవ చేసుకొన్నవాడౌచున్నాడు.

---

6. యస్మాత్ భిక్షుః హిరణ్యగ్ం రసేన గ్రాహ్యంచేత్,
స ఆత్మహా భవేత్॥
తస్మాత్ భిక్షుః హిరణ్యగ్ం
రసేన న దృష్టంచ, న స్పృష్టంచ, న గ్రాహ్యంచ।
సర్వే కామా మనోగతా
వ్యావర్తంతే। దుఃఖే చ న ఉద్విగ్నః।
సుఖే నిస్పృహః। త్యాగే-రాగే సర్వత్ర
శుభాశుభయోః అనభిస్నేహాః,
న ద్వేష్టి, న మోదతే చ॥
సర్వేషామ్ ఇంద్రియాణామ్ గతిః
ఉపరమో, య ఆత్మన్యేవ అవస్థీయతే,
తత్ పూర్ణానందైక బోధః, స "బ్రహ్మైవాఽహమ్ అస్మి"
- ఇతి కృతకృత్యో భవతి।
కృతకృత్యో భవతి।
ఇత్యుపనిషత్
ఇతి పరమహంసోపనిషత్

ఓ నారదా! బిడ్డా! ఏ బిక్షువు గురించి మనము ఇప్పుడు చెప్పుకుంటూ వస్తున్నామో, ఆతడు బంగారమును, సంపదలను మమకారంతో, ఆశతో ఎప్పుడైనా గ్రహిస్తూ ఉంటే అప్పుడు ఆతడు ఆత్మద్రోహి, కరణ (ఇంద్రియవిషయ) వివశుని క్రిందే లెక్క!

ఏ భిక్షువు బంగాన్ని రసదృష్టితో చూడడో, స్పృశించడో, గ్రహించడో, మనోగతమైన సర్వకోరికలను బయటకు త్రోలివేసి ఉంటాడో,.... దుఃఖ సంఘటనలచే ఉద్విగ్నత పొందడో, సుఖ సంఘటనలకు పొంగిపోడో, త్యాగి-వదిలినవాడై ఉంటాడో, ఇక్కడి త్యాగ - రాగ - శుభ - అశుభములపట్ల ఎట్టి అనుబంధ భావము-బంధము కలిగి ఉండడో...,

దేనినీ ద్వేషించడో, దేనికీ సంతోషించడో....,

సమస్త ఇంద్రియముల యొక్క గతులను మనస్సునందు ఉపశమింపజేసి (Having Withdrawn) ఉంటాడో...,

ఆ భిక్షకుడు **పూర్ణానంద-స్వస్వరూప బోధస్వరూపుడు** అగుచున్నాడు!

తాను **"బ్రహ్మవేత్త మాత్రమే"** కాకుండా, **"బ్రహ్మమే"** తానై ప్రకాశించుచున్నాడు!

ఏది పొందాలో, అది పొందినవాడై,.... కృతకృత్యుడు అగుచున్నాడు!

**ఇతి పరమహంసోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

⌘ ⌘ ⌘

శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 9 పరమహంసోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము

**పూర్ణమదః పూర్ణమిదమ్ పూర్ణాత్ పూర్ణమ్, ఉదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవ అవశిష్యతే**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఒక రోజు...

బ్రహ్మ మానసపుత్రుడు, దేవర్షి, నారదభక్తి సూత్రముల ప్రవక్త, త్రిలోక సంచారి, లోకములపై అవ్యాజమైన ప్రేమ కురిపించువారు, అనుక్షణ 'నారాయణ' శబ్దోపాసకులు, లోక కళ్యాణమూర్తి అగు **శ్రీ నారద మహర్షి** త్రిలోక సంచారాలు చేస్తూ బ్రహ్మలోకము వెళ్ళారు. పిత్రుదేవులు, సర్వలోక స్రష్ట, ప్రజాపతి, భక్తవత్సలుడు, సృష్టిరచనా మహాప్రాజ్ఞా దురంధరులు, సకల జన శ్రేయోభిలాషి, లోక-పితామహులు అగు బ్రహ్మదేవుని దర్శించుకున్నారు. తండ్రి పాదాలకు స-అష్టాంగ దండ ప్రణామములు సమర్పించారు. వారిరువురు లోకక్షేమము గురించి, తాత్త్వికవిశేషాల గురించి అనేక విషయాలు సంభాషించుకోసాగారు.

❖

**బ్రహ్మదేవులవారు :** బిడ్డా! నారదా! చెప్పు! ఇంకా ఏమైనా అడగదలచుకున్నావా?

**శ్రీనారదమహర్షి :** అవును తండ్రీ ! **యోగినామ్ పరమ హంసానామ్ కోమార్గః? తేషామ్ కా స్థితిః ?** యోగమార్గ విశేషాలు మీరు ఇప్పటిదాకా శెలవిచ్చారు. అయితే యోగులలో మహామహనీయులగు **పరమహంసలు** ఉంటారు కదా! వారు ఏ తీరుగా, ఏ మార్గము ఆశ్రయించినవారై ఉంటారు? వారి యొక్క స్థితి - సంప్రదాయాలు, దర్శన - అవగాహనలు, మార్గాన్వేషణలు, మార్గ దర్శకత్వం ఎట్టివి? దయతో వివరించండి.

**ప్రజాపతి - బ్రహ్మదేవులవారు :** ప్రియకుమారా! నారదా! పరమహంసల ఆత్మానుభూతి అనిర్వచనీయము! వాక్ అతీతమ్! 'ఇట్టిది' అని నిర్ణయించి, నిర్వచించి చెప్పటం ఎవరివల్లా సాధ్యమయ్యే విషయం కాదు. వారిది వాక్కుకు - మనస్సుకు కూడా అందని స్థానము. అందుచేత వారి గురించి నీవు అడిగే విషయాలు చెప్పటం దుర్లభతరము. అనేకమంది యోగులలో ఆ స్థానము అధిరోహించు వారు ఎక్కడో ఒక్కొక్కరు. **బాహుళ్యో ఏకో భవతి !** అయినా కూడా ఈ జీవుని మహదాశయము అదియే కాబట్టి, మహనీయులగు పరమహంసలకు నమస్కరిస్తూ, వారి విషయమై కొన్ని విశేషాలు ఇప్పుడు మనము చెప్పుకుందాము. శ్రద్ధగా వినిదెవుగాక!

**సయేవ నిత్య కూటస్థః :** పరమహంస - నిత్య కూటస్థుడు. అనగా మూల రూపుడు. సర్వముయొక్క అంతరాంతమున సర్వమునకు ఆధారమై ఉన్నవాడు. ప్రకృతికి మూలము.

హంస సరోవర జలంలో ప్రశాంతంగా, ఆనందంగా సంచారాలు చేస్తుంది. అంతేగాని, ఏ పరిస్థితిలోను సరోవర జలంలో మునిగిపోదు కదా ! అట్లాగే పరమహంసలు సంసారంలో క్రీడావినోదంగా ఆత్మానందమును కించిత్ కూడా వీడక, విహరిస్తున్నారు. సంసార జలంలో ఏ మాత్రము మునిగిపోరు. నిత్య నిర్మల స్వరూపులై ఉంటారు. వారికి ఈ సంసారము యొక్క ఈ దృశ్యము యొక్క వాస్తవ – అవాస్తవ, సహజ– సందర్భ రూపమేమో తెలుసు. అందుచేత విజ్ఞులు వారి గురించి చెప్పేటప్పుడు **'వేద పురుషుడు'** అని అభివర్ణిస్తూ ఉంటారు. **వేదములు ఎవరి గురించి చెప్పుచున్నాయో, వారే వేద పురుషులు. తెలియబడేదంతా 'తామే' అయి, తమయందు తామే సంచరిస్తూ ఉంటారు కాబట్టి వేదపురుషులు.** సర్వజీవుల **అంతర్యామిత్వము ధరించి ప్రకాశిస్తూ** ఉంటారు. కాబట్టి **'మహాపురుషులు'** కూడా! వారి చిత్తము ఎల్లప్పుడు పరబ్రహ్మస్వరూపమును ఆస్వాదిస్తూ, నా యందే సుప్రతిష్ఠితమై ఉంటోంది. నేను వారియందు స్వభావంగా అవస్థితుడనై, పరమ ప్రకాశశీలుడునై ఉంటున్నాను. వారు సర్వస్థితి – గతులయందు, సర్వదా....,

- **నన్నే అందరియందును,**
- **అందరిని నాయందును,**
- **నాయందు తనను,**
- **తనయందు నన్ను**

సందర్శిస్తూ ఆత్మానందభరితులై ఉంటున్నారు. నాచే కల్పితమైన ఈ 14 లోకాలలో క్రీడా వినోదంగా సంచారాలు చేస్తూ ఉంటారు. హంసవలె విహరిస్తూ సర్వము స్వస్వరూపముగా ఆస్వాదిస్తున్నారు. త్రిమూర్తులమగు మేము ఆ పరమహంసకు – స్వస్వరూపులమై, స్వ–అభిన్నులమై, వారి సహజానంద స్వరూపులమై ఉంటున్నాము. వారు తారసబడితే మేమే వారికి నమస్కరిస్తున్నాం.

**శ్రీ నారదమహర్షి :** పిత్రుదేవా ! అట్టి పరమ హంసలు చతుర్విధ ఆశ్రమములు అధిగమించిన వారు కదా ! మరైతే, వారికి పుత్ర – మిత్ర – కళత్రాది లోకరీతి అయినటువంటి సంబంధ – అనుబంధ – బాంధవ్యములు ఉండవా ? ఉంటాయా ? సన్న్యాసాశ్రమవాసులవలె కౌపీనము, దండము, ఆయా భౌతిక విశేషాలు... ఇవన్నీ కలిగి ఉంటారా ? వేదాధ్యయనులవలె శిఖ – యజ్ఞోపవీతము – స్వాధ్యాయనము ధారణ చేస్తూ – నిర్వర్తిస్తూ ఉంటారా? ఈ లోకములను, లోక విషయములను వారు ఏ దృష్టితో చూస్తూ ఉంటారు? వారికి అసలు ఈ భౌతిక శరీరము, ఇంద్రియ దృశ్యము మొ॥వి అందరిలాగానే – ఉంటాయా? భావనయందు ఉండవా?

**శ్రీ ప్రజాపతి :** వారు పుత్ర – మిత్ర – కళత్ర... ఇత్యాదులన్నీ **'మమాత్మస్వరూపం'**గా దర్శిస్తూ, బాహ్య నామ – రూపాలు, సంబంధ – బాంధవ్యాలు బాహ్యముననే త్యజించినవారై ఉంటారు. అతీత దృష్టితో ఆత్మ స్వరూపంగా సందర్శిస్తున్నప్పుడు..., ఇక నీవు చెప్పే సంబంధాలు – బంధాలు ఏముంటాయి ? **పరమహంసత్వము బుద్ధి సంబంధమైనది. అంతేకానీ.. భౌతిక సంబంధమైనది, చతుర్విధ ఆశ్రమ సంబంధమైనది కూడా కాదు! వారు లౌకికంగా చూస్తే - తదితరులవలె సందర్భానుచితంగానే ఉంటారు. వారి అంతర్ దృష్టికి మాత్రం - సంబంధ - బాంధవ్యములన్నీ ఆత్మకు అభిన్నమై ఉంటాయి.**

అంతేకాదు. వారు బాహ్య నియమాలు–ఆచారాలు అధిగమించినవారై ఉంటారు. తమ కొరకై తాము ఏదీ కలిగి ఉండరు. శిఖ – యజ్ఞోపవీతము–సాధ్యాయము ఇట్టి ఆయా లక్షణాలతో వారు సంబంధితులు కారు. అసలు వారికి బ్రహ్మము తప్పించి బ్రహ్మాండమే లేదు.

- ఒకవేళ లోకాచారాలను అనుసరించి కౌపీనము, దండము, వస్త్రములు మొ॥వి ధరించవలసి వస్తే... **'ఇవన్నీ ~~ఈ~~ శరీరరమునకు సంబంధిచినవి మాత్రమే! నాకు వీటితో సంబంధమే లేదు!'...** అను భావన, అవగాహన కలిగి ఉంటారు.
- ఏది ఎప్పుడు ఎక్కడ స్వీకరించవలసి వచ్చినా (లేక) విడువవలసివచ్చినా కూడా...,
- **"ఇదంతా తదితర జీవుల సానుకూల్యత కొరకు మాత్రమే అగును గాక ! ఏది నిర్వర్తించవలసి వచ్చినా కూడా, అది లోక సానుకూల్యము, లోకోపకారార్థము అయి ఉండుగాక ! నాకు దేనితోనూ మొదలే సంబంధములేదు. కాబట్టి నాకొరకై పట్టుకోవలసిన పనీ లేదు. వదల వలసినదీ లేదు. ఏది ఎట్లు లోకసానుకూల్యమో, అది అట్లే ఉండునుగాక !"**

  ***పరోపకారార్థమ్ ఇదమ్ శరీరమ్ !***

  ***లోకస్యైవ ఉపకారార్థాయ చ పరిగ్రహేత్!***

.... అను సుస్థిర భావన కలిగి ఉంటారు. (నానవాప్తమ వాప్తవ్యమ్, వర్తయేవచ కర్మణి – అని శ్రీ కృష్ణ పరమాత్మ గీతావాక్యం ప్రవచించిన తీరుగా). వారు – పుత్ర – మిత్ర – భార్య మొ॥వి స్వీకరించినా, వదల వలసి వచ్చినా, అవన్నీ జగన్నాటక సందర్భములుగా చూస్తూ ఉంటారు. శిఖ – యజ్ఞోపవీత – స్వాధ్యాయనములు (వేదము వల్లించటం, స్తోత్రములు చేయుట మొ॥వి)

నిర్వర్తించటం... ఇవన్నీ కూడా లోకశుభము, సహజీవులకు సౌకర్యము, తదితరుల ప్రయోజనములు... ఇవి మాత్రమే దృష్టిలో పెట్టుకొని జగన్నాటక అంతర్విభాగ చమత్కారములుగా ఆ పరమ హంసలు దర్శిస్తూ ఉంటారు. నేను కల్పించుచున్న 14 లోకములలో పొందవలసినది, వదలవలసినదీ – తమ కొరకై – ఏదీ ఉండదు.

ప్రియపుత్రా! నారదా! ఇక్కడ మరొక్క ముఖ్య విషయం! నీవు అడుగుతూ వస్తున్న :

- పుత్ర – మిత్ర – భార్య ఇటువంటివి ఉండటం (లేక) ఉండకపోవటము....,
- శిఖ, యజ్ఞోపవీతము, స్తోత్రోచ్ఛారణ, వేదమంత్ర పఠనము... ఇటువంటివి నిర్వర్తించటం (లేక) నిర్వర్తించకపోవటం...

ఇవన్నీ పెద్ద ముఖ్యమైన విషయాలు కావయ్యా! **న ముఖ్యోఽస్తి!** మరి? ఏది ముఖ్యము? **కోఽయమ్ ముఖ్యః?**

**"నేను అనగా ఎవ్వరు? ఈ దేహమునా? జీవుడనా? నాతో సహా, సర్వ బ్రహ్మాండాలు ఎందులో మాయగా కల్పించబడి, స్థితించి లయింపబడుచున్నాయో... అట్టి అనునిత్య సత్యమగు బ్రహ్మము** అనగా ఏమి?" ... అను ప్రశ్నలకు సరిఅయిన సమాధానము సంపాదించుకోవాలి. అట్టి తత్త్వార్థ జ్ఞానమును పొంది, పరమ పవిత్రమగు ఆత్మదృష్టిని అనునిత్యం చేసుకోవటం ముఖ్యము. కనుక "బాహ్య ఆచారాలు విశేషాలు పరమహంసపట్ల ఉంటాయా? ఉండవా?"... అను ప్రశ్నయే పెద్దగా విశ్లేషించవలసిన పనిలేదు-అని గమనించు. వారి తదితర, అవగాహనల గురించి విను.

❖

**'హంసో' భావన (లేక) సోఽహమ్ :** దేహత్వము నుండి ఆత్మత్వము చేరుచున్న పరమ యోగి (లేక) పరమహంసకు తాను ఆశ్రయించుచున్న హంసత్వమే (ఆత్మత్వమే) సర్వదా వెంటనంటి ఉంటుంది. మిగతావి చిన్న విషయాలు. అతనికి కమండలువు, శిఖ, యజ్ఞోపవీతము వస్త్రములు ... వీటన్నిటితో పనియే లేదు... అవి ఉన్నా – లేకున్నా, అతని దృష్టిలో అవి **విషయములే కావు**. అట్లాగే శీత – ఉష్ణాలు, మొదలైన షడూర్ములు... జలతరంగ ప్రాయాలు. జలములో తరంగాలుగా కనిపించేవన్నీ జలమే కదా ! షడూర్ములు అయినట్టి ఇక్కడి ద్వంద్వాలన్నీ బ్రహ్మమునకు వేరుగా లేవు. ఉండజాలవు. (షడూర్ములు = శీతలము–ఉష్ణము, సుఖము–దుఃఖము, మానము – అవమానము)

ఇక్కడి శబ్ద – స్పర్శ – రూప – రస – గంధ విషయాలన్నీ దేహమునకు సంబంధించినవి. దేహముతో బాటు ఉండి, దేహముతో పోయేవి. **దేహి** స్వరూపుడగు ఆత్మతత్వానికి ఇవన్నీ ఉండటము వలన (లేక) లేకపోవటం వలన ఏ మార్పు – చేర్పులు లేవు. దేహము ఉన్నప్పుడు 'నేను' ఉంటాను. దేహము లేనప్పుడూ నేను **యథాతథ స్వరూపుడనే!** శబ్ద – స్పర్శ – రూప – రస – గంధాలు, వాటి వాటి విషయాలు **నాకు సంబంధించినవి కావు. నేను వాటికి సంబంధించినవాడను కాను.** (గాఢ నిద్రలో అవి నా అనుభవంలో లేవు. కాని నేను ఉన్నాను)..... అను సందర్శనము కలిగి ఉంటారు.

**మనస్సు :**

**న చ మనోఽపి ఏవ :** "శబ్ద–స్పర్శ–రూప–రస–గంధాలు భావనామాత్రములే ! అట్లాగే మనస్సు కూడా ! **భావనకంటే** ముందుగానే ఉండేవాడను. **భావికుడను** (భావము తనదైనవాడు). మనస్సు లేనప్పుడు హంస (సోఽహమ్) స్వరూపమగు **'భావికుడు'** (ఆత్మ) ఉన్నవాడు. కనుక మనస్సు నాకు సంబంధించినది కాదు. నేను మనస్సుకు సంబంధించినవాడను కాదు. ఎందుకంటే మనస్సుతో ప్రారంభముకాను. మనోలయముచే అంతమవను. మనస్సు నా నుండే నా ఆలోచన – అనుభూతి – భావనా కల్పితమై బయల్వెడలుచు, మరల నా యందే లయిస్తోంది. **సర్వదా శేషించి ఉండి నేను మనోరహితుడను-అని ఎరిగి ఉంటున్నారు. "హంస జలములో సంచరిస్తూ ఉన్నప్పటికీ జలములో మునుగనివిధంగా, హంస (ఆత్మ) స్వరూపుడనగు నేను ఆలోచనలలో మునిపోవువాడను కాను"-**

ఈ విధంగా పరమహంస యొక్క స్వయమాత్మా భావన శబ్ద స్పర్శ రూప రస గంధ తన్మాత్రలను అధిగమించినదై ఉంటోంది. ఆతడు అంతరంగ చతుష్టయమునకు కూడా జనన స్థానము తానే అయి ఉంటున్నాడు. **సర్వమునకు అతీతత్వము – సాక్షిత్వము – అనన్యత్వము ఒక్కసారే వహిస్తూ ఆస్వాదిస్తున్నాడు.**

ఓ నారదా! ఈ జీవునికి అసలు సంసార బంధము ఎటువైపు నుండి వచ్చి పడుతోంది? ఇది ఇక్కడ పరిశీలిద్దాం.

**నింద :** ఇతరుల తప్పులను మననం చేయటం, మమకార–అహంకార దృష్టులతో కొందరిని నిందించటం, మరి కొందరిని స్తుతించటం.

**గర్వము :** "కొందరి కంటే ఈ ఈ సంపద, తెలివి, పాండిత్యము, జనాదరణ, సామర్థ్యములదృష్ట్యా – అధికుడను కదా !" అనే

గర్వము. ఇతరులపట్ల అల్పదృష్టితో కూడిన నిరాదరణ.

**మత్సరము :** "బలవంతుడను. నాకేమి?" అని పలువురితో పోట్లాడే స్వభావం. బాధించటం, ధిక్కారంగా మాట్లాడటం. ఇతరులను బాధించే ప్రవృత్తి – ప్రవర్తన కలిగి ఉండటం.

**దంభము :** తాను గొప్పవాడిననే ప్రదర్శనము. "నన్నే అందరూ గౌరవించాలి. నేను ఎవ్వరినీ గౌరవించఖర్లేదు" అని అనుకోవటం.

**దర్పము :** ఇతరులపై అధికారము పొగరు ప్రదర్శించటం. నా మాటే అందరు వినాలి. ఇతరుల మాటలు నేనెందుకు వినాలి? అని భావించు స్వభావము.

**ఇచ్ఛా - ద్వేషములు :** కొందరంటే ఇష్టం. మరికొందరంటే ద్వేషము.

**సుఖ-దుఃఖములు :** "ఇట్లా అయితే నాకు సుఖము. కాకపోతే దుఃఖము"... అను నిర్వచన పరంపరలు మనస్సులో పేర్చుకొని ఉండటం.

**కామము :** ఇంకేదో, ఏదేదో కావాలనే 'తపన'.

**క్రోధము :** కోపము – పగ – ఆవేశము చూపటం

**లోభము :** తాను తినడు. ఇతరులకు పెట్టడు. దాచి – దాచి మమకారము అధికం చేసుకోవటం.

**మోహము :** "ఏది నిత్యము? ఏది సత్యము ?" – అనునవి పరిశీలనాత్మక దృష్టితో చూచుటకు సంసిద్ధుడు కాకపోవటం. నామ – రూపాత్మకమైన భ్రమలు కొనసాగించటము. ఉత్తరోత్తర గతులు గమనించకపోవటం.

**హర్షము - విషాదము :** సందర్భములకు, సంఘటనలకు, సంబంధ – బాంధవ్యములకు పెద్దపీట వేసి,... క్షణక్షణం సంతోష – దుఃఖాలు పొందటం.

**అసూయ :** ఇతరుల సానుకూల్యతలను ఓర్చుకోలేక పోవటం. ప్రాతికూల్యతలను కోరుకోవటం.

**అహంకారము :** 'నేను – నావి' అని అహంకరించటం.

వీటిని తెలిసీ – తెలియకుండా ఆశ్రయించి అనేక బంధములను, దుఃఖ పరంపరలను, జన్మ – కర్మ గతులను ఈ జీవులలో అనేకులు కొని తెచ్చిపెట్టుకుంటున్నారు. ఇక పరమహంసా మార్గాణ్వేషకులగు యోగుల విషయమంటావా ?

- నిందా – గర్వ – మత్సర – దంభ – దర్ప – ఇచ్ఛా – ద్వేష – సుఖ – దుఃఖ – కామ – క్రోధ – లోభ – మోహ – హర్ష – విషాద – అసూయ – అహంకారాలను ... అల్లంత దూరంగా ఉండగానే గమనిస్తున్నారు. తమ యొక్క సత్యదృష్టిచే వాటిని పాము కుబుసమువలె త్యజించివేస్తున్నారు. ఆత్మభావనయందు భస్మముచేసి వేస్తున్నారు.
- తన భౌతిక దేహమును " ఇది నశించనున్నది కదా" అను అవగాహనతో ఒక శవమును చూచినట్లు చూస్తున్నారు. అంతేగాని మమకారముతో కాదు. మాన – మద – దర్ప – మత్సరములతో కాదు.
- ఏదేది మిథ్యా జ్ఞానానికి (illusionary impressions, impacts and mis-conception) కారణమగుచున్నవో ఆయా దృశ్య విషయాలను – దూరంగా ఉన్నప్పుడే గమనించి, వాటిని ప్రయత్నపూర్వకంగా దూరంగా పారద్రోలి వేస్తున్నారు.
- ఆత్మ యొక్క సందర్శనంలో అడ్డు అయి, అనుమానాలు రేకెత్తించగల ఆలోచనారీతులపట్ల జాగరూకులగుచున్నారు. సంశయ బుద్ధిని మొదలే అడ్డుకుంటున్నారు. ప్రయత్నపూర్వకంగా దృష్టిని పవిత్రపరచుకొంటున్నారు.

  **"ఈ బాహ్యంగా కనిపిస్తున్న నామ – రూప – సందర్భ – సంబంధ – అనుబంధాత్మక విషయాలన్నీ పైపై మెరుగులు మాత్రమే! ఆత్మయే సత్యము ! నిత్యము!"** అను బుద్ధిని తీర్చి దిద్దుకొని, తదితరులను ఆత్మ దృష్టితో ఆత్మగా దర్శిస్తున్నారు.
- సర్వ లౌకిక (లోక సంబంధమైన) బాహ్య (ఇంద్రియ) విషయాల పట్ల నిత్య నివృత్తుడు (Non Avocative at its core all times, and wel-relieved) అయి ఉంటున్నారు.
- **సత్ – నిత్యబోధః :** అనునిత్యమూ కూడా **"ఆత్మయే ఇవన్నీ – ఆత్మయే అందరుగా..."** అను బోధ (Understanding, way of looking at) సమన్వితులై ఉంటున్నారు.

ఓ నారదా ! యోగి సర్వముపట్ల అభ్యసించు ఆత్మీయ భావనచే,... పరాకాష్ఠగా **పరమహంస** అయి, స్వయముగా సర్వాత్మ స్వరూపుడై వెలుగొందుచున్నాడయ్యా!

**తత్ స్వయమేవ అవస్థితగ్ం-శాంతమ్ అచలమ్ ఆనంద చిద్ఘన ఏవ :**

సర్వము తానై, సర్వమునకు సాక్షియై, మౌన అస్వాదన చేయుచున్నారు.

- పరమ శాంత స్వరూపుడై, శాంత్యతీత అంతర్-హృదయుడై ఉంటున్నారు.
- "అహమాత్మా - ఆత్మయేనేను - నేనే ఇదంతా" ... అను భావము నుండి చలించనివాడై **"ఈ విశ్వము - ఇందలి సర్వ దేహములు - స్పందనలు - ఆకార, విరాకారములు నేనే"**.. అనే అద్వైత భావనా సమన్వితులై ఉంటున్నారు.
- కేవలానందచిద్ఘనుడు (A Solid manifestation fo Happy Awareness) అయి "ఇక్కడి ప్రతి ఒక్కరి రూపము నేనే! వీరంతా నా ఆత్మ రూపులే"... అను సుస్థిరానుభూతిచే వెలుగొందుచున్నారు.

**అస్మిన్ తదేవ మమ పరంధామః - "ఆ పరమాత్మ స్వరూపమే నా నివాసగృహము. పరమధామము"** అని ఎరిగినవాడై ఉంటున్నారు. అతడు సర్వమునకు పరమధాముడు అగుచున్నారు! మాకు కూడా వారు పరమధామము!

❖

**ఆత్మధ్యానయోగి యొక్క శిఖ, ఉపవీతము, సంధ్య ఏమేమిటై ఉన్నాయి?**

**ఆత్మ భావనయే** అతనికి **శిఖ**. భౌతికమైన శిఖ - శిఖ కాదు

**ఆత్మావగాహనయే** అతని **ఉపవీతము**. భౌతికమైన ఉపవీతము.. ఉపవీతము కాదు.

**పరమాత్మా - ఆత్మనో ఏకత్వ జ్ఞానేన తయోః భేద ఏవ విభగ్నః - సా సంధ్యా!**

→ జీవాత్మ - పరమాత్మ ఒక్కటే!
→ జీవుడుగా కనిపిస్తున్నది పరమాత్మయే !
→ పరమాత్మయే లీలావినోదంగా జీవాత్మ అయి వ్యవహరిస్తున్నారు!

... అను భావనచే తదితరమై భేదజ్ఞానమును భగ్నము చేసివేసినవారై ఉంటున్నారు. **'సర్వము మమాత్మయే'** అను అనుక్షణికమైన అవగాహన-అనుభావన-అనుభూతి-అనుభవములే ఆయన యొక్క **సంధ్యా వందన క్రియ.** ఆవల-ఈవల ఏకత్వమే అతని **సంధ్య!**

**సర్వాన్ కామాన్ పరిత్యజ్య - అద్వైతే పరమే స్థితిః**

వీరిట్లా ఉండాలి-వారట్లా కూడదు-ఇది కావాలి-అది వద్దు-ఇది కోరుకొనుచున్నాను - అది కోరుకోను ... ఇట్లా అతడు భావించడు. సర్వ కామములు (కోరికలు. Expectations) పరిత్యజించినవాడై 'పరము' అగు అద్వైతానంద స్థితిని అస్వాదిస్తూ ఉంటాడు. సర్వము ఆతనికి అఖండ చిద్విలాసము.

చేతితో అతడు 'జ్ఞానదండము'ను ధరించినవాడై ఉంటాడు. **'ఏకదండీ'** అని చెప్పబడుచున్నారు. ఆత్మ జ్ఞానము - ఆత్మ భావన - ఆత్మానుభావమే అతని త్రిదండము. ఇక అతనికి కాష్ఠ దండము ఒక విషయమే కాదు. అది ఉంటే ఉండవచ్చు. లేక, లేకపోవచ్చు. (Dress does not indicate real Address). ఆతడు సర్వదా 'ఏకదండీ ధారణ'తో ఏకత్వము ధరించి ఉంటారు.

**శ్రీనారద మహర్షి :** హే భగవాన్ ! అస్మత్ ప్రియ పిత్రుదేవా ! లోకంలో కొందరు **"సర్వము సన్న్యసిస్తున్నాము"** అని చెపుతూనే, సన్న్యాసాశ్రమము స్వీకరించి కూడా, కాష్ఠ దండమును ధరించి కూడా, మీరు చెప్పుకొంటూ వస్తున్న పమర హంస ధర్మాలు పుణికి పుచ్చుకోలేకపోతున్నారేమో? లోభము, క్రోధము, మాత్సర్యములకు లోను అగుచున్నారే ! వారు శుభ-సన్మార్గులు అయ్యేదెట్లా ?

**శ్రీ ప్రజాపతి :** అవును. నిజమే ! శాస్త్రయుక్తంగా, భౌతికంగా సన్న్యసించి కూడా కొందరు సంసార భావాలు త్యజించే యత్నం చేయకుండా... ఆత్మద్రోహులు (Damaging the conceptual understanding of ones own self) అగుచున్నారు. అట్టి బిడ్డల జాగరూకత - సముద్ధరణ కొరకై నీవు ప్రశ్నిస్తున్నావు. మంచిది. తత్ సంబంధంగా కొన్ని విషయాలు ఇక్కడ చెప్పుచున్నాను విను. ఎవ్వడైతే వేదాంత శాస్త్ర - యోగ పాఠ్యాంశసారమైన **'భిక్షకుడు'** అను **సాధనజీవన విధానము** స్వీకరించికూడా, లోక-ఈషణములు

వదలక, పారలౌకికత్వము (హంసత్వము) ఆశ్రయించక... కాలము వెళ్ల బుచ్చుచున్నారో, రోజులు గడుపుచున్నారో...

ఎవ్వడైతే భిక్షక సన్యాసి అయి కూడా...,

- చేతిలో కాష్ఠ (కొయ్య) దండమును బాహ్యాడంబరముగా ధరించి, 'సర్వము పరబ్రహ్మ స్వరూపమే' అను ధ్యాన దండమును ధరించకుండా...,
- తితిక్ష (ఓర్పు), ఆత్మజ్ఞానము, దృశ్యము పట్ల విరాగము కలిగి ఉండకుండా...,
- అంతరింద్రియముల (మనో - బుద్ధి - చిత్ - అహంకారముల) శమము, బాహ్యేంద్రియముల దమము(Control) లను అభ్యసించకుండా...,
- జ్ఞాన - వైరాగ్యములు మొదలైనవి ఆశ్రయించకుండా బాహ్యానికి మాత్రమే భిక్షక సన్యాసిగా జీవితము గడుపుచూ ఉంటాడో..., అతడు యతి వృత్తిని స్వీకరించి కూడా సంసారియే అగుచున్నాడయ్యా! పాపియే అగుచున్నాడు. తన యొక్క అల్ప జన్మ పరంపరలకు తానే ద్వారములను తెరచుకొన్నవాడగుచున్నాడు సుమా!

**స యాతి నరకాన్ ఘోరాన్ మహారౌరవ సంజ్ఞికాన్।**

యతి గుణములు ఆశ్రయించకుండా, బాహ్యమునకు మాత్రమే యతి రూపము ధరించువాడు ఘోరమైన - **'మహారౌరవము'** ఇత్యాది నరక త్రోవలను ఎన్నుకొనుచున్నవాడగుచున్నాడు. యతి మార్గము నుండి 'చ్యుతుడు' అగుచున్నాడు.

ఇది గ్రహించి, యతులు పరమహంస మార్గములో జాగరూకులై వ్యవహరించెదరు గాక ! ఈ హెచ్చరిక వారి శ్రేయమును కోరి గుర్తు చేస్తున్నాను.

పరమహంస ఇది గమనించియే "సర్వం పరబ్రహ్మమేవ" దర్శనమునందు సుస్థితుడై ఉంటారు.

## భిక్షువు అనగా ఎట్టివాడు ?

### (భిక్షువు = పరమహంస మార్గాన్వేషి - చీకటిని వెలుగుతో నింపువారు)

**ఆకాశాంబరో : "ఈ విశ్వమంతా నాచే ధారణ చేయబడుచున్నది. నాచే ధరించబడు వస్త్రము. ఈ పంచభూతములు, వాటి ధర్మములు, ఈ సర్వ జీవులు- నా ఆత్మ స్వరూపమునకు కట్టిన వస్త్రముపై గల రంగు చిత్రములవంటివి"**.. అను భావన - మననములను ఆశ్రయించి ఉంటారు.

**న నమస్కారో :** "హంస (ఆత్మ) స్వరూపుడనగు నాకు వేరు - అనునదే లేనప్పుడు, సర్వము ఆత్మ యొక్క లీలావినోద సంప్రదర్శనమ్ అయి ఉండగా, ఎవరు - ఎవరికి ఏమని నమస్కరించాలి!" - అను చిరునవ్వు కలిగి ఉంటారు. అతని దృష్టిలో నమస్కరించబడు వారు - నమస్కారము - నమస్కరించువారు ... ముగ్గురు ఏకమగు ఆత్మయే ! కనుక **న-నమస్కారులై** ఉంటారు. న (పరమాత్మ) మ (జీవాత్మ) ఏకత్వ రసములో ఉండియే బాహ్య నమస్కారములను గమనిస్తూ ఉంటారు.

**న స్వాహకారో - న స్వధాకారో :** "ఇది దేవతలకు స్వాహారూపంగా సమర్పిస్తున్నాను. ఇది పితృదేవతలకు స్వధా రూపంగా సమర్పిస్తున్నాను"... అనునదేమీ కలిగి ఉండరు. **"ఆత్మకు వేరుగా నేనుగాని, దేవతలుగాని, పితృదేవతలు గాని ఎక్కడున్నాము? అంతా అఖండమగు హంసతత్వమే కదా !"**... అను అవగాన యొక్క మహదత్వము - అచంచలత్వముచే,.... వారు స్వాహాకారులవరు. స్వధాకారులు అవరు. అవి చేయుచున్న లౌకిక సందర్భములను వారు స్వ-ఆత్మోపాసనగానే భావిస్తారు.

**న నిందా - స్తుతిః :** వారి దృష్టిలో... నిందా - స్తుతిలు గాని, నిందించువారు - స్తుతించువారుగాని ఆత్మ సమక్షంలో 'లేనివి' అగుచున్నాయి. ఆ ఉభయులు కూడా అఖండమగు ఆత్మస్వరూపులుగా ఆతనికి అనుభూతులగుచున్నారు.

**యాదృచ్ఛికో :** ఆత్మ అకారణం. ఆత్మయే ఈ సర్వము. కనుక ఇదంతా అకారణం. ఒక స్వప్నంలో గుడిశ - తెలిసిన వ్యక్తులు - తెలియని వ్యక్తులు తారసపడటం ఎంతగా యాదృచ్ఛికమో, అకారణమో..., సకారణం కాదో ..., **ఈ దృశ్యము - దేహములు - జన్మలు సంఘటనలు, సంబంధములు ఇవన్నీ కూడా అంతగానూ ఆత్మ సమక్షంలో యాదృచ్ఛికం !** అకారణం! సకారణం కాదు! మనోకల్పితము. - అను అవగాహన ఆ బిక్షువు కలిగి ఉంటారు!

ఆ భిక్షువుకు..., ఇంకా కూడా...,

**- న ఆవాహనమ్ :** నేను పరమాత్మను ఒకచోటికి ఎట్లా ఆహ్వానించాలి? కుదరదు. ఎందుకంటే ఇక్కడ లేకపోతే కదా, ఇక్కడికి ఆహ్వానించేది! అంతటానిండి ఉండి, అన్నీ తానే అయినవాడిని, **ఎక్కడి నుండి ఎక్కడికి ఏమని ఆహ్వానించగలను**?.... అని భావించి చిరునవ్వు చిందిస్తూ ఉంటారు.

**న విసర్జనమ్:** అంతా లయించిన తరువాత కూడా, ఏది చిట్ట చివరికి శేషించి ఉంటుందో, అట్టి ఆత్మను ఎవరు మాత్రం ఎప్పుడు వదలి ఉండగలరు? అది విడిచిపెట్టగలిగేది కాదు! ఆ పరమాత్మను ఆహ్వానించటమూ లేదు. విసర్జించటమూ కుదరదు అని ఎరిగి ఉంటారు.

**న మంత్రమ్ :** మననము కొరకు మంత్రము. తన స్వరూపమే అయి, తనకు అద్వితీయమైయున్న ఆత్మను ఇక, మననము చేయవలసినదేముంటుంది. అందుచేత మంత్రసిద్ధిచే మంత్ర స్వరూపుడే తానై, న-మంత్రమ్ భావుడగుచున్నాడు. మంత్రముచే సిద్ధించు (లేక) మననముచే సిద్ధించు పరమ వస్తువు - 'ఆత్మాఽహమేవ' అని ఎరిగి 'తానే' అయి ఉంటున్నారు.

**న ధ్యానమ్ :** ధ్యాని - ధ్యానము - ధ్యానింపబడు పరమాత్మ ఏకస్వరూపమై, త్రివేణీ సంగమము అవటం చేత, ఆ పరమహంస భిక్షువుకు ధ్యానము అను క్రియయే ఉండదు. **"అంతా పరతత్త్వమే! కనుక నేను పరతత్త్వమునే! కాబట్టి ఇదంతా నేనే"...** అను సుస్థితి - స్వస్థత చేకూరగా ఇక దేనిని గురించి ధ్యానం ? **'అన్యము'** అను మనోదోషమును తొలగించుకొని **'అనన్యము'**ను స్వభావ సిద్ధం చేయటానికి ధ్యానం! అనన్యత్వము సిద్ధించిన తరువాత వేరైన ధ్యానమే ఉండదు!

**న ఉపాసనమ్ :** ఉపాసనము కూడా లేదు. అట్లాగే ఉపాసించబడునది వేరుగా లేదు. తనకు తానే ఉపాసించబడువాడై ఉంటాడు. పరమాత్మయే తానై ఆ భిక్షువు వెలుగొందుచుండగా, ఇక **"భగవంతునికి సమీపంగా ఆసనము"**... అనే ప్రసక్తి ఎక్కడిది? తాను ఆత్మకు అభిన్నమై ఉండగా దూరమైనది ఎప్పుడు ? కొత్తగా దగ్గర కావలిసిన పనేమి ? అందుచే ఆతనికి క్రొత్తగా ఉపాసన-ఉపవాస ప్రక్రియలు ఉండవు.

**న లక్ష్యమ్-న అలక్ష్యమ్:** అతని లక్ష్యము లేదు. చేరవలసినది తానే అయి ఉండగా వేరే లక్ష్యము(Target) ఏముంటుంది? ఆత్మ (హంస) స్వరూపుడగు తాను కానిది ఏదీ లేదు. ఈ విశ్వమంతా తానే అయి ఉండగా తనకు సంబంధించనిది వేరుగా ఏమున్నది? (లేక) పట్టించుకోకూడనది మాత్రం ఏముంటుంది? కలలో కనిపించే దేనిని, **"కల తనదైనవాడు"** - పట్టించుకోకూడదు? మరొక దేనిని పట్టించుకోవాలి? అంతా తానే కదా!

- సర్వదా ఆత్మనైయున్న నేను పరిలక్షింపబడని క్షణమే లేదు!
- నేను సర్వదా సర్వమునకు వేరే, పరమైయున్నాను ! అప్రమేయుడను !
- అంతా నా కల్పనే కనుక నాకు వేరైనది ఎక్కడా ఏదీ లేదు. **ఇదంతా సర్వదా నేనే!**

**అంతా నేనే అయి, ఏదీ కానట్టివాడను ! న పృథక్ - న అపృథక్** ఇదంతా నాకు వేరే! అయితే, వేరుగానూ లేను. ఒకటి గాను లేను ! కల్పన అగు జగత్తు వాస్తవానికి లేదు. ఆత్మకు వేరుగా జగత్తులేదు. న సత్త్వమ్ ! న సర్వమ్ చ! ఉన్నదీ లేదు. లేనిదీ లేదు. అంతా లేదు. కొంత లేదు.

ఇక్కడ ఏకము లేదు. అనేకము లేదు. మట్టితో అనేక బొమ్మలు కనబడుతూ ఉంటే.....

... అవన్నీ మట్టియేకదా ! కనుక అవి మట్టి దృష్ట్యా అనేకము కాదు.

... పోనీ ఒకే మట్టి యొక్క వివిధ ఆకారములా? మట్టికి ఆకారమే లేదు కదా! ఒకే ఆకారము గల మట్టి అనేక ఆకారములుగా అగుచున్నదని అనలేము కదా ! **ఆత్మ ఒక్కటి కాదు. అనేకము కాదు. ఆత్మ ఏదీ అవటం లేదు.** అందుచేత **"జీవులంతా ఏకాత్మరూపులే"** అనే వాక్యముకూడా, నిరాకారమగు ఆత్మ వస్తువు యొక్క సమక్షంలో "**చిన్న వివరణ మాత్రమే** (Petty detail) " అగుచున్నది.

**అనికేతః :** భిక్షువుకు (లేక - పరమహంస మార్గాణ్వేషికి). ఒక గృహము లేదు. ఒక 'చోటు' అనునది లేదు. పోనీ ఈ విశ్వమంతా ఆయన నివాసమా ? (అత్యతిష్ఠతి దశాంగుళమ్!). ఈ విశ్వమును దాటి '10' అంతలున్నారని వేదవచనం!

స్వప్న ద్రష్ట స్వప్నంలో ఒక చోట ఉన్నాడని గాని, మరొకటో లేడనిగాని, సప్నమంతా అతని నివాసమనిగాని అనలేము కదా ! స్వప్నమును అధిగమించి, స్వప్నమంతా తనదై, స్వప్నముచే నిర్వచించబడనివాడై ఉన్నారు కదా !

**భిక్షువు (లేక) పరమహంస కూడా....,**

- ఈ విశ్వమంతా తనదై...,
- ఈ విశ్వమంతా తానే అయి...,
- ఈ విశ్వమునకు వేరై ...,
- విశ్వాత్మకుడై, విశ్వుడై,
- అవిశ్వుడై, సర్వాతీతుడై, కేవలసాక్షి అయి ఉన్నారు.

**స్థిరమతిః :** దేనిచేతా కూడా "అహమ్ బ్రహ్మాఽస్మి" "సోఽహమ్" భావమునుండి అతడు చ్యుతి పొందరు. ఒక కథా రచయిత కథలోని సంఘటనలను రచిస్తూ, "నేను కథారచయితను" అనునది ఏమరుస్తున్నాడా ? నాటక రచయిత – నాటకంలో మిత్రుల, శత్రువుల మధ్య సంభాషణ రచిస్తూ " నేను నాటక రచయితను"... అని మరచి మిత్రుడుగా–శత్రువుగా అగుచున్నాడా? లేదు కదా? అట్లాగే ఆ పరమహంస సర్వముచూస్తూ సర్వములో ఉంటూ సర్వము తానై ఉంటున్నారు. సర్వమునకు వేరై కూడా ఉంటున్నారు.

**సంపదలు - ఆపదలు :** లోకంలో అందరూ విలువైనవిగా భావించబడే బంగారము మొ॥వి భిక్షువు మనస్సుతో స్పృశించడు. 'ఇవి నావి కదా!'.... అని భావించడు.

అతనికి లోకములు లేవు ! అవలోకనము లేదు ! అతని దృష్టిలో బాధలు లేవు. బాధించువాడు లేడు, బాధింపబడునది లేదు. అతను బాధకు కూడా కేవల సాక్షియై, ఏదో తదితరమైన అసంబంధిత వస్తువును చూస్తున్నట్లుగానే చూస్తూ ఉంటారు.

**శ్రీనారద మహర్షి :** అయితే తండ్రీ ! భిక్షువు బంగారము ఇటువంటి సంపద సంబంధమైనవి తాకనేకూడదంటారా ?

**శ్రీ ప్రజాపతి :** అవునయ్యా ! ఏ భిక్షువు అయితే హిరణ్యము (బంగారము) మొ॥న సంపద సంబంధమైన వస్తువులను 'రస దృష్టి'తో **"– ఇవి ఉంటే గొప్ప కదా ! ఇవి ప్రసాదించగలనని అందరు అను కొనెదరుగాక!"** – ఇట్టి భావనతో సంబంధితుడు అవుతాడో ..., అతడు **పరబ్రహ్మ మార్గము** (లేక) **పరమహంస మార్గము** నుండి చ్యుతుడై **"పౌల్కసుడు"** (One who got his path lost) అగుచున్నాడయ్యా ! ఇష్టంతో బంగారమును స్పృశిస్తే అది పరమహంస మార్గమునుండి భ్రష్టత్వము తెచ్చి పెట్టగలదని గ్రహించి ఉండాలి! అప్పుడు అతడు అల్ప జన్మలకు పిలిచి తెచ్చుకొన్నవాడు అగుచున్నాడు.

అందుచేత బిడ్డా! నారదా! ఈ జీవుడు – పరమహంమార్గాణ్వేషియై...,

- మనోగతమైన సర్వకామములను (కోరికలను) త్యజించివేస్తూ ఉండాలి!
- దుఃఖములకు ఉద్విగ్నము కారాదు. సుఖములపట్ల నిస్పృహుడు (స్వీకరించనివాడు) అయి ఉండాలి.
- హృదయమును రాగ (Attachments) రహితం చేసుకోవాలి. సర్వత్రా మమకారరహితుడై ఉండాలి. (కానీ) సర్వము తానే అయి మహదంకార ప్రదర్శితుడై ఉండాలి.

**శుభాశుభయో అనభిస్నేహో ! : - ఈవిధంగా పరమహంసత్వమును సిద్ధింపజేసుకొనుచుండగా,**

శుభ – అశుభములపట్ల అభిస్నేహము (Deep relatedness) లేనివాడై చెన్నొందుచున్నాడు. **న ద్వేష్టి! న మోదతే !** దేనినీ ద్వేషించడు. ఏదీ చూచి మోదము పొందడు.

ఇంద్రియముల గతిని సర్వ విషయముల నుండి నిరోధించి, ఆత్మభావనచే – సర్వ భావనలను పరితప్తము చేసివేస్తున్నారు. **"నేను చూస్తున్నది – వింటున్నది – ఆఘ్రాణిస్తున్నది – స్పృశిస్తున్నది – రుచి చూస్తున్నది... అంతా బ్రహ్మమే! బ్రహ్మమే బ్రహ్మమునందు ప్రవర్తిస్తూ బ్రహ్మముగానే ప్రకాశమానమగుచున్నది"** అని ఆస్వాదించుచున్నారు.

ఆ భిక్షువు ... పరమహంస అయి, పూర్ణానంద – ఏకబోధ స్వరూపుడుగాను, 'బ్రహ్మైవాఽహమస్మి' అను నినాదముతో వెలుగొందుచున్నారు. పొందవలసిన పొంది కృతకృత్యుడై దీపిస్తున్నారు. బ్రహ్మమే తానై ప్రకాశించుచున్నారు.

**ఇతి పరమహంసోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 10 పైఙ్గలోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



శ్లో॥ 'పైఙ్గలోపనిషత్' వేద్యం పరమానన్ద విగ్రహమ్।
పరితః కలయే రామం పరమ - అక్షర వైభవమ్॥

పైఙ్గలోపనిషత్ పరిశీలనచే పరమానంద విగ్రహము, పరమాక్షర వైభవము - అగు ఆత్మారామ తత్త్వము సుస్పష్టమవగలదు.

| 1వ అధ్యాయము | ప్రథమో అధ్యాయః |
|---|---|
| **1.** అథ హ పైఙ్గలో<br>యాజ్ఞవల్క్యమ్ ఉపసమేత్య<br>ద్వాదశవర్ష శుశ్రూషా పూర్వకం,<br>"పరమ రహస్య 'కైవల్యమ్' అనుబ్రూహి"<br>ఇతి పప్రచ్ఛ॥ | ఒకప్పుడు పైఙ్గలుడు అనే శ్రద్ధ - గురు భక్తిగల ఉత్తమ అభ్యాసి-మహనీయుడు అగు యాజ్ఞవల్క్యుని ఆశ్రమం చేరి **12 సంవత్సరాలు** గురు శుశ్రూష నిర్వర్తించారు. అటు తరువాత ఒకానొక రోజు ఆ పైఙ్గలుడు తత్త్వజ్ఞానాభిలాషి అయి-తన గురువగు యాజ్ఞవల్క్యుడు సుఖాశీనుడై ప్రశాంతముగా ఉన్న సమయములో - ఆయనను సమీపించి, గురు నమస్కారములు వినమ్రతతో సమర్పించారు. "గురుదేవా! పరమ రహస్యమగు **"కైవల్యము"** గురించిన సమాచారమును అనుగ్రహ భాషణముగా ప్రసాదించ వేడుకొనుచున్నాను.... అని అభ్యర్థించారు. |
| **2.** సహోవాచ యాజ్ఞవల్క్యః :<br>సదేవ, (సత్ ఏవ) సౌమ్య! ఇదమ్<br>అగ్ర ఆసీత్।<br>తం నిత్యముక్తమ్।<br>అవిక్రియమ్।<br>సత్యజ్ఞానానందమ్।<br>పరిపూర్ణమ్।<br>సనాతనమ్।<br>ఏకమేవా, అద్వితీయం బ్రహ్మ।<br>తస్మిన్ మరు, శుక్తికా, స్థాణు,<br>స్ఫటిక ఆదౌ జలరౌప్య<br>పురుషరేఖాదివ, | **యాజ్ఞవల్క్యుడు**<br>ఓ సౌమ్యుడా! పరబ్రహ్మానందస్వరూపా! ప్రియ శిష్యా! ఈ ఎదురుగా కనబడుచున్న దృశ్య వ్యవహారమంతటికీ మునుముందే నీవు తెలుసుకోవాలనుకుంటున్న 'సద్వస్తువు' అగు ఆత్మ ఉండి ఉన్నది.<br>అట్టి సత్ ఆత్మకమగు తత్త్వము<br>- నిత్యముక్తము. అద్దానికి బంధమే లేదు.<br>- అట్టి ఆత్మ ఎట్టి కర్తవ్య వ్యవహారములకు సంబంధించినది కాదు. అవిక్రియము. (క్రియా రహితము). నిష్క్రియము - సత్య (యమ్‌సత్) - జ్ఞాన (కేవల తెలివి) - ఆనంద స్వరూపము. సర్వదా పరిపూర్ణము. జన్మ-కర్మలకంటే మునుముందే ఉండి ఉన్నట్టిది కాబట్టి 'సనాతనము'. అట్టి సత్ స్వరూప పరమాత్మ (లేక) బ్రహ్మమునందు ప్రకృతిగా ప్రదర్శనమగుచున్నది.<br>❖ యడారియందు యండమావులలో కనిపించే జలమువలె..., (మరు)<br>❖ ముత్యపు చిప్పయందు వెండివలె .... (శుక్తికా) |

**లోహిత-శుక్ల - కృష్ణ గుణమయీ,**
**గుణసామ్యా, అనిర్వాచ్యా**
**మూల ప్రకృతిః ఆసీత్।**
**తత్ ప్రతిబింబితం యత్**
**తత్ 'సాక్షి చైతన్యమ్' ఆసీత్।**
**సా పునః వికృతిం ప్రాప్య**
**సత్వా ఉద్రిక్తా, అవ్యక్తా**
**ఆఖ్యావరణశక్తిః ఆసీత్।**
**తత్ ప్రతిబింబం యత్**
**తత్ 'ఈశ్వర చైతన్యం' ఆసీత్।**

❖ స్థాణువు [చీకటిలో చూచిన చెట్టు మ్రోడు (లేక) శిల] యందు దొంగయొక్క ఆకారము - కదలుచున్నట్లుగా కనిపించి భయము కలిగినట్లు...,

❖ స్ఫటికములో గీతలు, గాలిబుడగలు, పురుషాకారము కనబడు తీరుగా- ఎరుపు-తెలుపు-నలుపు రంగుల (రజో-సత్వ-తమో గుణముల) మేళవింపుతో కూడి (త్రిగుణములతో కూడి), **"ఇది ఇట్టిది"** అని చెప్పటానికి అనిర్వాచ్యమైన "మూల ప్రకృతి" ఆసీనమైయున్నది. ఆత్మయందు మూల ప్రకృతి వాస్తవానికి లేనిదే! లేనిది ఉన్నదగుచున్నది! ఆశ్చర్యం!

(జలములో దృశ్యము ప్రతిబింబించు తీరుగా)... అట్టి మూలప్రకృతియందు పరబ్రహ్మముకూడా ప్రతిబింబిస్తూ (జీవాత్మగా) సాక్షి చైతన్యరూపమై యున్నది.

ఆ మూల ప్రకృతి మరల వికారములు (వికృతి)ని పొందుచున్నది. తనయొక్క సత్వగుణము (ఉనికి అను స్వభావముచే) ఉద్రిక్తత పొంది, అవ్యక్తము (వ్యక్తీకరించుచూ, తాను వ్యక్తము కానిది) అను నామము గల ఆవరణశక్తిగా ఆశీనమై ఉంటోంది.

---

**3. స స్వాధీన మాయః సర్వజ్ఞః**
**సృష్టి - స్థితి - లయానాం**
**ఆదికర్తా జగత్ - అంకుర రూపో భవతి।**
**తస్మిన్ విలీనమ్**
**సకలం జగత్ ఆవిర్భావయతి।**
**ప్రాణికర్మవశాత్ ఏష పటో**
**యద్వత్ ప్రసారితః।**
**ప్రాణికర్మక్షయాత్**
**పునః తిరో భావయతి।**
**తస్మిన్ ఏవ అఖిలం విశ్వం**
**సంకోచిత పటవత్ వర్తతే।**
**ఈశా అధిష్ఠిత - ఆవరణశక్తితో**
**రజ - ఉద్రిక్తా, మహత్ - ఆఖ్యా**
**"విక్షేపశక్తిః" - ఆసీత్।**
**తత్ 'ప్రతిబింబితమ్' యత్,**
**తత్ 'హిరణ్యగర్భ చైతన్యమ్' ఆసీత్।**
**స మహత్ తత్త్వా అభిమానీ**
**స్పష్ట - అస్పష్ట వపుః భవతి॥**

అట్టి **'ఆవరణశక్తి'** లేక **'ఆవరణతత్వము'** నందు పరబ్రహ్మము ప్రతిబింబిస్తూ **"ఈశ్వర చైతన్యము"**....గా వెలయుచున్నది.

**ఈశ్వరుడు** : మాయను తన స్వాధీనమునందు ఉంచుకున్నవాడు. మాయను ఉపాధిగా కలవాడు. దేహమునకు మునుముందు - దేహమున్నప్పుడు అటు తరువాత స్థితి-గతులను ఎరిగినట్టివాడు కాబట్టి **సర్వజ్ఞుడు.** సృష్టి-స్థితి-లయములకు (దృశ్యప్రారంభం-కొనసాగటం-ఉపశమనములకు) ఆదికర్త! బీజములో మహావృక్షము యొక్క అంకురము ఉన్నతీరుగా ఈ జగత్తును తనయందు అంకురరూపముగా కలిగి ఉన్నవాడు.

ఆ ఈశ్వరుడే తనయందు ఒకప్పుడు విలీనమగుచున్న సకల జగత్తును (జగత్ భావనను).... మరొకప్పుడు తిరిగి ఆవిర్భవింపజేయుచున్నారు.

అట్టి ఆ ఈశ్వరుడే సర్వ ప్రాణులకు సంబంధించిన స్వీయ వాసనల రూప కర్మలను అనుసరించి ఈ 'జగత్' అను ఇంద్రియ విషయ ప్రపంచమును సంప్రదర్శనముగా నిర్వర్తిస్తున్నారు.

ఆయా ప్రాణులకు సంబంధించిన సంస్కార రూప కర్మ వ్యవహారములు మరొకప్పుడు సంక్షయిస్తూ ఉండగా, తననుండి బయల్వెడలిన అనేకత్వ రూప ప్రాణులను తనయందు తిరోభవింపజేయుచున్నారు.

ఆ ఈశ్వరునియందే ఈ విశ్వమంతా కూడా మడిచిపెట్టబడిన పొడవైన చీర (వస్త్రము) వలె దాగినదై ఉంటోంది.

(మట్టి బొమ్మలో మట్టివలె) ఈశ్వరునియందే అధిష్ఠితమైయున్న "ఆవరణశక్తి" నుండి రజోగుణముచే ఉద్రిక్తమైనట్టి 'మహత్' అను పేరుగల **విక్షేపశక్తి** ఏర్పడుచున్నది.

ఆ 'మహత్' నందు ప్రతిబింబించిన బ్రహ్మము..... అద్దానియందు "హిరణ్యగర్భ చైతన్యము" (లేక, సృష్టి కల్పనా చైతన్యము) ప్రతిబింబితముగా ఉనికి పొందిన దగుచున్నది.

ఆ హిరణ్యగర్భుడు (సృష్టికర్త) మహత్ తత్వము (లేక) విక్షేపము (The Factor of making show) నందు అభిమానము (Interested) కలవాడై సుస్పష్ట - అస్పష్టరూప దేహము (శరీరము) ధరించుచున్నాడు.

**4. హిరణ్యగర్భ అధిష్ఠిత విక్షేపశక్తిః**
**తత్ తమో ఉద్రిక్తా,**
**అహంకారా అభిధా**
**'స్థూలశక్తిః - ఆసీత్।**
**తత్ ప్రతిబింబితమ్ యత్,**
**తత్ 'విరాట్ చైతన్యమ్' ఆసీత్।**
**స తత్ అభిమానీ స్పష్టవపుః**
**సర్వ స్థూలపాలకో 'విష్ణుః'**
**ప్రధాన పురుషో భవతి।**
**తస్మాత్ ఆత్మన → ఆకాశః సంభూతః।**
**ఆకాశాత్ → వాయుః।**
**వాయో → అగ్నిః।**
**అగ్నే → ఆపః।**
**అద్భ్యః → పృథివీ।**
**తాని పంచ తన్మాత్రాణి**
**'త్రిగుణా' భవంతి।**
**'స్రష్టు' కామో జగత్‌యోనిః**
**తమోగుణమ్ అధిష్ఠాయ**
**"సూక్ష్మ-తన్మాత్రాణి భూతాని**
**స్థూలీకర్తుం" - సో అకామయత।**
**సృష్టేః పరిమితాని భూతాని**
**ఏకమ్ - ఏకమ్**
**ద్విధా విధాయ,**
**పునః చతుర్ధా కృత్వా**
**'స్వ-స్వేఇతర' ద్వితీయాంశైః**
**పంచ - పంచధా సంయోజ్య,**
**పంచీకృత భూతైః**
**అనంతకోటి బ్రహ్మాండాని,**
**తత్-తత్ అండోచిత**
**చతుర్దశ భువనాని,**
**తత్ తత్ భువనోచిత**
**గోళక స్థూలశరీరాణి అసృజత్।**

ఆ హిరణ్యగర్భునిచే అధిష్ఠితమైయున్న మహత్ - స్వరూప 'విక్షేపశక్తి' యొక్క **'తమోగుణ ఉద్రిక్తత'** చేత **'అహంకారము'** అను **స్థూలశక్తి** జనించుచున్నది.

ఆవిధంగా అహంకారము (సమిష్ఠి అహంకారము) నందు ప్రతిబింబిచుచున్న తత్ పరబ్రహ్మము **విరాట్ (విశ్వ స్వరూప)** చైతన్యముగా విరాజిల్లుచున్నది.

ఆ విరాట్టునందు కూడా, అట్టి విరాట్ అభిమానియై, సర్వత్ర వెలయుచు, సర్వ స్థూల దేహములకు ఉనికిని కల్పించి పరిపాలించు **పరబ్రహ్మమే**... సర్వదా ప్రతిబింబిస్తున్నది. అనగా, అట్టి ప్రధాన పురుషుడుగా (లేక) విష్ణు భగవానుడుగా (విరాట్ అభిమానిగా) పరమాత్మయే ప్రతిబింబిస్తున్నారు. అందుచేత పరమాత్మ **సర్వదా అద్వితీయుడే!** ఆయనకు ద్వితీయమై ఎక్కడా ఏదీ లేదు.

అట్టి విష్ణు భగవాన్‌స్వరూప **ఆత్మ** నుండి **ఆకాశము**, ఆకాశము నుండి **వాయువు**, వాయువు నుండి **అగ్ని**, అగ్ని నుండి **జలము**, జలమునుండి **పృథివి** జనిస్తున్నాయి. ఆవిర్భవిస్తున్నాయి. ఈ పంచభూతముల నుండి సూక్ష్మభూతములగు **శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ**ములనబడు తన్మాత్రలు త్రిగుణముల **(సత్వ-రజో-తమో గుణముల)**తో కూడి ప్రకటితమగుచున్నాయి.

కేవలుడగు ఆ మహావిష్ణు ఆత్మ భగవానుడు **"నేను సృష్టించెదను గాక!"** అను కోరిక (స్రష్టుకామః) కలవాడయ్యారు. జగత్కర్త అయి **'తమోగుణము'**ను అధిష్ఠించారు. శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ సూక్ష్మ తన్మాత్ర సహిత **సూక్ష్మ పంచభూతములను** (స్థలము-చలనము-తేజస్సు-ద్రవము-స్థూలములనబడు).... **"స్థూల మహా భూతములుగా చేసెదను గాక".....** అని సంకల్పించారు.

సృష్టికి పరిమితము - అవసరము అయినంత వరకు సూక్ష్మ పంచభూతములను- ఒక్కొక్కదానిని '2' భాగములుగా విభజన చేస్తున్నారు.

ఆ రెండు - రెండు సూక్ష్మపంచభూత విభాగములలో మొదటి 1/2 భాగమును అట్లాగే ఉంచి, రెండవ అర్ధ భాగమును '4' భాగములుగా విభాగించుచున్నారు.

'4'గా విభజించిన పంచభూత ద్వితీయార్ధభాగములలోని ఒక్కొక్క భాగమును తదితర '4' సూక్ష్మభూతములలోని మొదట అర్థభాగముతో ప్రతి భూతమును '5' భాగములుగా పంచీకరణము చేయబడుచున్నాయి.

ఈవిధంగా పంచీకరించబడిన పంచ సూక్ష్మభూతములతో

- అనంతకోటి బ్రహ్మాండములు,
- అట్టి ప్రతి ఒక్క బ్రహ్మాండకోశములో 14 లోకములు,
- ఆయా లోక నివాసమునకు సానుకూల్యమైన గోళక స్థూల శరీరములను ... ఇవన్నీ మహావిష్ణువు యొక్క స్వకీయ పుష్టకామము (ఇష్టము) నుండి సృష్టించబడుచున్నాయి.

**5. స పంచభూతానాం రజో-అంశాంశ్చ**
**చతుర్ధా కృత్వా, భాగత్రయాత్**
**పంచ వృత్త్యాఽత్మకమ్**
**'ప్రాణమ్' అసృజత్।**

ఇంకా ఈశ్వరుడు - పంచభూతములయొక్క రజోగుణ అంశ (భాగమును '4' భాగములుగా చేసి..., ఆ 4 భాగములలో '3' భాగముల నుండి (ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమాన అనబడు) పంచ వృత్త్యాత్మకమైనట్టి 'ప్రాణము' లేక ప్రాణశక్తిని సృజించుచున్నారు.

అథ తేషాం తుర్యభాగేన
'కర్మేంద్రియాణి' అసృజత్।
స తేషాం సత్త్వాऽంశం
చతుర్ధా కృత్వా భాగత్రయ
సమష్టితః పంచవృత్త్యాऽత్మకమ్
'అన్తఃకరణమ్' అసృజత్॥
స తేషాం సత్త్వ తురీయభాగేన
'జ్ఞానేంద్రియాని' అసృజత్।
సత్త్వసమష్టిత ఇంద్రియ -
పాలకాన్ అసృజత్।
తాని సృష్టాని అణ్డే ప్రాచిక్షిపత్,
తత్ ఆజ్ఞయా 'సమష్టి-అణ్డం'
వ్యాప్యతా అన్య తిష్ఠన్।
తత్ ఆజ్ఞయా అహంకార సమన్వితో
విరాట్ - సర్వస్థూలాని అసృజత్।
హిరణ్యగర్భః తదాజ్ఞయా
సూక్ష్మాణి అపాలయత్।

ఆ తరువాత (3 భాగములు ప్రాణ సృష్టికై ఉపయోగించబడగా) .... 4వ భాగము నుండి పంచకర్మేంద్రియములను సృజించుచున్నారు. (కర్మేంద్రియములు : వాక్కు, కాళ్ళు, చేతులు, పాయువు, ఉపస్థ)

ఆ తరువాత ఆ ఈశ్వరుడు పంచభూతములయొక్క 'సత్వాంశ' (సాత్త్విక విభాగము) '4' భాగములుగా చేసి అందులో 3 భాగముల నుండి పంచవృత్యాత్మకము (దృశ్యభావ-మనో-బుద్ధి-చిత్త-అహంకారములు) అగు **'అంతఃకరణము'**ను సృష్టించుచున్నారు.

ఆపై ఆ 'సత్త్వాంశ' యొక్క 4వ భాగము (తురీయభాగము) నుండి పంచ **జ్ఞానేంద్రియ తత్త్వములను** ఈశ్వరుడు సృజియించుచున్నారు. (జ్ఞానేంద్రియములు = చర్మము, కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు)

అట్టి సత్వ సమిష్ఠి చేత **ఇంద్రియ పాలక ప్రజ్ఞా స్వరూపులగు** దేవతలను సృజియించుచున్నారు. ఆవిధముగా సృష్టించబడిన పంచ కర్మేంద్రియ - పంచ జ్ఞానేంద్రియతత్త్వములు, ఇంద్రియ దివ్య (దేవతా) ప్రజ్ఞలను ఆ ఈశ్వరుడు 'బ్రహ్మాండము'లో ప్రవేశింప జేస్తున్నారు.

అవన్నీ కూడా ఈశ్వరాజ్ఞను అనుసరించి ఈశ్వరునిచే సృష్టింటబడిన బ్రహ్మాండములో ప్రవేశించి, ఆ అండమునందు తమ తమ స్థానములలో ప్రవేశించి, తమ తమ ధర్మములతో (Functional Features) కూడుకొని అంతటా వ్యాపించినవిగా అగుచున్నాయి.

ఆ ఈశ్వరుని ఆజ్ఞచే అహంకార సహిత, విరాట్ (బ్రహ్మదేవుడు, సృష్టి ప్రజ్ఞా పురుషుడు) ఈ కనబడే సమస్త స్థూలములను సృజియించుచున్నారు.

ఈశ్వరాజ్ఞను అనుసరించి సృష్టికర్తయగు ఆ హిరణ్యగర్భుడు బ్రహ్మాండములోని సూక్ష్మతత్త్వములన్నీ కూడా పరిపాలించ సిద్ధమైనారు. (కానీ అంతా జడ స్థితి యందున్నది). ఒక చక్రవర్తి రాయి-రప్పలను పరిపాలించడు కదా! చైతన్యరూపులగు జనులను కదా, పరిపాలించేది!

---

6. అణ్డస్థాని తాని తేన వినా
స్పన్దితుమ్ - చేష్టితుం వా న శేకుః।
'తాని చేతనీ కర్తుం' - సో అకామయత।
బ్రహ్మాండం, బ్రహ్మరంధ్రాణి
సమస్త వ్యష్టి మస్తకాని
విదార్య, తదేవ అనుప్రావిశత్।
తదా జడాన్యపి, తాని
చేతనవత్ స్వస్వకర్మాణి చక్రి రే।
సర్వజ్ఞ ఈశో, మాయా లేశ సమన్వితో,
'వ్యష్టి దేహమ్' ప్రవిశ్య,
తయా మోహితో జీవత్వమ్ అగమత్।
శరీరత్రయ తాదాత్మ్యాత్
కర్తృ-భోక్తృత్వతామ్ అగమత్,
జాగ్రత్ - స్వప్న - సుషుప్తి -
మూర్ఛా - మరణ ధర్మయుక్తో,

ఈవిధంగా అండము (బ్రహ్మాండము) నందు వ్యాపించి-స్థితములైనట్టి కర్మేంద్రియ-జ్ఞానేంద్రీయ తత్త్వములు- చైతన్యమూర్తియగు ఈశ్వరుని సాన్నిధ్యము లేకుండా - తమకు తాముగా స్పందించలేకపోయాయి. క్రియా స్పందనము (చేష్టితము) నిర్వర్తించలేకపోయాయి. (అనగా, జడములుగా ఉండి ఉన్నాయి).

అప్పుడు ఈశ్వరుడు, **"నేను బ్రహ్మాండములో విసృజింపజేసినట్టి కర్మ - జ్ఞానేంద్రియ తత్త్వములు, దేవతా ప్రజ్ఞలు తమకుతాముగా స్పందములు, చేష్టితములు కాలేక, జడములుగా ఉన్నాయి. ఆనందము ఏమున్నది? కనుక వీటిని పరస్పరత్వముతో కూడిన చేతనములుగా చేసెదను గాక!"** .... అను కోరిక పొందారు.

బ్రహ్మాండములను, బ్రహ్మరంధ్రములను, సమస్త వ్యష్టిశరీరముల (Individual Physical Bodies) యొక్క మస్తకముల ద్వారా, వాటి వాటియందు చైతన్య స్వరూపుడై ఆ ఈశ్వరుడు తనకుతానై ప్రవేశించారు.

ఆయా భౌతిక శరీరములు మొదలైనవి మొట్టమొదట 'జడములు'గా ఉన్నప్పటికీ..., **'ఈశ్వర చైతన్యము'** అనే చిత్‌జ్యోతి ప్రవేశించగానే, అవన్నీకూడా **చైతన్యవంతము లయ్యాయి.** అటు తరువాత ఈశ్వరాజ్ఞచే తమకు నియమితములైన ఆయా ధర్మములను నిర్వర్తించసాగాయి.

ఈశ్వరుడు స్వతఃగా సర్వ శక్తిమంతుడు, సర్వజ్ఞుడు, మాయను తనయొక్క కళావిశేషముగా కలిగియున్నవాడు. అయితే అట్టి ఈశ్వరుడు తన కల్పన అగు వ్యష్టి దేహములలో ప్రవేశించినవాడై, మోహితుడుగా అగుచు (మోహము

**ఘటీ యంత్రవత్ ఉద్విగ్నో జాతో - మృత ఇవ**

**కులాల చక్రన్యాయేన**

**పరిభ్రమత్ ఇతి॥**

పొందినవాడై) 'జీవత్వమును' పొందుచున్నారు. "నేను ఒక జీవుడను" అను భ్రమతో కూడిన ఆవరణ పొందసాగుచున్నారు. ఇక ఆపై (స్థూల-సూక్ష్మ-కారణ) దేహత్రయముతో తదాత్మ్యము పొందినవాడై, "నేను కర్తను - భోక్తను" అను కర్తృత్వ - భోక్తృత్వముల స్వకీయ కల్పనకు బద్ధుడు అగుచున్నాడు.

అట్టి ఈశ్వరుడు, "నేను స్థూల దేహిని, నేను సూక్ష్మదేహిని, నేను కారణ దేహిని"... అని త్రిదేహభ్రాంతిని పొంది, అవియే తానుగా భావించుచూ క్రమంగా మేలుకొని జాగ్రత్ దశ, స్వప్నదశ, సుషుప్తి, మూర్ఛ, మరణము అను ఈ ఈ (5) ధర్మములు తనవిగా పొందుచున్నాడు.

కులాల (కుండలు తయారు చేసే) చక్రయంత్రమువలె ఉద్విగ్నుడై **"నేను జనిస్తున్నాను. మరణిస్తున్నాను"**.... అనునవి భావిస్తూ చావు-పుట్టుకల మధ్య పరిభ్రమించటము ప్రారంభిస్తున్నాడు.

---

## <u>ద్వితీయో అధ్యాయః</u>

**1. <u>అథ పైఙ్గలో యాజ్ఞవల్క్యం ఉవాచ:</u>**

**సర్వలోకానాం**

**సృష్టి - స్థితి - అంతకృత్**

**విభుః, ఈశః .... కథం**

**జీవత్వమ్ అగమత్ - ఇతి?**

**<u>సహోవాచ యాజ్ఞవల్క్యః</u>**

**స్థూల-సూక్ష్మ-కారణ దేహ ఉద్భవ పూర్వకం**

**జీవ-ఈశ్వర స్వరూపం వివిచ్య కథయామి-ఇతి।**

**సావధానేన ఏకాఽగ్రతయా శ్రూయతామ్।**

**ఈశః పంచీకృత మహాభూత**

**లేశాన్ ఆదాయ, వ్యష్టి - సమష్ట్యాత్మక స్థూల శరీరాణి**

**యథాక్రమమ్ అకరోత్।**

**కపాల - చర్మ - ఆన్త్రా - అస్థి - మాంస**

**- నఖాని పృథివ్యంశాః।**

**రక్త-మూత్ర-లాలా-స్వేద ఆదికా అబంశాః।**

**క్షుత్-తృష్ణ-ఉష్ణ-మోహ-మైథువా అగ్న్యంశాః।**

**ప్రచారణ-ఉత్తారణ-శ్వాసాది వాయ్వంశాః।**

**కామ క్రోధ ఆదయో వ్యోమాంశాః**

**ఏతత్ సంఘాతం కర్మణి సంచితం, 'త్వక్' ఆదియుక్తం,**

**బాల్యాది అవస్థా - అభిమానాస్పదం**

**బహుదోషాఽశ్రయమ్ 'స్థూలశరీరమ్' భవతి।**

### ద్వితీయ అధ్యాయము

**పైఙ్గలుడు** : హే మహాత్మా! యాజ్ఞవల్క్య సద్గురుదేవా! మీరు చెప్పేది చాలా ఆశ్చర్యంగా ఉన్నది. సర్వలోకాలను సృష్టించి - స్థితింపజేసి - లయింపజేయగల మహా సామర్థ్యవంతుడు, సర్వాంతర్గతుడు, సర్వము తన విభూతియే అయి ఉన్నట్టి విభుడు, సర్వత్రా విస్తరించియున్న ఈశ్వరుడు.... ఈవిధంగా పరిమితము - సంకుచితము అగు జీవభావము ఎందుకు పొందుచున్నారు? ఎందుకు జీవుడుగా అగుచున్నారు? దయచేసి వివరించండి.

**యాజ్ఞవల్క్య మహర్షి** : ఓ ప్రియ పైఙ్గలా! స్థూల-సూక్ష్మ-కారణ దేహ పూర్వకముగా ఏవిధంగా జీవ-ఈశ్వర తత్త్వము ప్రదర్శితమగుచున్నదో .... తత్ 'విచారణ'ను వివరిస్తున్నానయ్యా! సావధాన చిత్తుడవై ఏకాగ్రతతో వినుచుండెదవు గాక! ఇది నీవు అడిగిన ప్రశ్నకు ఆత్యంతిక సమాధానం కాగలదు.

ఈశ్వరుడు (మనము ఇంతకుముందు చెప్పుకున్నట్లు) స్వీయకల్పన అగు పంచీకృతములైన మహాభూతములను స్వీకరించినవారై, వ్యష్టి - సమిష్టి రూపములుగా $(5 \times {}^1/_2)$ $({}^1/_2 + {}^1/_8 + {}^1/_8 + {}^1/_8 + {}^1/_8 + {}^1/_8)$ ఇటువంటి అనేక సంమిశ్రములతో స్థూల దేహములను యథా ప్రకారముగా (ఒక పిల్లవాడు మట్టితో ఆకారములు ఆడుకొనుటకై తయారు చేసుకొను రీతిగా) సృష్టించుచున్నారు.

అట్టి ఈశ్వర సంకల్పానుసారంగా (${}^1/_2$ పృధివి + ${}^1/_8$ జల + ${}^1/_8$ అగ్ని + ${}^1/_8$ వాయు + ${}^1/_8$ ఆకాశ) అంశతో కూడిన **పృథివి యొక్క అంశలుగా** కపాలము, చర్మము, నరములు, మాంసము, గోరులు... ఇవన్నీ (భౌతిక దేహములో) ఏర్పడినవగు చున్నాయి.

**జలముయొక్క అంశలు** గా భౌతికదేహములో రక్తము, మూత్రము, లాలా జలము, స్వేదము (చెమట) .... ఇవన్నీ ఏర్పాటు కాబడినవగుచున్నాయి.

**అగ్నియొక్క అంశలు** గా ఆకలి, దాహము, ఉష్ణము (Heat), మోహము, మైధునము (Sexual Feelings) మొదలైనవి రూపుదిద్దుకుంటున్నాయి.

**వాయువుయొక్క అంశలు** గా నడవటము, దాటటము, దూకటము, శ్వాస మొదలైనవి ప్రదర్శితమగుచున్నాయి.

**వ్యోమ (ఆకాశ) అంశలు** గా కోరిక (కామము), క్రోధము... మొదలైనవి ప్రత్యక్షమై సంప్రదర్శితమగుచున్నాయి.

ఈవిధంగా వాటన్నిటి యొక్క సంఘాతము (Mixing) చేత (సంచిత పారబ్ధ ఆగామి) **కర్మలు**, చర్మమయ **దేహపరంపరలు**, బాల-కౌమార-యౌవన-వార్ధక్య-మరణ-పునర్జన్మాది **అవస్థలు**, అనేకరూపములైన **అభిమానములు**.... ఇటువంటివన్నీ ఒకచోటికి చేరినవై **"స్థూలదేహము"** రూపము అగుచున్నది. ఇవన్నీ **పంచీకృత మహాభూత విశేషములు.**

| | |
|---|---|
| **2. అథ అపంచీకృత మహాభూత<br>రజోఽంశ భాగ త్రయసమష్టితః 'ప్రాణమ్' అసృజత్।<br>ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన<br>సమానాః ప్రాణ వృత్తయః।<br>నాగ-కూర్మ-కృకర-దేవదత్త-<br>ధనంజయా 'ఉపప్రాణాః'।<br>హృద-ఆసన-నాభి-కంఠ సర్వాంగమ్ 'స్థానమ్'।<br>ఆకాశాది రజోగుణ తుర్యభాగేన<br>కర్మేంద్రియమ్ అసృజత్।<br>వాక్-పాద-పాణి-పాయూ-ఉపస్థాః తత్ వృత్తయః।<br>వచన - ఆదాన - గమన - విసర్గ -<br>ఆనందాః తత్ విషయాః।<br>ఏవం భూత సత్త్వాంశ భాగత్రయ<br>సమష్టితః అంతః కరణమ్ అసృజత్।<br>అంతఃకరణ మనో-బుద్ధి<br>చిత్త-అహంకారాత్ తత్ వృత్తయః।<br>సంకల్ప-నిశ్చయ-స్మరణా-<br>అభిమానా-అనుసంధానాః తత్ విషయాః।<br>గళ-వదన-నాభి-హృదయ- భ్రూమధ్యమ్ - స్థానమ్।<br>స భూత సత్త్వ తురీయభాగేన జ్ఞానేంద్రియమ్ అసృజత్।<br>శ్రోత్ర - త్వక్ - చక్షుః - జిహ్వా -<br>ఆఘ్రాణాని తత్ వృత్తయః।<br>శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాః తత్ విషయాః।<br>దిక్-వాతా-అర్క-ప్రచేతో-అశ్వి<br>వహ్ని - ఇంద్ర - ఉపేంద్ర మృత్యుకాః<br>చంద్రో విష్ణుః చతుర్వక్త్రః శంభుశ్చ కరణాఽధిపాః।** | ఇక, అపంచీకృత మహాభూతములయొక్క రజో గుణ స్వభావము (Inclination to Function, Work, act) యొక్క త్రిగుణాంశలు అన్నీ చేరి 'ప్రాణము' అను **చలన శక్తిని** సృజించుచున్నాయి.<br>అట్టి 'ప్రాణశక్తి' యొక్క చలన వృత్తులను అనుసరించి, **ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము** .... అనునవి **పంచప్రాణ వృత్తులు!**<br>**"నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయము"....** అని పిలువబడేవి పంచ **ఉపప్రాణ వృత్తులు...!** హృదయము, గుదము, నాభి (బొడ్డు) కంఠము, సర్వాంగములు... ఇవన్నీ ప్రాణశక్తి స్థానములు.<br>మహాభూతములగు "ఆకాశము-వాయువు-అగ్ని-జలము-పార్థివము"లకు సంబంధించి రజోగుణ '4'వ భాగములతో కర్మేంద్రియములను ఈశ్వరుడు సృష్టించుచున్నారు. (ఈశ్వరుడు = దేహ-దేహాంతరములకు సాక్షిగా ఉండి సర్వము చైతన్యపరచు తత్త్వము). రజోతత్త్వము యొక్క వ్యావృత్తులు వాక్కు, పాదములు, పాయువు, ఉపస్థ అనబడు కర్మేంద్రియ వృత్తులు.<br>రజోగుణ విషయములు - వచనము (మాట్లాడటము), అర్పించటము, గమనము, విసర్జనము, ఆనందములు. అట్టి సూక్ష్మ భూతముల "సత్త్వాంశముల మూడింటితో కూడినవై.... 'అంతఃకరణము' సృజించబడుతోంది.<br>సత్త్వాంశభూత అంతఃకరణము యొక్క వృత్తులు - మనస్సు (ఆలోచన), బుద్ధి (విచక్షణ), చిత్తము (ఇష్టము), అహంకారము (నేను - నాది రూపము).... అయి ఉన్నాయి. (అంతఃకరణ చతుష్టయం).<br>**సత్త్వాంశభూత** - అంతఃకరణము యొక్క విషయములు : సంకల్పము, నిశ్చయము, స్మరణము, అభిమానము అనుసంధానము చేయటము.<br>**అంతఃకరణ స్థానములు** : గళము (గొంతు), ముఖము (వదనము), నాభి (బొడ్డు), హృదయము, భ్రూమధ్యము.<br>అట్టి **సూక్ష్మభూత సత్త్వము** యొక్క "4వ భాగము" నుండి **జ్ఞానేంద్రియములు** జనిస్తున్నాయి.<br>**జ్ఞానేంద్రియతత్త్వము యొక్క పంచవృత్తులు** : శ్రోత్రము (చెవులు), త్వక్ (చర్మము), చక్షువులు (కళ్ళు), జిహ్వ (నాలుక), ఆఘ్రాణము (ముక్కు), సూక్ష్మభూత - సత్త్వాంశము నుండి ప్రకటితమగు జ్ఞానేంద్రియ విషయాలు : శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు.<br>**జ్ఞానేంద్రియములకు అధిష్ఠాన దేవతలు :** అష్ట దిక్పాలకులు : వాయువు, సూర్యుడు, ప్రచేతుడు (వరుణుడు), కర్మేంద్రియ దేవతలు - అశ్వనీ దేవతలు, అగ్నిదేవుడు, ఇంద్రుడు, ఉపేంద్రుడు, మృత్యుదేవత.<br>**మనో - బుద్ధి - చిత్త అహంకార అధిష్ఠాన దేవతలు** : వరుసగా చంద్రుడు, విష్ణువు, చతుర్ముఖ బ్రహ్మ, శంభుడు. |
| **3. అథ అన్నమయ-ప్రాణమయ-<br>మనోమయ - విజ్ఞానమయ -<br>ఆనందమయాః పంచకోశాః।<br>అన్నరసేనైవ భూత్వా, అన్నరసేన<br>అభివృద్ధిం ప్రాప్య, అన్నరసమయ<br>పృథివ్యాం యత్ విలీయతే, సో అన్నమయకోశః<br>తదేవ స్థూల శరీరమ్।** | ఈ జీవ-జగత్తులకు సంబంధించిన పంచకోశములు గురించి వివరిస్తున్నాను.<br>పంచకోశములు : 1. అన్నమయకోశము 2. ప్రాణమయకోశము 3. మనోమయ కోశము 4. విజ్ఞానమయకోశము 5. ఆనందమయ కోశము.<br>**అన్నమయకోశము** (Matter) : ఇది అన్నరసముచే జనిస్తోంది. అన్న రసము చేతనే వృద్ధి చెందుచూ, చివరి అన్న రసమయమగు పృథివియందు విలీనము అగుచున్నది. ఇదియే కంటికి ఎదురుగా కనిపిస్తున్న **'స్థూలదేహము'.**<br>**ప్రాణమయకోశము** (Energy) : కర్మేంద్రియములతో సహా పంచ ప్రాణములతో కూడిన తత్త్వములు. |

కర్మేంద్రియైః సహ ప్రాణాది
పంచకమ్ ప్రాణమయకోశః।
జ్ఞానేంద్రియైః సహ మనోమయకోశః।
జ్ఞానేంద్రియైః సహ బుద్ధిః విజ్ఞానమయ కోశః।
ఏతత్ కోశత్రయం 'లింగశరీరమ్'।
స్వరూప-అజ్ఞానమ్ ఆనందమయ కోశః।
తత్ 'కారణ – శరీరమ్।'

**మనోమయకోశము** (Thought): పంచ జ్ఞానేంద్రియములతో కూడిన మనోరూపము.

**విజ్ఞానమయకోశము** (Knowing) : పంచ జ్ఞానేంద్రియములతో కూడిన 'బుద్ధి' తత్త్వము.

ఇట్టి **ప్రాణ-మనో-విజ్ఞాన**-త్రికోశములను కలిపి **"లింగశరీరము"** అని పిలుస్తున్నారు.

**ఆనందమయకోశము** (Enjoying) : స్వస్వరూపముయొక్క అజ్ఞానముచే అనుభవమగునది. దీనినే **'కారణశరీరము'** అని కూడా పిలుస్తున్నారు.

---

**4.** అథ జ్ఞానేంద్రియ పంచకమ్,
కర్మేంద్రియ పంచకమ్, ప్రాణాది పంచకమ్,
వియత్ ఆది పంచకమ్, అంతఃకరణ చతుష్టయం,
కామ కర్మ తమాంస్య అష్టపురమ్।
ఈశా ఆజ్ఞయా విరాట్
'వ్యష్టి' దేహమ్ ప్రవిశ్య,
బుద్ధిమ్ అధిష్ఠాయ,
విశ్వత్వమ్ అగమత్।
విజ్ఞానాత్మా చిదాభాసో విశ్వో
వ్యావహారికో జాగ్రత్-
స్థూల దేహాభిమానీ, కర్మభూః
ఇతి చ 'విశ్వస్య' నామ భవతి।
ఈశా ఆజ్ఞయా సూత్రాత్మా
వ్యష్టి సూక్ష్మ శరీరమ్ ప్రవిశ్య,
మనః అధిష్ఠాయ 'తైజసత్వమ్' అగమత్।
తైజసః ప్రాతిభాసికః స్వప్నకల్పిత
ఇతి 'తైజసస్య' నామ భవతి।
ఈశా-ఆజ్ఞయా, మాయా-ఉపాధిః,
అవ్యక్త సమన్వితో, వ్యష్టి కారణ-
శరీరమ్ ప్రవిశ్య ప్రాజ్ఞత్వమ్ అగమత్।
ప్రాజ్ఞో అవిచ్ఛిన్నః పారమార్థికః సుషుప్త్య – అభిమాని
ఇతి 'ప్రాజ్ఞస్య' నామ భవతి।

పుర్యష్టకము (అష్టపురి)

1. **జ్ఞానేంద్రియ పంచకము** (5) (చెవులు-చర్మము-కళ్ళు-నాలుక-ముక్కు)
2. **కర్మేంద్రియ పంచకము** (5) (కాళ్ళు-చేతులు-గుదము-శిశ్నము-నోరు)
3. **ప్రాణ పంచకము** (5) (ప్రాణ-అపాన-వ్యాన-ఉదాన-సమానములు)
4. (ఆకాశ-వాయు-అగ్ని-జల-భూ)- **భూతపంచకము** (5)
5. **అంతఃకరణ చతుష్టయము** (4) (మనో-బుద్ధి-చిత్త-అహంకారములు)
6. **కామము**
7. **కర్మము**
8. **తమస్సు** (అజ్ఞానము)

ఇది "పుర్యష్టకము"! (27 రీతులైనవి) (Eight Factored Townsip)

**జాగ్రత్ అభిమాన-పురుషకారము** : ఈశ్వరాజ్ఞను అనుసరించి **విరాట్ పురుషుడు** 'వ్యష్టి దేహము'లో ప్రవేశించి, బుద్ధిని అధిష్ఠించినవాడై విశ్వమును (దృశ్యమును) పొందుచూ **'విశ్వుడు'** అని పిలవ బడుచున్నాడు. ఆ విరాట్టు **"విజ్ఞానాత్మ"** అని, **"చిదాభాసుడు"** అని, **"విశ్వుడు"** అని **"వ్యావహారికుడు"** అని, **"జాగ్రత్ స్థూల దేహాభిమాని"** అని **"కర్మభూయిష్టుడు"** అను పేర్లతో వర్ణింపబడుచున్నారు.

**స్వప్న అభిమాన-పురుషకారము** :ఈశ్వరాజ్ఞానుసారంగా ఒక్కొక్క వ్యష్టియొక్క సూక్ష్మ దేహములో ప్రవేశించి, ఆవిరాట్టు 'మనస్సు'ను, 'తేజస్సు'ను అధిష్ఠించి 'తైజసుడు' అను పేరుతో స్వప్నాభిమానియై చెన్నొందుచున్నారు.

అట్టి తైజసునకు **ప్రాతిభాసికుడు, స్వప్నకల్పితుడు....** మొదలైన పేర్లు కూడా ఉన్నాయి.

**సుషుప్త అభిమాన-పురుషకారము** : ఈశ్వరాజ్ఞను అనుసరించియే ఆ విరాట్ పురుషుడు (ఈశ్వరుడు) మాయను ఉపాధిగా తీసుకొని 'అవ్యక్తము'తో కూడుకున్నవాడై వ్యష్టియొక్క 'కారణ శరీరము' నందు ప్రవేశించి **"ప్రాజ్ఞత్వము"** పొందుట జరుగుతోంది.

అట్టి ప్రాజ్ఞునకు **'అవిచ్ఛిన్నుడు', 'పారమార్థికుడు', 'సుషుప్త్య అభిమాని'...** మొదలైన శబ్ద-తత్ శబ్దార్థములతో పిలువబడుచూ ఉన్నాడు.

---

**5.** అవ్యక్తలేశా – అజ్ఞాన ఆచ్ఛాదిత
పారమార్థిక జీవస్య "తత్త్వమసి"
ఆది వాక్యాని బ్రహ్మణా ఏకతాం జగుః।
నేఽ తరయోః వ్యావహారిక,
ప్రాతిభాసికయోః,
అన్తఃకరణ ప్రతిబింబిత
చైతన్యమ్ యత్, తదేవ

(సర్వము వ్యక్తీకరిస్తూ తాను వేరై ఉన్నట్టి) అవ్యక్తతత్త్వముచే ఆవరించబడిన పారమార్థిక స్వస్వరూపము వేద, ఆత్మజ్ఞ ఆప్తవాక్యములైనట్టి "తత్త్వమసి, సోఽహమ్" మహావాక్య మనన - నిదిధ్యాసలచే - **భిన్నత్వమునకు ఆధారమైనట్టి ఏకరస బ్రహ్మముగా** అనుభవమగుచున్నది.

ఇక్కడ ఎదురుగా ఇంద్రియములకు ఏ వ్యావహారిక భేదమంతా అగుపిస్తోందో, అట్టి ఇక్కడి భేదమంతా కూడా **'అంతఃకరణము'** అనే తటాక జలంలో **ప్రతిబింబించే చైతన్య బింబము (లేక) అంతఃకరణ దర్పణములో ప్రతిబింబమువంటిది మాత్రమే.** అట్టి అంతఃకరణ ప్రతిబింబిత చైతన్యమే జాగ్రత్-స్వప్న-సుషుప్తి రూపములుగా

**'అనస్థాత్రయభాగ్' భవతి।**
**స జాగ్రత్-స్వప్న-సుషుప్తి అవస్థాః ప్రాప్య,**
**ఘటీ యంత్రవత్ ఉద్విగ్నో**
**జాతో - మృత ఇవ స్థితో భవతి।**
**అథ జాగ్రత్-స్వప్న-సుషుప్తి-మూర్ఛా**
**మరణావస్థాః పఞ్చ భవన్తి।**
**తత్ తత్ దేవతా అనుగ్రహాన్వితైః**
**శ్రోత్రాఽఽది జ్ఞానేంద్రియైః**
**శబ్దార్థ విషయ గ్రహణ జ్ఞానమ్**
**"జాగ్రదవస్థా" భవతి।**
**తత్ర భ్రూమధ్యంగతో జీవ**
**ఆపాద - మస్తకం వ్యాప్య కృషి**
**శ్రవణాది అఖిల క్రియా**
**'కర్తా' భవతి। తత్ తత్ ఫలభుక్చ భవతి।**
**లోకాంతరగతః కర్మార్జిత ఫలం స యేవ భుంక్తే।**
**స సార్వభౌమవత్ వ్యవహారాత్**
**శ్రాన్తో అన్తర్భవనమ్ ప్రవేష్టుం మార్గమ్ ఆశ్రిత్య తిష్ఠతి।**

ఒకదాని వెనుక మరొకటిగా ప్రదర్శితమగుచున్నది.

ఈశ్వరుడు సర్వసాక్షి, సర్వమునకు పరము, మహాసంపన్నుడు అయి ఉండి కూడా, స్వకల్పితమగు 'ఊహ' అనే ప్రాతిభాసికమునందు ప్రవేశించి జాగ్రత్-స్వప్న-సుషుప్తి అవస్థలు ప్రాప్తింపజేసుకుంటూ,... పైకి-క్రిందికి తిరిగే ఘటీయంత్రమువలె జీవన్మృతుని వలె స్థితిపొందినవాడగుచున్నాడు.

**జాగ్రత్ - స్వప్న - సుషుప్తి - మూర్ఛ - మరణము**లనబడే పంచ అవస్థలు వరసగా పొందుచూ ఉన్నాడు.

శ్రోత్ర - త్వక్కు - చక్షువులు - జిహ్వ - ఘ్రాణము (వినికిడి-స్పర్శ-చూపు-రుచి-వాసనలనే) అనే జ్ఞానేంద్రియముల శబ్ద-అర్థ విషయములను గ్రహించు జ్ఞాన స్థితియే 'జాగ్రత్ అవస్థ' అయి ఉంటోంది.

అట్టి జాగ్రత్ అవస్థలో భ్రూమధ్య ఆకాశగతుడై జీవుడు (ఈశ్వరుని యొక్క జీవ చైతన్యము), దేహములో కాలి బొటన వేలునుండి-శిరస్సు వరకు వ్యాపించి ఉండి వినటము-చూడటము-స్పర్శ-రుచి చూడటము-వాసన... వీటన్నిటికీ కర్త అగుచున్నాడు. **కర్తృత్వము** వహిస్తున్నాడు. వాటి వాటికి **కర్మఫలభోక్త** కూడా అగుచున్నాడు.

ఈవిధంగా ఈశ్వర స్వరూపుడే అయి ఉన్న ఈ జీవుడు దేహాభిమానియై ఉంటూ, ఆ దేహము శిధిలమైనప్పుడు కర్మానుసారంగా మరొక లోకములో ప్రవేశించి, కర్మఫలములను అనుభవించటమును కొనసాగిస్తున్నాడు.

ఒక సార్వభౌముడు (చక్రవర్తి) అనేక కార్యక్రమములు నిర్వర్తించి అలసి తిరిగి అంతఃపురమునకు బయలుదేరువిధంగా, ఈ జీవుడు కూడా గాఢ నిద్రయందు ప్రవేశిస్తున్నాడు.

---

6 **కరణ ఉపరమే జాగ్రత్ సంస్కారోత్థ ప్రబోధవత్,**
**గ్రాహ్య - గ్రాహక రూప స్ఫురణమ్**
**'స్వప్నావస్థా' భవతి।**
**తత్ర విశ్వఏవ జాగ్రత్ వ్యవహార**
**లోపాత్, నాడీ మధ్యం**
**చరన్, తైజసత్వమ్ అవాప్య**
**వాసనా రూపకం జగత్-వైచిత్ర్యం**
**స్వభాసా భాసయన్,**
**యథా ఈప్సితం స్వయం భుంక్తే।**
**చిత్తా - ఏకకరణా 'సుషుప్త్యవస్థా' భవతి।**
**భ్రమ విశ్రాంత శకునిః**
**పక్షౌ సంహృత్య నీడాభిముఖం యథా గచ్ఛతి...,**
**తథా జీవోఽపి జాగ్రత్ - స్వప్న**
**ప్రపంచే వ్యవహృత్య శ్రాన్తో, (శాంతో)**
**అజ్ఞానం ప్రవిశ్య స్వానన్దమ్ భుంక్తే।**

**స్వప్నావస్థ** : జాగ్రత్‌లో ఇంద్రియానుభవములన్నీ విరమించబడినవై అంతఃకరణములోని సంస్కారార్థములను బాహ్యాత్వము లేకుండగానే, అంతరములో "గ్రహించువాడు - గ్రహించబడునది" ఈ ఉభయముతో కూడి ఈ జీవుడు అనుభవించటము.

స్వప్నావస్థ = మనస్సు తనకు తానే ఉపకరణమై తనయందే దృశ్యానుభవం పొందటము.

ఆ జాగ్రత్ అనుభవ జీవుడగు విశ్వుడే జాగ్రత్ వ్యవహారమంతా ఉపశమించగా, నాడీ మధ్యగా ప్రవేశించి **'తైజసత్వము'** (స్వప్నదృశ్యము) పొందుచున్నాడు కూడా!

వాసనారూపకమగు ఈ జగత్ వైచిత్ర్యమంతా, వాస్తవానికి **ఆత్మయొక్క స్వయం ప్రకాశ భాసక విశేషమే!** అయితే, ఈ జీవుడు ఏ భావనతో చూస్తే అదియే స్వయముగా ఆ రీతిగా అనుభవ రూపమగుచున్నది. (యద్భావమ్-తత్‌భవతి)

**సుషుప్తి** :చిత్తము అనేకీకరణమును త్యజించి 'ఏకీకరణము' సంతరించుకున్నప్పుడు **'సుషుప్తి అవస్థ'** సిద్ధించుచున్నది. ఒక పక్షి ఆహారము కొరకై ఎక్కడెక్కడో సంచారాలు చేసి-చేసి, సాయంకాలం చీకటి పడుచుండగా తిరిగి తాను నివసించే వృక్షముపై వ్రాలి రెక్కలు ముడుచుకొని ఇక విశ్రాంతి తీసుకుంటుంది చూచావా? అట్లాగే ఈ జీవుడు కూడా జాగ్రత్-స్వప్న ప్రపంచములో వ్యవహరించి, తిరిగి - తిరిగి, ఎంతో అలసిపోయి, అజ్ఞానము (తెలుసుకోవటమును ఉపసంహరించటము)ను ఆశ్రయించి 'స్వస్థానము'ను ఆస్వాదిస్తూ ఉండటమే 'సుషుప్తి'.

7. అకస్మాత్ ముద్గర దండా అద్యైః
తాడితవత్ భయా అజ్ఞానాభ్యామ్
ఇంద్రియ సంఘాతైః
కమ్పన్ ఇవ మృతితుల్యా మూర్ఛా భవతి।
జాగ్రత్ - స్వప్న - సుషుప్తి - మూర్ఛా
అవస్థానామ్ అన్యా, బ్రహ్మాఽఽది
స్తంభ పర్యంతమ్ సర్వం జీవ భయప్రదా,
స్థూలదేహ విసర్జినీ "మరణావస్థా" భవతి।
కర్మేంద్రియాణి, జ్ఞానేంద్రియాని, తత్ తత్
విషయాన్ ప్రాణాన్ సంహృత్య
కామకర్మాఽన్వితా, అవిద్యా భూత వేష్టితో
జీవో 'దేహన్తరమ్' ప్రాప్య, 'లోకాన్తరమ్' గచ్ఛతి।
ప్రాక్ కర్మఫలపాకేనా, ఆవర్తాంతర
కీటవత్, విశ్రాంతిం నైవ గచ్ఛతి।
సత్కర్మ పరిపాకతో, బహూనాం
జన్మనామ్ అంతే నృణాం మోక్షేచ్ఛా జాయతే।
తదా సద్గురుమ్ ఆశ్రిత్య
చిరకాలసేవయా బంధాత్ (న్)
మోక్షం కశ్చిత్ ప్రయాతి।
అవిచారకృతో బంధో,
విచారాత్ మోక్షో భవతి।
తస్మాత్ సదా విచారయేత్।
అధ్యారోపా అపవాదతః
స్వరూపం నిశ్చయా కర్తుం శక్యతే।
తస్మాత్ సదా విచారయేత్
జగత్ - జీవ - పరమాత్మనః
జీవభావ, జగత్‌భావ బాధే ప్రత్యక్ అభిన్నం
బ్రహ్మైవ అవశిష్యత ఇతి।

**మూర్ఛ** : (స్పృహ కోల్పోవడం) అకస్మాత్తుగా ఏదైనా (ఇనప కడ్డీ మొ॥వి) బలముగా తలకు తాకినప్పుడు, ఆ జీవుడు భయ-అజ్ఞానము (మతిమరపు)లకు లోనై, ఇంద్రియ సంఘాతముచే మృతితో సమానమైన కంపన పొందటమే **'మూర్ఛ'** రూపము.

**మరణము** : స్థూల దేహమును విడుచు చుండునట్టి స్థితి. జాగ్రత్-స్వప్న-సుషుప్తి-మూర్ఛల కంటే అన్యమై అనుభవమగునట్టిది. బ్రహ్మ దేవుడు మొదలుగా, ఒక స్థంభము పర్యంతము సర్వ జీవులకు భయప్రదమైనది. స్థూల దేహ విసర్జనమే మరణము.

**పునర్జన్మ** :ఈ జీవుడు వర్తమాన భౌతిక దేహము త్యజించుచున్నప్పుడు (మరణించుచున్నపుడు) కర్మేంద్రియములను, జ్ఞానేంద్రియములను, వాటివాటి వృత్తులైనటువంటి విషయములను, పంచప్రాణముల దేహాంతర్గత చలనములను ఉపసంహరించుకొని, "కామకర్మభావనలను, అజ్ఞానము (అవిద్య)"ను వెంటబెట్టుకొని, బహిష్కృతుడై, అవిద్యా-కామములచే మరొక దేహమును పొందుచూ, మరొక లోకములో ప్రవేశమానుడగుచున్నాడు.

ఈవిధంగా పూర్వకర్మ ఫలముల ప్రభావముచే సుడిగుండములో పడిన కీటకమువలె దేహ-దేహాంతరములలోనికి సుదీర్ఘ ప్రయాణములు నిర్వర్తిస్తున్నాడు. (పునరపి జననం। పునరపి మరణం।).

మరొకప్పుడు తన సత్కర్మల పరిపాకము (ఫలప్రదము) అవటముచేత, అనేక జన్మలలో సంచరిస్తున్న ఈ జీవుడు **"నాకు ఎక్కడినుండో బంధము వచ్చి పడింది. ఇప్పుడు మోక్షము ఆవశ్యకము"** - అని మోక్షేచ్ఛ పొందుచున్నాడు.

అట్టి మోక్షేచ్ఛచే అప్పుడు సద్గురువును ఆశ్రయించి, చిరకాలము గురుసేవ చేసినవాడై,.... మోక్షమును పొందుచున్నాడు.

అవిచారణచే బంధము, విచారణచే మోక్షము కలుగుచున్నాయి! అందుచేత ఓ పైజ్గలా! విజ్ఞుడైనవాడు ఎల్లప్పుడు విచారణశీలుడై ఉండాలయ్యా!

వేదాంతవేత్తలచే, వేదాంత శాస్త్రముచే **అధ్యారోప - అపవాద** సిద్ధాంతములను బుద్ధితో గ్రహించుచుండగా, స్వరూప నిశ్చలతను ఆశ్రయించి 'అహమేవ ఆత్మా!'... అను సునిశ్చయమును సంతరించుకొనుచున్నాడు.

అందుచేత ఓ పైజ్గల మహాశయా! ఈ జీవుడు జగత్తు-జీవుడు-పరమాత్మల గురించి అత్యంత శ్రద్ధ-ఆసక్తి-తెలివిలతో (బుద్ధులతో) విచారణ చేస్తూ ఉండాలి.

"ఈ జీవుని తత్త్వమేమిటి? ఈ జగత్తుయొక్క తత్త్వమేమిటి?"..... అనునవి, వాటి స్వరూప స్వభావములను ప్రత్యక్ అభిన్నముగా (బ్రహ్మముగా) ఎరుగుటచే, ఇప్పుడిక ఇదంతా సర్వదా బ్రహ్మమే అయి శేషించినదగుచున్నది.

---

## తృతీయో అధ్యాయః

1. అథ హ ఏనం పైఙ్గలః పప్రచ్ఛ
యాజ్ఞవల్క్యమ్ :
"మహావాక్యవివరణమ్ అనుబ్రూహి॥ ॥ఇతి॥
సహోవాచ యాజ్ఞవల్క్యః
తత్త్వమసి। త్వమ్ తత్ అసి।

## తృతీయ అధ్యాయము

**పైజ్గలుడు** : గురుదేవా! మహనీయా! మహాత్మా! యాజ్ఞవల్క్యా! నాపై కరుణతో ఇప్పుడు మహావాక్యములు - వాటి వివరణార్థములు విశదీకరించ ప్రార్థన!

**యాజ్ఞవల్క్యుడు : తత్ త్వమ్ అసి!** తత్ బ్రహ్మమే నీవు అయి ఉన్నావు!

**త్వమ్ తత్ అసి** నీవు బ్రహ్మమే! **త్వమ్ బ్రహ్మాఽసి** - నీ సృష్టికి కారణము నీవే!

**అహమ్ బ్రహ్మాఽస్మి** - నేను పరబ్రహ్మమునే!

**త్వమ్ బ్రహ్మాఽసి। అహమ్ బ్రహ్మాఽస్మి।**
**ఇతి అనుసంధానం కుర్యాత్।**
**తత్ర పారోక్ష్య శబళ 'సర్వజ్ఞత్వ' ఆది లక్షణో...,**
**మాయ-ఉపాధి సత్-చిత్-ఆనంద లక్షణో...,**
**జగత్ యోనిః తత్ పదవాచ్యో భవతి।**
**స ఏవా అంతఃకరణ సత్-భిన్న**
**(సమ్భిన్న) బోధో, 'అస్మత్' ప్రత్యయా**
**అవలంబనః, 'త్వమ్' పదవాచ్యో భవతి।**
**పర జీవోపాధీ మాయా-అవిద్యే విహాయ 'తత్ త్వమ్'**
**పదలక్ష్యం, ప్రత్యక్ అభిన్నం బ్రహ్మ॥**

...ఈ ఈ మహావాక్యముల మహత్తర ఉద్దేశ్యార్థనమును ఎల్లప్పుడు అనుసంధానం చేయాలి.

మొట్టమొదట పరమాత్మను ప్రథమ పురుష గా (Third Person) సర్వజ్ఞత్వ, సర్వతత్త్వ స్వరూపుడుగా, పరోక్షుడుగా 'మాయ'ను ఉపాధిగా ధరించిన ఈశ్వరునిగా, సత్-చిత్-ఆనంద స్వరూపునిగా ధ్యానిస్తూ ఉండగా - ఈ ఎదురుగా కనిపిస్తున్న జగత్తు తత్ పద-స్వంపద వాచ్యార్థమై స్ఫురించగలదు. (క్రమంగా అది 'ఉత్తమపురుష' (First Person) గా రూపుదిద్దుకొనుచున్నది)

ఆ ఈశ్వరుడే అంతఃకరణముతో కూడినవాడై "అస్మత్-నేను" అను ప్రత్యయమునకు అర్థరూపుడు అగుచున్నాడు. అవలంబనుడు అయి **త్వమ్** రూపమునకు **వాచ్యారూపుడు** అగుచున్నాడు. 'అస్మత్-త్వం' యొక్క ఆత్యంతి కార్థమే ఈశ్వర స్వరూపము! ఈశ్వరునికి సంబంధించినది 'మాయ'! జీవునికి సంబంధించినది 'అవిద్య'! ఈ **మాయా - అవిద్యలను** విడచిపెట్టినప్పుడు ఇక తత్-త్వమ్‌ల పదలక్ష్యము **ప్రత్యగభిన్నమగు బ్రహ్మమే!**

---

**2. తత్ త్వమ్ అసీతి, అహమ్ బ్రహ్మాఽస్మీతి,**
**వాక్యార్థ విచారః "శ్రవణం" భవతి।**
* **ఏకాంతేన శ్రవణాత్ అర్థానుసంధానమ్**
  **'మననమ్' భవతి।**
* **శ్రవణ - మనన నిర్విచికిత్సే అర్థే**
  **వస్తుని ఏకతాన్, అతయా**
  **చేతః స్థాపనం "నిదిధ్యాసనం" భవతి।**
* **ధ్యాతృ ధ్యానే విహాయ**
  **నివాత స్థిత దీప 'ధ్యేయే' ఏక గోచరం**
  **చిత్తం 'సమాధిః' భవతి।**
  **తదానీమ్ ఆత్మగోచరా వృత్తయః**
  **సముత్థితా 'అజ్ఞాతా' భవంతి।**
  **తాః స్మరణాత్ అనుమీయన్తే।**
  **ఇహా అనాది సంసారే సంచితాః**
  **కర్మకోటయో అనేనైవ విలయం యాంతి।**
  **తతో అభ్యాస పాటవాత్**
  **సహస్రశః సదా 'అమృతధారా' వర్షతి।**
  **తతో యోగవిత్తమాః సమాధిం ధర్మం మేఘం**
  **ప్రాహుః, వాసనాజాలే నిశ్శేషమ్ అమునా**
  **ప్రవిలాపితే, కర్మ సంచయే**
  **పుణ్య పాపే సమూలా - ఉన్మీలితే,**
  **ప్రాక్-పరోక్షమపి**

**శ్రవణము** : తత్ త్వమ్ అసి-అహమ్ బ్రహ్మాఽస్మి-ఈఈ మహా వాక్యముల అర్థవిచారణయే 'శ్రవణము' అయి ఉన్నది. ఆచార్య-శిష్యుల వ్యవహారమంతా శ్రవణమే!

**మననము** : శ్రవణము చేసిన (వినినట్టి) - బోధించుచున్నట్టి మహావాక్యార్థముల అనుసంధానము (తత్-దృష్టితో అహమ్-త్వమ్" లను సమన్వియించుకొనుచూ ఉండటము) **"మననము"** అని చెప్పబడుతోంది. ఇది అంతరంగముగా జరుగు స్వకీయ సాధన!

**నిది ధ్యాస** : శ్రవణ-మననముల అర్థమునందు సంశయ రహితముగా, నిర్విచికిత్సగా (Keeping the Analytical feature also as silent) ఏకాగ్రముగా బుద్ధిని స్థాపించటమే "నిది ధ్యాస"! నిది ధ్యాస అను అభ్యాసమునందు **(1) ఏకాగ్రత చేయువాడు**, **(2) ఏకాగ్రము చేయబడునది** - ఈ రెండు మాత్రమే శేషించి ఉంటాయి. ఆ రెండిటి ఏకత్వము సహజమై అనుభవమగుచున్నది.

**సమాధి** : ధ్యాతృ (ధ్యానము చేయు కర్త) - ధ్యానము (ధ్యానింపబడునది) ... ఈ రెండింటిని విడచి - గాలి వీచనిచోట వెలుగుచున్న దీపము వలె చిత్తము, చంచలత్వము త్యజించి ఉండటమును "సమాధి స్థితి" అని పిలుస్తున్నారు. ఏది ఎట్లున్నా ఆత్మగా చూడటం - **సమాధి**.

ఆత్మనే సర్వత్రా దర్శించు ఏకైక వృత్తిచే ఆత్మకు వేరై ఏదీ కించిత్తు కూడా తెలియబడక, సర్వము ఆత్మగా స్మరించబడుచుండు స్థితియే **సమాధి**.

అట్టి సమాధి (ధ్యాతృ-ధ్యేయ రహిత ధ్యాన స్థితి) యొక్క సమాధి అభ్యాసముచే సంసార సంబంధమైన అసంఖ్యాక కర్మ పరంపరా బంధములన్నీ నీటిలో వేసిన ఉప్పుగడ్డల వలె విలయము పొందగలవు.

సమాధి అభ్యాసముచే క్రమంగా సహస్రారము నుండి సదా అమృతధారలు వర్షించగలవు.

అందుచేతనే యోగపండితులు **"సమాధిస్థితి ఆత్మ ధర్మమును వర్షింపజేయు మేఘము వంటిది"** .... అని అభివర్ణిస్తున్నారు.

సమాధి అభ్యాసము (ద్రష్ట-దర్శన-దృశ్యములో లయింపజేసినట్టి కేవల దృక్ స్థానాభ్యాసము)చే సర్వ వాసనా జాలములు నిశ్శేషముగా నశించిపోగా, కర్మ సంచయముల సంబంధతపైన పుణ్య - పాపములు సమూలముగా

| | |
|---|---|
| **కరతల – ఆమలకవత్ వాక్యమ్**<br>**అప్రతిబద్ధా అపరోక్ష సాక్షాత్కారం ప్రసూయతే,**<br>**తదా 'జీవన్ముక్తో' భవతి।** | లయించిపోవుచున్నాయి. మహావాక్యముల (తత్త్వమ్ - సోఽహమ్ ఇత్యాదుల) ముందు వెనుకల పరోక్షార్థము, అపరోక్షార్థముగా కరతాలమలకము అగుచున్నది. ఆపై ఇక, అప్రతిబద్ధము సర్వ అనుమానాలు తొలగినట్టి స్వభావసిద్ధమగు అపరోక్షజ్ఞానము అనుభవమగుచూ, ఆతడు **'జీవన్ముక్తుడు'** అగుచున్నాడు. |
| **3. ఈశః పంచీకృత భూతానాం**<br>**"అపంచీకరణం కర్తుం" సో అకామయత।**<br>**బ్రహ్మాండం, తద్గత లోకాన్**<br>**కార్యరూపాంశ్చ కారణత్వం**<br>**ప్రాపయిత్వా తతః సూక్ష్మాంగమ్ కర్మేంద్రియాణి**<br>**ప్రాణాశ్చ జ్ఞానేంద్రియాణి,**<br>**అంతఃకరణ చతుష్టయం చ**<br>**ఏకీకృత్య, సర్వాణి భౌతికాని**<br>**కారణభూత–పంచకే సంయోజ్య**<br>**భూమిం → జలే,**<br>**జలం → వహ్నౌ,**<br>**వహ్నిం → వాయౌ,**<br>**వాయుమ్ → ఆకాశే చ,**<br>**ఆకాశమ్ → అహంకారే చ,**<br>**అహంకారమ్ → మహతి,**<br>**మహత్ → అవ్యక్తే,**<br>**అవ్యక్తం → పురుషే,**<br>**క్రమేణ విలీయతే।**<br>**విరాట్ హిరణ్యగర్భ ఈశ్వరా**<br>**ఉపాధి విలయాత్**<br>**పరమాత్మని లీయంతే।** | **అపంచీకరణము-ఉపసంహారము**<br>ఇప్పటివరకూ ఈశ్వర రచితమైనట్టి పంచీకరణ రూప జగత్ సృష్టి - స్థితుల గురించి చెప్పుకున్నాము కదా! ఇక ఇప్పుడు ఆ ఈశ్వరుడు స్వీయకృతమైన పంచీకరణమును "నేను అపంచీకరణము చేసెదను గాక!" .... అని (పిల్లవాడు ఆటలు విరమించి ఇల్లు చేరు రీతిగా).... భావించుచున్నారు. 'లయము'ను నిర్వర్తించటము గురించి చెప్పుకుందాము.<br>**కార్య** (That which produced, designed, executed) రూపములో ఉన్న బ్రహ్మాండములో అంతర్గతమైయున్న లోకములను - ఈశ్వరుడు **"కారణరూపము"**గా పొందించనారంభిస్తున్నారు. సూక్ష్మాంగములైన కర్మేంద్రియములను, ప్రాణములను, జ్ఞానేంద్రియములను, అంతఃకరణ చతుష్టయమును ఏకీకృతము (ఏకముగా, ఒక్కటిగా) చేయుచున్నారు. పంచభూతముల సంబంధమైన సర్వ దృశ్య వ్యవహారములను కారణ పంచభూతములలోనికి ఉపసంహరిస్తున్నారు. అనగా ఆత్మ రూపమగు అభేదతత్త్వముగా భావించి, లయింపజేస్తున్నారు.<br>పృథివి (భూమి)ని → జలము (ద్రవము) నందు,<br>జలమును → అగ్నియందు,<br>అగ్నిని → వాయువునందు,<br>వాయువులను → ఆకాశమునందు,<br>ఆకాశమును → అహంకారమునందు,<br>అహంకారమును → 'మహత్' యందు,<br>మహత్తును → అవ్యక్తమునందు,<br>అవ్యక్తమును → పురుషునియందు,<br>.... క్రమముగా విలీనము సలుపుచున్నాడు. విరాట్టు - హిరణ్యగర్భుడు - ఈశ్వరుడు ఈ ఉపాధులన్నీ పరమాత్మ యందు విలీనమగుచున్నాయి. |
| **4. పంచీకృత మహాభూత సంభవ**<br>**కర్మసంచిత స్థూలదేహః।**<br>**కర్మక్షయాత్ సత్కర్మ పరిపాకతో**<br>**'అపంచీకరణమ్' ప్రాప్య,**<br>**సూక్ష్మేణా ఏకీభూత్వా**<br>**కారణరూపత్వమ్ ఆసాద్య,**<br>**తత్ కారణమ్ కూటస్థే ప్రత్యగాత్మని విలీయతే।**<br>**విశ్వ తైజస ప్రాజ్ఞాః స్వస్వ – ఉపాధిలయాత్**<br>**ప్రత్యగాత్మని లీయంతే। అండం జ్ఞానాగ్నినా దగ్ధం**<br>**కారణైః సహ పరమాత్మని లీనం భవతి।** | ఈ స్థూలదేహము కర్మ సంచయము (As a sequence and consequence of acts and activities) గా సూక్ష్మత్వము సంతరించుకోవటం జరుగుతోంది. సత్ కర్మలచే కర్మక్షయము ఏర్పడుచుండగా, సత్ కర్మల పరిపాకముచే, క్రమంగా భౌతిక దేహ సంబంధమైన వేరువేరైన శబ్ద-స్పర్శ- రూప-రస-గంధాది సూక్ష్మ తత్త్వములన్నీ ఏకీభూతము (ఏకరూపము)గా రూపొందుచున్నాయి. తదనంతరము అట్టి ఏకీభూతము కారణ రూపమగు పరమాత్మయందు (తత్, ప్రత్యగాత్మ యందు) విలీనమగుచున్నాయి.<br>ఇక విశ్వుడు (జాగ్రత్ అనుభవ అభిమాని) తేజసుడు (స్వప్నానుభవ అభిమాని) ప్రాజ్ఞుడు (సుషుప్త్యానుభవ అభిమాని)... ముగ్గురు అభిమానులు తమ తమ అనుభూత-అనుభవ శరీరములను త్యజించుచు ప్రత్యగాత్మయందు విలీనము పొందుచున్నారు.<br>అండము (బ్రహ్మాండాభిమానము) జ్ఞానాగ్నియందు దగ్ధమై తన యొక్క కారణ తత్త్వముతో సహా స్వస్వరూప-పరమాత్మయందు లీనమగుచున్నది. |

**తతో బ్రాహ్మణః సమాహితో భూత్వా,**
**'తత్-త్వమ్' పదైక్యమేవ సదా కుర్యాత్।**
**తతో మేఘాఽపాయే, అంశుమాన్ ఇవ**
**ఆత్మా ఆవిర్భవతి।**

ఈ కనబడేదంతా చివరికి బ్రహ్మమునందు విలీనము అగుటయే స్వభావముగా కలిగియున్నది. కాబట్టియే బ్రహ్మతత్త్వమును ఉపాసించు బ్రాహ్మణుడు సర్వసమ దర్శనముచే సమాహితుడై, సర్వమును 'తత్-త్వమ్' అను దృష్టియందు (లేక) పదమునందు లయింపజేసినవాడై ఉంటున్నాడు. అప్పుడు- మేఘములు తొలగగానే సూర్యుడు ప్రకాశించురీతిగా, అజ్ఞానము తొలగగా, **"సర్వము సర్వదా ఆత్మయే"** అను ఆత్మ జ్ఞానము-తో కూడిన ఆత్మానుభవానందము ఆవిర్భవించగలదు.

---

**5. ధ్యాత్వా మధ్యస్థమ్ ఆత్మానం**
**కలశాంఽతర దీపవత్,**
**అంగుష్ఠమాత్రమ్ ఆత్మానమ్**
**అధూమ జ్యోతిరూపకమ్,**
**ప్రకాశయంతమ్ అంతస్థమ్**
**ధ్యాయేత్ కూటస్థమ్ అవ్యయమ్।**
**ధ్యాయన్ ఆస్తే మునిశ్చైవ చ**
**అసుప్తేః అమృతేస్తు యః**
**జీవన్ముక్తః స విజ్ఞేయః।**
**స ధన్యః! కృతకృత్యవాన్।**
**జీవన్ముక్తపదం త్యక్త్వా**
**స్వదేహే కాలసాత్ కృతే**
**విశత్య దేహముక్తత్వం**
**పవనో అస్పందతామ్ ఇవ।**
**అశబ్దమ్, అస్పర్శమ్, అరూపమ్ అవ్యయమ్**
**తథా అరసమ్, నిత్యమ్ అగంధవచ్చ యత్,**
**అనాది – అనంతమ్ (అనాద్యం తం),**
**మహతః పరమ్ ధృవమ్ తదేవ (అవ) శిష్యతి**
**అమలమ్ నిరామయమ్ ఇతి।**

ఓ పైఙ్గలా! మనమంతా సర్వదా హృదయములో పొగలేని దీపశిఖ వలె సర్వదా ప్రకాశించుచున్న అంగుష్ఠ మాత్ర పరమపురుషుడగు ఆత్మను కూటస్థముగా అవ్యయముగా ధ్యానించాలయ్యా! మనలో ప్రతి ఒక్కరియందు వెలుగుచున్న కూటస్థ ఆత్మజ్యోతియే **ధ్యేయ వస్తువు**.

ఎవ్వరైతే తనలోనే **"పొగలేని జ్యోతివలె సదా ప్రకాశించుచున్న అంతర్ కూటస్థాత్మజ్యోతి స్వరూపమే నేను, ఈ సర్వ-దృశ్య గత స్వరూపమును కూడా!"** అని నిరంతరము స్వీయాంతర్గత ఆత్మజ్యోతిని దర్శిస్తూ తదితర వ్యతిరిక్త భావనా-విషయముల పట్ల మౌనము వహించి, ధ్యానమును (ధ్యాస కలిగి ఉండటమును) జీవితాంతము మరువక చేస్తూ ఉంటారో... వారే **జీవన్ముక్తులు! సవిజ్ఞేయులు** - తెలుసుకోవలసింది తెలుసుకొన్నవారు! వారు ధన్యులు! కృతకృత్యులు!

వారు అనుక్షణికం-ఉపాసించు **ఆత్మ జ్యోతి స్వరూపము**చే జీవించి ఉన్నంత వరకు జీవన్ముక్తులై, ఇక అటు తరువాత, కాలవశాత్‌గా వచ్చిన ఈ భౌతిక దేహమును తగిన సమయంలో త్యజించుచున్నారు. గాలి స్పందన రహితమగు రీతిగా జీవన్ముక్తత్వము త్యజించి ధ్యాతృ (ధ్యానము చేయువాడు-ధ్యేయము (ఆత్మ జ్యోతి ధ్యానింపబడే విశ్వము) లను దాటివేసి, విదేహముక్తులగుచున్నారు. ధ్యాన-ధేయములు కూడా ఆత్మానుభూతియందు లయమయినట్టి విదేహముక్తుని స్థితి ఎటువంటిది?

అశబ్దము (శబ్దోచ్చారణ మౌనం వహించినట్టిది)! అస్పర్శమ్ (స్పర్శ సంబంధమైనది కాదు)! అవ్యయమ్ (వ్యయము - మార్పు చేర్పులు లేనిది)! అరసమ్ (రుచిగా చెప్పలేనిది)! అనుక్షణిక - నిత్యమ్ (త్రికాలములలో యథాతథము)! అగంధమ్ (వాసనానుభవము కాదు)! అనాదిమ్ - అనంతమ్ (ఆద్యంతములు లేనిది)! మహతః ('నేను' అను అహమ్‌కు మునుముందే ఉన్నటి మహత్ స్వరూపము)! పరమ్ (సర్వమునకు పరమై, ఆవల ఉన్నట్టిది)! ధృవమ్ (కదలికలు లేనట్టిది - సర్వము కదలుస్తూ, తాను కదలదు)! అమలమ్ (ఏ దోషము అంటనిది)! నిరామయమ్ (అద్దానియందు మరొకటేదీ లేనట్టిది)! అదింక ఆది శేష్యము! అన్నీ లయించినా కూడా అప్పటికీ శేషించియే ఉంటోంది.

---

## చతుర్థో అధ్యాయః

## చతుర్థో అధ్యాయము

**1. అథ హ పైంగలః పప్రచ్ఛ యాజ్ఞవల్క్యమ్:**
**జ్ఞానినః కిం కర్మ, కాచ స్థితి? ఇతి।**
**సహోవాచ యాజ్ఞవల్క్యః**
**అమానిత్వాది సంపన్నో**
**ముముక్షుః ఏకవింశతి (21) కులం**
**తారయతి। బ్రహ్మవిత్ మాత్రేణ**
**కులమ్ ఏకోత్తరశతం తారయతి।**
**ఆత్మానం రథినం విద్ధి। శరీరం రథమేవచ।**

**పైఙ్గలుడు:** స్వామీ! ఆత్మజ్ఞాని యొక్క కర్మలు, స్థితి ఎట్టివి?

**యాజ్ఞవల్క్యుడు :** జ్ఞాని అమానిత్వము - అదంభిత్వము - అహింస - క్షాంతి - ఇత్యాది (భగవద్గీతలో 13వ అధ్యాయంలో చెప్పిన) జ్ఞాన గుణములు స్వభావసిద్ధంగా కలిగి ఉంటాడు. అట్టి గుణ సంపన్నుడగు ముముక్షువు 21 వంశములను (తరములను) తరింపజేయుచున్నాడు. బ్రహ్మమును ఎరిగి బ్రహ్మవేత్త అగుచుండుటచే '101' వంశములను సముద్ధరిస్తున్నాడు.

ఓ పైఙ్గలా!... ఆత్మసాక్షాత్కారము గురించి దృష్టాంతపూర్వకంగా వినండి!
**జీవాత్మ** .... <u>రథికుడు</u> అని (దృష్టాంతంగా) తెలుసుకో!
**శరీరము** ..... <u>రథము</u> వంటిది.

**బుద్ధింతు సారథిం విద్ధి। మనః ప్రగ్రహమేవ చ।**
**ఇంద్రియాణి హయాని ఆహుః।**
**విషయాం తేషు గోచరాన్। జంగమాని విమానాని,**
**హృదయాని మనీషిణః। ఆత్మ ఇంద్రియమనోయుక్తం**
**భోక్తే! – ఇతి ఆహుః మహర్షయః।**
**తతో నారాయణః సాక్షాత్**
**హృదయే సుప్రతిష్ఠితః।**
**ప్రారబ్ధకర్మ పర్యంతమ్**
**మహి నిర్మోకవత్ వ్యవహరతి।**
**చంద్రవత్ చరతే దేహీ**
**స ముక్తశ్చ అనికేతనః।**
**తీర్థే శ్వపచ గృహే వా**
**తనుం విహాయ, యాతి 'కైవల్యమ్'।**
**ప్రాణాన్ అవకీర్య యాతి కైవల్యమ్।**

**బుద్ధియో** ..... ఈ శరీర రథమును నడుపుచున్న <u>సారధి.</u>
**మనస్సు** ..... గుర్రపు త్రాళ్ళు - <u>కళ్ళెము</u>
**ఇంద్రియములు** ..... శరీర రథమును లాగుచున్న <u>గుర్రములు</u>.
**ఇంద్రియ విషయములు** ..... ఆ గుర్రముల ఆహారము రూపమగు <u>పచ్చగడ్డి.</u>
**ఈ జీవుని హృదయము** ..... ఆ రథము యొక్క విమానము, ఎటువైపుకు వెళ్ళాలో...తత్ కదలిక రూపము.

**జీవాత్మ ఇంద్రియ-మనస్సులలో శరీర రథములోకూడి బుద్ధి సారధితో ఈ జీవుడు దృశ్యకల్పనా-జగత్తులో సంచరిస్తున్నాడు.....** అనునది మహర్షుల ప్రవచనము.

**ఆ సర్వాత్మకుడు అగు ఆదినారాయణుడు సర్వ హృదయవాసిగా సుప్రతిష్ఠుడై ఉన్నారు.**

ఈ జగత్తులో ఆత్మజ్ఞాని ప్రారబ్ధకర్మ శేషించి ఉన్నంత వరకు పాము కుబుసమును విడచువిధంగా సర్వము త్యజించియే ఉండి, ఈ జగత్తులో సంచారము చేస్తున్నారు.

ఏవిధంగా అయితే పూర్ణచంద్రుడు ఆకాశంలో స్వేచ్ఛగా, ఆకాశమునంతటా చల్లటి కిరణములతో నింపుతూ సంచరిస్తూ ఉంటారో.... జ్ఞాని కూడా జ్ఞాన తేజస్సుచే నిత్యముక్తుడై గృహపరిమితులు లేనివాడై ఈ దృశ్య జగత్తులో దేహమున్నంత వరకూ సంచరిస్తూ ఉంటాడు. జీవన్-మృత్యువులకు అతీతుడై ఉంటాడు.

అటుతరువాత ప్రారబ్ధానుభావనంతరము ఒక తీర్ధ స్థలంలోనో, లేక శ్వపచుని (పంచముని) ఇంట్లోనో (ఇక్కడ - అక్కడ అనే నియమము లేనివాడై), ఈ భౌతిక దేహమును త్యజించి, ప్రాణములను విశ్వప్రాణములతో ఏకం చేసి **'కైలవ్యపదము'**ను అధిరోహించుచున్నాడు.

---

2. **తం పశ్చాత్ దిక్–బలిం కుర్యాత్,**
**అథవా ఖననం చరేత్।**
**పుంసః ప్రప్రవ్రజనం ప్రోక్తం**
**నేఽత రాయ (న ఇతరాయ) కదాచన।**
**నా శౌచం, న అగ్నికార్యం చ**
**న పిండం న ఉదకక్రియా।**
**న కుర్యాత్ పార్వణాదీని**
**బ్రహ్మభూతాయ భిక్షవే।**
**దగ్ధస్య దహనం నాస్తి, పక్వస్య**
**పచనం యథా।**
**జ్ఞానాగ్ని దగ్ధ దేహస్య**
**న చ శ్రాద్ధం, న చ క్రియా।**
**యావచ్చ ఉపాధి పర్యంతం**
**తావత్ శుశ్రూషయేత్ గురుమ్।**
**గురువత్ గురుభార్యాయాం**
**తత్ పుత్రేషు చ వర్తనమ్।**
**శుద్ధమానస శుద్ధ చిద్రూపః సహిష్ణుః**
**"సోఽహమ్ అస్మి" ఇతి**
**ప్రాప్తే జ్ఞానేన, విజ్ఞానే జ్ఞేయే పరమాత్మని**

అట్టి విదేహముక్తుడగు మహాయోగి దేహము చాలించినప్పుడు, వారి భౌతిక దేహమును దిక్‌బలి (ఒక ప్రదేశములో వదలగా పురుగులు మొదలైనవి ఆహారముగా పొందురీతిగా) గాని, ఖననముగాని (పాతిబెట్టుటకు గాని) చేయబడాలి!

అట్టి సన్యాస యోగసిద్ధునికి మాత్రమే స్వేచ్ఛతో కూడిన ప్రవ్రజనము (నిత్య దేశ - లోక సంచారము) విధించబడినది. తదితరులకు కాదు! అట్టి బిక్షక సన్న్యాసికి మరణానంతరము శౌచక క్రియలు, అగ్ని కార్యములు, పిండోదకములు, శ్రాద్ధములు మొదలైన వాటితో పని ఉండదు.

పార్వాణము (పిండపూజ) మొదలైనవి కూడా బ్రహ్మభూతుడగు భిక్షువుకు ఉండవు.

జ్ఞానాగ్నితో దేహభావనయే దహించివేసియున్న వానికి దేహదహనముతో పని ఏమున్నది? ఉడికించి వండిన కూరను మరల ఉడికించవలసిన పనేమున్నది? అట్లాగే ఎవ్వరి దేహభావన మొదలంట్లా ఆత్మజ్ఞానాగ్నితో దగ్ధమైనదో, ఆతనికి ప్రేత సంస్కారములగు శ్రాద్ధము, అగ్నికార్యము, పిండప్రదానములతో పని ఉండదు.

ఓ పైజ్గల మునీ! మరొక్క ముఖ్య విషయం! ఈ భౌతిక ఉపాధి ఉన్నంత వరకు 'గురుశుశ్రూష'ను వదలనే కూడదయ్యా! కొనసాగించవలసినదే!

ఒకవేళ గురువు గృహస్థుడై ఉంటే గురు భార్యను, గురుపుత్రుని కూడా గురువు వలె సేవించాలి సుమా!

విషయములకు ఆది (వ్యుత్పత్తి) స్థానము అగు మనస్సు (శుద్ధ మనస్సు), తెలియబడే దానికి ఆవలగల చిత్ రూపము (శుద్ధచిత్)లను ఎరిగి ఓర్పు-నేర్పు గల సహిష్ణుడైన వానికి "ఆ పరతత్త్వమగు ఆత్మయే నేను"..... అను "సోఽహమ్ అస్మి" భావన స్వభావ సిద్ధమగుచున్నది.

బ్రహ్మనిష్ఠుడై **'బ్రహ్మమే నేను'** అను జ్ఞానము హృదయంతో వికశించుచుండగా,

హృది సంస్థితే దేహే, లబ్ధ
శాంతిపదం గతే
తదా ప్రభా మనో-బుద్ధిః శూన్యం భవతి।

జ్ఞేయము యొక్క అనుభవము ప్రవృద్ధమగుచున్నది. **హృదయ సంస్థితుడగు పరమాత్మను సందర్శిస్తూ పరమశాంతి పదము పొందుచున్నాడు.** మనో బుద్ధులు ఆతనిపట్ల విషయశూన్యరూపములై **'కేవలము'** అగుచున్నాయి. అదియే కైవల్యము.

---

**3.** అమృతేన తృప్తస్య
పయసా కిం ప్రయోజనమ్?
ఏవం స్వాత్మానం జ్ఞాత్వా
వేదైః ప్రయోజనం కిం భవతి?
జ్ఞానామృత తృప్త యోగినో
న కించిత్ కర్తవ్యమ్ అస్తి।
తత్ అస్తి చేత్, న స తత్త్వవిత్ భవతి।
దూరస్థోఽపి న దూరస్థః
పిండవర్జితః పిండస్థోఽపి,
ప్రత్యగాత్మా సర్వ వ్యాపీ భవతి।
హృదయం నిర్మలం కృత్వా
చింతయిత్వాఽపి అనామయమ్
"అహమేవ పరం సర్వమ్"
ఇతి పశ్యేత్ పరంసుఖమ్।
యథా జలే జలం క్షిప్తం
క్షీరం క్షీరే, ఘృతం ఘృతే,
అవిశేషో భవేత్, తద్వత్,
జీవాత్మ పరమాత్మనోః।

ఒకాయన అమృత భాండమును కలిగి ఉండి, అమృతమును రుచి చూస్తూ ఉండగా, **"అయ్యా! ఇదిగో పాలు పాయసము మీ కోసం తెచ్చాం. ఎంత రుచియో! కాస్త రుచి చూడండి!"....** అని అంటే, ఆతడు అమృతమును ఆవల పారవేసి, పాయసము కొరకై అర్రులు చాచుతాడా? లేదు కదా! అట్లాగే, స్వాత్మ స్వరూపమేమిటో, ఎట్టిదో ఎరిగి ఆస్వాదిస్తున్న 'తత్త్వానందానుభవి'కి వేద మంత్రముల - పఠనముల ప్రయోజనము - అమృతము ముందు సామాన్యమగు చెక్కెర పాయసము వంటిది అగుచున్నది.

ఆత్మ జ్ఞానామృతమును గ్రోలుచూ అత్యంత తృప్తిని పొందుచున్న యోగికి **"అయ్యా! మీరు ఈ నియమములు పాటించండి! అవి అట్లా చేయకండి!"....** అను కర్తవ్య - అకర్తవ్యములు, విధి-నిషేధములు నియమించ వీలు కాదు. ఆతనికి ఆ అవసరము లేదు. నియమ నిబంధన- నిష్ఠలపై బుద్ధిని పరిమితము చేసుకొని ధ్యాస నిలుపుచున్నవాడు తత్త్వవేత్త అగుట లేదు.

ఆతడు భౌతికంగా దేనికి ఎంతదూరంగా ఉన్నప్పటికీ, **ఆత్మత్వమునకు మాత్రం దూరముగా ఉండడు.** తానే ఆత్మగా అనుభూతమొందుచుండగా, ఆత్మకు దూరమేముంటుంది? ఆతడు ఈ మాంసపిండ శరీరములో ఉంటున్నప్పటికీ పిండ శరీర రహితుడై ఉంటాడు. జన్మించినా జన్మరహితుడు! నిర్వర్తిస్తూ కర్మ రహితుడు! యోచిస్తూ కూడా మనోహరితుడు!

సర్వమునకు వేరై,ఆత్మస్వరూపుడై, సర్వ వ్యాపిగా సర్వమును సందర్శించుచున్నాడు. హృదయమును అత్యంత నిర్మలముగా తీర్చిదిద్దుకున్నవాడై, అనామయుడు- విషయాతీతుడు - కేవల సాక్షియగు పరమాత్మనే చింతన చేస్తూ, **"ఈ సర్వముగా ప్రత్యక్షమై ఉన్నది నేనే"!** అను రూపముగా సందర్శిస్తూ పరమ సుఖమును పొందుచున్నాడయ్యా! **"ఇదంతా నేనైన నేను"**ను మధురముగా ఆస్వాదిస్తున్నాడు.

జలములో జలము పోసినప్పుడు అంతా కలిసిపోయి ఏకమగుచున్నది కదా! ఒక పాత్రలోని పాలను మరొక పెద్ద పాత్రలోని పాలలో పోస్తే ఏమౌతుంది? ఆ పాలు - ఈ పాలు కలసి ఒక పాలుగా అగుచున్నది. నేయిలో నేయి పోస్తే ఏకమగుచున్నది కదా! అట్లాగే **జ్ఞాని తన జీవాత్మత్వమును పరమాత్మత్వమునందు ఏకం చేసివేసి అద్వైత స్థితుడై, ఏక స్వరూపుడై ప్రకాశించుచున్నాడు.** ఇది నా జీవాత్మ - అది నా పరమాత్మ' అనునదేదీ ఇక రెండుగా శేషించటమే లేదు.

---

**4.** దేహే జ్ఞానేన దీపితే
బుద్ధిః అఖండాకార రూపా యదా భవతి,
తదా విద్వాన్ బ్రహ్మజ్ఞానాఽగ్నినా
కర్మబంధం నిర్దహేత్।
తతః పవిత్రం పరమేశ్వరాఖ్యమ్
అద్వైత రూపం, విమలాంబరాభమ్
యథా ఉదకే తోయమ్ అనుప్రవిష్టం,
తథా ఆత్మరూపో నిరుపాధి సంస్థితః।
ఆకాశవత్ సూక్ష్మ శరీర ఆత్మా
న దృశ్యతే వాయువత్ అంతరాత్మా।

ఓ ప్రియ మహాశయా! ఎప్పుడైతే దేహమునందు ఆత్మ జ్ఞాన దీపము ప్రకాశమానగుచున్నదో, అప్పుడిక బుద్ధి అఖండాకార రూపమును, అఖండాకారవృత్తిని సంతరించు కొనుచున్నది. ఇకప్పుడు ఆ ఆత్మజ్ఞాన విద్వాంసుడు 'బ్రహ్మజ్ఞానము' అనే అగ్నితో 'కర్మబంధములు' అనే త్రాళ్ళను దహించి మసి చేసివేస్తున్నాడు. ఇక బంధమెక్కడిది?

ఆపై ఆ బ్రహ్మవేత్త పరమ పవిత్రుడై, "అద్వైతరూపుడు, నిత్య నిర్మల స్వరూపుడు (విమలాంబరుడు)" అగు పరమేశ్వరునితో ఏకత్వము - ఐక్యము పొందుచున్నాడు. ఉదకము ఉదకములో ప్రవేశించినప్పుడు ఏకముగా అగు రీతిగా **"నాకు దేహమే లేదు. ఈ సర్వము నేనే"** అని ఎరిగి, నిరుపాధి సంస్థిత రూపమగు ఆత్మానంద స్వరూపుడగుచున్నాడు. మృత్యువే లేనివాడై 'అమృతుడు' అగుచున్నాడు.

ఆకాశము కళ్ళకు కనిపిస్తోందా? లేదు. అట్లాగే ఆత్మ కళ్ళకు కనిపించేది కాదు. వాయువు ఎట్లా కళ్ళకు కనిపించక చలనముచే అనుభవమౌతుందో, అట్లాగే అంతరాత్మ అనుభూతికి మాత్రమే సిద్ధించుచున్నది. ఆత్మ బాహ్య -

స బాహ్యమ్ - అభ్యంతర
నిశ్చలాత్మా, జ్ఞాన-ఉల్కయా
పశ్యతి చ అంతరాత్మా।
యత్ర యత్ర మృతో జ్ఞానీ
యేన వా, కేన మృత్యునా,
యథా సర్వగతమ్ వ్యోమ
తత్ర తత్ర లయం గతః।
ఘటాఽకాశమివ ఆత్మానం
విలయం వేత్తి తత్త్వతః,
స గచ్ఛతి 'నిరాలంబం'
జ్ఞానాలోకం సమన్తతః॥

అభ్యంతరములందు నిశ్చలమై (చలనము - కదలిక లేనిదై) ఉన్నది. 'ఆత్మజ్ఞానము' అనే దీపము యొక్క జ్ఞానకాంతిలో జ్ఞాని అంతరాత్మను దర్శించుచున్నాడు.

ఆత్మతత్త్వ జ్ఞానియై ఆత్మ స్వరూపుడుగా ప్రకాశించు జ్ఞానయోగి ఎక్కడెక్కడైతే దేహము త్యజించవలసిన సందర్భము ఏర్పడునో (మరణ సమయం ఆసన్నమగునో) అక్కడక్కడే సర్వగతమగు ఆకాశమువలె, సర్వగతమగు అఖండ-ఆత్మ స్వరూపమునందే **జీవాత్మత్వ లయమును** పొందుచున్నాడు.

**ఘటాకాశ మహాకాశో।** కుండ పగిలినప్పుడు కుండలోని ఆకాశము ఏమగుచున్నది? సర్వత్రా వెలయుచున్న ఆకాశముతో ఏకమగుచున్న రీతిగా, బ్రహ్మవేత్త ఇప్పుడే ఇక్కడే బ్రహ్మాకాశమునందు ఏకస్వరూప-లయము పొందుచున్నాడు. ఆత్మతత్త్వ జ్ఞాని పరమాత్మయందు తన ఆత్మను లయము చేసి ఆలంబనయొక్క ఆవస్యకత లేనట్టి **నిరాలంబ ఆత్మైక్య స్వరూపుడగుచున్నాడు.**

---

5\. తపేత్ వర్ష సహస్రాణి
ఏకపాదస్థితో నరః,
ఏతస్య ధ్యాన యోగస్య
కలాం న అర్హతి షోడశీమ్।
ఇదమ్ జ్ఞానమ్, ఇదమ్ జ్ఞేయమ్,
తత్సర్వం జ్ఞాతుమ్ ఇచ్ఛతి,
అపి వర్ష సహస్రాయుః
శాస్త్రాంతం న అధిగచ్ఛతి।
విజ్ఞేయో అక్షర తన్మాత్రో
జీవితం చ అపి చంచలమ్।
విహాయ శాస్త్ర జాలాని
యత్ సత్యం తత్ ఉపాస్యతామ్॥
అనంత కర్మ శౌచం చ
జపో యజ్ఞః తథైవ చ,
తీర్థయాత్రా అభిగమనమ్
యావత్ తత్త్వం న విందతి।
"అహం బ్రహ్మేఽతి" నియతం
మోక్ష హేతుః మహాఽత్మనామ్।
ద్వే పదే బంధ-మోక్షాయ
న మమేతి - మమేతి చ।
'మమేతి' బధ్యతే జంతుః।
'న మమేతి' విముచ్యతే॥
మనసో హి ఉన్మనీ భావే
ద్వైతం నైవ ఉపలభ్యతే।

ఒకడు వేలాది సంవత్సరములు ఒంటికాలితో తపస్సు చేసినప్పటికీ కూడా,.. ధ్యాన యోగముచే జీవ-బ్రహ్మైక్యము సిద్ధించుకొను ఆత్మయోగ స్థితికి 16వ వంతు (1/16 వంతు) కూడా సమానము - (ఆ తపస్వి యొక్క స్థితి) కాదు.

ఓ పైజ్గల ప్రియమునీశ్వరా! ఇప్పుడు మనము వివరించి చెప్పుకొనుచున్నదే జ్ఞానము! ఇదియే జ్ఞేయము కూడా! అట్టి ఈ జీవ-బ్రహ్మైక్య రూపమగు అఖండ పరబ్రహ్మము గురించిన విచారణను ప్రక్కకు పెట్టి, శాస్త్ర విశ్లేషణ విషయాలు వందల - వేల సంవత్సరాలు ప్రయత్నించినప్పటికీ "అక్షర బ్రహ్మయోగము - జీవబ్రహ్మైక్యత్వము".... గ్రహించనంత వరకూ అవన్నీ లాభం లేదు. చూడు! ఈ దేహ జీవితము అతిచంచలము కదా! **పరోక్ష జ్ఞానమునకు పరిమితమై కాలమును వృధా చేసుకోకూడదు.**

అందుచేత ఓ మునీశ్వరా! **శాస్త్రజాలమును ప్రక్కకుపెట్టి ఏది పరమసత్యమైయున్నదో అద్దానినే ఈ మానవుడు వివేకముతో ఉపాసించాలి సుమా!** స్వస్వరూపమును అఖండ-సర్వస్వరూపముతో ఏకము చేయాలి!

అంతులేకుండా కర్మలు, (మడి-దడి ఇటువంటి) స్నానాది శౌచములు, నదీ స్నానములు, జపములు, యజ్ఞములు, అనేకసార్ల తీర్థయాత్రలు చేయడం.... ఇవన్నీ కూడా తత్త్వము తెలుసుకోకుండా ఆచరిస్తే ఏమిటి లాభము? తత్త్వమును ఎరుగుటకై ప్రయత్న రూపములు అయినప్పుడు మాత్రమే ఉత్తమ ప్రయోజనము.

"నేను బ్రహ్మమునే" అని ఎరుగుట మాత్రమే,... మోక్షమునకు హేతువగుచున్నది అట్టి మార్గము (లేక) మహదాశయముచేతనే ఈ జీవుడు మహాత్ముడు కాగలడు.

ఇంతెందుకు? 'బంధము - మోక్షము' గురించి రెండు మాటలే ఉన్నాయి.

1\. నాది - నాకు సంబంధించినది .... **ఇది జీవునకు బంధమగుచున్నది.**

2\. 'నమమేతి - నాది కాదు' అనునది జీవుని **బంధవిముక్తునిగా** తీర్చిదిద్దుచున్నది. దేహముతో సహా ఈ సర్వము జగన్నాటకము మాత్రమే! నాటకములో పాత్రధారునికి సొంతమనునది ఏమున్నది? జగన్నాటకంలో జీవుని విషయము అంతే!

ఈ మనస్సు ఎక్కడికి వెళ్ళినా సరే, **"అక్కడ బ్రహ్మమే ఉన్నది! ఇక్కడి బ్రహ్మమే అక్కడ! బ్రహ్మము సర్వదా ఏకము-అఖండమే కదా!"....** అను ఉన్మనీ భావము ఆశ్రయించినప్పుడు ఇక 'ద్వైతము, అనునది ఎక్కడున్నదో చెప్పు?

| | |
|---|---|
| **యదా యాతి ఉన్మనీ భావః**<br>**తదా తత్ 'పరమమ్ పదమ్'।**<br>**యత్ర యత్ర మనోయాతి, తత్ర తత్ర పరంపదమ్।**<br>**తత్ర తత్ర పరంబ్రహ్మ సర్వత్ర సమవత్ స్థితమ్।**<br>**హన్యాత్ ముష్టిభిః ఆకాశమ్, క్షుధార్తః ఖండయేత్ తుషమ్,**<br>**'నాఽహమ్ బ్రహ్మేఽతి' జానాతి,**<br>**తస్య ముక్తిః న జాయతే।** | ఎప్పుడైతే ఈ మనస్సు ఉన్మనీ (దేనినీ ఆలోచించని కేవలీ) భావాతీత స్థితి పొందుచున్నదో, అప్పుడు పరమపదము సిద్ధించుచున్నది. ఉన్మనీ = జ్ఞానియొక్క మనస్సు ఎక్కడెక్కడికి వెళ్ళి వ్రాలుచున్నదో, అక్కడక్కడ సర్వత్ర సమవస్థితమై యున్న పరబ్రహ్మమును దర్శించటమే, (అనుభవము కావటమే) **ఉన్మనీ స్థితి.**<br>ఏవిధంగా అయినా ఆకాశమును ముష్ఠిఘాతములతో (మడిచిన గుప్పెటతో) ఖండములుగా చేయవచ్చునేమో! ఆకలిగొన్నవాడికి ఆహారం ఇవ్వకుండా కూరగాయల వర్ణనతో ఆతని ఆకలి తీర్చవచ్చునేమో! అంతేగాని "నేను జీవుడను మాత్రమే? సర్వతత్త్వ స్వరూపమగు బ్రహ్మమును నేను ఎట్లా అవుతాను''.... అను నాఽహమ్ బ్రహ్మభావన కొనసాగునంతవరకు 'ముక్తి' అనే ప్రసక్తియే ఉండదు. సాధ్యపడదు. ఈ జీవునిపట్ల బంధము, దుఃఖము, సాంసారిక ఆవేశములు తొలగవు. కొనసాగుచూనే ఉంటాయి. |
| **6. య ఏతత్ ఉపనిషదమ్ అధీతే,**<br>**...సో, అగ్నిపూతో భవతి।**<br>**... స వాయుపూతో భవతి।**<br>**.... స ఆదిత్యపూతో భవతి।**<br>**.... స బ్రాహ్మ పూతో భవతి।**<br>**.... స విష్ణుపూతో భవతి।**<br>**.... స రుద్రపూతో భవతి।**<br>**.... స సర్వేషు తీర్థేషు స్నాతో భవతి।**<br>**.... స సర్వేషు వేదేషు అధీతో భవతి।**<br>**.... స సర్వవేద వ్రత చర్యాసు చరితో భవతి।**<br>**.... తేన ఇతిహాస పురాణానాం**<br>**రుద్రాణాం శతసహస్రాణి జప్తాని ఫలాని భవంతి।**<br>**.... ప్రణవా నామయుతం జప్తం భవతి।**<br>**.... దశపూర్వాన్, దశ ఉత్తరాన్ పునాతి।**<br>**స పంక్తి పావనో భవతి। స మహాన్ భవతి।**<br>**బ్రహ్మహత్యా సురాపాన స్వర్ణస్తేయ**<br>**గురుతల్పగమన తత్సంయోగి పాతకేభ్యః పూతో భవతి।** | ఎవ్వరు ఈ ఉపనిషత్‌లో చెప్పబడుచున్న జీవబ్రహ్మైక్య పాఠ్యాంశమును ఆమూలాగ్రము శ్రద్ధగా అధ్యయనము చేస్తారో వారు అగ్నివలె, వాయువువలె, ఆదిత్యునివలె, విష్ణువువలె, రుద్రునివలె **పరమపవిత్రులగుచున్నారు.**<br>సర్వ తీర్థములలో - పవిత్రనదులలో స్నానము చేసిన పవిత్రత లభించ గలదు.<br>సర్వ వేదములు పఠించిన ప్రయోజనము సిద్ధించుచున్నది.<br>సర్వ వేద ప్రవచిత విధి - విధానములను వ్రతములను అనుసరించిన సత్ఫలములు వచ్చి చేరగలవు.<br>వేద - పురాణ - ఇతిహాసములను పఠించిన ప్రయోజనము, లక్షసార్లు 'రుద్రము'ను జపించిన సార్థకత పొందబడుచున్నది.<br>ప్రణవముతో కూడి లక్షలాది నామస్మరణను జపించిన స్థితితో సమానమగుచున్నది.<br>అట్టి జీవ-ఈశ్వర ఐక్య సిద్ధయోగి యొక్క వెనుకటి పది తరముల వారు, ముందటి పది తరముల వారు పవిత్రత సంతరించుకొనగలరు.<br>అట్టివాడు ఏ పంక్తిలో ఉంటే .... ఆ పంక్తిలోనివారు పావనులగుచున్నారు.<br>జీవ-బ్రహ్మముల ఏకత్వమును దర్శించువాడు మహానుభావుడగుచున్నాడు.<br>మహదాశయ సిద్ధి పొందినవాడై ప్రకాశిస్తున్నాడు. ఇతఃపూర్వపు మహాపాతకము లైనటువంటి బ్రహ్మహత్య, సురాపానము, బంగారము దొంగిలించడం, గురువుతో తల్పగమనము మొదలైన దోషములు ఏమైనా ఉంటే, అవి తొలగి జీవ-బ్రహ్మైక్య జ్ఞానసముపార్జితుడు, పవిత్రుడు అగుచున్నాడు. |
| **7. తద్విష్ణోః పరమం పదగ్ం**<br>**సదా పశ్యంతిసూరయః**<br>**దివీవ చక్షుః ఆతతమ్ తత్ విప్రాసో, విపన్యవో**<br>**జాగృవాంసః సమింధతే**<br>**విష్ణోః యత్ పరమం పదమ్।**<br>**ఓం సత్యమిత్యుపనిషత్**<br>**ఇతి పైఙ్గలోపనిషత్**<br>**ఓం శాంతిః శాంతిః శాంతిః** | పగటి వెలుగులో నలువైపులా సుస్పష్టమగుచున్న కంటి చూపువలె, నిత్యానిత్యవివేక పండిత్యము గల సూరులు, వేదవరేణ్యులగు విప్రులు సర్వేసర్వత్రా విష్ణుతత్త్వమునే ఎల్లప్పుడు అన్నిటా అంతటా సందర్శించుచున్నారు. అదియే విష్ణుపదము! నిదుర లేచినవాడు పరిసరములన్నీ చూచురీతిగా పరమగు విష్ణుపదమును, విష్ణుసాన్నిధ్యమును ఇక్కడే పరికిస్తూ పరమానందభరితుడై ఉంటున్నాడు.<br>జీవబ్రహ్మైకృత్వము గుర్తుచేస్తూ, అట్టి పరమసత్యమును సర్వజనులకు ఈ ఉపనిషత్ సుస్పష్టపరచుచున్నది! ఓం సత్! ఓం తత్‌సత్!<br>**ఇతి పైఙ్గలోపనిషత్**<br>**ఓం శాంతిః శాంతిః శాంతిః** |


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 10 పైఙ్గలోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



మం॥ శ్లో॥ 'పైఙ్గలోపనిషత్' వేద్యం పరమానంద విగ్రహమ్
పరితః కలయే రామం పరమాక్షర వైభవమ్ ॥

## ప్రథమ అధ్యాయము - కైవల్యపద విచారణ

**పరమానందవైభవము, పరమాక్షర వైభవము అగు ఆత్మారామతత్త్వమును పైఙ్గలోపనిషత్ సవివరించుచున్నది.**

'పైఙ్గలుడు' అనే గొప్ప తపస్వి. ఆత్మతత్త్వ జిజ్ఞాసి. మహామేధావి. ఆయన ఒకప్పుడు తత్త్వవేత్త అగు యాజ్ఞవల్క్య మహామునీశ్వరుని ఆశ్రమం ఆశ్రయించారు. గురుశుశ్రూష చేస్తూ గురుముఖతః నియమితుడై **ధ్యాన యోగ సాధన** నిర్వర్తించసాగారు. 12 సంవత్సరాలు ఆవిధంగా గడచిపోయినాయి. ఒకానొకరోజు పైఙ్గలుడు ప్రశాంతంగా సుఖాసీనుడై ఉన్న ఆచార్యవర్యులగు యాజ్ఞవల్క్య మునీంద్రుని ఏకాంతంగా సమీపించారు.

**పైఙ్గలముని** : గురువర్యా ! ఆత్మప్రజ్ఞానంద స్వరూపా ! వేదవేదాంగతత్త్వజ్ఞా ! యాజ్ఞవల్క్య సద్గురూ ! పరమరహస్యమగు **"కైవల్యము పదము"** గురించి సంభాషించమని, విశదీకరించమని మిమ్ములను శిరస్సు వంచి, వినమ్రుడనై అభ్యర్థిస్తున్నాను.

**యాజ్ఞవల్క్య మహర్షి :** ఓ సౌమ్యా ! ప్రియ పైఙ్గలా ! ఏ **"కైవల్యపదము"** గురించి మీరు తెలుసుకోవాలనుకొంటున్నారో అది సత్ (ఉనికి) చిత్ (ఎరుక) ఆనంద (అనుభూతి) లక్షణము. సర్వదృశ్య విలక్షణము అగు **స్వస్వరూప - సర్వాత్మస్వరూపమే** అది! అట్టి ఆత్మ ఇంద్రియములకు విషయముగా కనిపిస్తున్న ఈ దృశ్య వ్యవహారము రూపు దిద్దు కోవటానికి మునుముందే నిత్యసత్యమై వేంచేసి ఉన్నట్టిది. **సదేవ, సౌమ్య । ఇదమ్ అగ్ర ఆసీత్!** అందుచేత అది సనాతనము! ఈ జీవుడు తనయొక్క సహజమగు కేవలీ స్వరూపమును ఎరిగి, మమేకమవటమే **'కైవల్యము'.**

ఈ జీవుడు ఇంద్రియ జగత్తును చూస్తూ "ఈ దృశ్య జగత్తులో నేను బద్ధుడనై ఉన్నాను. మరి నాకు మోక్షము, కైవల్యము లభించేది ఎట్లా ?" ... అని మరింకేదో స్థితి లభించటానికై వెతకుచున్నాడు. ఈ జీవుడు స్వతఃగా ఆత్మస్వరూపుడే అయి ఉండగా, అతనికి అది ఎన్నడో, ఎప్పుడో ఏదోనిర్వర్తించి, తద్వారా పొందాలి - అను ప్రసక్తి ఏమున్నది? ఇప్పుడే, ఇక్కడే ఈ జీవుని సహజ-అనునిత్య చిదానంద స్వరూపమే - కైవల్యసిద్ధి రూపమగు 'ఆత్మ'!

స్వతఃగా పరాత్మకు బంధము లేదు. జగన్నాటకములో కనిపించే పరాత్మయొక్క స్వకీయ-అంశ అగు జీవాత్మ **"నాటక కల్పితపాత్ర"** వంటిది కాబట్టి, ముక్తి ఉండదు.

ఈ విధంగా ఆత్మ **'నిత్యముక్తము'**. జన్మకర్మలకు మునుముందే ఉన్నట్టిది కాబట్టి **'అక్రియము'**. నాటకంలో నటిస్తున్నవాడు పాత్రగా... అయిపోతున్నాడా? లేదే! పాత్రగా అతని నటనాచాతుర్యము మాత్రమే కనిపస్తోంది. అంతవరకే ! అట్లాగే ఆత్మ దృశ్య విషయం కాదు!

ఆత్మకు రూపమే లేదు. కదల్చబడే దేహమునకు రూపమున్నదిగాని, **కదిల్చేవానికి రూపమేమున్నది?**

అది కేవలము-సత్య (యత్ - సత్ = ఉనికి) - జ్ఞాన (కేవలమగు ఎరుక) - స్వయమ్ ఆనందమయము. ఆత్మను మరొకటేదో లభించే అగత్యమేమీ లేదు. తనకు తానే పరిపూర్ణము (It is complete by itself). సర్వమునకు మునుముందే ఉండి ఉన్నట్టి ఆత్మ తదితరమంతటినీ చేతనము చేయుచున్నది కాబట్టి **చైతన్యస్వరూపము**. సర్వమునకు మునుముందే ఉన్నది కాబట్టి **'సనాతనము'**. ఆత్మ సర్వదా ఏకమేగాని అనేకము కాదు. భిన్నత్వములో ఏకరూపమై ఉన్నట్టిది. అద్దానికి ద్వితీయమైనదంటూ ఏదీ లేదు. కనుక **'అద్వితీయము'**. సృష్టికంటే **మహత్తరమైనది**. తనయందు సృష్టిని **కల్పనా దృష్టిచే కలిగి ఉన్నట్టిది**. కనుక **మహత్తరము! బ్రహ్మము! పరబ్రహ్మము!**

**జగత్‌దృశ్యము :** ఆత్మయందు ఈ జగత్తు ఏ విధంగా ఏర్పడి ఉన్నదో... విను.

**మరు:** మరుభూమిలో (యడారి-యండమావులలో) నీరు ఉన్నట్లు అగుపిస్తుంది. యండాకాలంలో మృగములు, "అందులో నీరు కనబడుతోంది కదా । వెళ్ళి త్రాగివద్దాము"... అని పరుగులు తీయసాగుతాయి. అక్కడ నీరు ఏమీ లేకపోగా... అల్లంత ఆవల దూరంలో ఉన్నట్లు మరల భ్రమ కొల్పుతూ ఉంటుంది. అందుకే **'మృగతృష్ణ'** అంటారు. మృగతృష్ణ కనబడుచున్నప్పటికీ, దగ్గరకి వెళ్ళి చూస్తే జలము ఉండదు కదా! వాస్తవానికి ఆత్మయందు 'జగత్తు' అనబడునది లేదు. కానీ కనిపించటము జరుగుతోంది. విచారణ చేసినప్పుడు **'ఆత్మ అద్వితీయమైయుండగా, ఆత్మకు వేరుగా జగత్ దృశ్యమెక్కడిది?'**... అను **పరమార్ధము** శేషించగలదు.

**శుక్తికా :** ఒకాయన నది ఒడ్డున ఇసుకలో నడిచి వస్తూ ఉంటే ముత్యపు చిప్పలు కొన్ని సూర్యకాంతికి మెరమెర మెరుస్తూ కనిపించాయి. **"ఆహాఁ ! ఈనాడు సుదినము. లక్ష్మీకటాక్షము కాబోలు ! వెండి లభించింది ! ఏమి ఆనందము !"** ... అని తలచి ఏరి ఏరి జేబులలో నింపుకొని ఇంటికి తెచ్చి భార్యను పిలచి **'ఏమేఁ ! సంపాదన లేదని రోజూ అంటున్నావు కదా ! ఇదిగో వెండి తెచ్చాను. నీవు ఇక లక్షాధికారివే ! ఇక మాటలాడకు !"**.. అని పలికాడు. భార్య అన్నిటినీ పరిశీలించి **"ఏం మాట్లాడుతున్నారు? ఇవన్నీ వెండిలా మెరుస్తున్న ముత్యపు చిప్పలు మాత్రమే !"**... అని గదమాయించింది. ముత్యపు చిప్పలు వెండి కాకపోయినా, ఆ పెద్ద మనిషిని భ్రమింపజేసినట్లు... ఈ జగత్తు ఆత్మ స్వరూపమే అయి కూడా, అనేక విషయ - వస్తు - సంగతి - సందర్భముల దృష్ట్యా వేరువేరువలె (అనాత్మ దృష్టికి) అనిపిస్తోంది. ఆత్మదృష్టిచే ఇదంతా **స్వస్వరూపాత్మయే!**

**స్థాణు :** ఒకడు చీకట్లో నడచివస్తూ, నిట్టనిలువుగా బాటకు ప్రక్కన నిలచి ఉన్న శిలను చూచి (లేక, మోడువారిన చెట్టును చూచి), "ఇక్కడ ఎవ్వరో దారిదోపిడి దొంగ ఉన్నట్లున్నాడే! ఏం చేద్దాంరా బాబు?"... అని అనుకొన్న రీతిగా..., ఈ జగత్ దర్శనమంతా "శిలాస్వరూపమును, మోడువారిన చెట్టును (దొంగేమో అనే అనుమానంతో) చూచే బాటసారియొక్క భ్రమ - అనుభవము" వంటిది. భ్రమచే అపరిశీలనాత్మక దృష్టికి అనేక బంధములు, సంబంధములతో కూడిన వ్యవహారపరంపరలు అనుభవమగుచున్నాయి.

**స్ఫటిక :** స్ఫటికమునందు కాంతి పుంజముల గీతలు, జలబిందువులు, పురుషాకారములు అద్దాని లోపలగా ఉన్నట్లు కనిపిస్తూ ఉంటాయి. వాస్తవానికి స్ఫటికమంతా ఘనీభూతమైనట్టిదే గాని లోపల కాంతి గీతలు మొ॥వి ఉంటాయా? ఉండవు. ఈ ఎదురుగా ఉన్నదంతా ఘనీభూత స్వస్వరూప పరబ్రహ్మమే అయి ఉండగా... జన్మ - జరా - మృత్యువులతోను 14 లోకముల విశేషములతోను నిండినదై ఉన్నట్లు (స్ఫటికములో కాంతి పరావర్తనచే భ్రమగా అంతరమున కాంతి పుంజ గీతలు గోళములు - పురుషాకారములు కనిపిస్తున్న తీరుగా) కనిపిస్తోంది. అనిపిస్తోంది. దృష్టి జ్ఞానమయమైతేనో అవన్నీ "లేనివే" అగుచున్నాయి.

ఈ విధంగా మనో కల్పనా రూపమగు సుదీర్ఘమైన సందర్శనముచే (1) ఆత్మను అనేకముగా చూచు స్వభావము (ప్రకృతి) గురించి, (2) ఆ సందర్శిస్తున్న ద్రష్టయొక్క స్వయమాత్మతత్త్వము (స్వరూపము) గురించి, (3) జీవ - బ్రహ్మ ఏకరూపము గురించి- **ఆత్మ తత్త్వవేత్తల ప్రవచనసార విశేషాలు** కొన్ని ఇప్పుడు మనము చెప్పుకుందాము.

**మూల ప్రకృతి :** సత్ స్వరూపమగు ఆత్మకు **"స్వయం కల్పిత రూపము" "ఆత్మకు అభిన్నరూపము"** అయినట్టిది అయి... **'ఇట్టిది'** అని పదప్రయోగముచే నిర్వచించి చెప్పజాలనట్టిదగు కారణంగా - అనిర్వచనీయము అగు 'మూల ప్రకృతి' బయల్వెడలుచున్నది. అట్టి ప్రకృతి (ప్ర+కృ+తి) '3' గుణములతో త్రిగుణాత్మకరూపమై - లోహిత-శుక్ల-కృష్ణ... (ఎరుపు - తెలుపు - నలుపుల సంజ్ఞగా రజో- సత్వ-తమో గణ రూపమై) ప్రదర్శనమగుచున్నది. ఏ పరబ్రహ్మమునుండి మూలప్రకృతి (The sense of External quality) - **'నా నుండి వేరైన నేను'** రూపముగా బయల్వెడలుచున్నదో... అట్టి పరబ్రహ్మమే ఇదంతా ! జలములో సూర్యబింబ ప్రతి బింబమువలె - ఆ మూల ప్రకృతి యందు ఆత్మయే త్రిగుణ రూపముగా ప్రతిబింబితమగుచున్నది. **తత్ ప్రతిబింబతమ్ యత్, తత్ సాక్షి చైతన్యమ్ ఆసీత్ ।** తత్ పరమాత్మ - ఒకవైపుగా స్వకీయమే అయినట్టి ప్రకృతి యందు ప్రతిబింబిస్తూనే, మరొకవైపు నుండి **సాక్షి చైతన్యముగా** ఉండి, ప్రకృతిని **చైతన్య పరచుచున్నారు.**

**వికృతి :** ఆ మూలప్రకృతియే వికృతి రూపమై వికారములు పొందుచున్నది. తన యొక్క 'సత్వగుణము నుండి ఉద్రిక్తత (Inclination, Inspiration) పొందుచున్నది. **సా పునః వికృతిం ప్రాప్య, సత్వోద్రిక్తా అవ్యక్తా ఆఖ్యా ఆవరణశక్తిః ఆశీత్ ।** వ్యక్తీకరణము అనే క్రియను ప్రదర్శించు అవ్యక్తరూపమై, 'ఆవరణ శక్తి'గా రూపము (మూలప్రకృతి) పొందుచున్నది.

**'ఆవరణ శక్తి' - ఈశ్వర చైతన్యము:** తన యొక్క ఆవరణ శక్తియందు ఆత్మయే ప్రతిబింబిస్తూ 'ఈశ్వర చైతన్యము'గా వెలయుచున్నది.

**పైఙ్గలుడు :** కేవల అఖండ అప్రమేయ స్వరూపమగు ఆత్మ నుండి ప్రకృతి, ప్రకృతి నుండి వికృతి, వికృతి రూప అవ్యక్తము నుండి ఆవరణ శక్తి, ఆవరణ శక్తి నుండి ఈశ్వర శక్తి యొక్క చేతనత్వము (ఆత్మయొక్క స్వకీయ కల్పనచే) మృగతృష్ణలో నీరు వలె, చీకటిలోని స్థంభమును దొంగగా చూచిన విధంగా, జలములో ప్రతిబింబమువలెను, దర్పణంలో ప్రతిబింబమువలె బయల్వెడలుతోందని మీరు చెప్పిన దానిని బట్టి గ్రహించుచున్నాను. స్వామీ ! 'ఈశ్వరుడు – అని ఎద్దానిని అంటున్నారో...వివరించప్రార్థన.

## ఈశ్వరుడు

**యాజ్ఞవల్క్యుడు:** భౌతిక దేహమును తన ఉపకరణముగా కలవానిని (As an enstrustment) 'జీవుడు' అంటున్నాము. అజ్ఞానము ఈతని ఉపాధి. అట్లాగే 'మాయ'ను తన ఉపాధిగా కలవానిని (ఆధ్యాత్మ శాస్త్రములో) **'ఈశ్వరుడు'** అని పిలుస్తున్నారు. ఈతడు 'దేహముల ముందు స్థితి, దేహముల యొక్క రాక – దేహములతో జీవితము – దేహము యొక్క శిధిలము, పోక – దేహముతో తన స్థితి"... ఇవన్నిటినీ తన మాయా శక్తిచే ఎరిగి ఉన్నవాడు కాబట్టి **'సర్వజ్ఞుడు'** అని అంటారు. ప్రతిదేహిలో **జీవ – ఈశ్వరుల** సమాగమము ఏర్పడియే ఉన్నది (జీవుడు జీవితాంతార్గత విషయములకు పరిమితుడై ఉండటం చేత కించిజ్ఞుడు (కొంత మాత్రమే తన ఎరుకయందు కలిగి ఉన్నవాడు)" అని అంటూ ఉంటారు.

ఈశ్వరుడు ఆ విధంగా **"స స్వాధీన మాయః సర్వజ్ఞః।"** మాయను స్వఅధీనమునందు కలవాడు. దేహ దేహాంతరములు తెలిసియున్న సర్వజ్ఞుడు. ఇంకా కూడా **"సృష్టి - స్థితి - లయానాం ఆదికర్తా"** అని కూడా చెప్పబడుచున్నాడు. సృష్టికి ముందే ఉండి, సృష్టిని కల్పించుకొని, కొనసాగించుకొని, మరొకప్పుడు తనయందు లయం చేసుకొని ..., ఆ తరువాత కూడా శేషించి ఉంటున్నవాడు 'ఈశ్వరుడు'. ఆ ఈశ్వరుడు జగత్తుకు అంకుర (విత్తనములోని ఉత్తరోత్తర ఉత్పత్తి శక్తి వంటి) రూపుడు.

దృష్టాంతానికి....,

- అనేక నాటకములలో నటించు కళాకారుడు **"ఈశ్వరుడు"**. నటించుకళ తనదై, తాను వేరుగా ఉన్నవాడు **"పరమాత్మ"!**
- ఒక నాటకములోని అతని పాత్ర "జీవాత్మ"! పరమాత్మ యొక్క తేజో రూపుడగు ఈశ్వరుడు జగత్తును సృష్టించి, కొనసాగించి లయం చేసుకొనుచున్నవాడు, ఆ తదుపరి మరల జగత్ భావనచే జగత్తులను పునః ఆవిర్భవింపజేయుచున్నాడు (అదియే పునరావిర్భావము, పునఃసృష్టి)

ప్రతి ఒక్కరియందు ఈ 1. జీవిత్వము 2. ఈశ్వరత్వము 3. పరమాత్మత్వము ప్రవర్తమానములై ఉన్నాయి.

**ఈశ్వరుడు – ప్రాణి కర్మవశాత్ ఏష పటో యద్వత్ ప్రసారితః, ప్రాణికర్మ క్షయాత్ పునః తిరోభావయతి ।** – సర్వప్రాణులకు సంబంధించిన స్వీయవాసన–కర్మలను అనుసరించి ఈ జగత్తును **'ఇంద్రియ విషయ ప్రపంచము'**గా ప్రసరింపజేస్తున్నారు. విస్తరింపజేస్తున్నారు. మరొక్కప్పుడు ఆయా ప్రాణుల సంబంధితమైన తన యొక్క సంస్కారరూప కార్యవ్యవహారములను సంక్షయింపజేసి... ఉపసంహరించుకొనుచున్నారు. అనగా, తన నుండి బయల్వెడలిన అనేకత్వరూపమగు వివిధ ప్రాణులను తనయందే తిరోధానము (Withdraw) నిర్వర్తించుచున్నారు. ఒకామె క్రొత్త జరీ చీరను ధరించి, ఆతరువాత మడతపెట్టి లోన దాచి, మరింకెప్పుడో మరల మడత విప్పి ధరిస్తూ ఉంటుంది చూచారా ? ఆ విధంగా ఈశ్వరుడు అనేక జీవుల భావనను జగత్ – ప్రదర్శనరూపంగా ధరించి, మరల తనయందు లయింపజేసి, మరింకెప్పుడో పునఃగా ఆవిర్భావము చేయుచున్నారు. ఈ విధంగా **తస్మిన్ ఏవ అఖిలమ్ విశ్వమ్ సంకోచిత పటవత్ వర్తతే ।** ఉపసంహారణ తరువాత ఈ విశ్వమంతా కూడా మడిచిదాచిన వస్త్రమువలె ఈశ్వరునియందే దాచి ఉంచినదగుచున్నది. ఇదంతా ఆత్మయొక్క లీలా – క్రీడా విశేషమే । అందుచేత **"ఇదంతా ఈశ్వరసంకల్పమే"** అని మాయ – జగత్తుల గురించి సిద్ధాంతీకరించబడుచున్నది.

**మహత్ - విక్షేపశక్తి :** ఈశ్వరునిచే అధిష్ఠితమై (స్వకీయమై ప్రదర్శితమగు) ఆవరణ శక్తితో ... ఆ ఈశ్వరుడు రజోగుణ రూపమగు (Inclination to do activity) ఉద్రిక్తత (Exhibition of Inquisitiveness and enthusiasm) పొందటమును – **'మహత్‌చే నిర్మితమగు విక్షేపశక్తి"** గా చెప్పబడుచున్నది.

**హిరణ్య గర్భ చైతన్యము:** ఈశ్వరుడు దృశ్య జగత్ విషయపరంపరలందు, జగత్ దృశ్యమునందు ప్రతిబింబించు చమత్కారమే ఈ బ్రహ్మాండ ప్రదర్శనము! **తత్ ప్రతిబింబితమ్ యత్, తత్ 'హిరణ్యగర్భ చైతన్యమ్' ఆసీత్ ।** ఈశ్వరునిచే విషయములందు ప్రదర్శించబడుచున్న నిజచైతన్య శక్తియే **"హిరణ్య గర్భ చైతన్యము".** అట్టి చైతన్యాభిమానియే **"హిరణ్యగర్భుడు".** ఈ సృష్టికి కర్తృ చైతన్య స్వరూపుడుగా (సృష్టికర్తృ అభిమానిగా) మహత్ తత్త్వుడై ప్రతిబింబిస్తున్నది **పరబ్రహ్మమే! హిరణ్యగర్భుడు!** అట్టి సృష్టి అభిమాని..., **సుస్పష్టుడు, అస్పష్టుడు** కూడా!

– **సుస్పష్టుడు** (ఎదురుగా అనేక జనన – వృద్ధి – వినాశన రూపములుగా కనిపిస్తోంది కాబట్టి)!

– **అస్పష్టుడు** (అతడు వ్యక్తివంటివాడు కాదు). సర్వాధారుడు. 'నేను' అనునది అరూపమే కదా!

ఈ విధంగా సుస్పష్ట – అస్పష్ట శరీరము కలవాడగుచున్నాడు.

**అహంకారము :** హిరణ్యగర్భునిచే (సృష్టికర్తచే) అధిష్ఠితమైయున్న... మహత్ స్వరూపము యొక్క విక్షేప శక్తి (Distration Presentment) యే 'అహంకారము'. **(తత్) హిరణ్యగర్భ అధిష్ఠిత విక్షేపశక్తి, తత్ తమో ఉద్రిక్తా 'అహంకార' అభిధా స్థూలశక్తిః ఆసీత్।** సృష్టికర్త యొక్క తమోగుణ ఉద్రిక్త సంబంధమైన విక్షేపశక్తి (The Energy of Distraction) యే ఈ అహంకారము–అనే స్థూలశక్తిని జనింపజేస్తోంది.

**విరాట్ (Universal) :** 'అహంకారము' అనే జలమునందు ప్రతిబింబిస్తున్న పరమాత్మయే (లేక) పరబ్రహ్మమే **"విరాట్ పురుషాభిమాని"** గాను **విశ్వరూప చైతన్యముగాను** విరాజిల్లుచున్నారు.

**విష్ణువు - ఆది పురుషుడు :** విష్ణువు = అంతటా అంతర్లీనమై వేంచేసి, ఉండి అంతయు తానే అయి ఉన్న **చైతన్యస్వరూపుడు.**

ఆ విరాట్ అభిమాని సర్వత్రా వెలయుచు, సర్వస్థూల దేహములకు ఉనికిని కల్పించువారై, సర్వ దేహములను పరిపాలించుచున్నారు. అట్టి పరిపాలనా దక్షత యందు కూడా పరబ్రహ్మమే ప్రతిబింబించుచున్నది. పరబ్రహ్మ చైతన్యము 'విష్ణుభగవానుడు'గా అభివర్ణితము అగుచున్నది.

అట్టి ఆదిస్వరూప పరమాత్మ వైభవ ప్రతిభయగు విష్ణు భగవానుని నుండి **ఆకాశము** (Space) మొట్టమొదటగా ఆవిర్భవించుచున్నది.

> **అత్మాత్ – ఆకాశమ్** (ఉనికి నుండి చోటు)!
> ఆకాశమునుండి – **వాయువు** (చలనము)!
> వాయువు నుండి – **అగ్ని** (ఉష్ణము, తేజస్సు).
> అగ్ని నుండి – **ఆపః** (జ్వలనము – జలము – ప్రవహించటము)
> అభ్యః (జలము) నుండి – **పృధివి** (స్థూలము).
> అట్టి పంచభూతముల నుండి సూక్ష్మ పంచతన్మాత్రలు త్రిగుణములు (శబ్ద–స్పర్శ–రూప–రస–గంధముల సూక్ష్మరూపములు), ప్రకటితమగుచున్నాయి.

**పైఙ్గలుడు :** గురుదేవా ! అసలీ చిత్రవిచిత్ర సృష్టికంతటికీ మూల కారణమేమిటి ?

**యాజ్ఞవల్క్యుడు :** కేవలాత్మస్వరూపుడు, ఆది స్వరూపుడు, పురాణపురుషుడు, ఆత్మానంద స్వభావుడు అగు ఆది **మహావిష్ణువు** అనిర్వచనీయ కారణం చేత **"సృష్టికామోఽహమస్మి"** ... అనురూపంగా **"నేను సృష్టిని కల్పించుకొనెదనుగాక"** అనే **స్రష్టకామము** కలవాడయ్యారు. జగత్ కల్పనాచమత్కారము కొరకై "తమోగుణము' ను అధిష్టించారు. అప్పుడిక జగత్కర్తగా అయ్యారు.

తన యొక్క "దివ్య–భావనా–ప్రభాకాంతి పుంజములు" – అనతగు శబ్ద – స్పర్శ – రూప – రస – గంధములనబడే సూక్ష్మ తన్మాత్రలను **"వీటిని స్థూల రూపముగా చేసెదనుగాక"**... అని ఆ పురాణపురుషుడు సంకల్పించసాగుచున్నారు.

**సృష్టిక్రమము :** అట్టి సూక్ష్మతన్మాత్రల లీలా ప్రదర్శన – ఆస్వాదనల కొరకై 1. మొట్టమొదటగా స్థలము (Place) 2. చలనము 3. తేజస్సు 4. ద్రవము 5. స్థూలము అనబడే తన స్థూల పంచ మహాభూత కళావిశేషములను **"నేను స్థూలము చేసెదనుగాక ।"**... అని భావించారు. 'సృష్టి'కి ఎంతవరకు అవసరమో, అంతంతవరకు సూక్ష్మ పంచభూతముల సంమిశ్రములను ప్రారంభించసాగారు. పరమాత్మ మొట్టమొదటయే ఉండి, భావనలను స్వీకరించువారగుటచే "భావనారాయణుడు, ఆది నారాయణుడు" అనికూడా పౌరాణికులగు తత్త్వవేత్తలు పిలుస్తున్నారు.

## పంచ సూక్ష్మపంచమహా భూతముల "పంచీకరణము"

5 పంచమహాభూతములలో (ఆకాశ–వాయు–అగ్ని–జల–భూతత్త్వముల మునుముందటి వాటివాటి సూక్ష్మశక్తి రూపములలో) ఒక్కొక్కటిని రెండు రెండు 5 X 2=10 గా విభజించబడసాగాయి.

- (1) 1/2 – (2) 1/2 సూక్ష్మ పంచభూతముల ప్రతి ఒక్కటిలో మొదటి అర్థ భాగమును అట్లాగే యథాతథంగా ఉంచి ...,
- రెండవ అర్థ భాగమును మరల '4'గా విభజించి... (2nd 1/2 '4' భాగములుగా) ఏర్పరచి,
- "4'గా విభజించిన సూక్ష్మ భూతముల ద్వితీయార్థ భాగములను

1) ఆకాశ ప్రథమార్థ భాగము + మిగిలిన నాలుగు **పంచ సూక్ష్మ భూతముల** ద్వితీయార్థభాగములోని 1/4 వంతు విభాగములు.

2) వాయు ప్రథమార్థభాగము + మిగిలిన నాలుగు **పంచ సూక్ష్మ భూతముల** ద్వితియార్థ భాగములోని 1/4 వంతు విభాగములు.

3) అగ్ని ప్రథమార్థ భాగము + మిగిలిన నాలుగు **పంచ సూక్ష్మ భూతముల** ద్వితియార్థ భాగములోని 1/4 వంతు విభాగములు.

4) జలము యొక్క ప్రథమార్థ భాగము + మిగిలిన నాలుగు **పంచ సూక్ష్మ భూతముల** ద్వితియార్థ భాగములోని 1/4 వంతు విభాగములు.

5) పృథివి యొక్క ప్రథమార్థము + మిగిలిన నాలుగు **పంచ సూక్ష్మ భూతముల** ద్వితియార్థ భాగములోని 1/4 వంతు విభాగములు.

ఈ విధంగా పంచ మహాభూతములలో ప్రతి ఒక్క భూతము, పంచీకరణము. (భూతము యొక్క ప్రథమార్థము + మిగతా పంచ భూతములలో ద్వితీయార్థభాగములోని నాలుగు నాలుగువంతులు) చేత మహా విష్ణువు సృష్టిని కల్పిస్తున్నారు. చైతన్య స్వరూపుడు కల్పనామయుడు అగుటచే – 'మాయావి' అని చెప్పబడుచున్నారు. ఈవిధంగా సూక్ష్మమహాభూతముల '2' విభాగములు, ప్రథమార్థ + పావుపావు (1/4) ద్వితీయార్థముల పంచీకరణము నుండి...,

- అనంతకోటి బ్రహ్మాండములను,
- అట్టి ప్రతి ఒక్క బ్రహ్మాండకోశములో '14' లోకాలను,
- ఆయా లోకాలలో నివశించటానికి అనుకూలమగు అసంఖ్యాక సానుకూల్య పరిస్థితులను,
- నివాస సమార్థ్యముతో రూపు దిద్దుకొను సానుకూల్యక గోళక స్థూలదేహములను, వాటికవసరమగు ఆహారాదులను,
- అసంఖ్యాక జీవరాసులు, వారి వారి జీవిత విధానములు, జనన – జీవన – మరణ – పునర్జన్మ – విధి విధానములు–మొ॥వన్నీ బయల్వెడలుచున్నాయి.

ఇవన్నీ మహావిష్ణువు యొక్క స్రష్టకామము (లీలా రూప క్రీడలో కోరుకొను వినోదము) వంటివి. ఈ విధంగా ఈశ్వరుని ఇచ్ఛ (ఈశ్వరేచ్ఛ)గా ఇక్కడ కనబడుచున్నవన్నీ సృష్టించబడుచున్నాయి. (Being created out of playful inclination of Al-Pervading Divinity).

**ప్రాణ సృష్టి :**

**స పంచభూతనాం రజో - అంశాంశ్చ - చతుర్ధా కృత్వా, భాగత్రయాత్ - పంచవృత్యాత్మకమ్ 'ప్రాణమ్' అసృజత్ ।**

ఇంకా ఆ ఈశ్వరుడు – సూక్ష్మ పంచభూతములలోని **రజో అంశ** + తదితర '4' భూతములలోని '4' రెండవ విభాగములు కలిపి 'పంచీకరణ' చేస్తున్నారు. అట్టి రజో పంచకమును '4' విభాగములుగాచేసి అందులో మొదటి మూడు విభాగములను కలిపి – పంచవృత్యాత్మకమైన (Five - Avocation Faceted) 'ప్రాణము'ను సృజించుచున్నారు.

**పంచ వృత్యాత్మక ప్రాణములు - ప్రాణ - అపాన - వ్యాన - ఉదాన - సమానములు.**

**పంచకర్మేంద్రియ సృష్టి :** సూక్ష్మ పంచభూతముల రజో అంశ మిశ్రమము యొక్క 3 భాగముల నుండి పంచవృత్యాత్మకమైన ప్రాణశక్తి (విశ్వప్రాణము) ఈశ్వరునిచే సృజించబడిందని చెప్పుకున్నాము కదా ! ఇక, ఆపై ఆ రజోంశ యొక్క **నాలుగవ భాగము** నుండి **కర్మేంద్రియ పంచకము** ఈశ్వరునిచే సృజించబడుతోంది.

**కర్మేంద్రియములు :** (1) వాక్కు 2) కాళ్ళు 3) చేతులు 4) పాయువు 4) ఉపస్థ

**అన్తఃకరణ సృష్టి :** అటు తరువాత ఈశ్వరుడు... సూక్ష్మ పంచభూతములలోని 'సత్వాంశ'ను స్వీకరించి '4' భాగములుగా చేస్తున్నారు. అట్టి నాలుగు భాగములలోని '3' భాగముల నుండి పంచ వృత్యాత్మకమగు **'అంతఃకరణము'** ను సృష్టి చేస్తున్నారు.

**అంతఃకరణ పంచవృత్యాత్మకములు:** 1) మనస్సు 2) బుద్ధి 3) చిత్తము 4) అహంకారము 5) ఈ నాలుగు వ్యక్తీకరించు అవ్యక్తము.

**పంచ జ్ఞానేంద్రియ సృష్టి :** అట్టి (పైన చెప్పుకొన్న) 'సత్వాంశ' యొక్క తురీయ భాగము (4వ భాగము) నుండి ఈశ్వరునిచే **పంచజ్ఞానేంద్రియములు** సృష్టించబడుచున్నాయి.

**పంచజ్ఞానేంద్రియములు :** చర్మము, కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు.

**ఇంద్రియ పాలకులు :** ఈ విధంగా కర్మేంద్రియములను జ్ఞానేంద్రియాలను సృష్టించిన తరువాత ఈశ్వరుడు ఇట్లా భావించారు.

"వీటన్నిటినీ దేహములలో పనిచేయించటానికి ఆహారరసము మొ॥వి పొందటానికి, సామర్థ్యములు కొనసాగటానికి వీటిని దేహములలో ప్రవేశింపజేస్తూ పరిపోషిస్తూ – ఉపసంహరిస్తూ ఉండటానికి పర్యవేక్షణ కావాలి! అటువంటి– పర్యవేక్షించగల – **"దివ్యప్రజ్ఞ"**ల అవస్యకత ఉన్నది.

వెనువెంటనే ఆదిస్వరూపనారాయణుడు దివ్యశక్తులతో కూడిన అశరీర – దివ్య ప్రజ్ఞాసమన్వితులగు దేవతలను సృష్టించారు. **సత్వసమష్టిత ఇంద్రియ పాలకాన్ అసృజత్ ।** ఈ విధంగా సత్వగుణమునుండి ఇంద్రుడు – వరుణుడు – వాయువు – చంద్రుడు ఇత్యాది సమష్టి ఇంద్రియ పాలకులు (దేవతలు) సృష్టిలో ఈశ్వర సంకల్పముచే ఆవిర్భవించారు. అట్లు జనించిన ఇంద్రియ పాలకులగు దేవతలను తమ తమ ధర్మముల నిర్వహణకై ఈశ్వరుడు వారిని – **తాని సృష్టాని అణ్డే ప్రాచిక్షిపత్ ।** – (సృష్టి కార్యక్రమము కొరకై) బ్రహ్మాండములలో ప్రవేశింపజేశారు. ఈ విధంగా పంచకర్మేంద్రియములు, పంచజ్ఞానేంద్రియములు, పంచప్రాణములు, పంచ అంతరంగతత్త్వములు,... వాటినన్నిటినీ పర్యవేక్షిస్తూ పరిపాలించు దివ్య శక్తి సంపన్నులగు దేహతాప్రజ్ఞలు... ఇవన్నీ బ్రహ్మాండములలో ప్రవేశించి, అంతటా వ్యాపించినవైనాయి.

**సమష్ఠి స్థూలరూప విరాట్ :** ఇంకనూ ఈశ్వరాజ్ఞానుసారముగా అనేక విధములైన స్థూలాకారములు – దైవీ శక్తుల ప్రదర్శన – సానుకూల్యత – ఇంద్రియముల కార్యనిర్వహణల కొరకై – 'విరాట్' రూపముగా (In the form of Macro Appearence of matter) బ్రహ్మాండమునందు రూపుదిద్దుకున్నాయి. బ్రహ్మాండములోని స్థూల – సూక్ష్మతత్త్వముల నిర్మాణ – పర్యవేక్షణ కొరకై..., (అనేక పదార్థములు ఇవ్వబడగా, తినే పదార్థములు తయారుజేయు వంటవానివలె).. అహంకార సహిత విరాట్ అభిమాని అగు సృష్టి ప్రజ్ఞాపురుషుడు (బ్రహ్మదేవుడు) ఈశ్వర సంకల్పానుసారము రూపుదిద్దుకున్నారు. ఆయన స్థూల – సూక్ష్మ – కారణదేహములకు, దేవతా ప్రజ్ఞల నియామకుడు, కర్త, నిర్మాత, శక్తియుక్తుల ప్రసాదకుడు కాసాగారు. పరిపాలకుడై ఉన్నారు.

**స్పందన - చేష్టత :** ఇప్పటివరకు సృష్టించిన **ఇంద్రియశక్తులు, దేవతా ప్రజ్ఞలు, సృష్టికర్తృత్వాభిమాని...** ఇవన్నీ బ్రహ్మాండములలో ప్రవేశించాయి. అయితే అవన్నీ తమకు తాముగా ఏది ఎట్లా ఎందుకు **పరస్పరములతో కూడిన సమిష్ఠ వ్యవహారములను** నిర్వర్తించాలో ఎరుగక, జడస్థితిని మాత్రమే కలిగినవై ఉన్నాయి. సృష్టికర్త బ్రహ్మాండములోని పైన చెప్పుకొన్న పదార్థజాలములతో దేహాకారములు నిర్మించినప్పటికీ అవన్నీ స్వయం నిర్ణయ సామర్థ్యముతో వర్తించలేనివై ఉన్నాయి. అప్పుడు ఈశ్వరుడు "అచేతనములగు వీటిని సచేతనములుగా చేసెదనుగాక ! " అని సంకల్పించారు.

- బ్రహ్మాండములను,
- బ్రహ్మాండ రంధ్రములను,
- హిరణ్యగర్భ నిర్మితములగు వ్యష్టిదేహాకారములను స్పృశించసాగారు.

వ్యష్టి దేహముల మస్తకములను (ముఖము యొక్క ఊర్ధ్వ భాగములను) రంధ్రములు చేసి వాటన్నిటియందు చేతనారూపుడై ఈశ్వరుడు అసంఖ్యాక అంశలతోస్వయముగా ప్రవేశించ సాగారు. ఆ విధంగా భౌతిక దేహములు మొట్టమొదటగా 'జడములే' అయి ఉన్నప్పటికీ **'ఈశ్వర చైతన్యము'** యొక్క చిత్ జ్యోతి వాటిలో ప్రవేశించగానే... అవన్నీ కూడా **'చైతన్యవంతములు'** అయ్యాయి. ఇక ఆపై కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, ప్రాణములు, దేవతాప్రజ్ఞలు, అంతఃకరణములు... ఇవన్నీ కూడా వ్యష్ఠి దేహములలో ఈశ్వర చైతన్య తేజస్సుచే సచేతనముగా అయి తమకు ఈశ్వరునిచే నియమించబడిన ధర్మములను (The functions stipulated) నిర్వర్తించసాగాయి. నాటకపాత్రలో నటునివలె, **ఈశ్వరుడే దేహములలో జీవుడై ప్రకాశించి ప్రవర్తించసాగారు.**

**ఈశ్వరుడు - జీవుడు :** ఈశ్వరుడు స్వతఃగానే సర్వజ్ఞుడు. జన్మ-మృత్యువులకు ఈవల-ఆవల ఎరిగియున్నవాడు. **సర్వజ్ఞ-ఈశో, మాయాలేశ సమన్వితో, ... 'వ్యష్టి దేహమ్' ప్రవిశ్య తయా మోహితో 'జీవత్వమ్' అగమత్ ।** ఈశ్వరుడు స్థూల - సూక్ష్మ - దైవీశక్తులతో కూడిన బ్రహ్మాండముల స్వకీయ రచయిత. **'మాయ'** లేక **'కల్పన'** లేక **'ఊహ'** లేక **'భావన'** చే సర్వము తనయందు కల్పించి కొనసాగించి - లయింపజేయగల మహాసామర్థ్యము కలవాడు! 'మాయ'ను తన ఉపాధిగా కలవాడు. దేహములలో ప్రవేశించి చైతన్యము చేయగల మహా చైతన్య స్వరూపుడు! ఈశ్వరుడు అంతటివాడు అయిఉండి కూడా..., **'వ్యష్టి దేహము'**లో ప్రవేశించిన తరువాయి, అందులోని అంతరంగ విభాగములచే, కర్మ - జ్ఞాన ఇంద్రియ చర్యలచే మోహితుడై అనేక పరిమితములతో కూడిన 'జీవుడు' అను జీవత్వ స్థితి పొందినవాడగుచున్నాడు. ఈవిధంగా ఈశ్వరుడే ఈ వ్యష్టి దేహములో జీవుడుగా ప్రదర్శనమగుచున్నాడు. ఈ జీవుడు స్వతఃగా ఈశ్వరుడే! అయితే, ఈ జీవుడు

- స్థూల - సూక్ష్మ - కారణ త్రిశరీరములతో తదాత్మ్యము చెందుచున్నవాడగుచున్నాడు.
- **"నేను దీనికి కర్తను - దానికి భోక్తను** (This is what I am doing. That is what I am getting / enjoying / undergoing) అనే భావనలలో ప్రవేశించి, వాటి యందు నిబద్ధుడు (Bounded by) అగుచున్నాడు.
- **"నేను కొన్ని ధర్మములకు** (Functions) **బద్ధుడనై ఉన్నాను. జాగ్రత్ - స్వప్న - సుషుప్తి - మూర్ఛా - మరణ ధర్మములు కలవాడిని ..."** అని తనను తాను దేహ స్వభావములకు, దేహధర్మములకు **పరిమితునివలె** దర్శిస్తున్నాడు.
- ఘటములు (కుండలు తయారు చేసే) కులాల చక్రమువలె అనేక "దేహఘటములు" తయారు చేసుకొంటూ, ఆయా దేహధర్మములచే సంబంధితుడు - బంధితుడు అయి, **"అవును ! నేను పుట్టుక - చావుల మధ్య ఇరుక్కొని ఉన్నాను. నాకు పుట్టుక తరువాత చావుతప్పదు. తరువాత ఏదిఏటో తెలియదు! అంతే!"** అని అనుకుంటూ కులాల చక్రము (కుండలు తయారు చేసే చక్రయంత్రమువలె) చర్వితచరణుడై పరిభ్రమణములను సుదీర్ఘంగా కొనసాగిస్తూపోతున్నాడు.

***"ఇదేమిటి ? ఈ ఉపాధులేమిటి? ఏమిటీ సుఖ - దుఃఖాలు? నాకు సంబంధ-బాంధవ్యములేమిటి? ... ఎందుకొచ్చిన చావురా?"...*** అని అనుకుంటూనే అనేక ఉపాధులలో ప్రవేశ-నిష్క్రమణములను కొనసాగిస్తూ ఉన్నాడు. **"నేను ఈ ఉపాధిచే, ఇందలి కర్మ - జ్ఞాన ఇంద్రియములచే, దృశ్య - దేహ - మనో - బుద్ధి - చిత్త - అహంకారములచే నిబద్ధుడను. ఏదో చేస్తే గాని ఈ నా బంధనము తొలగదు. ఎవ్వరో రావాలి ! ఈనా బంధనములు త్రెంచాలి"...** అను భావనాపరంపరలచే చుట్ట చుట్టబడినవాడై ఉంటున్నాడు.

## ద్వితీయ అధ్యాయము- జీవేశ్వర న్యాయం

**పైఙ్గలుడు :** మీరు చెప్పేదంతా మహదాశ్చర్యం! పరమాశ్చర్యం! ఈశ్వరుడు సర్వలోకములకు సృష్టి - స్థితి - లయ కర్త అని, సర్వకల్పనలకు ఆవల ఉన్నవాడని, కల్పనలన్నీ స్వయం కృతముగా కలిగి ఉన్న మహాశక్తిమంతుడని , కల్పనా మాత్రముగా ఇదంతా కల్పించగలడు - ఉపసంహరించగలడు కూడా - అని, ఈ సృష్టి యొక్క అంతఃకృత అంతర్యామి అని, విభువు అని, ఒకవైపు నుండి అభివర్ణిస్తున్నారు.

ఇంతలోనే,

**"ఆ ఈశ్వరుడే దేహములలో ప్రవేశించి, దేహములను తన చైతన్యశక్తితో చైతన్యవంతము చేసి, తాను సంకల్పించిన మనోబుద్ధి చిత్త అహంకార ఇంద్రియ - ఇంద్రియ విషయములకు తానే బద్ధుడై 'జీవుడు'గా పిలువబడుచున్నాడు"...** అని కూడా సిద్ధాంతీకరించుచున్నారు.

సర్వజ్ఞుడగు ఈశ్వరుడు-కించిజ్ఞుడగు 'జీవుడు'గా జీవిత దశ పొందటమేమిటి? జీవుడై తాను కల్పించిన దేహతత్వములలోని వ్యష్టి దేహములో బద్ధుడై, అంతరంగ చతుష్టయముచే నిబద్ధుడగుచూ ఉపాధి పరంపరలలో సుదీర్ఘ బాటసారివలె ప్రయాణించుచూ బంధ విముక్తి కొరకై దేవులాడుతూ వెతకటమేమిటి? **సర్వ లోకానామ్ సృష్టి-స్థితి-అంతకృత్ విభుః, ఈశః-కథం 'జీవత్వమ్' అగమత్ ఇతి?**

సృష్టి - స్థితి - లయకారుడు, సర్వమునకు యజమాని అయినట్టి ఈశ్వరుడు - 'జీవుడు'గా ఎట్లా అగుచున్నాడు ? సర్వశక్తిమంతుడగు ఈశ్వరునికి బంధముతో కూడిన 'జీవుడు' అను స్థితి ఎట్లా వచ్చిపడుతోంది?

**యాజ్ఞవల్క్యుడు :** అవునయ్యా! ఇక్కడంతా జరుగుచున్నది ఇదియే! ఈ తతంగమంతా సుస్పష్టమవటానికై ... **స్థూల-సూక్ష్మ-కారణ దేహ ఉద్భవ పూర్వకం 'జీవ-ఈశ్వర'... స్వరూపం వివిచ్య కథయామి!** అసలు "ఈ జీవునిపట్ల ప్రదర్శితమగుచూ అగుపిస్తున్న 'స్థూల-సూక్ష్మ-కారణ' దేహములకు మునుముందటి ఈశ్వరరూపమేమిటి? ఈ జీవుని ఇప్పటి-అప్పటి రూపములేమిటి?"... అనునది వివరణ చేసుకుంటే గాని, **"ఈశ్వరుడు జీవుడుగా ఎందుకు అగుచున్నాడు? ఎట్లా అగుచున్నాడు?"...** అనునది సమన్వయము కాదు. అందుచేత మనము దేహత్రయమునకు మునుముందే ఉన్నట్టి జీవేశ్వర (జీవ+ఈశ్వర) రూపము గురించి విచారణ చేద్దాము.

**సావధానేన ఏకాగ్రతాయ శ్రూయతామ్ ।** స్వాధ్యయన–సావధాన చిత్తులై ఏకాగ్రతగా వినుచుండెదరుగాక ! ఎందుకంటే ...,

- జీవుడు – అతనిచే దర్శించబడి, అనుభవముగా పొందబడుచున్న ఇంద్రియ దృశ్యము వేరు – వేరా ? ఒక్కటేనా ?
- జీవుడు – జగత్ నియామకుడగు ఈశ్వరుడు వేరువేరా ? ఒక్కటేనా ?
- ఈశ్వరుడు – ఈశ్వరుని తన కళావిశేషముగా కలిగియున్న పరమాత్మ వేరు వేరా ? ఒక్కటేనా ?

ఈ విషయముల యొక్క నిర్ధారణమునకు సహకరించగల విశేషాలు... మనము ఇప్పుడు చెప్పుకోబోతున్నాం. కనుక శ్రద్ధగా వినండి!

పరమాత్మ యొక్క చిత్కళావిశేష స్వరూపుడగు ఈశ్వరుడు, మనం ఇంతకు ముందు చెప్పుకొన్న విధముగా అనంతమగు పరమాత్మ తత్త్వములో కొన్ని పంచీకృత మహాభూతలేశములను (అణువులను petty pieces) తీసుకొని

1) వ్యష్టి స్థూల శరీరములను 2) సమష్టాత్మకమైన స్థూల శరీరములను

ఈ రెండు యథాప్రకారముగా తన **సంకల్ప శక్తిని** ఉపయోగించి నిర్మించుచున్నారు.

**పృథివీ అంశా (Solid) తత్త్వముగా :** ఈ వ్యష్టి–సమిష్టి దేహములను కలిపి ఉంచే చర్మము – కపాలము – నరములు – మాంసము – గోరులు (Nails) ... ఇవన్నీ నిర్మితమగుచున్నాయి.

**జల అంశా (liquid) తత్త్వముగా :** దేహములలోని రక్తము, మూత్రము, లాలాజలము, స్వేదము (చెమట) మొ॥వి రూపము సంతరించుకుంటున్నాయి.

**అగ్న్యంశాతత్త్వముగా :** ఆకలి, దప్పిక (దాహము), ఉష్ణము (Heat) , మోహము (భ్రమ – Illusion ) , మైధునము (Sexual feelings) మున్నగునవి ఏర్పడుచున్నాయి.

**వాయువు యొక్క అంశాతత్త్వముగా :** నడవటము, దాటటము, దూకటము, ఉచ్ఛ్వాస – నిశ్వాసలు ఇవన్నీ ప్రదర్శితమగుచున్నాయి.

**వ్యోమాంశ (ఆకాశాంశ) తత్త్వములుగా :** కామము (ఏదో కావాలి – పొందాలి అనే కోరికలు), క్రోధము మొదలైనవి సంప్రదర్శనములగుచున్నాయి.

వాటన్నిటి యొక్క సంఘాతము – ప్రవర్తనము – విడిపోవటము అనే చర్యల చేత **కర్మలు** (Various Functions) ఏర్పడుచున్నాయి. దేహముల రాకపోకలు, వాటికి ఆధారమై సంచిత – ప్రారబ్ద – ఆగామి కర్మలు, ప్రతి దేహము యొక్క హాని వృద్ధులు, ఒక్కొక్క దేహమునకు సంబంధించిన బాల్య – కౌమార – యౌవన – వార్ధక్యములు, ఇంకా కూడా అనేక వస్తువుల పట్ల – విషయముల పట్ల అభిమానములు, దురాభిమానములు, అభియోగములు (Attributions) మొదలైనవన్నీ... ఏర్పడుచున్నాయి. ఈ ఈ విశేషముల సంఘాతమే (Association) మనకు కంటికి కనిపిస్తున్న ఈ స్థూల దేహము యొక్క **స్థూల – సూక్ష్మములతో కూడిన రూపము.**

## పంచప్రాణములు

ఇప్పుడిక అపంచీకృత (పంచీకరణమునకు మునుముందే ఉన్నట్టి) సూక్ష్మ పంచభూతత్త్వముల యొక్క **"రజో అంశ విభాగము** (inclination to function, work, act) యొక్క **'త్రిగుణాంశ సమిష్టి'** నుండి **'ప్రాణశక్తి'** బయల్వెడలు విశేషములు చెప్పుకుంటున్నాము.

రజోగునమునందు సత్త్వ – తమో అంశలు చేరుచుండగా 'విశ్వ ప్రాణశక్తి' ఉదయిస్తోంది. అట్టి ప్రాణము పంచవృత్తులతో కూడుకొని ఉంటుంది. 1) **ప్రాణము** → దేహములో విశ్వప్రాణము యొక్క ప్రవేశిక అంశ 2) **అపానము** → ప్రాణ శక్తి దేహములోని వ్యర్థములను బయటకు త్రోయు అంశ 3) **వ్యానము** → వ్యాపింపజేయు ప్రాణాంశ 4) **ఉదానము** → ఆహార రస ప్రసరణము 5) **సమానము** → సర్వత్ర సమత్వము పర్యవేక్షించునది ఈఈ పంచవృత్తులతో ప్రాణశక్తి దేహ రక్షణ కొనసాగించుచున్నది.

నాగము – కూర్మము – కృకరము – దేవదత్తము – ధనంజయము అనునవి దేహములోని పంచ **ఉపప్రాణ చలనములు.**

**ప్రాణశక్తి స్థానములు :** హృదయము, గుదము (ఆసనము), నాభి (బొడ్డు), కంఠము, సర్వాంగములు.

**అంతఃకరణము :** పంచభూతముల 'సత్త్వాంశ' యొక్క త్రిభాగముల నుండి **'అంతఃకరణము'** నిర్మితమగుచున్నది.

**అంతఃకరణ వృత్తులు :** మనస్సు (The Factor of thoughts) , బుద్ధి (Analysing and selecting factor), చిత్తము (ఇష్టము, The factor of liking), అహంకారము (The sense of 'I' & 'My')

**అంతఃకరణ విషయాలు :** సంకల్పము, నిశ్చయము, అభిమానము, అనుసంధానము (Getting Connected)

**అంతఃకరణ స్థానములు :** గళము (గొంతు), వదనము (Fore-face), నాభి (బొడ్డు), భ్రూమధ్య ప్రదేశము (Point in between two eye brows)

**జ్ఞానేంద్రియములు :** సూక్ష్మ పంచభూతముల 'సత్త్వము' గుణ సంబంధిత '4' వ భాగము నుండి జ్ఞానేంద్రియములు జనిస్తున్నాయి. కళ్ళు - చెవులు - చర్మము - జిహ్వా - ముక్కు - ఇవి పంచ **జ్ఞానేంద్రియములు.**

**జ్ఞానేంద్రియ పంచవృత్తులు :** శ్రోత్రము (వినికిడి), త్వక్, చక్షువు (చూపు), జిహ్వా, ఆఘ్రాణము.

**జ్ఞానేంద్రియ విషయములు :** శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు

**జ్ఞానేంద్రియ అదిష్ఠాన దేవతలు :** వాయువు, సూర్యుడు, ప్రచేతుడు (వరుణుడు), అష్టదిక్ పాలకులు

**కర్మేంద్రియ అధిష్ఠాన దేవతలు :** అశ్వనీ దేవతలు, అగ్నిదేవుడు, ఇంద్రుడు, ఉపేంద్రుడు, మృత్యువు.

**మనో - బుద్ధి - చిత్త - అహంకార అధిష్ఠాన దేవతలు :** (వరుసగా) చంద్రుడు, విష్ణువు, చతుర్ముఖ బ్రహ్మ, శంభుడు.

## పంచకోశములు

**పంచకోశములు :** అన్నమయ - ప్రాణమయ - మనోమయ - విజ్ఞానమయ - ఆనందమయ.

**అన్నమయ కోశము : అన్నరసేనైవ భూత్వా, అన్నరసేన అభివృద్ధిమ్ ప్రాప్య, అన్నరసమయ పృథివ్యాం యత్ విలీయతే, సో 'అన్నమయ కోశః' । తదేవ స్థూల శరీరమ్ ।**

ఈ స్థూల దేహమే అన్నమయ కోశ సంజ్ఞ.ఇది అన్నము (ఆహారము) నుండి జనించి, ఆహారము స్వీకరించుటచే వృద్ధి చెందుతూ, తిరిగి మరెప్పుడో అన్నరసమయ స్వరూపమగు పృథివిలో విలీనము అగుచున్నది. ఇది భూదేవతా ప్రసాదితముగా దర్శిస్తూ కృతజ్ఞతను (భూమిపట్ల, తల్లి - తండ్రుల పట్ల) కలిగి ఉండటము - ఏమరువకూడదు! ఎందుకంటే ఈ భౌతిక దేహము మోక్షమును కూడా ప్రసాదించగల మహత్తరమైన ఉపకరణము కదా ! "ఇది మనది కాదు. పృధివి యొక్క సొత్తు. తిరిగి ఇవ్వవలసిన సందర్భము ఉంటుంది"... అని గుర్తెరిగి ఉండాలి. పవిత్రమగు ఆత్మ - జ్ఞానదృష్టిని ప్రవృద్ధపరచుకోవటానికై సద్వినియోగము చేసుకోవాలి!

**ప్రాణమయ కోశము :** కర్మేంద్రియ పంచకము + పంచప్రాణములు... ఇది **ప్రాణమయ కోశ రూపము.**

**మనోమయ కోశము :** జ్ఞానేంద్రియ పంచకము + మననరూప మనస్సు ... కలసి **మనోమయ కోశమగుచున్నది.**

**విజ్ఞానమయ కోశము :** జ్ఞానేంద్రియ పంచకము + బుద్ధి... కలిపి **"విజ్ఞానమయకోశము"** ... అని పిలువబడుచున్నది.

**లింగ శరీరము :** ప్రాణమయ + మనోమయ + విజ్ఞానమయ '3' కోశములు కలిపి - **'లింగ శరీరము'** అని పిలువబడుచున్నది.

**ఆనందమయ కోశము :** ఈ ఆనందము దృశ్య - దృశ్య విషయ సంబంధమైనది. ఇంద్రియ సంబంధమైనది. (ఆత్మ జ్ఞాన సంబంధమైనది కాదు). అందుచేతనే - **స్వరూప - అజ్ఞానమ్ ఆనందమయమ్"...** అని చెప్పబడుతోంది.

**అష్టపురి :** ఈ దేహమును 'అష్టపురీ దేహమ్' అని పిలుస్తున్నారు. '8' ముఖ్యమైన వస్తువులచే ఇది ప్రవర్తితమగుచున్నది.

**1)** **జ్ఞానేంద్రియ పంచకము**
(శ్రోత్ర - త్వక్ - చక్షు - జిహ్వా - ఆఘ్రాణ) - 5
(చెవి చర్మము కళ్ళు నోరు ముక్కు)

**2)** **కర్మేంద్రియ పంచకము**
వాక్కు - చేతులు - కాళ్ళు - వాయువు - ఉపస్థ) -5

**3)** **ప్రాణాది పంచకము**
(ప్రాణ - అపాన - వ్యాన - ఉదాన - సమాన) - 5

**4)** **ఆకాశము మొదలైన భూత పంచకములు**
(ఆకాశ - వాయు - అగ్ని - జల - భూ) - 5

**5)** **అంతఃకరణ-చతుష్టయం**
(మనో - బుద్ధి - చిత్త - అహంకారములు) - 4 (5వది అవ్యక్తము - ఈ నాలుగిటిని వ్యక్తీకరించు పురుషకారము)

**6)** **కామము** (Desires, Expectations, Anticipations)

**7)** **కర్మము** (Functioning)

**8)** **తమస్సు** (Ignoring some thing while involving in some thing else).

ఈ '8' కలిపి ఈ దేహమును అష్టపురము (A Township with '8' factors) గా అభివర్ణించబడుతోంది.

**విశ్వుడు - జాగ్రత్ అభిమాని :**

ఈశ్వరాజ్ఞను అనుసరించి విరాట్ పురుషుడు వ్యష్టి దేహములో ప్రవేశించి, బుద్ధిని అధిష్ఠించినవాడై, 'విశ్వము' యొక్క అనుభవమును పొందుచున్నాడు. అట్టి విశ్వానుభవమును పొందుచున్న ఈశ్వరాంశను **'విశ్వుడు'** అని పిలుస్తున్నారు.

**అట్టి విశ్వుని యొక్క ముఖ్య లక్షణములు:**

- విశ్వమును తెలుసుకొనుచూ 'విజ్ఞానాత్మ' అయి విశ్వమునందు (జాగ్రత్ నందు) చరించుచూ ఉంటాడు.
- ఈ దేహముతో సహా విశ్వదృశ్యమును తనకు భిన్నమైనదానివలె, తాను అందులో ఒకనివలె చూస్తూ ఉంటాడు.
- నీటి యందు సూర్యప్రతిబింబము కనిపించు తీరుగా, ఈ విశ్వుడు చిత్ యొక్క అభాస (Reflective) స్వరూపుడు.

**విశ్వో** - ఈ విశ్వము – విశ్వుని దేహము (విశ్వుడు)

**వ్యావహారికో**-జాగ్రత్ నందు (విశ్వమునందు) వ్యవహరించువాడు కాబట్టి ఆ ఈశ్వరుని విశ్వాంశను 'వ్యావహారికు'డు అని కూడా అంటున్నారు.

**జాగ్రత్ స్థూల దేహాభిమానీ :** ఈ విశ్వుడు **"నా యొక్క సర్వస్వము ఈ జాగ్రత్ మాత్రమే ! ఇందులో కొన్ని పొందితే సుఖిని! పొందకపోతేనో, దుఃఖని! ఇందులో నేను పొందే సుఖ దుఃఖాలు, తారసబడే అనుబంధ – సంబంధ – బాంధవ్యాలు సత్యమే!"**... అను **అభిమానము** కలిగి ఉంటున్నాడు.

దేహాభిమనంతో దేహము యొక్క బాల్య కౌమార యౌవన వార్ధక్య మరణ – పునర్జన్మ దశలను తన స్వరూపమునకు సంబంధించినవిగా అనుభవము పొందుతూ ఉంటాడు.

**కర్మభూః :** సంచిత – ప్రారబ్ధ – ఆగామి కర్మలకు చెందినవాడుగాను, పుణ్య – పాప ఫలముల అనివార్యమగు అనుభవిగాను ... తనను తాను **భావించుకుంటూ** ఉంటాడు. ఈయన విశ్వములో తన రూపమును ఆస్వాదిస్తున్నాడు. కాబట్టి 'విశ్వుడు' అని, ఇంద్రియ విషయముల పట్ల అభిమానము తీవ్రముగా కలిగి ఉంటాడు కాబట్టి **'ఇంద్రియాభిమాని'**... అని పిలువబడుచూ ఉంటాడు.

**తేజసము - స్వప్నాభిమాని :** ఈశ్వరాజ్ఞచే సూత్రాత్మ వ్యష్టి సూక్ష్మ శరీరము (భావనా శరీరరము, కోపము – ప్రేమ – ఆశ – నిరాశ – సుఖము – దుఃఖము ... ఇటువంటి నవరసములు మొదలైనవి, అభిప్రాయ రూప భావనాపరంపరలు మొ॥వి కూడా దాగి ఉన్న శరీరము) లో ప్రవేశించి, **మనస్సును అధిష్ఠానముగా చేసుకొని** అనుభవములు పొందుచున్న అభిమానిని **'తేజసుడు'** – అని పిలుస్తున్నారు.

ఈతడు ప్రాతిభాసికగా (Reflective of one's own ideations and visualizations as if it is all an outside experience) అనుభవములందు అభిమానుడై తనయందు తానే ఉంటున్నాడు. స్వప్నకాల్పిక ప్రాతిభాసికములందు (Dream created sensuory reflection) చరించుచు, అందుకు వేరైనది తనకు ఎక్కడా ఏదీ లేనట్లు (జాగ్రత్ – సుషుప్తి – తురీయముల ప్రసక్తి కలిగి ఉ ండకుండా) మనో దేహముతో అనుభవములు పొందుచున్నాడు. తన యందు తానే రతించుచూ, 'తేజసుడు' అని పిలువబడుచున్నాడు.

**ప్రాజ్ఞత్వము-అవ్యక్తాభిమాని:** ఈశ్వరాజ్ఞచే విరాట్ పురుషుడు వ్యష్టిజీవుడై... జాగ్రత్ – స్వప్నములలో సంచరించుచూ, (ఉభయములను వ్యక్తీకరించుచూ) ఒకానొకప్పుడు ఉభయ వ్యక్తీకరణములను ఉపసంహరించుచున్నవాడు. ఒక పక్షి సాయంకాలం వరకు ఆహారము కొరకై ఊరంతా తిరిగి, రాత్రి చెట్టుపై రెక్కలు ముడుచుకొని విశ్రాంతి తీసుకొను రీతిగా జాగ్రత్ – స్వప్న సంబంధిత సంస్కారములన్నీ అప్రకటితం చేస్తూ, తనయందు అవ్యక్తస్థానములో దాచి ఉంచి... తాను అవ్యక్తత్వము వహిస్తున్నాడు. మాయా ఉపాధిని స్వీకరించి అవ్యక్తత్వ సమన్వితుడై **వ్యష్టికారణ – శరీరము** నందు ప్రవేశించి ('కార్య' శరీరములను ఉపసంహరించుకొన్నవాడై) నిర్విషయ ప్రాజ్ఞత్వమును ఆస్వాదించుచున్నాడు. అట్టి ప్రాజ్ఞుడు...,

- **ఇహార్థములను** అప్రకటితము చేస్తూ **'అవిచ్ఛిన్న పారమార్థికత్వము'** అనుభవించుచున్నాడు.
- సుషుప్తి – అభిమానియై, తనకు **తదితరమైనదేదీ లేని స్థితిని** ఆస్వాదించుచున్నాడు.
- ఒకానొక జడ స్థితిని పొందినవాడై ఉంటున్నాడు.

**"ప్రాజ్ఞుడు"** అని ఈ గాఢనిద్రాభిమానిని పిలుస్తున్నారు.

**బ్రహ్మణి ఏకత్వము (తురీయము) :** 4వది ఏకరూపమగు తురీయము అవ్యక్తతత్వముచే ఆచ్ఛాదించబడినట్టిది. జాగ్రత్ – స్వప్న – సుషుప్తుల కేవల సాక్షిత్వ రూప ... అవ్యక్త–ఆచ్ఛాదితము. ఇహ స్వరూపమునకు ఆవల గల పారమార్థిక స్థానము. ఇది 'తత్త్వమసి – సోఽ హమ్' ఇత్యాది మహావాక్యముల అపరోక్షానుభవ స్థితి. సర్వ సమభావసాక్షి స్థితి. అభేద సందర్శన స్థితి. జాగ్రత్ – స్వప్న – తురీయములలో ప్రవేశ–నిష్క్రమణములను నిర్వర్తించు ప్రజ్ఞ.

ఇక్కడ కనబడుచున్న భేద వ్యవహారమంతా కూడా అంతఃకరణము అనే తటాకములో ప్రతిబింబించే ఆకాశ – మేఘ – నక్షత్ర దృశ్యమువంటిది. ఇదంతా ప్రతిబింబిత న్యాయముగా చైతన్యమునందు ఒకానొక దృష్టికి దర్శితమగుచున్నట్టిది. ప్రతిబింబ చైతన్యమే అవస్థాత్రయము (జాగ్రత్–స్వప్న–సుషుప్తులు) పొందుచున్నది.

ఆత్మ యొక్క ప్రాతిభాసికమాత్రుడగు ఈ జీవుడు భౌతిక ఉపాధిచే జాగ్రత్ – స్వప్న – సుషుప్తి దశలను ఒకటి తరువాత మరొకటిగా అంతులేకుండా పొందుచూ పోతున్నాడు. వస్తుతః స్వతఃగా కేవల సాక్షి స్వరూపుడు – అప్రమేయుడు అయి ఉండి కూడా … ఘటీయంత్రములో చిక్కి పరిభ్రమణము చేయుచున్నవాని వలె…, జాగ్రత్ – స్వప్న – సుషుప్తుల మధ్య అటూ ఇటూ తిరుగాడుచున్నాడు. (కల కంటున్న వానికి తన జాగ్రత్ స్థితి విశేషములు అనుభవమునకు రాని విధంగా)… జాగ్రత్‌లో తన పరస్వరూపమును ఏమరచి, జీవన్మృతుని స్థితి (బ్రతికుండి కూడా చచ్చినవానితో సమానమగు స్థితి) పొందినవాడై ఉంటున్నాడు.

**పైఙ్గలుడు :** "జీవాత్మ పంచ అవస్థలు" గురించి – జాగ్రత్ – స్వప్న – సుషుప్తి – మూర్ఛ – మరణ అవస్థలుగా చెప్పబడుచున్నది కదా ! అట్టి పంచ దశల అవస్థల గురించి మరికొంత వివరించ ప్రార్థన.

**యాజ్ఞవల్క్యుడు :** సరేం ! ఈ జీవుని పట్ల పంచ అవస్థలు ఎట్టివో… మరికొన్ని విశేషాలు చెప్పుకుందాము.

## 1. జాగ్రత్ అవస్థ

**తత్ తత్ దేవతా అనుగ్రహాన్వితైః శ్రోత్రాది జ్ఞానేంద్రియైః శబ్దార్థ విషయ గ్రహణ జ్ఞానమ్ జాగ్రత్ అవస్థా భవతి।**

ఈశ్వర సంకల్పానుసారంగా దివ్య ప్రజ్ఞస్వరూపులగు దేవతల కార్యక్రమములచేత, అనుగ్రహంచేత ఈ జీవుడు కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు పొందుచున్నాడు! అంతేకానీ, ఏ జీవుడైనా, "నా కాళ్ళు – కళ్ళు – చెవులు – చర్మము – ముక్కు – చూపు శక్తి – వినికిడి శక్తి – స్పర్శ శక్తి – జీర్ణ శక్తి … ఇవి నేనే నిర్మించుకున్నాను" – అని అనగలడా ? లేదు కదా ! ఈ విధంగా దేవతలచే ప్రసాదించబడిన కర్మేంద్రియ – జ్ఞానేంద్రియములను గ్రహించుచున్న శబ్ద – అర్థ గ్రహణ సంబంధమైన జ్ఞానమంతా ఎందులో పొందబడుచున్నదో అదియే **"జాగ్రత్ అవస్థ" అగుచున్నది.**

**శ్లో॥ తత్రభ్రూమధ్యంగతో జీవ ఆపాద-మస్తకం వ్యాప్య,**
**కృషి - శ్రవణాది అఖిల క్రియా, "కర్తా" భవతి ॥**

అట్టి "జాగ్రత్ అవస్థ" లో ఈ జీవుడు భ్రూమధ్య (రెండు కనుబొమ్మల మధ్యగా) ఆకాశంలో ప్రవేశించి ఉన్నవాడు. అక్కడి నుండి ఇక పాదముల ఆదిగా నుదురువరకు వ్యాపించి ఉన్నవాడై కళ్ళతో చూడటము, చెవులతో వినుటము, ముక్కుతో వాసన చూడటము, చేతులతో పనులు చేయటము, కాళ్ళతో నడవటము, పాయు – ఉపస్థలతో విసర్జనము మొదలైన వ్యవహారములు – ఇవన్నీ నిర్వరిస్తూ, వాటికన్నిటికి **'కర్త'** అగుచున్నాడు. జ్ఞానేంద్రియ – కర్మేంద్రియ – మనో బుద్ధి చిత్త అహంకార.. ఇత్యాదులన్నీ ఉపకరణములవలె ఉపయోగించువాడగుచున్నాడు. ఆయా కర్మలను నిర్వర్తించటము, తాను నిర్వర్తిస్తూ ఉన్న కర్మల ఫలములను పొందటమూ చేస్తున్నాడు. **తత్ ఫల భుంక్చ, భవతి ।** కర్మ ఫలభోక్త అగుచున్నాడు. ఈ విధముగా కర్మలు నిర్వర్తించటము – కర్మ ఫలభోక్త అవటముచే కాలము గడుపుచున్నాడు. క్రమంగా భౌతిక దేహములో ప్రవేశించిన ఈ జీవుడు దేహముయొక్క పరిణామములను తనకు చెందినవిగాను, తనకు పట్టిన గతిగాను అసత్ పూర్వకంగా ఆపాదించుకొంటూ, అనేక కర్మలు – కర్మఫలములు అనుభవిస్తూ ఉండగా, ఇక ఈ దేహమునకు బాల్య – కౌమార – యౌవన – వార్థక్యములు ఒకదాని తరువాత మరొకటి వచ్చిపడుచున్నాయి. క్రమంగా ఈ భౌతిక దేహము శిథిలమవగా, దీనిని త్యజించుచున్నాడు. తనయొక్క మనో – ప్రాణ – సంస్కార – కర్మ ఫలములను వెంట నిడుకొని, దేహాభిమానము కారణంగా మరణముచే దుఃఖితుడు అగుచూ… మరల మరొక దేహమును పొందుచున్నాడు. మరల కర్మలను నిర్వర్తించటము ప్రారంభిస్తూ ఉన్నాడు. మరొకవైపు నుండి పూర్వ జన్మ కర్మ ఫలములకు భోక్తగా అయి ఉంటున్నాడు. **లోకాంతరగతః కర్మ్మి తత్ఫలమ్ స యేవ భుంక్తే ।** కర్మలను – కర్మ ఫలములను అనుభవిస్తూ తన పరస్వరూపమును ఏమరచుచున్నాడు. బహుదూరపు బాటసరి సుదీర్ఘ ప్రయాణంలో అనేక పట్టణములలో ప్రవేశించి – నిష్క్రమించు తీరుగా, **అసంఖ్యాక దేహములలో ప్రవేశ – నిష్క్రమణలు నిర్వర్తించుచున్నాడు.**

**స సార్వభౌమవత్ వ్యవహారాత్ శ్రాన్తో … అన్తర్భవనమ్ ప్రవేష్టుం మార్గం ఆశ్రిత్య తిష్ఠతి ।**

ఒక సార్వభౌముడు అనేక వ్యవహారములు నిర్వర్తించి, అలసిపోయి అంతఃపురములోని శయనాగారము ప్రవేశించి విశ్రాంతి తీసుకుంటాడు చూచావా! అట్లా, ఈ జీవుడు కూడా జాగ్రత్–స్వప్న సీమలలో విహరిస్తూ, అనేక దృశ్య విషయములను నిర్వర్తించి–నిర్వర్తించి అలసిపోయి, ఇక విశ్రాంతి కొరకై జాగ్రత్ నుండి గాఢ – నిద్రలోకి ప్రవేశించుచున్నాడు. **విషయరహితమగు జడవృత్తిని** ఆశ్రయించి ఉంటున్నాడు.

## 2. స్వప్నావస్థ

**కరణ ఉపరమే, జాగ్రత్ సంస్కారార్థ ప్రబోధవతీ, గ్రాహ్యా - గ్రాహ్యక స్ఫురణమ్, "స్వప్నావస్థా" భవతి।** అలసి నిదురిస్తూ కరణములను జాగ్రత్ వ్యవహారముల నుండి ఉపసంహరించి, జాగ్రత్ సంస్కారములలోని కొన్ని విషయాలచే ప్రబోధింపబడుచూ, **"గ్రహించువాడు (స్వప్న ద్రష్ట) - గ్రహించబడునది (స్వప్న దృశ్యము)... ఊహ - అపోహల"**తో కూడి కొనసాగుచుండటమే **'స్వప్నము'**. బాహ్యా ఇంద్రియములు నిష్క్రియము పొందుచుండగా, మనో ఉపకరణముతో – 'జాగ్రత్' వంటి... దృశ్యమే భావనచేసి, ఆ దృశ్య దర్శనమును అంతరంగములో కొనసాగించటము, **'స్వప్నము'**. జాగ్రత్ ద్రష్టయగు విశ్వుడే జాగ్ర వ్యవహారరహితుడై అటుపై **'తేజసుడు'** అను రూపమును దాల్చుచున్నాడు. స్వప్నావస్థ సందర్భములో

- జాగ్రత్ వ్యవహారమంతా నిద్రాణమై, అస్పందమై దాచిపెట్టబడి ఉంటుంది.
- జాగ్రత్ సమయంలో బాహ్యమున సంచరించుచున్న మనస్సు పాంచభౌతిక దృశ్యము నుండి వెనుకకు మరలి దేహములో నాభీ మధ్య భాగమునందు చరిస్తూ తనకు బాహ్యమువలె (తన ఊహయందే) అనుభవించబడుచున్నట్టిదే **స్వప్నము.**
- మనస్సు విశ్వత్వమును వదలి తన తేజో రూపమునందు తానే ప్రవేశించి, జాగ్రత్ వాసనలను తన తేజో మండలమునందు పునశ్చరణం వలె కల్పించుకొని జాగ్రత్‌తో సమానముగా **'సత్యమే'** అను భావనతో అనుభూతము చేసుకొనుచున్నది. కాబట్టి 'తేజత్వము' అని పిలువబడుతోంది. ఆ తేజత్వ – అభిమానిని **'తేజసుడు'** అని (వేదాంత వాఙ్మయముచే, ఉపనిషత్ వాఙ్మయముచే) పిలువబడుతోంది.
- జాగ్రత్–అభిమానికి ఈ జాగ్రత్ సత్యము వలె అనిపిస్తూ, 'స్వప్నము' మాత్రం అసత్యము, ఊహామాత్రము, అలీకము (భ్రమ), కల్పితము అయి ఉన్నది. ఇక స్వప్న – అభిమానికి జాగ్రత్ అదేరీతిగా అసత్యము, ఊహామాత్రము, అలీకము, కల్పితము వలె అనిపిస్తూ, స్వప్నములోని సందర్భములు మాత్రమే సత్యము వలె అగుపిస్తూ ఉంటాయి. అయితే జాగ్రత్ సందర్భంలో జాగ్రత్ అభిమాని (విశ్వుడు), స్వప్నము సందర్భంలో స్వప్నాభిమాని (తేజసుడు) – ఈ రెండు ఒకే **జీవుడు** కల్పించుకొనుచున్నవే! ఈ జీవుని రెండు అంశలు వేరువేరైన అంశలు – అని అనక తప్పదు.
- స్వప్నములో ఈ జీవుడు ఏది తనకు ఇష్టమో అది తన స్వప్నాకాశములో ప్రకాశించుచున్నట్టిదిగా పొందుచున్నాడు. ఈ విధంగా అనుభవించేదంతా ఈ జీవుని యొక్క స్వకీయ వాసనా వైచిత్ర్యమే। **తైజసత్వమ్ అవాప్య, వాసనా రూపకమ్ జగత్ వైచిత్ర్యం స్వభాసా భాసయన్ యథా ఈప్సితం స్వయం భుక్తే ।** తనకు ఇష్టమైనదే తాను స్వప్నములో కల్పించుకొనుచున్నాడు.

## 3. సుషుప్త్యవస్థ

జాగ్రత్ – స్వప్న సందర్భములలో చిత్తము అనేక విషయములను ఆశ్రయిస్తూ స్వవాసనలచే పరిపరి రీతులుగా ఒకేసారి ప్రసరిస్తూ ప్రవర్తించు స్వభావము కలిగి ఉంటోంది కదా !

**చిత్తైక కరణా 'సుషుప్త్యవస్థా' భవతి ।** అనేక చోట్ల సంచరించే ఈ చిత్తము ఏకత్వమును పొందటము చేత **'సుషుప్త్యవస్థ'** సిద్ధిస్తోంది. 'చిత్తము' తనకు తాను మాత్రమే కలిగి ఉన్నదగుచున్నది. సుషుప్త్యవస్థకు విషయములు ఉండవు. జడరూపమగు మౌనమే విషయము.

**భ్రమ విశ్రాంత శకునిః కుక్షే సంస్పృత్య నీడాభిముఖం యథాగచ్ఛతి, తథా జీవోఽపి జాగ్రత్ - స్వప్న ప్రపంచే వ్యవహృత్య, శ్రాన్తో, 'అజ్ఞానం' ప్రవిశ్య... స్వానన్దం' భుంక్తే ।**

ఒక పక్షి ఆహారము కొరకై ఎక్కడెక్కడో తిరిగి తిరిగి సాయంకాలము చీకటిపడుచుండగా, తిరిగి తాను నివశించే వృక్షముపై చేరి, రెక్కలు ముడుచుకొని గూటిలోనికి పోయి విశ్రాంతి పొందుతుంది చూచావా ? ఆ విధంగా, ఈ జీవుడు కూడా జాగ్రత్ – స్వప్నములలో సంచారాలు చేసి, ఎప్పుడో జాగ్రత్ – స్వప్న విశేషాలన్నీ త్యజించి **'సుషుప్తి'** అనబడే **'అజ్ఞాన భూమిక'**లో చేరి తన ఆత్మ సంబంధమైన ఒకానొక ఆనందమును (స్వానన్దమ్) తన చిత్తముతో అనుభవించుచున్నాడు.

## 4 మూర్ఛావస్థ

మూర్ఛావస్థలో ఈ జీవుడు ఇంద్రియములు కంపనము పొంది, తన వశములో లేని స్థితిని పొంది అనుభవించుచున్నాడు. **అకస్మాత్ ముద్గరదండా ఆద్యైః తాడితవత్ ।** ఒకానొకడు ముద్గరము (రాతి బండతో చేసిన రోకలి వంటి ఆయుధము) మొదలైనవాటి చేత తలపై మోదబడినప్పుడు, ఇంద్రియ సంఘాతములన్నీ బిగిదీసుకొని పోతాయి చూచావా ? అప్పుడు ఇంద్రియాలు – శబ్ద – స్పర్శ – రూప – రస గంధాలు వశం తప్పిపోయి, ఉపకరణములుగా ఉపకరించవు. ఆ విధంగా ఈ జీవుడు కూడా మరణమునకు ముందు, జీవించి ఉన్నప్పుడు కూడా మరికొన్ని ఆయా సందర్భములలోను **'మూర్ఛావస్థ'** పొందటము జరుగుతోంది. అప్పుడు స్వస్థతను

కోల్పోయి జడునివలెపడి ఉంటున్నాడు. తన దేహమే తన యాజమాన్యములో లేని స్థితిని అనుభవించుచున్నాడు. **భయ-అజ్ఞానభ్యామ్ ఇంద్రియ సంఘాతైః కంపన ఇవ మృత్యుతుల్యా 'మూర్ఛా' భవతి।** ఇట్టి మూర్ఛ దశలో ఈ జీవుడు భయ-అజ్ఞానములచే ఆవరించబడి, ఇంద్రియ సంఘాతము వశము తప్పి వ్రేలాడుచున్నట్లు అనుభవము పొందుచు మృత్యువుతో సమానమైన స్థితి పొందటము జరుగుతోంది.

## 5. మరణావస్థ

ఈ అవస్థ జాగ్రత్-స్వప్న-సుషుప్తుల కంటే వేరై ఉన్నది. **బ్రహ్మాఽఽది స్థంభ పర్యంతమ్ సర్వం జీవభయ ప్రదా। స్థూల దేహ వివర్జినీ।** ఈ అవస్థ బ్రహ్మదేవుని మొదలు చిన్నపురుగు వరకు-స్థంభము పర్యంతము-జీవులందరినీ భయమును కలుగజేస్తూ ఉంటున్నది.

### మృత్యువు - స్థూల దేహమును వదలటము

ఈ జీవుడు ఇంద్రిమయులతో కూడిన ఈ స్థూల దేహమును (ఇల్లు ఖాళీ చేసి మరొక ఊరికి వెళ్ళి పోవు రీతిగా) పరిత్యజించటము జరుగుతోంది.

### దేహాన్తర ప్రాప్తి - పునర్జన్మ!

మరణము సమయములో... **కర్మేంద్రియాని, జ్ఞానేంద్రియాని, తత్ - తత్ విషయాన్, ప్రాణాన్ సంస్పృత్య, ...** కర్మేంద్రియములను, జ్ఞానేంద్రియములను, వాటివాటికి సంబంధించిన విషయములను ప్రాణ వృత్తులను విడచిపెట్టుచున్నాడు. తన వెంట ...

1) కామ్య - కర్మ భావములను (కోరికలను, కర్మలకు సంబంధించిన ఉద్వేగ - అనుద్వేగ సంస్కారములను) వెంటనిడుకొని, **(కామ కర్మాఽఽన్వితా)**

2) **(అవిద్యాభూత వేష్టితో) జీవో దేహాన్తరమ్ ప్రాప్య, దేహాన్తరమ్ గచ్ఛతి**-జీవుడు మరొక దేహము కొరకై వెతుకుచూ లోక - లోకాంతరాలకు అవిద్యను వెంటనిడుకొని (వేరు వేరు లోకాలలోకి) బయల్వెడలుచున్నాడు.

## మోక్షేచ్ఛ

**పైఙ్గలుడు :** హే గురుదేవా ! ఈ జీవుడు మీరు చెప్పిన విధంగా అనేక సంస్కారాలను, అవిద్యను మూటకట్టుకొని, మరొక దేహము కొరకై బయల్వెడలి, ఆ నూతన దేహములో అవన్నీ మూట విప్పి తిరిగి కామ్యకర్మలు - వాసనలు - సంస్కారములు - ప్రవర్తనలు కొనసాగిస్తూ ఉన్నాడని, అవిశ్రాంతంగా తిరుగుచూ, బహు శ్రమ పడుచున్నాడని, అనేక దుఃఖములు పొందుచున్నాడని నాకు అర్థం అవుతోంది. మరి జీవునికి అట్టి అవిశ్రాంత దుఃఖము తొలగటానికి ఉపాయమేమిటి ?

**యాజ్ఞవల్క్యుడు :** ప్రియ పైఙ్గల మహాశయా ! వినండి.

ఈ విధంగా అనేక ఉపాధులలో ప్రవేశ - నిష్క్రమణములు నిర్వర్తిస్తున్న ఈ జీవుడు తన యొక్క సత్కర్మల ఫలితంగా ఒకానొకప్పుడు కాకతాళీయంగా - **"నేనేమిటి? ఈ దృశ్య పరంపరలు ఏమిటి? సంబంధము ఎట్టిది? ఎవరు కల్పిస్తున్నారు? ఈ జనన - జీవన - మరణాలకు వేరై నాకు సంబంధించిన, మరి ఇంకేదైనా సత్యము ఉన్నదా ? నాకు సంబంధించిన నిత్యమైనదేది? అనిత్యమైనదేది?"** ... ఇటువంటి ముఖ్య ప్రశ్నలకు (Fundamental questions for which answers are to be obtained) కు వస్తున్నాడు.

ఇక అతనిలో సరియగు సమాధానముల కొరకై జిజ్ఞాస ప్రారంభమౌతోంది. **"దృశ్యము నాకు బంధము కాకూడదు. ఎట్లా ?"...** అను మార్గమును వెతకనారంభిస్తున్నాడు. మోక్షేచ్ఛ పొందుచున్నాడు.

## విచారణ

ఇకప్పుడు అట్టి మోక్షముపట్ల (దృశ్యములోను, సంగతి - సందర్భములతోను, అనేక విషయ పంపరలతోను విడిపడాలని) పట్టుదల పొందుచున్నాడు. అద్దానికి సంబంధించిన వాఙ్మయమును (Literature-శాస్త్రములు) పరిశీలించటము ప్రారంభిస్తున్నాడు.

ఆత్మజ్ఞులగు సద్గురువులను ఆశ్రయిస్తున్నాడు. సాధనలకు, గురుసేవకు చిరకాలము తనను తాను నియమించుకొనుచున్నాడు. అట్లా ప్రయత్నిస్తూ "మోక్షము (నాకు స్వతఃగానే బంధము లేదు)"... అను నిశ్చల - సుస్థిర అవగాహనను నిర్మలమైన బుద్ధి సహాయముతో పునికి పుచ్చుకొనుచున్నాడు.

**పైఙ్గలుడు :** అసలు ఈ జీవుని పట్ల ఏర్పడు బంధము యొక్క రూపమేమిటి ? మోక్షము ఎట్లా కలుగుతుంది ?

**యాజ్ఞవల్క్యుడు : అవిచారకృతో బంధో** - విచారణ చేయకపోవటం చేతనే "నాకు బంధము ఉన్నది"... అని అనిపిస్తోంది.

**విచారాత్ మోక్షో భవతి। :** నేనెవరు ? ఈ దృశ్యమేమిటి ? నా స్వరూపము ఎట్టిది ? బంధము ఎట్లా, ఎందుకు కలుగుతోంది ? నిష్కారణముగా బంధమును నాకు నేనే స్వాభిమానినై తెచ్చిపెట్టుకుంటున్నానా ? బంధము వస్తుతః ఉన్నదా ? మనోకల్పితమా ? వాస్తవానికి మోక్ష స్వరూపుడనై ఉండి, బంధమును ఆపాదించుకుంటున్నానా ? మోక్షము నాపట్ల అనుక్షణికమయ్యేదెట్లా?

ఈ రూపమైన విచారణచే క్రమముగా ఆత్మగురించి తెలుసుకొనుచుండగా..., బంధము తొలగి ఈ జీవుడు మోక్ష స్వరూపుడగుచున్నాడు. అందుచేత ఓ పైఙ్గలా! **తస్మాత్ సదా విచారయేత్!** ఈ జీవుడు ఎల్లప్పుడు విచారణ చేసే కార్యక్రమంలో ఉండాలయ్యా! దేనిని గురించంటావా?

**1) ఈ దృశ్య జగత్తు 2) జీవుడు 3) ఈశ్వరుడు 4) పరమాత్మ....** వీటిని విడివిడిగా విచారిస్తూ, వీటన్నిటియొక్క పరస్పర ఏక-అఖండత్వము గురించి.

**అధ్యారోపము** (ఇదంతా అదే) – **అపవాదము** (ఇదంతా స్వతఃగా లేదు)... అను మార్గములలో పై నాలుగిటి స్వరూపము విషయములో నిశ్చలమైన అవగాహన పెంపొందించుకోవాలి. విచారణచే అట్టి అవగాహన సుసాధ్యమే! "జీవభావము – జగద్భావము... ఈ రెండిటి యొక్క మూలమేమిటి ? ఎంతవరకు 'కల్పన' (auributes) అయి ఉన్నాయి? వీటిని దాటి ఆవల పరిశీలించినప్పుడు ఏది తెలియబడుచున్నది?" ... అనునది విచారణగా పరిశీలించి చూస్తే...

**జీవభావ-జగత్ భావ బోధే**–జీవ భావము నుండే జగత్ భావము బయల్వెడలుచున్నదని జగత్తు జీవభావమునకు అభిన్నమని తెలియగలదు.

**ప్రత్యక్ - అభిన్నం బ్రహ్మైవ అవశిష్యత ।** – జీవాత్మ సర్వదా బ్రహ్మమునకు అభిన్నమని కూడా తెలియగలదు.

అప్పుడిక జీవాత్మకు అభిన్నమైనట్టి 'బ్రహ్మము' మాత్రమే శేషిస్తూ..., సర్వము సర్వదా బ్రహ్మముగా తెలియబడగలదు. మహావాక్యముల విచారణయే అందుకు మార్గమని గుర్తు చేస్తున్నాను.

## తృతీయ అధ్యాయము - మహావాక్య విచారణ

**పైఙ్గలుడు :** హే మహాత్మా ! సద్గురూ ! మహనీయా ! యాజ్ఞవల్క్య ఆత్మతత్త్వవేత్తా ! నాపై కరుణతో ఇప్పుడు వేద – వేదాంత వాఙ్మయము సూచిస్తున్న **మహావాక్యముల తాత్పర్య – వివరణ** బోధించమని వేడుకొంటున్నాను.

**యాజ్ఞవల్క్యుడు :** ఆత్మ తత్త్వము ఎరిగిన మహనీయులు కొన్ని 'మహావాక్యములు' ప్రసాదించారు. ఆయా వాక్యాలన్నీ వేదాంత శాస్త్రముచే శాస్త్రవేత్తలకు సవివరణ పూర్వకంగా గ్రంథస్థమై ఉన్నాయి. చెప్పబడుచున్నాయి కూడా! వాటి యొక్క విచారణచే ఈ జీవుడు **స్వస్వరూపాత్మ** గురించి తెలుసుకొని, సర్వబంధముల నుండి తప్పక విముక్తుడు కాగలడు.

**తత్ త్వమ్ అసి** - ఆ పరబ్రహ్మమే – "నీవు"గా కనిపిస్తున్నది!

**త్వమ్ తత్ అసి** - నీవు పరబ్రహ్మమే అయి ఉన్నావు.

**త్వమ్ బ్రహ్మాఽసి ।** - నీవు బ్రహ్మమే అయి, అజ్ఞాన దృష్టిచే జీవుడువలె అనిపిస్తున్నావు. విచారణచే **"నీవు బ్రహ్మమే ! ఆత్మ స్వరూపుడవే ! మమాత్మస్వరూపుడవే !"** ... అని ఎరుగబడుచున్నది.

**అహమ్ బ్రహ్మాఽస్మి :** 'నీవు బ్రహ్మమే' అని తెలుసుకుంటే నాకు వచ్చే లాభం ఏమిటి ? ఏమిటంటే, **"నేను బ్రహ్మమే"** ... అని తెలుసుకొనగలుగుటకు అది మార్గము అగుచున్నది. **నేను సర్వదా బ్రహ్మమే అయి ఉన్నాను !**

ఈ ఈ మహావాక్యములను విచారణచే అనుసంధానము చేసి, గురువుల అభిప్రాయము సేకరించి, తత్త్వార్థాన్ని బుద్ధితో సముపార్జించుకోవటము, దృష్టిని పవిత్రము – సమున్నతము చేసుకోవటము, 'బ్రహ్మమే నేను' అయి ఉండటము... ఇదియే **'మహవాక్య విచారణ మార్గము'**. ఈ వాక్య విచారణలో '3' మెట్లు (Phases) గురించి చెప్పుకుందాము 1) పరోక్షము 2) ప్రత్యక్షము 3) అపరోక్షము.

**పరోక్షజ్ఞానము : తత్ర పరోక్ష్య శబళ, 'సర్వజ్ఞత్వ' ఇత్యాది లక్షణో 'మాయోపాధి' - 'సత్ చిత్ ఆనంద లక్షణో', ... జగత్ యోనిః 'తత్' పదవాచ్యో భవతి ।**

ఎదురుగా ఈ జగత్తు ఇంద్రియములకు కనిపిస్తోంది కదా ! ఈ జగత్తును జీవుడు తన కళ్ళు – చెవులు – ముక్కు – నోరు – చర్మము – కాళ్ళు – చేతులు – ఇత్యాది ఇంద్రియములతో అనుభవిస్తున్నాడు. ఈ దేహములోను – దృశ్య జగత్తులోను అనేక చమత్కార విశేషాలన్నీ గమనిస్తే దీని వెనుక ఏదో మహత్తరమైన దివ్య ప్రజ్ఞ వేంచేసి ఉండి, ఇదంతా సృష్టించి – స్థితింపజేసి – నడిపిస్తూ – లయింపజేస్తూ పునఃసృష్టి చేస్తున్నట్లు ఎవ్వరైనా ఒప్పుకోక తప్పదు. అట్టి పరమాత్మ నా ఈ దేహమును ఈ ఎదురుగా ఉన్న విశ్వజగత్తును సృష్టించినవారు కాబట్టి ఆయన యొక్క **'సర్వజ్ఞత్వము'** మొట్టమొదటి లక్షణము.

ఇంకా ఆ పరమాత్మ – సర్వమును ఎరిగిన సర్వజ్ఞుడయి ఉండగా, 'జీవుడు'గా నేను ఆయనచే సృష్టించబడిన దేహమును – పదార్థములను ఉపయోగించుకుంటూ కించిజ్ఞుడను (కొంచమే తెలిసినవాడిని). – ఆయన కల్పనయే ఈ ఎదురుగా కనబడే దృశ్య

వస్తు సమూహమంతా ! నేను దేహముతో పుట్టటానికి ముందే ఇవన్నీ ఉన్నాయి కదా ! కల్పనకు ఆయన యజమాని ! కనుక 'మాయ' ఆయన యొక్క ఉపాధి. {నాకు ఈ దేహము, తెలియకపోవటము (అజ్ఞానము) **'ఉపాధి'** అయి ఉంటున్న తీరుగా}. అట్టి సృష్టిని ఆదిపురుషుని తత్త్వమేమిటో, లక్షణములు ఎట్టిదో, .. విచారణ చేయటమే **'పరోక్షజ్ఞానము'.** అట్టి పరమాత్మోపాసనను ఇట్టి దైవోపాసన ద్వారా భక్తి–యోగములచే ఉపాసించుటచే పరమాత్మయొక్క మహదత్వము అనుభవమవగలదు. (విష్ణు, శివ, లలితా సహస్ర నామములు అట్టి పరోక్ష పరమాత్మయొక్క అభివర్ణనములు).

**పైఙ్గలుడు :** అవును గురుసత్తమా ! అట్టి ఆది పురుషుడు, సృష్టికి మున్ముందే ఉండి.. ఇదంతా కల్పించువాడు అగు మహాప్రజ్ఞాస్వరూపుడగు – పరమాత్మ ఉండిఉండక తప్పదు. ఆయన యొక్క లక్షణములు ఎట్టివి ?

**యాజ్ఞవల్క్యుడు :** అట్టి పరమాత్మ తత్త్వము గురించి తపో – ధ్యానములు నిర్వర్తించిన ఆత్మబంధువులగు మహనీయులు–సత్ (ఉనికి) చిత్ (ఎరుక – వెలిగించటం) ఆనందములను ఆత్మ లక్షణములుగా–విశదీకరిస్తున్నారు. ఈ విశ్వము ఇద్దాని నిర్మాత యొక్క (విశ్వేశ్వరుని) సంకల్పరూపమే కదా ! కనుక ఈ జగత్తును ఆ పరమపరుషునిరూపంగా (The work of worker of the universe) గా ధ్యానము చేయటము– **'పరోక్షోపాసనామార్గము'** అయి ఉన్నది. పరోక్షమార్గములో ఈ దృశ్య జగత్తు జగదీశ్వరుని ఉపాధిగా భావన చేసి ఆరాధించబడుతోంది. 1. "నేను ఉపాసకుడను 2. ఈ జీవితము–సందర్భములు.... ఇవన్నీ నాకు ఉపాసనా వస్తువులు 3. శ్రద్ధ–మార్గము 4. సర్వతత్త్వస్వరూపుడగు పరమాత్మ నా ఉపాసనా వస్తువు".... అను అవగాహనయే పరోక్ష జ్ఞాన సిద్ధికి మార్గము.

## ప్రత్యక్ష అభిన్నం బ్రహ్మ

క్రమంగా ఆ పరోక్షోపాసకుడు **ప్రత్యక్షోపాసకుడు** అగుచున్నాడు. ఎట్లాగో విను ।

**స ఏవ అంతఃకరణ సంభిన్నబోధో 'అస్మత్' ప్రత్యయా, అవలంబనః 'త్వమ్' పదవాచ్యో భవతి ।**

ఈ జగత్తును ఉపాధిగా ధరించి ఉన్న ఆ పరమాత్మయే నాయందు 'నేను' అను రూపము గల ఉపాధిధారుడై ఉన్నాడు.

అట్లాగే 'త్వమ్' ('నీవు') రూపముగా కనిపించేదానిలో – 'నేను' అను ఉపాధిధారుడై కూడా ఉన్నారు. 'త్వమ్' పద వాచ్యార్థము అయి ఉన్నాడు. **అప్పుడిక 'తత్త్వమ్' భావన ఉదయించి, 'సోఽహమ్' భావనతో ఏకమై ప్రకాశించుచున్నది.** 'నీవు'గా కనిపిచే 'జగత్తు'గా కనిపించేది పరమాత్మ స్వరూపమే – అనునది ప్రత్యక్ష జ్ఞానము.

### అపరోక్ష జ్ఞానము

**ప్రత్యక్ అభిన్నం బ్రహ్మ ! జీవాత్మ పరబ్రహ్మ స్వరూపుడే - అను ప్రత్యగాభిన్న బ్రహ్మము అనుభూతమగుచున్నది.** 'నేను'గా ఉన్నది పరబ్రహ్మమే! పరబ్రహ్మరూపుడను! కనుక ఇదంతా నేనే! సోఽహమస్మి! నీవుగా కనిపించేది నేనే! త్వమేవాఽహమ్! ఇది అపరోక్ష జ్ఞానము. "నేను విశ్వస్వరూపుడను" – అను విశ్వరూప సందర్శన యోగము – అపరోక్ష జ్ఞానము. **అట్టి అపరోక్ష జ్ఞానము సిద్ధించేది ఎట్లా?**

## శ్రవణము

**- తత్ త్వమ్ అసి ! (శివతత్త్వజ్ఞానము = త్వమ్ తత్ శివేఽతి జ్ఞానః) ...** నీవు శివస్వరూపుడవే (బ్రహ్మమే) అయి ఉన్నావు !

**అహమ్ బ్రహ్మాఽస్మి !** నేను బ్రహ్మమే అయి ఉన్నాను. ఈ వాక్యముల తత్త్వార్థమేమిటో, ఏ ఏ విధములుగా ఇది తత్త్వశాస్త్రము చేతను, సద్గురువులగు ఆత్మజ్ఞుల తాత్పర్య ప్రవచనముల చేతను నిరూపించబడుతోందో... అట్టి సమాచారము వినటము – శ్రవణము. **బ్రహ్మము యొక్క అఖండ - అప్రమేయ - నిత్య - సత్య - స్వరూపార్థ సమాచారము వినటం, చదవటం - విశ్లేషించటం - సంభాషించటం ఇదంతా 'శ్రవణము' - రూపము.**

## మననము

**ఏకాంతేన శ్రవణాత్ 'అర్థ-అనుసంధానమ్' (ఇతి) మననమ్ భవతి ।** ఆ విధంగా **"తత్ త్వమ్ అసి । అహమ్ - బ్రహ్మాఽస్మి! జీవో బ్రహ్మేఽ తి నా పరః ।** ఇత్యాది మహావాక్యములకు సంబంధించిన సమాచారమును తెచ్చుకొని, క్రమంగా అద్దాని మహార్థమును మననము చేస్తూ ...,

- **కదిలే దేహములకు నామ - రూపాలుంటాయి. కదిల్చే నాకు రూపమెక్కడిది ?**
- **రూపమేలేని నేను పరిమితము లేని అనంతుడనుకదా !**
- **నాకు కనిపించే ఈ రూపములు - నామములు... ఇవన్నీ మమాత్మకు అభిన్నమై, నేను దేహ మనోబుద్ధి చిత్త అహంకారములచేతను, లోక ఇత్యాది సంగతి - సందర్భములచేతను స్పృశించబడనివాడనై ఉన్నాను కదా !**

ఇత్యాది భావనలతో ఏకాంతముగా విచారణచేయటమును, అర్థమును ఎవరికివారే అనుసంధానము చేయటమును **'మననము'** అంటారు. మననముచే బుద్ధి క్రమంగా సూక్ష్మార్థమును గ్రహించినదగుచున్నది. 'అద్వితీయ ఆత్మాఽహమ్.... భావనను సునిశ్చియం అవటం ఆరంభమౌతోంది.

## నిదిధ్యాసనమ్

శ్రవణ మననముల ద్వారా విన్న అర్థమును ఇక అనుమానాలేమీ లేకుండా చేసుకుంటూ, పరబ్రహ్మ వస్తువునందు చిత్తమును ఏకాగ్రపరచటము **'నిదిధ్యాస'** అని చెప్పబడింది. నిర్విచికిత్స = సందేహములు తొలగటం.

- అంతా పరమాత్మ యొక్క ప్రత్యక్షరూపమే! – అను భావముతో కర్మలన్నీ పరమాత్మకు సమర్పించటము.
- పరమాత్మయే ఈ ఇన్ని రూపాలుగా నాకు ఇంద్రియ విషయముల ద్వారా తారసబడుచున్నారు! – (పరమాత్మ పరమో)
- అనేకంగా కనిపిస్తున్న ఇదంతా, వీరంతా సర్వదా ఏకమే అగు పరమాత్మయే! (సంగవర్జితము)
- సర్వ జీవులపట్ల ప్రేమాస్పదుడై, పరమాత్మభావన ప్రవృద్ధపరచుకోవటము.

... అను ధ్యాసను ప్రతిక్షణము చెదరకుండా పరిపోషించుకోవటమే నిదిధ్యాస! అనుకుంటూ – అనుకుంటూ ఉంటే అంతా బ్రహ్మముగా అనిపిస్తూ ... ఇక బ్రహ్మమునకు వేరుగా ఏదీ లేదను సునిశ్చితాభిప్రాయము యొక్క పరిపక్వతయే **నిదిధ్యాస. శ్రవణ మనన నిర్విచికిత్సే అర్థే వస్తుని ఏకతయా చేతః స్థాపనం...నిధిధ్యాసనం భవతి :** అనేకముగా కనిపిస్తున్నప్పటికీ ఏకత్వ సందర్శనమునందు చిత్తము సుస్థాపించబడటము **నిదిధ్యాస!**

నిదిధ్యాసలో భేద భావాలన్నీ లయమగుచూ 1) ధ్యాతనగు నేను 2) ధ్యాన స్వరూప పరబ్రహ్మ రూపమగు ఈ విశ్వ – విశ్వాంతరములు... ఈ రెండు మాత్రమే శేషించి ఉంటాయి. అందుచేత 'ఏకాంత ధ్యానము' అని కూడా అంటారు. సర్వ విచికిత్సలు "అనునిత్య–ఆత్మానుభవము" వద్ద శమిస్తాయి. కనుక **"నిర్విచికిత్స స్థితి, కేవలానుభవస్థితి"** – సిద్ధించుచున్నాయి.

## సమాధిః

**ధ్యాతృ - ధ్యానే విహాయ, నివాతస్థిత దీప - 'ధ్యేయ' ఏక - గోచరమ్ చిత్తమ్... "సమాధిః" భవతి । : "నాకు కనబడేదంతా బ్రహ్మమే అయినప్పుడు, 'ఇదమ్ సర్వమ్ బ్రహ్మమేవ' అను సిద్ధాంతానుసారంగా నేను బ్రహ్మమునే అవుతాను. కనుక ఇదంతా నేనే"...** అనే కేవల ధ్యేయ – ఏకైక స్థితి సమాధి అని చెప్పబడింది. క్రమంగా ధ్యానము చేయువాడు – ధ్యానము చేయబడునది ... ఈ రెండు వదలి వేయబడి గాలిలేనిచోట కదలకుండా వెలుగొందు దీపమువలె **"చూడబడే జగత్తంతా నేనే"** అనే ధ్యేయ ఏక గోచర స్థితి – **సమాధి! అద్వితీయ (రెండవదేదీ లేనట్టి) స్వస్వరూప – అనునిత్యానుభవమును 'సమాధిస్థితి' అని అంటారు.**

**"సమాధి స్థితి" అభ్యాసము యొక్క దివ్యఫలము.**

ఆత్మను సర్వే – సర్వత్రా దర్శించుటయే ఏకైక **వృత్తిగా శేషించుచుండగా, ఆత్మకు వేరైనదేదీ** ఎక్కడా ఏ మాత్రమూ **శేషించక, సర్వము ఆత్మగా స్మరించు – దర్శించు స్థితియే సమాధి నిష్ఠ !** తానే సర్వమై, ఇక మనో–బుద్ధి–చిత్త అహంకారాలు మౌనము వహించి ఉండు స్థితి కాబట్టి – అది **మహామౌనస్థితి** కూడా!

**ఇహాఽది సంసారే సంచితాః కర్మకోటయ అనేనైవ విలయం యాంతి ।** ఇహ (ప్రారబ్దము) – ఆగామి – సంచిత రూపములగు కోట్ల కోట్ల సంఖ్యలలో గల కర్మ పరంపరల రాసులు ఎన్నైనా సరే... సమాధి భావనచే విలయమై పోతున్నాయి. ఎందుకంటే కనబడేదంతా తానే అయి ఉన్నప్పుడు తనకు వేరుగా కర్మఫల స్థితులేమి ఉంటాయి?

ఇట్టి సమాధి నిష్ఠ చేత 'సహస్రారము' నుండి అమృత ధారలు వర్షించుచున్నాయి. ఈ దృశ్యమంతా అమృత స్వరూపమగు ఆత్మగా స్వభావసిద్ధంగా అనుభూతమవటమే అమృతధార! యోగవిత్తముని సమాధి ఆత్మ ధర్మములను వర్షించు మేఘము వంటిది. అట్టి సమాధి ధారణాయోగికి

– **జన్మ – మరణముల** యొక్క 'సోఽ హమ్' యొక్క,

– **అంతరంగము యొక్క** తత్త్వమ్ యొక్క,

– **దేహ – దేహాంతరముల** యొక్క త్వమేవాఽ హమ్ యొక్క...,

ముందు – వెనుకలన్నీ, పరమార్థములన్నీ చేతిలోని ఉసిరిపండువలె (కరతలామలకమువలె) సర్వమూ స్వభావ సిద్ధంగా సుస్పష్టమౌతాయి.

ప్రత్యక్ష – పరోక్ష – అపరోక్ష జ్ఞానమంతా తనకు తానే పరస్పర సానుకూల్యంగా సుస్పష్టమగుచున్నది.

సర్వ ప్రతిబంధకములు తమకు తామే తొలగిపోగా, సర్వసందేహములు స్వయముగా పటాపంచలౌతాయి.

"ఆత్మ ఎదురుగానే ఉన్నది అంతటా అన్నీ తానే అయి ఉన్నది. నాకు అద్వితీయమై కూడా ఉన్నది"! పరోక్షము, ప్రత్యక్షము, అపరోక్షము.

"ఆత్మ ఇంద్రియ విషయము కాదు. కాబట్టి ప్రత్యక్షము కాదు. ఆత్మ గురించి వెతుకువానికి 'స్వస్వరూపమే' అయి ఉన్నది కాబట్టి పరోక్షము కాదు''... అని తెలియుచున్నది. అందుచేత ఆత్మ అపరోక్షమై సమాధినిష్ఠునికి స్వభావంగానే **కేవలాత్మ** అనునిత్యానుభవమగుచున్నది.

మహావాక్యార్థాలన్నీ ఘనీభూతానుభవమగుచున్నాయి. **అతడే జీవన్ముక్తుడు!**

## అపంచీకరణము

**పైఙ్గలుడు :** హేమహాత్మా ! గురుదేవా ! మీరు ఇంతక్రితముఈ సృష్టి నిర్మాణ రూపమగు పంచీకృత జగత్ నిర్మాణ చమత్కారమంతా చెప్పియున్నారు. ఇప్పుడిక **ఉపసంహరణ క్రియారూపమగు 'అపంచీకరణము'** ... గురించి కూడా వివరించమని వేడుకొనుచున్నాను.

పరమాత్మ యొక్క స్వ–అంశ అగు ఈశ్వరుని యొక్క ఇచ్ఛాను సారంగా బయల్వెడలి, సూక్ష్మ – స్థూల పాంచభౌతిక జగత్తు సృష్టి – స్థితి – లయముల రూపంగా ప్రదర్శితమగుచూ, తిరిగి ఎట్లా **ఉపసంహరణము** – (లయము) అగుచున్నాయి.

**సృష్టి క్రమము (పంచీకరణము) మీకు విశదీకరించి ఉన్నారు కదా । అట్లాగే 'లయక్రమము' గురించి (అపంచీకరణము గురించి) వివరించమని నా విన్నపము.**

**యాజ్ఞవల్క్యుడు :** సృష్టి అంతా కల్పనయే! కల్పించు పరమాత్మ సర్వదా యథాతథము. ఈ సృష్టి అంతా ఈశ్వర సంకల్పముచే ఉత్పన్నమైనదే! ఈశ్వరనిర్ణయానుసారంగా విధివిధాన నిర్మితమైనదై, ఈశ్వర సంకల్పము చేతనే పరిపోషించబడటము, కొనసాగటము జరుగుతోంది. ఇట్టి సృష్టి ఒకానొకప్పుడు ఈశ్వరేచ్ఛానుసారంగా ఉపసంహరించబడటము, మరలా పునఃసృష్టి ... ఇవన్నీ జరుగుతూ ఉంటాయి. ఇప్పుడు నీవు అడిగినట్లు సృష్టి యొక్క ఉపసంహారము (పంచీకృతము కాస్తా అపంచీకృతమవటము) ... నకు సంబంధించిన కొన్ని విశేషాలు చెప్పుకుంటున్నాము.

**ఈశః పంచీకృత భూతానాం, "అపంచీకరణమ్ కర్తుమ్ ।" - సో అకామయత ।** ఈశ్వరుడు ఒకానొకప్పుడు "నాచే పంచీకృతమై (చిన్న పిల్లవాడు ఆడుకోవటంలాగా) లీలా వినోదమువలె కొనసాగుచున్న ఈ కల్పనారూప – బ్రహ్మాండ సృష్టిని (ఆ పిల్లవాడు ఆట నుండి విరమించి ఆట వస్తువులను బుట్టలో వేసుకొని ఇంటికి చేరే ప్రయత్నము చేయు విధంగా) ... **ఈ బ్రహ్మాండ లీలా కల్పనను ఉపశమించచేసెదను గాక ।** ... అనే కోరిక పొందుచున్నారు.

ఇక ఆపై.....,

బ్రహ్మాండమును, అట్టి బ్రహ్మాండములోని లోకాలను ఆయా కార్యరూపములలో ఉన్నవాటిని – వాటి వాటి కారణ రూపములందు కలిపివేయుచున్నారు. సృష్టి యొక్క సూక్ష్మాంగములగు కర్మేంద్రియ – జ్ఞానేంద్రియములను, అంతఃకరణ చతుష్టయమును (మనోబుద్ధి చిత్త అహంకారములను)... అన్నిటినీ ఏకీకృతము చేయ సాగుచున్నారు. భావనచే సర్వ భౌతిక పదార్థములను వాటి వాటి కారణ – సూక్ష్మభూతములందు సంయోజ్యము (కలిపివేయటం) ప్రారంభిస్తున్నారు.

**భూమిని - జలమునందు ; జలమును - వహ్ని (అగ్ని) యందు ; వహ్నిని - వాయువునందు ;వాయువును - ఆకాశమునందు; ఆకాశమును - అహంకారమునందు ; అహంకారమును - అద్దాని కారణభూతమగు 'మహత్తు' నందు ; (సమిష్ఠి రూప**

**అహంకారమునందు), మహత్తును - అద్దాని కారణరూపుమగు 'అవ్యక్తము'నందు ; అవ్యక్తమును - తత్ కారణ భూతమగు పురుషుని యందు ; పురుషుని - విరాట్ పురుషునియందు...**

క్రమక్రమముగా విలీనము (ఈశ్వరునిచే) చేయబడుచున్నాయి. భావనచే తత్-తత్ ఉత్తరోత్తర దర్శనము చేయుచున్నారు. ఆ విరాట్ పురుషుడు **హిరణ్యగర్భునియందు,** హిరణ్యగర్భుడు **ఈశ్వరుని**యందు లయమొందుచున్నారు. ఈశ్వరుడు మాయోపాధిని త్యజించినవారై **'పరమాత్మ'** యందు లీనమగుచున్నారు. పరమాత్మగా భావించబడుచున్నారు!

## స్థూలదేహ అపంచీకృతము

సూక్ష్మ మహాభూత పంచీకృతముచే సంభవిస్తున్నటువంటి – కర్మ సంచితమైన స్థూలదేహము... – కర్మలు క్షయించటము జరిగినప్పుడు **'అపంచీకరణము'** ప్రాప్తించుచున్నది. స్థూల పంచభూతములు సూక్ష్మరూపముగా ఏకీభూతమగుచున్నాయి. కారణ రూపము పొందుచున్నాయి. అట్టి కారణము అద్దానికి కారణమగు **'కూటస్థ ప్రత్యగాత్మ'** (Absolute self) యందు విలీనము అగుచున్నది.

– ఇక విశ్వుడు (జాగ్రత్ అభిమాని), తేజసుడు (స్వప్నానుభవ అభిమాని) ప్రాజ్ఞుడు (గాఢ నిద్రాభిమాని) తమ తమ ఉపాధులు (Fields) లయమగుచుండగా, వారుకూడా **ప్రత్యగాత్మయందు** విలీనమగుచున్నారు.

ఈ బ్రహ్మాండము-బ్రహ్మాండాభిమానితో సహా-జ్ఞానాగ్నియందు దగ్ధమై కార్య-కారణములతో సహా **పరమాత్మ**యందు లీనము అగుచున్నది.

ఏవిధంగా ఆకాశంలో మేఘములు తొలగగానే సూర్యుడు స్వయముగా ప్రకాశమానుడై అగుపిస్తున్నారో, ఆవిధంగా అజ్ఞానము తొలగుటచే ఆత్మానుభము, ఆత్మతో ఏకత్వము అనుభూతమగలదు. పరమాత్మగా సర్వము శేషించినదై, అన్యత్వమంతా "రహితము-లేనిది"...గా అగుచున్నది. **అనన్యత్వము సిద్ధిస్తోంది.**

అందుచేత ఓ పైఙ్గలా ! ఈ జీవుడు ఈ సర్వమునకు ఆవల సర్వదా ప్రకాశమానమై ఉన్నట్టి, ఈ ఎదురుగా కనిపించే భేధములన్నిటి నుండీ దృష్టిని మరల్చి **"తత్త్వమ్ (నీవు బ్రహ్మమునే)"** అను తత్త్వ భావనను ఆశ్రయించి తత్ పదముతో సర్వదా ఐక్యము పొందే ప్రయత్నము నందు సదా, సర్వదా స్వయం నియమితుడు కావటమే ఉచితము. అప్పుడు స్వస్వరూప – పరబ్రహ్మతత్త్వముతో ఈ జీవుడు ఏకీభూతుడై, **బ్రహ్మమే తానై ప్రకాశించగలడు.**

## ధ్యేయము

మనలో ప్రతి ఒక్కరి హృదయములో పొగలేని దీపమువలె జ్యోతిస్వరూపుడై, అంతరమున పరమాత్మ సదా వెలుగొందుచున్నారు.

**అంగుష్ఠ మాత్రమ్ ఆత్మానమ్, "అధూమ జ్యోతి" రూపకమ్। ప్రకాశయంతమ్ అంతస్థమ్, ధ్యాయేత్ కూటస్థమ్, అవ్యయమ్ ।**

బొటనవ్రేలు ప్రమాణమై, తత్ జ్యోతి స్వరూపమై, కూటస్థమై మార్పు చేర్పులు లేనిదై, పొగలేని అగ్నివలె సదా అంతస్థముగా తనలో ప్రకాశించుచున్న ఆత్మయే ఎల్లప్పుడు ధ్యానము చేవలసిన వస్తువు. (ధ్యేయ వస్తువు).

## జీవన్ముక్తులు

ఎవ్వరైతే తనయందు సర్వదా ప్రకాశించుచున్న కూటస్థ అవ్యయ జ్యోతి స్వరూప పరమాత్మను **స్వస్వరూపునిగాను,** ఈ **విశ్వరూపునిగా కూడాగాను, సర్వ స్వరూపునిగాను** నిరంతరము ధ్యాస కలిగి ఉంటారో..., తదితరమైన సర్వ విషయముల పట్ల మునులై మౌనము వహించి ఉంటారో, అట్టి వారు **అమృత స్వరూపులు!** వారే జీవన్ముక్తులు! వారు సర్వ సంసార విషయ బంధముల నుండి విముక్తులై జగత్తునందు లీలగా, దేనిచేతనూ స్పృశించబడక జీవిస్తున్నవారు.

**స విజ్ఞేయో ।** : వారు తెలుసుకొనవలసినది తెలుసుకొని ఉన్నవారు.

**కృతకృత్యః ।** నిర్వర్తించవలసినది నిర్వర్తించినవారు, పొందవలసినది పొందినవారు.

**స ధన్యః ।** : వారు ధన్యులు

కనుక జీవన్ముక్తుడు కావటానికై **"నా హృదయమునందు సదా వెలుగొందు ఆత్మజ్యోతి రూప తేజో విభవమే నేను! ఈ సర్వేజీవులు, ఈ దృశ్య జగత్తు కూడా ఆత్మయే! ఆత్మనగు నేనే!"** అని సదా ధ్యానము చేస్తూ ఈ జీవుడు అమృత స్వరూపుడు, కృతకృత్యుడు, ధన్యుడు అయి, జీవన్ముక్తుడై ప్రకాశించుచున్నాడు.

## విదేహముక్తుడు

**శ్లో॥ జీవన్ముక్తపదం, త్యక్త్వా స్వదేహే కాలసాత్ కృతే,**
**విశత్య దేహముక్తత్వం, పవనో అస్పందతామ్ ఇవ ।**

ఈ విధంగా **నేను - నీవు - జగత్తు**లను **అఖండ - ఆత్మజ్యోతి రూపము**గా దర్శించుచూ ధ్యానించువాడు క్రమంగా 'జీవన్ముక్తము' అను పదమును కూడా దాటి పోవుచున్నాడు. **విదేహముక్తుడగుచున్నాడు.**

1) జీవన్ముక్తుడనై అఖండాత్మ ధ్యానము చేయుచున్నట్టి **'ధ్యాని'** స్వరూపుడనగు "నేను".

2) **ధ్యాన** విషయమగు అఖండాత్మజ్యోతి స్వరూపము.

... అను ద్వంద్వమును కూడా త్యజించి వేస్తున్నాడు.

కాలవశాత్ వచ్చియున్న జీవాత్మత్వ భావనను త్యజించి, దాటివేసి, కాలమును దాటివేసి, ధ్యాని - ధ్యేయ - ధ్యానముల ఏకత్వముచే అనిర్వచనీయమగు **'విదేహముక్తి'** యందు ప్రవేశించుచున్నాడు. తానే సర్వమై రెండవ వస్తువే లేనివాడై... వెలుగొందుచున్నాడు. వాయువు - వాయుతరంగముల భేదము అస్పంద వాయువునందు ఏ మాత్రము శేషించి ఉండని రీతిగా... ఆ విదేహముక్తుడు సర్వము తానై ప్రకాశించుచున్నాడు. **అది అనిర్వచనీయం!**

**జీవన్ముక్తుడు - సర్వము తనయందు దర్శించువాడు.** తాను వాయుతరంగ స్వరూపుడై వాయువును దర్శించువాడు.

**విదేహముక్తుడు - "సర్వము తానే" అయి వెలుగొందువాడు.** తనకు వేరైనదంటూ ఏదీ లేనివాడు. స్పందరహిత - వాయు తరంగరహిత వాయు స్వరూపము వంటివాడు. ఉపాసన - ఉపశించబడునది - ఉపాసకుడు... అనే భేదము కూడా రహితమై ఉన్నవాడు. జీవాత్మ - పరమాత్మల ద్వితీయత్వమంతా రహితమైపోగా, అద్వితీయత-దివ్యజ్యోతి స్వరూపత్వము స్వభావసిద్ధమగు స్థితి!

**దృశ్యము త్వమ్ - తత్ - ఈ మూడూ తానే అయి వెలుగొందుచున్నవాడు - విదేహముక్తుడు.**

ఇంకా విదేహముక్తి ఎట్టిది ?

- శబ్దములతో చెప్పగలిగేదికాదు... శబ్దరూపము కాదు. **అశబ్దమ్ !**
- స్పర్శకుఅనుభవమయ్యేది కాదు. **అస్పర్శమ్!**
- నాలుకకు రుచి అనుభవముగా అయ్యేదీ కాదు. **అరసమ్!**
- అది కొంతసేపు అనుభవముగా ఉండి, మరల పోయేదీకాదు. **నిత్యమ్!**
- ముక్కుకు గంధమువలె అనుభవమయ్యేదీ కాదు. **అగంధమ్!**
- ఒకప్పుడు ప్రారంభమైనట్టి కాదు. **అనాదిమ్**
- మరొకప్పుడు అంతమయ్యేది కాదు. **అద్యంతరహితమ్! అనన్తమ్!**
- సర్వమూ తానే అయి సర్వముగా వెలుగొందుచూ ద్రష్ట-దర్శన-దృశ్యము లందు ఏకరూపమై వెలుగొందుచున్నట్టిది. **మహత్!**
- సర్వరూపములు తానే అయి, అరూపి అయి, సర్వమునకు ఆవల - ఈవల కూడా ఏకరూపమై ఉన్నట్టిది. స్వప్నము తనదైనవాడు స్వప్నమునకు ఆవలయే ఉన్న రీతిగా, స్వప్నాంతర్గత ద్రష్ట - స్వప్న స్వరూపుడు కూడా అయినట్లు... ఏదీ కాక - అన్నీ అయి ఉండువాడు. **పరమ్!**
- తన **సర్వతత్త్వ స్వరూపము** ఏమాత్రమువిడువనివాడు. ఏ మాత్రమూ **స్వస్వరూప సర్వ స్వరూపము** నుండి చెక్కు చెదరనివాడు. **- ధృవమ్.**

... అది ఒక్కటే మార్పు - చేర్పులు లేనిదై సర్వదా శేషించి ఉన్నట్టిది. **ఆదిశేష్యమ్! సర్వశేష్యమ్!**

- అద్దానిని దేహ మనో బుద్ధి చిత్త అహంకారాల దోషము అంటజాలదు. **అమలమ్! స్వభావతః నిత్యనిర్మలమ్!**
- అందులో అహమ్ - త్వమ్ - తత్ భేదమే లేక, మరింకొకటేదీ లేనట్టిది. **నిరామయమ్!**

**తదేఽవ అవశిష్యతి ।**

సర్వము లయించినప్పుడు కూడా అదొక్కటే శేషించి ఉన్నట్టిది. అది **'అరూపరూపం'!**

విదేహముక్త స్వరూపమే ప్రతి జీవునియొక్క **వాస్తవ - సహజ స్థానం!** అది అనుభవైనకవేద్యము చేసుకొనుటయే మానవ జన్మయొక్క మహత్ ఉద్దేశ్యం! అసలు ఉద్దేశ్యం!

## చతుర్ధ అధ్యాయము - ఆత్మజ్ఞానానుభవం

**పైఙ్గలుడు :** స్వామీ ! జ్ఞానినః కిం కర్మ ? కాచ స్థితిః ? పూర్ణాత్మజ్ఞాని యొక్క కర్మలు ఎట్టివి ? అతని స్థితి ఏమిటి ? దయచేసి వివరించండి.

**యజ్ఞవల్క్యుడు : అమానిత్వాది సంపన్నో, ముముక్షుః** జ్ఞాని స్వతఃగానే అమానిత్వము మొదలైన జ్ఞానస్వభావములచే స్వభావసిద్ధముగా సంపన్నుడై ఉంటాడు.

**జ్ఞాన లక్షణములు (భగవద్గీత – 13వ అధ్యాయము)**

| అజ్ఞాన సంపద | జ్ఞాన లక్షణములు - జ్ఞాన సంపద |
|---|---|
| వారి - వీరికంటే కూడా నేనుకొంత ప్రత్యేకమైనవాడను! మా కులము - జాతి మొదలైనవి గొప్పవి! (మానిత్వం) | **అమానిత్వము:** - నేను - వారు, వీరు ... అంతా అందరమూ అఖండాత్మ స్వరూపులము. ఇక నాకు ప్రత్యేకత ఎందుకు ? జీవుడుగా చూస్తే ఒక చీమ కూడా గొప్పదే! అందు నా ఉపాసనా విషయమగు అఖండాత్మ వేంచేసియే ఉన్నది కదా! |
| నా గొప్ప నేను చూపుకోవాలి కదా ! (దంభము) | **అదంభము :** సర్వ స్వరూపమగు ఆత్మయే నేనై ఉండగా, ఆత్మ స్వరూపులే అగు తదితరులకు నాదంభము (లేనిది ఉన్నట్లు)- గుర్తింపులతో పనేమున్నది? |
| ఇతరుల బాధ పడితే నాకేమిటంటా ? బలము-తెలివి-పదవి- ధనము మొదలైన సంపదలతో తదితరములను నా చెప్పు చేతలలో ఉంచటమే గొప్ప! **(హింస)** | **అహింస :** అన్ని రూపాలు నేనే కనుక, ఒకరిని బాధించటము, హింసించము - నన్ను నేను బాధించుకోవటమే ! నా వలన ఒకరికి కలిగే సంతోషము నా సంతోషమే । |
| నాకున్న బాధలు ఎవరికున్నాయి ? అందరూ తప్పు చేస్తున్నారు! నేను అట్లా కాదు! ఇతరులవలన నాకు బాధలు ఉంటున్నాయి! నావలన ఇతరులకు కలిగే బాధలు-నేను వినను! నాకు చెప్పకండి! **(ఓర్పు లేకపోవటం)** | **క్షాంతి :** బాధలు అందరికీ ఉంటాయి. ఓర్పు కలిగి ఉండటమే నేర్పు. నేనూ ఇతరులకు కొంత బాధ కలిగించక తప్పదు. ఓర్పు పెంచుకోవటానికే బాధలు. |
| లోపల ఒక తీరు గాను, బయటకు మరొక తీరుగా ఉండటమే లౌకికము. అట్లు తప్పదు కదా ! చెప్పేదొకటి-చేసేది మరొకటి... ఇది ఉచితమే **(కుటిలత్వం).** | **ఆర్జవమ్ :** కుటిలత్వ రహితంగా, త్రికరణశుద్ధిగా (మాట - మనో - బుద్ధులయందు) ఏకభావము, సారుప్యత్వమే ఉచితము ! |
| నాకు తెలియదా ? యింకొకడు నాకు చెప్పేదేమిటి ? గురువును నమ్మాలా? అక్కర్లేదు. ఎవ్వడు గురువు? ఎవ్వడు శిష్యుడు? **(ఆచార్యులపట్ల తిరస్కారభావం).** | **ఆచార్యోపాసనమ్ :** మహనీయులు ఉన్నారు. వారి బోధలు, ఆప్త వాక్యములు నాకు శిరోధార్యములు, మార్గదర్శకములు. |
| ఈ రోజులలో ఎక్కువ మందిని నమ్మేటట్లుగా లేదు ! అందరూ చెడ్డవారే మరి ! ద్వేషము - కోపము - అసూయ - పరనింద - ఆత్మస్తుతి - అనుమానము - మొదలైనవి - **అశుచిభావాలు!** | **శౌచము :** మానవుడన్న తరువాత లోపాలుంటాయి మరి ? నాలోనూ ఉన్నాయి. అంతా ఆ పరమాత్మ యొక్క జగన్నాటక చమత్కారమే! అందరిలోనూ మంచి కూడా ఉన్నది. అది నేను గమనించాలి. అందరూగా వేంచేసియున్న పరమాత్మయే నా ఉపాసనా రూపం! |
| జీవితం వచ్చిందే ఇంద్రియాలతో విషయానుభవములకొరకాయె ! అందుకని తినటము, త్రాగటము, గంతులేయటం-ఇదీ మన పని ! | **ఆత్మనిగ్రహమ్ :** ఇంద్రియములు దేవతా ప్రసాదితములు. సద్వినియోగము కొరకై నేను సక్రమంగా నియమించు కోవాలి ! లేదా అధమగతులు తప్పవు ! |
| శబ్ద స్పర్శ రూప రస గంధములతో ఇష్టమైనవి పొందాలి కదా!-ప్రేయో మార్గమే (ప్రియమైనవి పొందప్రయత్నించుటచే)... ఇప్పటి మన కర్తవ్యం | **ఇంద్రియార్థేషు వైరాగ్యమ్ :** ఇంద్రియ విషయముల పట్ల రాగము లేకుండా విరాగికై ఉండటము చేతనే జీవితము సద్వినియోగమౌతుంది. రాగము - బంధము! విరాగము ముక్తి! |

| | |
|---|---|
| **నేను - నాది...** వీటిని పరిరక్షించుకోవాలి ! ఇవి నాకు సుఖప్రదము. ఇవియే నా సంపద! నా గొప్పతనం. నేను లోకంలో కాపాడుకోవాలి! **--(అహమ్‌కారము)--** | **అనహంకారము :** 'నాది' అని పించేదంతా నేను తెచ్చుకోలేదు. పరమాత్మచే ఇవ్వబడింది. అందుచేత అంతా ఆయనదే ! నాదంటూ ఏమీ లేదు. అహమ్ -మమలకు సుదూరంగా ఉండటమే సుఖ ప్రదము. జాగ్రత్‌లోని 'నేను' చే నేనుగాని, మరెవ్వరముగాని పరిమితులము కాదు. |
| పుట్టాము. ఎట్లాగైనా హాయిగా ఉందాము ! అయిపోయే ! ఇంకేమున్నది? తరువాత ఏమటో ఇప్పుడెందుకట? --దోషములు పరిశీలించకపోవటం-- **(దోష అపరిశీలనమ్)** | **జన్మ - మృత్యు - జరా - వ్యాధి దుఃఖ దోష అను దర్శనమ్ :** జన్మ-మృత్యువు - ముసలితనము - వ్యాధులు... ఇటువంటి దుఃఖ దోషములు ఈ దేహానికి ఉంటున్నాయి. కనుక సమయం వృధా చేసుకోకూడదు. ఇంద్రియ వశములమై ఉండరాదు. 'జీవితము' అనే అవకాశమును జ్ఞానము కొరకై సద్వినియోగం చేసుకోవాలి. |
| కొడుకులు... భార్య ... భర్త... గృహములు... ఇవన్నీనావి. నేను వీరందరికీ చెందినవాడను! నా సంపదే యివన్నీ! వీటిపట్ల మమకారమేనా సుఖం! **-- సక్తత--** | **అసక్తిః అనభిష్వంగః పుత్రదార గృహదిషు :** భార్య - భర్త - పుత్రులు నావారు... కానివారు... ఇవన్నీ పట్టుకొని వేలాడకూడదు. వీటితో ఆసక్తి (Attachment) అవసరం కాదు. ఇవన్నీ పరమాత్మవి! నేను సేవకుణ్ణి! - అసక్తత. (Non Attachment) యే త్రోవ! |
| జీవుడు - మంచివాడు - చెడ్డవాడు - దేవుడు - ప్రకృతి - జ్ఞానులు - అజ్ఞానులు ... ఇవన్నీ వేరు వేరు విషయాలు ఇదంతా అనేక భేదాలతో కూడుకొని ఉన్నది. వాటిని బట్టి నేను బ్రతకాలి. -- **(అన్యపరిమిత దృష్టి, దృశ్యదృష్టి, సంసార దృష్టి)** | **మయిచ అనన్య యోగేన భక్తిః అవ్యభిచారిణిః :** ఇదంతా పరమాత్మకు అనన్యము. పరమాత్మవలె అంతా ప్రేమా స్పదమే... అను-భావనలతో భక్తి (ప్రేమ)ని వదలక పోవటము. భక్తితో అవ్యభిచారుడనై ఉండటము ముఖ్యము. |
| నేను'భక్తుడను' అని 'జ్ఞానిని' అని, 'యోగిని' అని అందరూ గమనించరేం ? నా గొప్పతనం పదిమందికి తెలియాలికదా! నా యోగ-జ్ఞాన స్థితులను ఇతరులకు చెప్పి,.... మెప్పు పొందాలి **(జనాభిప్రాయ ఆవశ్యకత్వం)** | **వివిక్త దేశ సేవిత్వం :** భక్తి - ప్రేమ - జ్ఞానము - యోగము ... ఇవన్నీ నాకు పరమాత్మకు ఉన్న ఏకాంత సంబంధము. మరొకరి గొప్ప నాకెందుకు ? అవ్యాజమైన ప్రేమరూపమగు భక్తిని ప్రవృద్ధం చేసుకుంటాను. |
| పదిమందితో కలసి లోకవ్యవహారాలు మట్లాడుకుంటూ, ఆ కబుర్లు - ఈ కబుర్లు చెప్పుకుంటే కాస్త కాలక్షేపం। **(లోకవ్యవహారాలపట్ల ఆకర్షిత రూపముగు 'రతి')** | **అరతిః జన సంసది :** లోక వ్యవహారాలు మాట్లాడుకుంటూ "వాళ్ళు అట్టివారు - వారిని నమ్మకూడదు"... అనేకబుర్లుకు దూరంగా ఉండటమే నాకు మంచిది. లేదా, బ్రాహ్మీ దృష్టి'కి దూరమవుతాను కదా ! |
| ముందుగా లౌకిక వ్యవహారాలు. ఆ తరువాత, ముసలివాడిని అయినప్పుడు, దేవుడి గురించి చూద్దాంలే ! | **ఆధ్యాత్మజ్ఞాన నిత్యత్వమ్ :** ఆధ్యాత్మ శాస్త్రవేత్తలు ఆత్మబంధువులై ప్రేమాస్పదంగా నా సహజ స్వరూపం గురించి చెప్పే విశ్లేషణలు, విశేషాలు ఎప్పుడూ నేను మననము చేస్తూ, నిత్యమూ ఆధ్యాత్మ జ్ఞానము గురించిన దృష్టి కలిగి ఉండటము నాకు శుభము. |
| ఏమిటో 'తత్ త్వమ్' అంటూ ఏదో చెప్పుతారు. లోకార్థాలనువదలాలా ఏమిటి ? లోక సంబంధ విషయాలు, లౌకిక ఆశయాలు వదిలితే ఎట్లా ? ఇహజ్ఞానం ఇప్పటికి చాలు! పరజ్ఞానం తరువాత - అప్పటి మాట! **(తత్త్వార్థమును అవలోకించకపోవటం)** | **తత్త్వజ్ఞానార్ధ దర్శనమ్ :** "నీ సహజమగు అఖండాత్మ స్వరూపమును ఏమరచి సందర్భ సంబంధిత రూపమునకు పరిమితుడనై 'బద్ధుడను' అని అనకయ్యా !"... అని ఏ తత్త్వార్థ వాక్యాలు చెప్పబడుచున్నాయో వాటి అర్థమును బుద్ధితో దర్శించెదనుగాక ! బుద్ధిని తత్త్వార్థ జ్ఞానముచే సునిశితము, విస్తారము, ప్రశాంతము చేసుకొనెదను గాక! |

ఈ విధంగా (భగవద్గీతలో శ్రీకృష్ణ ప్రవచితంగా వివరణగా చెప్పబడిన) అమానిత్వము మొదలైన జ్ఞాన గుణములను జ్ఞాని కలిగియుండి, వాటిని పరిపోషించుకుంటూ, పరిరక్షించుకుంటూ ఉంటాడు. అట్టి అమానిత్వము మొదలైన జ్ఞాన గుణములు కలిగియున్న ముముక్షువు యొక్క '21' తరములవారు తరించగలరయ్యా! అవన్నీ పునికి పుచ్చుకొన్న బ్రహ్మవేత్త వలన 101 కులాలు (తరాలు) పరమపవిత్రమగుచున్నాయి.

## నిత్యానంద స్వస్థానం

**"అసలీ దేహమును ఎందుకొరకై ఈ జీవుడు పొందుచున్నాడు?"**... అని ప్రశ్నిస్తే... **'ఆనందస్థితి సముపార్జించుకోవటానికి, స్వభావసిద్ధం చేసుకోవటానికి!"**.... అనునది సమాధానము. మరి అట్టి **శాశ్వత - అఖండ ఆనందము** లభించేది ఎట్లా ? ఇంద్రియానందము సర్వదా దుఃఖమిశ్రితము, దుఃఖ పరిణామయుతము కూడా ! ఆత్మజ్ఞానము చేతనే శాశ్వతానందము లభించగలదు. మరి ఆత్మజ్ఞానము లభించేది ఎట్లా ? ఈ జీవుడు 'జ్ఞాని'గా అయ్యేది ఏ మార్గంలో ? ఆత్మజ్ఞులగు మహనీయులు **"ఈ జీవాత్మత్వమును ఎట్లా దర్శించాలి?"** .... అను ప్రశ్నకు ఒక **దృష్టాంత పూర్వక సమాధానం** చెప్పుచున్నారు. వినండి.

**ఆత్మానం రథినం విద్ధి :** ఈ జీవాత్మ రథములో అధిరోహించియున్న రథికుడు. **రథము ఉపయోగించి ప్రయాణించువాడు.** (Traveller and possessor of the chariot). ఆతడు చేరవలసినది పరమానంద స్థానము. దేహమును స్వీకరించటం, జీవుడుగా ధారణ చేయటం - అట్టి నిత్యానంద స్థితి కొరకు మాత్రమే! అంతేగాని, దృశ్యంలో ఏదో సొంతం చేసుకొని, తీసుకు వెళ్ళాలని కాదు.

**శరీరమ్ రథమేవచ :** ఈ శరీరము - ఆత్మజ్ఞానానందము అనే పవిత్ర స్థానమునకు చేర్చటానికై ఎన్నుకొన్న 'రథము'.

**బుద్ధింతు సారథింవిద్ధి :** ఈ బుద్ధి-ఆనంద స్థానముచేరటానికి రథికుడు (జీవుడు) నియమించుకొన్న రథసారథి. (రథమును నడుపువాడు).

**మనఃప్రగ్రహమేవచ :** మనస్సు ... బుద్ధిగుర్రములను నడుపుటకై తయారు చేసుకున్న 'కళ్లెము'

**ఇంద్రియాణి హయాని అహుః :** పంచ జ్ఞానేంద్రియములు దేహరథానికి వున్చిన గుర్రములు.

**విషయాం తేషు గోచరాన్ :** శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు ఆ ఇంద్రియ గుర్రములకు ఎదురుగా కనిపించే మేతవంటివి. ఇంద్రియము - ఇంద్రియ విషయములు ... ఒక రాజుకు గుర్రములవలె ప్రయాణ పరికరములు!

**జంగమాని విమానాని :** కర్మేంద్రియపంచకము (జంగములు) ఆ దేహ - రథవిమానము యొక్క ఇరుసు కదలికలు.

**హృదయాని మనీషిణం :** హృదయములోనే దేహరథ ప్రయాణము. ఆత్మానంద స్థానము స్వకీయ హృదయములోనే ఉన్నది.

**ఆత్మ - ఇంద్రియ మనోయుక్తమ్ - భోక్తే ఇతి ఆహు మహర్షయః.** జీవాత్మ - ఇంద్రియములు + మనస్సుతో కూడి ఈ దేహమునకు భోక్త (Experience) గా ఉన్నాడు - అని మహర్షులు ప్రవచిస్తూ గుర్తు చేస్తున్నారు.

ఓ పైజ్జల మహాశయా ! ఇదంతా ఇట్లా ఉండగా... సర్వాంతర్యామి అగు శ్రీమన్నారాయణుడు భోక్త అని, 'ప్రత్యగాత్మ'గా హృదయములో సుప్రతిష్టుతుడై ఉన్నారని సత్యద్రష్టలగు మహర్షులు (శృణ్వంతి విశ్వే, అమృతస్య పుత్రః, తస్యాంతమ్ సుషిరుగ్ం - సూక్ష్మమ్! తస్మిన్ సర్వమ్ ప్రతిష్ఠితమ్) అని గుర్తు చేస్తున్నారు.

**ఆత్మదర్శి...** ఈ దేహమును ఏ తీరుగా చూస్తున్నాడు? దేహము ఉన్నప్పుడు సర్వనియమిత కర్మలు నిర్వర్తిస్తూనే ..., పాము కుబుసమును విడచివేయునట్లుగా **సర్వకర్మఫలములను పరిత్యజించినవాడై ఉంటున్నాడు.**

ఏవిధంగా అయితే పూర్ణ చంద్రుడు "ఇది మాత్రమే నాగృహము"... అనునది లేకుండానే... ఆకాశంలో పరమ ప్రశాంతంగా ఆకాశమంతా సంచరిస్తూ తన అమృత కిరణములను అన్ని వైపులా ప్రసరింపజేస్తూ ఉంటారో..., అట్లాగే ఆత్మజ్ఞాని అమృత కిరణములు వెదజల్లుచూ ముక్తుడై ఈ భూమిపై పూర్ణచంద్రునివలె సంచారములు చేస్తున్నాడు. అట్టి విదేహముక్తుడు కాల నిర్ణయానుసారం సమయము - సందర్భము వచ్చిన తరుణంలో తీర్థ స్థలంలోగాని, (లేదా) ఒక శ్వపచుని (శూద్రుని) గృహంలోనైనా గాని - వస్త్రమును తొలగించుకొను రీతిగా భౌతిక తనువును త్యజించుచూ, ప్రాణములను సప్రాణముతో ఏకం చేసి - **'కైవల్య పదము'** నందు ప్రవేశించుచున్నాడు. **'ముక్త పదాభిషిక్తుడు'** అగుచున్నాడు.

# ఆత్మసంయమయోగి అగు ముక్తుడు - మరణ సంస్కారాలు

**పైజ్గలుడు :** మహాత్మా ! లోక సంబంధమైన విషయముగా అడుగుచున్నాను. అట్టి పూర్ణానంద ఆత్మజ్ఞాన సమన్విత విదేహముక్తుడు కైవల్యమును పొంది, అటుతరువాత కాలానుగతంగా దేహమును విడచినప్పుడు, ఆ మహనీయుడికి మృతదేహ సంస్కారములు చేయు శాస్త్ర విధి ఎట్టిది ?

**యాజ్ఞవల్క్యుడు :** కైవల్యము బుద్ధి సంబంధమైనదే కానీ,... భౌతికదేహ సంబంధమైనది కాదు. అట్టి విదేహముక్తుడు భౌతిక దేహమును త్యజించి కైవల్యము పొందినప్పుడు,... వారి భౌతిక దేహమును..., శాస్త్రప్రవచనానుసారంగా...

– 'దిక్‌బలి' (ఊరుకు దూరంగా జనసంచారంలేని ప్రదేశములో పక్షులు, కీటకములు భక్షించటానికి వీలుగా వదలిరావటము) చేస్తారు.

– లేదా 'ఖననము' (పాతిపెట్టటము) చేస్తారు.

సన్యాసి ఆశ్రమవాసికి మాత్రమే "ప్రవ్రజనదీక్ష" (ఎక్కడా ఒకచోట దీర్ఘకాలము ఉండకూడదను దీక్ష) నియమించబడింది. **నేఽతరాయ కదాచన । తదితరులకు కాదు.**

బ్రహ్మీభూతుడగు భిక్షువుకు (భిక్షక సన్యాసికి) మరణానంతరము శౌచక క్రియలుగాని, అగ్నికార్యములు కానీ, పిండోదకక్రియలుకానీ, శ్రాద్ధములు గాని, పార్వణము (పిండ ప్రదానములు, ధర్మోదకములు) గాని ఉండవు. ఒకసారి చక్కగా ఉడికించి వండిన కూరను మరల ఉడికించవలసిన పని ఉండదు కదా ! **దగ్ధస్య దహనం నాస్తి పక్వస్య పచనం యథా ।**

... అదే రీతిగా,

**జ్ఞానాగ్ని దగ్ధ దేహస్య న చ శ్రాద్ధం । న చ క్రియా ।** ఆ ముక్తుడు జ్ఞానాగ్నిచే **"దేహము నాకు సంబంధించినది. దేహమునకు నేను సంబంధించినవాడిని"**... అను **దేహభావనయే** మొదలంట్లా దగ్ధము చేసివేసినవాడై ఉంటున్నారు. అందుచేత ఇక వారిపట్ల దేహత్యాజ్యానంతరము శ్రాద్ధ – పిండ ప్రదాన క్రియల అగత్యమేమీ ఉండదు. ఆత్మజ్ఞాన సంపన్నుడగు ముక్తుడు దేహానంతరం క్రొత్తగా పొందవలసిన స్థితిగాని, గతిగాని ఏదీ శేషించి ఉండదు.

## గురుశుశ్రూష

**పైజ్గలుడు :** ముముక్షువులమగు మేము ముక్తినిపొందే సులభోపాయం సూచించండి.

**యాజ్ఞవల్క్యుడు :** 'తత్‌త్వమ్' (నీ సహజ స్వరూపము శాశ్వతము – నిత్యము – అఖండము అగు ఆత్మయే)... అను పరమ సత్యము – ఆత్మతత్త్వజ్ఞుడు అగు సద్గురువు యొక్క శాస్త్రార్థపూర్వక (మరియు) స్వానుభావ పూర్వక **ప్రవచనము**చేతనే ముముక్షువుకు సుస్పష్టము కాగలదు. అందుచేత అనుభవజ్ఞుడగు సద్గురువును ఆశ్రయించి 'సోఽహమ్' .. భావమును శాస్త్రవ్యాఖ్యాన సహితంగా సునిశ్చయము చేసుకోవాలి. 'తత్‌త్వమ్' అనునది గురుబోధ. 'సోఽహమ్' అనునది తత్త్వదర్శనముచే శిష్యుడు సంపాదించుకోవలసినది!

అందుచేత, **యావచ్ఛ ఉపాధి పర్యంతమ్, తావత్ శుశ్రూషయేత్ గురుమ్'...!** ఈ భౌతిక ఉపాధి భావనశేషించి ఉన్నంతవరకు గురుబోధనములను, గురు బోధావిశ్లేషణములను, గురు శుశ్రూషను ముముక్షువు విడవనేకూడదు. దేహమున్నంత వరకు గురువును ఉపాశించాలి. గురువును ఎంతటి భక్తి – ప్రపత్తులతో సేవిస్తారో, గురుపత్నిని, గురుపుత్రుని అంతటి భక్తి – ప్రపత్తులతో ఉపాసించుచుండటము ముముక్షువుకు శుభప్రదము.

**శుద్ధమానసము :** యోచనలు ఏవైనా, ఎట్టివైనా కూడా..., వాటి వాటి యొక్క ఉత్పత్తి స్థానము మాత్రము మనస్సే ! అనగా **సర్వ ఆలోచనలకు మునుముందే 'మనస్సు' అనునది ఉండి ఉన్నది.**

1) ఏ స్థానము ఆలోచనలు జనించటానికి ఉత్పత్తి స్థానమో,

2) దర్పణములో ప్రతిబింబించు దృశ్యములోని శుభాశుభములు ఏ తీరుగా దర్పణమునకు సంబంధించక – స్పృశించక ఉంటాయో, ఆ తీరుగా ఏ స్థానము ఆలోచనల శుభాశుభములతో స్పృశించబడకున్నదో... అదియే **'శుద్ధమానసము'.**

'కేవలమనస్సు' ను గమనిస్తూ ఉండటమే శుద్ధమానసమార్గ దర్శనము. అదియే కైవల్యము కూడా!

**శుద్ధచిద్రూపము :** చిత్ – ఎరుక. ఏదైతే ఎరుగబడుచున్నదో అదంతాకూడా చిత్ ప్రదర్శించు కళా విశేషము చేతనే ఎరుగబడుచున్నది. అనగా... ఎరుగబడుచున్న సర్వమునకు మునుముందే **'ఎరుక'** రూపముగా చిత్ కళ ప్రకాశమానమైయున్నది.

ఏ విధంగా అయితే సూర్యకిరణము ఒకానొక వస్తువుపై ప్రసరించుచున్నప్పటికీ, ఆ వస్తువు యొక్క దోషములు సూర్యకిరణమును స్పృశించవో (సూర్యకిరణమును ఆదోషము అంటదో), ఆ విధంగా... తెలియబడుచున్న విషయముల శుభాశుభములు కేవలమగు 'చిత్' అనబడు తెలివికి అంటదు. (అది కేవల చిత్ అయి ఉన్నది కదా!)

ఏ 'చిత్‌రూపము' ... ఎరుగబడుచున్నదానికంతటికీ మునుముందే ఉన్నదో... అట్టి చిత్‌ను **"శుద్ధ చిద్రూపము"**... అని పిలుస్తారు.

అట్టి **శుద్ధ మానసము** (కేవల మనోరూపము) మరియు **శుద్ధ చిద్రూపము** (కేవల చిత్) చేతనే "నేను" సర్వదా ఆత్మస్వరూపుడనే - "సోఽహమస్మి" అను మహత్తరార్ధము **సుస్పష్టము** అయి, **సుప్రకటితము** అగుచున్నది. **(1) గురువాక్యముల నిగూడార్ధము, (2) గురు - ఆప్తవాక్యముల ఆత్మ సందర్శన సూచనలు, (3) గురు ప్రవచన - విశ్లేషనముచే ఆత్మ జ్ఞానము లభించుచున్నది.**

గురుప్రసాదిత జ్ఞానముచే విజ్ఞానము (Application of what is heard) రూపము దిద్దుకొని ప్రవృద్ధమగుచున్నది.

జ్ఞానము = ఆత్మ గురించి తెలుసుకోవటము.

విజ్ఞానము = ఆత్మభావనను అనునిత్యం చేసుకోవటము.

**"మమాత్మ ఏవ ఇదగ్ం సర్వమ్"** - అను దృష్టి. తెలుసుకొన్న జ్ఞానముతో కూడిన జగత్ సందర్శనము.

అప్పుడు హృదయమునందే సంస్థితుడైయున్న పరమాత్మ అనుభూతము కాజొచ్చుచున్నారు. ఇక ఆపై **పరమశాంతి** స్వభావసిద్ధమై లభించుచున్నది.

అట్టి పరమశాంతిపదము అధిరోహించినట్టి ఆత్మతత్త్వ జ్ఞాని పట్ల, మనో - బుద్ధుల క్రియలు, వాటి ప్రభావములు, చర్యలు మొదలైనవి **పరమశూన్య రూపమై** ఉంటున్నాయి.

**పైఙ్గలుడు :** గురోత్తమా ! విషయముల వలన కలిగే ఆనందము - ఆత్మానందము, ఈ రెండూ ఒక్కటీరైనవేనా?

**యాజ్ఞవల్క్యుడు :** ఎట్లా అవుతాయి? కాదు. ఆత్మానందము సమక్షంలో విషయానందము 'సూర్యునిముందు దివిటీ' వంటిది.

**అమృతేన తృప్తస్య పయసా కింప్రయోజనం? ఏవం స్వాత్మాఽనం జ్ఞాత్వా వేదైః కిం ప్రయోజనం భవతి ?**

ఒకాయన అమృతమును గ్రోలుచూ తృప్తి - ఆనందములను పొందుచుండగా, మనము ఆయన వద్దకు వెళ్ళి **"అయ్యా ! మేము మీ కొరకై కొంచము పాలు తెచ్చాము, అస్సలు... ఇది చూడండి, ఎంత రుచియో అమృతమును వదలండి!"** ... అని అంటామనుకో! అతడు మన మాటలు విని అమృతమును త్యజించి వేసి **"బాగు ! బాగు ! రండి !"** అని పాలను కోరుకుంటాడా ? లేదు కదా ! అట్లాగే ఎవ్వరైతే 'స్వాఽత్మ' (The nature of one's own Absolute Self) యొక్క తత్త్వమేమిటో తెలిసి ఆస్వాదిస్తూ ఉంటాడో, అట్టివానికి వేదములవలన క్రొత్తగా వచ్చే ప్రయోజనమేదీ కనిపించదు. వాస్తవానికి వేదములు కూడా స్వాత్మజ్ఞానమే ఉద్దేశ్యిస్తున్నాయి. అతనికి స్వాత్మతత్త్వమును మించినదేదీ మరెక్కడా కనిపించదు. వేదములు అనుభవముకొరకై ఉన్నాయి. అనుభవము తరువాత వేదములు ఎందుకు? (వేదము = తెలుసుకోవటం - శబ్దార్థము)

అంతేకాదు. ఆత్మజ్ఞానామృత పరితృప్తునికి కర్మలు చేయటంవలనగాని, చేయకపోవటం చేతగాని క్రొత్తగా వచ్చేదీ ఉండదు. పోయేదీ కనిపించదు. అతని దృష్టిలో తనకు కర్తవ్య-అకర్తవ్యములేవీ ఉండవు. అతని దగ్గరకు వెళ్ళి మనము "అయ్యా మీరు ఈ నియమములు పాటించండి! ఈ ఈ విధి-నిషేధములు తప్పక మీరు ఆచరించాలి. ఆ పూజ మొదలైనవి ఇట్లా చేయకండి! అట్లా చేయకండి!"... మొదలైనవన్నీ చెప్పితే, అవన్నీ ఆతని దృష్టిలో- చిన్నపిల్లవాడు పెద్దలతో పలికే తెలిసీ-తెలియని మాటలవలె-అగుచున్నాయి. ఒకవేళ **"నాకు ఇవన్నీ కర్తవ్యాలు... అప్పటికిగాని నేను పరమాత్మను చేరలేను. మరి అది మాటలా?"**... అని ఒకడు అనుకుంటూ ఉంటే అప్పుడు **"ఈతడు ఇంకా తత్త్వవేత్త కాలేదు"** అని అనక తప్పదు.

ఇంకా విను

## ఇహ - పరసుఖమ్

విదితవేద్యుడు అగు (తెలుసుకొనవలసినది తెలుసుకొన్నట్టి) తత్త్వవేత్త....,

**దూరస్థోఽపి న దూర స్థః భవతి॥**

- ఈ జగత్తుకు అతడు దూరంగా ఉన్నప్పటికీ, అప్పుడు కూడా - ఈ జగత్తును ఆత్మస్వరూపంగా దర్శిస్తూ ఉంటాడు కాబట్టి-దేనికీ దూరస్థుడు కాదు. ఎక్కడ దేనికి ఎంత దూరంగా ఉన్నా కూడా ఆత్మ సంస్థితత్వమును విడవడు.

**పిండవర్జితః పిండస్థోఽపి భవతిః**

- దేహముతో ఉండి కూడా దేహమును త్యజించినవాడై ఉంటాడు. దేహమును ధరించి ఉండవచ్చు గాక! దేహముగా అవడు! దేహమును తాను ధరించు వస్త్రము (ఉత్తరీయము, పంచె) వలె భావించి ఉంటాడు. దేహమునకు వేరై 'దేహి'గా ప్రకాశమానుడై ఉంటాడు.

**ప్రత్యగాత్మా సర్వవ్యాపీ భవతిః**

– జీవాత్మగా ప్రత్యగాత్మరూపమున ఉండి కూడా, త్రిమూర్తులతో సహా సర్వులకు సర్వాత్మకుడై ఉంటాడు. సర్వవ్యాపి అయి చెన్నొందుచున్నాడు. సర్వభూతములు తానై, సర్వసాక్షిగా వేరై సర్వసమత్వము ఆస్వాదిస్తూ ఉంటాడు. కాబట్టి ఓ పైజ్గల మహాశయా ! నీవు **జీవాత్మగా ఉండి** కూడా... **పరమాత్మవై ప్రకాశించెదవు గాక !**

**నేనే సర్వము అయి ఉన్న పరబ్రహ్మమును! సర్వస్వరూపుడను! సర్వసాక్షిని!**

**హృదయం నిర్మలం కృత్వా చింతయిత్వాఽపి అనామయమ్... "అహమేవ పరమ్ సర్వమ్"... ఇతి పశ్యేత పరమ్ సుఖమ్ !**

నీవు హృదయమును నీ సాధనల ద్వారా నిర్మలము చేసుకో! అట్లా నిర్మలము చేసుకుంటూ ఆద్యంతములు లేనట్టి పరమాత్మ గురించి చింతన చేస్తూనే ఉండు. ఇది సాధన విధి!

అయితే... మరొకవైపుగా సాధ్య స్థితిని భావనచేస్తూ కూడా ఉండు! **"ఈ సర్వముగా ఏ పరతత్త్వము అయియే ఉన్నదో, అట్టి పర స్వరూపమే నేను! "**... అను నిశ్చలదృష్టిని కలిగియే ఉండుము. **"నేను బ్రహ్మమునే కాబట్టి ఈ సర్వము నేనే!"**... అను దృష్టి సునిశ్చితము చేసుకొన్నప్పుడే "పరమ సుఖము" లభిస్తుంది. అట్టి అవగాహనా దారుఢ్యముచే **'పరమ్ సుఖము'** లభించి తీరుతుందయ్యా!

## జీవ బ్రహ్మైక్యము - అద్వైత సిద్ధి!

ఒక బిందెలో గల నీళ్ళలో ఒక గ్లాసులో గల నీళ్ళు పోసినప్పుడు ఏమౌతుంది? **జలే జలం క్షిప్తం?** మొత్తము ఒకే రూపముగల నీళ్లు (జలము) అవుతుంది కదా !

ఒక పెద్ద పాత్రలోని పాలలో మరొక చిన్న పాత్రలోని పాలు పోసినపుడో? **క్షీరం క్షీరా!** పాలు-పాలు కలసిపోయి ఏకమౌతాయి కదా !

నెయ్యి (Ghee ఘృతమ్)లో నెయ్యి పోస్తేనో ? మొత్తమంతా ఒకే నెయ్యి అగుచున్నది కదా !

అట్లాగే ...,

**తద్వత్ జీవాత్మ పరమాత్మనో అవిశేషో భవేత్।** జీవాత్మను పరమాత్మతో ఏకము చేసినప్పుడు ఇక **జీవాత్మ – పరమాత్మల భేదమే ఉండదు.** 'ఏకము' అయిపోయి, విడదీసి చూపటానకి వీలే ఉండకుండా పోతుంది. (దీనినే **'అద్వైతసిద్ధి'** అని పిలుస్తున్నారు.)

ఎప్పుడైతే అజ్ఞానాంధకారముచే ఆవరించబడిన ఈ 'దేహము' అనే గృహము నందు **'ఆత్మజ్ఞానము'** అనే దీపము వెలిగించబడి, బుద్ధి అఖండాకార రూపము – అనే వెలుగును సంతరించుకుంటుందో, అప్పుడా **ఆత్మతత్త్వ జ్ఞాన విద్వరేణ్యుని** హృదయమందు **"బ్రహ్మతత్త్వానుభూతి"** చే జనించిన **జ్ఞానాగ్నిచే** కర్మ బంధములన్నీ కూడా వాటికవే దహించి వేయబడతాయి. ఏ విధంగా అయితే ఉదకము (జలము) ఉదకములో ప్రవేశించి ఏకోదకము అగుచున్నదో, ఆ విధంగా బ్రహ్మజ్ఞాని –

– పరమ పవిత్రము అయినది,
– 'పరమేశ్వరుడు' అని పిలువబడుచున్నట్టిది,
– (తనకు ద్వితీయమైనదేదీ ఎక్కడా ఏమాత్రమూ లేనట్టి) అద్వైత రూపము... అయి ఉన్నట్టిది,
– స్ఫటికమువలె నిత్య నిర్మలము,
– ఉపాధిరహితమైనది ....

అగు **పరతత్త్వమునందు** ప్రవేశించి... **పరతత్త్వమే తానై ప్రకాశించుచున్నాడు.**

నిరుపాధి సంస్థితము (That which is without any 'Body') అగు ఆత్మయందు ఆత్మరూపుడై వెలుగొందుచున్నాడు. వెలుగునందు వెలుగై, జలమునందు జలమై, పరమాత్మయందు పరమాత్మ అయి స్వయమాత్మానందుడగుచున్నాడు.

**పైజ్గలుడు :** మహనీయా! ఆత్మ సాక్షాత్కారము (స-అక్షాత్ కళ్ళతో ఎదురుగా సాక్షాత్కరించుకోవటం) పొందిన ముక్తుడు ఆత్మను (లేక) బ్రహ్మమును ఏమని దర్శిస్తాడు ? అతనికి బ్రహ్మము ఏ రీతిగా కనబడుతోంది ? దైవ విగ్రహంలాగానా! దైవరూపంగానా? గురురూపంగానా? ఇంకేదైనా ఆకారంగానా?

**యజ్ఞావల్క్యుడు :** ఆకాశము కళ్ళకు కనిపిస్తోందా ? లేదు! ఎందుకని ? అత్యంత సూక్ష్మం కాబట్టి. కళ్లు స్థూలమైనది మాత్రమే చూడగలుగుతుంది కదా । వాయువు ఆకాశం కంటే కొంత స్థూలము అయినప్పటికీ, కళ్ళకు కనిపించదు. కానీ స్పర్శచే వాయు

కదలికలు తెలియబడుచున్నాయి. ఆకాశము కంటే ఎంతో ఎంతో సూక్ష్మతమమగు ఆత్మ భౌతికమైన కళ్ళకు కనిపించేదా ? కాదు. అట్టి ఆత్మను 'జ్ఞానము' అనే చక్షువుచే నిర్మల బుద్ధిగల జీవుడు మాత్రమే బుద్ధితో దర్శించగలడు! **బాహ్యమున, అంతరమున (బాహ్యాంతరములలో) సదా సర్వదా స్వయం జ్యోతి స్వరూపమై ప్రకాశించుచున్నట్లుగా – ఉత్తమ బుద్ధితో గమించవలసిందే!** అది స్వానుభవైక వేద్యము మాత్రమే! ఒకరు మరొకరిని కూర్చోబెట్టి అందజేసేది కాదు!

**'ఆత్మజ్ఞానము'** అనే దీపపు కాంతిలో జ్ఞాని అంతరాత్మను జ్ఞానచక్షువులతో దర్శిస్తూ... ఆ అంతరాత్మయందే ఈ బాహ్యమంతా ఆత్మకు అభిన్నమై వెలుగొందుచున్నదిగా–దర్శిస్తున్నాడు.

ఒక కుండలోని ఆకాశము... ఆ కుండ పగిలినప్పుడు ఏమగుచున్నది? ఏ చోటపగిలితే అక్కడే ఆ చోటనే విశ్వాకాశములో (మహాకాశములో) కలిసిపోతుంది కదా! అట్లాగే ఆత్మజ్ఞానముచే ఆత్మతత్త్వ స్వరూపుడై ఉంటున్న ఆత్మజ్ఞాని ఎక్కడెక్కడ ఏ ఏ రీతులుగా ఈ పాంచభౌతిక దేహమును భావనచే త్యజిస్తున్నాడో, అక్కడక్కడే, అప్పటికప్పుడే జీవాత్మను సర్వగతమగు పరమాత్మాకారము (పరమాకాశము) నందు లయింపజేసినవాడై ఉంటున్నాడు. **అఖండాత్మానంద స్వరూపుడై మహాత్ముడు** అగుచున్నాడు.

**యథా సర్వగతం వ్యోమ తత్ర తత్ర లయం గతః ఘటాకాశమివ...** ఘటాకాశము (కుండలో ప్రదేశము) మహాకాశములో (అంతటా ఉన్న ప్రదేశములో) విలీనమైనట్లు జ్ఞాని సర్వేసర్వత్రా ఆత్మనే ధ్యానిస్తూ, ఆత్మయందు ఆత్మగా నిరాలంబ యోగ దర్శనము (ఆలంబనము లేని అప్రమేయాత్మ దర్శనము) నిర్వర్తిస్తూ, **అఖండాత్మ స్వరూపుడై** (దేహము ఉన్నప్పుడు – లేనప్పుడు కూడా) యథాతథంగా విరాజిల్లుచున్నాడు. తనయొక్క జీవత్వమంతా పరమాత్మత్వముతో ఏకమై పరమాత్మగా మాత్రమే శేషించినవాడగుచున్నాడు.

**ధ్యానముచే అప్పటివరకు "జీవాత్మ ధ్యాని" అయి ఉన్న యోగి, "పరమాత్మధ్యాని" అయి ధ్యాన ధ్యేయ రహితమగు 'ధ్యేయవస్తు ఆత్మ' గా ప్రకాశించడమే ధ్యాన యోగము యొక్క ఉద్దేశ్యము, మార్గము, అంతిమాశయము** (The ultimate objective) **కూడా !**

**జీవాత్మ తన జీవాత్మత్వమును పరమాత్మత్వము నందు లయింపజేసి, పరమాత్మగా శేషించటమే జీవుడు శాంతి కొరకై పొందవలసిన స్థితి ।** అట్టి ఆత్మధ్యాన ఫలమగు **జీవాత్మ యొక్క పరమాత్మైక్యముతో** (పరమాత్మతో మమేకముతో) మరింకేదీ (చక్రవర్తిత్వము, ఇంద్రత్వము మొ॥వి॥) సాటిరాదు. ఒకడు వెయ్యి సంవత్సముల కాలము ఒంటి పాదముతో నిలబడి తపస్సు చేయవచ్చునుగాక ! **'జీవ బ్రహ్మైక్య యోగము'** యొక్క ఫలములో '16'వ వంతు ఫలమునకు కూడా అర్హుడు కాజాలడు. "ఈ జీవాత్మ పరమాత్మకు అభిన్నము"... అనుట సోఽహమ్‌దృష్టి (లేక తత్త్వ దృష్టి)! **"నేను – ఎదురుగా గల ప్రతి ఒక్క జీవుడు – ఈ సర్వ జగత్తు – ఈఈ బ్రహ్మాండములు"** ... ఇదంతా కూడా ఏకమగు పరబ్రహ్మముగా అనుభవమగుటకై బుద్ధిని సంసిద్ధపరచునదే **'యోగం'**. కనిపించేదంతా అదే అయి ఉండగా కన్నుమూతలెందుకు ? "నీవు అదే ! నేను అదే !" అనే అభ్యాసముచేత మాత్రమే అట్లా అఖండాత్మగా అనిపించగలదు. అట్టి ఆశయము లేకుండా ఎన్నివందల ఏళ్ళు ఎంత తపస్సు మొదలైనవి చేసి ఏమి ప్రయోజనం ?

అహమ్ (జీవాత్మ) గా నేను – త్వమ్ గా నీవు – 'ఇదమ్' గా జగత్తు బ్రహ్మమే ! అఖండాత్మయే. ఆత్మకు వేరుగా ఏదీ లేదు ।"... అను రూపముగల **"సోఽహమ్' తత్త్వమ్ – సర్వం ఖల్విదమ్ బ్రహ్మ"**.... అనునదే జ్ఞానము (తెలియబడవలసినది).

**అదియే జ్ఞేయము (తెలియవచ్చునది).**

అది అనుకుంటూ అనుకుంటూ ఉంటే ఏ జీవునికైనా సరే, తాను ఎక్కడ – ఏ స్థితిలో ఉన్నా కూడా, తప్పక అనిపించగలదు.

**"నేను – నీవు – ఇది అంతా పరబ్రహ్మమే"** అని అనిపించటానకి దేహ – మనో – బుద్ధులను ఏ రీతిగా కించిత్ నియమించి అభ్యాసము చేయాలో, – అది చేయకుండా వందల సంవత్సరాలు వేల వేల శాస్త్రములు చదివి, మాత్రము ప్రయోజనమేమిటి ? "మేము శాస్త్రాలు కొంతకాలం చదివి ఆ తరువాత 'సర్వము అదే' అను అభ్యాసమును ప్రారంభిస్తాము"... అని అనుకోవటం వలన కూడా లాభమే లేదు. శాస్త్రములను పరిశీలించి శాస్త్రముల అంతము చేరటము ఎవరికీ సాధ్యం కాదు. **ఇదమ్ జ్ఞానమ్, ఇదమ్ జ్ఞేయమ్ తత్సర్వమ్ జ్ఞాతుమ్ ఇచ్ఛతి, అపి వర్ష సహస్రాయుః శాస్త్రాంతం న అధిగచ్ఛతి ।** **'ఇదంతా పరబ్రహ్మమే'** అని అనిపించే వరకు 'అనుకోవటము' అనే ప్రయత్నమునకు నాంది పలుకకుండా (Without making a start to perceive the unity in the diversity...) "శాస్త్రములన్నీ చదివి ఆ తరువాత అసలు విషయానికి వద్దాములేఁ ।"... అని శాస్త్ర పఠనము ప్రారంభించి వెయ్యేళ్లు కొనసాగిస్తే మాత్రం ఫలితం దక్కుతుందా ! లేదు. అసలీ జీవుని వర్తమాన దేహముతో గల ఆయుష్షు ఎంత ? పోనీ వంద

సంవత్సరాలు ఈ దేహంతో బ్రతుకుతాడని నమ్మకమున్నదా ? లేదే ! ఈ దేహము – ఈ ఆయుష్షు అతి చంచలమని, ఎప్పుడేమౌతుందో ఏమీ తెలియదని... మనలో ప్రతి ఒక్కరి పట్ల ఎదురుగా కనిపిస్తున్న సత్యమే కదా! మానవ జన్మ పరమాత్మత్వమునకు మహత్తరమైన అవకాశమని మహనీయ ఆప్తవచనము కదా !

శాస్త్రములా ... అనేకం **(అనేకాని చ శాస్త్రాని)**
ఆయుష్షు చూస్తే ... అల్పము **(అల్పాయుః)**
మరల ఇక్కడ ... ఎన్నో విఘ్నాలు **(విఘ్నకోటయః)**

ఇదీ పరిస్థితి. ఈ పరిస్థితిలో **"శాస్త్రములన్నీ చదివి, తెలుసుకొని ఇక అప్పుడు అఖండాత్మ భావనకు ఉపక్రమిస్తాను"**... అనునది కుదిరేది ఎట్లా ? మరి ? అఖండాత్మ భావనను ప్రారంభించి **"అహమ్ –త్వమ్ – ఇదమ్ జగత్... వీటన్నిటి యొక్క పూర్వాపరాలన్నీ అఖండాత్మ స్వరూపమే ।"**... అని మననము చేసుకుంటూ, ఆశయము సంసిద్ధము చేసుకొంటూ ఉండాలి. అద్దానిని సుస్థిరము – సునిశ్చితము – నిత్యాభ్యాసము కొరకై తనకు ప్రియము – అనుకూలము అగు శాస్త్రములను (అభ్యాసము కొరకై) ఆశ్రయించాలి. లేక యజ్ఞ – యాగ – పూజ – ప్రాణాయమము – మొదలైన ఇత్యాదులను సాధన రూపముగా ఆశ్రయించాలి! తీర్థ యాత్రలు ఆత్మాఽహమ్ ఆశయముతోనే ఆశ్రయించి పుణ్యక్షేత్రములు సందర్శించాలి. అంతేగాని, తీర్థయాత్రలు ఆయా ప్రదేశముల సందర్శనము కొరకా? కాకూడదు.

అట్లా కాకుండా ...,

**"అఖండాత్మ భావనకు ఇప్పుడు సమయం కాదు. చాలా చాలా నిర్వర్తించి అప్పుడు ఆ సంగతి చూద్దాం ।"**

అని శాస్త్ర–చారిత్రక పఠనము, కర్మలు, తీర్థయాత్రలు ఆశ్రయించి, ఇప్పటికి సరిపెట్టుకోవాలని పరిమితమవటము సరికాదు. శాస్త్రములు అనుభవమునకు దారితీయవు. తెలియజేయు వరకే వాటి పాత్ర. **అనుభవము నుండి శాస్త్రములు వస్తున్నాయి.** అనుభవము కొరకై శాస్త్రములు ఉపకరణములు అవుతాయి. కనుక **శాస్త్రములను 'ఉపకరణము' గాను, అనుభవమును ఆశయముగాను ఉద్దేశ్యించాలి సుమా !**

**విజ్ఞేయో అక్షర తన్మాత్రో, జీవితంచ అపి చంచలము ।** ఈ 'జీవితము – దేహము' అనే అవకాశము ఎంతకాలమో, ఎప్పుడు చేజారుతుందో చెప్పలేని విషయం కాబట్టి, క్షరమును ఉపయోగించుకుని అతి త్వరగా **అక్షరతత్త్వమును ఇప్పుడే, ఇక్కడే కాలం వృధా చేసుకోకుండా తెలుసుకోవాలి. తెలుసుకొని అనుభవముగా మరల్చుకోవాలి.** వర్తమాన మానవ దేహముతో ఈ జీవితమనేది ఎంతకాలము ఉండబోతోందో... ఏ మాత్రము తెలియని... కాలనియమితమైన అవకాశము (Life is an unknown time bound opportunity). అందుచేత...,

**విహాయ శాస్త్రజాలాని...** శాస్త్రములను ఉపయోగించుకొనుచూ, మెట్లను ఎక్కు రీతిగా క్రమంగా శాస్త్రజాలములను ఆ ప్రక్కకు పెట్టి..,

**యత్ సత్యమ్, తత్ ఉపాస్యతామ్ ।** ఏది **పరమసత్యమై** యున్నదో... అది ఇప్పుడే, ఇక్కడే **ఉపాసనా వస్తువుగా** స్వీకరించాలి. సత్యము యొక్క ఉపాసన కొరకై **శాస్త్రముల సహాయము** తీసుకోవాలి. అంతేగాని శాస్త్రముల కొరకై శాస్త్రములు కాదు। శాస్త్రములకొరకై సత్యము కూడా కాదు.

అట్లాగే ..., **అనంతకర్మ శౌచం చ, జపో యజ్ఞః తదైవ చ...,** మడి–ఆచారములు–జపము–యజ్ఞము ... మొదలైన కర్మలకు కూడా అంతూ–పొంతూ ఉండదు. అందుచేత సత్యము యొక్క 'ఉపాసన' కొరకై ఆయా కర్మలను ఉపకరణములు (Instruments, Process) గా ఆశ్రయించాలి. అంతేగాని ఆ ఆచారాది కర్మలు కర్మల కొరకై కాదు. ఆత్మతత్త్వ జ్ఞానము కొరకే ఉద్దేశ్యించబడినట్లు గమనించాలి.

ఆ విధంగానే తీర్థయాత్రలు కూడా । అఖండమగు (That which is not divisible as I, You, He, That, There, Here etc) పరతత్త్వ స్వరూపానుభవము యొక్క సునిశ్చితము, నిశ్చంచలము కొరకై తీర్థయాత్రలు. అంతేగాని తీర్థయాత్రలు తీర్థయాత్రల కొరకే కానే కాదు. ప్రదేశ బాహ్య సౌందర్యముల ఆస్వాదనకొరకు కాదు. పరోక్ష – ఉపాసనకు పరిమితమవటానికి కాదు.

**తీర్థయాత్రా అభిగమనమ్ యావత్ తత్త్వమ్ న విందతి ।** కేవలము తీర్థయాత్రలు చేస్తూ పోతున్నంత మాత్రం చేత యావత్ తత్త్వము అనుభవమవదు. మరి ? "తత్త్వమ్ (నీవుగా ఉన్నది తత్ పరమాత్మయే")... అనుభావన యొక్క దారుఢ్యము చేతనే **'తత్త్వము'** సిద్ధించుచున్నది. "నా శ్రోతలు – నా శిష్యులు – నా గురువులు – నా ఇష్టదైవము – విజ్ఞులు – అజ్ఞులు – మానవులు – జంతువులు – దేవతలు – దేహముల రాకపోకలు – ఈ దేహముతో చూస్తున్నది – రాబోయే దేహముతో చూడబోతున్నది ... ఇదంతా కూడా **అఖండమగు ఆత్మయే**... అను సిద్ధిబుద్ధి (లేక) ఎరుకయే **తత్త్వభావన ।**

'తత్ త్వమ్' అను తత్త్వ భావనచే **'నేను అదియే'** అను **'అహమ్ బ్రహ్మాఽస్మి'** భావన ఉదయించి, క్రమంగా సుదృఢము అగుచున్నది. **అహమ్ బ్రహ్మేఽతి నియతమ్ మోక్షహేతుః మహాఽత్మనామ్ ।** 'నేను బ్రహ్మము' అను ఆత్మభావనా మార్గముచే **"సర్వదా సర్వముగా ఉన్నది అఖండాత్మ స్వరూపుడనగు నేనే ।"...** అను మహాత్మత్వము సిద్ధిస్తోంది. జీవాత్మ కాస్తా 'మహాత్ముడు' అగుచున్నాడు. మహాత్మత్వము మోక్ష హేతువు అగుచున్నది.

**పైజ్ఞలుడు :** హే మహనీయా ! లోకగురూ ! అస్మత్ సద్గురూ ! అస్మత్ హృదయాంధకార విమోచక ప్రజ్ఞాదీప స్వరూపా ! యాజ్ఞవల్క్య మహాత్మా ! చివ్వరిగా నాదొక ప్రశ్న । స్వతఃగానే సర్వదా ఆత్మ స్వరూపుడే అయి ఉన్న ఈ జీవునికి – బంధము ఎక్కడి నుంచి వస్తోంది ? ఆ బంధము ఎట్లా తొలగుతుంది?

**యాజ్ఞవల్క్యుడు :** నాయనా ! మరలా చెప్పుచున్నాను. విను.

**1) బంధము :** పరమాత్మయే స్వయముగా – **జగత్ రూప ఊహాభావన**ను వినోదము కొరకై కల్పించుకొని, ప్రవేశించి, సంచారాలు చేస్తూ (స్వప్నములోని వాడు జాగ్రత్‌ను ఏమరచిన రీతిగా) తన ఆత్మత్వాన్ని మరచి అహంకార – మమకారాలు ఆశ్రయిస్తున్నాడు. ఊహలో కనిపించిన విశేషముల అనుభవములందు తన్మయుడయి, "ఇదియే నేను ! నేను ఇంతమాత్రమే ।"... అనే సుదృఢ భావనతో అనేక ఉపాధులు పొందటము, కొనసాగించటము, వదలటము, మరల పొందటము జరుగుచుండగా... **"నేను పరిమితుడను । జీవుడను । మోక్షము ఎక్కడ ? ఎప్పుడు ?" ...** ఈ రూపమైన వేదన పొందుచున్నాడు. స్వస్వరూపమగు అఖండాత్మను ఏమరచటము చేత 'బంధము' వచ్చిపడటం జరుగుతోంది.

**మోక్షము :** తన యొక్క సహజము – నిత్య సత్యము అగు అఖండాత్మత్వము తిరిగి గ్రహిస్తూ పరిమిత జీవాత్మత్వమును – పాము కుబుసమునువలె – త్యజించుటయే **మోక్షము**. అందుకు మార్గముగా రెండు ఉపాయాలు ఇక్కడ ఉదహరించుకుందాము.

('అహమ్' ఇత్యేవ బంధోయ, 'నాఽహమ్ ఇత్యేవ మోక్షయే।)

> **బంధము** - మమేఽతి (నాది –నేను)
>
> **మోక్షము** - న మమేఽతి (నాది కాదు! పరమాత్మది!)

జీవాత్మ సంబంధమైనదేదైనా కూడా – 'నాది' అనుకోవటం చేత జీవుడు 'బద్ధుడు' అగుచున్నాడు.

'నాది కాదు' (న మమేఽతి) చే విముక్తి పొందుచున్నాడు. బంధమోక్షము అనగా ... ఇంతమాత్రమే !

**పైజ్గలుడు :** దేనివలన 'మమ' అనే బంధము కలుగుతోంది ? దేని వలన 'న మమ' అనునది సిద్ధించగలదు ?

**యాజ్ఞవల్క్యుడు :** అంతా మనస్సేనయ్యా ! ( మనయేవ మనుష్యానాం కారణమ్ బంధమోక్షయో। )

ఆత్మ నుండి మనస్సు బయల్వెడలుతోంది. మనస్సు నుండి 'అన్య' (వేరు) అనే దృశ్యభావము (Outwared Experiencing) బయల్వెడలుతోంది. **దృశ్యభావములు ఆత్మను ఆవరించినట్లు అనిపిస్తూ, ఆత్మకు బంధము ఆపాదించుచున్నాయి.**

భావముల కంటే ముందే (ఆలోచనలకు మునుముందే) మనస్సు ఉన్నదికదా ! ఆలోచన సహాయంతో ఆలోచనలకు ఆవలగల మనస్సును ఆశ్రయిస్తే **'ఆలోచనారహితమనస్సు'** (లేక) కేవలమనస్సు అనుభవమవగలదు. కేవల – ఆలోచనారహిత విభాగమగు మనోరూపము 'ఉన్మనీ' అని అంటారు. ఎప్పుడైతే మనస్సు ఉన్మనీని (ఉత్+మనీ= ఆలోచనలకు ఆవలగల ఆత్మభావనను) ఆశ్రయిస్తుందో... ఇక అప్పటి నుండీ "ద్వైతము" (జీవాత్మవేరు... పరమాత్మవేరు... అను దృష్టి) ఏమాత్రమూ శేషించదు. మిగిలి ఉండదు. **మనసోహి ఉన్మనీభావే ద్వైతమ్ నైవ ఉపలభ్యతే !**

**యదాయాతి ఉన్మనీభావః తదా తత్ పరమమ్ పదమ్ !** మనస్సు (భావన) లయించినట్టి **'ఉన్మనీభావము'** రూపుదిద్దుకోగానే ఇక పరమపదము తనకు తానే లభించగలదు.

ఈ మన సంత్సంగపూర్వక సంభాషణను ఉపసంహరించబోతూ, ఒక ముఖ్యమైన విషయమును గుర్తు చేస్తున్నాను. **'ఉన్మనీభావన'** సిద్ధించిన తరువాత మనస్సు ఉంటుందా ?"... అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాను. మనస్సు అప్పటికీ ఉంటుంది. అయితే...

> **యత్ర యత్ర మనోయాతి తత్ర తత్ర పరం పదమ్ ।**
> **తత్ర తత్ర పరం బ్రహ్మ । సర్వత్ర సమవత్ స్థితమ్ ।**

ఉన్మనీ స్థితిలో, అప్పటికీ శేషించి యున్న మనస్సు...

**– ఎక్కడెక్కడికి వెళ్ళి వ్రాలుతుందో అక్కడక్కడ పరబ్రహ్మమే ఆ మనస్సుకు (ఉన్మనీకి) – అనుభవమౌతుంది. అదియే పరమపదము ।**

ఓ పైఙ్గలా !

మరొక ముఖ్యమైన విషయం కూడా నీ ముందు ఉంచున్నానయ్యా ।

**హన్యాత్ ముష్టిభిః ఆకాశమ్...,**

ఒకడు తనయొక్క పిడికిలిని ఉపయోగించి ఆకాశమును పొడిచి ముక్కలుగా చేయగలడేమో !

**క్షుదార్తః ఖండయేత్ తుషమ్ ।**

ఒకానొకడు ఎంతో ఆకలిగొని ఉంటే, అతనికి 'భోజనము' గురించి, కాయగూరల రుచి గురించి ఉపన్యాసము చెప్పి, అతని ఆకలి తీర్చవచ్చునేమో మరి ? (పై రెండు కుదిరేవికావు. ఒకవేళ సాధ్యపడవచ్చునేమో) !

కానీ...

**నాఽహమ్ బ్రహ్మేతి జానాతి తస్య ముక్తిః న జాయతే !**

**"అయ్యా ! మీరు ఎన్నన్నా చెప్పండి ! నేను జీవుడిని మాత్రమే ! పరబ్రహ్మము మరెక్కడో ఉన్నది. నేను ఎప్పటికోగాని దానిని పొందలేను ! సిద్ధించుకోలేను! అంతే !"** అని తలచి **"అహమ్ బ్రహ్మాఽస్మి"** అను వేద – సద్గురు ప్రవచిత పరమసత్యరూప **మహావాక్యము యొక్క అర్థమును స్వీకరించటానికి, "ఇప్పటికే నేను బ్రహ్మమును! వాస్తవానికి ఎప్పటికీ బ్రహ్మమునే" అను అర్థమును మొదలే ఒప్పుకోనివానికి ... ముక్తి అనే ప్రసక్తియే ఉండదు.** అది అంతే

**'తత్త్వమ్'** (నీవు బ్రహ్మ అను భావన) ద్వారా **'సోఽహమ్'** చేరటానికి తత్త్వ శాస్త్రమును ఆశ్రయించువానికి **ముక్తి** ఎల్లప్పుడూ స్వాభావసిద్ధమగుచున్నది.

## ఫలశ్రుతి

ఎవ్వరు ఈ 'పైఙ్గలోపనిషత్' ప్రతిపాదించు అనునిత్య **'జీవబ్రహ్మైక్య రూప'** పరమ సత్యమును ఆమూలాగ్రమూ అధ్యయనము చేస్తూ, పరమాత్మత్వమును హృదయస్థం చేసుకుంటూ ఉంటారో..., వారు... **అగ్ని, వాయువు, ఆదిత్యుడు, విష్ణువు, రుద్రుడు** వలె పరమపవిత్రత సంతరించుకొనగలరు. వారికి 4 వేదములు పారాయణము చేసిన ఉత్తమ ప్రయోజనము లభించగలదు. పురాణ – ఇతిహాసములను పఠించిన ఫలితమును పొందగలరు. వారికి రుద్రమును లక్ష సార్లు పఠించిన సత్ఫలము సిద్ధించగలదు. ఇష్ట దైవమంత్రమును ప్రణవముతో జేర్చి లక్షలాదిసార్లు జపించుచుండగా లభించు స్వస్థితి ఈ ఉపనిషత్ విచారణచే బుద్ధికి చేకూరగలదు.

**"జీవుడు – ఈశ్వరుడు – పరబ్రహ్మము"**ల అఖండ – ఏకాత్మ స్వరూపమును ఎవరు సేవించి, ఉపాసించి, ప్రవేశించి, తత్స్వరూపము సంతరించుకుంటారో, వారి యొక్క వెనుకటి పది తరముల వారు, మునుముందటి పది తరములవారు పవిత్రత సంతరించుకొనగలరు. ఆత్మతత్త్వ ధ్యానముచే **కృతకృత్యులు** కాగలరు.

**అట్టి జీవబ్రహ్మైక్య సద్భావనాసిద్ధుడు** అగు ఆ మహానుభావుడు ఏ పంక్తిలో ఉంటే,... ఆ పంక్తిలోని వారంతా **మహానుభావుల భావాలు** పొందగలరు.

ఏ యోగి అయితే – ఈ జీవుని **బ్రహ్మముగా** దర్శించే అభ్యాసము ప్రారంభించి, నిరంతరము కొనసాగిస్తూ ఉంటాడో, అతనితో సత్సంగ యోగముచే – బ్రహ్మహత్యా దోషము, సురాపనదోషము, బంగారము దొంగలించిన దోషము, గురుతల్పగమన దోషములు ఇవన్నీ కూడా – తొలగి ఆతడు **పవిత్రత సంతరించుకోగలరు**. పాతకులు కూడా పునీతులు కాగలరు. (దుర్జనో సజ్జనో భూయాత్। సజ్జనో శాంతిమాప్నుయాత్।)

నిత్యానిత్య వివేకులు, వేదవేదాంగవేత్తలు, జ్ఞాన ప్రజ్ఞచే ప్రకాశించే సూరులు... వీరంతా కూడా వెలుగులో వస్తువులు కనిపిస్తున్న తీరుగానూ, నిదురలేచి కనులు తెరచినవానికి పరిసరములు సుస్పష్టమగు విధంగానూ విష్ణుతత్త్వమునే అంతటా దర్శిస్తున్నారు.

విష్ణు సాన్నిధ్యమును పొంది, పరమమానంద భరితులగుచున్నారు. **అట్టి సర్వతత్త్వ స్వరూపమగు విష్ణు తత్త్వమునకు నమస్కరించుచున్నాము.**

జీవ – బ్రహ్మముల ఏకత్వమును గుర్తు చేస్తున్న యాజ్ఞవల్క్య – పైఙ్గల సంవాదరూప **పైఙ్గలోపనిషత్** అనేక మంది ముముక్షువుల చెవులలో మార్మోగును గాక! **ఆత్మతత్త్వము** వారి హృదయములయందు వెల్లివిరియునుగాక !

**ఇతి పైఙ్గలోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః ।**


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 11 భిక్షుకోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ భిక్షూణాం పటలం యత్ర విశ్రాంతిమ్ అగమత్ సదా**
**తత్ త్రైపదం బ్రహ్మతత్త్వం బ్రహ్మమాత్రం కరోతు మామ్॥**

*(కుటీచక - బహూదక - హంస - పరమహంస జ్ఞానతేజో మూర్తులు. అజ్ఞానాంధకారమును పటాపంచలు చేయువారు-అట్టి) భిక్షువుల పటలము (గుంపు) ఏ స్థానమునకు చేరినవారై..., అనునిత్యమైనట్టి, తెంపులేనటువంటి ఆత్మ **సుఖ విశ్రాంతిని** ఆస్వాదిస్తున్నారో, అట్టి **పరమపద స్థానము**కొరకై వారినందరినీ మేము శరణు వేడుచున్నాము. స్తుతించుచున్నాము. బ్రహ్మతత్త్వ (త్వమ్ తత్ బ్రహ్మమే) రూపమగు **బ్రహ్మసూత్రమును** చేబూని **ఉపాసనావిధిని** నిర్వర్తించుచున్నాము. ఈ సర్వమునూ బ్రహ్మతత్త్వముగా బ్రహ్మసూత్రముగా సందర్శించుటకై వారికి ప్రణిపాతులము అగుచున్నాము.*

❖

*భిం = అంధకారమ్*

*క్షుకం = నిర్మూలన చేయు మహనీయులు.*

*ఓం భిక్షూణాం పటలాయ నమోనమః*

*ఓం గౌతమాయ నమః*

*ఓం భరద్వాజాయ నమః*

*ఓం యాజ్ఞవల్క్యాయ నమః*

*ఓం వసిష్ఠాయ నమః*

*ఓం సకల కుటీచ భిక్షకాయనమః*

*ఓం సంవర్తక, అరుణి, శ్వేతకేతు, జడభరత, దత్తాత్రేయ, శుక, వామదేవ, హారీతకే ఇత్యాది పరమహంసాయ - నమో నమో నమో నమః*

***సర్వ భిక్షక - పరమహంస జనే నమో నమో నమో నమః॥***

1. ఓం! అథ భిక్షూణాం మోక్షార్థినాం
"కుటీచక", "బహూదక", "హంస"
"పరమహంస" చ ఇతి చత్వారః॥
కుటీచకో నామ...,
గౌతమ; భరద్వాజ;
యాజ్ఞవల్క్య; వసిష్ఠ;
ప్రభృతయో...,
అష్టౌ గ్రాసాం
చరంతో
యోగమార్గే 'మోక్షమ్' ఏవ ప్రార్థయంతే।

**ఓం కార నాదమయుడగు పరమాత్మకు నమస్కరిస్తూ...,**

మోక్షార్థులగు **భిక్షక సన్యాస యోగులు** '4' విధములైన వారుగా చెప్పబడుచున్నారు.

1. కుటీచక భిక్షక 2. బహూదక భిక్షక
3. హంస భిక్షక 4. పరమహంస.

(వీరి సంచార ప్రదేశము అష్టవిధ ప్రకృతి - భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనో, బుద్ధి, అహంకారములు).

**1. కుటీచక భిక్షక యోగులు**

కుటీచక మోక్షార్థ భిక్షక యోగులకు దృష్టాంతంగా : 1. గౌతమ మహర్షి 2. భరద్వాజ మహర్షి 3. యాజ్ఞవల్క్య మహర్షి 4. వసిష్ఠ మహర్షి ... మొదలైనవారు. **వీరు '8' గ్రాసములలోనూ చరించువారై (8 ముద్దలు భుజించువారై) యోగమార్గములో ఉండి 'మోక్షము' మాత్రమే ఉపాసించు వారు.**

---

2. అథ 'బహూదకా' నామ
త్రిదండ కమణ్డలు శిఖా
యజ్ఞోపవీత కాషాయవస్త్ర ధారిణో
బ్రహ్మర్షి గృహే,
మధు మాంసం వర్జయిత్వా
అష్టౌ గ్రాసాన్, భైక్షాఽ చరణం కృత్వా,
యోగమార్గే మోక్షమేవ ప్రార్థయంతే।

**2. బహూదక మోక్షార్థి భిక్షక యోగులు**

త్రిదండము, కమండలువు, శిఖ, యజ్ఞోపవీతము, కాషాయ వస్త్రములు ధరించినవారై ఉంటున్నారు.

**బ్రహ్మర్షి గృహములందు భిక్షాచరణము (భిక్షాటనము) చేస్తూ ఉంటారు.** మధువు - మాంసములను వర్జించినవారై (వదలినవారై), '8' గ్రాసములను (8 ముద్దలను) భిక్షాటనముచే నిర్వర్తిస్తూ (తినుచూ) 'యోగమార్గము' లో 'మోక్షము'ను కోరుకొనువారై ఉంటున్నారు.

---

అథ 'హంసా' నామ,
గ్రామ ఏక రాత్రం,
నగరే పంచ రాత్రం,
క్షేత్రే సప్త రాత్రం,
తదుపరి న వసేత్।
గోమూత్ర గోమయ ఆహారిణో
నిత్యం చాంద్రాయణ పరాయణా
యోగమార్గే మోక్షమేవ ప్రార్థయంతే!

**3. "హంసా" మోక్షార్థి భిక్షక యోగులు**

చాంద్రాయణమును ఆచరించువారు.
ఒక గ్రామములో ఒక రాత్రి మించి ఉండరు.
ఒక నగరములో '5' రాత్రులు దాటి నివశించరు.
ఒక క్షేత్రములో '7' రాత్రులు మించి వసించరు.
**'గోమూత్రము' 'గోమయము'... ఇవి ఆహారముగా కలవారై,** ఎల్లప్పుడు చాంద్రాయణ పరాయణులై ఒకచోట నిలవక ఆకాశములో చంద్రునివలె సంచారములు చేస్తూ వుంటారు.
వీరు 'యోగమార్గము'లో మోక్షమును పొందు విధిని ఉపాసిస్తున్నవారై ఉంటారు.

---

అథ 'పరమహంసా' నామ
సంవర్తక, అరుణి, శ్వేతకేతు,
జడభరత, దత్తాత్రేయ, శుక,
వామదేవ, హారీతక ప్రభృతయో...,
అష్టౌ గ్రాసాన్ చరంతో,
యోగమార్గే మోక్షమేవ ప్రార్థయంతే।
వృక్షమూలే శూన్యగృహే శ్మశానవాసినోవా,
సామ్బరావా, దిగంబరావా।

**4. "పరమహంసా" భిక్షక యోగులు**

**పరమహంసా యోగులకు దృష్టాంతము:** సంవర్తకుడు, అరుణి, శ్వేతకేతు, జడభరతుడు, దత్తాత్రేయుడు, శుకుడు, వామదేవుడు, హారీతకుడు... మొదలైనవారు.

వీరు అష్టగ్రాసములను స్వీకరించువారై (8 ముద్దలను గ్రహిస్తూ) యోగమార్గములో 'మోక్షము'ను ఆశ్రయిస్తు, ఆరాధిస్తూ, కోరుకొంటూ ఉంటారు. వృక్షమూలముల లోనో (చెట్టు మొదట్లో), శూన్య గృహములలోనో, శ్మశానవాసులుగానో ఉంటారు.

వస్త్రములను ధరించియో, ధరించకయో ఉంటారు.

**న తేషాం ధర్మ – అధర్మౌ,**
**లాభ – అలాభౌ, శుద్ధ – అశుద్ధౌ।**
**ద్వైతవర్జితాః సమ–లోష్ట–అశ్మ–కాంచనాః**
**సర్వవర్ణేషు భైక్ష – ఆచరణం కృత్వా,**
**సర్వత్రా ఆత్మైవ – ఇతి పశ్యంతి॥**

ఈ భిక్షువులంతా కూడా..., ధర్మ-అధర్మములు, లాభ-అలాభములు, శుద్ధ-అశుద్ధములు-అను ద్వైతములకు అతీతులై ఉంటారు. వదలివేసి ఉంటారు.

(ద్వైత వర్జితులై) మట్టి - రాయి - బంగారములను ఒకే దృష్టితో చూచువారై ఉంటారు.

వీరు **సర్వ వర్ణములవారి గృహములలోను భిక్షాటనం చేస్తూ**... సర్వత్రా ఆత్మతత్త్వమునే దర్శించువారై ఉంటారు. వీరికి 'ఆత్మ'కు వేరై వర్ణాశ్రమ ధర్మములు అగుపించవు.

---

**3. అథ జాతరూప ధరా।**
**నిర్ద్వంద్వా, నిష్పరిగ్రహా।**
**శుక్లధ్యానపరాయణా। ఆత్మనిష్ఠాః।**
**ప్రాణసంధారణార్థం యథోక్తకాలే**
**భైక్షమ్ ఆచరంతః॥**
**శూన్యాఽగార దేవగృహ**
**తృణ కూట, వల్మీక వృక్షమూల,**
**కులాలశాలా, అగ్నిహోత్రశాలా**
**నదీ పులిన, గిరికందర, కుహర**
**కోటర, నిర్ఝర స్థండిలే।**
**తత్ర బ్రహ్మమార్గే,**
**సమ్యక్ సంపన్నాః, శుద్ధ మానసాః,**
**'పరమహంస' ఆచరణేన**
**సన్న్యాసేన దేహత్యాగం కుర్వన్తి...।**
**తే 'పరమహంసా' నామ।**
**ఇత్యుపనిషత్**
**ఇతి భిక్షుకోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

జాతరూపధరులై - **అప్పుడే పుట్టిన బిడ్డవలె జగత్ రహితులై** ఉంటారు.

నిర్ద్వంద్వులై, **ద్వంద్వాతీతులై** ఉంటారు.

ఏదీ స్వీకరించనివారై, **నిష్పరిగ్రహులై** ఉంటారు.

నిర్మలమగు **ఆత్మ (శుక్ల) ధ్యానపరాయణులై, ఆత్మయందు మాత్రమే నిష్ఠ** కలిగియున్నవారై ఉంటారు.

**ఈ దేహములో ప్రాణములను నిలిపి ఉంచటానికి మాత్రమే** ఉద్దేశ్యించినవారై 'భిక్షాటనము' ఆచరిస్తూ ఉంటారు.

**వారు ఉండే చోటులు** : శిథిలమైన గృహములు (శూన్యాగారములు), దేవగృహము (గుడి), గడ్డి - పుట్ట - చెట్లు స్థలములలోను, కుమ్మరివారి ఇల్లు, అగ్నిహోత్రశాల... మొదలైనవి. నదీ తటములు, ఇసుక తిన్నెలు, కొండగుహలు, చెట్టు తొర్రలు, సెలయేళ్ళ గట్టులు,... (ఇటువంటి) మొదలైనవికూడా!

ఇక్కడ - అక్కడ **'బ్రహ్మమార్గము'**లో సంచరిస్తూ


**సమ్యక్** (సమరసభావ - సర్వత్రా సమదర్శన) సంపన్నులై,

**శుద్ధ మనస్సు - పరిశుద్ధ హృదయముతో** కూడుకొన్నవారై,

**'పరమహంస'** ఆచార పరాయణులై, సత్‌న్యాస రూప సన్న్యాసము అవధరించి భౌతికత్వమంతా త్యజించివేసినవారై (దేహత్యాగనిరతులై) .... ఉంటారు.

వారు పరమహంసలై భూదేవతను పులకింపజేస్తూ ఉంటారు.

**ఇతి**
**భిక్షుకోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**



⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 11 భిక్షుకోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము

**ఓం....ఆదిభిక్షుభ్యోం నమః। 'ఆది భిక్షువు' అగు పార్వతీ మాతా సహిత పరమశివునికి నమస్కరిస్తూ...,**

సర్వ సంసార బంధములను మొదలంట్లా త్రెంచివేసి-బంధనములు తొలగిన మదపుటేనుగు స్వేచ్ఛగా, ఆనందంగా అడవిలో సంచరించు రీతిగా-మోక్షాశయులై, మహదాశయులై, యోగానంద-స్వస్వరూప ఆత్మ సాక్షాత్కార-ప్రదేశములో సంచరించు **"భిక్షక మహామహితాత్మ యోగ సంపన్న పటలము"** నకు నమస్కరిస్తున్నాము. వారి గురించి - భక్తి - ప్రపత్తులతో ఇప్పుడు చెప్పుకుంటున్నాము.

❖

కైవల్యపదరూపమగు మోక్షార్థులైనట్టి (మోక్షమే సర్వదా ఆశయముగా కలిగి ఉన్నట్టి) భిక్షకులు .... (భి - అంధకారమును, క్షుకులు - క్షయింపజేయువారు) గురించి, 4 విధములైనవారుగా విభజించి (మోక్షశాస్త్ర ప్రవక్తలు) వర్ణించుచున్నారు.

1. **కుటీచక** భిక్షుకులు 2. **బహూదక** భిక్షుకులు 3. **హంస** భిక్షుకులు 4. **పరమ** హంసలు

## కుటీచక భిక్షుకులు (లేక) కుటీచక పరివ్రాజకులు

ఈ భిక్షుక పరివ్రాజక కుటీచకులు..., **అష్టౌ గ్రాసాంశ్చరంతో** - '8' గ్రాసములందు సంచరిస్తూ ఉంటారు.

ఎనిమిది గ్రాసములు భుజిస్తూ ఉంటారు. [మూలాధార - స్వాధిష్ఠాన - మణిపూరక - అనాహత - విశుద్ధ - ఆజ్ఞా - బ్రహ్మరంధ్ర - సహస్రార (ఊర్ధ్వ తురీయాతీత)] ... ఈ '8' గ్రాసములు స్వీకరిస్తూ యోగాన్వేషకులగు సర్వజనులకు (ఆయా వేరు వేరు అష్ట దళములలో ఒక్కొక్క దళములో మాత్రమే చిక్కి, సంసార రోగమును అనుభవించు సంసార జీవులకు) తోడై, **ఆత్మయోగ జ్ఞానమును** సూచిస్తూ ఉంటారు. **సద్గురువులై** లోకాలలో సంచరిస్తూ, సాధకులకు **యోగసహాయము** అందజేస్తూ ఉంటారు.

అష్టదళ పరివేష్టితులై ఉంటూ, **యోగ మార్గేణ మోక్షమేవ ప్రార్థయంతే!**-యోగ మార్గములో మోక్ష సాధనాపరులు మోక్షమార్గ దర్శకులు అయి ఉంటున్నారు.

- కుండలినీ ప్రవేశము
- మూలాధార - స్వాధిష్ఠాన - మణిపూరక - అనాహత - విశుద్ధ - ఆజ్ఞా చక్రములలో ఇచ్ఛా - బుద్ధి - మనస్సులను కేంద్రీకృతము చేయు యోగ సాధనము.
- ఆజ్ఞా చక్రమునుండి బ్రహ్మరంధ్ర ప్రవేశము
- సహస్రారము అనబడు 12 అంగుళములుగా విస్తరించియున్న **తురీయాతీత నిర్మల - అఖండాత్మ స్థానములో** యోగమార్గముగా ప్రవేశించటము.

- ఇట్టి యోగ మార్గాన్వేషకులకు సాధక – మార్గదర్శక గురువులై మోక్ష సాధనకు దారి చూపుతూ ఉండటము....

ఇవన్నీ నిర్వర్తిస్తూ ఉంటారు. **(సవ్య–అపసవ్య మార్గస్థ, సర్వ ఆపత్ వినివారిణీ)**

మహాత్ములగు గౌతమ మహర్షి, భరద్వాజ మహర్షి, యాజ్ఞవల్క్య మహర్షి, వసిష్ఠ మహర్షి మొదలైన వారంతా కుటీచక భిక్షుకులు.

కుటీచము → దేహమునందు (దేహాంతర్గత యోగ సిద్ధులు)

భిక్షుకులు → భిక్ష ప్రసాదించి భి–అంధకారము తొలగించే మార్గదర్శకులు. మోక్షమే ఆశయముగా కలవారు. దేహమే వీరి ప్రయోగశాల.

## బహూదక భిక్షుకులు (విశ్వ – విశ్వాంతర సంచార యోగ సిద్ధులు)

**బహూదకానామ్...** – '8' గ్రాసములందు సంచరిస్తూ ఉంటారు.

- త్రిదండము, కమండలువు, శిఖ, యజ్ఞోపవీతము, కాషాయవస్త్ర ధారణ గుర్తులుగా కలిగి వుంటారు.
- బ్రహ్మర్షి గృహములలో సంచారులై ఉంటారు. బ్రహ్మలోకాంతర్గతంగా సర్వలోకములు సందర్శించువారు.
- మధు మాంసములను విసర్జించి ఉంటారు. (మనో–ఇంద్రియ పరిధులను దాటివేసి ఉంటారు).
- అష్ట గ్రాసములను (హృదయాంతర్గత అష్టదళములలో - Eight Fields of the Flower of Heart) భిక్షాచరణము (ప్రకాశమానులై అంధకారము తొలగించే ఉనికి – ఆచరణ) కలిగి ఉంటారు.
- యోగ మార్గములో ఉండి మోక్ష మార్గమును ఉపాసించు వారు. మోక్ష మార్గమును ఆశ్రితులకు చూపువారు అయి ఉంటారు.

**త్రిదండి :** (మనోదండ, వాక్‌దండ, కర్మదండములు అను) '3' దండములు గల సన్న్యాసి. ఈ త్రిదండముల ఉపకరణముతో సత్యమును శోధించి సిద్ధింపజేసుకొన్నట్టి వారు.

**కమండలువు :** సన్న్యాసులు జలము ఉంచుకొను పాత్ర. ***(లోకములోని జీవితమును పాత్రగా భావిస్తూ సదా ఆత్మను సహజ స్వరూపముగా భావించు యోగస్థితి).***

**శిఖ :** సిగజుట్టు, శాస్త్ర సారముల గురించిన ఎరుకకు సంబంధించిన సంజ్ఞ. శిఖను నిర్వకల్ప పుష్పమాలికను చుట్టి, ప్రకృతి పీఠముపై ఆశీనులై ఉండువారు.

**యజ్ఞోపవీతము :** దేహము – దృశ్యములతో కూడిన జగత్తును యజ్ఞభావనతో దర్శించువాడు. త్రిగుణములను సృష్టి యజ్ఞ విభాగములుగా ఎరుగుచున్నవారు. క్రియాశీలకమగుచున్నప్పుడు యజ్ఞభావమును ఆశ్రయించి 'వ్యక్తిగతము'ను త్యజించి, సర్వగతులై సంచరించువారు.

**కాషాయ వస్త్రధారణమ్ :** సర్వమును సన్న్యసించి, విరాగి అయి ఉండటమును గుర్తుగా కలవారు.

**బ్రహ్మర్షి గృహే చరంతమ్ :** బ్రహ్మర్షుల బ్రహ్మము గురించిన ఋత్–సత్యవాక్కులను (**"తత్ త్వమ్। సోఽహమ్। జీవోబ్రహ్మైఽతి నాపరః। అయమాత్మా బ్రహ్మ। త్వమేవాఽహమ్।** ... మొదలైన మహా వాక్యోచ్ఛారణ) కలిగి ఉన్నవారు. బ్రహ్మర్షుల అధ్యాత్మ సంప్రదాయమునందు నివసిస్తూ, ప్రవచించువారు. 'బహ్మర్షి గృహము' నందు ఆవాసము కలిగి ఉండువారు. ఆనంద జలధిలో స్నానము చేసి 'సుజ్ఞాన' వస్త్రము ధరించువారు.

**మధుమాంసం వర్జయిత్వా :** ఇంద్రియములకు ప్రియమైనవి త్యజించి ఇంద్రియములను యోగ మార్గములో నియామకము చేయువారు. ప్రేయమును త్యజించి శ్రేయమును ఆశ్రయించువారు. జనులకు అది గుర్తు చేయువారు.

**అష్టౌ గ్రాసాన్ భైక్షాచరణమ్ :** అష్టగ్రాసములను (ముద్దలను) భిక్షగా స్వీకరించువాడు.

- అష్టదళోపరివేష్టితలింగ స్వరూపులు.
- యోగాష్టదళములందు విన్యాసము చేయువారు.
- అష్టదళ హృదయ సంచారులై, ఆశ్రితుల దోషములను తొలగించువారు. యోగమార్గములో మోక్షమును చూపువారు.

## 'హంసా' భిక్షుకులు

**వీరు .....** గ్రామము (ఇంద్రియములలో) .... ఒక రాత్రి!

నగరములో (అంతఃకరణములో) ..... '5'రాత్రులు!

పుణ్యక్షేత్రములో.... (ఉపాసనా స్థానములలో) '7' రాత్రులు!–ఇంతకు మించి ఒకచోట నివాసము కలిగి ఉండరు.

గో మూత్రము, గోమయము (యథాప్రాప్తములైన వాటిని) ఆహారముగా కలిగి ఉంటారు.

(గో–గోమూత్ర–గోమయ ఆహారిణో.... సత్యమును చూపుట, ధర్మనిరతి, పరతత్త్వము, తద్వారా పరబ్రహ్మ చైతన్యమును బోధించువారు).

**నిత్యం చాంద్రాయణపరాయణా:** ఆకాశంలో పూర్ణచంద్రుడు ఒకచోట నిలువకుండా ఆకాశమంతా సంచారములు చేస్తూ ఉంటారు కదా! అట్లాగే ఈ హంసలు ఒకచోట నిలిచిపోయి ఉండక,.. సంచారములు చేస్తూ చాంద్రాయణ పరాయణులై ఉంటారు. 14 లోకములు వారికి విహార స్థానములులై, వారు బ్రహ్మమును ఎరిగి సంచారములు నిర్వర్తిస్తూ ఉంటారు.

## పరమహంసలు

పరమ హంసల పటలములోనివారగు కొందరు మహనీయులను ముందుగా స్మరిస్తూ త్రిపదక్షిణ పూర్వ సాష్టాంగ దండ ప్రణామములు సమర్పించుకుంటున్నాము.

**ఓం సంవర్తకాయనమః । అరుణియే నమః । శ్వేతకేతాయన నమః। జడ భరతాయ నమః। దత్తాత్రేయాయ నమః। శుకదేవాయనమః। వామదేవాయ నమః।** 'సో పరమ్ ఏవ అహమ్' ఇతి పరమహంసః। సోஉహమ్ పరమమ్ ఇతి పరమహంసః।

ఈఈ మొదలైనవారంతా పరమహంసలు! ఇహమును పరతత్త్వమునందు లయింపజేసి పరమహంసలై 'మానస సరోవరము'నందు శాంతి – ఆనందములతోనూ, ఆత్మానందముతోను కూడి, **లీలగా విహరించు హంసలు.**

వీరు హృదయాంతరములోని అష్టదళ పద్మమునందు సంచరిస్తూ **అష్టాగ్రాసాన్ చరంతో,... యోగ మార్గే మోక్షమేవ ప్రార్థయంతే।** ... యోగ మార్గముగా మోక్షమే పరమార్ధముగా పరమలక్ష్యముగా, స్వభావముగా కలిగియుండువారు.

మూలాధారము నుండి → ఆజ్ఞా చక్రము వరకు

ఆజ్ఞా చక్రము నుండి → బ్రహ్మరంధ్ర స్థానము – సహస్రారముల వరకు, అద్దానిని దాటిన స్వయం ప్రకాశ సహస్రార–ఊర్ధ్వ ద్వాదశాంగుళ స్థానము వరకు యోగ మార్గములో **మార్గదర్శకులై ఆశ్రితులకు సంసారబంధములనుండి విముక్తికై త్రోవచూపువారు.**

**భిక్షుకయోగ లక్షణములు**

పరమహంసలగు భిక్షుక – తదితర భిక్షుకయోగులు ఉండే స్థలములు :

- వృక్షమూలములయందు,
- శిథిల గృహములయందు,
- శ్మశాన ప్రదేశములయందు.

ఎటువంటి సాంసార లౌకిక విషయములు చేరని ఏకాంత ప్రదేశములు ఎన్నుకొంటూ వుంటారు. గోచీ ధరించి గాని, దిగంబరులైకానీ చరిస్తూ ఉంటారు. వారిపట్ల "ధర్మ–అధర్మములు, లాభ–అలాభములు, శుద్ధ – అశుద్ధములు...." మొదలైన ద్వంద్వములకు స్థానమే ఉండదు. సమ **'లోష్ట–అశ్మ–కాంచనాః'!** వారి దృష్టికి మట్టి–రాయి–బంగారముల భేదము కనిపించదు. "మేము ఈ వర్ణముల వారి వద్ద భిక్ష స్వీకరిస్తాము. ఆ వర్ణములవారి వద్ద తీసుకోము" .... అను నియమము కూడా ఏమాత్రమూ కలిగి ఉండరు. వర్ణాశ్రమ ధర్మములకు నిబద్ధులు కాక, అతీతులై ఉంటారు. సర్వమూ బ్రహ్మమునందు సంయమింపజేస్తూ ఉంటారు.

**సదా సర్వదా సర్వత్రా ఆత్మగానే సర్వమును దర్శిస్తూ ఉంటారు.** 'సర్వత్రా ఆత్మైవ' ఇతి పశ్యంతి!

**ఇంకా కూడా ... ఆ పరమహంసలు...., జాతరూపధరా!** ... అప్పుడే పుట్టిన పసిబిడ్డవలె ప్రపంచములో ఏవిషయమునకు సంబంధించనివారై ఉంటారు. విషయములన్నీ వారిపట్ల అవిషయమై ఉంటాయి. 'జననక్షణయోగము'ను ఉపాసించువారై ఉంటారు. (జనించిన క్షణంలో ఉన్న తీరుగా ఇప్పుడు యోగము ద్వారా... అభ్యాసము చేయటము).

**నిర్ద్వంద్వా :** ద్వంద్వమోహ వినిర్ముక్తులై ఉంటారు.

- జీవాత్మ వేరు – పరమాత్మ వేరు.
- అజ్ఞాని వేరు – జ్ఞాని వేరు.
- పామరుడు వేరు – పండితుడు వేరు.
- కులీనుడు వేరు – అల్పకులజుడు వేరు.

.... ఇటువంటి ఆయా ద్వంద్వములన్నిటినీ అధిగమించినవారై సర్వత్రా **ఏకవస్తువు అగు అఖండాత్మయే ఈ సర్వము**గా సందర్శిస్తూ ఉంటారు.

**నిష్పరిగ్రహా :** ఈ పాంచభౌతిక వస్తు ప్రపంచములో ఏదీ పరిగ్రహించరు. **"ఈ ఇంద్రియ దృశ్యము నాకు చెందినది కాదు. (సర్వ సాంసారిక విషయలపట్ల కూడా) దీనికి నేను చెందినవాడను కాను"**..... అను ఎరుకను - సుస్పష్టముగా, నిర్దుష్టముగా కలిగి, శంకారహితులై ఉంటారు. "స్వప్నంలో కనిపించిన '5' అంతస్తుల మేడ ఎవరికి చెందింది? అసలు వాస్తవమైతే కదా! ఈ జాగ్రత్ జగత్ అట్టిదే!" అని గమనించువారై ఉంటారు.

**శుక్లధ్యానపరాయణా :** సర్వదా శుక్ల (ఆత్మ) ధ్యాన పరాయణులై ఉంటారు. **"ఆత్మైపమ్యేవ సర్వత్ర।"** సర్వము సర్వదా ఆత్మయే - అను 'ధ్యాస'ను విడువరు.

**ఆత్మనిష్ఠా :** ఎల్లప్పుడూ - సర్వము ఆత్మ స్వరూపముగా దర్శించుటయందే - నిష్ఠ కలిగి ఉంటారు. తదితరమైన లౌకిన నిష్ఠ-నియమములతో వారికి పని ఉండదు. ఏది చేసినా, మాట్లాడినా, ఎక్కడ చరించినా, ఏది ఎట్లా ఉన్నా, ఎవ్వరు ఏ రీతిగా స్పందన - అస్పందనములు కలిగి ప్రవర్తించినా, ఎవ్వరు ఏ గుణములు కలిగి ఉన్నాసరే, **"వీరు సర్వదా స్వతఃగా మమాత్మ స్వరూపులేకదా!"** అను అవగాహనను కించిత్ కూడా వదలి ఉండరు.

**ప్రాణసంధారణార్థం యథోక్తకాలే 'భైక్షమ్' ఆచరంతః :** "ప్రాణములను నిలుపుకోవటానికే ఆహారము" .... అను భావనను కలిగి ఉండి, తగిన సమయములో వారు భిక్షాటన చేస్తూ ఉంటారు.

## దేహ త్యాగ సందర్భము

**బ్రహ్మమార్గే సమ్యక్ - సంపన్నాః శుద్ధ మానసాః పరమహంస-ఆచరణేన - దేహత్యాగం కుర్వన్తి !**

వారు **"సర్వము బ్రహ్మమే"** అను ఎరుకచే సునిర్మితమై బ్రహ్మమార్గములో ...,

- **సంయోగ - వియోగాతీతమైన, సమరస భావనా సమన్వితమైన అఖండాత్మ-భావనా సుసంపన్నులై,**
- ఆలోచనలకు ముందే ఉండి ఉన్నట్టి **శుద్ధ-విషయరహిత-పరమ నిర్మల** మనస్సుతో కూడి ఉన్నవారై,

పైన మనము చెప్పుకొను పరమ హంస లక్షణ సమన్వితులై, ప్రశాంతముగా, ఆనందముగా, క్రీడా వినోదముగా ఉంటారు. ఏతత్ మృత్యు సమయమునందు శిధిల వస్త్రమును విడచు రీతిగా పాంచభౌతిక దేహమును త్యజిస్తారు.

**శూన్యాఽఽగార - దేవగృహ - తృణకూట - వల్మీక వృక్షమాల - కులాలశాలా - అగ్నిహోత్ర శాలా - నదీ పులిన - గిరికందర - కుహరకోటర నిర్ఝర స్థండిలే... తత్ర... సమ్యక్ సంపన్నాః శుద్ధ మానసాః పరమహంసా ఆచరణేన సన్న్యాసేన దేహత్యాగం కుర్వంతి!**

బ్రహ్మ మార్గములో సుస్థితులైన ఆ యతీశ్వర పరమహంసలు "మేము ఇక్కడే ఉండాలి. ఇక్కడే మరణించాలి! అక్కడ కాదు!" ..... ఇటువంటి వేదన భావములు కలిగి ఉండరు. అంతేకాదు! ఈ భౌతిక దేహమును ఎల్లవేళలా సుదూరంగా విడచి వచ్చిన వస్త్రమువలె సందర్శించువారై ఉంటారు.

పాడుపడిన ఇల్లు, దేవాలయము, గడ్డి ప్రదేశము, పుట్ట, చెట్టు మొదలు, కుమ్మరివాని ఇల్లు, అగ్నిహోత్ర శాల, నదీ తీరములోని ఇసుక తిన్నెలు, కొండగుహలు, చెట్టు తొర్రలు, సెలయేళ్ళగట్లు మొదలైన ఎక్కడైనా వారికి నివాసమునకు అర్హమైన ప్రదేశమే! **అట్లాగే భౌతిక దేహ త్యాజ్యమునకు కూడా అవన్నీ అర్హమైన ప్రదేశములే!**

⌘

ఎవ్వరెవ్వరైతే ఈ ఉపనిషత్‌లో చెప్పుకొన్న అంతర్లక్షణములు ఆశ్రయించి, మహదాశయశీలురై మానసికంగా అభ్యాసవశము చేసుకుంటారో, అట్టి ఏ ఆశ్రమవాసులైనా కూడా... వారు **పరమహంసలే! పరమహంస స్థానము చేరుటకై పరమహంసలే మనకు మార్గదర్శకులు.**

### ఇతి భిక్షుకోపనిషత్

సారాంశము : మనమంతా భిక్షుకులమై ఆత్మజ్ఞానభిక్ష కొరకై ఈఈ దేహగృహములను ఆశ్రయిస్తున్నాము. ఈ ఉపనిషత్‌లో చెప్పిన రీతిగా పరమహంసలమై దేహము త్యజించాలి - అని ఋషిపుంగవుల సూచన!

***ఓం శాంతిః! శాంతిః! శాంతిః!***


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 12 మండల బ్రాహ్మణోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ బాహ్య - అంతర తారక ఆకారం, వ్యోమ పంచక విగ్రహమ్,**
**రాజయోగైక సంసిద్ధం రామచంద్రమ్ ఉపాస్మహే॥**

*లోపల బయట తారకాకారమైయున్నది, పంచ ఆకాశరూపమైనది అగు రాజయోగ సిద్ధికొరకై శ్రీరామచంద్ర మూర్తిని ఉపాసించుచున్నాము.*

**1** **ఓం యాజ్ఞవల్క్యో హ వై**
**మహామునిః ఆదిత్య లోకం**
**జగామ! తమ్ ఆదిత్యం నత్వా,**
**"భో భగవన్! ఆదిత్యాత్మన్!**
**'తత్త్వమ్' అనుబ్రూహీ ఇతి!"**
**<u>సహోవాచ నారాయణః :</u>**
**జ్ఞానయుక్త - 'యమ' ఆది**
**అష్టాంగయోగ ఉచ్యతే॥**
**శీత-ఉష్ణ-ఆహార-నిద్రా విజయః,**
**సర్వదా శాన్తిః, నిశ్చలత్వం,**
**విషయేంద్రియ నిగ్రహశ్చ ఏతే 'యమాః'॥**
**గురుభక్తిః, సత్యమార్గ - అనురక్తిః,**
**సుఖానుగత వస్తు అనుభవశ్చ,**
**తద్వస్తు అనుభవేన**
**తుష్టిః; నిస్సంగతా, ఏకాంతవాసో;**
**మనోవృత్తిః; ఫలాన్ న-అభిలాషో,**
**వైరాగ్య భావశ్చ - "నియమాః"॥**
**సుఖాసనవృత్తిః చీరవాసాశ్చ ఏవమ్**
**ఆసన నియమా భవన్తి॥**

ఒకప్పుడు మహామునియగు యాజ్ఞవల్క్యుడు సూర్యభగవానుని దర్శించి, భక్తి - ప్రపత్తులు తెలియజేయు నిమిత్తమై 'ఆదిత్య లోకము' వెళ్ళారు. ఆదిత్య భగవానుని దర్శించి, **కృతాంజలి** సమర్పించారు. **'హే భగవాన్! ఆదిత్యాత్మదేవా! దయచేసి నాకు పరమాత్మతత్త్వమును ప్రబోధించండి'** అని అభ్యర్థించారు.

**సూర్యనారాయణుడు :** ఓ మునీశ్వరా! యాజ్ఞవల్క్యా! ఆత్మతత్త్వము వినినప్పటికీ, అనుభవానికి రావాలంటే మాత్రము అష్టాంగ యోగాలు తెలుసుకొని, ఆ యోగాలను అభ్యాసం (ప్రాక్టీస్) అవసరమని విజ్ఞులు చెప్పుచున్నారు. అందుచేత ముందుగా అష్టాంగ యోగాలు చెప్పుకుందాం!

**యమము** = శీత-ఉష్ణములను, ఆహార నిద్రలను జయించటము;

- అన్ని వేళల చిత్తమును ప్రశాంతముగా ఉంచుకొనుటము;
- బుద్ధిని నిశ్చలముగా ఉంచుకొనుటము;
- విషయముల పట్ల ఇంద్రియ నిగ్రహము;

**నియమము:** గురుభక్తి, సత్యమార్గము పట్ల అనురక్తి; అసత్య విషయముల పట్ల విరక్తి; - ఆత్మజ్ఞాన విషయములే వాస్తవ సుఖప్రదమను అవగాహన; ఆ ఆత్మవస్తు అనుభూతిచే **తుష్టి**; సంగము (అటాచ్‌మెంట్) తొలగించుకొను ప్రయత్నము; ఏకాంతవాసము (ఒంటరిగా భగవత్ ఉపాసన); జన సంసర్గమును వదిలి ఏకాంత మనోవృత్తి; కర్మఫలముల పట్ల అభిలాష లేకపోవటము; పరమాత్మకు సర్వము సమర్పించి ఉండటము - వైరాగ్య భావములు.

**సుఖాసనము:** ఏ ఆసనముతో ఎక్కువ సేపు సుఖముగా కూర్చుని ఉండి, వృత్తులను నియమించగలమో అది **సుఖాసనము. అదియే ఆసన నియమము.**

పూరక కుమ్భక రేచకైః
'షోడశ' (16), 'చతుష్షష్టి'(64), 'ద్వాత్రింశతి' (32)
సంఖ్యయా యథాక్రమం
"ప్రాణాయామః"॥
విషయేభ్య ఇంద్రియార్థేభ్యో
మనోనిరోధనం 'ప్రత్యాహారః॥'
సర్వశరీరేషు చైతన్య ఏకతానతా 'ధ్యానమ్'।
విషయ వ్యావర్తన పూర్వకం,
చైతన్యే చైతన్య స్థాపనం
'ధారణా' భవతి।
ధ్యాన విస్మృతిః 'సమాధిః'।
ఏవం సూక్ష్మాంగాని య ఏవం
వేద, స ముక్తిభాగ్ భవతి।

ప్రాణాయామము :

**పూరకము** - బయట నుండి గాలిని లోనికి పీలుస్తూ.. 16 మాత్రలు కాలం (16 చిటికల కాలం) (మాత్ర = సూదిని గ్రుచ్చి వెంటనే తీసివేయునంత కాలము)

**కుంభకము** : లోపలికి పీల్చిన గాలి దేహమునందు అంతటా నింపి ఉంచుతూ.. 64 మాత్రల కాలం (64 చిటికల కాలం)

**రేచకము** : దేహములో కుంభింపజేసిన గాలి బయటకు కదలటము.... 32 మాత్రల కాలము.

(**పూరకము** - కుడిముక్కుపుట మూసి ఎడమ ముక్కు పుటతో పీల్చటం.

**రేచకము** : ఎడమ ముక్కు పుట మూసి 'కుడి ముక్కు పుట' ద్వారా వదలటం.)

**ప్రత్యాహారము** : ఇంద్రియార్థముల యొక్క విషయముల నుండి మనస్సును నిరోధించుచూ, వెనుకకు మరల్చు ప్రయత్నములు.

**ధ్యానము** : అఖండమగు ఏక చైతన్యము సర్వశరీరములలోనూ సమముగా ఉన్నట్లు గమనిక, తత్ రీతిగా నిత్య సందర్శనము.

**ధారణ** : విషయములందు ప్రవేశించి విహరించుచున్న చైతన్యమును విషయముల నుండి వెనుకకు మరల్చటము, అట్లా మరల్చిన **చైతన్యమును చైతన్యమునందే** స్థాపించి ఉంచటము.

**సమాధిః** : నేను ధ్యానిని- ఇది ధ్యానింపబడు ధ్యేయము.. అను బేధము కూడా విస్మరించబడిన స్థితి. ధ్యాన-ధ్యేయముల ఏకత్వ యోగస్థితి.

ఈవిధంగా యమ, నియమ, ఆసన, ప్రాణాయామ - ప్రత్యాహార - ధ్యాన- ధారణ - సమాధులు **అష్టాంగములు**, వాటిని ఆచరిస్తూ, సూక్ష్మాంగములు (సూక్ష్మార్థములు) ఏమిటో తెలుసుకొన్నప్పుడు-ఈ జీవుడు ముక్తికి అర్హుడగుచున్నాడు.

---

2. దేహస్య పంచదోషా భవన్తి।
'కామ- క్రోధ-నిశ్వాస-భయ-నిద్రాః॥'
తత్ నిరాసస్తు నిస్సంకల్ప-
క్షమా-లఘ్వాహారా-అప్రమాదతా-తత్త్వసేవనమ్।
'నిద్రా భయ సరీసృపం।
హింసా ఆది తరఙ్గం।
తృష్ణా ఆవర్తం; దార పంకగ్ం।
సంసార వార్ధిం తర్తుం,
'సూక్ష్మమార్గమ్' అవలంబ్య,
సత్త్వ - ఆది గుణాన్ అతిక్రమ్య
'తారకమ్'.. అవలోకయేత్!
భ్రూమధ్యే సత్-చిత్-ఆనంద తేజః
కూటరూపం తారకం బ్రహ్మ।
తత్ ఉపాయం? లక్ష్యత్రయ అవలోకనమ్।
మూలాధారత్ ఆరభ్య -
బ్రహ్మరంధ్ర పర్యంతమ్

ఈ భౌతిక దేహంలో '5' దోషాలు ఉన్నాయి.

| **దోషము** | | **నివారణోపాయము** |
|---|---|---|
| కామమును | - | నిస్సంకల్పముతోను, |
| క్రోధము | - | క్షమాగుణముతోను, |
| నిశ్వాస (వాయుధారణ చేయలేకపోవటం) - మితభోజనముతోను, | | |
| భయము | - | అప్రమాదత, అప్రమశీలత, పరిమాత్మపై నమ్మికతోను |
| నిద్రా-జడత్వము | - | తత్త్వసేవనతోను ... జయించాలి! ('త్వమ్-తత్ అసి' - ఇతి భావేన) |

అష్టాంగ యోగములనబడే సూక్ష్మ మార్గములను అవలంబించి,
నిద్ర-భయము.... అనే సర్పములను
హింస-బాధ ...... అనే తరంగములను
భార్య - పుత్రాదులకు సంబంధించిన ఈషణములు .... అనే బురదను,
తృష్ణ (దురాశ) .... అనే సుడిగుండములను -
కలిగియున్న సంసార సముద్రాన్ని దాటివేసి..

సత్త్వ-రజో-తమో త్రిగుణములను అతిక్రమించివేసి, తారకముబ్రహ్మమును (తరింపజేసి ఒడ్డు జేర్చు దానిని, ఆత్మను) - అవలోకనము చేయాలి.

**తారకమ్** : 'భ్రూమధ్య' స్థానములో సత్ చిత్-ఆనందలక్షణములతో ప్రకాశమై వెలుగొందుచున్న కూర్మ (తాబేలు) రూపమే తారకము. ఆ కూర్మరూప తారకమునే 'బ్రహ్మము' అంటున్నారు.

సుషుమ్నా సూర్యాభా।
తన్మధ్యే తటిత్ - కోటి సమా,
మృణాళ తన్తు సూక్ష్మా కుణ్డలినీ!
తత్ర తమో నివృత్తిః।
తత్ దర్శనాత్ సర్వపాప నివృత్తిః।
తర్జన్య అగ్ర ఉన్మీలిత
కర్ణ రంధ్రద్వయే
'ఫూత్..' కార శబ్దో జాయతే।
తత్ర స్థితే మనసి, చక్షుః మధ్య
నీల జ్యోతిః పశ్యతి।
ఏవం హృదయేఽపి॥

**బహిర్లక్ష్యంతు।**

నాసాఽగ్రే చతుః (4) షట్ (6) అష్ట (8)
దశ (10), ద్వాదశ (12) - అంగుళీభిః
క్రమాత్ నీలద్యుతిః శ్యామత్వ
సదృక్ రక్తభంగీ స్ఫురత్
శుక్ల - పీత వర్ణ ద్వయోపేతం
వ్యోమత్వం పశ్యతి, స తు యోగీ,
చలత్ దృష్ట్యా వ్యోమభాగ వీక్షితుః।
పురుషస్య దృష్ట్యగ్రే
జ్యోతిర్మయూఖా వర్తన్తే।
తత్ దృష్టిః స్థిరాభవతి।
శీర్షోపరి ద్వాదశాంగులమాన (12)
జ్యోతిః పశ్యతి।
తదా అమృతత్వమేతి।

**మధ్య లక్ష్యంతు।**

ప్రాతః చిత్రాఽది వర్ణ
సూర్య, చంద్ర, వహ్ని జ్వాలావలీవత్
తత్ విహీన అంతరిక్షవత్
పశ్యతి, తత్ ఆకారాకారీ భవతి'।
అభ్యాసాత్ నిర్వికారం,
గుణరహితా - ఆకాశం భవతి,
విస్ఫురత్ తారక ఆకార
గాఢతమోపమమ్
పరాకాశం భవతి।
కాలా-అనల సమద్యోతమానం
మహాకాశం భవతి॥

**అందుకు ఉపాయము:**

లక్ష్యత్రయమును (ద్రష్ట-దర్శన-దృశ్యములను)... వాటికి ఆవల ఉండి వీక్షించటము. అవలోకించటము.

**సుషుమ్నానాడి** : మూలాధారము నుండి ఆరంభమై - బ్రహ్మరంధ్రము (సహస్రారము) పర్యంతము విస్తరించి ఉన్నది.

**కుండలినీ** : సుషుమ్నకు మధ్య భాగములో విద్యుత్ కోటి ప్రభలతో సమానమై, తామరతూడులోని 'దారము'వలె ఒకానొక శక్తి అతి సూక్ష్మరూపముగా ప్రకాశించుచున్నది. అదియే **కుండలినీ శక్తి.** ఆ శక్తి స్థానములో తమోవృత్తులు, తమస్సు నశించుచున్నాయి. అద్దాని దర్శనముచే (బుద్ధి యొక్క ఏకాగ్రతతో అనుభవముగా సిద్ధించుకోవటంచేత) సర్వపాపవృత్తులు నివృత్తి పొందగలవు.

**అంతర్లక్ష్య నీలజ్యోతి దర్శనము** : చూపుడువ్రేళ్ళ కొనలతో చెవి రంధ్రములను రెండిటినీ మూసి ఉంచితే, అప్పుడు లోనుండి **'ఫూత్'** కారశబ్దము వినబడుతూ ఉంటుంది. ఆ శబ్దముపై కేంద్రీకృతమైనప్పుడు మనస్సుకు రెండు కనుల మధ్య నీలలోహిత జ్యోతి (లేత నీలపు రంగు కాంతి) అనుభవమవుతుంది. ఈ విధంగా హృదయంలో తేజో మనో చక్షు దర్శనము చేయాలి.

**బహిర్లక్ష్యజ్యోతి దర్శనము:** నాసాగ్రముగా (భృకుటి స్థానము నుండి ఊర్ధ్వముగా యోగి ఆకాశతత్త్వమును,
చతు ('4') అంగుళముల దూరంలో - నీల ద్యుతి (నీలకాంతి) గాను,
షట్ ('6') అంగుళము దూరంలో - రక్త వర్ణము (ఎరుపు)తో కూడిన శ్యామల నలుపు) జ్యోతియు,
అష్ట ('8') అంగుళములు దూరంలో - తెలుపు,
దశ ('10') అంగుళముల దూరంలో - పసుపుపచ్చ రంగు తేజము,
ద్వాదశ ('12') అంగుళముల దూరంలో శ్వేతవర్ణ మిశ్రమ కాంతిగాను దర్శించు చున్నాడు. యోగ అభ్యాసముచే అట్లు దర్శనమగుచున్నది.

చలన దృష్టితో ఆకాశమును దర్శించు యోగికి దృష్టి యొక్క అగ్ర(పై) భాగములో జ్యోతి కిరణములు - తేజస్సు కనిపిస్తాయి. అట్టి జ్యోతి యొక్క దర్శనముచే దృష్టి స్థిరము అగుచున్నది.

యోగికి- శిరస్సు యొక్క ఉపరిభాగము నందు '12' అంగుళముల వరకు ఎప్పుడైతే జ్యోతి(వెలుగు) కనిపిస్తుందో, అప్పుడు ఆ యోగి 'అమృతత్వము'ను పొందు చున్నాడు. ఇది బహిర్లక్ష్యము

**మధ్య లక్ష్యము** : ఈ యోగ సాధన చేయుచున్న యోగి తన హృదయంలో

1) సూర్య-చంద్ర-అగ్ని జ్వాలల కాంతితో వెలుగొందుచున్న ఆకాశమును,

2) అవన్నీ లేనట్టి (సర్వశూన్య) ఆకాశమును కూడా దర్శిస్తూ ఉంటాడు. రెండు తీరులుగానూ సందర్శనము చేస్తూ ఉంటాడు.

క్రమంగా ఆ యోగికి అభ్యాసవశంగా నిర్వికార-గుణరహిత ఆకాశము అనుభూతమవుతోంది.

ఆ నిర్గుణ నిరాకార ఆకాశానుభవము కాస్తా ప్రకాశమాన (విస్ఫురత్) తారక (నక్షత్ర) ఆకారము గల గాఢతమము (నిర్విషయ రూపము) అగు **పరాకాశస్వరూపము**గా రూపుదిద్దుకొనుచున్నది.

సర్వోత్కృష్ట పరమద్యుతి
ప్రద్యోతమానం
**తత్త్వాకాశం భవతి।**
**కోటి సూర్యప్రకాశం**
**సూర్యాకాశం భవతి!**
**ఏవమ్ అభ్యాసాత్ తన్మయో భవతి,**
**య ఏవం వేద॥**

అట్టి పరాకాశమును దర్శించుచుండగా, క్రమంగా ప్రళయకాలాగ్ని కాంతులలో సమానమైన మహాకాశముగా దర్శనము అగుచున్నది.

ఆపై ఆ యోగి యొక్క ఆకాశానుభవము - సర్వోత్కృష్టము, పరమ ప్రకాశప్రద్యోత మానము అగు **'తత్త్వాకాశము'**గా అనుభూతమానమగు చున్నది.

అటుపై కోటి సూర్యప్రకాశమానమగు **'సూర్యాకాశము'**గా అనుభవముఅగుచున్నది. ఈ విధంగా బాహ్య అభ్యంతర స్వరూపమైన **'ఆకాశ పంచకము'** అను తారకమును అభ్యసిస్తూ ఉండగా అమనస్కమైన 'తన్మయస్థితి' కలుగుచున్నది. యోగి ఈ విధంగా ఆకాశపంచక తారకమును ఎరుగుచున్నాడు.

---

**3.** **తత్ యోగం చ ద్విధా విద్ధి -**
**పూర్వ- ఉత్తర విభాగతః।**
**పూర్వంతు - తారకం విద్యాత్**
**అమనస్కమ్ - తత్ ఉత్తరమ్ ఇతి!**
**తారకమ్ ద్వివిధమ్**
**మూర్తి తారకమ్ : అమూర్తి తారకమ్ ఇతి।**
**యత్ ఇంద్రియాంతమ్,**
**తత్ మూర్తితారకమ్!**
**యత్ భ్రూయుగాతీతమ్**
**తత్ 'అమూర్తితారకమ్' ఇతి।**
**ఉభయమపి మనోయుక్తమ్ అభ్యసేత్।**
**మనోయుక్తా అంతర్ - దృష్టిః**
**తారక ప్రకాశాయ భవతి!**
**భ్రూయుగ మధ్య బిలే 'తేజస'**
**ఆవిర్భావః। ఏతత్ పూర్వతారకమ్।**
**ఉత్తరమ్ తత్ - అమనస్కమ్।**
**తాలుమూల ఊర్ధ్వభాగే**
**మహజ్జ్యోతిః విద్యతే।**
**తత్ దర్శనాత్ అణిమాది సిద్ధిః॥**
**లక్ష్యే అన్తస్థ - బాహ్యాయాం, దృష్టౌ**
**దృష్టౌ నిమేష- ఉన్మేష వర్జితాయాం చ**
**ఇయం 'శామ్భవీ ముద్రా' భవతి।**
**సర్వతన్త్రేషు గోప్యా మహావిద్యా భవతి!**
**తత్ జ్ఞానేన సంసారనివృత్తిః।**
**తత్ పూజనం మోక్షఫలదమ్॥**
**అంతర్లక్ష్యం।**
**జలజ్యోతి స్వరూపం భవతి।**
**మహర్షి వేద్యమ్।**
**అన్తః - బాహ్య ఇంద్రియైః అదృశ్యమ్॥**

తారకయోగి యొక్క యోగవిద్యావిధానము రెండు విధములుగా ఉంటోంది

1. పూర్వము (ఫస్ట్ పార్ట్) - 'తారకవిద్య'
2. ఉత్తర (లేటర్ పార్ట్) - 'అమనస్కస్థితి'

**తారకము** : అట్టి తారక విద్య రెండు విధములై ఉంటోంది

**1. మూర్తి తారకము** : ఏ యోగ సాధనలో నామ రూపాత్మకమైనది సిద్ధించుచున్నదో, ఇంద్రియాంతకమై ఉన్నదో.. అది మూర్తి తారకము. (భూయుగము వరకు)

**2. అమూర్తి తారకము** : భ్రూమధ్య ఆకాశ సంబంధమునకు అతీతమైనది. (భూయుగమునకు ఊర్ధ్వముగా)

ఈ (మూర్తి-అమూర్తి తారకములు) ఉభయము మనస్సుతో చేర్చి అభ్యసించవలసినవే! ఉభయము యోగాభ్యాసిచే అభ్యసించబడుచున్నాయి.

మూర్తి - అమూర్తి తారకాభ్యాసముచే మనోయుక్తమైన 'అంతర్-దృష్టి'కి తారక ప్రకాశ (నక్షత్ర కాంతి) స్థితి (మనస్సుకు) సిద్ధించుచున్నవి.

**పూర్వ తారకము** : భూమధ్య ప్రదేశ బిలమునందు (రెండు కనుబొమ్మల మధ్య గల బిల - ఆకాశమునందు) ఒకానొక తేజస్సు జనిస్తోంది. **ఇది పూర్వతారకము.**

**ఉత్తర తారకము**: ఇది మనోలయ రూపమైనట్టి అమనస్కము.

-తాలు(దవడ) మూల (బిగినింగ్) ప్రదేశ ఊర్ధ్వభాగములో 'మహత్‌జ్యోతి' వెలుగొందుచున్నది. అట్టి ఆ మహత్ జ్యోతి యొక్క సందర్శనముచే ఆ యోగికి అణిమ-మహిమ-గరిమ-లఘిమ-ప్రాకామ్య-వశిత్వ-ఈశిత్వ - ఇచ్ఛా అష్టసిద్ధులు సిద్ధించుచున్నాయి.

తాలు మూల ఊర్ధ్వ భాగమున వెలుగొందుతున్న మహత్ జ్యోతి దర్శనమును 'శాంభవీ' ముద్ర- అంటారు. అట్టి శాంభవీముద్రను బాహ్యమునందును, అంతరమునందును ఉత్తమ (ఆత్మదర్శనము-అను) లక్ష్యమును గ్రహించి సాధన చేయాలి. కళ్లు - తెరచుట- మూయుటలను కూడా దాటిపోయినట్టిది ఈ శాంభవీ ముద్ర. ఇద్దాని యోగ సాధనకు కళ్లు మూతలతో పనిలేదు. **కనిపించేదంతా అదే అయి ఉండగా కళ్లు మూతలెందుకు?**

ఓ యాజ్ఞవల్క్య మునీంద్రా! మనము ఇప్పుడు చెప్పుకున్నది. సమస్త తంత్రములలోను రహస్యమగు యోగ మహావిద్య సుమా!

అట్టి తాలుమూల - ఆకాశములో వెలుగొందు మహత్ జ్యోతి యోగ విద్యను ఎరుగుట చేత **'సంసార నివృత్తి'** సిద్ధించగలదు.

ఈ యోగవిద్యను ఆరాధించు యోగికి మోక్షము సిద్ధించగలదు.

**అంతర్లక్ష్యము** : జలజ్యోతి-స్వరూపము. ఈ అంతర్జ్యోతిని మహర్షులు సత్య దృష్టి - ఆశయములచే గమనించి గానము చేస్తున్నట్టిది. అట్టి అంతర్జ్యోతి మనో బుద్ధులకు సందర్శనమయ్యేదేగాని, బాహ్య అంతర ఇంద్రియములకు విషయము కాదు.

4. సహస్రారే జలజ్యోతిః అంతర్లక్ష్యమ్!
బుద్ధి గుహాయాం సర్వాంగ సుందరం
'పురుషరూపమ్ అంతర్లక్ష్యమ్' ఇతి అపరే!
శీర్ష్ణా అంతర్గత మండల మధ్యగం
పంచవక్త్రమ్, ఉమాసహాయం,
నీలకంఠం, ప్రశాంతం, -
అంతర్లక్ష్యమ్.. ఇతి కేచిత్।
అగుష్ఠ మాత్రం పురుషో
అంతర్లక్ష్యమ్ - ఇతి ఏకే।
(దర్శనేన జీవన్ముక్త దశాయాం స్వయమ్
అన్తర్లక్ష్యో భూతా-పరమ్ - ఇతి అపరే)
ఉక్త వికల్పం। సర్వమ్ ఆత్మైవ।
తత్ లక్ష్యం శుద్ధాత్మ దృష్ట్యా వా
యః పశ్యతి, స ఏవ 'బ్రహ్మనిష్ఠో' భవతి
జీవః పఞ్చవింశకః (25)
స్వకల్పిత చతుర్వింశతి (24)
తత్త్వం పరిత్యజ్య షడ్వింశః (26)
పరమాత్మాఽహమ్ - ఇతి నిశ్చయాత్
జీవన్ముక్తో భవతి॥
ఏవమ్ అంతర్లక్ష్య దర్శనేన
జీవన్ముక్తి దశాయాం
స్వయం - అంతర్లక్ష్యో భూత్వా,
పరామ ఆకాశా - అఖణ్డమణ్డలో భవతి।

అంతర్లక్ష్యము **సహస్రార జలజ్యోతి (వెలుగుచున్న జ్యోతి) సందర్శనము అయి ఉన్నది.** అట్టి జలజ్యోతి జీవుని బుద్ధి గుహయందు సర్వాంగసుందరముగా సర్వదా వెలుగొందుచూనే ఉన్నది సుమా!

ఆ రీతిగా అంతర్లక్ష్యముగా కనిపించే జలజ్యోతి స్వరూపము పరమ పురుషుడే! 'శ్రీమన్నారాయణుడే' అని కొందరు అనుకొని దర్శిస్తున్నారు.

**ఈ అంతర్లక్ష్యము 'శిరస్సులో బ్రహ్మరంధ్రము నందు మధ్యమండలములో వెలుగొందు దివ్య జ్యోతి స్వరూపుడు-పంచముఖుడు, ఉమా సహాయుడు, ప్రశాంత మూర్తియగు పరమశివుడు'** అని మరికొందరు యోగసిద్ధులు ఆనందంగా సందర్శిస్తున్నారు.

ఆయనయే (బొటనవేలు ప్రమాణములగు, తత్ సంజ్ఞాలక్ష్యుడు అగు), **అంగుష్ఠ మాత్ర స్వయం జ్యోతి స్వరూప పురుషుడు** అని కొందరు గానము.

**ఆ అంతర్లక్ష్య పురుషుడు జీవన్ముక్త దశను దాటిన ఆ యోగి యొక్క విదేహముక్త-స్వస్వరూపమే! అది పంచభూతములకు పరమైనట్టి - సర్వస్వరూపము కూడా! -** అని ఇంకొందరి అభివర్ణన, స్వానుభవము.

ఈ ఈ వివిధ యోగుల - వివిధములుగా బయటకు కనిపించే-వికల్పానుభవములన్నీ... యుక్తియుక్తిమే! ఎవ్వరి అనుభవమును కాదనవలసిన పనిలేదు. ఎందుకంటే సర్వము **అఖండమగు** ఆత్మయే కదా!

అట్టి లక్ష్యమును **'శుద్ధమగు ఆత్మ దృష్టి'**తో ఎవ్వరు సందర్శిస్తారో, వారు బ్రహ్మనిష్ఠులే!

ఈ జీవుడు తాను కల్పించుకొనిన (25) [5 కర్మేంద్రియము+5 విషయములు)+ 5 జ్ఞానేంద్రియములు+5 విషయములు)+ అంతఃకరణ చతుష్టయమగు మనోబుద్ధి చిత్త అహంకారాలు) + జీవాత్మ- అనే] 25 తత్త్వములలో మొదటి 24తత్త్వములను త్యజించి, **26వ తత్త్వమగు పరమాత్మనే నేను..** అని ఎరిగి 25వది అగు జీవాత్మను స్వీయ పరమాత్మత్వముతో ఏకము చేసినప్పుడు - **జీవన్ముక్తుడు అగుచున్నాడు.** అట్టి అంతర్లక్ష్య దర్శనముచే జీవన్ముక్తుడై జీవన్ముక్త దశను కూడా దాటి, **తానే అఖండ మండలాకారుడగు పరమాకాశము..** అను స్వానుభవము నందు సంస్థితుడగుచున్నాడు.

## ద్వితీయ బ్రాహ్మణమ్

1. అథ హ యాజ్ఞవల్క్య
ఆదిత్యమణ్డల పురుషమ్ పప్రచ్ఛ
భగవన్! అంతర్లక్ష్యాదికం
బహుధా ఉక్తమ్!
మాయా తత్ న జ్ఞాతమ్।
తత్ బ్రూహి మహ్యమ్।

తదు హోవాచ :
పఞ్చమహాభూత కారణమ్,
తటిత్ కూటాఽభమ్,
తద్వత్ చతుః పీఠమ్।
తత్ మధ్యే తత్త్వ ప్రకాశో భవతి।

## ద్వితీయ బ్రాహ్మణము

**యాజ్ఞవల్క్యుడు** : హే! ఆదిత్య మండల పురుషా! సూర్యభగవాన్! ఆదిత్య నారాయణా! 'అంతర్లక్ష్యము' మొ॥నవాటి గురించి అనేక అనేక రీతులుగా చెప్పుచూ ఉన్నారు. అయితే.. అద్దాని యొక్క ప్రయోజనమగు జీవన్ముక్తి, బ్రహ్మనిష్ఠ, పరమాత్మాఽహమ్-ఇవి ఎట్లా సిద్ధించగలవు? ఈ విషయాలు నేను ఎరిగి ఉండలేదు. కనుక 'అంతర్లక్ష్యము' గురించి మరికొంతగా వివరించ ప్రార్థన.

**ఆదిత్యమండల పురుషుడు** : పంచమహాభూతములు కారణముగా ప్రకాశమానమగు త్రికూటము (ద్రష్ట-దర్శన-దృశ్యములు), అద్దానికి ఆశ్రయించి **జాగ్రత్ - స్వప్న - సుషుప్తి - తురీయములు; మనోబుద్ధి చిత్త-అహంకారములు** అనునవి చతుఃపీఠము.

వాటి మధ్యగా **తత్త్వ ప్రకాశ రూపమగు ఆత్మ** అతి గూఢమై వేంచేసి యున్నది. అదియే రహస్యమగు అవ్యక్తము కూడా.

అట్టి అతి రహస్య అవ్యక్త రూపమగు ఆత్మ 'జ్ఞానము' అనే పడవను అధిరోహించిన వారికే జ్ఞేయముగా అగుచున్నది. తెలియబడుచున్నది.

**సో అతి గూఢ అవ్యక్తశ్చ।**
**తత్ జ్ఞాన-ప్లవ అధిరూఢేన జ్ఞేయమ్!**
**తత్ బాహ్యా అభ్యన్తరః లక్ష్యమ్।**
**తత్ మధ్యే జగత్ లీనమ్।**
**తత్ నాద-బిందు-కలాతీతమ్, అఖణ్డ మణ్డలమ్!**
**తత్ సగుణ -నిర్గుణ స్వరూపమ్।**
**తత్ వేత్తా విముక్తః॥**
**ఆదాః అగ్ని మండలమ్।**
**తత్ ఉపరి సూర్య మణ్డలమ్।**
**తత్ మధ్యే సుధా చంద్ర మండలమ్।**
**తత్ మధ్యే అఖణ్డ తేజోమండలమ్।**
**తత్ విద్యుల్లేఖావత్ శుక్ల భాస్వరమ్।**
**తదేవ శామ్భవీ లక్షణమ్।**
**తత్ దర్శనే తిస్రో దృష్టయః।**
**అమా ప్రతిపత్ పూర్ణిమా చేతి।**
**నిమీలిత దర్శనమ్ అమా దృష్టిః।**
**అర్ధ ఉన్మీలితం ప్రతిపత్।**
**సర్వ ఉన్మీలనం పూర్ణిమా భవతి!**
**తాసు పూర్ణిమాభ్యాసః కర్తవ్యః॥**
**తత్ లక్ష్యమ్ - 'నాసాగ్రమ్!'**
**తదా తాలుమూలే గాఢతమో దృశ్యతే।**
**తత్ అభ్యాసాత్**
**'అఖణ్డమణ్డలాకార జ్యోతిః దృశ్యతే।**
**తదేవ సత్-చిత్-ఆనన్దమ్ 'బ్రహ్మ' భవతి!**
**ఏవం సహజానన్దే యదా మనో లీయతే,**
**తదా 'శామ్భవీ' భవతి॥**
**తామేవ "ఖేచరీమ్" ఆహుః॥**
**తత్ అభ్యాసాత్ మనః స్థైర్యమ్।**
**తతో వాయుస్థైర్యమ్।**
**తత్ చిహ్నాని....।**
**ఆదౌ తారకవత్ దృశ్యతే।**
**తతో వజ్రదర్పణమ్।**
**తతః పరిపూర్ణచంద్రమణ్డలమ్।**
**తతో నవరత్నప్రభా మణ్డలమ్।**
**తతో మధ్యాహ్న - అర్కమండలమ్।**
**తతో వహ్నిశిఖామణ్డలమ్।**
**.... క్రమాత్ దృశ్యతే॥**

అట్టి తత్త్వ స్వరూప అఖండ పరమాత్మయే సర్వే సర్వత్రా సర్వదా సర్వమై ఉన్నది కాబట్టి.. అదియే **బాహ్య - అభ్యంతర లక్ష్యము**.

అట్టి పరమాత్మయందే ఈ ఎదురుగా కనిపించే జగత్తు సర్వదా లీనమైయున్నది. అది నాదము (శబ్దము)నకు, బిందువు (చుక్క)నకు, కల (ఆకారములకు) అతీతమై అఖణ్డమణ్డలాకారమై యున్నది. సగుణ-నిర్గుణ ఉభయ స్వరూపమైయున్నది. అట్టి పరమాత్మను ఎరిగిన వాడు సర్వబంధములనుండి విడివడి విముక్తుడగుచున్నాడు.

మొదట - **అగ్ని మండలము**. ఆ తదుపరి - **సూర్యమండలము**. దాని మధ్యలో - **సుధా చంద్రమండలము**. అద్దాని మధ్యలో - **అఖణ్డ తేజోమండలము**

అయ్యది విద్యుత్ కాంతివలె తెల్లని ప్రకాశము.

ఆ శుక్ల - అఖండ 'తేజో మండలమే' శామ్భవీ లక్షణము.

అద్దాని దర్శనమే 'త్రిస్రోదృష్టి' (లేక) పరతత్త్వదృష్టి. ఆ శామ్భవీ లక్షణమునే బ్రహ్మ-విష్ణు- మహేశ్వరులుగా వేరువేరు ఉపాసకులు ధ్యానించుచున్నారు.

అదియే కొందరు యోగులు ప్రతిపత్తి (వారి బుద్ధి)చే పూర్ణపరతత్త్వముగా దర్శిస్తున్నారు. మరికొందరు కళ్లు మూసుకుని 'సోఽహమ్ - నేను అదే' అను దృష్టితో అంతరంగమున దర్శిస్తున్నారు. (అంతరహృదయ ఆభ్రాంతమధ్య హృదయాంతరంగుడు)

సగము మూసిన కళ్ళతో లోపల సర్వరూపముగానో (లేదా) బయట సర్వరూపముగానో అనిపిస్తోంది. పూర్తిగా తెరచిన (ఉన్మీలిత) కనులకు (దృష్టికి) పూర్ణముగా (బయట+లోపలగా) అగుపిస్తోంది. (శిలా విగ్రహమునందు అంతటా శిలయే ఉన్న రీతిగా) ఈ జగత్తంతా పరమాత్మతత్త్వమే!

అట్టి శాంభవీలక్షణ 'పూర్ణిమ-అభ్యాసమ్' - ముముక్షుయోగసాధకునికి కర్తవ్యము. నిర్వర్తించవలసినది.

అద్దానికై లక్ష్యము ఏకాగ్రము చేయవలసిన ప్రదేశము - నాశికకుపై భాగము (నాసాగ్రము - కనుబొమ్మల మధ్య-కించిత్ క్రిందగాగల పల్లము - స్థానము).

అది తాలు (దవడ) మూల-ఆకాశములో కూడా 'గాఢతమము' రూపముగా అనుభూతమవుతోంది. అద్దానిని యోగాభ్యాసంగా ఆశ్రయించాలి!

నాసాగ్రము - తాలు మూలములలోని తేజస్సును ఉపాసిస్తూ ఉండగా **అఖండమండలాకార జ్యోతి** యొక్క దర్శనము అగుచున్నది.

అదియే సత్ - చిత్ - ఆనంద బ్రహ్మము.

ఎప్పుడైతే ఆ సత్-చిత్ సహజానంద పరబ్రహ్మమునందు ఈ జీవుని మనస్సు విలీన మవుతుందో అది 'శాంభవీ' స్థితి యోగము అగుచున్నది. అదియే 'ఖేచరీముద్ర' అని కూడా పిలుస్తున్నారు.

అట్టి 'శాంభవీ' (లేక) ఖేచరీ ముద్రను అభ్యాసము చేస్తూ ఉండగా మనోస్థైర్యము, వాయు స్థైరము (మనో వాయునిశ్చలతలు) సిద్ధించుచున్నాయి.

**అట్టి శాంభవీముద్ర యొక్క చిహ్నములు**

మొట్టమొదట - నక్షత్రము వలె అగుపిస్తుంది.

తర్వాత వజ్రముతో నిర్మితమైన దర్పణము వలె కనిపిస్తుంది.

ఆ తర్వాత పూర్ణచంద్రమండలము వలె దృశ్యమానమవుతుంది.

ఆపై మధ్యాహ్న సూర్యమండలము వలె దివ్యప్రకాశమానమవుతుంది.

అటుపై అగ్నిశిఖామండలము వలె కనిపిస్తుంది.

ఈ విధంగా క్రమక్రమంగా దృశ్యమానమగుచున్నది.

2. తదా పశ్చిమ-అభిముఖ ప్రకాశః
స్పటిక ధూమ్ర బిన్దు నాద
కలా నక్షత్ర ఖద్యోత
దీపనేత్ర సువర్ణ నవరత్నాది ప్రభా దృశ్యన్తే॥
తదేవ ప్రణవ స్వరూపమ్।
ప్రాణా-అపానయోః ఐక్యం కృత్వా, ధృతకుమ్భకో
నాసాఽగ్ర దర్శన దృఢభావనయా
ద్వికరా అంగుళీభిః
షణ్ముఖీకరణేన ప్రణవ ధ్వనిం
నిశమ్య మనః - తత్ర లీనం భవతి!
తస్య న కర్మలేపః॥
రవేః ఉదయాస్తమయయోః
కిం కర్మ-కర్తవ్యమ్?
ఏవం విపశ్చిత్ ఆదిత్యస్య
ఉదయా-అస్తమయా భావాత్
సర్వకర్మా-అభావః॥
శబ్దకాల లయేన దివా-రాత్ర్య
అతీతో భూత్వా, సర్వపరిపూర్ణ జ్ఞానేన
'ఉన్మన్యవస్థా' అవశేన,
'బ్రహ్మైక్యం' భవతి॥
ఉన్మన్యా.... 'అమనస్కం' భవతి।
తస్య నిశ్చిన్తతా - ధ్యానమ్।
సర్వకర్మ నిరాకరణమ్ ... ఆవాహనమ్।
నిశ్చయ జ్ఞానమ్ ... ఆసనమ్।
ఉన్మనీ భావః ... పాద్యమ్।
సదా అమనస్కమ్.. అర్ఘ్యమ్।
సదా దీప్తిః.. ఆచమనం।
అపారామృతవృత్తిః.. స్నానమ్।
సర్వాత్మభావనా.. గన్ధః॥
దృక్ స్వరూపా అవస్థానమ్ ... అక్షతాః।
చిదాప్తిః ... పుష్పమ్।
చిదగ్ని స్వరూపం ... ధూపః॥
చిదాదిత్య స్వరూపం ... దీపః॥
పరిపూర్ణ చన్ద్రా అమృతస్య
ఏకీకరణం.. నైవేద్యమ్।

**అట్టి 'శాంభవీముద్ర' యొక్క చిహ్నములుగా..**

- పశ్చిమ - అభిముఖముగా (Left side) **ప్రకాశము** కనిపిస్తుంది.
- స్ఫటికముతో సమానమైన **తెల్లటి కాంతి పుంజము** అనుభూతమౌతుంది.
- **ధూమ్రము** (ఎక్కువ నలుపు, తక్కువ ఎరుపు) అగుపిస్తుంది.
- తర్వాత బిన్దు -నాద-కలా-నక్షత్ర కాంతులు, విద్యుత్తు -దీపకాంతులు, బంగారు, నవరత్నముల వన్నెలు, ప్రభలు కనిపిస్తాయి.

**అదియే ప్రణవ స్వరూపము**

-ప్రాణ-అపానములను ఐక్యము చేసి **'కుంభక ప్రాణాయామము'** అభ్యసించు యోగికి ముక్కుకు ఊర్ధ్వంగా ఆత్మానుభూతి సంబంధమగు - **నాసాగ్ర దర్శనము** యొక్క **దృఢ భావన** కలుగుతోంది.

- 'దృఢభావన'చే, రెండు ఉంగరపు వ్రేళ్ళతో చెవులు మూసి 'షణ్ముఖీకరణము' వలన ప్రణవనాదము నిరోధించబడుతుంది. ప్రణవ నిరోధము వలన 'మనస్సు' విలీనమగుచున్నవి.
- కుంభక - అభ్యాసము నిర్వర్తించుచున్న యోగికి క్రమంగా కర్మబంధములు తొలగి, కర్మలు - మొదలే లేనివిగా అగుచున్నాయి. 'నేను కర్మ బద్ధుడను' అనే భ్రమ తొలగుచున్నది.

ఏ విధంగా అయితే సూర్యునికి ఉదయ - అస్తమయములు వాస్తవానికి లేవో, ప్రపంచములో జరిగే ఏ కర్మలతోనూ సంబంధమే ఉండదో, కుంభక ప్రాణ యామముతో మనస్సు లయింపజేసినవానికి **కర్మలతో సంబంధమే ఉండదు. తాము సర్వమునకు ఆధారుడగుచునే, ఈ జగత్ సర్వమ్ తనకు లేనివాడై ఉంటాడు.** ఇది తెలుసుకొన్న తర్వాత ఇక, **"శాంభవీ ముద్రలోని ధ్యేయవస్తువగు చిత్ ఆదిత్యునికి ఉదయాస్తమయాలు లేవు. ఆయనకు కర్మలు లేవు. కర్మ బంధములూ లేవు"** అనునది సుస్పష్టమౌతుంది.

శాంభవీ యోగమునందు కుంభక ప్రాణాయమము ద్వారా అంతర్జ్యోతిని దర్శించు యోగి పట్ల శబ్ద-కాలములు లయిస్తాయి. అతడు రాత్రింబవళ్లకు అతీతుడు, అప్రమేయుడు, సాక్షి అగుచున్నాడు. సర్వ పరిపూర్ణ జ్ఞానము చేత 'ఉన్మనీ అవస్థ' (జగత్‌రహిత కేవలీ మనోస్థితి) మాత్రమే శేషించి, ఇక ఆతడు **'జీవ బ్రహ్మైక్య స్థితి'** పొందుచున్నాడు.

- 'ఉన్మనీ'యే అమనస్కము! **చంచల మనస్సుకు ఆవలయున్న నిశ్చల మనో విభాగమే ఉన్మనీ! అమనస్కము కూడా!**

## అమనస్కంతో ఆత్మ పూజ

- జగద్విషయముల గురించిన 'నిశ్చింత' ఆతని **'ధ్యానము'!**
- సర్వకర్మలను **'అవి నాకు సంబంధించినవి కావు. నేను వాటికి సంబంధించిన వాడిని కాదు'** అను భావనతో సర్వకర్మల నిరాకరణము - ఆతని **'ఆవాహనము'**. అఖండాత్మజ్ఞానమే అతడు సమర్పించే **ఆసనము.**
- ఉన్మనీ (కేవల-జగత్ రహిత మనస్సు) యే భగవానునికి **'పాద్యము'**.
- సదా మనస్సుకు సాక్షిగా ఉండే అమనస్కమ్ - **అర్ఘ్యము.**
- ఎప్పుడూ జ్ఞాన దీప్తితో ఉండటమే - **ఆచమనము.**
- అపారమగు అమృత స్వస్వరూపముపట్ల ఆత్మభావనావృత్తియే - **స్నానము.**
- సర్వాత్మభావనయే - **గంధ సమర్పణము.**
- దృక్ స్వరూప అవస్థ కలిగి ఉండటమే - **అక్షత సమర్పణ.**
- చిత్ స్వరూపము పొంది ఉండటమే - **పుష్పము.**
- చిదగ్ని స్వరూపమే - **ధూపము.**
- చిదాదిత్య స్వరూపము - **దీపము.**
- పరిపూర్ణ చంద్రామృత ఏకీకరణము - **నైవేద్యము.**
- ఆత్మభావనయందు నిశ్చలత్వము - **ప్రదక్షిణము.**

నిశ్చలత్వం ... ప్రదక్షిణమ్।
సోఽహమ్ భావో ... నమస్కారః।
మౌనం.. స్తుతిః।
సర్వసన్తోషో.. విసర్జనమ్।
ఇతి య ఏవం వేద!

- నేను ఆ ఆత్మ స్వరూపుడనే - సోఽహమ్ భావనయే - **నమస్కారము.**
- జగత్ విషయముల పట్ల మౌనము - **స్తుతి.**
- సర్వదా సంతోషముగా ఉండటయే - **విసర్జనము.**

ఇదియే ఆత్మసందర్శనము చేయు ఆత్మ సంయమయోగి యొక్క ఆత్మదేవుని **పూజావిధి. ఈవిధంగా ఆత్మచే ఆత్మ భగవానుని ఆత్మయందు పూజించాలి.**

---

3. ఏవం త్రిపుట్యాం నిరస్తాయాం
నిస్తరంగ సముద్రవత్, నివాత స్థిత దీపవత్,
అచల సంపూర్ణ భావ-అభావ
విహీన కైవల్య జ్యోతిః భవతి।
జాగ్రత్ - నిద్రా అన్తః పరిజ్ఞానేన
బ్రహ్మవిత్ భవతి।
సుషుప్తి సమాధ్యోః
మనోలయా విశేషేఽపి, మహదస్తు
ఉభయోః భేదః।
తమసి లీనత్వాత్
ముక్తిహేతుత్వాత్ ఆభావాచ్చ।
సమాధౌ మృదిత తమో వికారస్య
తదాకార ఆకారితా,
అఖణ్డాఽకార వృత్త్యాత్మక
సాక్షి చైతన్యే 'ప్రపంచలయః' సంపద్యతే।
ప్రపంచస్య మనః కల్పితత్వాత్,
తతో భేదా అభావాత్।
కదాచిత్ బహిర్గతేఽపి మిథ్యాత్వ భావాత్
సకృత్ విభాత సదా ఆనన్దా -
అనుభవైక గోచరో బ్రహ్మవిత్ తదేవ భవతి!
యస్య సంకల్ప నాశః స్యాత్,
తస్య ముక్తిః కరే స్థితా
తస్మాత్ భావ-అభావౌ పరిత్యజ్య
పరమాత్మ ధ్యానేన ముక్తో భవతి।
పునః పునః సర్వ-అవస్థాసు
జ్ఞాన-జ్ఞేయౌ
ధ్యాన - ధ్యేయౌ
లక్ష్య - అలక్ష్యే
దృశ్యా - అదృశ్యే చ
ఊహా-అపోహా-ఆది

క్రమంగా ద్రష్ట-దర్శన-దృశ్య రూప త్రిపుటిని దాటి పోయి (అధిగమించి/తిరస్కరించి) తరంగ రహితమైన సముద్రమువలె, గాలి వీచని చోట దీపమువలె, అచలము, భావ-అభావములను పూర్తిగా రహితము చేసుకున్నట్టిది **అగు కైవల్య జ్యోతి స్వరూపుడు** అగుచున్నాడు. ఈ జగత్తంతా ఆతని స్వయంజ్యోతి స్వరూపముయొక్క కాంతి పుంజమగుచున్నది.

జాగ్రత్-నిద్రలకు ఆవల సర్వదా ప్రకాశించు స్వస్వరూప పరిజ్ఞానము చేత ఈ జీవుడు **'బ్రహ్మవిత్'** అగుచున్నాడు (బ్రహ్మవేత్త)

సుషుప్తి-సమాధి.. ఈ రెండిటిలోనూ మనస్సు లయము పొందుచున్నది. కానీ ఆ రెండు ఒక్క తీరైనవి కానే కాదు. సుషుప్తి-సమాధిలకు రెండిటికీ చాలా భేదము ఉన్నది.

**సుషుప్తి** - ఇది తమస్సులో లీనమైయున్న జడస్థితి.. కనుక ఇక్కడ **ముక్తి హేతువులు భావించబడుటమే లేదు.** ఇక్కడ తమో వికారములు అప్రదర్శితత్త్వమును సంతరించుకుని, దాగి ఉన్నాయి. అంతవరకే!

సమాధిలో **తమో వికారములన్నీ తత్ ఆత్మ - ఆకారము** సంతరించుకుంటున్నవై.. తమోవృత్తులు --- అఖండాకార వృత్త్యాత్మకమైన సాక్షి చైతన్యము నందు ప్రవేశించుచూ, 'ప్రపంచ విలయము'.. సంభవించుచున్నది. అనగా **ప్రపంచము ఆత్మస్వరూపమై అనుభూతమగుచున్నది.**

అసలీ ప్రపంచము ఎవ్వరి చేత కల్పించబడినది? మనస్సు చేతనే! మనో కల్పిత జగత్తంతా ఒకే కల్పన కాబట్టి భేదముగా కనిపించేదంతా కూడా (సమాధి స్థితియలందు) అభావించబడుచున్నది.

**ఉన్మనీ (లేక) శాంభవీ యోగ సిద్ధునికి** - ఒకవేళ ఈ జగత్తు కొన్ని సమయాలలో బహిర్గతమై కనిపిస్తున్నప్పటికీ.. **'మనో కల్పనయే కదా'** అని ఎరుగబడియే ఉండటం చేత మిథ్యాత్వ భావనచే (ఇది కలలోని విశేషాల వంటివేనని) అసత్తుగా ఎరుగబడుచున్నది. అంతేకాని భేదబుద్ధి కలుగదు. ద్వంద్వములన్నీ ఏకరూపమౌతాయి.

ఏ యోగి అయితే ఈ దృశ్యమంతటినీ బ్రహ్మము యొక్క ప్రకాశము రూపమగు సదానన్ద అనుభవైకగోచరంగా దర్శిస్తాడో, ఆతడే **బ్రహ్మవేత్త.** అట్టి ఎరుకచే **బ్రహ్మవేత్త బ్రహ్మమే అగుచున్నాడు.**

ఎవ్వరి పట్ల **'ఇదంతా సర్వదా బ్రహ్మమే'** అనే భావన-అనుభూతుల పరిపుష్టిచే **జగత్ సంకల్పము నశిస్తుందో,** ఆతనికి ముక్తి ఆతని అరచేతిలోని పండు అగుచున్నది.

కనుక ఓ యజ్ఞవల్క్యా! ఈ భేదాత్మక జగత్తు గురించిన భావ- అభావములను రెండిటినీ పరిత్యజించి **'అఖండమగు పరమాత్మయే ఇదంతా'** అను పరమాత్మ ధ్యానమును ఆశ్రయించువాడు ముక్తుడే అగుచున్నాడు. పరమాత్మ తానే అయి ప్రకాశిస్తున్నాడు.

అట్టి అఖండ-అప్రమేయ-సర్వ బాహ్య అభ్యంతర స్వరూప పరబ్రహ్మమును తెలుసుకుని.. ఆ ఆత్మ సంయమ యోగి...,

జ్ఞానము (తెలుసుకోవటం) జ్ఞేయము (తెలియ బడునది),

- ద్రష్ట (చూచువాడు) - దృశ్యము (చూడబడునది),

లక్ష్యము, - అలక్ష్యము,

పరిత్యజ్య,
జీవన్ముక్తో భవేత్,
య ఏవం వేద॥

దృశ్యము (కనబడేది) - అదృశ్యము (కనబడనిది)
- ఊహ - అపోహ
.... మొదలైనవన్నీ పరిత్యంచుచున్నవాడై **జీవన్ముకుడు** అగుచున్నాడు .

---

4. పంచ అవస్థాః
జాగ్రత్; స్వప్న; సుషుప్తి; తురీయ;
**తురీయాతీతః॥**
జాగ్రతి ప్రవృత్తో జీవః
ప్రవృత్తి మార్గాసక్తః, పాపఫల నరకాదిమాంస్తు,
'శుభకర్మఫల - స్వర్గఫలమస్తు'
..... ఇతి కాంక్షతే।
స ఏవ స్వీకృత వైరాగ్యాత్,
"కర్మఫల జన్మ- అలమ్।
సంసార బన్ధనమ్ అలమ్।" ఇతి
విముక్త్య అభిముఖ నివృత్తి మార్గ
ప్రవృత్తో భవతి।
స ఏవ సంసార తారణాయ 'గురుమ్'
ఆశ్రిత్య, కామాది త్యక్త్వా
విహిత కర్మాచరన్, సాధన చతుష్టయ
సంపన్నో.., హృదయకమల మధ్యే
భగవత్ సత్తామాత్రా అన్తర్లక్ష్య రూపమ్
ఆసాద్య, సుషుప్త అవస్థాయాం ముక్త,
బ్రహ్మోఽ నంద స్మృతిం లబ్ధ్వా,
'ఏకఏవా అహమ్ అద్వితీయః'।
కంచిత్ కాలమ్ అజ్ఞానవృత్యా
విస్మృత, జాగ్రత్ వాసనాఽనుఫలేన
'తేజసోఽస్మి' - ఇతి।
తత్ ఉభయ నివృత్యా, 'ప్రాజ్ఞ ఇదానీమ్ అస్మి'
ఇతి అహమ్ ఏక ఏవ! స్థాన భేదాత్,
అవస్థా భేదస్య,
పరంతు, 'నహి మత్ అన్యత్' ఇతి జాత వివేకః,
'శుద్ధ-అద్వైత బ్రహ్మోఽహమ్' ఇతి అభిదా,
గన్ధం నిరస్య
స్వాన్తః విజృమ్భిత భానుమణ్డల
ధ్యాన తదాకార ఆకారిత
పరంబ్రహ్మోకార ముక్తిమార్గమ్

**పంచ అవస్థలు** - 1) జాగ్రత్ 2) స్వప్నము 3) సుషుప్తి 4) తురీయము 5) తురీయాతీతము

జాగ్రత్తులో ప్రవర్తించుచున్న జీవుడు 'ప్రవృత్తి మార్గ - ఆసక్తుడు' అయి ఉంటున్నాడు. **"అయ్యా! నాకు పాప ఫలములైనటువంటి నరకము, దుఃఖము మొదలైనవి రాకూడదు. శుభకర్మ ఫలములైనట్టి స్వర్గసుఖములు మొ॥వి లభించాలి"**.. ఇట్లా ఆకాంక్షిస్తున్నాడు.

ఈ విధంగా ప్రవృత్తి మార్గము కొనసాగుతోంది.

ఆతడే మరొకప్పుడు జాగ్రత్‌లో మాత్రమే లభించే ఫలముల పట్ల వైరాగ్యము పొందుచున్నాడు. **"ఈ జన్మ - కర్మఫలములు ఇక చాలు, ఇవన్నీ వాస్తవానికి బంధమే"** అని భావించి, సర్వసంసార బంధనముల నుండి 'విముక్తి కొరకై - **నివృత్తి మార్గము** వైపుగా అభిముఖుడగుచున్నాడు.

అట్టి వైరాగ్య మార్గ అభిముఖుడు సంసార బంధముల నుండి విడివడుటకై **'గురువు'ను తత్త్వ సమాచారము** కొరకై ఆశ్రయిస్తున్నాడు. కామములు, కామ్యకర్మలు క్రమంగా వదలటం ప్రారంభిస్తున్నాడు. **"విహిత- నియమిత సాధన"** కర్మలకు మాత్రమే 'పరిమితము' అగుచున్నాడు. సాధన చతుష్టయ సంపత్తిని (శమము- సత్సంగము- విచారణ-సంతోషములను) ఆశ్రయించుచున్నాడు. సాధన సంపన్నుడై.. ఇకప్పుడు హృదయకమలము నందు 'భగవంతుని ఉనికి మాత్రమే' లక్ష్యమగు **అంతర్లక్ష్య రూపమును** ఆశ్రయించి, సిద్ధింపజేసుకొంటూ.., ఆత్మయందు సుషుప్తి.. అనే అవస్థనుండి విముక్తునై 'బ్రహ్మానందము'నకు సంబంధించిన జ్ఞానము (స్మృతి) పొందిన వాడు అయి ఉంటున్నాడు.

- వాస్తవానికి నేను సర్వదా ఏకమే గానీ అనేకమును కాను. ఇదంతా నా యొక్క ఏక - అద్వితీయ బ్రహ్మానంద స్వరూపమే।

- నేను కొంత కాలము నా యొక్క అజ్ఞానవృత్తుల చేత, నా యొక్క ఏక - 'సర్వాత్మక అద్వితీయ' స్వరూపమును, ఏమరచుటచే - జాగ్రత్ వాసనలచేత **'విశ్వుడు'**గా కనిపిస్తూ ఉన్నాను. మరొకప్పుడు జాగ్రత్ వాసనలచే అంతరంగంలో దృశ్యం కల్పించు కొనుచున్నప్పుడు 'తేజసుడు అయి, స్వప్నమును అనుభవిస్తూ వస్తున్నాను. ఇంకొకప్పుడు 'జాగ్రత్-స్వప్న' ఉభయ వాసనల నుండి నివృత్తుడనై కేవల **ప్రాజ్ఞడను** అని భావించి ఉంటున్నాడు.

- నిజానికి ఈ జాగ్రత్-స్వప్న-సుషుప్తులు నా యొక్క వేరువేరైన సంచార ప్రదేశాలు, స్థానభేదాలు, అవస్థా భేదాలు'.. **అని చింతన చేయాలి. "నేను ఏకాత్ముడను" అనునది వృద్ధి చేసుకోవాలి.**

**"నాకు అన్యమైనదేదీ ఎక్కడా కించిత్తు కూడా లేనే లేదు కదా।"** అనే వివేకము జనించినవాడై తనయందు హృదయాంతర్గత-అఖండ మండలాకారజ్యోతిని, సందర్శించుచున్నాడు. **'శుద్ధ అద్వైత బ్రహ్మమే నేను'** అను మహాయోగభావము ఆశ్రయిస్తున్నాడు.

సర్వ భేదవాసనలను పరిత్యజించి వేసి, తనలోనే సర్వదా అనుక్షణము విజృంభించు చునేయున్న 'భానుమండల ధ్యానము'చే తత్-ఆకార ఆకారితుడగుచున్నాడు. **పరబ్రహ్మాకార' ముక్తి మార్గము** నందు ఆరూఢుడై **'పరిపక్వ స్థితుడు'** అగుచున్నాడు.

ఆరూఢః 'పరిపక్వో' భవతి।
సంకల్పాదికం మనోబన్ధ హేతుః।
తత్ విముక్తం మనో మోక్షాయ భవతి।
తద్వాం చక్షురాది బాహ్య ప్రపంచ
ఉపరతః, విగత ప్రపంచ గంధః।
సర్వమ్ జగదాత్మత్వేన పశ్యన్,
త్యక్త్వా అహఙ్కారో, 'బ్రహ్మోఽహమస్మి'
ఇతి చిన్తయన్, 'ఇదమ్ సర్వమ్
యత్, అయమ్ ఆత్మేఽతి'
భావయన్.. కృతకృత్యో భవతి॥

మనో బంధమునకు హేతువు (కారణము) ఏమిటి? సంకల్పములను ఆశ్రయించుటము చేతనే!

సంకల్పముల నుండి విముక్తుడైతే, ఈ జీవుడు 'మోక్షము' పొందగలడు.

హృదయము నందు జగత్ సంబంధమైనట్టి సర్వ సంకల్పములను రహితం చేసుకొన్నయోగి, ఇక ఆపై ఈ భౌతికమైన కళ్లకు కనిపిస్తున్న బాహ్య ప్రపంచమంతటినీ దాటి వేసినవాడై ఉంటున్నాడు. ప్రపంచ సంబంధమైన సర్వవాసనలు త్యజించివేసి.. తన యొక్క సర్వజగదాత్మత్వమును చూస్తూ ఆస్వాదిస్తూ..

ఈ జాగ్రత్‌లో వెంటనంటి తిరుగాడే **'నేను, నాది'** అనే అహంకారమును త్యజించి, అధిగమించుచున్నాడు. **'నేను సర్వదా పరబ్రహ్మస్వరూపుడనే- బ్రహ్మమునే' అనే రూపములో గల 'మహామహదహంకారము'ను చిన్తన చేస్తూ 'ఇక్కడ ఏదేదైతే కనిపిస్తోందో ఇదంతా సుమాత్మ స్వరూపమే'** అను భావనచే ఈ జీవుడు **కృతకృత్యుడు** అగుచున్నాడు.

---

**5.** సర్వ పరిపూర్ణ తురీయాఽతీత
బ్రహ్మభూతో 'యోగీ' భవతి
'తం బ్రహ్మేఽతి' స్తువన్తి।
సర్వలోక స్తుతి పాత్రః। సర్వదేశ సంచార శీలః।
పరమాత్మగగనే బిన్దుం నిక్షిప్య
శుద్ధా అద్వైత అజాడ్య సహజ అమనస్క యోగనిద్రా
అఖణ్డానన్దపదా అనువృత్త్యా 'జీవన్ముక్తో' భవతి।
తత్ చ ఆనంద సముద్ర మగ్నా
యోగినో భవన్తి।
తత్ అపేక్షయా ఇన్ద్రాయః స్వల్పాఽనన్దాః,
ఏవం ప్రాప్తానందః పరమయోగీ భవతి।
ఇత్యుపనిషత్।

ఆ హృదయాంతర్గత నిత్యోదిత ఆత్మజ్యోతిని ధ్యానించుచున్న యోగి - **సర్వపరిపూర్ణ - తురీయాతీత-బ్రహ్మభూతుడు** అగుచున్నారు.

అట్టి పరిపూర్ణ తురీయాతీత బ్రహ్మ భూతుడు 'బ్రహ్మమే' అని స్తుతించబడుచున్నాడు.

సర్వలోక స్తుతిపాత్రుడు, సర్వ(ప్ర)దేశములలో ఆత్మ సంచాలుడు అగుచున్నాడు.

పరమాత్మాకాశములో 'బిందువు'ను నిక్షేపించి (ఫిక్సింగ్), శుద్ధ అద్వైత అజాడ్య-సహజ అమనస్క - యోగ నిద్ర యందు ప్రవేశించి, 'అఖండానంద పదము' నందు అనునిత్యుడై (నిత్యవృత్తికలవాడై) ఉన్నవాడు 'జీవన్ముక్తుడే'!

ఆతడు 'ఆనంద సముద్రమగ్న యోగి'!

అట్టి 'సోఽహమాత్మానందము' యొక్క కించిత్ అపేక్ష (సాపేక్ష) చేత ఇంద్రుడు మొదలైన పదవులు అధిష్టించి, లోకపాలకులై స్వల్పానందమును పొందుచున్నారు. అట్టి స్వయమత్మానందమును పొంది ఈ జీవుడు పరమయోగి అగుచున్నాడు.

---

## తృతీయ బ్రాహ్మణమ్

## తృతీయ బ్రాహ్మణము-అమనస్కయోగము

**1.** యాజ్ఞవల్క్యో మహామునిః
మణ్డల పురుషం పప్రచ్ఛ!–
స్వామిన్। 'అమనస్క లక్షణమ్' ఉక్తమపి, విస్మృతం।
పునః తత్ లక్షణమ్ –బ్రూహి'.. ఇతి।
**తథేతి మండల పురుషో అబ్రవీత్:**
ఇదమ్ అమనస్కం అతిరహస్యం,
యత్ జ్ఞానేన కృతార్థో భవతి।
తత్ నిత్యం శాంభవీ ముద్రాన్వితం,
పరమాత్మ దృష్ట్వా, తత్ ప్రత్యయ లక్ష్యాని దృష్ట్వా
తదను సర్వేశమ్, అప్రమేయమ్,
అజమ్, శివమ్, పరాకాశమ్, నిరాలంబమ్, అద్వయమ్,
బ్రహ్మ–విష్ణు–రుద్రాదీనాం ఏకలక్ష్యమ్,

**యాజ్ఞవల్క్య మహాముని:** స్వామీ ఆదిత్య భగవాన్! సూర్య మండల పురుషన్! 'అమనస్క యోగము' గురించి మీరు వివరంగా చెప్పి ఉన్నారు. అయితే ఏం? నేను 'విస్మృతి' అనునది కూడా ఏమరచు' జీవలక్షణము కలవాడను. అందుచేత మరొక్కసారి 'అమనస్కయోగ లక్షణములు' గురించి విశదీకరించమని ప్రార్థిస్తున్నాను.

**ఆదిత్య మండల పురుషుడగు సూర్యభగవానుడు :** అవునయ్యా! 'అమనస్కయోగము' అనునది అతి రహస్యమైనది. ఇది తెలుసుకొంటే ఈ జీవుడు కృతార్థుడు కాగలడు.

అట్టి మనో ఉన్మనీ (మనస్సు యొక్క మనో కేవల సాక్షీ - అనుభము)నే 'శాంభవీముద్ర' అంటారు. అనగా శాంభవీ ముద్రాన్వితమైనది. పరమాత్మ దృష్టితో ఆత్మ యొక్క ప్రత్యయలక్షణములను సర్వదా దృష్టిలో పెట్టుకోవాలి. అప్పుడిక, సర్వేశ్వరుడును, అప్రమేయుడును, జన్మరహితుడును, సర్వశుభ-సుఖ ప్రదాత, పరాకాశస్వరూపుడు, నిరాలంబుడు, సర్వజీవుల స్వరూపమునకు వేరుకానట్టి అద్వయుడు, బ్రహ్మ-విష్ణువు-రుద్రుడు మొదలైన వారికి కూడా ఏకైక లక్ష్యము

సర్వకారణమ్, పరం(బహ్మా ఆత్మన్యేవ
పశ్యమానో 'గుహా విహరణం' ఏవం నిశ్చయేన జ్ఞాత్వా
భావా–అభావాది ద్వంద్వాఽతీతః
సంవిదిత మనో ఉన్మన్యనుభవః।
తదనన్తరమ్, అఖిలేంద్రియ
క్షయవశాత్ అమనస్క సుఖమ్ ।
బ్రహ్మానన్ద సముద్రే మనః ప్రవాహ
యోగ రూప, నివాత స్థిత దీపవత్
అచలమ్ 'పరబ్రహ్మ' ప్రాప్నోతి।
తతః శుష్క వృక్షవత్
మూర్ఛా నిద్రామయ నిశ్వాసో ఉచ్ఛ్వాసా అభావాత్,
నష్ట ద్వంద్వః, సదా అచంచల గాత్రః
పరమశాన్తిం స్వీకృత్య మనః ప్రచార శూన్యం
పరమాత్మని లీనం భవతి।
పయః స్రావా.. అనన్తరం ధేనుః స్తన క్షీరమివ,
సర్వేంద్రియవర్గే పరినష్టే
'మనోనాశం' భవతి – తదేవ అమనస్కం।
తదను "నిత్య శుద్ధః పరమాత్మా అహమ్ ఏవ" ఇతి
"తత్త్వమ్ అసి" ఇతి ఉపదేశేన
'త్వమేవాఽహమ్', 'అహమేవ త్వమ్'
ఇతి తారకయోగ మార్గేణ
అఖణ్డానంద పూర్ణః కృతాఽర్థో భవతి।

అయి ఉన్నావాడు, సర్వకారణ కారణుడు, అకారణుడు.. అగు **'పరంబ్రహ్మాత్మ తత్త్వము'** యొక్క **అనుక్షణిక సందర్శనము** సిద్ధిస్తోంది. అమనస్కయోగము' బాహ్య-అభ్యంతరములన్నీ హృదయ రూపమై, సహృదయగుహలో విహరించటమే! ఈ విధంగా ఆత్మను తెలుసుకొని, భావ-అభావములు మొదలైన ద్వంద్వములను దాటి, **తానే అదై** వెలుగొందటమే **అమనస్క స్థితి**. నిశ్చల జలంలో చంచల తరంగములవలె **నిశ్చల స్వస్వరూపంగా చంచల జగత్ దర్శనం అది!**

ఆ తదనంతరము - ఆతడు అఖిలేంద్రియ వ్యాపారములకు సంబంధించనివాడు అగుచున్నాడు. 'అమనస్క సుఖ బ్రహ్మానంద సముద్రము'లో మనః - ప్రవాహరూపుడు - అగుచున్నాడు. గాలి వీచికలు లేని చోట దీపము వలె అచలమగు పరబ్రహ్మస్వరూపము పొందినవాడగుచున్నాడు.

ఇక ఆ తర్వాత.. ఎండిన వృక్షము వలె, మూర్ఛలోనూ - గాఢ నిద్రలోను ఉన్నవాని వలె - ఉచ్ఛ్వాస - నిశ్వాసల అభావనాపరుడై, ద్వంద్వములన్నీ త్యజించినవాడై, ఎల్లప్పుడు చంచలము పొందుచున్న ఈ భౌతికదేహముతో 'పరమశాంతి'ని స్వీకరించినవాడై ఉంటున్నాడు. ఆతని మనస్సు ప్రసారశూన్యమై..., ఆతని జీవాత్మత్వమంతా.. పరమాత్మయందు విలీనము అయినదగుచున్నది.

పాలు పిండిన తర్వాత ఏవిధంగా అయితే, గోవు యొక్క స్తనము నుండి పాలు రావో, ఆ విధంగా ఎప్పుడైతే సర్వేంద్రియ వర్గములు విషయముల పొందని స్థితిలో 'మనోనాశనము' జరుగగలదు.

అదియే అమనస్కము!

**'ఆ నిత్య శుద్ధ పరమాత్మ నేనే అయి ఉన్నాను', 'తత్త్వమ్ అసి'..** మొదలైన మహావాక్యముల ఉపదేశమును గ్రహించిన తరువాత,

**"నేనే నీవుగా ఉన్నాను. నీవే నేనుగా ఉన్నావు"** - అను నిశ్చలావగాహనయే **తారకయోగ మార్గము**. ఇట్టి తారక యోగమార్గము నందు (శాంభవీ ముద్ర యోగి) అడుగులు వేయుచుండగా.. ఇక ఆతడు 'అఖండానందపూర్ణుడు'.. అగుచున్నాడు. 'కృతార్థుడు' అగుచున్నాడు. అనిర్వచనీయుడగుచున్నాడు.

---

**2.** పరిపూర్ణ పరమాకాశ మగ్నమానాః
ప్రాప్తో ఉన్మన్యవస్థః, సన్యస్త
సర్వేంద్రియవర్గ అనేక జన్మార్జిత
పుణ్యపుంజ పక్వ కైవల్య ఫలో
అఖణ్డానన్ద నిరస్త సర్వక్లేశ
కశ్మలో.. 'బ్రహ్మాఽహమస్మి'
ఇతి కృతకృత్యో భవతి।
త్వమేవాఽహమ్, నభేదోఽస్తి
పూర్ణత్వాత్ పరమాత్మనః
ఇతి ఉచ్చరన్ సమాలింగ్య
శిష్యం జ్ఞప్తిమ్ అనీనయత్।।

ఈ విధంగా **తత్త్వమ్, సోఽహమ్, త్వమేవాఽహమ్, అహమేవత్వమ్**ల పరమార్థమును ఆశ్రయిస్తూ - ఆ శాంభవీ యోగి (ఆత్మయోగి) **'పరిపూర్ణ పరమాకాశమగ్నుడు'**.. అగుచున్నాడు. ఉన్మనీ (ఆత్మనే సర్వదా దర్శించు) స్థితిచే మనో అంతర్గతమైన సర్వభేద విషయములను పరిత్యజించుచున్నాడు. సర్వేంద్రియ వర్గములను సన్యసించినవాడై, అనేక జన్మలలో ఆర్జించిన పుణ్య భావముల పరిపక్వతచే **'కైవల్యము'** అనే మధురాతిమధురమైన 'ఫలము'ను పొందుచున్నాడు. (కైవల్యము = ఇదంతా నా కేవలీ స్వరూపమే అను ఏక-అభేద సుస్థిరానుభూతి).

'అఖండానందము' అనే ఫలమును పొంది సర్వక్లేశ-కశ్మలములను మొదలంట్లా తొలగించి వేయునట్టి **"బ్రహ్మాఽహమ్. నేనే బ్రహ్మమును"** - అని సిద్ధించుకొని కృతకృత్యుడు అగుచున్నాడు.

**"నీవుగా ఉన్నది నేనే! నేనుగా ఉన్నది నీవే! నీకు - నాకు భేదము లేదు నీవు-నేను కూడా పూర్ణత్వము చేత పరమాత్మ స్వరూపులమే"!** అని లేచి నిలబడి ఆతడు లోకములకు ప్రకటించుచున్నాడు. తన వద్ద తత్త్వమును తెలుసుకొనటానికై వచ్చిన శిష్యుని సమాలింగనము చేసుకొని, ఇకప్పుడు **'తత్త్వమ్'** అనే స్మృతిజ్ఞా'నమును ప్రసాదించుచున్నాడు.

## చతుర్థమ్ బ్రాహ్మణమ్

**అథ హ యాజ్ఞవల్క్యో మణ్డల పురుషం పప్రచ్ఛ:**
**'వ్యోమపఞ్చక లక్షణమ్ విస్తరేణా అనుబ్రూహి'.. ఇతి।**
**సహోవాచ :**
**ఆకాశం; పరాకాశం; మహాకాశం;**
**సూర్యాకాశం; పరమాకాశమ్ ఇతి పఞ్చ భవంతి।**
**బాహ్యా-అభ్యన్తరమ్ అంధకారమయమ్ 'ఆకాశమ్'।**
**బాహ్య అభ్యన్తరే కాలానల**
**సదృశమ్ 'పరాకాశమ్'।**
**– స బాహ్యా-అభ్యన్తరే అపరిమిత**
**ద్యుతినిభమ్ తత్త్వం 'మహాకాశమ్'।**
**–స బాహ్య – అభ్యన్తరే సూర్యనిభం**
**'సూర్యాకాశమ్'।**
**–అనిర్వచనీయ జ్యోతిః**
**సర్వవ్యాపకమ్, నిరతిశయానన్ద**
**లక్షణమ్ 'పరమాకాశమ్'।**
**ఏవం తత్ తత్ లక్ష్య దర్శనాత్**
**తత్ తత్ రూపో భవతి।**
**నవ చక్రం (9), షట్ ఆధారమ్ (6)!**
**త్రిలక్ష్యమ్ (3), వ్యోమపఞ్చకమ్ (5)**
**సమ్యక్ ఏతత్ న జానాతి,**
**స యోగీ నామతో భవేత్॥**

### చతుర్థ బ్రాహ్మణము-వ్యోమపంచక లక్షణములు

**యాజ్ఞ వల్క్యుడు:** ఓ మణ్డల పురుషా! సూర్యనారాయణస్వామీ! మరొక విన్నపము. దయతో 'వ్యోమపంచక లక్షణములు' గురించి మరికొంత విస్తరించి వివరించ ప్రార్థన.

**ఆదిత్య భగవానుడు:** వ్యోమ పంచకము - (1) ఆకాశము 2) పరాకాశము. 3) మహాకాశము 4) సూర్యాకాశము, 5) పరమాకాశము.

**ఆకాశము** : బాహ్యమున లోలోపల కూడా అంధకారమయమై ఉన్నట్టిది.

**పరాకాశము** : బాహ్య - అభ్యంతరములలో 'కాలాగ్ని' సదృశమైనది. ఈ ఇహ రూపమునకు ఆవల పరస్వరూపము.

**మహాకాశము** : బాహ్య - అభ్యంతరములలో అపరిమితమైన జ్యోతి - తేజస్సుచే/ నిండి ఉన్నట్టిది. ('త్వమ్'ను 'తత్ బ్రహ్మము' రూపంగా చూడడం)

**సూర్యాకాశము** : బాహ్య - అభ్యంతరములలో సూర్య సదృశ కిరణాత్మక భావనలచే నిండియున్నట్టిది. సర్వము స్వస్వరూప తేజోవిభవముగా చూడటం.

**పరమాకాశము** : అనిర్వచనీయము! జ్యోతి స్వరూపము! సర్వవ్యాపకము! నిరతిశయానన్ద లక్షణ సమన్వితము. కేవల - అనుభవైకవేద్యము. అట్టి పరమాకాశమునకు 'రెండవది' అనునది వేరుగా లేదు.

అందుచే ఈ పరమాకాశము ఏఏ లక్ష్యములతో లక్ష్య దర్శనము చేస్తే, అది ఆ రూప లక్షణమే అగుచున్నది. ఎవరు ఏ లక్ష్యమును దర్శిస్తే ఆతడు ఆ రూపుడే అగుచున్నాడు.

నవచక్రమ్ (9) - (భూతాత్మ, ప్రేతాత్మ, అంతరాత్మ, జీవాత్మ, జ్ఞానాత్మ, నిర్మలాత్మ, శుద్ధాత్మ, మహాత్మ, పరమాత్మ)

షట్ ఆధారము (6) (దృశ్యము, దృక్, దేహము,జీవుడు, ఈశ్వరుడు, పరమాత్మ)

వ్యోమపంచకము (5) (ఆకాశము, పరాకాశము, మహాకాశము, సూర్యాకాశము, పరమాకాశము)

వీటన్నిటి యొక్క సమ్యక్ (సమరసము) ఎవరు గమనించరో.. వారు నామ మాత్రపు (పేరుకొరకు మాత్రమే) యోగులు. "అంతటా అన్నీగా అఖండ పరమాత్మ తతత్త్వమే! అనేకముగా కనిపిస్తూ ఏకముగా అయి ఉన్నట్టిదే. అహమ్-త్వమ్-ఇదమ్ ఏకస్వరూపమగు ఆత్మ!"... అని ఎరుగుచున్నవాడే వాస్తవమైన యోగి!

---

## పంచమం బ్రాహ్మణమ్

**సవిషయం మనో బన్ధాయ।**
**నిర్విషయం ముక్తయో భవతి।**
**అతః సర్వం జగత్ చిత్తగోచరమ్।**
**తదేవ చిత్తం నిరాశ్రయం,**
**మనో 'ఉన్మని అవస్థా' పరిపక్వం,**
**లయ యోగ్యం భవతి।**
**తత్ లయం పరిపూర్ణే మయి సమభ్యసేత్।**
**మనోలయకారణమ్ అహమేవ।**
**అనాహతస్య శబ్దస్య।**
**తస్య శబ్దస్య యో ధ్వనిః।**

### పంచమమ్ బ్రాహ్మణమ్

మనస్సు విషయముల సమేతమై ఉండటమే బంధము.

**మనస్సు నిర్విషయమై యుంటే, అదియే 'ముక్తి' అగుచున్నది.**

ఈ సర్వ జగత్తు చిత్తమునకే గోచరమగుచున్నది. చిత్తము ఉంటేనే జగత్తు. చిత్తము లేని వానికి జగత్తు ఎక్కడిది?

అట్టి ఈ చిత్తమును - ఏదీ ఆశ్రయించకుండా నిరాశ్రయము చేశామనుకో.. అప్పుడు ఉన్మనీ అవస్థ పరిపక్వమై, ఇక - ఆత్మయందు ఆ చిత్తము లయించటానికి యోగ్యత పొందుతుంది.

అట్టి మనోలయము యొక్క పరిపూర్ణత కొరకై (ఆదిత్య నారాయణుడనగు) **నాయందు మనోలయా భ్యాసము చేయాలి.** మనస్సు యొక్క లయ కారకుడను నేనే!

అనాహతములో (దేహములోని షట్చక్రములు స్థానముగా కలిగిన వెన్నెముక యందు) 'శబ్దము' ఉన్నది!

ధ్వనే అంతర్గతం జ్యోతిః।
జ్యోతిః అంతర్గతం మనః।
యత్ మనః - త్రి జగత్ సృష్టి-
స్థితి - వ్యసన కర్మకృత్,
తత్ మనో విలయం యాతి,
'తత్ విష్ణోః పరమమ్ పదమ్'।
తత్ లయాత్ 'శుద్ధ అద్వైత సిద్ధిః'
భేదా అభావాత్, ఏతదేవ
'పరమ తత్త్వమ్'।
స తత్ జ్ఞో బాలో, ఉన్మత్త పిశాచవత్,
జడవృత్త్యా 'లోకమ్' ఆచరేత్।
ఏవమ్ అమనస్కా అభ్యాసేనైవ
నిత్య తృప్తిః।
అల్పమూత్ర - పురీష।
మిత భోజన।
దృఢాంగా జాడ్య నిద్రా దృక్
వాయు చలనా।
అభావ బ్రహ్మదర్శనా అజ్ఞాత
సుఖ స్వరూపసిద్ధిః భవతి।
ఏవం చిరసమాధి జనిత
బ్రహ్మోఽమృత పాన పరాయణో
అసౌ సన్న్యాసీ, పరమహంసా,
అవధూతో భవతి।
తత్ దర్శనేన సకలం జగత్ పవిత్రం భవతి।
తత్ సేవా పరో అజ్ఞోఽపి ముక్తో భవతి।
తత్ కులమ్ ఏకోత్తరశతం తారయతి।
తత్ మాతృ-పితృ-జాయా-అపత్యవర్గం చ
ముక్తం భవతి!
ఇతి
మండల బ్రాహ్మణోపనిషత్
ఓం శాంతిః శాంతిః శాంతిః

ఆ శబ్దము యొక్క మధ్య భాగములో 'ధ్వని' - ఉన్నది!
ఆ 'ధ్వని'కి అంతర్గతంగా 'జ్యోతి' ఉన్నది!
ఆ జ్యోతికి అంతర్గతంగా మనస్సు ఉన్నది!
ఆ మనస్సే ముల్లోకముల సృష్టి - స్థితి-లయముల వ్యసనకర్మ నిర్వర్తిస్తోంది!
ఆ మనస్సును లయింపజేస్తే అప్పుడు శేషించునది, లంభించునదియే ఆ 'విష్ణు పరమ పదము'. మనోలయము విష్ణు పరమపద ప్రాప్తికి కారణముగుచున్నది.
మనస్సు యొక్క లయముచే **'శుద్ధ అద్వైత సిద్ధి'** లభించుచున్నది.
శుద్ధ అద్వైత సిద్ధిచే సర్వభేద భావములు అభావించబడతాయి. భేదములన్నీ అభావించిన స్థితియే **'పరమతత్త్వము'**
ఇంతవరకూ అజ్ఞాన వృత్తులచే కాపాడుకొంటూ వచ్చిన వ్యష్టిత్వము-ఇప్పుడు సమిష్టి రూపమగు పరతత్త్వమునందు లయించటం చేత - పరతత్త్వమును తెలుసుకొన్న యోగి ఈ జాగ్రత్తులో-ఒక బాలుని వలెను, ఉన్మత్తుని వలెను, పిశాచము వలెను జడవృత్తి కలిగి యున్న వానివలె లోకంలో సంచరిస్తూ ఉంటున్నాడు.
ఈ విధముగా 'అమనస్కము' యొక్క అభ్యాసము చేత...,
- ఆతడు **'నిత్యతృప్తుడు'**గా ఉంటాడు.
- అల్పమైన మూత్ర-పురీషములు (సాయిల్) (అల్ప విసర్జనలు) స్వభావతః కలిగి ఉంటాడు.
-అల్పముగా ఆహారముచే నిత్యతృప్తుడై ఉంటాడు.
-మనోధార్ఢ్యము కలిగి ఉంటాడు. దృఢమైన అంగములు కలిగి ఉంటాడు.
- జాడ్యము నిద్ర లేని దృష్టి పొంది ఉంటాడు.
-వాయువును నిరోధించువాడై ఉంటాడు.
- భావములను దాటి వేసి బ్రహ్మమును దర్శించుచూ తదితరులకు తెలియరాని **'ఆత్మసుఖ :స్వరూపసిద్ధి'** పొందినవాడై ఉంటాడు.
ఈ విధముగా చిరకాలము 'సమాధి'ని అభ్యసించిన యోగి, అట్టి సమాధి నుండి జనించిన **'బ్రహ్మమేవాఽహమ్'**అను **'బ్రహ్మామృత పారాయణుడు'** అగుచున్నాడు.
అట్టి వాడు సన్న్యాసి- పరమహంస-అవధూత కూడా!
అట్టి **'సమస్తము తానై-సమస్తమునకు వేరైనట్టి వ్యష్టి అతీత ఆత్మసుఖ స్వరూప సిద్ధయోగి** ని చూచినంతమాత్రము చేతనే ఈ సకల జగత్తు పవిత్రము పొందగలము. (జనులు పవిత్రులు కాగలరు).
ఆయన పట్ల సేవా పరులైనవారు -అజ్ఞానులైనప్పటికీ -ముక్తిని పొందగలరు.
ఆతని 101 వంశములు తరించుచున్నారు.
ఆతని తల్లి-తండ్రి-భార్య, పిల్లలు కూడా ముక్తులగుచున్నారు.
**ఇతి**
**మండల బ్రాహ్మణోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# (12) మండల బ్రాహ్మణోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



**మండల బ్రాహ్మణోపనిషత్** = ఆదిత్య మండల పురుషుడగు సూర్యనారాయణ భగవానునిచే ప్రబోధించిన బడిన బ్రహ్మము గురించిన తత్త్వబోధా బ్రాహ్మణము. ఓం భాస్కరాయ విద్మహే। మహద్యుతికరాయ ధీమహి। తన్నో ఆదిత్య ప్రచోదయాత్॥

❖

ఓంకార సంజ్ఞయగు జీవబ్రహ్మైక్య అఖండ తత్త్వమునకు నమోవాక్కములు.

❖

### 1. ప్రథమ బ్రాహ్మణము – తారకయోగము – శాంభవీముద్ర

**యాజ్ఞవల్క్య మహామునీశ్వరుడు** చతుర్వేద పారాయణుడు. మహాతపశ్శాలి. పరాపర శాస్త్రహృదయవేత్త. సద్గుణ సుసంపన్నుడు! ఆయన ఒక సందర్భములో **జగదాధారుడు, సవితృ మండల మధ్యవర్తి, ఆదిత్య మండల పురుషుడు, విరించి-నారాయణ – శంకరాత్ముడుగా మునిజనవందితుడు** – అగు ఆదిత్యభగవానుని దర్శనార్థమై సూర్యమండలము ప్రవేశించారు. ఆ సూర్యభగవానునికి భక్తి ప్రపత్తులతో ఆత్మప్రదక్షిణ నమస్కారములు సమర్పించారు.

**యాజ్ఞవల్క్య మహాముని :** స్వామీ! సూర్యనారాయణ భగవాన్! ఆదిత్య మండల పరమపురుషా! శతకోటి ప్రణామములు! నాపై దయతో నాకు 'పరబ్రహ్మతత్త్వ' విశేషములను ప్రబోధించవలసినదిగా అభ్యర్థన!

**ఆదిత్య మండల పురుషుడగు సూర్యనారాయణ భగవానుడు**: ఓ యాజ్ఞవల్క్య మహామునీ! ఆత్మ గురించిన తత్త్వ జ్ఞానము గురుముఖతః వినటము, అవగాహన, తెలుసుకోవటముచే.. తప్పక తెలియబడగలదు. అయితే ఈ జీవుడు అనేక ఉపాధులుగా వ్యష్టి తత్త్వముచే ప్రాభావితుడై ఇంద్రియ విషయములను ఆశ్రయించటము, నమ్మి ఉండుటము చేత బుద్ధిని నిర్మలము చేసుకోవాలి కాబట్టి జ్ఞాన శ్రవణముతోబాటుగా యోగాభ్యాసము అత్యవసరము. లేకుంటే వ్యష్టిని సమిష్టితోను, సమిష్టిని ఆత్మయందు లయింపజేయలేడు.

ఇది బ్రహ్మతత్త్వవేత్తల అభిప్రాయము. ఇది దృష్టిలో పెట్టుకొని మనము మునుముందుగా అష్టాంగ యోగముల గురించి చెప్పుకుందామయ్యా!

### అష్టాంగయోగములు

**జ్ఞానయుక్త 'యమ' ఆది అష్టాంగయోగ – ఉచ్యతే।** యోగము యొక్క అభ్యాసమును '8' అంగములుగానూ వాటి వాటి ఉపాంగముల వివరణతోడను మార్గ దర్శకులచే మార్గాన్వేషకులకు సవివరించబడుచున్నాయి. అవి జ్ఞానమునకు కూడా మార్గము అని చెప్పబడుచున్నాయి.

### 1. యమము – ఉపాంగములు

**1) శీత-ఉష్ణ ఆహార నిద్రా విజయము** : కాలానుసారంగా వసంత-గ్రీష్మ-వర్ష-శరత్-హేమంత-శిశిర ఋతు షట్కములలో ప్రకృతి శీత – ఉష్ణతాపములను కలుగజేస్తూ ఉంటుంది. వాటి పట్ల ఓర్పు వహించి స్వీకరించుటచే దేహము సానుకూలము అయి, సాధనమునకు ఉపకరిస్తుంది. అట్లాగే 'నేను ఇదే తినాలి – ఆ రుచియే కావాలి' – ఇటువంటి అభ్యాసములను జయిస్తూ, "దేహము అనే ఈ

ఉపకరణము  కొరకై ఆహారము - అంతేగాని, ఇంద్రియముల ఆనందము కొరకు కాదు" - అని గ్రహించి ఉండాలి. తత్త్వ జిజ్ఞాస-తత్త్వ జ్ఞాన సిద్ధి కొరకై ఆహారము-దేహము కూడా! ఆహారము ఆహారము కొరకై, రుచికొరకై కాదు. అతి నిద్ర పరమాత్మ ప్రసాదితమైన ఆయువును వృధా చేసుకోవటమే అవుతుంది.

**2) సర్వదా 'శాన్తి' :** ఇంద్రియ విషయ యోచనలతో హృదయమును అశాంతి చేసుకోకూడదు. మనస్సును ప్రశాంతముగా ఉంచుతూ తత్త్వ జ్ఞానమునకు సంసిద్ధము చేయాలి. ఎవ్వడైతే ప్రాపంచిక సందర్భములకు, సంగతులకు, సంబంధములకు వ్యధ చెందడో, సుఖ-దుఃఖ సమయములలో సమత్వమును వదలక ఉంటాడో, సూక్ష్మబుద్ధితో ధీరుడై ఉంటాడో.. ఆతడే **అమృత స్వరూపమగు ఆత్మభావనకు అర్హుడు అగుచున్నాడు.**

**3) నిశ్చలత్వము :** బుద్ధి యొక్క చంచలత్వమును, అనేక విషయములపై వ్రాలటమును పరిపరి రీతులుగా పరుగులు తీయు స్వభావమును అరికట్టు ప్రయత్నము చేస్తూ ఉండాలి. బుద్ధికి ఏకాగ్రతతో కూడిన నిశ్చలత్వమును అభ్యాసపూర్వకంగా అలవర్చాలి.

**4) విషయేంద్రియ నిగ్రహము :** మనస్సు ఇంద్రియ విషయములపై వ్రాలటమును గమనిస్తూ 'నిగ్రహము' (Control)ను అభ్యసిస్తూ ఉండాలి. రాగ - ద్వేషములు ఇంద్రియ - మనస్సులను శాసించకుండా జాగరూకులై ఉండాలి.

## 2. నియమము - ఉపాంగములు

**1) గురుభక్తి :** ఈ జీవుడు ఇంద్రియ విషయముల వెంట వెళ్లి వెళ్లి వాటి యందు ప్రియాప్రియములకు సంబంధించిన అనేక అభిప్రాయములు, నమ్మకములు, భావ-ఆవేశములు, సుఖ - దుఃఖ దర్శనములు, మంచి-చెడుల ద్వంద్వ భావనలు.. ఇవన్నీ కలిగి ఉంటున్నాడు. ఎప్పుడో **సత్యాన్వేషి** అగుచున్నాడు. అందుకు మానవ జన్మ చక్కటి సందర్భము. ఈ జగత్తులో మహనీయులగు సత్యద్రష్టలు, ఆత్మతత్త్వజ్ఞులు  ఉన్నారు. స్వకీయ భావావేశములను, అభిప్రాయ పరంపరలను, ఉద్వేగములను, కొంచెము ప్రక్కగా పెట్టి, **శాస్త్ర ఉద్దేశ్యములను ఎరిగినట్టి అనుభవజ్ఞుడగు సద్గురువును ఆశ్రయించాలి.** వారు చెప్పు సాధనలను శ్రద్ధగా స్వీకరిస్తూ, ఆత్మ గురించిన సమాచారము కొరకై బుద్ధిని సిద్ధము చేసుకొంటూ.., ఇక ఆపై గురువాక్యముల పట్ల బోధల పట్ల 'శ్రద్ధ-ఆసక్తు'లను పెంపొందించుకోవాలి. గురుభక్తిచే 'శ్రద్ధ' రూపుదిద్దుకొనగలదు.

**2) సత్యమార్గ అనురక్తి:** ఈ జీవుడు మనో కల్పనామాత్రమైనట్టి ఇంద్రియ విషయముల పట్ల, వాటి ఉపశాఖలు అగు ప్రియ-అప్రియ స్వజన-పరజన పుత్ర-కళత్ర.. ఇత్యాది బంధువర్గము పట్ల జన్మ-జన్మాంతరములుగా అనురక్తిని కొనసాగించుచూ, అజ్ఞాన భూములలో రాకపోక సంచారములు చేస్తూ వస్తున్నాడు. **'ఏది నిత్యము? ఏది సత్యము?'...** అను ప్రశ్నకు ఒకానొకప్పుడు వచ్చుచున్నాడు. కనుక ముముక్షువైనవాడు కాల్పిక విషయముల పట్ల, కాలాంతర్గత సంగతి- సందర్భముల పట్ల విరక్తి - వంటి జాగరూకతలను ఆశ్రయించాలి. సత్యమార్గము పట్ల 'అనురక్తి' ప్రవృద్ధ పరచుకొనునుగాక! ఇది. 'నియమము'లోని మరొక ఉపవిభాగ శాఖ.

**3) సుఖానుగత అనుభవశ్చ నిస్సంగతా:** ఇంద్రియముము నుండి లభించు సుఖములు వాస్తవానికి దుఃఖ మిశ్రితములు. భ్రమను జోడించినప్పుడు మాత్రమే మృగతృష్ణాజలంలాగా సుఖము వలె - అనిపిస్తూ ఉంటాయి. ఇది గుర్తెరిగి ఉండాలి.

**4) తద్వస్తు అనుభవేన తుష్టి:** ఆత్మ జ్ఞాన సంబంధమైన విశేషములచే ఆనందించటము, (చదివినప్పుడో, వినినప్పుడో-అద్దాని ఆనందమునకు) ఆకర్షించబడటము - ఇది కూడా నియమము యొక్క విభాగమే!

**5) నిస్సంగతా :** 'సంగము(Association - Attachment) చేత కామ-క్రోధ-సంయోగ-స్మృతి భ్రంశ-బుద్ధి నాశ-ప్రణస్యత (Down Fall)లు ఏర్పడుచున్నాయి' అని గమనించటమే **నియమము** యొక్క **నిస్సంగ** ఉపశాఖ. **ఏది ఎట్లా నిర్వర్తించాలో, అట్లే నిర్వర్తించుచూ,** సంగరహితుడై ఉండటము విజ్ఞాన దృష్టి చేత ఈ జీవునికి సుసాధ్యమే! నాటకంలో నటునివలె - **జగత్ నాటకంలో తన జీవాత్మత్వమును-తాను ధరిస్తున్న పాత్రవలె చూస్తూ - తాను వేరై ఉండాలి.**

**6) ఏకాంత వాసో :** ఏకాంతముగా (In Privacy) అభ్యాసము-సాధన-విచారణలను నిర్వర్తిస్తూ ఉండటము. "ఉపాసన నాకు-పరమాత్మకు సంబంధించినది మాత్రమే! పదిమంది గుర్తింపుకొరకు కాదు!" - అను ఎరుక. 'శ్రవణము' తరువాత నిర్వర్తించవలసిన మననముచే ఏకాంతవాసము ప్రారంభమగుచున్నది.

**7) మనోనివృత్తి :** 'ప్రవృత్తి' (Avocation) మార్గము నుండి (ఆయా ఇంద్రియ విషయముల నుండి) మనస్సును విరమింపజేయుటము. (Withdrawal of Avocation). వృత్తులకు అతీత స్థానములో బుద్ధిని నిలిపి, వృత్తులను ఆత్మోపాసనకు బాహ్య - ఉపకరణములవలె సమన్వయించుకొని, భావించి ఉండటం.

**8) ఫలాన్ న అభిలాషో:** ***'నాకు దృశ్యములో ఎంతవరకు ప్రయోజనము లభించింది?'*** అనే స్థితి నుండి, ***'ఈ ఈ కర్మ వ్యవహారములు నా బుద్ధిని నిర్మలము, సునిశితము, విస్తారము, పవిత్రము చేసుకొనటానికి ఉద్దేశ్యించెదను గాక!'*** అనునదియే **'ఫలాన్ న అభిలాష'** అగుచున్నది. చేయవలసినదియే చేస్తూ, ఇక ***'పొందవలసినది ప్రపంచంలో కాదు. నా ఆధ్యాత్మ తత్త్వమార్గాన్వేషణలో'*** అనునదే నిష్కామకర్మ!

**9) వైరాగ్య భావశ్చ :** దేని పట్లా రాగము లేకుండా ***"ఇదంతా కాలమహిమ. కాలము చేత సందర్భపడుచూ, కాలము చేత తొలగిపోయే స్వభావము కలిగి ఉన్నది కదా! ప్రకృత్యైవచ కర్మాణి। నాకు రాగ-ద్వేషములు ఉండవలసిన పనేమి?"..*** అను అవగాహనతో విరాగి అయి, వైరాగ్య భావము మనస్సు నందు కలిగి ఉండటము.

## 3. ఆసనము

**సుఖాసనవృత్తిః చిరవాసశ్చ ఏవమ్ ఆసన నియమా భవన్తి ।** ధ్యాసను ప్రాపంచిక విషయముల నుండి విరమింపజేసి ఒక్క చోటికి తెచ్చి ఏకాగ్రము చేస్తే గాని 'పరతత్త్వము' అనుభూతము కాదు. అందుకు శాస్త్రములు సూచించు 'పద్మాసనము' మొ॥వి (లేక) ఎక్కువసేపు ఒకచోట సుఖముగా కూర్చుని చిత్త-వృత్తులను వెనుకకు తెచ్చి ఆత్మతత్త్వ ధ్యానము నందు నియమించుటకు వీలుగా ఉండేటటువంటి ఏదైనా **'సుఖాసనము'**ను స్వీకరించాలి. అభ్యాసం చేసుకోవాలి.

## 4. ప్రాణాయామము

**శ్లో॥ పూరక-కుమ్భక-రేచకః-షోడశ (16) -చతుష్షష్టి- (64)**
**ద్వాత్రింశతి (32) సంఖ్యయా యథాక్రమం-"ప్రాణాయామః"।**

**పూరకము -** కుడి బొటనవ్రేలుతో కుడి ముక్కుపుట మూసి ఎడమ ముక్కుపుటతో గాలి శరీరములోనికి పీల్చుట 16 మాత్రలు (చిటికెల) కాలము (మాత్ర = ఒక సూదిని వస్త్రములో గ్రుచ్చి వెనువెంటనే తీయునంత సమయము)

**కుంభకము -** ఎడమ ముక్కుపుటను కుడి ముక్కు పుటను మూసి, దేహము నందు ఆ పీల్చినగాలిని స్థంభింపజేయుటము 64 మాత్రల (చిటికెల) కాలము. అట్టి సమయంలో ధ్యాసను ఆజ్ఞాచక్రంలో నిలిపి, బుద్ధితో దేహమంతా వాయు సమత్వమును ధారణ చేయటము.

**రేచకము -** ఎడమ ముక్కుపుటను మూసియే ఉంచి, కుడి ముక్కు పుటను కొంచెము - కొంచెముగా తెరుస్తూ దేహములో కుచించి ఉంచిన గాలిని నెమ్మదిగా వదలుచూ- మొత్తము గాలిని బయటకు పంపుట 32 మాత్రల (చిటికెల)కాలము

ఈ విధము యథాక్రమముగా (ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము, రాత్రి కూడా ప్రతి పూట 6 సార్లుగాని, 12 సార్లుగాని, 18 సార్లుగాని, 24 సార్లుగాని, 32 సార్లుగాని) నిర్వర్తించటము.

## 5. ప్రత్యాహారము

**విషయేభ్య ఇంద్రియార్థేభ్యో మనోనిరోధనం!** మనస్సును ఇంద్రియార్థములైన శబ్ద-స్పర్శ-రూప-రస-గంధముల నుండి వెనుకకు మరల్చి మరొక ఏదో ఒక ప్రదేశమునందు (ఇష్టదైవ రూప - పాదములు, బిందువు, గురుపాదములు.. ఇట్టి ఒక చోటు) ప్రతిక్షేపించటము.

## 6. ధ్యానము

**సర్వ శరీరేషు చైతన్య ఏకతానతా -** సర్వశరీరములలో చైతన్యము యొక్క ఏకత్వమును-అఖండత్వమును భావిస్తూ, అట్టి ధ్యాస-దర్శనములు కలిగి ఉండటము ధ్యానము.

## 7. ధారణా

**విషయ వ్యావర్తన పూర్వకం చైతన్యే - చైతన్య స్థాపనం ధారణమ్ :** ఈ మనస్సు అనుక్షణం ఆయా ఇంద్రియ సంబంధిత విషయములందు వ్యావర్తనము (Wondering Avocation) కలిగి ఉంటోంది, మనస్సు యొక్క రూపము? ఆలోచన! అట్టి ఆలోచన ఆత్మ యొక్క చైతన్య స్వరూపమే! కనుక **విషయ వ్యావర్తన పూర్వకచేతనమును** విషయముల వైపుగా పోకుండా నిరోధించి, ఆ చేతనమును (మనస్సును) **కేవల చిత్ చైతన్యము** నందు నిలిపి ఉంచటమే 'ధారణ'. పాలతో పాలను ఏకముచేయు తీరుగా వ్యష్టి చైతన్యమును విశ్వ చైతన్యముతో ఏకము చేసి ఉండటము.

ధారణలో రెండు విభాగములు ఉంటాయి.

1) తన మనస్సును చిత్ చైతన్యము నందు నిలిపి ఉంచటము. 2) నిర్మల చిత్ చైతన్యముతో మమేకము.

ఈ విధంగా యోగి-యోగలక్ష్యము అనే రెండు మాత్రమే ధారణయందు శేషించి ఉంటాయి. తదితరమైనదంతా మనస్సు సహాయముతో త్యజించబడి ఉంటుంది. (లేక) ఆత్మ - చైతన్య స్వరూపముగా భావన చేయబడుతుంది.

## 8. సమాధి

**ధ్యాన విస్మృతిః 'సమాధిః' :** ధ్యానములో 1) ధ్యానము చేయువాడు 2) ధ్యేయమగు ఆత్మ చైతన్యము ప్రవర్తితమౌతాయి. అట్టి 'ధ్యానాభ్యాసము' యొక్క తదనంతర – ఉత్తమ స్థితిలో ధ్యాని – ధ్యానింపబడు ధ్యేయము (చైతన్యము) ద్వయ స్థితిని వీడి **'ఏకస్థితి'** పొందుచున్నాయి. అప్పుడు ధ్యానయోగి 'నేను ధ్యానము చేయువాడను' అను అహమ్‌కారము (అహమ్ ధ్యానకర్తా)ను త్యజించి, **ధ్యేయమగు చైతన్యమే తానగుచున్నాడు.** ఈ జగత్తు ఏ చిత్ చైతన్య స్వరూపమో అట్టి తత్త్వము (ఆ ధ్యాని) తానే – అగుచున్నాడు. అప్పుడు **'చిదాత్మ'** గా మాత్రమే శేషించు ఆ ధ్యానయోగి, తానే చైతన్యాత్మ స్వరూపుడగుచున్నాడు. ధ్యేయమగు దృశ్యమంతా తన స్వరూపమే అయి.., **'సర్వరూపములును తానై – సర్వ సాక్షిగా కూడావేరై'** ఉండు స్థితియే **'సమాధి'**. సమాధి స్థితిలో జగత్‌దృశ్యమంతా, అట్టి నిష్ఠునకు అనన్యమై 'రెండవది' అనునదే లేనట్టి స్వస్వరూపానందమై అకృతిమంగా అనుభూతమౌతుంది.

ఈ విధమైన అష్టాంగ యోగముల అనునిత్య – అభ్యాసముచే ఈ జీవుని హృదయము నిర్మలమై, ఆత్మజ్ఞానము వినుటకు, ఆత్మసాక్ష్యాత్కారము పొందుటకు అర్హత పొందుచున్నది. అప్పుడు మాత్రమే ఆత్మ సమాచారము అనుభవమునకు రాగలదు.

మనము చెప్పుకొన్న యమ–నియమ–ఆసన–ప్రాణాయామ ప్రత్యాహార–ధ్యాన–ధారణ–సమాధులను, వాటివాటి సూక్ష్మాంగములను (అష్టాంగ యోగములను) ఎరుగుటచేతను, తత్సాధనాక్రమము చేతను – జీవుడు సర్వ సంసార భ్రమల నుండి విముక్తి పొందగలడు.

## సంసార దోషములు

ఈజీవుడు దేహమును పరిగ్రహిస్తూ ఉండగా, దేహమునకు సంబంధించి పంచ (5) దోషములు ఆతనిని వెంటనంటినవై ఉంటున్నాయి. ఆ పంచదోషములను, వాటి నివారణోపాయములను ఇక్కడ మనము ఉదహరించుకొందాము.

### దేహపంచదోషములు

**1) కామము :** ఇప్పటికి ఉన్నవి కాకుండా, ఇంకా ఏదో పొందాలి. లేనివేవో లభించాలి. ఉన్నవేవో కొన్ని వృద్ధికావాలి. అప్పటివరకు అసంతృప్తి! ఇప్పటిదాకా ఏమీ పొందామని ?
(సంగాత్ సంజాయతే కామః). ఏదో పొందాలి? అవి–వారు అట్లా ఉండాలి – ఇట్లా కాదు, మారాలి, వెళ్ళాలి, చేరాలి... మొదలైనవన్నీ 'కామము' యొక్క ఉపశాఖలు.

**2) క్రోధము :**

కామాత్ క్రోధాభిజాయతే!

పొందాలనుకొన్నవి పొందనప్పుడో తాను అనుకున్న రీతిగా తదితరులు ఉండనప్పుడో, దురాభిమానము చేతనో క్రోధము, క్రోధ రూపము (కోపము యొక్క ఆవేశ స్థితి) గా రూపు దిద్దుకుంటోంది. ఇంకేమున్నది? మనస్సుకు శాంతి లేదు.

**3) నిస్వాస :** ప్రాణము–మనస్సు ఇష్టముయొక్క రెండు రెక్కలు. దేహ జీవనాకారమగు గాలి (ప్రాణశక్తి) ఎల్లప్పుడు చంచలముగా ఉండుటచే చిత్తము–మనస్సు ఏకాగ్రత సంతరించుకోవటము క్లిష్టమవుతుంది. ఎప్పుడూ ఏ విషయము మీదా నిలువదు.

**4) భయము :**

ఉన్నదేదైనాపోతుందేమోనని,

లేనిది ఏదైనా జరిగి బాధిస్తుందేమోనని అనుకోవటం చేత

ఏవేవో విన్నవి –విననివి జ్ఞాపకమునకు వచ్చి చెడు శంకించటము చేతను 'భయము' వెంటనంటినదై వృద్ధి పొందుతూ ఉంటోంది.

**5) నిద్రా**

నిద్ర జడస్థితి. ఇది అధికమవటంచేత విచక్షణ–విజ్ఞానము సన్నగిల్ల గలదు. అవకాశములు వృధా అవుతూ ఉంటాయి.

### నివారణోపాయయములు

**నిస్సంగము :** వస్తు – విషయముల గురించి సంకల్పించుట చేతను, ధ్యాసచేతను సంబంధము ఏర్పడుతోంది. (ధ్యాయతో విషయాన్ సంగః తేషు ఉపజాయతే!) కనుక, 'నిస్సంగము' అను ఉపాయముతో మనో–బుద్ధులపై దండయాత్ర చేస్తున్న (ఏదోకావాలనే) కామవృత్తులను జయించుచూ రావాలి?

**క్షమ :** (తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు).

'ఇతరులు అనుకునేరీతిగా నేనూ ఉండలేనుకదా! నా దగ్గిర తప్పులు లేవా?' ఇటువంటి కించిత్ విచక్షణా పూర్వక వివేచనచే క్షమ (Forbearence) వృద్ధి పొందుతుంది. అది క్రోధమును జయించే ఉపాయము. లేదా, దేహ–మనోరుగ్మతలు, అనివార్యము.

**లఘు ఆహారా!**

ఆహారము మితముగా ఉంటేనే, నిశ్వాస ప్రాణాయామాదులకు సహకరించి, చిత్త ఏకాగ్రతకు సహకరించగలదు. ప్రాణాయా మముచే శ్వాసమీద ధ్యాస–నిఘా... ఉపాయమై ఉన్నది.

**అప్రమాదత :** అప్రమత్తత, అప్రమాదత (నిరుత్సాహము లేకుండా చేసుకోవటం చేత) అభయము సిద్ధించగలదు. సర్వ జగత్–రక్షకుడగు పరమాత్మయొక్క స్మరణచే భయమును జయిస్తూ ఉండాలి. వైరాగ్యముతో కూడిన ఉత్సాహముచే భయము–అభయస్వరూపంగా సంతరించుకొనగలదు.

**కాలముయొక్క విలువ ఎరిగి, తత్త్వజ్ఞానాశయము,**

సహజమగు స్వస్వరూప పరిజ్ఞానము వృద్ధి చెందుతుండగా, అతినిద్ర జయించబడుచున్నది.

## సంసార సాగరము - దాటు ఉపాయము

ఓ యాజ్ఞవల్క్యా! ఈ దృశ్యముచే ఏర్పడు అజ్ఞాన సంబంధమే 'సంసారము' అని చెప్పబడుచున్నది. 'ఏది నిత్యము? ఏది అనిత్యము? ఏది అనునిత్యము?' అనునది విచారణ చేయాలి. **'అనిత్యము - సందర్భ పరిమితము-భావనచే రూపము పొందినది'** అగు ఇంద్రియ విషయములపట్ల, దృశ్య విషయములపట్ల 'నిత్యము-నిజము'.. అను భావన నుండి సంసార సంబంధము ఏర్పడుతోంది. అవిశ్రాంతముగా జన్మజన్మలుగా పరిపోషించుకొనుచూ వస్తున్న అసంఖ్యాక విషయ సంబంధములచే ఏర్పడు స్థితిని 'సంసార సాగరము'.. అని పిలుస్తున్నారు. అట్టి సంసార సాగరమును 'ఎట్లా దాటాలిరా, బాబూ?' అని ఈ జీవుడు వేదన చెందుతూ ఉంటే,

ఇక ఈ సంసార సాగరములో.....,

**నిద్ర-ప్రమత్తత- బద్ధకము - అశ్రద్ధ - భయము** అనే రూపముగల పెద్ద పెద్ద 'నోళ్లు' గల కొండచిలువలు!

**హింస, బాధ, బాధించటము** - వంటి భీకర తరంగాలు!

**ఏదో పొందాలి అనే తృష్ణ! ఇంకా కూడా ఏవేవో కావాలి -** అనే సుడిగుండాలు! నిరాశ వీచికలు!

**సహజీవులతో ఏర్పడుచున్న సంబంధ-అనుబంధ-బాంధవ్యాలు. "వారు లేకపోతే నేనెట్లా? నేను లేకపోతే వాళ్ల ఏమవుతారో?"** ఇటువంటి పీకలలోతు బురద గుంటలు.

ఇటువంటి రూపము గల సంసార సాగరమును దాటటానికి స్థూలమైన క్రియలు సరిపోవు. మనో-బుద్ధులను నియమించి అల్పాశయములను, భావావేశములను ప్రక్షాళణము చేయగల సూక్ష్మమార్గములను అనుసరించుట - మనోవ్యాధియొక్క చికిత్సకై అనివార్యము. ఆవశ్యకము. సూక్ష్మమార్గములో, సత్త్వ-రజో-తమో త్రిగుణములను అతిక్రమించి తారకబ్రహ్మమును అవలోకనం చేయాలి.

### తారకము

భ్రూమధ్యములో ఏ **'సత్-చిత్ ఆనంద ఆత్మతేజస్సు'** కూర్మము (తాబేలు) ఆకారముగా వెలుగొందుచున్నదో అద్దాని దర్శనమే-తారక బ్రహ్మము యొక్క సందర్శనము. అందుకు ఉపాయము - లక్ష్యత్రయ (Trible objective) అవలోకనము.

1) బహిర్లక్ష్యము 2) మధ్య లక్ష్యము 3) అంతర్లక్ష్యము

ఓ యాజ్ఞవల్క్యా! త్రిగుణములకు ఆవల గల **'తారక బ్రహ్మము'** యొక్క '3' లక్ష్యముల ద్వారా అవలోకము ఏ విధంగానో.. ఇప్పుడు మనము చెప్పుకుంటున్నాము.

### 1) అంతర్లక్ష్య దర్శనము (అవలోకనము)

**సుషుమ్న : మూలాధారాత్ ఆరభ్య - బ్రహ్మరంధ్ర పర్యంతమ్ 'సుషుమ్నా' సూర్యాభా।** ప్రతి జీవుని దేహములోనూ కూడా..., బ్రహ్మనాడి 'మూలాధార చక్రము' నుండి ప్రారంభమై శిరస్సుయొక్క ఊర్ధ్వ స్థానమున గల బ్రహ్మరంధ్రము పర్యంతము విస్తరించి సూర్యతేజస్సుతో సమానమై ప్రకాశించుచున్న నాడిని **'సుషుమ్నానాడి'** అని పిలుస్తున్నారు.

**కుణ్డలినీ : తన్మధ్యే తటిత్‌కోటిసమా మృణాళ తన్తు సూక్ష్మా కుణ్డలినీ**: 'సుషుమ్న' యొక్క మధ్య భాగములో-విద్యుత్ కోటితో సమానమైనది, 'తామరతూడు' లోని దారము వలె సూక్ష్మరూపమైనది అగు ఒకానొక 'మహాశక్తి' ప్రకాశించుచున్నది. ఆ మహాశక్తిని 'కుణ్డలినీ శక్తి'.. అని పిలుస్తున్నారు. **తత్ర తమో నివృత్తిః।** అట్టి సుషుమ్నలోని కుండలినీ మహాశక్తి యొక్క సమక్షములో తత్ తేజోవీచికల ప్రకాశ - ప్రభావముచే-తమస్సు (చీకటి)కి నివృత్తి కలుగగలదు. కుండలినిని యోగాభ్యాసము సహాయముతో బుద్ధిచే ఉత్తేజ పరచాలి.

**తత్ దర్శనాత్ సర్వపాప నివృత్తిః।**

అట్టి కుణ్డలినీ తేజో దర్శనముచే సర్వ దృశ్య సంబంధిత అంతరంగ పాప-అధోవృత్తులు, అల్ప-ఆసురీ స్వభావములు నివృత్తిని పొందగలవు.

**అంతర్-పూత్కార శబ్దము : తర్జన్యగ్రోన్మీలిత కర్ణరంధ్ర ద్వయే - 'పూ-పూ' త్కార శబ్దో జాయతే।**

రెండు చూపుడు వ్రేళ్ళ కొనలతో రెండు చెవి రంధ్రములను మూసి ఉంచితే, అప్పుడు లోనుండి 'పూ'త్కార శబ్దము వినబడుతూ ఉంటుంది.

**చక్షుర్మధ్యే 'నీలజ్యోతి' దర్శనము : తత్ర పూత్కార శబ్దస్థితే మనసి, చక్షుర్మధ్యనీలజ్యోతిః పశ్యతి**

చూపుడు వ్రేళ్ళతో రెండు చెవి రంధ్రములను మూసి ఉంచినప్పుడు లోనుండి వినబడు 'పూ' త్కార 'శబ్దము' - తత్రస్థితే మనసి- పై మనస్సు నిలిపి ఉంచుచుండగా అట్టి స్థితప్రజ్ఞతతో కూడిన మనస్సుకు రెండు కనుల మధ్య ప్రదేశములో **'నీలజ్యోతి' - యొక్క దర్శనము** సిద్ధించగలదు. ఆ నీలజ్యోతియే హృదయము నందు కూడా దర్శింపబడుచున్నది.

ఇట్టి అంతర్-కుండలినీ శక్తి యొక్క తేజో దర్శనమును చక్షుర్మధ్య-హృదయాంతర్గత నీలజ్యోతి దర్శనములను **అంతర్లక్ష్య దర్శన-తారకావలోకనము** - అని అంటారు.

## బహిర్లక్ష్య దర్శనము (అవలోకనము)

**నాసాఽగ్రే చతుః (4), షష్ఠ (6), అష్ట (8) దశ (10 ద్వాదశ (12) అఙ్గులీభిః క్రమాత్**
**నీలద్యుతిః - శ్యామత్వ సదృక్-రక్త భంగీ, స్ఫురత్**
**శుక్ల పీతవర్ణ ద్వయోపేతం - 'వ్యోమత్వం' - పశ్యతి సతు యోగీ!**

ముక్కుకు ఊర్ధ్వభాగం నుండి - ఊర్ధ్వంగా పై చివరకు, (కనుబొమ్మలకు మధ్యగా కొంచం క్రింద స్థానమునుండి ఊర్ధ్వముగా)

| | |
|---|---|
| 1 నుండి 4 అంగుళముల వరకు .. | **నీలవర్ణ కాంతి** పుంజములు గాను, |
| 5 నుండి 6 అంగుళముల వరకు.. | **ఎరుపు-నలుపు** కలగలపు కాంతిగాను |
| 6 నుండి 8 అంగుళముల వరకు.. | **తెలుపు** కాంతి పుంజములతోను, |
| 9 నుండి 10 అంగుళముల వరకు.. | **పసుపు పచ్చ** కాంతి పుంజములతోను |
| 10 నుండి 12 అంగుళముల వరకు.. | **తెలుపు + పసుపు** వర్ణ కాంతి పుంజములతోను |

ఆకాశ తత్త్వము .. **ఏకాగ్ర అభ్యాసయోగికి** సందర్శనమగుచూ ఉంటుంది. అట్టి 12 అ॥ వరకు గల నాసాగ్రము నుండి బహిర్గతముగా గల ఆకాశము (Space)ను సందర్శించు అభ్యాసమును ఆశ్రయించువాడు - **బహిర్లక్ష్య దర్శన యోగి.**

ఆ విధంగా చలన దృష్టితో ఆకాశ విభాగము (వ్యోమభాగము)ను వీక్షించుచున్న యోగాభ్యాసికి 12 అంగుళముల ఆకాశమునకు ఆవలగా 'జ్యోతి సమూహములు' కనిపిస్తూ ఉంటాయి. **తత్ దృష్టిః స్థిరాభవతి।** ఇట్టి 12 అంగుళముల బాహ్యాకాశ దర్శనాభ్యాసముచే దృష్టి స్థిరత్వమును పొందుతూ ఉంటుంది.

అట్టి చంచల రహిత స్థిరదృష్టిని అభ్యసించు యోగికి క్రమంగా (అభ్యాసవశంగా).. శిరస్సుపైన 12 అంగుళములకు ఆవల జ్యోతి సమూహములు కనిపిస్తాయి. **శీర్షోపరి ద్వాదశాంగుళమాన జ్యోతిః పశ్యతి, తదా అమృతత్వమేతి।** శిరస్సుకు పైన 12 అంగుళములకు మీద జ్యోతిస్సమూహ దర్శనము చేయుచున్న యోగి **'అమృతత్వము'**ను ప్రాప్తింపజేసుకొనుచున్నాడు. ఇక ఆతని దృష్టి అనుభవములకు దేహము యొక్క రాకపోకలు.. 'ఒకచొక్కా విప్పి, మరొక చొక్కా ధరించటము' వంటిది. అంతేగాని శిరస్సుపై జ్యోతి దర్శనము చేయువానికి - భౌతిక దేహముతో తన్మయులగుచున్న తదితర జీవులవలె 'మరణము' అనే అనుభవ పరిమితత్వము ఉండదు.

## 2. మధ్య లక్ష్య దర్శనము (అవలోకనము)

**ప్రాతశ్చిత్రాఽది వర్ణ సూర్య-చంద్ర-వహ్ని జ్వాలావలీవత్ తత్ విహీనాత్ అంతరిక్షవత్ పశ్యతి।**

ఈ మధ్య లక్ష్య లక్షణ - తారకాయోభ్యాసి...., తన హృదయాకాశములో

1. సూర్య-చంద్ర-అగ్నిల యొక్క తేజస్సుతో నిండియున్న ఆకాశము.
2. అవన్నీ లేనట్టి కేవల నిర్మలకాశము.

ఈ రెండు విధములుగా (హృదయంలో).... దర్శనం చేస్తూ, అభ్యాసి అయి ఉంటాడు. **తదాకార ఆకారీ భవతి।**

ఇట్టి యోగాభ్యాసముచే క్రమంగా ఆ యోగి

- సూర్య - చంద్ర - అగ్నిల వెలుగులచే ఉజ్వల **తేజోపూర్ణ - ఆకాశ స్వరూపుడుగాను,**
- అవన్నీ లేని **కేవలాకాశ స్వరూపుడుగానూ** కూడా **తానే అయి ఉన్నట్టి అనుభవము** పొందుచున్నాడు.
- ఆకాశమే తన స్వరూపముగా అనుభవము పొందుచూ ఉంటాడు. ఈ భౌతిక దేహము- 'నేను' చేతిలో ధరించు ఒక కఱ్ఱ వంటిది. తేజోమయాకాశమే నా సహజ దేహము - స్వరూపము - అను అనుభవి అయి ఉంటాడు.

**ఆకాశ పంచకానుభవము - గుణాతీతాకాశము - పరాకాశము - మహాకాశము - తత్త్వాకాశము - సూర్యాకాశము**

తారక యోగాభ్యాసి క్రమంగా అభ్యాసయోగముచేత.., పంచాకాశములుగా ... ఒకదాని ఆవల మరొకటిగా స్వస్వరూపమును **సోఽహమ్**గా దర్శనము చేయుచున్నాడు.

**1) గుణాతీతాకాశము : 'నిర్వికార-గుణరహిత ఆకాశము' :** అనుభవమగుచు, అదియే తానగుచున్నాడు. **గుణాతీతోఽస్మి! నిర్గుణోఽస్మి!**

**2) పరాకాశము : అప్పుడిక విస్ఫురత్ తారకాకార గాఢ తమోపమమ్** – నిర్గుణ – నిర్వికార ఆకాశ స్వరూపము కాస్తా మహాప్రకాశమాన తారకాలతో కూడిన (నక్షత్రములతో కూడిన) ఆకారము గల గాఢతమ (చీకటి) రూప నిర్విషయ ఆకాశమగుచున్నది. అదియే 'పరాకాశ' సందర్శనము. క్రమంగా ఆ పరాకాశమే తానుగా అగుచున్నాడు. **పరాకాశ స్వరూపోఽస్మి! పరాత్ పరాఽస్మి! "పరాకాశ స్వరూపుడను. పరమునకే పరమైనవాడను" – అను స్వస్వరూపాస్వాదన!**

**3) మహాకాశము : ఇక ఆపై – కాలాఽనల సమద్యోతమానం మహాకాశం భవతి** – ఆ యోగికి కాలాగ్ని సమాన తేజోమయమగు **'మహాకాశము'**.. అనుభవమగుచున్నది. క్రమముగా ఆ మహాకాశమే తన స్వరూపముగా ఆ యోగి సంతరించుకొనుచున్నాడు. **మహత్ ఆకాశోఽస్మి! మహదస్మి! (మహత్ = అందరిలోని నేనైన నేను)**

**4) తత్త్వాకాశము. ఆ తర్వాత–సర్వోత్కృష్ట పరమద్యుతి ప్రద్యోతమానమ్–'తత్త్వాకాశమ్' భవతి।** ఇక సర్వముకంటే ఎంతో ఉత్కృష్టమైనది, పరమ ప్రకాశముచే – మహత్ తేజోమయమయినది అగు 'తత్త్వాకాశము'ను సందర్శించుచూ ఆ యోగి **'అదియే తానుగా'..** అగుచున్నాడు. **తత్త్వాకాశమహమస్మి! తత్త్వమహమస్మి! అందరియొక్క తత్ స్వరూపుడనే నేను!**

**5) సూర్యాకాశము : ఇక చివరిగా కోటి సూర్య ప్రకాశం 'సూర్యప్రకాశమ్' భవతి!** కోటి సూర్యుల ప్రకాశముతో సమానమైన మహాసూర్యప్రకాశమును దర్శించుచూ.. తానే 'కోటి సూర్యప్రకాశమానుడు' అగుచున్నాడు. **అహమాత్మా కోటి సూర్య తేజో స్వయం ప్రకాశ స్వరూపః। సర్వులు, సర్వము – నా సూర్య తేజో ప్రకాశ కిరణాంశలు!**

ఈ విధంగా బాహ్య – అభ్యంతర స్వరూపమైనట్టి నిర్వికార గుణరహితాకాశ – పరాకాశ – మహాకాశ – తత్త్వాకాశ – సూర్యాకాశ.. పంచాకాశ స్వరూపుడై ఆ తారక యోగాభ్యాసముచే **సత్‌చిత్ ఆనంద తారక పరబ్రహ్మము**గా వెలుగొందుచున్నాడు.

ఈ విధంగా అంతర్లక్ష్య – మధ్యలక్ష్య–బాహ్య లక్ష్య యోగ అభ్యాసములచే పంచాకాశ సందర్శనముచేయుచు, **పంచాకాశస్వరూపుడై** వెలుగుగొందు ఈ విశేషములను ఎరుగుటచే, అట్టి యోగి – పంచాకాశస్వరూపమును దర్శించగలడు. **తన్మయుడు అగుచున్నాడు. అమనస్కమును స్వభావసిద్ధంగా చేసుకొనుచున్నాడు.**

❖

యాజ్ఞవల్క్య మహాబుద్ధీ! ఇంకా విను, ఈ యోగము (1) పూర్వ విభాగము (2) ఉత్తర విభాగము అని రెండు విభాగములుగా విధానము కలిగి యున్నది. పూర్వ యోగ విభాగము : **'తారక విద్య'** అని, ఉత్తర యోగ విభాగము : **'అమనస్కము'** అని చెప్పబడుచున్నది. యోగజ్ఞులచే బోధించబడుచున్నది.

## యోగ – పూర్వ విభాగము – తారక విద్య!

**తారకమ్** = తారయితి – ఇతి – తారకమ్! తరింపజేయునది కాబట్టి తారకము. తారకము తిరిగి రెండు తీరులైనవి

**1) మూర్తి తారకమ్ :** ఇంద్రియములకు – ఇంద్రియ విషయములకు ఆవలగా ఉపాసించబడుచున్నట్టిది. ఇంద్రియ విషయములను త్యజించి, ఆ ఇంద్రియములను – ఇంద్రియ జగత్తును 'తనవి'గా కలిగి ఉన్నట్టి తత్త్వమును ఉపాసించటము. కదలికలను ఆధారంగా చేసుకొని, ఆ కదలికల ఆధారమై ఉన్నట్టి **ప్రేరణతత్త్వోపాసన.**

**2) అమూర్తి తారకమ్ :** భ్రూమధ్య గల ఆకాశమునకు ఆవల బ్రహ్మరంధ్రము వరకు, ఆ తదుపరి బ్రహ్మరంధ్రమును కూడా దాటి 12 అంగుళముల ఆకాశమునందును, 12 అంగుళములకు ఆవల కూడా విస్తరించియున్న **"తేజోచైతన్య తత్త్వము"** ఇక్కడ **ఉపాసనావస్తువుగా** అగుచున్నది.

ఈ మూర్తి– అమూర్తి తారకములు రెండూ కూడా మనస్సును నియమించి, మనోయుక్తముగా అభ్యసించవలసినవే సుమా! **ఉభయమపి మనోయుక్తమ్ అభ్యసేత్!** మనోయుక్తమైన 'అంతర్ దృష్టి' చేతనే తారక ప్రకాశము అనుభవమగుచున్నది.

భ్రూయుగ (భ్రుకుటీ ఆకాశము) మధ్యగా తారక యోగాభ్యాసనముచే ఏ తేజస్సు ఆవిర్భూతమై యోగికి అనుభవమగుచున్నదో, అదంతా **పూర్వ తారకము!**

**ఇక ఉత్తర తారకమో...**, అమనస్కము.

❖

**తాలుమూలభాగే మహజ్జ్యోతిః**

ఈ దేహములోని మహత్తర విశేషములో కూడియున్న మరొక తారక యోగలక్ష్యస్థానము గురించి ఇప్పుడు మనసు చెప్పుకుంటున్నాము.

**తాలుమూల–ఊర్ధ్వభాగే మహత్–జ్యోతిః విద్యతే।** తాలు (దవడ) మూలము యొక్క ఊర్ధ్వ (పై) భాగ ఆకాశములో **'మహత్‌జ్యోతి'**

వెలుగొందుచున్నదయ్యా। అట్టి మహజ్జ్యోతి యోగ సాధన చేత **తారక యోగికి సందర్శనమగుచున్నది**. ఆ మహజ్జ్యోతి దర్శనముచే యోగికి అణిమ మొదలైన అష్టసిద్ధులు కూడా సిద్ధించుచున్నాయి. (Concentration in the space where inwardside of upper Jaw is placed).

**(అష్టసిద్ధులు)**

అణిమ → అణురూప ప్రమాణముగా అయి, తదితర ప్రాణులందు పరమాణురూపుడై ఉండగలగటము.

మహిమ → దృశ్యమంతా నిండిన 'విరాట్' రూపుడుగా అవటము (విశ్వరూప సందర్శన యోగము)

గరిమ → బ్రహ్మాండములోని భూమి, గ్రహములు మొదలైన వాటి కంటే కూడా బరువుగా అవటము.

లఘిమ → దూదివలె అతి తేలికగా అవటము.

ప్రాప్తి → ఏవస్తువును ఎక్కడ భావన చేస్తే అది అక్కడే సిద్ధింపజేసుకోగలగటము.

ప్రాకామ్య → అనుకున్నచోటికి ఆకాశమార్గముగా (శూన్యములో నుండి) ప్రయాణించి, అనుకున్న చోట క్షణంలో ప్రత్యక్షము కాగలగటము. ఏది కోరితో అది ప్రసాదించగలగటము.

ఈశిత్వ → సమస్తమునకు అధికారి అయి, సమస్తమునందు విస్తరించి ఉండటము.

వశిత్వ → సమస్త భూతజాలమును తనవశముగా కలిగి ఉండటము.

అయితే ఈ మహజ్జ్యోతి దర్శనముచే, ఉత్తమ యోగులు అష్టాంగ యోగసిద్ధులను అతి చిన్న విషయములుగా భావిస్తూ, పరబ్రహ్మమే తానుగా అగుటయే **తారక యోగముయొక్క** మహాశయముగా కలిగి ఉంటారు.

## శామ్భవీ ముద్ర

**లక్ష్యే అన్తస్థ - బాహ్యాయాం దృష్టౌ, నిమేష - ఉన్మేష వర్జితాయాంచ, ఇయం 'శామ్భవీ ముద్రా' భవతి।** - తాలు మూలాకాశమునందు సర్వదా వెలుగొందు మహత్‌జ్యోతిని ఎవ్వడైతే బాహ్య అభ్యంతరములలో కళ్లు మూసి, మూయక కూడా (కళ్లు మూయటానికి.. తెరువటానికి సంబంధించకుండా) సర్వత్రా దర్శిస్తాడో,... అట్టి మహజ్జ్యోతి దర్శనమును **'శాంభవీముద్ర'** అంటారు. అట్టి **'అంతర్జ్యోతిః బహిర్జ్యోతిః- సర్వజ్జ్యోతిః ఆత్మజ్జ్యోతిః శివోస్మ్యఽహమ్** భావనకు కళ్లు మూయనూ అఖర్లేదు. తెరువనూ అఖర్లేదు. **కనిపించేదంతా ఆ దివ్యజ్యోతి స్వరూపమే అయి ఉండగా కళ్లు మూతలెందుకు?** కళ్లు మూసుకొని శాంభవీముద్రా విధియగు అంతర్జ్యోతిని దర్శించు యోగి, కళ్ల తెరచినప్పుడు కూడా **ఏతత్ అంతర్జ్యోతి యొక్క దర్శనము** కొనసాగుచున్నప్పుడే అది 'శాంభవీముద్ర' అగుచున్నది. **సర్వతన్త్రే గోప్యా మహావిద్యా భవతి॥** 'తాలుమూల ఆకాశ మహత్ జ్యోతి దర్శనమే బాహ్య - అభ్యంతరములందు సర్వదా సర్వముగా దర్శించటము' అనునది సర్వతంత్రములలో అంతర్లీన లక్ష్యముగా దాగి ఉన్న మహావిద్య! అట్టి శాంభవీముద్రను ఎరిగినంత మాత్రం చేతనే సర్వసంసార రుగ్మతలు, వేదనలు, బంధములు పటాపంచలవుతాయి. ఇక అట్టి శాంభవీముద్రా భావనా పుష్పములచే సర్వాంతర్యామియగు పరమాత్మయొక్క పూజనము చేత ఈ జీవునకు మోక్షము తప్పక సిద్ధించగలదు.

## అంతర్లక్ష్యము - అంతరంగ ధ్యేయవస్తువు

'తారక బ్రహ్మము'నకు సంబంధించిన అంతర్లక్ష్యము 'జలజ్యోతిస్వరూపము'గా ఉన్నది. **అంతర్లక్ష్యమ్ జలజ్యోతి స్వరూపమ్ భవతి.. ఇతి మహర్షి వేద్యమ్!** ఈ అంతర్జ్యోతి జలస్వరూపతత్త్వమును మహర్షులు గమనించి, ఆ అంతర్జ్యోతి జలస్వరూపమే బాహ్య ఇంద్రియ దృశ్యముగా కనబడచున్నది' అను ఋత్ (సత్యము)ను లోకములో ప్రకటించుచున్నారు. అందుచేత **అంతర్జల జ్యోతి దర్శనానుభవము బాహ్య ఇంద్రియముల అదృశ్యరూపముగా** చెప్పబడుచున్నది.

**'సహస్రారములో జలజ్యోతియే - అంతర్లక్ష్యము'** అని తారక యోగ సిద్ధి పొందిన మహనీయులు సిద్ధాంతీకరించుచున్నారు. అదియే పరమాత్మగా అభివర్ణిస్తున్నారు.

ఇక మరికొందరు యోగవేత్తలు **"అయ్యా! బుద్ధిగుహలో పరమ పురుషుడగు విష్ణు భగవానుడు సర్వదా శేషశయనుడై వేంచేసి ఉన్నారు. ఆయనయే శాంభవీముద్రకు దారిచూపగల తారకయోగ అంతర్లక్ష్య విషయుడగు యోగీశ్వరుడు"** - అని సుస్పష్టపరచుచున్నారు.

ఇక మరికొందరు అంతర్లక్ష్య తారకయోగ సిద్ధపురుషులు, తారకయోగ అంతర్లక్ష్య (Inner objective, Inner point to be reached) గురించి.... **'శిరస్సులో బ్రహ్మరంధ్రమునందు పరంజ్యోతి స్వరూపుడై పరమాత్మ, పంచవక్త్రుడు (ఐదు ముఖములుకలవాడు) ఉమతో (అమ్మవారు-మూలప్రకృతి)తో కూడుకున్నవారు, నీరకంఠుడు, పరమ ప్రశాంత చిద్విలాసానంద స్వరూపుడు అగు పరమశివుడే! ఆయననే ధ్యానించి శివతత్త్వ ధ్యానముచే 'శివోఽహమ్' భావనను పుణికిపుచ్చుకొని పునీతులవండి।'** అని జనులకు ఎలుగెత్తి గానం చేస్తూ చెప్పుచున్నారు.

ఇంకొందరు. **'ఆ అంతర్లక్ష్యము అంగుష్ఠ బ్రొటన వ్రేలు ప్రమాణముగా జ్యోతి స్వరూపుడై స్వ-హృదయములోనే మహాప్రకాశమానుడై వెలుగొందుచున్నారు. ఆయనయే తారక యోగ-శాంభవీ ముద్ర అంతర్లక్ష్య స్వరూపుడు'** అని సాధక జనులకు గుర్తు చెప్పుచున్నారు. 'ఆ అంగుష్ఠ పురుషుని ఆశ్రయించి స్వయం ప్రకాశమానాత్మ ప్రకాశమాత్రులు అవండి'.. అని గుర్తు చేస్తున్నారు.

మరింకా కొందరైతే, **"తారక యోగముచే ఈ జీవాత్మ ముక్తుడు అయినప్పుడు తానే ఈ పాంచభౌతిక జగత్తుకు ఆధారమగు సత్-చిత్-ఆనంద పరబ్రహ్మ స్వరూపుడై అనుభవమగుచున్నాడు. కనుక శాంభవీముద్రచే పొందబడుచున్నది స్వస్వరూపమే! మరింకెవ్వరినో కాదు"** - అను అంతర్లక్ష్యమును ముముక్షువులకు మునుముందు సమాచారముగా సిద్ధాంతీకరించి చెప్పుచున్నారు.

**యాజ్ఞవల్క్యుడు :** స్వామీ! సూర్యనారాయణ, ఆదిత్య భగవాన్! మీరు చెప్పిన వేరు వేరైన అంతర్లక్ష్యములలో ఏది యుక్తియుక్తం? ఏది సుగమము?

**ఆదిత్య భగవానుడు : ఉక్తమ్ వికల్పం (కింతు) సర్వమ్ ఆత్మైవ!** నేను చెప్పినవిధంగా అంతర్లక్ష్య పరమపురుషుడు 1) సహస్రారంలో జలజ్యోతి (2) శ్రీమన్నారాయణుడు (3) పరమశివుడు (4) అంగుష్ఠ పురుషుడు (4) జీవాత్మస్వరూపమే.... ఇట్లా ఎవ్వరెవ్వరు ఏ రీతిగా (సాకారుడు, నిరాకరుడు మొ॥విగా) ఉపాసిస్తే అవి అన్నీ కూడా ***యుక్తియుక్తమే!*** ఎందుచేతనంటావా? అంతా అఖండాత్మయే కదా! ఎవరు ఏ విధమైన రూపనామములతోను (లేక) నిర్గుణ-అనామరూప భావనతో - పరాకాష్ట (తారకయోగ-శాంభవీముద్రా) పరతత్త్వముగా, (అంతర్లక్ష్యముగా) స్వీకరించినప్పటికీ, శ్రద్ధానుసారంగా, సర్వము తానే అయినందున, ఆయా వివిధ ఉపాసకులంతా **చివ్వరికి సహజానంద-కేవలీసాక్షీ స్థానమునకే చేరుచున్నారు.** అట్టి లక్ష్యమును 'శుద్ధమగు ఆత్మదృష్టి'తో ఎవ్వరు చేరుప్రయత్నములో ఉన్నారో, వారే **'శుద్ధాత్మనిష్ఠులు'.**

**జీవన్ముక్తుడు :** ఎవ్వరైతే స్వీయకల్పితములే అయినట్టి 24 తత్త్వములను (పంచకర్మేంద్రియములను, పంచజ్ఞానేంద్రియములను, పంచ-పంచకర్మేంద్రియ - జ్ఞానేంద్రియ విషయములను, అంతరంగ చతుష్టయమును - 5+5+5+5+4) - పరిత్యజించి 25వది యగు స్వీయ కల్పిత **జీవాత్మాఽహమ్‌త్వమును** 26వదియగు **'పరమాత్మాఽహమ్' తత్త్వముగా** నిశ్చయముతో దర్శిస్తాడో.... ఆతడు **'జీవన్ముక్తుడు'** అగుచున్నాడు.

తనయందలి అంతర్లక్ష్యమగు పరమాత్మత్వము యొక్క దర్శనముచే జీవన్ముక్తత్వమును అధిగమించినవాడై తనకు తానే-తన స్వస్వరూప ధ్యానమే)-అంతర్లక్ష్యముగా స్వీకరించి, **అఖండ మండలాకారుడు, చరాచరవ్యాప్తుడు అగు పరమాత్మస్వరూపుడుగా** అగుచున్నాడు.

## 2. ద్వితీయ బ్రాహ్మణము - పరమాత్మతో మమేకత్వము - అభిన్నత్వము

**యాజ్ఞవల్క్యుడు :** హే భగవాన్! ఆదిత్యమణ్డల పురుషన్! అంతర్లక్ష్యము, అద్దాని యోగము ఇత్యాదిమార్గములలో మమేకమవటము గురించి మహత్తరమగు విషయాలు చెప్పుకొస్తున్నారు. ఇంతవరకు మేము మా యొక్క చేరవలసిన స్థానము భక్తి-యోగ-జ్ఞానముల లక్ష్యము బాహ్యమున (కైలాస శివుడనో, వైకుంఠ నారాయణుడనో, ద్వారకా కృష్ణుడనియో సహస్ర దళమండప పరాశక్తి అనియో) ఎక్కడో ఉన్నదను భావనతో సాధనలు కొనసాగిస్తూ వస్తున్నాము. ఇప్పుడు జీవాత్మస్వరూపము అంతర్లక్ష్యమగు పరమాత్మ తత్త్వమేనని, స్వస్వరూపమునందు మా జీవాత్మను లయింపజేయుటయే శాంభవీముద్రకు దారిచూపు తారక యోగమని చెప్పుచూ వస్తున్నారు. అంతర్ - బహిర్ అఖండ జ్యోతి స్వరూపమునందు జీవాత్మజ్యోతిని 'మమేకము' చేయు మార్గమును చెప్పుచున్నారు. మీరు చెప్పునది మహత్తరమగు **సోఽహమ్** నిర్వచన పరతత్త్వమే! అయితే మీరు చెప్పుచున్న మార్గము గురించి నేను ఇంకా ఎరుగవలసినంతగా ఎరిగి ఉండిలేదని నాకు అనిపిస్తోంది. అందుచేత యోగి, ఈ **'జగత్ - జీవాత్మ'**లను **స్వస్వరూప పరమాత్మ**యందు **మమేకము** చేయటము గురించి మరికొంత వివరించప్రార్థన.

**ఆదిత్య భగవానుడు :** సరే! విను! ఈ కనబడే దృశ్యమంతా సూక్ష్మ పంచ మహాభూత చమత్కారము! ఈ విధంగా పంచమహాభూత సముదాయమే ఈ విరాట్ దృశ్యమూలకారణము. అద్దానియందు ప్రకాశమానమగు ద్రష్ట-దర్శన-దృశ్య త్రికూటము కల్పనామాత్రమై ప్రదర్శితమగుచున్నది.

అద్దానిని ఆశ్రయించి చతుః పీఠము (జాగ్రత్-స్వప్న-సుషుప్తి-తురీయములు; మనో-బుద్ధి-చిత్త-అహంకారములు) ప్రదర్శమానమగుచున్నది.

ఆ చతుః పీఠము మధ్యగా 'తత్త్వ ప్రకాశము' ఉన్నది. అట్టి తత్త్వ ప్రకాశమగు ఆత్మ **అత్యంత గూఢమైనది.** తదితరమైన వస్తువులు - మనోబుద్ధులు మొ॥న వాటి వలెను, జాగ్రత్ స్వప్న-సుషుప్తుల వలెను, తెలియవచ్చునది కాదు. అత్యంత సూక్ష్మమైన బుద్ధికి మాత్రమే స్వీయ హృదయమున 'అనుభవము (An Experience that is logically enjoyable) రూపమున తెలియవచ్చేది.

**అవ్యక్తమైనది :** మనోబుద్ధి -చిత్త అహంకారములను, జాగ్రత్-స్వప్న-సుషుప్తులను, త్రిగుణములను, భావ-అభావములను - ఇవన్నీ వ్యక్తీకరిస్తూ తాను మాత్రము సర్వ వ్యక్తీకరణములకు ఆవల అవ్యక్తమై ఉన్నది. అందుచే **అది తెలియబడుట లేదు. తెలుసుకొనుచున్నదే అది కాబట్టి!**

ఈ విధంగా ప్రతి జీవుడు ఇంద్రియ-మనో-బుద్ధి-చిత్త అహంకారముల ద్వారా అనేక - అసంఖ్యాక విషయములను తెలుసుకొంటున్నాడు. మరి ఆత్మయో? అది తెలియబడేది కాదు. ఎందుకంటే 1. తెలియబడుతూ ఉన్నది 2. తెలుసుకొనువాడు - ఈ రెండూ అద్దాని వ్యక్తీకరణమై తాను అవ్యక్తరూపమై యున్నది కాబట్టి ఆత్మ తెలుసుకొనుచున్న వానికి సాక్షి అయి ఉండటం చేత జనన స్థానమై ఉండటంచేత.... తెలుసుకొనుచున్నవానిచే తెలియబడటము లేదు.

**యాజ్ఞవల్క్యుడు :** ఆశ్చర్యము, 'తెలుసుకొనుచున్న వాడు- తెలియబడునది'.. అను రూపములలో హృదయాకాశమున వ్యక్తీకరణము అగుచు, తాను అవ్యక్తమయి ఉంటున్న తత్త్వస్వరూపమగు (తానే అదై ఉన్న) ఆత్మను తెలుసుకోవటము ఎట్లా? 'అవ్యక్తము'ను ఎరుగునది ఏది? ఏ విధంగా?

**ఆదిత్య మండల పురుషుడు (సూర్యభగవానుడు):** అవును? అందుకే **'సో అతి గూఢ, అవ్యక్తశ్చ।'** అని ఆత్మజ్ఞులచే చెప్పబడుతోంది కదా!

- ఈ **దృశ్యము** ఇంద్రియములకు తెలియబడుతోంది కనుక ఇది **ఇంద్రియముల వ్యక్తీకరణము.**
- ఇంద్రియములు ఇంద్రియార్థములచే ఉపయోగించబడు భౌతిక ఉపకరణములు. కనుక **ఇంద్రియములు ఇంద్రియార్థములచే వ్యక్తీకరణములు.**
- **ఇంద్రియార్థములు** మనస్సు యొక్క ఉపకరణములు. కనుక, **మనస్సు యొక్క వ్యక్తీకరణమే ఇంద్రియార్థములు.**
- **మనస్సు** జీవాత్మ యొక్క వ్యక్తీకరణము కనుక **జీవాత్మ యొక్క ఉపకరణము.**
- జీవాత్మ ఎద్దాని ఉపకరణమో అది **పరమాత్మ!**

**అట్టి పరమాత్మను వ్యక్తీకరించునది మరొకటిదీ లేదు. కనుక 'అవ్యక్తము' అని చెప్పబడుతోంది.**

అట్టి పరమాత్మయందే జీవాత్మ - జగత్తులు (తెలుసుకొనుచున్నవాడు- తెలియబడుచున్నది - ఈ రెండూ) వ్యక్తీకరించబడుచున్నాయి. అట్టి పరమాత్మయే తెలుసుకొనవలసిన **అంతర్లక్ష్య వస్తువు.** ఏ జీవాత్మగా మనము ఈ జగత్‌దృశ్యమును తెలుసుకొంటున్నామో ఆ జీవాత్మ ద్వారా పరమాత్మను (తన నియామకుని) తెలుసుకోయత్నిస్తున్నాము. సూర్యకిరణము సూర్యుని తెలుసుకోవాలను రీతిగా! అందుచేతనే **'అంతర్లక్ష్యమగు అవ్యక్త స్వరూప పరమాత్మ అత్యంత నిగూఢమైనది. రహస్యమైనది'** అని మనము చెప్పుకోవటం జరుగుతోంది. పోనీ, **'తెలియబడనిది'** అని ఊరుకుందామా? లేదు. అది తెలుసుకో యత్నించువాని **స్వకీయ బోధ** రూపమే! అట్టి స్వస్వరూపమే 'శాస్త్రములు'. (అధ్యాత్మ శాస్త్రము-వేదాంత శాస్త్రము)అయి, సత్యద్రష్టలచే తెలుపబడుతోంది కదా! అద్దానిని తెలుసుకోగలము కాబట్టే మనిద్దరము అద్దాని గురించి సంభాషించుకుంటున్నాము. **'అద్దానిని ఎరగటము ఎట్లా?'** అని అడిగావు కదా! విను.

**తత్ జ్ఞాన ప్లవ అధిరూఢేన జ్ఞేయమ్।**

ఓ యాజ్ఞవల్క్యా! అట్టి 'అంతర్లక్ష్యము - శాంభవీ ముద్రారూపము-పరమాత్మ మొ॥న విశేషాలుగా చెప్పుకొంటున్న బ్రహ్మమును - **'జ్ఞానము'** అనే **'పడవ'**ను అధిరోహించి దర్శించుటచే **జ్ఞేయము**గా (తెలియబడునదిగా) అగుచున్నదయ్యా!

**తత్ బాహ్య -అభ్యంతర లక్ష్యమ్**

అట్టి పరబ్రహ్మమే బాహ్య-అభ్యంతర లక్ష్యము. అనగా **తెలుసుకొంటున్న** వానిని (One who is knowing) **తెలుసుకోవటమే** బాహ్య-అభ్యంతర లక్ష్యము.

**తత్ మధ్యే జగత్ లీనమ్!**

ఏది తెలియబడుచూ 'జగత్' అను శబ్దముచే ఉద్దేశించబడుచున్నదో, అట్టి ఇదంతా ఆ తెలుసుకొంటూ ఉన్న ద్రష్టయొక్క స్వస్వరూపమగు ఆత్మతత్త్వము నందే లీనమైయున్నది.

**తత్ నాద బిందు కలాతీతమ్।**

అయ్యది నాదము (శబ్దము - Sound - Letters)కు అతీతమైనది. ధ్యానమునందు ఒక బిందువుగా లక్ష్యము అగుచున్న దానికి కూడా వేరై, అతీతమైనది. అది భావన - భావించబడు 'కల'కు కూడా (రూపములకు కూడా) అతీతమై యున్నది. **నామరూపాత్మకమైనది కాదు. కనుక కలాతీతము.**

**అఖణ్డ మండలమ్**

అది నీవు-నేను-జగత్తుగా గాని, ద్రష్ట-దర్శన-దృశ్యములుగా గాని, జీవాత్మ-ఈశ్వరుడు-పరమాత్మగా గాని, ధ్యానించువాడు-ధ్యానము-ధ్యానింపబడునదిగా గాని విభజనమవటము లేదు. అందుచేత ఆ అంతర-బహిర్లక్ష్యములగు పరమాత్మ **అఖండ మండలాకారము (Indivisible and Un-partitioned Sphere)** అయి, **సర్వచరాచరములలోను-సర్వచరాచరములుగాను** వ్యాపించి ఉన్నదై (వ్యాప్తమ్ ఏవ చరాచరమ్).. సర్వతత్త్వమై విరాజిల్లుచున్నది. అదియే సర్వజీవుల యొక్క – నీయొక్క – నాయొక్క పిపీలికాది బ్రహ్మపర్యంతము మనందరి యొక్క అఖండ స్వస్వరూపమై ప్రకాశించుచున్నది.

**తత్ సగుణ-నిర్గుణ స్వరూపమ్!**

ఆ స్వస్వరూప పరమాత్మయే సగుణ-నిర్గుణ స్వరూపమై దృష్టికి గోచరమగుచున్నది.

**తత్ వేత్తా విముక్తః!** ఓ యాజ్ఞవల్క్యా! అట్టి స్వస్వరూపాత్మ గురించి తెలియనంత వరకు (అంతర్-బహిర్లక్ష్యము యొక్క తత్త్వము అవగాహన కానంతవరకు) బంధము తొలగదు.

అద్దాని గురించి తెలిసిన తర్వాత బంధమే లేదు. అదియే 'విముక్తి'గా చెప్పబడుతోంది.

## శాంభవీ లక్షణమ్ (ఆత్మలక్షణమ్)

మొట్టమొదట అగ్ని మండలము (శక్తి).

తదుపరి సూర్యమండలం (ప్రజ్ఞ).

అద్దాని మధ్యగా.. చంద్రమండలము! (సుధారూపము. చిత్తమండలము).

తన్మధ్యే అఖణ్డ తేజో మండలమ్! అద్దాని మధ్యగా అఖండ బ్రహ్మ తేజో మండలము – అఖండాత్మ తత్త్వము.

- అట్టి అఖండ తేజో మండలము విద్యుత్ కాంతి వలె తెల్లని ప్రకాశమానమై ఉంటుంది.
- ఇదియే శాంభవీ ముద్ర యొక్క ముఖ్య – లక్షణము

అట్టి అఖండ తేజోమండల సందర్శనమే **'త్రిస్రోదృష్టి' లేక 'అంతర్దృష్టి' లేక 'ఆత్మదృష్టి'.**

**తత్ ప్రతిపత్ పూర్ణిమాచేఽ తి :** అది అనేక తటాకములలో ప్రతిబింబిస్తూ ఆకాశములోనే ఉండి విహరిస్తున్న పూర్ణచంద్రబింబము వంటిది. ఆ అఖండ బ్రహ్మ తేజో మండలము నిప్పు యొక్క మెరుపు వంటిది. **(నీవారశూకవత్ తన్వీ)**

## తత్ దర్శనమ్

- అద్దానిని కొందరు త్రిశ్రోదృష్టిచే బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులుగా ధ్యానిస్తున్నారు.
- మరికొందరు పూర్ణ **ప్రతిపత్తి (స్వబుద్ధి) రూపమగు పూర్ణానంద తత్త్వము**గా ఆరాధిస్తున్నారు.
- ఇంకొందరు యోగులు కళ్ళు మూసుకుని **'సోఽ హమ్-అదియే నేను కదా!'** అను భావనతో ఉపాసిస్తున్నారు. పరమాత్మను అంతర హృదయ-అభ్రాంత మధ్య-హృదయాంతరంగునిగా మరికొందరు నమస్కరిస్తున్నారు.
- ఆ పరతత్త్వమే కొందరు సగము మూసిన కనులకు (అర్ధనిమీలిత) లోపల అర్ధభాగముగా-బయట మిగతా అర్ధభాగముగా ప్రకాశించుచున్నట్లుగాను చూస్తున్నారు. తత్ దృష్టితో దర్శిస్తూ సేవిస్తున్నారు. (చూచునది-కనబడునది అదే)
- పూర్ణానిమిలిత నేత్రములకు (పూర్తిగా కనులు తెరిచిన యోగికి) అయ్యిది బయట-లోపల పూర్ణమై సాక్షాత్కరించుచున్నది.
- అట్టి ఆత్మదర్శనమే శాంభవీలక్షణము. అట్టి పూర్ణాభ్యాసమే యోగ సాధకునికి ప్రమాణము – లక్ష్యము కూడా.

**తత్ లక్ష్యమ్ నాసాగ్రమ్:** అట్టి ఆత్మవస్తువును ఉపాసించుటకై లక్ష్య స్థానము నాసాగ్రము (ముక్కుకు ఉపరిభాగము మధ్య-ఆకాశము)గా గుర్తించబడి ధ్యానించబడుతోంది.

**తాలు మూలస్థానము:** మరొక ప్రదేశము (ఉపాసనా స్థలము) – తాలు మూలము (దవడ యొక్క ప్రారంభ స్థానము) అక్కడ గాఢ తమస్సు (చిమ్మచీకటి) వలె యోగాభ్యాసులకు దర్శనమగుచున్నది. అద్దాని ఏకాగ్ర బుద్ధితో కూడిన అభ్యాసముచే యోగాభ్యాసవశంగా **'అఖణ్డ మండలాకార జ్యోతి'** దృశ్యతే అనుభూతమగుచున్నది. అదియే సత్‌చిత్ ఆనంద పరబ్రహ్మముగా యోగాభ్యాసము చేత ఉపాస్యవస్తువై సిద్ధించుచున్నది. ఎప్పుడైతే ఈ మనస్సు అట్టి సహజానందమునందు లీనమవుతుందో **(ఏవం సహజానన్దే యదా మనోలీయతే)**, అప్పుడు 'శాంభవి' అను జీవబ్రహ్మైక్యము సిద్ధించుచున్నది. **తదా శామ్భవీ భవంతి!**

అట్టి **'జీవాత్మను పరమాత్మ యందు యోగాభ్యాస పూర్వకంగా ఐక్యము చేయుటము'**ను **'ఖేచరీ'** అని పిలుస్తున్నారు.

అట్టి ఖేచరీ అభ్యాసముచే ఈ జీవుడు **'మనోస్థైర్యము'** పొందుచున్నాడు. ప్రాణావాయువుల సంచలనము నిశ్చలమై, 'వాయు స్థైర్యము' పొందుచున్నాడు.

**అట్టి మనస్సును తాలుమూలము (దవడ మూల ప్రదేశములో) కనిపించు 'గాథ తమము'లో నిలిపి ఉంచు 'శామ్భవీ మమేకత్వము' (లేక) ఖేచరీముద్ర యోగము యొక్క యోగభ్యాసగతి..ఎట్లా ఉంటుంది?**

- మొట్టమొదట ఆత్మరూపలక్ష్య వస్తువుగా అఖండమండలాకారజ్యోతి – నక్షత్రమువలె (ఒక చుక్కవలె) అనుభూతమవుతుంది.
- తర్వాత వజ్రదర్పణము వలె అనుభూతం...,
- ఆపై పరిపూర్ణచంద్ర మండలము వలెను..,
- అటు తర్వాత నవరత్న ప్రభామండలముగాను...,
- ఇంకా మధ్యాహ్న – సూర్యమండలముగాను...,
- ఆపై అగ్ని శిఖామండలముగాను.....,

**క్రమాత్ దృశ్య తే!** క్రమక్రమముగా కనిపిస్తూ వస్తుంది. ఆ తర్వాత పశ్చిమాభిముఖమై **'శాంభవీముద్ర చిహ్నాములు'** అగుపించసాగుతాయి.

- స్ఫటికముతో సమానమైన కాంతిపుంజములతో కూడిన వస్తువు వలె కనిపిస్తుంది.
- ఇంకా ఆ తర్వాత ధూమ్ర (ఎక్కువ నలుపు–తక్కువ ఎరుపుల కలయిక)గాను, బిందు–నాద–కలా నక్షత్ర కాంతులతోను, దీపపు వెలుగు, సువర్ణకాంతులతోను, నవరత్న ప్రభలతోను కనిపించసాగుతుంది.

**తదేవ ప్రణవ స్వరూపమ్!**

- ప్రాణ అపానములను ఐక్యము చేసి, ధృతమగు కుంభకము సహాయముతో నాసాగ్రమును దర్శనము చేస్తున్నటువంటి దృఢాభ్యాసము;
- రెండు చూపుడువ్రేళ్ల చివరలో రెండు చెవులు మూసి అంతర శబ్దమును (నాదమును) వినుచుండుటము;
- షణ్ముఖీ ముద్రను (తాత్వికార్ధముగా) – దృశ్యము, ఇంద్రియ–ఇంద్రియార్ధములు, మనస్సు, జీవాత్మ, పరమాత్మల ఏకత్వ భావనాముద్రను అవలంబించటము;
- షణ్ముఖీకరణము సహాయముతో ప్రణవనాదమును నిరోధించుటము;
- మనస్సును ఆత్మయందు (లక్ష్య స్థానమునందు) లీనము చేయుటము;

ఇట్టి యోగాభ్యాసము చేయుచున్నవానికి కర్మ–కర్మఫలములతో సంబంధము తొలగుచున్నది.

**రవేత్ ఉదయాస్తమయయోః కిం కర్మ కర్తవ్యమ్?**

లోకరీతిగా **"సూర్యుడు ఇప్పుడు ఉదయిస్తున్నాడు. ఇప్పుడు అస్తమిస్తున్నాడు"** – అని మాట్లాడుకుంటాము. సూర్యగోళస్థితి– భూమియొక్క భ్రమణముల చేత రాత్రింబవళ్లు ఏర్పడుచూ ఉన్నాయి కదా! రాత్రింబవళ్ల కర్తృత్వము సూర్యునికి ఉన్నదా? లేదు. వాస్తవానికి సూర్యుడు– ఉదయించటము లేదు. అస్తమించటము లేదు. సూర్యుడు లేకుంటే,.... ఉదయ–అస్తమయములు, పగలు–రాత్రులు ఉండేవే కావు. కానీ, సూర్యుడు ఉదయాస్తమయములకు కర్త కాదు.

అట్లాగే ఈ జీవుడు వర్తమానములో కర్తృత్వ–భోక్తృత్వములు పొందుచూ ఉండవచ్చుగాక! ఆది స్వరూపమగు ఆత్మను ఎరిగిన తరువాత (ఆదిత్యునికి సూర్యాస్తమయ కర్తృత్వ భోక్తృత్వములే ఉండని తీరుగా) **'ఆత్మనగు నాకు కర్తృత్వ –భోక్తృత్వములు లేవు'** అని ఎరిగి **సర్వకర్మల అభావము** పొందుచున్నాడు.

కుంభక ప్రాణాయామము అభ్యసిస్తూ, మనో బుద్ధులను ఏకాగ్రంచే, **అంతర్జ్యోతి**ని దర్శించుచున్న యోగి పట్ల శబ్దము–కాలము.. రెండూ లయమును పొందినవగుచున్నాయి. ఆతడు ఆ రెండింటికీ అతీతుడగుచున్నాడు. ఆత్మయొక్క సర్వపరిపూర్ణ (పూర్ణచంద్ర) జ్ఞానముచే ఆలోచనారహిత మనోరూపమగు **ఉన్మనీ అవస్థ (జగత్ రహిత కేవలీమనోస్థితి)** మాత్రమే శేషించుచుండగా, ఇక ఆతడు **'జీవబ్రహ్మైక్యస్థితి'** లేక **'బ్రహ్మైక్యము'** పొందినవాడగుచున్నాడు.

## ఆత్మభగవానుని పూజ

ఓ యాజ్ఞవల్క్య మహాశయా! ఆత్మ భగవానుని పూజించటం ఎట్లాగో.. మహనీయులగు ఆత్మతత్త్వజ్ఞులు గానం చేస్తున్న విశేషములను ఇప్పుడు మనము చెప్పుకొనుచున్నాము.

### ఉన్మనీ- అమనస్క ఆత్మ తత్త్యోపాసకుడగు యోగియొక్క ఆత్మదేవపూజ

- జగద్విషయముల గురించి నిశ్చింతయే.. ఆతని → **ధ్యానము. (తస్య నిశ్చిన్తతా - ధ్యానమ్)**
- సర్వకర్మల -కర్మఫలముల నిరాకరణము (ఇవి నాకు సంబంధించినవి కావు -నేను వీటికి సంబంధించినవాడిని కాను- అను భావనయే) ఆత్మదేవునికి → **ఆవాహనము. (సర్వకర్మ నిరాకరణమ్ ఆవాహనమ్)**
- ఆత్మకు వేరుగా ఎక్కడా ఏదీ అన్యమై లేదు అనునది ఆయనకు సమర్పించబడు → **ఆసనము. (నిశ్చయజ్ఞానమ్ ఆసనమ్)**
- సర్వభావములను వదలివేసినట్టి భావాతీత కేవల మనస్సు-అనే ఉన్మనీ→ **పాద్యము** (పాదప్రక్షాళనము) **(ఉన్మనీ భావః పాద్యమ్)**
- సదా అమనస్కము-మనస్సును వేరుగా చూస్తూ ఉండే సాక్షిత్వము→ **అర్ఘ్యము (చేతులు కడుగుట) (సదా అమనస్కమ్ అర్ఘ్యమ్)**
- సర్వనిరుత్సాహములను అల్పభావమును వదలి, దీప్తిమంతుడై ఉండటము → **ఆచమనము. (సదా దీప్తిః ఆచమనమ్)**
- **అపారామృత వృత్తిః** ఇదంతా అపార - అమృతస్వరూప ఆత్మయే! అను వృత్తి → **స్నానము. (అపారామృత వృత్తిః స్నానమ్)**
- సర్వులు ఆత్మస్వరూపులే అనే సర్వాత్మ భావనయే → **గంధము! (సర్వాత్మభావనా గన్ధః)**
- ద్రష్ట-దర్శనము-దృశ్యములకు ఆవల దృక్ స్వరూపావస్థను ఆశ్రయించి ఉండటము→ **అక్షంతలు! (దృక్ స్వరూప అవస్థానమ్ అక్షతాః)**
- కేవలచిత్ స్వరూపమే 'తెలియబడేది'గా విస్తరించి ఉన్నది 'చిదాప్తమ్' → **పుష్పము (చిదాప్తిః పుష్పమ్)**
- ఇదంతా 'చిదగ్ని స్వరూపమే' అని అభావించటము → **ధూపము! (చిదగ్ని స్వరూపం ధూపః)**
- చిదాదిత్య స్వరూపము యొక్క ధ్యానము → **దీపము! (చిదాదిత్య స్వరూపం దీపః)**
- పరిపూర్ణ చంద్రామృతముగా మనోబుద్ధి చిత్త అహంకారములను ఏకీకరణము చేసి స్థాపించటము → **నైవేద్యము! (పరిపూర్ణ చన్ద్రాఽమృతస్య ఏకీకరణం నైవేద్యమ్)**
- బుద్ధి తన చాంచల్యమును వదిలి నిశ్చలమై ఉండటము → **ప్రదక్షిణము! (నిశ్చలత్వం ప్రదక్షిణమ్)**
- జీవాత్మగా ఉన్నా కూడా నేను పరమాత్మత్వముగా యథాతథమై ఉన్నట్టివాడను - అను **'సోఽహమ్'** భావన→**నమస్కారము (సోహమ్ భావో నమస్కారః)**
- జగత్ విషయముల పట్ల మౌనము వహించి ఉండటము (ఎట్లా ఉన్నా కూడా ఒక్కలం అని అనుకోవటం) → **స్తుతి (మౌనం స్తుతిః)**
- ఎల్లప్పుడూ 'సంతోషము'ను అభ్యసిస్తూ ఉండటము → **విసర్జనము (సర్వ సంతోషో విసర్జనమ్)**

**ఇతి ఏవం వేద।** అని తెలుసుకొనబడి ఉండునుగాక! ఇదియే ఆత్మభగవానునికి **ఆత్మసంయమయోగి యొక్క ఆత్మపూజా విధి.**

ఈ విధమైన భావన-ధ్యానములచే... ద్రష్ట-దర్శన-దృశ్య త్రిపుటిని అధిగమించివేసి నిస్తరంగ (తరంగ రహిత) సముద్రమువలె, గాలి వీచని చోట నిశ్చల దీపమువలె, భావ-అభావములను దాటి (వాటిని సాక్షిత్వము వహించి), **అచల-సంపూర్ణ-కేవలీ (ఆత్మ) జ్యోతి స్వరూపుడు** అగుచున్నాడు.

ఈ జీవుడు అట్టి సాధనచే జాగ్రత్-నిద్రలకు ఆవల సర్వదా ప్రకాశించుచున్నట్టి **స్వస్వరూప పరిజ్ఞానము** పొంది **'బ్రహ్మవిత్'** అగుచున్నాడు. అటుపై మనస్సు లయించగా ఈ జీవుడు కేవల పరబ్రహ్మ స్వరూపుడై **ఆత్మానందముగా శేషించుచున్నాడు. బ్రహ్మవేత్త - బ్రహ్మమే అయి ప్రకాశించుచున్నాడు.**

**యాజ్ఞవల్క్యుడు :** మహాత్మా! ఆదిత్యమండల ప్రభూ! బ్రహ్మ-విష్ణు-శివాత్మకా! ఆదిత్య దేవాదిదేవా! ఇప్పుడు నాదొక సందేహము, మనస్సు లయిస్తే ఈ జీవుడు జీవాత్మత్వమును అధిగమించి పరమాత్మత్వమును సంతరించుకొంటున్నాడని మీరు శెలవిచ్చుచున్నారు కదా! 'ఈ జీవుడు గాఢనిద్రలో ఉన్నప్పుడు ఈతనికి మనస్సు ఉండదుకదా! కనుక "సుషుప్తి స్థితిలో ఈ జీవుడు పరమాత్మ స్వరూపుడే అయి ప్రకాశించుచున్నాడు"- అని అనవచ్చునా! అది యుక్తియుక్తమేనా? గాఢ నిద్రాస్థితి (సుషుప్తి) - పరమాత్మ స్వరూపస్థితి ఒక్కటీరైనవేనా? కాదా?

**ఆదిత్య భగవానుడు :** కానేకాదు. యుక్తియుక్తము ఏమాత్రమూ కాదు. **సుషుప్తి-సమాధ్యోః 'మనోలయా' – విశేషేఽపి, మహదస్తు ఉభయో భేదః!** నీవు చెప్పినట్లుగా సుషుప్తి-సమాధి స్థితులలో మనస్సు లయిస్తుందను మాట నిజమేకానీ, సుషుప్తి-సమాధి స్థితులకు పూర్తిగా వేరువేరైనట్టివి! చాలా భేదము ఉన్నది. సుషుప్తి – ఇందులో మనస్సు తమస్సునందు లీనమగుచున్నది. ముక్తి హేతువులేవీ ఈ స్థితిలో భావించబడవు. ఎందుకంటే ఇది జడ అభావస్థితి. ఇక్కడ జాగ్రత్-స్వప్నములకు సంబంధించిన సంస్కారములు **అప్రదర్శితముగా** మాత్రమే ఉన్నాయి. అంతేగాని అవి ఏ మాత్రం **తరగనూ లేదు. రహితము కానూ లేదు.** మరల సుషుప్తి నుండి బయల్వెడలుచుండగా సంస్కారములు కూడా మౌనమును త్యజించి మనస్సును అనుసరించినవై జగదనుభవములకు మూలకారణమవటమును కొనసాగిస్తున్నాయి. గాఢనిద్రలో చాటుగా (అప్రదర్శితంగా) ఉన్న జగత్ **సంస్కారములు** జాగ్రత్ –స్వప్నములలో **రెక్కలు విప్పి విజృంభిస్తున్నాయి.** అంతేగాని, అట్టి సంస్కారములు ఆత్మభావనయందు లయమైపోవు సందర్భము (గాఢ నిద్ర) కాదు.

**సమాధి :** సమాధి స్థితిలో తమోవికారములన్నీ ఆత్మరూపమును సంతరించుకుంటున్నాయి. తమోవృత్తులు అఖండాకారమగు సాక్షి చైతన్యములో ప్రవేశించగా, 'ప్రపంచలయము' సంభవిస్తుంది. అనగా ప్రపంచము ప్రపంచముగాకాకుండా ఆత్మస్వరూపమై అనుభూతమగుచున్నది. 'బంగారమే ఆభరణముగా ఉన్నది' అని స్వర్ణ దృష్టి కలవానికి తెలియుచున్నట్లే, సమాధినిష్ఠునికి **'ఆత్మయే జగత్ రూపముగా ఉన్నది'..** అని స్వభావసిద్ధంగా అనుభూతమవుతుంది. **"అహమేవ ఇదమ్ సర్వమ్"** అను ఆనంద భావనతో ఇదంతా ఆస్వాదిస్తూ ఉంటాడు.

**యాజ్ఞవల్క్యుడు :** అసలు అనేక బంధములకు ఆలవాలమగు ఈ ప్రపంచము ఎవరిచే కల్పించబడి జీవుని నిబద్ధునిగా చేసివేస్తోంది? అట్లా ఈ జీవుని నిబద్ధితునిగా చేయటము చేత, వారుపొందే ప్రయోజనము ఏమిటి?

**ఆదిత్య భగవానుడు :** ఓ యాజ్ఞవల్క్యా! ఇక్కడి జీవుని యొక్క బంధము-అనుబంధము-సంబంధము-మోక్షము ఇవన్నీ కూడా ఆతని మనోకల్పితమేగాని, **మరొకరెవరో బయట దూరంగా ఉండి, ఈతనికి ఇక్కడ కల్పించుచున్నట్టివి కానే కావయ్యా!** మనస్సుచే కల్పించబడే 'కల్పన' సర్వదా ఒక్కటే అయి ఉన్నది. కాబట్టి,

**'సర్వభేధములు సమాధిస్థితియందు అభావించబడినవి'**గా అగుచున్నాయి. ఒకవేళ అట్టి సమాధి నిష్ఠుని పట్ల దృశ్యజగత్తు కొన్ని సమయములలో అనుభవరూపముగా సంభవించినప్పుడు కూడా. ఆ యోగి, **'ఇదంతా స్వతఃగానే మనోకల్పనయే కదా!'** అని ఎరిగియే, ఇందలి **విశేషములన్నీ మిథ్యాత్వ భావనచేతనే రూపుదిద్దుకుంటున్నాయ**ని గమనిస్తూనే-**వీటిని దర్శించుచున్నాడు.** అందుచేత ఈ కనబడేదంతా కలలోని విశేషాలతో సమానంగా చూస్తూ భేదబుద్ధికి తావు ఇవ్వటము లేదు. కలలో కనిపించిన కొండరాయికి – రత్నాల హారమునకు భేదమేముటుంది? ఎవ్వరైతే **"ఈ దృశ్యమునంతటినీ – పరబ్రహ్మముయొక్క (లేక) సదానందతత్త్వము యొక్క సంప్రదర్శనమే"** అని సందర్శిస్తాడో, ఆతడే **బ్రహ్మవేత్త!** ఆతడే సమాధినిష్ఠుడు! అట్టి ఎరుకచే ఆ బ్రహ్మవేత్త బ్రహ్మమే అయి ప్రకాశించుచున్నాడు. **యస్య సంకల్పనాశ స్యాత్, తస్య ముక్తిః కరే స్థితే।** ఎవ్వరి పట్ల సంకల్పములన్నీ బ్రాహ్మీభావన యందు లయించినవై ఉంటాయో, ఆతని పట్ల 'ముక్తి' అనునది అరచేతిలోని నిమ్మపండు వంటిది అగుచున్నది. కనుక ఓ యాజ్ఞవల్క్యా! 'ఈ పాంచభౌతిక జగత్తు గురించిన **భావ-అభావములను పరిత్యజించినవాడవై ఉండు.**

**"అఖండమగు పరమాత్మయే ఇదంతా! అఖండ ఆత్మస్వరూపుడనే నేను! ఇదంతా అఖండమై నాస్వరూపమునకు అభిన్నంగా ప్రకాశించుచున్నది. 'సూర్యునకు-సూర్యకాంతి పుంజములకు భేదమే లేనట్లు, నాకు – ఈ జగత్తుకు భేదమే లేదు"..** అను అనునిత్యధ్యానమును వదలకయే ఈ జగత్తులో సంచరించు.

అట్టి అఖండ-అప్రమేయ, సర్వ బాహ్య -అభ్యంతర స్వరూప, నిర్గుణ-సగుణ ప్రదర్శక **'పరబ్రహ్మము'**ను ఎరిగిన తరువాత.., ఇక ఆపై ఆతడు జ్ఞానము-జ్ఞేయము (తెలుసుకోవటం-తెలియబడునది), ధ్యానము-ధ్యేయము (ధ్యానించటం-ధ్యానము చేయబడునది). లక్ష్యముగా కలిగి ఉండవలసినది-అలక్ష్యము చేయవలసినది, ద్రష్ట (చూచువాడు)-దృశ్యము (చూడబడునది), ఊహ-అపోహ మొదలైన ద్వంద్వములన్నీ **స్వభావసిద్ధముగానే పరిత్యజించుచున్నాడు. ఆ చర్చ అంతా 'అఖండాత్మాఽహమ్' సమక్షంలో మౌనము దాల్చుచున్నది.**

ఓ యాజ్ఞవల్క్యా। ఓ ప్రియజనులారా। అఖండ – అప్రమేయ స్వస్వరూప ధ్యానము – జ్ఞాపకములే **'సమాధి నిష్ట'** అని గ్రహించెదరుగాక. ధ్యాని – ధ్యానవస్తువై ప్రకాశించటమే **సమాధి స్థితి।**

**యాజ్ఞవల్క్యుడు :** మహాత్మా! ఈ జీవుడు అనునిత్యముగా పొందుతున్న అవస్థల గురించి వివరించమని నా విన్నపము.

**ఆదిత్య భగవానుడు :** అవును. ఈ జీవుడు అనునిత్యముగా '5' అవస్థలు కలిగినవాడై ఉంటున్నాడు. 1) జాగ్రత్ 2)స్వప్నము 3) సుషుప్తి 4) తురీయము (5) తురీయాతీతము.

**జాగ్రత్ :** జాగ్రత్ ప్రవర్తనుడగు ఈ జీవుడు 'ప్రవృత్తి' మార్గమునందు ఆసక్తుడై ఉంటున్నాడు. ఎప్పుడో 'నాకు సుఖము కలిగించే స్వర్గలోకము లభించాలి. అందుకు శుభకర్మలు చేయాలి మరి! దుఃఖము కలిగించే నరక కర్మలు వద్దు. అందుచేత పాపకర్మలు చేయకూడదుకదా!' అని కాంక్షిస్తూ ఉండసాగుచున్నాడు. ఈ విధంగా సుకృత-దుష్కృత, విహిత-నిషిద్ధకర్మలు-కర్మ భావములలో జాగ్రత్ గడిచిపోతూ ఉంటుంది. అట్టి స్వభావతః ప్రవృత్తిమార్గములో ఉన్న ఈ జీవుడు **"ఎన్నాళ్లని ఈ ఇంద్రియ విషయములను నమ్మి ఉంటాము? ఇంద్రియములు స్వభావతః కొన్ని రోజులకు తేజస్సు కోల్పోతూ ఉంటాయి కదా! వీటిని నమ్మి ఉండటంలో ఏమి గొప్ప?"..** అని వైరాగ్యమును స్వీకరించటం ప్రారంభిస్తున్నాడు. **'కర్మలు-కర్మఫలముల వ్యవహారమంతా ఇకచాలు! ఇవన్నీ బంధమేగానీ సుఖము కాదు. పుట్టటం-చావటం, ఇంతకుమించి మరింకేమీ లేదా? నేను బద్ధుడనుగానే జీవితం గడుపుచున్నానే! సంసార బంధములు తొలగేది ఎట్లా? ఉపాయములేమిటి?'** అని ప్రశ్నించుకొంటున్నాడు. విముక్తి గురించి యోచించ ప్రారంభిస్తున్నాడు. ప్రవృత్తి నుండి కొంచెం కొంచెం వెనుకకు మరలటమునకు సిద్ధపడుచున్నాడు. **నివృత్తి మార్గమును ఆశ్రయించటమునందు ప్రవృత్తుడగుచున్నాడు.**

అప్పుడిక సంసారము నుండి తరించుటకొరకై విజ్ఞుడు - ఆత్మజ్ఞుడు-నిత్యానిత్యవివేకము కలిగిన వారు అగు గురువును ఆశ్రయించుచున్నాడు. ఆ యొక్క క్రమములో...,

- కామము మొదలైన మార్గములను త్యజించనారంభిస్తున్నాడు.
- శాస్త్రములు అందిస్తున్న భక్తి-క్రియాయోగ-జ్ఞాన విచారణా సంబంధమైనవి విహిత-ఉపాసనా కర్మలందు, పుణ్యకార్యములందు అనురక్తుడగుచున్నాడు.
- **శమము-సత్సంగము-విచారణ-సంతోషము** అనబడు **సాధన చతుష్టయ సంపత్తికి** ఉపక్రమించుచున్నాడు.

ఇప్పుడు ఇక కళ్లుమూసుకుని ధ్యానమునకు సిద్ధమగుచున్నాడు. హృదయ కమల మధ్యలో సర్వదా వేంచేసియున్నట్లుగా సూచించబడుచున్న శాస్త్ర విభాగములను పరిశీలిస్తూ యోగభ్యాసము ద్వారా ***'అంతర్లక్ష్యము'*** కొరకై ధ్యాన-యోగాది యత్నములు చేయుచున్నాడు. క్రమంగా తనయందలి పరతత్త్వమును అనుభూతపరచుకోవటం ప్రారంభించుచున్నాడు. యోగ-జ్ఞాన-భక్తి మార్గముల ప్రయత్నముచే తన యొక్క ఇహ స్వరూపమునకు ఆవల **ఇహస్వరూప ఉపకరణధారుడగు స్వకీయపరస్వరూపమును** తెలుసుకొని, దర్శిస్తూ మమేకమగుచున్నాడు. **'నేను సర్వదా పరబ్రహ్మ స్వరూపుడనే కదా!'..** అను రూపము గల బ్రహ్మానందస్ఫూర్తిని పొందనారంభిస్తున్నాడు. **"ఏక ఏవాహమ్-అద్వితీయః"!** ... అని ఎలుగెత్తి తనను గురించి తానే గానం చేస్తున్నాడు.

స్వప్నములో అనేకములు కనబడవచ్చుగాక! వారంతా స్వప్నద్రష్టయొక్క ఒకే స్వప్నకళానైపుణ్య ప్రదర్శనమేకదా! అట్లాగే, ఈ జీవుడు తన జాగ్రత్ **చైతన్యకళా ప్రదర్శనమునే** జాగ్రత్‌గా పొందుచున్నాడు. **"జాగ్రత్ అంతా 'ఏకము - అద్వితీయము' అగు నేనే!" ..** అనే మహావాక్యార్థము యొక్క అర్థ-తాత్పర్యములను తన హృదయమున పదిలపరచుకొని ఈ జగత్తులో యథాసందర్భానుసారంగా చరిస్తున్నాడు. ఆతని జీవ-బ్రహ్మైక్య అఖండభావనను మనము చెప్పుకోవటానికి మాటలు చాలవయ్యా! జాగ్రత్‌లో కనిపిస్తూ, కేవలమగు ఆత్మయందు సంస్థితుడై ఉన్నవానికి ఇక్కడ జాగ్రత్ స్వప్నము వంటిదే అగుచున్నది.

## స్వప్నము

ఈ జీవుడు కొంత సమయము జాగ్రత్‌ను విస్మరించి అజ్ఞానవృత్తిని ఆశ్రయించి, జాగ్రత్ వాసనలలో కొన్నింటిని ఫలదీకరించుకొని **'నేను తేజసుడను'** అని అనుకుంటూ స్వప్నదర్శనమునకు పరిమితుడై ఉంటున్నాడు.

- అందుచేత, స్వప్నము సమయములో **'స్వప్నము సత్యమే'** - అనియే ఆ ద్రష్ట భావన కలిగి ఉంటున్నాడు. 'స్వప్నదృశ్యము' - అప్పటికి జాగ్రత్ జగత్తు వంటిదే! స్వప్న సమయంలో **స్వప్నదృశ్యము సత్యము - జాగ్రత్ దృశ్యము అసత్యము.**
- స్వప్నములోని "నేను" - జీవాత్మ వంటిదే! జాగ్రత్తులోని 'నేను' వంటిదే!
- **"స్వప్నము నాదైన నేను"** - స్వప్నమునకు బాహ్యమున సర్వకారణుడై ఉన్నాడు కదా! అందుచేత స్వప్న ద్రష్ట - **'పరమ్' (ఆవల ఉన్న) ఆత్మ స్వరూపుడే!**

## సుషుప్తి

జాగ్రత్-స్వప్నములు రెండు అవస్థలను త్యజించినప్పటి అవస్థాభేధ-రహితస్థితి- 'నేను ప్రాజ్ఞుడనై ఉన్నాను' అని తలచి విషయరహిత **కేవల - ప్రాజ్ఞత్వమును** పొందుచున్నాడు.

ప్రాజ్ఞ చైతన్యము నుండే (అనగా) గాఢ నిద్రావస్థ నుండియే జాగ్రత్ బయ్యల్వెదలటము తిరిగి విలీనము పొందటకు జరుగుతోంది. అట్లాగే స్వప్నము కూడా! అందుచేత **సుషుప్తి అవస్థ-జాగ్రత్-స్వప్నములకు జనన-లయ స్థానములు** - అని చెప్పబడుతోంది.

## తురీయము

త్రి అవస్థల తరువాత 4వది–తురీయము (చతురీయము). ఇది జాగ్రత్–స్వప్న–సుషుప్తులలో **"సంచారము చేయుచున్న నేనైన 'నేను'!"** జాగ్రత్ స్వప్న సుషుప్తలు తనవైయున్న స్వస్వరూపము.

## తురీయాతీతము – తురీయాతీతుని స్వాత్మగానము

ఇది తురీయత్వము తనదై ఉన్నట్టిది కేవల మౌనస్వరూప. 'నేను' సుషుప్త్యవస్థలో విశ్రమించి బ్రహ్మానందము పొందుచున్న "నేనైన నేను" కు కూడా ఉత్పత్తి స్థానము. **తురీయాతీత అవస్థ ఆస్వాదించు 'నేను' యొక్క భావన ఏ విధంగా ఉంటుందో, విను....!**

**'హృదయ మధ్యభాగములో' సత్తా** (THE SENSE THAT 'I' AM PRESENT) **రూపమును.** జాగ్రత్ స్వప్నములను తురీయము ద్వారా కల్పించుకొనువాడను! బ్రహ్మానంద స్వరూపుడనగు నేను అద్వితీయుడను. నాకు నేరుగా జాగ్రత్ స్వప్న–సుషుప్తులు గానీ, వాటి వాటి అంతర్గత విషయాలు గాని లేవు. నేనే కొంత సమయము ఇంద్రియములను ఆశ్రయించి, ఆ ఇంద్రియముల ద్వారా విషయములను అనుభవిస్తూ, జాగ్రత్‌లో సంచరించుచూ **'నా స్వరూపము జాగ్రత్‌లో ఏదైతే కనిపిస్తుందో – అది మాత్రమే'** అని తలచుచూ, పరిమితుడనై ఉండటము జరుగుతోంది. ఇదియే జాగ్రత్! ఆ తరువాత ఒక సమయములో జాగ్రత్ వాసనలను **అంతరమున దాచివేసి, 'జాగ్రత్' నుండి వెనుకకు మరలుచున్నాను.**

అప్పుడు జాగ్రత్‌ను దాచి ఉంచి స్వప్నమును ప్రదర్శించుకొనుచున్నాను. ఇతః పూర్వపు జాగ్రత్ – స్వప్న జాగ్రత్ వాసనలలో కొన్నిటిని సమకూర్చుకుని మనస్సుతో దృశ్యము కల్పించుకొని ఆ స్వప్న దృశ్యములో ప్రవేశించి ఆయా విశేషములు ఆస్వాదిస్తూ **"స్వప్నములో ఏది కనపిస్తోందో. అద్దానికి బద్ధుడను, తేజసుడనైనాను. స్వప్న విషయములే, స్వప్న దృశ్యములే నా మొత్తము స్వరూపము"**.. అని భావిస్తూ కొంత సమయము గడుపుచున్నాను. మరల స్వప్నమును త్యజిస్తూ స్వప్న సంస్కారములను నాయందు దాచుకొనుచూ.. వెనుకకు మరలుచున్నాను. **ఇది నా యొక్క స్వప్న సంబంధిత వృత్తాంతము.**

మరికొంత సమయము 'ప్రాజ్ఞుడను' అయి, 'సుషప్తి' అను ఏకో – ఏకాంత స్థితిలో ఉంటున్నాను. జాగ్రత్ – స్వప్న ఇత్యాది ఆయా విభాగములను (అందలి సర్వ విశేషములతో సహా) నాలోనే (సంస్కార దేహములో) దాచుకొని ఉన్నవాడనై, వర్తమానంలో మాత్రము జాగ్రత్–స్వప్న–ఇత్యాది విభాగములు **'ఏకత్వము'** అనుభవించుచున్నాను. ఆ మూడు స్థితులలో తురీయడనై ప్రవేశించుచూ, నిష్క్రమిస్తూ నా సంస్కార దేహపు తలుపులు మూయుట – తెరచుట చేస్తున్నాను. తురీయునికి కేవలసాక్షినైనట్టి తురీయాతీతుడను! వివేకముచే నా స్వరూపము ఎరిగిన వాడనై, తత్ సంబంధమైన వివేకముతో **'నహి మత్ అన్యత్'.. నాకు వేరైనది ఎక్కడా ఏదీ లేదు..** అని గమనించుచున్నాను. **'శుద్ధ అద్వైత బ్రహ్మమే నేను'** అని గమనించి సర్వభేద వాసనలు విసర్జించి వేయుచున్నాను. సర్వత్రా మమస్వరూపముగా భావన చేయుచూ, జాగ్రత్–స్వప్న–సుషుప్తాంతర్గతమైనదంతా మమాత్మయొక్క తేజోవిలాసముగా మననముచేయటము, సందర్శించటము ప్రారంభిస్తున్నాను. **అభిదా సర్వగన్ధమ్ నిరస్య, స్వాన్త విజృమ్భిత భానుమండల ధ్యానః।** భేదగంధములు –దృష్టులు–సంస్కారములు పాము కుబుసమువలె విసర్జించి హృదయాంతరంగమునందు విజృంభిస్తున్న **ఆత్మతేజోభానుమండల ధ్యానినిగా** అగుచున్నాను. **పరబ్రహ్మాకార ముక్తిమార్గమ్ ఆరూఢః పరిపక్వో భవతి। – 'పరబ్రహ్మము'** అను ఆకారమును పొందినవాడనై ముక్తిమార్గమునందు ఆరూఢుడను అగుచున్నాను!

❖

ఓయాజ్ఞవల్క్య మహాశయా! ఈ విధంగా మననము చేస్తూ ఆ యోగి తురీయాతీత ధ్యానమునందు పరిపక్వత పొందినవాడుగుచున్నాడయ్యా!

**'అసలీ జీవునకు బంధము ఎట్లా సంప్రాప్తిస్తోంది?'** అని ప్రశ్నించుకుంటే, **'సంకల్పించుట వలననే'** అనునది సమాధానము లభిస్తోంది.

**సంకల్పాదికం మనోబన్ధహేతుః।** – 'సంకల్పించుట! (Thought Provocation by visualization) అను క్రియాశీలతచే ఏర్పడు సంకల్ప పరంపరలే మనోబంధమునకు హేతువు.

**తత్ విముక్తం మనో మోక్షాయ భవతి।** – సంకల్పములను ఉపశమింపజేసి, వాటియొక్క సాక్షిని నిశ్చలధారణ చేస్తున్నప్పుడు మనోమోక్షము సిద్ధిస్తోంది. సంకల్పరహిత ధ్యానము ఆత్మ ధ్యానమే అగుచున్నది.

ఈ విధముగా 'బంధము–మోక్షము' అనునవి మనస్సుకు సంబంధించినవి మాత్రమే **(మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో!)** ఆత్మకు బంధమే లేదు. ఇక మోక్షము యొక్క అగత్యముగాని, ప్రసక్తిగాని ఆత్మకు ఏముంటుంది? ఈ జీవుడు మనో–పరిమిత స్వరూపుడా? కాదు. **సర్వదా ఆత్మస్వరూపుడే!**

**యాజ్ఞవల్క్యుడు :** సంకల్పించటమును ఉపశమింపజేయుటమంటే 'ఆలోచించటమే మానివేయాలి' అని తమ ఉద్దేశ్యమా, స్వామీ?

**ఆదిత్య భగవానుడు :** అది కాదు. కళ్లకు కనిపిస్తున్న ఈ సాకార నామరూపాత్మక ప్రపంచమును వస్తు దృష్టితో కాకుండా ఆత్మదృష్టితో దర్శించటమునే - 'మనోవృత్తి నాశనము' అని అంటున్నారు. వస్తు దృష్టిని అధిగమించటమే సంకల్ప నాశనము. హృదయము నందు **అనేకము** అను దానితో కూడి జగత్ సంబంధిత సర్వ భేద సంకల్పములను యోగి **"ఆత్మాఖండ భావన"** యందు లయింపజేయును గాక! సంయమింపజేసి వేయును గాక! (1) సర్వ నామరూప గుణ భేద వాసనలు త్యజించటము. (2) తన యొక్క జగదాత్మత్వమును- ప్రశాంత-ఆనందములతో కూడి - **దృశ్యరూపముగా ఆస్వాదించటమే** అది!

ఈ జాగ్రత్తులో ప్రవర్తించుచూ, పాల్గొనుచున్న ద్రష్టత్వమును ఆవరించి వెంటనంటి తిరుగాడుచున్న 'అహమ్-మమ నేను- నాది'.. అనే అహంకారముపై నిశ్శబ్దయుద్ధము ప్రకటించాలి. జయించివేయాలి. **త్యక్త్వా అహంకారో, 'బ్రహ్మోఽహమస్మి' ఇతి చిన్తయన్!** అహంకారమును త్యజించి, **'నేను అఖండము-అప్రమేయము-సత్యము-నిత్యము అగు బ్రహ్మమును'** అని చింతన చేయాలి. చేతులెత్తి మనో-వాచా-కర్మణా ఎలిగెత్తి గానం చేయాలి. **ఊర్ధ్వ బాహుః విరౌమ్యేష! ఇదమ్ సర్వమ్ యత్ అయమ్ ఆత్మా-ఇతి భావయన్!** "ఈ కనబడేదంతా ఆత్మస్వరూపమే! మమాత్మస్వరూపమే!" అని సర్వదా భావన చేయాలి. అనుకుంటూ ఉండాలి! అనుక్షణం - అన్ని సందర్భములలోను తత్ భావనను భావన చేస్తూ ఉండాలి. ఇక **అనిపించక ఏం చేస్తుంది? అట్టివాడు కృతకృత్యుడయ్యా!**

ఏ యోగి అయితే తన హృదయాంతర్గత నిత్యోదిత ఆత్మజ్యోతిని - అఖండ మండలాకారముగాను, చరాచర వ్యాప్త నిత్యోదిత తత్త్వప్రకాశముగాను, సర్వ బాహ్య-అభ్యంతర స్థితమైనట్టిదిగాను - 'ఏకీభావి' అయి -ఉపాసిస్తున్నాడో.. అట్టియోగి **సర్వపరిపూర్ణ- తురీయాతీత బ్రహ్మభూతుడు** అగుచున్నాడు.

**తమ్ బ్రహ్మేఽతి స్తువన్తి!** ఎవ్వడూ ఈ లోకములను లోకాంతర్గత సర్వప్రదర్శనములను 'పరబ్రహ్మమే' అనురూపంగా స్వస్వరూప ప్రదర్శనానందుడై భావన చేస్తూ ఉన్నాడో, అట్టివాడు 'బ్రహ్మవేత్తయే కాదు! బ్రహ్మమే!'.. అని స్తుతించబడుచున్నాడు. ఆతడు సర్వలోకస్తుతి పాత్రుడు అగుచున్నాడు. **స సర్వలోక స్తుతి పాత్రః!** అంతేకాదు! **స సర్వలోక సంచార శీలో!**

**'అహమేవ ఆత్మా'** - నేనే ఆత్మను - అను ఆతను భావన చేతనూ సర్వలోకములు - జలములో..., జలతరంగాకారములవలె - ఆత్మయందే ప్రక్షిప్తమై ఉండటం చేతనూ,..... ఆతడు **సర్వలోకసంచారశీలుడే** అగుచున్నాడు.

**బిందోపాసన : పరమాత్మగగనే బిన్దుం నిక్షిప్య-** ఏయోగి అయితే శుద్ధ పరమాకాశము నందు బిందువును నిక్షేపించుచున్నాడో. ఆతడు అద్వైత - శుద్ధాద్వైతి.

**అద్వైతము:** పరబ్రహ్మమునకు (లేక) పరమాత్మకు (లేక) నా యొక్క (మరియు ప్రతి ఒక్కరి యొక్క) - అఖండ స్వస్వరూపమునకు వేరుగా ద్వితీయమై ఏదీ లేదు. - అనునదే అద్వైతభావన! 'జీవుడు బ్రహ్మమే' అను సునిశ్చయత. జీవుడు-జగత్తులను సదా అఖండాత్మకు అభిన్నంగా అవగాహన - అనుభూతులను కలిగి ఉండటము.

**శుద్ధాద్వైతము :** అట్టి పరబ్రహ్మము - అఖండమే కాకుండా సర్వదా ద్వైత దోషము పొందనట్టిది. జీవాత్మగా అగుటలేదు. జగత్-జన్మ-కర్మలు అద్దానికి ఎప్పుడూ లేవు! కనుక సర్వదా శుద్ధమే' అని ఎరిగినవాడై ఉండటము.

ఓ యాజ్ఞవల్క్యా! అట్టి శుద్ధాద్వైత పరమాత్మ బిందుతత్త్వమునందు - ఎట్టి జాడ్యము (బద్ధకము -అశ్రద్ధ) లేనివాడవై, **సహజానంద-అమనస్కుడవై-యోగనిద్రను ఆశ్రయిస్తూ** ఉపాసించుము. అట్టి అఖండానన్ద పదమును అనువర్తిస్తూ, అద్దానిపట్ల ఏకవృత్తి కలవాడవై భావోపాసన చేస్తూ ఉండుము. అప్పుడు నీవు సందర్భసత్యముల నుండి విడవడి, సహజ సత్యమగు ఆత్మగా ఈ సర్వమును సందర్శిస్తూ, **జీవన్ముక్తుడుగా** అగుచున్నావు. యోగానంద సముద్రములోని తరంగరూపుడుగా - తరంగమగ్నుడుగా స్వభావ సిద్ధముగా అగుచున్నావు.

**తత్ అపేక్షయా ఇన్ద్రాయ స్వల్పానన్దాః।**

అట్టి బిందునిక్షిప్య **- శుద్ధాఽద్వైత -అజాడ్య - సహజ-అమనస్కయోగనిద్రా-అఖండానంద సముద్రము** యొక్క కొన్ని జల బిందువుల స్వీకారముచే ఇంద్రుని ఇంద్రియానందము రూపము పొందుతోంది. ఇక, ఈ సర్వము మమాత్మస్వరూపమే అగు ఆత్మతత్త్వానందమును పొందిన పరమయోగి యొక్క ఆనందము ఎట్టిదని చెప్పగలం? **అవర్ణనీయం! అనిర్వచనీయం!**

ఇత్యుపనిషత్

## తృతీయ బ్రాహ్మణము - అమనస్కము - మరికొన్ని విశేషాలు!

**యాజ్ఞవల్క్యమహాముని :** హే భగవన్! మండల పురుషా! 'అమనస్కము' గురించి మీరు సవివరంగానే చెప్పుచున్నారు. అయినా కూడా - బహుశః అనేక జన్మలుగా ఈ మనస్సు అనేక విషయములపై వ్రాలు అలవాటుచేతకాబోలు - అమనస్కము గురించి నాకు ఇంకా బోధ పడలేదని, **ఇంకా కూడా మీ వద్ద ఇంకొన్ని విశేషాలు వినటము అవసరమని** నాకు అనిపిస్తోంది. **ఉక్తమపి విస్మృతమ్ ।** విస్మృతి అనే జాడ్యము గల జీవుడునగు నేను ఇంకా మీ వద్ద వినటము అత్యవసరమని భావిస్తున్నాను. **పునః తత్ లక్షణమ్ బ్రూహి!** మరల అమనస్క లక్షణములగురించి మరికొన్ని విశేషాలు వివరించప్రార్థన!

**అఖణ్డ మండల ఆదిత్యపురుషుడు :** ఈ 'అమనస్కము' బాహ్యలక్షణముగా కనబడేదికాదు. కళ్లు మూసుకొంటే కనబడేదీ కాదు. అందుచే **'అమనస్కయోగము అతిరహస్యమైనది** - అని చెప్పుకోబడుతోంది. అయితే అమనస్కము యొక్క రహస్య తత్త్వార్థము తెలుసుకొన్నప్పుడే ఈ జీవుడు కృతకృత్యుడు కాగలడు.

'అమనస్కము' అనునది - **ఉన్మనీ (జగత్ విషయరహిత కేవల మనోఉపకరణము)ను ఉపయోగించి, అంతర్-హృదయాంతరంగుడగు పరమాత్మయందు జగత్ దృశ్యమంతా సందర్శించే శాంభవీ (లేక) ఖేచరీ ముద్రతో కూడిన సంయోగ ఏకత్వము. కేవలసాక్షీ లక్షణముతో కూడిన మనస్సుతో పరమాత్మను సర్వమునందు - సర్వముగాను చూస్తూ ద్రష్టత్వమును కూడా లయింపజేయు స్థితి.** అట్టి శాంభవీ-(లేక)-ఖేచరీ ముద్రాధ్యాయుడు పరమాత్మ యొక్క ప్రత్యయ లక్షణములను దర్శించుచున్నాడు. పరమాత్మభావనా సమేతుడై ధ్యానను (భావనచే) ఆత్మయందు నిలిపి ఉంచటమే 'అమనస్కము'. అట్టి అంతర్లక్ష్య వస్తువు, అంతర్ బహిర్ వాస్తవస్వరూపుడగు ఆత్మయొక్క విశేష లక్షణములను గురించి ముందుగా కొంచెము చెప్పుకుందాము.

### ఆత్మయొక్క విలక్షణ లక్షణములు

**ఆత్మసర్వలక్షణ విలక్షణము:** వాస్తవానికి అలక్షణము. లక్షణములకు అతీతము. అయితే ప్రత్యయ లక్షణంగా ఆత్మలక్షణముల గురించి కొన్ని విశేషాలు చెప్పుకొందాము.

**సర్వేశ్వరుడు :** సర్వదేహములలో జ్యోతిస్వరూపుడై వెలుగొందుచున్న ఆ స్వస్వరూప అభిన్న ఆత్మభగవానుడు **సర్వనియామకుడు. జీవాత్మ** (The Experiencer) కు, **దృశ్యమునకు,** అట్టి దృశ్యమునకు ముడిపదార్థములైనట్టి **సూక్ష్మపంచభూతములకు 'నియామకుడు'** **కనుక సర్వేశ్వరుడు. ఈ సర్వము తన ఈశ్వరత్వముగా కలవాడు.**

**అప్రమేయమ్ :** ఆయన కల్పనా కళావిన్యాసమే ఈ జగత్తు. అయితే, కల్పనకు చెందిన వాడు కాదు. మనోబుద్ధిచిత్త అహంకారములకు చెందినవాడు కాదు. స్వప్నము తనదైయున్నవాడు - స్వప్నములోని ఏ వస్తువుకు చెందనివాడై, స్వప్నమునకు వేరుగా ఉన్నాడుకదా! కథారచయిత కథలో ఏసంఘటనకు చెందనివాడై, ఆ కథకు వేరై ఉన్నట్టివాడు కదా! అట్లాగే ఆత్మ దేనికీ చెందినదికాదు. కనుక అప్రమేయము. దేనిలోనూ ప్రమేయము (Relatedness) లేనట్టిది.

**అజమ్ :** ఆత్మ **'అహమ్ సృష్టి కామః'..** "నేను సృష్టిని (లేక) కల్పనను కోరుకొనుచున్నాను" - అను భావతరంగము పొందిన సందర్భములో పాంచభౌతిక - అభౌతికములతో కూడిన సృష్టి జనించుచున్నది. అట్టి సృష్టిలో ఈ భౌతిక దేహముతో సహా సర్వము జనిస్తున్నాయి. మరొకప్పుడు లయిస్తున్నాయి. అయితే దేహమును కదిలించుచున్న 'దేహి' అనబడు ఆత్మయొక్క ఒకానొక చైతన్య వికాసకిరణము - దేహముకన్నా మునుముందే ఉన్నది. ఈ 'దేహి' సర్వదా ఏ ఆత్మను తన స్వరూపముగా కలిగి ఉన్నదో, అట్టి ఆత్మ-దేహముతోగాని, భావముతోగాని, సృష్టితోగాని జనించటము లేదు. ఆత్మ అంతకు మునుముందే ఉన్నది. కనుక ఆత్మ అజము. 'జనించుట' అను స్వభావము లేనట్టిది. జనించటము లేదుకాబట్టి, మరణించటమూ ఉండదు. జనన-మరణములు లేనట్టిది కాబట్టి **ఆద్యంతరహితము.**

**శివమ్ :** ఆత్మ సర్వదేహములలో వేంచేసి, సర్వము వినోదముకొరకై కల్పించుకొనుచూ, 'జీవితము' అనే క్రీడానందమునకు కారణమగుచున్నది. సర్వజీవుల యొక్క 'సుఖము' అనే అనుభూతి ఎదురుగా ఉండే వస్తువు నుండి రావటము లేదు. 'ఆత్మ' నుండే జనించుచున్నది. అందుచేత ఆత్మ సర్వులకు సుఖప్రదాత! సర్వశుభప్రదాత! వినోదప్రదాత! పరమశివమ్!

**పరాకాశమ్ :** పరమ్-ఆవల. **ఆకాశము** నుండి వాయువు, **వాయువు** నుండి అగ్ని, **అగ్ని** నుండి జలము, జలము నుండి భూమి బయల్వెడలు చున్నాయి. మరి ఆకాశము (Absolute Space) ఎక్కడి నుండి బయలుదేరుతోంది? **ఆత్మాత్ ఆకాశమ్. ఆత్మ నుండి!** అట్టి ఆత్మ సర్వమునకు ఆవల ఉండి ఉన్నది. నాటక రచయిత యొక్క స్వస్వరూపము - నాటక పాత్రలకు, నాటకమునకు 'ఆవల' పరమైయున్నది కదా! ఆత్మ కూడా ఇహాకాశమునకు జనన స్థానమై ఉన్నది. ఈ విధంగా ఆత్మ **పరాకాశ స్వరూపము.** ఇహాకాశ జనిత స్థానము కూడా!

**నిరాలంబమ్: ఈ భౌతిక దేహము కదలటానికి ప్రాణశక్తి కారణము. అనగా ఈ పాంచ భౌతిక దేహము-అనే వస్తువు ప్రాణశక్తిని** 'ఆలంబనము' కా కలిగిఉన్నది. ఆ ప్రాణశక్తి మనస్సు యొక్క అధీనములో ఉండి కదలుచున్నది. అందుచేత ప్రాణశక్తికి మనస్సు ఆలంబనమగుచున్నది. ఈ మనస్సు ఎవరిది? జీవాత్మది! కనుక మనస్సుకు **జీవాత్మ** ఆలంబనము. జీవాత్మకు కూడా మరొక ఆలంబనము (కదల్చువాడు) ఉన్నాడా? ఉన్నాడు. 'జీవాత్మ' అనగా జగత్తులో ఉండి, జగత్తులోని ఒక వస్తువగు ఈ దేహమును కదల్చుచు, దేహములోని ఇంద్రియములతో, ఇంద్రియ విషయములను ఆస్వాదించువాడు కదా! కలలో ఉండి కలలోని దృశ్యమును చూచు 'నేను' వంటివాడు. **ఆ జీవాత్మకు ఆధారము, ఆలంబనము పరమాత్మ!** మరి పరమాత్మకు ఆధారము? అద్దానికి మరొకటి ఏదీ ఆధారముగా గానీ, ఆలంబనముగా గానిలేదు. అవసరం కూడా లేదు. కనుక ఆత్మ **నిరాలంబము.**

**అద్వయమ్ :** దృశ్యము ఇంద్రియములచే పొందబడుతోంది. ఇంద్రియములు లేకపోతే దృశ్యము లేదు. కనుక దృశ్యము ఇంద్రియములకు వేరుకాదు. ఇంద్రియములు ఇంద్రియార్థములకు (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములకు) ఉపకరణములు. కళ్లు స్వయముగా చూడవు. చూచు శక్తి ప్రవేశించి ఉంటేనే కళ్లు చూడగలవు. చూపుశక్తికి వేరుగా కనులకు ఉనికి లేదు.

పంచ-ఇంద్రియార్థములు మనస్సుకు **పంచశిరస్సులు** వంటివి. మనస్సు లేకపోతే ఇంద్రియార్థములకు ఉనికిలేదు. **మనస్సే ఇంద్రియార్థములుగా ఉన్నది. మనస్సుకు ఇంద్రియార్థములు వేరైనవికావు.**

మనస్సు జీవాత్మది. జీవాత్మయే లేకపోతే 'మనస్సు' అనేదే లేదు. కనుక మనస్సు జీవాత్మకు వేరైనది కాదు.

ఇక జీవాత్మయో? పరమాత్మయే జీవాత్మగా ఉన్నాడు. జీవాత్మ పరమాత్మకు వేరుగా ఉనికియే కలిగి ఉండలేదు. కనుక **పరమాత్మయే జీవాత్మగా, మనస్సుగా, ఇంద్రియములుగా, ఇంద్రియదృశ్య జగత్తుగా ఉన్నారు.** పరమాత్మకు వేరుగా ఈ 14 లోకాలుగాని, వాటి వాటి విశేషాలు గాని లేవు. 'ద్వితీయము-రెండవది' అనునదే ఆత్మకు లేదు. కనుక ఆత్మ **'అద్వయము'.**

**బ్రహ్మ-విష్ణు-రుద్రాదీనాం ఏకలక్ష్యమ్ :** బ్రహ్మదేవుడు, విష్ణుభగవానుడు, రుద్రదేవుడు – ఈ త్రిమూర్తులు మొదలైన అందరికీ కూడా ఏకైక లక్ష్యము అయినట్టి ఈ ఆత్మ. ఏ జీవుడైనాసరే, ఇంద్రియజగత్ – ఇంద్రియ-మనో-బుద్ధి-చిత్త-అహంకారములను దాటి ఆవల చూస్తూ ఉండగా గమనికచే-అట్టి ఆ ప్రదర్శనమునకు వస్తువై ఉన్నట్టిదే.. పరమాత్మ! అట్టి పరమాత్మ సర్వస్వరూపమే అయి ఉన్నది! అందుచేత పిపీలికాది బ్రహ్మపర్యంతము.. ఎవ్వరైనా సరే **తారకము లేక ఖేచరీముద్ర** అనబడే 'అంతర్లక్ష్యము'..ను అంతర దృష్టిచే దర్శించప్రారంభిస్తే.. అప్పుడు అఖండమగు ఏకాత్మత్వమే సిద్ధిస్తోంది. అందుచేత ఆత్మ **'ఏకలక్ష్యము'..** అయి ఉన్నది.

**సర్వకారణమ్ :** 'ఇక్కడి దృశ్య-దేహ-మనో-బుద్ధి-చిత్త-అహంకారములకు కారణ కారణము ఎవరయ్యా?' అని పరిశోధిస్తే అట్టి పరిశోధనలచే **'ఆత్మయే కారణము'..** అని తెలియవచ్చుచున్నది. అందుచేత సృష్టి-స్థితి-లయములకు, జీవ-ఈశ్వరులకు.. అంతటికీ కారణము సర్వాత్మకము అగు స్వ-అంతర్గత కేవలాత్మయే! ఆభరణమునకు కారణము బంగారమే అయినట్లు, తరంగమునకు జలమే కారణమగుచున్నట్లు, మృత్తిక (మట్టి) బొమ్మలకు మట్టియే కారణమగుచున్నట్లు, ఈ సర్వజీవుల దేహములకు, వారివారి మనో-బుద్ధి-చిత్త అహంకారములకు మూలకారణము, ఆదికారణము, సర్వకారణము **ఆత్మయే!**

ఈ విధంగా 'మమాత్మయే ప్రత్యయలక్షణ సమన్వితమగు **'పరబ్రహ్మాత్మ'** అయి ఉన్నది'.. అని హృదయగుహలోనే సునిశ్చయుడై, దర్శిస్తూ, ఎవ్వడు హృదయాంతర్గత పరమాత్మతత్త్వమును 'భావాభావములకు ఆవలగా'గా గమనిస్తాడో. ఆతడే **సంవిదితుడు**, 'సత్'ను ఎరిగిన వాడు. తెలుసుకొనవలసినది తెలుసుకొన్నవాడు. ఆతడు **'ఉన్మనీ అనుభవుడు'..** అని కూడా పిలువబడుచున్నాడు. ఈ విధంగా ఉన్మనీ స్థితిని అభ్యాసము చేస్తూ ఉండగా, అఖిలేంద్రియ విషయాలు వాటివాటి కారణములతోసహా ఆత్మయందు ఆత్మస్వరూపముగా దర్శించబడుచూ.. విషయస్వరూపమును కోల్పోవుచున్నాయి. **ఇదియే ఇంద్రియక్షయము.**

ఎప్పుడైతే ఇంద్రియములు వాటి వాటి విషయములు ఆత్మకు అనన్యముగా మనస్సుకు తెలియవచ్చుచున్నాయో.., అదియే **'అమనస్కస్థితి'! తదనన్తరమ్ అఖిలేంద్రియక్షయవశాత్ అమనస్క సుఖ బ్రహ్మానంద సముద్రే మనః ప్రవాహరూపః!** అఖిలేంద్రియములు (ఉప్పుగడ్డ నీటి యందువలె) ఆత్మభావన యందు (ఆత్మగా) విస్మరించబడినవై, ఇతఃపూర్వపుమనస్సు – 'అమనస్కసుఖము' అనే **'జలముచే పరివృత్తమైన బ్రహ్మానందమనః ప్రవాహరూపము'**గా అగుచున్నది. అట్టి జగత్ సంయోగ-వియోగాతీతమైనటువంటి యోగ స్థితి (లేక ధారణ) గాలి వీచని చోట దీపమువలె అచలమై (నిశ్చలమై), 'పరబ్రహ్మము'ను పొందినదిగా అగుచున్నది. అట్టివాడు ఎండిన మ్రాను (లేక చెట్టు) వలె మరల జగత్ భావనలలో చిగురించనివాడై ఉంటాడు. గాఢ నిద్రలోను, మూర్ఛలోను ఉన్నవాని వలె ఉచ్ఛ్వాస – నిశ్వాస భావనలు (నేను, ఇప్పుడు గాలిపీలుస్తున్నాను. అప్పుడు వదలుచున్నాను.. అనే సంకల్పము) కూడా ఉండవు. ఈ కనబడేదంతా ఆతని పట్ల 'అసంకల్పితము' అగుచున్నది. **'ఆత్మయేవాఽహమ్'** అను భావనను పునికిపుచ్చుకొన్న ఆ ఆత్మతత్త్వవేత్త

సమక్షములో సర్వ ద్వంద్వములు నశించినవిగా అగుచున్నాయి. సదా మార్పు-చేర్పులు పొందుచూ చంచల స్వభావి అయి ఉన్న ఈ భౌతికదేహము-భౌతిక ప్రపంచము ఆతని పట్ల **పరమశాంతరూపము** సంతరించుకున్నవి అగుచున్నాయి. మనస్సు శాంతిని అధిరోహించినదై ప్రచార శూన్యము పొంది **పరమాత్మయందు విలీనము** పొందినదిగా అగుచున్నది.

**పయఃస్రావా-అనన్తరమ్ ధేనుః స్తనక్షీరమ్ - ఇవ..,** ఒకసారి పాలు మొత్తము పిండిన తరువాత ఏ విధంగా అయితే గోవు యొక్క స్తనముల నుండి ఇక పాలు రావటం కొనసాగదో.. ఆ తీరుగా.. **సర్వేంద్రియ వర్గే పరినష్టే, 'మనోనాశనమ్'.. భవతి!..** సర్వ ఇంద్రియములు దృశ్యమును పొందటము మానివేసినవై... ఇక 'మనోనాశనము' సిద్ధించుచున్నది. ఇంద్రియములు-విషయములు ఆత్మ రూపం సంతరించుకుంటున్నాయి.

## 'అదియే అమనస్కము'

అట్టి నిత్య శుద్ధుడగు పరమాత్మను నేనే! **అహమేఽవ..** అనుఉపదేశము చేత

1) తత్ పరమాత్మా నిత్య శుద్ధః

2) తత్ త్వమ్ అసి.. అదియే నీవు కూడా!

3) అందుచేత, త్వమేవాఽహమ్.. 'నీవుగా' ఉన్నది 'నేనే'!

4) అహమేవ త్వమ్.. 'నేను'గా ఉన్నది 'నీవే'!

.... ఈ నాలుగు'తారక యోగ మార్గములు' అనబడుచున్నాయి. ఈ తారక యోగమార్గములో నడుచుచున్నవాడు అఖండానందపూర్ణుడగు చున్నాడు! కృతార్థుడు అగుచున్నాడు.

ఈ విధంగా "1) తత్ త్వమ్ 2) సోఽహమ్ 3) త్వమేవాఽహమ్ 4) అహమ్ త్వమేవ".. ల పరమార్థమును ఆశ్రయిస్తూ అంతర్లక్ష్యశీలుడుగు శాంభవీ ముద్రాయోగి (లేక) ఖేచరీము ద్రాయోగి **'పరిపూర్ణ పరాకాశమగ్నుడు'** అగుచున్నాడు. జగత్ భావనారహిత మనస్సు అనబడే 'ఉన్మనీ' సహాయముచే మనో అంతర్గతమైనట్టి సర్వభేద విషయములను త్యజించివేయుచున్నాడు. ఆతని జీవాత్మత్వమంతా పరమాత్మత్వము సంతరించుకొన్నదై, పరమాత్మకు అభేదరూపము పొందుచున్నది. సర్వేంద్రియవర్గమును సన్న్యసించినవాడై.. అనేక జన్మలలో ఆర్జించిన పుణ్యపరిపాకము చేత.. **'కైవల్యము'** అను మధురాతి మధురమైన ఫలమును పొందుచున్నాడు. అఖండానంద ఫలమును ఆస్వాదిస్తూ సర్వక్లేశ కర్మలను వదిలివేయుచున్నాడు. కర్మపరిధులకు అందని ఆత్మ స్వరూపముతో ప్రకాశించుచున్నాడు.

**'బ్రహ్మోఽహమస్మి - నేనే బ్రహ్మమును'** అనునది సిద్ధించుకొని, **కృతకృత్యుడు** అగుచున్నాడు.

ఇప్పుడు ఎవ్వరైనా ఆత్మజ్ఞానార్థుడై ఆతనిని ఆశ్రయించినప్పుడు.... ఆతడు ముందుగా లేచి నిలబడి, కౌగిలించుకొని.. త్వమేవాఽహమ్- **నీవుగా ఉన్నది నేనేనయ్యా! న భేదోఽస్తి - నీకు-నాకు భేదమే లేదు! పూర్ణత్వాత్ పరమాత్మనః - పూర్ణాత్మత్వము చేత మనమిద్దరమూ కూడా - అఖండ పరమాత్మ స్వరూపులమే!** - అని మనో-వాక్కులతో సమాలింగనము చేసుకొని, అప్పుడు ఇక శిష్యుని కూర్చోబెట్టి **'తత్ త్వమ్'** అను స్మృతి జ్ఞానమునకు సంబంధించిన సమాచారమును సంభాషించుచున్నాడు. బోధించుచున్నాడు.

# 4. చతుర్థబ్రాహ్మణము - వ్యోమపంచక లక్షణములు

**యాజ్ఞవల్క్యుడు :** హే మహాత్మా! భగవన్! మండల పురుషా! ఆదిత్య సద్గురువరేణ్యా! ఇప్పుడు ఇక తత్త్వశాస్త్రముచే ప్రవచనము చేయబడుచున్న **'వ్యోమపంచక లక్షణములు'** గురించి వినగోరుచున్నాను. వాటి లక్షణములు వివరించి చెప్ప వేడుకొంటున్నాను.

**ఆదిత్య భగవానుడు :** సరే, వినండి. పంచ (5) ఆకాశములు 'వ్యోమ పంచకము'గా అభివర్ణించబడుచున్నాయి. 1. (భూత) ఆకాశము 2. పరాకాశము, 3. మహాకాశము, 4. సూర్యాకాశము 5. పరమాకాశము.

**1. (భూత) ఆకాశము : బాహ్య అభ్యన్తరే అంధకారమయమ్।** ఇది లోన-బయట కూడా అంధకారముతో నిండి ఉన్నది. పాంచభౌతిక దృష్టిచే అజ్ఞాన-అంధకార సంబంధమైనది. అజ్ఞాన అంధకార ఆకాశము, అజ్ఞాన స్వరూపము.

**2. పరాకాశము : బాహ్య అభ్యన్తరే కాలాఽనల సదృశ్యమ్!** ఇది అంధకారమునకు ఆవల కాలాగ్నితో సమానంగా అగ్నితో ఉన్నట్టిది. ఇది జ్ఞానసాధనా సమాచారమునకు సంబంధించిన ఆకాశము. యోగసాధనా సంబంధిత రూపము. యోగధ్యాన స్వరూపము. 'యోగాగ్ని' గా వర్ణించబడుతోంది.

**3. తత్త్వమహాకాశము : స బాహ్యా - అభ్యన్తరే అపరిమిత ద్యుతినిభమ్ :** ఇది బాహ్యా -అభ్యంతరములలో అపరిమితమైన జ్యోతి (వెలుగు) స్వరూపమై వెలుగుతో నిండి ఉన్నట్టిది. సత్ స్వరూపమైనది. **'త్వమ్ తత్ అసి-నీవుగా పరమాత్మయే ఉన్నది'** - అను దర్శనమునకు సంబంధించినది కాబట్టి **తత్త్వాకాశము** అని అంటారు. తత్త్వ జ్ఞాన స్వరూపము.

**4. సూర్యాకాశమ్ : స బాహ్యా అభ్యన్తరే సూర్యనిభమ్!** ఇది లోన-బయట కూడా సూర్య(జ్ఞాన) ప్రభలతోనూ తేజస్సులోనూ వెలుగొందుచున్నట్టిది (చిత్‌స్వరూపము). **జ్ఞానస్వరూపము. ప్రజ్ఞాస్వరూపము. సర్వ సహజీవులు 'స్వస్వరూపాత్మ' సూర్యుని కిరణములుగా అనుభవమగునట్టిది.**

**5. పరమాకాశము :** ఇది ఇట్టిదని దృష్టాంతములచే నిర్వచించలేము! అనిర్వచనీయము! జ్యోతిస్వరూపము! సర్వము తానైనట్టిది! సర్వవ్యాపకము! నిరతిశయానంద లక్షణము! ఆత్మత్వానందమునకు సంబంధించినది. అఖండాత్మా పరస్వరూపము! అనేకముగా కనిపిస్తున్నదంతా **'ఏకము-అక్షరము-అఖండము'** గా అనిపించునట్టిది.

ఎవడు ఏ లక్ష్యముతో అంతర్లక్ష్యముగా దర్శిస్తాడో ఆతడు అదియే అగుచున్నాడు. ఆ రూపలక్షణములే పొందుచున్నాడు. ఉదాహరణకు **'నేను భూతాకాశ సంబంధమైన భౌతికవస్తువులు పొందాలి! అప్పుడే నేను పొందవలసినవి పొందినట్లు కదా'!..** అను అనిర్వచనము కలవాడు ఉపాధి పరంపరలను పొందుచున్నాడు. పరాకాశ లక్ష్యముగలవాడు - ఈ సర్వమునకు పరమైన స్వరూపము పొంది ఇహమున (జీవాత్మ-దృశ్యములను) ఆవల పరమై ఉండి - ఇహమును (ఆవల ఉండి ఈవలను) దర్శించుచున్నట్టి యోగాభ్యాసి.

ఓ యాజ్ఞవల్క్యా! మహాత్మన్! ముఖ్యముగా తెలుసుకొని ఉండవలసినవి ఇక్కడ ఉదహరిస్తున్నాను.

**1) నవచక్రము** (9) : భూతాత్మ, ప్రేతాత్మ, జీవాత్మ, అంతరాత్మ, పరమాత్మ, నిర్మలాత్మ, శుద్ధాత్మ, జ్ఞానాత్మ, మహాత్మ.

**2) షట్ ఆధారములు**

1) దృశ్యమునకు ఆధారము - ఇంద్రియములు
2) ఇంద్రియములకు ఆధారము - ఇంద్రియార్థములు
3) ఇంద్రియార్థములకు ఆధారము - మనస్సు
4) మనస్సుకు ఆధారము - జీవాత్మ
5) జీవాత్మకు ఆధారము - పరమాత్మ (వ్యష్టి)
6) పరమాత్మ (వ్యష్టి) ఆధారము - సర్వాత్మ; సర్వాంతర్యామి

**3) త్రిలక్ష్యము :** (ఈ ఉపనిషత్‌లో చెప్పబడిన) 1) అంతర్లక్ష్యము 2) బహిర్లక్ష్యము 3) మధ్యలక్ష్యము

**4) వ్యోమపంచకము :** భూతాకాశము; పరాకాశము; మహాకాశము; సూర్యాకాశము; పరమాకాశము.

**5) సమ్యక్ :** సమ్యక్ దృష్టి కలవాడు. పైన చెప్పిన (మరియు) ఈ దృశ్యంలో గల **భిన్నత్వములో అంతర్లీనమైయున్న ఏకత్వము దర్శించువాడు.** అఖండాత్మ యొక్క స్వ-అభిన్న వినోద చమత్కారమే అయి, ఏకస్వరూపమే ఇదంతా - అను అవగాహన!

ఇవి ఎరుగుచున్నప్పుడే..., ఆతడు 'యోగి' అగుచున్నాడు. **సమ్యక్ ఏతత్ న జానాతి, సయోగీ నామతో భవేత్।** నవ చక్రములు మొదలైన పైవిషయములు తెలియనివాడు పేరుకు మాత్రమే యోగి!

## 5. పంచమ బ్రాహ్మణము - న బంధోఽస్తి । న ముక్తోఽస్తి । చిదాకాశోఽస్తి కేవలమ్।

**యాజ్ఞవల్క్య మునీంద్రుడు :** హే భగవాన్! ప్రభాకరా! ఆదిత్య మహాదేవా! 'బంధము' అనగా ఏమి? ఎవరికి?

**ఆదిత్య భగవానుడు :** పరమాత్మ నిత్యముక్తుడు. 'బంధము' అనే ప్రసక్తియే లేదు. ఈ జీవాత్మ సర్వదా పరమాత్మ స్వరూపుడు, పరమాత్మకు అభిన్నుడు కూడా కదా! కనుక జీవాత్మకు బంధము ఉన్నదనటము కూడా యుక్తి యుక్తము కాదు. అందుచేత బంధము గురించి ఈ విధముగా చెప్పబడుచున్నదో.. విను!

**స విషయమ్ మనో 'బంధాయ'** - మనస్సు సవిషయ సహితమై (విషయములతో కూడి) ఉంటే... అది **'బంధము'**

**నిర్విషయం ముక్తయో భవతి! మనస్సు విషయ రహితమై నిర్విషయమై ఉంటే.. అదియే ముక్తి!**

**అతః సర్వం చిత్తగోచరమ్.** చిత్తము (సంకల్పము) ఉంటేనే 'జగత్తు' అనబడేది గోచరము అగుచున్నది. చిత్తము లేనివానికి జగత్తే లేదు. దృశ్య విషయముల పట్ల ఇష్టము రూపమే - ఈ చిత్తము. అట్టి ఈ చిత్తము ఏ ఇంద్రియ విషయములనూ ఆశ్రయించకుండా నిశ్చలముగా, నిరాశ్రయంగా చేశామా, .. అప్పుడు క్రమంగా 'ఉన్మనీ అవస్థ (కేవల మనోరూపము) - నిర్విషయమనోస్థితి'..

పరిపక్వమవుతూ వస్తుంది. మనో ఉన్మనీ పరిపక్వతచే మనస్సు ఆత్మయందు లయించటానికి యోగ్యమగుచున్నది. భేదముతో కనిపించుచున్న ఈ దృశ్యము అభేదము-అఖండము అగు ఆత్మగా నిశ్చయ - నిశ్చలమవటమే **'మనోలయము'.**

ఓ యాజ్ఞవల్క్యా! అట్టి మనోలయమును అభ్యసించాలి. మనోలయము యొక్క పరిపూర్ణత కొరకై ఆది స్వరూపుడను, ఆదిత్య నారాయణుడను అయి, సర్వజీవులలో సాక్షిగా ఉన్న నాయందు మనస్సును, చిత్తమును ఏకాగ్రం చేస్తూ ఉండాలి. మనస్సు యొక్క లయకారకుడను, లయ స్థానము కూడా ఆదిస్వరూపుడనగు నేనే!

దేహములోని షట్ (6) చక్రస్థానములు తనయందు కలిగియున్న వెన్నెముక-అయినట్టి 'అనాహతము' నందు అనుక్షణము 'ఉ..మ్' 'శబ్దము' సుదీర్ఘమై జనించుచూ ఉన్నది. **అనాహతస్య శబ్దస్య!** ఆ శబ్దము యొక్క అంతర్గతముగా 'ధ్వని' స్ఫురణగా ప్రకటితమగుచూ ఉన్నది. **తస్య శబ్దస్య యో 'ధ్వనిః'!**

ఆ ధ్వనికి అంతర్గతముగా 'జ్యోతి' (కాంతి చైతన్యము) ఉన్నది. **ధ్వనే అంతర్గతమ్ - జ్యోతిః।**

ఆ జ్యోతికి అంతర్గతమై 'మనస్సు' ఉన్నది. **జ్యోతిః అంతర్గతో మనః।**

మనస్సు యొక్క కల్పనావిశేషమే ఈ స్వర్గ-మర్త్య-పాతాళ త్రిలోక సృష్టి! ఈ సృష్టి యొక్క ప్రారంభము, స్థితి, వ్యసనము, లయము- ఇందులోని కర్మలు, కర్మబంధములు, మనోబంధములు, మోక్షములు.. ఇవన్నీ మనస్సే.

మనస్సు లయిస్తే.... అన్నీ లయిస్తాయి. త్రిలోకములు, సత్త్వాది త్రిగుణములు, జాగ్రత్ మొదలైన అవస్థలు, త్రికాలములు, త్రిపుటి (ద్రష్ట-దర్శన-దృశ్యము) - అన్నీ కూడా **ఆత్మస్వరూపుడనైన 'నేను'** యొక్క సహజరూపమగు 'ఆత్మ' యందు లయించుతాయి.

- ఇష్టబడే **నేను**, ఇష్టము, ఇష్టమైన వస్తువు...,
- ప్రేమించే **నేను**, ప్రేమ, ప్రేమించబడేది....,
- కోపించే **నేను**, కోపము, కోపమునకు విషయము....,
- జాగ్రత్-స్వప్న-సుషుప్తులు నావైన **నేను**, జాగ్రత్ - స్వప్న - సుషుప్తులు, తదంతర్గత భావాలు....,

ఇవన్నీ మనోభావనలుగాను, మనో స్వరూపముగాను తెలియబడగలవు. మనస్సే ముల్లోకములు. మనస్సు లయిస్తే ముల్లోకాలు లేవు. మరింకేమీ లేవు. మనస్సులయిస్తే, అప్పటికీ ఏది శేషించినదై ఉంటోందో.. అదియే **విష్ణుపదము.**

ఈ విధంగా సర్వము ఆత్మస్వరూపమునకు అభిన్నంగా దర్శించబడటమే **'మనోలయము'.**

- మనోలయము పొందగా శేషించి, అనుభవమగుచున్నది - **విష్ణుపదము.**

మనస్సు యొక్క లయముచే సిద్ధించునదే - **శుద్ధ అద్వైతస్థితి.**

మనస్సు శాంతిస్తే సర్వభేదములు **తొలగుతాయి**. మరొక రకంగా చెప్పాలంటే **సర్వభేదములు అభావించబడతాయి**. (లేక) **భిన్నత్వములోని ఏకత్వమగు ఆత్మతత్త్వమే సర్వదా అనుభవ వస్తువు** (సర్వదర్శితము) అగుచున్నది.

అద్దానినే **'పరమ తత్త్వము'**.. అని కూడా అంటున్నారు. అజ్ఞాన దృష్టి-అజ్ఞాన అవగాహన - అజ్ఞాన కర్మల కారణంగా ఇప్పటివరకూ పరిరక్షించుకొంటూ వచ్చిన వ్యష్టిత్వము సమిష్టితత్త్వమునందు, సమిష్టి 'పరము' నందు (ఉప్పుగడ్డ యొక్క ఆకారము జలమునందువలె) కరిగిపోవుచున్నది. ఇక పరతత్త్వముతో మమేకత్వము సంపాదించిన ఆ మహనీయుడు ఎట్లా ఉంటాడంటావా?

**పసిబాలుడు :** అప్పుడే పుట్టిన పసిబాలునికి నాది-నీది-నా వాళ్ళు-కాని వాళ్ళు, మనకన్నా తక్కువవారు- ఎక్కువ వాళ్ళు, ఏవేవోపొందాలనే తపన, ఇవన్నీ.. ఉండవు కదా! ఆ **విష్ణు పద అధిరోహి (లేక) అద్వైత స్థాన సంస్థితుడు (లేక) పరతత్త్వ దర్శికి** భేదములే కనిపించవు. పసి బాలునివలె క్రీడా వినోదంగా కేరింతలు ప్రదర్శిస్తూ ఈ జగత్ దృశ్యమును వీక్షిస్తాడు.

**ఉన్మత్త :** ఒకే ధ్యాసలో ఉండిపోయి మిగతా ఏదీ గమనించక, గుర్తించక, మరేదీ వినని-చూడని - స్పందించనివాడే ఉన్మత్తుడు కదా! అట్లాగే పరతత్త్వ ధ్యాని అఖండమగు ఆత్మనే సర్వత్రా చూస్తూ మరింకే గుణ-రూప-సంబంధ-నామ-జాతి భేదములను లెక్కలోకి తీసుకోడు. అందుకే **'ఉన్మత్తుని వలె'...** అని చెప్పబడుతోంది.

**పిశాచవత్ :** పిశాచము పట్టినవాడు వర్తమానాన్ని వదలి ఎవరో మరొక వ్యక్తివలె సంభాషించు విధంగా, పరతత్త్వజ్ఞుడు తన వ్యష్టిత్వమును వదలి'...., అఖండము - సర్వగతము- సర్వమునకు అతీతము అగు కేవలీ తత్త్వము నందు సంస్థితుడై ఉంటాడు. అందుచేతనే 'పిశాచవత్' అని కూడా వర్ణించబడుచున్నాడు.

**జడవృత్యా :** ప్రపంచములో అనేక విలువైనవి, గొప్పవి అనుకొనే సంపద-ఆపద, స్వజనులు- పరజనులు, స్వజాతి-పరజాతి, స్వమత-పరమతమువారు.. ఇటువంటి విషయాన్ని ఆ ఆత్మజ్ఞుడు-మొదలే లేనట్టిది, కల్పితము, అవాస్తవము అగు విషయాలుగా చూస్తూ ఉంటాడు. అట్టివాటిలోని భేదదృష్టులను, అధిక -అల్పభావములను తిరస్కరించినవాడై ఉంటాడు. అందుచేత లౌకిక దృష్టి, భేదదృష్టి కలవారికి ఆతడు జడునివలెనూ, తెలివి తక్కువ వాడివలెనూ అనిపిస్తూ ఉంటాడు.

ఓ యాజ్ఞవల్క్యా! మనము ఇప్పుడు చెప్పుకున్నవన్నీ అమనస్కము యొక్క అభ్యాస చిహ్నములేనయ్యా! అయితే అమనస్కుని బాహ్య లక్షణములతో నిర్వచించలేము. అది అంతరంగ - బుద్ధి సంబంధిత పరాకాష్ఠ స్థితి!

అమనస్కుడు ఎల్లప్పుడూ ఏ ప్రాపంచిక విషయము, సందర్భము మొదలైన వాటితో సంబంధము లేకుండా **'నిత్య తృప్తుడు'** అయి ఉంటాడు. **సర్వమూ తానే అయి, సర్వమునకు సంబంధించనివాడై ఉంటాడు**. ఆతడు ఉద్వేగరహితుడై 'సమమ్ సర్వేషు భూతేషు తిష్ఠన్తమ్ పరమేశ్వరమ్'.. భావనను ఆశ్రయించుచుండుటచే, ఆతనిపట్ల ప్రాణశక్తి దేహమంతా స్వభావంగా సమత్వము పొందినదై ఉంటుంది. ఆతని నిత్య తృప్తి-ప్రాణశక్తి సమత్వములచేత (సమానప్రాణ ప్రభావము)..

- అల్పమైన మూత్ర-పురీషములు (విసర్జనములు) కలిగి ఉండటము,
- మితాహారముచే దేహము శక్తి పొందుచూ ఉండటము,
- మనో ధైర్యము, దార్ఢ్యములు,
- దేహాంగములు ఉత్సాహపూరితంగాను, సంతోషముతో కూడిన ఆరోగ్యము కలిగి ఉండటము,
- జాడ్యముతో కూడిన గాఢనిద్రకు బద్ధుడు కాకుండటము,
- దేహములోని ప్రాణవాయు చలనమును స్వభావంగానే ఆతనిచే **'స్వభావ కుంభకము'**గా నిరోధించబడటము,
- భావములు ఎందులోంచి వస్తున్నాయో అట్టి ఆత్మస్థాన సందర్శనము..,

ఇవన్నీ స్వభావ సిద్ధమగుచున్నాయి. భావములకు ఆవల బ్రహ్మము. ఆ ఆత్మజ్ఞాని భావములను దాటివేసి 'బ్రహ్మము'ను దర్శిస్తూ ఉంటాడు. ఇతరులకు 'ఇది' అని తెలియరాని 'సుఖ స్వరూపస్థితి'ని పొందినవాడై ఉంటాడు. 'మనస్సు' ను జగన్నాటకంలోని దృశ్య విశేషంగా దర్శిస్తూ, తాను సర్వదా వేరై, పరమై ఉంటూ ఉంటాడు.

ఈ విధంగా స్వస్వరూప అఖండ పరమాత్మతత్త్వ దర్శనుడై **'అహమేవ బ్రహ్మమ్'** భావనయందు ప్రశాంతస్థితి పొందినవాడగుచున్నాడు. అట్టి **సోఽహమ్-తత్త్వమ్-త్వమేవాఽహమ్, త్వమ్-అహమేవ** గూఢార్థము ఎరిగి, పవిత్ర ఆత్మను ఎరిగినవాడై.. **'బ్రహ్మామృత పారాయణుడు'** అయి ఉంటున్నాడు.

- ఆతడే **సన్న్యాసి!**
- ఆతడే **పరమహంస!**
- ఆతడే **అవధూత!**

అట్టి ఆత్మస్వరూపము సిద్ధించుకొని **"అద్వితీయాత్మా సోఽహమ్ - నేనే!"** అని సిద్ధించుకొన్నవాడు. **సమస్తము తానై, సర్వమునకు వేరై వ్యష్టి-అతీత ఆత్మ సుఖభావమును అనుభవించుచూ..** ఈ భూమిపై సంచరిస్తూ ఉంటే భూమి పులకించుచున్నది.

ఆయనను చూచినంత మాత్రము చేతనే జనులు పునీతులు, పవిత్రులు అయి, వారివారి మనోబుద్ధులు నిర్మలము కాగలవు.

ఆతనిని సేవించువారు (శిష్యులు), భక్తులు మొదలైనవారు కూడా ముక్తులగుచున్నారు. **తత్ సేవాపరః ముక్తోభవతి.** వారంతా **అజ్ఞోఽపి ముక్తో భవతి।** అజ్ఞానులు కూడా ముక్తిని పొందుచున్నారు. ఇక జ్ఞానులు వారిని దర్శిస్తే.., వేరే చెప్పేదేమున్నది?

ఆతని వలన 10 వంశీయులు తరించుచున్నారు. ఆతని తల్లి, తండ్రి, భార్య సంతానము కూడా ముక్తులగుచున్నారు.

*ఇతి మండల బ్రాహ్మణోపనిషత్*

*ఓం శాంతిః! శాంతిః! శాంతిః!*

----


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 13 మంత్రికోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ స్వా అవిద్యా ద్వయ తత్కార్య అపహ్నమ్ అజ్ఞానభాస్కరమ్,**
**మన్త్రికోపనిషత్ వేద్యం రామ చన్ద్రమ్ అహమ్ భజే ॥**

*నాయొక్క (జీవ-ఈశ్వరరూప) అవిద్యాద్వయమును, వాటివాటి కార్యపరంపరలను మొదలంట్లా పెకలించుచూ, అజ్ఞానాంధకారమును తొలగించి , అధిగమింపజేసి, ఆత్మను ప్రకాశమానము చేయు సూర్య తేజో రూపమగు ఈ* "**మన్త్రికోపనిషత్**" *చెప్పు "ఆత్మారామోఽహమ్" నకు నమస్కరించుచున్నాను.*

**1. హరిః ఓం॥**
**అష్టపాదం, శుచిం, హంసం త్రిసూత్రమ్**
**అణుమ్, అవ్యయమ్,**
**త్రివర్త్మానమ్ తేజసోఽహమ్ సర్వతః పశ్యన్,**
**న పశ్యతి ।**

ఓంకార స్వరూపుడగు శ్రీహరికి నమోవాక్కములు.

'అహమ్' అను చైతన్యము **ఎనిమిది పాదములు** కలిగినట్టిది. అత్యంత శుచి అయినది. **మూడు సూత్రములు** కలది. అణురూపమైనది. అవ్యయమైనది.

**మూడు తీరులైన వర్తనములు** కలిగినది అయినట్టి "అహమ్" తన తేజస్సుతో సర్వదేహముల లోనూ వెలుగొందుచున్నది. ఆ హంస అంతటా చూస్తూ ఉన్నది. కానీ తాను మాత్రం ఎవ్వరికీ కనబడుటలేదు. చూడనిదిగానే ఉంటోంది కూడా!

---

**2. భూత సమ్మోహనే కాలే భిన్నే**
**తమసి వైఖరే,**
**అతః పశ్యన్తి సత్వస్థా, నిర్గుణమ్ గుణ గహ్వరే!**

జీవులపట్ల సంమోహన జనకమైన కాలమును జీవుడు దాటివేయగా, తమస్సు (అజ్ఞానము) ప్రక్కకు జరుగగా, అప్పుడు సత్వగుణమునందు స్థితి పొందినవాడై ఈ జీవుడు గుణములకు ఆవల గల నిర్గుణతత్త్వము అగు 'హంస'ను దర్శించగలడు. ఆతనికి ద్యోతకము కాగలదు. గుణములకు అంతరాంతరంగా, ఆధారముగా, జనన స్థానముగా ఉండి, ఈ సర్వమునకు ఆధారమై 'హంస' ప్రకాశించుచున్నది.

---

**3. అశక్యః సో అన్యథా ద్రష్టుమ్**
**ధ్యాయమానః కుమారకైః**
**వికార జననీమ్, అజ్ఞామ్,**
**అష్టరూపామ్ అజాం ధృవామ్॥**

కౌమారులు (చిన్నవారు) వంటి జీవులు అపరిపక్వమైన బుద్ధితో (గుణములకు పరిమితమైనటువంటి అవగాహనతో) ఎంతగా ధ్యానించినప్పటికీ నిర్గుణతత్త్వమగు (హంసతత్త్వమగు) ఆత్మను సందర్శించ లేరు.

సాంసారిక బుద్ధి కొనసాగునంత వరకూ-వికారములకు తల్లి వంటిది, అజ్ఞానముతో కూడుకొని ఉన్నట్టిది, "8" రూపములతో కూడుకొన్నది అగు - "**మాయ**"యే ధృవముగా దర్శించబడుచూ, ధ్యానింప బడుచున్నది. ధ్యాస సంసారమునకే (లేక) మాయకే (లేక) కల్పనకే పరిమితమగుచున్నది.

| | |
|---|---|
| **4. ధ్యాయతే అధ్యాసితా తేన,<br>తస్యతే ప్రేర్యతే పునః।<br>సూయతే 'పురుషార్థం' చ<br>తేన ఏవ అధిష్ఠితం జగత్॥** | దృశ్యముయొక్క అధ్యాసచే దృశ్యమే లభిస్తోంది. దృశ్యవ్యవహారములచే ఆతడు మరల మరల ప్రేరణ పొందుచున్నవాడై, పురుషార్థములకు పరిమితుడు అగుచు, వాటినే పొందుచున్నాడు. పరమ సత్యమగు ఆత్మను కాదు. అట్టి మాయచేతనే ఈ జగత్తు అధిష్ఠించబడియున్నది (మాయయే ఈ జగత్తుకు మూలపదార్థము అగుచున్నది). |
| **5. గౌరవా, ఆది-అన్తవతీ, సా జనిత్రీ, భూతభావినీ,<br>సితా - అసితా చ రక్తాచ, సర్వకామదుఘా విభోః॥** | ఈ సంసారము ఎట్టిది? సహజము కానిది. గౌరవమైనది (భారమైనది). ఆది-అంతములతో కూడుకొని ఉన్నట్టిది. దేహపరంపరలను జనింపజేయునది. దేహభావములను ఆశ్రయించి ఉండునది. తెల్లని-నల్లని-ఎర్రనిది (సత్త్వ తమో రజో గుణములు కలది). **అనేక** కోరికల సమూహవిభవములను తనకు విభువగు ఆత్మకే ఆపాదించునది. |
| **6. పిబన్తి యే నామ విషయామ్<br>అవిజ్ఞాతామ్ కుమారకాః<br>ఏకస్తు పిబతే దేవః<br>స్వచ్ఛన్దో అత్ర వశానుగః॥** | చిన్న పిల్లలు (కౌమారులు) వంటి అజ్ఞానాశ్రయులు అవిషయములైనవాటిని విషయములుగా-సత్యాసత్యములు తెలియనివారై (అవిజ్ఞాతులై) ఆస్వాదించుచున్నారు. వీటిని అధిగమించిన దృష్టిగల ఆత్మజ్ఞాని (విజ్ఞాత) మాత్రమే అనేక విషయములలో ఏకస్థుడై యున్న ఆత్మదేవుని ఎరిగి, విషయములను నిజముగా ఆస్వాదించగలుగు చున్నాడు. అజ్ఞుడో-విషయములచే బాధించబడుచున్నాడు. బద్ధుడగుచున్నాడు |
| **7. ధ్యాన క్రియాభ్యాం భగవాన్<br>భుంక్తే అసౌ ప్రహసన్ విభుః<br>సర్వసాధారణీం దోగ్ధ్రీమ్<br>పీయమానాంతు యజ్వభిః॥** | ధ్యాన క్రియలచే పరమాత్మ తత్త్వమును ఎరిగినవాడు స్వయమ్ భగవానుడై పక పక నవ్వుకొనుచూ, **"వీటి నియామకుడను నేనే కదా!"** - అని ఎరిగి ఆస్వాదిస్తూ ఆనందిస్తున్నాడు. సర్వసాధారణము అగు ఆత్మను యజ్ఞభావి అయి ఎరిగి, తనకు అనుభవము అగు ఈ దృశ్యమును **తాను త్రాణి ఆస్వాదించు పానీయము వంటిదిగా** భావించి ఆస్వాదిస్తున్నాడు. |
| **8. పశ్యతి అస్యాం మహాత్మానః<br>సుపర్ణం పిప్పలాశనమ్,<br>ఉదాసీనం ధ్రువం హంసమ్<br>స్నాతకా ఆధ్వర్యవో జగుః॥** | మహాత్ములగు కొందరు ఈ దృశ్యమును జీవ-బ్రహ్మతత్త్వముల చమత్కారముగా, పిప్పల (పక్షియొక్క) రెండు రెక్కలుగా, పిప్పలాశనముగా చూస్తున్నారు. మరి కొందరు (ఆత్మను) ఉదాసీనము ధ్రువము అగు హంసగా దర్శిస్తున్నారు. ఇది స్నాతక ఆధ్వర్యువులు చెప్పురీతి! పరమాత్మను శాశ్వతమైన వస్తువుగాను, జీవుడు పరమాత్మ యొక్క అంశగా కించిత్ కాలము కనిపించునదిగాను చెప్పుచున్నారు. |
| **9. శంసంతమ్ అనుశంసంతి<br>బహ్వృచాః శాస్త్ర కోవిదాః<br>రథంతరం బృహత్ సామ<br>సప్తవైద్రైస్తు గీయతే॥** | శాస్త్రకోవిదులగు వారు ఆత్మగురించి బృహత్ ఋచమ్ - మహత్తరమగు సత్యము - అని గానం చేస్తున్నారు.<br>**'రథంతరము'** అనే బృహత్ (అతి పెద్ద) సామగానము **సప్త స్వరములతో ఆత్మ తత్త్వమును గానము** చేయుచున్నది. |
| **10. మంత్రోపనిషదమ్,<br>బ్రహ్మపదక్రమ సమన్వితమ్,<br>పఠంతి భార్గవా హి ఏతే హి అథర్వాణో, భృగూత్తమాః॥** | భార్గవులు, అథర్వణులు భృగూత్తములు - వీరేమో **మంత్ర - ఉపనిషదములతో కూడిన పదజాలముతో** బ్రహ్మపదము గురించి మంత్రోచ్ఛారణా పూర్వకముగా వర్ణించి చెప్పుకొస్తున్నారు. |
| **11. స బ్రహ్మచారి వృత్తిచ్ఛ<br>స్తంభో అథ ఫలితః తథా,<br>అనడ్వాన్ రోహితా ఉచ్ఛిష్టః<br>పశ్యంతో బహు విస్తరమ్ ॥** | హంస - "బ్రహ్మచారియొక్క వృత్తాలు కలిగియున్నదై, స్తంభమువలె కదలకుండా ఉన్నట్టిదై అనేక - ఫలితములు కలుగజేస్తూ ఉన్నట్టిది. ఎర్రటి అతిదీర్ఘము అయిన (పొడవైన) శరీరముగల ఎద్దువలె బహువిస్తారమై యున్నది" - అని విజ్ఞులు గుర్తుగా చెప్పుచున్నారు. |
| **12. కాలః ప్రాణశ్చ భగవాన్ మన్యుః శర్వో మహేశ్వరః<br>ఉగ్రో భవశ్చ రుద్రశ్చ ససురః సా అసురః తథా॥** | ఆ పరమాత్మ అథర్వణవేద మంత్రములచే, ఇతర వేదములచే, తదితర ప్రాజ్ఞులచే - "కాల స్వరూపుడు, ప్రాణేశ్వరుడు, భగవంతుడు, మన్యువు, శర్వుడు, మహేశ్వరుడు, ఉగ్రుడు, భవుడు, రుద్రుడు, సురుల స్వరూపుడు, అసురుల స్వరూపుడు, ప్రజాపతి, విరాట్టు, పురుషుడు, జలము (జలస్వరూపము), పరమాత్మ అని సంస్తుతించ బడుచున్నారు. ఆ స్తుతులచే విభువు అగు పరమాత్మయే తెలియజేయబడుచున్నారు. |

| | |
|---|---|
| **13.** ప్రజాపతిః, విరాట్ చ ఏవ పురుషః సలిలమేవచ<br>స్తూయతే మంత్ర సంస్తుత్యైః (ర)అథర్వవిదితైః విభుః।<br>**14.** తం షడ్వింశక (26), ఇత్యేతే, సప్తవింశం(27) తథా అపరే<br>పురుషం నిర్గుణం సాంఖ్యమ్ అథర్వశిరసో విధుః॥ | "ఆ ప్రభువు (విభువు) 26 పదార్థములతో కూడి ఉన్నారు" - అని కొందరు వర్ణిస్తున్నారు. మరి కొందరేమో 27 విశేషముల (పదార్థముల) కలయిక అని చెప్పుచున్నారు. అథర్వశిరోవేత్తలు ..... ఆయన నిర్గుణుడని, సాంఖ్యుడని ఎరిగి, గానము చేయుచున్నారు. |
| **15.** చతుర్వింశతి(24) సంఖ్యాతమ్, వ్యక్తమ్, అవ్యక్తమేవ చ<br>అద్వైతం ద్వైతమ్ ఇతి ఆహుః త్రిధా తం పఞ్చధా తథా॥ | ఆ పరతత్త్వ స్వరూపుడగు **ఆత్మపురుషుడు** 24 సంఖ్యలతో కూడుకొనిన వారని, వ్యక్త-అవ్యక్త స్వరూపుడు కూడా అయి ఉన్నవారని, అద్వైతమని-ద్వైతమని మూడు విధములుగా ఐదు విధములుగా కూడా ప్రదర్శనమగుచున్నారని కొందరు చెప్పుచూ ఉన్నారు. |
| **16.** బ్రహ్మాద్యం స్థావరాన్తం చ పశ్యన్తి జ్ఞాన చక్షుషః<br>తమ్ ఏకమేవ పశ్యంతి పరిశుభ్రం విభుం ద్విజాః॥ | జ్ఞాన చక్షువులతో ఆత్మజ్ఞులు ఆ పరమాత్మను - **బ్రహ్మదేవుని నుండి** స్థావరము వరకు **ఏకస్వరూపుడే** అయి ఉన్నట్లుగా దర్శిస్తున్నారు. పరిశుభ్రుడుగా, సర్వనియామకుడగు విభువుగా ఆయనను మాత్రమే సర్వే సర్వత్రా ద్విజులు సందర్శిస్తున్నారు. 'ఆయనకు అన్యమైనది లేదు' (అనన్యుడు) అని అభివర్ణిస్తున్నారు. |
| **17.** యస్మిన్ సర్వమ్ ఇదమ్ ప్రోతమ్<br>బ్రహ్మః స్థావర-జంగమమ్<br>తస్మిన్ ఏవ లయం యాతి<br>స్రవన్త్యః సాగరే యథా॥ | పరమాత్మయందు (బ్రహ్మమునందు) ఈ ఎదురుగా కనిపిస్తున్న స్థావర జంగాత్మకమైనదంతా గ్రుచ్చబడినదైయున్నది. నదులన్నీ పోయిపోయి సముద్రమునందు కలుస్తున్న తీరుగా (నదీనామ్ సాగరో గతిః), ఈ కనబడేదంతా బ్రహ్మమునుండే బయల్వెడలి, బ్రహ్మమునందే కనిపిస్తూ, బ్రహ్మములోనే లయించుచున్నది. **బ్రహ్మమే** అయి ఉన్నది. **అంతా సర్వదా బ్రహ్మమే!** |
| **18.** యస్మిన్ భావాః ప్రలీయన్తే<br>లీనాశ్చ అవ్యక్తతాం యయుః<br>పశ్యన్తి వ్యక్తతాం భూయో<br>జాయన్తే బుద్బుదా ఇవ॥ | బ్రహ్మదేవుని నుండి స్థావరము వరకు (ఆ బ్రహ్మ స్థావర పర్యన్తమ్) ఈ స్థావర జంగమాత్మక జగత్తంతా ఆపరమాత్మయందు భావనా రూపముగా జనించి, వ్యక్తమై, భావనగానే ఉన్నదై (ఆ బ్రహ్మమునందే), ఒకప్పుడు అభావనత్వము పొంది లయించుచున్నది. మరల మరొకప్పుడు భావరూపంగా పునర్వ్యక్తమగుచున్నది. ఏవిధంగా అయితే జలమునందు బుడగ జనించి, జలములోనే సంచరించుచు, జలమునందే లయించు చున్నదో అట్లాగే, ఇదంతా బ్రహ్మమునుండే బయల్వెడలి, బ్రహ్మమునందే చరిస్తూ బ్రహ్మమునందే లయిస్తోంది. |
| **19.** క్షేత్రజ్ఞ అధిష్ఠితం చ ఏవ, కారణైః విద్యతే పునః<br>ఏవం స భగవాన్ దేవం, పశ్యన్తి అన్తే పునః పునః॥ | ఆ పరమాత్మ క్షేత్రజ్ఞత్వము ను అధిష్ఠించి, కార్యకారణ కర్తృత్వాలు స్వీకరించి, సర్వమును (లీలగా) కల్పించుకొని, మరల మరొకప్పుడు క్షేత్రజ్ఞ-కార్యకారణ కర్తృత్వాలను తనయందే లయింపజేసుకుంటున్నారు. మరొకప్పుడు పునరావిర్భావము చేయుచున్నారు - అని జ్ఞానులు దర్శిస్తున్నారు. వారు ఆ తీరుగా దర్శిస్తున్నది, "**శృణ్వంతి విశ్వే**" ... అని గానము చేయుచున్నారు. |
| **20.** బ్రహ్మ బ్రహ్మేఽ తి యథా యాన్తి యే విదుః బ్రాహ్మణాః తథా,<br>అత్రైవ తే లయం యాన్తి, లీనాశ్చ అవ్యక్తశాలినః।<br>లీనాశ్చా అవ్యక్త శాలినః॥<br>ఇతి మన్త్రికోపనిషత్॥<br>ఓం శాంతిః శాంతిః శాంతిః॥ | **జగత్తు లేదు. బ్రహ్మమే ఉన్నది.** బ్రహ్మమును జగత్తుగా కాకుండా బ్రహ్మముగా ఎరుగు బ్రాహ్మణులు బ్రహ్మమునే పొందుచున్నారు. బ్రహ్మమునందే అవ్యక్త స్వరూపులై బ్రహ్మమునందే లీనము-లయము అగుచున్నారు. జగత్తుగా వ్యక్తము కానివారై అవ్యక్తమునందే లీనమై ఉంటున్నారు. తామే బ్రహ్మమై ఉంటున్నారు.<br>**ఇతి మంత్రికోపనిషత్**<br>**ఓం శాంతిః శాంతిః శాంతిః** |


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 13 మంత్రికోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



ఓంకార స్వరూపుడగు శ్రీహరికి సద్గురు-సత్‌భావనా పూర్వక నమస్కారము. త్రిప్రదక్షిణ పూర్వక సాష్టాంగదండ ప్రణామములు సమర్పిస్తూ....

సో౽హమ్ → సో + అహమ్ → అహమ్ సయేవ → హమ్‌స. **"హంస"**।

సో౽హమ్ తత్త్వము (లేక) పరమాత్మ - పరబ్రహ్మము అను "**ఉపనిషత్ వాచక సారాంశ తత్త్వము**" గురించి ఇప్పుడు మనము చెప్పుకుంటున్నాము. అనిర్వచనీయమగు ఆత్మగురించి నిర్వచనము చేసుకుంటున్నాము. మాటలకు - భావాలకు అందని స్వస్వరూప కేవలాత్మానందము గురించి కొన్ని మాటలు వివరించుకుంటున్నాము.

⌘

**ఆ "హంస" రూప పరబ్రహ్మము ....ను ఆత్మతత్త్వవేత్తలు ఏరీతిగా చూస్తున్నారు?**

*8 పాదములు కలిగి ఉన్నట్టిదిగాను....,*

(1. దృశ్యము 2. ద్రష్ట; 3. మనో 4. బుద్ధి 5. చిత్త 6. అహంకారములు; 7. జీవాత్మ-ఈశ్వరుడు. జీవుడు = ఒక దేహమును ఉపాధిగా కలిగియున్న **నేను!** 8. ఈశ్వరుడు = అనేక దేహపరంపరలను కలిగి ఉండి **"మాయ"** ను ఉపాధిగా కలిగి ఉన్న **నేను**)

**శుచిమ్ :** ఆ హంస (సో౽హమ్ స)... అనబడు ఆత్మ **పరమశుచి** అయినది. ఈ దృశ్య దేహ-మనో-బుద్ధి-చిత్త-అహంకార-జన్మ-కర్మల దోషాలు అద్దానిని స్పృశించవు. **"ఆభరణము ధరించినవాడు ఎట్టివాడు? మంచివాడా? కాదా?"** ... అనుదానితో ఆ ఆభరణములోని బంగారమునకు ఏమి సంబంధము? ఆభరణము ధరించువాని సుగుణ-దుర్గుణములు ఆభరణమునకు అంటవుకదా! ఆత్మకు ఏ దోషము అంటదు. అది సర్వదా శుచివస్తువే! ఆత్మ త్రిగుణములకు ఆధారము కావచ్చుగాక! త్రిగుణసంబంధమైనదే కాదు!

**త్రిసూత్రమ్ :** దృశ్యము-జీవుడు-ఈశ్వరుడు అనునది ఆ బ్రహ్మమును అలంకరించు త్రిసూత్రములు. అట్లాగే, సత్త్వ-రజో-తమో గుణములు కూడా అద్దానిని అలంకరించి ఉండేవే! దృశ్యము-ద్రష్ట-దృక్‌లు కూడా ఆ ఆత్మచే ధరించబడే త్రిసూత్రములే! దృశ్యజగత్తు-ద్రష్ట-ఆత్మ ... అనునవి ఆ "హంస" యొక్క చమత్కార ఆపాదిత విన్యాసములు.

**అణుమ్ :** ఈ దృశ్యము-దేహము-మనో-బుద్ధి-చిత్త అహంకారములకంటే కూడా "హంస" (ఆత్మ) అత్యంత సూక్ష్మము. అందుచేత కవులు అద్దానిని "**అణువు వంటిది**" అని అంటున్నారు. వస్తువు అణువులతో తయారవుతుంది. వస్తువు స్థూలము. అణువు సూక్ష్మము. ఇదంతా ఆత్మ అను అణు నిర్మితమే! ఆత్మ పరమాణువుకు కూడా అణువు!

**అవ్యయమ్ :** ఈ దృశ్యములో కనిపించేవన్నీ జనించి - వ్యయము అయిపోతూ ఉంటాయి. "హంస"యో? వ్యయము పొందదు. మార్పు-చేర్పులు ఉండవు. అందుచేత ***ఆత్మ అవ్యయము!***

**త్రివర్మానమ్ :** ఆ హంస (ఆత్మ) ... జాగ్రత్ - స్వప్న - సుషుప్తులనబడే మూడు వీధులలోను (మూడు మార్గములలో) మూడు నడకలతో వర్తిస్తూ ఉంటుంది. కనుక త్రివర్మానము. ఈ జాగ్రత్-స్వప్న-సుషుప్తులు ఆత్మయొక్క వ్యక్తీకరణము. తాను అవ్యక్తమై ఈ సర్వము వ్యక్తీకరించుచున్నది.

**అహమ్ తేజసో :** ఆ పరమహంస-ప్రతి దేహములోను **'నేను'** అనే తేజస్సుతో-ప్రకాశమానమై ఉన్నది.

అట్టి హంస అనబడు ఆత్మ ఏమి చేస్తూ ఉన్నది?

- ఈ దృశ్యమును, దేహమును, మనో-బుద్ధి-చిత్త అహంకారములను, జీవాత్మను, అవ్యక్తమును, ఈశ్వరుని ... అన్నీ **మౌనముగా, అతీతముగా, ఆనందముగా, క్రీడావినోదముగా** చూస్తూ ఉన్నది. **సర్వతఃపశ్యన్!** సర్వమునకు ఆధారమగుచూనే, అకారణుడై, అతీతుడై, కేవల సాక్షి అయి, చిద్విలాసుడై, కేవలుడై ఉంటున్నది.
- తాను మాత్రము ఎవ్వరికీ కంటికి అగుపించటము లేదు. **న పశ్యతి!**

## హంస సందర్శనము

పోనీ... ఆ హంస ఈ జీవునకు వేరుగా ఎక్కడో ఉన్నదా? లేదు. జీవునికి (ద్రష్టకు) దృశ్యములోని ఈ దేహముతో సహా, మనోబుద్ధి చిత్త అహంకారములతోసహా - బాహ్య, అంతరంగ చతుష్టయ సర్వ విశేషములకంటే కూడా ఎంతో సమీపములో ఉన్నది. **"ఎంత సమీపము?"** - అని అంటే, "**ఈ జీవుడు హంస స్వరూపుడే!**" ...... అనునంతగా!

మరి ఈ జీవుడు బాహ్యవస్తువు అయినట్టి దృశ్యమును చూస్తున్నాడు,తెలుసుకుంటున్నాడే గాని, స్వస్వరూపమగు **హంస**ను గమనించటము లేదేమి? ఎందుకంటే, ఈ పాంచ భౌతిక జగత్తును చూచి "సమ్మోహనము" పొంది ఉండటముచేత! ఈ దృశ్యమంతా కాలముతో జనించి కాలముతో లయిస్తోంది. కాలమునందే జాగ్రత్-స్వప్న-సుషుప్తి-దేహ పతనానంతర-పునర్జన్మలు కూడా అంతర్గతమై ఉన్నాయి. అటువంటి భూత సమ్మోహితము (Illusioned by seeing matter relatedness) తో కూడిన కాలము (Time Factor) అనే తెరను ఖండిస్తే, అప్పుడు **"దృశ్య సంబంధితుడను"** ... అనే చీకటి తొలగుతుంది. **భూత సమ్మోహనే కాలే భిన్నే, తమసి వైఖరే!**

ఎప్పుడైతే, కాలము-కాలాంతర్గత పంచభూత దృశ్యములు - కాలాంతర్గత త్రి అవస్థలు (జాగ్రత్-స్వప్న-సుషుప్తులు) ... అనే విశేషములన్నీ అధిగమించిన దృష్టిని, అవగాహనను ఈ జీవుడు సముపార్జించుకుంటాడో,... అప్పుడు, ....

**అతః పశ్యన్తి సత్వస్థా నిర్గుణమ్ గుణగహ్వరే!** త్రిగుణములనే గుహలోపల (ఆవల) సర్వదా సత్ స్వరూపమై, చిత్ చైతన్యమై, ఆనందమయమై వెలుగొందుచున్న "హంస" (సోఽహమ్ - స్వకీయ చైతన్య పరతత్త్వము)ను ఈ జీవుడు దర్శించగలడు. "**నేనే అదికదా!**" **అని జ్ఞానదృష్టి** (Common Sense) చే గమనించగలడు.

## త్రిగుణాత్మక దృష్టి

కౌమారదశలో ఉన్న (చిన్న పిల్లవాని వంటి) ఈ జీవుడు అపరిపక్వమైన (Immatured) బుద్ధి కారణంగా సత్త్వ-రజో-తమో త్రిగుణ దృష్టికి పరిమితుడు అగుచున్నాడు. **"ఈ దృశ్యములో నేను ఇంకా ఏమి పొందాలి? ఎట్లా పొందాలి?"**.... అనే త్రిగుణాత్మకమైన ధ్యాస-ఆశయములతో (లేక) అవగాహనలతో ఎంతగా ధ్యానించినప్పటికీ,... త్రిగుణములకు కూడా ఆధారమైన హంస (ఆత్మ) అనుభవముగా లభించదు. సాంసారికమైన దృశ్య విషయరూప బుద్ధి కొనసాగుచున్నంతవరకు అజ్ఞానము కొనసాగుచూనే ఉంటుంది.

**అజ్ఞానమే...., మాయ! అజ్ఞానమే దృశ్యపరిమితానుభవము.**

**అజ్ఞానమే అనేక వికారములకు తల్లి!** మాయనే ధృవముగా ధ్యానిస్తూ..., మాయలో వెతికితే, మాయయే ఆశయముగా అగుచున్నది. మాయా ప్రయోజనములే సిద్ధిస్తున్నాయి. **స్వప్నములో స్వప్నద్రష్ట అగుపించనట్లుగానే, ఈ మాయా కల్పితమగు జగత్తులో ఆత్మను వెతికి ఏమి లాభం? లాభం లేదు!**

**అట్టి మాయయొక్క 8 రూపములు**

(-శబ్ద స్పర్శ రూప రస గంధ విషయములు - మననము, ధ్యాస, ఆశ).

దృశ్యాంతర్గతమైనటువంటి ధ్యాస - ఆశయములు, ధ్యేయము కలవాడగు ఈ జీవుడు - దృశ్య వ్యవహారములచేత మరల - మరల ప్రేరణ పొందుచున్నాడు. అప్పుడిక చతుర్విధ (ధర్మ-అర్థ-కామ-మోక్షములకు) పరిమితుడై, వాటికై ప్రయత్నించుచూ, వాటినే పొందటము, కోల్పోవడము కూడా చేయుచున్నాడు. ఫలితం? **నిత్యసత్యము, పరము, నిత్యముక్తము అగు "హంస (ఆత్మ)" తత్త్వము వైపుగా దృష్టిని తగినంతగా సారించటము లేదు**. అట్టి దృశ్యపరిమితమైన దృష్టియే "మాయ".

అట్టి మాయ చేతనే -- **తేనఏవ అధిష్ఠితాం జగత్** - ఈ జగత్తు అధిష్ఠితిమైయున్నది. మాయయే ఈ సర్వ **అన్య భావనా** స్వరూపమగు జగదనుభవమునకు మూల పదార్థము. వాస్తవానికి జగత్తు ఆత్మస్వరూపమే! ఆత్మాధిష్ఠితమే!

**ఇంద్రియ జగత్ దృశ్యానుభవముల రూపమగు సంసారము ఎట్టిది?**

**గౌరవాత్** → అత్యంత ఘనీభూతమై, భారమై, "దాటలేమేమో" అను రూపముగా ఈ జీవునికి ఎదురుగా కల్పితముగా ప్రదర్శితమగుచున్నట్టిది. భౌతికంగా కనిపిస్తూ ఆకట్టుకొంటూ ఉన్నది. ఆత్మను ఏమరపింపజేస్తోంది. సత్యమును మరుగు పరుస్తోంది.

**ఆద్యన్తవతీ** → ఈ శరీరము-సంబంధములు-అనుబంధములు-బాంధవ్యములు-జాతి మత కుల భేదాలు - సంపదలు - ఆపదలు... ఇవన్నీ సుదీర్ఘము .... శాశ్వతము - సత్యము అని అనిపిస్తూ ఉంటాయి. ఇందులో విషయములను కొంచెము సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే.... ప్రతి ఒక్కటీ కూడా ఒకప్పటి కల్పనచే ప్రారంభమై, మరొకప్పటి తొలగిపోయేవే! ఇక్కడ "ఎల్లప్పటికీ ఇట్లే ఉంటాయి" అనునది ఒక్కటి కూడా లేదు. ఇదంతా ఆది-అంతము కలిగి ఉన్నట్టిది. ఆలోచన యొక్క 'ఆది-అంతము' - రూపమైనట్టిది.

**సా జనిత్రీ** → ఒక్క విషయం ఆశ్రయిస్తే చాలు, దానితోబాటే అనేక వికారాలు చిలవలు-పలువలుగా జనించి వెంటనంటినవై ఉంటాయి.

**భూతభావనీ** → ఇక్కడ సిద్ధించే భూతభావనానుభవములు, వాటితో ఏర్పడే సంబంధ-బాంధవ్యములూ... ఇవన్నీ కూడా "**భావన**" చే ఏర్పడుచున్నవే! నామ-రూపములు, తత్సంబంధితములు... ఇవన్నీ భావన చేస్తేనే ఉంటాయి. లేకుంటే,... ఉండవు. అట్టి భావనయే స్వప్నము వంటి - "నేను-నీవు-వారు-వీరు"... మొదలైనదంతా కల్పిస్తోంది.

**సితా-అసితాచ-రక్తాచ :** తెల్లని (సత్వగుణము), నల్లని (తమోగుణము), ఎరుపు (రజోగుణము) లతో కూడుకొని, మిశ్రమమై కనిపించుచున్నది.

**సర్వకామ దుఘావిభోః:** ఈ సంసారము అనేక కోరికల పరంపరలచే నిర్మితమై యున్నట్టిది. కోరికలకు అంతేమున్నది? ఒకటి తీరితే మరొకటి చోటుచేసుకుంటూ ఉంటుంది. తీరని కోరికలు దుఃఖము, ఆదుర్దాలను కలుగజేస్తూ పోతూ ఉంటాయి. **"ఏమో! రేపు ఎట్లా ఉంటుందో? మరి ఏం చేయాలి? ఏమికానున్నది? ఎట్లా?"** మొదలైన ఉద్వేగములతో నిండిపోయి ఈ సంసారానుభవము ఏర్పడి ఉంటోంది.

ఏమీ తెలియని "అమాయకబాలుడు" వంటి ఈ జీవుడు.....,

→ ఏదో పొందాలి....!

→ ఏదో ఉపాసించాలి. ఇంకా ఎక్కడికో వెళ్ళాలి. ఆ ప్రదేశం - ఆ చోటు ... ఎప్పటికో ఏదో చేస్తేగాని లభించదే!

అని అనుకొంటూ రోజులు గడుపుచున్నాడు. ***"పరమ సత్యము ఏమిటి?"*** .... అనేది పరిశీలించటము లేదు. అజ్ఞానముచే అవిషయములైనట్టి వాటిని విషయములుగా భావించి, వాటిని ఆలోచిస్తూనో, ఆస్వాదిస్తూనో కాలమును వృధా చేసుకుంటున్నాడు. ఆత్మతత్త్వము ఏమిటో-ఎట్టిదో-ఎందుకో తెలిసియున్నట్టి విజ్ఞుడు మాత్రమే విషయములలో తాను చిక్కక, ఏకస్థుడై, ఆత్మను ఎరిగి ఉన్నవాడై, **విషయములను కథా విషయములుగా ఆస్వాదించి ఆనందించగలుగుచున్నాడు**.

ఈ జీవుడు ధ్యానము మొదలైన ఆయా శాస్త్రములచే సూచించబడుచున్న అభ్యాసములచే పరమాత్మ తత్త్వమేమిటో ఎరుగుచున్నాడు. స్వయముగా తత్ పరమాత్మస్వరూపుడై, విషయములకు ఆవల ఉండి, విషయములను చూచుచూ "**వీటినన్నిటియొక్క నియామకుడను నేనే కదా!**" అని పకపకా నవ్వుతూ ఆస్వాదిస్తున్నాడు. **ధ్యానక్రియాభ్యః భగవాన్ భుఙ్క్తే అసౌ ప్రహస్య విభుః।** స్వయమ్ భగవానుడుగా

ఈ జీవుడు అగుచున్నాడు. సర్వ దేహములలో ఏకస్థుడై ఉన్న తన ఆత్మస్వరూపమును ఎరిగినవాడై, **స్వచ్ఛందముగా సందర్భానుగతమైన విషయములను ప్రశాంత దృక్కులతో ఆస్వాదిస్తున్నాడు.** ఈవిధముగా ఆత్మజ్ఞుడే వాస్తవానికి విషయములను ఆస్వాదించటమును ఎరిగిఉన్నవాడు సుమా!

**సర్వ సాధారణీం దోగ్ధ్రీమ్ పీయమానాంతు యజ్వభిః** సర్వసాధారణమైయున్న ఆత్మను యజ్ఞభావనా బలముతో ఎరిగి ఉన్నవాడై ఆనందపూరిత మనో విన్యాసములో విషయములను విషయములుగా చూడగలుగుచున్నాడు. ఇదంతా తాను వినోదముగా త్రాగుచున్న "పానీయము" వలె భావించి **సంతోషము చెదరనివాడై** ఉంటున్నాడు. *(యజ్వ - విద్యుక్తముగా యజ్ఞము చేయుచున్నవాడు)*

# ఆత్మదృష్టి

**స్నాతక అధ్వర్యులు : స్నాతకము** = బ్రహ్మచారి వ్రతము. **అధ్వర్యులు** = ఉపాసనానుభవము కలవారు. యోగవిదులు. యజ్ఞవిదులు, **"ఆత్మానందము"** అనే జలముతో స్నానము చేసి, **"సుజ్ఞానము"** అనే వస్త్రముకట్టి, **సర్వవేదాంత సిద్ధాంతములను భూషణములుగా** ధరించటమును **యజ్ఞముగా** భావించి నిర్వర్తించు అభ్యాసము కలవారు. సిద్ధాంతమును అనుసరించువారు.

**– వీరి సిద్ధాంతమును అనుసరించి**

- జీవుడు – దృశ్యము అనునవి ఆత్మ అనే పక్షియొక్క రెండు రెక్కలు వంటివి.
- 1. జీవాత్మను సందర్భముగాను, పరమాత్మను పరమసత్యముగాను గ్రహించి, జీవాత్మత్వము పట్ల ఉదాశీనులై ఉండటము.
  2. జీవాత్మ అనునది పరమాత్మయొక్క కించిత్ కాలము కనిపించే చమత్కార విశేషముగా భావించటము–ఇదియే ఆత్మారామోపాసనము!

**ఉదాసీనం ధ్రువమ్ హంసమ్** – ఆత్మను ధృవమైనదిగాను ఉదాసీనము (దేనికి సంబంధించనిది) గాను ఉంటుందని చెప్పబడుచున్నది.

**బహ్వృచులు :** వీరు శాస్త్రకోవిదులై ఆత్మగురించి రథంతరము (Beyond the Chariot of this Physical Body) అనబడే సప్తస్వరములతో కూడి సామగానము చేస్తూ ఆత్మయొక్క అప్రమేయత్వ–నిత్యత్వ–సర్వత్వ–అఖండత్వ – దివ్యత్వ – వ్యాప్యత్వ – సత్యత్వ – అమృతత్వ – అమోఘత్వ – నిరంజనత్వ – నిరామయత్వ – నిర్లేపత్వ ఇత్యాది లక్షణములను ఎలుగెత్తి గానము చేస్తున్నారు. **పరమాత్మయే నిత్యసత్యమై జాగ్రత్–స్వప్న–సుషుప్తులలో వేరువేరు "నేను"లను అలంకారముగా కలిగి ఉన్నది....** అని వీరు నిర్వచించుచున్నారు.

**మంత్రోపనిషదులు :** భార్గవుడు, అధర్వణుడు, భృగువు మొదలైన ఆత్మతత్త్వజ్ఞులగు మహనీయులు బ్రహ్మపదమును మహావాక్యముల రూపముగా....

- తత్ త్వమ్। సోఽహమ్।
- అహమ్ బ్రహ్మాఽస్మి । జీవో(బ్రహ్మేతి నా పరః।
- సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ। త్వమేవాఽహమ్।।
- అహమ్ త్వమేవ।

..... ఇత్యాది మంత్ర వర్ణనములద్వారా ముముక్షువులకు త్రోవచూపుచున్నారు. ఆత్మమననము – ధ్యాస – తదాత్మ్యములను ఎలుగెత్తి చాటుచున్నారు. ఈవిధంగా ఆత్మ పఠనము వినిపిస్తున్నారు.

వారు **"బ్రహ్మమునందు చరించటము"** అనే బ్రహ్మచారి (బ్రహ్మోఽహమ్ – ఆచారిణ) వృత్తుల గురించి బోధించుచున్నారు. ఆత్మను స్థంభము (కదలని వస్తువు)గా దర్శించి స్థంభయోగముచే ఆత్మ నిశ్చలత్వమును సూచిస్తున్నారు.

ఆత్మను...,

- అనేక ఫలములు కలిగించు ఫలవృక్షముగాను,
- ఎఱ్ఱటి శరీరముగల ఎద్దువలె బహు విస్తారమై లోకములన్నీ తనయందు ఇముడ్చుకున్నట్టిదిగాను,

**భావనచేసి ఉపాసన చేయుచున్నారు.**

మరికొందరు... ఆ హంస (స్వస్వరూపాత్మను)

→ ప్రజాపతిగాను (సృష్టికర్తగాను),

→ విరాట్ స్వరూపముగాను, (విశ్వరూపుడుగాను),

→ పురుషుడు గాను (సృష్టి స్థితి లయ పురుషకారమును సంప్రదర్శించువాడు గాను),

→ జలస్వరూపుడు, జలజ్యోతి స్వరూపుడుగాను,

***మంత్ర-సంస్థుతిలతో స్తోత్రము చేయుచున్నారు.***

**స్తూయతే మంత్ర సంస్తుత్యైః**

అంతేకాకుండా

**రథర్వవిదితైః విభుః** ఈ విశ్వము అనే రథములో అధిరోహించిన రధికునివంటిది ఆత్మ! రధికుని కనుసన్నలలో ఆజ్ఞానుసారము రథము చరించువిధంగా, ఆత్మయొక్క ఇచ్ఛా-సంకల్ప స్వరూపమే ఈ బ్రహ్మాండముల రాక – పోకలు అని స్తోత్రము చేయుచున్నారు. అధర్వణ వేద మంత్రములలో ఆత్మమాహాత్మ్యమును సంస్తుతిస్తున్నారు.

❖ ❖ ❖

ఆ ఆత్మవస్తువగు "హంస" యొక్క తత్త్వము ఎట్టిదో – అది సాంఖ్యమార్గముగా బోధించటానికి మహనీయులగు వేరువేరు గురువులు – వేరు వేరు విభాగములుగా విభజించి ప్రవచించటము జరుగుతోంది.

ఆ పరతత్త్వము 26 అంశలతో (గుణములతో) కూడి ఉన్నది

- పంచకర్మేంద్రియములు → పంచకర్మేంద్రియ విషయములతో,
- పంచ జ్ఞానేంద్రియములు → పంచ జ్ఞానేంద్రియ విషయములతో,
- పంచ భూతములు,
- పంచ ప్రాణములు,
- అంతరంగ చతుష్టయము (మనో-బుద్ధి-చిత్త-అహంకారాలు),
- (25) జీవాత్మ (భౌతిక దేహ ఉపాధియుక్తుడు),
- (26) పరమాత్మ,

**మరికొందరు గురువులు – ఆత్మ 27 గుణములతో కూడి ఉన్నట్లు చెప్పుచున్నారు.**

పై మొదటి 24 తత్త్వములకు (25) అవ్యక్తము (26) ఈశ్వరుడు (అనేక దేహములు తనవై, మాయను ఉపాధిగా కలిగి ఉన్నట్టి వాడు) అని కొందరు విభజించి చెప్పుచున్నారు. '27వది పరమాత్మ'!

**ఇక అథర్వశిరోతత్త్వవేత్తలు (ఆరోపణ వాదులు) :**

ఆ పరమ పురుషుడు సర్వదా **నిర్గుణుడు! గుణాతీతుడు! కేవలసాక్షి! ఆయనపై మిగతావన్నీ ఆరోపించబడుతున్నాయి** – అని సిద్ధాంతీకరించుచున్నారు. ఇంకా, ఆ హంస (ఆత్మ) గురించి

- 24 తత్త్వములు గల --- వ్యక్త-అవ్యక్త పురుషుడుగా చెప్పబడుతోంది.

**అద్వైత సిద్ధాంతానుసారము :** ఆత్మ భగవానుడు ఒక్కడే ఉనికి కలిగి ఉన్నారు. ఆయనకు వేరు మరింకొకటేదీ లేదు. ఆ ఆత్మ దేవుడే జీవాత్మగా, జగత్తుగా కూడా అజ్ఞానదృష్టికి అగుపిస్తున్నారు. జ్ఞానదృష్టి సర్వము సర్వదా ఆత్మయే! ఈ జీవాత్మ జగత్తులు స్వప్నములోని ద్రష్ట – స్వప్న దృశ్యము వంటివి.

**ద్వైత సిద్ధాంతానుసారము :** జీవాత్మ పరమాత్మను ఆరాధించి పరమాత్మ పాదములు చేరి అఖండానందము సముపార్జించుచున్నాడు. అయితే జీవాత్మ కించిజ్ఞుడు (కొంతయే తెలిసినవాడు). పరమాత్మ సర్వజ్ఞుడు. జీవాత్మ సర్వజ్ఞుడు అయ్యే ప్రసక్తియే లేదు. కనుక ద్వైతము సర్వదా యథాతథము – అని బోధిస్తున్నారు. జీవాత్మ పరమాత్మను ఆశ్రయించి ఉండటమే మోక్షము-అని ప్రకటిస్తున్నారు.

**త్రిధాతము :** మరికొందరు – జీవాత్మ – జగత్తు – పరమాత్మ ఎప్పటికీ వేరువేరుగా ఇట్లాగే ఉంటాయి-అను సిద్ధాంతమును ప్రతిపాదిస్తున్నారు.

**పంచధాతము :** మరికొందరు..., జగత్తు – జీవాత్మ – మాయ – ఈశ్వరుడు – పరమాత్మ ... సర్వదా వేరుగానే ఉంటాయి–అను నిశ్చయము తెలుపుచున్నారు. ఈవిధంగా.... **అనేక సిద్ధాంతములు బోధింపబడుచున్నాయి.**

**ఇక ఈ ఉపనిషత్ ప్రతిపాదించుచున్న హంస తత్త్వము :**

జ్ఞాన చక్షువులకు అనేకముగా ఉన్నదంతా ఏకముగా అనిపిస్తోంది. తెలియవస్తోంది. సృష్టికర్తయగు బ్రహ్మదేవుడినుండి –– స్థావరము వరకు – **బ్రహ్మాద్యమ్ స్థావరాన్తంచ పశ్యన్తి జ్ఞాన చక్షుషః తమ్ ఏకమేవ!** – ఏకమగు పరమాత్మయే సర్వదా ఉన్నది. ఇక్కడ అనేకమనునదే లేదు. ఒకే స్వప్నములో అనేక నామ – రూపముల కల్పన వంటిదే ఈ కనబడేదంతా!

**తమ్ ఏకమేవ పశ్యంతి పరిశుభ్రమ్ విభుమ్ ద్విజాః।** వేద హృదయమును, వేదాంత తత్త్వమును ఎరిగిన ద్విజులు ఆ పరమాత్మ జీవాత్మ–జగత్తు మొదలైన దోషములచే స్పృశించబడడని గమనిస్తున్నారు. సర్వ భావములకు ఆయనయే విభుడని, అంతా తానే అయి అఖండము – అప్రమేయము – నిత్యము – సత్యము అయి సర్వదా వెలుగొందుచున్నారని ఎలుగెత్తి సిద్ధాంతీకరించుచున్నారు.

ఇక ఈ స్థావర జంగమాత్మకమై కనిపించేది ఏమిటంటారా? సముద్రజలములో తరంగము ఆకార సమన్వితముగాలేచి, సముద్ర జలములోనే సంచరించి, చివరికి సముద్రజలములోనే లయిస్తోంది కదా! **స్రవన్తి సాగరే యథా!**

అట్లాగే ఈ జగత్‌దృశ్యానుభవమంతా కూడా భావనాతరంగ రూపమే అయి ఉండి, ఆత్మమహా సముద్రములో **బయల్వెడలి**, ఆత్మయందే **అటూ–ఇటూ సంబరాలు** చేసి చేసి, చివరికి ఆత్మయందే **లయము** పొందుచున్నది. **యస్మిన్ సర్వమ్ ఇదమ్ ప్రోతమ్ బ్రహ్మః స్థావర జంగమమ్, తస్మిన్‌యేవ లయం యాతి।** ఈ దృశ్య జగత్ అనుభవ పరంపరా వ్యవహారమంతా ఇద్దాని స్థావర–జంగమ విశేషాలతో సహా ఎద్దానియందు ప్రోతము (జలములో జలతరంగమువలె) అయి ఉన్నదో...., అట్టి ఆత్మయందే జగత్ భావములు మొదలంట్లా లయిస్తున్నాయి. అప్పుడు అనేకముగా కనిపిస్తున్న దృశ్యమంతా ఏకమగు ఆత్మగానే అనిపిస్తూ, అనుభూతము అగుచున్నది.

**మరల చెప్పుకుందాము**

జలంలో ఒక బుడగ (Bubble) బయల్వెడలి, జలంలోనే సంచారాలు చేస్తూ, చివరికి తిరిగి జలమునందే లయము పొందుతోంది కదా! అట్లాగే, **యస్మిన్ భావాః ప్రలీయన్తే లీనాశ్చ అవ్యక్తతాం యయుః, పశ్యన్తి వ్యక్తతాం భూయో జాయన్తే –– బుద్బుదా ఇవ!** ఎద్దానియందైతే (ఆత్మయందు) భావగతమైన తతంగమంతా లీనమై అవ్యక్తత్వము సంతరించుకుంటోందో, అద్దానినుండే బుద్బుదమువలె, భావన వ్యక్తమై మరల మరల దృశ్యరూపమున కనిపించునదిగా అగుచున్నది. దీనంతటి వలనా కూడా **ఆత్మకు వచ్చే లోటు ఏమీ లేదు.**

**ఇదంతా బ్రహ్మమునుండే బయల్వెడలి, బ్రహ్మమునుండే ప్రదర్శనమగుచూ, బ్రహ్మమునందే లయించుచున్నది. బ్రహ్మము సర్వదా బ్రహ్మమే అయి ఉన్నది. ఇదంతా సర్వదా బ్రహ్మమే!**

# పరమాత్మ - క్షేత్రజ్ఞత్వము

పరమాత్మయే ..., సర్వ దేహములలోనూ **"క్షేత్రజ్ఞుడు (Knower)"** – రూపమును అధిష్ఠించి, మరల కారణస్వరూపుడై తనకు అన్యమైనదిగా కనిపించుచున్న క్షేత్రమును భావనచేస్తూ సృష్టి స్థితి లయములను పునః పునః కల్పించుకొనుచున్నారు.

**క్షేత్రజ్ఞుడు : ఎరుగుచున్నవాడు**

ఇది నా దేహము – నేను పొందు దృశ్యము – బుద్ధి – ఇంద్రియములు – ఇంద్రియ విషయములు – సుఖ – దుఃఖములు... అను రూపముగా తనకు అన్యమైనదంతా **ఎరుగుచున్నట్టివాడు.**

**క్షేత్రము : ఎరుగబడుచున్నట్టిది**

పంచమహాభూతములు, బుద్ధి, అహంకారము, వ్యక్తీకరణమునకు ఆవలగల అవ్యక్తము (దేహి), పంచజ్ఞానేంద్రియములు – పంచకర్మేంద్రియములు, కర్మేంద్రియ–జ్ఞానేంద్రియ విషయములు, ఇచ్ఛ, ద్వేషము, సుఖ–దుఃఖ భావములు సంఘాతము (కలయిక), చేతనము (కదలించునది), ధైర్యము–ఉత్సాహము మొదలైనవన్నీ!

1. హంస (ఆత్మ) నుండి ఒకానొకప్పుడు క్షేత్రజ్ఞుడు (తెలుసుకొనువాడు) అను తత్త్వము సముద్రములో తరంగమువలె బయల్వెడలుచున్నది.
2. ఆ క్షేత్రజ్ఞుడు – సముద్రజలంలో బయల్వెడలిన తరంగము ఆకారము కలిగి ఉండి,...అది సముద్రమంతా సంచారము చేయువిధముగా – **"తెలియబడునది"**.... అను క్షేత్రమును కల్పించుకొనుచున్నది. క్షేత్రజ్ఞుడు స్వ ఊహాకల్పిత 'క్షేత్రము'నందు సంచరించుచూ,.... తన సహజము, కేవలము అగు సత్–చిత్–ఆనంద రూపమును ఏమరుచుచున్నాడు.
3. ఆ క్షేత్రమే 14 లోకములు, అసంఖ్యాక ఉపాధులరూపమై **"అనుభవించటము** (Experiencing)" అనే బహిర్లక్షణము రూపము కలిగి ఉండి, క్షేత్రజ్ఞుడు విహరించు ప్రదేశముగా అగుచున్నది.
4. అఖండము – అప్రమేయము – కేవలము – సర్వసాక్షీ భూతము అగు ఆత్మ, మరొకప్పుడు తన నుండి బయల్వెడలిన **"క్షేత్రజ్ఞుడు (తెలుసుకొనువాడు)"** అనుదానిని ఉపసంహరించి, తనయందు లయము చేసుకొనుచున్నది. అప్పుడు క్షేత్రజ్ఞుడితోబాటే తెలియబడునది (క్షేత్రము) కూడా ఆత్మయందు లయమగుచున్నది. ఈవిధంగా సముద్రములో ఎప్పుడో బయల్వెడలిన తరంగము మరెప్పుడో సముద్ర జలములో విలీనమైన తీరుగా, క్షేత్రజ్ఞుడు – క్షేత్రము... (తెలుసుకొనువాడు – తెలియబడినది) అనునదంతా తన ఉత్పత్తి స్థానమగు ఆత్మయందే విలయమగుచున్నది.
5. మరొకప్పుడు..., సముద్ర జలము నుండి మరల తరంగము మరల బయల్వెడలురీతిగా ఆత్మ (హంస–సోఽహమ్) నుండి క్షేత్రజ్ఞుడు (The knower) బయల్వెడలగానే క్షేత్రము (That being known) కూడా తిరిగి సంప్రదర్శనమగుచున్నది.

అయితే....,

- సముద్ర జలములో బయల్వెడలిన తరంగము జలము కానిదెప్పుడు? ఆ తరంగము జలమే అయి జలమునందే సంచరించుచున్నది కదా!

అట్లాగే...,

- ఆత్మనుండి (హంస–సోఽహమ్–అను సహజమగు "నేను" నుండి).... "**క్షేత్రజ్ఞుడు**" **(తెలుసుకొనువాడు)** .... బయలుదేరి తనకు బాహ్యముగా "తెలియబడునది (క్షేత్రము)" ను కల్పించుకొని, జగత్తు అనబడు 14 లోకముల రూప దృశ్యములో సంచారములు చేస్తున్నప్పటికీ, **ఆత్మయే క్షేత్రజ్ఞుని రూపము**. క్షేత్రజ్ఞుడు ఆత్మ స్వరూపము కానిది ఎన్నడూ లేదు. (తరంగము జలముకాని క్షణమే లేనివిధంగా)!
- ఆత్మయే "**తెలియబడునది**" అను రూపము అయి ఉన్నది. అనగా, తెలియబడుదాని రూపమంతా ఆత్మయే! (తరంగము సంచారములు చేస్తున్నదంతా జలములోనే, జలమే అయి ఉంటున్న తీరుగా)! (The "Absolute Self" itself is always - 'The knower' as well "All that being known").

### సర్వము సర్వదా సర్వథా సర్వత్రా **ఆత్మయే!**

కనుక ఆత్మ నుండి వేరుగా ఏదీ బయల్వెడలటమూ లేదు. ఆత్మ నుండి (సముద్ర జలములో తరంగమువలె) ఏదైనా బయల్వెడలుచున్నదనుకొంటే... అట్టి క్షేత్రజ్ఞుడు – క్షేత్రము... మొదలైనదంతా ఆత్మకు అభిన్నము. అందుచేత **ఆత్మ** సర్వదా **అద్వితీయము!** అఖండము! నిత్య సత్యము! ఆత్మకు భిన్నమై ఒకప్పుడుగాని – ఇప్పుడు గాని, మరొకప్పుడు గాని ఏదీ లేదు! సర్వదా ఆత్మయే అయి, సదాశివ స్వరూపమై వెలుగొందుచున్నది.

❖ ❖ ❖

ఎవ్వరైతే – **బ్రహ్మ బ్రహ్మేతి యథా యాన్తి, యే విదుః బ్రాహ్మణాః తథా,...** బ్రహ్మమునుండి బయలుదేరునది బ్రహ్మమే అయి ఉన్నది... అని ఎరుగుచున్నారో.... అట్టి వాడు **బ్రాహ్మణుడు**... అని చెప్పబడుచున్నాడు.

### అత్రైవ తే లయం యాన్తి లీనాశ్చ అవ్యక్తశాలినః

.... ఆతని వ్యక్త – అవ్యక్తములు ఇప్పుడే, ఇక్కడే బ్రహ్మము అయి ఉన్నాయి. **బ్రహ్మమునందే క్షేత్రజ్ఞ – క్షేత్రములు బ్రహ్మముగా** ప్రకాశించుచున్నవగుచున్నాయి.


***ఇతి మంత్రికోపనిషత్***

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

శుక్ల యజుర్వేదాంతర్గత

# (14) ముక్తికోపనిషత్

**శ్లోక తాత్పర్య పుష్పమ్**



**శ్లో॥ ఈశాది అష్టోత్తర శత (108) వేదాంత పటలాశయమ్**
**ముక్తికోపనిషత్ వేద్యం రామచంద్రపదమ్ భజే॥**

*ఆత్మజ్ఞానంద వైభవమే 'ఈశావాస్యోపనిషత్' మొదలైన 108 ఉపనిషత్తులందు అంతటా రసస్వరూపమై, వేదాంతసార విశేషములతో విస్తరించి ఉన్నది. సర్వ ఉపనిషత్తుల మహదాశయమగు ఆత్మారామ చంద్రపదమును స్తుతిస్తున్నాను.* ***ఈ ముక్తికోపనిషత్ సర్వ ఉపనిషత్తుల సారము.***

**1. ఓం అయోధ్యానగరే రమ్యే**
**రత్న మంటప మధ్యమే,**
**సీతా భరత సౌమిత్రి**
**శత్రుఘ్నాద్యైః సమన్వితమ్,**
**సనకాద్యైః మునిగణైః**
**వసిష్ఠాద్యైః, శుక – ఆదిభిః,**
**అన్యైః భాగవతైశ్చ అపి**
**స్తూయమానమ్, అహర్నిశమ్॥**

ఓం కార స్వరూపుడగు శ్రీరామచంద్రమూర్తికి నమస్కరిస్తూ...,

అతిరమ్యము - మనోహరము అగు అయోధ్యానగరమునందు, రత్నమంటపము. మధ్యగా సీతా - భరత - లక్ష్మణ - శత్రుఘ్నులు మొదలైన వారితో కూడుకొని...,

సనకుడు - సనందనుడు మొదలైన అనేకమంది మునివర్యులతోను, శ్రీ వసిష్ఠ మహర్షి, శుకమహర్షి వంటి మహనీయులతోను, తదితర అనేకమంది భాగవతోత్తములతోను శ్రీరామచంద్రస్వామి ఉపవేష్ఠితులై ఉన్నారు.

వారంతా క్షణక్షణము, అహర్నిశము శ్రీరామచంద్ర పరబ్రహ్మమును స్తోత్ర - చేస్తున్నారు.

---

**2. 'ధీ' విక్రియా సహస్రాణాం**
**సాక్షిణం నిర్వికారిణమ్**
**స్వరూప ధ్యాన నిరతం,**
**సమాధి విరమే హరిమ్।**
**భక్త్యా శుశ్రూషయా రామం**
**స్తువన్ పప్రచ్ఛ మారుతిః॥**
**<u>శ్రీ మారుతిః ఉవాచ :</u>**
**రామ! త్వం పరమాత్మాఽసి,**
**సత్–చిత్–ఆనంద విగ్రహః।**

ఆ సమయంలో శ్రీరామచంద్ర ప్రభువు ఆత్మారాముడై, బుద్ధి నుండి బయల్వెడలుచున్న వేలాది భావనా వికారములకు కేవల సాక్షియై **సమాధిని** ఆశ్రయించినవారై ఉన్నారు. నిర్వికారుడై, స్వస్వరూప ధ్యాననిరతుడై సమాధిని ఆస్వాదిస్తూ ఉన్నారు. కొంతసేపు గడచింది. భక్తజనపరాయణుడు అవటముచేత అట్టి 'సమాధి' నుండి బయల్వెడలి కనులు తెరచారు. ఆ శ్రీహరి అవతారుడగు రామయ్య ఆవిధంగా సమాధి ఆనందమునుండి బయల్వెడలి బహిర్ముఖుడై చిరునవ్వుతో సభాసదులపై ప్రేమచూపుల వర్షము కురిపించసాగారు.

స్వామి సమాధిని విరమించి బహిర్ముఖుడవటమును శ్రీరాముని పాదాలపై దృష్టిని నిలిపి శుశ్రూష చేస్తున్న ఆంజనేయ స్వామి ముందుగా గమనించారు. భక్తితో స్తుతిస్తూ, "ఇది తగిన సమయము" అని భావించి, శ్రీరామచంద్రుని ఇట్లు పరిప్రశ్నించనారంభిచారు.

**శ్రీమారుతి :** హే రామచంద్ర భగవన్! మీరు స్వయమ్ పరమాత్మానంద స్వరూపులు, సత్ (ఉనికి) - చిత్ (ఎరుక-వెలుగు) - ఆనంద విగ్రహులు! తండ్రీ! రఘుశ్రేష్ఠా!

ఇదానీం త్వాం, రఘుశ్రేష్ఠ!
ప్రణమామి ముహుర్ముహుః।
త్వత్ రూపమ్, జ్ఞాతుమ్ ఇచ్ఛామి
తత్త్వతో, రామ! ముక్తయే।
అనాయాసేన ఏన అహమ్
ముచ్యే అయం భవ బంధనాత్!
కృపయా వద మే, రామ!
యేన ముక్తో భవామి అహమ్?
<u>శ్రీ రామచంద్రౌవాచ :</u>
సాధు పృష్టం మహాబాహో।
వదామి, శ్రుణు తత్త్వతః।
వేదాంతే సుప్రతిష్ఠో అహమ్।
వేదాంతమ్ సము పాశ్రయ।

మీకు మరల మరల ప్రణామములు సమర్పించుకుంటున్నాను. స్వామీ! ఓ రామయ్యా! అనేక సంసార బంధములలో చిక్కుకున్న నేను మీ యొక్క తత్త్వరూపము తెలుసుకొని, ముక్తుడిని అవ్వాలని కోరుకొంటున్నానయ్యా!

ఈ జగత్తు సత్యమే - అనురూపముగల 'భవ' బంధములో చిక్కుకొనియున్నాను. అట్టి నాకు - ఈ దుర్భర భవబంధము నుండి అనాయాసముగా - సులభముగా ఏవిధంగా విముక్తి కలుగ గలదో - అట్టి ఆ మార్గమును దయతో శెలవీయండి. నా మీద కృపతో **"దేని చేత నేను ముక్తుడను కాగలను?"** అనునది ప్రబోధించ ప్రార్థన!

**శ్రీరామచంద్రుడు :** ఉత్తమ భుజములు కలిగియున్న ఓ ప్రియ ఆంజనేయా! నీవు అడుగుచున్నది ఉత్తమమైన, పరమ శ్రేయోదాయకమైన విషయము. యదార్థతత్త్వ మేమిటో తప్పక చెప్పుతాను. సావధాన చిత్తుడవై విను.

ఈ దృశ్య జగత్తంతా 'వేదమ్' తెలియబడునది. దీనికంతటికీ ఆవల (అంతేన) - "తెలుసుకొనుచున్నవాడు - ఎరుగుచున్నవాడు" ఉన్నాడు. **నేను అట్టి వేదాంత స్వరూపమునందు సుప్రతిష్ఠితుడనై ఉన్నాను.** అందుచేత ప్రియ హనుమా! నీవు తెలియబడుచున్నదానిని అధిగమించి, వేదాంత తత్త్వమును ఆశ్రయించవయ్యా! అట్టి వేదాంతవిజ్ఞానము (ఉపనిషత్తులచే) అభివర్ణించబడుచున్నది.

---

3. <u>శ్రీ హనుమాన్ – ఉవాచ :</u>
వేదాంతాః కే? రఘు శ్రేష్ఠా! వర్తంతే కుత్ర తే, వద?
<u>శ్రీరామచంద్రౌవాచ :</u>
హనుమాన్! శృణు వక్ష్యామి వేదాంత స్థితి మంజసా।
నిశ్వాసభూతా మే విష్ణోః వేదా జాతాః సు విస్తరాః।
తిలేషు తైలవత్ వేదే వేదాంతః సుప్రతిష్ఠితః।
<u>శ్రీ హనుమాన్ ఉవాచ :</u>
శ్రీరామా! వేదాః కతివిధాః తేషామ్ శాఖాశ్చ, రాఘవ?
తాసు ఉపనిషదః కాః స్యుః? కృపయా వద తత్త్వతః।
<u>శ్రీరామ ఉవాచ :</u>
ఋగ్వేదాది విభాగేన వేదాః చత్వార (4) ఈరితాః।
తేషాం శాఖా హి అనేకాః స్యుః। తాసు ఉపనిషదః తథా।
– ఋగ్వేదస్య తు శాఖాఃస్యుః
ఏక వింశతి (21) సంఖ్యయా।
– నవాధిక శతం (109) శాఖా
"యజుషో, మారుతాత్మజా!
– సహస్ర సంఖ్యయా (1000) జాతాః
శాఖాః సామ్నః, పరంతప!
– అధర్వణస్య శాఖాస్స్యుః
పంచాశత్ (50) భేదతో, హరే!

**శ్రీఆంజనేయ స్వామి :** ఓ రఘుశ్రేష్ఠా! వేదాంతము ఎట్టిది? అట్టి వేదాంత శాస్త్రమును విశదీకరించు శాస్త్రములు (ఉపనిషత్తులు) ఏమని శాస్త్రీకరిస్తున్నాయి? అవి ఎక్కడ ఎవరిచే చెప్పబడుచున్నాయి? ఆ ఉపనిషత్తులు బోధిస్తున్నది దేని గురించి? దయచేసి ఆ వివరాలు చెప్పండి.

**శ్రీరామచంద్రుడు :** ఓ ప్రియ హనుమా! నీవు కోరిన విధముగా వేదాంతముల - ఉపనిషత్తుల వివరములు చెప్పుచున్నానయ్యా! విను.

నాయొక్క విష్ణుతత్త్వమునుండి నిశ్వాస (గాలి వదలు) రూపముగా అనాయసముగా సువిస్తృతమగు విజ్ఞానభాండాగారముగా 'వేదాంతములు' పుట్టాయి. అవన్నీ సువిస్తారమై ఉన్నాయి.

నువ్వులలో - నూనె దాగి ఉండువిధముగా, వేదములలో వేదాంత - జ్ఞానము సుప్రతిష్ఠితమైయున్నది. నేను వేదాంతస్వరూపుడనై ప్రకాశించుచున్నాను.

**శ్రీ హనుమ :** హే మమ ఆత్మేశ్వరా! శ్రీరామా! వేదములు - వాటి శాఖలు ఏఏవిధములై ఉన్నాయి? ఆ వేదములలో వేదాంత శాస్త్ర సూత్ర ప్రదర్శనములగు ఉపనిషత్తులు ఏఏ రీతులుగా ఉన్నాయి! కృపతో తత్త్వపూర్వకమైన విషయాలు చెప్పండి.

**శ్రీరాముడు :** వేదములు 4 విభాగములుగా విభజించబడ్డాయి. 1. ఋగ్వేదము 2. యజుర్వేదము 3. సామవేదము 4. అథర్వణవేదము. ఆ '4' వేదములకు అనేక శాఖలు, ఉపశాఖలు. వాటిని అనుసరించుచూ, ఉపనిషత్తులు కూడా ఆ శాఖ-ఉపశాఖలలో నిక్షిప్తమై ఉన్నాయి. ఓ మారుతాత్మజా! ఆ వివరాలు ప్రస్తావిస్తున్నాను. విను. ఋగ్వేదమునకు .... '21' శాఖలు, యజుర్వేదమునకు ... '109' శాఖలు, సామవేదమునకు .... '1000'. శాఖలు, అథర్వణ వేదమునకు '50' శాఖలు. ఈ శాఖలన్నీ వేరువేరు రీతులుగా అనేక విశేష భేదములు కలిగి ఉన్నాయి. (మొత్తం-1180)

| | |
|---|---|
| **4. ఏకైకస్య అస్తు శాఖాయా<br>ఏకైక ఉపనిషత్ మతా।<br>తాసామ్ ఏకాం ఋచం యేన<br>పఠ్యతే భక్తితో మయి ।<br>స మత్ - సాయుజ్య పదవీం<br>ప్రాప్నోతి ముని దుర్లభామ్।**<br>**<u>శ్రీ హనుమాన్ ఉవాచ :</u><br>(హే) శ్రీరామ!<br>- కేచిత్ మునిశ్రేష్ఠా 'ముక్తిః'<br>ఏకేతి చక్షిరే।<br>- కేచిత్ త్వమ్ నామభజనాత్।<br>- కాశ్యాం తారా-ఉపదేశతః।<br>- అన్యేతు 'సాంఖ్య యోగేన'।<br>- 'భక్తి యోగేన' చ అపరే।<br>- అన్యే 'వేదాంత వాక్యార్థ<br>విచారాత్ పరమర్షయః'।<br>- "సాలోక్యాది విభాగేన<br>చతుర్ధా ముక్తిః" ... ఈరితా।** | మనము చెప్పుకున్న ఈ నాలుగు వేదముల - వివిధ శాఖలలో ఒక్కో శాఖలో ఒక్కొక్క ఉపనిషత్ వర్ణితమై, వేద-అంతర్విభాగ (వేదాంత విభాగమై) - ఉన్నది. అట్టి ఉపనిషత్తులలోని సారభూతమైన బ్రహ్మ జ్ఞానమును ఎవ్వరు భక్తితో అధ్యయనము చేస్తారో, అట్టివారు మునులకు కూడా దుర్లభమైనటువంటి నా సాయుజ్యపదవిని పొందుచున్నారు.<br>**శ్రీ హనుమంతుడు** : ఓ శ్రీరామా! వేరు వేరు మునిశ్రేష్ఠులు ముక్తికి వేరు వేరు మార్గములు ఉన్నాయని సిద్ధాంతీకరించి చెప్పుచూ ఉన్నారు.<br>కొందరేమో మీ (రామ) నామ భజన మాత్రమే తరుణోపాయమని ఉపదేశిస్తున్నారు. తారక మంత్రమే మార్గమంటున్నారు.<br>ఇంకొందరు ఆత్మ-అనాత్మ విచారణ, అంతరంగ చతుష్టయ విచారణలతో కూడిన తత్త్వ జ్ఞానము అగు 'సాంఖ్య యోగము' మాత్రమే త్రోవ అని అంటున్నారు.<br>వేరే కొందరు భక్తియోగము - భక్తి గుణ సంపద (అమానిత్వము మొదలైనవి) మార్గదర్శకముగా బోధిస్తున్నారు.<br>ఇక కొందరైతే "అయ్యా! అన్నీ అట్లా అట్టిపెట్టండి. **తత్త్వమ్ - సోఽహమ్ - త్వమేవాఽహమ్** - ఇత్యాది మహా వాక్యముల విచారణ చేయండి" అని (పరమర్షులు) సూచిస్తున్నారు.<br>కొందరు మహనీయులు - "సారూప్యము - సామీప్యము - సాలోక్యము - సాయుజ్యము" అను చతుర్విధ (4) మార్గములను - మెట్లుగా మోక్షమార్గమును ప్రవచిస్తున్నారు. **వీటిని గురించి దయతో వివరించండి.** |
| **5. <u>సహోవాచ శ్రీరామః :</u><br>కైవల్యముక్తిః ఏకైవ పారమార్థిక రూపిణీ।<br>దురాచారరతోవాఽపి మన్నామ భజనాత్, కపే!<br>"సాలోక్యముక్తిమ్" అప్నోఽతి।<br>న తు లోకాంతరాదికమ్।<br>కాశ్యాంతు బ్రహ్మనాళే అస్మిన్,<br>మృతో మత్ 'తారమ్' అప్నుయాత్,<br>పునరావృత్తి రహితాం<br>ముక్తిమ్ ప్రాప్నోతి మానవః।<br>యత్ర కుత్రాపి వా కాశ్యాం<br>మరణే స మహేశ్వరః, జంతోః దక్షిణ కర్ణేతు<br>మత్ 'తారమ్' సముపాదిశేత్।<br>నిర్ధూత అశేష పాపౌఘో<br>మత్ సారూప్యమ్ భజతి అయమ్,<br>స ఏవ "సాలోక్య సారూప్య<br>ముక్తిః" - ఇతి అభిధీయతే।** | **శ్రీరామచంద్రుడు** : 'కైవల్యముక్తి' పారమార్థికంగా **ఏకమే**గాని, అనేక రూపములైనట్టిది కాదు! ఓ కపీశ్వరా! ఒకడు దురాచారుడైనప్పటికీ ఇప్పుడు (శ్రీరామ్। జయరామ్। జయజయరామ్ మొ॥న రీతిగా) నా నామస్మరణను ప్రారంభిస్తే ఆతడు తప్పక 'సాలోక్యముక్తి'ని ఇక్కడే పొందుచున్నాడు. ఆతడు ముక్తికై వెతుకుతూ మరొకలోకమునకు వెళ్ళవలసిన పని ఉండదు.<br>ఏ మానవుడైతే బ్రహ్మనాళమునందు ఉన్నవాడై కాశీ సుక్షేత్రములో (లేక, బ్రహ్మరంధ్ర బాహ్య-అభ్యంతర క్షేత్రములో) మరణము పొందుతాడో (ఆతడు దురాచారుడైనప్పటికీ).... తారక మంత్రముచే తరించుచున్నాడు. అట్టి తారక మంత్రమును పొంది ఆతడు పునరావృత్తి రహితమగు ముక్తిని పొందుచున్నాడు.<br>ఏ జీవుడైనా సరే, 'కాశీ' (బ్రహ్మరంధ్ర) పుణ్యక్షేత్రములలో మరణము పొందుచున్నప్పుడు, (లేక బ్రహ్మరంధ్ర స్థానములో ధ్యాస కలిగి ఉండి దేహమును త్యజించుచున్నప్పుడు) మహేశ్వరుడు ఆ జీవుని కుడిచెవిలో ప్రేమాస్పదముగా తారకమంత్రమును ఉపదేశించుచున్నారు. ఆ కరుణామయుడగు శివభగవానునిచే తారకమంత్రము పొందిన ఆ జీవుడు సమస్త పాపదోషముల నుండి పరిశుద్ధుడై, విముక్తుడై, నాయొక్క సారూప్యముక్తిని పొందుచున్నాడు. నా స్వరూపుడై బుద్ధి వృత్తులకు కేవల సాక్షి అయి, రామతత్త్వములో ప్రవేశిస్తున్నాడు. రామబ్రహ్మ స్వరూపుడగుచున్నాడు. ఇదియే <u>సాలోక్య - సారూప్య ముక్తి</u> అని చెప్పబడుతోంది. |

**6.** సదాచార రతో భూత్వా
ద్విజో నిత్యమ్ అనన్య ధీః,
మయి సర్వాత్మకే భావో
**మత్ సామీప్యం భజతి అయమ్।**
స ఏవ "సాలోక్య సారూప్య సామీప్యా ముక్తిః" ఇష్యతే॥
గురూ – ఉపదిష్ఠ మార్గేణ
ధ్యాయన్ మత్ రూపమ్ అవ్యయమ్,
మత్ సాయుజ్యం ద్విజః
సమ్యక్ భజేత్ భ్రమరకీటవత్।
స ఏవ సాయుజ్యముక్తిస్స్యాత్
బ్రహ్మానందకరీ, శివా।
చతుర్విధా చ యా ముక్తిః
మత్ ఉపాసనయా భవేత్।
<u>శ్రీ హనుమాన్ వాచ:</u>
ఇయం కైవల్యముక్తిస్తు కేన ఉపాయేన సిద్ధ్యతి?
<u>శ్రీరామౌవాచ:</u>
'మాండూక్యమ్' ఏకమేవ అలం
ముముక్షూణాం విముక్తయే।
తథాపి అసిద్ధం చేత్ జ్ఞానం,...
దశ (10) ఉపనిషదం పఠ।
జ్ఞానం లబ్ధ్వా అచిరాదేవ మామకం ధామ యాస్యసి।

**సాలోక్య సారూప్య సామీప్య ముక్తి :** ఒకడు ఇహత్వమునకు ఆవలగల పరత్వమునందు నిష్ఠ - శ్రద్ధలచే 'ద్విజుడు' అయి సదాచారములను నిర్వర్తిస్తూ, ఆత్మారామునిగా, సర్వాత్మక భావముతో నన్ను సర్వరూపముల సామీప్య రూపుడుగా, (ఎదురుగా 'త్వమ్' స్వరూపుడుగా) భజిస్తూ ఉంటే, అట్టివాడు 'సాలోక్య - సారూప్య - సామీప్య ముక్తి'ని కరతలామలకము చేసుకొనుచున్నాడు.

**సాయుజ్యముక్తి :** ,సద్గురువు ఉపదేశించుచున్న 'తత్-త్వమ్' మార్గముగా నా రూపమును (సర్వమునందు ఉన్న నన్ను - నాలోనే ఈ సర్వము ఉండటమును) .... అవ్యయమైనట్టిదిగా ధ్యానము చేస్తూ ఉంటే, ఆ **ద్విజుడు - భ్రమరకీటక న్యాయము - వలె, సమ్యక్ భావనచే, నా సాయుజ్యము** పొందుచున్నాడు. తానే ఆత్మారాముడని ఎరిగి, దర్శిస్తూ, ప్రవేశించటమే అది.

అ శివానంద స్వరూపమగు సాయుజ్యముక్తి ఈ జీవునకు బ్రహ్మానందమును ప్రసాదించుచున్నది. సర్వసాంసారిక బుగ్మతలను తొలగించునది.

నన్ను ఆయా విధములుగా ఉపాసించుచుండగా, క్రమంగా సారూప్య - సామీప్య - సాలోక్య - సాయుజ్య ముక్తులు జీవుడు తప్పక సముపార్జించుకోగలడు.

**శ్రీ ఆంజనేయుడు :** జీవులందరికీ సుఖము కలుగజేయు-లోకో రమయతీఽతి... ఓ శ్రీరామచంద్రా! ఇప్పుడే, ఇక్కడే కైవల్యముక్తిని సిద్ధింపజేసుకోవటానికై, మేము ఏ ఉపాయము ఆశ్రయించాలో దయతో శెలవివ్వండి!

**శ్రీరాముడు : ఒక్క మాండూక్యోపనిషత్** యొక్క తత్త్వసారమును అధ్యయనము చేసినంత మాత్రముచేతనే ముముక్షువు - ఇక్కడే ఇప్పుడే ముక్తిని సంతరించుకోగలడు.

ఓ హనుమా! ఒకవేళ **మాండూక్యోపనిషత్** .... పరిశీలించిన తరువాత కూడా ఆ ముముక్షువుకు **"నేను సర్వదా ముక్తుడనే"** .... అనే భావన సుస్థిరము కాకపోతే, దశోపనిషత్తులు (ఈశ - కేన - కఠ - ప్రశ్న - ముండక - మాండూక్య - తైత్తరీయ - ఐతరేయ - ఛాందోగ్య - బృహదారణ్యకములు) అధ్యయనము చేయటంచేత ఆత్మారామ జ్ఞానము లభించి, నా ధామమును ఆతడు చేరగలడు.

---

**7.** తథాపి దృఢతా నో చేత్
విజ్ఞానస్య, అంజనా సుత!
ద్వాత్రింశాఖ్యో (32) ఉపనిషదం
సమభ్యస నివర్తయ।
విదేహ ముక్తాః ఇచ్ఛాచేత్
అష్టోత్తర శతం (108) పఠ।
తాసాం క్రమం స శాంతిం చ
శృణు, వక్ష్యామి తత్త్వతః।
ఈశ కేన కఠ ప్రశ్న
ముండక మాండ్యూక్య తిత్తిరిః
ఐతరేయం చ ఛాందోగ్యమ్
బృహదారణ్యకం తథా।

ఓ అంజనాసుతా! ఒకవేళ అప్పుడు కూడా (సోఽహమ్, తత్త్వమ్, త్వమేవాఽహమ్, త్వమ్ అహమేవ.... మహావాక్యాల) పరమార్ద నిశ్చల దృష్టి, ఆత్మాఽహమ్ భావన, తృప్తి ఇంకా లభించలేదని అనిపిస్తే, అప్పుడు '32' ఉపనిషత్తులను పరమార్ధ పూర్వకంగా అధ్యయనము చేయటముచేత సర్వ మనోబంధనములు పటాపంచలు కాగలవు!

ఒకవేళ **"నేను విదేహముక్తుడను అయ్యెదను గాక"....** అని అభిలాష ఉంటే అప్పుడు '108' ఉపనిషత్తులు పరిశీలించబడును గాక!

ఆ 108 ఉపనిషత్తుల క్రమమును, అందలి శాంతి పాఠ్యాంశములతో సహా ఒక క్రమ విశేషంగా తత్త్వార్ధ దృష్టిగా చెప్పుచున్నాను. విను!

<u>**దశోపనిషత్తులు**</u>

1. ఈశావాస్యోపనిషత్ 2. కేనోపనిషత్ 3. కఠోపనిషత్ 4. ప్రశ్నోపనిషత్
5. ముండకోపనిషత్ 6. మాండుక్యోపనిషత్ 7. తైత్తిరీయోపనిషత్
8. ఐతరేయోపనిషత్ 9. ఛాందోగ్యోపనిషత్ 10. బృహదారణ్యకోపనిషత్.

బ్రహ్మ కైవల్య జాబాల
శ్వేతాశ్వో హంస ఆరుణిః
గర్భో నారాయణో హంసో
బిందు నాద శిరః శిఖా,
మైత్రాయణీ కౌషీతకీ
బృహజ్జాబాల తాపనీ
కాలాగ్ని రుద్ర మైత్రేయీ
సుబాల క్షురిక మంత్రికా
సర్వసారం నిరాలంబం
రహస్యం వజ్ర సూచికమ్,
తేజో నాద ధ్యాన విద్యా
యోగతత్త్వ ఆత్మబోధకమ్॥

**ద్వాత్రింశాఖ్య (32) ఉపనిషత్తులు (11 నుండి 42)**

11. బ్రహ్మోపనిషత్ 12. కైవల్యోపనిషత్ 13. జాబాలోపనిషత్
14. శ్వేతాశ్వతరోపనిషత్ 15. హంసోపనిషత్ 16. ఆరుణికోపనిషత్

17. గర్భోపనిషత్ 18. నారాయణోపనిషత్ 19. పరమహంసోపనిషత్
20. అమృతబిందూపనిషత్ 21. అమృతనాదోపనిషత్ 22. అథర్వశిరోపనిషత్
23. అథర్వశిఖోపనిషత్

24. మైత్రాయణ్యుపనిషత్ 25. కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్ 26. బృహజ్జాలోపనిషత్
27. నృశింహతాపినీ [(క) పూర్వతాపినీ (గ) ఉత్తరతాపినీ] ఉపనిషత్తులు.

28. కాలాగ్ని రుద్రోపనిషత్ 29. మైత్రేయోపనిషత్ 30. సుబాలోపనిషత్
31. క్షురికోపనిషత్ 32. మంత్రికోపనిషత్

33. సర్వసారోపనిషత్ 34. నిరాలంబోపనిషత్ 35. శుకరహస్యోపనిషత్
36. వజ్రసూచికోపనిషత్ 37. తేజోబిందూపనిషత్ 38. నాదబిందూపనిషత్
39. ధ్యానబిందూపనిషత్ 40. బ్రహ్మవిద్యోపనిషత్ 41. యోగతత్త్వోపనిషత్
42. ఆత్మబోధోపనిషత్

---

8. పరివ్రాట్ త్రిశిఖీ సీతా,
చూడా నిర్వాణ మండలమ్
దక్షిణా శరభం స్కందం,
మహా నారాయణా అద్వయమ్।
రహస్యం రామతపనం,
వాసుదేవంచ ముద్గలమ్।
శాండిల్యం పైంగ్లలమ్ భిక్షమ్,
మహత్ శారీరకం శిఖా।
తురీయాతీత సన్న్యాస,
పరివ్రాజ అక్షమాలికా।
అవ్యక్త ఏకాక్షరం పూర్ణా,
సూర్యా అక్ష్యు అధ్యాత్మ కుండికా।
సావిత్ర్యా ఆత్మా పశుపతమ్,
పరబ్రహ్మో అవధూతకమ్।
త్రిపురాతపనం దేవీ, త్రిపురా కఠ భావనా।
హృదయం కుండలీ భస్మ
రుద్రాక్ష గణ దర్శనమ్।
తారసార మహావాక్య
పంచ బ్రహ్మ–అగ్నిహోత్రకమ్।
గోపాలతపినం కృష్ణమ్,
యాజ్ఞవల్క్యం వరాహకమ్।
శాట్యాయనీ హయగ్రీవం,

**తదితర ఉపనిషత్తులు (మొత్తం 108)**

43. నారద పరివ్రాజకోపనిషత్ 44. త్రిశిఖిబ్రాహ్మణోపనిషత్ 45. సీతోపనిషత్
46. యోగ-చూడామణీ ఉపనిషత్ 47. నిర్వాణోపనిషత్ 48. మండల బ్రాహ్మణోపనిషత్

49. దక్షిణామూర్త్యుపనిషత్ 50. శరభోపనిషత్ 51. స్కందోపనిషత్
52. మహానారాయణోపనిషత్ 53. అద్వయతారకోపనిషత్

54. రామ రహస్యోపనిషత్ 55. రామ పూర్వతాపిన్యుపనిషత్, రామ ఉత్తర తాపిన్యుపనిషత్తు 56. వాసుదేవోపనిషత్ 57. ముద్గలోపనిషత్

58. శాండిల్యోపనిషత్ 59. పైంఙ్లలోపనిషత్ 60. భిక్షుకోపనిషత్
61. మహోపనిషత్ 62. శారీరకోపనిషత్ 63. యోగశిఖోపనిషత్

64. తురీయాతీతోపనిషత్ 65. సన్న్యాసోపనిషత్ 66. పరమహంస పరివ్రాజకోపనిషత్ 67. అక్షమాలికోపనిషత్

68. అవ్యక్తోపనిషత్ 69. ఏకాక్షరోపనిషత్ 70. పూర్ణోపనిషత్ 71. సూర్యోపనిషత్
72. అక్ష్యుపనిషత్ 73. అధ్యాత్మోపనిషత్ 74. కుండికోపనిషత్

75. సావిత్ర్యుపనిషత్ 76. ఆత్మోపనిషత్ 77. పశుపత బ్రహ్మోపనిషత్
78. పరబ్రహ్మోపనిషత్ 79. అవధూతోపనిషత్

80. త్రిపురాతాపినీ ఉపనిషత్ 81. దేవ్యుపనిషత్ 82. త్రిపురోపనిషత్
83. కఠ శ్రుత్యుపనిషత్ 84. భావనోపనిషత్

85. రుద్రహృదయోపనిషత్ 86. యోగకుండలినీ ఉపనిషత్ 87. భస్మజాబాలోపనిషత్ 88. రుద్రాక్షజాబాలోపనిషత్ 89. గణపత్యుపనిషత్ 90. దర్శనోపనిషత్

91. తారసారోపనిషత్ 92. మహావాక్యోపనిషత్ 93. పంచబ్రహ్మోపనిషత్
94. ప్రాణాగ్నిహోత్రోపనిషత్

95. గోపాలతాపన్యుపనిషత్ 96. కృష్ణోపనిషత్ 97. యాజ్ఞవల్క్యోపనిషత్
98. వరాహోపనిషత్

దత్తాత్రేయంచ గారుడమ్,
కలి జాబాలి సౌభాగ్య,
రహస్య ఋచ ముక్తికా।

99. శాట్యాయనోపనిషత్ 100. హయగ్రీవోపనిషత్ 101. దత్తాత్రేయోపనిషత్ 102. గారుడోపనిషత్
103. కలిసంతారణోపనిషత్ 104. జాబాలీ ఉపనిషత్ 105. సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్ 106. సరస్వతీ రహస్యోపనిషత్ 107. బహ్వృచోపనిషత్ 108. ముక్తికోపనిషత్

---

**9.** ఏవమ్ అష్టోత్తర శతమ్
భావనాత్రయ నాశనమ్,
జ్ఞాన వైరాగ్య దం పుంసాం
వాసనా త్రయనాశనమ్।
పూర్వ – ఉత్తరేషు విహిత
తత్‌తత్ 'శాంతిః' పురస్సరమ్॥
వేదవిద్యా వ్రతస్నాత దేశికస్య
ముఖాత్ స్వయమ్
గృహీత్వా అష్టోత్తర శతమ్ యే పఠంతి ద్విజోత్తమాః,
ప్రారబ్ధ క్షయ పర్యంతం జీవన్ముక్తా భవంతి తే।
తతః కాలవశాత్ ఏవ ప్రారబ్ధేతు క్షయం గతే,
వైదేహీం మామకీం ముక్తిం యాంతి।
నాస్తి అత్ర సంశయః।
సర్వోపనిషదాం మధ్యే
సారమ్ అష్టోత్తరం శతమ్,
సకృత్ శ్రవణమాత్రేణ
సర్వామౌఘ నికృంతనమ్।

పైన మనము చెప్పుకున్న '108' ఉపనిషత్ విశేషాలు పఠిస్తూ పరిశీలిస్తూ ఉంటే, (జగత్‌భావన - జీవభావన - ఈశ్వర భావన అనబడు) భావనా త్రయము తొలగిపోతాయి. ఆ పాఠకునికి జ్ఞాన - వైరాగ్యములు సిద్ధిస్తాయి. వాసనా త్రయము నశించగలదు. స్వయమాత్మానంద స్వరూపుడు కాగలడు!

(భావనా త్రయము = సృష్టి - స్థితి - లయములపట్ల 'వాస్తవమే' అనుభావన, వాసనాత్రయము = దృశ్య - దేహ - జీవాత్మ వాసనలు)

ఉపనిషత్ - పఠనమునకు ముందు - వెనుక కూడా శాంతి పాఠము చేర్చి పఠించటము సముచితము.

**గురుముఖతః** :ఈ ఉపనిషత్ ప్రవచన - విశ్లేషణ - అర్థ పరిశీలనలకొరకై వేదవిద్యాపారంగతుడు, వ్రతనియమ నిష్ఠుడు, బ్రహ్మమును ఎరిగి చరించు స్నాతకుడు - అగు **పండితుని** ఆశ్రయించెదరు గాక! ఆయన ముఖతః వింటూ, స్వయముగా పరిశీలిస్తూ 108 ఉపనిషత్తులను పఠించు ద్విజోత్తముడు ప్రారబ్దము శేషించు వరకు జీవన్ముక్తుడై దృశ్యమును స్వీకరిస్తాడు.

అటు తరువాత ప్రారబ్దము క్షయము అయిన తరువాత స్వభావ సిద్ధముగా విదేహముక్తుడు అగుచున్నాడు.

ఇందులో సందేహమే లేదు.

సర్వ ఉపనిషత్తుల మధ్యగతముగా మనము ఉదహరించుకొన్న '108' ఉపనిషత్తులు అన్ని ఉపనిషత్తుల (1180 ఉపనిషత్తుల) సారరూపమై ఉన్నాయి.

ఈ ఉపనిషత్తులు ఒకసారి శ్రవణము చేసినంత మాత్రముచేత సర్వ పాపములు-పాపదృష్టులు నశించగలవు.

---

**10.** మయా ఉపదిష్టం శిష్యాయ
తుభ్యం, పవననందన!
ఇదం శాస్త్రం మయా, ఆదిష్టం
గుహ్యమ్ అష్టోత్తరం శతమ్,
జ్ఞానతో – అజ్ఞానతోవాఽపి
పఠతాం బంధమోచకమ్।
రాజ్యం దేయం, ధనం దేయం,
యాచతః కామపూరణమ్...,
ఇదమ్ అష్టోత్తర శతం
న దేయమ్ యస్య కస్యచిత్।
నాస్తికాయ, కృతఘ్నాయ
దురాచారరతాయ వై,

ఓ పవన నందనా! నీవు నాకు ప్రియ భక్తుడవు - శిష్యుడవు అయి ఉండటముచేత, ఈ అతి రహస్యమైనటువంటి శాస్త్ర విషయాలు నీకు చెప్పబడుచున్నాయి.

ఒకడు అజ్ఞాని అయినప్పటికీ కూడా,.... 108 ఉపనిషత్ విశేషాలు తెలుసుకుంటూ, పఠిస్తూ ఉంటే, ఆతడు బంధవిముక్తుడు కాగలుగుతాడు.

ఒకడు రాజ్యం ఇస్తానన్నా, ధనము ఇస్తానన్నా, కోరినవన్నీ ఇస్తానన్నా కూడా, (భౌతిక - లౌకిక దృష్టికి పరిమితుడై, వైరాగ్యాచరణము, దైవీగుణ సంపద, గురుభక్తి, సాత్వికాచారాములు లేకుంటే) ... అట్టి వానికి ఈ అష్టోత్తర శత ఉపనిషత్ బోధ ఇవ్వకూడదు.

'దేవుడే లేడు - అంతా నేనే' - అను అభిప్రాయములు గల నాస్తికునికి, చేసిన సహాయం మరచి ఉండే కృతఘ్నుడికి (ఉదా: తల్లి తండ్రులు మొదలైన వారు చేసిన మేలు మరచి మాట్లాడే వానికి), భగవంతునిపట్ల (భక్తి ప్రపత్తులు లేక) తిరస్కారభావము కలవానికి, శాస్త్రముల కథా విషయములు - చారిత్రక విషయాల బురదలో ఇరుక్కొని ఆత్మ విచారణకు సంసిద్ధుడు కానివానికి, గురుభక్తి లేని వానికి ఎట్టి పరిస్థితులలోనూ ఈ ఉపనిషత్ జ్ఞాన విషయాలు ప్రబోధించరాదు. ఎందుకంటే అది వృధా ప్రయాసయే కాబట్టి.

మద్భక్తి విముఖాయా, సః శాస్త్రగర్తేషు ముహ్యతే,
గురుభక్తి విహీనాయ దాతవ్యం న కదాచన।
సేవాపరాయ శిష్యాయ హితపుత్రాయ, మారుతే!
మద్భక్తాయ సుశీలాయ కులీనాయ సుమేధసే,
సమ్యక్ పరీక్ష్య దాతవ్యం ఏవమ్ అష్టోత్తరగ్ం శతం।
యః పఠేత్, శ్రుణుయాత్‌వాపి స మామ్ ఏతి న సంశయః॥

ఓ మారుతీ! సేవా తత్పరత గల శిష్యులకు, హితమైన ప్రవర్తన గల పుత్రులకు, నా భక్తులకు, ఉత్తమ శీలము కలవారికి, ఉత్తమ కుల (జ్ఞాన) జాతులకు, గొప్ప మేధస్సు కలవారికి - ఇట్టి వారికి ..., వారి వారి యోగస్థితిని పరిశీలించి జ్ఞాన విషయాల పరాకాష్ఠను బోధించాలి.

ఎవ్వరు '108' ఉపనిషత్తులను పఠిస్తారో, (లేక) చక్కగా వింటారో, హృదయస్థం చేసుకుంటూ ఉంటారో, అట్టి వారు ఆత్మారాముడనగు నన్ను తప్పక పొందుచున్నారయ్యా! అనుమానమే లేదు.

---

**11.** **తత్ ఏతత్ ఋచా అభ్యుక్తమ్**
**విద్యా హవై బ్రాహ్మణమ్ ఆజగామ**
**"గోపాయమాం। శేవధిష్టే అహమస్మి।**
**అసూయకాయా అన్బజవే శఠాయ మా మా బ్రూయాత్।**
**వీర్యవతీ తథా అస్యామ్।**
**యమేవ ఏష విద్యా శ్రుతమ్, అప్రమత్తం, మేధావినం,**
**బ్రహ్మచర్య - ఉపపన్నం**
**అస్మాత్ ఇమామ్ ఉపసన్నాయ, సమ్యక్ పరీక్ష్య దద్యాత్**
**వైష్ణవీమ్, ఆత్మనిష్ఠామ్ ఇతి।**
**అథ హి ఏనం శ్రీరామచంద్రం**
**మారుతిః పప్రచ్ఛ:**
**"ఋగ్వేదాది విభాగేన పృథక్ 'శాంతిమ్'**
**అనుబ్రూహి...." ఇతి।**
**సహోవాచ శ్రీరామః**
**ఐతరేయ, కౌషీతకీ, నాదబిందు, ఆత్మబోధ,**
**నిర్వాణ, ముద్గల, అక్షమాలికా, త్రిపురా, సౌభాగ్య**
**బహ్వృచానామ్-ఋగ్వేద గతానాం.., దశ సంఖ్యా కానామ్ (10)**
**ఉపనిషదామ్ "వాక్ మే మనసి..." ఇతి శాంతిః॥**

**శ్లో॥ ఓం వాక్ మే మనసి ప్రతిష్ఠితా।**
**మనో మే వాచి ప్రతిష్ఠితమ్।**
**ఆవి రావీః మ ఏధి, వేదస్య మ ఆణీస్థః।**
**శ్రుతం మే మా ప్రహాసీః।**
**అనేన అధీతేన, అహోరాత్రాన్ సందధామి।**
**ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి।**
**తత్ మామ్ అవతు। తత్ వక్తారమ్ అవతు।**
**అవతు మామ్। అవతు వక్తారమ్।**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

**వేద ఋక్ వాక్ దేవత పలుకులు**

ఒకానొక సమయములో విద్యా దేవి - బ్రహ్మతత్త్వమును అధ్యయనము చేయుచున్న బ్రాహ్మణుల వద్దకు వెళ్ళి ఇట్లా చెప్పటం జరిగింది.

ఓ బ్రహ్మ తత్త్వమును ఎరుగుచున్న బ్రాహ్మణులారా! నన్ను మీరు మీ హృదయంలో ఉపాసించండి. నేను మిమ్ములను - ఒక చక్రవర్తి తన నిధులను కాపాడు తీరుగా - కాపాడుకుంటాను. పరస్పరము బ్రహ్మవిద్యాబోధ నిర్వర్తించండి.

అయితే ఒక నియమము విధిస్తున్నాను-వినండి. అసూయ కలవారికి, వంకర-టింకర కుటిల బుద్ధి గలవారికి, మోసము చేయు స్వభావము కలవారికి నన్ను బోధించకండి. నన్ను అప్పగించవద్దు. నేను మీ పట్ల వీర్యవతినై ఇష్ట - కామ్యములు తీరుస్తాను.

ఎవ్వరైతే వేద పఠనము చేస్తూ ఉంటారో, ఆత్మతత్త్వ జ్ఞానము విషయములో అప్రమత్తులై ఉంటారో, మేధావి అయి ఉంటారో, బ్రహ్మచర్య వ్రతస్థులై ఉంటారో, వారిని చక్కగా, పరీక్షించి బోధించాలి. అర్హులు అవునా? కాదా - అని పరీక్ష చేసి అప్పుడు మాత్రమే విష్ణు సంబంధమైన 'ఆత్మనిష్ఠ' (నేనే ఆత్మారాముడు - అను నిష్ఠను) బోధించాలి.

**ఆంజనేయుడు** : తండ్రీ! ప్రభూ! శ్రీరామచంద్రా! ఋగ్వేదము మొదలైన విభాగములలో వేరువేరు శాంతిపాఠముల గురించి దయతో వివరించండి.

**ఋగ్వేదాంతర్గత** - (అకారాదిగా) 1. అక్షమాలికా 2. ఆత్మబోధ 3. ఐతరేయ, 4. కౌషీతకీ, 5. త్రిపురా 6. నాదబిందు 7. నిర్వాణ 8. బహ్వృచ, 9. ముద్గల 10. సౌభాగ్యలక్ష్మీ - దశ ఉపనిషత్తులు.

**ఋగ్వేదాంతర్గత ఉపనిషత్ శాంతి పాఠము** : ఓ పరంధామా! నాయొక్క వాక్కు ఎల్లప్పుడు మనస్సునందు ప్రతిష్ఠితమై ఉండు గాక! నా మనస్సు వాక్కునందు నెలకొని ఉండు గాక! ఓ జ్యోతి స్వరూప పరమాత్మా! నా అజ్ఞానము తొలగించండి. జ్ఞాన ప్రకాశమును అనుగ్రహించండి. నా తెలివి (ఎరుక)ను సూక్ష్మము - సుతీక్ష్ణముగా తీర్చిదిద్దండి. నేను ఆత్మతత్త్వ సమాచార రూపముగా ఇప్పుడు వినుచున్నవి- ఇదివరకు విన్నవి మరుగున పడక జ్ఞాపకముండును గాక! నేను అధ్యయనము చేసిన గ్రంథములోని విశేషములు రాత్రింబవళ్ళు ఎల్లప్పుడూ అనుసంధానము చేసెదను గాక! యధార్థము - సత్యము అగు విషయమే మాట్లాడుదును గాక!

కరుణామయుడగు ఆ పరమాత్మ నన్ను రక్షించును గాక! నాకు స్వానుభవముగా బోధించుచున్న వక్తారుని (గురుని) కూడా సర్వదా రక్షించును గాక! నాపై ప్రేమచే పరమ సత్యమును వక్తారులు (గురువులు) నాకు బోధించెదరు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

12 ఈశావాస్య, బృహదారణ్యక, జాబాల, హంస,
పరమహంస, సుబాల, మంత్రికా, నిరాలంబ
త్రిశిఖీ బ్రాహ్మణ, మండల బ్రాహ్మణ,
అద్వయతారక, పైంగ్గల, భిక్షు,
తురీయాతీత, అధ్యాత్మ, తారసార, యాజ్ఞవల్క్య,
శాట్యాయనీ, ముక్తికానాం
శుక్లయజుర్వేదగతానాం, ఏకోనవింశతి (19) సంఖ్యాకానామ్
ఉపనిషదామ్ – "పూర్ణమదః" ఇతి శాంతిః।

> ఓం పూర్ణమ్ అదః। పూర్ణమ్ ఇదమ్। పూర్ణాత్ పూర్ణమ్ ఉదచ్యతే।
> పూర్ణస్య పూర్ణమ్ ఆదాయ, పూర్ణమేవ అవశిష్యతే।

ఓం శాంతిః శాంతిః శాంతిః।।

**శుక్లయజుర్వేంతార్గత ఉపనిషత్‌లు :** (అకారాదిగా) - 1. అధ్యాత్మ 2. అద్వయతారక 3. ఈశావాస్య, 4. జాబాల 5. తారసార 6. తురీయాతీత, 7. త్రిశిఖి బ్రాహ్మణ 8. నిరాలంబ 9. పరమహంస, 10. పైంగ్గల 11. భిక్షుక, 12. మండల బ్రాహ్మణ 13. మంత్రిక, 14. ముక్తిక 15. సుబాల 16. యాజ్ఞవల్క్య 17. శాట్యాయనీ, 18 హంస 19. బృహదారణ్యక

**శుక్లయజుర్వేంతార్గత ఉపనిషత్ శాంతి పాఠము :** ఆ పరమాత్మ సర్వదా పూర్ణుడు! ఇహాత్మ స్వరూపములగు ఈ జీవుడు - జగత్తులు కూడా పూర్ణమే! పరతత్త్వ పూర్ణము నుండియే ఇహతత్త్వ పూర్ణము బయల్వెడలుచున్నది. (ఇట్లు అగుచూ కూడా) పూర్ణము పూర్ణముగానే శేషించినదై ఉన్నది. ఇహాత్మగా ప్రత్యక్షమై ఉన్నప్పటికీ... పరమాత్మయొక్క పూర్ణత్వము చెక్కుచెదరుట లేదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

---

**13.** కఠవల్లి, తైత్తిరీయక, బ్రహ్మ, కైవల్య, శ్వేతాశ్వతర, గర్భ,
నారాయణ, అమృతబిందు, అమృతనాద, కాలాగ్ని రుద్ర
క్షురికా, సర్వసార, శుకరహస్య, తేజోబిందు,
ధ్యానబిందు, బ్రహ్మవిద్యా, యోగతత్త్వ,
దక్షిణామూర్తి, స్కంద, శారీరక,
యోగశిఖ, ఏకాక్షర, అక్ష్య, అవధూత, కఠరుద్ర,
రుద్రహృదయ, యోగకుండలినీ, పంచబ్రహ్మ,
ప్రాణాగ్నిహోత్ర, వరాహ, కలిసంతరణ,
సరస్వతీరహస్యానాం కృష్ణ యజుర్వేదగతానాం
ద్వాత్రింశత్ (32) సంఖ్యాకానామ్
ఉపనిషదామ్ 'సహనావవతు' ఇతి శాంతిః।

> 1) ఓం సహనావవతు। సహ నౌ భునక్తు। సహవీర్యం కరవావహై,
> తేజస్వినా అవధీతమస్తు। మా విద్విషావ హైః।
> ఓం శాంతిః శాంతిః శాంతిః।

> 2) ఓం – శం నో మిత్రః। శం వరుణః।
> శం నో భవత్ అర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః।
> శం నో విష్ణుః ఉరుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో।
> త్వమేవ ప్రత్యక్షమ్ బ్రహ్మాఽసి।
> త్వామేవ ప్రత్యక్షమ్ బ్రహ్మ వదిష్యామి।
> ఋతమ్ వదిష్యామి। సత్యమ్ వదిష్యామి।
> తత్ మామ్ అవతు। తత్ వక్తారమ్ అవతు।
> అవతు మామ్। అవతు వక్తారమ్।
> ఓం శాంతిః శాంతిః శాంతిః।।

**కృష్ణయజుర్వేంతార్గత ఉపనిషత్‌లు :** (అకారాదిగా) - 1. అమృత నాద 2. అమృత బిందు 3. అవధూత 4. అక్ష్యు 5. ఏకాక్షర 6. కలిసంతారణ 7. కఠవల్లీ (కఠోపనిషత్) 8. కఠరుద్ర 9. కాలాగ్ని రుద్ర 10. కైవల్య 11. గర్భ 12. తేజోబిందు 13. తైత్తిరీయ 14. దక్షిణామూర్తి 15. ధ్యాన బిందు 16. నారాయణ 17. పంచబ్రహ్మ 18. ప్రాణాగ్నిహోత్ర 19. బ్రహ్మ 20. బ్రహ్మ విద్యా 21. యోగకుండలినీ 22. యోగతత్త్వ 23. యోగశిఖ 24. వరాహ 25. శారీరక 26. శుక రహస్య 27. శ్వేతాశ్వతర 28. సరస్వతీ రహస్య 29. సర్వసార 30. స్కంద 31. రుద్రహృదయ 32. క్షురిక.

**32 ఉపనిషత్తుల - కృష్ణ యజుర్వేంతార్గత శాంతి పాఠము :** సత్యవస్తువగు ఆత్మ గురించి సంభాషించు కొనుచున్న గురు శిష్యులమగు మా ఇద్దరిని సర్వతత్త్వ స్వరూపుడు, కరుణామయుడు అగు పరమాత్మ రక్షించును గాక! మా ఇద్దరినీ దయతో పరిపోషించెదరు గాక! మేమిరువురము ఆత్మ తత్త్వమును **సంభాషించు - విను సామర్థ్యమును** కలిగి ఉండెదము గాక! మేము చెప్పుకొనుచున్నది విజ్ఞాన తేజోవంతమగును గాక! మేము పరస్పరము ద్వేషించుకొన కుండెదము గాక!

ఓ మిత్రదేవా! వరుణదేవా! ఈ దేహ-ఉపకరణమును ప్రసాదించుచున్న అర్యమదేవా (పితృదేవా)! ఇంద్రభగవన్! బృహస్పతీ! సద్గురువగు విష్ణుదేవాదిదేవా! మీరు మా ప్రాణ - అపానములను, నేత్రములను, బలమును, వాక్-బుద్ధులను, పాదములను - వీటినన్నిటినీ బ్రహ్మవిద్యకు అర్హముగా తీర్చిదిద్దుచూ, మాకు సమర్థత ప్రసాదించెదరు గాక! ఓ పరబ్రహ్మామా! నమస్కారము. ఓ వాయుదేవా! నమస్తే! మీరు మాకు ప్రాణేశ్వరులు! ప్రత్యక్షబ్రహ్మము అయి ఉన్నారు. మిమ్ములను ప్రత్యక్ష బ్రహ్మముగా చెప్పుకొనుచున్నాము.

సత్యవాక్కులను, సత్యమును మేము చెప్పుకొనుచున్నాము. ఆ పరమాత్మ గురుశిష్యులగు మా ఇద్దరినీ రక్షించును గాక! ఆత్మ గురించి చెప్పు సద్గురువులు ఆత్మతత్త్వము మాపై దయతో బోధించెదరు గాక! మా పట్ల మా సద్గురువులు మాటలు పలికెదరు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః।

14 కేన, ఛాందోగ్య, ఆరుణి,
మైత్రాయణి, మైత్రేయీ, వజ్రసూచిక,
యోగచూడామణి, వాసుదేవ, మహత్, సన్న్యాస,
అవ్యక్త, కుండికా, సావిత్రీ,
రుద్రాక్ష జాబాల, దర్శన, జాబాలీనాం,
సామవేదగతానాం
షోడశ (16) సంఖ్యాకానామ్ ఉపనిషదామ్...,

"ఓం ఆప్యాయన్తు మమ అంగాని", – ఇతి శాంతిః॥
ఆప్యాయంతు మమ అంగాని
వాక్ ప్రాణః చక్షుః శ్రోత్రం అథో (అథః)
బలం ఇంద్రియాణి చ సర్వాణి। సర్వమ్ బ్రహ్మ – ఔపనిషదమ్
మా అహం బ్రహ్మ నిరాకుర్యాం।
మా మా బ్రహ్మ నిరాకరోత్।
అనిరాకరణమ్ అస్తు। అనిరాకరణం మే అస్తు।
తత్ ఆత్మని నిరతే యే ఉపనిషత్సు ధర్మాః,
తే మయి సన్తు । తే మయి సన్తు।
ఓం శాంతిః శాంతిః శాంతిః॥

**సామవేదాంతర్గత ఉపనిషత్‌లు** : (అకారాదిగా) - 1. అవ్యక్త 2. ఆరుణిక 3. కేన 4. కుండిక 5. ఛాందోగ్య 6. జాబాల 7. దర్శన 8. మహత్ 9. మైత్రాయణి 10. యోగచూడామణి 12. వజ్రసూచిక 13. రుద్రాక్ష జాబాల 14. సన్న్యాస 15. సావిత్రి 16. వాసుదేవ

**సామవేదాంతర్గత ఉపనిషత్ శాంతిపాఠము** : ఉపనిషత్తులు ప్రబోధిస్తున్న పరమ సత్యము పొందుటకై మా అంగములన్నీ ఆప్యాయత కలిగి ఉండును గాక! వాక్కు, ప్రాణము, కళ్ళు, చెవులు, బలము, తదితర అన్ని ఇంద్రియములు అందుకు ప్రియముగా సహకరించుటకు సంసిద్ధమగును గాక! ఉపనిషత్ ప్రవచనమగు పరబ్రహ్మమును గ్రహించుటకు సంసిద్ధులమగుచున్నాము.

బ్రహ్మము నన్ను నిరాదరణ చేయకుండును గాక! నేను బ్రహ్మమును నిరాకరించ కుండునట్లు శ్రద్ధావంతుడనగుదును గాక! అనిరాకరణమే (బ్రహ్మముచే) సర్వకాల - సర్వావస్థలయందునూ సిద్ధించును గాక! నేను అనిరాకరణుడను (Non-Refusing and Non-Distracting) అయి ఉండెదను గాక!

నేను ఆత్మతత్త్వముపట్ల ఎల్లప్పుడూ నిరతుడను అయి ఉండెదను గాక! ఉపనిషత్తులు ఏ ఆత్మ దర్శనమును గానము చేయుచున్నాయో, అట్టి పాత్యాంశము నాయందు సుస్థిరతను పొందును గాక! సునిశ్చితమగును గాక! అనుభూతమగును గాక! అను నిత్యమగును గాక!

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

15 ప్రశ్న, ముండక, మాండూక్య, అథర్వ శిరో, అథర్వశిఖా,
బృహజ్జాబాల, నృసింహతాపనీ, నారదపరివ్రాజక, సీతా,
శరభ, మహానారాయణ, రామరహస్య, రామతాపనీ,
శాండిల్య, పరమహంస పరివ్రాజక, అన్నపూర్ణా,
సూర్యా, ఆత్మా, పాశుపత, పరబ్రహ్మ, త్రిపురా తాపినీ,
దేవీ, భావనా, భస్మజాబాల, గణపతి, మహావాక్య, గోపాలతాపినీ,
కృష్ణ, హయగ్రీవ, దత్తాత్రేయ, గరుడానామ్
అథర్వ వేదగతానాం ఏకత్రింశత్ (31)
సంఖ్యాకానామ్ ఉపనిషదామ్...,
'భద్రం కర్ణేభిః' – ఇతి శాంతిః॥

ఓం భద్రం కర్ణేభిః శ్రుణుయామ
దేవాః। భద్రం పశ్యేమ అక్షభిః
యజత్రాః। స్థిరైః అంగైః తుష్టు వాగ్ంసః తనూభిః।
వ్యసేమ దేవహితం యత్ ఆయుః।
స్వస్తి న ఇంద్రో వృద్ధ శ్రవాః।
స్వస్తి నః పూషా విశ్వవేదాః స్వస్తి న తార్క్ష్యో అరిష్టనేమిః।
స్వస్తి నో బృహస్పతిః దదాతు
ఓం శాంతిః శాంతిః శాంతిః। ఇతి శాంతిః॥

**అథర్వణవేదాంతర్గత ఉపనిషత్‌లు** : (అకారాదిగా) - 1. అథర్వశిఖ 2. అథర్వశిర 3. అన్నపూర్ణ 4. ఆత్మ 5. కృష్ణ 6. గణపతి 7. గరుడ 8. గోపాల 9. త్రిపుర తాపినీ 10. దేవీ 11. దత్తాత్రేయ 12. నారదపరివ్రాజక 13. నృశింహ తాపిని 14. పరమహంస పరివ్రాజక 15. పరబ్రహ్మ 16. పాశుపత బ్రహ్మ 17. ప్రశ్న 18. భావ 19. భస్మజాల 20. బృహత్ జాల 21. మహానారాయణ 22. మహావాక్య 23. మాండుక్య 24. ముండక 25. రామరహస్య 26. రామతాపినీ 27. శరభ 28. శాండిల్య 29. సీత 30 సూర్య 31. హయగ్రీవ

**అథర్వవేదాంతర్గత శాంతి పాఠము** : ఓ దేవతలారా! యజ్ఞభావులై మీచే ప్రసాదించబడిన ఈ మా చెవులతో భద్రమైన **(ఆత్మ) వస్తువు** గురించే వినుచుండెదము గాక!

మేము యజ్ఞభావులమై ఈ కళ్ళు ఉపయోగిస్తూ **భద్రము - క్షేమము** అగు **ఆత్మ వస్తువునే** దర్శించెదము గాక!

స్థిరమైన బలముతో కూడి ఈ అంగములతో ఆరోగ్యంగా ఉండి, యజ్ఞభావనతో (విహిత - శాస్త్రవిధిత - వేద విధిత )కర్మలు నిర్వర్తించెదము గాక! ఓ పరమాత్మా! మిమ్ములను స్తుతిస్తూ మాకు ప్రసాదించబడిన ఆయుష్షును గడపుచుండెదము గాక! ఉత్తమ శ్రవణము చేయగల పెద్ద చెవులు గల ఇంద్రుడు, విశ్వమును ఎరిగి వెలుగించుచున్న సూర్యనారాయణుడు, మిక్కిలి వేగము కలిగియున్న వాయుదేవుడు మాయొక్క ఆధ్యాత్మికభావములను పరిరక్షించుచుండెదరు గాక! దేవతల గురువగు బృహస్పతి మాకు విషయమును గ్రహించగల ఉత్తమ అవగాహన పొందుటకై సునిశిత బుద్ధిని ప్రసాదించెదరు గాక!ఆశీర్వదిస్తూ, సహకరించెదరు గాక!

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

| | |
|---|---|
| 16 **ముముక్షవః, పురుషాః**<br>**సాధన చతుష్టయ సంపన్నాః,**<br>**శ్రద్ధావంతం, సత్కులభవం,**<br>**శ్రోత్రియం, శాస్త్రవాత్సల్యం,**<br>**గుణవంతం, అకుటిలం,**<br>**సర్వభూతహితే రతం,**<br>**దయాసముద్రమ్ సద్గురుమ్**<br>**విధివత్ ఉపసంగమ - ఉపహార**<br>**పాణయ 'అష్టోత్తరశత ఉపనిషదం'**<br>**విధివత్ అధీత్య,**<br>**శ్రవణ - మనన - నిదిధ్యాసనాని**<br>**నైరంతర్యేణ కృత్వా,**<br>**పారబ్ధ క్షయాత్ దేహత్రయ**<br>**భంగమ్ (కృత్వా), ప్రాప్య -**<br>**ఉపాధి వినిర్ముక్త,**<br>**ఘటాకాశవత్ పరిపూర్ణతామ్ ఏతి-**<br>**విదేహ ముక్తిః**<br>**కైవల్య ముక్తిః ఇతి।**<br>**అత ఏవ బ్రహ్మలోకస్థా,**<br>**అపి బ్రహ్మముఖాత్ వేదాంత శ్రవణాది కృత్వా,**<br>**తేన సహ కైవల్యం లభంతే।**<br>**అతః సర్వేషాం 'కైవల్యముక్తిః'**<br>**జ్ఞానమార్గేణ ఉక్తా।**<br>**న కర్మ, సాంఖ్య, యోగ, ఉపాసనాదిభిః॥**<br>**.... ఇతి ఉపనిషత్।** | ఓ హనుమా! మానవ జన్మ అత్యంత దుర్లభము. **స్థూల సూక్ష్మ కారణ శరీర త్రయ బంధనముల నుండి విముక్తుడను నేను అవ్వాలి ....** అను ఆశయముతో ముముక్షువుగా సంసిద్ధుడు కావాలి. అట్టి ముముక్షువైనవాడు - ఆత్మ తత్త్వజ్ఞానము కొరకై సద్గురువును ఆశ్రయించాలి.<br>- సాధన చతుష్టయము (ఇంద్రియ నిగ్రహ రూప శమము - విచారణ - సంతోషము - సత్సంగము) కలిగి ఉన్నట్టి....,<br>- శ్రద్ధావంతుడైనట్టి, సత్కులజాతుడైనట్టి (సత్ వస్తువును ఎరిగిన పరంపరా సంబంధీకుడైనట్టి) ...,<br>- వేదతత్త్వము తెలిసి శ్రోత్రియుడైనట్టి...,<br>- శాస్త్రములపట్ల గౌరవము - వాత్సల్యము కలిగి ఉన్నట్టి....,<br>- గుణవంతుడు, కుటిలత్వము లేనివాడైనట్టి...,<br>- సర్వజీవుల క్షేమము కోరుకొనువాడగు....,<br>- దయాసముద్రుడు.... అయినట్టి **సద్గురువును** విధివిధాన పూర్వకముగా **సమీపించాలి**. నమస్కార పూర్వకంగా శరణు వేడాలి. '108' ఉపనిషత్తులు అధ్యయనము చేయాలి. శ్రవణము (వినటము - Hearing), మననము (ఆలోచించి తత్త్వార్థాన్ని బుద్ధిలో నిలపటము-Chanting), నిదిధ్యాస (ధ్యాసయందు నిలుపు కోవటము-Becoming)ల ద్వారా తత్త్వార్థాన్ని నిరంతరము, (ఎల్లప్పుడూ) ఉపాసించాలి. ప్రారబ్ధమును క్షయింపచేసుకొంటూ స్థూల - సూక్ష్మ - కారణదేహ సంబంధములను త్రెంచి వేయాలి. అటు తరువాత ప్రారబ్ధముగా ప్రాప్తించిన వర్తమాన ఉపాధి నుండి విముక్తుడై ఇక ఆతడు-కుండ పగిలినపుడు కుండలోని ఆకాశము మహాకాశమును కలియురీతిగా-సర్వాత్మకుడు పరిపూర్ణుడు అగుచున్నాడు. దేహపరిధులను దాటి, **విదేహముక్తుడు** అగుచున్నాడు. అదియే కైవల్య ముక్తి కూడా!<br>అట్టి '108' ఉపనిషత్తులు అధ్యయనము చేసిన జ్ఞాని బ్రహ్మలోక నివాసము పొందుచున్నాడు. పరబ్రహ్మ స్వరూపానుభవి-సృష్టికర్తయగు బ్రహ్మదేవుని ముఖతః వేదాంత శ్రవణము చేసినవాడై-అద్దానిచే **కైవల్యపదము** సిద్ధింపజేసుకుంటున్నాడు.<br>ఈవిధంగా **'కైవల్యముక్తి'** అనునది జ్ఞానమార్గములోనే సాధ్యము అగుచున్నదని చెప్పబడుచున్నది. అట్టి కైవల్యము కర్మ-సాంఖ్య-యోగోపాసనలతో సిద్ధించటములేదు. అవన్నీ 'జ్ఞానము'నకు దారితీయుచుండగా 'ఆత్మజ్ఞానము'చే కైవల్యము సిద్ధించగలదు. ఇతి - ఉపనిషత్ వాణి। |
| **<u>ద్వితీయోధ్యాయః</u>**<br>1. **అథ హ ఏనం శ్రీరామచంద్రం**<br>**మారుతిః పప్రచ్ఛ :**<br>**కే అయం జీవన్ముక్తిః?**<br>**కే అయం విదేహముక్తిః?**<br>**కిం వా తత్ర ప్రమాణం?**<br>**కథం వా తత్ సిద్ధిః?**<br>**సిద్ధ్యా వా కిం ప్రయోజనం? ఇతి॥** | **ద్వితీయాధ్యాయము**<br>**మారుతి (ఆంజనేయస్వామి)** : హే రామయ్యా! ఆత్మానంద స్వరూపా! జీవన్ముక్తి అనగా ఏది? విదేహ ముక్తి - అనగా?<br>ఈ రెండు ముక్తులకు ప్రమాణము ఏమిటి? ఆ రెండూ ఏవిధంగా సిద్ధిస్తాయి? అవి సిద్ధించటముచేత వచ్చే ప్రయోజనము ఏమిటి?<br>**శ్రీరామచంద్రుడు** : ఈ జీవునియొక్క చిత్తము<br>- నేను కర్తను! నేను భోక్తను!<br>- సుఖ దుఃఖములు అనుభవించువాడను....,<br>- దృశ్యమునకు పరిమితుడైనవాడను...,<br>ఇటువంటి లక్షణాలన్నీ కలిగి ఉంటోంది. అది చిత్తము యొక్క ధర్మము. ఇప్పుడు ఈ జీవుడు చిత్తము యొక్క ఆయా ధర్మములను తన స్వరూపముపై |

సహోవాచ శ్రీరామః

పురుషస్య కర్తృత్వ – భోక్తృత్వ,

సుఖ – దుఃఖాది లక్షణః చిత్త ధర్మః...,

క్లేశ రూపత్వాత్ 'బంధో' భవతి।

తత్ నిరోధనం 'జీవన్ముక్తిః'॥

ఉపాధి వినిర్ముక్త, ఘటాకాశవత్

ప్రారబ్ధ క్షయాత్ 'విదేహముక్తిః'॥

జీవన్ముక్తి – విదేహముక్త్యోః

అష్టోత్తర శతోపనిషదః ప్రమాణమ్॥

కర్తృత్వ (భోక్తృత్వ) – ఆది దుఃఖ నివృత్తి ద్వారా

"నిత్యానంద అవాప్తిః

ప్రయోజనం భవతి॥

తత్ పురుషప్రయత్నే సాధ్యో భవతి।

ఆపాదించుకొంటున్నాడు. ఫలితంగా అనేక క్లేశములు తెచ్చిపెట్టుకొని బంధము కలిగినవాడగుచున్నాడు. అట్టి బంధనములను నిరోధించటమే "జీవన్ముక్తి".

ఒకచోట గల కుండలో ఉన్న ఆకాశము - ఆకుండ పగిలినప్పుడు ఏమౌతుంది? అంతటా ఉన్న మహాకాశముతో ఏకమగుచున్నది కదా! ప్రారబ్ధము క్షయించగా ఉపాధి నుండి విముక్తుడు అయి, ఈ జీవాత్మ పరమాత్మతో ఏకము కావటమే విదేహముక్తి.

ఇక జీవన్ముక్తికి - విదేహముక్తికి ప్రమాణము ఏమిటంటావా? '108' ఉపనిషత్తులలో చెప్పబడిన విశేషములే.

(నాటకంలో ఒకడు ఒక పాత్రగా నటిస్తూ ఉంటే... ఆ పాత్రయొక్క కర్తృత్వ భోక్తృత్వాలు ఆ కళాకారునికి చెందినవి అవుతాయా? అవవు. అట్లాగే) ఈ జీవుడు కర్తృత్వ-భోక్తృత్వములచే పొందుచున్న దుఃఖములు తొలగటము - ద్వారా **నిత్యానంద ప్రాప్తి** సిద్ధించటమే **జీవన్ - విదేహముక్తుల ప్రయోజనము.**

అట్టి జన్మ - కర్మ సంబంధములను అధిగమించివేసినట్టి - అతీతమైనట్టి నిత్యానందము సిద్ధింపజేయు జీవన్ముక్తి, విదేహముక్తి ఎట్లా లభిస్తాయి?

**పురుషప్రయత్నము చేతనే!**

---

2. యథా....,

పుత్ర కామేష్టినా... పుత్రం,

వాణిజ్యాదినా .... విత్తం,

జ్యోతిష్టోమేన .... స్వర్గం,

తథా ....,

పురుష ప్రయత్న సాధ్య, వేదాంత

– శ్రవణ ఆది జనిత సమాధినా

జీవన్ముక్త్యాది లాభో భవతి।

'సర్వ వాసనా క్షయాత్' – తత్ లాభః।

అత్ర శ్లోకాః।

1. ఉచ్ఛాస్త్రం 2. శాస్త్రితం చ ఏతి

పౌరుషం ద్వివిధమ్ మతమ్।

తత్ర 'ఉత్ – శాస్త్రమ్' అనర్థాయ,

పరమార్థాయ .... శాస్త్రితమ్।

లోక వాసనయా జంతో, శాస్త్ర

వాసనయాఽపి చ,

దేహవాసనయా

జ్ఞానం యథా తత్

న ఏవ జాయతే।

ఏవిధంగా అయితే ...,

పుత్రకామేష్టి యాగము చేయడంచేత ... సంతానము,

వ్యాపారము చేయటము చేత ... ధనము,

'జ్యోతిష్టోమము' మొదలైన యజ్ఞయాగములచేత ... స్వర్గలోకము...,

.... ఇవన్నీ లభిస్తున్నాయో, అదేవిధంగా 'పురుషప్రయత్నం' చేతనే ఒకడు వేదాంత శాస్త్రము వినడానికి అర్హుడు అగుచున్నాడు. అట్టి శ్రవణముచేత జీవ - బ్రహ్మైక్య రూపమగు, **ద్రష్ట - దృశ్య ఐక్య రూపము** - అనే సమాధిస్థితి, జీవన్ముక్తి మొదలైనవి లభిస్తున్నాయి. సర్వ వాసనల క్షయము జీవన్ముక్తి వలన వచ్చే లాభమని విజ్ఞులు గానము చేస్తూ చెప్పుచున్నారు.

ప్రతి జీవుడు దేహముతో పురుష ప్రయత్నము ఏదో ఒకటి చేస్తూనే ఉన్నాడు. అయితే పురుషప్రయత్నం రెండు తీరులుగా ఉంటోంది.

**ఉత్ (అసత్) శాస్త్రీయము:** జీవితాశయమగు ఆత్మతత్త్వమును తెలుసుకొనే మార్గమును, శాస్త్రములు చెప్పే సూచనలు **ప్రక్కగా పెట్టి**, ఇంద్రియ - **దృశ్య వ్యవహారములకు సంబంధించి ఏదో పొందాలని చేసే పురుష - ప్రయత్నములు.**

**సత్-శాస్త్రీయము** : సశాస్త్రీయంగా ఆత్మతత్త్వ జ్ఞానము ముఖ్యాశయముగా కలిగి ఉండి, ఇక అప్పుడు చేయు **పురుష ప్రయత్నము.**

ఉత్ శాస్త్రీయ పురుష ప్రయత్నములు (ఆత్మశాస్త్ర వ్యతిరిక్త ప్రవర్తనలు) **అనర్థము** కొరకే అగుచున్నది.

సత్ శాస్త్రీయ పురుష ప్రయత్నములు **పరమార్థమగు జీవన్ముక్తి - విదేహముక్తులకు** దారి చూపుచున్నాయి.

లోక వాసనలను, శాస్త్రవాసనలను, దేహవాసనలను కొనసాగించుచూ చేయు పురుష ప్రయత్నములు **"యథాతథస్వరూపము"** అయి ఉన్న స్వస్వరూపాత్మ జ్ఞానము వైపుగా ఈ జీవుని నడిపించజాలవు - అని గుర్తు చేస్తున్నాను.

3. **ద్వివిధో వాసనా వ్యూహః**
**1. శుభశ్చైవ, 2. అశుభశ్చతే।**
**వాసనౌఘేన శుద్ధేన తత్రచేత్**
**అనునీయసే।**
**తత్ క్రమేణాశు తేనైవ**
**మామకమ్ పదమ్ ఆప్ను హి॥**
**అథచేత్ అశుభో భావః**
**త్వాం యోజయతి సంకటే,**
**ప్రాక్తనః తత్ అసౌ యత్నాత్**
**జేతవ్యో భవతా, కపే!**
**శుభ–అశుభాభ్యాం మార్గాభ్యాం**
**వహంతి వాసనా సరిత్।**
**పౌరుషేణ ప్రయత్నేన**
**యోజనీయా శుభే పథి।**
**అశుభేషు సమావిష్టం**
**శుభేష్వేవ అవతారయేత్।**
**అశుభాత్ చాలితం యాతి**
**శుభమ్ తస్మాత్ అపీతరత్।**
**పౌరుషేణ ప్రయత్నేన**
**లాలయేత్ చిత్తబాలకమ్॥**
**ద్రాగభ్యాస వశాత్ యాతి**
**యదా తే వాసనోదయమ్,**
**తత్ అభ్యాసస్య సాఫల్యమ్**
**విద్ధి త్వమ్, అరిమర్దన!**

ఓ ప్రియ హనుమా! ఈ జీవుడు పుట్టుకతోనే రెండు రకాల వాసనలు తనవెంట తెచ్చుకుంటున్నాడు. 1. శుభ వాసనలు 2. అశుభవాసనలు. ఇక వాటితో జీవితమును గడుపుచున్నాడు. ఇప్పుడు ఏమి చేయాలి? **శుభవాసన**లకు సంబంధించిన పురుష ప్రయత్నములను అధికం చేసుకుంటూ, **అశుభ వాసన**లను క్రమంగా జయిస్తూ, త్యజిస్తూ రావాలి.

ఈవిధంగా శుభవాసనలను వృద్ధి చేయు పురుష ప్రయత్నములను క్రమక్రమంగా వృద్ధి చేసుకుంటూ వస్తే, ఇక అశుభవాసనా సంబంధమైన పురుష ప్రయత్నములు సన్నగిల్లుతూ వస్తాయి. అప్పుడు ఆ జీవుడు నాయొక్క "ఆత్మారామపదము"ను తప్పక పొందగలవు.

ఓ ప్రియ కపీశ్వరా! హనుమా! ఒకవేళ ఇతఃపూర్వపు అశుభవాసనలు నిన్ను ఆకర్షించుచూ, సంసార సంబంధమైన పురుషకారములవైపు ఆకర్షిస్తూ ఉంటే, అప్పుడు ఆ ప్రాక్తన (ఇతః పూర్వపు) కర్మవాసనలను వర్తమాన (ఆద్యతన) పురుషప్రయత్నముల సహాయముతో జయించివేయాలయ్యా!

ఇతః పూర్వపు సంస్కారరూప వాసనలు అనే ప్రవాహము 1. శుభమార్గము 2. అశుభమార్గము అను రెండు మార్గములలో ప్రవహిస్తున్నదని ఈ జీవుడు గమనించాలి సుమా! అప్పుడిక పురుష ప్రయత్నముతో ఇప్పుడు అశుభ మార్గమును నిరోధించాలి. శుభ మార్గములోనికి (వర్తమాన పురుష ప్రయత్నముల ద్వారా) సంస్కారములను (వాసనలను) మరల్చాలి. శుభ ప్రయత్నములవైపు ప్రవహింపజేయాలి. శుభవాసనలను ప్రవృద్ధం చేసుకోవాలి.

అశుభ మార్గములో చొచ్చుకుపోయి ఉన్నట్టి పురుష ప్రయత్నములను ఏదో ఒక ఉపాయములతో, వెనుకకు మరల్చి, ఆ పురుష ప్రయత్నములను శుభమార్గములో నియోగించాలి. అశుభ మార్గములో పోవుచున్న మనస్సును విజ్ఞులు - శాస్త్రములు చెప్పే సాధనల సహాయంతో శుభమార్గములోనికి క్రమంగా మరల్చాలి.

ఈ చిత్తము అనే బాలుడు అల్లరి చిల్లరిగా అశుభ మార్గములలో పరుగులు తీస్తున్నాడు. ఇప్పుడు ఈ జీవుడు మానవ జన్మకు వచ్చాడు కదా! అందుచేత, ఆయా ప్రయత్నములతో పురుషకారముతో ఈ చిత్త బాలకుణ్ణి లాలించి, బుజ్జగించి అశుభ పురుషాకారము నుండి పిలుచుకొచ్చి, శుభపురుషకారములలో క్రమంగా నియమించాలి.

ఓ శత్రు భయంకరా! హనుమా! ఇతః పూర్వపు ఇంద్రియ విషయములను ఆస్వాదించుటలో పెంపొందిన వాసనలనుండి ఈ చిత్తమును శుభ అభ్యాసములవైపు మరల్చగలిగినవాడే యోధుడు! విజయుడు! వీరుడు! శత్రుమర్దనుడు!

---

4. **సందిగ్ధాయామ్ అపి భృశం**
**'శుభామ్' ఏవ సమాచరేత్।**
**శుభాయాం వాసనా వృద్ధౌ**
**న దోషాయ, మరుత్సుతా!**
**1. వాసనాక్షయ 2. విజ్ఞాన**
**3. మనోనాశా, మహామతే!**
**సమకాలం చిరాభ్యస్తా**
**భవంతి ఫలదా మతాః॥**
**త్రయమ్ ఏతే సమం యావత్**
**న అభ్యస్తా చ పునః పునః,**

ఓ ఆంజనేయా! ఒకవేళ - **"నా చిత్తము అశుభ వాసనలు కలిగి లేవు కదా? ఉన్నాయంటారా?"** - అనే సందిగ్ధము నీలో ఉన్నప్పుడు కూడా, నీవు శుభ పురుషకారములను వదలవద్దు. కొనసాగించవలసిందే! ఎందుకంటావా? ఓ వాయుపుత్రా! విను. శుభ వాసనల సంవృద్ధి, ప్రభావముచేత అశుభవాసనలు ముందు ముందు కూడా నిన్ను సమీపించలేవు. నీపట్ల దోషక్రమము రూపు దిద్దుకోకుండా నశిస్తుంది.

ఓ మహామతీ! 1. వాసనాక్షయము 2. ఆత్మ జ్ఞానము 3. మనోనాశనము.

ఈ మూడూ కూడా ఈ జీవుడు ఒకేసారి అభ్యసించాలయ్యా! అప్పుడు ఆత్మతత్త్వానుభవము ఫలప్రదమౌతుంది. విడివిడిగా ఒక్కొక్కటి అభ్యసిస్తే ఉత్తమ ఫలము లభించదు.

| | |
|---|---|
| **తావత్ న పద సంప్రాప్తిః**<br>**భవతి అసమా శతైః।**<br>**ఏకైకశో నిషేవ్యంతే**<br>**యద్యేతే చిరమపి అలమ్**<br>**తత్ న సిద్ధిం ప్రయచ్ఛంతి**<br>**మంత్రాత్ సంకీర్ణితా ఇవ।**<br>**త్రిభిః ఏతైః చిరాభ్యస్తైః**<br>**హృదయ గ్రంథయో దృఢాః**<br>**నిశ్శంకమేవ తృట్యంతి**<br>**బిస చ్ఛేదాత్ గుణా ఇవ।**<br>**జన్మాంతర శతాభ్యస్తా**<br>**మిథ్యా సంసార వాసనా**<br>**సా చిరాభ్యాస యోగేన**<br>**వినా న క్షీయతే క్వచిత్॥** | **ఎంతెంతవరకైతే 1) వాసనాక్షయము 2) ఆత్మజ్ఞాన సముపార్జనము, 3) మనో నాశనము... అను మూడూ ఈ జీవుడు మరల మరల (ఒక్కసారే) అభ్యసించడో, అంతంత వరకు ఈ జీవునికి ఆత్మపద ప్రాప్తి, వంద జన్మలెత్తినా ఆత్మారామ స్థానము లభించదు.**<br>మంత్రమును - అర్థమును - ఉద్దేశ్యమును తెలుసుకొని పఠిస్తేనే ఉత్తమ ప్రయోజనము కదా! అట్లాగే పై మూడు ఒక్కసారే చిరకాలము అభ్యసించకపోతే రామబ్రహ్మానందము అనే సిద్ధిని ఈ జీవుడు పొందనే లేడయ్యా!<br>ఒక తామరతూడును ఛేదిస్తూ ఉంటే అందులోని దారము కూడా తెగిపోతుంది కదా! అట్లాగే వాసనా క్షయము-ఆత్మ జ్ఞానము-మనోలయములనే '3' అభ్యాసములు ఒక్కసారే నిర్వర్తిస్తూ ఉండగా హృదయములోని గ్రంధులు (చిక్కుముళ్లు), రాగద్వేష మోహ దోషములు, అవిద్య - ఆవరణ - విక్షేప త్రివిధ మాయలు, పుత్రేషణ - ధనేషణ - దారేషణ త్రివిధ ఈషణములు, ఆధ్యాతిక - ఆధిదైవిక - ఆధి భౌతిక దుఃఖములు (త్రివిధ తాపములు) ... ఇవన్నీ ముడి వీడుతాయి. సర్వశంకలు (అనుమానాలు) (If there is constant practice) తొలగుతాయి.<br>జీవుడు జన్మజన్మాంతరాలుగా అసంఖ్యాక మిథ్యాసంసార వాసనలు అభ్యాసవశంగా మూటలు కట్టుకొని తన సంస్కార శరీరము (కారణ శరీరము) నందు దాచుకుంటూ పోతున్నాడు. అవన్నీ చిరకాలము అభ్యాసమును ఆశ్రయించకపోతే క్షీణించవు. |
| **5. తస్మాత్, సౌమ్య! ప్రయత్నేవ, పౌరుషేన వివేకినా,**<br>**భోగేచ్ఛాం దూరతః త్యక్త్వా,**<br>**త్రయమేవ సమాశ్రయ।**<br>**తస్మాత్ వాసనయా యుక్తమ్**<br>**'మనోబద్ధమ్' విదుః బుధాః।**<br>**సమ్యక్ వాసనయా త్యక్తం**<br>**'ముక్తమ్' - ఇతి అభిధీయతే।**<br>**మనో నిర్వాసనీ భావమ్**<br>**ఆచరాశు, మహాకపే!**<br>**సమ్యక్ ఆలోకనాః సత్యాత్**<br>**వాసనా ప్రవిలీయతే।**<br>**వాసనా విలయే చేతః**<br>**'శమమ్' ఆయాతి దీపవత్।**<br>**వాసనాం సం పరిత్యజ్య**<br>**మయి చిత్ - మాత్ర విగ్రహే,**<br>**యః తిష్ఠతి గతవ్యగ్రః**<br>**సోఽహమ్ సత్ చిత్ సుఖాత్మకః।**<br>**సమాధిమ్ అథ కర్మాణి**<br>**మా కరోతు కరోతువా,**<br>**హృదయేన ఆత్త సర్వేహో**<br>**ముక్తఏవ ఉత్తమాశయః॥** | అందుచేత ఓ సౌమ్యా! ప్రియ హనుమా! **"శాస్త్ర సూచనానుసారంగా ప్రయత్నించటము"** అనే వివేకముతో కూడిన కార్యక్రమమును ఆశ్రయించి, ఈ జీవుడు భోగేచ్ఛలన్నీ సుదూరముగా వదలివేయును గాక! నేను చెప్పిన త్రయీ (3) సాధనములకు ఉపక్రమించి భోగేచ్ఛలను త్యజించు **బుద్ధిబలమును** పెంపొందించుకొనును గాక!<br>ఈ జీవుడు వాస్తవానికి ఆత్మారామ స్వరూపుడే కదా! మరి 'బంధము' అనునది ఎక్కడి నుండి వచ్చి ఇక్కడికి దిగుమతి అవుతోంది? దీనికి సమాధానము - **వాసనలతో కూడియున్న మనస్సే బంధమునకు కారణము** - అని బుధుల (విజ్ఞుల) అభిప్రాయము. ప్రయత్నశీలుడవై మనస్సు నుండి వాసనలను తొలగించావా, ... అదియే 'ముక్తి' అని పిలువబడుతోంది. (వాసనలు = Tendency of Feelings & opinions about worldly appearences and incidents)<br>ఓ మహా కపీ! ఏదో ఒక ఉపాయంతోనో, కొన్ని ఉపాయాల సహాయంతోనో మనస్సును ఎంత త్వరగా వాసనా రహితము చేసుకుంటే అంతగా మంచిది.<br>అయితే మనస్సు నుండి వాసనలు తొలగడానికి మార్గమేమిటి? ఉపాయమేమిటి? విను. ఈ కల్పిత జగత్తును అధిగమించి సర్వే సర్వత్రా **సత్యముగు, సమముగు** ఆత్మయొక్క సందర్శనాభ్యాసముచే వాసనలు త్వరగా వాటికవే తొలగుతాయి.<br>వాసనల విలయము చేత 'చిత్తము' (అభిరుచి) అనబడునది - తైలము (నూనె) లేని దీపమువలె శమించగలదు. వాసనలు పూర్తిగా పరిత్యజించబడినాయా, ఇక ఆతడు అన్ని ఆదుర్దాలు, దిగుళ్ళు వదలివేసినవాడై, నా సత్ చిత్ రామానంద స్వరూపమునందు ప్రకాశించి, తానే నేనై, చిదానంద స్వరూపుడై, సత్ చిత్ ఆనంద సుఖమును అనుభవించగలడు.<br>ఆతడు ఏ వేగిరపాటూ లేనివాడై రామానంద సాగరమునందు ఆనంద తరంగమై విహరించగలడు.<br>ఒకడు కర్మలన్నీ త్యజించి సమాధి నిష్ఠుడై ఉండవచ్చు గాక! లేదా అనేక కర్మలు నిర్వర్తించుచూ ఉండవచ్చు గాక! **సర్వ ప్రాపంచక సంబంధములు హృదయములో రహితము చేసుకొని, ఉత్తమాశయమును ఆశ్రయించినవాడు సర్వదా ముక్తుడేనయ్యా!** |

6. **నైష్కర్మ్యేణ న తత్స్య అర్థః,**
**తస్య అర్థో అస్తి న కర్మ భిః।**
**న సమాధాన జాప్యాభ్యాం**
**యస్య నిర్వాసనం మనః।**
**సంత్యక్త వాసనాన్ మౌనాత్**
**ధృతే నాస్తి ఉత్తమం పదమ్।**
**వాసనా హీనమపి ఏతః**
**చక్షురాది ఇంద్రియః స్వతః।**
**ప్రవర్తతే బహిః స్వార్థే**
**వాసనామాత్ర కారణమ్।**
**అయత్నా ఉపనతేషు అక్షిః దృక్ ద్రవ్యేషు**
**యథా పునః...,**
**నీరాగమేవ పతతి**
**తద్వత్ కార్యేషు ధీర ధీః।**
**భావ సంవిత్ ప్రకటితా**
**మనురూపాం చ మారుతే!**
**చిత్తస్య ఉత్పత్తి ఉపరమం**
**హంసవా మునయో విదుః।**
**దృఢాభ్యస్త పదార్థైక భావనాత్**
**అతి చంచలమ్,**
**చిత్తం సంజాయతే జన్మ,**
**జరా మరణ కారణమ్।**

ఎవని మనస్సైతే **ప్రాపంచక సంబంధిత సంగతులు, సందర్భములు, సంబంధములపట్ల వాసనా శూన్యమై ఉంటుందో,...** అట్టి ఆత్మతత్త్వ జ్ఞానికి,
- కర్మలు చేయకపోవడం చేతగాని,
- కర్మలు చేయుచుండుట చేతగాని,
- 'సమాధి' అనే **సమాధాన యోగాభ్యాసము చేతగాని,**
- జప - తపములు చేయుటచేతగాని, (లేక) చేయకపోవుట చేతగాని,

... **క్రొత్తగా రావలసిన ప్రయోజనమూ ఉండదు. రాని ప్రయోజనమూ లేదు.**

**"మనస్సును వాసనలను త్యజించి వేయుగా అప్పుడు ప్రశాంతమగు మౌనము వహించి ఉండటము"...** అనే స్థితిని మించిన పదము మరొకటి ఏదీ లేదు. ఉండదు.

ఈ కళ్ళు - చెవులు మొదలైన ఇంద్రియములు స్వతఃగా వాసనాశూన్యములు. (ఎందుకంటే అవి ఉపయోగించబడు ఉపకరణముల వంటివి మాత్రమే కదా!) అయితే బహిర్గతమై విషయములను ఆశ్రయించటానికి పదార్థములను స్వీకరించటానికి కారణము ఎవరు? ఈ జీవునియొక్క పూర్వ వాసనలే!

ఏవిధంగా అయితే స్వతఃగా జడము అయినట్టి ఈ కళ్ళు - చెవులు మొదలైన ఇంద్రియములు ఆయా పదార్థములపై వ్రాలి కూడా విషయానుభవము (బాగున్నది - బాగోలేదు - కావాలి - వద్దు ... మొదలైన భావములు) అవి స్వతఃగా పొందకయే వర్తిస్తున్నాయో...,

ఆ విధంగా, ధీరుడగు జ్ఞాని తాను పాల్గొనుచున్న కార్యక్రమములయందు రాగ రహితుడై ప్రవర్తించుచున్నాడు. అజ్ఞానియో, రాగముతో కూడి ప్రవర్తిస్తున్నాడు. వారిద్దరి భేదము ఇంత వరకే!

ఓ మారుతీ! జ్ఞాని తనయొక్క చిత్తములో భావములను అనుసరించి ఈ దృశ్య జగత్తులో ప్రవర్తిస్తూ ఉన్నప్పటికీ కూడా, "హంస" (క్షీర భాగమును స్వీకరిం - జల భాగము విడచుట) వలె, ఆత్మతత్త్వమును గ్రహించి, ఇక తదితరమైనదంతా అతడే త్యజించివేసినవాడై ఉంటున్నాడు.

ఇక ఆత్మతత్త్వము ఏమిటో ఎరుగని అజ్ఞాని విషయానికి వస్తే.... ఆతని చిత్తము పదార్థభావనలను అవిశ్రాంతంగా ఆశ్రయించి ఉండటంచేత - అనుక్షణము అతి చంచలమై ఉంటోంది. అట్టి చంచల చిత్తము జన్మ - జరా - మరణములకు కారణములను జనింపజేసుకుంటూ పోతోందయ్యా!

---

7. **వాసనా వశతః**
**ప్రాణః స్పందః, తేన చ వాసనా,**
**క్రియతే చిత్తబీజస్య**
**తేన బీజాంకుర క్రమః।**
**ద్వే బీజే చిత్త వృక్షస్య**
**1) ప్రాణ స్పందన, 2) వాసనే।**
**ఏకస్మింశ్చ తయో క్షీణే**
**క్షిప్రం ద్వే అపి నశ్యతః।**
**అసంగ వ్యవహారత్వాత్**
**భావభావన వర్జనాత్।**
**శరీర నాశ దర్శిత్వాత్**

వాసనల కారణంగానే ప్రాణ స్పందన ఏర్పడుతోంది. ఆపై, ప్రాణ స్పందన వలన తిరిగి వాసనలు ఏర్పడుచున్నవగుచున్నాయి.

ఈవిధంగా "బీజములోంచి వృక్షము, తిరిగి వృక్షములో నుండి బీజము" వలె - చిత్త బీజమునుండి ప్రాణస్పందన, - ప్రాణస్పందనచేత వాసనలు (చిత్తరూపము) ఏర్పడుచున్నాయి. కాబట్టి 1. వాసనలు 2. ప్రాణస్పందన ... ఈ రెండిటిలో ఒకటి క్షయిస్తే, అతి త్వరగా రెండవది కూడా నశించడం జరుగుతోంది. 'చిత్తము' అనే వృక్షమునకు రెండు బీజములు 1. ప్రాణ స్పందన 2. వాసనలు. ఈ రెండు కలిసి ఉంటేనే 'చిత్తము' ఉంటుంది. ఒక్కటి నశిస్తే రెండవది నశిస్తోంది. చిత్తము నశిస్తుంది.

ఓ మారుతాత్మజా! సంగరహితముగా ప్రాపంచక వ్యవహారములను నిర్వర్తిస్తూ సందర్భములను దర్శించటముచేత భావ - అభావ సంసారము సన్నగిల్లుచున్నది.

దృశ్యములోని వస్తువులన్నీ కాలతః నాశనశీలమే కదా! అట్లాగే ఈ శరీరము కూడా! ఈ శరీరము అతి త్వరలో నశించబోవు వస్తువుగా దర్శించటముచేత 'వాసనలు' తీవ్రతను కోల్పోసాగుతాయి.

**వాసనా న ప్రవర్తతే।**
**వాసనా సంపరిత్యాగాత్**
**చిత్తం గచ్ఛతి అచిత్తతామ్।**
**అవాసనత్వాత్ సతతం**
**యదా న మనుతే మనః।।**
**అమనస్తాత్ తత్ ఉదేతి**
**పరమ ఉపశమప్రదా।**
**అవ్యుత్పన్నమ్ మనా యావత్**
**భవాత్ అజ్ఞాత తత్పదః।**
**గురు శాస్త్ర ప్రమాణైస్తు**
**నిర్ణీతం తావత్ ఆచర।**

వాసనలు పరిత్యజించబడినప్పుడు ఇక ఈ చిత్తము **అచిత్తముగా** అగుచున్నది.

వాసనలు నశించుచుండగా మనస్సు **సంకల్పరహితమై** ఉంటుంది. మనస్సు మననము సంత్యజించుచున్నది. ఇక అది **అమనస్కము** అగుచున్నది.

మనస్సు శమించుటచే సిద్ధించు అమనస్కముచే జగత్తు ఉపశమించినదై పరమ విశ్రాంతి రూపమగు పరమపదము లభించుచున్నది.

**"అవిషయ - భావాభావ వివర్జిత అమనస్కము"** వ్యుత్పత్తి కానంత వరకు స్వస్వరూపమగు ఆత్మారామ పదము అనుభవమునకు రాదు.

కనుక ఓ పవన తనయా! ఆంజనేయా! గురు శాస్త్ర ప్రమాణములచే ఆత్మభావనా యోగస్థితి లభించనంతవరకు (జగత్తు ఆత్మగా అనుభూతము కానంత వరకు) **జగత్ భావ ఉపశమన రూపమగు అమనస్కయోగము**ను ఈ జీవుడు అభ్యసిస్తూ ఉండటమే ఉచితము. అందుకు శుభవాసనలు ఆశ్రయిస్తూనే ఉండాలి. అశుభ-వాసనలను జయించుటయందు ప్రయత్నశీలుడై ఉండక తప్పదు.

---

8. **తతః పక్వకషాయేన**
**నూనం విజ్ఞాత వస్తునా,**
**శుభోఽపి అసౌ త్వయా త్యాజ్యో**
**వాసనౌఘో నిరాధినా।**
**ద్వివిధః చిత్తనాశోఽస్తి**
**1. సరూపో 2. అరూప ఏవ చ।**
**జీవన్ముక్తౌ సరూపస్యాత్,**
**అరూపో దేహముక్తిగః।**
**అస్య నాశమ్ ఇదానీం త్వం, పావనే శ్రుణు**
**సాదరమ్! చిత్త నాశ అభిధానం హి**
**యదా తే విద్యతే పునః,**
**మైత్ర్యాదిభిః గుణైః యుక్తః**
**శాంతిమ్ ఏతి న సంశయః।**
**భూయో జన్మ వినిర్ముక్తం**
**జీవన్ముక్తస్య తన్మనః।**
**సరూపోఽసౌ మనో నాశో**
**జీవన్ముక్తస్య విద్యతే।**
**అరూపస్తు మనోనాశో**
**వైదేహీ ముక్తిగో భవేత్।**

ఆవిధంగా గురు-శాస్త్ర-ధర్మ ప్రమాణములతో చెప్పబడిన శుభకర్మలను ఆచరిస్తూ, ఆ తరువాత - ఔషధము సేవించినతరువాత రోగము ఉపశమించగా ఇక ఆ ఔషధమును వదలుచున్న విధంగా - **శుభ వాసనలను కూడా త్యజించివేయాలి.**

'చిత్తనాశనము' అనునది రెండు విధములైనదిగా చెప్పబడుచున్నది.

1. **సరూపము** : కనబడే నామ రూపాలన్నీ ఆత్మారామ సంప్రదర్శనముగా దర్శించటము. దీనిని 'జీవన్ముక్తి' అని అంటారు.

2. **అరూపము** : సాకారముగా కనిపిస్తున్నదంతా సాకారముగా ఏమాత్రమూ అనిపించక, సర్వదా నిరాకార పరబ్రహ్మముగా అగుపించటము, అనిపించటము. ఇది 'విదేహముక్తి' అని పిలువబడుచున్నది.

ఓ పవనసుతా! పాప దోషరహితుడా! ఆంజనేయా! మనము చెప్పుకున్న ఈ 'చిత్తనాశనము'ను సాదరముగా విను. అభ్యసించు. మరల మరల అభ్యసించబడుచుండగా, మైత్రి-ప్రేమ-కరుణ మొదలైనవి (సర్వజీవుల పట్ల అమృత వర్షమువలె) నీ నుండి కురియును గాక! క్రమంగా నీయొక్క సర్వాత్మత్వము పట్ల సర్వసందేహాలు తొలగి, స్వభావ సిద్ధముగా పరమశాంతిని పొందగలవు. అట్టి జీవన్ముక్తుని మనస్సు **'పునర్జన్మ'** అను భ్రమ - స్వభావ దోషమునుండి స్వయముగా విముక్తి పొందగలదు.

**జీవన్ముక్త మనోనాశనము** : ఈ కనబడే నామ-రూప-గుణాత్మకమైనదంతా యథాతథముగా నామ - రూప - గుణాత్మకంగా కనిపిస్తూ సమరసమగు పరబ్రహ్మముగా భావింపబడటము, తెలియబడటము - ఇది జీవన్ముక్త లక్షణము.

**విదేహముక్త మనోనాశనము** : సర్వదా సర్వత్రా సర్వము నామ - రూప - గుణాత్మక భేదమంతా కోల్పోయి, కేవలము సర్వత్రా సమ స్వరూపమై శ్రీరామబ్రహ్మమేనని అనిపిస్తూ, అగుపిస్తూ ఉంటే .... అట్టి స్వభావసిద్ధమగు అనునిత్యానుభూతి **విదేహముక్త మనో నాశనము**గా చెప్పబడుతోంది. అనన్యత్వమే విదేహముక్తియొక్క శుభలక్షణము.

---

9 **సహస్ర అంకుర శాఖాత్మ**
**ఫల పల్లవశాలినః,**
**అస్య సంసార వృక్షస్య**
**మనోమూలమ్ ఇదమ్ స్థితమ్।**
**సంకల్ప ఏవ తత్ మన్యే**
**సంకల్ప - ఉపశమేన తత్,**

**సంసార వృక్షము** : వేలాది అంకురములు, శాఖలు, ఫలములు, పల్లవములు (చిగుళ్ళు) కలిగి ఉన్నట్టి "సంసారము' అనే వృక్షము - మనస్సుయే మూలముగా కలిగి స్థితి పొంది ఉన్నది.

**"సంకల్పించటము"** అనునదే మనస్సు యొక్క రూపము. సంకల్పించటము ఉపశమించిందా ... వెంటనే మనస్సు అనునది కూడా మొదలంట్లా ఉపశమించినట్లే! **సంకల్ప రాహిత్యము** అనే అభ్యాసముచే సంకల్ప పరంపరలు అనే జలమును అందించటం మానివేస్తే అప్పుడు ఈ సంసార పూతీగ దానికదియే ఎండిపోతుంది. ఇక చిగురించదు.

శోషయాశు యథా శోషమ్
ఏతి సంసార పాదపః।
ఉపాయ ఏకఏవ అస్తి
మనసః స్వస్య నిగ్రహే।
మనసో అభ్యుదయో నాశో,
మనోనాశో మహోదయః।
'జ్ఞ' మనో నాశమ్ అభ్యేతి
మనో అజ్ఞస్య హి శృంఖలా।
తావత్ నిశీవ వేతాళా
వల్గంతి హృది వాసనాః
ఏకతత్త్వ దృఢ - అభ్యాసాత్
యావత్ న విజితం మనః।
ప్రక్షీణ చిత్త దర్పస్య
నిగృహీత ఇంద్రియ ద్విషః।
పద్మిన్య ఇవ హేమంతే
క్షీయంతే భోగవాసనాః।

కాబట్టి ఓ ప్రియ అంజనీపుత్రా! ఈ మనస్సును నిగ్రహించటానికి, ఒకే ఒక్క ముఖ్యమైన ఉపాయం. ఈ మనస్సును **"సర్వము ఆత్మ స్వరూపమే"** అను ఆత్మ భావనయందు నియమించి, క్రమంగా జగత్తును సన్న్యసించాలి. భేదదృష్టిని వదలి **ఆత్మ దృష్టి (లేక) ఆత్మ భావనను ఆశ్రయించాలి.**

మనస్సుయొక్క అభ్యుదయమే - సర్వ అనర్థములకు, నష్టములకు మూల కారణము. మనస్సు నశించిందా, అది ఈ జీవునికి మహోదయమే అవుతుంది. (ఈ జీవుడు శివుడే అగుచున్నాడు).

జ్ఞానిపట్ల ఆతని మనస్సే మనస్సును నశింపజేయు గొప్ప ఆయుధము అగుచున్నది. అజ్ఞానికో, ఆ మనస్సే బంధము.

రాత్రిపూట చీకట్లో చూస్తూ ఉంటే అక్కడ భేతాళుడు (దయ్యము) ఉన్నట్లు కనిపించి, అజ్ఞాన బాలకునికి భయములన్నీ వచ్చి పడుచున్నాయి చూచావా? హృదయములో ప్రాపంచక వాసనలు ఉన్నంత వరకు నీపై మనస్సే పెత్తనము చెలాయిస్తుంది. **"సర్వత్రా ఏకబ్రహ్మమే"** అనే దృఢమైన అభ్యాసమును ఆశ్రయించనంత వరకు, మనస్సును నీవు జయించ లేవు. మనస్సే నీపై పెత్తనం చెలాయిస్తుంది.

**"ఇంద్రియ విషయములను స్వీకరించకపోవటము"** - అను అభ్యాసముచే చిత్తము క్షీణించిపోతుంది. అప్పుడిక - హేమంత ఋతువులో తామరతీగలు నశించువిధంగా, తన చిత్తము క్షీణింపజేయు అభ్యాసము ఆశ్రయించువానిపట్ల - భోగవాసనలన్నీ తమకు తామే క్షీణించిపోతాయి. చిత్తము సంగతులకు, సందర్శనములకు అతీతత్వము సంతరించుకుంటుంది.

---

**10** హస్తం హస్తేన సంపీడ్య,
దంతైః దంతాన్ విచూర్ణ్య చ,
అంగాని అంగైః సమాక్రమ్య
జయేత్ ఆదౌ స్వకం మనః॥
ఉపవిశ్య ఉపవిశ్యైకమ్
చింతకేన ముహుః ముహుః
న శక్యతే మనో జేతుమ్,
వినా యుక్తిం అనిందితామ్।
అంకుశేన వినా మత్తో
యథా దుష్ట మతం గజః।
అధ్యాత్మ విద్యాధిగమః,
సాధు సంగతిః ఏవ చ,
వాసనా సం పరిత్యాగః,
ప్రాణ స్పంద నిరోధనమ్,
ఏతాః తా (ఏతాస్తా) యుక్తయః పుష్టాః
సంతి చిత్తజయే కిల,

అందుచేత ఓ ప్రియ హనుమా! చేయి - చేయి అదిమిపెట్టి, పళ్ళు - పళ్ళు నొక్కిపెట్టి చూర్ణము చేసి అయినా సరే, అంగములను అంగములతో మూసి ఉంచైనా సరే ... ఎట్లాగో అట్లా బలవంతముగా **'సంకల్ప పరంపరలు'** అనే స్వభావముతో విగ్రవీగుచున్న ఈ మనస్సుపై మొట్టమొదట యుద్ధము ప్రకటించి, జయించాలి. చక్కగా ఒకచోట కూర్చుని (ఆసనమును ఆశ్రయించి) మాటిమాటికి ఆత్మతత్త్వము గురించే ఈ మనస్సును నియమిస్తూ ఉండాలి. మనస్సు నియమించే ఉపాయాలు పట్టుకొని ఉండాలి. అనిందితమైన యుక్తులను (ఉపాయములను) ఆశ్రయించకపోతే ఈ మనస్సును జయించటము శక్యము కాదు. (అట్టి ఉపాయాలు ఇంద్రియములను క్షీణింపజేసి ఆత్మను క్షోభింపజేసేవిగా ఉండకూడదు).

ఒకచోట దుష్టప్రవర్తన, భావ ఉద్వేగములు గల మదగజము ఉన్నది. దానిని స్వాధీనం చేసుకోవటానికి మావటివాడు అంకుశమును ఉపయోగిస్తాడు కదా! అంకుశము లేకుండా ఆ మద మత్తగజము (మదపుటేనుగు) స్వాధీనం అవుతుందా? కాదు కదా! మనస్సును కూడా ఉపాయాలతో జయించాల్సిందే!

- గురు ముఖతః మరియు శాస్త్రముల పరిశీలన సహాయంతో ఆత్మతత్త్వమును ఎరుకచేయు అధ్యాత్మ విద్యను ఆశ్రయించటము...,
- సాధువులతో సంగము (సత్సంగము)...,
- ఇంద్రియ నియమ-నిగ్రహముల సహాయముతో వాసనలను పరిత్యజించటము...,
- ప్రాణాయామ అభ్యాసముచే ప్రాణ స్పందన నిరోధము...,

అనబడు ఈఈ ఆయా ఉపాయాముల అభ్యాస పరిపుష్టి చేత చిత్తమును నీవు **జయించి వేయాలి. జయించి తీరాలి.**

ఉపాయాలు ఎప్పుడు సులభముగాను, దేహ-ఇంద్రియ, ఆత్మలను బాధ పెట్టనివి గాను ఉండాలి. అంతేగాని ఇంద్రియములను క్షోభింపచేసేవిగాను, క్షయింపజేసేవి

సతీషు యుక్తిషు ఏతాసు।
హఠాత్ నియమ యంతి యే,
... చేతసో దీపమ్ ఉత్సృజ్య
విచిన్వంతి తమో – అంజనైః।

గాను ఉండకూడదు (ఈ మానవుడు ఇంద్రియములను దేవతలచే ప్రసాదించ బడినవై, ఆయా దేవతల సొత్తుగాను, తిరిగి ఇవ్వబడవలసినవిగాను భావించాలి). ఇంద్రియములను హఠంచేసి పరమాత్మను సిద్ధించుకోవాలి-అని అనుకొను వారు **- చేతిలోని దీపమును దూరంగా దాచి పెట్టుకుని, కాటుక పెట్టుకొన్న కళ్ళు చాలనుకొని చీకటిలోని ఒకానొక వస్తువు కోసము వెతకటము** వంటిది.

---

11 విమూఢాః కర్తుమ్ ఉద్యుక్తా,
యే హఠాత్ చేతసో జయమ్,
తే నిబధ్నంతి నాగేంద్రమ్
ఉన్మత్తం ... బిసతంతుభిః।
ద్వే బీజే చిత్తవృక్షస్య
వృత్తిః ప్రతతి ధారిణః
1. ఏకం ప్రాణ పరిస్పందో।
2. ద్వితీయం దృఢ భావనా।
సా హి సర్వగతా సంవిత్
ప్రాణ స్పందేన చాల్యతే,
చిత్త – ఏకాగ్రత్ యతో,
జ్ఞాన ముక్తం సముపజాయతే।
తత్ సాధనమ్ అథో ధ్యానం
యథావత్ ఉపదిశ్యతే।
విలాప్య వికృతిం కృత్స్నాం
సంభవ వ్యత్యయక్రమాత్,
పరిశిష్టంచ చిన్మాత్రం
చిదానందమ్ విచింతయ।
అపానే అస్తంగతే ప్రాణో
యావత్ న అభ్యుదితో హృది,
తావత్ సా "కుంభకావస్థా"
యోగిభిః యా అనుభూయతే॥

విమూఢులు అగు కొందరు మూర్ఖత్వముతో హఠయోగమును ఆశ్రయించి ఈ మనస్సును జయించాలని ప్రయత్నిస్తున్నారు! అది మదగజమును, నాగేంద్రుని (ఆదిశేషుని) తామరకాడలోని తంతువులతో బంధించాలని అనుకోవటము వంటిది సుమా!

"వృత్తులు (Avocations)" అనే లతలచే చుట్టుచుట్టి ఆవరించబడియున్న ఈ "చిత్తము" అనే వృక్షము రెండు భాగములు గల బీజములో నుండి జనిస్తోంది.

1. ప్రాణ పరిస్పందన
2. దృఢముగా దృశ్య విషయములను భావన చేయటము.

'సర్వగతము' అయినట్టి సంవిత్ (సత్=ఉనికి, విత్ =ఎరుగుట) ప్రాణ స్పందనచే చలించబడుచున్నది.

ఈ చిత్తము అనేక విషయములతో ఒక్కసారే పెను సంబంధము కలిగి ఉండటము చేతనే, తన ఉత్పత్తి స్థానమగు ఆత్మారాముని గుర్తించలేకపోవుచున్నది. ఈ చిత్తము ఏకాగ్రము పొందితే, అప్పుడు ఆత్మ జ్ఞానము ఉదయించుచున్నది.

అయితే, చిత్తము ఏకాగ్రత పొందేది ఎట్లా? అందుకు సాధనముగా **'మనో ధ్యానము'** యథావిధిగా ఉపదేశించబడుతోంది.

ఓ హనుమా! ఇది కాదు - ఇదికాదు (నేతి । నేఽతి) అను వివేచనచే క్రమముగా వికృతి (వికారములు) తొలగించుకో. దృశ్యభావమును పూర్తిగా త్యజించి, అప్పటికీ శేషించియుండే చిదానంద స్వరూపమగు చిన్మాత్రము (కేవల ఎరుక స్వరూపము)ను విచింతన చేయి.

సాధారణంగా వాయువు దేహములోనికి వెళ్ళి (ప్రాణము) ఇంతలోనే బయటకు ప్రయాణిస్తూ (అపానము) ఉంటోంది కదా!

ప్రాణకదలికలకు సంబంధించి ఎంతవరకైతే (ఎంత సమయమైతే) అపానము సంబంధింత కదలిక ఆగి ప్రాణవాయువు చలించక ఉంటుందో..., అట్టి యోగాభ్యాసముచే యోగికి అనుభవమయ్యేదే "కుంభకావస్థ". ఇదే అంతః కుంభకం!

---

12. బహిః అంస్తంగతే ప్రాణే
యావత్ న అపాన ఉద్గతః
తావత్ పూర్ణాం సమావస్థాం
బహిష్టం కుంభకం విదుః॥
బ్రహ్మాకార మనోవృత్తి
ప్రవాహో అహంకృతిం వినా,
సంప్రజ్ఞాత సమాధిస్స్యాత్
ధ్యాన అభ్యాస ప్రకర్షతః॥

**బహిర్-కుంభకము :** వాయువు దేహము నుండి బహిర్గతము అయినప్పుడు - ఇక దేహములో అపాన వాయువు కదలికలు ఉండవు. అప్పుడు కూడా దేహములో ప్రాణ - అపానముల కదలికలు లేక, దేహములో పూర్ణ సమావస్థ ఏర్పడుచున్నది. దీనిని **'బాహ్యకుంభకము'** అని పిలుస్తారు.

**సం ప్రజ్ఞాత సమాధి స్థితి :** "ఈ జనులందరిలో నేనొక ప్రత్యేకత ఉన్నవాడిని"... అను అహంకారము - (బాహ్య అభ్యంతర కుంభక ప్రాణాభ్యాసము సహాయముచే) త్యజించబడుతూ రాగా **"అందరిలోని నేనైన నేను - అందరూ నాలో నేనుగా ఉన్న నేను ....",** అను రూపము గల "బ్రహ్మాకార మనోవృత్తి కి సంప్రజ్ఞాత (ఎరుగుచున్నవాడై) ధ్యానాభ్యాసము చేయటమును **"సమాధి అభ్యాసము - సంప్రజ్ఞాత సమాధి"** అని గ్రహించు.

ప్రశాంత వృత్తికం చిత్తం
పరమానంద దీపకమ్।
'అసం ప్రజ్ఞాత' నామాయం
సమాధిః యోగినాం ప్రియః।
ప్రభా శూన్యం, మనః శూన్యం
బుద్ధి శూన్యం, చిదాత్మకమ్
అతత్ వ్యావృత్తి రూపోసౌ
సమాధిః ముని భావితః।
ఊర్ధ్వపూర్ణమ్ అధః పూర్ణమ్
మధ్యపూర్ణమ్ శివాత్మకమ్।
సాక్షాత్ విధిముఖో హి ఏష
'సమాధిః' పారమార్థికః।
దృఢ భావనయా, త్యక్త పూర్వా-పర విచారణమ్,
యత్ ఆదానం పదార్థస్య
'వాసనా' ప్రతికీర్తితా।

**అసంప్రజ్ఞాత సమాధి స్థితి :** ఈ చిత్తము-దృశ్య విషయముల నుండి వెనుకకు మరలినదై, ప్రశాంత వృత్తిని మాత్రమే ఆశ్రయించి ఉన్నదై,, పరమానంద జ్ఞాన దీపకముగా యోగికి అనుభూతమగుచున్నప్పుడు, అట్టి ప్రియత్వముతో కూడిన స్థితిని "అసంప్రజ్ఞాత సమాధి స్థితి" అని అంటారు.

**ఆతత్ వ్యావృత్తి రూపసౌ సమాధి ( శూన్య సమాధి) :** ప్రభా (వెలుగు) శూన్యమై, మనఃశూన్యమై, బుద్ధి శూన్యమై - (జ్యోతి - మనస్సు - బుద్ధి లేనివై), **"కేవల చిదాత్మాకము"** మాత్రమే అనుభవముగా శేషించితే, "ఆతత్ వ్యావృత్తరూపసౌ సమాధి" అని మునులచే (యోగులచే) భావించబడుచున్నది.

**పారమార్థిక సమాధి (పూర్ణసమాధి) :** ఊర్ధ్వమున పూర్ణము. అధో (క్రింద) భాగమున కూడా పూర్ణమే. సర్వతత్త్వ స్వరూపమగు శివాత్మకము. ఈ సర్వము స్వముఖముగా విధిరూపము (బ్రహ్మ దేవుని ముఖరూపము), స్వముఖ బ్రాహ్మీ రూపము - అను యోగీభావ స్థితిని పారమార్థిక సమాధి (పూర్ణ సమాధి) అని పిలుస్తున్నారు.

**వాసన:** ఒకడు తనకు ఎదురుగా ఉన్న పదార్థములను (అట్లాగే సంగతి - సంబంధ - అనుబంధ - సంఘటనలను) - "దీని పూర్వమేమిటి? పరము (ఆవల) ఏమికానున్నది?" .... అనే పూర్వాపర విచారణ ఏ మాత్రము చేయకుండానే - దృఢభావముతో (ఒక మూర్ఖునివలె) గ్రహించటమును 'వాసన' అను శబ్దము యొక్క అర్థము, ఉద్దేశ్యము కూడా!

13 భావితం తీవ్ర సంవేగాత్
ఆత్మనా యత్ తదేవ సః,
భవతి ఆశు, కపిశ్రేష్ఠ!
విగత ఇతర వాసనః, తాదృక్ రూపో హి పురుషో,
వాసనా వివశీకృతః।
సంపశ్యతి యదేవ ఏతత్
'సద్వస్తు' ఇతి విముహ్యతి।
వాసనా వేగ వైచిత్ర్యాత్
స్వరూపం న జహాతి తత్।
భ్రాంతం పశ్యతి దుర్దృష్టిః
సర్వమ్ మదవశాత్ - ఇవ।
వాసనాత్ ద్వివిధా ప్రోక్తా
1. శుద్ధాచ, 2. మలినా తథా।
మలినా జన్మ హేతుస్స్యాత్।
శుద్ధాత్ జన్మ వినాశనీ।
అజ్ఞాన సుఘనాకారా ఘనాహంకార శాలినీ,
'పునర్జన్మకరీ' ప్రోక్తా,
మలినా వాసనా బుధైః।

ఓ కపిశ్రేష్ఠా! ఇక్కడ ఒక చిన్న చమత్కారము. ఒకడు మనస్సుతో తక్కిన చింతనలను వదలి, **దేనినైతే తీవ్రగతిగా** భావిస్తూ (భావన చేస్తూ) ఉంటాడో (ఒక్క దాని గురించే మనస్సును నిలిపి తదితర వాసనలను వదలి ఉంటాడో), ఆతడు ఏకైక తీవ్ర వాసనా వస్తువే (వాసనా వివశత్వము చేత) తానుగా అగుచున్నాడయ్యా! ఈ పురుషుడు వాసనా రూపుడే!

ఆ ఏకైక మనో భావనా వస్తువే తానై, అద్దానినే సందర్శిస్తూ 'ఇదియే నేను' లేక 'ఇదియే సద్వస్తువు' అను మోహమును పొందడం జరుగుతుంది. అట్టి వాసనా వేగ వైచిత్ర్యము కారణంగా తాను పొందిన ఆ రూపమును **వదలలేడు** (తత్ న జహాతి). అది సత్యము కాదు కాబట్టి **పట్టుకొని ఉండనూ లేడు.**

అట్టి వాసనా ప్రభావముచేత సత్య దృష్టి మరుగునపడినదై, భ్రాంతి పెత్తనం చెలాయించ సాగుతోంది. దుర్దృష్టి చేత భ్రాంతి (లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు) ... భావించటం ప్రారంభించి సర్వమును మదవశుడై చూస్తున్నాడు.

ఓ హనుమయ్యా! వాసనలు రెండు విధములుగా విభజించి చెప్పబడుచున్నారు. 1. శుద్ధ వాసనలు 2. మలిన వాసనలు.

**మలిన వాసనలు :** జన్మ - జన్మాంతరములకు కారణమగుచున్నాయి. పునర్జన్మ పరంపరలు కలుగజేస్తున్నాయి.

**శుద్ధ వాసనలు :** పునర్జన్మ పరంపరల తతంగమును నిరోధిస్తున్నాయి. నశింపజేస్తున్నాయి.

**మలినవాసనలు - అజ్ఞానముచే** ఏర్పడునవి. వారు - వీరు - నేను - వేరు వేరు - అను రూపముగా ఘనీభూతమై ఉంటున్నాయి. అహంకారమును వృద్ధి చెందించు చున్నది. బుధులు **"నాయనలారా! ఈ మలిన - వాసనలు 'పునర్జన్మలు' అనే చక్రంలోకి తోస్తున్నాయి. జాగ్రత్త!"** అని హెచ్చరిస్తున్నారు.

14 పునర్జన్మాంతరం త్యక్త్వా
స్థితః సంభ్రష్ట బీజవత్,
బహుశాస్త్ర కథా కంథా
రోమంథేన వృథైవ కిం?
అన్వేష్టవ్యం ప్రయత్నేన,
మారుతే! జ్యోతిరాంతరమ్।
దర్శన – అదర్శనే హిత్వా
"స్వయం కేవలరూపతః"
య ఆస్తే, కపిశార్దూల!
బ్రహ్మా, న బ్రహ్మవిత్, స్వయమ్।
అధీత్య చతురో వేదాః
సర్వ శాస్త్రాణి అనేకశః
బ్రహ్మతత్త్వం న జానాతి
దర్వీపాక రసం యథా।
స్వదేహా అశుచి గంధేన
న విరజ్యేత యః పుమాన్,
విరాగ కారణం తస్య
కిమ్ అన్యత్ ఉపదిశ్యతే?
అత్యంత మలినో దేహో, దేహీ చ అత్యంత నిర్మలః।
ఉభయోః అంతరం జ్ఞాత్వా, కస్య శౌచం విధీయతే?

నాయనా! ఆంజనేయా! వేయించిన విత్తనములు మరల మొలకెత్తవు కదా! చిగురించవు కదా! ఆవిధంగా ఈ జీవుడు పునర్జన్మలు కలుగజేయు మార్గమును గమనించి కర్మలను జ్ఞానాగ్నితో దహింపజేసి - ఆ త్రోవ నుండి ఈవల పడాలి. ఇక బహు శాస్త్రములను, కథా కథనములను వల్లించి, ఏమి ప్రయోజనము! అదంతా అంధకారంలో ప్రవేశమే అవుతుంది! **కర్మపరిధులను అధిగమించివేయుటమే వర్తమాన కర్తవ్యము. ఆత్మగా సందర్శనమే కర్మపరిధులకు ఆవలి వడ్డు.**

ఓ మారుతీ! వాయునందనా! అంతర్ హృదయములో సర్వదా వెలుగొందుచున్న ఆత్మజ్యోతి కొరకై ఈ జీవుడు ప్రయత్నపూర్వకముగా అన్వేషణ చేయాలి.

అందుచేత ఓ కపిశార్దూలా! ఈ ఎదురుగా కనిపిస్తూ ఉన్నది - కనిపించనిదీ ... ఇదంతా వదిలివేసి స్వయం కేవల రూపమగు (తానే అది అయి ఉన్నట్టి) ఆత్మజ్యోతిగా వెలుగొందాలి. **బ్రహ్మమును తెలుసుకొని, అక్కడకు ఆగక, తానే స్వయముగా 'బ్రహ్మము' అవాలి!**

ఒక గరిట సహాయంతో ఒక ఇల్లాలు పాకము తయారు చేస్తూ ఉన్నప్పుడు, ఆ గరిట పాకములో ప్రవేశింపజేయబడినప్పటికీ, ఆ పాకముయొక్క రుచి గరిటకు తెలుస్తోందా? లేదు కదా! అట్లానే నాలుగు వేదములు, సర్వశాస్త్రములు, ఇంకా అనేక విషయాలు తెలిసినప్పటికీ **బ్రహ్మతత్త్వము తెలిసికూడా, తద్భావము ఆశ్రయించకపోతే ఏమిటి లాభం?**

తన దేహములోని అశుచితో కూడిన దుర్గంధములను, దుర్వాసనలను గమనించి, వాటి నుండి విరమించక, విరాగము పొందని మానవునికి ఏమి ఉపదేశించి ఏమి ప్రయోజనం?

నాయనా! హనుమా! **ఈ దేహము అనేక మలినములతో కూడుకొని ఉన్నది.** దేహియో ... ఆతడు **ఆత్మ స్వరూపుడే కాబట్టి, అత్యంత నిర్మలుడు.**

దేహి - దేహముల అంతరము (భేదము) ఏమిటో తెలుసుకొన్నట్టి విజ్ఞునికి ఇక 'శౌచము' యొక్క విధి విధానములను నిర్దేశించి చెప్పవలసిన పనేమున్నది?

---

15 బంధో హి వాసనా గంధో,
మోక్షస్స్యాత్ వాసనా క్షయః।
వాసనాం సంపరిత్యజ్య
మోక్షార్థిత్వమ్ అపి త్యజ।
మానసీ వాసనాః పూర్వం
త్యక్త్వా విషయ వాసనాః,
మైత్ర్యాది వాసనా నామ్నీః
గృహాణ అమల వాసనాః।
తాశ్చాపి అంతః పరిత్యజ్య,
తాభిః వ్యవహరన్ అపి।
అంతః శాంతః సమస్నేహో
భవ చిన్మాత్ర వాసనాః,
తామ్ అపి అథ పరిత్యజ్య
మనో బుద్ధి సమన్వితామ్,

వాసనా గంధము (Deeply sensing tendencies) యే **'బంధము'**. వాసనా క్షయమే **'మోక్షము'**. ఇంతకు మించి మోక్షమునునది వేరే ఏదీ లేదు.

ఓ సీతా శోకవినాశకా! హనుమా! వాసనలన్నీ క్రమంగా పరిత్యజిస్తూ చివరికి **"నాకు మోక్షము లభించాలి కదా!"** - అనే రూపము గల వాసనను కూడా త్యజించి వేయవయ్యా! ఆత్మ నిత్యముక్తమైయుండగా మోక్షము ఎవరికి?

ముందుగా వాసనా పూర్వకమైన శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ సంబంధములగు విషయ వాసనలు త్యజించు.

మైత్రి - కరుణ - క్షమ - సేవ - వాత్సల్యము సర్వత్రా అనురాగము ఇటువంటి అమల వాసనలను స్వీకరించువాడై ఉండు.

ఆ తరువాత వాటితో వ్యవహరిస్తూ, క్రమంగా ఆయా వాసనలను కూడా పరిత్యజించి ఉండు.

అంతర్హృదయములో పరమశాంతుడవై ఉండు. సర్వ సహదేహుల పట్ల సమాన స్నేహ - భావము కలవాడవై వుండు. **"నేను సదా సత్ చిత్ స్వరూపుడను కదా! అట్లాగే, ఈ కనబడే జీవులంతా సహజంగా అదే సత్-చిత్-ఆనంద ఆత్మ స్వరూపులే!"** అను రూపము గల చిన్మాత్ర వాసన మాత్రమే నీయందు శేషించినదై ఉండును గాక!

శేష స్థిర సమాధానో
మయి త్వం భవ। మారుతే!

ఆ తరువాత మనో - బుద్ధి - చిత్త సమన్వితమైన ఆ 'వాసన'ను కూడా త్యజించి, అప్పటికీ శేషించిన దానియందు **స్థిర సమాధానుడవై, ఆసీనుడవై ఉండు. ఓ మారుతీ! రామబ్రహ్మమువై, నేనే నీవై, నీవే నేనై ప్రకాశించుము!**

**16.** అశబ్దమ్, అస్పర్శమ్ అరూపం,
అవ్యయమ్, తథా అరసమ్
నిత్య సుగంధవచ్చ యత్,
అనామ-గోత్రమ్ మమరూపమ్
ఈదృశమ్ భజస్వ, నిత్యం, పవనాత్మజ! త్వం।
దృశి స్వరూపం గగనోపమం
పరం, సకృత్ విభాతమ్ తు అజమ్, ఏకమ్, అక్షరమ్।
అలేపకం సర్వగతమ్ యత్ అద్వయం,
"తదేవ చ అహమ్ సకలమ్ విముక్త ఓమ్"।
దృశిస్తు శుద్ధోఽహమ్ అవిక్రియాత్మకో,
న మేఽస్తి, కించిత్ విషయ స్వభావతః,
పురః స్థిరశ్చ, ఊర్ధ్వమ్ అధశ్చ సర్వతః
సు-పూర్ణ భూమాహమ్
ఇతి ఇహ భావాయ॥

ప్రియ మారుతీ! పవనాత్మజా! 'అశబ్దము - అస్పర్శము - అరూపము - అవ్యయము - అరసము, నిత్య - సుగంధము వంటిది, నిత్యమైనది, నామ - గోత్ర రహితమైనది అగు **పరబ్రహ్మమే నేను.** అట్టి లక్షణ విలక్షమగు **మమ రామబ్రహ్మతత్త్వమును అను నిత్యముగా భజించెదవు గాక!**

ద్రష్టకు - దర్శనమునకు - దృశ్యమునకు ఆధారమైయున్న తత్ స్వరూపమైయున్న కేవల **దృక్ స్వరూపుడను!** ఆకాశమువలె, **అనంతుడను!** సర్వమునకు **పరమైనట్టి వాడను!** సర్వముగా **ప్రకాశించువాడను!** క్షరములన్నిటికీ ఆధారమైన **అక్షర స్వరూపుడను!** దేనిచేతనూ పూత వేయబడని **అలేపనుడను!** ద్వితీయమనునదియే లేనట్టి **అద్వితీయుడను! సర్వదా సర్వము అయినట్టి వాడను! ఓంకార తత్ స్వరూపుడను!**

సర్వ దృశ్యములకంటే **పరిశుద్ధుడను! సర్వక్రియా రహితుడను! నిష్క్రియుడను!** విషయములు - అను స్వభావము కించిత్ కూడా లేనట్టి నిర్విషయుడను!

పైన - క్రింద కూడా పరమాత్మ - జీవాత్మగా వ్యాపించి సుస్థిరుడనై ఉన్నవాడను. సర్వత్రా **పరిపూర్ణుడను! సంపూర్ణుడను! భౌమానందుడును!** నన్ను సంపూర్ణ రామ బ్రహ్మముగా భావన చేయి.

**17** అజో అమరశ్చ ఏవ, తథా అజరో, అమృతః
స్వయం ప్రభః సర్వగతోఽహమ్ అవ్యయః।
– న కారణమ్ – కార్యమ్ అతీత్య నిర్మలః
సదేవ తృప్తోఽహమ్
– ఇతీహ భావయ।
జీవన్ముక్త పదం త్యక్త్వా
స్వదేహే కాలసాత్ కృతే,
విశతి అదేహ ముక్తత్వం, పవనో అస్పందతామ్ ఇవ।
తదేతత్ ఋచ అభ్యుక్తం, తద్విష్ణోః పరమమ్ పదమ్
సదా పశ్యంతి సూరయః, దివీవ చక్షుః ఆతతమ్,
తత్ విప్రాసో విపన్యవో జాగృవాంసః సమింధతే,
'విష్ణోః యత్ పరమమ్ పదమ్।
ఓం సత్యమితి ఉపనిషత్
ఇతి ముక్తికోపనిషత్

జన్మ రహితుడను! మరణ - వార్ధక్య ధర్మములు లేనట్టి **అమృత స్వరూపుడను! స్వయం జ్యోతి - స్వయం ప్రభా స్వరూపుడను!** (కల తనదైనవాడు కలంతా నిండి ఉన్న రీతిగా) **సర్వగతుడను! అవ్యయుడను!** కార్య - కారణములకు అతీతుడను! నిర్మలుడను! నిత్య సత్య స్వరూపుడను! **నిత్యుడను! నిత్యానంద - నిత్య తృప్త స్వరూపుడను! అని నన్ను తెలుసుకో!**

జీవన్ముక్తుడు - దేహము కాల ధర్మము పొందుచుండగా, ఆతడిక ఆ జీవన్ముక్త పదమును కూడా త్యజించి, వీచికలు లేనట్టి వాయువువలె విదేహముక్తి యందు ప్రవేశించుచున్నాడు. రామానంద తత్త్వమునందు స్వభావ సిద్ధముగా 'ఏకము' అగుచున్నాడు.

ఈ ఉపనిషత్ విశేషము - ఋక్కుల రూపముగా వేదములచే ప్రవచించబడు చున్నాయి. బుద్ధి మంతులు **విష్ణుపదమును** - ఆకాశంలో సూర్యుని చూచువిధంగా - సుస్పష్టముగా దర్శించుచున్నారు.

అట్టి స్వస్వరూప పరబ్రహ్మమును ఎరిగినవారు ఇక దేనికీ దుఃఖించరు. సర్వదా జాగరూకులై, ఉపాధి వినిర్ముక్తులై సర్వదా సర్వత్రా సమమైయున్న విష్ణుపదమును పొంది **ఆత్మానందము నందు ఓలలాడుచున్నారు. అదియే పరమపదము!**

**ఇతి ముక్తికోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

❖ ❖ ❖ ❖ ❖

శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 14 ముక్తికోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



**శ్లో॥ ఈశాది అష్టోత్తర శత వేదాంతపటలాశయమ్,**
**ముక్తికా - ఉపనిషత్ వేద్యం రామచంద్రపదం భజే॥**

ఓంకార స్వరూపుడగు 'శ్రీరామచంద్ర పరబ్రహ్మము' అను ఆత్మారామునకు, కోదండరామునకు, సీతారామునకు నమస్కరిస్తున్నాము. అత్యంత రమ్యము, మనోహరము, సుందరము అగు అయోధ్యానగరము. రావణ సంహారానంతరము శ్రీరామచంద్రుడు పట్టాభిషిక్తుడైనారు. రామరాజ్యములో ప్రజలు సుఖశాంతి ఐశ్వర్య ఆనందములు పొందసాగారు. ఇహపర మహదాశయ సమన్వితులు అగుచుండగా రామరాజ్యపాలన కొనసాగుచున్నది. సీతా-భరత-సౌమిత్రి-శత్రుఘ్న సమేతుడై భూలోకమంతా పరమానందభరితము చేస్తున్న సమయము. మునులు, ఋషుల, భక్తుల, దేవతల రాకపోకలతో అయోధ్య నగరం కళకళలాడసాగినది.

ఒకానొక రోజు....,

శ్రీరామమందిరము. రత్నపండపము. శ్రీరామచంద్రస్వామి సీతాలక్ష్మణభరత శత్రుఘ్న సమేతులై సింహాసనాధిష్ఠితులై ఉన్నారు.

సనకుడు, సనందుడు మొదలైన మునిపుంగవులు, శ్రీ వసిష్ఠమహర్షి, శుకమహర్షి తదితర అనేకమంది మహర్షులు, సుగ్రీవుడు, విభీషణుడు, ఆంజనేయుడు. జాంబవంతుడు గుహుడు మొదలైన పరమభాగవతోత్తములు - వారంతా ఆ సువిశాల మండపములో పరివేష్ఠితులై ఉన్నారు. వారంతా కూడా శ్రీరామచంద్రుని బ్రహ్మానందజనితమైన దివ్యమంగళ విగ్రహము దర్శిస్తూ రామతత్త్వమును స్తుతిస్తున్నారు.

ఇట్లా ఉండగా, కొంత సమయము సత్సంగ రూపముగా ఆత్మతత్త్వపరమార్థము ఉపనిషత్ వాక్యార్థపూర్వకంగా బ్రహ్మతత్త్వజ్ఞులు సంభాషించసాగారు. అది శ్రద్ధగా వింటూ అక్కడి సభలోని వారు ఆత్మా-ఆరామమునందు పరబ్రహ్మసందర్శనము చేయసాగారు. శ్రీరామచంద్ర ప్రభువు కూడా ఆ సమయములో

- ఆత్మారాములై,
- **'ధీ'విక్రియా సహస్రాణాం సాక్షిణమ్**-బుద్ధినుండి బయల్వెడలుచున్న వేలాది భావనా వికారములకు ఆవల-కేవలము సాక్షి అయి,
- నిర్వికారుడు - నిరాకారుడు - నిరాలంబుడు అయి, నిర్వికల్ప - సమాధిని ఆశ్రయించసాగారు. స్వస్వరూపధ్యాన నిరతులై సమస్తమును అధిగమించివేసి 'కేవల సాక్షీతత్త్వము'నందు సంస్థితులై ఉండసాగారు.

అది గమనించిన అక్కడి మహర్షులు, భక్తజనులు.... శ్రీరామచంద్రుని ఉద్దేశ్యించి ఇట్లు పలుకసాగారు.

"తండ్రీ! శ్రీరామచంద్ర ప్రభూ! సర్వజ్ఞా! నిర్వికల్ప సమాధికి ఇది సమయము కాదు కదా! అజ్ఞానములో కొట్టుమిట్టాడుచున్న మమ్ములను సముద్ధరించటానికై అవతరించారు. అందుచేత సమాధిని చాలించి ఇహమునకు వేంచేయండి. శ్రీరామదర్శనమును, రామతత్త్వపానమును ప్రసాదిస్తూ మమ్ములను సముద్ధరించండి! మీరు భక్తవత్సలురు. మమ్ములను సంసాగరసాగరమునుండి ఉద్ధరించటమే మీ అవతార

మహదుద్దేశ్యము! మా పట్ల ఈ సృష్టి - స్థితి - లయారూపమంతా కొనసాగునంతవరకూ **'శ్రీరామా! జానకిరామా! కోదండరామా! పట్టాభిరామా!'...** అని పిలువగానే **'ఇదిగో ఇక్కడ! నేనున్నాను? భయపడకండి!'** అని పలికి మమ్ములను సంసార సాగరము నుండి రక్షించుటకై కంకణము కట్టుకొన్నవారు. మీ చల్లటి చూపులే మాకు శ్రీరామరక్ష. మాపై దయతో నిర్వికల్ప సమాధినుండి బయటకురండి!'

⌘

'భక్తవత్సలత' అను ఏకైక సంస్కారముతో కూడిన శ్రీరామచంద్రుడు భక్తుల ప్రేమపూర్వక అభ్యర్ధనను విన్నవారై, సమాధిస్థితిని విరమించుచూ వాత్సల్య పూర్వకంగా కనులు తెరిచారు. శ్రీహరి అవతారుడగు ఆ రామయ్య **'సమాధి ఆనందము'** నుండి బయల్వెడలి, బహిర్ముఖుడై చిరునవ్వు చిందిస్తూ అక్కడి సభలోని వారందరిపై తన చల్లటి చూపులతో ప్రేమవర్షము కురిపించసాగారు.

⌘

శ్రీరామచంద్రుని పాదాలపై దృష్టినంతటినీ నిలిపి శుశ్రూష చేస్తున్న ఆంజనేయస్వామి - శ్రీరామయ్య నిర్వికలిల్ప సమాధినుండి బహిర్ముఖుడవటము, ప్రశాంత ఆనంద చిత్తుడై ఉండటము గమనించారు. భక్తితో స్తుతించారు. **"రామబ్రహ్మతత్త్వము గురించి నా స్వామి నుండి తెలుసుకోవటానికి ఇది తగిన సమయము కదా"** - అని భావించారు. భక్తహృదయాంతరంగుడగు శ్రీరామచంద్రుడు పరమ భక్తుడగు ఆ హనుమంతుని చిరునగవుతో పలకరించారు. అప్పుడిక ఆ హనుమయ్య పులకిత శరీరుడై, నమస్కరించారు. బ్రహ్మజ్ఞానార్థి అయి రామయ్యను ఈ విధంగా పరిప్రశ్నించసాగారు.

**హనుమంతుడు: రామ త్వమ్ పరమాత్మాఽసి, సచ్చిదానంద విగ్రహః।** ప్రభూ! రామచంద్రా! మీరు స్వయం పరమాత్మానందస్వరూపులు! కేవల సత్ (ఉనికి) - కేవల చిత్ (ఎరుక-సర్వము వెలిగించు) - కేవల ఆనంద విగ్రహులు...అని ఇప్పటివరకు వేదోపనిషత్ సోదాహరణములతో ఉపన్యసించిన మహామునివరేణ్యులు మీ గురించి సిద్ధాంతీకరించుచున్నారు.

**ఇదానీం త్వాం, రఘుశ్రేష్ఠ। ప్రణమామి ముహుర్ముహుః।** తండ్రీ! రఘుశ్రేష్ఠా! మీకు మరల మరల ప్రణామములు. మిమ్ములను శరణువేడుచున్నాను. నాకు వచ్చిన గొప్ప 'చిక్కు' ఏమిటో వినండి! మిత్ర-శత్రు-మన-పర భేదములతో కూడిన అనేక సంసార బంధములలో నేను జీవుడనై చిక్కుకొని ఉన్నానని గమనిస్తున్నాను. ఇక్కడి మహనీయులగు ఋషీశ్వరులు సూచించినట్టి మార్గముగా మీ యొక్క తత్త్వరూపమును మీ నుండే తెలుసుకొని భవబంధములనుండి విముక్తుడను కావాలని తీవ్రమైన అభిలాష పొందుచున్నాను.

హే అఖండతత్త్వానంద స్వరూపా! ఆత్మారామా! శ్రీరామచంద్ర ప్రభూ! 'నీవు కల్పించిన మాయయే ఇదంతా!' అని ఇక్కడి జ్ఞానులగు కొందరు సభిక మహాశయులు మాకు ఇప్పటివరకూ శెలవిస్తున్నారు కదా! నేను 'ఈ ఇంద్రియ జగత్తు సత్యమే' అను భవబంధమునందు చిక్కుకున్నానని గురువాక్యములచే ప్రబోధించబడ్డాను. అట్టి సంసార బంధములనుండి నేను అనాయాసముగాను, సులభముగాను విముక్తుడనై, బయటబడేది ఎట్లా? అట్టి మార్గమును నా మీద వాత్సల్యముతో నాకు దయచేసి చూపండి!

***అనాయాసేన యేన అహం ముచ్యేఽ యం భవబంధనాత్? దేని చేత నేను సులభముగా అనాయాసంగా, ముక్తుడను కాగలను?*** మార్గదర్శకులై, మార్గాన్వేషణకుడనగు నాకు ప్రబోధించమని, మీ పాదములను భక్తితో స్పృశిస్తూ, మీ పాదరజమును శిరస్సున దాల్చుచూ...మిమ్ములను అర్థిస్తున్నాను.

**శ్రీరామచంద్రుడు:** ఓ మహాబాహో! శత్రుమర్దనా! ఉత్తమ భుజసౌందర్యముతో ప్రకాశించుచున్న ప్రియ హనుమా! 'ఈ దృశ్యమే సత్యము' - అను రూపముగల భవబంధమును గమనించి **'దీనికి ఉపాయమేమిటి?'** అని ప్రశ్నించుచున్నావు. ప్రతి జీవుడు బంధవిముక్తికై సమాధానము పొందవలసిన ప్రశ్నను నాముందు ఉంచావు. కాబట్టి నీవు అడుగుచున్నది - **సాధు పృష్టమ్! ఉత్తమమైన, పరమశ్రేయోదాయకమైన** విషయము. ఇక్కడి యదార్థ తత్త్వమేమిటో - సవివరణ పూర్వకముగా చెప్పుతాను. సావధాన చిత్తుడవై వినెదవుగాక! **శ్రుణు తత్త్వతః।**

**వేదము** అను శబ్దముయొక్క అర్థము **'తెలియబడునది'!** దేనినైతే నీవు 'భవము' అని, 'సంసారము' అని పిలుస్తున్నావో - అదంతా కూడా ఈ 'తెలియబడునది - వేదము'నకు సంబంధించియే! 'ఈ కనబడేదంతా సత్యమే' అను భావనయే భవబంధము. ఇంద్రియ విషయములపై ఆరూఢతయే - బంధము.

**'వేదాన్తమ్'** అనగా? ఈ ఇంద్రియములకు, మనోబుద్ధి చిత్తములకు తెలియబడుచున్న దానికి ఆవల (అన్తమ్ - ఆవల) ఉన్నట్టిది. ఆవల ఏమున్నది? **'తెలుసుకొనుచున్నవాడు'** ఉన్నాడు. **వేదాన్తే సుప్రతిష్ఠోఽహమ్!** అట్టి వేదాన్త స్వరూపుడనై వేదాన్తమునందు నేను సుప్రతిష్ఠుడనై (wel - placed) ఉన్నానయ్యా! అందుచేత ఓ మారుతీపుత్రా! ప్రియ హనుమా! నీవు ఈ ఇంద్రియ మనో-బుద్ధి-చిత్త-అహంకారములకు 'విషయములు'గా తెలియబడుచున్న దానినంతటినీ అధిగమించి 'వేదాంత తత్త్వము'ను ఆశ్రయించి, తద్వారా ఆత్మారాముడునగు నన్ను చేరవయ్యా! వేదోపనిషత్తుల ప్రవచనసారము, ఉద్దేశ్యము కూడా అట్టి వేదాంతతత్త్వమే సుమా!

**శ్రీహనుమంతుడు :** ఓ రఘుశ్రేష్ఠా! ప్రియరామచంద్రా! అస్మత్ ప్రభూ!

- 'వేదాంతము' అనగా ఏమి? ఎట్టిది?
- అట్టి వేదాంత శాస్త్రమును విశదీకరించుచున్న ఉపనిషత్తులు ఎద్దాని గురించి, ఏమని శాస్త్రీకరిస్తున్నాయి? ఏమని బోధిస్తున్నాయి?
- అవన్నీ ఎవ్వరిచేత ఎప్పుడు, ఏ ఉద్దేశ్యముతో, ఎవ్వరికొరకై సిద్ధాంతీకరించబడుచున్నాయి? దేనిగురించి సూచిస్తున్నాయి?

దయచేసి ఈ వివరాలు చెప్పండి.

**శ్రీరామచంద్రుడు :** ప్రియ హనుమా! నీవు కోరినట్లుగా వేద - వేదాంతోపనిషత్తులు గురించిన వివరాలు చెప్పుచున్నాను. **శృణు, వక్ష్యామి వేదాంత స్థితిమంజసా!** శ్రద్ధతో కూడిన వాడవై విను.

ఒకడు స్వప్నము కంటున్నప్పుడు, అతనియొక్క స్వప్న చైతన్యమే స్వప్నములో 1) 'స్వప్నాంతర్గతద్రష్ట'గాను, 2) 'స్వప్నదృశ్యము'గాను ప్రదర్శితమగుచున్నది కదా! ఆ విధంగానే, నాయొక్క విష్ణుతత్త్వమే ఈ 14 లోకములు - లోకపాలకులు - లోకాంతర దృశ్యములో - ద్రష్టలతో కూడిన బ్రహ్మాండ స్వరూపమై విరాజిల్లుచున్నది. అట్టి నా యొక్క **'విష్ణుతత్త్వము'** నుండి **'నిశ్వాస'** (ముక్కు నుండి బహిర్గతమగు గాలి వీచికల) రూపముగా...అప్రయత్న - అనాయాస పూర్వకముగా...సువిస్తృతమైన భాండాగారము (All Extended very big Library) వలె **'వేదములు'** పుట్టాయి. అవన్నీ శబ్దము - అర్థముల రూపముగా విస్తరించినవై ఉన్నాయి. నువ్వుగింజలతో నూనె దాగి ఉంటుంది చూచావా? ఆ విధంగా సంహితల (శరీరావయములను వినియోగించి చేయు క్రియ రూప ఉపాసన), బ్రాహ్మణముల (మనస్సును నియమించి చేయు ధ్యానరూపోపాసనల) ప్రాముఖ్యముతో కూడిన వేదములతో (వేద మంత్రములు, యజ్ఞయాగవిధానములలో) **'వేదాంతజ్ఞానము'** సుప్రతిష్ఠితమైయున్నది. అట్టి వేదాంత పరమపురుషడనై నేను ప్రకాశించుచున్నాను. సర్వసాక్షినై, సర్వులలోను సాక్షిగా కూడా అయి వెలుగొందుచున్నాను.

**శ్రీహనుమంతుడు :** ఓ రామా! రాఘవేంద్రా! ముందుగా ఇది చెప్పండి! **వేదాః కతి విధాః? తేషామ్ శాఖాశ్చ (కతి విధాః)? తాసు ఉపనిషదః కాః స్యుః? మమ ఆత్మేశ్వరా!** వేదములు వాటి శాఖలు ఏ విధములుగా ఉన్నాయి? అట్టి వేదములలో వేదాంత శాస్త్ర ప్రవచనములగు ఉపనిషత్తులు ఏఏ పనితీరులై ఉన్నాయి? **కృపయా వద తత్త్వతః!** నామీద కృపతో ఆయా విశేషములు నాకు తత్త్వార్థపూర్వకముగా దయచేసి బోధించండి.

**శ్రీరామచంద్రుడు :** వేదములన్నీ ఒకచోటికి తేబడినవై '4' భాగములుగా విభజించబడినాయి.

1) ఋగ్వేదము (ఋక్‌మంత్రములు. సత్యమును అభివర్ణించునవి)
2) యజుర్వేదము (యజ్ఞయాగ విధి - విధానములను తెలియజేయునవి)
3) సామవేదము (నాదము, సంగీతములతో భగవంతుని స్తోత్రములు సమర్పించునవి)
4) అథర్వణ వేదము (ప్రకృతిని, పురుషుని, పురుషోత్తముని నిర్వచించు మార్గము చూపుచున్నట్టివి)

ఈ నాలుగు వేదములనుండి అనేక శాఖలు, ఉపశాఖలు విభజనపూర్వకముగా (Like Different Chapters) బయల్వెడలినాయి. అట్టి శాఖ-ఉపశాఖలు, వాటిని అనుసరించి వేదాంత శాస్త్రము యొక్క విస్తార రూపములగు ఉపనిషత్తులు. ఆత్మతత్త్వము గురించి సూత్రీకరిస్తూ ఆయా శాఖ - ఉపశాఖలలో ఉపనిషత్తులు నిక్షిప్తమై ఉంటూ వస్తున్నాయి. ఓ మారుతాత్మజా! ఆయా కొన్ని వివరణములు ఇప్పుడు మనము ప్రస్తావించుకుంటున్నాము. విను.

| | | |
|---|---|---|
| ఋగ్వేదమునకు | → | ఏకవింశతి (21) శాఖలు, |
| యజుర్వేదమునకు | → | నవాధిక శత (109) శాఖలు, |
| సామవేదమునకు | → | సహస్రసంఖ్యయా (1000) శాఖలు, |
| అథర్వణవేదమునకు | → | పంచాశత్ (50) శాఖలు. |

ఈ శాఖలన్నీ వేరు - వేరైన మంత్ర - తంత్ర - విధి - విధాన విశేషములతో అనేక విశేష భేదములు కలిగి ఉన్నాయి. పై 21 + 109 + 1000 + 50 = 1180 శాఖలలో ఒక్కొక్క దానిలో ఒక్కొక్క ఉపనిషత్ వేదాంత (వేదము చివరిగా) భాగముగా చెప్పబడుచూ సూత్ర - ఉపాసనా - వివరణ - సిద్ధాంత - విధాన పూర్వకం చెప్పబడినవై ఉన్నాయి.

**శ్లో॥ తాసామ్ ఏకామ్ ఋచం యేన పఠ్యతే భక్తిసా మయి,**
**స మత - సాయుజ్య పదవీం ప్రాప్నోతి, మునిదుర్లభమ్!**

అట్టి 1180 ఉపనిషత్తులలోని ఏ ఒక్కటైనా సరే, ఎవ్వరైతే-అందులోని సారభూతమై యున్నట్టి బ్రహ్మజ్ఞానమును నా పట్ల భక్తితో శ్రద్ధగా పఠిస్తారో, అధ్యయనము చేస్తారో,-అట్టివారు మునులకు కూడా దుర్లభమగుచున్న నాయొక్క **సాయుజ్య పదవిని** అధిరోహించుచున్నారు.

**శ్రీహనుమంతుడు :** ప్రియస్వామీ! శ్రీరామచంద్రా! ఒక్కొక్క ముని శ్రేష్ఠుడు **'ముక్తిమార్గము'** గురించి ఒక్కొక్క విధంగా నిర్వచిస్తూ ప్రపంచమునకు సూచిస్తున్నారు. "ఇదియే ముక్తికి మార్గము" – అని అనుశాసిస్తున్నారు కూడా!

**ముక్తిః ఏ కేతి చక్షిరేః** ఏకత్వమే ముక్తి! అనేకత్వమే బంధము! ఏకాగ్రతచే అది సిద్ధిస్తుందని, ఏకాగ్రత కొరకై ప్రాణాయామము, షట్చక్రములలో బుద్ధి నిలుపటము మొదలైనా **క్రియాయోగమార్గమే శ్రేష్ఠమని** చెప్పుచున్నారు.

**కే చిత్ త్వం-తారకోపదేశము-నామభజనమ్ :** కొందరు "శ్రీరామ జయరామ, జయ జయరామ! హరేరామ హరే రామ రామరామ హరే హరే! శ్రీరామరామ రామేతి, రామేరామ మనోరమే ... ఈ విధములైన" – **నామభజనయే ముక్తికి ఏకైకమార్గమని** ప్రబోధిస్తున్నారు. ""రామతారకమంత్రము మాత్రమే మిమ్ములను సంసారమునుండి తరింపజేస్తుంది" – అని కొందరు సిద్ధాంతీకరించుచున్నారు.

**అన్యేత సాంఖ్య యోగేన :** 'నాయనలారా! సాంఖ్య విచారణకు ఇప్పటికిప్పుడే ప్రారంభించండి. దృశ్యము – దేహము – ఇంద్రియములు – ఇంద్రియ విషయములు – మనస్సు – బుద్ధి – చిత్తము – అహంకారము – అవ్యక్తము – జీవుడు – ఈశ్వరుడు – పరమాత్మ....ఇవన్నీ విభాగించి ఒక్కొక్కదానియొక్క తత్త్వమేమిటో, వాటి వాటి జడ చైతన్య స్వభావములు ఎట్టివో...., విభాగించి తెలుసుకోండి. ఇవన్నీ తెలుసుకొన్నారా, ఇక ముక్తి మీకు కరతలామలకము!" – అని బుద్ధిచే విభాగించు బుద్ధియోగము (లేక) సాంఖ్యయోగమే మోక్షమునకు (బంధవిముక్తి) మార్గమని మరికొందరు ప్రవచిస్తున్నారు. బుద్ధితో విభాగము చేసి తెలుసుకోవటముచేత మాత్రమే (జ్ఞానమార్గమే) ముక్తిమార్గముగా నిర్ణయించి చెప్పుచున్నారు.

**భక్తియోగేనచ అపరే :** మరికొందరు గురువులు శిష్యులకు తదితర జనులకు భక్తిమార్గమును చూపుచూ, **"కైవల్య సిద్ధికి భక్తియే మార్గము. నీవు నీ భార్యను – భర్తను – పిల్లలిని, స్నేహితులను, తదితర బంధువులను, సంపదలను, పేరు – ప్రతిష్ఠలను ఎంతెంతగా ప్రేమిస్తూ వస్తున్నావో...అదంతా కలబోసి ఒకచోటికి జేర్చి (గోపికాస్త్రీలవలె) పరమాత్మకు సమర్పించండి. అట్టి భక్తియోగము మాత్రమే** మార్గము. మిగతా జ్ఞాన – క్రియా మార్గములు భక్తుడుగా తీర్చిదిద్దటానికే ఉన్నాయి...!" – అని భక్తి యోగమును ప్రబోధిస్తున్నారు. అమానిత్వము, అదంభిత్వము మొదలైన భక్తి గుణములే అందుకు మార్గమని చెప్పుచున్నారు.

**అన్యే వేదాంతవాక్యార్థ విచారాత్ పరమర్షయః :** ఇక మరికొందరు మునిపుంగవులగు గురువులు. మహావాక్యవిచారణను సూచిస్తున్నారు. 'అసలు విషయము పట్టుకోకుండా, ఏవేవో ప్రయత్నాలతో కాలం వెళ్లబుచ్చుచున్నారేమి? మానవ జీవితము కాలపరిమితమైయున్న మహత్తరమైన అవకాశము. అందుకే వేద ఉపనిషత్తులు మహావాక్యములను జీవులకు అందిస్తున్నాయి. వాటిని పరిశీలించాలి. పరమార్థాన్ని గ్రహించాలి.

'తత్ త్వమ్' → 'నీవు'గాను జగత్తుగాను కనిపిస్తున్నది ఆ పరమాత్మయే!

'సోఽహమ్' →'తత్త్వమ్'ను విచారణ చేసి, తద్వారా **'నేను అదియే! ఆ పరమాత్మ స్వరూపమే'** అను అర్థమును బుద్ధితో సముపార్జించుకోవటానికే ఈ మానవఉపాధిని పొందటము యొక్క **ముఖ్యోద్దేశ్యము.**

'త్వమ్ ఏవాఽహమ్' → 'నీవుగా కనిపిస్తున్నది నేనే!'...'మమాత్మా సర్వభూతాత్మ' భావన!

త్వమ్ అహమేవ → 'నేను మీ ఆత్మ స్వరూపుడనే!' అని తనను తాను తదితరులకు చెందిన సొత్తుగా అంగీకరించి ఉండటము.

జీవోబ్రహ్మైఽతి నాపరః → ఈ జీవుడగా కనిపిస్తున్నది పరబ్రహ్మమే!

ఇట్లా అనుకుంటూ ఉంటే అనిపిస్తుంది కూడా! అట్లా అనిపించటమే బ్రహ్మీ దృష్టి!

(ఈ మొదలైన) మహావాక్యముల పరమార్థ విచారణ లేనంతవరకూ కళ్లు మూసుకుని కూర్చుని కూడా ప్రయోజనము లేదు. కనుక జనులారా కనులు తెరవండి! మహావాక్యముల అర్థమును పరిశీలించి హృదయస్థం చేసుకోండి. బుద్ధిని మహావాక్యార్థములతో నింపివేయండి. అప్పుడు సాయుజ్య పదవి దానికదే సిద్ధిస్తుంది!...**అని ఉపదేశిస్తున్నారు.**

**సాలోక్యాది విభాగేన చతుర్థా ముక్తిరీరితా :** మరికొందరు మునీశ్వరులు, "సాలోక్యము ఇత్యాది చతుర్విధ మార్గమును ఆశ్రయిస్తేనే ముక్తి లభిస్తుంది. అది వదలి మరెటో వెళ్ళకండి" అని బోధిస్తున్నారు.

**సామీప్యము :** ముందుగా ఇష్టమైన దేవత యొక్క రూపమును స్వీకరించి ఉపాసించటము. ఈ విధంగా ఇంద్రియములను పూజయందు నియమించటము. తత్‌రూప్యభావనతో తత్‌స్వరూపాభిమానివి అవటము. ఈ జగత్తు తత్‌రూపముగా అనుభవమవటము.

**సారూప్యము :** తత్‌సారూప్యభావనతో బాటుగా 'సంకీర్తన' ఇత్యాదులచే జగన్‌భావనను అధిగమించి ఇష్టదైవముతో మనస్సు ఏకమై తత్ రూప భావనతో **సారూప్యము** పొందటము.

**సాలోక్యము :** సర్వము ఆ ఇష్ట దైవ భావనగా సందరిస్తూ ఉండటము, క్రమంగా **'ఈ కనబడు జీవులు, రూపనామాలు - అన్నీ కూడా ఆ ఇష్ట దైవముయొక్క రూపములే'** అను అనుభూతిచే ఇష్టదేవతా రూపముగా ఈ సర్వమును గాంచుచూ, **'సాలోక్యము'** అను స్థితికి చేరటము.

**సాయుజ్యము :** ఆ పరమాత్మతో మమేకమై, అభిన్నమై 'వారికి నేను వేరుగా లేను' అను అద్వితీయస్థితి' (లేక) 'అద్వైత స్థితి'ని సముపార్జించటము.

ఇట్టి సాలోక్యాది చతుర్విధ స్థితులను సంపాదించమని చెప్పుచున్నారు.

జీవులమగు మేము - పరబ్రహ్మమును పొందుటకు - వివిధ గురు ప్రవచితమై, అనుసరించతగ్గ ఆయామార్గములలో ఉత్తమమైనదేది?

**శ్రీరామచంద్రుడు :** ఓ కపీశ్వరా! ఆంజనేయా! ఎవ్వరూ ఎట్టి మార్గమునైనను వారి వారి అభిరుచి చేతను, పూర్వ సంస్కారములచేతను అనుసరించవచ్చునుగాక! శ్రద్ధ - ఏకాగ్రత - దృశ్య పరిత్యాగము చేతనే పారమార్థిక రూపమగు కైవల్యము లభించుచున్నది. అట్టి పారమార్థిక రూపమగు కైవల్యము ఏకరూపమే గాని అనేక రూపము కాదు.

**ఏకరూపము :** జీవ - బ్రహ్మములు అభేదస్థితి. ఏకత్వము.

**సాలోక్యముక్తి :** ఒకడు దురాచారుడైనప్పటికీ 'శ్రీరామనామజపము' (నామస్మరణ)చే ఇక్కడే సాలోక్యముక్తిని పొందుచున్నాడు. **దురాచారరతోవాఽపి మన్నామ భజనాత్, కపే! సాలోక్యముక్తమ్ ఆప్నోతి।** ఓ కపిశ్రేష్ఠా! ఆతడిక మరొక లోకము (విష్ణు లోకము, శివ లోకము, బ్రహ్మలోకము మొదలైనవి) పొందవలసినదేమీ ఇక ఉండదు. **నతు లోకాంతరాదికమ్!**

**సాలోక్య - సారూప్య ముక్తి :** ఎవ్వడైతే యోగమార్గములో బ్రహ్మనాళముతో ప్రకాశించినవాడై మూలాధారచక్రము నుండి బయల్వెడలి **స్వాధిష్ఠాన - మణిపూరక - అనాహత - విశుద్ధ** చక్రములను దాటి, ఆజ్ఞా చక్రమునందు ప్రకాశించినవాడై, అక్కడి ధ్యానబలిమిచే శిరస్సుకు ఊర్ధ్వభాగమునగల బ్రహ్మరంధ్రమును చేరి ధ్యానపరుడగుచున్నారో, అట్టివాడు కేవలీ రూపమును సంతరించుకుంటున్నాడు. కాశి వంటి పవిత్ర ప్రదేశములలో దేహము త్యజిస్తున్నప్పుడు (మరణించుచున్నప్పుడు) అతనికి నాయొక్క తారకము (తరించు మనన స్థితి) లభించినదై, దేహానంతరము నా స్థానము జేరటం జరుగుతోంది. ఎక్కడి - ఎవ్వరి - ఎట్టి వారైనాసరే కాశీ పుణ్యక్షేత్రముతో మరణించుచున్నప్పుడు ఆ జీవునికి శివమహేశ్వరుడు ప్రేమాస్పదముగా కుడి చెవిలో తారకమంత్రము ఉపదేశించుచున్నారు. కరుణామయుడగు ఆ పరమశివుడు బోధించు తారకవిద్యచే ఆ జీవుడు సమస్త పాప దోషములనుండి పరిశుభ్రుడు అగుచున్నాడు. అప్పుడాతడు నాయొక్క ఈ సారూప్యము భజించుచు 'సాలోక్య -సారూప్యముక్తి' పొందుచున్నాడు.

**సాలోక్య-సారూప్య సామీప్యముక్తి :** ఒకడు ఇహమును అధిగమించుచు, పరమును ఆశ్రయించు దీక్ష చే 'ద్విజుడు' అగుచున్నాడు. అట్టి శ్రద్ధ - నిష్ఠలను వృద్ధి చేసుకుంటూ, సదాచారములద్వారా (సహజీవుల పట్ల వాత్సల్యము మొదలైన మార్గములుగా) అత్మారామ సామీప్యము పొందుతూ, ఆతడు 'సర్వులు అఖండ-ఆత్మస్వరూపులే' అను రూపముగల సర్వాత్మభావమును సముపార్జించుకొనుచున్నాడు. ఎదురుగా కనిపిస్తున్న 'త్వమ్'ను 'తత్' పరమాత్మగా సర్వజీవులను దర్శించుచూ **'తత్త్వదర్శి'** అగుచున్నాడు. సర్వసహజీవులను పరమాత్మ స్వరూపముగా భజించుచుండగా అట్టివాడు ఆ సర్వాత్మకత్వ భావనా సిద్ధిచేత నా సామీప్యతను అనుభూతము చేసుకొంటూ సామీప్య - సారూప్య - సామీప్య ముక్తిని పొందుచున్నాడు.

**సాయుజ్యముక్తి :** సాలోక్య-సారూప్య-సామీప్య ముక్త స్థితి వృద్ధి చెందుచుండగా 'తత్ త్వమ్' అనబడు సర్వసహజీవులను రామబ్రహ్మము యొక్క ప్రత్యక్ష రూపములే-అను రూపముగల తాత్త్విక స్థితి రూపుదిద్దుకుంటున్నదని అనుకొన్నాము కదా! ఇక అప్పటి నుండి సద్గురువు ఉపదేశించు తత్త్వపాఠ్యాంశముల ప్రభావము చేత **"సర్వము తనయందలి రామబ్రహ్మ స్వరూపముగాను, సర్వమునందు ప్రకాశమానమగునది స్వస్వరూప రామబ్రహ్మముగాను"** దర్శించనారంభించుచున్నాడు. ఈ విధంగా అవ్యయమగు ఉత్తమోత్తమమైన **సాయుజ్యముక్తిని** పొందుచున్నాడు.

**భ్రమరకీటక న్యాయము :** ఒక గండుతుమ్మెద చిన్న పురుగును తెచ్చి ఒకచోట ఉంచి దానిచుట్టూ 'ఝుయ్' అను భీకర శబ్దము చేస్తూ ఉండగా...ఆ కీటకము భయపడుచూ, భయపడుచూ ధ్యాసనంతటినీ ఆ భ్రమరము (తుమ్మెద)పైనే ఉంచసాగుతుంది. కొద్దిరోజులకు ఆ చిన్నకీటకము కాస్తా పెద్ద గండుతుమ్మెదగా అగుచున్నది. ఇట్టి భ్రమర - కీటక న్యాయమువలె 'సమ్యక్ భావన'చే (తత్త్వమ్ భావనచే) 'సోఽహమ్' భావమును పొంది, ఇక ఆతడు నా స్థానమునకు వచ్చి చేరుచున్నాడు. తానే ఆత్మారాముడై, లోకమంతా నావలె స్వస్వరూపముగా దర్శించుచూ రామానందసాగరుడు అగుచున్నాడు. "ఇదంతా నా స్వరూప - స్వభావమే! పరమాత్మయే ఇదంతా! ఆత్మస్వరూపుడగు నాకు అన్యముగా ఏదీ ఏక్కడా లేదు" .... అను స్వభావానుభూతి పొందుచున్నాడు.

**ఇదియే 'సాయుజ్యము'** అని చెప్పబడుతోంది. ఏ విధంగా అయితే సముద్రాధిష్ఠాన దేవత సముద్ర తరంగములన్నీ తనయందు

'నాకు అద్వితీయము' అను భావనతో చిద్విలాసముగా దర్శించుచున్నదో..., సర్వ జగదంతర్గత జీవులను, వారి వారి స్వభావములను యోగి తన యొక్క బ్రహ్మానంద సముద్ర స్వరూపములోని ఆనంద తరంగాలుగా దర్శించటము **'సాయుజ్యము'**. అట్టి సాయుజ్యముక్తినే **"బ్రహ్మానంద స్వరూపము". "శివానంద లహరి", "ఆత్మ సాక్షాత్కారము"** అని కూడా అంటూ ఉంటారు.

ఓ ప్రియ తనయా! ఆంజనేయా! ఎవ్వరైతే 'శ్రీరామోపాసన' అనబడు నా ఉపాసకుడై ఉంటాడో, అట్టివాడు – **చతుర్విధాచ యా ముక్తిః మత్ ఉపాసనయా భవేత్** – చతుర్విధములైన ముక్తులను సంపాదించుకొంటున్నాడు. అతని యొక్క భక్తి ప్రపత్తులకు వశుడనై నేను వారిని చతుర్విధముక్తుల వైపుగా అడుగులు వేయించి తీసుకువెళ్ళుచున్నాను. భక్తి ప్రపత్తుల మహత్తర ప్రభావముచే ఈ జీవుడు **'కైవల్య ముక్తి'** పొందుచున్నాడు.

**శ్రీ హనుమంతుడు** : స్వామీ! రామచంద్రా! 'కైవల్యముక్తి'యే 'పరాకాష్ఠ' కదా! అట్టి కైవల్యముక్తిని జీవులమగు మాకు సులభముగా ఏ ఉపాయము చేత సిద్ధిస్తుంది? **ఇయం కైవల్య ముక్తిస్తు కేన ఉపాయేన సిద్ధ్యతి?** అట్టి కైవల్యసిద్ధిని ప్రసాదించుటకై మేము ఎవరిని ఆశ్రయించాలి?

## కైవల్యసిద్ధి (కేవలీభావన – The Sense that 'Iam The Absolute)

**శ్రీరాముడు :** 'కైవల్య సిద్ధి' అనునది వాస్తవానికి ఎవరికివారే తమయొక్క ఉత్తమ బుద్ధి చేత, తత్త్వమ్ భావన చేత సిద్ధింపజేసుకోవలసిందే! అంతేగాని ఈ జీవునికి మరొకరెవరో ఎప్పటికో ప్రసాదించేది కాదు. అది ఇప్పుడే ఇక్కడే (ఇహైవ) సిద్ధింపజేసుకోవాలి. అందుకుగాను మునుముందుగా సాధన చతుష్టయము, భక్తి, దైవీగుణసంపత్తి....ఇత్యాదులచే హృదయమును పరిశుభ్రపరచుకోవాలి. అటు తరువాత 'బ్రహ్మజ్ఞానము'ను హృదయముతో వెలిగించాలి. అందుకు ముముక్షువులందరికీ ఒక ఉపాయము చెప్పుచున్నాను. విను.

**ఉపనిషత్ – అధ్యయనము :** అందుకు సులభోపాయము వేదాంతములగు ఉపనిషత్ అధ్యయనములు. ఓ ముముక్షువులారా! మీరు ఒక్క 'మాండూ క్యోపనిషత్తు'ను గురుముఖతఃగాను, ఆ తరువాత స్వయముగాను అధ్యయనము చేసినా కూడా చాలు. అప్పుడు ఆ ముముక్షువు అయినట్టి అధ్యయని (one who studies) కి ఇప్పుడే – ఒక్కడే సాయుజ్యము లభించగలదు.

ఒకవేళ ఆ 'మాండూక్యోపనిషత్తు'ను అధ్యయనము చేసిన తరువాత కూడా ***'నేను ఆత్మారాముడనే! నేనే బ్రహ్మమును! సముద్రములో అనేక తరంగములవలె సహజీవులు – బ్రహ్మాండములు లీలావినోదముగా నాయందే ఉత్పత్తి – స్థితి లయములు పొందుచున్నాయి'*** అను స్థితి విషయంలో నిశ్చలత ఏర్పడక, ఇంకా కొన్ని అనుమానాలు కొనసాగుచున్నాయా? అయితే ఇంకొక ఉపాయం! ఓ ప్రియ మమాత్మానంద స్వరూపులగు ముముక్షువులారా! మరలా నడుముకట్టండి.

(1) ఈశావాస్య, (2) కేన, (3) కఠ (4) ప్రశ్న, (5) ముండక, (6) మాండూక్య, (7) తైత్తరీయ, (8) ఐతరేయ, (9) ఛాందోగ్య, (10) బృహదారణ్యకములు అనబడే **దశోపనిషత్తులు** అధ్యయనము చేయండి. గురుముఖతః వినండి. మీకు మీరుగా కూడా పఠించండి. అప్పుడు మీరు నాయొక్క ధామము (State, Placement) కు తప్పక చేరగలరు.

ఒకవేళ పూర్వజన్మల సుదీర్ఘ సంస్కార పంపరలు కారణంగా అప్పటికీ కూడా **'తత్త్వమ్ – సోऽహమ్ – త్వమేవాऽహమ్ – త్వమ్ అహమేవ'** అను పరమార్థ నిశ్చయము సుస్థిరము కాలేదనుకో! అప్పుడు మరికొన్ని –'32' ఉపనిషత్తులు అధ్యయమను చేయండి – అని వేదాంత–తత్త్వజ్ఞులచే సూచించబడుతోంది.

(1) బ్రహ్మో, (2) కైవల్య (3) జాబాల, (4) శ్వేతాశ్వతరో (5) హంస, (6) ఆరుణిక, (7) గర్భ, (8) నారాయణ, (9) పరమహంస, (10) అమృతబిందు, (11) అమృతనాద, (12) అథర్వశిర, (13) అథర్వ శిఖ, (14) మైత్రాయణ్య, (15) కౌషీకీ బ్రాహ్మణ, (16) బృహత్‌జాల, (17) నృశింహతాపనీ (పూర్వతాపనీ, ఉత్తర తాపనీ) (18) కాలాగ్ని రుద్ర, (19) మైత్రేయ, (20) సుబాల, (21) క్షురిక, (22) మంత్రిక, (23) సర్వసార, (24) నిరాలంబ, (25) శుక రహస్య, (26) వజ్ర సూచి, (27) తేజోబిందు, (28) నాదబిందు, (29) ధ్యానబిందు, (30) బ్రహ్మ విద్య, (31) యోగతత్త్వ , (32) ఆత్మబోధ.

మొత్తముమీద ఉపనిషత్ సాహిత్యముతో 108 ఉపనిషత్తులు అతి ముఖ్యమైనవి. వీటినన్నిటినీ పఠిస్తూ ఉంటే,...భావనాత్రయమును (దృశ్య భావన – ద్రష్ట భావన – దర్శన భావనలు) నశించగా, **'కేవల దృక్'** భావన శేషించగలదు. ఇవి అటు ఆత్మజ్ఞానముపట్ల సరాగము, ఇటు దృశ్యము పట్ల విరాగమును కూడా (ఆ అధ్యయనము) కలిగించగలవు. వాసనాత్రయము (జీవాత్మ వాసన – దేహవాసన – దృశ్యవాసన) తొలగిపోగలవు. ఇక్కడ రెండు విషయాలు.

(1) అట్టి ఉపనిషత్ అధ్యయనము చేస్తున్నప్పుడు (లేక) పఠించుచున్నప్పుడు ఆ ఉపనిషత్ ప్రారంభములోను, చివర కూడా ఆ ఉపనిషత్‌కు సంబంధించిన 'శాంతి పాఠము'ను కూడా పారాయణము – పఠించాలి.

(2) ఆత్మతత్త్వ జ్ఞానము వాక్కుకు – మనస్సుకు అగోచరము (అవాక్ – మానస గోచరం)గా చెప్పబడుచున్న స్వానుభవము, స్వా–అధ్యయన సారము కదా! అందుచేత ఉపనిషత్తులను కొద్దిమంది ఔత్సాహికులగు ముముక్షువులు పరస్పరము సంభాషించుకొంటూ అర్థవివరణ చేసుకోవటము – **ఉత్తమ ప్రయోజనకరము.** ఒక్కరుగా కూర్చుని పఠించుటము కంటే కూడా, కొందరితో కలిసి అధ్యయనముచేయటము మరింత ఫలప్రదము.

గురుముఖతః విని, పఠించటము – మరింత అధికమైన ఫలప్రదాత అగుచున్నవి. అందుచేత ఈ 108 ఉపనిషత్తులు పఠణ – అధ్యయన – విశ్లేషణ – అవగాహన – స్వానుభవముల కొరకై....,

- వేద విద్య (ఉపనిషత్తు విద్య)యందు **పారంగతుడు,**
- ఎల్లప్పుడూ **ఆత్మతత్త్వ సమాధ్యాస చే నిత్యరతుడు**, అనునిత్య **జ్ఞానానందశీలుడు,**
- జగత్తును అధిగమించి, దీనికి ఆధారమైయున్న **ఆత్మతత్త్వమునందే నియమము** కలవాడు,
- ఆత్మ తత్త్వ జ్ఞానమునందు, **'ఆత్మోపమ్యేవ సర్వత్ర'** – దర్శనమునందు నిష్ఠ, పట్టుదల కలవాడు,
- ఆత్మయందే సదా **సంచరించుచు స్నాతకుడు (ప్రవర్తకుడు)** ..., అగువానిని ఆశ్రయించాలి.

నిత్యానిత్య వివేకియగు అట్టి పండితుని ముఖతః స్వయముగా వినాలి. అటు తరువాత తనకు తానుగానూ మననము చేస్తూ, అధ్యయనము చేస్తూఉంటే, అతిత్వరగా మహత్తరమైన ప్రయోజనము సిద్ధించగలదు. అట్టివాడు తప్పక ముక్తిని పొందగలడు. ఈ కళ్ళకు కనిపించుచున్న **దృశ్యము బంధమని అనిపించక, స్వస్వరూపముగా అనిపించటమే ముక్తి**. ఉపనిషత్తులను అధ్యయనము చేయుచున్నవాడు – జీవన్ముక్తుడై ప్రకాశించుచున్నాడు. అట్టివాడు – వర్తమాన దేహముతో ఏదేది ప్రారబ్ధవశముగా పొందాలో, అవన్నీ పొందుచూ, ప్రారబ్ధమును (సంచిత కర్మల నుండి వర్తమాన దేహముతో అనుభవించవలసినవిగా నిర్ణితమైనవి) 'అనుభవించటము' ద్వారా క్షయం చేసివేసుకొంటున్నాడు. ప్రారబ్ధానంతరము విదేహముక్తుడగుచూ నా యొక్క సన్నిధానమును చేరుచున్నాడు.

ఓ హనుమా! **నాస్తి తత్ర సంశయః!**

ఆ విధంగా ఉపనిషత్తుల అధ్యయనముచే ఈ జీవుడు జీవన్ముక్తి, ప్రారబ్ధ కర్మల క్షయము, 'విదేహముక్తి' పొందుతాడు. ఇందులో ఏమాత్రము సందేహము లేనే లేదయ్యా!

మనం పైన చెప్పుకొన్న 108 ఉపనిషత్తులు కూడా సర్వ ఉపనిషత్తుల (1180 శాఖలలో గల ఒక్కొక్క ఉపనిషత్తు చొప్పున మొత్తము ఉపనిషత్తుల మధ్యగతమైయున్న 1180 ఉపనిషత్తుల) 'సారము'గా చెప్పబడుచున్నాయి. ఈ 108 ఉపనిషత్తులు శ్రవణము చేసినంత మాత్రముచేత సర్వ పాపములు పాపదృష్టులు, దోషదృష్టులు తొలగి, హృదయము అత్యంత నిర్మలము కాగలదు. ఓ పవన నందనా! నీవు నాకు ప్రియభక్తుడవు! అత్యంత బుద్ధి మంతుడవగు శిష్యుడవుకూడా! అందుచేత (108) ఉపనిషత్తులలోని అతి రహస్యమగు కొన్ని సార విశేషాలు నీకు విశదీకరిస్తున్నాను.

ఒకడు అజ్ఞాని అయినప్పటికీ కూడా, అష్టోత్తర శత (108) ఉపనిషత్తులలోని సారాంశములను పఠిస్తూ హృదయస్తము చేసుకొంటూ ఉంటే అట్టివాడు జన్మజన్మలుగా చిక్కు ముడిపడుతూ వస్తున్న సర్వ సంసార బంధములనుండి తప్పకుండా విమోచనము పొందగలడు. ఈ ఉపనిషత్తులను గురుముఖతః గాను, స్వయము గాను అర్థము చేసుకొని, **'తత్ పరబ్రహ్మమ్ అహమేవ'** అని సునిశ్చితుడు అగుచున్నవాడు, తాను తెలుసుకొన్న బ్రహ్మతత్త్వమును తనను ఆశ్రయించవచ్చిన వారికి – **నీవు వెతుకుతున్న ఆ పరబ్రహ్మతత్త్వము స్వయముగా నీవు, నేను కూడా! తరంగము జలము కోసము వెతుకుచున్నట్లు మనము బ్రహ్మము కొరకై వెతుకుచున్నాము. తత్త్వమ్! అహమ్ బ్రహ్మఽస్మి** – అని బోధించుచున్నాడు. ఓ హనుమా! ఆత్మ తత్త్వము ఎరిగినవాడు తనను జ్ఞానము కోసము అర్థించినవారికి తప్పక బోధించాలి. అయితే...బ్రహ్మతత్త్వము బోధించుటకు ముందు, ఆ శ్రోత (శిష్యుడు) **'ఆత్మబోధ'** వినటానికి అర్హుడో, కాదో గమనించి అప్పుడు మాత్రమే విశదపరచటము ఉచితము.

- "అయ్యా! నాకు బోధించండి! నేను అత్యవసరంగా తెలుసుకోవాలి!"–అను రూపముగల **ఇచ్ఛ పట్టుదల** అతనిలో ఉన్నాయా? ఇది గమనించాలి.
- 'నేను ఎరిగి ఉండలేదు. విద్యార్థినై ఆత్మవిద్యను అర్థిస్తున్నాను'. అను రూపముగల శిష్యత్వము అతనిలో కనిపించాలి. ఏవో కొన్ని సిద్ధాంతములను ఖండించటానికో, తనకు తెలిసినవి చెప్పి తృప్తి పొందటానికో, వాదోపవాదాలు చేయటానికో, ఎవరో కొందరికి ఏమీ తెలియదని నిరూపించటానికో..ఎవ్వరినైనా సమీపిస్తే, ఆవిధంగా సమీపించుచూ ఉన్నవానియందు శిష్యత్వము యొక్క ధారణ లేనిదే అగుచున్నది. కాబట్టి అట్టి వానికి బ్రహ్మతత్త్వము బోధించకపోవటమే ఉచితము.

**హిత పుత్రాయ :** కుమారుడైనా సరే, మరెవ్వరైనా సరే…తల్లి–తండ్రి–గురువు–దైవములపట్ల సేవ–కృతజ్ఞతలు కలిగి ఉంటేనే బోధించాలి.

**మద్భక్తాయ :** భక్తుడు కానివానికి బోధించకూడదు. హృదయములో భక్తి–ప్రపత్తులు కలవాడే ఆత్మజ్ఞాన సమాచారములకు 'అర్హుడు' అగుచున్నాడు.

ఈ ఈ లక్షణములను చక్కగా సమ్యక్ పరీక్ష చేసి అప్పుడు ఈ 108 ఉపనిషత్తుల సార విషయములను తెలియజేప్పాలి. పై…అర్హతలు లేకుండా ఒకడు 'నేను రాజ్యం ఇస్తానండీ! ఎంత ధనమైనా ఇస్తాను. మీరు ఏమి అడిగితే అవన్నీ ఇచ్చి మీ కోరికలు తీరుస్తాను' అని అంటే కూడా ఈ 108 ఉపనిషత్ ప్రబోధమగు 'సోఽహమాత్మవిద్య' లేక 'తత్త్వవిద్య'ను బోధించకూడదయ్యా! ఎందుకంటే ఉపనిషత్ బోధ అట్టివానిపట్ల ఉద్దేసించిన ప్రయోజనము సిద్ధించదు. జగత్ వ్యవహారములు, లోభ–మోహములు దట్టంగా నిండి ఉన్న హృదయములో వేదాంత అంతర్గతమగు ఉపనిషత్ – జ్ఞానజ్యోతి వెలుగు విస్తరించ జాలదు.

- 'ఈ సృష్టికి ఆవల కర్తా లేడు. ఇవన్నీ ప్రసారించే దేవుడూ లేడు. భక్తి–జ్ఞానము ఇవన్నీ వృధా!'…అను అభిప్రాయములు గల నాస్తికునికి…,
- చేసిన మేలు మరచి తల్లి–తండ్రులపట్ల, తదితర హితులపట్ల కృతఘ్నుడై ఉండువానికి…..;
- ఇతరులను వేధించటము, బాధించటము, దూషించటము, ఎగతాళి చేయటము, తక్కువగా చేసి మాట్లాడటము, ద్రోహము చేయాలనుకోవటము…ఇటువంటి దురాచారములు కొనసాగించువానికి….;
- భక్తి – ప్రపత్తి – అణుకువ లేనివానికి, పరాప్రేమరూపమగు భక్తిభావన పట్ల విముఖత చూపువానికి….;
- శాస్త్ర విషయములను–చారిత్రక విషయములను గట్టిగా పట్టుకొని జ్ఞానవిషయములవైపుగా దృష్టిసారించుటకు సిద్ధము కానివానికి…;
- గురువులలో భేదము చూస్తూ దూషణ – అనుమానము – తేలిక భావన చేయుచున్నవానికి….;
- శాస్త్ర విషయముల వాదోపవాదములను చేబూని పరులను ఖండించటము…ఇదియే పరమావధిగా ఉండి 'శాస్త్రములు' అనే బురదగుంటలలో చిక్కుకున్నవానికి; శాస్త్ర చర్చలందు మాత్రమే అభిరుచిని పరిమితము చేసుకొని, జ్ఞానానుభవమునకు సిద్ధము కానివానికి….;
- గురుభక్తి (నాకు తెలియదుకాబట్టి వారు చెప్పునది ముందుగా శ్రద్ధగా విందాము. అర్థము చేసుకొని, ఆ తరువాత ఆలోచన చేద్దాము – అనే) శ్రద్ధ…లేనివానికి,
- గురువు మీద, శాస్త్రము మీద, తన మీద నమ్మకము (ప్రపత్తి) పెంపొందించుకొనుటకు సంసిద్ధుడు కానివానికి…; గురిలేనివానికి, పిరికితనము – అపనమ్మకములను జయించ సిద్ధము కానివానికి…;

….. ఈ అష్టోత్తర శతోపషనిషత్ ప్రతిపాదితమగు 'పరబ్రహ్మత్వము'ను బోధించకూడదు. అతడు **'తత్త్వమ్, సోఽహమ్'** సారాంశములను గ్రహించక, పెడర్థము చేసుకోవటము, స్వధర్మము – ఇత్యాదులపట్ల వితండవాదము ఆశ్రయించటము… మొదలైన దోషములకు లోను అయ్యే ఆస్కారము ఉన్నది. దోష నివృత్తికై ప్రయత్నశీలుడే ఉపనిషత్ శ్రవణమునకు అర్హులు.

ఓ రామచంద్రా! ఈ 108 ఉపనిషత్తుల పాఠ్యాంశములను ఎవ్వరూ చదువుతారో (లేక) వింటారో…ఆ పాఠకుడు–శ్రోతకూడా … సంయోగ–వియోగాతీత **'రామపరబ్రహ్మస్థానము'** అని వర్ణించబడుచున్న నా స్థానమును చేరుచున్నారు.

⌘

వేద ఋక్ వాక్ దేవతాయగు శ్రీవిద్యాదేవి – వేదోపనిషత్తులను గానం చేస్తూ సంభాషించుకుంటూ బోధిస్తూ, అర్థ తాత్పర్యములను గానం చేస్తున్న – ప్రకటించుచున్న బ్రహ్మ విద్యా పారాయణుల వద్ద (బ్రాహ్మణుల వద్ద) ప్రత్యక్షమై ఇట్లా పలుకుచున్నది.

***'ఓ వేదాంతరూపమగు ఉపనిషత్ విద్యను ఎలుగెత్తి గానము చేస్తున్న బ్రహ్మ విద్యాపారంగతులారా! బ్రహ్మవిద్యాస్వరూపిణినగు నన్ను మీయందు కొంచము దాచి ఉంచండి. మీయందు సర్వదా సంరక్షించుకొంటూనే, కొంత మాటుగా కూడా ఉంచండి. నేను మిమ్ములను ఒక నిధివలె కాపాడుకుంటాను. ఇష్ట కామ్యములు సిద్ధింపజేస్తాను. ఉపనిషత్ తత్త్వార్థము కొరకై మిమ్ములను సమీపించు శిష్యునికి గురుభక్తి, దృశ్య విషయములపట్ల విరక్తి, సత్ప్రవర్తన, జిజ్ఞాస, ఆత్మజ్ఞానార్తి, ధర్మ నిరతి …ఇవన్నీ ఉన్నాయో లేవో పరీక్షించి, అప్పుడు బ్రహ్మవిద్యను (ఆత్మతత్త్వబోధను) తప్పక బోధించండి. అయితే ఒక నియమమును మాత్రమే విధిస్తున్నాను.***

- ప్రక్క వారిని చూచి అసూయపడువారికి,
- 'ఋజుత్వము' (త్రికరణశుద్ధి) లేకుండా వంకర టింకర వర్తనము – భావములు పెంపొందించుకొని ఉన్నవారికి, (పైకి ఒకటి చెప్పి లోన మరొకటి కలవారికి…. (Inner Agenda is opposite to Outer Expressions),

- మోసము చేయు (శఠ) స్వభావము కలవారికి

**నన్ను బోధించవద్దు.** వీర్యవతినగు నేను ఉత్సాహము, సాహసము, ధైర్యము, సూక్ష్మ విషయములు గ్రహించగలబుద్ధి, శక్తి, పరాక్రమము ప్రసిద్ధమైయున్న హృదయములలో మాత్రమే - ప్రవేశిస్తాను.

**వీర్యవతినై బ్రహ్మజ్ఞాన మార్గము ఆశ్రయించువారికి కావలసినన్నీ ప్రసాదించుచూ తోడై ఉంటాను.**

⌘

ఓ ఆంజనేయా! ఎవ్వరైతే వేదశబ్దములను, శ్లోకములను ఉపాసిస్తూ పలుకుచూ ఉంటారో, ఆత్మ తత్త్వజ్ఞానము కొరకై ఔత్సాహితులై - అప్రమత్తులై - అల్ప విషయమననములను, త్యజించినవారై ఉంటారో, బ్రహ్మము నందు చరించు 'బ్రహ్మ చర్య వ్రతస్తులు' అయి ఉంటారో, వారు కోరినప్పుడు, వారియొక్క ఆయా అర్హతలను - సంసిద్ధతలను పరీక్షించి, అప్పుడు...తప్పక ఈ **'విష్ణు స్వరూప సంబంధమైనటువంటి ఆత్మనిష్ఠ'** లేక **'నేనే ఆత్మను - అను నిష్ఠ'**...ను బోధించెదరుగాక!

ఓ హనుమా! ఇంకా ఏమైనా 'ఉపనిషత్ సాహిత్యము' విషయమై తెలుసుకోవాలని అనుకుంటున్నావా?

**శ్రీహనుమంతుడు :** అవును స్వామీ! "ప్రతి ఉపనిషత్తు పారాయణ చేస్తున్నప్పుడు - శాంతి పాఠముతో ప్రారంభించబడి, శాంతి పాఠముచే ముగించబడుగాక" అని మీరు శలవిచ్చి ఉన్నారు కదా! **ఋగ్వేదాది విభాగేన పృథక్ శాంతిమ్ అనుబ్రూహి!** ఋక్-యజుర్-సామ-అథర్వణ వేదములలో చెప్పబడుచున్న 'శాంతి పాఠము'ల గురించి కూడా వివరించప్రార్థన.

**శ్రీరామచంద్రుడు :** విను. చెప్పుచున్నాను.

**ఋగ్వేద అంతర్గత ఉపనిషత్తులు** : అక్షమాలిక, ఆత్మబోధ, ఐతరేయ, కౌషీతకీ బ్రాహ్మణ, త్రిపుర, నాద బిందు, నిర్వాణ, బహ్వృచ, ముద్గల, సౌభాగ్యలక్ష్మీ (10)

## ఋగ్వేదాంతర్గత శాంతిమంత్రము

**ఓం వాఙ్మే (వాక్ మే) మనసి ప్రతిష్ఠితా! మనో మే వాచి ప్రతిష్ఠితమ్!**
**ఆవిః ఆవీర్మ ఏధి! వేదస్య మ ఆణీ స్థః! శృతం మే మా ప్రహాసీః।**
**అనేన అధీతేన। అహోరాత్రాన్ సందధామి!**
**ఋతం వదిష్యామి! సత్యం వదిష్యామి!**
**తత్ మామ్ అవతు! తత్ వక్తారమ్ అవతు। అవతు మాం। అవతు వక్తారమ్ ॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

నాయొక్క వాక్కు మనస్సునందు, మనస్సు వాక్కునందు ఎల్లప్పుడు ప్రతిష్ఠితములై నెలకొని ఉండునుగాక! నాలో జ్యోతిస్వరూపులై వేంచేసియున్న ఓ పరమాత్మా! నాయందలి అజ్ఞాన తెర తొలగి మీ ప్రకాశము వెల్లివిరియును గాక! ఎల్లప్పుడూ మీరు నాయందు తెలియబడుచూ ఉండెదురుగాక! అందుకై నా బుద్ధి-తెలివి సుసూక్ష్మము, సుతీక్ష్ణము అగును గాక! ఆత్మజ్ఞుల వద్ద నేను వినుచున్న సమాచారము మరుగున పడుకుండునుగాక! నేను అధ్యయనము చేస్తున్న గ్రంథములలోని ఆత్మశాస్త్ర సంబంధమైన విశేషములను రాత్రింబవళ్లు అనుసంధానము చేసెదనుగాక! ఋక్కులు పలుకు సత్యము-యదార్థము అగు మాటలనే ఎల్లప్పుడు మాట్లాడుదునుగాక! ఆ పరమాత్మ-నాకు రక్షకుడయ్యెదరు గాక! పరమాత్మ గురించి నాకు చెప్పుచున్న సద్గురువు అగు వక్తారుని కూడా సర్వదా రక్షించెదరు గాక!

ఈ దృశ్యము, నా దేహిత్వము, నా అంతరంగము-మమాత్మ స్వరూపమై నా యందు సశాంతించునుగాక! **(ఓం శాంతిః। శాంతిః। శాంతిః।)**

**శుక్ల యజుర్వేదాంతర్గత ఉపనిషత్తులు (19) :** ఆధ్యాత్మ, అద్వయ తారక, ఈసావాస్య, జాబాల, తారసార, తురీయాతీత, త్రిశిఖి బ్రాహ్మణ, నిరాలంబ, పరమహంస, పైంజ్గల, భిక్షుక, మండల బ్రాహ్మణ, మంత్రిక, ముక్తిక, సుబాల, యాజ్ఞవల్క్య, శాట్యాయనీ, హంస, బృహదారణ్యక (19)

## శుక్ల యజుర్వేదాంతర్గత శాంతిమంత్రము

**ఓం పూర్ణమ్ అదః। పూర్ణమ్ ఇదమ్। పూర్ణాత్ పూర్ణమ్ ఉదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమ్ ఆదాయ, పూర్ణమేవ అవశిష్యతే॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

- ఆ పరస్వరూపము సర్వదా పూర్ణము! ఇక్కడి ఈ ద్రష్ట – దర్శన – దృశ్యముల వెంటనిడుకొనియున్న ఇహస్వరూపము కూడా పూర్ణమే! పరమాత్మ సర్వదా పూర్ణుడే! పరమాత్మకు అభిన్నుడగు జీవాత్మ కూడా పూర్ణుడే!
- పరస్వరూప పూర్ణము నుండే ఇహ స్వరూప పూర్ణము బయల్వెడలుచున్నది.
- పరస్వరూపము నుండి ఇహ స్వరూపము బహిర్గతము అగుచున్నప్పుడు కూడా...పరస్వరూపము ఇహమును తనయందు ఇముద్చుకొన్నదై, సర్వదా పూర్ణముగానే ఉన్నది. (ఎందుకంటే, ఈ ఇహము పరమునకు అభిన్నము కాబట్టి)

**కృష్ణయజుర్వేదాంతర్గత *(32)* ఉపనిషత్తులు** : అమృతనాద, అమృతబిందు, అవధూత, అక్ష్యు, ఏకాక్షర, కలిసంతారణ, కఠవల్లీ, కఠశృత్యు, కాలాగ్ని రుద్ర, కైవల్య, గర్భో, తేజోబిందు, తైత్తిరీయ, దక్షిణామూర్తి, ధ్యానబిందు, నారాయణ, పంచబ్రహ్మో, ప్రాణాగ్నిహోత్రో, బ్రహ్మో, బ్రహ్మవిద్య, యోగకుండలినీ, యోగతత్త్వ, యోగశిఖ, వరాహ, శారీరక, శుకరహస్య, శ్వేతాశ్వతరో, సరస్వతీరహస్య, సర్వసార, స్కంద, హృదయ, క్షురిక (32)

## కృష్ణయజుర్వేదాంతర్గత శాంతిమంత్రము

1) **ఓం సహనావవతు! సహనౌ భునక్తు!**
**సహ వీర్యం కరవావహై! తేజస్వి నావధీతమ్ అస్తు। మా విద్విషావహై।**
**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

(పరబ్రహ్మతత్త్వమును ప్రవచించుకుంటూ పరస్పరము సంభాషణ పూర్వకంగా ఉపాసిస్తున్న గురుశిష్యులమగు)...

- మా ఇరువురిని పరమాత్మ సర్వదా సంరక్షించునుగాక! జీవితావసరములు ప్రసాదించి పరిపోషించునుగాక! (ఆత్మ విద్యను సునిశ్చితము, అనుభూతము చేసుకొనుచున్న మా ఈ ప్రయత్నము నందు) ఒకరి వలన మరొకరము సామర్థ్యము కలిగినవారిమయ్యెదముగాక! తేజోవంతులమయ్యెదము గాక! మేము పరస్పరము ఆత్మతత్త్వము గురించి సంభాషించుకొనుచూ...,
- 'ఈయనకు వినటమురాదు' అని గురువుగానీ, – 'ఈయనకు చెప్పటమురాదు' అని శిష్యుడుగానీ అనుకొనుకుండెదముగాక? అనగా పరస్పరము విసుగు, ద్వేషభావము జనించకుండునుగాక! పరస్పరము ప్రేమ వెల్లివిరియును గాక!

2) **ఓం శం నో మిత్ర శ్శం వరుణః। శం నో భవతి అర్యమా।**
**శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణుః ఉరుక్రమః।**
**నమో బ్రహ్మణే! నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాఽసి!**
**త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి! ఋతం వదిష్యామి! సత్యం వదిష్యామి!**
**తత్ మామ్ అవతు। తత్ వక్తారమ్ అవతు। అవతు మాం। అవతు వక్తారమ్!**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఈ పాంచభౌతిక దేహమును తమ దివ్యశక్తులతో నిర్మించి ఇచ్చి, దీనికి వాస్తవానికి యజమానులే అయి ఉన్న ఓ దివ్యతత్త్వ స్వరూప దేవతలారా! బ్రహ్మ విద్య కొరకై ఈ ఉపాధి మా పట్ల సానుకూలమగుగాక! ఓ మిత్రుడా! సూర్యభగవాన్! జలస్వరూపుడగు వరుణదేవా! గర్భములో దేహనిర్మాణమును ప్రజ్ఞచే పరిరక్షించి, ప్రసాదించిన ఓ అర్యమస్వామీ! ఇంద్రియములన్నిటికీ అధికారియగు ఓ ఇంద్రభగవాన్! బుద్ధికి అధిదేవత యగు ఓ బృహస్పతి సద్గురువా! సర్వత్రా, సమస్వరూపమై, సర్వము అయి ప్రకాశించుచున్న ఓ విష్ణు భగవాన్! మీరంతా కూడా క్రమముగా నాయొక్క ప్రాణమునందు, శక్తి –బలములందు, వాక్కు – బుద్ధులయందు, పాదములందు దివ్యశక్తితో ప్రకాశించుచూ, మేము బ్రహ్మవిద్యను శ్రవణము – ధారణ చేయుటకు సమర్థులమగునట్లుగా మా యీ దేహమును సానుకూలము చేసెదరుగాక!

ప్రాణచలనరూపుడగు ఓ వాయుదేవా! మీకు నమస్కారము! నమస్తే! మీరే నాకు ప్రత్యక్ష బ్రహ్మస్వరూపముగా అయిఉంటున్నారు! మీరే ప్రత్యక్షపరబ్రహ్మముగా మేము చెప్పుకొంటున్నాము. మీ కరుణచే మేము వేదములలోని ఋక్కులు పలుకు ఋతమును (Exact meaning) చెప్పుకొంటున్నాము. సత్‌స్వరూపమగు సత్యము (Ever present) గురించి చెప్పుకొంటున్నాము. మీరు మాకు సంరక్షకులై ఉండెదరుగాక! పరబ్రహ్మమును (మాకు విశదీకరిస్తున్న ఈ సద్గురువగు వక్తారునికి (speaker) కూడా) సంరక్షకులయ్యెదురుగాక! మమ్ములను – మా గురువగు వక్తారుని రక్షించమని ప్రార్థిస్తున్నాము.

(మా ఆధి భౌతిక – ఆధి దైవిక – ఆధ్యాత్మికములు → ఆత్మ స్వరూపము సంతరించుకొని – సశాంతించునుగాక!)

**సామవేదాంతర్గత షోడశ (16) ఉపనిషత్తులు**: అవ్యక్త, ఆరుణిక, కేన/తలవర, కుండిక, ఛాందోగ్య, జాబాల, దర్శన, మహదో, మైత్రేయాణ్యు, మైత్రేయ, యోగచూడామణి, రుద్రాక్ష జాబాల, వజ్రసూచిక, వాసుదేవ, సన్న్యాస, సావిత్రి (16)

## సామ వేదాంతర్గత శాంతిమంత్రము

**ఓం ఆప్యాయన్తు మమ అంగాని, వాక్ ప్రాణః చక్షుః శ్రోత్రం అథో బలమ్ ఇంద్రియాణి చ సర్వాణి।**
**సర్వం బ్రహ్మ ఔపనిషదం। మాఽహం బ్రహ్మ నిరాకుర్యాం।**
**మా మా బ్రహ్మ నిరాకరోత్। అనిరాకరణమస్తు, అనిరాకరణం మే అస్తు।**
**తత్ ఆదాత్మని, నిరతేయ, ఉపనిషత్సు ధర్మాః తే మయిసన్తు! తే మయిసన్తు॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

(మాకు ఈ ఇంద్రియాకారములను - ఇంద్రియశక్తులను ప్రసాదించుచున్న దివ్యదైవీ తత్త్వమునకు నమస్కరిస్తూ)

ఓ దివ్యస్వరూపలగు దేవతలారా! ఇంద్రియములను ప్రసాదిస్తూ పరిరక్షించుచున్న దివ్య ప్రజ్ఞాస్వరూపులారా!

...మా ఈ అంగములన్నీ మేము పరమసత్యము ఎరుగుటకు, మాకు అనుభూతమగుటకు సానుకూల్యముగా, ఆప్యాయత కలవై సహకరించునుగాక! వాక్కు, పంచప్రాణములు, కళ్లు, చెవులు, ఇంతే కాకుండా ఈ బలము (శక్తి) ఈ తదితర కర్మేంద్రియములు ఇవన్నీ కూడా మా బ్రహ్మ యజ్ఞము నందు ప్రియముగా సహకరించునుగాక! బ్రహ్మము యొక్క సామీప్యమును మేము పొందెదముగాక! బ్రహ్మము మమ్ము నిరాదరణ చేయుకుండునుగాక! మేము బ్రహ్మమును ఏమరచి ఉండకుండెదము గాక! నిరాకరించకుండెదము గాక! మా ఇరువురి మధ్య ఆదరణయే సర్వదా ఏర్పడినదగుగాక! నేను ఆత్మజ్ఞానము పట్ల, తత్త్వానుభవము పట్ల నిరతుడను (Engaged) అయి ఉండెదను గాక! ఉపనిషత్తులు ఎలుగెత్తి ప్రకటించుచున్న ఆత్మతత్త్వము-ఆత్మ ధర్మము మా హృదయమునందు ప్రకాశించునుగాక! సుస్థిరమై సునిశ్చితమగును గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః

**అథర్వణ వేదాంతర్గత ఉపనిషత్తులు - ఏకత్రింశతి (31)**: అథర్వశిఖ, అథర్వశిర, అన్నపూర్ణ, ఆత్మో, కృష్ణ, గణపతి, గరుడ, గోపాల, త్రిపురరూపిణి, దేవీ, దత్తాత్రేయ, నారదపరివ్రాజక, నృశింహతాపని (పూర్వ, ఉత్తర), పరమహంస పరివ్రాజక, పరబ్రహ్మ, పాశుపతబ్రహ్మ, ప్రశ్న, భావన, భస్మజాల, బృహత్‌జాల, మహానారాయణ, మహావాక్య, మాండూక్య, ముండక, రామరహస్య, రామ తాపని (పూర్వ-ఉత్తర), శరభ, శాండిల్య, సీత, సూర్య, హయగ్రీవ (31).

## అథర్వణ వేదాంతర్గత శాంతిమంత్రము

**ఓం భద్రం కర్ణేభి శ్రుణుయామ, దేవాః ।**
**భద్రం పశ్యేమ అక్షభిః యజత్రాః।**
**స్థిరైః అంగైః తుష్టువాగ్ంసః తునూభిః ।**
**వ్యశేమ దేవహితం యత్ ఆయుః।**
**స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః। స్వస్తి న పూషా విశ్వవేదాః।**
**స్వస్తి నః తార్క్ష్యో అరిష్టినేమిః।**
**స్వస్తి నో బృహస్పతిః దధాతు॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

- ఇంద్రియములను సంకల్పించి నిర్మించి మాకు ప్రసాదించుచూ పరిరక్షిస్తున్న ఓ దేవాది దేవా! మీచే అనుగ్రహించబడిన ఈ చెవులతో మేము ఎల్లప్పుడూ పరమక్షేమకరము (భద్రము) అగు ఆత్మతత్త్వమునకు సంబంధించిన సమాచారమునే వినుచుండెదముగాక! ఆత్మయజ్ఞ శీలురమైయున్న మేము ఈ కనులతో భద్రము - శుభప్రదము అగు ఆత్మతత్త్వముగానే ఈ కనబడేదంతా చూచుచుండెదము గాక!
- స్థిరమైన (వణకని) బలోపేతమైన అవయవములతో ఆరోగ్యముతో కూడి ఉన్నవారమై, మిమ్ములను స్తుతించుచూ, మాకు విధించిన ఆయుఃకాలమును మేము వినియోగము చేసెదముగాక! మీ భావనతో (ఆత్మభావనలో) ఆయుష్షును గడుపుచుండెదముగాక!

- త్రిలోకాధిపతి, పురాణప్రసిద్ధుడు, గొప్ప కీర్తిమంతుడు, విశాలమైన (సూక్ష్మ శబ్దతత్త్వగ్రహణముతో కూడిన పెద్ద) చెవులు గల ఇంద్ర భగవానుడు మాకు స్వస్థి (శుభము) కలుగజేయునుగాక! ఈ విశ్వస్వరూపమేమిటో ఎరిగిన పూషుడు (సూర్యభగవానుడు) మాకు శుభములు కలుగజేయనుగాను!
- మిక్కిలి వేగముగల గరుడుడు మాయందు ఆధ్యాత్మ సంపదను అమృతకలశమువలె సదా పరిరక్షించుదురు గాక! మా అరిష్టములు తొలగించును గాక!
- దేవగురువగు బృహస్పతి మాకు ప్రశాంతము – విస్తారము – సుతీక్ష్ణము – సూక్ష్మము అగు బుద్ధిని ప్రసాదించి మాకు స్వస్థిని కలుగజేయును గాక! సాదృశ్యమగు దృశ్య-ద్రష్ట-దర్శనములు అస్మత్ ఆత్మయందు సశాంతించినవగుగాక! ఓం శాంతిః శాంతిః శాంతిః॥

## యోగ విద్యా ప్రధాన ఉపనిషత్తులు

**ఋగ్వేదాంతర్గత :** అద్వయతారక, నాదబిందు (2)

**శుక్లయజుర్వేద :** త్రిశిఖిబ్రాహ్మణ, మండల బ్రాహ్మణ, హంస (3)

**కృష్ణయజుర్వేద :** అమృతనాద, అమృతబిందు, తేజోబిందు, ధ్యానబిందు, బ్రహ్మవిద్య, యోగకుండలి, యోగచూడామణి, యోగతత్త్వ, యోగశిఖ, వరాహ, క్షురిక (11)

**సామవేద :** దర్శన (1)

**అథరణ్వవేద :** పాశుపతబ్రహ్మ, మహావాక్య, శాండిల్య (3)

ఓ హనుమా! ఈ మానవజన్మ అత్యంత దుర్లభమైనది సుమా! మహత్తరమైన సందర్భము. స్థూల – సూక్ష్మ – కారణ శరీరముల నుండి పూర్తిగా విముక్తుడు కాగలుగుటకు ఇది సదవకాశము. దీనిని జీవుడు ఏమాత్రమూ వృధా చేసుకోకూడదు. **"నేను సంసారబంధమునుండి మొదలంట్లా విడివడాలిసిందే"** అను ఆశయమును ఆశ్రయించి మహదాశయుడు కావాలి. ముముక్షువు కావాలి. ఆ విధంగా ముముక్షువు అయి, ఇక తాత్సారము చేయరాదు. ఆత్మతత్త్వమును బోధించగల 'సద్గురువు'ను ఆశ్రయించాలి.

***ఇక్కడ సద్గురువుయొక్క విశేష లక్షణముల గురించి కొన్ని విశదీకరిస్తున్నాను.***

- ఇంద్రియ నిగ్రహరూపమగు శమము (Control over 'Indriamulu'), విచారణ (అధ్యయనము– Analytical), సంతోషము (Being content with whatever got) సత్సంగము (Relatedness with the permanent) – అను సాధన చతుష్ఠయమును అనుష్ఠానము చేయుచున్నవాడు;
- శ్రద్ధావంతుడు; బ్రహ్మతత్త్వమును ఎరిగిన సంఘములోనివాడు (సత్కులజాతుడు);
- శ్రుతుల హృదయము ఎరిగినట్టి శ్రోత్రియుడు; వేదాంత శాస్త్రముయొక్క ఆశయమగు 'తత్త్వమ్ – నీవే బ్రహ్మము' అనునది నిర్దుష్టముగా, సునిర్ణయముగా కలిగి ఉన్నవాడు;
- శాస్త్రములపట్ల, సదాచారములపట్ల గౌరవము, అవగాహన, ప్రియత్వము కలిగి ఉన్నట్టివాడు;
- సద్గుణవంతుడు;
- కుటిలమైన బుద్ధి – ఆలోచనలు, లోక – దృశ్యసంబంధమైన ఆశ-ఆశయములను హృదయమునందు రహితము చేసుకొని ఉన్నవాడు;
- సహజీవులపట్ల వాత్సల్యము కలిగి ఉండి, సర్వులపట్ల ప్రేమ పొంగుతూ ఉన్నవాడు. సర్వజీవుల క్షేమము కోరుకొనువాడు;
- దయా సముద్రుడు;
- ఓర్పు గలవాడు;
- సూక్ష్మమగు తాత్త్విక విషయములను హృదయ రంజకముగా విశదీకరించగలిగినట్టి వాక్‌చతురత కలిగినట్టివాడు;
- శ్రోతను పరబ్రహ్మ స్వరూపముగా సంభావించువాడు (భావన చేయువాడు). "నీవు మహత్తరమగు ఆత్మవే"! – అనునది సంభాషణయొక్క ఆశయముగా కలిగి ఉన్నట్టివాడు, తత్త్వవేత్త! మహదాశయుడైనవాడు! సర్వక్షుద్రాశయములను జయించినవాడు.

అట్టి లక్షణములు కొన్నిగాని, అన్నీగానీ గల సద్గురువును విధివిధానంగా ఆశ్రయించాలి. నమస్కరిస్తూ శరణువేడాలి. ఆ మహనీయుని వద్ద అష్టోత్తర శత ఉపనిషత్ విశేషములను (108 ఉపనిషత్తులను, సారమును)... – మొట్టమొదట శ్రద్ధగా శ్రవణము చేయాలి.

తన హావభావములను, ఆవేశపూరితమైన అభిప్రాయములను కొంతసేపు ఆప్రక్కనే ఉంచి, ఆ సద్గురువు ఉపనిషత్ సాహిత్య పూర్వకంగా నిరూపిస్తూ వస్తున్న **"నీవు బ్రహ్మమువే! తత్త్వమసి"**...అను మహత్తరార్థమును వినాలి. అనుమానాలు ఉన్నప్పుడు ఆ గురువర్యులు మెచ్చువిధముగా సానుకూల్యమైన పద్ధతిలో ఆధ్యాత్మశాస్త్ర విశేష నిరూపణ...అను ఆశ్రయముతో సున్నితంగా, అణకువగా ప్రశ్నించాలి. అంతేగానీ, ప్రశ్నలు మరొకరి గుణగణములు ఎంచురీతిగా ఉండరాదు. ఏ సిద్ధాంతము యొక్క ఉద్దేశ్యము ఏమై ఉన్నదో...అది ఎరుగుటకొరకై అడుగాలి. గురువు యొక్క అనుభవపూర్వకమగు అభిప్రాయము ఏమిటో తెలుసుకొనుటకై పరిప్రశ్నించాలి. అంతేగానీ, ప్రశ్నలు మరొకరి (లేక) మరొక గురువుయొక్క గుణగణములు విమర్శించు ఆశయము ఉండరాదు. ఏ సిద్ధాంతము యొక్క ఉద్దేశ్యం ఏమై ఉన్నదో...అది ఎరుగుటకై అడగాలి. గురువుయొక్క అనుభవపూర్వకమగు అభిప్రాయము ఏమిటో ఎరుగుటకై పరిప్రశ్నించాలి. అంతేగాని, గురువుకు ఎంతవరకు తెలుసో పరీక్షించటానికి కాదు. వారి వద్ద తనకు అవసరమైనది, వారికి తెలియవచ్చినది తెలుసుకోవటమే ఆశయముగా కలిగి ఉండాలి.

- ఆ విధముగా శ్రవణము చేసినది - ఏకాంతముగానో, తన సహచరులగు ముముక్షుజనులతో కూడియో - మననము చేయాలి. 'ఈ అభిప్రాయము వెనుక ఉద్దేశ్యమేమిటి? వారు చెప్పినట్లుగా నాకు అనిపించటము లేదే? ఎందుచేత?' అను విచారణచే పరిప్రశ్నలకు సమాధానము సద్గురువు వద్దనుండిగాని, తదితరులవద్ద నుండి సంపాదించుకోవాలి.
- అదే సమయంలో (At the same time) నిదిధ్యాస. ఏ ఆత్మ గురించిన సమాచారము తాను విని - మననము చేస్తున్నాడో, 'అట్టి అఖండ - అప్రమేయమగు ఆత్మ నేనేకదా!' అను ధ్యాస, ధ్యానములకు పెంపొందించుకోవాలి 'అనిపించటమును' వృద్ధి చేసుకోవాలి.
- ఈ విధంగా శ్రవణ - మనన - నిదిధ్యాసలను నిరంతరము అభ్యసిస్తూ... తత్త్వార్థమును అన్నివేళలా ధ్యాసయందు నిలుపుకుంటూ ఉండాలి.

1. నేను ఈ స్థూల దేహమునకు చెందినవాడను. ఇది నాకు చెందినది.
2. నేను ఈ సూక్ష్మ (మనో) దేహమునకు చెందినవాడను. ఇది నాకు చెందినది.
3. నేను కారణదేహమునకు (అభ్యాసవశంగా ఏర్పడుచున్న సంస్కారదేహమునకు) చెందినవాడను, ఇది నాకు చెందినది.

అను మనోకల్పిత సంబంధమును మొదలంట్లా త్యజించివేయాలి. త్రిదేహవిముక్తుడు కావాలి. త్రిదేహములకు వేరైన 'దేహి' తాను కదా! **సంబంధము నుండే బంధము వస్తోంది. సంబంధము లేనివాడికి బంధమే లేదు.** ఆ త్రిదేహములను కలలో కనిపించే మూడు వస్తువులుగా అనగాహన కలిగి ఉండటము - అనునది ఉపనిషత్ ప్రబోధకమగు సారము. 'తత్త్వమ్ - సోఽహమ్ - త్వమేవాఽహమ్ - త్వమ్ అహమేవ'...అను మహావాక్యార్థములను బుద్ధియందు నిలిపి నిశ్చలము చేసుకోవాలి. అట్టివాడు జీవన్ముక్తుడై ఈ భూమిపై ప్రశాంత - ఆనంద - సర్వాతీతత్వములతో కూడి సంచరిస్తున్నాడు. ప్రారబ్దమున్నంతవరకు ఈ దేహము కలిగి ఉంటున్నాడు. ఈ దేహము స్వభావముగా శిధిలమయినప్పుడు - ఇక ఆతడు - ఏమగుచున్నాడంటావా?

- కుండలో ఆకాశము (space) ఉన్నది కదా?
- కాలక్రమేణా (లేదా) ఏదో కారణం చేత ఆ కుండ పగిలినప్పుడు, ఆ కుండలోని ఆకాశము ఏమగుచున్నది? **ఘటాకాశము మహాకాశములో ఏకమగుచున్నది కదా!**

అట్లాగే ఆజీవన్ముక్తుడు దేహమున్నప్పుడు - దేహము శిధిలమగుచుండగా కూడా,.... **ప్రారబ్ధముగా లభించిన వర్తమాన దేహమునుండి వినిర్ముక్తుడై సర్వదా సర్వము అయి ఉన్న సర్వాత్మకమగు మహాత్మత్వమునందు మమేకమగుచున్నాడు.** పరిపూర్ణుడై స్థూల - సూక్ష్మ - కారణ దేహపరిధులను దాటి **'విదేహముక్తుడు'** అగుచున్నాడు. (లేక) **'నేను దేని చేతనో బద్ధుడను'** అను భావనలను అధిగమించి, భావములకు ఆవల రామబ్రహ్మమై, శివాత్మకుడై, ఆత్మానారాయణుడై, భావనారాయణుడై వెలుగొందుచున్నాడు. **సయేవ కైలవ్య ముక్తిః!** అదియే కైవల్యముక్తి...అని కూడా చెప్పబడుచున్నది. కేవలీస్థితి యొక్క సిద్ధియే కైవల్యసిద్ధి.

ఈ '108' ఉపనిషత్తుల ఉపనిషత్ వాఙ్మయమును అధ్యయనము చేస్తూ ఉన్నవాడు. క్రమముగా సర్వలోకముల స్థితిగతులను పాముకుబుసమువలె విడచి **'బ్రహ్మలోకనివాసి'** అగుచున్నాడు. దేహ-దేహానంతర స్థితులలో కూడా **'సర్వము బ్రహ్మముగా చూడటము'** అను సందర్శనము, **సంభావనములతో** కూడిన బుద్ధిస్థితియే **"బ్రహ్మలోకము"**. అట్టి బ్రహ్మలోకమును చేరి బ్రహ్మమే తానైనట్టి పూర్ణానందుడు-సృష్టికర్తయగు బ్రహ్మదేవుని ముఖతః వేదాంత శ్రవణము చేయువాడై, **కైవల్యపీఠము** నందు శాశ్వతుడై ఉంటున్నాడు.

**ఆంజనేయుడు :** అట్టి కైవల్యముక్తి లభించటానికై భక్తిమార్గము, కర్మమార్గము, క్రియాయోగమార్గము మొదలైన వేరు వేరు మార్గములు వేరు వేరు గురువులచే 'ఇదియే మార్గము' అని చెప్పబడుచున్నది కదా! అన్నిటికంటే ఉత్తమమైనదేది?

**శ్రీరామచంద్రుడు :** అన్ని మార్గముల అంతిమ స్థానము కైలవ్యమేనయ్యా! **'కేవలీ స్వరూపమగు ఆత్మయే నేను'** అని ఎరుగుటయే! అట్టి ఎరుక బుద్ధికి (అవగాహన)కు సంబంధించినది. క్రియలకు సంబంధించినది కాదు. అందుచేత కర్మ – సాంఖ్య – క్రియా యోగములను **'ఉపాసనలు'** (లేక) **'మార్గములు'** (లేక) **ఉపకరణములు** అని భావించు. చివరికి కైవల్యము జ్ఞానమార్గము చేతనే (తెలుసుకొనుటచేతనే) సిద్ధించుచున్నది. కర్మయోగము, భక్తియోగము, కుంభకాది – చక్రోపాసనాది క్రియాయోగము...చేత కాదు. అవన్నీ బుద్ధిచే బుద్ధికి ఆవలగల 'కేవలీ స్వస్వరూపానుభవము' నందు లయము పొంది, ద్వితీయమేలేని నా అద్వితీయ స్థానము చేర్చుచున్నాయి....అనునదే ఉపనిషత్ సారాంశము. "వెళ్ళవలసినచోటికి వెళ్ళామా? లేదా?" .... అనేది ముఖ్యం గాని, "ఏమార్గంలో ఏవాహనం ఉపయోగించాము" .... అనునది గొప్ప – తక్కువ అను రీతిగా చర్చనీయాంశం కాదు.

## ద్వితీయ అధ్యాయము

**శ్రీ ఆంజనేయ స్వామి :** హే భక్తవత్సలా! అపార కరుణాసాగరా! జీవులను తరింపజేయు తారకరామా! మీరు జీవన్ముక్తి – విదేహముక్తుల గురించి ప్రస్థావిస్తూ వస్తున్నారు కదా!

**కే అయం జీవన్ముక్తి ః?** – 'జీవన్ముక్తి' అనగా ఏది?

**కే అయం విదేహముక్తిః?** – 'విదేహముక్తి' అనగా?

**కిం వా తత్ర ప్రమాణమ్?** – ఆ రెండింటికీ 'ఇది' అని చెప్పు ప్రమాణము. (శాస్త్ర నిరూపణ)...ఏది?

**కిం వా తత్ర సిద్ధి ః ?** – అవి ఈ జీవుడు ఎట్లా సిద్ధింపజేసుకోగలుగుతాడు?

**సిద్ధ్వా వా కిం ప్రయోజనం?** – సరే, అవి రెండూ సిద్ధిస్తాయనుకోండి, అప్పుడు ఈ జీవునికి కలిగే ప్రయోజనము ఏమిటి?

**శ్రీరామచంద్రుడు :** ఓ హనుమా! సర్వదా అనంత చిత్కళా స్వరూపమగు ఆత్మస్వరూపుడే అయి ఉన్న ఈ జీవునివద్ద – **'చిత్తము (అభిరుచి ఇష్టము)'** అనబడేది (అనంత కళలలో) ఒక కళ అయిఉన్నది. చిత్ సూర్యుని నుండి బయలుదేరే అనేక కిరణములతో ఈ చిత్తము ఒకానొక కళాకిరణము వంటిది. అట్టి ఈ జీవునియొక్క చిత్తము (చిత్ స్వరూపమునుండి బయల్వెడలినప్పటికీ).... ఎప్పటి నుంచో కొన్ని చమత్కారమైన లక్షణములను ఆశ్రయించినదై ఉంటోంది.

**"నేను దృశ్య సంఘటనలకు కర్తను! నేనే భోక్తను! ఈ ఇంద్రియ దృశ్యము నాకు సంబంధించినది! నేను వీటికి సంబంధించినవాడను! వీటికి పరిమితుడను! ఈ సుఖ దుఃఖములకు సంబంధించినవాడను. అందుచేత వీటికి బద్ధుడను!"** ఇటువంటి లక్షణములను ఈ చిత్తము పుణికిపుచ్చుకుంటోంది. పురుషస్య కర్తృత్వ – భోక్తృత్వ సుఖ దుఃఖాది లక్షణః చిత్త ధర్మః ! ఇవన్నీ చిత్తము యొక్క ధర్మములు (Functions / Features) అయి ఉంటున్నాయి. **క్లేశ రూపత్వాత్ 'బంధో' భవతి।** క్లేశములకు కారణమగుచు, చివరికి ఈ పురుషునికి [పురుషకారము (Functional Consciousness) కలిగి ఉన్న ఈ జీవునికి] **'నేను బద్ధుడను'** అను భావనను తెచ్చిపెడుచున్నాయి. అట్టి ఈ చిత్తమును 'కర్తృత్వ –భోక్తృత్వ భావనల నుండి, సుఖ–దుఃఖ–పాప–పుణ్య–ఇత్యాది లక్షణముల నుండి నిరోధించటమే 'జీవన్ముక్తి' యొక్క రూపము.

అటు తరువాత **'నేను ఉపాధి పరిమితుడను. దేహము అను ఉపాధికో, మనస్సు అనే ఉపాధికో, జీవుడు అనబడు ఉపాధికో సంబంధించిన వాడను'** అనునదంతా వదిలివేసి, 'ప్రారబ్ధము' అనే స్వసంకల్పిత కల్పితమును కూడా దాటివేసిన స్థితి – **'విదేహముక్తి'.**

అట్టి 'జీవన్ముక్తి – విదేహముక్తి'...లకు ప్రమాణము అష్టోత్తర శత ఉపనిషత్ వాఙ్మయమ్!

'నేను కర్తను–నేను భోక్తను–ఎదుటివాడు కర్త–అతడు భోక్త' మొదలైనవన్నీ దుఃఖవృత్తులు. (Avocations pertaining to one's meloncholy). అట్టి వృత్తుల నివృత్తి చేత 'నిత్యానంద స్థితి'ని సంపాదించుకోవటమే జీవన్ముక్తి–విదేహముక్తిల యొక్క 'ప్రయోజనము'. **కర్తృత్వాది దుఃఖనివృత్తి ద్వారా నిత్యానంద అవాప్తిః ప్రయోజనమ్ భవతి!** అట్టి నివృత్తి కొరకే మానవజన్మయొక్క ఉద్దేశ్యము, ప్రయోజనము కూడా!

**తత్ పురుష ప్రయత్నేన సాధ్యో!** అట్టి జీవన్ – విదేహముక్తి అగు 'దుఃఖ నివృత్తి రూప నిత్యానంద స్థితి' ఎట్లా ప్రాప్తిస్తుంది? పురుషప్రయత్నము చేతనే! ఒకడు అందుకు ప్రయత్నించుటచే జగత్ అతీత – దుఃఖరాహిత్య స్థితిని తప్పక సిద్ధింపజేసుకోగలడు.

ఒకడికి సంతానము కలుగనప్పుడు **'పుత్రకామేష్టి యాగము'** అనే ప్రయత్నము చేస్తున్నాడు. అట్టివాడు అట్టి ప్రయత్నము చే సంతానము పొందుచున్నాడుకదా!

మరొకడు **'ధనము సంపాదించాలి'** అని వ్యాపారము చేయుచున్నాడు. శ్రమించి డబ్బు సముపార్జిస్తున్నాడు. ఈ ప్రపంచములో పేరు ప్రతిష్టలు, యుద్ధ ప్రావీణ్యత, సంగీత – సాహిత్యములు ఇటువంటి వాటిని కోరుకొనువాడు వాటి కొరకై ప్రయత్నించి కదా...సంపాదిస్తున్నాడు!

అదే విధంగా...,

వేదాంత శ్రవణము-మననము-నిదిధ్యాస (వినటము, అనుకోవటము, అనిపించటము) - ఇటువంటి పురుష ప్రయత్నముల చేతనే ఈ జీవుడు జీవన్ముక్తి - విదేహముక్తి దుఃఖనివృత్తి (Relief from all worries), కైవల్యము, మొదలైనవి సిద్ధించుకోగలుగుతాడు. 'పురుషప్రయత్నము'నకు సిద్ధపడకుండా, ఊరికే కూర్చుని **'ఆత్రోవన పోయేవాడు వచ్చి నాకు అవన్నీ ఇస్తే బాగుండుకదా'!** అని అనుకుంటూ ఉంటే, పగటి కలలు కంటూ ఉంటే ఈ జీవునికి ఏమి ప్రయోజనము? **పురుష ప్రయత్నము చేతనే అవి లభించగలవు** - అని జీవుడు మొట్టమొదట విశ్వసించాలి.

అసలు ఈ జీవునికి బంధము ఎట్లా వచ్చి పడుతోంది? వాసనలు (Tendenicies) చేతనే! అభ్యాసవశం చేత **"అది కావాలి! ఇది పొందాలి! అది ఆవిధంగానే ఉండాలి. లేదా నా గతి ఇంతే"...** అని తలచుచూ ఉండగా వాసనలు ఏర్పడుచున్నాయి. **సర్వ వాసనా క్షయాత్ తత్ లాభః అత్ర శ్లోకాః!** 'నాయనలారా! వాసనాక్షయముకై ఉపక్రమించండి! అద్దాని చేతనే కైవల్యపదమగు **'స్వయమాత్మాఽహమ్'** లభించుచున్నది'...అని శ్రేయోభిలాషులగు ఆత్మజ్ఞులు-(ఊర్ధ్వ భాహుః విరౌమ్యేష)-ఎలుగెత్తి గుర్తు చేస్తున్నారు. గానం చేస్తూ వినిపిస్తున్నారు!

**శ్రీ ఆంజనేయుడు:** స్వామీ! ప్రతి జీవుడు వాస్తవానికి పురుషకారము కలిగియుండియే ఉన్నాడు కదా! ఏదో ఒక ప్రయత్నమునకు ఉపక్రమించి సామర్థ్యము కలిగియే ఉన్నాడు కదా!

**శ్రీరామచంద్రుడు :** అవును. ప్రతిజీవుడు పురుషకారము చేతనే ఈ భౌతికదేహము, శబ్ద - స్పర్శ - రూప - రస - గంధములను, ఇంద్రియశక్తులను, జాగ్రత్ - స్వప్న - సుషుప్తులు...మొదలైనవన్నీ ధారణ చేయుచున్నాడు. అట్టి పురుషకారము చేతనే వాసనలు కలిగి ఉంటున్నాడు. **ఈతడు దేహధారణ చేయుచున్నప్పుడే తనవెంట వాసనలు** (Tendenicies) **కొన్ని తెచ్చుకుంటున్నాడు.** అట్టి వాసనలు రెండు తీరులైనవై ఉంటున్నాయి.

**1) శుభ వాసనలు 2) అశుభవాసనలు**

ఈ రెండింటితో ఇక ఈ దేహమును ఉపయోగించటము ప్రారంభిస్తున్నాడు. ఇప్పుడేమి చేయాలో, విను...

**శుభవాసనలకు సంబంధించిన పురుష ప్రయత్నములను అధికాధికం చేసుకుంటూ, అశుభవాసనలను క్రమక్రమంగా తొలగించుకొనుచూ ఉండాలి. ఈ రెండు విధములైన ప్రయోజనములకు కూడా పురుష ప్రయత్నమే మార్గము.**

- శుభవాసనలచే అశుభవాసనలు సన్నగిల్లుతాయి.
- అశుభవాసనల వృద్ధిచే శుభవాసనలు వెనుకకు మరలుతాయి.

ఇది గమనించిన ఈ జీవుడు శుభవాసనలకు సంబంధించిన పురుష ప్రయత్నములను ఎప్పటికప్పుడు ఆవిష్కరిస్తూ, అశుభవాసనలు సన్నగిల్లచేయు పురుషప్రయత్నములను అధికం చేసుకోవాలి. అశుభవాసనలలోనికి లోతుగా చొచ్చుకుపోయి ఉన్న బుద్ధిని వెనుకకు మరల్చి, అద్దానిని శుభ ప్రయత్నములందు నియమించాలి. విజ్ఞులు-శాస్త్రములు సూచిస్తున్న సాధనలే అందుకు ఉపాయం. **పౌరుషేణ ప్రయత్నేన లాలయేత్ చిత్తబాలకమ్!** పురుషకారముతో కూడిన ప్రయత్నములతో ఈ చిత్తబాలకుడిని లాలిస్తూ దృశ్య సంబంధమైన ఆవేశబంధముల నుండి వెనుకకు మరల్చాలి. బుజ్జగించి క్రమంగా కొంచము ఆజ్ఞాపిస్తూ, సంస్కరిస్తూ శుభవాసనలవైపు నడిపించాలి.

ఓ శత్రు మర్దనా! ఆంజనేయా! ఏ జీవుడైతే - ఇంద్రియ విషయములపై వ్రాలుచూ గొప్ప ప్రతాపము చూపుచున్న ఈ చిత్తమును,
అట్టి పునర్జన్మ హేతువులగు సంస్కారములను, గమనించి అట్టి ప్రవాహపతిత చిత్త విభాగముపై యుద్ధము ప్రకటించి,
ఆ విభాగమును వశపరచుకొని, అద్దానిని శుభప్రదము. జ్ఞానప్రదము - మోక్షప్రదము అగు మార్గములోనికి మరల్చుతాడో,
ఆతడే విజయము పొందుచున్న యోధుడు సుమా!

**శ్రీ ఆంజనేయుడు :** స్వామీ! కొందరైతే "మా చిత్తము అశుభవాసనలవైపు వెళ్ళటము లేదు లెండి! మాకు చిత్తమును మరల్చవలసినంతగా అవసరమేమున్నది? మాకు సాధనలతో పనిలేదు" అని ఎదురు ప్రశ్న వేస్తూ ఉన్నారు! బద్ధకస్తులై కాలము గడుపుచున్నారు.

**శ్రీరామచంద్రుడు :** ఒక వేళ్ళ **"నా చిత్తము అశుభ వాసనలవైపు మళ్ళటము లేదు"**...అని అనిపించినప్పుడు కూడా, ఈ జీవుడు ఊరుకొని జీవితకాలము ఉండుటము మంచిదికాదు. అట్టి సందిగ్ధ సమయములోకూడా ఈ చిత్తమును శుభవాసనలను వృద్ధిచేయు పురుష ప్రయత్నములను ప్రారంభించటానికి, కొనసాగించటానికి నియోగించాలి. ఈ జీవుడు ప్రయత్నశీలుడై ఉండటమే మంచిదని నా అభిప్రాయము. (అందుకే 'మానవజన్మ' అనునది 'కర్మభూమి'గా చెప్పబడుతోంది).

ఓ వాయుపుత్రా ! నీవు పురుషకారములను ఎట్టి పరిస్థితులలోనూ వదలనే వద్దయ్యా ! కొనసాగించవలసిందే ! ఎందుకంటావా? శుభవాసనల సమృద్ధి చేత, ముందు-ముందటి స్థితిగతుల, పరిస్థితుల ప్రభావముగా ఉదయించయత్నించే అశుభపురుషకారములను

ఇప్పుడే నిరోధించినవాడవవుతావు. **సందిగ్ధాయామ్ అపి భృశం శుభామ్ ఏవ సమాచరేత్!** శుభ వాసనలవలన (శుభ పురుషకారములవలన) శుభమే జరుగుతుంది కదా! **శుభాయాం వాసనావృద్ధేన దోషాయ, మరుత్‌సుతా!** కనుక శుభవాసనల ప్రవృద్ధి శుభప్రదామే అవుతుంది. దోషములు అంటని ఒక అతీతస్థితికి అవి సహకరిస్తాయి.

## త్రి – అభ్యాసములు

ఓ మహామతీ!

(1) వాసనాక్షయము (2) ఆత్మజ్ఞానము (3) మనోనాశనము. **సమకాలమ్ చిరాభ్యస్తా భవంతి ఫలదా మతాః।** ఈ మూడూ కూడా ఒకేసారి…చిరకాలము అభ్యసిస్తే, అది మహాఫలప్రదము కాగలదని నా అభిప్రాయము. అంతేగాని ఒకదాని తరువాత మరొకటి కాదు. ఎంతెంతవరకైతే ముముక్షువు ఈ మూడూ ఒకేసారిగా అభ్యసిస్తూ వస్తాడో….అంతంతవరకు ఆత్మపద ప్రాప్తి యొక్క సామీప్యత లభించగలదు. అట్లా ఎంతెంతవరకు అనుసరించబడదో, అంతవరకు ఆత్మపదప్రాప్తి అల్లంత దూరముగానే ఉంటోంది. **త్రయం ఏతే సమం యావత్ న అభ్యస్తా చ పునః పునః, తావత్ న పద సంప్రాప్తిః భవత్యపి సమాశతైః।** మూడు ఒక్కసారే అభ్యసించకపోతే, వందల వేల సంవత్సరాలు, జన్మలు గడిచినా కూడా ముక్తి లభించటం లేదు. మంత్రమును, అర్థమును ఒకేసారి ఉపాసిస్తేనే ఉత్తమ ప్రయోజనము చేకూరుచున్న తీరుగా, ఆ మూడూ ఒక్కసారి ఆశ్రయిస్తేనే **పరబ్రహ్మస్థానము** లభిస్తోంది మరి!

ఒక తామరతూడును కత్తిరిస్తూ ఉండగా, అందులోని సన్నటి దారములు కూడా తెగిపోతాయి కదా! అట్లాగే వాసనాక్షయము – జ్ఞానసముపార్జన – మనోలయములను ఒక్కసారే అభ్యసిస్తూ ఉండగా హృదయములోని చిక్కుముడుల రూపమున – "సృష్టి సృష్టించబడుతోంది. స్థితి కలిగి ఉన్నది – లయిస్తోంది" – అనురూపముగా ఉంటున్న హృదయగ్రంథులు (చిక్కుముళ్లు) విడిపోతున్నాయి.

– **రాగ –ద్వేష – మోహములు, అవిద్య – ఆవరణ – విక్షేపములు**

– **దారేషణ – పుత్రేషణ – ధనేషణలు; ఆధ్యాత్మిక – ఆధిభౌతిక – అధి దైవిక తాపములు** … ఇవన్నీ ముడి వీడుతాయి. స్వస్వరూపముపై బనాయించుకున్న సర్వ శంకలు (Atributed Illusionary assumptions and pressumptions on one's own self) తొలగుతాయి.

ఓ ఆంజనేయా! ఈ జీవుడు అనేక జన్మ – జన్మాంతరములుగా అసంఖ్యాక–మిధ్యావాసనలన్నీ తన సంస్కారదేహములో మూటలు కట్టుకొని ఉండి, ఇప్పుడీ మానవదేహము స్వీకరించినవాడై ఉన్నాడు. (ఆ సంస్కార దేహమే 'కారణదేహము' కూడా). అవన్నీ తొలగాలంటే చిరకాలము వాసనాక్షయ–ఆత్మజ్ఞాన–మనోనాశన త్రివిధములైన ఆశయములతో పురుషప్రయత్నము అత్యవసరము.

ఈ జీవుడు స్వతఃగా ఆత్మారామస్వరూపుడేనని మొట్టమొదటే అనుకున్నాము కదా! మరి 'బంధము' అనునది ఎక్కడినుండి వచ్చి ఇక్కడికి దిగుమతి అయింది? **తస్మాత్ వాసనాయుక్తమ్ 'మనోబద్ధమ్' విదుః బుధాః। వాసనలతో కూడియున్న మనస్సే బంధమునకు కారణము**–అని బుద్ధిమంతులగు విజ్ఞులు ప్రకటించుచున్నారు. నీవు కనుక ఇప్పుడు పురుషాకారముతో ప్రయత్నశీలుడవై మనస్సునుండి ఆయా విషయ వాసనలను తొలగించివేసుకొన్నావా…, ఇప్పుడే, ఇక్కడే 'ముక్తి' లభించగలదు. **వాసనలకు వేరుగా బంధములేదు.** దృశ్యవాసనలు తొలగటము తప్పించి వేరుగా **'ముక్తి'** అనునదేదీ వేరుగా లేదు. అందుచేత ఓ మహాకపీ! **మనో నిర్వాసనీ భావమ్ ఆచరాశు!** ఏదో ఒక ఉపాయముతోనో, లేక కొన్ని కొన్ని ఆయా ఉపాయముల సహాయముతోనో – ఈ మనస్సును ఎంత త్వరగా 'వాసనారహితము' చేసుకొంటే, అంతగా మంచిది. అయితే, మనస్సు నుండి దృశ్య సంబంధమైన వాసనలు తొలగటానికి మార్గమేమిటి? ఉపాయమేమిటి?

***'ఈ కల్పిత జగత్తును అధిగమించి, ఈ జగత్తంతా ఎందులో అలంకారప్రాయమాత్రము అయిఉన్నదో… అట్టి సర్వే – సర్వత్రా సమరస రూపమైయున్న ఆత్మ సందర్శనము'*** అను అభ్యాసముచే వాసనలన్నీ తమకు తామే త్వరత్వరగా తోకముడుస్తాయి.

వాసనలు లయిస్తూ ఉండగా…ఇక ఈ 'చిత్తము' అనబడునది 'తైలము (నూనె) అయిపోతూ వస్తున్న దీపము' వలె తనకు తానే శమించగలదు. ఓ వాయునందనా? ఆ విధంగా వాసనలు పరిత్యజించబడుచుండగా… మనస్సు స్వతఃగానే అన్ని ఆదుర్దాలు – దిగుళ్లు – దృశ్య సంబంధమైన ఆయా భావావేశాలు పాము కుబుసమువలె పరిత్యజించివేస్తూ…సత్–చిత్–ఆనందమగు రామానంద స్వరూపమునందు స్వయముగా ప్రవేశించుచున్నదగుచున్నది. ఆ జీవుడిక తత్ స్వరూపుడై, సత్–చిత్–ఆనంద అఖండ సుఖమును సిద్ధించుకొనుచున్నాడు. ఏ **వేగిరపాటూ లేనివాడై రామానందసాగరమునందు ఆనంద తరంగమై, తదితరులను అట్టి ఆనంద తరంగములు గానే వీక్షిస్తూ, ఈ జగత్తులో తృప్తి – సంతోషములతో విహరిస్తున్నాడు.** ఈ జగత్ సంగతి – సందర్భములకు ఏమాత్రము పట్టుబడనివాడై ఉంటున్నాడు.

**శ్రీ ఆంజనేయస్వామి :** ఆ తరువాత ఆతడు సమాధిలో ప్రవేశించి జగత్తును త్యజిస్తాడా, స్వామీ?

**శ్రీరామచంద్రుడు :** ఒకడు దృశ్య సంబంధమైన సర్వ స్థితి వ్యవహారములను త్యజించివేసి **'సమాధినిష్ఠుడు'** అయిఉండవచ్చుగాక! (లేదా) ఈ దృశ్యములోనే ఉండి అనేక దృశ్య సంబంధమైన కర్మలు - వ్యవహారములు నిర్వర్తిస్తూ తలమునకలై ఉండవచ్చుగాక! ఎవ్వడైతే తన హృదయాంతరములో సర్వ ప్రాపంచక విషయములను రహితము చేసివేసుకొన్నవాడై ఉంటాడో...అతడు నిత్యముక్తుడేనయ్యా!

**ఈ మనస్సు ప్రపంచములో ఉండవచ్చుగాక! మనస్సులో ఈ ప్రపంచము ఉండవలసిన పనిలేదే!** నటించే వానిని నాటకంలోని సందర్భములు కలచివేయటమేమిటి? ఆత్మజ్ఞానముచే అది తప్పక సుసాధ్యమే! అట్టి ఆత్మ తత్త్వజ్ఞానికి ...,

- అసలు కర్మలు ఏమాత్రమూ చేయకపోవుట చేతగాని..., (నైష్కర్మ్యేణ)
- అనేక కర్మలు పుంఖాను పుంఖముగా నిర్వర్తించుట చేతగాని... (పుంఖానుపుంఖ విషయ అనుక్షణ తత్పరోఽపి)

  **- అర్థో అస్తి న కర్మభిః ...., ఏమీ క్రొత్తగా లభించవలసినది ఉండదు.**
- జగత్ దృశ్యములన్నీ వదిలివేసి నిరంతరమూ తనను తాను స్వ-అధిష్ఠానమునందు ప్రతిక్షేపించుకొనుటచేత గానీ...
- జపము-తపము-హోమము-యజ్ఞము మొదలైనవన్నీ ఒకదాని తరువాత మరొకటిగా నిరంతరము చేయుచుండుట చేతగానీ...
- అవన్నీ చేయకపోవుటచేతగానీ...

**క్రొత్తగా వచ్చే ప్రయోజనమూ లేదు. కోల్పోవునదీ లేదు. ఆత్మయే సిద్ధించిన తరువాత ఇక క్రొత్తగా ప్రాప్తించవలసినదేమున్నది? ప్రాప్తించనిదేమి?**

ఓ ప్రియ మారుతపుత్రా! ఆంజనేయా! **సంత్యక్త వాసనాన్ మౌన, ధృతే నాస్తి ఉత్తమం పదమ్!** ఈ మనస్సు సర్వవాసనలు త్యజించి, దృశ్యము గురించిన ఏ ఒక్క విషయమూ ఏ మాత్రమూ 'మననము' చేయకుండా సర్వాతీతమగు 'మౌనము' వహించి, అట్టి 'ధృతి' ని కలిగి ఉండటము మించిన ఉత్తమ పదము మరొక్కటేదీ లేదయ్యా!

**శ్రీ ఆంజనేయస్వామి :** ప్రియ రామా! ఈ ఇంద్రియముల వలననే కదా, వాసనలు ఏర్పడుచున్నాయి? ఇంద్రియము లేకుంటే, వాసనలే ఏర్పడేవి కావేమోకదా?

**శ్రీరామచంద్రుడు :** ఈ కళ్ళు - చెవులు - ముక్కు ...ఈ ఇంద్రియములన్నీ ఉపకరణములు మాత్రమే. అనగా, స్వయముగా జడములు. మరొకటి చేత ఉపయోగించబడుచున్నప్పుడు మాత్రమే క్రియాశీలకములు. జడమైన వస్తువుకు వాసనలేమి ఉంటాయ్? అందుచేత అవన్నీ వాసనా శూన్యములు. వాటికి వాసనలు కలిగించు కర్తృత్వమెక్కడిది? లేదు.

**శ్రీ ఆంజనేయస్వామి :** మరి బాహ్య విషయములను - పదార్థములను ఆశ్రయించటానికి, స్వీకరించటానికి కారణము ఎవ్వరు? జీవాత్మయా? పరమాత్మయా?

**శ్రీరామచంద్రుడు :** ఆత్మ ఎల్లప్పుడూ నిష్క్రియము. సర్వసాక్షి. విషయములచే స్పృశించబడనిది! ఇక్కడి దృశ్య విషయాలను, సంగతులను, సందర్భములను, సంబంధ - అనుబంధ - బాంధవ్యములను, ఇష్ట - అయిష్టములను, ప్రియ - అప్రియములను, శత్రు - మిత్ర ప్రభావములను, మాన - అవమానములను, ఆశ - నిరాశలను, భావ - అభావ ఉద్వేగములను మొదలైన వాటినన్నీ ఈ ఇంద్రియములు స్వీకరించటానికి కారణము... **ఈ జీవుని యొక్క పూర్వవాసనలే! మనస్సే వాసనలకు కారణం.**

- ఏ విధముగా అయితే 'స్వతహాగా జడమే' అయినట్టి ఈ కళ్లు - చెవులు మొ॥న ఇంద్రియములు (పులుసులో ప్రవేశించిన గరిటవలె) ఆయా విషయములపై వ్రాలుచున్నప్పుడు కూడా, **"ఇది బాగున్నది, అది బాగోలేదు, ఇవి కావాలి, అవి వద్దు" -** మొదలైన భావములు తమకు తాముగా ఏమీ పొందకయే ఉన్నాయో....,

ఆ విధముగా ఒక ధీరుడైన ఆత్మజ్ఞాని తాను పొందుచున్న విషయములందు, పాల్గొనుచున్న కార్యక్రమములందు ఇంద్రియములతో నిర్వర్తిస్తున్న సర్వకర్మలయందు **రాగరహితుడై** తప్పక ఉండగలడు.

అజ్ఞానియో **రాగసహితుడై** పాల్గొనుచున్నాడు. జ్ఞాని - అజ్ఞానిల మధ్య అంతరము ఇంతవరకే!

ఓ మారుతీ! హనుమా!

జ్ఞాని తనయొక్క చిత్తముతో జగత్ భావములను అనుసరిస్తూ ఈ దృశ్య జగత్తుతో ప్రవర్తించుచున్నప్పటికీ - హంస క్షీరభాగమును స్వీకరించి జలవిభాగమును త్యజించివేయు విధంగా - ఇక్కడ **'ఆత్మతత్త్వసారము'ను మాత్రమే స్వీకరించి, తదితరమైనదంతా జగత్**

**నాటకముయొక్క 'రక్తి'కే వదలివేయుచున్నాడు.** అది ఎరిగినవాడే ముని! (మౌన ధారణాన్ మునిః!).

ఇక ఆత్మ తత్త్వమును పరిశీలించనట్టి, దృష్టిలో ఏమాత్రము కలిగి ఉండనట్టి, అందుకు సరిఅయిన మార్గములో ప్రయత్నించనట్టి జీవుని విషయము ఏమంటావా? ఆతని చిత్తము ఎల్లప్పుడూ పదార్థ భావననే అనుసరిస్తూ ఉండటము చేత...అనుక్షణమూ అతి చంచలమై ఉంటోంది. ఎందుకంటే దృశ్యములో ప్రతిది అనుక్షణము మార్పు చెందుతూనే ఉంటుంది కదా! ఈ చిత్తము అనేక భ్రమణములు కలిగి ఉండటముచేత ఆ జీవునికి శాంతిస్థానమేదో తెలియుటయే లేదు. అట్టి చంచలచిత్తము జన్మ-జనన-మరణ-మాతృగర్భ పునఃప్రవేశ - పునర్జన్మ పరంపరలకు కారణముగా అగుచున్నది.

## వాసనలు - ప్రాణ స్పందన

ప్రాణస్పందనము కూడా వాసనల కారణముగానే ఏర్పడుతోంది. అటుపై ప్రాణ స్పందన వలన తిరిగి వాసనలు ఏర్పడుచున్నాయి. బీజములోంచి వృక్షము, మరల ఆ వృక్షము లోంచి బీజము బయల్వెడలుచున్న విధంగా...,

→ వాసనల రూపమైన చిత్త బీజమునుండి ప్రాణస్పందన...,

→ ప్రాణస్పందన నుండి వాసనలు...,

ఏర్పడుచూ పోతున్నాయి. చిత్తము అనే వృక్షమును రెండు బీజములు ఉన్నాయి. **(1) ప్రాణస్పందన, 2) వాసనలు**... ఈ రెండింటిలో ఒకటి నశిస్తే, ఇక రెండవది తనకు తానే నశించగలదు. ఈ రెండూ కలసి ఉంటేనే 'చిత్తము' అనబడునది మనుగడ కలిగినదై ఉండగలదు.

**శ్రీ ఆంజనేయస్వామి :** 'సంసారము' అనునది కదా, ఈ జీవునికి బంధకారణము! అట్టి సంసారము శమించేది ఎట్లా?

**శ్రీరామచంద్రుడు :** సంసారము యొక్క రూపమేమిటి? వస్తు-విషయ-వ్యవహారములవైపుగా పరుగులు తీయు భావ - అభావములే! ఈ జీవుడు ప్రాపంచిక వ్యవహారములను సంగరహితుడై (sans any attachments) నిర్వర్తిస్తూ ఉంటే, క్రమంగా భావ-అభావరూపమగు సంసారము తనకు తానే శమించగలదు. 'ఈ శరీరము కూడా దృశ్య వస్తువువలె నశించబోవు స్వభావము కలిగియే ఉన్నది కదా!' అను జ్ఞప్తి - సందర్శనములచే వాసనలు సన్నగిల్లగలవు. **శరీరనాశ దర్శిత్వాత్ వాసనా న ప్రవర్తతే!**

వాసనలు పరిత్యజించుచుండగా చిత్తము అచిత్తముగా (లేనిదిగా) అయి **'చిత్‌స్వరూపము'** నందు ఏకత్వము చెందినది అగుచున్నది. **వాసనా సం పరిత్యాగాత్ చిత్తం గచ్ఛతి అచిత్తతామ్!** ఎల్లప్పుడూ అవాసనత్వము అభ్యసించటం జరుగుతూ ఉంటే, మనస్సు మననము త్యజించినదగుచూ, ఆత్మకు అభిన్న స్వరూపమై **'అమనస్కము'** సిద్ధించుచున్నది. అట్టి అమనస్క స్థితి చేత దృష్టి - జగత్తు కూడా ఉ పశమించినవై ఇదంతా ఆత్మరూపముగా అనుభవమగుచూ, ఇక ఆ జీవుడు **పరమవిశ్రాంతి రూపమగు పరమపదమును** పొందుచున్నాడు. ఎంతెంతవరకైతే అట్టి అమనస్కము రూపుదిద్దుకుంటూ ఉండదో అంతంతవరకు స్వస్వరూపమగు 'ఆత్మతత్త్వము' అనుభవమునకు విషయమై లభించదు. (అమనస్కము = విషయములను స్పృశించకముందే ఉన్నట్టి కేవల మనోరూపము)

కాబట్టి ఓ పవనతనయా! సర్వమునకు పరమై, సర్వస్వరూపమైయున్న ఆత్మ - గురు - శాస్త్ర ప్రమాణముల సహాయముతో అనునిత్యానుభవముగా అయ్యేవరకు - **అమనస్కయోగమును** (ఈ ఎదురుగా ఉన్న దానిని ఆత్మస్వరూపముగా అనుకోవటము - అను అభ్యాసమును) అభ్యసించటము అవసరమే! అందుకుగాను శాస్త్రములచేతను, గురువుల చేతను సూచించబడుచున్న శుభకర్మలను, యోగాసాధనములను నిర్వర్తించుచూ ఉండాలి. అటు తరువాత ఏ విధంగా అయితే వైద్యుడు సూచించిన ఔషధములను ఒక రోగి (రోగము తొలగిన తరువాత) సేవించటము మానివేస్తాడో...ఆ విధంగా శుభకర్మసంబంధమైన వాసనలను కూడా ఈ జీవుడు త్యజించివేస్తూ, **'సంపూర్తిగా అంతరంగ వాసనా రాహిత్యము'** వైపుగా అడుగులు వేయును గాక! కర్మలు నిర్వర్తించటముగాని, దైవసంబంధమైన యజ్ఞ-యాగ-వ్రత-జపములు చేయుటగాని, **'లోక సానుకూలత్వము - సందర్భానుచితము'**లను దృష్టిలో పెట్టుకొని, **"ఇది ఇప్పుడు ఈ జగన్నాటకంలో నా పాత్రయొక్క ధర్మము. కనుక ఇట్లు నిర్వర్తిస్తాను!"** - అను అవగాహనతో నిర్వహించునుగాక! **నాటకములో నటించువాడు పాత్ర ధర్మములను తనపై ఆపాదించుకొని 'ఇది నా ప్రేమ! ఇది నా ఆవేశము! ఇది నా కోపము'! ఇది నా పుణ్యము. ఇది నా పాపము" అని 'మమ' అనుకోకుండానే అవన్నీ పాత్రోచితముగా నిర్వర్తిస్తున్నాడు కదా!** జగన్నాటకములో కూడా జీవుడు అంటీ - అంటక, ముట్టీ - ముట్టక జగత్తులోని తన పాత్రను ఎందుకు నిర్వర్తించలేడు? నిర్వర్తించగలడు! కనుక **చిత్తము లేనివాడై చిత్తము ప్రదర్శించటమే చిత్త నాశనము, వాసనా నాశనము** కూడా!

ఈ చిత్తము యొక్క నాశనము రెండు తీరులైనవిగా ఉంటుంది.

**1) సరూపచిత్తనాశనము :** కనబడే నామ - రూపాత్మకమైనదంతా ఆ పరమాత్మయొక్క మాయా విశేషముగా భావన చేయటము; పరమాత్మను చేరు విధానముగా నామరూపాత్మక జగత్తులో సందర్భోచితముగా సానుకూల్యుడై వర్తించటము - **సరూపచిత్తనాశనము.**

ఆతనికి ఇదంతా సారూప్యముగా కనిపిస్తూ, ఆత్మ స్వరూపముగా మననము చేయబడుచూ, ఆతనిచే **ఆత్మోపాసన** చేయబడుచున్నది. ***ఇది జీవన్ముక్త లక్షణము.***

**2) అరూపచిత్త నాశనము :** 'ఆత్మ తప్పితే ఎక్కడా కూడా (ఆత్మకు వేరుగా) సాకారము లేదు. నిరాకారము లేదు' అను ఎరుక, దృష్టి స్థిరముగా అయి ఉండటము. ఈతని దృష్టికి, **జగత్తు అనునదే లేదు! ఆత్మయే ఉన్నది. ఇది విదేహముక్త లక్షణము.** విదేహముక్తుని స్వభావసిద్ధానుభూతిచే దృశ్యజగత్తు అభిన్నము, ఏకరూపమేగాని, రెండు రూపములు కాదు. ఆత్మ సర్వదా అద్వితీయమే గాని ఆత్మకు వేరుగా 'నేను – నీవు – జగత్తు' మొదలైనవి ఇదివరకు ఉన్నవి కావు. ఇప్పుడూ లేవు. మరొకొప్పుడూ ఉండజాలవు' అంతా ఏకాత్మయే!...అనునది విదేహముక్తి! విశ్వమంతా తనదేహమై, విశ్వాతీతుడై ఉండటమే విదేహముక్తి.

**ఓ పవనసుతా!** ఓ ప్రియహనుమా! అట్టి చిత్తము నశించుటచే లభించగల ప్రయోజనము ఏమిటో చెప్పుచున్నాను. విను.

సాదరము – శ్రద్ధలతో ఎప్పుడైతే 'చిత్తనాశనము'ను (ఈ సరూప – అరూప చిత్తనాశన మార్గములలో) మరల – మరల అభ్యసిస్తూ ఉంటావో, అప్పుడు అంతటా అన్నిటా ప్రియమగు ఆత్మ వస్తువే సందర్శనమగుచూ అనుభమవమవసాగుతుంది. సహజీవులపట్ల మైత్రి, కరుణ – ప్రేమ ఇత్యాది మధురగుణాలు స్వభావంగానే హృదయ స్పందనంగా జనించి వృద్ధి చెందుతాయి. ఆతని నుండి **సర్వజీవుల పట్ల ఆప్యాయత అను 'అమృతవర్షము'** స్వభావంగా వర్షిస్తూ ఉంటుంది.

సర్వభేద దృష్టులకు, భేద అనుభవములకు కారణము ఈ చిత్తమే! అట్టి చిత్తము ఆత్మయందు లయము పొందుచుండగా సర్వ జీవులు ఆత్మస్వరూపముగా అనుభూతమగుచూ ఉంటారు. **భేద దర్శనమే అశాంతికి మూలము. చిత్తము లయిస్తూ ఉంటే, భేద దర్శనము కూడా తొలగుచున్నది.** ఆ జీవుడు స్వభావ సిద్ధముగా పరమ శాంతిని పొందుచున్నాడు.

అట్టివాని మనస్సు ఆత్మతో తన్మయమగుటచే ఇక 'పునర్జన్మ' అనే వృత్తిని మొదలంట్లా త్యజించినదై..., ఆతడు జీవన్ముక్తుడు అగుచున్నాడు. **'వర్తమానములోనే నేను జన్మరహితుడను'** అని గ్రహించినవాడై,**'జీవన్ముక్తుడు'** అగుచున్నాడు. ఇక మరొక జన్మ యొక్క ప్రసక్తి ఎక్కడిది?

**సరూపోఽసౌ మనో నాశో జీవన్ముక్తస్య విద్యతే!** నామ–రూపాత్మక–సారూప్య సంబంధితమైన మనో నాశనమునే జీవన్ముక్తి అని కూడా పిలుస్తున్నారు. సర్వభేదములు కనిపిస్తూ కూడా...కనిపించనివై (అనిపించనివై) సమమగు ఆత్మగా అనుభూతమగుచుండటమే జీవన్ముక్తి. జీవన్ముక్తునికి ఆత్మయే ఈ అనేక భేదములతో కనిపిస్తున్నట్లు నిత్యానుభూతమగుచున్నది.

**అరూపస్తు మనోనాశో వైదేహీముక్తిగో భవేత్।** ఇక్కడ **'భేదరహితమగు ఆత్మ తప్పితే, భేదము మొదలేలేదు'..** అను దృష్టిచే అది క్రమంగా **'అరూపమనోనాశనము'** అగుచూ.. **'విదేహముక్తి'**గా రూపుదిద్దుకుంటోంది. అట్టివాడు **'విదేహముక్తుడు'** అగుచున్నాడు. ఆతని సంసార స్పృంఖలములన్నీ తెగిపోయి ఎక్కడో నేలరాలిపోవుచున్నాయి.

## సంసార వృక్షము

**శ్రీహనుమస్వామి :** అసలు ఈ జీవుడు సంసార బద్ధుడు అవటానికి మూల కారణమేమిటి? ఇది తొలగటానికి మార్గము ఏది? ఉపాయమేమిటి?

**శ్రీరామచంద్రుడు :** అవును! ఈ 'సంసారము' అనే వృక్షము వేలాది అంకురములు (Reproductive Features), శాఖలు (Different Extensions), ఫలములు (Many Results), పల్లవములు (చిగుళ్ళు) కలిగి ఉన్నదై మహావృక్షరూపమున ఈ జీవుని యందు తిష్ట వేసుకొని ఉన్నది. ఈతడు అనేక బంధములు కలిగి ఉండటానికి కారణముగా అగుచున్నది.

అట్టి సంసార బంధము (లేక) సంసార వృక్షము బాహ్యమున దృశ్య ప్రపంచములో ఉన్నదా? లేనే లేదు. బాహ్యమున ఉన్నది అద్దాని శాఖలు మాత్రమే! అది హృదయమునందే స్థితి కలిగి ఉన్నది. అద్దాని యొక్క మూలము ఈ జీవుని యొక్క మనస్సే! అట్టి మనస్సు చేతనే ఈ జగత్తు, ఇక్కడి భేద భావములు.. ఇవన్నీ అనుభవమగుచూ, ఈ జీవుని కట్టిపడేసి, అనేక జన్మపరంపరలలోనికి దొర్లిస్తున్నాయి. **అస్య సంసార వృక్షస్య మనోమూలమ్ ఇదమ్ స్థితమ్**– సంసార వృక్షమునకు మూలము మనస్సే! మనస్సు అనగా ఏమి? **సంకల్పయేవ తన్మన్యే।** సంకల్పములే 'మనస్సు'గా చెప్పబడుతోంది. 'సంకల్పించటము' అనే సుదీర్ఘముగా అభ్యసిస్తూ వస్తున్న దురలవాటు మానుకోబడిందా, అట్టి **సంకల్ప ఉపశమనముచే 'మనస్సు' అనబడునది కూడా ఉపశమిస్తుంది.**

ఈ 'సంసారము' అనే పూతీగ 14 లోకములలోకి ప్రాకి విస్తరించి అనేక ఫల–పుష్ప–పునః ఉత్పత్తులను కొనసాగిస్తోంది. అది 'సంకల్పములు' అనే జలము పోస్తూ ఉండటము చేతనే ఆ విధంగా విస్తరిస్తూ, ప్రాకుతూపోతోంది. ఎప్పుడైతే నీవు **'సంకల్పములు'** అనే జలమును ఈ సంసార పూపాదుకు 'మొదట్లో పోయటము మానివేస్తావో..., అప్పుడు ఇది ఎండి తనకుతానే నశించగలదు.

**సంకల్ప ఏవ తన్మన్యే** – సంకల్పము రూపమే మనస్సు. మనస్సే సంసారము.

**సంకల్ప ఉపశమేన తత్** – సంకల్పములు చేయకుండా ఉంటే మనస్సు ఉపశమిస్తుంది. **'సంకల్పించకపోవటము'** అనునదే ఈ **'మనోకల్పిత సంసారము'** యొక్క ఉపశమనమునకు ఏకైక ఉపాయము. "ఆఁ! ఏమున్నదిలే?" అని తలచి నీవు నిస్సంకల్పము (సంకల్పరాహిత్యము) కొరకు ప్రయత్నించకపోయినావా,.... అప్పుడు నీ మనస్సు సంసారమును వృద్ధి చేసుకుంటూనేపోతుంది. మనస్సు వృద్ధి చెందటము చేతనే ఈ జీవుడు జన్మ-కర్మల అరణ్యములో చిక్కుకుని తిరుగాడుచున్నాడు.

**మనసో అభ్యుదయో నాశో :** మనస్సు యొక్క అభ్యుదయమే సర్వదుఃఖములకు, అజ్ఞానమునకు కారణమై ఈ జీవుని జన్మ-మృత్యువుల మధ్య వ్రేలాడునట్లుగా చేయుచున్నది. అదియే జీవునిపట్ల వినాశనము.

**మనోనాశో మహోదయః :** మనస్సు నశించటము చేత ఈ జీవుడు శివస్వరూపుడై **మహోదయమును** పొందుచున్నాడు.

**విజ్ఞుడు :** మనస్సును ఉపయోగించుకొని మనస్సును నశింపజేసుకొని, సంసార బంధముల నుండి విముక్తుడై ఆత్మానుభవమునందు ఉదయిస్తున్నాడు.

**అజ్ఞుడో.. :** ఆతని మనస్సే ఆతనికి బంధముగా అగుచున్నది.

**'మనస్సు యొక్క ముఖ్యలక్షణము ఏమిటి?'** అని ఆత్మతత్త్వ పరిశోధకులు పరిశీలించి 'ఏకత్వమును విడిచి అనేకత్వమును ఆశ్రయించటమే'.. అని గమనించి మనందరికి చాటి చెప్పుచున్నారు. అందుచేత ఇప్పుడు ఏమి చేయాలి? **'ఏకతత్త్వము'** అగు ఆత్మనే దర్శించటము అనే దృఢమైన అభ్యాసమునకు ఈ జీవుడు సంసిద్ధుడు కావాలి. అనేకత్వమును దాటి, ఏకత్వమునే దర్శించటం ప్రారంభించాలి. **'ఈ అనేకముగా కనిపిస్తున్నదంతా వాస్తవానికి సర్వదా ఏకమగు ఆత్మయే'** అని దృఢముగా అనుకుంటూ ఉండటమును – అన్ని సందర్భములలోను ఆశ్రయించినవాడై ఉండాలి. ఏ మనస్సుతో 'అనేకత్వము' యొక్క దర్శనాభ్యాసము సన్నగిల్లుతూ వచ్చి, 'ఏకత్వము' యొక్క దర్శనము, దృఢమగుతూ వస్తుందో... అదియే 'అమనస్కము' యొక్క రూపము.

**శ్లో॥ తావత్ నిశీవ వేతాళా వల్గంతి హృదివాసనాః,**
**ఏకతత్త్వ దృఢ-అభ్యాసాత్ యావత్ న విజితం మనః॥**

ఎంతవరకైతే నీవు **'ఏకత్వ దర్శనము'** అనే దృఢమైన అభ్యాసమునకు ఉపక్రమించి అత్యంత శక్తి-యుక్తులతో కొనసాగించవో,.. అంతవరకు హృదయములోని వాసనల నుండి జనించిన 'అజ్ఞానము' అనే చీకట్లో కనబడుచున్న **'సంసారము'** అనే భేతాళుడు నిన్ను పట్టుకొని వదలడు. కొనసాగుతూనే ఉంటాడు.

సంకల్పములు తొలిగేది ఎట్లా! పడవ (Boat) లోనికి జలము ప్రవేశించనివిధంగా ఇంద్రియ విషయములు స్వీకరించకపోతే.. సంకల్పములు క్షయిస్తాయి. హేమంత ఋతువులో తామరతీగలు ముడుచుకుపోయి నశించువిధంగా, ఇంద్రియ విషయములను మననము చేయటము తగ్గించుకొంటూపోతూ ఉంటే, అప్పుడు భోగవాసనలు క్షీణిస్తాయి. క్రమంగా చిత్తము అనునది కూడా క్షీణించి, నశించుచున్నది.

**శ్రీ ఆంజనేయస్వామి :** ఈ పాంచభౌతిక దేహధారణ చేస్తూ కాలాంతర్గతంగా దేహముతో జీవిస్తూ ఉన్న మాకు (1) దృశ్య సంబంధమైన సర్వ సంకల్పములు త్యజించటము, (2) తద్వారా చిత్తమును జయించటము, (3) భేద దృష్టిని దాటవేయుటము – ఈ మూడూ కూడా అంత తేలికైన పనంటారా స్వామీ? కాదేమో? వాటిని మనస్సుకు అలవాటు చేయటం ఎట్లా?

**శ్రీరామచంద్రమూర్తి :** అవును. అయితే ఇంద్రియ దృశ్య వ్యవహారముల ఏర్పడుచున్న సంకల్ప పరంపరా ప్రవాహ వేగమును నిరోధించటమొక్కటే శాంతి స్థానమునకు మార్గము. అశాంతి తొలగి శాంతి కావాలంటే అందుకు ప్రయత్నమునకు నీవు ఉద్యుక్తుడవు కాక తప్పదు! కాలవలసిదే! వేరే త్రోవ లేదు!

**హస్తం – హస్తేన సంపీడ్య** – చేయిచేయి అదిమిపెట్టి ఉంచి అయినా సరే....,

**దంతైః దంతాని విచూర్ణ్యచ-** (లేక) పళ్లు-పళ్లు నొక్కిపెట్టి అయినా సరే...,

**అంగాని అంగైః సమాక్రమ్య** – శరీరములోని అంగములను (అవయములను) అంగములతో మూసిపెట్టి అయినాసరే...,

ఈ మనస్సును స్వాధీనం చేసుకోవటానికి ఎంతటి బలమైనా నియోగించాలి. ఎంతటి తెలివితేటలైనా చూపవలసిందే. మొట్టమొదట మనస్సును జయించటానికి ఉద్యుక్తుడు కానివాడు – తదితర భక్తి జ్ఞానమార్గములను అనుసరించి కూడా ఆత్మభావన సిద్ధించుకోలేదు. అందుకు ఒక ఉపాయం! ఒకచోట చక్కగా ఆశీనుడై, సుఖాసనమును ఆశ్రయించి, 'ఆత్మతత్త్వము' గురించి మనస్సును నియమిస్తూ

ఉండాలి. శాస్త్రములు, గురువర్యులు సూచిస్తున్న మనో నిరోధక శమ-దమ-తితీక్ష ప్రాణాయామ-ప్రత్యాహార-ధ్యాన-ధారణ-సమాధి ఉపాయములను ఉద్వేగరహితంగా ఆశ్రయించాలి. ప్రయత్నము, ఉపాయము - ఈ రెండూ తెలుసుకొని సాధన చేయాలి. సాధనను ఆత్మవిచారణ దగ్గరకు కొనిపోవాలి. అనిందితమైన (తదితరులకు ఇబ్బంది కలుగజేయునట్టి) ఉపాయములను ఆశ్రయిస్తూ మనస్సును జయించి, అద్దానిని.. ఆత్మతత్త్వము వైపు నియమించాలి. ఓ హనుమా! ఒక ప్రదేశముతో ఒక దుష్ట ఏనుగు మదగర్వముతో జనులకు హాని కలిగిస్తోంది. అప్పుడేంచేస్తాము? గజము (ఏనుగు)ను వశం చేసుకోగల సామర్థ్యము గల మావటివానిని పిలిపిస్తాము. ఆతడు అంకుశముతో వచ్చి, ఆ మదగజమును స్వాధీనము చేసుకొంటాడు. అంకుశము లేకుంటే మత్తగజము మాట వింటుందా? వినదుకదా! మనస్సు అనే గజమును ఉపాయములతో కూడిన ప్రయత్నముతో (అనగా) 'యోగము, భక్తి' ఇత్యాది సాధనాలతో వశము చేసుకోవాలి. ఒకవైపు మనస్సును నిస్సంగమార్గముగా స్వాధీనము చేసుకుంటూనే, ఆత్మతత్త్వమును పరిశీలించాలి. **'ఆత్మ అనగా ఏది? ఎక్కడున్నది? అద్దానికి నాకు సంబంధమేమి? నా స్వరూపమునకు ఆత్మకు ఏమి సంబంధము? నాకు బంధము ఉన్నాదా? లేక ఆపాదించబడుతోందా?'** మొదలైన ఆత్మ గురించిన 'సమాచారము-వివేచన' అందిస్తున్న ఆధ్యాత్మశాస్త్రమును పరిశీలించాలి. ఆత్మతత్త్వశాస్త్రమును ఎరిగిన సద్గురువును సందర్శించాలి. గురుముఖతః వినాలి. 'సాధుసంగమము' అనుబడు సదవకాశమును సద్వినియోగము చేసుకోవాలి.

1) ఆధ్యాత్మ విద్యా పరిశీలనము - సముపార్జనము.

2) సాధు సాంగత్యము.

3) ఇంద్రియములను సాధనలయందు నియమించటము, సాధనసహాయముతో వాసనలను పరిత్యజించే ప్రయత్నము.

4) ప్రాణాయామ అభ్యాసముచే ప్రాణస్పంద నిరోధము .

ఈ ఈ అభ్యాసములచేత చిత్తమును నీవు అదుపు చేసి, చిత్ స్థానమునకు చేర్చాలి. ఈవిధంగా శాస్త్రములచే, గురువులచే సూచించబడుచున్న సాధనలను, ఉపాయములను అనునిత్యముగా అభ్యసిస్తేనే సంసార రోగము శమిస్తుంది. ఓ ప్రియభక్త శిఖామణి అగు హనుమా! ఒక్క ముఖ్య విషయము గుర్తు చేస్తున్నాను.

**శ్లో॥ సతీషు యుక్తిషు ఏతాసు 'హఠాః' నియమయన్తి యే,**
**చేతసో దీపమ్ ఉత్సృజ్య విచిన్వన్తి తమో- అఞ్జనైః॥**

ఉపాయాలు ఎప్పుడూ అభ్యాససాధ్యమై, ఆ అభ్యాసికి, సహజనులకు కూడా సుఖానుకూల్య-సానుకూల్యములై ఉండటమే ఉచితము. అంతేగాని అట్టి సాధనోపాయములు ఇంద్రియములను క్షయింపజేసేవిగాను, ఆత్మను క్షోభింపజేసేవిగాను ఉండకూడదు. "ఇంద్రియములను బలవంతముగా హఠం చేసి, తద్వారా పరమాత్మను సిద్ధింపజేసుకుంటాను'.. అనునది సముచితము కాదు. 'హఠము' (బలవంతము - బాధతో కూడిన ప్రయత్నము) ద్వారా సత్యము, ప్రియమగు మహదాత్మను సంసాదించుకోవాలని అనుకోవటము- ***చీకట్లో ఏదో ముఖ్యమైన వస్తువు కనిపించలేదని, చేతిలోని వెలుగుచున్న దీపమును దూరంగా ఉంచి, కళ్లకు కాటుక పెట్టుకుంటే కనబడుతుందిలే అని అనుకొని ఇక కటిక చీకట్లో కావలసిన వస్తువుకై వెతకటము*** వంటిది. ఓ పవన పుత్రా! విమూఢులగు కొందరు హఠయోగము (ఇంద్రియములను బాధించుకుంటూ), క్షోభింపజేస్తూ (లేక) తదితర జీవులను కూడా కొన్నిసార్లు బాధిస్తూ ఉంటున్నారు. తద్వారా మనస్సును జయించాలని ప్రయత్నించటం ముళ్ళున్న మార్గమే! అది క్రూరమైన అభ్యాసములచే కుదిరేపని కాదు. ఒకడు. ఒక మదగజమునుగాని, కొండశిలువనుగాని తామరతూడులోని సన్నని దారములతో బంధించాలనుకోవటము కుదిరే పనేనా? కాదు. గట్టి త్రాళ్ళతో ఉపాయంగా వాటిని బంధిస్తాము కదా! ఇదీ అంతే! ఇంద్రియములను తెలివిగా ఉపయోగించి మనస్సు - అనే మదగజమును **'ఉపాయము'** అనే అంకుశంతో వశం చేసుకోవలసిందేగాని, ఇంద్రియములను క్షోభింపజేసి తద్వారా కానే కాదని ముముక్షువులందరికీ గుర్తు చేస్తున్నాను.

## మనోవృత్తులు

**శ్రీ ఆంజనేయస్వామి :** తండ్రీ! శ్రీరామచంద్రా! ఈ మనోవృత్తులను మేము జయించుటకు మార్గమేమిటి?

**శ్రీరామచంద్రుడు :** అవును! "దృశ్య సంబంధమైన మనోవృత్తులు (Avocations)" అనే లతలచే 'చిత్తము' అనే మహావృక్షము ఆవరించబడినదై ఉన్నది. పైకి-క్రిందికి ఆ లతలు పిచ్చిపిచ్చిగా పాకినవై ఆక్రమిస్తున్నాయి. అయితే 'చిత్తము' అనే మహావృక్షము ఏ బీజము నుండి బయల్వెడలినదో, ఆబీజము రెండు విభాగములు కలిగి ఉన్నది.

1) ప్రాణపరిస్పందనము (తద్వారా జడమగు ఇంద్రియములు ప్రవర్తించగలగటము)

2) దృఢముగా దృశ్యవిషయములను భావన చేయుటము.

సర్వగతమైనట్టి **సంవిత్** [సత్ = **ఉనికి**(+) విత్=**ఎరుక** – (Awareness)] – **ప్రాణస్పందనల** చేతనే స్వీయరచనా వ్యసనరూపమగు దృశ్యము నందు చిత్తమును – చలింపజేయటము జరుగుచున్నది.

మరొక్క విషయం కూడా! ఈ చిత్తము ఒకేసారి అనేక విషయ విభాగములతో పెనుసంబంధము కలిగి ఉండటము చేతనే, అది తనయొక్క జనన స్థానమగు (ఆది స్థానమగు) ఆత్మను ఏ మాత్రమూ కూడా గుర్తించలేకపోతోంది. ఎప్పుడైతే ఈ చిత్తము **'అనేకములను స్మరించటము'** అనే దురభ్యాసము (దురలవాటు)ను జయించి, త్యజించి **'ఒక విషయముపై ఉన్నప్పుడు తదితరములన్నీ త్యజించి ఉండటము'...,** అనే ఏకాగ్రత కుదుర్చుకొనుచున్నదో,.., అప్పుడు ఆత్మజ్ఞానము ఉదయించటానికి పరిస్థితి సమకూరుచున్నట్లే! మరి చిత్తము ఏకాగ్రత (Concentration at one point) ను పొందేది ఎట్లా? అందుకు ధ్యానము, మార్గమైయున్నది. అట్టి మనోధ్యానము గురించి ఈ సందర్భములో కొన్ని విషయాలు చెప్పుకుందాము. శ్రద్ధ-ఆసక్తిలతో వినెదవుగాక!

## నేతి – నేతి (న ఇతి)

**'ఇది నేను కాదు! ఇది నేను కాదు'** అను మార్గములో దృశ్య-దేహ-ఇంద్రియ-ఇంద్రియ విషయ-మనో-బుద్ధి-చిత్త-అహంకారములను అధిగమించి వేయి. వికృతవికారములన్నీ తొలగించుకుంటూరమ్ము. క్రమంగా దృశ్యభావమును మొదలంట్లా త్యజించు. దృశ్య భావమంతా (దేహభావముతో సహా) తొలగిన తరువాత కూడా (ప్రక్కకు పెట్టిన తరువాత కూడా) ఏది శేషిస్తోందో, అట్టి **కేవల చిన్మాత్రము (ఎరుగబడేదంతా తొలగిస్తే శేషించే కేవలీ ఎరుక)**ను చింతన చేయి. తదితర చింతనలను దూరంగా వదలివేసి ఉండు.

## కుంభక ప్రాణాయామము (లేక) కుంభకావస్థ

సాధారణంగా ప్రకృతిచైతన్యము యొక్క **చంచలశక్తి నియమానుసారముగా** గాలి దేహములోనికి ప్రవేశించటము. (ప్రాణచలనము) లోపలి నుండి ఆ గాలి బహిర్గతము అవటము (అపాన చలనము) – స్వభావసిద్ధముగా జరుగుచూ ఉంటోంది. ఏఏ స్థానములలో అపాన చలనము (Air Move from inside to out side) ఇంకనూ ప్రారంభమవక – ప్రాణచలనము (Air Move from out side to inside) ముగిసినదై ఉంటుందో ఆ సమయము, స్థానము యోగికి మాత్రమే అభ్యాసముచే అనుభవమగుచున్నది. అట్టి ప్రాణచలనము ముగిసినదై – అపానము సంబంధమైన కదలిక ఇంకా ప్రారంభముకానట్టి ఉభయప్రాణ చంచల రహిత స్థితి **'అంతరంగ ప్రాణ కుంభకము'** అంటారు.

ప్రాణము (వాయువు) దేహమునుండి బహిర్గతమై (రేచకము) యున్న సందర్భములో దేహములోని వాయువు బహిర్గతమవటము చేత కూడా దేహమునందు **'పూర్ణసమానవస్థ'** ఏర్పడినదగుచున్నది. బాహ్యమున ప్రాణ-అపానముల నిశ్చల స్థానము బాహ్య ప్రాణ కుంభకము. అట్టి బాహ్య-అభ్యంతర కుంభక యోగము ఇచ్ఛా పూర్వకముగా అభ్యసించబడుచూ ఉండగా, అప్పుడు ఆజీవునిలో **'బ్రహ్మాకారమనోవృత్తి'** జనించగలదు.

## సంప్రజ్ఞాత సమాధి స్థితి

**శ్లో॥ బ్రహ్మాకారమనోవృత్తి ప్రవాహో అహంకృతిమ్ వినా,**
**సంప్రజ్ఞాత సమాధిస్స్యాత్, ధ్యాన అభ్యాస ప్రకర్షతః ॥**

'అందరిలోనూ నేను ఏదో ఒక ప్రత్యేకమైనవాడను' అను ప్రత్యేక అహంకారవృత్తి- బాహ్య -అభ్యంతర కుంభక ప్రాణాయామము చేతగాని, తదితర యోగాభ్యాసముల చేతగాని- లయించగలదు. **"అందరూ నాలో నేనై ఉండటము – నేనే అందరిలో 'నేను'గా ఉండటము"** అను బ్రహ్మాకారమనోవృత్తిని ధ్యాన అభ్యాసముచే పొందియున్న స్థితి – సంప్రజ్ఞాతసమాధి స్థితి. **"వ్యష్టి అహంకార భావన"** నశించగా ఏర్పడునదే **బ్రహ్మాకారమనోవృతి (లేక) బ్రహ్మ భావన.**

## అసంప్రజ్ఞాత సమాధి స్థితి

భావన నశించగా ఏర్పడు బ్రహ్మాకారమనోవృత్తి (లేక) బ్రహ్మాభావన. ఈ చిత్తము దృశ్యవిషయములను పూర్తిగా త్యజించివేసి ఉన్నప్పుడు, ఇక ఈ కనిపించేదంతా **'పరమానంద జ్ఞానదీపము'**గా యోగికి అనుభూతమగుచుండగా ఏర్పడు యోగుల ప్రియస్థితిని **'అసంప్రజ్ఞాత సమాధిస్థితి'** అంటారు. జగత్తు ఉంటే కదా, అది బ్రహ్మమా – మర్మమా అను ప్రశ్న?

**అతత్ వ్యావృత్తిరూపసమాధిస్థితి :** ఏ యోగి దృష్టిలో ప్రభ (జ్యోతి), శూన్యమునందు లయించినదై, అట్లాగే మనోబుద్ధులు కూడా శూన్యస్వరూపము పొందటము జరిగి **'ఈ జగత్తంతా ఆత్మయొక్క వ్యాప్తరూపమే'** – అను భావన ఘనీభూతమౌతోందో, అదియే **"అసంప్రజ్ఞాత సమాధిస్థితి"**. అది మునులు పొందుచున్న సమాధి.

## పారమార్థిక సమాధి

**శ్లో॥ ఊర్ధ్వపూర్ణమ్। అథః పూర్ణం। మధ్యపూర్ణం శివాత్మకమ్ ।**
**సాక్షాత్ విధిముఖో హి ఏష సమాధిః పారమార్థికః॥**

ఊర్ధ్వము (పైన), క్రింద, మధ్య కూడా ఆత్మ వస్తువుచే పూర్ణమై, ఈసర్వము శివాత్మకమై (శివాత్ పరతరమ్-నాస్తి).. ఈ సర్వము తన బ్రహ్మదేవత్వము (సృష్టించు సంస్కారము) యొక్క ముఖరూపమై అనుభవమవటము స్వయమ్ బ్రాహ్మీభావస్థితి. "ఇదంతా నాయొక్క పారమార్థిక స్వరూపమే" - అను స్వకీయ నిశ్చల స్వస్థితిని **"పారమార్థిక సమాధి"** అని అంటున్నారు.

## వాసనలు

**శ్రీఆంజనేయస్వామి :** రామచంద్రప్రభూ! **'ఈ జీవుని ఉపాధి పరంపరల సుదీర్ఘ ప్రయాణములకు కారణము వాసనలే'** అని చెప్పబడుతోంది కదా! అట్టి 'వాసనలు' అనగా ఏమై ఉన్నదో, దయచేసి వివరించండి.

**శ్రీరామచంద్రుడు : దృఢ భావనయా, త్యక్త పూర్వాపరవిచారణమ్, యత్ ఆదానం పదార్థస్య 'వాసనా' ప్రతి కీర్తితా!** ఒకడు 'ఇది ఇతః పూర్వము (ముందుగా) ఏమి? ఇక ముందు ఏమి కానున్నది?' - అనునది (ఒక వస్తువు - పదార్థము, సందర్భము-సంగతి గురించి) ఏ మాత్రమూ విచారణ చేయకుండా, అద్దానిని దృఢభావనతో స్వీకరించి, అద్దానిని (అవిచారణ పూర్వకంగా) అంటి పెట్టుకుని ఉండటమును - **'వాసన'** అని పిలుస్తున్నారు.

ఓ కపిశ్రేష్ఠా! ఇక్కడ ఒక విశేషమున్నది. ఒకడు మనస్సుతో తక్కిన విషయాలన్నీ ప్రక్కన వదలి, ఏదో ఒకానొక విషయముపై మాత్రమే ధ్యాస-ఏకాగ్రత-శ్రద్ధ కలిగి ఉన్నాడనుకో. ఆతడు అతిత్వరగా ఆ **ఏకైక వస్తు రూపుడే స్వయముగా అగుచున్నాడు.** ఆ ఏకైక భావనా వస్తువు యొక్క అతి సామీప్యత పొందినవాడై, అద్దానినే దర్శిస్తూ- దర్శిస్తూ **"ఇదియేనేను" (లేక) "ఇదియే సత్‌వస్తువు!"** - అను ఆత్మీభావనకు చేరుచున్నాడు. చివరికి అదియే తానగుచున్నాడు. ఈ జీవుని పట్ల ఆతని వాసనా వివశత్వము (వాసనకు వశుడై ఉండటము) యొక్క ప్రభావము అట్టిది మరి!

**భావితం తీవ్ర సంవేగాత్ ఆత్మనా యత్**: దేనినైతే తీవ్రమైన సంవేగముతో 'తాను'గా భావిస్తాడో,

**తదేవ సః భవతి -** ఆతడు అదిగానే పరిణమిస్తున్నాడు (యత్ భావమ్.. తత్ భవతి),

**తీవ్ర సంవేగాత్ -** **విగత ఇతర వాసనః** - ఇతర వాసనలన్నీ వదలి....,

**వాసనా వివశీకృతః** - ఒకే వాసనకు (విషయమునకు) వివశీకృతుడై ఉంటూ ఉంటే

**తాదృక్ రూపోహి భవతి** - ఆరూపమే తానగుచున్నాడు

ఆవిధంగా ఆతడు దేనినైతే

| | | |
|---|---|---|
| ఇది నాకు సంబంధించినది. నేను దీనికి సంబంధించిన వాడిని! | - | అది నాకు సంబంధించినది కాదు! |
| దీనిపై ఆధారపడి ఉన్నాను ! | - | దానిపై ఆధారపడి లేను! |
| ఇది నాకు అత్యంత ప్రియము! | - | అది అప్రియము! |
| ఇది బహు సుందరము! | - | అది కాదు! |
| ఇది అంటే ఇష్టము ! | - | అదంటే కోపము! |
| ఇది నా సొంతము! | - | అది కాదు ! |

ఈ విధంగా దేనిని తనకు సంబంధితము అని అనో, తాను ఆధారపడి ఉన్నాననో, తనకు ప్రియము అనియో, 'అందముగా ఉన్నది కదా' అనియో, తనకు ఇష్టము -అనియో, సొంతము అనియో, తనకు అవినాభావన పంబంధము కలిగి అది లేకపోతే తాను లేననియో, అది గొప్ప అనియో - ఈ తీరుగా అనుకుంటూ ఉంటే.. అనేకసార్లు అనుకోవటము వలన అది **'అలవాటు'**గా అగుచున్నది.

ఆ అలవాటు సుదీర్ఘముగా కొనసాగిస్తే అది **'సంస్కారము'** అగుచున్నది.

ఆ 'సంస్కారము' అభ్యాసముగా ఇంకా కొనసాగిస్తే అది **'వాసన'**గా అగుచున్నది.

**సంపశ్యతి 'యత్ ఏవ ఏతత్ వస్తు' ఇతి ముహ్యతే!** ఏదైతే ఈ జీవుడు 'ఇది ఇట్లే సత్యము' అని అనుకుంటూ ఉంటాడో, క్రమంగా అభ్యాసవశంగా సంస్కారముచే 'ఇది ఇంతే' అని మోహము చెందుచూ ఉంటాడు.

ఈ జీవుడు 'నేను దేహమును -దృశ్యబద్ధుడను-అల్పుడను - దుఃఖిని - పరిమితడను'.. ఇత్యాదులన్నీ కూడా **"అనుకోవటము - అభ్యాసము - సంస్కారము - వాసన - అట్లే అనిపించటము - అదే తాను అవటము"**.. అను అభ్యాస స్థితి గతులచే సిద్ధించినవే!

**చమత్కారమైన విశేషమేమంటే......**

వాసనా వేగము చేత ఈ జీవుడు తాను ఏమి అనుకుంటూ వస్తున్నాడో.. అదియే తానగుచున్నాడని చెప్పాను కదా! వాసనా వేగము చేత ఏ రూపము తానయ్యాడో.. అది ఇక ఆతడు అది వదలలేకపోవుచున్నాడు. **వాసనావేగ వైచిత్ర్యాత్ స్వరూపమ్ న జహాతి తత్!** ఆతడు దుర్-దృష్టిచే భ్రాంతి పొందటం జరుగుతోంది. ఆభ్రాంతిని భ్రాంతిగా గుర్తించటమే లేదు. ఇక ఆపై, సర్వము భ్రాంతి మయమై ఆతని పట్ల సిద్ధిస్తోంది. ఉదాహరణకు, ఒకడు మత్తుపానీయము తీసుకొని ఉండగా, అంతా మత్తు భ్రమతో నిండినదై అగుపిస్తూ ఉంటుంది కదా!

ఈ జీవుని పట్ల కూడా తలచటము - అనుకోవటము - అనిపించటము - అలవాటు - అభ్యాసము - సంస్కారము - వాసన.. అను మెట్లుగా నిర్మితమైన వాసనలచే తాను ఆత్మను ఏమరచి స్వకీయ వాసనారూపిగా పరిణతి అయి, ఇక ఆ వాసనా ఫలితరూపమును (లేక భావనను) ఏ మాత్రమూ వదలలేకపోవుచున్నాడు. ఈ తతంగమంతా అనేక ఉపాధులుగా కొనసాగుతూ వస్తోంది. ఇక్కడి ఉపాధులు, సంబంధ-అనుబంధ-బాంధవ్యములు, దేహముల రాక-పోకలు, అజ్ఞాన సంయోగ-వియోగ పరంపరలు, లోక-లోకాంతరములు, దృశ్య బ్రహ్మాండ పరంపరలు - ఇవన్నీ వాసనా ప్రభావములేనయ్యా!

**శ్రీ ఆంజనేయస్వామి :** హే ప్రియ రామచంద్రా! అస్మత్ ఆత్మానందస్వరూపా! జీవులమగు మేము మా వాసనల చిక్కుముడులలో చిక్కుకుని అనేక బంధములను, దుఃఖములను తెచ్చిపెట్టుకుంటున్నామని అర్థమగుచున్నది. మరి ఇప్పుడు ఈ బంధము-దుఃఖము తొలగటానికి, ఆత్మానందము పొందటానికి త్రోవ ఏది?

**శ్రీరామచంద్రుడు :** సరే! విను! ఇప్పుడు మనము వాసనల గురించి చెప్పుకుంటున్నాము కదా! అట్టి వాసనలు రెండు విధములుగా విభజించబడుచున్నాయి. 1) శుద్ధ వాసనలు, 2) మలినవాసనలు.

**మలినా జన్మహేతుస్స్యాయత్ :** మలిన వాసనలు జన్మపరంపరలకు కారణముగా అగుచున్నాయి.

**శుద్ధాత్ జన్మవినాశనీ :** శుద్ధ వాసనలో, పునర్జన్మల అంకురములను నశింపజేయుచున్నాయి.

## మలిన వాసనలు

" నేను జీవుడను! ఈ దేహ మాత్రుడను! ఇక్కడ చిక్కుకున్నాను! ఈ ఎదురుగా ఉన్నదంతా నిజమే! ఈ దేహముంటేనే నేను ఉంటాను! మరల ఇటువంటి దేహముతోటే పుట్టితే బాగుండును! వీరు నావారు! వారు కాదు!" - ఇవన్నీ స్వకీయ నిర్మితమైన మలినవాసనలకు కొన్ని ఉదాహరణములు. అహంకారము (నాది-నేను-ప్రత్యేకమగు నేను) అను దీర్ఘవ్యాధి నుండి మలిన వాసనలన్నీ బయల్వెడలుచున్నాయి. అజ్ఞానము యొక్క ఘనీ భూతరూపమే అహంకారము. అజ్ఞానము వలన అహంకారము, అహంకారము వలన వాసనలు, వాసనల వలన అజ్ఞాన అహంకారము... ఈ విధంగా పరస్పరంగా ఇవి వృద్ధి చెంది, ఆత్మస్వరూపుడగు ఈ జీవుని 'భావనా పరంపరలు-ఉపాధి పరంపరలు-జన్మమృత్యుపరంపలు' అనే మూడు త్రాళ్లతో నిర్మితమైన వలలో చిక్కుకునేటట్లుగా చేస్తున్నాయి. అందుచేత- **బుధులు (విజ్ఞులు)- 'ఓ జనులారా! అజ్ఞాన వాసనలు దరిజేరకుండా అతిజాగరూకులై ఉండండి..** అని శ్రేయోభిలాషులై హెచ్చరిస్తున్నారు. **అజ్ఞాన సుఘనాకారా, ఘనాహంకార శాలినీ, పునర్జన్మకరీప్రోక్తా, మలినావాసనైః బుధైః! మలిన వాసనలు '3' లక్షణములను ప్రదర్శిస్తూ ఉన్నాయి.**

1) అజ్ఞానమును మరింతగా ఘనీభూతము చేయటము.

2) అహంకారమును ఘనము (పెద్దది)గా చేయటము

3) 'పునర్జన్మ పరంపరలు' అనే మార్గములో త్రోసివేయటము.

అందుచేత ఈ జీవుడు మలిన వాసనలను సన్నగిల చేసుకోవటము - శుద్ధ వాసనలను పెంపొందించుకొనుటము.. అను ప్రయత్నములో అనుక్షణము నిమగ్నమై ఉండాలి. "మానవ ఉపాధి యొక్క పరమావధి మలిన వాసనలను వదలించుకొని, బుద్ధిని శుభ్రపరచుకోవటమే!"- అని ఎల్లప్పుడూ దేహము కొనసాగునంతవరకు జ్ఞాపకము కలిగి ఉండాలి. మలిన వాసనలను గుర్తించి, వదిలించుకునే ప్రయత్నములకు ఉపక్రమించకుండా **'మాకు ఇది తెలుసు. వాళ్లకు అది తెలియదు. మేము ఇటువంటి వాళ్లము. వాళ్లు అటువంటి వాళ్లు'** అని చిలకపలుకులు పలుకుతూ మీన-మేషాలు లెక్కపెట్టుకొంటూ ఉంటే, ఈ జీవునికి ఏమి ప్రయోజనం? కాబట్టి మలిన వాసనలను హృదయము నుండి వెడలగొట్టే ఉపాయము ఆశ్రయించాలి.

## శుద్ధవాసనలు

"అంతా పరమాత్మయే! పరమాత్మ సంకల్పమే! సత్ రసవతీ స్వరూపమే!" అను బలముతో కూడిన బుద్ధితో నా ఈ మనస్సును ఉత్తమ – ధ్యానము–భక్తి–యోగాభ్యాసములతో శుద్ధ పరచుకోవాలి. ప్రయత్నశీలుడనై ఉండాలి".... అనే ఈ జీవుని ఆలోచనలన్నీ శుద్ధవాసనల నుండే బయల్వెడలుచున్నాయి. ఒక బీజమును అగ్నిలో వేయిస్తే (వేడిపెట్టి–ఉడికిస్తే)– అప్పుడు ఆ బీజము నందు మరల అంకురించటము అనునది నశిస్తూ, ఆకారతః మాత్రమే శేషించినదై ఉంటుంది కదా! అట్లాగే శుద్ధ వాసనల ప్రభావము చేత ఈ జీవుని అంతరంగము నందు పునర్జన్మహేతువులగు బీజము పునరంకురస్వభావము పోగొట్టుకొన్నదగుచున్నది. అప్పుడిక ప్రారబ్ధకర్మలు దేహమున్నంత వరకు మాత్రమే శేషిస్తాయి. ఓ ఆంజనేయా! నిర్మోహమోటముగా నీకు ఒక్క విషయము గుర్తు చేస్తున్నానయ్యా! **బహుశాస్త్రకథా కంథా రోమంథేన వృథైవకిమ్?** ఈ జీవుడు అనేక శాస్త్రములలోని కథలను, పాత్రలను, వంశచరిత్రలను, సంఘటనలను కేవలము వల్లించుకొంటూపోతూ ఉంటే ఏమి ప్రయోజనమయ్యా? "నా మలినవాసలు ఏఏ తీరులుగా ఉన్నాయి? వాటిని తొలగించుకొనే సాధనలు, విధానములు ఏమిటి? వాటిని ఎట్లా ఆశ్రయించాలి?" – అనేది వర్తమాన కర్తవ్యమని జనులందరికీ గుర్తుచేస్తున్నాను.

- ***నాలో శుద్ధ వాసనలు ఏమేమి? వాటిని ఎట్లా వృద్ధి పరచుకోవాలి?***
- ***మలిన వాసనలను తొలగించుకొంటూ శుద్ధ వాసనలను ఆవిష్కరించుకుంటూ –పెంపొందించుకొంటూ.. అంతర హృదయేశ్వరుడగు ఆత్మారాముని జ్యోతి స్వరూపము అంతరమునందే ఎట్లా సందర్శించాలి?'***

అనే ప్రయత్నమునందు ఈ జీవుడు తనను తాను నియమించుకోవాలి కదా? ఓ మారుతీ! అట్టి ప్రయత్నశీలుడైనవాడు **'హృదయాంతర్గ ఆత్మజ్యోతి'**ని దర్శించి, ఆత్మతో మమేకమై ఆత్మారాముడై విరాజిల్లుచున్నాడు.

ఇక్కడ ఎదురుగా కనిపిస్తూ – కనిపించకుండానే ఉన్నాయని అనిపిస్తూ ఉన్న (కనబడే–ఊహించబడే) సర్వవిశేషములనూ కూడా – **దర్శన అదర్శనే హిత్వా**–వాటివాటి గతికి వాటిని వదలి, **స్వయం కేవల రూపతః** – తానే ఆత్మారామానందసాగరుడై విరాజిల్లాలి. ఓ హనుమా! ఇక్కడ మరొక్క ముఖ్య విషయము కూడా విను! శుభ వాసనల సహాయముతో ఆత్మజ్ఞానము సంపాదించుకోవలసినదే! అయితే అంతటితో ఆగి ఊరుకోకూడదు మరి? ఆత్మయే తానై, సర్వవాసనలు త్యజించి ఉండాలి.

**బ్రహ్మ! న బ్రహ్మవిత్, స్వయమ్।** ఓ కపిశార్దూలా! బ్రహ్మము గురించి **తెలుసుకొన్నవాడై ఉన్నంత మాత్రముచేత సరిపోదు.** ఈ జీవుడు (ముముక్షువు) తానే **'బ్రహ్మము'**గా అయి విరాజిల్లాలి! తానే ఆత్మజ్యోతి స్వరూపుడై వెలుగొందాలి! జగత్ జ్యోతి స్వరూపుడై ఆత్మానందమును ఆస్వాదించాలి! 'అహమ్ సర్వస్య ప్రభవో!' అను అనుభవస్థానము చేరాలి! కనుక ఓ వాయుపుత్రా! బ్రహ్మమే నీవై విరాజిల్లుము!

**శ్రీ ఆంజనేయస్వామి :** నాలుగు వేదముల పఠనము ఇత్యాదుల చేత కూడా అట్టి స్వయమాత్మానంద స్వస్వరూపము ఆవిష్కరించబడ గలదుకదా, స్వామీ!

**శ్రీరామచంద్రుడు :** నాయనా! అంజనీపుత్రా! వేదపఠనము ఇత్యాదులు శుభప్రదమే! అయితే నేను ఇక్కడ ఒక హెచ్చరికను వినిపిస్తున్నాను. విను

**శ్లో॥ అధీత్య చతురోవేదాః, సర్వశాస్త్రాణి అనేకశః**
**'బ్రహ్మతత్త్వమ్' న జానాతి, దర్వీపాక రసం యథా॥**

ఎప్పుడైనా పఠనము వేరు! అనుభవము వేరుకదా! అనుభవమునకు దారితీయకపోతే పఠనము వలన ప్రయోజనమేమున్నది? ఒక వంటవాడు (Cook) అత్యంత రుచి–సువాసనల (కమ్మటి వాసనలు) వెదజల్లుచున్న పులుసులో గరిటను ప్రవేశపెట్టి త్రిప్పుచున్నంత మాత్రము చేత, ఆ దర్వికి (గరిటకు) పులుసు యొక్క రుచి తెలిసి ఆనందించగలదా? లేదు కదా! అట్లాగే, నాలుగు వేదములను, అనేక శాస్త్రములను ఆమూల నుండి – ఈ మూల వరకు అనేకసార్లు వల్లె వేస్తున్నప్పటికీ, ధారాళముగా పలుకగలుగుచున్నప్పటికీ 'బ్రహ్మతత్త్వము' తెలుసుకొని, అనుభవముగా సిద్ధించుకోకపోతే ఏమి లాభము? **'నీవు–నేను కూడా పరబ్రహ్మస్వరూపులమే'** అను మననము చేతనే బ్రహ్మభావన సిద్ధించుచు, క్రమంగా అభ్యాసమై, సంస్కారమై, ఆ బ్రహ్మభావనయే మహత్తరమగు వాసన (Tendency)గా రూపుదిద్దుకోగలదు. కనుక వల్లె వేస్తే చాలదయ్యా! 'అంతా బ్రహ్మమే' అని అనిపించే వరకు అనుకుంటూ వుండాలి! అనిపించే బ్రహ్మమే నీవై సర్వత్రా వెలుగొందాలి!

**శ్లో॥ స్వదేహా 'అశుచి' గంధేన న విరజ్యేత్ యః పుమాన్,**
**విరాగకారణమ్ తస్య కిమ్ అన్యత్ ఉపదిశ్యతే?**

ఓ అంజనీ ప్రియపుత్రా! ఎవ్వడైతే స్వదేహములోని అశుచి అయిన గంధములను (Narrow, Pessimistic and negative Tendencies in the Inner-Self) గమనించి వాటి నుండి విరమించటానికి (కోపము-ఆవేశము-క్రోధము-దురాశ-రాగము-మమకారము-శత్రుభావము-విషాదము- పరదూషణ-ఇతరులను పోరుపెట్టి బాధించటము - మాటలో పరుషత్వము- పరద్వేషము-ఆత్మస్తుతి-జాతి మత కులాహంకారములు-దుష్టాభ్యాసముల పట్ల అనురక్తి మొదలైనవి) తొలగించుకోవటానికి ప్రయత్నశీలుడై ఉండడో, అట్టి వానికి ఎంతగా ఆత్మవిషయము గుర్తు చేస్తే మాత్రము ఏమి ప్రయోజనమయ్యా? **విరాగము లేనిచోట ఆత్మబోధ నిష్ప్రయోజనమే అవుతుంది.** దేహి-దేహముల భేదము గుర్తించ సిద్ధముకానివానికి 'శుచి' ఏముంటుంది? ఈ దేహము పట్ల విరాగము కలవాడే ఆత్మతత్త్వ బోధకు అర్హుడగుచున్నాడు.

వాస్తవానికి..? **అత్యంత మలినోదేహో, దేహీచ అత్యంత నిర్మలః**

ఈ దేహము - అనేక మలినములతో కూడిన పదార్థము.

దేహియో - అత్యంత నిర్మలమగు ఆత్మయే స్వరూపముగా కలవాడు.

**ఉభయోః అంతరమ్ జ్ఞాత్వా కస్య శౌచం విధీయతే?** ఈ రెండిటి యొక్క భేదమేమిటో తెలిసిన వాడికి క్రొత్తగా 'శుచి-శౌచము'లను నియమించి చెప్పవలసిన పనేమున్నది?

**శ్రీ ఆంజనేయస్వామి :** శ్రీరామచంద్ర భగవాన్!

మోక్షము అనగా ఏమి? అది ఈ జీవునికి ఎప్పటికి ఎట్లా లభిస్తుంది?

**శ్రీరామచంద్రమూర్తి : 'నాకు బంధమే లేదు'** అని అనిపించు **స్థితియే** మోక్షము. అయితే ఈ జీవునికి బంధము ఎక్కడి నుంచి వచ్చి పడుతోంది? ఎవ్వరు కల్పిస్తున్నారు? మరెవ్వరూ కల్పించటము లేదయ్యా! మనము ఇంతవరకు వాసనలు ఎట్లా ఏర్పడుచున్నాయో చెప్పుకోవటము జరిగింది కదా!

**బంధోహి వాసనా గంధో** - వాసన గంధములే బంధము!

**మోక్షస్య వాసనా క్షయః**-అసత్-వాసనలు క్షయించటమే మోక్షము. వాసనలకు వేరుగా ఈ జీవునికి బంధము లేదు. మోక్షమూ లేదు.

ఓ మారుతీ! **'మోక్షమును నేను సిద్ధించుకోవాలి!'** అనే లక్ష్యము కలవాడవై అశుభవాసనలను త్యజిస్తూ, శుభవాసనలను ఆశ్రయిస్తూ ఉండు. అశుభవాసనలన్నీ తొలగుచూ ఉంటే శుభవాసనలు తమ విధిని నిర్వర్తించుచున్నట్లే! 'వాసనలు బంధము' అని అనుకున్నాము కదా! కనుక 'నాకు మోక్షము కావాలి! పొందాలి'.. అనే వాసనను కూడా చిట్టచివరిగా త్యజించివేయి. ఎందుకంటే సర్వసాక్షియగు నీ స్వస్వరూప పరతత్త్వమునకు బంధమేమున్నది? అది నిత్యముక్త స్వరూపమే. ఇక 'జీవుడు' అనునదో? అది స్వకల్పిత మాత్రము కదా! కల్పితమైన దానికి బంధమేమి? మోక్షమేమి?

ఈ జగత్తులోని పాత్ర.. నాటకములోని పాత్ర వంటిదేకదా! అది జగన్నాటకమును అనుసరించి ఉండవచ్చుగాక! ఆత్మారామ స్వరూపుడవగు నీకు జీవాత్మత్వము వలన బంధమేముంటుంది? జీవాత్మ జగత్ నాటకములోని కల్పన కాబట్టి అద్దానికి మోక్షమేముంటుంది? ఒకడు ఒక నాటకములో ఒక 'పాత్ర'గా నటిస్తూ ఉంటే, ఆ పాత్రయొక్క స్వభావము-కష్టము-సుఖములచే పాత్రధారునికి బంధమేముంటుంది? మోక్షమేముంటుంది?

పరమాత్మ **నిత్యముక్తము**, జీవాత్మ **నిత్యబద్ధము** అయిఉన్నారు. ఈ విధమైన అవగాహనతో 'మోక్షేచ్ఛావాసన'ను కూడా త్యజించివేయి. మోక్షార్థిగా కూడా ఉండవలసిన పని నీకు లేదు. **వాసనాం సంపరిత్యజ్య మోక్షార్థిత్వమపి త్యజ!**

ముందుగా ఈ భౌతిక దేహసంబంధమైన శబ్ద-స్పర్శ -రూప-రస-గంధ వాసనలను దాటి అతీతదృష్టిని ఆశ్రయిస్తూ ఉండు.

భౌతిక దేహ-ఇంద్రియ వాసనలను త్యజించే ఉపాయములుగా - **మైత్రి, కరుణ, క్షమ, సేవ, వాత్సల్యము, యజ్ఞభావముతో కర్మలు నిర్వర్తించటము, పరోపకారము, దాక్షిణ్యము,** మొదలైన సాత్విక వాసనలు ఆశ్రయించు. మైత్ర్యాది వాసనా నామ్నీః గృహాణ అమల వాసనాః మైత్రి మొదలైన నిర్మల వాసనలను స్వీకరిస్తూ మలవాసనలను జయించు.

అటు తరువాత, ఆ సాత్విక స్వభావముతో వ్యవహరిస్తూనే .. స్నేహము - ఇత్యాది - సంబంధించిన వాసనలను కూడా హృదయములో రహితము చేసికొని ఉండు. **తశ్చాపి అంతః పరిత్యజ్య తాభిః వ్యవహరన్ అపి!** ఈ విధముగా క్రమంగా అంతర్హృదయము నుండి సర్వ **సాత్విక- రాజసిక-తామసిక వాసనలను బయటకు పారద్రోలి వేయి.**

- ❖ అంతర్హృదయములో పరమ శాంత స్వరూపుడవై ప్రకాశిస్తూ ఉండు!
- ❖ బాహ్య జగత్తులో మాత్రము సర్వదేహుల పట్లా సాత్విక – స్నేహ – వాత్సల్యభావాలు ప్రదర్శించుచూ ఉండు!
- ❖ **'నేను సర్వదా సత్‌చిత్ ఆనంద స్వరూపుడను! అట్లాగే ఈ ఎదురుగా నాకు కనిపిస్తున్న జీవులంతా (నాతో సహా) సత్‌చిత్ ఆనందమగు పరబ్రహ్మస్వరూపులే! సహజముగా అందరమూ ఆత్మానందరూపులమే! ఇహ ఇక్కడి సంగతి – సందర్భములు ఎట్లా ఉంటే మాత్రము ఆత్మత్వమునకు వచ్చేలోటు ఏమున్నది'..... అను రూపము గల 'కేవల చిన్మాత్రము' అను ఒక్క 'వాసన' మాత్రమే నీయందు సశేషించినదై ఉండుగాక!**
- ❖ అటుపై పైన చెప్పుకున్న వాసనా రూపమైన మనో–బుద్ధి–చిత్త–అహంకార సంబంధమైన శాస్త్ర విశ్లేషణా వాసనలను కూడా త్యజించివేయి.
- ❖ ఆ విధముగా త్యజించి వేసిన తరువాత అప్పటికీ నీయందు శేషించియుండు నిర్మల–నిత్య సత్య–పరమానంద స్వరూపమగు స్వస్వరూప – ఆత్మజ్యోతితో మమేకమై, ఆసీనుడవై స్థిర సమాధాన సమన్వితుడువై ఉండు.
- ❖ ఓ మారుతీ! నీవు నన్నుగా ఆరాధిస్తున్న ఆ రామబ్రహ్మము నీవేనయ్యా! నీవు నేనై ప్రకాశించుము. నీయందు నేను నీవై ఉన్నాను. **మయి త్వమ్ భవ, మారుతే!**

**శ్రీ ఆంజనేయస్వామి :** తండ్రీ! ప్రియ ఆత్మారామా! లోకములకు ఆనందము కలుగజేయు స్వామీ! లోకో **రమయతీఽ** తి రామబ్రహ్మమా! నేనే రామబ్రహ్మమై యుండగా ఇక నేను ఎట్టి విశేషములతో సమన్వితుడవై ఉంటున్నానో.. అది కూడా దయతో అభివర్ణించప్రార్థన!

**శ్రీరామచంద్రమూర్తి :** ఓ హనుమా! **"నేనే నీవు"** అయిన నేను (లేక) **'నీవే నేనైన నేను'** అయినట్టి **రామపరబ్రహ్మము** ఎట్టి మహత్ లక్షణ సమన్వితమో అది భాషకు అందనిది. అయినా, కొన్ని విశేషాలు ఇప్పుడు ఉదహరిస్తాను.

**అశబ్దమ్** → అట్టి సర్వాత్మకమగు రామబ్రహ్మమును ఒక 'శబ్దము' చెప్పి వివరించలేము. వాక్ నివర్తంతే! వాక్కుకు అందనిది!

**అస్పర్శన్** → అది స్పర్శకు విషయము కాదు. తాకుటచే అనుభవమయ్యేది కాదు.

**అరూపమ్** → సర్వ నామ–రూపములు అద్దానివే అయి ఉండగా, అది ఏ రూపమని అనాలి? అన్ని రూపములు అద్దానివే! కనుక అరూపము. రూపరహితము.

**అవ్యయమ్** → పదార్థములు – కాలకల్పనల వలె అది వ్యయము అయ్యేది కాదు.

**అరసమ్** → రుచికి విషయము గాని కాదు.

**నిత్య సుగంధవత్ చ** → సుగంధము ఎప్పటికప్పుడు ఖర్చు అవుతుంది. కాని అది నిత్యసుగంధ స్వరూపము.

**అనామగోత్రమ్** → సర్వము అద్దాని సంప్రదర్శనమే అయి ఉండగా.. అది 'ఈ నామము–ఆ గోత్రము' అని ఎట్లా అంటాము?

**మమరూపమ్ ఈదృశమ్** → అది ప్రతి ఒక్కరి స్వస్వరూపమే! అది 'మమస్వరూపము'గా ప్రదర్శనమగుచున్నట్లుగా ఆరాధించు. "నా సహజ స్వరూపము అదియే! అద్దానికి వేరుగా కనిపించేదంతా సందర్భమాత్రము, అజ్ఞాన కల్పితము!"... అని మననము చేయుము.

**నిత్యమ్** → అది ఎల్లప్పుడు అంతటా వేంచేసియే ఉన్నట్టిది. నిత్యమైనది. ఎల్లప్పుడు ఉండేది!

**పవనాత్మజ త్వమ్** → ఓ పవనాత్మజా! నీవుగా ఉన్నది అదియే! నీవు అదియే!

**దృశిస్వరూపము** → కనబడుచున్నదంతా అదియే! రామబ్రహ్మమే! నేనే! ఈ దృశ్యమంతా తన స్వరూపంగా కలిగి ఉన్నట్టిది!

**గగనోపమమ్** → ఆకాశము వలె అనంతము, నిర్విషయము, నిరామయము కూడా!

**పరమ్** → స్వప్నము తనదై ఉన్నవాడు స్వప్నములోని స్వప్నద్రష్టకు–స్వప్నదృశ్యమునకు వేరై ఉన్నతీరుగా, సర్వమునకు పరమై ఉన్నది.

**సకృత్ విభాతమ్ తత్** → ఈ సర్వముగా ప్రకాశింపజేయుచున్నట్టిది. ఈ జగత్తు అను వెలుతురు ఆ రామబ్రహ్మముదే!

**అజమ్** → జన్మరహితమైనది. పుట్టుక – ప్రారంభము లేనట్టిది.

**ఏకమ్** → సర్వదా ఏకమేగాని అహమ్–త్వమ్– సః.. ఇత్యాది అనేకముగా ఏ మాత్రము అగుచుండనట్టిది.

**అలేపకము** → ఓ పవనాత్మజా! నీవు ఎల్లప్పుడూ ఉపాసించవలసినది అట్టి ఆ నా రూపమేనయ్యా! మనోబుద్ధి – చిత్తములుగా ఉన్నది నేనే! అహంకారము మొ॥ వాటి చేత ఏ మాత్రము లేపనము చేయబడి యుండదు. మేఘములు అనంతాకాశమును కప్పి ఉంచలేవుకదా!

**సర్వగతమ్** → స్వప్నము తనదైనవాడు స్వప్నమంతా - అంతటా - అన్నిటా నిండి ఉంటాడు కదా! ఒక కథారచయిత యొక్క రచనా విభవము **కథలోని అన్ని పాత్రలు-కథా సంఘటనలు**గా ఉంటుంది కదా! అట్లాగే, పరమాత్మ సర్వగతుడు

**అద్వయమ్ యత్** → ఈ విధంగా ఎద్దానికైతే ద్వితీయమనునదే లేదో.... అట్టిది - రామ పరబ్రహ్మతత్త్వమ్!

**తదేవచాఽహమ్** → అదియే నేను! పరబ్రహ్మమే నాసహజ - నిత్య స్వరూపము!

**సకలమ్** → ఉన్నదంతా అదియే! అంతా అదే! ఈ కనబడేదంతా నేనే! (నిష్కలమ్ → ఏదీగా అవనిదీ అదే!)

**విముక్తమ్** → అంతా అయి, అన్నిటి నుండి వేరై ఉన్నవాడను. సర్వదా విముక్తుడను! సర్వభూతములు (జీవులు) నేనై, సర్వసాక్షిగా సర్వదా అతీతమై - వేరై ఉన్నవాడను. ఆత్మ నిత్యముక్తము.

**ఓం** → వేదములు 'ఓం' అను సంజ్ఞచే చెప్పబడుచున్నట్టి వాడను!

**దృశిస్తు శుద్ధోఽహమ్** → దృశ్యముకంటే పరమ పవిత్రమగు దృక్ స్వరూపుడను!

**అవిక్రియాత్మన్** → నాటకదీపము వలె నిష్క్రియుడను! కేవల సాక్షిని!

**నమేఽస్తి కించిత్ విషయ స్వభావతః** → విషయములుగాని, విషయ సంబంధమైన స్వభావముగాని కించిత్‌కూడా నాకు లేవు! సూర్య తేజస్సు (వెలుగు)లో కనిపించే వస్తు ఆకారములతో వెలుగుకేమి సంబంధము? వెలుగు వస్తువుల వలన బంధము పొందదు కదా!

**పురస్థిరశ్చ ఊర్ధ్వమ్ అధశ్చ సర్వతః** → జాగ్రత్-స్వప్న-సుషుప్తులలో పైన-క్రింద అంతటా సర్వత్రా వ్యాపించినదై ఉన్నవాడను.

**సుసంపూర్ణ భూమాఽహమ్** → పూర్ణ భౌమానంద స్వరూపుడను!

ఈ విధముగా నన్ను భావన చేయి. (లేక) నీలోని నన్ను (రామపరబ్రహ్మమును) భావన చేయి. నీవుగా నన్ను ఎరుగుము!

**అజో అమరశ్చ తదా అజరో** → కాలసంబంధమైన జన్మ-జరా-మరణములచే స్పృశించబడనివాడను.

**అమృతః** → అమృతస్వరూపుడను ! కాలః కాలుడను!

**స్వయం ప్రభః** → నాకు నేనే ప్రభవించువాడను. నా ప్రభవమునకు మరొకటేదీ కారణమై లేదు!

**న కారణ-కార్య** → నాకు కార్య-కారణములు లేవు. అట్టి సర్వకల్పనలకు ఆవల సర్వదా ప్రకాశించు కేవలుడను!

**అతీత్య నిర్మలః** → సర్వమునకు అతీతమైనట్టి నిర్మల స్వరూపుడను

సదేవ **తృప్తోఽహమ్** → సత్‌స్వరూపముచే నిత్య తృప్తుడనై ఉన్నవాడను - **అని నన్ను భావించు.**

ఈ విధముగా ఆత్మారామతత్త్వమును ఎరుగుచూ ఈ జీవుడు జీవన్ముక్తుడు కాగలడు.

ఆ తరువాత, భౌతిక దేహమును కాలగతికి చెందినదిగా సమర్పించుచూ క్రమముగా **'విదేహముక్తుడు'** అగుచున్నాడు.

**వీచికలు లేనట్టి వాయువువలె కేవలీ స్వరూపుడై, బ్రహ్మాండములను ధరించినవాడై, సర్వదృశ్య రహితుడై చెన్నొందుచున్నాడు!**

⌘

ఈ చెప్పుకున్న విశేషములు వేదములచే ఋక్కుల రూపమున చెప్పబడుచూనే ఉన్నాయి. శ్రీరామబ్రహ్మతత్త్వమును ఎరిగిన బుద్ధిమంతుడు, ఆకాశములో సూర్యునివలె సదా సర్వత్రా విష్ణు పరమపదమును దర్శించుచున్నాడు. స్వస్వరూప పరబ్రహ్మతత్త్వమును ఎరిగి, ఉపాధి వినిర్ముక్తుడై ఆత్మతత్త్వమునందు నిత్య జాగ్రత్‌ను అనుభూతము చేసుకొన్నవాడగుచున్నాడు.

సర్వత్రా సమస్వరూపమైయున్న విష్ణుపదమును పొంది శ్రీరామానంద సాగరము నందు ఆత్మానంద తరంగ స్వరూపుడై బ్రహ్మానందము నందు ఓలలాడుచున్నాడు.

⌘

ఆత్మత్వమే పరమ సత్యము. తదితరమైనదంతా కల్పితము. రామచంద్ర ప్రబోధమును శ్రద్ధగా విని, రామభక్త హనుమంతుడు రామానంద సాగరస్వరూపుడై వెలుగొందసాగారు!

**ఇతి ముక్తి కోపనిషత్**

***ఓం శాంతిః శాంతిః శాంతిః***

శుక్ల యజుర్వేదాంతర్గత


⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 15 సౌబాల బీజ బ్రహ్మోపనిషత్

## (లేక) సుబాలోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

### శ్లోక తాత్పర్య పుష్పమ్



శ్లో॥ బీజ అజ్ఞాన మహామోహా అపహ్నవాత్ యత్ విశిష్యతే,
నిర్బీజం త్రైపదం తత్త్వం 'తదస్మి' ఇతి విచింతయే ॥

'బీజ-అజ్ఞానము' అనే మహామోహము తొలుగగా, అప్పటికీ శేషించు **"నిర్బీజ-త్రైపదస్థానమే"** నేను అని చింతన చేయాలి.

**ప్రథమ ఖండః** — **1వ ఖండము**

**1.** **తదాహుః కిం తదాసీత్?**
<u>**తస్మై సహోవాచ :**</u>
**న సత్। న అసత్। న సదసత్। ఇతి।**
**తస్మాత్ తమః సంజాయతే।**
**తమసో → 'భూతాదిః'।**
**భూతాదే → 'ఆకాశమ్'।**
**ఆకాశాత్ → వాయుః।**
**వాయోః → 'అగ్నిః'।**
**అగ్నేః → 'ఆపః'।**
**అద్భ్యః → 'పృథివీ।**
**తత్ 'అణ్డం' సమభవత్।**
**తత్ సంవత్సర మాత్రం**
**ఉషిత్వా, ద్విధా కరోత్, అధస్తాత్॥**

**శిష్యుడగు రైక్యుడు:** (సర్వము మొట్టమొదట అఖండ బ్రహ్మమే అయి ఉండగా) అప్పుడిక ఏమి జరిగినది? (ఏమి జరుగుటచే ఈ కనబడేదంతా.. ఏర్పడినదైనది?)
**ఘోరాంగీరస సద్గురువు :** మొట్టమొదట ఆత్మ మాత్రమే ఉన్నది. అది సత్తు కాదు! అసత్తు కాదు! సదసత్తు కూడా కాదు.
- అట్టి పరమాత్మ నుండి మొదటగా **తమస్సు** జనించింది.
- తమస్సు నుండి భూతాది (సూక్ష్మ-పంచభూతా- [ప్రారంభ] తత్త్వము) బయల్వెడలింది. **భూతాది** నుండి - ఆకాశము ప్రదర్శితమైనది. ఆకాశము నుండి సంచలన రూపమగు వాయువు,
వాయువు నుండి - తేజోరూపమగు 'అగ్ని',
అగ్ని నుండి - ద్రవ-జలన రూపమగు 'జలము'. జలము (ద్రవము) నుండి-పృథివి
అవన్నీ ఒక గ్రుడ్డు - అండము (ఎగ్) రూపముగా అయినాయి.
అది సంవత్సరము మాత్రముచే (కాలముచే) రెండుగా అయినది. అట్టి సంవత్సరము నుండి 'భూమి'. ప్రదర్శనమగుచున్నది. (సంవత్=సత్తునుండి వరము = ప్రదర్శితము)

---

**2.** **(తత్ అధస్తాత్).. భూమిః। ఉపరిష్టాత్.. ఆకాశమ్।**
**మధ్యే.. పురుషో దివ్యః। సహస్ర శీర్షా పురుషః,**
**సహస్రాక్షః సహస్ర పాద్। సహస్ర బాహుః ఇతి।**
**సో అగ్రే భూతానామ్ 'మృత్యుః అసృజత్।**
**త్ర్యక్షరమ్। త్రి శిరస్కం! త్రి పాదం! ఖండపరశుం!**
**తస్య 'బ్రహ్మ' అభిధేతి। సో బ్రాహ్మణమేవ వివేశ।**
**సమాన సాన్ 'సప్తపుత్రాన్' అసృజత్।**
**తేహ విరాజః సప్త మానసాన్ అసృజన్।**

భూమికి పైన ఆకాశము!
అట్టి 'ఆకాశము-భూమి' మధ్యగా - దివ్య పురుషుడు.
ఆ పురుషుడు వేలాది శిరస్సులు, వేలాది కళ్ళు, (ధ్యాసలు), వేలాది పాదములు (నడకలు), వేలాది బాహువులు (క్రియావ్యవహారములు) - కలవాడు. ఆతడు భూతసృష్టికి ముందు మృత్యువును (మార్పు - change factor) సృష్టించారు. ఆమృత్యువుకు '3' అక్షరములు, 2 శిరస్సులు, మూడు పాదములు, ఖండ పరశువు (గండ్రగొడ్డలి) కలిగి ఉన్నది. 'బ్రహ్మ' అను పేరు గల ఆయన బ్రాహ్మణములయందు ప్రవేశించారు. (కర్తృత్వ రూపముగా బ్రాహ్మణ నామధేయుడైనారు). ఆ బ్రహ్మదేవుడు సృష్టి కొరకై '7'గురు మానస పుత్రులను సృష్టించారు. వారే సప్తమానస పుత్రులు.

తేహ ప్రజాపతయో।
బ్రాహ్మణో అస్య ముఖమ్ ఆసీత్।
బాహూ రాజన్యః కృతః। ఊరూ తదస్య యత్ వైశ్యః।
పద్భ్యాగ్ం శూద్రో అజాయత।
చంద్రమా మనసో జాతః। చక్షోః సూర్యో అజాయత।
శ్రోత్రాత్ వాయుశ్చ, ప్రాణశ్చ।
హృదయాత్ సర్వమిదం జాయతే।

ఆ '7'గురు ప్రజాపతులు, విరాట్టులు.
ఆ బ్రహ్మ (సృష్టికర్త) ముఖము నుండి (బ్రహ్మము గురించిన భావనలతోకూడి) బ్రాహ్మణులు పుట్టారు.
బాహువుల నుండి క్షత్రియులు (క్రియా సామర్థ్యము)
ఊరువుల (తొడల నుండి) వైశ్యులు (పరిపోషకులు). పాదముల నుండి.. శూద్రుడు (సేవాభావులు). (బ్రాహ్మణము (ఉపాసన), క్రియాసామర్థ్యము, పరిపోషణ, సేవాభావము)
మనస్సు నుండి.. చంద్రుడు! కనుల నుండి.. సూర్యుడు! చెవుల నుండి వాయువు, ప్రాణము జనించాయి.
ఆయన హృదయము నుండి **సర్వజగత్తు** జనించింది.

---

<u>ద్వితీయః ఖండః</u>

**ద్వితీయ ఖండము**

1 అపానాత్ నిషాదా,
యక్ష-రాక్షస-గంధర్వాశ్చ అస్థిభ్యః। పర్వతా లోమభ్య।
ఓషధి వనస్పతయో లలాటాత్। క్రోధజో రుద్రో జాయతే।
తస్య ఏతస్య మహతో భూతస్య నిశ్వసితమ్ ఏవా ఏతత్..
ఋగ్వేదో; యజుర్వేదః; సామవేదో, అథర్వవేదః శిక్షా; కల్పో;
వ్యాకరణమ్; నిరుక్తమ్; ఛందో;జ్యోతిషామ్ అయనం; న్యాయో;
మీమాంసా, ధర్మశాస్త్రాణి, వ్యాఖ్యానాని
ఉప వ్యాఖ్యానాని చ సర్వాని చ భూతాని।

ఆయన యొక్క అపాన వాయువు నుండి - నిషాదులు, ఎముకల నుండి - యక్ష-రాక్షస- గంధర్వులు, రోమముల నుండి - పర్వతములు, లలాటము (ముఖము నుదురు) ప్రదేశము నుండి ఓషధులు, వనస్పతులు, ఆయన క్రోధము నుండి రుద్రుడు జనించారు.

ఆ మహాభూతము యొక్క (మహతో భూతస్య) నిట్టూర్పు (నిశ్వాసము) నుండి ఋక్- యజుర్-సామ-అధర్వణ వేదములు, వేదాంగములు, శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము - న్యాయము, మీమాంస, ధర్మశాస్త్రము, వ్యాఖ్యానములు, ఈ సర్వ జీవరాశులు జనించాయి.

---

2 హిరణ్యజ్యోతిః అస్మిన్ అయమ్
ఆత్మా అధిక్షియన్తి భువనాని
విశ్వా, ఆత్మానం ద్వివిధా కరోత।
అర్ధేన 'స్త్రీ' అర్ధేన 'పురుషో'।
దేవోభూత్వా దేవాన్ అసృజత్।
ఋషిః భూత్వా ఋషీన్,
యక్ష రాక్షస గన్ధర్వాన్ గ్రామ్యాన్
ఆరణ్యాంశ్చ పశూన్ అసృజత్।
ఇతరా గౌః, ఇతరో అనడ్వాన్।
ఇతరా బడబేతరో అశ్వః।
ఇతరా గర్ధభి-ఇతరో గర్ధభః।
ఇతరా విశ్వంభరా ఇతరా విశ్వంభరః
సో అన్తే వైశ్వానరో భూత్వా
సందగ్ధ్వా సర్వాణి భూతాని।
పృధివీ అప్సు ప్రలీయత। ఆపః తేజసి ప్రలీయంతే।
తేజో వాయౌ విలీయతే। వాయుః ఆకాశే విలీయత।
ఆకాశమ్.. ఇంద్రియేషు। ఇంద్రియాణి.. తన్మాత్రేషు।
తన్మాత్రాణి.. భూతాదౌ విలీయన్తే।
భూతాదిః.. మహతీ విలీయతే।

ఎవనిలో ఈ విశ్వము ఇందులోని త్రిభువనములు కల్పితమై కనిపిస్తున్నాయో, ఆతడే **హిరణ్య జ్యోతి** స్వరూపుడగు **ఆత్మ**. ఆతడు తనను తాను రెండుగా, చేసుకొన్నారు. సగము 'స్త్రీ'. సగము పురుషుడు. (ప్రకృతి - పురుషుడు, స్వభాము-స్వభావి). (స్త్రీ = స + ర + త = సత్వ రజో తమోగుణ ప్రకృతి)
దేవదేవుడై దేవతలను సృజించారు. ఋషీశ్వరుడై ఋషులను యక్షులను, రాక్షసులను, గంధర్వులను, జన నివాసయోగ్యమగు గ్రామ్యములను, అరణ్యములను, పశువులను కూడా సృష్టించారు. (తేజస్సుచే ప్రకాశింపజేయ సాగారు).
ఆవు-ఎద్దు, ఆడ-మగ గుర్రములు, ఆడ-మగ గాడిదలు, విశ్వంభరుడు - విశ్వంభరి.. (భరించువాడు - భరించబడునది). మొదలైనవన్నీ సృష్టించారు. చివరకు తానే వైశ్వనరాగ్ని అయి, అన్ని భూతములను దహించి సాగారు.
పృధ్వి- **జలమునందు** విలీనమయి,
జలము - **తేజస్సు** నందు లీనమయి,
తేజస్సు - **వాయువు** నందు లీనమై....,
వాయువు **ఆకాశము** నందు లీనమయి ఉండసాగాయి.
ఆకాశము- ఇంద్రియములందు,
ఇంద్రియములు - శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ **తన్మాత్రలయందు**, తన్మాత్రలు **భూతాది** యందు విలీనమై కనబడసాగాయి.
భూతాది కాస్తా.. **మహతి** యందు (మహత్తు నందు),
మహత్తు - **అవ్యక్తము** నందు,
అవ్యక్తము.. **అక్షరము** నందు,
అక్షరము.. **తపస్సు** నందు,

| | |
|---|---|
| **మహాన్.. అవ్యక్తే విలీయతే।**<br>**అవ్యక్తమ్.. అక్షరే విలీయతే।**<br>**అక్షరమ్.. తమసి విలీయతే।**<br>**తమః.. పరే దేవ ఏకీభవతి।**<br>**పరస్తాత్ న సత్! న అసత్! న సదసత్।**<br>**ఇతి ఏతత్ నిర్వాణానుశానమ్।**<br>**ఇతి వేదానుశాసనమ్। ఇతి వేదానుశాసనమ్।** | విలీనమయి ఉండసాగాయి.<br>తమస్సేమో.. పరము నందు<br>ఏకత్వము పొంది ఉండ సాగింది.<br>అట్టి పరము యొక్క స్వరూపము సత్తు (ఉన్నది) కాదు. అసత్తు (లేనిది) కాదు. సదసత్ (ఉండీలేనిది) కాదు. ఇట్లు వేదముల యందు నిర్ణయించి వర్ణించబడింది. **అనుశాసనము** అయి ఉన్నది. |

<u>తృతీయః ఖండః</u>

**3వ ఖండము**

**1. అసత్‌వా ఇదమ్ అగ్ర ఆసీత్।**
**అజాతమ్, అభూతమ్; అప్రతిష్ఠమ్;**
**అశబ్దమ్; అస్పర్శమ్; అరూపమ్;**
**అరసమ్; అగన్ధమ్; అవ్యయయ్; మహాన్తమ్;**
**బృహన్తమ్, అజమ్..**
**ఆత్మానమ్ మత్వా ధీరో న శోచతి।**
**అప్రాణమ్; అముఖమ్; అశ్రోత్రమ్;**
**అవాక్; అగమనో; అతేజనమ్;**
**అచక్షుష్కమ్; అనామ-గోత్రమ్;**
**అశిరస్కమ్; అపాణి-పాదమ్;**
**అస్నిగ్ధమ్; అలోహితమ్; అప్రమేయమ్;**
**అహ్రస్వమ్; అదీర్ఘమ్; అస్థూలమ్, అనణ్వన్;**
**అనల్పమ్; అపారమ్; అనిర్దేశ్యమ్;**
**అనపావృత్తమ్; అప్రకాశ్యమ్; అసంవృతమ్;**
**అనన్తరమ్, అబాహ్యమ్।**

ఈ జగత్తు మొట్ట-మొదట అసత్తు (వాస్తవానికి లేనిది)యే అయి ఉన్నది. ఆత్మ మాత్రమే మొట్టమొదట ఉండి ఉన్నది. అట్టి ఆత్మ.. పుట్టుకలేనిది, పాంచభౌతిక రూపరహితము, ప్రతిష్ఠ లేనిది. (అది ఎందులోనూ లేదు. అద్దానిలో ఏదీ లేదు), శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ రహితము, మార్పు-చేర్పులు లేని అవ్యయము, మహన్తమైనది (అనన్తమ్). బృహన్తము (Greatest). జన్మరహితము. 'నా ఆత్మ ఇట్టిది' అని తెలుసుకొనినప్పుడు ఇక ఈ జీవుడు ఏ మాత్రమూ దేనికో దుఃఖించదు.

అట్టి ఆత్మ ప్రాణ స్వరూపము కాదు. 'ముఖము' (Face) కాదు. వినికిడి (శ్రోత్రము) కాదు. వాక్కు-మనస్సు-కాదు. తేజస్సు కాదు. చూపు-కనబడునది కాదు. నామగోత్రములు లేవు. శిరస్సు కాళ్లు-చేతులు లేవు. స్నిగ్ధము (నునుపైనది) అను లక్షణము లేదు. లోహధర్మము లేదు. దేనికీ సంబంధించనిది కాబట్టి అప్రమేయము. పొట్టి-పొడుగులు లేనిది. స్థూలము కాదు. సూక్ష్మము (అణువు వంటిది) కాదు. అల్పము కాదు. అధికము కూడా కాదు. దేనికో చుట్టుకొని లేదు. అది దేనిచేత ప్రకాశించబడుట లేదు. సంవృతము (కప్పబడినది) కాదు. అంతరమునగాని, బాహ్యమున గాని ఉన్నది కాదు. 'ఇది' అని ఆత్మ గురించి చెప్పలేము.

**2. న తత్ అశ్నాతి కించన।**
**న తత్ అశ్నాతి కశ్చన। ఏతద్వై సత్యేన, దానేన;**
**తపసా, అనాశకేన బ్రహ్మచర్యేణ,**
**-నిర్వేదనేన, అనాశకేన షట్ అఙ్గేనైవ సాధయేత్।**
**ఏతత్రయం వీక్షేత**
**1) దమం 2) దానం 3) దయామ్ ఇతి।**
**న తస్య ప్రాణా ఉత్క్రామన్తి। అత్రైవ సమవలీయన్తే,**
**బ్రహ్మైవసన్, బ్రహ్మాప్యేతి, య ఏవం వేద।**

అది దేనిచేతా తినబడదు. అది దేనినీ తినటము లేదు. అద్దాని అనుభవమును **సత్యము, త్యాగము, తపస్సు, ఏకాగ్ర బ్రహ్మచర్యము, జగత్ సంబంధమైన-పూర్తి నిశ్చింత, అనాశకమైన షడంగము** (ఆరవ అంగమైన మనస్సు)ల చేత ఈ జీవుడు సిద్ధించుకోవాలి. ప్రయత్నశీలుడు కాని వానికి అట్టి 'ఆత్మ' యొక్క 'భావన' సిద్ధించటం లేదు.

అట్టి ఆత్మ భావనకు గాను **ఇంద్రియ నిగ్రహము (దమము), దానము; దయలను గుణములుగా** వృద్ధి చేసుకోవాలి. ఈ మూడు పెంపొందించుకోవాలి.

అట్టి ఆత్మను అనుభవముగా సిద్ధించుకొనిన జీవుడు జీవించునప్పుడు మరణించునప్పుడు కూడా బ్రహ్మమును ఎరిగి ఉండుటచే - ఇక ఆతని ప్రాణములు బయటకు పోవు. పైకి పోవు. మరి? ఆత్మయందే లీనమై ఆత్మత్వమునే పొందుచున్నాయి. ఆత్మయే అయి ఉంటున్నాయి.

<u>చతుర్థః ఖండః</u>

**4వ ఖండము**

**1. హృదయస్య మధ్యే లోహితం**
**మాంసపిణ్డమ్, యస్మిన్..,**
**తత్ దహరం 'పుణ్డరీకం',**
**'కుముదమ్' ఇవ అనేకధా వికసితం।**
**హృదయస్య దశ ఛిద్రాని భవన్తి।**
**యేషు ప్రాణాః ప్రతిష్ఠితాః సయదా ప్రాణేన**

ఈ హృదయము యొక్క మధ్య భాగములో ఎర్రటి మాంస పిండము ఉన్నది. హృదయము యొక్క దహరాకాశము నుండి భావములు - జగత్తులు బయల్వెడలుచున్నాయి. అద్దాని యందు తామర మొగ్గ వలె, కలువ ఆకారము వలె అనేక విధములుగా వికసించి యున్న హృదయ పద్మము నందు దశ (10) ఛిద్రములు (Holes) ఉన్నాయి.

ఆ (10) ఛిద్రములందు గల ప్రాణ శక్తి - దేహములో సంచరించే ప్రాణములతో

సహ సంయుజ్యతే, తదా పశ్యతి
నద్యో, నగరాని బహూని వివిధాని చ।
యదా వ్యానేన సహ సంయుజ్యతే
తదా పశ్యతి దేవాంశ్చ, ఋషీంశ్చ।
యదా అపానేన సహ సంయుజ్యతే
తదా పశ్యతి యక్ష-రాక్షస- గంధర్వాన్।
యదా ఉదానేన సహ సంయుజ్యతే,
తదా పశ్యతి దేవలోకాన్,
దేవాన్, స్కన్దం, జయన్తం చ ఇతి।
యదా సమానేన సహ సంయుజ్యతే,
తదా పశ్యతి దేవలోకాన్, ధనాని చ।
యదా వైరంభేణ సహ సంయుజ్యతే,
తదా పశ్యతి దృష్టం చ- అదృష్టం చ, శ్రుతం చ-అశ్రుతం చ;
భుక్తం చ-అభుక్తం చ; సత్ చ-అసత్ చ.. సర్వం పశ్యతి।
యథా ఇమే ఆదశనాడ్యో భవన్తి, తాసామ్ ఏకైకస్యాం
ద్వా-సప్తతిః, ద్వాసప్తతిః శాఖానాడీ సహస్రాణి (72000) భవన్తి।

సంయోగము పొందుచున్నప్పుడు ఈ జీవుడు అనేక నదీ ప్రవాహములను, వివిధమైన నగరములను చూస్తూ ఉంటాడు.

ఎప్పుడు ఈ జీవుడు తన వ్యాన వాయు చలనములతో ఆ ఛిద్రములలో నిక్షిప్తమై యున్న ప్రాణశక్తి స్థానములను కలుస్తాడో అప్పుడు ఈ జీవుడు దేవతలను, ఋషులను చూస్తాడు.

అపానముతో కూడి సంయుజ్యము పొందునో (కలియునో), అప్పుడు ఆ యోగికి యక్ష-రాక్షస-గంధర్వులు కనిపిస్తారు.

ఉదాన ప్రాణముతో కలిసినప్పుడు - దేవలోకములను, దేవతలను, స్కందుని, జయంతుని దర్శనము అగుచున్నది.

సమానప్రాణముతో కలియటం జరిగినప్పుడు దేవలోకమును, దేవతా సంపదలను (ధనమును) చూడటం జరుగుతోంది.

వైరంభనితో (ఉప ప్రాణముతో) సంయుజ్యత (అసోసియేషన్) పొందినప్పుడు
-దృష్ట-అదృష్టములు (చూచినవి, చూడనివి)
- విన్నవి - విననివి,
- తిన్నవి - తిననివి
-సత్య- అసత్యములు
**- సర్వము దర్శించగలడు.**

హృదయ మాంస పిండము నుండి '10' నాడులు బయల్వెడుచున్నాయి. ఆ ఒక్కొక్కనాడి నుండి '72000' చొప్పున ఉపనాడులు విస్తరించి ఉంటున్నాయి.

---

2. యస్మిన్ అయమ్ ఆత్మా స్వపితి
శబ్దానాం చ కరోతి।
అథ ద్వితీయే సంకోశే స్వపితి, తత్ ఇమం చ-లోకం,
పరంచ-లోకం పశ్యతి। సర్వాన్ శబ్దాన్ విజానాతి।
స 'సంప్రసాద' ఇతి ఆచక్షతే।
ప్రాణః శరీరమ్ పరిరక్షతి।
హరితస్య, నీలస్య, పీతస్య, లోహితస్య
శ్వేతస్య నాడ్యో, రుధిరస్య పూర్ణాః।
ధాత్ర ఏతత్ దహరం పుణ్డరీకం।
కుముదమ్ ఇవా అనేకధా వికసితం।
యథా కేశః సహస్రధా భిన్నః
తథా 'హితా' నామ నాడ్యో భవన్తి।

ఆ హృదయ మాంసము నందు ఆత్మ తన స్వరూప-స్వభావములను ఏమరచి నిదురించినప్పుడు శబ్దము చేయును.

రెండవ సం-కోశము (విభాగము) నందు నిదురించుచున్నప్పుడు ఇహలోకమును, పరలోకమును దర్శించుచున్నాడు.

ఆ ఆత్మ పురుషుడు సర్వశబ్దములను తెలుసుకొనుచున్నాడు.

అద్దానిని 'సంప్రసాదము' అని పిలుస్తారు. (ఆత్మ తనను తాను ప్రక్కగా పెట్టుకొని ద్వితీయమును కల్పించుకొని దర్శించుటయే "సంప్రసాదము").

ఆత్మయొక్క శక్తి రూపమగు ప్రాణము శరీమును రక్షించుచున్నది.

హృదయకోశము - హరితము (పచ్చని) నీలము, నల్లని, పసుపు పచ్చని, ఎర్రని, తెల్లని, నాడులు కలిగి ఉండి, వాటిలో రక్తము నిండియున్నది.

ఈ హృదయ మాంస పిండము గల దహరము (భావనాజనన స్థానమగు దహరాకాశము) తామర మొగ్గవలె, కలువ పువ్వు వలె అనేక విధములుగా వికశించి ఉన్నది. ఒక తల వెంట్రుక 'వెయ్యి'గా చీలిస్తే ఎట్లా ఉంటుందో, హృదయ కోశము నుండి బయల్వెడలు 10 నాడులయొక్క '72000' ఉపనాడులు అట్టి పరిమాణములో ఉంటున్నాయి.

---

3. హృత్-ఆకాశే పరే కోశే దివో
అయమ్ ఆత్మా స్వపితి యత్ర సుప్తో..,
-న కంచన కామం కామయతే।
-న కంచన స్వప్నం పశ్యతి।
- న తత్ర దేవా, న దేవలోకా, - న యజ్ఞా వా,

అట్టి హృదయాకాశము నందు - సర్వకోశములకు, దివ్యలోకములకు **వేరైన కోశము** నందు ఆత్మ సుషుప్తిని పొందుచున్నది. అట్టి సుప్తస్థితిలో..
-ఏ కోరికలు కోరుకోడు. (జాగ్రత్త ఉండదు)
- ఏ స్వప్నానుభవ దృశ్యము ఉండదు.
- అక్కడ దేవతలు - దేవలోకములు కూడా లేవు.
- యజ్ఞము ఇత్యాది క్రియ-కార్యక్రమాలు ఉండవు.

| | |
|---|---|
| **-న మాతా, న పితా, న బంధుః,** | - తల్లి - తండ్రి - బంధువుల - బాంధవ్యములు కూడా ఉండవు. |
| **-న బాంధవో, - న స్తేనో,** | - అక్కడ దొంగ (మనో భావకుడు) లేడు. బ్రహ్మలేరు. సృష్టి లేదు. తేజోదేహము లేదు. |
| **- న బ్రహ్మహా తేజస్కాయమ్ అమృతం సలిల ఏవ,** | - అది అమృతమయము. (మార్పుకు సంబంధించనిది) |
| **ఇదం సలిలం వనం భూయః** | - అమృతమే జలము. జలమే (సలిలమే) అమృతము. |
| **తేనైవ మార్గేణ అజాగ్రాయ** <br> **ధావతి 'సామ్రాట్' ఇతి। హో వాచ।** | - ఆ అమృతమే జలము, వనము కూడా! ఆ మార్గమున 'అజాగ్రము' (జన్మ రాహిత్య స్థానము) నకు వెళ్లువాడు 'సామ్రాట్' అని చెప్పబడుచున్నాడు. |

| <u>పంచమః ఖండః</u> | **5వ ఖండము** |
|---|---|
| 1 **స్థానాని స్థానిభ్యో యచ్ఛతి।** | సర్వత్రా స్థానము గలవానికి (దేహమున) స్థానము ఇవ్వబడుచున్నది. |
| **- నాడీ తేషాం నిబన్ధనమ్** | వాటికి నిబంధనము (కట్టబడిన త్రాళ్లు) - **నాడులు** |
| **<u>చక్షుః అధ్యాత్మం</u>** | చక్షురింద్రియము (చూపు) **అధ్యాత్మము!** |
| **-ద్రష్టవ్యమ్ అధిభూతమ్।** | చూడబడునది - **అధిభూతము!** |
| **ఆదిత్యః తత్రా అధిదైవతమ్।** | ఆదిత్యుడు (ఆది-తు-యః-మొట్టమొదటే ఉన్నవాడు) - **అధిదైవతము!** |
| నాడీ తేషాం నిబన్ధనమ్। | వాటికి నాడులు నిబంధనము. |
| **యః చక్షుసి, యో ద్రష్టవ్యే,** <br> **య ఆదిత్యే, యో నాడ్యాం,** <br> **యః ప్రాణే, యో విజ్ఞానే,** <br> **య ఆనన్దే యో హృద్యాకాశే,** <br> **య ఏతస్మిన్ సర్వస్మిన్** <br> **అన్తరే సంచరతి, సోఽయమ్ ఆత్మా।** <br> **తమ్ ఆత్మానమ్ ఉపాసీతా..,** <br> **అజరమ్, అమృతమ్, అభయమ్,** <br> **అశోకమ్, అనన్తమ్॥** | ఏదైతే **చక్షువులయందును**, (ఇంద్రియము లందు), **చూడబడుచున్న** దానియందును, ఆధిదైవతమగు ఆదిత్యునియందును, నాడియందును, ప్రాణము (శక్తి) యందును, విజ్ఞానము (ఎరుక) యందును, ఆనందము (ఎక్స్‌పీరియన్సింగ్) యందును, హృదయాకాశమునందును - ఈ సర్వము నందును, దీని అంతరమునందును సంచరించుచున్నదో.. (లేక ఏ తత్త్వముయొక్క పురుషకారము ఆక్రమించుకొనినదై ఉన్నదో) - అదియే **'ఆత్మ'!** <br> అట్టి ఆత్మ **జన్మరహితము** కాబట్టి **అజరము** (కదలికలు లేనిది కూడా). మరణ రహితము కాబట్టి <br> **అమృతము** : సర్వరక్షకము కాబట్టి **అభయము.** <br> దుఃఖములన్నీ అద్దాని ఎరుకచే తొలగుతాయి కాబట్టి అశోకము. అద్దానికి ఆది-అంతములు లేవు, కనుక **'అనన్తమ్'. అదియే ఉపాస్యము.** |

| | |
|---|---|
| **<u>శ్రోత్రమ్ అధ్యాత్మమ్</u>** | వినబడటము ⟶ అధ్యాత్మము |
| **-శ్రోతవ్యమ్ అధిభూతమ్। - దిశః తత్ర అధిదైవతమ్।** | వినబడుచున్నదంతా ⟶ అధిభూతము! <br> పది దిక్కులు కూడా ⟶ అధిదైవతము! |
| **- నాడీ తేషాం నిబన్ధనమ్।** | వాటికి నాడులు ⟶ నిబంధనము! |
| **యః శ్రోత్రే, యః శ్రోతయితవ్యే,** <br> **యో దిక్షు, యో నాడ్యాం, యః ప్రాణే, యో విజ్ఞానే,** <br> **య ఆనన్దే, యో హృద్యాకాశే, య ఏతస్మిన్ సర్వస్మిన్** <br> **అన్తరే సంచరతి.. సోఽయమాత్మా।** <br> **తమ్ ఆత్మానమ్ ఉపాసీత** <br> **అజరమ్, అమృతమ్, అభయమ్ అశోకమ్, అనన్తమ్॥** | చెవులయందు, **వినబడుచున్న**దానియందు, దిక్కులయందు, నాడులయందు, ప్రాణము నందు, విజ్ఞానమునందు, ఆనందమునందు, హృదయాకాశము నందు.. వాటి యొక్క అన్నిటి అంతరమునందు **ఏది స్వయం ప్రభాభాసమై సంచరించు చున్నదో.. అదియే ఆత్మ! జరామరణ రహితము, అభయము, అశోకము, అనన్తము అగు అట్టి ఆత్మయే ఉపాసించవలసినట్టి వస్తువు. అన్యము కాదు.** |

| | |
|---|---|
| <u>నాసా అధ్యాత్మం।</u> | వాసన ధర్మము గల ముక్కు స్థానము - అధ్యాత్మము. |
| **ఘ్రాతవ్యమ్.. అధిభూతమ్।** | వాసనగా పొందబడుచున్నది - అది భూతము. |
| **పృథివీ తత్ర.. అధి దైవతమ్। నాడీ తేషాం.. నిబన్ధనం।** | పృథివి (వాసన స్థానము) - అధిదైవతము <br> నాడులు - అద్దాని నిబంధనము. |
| **యో నాసాయాం, యో ఘ్రాతవ్యే, యః పృథ్వివ్యాం యో నాడ్యాం,** <br> **యః ప్రాణే, యో విజ్ఞానే య ఆనన్దే.. యో హృద్యాకాశే..,** | ఈ ముక్కు నందు, వాసన చూడబడుచున్నదానియందు, పృథివియందు, నాడులయందు, ప్రాణశక్తియందు, తెలివి (విజ్ఞానము) నందు, ఆనన్దము నందు, |

| | |
|---|---|
| య ఏతస్మిన్ సర్వస్మిన్<br>అన్తరే సంచరతి, సో అయమాత్మా।<br>తమ్ ఆత్మానమ్ ఉపాసీతా, అజరమ్, అమృతమ్,<br>అభయమ్, అశోకమ్, అనన్తమ్॥ | హృదయాకాశము నందు ఏదైతే కేవల చిత్స్వరూపమై సంచరిస్తోందో.. అదియే 'ఆత్మ'. **ఇవన్నీ ఏర్పాటైన రూపమో... అదియే ఆత్మ!**<br>అజరము - అమృతము<br>అభయము - అశోకము<br>అనన్తము అగు ఆత్మవస్తువే ఉపాసించవలసినట్టిది. |
| **2. <u>జిహ్వా అధ్యాత్మమ్!</u>**<br>**రసయితవ్యమ్.. అధిభూతం।**<br>**వరుణః తత్ర.. అధిదైవతమ్। నాడీ తేషామ్.. నిబన్ధనమ్।**<br>**యో జిహ్వాయాం, యో రసయితవ్యే,**<br>**యో వరుణే, యోనాద్యాం, యః ప్రాణే, యో విజ్ఞానే,**<br>**య ఆనన్దే, యో హృద్యాకాశే య ఏతస్మిన్ సర్వస్మిన్**<br>**అన్తరే సఞ్చరతి, సో అయమ్ ఆత్మా।**<br>**తమ్ ఆత్మానమ్ ఉపాసీతా**<br>**-అజరమ్, అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్॥** | రుచి - నాలుక - అధ్యాత్మము.<br>-రుచి చూడబడటము రుచిచూడబడుచున్నవి - అధిభూతము.<br>- వరుణ భగవానుడు - అధి దైవతము.<br>- ఆ రెండు నిబంధించబడినది - నాడుల చేత,<br>రుచి చూస్తున్న ఈ నాలుకలో, రుచి చూడబడుచున్న వస్తువులో, రుచి ప్రదాతయగు వరుణదేవునిలో, ఆ రుచి చూచే క్రియకు కావలసిన శక్తియందు, అద్దాని ఎరుక యందు, రుచి యొక్క అనుభూతియందు, అవన్నీ ఏర్పడి ఉన్న హృదయాకాశము (దహరాకాశము) నందు.. **అంతరముగా ఏది స్వానందరూపంగా సంచరిస్తోందో.. అదియే 'ఆత్మ'!**<br>అది అజరము, అమృతస్వరూపము, అభయము, అశోకము, అనన్తము. అట్టి ఆత్మయే ఉపాస్య వస్తువు. ఈ జీవుడు ఉపాసించవలసినది అద్దానినే! |
| **3. <u>త్వక్ అధ్యాత్మమ్!</u>**<br>**స్పర్శయితవ్యమ్ అధిభూతమ్।**<br>**వాయుః తత్ర అధిదైవతమ్। నాడీ తేషామ్ నిబన్ధనమ్।**<br>**యస్తు వచి (యస్త్వంచి), యః స్పర్శయితవ్యే,**<br>**యో వాయౌ, యో నాద్యామ్, యః ప్రాణే, యో విజ్ఞానే,**<br>**య ఆనన్దే, యో హృద్యాకాశే,**<br>**య ఏతస్మిన్ సర్వస్మిన్ అన్తరే సఞ్చరతి..,**<br>**సోఽయమాత్మా।**<br>**తమ్ ఆత్మానమ్ ఉపాసీతా**<br>**-అజరమ్ అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్॥** | స్పర్శ (చర్మము) - అధ్యాత్మము.<br>స్పర్శచే అనుభూతమగుచున్నది - అధిభూతము.<br>వాయుదేవుడు అద్దానియొక్క- అధిదైవతము.<br>నాడీ సమూహము అద్దాని - నిబంధనము.<br>ఏదైతే చర్మము నందు,<br>స్పర్శించబడు వస్తువుల యందు,<br>అదిదేవతయగు వాయువునందు, అద్దానిని కదిల్చే చైతన్యమగు ప్రాణ శక్తియందు, స్పర్శ యొక్క విజ్ఞాతము (ఎరుకయందు), అద్దాని అనభవము నందు, అవన్నీ ఉనికి కలిగియున్న హృదయ (దహర) ఆకాశము నందు **ఏదైతే తేజోరూపమై సంచారములు చేయుచున్నదో.. అదియే 'ఆత్మ'!** అట్టి ఆత్మను-అజరము, అమృతము, అభయము, అశోకము, అనన్తముగా ఉపాసించెదరు గాక! |
| **4. <u>మనో అధ్యాత్మమ్!</u>**<br>**మన్తవ్యమ్ అధిభూతమ్।**<br>**చంద్రః తత్ర అధిదైవతం। నాడీ తేషామ్ నిబన్ధనమ్।**<br>**యో మనసి, యో మన్తవ్యే**<br>**యః చంద్రే, యో నాద్యాం**<br>**యః ప్రాణే, యో విజ్ఞానే,**<br>**య ఆనన్దే, యో హృద్యాకాశే**<br>**య ఏతస్మిన్ సర్వస్మిన్ అన్తరే సఞ్చరతి..,**<br>**సోఽయమాత్మా। తమ్ ఆత్మానమ్ ఉపాసీతా..,**<br>**అజరమ్, అమృతమ్ అభయమ్, అశోకమ్, అనన్తమ్॥** | ఆలోచనా శక్తి - స్వభావము అధ్యాత్మము.<br>ఏది ఆలోచించబడుతోందో - అది - అధిభూతము<br>అద్దానికి చంద్రభగవానుడు - అధి దైవతము<br>దేహములోని నాడులు - అద్దాని నిబంధనము.<br>అట్టి మనస్సు నందు, ఆ మనస్సు ఆలోచించుచున్న విషయములందు, మనస్సుకు అధి దేవతయగు చంద్రునియందు, మనోసంబంధితమైన నాడులయందు, అవన్నీ పని చేయటానికి కావలసిన ప్రాణశక్తి యందు, అద్దాని 'ఎరుక' యందు, అద్దాని అనన్దము (అనుభూతము) నందు, అవన్నీ ఏర్పడియున్న హృదయాకాశమునందు, వాటి అన్నిటికీ అన్తరంగాను **ఏది స్వయం చైతన్యమై సంచారములు చేయుచున్నదో, అదియే 'ఆత్మ'.** అజరము - అమృతము - అభయము - అశోకము - అనన్తము అగు అట్టి ఆత్మనే ఉపాశించాలి. |

| | |
|---|---|
| **<u>బుద్ధిః అధ్యాత్మమ్।</u>** | ఈ బుద్ధి ఆధ్యాత్మ స్వరూపము. |
| **బోధవ్యమ్.. అధిభూతమ్।** | బుద్ధికి అవగతమగుచున్నదంతా- అధిభూతము. |
| **బ్రహ్మే తత్రా – అధిదైవతమ్।** | బ్రహ్మదేవుడు అద్దానికి - అధిదైవతము. |
| **నాడీ తేషాం.. నిబన్ధనమ్।** | నాడీవిభాగము అద్దాని - నిబంధనము. |
| **యో బుద్ధౌ, యో బోద్ధవ్యే,**<br>**యో బ్రహ్మణి, యో నాడ్యాం**<br>**యః ప్రాణే, యో విజ్ఞానే**<br>**య ఆనన్దే, యో హృద్యాకాశే**<br>**య ఏతస్మిన్ సర్వస్మిన్ అన్తరే సఞ్చరతి..**<br>**సోఽ యమాత్మా। తమ్ ఆత్మానమ్ ఉపాసీతా**<br>**–అజరమ్, అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్॥** | అట్టి బుద్ధియందు, ఆ బుద్ధిచే నిర్ణయాత్మకమగుచున్న సర్వమునందు, బుద్ధిచే తెలియబడుచున్న వాటియందు, బుద్ధి యొక్క అధిదేవతయగు బ్రహ్మదేవుని యందు,తత్సంబంధమైన దేహములోని నాడుల యందును, ప్రాణశక్తి యందును, వాటి విజ్ఞానము (ఎరుక) యందును, వాటి అనుభవము (ఆనన్దము) యందును, అవన్నీ ఉన్నట్టి స్థానము (హృదయాకాశము) నందును, **వాటన్నిటి అంతరంగానూ ఏది సర్వదా స్వానందరూపమై సంచారము చేయుచున్నదో అదియే 'ఆత్మ'.** అజరము అమృత స్వరూపము, అభయము, అశోకము, అనన్తము అగు అట్టి ఆత్మయే సర్వదా ఉపాసించవలసిన వస్తువు. |
| **<u>అహంకారో అధ్యాత్మమ్।</u>** | అహంకారము (అహం స్వరూపము) - అధ్యాత్మము. |
| **'అహమ్ కర్తవ్యమ్'.. అధిభూతమ్।** | 'నాకు భోక్తృత్వము - కర్తృత్వము ఉన్నది' - అనునదే అధిభూతము. |
| **రుద్రః తత్రా.. అధిదైవతమ్।** | రుద్ర భగవాడును - అధిదైవతము. |
| **నాడీ తేషాం.. నిబన్ధనమ్।** | అద్దాని దేహములోని నాడులు - నిబంధనము. |
| **యో అహంకారే, యో అహమ్ కర్తవ్యే,**<br>**యో రుద్రే, యో నాడ్యాం,**<br>**యః ప్రాణే, యో విజ్ఞానే,**<br>**య ఆనన్దే, యో హృద్యాకాశే,**<br>**య ఏతస్మిన్, సర్వస్మిన్ అంతరే సఞ్చరతి..** | ఏదైతే - అట్టి **అహంకారము** నందు **'అహమ్ కర్తవ్యము'** నందును, అధి దేవతయగు రుద్రదేవుని యందు, ఆ సంబంధితములైన నాడులయందును, 'శక్తి' రూపప్రాణమునందును, అహంకారము యొక్క 'ఎరుక యందును, అద్దాని అనుభూతి యందును వాటన్నిటి యొక్క **అంతరమున స్వస్వరూపమై ఏది సంచారము కలిగినదైయున్నదో.. అదియే ఆత్మ.** |
| **సోఽ య మాత్మా!** | ఆత్మయే అన్ని రూపాలుగా ఉన్నదగుచున్నది. |
| **తమ్ ఆత్మానమ్ ఉపాసీతా** | అది అజరము అమృతస్వరూపము, అభయము, అశోకము, అనన్తము కూడా. |
| **అజరమ్, అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్॥** | అట్టి ఆత్మయే ఎల్లరకు సర్వదా ఉపాసనా వస్తువు అయి ఉన్నది. |
| **<u>5. చిత్తమ్ అధ్యాత్మమ్ ।</u>** | చిత్తము - అధ్యాత్మము. |
| **చేతయితవ్యమ్.. అధిభూతమ్।** | ఈ చిత్తము ఏదేది చింతన చేయుచున్నదో.. అదంతా కూడా - అధిభూతము. |
| **క్షేత్రజ్ఞః తత్రా.. అధిదైవతమ్।** | సర్వక్షేత్రములలోని క్షేత్రజ్ఞుడు - అధిదైవతము. |
| **నాడీ తేషామ్.. నిబన్ధనమ్। యః చిత్తే, యః చేతయితవ్యే,** | తత్సంబంధమైన దేహములోని నాడులు - నిబన్ధనము. |
| **యః క్షేత్రజ్ఞే, యో నాడ్యాం, యః ప్రాణే, యో విజ్ఞానే,**<br>**య ఆనన్దే, యో హృద్యాకాశే,**<br>**య ఏతస్మిన్, సర్వస్మిన్, అన్తరే సఞ్చరతి,**<br>**సోఽ యమాత్మా। తమ్ ఆత్మానమ్ ఉపాసీతా**<br>**అజరమ్, అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్॥** | ఏదైతే చిత్తమునందు, చిత్తము వ్రాలుచున్న విషయములందు, సర్వ దేహములలోని క్షేత్రజ్ఞునియందు, చిత్త సంబంధమైన నాడులయందు, ప్రాణశక్తి యందు, చిత్తసంబంధమైన విజ్ఞానము (లేక ఎరుక) యందు, అద్దాని అనుభూతి యందు, అవన్నీ ఏర్పడి ఉన్న హృదయాకాశము నందు-వాటన్నిట్టి యొక్క అంతరముగా ఏర్పడి ఉన్నదో, అట్టి స్వకీయ సత్తా రూపమై సంచరించుచున్న తత్త్వమే ఆత్మ. అజరము, అమృతము, అభయము, అశోకము, అనన్తము అగు అట్టి ఆత్మయే ఉపాసించవలసినట్టిది. |
| **<u>వాక్ అధ్యాత్మమ్।</u>** | వాక్ శక్తి - అధ్యాత్మము. |
| **వక్తవ్యమ్.. అధిభూతమ్।** | చెప్పటము అనునది - అధిభూతమ్. |
| **అగ్నిః తత్రా .. అధిదైవతమ్ నాడీ తేషామ్ నిబన్ధనమ్।** | అగ్నిదేవుడు - అధిదేవత.<br>దేహనాడులు - నిబంధనము. |
| **యో వాచి, యో వక్తవ్యే యో అగ్నౌ,**<br>**యో నాడ్యాం, యః ప్రాణే,** | వాక్కులోను, చెప్పబడుచున్న మాటలయందును, వాటి అర్థ-ఉద్దేశ్యములయందు, అధిదేవతయగు అగ్నియందు, నాడులందు, ప్రాణతత్త్వము నందు, మాటల ఎరుక |

| | |
|---|---|
| **యో విజ్ఞానే, య ఆనన్దే, యో హృద్యాకాశే..,**<br>**య ఏతస్మిన్ సర్వస్మిన్ అన్తరే సఞ్చరతి..,**<br>**సోஉయమాత్మా। తమ్ ఆత్మానమ్ ఉపాసీతా..**<br>**అజరమ్, అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్॥** | యందు, శబ్దానుభవము నందు, అవన్నీ ఏర్పడి ఉన్న హృదయాకాశము నందును - ఏది **అంతర్లీనమై స్వానుభవ రూపి అయి సంచరించుచున్నదో - అదియే 'ఆత్మ'**. అట్టి ఆత్మ అజరము అమృతము. అభయ స్వరూపము. అశోకము. అనన్తము కూడా! |
| **6. హస్తాః అధ్యాత్మమ్**<br>**ఆదాతవ్యమ్.. అధిభూతమ్।**<br>**ఇంద్రః తత్రా అధిదైవతమ్। నాడీ తేషామ్ నిబన్ధనమ్।**<br>**యో హస్తే, య ఆదాతవ్యే,**<br>**య ఇన్ద్రే, యో నాడ్యాం, యః ప్రాణే**<br>**యో విజ్ఞానే, య ఆనన్దే, యో హృద్యాకాశే..**<br>**య ఏతస్మిన్ సర్వస్మిన్ అన్తరే సఞ్చరతి..**<br>**సోஉయమాత్మా। తమ్ ఆత్మానమ్ ఉపాసితా..**<br>**అజరమ్, అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్॥** | హస్తములు (చేతులు) అధ్యాత్మము.<br>చేతులతో స్వీకరించుచున్నదంతా పట్టుకొనుచున్నదంతా - అధిభూతము.<br>ఇంద్ర దేవుడు - అధిదైవతము.<br>అద్దాని దేహములోని నాడులు - నిబంధనములు.<br>ఈ చేతులు, ఈ చేతులతో పట్టుకోబడుచున్న వస్తువులు, హస్తముల అధిదేవత యగు ఇంద్రభగవానుడు, చేతులకు సంబంధించిన నాడులు, ప్రాణశక్తి, జ్ఞానము (ఎరుక), సంబంధించిన ఇవన్నీ ఏర్పడియున్న హృదయాకాశము - **వీటన్నిటియొక్క అంతరమున అనుభవి అయి సంచారము కలిగి ఉన్నట్టిదే ఆత్మ**. అట్టి ఆత్మను అజరము-అమృతము-అభయము-అశోకము- అనన్త లక్షణములతో ఉపాసించాలి. |
| **7. పాదాః అధ్యాత్మమ్।**<br>**గన్తవ్యమ్.. అధిభూతమ్।**<br>**విష్ణుః తత్రా.. అధిదైవతమ్।**<br>**నాడీ తేషామ్ నిబన్ధనమ్। యః పాదే, యో గన్తవ్యే,**<br>**యో విష్ణౌ, యో నాడ్యాం, యః ప్రాణే, యో విజ్ఞానే,**<br>**య అనన్దే, యో హృద్యాకాశే,**<br>**య ఏతస్మిన్ సర్వస్మిన్ అన్తరే సఞ్చరతి**<br>**సోஉయమాత్మా। తమ్ ఆత్మానమ్ ఉపాసీతా..**<br>**అజరమ్, అమృతమ్, అభయమ్ అశోకమ్, అనన్తమ్॥** | పాదములు - అధ్యాత్మము.<br>నడుస్తూ వెళ్ళు ప్రదేశము - అధిభూతము.<br>విష్ణుభగవానుడు - అధిదైవతము.<br>దేహములోని నాడి - నిబన్ధనము.<br>పాదములయందు, నడుచుచున్న ప్రదేశము నందు, దైవమగు విష్ణువునందు, దేహంలోని పాద సంబంధమైన నాడులందు, ప్రాణశక్తి యందు, విజ్ఞానము (ఎరుక) యందు, అనుభూతియందు.. వాటన్నిటి అంతరమునందు **ఉనికి-ఎరుక-ఆనందములతో కూడి సంచారము చేస్తున్నది ఆత్మయే!** అజరము, అమృతము, అభయము, అశోకము అగు ఆత్మయే ఉపాసన వస్తువు. |
| **పాయుః అధ్యాత్మమ్।**<br>**విసర్జయితవ్యమ్– అధిభూతమ్।**<br>**మృత్యుః తత్రా.. అధిదైవతమ్। నాడీ తేషామ్.. నిబన్ధనమ్।**<br>**యః పాయౌ, యో విసర్జయితవ్యే,**<br>**యో మృత్యౌ, యో నాడ్యాం,**<br>**యః ప్రాణే, యో విజ్ఞానే, య ఆనన్దే, యో హృద్యాకాశే,**<br>**య ఏ తస్మిం తు సర్వస్మిన్ అన్తరే సఞ్చరతి..,**<br>**సోஉయమాత్మా। తమ్ ఆత్మానమ్ ఉపాసీతా..,**<br>**అజరమ్, అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్॥** | పాయువు (విసర్జనము) అధ్యాత్మము.<br>విసర్జించబడునది - అధిభూతము.<br>మృత్యువు (యముడు)- అధిదేవత.<br>నాడులు - నిబంధనము.<br>ఎవ్వరైతే-పాయువు (విసర్జనావయము)నందు, విసర్జించబడుదానియందు, మృత్యువు నందు, నాడులందు, ప్రాణశక్తియందు, ఎరుక యందు, అనుభవము నందు హృదయాకాశమునందు **వాటి యొక్క అంతరమునందు కూడా చిత్-చైతన్యమై సంచరించుచున్నదో అదియే ఆత్మ**. అట్టి జన్మమృత్యువులు లేని అమృతమ్-అభయమ్-అశోకమ్-అనన్తమ్ ఆత్మయే ఎల్లప్పుడు ఉపాసించవలసిన వస్తువు. |
| **8. ఉపాస్థో అధ్యాత్మమ్।**<br>**ఆనన్దయితవ్యమ్.. అధిభూతమ్।**<br>**ప్రజాపతిః తత్రా.. అధిదైవతమ్। నాడీ తేషామ్.. నిబన్ధనమ్।**<br>**య ఉపస్థే, య ఆనన్దయితవ్యే,**<br>**యః ప్రజాపతౌ, యో నాడ్యాం** | ఉపస్థ (మర్మాంగ) అధ్యాత్మము.<br>ఆనందించబడునది - అధిభూతము.<br>ప్రజాపతి - అధిదైవము.<br>నాడులు - నిబంధనము.<br>ఏ తత్త్వమైతే ఉపస్థయందు, ఆనందించబడుచున్న దానియందు, ప్రజాపతియందు, |

| | |
|---|---|
| యః ప్రాణే, యో విజ్ఞానే, య ఆనన్దే, యో హృద్యాకాశే<br>య ఏతస్మిన్ సర్వస్మిన్ అన్తరే సఞ్చరతి..<br>సోஉ_యమాత్మా। తమ్ ఆత్మానమ్ ఉపాసీతా..,<br>అజరమ్, అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్॥ | నాడులయందు, ప్రాణశక్తియందు, ఎరుక- అనుభూతల యందు, హృదయాకాశము నందు, వాటి వాటి అంతరమున **సర్వ ప్రకాశకమై సంచారము చేయుచున్నదో.. అదియే 'ఆత్మ'**. అదియే ఉపాసించతగినది. అది జరామరణ రహితమని, అభయమని, శోకరహితమని, ఆద్యంతరములు లేనట్టిదని ఎరిగి ఉపాసించాలి. |
| ఏష సర్వజ్ఞ! ఏష సర్వేశ్వర!<br>ఏష సర్వాధిపతిః! ఏషో అంతర్యామి!<br>ఏష యోనిః సర్వస్య। సర్వసౌఖ్యైః ఉపాస్య<br>మనో, న చ సర్వసౌఖ్యాన్ ఉపాస్యతి।<br>వేద-శాస్త్రైః ఉపాస్యమానో।<br>న చ వేదశాస్త్రాణి ఉపాస్యతి।<br>యస్యాత్ అన్నమిదమ్ సర్వమ్,<br>న చ యో అన్నమ్ భవత్యతః। | ఆట్టి సర్వము తానే అయి, సర్వమును ప్రకటిస్తూ - వెలిగించువాడై సర్వమునకు అంతర్యామి అయినట్టి ఆత్మ భగవానుడే **సర్వజ్ఞుడు, సర్వ నియామకుడు**. కాబట్టి **సర్వేశ్వరుడు**. సర్వమునకు అధిపతి కూడా! ఈ సర్వమునకు జనన స్థానము ఆత్మపురుషుడే కాబట్టి అంతటికీ యోని. సర్వసుఖములను ఉపాసించు మనస్సు ఆయనయే అయినప్పటికీ ఆయన దేనినీ ఉపాసించనివాడు.<br>వేదములు-శాస్త్రములు ఉపాసిస్తున్నది ఆయననే! అంతేగాని, ఆయన శాస్త్రములను ఉపాసించుట లేదు. ఆయన వేదశాస్త్రములు ఉపాసించే ధర్మము ఆపాదించలేము। ఎవ్వడికి ఈ కనబడేదంతా అనుభవరూపమో (అన్న స్వరూపమో), ఎవ్వడు అనుభవ రూపము కాడో (తాను అన్న రూపము కాడో)... దృశ్యము రూపము కాడో.. ఆయన ఆత్మ! |
| **9.** పరం సర్వనయన ప్రశస్తాత్<br>అన్నమయో → భూతాత్మా,<br>ప్రాణమయ → ఇంద్రియాత్మా,<br>మనోమయః → సంజ్కల్పాత్మా,<br>విజ్ఞానమయః → కాలాత్మా,<br>ఆనన్దమయో → లయాత్<br>ఆత్మా-ఏకత్వాత్।<br>నాస్తి ద్వైతం, కుతో మర్త్యమ్?<br>నాస్తి అమృతం కుతో నాశః?<br>న అన్తః ప్రజ్ఞో। న బహిః ప్రజ్ఞో।<br>న ఉభయతః ప్రజ్ఞో।<br>న ప్రజ్ఞాన ఘనో।<br>న ప్రజ్ఞో, న అప్రజ్ఞోஉ_పి।<br>నో విదితం। వేద్యం నాస్తీతి।<br>ఏతత్ నిర్వాణమ్ అనుశాసనమ్।<br>ఇతి వేదాஉ_ను శాసనమితి!<br>ఇతి వేదాஉ_నుశాసనమ్! | ఈ విధముగా ఆత్మ ఎటువంటిదంటే..<br>ఈ కళ్లకు కనిపించుచున్న అన్నమయ ప్రపంచానికి భూతాత్మగాను...,<br>-ప్రాణమయుడై ఇంద్రియాత్మగాను....,<br>-మనోమయుడై సంకల్పాత్మగాను....,<br>- విజ్ఞానమయుడై కాలాత్మగాను....,<br>లయాత్మకత్వముచేత ఆనందమయుడై ఉన్నారు. ఇన్నీ ఆత్మయే! ఆత్మకు వేరుగా ఏదీ ద్వితీయమై లేదు. ద్వైతమే లేనప్పుడు, 'మరణము' అను స్వభావము (మర్త్యము) ఎక్కడిది? మృత్యువే లేనప్పుడు, అమృతము మాత్రము ఎక్కడిది, అంతా ఆత్మయే!<br>అట్టి ఆత్మ ఎట్టిదని చెప్పాలి. అది అంతః ప్రజ్ఞయా। (ఈజ్ ఇట్ ఇన్‌సైడ్ ఇంటలెక్చువల్)? కాదు. లోపల గల మనోబుద్ధి చిత్త అహంకారములా? కాదు. బయట కనిపించే ప్రజ్ఞ కూడా కాదు. ఉభయ ప్రజ్ఞ కూడా కాదు. అట్టి ఆత్మ కేవల ప్రజ్ఞ కాదు. 'అప్రజ్ఞ' కూడా కాదు.<br>అది తెలియబడునది, తెలుసుకోకలిగినది కూడా కాదు. (తెలుసుకొంటున్నది, తెలియబడుచున్నది అదియే కదా)! అట్టి ఆత్మ యొక్క అనుభవమే **నిర్వాణము**. ఇది విదిత వేద్యుల నిర్ణయము, వేదములచే అనుశాసనము, ఆత్మ అనుభవమాత్ర సిద్ధము। |

<u>షష్ఠః ఖండః</u>

**6వ ఖండము**

| | |
|---|---|
| **1.** నైవ ఇహ కిఞ్చన అగ్ర అసీత్।<br>అమూలమ్, అనాధారా,<br>ఇమాః ప్రజాః ప్రజాయంతే।<br>దివ్యో దేవ ఏకో నారాయణః।<br>చక్షుశ్చ ద్రష్టవ్యం చ నారాయణః।<br>శ్రోత్రంచ, శ్రోతవ్యంచ నారాయణో।<br>ఘ్రాణశ్చ, ఘ్రాతవ్యం చ నారాయణో। | సృష్టికి మునుముందు ఆత్మ తప్పితే ఎక్కడా ఏదీ లేదు. ఏ ఒక్క మూలము, ఆధారము లేకుండానే ఈ జీవులంతా పుట్టుకొస్తున్నారు. **ఏకములోంచి అనేకముగా పుట్టుచూ, ఇదంతా సర్వదా ఏకమే అయి ఉన్నది.** ఏకమగు నారాయణ స్వరూపమే ఇదంతా కూడా! (మట్టి పోయి మట్టి బొమ్మలు రావు కదా).<br>చూచే కళ్ళు - ఆ కళ్లకు కనబడుచున్నది నారాయణుడే!<br>చెవులు- ఆ చెవులకు వినబడుచున్నదీ కూడా నారాయణుడే!<br>ఘ్రాణేంద్రియము (ముక్కు)-వాసనగా పొందబడుచున్నదీ కూడా నారాయణుడే! |

| | |
|---|---|
| జిహ్వా చ రసయితవ్యం చ నారాయణో। | ఈ నాలుక - నాలుకకు అనుభవమగుచున్న రుచి పదార్థములు నారాయణుడే! |
| త్వక్ చ, స్పర్శయితవ్యం చ నారాయణో। | ఈ చర్మము - స్పర్శానుభవరూపమగు వస్తు సముదాయము.. నారాయణుడే! |
| మనశ్చ-మన్తవ్యంచ నారాయణో। | ఈ మనస్సు - అది రచిస్తూ ఉన్నట్టి విషయాలు కూడా నారాయణుడే! |
| బుద్ధిశ్చ-బోధవ్యంచ నారాయణో। | ఈ బుద్ధి, బుద్ధికి తెలియబడుచున్నదంతా కూడా నారాయణుడే! |
| అహంకారశ్చ-అహం కర్తవ్యంచ నారాయణః। | అహంకారము - ఇది'నాకర్తవ్యము' అనిపిస్తున్నవన్నీ కూడా నారాయణుడే! |
| చిత్తం చ - చేతయితవ్యంచ నారాయణో। | ఈ చిత్తము, చిత్తము ఆశిస్తున్నది, చిత్తమునకు ఇష్టమగుచున్నది.. అంతా నారాయణుడే! |
| వాక్ చ - వక్తవ్యంచ నారాయణో। | వాక్కు - ఆవాక్కుచే పలు కబడుచున్నదంతా కూడా నారాయణుడే! |
| హస్తౌ చ - ఆదాతవ్యం చ నారాయణః। | చేతులు, చేతులతో పట్టుకోబడుచున్నవి - ఇవ్వబడుచున్నవి.. ఇవన్నీ నారాయణుడే! |
| పాదౌ చ - గన్తవ్యంచ నారాయణః। | పాదములు - నడకలు -నడతలు నారాయణుడే! |
| పాయుశ్చ - విసర్జయితవ్యం చ నారాయణ। | విసర్జకాయవమగు పాయువు - విసర్జించబడుచున్నది కూడా నారాయణుడే! |
| ఉపస్థశ్చ - ఆనన్దయితవ్యం చ నారాయణో। | మర్మాంగము (ఉపస్థ), అద్దాని చేత ఆనందముగా పొందబడుచున్నదీ నారాయణుడే |
| ధాతా, విధాతా, కర్తా - వికర్తా-దివ్యో.., దేవ ఏకో నారాయణః॥ | ధాత (మూల కర్తృత్వము) - విధాత (సృష్టికాల్పికుడు) - కర్త- అకర్త.. ఇవన్నీ కూడా దివ్యదేహ దేవాదిదేవుడు ఏకోనారాయణుడే! |
| **2.** ఆదిత్యా రుద్రా, మరుతో, వసవో, అశ్వినా, ఋచో, యజూగ్ంషి, సామాని, మన్త్రా అగ్నిః ఆజ్యమ్ ఆహుతిః నారాయణః। ఉద్భవః సంభవో, దివ్యో, దేవ - ఏకోనారాయణో॥ | ద్వాదశాదిత్యులు, ఏకాదశ రుద్రులు, మరుత్ గణము, వస్తుతత్త్వ దేవతలు, అశ్వినీ దేవతలు, ఋక్కులు, యజస్సులు, సామగానములు, మంత్రములు, అగ్ని, అగ్నికి సమర్పించు ఆజ్యము (నెయ్యి) ఆహుతి.. అన్నీ నారాయణుడే! ఉద్భవించుచున్నవి. సంభవించుచున్నవి, దివ్యమైనవి, దేవతలు.. ఏకోనారాయణుడే. |
| మాతా, పితా, భ్రాతా, నివాసః శరణం, సుహృత్, గతిః నారాయణో॥ | తల్లి తండ్రి, సోదరుడు, నివసించే ఇల్లు, శరణము (దిక్కు), సుహృత్, గతి - ఇవన్నీ నారాయణుడే |
| విరాజా-సుదర్శనా-జితా-సౌమ్యా మోఘా-కుమారా-అమృతా సత్యా-సుమధ్యమా-నాసీరా-శిశుః-అసురా-సూర్యా భాస్వతీ.. విజ్ఞేయాని నాడీనామాని దివ్యాని, | దివ్యమగు దేహములోని **'నాడులు'**అయినటువంటి - విరాజ; సుదర్శన; జిత; సౌమ్య; మోఘ; కుమార; అమృత; సత్య; సుమధ్యమ; నాసీర; శిశు; అసూర; సూర్య; భాస్వతి; - (మొదలుగా గల నాడులు) నారాయణుడే! |
| - గరతి, | తాగేవి; |
| - గాయతి వా, | పాడేవి; |
| - వర్షతి॥ (సర్వం నారాయణో) | వర్షించేవి..., ఇవన్నీ నారాయణుడే! |
| **3.** వరుణో అర్యమా చంద్రమా | - జలదేవత అగు వరుణుడు, |
| కలా కవిః అర్థాదా(తా) (ధాతా) | -పితృ దేవతయగు అర్యముడు, |
| బ్రహ్మే ప్రజాపతిః మఘవా | -మనో అధి దేవతయగు చంద్రుడు, |
| దివసాశ్చ, అర్ధ దివసాశ్చ | కల (Dream), కలకు ఆవల ఉన్నది, ఈవల ఉన్నది...., |
| కలాః కల్పాశ్చ ఊర్ధ్వంచ దిశశ్చ సర్వం నారాయణః॥ | సృష్టికంతటికి కర్తయగు బ్రహ్మదేవుడు, ప్రజాపతి (జీవులకు పతి); మఘువుడు (ఇంద్రియాధిపతియగు ఇంద్రుడు); కల, కల్పనపైన ఉన్నది, క్రింద ఉన్నది 10 దిక్కులు, ఆ పది దిక్కులలో ఏర్పడినది...., |
| పురుష ఏవ ఇదగ్ం సర్వం యత్ భూతం, యచ్చ భవ్యం॥ | సర్వము నారాయణుడే। |
| తత్ విష్ణోః పరమం పదగ్ం సదా పశ్యన్తి సూరయః | ఇప్పుడు కనబడు సర్వము, ఇతః పూర్వము ఉండి ఉన్నది, ఇక ముందు ఉండబోయేది. సర్వము ఆ పరమపురుషుడే! |

**దివీవ చక్షుః ఆతతం**
**తత్ విప్రాసో విపన్యవో**
**జాగృవాగ్ంసః సమిన్ధతే, విష్ణోః యత్**
**పరమమ్ పదమ్।**
**తత్ ఏతత్**
**నిర్వాణా అనుశాసనమ్ ఇతి॥**
**వేదా అనుశాసనమ్ ఇతి॥**
**వేదా అనుశాసనమ్॥**

విద్వాంసులైన శూరులు ఎల్లప్పుడూ అంతట పరమపదమగు ఆ విష్ణుతత్త్వమునే చూస్తూ ఉన్నారు. 'కనబడేదంతా అదే' అని ఎరిగి ఉంటున్నారు.

ఆయన చక్షువులే దివ్యలోకములన్నీ వ్యాపించి ఉన్నవి.

పండితులైన, నిత్యానిత్యవివేకులైన, వేదార్థము తెలిసిన - విప్రులు సర్వదా జాగరూకులై ఆ విష్ణు పదమునే సర్వత్రా ఎరిగి, చూస్తూ, గమనిస్తూ పరమపద ధ్యానులై ఉంటున్నారు.

అట్టి ఆత్మయే నిర్వాణానుశాసనము. అది ఎరుగుటయే నిర్వాణానుశాసనము. వేదములు అనుశాసనము చేస్తున్నది ఆత్మగురించే!

---

<u>సప్తమః ఖండః</u>

**7వ ఖండము**

1 **అన్తఃశరీరే నిహితో గుహాయామ్**
**అజ ఏకో నిత్యో, యస్య పృథివీ శరీరం,**
**యః పృథివీమ్ అంతరే సఞ్చరన్,**
**యం పృథివీ న వేద;**
**యస్య ఆపః శరీరమ్,**
**యో ఆపో అన్తరే సఞ్చరన్**
**యమ్ ఆపో అస్య న విదుః,**
**యస్య తేజః శరీరమ్,**
**యః తేజో అన్తరే సఞ్చరన్, యం తేజో న వేద,**
**యస్య వాయుః శరీరమ్,**
**యో వాయుమ్ అన్తరే సఞ్చరన్,**
**యం వాయుః న వేద,**
**యస్య ఆకాశః శరీరమ్**
**య ఆకాశమ్ అన్తరే సఞ్చరన్**
**యం ఆకాశో న వేద;**
**యస్య మనః శరీరమ్,**
**యో మనో అన్తరే సఞ్చరన్, యం మనో న వేద;**
**యస్య బుద్ధిః శరీరమ్,**
**యో బుద్ధిమ్ అన్తరే సఞ్చరన్,**
**యం బుద్ధిః న వేద;**
**యస్య అహంకారః శరీరమ్,**
**యో అహంకారమ్ అన్తరే సఞ్చరన్,**
**యమ్ అహంకారో న వేద;**
**యస్య చిత్తం శరీరం,**
**యః చిత్తం అన్తరే సఞ్చరన్,**
**యం చిత్తం న వేద;**
**యస్య అవ్యక్తం శరీరమ్, యో అవ్యక్తమ్**
**అన్తరే సంచరన్, యం అవ్యక్తం న వేద;**
**యస్యా అక్షరమ్ శరీరమ్**
**యో అక్షరమ్ అంతరే సంఞ్చరన్,**

ప్రతి శరీరము నందు అంతశ్శరీరుడై, హృదయ గుహాయందు దాగి, జన్మ రహితము, నిత్యము, అయి ఈ పృథివిని ఆ పరమాత్మ (లేక నారాయణుడు) తన శరీరముగా కలిగి ఉన్నారు. పృథివినంతటా అంతరమున ఆత్మా నారాయణుడు సంచరించుచున్నప్పటికీ కూడా, పృథివికి ఆ తన అంతర్యామియగు నారాయణుని గురించి (పరమాత్మతత్త్వము గురించి) తెలియుట లేదు.

జలము ఎవ్వని శరీరమో, జలమునందు అంతర్యామి అయి వసిస్తున్నారో, అయినప్పటికీ జలము ఎవ్వరిగురించి తెలుసుకొని ఉండుటలేదో. ఆయనయే ఆత్మానారాయణుడు.

ఇక్కడి తేజస్సు ఎవ్వరి శరీరమై ఉన్నదో, ఎవ్వరు తేజస్సు యొక్క అంతరముగా సంచరిస్తున్నారో, అయినా కూడా తేజస్సు ఎవని గురించి ఎరుగుట లేదో, ఆయనే తేజో - శ్రీమన్నారాయణుడు.

ఎవనికి వాయువు శరీరమై ఉండి, వాయువునందు అంతర్యామిగా సంచరిస్తున్నప్పటికీ, వాయువుకు ఆ విషయము గురించి (ఆయన గురించి) తెలియుట లేదో ఆయనే వేదాన్త ప్రాణేశ్వర నారాయణుడు.

ఎవనికి ఆకాశమంతా తన శరీరమైయుండి, ఆకాశమునకు అంతర సంచారుడై ఉన్నారో, కానీ ఆకాశము అది గమనించటమే లేదో.. ఆయనే ఆకాశ - శ్రీమన్నారాయణుడు.

ఎవనికి మనస్సు శరీరమై ఉండి, మనస్సు యొక్క అంతరమున సంచరిస్తున్నప్పటికీ మనస్సుకు ఆయన గురించి ఎరుక కలుగుట లేదో.. ఆయనే యోచనా-వేదనారాయణుడు.

ఎవరికి బుద్ధి శరీరమై ఉండి, బుద్ధికి అన్తర- సంచారుడై ఉండగా కూడా, బుద్ధికి అది తెలియుట లేదో ఆయనే బుద్ధి - ప్రజ్ఞా నారాయణుడు.

ఎవనికి అహంకారము శరీరమో అహంకారము యొక్క అంతరమున సఞ్చరిస్తున్నారో.. కానీ అహంకారమునకు అది తెలియవచ్చుటలేదో.. ఆయనే సోఽహమ్కార నారాయణుడు.

చిత్తము ఆయన శరీరమే అయి, అద్దానికి అంతరమున సంచారుడై ఉన్నప్పటికీ ఎవని గురించి చిత్తమునకు తెలియుట లేదో, ఆయనయే చిత్ చైతన్య నారాయణుడు!

అవ్యక్తము ఎవరికి శరీరమై యుండి, అద్దానికి అన్తర సంచారుడై ఉండగా కూడా, అవ్యక్తము ఆయనను సందర్శించలేకపోతోందో, ఆయనే వ్యక్తావ్యక్త నారాయణుడు.

- అక్షరము ఆయన శరీరమే. అక్షరములో అంతర్యామిగా ఉన్నారు. కానీ అక్షరమునకు ఆయన సంచారము తెలియవచ్చుట లేదు. ఆయనే అక్షర

**యం అక్షరమ్ న వేద;**

**యస్య మృత్యుః శరీరమ్,**

**యో మృత్యుమ్ అన్తరే సఞ్చరన్,**

**యం మృత్యుమ్ న వేద;**

నారాయణుడు.

మృత్యువు ఆయన శరీరమే అయి ఉండి, మృత్యువుకు అంతర్యామిగా ఆయన సంచరిస్తూ ఉండగా, మృత్యువుకు ఆయన గురించి ఎరుక కలగుట లేదు. ఆయనే అమృత నారాయణుడు! సర్వదా ఏకో నారాయణుడు!

---

**2. స ఏష సర్వభూతా-అన్తరాత్మా,**

**అపహత పాప్మా, దివ్యో దేవ-**

**ఏకో నారాయణః॥**

**ఏతాం విద్యాం అపాన్తరతమాయ దదా।**

**అపాన్తరతమో - బ్రహ్మణే దదౌ।**

**బ్రహ్మ - ఘోరాంగిరసే దదౌ।**

**ఘోరాంగిరా - రైక్వాయ దదౌ।**

**రైక్వో - రామాయ దదౌ।**

**రామః సర్వేభ్యో భూతేభ్యో దదాః॥**

**ఇత్యేవం.. నిర్వాణమ్ అనుశాసనం ॥**

**ఇతి వేదానుశాసనమ్॥**

**ఇతి వేదానుశాసనమ్॥**

ఆయన సర్వ జీవరాసులకు అంతరాత్మ! దివ్యస్వరూపుడు! దేవాది దేవుడు! జీవుల దోషములను తొలగించువాడు!

ఆయనఆత్మ విద్యను (నారాయణ తత్త్వజ్ఞానమును) అపాన్తరతమాయునకు ప్రసాదించారు.

అపాంతరమాయుడు ఆ విద్యను సృష్టికర్తయగు **బ్రహ్మదేవునికి** ఇచ్చారు.

బ్రహ్మదేవుడు **ఘోరాంగిరసునకు** ఇచ్చారు.

ఘోరాంగిరసుడు అట్టి ఆత్మానారాయణ విద్యను **రైక్యునకు ప్రసాదించారు.**

రైక్వుడు **రామచంద్రునకు** ఇచ్చారు.

ఆ రాముడు (సర్వజీవులను ప్రేమించుచూ, లోకోరమయతీతి-కాబట్టి) సర్వ జీవులకు ప్రసాదించుచున్నారు.

ఇది నిర్వాణ (మోక్ష)మార్గ అను శాసనము.

వేదములచే ఎలుగెత్తి గానము చేయబడుచున్నా వేదవాక్ - నిర్వచనము.

---

<u>అష్టమః ఖండః</u>

**8వ ఖండము**

**అన్తశ్శరీరే నిహితో గుహాయాం**

**శుద్ధః, సోఽ యమాత్మా**

**సర్వస్య మేదో, మాంస క్లేదాన కీర్ణే,**

**శరీరమధ్యే అత్యంత ఉపహితే,**

**చిత్రభిత్తి, ప్రతీకాశే గన్ధర్వ నగరోపమే,**

**కదళీ గర్భవత్ నిస్సారే,**

**జల బుద్బుదవత్ చంచలే,**

**నివసనన్తమ్ ఆత్మానమ్..!**

**అచిన్త్య రూపమ్; దివ్యమ్; దేవమ్; అసంగమ్;**

**శుద్ధమ్, తేజసః కాయమ్,**

**సర్వ రూపమ్; సర్వేశ్వరమ్; అచిన్త్యమ్; అశరీరమ్;**

**నిహితం గుహాయామ్।**

**అమృతం; విభ్రాజమానమ్; ఆనందమ్;**

**తం పశ్యతి విద్వాంసః, తేన యేన పశ్యన్తి?**

పరమశుద్ధమగు ఆ ఆత్మాదేవుడగు శ్రీమన్నారాయణుడు ఈ శరీరములోనే హృదయగుహ సర్వదా ప్రకాశమానుడై వేంచేసి ఉన్నారు.

ఈభౌతిక దేహము మేదస్సు (క్రొవ్వు) - మాంసమయమై తడితో కూడుకుని ఉన్నది కదా! అట్టి ఈ దేహము యొక్క మధ్య భాగమున బొమ్మలు చిత్రించబడిన గోడవలె, గంధర్వ నగరము వలె, అరటి స్తంభము వలె నిస్సారమైన సంసారకల్పన ఉన్నది. జలములో బుడగవలె అతి చంచలముగా ఉన్నది. అట్టి సంసారాంతర్గత వస్తువు అగు ఈ దేహములో ఆత్మ-నివాసము కలిగి ఉన్నది.

అట్టి ఆత్మ-అచిన్త్య రూపము. దివ్యము. దేవతాస్వరూపము. దేనికీ సంబంధించక సంగరహితమై యున్నది. పరమశుద్ధము.. చీకట్లన్నీ పటాపంచలు చేయు దివ్య తేజోరూపము, సర్వము తన స్వరూపముగా కలిగి ఉన్నట్టిది. సర్వము నందు అంతర్హితముగా విస్తరించి ఉన్నట్టిది. మనస్సుకు విషయముకాక, భావాతీతమై ఉన్నట్టిది. ఉపాధి రహితము. హృదయగుహ యందు మౌనముగా దాగి ఉన్నది. మనోబుద్ధులకు సాక్షిగా చక్షువులకు అందనిదై ఉన్నది. అమృతస్వరూపమై, సర్వత్రా ఎదురుగా విభ్రాజమానమై ఉన్నది. ఆనంద స్వరూపము. **విద్వాంసులగు విజ్ఞులు ఈ సర్వమును అట్టి ఆత్మగా దర్శించుచున్నారు.** అట్టి ఆత్మను దేనితో దర్శిస్తున్నారు? భౌతిక చక్షువులతోనా? ఏది అంతా సాక్షి అయి అంతా చూస్తోందో, విద్వాంసుడు అద్దానిని సాక్షి అయి చూస్తున్నాడు. ఆత్మ అయి ఆత్మను దర్శించుచున్నాడు. ఆయనను ఎవరు దర్శించగలరు?

---

<u>నవమః ఖండః</u>

**9వ ఖండము**

**1 అథ హి ఏనం రైక్వః పప్రచ్ఛః**

**భగవన్। కస్మిన్ సర్వే**

**అస్తం గచ్ఛంతి? ఇతి।**

<u>రైక్వుడు</u> : భగవన్? గురుదేవా।

ఈ సర్వము తిరిగి దేనిలో అస్తమించుచున్నది?

**గురువరేణ్యుడు :** ఈ కళ్లు దేనిదేనిని దృశ్యముగా పొందుచున్నాయో అట్టి ఇదంతా కళ్లలోనే అస్తమిస్తున్నది. **చూడబడుచున్నదంతా చూపుయందే అస్తమించుచున్నది.**

తస్మైస హో వాచ:

**చక్షురేవా ఆప్యేతి యః**

**చక్షురేవా అస్తమేతి!**

**ద్రష్టవ్యమ్ ఏవా ఆప్యేతి యో, ద్రష్టవ్యమేవా అస్తమేతి;**

**ఆదిత్యమేవా ఆప్యేతి య, ఆదిత్యమేవా అస్తమేతి;**

**విరాజమేవా ఆప్యేతి యో, విరాజమేవా అస్తమేతి;**

**ప్రాణమేవా ఆప్యేతి యః ప్రాణమేవా అస్తమేతి;**

**విజ్ఞానమేవ ఆప్యేతి యో విజ్ఞానమేవ అస్తమేతి;**

**అనన్ద మేవ ఆప్యేతి య, ఆనన్దమేవ అస్తమేతి;**

**తురీయమేవ ఆప్యేతి యః, తురీయమేవ అస్తమేతి;**

**తత్ అమృతమ్; అభయమ్; అశోకమ్; అనన్తం;**

**నిర్బీజమేవ ఆప్యేతి। ఇతి॥**

**– హోవాచ –**

**శ్రోత్రమేవ ఆప్యేతి యః శ్రోత్రమేవ అస్తమేతి।**

**శ్రోతవ్యమేవ ఆప్యేతి యః శ్రోతవ్యమేవ అస్తమేతి।**

**దిశమేవ ఆప్యేతి యో దిశమేవ అస్తమేతి।**

**సుదర్శనమేవ ఆప్యేతి యః, సుదర్శనమేవ అస్తమేతి।**

**అపానమేవ ఆప్యేతి యో అపానమేవ అస్తమేతి।**

**విజ్ఞానమేవ ఆప్యేతి యో, విజ్ఞానమేవ అస్తమేతి।**

**ఆనన్దమేవ ఆప్యేతి య, ఆనన్దమేవ అస్తమేతి।**

**తురీయమేవ ఆప్యేతి యః, తురీయమేవ అస్తమేతి।**

**తత్–అమృతమ్, అభయమ్, అశోకము, అనన్తమ్,**

**నిర్బీజమేవ ఆప్యేతి**

**–ఇతి హోవాచ–**

చూచుచున్నవానియందే చూడబడేది లయిస్తోంది.

- ద్రష్టవ్యము ఎవరు పొందుచున్నారో - ఆతనియందే ద్రష్టవ్యము లయిస్తోంది.

- 'ఆదిత్యము'గా పొందబడేది ఆదిత్యునియందే అస్తమిస్తోంది. సూర్యకిరణములు వస్తువుపై పడి ఆ తర్వాత కిరణములు సూర్యుని యందేలయించున్నట్లుగా,

ఏది విరాజమానము (మ్యానిఫెస్టేషన్) అగుచున్నదో, అదంతా విరాజమై ఆ విరాజమానత్వమునందే అస్తమించుచున్నది. ఆ విరాజమానమగుచున్న దానిలో లయిస్తోంది.

ఏది ప్రాణము పొందుచున్నదో - అట్టి దానియందే (ఆత్మయందే) ప్రాణము అస్తమించుచున్నది.

ఏది ఆనందమును పొందుచున్నదో, అద్దానియందే ఆనన్దము అస్తమించుచున్నది.

ఏది తురీయమును పొందుచున్నదో, తిరిగి తురీయము ఆతనియందే (ఆత్మయందే) అస్తమించుచున్నది.

ఎందులో ఇవన్నీ బయల్వెడలుచున్నాయో, అట్టి ఆత్మ అమృతస్వరూపము. అభయము. అశోకము. అనన్తము. అప్పుడు ఆత్మ నిర్బీజమును పొందుచున్నది.

ఏది (ఆత్మయే) శ్రోతమును (వినికిడి) పొందినదో, అదియే శ్రోతమును అస్తమింపజేయుచున్నది.

ఏది వినబడుచున్న దానిని పొందుచున్నదో, అది వినబడుచున్న దానిని తనయందు తిరిగి అస్తమింపజేయుచున్నది.

ఏది దిక్కులను పొందుచున్నదో, అది దిక్కులను తిరిగి తనయందే అస్తమింప జేయుచున్నది.

ఏది సుదర్శనము (సౌందర్యమును)పొందుచున్నదో అదియే సుదర్శనమును తనయందు అస్తమింపజేయుచున్నది.

అపానమును పొందుచున్నట్టిదే అపానమును తిరిగి తనయందు అస్తమింప జేయుచున్నది.

విజ్ఞానమును పొందుచున్నట్టిదే విజ్ఞానమును తనయందు అస్తమింజేయుచున్నది.

ఆనందమును పొందుచున్నతత్త్వమే ఆనందమును అస్తమింపజేయుచున్నది.

తురీయమును ఏది పొందుచున్నదో, అదియే తనయందు ఆ తురీయమును తనయందు అస్తమింపజేయుచున్నది.

అప్పుడు తిరిగి అమృతము, అభయము, అశోకము, అనన్తము, నిర్బీజము అగు ఆత్మను పొందుచున్నది. ఆత్మ ఆత్మనే పొందుచున్నది. ఆత్మ ఆత్మయందే లయిస్తోంది

---

**2** నాసామేవ ఆప్యాతియో నాసామేవ అస్తమేతి।

ఘ్రాతవ్యమేవ ఆప్యాతి యో ఘ్రాతవ్యమేవ అస్తమేతి

పృథివీమేవ ఆప్యేతి యో, పృథివీమేవ అస్తమేతి।

జితామేవ ఆప్యేతి యో, జితామేవ అస్తమేతి।

వ్యానమేవ ఆప్యేతి యో, వ్యానమేవ అస్తమేతి।

విజ్ఞానమేవ ఆప్యేతియో, విజ్ఞానమేవ అస్తమేతి।

ఆనన్దమేవ ఆప్యేతి య, ఆనన్దమేవ అస్తమేతి।

తురీయమేవ ఆప్యేతి యః, తురీయమేవ అస్తమేతి।

ముక్కును పొంది ఆత్మయే ముక్కును అస్తమింపజేయుచున్నది.

వాసన (స్మెల్)ను పొందుచున్నదే వాసనను అస్తమింపజేయుచున్నది.

(ఆత్మయే) పృథివిని పొందినదై, పృథివిని తన యందు అస్తమింపజేయుచున్నది.

జితా (సానుకూల్యము-అనుభూతి)ని కల్పించుకొన్నట్టిదే - అట్టి సానుకూల్యత (జిత)ను మరల తనయందు అస్తమింపజేసుకొనుచున్నది.

ఏది వ్యాన(ప్రాణ ప్రసరణను ప్రవర్తింపజేయుచున్నదో అదియే వ్యానమును తనయందు అస్తమింపజేసుకొనుచున్నది.

విజ్ఞానమును పొందుచున్న ఆత్మయే విజ్ఞానమును అస్తమింపజేయుచున్నది.

ఆత్మ ఆనన్దమును ఒకప్పుడు పొందినదై, మరొకప్పుడు ఆనందమును ఉపసంహరిపజేస్తూ తనయందు అస్తమింపజేయుచున్నది.

తత్ అమృతమ్, అభయమ్,
అశోకమ్, అనన్తమ్
నిర్బీజమేవ ఆప్యేతి॥

తురీయమును పొందిన పరతత్త్వమే తురీయమును అస్తమింపజేయుచున్నది. ఆ విధముగా అస్తమింపజేయుచున్నప్పుడు ఆత్మ అమృతత్వమును అభయమును, అశోకమును, అనన్తమును పొందినదిగా అగుచున్నది. నిర్బీజస్వరూపమై వెలుగొందుచున్నది.

3 <u>ఇతి హైూవాచ :</u>
జిహ్వామేవ ఆప్యేతి యో, జిహ్వామేవ అస్తమేతి।
రసయితవ్యమేవ ఆప్యేతి యో, రసయితవ్యమేవ అస్తమేతి;
వరుణమేవ ఆప్యేతియో, వరుణమేవ అస్తమేతి;
సౌమ్యమేవ ఆప్యేతి యః సౌమ్యమేవ అస్తమేతి।
ఉదానమేవ ఆప్యేతి య ఉదానమేవ అస్తమేతి।
విజ్ఞానమేవ ఆప్యేతి యో విజ్ఞానమేవ అస్తమేతి।
ఆనన్దమేవ ఆప్యేతి య అనన్దమేవ అస్తమేతి
తురీయమేవ ఆప్యేతి యః తురీయమేవ అస్తమేతి॥
తత్ అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్,
నిర్బీజమ్, ఏవ అవాప్యేతీతి॥

ఏది (ఆత్మ) జిహ్వను పొందుచున్నదో, అద్దానిచేతనే జిహ్వ అస్తమింపజేయబడుచున్నది.

ఏది రుచికరమగు పదార్థములను కల్పనచే పొందుచున్నదో, ఆ రుచి (రసయితవ్య), పదార్థానుభవమును తనయందు అస్తమింపజేసుకొనుచున్నది.

ఏ(ఆత్మ)తత్త్వము వరుణుని (జలదేవుని) పొందినదో, అద్దాని (ఆత్మ) చేతనే వరుణుడు అస్తమింపజేయబడుచున్నారు.

సూర్యుని పొందిన ఆత్మయే తనయందు సూర్యుని అస్తమింపజేసుకొనుచున్నది.

ఏది ఉదానము పొందినదో అట్టి ఆత్మయే ఉదాన ప్రాణమును తన యందు అస్తమింపజేసుకొనుచున్నది.

అట్టి ఆత్మ సర్వదా అమృతము, అభయము, అశోకము, అనంతము, నిర్బీజము కూడా!

4 <u>హైూవాచ</u>
త్వక్ చమేవ అవాప్యేతి య, త్వక్చమేవ అస్తమేతి,
స్పర్శయితవ్యమ్ ఏవఆప్యేతి, యః స్పర్శయితవ్యమేవ అస్తమేతి;
వాయుమేవ ఆప్యేతియో, వాయుమేవ అస్తమేతి;
మోఘమేవ ఆప్యేతి యో, మోఘమేవ అస్తమేతి;
మేఘమేవ ఆప్యాతియో మేఘమేవ అస్తమేతి
సమానమేవ ఆప్యేతి యః సమానమేవ అస్తమేతి;
విజ్ఞానమేవ ఆప్యేతి యో, విజ్ఞానమేవ అస్తమేతి;
ఆనన్దమేవ ఆప్యేతి య,
ఆనన్దమేవ అస్తమేతి;
తురీయమేవ ఆప్యేతి యః
తురీయమేవ అస్తమేతి;
తత్ అమృతమ్, అభయమ్, అశోకమ్,
అనన్తమ్, నిర్బీతమ్ ఏవ ఆప్యేతి ఇతి।
<u>హోవాచ</u>
వాచమేవ ఆప్యేతి యో,
వాచమేవ అస్తమేతి;
వక్తవ్యమేవ ఆప్యేతి యో,
వక్తవ్యమేవ అస్తమేతి;
అగ్నిమేవ ఆప్యేతి యో,
అగ్నిమేవ అస్తమేతి;
కుమారమేవ ఆప్యేతి యః,
కుమారమేవ అస్తమేతి;

ఏ ఆత్మానారాయణుడు చర్మమును పొందుచున్నాడో.. ఆయనయే చర్మతత్త్వమును తన యందు తిరిగి లయింపజేసుకుంటున్నారు.

అట్లాగే స్పర్శానుభవ వస్తు కల్పన ఎవ్వరు (కల్పించుకొని) పొందుచున్నారో, అట్టి ఆత్మయందే స్పర్శయిత్వమంతా అస్తమించుచున్నది.

ఎవ్వరు వాయువును పొందుచున్నారో, అట్టి ఆత్మయందే వాయు తత్త్వము అస్తమించిన దగుచున్నది.

ఎవ్వరు మోఘమును (పాపమును) పొందుచున్నారో అట్టి మోఘము అట్టి ఆత్మయందే తిరిగి లయించుచున్నదగుచున్నది.

ఏ తత్త్వము సమాన ప్రాణము కల్పించుకొనుచున్నదో ఆ సమాన ప్రాణము మరల ఆ తత్త్వము నందే లయించుచున్నదగుచున్నది.

ఏ ఆత్మ'విజ్ఞానము'ను పొందుచున్నదో, ఆ విజ్ఞానము అట్టి ఆత్మయందే లయించుచున్నది.

ఏది ఆనందమున పొందుచున్నదో అద్దాని యందే ఆనందము లయిస్తోంది.

ఏది తురీయము పొందుచున్నదో అట్టి తురీయము అద్దానియందే (జలంలో తరంగంవలె) కరిగిపోవుచున్నది. లయము పొందుతోంది.

అవన్నీ బయల్వెడలి తిరిగి లయించుచున్నట్టి ఆత్మ-అమృతము, అభయము, అశోకము, అనన్తము అయి నిర్బీజత్వము పొందినదగుచున్నది.

ఏది వాక్కును పొందుచున్నదో, అద్దానియందే వాక్కు లయించినదగుచున్నది.

ఏది చెప్పబడుచున్నదంతా తననుండి బయల్వెడలదీయుచున్నదో,.. ఆ చెప్పబడుచున్నదంతా ఆ చెప్పుచున్న వక్తవ్యమునందే అస్తమించుచున్నది.

అగ్ని ఎవరిచే పొందబడుచున్నదో అది అగ్నియందే అస్తమించుచున్నది.

కుమారము (ఉపప్రాణము) ను ఏది పొందుచున్నదో, అట్టి కుమారము అద్దానియందే (ఆత్మయందే) లయించుచున్నది.

5. **వైరంభమేవ ఆప్యేతి యో వైరంభమేవ అస్తమేతి।**
**విజ్ఞానమేవ ఆప్యేతి యో విజ్ఞానమేవ అస్తమేతి।**
**ఆనన్దమేవ ఆప్యేతి య ఆనన్దమేవ అస్తమేతి।**
**తురీయమేవ ఆప్యేతి యః తురీయమేవ అస్తమేతి।**
**.. తత్ అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్,**
**నిర్బీజమ్ ఏవ ఆప్యేతి। ఇతి హో వాచ ....**

వైరంభమును (ఉపప్రాణము) పొందిన ఆత్మయందే ఆ వైరంభము తిరిగి అస్తమించు చున్నది.

విజ్ఞాన-అనన్ద-తురీయములు పొందుచున్న ఆత్మయందే అవి లయించిన వగుచున్నాయి.

అట్టి ఆత్మ అమృత రూపము! అభయ ప్రదాత!

శోకరహితము! అనన్తము! నిర్బీజ రూపము. (వాక్కు మొదలైనవి స్వస్వరూపము నందు అస్తమించగా) **కేవలము** అగుచున్నది.

---

6. **హస్తమేవ ఆప్యేతి యో, హస్తమేవ అస్తమేతి;**
**ఆదాతవ్యమ్ ఏవ ఆప్యేతి య, ఆదాతవ్యమేవ అస్తమేతి;**
**ఇన్ద్రమేవ ఆప్యేతి య, ఇన్ద్రమేవ అస్తమేతి;**
**అమృతమేవ ఆప్యేతి యో, అమృతమేవ అస్తమేతి;**
**ముఖ్యమేవ ఆప్యేతి యో, ముఖ్యమేవ అస్తమేతి;**
**విజ్ఞానమేవ ఆప్యేతి యో, విజ్ఞానమేవ అస్తమేతి;**
**ఆనందమేవ ఆప్యేతి య, ఆనందమేవ అస్తమేతి;**
**తురీయమేవ ఆప్యేతియః, తురీయమేవ అస్తమేతి;**
**తదమృతమ్, అభయమ్, అశోకమ్,**
**అనన్తమ్, నిర్బీజమ్, అవాప్యేతి॥**
**– ఇతిహోవాచ–**

హస్తమును పొందినదే హస్తమును తనయందు అస్తమింపజేసుకుంటోంది.

'తీసుకొనునది'ని పొందిన ఆత్మయందే ఆత్మచే 'తీసుకొనుటము' ను అస్తమింప బడుతోంది.

ఇన్ద్రుని సంకల్పించుకొని పొందిన ఆత్మయే, ఇంద్రుని తనయందు అస్తమింపజేసుకుంటోంది.

అమృతమును పొందినదే అమృతమును తనయందు లయింపజేసుకుంటోంది.

"ఇది ముఖ్యముకదా" - అని ముఖ్యమును కల్పించుకున్న ఆత్మయే ముఖ్యమును తనయందు అంతర్గతముగా చేసుకుంటోంది.

వాటికి సంబంధించిన విజ్ఞాన-ఆనందములు-అమృతము, అభయము, అశోకము, అనన్తము, నిర్బీజము అగు **ఆత్మ నుండే పొందబడినవై, ఆత్మయందే లయించుచున్నవగుచూ, కేవలాత్మయే శేషించుచున్నది.**

---

7. **పాదమేవ ఆప్యేతియో పాదమేవా అస్తమేతి।**
**గంతవ్యమ్ ఏవ ఆప్యేతియో గంతవ్యమేవ అస్తమేతి।**
**విష్ణుమేవ ఆప్యేతియో విష్ణుమేవ అస్తమేతి।**
**సత్యమేవ ఆప్యేతి యః సత్యమేవ అస్తమేతి।**
**అంతర్యామమేవ ఆప్యేయతియో, అంతర్యామమేవ అస్తమేతి;**
**విజ్ఞానమేవ ఆప్యేతి యో, విజ్ఞానమేవ అస్తమేతి;**
**ఆనన్దమేవ ఆప్యేతి యః, ఆనన్దమేవ అస్తమేతి;**
**తురీయమేవ ఆప్యేతి యః తురీయమేవ అస్తమేతి।**
**తత్ అమృతమ్, అభయమ్, అశోకమ్,**
**అనన్తమ్, నీర్బజమేవ ఆప్యేతి – ఇతి॥**
**– హోవాచ–**
**పాయుమేవ ఆప్యేతి యః, పాయుమేవ అస్తమేతి;**
**విసర్జయితవ్యమేవ ఆప్యేతి యో, విసర్జియితవ్యమేవ అస్తమేతి;**
**మృత్యుమేవ ఆప్యేతి యో మృత్యుమేవ అస్తమేతి;**
**మధ్యమామ్ ఏవ ఆప్యేతి యో మధ్యమామ్ ఏవ అస్తమేతి।**
**ప్రభంజన మేవ ఆప్యేతియః ప్రభంజనమేవ అస్తమేతి।**
**విజ్ఞాన మేవ ఆప్యేతి యో, విజ్ఞానమేవ అస్తమేతి।**
**ఆనందమేవ ఆప్యేతి య, ఆనన్దమేవ అస్తమేతి॥**

పాదములు ఎయ్యది పొందుచున్నదో, అద్దానియందే పాదములు అస్తమించు చున్నాయి.

'వెళ్లటము-నడవటము' అనేది ఎద్దానిచే పొందబడుచున్నదో అది అద్దానియందే లయించుచున్నది.

ఏ పరమాత్మ తత్త్వము విష్ణువును పొందుచున్నదో, విష్ణువు అద్దానియందే లయించుచున్నారు.

ఏది సత్యమును పొందటము జరుగుతోందో, ఆ సత్యము అద్దానియందే (ఆత్మయందే) లయించుచున్నది.

ఏది (ఆత్మ) అంతర్యామిత్వము పొందుచున్నదో, అద్దానిచేతనే అంతర్యామిత్వము కూడా అస్తమింపజేయబడుచున్నది.

విజ్ఞానము పొందబడగా, ఆ విజ్ఞానము విజ్ఞానమునందే అస్తమిస్తుంది.

ఆత్మయే ఆనందమును, తురీయమును పొందును. విజ్ఞానమును, ఆనందమును తురీయమును అస్తమింపజేసి ఆ అమృత-అభయ-అశోక- అనన్త - నిర్బీజ వస్తువునే పొందుచున్నది. **అట్టి ఆత్మయే ఏకము, సర్వముగా శేషించుచున్నది.**

ఇంకా విను, పాయువు పొందుచున్నటిదే పాయువును అస్తమింపజేస్తోంది.

విసర్జనత్వమును పొంది ఆ విసర్జనత్వమును తనయందు అస్తమింపజేస్తోంది.

మృత్యువును కల్పించుకొని, మృత్యువును తనలో అస్తమింపజేస్తోంది.

మధ్యమమును పొందినవే, ఆ మధ్యమమును తనయందు అస్తమింపజేస్తోంది.

ఏది ప్రభఞ్జనమును పొందుతోదో, ఆ ప్రభఞ్జనమును తానే తనయందు అస్తమింపజేస్తోంది. అద్దాని విజ్ఞానము కూడా తనయందే (ఆత్మ)

| | |
|---|---|
| **తురీయమేవ ఆప్యేతియః తురీయమేవ అస్తమేతి।**<br>**తత్ అమృతమ్, అభయమ్, అశోకమ్,**<br>**అనన్తమ్, నిర్బీజమ్ ఏవ ఆప్యేతి॥**<br>**-ఇతిహోవాచ।** | అస్తమింపజేసుకుంటోంది.<br>విజ్ఞానమును, ఆనందమును, తురీయమును అస్తమింపజేసుకుని ఆ అమృత-అభయ-అశోక-అనన్త, నిర్బీజస్వరూపము (కేవలాత్మ)ను పొందుచున్నదగుచున్నది. **ఆత్మ ఆత్మగా నిర్బీజమై శేషించుచున్నదగుచున్నది.** |
| **8. ఉపస్థమేవ ఆప్యేతి య, ఉపస్థమేవ అస్తమేతి।**<br>**ఆనందమయితవ్యమ్ ఏవ ఆప్యేతి య,**<br>**ఆనందయితవ్యమేవ అస్తమేతి;**<br>**ప్రజాపతిమేవ ఆప్యేతి యః ప్రజాపతిమేవ అస్తమేతి;**<br>**నాసీ(నా) రామేవ ఆప్యాతి యో నాసీ(నా)రామేవ అస్తమేతి।** | ఏది తననుండి ఉపస్థను పొందుచున్నదో అట్టి ఉపస్థను ఉపస్థత్వమునందే లయింపజేస్తోంది. ఆనందమును పొంది అద్దానిని ఆనందితవ్యము నందే అస్తమింపజేస్తోంది.<br>ఆత్మయే ప్రజాపతిని పొందుచున్నది. ఆ ప్రజాపతిని ఉపశమింపజేసుకుంటోంది. నాసీరుని పొందుతోంది. (అగ్ర ఈశ్వరుని పొందుతోంది) నాసీరము - దర్పము - ఈశ్వరత్వములను కూడా తిరిగి తనయందు లయింపజేసుకుంటోంది. |
| **9. కూర్మీరమేవ ఆప్యేతి యః, కూర్మీరమ్ ఏవ అస్తమేతి,**<br>**విజ్ఞానమేవ ఆప్యేతి యో, విజ్ఞానమేవ అస్తమేతి;**<br>**ఆనందమేవ ఆప్యేతి య ఆనన్దమేవ అస్తమేతి;**<br>**తురీయమేవా ఆప్యేతియః, తురీయమేవా అస్తమేతి;**<br>**తత్ అమృతమ్ అభయమ్ అశోకమ్**<br>**అనన్తమ్ నీర్బజమ్ ఏవా ఆప్యేతి॥**<br>**– ఇతి సహోవాచ–** | కూర్మీరమును (పంచ ఉపప్రాణములలో ఒకానొకటి). ప్రదర్శిస్తూ ఇంతలోనే అద్దానిని తనయందే ఉపసంహరించుకొనుచున్నది.<br>ఆయా ప్రదర్శన ఉపసంహరణ సంబంధములైన ఆనంద-తురీయములను పొంది వాటిని కూడా తిరిగి తనయందు ఉపసంహరించుకొనుచున్నది.<br>అమృతము-అభయము-అశోకము-అనన్తము-నిర్బీజము లగు ఆత్మత్వము పొంది ఆత్మగానే శేషించుచున్నది. ఆత్మ ఆత్మయందే శేషించినదై ఉన్నదగుచున్నది. |
| **10. మన ఏవ ఆప్యేతి యో, మన ఏవ అస్తమేతి;**<br>**మన్తవ్యమేవా ఆప్యేతి యో, మన్తవ్యమేవా అస్తమేతి;**<br>**చంద్రమేవ ఆప్యేతి యః చంద్రమేవ అస్తమేతి;**<br>**శిశుమేవ ఆప్యేతి యః, శిశుమేవా అస్తమేతి;**<br>**శ్యేనమేవ ఆప్యేతి యః, శ్యేనమేవ అస్తమేతి;**<br>**విజ్ఞానమేవ ఆప్యేతి యో, విజ్ఞానమేవ అస్తమేతి;**<br>**ఆనన్దమేవ ఆప్యేతి య, ఆనన్దమేవ అస్తమేతి;**<br>**తురీయమేవ ఆప్యాతి యః, తురీయమేవ అస్తమేతి;**<br>**.. తత్ అమృతమ్, అభయమ్, అశోకమ్,**<br>**అనన్తమ్, నిర్బీజమ్, ఏవ ఆప్యేతి। ఇతి।**<br>**-హోవాచ-**<br>**బుద్ధిమేవ ఆప్యేతి యో, బుద్ధిమేవ అస్తమేతి;**<br>**బోద్ధవ్యమేవా ఆప్యేతి యో, బోద్ధవ్యమేవా అస్తమేతి;**<br>**బ్రహ్మాణమేవ ఆప్యేతి యో, బ్రహ్మాణమేవ అస్తమేతి;**<br>**సూర్యమేవ ఆప్యేతి యః, సూర్యమేవ అస్తమేతి;**<br>**కృష్ణమేవ ఆప్యేతి యః, కృష్ణమేవ అస్తమేతి;**<br>**విజ్ఞానమేవా ఆప్యేతియో, విజ్ఞానమేవా అస్తమేతి;**<br>**ఆనందమేవ ఆప్యేతి య, ఆనందమేవ అస్తమేతి;**<br>**తురీయమేవ ఆప్యేతియః తురీయమేవ అస్తమేతి;**<br>**తత్ అమృతమ్, అభయమ్, అశోకమ్,**<br>**అనంతమ్, నిర్బీజమ్। ఏవ ఆప్యేతి। ఇతి।**<br>**– హో వాచ–** | మనస్సును పొంది, ప్రదర్శించి, ఆ మనస్సును అస్తమింపజేసుకుంటోంది. ఆలోచించు విషయములన్నీ కల్పన చేసుకొని ఆ మనోవిషయములన్నీ లయింపజేసుకొని చంద్రతత్త్వము (కేవల మనోరూపము) పొందిన దగుచున్నది. ఆ కేవల మనోరూపమగు చంద్రుని కూడా అస్తమింపజేసుకుంటోంది.<br>శిశువు (ఉపప్రాణము)ను పొందుచున్న ఆత్మయందే శిశువు అస్తమించిన దగుచున్నది. శ్యేనము (మరొక ఉపప్రాణము)ను ఎవరు పొందుచున్నారో, ఆయనయందే అస్తమించినదగుచున్నది. ఆత్మయే 'విజ్ఞానము'కు పొందుచున్నది. విజ్ఞానము - ఆనందము- తురీయము ఏ ఆత్మ పొందుచున్నదో, అదియే తనయందు అస్తమింపజేసుకున్న దై - అమృతము, అభయము, అశోకము, నిర్బీజము అగు కేవలాత్మ స్వరూపము సంతరించుకొనుచున్నది.<br>ఏది 'బుద్ధి'ని కల్పించుకొనుచున్నదో అదియే తిరిగి బుద్ధిని తనయందు అస్తమింపజేసుకొనుచున్నది. బుద్ధికి విషయమగు బోధవ్యమును పొందుచున్నది. ఆ బోధవ్యమును కూడా తన యందు అస్తమింపజేసుకొనుచున్నది.<br>సృష్టికర్తయగు 'బ్రహ్మ'ను కల్పించుకొని, ఆ బ్రహ్మను అస్తమింపజేయుచున్నది. సూర్యుని పొంది ఆ సూర్యుని తనయందు అస్తమింపజేయుచున్నది.<br>కృష్ణము (నిబిడాంధకారము)ను ఏది పొందుచున్నదో అది తనయొక్క కృష్ణత్వమునందు ఆ నిబిడాంధకారమును అస్తమింపజేయుచున్నది.<br>విజ్ఞాన ఆనందతురీయములను పొంది వాటిని కూడా తానే తనయందు అస్తమింప జేయుకొనుచున్నది.<br>ఆ విధంగా అన్నీ అస్తమింపజేసుకొన్నదై అమృతము-అశోకము- అనంతము- నిర్బీజము అగు స్వస్వరూపము మాత్రమే పొందినదై ప్రకాశించుచున్నది. |

**11.** అహంకారమేవ ఆప్యేతి యో, యో అహంకారమేవ అస్తమేతి;
'అహమ్ కర్తవ్యమ్' ఏవ ఆప్యేతి యో, 'అహమ్ కర్తవ్యమేవ' అస్తమేతిః
రుద్రమేవ ఆప్యేతి యో, రుద్రమేవ అస్తమేతి;
అసురమేవ ఆప్యేతి యో, అసురమేవ అస్తమేతి;
శ్వేతమేవ ఆప్యేతి యః, శ్వేతమేవ అస్తమేతి;
విజ్ఞాన మేవా ఆప్యేతియో, విజ్ఞానమేవ అస్తమేతి;
ఆనన్దమేవ ఆప్యేతి య ఆనన్దమేవ అస్తమేతి;
తురీయ మేవ ఆప్యేతి యః, తురీయమేవ అస్తమేతి;
తత్ అమృతమ్, అభయమ్, అశోకమ్, అనన్తమ్, నిర్బీజమేన ఆప్యేతి
– ఇతి హో వాచ –

ఏది అహంకారము పొందుచున్నదో అట్టి అహంకారమును తానే తనయందు అస్తమింపచేసుకొనుచున్నది. అహమ్‌కర్తవ్యము (కర్తవ్యములు కలవాడను) అనునది పొంది, అద్దానిని కూడా తనయందే విరమింపజేసుకొనుచున్నది. రుద్రమును పొంది ఆ రుద్రము (రౌద్రము)ను తన యందే అస్తమింపజేసుకొనుచున్నది. అసురత్వమును పొంది అది కూడా తనయందు లయింపజేసుకుంటోంది. శ్వేతమును (సాత్వికతను) పొంది శ్వేతమును తన యందే అదృశ్యపరచుకొనుచున్నది. విజ్ఞానము - అనన్దము- తురీయమును పొంది వాటిని తనయందు అస్తమింపజేసుకొనుచున్నది. అమృతము- అభయము- అశోకము-అనన్తము - నిర్బీజము అగు ఆత్మస్వరూపమై శేషించినదగుచున్నది.

---

**12.** చిత్తమేవ ఆప్యాతి యః చిత్తమేవ అస్తమేతి;
చేతయితవ్యమేవ ఆప్యేతి యః చేతయితవ్యమేవ అస్తమేతి।
క్షేత్రజ్ఞమేవ ఆప్యేతి యః క్షేత్రజ్ఞమేవ అస్తమేతి;
భాస్వతీమేవ ఆప్యేతి యో, భాస్వతీమేవ అస్తమేతి
నాగమేవ ఆప్యేతియో, నాగమేవ అస్తమేతి;
విజ్ఞానమేవ ఆప్యేతి యో, విజ్ఞానమేవ అస్తమేతి;
ఆనందమేవ ఆప్యేతి య, ఆనందమేవ అస్తమేతి;
తురీయమేవ ఆప్యేతియః,తురీయమేవ అస్తమేతి;
.. తత్ అమృతమ్ అభయమ్
అశోకం, అనన్తమ్ నిర్బీజమేవస్య ఆప్యేతి। ఇతి
– హోవాచ–

చిత్తమును పొందినదై ఆత్మ ఆ చిత్తమును తిరిగి తనయందే అస్తమింప జేసుకొనుచున్నది. చేతయితవ్యమును పొంది ఆ చిత్త విషయములగు చేతయితవ్యమును తనయందే లయింపజేసుకొనుచున్నది.

క్షేత్రజ్ఞత్వమును ఆత్మ పొందుచూ, అద్దానిని తనయందు ఆత్మయే అస్తమింపజేసుకొనుచున్నది. భాస్వతి (తెలియబడునదంతా) పొంది, ఆ భాస్వతిని తనయందు లయింప జేసుకొనుచున్నది. నాగమును పొంది ఆ 'నాగము'ను తనయందు అస్తమింపజేసుకొనుచున్నది.

విజ్ఞాన- ఆనంద-తురీయములను పొంది ఆ విజ్ఞాన- ఆనంద తురీయములను తనయందే అస్తమింపజేసుకొనుచున్నది.

అప్పుడు అమృతము; అభయము; అశోకము; అనన్తము, నిర్బీజము అగు స్వస్వరూపాత్మానందమై విరాజిల్లుచున్నది.

---

**13.** య ఏవం నిర్బీజమ్ వేద, నిర్బీజయేవ స భవతి।
న జాయతే। న మ్రియతే। న ముహ్యతే। న భిద్యతే।
న దహ్యతే। న ఛిద్యతే। న కమ్పతే। న కుప్యతే।
న సర్వదహనో। అయమ్ ఆత్మా- ఇతి యా చక్షతే॥
నైవమ్ ఆత్మా ప్రవచన శతేనాఽపి లభ్యతే।
న బహుశ్రుతేన। న బుద్ధి జ్ఞేన।
న శ్రుతేన। న మేధయా।
న వేదైః। న యజ్ఞైః। న తపోభిః ఉగ్రైః।
న సాంఖ్యైః। న యోగైః। న ఆశ్రమైః। న అన్యైః।
ఆత్మానమ్ ఉపలభన్తే।
ప్రవచనేన ప్రశంసయా వ్యుత్థానేన తమేతం బ్రాహ్మణాః
శుశ్రువాంసో అనూచానా ఉపలభన్తే।
శాంతో, దాంతో ఉపరతః తితిక్షుః సమాహితో భూత్వా
ఆత్మన్యేవ ఆత్మానం పశ్యతి।
సర్వస్య ఆత్మాభవతి, య ఏవం వేద॥

ఎవరైతే ఆత్మ యొక్క మరింకొకటేదీ జనించనట్టి - శుద్ధాత్మ స్వరూపమును ఎరుగుచున్నాడో, ఆతడు **నిర్బీజాత్మ స్వరూపమే** అగుచున్నాడు. అట్టి ఆత్మ సాక్షాత్కారముచే అట్టివాడు జనించడు. మరణించడు। మోహము పొందడు। అసలు భేదమనునదే పొందడు. ఖండింపబడడు. దహించబడడు, కంపనము పొందడు. కోపగించడు। దహించబడడు। అంతా ఆత్మగా దర్శించుచున్నాడు.

అట్టి **"ఆత్మతత్త్వ స్వానుభవము"** వందల ప్రవచనముల చేత కూడా లభించేది కాదు. ఎంతగానో విన్నా లభ్యమవదు. బుద్ధి యొక్క తెలియతేటలకు కూడా లభించదు. వేదజ్ఞానముచే పొందబడజాలదు. యజ్ఞములచేతగాని, ఉగ్ర తపస్సుచేతగానీ లభ్యమయ్యేది కాదు.

అది సాంఖ్య యోగ విశ్లేషణాజ్ఞానముచే కూడా ప్రాప్తించునది కాదు। ఏదో ఆశ్రమముల మార్పు చేతగాని మరింకేదైనా నిర్వర్తిస్తే గాని ఆత్మలభించునది కాదు.మరి? 1) ప్రవచన ప్రశంసచేత, 2) ఆత్మయందు వ్యుత్థానము (Wake Up) చేతను 3) బ్రహ్మవేత్తలు చెప్పేది వినాలనే కోరికచేతనూ, వినుచూ ఉండగా తనకు తానే లభింపజేసుకోవలసినట్టిది.

శాంతుడు (Peaceful by silencing all worldly Avocations), దాంతుడు (ఇంద్రియములను నిగ్రహించినవాడు), ఉపరతుడు (ఆత్మభావనయందు నియమితుడు) తితిక్ష ఓర్పులతో కూడుకున్నప్పుడు ఆత్మయే ఆత్మను దర్శించుచున్నది. ఇది ఎరుగటచే సర్వము ఆత్మయే అగుచున్నది.

**అథహి ఏనం రైక్వః పప్రచ్ఛ। 'భగవన్। కస్మిన్ సర్వే సంప్రతిష్ఠితా భవంతి?' ఇతి।**
**తస్మైహోవాచ: రసాతల లోకేషు ఇతి।**
**రైకః: కస్మిన్ రసాతల లోకా ఓతాశ్చ ప్రోతాశ్చ ఇతి?**
<u>**సమాధానం (సహోవాచ)**</u>
**భూర్లోకేషు ఇతి।**
**రైక్వ హో వాచ : కస్మిన్ భూలోకా ఓతాశ్చ-ప్రోతాశ్చ ఇతి?**
**సమాధానం : భువర్లోకేషు ఇతి।**
**రైక్వోవాచ : కస్మిన్ భువర్లోకా ఓతాశ్చ ప్రోతాశ్చ ఇతి?**
**సమాధానం : సువర్లోకేష్వితి।**
**రైక్వోవాచ : కస్మిన్ సువర్లోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి?**
**స|| మహర్లోకేషు ఇతి।**
**రైక్వోవాచ : కస్మిన్ మహర్లోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి?**
**స|| జనోలోకేషు ఇతి।**
**రైక్వో సహోవాచ : కస్మిన్జనోలోకా ఓతాశ్చ-ప్రోతాశ్చేతి?**
**స|| తపోలోకేషు ఇతి।**
**రైక్వోవాచ : కస్మిన్ తపోలోకా ఓతాశ్చ-ప్రోతాశ్చ ఇతి?**
**స|| సత్యలోకేష్వితి।**
**రైక్వః సహోవాచ : కస్మిన్ సత్యలోకా ఓతశ్చ ప్రోతాశ్చ-ఇతి।**
**స|| ప్రజాపతి లోకేష్వితి।**
**రైక్వేస్సహోవాచ : కస్మిన్ ప్రజాపతి లోకా ఓతాశ్చ ప్రోతాశ్చ-ఇతి।**
**స|| బ్రహ్మలోకేష్వితి**
**రైక్వేస్సహోవాచ : కస్మిన్ బ్రహ్మలోకా ఓతాశ్చ-ప్రోతాశ్చ ఇతి?**
**స|| సర్వలోకేషు, ఇతి।**
**రైక్వేవాచ : కస్మిన్ సర్వలోకా ఓతాశ్చ ప్రోతాశ్చేతి?**
**స|| సర్వలోక ఆత్మని బ్రహ్మణి-మణయ ఇవౌతాశ్చ ప్రోతాశ్చేతి?**
**గురుస్సహోవాచ : ఏవమ్ ఏతాన్లోకాన్ ఆత్మని షతిష్ఠితాత్, వేద। ఆత్మైవ స భవతి।।**
**నిర్వాణానుశాసనమ్ ఇతి। ఇతి వేదానుశాసనమ్, ఇతి।**
**వేదాను శాసనమ్।**

**రైక్వుడు** : గురుదేవా! భగవన్।
సర్వము దేనియందు ప్రతిష్ఠితమైయున్నది.

**గురుదేవుడు** : అంతాకూడా **రసాతలలోకములో** ప్రతిష్ఠితమై ఉన్నదయ్యా!

**రైక్వుడు** : అయితే మహనీయా। రసాతల లోకము ఎందులో ఓత-ప్రోతము గా ఉన్నది?

**గురుదేవుడు** : 'భూలోకము' నందు ఓత-ప్రోతమై ఉన్నది. భూలోకము భువర్లోకమునందు ఓత-ప్రోతము.

**రైక్వుడు** : భువర్లోకము ఎద్దానియందు ఏర్పడినదై (నిలువుగాను-అడ్డంగాను) యున్నది?

**గురుదేవుడు** : 'సువర్లోకము' నందు ఓత్-ప్రోతమైయున్నది.

**రైక్వుడు** : స్వామీ మరైతే 'సువర్లోకము' ఎందులో ఓత-ప్రోతమైయున్నది?

**గురుదేవుడు** : మహర్లోకము నందు.

**రైక్వుడు** : అప్పుడు మహర్లోకము ఎందులో ఓత్ - ప్రోతమై ఉన్నదగుచున్నది?

**గురుదేవుడు** : 'జనోలోకము' నందు.

**రైక్వుడు** : అట్లాగైతే జనోలోకము ఎందులో ఓత-ప్రోతమై ఉన్నది?.

**గురుదేవుడు** : తపోలోకము నందు.

**రైక్వుడు** : మరిక తపోలోకము ఎందులో ఓత-ప్రోతమై ఉన్నది?

**గురుదేవుడు** : 'సత్యలోకము' నందే!

**రైక్వుడు** : ఓహో! మరప్పుడు సత్యలోకము ఎందులో ఓత-ప్రోతమై ఉండి ఉంటోంది?

**గురుదేవుడు** : 'ప్రజాపతి లోకము' నందు

**రైక్వుడు** : అయినప్పుడు, ప్రజాపతి లోకము ఎందులో ఓత-ప్రోతమై ఉన్నది?

**గురుదేవుడు** : అదా? 'బ్రహ్మలోకము' నందు!

**రైక్వుడు** : అటువంటప్పుడు, బ్రహ్మలోకము' - ఎందులో ఓత-ప్రోతమై ఉన్నది?

**గురుదేవుడు** : బ్రహ్మలోకము సర్వలోకము లందు ఓత-ప్రోతమై ఉన్నది.

**రైక్వుడు** : సర్వలోకములు ఎందులో ఓత-ప్రోతమై ఉన్నాయి?

**గురుదేవుడు** : 'సర్వలోకములు కూడా బ్రహ్మము' అనబడు ఆత్మయందు - సూత్రము నందు మణులవలె - ఓత ప్రోతమై ఉన్నాయి.

**ఓ శిష్యా! రైక్వా! ఈ విధంగా ఎవ్వడైతే సర్వలోకములు ఆత్మయందే ప్రతిష్ఠితమై ఉన్నాయని గమనిస్తాడో తెలుసుకుంటాడో.. ఆతడు 'ఆత్మ'యే అగుచున్నాడు.**

**ఇది నిర్వాణ - అనుశాసనము।**

**- ఇది వేదానుశాసనము।**

**వేదాను శాసనము।**

1 అథ-హైనం రైక్వః పప్రచ్ఛః :
భగవన్। యో అయం
విజ్ఞానఘన ఉత్క్రామన్, స కేన
కతరవాద్వా అవస్థానమ్ ఉత్సృజ్య అపక్రామతీతి?
తస్మై (గురు) సహోవాచః
హృదయస్య మధ్యే లోహితం మాంసపిండం, యస్మిన్,
తత్ దహరం, పుండరీకమ్, కుముదమివ,
అనేకథా వికసితం। తస్య మధ్యే సమద్రః। సముద్రస్య
మధ్యే కోశః। తస్మిన్ నాద్యః శతశ్రో భవంతి।
తత్ర రమారమేచ్చా పునర్భవేతి
(రమా-అరమా-ఇచ్చా-పునః భవ ఇతి)
తత్ర రమా పుణ్యేన పుణ్యం లోకం నయతి।
అరమా పాపేన పాపమ్ ఇచ్ఛయా యత్ స్మరతి...,
తత్ అభిసంపద్యతే...,

**రైక్వుడు** : హే గురుదేవా! ప్రభూ! భగవాన్, అట్టి విజ్ఞాన ఘనుడగు ఆత్మాదేవాది దేవుడు ఉత్క్రమణము (వేకింగ్ అప్) పొందుచున్న వాడై దేనిచేత, ఏ స్థానము నుండి బయల్వెడలి, ఏ స్థానము వైపుగా బయల్వెడలు చున్నాడు.

**గురుదేవుడు** : హృదయము యొక్క మధ్య భాగములో ఎర్రటి మాంస పిండము ఉన్నది. అద్దాని మధ్యలో దహరము (హృదయ దహరాకాశము - అంతరంగ చతుష్టయమునకు జనన స్థానము - 'ఎరుక' అనే వెలుగుతో కూడిన ఆకాశము) ఉన్నది. అట్టి హృదయ దహరము తామర మొగ్గ, కలువల వలె అనేక విధములుగా వికసించినదై ఉన్నది. ఆ దహర మధ్యలో సముద్రము. ఆ సముద్ర మధ్యలో కోశము. దానిలో వందలాది సూక్ష్మమగు శక్తి నాడులు. ముఖ్యంగా నాలుగు నాడులు (1) రమా (2) అరమ(3) ఇచ్చా (4) పునర్భవ

'రమా'నాడియందు రమించు ఇచ్ఛగలవాడు పునర్జన్మ పొందుచున్నాడు. అట్టి 'రమా' నాడియందు పుణ్యకార్యముల సహాయముతో ఈజీవుడు పుణ్యలోకములు పొందుచున్నాడు. 'అరమా' యందు పాపము చేత పాపలోకములు పొందుచున్నాడు. ఈ జీవుడు ఇచ్చానాడియందు సంచరించువాడు. **ఏది స్మరిస్తూ ఉంటే అదియే పొందటము జరుగుతోంది.**

---

2 పునర్భవాయ కోశం భినత్తి।
కోశం భిత్వా శీర్ష కపాలం భినత్తి।
శీర్ష కపాలం భిత్వా పృథివీం భినత్తి।
పృథివీం భిత్వా ఆపో భినత్తి। ఆపో భిత్వా తేజో భినత్తి!
తేజో భిత్వా వాయుం భినత్తి।
వాయుం భిత్వా - ఆకాశం- భినత్తి।
ఆకాశం భిత్వా-మనో భినత్తి।
మనో భిత్వా భూతాదిం భినత్తి।
భూతాదిం భిత్వా మహాన్తం భినత్తి।
మహాన్తం భిత్వా అవ్యక్తం - భినత్తి।
అవ్యక్తం భిత్వా అక్షరం భినత్తి।
అక్షరం భిత్వా మృత్యుం భినత్తి।
మృత్యుర్వై పరే దేవ ఏకీ భవతీతి।
పరస్తాత్ న సత్, న అసత్, న సదసత్।
ఇతి ఏతత్ నిర్వాణానుశాసనమ్
ఇతి వేదానుశాసనమ్।
ఇతి వేదానుశాసనమ్।

పునర్భవ నాడీ సంచారముచే 'కోశము' - ఎప్పటికప్పుడు నశిస్తూ క్రొత్త చిగుళ్ళు చిగురిస్తూ ఉంటోంది.

కోశము యొక్క మూలము నశిస్తే 'శీర్షకపాలము' భేదించబడుచున్నది.

- శీర్షక పాలము భేదమవగా, 'పృథివి' భేదించబడుతోంది. పృథివి భేదించబడుటచే జలము భేదించబడుతోంది. జలము భేదించబడగా తేజస్సు భేదనమగుచున్నది. తేజస్సుచే వాయువు ఛేదన పొందుతోంది.

వాయువు ఛేదించి, ఆకాశమును భేదించుచున్నది.

ఆకాశ భేదనముచే మనస్సు భేదనము (బ్రద్దలు) చేయబడుతోంది.

మనస్సు భేదనము చెందుటచే 'భూతాది' కూడా భేదనము అగుచున్నది. భూతాది భేదమవగా, అప్పుడు 'మహాన్తము' భేదనము పొందుతోంది. మహాన్త భేదనము చేత 'అవ్యక్తము' భేదనమగుచున్నది. అవ్యక్తము యొక్క భేదనము అక్షతము యొక్క భేదనములకు దారితీయుచున్నది. అక్షతము బేధనమగుచుండగా 'మృత్యువు' (క్షతము) కూడా భేదనమగుచున్నది.

మృత్యువు - రూపరహితమై పరము అగు అఖండ పరమాత్మతో ఏకమగుచున్నది. అట్టి పర స్వరూపము సత్తుకాదు. **అసత్తు కాదు. సత్+అసత్తు (సదసత్తు) కాదు.**

**ఇది నిర్వానుశాసనము।**

**ఇది వేదానుశాసనము।**

**వేదానుశాసనము!**

ద్వాదశః ఖండః

నారాయణాద్వా 'అన్నం' ఆగతమ్।
పక్వం బ్రహ్మలోకే మహాసంవర్తకే।
పునః పక్వమ్। ఆదిత్యే। పునః పక్వమ్। క్రవ్యాది।
పునః పక్వమ్। జ్వాలకీల క్లిన్నం పర్యుషితమ్। పూతమ్।
అన్నమ్ అయాచితమ్; అసం క్లిప్తం,
తత్ అదశ్నీయాత్। న కంచన యాచేత।

**12వ ఖండము**

అన్నమ్ - అనుభవమగుచున్నదంతా! అనుభవముగా పొందేదంతా!
నారాయణుని నుండే అన్నము వచ్చుచున్నది. బ్రహ్మలోకమున పక్వమై (దృశ్యానుభవముగా సిద్ధించినట్టి) మహాసంవర్తకమున పక్వమైన తరువాత, ఆదిత్యుని యందు - ఆతరువాత క్రవ్యాదిగా పదార్థప్రారంభ దశ. పక్వమైన అన్నము నారాయణుని నుండే బయల్వెడలుచున్నది. మరల (రెండవసారి) పక్వమైనది, జ్వాలాకలచే పచనమై చమర్చ బడినది. (చల్లబడినది). పర్యుషితమైనది (వండి ఝాము దాటినది). అన్నము అయాచితమై ప్రాప్తించేది. అందుచేత అసంక్లిప్తంగా భావించాలి. అనగా అన్నమును ఎప్పుడూ మానసికంగా స్వీకరించకూడదు. (తానుగా) యోచించరాదు.

---

త్రయోదశః ఖండః

1 "బాల్యేన తిష్ఠాసేత్। బాలస్య భావో,.. అసంగో
నిరవద్యో, మౌనేన పాండిత్యేన
నిరవధికారతయా
ఉపలభ్యతే కైవల్య ముక్తం నిగమనం"
ప్రజాపతిః ఉవాచ।
మహత్ పదమ్ జ్ఞాత్వా,
వృక్షమూలే వసేత,
కుచేలో, అసహాయ, ఏకాకీ సమాధిస్థ,
ఆత్మకామ (ఆత్మను కోరుకొన్నవాడై), ఆప్తకామో,
నిష్కామో, జీర్ణకామో
హస్తిని, సింహే, దంశే, మశకే
నకులే, సర్ప యక్ష రాక్షస గంధర్వే
మృత్యో రూపాణి విదిత్వా-న బిభేతి, కుతశ్చనేతి॥

**13వ ఖండము**

**సద్గురువు** : ప్రియ సర్వమానవులారా?

బాలుని వలె ఎప్పుడూ ఉండాలి - అని ఉద్దేశ్యము కలిగి ఉండండి!

బాల భావనతోబాటు అసంగము (అన్‌అటాచ్డ్) అయి ఉండండి. నిరవద్యము (విభాగించబడజాలని రూపంగా) అవండి! అప్పుడు, మౌన నిరూపము, నిత్యానిత్య పాండితీరూపము, నిరవధికము (హద్దులు లేనిది), నిగమములచే (వేదములచే) గానము చేయబడుచున్నది అగు-'**కైవల్యముక్తి**' - లభించగలదు.

**ఒకప్పుడు ప్రజాపతి జీవులను ఉద్దేశ్యించి ఇట్లు పలికారు.**

**శ్రీ ప్రజాపతి** : ఓ బిడ్డలారా!

'**ఆత్మయే నేను**' అను మహత్‌పదమును చక్కగా-ముందుగా తెలుసుకొని ఉండండి. వృక్ష మూలమున కూర్చుని ఉండండి. మాసిన గుడ్డలతో ఏకాకి అయి 'సమాధి' యందు స్థితులై ఉండండి. ఆత్మను మాత్రమే కోరుకొనుచు, ఆప్తకాములై (ఆత్మకామము సిద్ధించుకొన్నవారై) మెలగండి. నిష్కాములై జీర్ణకాములై ఉండండి. ఏనుగు నందు సింహమునందు దోమయందు, ముంగిస యందు సర్ప-యక్ష-రాక్షస-గంధర్వులయందును '**ఇదంతా ఈతని పట్ల మార్పు చెందబోవుచున్నది. కనుక ఇదంతా మృత్యురూపమే**' అని గమనిస్తూ ఉండగా ఇక సర్వభయములు తొలగుతాయి. **అభయము సిద్ధిస్తుంది. దేనికీ భయముండదు.**

---

2. వృక్షమివ తిష్ఠాసేత్ ఛిద్యమానోఽపి,
న కుప్యేత। న కమ్పేత।
ఉత్పలమివ తిష్ఠాసేత్
ఛిద్యమానోఽపి న కుప్యేత, న కన్పేత।
ఆకాశమివ తిష్ఠా సేత్, ఛిద్యమానోఽపి
..న కుప్యేత, న కమ్పేత। సత్యేన తిష్ఠాసేత్।
సత్యో అయమాత్మా...!
సర్వేషామేవ గన్ధానాం పృథివీ హృదయమ్।
సర్వేషామ్ ఏవ రసానామ్ ఆపో హృదయమ్!
సర్వేషామ్ ఏవ రూపాణామ్ తేజో హృదయమ్।

నాయనలారా! ఒక వృక్షము వలె ఉండాలని కోరుకునెదరుగాక! నరకబడుచున్నప్పుడు కూడా వృక్షము కోపించదు. కంపించదు కదా! ఒక ఫలమును కత్తిపీటతో కోస్తున్నప్పుడు కూడా ఏ మాత్రము కోపము - కంపన పొందని విధంగా సుతిష్ఠితులై ఉండాలి.

ఖండించబడుచున్నప్పుడు కూడా ఆకాశము వలె కోపము-కంపన (యాంగర్ అండ్ డిస్టబెన్స్) పొందనివారై ఉండండి. పరమ సత్యమును ఆశ్రయించి, అవధరించినవారై ఉండండి. ఎందుకంటే మీరు సర్వదా ఆత్మస్వరూపులే.

సర్వగంధములకు (వాసనలకు)స్థానమేది? పృథివియే! గంధమునకు పృథివియే హృదయము.

సర్వ రసములకు హృదయస్థానము జలము.

సర్వ రూపానుభవములకు తేజస్సుయే హృదయస్థానము.

సర్వ స్పర్శానుభవములకు వాయువే హృదయ(ఉత్పత్తి) స్థానము.

| | |
|---|---|
| సర్వేషామ్ ఏవ స్పర్శానాం వాయుః హృదయమ్। | సర్వ శబ్దములకు ఆకాశమే హృదయము. |
| సర్వేషామ్ ఏవ శబ్దానామ్ ఆకాశమ్ హృదయమ్। | సర్వ గీతములకు అవ్యక్తమే హృదయస్థానము. |
| సర్వే షామ్ ఏవ గీతానామ్ అవ్యక్తం హృదయమ్। | సర్వ సత్త్వములకు (ఉన్నట్లుగా కనబడేవన్నిటికీ) మృత్యువే హృదయము. |
| సర్వేషామ్ ఏవ సత్వానామ్ మృత్యుః హృదయమ్। | మృత్యువునందు అన్నీ కూడా ఏకమై యుండి మృత్యువుకు ఆవల పరమై ఆత్మస్వరూపమున్నది. |
| మృత్యుర్వై పరే దేవ ఏకీ భవతీతి పరస్తాత్। | అట్టి పరస్వరూపము సత్- 'ఉన్నది' - కాదు. అసత్ 'ఉండనిది' కాదు. సదసత్తు - ఉండి లేనిది కాదు. |
| న సత్। న అసత్। న సదసత్॥ | |
| ఇత్యేతత్ నిర్వాణానుశాసనమ్। | **ఇది నిర్వాణానుశాసనము.** |
| ఇతి వేదానుశాసనమ్। | **ఇది వేదానుశాసనము** |
| ఇతి వేదా అనుశాసనమ్॥ | **వేదాను శాసనమే!** |

<u>చతుర్దశః ఖండః</u>

### 14వ ఖండము

| | |
|---|---|
| 1. పృథివీ వా అన్నమ్। ఆపో అన్నాదాః। | అన్నము = అనుభవించబడునది. అన్నాదమ్ = అనుభవించుచున్నది. |
| ఆపోవా అన్నమ్। జ్యోతిః అన్నాదమ్। | పృధివి - అన్నము (అనుభవించబడు స్వరూపము). జలము - అన్నాదము (పృథివికి స్థానము). |
| జ్యోతిర్వా అన్నమ్। వాయుః అన్నాదో। | జలము అన్నము ; జ్యోతి (అగ్ని) -- అన్నాదము (జలమునకు చోటు)! |
| వాయుర్వా అన్నమ్। ఆకాశో అన్నాద। | జ్యోతి అన్నము; **వాయువు** అన్నాదము (జ్యోతికి - అగ్నికి వాయువు ఉనికి స్థానము)! |
| ఆకాశో వా అన్నమ్। ఇంద్రియాణి అన్నాదాన్। | వాయువు అన్నము; **ఆకాశము** వాయువునకు అన్నాదము (వాయువు చలించు చోటు)! |
| ఇంద్రియాణి వా అన్నమ్। మనో అన్నాదం। | ఆకాశము అన్నము. **ఇంద్రియములు** అన్నాదము (ఆకాశమునకు స్థానము)! |
| మనో వా అన్నమ్। బుద్ధిః అన్నాదా। | ఇంద్రియములు అన్నము. **మనస్సు** అన్నాదము (ఇంద్రియములు ఉనికి కలిగి ఉన్న చోటు)! |
| బుద్ధిర్వా అన్నమ్। అవ్యక్తమ్ అన్నాదమ్। | **మనస్సే అన్నము. బుద్ధి** అన్నాదము. (మనస్సుకు బుద్ధి జనన స్థానము)! |
| అవ్యక్తం వా అన్నమ్। అక్షరమ్ అన్నాదమ్। | **బుద్ధి** అన్నమైతే, **అవ్యక్తము** అన్నాదము! |
| అక్షరం వా అన్నమ్। మృత్యుః అన్నాదో। | **అవ్యక్తము** అన్నమైనప్పుడు అక్షరము అన్నప్రదాత! |
| మృత్యుర్వై పరే 'దేవ' - ఏకీభవతి ఇతి॥ | అక్షరము అన్నము, అప్పుడు మృత్యువు అన్నప్రదాత! |
| పరస్తాత్ 'న సత్। న అసత్! న సదసత్! | మృత్యువు అమృత్యువుకు పరము (ఆవల)గా ఉన్న **ఆత్మదేవునితో ఏకీభూతము పొందుచున్నది.** అట్టి పరస్వరూపము సత్-అసత్-సదసత్ కూడా కాదు. |
| ఇతి ఏతత్.. | |
| -నిర్వాణాఽనుశాసనమ్। | ఇదియే నిర్వానుశాసనము! వేదానుశాసనము! |
| - ఇతి వేదానుశాసనమ్। | |
| - ఇతి వేదానుశాసనమ్। | |

<u>పఞ్చదశః ఖండః</u>

### 15వ ఖండము

| | |
|---|---|
| 1. అథ హి ఏనం రైక్వః పప్రచ్ఛ | <u>**రైక్వుడు**</u> : భగవాన్! గురుదేవా! విజ్ఞానఘనుడగు జ్ఞాని ఉత్క్రమించుచున్నపుడు (పైకిపోవుచున్నప్పుడు, మీఱుచున్నప్పుడు అట్టి ఆతడు ఏ ఏ స్థానములను దహించుచున్నాడు? ఉద్దీపించుచున్నాడు? (ఉత్క్రమణము = దాటివేయుట) |
| భగవన్। యో అయం విజ్ఞాన ఘన ఉత్క్రామన్ | |
| స కేన, కతరత్స్వ అవస్థానం దహతి? ఇతి। | |
| <u>తస్మై సహోవాచ</u> | **గురుదేవుడు** : ఆ యొక్క విజ్ఞాన ఘనుడు దేహము నుండి ఉత్క్రమించుచ్చుప్పుడు ఆతని ప్రజ్ఞ ప్రాణమును దహించుచున్నది. అంతేకాకుండా అపానమును, వ్యానమును, ఉదానమును సమానమును దహించుచున్నది. |
| యోఽయం విజ్ఞానఘన ఉత్క్రామన్ | |
| - ప్రాణం దహతి | |
| -అపానం, వ్యానం, ఉదానం, | ఉప ప్రాణములగు వైరమ్భమును, ముఖ్యమును, అంతర్యామమును, ప్రభంజనమును, కుమారమును, శ్యేనమును, శ్వేతమును, కృష్ణమును, నాగమును కూడా దహించుచున్నది. |
| సమానం, వైరమ్భమ్, ముఖ్యమ్, | |
| అన్తర్యామమ్, ప్రభఞ్జనమ్, కుమారమ్, | |

**శ్యేనమ్, శ్వేతమ్, కృష్ణమ్, నాగం దహతి।**
**-పృథివి-ఆపః-తేజో-వాయుః-ఆకాశం దహతి।**
**జాగరితం స్వప్నం సుషుప్తం చ తురీయం చ**
**-మహాన్తం చ లోకం, పరంచ లోకం, దహతి।**
**లోకాలోకం దహతి।**
**- ధర్మ-అధర్మమ్ దహతి।**
**-అభాస్వరం, అమర్యాదం,**
**నిరాలోకం, అతఃపరమ్ దహతి।**
**- మహాంతం దహతి।**
**అవ్యక్తం దహతి।**
**అక్షరం దహతి। మృత్యుం దహతి!**
**మృత్యుర్వై పరే దేవ**
**ఏకీ భవతీతి।**
**పరస్తాత్..**
**న సత్। న అసత్। న సదసత్।**
**ఇత్యేతత్ నిర్వాణానుశాసనమ్।**
**ఇతి వేదాఽనుశాసనమ్।**
**ఇతి వేదాఽను శాసనమ్।**

ఆతని ప్రజ్ఞ పంచభూతములగు పృథిని, జలము, తేజస్సు, వాయువు, ఆకాశములనూ కూడా దహించుచున్నది.

త్రిస్థానము- త్రిదశలగు జాగ్రత్-స్వప్న-సుషుప్తులను దహించుచున్నది. చతురీయము (తురీయము)ను కూడా కాల్చుచున్నది.

మహత్తును ఈ లోకమును పరలోకమును కూడా దహించుచున్నది.

లోకాలోకములను దహించి వేస్తోంది.

ధర్మ-అధర్మములను కాల్చుచున్నది.

అభాస్వరమును (వెలిగించనట్టి దానిని), అమర్యాదమును (పట్టించుకోని విషయములను), నిరాలోకమును అంతఃపరమును (అంతరంగమును మనోబుద్ధి-చిత్త-అహంకారములను) కాల్చివేయుచున్నది. మహాంతమును, అవ్యక్తమును కూడా దహిస్తోంది. ఇహ-పరములను కాల్చివేయుచున్నది.

అక్షరమును దహిస్తోంది.

మృత్యువును కూడా దహించి వేస్తోంది.

మృత్యువు ఆ పరదేవుని యందు (పరమాత్మ యందు) ఐక్యము పొందినదై, ఏకీభూతమగుచున్నది. **అప్పటికీ శేషించునదే కేవల సహజ పరస్వరూపము!** అది సత్తు కాదు! అసత్తుకాదు! సదసత్తు కూడా కాదు.

**ఇతి - నిర్వాణానుశాసనమ్।**
**ఇతి - వేదానుశాసనమ్**
**వేదానుశాసనమ్ ఇతి!**

---

షోడశః ఖండః

## 16వ ఖండము

**సౌబాల బీజ బ్రహ్మోపనిషత్..**
**న అప్రశాన్తాయ దాతవ్యం।**
**న అపుత్రాయ, న అశిష్యాయ,**
**- న అసంవత్సర రాత్రోషితాయ,**
**- న అపరిజ్ఞాత కులశీలాయ దాతవ్యం।**
**నైవచ, ప్రవక్తవ్యా।**
**యస్య దేవే పరాభక్తిః! యథా దేవే తథా గురౌ।**
**తస్య ఏతే కథితా హి అర్థాః**
**ప్రకాశన్తే**
**మహాత్మనః।**
**ఇత్యేతత్**
**నిర్వాణానుశాసనమ్**
**ఇతి వేదాఽను శాసనమ్।**
**ఇతి వేదాఽనుశాసనమ్**
***సౌబాల బీజ బ్రహ్మోపనిషత్ (లేక)***
***సుబాలోపనిషత్ సమాప్తః***
***ఓం శాంతిః। శాంతిః। శాంతిః।***

పరమ సత్యమును ప్రతిపాదించుచున్న ఈ 'సౌబాల బీజ బ్రహ్మోపనిషత్ పాఠ్యాంశమును

- ప్రశాంతముగా ఉండనివానికి బోధించరాదు.

- పుత్రుడు - శిష్యుడు కానివాడికి ఇవ్వకూడదు. (పితృభక్తి, గురు భక్తి లేని వానికి సంబోధించకూడదు).

ఒక్క సంవత్సరము గాని, ఒక రాత్రి గాని శ్రోతయొక్క ప్రజ్ఞ-ఆశయములను పరిశీలించకుండా చెప్పకూడదు.

కులశీలములు, కులధర్మములు తెలియని వానికి ఇవ్వనూ కూడదు. బోధించనూ కూడదు.

ఎవ్వనికి దైవభక్తి, గురుభక్తి ఉంటుందో ఆట్టి మహాత్ముని యందు మాత్రమే ఈ ఉపనిషదార్థము ప్రకాశించగలదు.

ఇదియే ఆత్మనిర్వచితమ్

**నిర్వాణానుశాసనము**
**వేదానుశాసనము.**
**వేదానుశాసనమితి**
**ఓం**
**ఇతి సౌబాల బీజ బ్రహ్మోపనిషత్ (లేక) సుబాలోపనిషత్ సమాప్తమ్**

శుక్ల యజుర్వేదాంతర్గత

# 15 సౌబాల బీజ బ్రహ్మోపనిషత్

## (లేక) సుబాలోపనిషత్

### అధ్యయన వచన పుష్పము

### 1 ప్రథమ ఖండము - సృష్ట్యాది

ఒకానొకప్పుడు రైక్వుడు అను వేద విద్యాపారంగతుడు తన గురువు అగు ఘోరాంగీరస మహామునీశ్వరుని ఆశ్రమం చేరి 'గురుశుశ్రూష' చేస్తూ భక్తి ప్రపత్తులతో ఆ సద్గురువు సూచించిన మార్గములో దీర్ఘకాలము తపో-ధ్యాన-యోగాభ్యాసములను నిర్వర్తించారు. క్రమంగా రైక్వుని బుద్ధి నిర్మలము, అధ్యాత్మ విద్యాశ్రవణమునకు అర్హము అగుచున్నట్లుగా గురువులగు శ్రీఘోరాంగీరసుల వారు గమనించారు. ఒకరోజు రైక్వుని, తదితర కొంతమంది శిష్యులను ఏకాంతమునకు ఆహ్వానించి తపస్సు-ధ్యాన-యోగ సంబంధమైన అనేక విశేషాలు, రహస్యాలు వివరించసాగారు. ఆ విధముగా వింటూ, రైక్వుడు ఇక పరబ్రహ్మతత్త్వశాస్త్రమగు **'ఆత్మానారాయణ విద్య'** గురించి గురువును పరిప్రశ్నించటము ప్రారంభించారు.

**ఘోరాంగీరస మునీంద్రుడు :** ప్రియరైక్వా! ప్రియబిడ్డలారా! సాధనలన్నిటి యొక్క పరాకాష్ట - ప్రయోజనము - **మీ సహజ స్వరూపమగు ఆత్మగురించి ఎరుగుటయే!** అట్టి అఖండమగు బ్రహ్మమే మొట్టమొదటి - ఆ తర్వాత - ఇప్పుడు - ఇంక ఎప్పటికీ ప్రకాశనమానమై ఉన్నదని, అది మీకు - నాకు - ప్రతి ఒక్కరికీ అద్వితీయమని ఎరుగటయే ఈ జగదనుభవ - సందర్భము యొక్క ముఖ్య ప్రయోజనము.

**రైక్వుడు :** హే సద్గురూ! మొట్టమొదట అఖండమగు బ్రహ్మమే ఉండి ఉండగా, ఏమి జరుగుటచే - ఈ ఎదురుగా కనిపిస్తున్న ద్రష్ట-దృశ్యముల తతంగమంతా ఏర్పడినదగుచున్నది? **తదాహుః, కిం తదాసీః?**

**ఘోరాంగీరస మునీంద్రుడు :** ఔను! మనము చెప్పుకొనుచూ వస్తున్న విధంగా మొట్టమొదట 'బ్రహ్మము' మాత్రమే ఉన్నది. అదియే **'పరమాత్మ', పరతత్త్వము', 'కేవలము'** అని కూడా అంటున్నారు. అయ్యది 'ఉనికి (సత్)' అనునది ఒక లక్షణముగా కలిగి ఉన్నది. అయితే,

- అది సత్తు (ఉన్నది) కాదు!
- అసత్తు (లేనిది) కాదు!
- సత్+అసత్తు (ఉన్నది+లేనిది) = అని కూడా కాదు! (ఉండీ లేనిది కాదు).

అందుచేత 'సత్-అసత్' శబ్దముల పరిధుల సహాయముతో నిర్వచించలేము. కేవల తేజోరూపమగు అద్వాని నుండి ఊహ-భావన-కల్పనా రూపమగు 'తమస్సు' - అనిర్వచనీయంగా బయల్వెడలుచున్నదని మాత్రం అనగలం.. అట్టి 'తమస్సు' నుండి పంచభూతాత్మకమగు **'భూతాది'** బయల్వెడలుతోంది. ఈ విధంగా నిర్విషయపరబ్రహ్మము నుండి సవిషయ సంబంధమైన **'తమస్సు'...,**

తమస్సు నుండి - భూతాది (The Materialism),
భూతాది నుండి - ఆకాశము (Space),
ఆకాశము నుండి - వాయువు (స్పందన, చలనము),
వాయువు నుండి - అగ్ని (తేజస్సు - ఉష్ణము),

అగ్ని నుండి – జలము (ఆపః – ద్రవము– ప్రవాహరూపము),

ఆపః నుండి – పృధివీ (Solid)

ఈ తత్త్వాలన్నీ బయల్వెడలుచున్నాయి.

అది ఒక సమమగు అణ్డము వంటిదిగా రూపుదిద్దుకొంటోంది. అదియే 'బ్రహ్మాండము' అనబడుచున్నది. అది సంవత్సరము ('సంవత్–సరమ్') కేవల సత్, సరస్సులో నిశ్చల జలమువలే కొంతకాలము అట్లే ఉండి, రెండు విధములుగా విభజనమగుచున్నది. 1) భూమి (క్రింద), 2) ఆకాశము (పైన)

భూమి – ఆకాశముల మధ్య **పురుషకారముతో** కూడిన **దివ్య పురుషుడు** ఉదయిస్తున్నారు. ఆ పురుషాకారము– **సహస్ర శీర్షా–పురుషః, సహస్రాక్షః, సహస్ర పాద్, సహస్ర బాహుః**– వేలాది శిరస్సులను, వేలాది కనులను, పాదములను, బాహువులను (ఆలోచనలు, దృష్టులు, నడకలు, కార్యనిర్వహణములు) – [ఒక కథారచయిత కథలో అనేక పాత్రలు రచించు తీరుగా] అవధరించుచున్నారు.

అన్నిటికీ అగ్రముగా (ముందుగా) 'మార్పు (Factor of Change)' అనురూపము గల మృత్యువు కల్పించబడుచున్నది. ఆ మృత్యువు నుండి

**త్ర్యక్షరమ్** – '3' అక్షరములు గల, (సృష్టి–స్థితి–లయలు)

**త్రి శిరస్కమ్** – '3' శిరస్సులు గల, (ద్రష్ట–దర్శన–దృశ్యములు)

**త్రి పాదమ్** – '3' పాదములు గల (జాగ్రత్–స్వప్న–సుషుప్తులు)

అనేవి ఖండపరశువు (గండ్రగొడ్డలి) వలె నియామకమగుచున్నాయి. అప్పుడు 'సృష్టించటము' – అనే స్వభావముతో కూడిన పురుషకారము ఉదయించుచున్నది. ఆ ప్రథమ పురుషకారుడు – బ్రహ్మము యొక్క తేజస్సుచే – సృష్టికర్తయగు **'బ్రహ్మదేవుడు'**గా స్తుతించబడుచున్నారు. అట్టి బ్రహ్మము+ (వేదములలోని) సృష్టి బ్రాహ్మణము (బ్రహ్మము+అహమ్) నుండి (లేక, బ్రాహ్మణముల నుండి) ఈ సృష్టి బయల్వెడలసాగింది. వారి నుండి ముందుగా మనో రూపులగు మానస – పుత్రులు జనించారు. వారు **సప్త మానస పుత్రులై** సృష్టిలో విరాజిల్లసాగారు.

ముఖము నుండి – బ్రాహ్మణులు (యోచనముల – అభిమానులు), --- [Thinking]

బాహువుల నుండి – రాజన్యులు (సామర్థ్యముల – అభిమానులు), --- [Functioning]

ఊరవుల (తొడల) నుండి – వైశ్యులు (పరిపోషణముల – అభిమానులు). --- [Maintaining]

పాదముల నుండి – శూద్రులు (ఇంద్రియానుభవముల – అభిమానులు), --- [Enjoying]

ఇవన్నీ – వీరంతా బయల్వెడలుచున్నారు. ఇంకా.... పురాణ పురుషుడగు హిరణ్యగర్భ పురుషుని దేహము నుండి మరికొన్ని కూడా బయల్వెడలుచున్నాయి.

మనస్సు నుండి – చంద్రుడు (ఓషధ – వనస్పద తత్త్వములు),

చక్షువుల నుండి – సూర్యుడు (తేజస్సు – ఆదిత్యుడు),

చెవుల నుండి – వాయువు, ప్రాణశక్తి,

ఆయన హృదయములోనే ఈ కనబడేదంతా జనించుచున్నది.

ఈ దృశ్య సృష్టి అంతా కూడా కేవలాత్మ నుండి జనించిన సృష్టికర్తయగు హిరణ్యగర్భుని (బ్రహ్మదేవుని) మనోవికాసమే! హృదయాంతర్గత విన్యాసమే!

## 2. ద్వితీయ ఖండము – సృష్టి పరికరములు

ఆ సృష్టికర్తృత్వ (సృష్టి అహంకార) పురుషుని నుండి

- అపానవాయువు (నిచ్చ్వాస వాయువు) నుండి నిషాదులు,
- ఎముకల నుండి యక్షులు, రాక్షసులు, గంధర్వులు,
- రోమముల నుండి పర్వతములు,
- లలాటము నుండి ఓషధులు, (ఆహార ధాన్యములు), వనస్పతములు (ఫలములు, పప్పు ధాన్యములు),
- ఆయన క్రోధము నుండి రుద్రుడు,
- ఆ మహాభూత స్వరూపుని ఊపిరి నుండి– ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణవేదము, వేదాంగములు, శిక్ష, కల్పన, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము, న్యాయము, మీమాంస, ధర్మశాస్త్రము, వ్యాఖ్యానము, తర్కశాస్త్రము..,
- అంతేకాక ఈ సర్వజీవరాశులు, వారివారి స్వభావములు, జీవన విధానములు.. ఇవన్నీ జనించసాగాయి.

ఎవనిలో ఈ విశ్వము, ఇందులోని త్రిలోకములు, జీవజాతులు, వారి–వారి ఆహార – విహారములు, పరస్పరానుకూలములు, పరస్పర ప్రతికూలములు..., ఇవన్నీ కనిపిస్తున్నాయో... ఆతడే హిరణ్య జ్యోతి స్వరూపుడగు 'బ్రహ్మ'!

ఆ సృష్టికర్త- సృష్టిగమన విధానముగా తనను తాను రెండు రూపములుగా కల్పించుకొనుచున్నారు. 1. పురుషుడు 2. స్త్రీ (పురుషుడు = పురుషకారము తనదైనవాడు, స్త్రీ = స-ర-త = సత్త్వ-రజో-తమోగుణ - వర్తన)

**దేవదేవుడుగా అయి** - అశరీర దివ్యప్రజ్ఞలతో మనోదేహమాత్రులగు దివ్య స్వరూప - దేవతలను సృష్టించారు.

**ఋషీశ్వరుడై** - ఋత్‌ను ఎరిగి ఆ ఋత్ (యదార్థమును) శబ్దపూర్వకముగా గానము చేయగా **వేదవాక్కులు** బయల్వెడలాయి.

అట్లాగే తన కల్పనా రూపమగు సృష్టియందు యక్షులను, రాక్షసులను, గంధర్వులను, జననివాసయోగ్యములగు గ్రామములను, జంతునివాస యోగ్యములగు అరణ్యములను, గ్రాసము స్వీకరించి క్షీరమును ప్రసాదించు పశువులను - **ప్రసాదించారు.** అందులో పునరుత్పత్తి చమత్కారము సుసృష్టితము అవసాగింది.

ఆవు-ఎద్దు; ఆడగుర్రము-మొగగుర్రము; విశ్వంభరుడు-విశ్వంభరి మొదలగువన్నీ సృష్టించారు. అట్లు సృష్టించబడుచున్న జీవులందరికీ ఆహారము-ఆహార విధానము కల్పించారు. చివరిగా తానే వైశ్వానర రూపుడై 'జఠరాగ్ని' దేహముతో తన కల్పనలను 'సందగ్ధా- **దహించసాగారు.**

## కల్పనా సందగ్ధము

పృథివి - జలమునందు, జలము - తేజస్సు (అగ్ని) యందు, తేజస్సు-వాయువునందు, వాయువు - ఆకాశమునందు, ఆకాశము- ఇంద్రియములందు, ఇంద్రియములు- (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధ) పంచతన్మాత్రల యందు, తన్మాత్రలు - 'భూతాది' యందు, భూతాది - సర్వజీవులులోని అఖండ అహంకార స్వరూపమగు 'మహతి' యందు, మహాన్ (మహత్) - అక్షరము నందు, అక్షరము - తమస్సు నందు, తమస్సు - పరతత్త్వము నందు **'విలీన ధర్మము'**ను పరికల్పన చేయసాగారు. ఆ విధంగా అన్నీ విలీనమగుచున్నప్పుడు కూడా, శేషించియుండే పరబ్రహ్మతత్త్వము

*అట్టి పరబ్రహ్మమును సత్తు కాదు! అసత్తు కాదు! సదసత్తు కాదు!*

ఇతి నిర్వాణశాసనమ్! వేదాను శాసనమ్!

## 3. తృతీయ ఖండము - ఆత్మ లక్షణములు

**రైక్వుడు :** మహాత్మా! మునిసత్తమా! ఈ పాంచభౌతిక జగత్తు- అంతాకూడా అనేక చిత్ర విచిత్ర సంప్రదర్శన విశేషములతో కూడి కనిపిస్తోంది కదా! ఇంతగా 14 లోకముల అనేక-అనేక చమత్కారములతో కూడిన ఈ జగత్తు మొట్టమొదట ఎక్కడ ఉండి ఉన్నది? ఎట్లా బయల్వెడలుతోంది? ఎవరివలన?

**ఘోరాంగీరస మునీశ్వరుడు :** మొట్టమొదట ఇది అసత్తే అయిఉన్నది. 'జగత్తు' అనునది ఆత్మాంశ అగు ద్రష్ట యొక్క భావన - ఊహ-అభిమాన-ఆవేశ ఫలస్వరూపమే। ఒక భావనచే ఒక తీరుగా, మరొక భావనచే మరొక తీరంగా ఉండటము చేత ఇది అసత్తు (స్వతఃగా లేనిది)గా చెప్పబడుచున్నది. ఇది 1) ద్రష్టయందు **స్వప్నమువలె** 2) ఆత్మయందు - **స్వతఃగా లేనిదై**, 3) ఆత్మకు **ద్వితీయము** కానిదై ఉన్నది. ఈ దృశ్యము సత్-అసత్ అని, (ఉన్నది - లేదు అని కూడా) అనవచ్చు! ఏ ఆత్మయందు- జలమునకు తరంగాకారము వలెను, మట్టికి 'కుండ' ఆకారము వలెను - ఈ జగత్తు అనుభవమగుచున్నదో, అట్టి **ఆత్మను తెలుసుకుంటే మాత్రమే ఈ జగత్తు యొక్క వాస్తవ రూపము (కల్పనామాత్రమని) తెలియబడగలదు.** 'మట్టిబొమ్మ యొక్క ఆకార విశేషాలు - (ఇది ఏనుగుబొమ్మ - ఇది బొమ్మ - ఇది రాముని బొమ్మ.. మొదలైనవి) ఎంతగా తెలుసుకొన్నప్పటికీ.. అంతా తెలిసినట్లు కానేకాదు. మట్టి గురించి తెలిస్తే "మట్టియే ఒకరు తన ఊహనుబట్టి ఒక బొమ్మగా చేశారు. మట్టి ఆకారముగా అవటము లేదు. కానీ ఆకారముగా ఉన్నది మట్టియే!" - అని తెలిసిపోతుంది. మట్టి యొక్క తత్త్వమేమిటో తెలిస్తే (ఆ మట్టితో ఏ ఆకారమైనా చేయవచ్చు కాబట్టి).. మట్టి బొమ్మ గురించి తెలిసినట్లే! ఆకారము గురించి ఎంతగా తెలిసినా మట్టి గురించి తెలియనంత కాలము - మట్టి బొమ్మ గురించి పూర్ణముగా తెలియనట్లే। కనుక ఆత్మ ఎట్టిదో తెలిస్తే **"జగత్తు మొదలే అసత్తు! ఆత్మకు వేరుగా ఏదైనా, జగత్తుగురించి తెలిసినా, అది అసత్తే। నాటకములో రెండు పాత్రల సంబంధము ఎటువంటిదో - ఈ జగత్తులోని జీవుల పరస్పర సంబంధాలు అట్టివి"** - అని తెలియగలదు. మరి ఆత్మ ఎట్టిది?

## ఆత్మతత్త్వ విశేషాలు

**అజాతమ్ :** శరీరమునకు జన్మ-వృద్ధి-క్షయ-నాశనములు ఉన్నాయి. శరీరి (One who is using the body) కి? అవి లేవు! ఆత్మకు 'జన్మ' అను ధర్మమే లేదు.

**అభూతమ్ :** శరీరము పంచభూత నిర్మితము. 'నేను'అను భావనతో ప్రదర్శితమగుచున్న 'శరీరి'కి? పంచభూత (పృథివి-జల-అగ్ని-వాయు-ఆకాశములచే) నిర్మితుడు కాదు. ఈ విధముగా ఆత్మ-అభూతము.

**అప్రతిష్ఠమ్ :** శరీరము ఇక్కడ ప్రతిష్ఠితమై ఉన్నది. (లేక) అక్కడికి వెళ్ళి ఆ ఇంటిలో ప్రతిష్ఠితమై ఉన్నది - అని అనగలము! ఎందుకంటే అది ఆకాశము (చోటు)లో ఉంటుంది. మరొకప్పుడు నశిస్తుంది. 'నేను' అనునది? ఒక చోట ఉన్నట్టిది కాదు.. ఆత్మ దేహములలో ప్రతిష్ఠితమై లేదు. ఆత్మ యందే దేహములన్నీ (ధరించబడిన) పూదండవలె గుచ్చబడినవై ఉన్నాయి. అందుచేత 'ప్రతిష్ఠతముగా కనిపించేవన్నీ ఆత్మ నుండే ప్రదర్శితమగుచున్నాయి. ఆత్మయో, అప్రతిష్ఠితము! ఒకచోట ఉన్నట్టిది కాదు!

**అశబ్దము :** సర్వమునకు పరమై, సర్వమునకు ఉత్పత్తి-స్థితి-లయ స్థానమగు పరతత్త్వ స్వరూపము శబ్దముచే చెప్పబడగలిగేది కాదు. మరి? శబ్దమునకు అది ఆధారము, అందుచేత 'అశబ్దము' అనబడుచున్నది. శబ్దములు అద్దానిని నిర్వచించి **"ఇది ఇట్టిది! ఇంతే"** ... అని చెప్పి ముగించలేవు.

**అస్పర్శమ్ :** ఆ పరస్వరూపము 'స్పర్శ'కు విషయమైనది కాదు. శరీరమును తాకగలము. అంతేగాని 'శరీరి'ని తాకలేము కదా! భౌతిక జగత్తు స్పర్శకు విషయము కావచ్చుగాక! ఆత్మను స్పర్శించనూలేము, 'ఈ తీరైనది' అని అననూలేము.

**అరూపమ్ :** ఈ శరీరమునకు రూపము ఉన్నది. దీనిని ఉపయోగిస్తున్న 'శరీరి'కి రూపము ఎక్కడిది? రూపమే లేని దానికి ఎల్లలు ఎక్కడివి? పరబ్రహ్మమునకు నామ-రూపములు లేవు. అరూపము!

**అరసమ్ :** పరమాత్మ ఒక పదార్ధము వలె రుచికి విషయము కాదు. అద్దాని స్వకీయ కల్పనయగు దేహములోని ఒక ఇంద్రియము (నాలుక)చే కల్పనా విభాగుడగు దేహి రుచిని ఆస్వాదించుచుండవచ్చుగాక! "దేహి" ని తన అంశగా గల పరతత్త్వము - నాలుకలో రుచిచూడబడు విషయము వంటిది కాదు. అరసమ్!

**అగన్ధమ్ :** అది పుష్ప సువాసన వలె ముక్కుకు వాసనానుభవముగా అగునదికాదు. అందుచేత అగన్ధము.

**అవ్యయమ్ :** కనబడేవన్నీ ఇప్పుడున్న స్థితిని మరొకప్పటికి కోల్పోతూ ఉంటాయి. (యత్ దృశ్యమ్-తత్ నశ్యమ్). పరమాత్మ జీవాత్మ-జగత్తులను ప్రదర్శించుచున్నది. అవన్నీ కాలబద్ధమై, మార్పుచెందు స్వభావము కలిగి ఉండవచ్చుగాక! పరమాత్మకు మాత్రం మార్పు-చేర్పులు ఉండవు. నటుడు పాత్రగా కనిపిస్తాడేమోగాని, పాత్రగా అవడు కదా! మార్పు-చేర్పులు లేవు కనుక **ఆత్మ అవ్యయమైనది.**

**మహాన్తమ్ :** ఒకడికి కలలో అనేక మంది కనిపిస్తూ ఉంటే, వారందరిలోని 'నేను' (లేక) ఆత్మ అనునది తానే కదా! 'నేను' అనునది (జాగ్రత్‌లో కూడా) 'నాది' అనుకొన్న అన్నిటిలో ప్రవేశించినదై ఉంటోంది. అహమ్ అజ్ఞాన దృష్టిచే ఒక్క దేహపరిమితము వలె కనిపిస్తూ ఉన్నప్పటికీ, సుజ్ఞాన దృష్టిచే 'నేను' అనునది - **'అందరిలోని నేనైన నేను'**గానే ఉన్నది. అందుచేత పరమాత్మ మహాన్తము. ఆత్మ రూప-నామ-కాల-ప్రదేశములకు పరిమితము కాదు. కనుక మహాన్తము!

**బృహన్తమ్ :** 'నాటకములోని పాత్రలన్నీ నాటక రచయిత యొక్క రచనా కళావిశేషమే (The Art of Drama - Writing) అయిన తీరుగా - సర్వబ్రహ్మాండములు తనలోనే కలిగి ఉండుటచే పరమాత్మ బృహత్తరమైనది. (The biggest of the Biggest). అందుచేతనే 'బ్రహ్మము' అని కూడా పిలువబడుతోంది.

**అజమ్ - అజాతమ్ :** ఆత్మ దేనినీ తనకు వేరుగా జనింపజేయటమూ లేదు. తాను జనించటము లేదు. సర్వస్వరూపమై యుండియే,... ఆత్మ సదా అప్రమేయమై, నిత్యమై, సత్యమై ప్రకాశించుచున్నది. కాబట్టే **'పరము-పరతత్త్వము-పరమాత్మ'** అని పిలువబడుచున్నది. ఆత్మ సర్వదా జన్మరహితము. దేనినీ జనింపజేయటమూ లేదు. అజము, అజాతము కూడా!

ఈ విధముగా ఎవ్వరైతే స్వస్వరూపమే అయి ఉన్న ఆత్మను తెలుసుకుంటారో, **-ఆత్మానమ్ జ్ఞాత్వా-మత్వా ధీరో న శోచతి**-అట్టి ఉత్తమ బుద్ధి కలవారు దేనికొరకూ శోకించరు, దుఃఖించరు. ఆత్మ నిత్యమై, తదితరమైనదంతా కల్పితమై ఉండగా, ఇక దుఃఖము దేనికొరకు?

ఓ రైక్వాయనా! తదితర శ్రోతలారా! ఎందులోంచి ఈ కనబడేదంతా జలములో తరంగమువలె భావన-ఊహగా ప్రదర్శితమగుచూ, ప్రతిష్ఠితమై, మరల మరొకప్పుడు లయించుచున్నదో... అట్టి పరతత్త్వము గురించి ఇంకా కొన్ని విశేషములను చెప్పుచున్నాను. వినండి!

❖

**అప్రాణము :** ప్రాణము (ప్రాణశక్తి) అద్దానిది. శక్తి వేరు - శక్తిమంతుడు వేరు కదా! ప్రాణశక్తి ఆత్మ నుండి బయల్వెడలుచున్నట్టిది. ఆత్మ ప్రాణశక్తికి, ప్రాణమునకు జనన స్థానము, తనకు ఉపకరణము అయిన మనస్సుకు కూడా ఉత్పత్తి స్థానమై ఉన్నట్టిది. అందుచేత అది అప్రాణము! ప్రాణము తనదై ఉన్నట్టిది; అంతేగాని **ప్రాణ రూపము కాదు** - ప్రాణముపై ఆధారపడి ఉన్నట్టిది కాదు!

**అముఖమ్ :** కళ్లు-చెవులు-ముక్కు-నాలుక- చర్మము.. ఇవన్నీ కలిగియున్నట్టి ముఖము అద్దాని ఉపకరణ వస్తువు. 'ఈ కనబడే సర్వము అద్దాని ముఖమే' - సర్వతోముఖమ్! అది శరీరము లేకపోయినా కూడా ఉండి ఉంటున్నట్టిది. కనుక - అముఖము.

**అశ్రోత్రమ్ :** అది చెవుల రూపము కాదు. వినికిడి రూపమూ కాదు. వినికిడి అద్దాని చిత్కళ. చెవులు అందుకు ఉపకరణాలు. అవి స్వతఃగా జడములై, ఆత్మచే ఉపయోగించబడుచున్నవై, ఆత్మచే చైతన్యము పొందుచున్నాయి. అందుచేత **'వినికిడి'** అనే ధర్మమునకు ఆత్మ బద్ధము కాదు. నేను ఉపయోగించు వస్తువు యొక్క ధర్మములు 'నావి' కాని, 'నేను' కాని అవవు కదా! పరతత్త్వము ఈ విధముగా అశ్రోత్రము.

**అగమనో :** ఆత్మ ఒకచోటి నుండి బయలుదేరి – మరొకచోటికి నడిచి వెళ్ళునది కాదు. 'ఈచోటు– ఆ ప్రదేశము'.. ఇవన్నీ శరీర ధర్మాలు.. 'ఈ లోకము–ఆలోకము'.. అనునవో? మనోధర్మాలు. **ఆత్మకు రాకపోక ధర్మాలు లేవు.**

నేను ఇంట్లో ఉన్నప్పుడు – ఉద్యోగ ప్రదేశములో ఉన్నప్పుడు – స్నేహితులతో ఉన్నప్పుడు – సత్సంగములో ఉన్నప్పుడు – 'నేను' అనునది ప్రదేశాలు మారుస్తోందా? అంతా ఒక్క 'నేనే' కదా! అట్లాగే ఆత్మకు ఆగమన–నిష్క్రమణములు లేవు. జాగ్రత్‌లో 'ఈతడు వెళ్ళాడు – వచ్చాడు' అనునవి చెప్పుకుంటున్నాం. జాగ్రత్–స్వప్న–సుషుప్తులు, దేహ–దేహాంతరములు తనలో కలిగి ఉండే ఆత్మ ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్ళగలదు? గమనములు లేనిది! ఉదాహరణకు, ఒకడు కలలో ఈ ఊరినుంచి ఆ ఊరికి వెళ్ళినప్పటికీ, కల తనదైనట్టి ఆతడు ఎక్కడినుండి ఎక్కడికీ వెళ్ళుచుండుటలేదు కదా!

**అతేజసమ్ :** ఆత్మ యొక్క తేజోరూపమే సూర్య–చంద్ర–నక్షత్ర – అగ్నిలలో తేజోరూపముగా అగుపిస్తోంది. తేజోరూపమును ప్రదర్శిస్తూ దర్శించుకొనుచున్నది కూడా ఆత్మయే! అంతేగాని ఆత్మ తేజోరూపము కాదు. ఒకని ముఖ తేజస్సు ఆతనిది కావచ్చునేమో! అంతేగాని 'ఆతడు' కాదు కదా! ఆత్మ అతేజసము.

**అచక్షుష్కమ్ :** జాగ్రత్–స్వప్నములలో ఉపకరణమై ఉంటున్న చక్షువులు – చూపు అద్దాని చిత్కాళా విశేషాలు. ఆత్మ 'చూపు'రూపము కాదు. చూపులకు విషయము కాదు. చూపు–చూపులకు విషయములు–ఈ రెండూ కూడా ఆత్మ సాన్నిధ్యముచే ప్రవర్తితమగుచున్నాయి. ఒకడు కళ్ళు మూసుకొని– ఏదీ చూడటము మానివేసినప్పటికీ – తాను లేకుండా పోడుకదా! ఈ విధముగా ఆత్మ చక్షువులకు– చూపుకు పరిమితమైనది కాదు. విషయము కాదు.

**అనామ–గోత్రమ్ :** లౌకికమైన – సాంఘికమైన జీవనా విధి విధానాలలో ఒకనిని గుర్తించటానికై కల్పించబడే నామ – గోత్రములు సాంఘిక–లోకాంతర్గత సంబంధమైన కల్పనలు మాత్రమే! ఆత్మకు నామము – గోత్రము ఆపాదించ వీలుకాదు. 'నేను' అనుదానికి దేహనామము – గోత్రము – జాతి ఎట్లా ఆపాదించగలము? అందుచేత ఆత్మ నామ – గోత్ర సంబంధమైనది కాదు. ఆత్మ అనామమ్! అగోత్రమ్!

**అశిరస్కమ్ :** అన్ని శిరస్సులు తనవై ఉన్న దానికి (సహస్ర శీర్షా పురుషః) – ఇది **అద్దాని శిరస్సు– అని ఎట్లా అంటాము**? అన్ని రూపాలు తనవే అయినదానికి 'ఇది రూపము' అని అనలేము కదా! **'ఆత్మకు శిరస్సులేదు. కానీ, శిరస్సును వెలిగించునది ఆత్మయే'!**

**అపాణి పాదమ్ :** అన్ని హస్తములు (చేతలు–చేతులు), అన్ని పాదములు (నడకలు–నడతలు) అద్దానివే! అది పాణి పాదము అగుచున్నదా! 'నేను' అను దానికి ఈ దేహము, దీని యొక్క చేతులు – కాళ్లు **ఉపయోగించబడు ఉపకరణములు మాత్రమే**గాని, 'నేను' అనునది కాళ్లు–చేతులుగా అవదు కదా! ఈ విధముగా పరతత్త్వము చేతులు–కాళ్లు.. లేనట్టిది. అంతటా తానే అయి, సమమై ఉన్నట్టి పరమాత్మకు చేతులతోను, కాళ్లతోను పని ఏమున్నది? (సర్వతః పాణిపాదమ్ తత్).

**అస్నిగ్ధమ్ :** ఒక వస్తువుకు నునుపు–గఱుకు ఉన్నట్లుగా ఆత్మ నునుపైన – గఱుకైన వస్తువు వుంటిది కాదు.

**అలోహితమ్ :** అద్దానికి లోహధర్మములు (రూపము–గుణము–రంగు–రసాయన ధర్మాలు మొదలైనవి) లేవు. అందుచేత అలోహితము.

**అప్రమేయమ్ :** అది దృశ్య–దేహ–మనో–బుద్ధి–చిత్త–త్రిగుణ–అహంకార–అవ్యక్త–మహత్– మొదలైనవాటికి సంబంధించినది కాదు. అవి ఆత్మకు సంబంధించినవి కూడా కావు. ఆత్మ సర్వదా విడిగా ఉండి, అద్దాని తేజో విలాసముచే.. అవన్నీ దృశ్యమానమగుచున్నాయి. అందుచేత ఆత్మ సర్వదా ప్రమేయము లేనిది! (Neither Related to nor limited to whatever outwardly appearing). అప్రమేయము!

**అహ్రస్వమ్ – అదీర్ఘమ్ :** వస్తువులకు వలె ఆత్మకు పొట్టి–పొడవు ధర్మాలు లేవు. ఒకడు పొట్టిగా ఉంటే 'నేను' అనునది పొట్టిగా ఉండినట్లా? పొడవుగా ఉంటే, 'నేను' అనునది పొడవుగా ఉన్నట్లా? కాదు కదా!

**అస్థూలమ్ – అణస్వమ్ :** ఆత్మస్థూల వస్తువు (Material Object) కాదు. అణువు వలె సూక్ష్మమైనది కూడా కాదు. అవన్నీ జడమగు పదార్థ ధర్మాలు.. వాటన్నిటికీ–చైతన్య స్వరూపమై **ఆత్మయే** –ఆధారముగా ఉన్నది.

**న అల్పమ్ – న అపారమ్ :** ఆత్మ అల్పము కాదు. అపారము కాదు. అవన్నీ వస్తు గుణ సంబంధమైనవి. 'శక్తి–శక్తిమంతుడు' కూడా

అయినట్టి ఆత్మ అల్పము-అనిగాని అపారము అనిగాని ఎట్లా అంటాము? అనన్యమగు ఆత్మకు చిన్న-పెద్ద తేడాలు ఆపాదించటమెట్లా?

**అనపావృతమ్ -అసంవృత్తము :** ఆత్మదేనినీ చుట్టుకొని ఉండటము లేదు. ఆత్మను మరొకటేదీ పట్టుకొని ఉండటము కూడా లేదు. అందుచేత అనపావృతము, అసంవృతము కూడా!

**అప్రకాశ్యమ్ :** మరొకటేదీ ఆత్మను ప్రకాశింపజేయలేదు. ఆత్మసర్వదా స్వయం ప్రకాశకము. సూర్యుని చూడటానికి దివిటీ కావాలా? ఆత్మను ప్రకాశింపజేయ గలిగినది ఏదీ ఎక్కడా లేదు. అందుచేత అప్రకాశ్యము.

**అనన్తరమ్ - అబాహ్యమ్ :** ఆత్మలోన ఉన్నది కాదు. బయట ఉన్నది కాదు. (అన్తర్బహిశ్చ తత్ సర్వమ్ వ్యాప్య నారాయణ స్థితః). అంతా అదే అయి ఉండగా, అద్దానికి బాహ్యమేమున్నది? అంతరమేమున్నది? భౌతికాకాశమునకే బాహ్య-అభ్యంతరములు లేవు. ఇక ఆత్మాకాశము మాట వేరుగా చెప్పాలా?

**న తత్ అశ్నాతి కించన। నతత్ అశ్నాతి కశ్చన।** : అట్టి ఆత్మ ఏదీ అనుభవించటమూ లేదు. అది ఎవ్వరి చేతనూ అనుభవించబడటమూ లేదు. అది ఏదీ తినుట లేదు. ఏదీ అద్దానిని తినటమూ లేదు. నాటకములో ఒకడు నటిస్తూ ఉంటే.. పాత్ర పొందుచున్నదేదీ పాత్రధారుడు పొందుచున్నట్లు కాదు కదా! నాటకములోని పాత్రధర్మములకు - నటునికి ఏమి సంబంధం?

ఓ రైక్వా! ప్రియబిడ్డలారా! అట్టి ఆత్మ వస్తువును అర్థము చేసుకోవటము కోసమే మనము ఈ 'జీవితము' అనే అవకాశమును ఉపయోగించుకోవాలి. సత్యము-దానము- తపస్సు-చెక్కు చెదరని (అంతా బ్రహ్మమే-అను భావనతో కూడిన) బ్రహ్మచర్యముతో - ఈ ప్రాపంచక సర్వ విషయముల పట్ల 'నిర్వేదన' (Non-Worrying) పెంపొందించుకున్నప్పుడు - ఆరవ (6) అంగమగు **మనస్సు** సహాయంతోను, **మీలోనే సర్వదా వేంచేసినదై యున్న ఆ ఆత్మవస్తువును** - సాధయేత్-**సాధించుకోవాలి!** సిద్ధింపజేసుకోవాలి. అట్టి ఆత్మ దృష్టి (లేక) ఆత్మదర్శనము కొరకై ఉపాయములను వినండి.

**దమము** - ఇంద్రియ నిగ్రహము

**దానము** - సర్వము పరమాత్మకు చెందినదిగా భావించి, సహజీవులకొరకై సమర్పణ భావము కలిగి ఉండటము.

**దయ** - సహ జీవుల పట్ల దయ, ప్రేమ కలిగి ఉండటము

..... ఇటువంటి శాస్త్ర-మహనీయ ప్రవచితములగు ఉపాయములను ఆత్మదర్శన-ఆశయముతో ఆశ్రయించిన వారై ఉండండి. అంతేగాని

- ఇంద్రియ విషయములకు వశులై,
- 'అంతా నాదే' అనే మమకార-అహంకారములతో లోభ గుణముతో,
- కోప-తాప-ఆవేశములుచే పరవశులై....,

'మానవజన్మ' అనే అవకాశము దుర్వినియోగ పరుచుకోకండి!

ఎవ్వడు సర్వ ప్రయత్నములచే సర్వదా, సర్వమై, సర్వమునకు సాక్షి అయి ఉన్న బ్రహ్మమును ఇక్కడే - ఇప్పుడే సంశయ రహితముగా ఎరిగి ఉంటాడో.. ఆతని ప్రాణములు దేహమును విడచినప్పుడు మరెక్కడికో పోవు. **న తస్య ప్రాణా ఉత్క్రామన్తే।** మరి? **అత్రైవ సమవలీయన్తే** బ్రహ్మైవసన్? ఆ ప్రాణములు బ్రహ్మమును ఎరిగి ఉండుటచేత బ్రహ్మమునందే విలీనమగుచూ..,

***బహ్మ ఆప్యేతి య ఏవం వేద!***

బ్రహ్మమునే పొందుచున్నాయి. **(బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి!)** బ్రహ్మమును ఎరుగుటచే ఆతడు బ్రహ్మమే అగుచున్నాడు. ఇది **వేదములు ఎలుగెత్తి గానం చేస్తున్న సత్యవాక్కు!**

## 4. చతుర్థఖండము - హృదయ పద్మము

**ఘోరాంగీరసమునీశ్వరుడు :** నాయనలారా! ఇంకా వినండి. **హృదయస్య మధ్యే లోహితం మాంస పిండం।**

హృదయము యొక్క మధ్య ప్రదేశములో లోహితము (పద్మరాగము వలె ఎరుపు రంగుతో కూడిన) మాంస పిండము ఉన్నది. ఆ హృదయ మాంసపిండము యొక్క అంతర్గతంగా తామరమొగ్గ - కలువల వలె హృదయాకాశ పుష్పము అనేక విధములుగా (నును రెక్కల వంటి విభాగములతో) వికశితమై యున్నది. తత్ దహరం పుండరీకమ్। అదియే దహరము "దహరాకాశము" అనబడుచున్నది.

**హృదయస్య దశ ఛిద్రాని భవన్తి। యేషు ప్రాణాః ప్రతిష్ఠితాః।**అట్టి హృదయకుశుమమునకు సూక్ష్మమగు 10 ఛిద్రములు (గుండ్రటి చిల్లులు) ఉన్నాయి. ఆ పది ఛిద్రములలో సూక్ష్మ ప్రాణములు ప్రతిష్ఠితమై ఉన్నాయి.

ఆ హృదయ కుశుమములో సంచరించుచున్న పంచ ప్రాణములలో మొదటిదైన ప్రాణవాయువుతో (బయట నుండి లోనికి వచ్చి నిలుచు ప్రాణధ్యాసతో) సంయుజ్యము పొందుచున్నప్పుడు అట్టి వానికి-అనేక నదీ సంబంధమైన - నగర సంబంధమైన - ఇత్యాది దృశ్యములు కనబడుచూ ఉంటాయి.

**యదావ్యానేన సహ సంయుజ్యతే తదా పశ్యతి దేవాంశ్చ, ఋషీంశ్చ।** ఎప్పుడైతే తన యొక్క దేహములోని **వ్యాన ప్రాణచలనముతో** (ప్రాణాయామ విధానంగా), హృదయ ఛిద్రములలో ఉన్న దహరాకాశ స్థానములలో ప్రవేశింపజేసి...., (తన వ్యాన చలనమును ఆ హృదయములోని దహరాకాశములో ప్రవేశింపజేస్తాడో) ఏకము చేస్తాడో, అప్పుడాతడు దేవతల-ఋషుల దర్శనము చేయగలుగుచున్నాడు. వారితో సంభాషణము సిద్ధించుచున్నది. యదా అహనేన సహ సంయుజ్యతే తదా పశ్యతియక్ష రాక్షస గంధర్వాన్!

ఎప్పుడు అపానము - హృదయ పుష్పములోని ఛిద్రములో ప్రవేశించి అక్కడి దహరముతో ఏకము చెందుతుందో, అప్పుడు యక్ష-రాక్షస-గంధర్వుల దర్శనము అగుచున్నది.

**ఉదాన చలనముతో** కూడి - హృదయ పుష్పఛిద్రాంతర్గత ప్రాణశక్తితో దహరములో ధ్యాస ప్రవేశించినప్పుడు దేవలోకములు, దేవతలు, స్కందుడు, జయంతుడు, (ఇంద్రకుమారుడు) మొదలైన వారి దివ్యదర్శనము అగుచున్నది.

**సమానప్రాణముతో** కూడి హృదయ పుష్పఛిద్రములోని దహరాకాశములో ధ్యాసతో కలిసినప్పుడు దేవలోకము - నందనవనము, పారిజాతవనము, కామధేనువు, కల్పవృక్షము మొదలైన దేవతా సంపదలు దర్శనమగుచున్నాయి.

(ఉపప్రాణ రూపమగు) - **వైరంభ ఉపప్రాణముతో** మరియు ధ్యాసతో కూడి హృదయ పుష్ప ప్రవేశము చేసి, ఆ పుష్పఛిద్రములోని దహరముతో కలియుటచే, అట్టియోగి వైరంభ ప్రాణ సంయోగముచే - చూచినవి-చూడనివి, విన్నవి-విననివి, భుజించినవి-భుజించనివి, సత్యము- అసత్యము- ఇటువంటివన్నీ చూడగలుగుచున్నాడు. ఈవిధంగా దేహ దశప్రాణముల సహాయముతో హృదయాకాశ ప్రాణదశ దళములతో యోగాభ్యాసులు ఏకము చేసి సిద్ధిని పొందుచున్నారు. ఇప్పుడిక హృదయాకాశ ప్రాణదశ దళములతో యోగాభ్యాసులు ఏకము చేసి సిద్ధిని పొందుచున్నారు.

❖

ఇప్పుడిక హృదయ దహరాకాశ - దశప్రాణ కుసుమ దళముల నుండి, పిండభాగమునకు వద్దాము. ఆ హృదయ పిండము నుండి 10 ముఖ్యనాడులు బయల్వెడలుచున్నాయి. ఆ ప్రతి ఒక్కనాడి నుండి '72000' ఉపనాడులు బయల్వెడలుచున్నవై ఉన్నాయి.

జీవాత్మప్రజ్ఞ ఆ హృదయ పిండమునందు ప్రవేశించి నిదురించుచున్నప్పుడు (విశ్రాంతి పొందినప్పుడు) **ఒకానొక శబ్దము వెలువడుతూ ఉంటుంది.** హృదయకోశము యొక్క రెండవ భాగము నందు ఈ జీవాత్మ ప్రజ్ఞ ప్రవేశించి నిదురిస్తున్నప్పుడు, **ఇహ-పరలోక విభాగములన్నీ చూస్తూ ఉంటోంది.** సర్వశబ్దార్థములను (మహావాక్యార్థములను) ఎరుగగలుగుచున్నది. ఇట్టి రెండవ హృదయ కోశ విభాగ ప్రవేశమును యోగశాస్త్రములో **'సంప్రసాద'**.. అని పిలుస్తున్నారు. హృదయ పిండములో ఒకవైపు నిద్రా మౌనము, రెండవవైపు విశ్వము.

ఆ ప్రాణశక్తి ఈ భౌతిక దేహమును ఎల్లప్పుడు పర్యవేక్షిస్తూ, పరిరక్షించుచూ ఉన్నది.

దేహములో ఆకుపచ్చని-నల్లని-పసుపుపచ్చని-ఎర్రని-తెల్లనినాడులు ఉన్నాయి. అవి అన్నీ **-రుధిరస్య పూర్ణాః-** రక్తముతో పరిపూర్ణములై ఉన్నాయి. హృదయ మాంసపిండము నందలి దహరము (ఆకాశము) తామర మొగ్గవలె, కలువపువ్వు వలె అనేక విధములుగా వికసించి ఉన్నది. 10 నాడులను ఆశ్రయించి ఉన్న 72000 ఉపనాడులు- వెంట్రుకలో వెయ్యవ వంతు (1/1000) పరిణామములో శక్తిరూపముగా ఉండి శరీరమంతా విస్తరించి ఉన్నాయి. హృదయాకాశములోని విశ్వశక్తియే (దహరమే) వాటన్నిటికీ పుట్టినిల్లు, ప్రదర్శనా ప్రారంభస్థానము, వికశిత ప్రదేశము.

## సుషుప్తి

అట్టి హృదయాకాశము నందు జీవాత్మ. సర్వకోశములకు-దివ్యలోకములకు-వేరై, పంచకోశములందు గాఢనిద్రా ముద్ర వహిస్తూ ఉంటున్నాడు. ఏ జీవాత్మ అయితే హృదయదహరాకాశము నందు సుషుప్తి (గాఢనిద్ర) పొందుచున్నాడో..

- అట్టి సుషుప్త స్థితిలో ఏ కోరికలు కోరడు. (జాగ్రత్ ఉండదు)
- స్వప్నాంతర్గత దృశ్యము కూడా ఆతనికి ఉండదు.
- అట్టి గాఢ నిద్ర (సుషుప్తి) అనుభవములో దేవతలు, దేవలోకములు, యజ్ఞయాగాది క్రియాకార్యక్రమములు, తల్లి తండ్రి- బంధువులు- ఇత్యాది సంబంధ బాంధవ్యములు, సొమ్ము-సొంతదారు- దొంగ మొదలైనవి, **ఇవన్నీ కూడా ఉండవు. అది జడత్వము వహించినప్పటి మౌన స్థానము.**

## అమృతమార్గము

ఎక్కడైతే సృష్టి, సృష్టికర్త, శరీరము మొదలైనవన్నీ రహితమవుతాయో, (వాస్తవానికి మొదలే లేనివౌతాయో), ఆస్థానము (ఆ అనుభవము) జీవునికి అమృతమయము. అది కేవల సాక్షీ స్వస్థానము. అదియే **'అమృత మార్గము'** అని **'సలిల మార్గము'** అని కూడా పిలుస్తూ

ఉంటారు. ఈ దృశ్యమును దాటివేసి, అట్టి అమృతమార్గములో (లేక) సలిల మార్గములో అడుగులు వేయుచున్నవాడు (సర్వదృశ్యములు దాటివేసి నిరామయ-నిష్ప్రపంచ కేవలాత్మస్థానము వైపు లక్ష్యముతో అడుగులు వేయువాడు అట్టివాడు) **'సామ్రాట్'** అను శబ్దముతో (అధ్యాత్మశాస్త్రములో) చెప్పబడుచున్నాడు.

## 5. పంచమ ఖంధము - ఆత్మ అనగా ఏది?

## అజరమ్ - అభయమ్ - అమృతమ్ - అశోకమ్ - అనన్తమ్ - కేవలాత్మ

**స్థానాని స్థానిభ్యో యచ్ఛతి।** స్థానములను స్థానులకు (స్థానము కలవాటికి) ఇచ్చుచున్నట్టిదే **'చైతన్యాత్మ'।** అట్టి స్థానములందు-స్థానులయందు సంచరించుచున్నట్టిది కూడా ఆ చైతన్య స్ఫూర్తి రూపమే!

ఆత్మ సర్వదా 1) అజరము (జన్మలేనిది) 2) అమృతము (మరణము లేనిది - అజరామరము), 3) అభయము, 4) అశోకము 5) అనంతము అయి ఉన్నది. ***స్వస్వరూపమగు ఆత్మను ఈ ఈ పంచ-అకారములుగా (అజర-అమృత-అభయ-అశోక-అనంత స్వభావసమిత్వముగా) గమనించి ఉపాసించాలి!***

అట్టి ఆత్మ సర్వాత్మకము-సర్వతత్త్వస్వరూపము అయినప్పటికీ కూడా.. ఉపాసన కొరకై (యోగ శాస్త్రములో) ఉపాసక ద్రష్టలచే చెప్పబడుచున్న ఉపాసనా స్థానములను ఇప్పుడు వివరిస్తున్నాను. శ్రద్ధాళువులై వినండి.

### చూపు - PERCEPTION - THE FACULTY OF SEEING

ఈ భౌతిక చక్షువులు (చక్షు ఇంద్రియము) **'అధ్యాత్మము'**. చూడబడుచున్నవన్నీ **'అధిభూతము'**. ఈ చూపును ప్రసాదించు దివ్యశక్తి - **'ఆదిత్యుడు'**. ఆతడే **'అధిదైవతము'**. దేహములో గల నాడులు చూపుశక్తిని ప్రసరణ మార్గము. (విద్యుత్తుకు విద్యుత్ తీగలవంటివి). (1) చక్షురింద్రియములోను, (2) కనబడే దృశ్యములోను, (3) ప్రాణశక్తి యందు, (4) నాడులందు, (5) ఆదిత్యునియందు, (6) చూపు యొక్క విజ్ఞానము (ఎరుక) నందు, (7) ఆనందము (అనుభవము) నందు, ఉండి, అవన్నీ తానే అయి, వాటన్నిటి **అంతరమున ఏది సర్వదా సంచారములు చేయుచున్నదో.. అదియే ఆత్మ! అట్టి ఆత్మను అజర-అమృత-అభయ-అశోక-అనన్తరూపముగా గమనిస్తూ ఉపాసించాలి.**

### వినికిడి - THE FACULTY OF HEARING

**వినికిడి - చెవులు** అధ్యాత్మము, వినబడుచున్నదంతా **అధిభూతము**. దశ (10) దిక్ దేవతలు - అద్దాని **అధిదైవతము**. నాడులు **నిబంధనము**. ఏది **నాడులయందు, వినికిడియందు, వినబడుచున్నదానియందు, దిక్కులయందు, దిక్ దేవతలయందు, వినికిడి శక్తి (ప్రాణశక్తి) యందు, వినికిడిచే పొందు 'అనుభూతి** (ఆనందించటము) యందు, అవన్నీ ఉండినవై యున్న **హృదయాకాశమునందు** - అవన్నీ తానే అయి ఉండి వాటి అన్నిటి యొక్క **అన్తరమునందు** ఏది సర్వదా **సంచరించుచున్నదో** అదియే - మనమంతా ఎల్లప్పుడు ఉపాసిస్తూ ఉండవలసిన అజర-అమృత-అభయ-అశోక-అనన్త లక్షణ సమన్వితమగు ఆత్మ! **అదియే సర్వదా ఆరాధ్యము!**

### ఘ్రాణము - వాసన - THE FACULTY OF SMELLING

**ఈ వాసన చూచుచున్న ముక్కులో అనుభవమగు** 'వాసన'యే (Smell itself) **అధ్యాత్మము.** వాసనగా ఎందులోంచి వచ్చి (పుష్పములు మొదలైనవి) ముక్కుకు చేరుచున్నవో, అవన్నీ కూడా **అధిభూతము**. వాసన ప్రసాదించు ఈ భూదేవత (పృథివి) **అధిదైవతము**. దేహములోని నాడులు అందుకు **నిబంధనము**.

ఏది వాసన తన్మాత్రతో కూడిన **'ముక్కు'** యో, ఏది 'వాసన'గా లభించు **వస్తు సమూహమో**, ఏవి వాసన సిద్ధించుటకై దేహములో **నాడులుగా ఉన్నాయో, ఏ ప్రాణశక్తి వాటినన్నిటినీ అనుసంధానము** చేయుచున్నదో, ఏది వాసనను తెలుసుకొను **'ఎరుక'** రూపముగా ఉన్నదో, ఏ పృథివి వాసనశక్తిని ప్రసాదించు అధిదైవమో, ఏది **వాసన - అనుభూతి** (Experience) **(లేక) ఆనందము** రూపముగా ఉన్నదో, **ఏ హృదయాకాశములో అవన్నీ స్థానము కలిగినవై ఉన్నాయో,** అవన్నీగా తానే అయి ఉన్నదే అంతరాత్మ! వాటి అన్తరాన్తరములో సంచరిస్తూ కూడా ఉన్నది. అట్టి అజరము అమృతము - అభయము-అశోకము - అనన్తము అగు ఆత్మయే మనకు ఆరాధ్య వస్తువు!

### జిహ్వా - THE FACULTY OF TASTING

నాలుకలోని రుచి (రుచి అనుభవి) **అధ్యాత్మము**. రుచిచూడబడుచున్న సర్వ వస్తు సముదాయము ఆధిభూతము. **వరుణుడు** జిహ్వాకు **అధిదైవతము. నాడులు** అందుకు **నిబంధనము. జిహ్వ (నాలుక)** యందు, రుచిచూడబడుచున్న **పదార్థముల** యందు (రసయితవ్యములందు), దివ్యపురుషుడగు-**వరుణదేవునియందు**, జిహ్వమునకు సంబంధించిన **నాడులందు, ప్రాణశక్తి యందు, రుచియొక్క జ్ఞానము - అనుభవములందు, హృదయకాశము నందు**, ఉండి, అవన్నీ తానే అయి ఉండి, - అంతేకాకుండా వాటన్నిటి

అంతరముగాను-ఏదైతే - సంచారములు చేస్తూ కూడా ఉన్నదో - **అదియే అజరము, అమృతము, అభయము, అశోకము, అనన్తము అగు ఆత్మ!** అదియే ఉపాసించవలసిన వస్తువు.

## త్వక్ (చర్మము) - THE FACULTY OF TOUCH

చర్మము-స్పర్శ- (స్పర్శానుభవి) **అధ్యాత్మము.** స్పర్శాననుభవమునకు విషయములగుచున్న జగత్తులోని వస్తు జాలమంతా **అధిభూతము.** వాయువు (వాయుదేవుడు) అద్దానికి **అధిదైవము.** స్పర్శనాడులు అద్దానియందు **నిబన్ధనము.** ఈ **చర్మము - స్పర్శయు,** ఏది స్పర్శకు విషయమగుచున్నదో అట్టి (ప్రపంచములోని) **వస్తు జాలము,** అధి దైవమగు **వాయుదేవుడు, నాడులు, ప్రాణము,** విజ్ఞాన-ఆనందములందు తెలుసుకొనుచున్నట్టిది - **అనుభవరూపము,** అవన్నీ ఏర్పడినవైయున్న **హృదయాకాశము** వీటన్నిటిగా ఏది తానే అయి ఉంటుందో, వీటి యొక్క అంతరము నందు - ఏదైతే సంచారములు సలుపుచున్నదో.., అదియే **సర్వులు ఉపాసించవలసిన ఆత్మ! అట్టి మన ఆత్మ భగవానుడే మనకు ఉపాస్య విగ్రహము!**

## మనస్సు - THE FACULTY OF THINKING

ఆలోచన (ఆలోచించువాడు) **అధ్యాత్మము,** దేనిదేని గురించి ఆలోచించబడుచున్నదో అది **అధిభూతము. చంద్రభగవానుడు. అధిదైవతము.** దేహములోని నాడులు - అద్దాని **నిబంధనము.** ఏదైతే - మనస్సు నందు, ఆమనస్సు ఆలోచించుచున్న విషయములందు, నాడులయందు, అవన్నీ పనిచేయటానికై ప్రాణశక్తియందును, అద్దాని విజ్ఞానము (ఎరుక)-ఆనందము(అనుభూతి-Experiencing) యందును, అవన్నీ ఏర్పడియున్న హృదయాకాశమునందును-ఆయా రూపములుగాను, వాటన్నిటి అంతరముగాను **ఏ ఆత్మ సంచారములు చేయుచున్నదో,** వాస్తవానికి, అవన్నీ తానే అయి ఉన్నదో..., అదియే **అజర-అభయ-అశోక-అనన్త-అమృత స్వరూపమగు ఆత్మ!** ఈవిధంగా ఆత్మను ఉపాసించాలి.

## బుద్ధి - THE FACULTY OF DISCRIMINATION

బుద్ధి (బుద్ధి తనదైన జీవుడు) **అధ్యాత్మము.** అట్టి బుద్ధికి అవగతమగుచున్నదంతా **అధిభూతము.** బ్రహ్మదేవుడు ఈ బుద్ధికి **అధిదైవతము.** నాడీ విభాగము **నిబంధనము.** అట్టి బుద్ధియందు, ఆ బుద్ధిచే నిర్ణయాత్మకమగుచున్న దానియందు **(బోధవ్యమునందు),** బుద్ధికి అధిదేవత అగు **బ్రహ్మదేవునియందు, నాడులయందు, ప్రాణశక్తియందు, విజ్ఞాన - ఆనందములయందు, హృదయాకాశము** నందు, వాటి బాహ్య-అంతరములందు ఏది సంచరించుచూ ఉన్నదో.. ఆ ఏవేవన్నీ తానే అయి ఉన్నదో..., అట్టి **ఆత్మనే ఉపాసించాలి.**

## అహంకారము - THE SENSE OF INDIVIDUALISTIC 'I'

**అధ్యాత్మికమగు** అహంకారమునందు, **అధిదైవతమగు** రుద్రుని యందు, దేహనాడుల **నిబంధనము** నందు, 'నేను కర్తను - కర్తవ్యము కలవాడను'.. అను **అధిభూతము**నందు, సంబంధిత **ప్రాణశక్తి**నందు, హృదయాకాశమునందు సంచరించుచున్న, అవన్నీ స్వయముగా తానే అయిఉన్న - అజర-అమృత-అభయ-అశోక-అనన్త **ఆత్మయే** సర్వదా **సర్వులకు ఉపాసనా వస్తువు.**

## చిత్తము - THE FEATURE OF LIKING / INTERESTEDNESS

**అధ్యాత్మము** అగు **చిత్తము**నందు, **అధిభూతమగు** - చిత్తమునకు **ఇష్ట విషయములందు,** (వ్రాలుచున్న విషయములందు), సర్వదేహములలోని అధిదైవతము అగు **క్షేత్రజ్ఞు**నియందు, వాటి సంబంధమైన **దేహనాడులయందు, ప్రాణశక్తియందు,** చిత్త సంబంధమైన **విజ్ఞాన-ఆనందములయందు, అనుభూతుల యందు,** అవన్నీ ఏర్పడియున్న **హృదయాకాశమునందు,** వాటన్నిటి అంతరముగాను సంచరించుచున్నట్టిదే **'ఆత్మ'.** అవన్నీ కూడా **ఆత్మయే!** అట్టి ఆత్మ **అజరము, అమృతము, అభయము, అశోకము, అనన్తము!** అద్దానిని ఉపాసించుచుండెదముగాక!

## వాక్కు - THE FACULTY OF TALKING

వాక్ శక్తి (మాటలాడువాడు) **అధ్యాత్మము.** చెప్పబడు మాటల రూపముగా **అధిభూతము.** నిబన్ధనమగునది - దేహనాడీ మండలము. అధిదైవతమగు **అగ్ని, ప్రాణశక్తి** శబ్దము యొక్క **విజ్ఞానము (ఎరుక), శబ్దానుభవము (ఆనందము),** అవన్నీ ప్రవర్తించే **హృదయాకాశము...** వీటన్నిటి రూపముగాను, వీటన్నిటియందు అంతర్గతమై సంచరించుచున్న, ఇవన్నీ తానే అయి ఉన్న **ఆత్మయే ఉపాస్యము.**

## హస్తములు - THE ABILITY OF HOLDING WITH HANDS

హస్తములు (చేతులు) - **అధ్యాత్మము.** చేతులతో పట్టుకొనబడుచున్నదంతా - **అధిభూతము. ఇంద్రదేవుడు** - అధిదైవతము. దేహములోని **నాడులు - నిబంధనము.** ప్రాణశక్తి, ఎరుక, అనుభవము; హృదయాకాశము.. వీటన్నిటిలో సంచరించుచూ, ఇవన్నీ తానే అయినట్టి అజర-అమృత-అభయ-అశోక-అనన్త స్వరూపమగునదియే ఆత్మ! ఆత్మయే ఉపాస్య వస్తువు!

## పాదములు - THE FEATURE OF WALKING

పాదములు-**అధ్యాత్మము;** విష్ణుభగవానుడు-**అధిదైవతము**. నడక-నడత-**అధిభూతము**, నాడులు-**నిబంధనము; ప్రాణము**-శక్తి; అధిభూతము నడుచుప్రదేశములు; **విజ్ఞాత-ఆనందములు;** హృదయాకాశము స్థానము-అన్ని రూపములు-తానేఅయి, వాటి అన్నిటి అంతరముగా ప్రకాశమానమవటము, సంచారములు చేయుటము - ఇవన్నీ నిర్వర్తించుచున్నట్టిదే - ఆత్మ! **ఆత్మను అన్ని రూపములుగా అయి ఉన్నట్లు ఉపాసించాలి. సర్వమునకు ఆత్మయే అంతర్యామి. ఆత్మయే కూడా!**

## పాయువు (విసర్జనావయము) - THE FEATURE OF DICORDING / LEAVING

**అధ్యాత్మమగు** పాయువు నందు, విసర్జించబడుచున్న **అధిభూతము** నందును, అధిదైవతము అగు **మృత్యువు** నందును, బంధనములగు **నాడులయందును, ప్రాణశక్తియందు, విజ్ఞాన- ఆనందములయందు, హృదయాకాశమునందును** ఏది సర్వదా **సంచరించుచూ** ఉన్నదో.. అవన్నీ **ఏది తానే** అయి ఉన్నదో ..., **అదియే ఆత్మ!**

## ఉపస్థ - మర్మాంగము - THE FACULTY OF REPRODUCTIVITY

ఉపస్థ (మర్మాంగము) - **అధ్యాత్మము**: పొందబడుచున్న ఆనందము - **అధిభూతము**; ప్రజాపతి - **అధిదైవతము**; -నాడులు - **నిబంధనములు. ప్రాణశక్తి, ఎరుక-అనుభూతులు - హృదయాకాశము**. ఇవన్నీ తానే అయి, ఏది వీటన్నిటి యందూ సంచారము చేయుచున్నదో.. అదియే 'ఆత్మ'. అట్టి ఆత్మ అజరము (జననరహితము). దేహధర్మములగు వార్ధక్య-మరణములు లేని అమృత స్వరూపము! అభయస్వరూపము అట్టి స్వభావ లక్షణములు గల పరతత్త్వమగు **ఆత్మయే మనకు ఉపాస్య వస్తువు అయి ఉండునుగాక!**

అట్టి **పరమాత్మ సర్వజ్ఞుడు** (ఈ జీవుడు కించిత్‌జ్ఞుడు). ఆత్మదేవుడు సర్వమును నియమించుచుండటచే సర్వేశ్వరుడు ! సర్వమునకు అధిపతి! సర్వమునకు అంతర్యామి! ఈ కనబడే జగత్తు కంతటికీ జనన స్థానము. ఈ దృశ్యములో ఆయా సౌఖ్యములను ఉపాసించు ఈ మనస్సు ఆ పరమాత్మ స్వరూపమే అయినప్పటికీ.. ఆత్మదేనినీ ఉపాసించటమూ లేదు. **సర్వము ఉపాసించుచున్నది ఆత్మనే!**

**వేద-శాస్త్రైః ఉపాస్యమానో।** వేదములు - శాస్త్రములు ఎలుగెత్తి గానము చేస్తున్నది, ఉపాసనచే ఉద్దేశ్యిస్తున్నది, అట్టి **సర్వస్వరూప-స్వస్వరూప పరబ్రహ్మమునే!** అంతేగాని, **ఆ పరమాత్మ వేద-శాస్త్రములను ఉపాసించువాడు** కాదు.

- ఎవ్వనికి ఈ కనబడేదంతా స్వీయ - అనుభవరూపము, ఆస్వాదన రూపము, **యస్యాత్ అన్నమిదమ్ సర్వమ్-అయి ఉన్నదో...**, **ఆయనయే ఆత్మ భగవానుడు!**
- **నచయో అన్నమ్ భావిత్యః** - ఎవ్వడు మరొక దేనికీ అనుభవరూపము, ఆస్వాదనరూపము, అనుభూతిరూపము (అన్నమ్) కాడో, ఆయనయే **ఆత్మ చైతన్యుడు.**

అట్టి ఆత్మయే - పంచ - (అన్నమయ-ప్రాణమయ-మనోమయ-విజ్ఞానమయ-ఆనందమయ) **కోశములలో** రాజ్యము ఏలుచున్నది.

- ఇక్కడి అన్నమయ (పంచభూతాత్మక) ప్రపంచానికి - 'భూతాత్ముడు' గాను (**అన్నమయో భూతాత్మా**)....,
- ప్రాణమయ ఇంద్రియత్వానికి - ప్రాణమయతత్త్వానికి **ఇంద్రియాత్ముడుగాను...,**
- మనోమయమునకు - **సంకల్పాత్ముడు**గాను.....,
- విజ్ఞానమయమునకు - **కాలాత్మ**గాను....,
- ఆనందమయమునకు - **లయాత్మకుడుగాను వెలయుచున్నాడు.**

***ఆయనయే భూతాత్ముడు, ఇంద్రియాత్ముడు, సంకల్పాత్ముడు, కాలాత్ముడు, లయాత్ముడు కూడా!***

ఆ పరమాత్మకు వేరుగా దృశ్యము లేదు. ఎందుకంటే ద్రష్ట **(దృశ్యమును తన దృష్టితో చూచువాడు) ఆయనయే! - దృష్టి, దృశ్యము ఆయనయే!** 'దృక్'గా ఉండి, ఆ తరువాత స్వప్నద్రష్ట-జాగ్రద్రష్ట - సుషుప్తి ద్రష్టలను కల్పించుకొని, (ఆ మూడు తానే అయి), త్రిదష్టల అనుభవమునకై **స్వప్న-జాగ్రత్-సుషుప్తి దృశ్యరూపుడగుచు, మరొకప్పుడు.. అవన్నీ తనయందు లయము చేసుకొనుచున్నాడు. ఇదంతా ఆత్మ దేవుని మహత్యమే!**

- **అన్నమయ- ప్రాణమయ-మనోమయ - విజ్ఞానమయ - ఆనందమకోశములు** ఆయన ప్రత్యక్ష రూపములే!
- వాటి కర్తృత్వము వహిస్తున్న **భూతాత్మ - ఇంద్రియాత్మ-సంకల్పాత్మ-కాలాత్మ-ఆనందాత్మ..** కూడా ఆ ఆత్మదేవుడే!

ద్వితీయమైనదంతా ఆత్మా భగవానుని నుండే బయలుదేరి, ఆయనయందే తైతక్కలాడుచూ ఆయన యందే లయించుచున్నది. అప్పుడు ఆయన మాత్రమే శేషించుచున్నారు. ఆత్మభగవానుడే 1. సృష్టిమయాత్ముడు 2. స్థితిమయాత్ముడు 3. లయమయాత్ముడు 4. క్రియా-నిష్క్రియమయాత్ముడు 5. కేవలాత్ముడు కూడా...!

కనుక ఓ రైక్వనామధేయ ఆత్మస్వరూపా! ఆత్మసర్వదా అద్వితీయము! నీకు వేరు కాదు! నీ జీవాత్మత్వమంతా ఆత్మ దేవుడవైయున్న నీయొక్క సంకల్ప - వికల్ప కళా ప్రదర్శన విన్యాసమే! ఓ ఆత్మదేవా! నీకు నమస్కారము!

మరి ఇప్పుడు చెప్పు! మనస్వరూపమెట్టిది? ఈ **దేహభావ కల్పనా-పరంపరలు పొందటము, అవి తనయందు పరిపోషింపజేసుకుంటూ ఉండటము, దేహ-దేహ భావనలను తన యందు లయింపజేసుకోవటం**, ఇవన్నీ నిర్వర్తిస్తున్న ఆత్మయే నీ-నా సహజ స్వరూపము! ఈ దేహధారణ-విసర్జన... ఆత్మ రూపులమగు మనకు వస్త్రధారణ - విసర్జన వంటిది అయి ఉండగా, ఆత్మకు ద్వితీయమే లేదు. ఇక **కు తో మర్త్యమ్? 'మరణము' అనునది ఎక్కడ? మరణించువాడు ఎవ్వడు? అద్వితీయమగు ఆత్మకు (జీవాత్మకు) - క్రొత్తగా మనము సంపాదించి ఇవ్వవలసిన అమృతత్వము అనునది మాత్రమూ ఎక్కడిది?** అదీ లేదు! మృతము లేదు. అమృతము లేదు. **ఆత్మ మాత్రమే ఉన్నది!**

అట్టి ఆత్మ...., ఏదై ఉన్నది? మరికొంత వివరించుకుందాము.

- **న అంతః ప్రజ్ఞో!** లోపల గల మనోబుద్ధి చిత్త- అహంకార ప్రజ్ఞయా?.. కాదు.
- **బహిఃప్రజ్ఞయా?** ఈ ద్రష్ట-దర్శన-దృశ్య రూప ప్రజ్ఞయా? కాదు.
- **అంతర్బహిః ఉభయప్రజ్ఞయా?..** ఇంద్రియములు - ఇంద్రియ విషయములా? కాదు!
- **ప్రజ్ఞాన ఘనమా** (ఘనీభూతమగు కేవల ప్రజ్ఞయా)? .. అది కూడా కాదు.

ఆత్మ- తెలుసుకొనుచున్న రూపము అవటము లేదు. తెలియబడుచున్న దాని రూపము కూడా అవటము లేదు. అవన్నీ వాస్తవానికి లేవు. ఎందుకంటే అవి ఆత్మ యొక్క స్వయం కల్పితాలు కాబట్టి. **ఒక నవలా రచయిత ఒక పాత్రను, ఆ పాత్రకు కొన్ని స్వభావములు కల్పిస్తే, అవి వాస్తవంగా ఉన్నవి అవుతాయా? లేదు కదా! రచయిత మాత్రమే ఉన్నాడు. పాత్రలు కల్పనలో మాత్రమే ఉన్నాయి.** అట్లాగే..., ఆత్మచే స్వయం కల్పితమగు

| | | |
|---|---|---|
| విదితము | - | తెలుసుకొనటము |
| వేద్యము | - | తెలియబడునది |
| విదితుడు | - | తెలుసుకొనువాడు |

.... ఈ మూడూ ఆత్మకు వేరుగా లేవు. ఆత్మకు **ఎప్పుడూ ఎక్కడా ద్వితీయమే లేదు**. ఎక్కడైనా ఏదైనా కనిపిస్తూ ఉంటే.. అది ఆత్మకు సర్వదా అభిన్నమేనని గ్రహించబడుగాక!

ఇతి - 'నిర్వాణ అనుశాసనము'!

ఇతి - వేదములు సిద్ధాంతీకరించి ప్రకటిస్తూ ఉన్న పరమసత్యము!

***'ఆత్మకు ద్వితీయమైనది ఎక్కడా ఏదీ లేదు! ఆత్మ అద్వితీయము' ఇతి వేదానుశాసనమ్!***

## 6. షష్ఠమ ఖండము-ఏకో నారాయణో!

**రైక్వుడు :** మహాత్మా! ఘోరాంగీరస గురువర్యా! ఈ కనబడే వివిధ రూపములు - స్వభావములు గల జీవరాశులు.. ఇవన్నీ ఎక్కడి నుండి వచ్చాయి? వీరందరికీ మూలము ఏమిటి? ఆధారమేది?

**ఘోరాంగీరస మునీశ్వరుడు :** నాయనా! ఉన్న సత్యమును ప్రకటించమంటావా? అయితే, విను. మొట్టమొదట **అఖండమగు ఆత్మయే ఉన్నది. ఇప్పుడూ, ఆత్మ (సర్వదా) అఖండమే అయిఉన్నది! ఆత్మ ఎల్లప్పటికీ అద్వితీయమే! ఏకములోంచి అనేకము ఏర్పడుచున్నప్పటికీ ఏకము సర్వదా ఏకమే!** (దృష్టాంతానికి) బంగారము నుండి ఎన్నిపేర్లుగల ఆభరణములు తయారగుచున్నప్పటికీ, అంతా సర్వదా బంగారమే అయి ఉన్నది కదా! కలలో ఎన్ని నామ-రూప-ఆకారాదులు కనిపించినా, అవన్నీ స్వప్న సంచాలకుని ఏక-అఖండ స్వప్న చైతన్య రూపమే కదా!

**నైవ ఇహ కించిత్ నాఽగ్ర ఆసీత్!** సృష్టికి ముందు ఇక్కడ ఏదీ లేదు. **అమూలమ్, అనాధారా ఇమాః ప్రజాః ప్రజాయంతే!** ఆత్మకు వేరుగా ఏమూలమూ (రూట్ కాజ్) గానీ, ఏ ఆధారమూ (Source)గాని లేకుండానే ఈ జీవరాశులన్నీ ఏర్పడినవగుచున్నాయి. అందుచేత మొట్టమొదట నారాయణుడై ఉన్నారు. ఇదంతా నారాయణస్వరూపమే! నారాయణునికి వేరుగా సృష్టిలేదు. జీవులులేరు! అన్ని జీవుల రూపముగా ఉన్నది నారాయణుడే! **దివ్యో దేవ ఏకో నారాయణః।** నవలా రచయితకు చెందని ఏ సంఘటన నవలలో ఉండగలదు?

**శక్షుశ్చ, ద్రష్టవ్యంచ నారాయణః।** చూచే కళ్లు - ఆ కళ్లకు కనిపిస్తున్న దృశ్యములు, ద్రష్టలు, దృష్టులు, వినే చెవులు - ఆ చెవులకు

వినబడే శబ్దములు, ఆ శబ్దముల అర్థములు, వాసనచూచే ముక్కు-ఆ ముక్కు అనుభమగు వాసనలు-అనుభూతులు, రుచి చూచే నాలుక-ఆ నాలుకకు రుచికరమగుచున్నవి. చర్మము-స్పర్శగా ప్రాప్తించున్నట్టి స్పర్శానుభూతి-ఇవన్నీ వేరు-వేరుగా కనిపిస్తున్నప్పటికీ, వాటి వాస్తవ స్వరూపము-**ఏకో నారాయణుడే!** ఆత్మకు అభిన్నమగు ఆత్మకామ-సంకల్ప చమత్కారములే! నీ కళ్ళతో చూచేది, నీ చెవులతో వినేదీ నీవే కదా! (వినేది, చూచేది, మాట్లాడేది, ఆలోచించేది, ఇష్టపడేది ఒక్కడేగాని వేరు వేరు జీవాత్మ విభాగములు కాదు కదా!)

చూపుయే – చూడబడు దృశ్యరూపముగాను, వినికిడియే వినబడు శబ్దరూపముగాను, వాసనయే వాసన ఇచ్చు వస్తువుల రూపముగాను, రుచియే రుచి పదార్థములుగాను, స్పర్శయే- స్పర్శించబడునవిగాను దీపించుచున్నవి. ఉభయము నారాయణుడే!

మనస్సు – అట్టి ఈ మనస్సు ఆలోచించు విషయములుగా ఉన్నది కూడా నారాయణుడే! **మనశ్చ-మన్తవ్యశ్చ నారాయణో!** అట్లాగే...,

బుద్ధి – ఆ బుద్ధికి తెలియబడుచున్న విషయములు;
అహంకారము – అహమ్ కర్తవ్య భావనలు;
చిత్తము – ఇష్టమగుచున్న విషయాలు;
వాక్కు – చెప్పబడుచున్నవి – మాట్లాడబడుచున్నవి;
చేతులు – ఆచేతులతో పట్టుకోబడుచున్నవి;
పాదములు – ఆపాదముల సంచారాలు చేస్తున్న ప్రదేశములు, నడకలు, నడతలు;
పాయువు – విసర్జితములు;
ఉపస్థ (జననేంద్రియము) – ఆనందము **ఇవన్నీ ఏకో నారాయణ స్వరూపమేనయ్యా!**

ఈ సృష్టి, దీనికి కర్తృత్వాహంకారము ధారణ చేస్తున్న ధాత (బ్రహ్మదేవుడు – సృష్టికర్త); దీనిని విధి -విధానముగా నడుపుచున్న విధాత, కర్త-వికర్త.... ఇవన్నీ కూడా దివ్యదేవాది దేవుడగు **ఆదినారాయణుడే!** దీనికంతటికీ ఆయన ఆది-మధ్య-అన్తస్వరూపుడు! ఆది మద్యాంతరహితుడు!

ఎందుకంటే.....,

మొట్టమొదట సృష్టికి మునుముందుగా ఏమున్నదో.. ఇప్పటికీ అదే ఉన్నది. నారాయణ తత్త్వమును పరిశీలించినవారికి ఇక్కడ అనేకంగా కనిపించేదంతా సర్వదా ఏకముగానే అనిపించుచున్నది. ఇదంతా అజ్ఞానదృష్టికి అనేకము! విజ్ఞాన దృష్టికో – ఏకోనారాయణుడు. సమస్తము సర్వదా ఏకోనారాయణ దివ్యతత్త్వమై ఉండగా,.... ఏది ఎప్పుడు ఎక్కడ పుట్టినదని చెప్పాలి? **నీవు-నేను కూడా నారాయణానంద స్వరూపులమే!**

❖

ఇంకా వినండి!

ప్రప్రథమ ప్రకాశరూపుడగు **ఆదిత్యుడు, (యత్ ఆదిః – పురుషో ... ఇతి ఆదిత్యః)**...,
ఇదంతా తనయందు క్షణక్షణం లయం చేసుకుంటున్న **రుద్రుడు**...,
ఎప్పటికప్పుడు మార్పు- చేర్పులను పర్యవేక్షిస్తున్న **మారుత్‌గణము**.....,
విశ్వము- దేహము తన చేతనములచే (కదలికలచే) సంరక్షిస్తున్న **వాయువు**.....,
కాలము-స్థానము-దేహాంతర విశేషములు ప్రవేశించి ఉన్నట్టి **వసువులు**......,
ఓషధ-ఆహార – అనుపాన తత్త్వములను నడుపుచున్న **అశ్వినీ దేవతలు**......,

- ఋగ్వేదములోని ఋక్కులు, యజుర్వేదములోని యజ్ఞ-యాగవిధుల రూపములగు యజస్సులు, సామవేదములోని సామగానములు, ప్రకృతితత్త్వములను ప్రకటించు అధర్వణవేదమంత్రములు.....,
- యజ్ఞవస్తువులగు మన్త్రము, అగ్ని, నేయి, ఆహుతి, యాజ్ఞీకుడు మొదలైనవి;
- కర్మలు – ఫలములు, లోకములు, ఇవన్నీ **ఏకోనారాయణ తత్త్వమే! నారాయణ స్వరూపమే! నారాయణ! నారాయణ! నారయణ!**

ఇంతేకాకుండా..

ఉద్భవిస్తున్నవి, సంభవిస్తున్నవి, దివ్య అశరీర శక్తిస్వరూపులగు దేవతలు,

- అంతా ఏకోనారాయణ స్వరూపమే!
- తల్లి, తండ్రి, తమ్ముడు, అన్న, నివాసము, శరణము (విశ్రాంతి స్థానము), సుహృత్ (శ్రేయోభిలాషులు), కానివారు, అయినవారు, స్థితులు, గతులు...,

- అంతా – **ఏకోనారాయణయేవ!**
- జలదేవతయగు వరుణుడు,
- పిత్రు లోకాధిపతియగు అర్యముడు,
- మనో అధిదేవతయగు చంద్రుడు,
- కల–కల్పన, వాటికి ఆవల, ఈవలగా ఉన్నది,
- పైన– క్రింద–ప్రక్కన ఉన్నది, కనబడుచున్నది కనబడకుండా ఉన్నది....,

### *సర్వమ్ నారాయణమ్ । ఏకో నారాయణో!*

ఓ రైక్వా! నీవు–నేను – ఈ శిష్యులు, ఇక్కడివారు, అక్కడివారు, ఇక్కడ– అక్కడ, అప్పుడు– ఇప్పుడు – ఇంకొకప్పుడు... ఉన్నది – చూస్తున్నది – భావిస్తున్నది, లేనిది – కనబడనిది – భావాతీతము.. అంతా నారాయణుడేనయ్యా! ఆత్మానారాయణుడే! ఏకో–నారాయణుడే నీ ఆత్మగా, నా ఆత్మగా నాటక పాత్రలవలె వేరువేరైనట్లు – భ్రమదృష్టి కలిగియున్నప్పుడు – అనిపిస్తున్నారు.

**విద్వాంసులగు మహనీయుల (సూరుల దృష్టి) ఎట్లా ఉంటోందంటే...,**

**తద్విష్ణోః పరమమ్ పదగ్ంం సదా పశ్యన్తి సూరయః!** ప్రజ్ఞావంతులగు మహనీయులు ఎల్లప్పుడూ అంతటా 'పరమపదము' అను శబ్దముచే చెప్పబడు 'విష్ణుతత్త్వము'నే అంతటా చూస్తున్నారు. **'ఈ కనబడేదంతా ఎల్లప్పుడూ అదేకదా!'..** అని ఎరిగియే ఆస్వాదిస్తున్నారు. చూస్తూ, గమనిస్తూ నిత్యము పరమపద ధ్యానులై ఉంటున్నారు. **పర ధ్యానములో ఇహ ధ్యానమును అంతర్విభాగం చేసివేస్తున్నారు.**

**దివీవ చక్షుః ఆతతమ్!** ఆ శ్రీమన్నారాయణుని, వ్యాప్తనారాయణుని చక్షువులే, (లేక) ఆయనయొక్క దృష్టులే దివ్యలోకములలో, ఊర్ధ్వ–అధోలోకములలో అంతటా వ్యాపించినవై ఉంటున్నాయి.

**తత్ విప్రాసో విపన్యవో జాగృవాగ్ంసః సమిన్ధతే విష్ణోః యత్ పరమమ్ పదమ్!** వేదార్ధము ఎరిగి, నిత్యానిత్య వివేకముతో కూడియున్న పండితవరేణ్యులగు **విప్రులు – సర్వదా జాగరూకులై** – సర్వేసర్వత్రా ఆ **'విష్ణుపదము'**నే సందర్శిస్తున్నారు. గమనిస్తున్నారు. ఈ రీతిగా విష్ణుతత్త్వ ధ్యానులై ఉంటున్నారు. నాటకములోని ఒక సందర్భమును చూస్తూ..., "ఇది నాటక రచయిత యొక్క కల్పనలోని అంతర్విశేషమే!.... అనునది మరుస్తామా? లేదు కదా?

అట్టి ఆత్మ యొక్క సర్వప్రకటితతత్త్వమే ఇదంతా! ఇదియే నిర్వాణాను శాసనము! వేదానుశాసనము! ఆత్మానారాయణానుశాసనము! మహర్షుల వాక్కు! సత్య వాక్కు! సత్యద్రష్టల అనునిత్యానుభావం!

## 7. సప్తమ ఖండము – అంతర్యామి – అవిజ్ఞేయో!

ఆ ఆత్మానారాయణుడు సర్వదేహుల హృదయగుహలలో ఏకస్వరూపుడై ఉన్నారు. అంతః శరీరుడై, నిత్యుడు, జరాజన్మ రహితుడు అయి, దేహ–దేహాంతరములుగా నిత్యప్రకాశమానుడై వెలుగొందుచున్నారు.

అట్టి ఆత్మానారాయణ తత్త్వము గురించి మరికొన్ని విశేషాలు చెప్పుచున్నాను. అంతా వినండి!

- **ఈ పృధివి** అంతా ఆ ఆత్మానారాయణుడు తన శరీరముగా కలిగి ఉంటున్నారు. పృధివికి అంతరమున సర్వదా సంచరించువాడై ఉంటున్నారు. కానీ, పృధివిచే ఆయన ఎరుగబడుటయే లేదు.
- **జలము** ఆయన శరీరమై, జలము యొక్క అంతరమున సంచరించువాడై ఉన్నప్పటికీ, జలమునకు ఆయన గురించి తెలియరావటము లేదు.
- **తేజస్సు** ఆయన శరీరమై, తేజస్సుకు అంతర్యామి అయి సంచరిస్తూ ఉన్నప్పటికీ, తేజస్సు ఆయనను గమనించటము లేదు.
- ఆయన **వాయుః శరీరుడై** వాయువు యొక్క 'అంతర్యామి'గా సంచరిస్తూ ఉండగా కూడా, వాయువు ఆయనను గుర్తించలేక పోతోంది.
- ఆయన **ఆకాశమును** తన శరీరముగా కలిగి ఉండి, ఆకాశమునందు అంతరమున సంచరిస్తూ ఉన్నప్పటికీ కూడా, ఆకాశము ఆయనను గమనించటము లేదు.
- ఈ **మనస్సు** ఆ ఆత్మానారాయణుని శరీరమే! మనస్సుకు అంతర్యామి అయి, సంచారులై సర్వదా వ్యవహరిస్తున్నదీ ఆయనే! అయినా కూడా మనస్సు అట్టి ఆత్మభగవానుని గుర్తించే యోచనయే చేయటము లేదు.
- ఈ **బుద్ధి** ఏ ఆత్మ యొక్క శరీరమో, ఏది బుద్ధికి అంతర్గతమై సర్వదా ఉత్తేజిత రూపముగా పచార్లు చేయుచున్నదో, అట్టి ఆత్మను ఈ బుద్ధి చూడటమూ లేదు. అర్ధము చేసుకోవటమూ లేదు. ఆత్మానారాయణుడు లౌకిక బుద్ధికి విషయమగుటలేదు.

- ఆయన **అహంకార శరీరుడై** అహంకారమును లోనుండి ప్రవర్తింపజేయు సంచాలకుడై ఉంటూ ఉన్నప్పటికీ, ఈ అహంకారము బయట చూపులకు పరిమితమవుతోందే గాని, తన యందు ఆధారుడు, సంచాలకుడు, సంచారుడు అగు ఆత్మను తన స్వరూపముగా భావించటము లేదు. ఎరుగుటయూ లేదు.
- ఈ **'ఇష్టము'** రూపము గల చిత్తము ఏ ఆత్మ యొక్క శరీరమే అయి ఉన్నదో, ఏ ఆత్మ అయితే - చిత్తమును తన సంచార ప్రదేశముగా కలిగి యున్నదో; అట్టి ఆత్మను చిత్తము తన యొక్క ప్రియమగు వస్తువుగా గమనించటమే లేదు. బాహ్య విషయముల పట్ల మాత్రమే స్పందన కలిగినదై ఉంటోంది.
- **'అవ్యక్తము'** ఎవ్వరి శరీరమో, అవ్యక్తమునకు ఎవ్వరు అంతర్యామియో, అంతర్-ప్రవర్తకుడో, అట్టి ఆత్మను ఈ అవ్యక్తము ఏ మాత్రము గాంచటమే లేదు.
- ఏ ఆత్మానారాయణుడు అక్షరము (క్షరము కానిది- మార్పు లేనిది) అగు తత్త్వమును తన శరీరముగా అవధరించిన వారై ఉన్నారో,.. ఏ అక్షరము జీవాత్మకు సర్వదా అభ్యంతరము అయి (Inner Zone) ఉన్నదో, అట్టి మహత్తర అఖండాత్మ విశేషమును ఆ అక్షరము **'ఇది కదా నేను'.. అను దర్శనమునకు ఉపక్రమించటమే లేదు.**
- ఏ పరతత్త్వ చైతన్యమునకు మృత్యువు తన శరీరమే అయి ఉన్నదో, మృత్యువు యొక్క అంతరమున నిండిఉన్నదో ఆత్మ అయి ఉన్నదో.. అట్టి ఆత్మ తత్త్వమును మృత్యువు ఏ మాత్రము గుర్తు కలిగి ఉండటము లేదు. గమనించటము లేదు!

ఈ కనబడే సర్వశరీరములలోనూ ఏది అంతరాత్మయో, ఆ తీరుగా అంతరాత్మ అయి కూడా..., దేహ-మనో-బుద్ధి-చిత్త-అహంకారముల దోషములచే స్పృశించబడటమే లేదో.., దివ్యస్వరూపమై, దేవాదిదేవుడై ఇప్పుడే - ఇక్కడే నీ-నా-వారి-వీరి-సర్వ శరీరములలో జ్యోతి స్వరూపమై వెలుగొందుచున్నాదో **అట్టి కేవలాత్మయే సందర్భములన్నిటికీ ఆవల గల అహమ్-త్వమ్-తత్‌ల సహజ సత్యస్వరూపము.**

- ఏకోనారాయణుడు!
- అఖండ పరస్వరూపము!
- నిత్యోదిత చైతన్యానంద తత్త్వ స్వరూపుడు! తత్త్వ పురుషుడు!

❖ ❖ ❖

ఇట్టి **'ఆత్మవిద్య'**ను లేక **'ఏకోనారాయణ విద్య'**ను సర్వజీవులపై గల అవ్యాజమైన ప్రేమను నింపుకొని ఉన్న శ్రీమన్నారాయణుడు **అపాంతరమాయకు** (ఆకాశవాణికి) ఇచ్చారు. ఆ అపాంతర మాయ **సృష్టికర్తయగు బ్రహ్మదేవునికి** ప్రసాదించటము జరిగింది. బ్రహ్మదేవుడు **ఘోరాంగీరసునకు** బోధించారు. ఆ ఘోరాంగీరసుడు **రైక్వునికి**, ఆ విద్యను తెలియజేశారు. రైక్వుడు **శ్రీరామునికి** ఇచ్చారు. సర్వజీవులపై గల వాత్సల్యముతో శ్రీరామచంద్రుడు.. లోకములకు అందించటం జరిగింది.

**ఇతి నిర్వాణానుశాసనమ్! వేదానుశాసనమ్! వేదానుశాసనమితి!**

## 8. అష్టమ ఖండము-ఆత్మ అచిన్త్యమ్! అభిన్నమ్! ఇదమ్ సర్వమ్!

**అన్తశ్శరీరే నిహితో గుహాయాం శుద్ధః సో అయమాత్మా!** పరమశుద్ధుడగు ఆత్మ ప్రతి ఒక్క దేహములోని హృదయగుహలో ప్రకాశమానుడై ఉన్నది.

ఈ భౌతిక దేహము మేధస్సు (మెదడు, క్రొవ్వు, వప ల)తో - మాంసమయమై, 'రక్తము' అనే ద్రవము (తడి)తో కూడుకొనియున్నది. అట్టి ఈ దేహము యొక్క మధ్య ప్రదేశములో **'హృదయము'** ఉన్నది. హృదయంలో దేహమున్నది. దేహములో హృదయమున్నది. బంగారములో ఆభరణాకారం, ఆభరణాకారంలో బంగారము ఉన్నతీరుగా,

- అనేక రంగుబొమ్మలు చిత్రించబడిన ఒక 'గోడ'వలె,
- అనేక కల్పనా విశేషములతో కూడిన గంధర్వనగరము వలె,

అనేక పరస్పర సంబంధ - అనుబంధ - ఇష్ట - అయిష్ట వ్యవహారములు తనయందు కలదై హృదయము ప్రదర్శితమవుతోంది. అరటి స్థంభమువలె లోన శూన్యమై నిస్సారముగా ఉన్నది. జలములో కనిపించే 'బుడగ' వలె అతి చంచలము కూడా!

**అట్టి 'సంసారములోని ఒక వస్తువు' అనతగినట్టి - ఈ భౌతిక దేహాంతర్గత హృదయంలో 'ఆత్మ' అనబడు మహత్తర-దివ్యచైతన్యతత్త్వము దాగి ఉన్నది.** అట్టి ఆత్మ...,

... ఆలోచనలకు అందనిది. **అచిన్త్యము.** ఆలోచనలకు ఆవల ఆలోచించువాని కేవల రూపమగుటచే ఆత్మ ఆలోచనకు అవిషయంగా చెప్పబడుతోంది. ఆలోచనలకు - ఆ ఆలోచించువాడు దొరుకుతాడా? దొరకడు కదా!

... అత్యంత పవిత్రము. దివ్యమైనది. దోషములచే స్పృశించబడనిది!
... దేనికీ సంబంధించక, ప్రత్యేకమై ఉన్నది. అసంగముగా ఉన్నది. మౌనస్వరూపము!
... పరమశుద్ధ ప్రకాశముతో కూడి ఉన్నట్టిది!
... మహాతేజవంతమై ప్రకాశించుచున్నట్టిది!
... అది సర్వస్వరూమై, సర్వ నియామకము అయి ఉండుటచే సర్వేశ్వరము కూడా!
... అది అశరీరము కాబట్టి అచిన్త్యమై ఉన్నది.
... హృదయగుహలో సర్వకారణమై, తనకు వేరే బాహ్యమైన కారణము ఏదీ లేనిదై ఉన్నది. అకారణం తు!

అట్టి ఆత్మ అమృతస్వరూపము! సర్వమును వెలిగించుచూ ఉన్నట్టి విభ్రాజమానము! పరమానంద ఐశ్వర్య సమన్వితము! విద్వాంసులు.. **ఆ ఆత్మనే అంతటా దర్శించుచున్నారు. "ఈ సర్వము ఆత్మకు అభిన్నము" - అనునది వీడక, ప్రశాంతమగు దృష్టి కలిగి ఉంటున్నారు. ఇంద్రియములకు విషయములుగా కనిపించేదంతా ఆత్మస్వరూపమేనని ఎరిగి ఉంటున్నారు.**

## 9. నవమ ఖండము-ఆత్మయందే అస్తమయం

**రైక్వుడు :** భగవన్! సద్గురు శ్రీ ఘోరాంగీరస మహాశయా! ఈ కనబడుచున్నదంతా, తిరిగి ఎందులో అస్తమించబోవుచున్నది? ఎందులోకి నిష్క్రమించుచున్నదగుచున్నది.

**శ్రీ ఘోరాంగీరస మహాముని :** బిడ్డా! అనుభవము (Experience) అనునది అనుభవి (One who is experiencing) యొక్క అనుభవత్వపు చమత్కారమే కదా! అందుచేత,

వస్తువు - ఆ వస్తువుయొక్క అనుభవమునందు, అనుభవము - 'అనుభవి' యందు, అనుభవి - జీవాత్మయందు, జీవాత్మ - సర్వాత్మయందు స్వభావంగా అస్తమిస్తున్నాయి.

ఈ కనులతో ఏఏ దృశ్యములు పొందబడుచున్నాయో అవన్నీ కూడా చక్షువులలోనే లయించినవి (అస్తమించినవి) అగుచున్నాయి. ఆ 'కనులు' అనే ఇంద్రియములను ఉపయోగించిన ద్రష్టత్వము దృశ్యానుభవము కూడా ద్రష్టయొక్క (అప్రదర్శిత) దృక్ స్వరూపము నందే అస్తమించుచున్నాయి.

సూర్యకిరణములు సూర్యుని నుండి బయల్వెడి, ఆయా వస్తువులపై పడి, అటు తర్వాత (సూర్యాస్తమయానికి) సూర్యునియందే అస్తమిస్తున్నాయి కదా.

అట్లాగే కనులచే పొందబడిన దృశ్యము, ద్రష్టత్వ భావన, జీవాత్మభావన - ఇవన్నీ కూడా **అధిదైవితము** అగు ఆదిత్యుని యందు అస్తమించినవి అగుచున్నాయి. (ఆది తత్ యత్ - మొట్టమొదటే ఉన్నట్టిది = ఆదిత్యుడు)

విరాజము (మ్యానిఫెస్టేషన్) చేత ఏదేది పొందబడుచున్నదో (లేక) విరాజమానమగుచున్నదో.. అదంతా కూడా విరాజత్వము (The Feature of Manifestation) నందే అస్తమించినదగుచున్నది.

అట్లాగే....,

**ప్రాణశక్తి నుండి** పొందిన ప్రాణచలనము **ప్రాణశక్తియందు, విజ్ఞానముగా** పొందబడినదంతా మూలవిజ్ఞానతత్త్వము నందు; ఆనందము రూపముగా పొందినది **ఆనందమునందు, తురీయముగా** పొందబడుచున్నది. **తురీయము** నందును అస్తమించినవగుచున్నాయి. అట్టి చక్షుత్వము, ద్రష్టత్వము, ఆదిత్యత్వము, విరాజము, విరాజమానత్వము, ప్రాణము, విజ్ఞానము, ఆనందము, తురీయము - ఇవన్నీ వాటి జన్మస్థానము అగు **అమృత-అభయ-అశోక- అనన్త-నిర్బీజ** రూపమగు... **ఆత్మయందే అస్తమించి, ఆత్మరూపముగానే శేషించుచున్నవగుచున్నాయి.**

అట్లాగే శ్రోత్రముగా పొందబడినది 'వినికిడి' యందు, (వినబడుచున్నవన్నీ కూడా 'వినటము' యందును), వినటము దిక్‌తత్త్వమునందు, సుదర్శనము (సుందరము)గా భావించబడుచున్నది సుందరభావనయందు, విజ్ఞానముగా పొందబడునది విజ్ఞాన స్వభావము నందు, ఆనందముగా పొందబడుచున్నదంతా ఆనందానుభవము నందు, తురీయముగా పొందబడుచున్నది తురీయభావన యందు అస్తమించినవగుచున్నాయి. వినికిడి, వినటము, దిక్ భావన, సుదర్శన- అనుభూతి, విజ్ఞానతత్త్వము, ఆనందానుభూతి.. ఇవన్నీ కూడా ఆత్మ నుండి బహిర్గతమై, మరల అట్టి **అజర - అమృత-అభయ-అశోక-అనన్త స్వరూపమగు ఆత్మ** యందే అస్తమించి, **'నిర్బీజాత్మస్వరూపము'** అగుచున్నాయి.

అదేవిధంగా....,

'ముక్కుగా పొందబడుచున్నది (ఆత్మ యొక్క) – నాసికత్వము నందు, ఆఘ్రాణముగా (వాసన రూపము)గా పొందబడునది–ఆఘ్రాణత్వము నందు, ఆ ఆఘ్రాణత్వము అధిదేవతయగు పృథివీతత్త్వము నందు, జితా (జయింపబడినదంతా) జితా భావనయందు, వ్యానము వ్యాన (విస్తరణ)తత్త్వము నందును, అవన్నీ – వాటివాటి విజ్ఞానము (ఎరుక) – ఆనందము (అనుభవము) నందు, ఆనందముగా అనుభవసాక్షియందు అస్తమించినవి అగుచున్నాయి. ఆ విజ్ఞాన–ఆనంద–తురీయములు (ఎరుక–అనుభూతి–అనుభూతిసాక్షులు) అమృత–అభయ–అశోక–అనన్త–నిర్బీజలక్షణ సమన్వితమగు **'కేవలాత్మ'**యందు అస్తమించుచున్నాయి. ఏదేది ఎందులోంచి బయల్వెడలుచు, ప్రదర్శితమగుచున్నదో.. అది అందులోనే అస్తమించుచున్నది. చివరిగా చెప్పాలంటే, పైన ఉదహరించుకొన్నవన్నీ ఆత్మనుండే బయల్వెడలి, ఆత్మయందు లయించగా, ఆత్మ నిర్బీజముగా (ఇతఃపూర్వమువలెనే) అగుచున్నది.

ఇంకా కూడా....,

**జిహ్వామేవ ఆప్యేతి యో, జిహ్వా మేవా అస్తమేతి.** ఏదైతే 'ఇది నాయొక్క నోటికి సంబంధించిన అనుభవము – అనుభూతి" … అగుచున్నదో అదంతాకూడా (జిహ్వానుభవముగా ప్రదర్శితమైనదంతా) 'జిహ్వానుభవము' నందు అస్తమించుచున్నది. రుచి రూపముగా పొందబడుచున్నది– రుచి యొక్క అనుభవము నందు, రుచి అనుభవమంతా రుచికి అధిదేవతయగు వరుణునియందు, సౌమ్యము, సౌమ్యత్వము నందు, 'ఉదాసీనము'– ఉదాసీనత్వమునందు– .. అవన్నీ ఎరుక (విజ్ఞానము) – అనుభూతి (ఆనందము)– తురీయము (ఆనంద సాక్షి) అగు ఆత్మయందు తిరిగి అస్తమిస్తున్నాయి.

చర్మము – చర్మానుభూతి యందు, చర్మానుభూతి, స్పర్శానుభూతి యందు, ఆ స్పర్శానుభూతి – అద్దాని అధి దేవతయగు వాయుదేవుని యందు, మోఘము (పాపము) మోఘతత్త్వము నందు (పాపభావనయందు), సమానానుభూతి – సమాన భావనయందు, అస్తమించుచున్నాయి. ఆయా భావనలన్నీ విజ్ఞాన–ఆనంద–తురీయములతో సహా (ఎరుక–అనుభూతి–సాక్షిత్వములతో సహా) – అమృత–అభయ–అశోక–అనన్త–నిర్బీజ రూపమగు 'ఆత్మ' యందు అస్తమించినవి అగుచున్నాయి.

- వాక్కుగా పొందబడునది. (చెప్పుచున్నదంతా) వాక్‌శక్తి యందు, చెప్పబడుచున్నవన్నీ వక్తవ్యతత్త్వము నందు, ఆ రెండూ అధిదైవతమగు, **అగ్నియందు**, కుమార ఉపప్రాణము కుమార తత్త్వము నందు, వైరంభము – వైరభతత్త్వమందు..
- హస్తములు – హస్త భావనయందు, హస్తములచే ధారణ చేయబడేదంతాహస్తధారణాతత్త్వము నందు, వాటి అధిదైవతము అగు ఇంద్రుడు – ఇంద్రత్వము నందు,
- అమృతముగా (జన్మరహితము) పొందబడునది. అమృత భావనయందు,
- పాదములు –నడకలు.. వాటి వాటి భావనయందు, అవి అధిదేవతయగు విష్ణువునందు,
- 'ఇది సత్యము' అని ఎద్దానిచే భావన చేయబడుచున్నదో, అది అద్దాని భావనా వైశిష్ట్యము నందు,
- ఏది 'అంతర్యామి'ని పొందుచున్నదో అట్టిది, ఆత్మ యొక్క అంతర్యామిత్వము నందు'

అస్తమించినవగుచున్నాయి. వాటికి సంబంధించిన విజ్ఞానము–ఆనన్దము–తురీయము(ఎరుక– అనుభూతి–సాక్షి).. ఎద్దానిచే కల్పించబడుచున్నాయో, అట్టి **ఆత్మయందే లయించుచున్నాయి.**

అట్టి **అమృతరూపము, అభయము, అశోకము, అనన్తము, నిర్బీజము అగు ఆత్మయందు అవన్నీ ఒకప్పుడు బయల్వెడలి, మరొకప్పుడు అస్తమించినవగుచున్నాయి.**

**ఇదియే ఇక్కడి స్వకీయ సృష్టి – స్థితి – లయ ఆత్మ విన్యాస వినోదము.**

ఇంకా మరికొంతగా చెప్పుకోవాలంటే..

పాయువు (విసర్జన) అద్దానిస్వభావ లేక భావతత్త్వమందు, విసర్జనము చేయబడునదంతా విసర్జన భావనయందు, విసర్జనాభావన–మృత్యువునందు, మధ్యమము– మధ్యమమునందు,(All that as In-Between in the Sense of feeling of the In between) ప్రభఞ్జనము–ప్రభంజనత్వము నందు (Show in the Show), ఉపస్థ ఆనందమునందు, ప్రజాపతి – ప్రజాపతిత్వమునందు,

- ఉపప్రాణములగు కూర్మము మొ॥వి ఉపప్రాణతత్త్వము నందు.
- మనస్సు అద్దాని ఉత్పత్తి స్థాన విభాగమగు మహా–మనస్సు నందు, ఆ మనస్సుచే ఆలోచించబడుచున్నవన్నీ, మానస తత్త్వమునందు, అవి రెండూ అధిదైవమగు **చంద్రభాగవానుని** యందు,
- శిశువు – శిశుత్వము నందు, శ్యేనము (స్వభావము) – శ్యేనత్వము (స్వభావత్వము) నందు....,

- బుద్ధి – బుద్ధితత్త్వము నందు, బుద్ధిచే విచారించబడునవి – బోధత్వము నందు, అవి అధిదైవతము అగు బ్రహ్మదేవునియందు తృష్ణ తన జనన స్థానమగు జీవునిలోని తృష్ణత్వమునందు,
- అహంకారము – అహంకారభావన యందు,
- అహమ్–మమకర్తవ్యమ్ (నాకర్తృత్వము, నా భోక్తృత్వము – మొదలైనవన్నీ) – అహంకర్తృత్వ భావన యందు,
- ఆ అహంకారము, అహంకర్తృత్వము – అహంకారమునకు అధిదేవతయగు **రుద్ర భాగవానుని** యందు,
- అసురము – అసురభావనా తత్త్వమందు,
- శ్వేతము – శ్వేతభావనయందు (సత్త్వ భావనలు – సత్త్వ గుణమునందు),
- చిత్తము – చిత్తభావనాతత్త్వమందు,
- చిత్తముచే ప్రియముగా అనుభూతమగుచున్నవన్నీ కూడా చిత్త ప్రియత్వము నందు, చేతయితమంతా చేతయితము ఉద్భవించు స్థానమునందు,
- క్షేత్రజ్ఞుడు ఆ క్షేత్రజ్ఞత్వము ఉదయించు స్వస్థానము నందు (ఆత్మయందు)
- వెలిగించబడుచున్నవన్నీ ఆ వెలుగుకు ఉత్పత్తి స్థానమగు కేవల తేజస్సునందు,
- నాగము (ఉపప్రాణము), అద్దాని ఉదయస్థానము అగు ప్రాణశక్తియందు, దేహ ప్రాణశక్తి – విశ్వప్రాణమునందు,

వాటివాటి విజ్ఞాన (ఎరుక) ఆనంద(అనుభూతి) తురీయ (సాక్షి)త్వములతో సహా అవన్నీతిరిగి ఏకము – అఖండము – అప్రమేయము – నిత్యము – ఆనందము – కేవలము – అమృతము – ఇహపర పరాత్పరము అగు – **"స్వస్వరూపాత్మ"** యందు స్వభావసిద్ధంగా అస్తమిస్తున్నాయి! **అమృతము–అభయము– అశోకము–అనన్తము–నిర్బీజము అగు పరమాత్మయందే సర్వము విలీనములగుచున్నాయి.**

అట్టి నిర్బీజమగు ఆత్మ యొక్క తత్త్వమేమిటో ఎరిగినవాడు **'నిర్బీజాత్మస్వరూపుడు'** (Absolute Self Sans the creation) అయి సర్వత్రా విరాజిల్లుచున్నాడు. **సృష్టి కొనసాగుచున్నప్పటికీ 'సృష్టి రాహిత్యము'ను ఆస్వాదిస్తూ ఉంటున్నాడు.**

అట్టివాడు తనను **తాను ఆత్మస్వరూపమే** అని ఎరుగుచూ,

- న జాయతే – జన్మించడు! "నేను జన్మించువాడను కాను" – అని ఎరిగినవాడై ఉంటున్నాడు.
- న మ్రియతే – మరణానుభవము పొందడు! "వస్త్రము ధరించి విడచుచున్నవిధంగా ఈ భౌతిక దేహము ధరిస్తున్నాను. విడచుచున్నాను" అని వినోది అయి గమనించువాడై ఉంటున్నాడు.
- న ముహ్యతే – 'ఈ దృశ్యము ఆత్మకు వేరుగా ఉన్నది' అనే మోహమును పొందడు. ఇక్కడున్నదంతా చూస్తూ కూడా, ఏమాత్రమూ వ్యధ చెందడు.
- న దహ్యతే – ఈ భౌతిక దేహము దహించబడవచ్చుగాక! తాను దహించబడనివాడై ఉంటాడు.
- న ఛిద్యతే – తాను ఖండనము పొందడు. ఆత్మగా అఛిద్యస్వరూపుడై విరాజిల్లుతూ ఉంటాడు.
- న కమ్పతే – ఈ జాగత్ దృశ్యములోని సంగతులను, సందర్భములను, సంఘటనలకు చూస్తూ.. తాను కమ్పనము పొందడు.
- న కుప్యతే – 'ఇదిమాయాజగత్తు' అని ఎరిగినవాడై, దేనిపట్లా కించిత్తు కూడా హృదయము నందు కోపము పొందడు. క్రోధము కలిగి ఉండడు.
- న సర్వదహనో : దేనినీ దేనితోనూ దహించివేయడు.

**అయమ్ ఆత్మా– ఇతి యాచక్షతే!** 'ఆహా! ఇదంతా సర్వదా అమృత–అభయ–అశోక–అనన్త–నిర్బీజ స్వరూపమగు నా ఆత్మకు సర్వదా అభిన్నము కదా!'.. అని దర్శిస్తూ ఉంటాడు.

ఓ రైక్వా! వివరించుకొనియున్నట్టి ఉపసంహార (లేక) పైన అస్తమయ చమత్కారము 'త్వమ్' పరంగా సారము (The Essence) చెప్పుచున్నాను. విను.

- 'నీవు' పొందుచున్న విశేషములన్నీ నీయొక్క నీ ద్రష్టత్వ స్వభావమునందు,
- ద్రష్టత్వము 'దృక్' స్వభావమునందు,
- 'దృక్' కాస్తా నీ జీవత్వ స్వభావమునందు,
- జీవత్వమంతా – నీ ఈశ్వర స్వభావమునందు,
- నీ ఈశ్వరత్వము – ఆత్మ స్వభావమునందు,
- ఆత్మ స్వభావము నీ యొక్క **అశోక–అజర–అనన్త–నిర్బీజ–అభయ 'స్వతత్త్వము'** నందు అస్తమిస్తున్నాయి. ఉపశమిస్తున్నాయి.

**రైక్వుడు :** గురుదేవా! ఘోరాంగిరసమహాత్మన్! మరి ఆత్మతో ఏకత్వము ఏ ప్రవచనముల ప్రభావముచే, ఏఏ వేదాధ్యయ, యజ్ఞ యాగ ఇత్యాది ప్రయత్నములచే లభించగలదు?

**ఘోరాంగిరసముని వరేణ్యుడు :** నాయనా! రైక్వా! **నైవమ్ ఆత్మా ప్రవచన శతేనాఽపి లభ్యతే, న బహు శ్రుతేన...!** అట్టి కేవల-ఆత్మభావన- ఆత్మ గురించి వందలసార్లు ఉపన్యసించినప్పటికీ లభించటము లేదు. ఎంతగానో వినినా కూడా, (లేదా) సొంత బుద్ధి పాటవము చేత గానీ, శ్రుతిజ్ఞానము చేతగాని, మేధస్సు చేతగాని, వేద మంత్రముల పఠనము చేతగాని, ఎన్నో యజ్ఞాలు చేయటము చేతగాని, ఉగ్రమైన తపస్సు చేతగాని, సాంఖ్యశాస్త్ర పఠణము చేతగాని, ప్రాణాయామము ఇత్యాది యోగాభ్యాసముల చేతగాని, ఆశ్రమములలో సుదీర్ఘనివాసము చేతగాని - లభించటము లేదయ్యా!

ఎట్లా పొందవచ్చో, ఆత్మజ్ఞులు మనకందిస్తున్న కొన్ని బాటలు ఇక్కడ ఉదహరిస్తున్నాను.

1 **సత్సంగముచే ఆత్మ గురించిన ఉపనిషత్-అర్థములను విశ్లేషించుకొనుచూ ప్రవచనములపై మరల మరల బుద్ధి సారించుచూ ఉండగా...,**
2 **బ్రహ్మముగా ఇదంతా దర్శిస్తూ బ్రాహ్మణాచారము (బ్రహ్మముగా భావించటము - అనే ఆచారము) పాటించుచూ ఉండగా...,**
3 **ఆత్మతత్త్వమును ప్రశంసించుచూ,**
4 **ఆత్మతత్త్వమునందు నిదుర లేచుచూ,**
5 **బ్రహ్మవేత్తలు చెప్పేవి ఇష్టంగా వినుచూ, హృదయమున పదిలపరచుకొనుచుండగా, "నీవు తత్ స్వరూపుడవే అని పలుకు తత్త్వవేత్తల పలుకులు వినుచుండగా ...,**
6 **శాంతమును ఆశ్రయిస్తూ,**
7 **ఇంద్రియని గ్రహమును అవలంభిస్తూ..., ఇంద్రియములను ఆత్మధ్యానము, ఆత్మ భావన, ఆత్మజ్ఞాన సమాచార సముపార్జనకై నియమిస్తూ,**
8 **తితిక్ష-సహాయంతో (ఓర్పుగా) జగత్ విషయ-సందర్భములను మాయగా గమనిస్తూ, అంగీకార బుద్ధితో** (Let them be as they be) - **సమభావన కలిగినవాడై, ఓర్పుతో సహిస్తూ, సమహితత్వము, ఉత్తమ సమాధానముచే, సర్వజీవుల పట్ల సమభావన కలిగి ఉండటము చేత...,**

.... ఇటువంటి ప్రయత్నములు కొనసాగుచుండగా ఆ యోగి **ఆత్మచేత ఆత్మను దర్శించుచున్నాడు**. ఆత్మ గురించి ఎరిగి, సర్వము (తెలుసుకొనువాడు - తెలియబడునది, అనుభవము తనదైన వాడు - అనుభవముగా పొందబడుచున్నది మొదలైనదంతా) - **ఆత్మగా దర్శించటమే** ఆత్మతత్త్వానుభూతి యొక్క స్వాభావికత్వమునకు సుమార్గము.

ఆత్మదర్శనము, ఆత్మసాక్షాత్కారము అనగా సర్వము స్వస్వరూపాత్మకు అభిన్నముగా అనిపించటము.

## దశమ ఖండము - ఆత్మయందు ఓత-ప్రోతము

**రైక్వుడు :** భగవాన్! గురుమహరాజ్! ఈ కనబడే సర్వము ఎందులో ప్రతిష్ఠితమై ఉన్నది?

**ఘోరాంగిరసమునీశ్వరుడు :** ఈ కనబడేదంతా రసస్వరూపమై రసాతల లోకములో **సంప్రతిష్ఠితమై** యున్నది. **రసోవై బ్రహ్మమ్!**

**రైక్వుడు :** అట్టి రసాతలము ఎందులో పూవువలె గ్రుచ్చబడి, ఓత-ప్రోతమై యున్నది? "ఓతము - తనయందే ఇదంతా! ప్రోతము - ఇద్దానియందంతా తానే!

| | | |
|---|---|---|
| రసాతలము | → | భూలోకము నందు, |
| భూలోకము | → | భువర్లోకము నందు, |
| భువర్లోకము | → | సువర్లోకము నందు, |
| సువర్లోకము | → | మహర్లోకమునందు, |
| మహర్లోకము | → | జనోలోకమునందు, |
| జనోలోకము | → | తపో లోకమునందు, |
| తపోలోకము | → | సత్యలోకము నందు, |
| సత్యలోకము | → | ప్రజాపతి లోకమునందు, |
| ప్రజాపతి లోకము | → | బ్రహ్మ లోకమునందు, |

పూలదండలో పూలవలె,

*బంగారములో ఆభరణము - ఆభరణములో బంగారమువలె,*
*జలములో తరంగము - తరంగములో జలమువలె*

**'ఓత - ప్రోతము' అయి ఉన్నాయి.**

అట్టి బ్రహ్మలోకము సర్వలోకములందు **ఓత-ప్రోతమై** అంతర్-సంచారక, అంతర్-ప్రత్యక్షమై ఉన్నది. మరి సర్వలోకములు ఎందులో ఉన్నాయి?

- సర్వలోకములు ఆత్మయందు ఓత-ప్రోతమై ఉన్నాయి. పరబ్రహ్మమునందు స్థానము కలిగియున్నాయి.
- మణులలో దారమువలె ఈ సర్వలోకములలో పరబ్రహ్మము అంతర్గతమై, ఇవన్నీ నిలచి ఉండటానికి మూల కారణమైయున్నది. ఎవ్వడైతే 'ఈ లోకములన్నీ ఆత్మయందే భావనామాత్రముగా ప్రతిష్ఠితములై ఉన్నాయి - అని గ్రహిస్తాడో, ఆతడు తనను ఆత్మగానే ఎరుగుచూ, సర్వలోకములను తన యందు ధరించినవాడగుచున్నాడు.
- ఇది నిర్వాణానుశాసనము - ఇతి వేదానుశాసనము. వేదవాఙ్మయము బల్లగుద్ది సిద్ధాంతీకరించు పరమసత్యము.

## ఏకాదశ ఖండము - ఆత్మయందే పునః ప్రవేశము

**<u>రైక్వుడు</u> :** ఓ గురుమహాదేవా! విజ్ఞాన ఘనుడగు ఆత్మభగవానుడు సర్వదేహములలో సర్వదా సమముగా వేంచేసినవారై ఉన్నారని మీరు శెలవిచ్చారు కదా! నా సందేహము ఏమిటంటే, అట్టి సర్వతత్త్వ స్వరూపుడగు ఆత్మతత్త్వము, ఎప్పుడు ఈ జీవునిదేహములో ఉత్క్రమణము (ప్రవేశము) పొందుచున్నారు? దేనిచేత దేహములో ప్రకాశిస్తున్నారు? ఏ స్థానము నుండి బయల్వెడలి ఈ భౌతిక దేహములోనికి వేంచేయుచున్నారు? ఇక్కడి నుండి (దేహపతానంతరము) తిరిగి ఎటువెళ్లుచున్నారు?

**గురుదేవుడగు ఘోరాంగీరసమునీంద్రుడు :**

- హృదయము యొక్క మధ్య ప్రదేశములో ఎఱ్ఱటి మాంసపిండము!
- అట్టి హృదయము యొక్క మధ్య భాగములో ఆకాశము (దహరాకాశము)!
- అట్టి హృదయ - దహరము-తామర మొగ్గ, కలువ వలె అనేక రెక్కలు కలిగి, వికశించియున్నది.
- అద్దాని మధ్యలో సముద్రము.
- ఆ సముద్రము మధ్యగా కోశము.
- ఆ కోశములో వందలాది నాడులు.
- అట్టి అసంఖ్యాక నాడులలో '4' ముఖ్యమైన నాడులు 1) రమా 2) అరమా 3) ఇచ్ఛా 4) పునర్భవ
- **తత్ర 'రమా' పుణ్యేన పుణ్యం లోకం నయతి।**

అట్టి నాడులలో-రమా (ఇంద్రియ విషయములతో, జగత్ దృశ్య విషయములలో మనోబుద్ధులను నియమించి, వాటియందు రమిస్తూ రోజులు గడపటం) వలనను..., అట్టి 'రమా' నాడి యందు రమించు ఇచ్ఛ గలవాడు పునర్జన్మ, జన్మ పరంపరలు పొందుచున్నాడు. పుణ్య కార్యములు నిర్వహిస్తూ (ఆశ్రయిస్తూ) ఈ 'రమా' నాడి యందు రమించువాడు క్రమంగా పుణ్యలోకములు పొందటము జరుగుతోంది.

- **అరమా పాపేన.** 'అరమా' యందు రమించువాడు ఆసురీభావన సంపన్నుడై పాపలోకములు చేరవలసి వచ్చుచున్నది.
- **ఇచ్ఛయా యత్‌స్మరతి, తత్ అభి సంపద్యతే!** 'ఇచ్ఛ' అను మరొక ముఖ్యనాడి యందు సంచరించువాడు - ఇచ్ఛచే ఏది స్మరిస్తూ ఉంటే, అది పొందటం జరుగుతూ ఉంటోంది.

**పునర్భవాయం కోశం భినత్తి।** పునర్భవనాడియందు సంచరించుజీవుని పట్ల కోశములు ఛేదనము పొందుచున్నాయి. పంచకోశములు ఖండించబడుచుండగా 'శీర్షకపాలము' - భేదనము పొందుచున్నది. **కోశం భిత్వా శీర్ష కపాలం భినత్తి।**

- శీర్షకపాల భేదన చేత - **'పృథివి'** భేదనము పొందుతోంది.
- పృథివీ భేదనముచే **'జలము'** ఆపః (జలము) భేదించబడుతోంది.
- జలము భేదనచే - **'తేజస్సు'** భేదనము పొందుచున్నది.
- తేజస్సు యొక్క భేదనము - **'వాయువు'**ను భేదనమునకు దారితీయుచున్నది.
- వాయువు భేదనమై - **'ఆకాశము'**ను భేదనము చేయుచున్నది.
- ఆకాశము భేదనమై - **'మనస్సు'**ను భేదనము చేయుచున్నది.
- మనస్సు భేదనమై - **'భూతాది'**ని ఖండనము చేయుచున్నది.
- భూతాది ఛిద్రము (ఖండము) అయి - **'మహాస్తము'** ఖండము చెందుచున్నది.

- మహాన్తము ఖండమై – అవ్యక్తమునకు భినత్తి (ముక్కలు) చేయుచున్నది.
- అవ్యక్తము ఖండమై – అక్షరమును భేదనము చేయుచున్నది.
- ఖండమైన అక్షరము – మృత్యువును భేదనము చేయుచున్నది.

**మృత్యుర్వై పరే దేవ ఏకీభవతి!** ఇకప్పుడు మృత్యువు – **'పరము–పరమాత్మ'**లో ఏకత్వము పొందుచున్నది. **"ఇహమునకు (అనగా 'జీవాత్మ'కు) యజమాని, ఏకస్వరూపుడు, అఖండుడు",** అను ఆయా శబ్దార్ధములచే ఉద్దేశ్యించబడుచున్న 'పరము'తో తదితరమైనదంతా ఏకీభూతము అగుచున్నది. (All this is getting united with the other side of one's own self)

ఓ రైక్వా!

అట్టి మనలో ప్రతి ఒక్కరి మనందరి పర స్వరూపము (ఇహస్వరూపమునకు ఆవల ఉన్నట్టిది) – అఖండము. అద్దానిలో నేను – నీవు –జగత్తు– బంధము–మోక్షము– విజ్ఞుడు– అజ్ఞుడు.. ఇత్యాది భేదములే లేవు. అది – ఏకము, అనన్తము, అద్వితీయము, నిత్యము, నిర్మలము, సత్యము, నిరామయము, నిరాలంబము' ఇత్యాది – మహదర్థములచే, **మహత్** శబ్దములచే చెప్పబడుచున్నది.

ఓ శ్రోతలారా! అట్టి పరస్వరూపము సర్వదా మన యొక్క సహజ స్వరూపము! తదితరమైనదంతా ఆపాదితము, కల్పితము, సందర్భ మాత్రము ఊహాజనితము. అసత్తు కూడా!

అట్టి మనయొక్క అఖండ అప్రమేయ పరస్వరూపము...., **'సత్తు' – ఉన్నది** (That is here present) అనవచ్చా?

ఇంద్రియములకు మాత్రమే ఉన్నట్లుగా కనిపిస్తున్న వస్తువును మాత్రమే మనము లౌకికముగా 'సత్తు' – ఉన్నది అని అంటాము. ఆత్మయో ఇంద్రియములకు విషయమే కాదు! కనుక 'సత్తు' – ఉన్నది" – అని (ఇంద్రియానుభవముల దృష్ట్యా) అనలేము!

**పోనీ, అసత్తుయా?**

ఇంద్రియములు ఆ పరస్వరూపము యొక్క చైతన్యతత్త్వము (కదలించు స్వభావము) చేతనే ప్రవర్తమానమగుచున్నాయి. పరతత్త్వమే లేకపోతే (విద్యుత్తు లేకుంటే బల్బు వెలగని విధంగా ఫాన్ తిరగని విధంగా) ఇంద్రియములు తమకు తాముగా ప్రవర్తించలేవు. కనుక పరస్వరూపము, అసత్తు కాదు. ఇంద్రియములను చేతనముగా చేయుదానిని 'అసత్తు' అని ఎట్లా అంటారు?

లేక సదసత్తుయా? కొంతసేపు సత్తు గాను, మరికొంతసేపు అసత్తుగాను ఉంటోందా? స్వస్వరూపము సత్ – అసత్‌ల మిశ్రమమా?

'నేను ఉన్నాను' అనునది సత్తు. 'నేను మెళకువలో లేను. నేనునిద్రలో ఉన్నాను'.. అను ఉనికిని భావన చేయుచూ సత్–అసత్ భావనలకు మునుముందే ఉన్నట్టిది. సత్–అసత్ భావనలకు (అనుభూతులకు) సాక్షియై ఉన్నది. కనుక అది 'సదసత్తు' (ఉండీ లేనిది – లేకా ఉన్నది) కూడా కాదు.

అద్దాని ఉనికిని, ప్రతిభను – మోక్షశాస్త్రము, ఆత్మజ్ఞులు గానంచేస్తూ మనకు వినపిస్తున్నారు! అందుచేత నిర్వానుశాసనము!

తెలియబడేదంతా 'వేదము'! **తెలుసుకొంటున్నవాడు ఉంటేకాదా, తెలియబడేది**? **'అట్టి కేవల చిత్‌స్వరూపుడగు తెలుసుకొనువాడు ఉన్నాడు'..** అనటానికి తెలియబడునది ఉండటమే **సాక్ష్యము. ప్రమాణము.** అందుచేత ఆ పరస్వరూపము.. ***'వేదానుశాసనము' 'వేదానుశాసనమితి'!***

## 12. ద్వాదశ ఖండము – అన్నమ్ – అన్నాదమ్ – సర్వమ్ బ్రహ్మమ్!

అన్నమ్ = అనుభవముగా పొందబడుచున్నది. జగత్ రూపముగా భావించబడుచున్నది. దృశ్యముగా దర్శించబడుచున్నది.
అన్నాదమ్ = అనుభవి

- కళ్లచే దృశ్యముగా చూడబడుచున్నదంతా కళ్లకు అన్నమ్. చెవులచే శబ్దముగా వినబడుచున్నది చెవులకు–వినికిడి రూపము అన్నము.
- మనస్సుచే విషయముగా ఆలోచించబడుచుననది. మనస్సుకు విషయములు అన్నము.
- బుద్ధిచే 'ఇది ఇట్లుకదా' అని సమన్వించుకోబడుచున్నదంతా – బుద్ధికి ఆహారము! వివేచనయే బుద్ధికి అన్నమ్!
- చిత్తమునకు **ఇష్టము అన్నము.**
- అహంకారమునకు **'అహమ్ కర్తవ్యమ్? 'అహమ్‌కర్తా'..** అనునది అన్నము.
- ఈ దృశ్యమంతా జీవునికి **'అన్నము'.** సర్వేంద్రియ విషయాలు జీవాత్మకు అన్నముగా అగుచున్నాయి.
- పరమాత్మకు (మనపర స్వరూపమునకు) ఈ దృశ్యములోని ఇహస్వరూపము (జీవాత్మ) – అన్నము అగుచున్నది.
- ***అట్టి పరస్వరూపము సర్వదేహములలో వేంచేసియున్న శ్రీమన్నారాయణునికి 'అన్నము' అగుచున్నది.***

ఈ విధంగా..

అన్నమ్ = అనుభవమునకు విషయమగుచున్నట్టిదంతా కూడా!

**నారాయణాద్వా అన్నమ్ ఆగతమ్!** అన్నమ్ (అనుభవమగుచున్నదంతా కూడా) సర్వాంతర్యామి– సర్వదేహనివాసి– సర్వతత్త్వ స్వరూపుడు అగు శ్రీమన్నారాయణుని నుండియే బయల్వెడలు చున్నది.

అనుభవించబడుచున్నదంతా (అనుభూతమగుచున్నదంతా)... **బ్రహ్మమే! నారాయణ స్వరూపమే!**

**పక్వ బ్రహ్మలోకే..** బ్రహ్మలోకమునందు పక్వమైనట్టి 'అన్నము' (All that being experienced).

**పక్వ– మహాసంవర్తకే..** ప్రళయ మేఘముల నుండి పరిపక్వత పొందుచున్నదై,

**పునః పక్వమ్ ఆదిత్యే..** తిరిగి జగత్–ఆది స్వరూపుడగు ఆదిత్యభగవానునిచే పక్వము పొందినదై,

**పునః పక్వమ్ క్రవ్యాది..** తిరిగి మాంసమయదేహము నందు ఆ అన్నము పక్వమగుచూ,

**పునః పక్వమ్ జ్వాలాకీల కిన్నః** – అగ్ని (జ్ఞానాగ్ని) జ్వాలలచే ఉడకబెట్టబడినదై,

**పర్యుషితమ్** – ఉడకబెట్టి – చల్లార్చబడినదై,

**పూతమ్** – పవిత్రమై బ్రహ్మమునందే చివరికి చేరుచున్నది. కనుక, పరబ్రహ్మముగానే అనుభూతము అగుగాక! ఈ కనబడే 'అన్నము' శబ్దముచే చెప్పబడుచూ, అనుభూతముగా (జీవాత్మ నుండి దృశ్యానుభవము వరకు) ఏది అగుచున్నదో, అదంతా కూడా ఆత్మానారాయణుని నుండే బయల్వెడలుచూ ఆత్మానారాయణ స్వరూపమే అయి ఉన్నది.

**'అన్నమ్ పూతమ్, అయాచితమ్, అసంక్లప్తం తత్ అదశ్నీయాత్! న కించన యాచేత!**

దృశ్యమును నారాయణ స్వరూపముగా (అన్నమును పరబ్రహ్మ స్వరూపముగా) భావించి ఉపాసించాలి! ఈ అనుభవమగుచున్న దాని పట్ల 'నారాయణ స్వరూపము' అను పవిత్ర భావన కలిగి ఉండాలి. అంతేగానీ అసంక్లిప్తముగా (జగత్ భావాలతో, కామ–క్రోధ–లోభ.. మోహ–మద–మాత్సార్యాలతో కలిపి) భుజించరాదు. ఆస్వాదించరాదు.

**న కఞ్చన అయాచితమ్ – అది అట్లాగే ఉండాలి – ఇట్లాగు ఉండకూడదు".** అనే యాచనతో ఈ అన్నమ్ (దృశ్యము)ను స్వీకరించరాదు. నారాయణ స్వరూపముగా భావిస్తూ అనుభవమయ్యేదంతా సర్వదా ఆత్మానారాయణత్వముగా ఉపాసించబడుగాక! పరబ్రహ్మస్వరూపముగా దర్శించబడుగాక! (అన్నమ్ పరబ్రహ్మ స్వరూపమ్)!

(అన్నమ్ బ్రహ్మ! అహమ్ బ్రహ్మ! భోక్తాచ బ్రహ్మ! అనుభవమగుచున్నదంతా బ్రహ్మమే! నేను బ్రహ్మమును! దృశ్యానుభవి అగు నా జీవాత్మ బ్రహ్మమే! అనుభవించువాడు – అనుభవించబడునది – ఉభయ ప్రేరకుడు – అంతా బ్రహ్మమే!)

## 13. త్రయోదశ ఖండము–బాలవత్–సుబాలవత్

### ప్రజాపతి ఆప్త వాక్యములు

**ఘోరాంగీరసుడు :** ఓ రైక్వా! తదితర శ్రోతలారా! ఓ పరబ్రహ్మానంద స్వరూపులారా! ఈ జగత్తులో ఏరీతిగా ఉండాలో, సంచరించాలో, ఇక్కడ కొన్ని విశేషాలు మీముందు ఉంచుచున్నాను. వినండి!

**బాల్యేన తిష్ఠాసేత్!** 'నేను ఈ దృశ్యములో ఒక బాలునివలె ఉండాలి'.. అని కోరుకొనెదరు గాక! (ఇందుకే ఈ ఉపనిషత్తుకు 'సౌబాలబీజ బ్రహ్మోపనిషత్' (లేక) 'సుబాలోపనిషత్' అను పేరు ఇవ్వబడింది)!

**బాలస్వభావో :** ఒక చిన్న పిల్లవానికి 'ఆట బొమ్మ' ఎంతో ఆనందము ఇస్తున్న విధంగా, ఈ జగదనుభవమంతా (దృశ్యవ్యవహారమంతా) ఈ దేహములు ఇంద్రియములతో సహా, – ఇంద్రియ విషయములతో సహా – **"ఆడుకొనే వస్తువుల సంఘములు"** వలె దర్శించబడుగాక! దీనినే బాలోపాసన – అని కూడా అంటారు! అంతా చిన్న పిల్లల ఆటలలో సంఘటనల వలె భావించాలి!

**అసంజ్ఞో :** బాలునికి దేనితోనూ సంగము ఉండదు. ఆడుకునేటప్పుడు ఆడుకోవటం, అల్లరి చేసేటప్పుడు అల్లరి, రుచిగా తినేటప్పుడు తినటం, అమ్మ జోలపాట పాడేటప్పుడు పాట విని వినోదించటము, నిద్రపోయేటప్పుడు నిద్ర.. **ఆస్వాదిస్తూ.. ఉంటాడు.** దేనికీ పరిమితుడై ఉండదు. అట్లాగే ఇక్కడి సంగతి – సందర్భ–సంబంధ– సంవేదనలను పొందుచూ కూడా ఏ ఒక్కదానితోనూ **సంగము లేకుండా** ఈ జీవుడు వేరుగా ఉండాలి. అసంగులమై మనము ఉందాము. కథ చదువుతూ ఉండేవాడికి కథలోని విశేషాలన్నీ (కష్ట–సుఖ–సంగత–అసంగతాలన్నీ) నవలాపఠణ వ్యాసంగ విశేషాలే కదా! అంతేగాని, క్రోధ–తాప–ఆవేశములు పొందవలసిన పనేమున్నది? ఈ దృశ్య జగత్తు అటువంటిదే!.... అనునదే **సౌబాలబీజ భావన.**

**నిరవద్యో :** ఇక్కడి గుణములతో సంబంధము కలిగి ఉండక, గుణాతీతులమై, దృశ్యాతీతులమై, గుణములకు బద్ధులము కానివారమై తదితరులలో కన్పించే త్రిగుణ సాక్షిగా చూస్తూ ఉండెదము గాక! వేరు-వేరుగా కాక, ఏకమును దర్శించెదముగాక! ఏకమునందు ఇక్కడ అనుభూతమగు 'అనేకమంతా' (ఏకం చేసి) దర్శించెదము గాక!

**మౌనేన :** సర్వ జగత్ విశేషాల పట్ల, విషయముల పట్ల - అప్రమేయులమై 'మౌనము' వహించిన వారమై ఉండెదముగాక!

**పాండిత్యేన :** నిత్యానిత్య వివేకులు చెప్పుచున్న పరమాత్మ సంబంధమైన పాఠ్యాంశములను నెమరవేసుకుంటూ, హృదయస్థము చేసుకుంటూ పవిత్రమగు ఆత్మజ్ఞాన దృష్టిని వదలక - ఉండెదముగాక! దృశ్యము నందు జ్ఞానదృష్టి, మహావాక్యార్థ పాండిత్యము కలిగి ఉండి - సంచరించెదముగాక!

**నిరధికారతయా ఉపలభ్యతే కైవల్య ముక్తం-ఇతి నిగమనమ్:** -మనము పైన చెప్పుకొన్నవిధంగా బాలునివలె ఉండాలి. నిరధికారముగా ఉండాలి! **వేదములచే గానము చేయబడుచున్నట్టిది**-అగు **'కైవల్యముక్తి'**కి ఇక్కడే, ఇప్పుడే మనము యోగ్యులము అవాలి.

ఓ రైక్వా! తదితర బిడ్డలారా! ఒక సందర్భములో ఈ సృష్టికి కారణభూతుడగు ప్రజాపతి చెప్పిన ఒక పాఠ్యాంశమును మనము ఈ సందర్భములో గుర్తు చేసుకుందాము.

## ప్రజాపతి శ్రేయో వాక్యములు

ప్రజాపతి : ఓ సర్వజీవులారా! బిడ్డలారా! **'నేను దేహ-మనో-బుద్ధి-చిత్త-అహంకార దేహపరిమితుడును కాను! సర్వదా ఆత్మస్వరూపుడను!"** అను పరమసత్యమును సదా మననము చేసుకొంటూ ఉండండి! మహత్ పదమ్ జ్ఞాత్వా- **'మహత్పదము'** అనగా ఏమో తెలుసుకొని ఉండండి.

**వృక్షమూలే వసేత్ కుచేలో, అసహాయ, ఏకాకీ-సమాధిస్థ** మాసిన గుడ్డలతో, అసహాయులై (ఏ ఒక్కటీ సహాయముగా కలిగి ఉండవలసిన అవసరము లేనివారై), ఏకాకి అయి (ద్వితీయము అనునదంతా దాటివేసినవారై), ఇక (ఈ సంసార)వృక్షమూలమున ఆశీనులై, ప్రశాంతచిత్తముతో సర్వమును దర్శిస్తూ ఉండండి! 'సర్వమునందు సమమగు **సంవిదాత్మ**ను దర్శించటము'..అను సమాధియందు సుఖముగా కూర్చుని యున్నవారై ఉండండి!

**ఆప్తకామో -** దృశ్యములో ఏదీ కోరక- కోరికలన్నీ తీరిపోయినవారై...,

**ఆత్మకామో-** ఆత్మదర్శనము (సర్వము ఆత్మగా దర్శించటము) ఒక్కటి మాత్రమే కోరుకొనుచున్నవారై....,

**నిష్కామో -** ఏ కోరికలూ లేనివారై, కోరికల తీరమును దాటివేసినవారై.., ఉండండి!

**జీర్ణకామో -** సర్వకామముల రహస్యమును ఆత్మాభావనయందు జీర్ణము చేసుకొన్న వారై ఉండండి!

**యో హస్తిని - ఇత్యాది మృత్యోర్యూపాణి విదిత్వా నబిభేతి కుతశ్చనేతి।** ఇక్కడ దృశ్యములో కంటికి కనిపిస్తున్న ఏనుగునందు, సింహము నందు, ఒక ఈగ-దోమయందు, ముంగిసయందు, సర్పము నందు, యక్ష-రాక్షస-గంధర్వ- కింపురుష దేవ ఇత్యాది జాతులందు, సహమానవుల యందు **'ఇదంతా మృత్యురూపమే! మార్పుచెందురూపమే! దీనికి ఆవల ఆత్మ! ఆ ఆత్మయే ఈ ఈ రూపాలన్నీ! కనిపించేదంతా అనేకముగా కనిపించుచున్నప్పటికీ ఇదంతా అఖండమగు ఆత్మగా నాకు సునిశ్చయమై అనిపించునుగాక!'..** అను ఉపాసనను స్వీకరించినవారై ఉండండి! అప్పుడిక సర్వ భయములు తొలగుతాయి. అభయము సిద్ధించగలదు.

ఓ బిడ్డలారా! **వృక్షమివ తిష్ఠాసేత్, ఛిద్యమానోఽపి, న కుప్యేత। న కమ్పేత।** ఈ సంసారణ్యమును జయించివేయాలి, ఒక వృక్షము వలె ఉండాలని కోరుకొనిదెరుగాక! ఎట్లా అంటే, వృక్షము నరకబడుచున్నప్పుడు కూడా ఏ మాత్రమూ కోపించదు. కంపించదు. ఫలములను కోసుకొంటున్నప్పుడు ఏ మాత్రము కోపము -కంపన లేనిదై ఉంటుంది. ఆవిధంగా ఈ దృశ్యమునందు జీవితయాగము సాగిస్తూ, ఆత్మతత్త్వమునందు సర్వదా తత్పరులై ఉండండి.

**ఆకాశమివ తిష్ఠాసేత్, ఛిద్యమానోఽపి, .. న కుప్యేత! న కమ్పేత।** ఖండించబడుచున్నప్పుడు కూడా ఆకాశము కోపము- కంపము పొందదు కదా! ఒకచోట ఒక గోడ కట్టినంత మాత్రము చేత ఆకాశము తన అఖండత్వము ఏ మాత్రము త్యజించకుండానే ఉంటుంది కదా! అట్లాగే మీరంతా పరమసత్యమగు 'ఆత్మాఽహమ్' భావనను సర్వదా సుస్థిరముగా ఆశ్రయించి ఉండెదరుగాక! **సత్యేవ తిష్ఠాసేత్! సత్యో అయమాత్మా!** మీరంతా సత్యమునందే ప్రతిష్ఠితులమై ఉండండి! ఆ సత్యము ఏమిటంటారా?

**పరబ్రహ్మమే అజ్ఞాన దృష్టికి జీవాత్మవలె అగుపిస్తోంది! ఈ జీవాత్మ సర్వదా పరబ్రహ్మమే!** ఈ సత్యమునే అనేక సంభాషణలతో నిరూపించుకుంటున్నాము. మహర్షుల ఆప్తవాక్యములు ఉపనిషత్తుల రూపంగా అదియే ప్రకటిస్తున్నాయి.

## ఇదంతా – పరమాత్మ హృదయ స్థానము నందే!

| | |
|---|---|
| **సర్వేషామ్ ఏవ గంధానామ్ పృథివీ హృదయమ్।** | సర్వ గంధములకు పృథివియే (భూమియే) హృదయస్థానము! |
| **సర్వేషామేవ రసానామ్ ఆపో హృదయమ్।** | సర్వ రసములకు జలమే హృదయస్థానము! |
| **సర్వేషామేవ స్పర్శానామ్ వాయుః హృదయమ్।** | సర్వ స్పర్శానుభవములకు వాయువు హృదయ స్థానము! |
| **సర్వేషామ్ శబ్దానామ్ ఆకాశమ్ – హృదయమ్।** | సర్వశబ్దములకు ఆకాశమే హృదయము! |
| **సర్వేషామేవ గీతానామ్ అవ్యక్తమ్ హృదయమ్।** | సర్వ గీతములకు అవ్యక్తమే హృదయము! |
| **సర్వేషామేవ సత్వానామ్ మృత్యుః హృదయమ్।** | ఉనికి గల సర్వ పదార్థములకు మృత్యువు (మార్పు)యే హృదయము |

మృత్యువునందు – ఉనికి గల సర్వ పదార్థములూ – ఏకీభూతమగుచున్నాయి. అట్టి మృత్యువు యొక్క స్థానము పరతత్త్వము యొక్క హృదయము. పరమాత్మ సర్వదా ప్రతి ఒక్కరి సహజ–స్వస్వరూపమే అయి ఉన్నది. అట్టి పరమాత్మ సత్తు కాదు. అసత్తు కాదు. సదసత్తు కాదు. అట్టి పరమాత్మను సర్వాంతర్యామిగా, సర్వతత్త్వ స్వరూపునిగా ఉపాసించండి! అప్పుడు మీరే పరమాత్మ స్వరూపులై ప్రకాశించగలరు!

**ఇదియే నిర్వాణానుశాసనము**

**వేదానుశాసనమ్**

## 14. చతుర్ధశ ఖండము – ఆత్మయేవ అన్నాదమ్

**అన్నము = అనుభూతమగు వస్తువు!   అన్నాదమ్ = అనుభవి. అనుభవ ప్రదాత.**

**ఘోరాంగీరస మునీశ్వరుడు**

| | | | |
|---|---|---|---|
| ఈ పృథివి | అన్నము (అనుభవము)–జలము అన్నాదము (అన్నప్రదాత) | | |
| జలము | అన్నము | – | జ్యోతి 'అన్నాదము' (ప్రదాత). |
| జ్యోతి | అన్నము | – | వాయువు అన్నాదము. |
| వాయువు | అన్నము | – | ఆకాశము అన్నాదము. |
| ఆకాశము | అన్నము | – | ఇంద్రియములు అన్నాదము. |
| ఇంద్రియములు | అన్నము | – | మనస్సు అన్నాదము. (మనస్సుచే ఇంద్రియములు ఉపయోగించబడుచున్నాయి) |
| మనస్సు | అన్నము | – | బుద్ధి అన్నాదము. (బుద్ధికి మనస్సు ఉపకరణము) |
| బుద్ధి | అన్నము | – | అవ్యక్తము అన్నాదము. |
| అవ్యక్తము | అన్నము | – | అక్షరము అన్నప్రదాత. |
| అక్షరము | అన్నము | – | మృత్యువు అన్నాదము. |

మృత్యువునకు ఆవల పరమాత్మ అనంతప్రకాశమానుడై, స్వభావానందస్వరూపుడై, ఏక–అఖండ స్వరూపుడై విరాజిల్లుచున్నారు. పరమాత్మయే సర్వమునకు అన్నాదము (One for whose consumption all this is). ఈ సర్వము పరమాత్మకు అన్నము!

**అట్టి పరతత్త్వము...,**

***సత్తు కాదు! అసత్తు కాదు! సదసత్తు కాదు!***

**ఇతి నిర్వానుశాసనము**

**ఇతి వేదానుశాసనము**

## 15. పంచదశ ఖండము – ఆత్మ జ్ఞానాగ్ని దేనిని దహిస్తోంది?

**రైక్వుడు :** గురుదేవా! ఘోరాంగీరస మహాశయా! **యో అయం 'విజ్ఞానఘన' – ఉత్క్రామన్, స కేన, కతరత్వ అవస్థానం దహతి?** ఆత్మాజ్ఞానముచే ఏ ఆత్మజ్ఞాన-విజ్ఞాన ఘనము ఉత్క్రమనము, అట్టి జ్ఞానాగ్ని దేనిచే ఏ స్థానమును దహించున్నది?

**ఘోరాంగీరస మహామునీంద్రుడు :** ఆత్మ జ్ఞానియొక్క విజ్ఞాన ఘనాగ్ని ప్రజ్వలితమై మొట్టమొదట 'ప్రాణము'ను దహించుచున్నది. ప్రాణముతో బాటే అపాన-వ్యాన-ఉదాన-సమానములను కూడా, దహిస్తోంది.

అట్లాగే వైరంభమును, ముఖ్యప్రాణమును, అంతర్యామమును, ప్రభంజనమును, కుమారమును, శ్యేనమును, శ్వేతమును, కృష్ణమును, నాగమును, ప్రాణ-ఉపప్రాణములు – ఇవన్నీ ఆతని ఆత్మజ్ఞానాగ్ని దహించి వేయుచున్నది.

ఆ తరువాత ఆ విజ్ఞాన ఘనుడు – పంచభూతములైనటువంటి పృథివి, ఆపః, తేజో, వాయుః ఆకాశములను దహిస్తున్నారు. ఆత్మకు అభిన్నముగా భావించి, ఏకము చేయుచున్నారు.

- జ్ఞానాగ్ని జాగ్రత్ – స్వప్న-సుషుప్తి-తురీయములను,
- మహాన్తలోకము (అన్నిటిలోని నేనైన నేను)ను ఇహలోకమును, పరలోకమును ఆత్మ జ్ఞానాగ్ని దహించుచున్నది. లోక-అలోకములను కూడా దహించివేయబడుచున్నది.
- ఆత్మత్త్వము – ఇంకా కూడా, ధర్మ-అధర్మములను కూడా దహిస్తోంది.
- అభాస్వరమును, అమర్యాదను, నిరాలోకమును, అన్తఃపరము (మనో-బుద్ధి-చిత్త-అహంకారములను) కూడా ఆత్మతత్త్వ జ్ఞానాగ్ని దహించివేయుచూ, ఆత్మతత్త్వముతో ఏకము చేయుచున్నది.
- మహాన్తమును, అవ్యక్తమును కూడా దహించివేయుచున్నది.
- అక్షరమును, మృత్యువును కూడా దహించుచున్నది.

మృత్యువుకు ఆవల గల పరతత్త్వ స్వరూపము (లేక) కేవలీ స్వస్వరూపము మాత్రము ఆ దహనముకు విషయమే అయి ఉండదు. అట్టి పరతత్త్వము-న సత్! న అసత్! న సదసత్!

**ఇతి నిర్వాణుశాసనమ్!**

**ఇతి వేదానుశాసనమ్!**

## 16. షోడశ ఖండము – అర్హత – ఫలశ్రుతి

మహత్తర సత్యమగు సర్వగత-స్వస్వరూప ఆత్మతత్త్వము గురించి సహేతుక వివరణతో ప్రతిపాదిస్తున్న ఈ శుక్లయజుర్వేదాంతర్గత **'సౌబాల బీజబ్రహ్మోపనిషత్ (లేక) సుబాలోపనిషత్'** లోని విషయాలను, వివరణలను, చర్చనీయాంశాలను

- అప్రశాంత శీలుడగువానికి చెప్పరాదు.
- విజ్ఞానార్థుడైతేనే పుత్రునికైనా, శిష్యునికైనా బోధించాలి.
- ఒక సంవత్సరకాలముగాని, (లేక) ఒకరాత్రి కాలముగాని శ్రోతయొక్క ఆశయము – పట్టుదల- ప్రజ్ఞలను పరిశీలించకుండా ఈ ఉపనిషత్ విషయములు చెప్పవద్దు.
- కులశీలత్వము – కులధర్మము ఎరుగని వానికి కూడా బోధించరాదు.

ఎవ్వనికైతే దైవభక్తి-గురుభక్తి హృదయమునందు వికశించి ఉంటుందో, **అట్టివానికి తప్పక బోధించాలి**. అట్లు బోధించుటచే ఇందలి తత్త్వార్థము అగు ఆత్మ వస్తువు సుస్పష్టముగా, హృదయస్థమై ప్రకాశమానమవగలదు.

**లోక కళ్యాణమస్తు!**

**ఇతి నిర్వాణానుశాసనమ్! వేదానుశాసనమ్!**


***ఇతి సౌబాలబీజ బ్రహ్మోపనిషత్ (లేక) సుబాలోపనిషత్***

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

శుక్ల యజుర్వేదాంతర్గత

# 16 యాజ్ఞవల్క్యోపనిషత్

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**ఓం నమో యాజ్ఞవల్క్యాయ! జనకాయ! అత్రిమహర్షయే! సంవర్తకాయ! ఆరుణి! శ్వేతకేతవే! దూర్వాసాయ! ఋభు! నిదాఘాయ! దత్తాత్రేయాయ! శుక! వామదేవాయ! హారీతకాయ ప్రభృతయో నమో నమః॥**

**శ్లో॥ సన్న్యాస జ్ఞాన సంపన్నా యాంతి యత్ వైష్ణవం పదమ్**
**తద్వై పదమ్ బ్రహ్మతత్త్వం, రామచంద్రపదం భజేత్॥**

*సన్న్యాస జ్ఞానసంపన్నులగు మహనీయులు ఏ సర్వత్రా సర్వముగా వేంచేసి యున్న వైష్ణవ పదమును సముపార్జించుకొని ఆనందభరితులగుచున్నారో.... అట్టి అద్వైత పదమును ప్రసాదించుటకై బ్రహ్మతత్త్వ స్వరూపమగు శ్రీరామచంద్ర పాదపద్మములను భజించుచున్నాము.*

----

**ఓం**

**1. అథ జనకో హ వై వైదేహో యాజ్ఞవల్క్యమ్**
**ఉపసమేతి యో, వాచః**
**'భగవన్'! సన్న్యాసమ్ అనుబ్రూహీతి।**
**కథం సన్న్యాస లక్షణమ్?**
**<u>సహో వాచ యాజ్ఞవల్క్యః</u>**
**బ్రహ్మచర్యం సమాప్య గృహీ భవేత్।**
**గృహాత్ వనీ భూత్వా ప్రవ్రజేత్।**
**యది వేతరథా బ్రహ్మచర్యాత్**
**ఏవ ప్రవ్రజేత్, గృహాద్వా, వనాద్వా।**
**అథ పునః అవ్రతీ వా – వ్రతీవా,**
**స్నాతకోవా – అస్నాతకోవా,**
**ఉత్సన్నాఽగ్నిః – అనగ్నికోవా,**

ఒకానొకరోజు విదేహరాజగు జనక మహారాజు బ్రహ్మతత్త్వజ్ఞాని అగు యాజ్ఞవల్క్య యతీంద్రులవారిని సమీపించారు. ఇట్లు సంభాషించసాగారు.

**జనకమహారాజు :** హే భగవన్! యాజ్ఞవల్క్య మునీశ్వరా! 'సన్న్యాసము' అను దాని గురించి చెప్పండి. సన్న్యాసము యొక్క లక్షణములు ఏమేమియో దయచేసి వివరించండి!

**యాజ్ఞవల్క్యుడు :** మహాత్మా! జనకమహారాజా! వినండి.

గురు ఆశ్రమములో విద్యాభ్యాసము ముగించుకొని, ఆ బ్రహ్మచారి వ్రతస్తుడు (బ్రహ్మమును ఆచార్యులు వారి వద్ద నేర్చుకొనువాడు) - విద్యాభ్యాసం తరువాత ఇల్లు చేరుకొనుచున్నాడు.

గృహమును చేరి, గృహస్థాశ్రమము స్వీకరించి, గృహస్థ ధర్మ నిరతుడై, అటు తరువాత తగిన సమయములో మోక్షార్థి అయి ఏకాంతము కొరకై వానప్రస్థ వ్రత పూర్వకంగా వనముల (అడవి) ఆశ్రయించుచున్నారు. అటునుండి సన్న్యసించుచున్నారు.

లేదా, మనోస్థితిని అనుసరించి **బ్రహ్మచర్యము నుండి గాని, గృహస్థాశ్రమము నుండి గాని, వాన ప్రస్థాశ్రమమునుండి గాని సన్న్యసించవచ్చు.**

మరొక మాట! ఒకడు బ్రహ్మచారి అయి ఉండవచ్చు, కాకపోవచ్చును. స్నాతకుడు (మంత్రముగ్ధముగా, బ్రహ్మచర్యము స్వీకరించువాడు) అవవచ్చు (లేక) అస్నాతకుడు కావచ్చుగాక! నిత్యాగ్నిహోత్రవ్రతుడు కావచ్చు! (లేక) అవకపోవచ్చు. ఎవనికి ఏ

**....యత్ అహరేవ విరజ్యేత్, తత్**
**అహరేవ ప్రవ్రజేత్।**

రోజు, ఏ సమయములో ఈ జగద్విషయములన్నిటిపై సాత్విక వైరాగ్యము - విరక్తి కలుగుతుందో, ఆ వెనువెంటనే ఆరోజే సన్న్యసించటము ఉచితము.

---

**2. తత్ ఏకే ప్రజాపత్యామే వేష్టిం కుర్వంతి।**
**అథవా, న కుర్యాత్ అగ్నేయా యామేవ కుర్యాత్।**
**అగ్నిః హి ప్రాణః।**
**ప్రాణమేవ ఏతయా కరోతి।**
**త్రై ధాతవీయామ్ ఏవ కుర్యాత్।**
**ఏతయైవ త్రయో ధాతవో**
**యదుత 'సత్వం రజః తమ' ఇతి।**
**అయం తే యోనిః ఋత్విజో యతో జాతో అరోచథాః,**
**'తం జానన్' అగ్ని ఆరోహా, ధానో వర్ధయా, 'రయమ్'**
**ఇతి అనేన మంత్రేణ అగ్నిమ్ ఆజిఘ్రేత్, ఏషవా**
**అగ్నేః యోనిః యః ప్రాణంగచ్ఛ, స్వాం యోనిం గచ్ఛ 'స్వాహా'**
**ఇత్యేవమ్ ఏవై తదాహ,**
**గ్రామాగ్నిమ్ ఆహృత్య, పూర్వవత్ అగ్నిమ్ ఆజిఘ్రేత్।**
**యత్ అగ్నిం న విందేత్, అప్సు జుహుయాత్।**
**"ఆపోవై సర్వా దేవతాః సర్వాభ్యో దేవతాభ్యో**
**జుహోమి "స్వాహా"।।" – ఇతి**
**సాజ్యగ్ం హవిః అనామయం**
**మోక్షమంత్రః త్రైయ్యేవం వేద, తత్ బ్రహ్మ।**
**తత్ ఉపాసితవ్యమ్।**
**శిఖాం యజ్ఞోపవీతం ఛిత్వా**
**"సన్న్యస్తం మయా"**
**ఇతి త్రివారమ్ ఉచ్ఛరేత్।**
**ఏవమ్ ఏవైతత్**
**భగవన్ ఇతి వై యాజ్ఞవల్క్యః।**
**అథ హి ఏనం అత్రిః పప్రచ్ఛ యాజ్ఞవల్క్యమ్ః**
**అయజ్ఞోపవీతీ కథమ్**
**బ్రాహ్మణ – ఇతి?**
**<u>సహోవాచ యాజ్ఞవల్క్యః</u>**
**ఇదం ప్రణవమేన అస్య తత్ యజ్ఞోపవీతం।**
**య ఆత్మా ప్రాశ్య ఆచమ్యాయం విధిః**
**అథవా,....**
**పరివ్రాట్ వివర్ణవాసో, ముండో,**

అట్టి సన్న్యాసము స్వీకరించు సందర్భములలో కొందరు "ప్రజాపత్యేష్టి (యాగము)" చేస్తూ ఉంటారు. (లేదా) మరికొందరు చేయపోకనూవచ్చు. అయితే, అగ్నేయ్యాష్టిని మాత్రము చేసి అగ్నిసాక్షిగా సన్న్యసిస్తున్నారు.

ఈ దేహములో ప్రాణమే 'అగ్ని', అందుచేత ప్రాణమే అగ్నిగా భావించి అగ్నేయ్యాష్టి నిర్వర్తిస్తారు. అట్టి ప్రాణాగ్నిలో 'త్రైధాతవీయము' చేయుచున్నారు.

అనగా (సత్వ-రజో-తమో) త్రి గుణములను ప్రాణాగ్నికి సమర్పిస్తూ... హోమము చేయుచున్నారు.

ఆ త్రిగుణములకు మూల స్థానము - ఏదో అదే యోని (యాగశాల). గుణ సంబంధమైనదంతా అరోచన (రుచించకపోవటమే) ఋత్విజులు (వేద మంత్ర ద్రష్టలై యజ్ఞము చేయించువారు) - పలుకు మంత్రార్థములు.

"తమ్ జానన్ (బ్రహ్మమును ఎరుగుట కొరకు)" అను మంత్రముతో అగ్నిని ఆహ్వానించి 'ధారణ' అనే మార్గముగా తేజస్సును (అగ్నిని) ప్రజ్వలింపజేస్తున్నారు.

బ్రహ్మమును ఎరిగే మహామంత్రములతో అగ్ని ఘ్రూణము చేయుచున్నారు.

**"ఏషావా అగ్నేః యోనిః యః ప్రాణం గచ్ఛ, స్వాం యోనిం గచ్ఛ స్వాహా"** (నా ప్రాణములను, అహంకారమును అగ్ని యోనికి సమర్పిస్తున్నాను) ... అను మంత్రమును చదువుతూ జ్ఞానాగ్నిలో ప్రాణములను-భౌతిక రూపమును ఆహుతి చేస్తున్నాడు.

గ్రామాగ్నిని తెచ్చి పై విధంగా అగ్నికి ఆఘ్రూణము చేస్తున్నారు. కొందరు అగ్నిని ఉంచనివారై, (అగ్నితో కాకుండా) నీటియందే నీటితో హోమము చేయుచున్నారు.

ఈ జలమే సర్వ దేవతా స్వరూపము! అందుచేత జపముతో సర్వ దేవతలకు జలమును హోమము చేయుచున్నాను. దేవతలు స్వీకరించెదరు గాక! అను అర్థము గల మంత్రమును గానం చేస్తున్నారు.

ఆజ్యముతో కూడిన హవిస్సును హోమము చేయవలెను. "బ్రహ్మమునే ఉపాసిస్తున్నాను, '3'టిని (త్రిగుణములను, త్రిదేహములను త్రికాలములను) ఎరిగి మోక్ష మంత్రముతో మోక్షోపాసన నిర్వర్తిస్తున్నాను- అని పలుకుచూ పరబ్రహ్మమును (నిరాకార - నిర్గుణతత్వమును) ఉపాసించాలి.

శిఖ (పిలక)ను, యజ్ఞోపవీతమును త్రెంచి "నేనిప్పుడు సన్యాసిని అగుచున్నాను".... అని 3 సార్లు ఉచ్ఛరించి - సన్న్యాసాశ్రమమును స్వీకరించుచున్నారు.

ఇదియే సన్న్యాస విధిగా చెప్పబడినది - అని భగవంతుడగు యాజ్ఞవల్క్యుడు చెప్పారు. "ఏవమ్ ఏవై తత్! ఇది ఆ తత్ వస్తువును జేరు త్రోవ అని పలికారు!

**అత్రిమహాముని :** ఓ యాజ్ఞవల్క్య మహాశయా! బ్రహ్మముకొరకే బ్రాహ్మణత్వము కదా! యజ్ఞోపవీతమును వదలితే బ్రాహ్మణుడు ఎట్లా అవుతాడు.

**యాజ్ఞవల్క్యమహనీయుడు :** బ్రహ్మజ్ఞా! అత్రిమహర్షీ! ఆత్మతత్త్వ సూచకముగు ప్రణవమే ఆ సన్న్యాసాశ్రమ ప్రవేశికి యజ్ఞోపవీతము. ఆత్మనే ప్రాశనము (స్వీకరించు జలము)గా భావించి ఆచమనము చేస్తూ ఉంటారు.

**పరివ్రాజక మార్గము (సన్యాస మార్గము)** - ఆ సన్న్యాసి (పరివ్రాట్) వివర్ణములయిన

అపరిగ్రహః, శుచిః, అద్రోహీ, భైక్షమాణో,
బ్రహ్మభూయాయ భవతి।
ఏష పంథా పరివ్రాజకానాం।
వీరాధ్వానేవ అనాఽశకేవా అపాం ప్రవేశేవా,
అగ్నిః ప్రవేశే వా, మహాప్రస్థానే వా
ఏష పంథా బ్రహ్మణా హా అనువిత్త, తేనేఽ తి,
స సన్న్యాసీ బ్రహ్మవిత్।
ఇత్యేవమేవా ఏష, భగవన్
ఇతి వై యాజ్ఞవల్క్యః।
తత్ర పరమహంసా నామ సంవర్తక, ఆరుణి,
శ్వేతకేతు, దూర్వాస, ఋభు
నిదాఘ దత్తాత్రేయ, శుక,
వామదేవ, హారీతక ప్రభృతయో....,
అవ్యక్తలింగా, అవ్యక్త ఆచారా,
అనున్మత్తా – ఉన్మత్తవత్ ఆచరంతః।
పరస్త్రీ – పుర పరాఙ్ముఖాః త్రిదండం, కమండలుం,
భుక్త పాత్రం, జలపవిత్రగ్ం, శిఖాం, యజ్ఞోపవీతం,
బహిరంతశ్చ ఏత్యే తత్సర్వం 'భూ స్వాహా' ఏతి,
అప్సు పరిత్యజ్య ఆత్మానమ్ అన్విచ్ఛేత్।
యథా 'జాత' రూప ధరా,
నిర్ద్వంద్వా, నిష్పరిగ్రహాః,
'తత్త్వ బ్రహ్మ' మార్గే...,
సమ్యక్ సంపన్నా...,
శుద్ధమానసాః...,
ప్రాణ సంధారణాఽర్థమ్
యథోక్త కాలే, విముక్తో
'భైక్షమ్' ఆచరన్, ఉదరపాత్రేణ
లాభ–అలాభౌ సమౌ భూత్వా,
కరపాత్రేణ వా, కమండలు – ఉదకపో,
'భైక్షమ్' ఆచరన్॥

(రంగు చెడిన) వస్త్రము ధరించి, (ముండో) బోడి గుండు గలవాడై; అన్నీ వదలి - అపరిగ్రహుడై, శుచి - అద్రోహి అయి; భిక్షాటనము చేస్తూ-బ్రహ్మమును ఉపాసించువాడు బ్రహ్మమును పొందుచున్నాడు. ఇది పరివ్రాజకుల మార్గము.

**మహా ప్రస్థాన మార్గము** - అంధకార ప్రదేశ ప్రవేశముచేసి, ఆహారము మానివేసి చివరికి జలములోగాని, అగ్నిలోగాని ప్రవేశించటము. ఆ మార్గముగా పరబ్రహ్మమును కొందరు పొందుచున్నారు. ఇట్టి మార్గముగా సన్న్యాసి బ్రహ్మమును ఎరిగి బ్రహ్మవేత్తగా అగుచున్నాడు. ఇది మహా ప్రస్థాన మార్గము.

*(ఈవిధంగా భగవంతుడగు యాజ్ఞవల్క్యుడు పలికారు)*

**ఇక పరమహంసల గురించి - ఇట్లా యాజ్ఞవల్క్యులవారు పలుకసాగారు.**

**కొందరు మహనీయులగు పరమహంసలు** : సంవర్తకుడు, ఆరుణి, శ్వేతకేతు, దూర్వాసుడు, ఋభు,నిదాఘ, దత్తాత్రేయ, శుక, వామదేవ, హారీతక మొదలైనవారు.

**పరమహంసలు** : అవ్యక్తమగు రూప - ఆచారములు కలిగినవారై ఉంటారు. అవి బాహ్యమునకు వ్యక్తము అవవు. బాహ్యవేష ధారణబట్టి ఆశ్రమములను బట్టి పరమహంసను గుర్తించలేము.

(జన్మ-మరణ - దృశ్య - దేహ - కర్మల రహస్యము, నిత్య - అనిత్యము ఎరుగుటచే) వారు ఏ మాత్రము ఉన్మత్తులు కారు. కానీ, బయటకు ఉన్మత్తుని వలె (పిచ్చివాని వలె) భౌతిక-లోకపు పరిమితులగు - లోక జనులకు కనిపిస్తూ ఉంటారు.

పరస్త్రీ-పురనివాసము మొదలైనవాటిపట్ల పరాఙ్ముఖులై (ధ్యాసయే లేనివారై) ఉంటారు. త్రిదండము, కమండలువు, భిక్షాపాత్ర జలపవిత్రము, శిఖ, యజ్ఞోపవీతము మొదలైన సన్న్యాస - బ్రహ్మచారి ఆశ్రమవాసుల బాహ్య-అభ్యంతర లక్షణములన్నీ 'ఓం భూస్వాహా' అంటూ నీటియందు పరిత్యజించి, ఒక్క "ఆత్మతత్త్వము" కొరకు మాత్రమే అన్వేషణ చేస్తున్నవారై, ఆశ్రయించుచున్నవారై ఉంటారు.

అప్పుడే పుట్టిన శిశువు వలె మనో రూపము ధరించినవారై, దేనితో సంబంధించని వారై, ద్వంద్వమునకు అతీతులై, ఏదీ పరిగ్రహించనివారై ఉంటారు.

"త్వమ్ త్వత్ బ్రహ్మమేవ - నీవు, ఈ జగత్తు బ్రహ్మమే" - అను అవగాహనను సుస్థిరపరచుకొను మార్గములో, మహా వాక్యార్ధ సుసంపన్నత కలవారై,శుద్ధ (కేవల) మానస సమన్వితులై ఉంటారు.

అట్టి పరమహంసలలో కొందరు ప్రాణములను నిలుపుకొనుటకు మాత్రమే - ఆయా ఉచిత సమయములలో సమాధిని వదలి ఈవలకు వచ్చి భిక్షాటనము చేస్తూ ఉంటారు. భిక్షాటనతో లభించిన దానితో పొట్ట నింపుతూ, లాభ-అలాభములను సమదృష్టితో చూస్తూ, చేతులనే భిక్షక పాత్రగా కలిగి ఉండి, అన్నము పెట్టించుకొనుచు, కమండలములోని ఉదకము త్రాగుచూ ఉంటారు.

---

**3.** ఉదరమాత్ర సంగ్రహః
పాత్రాంతర శూన్యో జల – స్థల కమండలుః,
అబాధక రహస్య స్థల
నికేతనో, లాభ – అలాభౌ సమౌ భూత్వా,

ఇంకా కూడా, ఆ సమయమునకు, ఆ పూటకు కావలసినంత మాత్రమే స్వీకరిస్తూ ఉంటారు. రెండవపాత్ర (దాచుకొనుటకై) ఏదీ కలిగి ఉండరు. జలము ఉన్నచోటే కమండలువు బయటకు తీస్తారు. ఇతరచోట్ల బయట గుర్తుగా చూపించుకోరు.

ఇతరులకు ఏ బాధ కలిగించనట్టి రహస్య స్థలము నివాస ప్రదేశముగా కలిగి ఉంటారు. లాభ - అలాభములను సర్వదా సమదృష్టితో చూస్తూ ఉంటారు.

**శూన్యాఽగార, దేవగృహ, తృణ,**
**కూట, వల్మీక,**
**వృక్షమూల, కులాలశాలా**
**అగ్నిహోత్రశాలా, నదీ**
**పులినగిరి, కుహర, కోటర**
**కందర నిర్ఝర స్థండిలేషు అ-నికేత**
**నివాస్య, ప్రయత్నః**
**శుభాఽశుభ కర్మ నిర్మూలన పరః**
**సన్న్యాసేన దేహ త్యాగం కరోతి।**
**స పరమహంసో నామేతి ఆశామ్బరో**
**న నమస్కారో, న దారాపుత్రా అభిలాషీ,**
**లక్ష్య-అలక్ష్య నిర్వర్తకః పరివ్రాట్**
**పరమేశ్వరో భవతి।**
**అత్ర ఏతే శ్లోకా భవంతి।**
**యో భవేత్ పూర్వసన్న్యాసీ**
**తుల్యోవై ధర్మతో యది,**
**తస్మై ప్రణామః కర్తవ్యో।**
**నేతరాయ కదాచన।**
**ప్రమాదినో బహిః చిత్తాః**
**పిశునాః, కలహోత్సుకాః।**
**సన్న్యాసినోఽపి దృశ్యంతే**
**'వేదసందూషిత-ఆశయాః'।**
**నామాదిభ్యః పరే భూమ్ని**
**స్వారాజ్యే చేత్ స్థితో**
**అద్వయే, ప్రణమేత్ కం?**
**తత్ ఆత్మజ్ఞో న కార్యం**
**కర్మణా తదా।**
**"ఈశ్వరో జీవకలయా ప్రవిష్టో**
**భగవాన్" ఇతి.... ప్రణమేత్**
**దండవత్ భూమా వా**
**అశ్వ చండాల గోఖరమ్**
**మాగ్ంస పాంచాలికా యాస్తు**

పాడుపడిన ఇళ్ళు, దేవాలయములు, రెల్లుగడ్డి గుబ్బు ప్రదేశములు, పుట్టలు ఉన్న చోట్లు, వృక్షముల మొదలు ప్రదేశములు, కుమ్మరి (కుండలు తయారగు) శాలలు, అగ్నిహోత్రశాలలు, నదీ తీర ఖాళీ ప్రదేశములు, కుహరములు (కొండ గుహలు), కోటరములు (చెట్టు తొర్రలు), సెలయేర్లు గల ప్రదేశములు, కందరములు (గుహలు, కనుమలు), నిర్ఝరములు (బండరాళ్ళ ప్రదేశము) స్థండిలము (మట్టిగడ్డల దిబ్బలు)... ఇవన్నీ ఆతడు సంచారి అయి నివసించు ప్రదేశములు. ఆయనకు 'ఇది ఇల్లు' అనునది ఏదీ ఉండదు. శాశ్వత గృహ నివాస ప్రయత్నము చేయరు. శుభ-అశుభ కర్మల పరిధిని దాటి వేసినవాడై, సన్యాసి అయి సర్వము త్యజించినవాడై దేహత్యాగము చేయువాడగుచున్నారు. దేహ ధర్మములను అధిగమించివేసి, కేవలసాక్షిత్వము సంచరించుకొని ఉంటారు.

ఆ పరమహంస ఆశాంబరుడు (వస్త్రములు త్యజించిన దిగంబరుడు).

- నమస్కారములు లేనివారు,
- భార్య - పుత్రులపై అభిలాష లేనివారు,
- పరివ్రాట్ - ప్రాపంచక లక్ష్య అలక్ష్యములేవీ లేనివారు అయి ఉంటారు.

"అట్టివాడు పరమేశ్వరుడే (ఇహమును దాటివేసి పరమునందు స్వరూపతః ఏర్పడియున్న వాడు)" - అని విజ్ఞులు ఆయనగురించి గానము చేయుచున్నారు. ఒక సన్న్యాసి తన కన్నా ముందే సన్యసించినవానికి, తనతో సమాన ధర్మము కలవానికి మాత్రమే నమస్కరించుచూ, ప్రణామములు సమర్పించాలి. తదితరులకు నమస్కరించటము' అను ధర్మము కలిగి ఉండరు.

కొందరు బాహ్యమున సన్యాస వేషధారణ చేస్తూ కూడా...., దృశ్య ధ్యాసలచే (తదితర జీవులకు బాధ కలిగించువారు) ప్రమాదులు, బాహ్య చిత్తము (లౌకిక విషయములపట్ల ఇష్టము కలవారు), లోభగుణము కలవారు, కలహములయందు ఉత్సాహము చూపువారు,... ఇటువంటి సన్న్యాసులు కూడా ఉంటారు. వారిని **"వేదసందూషిత ఆశయ సన్న్యాసులు"** ... అని పిలుస్తారు.

ఓ జనకమహారాజా!

నామరూపాదులకు ఆవల, (పరమై) అద్వయస్వారాజ్యమునందు సంస్థితుడై ఉన్నవాడు ఎవరికి ఏ ఉద్దేశ్యముతో నమస్కరించాలి? అట్టి ఆత్మ సామ్రాజ్యము నందు విహరించువానికి, ఆత్మమేవాఽహమ్ జ్ఞానికి "ఇది చేయాలి! ఇట్లాగే చేయాలి!'.... అనునదేమీ పరిధులుగా చెప్పలేము. ఆతనికిక కర్మలతో పని ఏముంటుంది? **'అహమేవ ఇదమ్ సర్వమ్'** అను అనన్య దృష్టి గల వానికి నియమాలు ఇవి అని అనలేం!

ఓ విదేహ రాజా! యోగేశ్వరా! "ఆ సర్వేశ్వరుడగు భగవానుడే తన జీవకళతో సర్వ జీవులలో ప్రవేశించి సర్వము ప్రకాశమానము చేయుచున్నారు.... అని గమనిస్తూ ఉన్న బుద్ధితో ఒక గుర్రము - చండాలుడు, గోవు, గాడిదకు కూడా సాష్టాంగదండ ప్రణామములు సమర్పిస్తూ ఉంటున్న భావనతో దర్శించాలి. (ఇక ఇతరులకు చేయాలని వేరే చెప్పాలా?)

నాయనా! జనకా! ఎందుకో ఈ జీవుడు ఆత్మ దృష్టిని ఏమరచి మాంస దృష్టితో దేహాలను చూస్తూ - మోహము చెందుచున్నాడు! ఈ దేహములు లోపల మాంసము గల బొమ్మ యంత్రములు. క్రొవ్వు - బొమికలు - గ్రంధులతో కూడిన ఈ స్త్రీ-పురుష దేహములలో గల ప్రత్యేకత ఏమున్నదయ్యా?

ఓయీ జీవుడా? ఈ స్త్రీ పురుష దేహములలో చర్మము - మాంసము - రక్తము - కన్నీరు - బొమికలు .... ఇవన్నీ విడదీసి చూస్తే ఇందులో రమ్యమైన వస్తువు

యంత్రలోకే అంగ పంజరే
స్నాయుః అస్థి గ్రంథి శాలిన్య స్త్రీయః కిమవ శోభనమ్?
త్వక్ మాంస రక్త భాష్పాంబు పృథక్ కృత్వా విలోచనే
సమాలోకయ రమ్యంచేత్ కిం ముధా పరిముహ్యసి?
మేరు శృంగతటోల్లాసి, గంగాజల రయోపమా,
దృష్టా యస్మిన్ మునే
ముక్తాహారస్య ఉల్లాసి శాలితా,
శ్మశానేషు దిగంతేషు స ఏవ లలనాస్తనః,
శ్వభిః ఆస్వాద్యతే కాలే
లఘు పిండఇవాంధనః।
కేశ కజ్జల ధారిణ్యో, దుస్పర్శా, లోచప్రియాః,
దుష్కృత అగ్నిశిఖా నార్యో
దహంతి తృణవత్ నరమ్।
జ్వలితా అతి దూరేఽపి।
సరసా అపి నీరసాః।
స్త్రియో హి నరకాగ్నీనామ్
ఇంధనం చారు దారుణమ్॥
కామనామ్నా కిరాతేన వికీర్ణా ముగ్ధ చేతసః
నార్యో నరవిహంగానామ్
అంగబంధన వా గురాః।
జన్మ పల్వల మత్స్యానాం చిత్త కర్దమచారిణామ్,
పుంసాం దుర్వాసనాం రజ్జుః
నాడీ బడిశ పిండికా।
సర్వేషాం దోష రత్నానాగ్ం సుసముద్గికయా అనయా
దుఃఖ శృంఖలయా నిత్యమ్। అలమ్ అస్తు మమ స్త్రీయా।
యస్య స్త్రీ, తస్య భోగేచ్ఛా నిస్త్రీ కస్య క్వ బోగభూః?
స్త్రియం త్యక్త్వా జగత్ త్యక్తం,
జగత్ త్యక్త్వా సుఖీ భవేత్।

ఏమున్నది? ఎందుకు వృధాగా మోహము చెందుచున్నావు?

"మేరు శిఖరముమీద నుండి క్రిందపడుచున్న సెలయేటి మెలికల వేగము వలె జడ, గంగా జలము వంటి అధరామృతము - ఇటువంటి కవుల వర్ణనలతో ముక్తాహారములు ధరించిన స్త్రీ పురుష దేహములను చూచుకొని ఒకరికొకరు రస-ఉల్లాసము పొందుచున్నారే గాని,.... **ఆ ముక్తాహారము-రంగు రంగు వస్త్రముల లోపల గల దేహము రక్తము- చీము-మాంసము-భౌమికల అమరికయే గదా!"** - అని గమనించకపోతే ఎట్లా?

ఓయీ! అమాయక జీవుడా! నీవు ఏఏ స్త్రీ స్థనములు - పురుష భుజస్కంధములు స్పృశించి ఆనందించాలని వేడుకపడుచున్నావో అవన్నీ కూడా కాలక్రమేణా ఒకానొక రోజు కుక్కలచేత ఆహార సంపదగా భావించబడుచు, అన్నపు ముద్దలవలె తినబడుచున్నాయి కదా!" అనునది గుర్తు పెట్టుకోబడు గాక! నల్లటి కురులు ధరించినట్టి, దుష్టమగు స్పర్శ - ఆలోచనలు గల ప్రియురాళ్ళు (అట్లాగే ప్రియులు) భౌతిక దేహ ధ్యాసలను మరింత ఉద్ధృతము చేస్తున్నారు. చివరికి అట్టి భౌతికాకర్షణలు ఈ జీవులను గడ్డి పోచలను కాలుస్తున్నట్లుగా కాలుస్తున్నాయి.

ఈ భౌతిక దేహ ఆకర్షణలు (మాంస దేహ ధ్యాసలు) ఎటువంటివంటే.....

తాను ప్రియముగా భావిస్తున్న మాంసమయ భౌతిక దేహము ఎంతో దూరములో ఉండి కూడా, ఇక్కడ ఆ జీవుని మనస్సులో మంట రేపగలదు. పైకి ఎంతో సరసరూపముగా కనిపిస్తూనే... చివరకు నీరసమును మిగుల్చుచున్నాయి.

స్త్రీలకు (అట్లాగే స్త్రీలకు పురుష దేహాకర్షణలకు సంబంధించిన) భౌతిక దేహధ్యాసలు నరకాగ్నులకు ఇంధనము అయి దారుణములుగా పరిణమించటము ఎదురుగా జరుగుచూనే ఉన్నది.

కాముడు అనే కిరాతకుడు ఈ 'జీవులు' అను పక్షులను నిష్క్రియులుగాను, ముగ్ధము అగు బుద్ధి కలవారు గాను - చేసి, వలలో చిక్కించుకొనటానికి, ఉపయోగించే వలలే ఈ స్త్రీ పురుష భౌతిక రూపాలు.

"జన్మలు" అనే బుట్టలోనికి వేయటానికై 'జీవులు' అనే చేపల దుర్వాసనతో కూడిన గాలమువంటి వారు ఈ స్త్రీలు. (అట్లాగే స్త్రీల విషయంలో పురుషులు కూడా).

అన్ని దోషరత్నములకు 'పేటిక' వంటిది ఈ శృంగార సంబంధమైన మోహాకర్షణ. నిత్యము దుఃఖ సంకెళ్ళు వేసి ఉంచునట్టిది. అయ్యా! స్త్రీలతో దేహాకర్షణా సంబంధం (అట్లాగే స్త్రీలకు పురుషులతో భౌతికదేహ ఆకర్షణా బంధము)... ఇక చాలు!

ఎక్కడ స్త్రీ (రక్త-మాంసదృష్టి) ఉంటే అక్కడే కదా, భోగేచ్ఛ. ఎక్కడ స్త్రీ సంబంధము ఉండదో, అక్కడ భోగేచ్ఛకు ఏమీ పని ఉండదు.

స్త్రీని (భౌతికమైన శృంగార భావనను) త్యజిస్తే జగత్తును జయించినట్లే? జగత్తును త్యజించిన జీవుడు సుఖవంతుడు కాగలడు.

---

**4.** అలభ్యమానః తనయః పితం క్లేశయేత్ చిరమ్।
లబ్ధోహి గర్భపాతేన
ప్రసవేన చ బాధతే।
జాతస్య గ్రహరోగాది
కుమారస్య చ ధూర్తతా।
ఉపవీతేఽపి అవిద్యత్వమ్

కొడుకులు చిరకాలముగా కలుగకపోతే, అదీ ఆ తండ్రికి ఎంతో బాధ (క్లేశము) కలిగించే విషయమే అవుతుంది.

సంతానము కలుగుచున్నప్పుడో? గర్భపాతముతోను, ప్రసవముతోను... శారీరక బాధ అనివార్యము.

పుట్టిన కుమారుడు (సంతానము) గ్రహ దోష- రోగాదులు పొందుతూ ఉంటే అదంతా మనస్సుకు ఎంతో ఆదుర్దా! మనస్సును కలచివేస్తూ ఉంటుంది. ఆ పిల్లవాడు అల్లరి చిల్లరగా ధూర్తుడై తిరుగుతూ ఉంటే ఇంక బాధ చెప్పలేనట్టిది.

**అనుద్వాహశ్చ పండితే।**
**యూనశ్చ పరదారాది।**
**దారిద్ర్యం చ కుటుంబినః।**
**పుత్ర దుఃఖస్య నాస్తి అంతో।**
**ధనీచేత్ మ్రియతే తదా।**
**న పాణి - పాద చపలో,**
**న నేత్ర చపలో యతిః।**
**న చ వాక్ చపలశ్చైవ**
**బ్రహ్మభూతో జితేంద్రియః।**
**రిపౌ బుద్ధే స్వదేహే చ,**
**సమైకాత్మ్యం ప్రపశ్యతః,**
**వివేకినః కుతః కోపః**
**స్వ దేహ - అవయవేషి ఇవ।**
**అపకారిణి కోపశ్చేత్**
**కోప కోపః కథం న తే?**
**ధర్మార్థ కామ మోక్షాణాం**
**ప్రసహ్య పరిపంథిని?**
**నమోఽ స్తు మమ కోపాయ**
**స్వ - ఆశ్రయ జ్వాలినే భృశమ్।**
**కోపస్య మమ వైరాగ్యదాయినే, దోషబోధినే।**
**యత్ర సుప్తా జనా నిత్యం**
**ప్రబుద్ధః తత్ర సంయమీ।**
**ప్రబుద్ధా యత్ర తే,**
**విద్వాన్ సుషుప్తిం యాతి యోగిరాట్।**
**చిత్ ఇహ అస్తీతి**
**చిన్మాత్రమ్ ఇదమ్ చిన్మయమేవ చ।**
**'చిత్ త్వమ్, చిత్ అహమ్',**
**ఏతే చ, లోకాః 'చిత్' భావయ।**
**యతీనాం తత్ ఉపాదేయమ్**
**పారహగ్ంస్యం పరంపదమ్**
**న అతః పరతరం కించిత్**
**విద్యతే మునిపుంగవే।**
**ఇతి యాజ్ఞవల్క్యోపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః।**

ఎప్పుడూ భయమే! ఇంకెక్కడి తత్త్వవిచారణ?

ఉపనయనము చేసినా కూడా, చదువు అబ్బకపోతే అది మరొక బాధ. ఆతడు పండితుడైనప్పటికీ పెళ్ళి అయ్యే వరకు మరొక బాధ, పెళ్ళి అవుతుందో, అవదో... అని! పడుచుతనములో పరస్త్రీ వ్యామోహము! కుటుంబము పెరుగుచున్నకొలదీ.... దారిద్ర్యము వంటివి బాధిస్తూ ఉంటాయి.

పుత్రుని వలన కలిగే దుఃఖములకు అంతు పొంతూ ఉండదు.

ఒకవేళ ఒకడు ధనికుడైతే ఏ బాధా ఉండదా? కొడుకే ధనం గురించి చంపుకు తింటూ ఉంటాడు. ఆపై వార్ధక్య బాధ. మరణ బాధ ఉండనే ఉంటాయి కదా! యతి అయినవాడు (పరమాత్మను చేరు ప్రయత్నము చేయువాడు) చేతులూ-కాళ్ళు చపలముగా (ఏదో చేయాలి - ఎటో వెళ్ళాలి - అనే చపలత్వము) కలిగి ఉండరాదు. వాక్ చపలము (నోటికొచ్చినట్లు మాట్లాడటము) కూడదు. ఆతడు ఇంద్రియములను జయించి బ్రహ్మభూతుడు కావాలి.

వివేకి అయినవాడు ఈ కనడేదంతా ఏకాత్మ స్వరూపముగాను, తన ఆత్మ దేహముగాను దర్శించుచున్నాడు. స్వదేహముపై ఎవరికైనా కోపముంటుందా? ఉండదుకదా! ఈ విశ్వమంతా తన దేహముగా చూచుకొంటున్న విశ్వదేహుడగు బ్రహ్మ భూతునకు (వివేకికి) ఎవ్వరిమీదైనా కోపము ఎట్లా ఉంటుంది? ఉండదు! ఓ జనకా! ఎవ్వరికైనా ... తనకు అపకారము ఎవ్వరు చేస్తున్నారో, వారి మీద కోపము వస్తుంది కదా? మరి 'కోపము' అనే గుణము శత్రువు అయి ఈ జీవుని ధర్మ-అర్థ-కామ-మోక్షములు భ్రష్టు పట్టిస్తున్నాయే! **ఈతనికి తన కోపము మీద కోపము ఎందుకు రావటంల్లేదో మరి?** నాకు ఇది ఆశ్చర్యమే!

అవును! నా 'కోపము'పై నాకు వస్తున్న 'కోపము'నకు నమస్కరిస్తున్నాను! నేను ఆశ్రయిస్తూ నా ఆశ్రయమునే తగలబెడుతున్న నా "కోపము" పై నాకు వస్తున్న "కోపము" నా దోషములను నాకు బోధించి, నన్ను వైరాగ్యవంతునిగా చేయుచున్నదికదా!

ఎక్కడ సామాన్య జనులంతా నిదురిస్తున్నారో, (అది గొప్ప విషయముగా చూడటం లేదో, దృశ్యమే సర్వస్వముగా చూస్తున్నారో) - అక్కడ (అట్టి ఆత్మ విషయమునందు) సంయమియగు యోగి ప్రబుద్ధుడై ఉంటున్నాడు.

ఎక్కడ (ఏఏ ప్రాపంచిక విషయ సమూహములలో) అనేకమంది జనులు పీకలదాకా మునిగి, ప్రబుద్ధులై ఉంటున్నారో, అట్టి విషయములపట్ల ఆత్మతత్త్వ విద్వాంసుడగు యోగిరాట్ 'సుషుప్తి' వహించినవాడై ఉంటున్నాడు. పట్టించుకోవటం లేదు.

చిత్ అనబడు చిదానంద చైతన్యము ఇప్పుడే, ఇక్కడే ఎదురుగా ఉన్నది. ఇదంతా కూడా చిన్మాత్రమే. ఈ దృశ్యమంతా చిన్మాత్రమే!

ఓ జనకమహారాజా! ఉన్న సత్యమేమిటో చెప్పుచున్నానయ్యా! నీవు చిత్ స్వరూపుడవు. నేను అదే చిత్ స్వరూపుడను! వారు-వీరు కూడా చిత్ రూపులే! ఈలోకమంతా చిత్ స్వరూపమే! అట్టి చిత్ స్వరూపమునే భావన చేయి. తదితరమంతా భావన చేయనేవద్దు. చూస్తూ అంతరంగమున మౌనస్వరూపుడవై ఊరుకొని ఉండు! యతులకు అట్టి అఖండ చిత్ స్వరూపమే ఉపాదేయము (సర్వదా ఆశ్రయించి ఉండవలసినట్టిది). పరమహంసలు ఆ పరమపదమును ఆనందముగా ఆస్వాదిస్తూ మనకు విప్పి చూపిస్తూ, అవ్యాజమైన ప్రేమతో వశీకరిస్తున్నారు. మన కనులు తెరచి మనకు చూపుచున్నారు!


ఈ సర్వము - సర్వదా ఏకైక - అఖండ చిత్‌రూపమే! ఇంతకు మించి వేరే సత్యమేమీలేదు. ఉండదు. ఇది ముని పుంగవులకు నిత్యానుభవము!

**ఇతి యాజ్ఞవల్క్య ఉపనిషత్**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

శుక్ల యజుర్వేదాంతర్గత

# 16 యాజ్ఞవల్క్యోపనిషత్

## అధ్యయన పుష్పము



'విదేహ రాజు' అగు జనకమహారాజు – జగత్ తత్త్వము ఎరిగిన కర్మయోగి! దేహము ఉండి, జగత్తంతా తన దేహముగా భావించువాడు కాబట్టి 'విదేహుడు' అని లోక ప్రసిద్ధుడు. **"కర్మణేవహి సంసిద్ధిమ్ ఆస్థితాః జనకాదయః"..** అని గీతాచార్యుల వారిచే కర్మ యోగమునకు దృష్టాంతముగా చెప్పబడినవారు. శ్రీమద్రామాయణములో మహర్షి వాల్మీకిచే మన అమ్మ సీతమ్మ పేర్లు చెప్పబడుచున్నప్పుడు– **'జనకాత్మజ'** అని ముద్దుగా అనటమునకు సాకారములు. ప్రాతఃస్మరణీయులు. పేరు తలచినంత మాత్రము చేతనే హృదయములో ప్రవేశించి జ్ఞానదీపిక అయి వెలుగొందువారు.

అట్టి జనకమహారాజు ఒకానొక రాజు యాజ్ఞవల్క్య జగద్గురువు యొక్క ఆశ్రమమును దర్శించారు. ఇరువురి మహాపురుషుల కలయిక లోకకళ్యాణమే కదా ! జనకుడు స్వామి యాజ్ఞవల్క్యునికి ప్రదక్షిణము చేసి సాష్టాంగ దండప్రణామములు సమర్పించారు. తత్త్వవేత్తయగు యాజ్ఞవల్క్యుల వారితో సత్సంగ విధిని ప్రారంభిస్తూ... ఈ విధముగా పరిప్రశ్నించసాగారు.

**జనకమహారాజు :** భగవాన్ ! లోకగురూ ! యాజ్ఞవల్క్యమునీశ్వరా ! **"సన్న్యాసము"**... అను విషయమై మీ నుండి శాస్త్రీయ సంబంధమైన మరియు స్వానుభవసంబంధమైన విశేషాలు వినాలని కుతూహలము కలిగి ఉన్నాను. దయచేసి **'సన్న్యాసము'** యొక్క విశేష లక్షణములేమిటో వివరించండి.

**యాజ్ఞవల్క్యుడు :** మహాత్మా ! జనకమహారాజా ! చెప్పుచున్నాను వినండి.

పిల్లవానికి 5వ ఏట ఉపనయన సంస్కారమును కులానుచారముగా నిర్వర్తించి, ఇక అటుపై 'గురు ఆశ్రమము'లో విద్యాభ్యాసమునకై చేర్చగానే బ్రహ్మచారి అగుచున్నాడు. ఆ బ్రహ్మచారి (7 సంవత్సరముల కాలము) ఆశ్రమములో సర్వవిద్యలు అభ్యసించి, పారంగతుడై తిరిగి గృహమును చేరుచున్నాడు.

ఇల్లు చేరిన తరువాత, తీర్థయాత్రలు చేసి లోకరీతులను గమనిస్తున్నాడు. వంశానుచారముగా సంధ్యావందనము – దైవోపాసన – వ్రతములు – ధ్యానములు నిర్వర్తిస్తూ తగిన సమయములో వివాహము చేసుకొని **'గృహస్థాశ్రమము'**ను స్వీకరించుచున్నాడు. ఇక ఆ తరువాత గృహస్థ ధర్మములు నిర్వర్తిస్తూ... ఉచిత సమయంలో **'పరివ్రాజకుడు'**గా అగుచున్నాడు (లేక) **వాన ప్రస్థాశ్రమము** స్వీకరించి వనములలో ప్రవేశించి ఏకాంతముగా యోగ – తపోధ్యానములు కొనసాగిస్తున్నారు.

విరక్తి – మానసిక పరిపక్వత –సంసిద్ధతలను అనుసరించి బ్రహ్మచర్యాశ్రమమునుండే కొందరు సన్న్యాసము స్వీకరిస్తున్నారు. మరికొందరు గృహస్థాశ్రమము నుండి, ఇంకొందరు వానప్రస్థాశ్రమము నుండి సన్న్యాసము స్వీకరించుచున్నారు.

**జనకమహారాజు :** ఒకడు సన్న్యాసాశ్రమము స్వీకరించి, పరివ్రాజకుడు అవటానికి ఏది సరి అయిన సమయము?

**యాజ్ఞవల్క్యుడు :** ఓ ఆర్యా! "సన్న్యాసము – స్వీకరించటానికి ఇదీ సమయము"... అని ఎక్కడా శాస్త్రములు నిర్దేశించలేదు. ఒక్క విషయము మాత్రము చెప్పబడుతోంది. **యత్ అహరేవ విరజ్యేత, తత్ అవహరేన ప్రవ్రజేత్ ।** ఎప్పుడు సర్వప్రాపంచిక విషయములు

– విశేషములపై సాత్వికమైన – స్వాభావసిద్ధమైన విరక్తి కలుగుతుందో (స్వాభావికంగా అనురక్తి తొలుగుతుందో)... ఆ రోజే సన్న్యసించటానికి తగిన రోజుగా భావించబడుగాక ! ఒకడు అనేక వ్రతములు చేయువాడు కావచ్చు. కాకపోవచ్చు. శాస్త్రీయంగా స్నాతకవ్రతము (బ్రహ్మచర్యాశ్రమ నిరతి) స్వీకరించి ఉండవచ్చు – ఉండకపోవచ్చు (అస్నాతకుడు కావచ్చు). మరొకడు నిత్యాగ్నిహోత్రుడు కావచ్చు. కాకనూ పోవచ్చును. సశాస్త్రీయముగా బ్రాహ్మణ – క్షత్రియ – వైశ్య – శూద్ర వర్ణ్య ధర్మములు నిరతితో అనుసరించువాడు అయితే అయివుండవచ్చు. లేదా, అయి ఉండకనూ పోవచ్చు. ఏది ఏమైనా కూడా ఎప్పుడు ప్రాపంచిక సర్వ విషయములపైనా (సాత్విక) వైరాగ్యము కలుగుతుందో – ఆ రోజే సన్న్యసించటానికి మంచిరోజు. అంతే !

**జనకమహారాజు:** సన్న్యాసాశ్రమము స్వీకరిస్తూ, మునుముందుగా తప్పక నిర్వర్తించవలసిన శాస్త్రీయ విధి విధానాలేమైనా ఉన్నాయా!

**యాజ్ఞవల్క్యుడు :** అవును. కొన్ని కొన్ని విధానాలు శాస్త్రములచే సూచించబడినాయి. అదంతా లోకరీతి కొరకు, తదితరులకు తన 'సన్న్యాసాశ్రమ స్వీకారము' ను తెలియజేస్తూ... ప్రకటించటానికి మాత్రమే. సన్న్యాసాశ్రమము స్వీకరించు సందర్భములో కొందరు **'ప్రజాపత్యేష్టి'** అనే పేరుగల యాగమును చేస్తూ ఉన్నారు. మరికొందరు చేయుచుండటము లేదు. అయితే **'అగ్నిసాక్షిగా సన్న్యసించటము'** అను రూపముగల **'అగ్నాయేష్ఠి'** అనే వ్రతమును చాలామంది నిర్వర్తించి, అటుపై సన్న్యాస స్వీకారము చేస్తూ ఉండటము ఒక సదాచారమై ఉన్నది.

వాస్తవానికి **ఈ దేహములోగల ప్రాణమే అగ్ని।** అందుచేత కొందరు ఈ దేహమునే అగ్నిశాలగా ఉద్దేశ్యించి **'అగ్నేయాష్ఠి'**ని నిర్వర్తిస్తు ఉన్నారు. అట్టి ప్రాణాగ్నిలో లోక సంబంధమైన "త్రైధాతవీయము"ను నిర్వర్తిస్తున్నారు. 1) లోక సంబంధమైన దేహము 2) లోక సంబంధమైన మనో – బుద్ధి – చిత్త – అహంకారములను 3) లోక సంబంధమైన కార్య–కారణ – కర్తృత్వదేహములను ప్రాణాగ్నికి ఆహుతి చేసినవారై సన్న్యసించుచున్నారు.

**జగకమహారాజు :** స్వామీ ! మీరు ఉదహరిస్తున్న **'త్రైధాతవీయము'** గురించి మరికొంత వివరించండి.

**యాజ్ఞవల్క్యుడు : ఏతయైన త్రయోదాతవో యదుత "సత్వం - రజః - తమ" ఇతి ।** ప్రాణాగ్నికి సన్న్యాస సమయములో 'ఆహుతి' చేయు ప్రకృతికి సంబంధించిన సత్వ – రజో – తమో గుణములే ! ఈ త్రిగుణములను ప్రాణాగ్నిలో హోమము చేయటమే... అంతర్లీన ఉద్దేశ్యమని గ్రహించబడుగాక ! అది గమనించియే త్రైధాతవీయము నిర్వర్తించాలి.

ఆ త్రిగుణముల ఉత్పత్తి స్థానమేదో అట్టి **హృదయస్థానమే... యాగశాల!** ప్రాణములే అగ్ని! త్రిగుణ సంబంధమైన సర్వ ఇంద్రియ విషయముల పట్ల 'అరుచి' యే (అరోచన – రుచించక పోవటమే) మంత్రమును ఉచ్చరించు ఋత్విజులు (వేదమంత్రములను ఉచ్చరిస్తూ త్రైధాతవీయము నిర్వర్తింపజేసే ఋత్విక్కులు). **"తమ్ జనన్"** – (ఆ బ్రహ్మమును ఎరుగుటకై సంసిద్ధపడుచున్నాను)... అను భావనా సమృద్ధియే అగ్నిని (ప్రాణాగ్నిని) సుస్వాగతము (ఆహ్వానము) పలుక భావోచ్చారణ ధారణయే అగ్ని తేజస్సు యొక్క ప్రజ్వలనము. **తమ్ జానన్ అగ్ని ఆరోహా ధానో వర్ధయా రయమ్, అగ్నిమ్ అజిఘ్రేత్ ।** ... అను మంత్రముతో చెప్తుతారు. బ్రహ్మమును నిర్వచించు మహావాక్యములతో కూడిన మంత్రములతో అగ్ని ఘ్రాణము (పొగను వాసన చూచుటతో కూడిన విధి) చేయుచున్నారు.

**"ఏషవా అగ్నే యోనిః**
**ప్రాణంగచ్ఛ । స్వాం యోని గచ్ఛ స్వాహా"**

**"నా ప్రాణములను అహంకారమును జ్ఞానాగ్ని యోని యందు సమర్పిస్తున్నాను! ఓ అగ్నిదేవా! ఆహూతిని జ్ఞానస్వరూపమగు పరమాత్మ యొక్క సమక్షమునకు చేర్చండి"...** అని పలుకుచూ తన సర్వ భౌతిక రూపానుభవములను, ప్రాణశక్తులను జ్ఞానాగ్నికి ఆహుతి చేస్తున్నారు. కొందరు "గ్రామాగ్ని" (త్రిగుణ–త్రిఅవస్థల సముదాయముగా భావిస్తూ) తెచ్చి మనం చెప్పుకున్నట్లు అగ్నిలో ఆహుతి చేస్తున్నారు.

మరికొందరు అగ్నితో కాకుండా – **యద్యత్ అగ్నిం న విదేయాం - అప్సు జుహుయాత్** – జలమును తెచ్చి, జలమును జలములో ఆహుతిగా సమర్పిస్తున్నారు.

**"ఆపోవై సర్వాదేవతాః । సర్వేభ్యో దేవతాభ్యో జుహోమి స్వాహా"**

అని మంత్రమును ఉచ్చరిస్తూ నీటియందు నీటిని హోమము చేస్తున్నారు ! "ఓ సర్వదేవతలారా ! నేను జలమునందు సమర్పిస్తున్న జల ఆహుతులను స్వీకరించి "ఆత్మైవ ఇదమ్ దర్శనమ్" నకు తోడు అవండి !"... అని దేవతలను తలచుకొంటున్నారు.

**సాజ్యగ్ం హవిః అనామయం మోక్షమంత్రః**
**త్రైయ్యేవం వేద... తత్ బ్రహ్మ । తత్ ఉపాసితవ్యమ్।**

ఈ జలమే సర్వదేవతల స్వరూపముకదా! అందుచేత సర్వదేవతలకు జలమునే వారి నివాసస్థానమగు జలమునకు హవిస్సుగా సమర్పిస్తున్నాను... అని **"సమర్పించునేను - సమర్పించబడుచున్న జలము - స్వీకరించు జలము బ్రహ్మమే।"...** అని మరి ఉపాసించబడునుగాక ।

అప్పుడు ఆజ్యముతో కూడిన 'హవిస్సు'ను కూడా హోమము చేస్తూ నిరాకార - నిర్గుణ పరబ్రహ్మమును ధ్యానిస్తు ఉండాలి.

పైన చెప్పిన వివిధ రీతులైన హోమము చేసిన తరువాత శిఖ - పిలక - యజ్ఞోపవీతమును త్రెంచి (ఖండించి)

## "సన్న్యస్తం మయా"

"మయా సత్ + యత్ + అస్తమ్" - నా చేత (ఇప్పటి నుండి 'సత్' వస్తువగు బ్రహ్మమునందే స్వరూపతః - స్వభావతః నేను ఉనికిని పొందబడుచున్నది. నా చేత ఆశ్రయించబడుచున్నది) అని '3'సార్లు ఎలుగెత్తి పూర్వ - పరమంత్రపూర్వకముగా ప్రకటించుచున్నాడు.

ఓ జనక మహారాజా !

ఇవి సన్న్యాసాశ్రమమును ఆశ్రయించటమునకు సంబంధించిన కొన్ని విధి విశేషాలు. అప్పుడు ఆ ప్రక్కనే ఆశీనులై తపోతేజస్సుతో ప్రకాశించుచున్న అత్రి మునీంద్రులు ఇట్లా ప్రశ్నించారు.

**అత్రి మునీంద్రుడు :** హే మహానుభావన్ ! యజ్ఞవల్క్యా ! ఈ సందర్భములో తమ ప్రవచనమును కోరుతూ, ఒక ప్రశ్నకు మీ ముందు ఉంచుచున్నాను. అనుజ్ఞ ఇవ్వండి.

ఆ సన్న్యాసి యజ్ఞోపవీతమును త్యజించుచున్నారు కదా! యజ్ఞోపవీతము విడిచిన తరువాత అట్టివాడు 'బ్రాహ్మణుడు' అని ఎట్లా అనిపించుకుంటాడు? అనిపించుకోడేమోకదా !

**యాజ్ఞవల్క్యుడు :** ఓహో ! అదా? స్వామీ ! అత్రి మునీంద్రా ! 'యజ్ఞోపవీతము' అనగా త్రిసూత్రపు దారము కాదు కదా! సన్న్యాసము పుచ్చుకున్న తరువాత ఆ సన్న్యాస విషయములో ప్రణవము :: ఓంకారము :: అ + ఉ + మ

## పరమాత్మ - జీవాత్మ - దృశ్యములు

ఇవియే 'యజ్ఞోపవీతము' అగుచున్నది. **'ప్రణవమేవ అస్య తత్ యజ్ఞోపవీతమ్".** "ఆత్మతత్త్వధ్యానము'నే ప్రాశనము (స్వీకరించు జలము) గా భావించి మనస్సుతో "సర్వతత్త్వాత్మకమ్"ను, బుద్ధితో "సర్వతత్త్వసాక్షి"ని యజ్ఞోపవీతముగా స్వీకరించువారై ఉంటారు. ఆత్మ భావనయే అతనికి ఆచమనముచేయు విధి అగుచున్నది. **య ఆత్మా ప్రాశ్య ఆచమ్యాయం విధిః ।**

ఆ సన్న్యాసి ఇక అక్కడి నుండి (సన్యాస ఆశ్రమమును ఆశ్రయించినది మొదలు)...

**వివర్ణ వాసో -** వివర్ణములైన (రంగులు చెడిన) వస్త్రములు ధరిస్తూ ఉంటారు. కొందరు దిగంబరులై ఉంటారు.

**ముండో -** బోడిగుండు కలవారై ఉంటారు.

**అపరిగ్రహః -** ఏ లోక సంబంధమైన విషయములను తనకు తానుగా స్వీకరించనివారై, పరిగ్రహించనివారై ఉంటారు.

**శుచిః - 'సర్వము పరమాత్మ యొక్క నాటకరంగ రచనాకల్పనయే'** అను భావనతో ఎవ్వరినీ, దేని విషయములోనూ తప్పుపట్టనివాడై ఉంటారు.

- సర్వమ్ విశ్వమ్ బ్రహ్మమయమ్!
- ఓంకార నాదమయమ్!
- ఓం శివ శక్తిమయమ్!
- ప్రేమమయమే! పరమాత్మమయమే! అను శుచి అయిన భావనను ఆశ్రయిస్తూ... ఉంటారు.

**అద్రోహీ :** ఎవ్వరికైనా కూడా కించిత్ కూడా హాని కలిగించాలనే ఉద్దేశ్యమే లేనివారై, మహత్తర క్షమాగుణ సంపన్నులై ఉంటారు.

**భైక్షమాణో :** భిక్షము ఎత్తుతూ శరీరమునకు ఆహారము అందిస్తూ... ఉంటూ... క్రమముగా 'బ్రహ్మీభూతుడు' అగుచున్నాడు. ఈ విధము ఒక చోట నిలువక, నివశించక పరివ్రాజకుడై తిరుగుచూ కేవలము పరబ్రహ్మోపాసకుడై కాలము గడుపుచూ ఉంటున్నారు.

**సన్న్యాసుల మహాప్రస్థాన మార్గము :**

వీరి మహాప్రస్థాన మార్గము ఎట్లా ఉంటోందంటే...,

- వీరాధ్యానమునందు (ఓంకారము ఇత్యాది శబ్దములతో) ఏకాంతముగా జనరహిత చీకటి ప్రదేశములో దేహము వదలుచున్నారు.
- ఆహారము మానివేసి... చివరికి జలములోగాని, అగ్నిలోగాని, భౌతిక దేహమును ప్రవేశింపచేసి పాము కుబుసమువలె భౌతికపరిమితులను త్యజించుచున్నారు.

అయితే వారి గురించి ఇవియే నియమము – అని ఏమీ చెప్పలేము. వారు సర్వనియమములను దాటినవారై ఉంటారు.

ఈ విధంగా సన్న్యాసమార్గమును ఆశ్రయించి బ్రహ్మవేత్తలై... ప్రకాశించుచున్నారు.

# పరమహంస

అట్టి సన్న్యాసులలోను, యోగులలోను కొందరు 'పరమహంస' అను మహత్తర స్థానమును ఆశ్రయించినవారై ఉంటున్నారు. అట్టి వారిలో కొందరు ఇప్పుడు దృష్టాంత పూర్వకముగా స్మరిస్తూ, వారికి ప్రణామములు సమర్పిస్తున్నాము. ఓం

**సంవర్తకాయ నమః । ఆరుణియే నమః ।**
**శ్వేతకేతవే నమః । దూర్వాసాయ నమః ।**
**ఋభుయే నమః । నిదాఘాయ నమః ।**
**దత్తాత్రేయాయ నమః । శుకాయ నమః ।**
**వామదేవాయ నమః । హారీతకాయ నమః ।**

ఇత్యాది ప్రభృతయో పరమహంస మహాజనే నమో నమో నమో నమః

**అవ్యక్త లింగాయ :** వారు ఇటువంటి గుర్తులు, ఆకారములు, వస్త్రములు, రంగు – రూపులు ... మొదలైనవి కలిగి ఉంటారని నిర్వచించలేము. అవ్యక్తమైన స్వరూపము కలిగి ఉంటారు. జగత్తుకు కేవలసాక్షిత్వము వహించువారికి జగత్ అంతర్గత లక్షణములు ఏమని మనము చెప్పుకోగలము. అట్టివారు ఏ ఆశ్రమములోనైనా ఉండి ఉండవచ్చు.

**అవ్యక్త ఆచారా :** ఆ పరమహంసలను ఆచార పరిధులకు తీసుకొని రాలేము. తమ యొక్క పరమహంసత్వము అర్హత – అవసరములను అనుసరించి మాత్రమే తెలియనిస్తారు. లేకుంటే ఎవ్వరికీ తెలియనీయరు కూడా.

**అనున్మత్త - ఉన్మత్తవత్ ఆచరంతః :** వారు ఏమాత్రము అమాయకులు – తెలియనివారు – ఉన్మత్తులు (పిచ్చివారు) కాకపోయినప్పటికీ.. సాంసార జీవుల దృష్టికి ఉన్మత్తులవలెనే అగుపిస్తారు. **తమ యొక్క అఖండానంద సర్వాత్మకత్వమును, అంతర్ దృష్టిని లోకసంబంధమైన ఆశయములు కలవారికి తెలియనీయనివ్వరు.** పాము అడుగుల జాడ పామే కనిపెట్టగలదు కదా ! పరమహంసలను యోగయుక్తులు మాత్రమే గమనించగలరు. జన్మ–కర్మ–మరణ–దేహ–దృశ్య–రహస్యములు, వాటివాటి సత్యాసత్యములు ఎరిగియే, బాహ్యమున ఏమీ తెలియని వారివలె కనిపిస్తూ ఉంటారు. ఈ భౌతిక స్త్రీ – పురుష సంబంధ – అనుబంధ – బాంధవ్యములకు, పురనివాస భేషజములకు, సంపద – ప్రతిష్ఠ వంటి వాటికి ... **"ఇవన్నీ అర్థరహితములు. నిస్సారములు, భూటకము ! నాటకము !"...** అను బుద్ధితో మొదలే వాటన్నిటికీ అంతరంగమునందు సుదూరులై ఉంటారు. బాహ్యమున "ఇట్లా ఉంటారు – అట్లా ఉండరు".. అనేమీ చెప్పలేము. సన్న్యాస – బ్రహ్మచారి ఆశ్రమముల వారి బాహ్య లక్షణములైనట్టి త్రిదండము – కమండలువు – భిక్షాపాత్ర – జలపాత్ర – శిఖ – యజ్ఞోపవీతము మొదలైన లక్షణములన్నీ కూడా ... ఆ పరమహంసలు **'ఓం భూస్స్వాహా'** అంటూ నీటియందు శవభస్మమువలె పరిత్యజించి వేసి వుంటారు. వారి చూపు – అన్వేషణ – భావన – సంకల్పము–దృష్టి – ధ్యాస – శ్రుతము – కృతము ... ఇవన్నీ కూడా **"శివోఽహమ్ –ఆత్మాఽహమ్"** సందర్శనమునందు, తత్త్వమార్గమునందు మాత్రమే నియమితమై ఉంటాయి.

**యథా జాతరూపధరా నిర్ద్వంద్వా, నిష్పరిగ్రహః ।** ఏవిధంగా అయితే అప్పుడే పుట్టిన శిశువుకు ఏ విషయముతోనూ ఏ మాత్రమూ కించిత్ కూడా సంబంధము ఏర్పడి ఉండలేదో,... ఆ విధంగా ఆ పరివ్రాట్... పరమహంస

- ద్వంద్వములు లేనివారై, నిర్ద్వందులై,
- దేనినీ పరిగ్రహించనివారై, నిష్పరిగ్రహులై ఉంటారు.
- తత్త్వమ్‌బ్రహ్మ (నీవు పరబ్రహ్మ స్వరూపుడవే అయి ఉన్నావు) – అను పరాకాష్ఠార్థముతో సర్వసహజీవులను సర్వదా సర్వ సందర్భములలోను సందర్శించు మార్గమును అనుసరించువాడై **(తత్త్వ బ్రహ్మ మార్గే)**
- సమత్వయోగ సంపన్నులై....,
- అత్యంత పరిశుద్ధ మానసులై ...,

ఈ జగత్తునందు సంచరించుచున్నారు. తానున్న ప్రదేశములను **"ఆత్మానుభావానందము"**లో నింపివేస్తూ ఆశ్రయించినంత మాత్రము చేతనే సహజీవుల స్వస్వరూపాత్మ సంబంధితమైన సర్వసందేహములు మొదలంట్లా తొలగించువారై ఉంటారు.

ఓ జనకమహారాజా !

సన్న్యాసి - పరివ్రాట్ - అవధూత ... వీరి ఆహారము విషయమై తత్ - విశేషము చెప్పుచున్నాను. వినండి.

మహత్ములగు సన్న్యాసులు, అవధూతలు, పరివ్రాట్‌లు ఎల్లప్పుడు సర్వ సమరస స్వరూపమునందు సమాధినిష్ఠులై ఉంటారు. అట్టి కేవల సాక్షీ స్థితి నుండి యథోక్త కాలములో బయటకు వచ్చి ప్రాణ సంధారణ కొరకై భిక్షము (భిక్షాటనము) ఆచరిస్తూ ఉంటారు. ఆహారము ఇంద్రియ ప్రియత్వము కొరకు కాదు. జీవుడు బ్రతకటానికి తినాలిగాని, తినటానికి బ్రతుకకూడదు కదా! వారు ఈ 'ఉదరము (పొట్ట)' అనే భిక్షకపాత్రకు సరిపోవు ఆహారమును నాలుక యొక్క రుచి-పచులకు బద్ధులు కాకుండా-బిక్షగా స్వీకరిస్తూ, కమండలములోని జలమును త్రాగుతూ ఈ దేహమును జీవింపజేయు నిమిత్తమై ఉద్దేశ్యిస్తారు. ఎప్పటికప్పుడు ఎంత కావాలో అంత వరకే ఒక పాత్రలో ఆహారము కలిగి ఉంటారు. 'రేపు ఎట్లా ?' అని ఉద్దేశ్యించరు. రెండవ పాత్రలో ఆహారము దాచుకోరు. ఎక్కడ జలము లభిస్తే అక్కడే కమండలువులో జలమును నింపి స్వీకరిస్తారు. ఎవ్వరికీ ఏమాత్రము బాధ-ఇబ్బంది కలుగజేయనివారై, రహస్య స్థలములను, జనసంచార రహిత ఏకాంత ప్రదేశములను తమ ఉనికి చోటుగా కలిగి ఉంటారు. 'ఇది లభించిందా? అది లభించలేదా?".. మొదలైన ఆయా ఊహ-అపోహలను దగ్గరకు రానివ్వరు. ఊరి బయట పాడుపడిన శిథిల గృహములు, శూన్య ప్రదేశములు, దేవతాగృహములు (గుడులు), గడ్డి దుబ్బలు, పుట్టలు ఉన్న ప్రదేశములు, వృక్షమూలములు, కుమ్మర గృహములు, అగ్ని హోత్రశాలలు, యజ్ఞ-యాగములు జరుగుచున్న స్థలములు, నదీ తీరములు, ఇసుక ఎడారులు, కొండ గుహలు, కందరములు (కనుమలు), నిర్ఝర (కొండరాళ్ళ) స్థానములు, స్థండిలములు (మట్టి దిబ్బలు)... ఇవన్నీ ఆ మహనీయులు మార్చి - మార్చి సంచరిస్తూ ఉంటారు.

ఈ విధంగా ఆ సన్న్యాసులు శుభా - అశుభ కర్మలను తమ హృదయమునుండి నిర్మూలనము చేసుకొను ప్రయత్నమే సన్న్యాసము. క్రమంగా సర్వపరిధులను అతిక్రమించి దేహమును 'లేనిది'గా దర్శించుచూ, దేహరహితత్వమును స్వభావముగా చేసుకొంటూ, సామ్రాట్‌లై సర్వలోక సంచార భావనలచే పరివ్రాట్టులై చివ్వరికి నిర్వికల్ప సమాధినిష్టులై అవధూతలుగా భూమిపై ప్రకాశించుచున్నారు. పరమహంస ఆకాశాంబరులై (సర్వ జగత్ రూప వస్త్రములను పరిత్యజించి)

- పరము + ఇహము రూపములగు నమస్కారమును కూడా (జీవాత్మ - పరమాత్మల భేదమును) అధిగమించినవారై ఉంటున్నారు. 'నమస్కారులై' ఉంటున్నారు.
- భార్య - పుత్రులు ఇవన్నీ ఆత్మకు అభిన్న భావముతో ఆత్మలీలగా అవలోకిస్తూ ... వాటికి సంబంధించిన ప్రాపంచక అభిలాషలను తూష్ణీకరించి వేసి ఉంటున్నారు.
- ప్రాపంచక లక్ష్య - అలక్ష్యములను ఎరిగి పరివ్రాట్‌లై ప్రకాశించుచున్నారు.

'ఇహము'ను దాటివేసి పరమేశ్వర స్వరూపులై దృశ్యమంతా తమ పరమాత్మత్త్వములో నింపివేసి ఉంటున్నారు.

**జనకమహారాజు :** సన్న్యాసాశ్రమ నియమానుసారము వారు న-నమస్కారులు (తదితర జనులకు నమస్కరించనివారై) అయి ఉంటారా ? నామ - రూపాదులను ఉపాసించువారై ఉంటారు ?

**యాజ్ఞవల్క్యుడు :** ఈ విషయమై ఇట్లా చెప్పబడుతోంది. "ఒక సన్న్యాసి పూర్వసన్న్యాసులకు (తనకన్నా మునుముందే సన్న్యసించినవారికి) తనతో సమాన ధర్మనిరతులకు నమస్కరిస్తారు. తదితరులకు నమస్కరించరనునది సన్న్యాసాచారముగా చెప్పబడుచున్నది.

### వేద సందూషితాశయ సన్న్యాసులు :

ఓ జనక మహారాజా! సన్న్యాసాశ్రమవాసుల క్షేమము-జాగరూకతలను దృష్టిలో పెట్టుకొని ఈ విషయములను ఇక్కడ చెప్పుకుంటున్నాము.

సన్న్యాసాశ్రమము... ఒకానొక "ఉపాసన" యొక్క ఆశ్రయము కదా ! అందుచేత సన్న్యాసము అవధరించిన వెంటనే సన్న్యాసత్వము మనస్సు పునికి పుచ్చుకున్నట్లు కాదు. ఆశ్రమము, ఆకారము మారినంతమాత్రంచేత బుద్ధికి సర్వాతీతత్వము సిద్ధించినదని అనవీలు కాదు కదా!

సన్న్యాసులలో కొందరు..

**ప్రమాదినో** ... బద్ధకముతో అశ్రద్ధ కొనసాగించున్నారు.
**బహిఃచిత్తః** ... బాహ్యేంద్రియ చిత్తము ఇంకనూ ఉపసంహరించని వారై ఉంటున్నారు.
**కలాహ-ఉత్సుకాః** ... కోపము - ఆవేశము - పోట్లాటల నుండి ... ఇంకనూ వెనుతిరగనివారుగా ఉంటున్నారు..

ఇటువంటి స్వభావములు ఉన్నవారు ఉంటూ ఉంటారు. వీరిని **"వేదదూషిత ఆశయ సన్న్యాసులు"** అంటారు.

అయితే,

అజ్ఞానము యొక్క విన్యాసము చేత కొందరు సన్న్యాసము స్వీకరించికూడా, ప్రాపంచక రుగ్మతలు వదల లేకపోయి ఉండవచ్చు. అంత మాత్రము చేత – అది 'సన్న్యాస ఆశ్రమ విధి'కి (మరియు) '.నామరూపాదులకు ఆవల పరమైయున్నట్టి అద్వయ సామ్రాజ్యమునందు సంస్థితులైయున్న మహనీయులగు అవధూతలకు, పరివ్రాజకులకు–వీరందరికీ ఆపాదించటము ఉచితమా? కాదు.

గొప్ప వేద పాఠశాలలో చేరిన కొందరు విద్యార్థులు అల్లరిని వదలక – వేద హృదయములో ప్రవేశించలేదు కాబట్టి, ఆ అల్లరి అనే దోషమును వేద అధ్యయనమునకు వేద పాఠశాలకు, ఉపాధ్యాయులకు, ఉత్తమ విద్యార్థులకు ఆపాదించటము కదా!

అందరినీ కలిపి ఒకగాటున కట్టటము వీలుకాదు కదా !

అది అటుంచి ఇక, ఆ పరమహంసల మరికొన్ని విశేష లక్షణములు చెప్పుకుందాము.

## పరమ హంసల నామ - రూపార్చన

ఓ జనకమహారాజా ! 'పరమహంసల నామ – రూపాదుల అర్చన ఎట్లా ఉంటుంది ?"... అను ప్రశ్నకు సమాధానము చెప్పుకుందాము.

**నామాదిభ్యః పరే భూమ్ని స్వారాజ్యే చేత్ స్థితో అద్వయే, ... ప్రణమేత్‌కమ్, తత్ ఆత్మజ్ఞో న కార్యం కర్మణా తదా!** ఏ యోగి (లేక) సన్న్యాసి (లేక) జ్ఞాని (లకే) పరమహంస అయితే నామ – రూపములకు పరమై – వేరై – ఆవల ఆక్రమించుకొని ఉన్నట్టువంటి "అద్వయ–ఆత్మ సామ్రాజ్యము" నందు సంస్థితుడై ఉన్నాడో–ఇక అతడు ఎవరికి, ఏమని, ఎందుకు నమస్కరిస్తాడు?

**జనకమహారాజు :** అట్టి **'అంతానేనే'** అను **'ఆత్మసామ్రాజ్య – అభిషిక్తుడు'** అవటానికి ఏ ఏ కర్మలు, సాధనలు, మార్గములు ఇప్పుడు జీవులమగు మేము అనుసరించాలి?

**యజ్ఞవల్క్యుడు :** ఆత్మజ్ఞానమే అందుకు మార్గము ! ఈ జీవుడు తాను "దేహమును ఏలుచూ దేహములోనే సంస్థితుడై ఉన్నాను"... అని భ్రమిస్తూ ఉన్నాడు. "సర్వమును నేనే అయి – సర్వమునకు వేరై" ఉన్నట్టి ఆత్మ సామ్రాజ్యము యొక్క **జ్ఞానము** చేతనే గుర్తించబడుతోంది. అట్టి 'ఆత్మ జ్ఞానము'నకు వాస్తవానికి ఎటువంటి కర్మలతోను పని లేదు. ఆత్మజ్ఞునికి "ఇది ఇట్లా చేయాలి ! అది అట్లా చేయకు, ఇది మార్గము. అది కాదు !"... ఇటువంటి త్యాజ్య – గ్రాహ్య, కృత – అకృత సంబంధమైన పరిధులు చెప్పబడజాలవు. మరి ఎవరికి శాస్త్రములు చెప్పుచున్నది ? 'దేహ భ్రాంతి – ఇంద్రియ విషయ పరిమితత్వము' తనపై ఆపాదించుకొనుచున్న సందర్భములో మాత్రమే ఉపాయముల రూపముగా హేయ (వదల వలసిన) – ఉపదేయములు (స్వీకరించవలసినవి) చెప్పబడుచున్నాయి.

**జనకమహారాజు :** మీరు చెప్పుచున్నట్లు స్వస్వరూపాత్మపట్ల అజ్ఞానము తొలగటానికి, నేను ఎటువంటి ఉపాయము ఆశ్రయించటము ఉచితమో, ఆజ్ఞాపించండి.

**యజ్ఞవల్క్యుడు :** ఓ విదేహరాజ్య చక్రవర్తీ ! జనక మహారాజా ! **ఈశ్వరో జీవకలయా ప్రవిష్టో భగవాన్ - ఇతి, ప్రణమేత దండవత్ భూమౌ వా - అశ్వ చండాల గోకరమ్**

**" ఆ సర్వేశ్వరుడు, సర్వకళామయుడు అగు పరబ్రహ్మమే (లేక) భగవానుడే తన యొక్క అద్భుతము - అనంతము అగు జీవకళలతో సర్వ దేహములలోను ప్రవేశించి సర్వమును ప్రకాశమానము చేయుచున్నారు. సర్వ స్వరూపుడై వెలుగొందుచున్నారు. ఈ కనబడే సర్వముఖములు ఆయనకు నివాసస్థానమే.**

అను దృష్టి మననము కలవాడనై, ఉత్తమము, ఆత్మీయము అయినట్టి బుద్ధితో సర్వులను చూడు. ఒక గుర్రమును, ఛండాలుని, గోవును, గాడిదను చూస్తూ ఉన్నప్పుడు కూడా మనస్సులో **"ఓ సర్వాత్మకా ! పరమాత్మా !"** అని **అంతరగమునందు** మనస్సుతో ఉచ్చరిస్తూ సాష్టాంగ దండ ప్రణామములు సమర్పిస్తూ ఉండు. నీవి అని అనుకొన్నవి ఆయనివిగా భావన చేయి. అప్పుడు క్రమంగా "సర్వముగా ఉన్నది మమాత్మయే"... అనునుది అతి త్వరలో అనిపించగలదు. **నమస్కార పూర్వక భావనతో అనుకుంటూ ఉంటే... తప్పకుండా అనిపించగలదు.**

## మాంసదృష్టి - ఆత్మ దృష్టి

నాయనా ! జనకా ! ఎందుచేతనో ఈ జీవుడు ఆత్మదృష్టిని ఏమరచి మాంస దృష్టిని – కొన్ని దేహపరంపరలుగా – పెంపొందించుకొన్నవాడై ఉంటున్నాడు. ఈతడు మోహము చెందుచున్నాడు! ఈ భౌతిక దేహములు ఎటువంటివి ? మాంసముతోను, బొమికలతోను, గ్రంధులతోను, క్రొవ్వు – రక్త – చీములతోను తయారుకాబడిన భౌతికమైన (మెటీరియల్) బొమ్మలే కదా ! అవి కాస్త

ప్రక్కన పెడితే ఏ దేహములో ఏమి ప్రత్యేకత ఉన్నది ? **తత్ మాంసరక్త భాష్పాంబు పృథక్ కృత్వా విలోచనే, సమాలోకయ ! గమ్యం చేత్ కింముధా పరిముహ్యాసి ?** ఓ జీవుడా ! చర్మము – మాంసము – రక్తము – కన్నీరు... ఇవన్నీ విడివిడిగా ఒక చోట ఒక వరుసలో పెట్టి పరిశీలించిచూడవయ్యా. వీటన్నిటిలోని ఏ ఒక్కటిలో ఏమి ప్రత్యేకత ! ఏమి రమ్యత ? ఎందుకు నీవు పరిమోహము పొందుచున్నావయ్యా ? భావకవులు **"మేరు శిఖరము మీద నుండి తెల్లటి మెరుపులతో కూడి జాలువాడుచున్న సెలయేరువంటి మల్లెపూలచే గ్రుచ్చబడిన పొడవైన జడవలె, గంగాజలము వంటి అధరామృతముతో"...** ఇటువంటి వర్ణనలతో ముక్తాహారములతో కూడిన స్త్రీ – పురుష దేహములను వర్ణిస్తూ పాఠకుల భ్రమలను మరింత అధికము చేస్తున్నారు. ఇటు వంటి వన్నీ మననము చేసుకొంటూ స్త్రీ – పురుష జీవులు ఒకరినొకరు దేహములవైపు చూచుకొనుచూ రస–సముల్లాసము పొందుచున్నారే ! "జిలుగు – జిగేల్ వస్త్రములచే, పుష్పహారములచే అలంకరించబడిన భౌతిక దేహముల లోపల రక్త –చీము – మాంస – బొమికల అమరికయే కదా !"... అనేది ఈ జీవుడు గుర్తు పెట్టుకొని ఉండకపోతే ఎట్లా ? అభౌతికము – అప్రమేయము అయి, సర్వమును కదలుటకు కారణముగుచున్న ఆత్మను గుర్తించి దర్శించాలి కదా !

ఓయీ ! అమాయక జీవుడా ! **శ్మశానేషు దిగంతేషు స ఏవ లలనాస్తనః శ్వభిరా అస్వాద్యతే కాలే లఘుపిండ ఇవాంధనః !** ఏ ఏ స్త్రీ స్థనములు, పురుషుల భుజస్కంధములు చూచి ఒకరికొకరు స్పృశించి మురిసిపోతూ ఆనందించుచున్నారో, అవన్నీ కూడా "కాలక్రమేణా ఒకానొక రోజు కుక్కల చేత – నక్కల చేత అన్నపు ముద్దలవలె, తమకు ఇవ్వబడగా లభించిన సొంత సొమ్ము వలెను గుటకలు వేస్తూ మ్రింగబడబోవుచున్నాయి కదా !"... అనునది గుర్తు కలిగి ఉండకపోతే ఎట్లా ? ఎప్పటికప్పుడు మార్పు చెందుచున్న భౌతిక రూపములు చూచి పిచ్చిగా ఆకర్షితులవటము మానవ జన్మ పొందిన మీకు ఉచితమా ? కాదు.

నల్లటి కురులు ధరించి మనస్సులో దుష్టమగు పరస్పర స్పర్శభావన – ఆలోచనలతో కూడుకొని ప్రియురాండ్లు ప్రియుల పట్లా, ప్రియులు ప్రియురాండ్ల పట్లా భౌతిక ధ్యాసలు పెంపొందించుకొని ఫలితంగా మండుటెండలో గడ్డివలె ఈ జీవులు కాలుతూ ఉడికిపోవుచున్నారు. ఈ భౌతిక దేహములకు సంబంధించిన ధ్యాసలు ఎటువంటివంటే ....

**జ్వలితా అతిదూదేపి...** మనస్సు ఒక దేహముతో మమకారము – కోపము – కామము దృష్టితో సంబంధము పెట్టుకోవటము వలన తత్ఫలితంగా ... ఆ దేహము ఎక్కడో దూరాన ఉన్నప్పుడు కూడా ... అతని మనస్సును జ్వలింపజేయగలదు. మకిలి నింపగలదు.

**సరసాపిఽనీరసా : -** భౌతిక దేహముతో కలిగి ఉన్న సంబంధము పైకి సరసముగా కనిపిస్తూ ఇంతలోనే నీరసముగా పరిణమిస్తోంది.

**స్త్రీ యోహి నరకాగ్నీనామ్ ఇంధనమ్ చారుదాగుణమ్।** ఈ స్త్రీ – పురుషుల పరస్పర దేహాకర్షణ సమాచారములు 'నరకము' అనే అగ్నిని హృదయములో దారుణముగా ప్రజ్వలించుటకు ఇంధనముగా అగుచున్నాయి. 'కాముడు' అనే కిరాతకుడు దృశ్యమునందు ధ్యాసలు గల జీవులు అనే పక్షులను ("నారీ దేహములు – పురుష దేహములు" అనే ఆకారములను) ఎరగ వేసి "అనేక దుర్వాసనలు" రూపముగల త్రాళ్ళతో తయారైన వలలో బంధించి "జన్మపరంపరలు" అనే పంజరములలో కట్టివేసి ఉంచుచున్నాడు. "అన్ని దోషములకు పేటిక వంటిది. ఈ నారీ సంబంధింత (దృశ్య సంబంధిత) వ్యవహారమంతా ! ఇక్కడ ఏదో పొందాలి – కావాలి– ఏదో చేయాలి. అనునదంతా ఈ జీవునికి దాస్య శృంఖలములుగా పరిణమిస్తున్నాయి. అట్టి బంధములకు అంతూ–పొంతూ ఏముంటుంది ? అందుచేత, **"అలమ్ అస్తు మమ స్త్రీయా** – ఓ మనసా ! ఈ సంబంధములను, అనుబంధములను ఇక చాలించు. మనము అసలు విషయమునకు వచ్చి పరిశీలిద్దాము" ... అని ఈ జీవుడు వివేకి అయి ఆత్మతత్త్వ జ్ఞానము కొరకై అత్యంత త్వరగా నాంది పలకటము ఉచితము.

**యస్య స్త్రీ, తస్య బోగేచ్చా ! ని స్త్రీ కస్య క్వ భోగభూః ?** స్త్రీ (దేహ) ధ్యాస కలిగి ఉంటేనే భోగేచ్ఛ ఉంటుంది ? భోగేచ్ఛ లేనప్పుడు భోగభూములూ ఉండవు. స్త్రీయం త్యక్త్వా జగత్ త్యక్త్వం ! స్త్రీ (సంబంధము)ను త్యజిస్తే జగత్తును త్యజించినట్లే అవుతుంది. **జగత్ త్యక్త్వా సుఖీ భావేత్ !** జగత్తును త్యజించినవాడు 'సుఖి' అగుచున్నాడు. (స్త్రీ = సత్వ + రజో + తమో = స + ర + త)

ఈ పరస్పర సంబంధములు, భార్య – పుత్ర – కళత్ర – మిత్ర... ఇత్యాది వ్యవహారములు ఈ జీవుని భ్రమింపజేస్తూ ఉన్నాయి. ఈ జీవుడు సత్యము వైపుగా దృష్టి సారించకుండానే రోజులు – జీవితములలను గడిపివేస్తున్నాడు. ఈ సంసారమును నమ్మి ఉండకూడదు ఎందుకంటే ...

- చాలా కాలము వరకు దంపతులకు సంతానము కలుగకపోతే అది వారికి ఎంతో దుఃఖము – నిరుత్సాహము కలుగజేస్తూ ఉంటుంది.
- సంతానము కలుగుతూ ఉంటే... అది ఆ తల్లికి గర్భపాతము సమయములో ప్రసవవేదన.
- సంతానము కలిగినప్పటి నుండి వారి అనారోగ్య బాధల వలన తల్లి తండ్రులకు ఎన్నో ఆదుర్దాలు ! ఉద్వేగాలు ! ముచ్చెమటలు పోస్తూ ఉంటాయి.

- ఆ కుమారుడు అల్లరి – చిల్లరగా తిరుగుతూ ధూర్తుడైతే అది మరింత వేదన !
- ఉపనయనము చేసినా విద్య అబ్బకపోతే మరింత మనఃతాపము.
- ఒకవేళ పండితుడు అయితే కూడా అతనికి వివాహము అవ్వకపోతే ... ఇల్లంతా నిరుత్సాహము "ఏమి చెయ్యాలిరా !" అని వేదన.
- అతడు సంపదలు పొంది పరస్త్రీ వ్యామోహముతో దురభ్యాసి అయితే కష్టాలకు అంతు ఉండటము లేదు.
- ఒకవేళ కొడుకు కుటుంబము దారిద్ర్య బాధ అనుభవిస్తూ ఉంటే, అది తల్లిదండ్రులకు మరింత కష్టకాలము.
- కొడుకు పరుషంగా పలికేమాటలకు ఆ తల్లిదండ్రుల మనస్సులు వికలమైపోతూ ఉంటాయి.

**ధనీచేత్ మ్రియతే తదా !** ఒకవేళ, **"అన్నీ బాగానే ఉన్నాయి కదా ! సంతానము – సంపద ... అన్నీ అనుకూలమే"**... అని అనుకుంటూ మురిసిపోయే వారికి ఖరా–మృత్యువులు దేహగతియే మార్చివేస్తున్నాయి. ఎవ్వడూ కాలమును నమ్మి ఉండటము కుదరదు. ఏది ఎప్పుడు ఎందుకు ఎట్లా అవుతుందో ఎవ్వరూ ముందుగా తెలుసుకోలేని కాలగతి ఇక్కడ తాండవ మాడుతోంది. కాలమునకు "ఎర' కానిదేది, **ఒక్క ఆత్మ తప్ప** ?

## చపలత్వము జయించాలి

ఓ జనక మహారాజా ! తన యొక్క సర్వతత్త్వాత్మకమగు స్వరూపాత్మ స్వభావమును పునికి పుచ్చుకోవటానికి ఈ జీవుడు బుద్ధి యొక్క చపలత్వమును త్యజించాలి. కదులుచున్న అద్దము (మిర్రర్) లో ప్రతిబింబమును స్పష్టముగా చూడలేము కదా ! ఇదీ అంతే ! అందుచేత...,

**న పాణి - పాద చపలో యతిః :** యోగ సిద్ధి పొందతలచువాడు చేతులను, వేళ్ళను ఎల్లప్పుడూ చపలముగా ఉంచుకోరాదు. చేతులతో ఏదేదో చేయాలని, కాళ్ళతో ఎటో ఎటో వెళ్ళాలని చపలత్వము పొందరాదు.

**న చ వాక్ చపలశ్చైవ :** వాక్కుతో అనవసరమైన సంభాషణ పరదూషణ తెలిసీ – తెలియని విషయాలను తెలిసిన వారిపై ఆపాదించటము, లౌకిక విషయాలపై అతిభాషణము... ఇవన్నీ కూడదు.

యతి అవటానికై – వాక్ – పాణి – పాదములపై (జ్ఞానేంద్రియములపై కర్మేంద్రియములపై) స్వాధీనత – నిగ్రహము – అలవరచుకోవటము అవసరము.

**బ్రహ్మభూతో జితేంద్రియః** ఇంద్రియములను జయించువాడే... బ్రహ్మ భూతుడు (తనను బ్రహ్మముగా అనుభూతపరచుకొన్నవాడు) కాగలడు.

## కోపముపై కోపము

ఈ జీవునికి అన్నికన్నా పెద్ద శత్రువు 'కోపము'. వారిపై – వీరిపై మనస్సులో కోపమున్నంత సమయము–వివేకమునకు చోటు దొరకదు. అందుచేత సాధకుడు కోపము విషయములో అతి జాగరుకుడై ఉండాలి.

**జనక మహారాజ :** మహాత్మా! కోపము ఎల్లప్పుడూ శత్రువే. ఇందులో సందేహము లేదు. అయితే అట్టి కోపము మా మనో–బుద్ధి–చిత్తములలో ప్రవేశించనీయకుండా ఎట్లా చూచుకోవాలి? మాపై దయతో, కోపమును దూరంగా ఉంచగలిగే ఉపాయాలేమన్నా శెలవివ్వండి.

**యజ్ఞవల్క్యుడు :** ఓ జనకమహారాజా ! ఎవ్వరికైనా తన దేహావయములపై తనకు కోపముంటుందా ? ఉండదు కదా ! **రిపేబుద్ధౌ స్వదేహేచ సమైకాత్మ్యం ప్రపశ్యతః, వివేకినః కుతః కోపమ్ ?** వివేకవంతుడగు ఆత్మ సంయమ యోగికి ఈ విశ్వమంతా తన శరీరము అగుచున్నది. పరమహంసలకు తాము విశ్వాత్మకునిగాని, ఈ విశ్వము తమ ఆత్మ దేహముగాను స్వభావసిద్ధముగా అనిపించుచున్నది. ఆత్మ జ్ఞానముచే కోపము హృదయమునుండి తనకు తానే తోకముడుస్తోంది.

## తన కోపమే తనకు శత్రువు

ఓ సహజీవులారా ! కోపము అతి ప్రమాదకరమైనది అని గుర్తు చేస్తున్నాను. అది ఉన్నచోట ఎంతో కష్టపడి సముపార్చించుకొన్న సత్వగుణము, తద్వారా పొందవలసియున్న పురుషార్థములు (ధర్మ – అర్థ – కామ మోక్షములు) భ్రష్టుపట్టుచున్నాయనునది దయచేసి గమనించండి.

### అపకారిణి కోపశ్చేత్ కోప కోపః కథం న తే ?

ఓ విదేహరాజా ! జనకమహారాజా ! ముందుగా ఒక ప్రశ్న. ఒకరిపై కోపము ఎందుకు వస్తోంది ? అతని వలన హాని కలుగుట చేతనే కదా ! అటువంటప్పుడు శుభములను పాడుచేసి అశుభములను కలిగించు 'కోపము' పై కోపము ఈ జీవునకు ఎందుకు

కలుగటము లేదు ? అందుచేత **"నా యొక్క ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ ఫలములు పరిరక్షించుకోవటానికై నేను నా 'కోపము' పై కోపము కలిగి ఉండెదను గాక"** అని జీవుడు తలచును గాక.

**నా కోపముపై తిరగబడుచున్న ఓ నా కోప-కోపమా! నీకు నమస్కరిస్తున్నానయ్యా! నీ దయవలన (నా కోపము పై కోపము వలన) నా ఇంటికి వచ్చి, నా ఇంటినే తగలబెట్టు ప్రయత్నిస్తున్న - నా 'కోపము' ను గృహ బహిష్కరణ చేయుచున్నాను కదా ! నమోస్తు ! కోపముపై కోపము వలన నాకు 'వైరాగ్యము' అనే మహత్తర గుణము అబ్బుతోంది. అందుచేత కోపము పై నాకు వస్తున్న కోపము నన్ను కాపాడే ఆత్మ బంధువు !...** అని ఈ జీవుడు గమనిస్తూ... కోపముపై కోపము కలిగి ఉండును గాక!

## సంసార దృష్టి - సన్న్యాసయోగి దృష్టి

దేని దేని పట్ల అయితే అనేకమంది జనులు 'ఇవన్నీ అవసరము! సంపాదించుకోవాలి! దాచుకోవాలి! దోచుకోవాలి! ఇంకా పొందాలి! కలిగి ఉండాలి! ఎంతగానో పెంపొందించుకోవాలి !" ... అని తాపత్రయపడుచున్నారో.. సంయమియగు యోగికి అవన్నీ నిస్సారములై కనిపిస్తున్నాయి. "నన్ను గొప్ప అనుకోవాలి" ... ఇటువంటివన్నీ సంయమి అగు యోగరాట్‌ను కించిత్ కూడా సమీపించజాలవు.

ఇక ప్రబుద్ధుడగు సన్యాస యోగికి – యోగ విరాట్‌కు పరమహంసకు ఏది పరలక్ష్యమై అనునిత్యముగా, ఉపాసించవలసినదిగా అగుచున్నదో, అది సామాన్య (ఆత్మ విషయమై, అజ్ఞానము కొనసాగించు) జనులకు "అది పట్టించుకోవలసిన విషయమ్ కాదు లెండి. ఇప్పుడు కాదు ! ఎప్పుడో చూద్దాంలే! అయినా ఏమిటి లాభం ! ముందుగా ఇక్కడ పొందేవన్నీ లెక్కించుకోనీ ! చివరి విషయం ఆత్మజ్ఞానమే లెండి !"... అని తలుస్తున్నాడు. వర్తమానమునందు – ఆత్మ సమాచారమును ఏమాత్రమూ లక్ష్యముగా, ఆశయముగా కలిగియే ఉండటము లేదు! ఆధ్యాత్మ శాస్త్రమును శాస్త్రముగా పరిగణించటమే లేదు. ఓ జనకమహారాజా ! పరిశీలించటానికి వెనుకాడటమే, తిరస్కరించటమో, బద్ధగించటమో, అల్పాశయములతో రోజులు గడపటమో, సందిగ్ధత కొనసాగించటమో, ఇదియే ఈ జీవుడు అజ్ఞానిగా ఉండిపోవటానికి కారణం.

### "చిత్ ఆనందము ఎక్కడ ఉన్నది ?"

ఓ మహారాజా ! **'చిదాత్మ'** అనబడే చిదానందము ఇప్పుడే ఇక్కడే ఈ జీవునికి లోన – బయట కూడా సర్వదా వేంచేసియే ఉన్నది.

ఈ కనబడే జగత్తంతా 'ఎరుక' అను రూపము దాల్చిన చిత్ తేజ చిదానందమ్ !

నాయనా ! ఒక పరమసత్యము వేదాంతసారవాక్యము నీ ముందు ఉంచుచున్నాను.

**చిత్ త్వమ్** - నీవు సర్వదా చిదాకార – చిదానంద – సదాశివ స్వరూపుడవే అయి ఉన్నావయ్యా !

**చిదహమ్** - నేను కూడా అట్టి చిదానంద చిత్ – ప్రకాశ స్వరూపుడనే !

**ఏతేచ లోకాః చిత్ ఇతి భావయ** - ఈ కనబడే లోకము, ఈ దృశ్యము **ఇదంతా సర్వదా చిదానంద స్వరూపమే !**

ఈ పరమ సత్యమును గ్రహించి, సర్వదా తత్భావనయందు ఉండుము. యతులకు, మహాయోగులకు, పరమహంసలకు

**సర్వము బ్రహ్మమే !**
**నేను బ్రహ్మమే !**
**ఈ సర్వము నేనే !**

అనునదే ఎల్లప్పుడూ నిత్యోపాసన, అనునిత్య నిష్ఠ, ఆనంద దర్శనము అయి ఉన్నది.

వారు సర్వదా సర్వత్రా ఈ విశ్వమంతా, సర్వ జీవులతో సహా తమ ఆత్మ స్వరూపముగా దర్శించుచూ ఆనందిస్తున్నారు.

**"నేను – నీవు అఖండ బ్రహ్మమే"** అట్టి అనుక్షణిక భావనయే **నిశ్చల సమాధి-మోక్షము-జ్ఞానముకూడా!**

అంతే!

ఇంతకుమించిన సత్యము మరేదీ లేదు. మనం ఇప్పుడు చెప్పుకొన్న విషయములన్నీ కూడా మునిపుంగవులు తమలో తాము సంభాషించుకొని ఆనందిస్తున్న విషయాలేనయ్యా ! మనపై అవ్యాజమైన ప్రేమతో వారు ఎలుగెత్తి మనందరికీ చాటుచున్నారు.

**ఇతి యాజ్ఞవల్క్యోపనిషత్**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 17 శాట్యాయనీయోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ శాట్యాయనీ బ్రహ్మవిద్యా అఖండాకార సుఖాకృతీః**
**యతి బృంద హృత్-ఆగారం రామచంద్రపదం భజే॥**

*యతులు - ఏ "అఖండ సుఖాకృతి" (Un ending form of pleasantness) అయినటువంటి తత్త్వమును - తమ హృదయమునందు సర్వదా ధారణ చేస్తూ ఉన్నారో, అట్టి **"శాట్యాయనీ బ్రహ్మ విద్యా మార్గదర్శకము"** అగు శ్రీరామచంద్ర పాద పద్మములను భజించుచున్నాము.*

ఓం

**1. మనఏవ మనుష్యాణాం**
**కారణం బంధ-మోక్షయోః।**
**బంధాయ విషయాసక్తమ్,**
**ముక్త్యైః నిర్విషయమ్ స్మృతమ్॥**
**సమాసక్తం సదా చిత్తం**
**జంతోః విషయగోచరే,**
**యత్ ఏవం బ్రహ్మణిస్యాత్**
**తత్ కో న ముచ్యేత బంధనాత్?**
**చిత్తమేవ హి సంసారః,**
**తత్ ప్రయత్నేన శోధయేత్।**
**యత్ చిత్తః తన్మయో భవతి**
**గుహ్యమ్ ఏతత్ సనాతనమ్।**
**న అవేదవిత్ మనుతే, తం**
**బృహంతం। న అబ్రహ్మవిత్**
**పరమం ప్రైతి ధామ,**
**విష్ణుక్రాంతం వాసుదేవం విజానన్,**

ప్రణవ స్వరూపుడగు పరమాత్మకు నమస్కరిస్తూ ....!

ఆత్మ నిత్యముక్తము. జీవుడో,... నిత్యబద్ధుడు. ఆత్మకు 'బంధము' అనునదే ఉండదు. ఈ జీవుడు స్వతఃగాను, సహజముగాను **ఆత్మయే స్వరూపముగా** కలిగి ఉన్నాడు. అటువంటప్పుడు ఈ జీవునికి బంధముయొక్క అనుభవమంతా ఎక్కడినుండి వచ్చిపడుతోంది? **బంధ-మోక్షములకు కారణము మనస్సే!**

'బంధము' అనగా విషయములపట్ల ఆసక్తి! ఆ విషయాసక్తి తొలగి మనస్సు విషయరహితమైతే (నిర్విషయమైతే) అదియే 'ముక్తి'! ఇంతకు వేరుగా బంధము లేదు. ముక్తి లేదు.

ఈ జీవులయొక్క చిత్తము ఎల్లప్పుడూ ఎదురుగా కళ్ళకు చెవులకు-తదితర ఇంద్రియములకు విషయములుగా అగుచున్న వాటి పట్ల సమాసక్తము అగుచున్నది.

ఆవిధముగా విషయములపై వ్రాలుచున్న ఈ చిత్తము - విషయములపై వ్రాలుచున్న విధంగానే - బ్రహ్మము వైపుగా ప్రసరించటము జరిగిందా, అప్పుడు ఎవ్వనికి మాత్రము ఎందుకు ముక్తి లభించదు? లభించి తీరుతుంది.

'సంసారము' అనగా ఈ చిత్తమే అయి ఉన్నది. మరింకేదో కాదు. అట్టి ఈ చిత్తమును ప్రయత్న పూర్వకంగా శోధించాలి.

సనాతనమై, అతి దీర్ఘకాలంగానూ..., (మొట్టమొదటినుండి కూడా) వాస్తవమై, రహస్యము అయినదేమిటంటే - ఈ చిత్తము దేనిదేనిపై వ్రాలుచున్నదో... ఈ జీవుడు ఆయా రూపములుగా ఆవిధంగా తానే అగుచున్నాడు.

ఈ జీవుడు తెలుసుకుంటూ ఉన్నదానిని తెలుసుకుంటేనే "విదితవేత్త" అగుచున్నాడు. వేదవేత్త కానివాడు (తెలుసుకొంటున్న దానిని తెలుసుకొనని వాడు) పరమాత్మను మననము చేయలేడు. పరమాత్మను మననము చేయనివాడు బ్రహ్మవేత్త కాలేడు. బ్రహ్మవేత్త కానివాడు పరమపదమును పొందలేడు.

**విప్రో విప్రత్వం గచ్ఛతే తత్త్వదర్శీ।**
**అథ హ యత్ పరంబ్రహ్మ సనాతనమ్,**
**యే శ్రోత్రియా అకామహతా**
**అధీయుః। శాంతో,**
**దాంత ఉపరతి తితిక్షుః**
**యో అనూచానో హి "అభిజజ్ఞౌ" సమానః।**

ఏది అయితే-అన్నీ తానే అయి 'విష్ణుక్రాంతము' (సర్వవ్యాపి, సర్వాతీతుడు) గాను, అన్నిటియందు వసించుచూ 'వాసుదేవము'గాను ప్రకాశించుచున్నదో అట్టి తత్త్వమును గ్రహించి, "తత్త్వదర్శి" అయి, ఈ జీవుడు 'విప్రత్వము' పొందుచున్నాడు. 'విప్రుడు' అగుచున్నాడు.

అట్టి శ్రోత్రియుడు-ఈ దృశ్య ప్రపంచము నుండి ఏమీ అవసరములేనట్టి అకామవంతుడై, జన్మ-కర్మలకు ముందే ఉన్నట్టి సనాతన పరబ్రహ్మమును అధ్యయనము చేయుచున్నాడు. శాంతుడు-దాంతుడు (ఇంద్రియములను జయించువాడు) - ఉపరతి (ఇంద్రియములను విషయములనుండి ఆవలకి తెచ్చి ఆత్మభావనయందు నియమించటము)ని ఆశ్రయించి, అనూచానుడై (జగత్తులను దాటివేసి) అభిజజ్ఞుడు (ఆత్మను ఎరిగినవాడు) అగుచున్నాడు. సమాహితుడగుచున్నాడు.

---

**2. త్యక్త ఈషణో హి అనృణస్తం విదిత్వా,**
**మౌనీ వసేత్ ఆశ్రమే,**
**యత్ర కుత్ర అథ ఆశ్రమం చరమం సం ప్రవిశ్య।**
**యథా ఉపపత్తిం పంచమాత్రాం దధానః।**
**త్రిదండమ్ ఉపవీతం చ,**
**వాసః కౌపీన వేష్టనమ్,**
**శిక్యం పవిత్రమ్ ఇత్యేతత్**
**భిభృయాత్ యావత్ ఆయుషమ్।**
**పంచ ఏతాస్తు యతేః మాత్రాః**
**తా మాత్రా బ్రహ్మణే శ్రుతాః।**
**న త్యజేత్ యావత్ ఉత్క్రాంతిః**
**అంతేఽపి నిఖనేత్ సహ।**
**విష్ణు లింగం ద్విధా ప్రోక్తం**
**వ్యక్తమ్, అవ్యక్తమ్ ఏవ చ।**
**తయోః ఏకమపి త్యక్త్వా**
**పతత్యేవ న సంశయః।**
**త్రిదండం, వైష్ణవం లింగం**
**విప్రాణాం ముక్తి సాధనమ్।**
**నిర్వాణం సర్వధర్మాణామ్।**
**ఇతి వేదానుశాసనమ్।**
**అథ ఖలు సోమ్య।**
**1. కుటీచకో 2. బహూదకో**
**3. హంసః 4. పరమహంసః**
**ఇతి ఏతే పరివ్రాజకాః చతుర్విధా భవంతి।**
**సర్వ ఏతే విష్ణులింగినః శిఖిన ఉపవీతినః**
**శుద్ధచిత్తా ఆత్మానమ్ ఆత్మనా బ్రహ్మ భావయంతః,**
**శుద్ధ చిద్రూప ఉపాసనరతాః జప యమవంతో,**
**నియమవంతః సుశీలినః పుణ్యశ్లోకా భవంతి।**
**తత్ ఏతత్ ఋచా అభ్యుక్తమ్।**

ఈషణము (కోరిక, ప్రేమ-ఈషణత్రయము-భార్యేషణ-పుత్రేషణ-ధనేషన)లను వదలి, ఋణములనుండి (ఋణచతుష్టయము **దేవ-ఋషి-పిత్రు-మానవ** ఋణముల నుండి) విముక్తుడై, మౌని అయి (సర్వప్రాపంచక విషయముల పట్ల మౌనము వహించినవాడై), ఇక ఆపై ఎక్కడో అక్కడ ఒక ఆశ్రమంలో ప్రవేశించి ఉంటున్నాడు. సన్న్యాసి అయి పంచ మాత్రలను (శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములను) పంచ సూత్రపు త్రాడు వలె ధరించువాడుగా అగుచున్నాడు.

1. త్రిదండము 2. ఉపవీతము 3. వస్త్రము కౌపీనము (గోచి), వేష్టనము (వేపనము), 4. శిక్యము 5. పవిత్రము (దర్భతో చేసినది)... వీటిని ఎల్లప్పుడూ జీవితాంతమూ ధరించుచున్నాడు.

పై '5' కూడా యతికి మాత్రమే బ్రాహ్మణములచే నియమముగా చెప్పబడుచున్నాయి. "ప్రాణోత్క్రమణవము వరకు (ప్రాణము పోవువరకు) యతి వీటిని వదలరాదు. యతి దేహమును విడిచినప్పుడు ఈ ఐదింటిని ఆ దేహముతోబాటే ఖననము చేయబడుగాక!".... అని బ్రాహ్మణములు (వేదములలోని విభాగములు) సూచిస్తున్నాయి.

విష్ణులింగము (విష్ణుతత్త్వము) రెండు విధములుగా చెప్పబడుచున్నది. 1. వ్యక్తము 2. అవ్యక్తము.

ఆ రెండిటిలో ఏ ఒక్కటి వదలినా కూడా ఆతడు పతితుడు అగుచున్నాడు. సంశయమే లేదు. (వ్యక్తముగా కనిపించేది బ్రహ్మమే! బ్రహ్మమే వ్యక్తమువలె ఉన్నది). [వాటిని వదలటం కాదు. ఏకత్వం చూడటం]

1. త్రిదండము 2. వైష్ణవ లింగము ఈ రెండూ కూడా విప్రులకు ముక్తి సాధనములు.

సర్వధర్మములకు 'నిర్వాణము' (అతీత్వము, కేవలసాక్షిత్వము)యే పరమ లక్ష్యము - అని వేదమాత యొక్క అనుశాసనము.

ఓ బిడ్డలారా! సౌమ్యా! ఇంకా వినండి. **పరివ్రాజకులు**గా అగు సన్యాసులు '4' విధములైనవారుగా చెప్పబడుచున్నారు. 1. కుటీచకుడు 2. బహూదకుడు 3. హంసుడు 4. పరమహంస.

ఈ నలుగురు కూడా విష్ణులింగము కలవారై శిఖ - యజ్ఞోపవీతములు కలిగి ఉండి....,

శుద్ధ చిత్తులై, ఆత్మతో ఆత్మను బ్రహ్మముగా భావించుచున్నవారై, 'శుద్ధ చిద్రూపము'ను ఉపాసనా వస్తువుగా కలిగి ఉన్నవారై (శుద్ధ చిద్రూపోపాసనయందు రతులై), జప-తపములయందు యమ-నియమవంతులై, ఉత్తమ ప్రవర్తన-శీలము కలవారై... 'పుణ్యకీర్తి' కలవారగుచున్నారు.

ఈవిధముగా ఋక్కులచే చెప్పబడుచున్నది.

**కుటీచకో బహూదకశ్చ అపి**
**హంసః పరమహంస ఇతి వృత్త్యా చ భిన్నాః।**
**సర్వ ఏతే విష్ణులింగం దధానా వృత్త్యా వ్యక్తమ్**
**బహిః - అంతశ్చ నిత్యమ్।**
**పంచయజ్ఞా వేదశిరః**
**ప్రవిష్టాః, క్రియావంతో**
**అమీ సంగతా బ్రహ్మవిద్యామ్।**
**త్యక్త్వా వృక్షం వృక్షమూలం**
**శ్రితాసః సన్న్యస్త పుష్పా, రసమేవ అశ్నువానాః**
**విష్ణుక్రీడా, విష్ణురతయో విముక్తా, విష్ణ్వాత్మకా**
**విష్ణుమేవా అపి యంతి।**
**త్రిసంధ్యం శక్తితః స్నానం తర్పణం మార్జనం తథా,**
**ఉపస్థానం పంచయజ్ఞాన్ కుర్యాత్ ఆమరణాంతికమ్।**
**దశభిః ప్రణవైః, సప్త వ్యాహృతిభిః,**
**చతుష్పదా, గాయత్రీ జపయజ్ఞశ్చ**
**త్రిసంధ్యం శిరసా సహ,**
**'యోగ యజ్ఞః' సత్ ఏకాగ్ర్య భక్త్యా**
**సేవా హరేః గురోః।**
**అహింసా తు తపోయజ్ఞో**
**వాక్ - మనః - కాయ కర్మభిః,**
**నానా-ఉపనిషత్ అభ్యాసః**
**'స్వాధ్యాయో యజ్ఞ' ఈరితః।**
**"ఓం" ఇతి ఆత్మానమ్**
**అవ్యగ్రో బ్రహ్మణ్యగ్నౌ జుహోతి తత్,**
**'జ్ఞానయజ్ఞః సవిజ్ఞేయః,**
**సర్వ యజ్ఞా ఉత్తమోత్తమః।**

కుటీచకులు (త్రిదండధారులు) బహూదకులు (త్రిదండధారి), హంసలు (ఏకదండధారి), పరమహంసలు (దండరహితుడు)... ఈ నలుగురు బాహ్యవృత్తిచే మాత్రమే భేదముగా కనిపిస్తారు. (అంతర్వృత్తి-ఆశయము-అంతిమసిద్ధి ఒక్కటే).

వీరందరూకూడా బాహ్యమున విష్ణులింగమును వృత్తిచే వ్యక్తీకరించువారై ఉంటారు. బాహ్య-అంతరములో నిత్యవస్తువగు ఆత్మనే ధారణగా ఎల్లప్పుడూ కలిగి ఉంటారు.

పంచయజ్ఞములు (వేదపఠనము, వైశ్వదేవము, అతిథిపూజ, పిత్రుతర్పణము, భూతబలి) లేక (దేవయజ్ఞము-పిత్రుయజ్ఞము-భూతయజ్ఞము- బ్రహ్మయజ్ఞము-మనుష్యయజ్ఞము)... నిర్వర్తించువారై ఉంటారు. వేదాంత (ఉపనిషత్) విద్యయందు ఉపప్రవిష్టులై ఉంటారు. బ్రహ్మ విద్యయందు ఎల్లప్పుడూ సంలగ్నులై, క్రియావంతులై ఉంటారు. సర్వమును త్యజించి, వృక్షమునో, వృక్షమూలమునో ఆశ్రయించి, పుష్పములను త్యజించి రసమును మాత్రమే అనుభవించువారై ఉంటున్నారు.

విష్ణుక్రీడగా ఈ దృశ్యమునంతా దర్శించుచూ, విష్ణువునందే రమించువారై, విష్ణువునే ఆశ్రయించువారై, విష్ణ్వాత్మకులై ఉండువారు సర్వ బంధములనుండి విముక్తులై విష్ణుత్వమునందు ప్రవేశించుచున్నారు. యథాశక్తి త్రిసంధ్యలయందు స్నానము, తర్పణము, మార్జనము (హృదయమును ప్రాపంచక విషయముల నుండి పరిశుభ్రపరచు విధులు), ఉపస్థానము (పరమాత్మయందు బుద్ధిని ప్రతిక్షేపించటము, పంచయజ్ఞములు) - ఇవన్నీ ఆమరణాంతము వదలరాదు.

(దశ) '10' ప్రణవములతోను, (ఓం - 10 సార్లు), (సప్త) '7' - వ్యాహృతులతోను (భూ-భువః-సువః-మహః-జనః-తపః-సత్యమ్), (చతుః) 4 - పాదములతోను 1. ఓం భూర్భువస్సువః 2. తత్ సత్ వితర్వరేణ్యము 3. భర్గో దేవస్య ధీమహి 4. ధియోయోనః ప్రచోదయాత్

గాయత్రీ జపయజ్ఞమును త్రిసంధ్యలు శిరస్సుతో (ఎరుకతో) చేయాలి!

ఎల్లప్పుడు యోగయజ్ఞము, సత్ ఏకాగ్ర్యము, హరిభక్తి, గురుసేవ చేస్తూనే ఉండాలి.

తపో యజ్ఞమును అహింసోపరమో ధర్మపూర్వకంగా -వాక్-మనో-కాయములచే చేయాలి. వాక్-మనో- కాయములచే ఇతరులకు బాధ కలిగించకపోవటమే అహింసా యజ్ఞము. అనేక ఉపనిషత్తుల అధ్యయనము, అభ్యాసము -స్వాధ్యాయయజ్ఞము నిర్వర్తిస్తూ ఉండాలి.

ఎటువంటి వ్యగ్రత (Emotional feelings) లేకుండా 'ఓం' అని పలుకుచు జీవాత్మను బ్రహ్మాగ్నియందు హోమము చేయటమే జ్ఞానయజ్ఞము. "పరబ్రహ్మమే నాకు జీవాత్మలుగా అగుపిస్తోంది"- అను భావనతో జగత్ దర్శనముచే జీవాత్మను బ్రహ్మమునందు హోమము చేయటము అగుచున్నది. అది యజ్ఞములలోకెల్లా ఉత్తమోత్తమమగు "ఆత్మయజ్ఞము".

---

**3. జ్ఞానదండా, జ్ఞాన శిఖా జ్ఞానయజ్ఞోపవీతినః**
**శిఖా జ్ఞానమయీ యస్య**
**ఉపవీతంచ "తన్మయమ్"।**
**బ్రాహ్మణ్యం సకలం తస్య**
**ఇతి వేదానుశాసనమ్! అథ ఖలు సౌమ్య।**
**ఏతే పరివ్రాజకా యథా ప్రాదుర్భవంతి,**
**తథా భవంతి।**
**కామ క్రోధ లోభ మోహ**
**దంభ దర్ప అసూయా మమత్వ**

ఆత్మజ్ఞానమే త్రిదండము. జ్ఞానమే శిఖ. జ్ఞానమే యజ్ఞోపవీతము.

ఎవ్వరైతే జ్ఞానశిఖ, జ్ఞాన ఉపవీతము ధరించి ఈ జగత్తును అఖండాత్మకు అభిన్నముగా భావనచేస్తూ..., ఆత్మయందు తన్మయులై 'సోऽహమ్' భావనతో ఈ సకలమును దర్శిస్తూ ఉంటారో, అతడే **బ్రాహ్మణుడు.** ఇది వేదానుశాసనము.

ఓ సౌమ్యా! ప్రియ శిష్యా! అప్పుడే పుట్టిన పిల్లవాడు ఏవిధముగా శబ్ద స్పర్శ రూప రస గంధములతోను సంబంధ-అనుబంధ-బాంధవ్య విషయముతోను ఏమాత్రము సంకల్పము లేకుండా ఉంటాడో,.... పరివ్రాజకుడు కూడా ఈ జగత్తులో ఆ తీరుగా ఉంటాడు.

కామ-క్రోధ-లోభ-మోహ-దంభ-దర్ప-అసూయ-మమత్వ-అహంకారములు మొదలైనవన్నీ దాటివేసినవాడై (లేక) జయించినవాడై, మాన-అవమానములను,

అహంకారాదీం తితీర్య,
మాన-అవమానౌ, నిందా-స్తుతీ చ
వర్జయిత్వా, వృక్ష ఇవ
తిష్ఠాసేత్, చిద్యమానో న బ్రూయాత్।
తథైవం విద్వాంస ఇహైవ అమృతా భవంతి ।
తత్ ఏతత్ ఋచా అభియుక్తమ్।
బంధుం పుత్రం అనుమోదయిత్వా
న వేక్షమానో, ద్వంద్వసహః ప్రశాంతః,
ప్రాచీమ్ ఉదీచీం వా నిర్వర్తయం చరేత్,
పాత్రీ దండీయుగమ్ అత్రావలోకీ,
శిఖీ ముండీ చ ఉపవీతీ
కుటుంబీ యాత్రామాత్రం ప్రతిగృహ్ణాన్
మనుష్యాత్, అయాచితం - యాచితం
వోత భైక్షం, మృద్దార్వ లాబూ, ఫలవర్ణ పాత్రమ్,
క్షీణం క్షౌమం తృణం కథాం చ
పర్ణమ్ ఆచ్ఛాదనంస్యాత్, అహతమ్ విముక్తః,
ఋతుసంధౌ ముండయేత్ ఊర్ధ్వమాత్రం
న అధో, న అక్షం జాతు, శిఖాం న అవాపయేత్।
చతురోమాసాం ధ్రువశీలతః స్యాత్, స యావత్ సుప్తో
అంతరాత్మా పురుషో విశ్వరూపః,
అన్యావథా అష్టో పునరుత్థితే అస్మిన్ స్వకర్మ లిప్సుః విహరేత్ వా,
వసేత దేవాద్యగారే, తరుమూలే, గుహాయాం వసేత్।
అసంగో, లక్షిత శీలవృత్తః,
నిరింధన జ్యోతిరివ ఉపశాంతో, న చ ఉద్విజేత్।
ఉద్విజేత్ యత్ర కుత్ర?
ఆత్మానం చేత్ విజానీయాత్ 'అయమస్మి!" ఇతి పూరుషః।
కిమ్ ఇచ్ఛత్, కస్య కామాయ, శరీరమ్ అనుసంజ్వరేత్?
తమేవ ధీరో విజ్ఞాయ, ప్రజ్ఞాం కుర్వీత బ్రాహ్మణః।
న అనుధ్యాయాత్ బహూం శబ్దాన్, వాచో విగ్లాపనం హి తత్।
బాల్యేనైవ హి తిష్ఠాసేః నిర్విద్య బ్రహ్మవేదనమ్।
బ్రహ్మవిద్యాం చ బాల్యం చ నిర్విద్య, మునిః ఆత్మవాన్।
యదా సర్వే ప్రముచ్యంతే కామాయ అస్య హృది శ్రితాః,
అథ మర్త్యో అమృతో భవతి, అత్ర బ్రహ్మ సమశ్నుతే॥
అథ ఖలు సోమ్యా।
ఏయం పారివ్రాజ్యం నైష్ఠికం ఆత్మధర్మం యో విజహాతి,
స వీరహా భవతి। స బ్రహ్మహా భవతి।
స భ్రూణహా భవతి।

నింద-స్తుతులను మొదలంట్లా వదలివేసి (అతీతుడై వాటికి అందనివాడై) ఉంటాడు. ఏవిధముగా ఒక వృక్షము ఖండింపబడుచున్నప్పటికీ "ఎందుకు? నీవెవ్వరు? నేనెంతటిదాననో తెలుసా? పళ్ళు-కాయలు నీకు ఇచ్చానే!".... అని కూడా ఏమీ అనదు కదా! కోపము - అవమానము - నింద పొందదు కదా! పరివ్రాజకుడు కూడా తనను బాధించువారిపట్ల కూడా అంతటి మౌనము, క్షమ కలిగి ఉంటాడు. అట్టివాడు ఆత్మానుభవమునందు విద్వాంసుడై, ఇక్కడే అమృతత్వము పొందుతున్నాడు. ఇది ఈ ఋక్కుచే చెప్పబడుచున్నది.

సన్న్యాసము స్వీకరించువాడు బంధువులను, పుత్రులను ఒప్పించి, సన్న్యసించి,... ఇక వెనుకకు చూడడు. సర్వ ద్వంద్వములను సహించువాడై, ప్రశాంత చిత్తముతో తూర్పుగాగాని, పడమర దిక్కుగా గాని బయల్వెడలుచున్నాడు. పాత్ర-త్రిదండమును ధరించి ఉంటాడు. పిలక మాత్రమే కలిగి ఉంటాడు. ఉపవీతుడై, దేహయాత్రకు (దేహము నిలవటానికి, ఎంత అవసరమో అంత మాత్రమే) భిక్షగా పొందుతూ ఉంటాడు. యాచితంగాగాని, అయాచితంగాగాని భిక్షాన్నమును స్వీకరిస్తాడు. మట్టి పాత్రతో గాని, సొరకాయ డిప్పతోగాని గ్రహిస్తున్నాడు.

చిరిగిపోయినదిగాని, పట్టుదిగాని గడ్డిబొంతను, ఆకులను పరచుకొని ఆచ్ఛాదనముగా ఆశీనుడై ఉంటాడు.

ఋతువు - ఋతువుకు ఒకసారి (రెండు నెలలకొకసారి) మాత్రమే ముండనము (జుట్టు తీసి వేయటం) చేయాలి. మెడకు పైభాగమున మాత్రమే ముండనము, చంకలు, శిఖను ముండనము చేయరాదు.

చాతుర్మాస్యవ్రత నియమమును పాటిస్తూ ఉండాలి. పూర్తిగా సుప్తుడై (ప్రాపంచక విషయములు పట్టించుకోనివాడై), అంతరాత్మ పురుషుడగు విశ్వరూపుని ధ్యానిస్తూ, ధ్యాన-సమాధుల నుండి పునరుత్థానము పొందినప్పుడు లేచి నిలబడి మరల దేహమును ఉపయోగించుచూ దేహావసరముల కొరకై విహరిస్తూ ఉంటున్నారు.

దేవాలయా లయములలోను, వృక్షమూలములందు గుహలలోను వసిస్తూ ఉంటారు.

పరివ్రాజకుడు - దేనితోనూ సంగము లేనివాడై, ఉత్తమశీలము కలిగి ఉండాలి. ఇంధనము లేని దీపమువలె సర్వ జగద్విశేషములపట్లా ఉపశాంతుడై (రహితుడై) ఉండాలి. దేనికీ ఉద్వేగము (ఆవేశము) పొందడు. అంతా స్వస్వరూపాత్మయే అయి ఉండగా ఎందుకు ఎక్కడ ఎవ్వరికొరకు ఉద్వేగము పొందు అవసరమున్నది? ఆత్మతో ఆత్మను ఎరిగి, "నేనే ఆత్మస్వరూపుడను"... అని సుస్పష్టపరచుకొని ఉంటాడు. తానే సర్వ స్వరూపమగు ఆత్మ స్వరూపుడై ఉండగా ఏదంటే ఇష్టపడాలి? ఏమి కోరుకోవాలి. శరీరమును బాహ్య వస్తువులాగా చూస్తాడు.

ఈ జీవుడు ఆత్మను బుద్ధితో ఎరిగి, బ్రహ్మమే జగత్-స్వరూపముగా గమనించి బ్రాహ్మణుడు అగుచున్నాడు.

అనేక శబ్దముల గురించి పెద్దగా ధ్యానించవలసిన పని కూడాలేదు. అదంతా వాచోవిగ్లాపనమే (మాటలలోపడి - ఆత్మను ఏమరచటమే) అవుతుంది.

బ్రహ్మమును తెలుసుకొని, పరివ్రాజకుడు ఈ జగత్తులో బాలునివలె (సంసార జీవులతో మెలగుచున్నప్పుడు ఏమీ తెలియనట్లే) ఉంటాడు. బ్రహ్మవిద్యను తెలిసి కూడా బాలునివలెను, విద్య తెలియనివానివలెను మౌనము వహించి ఉంటాడు.

ఎప్పుడైతే హృదయమునందు ప్రవేశించియున్న సర్వ కామములనుండి (Desires wishes Expectations, Influence of world related objectives etc.,) ఈ మానవుడు విముచ్యుడు అవుతాడో, ఆతడు ఇప్పుడే ఇక్కడే అమృత స్వరూపుడగుచున్నాడు. ఇక్కడే ఇప్పుడే బ్రహ్మమును పొందుచున్నాడు. అంతేగాని, బ్రహ్మము మరెప్పుడో-ఎక్కడో పొందవలసినది కాదు.

స మహా పాతకీ భవతి।
య ఇమాం వైష్ణవీం నిష్ఠాం పరిత్యజతి,
స 'స్తేనో' భవతి।
స గురుతల్పగో భవతి।
స మిత్రధృక్ భవతి।
స కృతఘ్నో భవతి।
స సర్వ-అస్మాత్ లోకాత్ ప్ర-చ్యుతో భవతి।

ఓ సౌమ్యా! ప్రియ శిష్యుడా! మరొక్క విషయం, ఎవడైతే సన్న్యాస ఆశ్రమమును స్వీకరించి పారివ్రాజకుడై కూడా, ఆ ఆశ్రమ ధర్మాలకు వ్యతిరేకిఅయి చరిస్తాడో..., అట్టివాడు ధర్మచ్యుతి పొంది, ఆత్మతత్త్వానుభవ సామర్ధ్యమును కోల్పోయిన వాడగుచున్నాడు, భ్రూణహాని (గర్భస్త శిశు హత్యాపాతకము)మొ॥ మహాపాతకము చేసినవానితో సమానము. జన్మను వృధా చేసుకున్నట్లే అగుచున్నది.

పరివ్రాజకుడై వైష్ణవీ నిష్ఠను పరిత్యజించినవాడు దొంగతో సమానమగుచున్నాడు.

గురుతల్ప - మిత్రద్రోహ - కృతఘ్నతా పాప దోషము పొందుచున్నాడు. ఈ లోకమును పోగొట్టుకొని చ్యుతుడై అల్పగతులు ఆశ్రయించువాడగుచున్నాడు.

---

4. <u>తత్ ఏతత్ ఋచా అభ్యుక్తమ్।</u>
స్తేనః సురాపో గురుతల్పగామీ
మిత్ర ధృగేతే నిష్కృతేః యాంతి శుద్ధిమ్।
వ్యక్తమ్ - అవ్యక్తం వా విధృతమ్
విష్ణులింగం త్యజత్ న శుద్ధ్యేత్ అఖిలైః।
ఆత్మ భాసా, త్యక్త్వా విష్ణోః లింగమ్, అంతర్బహిర్వా-యః
స్వా ఆశ్రమం సేవతే, న ఆశ్రమం వా,
ప్రత్యాపత్తిం భజతేవ అతిమూఢో,
న ఏషాం గతిః కల్పకోట్యాఽపి దృష్టా!
త్యక్త్వా సర్వ ఆశ్రమాన్, ధీరో వశేత్ "మోక్షాశ్రమే" చిరమ్
మోక్షాశ్రమాత్ పరిభ్రష్టో న గతిః తస్య విద్యతే।
ప్రారివ్రాజ్యం గృహీత్వా తు యః స్వధర్మే న తిష్ఠతి,
తమ్ "ఆరూఢచ్యుతం" విద్యాత్।
ఇతి వేదానుశాసనమ్। అథ ఖలు సౌమ్య।
ఇమమ్ సనాతనమ్ ఆత్మ ధర్మం "వైష్ణవీం నిష్ఠాం"
లబ్ధ్వా, యః తామ్ అదూషయత్ వర్తతే, స 'వశీ' భవతి।
స పుణ్యశ్లోకో భవతి। స లోకజ్ఞో భవతి।
స వేదాంతజ్ఞో భవతి। స బ్రహ్మజ్ఞో భవతి,
స సర్వజ్ఞో భవతి, స సర్వరాట్ భవతి।
స పరంబ్రహ్మ భగవంతమ్ ఆప్నోతి।
స పితౄన్, సంబంధినో, బాంధవాన్, సుహృదో,
మిత్రాణి చ భవాత్ ఉత్తారయతి।
తదేతత్ ఋచా అభ్యుక్తమ్।
శకుంతలానాం ప్రథమం బభూవ,
తథా కులానాం త్రిశతం సమగ్రమ్,
ఏతే భవంతి సుకృతస్య లోకే।
యేషాం కులే సన్యసతి ఇహ విద్వాన్,
త్రింశత్ పరాం, త్రింశత్ అపరాన్,
త్రింశత్ చ పరతః పరాన్, ఉత్తారయ ధర్మిష్ఠః

ఋక్కులు ఇంకా కూడా ఈవిధముగా పలుకుచున్నాయి.

- దొంగతనము, సురాపానము, గురుతల్పము, మిత్రద్రోహము ఈ దోషముల నుండి 'నిష్కృతి' విధులు ఉన్నాయి. అట్టి నిష్కృతి క్రియలను ఆశ్రయించుటచే జీవుడు శుద్ధి పొందగలడు.

కానీ పరివ్రాజకుడై వ్యక్త - అవ్యక్త రూపమగు విష్ణు లింగమును త్యజిస్తే శుద్ధిలేదు. నిష్కృతిలేదు.

బాహ్య - అంతరములందు ప్రదర్శితమై ఉన్నట్టి ఆత్మ తేజో రూపమగు విష్ణు లింగమును వదలి తదితరములైన ఆశ్రమ ధర్మములను సేవించినా, సేవించకున్నా కూడా ఆతడు ప్రత్యాపత్తి (Down fall) పొందుచున్నాడు. అతి మూఢుడితో సమానము. కోటి కల్పములు గడచినా 'ఉత్తమగతి' లభించదు.

ఓ బిడ్డలారా! మిగతా ఆశ్రమములందు కూడా 'మోక్షాశ్రమము' కొరకై చిరకాలము ధీరుడై (తెలివిగలవాడు) వసించునుగాక! ఆశ్రమముకంటే (మోక్ష) ఆశయము ముఖ్యము.

మోక్షాశ్రమము నుండి పరిభ్రష్టుడైనవానికి గతి దుర్గతియే!

పరివ్రాజ్యమును (సన్న్యాసాశ్రమము) స్వీకరించి ఎవ్వడు స్వధర్మము (అట్టి ఆశ్రమ ధర్మము) నందు నిలచి ఉండడో ఆతడు **ఆరూఢచ్యుతుడు** (చెట్టు ఎక్కుతూ క్రిందకు పడినవాడు) అగుచున్నాడు. ఇది వేదముల యొక్క అనుశాసనము.

నాయనా! సనాతన (జన్మల కంటే మునుముందే ఉన్న) "ఆత్మ ధర్మము" అయినట్టి వైష్ణవీనిష్ఠ'ను పొంది కూడా, అద్దానిని దూషించటముచే తిరిగి అవశుడు (No Control on Senses) అగుచున్నాడు. ఎవడు అట్టి దూషణ చేయడో - ఆతడే 'వశీ'. (సంసారము తన వశము చేసుకున్నవాడు) అగుచున్నాడు.

వైష్ణవీ నిష్ఠ స్వీకరించువాడు పుణ్య శ్లోకములు పఠించినవాడగుచున్నాడు. లోకతత్త్వము ఎరుగినవాడవగలడు. తెలుసుకొనుచున్నట్టి వానిని - (వేదాంతుని) ఎరుగుచున్నాడు, వేదాంతజ్ఞుడు అగుచున్నాడు. **బ్రహ్మమును ఎరుగగలడు.** సర్వజ్ఞుడు అగు చున్నాడు. సర్వరాట్ (రాజాధిరాజు) అగుచున్నాడు. పరబ్రహ్మ భగవంతత్వమును సముపార్జించుకొనుచున్నాడు. బ్రహ్మమే తానగుచున్నడు.

సన్న్యాసాశ్రమ ధర్మ నిష్ఠను భక్తి - శ్రద్ధలతో ఆచరించువాడు తన పితృదేవతలను, సంబంధులను, ఇతర బంధువులను, సుహృత్తులను, మిత్రులను సంసార సముద్రమునుండి దాటించగలడు. ఈవిధముగా ఋక్కుల గానం!

ఏ కులములో బ్రహ్మవేత్త ఉంటాడో, ఆతడు తన కులములోని '300' మందిని ఉద్ధరించుచున్నాడు.

ఆ వంశములోని వారంతా సుకృతములు (పుణ్యకర్మలు) చేసిన వారి లోకములు చేరగలరు. ఆ కులములోని వారు ఇక్కడే జ్ఞాన విద్వాంసులై తరించగలరు.

ధర్మిష్ఠుడైన సన్న్యాసి (పరివ్రాట్) వెనుక 300 మందికి, ముందు 300 మందిని, 300 మంది ముందుకన్నా ముందువారిని తరింపజేయుచున్నాడు - ఇతి శ్రుతి వాక్యము.

'పరివ్రాట్' ఇతి వై శ్రుతిః।
సన్న్యస్తమ్ ఇతి యో బ్రూయాత్
కంఠస్థ ప్రాణవాన్ అపి, తారితాః పితరః తేన।
ఇతి వేదానుశాసనమ్।
అథ ఖలు సౌమ్య।
ఇమం సనాతనమ్ ఆత్మధర్మమ్ వైష్ణవీం నిష్ఠాం
న అసమాప్య ప్రబ్రూయాత్।
న అనూచానాయన్, న అనాత్మవిదే
న అవీతరాగాయ, న అవిశుద్ధాయ,
న అనుపన్నాయ, న అప్రయత మానసాయేతి హస్మాహుః।

ప్రాణములు కంఠమున చేరిపోవడానికి సిద్ధముగా ఉన్నప్పుడైనా సరే **"సన్న్యస్త మయా। నేను సన్న్యాసము స్వీకరించుచున్నాను"** .... అని ఉచ్చరిస్తూ ప్రకటిస్తే కూడా... ఆతని పితృదేవతలు తరిస్తారు. ఇది వేదానుశాసనము!

ప్రియ సౌమ్యా! బిడ్డా! ఈ సనాతన - ఆత్మధర్మరూపమగు 'వైష్ణవీ నిష్ఠ'ను సమాప్యము (పైన చెప్పిన ఫలశ్రుతి)తో కూడియే బోధించాలి. సమాప్యము (ఫలశృతి) చేయకుండా చెప్పరాదు!

అసమాప్యనికి,.... అనగా శాస్త్ర విధి - ఆచారములు గౌరవించనివానికి (సదాచారము లేని వానికి), ఆత్మ జ్ఞానముకొరకై ఉత్సాహము చూపని వానికి, రాగద్వేషములను త్యజించుటకు సంసిద్ధుడు కానివానికి, అపరిశుద్ధమైన (ద్రోహ చింతన ఇత్యాది భావములు తొలగని) బుద్ధి కలవానికి, ఆత్మ జ్ఞానమును అర్థించని వానికి (సంసిద్ధుడు కానివానికి) ప్రయత్నమానసుడు - పరిశుద్ధ మానసుడు కానివానికి **బోధించరాదు.**

---

5. తత్ ఏతత్ ఋచా అభ్యుక్తమ్।
విద్యా హ వై బ్రాహ్మణమ్ ఆజగామ
– గోపాయ మాం శేవధిష్టే అహమస్మి।
– అసూయకాయ, అనృజవే,
శఠాయ మా మా బ్రూయాత్
వీర్యవతీ తథాస్యామ్।
యమ్ ఏవ విద్యాశ్రుతమ్, అప్రమత్తం,
మేధావినం, బ్రహ్మచర్య – ఉపపన్నమ్,
అస్మా ఇమామ్ ఉపపన్నాయ,
సమ్యక్ పరీక్ష్య ....,
దద్యాత్ వైష్ణవీమ్, ఆత్మనిష్ఠామ్।
అధ్యాపితా యే గురుం
వాద్రియంతే విప్రా వాచా మనసా కర్మణా వా,
యథైవ తేన న గురుః భోజనీయః, తథైవ చ
అన్నం న భునక్తి శ్రుతమ్ తత్।
గురురేవ పరోధర్మో।
గురురేవ పరాగతిః।
ఏకాక్షరప్రదాతారమ్
యో గురుం నా అభినందతి,
తస్య శ్రుతం తపో జ్ఞానమ్
స్రవతి ఆమ ఘట – అంబువత్।
యస్య దేవే పరా భక్తిః,
యథా దేవే తథా గురౌ,
స బ్రహ్మవిత్ పరం ప్రేయాత్॥
ఇతి వేదానుశాసనమ్॥
ఇతి శాట్యాయనీయోపనిషత్
ఓం శాంతిః శాంతిః శాంతిః

ఋక్కులు ఇంకా ఈవిధంగా గానము చేస్తున్నాయి.

బ్రహ్మ విద్యాదేవి బ్రహ్మమును ఉపాసించు వానివద్దకు వచ్చి ఇట్లా పలుకుచున్నది. బిడ్డా! బ్రహ్మ విద్యా స్వరూపునగు నన్ను ఉపాసించు. నేను నీకు వశమౌతాను.

అయితే, అసూయ కలవానికి, ఋజుత్వము (సత్యమును స్వీకరించుటకు సంసిద్ధత- వంకర - టింకరకాని ఋజు బుద్ధి) .... లేనివానికి, మొండితనము - మూర్ఖత్వము వహించి ఉన్నవానికి ఈ అధ్యాత్మ శాస్త్ర విద్య (బ్రహ్మ విద్య) బోధించవద్దు సుమా!

నేను నీయందు వీర్యవతినై ప్రకాశించగలను. నీవు పలికే వాక్యములలో ప్రవేశిస్తాను.

ఎవ్వడైతే విద్యాశ్రుతుడో (విద్యను అర్థించి శ్రద్ధగా వినువాడో), అప్రమత్తుడో (నిద్ర-బద్ధకము లేనివాడో), తెలివికలవాడో (మేధావియో), బ్రహ్మమునందు చరించు వ్రతము (దీక్ష) (లేక బ్రహ్మచర్య దీక్ష) స్వీకరిస్తాడో - ఆతడు సమీపించినప్పుడు, తెలివి-నిర్మల హృదయములను పరీక్షించి, అర్హుడైతేనే ఆత్మనిష్ఠయగు బ్రహ్మ విద్యను బోధించాలి. **తప్పక బోధించాలి.**

ఇక బ్రహ్మ విద్యను నేర్చుకొను ఆశయము గల విద్యార్థి మనసా-వాచా-కర్మణా గురువును సేవించాలి. ఆశ్రయించాలి. అర్థించాలి!

గురువుకు భోజనము పెట్టపోతే (గురువుకు దక్షిణ ఇచ్చి, సేవించి, సంతోషింప జేయకపోతే) ... అట్టివాడు నేర్చిన విద్య అనుభవమునకు రాదు. అనుభవముగా సిద్ధింపజేసుకోలేడు. విన్న అర్థము అనుభూతిగా సిద్ధించదు సుమా!

గురువే పరమధర్మము! గురువే పరాగతి! పరమునకు మార్గము!

ఏకము - అక్షరము అగు పరబ్రహ్మతత్త్వమును బోధించిన సద్గురువును ఎవ్వడైతే పరతత్త్వ స్వరూపముగా ఉపాసించడో, ఆయనకు కృతజ్ఞతలు పలుకడో, అభినందించడో - అట్టివాడు నేర్చుకొన్న విద్య, విన్నది, తపస్సు, జ్ఞానము - ఇవన్నీ కూడా పచ్చి కుండలోని 'నీరు' వలె నిష్ప్రయోజనమౌతాయి.

పరమాత్మయందు ఎంతటి భక్తి ఉంటుందో, అంతటి భక్తి - ప్రపత్తులు గురువుపై కలిగి ఉన్నప్పుడే బ్రహ్మవిద్యపై గురి కుదురుతుంది. 'గురి' యొక్క ప్రభావముచేత ఆతడు బ్రహ్మవేత్త అయి, పరబ్రహ్మ స్వరూపము - తానే అగుచున్నాడు.

**ఇది వేదానుశాసనము!**

**ఇతి శాట్యాయనీయోపనిషత్**

**ఓం శాంతిః! శాంతిః! శాంతిః!**


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 17 శాట్యాయనీయోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



**శ్లో॥ శాట్యాయనీ బ్రహ్మవిద్యా - అఖండాకార సుఖాకృతీ।**
**యతి బృంద హృదాగారం - రామచంద్రపదం భజే॥**

విద్యార్థులు కొందరు తపో–ధ్యాన–శాస్త్ర విద్యా పారాయణులై శాట్యాయనీ మునీంద్రులవారిని... సమీపించి **"తండ్రీ ! సద్గురూ ! బ్రహ్మజ్ఞా ! బ్రహ్మజ్ఞానము కొరకై మీ పాదములు ఆశ్రయిస్తున్నాము. దయచేసి అనుగ్రహించండి"...** అని అర్థించుచున్నారు.

**శాట్యాయనీ మునీశ్వరులు :** బిడ్డా ! సౌమ్యా ! సుస్వాగతము ! నీ గురుభక్తి గురించి విని ఆనందము ప్రకటిస్తున్నాను. నీకు సందేహములేమైనా ఉంటే... అడుగు.

**సౌమ్యుడు (శిష్యుడు) :** మహనీయా ! ఈ జీవుడు స్వతఃగా ఆత్మస్వరూపుడే కదా !

**శాట్యాయనీ మునీశ్వరులు :** అందులో సందేహించవలసినది ఏమున్నదయ్యా ! వేదాంగములైనటువంటి ఉపనిషత్తులు, వేదమంత్ర – అంతరార్థములు, మహనీయుల ఆత్మీయ వాక్యములు ... ఇవన్నీ కూడా **"జీవో బ్రహ్మేతి నాఽ పరః"** ... **ఈ జీవుడు స్వతఃసిద్ధముగా బ్రహ్మమే** – అని ఎలుగెత్తి గానము చేస్తున్నాయి కదా! గురు–శాస్త్ర–స్వవిచారణలు ఈ సత్యమును నిర్ద్వంద్వంగా ప్రకటిస్తూనే వస్తున్నాయయ్యా!

**సౌమ్యుడు :** ఆత్మకు బంధముంటుందా ?

**శాట్యాయనీమునీశ్వరులు :** సూర్యకాంతిలో కనిపించే ఒకానొక వస్తువుయొక్క ఆకార – రంగు – రుచి,... ఇత్యాది ధర్మములు (Features) సూర్యకాంతికి అంటుతాయా? సూర్యబింబానికి అంటుతాయా? లేదు కదా! అట్లాగే ఆత్మకు బంధమే ఉండజాలదు. ఆత్మసర్వదా అఖండము, అప్రమేయము, నిత్యము, సత్యము, నిర్గుణము. కనుక **ఆత్మ నిత్యముక్తము.**

**సౌమ్యుడు :** అవును కదా ! మరి, స్వతఃగా ఆత్మ స్వరూపుడగు ఈ జీవునకు **"నేను బద్ధుడను! పరిమితుడను! అజ్ఞానిని! దోషములు కలవాడను. దేహ పంజరములో చిక్కుకున్నవాడను!"...** అనునదంతా ఎందువలన ఎవ్వరివలన, ఎప్పటి నుండి వచ్చి పడుతోంది?

**శాట్యాయనీ మునీశ్వరులు :** ఓహ్! అదా ? విను, చెప్తుతాను.

**మనఏవ మనుష్యాణాం కారణం బంధ - మోక్షయో !** ఆత్మకు ఏనాడు 'బంధము' అనునదే లేనప్పటికీ, కల్పితమాత్రమగు మనస్సే ఈ జీవుని పట్ల బంధ – మోక్షములకు కారణము అగుచున్నది. కనుక బంధ, మోక్షములు రెండూ – ఆత్మ సమక్షములో కల్పిత విశేషములే!

**సౌమ్యుడు :** స్వామీ! 'బంధము' అనగా ఏమి ? మోక్షము (లేక) ముక్తి అనగా ఏమి ?

**శాట్యాయనీ మునీశ్వరులు :** ఏమీ లేదయ్యా ! ఈ జీవుడు ఆశ్రయించిన దేహములో ఇంద్రియములు (కళ్ళు – చెవులు – నోరు – ముక్కు – చర్మము.. ఇవన్నీ) ఉన్నాయి కదా ! వీటన్నిటి చేత దృశ్యము – శబ్దము – రుచి – వాసన – స్పర్శ... ఇవన్నీ పొందబడుచున్నాయి. ఇవి అనేక విషయములపై వ్రాలుచున్నాయి. మనస్సు అట్టి విషయ పరంపరలతో **"ఇవి నాకు చెందినవి ! నేను వీటికి సంబంధించిన**

**దానను"...** అను రూపముగల ఒకానొక అవినాభావ సంబంధము, ఎప్పటినుంచో పెంపొందించుకుని ఉంటోంది. ఈ తతంగమంతా అనేక ఉపాధి పరంపరలుగా కొనసాగుతూ వస్తోంది. అందుచేత విషయముల పట్ల (తో) ఏర్పడుచున్న ఆసక్తియే ... **'బంధము'!** నిర్విషయమే ( విషయములు మనస్సు పట్ల రహితమగుటయే)... **'మోక్షము'!**

**విషయములతో సమాసక్తత:** ఈ జీవుని యొక్క చిత్తము జీవితమంతా కూడా ఇంద్రియములకు ఎదురుగా గోచరమగు దృశ్య విషయములపై వ్రాలుచూ, వాటితో సమాసక్తము (Deeply immersed) అగుచున్నది. మమేకము - అవినాభావ సంబంధము పొందుచున్నది. "ప్రేమ - ఇష్టము - కోరిక - దుఃఖము - ఆవేశము - అనుకరణము"... ఇవన్నీ పొందుతోంది. అప్పుడు ఆ చిత్తము జీవునకు బంధమంతా తెచ్చిపెడుతోంది.

**బ్రహ్మముతో సమాసక్తత** : ఇదే చిత్తము పరబ్రహ్మముతో మమేకము-అవినాభావ సంబంధము కలిగి ఉండగలదు కూడా! ఆ విధంగా ఆత్మవైపు చిత్తము మరిలినప్పుడు-ఎవ్వరికి మాత్రం సర్వబంధముల నుండి విముక్తి ఎందుకు కలుగదు? తప్పక (బంధవిముక్తి) కలుగుతుంది !

**చిత్తమేవ హి సంసారః !** చిత్తము = ఇష్టముయొక్క సంప్రదర్శనము. ఈ చిత్తమేనయ్యా, సంసారము! అట్టి చిత్తమును **"ఇది దేనిదేనిపై వ్రాలి అక్కడ చిక్కుకున్నదై ఉంటోంది? ఎట్లా చిక్కుకుంటోంది? వెనుకకు మరలి "అంతా ఆత్మస్వరూపమే" అను ధ్యాసను ఎట్లా పెంపొందించుకోగలుగుతుంది?"...** ఈ ఈ మార్గములలో నిత్యము చిత్తమును శోధిస్తూ ఉండాలి.

**యత్ చిత్తమ్ - తత్ మయో భవతి - గుహ్యమ్ ఏతత్ సనాతనమ్।**

ఈ చిత్తమునకు సనాతనమైన (జన్మల ప్రహసనము కావటానికి కూడా మునుముందుగా) ఒక లక్షణము రహస్యముగా కలిగి ఉన్నది. చిత్తము దేనిపై వ్రాలి బహుకాలము ఉంటుందో,.. ఈ జీవుడు ఆ చిత్తవిషయ రూపమును సంతరించుకోవటము జరుగుతోంది. ఇదే చిత్తము సనాతనమగు పరబ్రహ్మమును ధ్యానిస్తూ ఉండగా, ఇక ఈ జీవుడు కూడా పరబ్రహ్మస్వరూపుడుగా రూపప్రాప్తి పొందుచున్నాడు. చిత్తము బ్రహ్మమువైపు అడుగులు వేయాలీ-అంటే.., ముందుగా ఈ జీవుడు **బ్రహ్మము ఎట్టిదో, బ్రహ్మతత్త్వమేమిటో బుద్ధితో గ్రహించాలి.**

ఈ బుద్ధి ఇంద్రియములతో విషయములను తెలుసుకుంటోంది కదా! తెలియబడేదంతా ఏదైతే తెలుసుకుంటోందా,... ఆ తెలుసుకొనుచున్న దానిని (జీవాత్మను) (Perceiving the perceiver) ... తెలుసుకోవటమే **విదితవేద్యము.** అట్టి దర్శనము చేయువాడే **వేదవేద్యుడు.**

"తెలుసుకొనబడుచున్నదానినంతటినీ తెలుసుకొనుచున్నవాడు" ... ఈతడే **వేదవేద్యుడు** (knowing the one who is knowing) అని అనుకున్నాము కదా ! ఇక వేదవేత్త అయ్యేంతవరకు ఈ జీవుడు దృశ్యమననమే కొనసాగించగలడుగాని, ఆ **"బృహత్ వస్తువు సర్వతత్త్వస్వరూపము"...** అగు **పరమాత్మను** ధ్యానించలేడు. పరమాత్మ ధ్యానము లేకపోతే **బ్రహ్మవేత్త** కాలేడు. బ్రహ్మవేత్త కానివాడు **పరమ పదమును** పొందజాలడు. సంసారలంపటములోనే తిరుగాడుచూ ఉంటాడు.

ఏదైతే...,

**విష్ణుక్రాంతమ్ :** దృశ్య - ద్రష్ట - మనో - బుద్ధి - చిత్త - అహంకారములతో సహా ఏదైతే అన్ని రూపములుగా అగుచున్నదో..., అది 'విష్ణుక్రాంతము' .... అనబడుచున్నది. (క్రాంతము = వ్యాప్తి పొందినట్టిది, ఆక్రమించుకొన్నట్టిది, తేజోప్రదర్శనము)

**వాసుదేవమ్ విజానన్ విప్రో :** సర్వ ద్రష్టలందరిలో - వారివారి దర్శన - దృశ్యములతో సహా ఏది వసించి ఉన్నదో...., అవన్నీ తానే అయిఉన్నదో... అదియే **వాసుదేవము!** అట్టి బ్రహ్మమును ఎరిగిన తత్త్వ దర్శియే **విప్రుడు!** అద్దానిని ఎరుగుటయే **విప్రత్వము.**

**తత్త్వదర్శి :** 'త్వమ్' (నీవు) యొక్క వాస్తవరూపమును 'తత్'గా (ఆత్మగా) దర్శించువాడు.

**శ్రోత్రియుడు :** శ్రుతులు (వేదవేదాంతములు) ప్రతిపాదిస్తున్న సత్యమును ఆశయముగా కలవాడు. దృశ్యము నుండి ఏకించిత్ కావాలని కోరనివాడు (అకామవంతుడు). సనాతనమగు (జన్మ కర్మలకు మునుముందే ఉన్నట్టి) పరబ్రహ్మమును మాత్రమే ఉపాసనవస్తువుగా కలవాడు. శాంతుడు దాంతుడు (ఇంద్రియనిగ్రహముతో ఇంద్రియములను తన వశము ఉంచుకున్నవాడు). ఉపరతుడు (ధ్యాసలన్నీ విషయములనుండి వెనుకకు మరల్చి సర్వము ఆత్మ దృష్టితో చూచువాడు). ఇట్టి విశేషములను అభ్యసిస్తూ వస్తున్న యోగి-క్రమముగా ఈ మార్గములో ఈతడు "అభిజజ్ఞుడు" (తెలుసుకొనవలసిన బ్రహ్మమును బాగుగా ఎరిగినవాడు)గా అగుచున్నాడు. అట్టి పరమాత్మ స్థానమును ఈ బుద్ధి చేరుటకై...,

**ఈషణోత్యక్త :** కోరిక - మమకారముల రూపమగు ఈషణములను (ఈషణత్రయము - భార్యేషణ ; పుత్రేషణ ; ధనేషణ) ... ఇవి పరమాత్మకు చెందినవి - అనుభావన సహాయంతో త్యజించాలి. భార్య - భర్త - పిల్లలు - స్నేహితులు - ఎరిగినవారు... వీరందరూ ఆత్మ స్వరూపముగా ఆత్మకు అనన్యముగా దర్శించబడుటచేత ఈషణములు ప్రక్కకు తొలుగగలవు. **"ఆత్మైవహి బంధురూపేణ"** - అను భావనచే **'అన్యత్వము'** జయించబడుతోంది.

**అనృణస్తమ్ :** ఈ భౌతికదేహము తనకుతానుగా జీవించటంలేదు. ప్రకృతి ప్రసాదము–తదితరుల ప్రసాదముచేతను, దివ్యప్రజ్ఞల సహకారముచేతను జీవిస్తోంది. అందుచేత, ఋణ విముక్తుడు కావాలి. (ఋణ చతుష్టయము – దేవ ఋణము, ఋషి ఋణము, పితృ ఋణము, మానవ ఋణము). మనము పొందుచున్న దానిని గుర్తిస్తూ కృతజ్ఞులమై ఉండటమే అనృణస్తము. కర్మలు ధర్మసమ్మతంగా, కృతజ్ఞతాపూర్వకంగా, సమర్పితంగా నిర్వర్తించటము అందుకు విధానము.

**మౌని :** సర్వప్రాపంచక సంగతి – సందర్భ – సంబంధ – అనుబంధ – సంఘటనల పట్ల... అతీతుడై (అవన్నీ కథలోని కల్పిత విషయాలవలె) మౌనము వహించినవాడై (స్పర్ధ పొందనివాడై) ఉండాలి.

ఇట్టి ప్రయత్నముల సానుకూల్యత కొరకై ఏదైనా – ఎక్కడైనా ఒక ఆశ్రమములో యథా–ఉపపత్తిగా (సందర్భానుకూలంగా) ప్రవేశించి శాస్త్ర విధిగా సాధనకు ఉపక్రమించాలి. అందుకు పంచసూత్రధారణ చేయును గాక !

## సన్న్యాసాశ్రమము

త్యాగము చేతనే కైవల్యము. అందుకు శాస్త్రములు అందిస్తున్న మార్గమే సన్న్యాసాశ్రమము. ఆ విశేషాలు కొన్ని ఇక్కడ ఉదహరించుకుందాము.

**పంచసూత్రధారణ :** 1) త్రిదండము (త్రిగుణములను చేతిలో దండముగా (కర్రగా) ధరించటము 2) ఉపవీతము (బ్రహ్మముతో సామిప్యమునకు సంజ్ఞయగు త్రిసూత్రపు దంధ్యము) 3) కౌపీనము – వేష్ఠము (వేపనము) – కాషాయ వస్త్రము – విరాగమునకు సంజ్ఞ. 4) శిక్యము (శిరోమండనము) 5) పవిత్రము (దర్భత్రాడు)

ఇవన్నీ సన్యాసి జీవితాంతము ధరించుచున్నాడు. ఈ ఐదు కూడా యతికి మాత్రమే – బ్రాహ్మణములచే నియమముగా చెప్పబడుచున్నాయి. ప్రాణములు ఉన్నంతవరకు అవి యతి వదలరాదు. యతి దేహమును త్యజించిన తరువాత కూడా ఈ ఐదింటిని యతి యొక్క మృతదేహముతో బాటే ఖననము చేయాలి – అని బ్రాహ్మణములు సూచిస్తున్నాయి.

విష్ణు తత్త్వము (విష్ణు లింగము) రెండు విధములు 1) వ్యక్తమ్ 2) అవ్యక్తమ్

విష్ణు తత్త్వము యొక్క వ్యక్త (ఎదురుగా కనబడేవి) – అవ్యక్తములు (అభౌతికతత్త్వములు) రెండూ పరమాత్మ యొక్క సంప్రదర్శనములే ! రెండూ ఉపాసనీయములే ! వ్యక్త – అవ్యక్త విష్ణుతత్త్వ విన్యాసములు రెండింటిలో (ఉపాసన దృష్ట్యా) ఏదీ వదలకూడదు. ఆ రెండు తత్త్వములలో ఒకటి ఉపాసిస్తూ రెండవది త్యజిస్తే అప్పుడు ఆ జీవుడు పతనమువైపునే జరుగుచున్నవాడౌతాడు. మోక్షమువైపుగా కాదు సుమా ! కనుక వ్యక్తము – అవ్యక్తము ... ఈ రెండూ కూడా విష్ణులింగ స్వరూపముగా ఉపాసించాలి. జగదోపాసన, సహజీవోపాసన – దైవోపాసనారూపమగు ఆత్మోపాసనయే!

**విష్ణు లింగమ్:** ఏది వ్యక్త–అవ్యక్తములు (బంగారు+ఉంగరము తానే అయి) వ్యక్తావ్యక్త ఉభయములకు వేరై చెన్నొందుచున్నదో... అయ్యది ! 1) త్రిదండము 2) వైష్ణవ లింగము... ( 1. త్రిగుణములు చేతిలో దండమువలె ధారణ చేయుటము 2. జగత్తుకు ఉత్పత్తి – స్థితి – లయ స్థానమై ఉండటము)... ఈ రెండు కూడా విప్రులకు ముక్తిసాధనము.

సర్వధర్మములకు కేవలసాక్షిత్వమే (నిర్వాణమే) ముక్తి ! ఇది వేదములు సిద్ధాంతీకరించి గానము చేయుచున్న పరమసత్యము.

**ఇతి వేదానుశాసనమ్ !**

**పరివ్రాజకులు (సన్యాసులు) '4' రకములుగా చెప్పబడుచున్నారు.**

**1. కుటీచకుడు :** ఒక కుటీని (శరీరమును) ఆశ్రయించినవాడై ఉన్నవాడు. ఆత్యంతికార్థంగా..., ఈ జగత్తును తన శరీరముగా చూచువాడు. వసుధైక కుటుంబముగా భావించుచున్నవాడు. 'తన కుటుంబమే'గా ఈ సర్వమును దర్శించువాడు. ఈతని గుర్తు త్రిదండ ధారణ! **"అంతా నాకు చెందినదే! అందరు నావారే!"** ..... అనుదృష్టి కలవాడు.

**2. బహూదకుడు :** సర్వ సహజీవులను (తనతోసహా) ఒకే సముద్రజలము యొక్క వివిధ తరంగముల ప్రదర్శనముగా దర్శించు సిద్ధిని పొందినవాడు. "అహమ్ ఏకతరంగమస్మి – బ్రహ్మానంద సాగరే!".... అను భావనతో ఉపాసించువాడు.

**3. హంస :** "సోఽహమ్" భావన పునికి పుచ్చుకొన్నవాడు. **"నేను – నీవు – ఆతడు – ఈతడు .... ఈ కనబడేవారంతా మమాత్మ అగు ఆ పరమాత్మ స్వరూపమే"** ..... అను భావన పునికి పుచ్చుకొన్నవాడు. "ఇదంతా ఏద్రై ఉన్నదో – అదియే నేను" అను అభ్యాసి.

**4. పరమహంస :** సర్వ జీవ జాలము, సర్వ జగత్తులు తానై, సర్వసాక్షిగా వేరై ఉండువాడు. ఈ సర్వము తనకు అభిన్నముగా – ఆత్మైవమేవ్వ – అను అనుభూతిని అనునిత్యపరచుకొనినవాడు. (సోఽహమ్ పరమమ్ = సర్వమునకు పరమైయున్నదే 'నేను' , కేవలుడను. సర్వమును)

ఈ '4'రు పరివ్రాజకులు కూడా - "విష్ణు లింగధారణ" చేయువారై ఉన్నట్లే!

- శిఖ - యజ్ఞోపవీతములు - సంజ్ఞగా కలిగి, శుద్ధచిత్తా - (విషయములు ఎందులో ప్రతిబింబిస్తున్నాయో అట్టి కేవల చిత్త) సమన్వితులై, శుద్ధ చిత్త మానసులై,....

**- శుద్ధ చిత్తా ఆత్మానమ్ ఆత్మనా బ్రహ్మభావయంతః** - అట్టి శుద్ధ చిత్తమును ఉపకరణగా చేసుకొని ఆత్మచేత ఆత్మను భావించటమును సిద్ధించుకున్నవారు.

**- "ఎల్లప్పుడూ అంతటా ఈ కనబడు సర్వజీవులు, దృశ్యాంతర్గత సర్వ వస్తు జాలము - ఇవన్నీ కేవల చిద్రూపము యొక్క ప్రత్యక్షరూపమే"** అనునది అనునిత్యోపాసనగా కలవారై, శుద్ధ చిద్రూపోసనారతులై ఉంటున్నారు. **"అహమేవ ఇదమ్ సర్వమ్"** భావనచే పరిపూర్ణత్వము సంతరించుకొనుచున్న వారు.

- ఎల్లప్పుడు ఆత్మయే జప - తప - వస్తువులుగా కలవారై ఉంటున్నవారు.

**- ఆత్మభావనయందే** ఎల్లప్పుడు తమను తాము ప్రయత్నపూర్వకముగా నియమించుకున్నవారై ఉంటున్నారు.

**- సుశీలినః** - సర్వదా తదితరులపట్ల ఉత్తమమైన ప్రవర్తన కలవారై, తదితరులకు భయముగాని - ఉద్రిక్తతగాని, ఉద్విగ్నతగాని కలిగించక, శుభకాములు - శ్రేయోదాయులు అయి, పుణ్యకీర్తివంతులలై ఉండువారు.

ఈవిధముగా పరివ్రాజకులు ఋక్కులచే అభివర్ణించబడుచున్నారు.

ఓ సౌమ్యుడా! బిడ్డా! మనము చెప్పుకున్న ఈ **కుటీచకులు** (ద్రష్ట-దర్శన-దృశ్యములనబడే **త్రిదండి ధారలు**), **బహూదకులు** (ఆ మూడిటిని త్రిదండముగా చేతియందు ధరించు **(త్రిదండి ధాములు)**, **హంసలు** (ఏక దండధారులు - సర్వము ఏకమగు అఖండ శివస్వరూపముగా దర్శించువారు), **పరమహంసలు** (దండమే ధరించనివారు, తమ ద్రష్టత్వమును పరబ్రహ్మమునందు **మమేకము చేసి, కేవలము పరబ్రహ్మమొక్కటేగా** ఏర్పడి ఉన్నవారు, అనన్యభావులు)....

ఈ నలుగురు బాహ్యాన కొన్ని కొన్ని వేరు వేరు లక్షణములు ఉన్నవారుగా కనిపిస్తారు. బాహ్యవృత్తి రీత్యా కొంచెము భేదము ఉన్నవారివలె అగుపిస్తుండవచ్చుగాక!

**వీరందరూ కూడా అంతరమున-బాహ్యమున కూడా అనునిత్యమూ-"ఇదంతా సస్వరూప-విష్ణుమయమే! అనన్యమగు విష్ణు స్వరూపమే! విష్ణు తత్త్వమే!" .... అను విష్ణులింగధారణ విషయంలో ఒకే తీరై ఉంటారు.**
ఈ విధంగా ఈ కుటీచక, బహూదక, హంస, పరమహంసలు

**పంచయజ్ఞా :** పంచయజ్ఞాత్ములై ఉంటారు 1) **వేద పఠనము, వైశ్వ దేవము** 2) (సహజీవులను బ్రహ్మముగా ఉపాసించి) **అతిథి పూజ**, 3) (జగత్తును-శరీరములను నిర్మించు ప్రజ్ఞలను ప్రదర్శించు దేవతారూపులగు) **పితౄ తర్పణము** 4) సహజీవులకు ఆనందము కలిగించటము 5) వారిని **బ్రహ్మముగా ఉపాసించటము** అనే భూతబలి (లేక) i) దేవయజ్ఞము ii) పితృయజ్ఞము iii) భూతయజ్ఞము iv) మనుష్యయజ్ఞము v) బ్రహ్మయజ్ఞము.

ఈ పంచ - పంచ యజ్ఞములను మనస్సుతో నిర్వర్తించువారు అయి ఉంటున్నారు.

**వేదశిరః ప్రవిష్టాః :** వేదములకు శిరస్సులగు ఉపనిషత్ అర్థములందు సదా ప్రవేశించినవారై, ఉపవిష్టులై (వాటియందు ఆశీనులై) ఉంటారు.

**క్రియావంతో :** వేదాంతార్థములను మననము చేయటయందు క్రియావంతులై ఉంటారు. (అంతేగాని బద్ధకము - అశ్రద్ధ - అతినిద్ర దరిచేరనీయరు).

**అమీ సంగతా బ్రహ్మ విద్యామ్ :** బ్రహ్మ విద్యకు సంబంధించిన సంగతులను ఎల్లప్పుడు పలుకువారు, బోధించువారు అయి ఉంటారు. సంసార వృక్షమును త్యజించినవారై, వృక్ష మూలము (At the Root point of all this being known) నందు సుఖాశీనులై, పుష్పములను (శాస్త్రముల బాహ్య కథా విశేషములకు, బాహ్యముగా కనిపించే సాధనము వ్యవహారములను) వదలి - సర్వప్రయోజనములను సన్న్యసించు **రసమును** (బ్రహ్మ తత్త్వ జ్ఞాన సారమును), స్వీకరించువారై ఉంటున్నారు.

(అనేకానిచ శాస్త్రాని, కల్పాయుః విఘ్నకోటయః। తస్మాత్ సారమ్ విజానీయామ్ - అనురీతిగా) సారము స్వీకరించుటను ఎరిగినవారై ఉంటున్నారు. నిష్ణాతులుగా ఉంటున్నారు.

❖

**సౌమ్యుడు :** ఓ గురుదేవా ! మేము కూడా కుటీచక-హంస-పరమహంసలవలె శాస్త్రసారవంతులము కావటానికై ఏ సాధనా మార్గమును అనుసరించాలో ఏ త్రోవలో అడుగులు వేయాలో... దయతో సూచించండి.

**గురుదేవుడు:** శాస్త్రములు 1) త్రిసంధ్యలయందు శక్తి కొలది స్నానము 2) తర్పణము 3) మార్జనము. (హృదయ గృహమును ఆచరించు **ప్రాపంచక విషయములు** అనే ధూళిని ఎప్పటికప్పుడు ఊడ్చి శుభ్రపరచుకోవటము) 4) ఉపస్థానము (హృదయమునందు పరమాత్మ

యొక్క తత్త్వజ్ఞాన-అనుభవములను ప్రతిక్షేపించుకోవటము 5) పంచ యజ్ఞములు (దేవ-పిత్రు-భూత-మనుష్య- బ్రహ్మయజ్ఞము)... సూచిస్తున్నాయి. ఇవన్నీ కూడా-**కుర్యాత్ అమరణాన్తికమ్**-జీవించి ఉన్నంతవరకు నిర్వర్తిస్తూ ఉండటమే ఉచితము.

- దశ (10) ప్రణవములతోను,
- సప్త (7) వ్యాహృతుల (భూ - భువః - సువః - మహః - జనః - తపః - సత్యమ్) తోను,
- చతుష్పదములతోను (4) i) ఓం భూర్భువస్సువః ii) తత్ సవితుః వరేణ్యమ్ iii) భర్గోదేవస్య ధీమహి iv) ధియో యోనః ప్రచోదయాత్)

గాయత్రీ జపయజ్ఞమును త్రిసంధ్యలయందు **మనస్సుతో - ఎరుకతో (అర్థమును మననము చేస్తూ)** నిర్వర్తించాలి.

ఎల్లప్పుడుకూడా ...

1) యోగ **సాధనలు** (యోగయజ్ఞము),
2) సత్ ఏకాగ్రమును (సత్ స్వరూప పరబ్రహ్మమే మహదాశయముగా కలిగి, **బుద్ధిని ఏకాగ్రము చేయుటమును**), ఆశయముగా కలిగి ఉండాలి.
3) భక్తితో - సర్వాత్మకుడు - సర్వ బాహ్య అభ్యంతరస్థుడు అగు **పరమాత్మను జగత్‌రూపుడుగా సేవించటము,**
4) బ్రహ్మజ్ఞానమును స్వానుభవం చేసుకొన్న **బ్రహ్మతత్త్వజ్ఞులపట్ల గురుభక్తి,**
ఈ నాలుగు వదలవద్దు.

**తపస్సు :** పరతత్త్వముయొక్క సామీప్య-స్వానుభవముల కొరకు తపిస్తూ చేయు యత్నములు - తపస్సు.

**అహింస :** "వాక్ - మనో - కాయములతో సహజీవులెవ్వరినీ బాధించక, స్వదేహభాగమువలె దర్శించటము" .

**స్వాధ్యాయ యజ్ఞము :** "ఆయా ఉపనిషత్తులను, అవి ప్రతిపాదించు అర్థమును అభ్యసించటము-సంభాషించటము-బోధించటము" అను స్వాధ్యాయయజ్ఞము ప్రతి రోజు నిర్వర్తించబడుగాక.

**జ్ఞాన యజ్ఞము :** అన్ని వ్యగ్రతలను (All Emotions / Feelings) వదలివేస్తూ, 'ఓం' కారమును ఉచ్ఛరిస్తూ జీవాత్మను **"బ్రహ్మమేవాఽగ్ని"** యందు అనుక్షణము హోమము చేయటమే **'జ్ఞాన యజ్ఞము'. "పరబ్రహ్మమే నాకు అవిజ్ఞాన దృష్టిచే అనేక జీవాత్మలుగా కనిపిస్తున్నది. జ్ఞాన దృష్టిచే అంతా పరమాత్మయే!"...** అను భావనతో ఈ దృశ్యజగత్తును దర్శిస్తూ ఉండటమే **బ్రహ్మాగ్ని హోమము (లేక) జ్ఞానయజ్ఞము.** అట్టి జ్ఞానయజ్ఞము-అన్ని యజ్ఞములకన్నా పరమోత్కృష్టము, పరమ పవిత్రము, సర్వదా సుసాధ్యముకూడా.

"ఓ జనులారా ! ఆత్మ జ్ఞానమే దండము ! జ్ఞానమే శిఖ ! జ్ఞానమే యజ్ఞోపవీతము ! ఎవనికి జ్ఞానమయమైన శిఖ ఉంటుందో అతడు **'తన్మయము' (ఆత్మతో ఏకత్వము)**... అనే **ఉపవీతము** స్వభావముగానే ధరించుచున్నవాడగుచున్నాడు. అదియే సకలురకు బ్రహ్మణ్యము. బ్రహ్మణ్యమే బ్రాహ్మణ లక్షణము.

**సౌమ్యుడు :** స్వామీ మీ ఆజ్ఞలు, సూచనలు అమోఘములు! శిరోధార్యములు!

పరివ్రాజకుల గురించి మనము చెప్పుకుంటున్నాము. మరికొన్ని విశేషాలు చెప్ప ప్రార్థన.

**గురుదేవుడు :** ఓ సౌమ్యా ! **ఏతే పరివ్రాజకా యథా ప్రాదుర్భవంతి, తథా భవంతి !** అప్పుడే పుట్టిన పిల్లవాడు ఈ జగత్తు విషయంలో ఏ విధంగా ఉంటాడో, పరివ్రాజకుడు ఆ విధముగా ఉంటాడు. ఇదంతా క్రీడా ప్రాంగణముగా, తాను క్రీడా-లీలా-వినోదిగా భావన కలిగి ఉంటాడు. 'శరీరమునకు మునుముందటి స్థితి' పట్ల మననశీలుడై ఉంటాడు.

**కామము, క్రోధము, లోభము, మోహము, దంభము, దర్పము, అసూయ,** (నాది - అను) **మమత్వము,** ('నేను - నేను ఇంతటి వాడిని'... అనే) **అహంకారము**... మొదలైనవన్నీ మొదలంట్లా త్యజించిన వాడై, జయించినవాడై ఉంటాడు. అతనికి- **"నేను ఈ ఈ విశేషములు కలవాడిని కదా !"...** అనే మానముగాని, **"అయ్యో ! నన్ను ఇంతమాట అన్నారా"... అనే అవమానముగాని, "అరెఁ ! నన్ను నిందిస్తున్నారే ! ఆహాఁ ! వీళ్ళు నన్ను స్తుతిస్తున్నారు కదా !"...** అనే నిందాస్తుతులుగాని లేనివాడై, వాటికి అతీతుడై - వదలివేసి ఉంటాడు. ఈ ఈ లక్షణములు గల వారెవ్వరైనా - గృహస్థుడు మొ॥న ఏ ఆశ్రమంలో ఉన్నప్పటికీ పరివ్రాజకులేనయ్యా!

అంతేకాదు.

ఒక మహావృక్షము తాను నరకబడుచున్నప్పుడు కూడా **"వీళ్ళకు ఇంత ఇచ్చానే ! నరుకుచున్నారు కదా ! నాపై వ్రాలే పక్షులు నావే కదా ! అవి ఏమౌతాయి ?"...** ఇవన్నీ ఏమీ పొందక మౌనంగా ఉంటుంది చూచావా ? ఆ తీరుగా **ఆత్మ తత్త్వమును ఎరిగిన మహనీయుడు ఇక్కడ ఏదీ 'నాది' అను భావన పొందనివాడై, మార్పు-చేర్పులకు అతీతుడై, అమృతస్వరూపుడై పరతత్త్వమును ఆస్వాదించుటలో అనునిత్యము నిమగ్నుడై ఉంటాడు.**

**ఋత్విక్కులు గానం చేసే ఋక్కులు ఈవిధంగా ఎలుగెత్తి చెప్పుచున్నాయి.**

**సన్న్యాస స్వీకారము :** బ్రహ్మచారిగాని, గృహస్థుడుగాని, బంధువుల-పుత్రుల ఆమోదముతో సన్న్యాసవ్రతము స్వీకరించుచున్నాడు. సన్న్యాసము పుచ్చుకొన్న వెంటనే, ఇక వెనుకకు తిరగకుండా గృహమునుండి బయల్వెడలుచూ అడుగులు వేస్తున్నాడు. ప్రశాంతమనస్కుడై, ద్వంద్వములను సహించుచూ, తూర్పు దిక్కుగాగాని, పడమర దిక్కుగా గాని బయల్వెడలుచున్నాడు. చేతిలో భిక్షక పాత్ర, త్రిదండము ధరించువాడై ఉంటున్నాడు. క్షౌరముచే పిలకమాత్రమే కలిగి ఉండి సంచరించసాగుచున్నాడు. ముండనము చేసినప్పటి శిఖ, పరమాత్మ స్వామీప్యము అనే ఉపవీతము (బ్రహ్మరంధ్రస్థానము – సహస్రారము) మాత్రమే అతని కుటుంబ సభ్యులు. ఈ విధంగా యాత్రలు చేస్తూ ఉంటాడు. మట్టి పాత్రగాని, సొరకాయ డిప్పగాని అతని భిక్షకపాత్ర ! అయాచితంగాగాని, యాచితంగా గాని ఏది ఆహారముగా లభించితే "మహాప్రసాదము" అని పలుకుచూ – భావిస్తూ స్వీకరించుచున్నాడు.

పట్టు వస్త్రములతోగాని, మరి ఏదైనా చిరిగిపోయిన వస్త్రములతో గాని తయారైన బొంతనో (లేక) గడ్డి బొంతనో ఆశీనమునకై అచ్ఛాదనముగా కలిగి ఉంటాడు. ఋతువునకు (రెండు నెలలకు) ఒకసారి మండనము (క్షౌరము) చేయించుకొంటూ (తలపై జట్టు తొలగించుకొంటూ) ఉంటాడు. మెడకు పై భాగము మాత్రమే ముండనముగాని, క్రింద భాగము కాదు. (చంకలు-శిఖను తీయరాదు).

అతడు వర్షరుతువుతో ప్రారంభించి, **చాతుర్మాస్య వ్రత దీక్షతో** 4 నెలలు ఒక్కచోట (ఆశ్రమంలోగాని, దేవాలయములోగాని, సత్సంగము జరుగు సాత్వికుని అభ్యర్థనను అనుసరించి వారి బాహ్యకుటీరములోగాని) ఉంటూ ఉంటారు.

ఆ 4 నెలలు కూడా ప్రాపంచక విషయములు ఏ మాత్రము పట్టించుకోకుండా, అంతరాత్మ పురుషుడగు విశ్వరూపుని యందు బుద్ధిని నిలిపి ధ్యానమునందు ఆత్మతత్త్వము ప్రతిపాదించు ఉపనిషత్-ఇత్యాది గ్రంథ పఠనమునందు గాని, ఏకాంత తపస్సునందు గాని కాలము వెళ్ళబుచ్చుచూ ఉంటాడు.

ధ్యాన – సమాధుల నుండి పునరుత్థానము పొందినప్పుడు ప్రకృతిని నిర్మితమగు భౌతిక దేహము యొక్క సంరక్షణ – ఉపయుక్తముల కొరకై క్రియలు నిర్వర్తిస్తూ ఉంటారు. ఆయా విహిత "ఆహార – ఆశ్రితజన ఉద్ధారణ"... ఇత్యాది స్వకర్మ (ప్రకృతిచే సంకల్పించబడు విద్యుక్త కర్మలందు) ఇంద్రియములతో – ఇంద్రియార్థములతో కూడిన ఈ దేహమును "ఉపయోగించబడుచున్న వస్తువు" వలె నియోగించుచూ, ఆనందముగా దృశ్యమునందు విహరించుచున్నారు.

## పరివ్రాజక నివాసస్థానములు

వారు దేవాలయములను, వృక్షముల క్రింద స్థలములను, కొండగుహలను, కొండ ప్రదేశములను, నదుల ఒడ్డున, తీర్థప్రదేశములను... నివాసములుగా కలిగి ఉంటున్నారు. ఏ ఒక్క ప్రదేశముతోను, రూప – నామములతోను, వ్యక్తులతోను అనుబంధ పూర్వకమగు బంధము కలిగి ఉండనివారై, "అసంగులు (unattached)" అయి ఉంటున్నారు. **"ఇదంతాకూడా మమాత్మస్వరూపమే కదా !"...** అను లక్ష్యముతో కూడిన శీలము (behaviour), వృత్తి (Avocation) కలిగి – (లక్షిత శీల వృత్తులై) ఉంటున్నారు. ఇంధనము అయిపోయినప్పటి అగ్నివలె సర్వవేదనలు, ఆవేశములు, ఆదుర్దాలు, సుఖ-దుఃఖ-భావ అభ్యాసములు సమసిపోయినవారై ఉంటున్నారు. పరమ ఉపశాంతులై మహత్తర ప్రశాంత స్థితితో కూడిన మౌనానందమును ఆస్వాదిస్తున్నారు. **అసంగో లక్షిత శీలవృత్తః, నిరింధనజ్యోతిరివ ఉపశాంతో, న చ ఉద్విజేత్ !** అంతరంగమున ఏ మాత్రమూ కూడా ఉద్వేగము పొందుటయే లేదు. **"అవును! ఉద్వేగమెందుకు ? సర్వాత్మకము – సర్వస్వరూపము – సర్వ సంప్రదర్శనశీలము అగు ఆత్మ నేనే అయి ఉండగా నాది కానిదేది? అంతా 'నేనే-నాదే' అయి ఉండగా దేనిని చూసి ఉద్వేగపడాలి? క్రొత్తగా ఏ విభాగము చూసి 'ఇచ్ఛ' పొందాలి ? అంతా నా ఇచ్ఛానంద స్వరూపమేగా!"** అను భావముతో హృదయమంతా పూరించుకొని ఉంటున్నారు. **శరీరమ్ అనుసంజ్వరేత్!** శరీర భావములన్నీ ఆత్మజ్ఞానాగ్నిలో వ్రేల్చివేస్తున్నారు. ఆత్మ జ్ఞానము పొందినట్టి ధీరులై వారు బ్రహ్మభావనచే **"బ్రాహ్మణులు"**... అనబడుచున్నారు.

ఓ సౌమ్యా ! సర్వదా బ్రహ్మభావనయే ఆశ్రయించాలయ్యా! బ్రహ్మభావనను ఆశ్రయించకుండా బ్రహ్మము గురించి వంద శబ్దములు చెప్పుకొని ఊరుకుంటే ఏం లాభం? **న అనుధ్యాయాత్ బహూం శబ్దాన్, (కింతు) వాచా విగ్లాపనం హి తత్!** అనేక శబ్దములు (Jorgons, Technical words and phrases) తో అంత పెద్దపనేమున్నది ? ఎక్కువగా మాటలు (బ్రహ్మముగురించి) చెప్పుకోవటమనేది బ్రహ్మభావనకు గ్లాపన (Missing) అవవచ్చునేమో కూడా! ఎన్ని చెప్పుకున్నా, చెప్పుకోపోయినా **"ఈ సర్వము... సర్వులు తానే" – అయి ఉన్న బ్రహ్మము నేనే"...** అను సంభావనయే కదా, ముఖ్యము?

ఓ సౌమ్యా ! బ్రహ్మమును తెలుసుకొని, బ్రహ్మమే తాముగా తెలుసుకొనియున్న బ్రహ్మజ్ఞులు ఈ జగత్తులో-ఆడుకొనే బాలునివలె (చిన్నపిల్లవానివలె) కేరింతలు కొడుతూ ఉంటారు. 'అంతా బ్రహ్మమే' అని తెలిసియే ఏమీ తెలియని చిన్న పిల్లవానివలె మునీశ్వరులు సంసారము నందు సంసారులై ఉంటున్నారు. సహజీవులతో ఉద్వేగరహితులై ఉంటున్నారు. బ్రహ్మమును ఎరిగినవారే బ్రహ్మజ్ఞులను గుర్తించగలరు.

ప్రతి జీవుడు సహజసిద్ధంగా **పరమానందము - కేవల సాక్షి** యగు పరబ్రహ్మమే స్వరూపముగా కలిగి ఉన్నాడయ్యా! అయితే కేవలకల్పితమాత్రమగు ఈ దృశ్యములో **"ఏదో పొందాలి ! అప్పుడు కానీ ఇప్పటికి లభించని ఆనందము ఏదో లభించదు"...** అను "కామము"ను హృదయములో తనకు తానే పదిలపరచుకొని-వృద్ధిచేసుకొని ఉండటముచేతనే, **ఈ జీవుడు తన హృదయములో సర్వదా వేంచేసియుండి, నిత్యప్రకాశతత్త్వమగు పరబ్రహ్మమును వీక్షించలేక పోవుచున్నాడు.** హృదయములో **"కామము"** అను **జన్మజన్మల స్వకీయ కల్పనావేశమే** "బ్రహ్మానందము"నకు అడ్డు తెరగా నిలచుచున్నది.

**శ్లో॥ యదా సర్వే ప్రముచ్యంతే కామాయే అస్య హృదిశ్రితాః,**
**అథ మర్త్యో అమృతో భవతి । అత్ర బ్రహ్మ సమశ్నుతే ॥**

ఏ మానవుడు - తన యొక్క హృదయములోకి (దొంగవలె) ప్రవేశించియున్న ("ఇంద్రియ విషయముల రూపముగా ఉన్నదేదో ఇంకా ఈ బాహ్య జగత్తు నుండి పొందాలి ! లేదా దుఃఖము తొలగాలి. అంతదాకా అసంతృప్తి కొనసాగక తప్పదు"... అను నిర్వచనముల రూపమగు) **"కామము"**ను హృదయము నుండి పూర్తిగా వెడల గొట్టి వేస్తాడో... ఆతడే ధన్యుడు. అతడు, ఇక్కడే ఇప్పుడే అమృత స్వరూపుడై **'బ్రహ్మము'**గా అగుచున్నాడు. బ్రహ్మమే తానై **సర్వస్వస్వరూపత్వము - సర్వ సాక్షిత్వము** పునికిపుచ్చుకొనుచున్నాడు.

**సౌమ్యుడు :** స్వామీ ! కొందరు సన్న్యాసాశ్రమము స్వీకరించి కూడా, అజ్ఞాన ప్రభావము చేత లౌకికమైన ధన-కనక-కీర్తి-ప్రతిష్ఠల వైపుగా అడుగులు వేస్తున్నారే ! మీరు చెప్పినట్లు "ప్రముచ్యంతే కామాః హృదిస్థితా" వైపుగా తగినంత దృష్టి సారించక పోవటము కొంత గమనిస్తున్నాము. అట్టి చ్యుతి పొందినవారిగురించి మా యొక్క జాగరూకత కొరకై మాపై దయతో వివరించండి.

**గురుదేవుడు :** అవును నాయనా ! సన్న్యాసాశ్రమ స్వీకారానంతరము కూడా అత్యంత జాగరూకత అవసరమే ! ఇంద్రియ విషయములు ఆకర్షించకుండా తగు జాగరూకత వహించలిసిందే. ఇది దృష్టి పెట్టుకోనివాడు 'పతనము' పొందుచున్నాడు. సన్న్యాసాశ్రమ నిష్ఠ నుండి (లేక) పారివ్రాజ్యక నియమమునుండి చ్యుతుడై, తిరిగి సంసార దృష్టులవైపుగా నడుచువాడు..., (లేక) సన్న్యాసవృత్తిని సాంసారిక ప్రవృత్తికి ఉపయోగించుకొనువాడు అగుచున్నాడు. అది నిప్పుతో ఒళ్ళు కాల్చుకోవటము వంటిది.

- ఆత్మధర్మమును విడిచి చరించువాడగుచున్నాడు.
- ఆత్మావగాహనకు సంబంధించిన బుద్ధి సామర్థ్యమును, అవకాశములను పోగొట్టుకొన్నవాడగుచున్నాడు.
- బ్రహ్మ మార్గమునుండి నిమ్నమార్గమునకు (దృశ్య మార్గమున) పడుచున్నవాడగుచున్నాడు.
- జన్మపరంపరల దోషమును వదిలించుకోబోయి, మరింతగా అంటించుకొనుచున్నాడు. వృథాజన్మలు పొందుచున్నాడు.
- మహాపాతకము చేయువానితో సమానమగుచున్నాడు.

ఏ సన్న్యాసి అయితే - మనము చెప్పుకొన్న **"సర్వే సర్వత్రా విష్ణుతత్త్వము దర్శించు మార్గము"**ను వదలి, కేవలము వస్త్రధారణ - కమండలువు - దండము - శిఖలు మాత్రమే ధరించి, సంసార దృష్టి పరంపరలలో మునిగి తేలుచూ కాలము వెళ్ళబుచ్చుతారో, వారు "దొంగతో సమానము" అని చెప్పబడుచున్నారు. ఫలితముగా బాహ్యమున పరివ్రాజకుడుగాను, లోన సంసారచింతనలు ఆశ్రయించువాడుగాను అగుచున్నాడు. గురు / గురుపత్నీ తల్ప - మిత్ర ద్రోహ - కృతఘ్నతా క్రియలతో సమానమగు దోషములను మూటకట్టుకున్నవాడుగా అగుచున్నాడు. వర్తమాన లోకమును పోగొట్టుకొని, చ్యుతుడై అల్పగతులను ఆహ్వానించుచున్నాడు.

ఓ సౌమ్యా ! వేద వాక్యరూపములగు ఋక్కులు ఈ విధముగా గానము చేస్తున్నాయి.

- **స్తేన సురాపానో గురుతల్పగామీ మిత్ర ధృగేతే నిష్కృతేః యాంతి శుద్ధిమ్।** దొంగతనము, సురాపానము, గురుతల్పము, మిత్రద్రోహము... ఇటువంటి పాతకములకైతే, "పశ్చాత్తాపముచే నిష్కృతి ఉన్నది" - అని చెప్పబడుతోంది ఆ దోషము తొలగించుకోగల సాత్త్వికమార్గరూప ఉపాయాలు ఉన్నాయి. ఆయా కర్మలు (శాస్త్రములచే, ఆర్యులచే) సూచించబడుచున్నాయి.
- కానీ - **వ్యక్తం అవ్యక్తంవా విధృతం విష్ణులింగం త్యజత్ న శుద్ధ్యేత్ అఖిలైః।** -వ్యక్త-అవ్యక్త రూప విష్ణు లింగమును, గురుముఖతః సన్న్యాసాశ్రమ విధిని స్వీకరించి కూడా... చ్యుతి పొందితే... అట్టి దోషమునకు నిష్కృతి (దోషము తొలగించగల కర్మలు) లేవు. **పతనము అనివార్యము.**

## నిజాత్మాశ్రమము

ఓ సహజాత్మానంద స్వరూపులారా ! మీ యందే స్వస్వరూపాత్మ స్వరూపమై, బయట-లోపల కూడా ఎల్లప్పుడు ప్రకాశమానమైయున్న, భాసించుచున్న-**విష్ణులింగ స్వరూపమును** (మరియు) **స్వహృదయాశ్రమవాసిని** ఏమరచి బాహ్యమున ఏదో వస్తువునో విషయమునో భజించటము కొనసాగిస్తూ ఉన్నవాడు మూఢుడే! హృదయమున పరమాత్మను ఏమరచి, బాహ్య జగత్తులో పరమాత్మ కొరకై వెతకువానికి కోట్ల కల్పములు గడచిపోయినా కూడా "ఉత్తమోత్తమగతి' లభించటము లేదు. అనగా, **బాహ్య ఇష్టదైవమును స్వస్వరూపముగా దర్శించినప్పుడే తత్త్వసిద్ధి!**

అందుచేత ఓ ప్రియ మిత్రులారా! సర్వ ఆశ్రమములను (బ్రహ్మచారి-గృహస్థ-వానప్రస్థ-సన్న్యాసాశ్రమములను) బయటనే అట్టిబెట్టి, శాశ్వతమగు **"సర్వత్రా స్వస్వరూపసందర్శనము. జగత్తును ఆత్మగా దర్శించటము"...** అనబడే **'మోక్షాశ్రమము'**ను మీరు సేవించెదరు గాక.

**మోక్షాశ్రమాత్ పరిభ్రష్టో న గతిః తస్య విద్యతే ।**

ఏ ఆశ్రమము నుండి భ్రష్టుడైనా, లేకున్నాకూడా, **మోక్షాశ్రమము** నుండి పరిభ్రష్టుడైనవాడికి.. గతిలేదు.

ఓ సౌమ్యా!

పరివ్రాజధర్మము (సన్న్యాసధర్మము) శాస్త్రయముగా స్వీకరించికూడా, స్వధర్మము నందు (పరివ్రాజ ధర్మమునందు) బుద్ధిని నిలుపడో, దుష్టబుద్ధితో దుష్ప్రవర్తనుడు, సంసార విషయాశయుడు అవుతాడో... అతడు **"ఆరూఢచ్యుతుడు"** (వృక్షము ఎక్కుచూ క్రిందపడినవాడితో సమానము) అని గమనించు.

ఇతి వేదానుశాసనమ్ ।

# వైష్ణవీ నిష్ఠ - తత్ ప్రభావము

బిడ్డా ! సౌమ్యా ! సనాతన - **ఆత్మధర్మ రూపమగు** "తత్ - త్వమ్; సోఽహమ్ః; త్వమేవాఽహమ్; అహమ్ బ్రహ్మాఽస్మి".... అర్థముతో కూడిన "వైష్ణవ నిష్ఠ"ను సముపార్జించుకొని, నిర్మలమైన ప్రవర్తన కలిగియున్నవాడు (అదూషత్ వర్తతే)... సర్వశుభములు పొందగలడు. 'జీవితము' అనే అవకాశమును సద్వినియోగఎరచుకొన్నవాడగుచున్నాడు. సర్వము తన వశమునందు కలిగి వున్నవాడు 'వశీ' అగుచున్నాడు.

- అతడు పుణ్య శ్లోకుడు (వేదాంతార్థమగు ఉపనిషత్ సారవాక్యము ఎరిగినవాడు).
- లోకతత్త్వము ఎరిగినవాడు - "లోకజ్ఞో" అగుచున్నాడు.
- వేదాంతము ఎరిగినవాడు, బ్రహ్మమును ఎరిగినవాడు సర్వమును ఎరిగినవాడు (వేదాంతజ్ఞా, బ్రహ్మజ్ఞో, సర్వజ్ఞో) అగుచున్నాడు.

సర్వమునకు చక్రవర్తి (స-సర్వరాట్) , పరబ్రహ్మము, భగవంత - స్థానము పొందుచున్నాడు. అతని పితృ దేవతలు, సంబంధితులు, బంధువులు, సుహృత్తులు, మిత్రులు... వారు కూడా ఆ ఆత్మతత్త్వజ్ఞుని సాంగత్యములో తరించుచున్నారు. (స తరతి! స తరతి! స లోకాం తారయతి)

ఏ కులములో 'బ్రహ్మవేత్త' ఉంటాడో, అతడు ఆ కులములో '300' మందిని అజ్ఞానము నుండి ఉద్ధరించుచున్నాడు. అతని వంశములోనివారు సుకృతులు అగుచున్నారు. ఇక్కడే వారు కూడా జ్ఞాన విద్వాంసులగుచున్నారు. ఆత్మ ధర్మము ఎరిగిన 'పరివ్రాట్- ఎక్కడ ఉంటే, అతని సమీపములో ఇటు, '300' మంది, అటు '300' మంది వెనుక - ముందు - ఇరువైపులా ... ఉన్నవారు కూడా ఆత్మజ్ఞాన గంధమును పొంది తరిస్తున్నారు.

ఓ మిత్రులారా ! ఈ జగత్తును సన్యసించువిధిని, విధానమును, అద్దాని ప్రయోజనమును - ఆశయములను కనీసము గ్రహించి ఉండండి. హృదయములో సన్న్యాసభావములను పదిలపరచుకోండి. ఆత్మధర్మమును (The feature of experiencing Absolute self as a mere witness to Relativity) సుస్పష్టపరచుకోండి. ప్రాణములు కంఠములో చేరి దేహమును విడచుచున్నప్పుడైనా సరే (Atleast while leaving the body ప్రాక్ శరీర విమోక్షణాత్)... కామ - క్రోధములను మొదలంట్లా జయించి **"మయా సన్న్యస్తమ్! నేను సర్వము సన్న్యసించుచున్నాను. కేవల సాక్షిత్వమునందు ప్రవేశించుచున్నాను..."** అని బిగ్గరగా ప్రకటించి, హృదయస్థుడైనా కూడా, ఆతడు, అతని పితృ దేవతలు తరించుచున్నారు. ఆతడు భ్రమలను విడచుచున్నాడు.

బిడ్డా ! సౌమ్యా ! సనాతనమగు ఆత్మ ధర్మముగురించి బోధించుచున్నప్పుడు అట్టి **"వైష్ణవీనిష్ఠ"** యొక్క ఫలశృతి చెప్పుకోవాలి.

- పొందుటవలన ప్రయోజనము ఏమిటో, ఎరుగకపోవుట వలన పోగొట్టుకొనునది ఏమో చెప్పుకుంటూ ఉండాలి! ఈ జీవుడు గుర్తుచేసుకొంటూ ఉండాలి!

## ఈ వైష్ణవీనిష్ఠ - సనాతన ఆత్మ ధర్మమును ఎవ్వరికి చెప్పకూడదు?

- శాస్త్రవిధులను - ఆచార విధులను - సదాచారములను గౌరవించనివానికి.
- రాగ - ద్వేషములను త్యజించవలసిన అవసరము గుర్తించనివానికి, - త్యజించుటచే ప్రయోజనమేమిటో గమనించనివానికి, ... గమనించటానికి సంసిద్ధపడని వానికి..,
- అపరిశుద్ధమైన చింతనలు, ద్రోహ బుద్ధి, అల్పమైన ఆశయములు, దురభి ప్రాయములతో - నిండి ఉన్న బుద్ధి కొనసాగించువారికి,

- ఆత్మ జ్ఞానము కొరకై "అభ్యర్థన, విన్నపము"లతో కూడిన ప్రవర్తన లేని వానికి,
- ఉత్సాహము - సహనము - ఏకాగ్రతలు సంతరించుకొన్న మనస్సు ఇంకనూ పెంపొందనివారికి **బోధించకూడదు.**

శ్రోతను పై దోషములు పోగొట్టుకొనుటకు ప్రయత్నమునందు నియమించి, అప్పుడు తగిన సమయములో **"వైష్ణవీనిష్ఠ"** ను ఉపనిషత్తుల, (భగవద్గీత, యోగవాసిష్ఠము ఇత్యాది) ఆత్మతత్త్వ బోధక గ్రంధముల సహాయముతో బోధించాలి.

**ఆత్మతత్త్వమును అవ్యాజమైన ప్రేమతో మనకు గుర్తు చేస్తున్న మహనీయుల వాక్ప్రవాహరూపములగు ఋక్కులు "విద్యాదేవి పలుకు అప్త వాక్యములు" గురించి ఇట్లా గానము చేస్తున్నాయి.**

బ్రహ్మము గురించి సంభాషించుకొనుచున్న బ్రహ్మ విద్యా సభలోను, బ్రహ్మవిద్యను సంభాషించుకొనుచున్న గురు - శిష్యుల మధ్యను ప్రత్యక్షమై అమృత దృక్కులతో వాత్సల్యమును వర్షింపజేయుచూ బ్రాహ్మీదేవి - [బ్రహ్మవిద్యాదేవి (మహాసరస్వతీదేవి)] ఈ విధముగా మృదుమధురవాక్కులు పలుకుచున్నది.

- **గోపాయ మాం శేవధిష్టేతి అహమస్మి !** ఓ బిడ్డలారా ! మీ యందు రహస్యరూపిణి అయి దాగిన **బ్రాహ్మీస్వరూపిణి**నగు నన్ను **మీ స్వస్వరూపముగా ఉపాసించండి !**
- మీరు బ్రహ్మతత్త్వము గురించి విజ్ఞాన దృష్టితో సంభాషించుకొనుచుండగా, మీపై అవ్యాజమగు ప్రేమను వర్షింపజేస్తాను. బ్రహ్మ విద్యనగు నేను స్వభావసిద్ధముగా వశమౌతాను. ఇందులో సందేహమే లేదు.
- ఓ బ్రహ్మజ్ఞులారా ! మీరు బ్రహ్మ విద్యను మీయందే దాచుకోకండి. ఎవ్వరైతే మిమ్ములను ఆశ్రయించి, నమస్కరించి, బ్రహ్మ విద్యను 'దేహీ' అని అభ్యర్థిస్తారో, వారికి మీరు విద్యను దాచుకోకుండా "తత్-త్వమ్' అను మహత్తర సత్యమును నిరూపిస్తూ బోధించండి. అంతేగాని, శిష్యులకు **"మీరు స్వల్పులు - అల్పులు. మీ గతి ఇంతే"...** అను రూపమున కాదు.

**"తత్త్వమసి! మీరు సర్వదా స్వతఃగా బ్రహ్మమే అయి ఉన్నారు"**

అను అర్థమును నిరూపించుకుంటూ ఒకరినొకరు సంభాషించుకోండి. గురు - శిష్యుల ఇరువురి హృదయములలోను ఆత్మవిద్యానుభవముగా నేను సిద్ధించగలను. మీకు వశమై ఉంటాను. వాక్ - ప్రవాహరూపముగాను, జ్ఞాపకశక్తి - శబ్దోచ్చారణ శక్తిగా మీ యందు ప్రకాశమానమగుచు, మీ బ్రహ్మ విద్యా ప్రవచనములలో రసరూపిణినై ఉంటాను.

ఓ ఆత్మ విద్యాబోధనము చేయుచూ, సత్సంగపూర్వకంగా సంభాషించు ఉత్తమజనులారా! మీ వాక్కునందు నేను సంతోషముగా ఉత్సాహము-జ్ఞప్తి - భావతరంగావేశముగా ప్రవేశించుచున్నాను. అయితే, శిష్యుని సత్ప్రవర్తన చూచి బ్రహ్మ విద్యను బోధించండి - అని మాత్రమే కోరుకుంటున్నాను.

ఓ సద్గురువును ఆశ్రయిస్తున్న శిష్యజనులారా! ఆత్మవిద్యను శ్రద్ధగా, ఉత్సాహముగా వినుచున్న శ్రోతలారా! నేను మీ బుద్ధిని వెంటనంటి ఉంటాను.

***ఓ ఆత్మతత్త్వ ప్రవచకులారా!***

- అసూయ కలవానికి, ఇతరులను 'చిన్నచూపు' చూస్తూ అవమానించు స్వభావము కలవానికి, ఇతరుల శుభమును చూచి ఓర్వలేని వానికి, ఇతరుల తప్పులను ఎంచుటలో ప్రావీణ్యత చూపాలనుకొనువానికి,
- ఋజుత్వము (Stright forwardness) లేనివానికి, సత్యమును స్వీకరించటానికి సంసిద్ధపడక, సంకుచితంగాను, వంకర - టింకరగాను యోచించు బుద్ధి కలవానికి, విషయమును వక్రబుద్ధితో (సూటిగా కాకుండా) యోచించువానికి,
- "నేను నమ్మినదే నిజము! నాకు ఎవ్వరూ చెప్పలేరు" అని మొండితనము వహించి ఉన్నవారికి, శఠులకు....,

**ఈ ఆధ్యాత్మ విద్య (లేక) బ్రహ్మ విద్యను బోధించక పోవటమే ఉచితము సుమా!**

**గురుస్థానము :**

ఓ బ్రహ్మ విద్యను సమీపించి ఉపాసించి, నేర్చుకొనుచున్న శిష్యులారా! **గురువుగా సంబోధించబడుచున్న విజ్ఞులారా!** నేను మీయందు వీర్యవతినై ప్రకాశించగలనని ప్రతిజ్ఞ చేస్తున్నాను. మీరు పలికే వాక్యములలో, భావములతో, విజ్ఞానములో ప్రవేశించి మిమ్ములను ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దుతాను. ఆత్మ విద్యాస్వరూపణినగు నాకు నమస్కరించినంత మాత్రముచేతనే ప్రేమాస్పదనై మీ వెంట నంటి ఉంటాను.

ఓ బ్రహ్మ విద్యను ఎరిగిన బిడ్డలారా !

ఎవ్వడైతే...,

- విద్యా–ఆశ్రితుడై ఉంటాడో..., బ్రహ్మవిద్యకు సంబంధించిన పలుకులను వినాలని, తెలుసుకోవాలని ఆత్రుత శ్రద్ధ కలిగి ఉంటాడో...,
- అప్రమత్తుడై బ్రహ్మ విద్యయందు ఉత్సాహవంతుడై ఉంటాడో..,
- చెప్పుచున్నది విని, అర్థము చేసుకొని సమన్వయించుకోగల తెలివితేటలు కలిగి ఉంటాడో, మేధావియో,
- "ఈ కనబడే దంతా బ్రహ్మమే"... అని ఎరుగుటకు నిష్ఠగల బ్రహ్మచర్యోపాసకుడో...',

అట్టి గుణములు ప్రదర్శించుచూ గురువును సమీపించి బ్రహ్మ విద్యను అర్థించినప్పుడు, అతని హృదయనైర్మల్యత్వమును పరిశీలించి, అందుకు ఆ శిష్యునికి సహకరిస్తూ – బ్రహ్మ విద్యను తప్పక బోధించాలి ! అతనికి వైష్ణవీనిష్ఠ – ఆత్మ త్వ దర్శనము – సోఽ హమ్, తత్త్వమ్, త్వమేవాఽ హమ్' ల పాఠ్యాంశములు తప్పక మహత్తరమగు ఆశమయతో బోధించాలి.

**శిష్యుడు :** ఇక బ్రహ్మ విద్యను నేర్చుకొను ఆశయముగల శిష్యుడు (విద్యార్థి)

- మనసా, వాచా, కర్మణా గురువును ఆశ్రయించాలి. సేవించాలి. అర్థించాలి.
- గురువునకు తన నిర్ణయములు చెప్పి ఒప్పించేపని ఉచితం కాదు.
- గురువుకు దక్షిణ – భోజనము సమర్పించాలి.
- గురువు మనస్సును సంతోషింపజేయు **"ఉపాసన"** లేనివానికి బ్రహ్మ విద్య అనుభవమునకు రాదు. ఇది **విధి శాసనము.**

వినుచున్న విద్యను అనుభవమునకు తెచ్చుకొనే ప్రజ్ఞ, సంసిద్ధత – శిష్యుని యందు సదా నిదురలేచి, ఉత్సాహపూర్వకంగా వేచి ఉండునుగాక !

**గురురేవ పరో ధర్మో :** గురువే పరమధర్మము ! వారిని పూజనీయులుగా భావించుట ఆత్మోపాసనతోను, ఆత్మ ధర్మనిరతితోను సమానము. గురువునే పరధర్మ స్వరూపనిగా దర్శించలేకపోతే, ఇక పరతత్త్వమును సర్వే–సర్వత్రా ఎట్లా దర్శించగలుగుతాడు?

**గురురేవ పరాగతి :** గురువు చెప్పు శాస్త్రీయ – స్వానుభవ సమాచారములే, మహత్ వాక్య ప్రవాహములే, సోదాహరణ పూర్వక నిరూపణలే–పరమునకు **గతి, మార్గము** కూడా!

**ఏకాక్షర ప్రదాతారమ్ :** అనేకముగాను, నశించబోవు స్వభావముతో కూడినది అగు – ఈ దృశ్య జగత్తుకు ఆధారముగా ఉన్న "ఏకము – అక్షరము"... అగు ఆత్మతత్త్వమును హృదయమునందు ప్రవేశింపజేయువారు గురువు! ఆయన ఏకాక్షరమును ప్రసాదించు వారుగా ఉపాసించాలి. అనగా...,

అట్టి గురువును ప్రత్యక్షముగా కనిపించే పరతత్త్వ స్వరూపముగా ఉపాసించటమే – శిష్యత్వ ధారణ!

ఎవ్వడు గురువుకు కృతజ్ఞతలు పలుకడో, పరతత్త్వ స్వరూపముగా ఉపాశించడో, అట్టివాడు నేర్చుకొను విద్య, విన్న విషయాలు, చేసిన తపస్సు... ఇవన్నీ పచ్చికుండలోని నీరువలె... అనుభవమునకు ఉపయోగించక, నిష్ప్రయోజనము అగుచున్నాయి. వృథా అగుచున్నాయి.

**యస్య దేవే పరాభక్తిః, యథా దేవే తథా గురౌ।**

**స బ్రహ్మవిత్ పరం ప్రేయాత్ ... ఇతి వేదానుశాసనమ్ ॥**

పరమాత్మయందు ఎంతట భక్తియో అంతటి భక్తిని – ప్రపత్తులను గురువుపై కలిగి ఉన్నప్పుడు ... బ్రహ్మవిద్య తనకు తానే హృదయమున ప్రవేశించి, **"పరబ్రహ్మానుభావము"**గా **ప్రకాశమానము అవగలదు.**

ఆ బ్రహ్మవేత్త పరతత్త్వమును పొంది బ్రహ్మమే తానై సర్వే సర్వత్రా వెల్లివిరియగలదు.

**ఇతి వేదానుశాసనమ్**

**ఇతి శాట్యాయనీయోపనిషత్**


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 18 హంసోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## శ్లోక తాత్పర్య పుష్పమ్



**శ్లో॥ హంసాఖ్య ఉపనిషత్ ప్రోక్త నాదా విః యత్ర విశ్రమేత్,**
**తత్ ఆధారమ్ నిరాధారమ్ బ్రహ్మమాత్రమ్ అహమ్ మహః॥**

*హంసోపనిషత్ వివరించు - 'హంసో౽హంస' నాదము ఎక్కడ లయించినదగుచున్నదో, అట్టి సర్వమునకు ఆధారమై, తాను మాత్రం నిరాధారము అయినట్టి బ్రహ్మమే నేనే! "ఆ మహత్తరమగు బ్రహ్మము యొక్క వర్ణనము నా గురించే!" అని ఉపనిషత్ సూత్రీకరించుచున్నది!*

| | |
|---|---|
| **1. గౌతమ ఉవాచ**<br>**(హే సనత్ కుమార గురూ!)**<br>**భగవన్! సర్వధర్మజ్ఞ।**<br>**సర్వశాస్త్ర విశారద।**<br>**బ్రహ్మవిద్యా ప్రబోధో హి,**<br>**కేన ఉపాయేన జాయతే॥** | **గౌతమ మునీంద్రులు :**<br>హే భగవన్! సనత్కుమార శ్రీగురుభ్యోనమః! సర్వ ధర్మములు ఎరిగి ఉన్నట్టి మహాత్మా! ఆత్మ-జీవుడు-ఈశ్వరుడు-దేహము-మనోబుద్ధి చిత్త అహంకారాలు ... వాటివాటి ధర్మముల గురించిన తత్త్వజ్ఞులుగా లోక ప్రసిద్ధులగు మహనీయా! సర్వ శాస్త్రముల ఉద్దేశ్యము, సారవిశేషము ఎరిగినట్టి సర్వశాస్త్ర విశారదా! మాకు బ్రహ్మవిద్య యొక్క ప్రబోధము ఎట్లా సులభముగా లభిస్తుందో...., దయచేసి బోధించవలసినదిగా ప్రార్థిస్తున్నాను. |
| **2. సనత్కుమార ఉవాచ**<br>**విచార్య సర్వ ధర్మేషు మతమ్**<br>**జ్ఞాత్వా, పినాకినః,**<br>**పార్వత్యా కథితమ్ తత్త్వమ్**<br>**శృణు, గౌతమ!**<br>**తత్ మమ।** | **శ్రీ సనత్కుమారుడు :**<br>నాయనా! గౌతమా! నీవు అడిగినట్లే, ఒకసారి జగన్మాతయగు పార్వతీదేవి భగవానుడగు పినాకినిని (పరమశివుని) ప్రశ్నించటం జరిగింది. శివభగవానుడు ఆ ప్రశ్నకు ఇచ్చిన సమాధానము-ఒకానొక సందర్భములో అమ్మవారు వాత్సల్య హృదయులై నాకు బోధించటం జరిగింది. లోకకళ్యాణ మూర్తియగు శివ భగవానుడు చెప్పిన విశేషాలే బ్రహ్మమును అధ్యయనము చేయు విద్యార్థులమై మనము ఇప్పుడు చెప్పుకుందాం. |
| **3. అనాఖ్యేయమ్ ఇదమ్ గుహ్యమ్**<br>**యోగినామ్ కోశ సన్నిభమ్,**<br>**హంసస్యా ఆకృతి విస్తారమ్।**<br>**భుక్తి-ముక్తి ఫలప్రదమ్॥** | **జగన్మాత - పార్వతి :**<br>హే పరమేశ్వరా! మీరు అనేక ధర్మ విశేషాలను విశ్లేషించారు. మనం విచారణ చేశాం. ఇప్పుడు ఆత్మరూపమగు 'హంస' ధర్మముగా ఏది చెప్పబడుచున్నదో అది వివరించ ప్రార్థన. |

**పరమశివుడు :**

ఓ ఆదిశక్తి స్వరూపిణీ! జగన్మాతా! పార్వతీ! అవును! ఇప్పటిదాకా అనేక ధర్మ ములను, ధర్మసూక్ష్మములను అఖ్యాన (కథా-చారిత్రక) విధానంగా చెప్పుకున్నాం. నీవిప్పుడు అడుగుచున్న **'హంస-పరమహంస'** ధర్మము - కథలాగా, చరిత్రలాగా చెప్పుకో గలిగేది కాదు. అనాఖ్యేయం! పరమ రహస్యమైనది కూడా! యోగపుంగవులకు ధనాగారము వంటిది. (రాజులు ధనాగారం రహస్యంగా కలిగి ఉంటారు కదా!). అద్దాని ఫలమో - అపరిమితమైనది. భుక్తి-ముక్తి ప్రదము కూడా! ఇహ-పర శుభ ప్రదాత!

---

**4. అథ హంస పరమహంస**
**నిర్ణయమ్ వ్యాఖ్యాస్యామో।**
**బ్రహ్మచారిణే, శాన్తాయ, దాన్తాయ గురుభక్తాయ**
**"హంసఽ హంస" (హంసోఽ హమ్ స)**
**ఇతి సదా ధ్యాయన్॥**

ఇప్పుడు హంస!హంసో!సోఽ హమ్!సోఽ హమ్ పరమ్! పరమ హంసోఽ హమ్! - అనాఖ్యాతమైనట్టి తత్త్వమును... వ్యాఖ్యానించుకుందాం. శ్రద్ధగా వినండి.

ముందుగా బ్రహ్మమును గురించి తెలుసుకొనే నేపథ్యములో **"నేను బ్రహ్మమునందే చరిస్తున్నాను"** ... అను భావనను ఆశ్రయిస్తూ, బ్రహ్మచారిత్వమును ప్రవృద్ధపరచుకుంటూ ఉండాలి.

అందుకు మార్గంగా ఇంద్రియములను క్రమంగా విషయములనుండి విరమింప జేస్తూ..., భగవత్ ఉపాసనయందు (భక్తి-ధ్యానము-యోగసాధనము పూజ-యజ్ఞ-యాగము ఇత్యాదులందు) నియమిస్తూ రావాలి.

అందుకుగాను బ్రహ్మజ్ఞుడు - తత్త్వజ్ఞుడు - అనుభవజ్ఞుడు అగు గురువును - ఉపాసిస్తూ - గురుభక్తి - దైవభక్తి సంవృద్ధి పరచుకోవాలి!

ఇకప్పుడు - **తత్ త్వమ్ - తత్ విశ్వమ్ (నీవుగా కనిపించేది పరమాత్మయే! విశ్వముగా కనిపించేది పరమాత్మయే!)** నేను-నాది అంతా పరమాత్మయే!

**"హం సోఽ హమ్ స"**
- 'నేను' గా ఉన్నది ఆయనయే!
- నాది అంతా ఆయనదే!
- ఆయనే నేను! నేనే ఆయన!
- ఈ జగత్తుగా - నీవుగా కనిపిస్తున్నదంతా నేనే! నేనుగా కనిపిస్తున్నది నీవే ...

అనే అర్థమును, పరమార్థమును ధ్యానించటం ప్రారంభించాలి. అనుక్షణికంగా అట్టి ధ్యాస కలిగి ఉండటమే 'ధ్యానము'.

---

**5. సర్వేషు దేహేషు**
**వ్యాప్య వర్తతే,**
**యథా హి అగ్నిః కాష్ఠేషు,**
**తిలేషు తైలమివ**
**తమ్ విదిత్వా**
**న మృత్యుమ్ ఏతి।**

**"సదాసోఽ హమ్" - "హంసోఽ హమ్"**

మంత్రమును ధ్యానించటము భావనా సంబంధమైనది.

(శబ్దము నుండి → అర్థమునకు → భావనకు)

అదియే **(సో) నేను (అహమ్)** అను మంత్రము (మననాత్ త్రాయతే) మనన రూపము గురించి చెప్పుచున్నాను.

సః - **ఆ పరమాత్మ ఎవ్వరు - అని ధ్యానించాలి?**
- ఈ విశ్వములోని సర్వ దేహములలో వ్యాపించి ఉన్నవారు!
- సర్వ దేహములుగా - 'దేహి'లుగా వర్తించుచున్నట్టి వారు!
- విశ్వ దేహులుగా ఉన్నట్టి వారు!

బాహ్యానికి దేహాలు కనిపిస్తున్నాయి. కానీ, అంతర్గతుడై పరమాత్మ (సః) ఈ సర్వ దేహములలో ప్రదర్శనమగుచున్నారు.

దృష్టాంతానికి :

→ కట్టెలు జడంగా కనిపిస్తాయి గాని అగ్ని అంతర్గతమై ఉన్నట్లుగా కళ్ళకు కనిపిస్తోందా? లేదు. కానీ ఆ కట్టెలను ఒరిపిడి చేసినప్పుడో?

కట్టెలలోని అగ్ని బహిర్గతమౌతుంది. అట్లా పరమాత్మ సర్వ దేహాలలో దాగి ఉన్నారు.

→ నువ్వు గింజలను చూస్తే నూనె కనిపిస్తుందా? లేదు. కాని నూనె కావాలనుకొన్న వాడికి నువ్వులను ఇస్తే, "నాకు నూనె లభించినట్లే!"... అని భావిస్తాడు. ఎందుకు? నువ్వులను గానుగలో నూరితే నూనె లభిస్తుంది కాబట్టి! ఆ రీతిగా హంసోపాసకుడు సర్వ సహజీవులలోను సారవస్తువు అగు ఆత్మనే దర్శిస్తాడు. అట్టి ఆత్మను తెలుసుకున్నవాడు 'మృత్యువు'ను అధిగమిస్తున్నాడు.

---


**6. గుదమ్ అవష్టభ్యా ఆధారాత్**
**వాయుమ్ ఉత్థాప్య,**
**స్వాధిష్ఠానమ్ త్రిః ప్రదక్షిణీ కృత్య,**
**మణిపూరకమ్ గత్వా,**
**అనాహతమ్ అతిక్రమ్య,**
**విశుద్ధే ప్రాణాత్ నిరుధ్యా,**
**ఆజ్ఞామ్ అనుయాయన్,**
**బ్రహ్మరన్ధ్రమ్ ధ్యాయన్,**
**"త్రిమాత్రోఽహమ్"**
**ఇత్యేవమ్ సర్వదా ధ్యాయన్।**
**పశ్యతి - న - ఆకారశ్చ (అనాకారశ్చ) జపతి।**
**(శిశ్నా-ఉభే పార్శ్వే భవతః।)**

**7. ఏషో అసౌ పరమహంసో**
**భానుకోటి ప్రతీకాశో**
**యేన ఇదమ్ సర్వమ్ వ్యాప్తమ్॥**

ఓ పార్వతీ దేవీ! **"నాలోని - 'నేను'గా ఉన్నది పరమాత్మయే! అందరిలో 'నేను' ఆ పరమాత్మకు చెందినదే!"**... అనే హంసోఽహమ్ మననమునకై యోగశాస్త్రము ఈ భౌతిక దేహమును యోగోపకరణంగా ఉపయోగించటం నేర్పుతోంది.

**హంస-సోఽహమ్ అని ధ్యానిస్తున్నప్పుడు**


- ఎడమ కాలి మడమతో పార్థివరూపమగు మూలాధార స్థానమైనట్టి గుదమును మూసి ఉంచి.... (లేదా) సంకల్పముతో మూలాధార స్థానమగు గుదమును బిగించి...,
- గాలిని, నెమ్మది-నెమ్మదిగా ఊర్ధ్వంగా పీల్చి, దేహమును గాలితో నింపి, 'కుంభకము' చేస్తూ....,
- మూలాధారమునుండి వాయువును పైకి నెమ్మది నెమ్మదిగా బుద్ధిబలంతో (ధ్యాసతో) కదల్చుచూ...,
- ప్రాణ-అపాన మేళనముతో, **మూలాధార త్రికోణములో ఊర్ధ్వ బిందు** స్థానములో అగ్నిని భావన చేస్తూ...
- ఆ ఉష్ణభావనతో మత్తుగా ఉండే కుండలినీ శక్తిని మేల్కొలిపి, సుషుమ్నానాడి మార్గమును ఉత్తేజితం చేస్తూ....,
- విరాట్ రూపుడగు పరమాత్మను ధ్యానిస్తూ...,
- ప్లీహ-అగ్ని స్థానమగు బొడ్డుకు (1 1/2 బెత్తల) క్రింద స్థానంలోగల **స్వాధిష్ఠానమునకు ప్రయాణించి** - స్వాధిష్ఠానచక్రమునకు మూడు ప్రదక్షిణములు చేసి....,
- ఆ తరువాత నాభిస్థానములో ఉన్న జలధాతువును నియమించు కేంద్ర స్థానమయినట్టి **మణిపూరక చక్రమునకు** ఇచ్ఛాశక్తితో ప్రాణ-అపానాగ్నిని నడిపించి,
- ఇక అటు తరువాత వాయు స్థానచలన కేంద్రము - హృదయకేంద్రము అగు **అనాహత చక్రమును** ఇచ్ఛాశక్తితో చేర్చి, క్రమంగా అతిక్రమించి, అచ్చట నుండి **కంఠస్థానము-ఆకాశ తత్త్వరూపము అగు విశుద్ధ చక్రమును** చేరి..., అక్కడ ప్రాణాపానములను నిరోధించి....,
- ఆచోటినుంచి భ్రూమధ్య కేంద్రము, ద్రష్ట-దర్శన-దృశ్యముల లయస్థానము అగు **ఆజ్ఞాచక్రము** అధిరోహించి, అనుసరించి
- ఆ స్థానములో యోగి **"సహస్రార ప్రారంభ స్థానము అగు బ్రహ్మరంధ్రము"**ను ధ్యానము చేయుచున్నాడు.



(ఇదంతా బుద్ధి-ఇచ్ఛల ప్రయాణ-సాధన సన్నివేశముగా గ్రహించబడును గాక! గమనించబడుగాక!)

బ్రహ్మరంధ్రోపాసనచే-**జాగ్రత్-స్వప్న-సుషుప్తులకు ఆధారుడను- కల్పించుకొనువాడు అగు తురీయుడను నేను ... అని సాకారతుర్యుడు ఇక నిరాకార తుర్యక్ తుర్యుడుగా** అగుచున్నాడు. 'శిష్యము' యొక్క ఉభయ పార్శ్వము తానే అయి ప్రకాశిస్తున్నాడు. అట్టి తుర్యక్-తుర్యుడే పరమహంస! ఆతడు కోటి సూర్య ప్రకాశమానమగు ఆత్మ స్వరూపుడై విరాజిల్లుచున్నాడు! తానే సర్వమునందు-సర్వముగా విస్తరించి ఉండి, తానే సర్వము అయినవాడై ఆనందిస్తున్నాడు! కుండలినీ తానే! సహస్రార స్థానము తానే! సుషుమ్నానాడి కూడా తానే!

ఆ పరమాత్మ హృదయ పద్మదళములోని వాసియై ప్రకాశిస్తూ బ్రహ్మాండ కల్పనలుచేయుచూ వినోదిస్తున్నాడు. మరోవైపు జీవాత్మయై హృదయపద్మము యొక్క '8' పుష్పదళములలో సంచారాలు చేస్తున్నాడు.




**8\. తస్యా అష్టధా వృత్తిః భవతి।**
**పూర్వ (తూర్పు) దళే పుణ్యే మతిః।**
**ఆగ్నేయే నిద్రా–ఆలస్యాదయో భవన్తి।**
**యామ్యే (దక్షిణదళే) క్రౌర్యే మతిః।**
**నైరృతే పాపే మనీషా।**
**వారుణ్యామ్ (పడమర) క్రీడా।**
**వాయవ్యామ్ గమన–ఆదౌ బుద్ధిః।**
**సౌమ్యే (ఉత్తరమున) రతిప్రీతిః।**
**ఈశాన్యే ద్రవ్యా దానమ్।**
**మధ్యే వైరాగ్యమ్।**
**కేసరే జాగ్రత్ అవస్థా।**
**కర్ణికాయామ్ స్వప్నో।**
**లింగే సుషుప్తిః।**
**పద్మత్యాగే తురీయమ్।**
**యదా హంసో నాదే**
**విలీనో భవతి,**
**తత్ తురీయాతీతమ్ భవతి।।**

**తూర్పువైపు దళమును అధిష్ఠించినపుడు :** పుణ్యకార్యములందు ఆసక్తి కలిగి ఉంటున్నాడు.

**ఆగ్నేయ దళము అధిష్ఠించినప్పుడు :** (తమోగుణ సంబంధమైన) నిద్ర-ఆలస్యము మొదలైనవి కలుగుచున్నాయి.

**దక్షిణ దళము అధిష్ఠించినప్పుడు :** (రజోగుణ సంబంధమైన) బుద్ధి క్రూరంగా ఉంటోంది.

**నైరృతి దళము అధిష్ఠించినప్పుడు :** పాపబుద్ధి కలుగుతోంది.

**పడమటి దళము అధిష్ఠించినప్పుడు :** క్రీడలందు - ఆట - పాటలందు ప్రీతి కలుగుతోంది.

**వాయువ్య దళము అధిష్ఠించినప్పుడు :** నడవటం - తిరగడం -దూర ప్రయాణాలు... ఇవి ప్రీతి అగుచున్నాయి.

**ఉత్తర దిక్కుగల దళము అధిష్ఠించినప్పుడు :** అజ్ఞానులకు కామరతియందు, సుజ్ఞానులకు ఆత్మరతియందు ఇష్టము కలుగుతోంది.

**ఈశాన్యదిక్ దళము అధిష్ఠించినప్పుడు :** ద్రవ్యము - ఆదానము (ఇవ్వడం - స్వీకరించటంలో) ప్రీతి!

**మధ్య భాగం అధిష్ఠించినప్పుడు :** వైరాగ్య భావాలు కలుగుచున్నాయి.

**కేసరములందు (రేఖలందు) అధిష్ఠించినప్పుడు :** జాగ్రత్ అధికంగా ఉంటుంది.

**తొడిమల స్థానం పొందుతున్నప్పుడు :** స్వప్నము

**పద్మము యొక్క మూలభాగం అధిష్ఠిస్తుంటే :** గాఢనిద్రా పరవశం

**హృదయ పద్మమును దాటి అధిష్ఠించినప్పుడు :** తురీయత్వం, కేవలసాక్షిత్వం, నిర్గుణత్వం, హంసో-సోఽహమ్ ... అను పరమాత్మయందు అధిష్ఠుతుడగుచున్నాడు. **'తురీయాతీతుడు'** అగుచున్నాడు.

ఈ జీవాత్మ ఈవిధంగా అష్ట దళమును, హృదయపద్మ మధ్య ప్రదేశమును దాటిపోయి తురీయాతీతుడై, ఆత్మకు అభిన్నుడై, కైవల్యపదమును అందుకొనుచు, **'పరమహంస'** అగుచున్నాడు.

| | |
|---|---|
| **9. అథో నాద 'ఆధారాత్'**<br>**"బ్రహ్మరంధ్ర" పర్యంతమ్**<br>**శుద్ధస్ఫటిక సంజ్కాశమ్।**<br>**స వై "బ్రహ్మ", "పరమాత్మ"**<br>**ఇతి ఉచ్యతే॥** | అట్టి యోగ సాధన పరిపక్వమగుచు, **"తురీయ తురీయుడు", "పరమహంస"** అగుచుండగా..., హృదయ ఆధార (Central) (పుష్ప) స్థానము నుండి - సహస్రార స్థానములో గల బ్రహ్మరంధ్రము వరకు - "శుద్ధ స్ఫటికము" వలె శుద్ధము - శుభ్రము- తెల్లటి కాంతి పుంజములు వెదజల్లు నిర్మల (Transparent) అద్దము వలె కుండలినీశక్తి అనుభవము అగుచున్నది. అట్టి స్వరూపముచే (పరమహంస) "బ్రహ్మము-పరమాత్మయే వారు" అని చెప్పబడుచున్నారు. |
| **10. అథ హంస ఋషిః।**<br>**"అవ్యక్త గాయత్రీ" ఛన్దః।**<br>**'పరమ హంసో' దేవతా।**<br>**'హం' బీజమ్! 'సం' శక్తిః।**<br>**'సోఽ హమ్' కీలకమ్।** | "నేను-నీవు-ఈ జగత్తు అంతా బ్రహ్మమే" ... అను భావన-బుద్ధి కలిగి ఉండటమే "అజపా గాయత్రి". అట్టి అజపా గాయత్రికి...,<br>హంస (పరమాత్మ) = ఋషి;<br>అవ్యక్త గాయత్రి = మనస్సుతో సర్వపూర్ణుడు అగు సవితృ భగవానుని (సత్ + చిత్) భావనచేస్తూ బుద్ధితో ఆస్వాదించటము. → **చందస్సు**;<br>పరమహంస అహమ్ స పరమో - స పరమోఽహమ్ → **దేవత**;<br>హమ్ (నేను) → **బీజమ్**;<br>సం (ఉనికి) → **శక్తిః**; సోఽహమ్ (ఉనికి) → **కీలకము**; |
| **11. షట్ (6) సంఖ్యా, అహో రాత్రయోః**<br>**ఏకవింశతి సహస్రాణి - షట్ శతాని**<br>**(21600) అధికాని భవంతి।**<br>**సూర్యాయ, సోమాయ నిరంజనాయ**<br>**నిరాభాసాయాఽ తను**<br>**సూక్ష్మమ్ ప్రచోదయాత్॥** | షట్ సంఖ్యామ్ - షట్ (6) ఆధార దేవతలు → **ఆధార దేవతలు : (గణేశ-బ్రహ్మ-విష్ణు-రుద్ర-త్రిపురేశ్వరీ-సదాశివులు. వీరు (6) జపకర్తలు).**<br>రాత్రి-పగలు కలిపి → **21,600 - శ్వాసలు. శ్వాసయే జపము.**<br>అజపా మంత్ర జపాన్ని '4' భాగములుగా విభజించి....,<br>- మొదటి భాగము **సూర్యునికి,**<br>- రెండవ భాగము **సోమునికి** (చంద్రునికి)<br>- మూడవ భాగము **నిరంజనుడగు సర్వేశ్వరునికి,**<br>- నాలుగవ భాగము సూక్ష్మ స్వరూపుడు అగు **నిరాభాసునికి** సమర్పించాలి.<br>**"మీరు యీ యోగోపాసనను స్వీకరించి మా బుద్ధిని ప్రేరేపించండి!"** అని భావ-అభ్యర్థనలను సమర్పించాలి! |
| **12. అగ్ని షోమాభ్యామ్ వౌషట్**<br>**హృదయ-అంగన్యాస -**<br>**కరన్యాసౌ భవతః॥** | **హృదయాంగన్యాసములు :** హం సామ్ హృదయాయనమః।<br>హం సీమ్ శిరసే స్వాహా।<br>హం సూమ్ శిఖాయై వషట్<br>హం సైమ్ కవచాయు హుమ్<br>అగ్ని సోమాభ్యాం-నేత్రత్రయాయవౌషట్ అని చెప్పాలి. |
| **13. ఏవమ్ కృత్వా హృదయే**<br>**'హంసమ్' ఆత్మానమ్ ధ్యాయేత్॥** | ఈవిధంగా అంగన్యాసము-కరన్యాసము (సోహమ్ మంత్రజపానికి) చెప్పుచూ..., హృదయములో ఉన్నట్టి **"హంస-ఆత్మభగవానుని"** అహమ్ బ్రహ్మాఽస్మి! అహమ్ బ్రహ్మాఽస్మి! అహమ్ బ్రహ్మాఽస్మి! అని ధ్యానము చేయాలి. |
| **14. అగ్నీ షోమౌ → పక్షౌ।**<br>**'ఓం'కార → శిరః।**<br>**'ఉ'కారో → బిందుః।**<br>**త్రినేత్రమ్ ముఖమ్ రుద్రో।**<br>**రుద్రాణీ చరణౌ।** | అట్టి యోగ పరాకాష్ఠ అందుకుంటున్న యోగి-విశ్వస్వరూపుడౌతాడు. విశ్వాతీతుడై, సూర్య-చంద్రులను తన బాహువులుగా భావము పొందుతాడు.<br>'ఓం'కారము ..... తన శిరస్సుగా అనుభూతి పొందుతాడు.<br>సబిందుకములు అయినట్టి **'అ'కార 'ఉ'కార-'మ'కారములను** తన త్రినేత్రములుగా దర్శిస్తాడు. తనయందే ఈ సర్వము లయిస్తున్న రుద్రుని తన ముఖముగా - ఆత్మ భావన సిద్ధి కొరకై-ఉపాసిస్తున్నారు.<br>రుద్రాణి (ప్రకృతి) - పాదములు అగుచున్నాయి. |

**ద్వివిధం కణ్ఠతః కుర్యాత్॥**

**ఇతి 'ఉన్మనా'**

**'అజపా ఉపసంహార'**

**ఇతి అభిధీయతే॥**

ఈవిధంగా ద్వివిధరూపములైన హంస ధ్యానమును - అనగా,

- **"నేను"గా ఉన్నది ఆ పరమాత్మయే!**
- **ఆ పరమాత్మగా ఉన్నది నేనే! నేను పరమాత్మ అఖండము!** - అని ధ్యానమును చేయాలి.

ఇట్లు ధ్యానము చేస్తూ ఉంటే .... 'అనుకోవటం' అనే అవసరము లేకుండానే అన్నీతానై ఉంటున్నాడు. అప్పుడు ఆతడు **'ఉన్మనీ'** అని చెప్పబడుచున్నాడు. అట్టి స్థితి **'అజపాసంహారము'** అని చెప్పబడుచున్నది. ఎందుకంటే జపించువాడు జపత్వము త్యజించి బ్రహ్మమే తానై చెన్నొందుచున్నాడు.

---

**15. ఏవమ్ హంసవశాత్**

**తస్మాత్ మనో విచార్యతే॥**

ఈవిధంగా **ఈ జగత్తు పరమాత్మయే - పరమాత్మయే నేనై ఉన్నాను - నేనే పరమాత్మ అయి ఉన్నాను.** ... అను ధ్యానముచే...., 'సోఽహమ్' జపభావన చేస్తూ ఉండగా..., **హంస (పరమాత్మ)కు వేరొకటి ఏదీ లేదు. కనుక 'నేను' అనునది పరమాత్మకు వేరుగా లేదు, ఉండజాలదు...** అను అనుమానమే లేనట్టి నిశ్చయ నిర్ణయమునకు వస్తున్నాడు.

---

**16. అస్యైవ జపకోట్యా**

**నాదమ్ అనుభవతి॥**

**స చ దశవిధ ఉపజాయతే**

**'చిణ్' ఇతి ప్రథమః॥**

**'చిణ్ చిణీ' ఇతి ద్వితీయః॥**

**ఘంటానాదః తృతీయః॥**

**శంఖనాదః చతుర్థః॥**

**పంచమస్తమ్-త్రీనాదః॥**

**షష్ఠః తాలనాదః॥**

**సప్తమో వేణునాదః॥**

**అష్టమో భేరీనాదః॥**

**నవమో మృదంగనాదః॥**

**దశమో మేఘనాదః॥**

"హమ్ సోఽహమ్ స" అని భృకుటి స్థానములో నుండి చేయు జపము యొక్క కోటి జపము (జపకోటి) చేత నోటితో జపించకపోయినప్పుడు కూడా - చెవులకు నాదము ప్రతి ధ్వనించసాగుతుంది. నాదానుభవము (కుడిచెవియందు) గంటవలె అనుక్షణికంగా కాగలదు. ఆనాదము '10' రీతులుగా చెవులకు గంటానాదము వలె వినపడసాగగలదు.

మొదట నాదము ⟶ 'చిణ్' శబ్దము.

రెండవనాదము ⟶ చిణ్ - చిణి శబ్దము.

మూడవ నాదము ⟶ ఘంటానాదము.

నాలుగవ నాదము ⟶ శంఖానాదము

ఐదవ నాదము ⟶ తంత్రీనాదము, వీణానాదము, స-రి-గ-మ సంగీతము.

ఆరవ నాదము ⟶ తాళ (తాళముల) నాదము

ఏడవ నాదము ⟶ వేణునాదము

ఎనిమిదవ నాదము ⟶ భేరీనాదము

తొమ్మిదవ నాదము ⟶ మృదంగ నాదము.

పదవ నాదము ⟶ మేఘనాదము.

---

**17. నవమం పరిత్యజ్య**

**దశమమేవ అభ్యసేత్॥**

ఈ వరుసలోని తొమ్మిది నాదములను పరిత్యజించి (వదలి) పదవ నాదమును భావనచేస్తూ అభ్యసించాలి! ఆశ్రయించాలి!

---

**18. ప్రథమే 'చించిణీ' గాత్రమ్॥**

**ద్వితీయే 'గాత్ర భంజనమ్'॥**

**తృతీయే భేదనమ్ యాతి॥**

**చతుర్థే కంపతే శిరః॥**

అనాహతము మొదలై చక్రములలో ప్రయాణిస్తూ - 'భృకుటి'కి ఆజ్ఞాచక్రము చేరి, అక్కడ ఆసీనుడై "హం సోహ మ్ స" అను మంత్రమును అజపాగాయిత్రిని భావనతో ఉచ్చరిస్తూ బ్రహ్మ రంధ్రమువైపు ధ్యాస సాగిస్తూ ఉండగా...

- మొట్టమొదట 'చిణ్ చిణ్' అను ఒకానొక చిరుగంటానాదం శరీరంలో పుట్టుచున్నది.
- క్రమంగా రెండవ స్థితిలో ఆ చిణ్-చిణ్ ధ్వని దేహమంతా వ్యాపిస్తూ హృదయంలోను, సర్వ స్థానాలలోను మధురంగా వినిపిస్తుంది.
- మూడవ స్థితిలో భ్రుకుటి స్థానములో ఏకాగ్రత నిశ్చలమగుచూ ఇంద్రియ విషయములతో ఏర్పడే బంధము భేదనమగుచూ వస్తుంది. అప్పటి వరకు

| | |
|---|---|
| | ముడుచుకొని ఉన్న హృదయ-కమల దళములు విచ్చుకోసాగుతాయి.<br>- నాలుగవ స్థితిలో బ్రహ్మరంధ్రమువైపుగా ఏకాగ్రత అధికమగుచూ ఉండగా శిరస్సు - తన్మయ సంబంధమైన చిన్న-చిన్న ప్రకంపనములు పొందుచున్నది. |
| **19.** **పంచమే స్రవతీ తాలూ।**<br>**షష్ఠే అమృత నిషేవణమ్।**<br>**సప్తమే గూఢ విజ్ఞానమ్।**<br>**పరావాచా తథా అష్టమే।** | - ఐదవ స్థితిలో తాలువు - కంఠముల మధ్య తంత్రీనాదము జనిస్తూ ఉండగా, కంఠములో మధుర ద్రవము స్రవిస్తుంది.<br>- ఆరవ స్థితిలో తాలువులో జనించే మధురమగు అమృతరసమును ఆ యోగి గ్రోలుతూ ఉంటాడు.<br>- ఏడవ స్థితిలో జనించే వేణునాదము వింటూ ఉండగా నిగూఢమైన బ్రహ్మ జ్ఞానము కలుగుతూ - వృద్ధి చెందుతూ వస్తుంది.<br>- ఎనిమిదవ స్థితిలో వాక్కు - దృష్టి మొదలైనవన్నీ ఇహత్వము త్యజించి పరత్వము సంతరించుకుంటూ ఉంటాయి. |
| **20.** **అదృశ్యమ్ నవమే దేహమ్।**<br>**దివ్యమ్ చక్షుః తథా అమలమ్।**<br>**దశమం చ 'పరంబ్రహ్మ' భవేత్**<br>**బ్రహ్మో ఆత్మ సన్నిధౌ॥** | - తొమ్మిదవ స్థితిలో భౌతికమైన ఇంద్రియ దృశ్యమును అధిగమించి ఆ యోగి **"సర్వము ఆత్మయొక్క విన్యాసమే"** అను దివ్య దృష్టి - దివ్య చక్షువులు, దోషరహితమగు- **నిర్దోషంహి సమం బ్రహ్మ** - భావనను పొందుచున్నాడు.<br>- పదవ స్థితిలో తానే 'పరబ్రహ్మము' అయి బ్రహ్మాత్మ సన్నిధి - సాయుజ్యములను సంపాదించుకుంటున్నాడు. |
| **21.** **తస్మాత్ మనో విలీనే ।**<br>**మనసిగతే సంకల్ప – వికల్పే,**<br>**దగ్ధే పుణ్య–పాపే, సదా శివః – శక్త్యా**<br>**ఆత్మా సర్వత్రా అవస్థితః** | ఈవిధంగా క్రమంగా మనస్సు విలీనం అవుతూ వస్తుంది. సంకల్ప-వికల్పములు, పాప-పుణ్య ద్వంద్వాలు ఆతని దృష్టిలో దగ్ధం అగుచున్నాయి. "అంతా ఆత్మయే" అని అనిపించసాగుతుంది. అప్పుడు ఆతడు శివ-శక్తి ఏకస్వరూపుడై, సర్వత్రా ఆత్మస్వరూపుడుగా తానే అయి... అంతటా, అన్నిటా, అంతగా, అన్నీగా అవస్థితుడగుచున్నాడు. |
| **స్వయమ్ జ్యోతిః**<br>**శుద్ధో – నిత్యో – నిరంజనః**<br>**శాంత తమః**<br>**ప్రకాశయతి।**<br>**ఇతి వేదానువచనమ్ భవతి॥**<br>**ఇతి హంసోపనిషత్॥**<br>**ఓం శాంతిః శాంతిః శాంతిః** | ఆ యోగి...,<br>- స్వయం జ్యోతి స్వరూపుడై,<br>- ఆత్మజ్యోతి స్వరూపుడై,<br>- శుద్ధుడు - నిరంజనుడు అయి<br>**- పరమశాంత స్వరూపుడై ప్రకాశిస్తున్నాడు.**<br>పరమహంస అయి సర్వమునకు అభిన్నుడై అప్రమేయుడై,<br>- సర్వభూతములు తానై<br>- సర్వసాక్షిగా వేరై, సర్వము కలిగి - ఏమీ లేనివాడై విరాజిల్లుచున్నాడు.<br>వేదములు ప్రవచించే వేదాంతవేద్యుడై, సర్వము స్వయంప్రకాశ రూపముగా కలిగి వర్తిస్తున్నాడు.<br>సర్వాత్మకుడు - సర్వతత్త్వ స్వరూపుడు 'కేవలుడు' అగుచున్నాడు.<br>- ఇతి వేదానువచనమ్।<br>***ఇతి హంసోపనిషత్***<br>***ఓం శాంతిః శాంతిః శాంతిః*** |


శుక్ల యజుర్వేదాంతర్గత

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

# 18 హంసోపనిషత్

⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘ ⌘

## అధ్యయన పుష్పము



ఒక సందర్భములో శ్రీ గౌతమమహర్షి ఆత్మ జ్ఞానాశయంతో, సర్వ సందేహముల నివృత్తి కొరకై

- బ్రహ్మ మానసపుత్రుడు,
- బ్రహ్మ జ్ఞాన ప్రకాశకులు,
- లోక కళ్యాణ మూర్తి,
- మహర్షులకు కూడా గురువు...,

అయినట్టి శ్రీ సనత్కుమారుల వారిని దర్శించారు. సాష్టాంగ దండ ప్రణామములు సమర్పించారు. లోక గురువగు ఆ మహనీయుని ముముక్షు భావయుక్తుడై వినయముతో ఇట్లు పరిప్రశ్నించ సాగారు.

❖

**శ్రీ గౌతమ మహర్షి :** హే సనత్కుమార భగవన్! సర్వ ధర్మజ్ఞా! వేదాంతశాస్త్ర విశేషములైనట్టి జీవాత్మ – పరమాత్మ – ఈశ్వరులు, అంతఃకరణములైనట్టి మనోబుద్ధి – ఆదిగా గల చతుష్టయము, దేహము అనే ఉపకరణము, దేహాంతర్గత – ఉపాసనాయోగము, అద్వితీయమగు పరబ్రహ్మముతో ఐక్యము, అందుకుగాను సర్వ ఉపాయాలు – ఇవన్నీ సుస్పష్టముగా ఎరిగియున్నట్టి మహా మహనీయులు మీరు. సర్వ శాస్త్రములు, వాటి ఉద్దేశ్యము, తత్సారము, అంతర్గత పాఠ్యాంశములు ఎరిగినట్టి సర్వశాస్త్ర కోవిదులు. మావంటి ముముక్షువులు ఆశ్రయించగానే తత్త్వరహస్యములను తెలియజేయు కరుణారసమూర్తులు. ప్రేమార్ద్ర హృదయులు. మా సంసార దోషము ఎట్టిదో ఎరిగి, మాకు దారి చూపగల సద్గురువరేణ్యులు. మార్గదర్శకులు. లోక కళ్యాణమూర్తులు.

హే సద్గురూ! సనత్కుమార గురువరేణ్యా! బ్రహ్మమానస పుత్రా!

**ఏ ఉపాయముచేత అజ్ఞులమై, – ('సంసారము' అనే కాళరాత్రి ఆవరించగా), జడులమై నిదురిస్తున్న మాకు..., "ఆత్మవిద్యా ప్రబోధము" అనే మెలుకువ సులభంగా లభిస్తుందో**... అది బోధించవలసినదిగా మిమ్ములను అర్థిస్తున్నామయ్యా!

**శ్రీ సనత్కుమారుడు :** నాయనా! గౌతమా! భక్తవత్సలురగు పార్వతీ పరమేశ్వరులు కైలాసంలో ఒకానొక శుభ సందర్భంలో సుఖాసీనులై సంభాషించుకుంటూ ఉన్నారు. జగన్మాతయగు పార్వతీ దేవికి సంసార జీవులమగు మనందరిపై గల అవ్యాజమైన కరుణ–మాతృ వాత్సల్యము కలిగియుండటంచేత, మనయొక్క **దుఃఖమయ సంసార దోష నివృత్తి**ని దృష్టిలో పెట్టుకొని అనేక ధర్మాలు, పౌరాణిక విశేషాలు, ఆధ్యాత్మ జ్ఞాన రహస్యాల గురించి ప్రశ్నించసాగారు. పరమాత్మ, సర్వాంతర్యామి, సర్వతత్త్వ స్వరూపుడు, లోక శుభంకరుడు అగు పినాకిని (శివ దేవుడు) శ్రీ పార్వతీమాతతో అనేక తాత్త్విక రహస్యాలు, ధర్మ విశేషాలు సంభాషించటం జరిగింది.

ఆ సమయంలో **"పరమహంత తత్త్వము"** గురించి కూడా కొన్ని విశేషాలు విశ్లేషించి చెప్పారు.

ఒకానొక (మరొక) సందర్భములో నేను లోకమాతయగు పార్వతీ దేవిని దర్శించుకోవటం జరిగింది. అమ్మ కదా! **"బిడ్డా! ఏమైనా కోరుకో! ఇస్తాను"** అని అన్నప్పుడు నేనూ మీలాగానే **"అమ్మా! మేము బ్రహ్మ విద్యాపారంగతులమై, బ్రహ్మప్రబోధము పొందేది ఎట్లాగో చెప్పి, నన్ను సంసార దుఃఖములనుండి కాపాడవమ్మా!"** అని ఆ వరాల తల్లిని అభ్యర్థించాను. అమ్మ ఆ సందర్భములో చెప్పియున్న పరమహంస తత్త్వమును ఇప్పుడు నీవు నన్ను అడుగుచున్న ప్రశ్నలకు సమాధానంగా చెప్పుచున్నాను విను.

ఓ గౌతమ మునివర్యా! ప్రపంచ భావన అనే కలనము (కల్పిత భావన – మనోకల్పన)ను తొలగించుకొన్నప్పుడు, ఇక శేషించి ఉండే స్వస్వరూపమగు "సన్ మాత్రము" (కేవల సత్ స్వరూపము)నే బ్రహ్మజ్ఞులు **'బ్రహ్మము'** అని పిలుస్తున్నారు.

అయితే...,

అట్టి బ్రహ్మము గురించి మనము ఒక కథలాగానో, సంఘటనలాగానో, కథానికలాగానో, చరిత్రలాగానో చెప్పుకో గలిగేది కాదు. అనాఖ్యేయం! 'నేనే బ్రహ్మమును' – అనబడు బ్రహ్మోఽహమ్ భావనానుభవమును **'పరమహంస ధర్మము – హంసధర్మము'** అని కూడా అంటారు. అట్టి **'హంస ధర్మము'** అనునది పరమ రహస్యము. **"నేను భౌతిక రూపము మాత్రమే కదా!"**.... అని తలచుచున్న ఈ జీవుని యొక్క విస్తారమగు హంస రూపమును (లేక) సోఽహమ్ రూపమును గుర్తు చేసేదే హంసోఽహమ్! మహా రాజులు తమ యొక్క ధనాగారమును అందరికీ తెలిసేటట్లుగా కాకుండా,... ఎక్కడో రహస్య ప్రదేశంలో నిర్మించుకొన్నవారై ఉంటారు కదా! అట్లాగే నీవు అడిగిన బ్రహ్మము (లేక) హంస ధర్మము – అనునది పరమహంసలగు యోగులు – రహస్యముగా – అంతరంగమున దాచుకొని, అద్దాని విజ్ఞానముతో ఈ సర్వమును వినోదముగా సందర్శిస్తూ ఉంటారు. **అది హంసయోగ స్థితి**.

ఇది ఇట్లా ఉండగా....,

ప్రతి జీవుడు సర్వదా కేవలాత్మ స్వరూపుడే! కనుక **సోఽహమ్ – హంస యోగము**ను తప్పక తెలుసుకోవలసిందే! అప్పుడే సంసార దుఃఖము తొలగుతుంది. అట్టి విజ్ఞానమును, శ్రద్ధ – భక్తి – శుశ్రూష కలవాడు తప్పక పొందగలడు. అట్టి బ్రహ్మ జ్ఞాన స్వరూపమైన "హంస ధర్మము" – భుక్తి ముక్తి ఫలప్రదము. ఇహ–పర సాధనము కూడా!

ఓ గౌతమా! ఇప్పుడు మనము అనాఖ్యాతము–**పరమహంసలు స్వానుభవ పాఠ్యాంశముగా నిర్ణయించి చెప్పుచున్నది. సోఽహమ్ రూపమైనట్టిది, పరమశివుడు పార్వతీ దేవికి వ్యాఖ్యానించి చెప్పియున్నది** అగు 'హంసోఽహంస' అను మంత్రోపాసన, యోగభ్యాసము, ధారణ, తత్త్వముల గురించి – అమ్మవారు – నాకు బోధించిన విశేషాలను చెప్పుకుంటున్నాము. శ్రద్ధగా వినెదరు గాక!

❖

**"హంసోఽహంస"** .... అను పరమహంస ధ్యానమునకు సంసిద్ధమయ్యే ముందుగా ... ఆ యోగసాధకుడు పాటించవలసిన నియమములు, మార్గములు ఏమిటి? చెప్పుకుందాము! పరమహంస నిర్ణయములు ఎట్లా ఎట్లా ఉంటాయో కూడా సంభాషించుకుందాం!

**బ్రహ్మచారిణే : "నేను బ్రహ్మము గురించి తెలుసుకొని, బ్రహ్మమును గురించిన ఆచారములను అనుసరిస్తూ, బ్రహ్మము వైపుగా అడుగులు వేసెదను గాక!"** ... అని ముందుగా దృఢనిశ్చయమును పెంపొందించుకోవాలి.

**"సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ – ఇతి ఆచరణేన బ్రహ్మచారో భవతి"**

"ఇదంతా బ్రహ్మమే కదా" అని చెప్పే తత్త్వమ్ – సోఽహమ్ వాక్యార్థములను పరమలక్ష్యముగా కలిగి యున్నవాడు – **"బ్రహ్మచారి"** అగుచున్నాడు. (లౌకికార్థంగా "వివాహం కానివాడు – అనునది ఆధ్యాత్మికార్థము కాదు).

అందుకు మార్గము? దాన్తాయ! – ఇంద్రియ నిగ్రహము, ఇంద్రియముల సద్వినియోగము!

ఈ మనో–బుద్ధులు శబ్ద స్పర్శ–రూప–రస–గంధములకు సంబంధించిన విషయ పరంపరలలో అనేక జన్మల నుండి స్వప్నతుల్యంగా గడపుతూ ఉండగా, ఈ జీవుడు ఆత్మ తత్త్వజ్ఞానము ఏమరచుచున్నాడు. తన స్వరూపముపై అల్పత్వము, కర్మబంధత్వము కప్పుకొని అనేక మనో రుగ్మతలు తెచ్చిపెట్టుకుంటున్నాడు. ఇప్పుడు **హంసోపాసన** కు ఉపక్రమించటానికి వీలుగా, **ఇంద్రియములను నిగ్రహించాలి**.

దాస్తుడు కావాలి! వాటిని భక్తి-జ్ఞాన-వైరాగ్య అభ్యాసముల వైపుగా నియమిస్తూ ఉండాలి.

→ ఇంద్రియములు మనస్సుకు ఉపకరణములు. అంతేగాని మనస్సు ఇంద్రియములకు బద్ధము కావలసిన పని లేదు.

→ మనస్సు మనకు ఉపకరణం. అంతేగాని మనస్సుకు మనం బద్ధులం కావలసిన పని లేదు.

అభ్యాసవశం చేతనే మనము మనస్సుకు, మనస్సేమో ఇంద్రియములకు బద్ధముగా అగుచుండటం జరుగుతోంది.

అందుచేత ఇప్పుడు ఇంద్రియములను సన్మార్గములోను, భగవత్ ఉపాసనయందు నియమిస్తూ రావలసిన అగత్యం ఏర్పడుతోంది.

**గురుభక్తాయ** : ఆత్మజ్ఞులగు మహనీయులు ఈ జగత్తును ఏ దృష్టితో అవగాహనతో చూస్తున్నారో... అది జీవులకు ముఖ్యము. అందుచేత, బ్రహ్మజ్ఞుడు, తత్త్వజ్ఞుడు అనుభవజ్ఞుడు అగు గురువును ఉపాశించాలి. గురుభక్తి - దైవభక్తి యొక్క సంవృద్ధి చేత బుద్ధి వికశితమై **"పరమ సత్యము"** యొక్క ప్రవేశము కొరకై సంసిద్ధమౌతుంది. సంసార దృష్టి నుండి బ్రహ్మీదృష్టి వైపుగా మరలుటకై సద్గురువును సమీపించాలి. సంశయములు తొలగుటకై వారి యొక్క ఆప్త వాక్యములు విని, వారు చెప్పు మార్గములో విశ్లేషించాలి. వారు తత్త్వమ్ **(త్వమ్ (నీవు)గా కనిపిస్తున్నది - తత్ పరమాత్మయే)** - అనే సార విషయం చెప్పుచున్నారు.

**సదా ధ్యాయన్ "హంసోఽహంస"**

హంస ధ్యానమును ఎల్లప్పుడు అభ్యసిస్తూ ఉండాలి. (హంస = అహంమ్‌సః - నేను ఆ బ్రహ్మమే అని సంజ్ఞ!)

**విశ్వమ్ విష్ణుః :** ఈ విశ్వము రూపముగా కనిపిస్తున్నది విశ్వేశ్వరుడే! పరమాత్మయే!

**తత్త్వమ్ :** నాకు ఎదురుగా 'నీవు' అను సర్వనామ రూపంగా కనిపిస్తున్న వారందరు ఆ పరమాత్మయే! పరమాత్మయే **ఈ అన్ని రూపాలలో, రూపాలుగా ఉన్నారు.** (ఉదాహరణకు-మట్టితో అనేక బొమ్మలు చేసినప్పుడు ఆ అనేక బొమ్మలలో-బొమ్మలుగా ఉన్నది ఒకే మట్టి కదా! అట్లాగే ఒకే పరమాత్మ ఇన్ని రూపాలుగా కనిపిస్తున్నారు... అనునదే 'తత్త్వమ్' మహా వాక్యము యొక్క అర్థము- తాత్పర్యము)!

**జీవో బ్రహ్మేఽతి** : జీవుడుగా కనిపిస్తున్నది సర్వదా బ్రహ్మమే.

**శివతత్త్వ జ్ఞానమ్** : త్వమ్ తత్ శివయేవ ... ఇతి జ్ఞానమ్.

**త్వమేవాఽహమ్** : 'నీవుగా' నాకు కనిపిస్తున్నది నా ప్రియమగు ఆత్మయే!

**సోఽహమ్** : పరమాత్మయే 'నేను-నాది'గా ఉన్నారు. నేనుగా నాలో ఉన్నదంతా ఆ పరమాత్మయే! నేను పరమాత్మకు చెందిన వాడనే! అందుచేత నాకు నాదిగా చెందినది (నాది), 'నేను' గా అనిపించేది (నేను) - రెండూ పరమాత్మయొక్క విన్యాసమే!

ఈ మహా వాక్యముల ధ్యాసయే... ధ్యానము. **'హంసోఽహమ్ సదా ధ్యానం'** ... అయి ఉన్నది. అట్టి ధ్యానమును ప్రవృద్ధపరచుకోవాలి. క్రమంగా "పరమాత్మకు వేరైనది - నాకు వేరైనది" అనునది త్యజించబడుచూ అంతా పరమాత్మ విన్యాసంగా **అనుకుంటూ - అనుకుంటూ** ఉండటంచేత, **అనిపిస్తూ - అనిపిస్తూ** ఉండటమే 'హంసోఽహంస' ధ్యానము. అది-బుద్ధి నిర్మలమై సమున్నత స్థానమును సంతరించుకొను స్థితి!

ఈవిధంగా **'దాసోఽహమ్'** సహాయంతో సర్వము సమర్పితముగా అగుచుండగా...,

**"సదా సోఽహమ్"**
**"సోఽహమ్"**

మంత్రమును ఏకరూపం చేస్తూ **"హంసోఽహంస"**ను ఎలుగెత్తి మనస్సుతో ఉచ్ఛరిస్తూ, భావము - అర్థమును దృష్టియందు బుద్ధియందు నిలుపుకుంటూ... ఆతడు **'పరమహంస'** అయి విరాజిల్లుచున్నాడు.

అట్టి 'హంస ధ్యాని' ధ్యానిస్తున్న హంస (పరమాత్మ) ఎట్టివారు? (లేక) ఆత్మ ఎట్టిది?

**సర్వేషు వేదేషు వ్యాప్య వర్తతే!**

స్వప్నము కనువాని (One whom the Dream belongs to) స్వప్న చైతన్యమే స్వప్నాంతర్గత **ద్రష్ట, స్వప్న దృశ్యములు, విషయములు, వ్యక్తులుగా...** అయి, ఆ స్వప్న ద్రష్టకు **"నాకు ఈ స్వప్నము వేరైనదే!"....** అని అనిపిస్తోంది. అయితే స్వప్న ద్రష్టయొక్క స్వకీయ

కల్పనయే స్వప్న రూపముగాను, స్వప్నములోని సర్వ విశేషాలుగాను దాలుస్తోంది కదా! కనుక, కల్పన అనబడేది - కల్పించుకొను వానికంటే వేరు కాదు. ఈ విషయం నిదుర లేచిన తరువాత సుస్పష్టమే అగుచున్నది కదా!

అట్లాగే....,

**సర్వేషు వేదేషు** → జాగ్రత్ - స్వప్నములో తెలియబడేదంతా కూడా....,

**(కో) వ్యాప్య వర్తతే** → ఎవ్వరైతే - తనకుతానే వ్యాపించి ఉండి, తానే జాగ్రత్ - స్వప్న - సుషుప్తి రూపుడై తన స్వరూపమును తానే ఆయా వివిధ రూపములుగా సందర్శించుచున్నారో ఆతడే హంస! హంసరూపుడు! ఆత్మ స్వరూపుడు! ఆత్మ!

అట్టి 'సోఽహమ్' (నేనే ఆత్మరూపుడనై ఉండి, ఇన్నిగా నాచే నేనే ఆస్వాదించబడుచున్నాను).... అను భావనను - అర్థమును ఉపాసిస్తూ 'పరమహంస' అగుచున్నాడు.

***అట్టి 'హంస' (స్వస్వరూప - సర్వస్వరూప) ఆత్మ భగవానుడు ఎట్టివాడు?***

**యథా అగ్నిః కాష్ఠేషు :** కట్టెలలో అగ్ని దాగి ఉండి ఒరిపిడిచే మాత్రమే ప్రదర్శితమగుచున్న తీరుగా **'హంస (ఆత్మ)'** సర్వ జీవుల దేహాలలో సర్వదా వేంచేసియే ఉన్న స్వస్వరూపము. హంసోపాసన యొక్క ఆశ్రయముచే సంసార దృష్టులు నశించినప్పుడు హంస భావన బహిర్గతమై అనుభవమునకు వస్తోంది.

**తిలేషు తైలమివ :** నువ్వు గింజలలో నూనెవలె (నువ్వు గింజలు గానుగ ఆడితే నూనె లభించినట్లుగా), సర్వ జీవులలో అంతర్యామిగా ఉన్న **స్వస్వరూప పరమాత్మ** శాస్త్ర ప్రవిచతమైన మార్గంలో సాధనలచే-అనుభవం కాగలదు.

అన్ని నువ్వు గింజలలోను తైలము ఒక్కటే అయినట్లు... జీవులు అనేకులైనప్పటికీ ఆత్మ సర్వదా ఏకమే అయి ఉన్నది.

**అట్టి ఆత్మ తత్త్వమును, హంస ధర్మమును (సయేవ అహమ్! - అహమ్ బ్రహ్మమేవ! నేను బ్రహ్మమే అయి ఉన్నాను - అను ధర్మమును) తెలుసుకొన్నవాడై, హంసోపాసకుడు మృత్యువుయొక్క పరిధిని అధిగమించిన వాడగుచున్నాడు. తమ్‌ఏవ విదిత్వా న మృత్యుమ్ ఏతి! సర్వము సర్వదా ఆత్మ విన్యాసంగా దర్శిస్తూ తాను ఆత్మస్వరూపుడై విరాజిల్లుచున్నాడు. పరమహంస అయి, సదా హంస తత్త్వము అనే జలముతో కూడిన మానస సరోవరంలో ప్రశాంతంగా వినోదంగా అనంత సుఖ స్వరూపుడై విహరిస్తున్నాడు. బ్రహ్మమానస సరోవంలో 'హంస' వలె, ఈ జగత్తులో హంస అయి విహరిస్తున్నారు.**

❖

**దేహ ఉపకరణము - హంసోపాసన :** ఇప్పుడు - ఈ 'దేహము' అనే వస్తువును ఒక **ఉపకరణము**గా ఉపయోగించి **"హంసాభ్యాసము"** **(లేక) "హంసోపాసన"** ఎట్లా సదాభ్యాసులు చేయటం జరుగుతోందో, (అట్టి మహనీయుల ఉపాసన - అభ్యాసములు మనకు ప్రమాణం కనుక), అట్టి యోగాభ్యాసము మనము వివరించుకుంటున్నాము.

ఈ దేహమును ఉపయోగించుకోవటం - లోకంలో జీవులచే రెండు విధాలుగా జరుగుతోంది.

**1. సదభ్యాసులు :** ఈ దేహమును ఒక యజ్ఞ వస్తువుగాను, యోగోపకరణముగాను, ప్రకృతిమాతచే జీవుని మోక్షసాధన (లేక) పరమహంసత్వమును సముపార్జించుకోవటానికి ఆతనిపై గల వాత్సల్యముచే ప్రసాదించబడిన ఒక మహత్తరమైన సాధన వస్తువుగాను- అర్థము చేసుకొని, ఈ భౌతిక దేహ వస్తువును సద్వినియోగం చేసుకొనుచున్నవారు.

**2. దురభ్యాసులు :** ఈ దేహమును పొంది, ఇందలి ఇంద్రియములచే ఏర్పడే సయోగము కారణంగా ఇంద్రియ విషయములను దర్శించుచున్న సందర్భములతో క్రమంగా తన్మయులు అయి ఉంటున్నవారు. **"ప్రకృతి ప్రాసాదితమైన ఈ భౌతిక దేహమును నేను నా యొక్క ఆత్మ దివ్యత్వమును అనుభవానికి తెచ్చుకోవటానికై కదా, ఆశ్రయించాను!"....** అనునది ఏమరచినవారు. వారు, **"ఈ ఇంద్రియాలకు కనబడే విషయాలే నా సర్వస్వము. ఇక్కడే నా సుఖ దుఃఖాలు. ఇంద్రియ కల్పిత దృశ్యములో కొన్ని కొన్ని పొందితే నాకు సుఖం. లేదా, దుఃఖము"** - అని భావిస్తూ విషయములలో తన్మయమై ఉండటం జరుగుతోంది. అట్టి సుఖ దుఃఖ తరంగాలలో పడి అనేక ఉపాధి పరంపరలను పొందుతూ, ఇంద్రియాతీతమైన హంసానుభవము - ఆత్మానుభవమునకు ప్రయత్నమే చేయకపోవటం జరుగుతోంది. ఇదియే **సంసారము** - అని లోక ప్రసిద్ధమై యున్నది.

ఇప్పుడు..., కొందరు జీవులు ఏ తీరుగా 'సదభ్యాసి' అయి...., ఈ 'దేహము' అనే వస్తువును ప్రకృతిమాతచే ప్రసాదించబడిన ఒక మహత్తరమైన ఉపకరణము గాను, సంసార సాగరమును దాటించగలిగిన 'నావ' గాను గమనిస్తూ, భావించి, ఉద్దేశ్యించి, యోగమార్గంగా 'హంసోపాసన' నిర్వర్తిస్తూ పరమహంసలుగా అగుచున్నారో..., అది చెప్పుకుందాము. అట్టి మహనీయుల అభ్యాసము- ఉపాసన-లక్ష్యసాధన-తదితర జనులకు ప్రమాణం కదా! కనుక అట్టి యోగాభ్యాసమును వివరించుకుంటున్నాము.

**"హంసోఽహంస - సోఽహమ్" - ఉపాసిస్తూ అందుకుగాను దేహమును ఉపకరణంగా ఉపయోగించే యోగాభ్యాసము.**

**చక్రములు** - దేహములోని భూ-జల-అగ్ని-వాయు-ఆకాశ-పంచభూతాతీత తత్త్వములను పర్యవేక్షించు "శక్తి కేంద్రములు". ఆయా తత్త్వములకు ఆధిపత్యము వహించి దేహములో వాటిని త్రిప్పుచుండటంచేత 'చక్రములు'. ప్రజ్ఞయొక్క విశేష ప్రదర్శనచేత "ప్రజ్ఞాకేంద్రములు" అని కూడా అనుచున్నారు. అవి 1) మూలాధారము (పృథ్వి) 2) స్వాధిష్ఠానము (జలము) 3) మణిపూరకము (అగ్ని) 4) అనాహతము (వాయువు) 5) విశుద్ధము (ఆకాశము) 6) ఆజ్ఞా (త్రిపుటి) 7) బ్రహ్మరంధ్రము 8) సహస్రారము.

### గుదమ్ అవష్టభ్యా, ఆధారాత్,

ఎడమకాలి మడతో ఈ పార్థివదేహము యొక్క దేహములోని భూతత్త్వమును పర్యవేక్షించుచున్న **'మూలాధార చక్రస్థానము'** అగు **గుదస్థానమును** మూసి...., (లేదా) సంకల్పశక్తిని ఉపయోగించి గుదస్థానమును నెమ్మదిగా బిగించి ఉంచి, అక్కడ కొంతసేపు తమ సంకల్ప శక్తిని సంకల్పపూర్వకంగా ఉంచటం అభ్యసిస్తున్నారు.

### వాయుమ్ ఉత్థాప్య,

అటు తరువాత గాలిని ఆ చోటు నుండి నెమ్మదిగా కుంభించి, కుంభకాభ్యాసముచే గాలితో నింపి ఉంచి, నిలపి ఉంచి...,

- మూలాధార స్థానము నుండి ఆ కుంభక వాయువును ఇచ్ఛ-సంకల్పములతో (లేక, బుద్ధిపూర్వకంగా) పై పైకి నెమ్మదిగా కదల్చుచు...,
- ప్రాణ - అపానములతో త్రికోణమును నిర్మించుకొని, అద్దాని యొక్క ఊర్ధ్వ △ బిందు స్థానములో 'అగ్ని'ని భావన చేస్తూ...
- ప్రాణ-అపానములచే త్రికోణ ఊర్ధ్వ బిందు స్థానములో జనించిన 'ఉష్ణము'తో మూలాధారము నుండి, వెన్నెముక మధ్యన ఊర్ధ్వంగా ఉండి, అప్రబుద్ధంగాను, మత్తుగాను ఉండే మహత్తరశక్తి సంపన్నమగు **'కుండలిని'ని - సుషుమ్నానాడి** మార్గంగా ఉత్తేజ పరచుచున్నారు.
- అట్లు కుండలినీ శక్తిని నిద్రలేపుతూ విరాట్ పురుషుడగు పరమాత్మను ధ్యానములో నిలుపుతూ కొంతసేపు ధ్యానం చేస్తున్నారు. తరువాత, ఇచ్ఛాశక్తితో కూడిన ప్రాణతత్త్వమును మూలాధార - త్రికోణ - ఊర్ధ్వ బిందువు నుండి సుషుమ్నానాడి ద్వారా ఉత్తేజితమైన **కుండలినీశక్తితో** సహ ఊర్ధ్వానికి ప్రయాణింపజేయుచున్నారు.

### స్వాధిష్ఠానమ్ త్రిప్రదక్షిణీకృత్య ...,

క్రమంగా బొడ్డుకు $1\ ^1/_2$ బెత్తెల క్రిందిగా ఉండి, **దేహములోని జలతత్త్వమును పర్యవేక్షిస్తూ** ఉంటున్నట్టి, **ప్లీహ-జల** కేంద్ర స్థానమగు **"స్వాధిష్ఠాన చక్రము"**నకు బుద్ధిని చేర్చుచున్నారు. స్వాధిష్ఠాన చక్రస్థానమునకు బుద్ధి + ప్రాణ + మనో అగ్ని శక్తులతో కూడి ముమ్మారు (3సార్లు) ప్రదక్షిణము చేయుచున్నారు. కొంతసేపు ధ్యానమునందు బుద్ధిని నిలుపుచున్నారు.

### మణిపూరకమ్ గత్వా ...,

ఆ తరువాత..., **దేహములోని అగ్నిని నియమించు ధర్మము నిర్వర్తిస్తున్నట్టి, నాభి** స్థానంలో అగ్నితత్త్వమై - శక్తిరూపంగా కేంద్రీకృతమైయున్న **'మణిపూరక చక్రము'**ను చేరుచున్నవారగుచున్నారు. అట్టి స్థానములో ఏకాగ్రతతో బుద్ధిని (మనో-ప్రాణ అగ్నిలతో సహా) కొంతసేపు నిలుపుచున్నారు. క్రమంగా అక్కడి నుండి కూడా ఊర్ధ్వంగా బయల్వెడలుచున్నారు.

### అనాహతమ్ అతిక్రమ్య

అటుపై దేహములోని వాయుస్థానము - వాయు స్పందన కేంద్రము అయినట్టి, **హృదయస్థానమున** ఉన్నట్టి **"అనాహత చక్రము"**ను చేర్చుచున్నారు. ఆ అనాహత చక్రస్థానములో కొంతసేపు ధ్యానమును నిర్వర్తిస్తూ ఉన్నారు. క్రమంగా ఆ స్థానమును దాటుచు, సుషుమ్నానాడిలో మరికొంత ముందుకు - ఊర్ధ్వముగా పయనిస్తున్నారు.

### విశుద్ధే ప్రాణాత్ నిరుధ్య

క్రమంగా – దేహములో ఆకాశతత్త్వ కేంద్ర స్థానము, **కంఠ** ప్రదేశములో నిక్షిప్తమైయున్నట్టిది, దేహములోని సర్వస్థానములను – ప్రదేశములను పర్యవేక్షిస్తూ ఉన్నట్టిది–అయినట్టి **"విశుద్ధ చక్రస్థానము"**ను చేరుచున్నారు. అట్టి విశుద్ధ చక్ర కేంద్రబిందువు గల కంఠ స్థానములో ఉపాసన–తపస్సులను నిర్వర్తిస్తున్నారు. ఆచోట కొంతసేపు ప్రాణ – అపానములను నిరోధించి, ప్రాణాయామ పరాయణులై ఉంటున్నారు. అటు తరువాత, మరల ఊర్ధ్వంగా ప్రాణశక్తి – మనస్సులను బుద్ధితో నడుపుచున్నారు.

### ఆజ్ఞామ్ అనుయాయన్

క్రమంగా – కంఠప్రదేశమునుదాటి, కనుబొమ్మల మధ్య స్థానం చేరుచున్నారు. ఆకాశాతీత – ఆకాశ నియమాకము. ద్రష్ట – దర్శన – దృశ్యములు ఏకరూపము పొందే పవిత్ర స్థానము. సర్వేంద్రియముల విషయములన్నీ అవిషయములై ఉండునట్టి నిరాకాశ స్థానము. త్రిపుటీ – త్రివేణీ సంగమ స్థానము (యోగ పరిభాషలో – గంగా – యమున – సరస్వతీ నదీ ప్రవాహములు కలయుచున్న ఏక స్థానము). అట్టి **"ఆజ్ఞా చక్రము"**ను ఆ హంసోపాసకులు **ఇచ్ఛ – ప్రాణ – జ్ఞాన** త్రిశక్తియుతంగా చేరుచున్నారు.

### బ్రహ్మరంధ్రమ్ ధ్యాయన్ 'త్రిమాత్రోఽహమ్'

ఇక ఇప్పుడు త్రిపుటీస్థానము అయినట్టి ఆజ్ఞాచక్ర అనుయాయులగుచున్నారు. నిర్విషయంగా, ప్రశాంతముగా సుఖాశీనులై, శిరస్సుయొక్క ఊర్ధ్వ భాగములో స్థానము కలిగియున్న బ్రహ్మ రంధ్రము వైపు దృష్టిని సారించుచున్నారు. సూక్ష్మమగు బ్రహ్మరంధ్రము పట్ల మనో–బుద్ధి–చిత్తములతో దృష్టి ధ్యాసలను నిలుపుచున్నారు.

క్రమంగా....,

త్రిమాత్రోఽహమ్ – ద్రష్ట – దర్శన – దృశ్యములను నేను **స్వరూపముగా కలవాడను.**
– జాగ్రత్ – స్వప్న – సుషుప్తులను నా మహత్ – ప్రదర్శనా స్థలములయిఉన్నట్టి **తురీయ స్వరూపుడను.**
– అకార – ఉకార – మకారములు ఏకమగు **ఓం కార స్వరూపుడను.**

.... అను రూపమై **త్రిమాత్రోహమ్ ధ్యానమును** ఆశ్రయించుచున్నారు.

*ధ్యాసను బ్రహ్మ రంధ్రమునందు నిలిపి,*
*బ్రహ్మమును సందర్శిస్తూ,*
*సర్వము బ్రహ్మమునందు, బ్రహ్మమును సర్వమునందు,*
*సర్వము బ్రహ్మముగాను,*
*దర్శించుచూ – ఆస్వాదిస్తున్నారు.*

**సాకారము అదే!**
**నిరాకారము అదే!**
**జీవాత్మ అదే!**
**పరమాత్మ అదే!**


"ఇటు – అటు గల ఇడ – పింగళ, అంతర్లీన శక్తి స్వరూపమగు కుండలిని, షట్ చక్రములు, జీవుడు – ఈశ్వరుడు, నేను – నీవు, ఉన్నది – లేనిదీ ***అంతా బ్రహ్మమే! సర్వము బ్రహ్మమే!"*** – అని భావనను సుస్థీకరించుకొంటూ హంస ధ్యానమును కూడా దాటిపోయి, తానే హంస–పరమహంస అగుచున్నారు!

"పరిమితుడగు **జీవుడను** నేనే! అపరిమితుడగు **ఈశ్వరుడను** నేనే!" అను భావనచే తానే 'హంస' అయి ధ్యానమును త్యజిస్తున్నాడు కూడా! ధ్యాత – ధ్యానము – ధ్యేయము ఏకాత్మ స్వరూపమై అనుభవమగుచున్నప్పుడు, ఇక వేరే ధ్యానముతో పని లేదు.

అట్టి పరబ్రహ్మమూర్తి కోటి సూర్య ప్రభాభాసితుడై వెలుగొందుచున్నారు. సర్వము వ్యాపించినవాడై, సర్వములో – సర్వముగా "హంస" "పరమహంస" అయి బ్రహ్మానందమునందు తేలియాడుచున్నారు.

**తస్య అష్టధా వృత్తిః భవతి**

వాస్తవానికి స్వరూపతఃగా జీవాత్మ పరమాత్మయే! పరమాత్మయే మాయా వినోదియై హృదయ పద్మదళ నివాశి అయి ఉండి, అనేక విధములైన తత్త్వములతో కూడిన మాయాకాశంలో విహరిస్తున్నారు. అట్టి పరమాత్మయొక్క విన్యాసము **అష్టవిధ ప్రకృతి విశేషాలుగా, అష్టదళ విన్యాసాలుగా** విశ్వ తత్త్వజ్ఞులు చెప్పుతూ ఉంటారు.




**హృదయమధ్యస్థమ్...,**

పరమాత్మ సర్వదా పరమాత్మగా, హంసరూపుడై అంతరహృదయ – అభ్యాంతరంగుడై ఉంటూనే...., తనయొక్క ఒక 'అంశ' అగు జీవాత్మగా అష్టదళములలో క్రీడా వినోదిఅయి సంచారములు చేస్తున్న విహారమే విశ్వములోని 14 లోకముల విన్యాసము, ఈ మాయా రచనా చమత్కారము కూడా!

**పూర్వ (తూర్పు) – దళే పుణ్యమతిః :** తూర్పువైపు గల దళమునందు సంచరించుచున్నప్పుడు అట్టి సమయంలో ( ఆ జీవాత్మ) పుణ్య కార్యములందు ఆసక్తి కలిగినవాడై ఉంటున్నాడు. సత్త్వగుణ ప్రధానుడై ఉంటున్నాడు.

**ఆగ్నేయే – నిద్ర – ఆలస్యాదయో భవంతి :** జీవాత్మ ఆగ్నేయ దిక్కుగా ఉన్న హృదయ పద్మ దళములో ప్రవర్తించుచున్నప్పుడు నిద్ర – ఆలస్యము మొదలైన తమోగుణ ఆసక్తి సమన్వితుడై ఉండటం జరుగుతోంది.

**యామ్యే (దక్షిణ) – క్రౌర్యే మతిః :** దక్షిణ దళమునందు పచార్లు చేస్తూ ఉన్నప్పుడు... కోపంగాను, ఆవేశంగాను, మూర్ఖపట్టుదలతోను, క్రూరంగాను, కోపంగాను కనిపిస్తున్నాడు. (రజో–తమో గుణాసక్తుడై ఉంటున్నాడు).

**నైరృతీ–పాపే మనీషా:** నైరృతి దళములో విహారాలు చేస్తున్న సందర్భములో (ఆ జీవాత్మ) పాపపు బుద్ధి కలిగి ఉంటున్నాడు. దొంగతనం చేసే స్వభావం, మోసం–దగా చేయాలనే ఉబలాటం, అసత్యమైన పలుకులు.... ఇత్యాదులు గుణ సంపదగా కలిగి నర్తిస్తున్నాడు.

**వారుణ్యామ్ (పడమర) క్రీడా! :** పడమట దళము అధిష్ఠించి ఉన్నప్పుడు క్రీడా వినోది అయి, హాస్యరస ప్రదర్శనం, ఇతరులను ఎగతాళి చేయటం, అంతా చాలా తేలికగా తీసుకొనే స్వభావం.... ఇటువంటివి ప్రదర్శించుచున్నాడు. (Child Ego State).

**వాయవ్యాం గమనాదౌ బుద్ధిః :** వాయవ్యదళముపై ప్రవేశించి సంచరించుచున్నప్పుడు – ఒకచోట నిలువక, ఎట్లెట్లో సంచారాలు చేయాలని, దూర ప్రదేశాలు తిరిగి రావాలని, తీర్థ ప్రదేశాలు చూచిరావాలనే అభిలాషలు వ్యక్తీకరిస్తున్నాడు. సంచార క్రియలు నిర్వర్తించి ఆస్వాదిస్తున్నాడు.

**సౌమ్యే (ఉత్తరమున) రతి ప్రీతిః :** హృదయ పద్మముయొక్క ఉత్తరదిక్ దళమునందు సంచారములు పొందటం జరుగుతున్నప్పుడు అనేక విషయ పరంపరలతో సంబంధము పెట్టుకుంటూ, రమిస్తూ ఉండటంలో ప్రీతి కలిగినవాడై ఉంటున్నాడు.

**ఈశాన్యే ద్రవ్యాదానే :** ఈశాన్య దిక్ దళములో జీవాత్మగా సంచరించు సందర్భములో "ద్రవ్యము సంపాదించాలి! సంపదలు, వస్తువులు ప్రత్యేకమైనది కలిగి ఉండాలి! ఇంకా ఏదో పొందాలి! నాకున్నవి మరెవ్వరి దగ్గర ఉండకూడదు".... ఇట్టి రూప – ఆవేశము గల విషయ పరంపరలలో మునిగి – తేలుచున్నాడు. ఇందులో ఉత్తరాధికారి "నేను ఇతరులకు ఏదో దానం చేసినప్పుడే నాకు తృప్తి" .... అను భావ–ఆవేశము కలిగి ఉంటున్నారు.

**మధ్యే వైరాగ్యమ్ :** హృదయ మధ్య భాగంలో జీవాత్మ అధిష్ఠించినప్పుడు వైరాగ్య భావాలు కలుగుచున్నాయి. "ఈ ఇంద్రియ ప్రపంచ వ్యవహారములు, స్థితిగతులు నిత్యము కాదు, సత్యము కాదు. వీటన్నిటికీ ఆవల దృష్టి సారించెదను గాక"... అని తలచనారంభిస్తున్నాడు.

**కేసరే జాగ్రదవస్థా :** హృదయపుష్ప కేసరములు (తంతువులు) అధిష్ఠించినప్పుడు "ఇంద్రియ బాహ్య విషయాలు – పదార్థములతో సంయోగ వియోగము".... అనే జాగ్రత్ అవస్థయందు అధికప్రీతి కలవాడై ఉంటున్నాడు.

**కర్ణికాయామ్ స్వప్నో :** హృదయ పద్మముయొక్క కర్ణికలు (తొడిమల) వద్ద అధిష్ఠితుడైయున్నప్పుడు అంతరంగ మనో కల్పనా విశేషములయందు సంలగ్నుడై, ప్రీతి–ధ్యాస–ఇష్టము కలిగినవాడై వర్తిస్తున్నాడు. నిద్రాప్రియుడు అగుచున్నాడు.

**లింగే సుషుప్తిః :** హృదయపుష్పము యొక్క మూల–ప్రారంభ స్థానమునందు సంస్థితుడై ఉన్నప్పుడు గాఢ నిద్రా పరవశత్వము పొందుచున్నాడు. విషయరహితత్వము, విషయాతీత కేవలసాక్షిత్వములయందు ప్రీతికలవాడై ఉంటున్నాడు.

హృదయ పద్మదళమును దాటిపోయిన – అతీతమైన స్థానమునందు సంస్థితుడు అగుచు, అధిష్ఠానముగా అగుచున్నాడు. **"జాగ్రత్–స్వప్న–సుషుప్తులకు నేను యజమానిని. అవన్నీ నా రచనా వ్యాసంగములే కదా!"**... అని గ్రహించుచు–**తురీయుడు** అగుచున్నాడు.

హృదయ పద్మ దళమును దాటిపోయి, భృకుటీ మధ్య స్థానము – నాశికకు ఊర్ధ్వము అగు **'ఆజ్ఞాచక్రము'**నందు సంస్థితుడై, బ్రహ్మ రంధ్రమును దర్శించుచుండగా, అట్టి యోగి, **హంసస్వరూపుడగుచున్నాడు.**

**యదా హంసో నాదే విలీనో భవతి, తత్ తురీయాతీతమ్ భవతి॥**

ఎప్పుడైతే **"హంస–సోఽహమ్–హంసోహంస"** ... నాదమునందు "అహమస్మి తత్" భావనతో విలీనుడగుచున్నాడో.... అప్పుడా యోగి **తురీయాతీతుడై, వాక్‌చే వర్ణించి చెప్పబడుటకు అశక్యుడై, కేవల చిదానంద జగత్ + జగత్ సాక్షీ స్వరూపుడై ప్రకాశిస్తున్నాడు. సర్వాకార – నిరాకారుడై హంసస్వరూపుడై పరమహంసయై పరమాత్మ అను సంజ్ఞకు సూచనార్థమై వెలుగొందుచున్నాడు.**

## శుద్ధ స్ఫటిక సంకాశమ్

అట్టి యోగి....,

- యోగ సాధన యొక్క పరిపక్వతచే....,
- తురీయ తురీయుడు అగుచుండగా...,

**నాద ఆధార స్థానము – విశుద్ధము నుండి** → **బ్రహ్మ రంధ్రము పర్యంతము** → **శుద్ధ స్ఫటిక సంకాశుడై నిర్మల – నిర్విషయ – విషయాతీతుడై వినిర్మలాత్ముడై ప్రకాశిస్తూ ఉంటాడు.**

**"ఈ సర్వముగా వ్యక్తమగుచు – వ్యక్తీకరించుచున్నది ఆత్మయే! కనుక, ఇదంతా ఆత్మకు అభిన్నము. నేను సహజంగా, స్వతఃసిద్ధంగా ఆత్మస్వరూపుడనే"**.... అను అవగాహన–అనుభూతిచే ఈ హంసోపాసకుడు, **'పరమహంస'** అగుచున్నాడు.

→ తానే బ్రహ్మమై శుద్ధ స్ఫటికమువలె వెలుగొందుచున్నాడు.

→ 'పరమాత్మ' తానే అయి పూర్ణమునందు పూర్ణమునకు పూర్ణమై – విలసిల్లుచున్నాడు.

❖

## హంస మహామంత్ర జపం

ఇప్పుడు...,

హంసోపాసకులు – హంసవ్రతులు అంగన్యాస – కరన్యాస పూర్వకంగా అజపాగాయత్రీ అగు **'హంసోఽహంస'** మంత్రమును గానం చేస్తూ – **సర్వత్రా ప్రకాశమానుడగు ఆత్మ భగవానుని ఉపాసిస్తున్న విధి** గురించి చెప్పుకుందాము.

**జపా గాయత్రి :**

| | |
|---|---|
| **ఓం** | ఓంకార స్వరూపుడగు పరమాత్మకు నమస్కరిస్తున్నాము. |
| **భూర్భువస్సువః** | భూ భువర్ – సువర్‌లోకములన్నీ |
| **తత్** | ఎవ్వరియొక్క – సవితుః = సత్ + విత్ |
| **సవితుః వరేణ్యం** | (సత్ విత్ – ఉనికి ఎరుకల – Presence & Awareness) – కేవల స్వరూపుడు, సవిత్రు దేవుడు, వరేణ్యుడు (శ్రేష్ఠాతిశ్రేష్ఠుడు) అగు ఆత్మ భగవానుని |
| **ధీమహీ** | ధీ మహిమచే – బుద్ధి శక్తి ఔన్నత్యము చేత...., |
| **భర్గో దేవస్య** | అస్య భర్గోః ఏవః – తేజో శక్తిచే (త్రిలోకములు) వెలుగొందుచున్నాయో ..., |
| **ధియో యో నః** | ఆయన మాయొక్క ధీశక్తులను |
| **ప్రచోదయాత్** | ప్రత్యుత్సాహ పరచి, తన వైపుగా ప్రచోదింపజేయును గాక! వికసింపజేయును గాక! |

**అజపా గాయత్రీ మహా మంత్రః**

| | |
|---|---|
| **అథ 'హంస' ఋషిః** | పరమాత్మ (హంస) – ఋషి |
| **అవ్యక్తా గాయత్రీ ఛందః** | అవ్యక్తా గాయత్రీ ఛందో గానము – మౌనస్వరూపముగా ఆత్మ భావనా గానము. |
| **పరమహంసో దేవతా** | పరమహంస దేవత |
| **'హం' బీజమ్** | 'హం' జీవాత్మ (అహమ్ / వ్యష్టిగతమైన నేను) **బీజము** గాను |
| **'సం' శక్తిః** | 'సం' సత్ స్వరూప – సర్వస్వరూప – (సత్ / సమిష్టిగతమైన 'నేను') శక్తిగాను |
| **'సోహమ్' కీలకమ్** | 'సోऽహమ్'... లక్ష్యార్థముగాను |
| **షట్ సంఖ్యా** | – పంచ భూతములు + మనస్సు = జీవాత్మ సాధన వస్తువులు గాను<br>– 'షడాధార దేవతలు' గా అభివర్ణించబడు గణేషుడు–బ్రహ్మ–విష్ణు–రుద్ర– త్రిపురేశ్వరి – సదాశివుడు జపకర్తలు–జపనియామక గురువులు గాను |
| **అహో–రాత్రయోః ఏకవింశతి సహస్రాణి షట్–శతాని అధికాని భవంతి** | ప్రతి రోజు రాత్రి – పగలులో జరుగుచున్న '21600' శ్వాసలు జపరూపములై **అజపాగాయత్రీ మంత్రోచ్చారణలుగా**ను భావించబడుచున్నాయి. "పరమాత్మయే నా ఊపిరి" అని భావన చేయుట జరుగుచున్నది. |

***హంసోపాసకులచే పరమహంస ధ్యానము అనుక్షణికంగా నిర్వర్తించబడుచూ, సాగుతూ ఉంటుంది.***

ఒక రోజులోని ఇట్టి అజపాగాయత్రీ ఫలమును నాలుగు విభాగములుగా సంకల్పించి ఏతత్ దేవతలకు లోక కళ్యాణార్థమై సమర్పించివేస్తూ ఉంటారు.

**సూర్యాయ** – మొదటి భాగము → సూర్యునికి (విరాట్ పురుషునికి, తేజోశక్తి ప్రదాతకు),
**సోమాయ** – రెండవ భాగము → చంద్రునికి (ఓషధులు – ఆహారము – పరిపోషణతత్వానికి–ఓజోశక్తి ప్రదాతకు),
**నిరంజనాయ** – మూడవ భాగము → రంజన రహితమగు నిర్మలబుద్ధి దేవతలకు. నిశ్చల బుద్ధికి,
**నిరాభాసాయ** – నాలుగవ భాగము → ఆభాస (ప్రతిబింబత్వము) అను దోషము లేనట్టి – అంటనట్టి నిరాభాసుడగు పరమాత్మకు!

**సూర్యాయ – సోమాయ నిరఞ్జనాయ – నిరాభాసాయ తన్నో సూక్ష్మమ్ ప్రచోదయాత్**

అను మంత్రముచే "స్థూల దృష్టి దోషమును తొలగించి మా బుద్ధికి సూక్ష్మమైన బుద్ధిని ప్రసాదించండి.... అని జపా–అజపా గాయత్రీ మంత్ర ఫలాన్ని–సృష్టి శక్తులకు, భూమికి, పంచభూతములకు లోకకళ్యాణార్థమై సమర్పిస్తున్నాను"– అను భావనయే సాధన అగుచున్నది.

## హృదయాది అంగన్యాసములు – అంగుష్ఠాది కరన్యాసములు

అజపా గాయత్రీ ధ్యానము యొక్క అనుక్షణికత, ఏకాగ్రత, లక్ష్యసుద్ధికై హంసమహా మంత్రమును అంగ–కర న్యాసాలతో ముందుగా హృదయములోను, త్రిపుటియందు ఆవిష్కరిస్తూ ఉంటారు. సమయము = **నిదురలేచిన మరుక్షణం! మరల నిదురపోవు వరకు!**

**హంస నేను రూపంలో ఉన్న పరమాత్మ నాలోని 'నేను' అందరిలోని 'నేను'**

| | |
|---|---|
| **హం సాం** .... అంగుష్ఠాభ్యాం నమః | **హం సాం** .... హృదయాయ నమః |
| **హం సీం** .... తర్జనీభ్యాం నమః | **హం సీం** .... శిరసే స్వాహా |
| **హం సూం** .... మధ్యమాభ్యాం నమః | **హం సూం** .... శిఖయాయ వౌషట్ |
| **హం సైః** ..... అనామికాభ్యాం నమః | **హం సైః** .... కవచాయహుమ్ |
| **హం సౌం** .... కనిష్ఠికాభ్యాం నమః | **హం సౌం** .... నేత్రతయాయవేషట్ |
| **హం సః** .... కరతలకర పృష్ఠాభ్యాం నమః | **హం సః** .... అస్త్రాయఫట్ |

**అగ్నిషోమాభ్యామ్ ఇతి దిగ్బంధః**

అని న్యాసము చెప్పుకొని, "శ్వాసను ఉపాసనగా, నిశ్శబ్ద-మౌనము కొనసాగిస్తూనే సందర్శనంతో గమనించటం" అనే **అజపాగాయత్రి** చెప్పుచూ...,

**ఏవం కృత్వా హృదయే హంసమాత్మానమ్ ధ్యాయేత్ ॥**

"నా హృదయంలోను, సర్వుల హృదయాలలోను 'నేను' రూపముగా సంచారాలు చేస్తున్న జీవాత్మ సర్వదా పరమాత్మయొక్క లీలా - కల్పనా - క్రీడా - ఛాయా విశేషమే! కనుక తత్ త్వమ్! అహమ్ బ్రహ్మాస్మి".... అని ధ్యానం చేస్తున్నారు!

**హంసోపాసనచే హంసయోగ స్థానమును (లేక) అపరోక్షానుభూతి పొందుచున్న**

**పరమహంస యొక్క దృశ్యవిశేష దర్శనం ఎట్లా ఉంటుంది?**

**అగ్ని సోమౌ పక్షః** .... సూర్యచంద్రులు హంసస్వరూపునకు బాహువులు అగుచున్నాయి.

**ఓంకార శ్శిరః** .... 'ఓం'కారము ఆయనకు శిరస్సు!

**ఉకారోబిన్దు....** ఉకారము, ప్రకృతి - బిన్దుస్వరూప!

**త్రినేత్రమ్** .... **'అ'కార 'ఉ'కార 'మ'కారములు** సత్వ-రజో-తమో త్రిగుణములు, జాగ్రత్-స్వప్న-సుషుప్తులు, భూత-వర్తమాన-భవిష్యత్‌లు ఇవన్నీ త్రి-త్రి-త్రి-నేత్రములుగా అగుచున్నాయి.

**ముఖమ్ రుద్రో** .... లయకారుడగు రుద్ర భగవానుడు అస్మత్ ముఖ స్వరూపులు.

**రుద్రాణీ చరణౌ** .... ప్రకృతి స్వరూపిణి, విశ్వరూపిణియగు రుద్రాణి (అమ్మవారి) చరణములే (ద్వంద్వములు) ఇదంతా! సంచరించే జగత్తంతా రుద్రాణీ స్వరూపమే!

**"జీవాత్మగా జగత్తులోను, పరమాత్మగా జగత్ సాక్షిగాను, ఇహ-పర స్వరూపుడనై ఉన్నది నేనే! అందరు నాకు అభిన్నము. అందరికీ నేను అభిన్నుణ్ణి!"**

ఇట్టి హంస ధ్యానము చేయబడు గాక! ఇట్లు ధ్యానిస్తూ ఉండగా ఆ ముముక్షుత్వము (హంసోఽహంస) కూడా ఉపశమించగా, ఇక **"ఉన్మనీ"** (కేవల మనస్సు) - అను పేరుతో (హంసో తత్త్వజ్ఞులచే) పిలువబడుచున్నాడు.

ఉత్ + మనీ = మనస్సు జనిస్తున్న స్వస్వరూపస్థానము.

**'సోఽహమ్'** జపము ఉపశమించుచుండగా **- సోఽహమ్** భావన స్వభావ సిద్ధమైపోతోంది. 'సాధన అవసరమే లేదు' అని తెలుసుకొని - ఆస్వాదించటానికే సాధన - సాధనా క్రమం కూడా! ముఖ్య - భావన సిద్ధించిన తరువాత, ఇక భావనయే జపమగుచున్నది.

**'ఏవం హంసవశాత్ అస్మానో' విచార్యతే।** 'హంస' అనబడే నేనైన పరమాత్మకు వేరుగా ఎక్కడా మరింకేదీ ఏదీ లేదు. నేను - నీవు - జగత్తు - దేహాలు - జన్మ - మృత్యువులు .... అంతా హంస చమత్కారమే! .... అని బుద్ధి నిశ్చయమౌతుంది. ఇక అన్ని ప్రయత్నములు సశాంతించి, కేవలానుభవము శేషించటమే 'హంసోఽహమ్!'

## 'హంస' జపకోట్యా నాదం భవతి

మనము చెప్పుకున్న **"ఆజ్ఞా చక్రములో 'హంస' మంత్రమును అనుక్షణికం చేస్తూ బ్రహ్మరంధ్రమునందు దృష్టి పెట్టడం"...** అనే జపకోటియొక్క ప్రభావం చేత, అట్టి అభ్యాసి అయినట్టి యోగికి హృదయకమలమునందు 'సోఽహమ్' అనుభవరూపమగు ఒకానొక నాదము ఉత్పన్నమై ఉంటోంది. ఆ శబ్దముయొక్క అనుభవము ఆ యోగి (లేక సాధకుడు, ముముక్షువుయొక్క) సంకల్పము లేకుండా స్వభావ సిద్ధముగా అనుభవము అవుతుంది. అది పదితీరులైన నాదము అయి ఉంటోంది. ఇది కుడిచెవియొక్క అంతర్విభాగము నుండి బయల్వెడలుచూ ఉంటుంది!.

**చిణ్‌తి** .... ప్రథమః (1) మొట్టమొదట 'చిణ్' శబ్దనాదము
**చిణ్‌చిణీతి** .... ద్వితీయః (2) 'చిణ్' – చిణీ' ... ఇతి।
**ఘంటానాద** .... తృతీయః (3) టంగ్ ..... ఘంటానాదము
**శంఖనాదః** .... చతుర్థః (4) ఉమ్.... శంఖానాదమ్ ఇతి।
**తంత్రీనాదః** .... పంచమః (5) ట్రింగ్ ..... తంత్రీనాదమ్ ఇతి।
**తాల నాదః** .... షష్ఠః (6) తధీంధీం .... తాల (గొంతుకతో) నాదమ్ ఇతి।
**వేణు నాదః** .... సప్తమః (7) ఈ.... వేణునాదమ్ ఇతి।
**భేరీనాదః** .... అష్టమా (8) ధుం .... భేరీనాదమ్ ఇతి।
**మృదంగనాదః** .... నవమో (9) తకిట – తటకిట .... మృదంగనాదమ్ ఇతి।
**మేఘనాదః** .... దశమో (10) ఝుంమ్ .... మేఘనాదమ్ ఇతి।

వరుసగా మొట్టమొదటి '9' నాదములను వదలి, **10వది అగు ఒక్క మేఘనాదమును** మాత్రమే స్వీకరించి హంసయోగాభ్యాసులు అద్దానిపై మనస్సు – బుద్ధి నిలిపి ఉంచటమును అభ్యాసం చేస్తున్నారు.

**మరికొంత వివరణ – అంతరార్థములు**

**ప్రథమే చించినాగాత్రమే (చిణిత)** : మొట్టమొదట "హంసోఽహంస" యోగోపాసకునకు దేహమంతాకూడా "చిణ్" నాదం వినబడనారంభిస్తుంది. ఆ శబ్దము అన్ని చక్రాలలోను, దేహమంతా వినబడుచున్నట్లు తోచుచూ ఉంటుంది.

**ద్వితీయం గాత్ర భంజనమ్ (చిణ్–చిణిత)** : రెండవ దశలో 'నేను దేహముచే బద్ధుడను. దేహ పరిమితుడను' అనే బంధ భావన తొలగి .... **"ఈ దేహము ప్రకృతికి చెందినది. ప్రకృతి నాకు నా యొక్క హంసోపాసనకు, ఆత్మయొక్క దివ్యత్వానుభూతికి ప్రసాదించబడిన మహత్తర వస్తువు. సదుపయోగము చేసుకొని, తిరిగి ప్రకృతికి ఇచ్చివేయవలసిన వస్తువు"**–అనే భావనా పరిపుష్ఠితో దేహమును దర్శిస్తాడు. కనుక ఈ దశలో దేహముతో సాంసారిక బంధము తొలగి, సాధనావస్తు సంబంధము ప్రవృద్ధమౌతూ వస్తుంది.

**తృతీయమ్ భేదనమ్ యాతి। (ఘంటానాదానుభవమ్)** : మూడవ దశలో ఈషణములు (Attachments – భార్యేషణ పుత్రేషణ – ధనేషన – గృహేషణ ఇత్యాదులు) భేదనమౌతాయి. "సృష్టి–స్థితి–లయాలు సత్యమే" అను బ్రహ్మ–విష్ణు–రుద్ర గ్రంధుల (మానసికమైన – కల్పన పట్ల సత్యదృష్టి బంధనములు) – చిక్కుముడులు విడిపోతూ వస్తాయి.

**చతుర్థే కంపతే శిరః–శంనాదమ్** : నాలుగవదశలో హంసోపాసనతో పొందుచున్న ఆనందము యొక్క రుచితో శిరస్సు కంపిస్తూ ఉంటుంది. **"ఆహాఁ! ఈ సాంసారికార్థముచే చెలరేగుచున్న ఇంద్రియ విషయాలు ఎంతగా చిన్నవి!"....** అని అతీతత్వ భావన పొడచూపుతూ ఉంటుంది. హృదయములో శంఖనాదము బయల్వెడలి ఇంద్రియ విషయములను – బంధ భావనలను ప్రారద్రోలివేయ నారంభిస్తుంది. విషయముల జోక్యము లేని ఇంద్రియములు **కేవలీ సుఖ రూపముగా అనుభవమవసాగుతాయి.**

**పంచమీ స్రవతీ తాలూ (తంత్రీనాదః)** : ఐదవ దశలో తంత్రీనాదము పుట్టుచుండగా గొంతుకలో రసము స్రవిస్తూ ఉంటుంది. ఒకానొక మధురమైన రసానుభూతి ఉదయిస్తూ వస్తూంది. **"ఈ దృశ్యమంతా సర్వమూ మధురరసానుభూతి రూపమే"** ... అని అనిపించసాగుతుంది.

**షష్ఠే అమృత నిషేషణము (తాలనాదః)**: ఆరవ (6) దశలో అమృతము స్రవిస్తుంది. చంద్ర–సూర్య మండలములు ఏకమై ఆ యోగి (లేక) ఉపాసకుడు అమృత స్వరూపమును – మార్పు చేర్పులు లేని సహజ రూపమును గ్రోలుతూ ఉంటాడు. దృశ్యము–ద్రష్టత్వము మొదలైనవి ఆతనికి, వాటివాటి కష్ట–సుఖ విషయాలతో సహా అమృత స్వరూపమౌతాయి.

**సప్తమమ్ గూఢ విజ్ఞానం (వేణునాదమ్)** : ఏడవ దశలో నిగూఢమగు ఆత్మజ్ఞానము - విజ్ఞానము యొక్క ఉత్తమ స్థితి కలుగుచూ ఉంటాయి. ఆత్మయొక్క అఖండత్వ-అప్రమేయ-నిత్యత్వ విశేషణాలు ఆతని బుద్ధికి **"అవును కదా"** - అని అనిపించసాగుతాయి. అనుభవ రూపము సంతరించుకోసాగుతాయి.

**పరావాచా తథా అష్టమ (భేరీనాదము)** : ఎనిమిదవ దశలో పరావాక్కుతో - పరా అనుభవముతో (తనయొక్క ఇహ స్వరూపమునకు సాక్షియై చెన్నొందుచున్న పర స్వరూపముతో) ఎడతెగని సంయోగము, అనుబంధము కలుగటం ప్రారంభమౌతుంది. **"స్వప్న దృశ్యమునకు నేను వేరుగా ఉన్నట్లుగా, జాగృత్ దృశ్యమునకు కూడా వేరుగానే ఉన్నాను కదా!"** అని తెలుసుకో సాగుతాడు.

**అదృశ్యమ్ నవమే దేహమ్ (మృదంగనాదమ్)** : తొమ్మిదవ దశలో అదృశ్య స్వరూపుడగు క్షేత్రజ్ఞానానుభవం (దేహి-అనుభూతి) ఆరంభించి ప్రవృద్ధమగుచూ, నిర్మలమగు దివ్య చక్షువులు (జ్ఞాన దృష్టి - ఆత్మదృష్టి) ప్రవృద్ధము-అనునిత్యము కావటం ఆరంభమౌతుంది. ఈ జీవుడు ఈశ్వర స్వరూపుడై, జీవునకు సాక్షి-నియామకుడు-పర్యవేక్షకుడు అయి ఆనందిస్తున్నాడు. "ఒక దేహములోని నేను" .... స్థితిని అధిగమించి, - "సహస్రశీర్షా - ఈ వేలాది అందరిలోని నేనైన నేను" .... ప్రవృద్ధం కాసాగుతుంది.

ఈ 9 నాదములు దాటిపోయి, **10వది అగు మేఘనాదముతో** బుద్ధిని నిలిపినప్పుడు ఇక ఆ యోగి (సోఽహమ్ ఉపాసకుడు).... పరబ్రహ్మ స్వరూపుడై వెలుగొందుచున్నాడు! (ఊర్ధ్వభాహుః విరేమేష్య - అహమస్మి బ్రహ్మమ్)! **"అందరిలోని నేను అందరుగా నేను! సర్వమునకు వేరైన నేను"** ... అను త్రిమూర్తీ - ఏకస్వరూపము స్వభావసిద్ధమగుచున్నది!

## హంసోపాసన ..... సోఽహమ్ యోగము

# ఫలశృతి

ఈ హంసోపనిషత్ వర్ణితము అగు **"హంసోఽహంస! సోఽహమ్! హంసోపాసన!"** చే, ఆయోగి (సాధకుడు) తన ఆత్మయొక్క విభవమే జగత్ రూపము-అని ఎరిగినవాడై...., పరమహంసగా ఆత్మ ప్రకాశమానుడగుచున్నాడు.

**తస్మాత్ మనో విలీయతే ... ఇతి ఉన్మనీ :** ఆతని మనస్సు ఆత్మయందు విలీనమై ఆత్మస్వరూపముగా రూపు దిద్దుకొంటోంది. దర్పణములో ఏదేది ప్రతిబింబించినా కూడా,... దర్పణములో ఆ వస్తువూ - ఆ రూపమూ ఉన్నాయా? వాస్తవానికి లేవు కదా! కేవల మనోరూపుడై, మనోవిషయములన్నీ దర్పణ ప్రతిబింబ మాత్రముగా అయి ఆతడు ప్రకాశిస్తున్నాడు.

దర్పణములో ఒక వ్యక్తి యొక్క కదలికలు ప్రతిబింబిస్తుంటే..., ఆ వ్యక్తి దర్పణములో ఉండి ఉన్నట్లా? కాదుకదా!

నిర్మల మనోదర్పణములో ప్రతిబింబించే జగత్-నామ-రూపాలు-సంఘటనలు మొదలైనవి వాస్తవానికి మనోదర్పణములోనూ లేవు! మరెక్కడా లేవు! ఆత్మ జ్ఞానముచే **"ఆత్మకు వేరుగా మనస్సు అనబడునదేదీ లేదు!"**.... అని తెలియవచ్చుచున్నది. ఈవిధంగా **"మనస్సు"** అనబడేది ఆత్మకు అభిన్నమై అనుభూతమవటమే **'మనోలయము'**! పరమహంస మనస్సు లేనివాడై, మనస్సుగా ఉన్నది ఆత్మతత్త్వమే... అని గమనిస్తూ, **'మనోసాక్షి'**గా విరాజిల్లుచున్నాడు. మనస్సు ఆత్మస్వరూపమే అయిన తరువాత ఇక మనస్సుచే ఆత్మ బంధించటమనేది ఎక్కడిది? ఇది 'ఉన్మనీ స్థితి' గా కూడా అభివర్ణించబడుతోంది.

**మనసిగతే సంకల్ప - వికల్పే ...** ఆ పరమ హంస సంకల్ప - వికల్పములను (Idea - Formation and withdrawl of Idea), సర్వవిషయములను ఆత్మయందు లయింపజేస్తున్నారు అనగా, ఆత్మకు అభిన్నమైనవిగా గమనించుచున్నారు. ఆత్మగా దర్శిస్తూ ఉంటున్నారు. **అహమ్ బ్రహ్మాస్మి**-అను అనుభవములో వ్యష్ఠి-జీవత్వ భావనలను-**జలంలో కరిగిపోతూ ఉన్న ఉప్పు బొమ్మవలె** - దర్శిస్తున్నారు.

**దగ్ధే పుణ్య - పాపే : "సర్వము మమస్వరూపమగు పరబ్రహ్మమే! ఇక ఇందులో పుణ్యపాపములు ఎక్కడున్నాయి?"**.... అని గమనించినవారై ఉంటున్నారు. మట్టితో రాక్షసుడి బొమ్మ - దేవత బొమ్మ తయారుచేసినప్పుడు,..... రాక్షస బొమ్మలోని మట్టి - దేవతా బొమ్మలోని మట్టి ... మట్టి దృష్ట్యా వేరు వేరు కాదు కదా! అట్లాగే ఆత్మ భగవానునికి ఎప్పుడూ ఎక్కడా భిన్నమైనది లేదని దర్శిస్తూ.... పుణ్య-పాప ఇత్యాది ద్వంద్వ భావములను ఆత్మజ్ఞానాగ్ని యందు దగ్ధం చేసినవాడై ఉంటున్నారు.

**సదాశివః :** "జ్ఞానిగాను-అజ్ఞానిగాను, ఎరిగినవాడు గాను, ఎరుగనప్పుడు, దేహము ఉన్నప్పుడు లేనప్పుడు - ఎల్లప్పుడు - సదా - శివస్వరూపుడనే".... అని సదాశివత్వం పుణికి పుచ్చుకొని ఉంటున్నాడు.

**శక్త్యా :** శివ-శక్తి స్వరూపానుభూతి కలిగినవాడై ఉంటున్నాడు. "నేను - నా ప్రకృతి" ఈ రెండిటి ఏకత్వములోని భిన్నత్వమే ఈ జగత్ దృశ్యమైయున్నది... అని ఆస్వాదిస్తున్నారు. ఏకత్వము విడువకనే శివశ్శక్త్యా - భిన్నత్వమును వినోదిస్తున్నారు.

**జీవాత్మగా ఉన్నది పరమాత్మయే! జీవాత్మలు అనేకంగా కనబడుచున్నప్పటికీ ఆత్మ అఖండము! అప్రమేయము! ప్రతి జీవుని ఈ జీవాత్మత్వము సందర్భ సత్యము మాత్రమే! పరమాత్మత్వమో, అనునిత్యసత్యము! సదాశివము!**

సర్వ జీవులు తానై, సర్వసాక్షిగా వేరైన అఖండ – అప్రమేయ ఆత్మానందమే పరమహంసలు విహరిస్తున్న బ్రహ్మానంద క్షీర సాగరము..

ఆ పరమాత్మయే తానైన పరమహంస యొక్క అనిర్వచనీయ స్వానుభవం ఎటువంటిది? **అవర్ణనీయం! వర్ణనాతీతం!**

**సర్వత్రా అవస్థితః**

- ❖ స్వప్నము తనదైన స్వప్న ద్రష్ట–స్వప్నములోని ఒకవిభాగంలో ఉంటాడా? లేదు. అట్లాగే, ఆతడు తనయొక్క స్వప్నచైతన్యముచే స్వప్నమంతా నింపి ఉంచునట్లు, స్వప్నముతో అంతా తానే అయి, సర్వత్రా అవస్థితుడై ఉన్నట్లు....,
- ❖ కథా రచయితయొక్క కల్పనా చైతన్యమే కథ (లేక నవల)లోని సర్వ పాత్రలు, సంఘటనలు, సందర్భములు, పాత్రల మధ్యలో గల సంబంధ–అనుబంధ బాంధవ్యములు అయిఉంటున్న తీరుగా...,

  హంసోపాసకుడు,స సోఽహమ్ భావకుడు, 'సోఽహమ్ స' మంత్రార్థతత్త్వవేత్త ..., అగుచున్నాడు.

  **ఈ బ్రహ్మాండములుగా, ఈ సర్వలోకములుగా**–ఆత్మ స్వరూపుడనైనట్టి నేనే – సర్వదా, సర్వత్రా **"అవస్థితుడనై ఉన్నాను"** అను పరమ సత్యమును అనుక్షణికంగా ఆస్వాదిస్తున్నారు. స్వీయ కల్పన, రచనలవలె ఆస్వాదిస్తూ, సర్వము తానే అయి ఉంటున్నాడు.

**స్వయం జ్యోతిః**

- ❖ మమాత్మయే జ్యోతి స్వరూపమై ఇక్కడ పంచభూతములను, జాగ్రత్ స్వప్న సుషుప్తులను, జీవ–ఈశ్వరతత్త్వములను, బ్రహ్మాండములను, బ్రహ్మాండంతర్గత దేహ–దేహాంతర పరంపరములను, సత్–చిత్–ఆనందములను, ఈ సమస్తమును వెలిగించుచున్నది. ప్రకటించుచున్నది. అట్టి 'హంస' జ్యోతిని వెలిగించు జ్యోతి మరొకటి లేదు.

***జ్యోతిర్జ్యోతిః స్వయం జ్యోతిః ఆత్మజ్యోతిః శివోఽస్మ్యహమ్***

అను స్వయం జ్యోత్యానంద వెలుగులును విరజిమ్ముతూ ఉన్నారు. ఆ పరమహంస, తాను స్వయంజ్యోతి అయి..., ఈ జగత్తులను, సర్వ సహజీవులను స్వయం జ్యోతి యొక్క కిరణరూపములుగా ఆస్వాదిస్తున్నారు.

**శుద్ధో :** అస్మత్ 'హంస' రూపము సదా శుద్ధము. జాగృత్–స్వప్న–సుషుప్తులతోగాని, అందులోని అంతర్గత కర్మ–పుణ్య–పాపాది సంగతుల చేతగాని స్పృశించబడనట్టి నిత్యముక్త స్వరూపము – అని ఆ **పరమహంస** సందర్శిస్తున్నారు.

**నిత్యో :** ***"కాలమునకు నియామకమైయుండి, భూత–వర్తమాన–భవిష్యత్ త్రికాలములకు సాక్షినై, వాటికి సంబంధించక, మార్పు చేర్పులు చెందని కాలఃకాలము*** – నాయొక్క పరమహంస స్వరూపము! హంసతత్త్వమై క్రీడగా కాలమును సంకల్పించుచున్నాను. నియమించుచున్నాను. అందులో సంచారాలు చేసే నాయొక్క జీవాత్మ తత్త్వమంతా ఆటలలోని ఆట వస్తువులుగా కల్పించుకొనుచున్నాను. పరిపాలించుచున్నాను. మరొకప్పుడు ఆ కాల–చక్రమును, కాలాంతర్గత సర్వ విషయములను లయింపజేసుకొనుచున్నాను. మరల ఎప్పుడో సృష్టులను కల్పించుకొనుచూ ఉన్న నిత్యోదిత స్వరూపమగు **'హంస'**ను నేను!... అని పరమహంస తన హంసత్వమును అద్వితీయముగా (జగత్తంతా నేనే – అని ఎరిగినవాడై) అనుభూతయుతుడగుచున్నారు. స్వదేహ భావంగా ఆస్వాదిస్తున్నారు.

**నిరంజనః :** నిత్య నిర్మలమై, అస్పృశ్యమై 'హంస'యై సర్వత్రా వెలుగొందుచున్నారు!

**శాంతతమః :** సర్వతత్త్వానందము–కేవలీరూపము అగు అస్మత్ హంసస్వరూపము పరమశాంతమైనది! సర్వదా ....,

**శాంతము – శివము – అద్వైతము – సగుణ – నిర్గుణాతీత కేవలసాక్షి!**

ఆకాశము మేఘముల రాక – పోకలచే తనయొక్క సహజసిద్ధమగు అనంతతత్త్వము – అప్రమేయత్వములను కోల్పోతోందా! లేదు కదా! అట్లాగే .... పరమ శాంతమగు అస్మత్ హంసత్వము జన్మ–కర్మ–సృష్టి–స్థితి–లయ–కాలములచే తన సహజ సిద్ధమగు అనంతత్వము–అప్రమేయత్వము కించిత్ కూడా కోల్పోవటం లేదు.

సర్వదా శాంతము – శాంతతరము – శాంతతమము అయి హంస (ఆత్మ) అంతటా విరాజిల్లుచున్నది – అని గ్రహించి, క్షీరసాగరంలో శయనించే విష్ణుమూర్తివలె.... సర్వము పర్యవేక్షిస్తున్నారు. వీక్షిస్తున్నారు.

ఈవిధంగా ఆ పరమహంస హంస (కేవలాత్మ) స్వరూపుడై..., **"సదాశివ – శక్త్యా"** సమేతుడై, సర్వత్రా వ్యవహరిస్తూ..., నిరాభాసమై, స్వయంజ్యోతి స్వరూపమై, శుద్ధమై, శాంతమై, నిత్యమై, నిరంజనమై, సర్వమై, పరమ శాంతమై ప్రకాశమానమగుచున్నారు!

**హంసోఽహమ్! హంసోఽహమ్! హంసోఽహమ్!**

***ఇతి వేదానువచనమ్! ఇతి హంసోపనిషత్!!***

***ఓం శాంతిః శాంతిః శాంతిః***

## వేదోపనిషత్ - అంతర్గత
# శాంతి - మంగళ శ్లోకములు

ఓం

1. శివనామ నిభావితే
అంతరంగే, మహతి జ్యోతిషి
మానసీమయాఽర్ధే
దురితాని అపయాన్తి దూరదూరే
ముహురాయాన్తి
మహాన్తి మంగళాని।

ఏ **పరమశివము** మహత్తరమై - అఖండజ్యోతి స్వరూపమై సర్వజీవుల హృదయాంతరంగములలో సదా వెలుగొందుచున్నదో- అట్టి పరమార్థమగు **శివ బ్రహ్మమును** స్తుతించుచున్నాము.

- మేము ఆరాధించు తత్త్వము మాయొక్క సర్వ దురితములను మా నుండి తొలగించును గాక!

**- మహత్తరము, మంగళ ప్రదము అగు పరబ్రహ్మ స్థానమునకు మమ్ములను తిరిగి చేర్చును గాక!**

2. స్మృతే సకల కల్యాణ భాజనం
యత్ర జాయతే
పురుషః యస్య అజమ్,
నిత్యమ్ వ్రజామి శరణమ్।
హరిః ఓం॥

సర్వ శుభములను చేకూర్చు కళ్యాణ భాజనుడు, జన్మరహితుడు, నిత్యుడు అగు ఏ పరమ పురుషుని స్మృతులన్నీ గానం చేస్తూ చూపుచున్నాయో,... అట్టి **ఓం కార స్వరూప శ్రీహరియగు విష్ణు భగవానుని మమ్ములను మాయనుండి దాటించుటకై శరణు వేడుచున్నాము.**

3. ఓం వాక్ మే మనసి ప్రతిష్ఠితా।
మనో మే వాచి ప్రతిష్ఠితమ్।
ఆవిః ఆవీః మ(మే) ఏధి
వేదస్య మ (మే) ఆణీస్థః।
శ్రుతం మే మా ప్రహాసీః।
అనేన అధీతేన,
అహో రాత్రాన్ సందధామి।
ఋతమ్ వదిష్యామి।
సత్యమ్ వదిష్యామి।
తత్ మాం అవతు ।
తత్ వక్తారమ్ అవతు।
అవతు మాం।
అవతు వక్తారమ్॥
ఓం శాంతిః। శాంతిః। శాంతిః॥

ఓం కార పరబ్రహ్మమును స్మరించుచున్నాము.

నా వాక్కు - నేను పలుకు పలుకులు నా మనస్సునందు సుస్థిరమై, ప్రతిష్ఠితమై ఉండును గాక!

నాయొక్క మనస్సు వాక్కునందు నెలకొని, ప్రతిష్ఠితమగును గాక! మనస్సు ఒక తీరుగా, వాక్కు మరొక తీరుగా ప్రవర్తనము కలిగి ఉండకుండును గాక!

ఓ పరంజ్యోతి స్వరూప పరమాత్మా! నా అజ్ఞానాంధకారమును పోగొట్టుటకై విజ్ఞాన దీపమును వెలిగించండి! మా మనో-వాక్కులు విజ్ఞానము కొరకై సమర్థమగును గాక!

మేము గురువుల నుండి, గ్రంథములనుండి ఎరుగుచున్నదంతా మాయందు సుస్పష్టము- సుస్థిరము అగును గాక!

వినుచున్నదంతా యథా - అర్థసహితంగా బుద్ధి-హృదయములలో ప్రవేశించి వికసించి ఉండును గాక!

అనేక రీతులుగా అధ్యయనము చేస్తున్న ఆత్మతత్త్వ విశేషాలు మేము రాత్రింబవళ్ళు - ఎల్లప్పుడు బుద్ధితో 'అవగతము' తో కూడుకొని అనుసంధానము చేయుచుండెదము గాక! ఋక్కులు (వేదోపనిషత్తులు, వేదవేత్తలు, ఆత్మవేత్తలు) చెప్పుచున్న ఋతమునే పలికెదము గాక! యథార్థమునే పలికెదము గాక!

'సత్' స్వరూపమగు చిదానంద పరబ్రహ్మము గురించియే చెప్పుకొనుచుండెదము గాక!

సర్వరక్షకుడగు ఆ పరబ్రహ్మ భగవానుడు నాకు, వక్తారుడై నాకు బ్రహ్మతత్త్వమును బోధిస్తున్న సద్గురువునకు సదా రక్షకుడై ఉండును గాక!

నాకు, ఆచార్యులవారికి సర్వదా సర్వ సమృద్ధములు ప్రసాదిస్తూ... పరిపోషించుచుండును గాక!

**ఆధి - ఆత్మిక, ఆధి - దైవిక, ఆధి - భౌతిక త్రితాపములు ప్రశాంతమగు ఆత్మయందు ఆత్మత్వము పొంది సశాంతించును గాక!**

**4.** **ఓం పూర్ణమ్ అదః।**
**పూర్ణమ్ ఇదమ్।**
**పూర్ణాత్ పూర్ణమ్ ఉదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమ్ ఆదాయ,**
**పూర్ణమేవ అవశిష్యతే॥**
**ఓం శాన్తి శాన్తి శాన్తిః॥**

'పరాత్పర' స్వరూపమగు ఆ బ్రహ్మము సర్వదా (సర్వకాల - అవస్థలయందు) సదా పూర్ణము. (The Experiencer of the Experiencer is complete by itself).

'ఇహాత్మ' స్వరూప విభాగ విశేషములగు జీవాత్మ (The Experiencer) - జగత్తు (All that being experienced) లు కూడా పూర్ణమే!

పూర్ణమగు 'పరాత్మ' నుండియే పూర్ణమగు 'ఇహాత్మ' (జలంలో తరంగముల వలె) బయల్వెడలి సంప్రదర్శితమగుచున్నది.

(మట్టి నుండి కుండలు, బంగారము నుండి ఆభరణములు, జలము నుండి తరంగములు బయల్వెడలుచున్నప్పటికీ మట్టి - బంగారము - జలము సర్వదా యథాతథమై యున్న విధంగా) ....,

.... పూర్ణమగు పరమాత్మ నుండి జాగ్రత్ - స్వప్న - సుషుప్తి అనుభవి స్వరూపుడగు జీవాత్మ బయల్వెడలి, సంప్రదర్శితుడగుచూ ఉన్నప్పటికీ....

(సర్వజీవుల) స్వస్వరూపమగు పరమాత్మ (లేక) పరబ్రహ్మము సర్వదా యథాతథమే! పూర్ణమే!

**భ్రమాత్మకములగు తాపత్రయములు అట్టి ఓంకార పరబ్రహ్మమునందు సశాంతించునవై ఉండును గాక!**

---

**5.** **హరిః ఓం॥**
**సహ నా(నౌ) అవతు**
**సహ నౌ భునక్తు।**
**సహ వీర్యం కరవావహై।**
**తేజస్వినా (నౌ)**
**అధీతమ్ అస్తు।**
**మా విద్విషావ హై**
**ఓం శాంతిః। శాంతిః। శాంతిః॥**

ఓంకార సర్వాత్మ స్వరూపుడగు శ్రీహరికి నమస్కరిస్తున్నాము.

శిష్య - ఆచార్యులమగు మనమిరువురము సర్వజగద్రక్షకుడగు ఆ పరమాత్మచే సదా **సంరక్షించబడెదము** గాక!

సర్వజీవ పరిపోషకుడగు ఆ పరంధాముడు శిష్య - ఆచార్యులమగు మన ఇరువురిని **పరిపోషించును** గాక!

(గురు శిష్యులమగు) మనము ఇరువురము **ధైర్య - ఉత్సాహ - సాహసములచే వీర్యవంతులమై బ్రహ్మతత్త్వ - అధ్యయనమునందు పరిశ్రమించెదము గాక!** నిర్వర్తించెదము గాక! ఆ పరబ్రహ్మతత్త్వము మనపట్ల తేజోవంతమై సు-ఫలప్రదమగును గాక!

(శిష్యునకు వినటము రాదు - ఆచార్యులకు చెప్పటము రాదు - ఇత్యాది) అల్ప భావములకు లోనై శిష్య - ఆచార్యులమగు మనమిరువరము పరస్పరము ద్వేషించుకొనకుండెదము గాక! ప్రేమించుకొనెదము గాక! మన ఇరువురి మధ్య ఆప్యాయత - ప్రపత్తులు వెల్లివిరియును గాక!

**దృశ్య - ద్రష్ట - దర్శన త్రయములు ఆత్మరూపమునందు సశాంతించినవగును గాక!**

---

**6.** **ఓం**
**శం నో మిత్రః। శం వరుణః।**
**శం నో భవతు అర్యమా।**
**శం న ఇంద్రో బృహస్పతిః।**
**శం నో విష్ణుః ఉరుక్రమః॥**
**నమో బ్రహ్మణే।**
**నమస్తే వాయో।**
**త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాఽసి।**
**త్వాం ఏవ ప్రత్యక్షం బ్రహ్మ**
**అవాదిష్యామ్।**

(పంచ ప్రాణములలోని 'ప్రాణము'నకు, 'పగలు'కు అభిమాన దేవతయగు) **మిత్ర భగవానుడు....,**

- ('అపానము'నకు, 'రాత్రి కాలము'నకు అభిమాన దేవతయగు) **వరుణ భగవానుడు...,**

- (దృష్టితత్త్వాభిమాని, పితృలోకములో శ్రేష్ఠుడు అగు) **అర్యమభగవానుడు...,**

- (త్రిలోకములలోని / ఈ దేహములోని ఇంద్రియ తత్త్వముల అభిమాని - అధి దేవత అగు) ..... **ఇంద్రభగవానుడు...,**

- (దేవతలకు గురువు, బుద్ధ్యభిమాన దేవత అగు) **బృహస్పతి భగవానుడు...,**

- (త్రివిక్రమావతారంలో త్రిపాదములతో భూమి - ఆకాశములను, అహంకార తత్త్వమును కొలచి వేసిన) ఉరుక్రమ బిరుదాంకితుడగు **విష్ణు భగవానుడు** మాకు శుభములను సర్వ ప్రశాంతతలను ప్రసాదించును గాక!

ఋతం అవాదిష్యామ్।
సత్యం అవాదిష్యామ్।
తత్ మా ఆవీత్।
తత్ వక్తారమ్ ఆవీత్।
ఆవీత్ మాం।
ఆవీత్ వక్తారమ్।
ఓం శాంతిః। శాంతిః। శాంతిః॥

ఓ వాయు భగవాన్! ప్రాణస్వరూపా! ప్రాణేశ్వరా! సర్వ స్వరూపము - సర్వసాక్షి అగు పరబ్రహ్మమా! సర్వాత్మకుడా! ఆత్మదేవా! సర్వస్థితుడవగు మీకు భక్తి పూర్వకంగా నమస్కరిస్తున్నాము.
మిమ్ములను 'ప్రత్యక్ష బ్రహ్మము'గా (దృశ్యజగత్తును/విశ్వేశ్వరుడుగా) దర్శించుచున్నాము. స్తుతించుచున్నాము.
ఋగ్వేదములోని ఋక్కులచే, సర్వవేదములచే అభివర్ణించబడుచున్న 'ఋతము' అగు పరమాత్మను స్తుతించుచున్నాము.
'సత్' స్వరూప పరబ్రహ్మము గురించిన సత్యమును స్తుతించుచున్నాము.
అట్టి పరబ్రహ్మము నన్ను, నాకు తత్త్వజ్ఞానము బోధిస్తున్న ఆచార్యుల వారిని సదా రక్షించును గాక! ఉభయులను కాపాడును గాక!
**భూ భువర్ సువర్ త్రిలోక సర్వభేదములు నిర్మల పరబ్రహ్మ స్వరూపమునందు సశాంతించినవగు గాక!**

---

**7.** ఓం
అహం వృక్షస్య రేః ఇవ।
కీర్తిః పృష్ఠం గిరేః ఇవ।
ఊర్ధ్వ పవిత్రో వాజినీవ,
'స్వమ్' అమృతమస్మి।
ద్రవిణగ్ం సవర్చసమ్
సుమేధాః అమృతో అక్షితః।
ఇతి త్రిశంకోః వేద అనువచనమ్॥
ఓం శాంతిః। శాంతిః। శాంతిః॥

ఈ 'సంసారము' అను వృక్షమునకు 'ఆధారము' అయి ఉన్న 'రేః' - చైతన్య స్ఫూర్తి నేనే! పర్వతముయొక్క శిఖరాగ్రమువలె నా 'కీర్తి'యే వేద-ఉపనిషత్ వాఙ్మయ పర్వత శిఖరముపై ప్రకాశమానమై యున్నది.
ఊర్ధ్వ పవిత్రత (ఘనత)గా సర్వత్రా ఉన్నది - నాలోని నేనైన ఆత్మయే! ఆకాశంలో ఎల్లప్పుడూ ప్రకాశించే సూర్యునికి ఉదయాస్తమయములు లేని తీరుగా నేను స్వయముగా... **జన్మ - మృత్యువులకు చెందనట్టి, సంబంధించనట్టి 'అమృత స్వరూపుడను' అయియే ఉన్నాను.**
ఈ దృశ్యమంతా నాకు సంపద అయినట్టి బ్రహ్మ వర్చస్సు. సృష్టికళా విశేష సమన్వితుడను కదా!
ఇదంతా నా చిదానందము! ఎరుకరూపము. వేదో వీక్షణము! బుద్ధి ప్రదర్శన చమత్కారము! మార్పు చేర్పులకు ఆవల, దృష్టికి ఆవల ... కేవల దృక్-అమృత-ఆనంద స్వరూపుడను!
ఇతి త్రిశంకు మహర్షి ప్రవచిస్తూ బోధించు వేద ప్రమాణముతో కూడిన అనువచనము. **దృశ్య - జీవ - ఈశ్వర భేదమంతా ఆత్మానందమునందగు సశాంతించినవగును గాక!**

---

**8.** ఓం
యః (యం) ఛందసాం
ఋషభో విశ్వరూపః,
ఛందోభ్యో అధి అమృతాత్
సంబభూవ,
సః మే ఇన్ద్రో మేధయా స్పృణోతు।
అమృతస్య దేవ ధారణో భూయాసమ్।
శరీరమ్ మే విచర్షణమ్।
జిహ్వా మే మధు మత్తమా।
కర్ణాభ్యాం భూరి విశ్రువమ్।
బ్రహ్మణః కోశోసి
మేధయా పిహితః।

ఏ ప్రణవ నాదమును వేదములు ప్రప్రథమంగా పలుకుచున్నాయో, ఈ విశ్వమంతా ఎద్దానికి తన రూపమే అయి ఉన్నదో...,
ఏ 'ఓం' కారము అమృత రూపమై, ఆత్మరూపమై వేద వాఙ్మయము నుండి ప్రవచన - నిర్వచన రూపంగా ప్రకటించబడుచున్నదో...,
అట్టి మహత్తర ఆత్మ తత్త్వము నా ఇంద్రియములను, మేధస్సును (బుద్ధిని) విజ్ఞానరూపమై స్పృశించును గాక!
నేను ఇంద్రుడంతటి మేధస్సు కలిగియుండెదము గాక! ఓ ఆత్మదేవా! నేను అమృతరూపమగు బ్రహ్మజ్ఞాన 'ధారణ' పొందినవాడను అయ్యెదను గాక!
ఈ నా శరీరము బ్రహ్మతత్త్వము యొక్క శ్రవణ - మనన - నిది ధ్యాసల నిమిత్తమై అర్హము, ఆరోగ్యవంతము, జలసమన్వితము అయి ఉండును గాక!
నా ఈ నాలుక - బ్రహ్మతత్త్వ విశేషాలను పలుకు మాధుర్యము కలిగి ఉండును గాక!
ఈ నా చెవులు ఆచార్యుల వద్ద నుండి బ్రహ్మతత్త్వ ప్రవచ వాక్యములు విరివిగా వినుటకు యోగ్యమై ఉండును గాక!
సంసార రూపములైనట్టి పంచకోశములకు సంబంధించిన బుద్ధిచే, మాయందు అంతరంగమున అనునిత్య ప్రకాశమైయున్న **పరబ్రహ్మము** కప్పబడినదై ఉన్నది.

శ్రుతం మే గోపాయ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

ఓ ఆత్మ దేవా! మీ గురించి వినుచున్న మాటలచే (గురువాక్యములచే - వేదాంత సిద్ధాంతములచే), మీరు వినబడుచున్నవారై మమ్ములను గోపాయ - కాపాడండి! **మా యొక్క స్థూల - సూక్ష్మ - కారణ దేహములు ఆత్మ రూపము సంతరించుకొని ఆత్మగా సశాంతించునవై ఉండును గాక!**

---

9. ఓం
ఆప్యాయన్తు మమ అంగాని
వాక్ ప్రాణః చక్షుః శ్రోత్రమ్ అథో బలమ్
ఇంద్రియాణి చ సర్వాణి।
సర్వమ్ బ్రహ్మ – ఔపనిషదమ్। (బ్రహ్మోపనిషదా)
మా అహమ్ బ్రహ్మ నిరాకుర్యామ్।
మా మా బ్రహ్మ నిరాకరోత్।
అనిరాకరణమ్ అస్తు।
అనిరాకరణమ్ మే అస్తు
తత్ ఆత్మని నిరతే
య ఉపనిషత్సు ధర్మాః,
తే మయి సన్తు।
తే మయి సన్తు॥
ఓం శాంతిః శాంతిః శాంతిః॥

ఓంకార సంజ్ఞాస్వరూప సర్వతత్త్వ స్వరూపుడవగు ఓ పరమాత్మా! ఇది మా విన్నపము! వినండి. ఉపనిషత్తులచే చేతులెత్తి ప్రకటించబడుచున్న **బ్రహ్మము (లేక) సర్వాత్మకుడగు** పరమాత్మ మా యొక్క సర్వ అంగములను, వాక్కును, ప్రాణమును, కళ్ళను, చెవులను (కాళ్ళు-చేతులు, నడతలు, పనులు, మాటలు, శక్తి, చూపు, వినుచున్నవి - వీటన్నిటినీ) - బ్రహ్మోపాసనకై ఆప్యాయము, మధురము చేసి, సిద్ధము చేయును గాక!

- బ్రహ్మము (బ్రహ్మజ్ఞానము) నన్ను నిరాకరించకుండును గాక!

- నేను బ్రహ్మజ్ఞానమును నిరాకరించకుండుదును గాక! బ్రహ్మము - నేను పరస్పరము ఆదరణ, ఆప్యాయత కలిగి ఉండెదము గాక!

ఉపనిషత్తులు చెప్పు ఆత్మ ధర్మము గురించిన సమాచారము - విశేషముల అధ్యయనము నందు మేము నిరతులమై ఉండెదము గాక!

అట్టి పరబ్రహ్మము మమ్ము కాపాడును గాక! రక్షించును గాక!

**భూత - వర్తమాన - భవిష్యత్ త్రికాల కల్పనా విశేషమైనట్టిదంతా ఆత్మ స్వరూపమై ఆత్మయందు లయించి శాంత - ఆత్మత్త్వమును సంతరించుకొనును గాక!**

---

10. ఓం
భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః।
భద్రం పశ్యేమ అక్షభిః యజత్రాః।
స్థిరైః అంగైః తుష్టువాగ్ంసః తనూభిః।
వ్యసేమ దేవ హితం యత్ ఆయుః।
స్వస్తి నః ఇంద్రః వృద్ధశ్రవాః।
స్వస్తి నః పూషా విశ్వవేదాః।
స్వస్తి నః తార్క్ష్యో అరిష్టనేమిః।
స్వస్తి నః బృహస్పతిః దదాతు॥
ఓం శాంతిః శాంతిః శాంతిః॥
భద్రం మే అపివాతాయ మనః॥
ఓం శాంతిః శాంతిః శాంతిః॥

ఓ దేవతలారా! మీరు ప్రసాదించిన ఈ చెవులతో మేము భద్రమగు (శుభ ప్రదమగు) దాని గురించియే (బ్రహ్మ తత్త్వమునే) వినుచుండెదము గాక!

యజన (యజ్ఞ - యాగ - యోగ ప్రయత్న) శీలురమగు మేము భద్రమైన దానినే (సర్వము బ్రహ్మముగా) చూచుచుండెదము గాక!

బలము - కలిగియున్న అంగములతో ఆరోగ్యవంతము అగు శరీరముతో - దేవతలచే ప్రసాదించబడిన ఆయుష్షును దేవతల హితముగా (దేవతలకు ప్రియముగా) - గడుపుచుండెదము గాక!

ఔన్నత్యముతో కూడిన వినికిడిగల, పురాణ ప్రసిద్ధుడగు **ఇంద్ర భగవానుడు,** విశ్వతత్త్వము ఎరిగిన **సూర్యభగవానుడు,** దోషములను తొలగించి మమ్ములను పవిత్రులుగా తీర్చిదిద్దుదురు గాక! బుద్ధి కుశలుడగు **బృహస్పతి భగవానుడు** మాకు అనుగ్రహమును ప్రసాదించెదరు గాక! మాకు స్వస్థత కలుగజేయుదురు గాక!

మా మనస్సులకు ప్రాణేశ్వరులగు వాయు దేవులవారు శుభము, భద్రము కలుగజేయుదురు గాక! **ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

---

11. యో బ్రహ్మాణమ్ విదధాతి పూర్వమ్,
యోవై వేదాంశ్చ ప్రహిణోతి, తస్మై
తగ్ం అహమ్ ఆత్మబుద్ధి ప్రకాశమ్,
ముముక్షుర్వై శరణమ్
అహమ్ ప్రపద్యే॥
ఓం శాంతిః శాంతిః శాంతిః॥

- ఏ పరబ్రహ్మము ఈ జగత్తుకు మునుముందే ఉన్నదై, ఈ జగత్ రూపముగా విస్తరించినదై ఉన్నదో,

- ఏది వేద - ఉపనిషత్తులచే 'తత్త్వమ్' శాస్త్రముగా స్తుతించబడుచున్నదో,

- అట్టి **ఆత్మ నా బుద్ధికి ప్రకాశమానమగుటకై...,**

**ముముక్షువునై ఆచార్యులను, బ్రహ్మజ్ఞులను, వేదాంత శాస్త్రమును శరణు వేడుచున్నాను.**

**సర్వము శాంత్యాత్మయందు సశాంతించును గాక!**

---

శ్లో॥ ఓం మంగళమ్ గురుదేవాయ మహనీయ గుణాత్మనే
సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మంగళమ్॥
ఓం శాంతిః శాంతిః శాంతిః॥

# చతుర్వేదాంతర్గత

# ఉపనిషత్ ఉద్యానవనము Vol - I

## మంగళ శ్లోక - తాత్పర్య - వివరణ సమేతంగా

## (మొదటి సంపుటి - ఋగ్వేదాంతర్గత - శుక్లయజుర్వేదాంతర్గత)

ఋగ్వేదాంతర్గత : 1. అక్షమాలిక 2. ఆత్మబోధో 3. ఐతరేయ 4. కౌషీతకీ బ్రాహ్మణ 5. త్రిపుర 6. నాదబిందూ 7. నిర్వాణ 8. బహ్వృచ 9. ముద్గల 10. సౌభాగ్యలక్ష్మీ ఉపనిషత్తులు.

శాంతి మంత్రము :

ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా । మనో మే వాచి ప్రతిష్ఠితమ్ । ఆవిరావీర్మయేధి।
వేదస్య మ ఆణీస్థః । శృతం మే మా ప్రహాసీః।
అనేన అధీతేన । అహోరాత్రాన్ సందధామి । ఋతం వదిష్యామి।
సత్యం వదిష్యామి। తత్ మామ్ అవతు । తద్వక్తారమ్ అవతు।
అవతు మామ్ । అవతు వక్తారమ్ । ఓం శాంతిః శాంతిః శాంతిః॥

నా వాక్కునందు మనస్సు, నా మనస్సునందు వాక్కు ప్రతిష్ఠితమై ఉండునుగాక! ఓ జ్యోతి స్వరూపా! పరమాత్మా! జ్ఞాన ప్రకాశముచే నాలోని అజ్ఞానమును పోవునట్లు అనుగ్రహించండి! మనో-వాక్కులారా! నాకు విజ్ఞానము ప్రసాదించు సామర్థ్యము కలిగి ఉండెదరు గాక! నేను వినుచున్న ఆత్మజ్ఞాన సమాచారము స్వానుభవమగుచూ, నా జ్ఞప్తియందు పదిలమగును గాక! మేము రాత్రింబవళ్ళు ఆత్మతత్త్వార్థములను ఏమరువక, సువిజ్ఞాన పూర్వక అధ్యయనము చేయుచుండెదము గాక! ఋక్కులు చెప్పుచున్న ఆత్మతత్త్వమును, పరమసత్యమును సదా ఎరుగుచూ పలుకుచుండెదము గాక! ఓ పరమాత్మా! నాకు - నాకు తత్త్వమును బోధించు పూజ్యనీయుడగు నా గురువుకు సదా రక్షకులై ఉండమని ప్రార్థిస్తున్నాను.

శుక్లయజుర్వేదాంతర్గత : 1. అద్వయతారక 2. అధ్యాత్మ 3. ఈశావాస్య 4. జాబాల 5. తారసార 6. తురీయాతీత 7. త్రిశిఖి బ్రాహ్మణ 8. నిరాలంబ 9. పరమహంస 10. పైంగ్గల 11. భిక్షుక 12. మండల బ్రాహ్మణ 13. మంత్రిక 14. ముక్తిక 15. యాజ్ఞవల్క్య 16. శాత్యాయనీ 17. సౌబాలబీజ (సుబాల) 18. హంస - ఉపనిషత్తులు.

శాంతి మంత్రము :

ఓం పూర్ణమిదః । పూర్ణమిదమ్ । పూర్ణాత్ పూర్ణమ్ ఉదచ్యతే ।
పూర్ణస్య పూర్ణమ్ ఆదాయ, పూర్ణమేవ అవశిష్యతే ।
ఓం శాంతిః శాంతిః శాంతిః॥

ఆ పరమాత్మ సర్వదా పూర్ణుడు. పరమాత్మయొక్క అంశయగు ఈ జీవాత్మ కూడా పూర్ణుడే! పూర్ణుడగు పరమాత్మ నుండి పూర్ణుడగు జీవాత్మ దృశ్యాభిమాని అయి బయల్వెడలుచున్నప్పటికీ .... పరమాత్మ సర్వదా పూర్ణమే అయి, సర్వదా సంప్రదర్శితులై ఉన్నారు.



:- తాత్పర్య - వ్యాఖ్యానములు -:
**యేలేశ్వరపు హనుమ రామకృష్ణ**
డోర్ నెం. 2/8, రామలింగేశ్వరస్వామి గుడి వీధి
కూచిపూడి - 521 136, కృష్ణా జిల్లా ఆంధ్రప్రదేశ్

hasitha # 97042 75472